ఈనాడు
అల్లూరి సీతారామరాజు

మలేరియా నిర్మూలనలో ఏం జరుగుతోంది?

పిచికారీ చేస్తున్నా.. పెరుగుతున్న కేసులు



చింతూరు, న్యూస్‌టుడే: దోమ చిన్నదే అయినా.. కుడితే పర్యవసానం ఎలా ఉంటుందో మన్యంలో నమోదవుతున్న మలేరియా కేసులే చెబుతున్నాయి. మలేరియా నిర్మూలనకు దశాబ్దాలుగా చర్యలు చేపడుతున్నా.. ఏటా జ్వరపీడితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. దోమల నివారణకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతున్నా ప్రజల్లో అవగాహన లేమి, అధికారుల్లో నిర్లక్ష్యంతో ఫలితం ఉండటం లేదు.

జనాభా	12.24 లక్షలు
పీహెచ్‌సీలు	64
పిచికారీ చేసిన గ్రామాలు	2,086
అత్యధిక కేసులు నమోదైన గ్రామాలు	15
గతేడాది సేకరించిన రక్తపూతలు	7,95,175
నమోదైన కేసులు	3,119
ఈఏడాది సేకరించిన రక్తపూతలు	6,39,966
నమోదైన కేసులు	3,305

▮ మలేరియాలో నాలుగు రకాలు ఉన్నా.. మన్యంలో ప్లాస్మోడియం ఫాల్సిఫరం (పీఎఫ్), ప్లాస్మోడియం వైకాక్సు (పీవీ) కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. దోమల నివారణకు ప్రత్యేకంగా ఒక శాఖ నిరంతరం పని చేస్తున్నా మలేరియా వ్యాప్తికి అడ్డుకట్ట పడటం లేదు. అల్లూరి జిల్లాలో ఏటా రూ. కోట్లలో ఖర్చు చేస్తున్నా ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఏటా ఏప్రిల్ నుంచి జూన్ వరకు మొదటి విడతగా, జులై నుంచి ఆగస్టు వరకు రెండో విడతగా మలేరియా మందు పిచికారీ చేస్తున్నారు.

▮ గ్రామాల్లో మందు పిచికారీ చేసేందుకు సిబ్బంది వస్తే.. ఇళ్లలో సామగ్రి బయటపెట్టి మందు కొట్టించేందుకు గిరిజనులు ఆసక్తి చూపడం లేదు. వారికి అవగాహన కల్పించాల్సిన సిబ్బంది మందు పిచికారీ చేసినట్లు నమోదు చేసి వెళ్లిపోతున్నారు.

▮ ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచన మేరకు తొలినాళ్లలో దోమల నివారణకు డీడీటీ మందు పిచికారీ చేసేవారు. 25 ఏళ్ల కిందట ఆ మందు పనిచేయడం లేదని కొంతకాలం మలాథియాన్, ప్రస్తుతం ఏసీఎం 5 శాతం మందు వినియోగిస్తున్నారు. ఉచితంగా మందు పిచికారీ చేస్తున్నా.. చాలామంది ఇళ్లలోకి సిబ్బందిని రానివ్వడం లేదు. ఇంట్లో ఎవరైనా జ్వరం బారినపడితే వెంటనే ఆసుపత్రికి రావడం లేదు. తగ్గకపోతే అప్పుడు వస్తుండటంతో పరిస్థితి చేయిదాటి పోతోంది.

▮ దోమల నివారణకు జిల్లాలో ఏటా రూ.1.39 కోట్లు ఖర్చు చేస్తున్నారు. మందు పిచికారీ చేసేందుకు గ్రామాల్లో ఐదుగురు కార్మికుల బృందాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కొక్కరికి రోజుకు రూ.520 చెల్లిస్తున్నారు. ఈ బృందం రోజుకు 150 ఇళ్లలో మందు పిచికారీ చేయాల్సి ఉంది.

అంత్యక్రియలకూ అష్టకష్టాలు

ముంచంగిపుట్టులో ఇంజినీరింగ్ కార్యాలయం వెనుక ఉన్న నివాస గృహాలకు వెళ్లేందుకు నాలుగు అడుగుల కాలిబాట లేక స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఆ ప్రాంతానికి చెందిన వృద్ధురాలు కుమలమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందగా.. అంత్యక్రియలకు భౌతికకాయాన్ని తరలించేందుకు ఇబ్బందులు తప్పలేదు. పొదలపై తీసుకువచ్చేందుకు మార్గం లేక రోడ్డు వరకు చేతులతో మోసుకురావాల్సి వచ్చింది. అధికారులు స్పందించి రోడ్డు సదుపాయం కల్పించాలని స్థానికులు కోరారు. – ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

మృతదేహాన్ని మోసుకొస్తున్న బాధితులు

అంబులెన్సులొచ్చాయ్

పాడేరు డివిజన్‌కు కొత్తగా 10 అంబులెన్సులను ప్రభుత్వం కేటాయించింది. ఇవి బుధవారం చింతపల్లి మీదుగా పాడేరు ఐటీడీఏకు చేరాయి. డివిజన్ వ్యాప్తంగా పలు అంబులెన్సుల టైర్లు అరిగిపోయి మరమ్మతుకు గురయ్యాయి. వాటి స్థానంలో మండలాల్లోని పీహెచ్‌సీలకు నూతన వాహనాలను కేటాయించనున్నట్లు సంబంధిత అధికారులు చెప్పారు. – న్యూస్‌టుడే, చింతపల్లి గ్రామీణం

అబలకు అండగా..

ఆపత్కాలంలో సాయం పొందొచ్చు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే

మహిళల భద్రత, రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశాయి. రోజులో 24 గంటలూ ఆయా కేంద్రాలు అందుబాటులో ఉంటాయి. గృహహింసకు గురైనా, దాడులు జరిగినా బాధితులు ఆయా కేంద్రాలను సంప్రదిస్తే వైద్య సాయంతోపాటు పునరావాసం కల్పిస్తారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు, పోలీసు, రెవెన్యూ, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ బాధితులకు చేయూతనిస్తారు.

181 మహిళా సహాయ కేంద్రం

మహిళలను కట్నం కోసం వేధించడం, శారీరక, మానసిక వేధింపులకు పాల్పడిన సందర్భంలో బాధితులు 181 నంబరుకు ఫోన్ చేయొచ్చు. రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది వివరాలు నమోదు చేసుకుని బాధితులను ఆదుకునేలా చర్యలు చేపడతారు.

15100 జాతీయ న్యాయ సహాయ కేంద్రం

న్యాయస్థానాల్లో కేసులకు సంబంధించి 15100 నంబరుకు ఫోన్‌చేసి న్యాయసేవలు పొందవచ్చు. కోర్టుల్లో న్యాయవాదులను పెట్టుకోలేని మహిళలకు ప్రభుత్వ న్యాయవాది ద్వారా చేయూతనిస్తారు.

1098 బాలల కోసం

బాలలతో వెట్టిచాకిరీ చేయించడం, పారిశ్రామిక, కర్మాగారాల్లో పనుల్లో పెడితే.. వారిని రక్షించేందుకు హెల్ప్‌లైన్ నంబర్ 1098కు ఫోన్ చేయవచ్చు. అధికారులు వెంటనే స్పందించి వారికి విముక్తి కల్పిస్తారు. బాలలపై హింస, దాడులకు పాల్పడితే వారిపై ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

మహిళలకు 100

మహిళలు, యువతులు, విద్యార్థినులను ఎవరైనా వేధిస్తే 100 నంబరుకు ఫోన్ చేస్తే వెంటనే స్పందించి ఆదుకుంటారు. దూర ప్రాంతమైతే ఆ ప్రాంత పోలీసులకు సమాచారం చేరవేసి రక్షణ కల్పించేలా చూస్తారు.

1930 సైబర్ నేరాలపై

కొందరు వ్యక్తులు సామాజిక మాధ్యమాల ద్వారా మహిళలతో పరిచయాలు పెంచుకుంటారు. ఈ క్రమంలో వివిధ రూపాల్లో వారిని బెదిరిస్తే 1930 నంబర్‌ను ఫోన్ చేసి సాయం కోరవచ్చు. పోలీసు అధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేస్తారు. ఆన్‌లైన్‌లో ఆర్థిక మోసాలకు పాల్పడిన వారిపై ఫిర్యాదు చేస్తే బ్యాంకుఖాతా నుంచి నగదు లావాదేవీలను నిలిపేస్తారు.

మంచు ముంచుతోంది!

ఘాట్‌రోడ్డులో అప్రమత్తం

మంచులో లైట్లు వేసుకుని వస్తున్న వాహనం

అనంతగిరి, న్యూస్‌టుడే

మన్యం అనగానే ప్రతి ఒక్కరికీ పర్యాటకమే గుర్తొస్తుంది. ప్రకృతి సహజసిద్ధమైన అందాలు ప్రతి ఒక్కర్నీ మంత్రముగ్ధుల్ని చేస్తాయనడంలో సందేహం లేదు. పచ్చని కొండలు, జలపాతాలు, కాఫీ తోటలు, మంచు సోయగాలను ఆస్వాదించేందుకు ప్రకృతి ప్రేమికులు దూర ప్రాంతాల నుంచి వస్తుంటారు. ఆహ్లాదాన్ని పంచే మంచు పలు సందర్భాల్లో ప్రమాదాలకు కారణమవుతోంది. పర్యాటకులు కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా జాగ్రత్తగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చు.

✦ ఏడాది కిందట ద్విచక్ర వాహనంపై పాడేరు సమీపంలోని వంజంగి మేఘాలకొండను చూసేందుకు వచ్చిన ఓ కుటుంబం తిరుగు ప్రయాణంలో దట్టంగా కురుస్తున్న మంచులో రోడ్డు మలుపు కనిపించక ప్రమాదానికి గురయ్యారు. ఒకరు మృతి చెందగా.. మరొకరు గాయపడ్డారు.

✦ కొద్ది నెలల కిందట పాడేరు ప్రాంతానికి ద్విచక్ర వాహనంపై వచ్చిన పర్యాటకులు తిరుగు ప్రయాణంలో మంచులో దారి కనిపించక ప్రమాదానికి గురయ్యారు. ఓ మహిళ ప్రాణాలు కోల్పోయింది.

✦ అనంతగిరి ఘాట్‌రోడ్డులో ఏడాది కిందట ఎదురెదురుగా వస్తున్న ఆటో, కారు మంచులో ఢీకొన్నాయి. పలువురు గాయాలపాలయ్యారు.

✦ అనంతగిరి ఘాట్ రోడ్డులో మూడో నంబరు మలుపు సమీపంలో కారు, లారీ ఢీకొనగా పర్యాటకులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కారు నుజ్జయింది.

సీజన్ ప్రారంభం ... పర్యాటక సీజన్ ప్రారంభం కావడంతో కొద్దిరోజులుగా మన్యానికి వచ్చే పర్యాటకుల సంఖ్య బాగా పెరిగింది. సందర్శకులకు ఘాట్‌రోడ్డు ప్రయాణం వింత అనుభూతినిస్తోంది. అనంతగిరి ఘాట్‌రోడ్డులో వెంకయ్యపాలెం మొదలు గాలికొండ వరకు సుమారు 35 కిలోమీటర్ల ప్రయాణంలో 24 కి.మీ. ఘాట్‌రోడ్డే ఉంటుంది. ఇందులో ఎనిమిది ఎయిర్‌పిన్ బెండ్లు, 70 వరకు ప్రమాదకర మలుపులున్నాయి. పాడేరు ఘాట్‌రోడ్డు సుమారు 21 కి.మీ. దూరం ఉంటుంది. ఇందులో మూడు పెద్ద మలుపులతోపాటు చాలావరకు ప్రమాదకర మలుపులున్నాయి. లంబసింగి వెళ్లే మార్గంలోనూ ఇదే పరిస్థితి. ఘాట్‌రోడ్లలో వాహనచోదకులు జాగ్రత్తగా వెళ్లాల్సిన అవసరముంది.

ఈ జాగ్రత్తలు పాటిస్తే మేలు..

1. మన్యానికి వాహనాల్లో వచ్చేవారు ఘాట్‌రోడ్డుపై అవగాహన లేకపోవడంతో కాస్త నెమ్మదిగా వెళ్లడం మంచిది.
2. మంచు అధికంగా కురిసే సమయంలో హెడ్ లైట్లతోపాటు పార్కింగ్ సిగ్నల్ లైట్లను ఆన్ చేసి రాకపోకలు సాగించాలి.
3. మలుపుల్లో విధిగా హారన్ మోగించాలి.
4. ఫాగ్‌ల్యాంప్‌లను ఆన్ చేసుకుంటే ఇవి పసుపు వర్ణంలో వెలగడం వల్ల ఉపయుక్తంగా ఉంటుంది.
5. దారి కనిపించని సమయంలో ముందు వాహనాలను ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించకూడదు.
6. వాహనాలకు రేడియం స్టిక్కర్లు అతికించడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలకు స్పష్టంగా కనిపించే అవకాశం ఉంటుంది.

అవగాహన లేకే ప్రమాదాలు .. ఘాట్‌రోడ్డుపై అవగాహన లేని కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. మంచు పడే సమయంలో మలుపుల్లో ప్రమాదాలకు గురవుతున్నారు. హెచ్చరిక బోర్డులను అనుసరిస్తూ వాహనాలు నడపడం మంచిది. మంచు కురిసే సమయంలో లైట్లు వేసుకుని నిదానంగా రాకపోకలు సాగించాలి. ఎప్పటికప్పుడు హారన్ మోగిస్తూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం శ్రేయస్కరం.
– శ్రీనివాస్‌రావు, ఎస్సై, అనంతగిరి

కొద్ది రోజుల కిందట మంచు కారణంగా రహదారి మలుపులో ప్రమాదానికి గురైన కారు

చెత్త శుద్ధితో సంపద వృద్ధి

లక్ష్యానికి చేరువలో జిల్లా

కూనవరం, న్యూస్‌టుడే

ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుతూనే సంపద సృష్టి జరగాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం కంపోస్టు పిట్ (చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారీ గుంత)ల ఏర్పాటుకు నిర్ణయించింది. ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేసి పనులకు వెళ్లే శ్రామికులుందరూ తమ ఇళ్ల ఆవరణలో వీటిని తవ్వేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు. గొయ్యి తవ్వేందుకు పైసా పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేదు. రెండు పనిదినాలను వారికి కల్పించి రూ.820 వేతనం చెల్లిస్తున్నారు. ఫలితంగా జిల్లాలో నిర్దేశిత లక్ష్యం గడువుకంటే ముందుగానే పూర్తికానుంది.

✦ జిల్లా వ్యాప్తంగా 22 మండలాల్లో 99 వేల కంపోస్టు గుంతలను మూడు నెలల్లో ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉపాధి హామీ సిబ్బంది గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. రెండు నెలల కార్యాచరణ ప్రారంభమైంది. ఇప్పటివరకు 57,947 గోతుల తవ్వకం పూర్తయింది. మరో వారంలో శత శాతం లక్ష్యాన్ని చేరుకునేందుకు పనులను వేగవంతం చేశారు.

ఇంటి ఆవరణలో గొయ్యి తవ్వుతున్న మహిళ

✦ ఉపాధి శ్రామికులు చేయాల్సిందల్లా తమ ఇంటి ఆవరణలో 0.90 మీటర్ల పొడవు, వెడల్పు, లోతుతో గొయ్యి తవ్వడమే. గోతిలోకి వర్షపు నీరు వెళ్లకుండా చుట్టూ మట్టిని అడుగు ఎత్తులో కట్టగా వేస్తారు. పశువులు ఉన్న వారంతా రెట్టింపు కొలతలతో పెద్ద గొయ్యి తవ్వవచ్చు. లబ్ధిదారు అవసరం మేరకు రెండూ తవ్వేలా అవకాశమిచ్చారు.

✦ స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్రలో భాగంగా కంపోస్టు గోతుల తవ్వకం పనుల పర్యవేక్షణను ఉపాధి హామీ పథకానికి అప్పగించారు. ఇళ్లలోని చెత్తను బయట పడవేయకుండా ప్లాస్టిక్ మినహా తడి, పొడి చెత్తను ఈ గుంతలో వేసేలా అవగాహన కల్పించారు. ఇంట్లోని చెత్త రోడ్లపైకి రాకపోవడంతో ఇంటి ఆవరణతో పాటు గ్రామాలు పరిశుభ్రంగా మారతాయని ఇన్‌ఛార్జి ఏపీడీ శ్రీకాంత్ పేర్కొన్నారు.

ఒడిశా సీఎం పాడేరు రాక 16న

పాడేరు, న్యూస్‌టుడే: భగవాన్ బిర్సా ముండా 150వ జయంత్యుత్సవాల సందర్భంగా ఈ నెల 16న పాడేరు చింతలవీధి కూడలిలో ఆయన విగ్రహ విష్కరణ జరగనుంది. ఈ కార్యక్రమానికి ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాంఝీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. భాజపా జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి, ముఖ్య నాయకులు బుధవారం భూమి పూజచేసి విగ్రహ ఏర్పాటు పనులను ప్రారంభించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద 16న జనజాతీయ గౌరవ దివస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. మంత్రులు సంధ్యారాణి, సత్యకుమార్ యాదవ్, కందుల దుర్గేష్, భాజపా రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ హాజరవుతారన్నారు.

బాలల వేషధారణ భళా..

గిరిజనుల వేషధారణల్లో విద్యార్థులు

చింతపల్లి, న్యూస్‌టుడే: భగవాన్ బిర్సా ముండా జయంత్యుత్సవాలు చింతపల్లిలో బుధవారం ఘనంగా జరిగాయి. జాతీయ గౌరవ దివస్‌లో భాగంగా స్థానిక గిరిజన సంక్షేమ బాలబాలికల సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. బాలబాలికలు సంప్రదాయ గిరిజనుల వేషధారణలో అలరించారు. ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు అర్జున్, బీఎస్ఎన్‌రాజు, రామరాజు, వార్డెన్ గణేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరి గ్రామాల అభివృద్ధే లక్ష్యం

పాడేరు, న్యూస్‌టుడే: గిరిజన గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన, పీఎం జన్‌మన్ పథకంలో పూర్తి చేసిన 11,598 గృహాలను బుధవారం ప్రారంభించారు. పాడేరు మండలం వంతాడపల్లి పంచాయతీ సప్పిపుట్టు గ్రామంలో ఆరు ఇళ్లను కలెక్టర్ దినేష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ప్రారంభించి లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందజేశారు. ఒకప్పుడు గిరిజన గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం లేని పరిస్థితి. ప్రస్తుతం వీధులన్నీ సీసీ రోడ్ల నిర్మాణంతో కళకళలాడుతున్నాయని మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి చెప్పారు. ఎంపీపీ రత్నకుమారి, సర్పంచి పార్వతి, గృహ నిర్మాణసంస్థ పీడీ బాబు, ఎంపీడీఓ తేజరతన్ నాయకులు విజయరాణి, రమణమూర్తి, వెంకటరమణ పాల్గొన్నారు.

లబ్ధిదారుకు ఇంటి తాళం అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

అందరికీ ఆవాసం

చినగెద్దాడలో గృహ ప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే శిరీషాదేవి, ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీ ప్రాంతంలో అర్హులందరికీ ఆవాసం ఉండాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పక్కా ఇళ్లు మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే శిరీషాదేవి చెప్పారు. చినగెద్దాడ గ్రామంలో పీఎం జన్‌మన్ పథకంలో నిర్మాణం పూర్తయిన ఇళ్లను ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. నియోజకవర్గంలో పీఎం జన్‌మన్‌లో 5,545, గ్రామీణ పథకంలో 4,114 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. వీటిలో 3,344 ఇళ్లు పూర్తవడంతో సామూహిక గృహ ప్రవేశాలు చేసినట్లు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబూరమేష్, భాజపా రాష్ట్ర కార్యదర్శి స్వప్నకుమారి, హౌసింగ్ ఈఈ రవికుమార్, డీఈ మూర్తి, తహసీల్దార్ బాలాజీ, ఎంపీడీవో ప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, తెదేపా మండల అధ్యక్షుడు అనంత మోహన్, నాయకులు రవిబాబు, అన్నవరం, గంగరాజు పాల్గొన్నారు.

యువతే దేశ భవిష్యత్తు

ప్లకార్డులు చూపుతున్న మంత్రి అనిత తదితరులు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: డ్రగ్స్ రహితంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని హోం మంత్రి అనిత చెప్పారు. గంజాయి, మత్తు పదార్థాల రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. యువతే దేశ భవిష్యత్తని, మత్తుకు బానిసై భవితను నాశనం చేసుకోవద్దని కోరారు. విశాఖ రేంజ్ పరిధిలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా 'అభ్యుదయం' పేరిట సైకిల్ యాత్రకు బుధవారం పాయకరావుపేట నుంచి శ్రీకారం చుట్టారు. డీఐజీ గోపీనాథ్ జెట్టి మాట్లాడుతూ.. 'మాదక ద్రవ్యాల వినియోగం అతిపెద్ద సమస్యగా మారింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి సాగును సమర్థంగా అరికట్టగలిగాం. ఏజెన్సీలోని 20 మండలాల్లో 35 వేల మంది రైతులకు నచ్చజెప్పి 30 వేల ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తున్నాం. డ్రోన్లు, ఉపగ్రహ చిత్రాలను విశ్లేషించి గంజాయి సాగును అరికడుతున్నాం. గంజాయి రవాణా కేసుల్లో ఇప్పటికే 2,500 మందిని అరెస్టు చేశాం. 61 మందిపై పీడీ చట్టం ప్రయోగించి'నట్లు చెప్పారు. ఎస్పీ తుహిన్‌సిన్హా, నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు, పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ శివదత్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబాబు, నగేష్, ప్రదీప్, వరహాలబాబు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫ్లాష్‌మాబ్

చేయిచేయి కలిపి..

ఐదేళ్లకోసారి ప్రభుత్వాలు మారుతున్నా మారుమూల గ్రామాలకు రహదారి సదుపాయం సమకూరడం లేదని నిరాశ చెందకుండా గిరిజనులు చేయి చేయి కలిపారు. శ్రమదానంతో గ్రామానికి రోడ్డు నిర్మించుకున్నారు. ముంచంగిపుట్టు మండలం బుంగాపుట్టు పంచాయతీ కొసాంపుట్టుకు చెందిన 120 మంది గిరిజనులు రెండు కి.మీ. దూరం శ్రమదానం చేసి మట్టిరోడ్డు నిర్మించుకున్నారు. కొజ్జిరిగుడ నుంచి కొసాంపుట్టు వరకు ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగించేలా రాళ్లు, మట్టి వేసి చదును చేశారు. వానొస్తే రోడ్డు కోతకు గురవుతోందని, తారు రోడ్డుతోపాటు గెడ్డపై వంతెన నిర్మించాలని వారంతా కోరుతున్నారు. – **న్యూస్‌టుడే, ముంచంగిపుట్టు**

రోడ్డు నిర్మాణంలో గిరిజనులు

ఖాళీలు ఇలా.. పర్యవేక్షణ ఎలా?

ఇన్‌ఛార్జిలతో నెట్టుకొస్తున్న విద్యాశాఖ

పాడేరు/పట్టణం, న్యూస్‌టుడే

జిల్లాలో కీలకమైన విద్యాశాఖలో ఏళ్ల తరబడి ఖాళీలు భర్తీకి నోచుకోవడం లేదు. పాఠశాలలను నిరంతరం పర్యవేక్షించాల్సిన డీవోఈవో, ఎంఈవో పోస్టుల్లో ఎవరూ నియామకం కాకపోవడంతో ఇన్‌ఛార్జిలతో నెట్టుకురావాల్సి వస్తోంది. ఫలితంగా పర్యవేక్షణ పడకేస్తోంది. ఇప్పటికే విద్యా సంవత్సరం సగం పూర్తవడంతో కీలక పోస్టులు ఈ ఏడాదైనా భర్తీ అవుతాయన్న నమ్మకం సన్నగిల్లుతోంది. భవిష్యత్తులో చేపట్టనున్న కౌన్సెలింగ్‌లోనైనా ఖాళీల భర్తీకి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరముంది.

● జిలా వ్యాప్తంగా 2,599 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఒకటి నుంచి పదో తరగతి వరకు సుమారు లక్ష మంది విద్యార్థులు ఉన్నారు. ఒక్కో మండలంలో 130 నుంచి 160 వరకు పాఠశాలలు ఉండగా, 200 మందికిపైగా ఉపాధ్యాయులున్నారు.

● 22 మండలాల్లో పది చోట్లే ఎంఈవో-1 పోస్టుల్లో అధికారులు ఉన్నారు. జిల్లా కేంద్రం పాడేరుతోపాటు గూడెంకొత్తవీధి సహా 12 మండలాల్లో ఈ పోస్టుల్లో ఇన్‌ఛార్జిలే కొనసాగుతున్నాయి. ఎంఈవో-2 పోస్టుల్లో 13 మందే ఉన్నారు. జిల్లాలో రెండు డీవైఈవో పోస్టుల్లోనూ ఇన్‌ఛార్జిలే కొనసాగుతున్నారు.

● ఆదర్శ పాఠశాలల ఏర్పాటు, తల్లిదండ్రుల సమావేశాల నిర్వహణ, ప్రతి శనివారం నోబ్యాగ్ డే, ఎసెస్‌మెంట్ టెస్టులు, మధ్యాహ్న భోజనం, ఇతర కార్యక్రమాల పర్యవేక్షణ బాధ్యత ఎంఈవోలదే. పాఠశాలలను తనిఖీ చేస్తూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ నివేదికలు పాఠశాల కమిషనరేట్‌కు ఇవ్వాల్సి ఉంటుంది. అదనపు అలవెన్సులు లేకపోవడంతో జేబు నుంచి ఖర్చు చేయాల్సి వస్తోంది.

● గతంలో మండలానికో ఎంఈవో ఉండేవారు. వైకాపా ప్రభుత్వం ఎంఈవో-1, 2 పోస్టులను ఏర్పాటు చేసింది. ఎంఈవో-1కు ఉపాధ్యాయుల జీతాలు, ఆర్థిక వ్యవహారాలను అప్పగించారు. ఎంఈవో-2కు పాఠశాలల తనిఖీ, పర్యవేక్షణ బాధ్యతలు ఇచ్చారు. ఎంఈవో-1 పోస్టులో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సీనియర్ ప్రధానోపాధ్యాయుడికి పదోన్నతి కల్పించి నియమించారు. ఎంఈవో-2 పోస్టులో జడ్పీ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులకు అవకాశం కల్పించారు. పూర్తిస్థాయిలో ఎంఈవోలు లేనిచోట ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మండల కేంద్రాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో-1 ఇన్‌ఛార్జి బాధ్యతలు, ఎంఈవో-2కు జడ్పీ పాఠశాలల్లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. కొన్నిచోట్ల జడ్పీ పాఠశాలలు లేకపోవడంతో సీనియర్ స్కూల్ అసిస్టెంట్లను ఇన్‌ఛార్జిలుగా నియమిస్తున్నారు.

సందర్భమేదైనా ఈనాడును చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

(c) eenadu

అటవీ ప్రాంతంలో శిక్షణ అధికారుల పర్యటన

వై.రామవరం, న్యూస్‌టుడే: మారుమూల అటవీ ప్రాంతంలోని గొరబంద గ్రామాన్ని బుధవారం శిక్షణ సివిల్ సర్వీస్ అధికారులు సందర్శించారు. గిరిజనులతో కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం గ్రామ పరిస్థితులు, రవాణా, వైద్య సదుపాయాలపై ఆరాతీశారు. గొరబంద కాశీవిశ్వనాథుని ఆలయాన్ని సందర్శించారు. వాహన రాకపోకలకు ప్రమాదకరంగా ఉన్న ఈ గ్రామాన్ని సందర్శించిన ఆయా అధికారులు ప్రజల జీవన శైలిని అడిగి తెలుసుకున్నారు. చవిటిదిబ్బలు సమీపంలోని పూతిగుటం గ్రామాన్ని సందర్శించారు. ఈ గ్రామంలో ఉన్న పరిస్థితులపై ఆరా తీశారు. గ్రామంలోని ఉబ్బలింగేశ్వర ఆలయాన్ని సందర్శించారు. మారుమూల అటవీ ప్రాంతంలోని గ్రామాలను సందర్శించడంతో ఆయా గ్రామాల గిరిజనులు ఆనందం వ్యక్తం చేశారు. నోడల్ అధికారి బాపన్నదొర, తహసీల్దార్ వేణుగోపాల్, ఎస్ఐ రామకృష్ణ, ఇతర శాఖల అధికారులు, ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.

లిచీ సాగుపై విస్తృత పరిశోధనలు

చింతపల్లి, న్యూస్‌టుడే: వాణిజ్య సరళిలో లిచీ పండ్ల సాగుపై చింతపల్లిలో పరిశోధనలు చేస్తున్నట్లు కొవ్వూరు ఉద్యాన పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ రవీంద్రకుమార్, డాక్టర్ శివకుమార్ తెలిపారు. స్థానిక ఉద్యాన పరిశోధనా స్థానానికి చెందిన క్షేత్రంలో పలు రకాల లిచీ మొక్కలను బుధవారం నాటారు. ఈ సాగు అధికంగా బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఉందన్నారు. సంప్రదాయేతర ప్రాంతం అయినప్పటికీ మన్యం వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఇప్పటికే పరిమితంగా పండిస్తున్నారన్నారు. దిల్లీ కేంద్రంగా అఖిల భారత సమన్వయ పండ్ల పరిశోధనా పథకం (ఏఐసీఆర్‌పీ) ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగిందన్నారు. ఇందులో భాగంగా బిహార్‌లోని ముజాఫర్‌పూర్‌లో లిచీ పండ్ల పరిశోధనా స్థానం సిఫారసు చేసిన షాహి, బెడానా, చైనా, గండకిలాలిమా వంటి హైబ్రిడ్ రకాలను తీసుకొచ్చినట్లు చెప్పారు. లిచీ పంట నాటిన మూడేళ్ల నుంచే దిగుబడినిస్తుందన్నారు. ఉద్యాన పరిశోధనాస్థానం అధిపతి బిందు పాల్గొన్నారు.

చింతపల్లి ఉద్యాన పరిశోధనాక్షేత్రంలో లిచీ మొక్కకు నీరు పోస్తున్న శాస్త్రవేత్తలు

ఇంటింటికీ మన మిత్ర

కలెక్టరేట్, న్యూస్‌టుడే

వాట్సాప్ గవర్నెన్స్‌పై విస్తృత ప్రచారం

కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా క్షణాల్లో సేవలు పొందేలా వాట్సాప్ గవర్నెన్స్ (మన మిత్ర)ను కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. చేతిలో స్మార్ట్ ఫోనుంటే చాలు.. 738 రకాల సేవలను పొందవచ్చు. అవగాహన లేక చాలామంది నేటికీ సచివాలయాలకు వస్తున్నారు. ఈ క్రమంలో మనమిత్రను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. సచివాలయ ఉద్యోగులు ప్రతి శుక్రవారం తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి వాట్సాప్ సేవలపై అవగాహన కల్పించాలని గ్రామ, వార్డు సచివాలయ శాఖ డైరెక్టర్ శివప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

- జిల్లా వ్యాప్తంగా 522 సచివాలయాల పరిధిలో 3,748 మంది ఉద్యోగులు మన మిత్ర సేవలను ఇంటింటికీ చేరువ చేసేందుకు వస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రతి శుక్రవారం ఇంటింటికీ వెళ్లి యాప్ వినియోగంపై అవగాహన కల్పించనున్నారు.
- జిల్లాలో 5,59,793 కుటుంబాలను సర్వే చేసి మన మిత్ర సేవలపై అవగాహన కల్పిస్తారు. వాట్సాప్ ద్వారా సేవలు ఎలా పొందాలో వివరిస్తారు. క్యూఆర్ కోడ్ ముద్రించిన కరపత్రాలు అందజేస్తారు. ఇళ్ల సంఖ్య, నమోదైన పౌరుల వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు. వీటన్నింటినీ పంచాయతీ కార్యదర్శి, వార్డు పరిపాలనా కార్యదర్శి సమన్వయం చేస్తూ సర్వే విజయవంతంగా జరిగేలా పర్యవేక్షిస్తారు.
- ఎనర్జీ అసిస్టెంట్లు, కార్యదర్శులు విద్యుత్తు బిల్లులు, కొత్త కనెక్షన్ల ఫిర్యాదులపై వాట్సాప్ సేవలను వివరిస్తారు. వ్యవసాయ, ఉద్యాన, పట్టు, పశు సంవర్ధక, మత్స్య, ఏఎన్ఎం, వార్డు హెల్త్ కార్యదర్శులు శాఖల వారీగా వాట్సాప్ సేవలపై అవగాహన కల్పిస్తారు.

అనకాపల్లి మండలం అక్కిరెడ్డిపాలెంలో అవగాహన కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు

సేవలు పొందడం ఇలా.. 95523 00009

నంబరుకు హాయ్ అని సందేశం పంపడం ద్వారా అన్ని ప్రభుత్వ సేవల జాబితా కనిపిస్తుంది. కావాల్సిన సేవలు ఎంచుకుని అవసరమైన వివరాలు పొందుపరచాలి. సేవలకు సంబంధించి చాట్‌బాట్‌లో అదనపు వివరాలను అక్షరాలు, వాయిస్ రూపంలో అడగొచ్చు. వివరాలు ఒకసారి తనిఖీ చేసిన తరవాత రియల్ టైమ్ అప్‌డేట్ / కన్ఫర్మేషన్ సందేశం వస్తుంది. వాట్సాప్ గవర్నెన్స్‌లో చాట్‌బాట్ ఈ ధ్రువీకరణ పత్రాలు, రసీదులు, తిరుగు రసీదు అందిస్తుంది.
– మంజులవాణి, జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారిణి

విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

గంగవరం, న్యూస్‌టుడే: విద్యార్థుల చదువు, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీడీ రుక్మాండయ్య ఆయా పాఠశాలలు, వసతి గృహాల సిబ్బందికి సూచించారు. స్థానిక ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. వసతి గృహంలో సౌకర్యాలు, మరుగుదొడ్లు, తరగతి గదులు తనిఖీ చేశారు. పాఠశాల, వసతి గృహాల దస్త్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వసతి గృహంలో అందుతున్న సదుపాయాలపై వారిని అడిగి తెలుసుకున్నారు. ఇన్‌ఛార్జి హెచ్ఎం వై. లక్ష్మి, వార్డెన్ లావణ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల, న్యూస్‌టుడే: విద్యార్థులకు పునాది అంగన్‌వాడీ కేంద్రం నుండే ప్రారంభమవుతుందని గిరిజన సంక్షేమ శాఖ డీడీ రుక్మాంగదయ్య పేర్కొన్నారు. అడ్డతీగల పంచాయతీ అనిగేరులో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దస్త్రాలు పరిశీలించారు. చిన్నారులు సక్రమంగా బడికి వస్తున్నదీ, లేనిదీ ఆరా తీశారు. ఏసీడీఎస్ సూపర్‌వైజరు అరుణలత, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అనిగేరు అంగన్‌వాడీ కేంద్రంలో దస్త్రాలు పరిశీలిస్తున్న డీడీ రుక్మాంగదయ్య

అప్రమత్తతతో న్యుమోనియా నివారణ

పాడేరు, న్యూస్‌టుడే: ప్రతిఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి న్యుమోనియా టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని జిల్లా వైద్యాధికారి కృష్ణమూర్తి నాయక్ అన్నారు. న్యుమోనియా దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద మినుములూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని డీఎంహెచ్‌ఓ ప్రారంభించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ప్రజలకు అవగాహన కల్పించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. చలికాలంలో చిన్నారులను న్యుమోనియా వేధిస్తోందని, అప్పుడే పుట్టిన శిశువులు జలుబు కారణంగా ఈ వ్యాధి బారిన పడుతున్నారు. అప్రమత్తతతోనే ఈ వ్యాధి బారినుంచి బయట పడొచ్చని వైద్యులకు సూచించారు. ఈనెల 12 నుంచి 28వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సీహెచ్ కమలకుమారి, జిల్లా స్టాటిస్టికల్ అధికారి కైలాస్, డీపీహెచ్ఎన్ భూలోకమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజుపేట ర్యాలీలో వైద్య సిబ్బంది

ఎటపాక, న్యూస్‌టుడే: నెల్లిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో రాజుపేటలో ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ న్యుమోనియా నిరోధక చర్యలు తీసుకోవడం, సమయానికి చికిత్స అందించడమనే లక్ష్యంతో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. న్యుమోనియా ఒక తీవ్రమైన శ్వాస సంబంధమైన వ్యాధి, అయిదేళ్లలోపు వయసు పిల్లలు, వృద్ధులకు ఎక్కువగా వ్యాప్తి చెందుతుందన్నారు. సిబ్బంది సత్యవాణి, లలిత, అన్నపూర్ణ పాల్గొన్నారు.

‘స్థానిక’ంలో శతశాతం విజయమే లక్ష్యం

పాడేరు, న్యూస్‌టుడే: పార్టీ బలోపేతంతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో శతశాతం విజయం సాధించడమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని పాడేరు నియోజకవర్గ తెదేపా పరిశీలకుడు బుద్ద నాగజగదీశ్వరరావు సూచించారు. పాడేరు నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం బుధవారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో పార్టీ సంస్థాగత కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జగదీశ్వరరావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించి ఈ కమిటీలను ఎన్నుకున్నట్లు చెప్పారు. నాయకులు బొర్రా నాగరాజు, గోవింద్, చిట్టిబాబు, ఊర్మిళ పాల్గొన్నారు.

కమిటీ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న బుద్ద నాగజగదీశ్వరరావు, గిడ్డి ఈశ్వరి

బైక్ అదుపుతప్పి పర్యాటకుడి మృతి

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: అరకులోయ అందాలను తిలకించేందుకు బయలుదేరిన పర్యాటకుడు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా నెల్లిమర్ల గ్రామానికి చెందిన బొంతు సాయి(25) విజయనగరం నుంచి అరకులోయకు బైక్‌పై వచ్చాడు. అరకులోయ నుంచి పాడేరు వెళ్లే క్రమంలో కురిడి రైల్వే గేటు సమీపంలో ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సాయి తీవ్రగాయాలపాలై మృతి చెందాడు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘటనాస్థలంలో బైక్, సాయి మృతదేహం

రోడ్డు ప్రమాదంలో చెరువపల్లి వాసి..

చింతూరు, న్యూస్‌టుడే: నడిచి వెళ్తున్న వ్యక్తిని ఢీ కొని బైక్ నడుపుతున్న ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం చెరువపల్లికి చెందిన ముగ్గురు యువకులు మంగళవారం రాత్రి చింతూరు నుంచి భద్రాచలం వెళ్తున్నారు. చింతూరు మండలం తుమ్మల వద్ద రోడ్డుపై నడిచి వెళ్తున్న అదే గ్రామానికి చెందిన కుంజా ముత్తయ్యను వేగంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో బైక్ అదుపుతప్పి ముగ్గురు కింద పడిపోయారు. వీరిలో మడకం శిశ్చష్ణ (31) అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన ఇద్దరికి స్వల్ప గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. వాహనం ఢీకొన్న వ్యక్తి కూడా గాయపడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ చెప్పారు.

ఉపాధి సిబ్బంది కార్యవర్గ ఎన్నిక

పెదబయలు, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకం పెదబయలు మండల నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షులుగా కోశారి రాంబాబు, ఉపాధ్యక్షులుగా గులిమిండల కొండలరావు, కోశాధికారిగా జాగరపు శాంతమ్మ, ఉపకోశాధికారిగా దలాయి రాజుబాబు, ఉపకార్యదర్శిగా మఠం బోడయ్యపడాల్, కోశాధికారిగా కొర్రా బాలన్న, సలహాదారుడిగా చెండా ప్రసాదరావు, జిల్లా కమిటీ సభ్యులుగా కూడా రాజారావు ఎన్నికయ్యారు.

ఉద్యోగ నియామక చట్టాన్ని ప్రకటించాలి

చింతూరు, న్యూస్‌టుడే: మన్యంలో ఆదివాసీ నిరుద్యోగులకు నూరు శాతం ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం తక్షణమే ఉద్యోగ నియామక చట్టాన్ని ప్రకటించాలి సత్యాగ్రహ సారధి రామారావుదొర డిమాండ్ చేశారు. ఆదివాసీ జేఏసీ చేపట్టిన సత్యాగ్రహ యాత్రను మండలంలోని అల్లిగూడెంలో బుధవారం నిర్వహించారు. పేగ సర్పంచి చంద్రయ్య, నెహ్రూ, రామకృష్ణ, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

లాభదాయక పంటలపై దృష్టి

చింతపల్లి, న్యూస్‌టుడే: గిరి రైతులు మారుతున్న కాలానికి అనుగుణంగా ఎగుమతులకు అనువైన లాభదాయక పంటల సాగుపై దృష్టిసారించాలని మండల వ్యవసాయాధికారి మధుసూదనరావు అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం కొలపరి గ్రామంలో రైతులతో ఆయన సమావేశమయ్యారు. వీఏఏ విఘ్నేష్, వీహెచ్ఏ గంగాభవానీ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయానికి రూ.లక్ష విరాళం

చింతూరు: మోతుగూడెంలో అయ్యప్పల కుటీరం నిర్మాణానికి జమాల్‌ఖాన్ ట్రస్టు రూ.లక్ష వితరణను బుధవారం నిమ్మలగూడెంలో అందజేసింది. అయ్యప్ప భక్తుల కోరిన విధంగా ఆర్థికంగా సాయపడేందుకు వితరణ ఇస్తున్నట్లు ఛైర్మన్ జమాల్‌ఖాన్ చెప్పారు. తెదేపా నాయకులు జహంగీరు, సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నమూనా చెక్కు అందజేస్తున్న జమాల్‌ఖాన్

గిరిజన సమాఖ్య మహాసభ 18న

ఎటపాక, న్యూస్‌టుడే: మారేడుమిల్లిలో ఈ నెల 18న నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వాసం రాము పలుపునిచ్చారు. క్రిష్టవరంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీను, శ్రీకాంత్, దుర్గారావు, పుల్లారావు, ఏసు, గోపాల్, కోటయ్యలు పాల్గొన్నారు.

ప్రాణాలు నిలిపేది రక్తదానం

పాడేరు, న్యూస్‌టుడే: రక్తదానంతో ప్రాణాలు నిలపొచ్చని, రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం పాడేరులో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అనేకమంది రక్తహీనతతో బాధపడుతున్నారని, గర్భిణులు, బాలింతలకు అత్యవసర సమయంలో శస్త్రచికిత్సలు నిర్వహించడం కోసం రక్తం అవసరం ఉంటుందని పేర్కొన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 18 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. జిల్లా వైద్యాధికారి కృష్ణమూర్తినాయక్, యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ జితేంద్రనాయక్, లీడ్ బ్యాంకు మేనేజర్ మాతునాయుడు, డాక్టర్ రాఘవేంద్రరావు, రెడ్‌క్రాస్ సంస్థ వైస్ ఛైర్మన్ గంగరాజు, కార్యదర్శి గౌరీశంకర్, కోశాధికారి సూర్యారావు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలతో అధికారులు

జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో ప్రతిభ

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న విజ్ఞాన్ మంథాన్ పోటీ పరీక్షల్లో రింతాడ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ప్రతిభ కనబరిచారని ప్రధానోపాధ్యాయిని సుమిత్ర తెలిపారు. పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులను అభినందించారు. ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం జ్ఞానభారతి ద్వారా విద్యార్థి విజ్ఞాన్ మంథాన్ పోటీ పరీక్షలు నిర్వహిస్తోందన్నారు. ప్రథమ దశలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో పదో తరగతి విద్యార్థినులు సాగిన తేజస్విని, బిసుదొర శ్రీవల్లి, తొమ్మిదో తరగతి విద్యార్థిని వంతల అఖిల ఉత్తీర్ణత సాధించి రెండో దశ పరీక్షలకు అర్హత సాధించారన్నారు. వార్డెన్ గంగాభవాని, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

విద్యార్థినులతో హెచ్ఎం సుమిత్ర, ఉపాధ్యాయినులు

వైద్యకళాశాలల ప్రైవేటీకరణ తగదు

పాడేరు, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం తక్షణమే వెనక్కు తీసుకోవాలని వైకాపా అల్లూరి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు డిమాండ్ చేశారు. బుధవారం పాడేరు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద వైకాపా ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అంతకుముందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి సబ్ కలెక్టరేట్ వరకు ర్యాలీగా చేరుకున్నారు. ఎంపీ తనూజారాణి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్తులను సీఎం చంద్రబాబునాయుడు తమ అనుచరులకు కట్టబెట్టే ఆలోచన చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం ఏఓ అప్పలస్వామికి వినతిపత్రం అందజేశారు.

అడ్డుమండలో ప్లకార్డులు పట్టుకున్న ఏఎన్ఎం, ప్రభుత్వ ఉద్యోగులు, వైకాపా నాయకులు

రంపచోడవరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో వైద్య కళాశాలలను ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం దారుణమని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పేర్కొన్నారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ రంపచోడవరంలో వైకాపా శ్రేణులు బైక్ ర్యాలీ చేశాయి. అనంతరం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మండల పార్టీ కన్వీనర్ జల్లేపల్లి రామన్నదొర, స్థానిక సర్పంచి మంగా బొజ్జయ్య, ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైకాపా నిరసనలో ప్రభుత్వ ఉద్యోగులు

హుకుంపేట మండలం అడ్డుమండలో సర్పంచి గుమ్మ శ్యామ్ ఆధ్వర్యంలో కోటిసంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఏఎన్ఎం, ప్రభుత్వ ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని స్థానికులు తెలిపారు. వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు డిమాండ్ చేశారు.

బిర్సా ముండా స్ఫూర్తితో పోరాటాలు

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరయోధులు బిర్సా ముండా స్ఫూర్తితో హక్కులు, చట్టాల రక్షణకు పోరాడదామని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ అన్నారు. బిర్సా ముండా 150వ జయంతి వారోత్సవాల్లో భాగంగా అరకులోయ దండకారణ్య కళాశాలలో విద్యార్థులతో కలసి ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. జిల్లాలో గిరిజన చట్టాలను నిర్వీర్యం చేస్తూ చేపడుతున్న హైడ్రో ప్రాజెక్టుకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాల్లో యువత భాగస్వాములవ్వాలని కోరారు. ప్రిన్సిపల్ రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరకులోయలో నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు, సంఘ నేతలు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: స్థానిక జూనియర్ కళాశాలలో బిర్సా ముండా జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. గిరిజన సంఘం ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ మాట్లాడుతూ.. ఆదివాసీల కోసం బిర్సా ముండా చేసిన పోరాటాలు చిరస్మరణీయమన్నారు.

జి.మాడుగుల, న్యూస్‌టుడే: జి. మాడుగుల గురుకుల పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ఏటీడబ్ల్యూవో నాగ శిరీష హాజరయ్యారు. విద్యార్థులతో మాక్ పార్లమెంట్ నిర్వహించారు. విద్యార్థులు వివిధ వేషధారణలతో చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపల్స్ వేణు, విజయకుమారి, ఆశ్రమ పాఠశాలల హెచ్ఎంలు బాలరాజు, సుభద్ర, ప్రదీప్‌చంద్ర పాల్గొన్నారు.

మాక్ పార్లమెంట్‌లో జి.మాడుగుల గురుకుల విద్యార్థులు

దిల్లీలో గిరిజన ఉత్పత్తుల ప్రదర్శన

చింతపల్లి: కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ దిల్లీలో నిర్వహించిన ట్రైబల్ బిజినెస్ కాన్‌క్లేవ్ (టీబీసీ) 2025లో చింతపల్లి ప్రాంతానికి చెందిన గిరిజన వికాస్ ఆధ్వర్యంలో మాతోట రైతు ఉత్పత్తిదారులసంఘం స్టాల్ ఏర్పాటుచేసింది. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జ్యూయల్‌ఓరం, కంట్రోలర్ జనరల్ డీపీఐఐటీ సిన్హా తదితరులు ఈ స్టాల్‌ను సందర్శించారు. మాతోట సీఈఓ చిన్నారావు పాల్గొన్నారు.

స్టాల్‌ను పరిశీలిస్తున్న అతిథులు

గంజాయి సాగు, రవాణా సమాచారమివ్వండి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: గంజాయి సాగు, రవాణా చేపడితే పోలీసులకు సమాచారమివ్వాలని ఈగల్ టీం సీఐ నారాయణరావు అన్నారు. వాసవ్య మహిళామండలి సభ్యులతో కలసి బుధవారం మేడూరు గ్రామ గిరిజనులకు అవగాహన కల్పించారు. హెడ్ కానిస్టేబుల్ ఎలీషా, వైస్ సర్పంచి రాము, సమన్వయకర్త సుబ్బారావు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సీఐ నారాయణరావు, సిబ్బంది

త్వరితగతిన 5, 6 యూనిట్ల పూర్తి

మోతుగూడెం, న్యూస్‌టుడే: లోయర్ సీలేరు ప్రాజెక్టులో ఏపీ జెన్‌కో విజయవాడ విద్యుత్ సౌధ హైడల్ డైరెక్టర్ సుజయ్ కుమార్ బుధవారం పర్యటించారు. సీలేరు విద్యుత్తు కాంప్లెక్స్ ముఖ్య ఇంజినీరు రాజారావు, అధికారులు సాదర స్వాగతం పలికారు. పొల్లూరు జలవిద్యుత్కేంద్రంలో నిర్మాణంలోనున్న 5, 6 యూనిట్లను పరిశీలించారు. ఈ యూనిట్లకు సంబంధించి బటర్‌ఫ్లై వాల్ కనెక్షన్, పెన్‌స్టాక్ పైప్‌లైన్ నిర్మాణం, సివిల్ పనుల వివరాలను ప్లాంట్ మేనేజర్ బాలకృష్ణ వివరించారు. సాధ్యమైనంత త్వరగా ఈ రెండు యూనిట్ల పనులు పూర్తి చేసి అదనంగా 230 మెగావాట్ల విద్యుదుత్పత్తిని ప్రారంభిస్తామన్నారు. ఓఅండ్ఎం ఎస్ఈ చినకామేశ్వరరావు, సివిల్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు నాగశ్రీనివాస్, టెక్నికల్ డీఈ వరప్రసాద్, సీనియర్ అకౌంట్ అధికారి వరప్రసాద్, ఏడీఈ కొండబాబు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న జెన్‌కో హైడల్ డైరెక్టర్ సుజయ్ కుమార్

పీహెచ్‌సీల్లో అన్నిరకాల మందులు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మలేరియా, టైఫాయిడ్, డయేరియా తదితర వ్యాధులకు సంబంధించిన అన్ని రకాల అత్యవసర మందులు, వ్యాక్సిన్లను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో డి.కృష్ణమూర్తినాయక్ అన్నారు. తాజంగి పీహెచ్‌సీని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, వార్డులు, ప్రసూతి గదిని పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, గ్రామాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది సందర్శనలు తదితర విషయాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులను వారం రోజులు ముందుగా వసతిగృహాలకు తరలించాలని పేర్కొన్నారు. తల్లిపాల ప్రాముఖ్యత, వ్యాధి నిరోధక టీకాలు, పోషకాహారం గూర్చి గిరిజనులకు అవగాహన కల్పించాలన్నారు. వైద్యులు సంతోష్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాజంగి పీహెచ్‌సీలో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో కృష్ణమూర్తి నాయక్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ
కార్యనిర్వాహక ఇంజనీరు కార్యాలయం, విజయనగరం

టెండర్ నోటీస్ నెం	పని పేరు	కాంట్రాక్ట్ విలువ
01/2025-26 తేది: 11-11-2025	అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం కొమ్మంగి (జిపి)కి చెందిన రౌరింతాడ (వి) సమీపంలో స్థానిక గెడ్డపై సౌరశక్తితో నడిచే ఎత్తిపోతల పథకం నిర్మాణం	రూ. 22,82,971/-
02/2025-26 తేది: 11-11-2025	అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం అడ్డుమండ (V) & (GP) సమీపంలో స్థానికగెడ్డపై సౌరశక్తితో నడిచే ఎత్తిపోతల పథకం నిర్మాణం	రూ. 24,22,210/-
03/2025-26 తేది: 11-11-2025	అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం కిండంగి (V) & (GP) సమీపంలో స్థానికగెడ్డపై సౌరశక్తితో నడిచే ఎత్తిపోతల పథకం నిర్మాణం	రూ. 23,31,084/-
04/2025-26 తేది: 11-11-2025	అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం తడిగిరి (V) & (GP) సమీపంలో స్థానికగెడ్డపై సౌరశక్తితో నడిచే ఎత్తిపోతల పథకం నిర్మాణం	రూ. 24,66,063/-
05/2025-26 తేది: 11-11-2025	అల్లూరిసీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండలం డి.వి.కోట (వి) సమీపంలోని పెద్ద కాలువపై సౌరశక్తితో నడిచే ఎత్తిపోతల పథకం నిర్మాణం	రూ. 23,26,601/-

"ఇ" ప్రొక్యూర్‌మెంట్ సైట్ నుండి టెండర్ షెడ్యూల్స్ 12-11-2025 ఉ॥ 10.00 గం॥ల నుండి తీసుకోవాల్సిన చివరి తేది: 26-11-2025 మ॥ 04.00 గం॥ల వరకు
ఆన్‌లైన్ ద్వారా టెండర్ స్వీకరించుటకు చివరి తేది: 26-11-2025 మ॥ 04.30 గం॥ల వరకు
టెండర్ ఆహ్వానించు అధికారి: కార్యనిర్వాహక ఇంజనీరు, ఫోన్ నెం. 9110752109
మిగిలిన వివరములు కొరకు www.apeprocurement.gov.in నందు లేదా మా యొక్క సహాయక కార్యనిర్వాహక ఇంజనీరు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ కార్యాలయం, విజయనగరం వారిని సంప్రదించగలరు. ఫోన్ నెం. 9550805224

పకడ్బందీగా ‘పది’ పరీక్షల నిర్వహణ

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షలు కట్టుదిట్టమైన భద్రత మధ్య పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రభుత్వ పరీక్షల నిర్వహణ అసిస్టెంట్ కమిషనర్ శశికుమార్ చెప్పారు. మండలంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను బుధవారం పరిశీలించారు. స్థానిక గురుకుల పాఠశాలతోపాటు బోదులూరులోని గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత బాలికల పాఠశాలను సందర్శించారు. ఆయా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, ప్రహరీలు, ఫర్నిచర్, లైట్లు, తాగునీటి వసతి, మరుగుదొడ్లు ఉన్నాయా అని ఆరా తీశారు. శత శాతం ఉత్తీర్ణత సాధించేలా ఇప్పట్నుంచే సన్నద్ధం కావాలని విద్యార్థులకు సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఎంఈవోలు నరసింహారావు, ముత్యాలరావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వెంకయ్య పాల్గొన్నారు.

ఎటపాక, న్యూస్‌టుడే: పాడేరు ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమీషనర్ శశికుమార్ బుధవారం గౌరిదేవిపేట జిల్లా పరిషత్, కొత్తూరు నారాయణపురం ఆశ్రమోన్నత పాఠశాలలను సందర్శించారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వాహణలో పాఠశాలల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మౌలిక వసతులను ఏవిధంగా ఉన్నాయో పరిశీలించి సూచనలు చేశారు. ఆయన వెంట మండల విద్యాశాఖాధికారి సరియం రాజులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ శశికుమార్

రబ్బరు రైతులకు సంక్షేమ పథకాలు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: రబ్బరు తోటలు సాగు చేస్తున్న రైతులకు ప్రయోజనకరంగా ఉండేందుకు రబ్బరుబోర్డు ఆధ్వర్యంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు ఆ బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ బినూమాథ్యూ వెల్లడించారు. వేటుకూరు పంచాయతీ పరిధి పందిరిమామిడికోటలో బుధవారం ఈ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రైతుల పిల్లలకు విద్యాభ్యాసానికి స్టైఫండ్‌తో పాటు, ఆరు నుంచి ఉన్నత చదువులకు వరకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. రబ్బరు బోర్డు అభివృద్ధి అధికారి సుశాంత్ కుమార్ నాయక్, ఏపీవో దేవదానం, క్షేత్రాధికారి సాయిమౌళి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రబ్బరుబోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ బినూమాథ్యూ

తాటాకిల్లు దగ్ధం

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: చెరుకుంపాలెం పంచాయతీ మిరియాలవీధిలో సత్యవతికి చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. ఆమె భర్త పెదకాపు అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం మృతిచెందారు. ఆ బాధ నుంచే తేరుకోకముందే బుధవారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో ఇల్లు అగ్నికి ఆహుతైంది. దీంతో ఆమె కట్టుబట్టలతో వీధిన పడ్డారు. బాధితురాలిని ఎస్సై చినబాబు, సర్పంచి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు సుబ్బారావు, అధికారులు పరామర్శించి.. బియ్యం నిత్యావసరాలు అందజేశారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	108	105
లైవ్	135	125
డ్రెస్డ్	196	220
స్కిన్‌లెస్	223	230

మేమున్నాం.. మీకు తోడుగా
పాడేరు: 89853 66570 అరకులోయ: 63034 86346 రంపచోడవరం: 94908 77172

హుకుంపేట, న్యూస్‌టుడే: మాయం గ్రామంలోని పాఠశాలలో 25 మంది విద్యార్థులు ఉన్నారు. భవనం లేకపోవడంతో పాకలో బడి నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. – రామారావు, గ్రామస్థుడు, ✓: నూతన భవనాలు మంజూరయ్యాయి. త్వరలో పనులు చేపడతాం. – చెల్లయ్య, డిప్యూటీ డీఈవో

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి ప్రధాన రహదారిలోని డ్రైనేజీలో శిథిలాలతోపాటు, చెత్త పేరుకుపోయి, అధ్వానంగా ఉండటంతో మురుగు పారడం లేదు. – గణేశ్, మారేడుమిల్లి, ✓: డ్రైనేజీల్లోని పూడిక తీయడానికి అవసరమైన చర్యలు చేపడతాం. – శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: కించాయిపుట్టు పంచాయతీలోని గుమ్మశిరగంపుట్టు నుంచి బరడ వెళ్లే మార్గంలో మట్టిరోడ్డుపై ప్రమాదాలు జరుగుతున్నాయి. తారురోడ్డును కలుపుతూ సిమెంటు రోడ్డు నిర్మించాలి. – లక్ష్మణ్, స్థానికుడు, ✓: ఈ మార్గంలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి జిల్లా పరిషత్ నిధులు కేటాయించారు. పనులు చేపడతాం. – మురళీకృష్ణ, మండల ఇంజినీరు, ముంచంగిపుట్టు

రంపచోడవరం ఎంపీడీవోగా ప్రసాద్

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం ఎంపీడీవోగా పీవీవీఎస్ ప్రసాద్ బాధ్యతలను చేపట్టారు. ఈయన అనకాపల్లి మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవో పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా డిప్యూటీ ఎంపీడీవో రాజాబాబు బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీవో ప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని 19 పంచాయతీలలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు చర్యలు చేపడతా న్నారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు.

అల్లూరి పార్కు సంగతి అంతేనా?

అల్లూరి నడయాడిన ప్రాంతంగా చారిత్రక నేపథ్యం ఉండటంతో పాడేరు కేంద్రంగా ఏర్పడిన కొత్త జిల్లాకు అల్లూరి సీతారామరాజు జిల్లాగా నామకరణంచేశారు. ఇక చింతపల్లి పేరు చెపితే విప్లవ వీరుడు అల్లూరే గుర్తుకొస్తారు. అప్పట్లో పోలీస్‌స్టేషన్‌పై ఆయన దాడి వంటి విశేషాలు చరిత్రపుటల్లో పదిలంగా ఉన్నాయి. ఇంతటి విశిష్టత కలిగిన చింతపల్లిలో అల్లూరి పార్కును ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వ హయాంలో ప్రకటించిన నేతలు.. ఆ ఊసే మరిచారు. మూడేళ్లు అవుతున్నా నేటికీ ముందడుగు పడలేదు. కేవలం అల్లూరి విగ్రహావిష్కరణ చేసి ఊరుకున్నారు. అల్లూరి జయంతి, వర్ధంతి సమయాల్లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి మమ అనిపిస్తున్నారు. నేటికీ పార్కు నిర్మాణం గురించి ఎవరూ పట్టించుకోవడంలేదు.
– న్యూస్‌టుడే, చింతపల్లి

బ్రిటిష్‌కాలంనాటి కట్టడంలో కొనసాగుతున్న ఖజానా కార్యాలయం

స్థల సమస్య

✦ ఉమ్మడి విశాఖ జిల్లాలో అన్ని ఉపఖజానా కార్యాలయాలకు సొంత భవనాల నిర్మాణాల కోసం గతంలో ప్రభుత్వం రూ.75 లక్షల నిధులు విడుదల చేసింది. చింతపల్లి ఉపఖజానా కార్యాలయం ఏర్పాటుకు నిధులు సిద్ధంగా ఉన్నా దీనికి స్థల సమస్య ఏర్పడింది. రెవెన్యూ అధికారులు గతంలో ఈ కార్యాలయం నిర్మాణానికి స్థలాన్ని కేటాయించారు. మరోవైపు ప్రస్తుతం ఉన్న భవనాన్ని పునర్నిర్మించేందుకు అవసరమైన కొలతలు కొలుచుకుని వెళ్లారు. ఈ పనులు సైతం ఇప్పటివరకూ ప్రారంభం కాలేదు. చారిత్రక నేపథ్యం కలిగిన ఈ ప్రాంతంలో అల్లూరి పార్కు ఏర్పాటవుతుందన్న ఆశ నెరవేరలేదు. ప్రస్తుత ప్రభుత్వం అయినా చింతపల్లిలో అల్లూరి పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

✦ ఇక్కడ ఉప ఖజానా కార్యాలయానికి చారిత్రక నేపథ్యం ఉంది. బ్రిటిష్ కాలం నుంచి ఈ కార్యాలయం చింతపల్లిలోనే కొనసాగుతోంది. అప్పట్లో బ్రిటిష్ పాలకులు నిర్మించిన భవనంలోనే ఇది ఇప్పటికీ కొనసాగుతుండటం విశేషం. దాదాపు 103 ఏళ్ల చరిత్ర దీనికి ఉంది. ఈ భవనానికి ఆనుకునే నాడు అల్లూరి సీతారామరాజు దాడి చేసిన పోలీస్‌స్టేషన్ భవనం ఉంది. ఈ ప్రాంతాన్ని చారిత్రక ప్రదేశంగా గుర్తించి.. ఇక్కడ అల్లూరి పార్కును నిర్మించాలని భావించింది కేంద్ర ప్రభుత్వం. దీనికోసం కొంత నిధులను కేటాయించింది. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యతలను క్షత్రియ పరిషత్, క్షత్రియ సేవాసమితికి అప్పగించారు. వీరి ఆధ్వర్యంలోనే 2022 ఆగస్టు 22న పార్కు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఉప ఖజానా కార్యాలయం ఎదుట అల్లూరి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి కేంద్ర గిరిజనవ్యవహారాలశాఖ మంత్రి అర్జున్ ముండా, రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి రాజన్నదొర ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆ తర్వాత పార్కు నిర్మాణ పనులు విస్మరించారు.

సర్వసభ్య సమావేశం రేపు

జి.మాడుగుల, న్యూస్‌టుడే: ఈనెల 14న మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ వేదెడ్ రాజు తెలిపారు. ఈనెల 13న జరగాల్సిన సమావేశం వాయిదా పడడంతో ఎంపీడీవో ఎస్.అప్పలరాజు ఆదేశాలతో 14న నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

డుంబ్రిగుడ: స్థానిక శాఖ గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి వారోత్సవాలను నిర్వహించనున్నామని గ్రంథాలయ అధికారిణి సునీత తెలిపారు. 20న జరిగే ముగింపు వేడుకల్లో విజేతలకు బహుమతులు ప్రదానంతోపాటు జ్ఞాపికలు అందజేయనున్నామని పేర్కొన్నారు.

హిందీ భాషపై ప్రతిభా పరీక్షలు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: హిందీ భాషపై అభిరుచి పెంపొందించేందుకు హిందీ సేవ సదన్ ఆధ్వర్యంలో డిసెంబరు 5 నుంచి ప్రతిభా పరీక్షలను నిర్వహించనున్నామని పాడేరు ఐటీడీఏ హిందీ ప్రచార కన్వీనర్ సూరిబాబు బుధవారం తెలిపారు. 5న పాఠశాల, వచ్చే ఏడాది జనవరి 4న జిల్లా స్థాయి పరీక్షలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. పూర్తి సమాచారం కోసం 89199 17096 నంబరులో సంప్రదించాలని కోరారు.

రైతు సేవా కేంద్రం ప్రారంభమెప్పుడు?

కొయ్యూరులో నూతనంగా నిర్మించిన రైతు సేవా కేంద్రం ప్రారంభానికి నోచుకోలేదు. భవనం లోపల విద్యుత్తు పరికరాలు అమర్చని కారణంగా దీన్ని ఇంకా ప్రారంభించలేదు. ఇప్పటికైనా కొద్దిపాటి పనులు పూర్తిచేసి ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు. ఈవిషయమై ఏఈ రామకృష్ణ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా.. విద్యుత్ పరికరాలు ఏర్పాటుకు మళ్లీ ప్రతిపాదనలు పంపామని, ఉన్నతాధికారులు సూచించిన విధంగా ఈ పనులను తొందరలోనే పూర్తిచేసి ప్రారంభిస్తామని పేర్కొన్నారు. – కొయ్యూరు, న్యూస్‌టుడే

కొయ్యూరులో పూర్తయిన రైతు సేవా కేంద్రం

అరధకోట వంతెన వద్ద ఇలా..

ఆదమరిస్తే అంతే!

పెదబయలు మండలం అరడకోట వంతెన వద్ద రక్షణ గోడలు అంతంతమాత్రంగా ఉండడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ఇక్కడ ప్రమాదకర మలుపు ఉండడంతో వేగంగా వచ్చే వాహనదారులు ఆదమరిస్తే గెడ్డలోకి దూసుకెళ్లే అవకాశం ఉంది. పెదబయలు నుంచి పాడేరు వెళ్లే మార్గంలో ముసడిపుట్టు, ఈదులపుట్టు వద్ద ఇలాంటి పరిస్థితులున్నాయి. ఇటువంటి చోట్ల ప్రమాదాల నివారణకు ఆర్‌అండ్‌బీ అధికారులు స్పీడ్‌బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని వాహనదారులు కోరుతున్నారు. – పెదబయలు, న్యూస్‌టుడే

ప్రయాణం.. నరకప్రాయం

రెండు మండలాలకు ఉపయోగపడే బంగారుమెట్ట-వంతాల రహదారి నిర్మాణం కలగానే మిగిలిపోయింది. పాడేరు మండలం బంగారుమెట్ట నుంచి జి.మాడుగుల మండలం వంతాల వరకు రహదారి నిర్మాణానికి గతంలో రూ.1.40 కోట్లు మంజూరైంది. అప్పట్లో మెటల్ వేసి వదిలేశారు. జనవరి తర్వాత రహదారి మెటల్ కొట్టుకుపోయింది. పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గంలో ప్రయాణించే ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగుల బాధలు వర్ణనాతీతం. జి.మాడుగుల మండలంలోని వంతాల, గడుతూరు, పెదలోచలి, సొలభం పంచాయతీల్లోని ప్రజలు ఈ మార్గానే వినియోగిస్తున్నారు. జిల్లా కేంద్రానికి వెళ్లాలన్నా, అత్యవసరంగా గర్భిణులు, రోగులను తరలించాలన్నా వీరికి ఇదే ప్రధాన మార్గం. అధికారులు చొరవ తీసుకొని బీటీ రహదారిని నిర్మించాలని వంతాల పంచాయతీ సర్పంచి పద్మ కోరారు.
– న్యూస్‌టుడే, జి.మాడుగుల

బంగారుమెట్ట-వంతాల రహదారిని చూపిస్తున్న సర్పంచి పద్మ

అందాల జలపాతం.. అప్రమత్తత అవసరం!

ఎత్తయిన కొండలు, పంట పొలాలు, పక్షుల కిలకిలారావాల మధ్య వల్లంపేట(గాది గుమ్మి) జలపాతం చూపరులను ఆకట్టుకుంటోంది. కొయ్యూరు మండలం కినపర్తి పంచాయతీలో ఈ జలపాతం ఉంది. అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కృష్ణదేవిపేటకు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంది. కార్తిక మాసంలో మన్యంతోపాటు, మైదాన ప్రాంతం నుంచి అధిక సంఖ్య ఇక్కడకు వస్తుంటారు. జలపాతం మధ్యలో తాటిచెట్టంతలోతులో అగాధం ఉండటంతో ఇప్పటివరకు దాదాపు 40 మంది మృత్యువాత పడ్డారు. ఈ నేపథ్యంలో ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. జలపాతం వద్ద కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రమాద హెచ్చరికను తెలిపే ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఇక్కడ వచ్చేవారు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.
– కొయ్యూరు, న్యూస్‌టుడే

అ వీ ఇ వీ

ఉద్యమానికి మద్దతు

సీలేరు, న్యూస్‌టుడే: ధారకొండ మండలం ఏర్పాటుచేయాలని చేపడుతున్న ఉద్యమానికి జనసేన పార్టీ మద్దతు తెలుపుతుందని ఆ పార్టీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ కార్య నిర్వాహక సభ్యుడు గొర్లె వీరవెంకట్, మండల ఉపాధ్యక్షుడు బత్తుల సిద్ధార్థమార్క్ తెలిపారు. బుధవారం ధారకొండలో ధారకొండ, గుమ్మిరేవుల, దుప్పిలవాడ, సీలేరు పంచాయతీ జనసైనికులతో సమావేశం నిర్వహించారు. మండల ఏర్పాటు ఆవశ్యకతను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గంగులయ్య ద్వారా తీసుకెళ్తామని తెలిపారు. మాజీ సర్పంచి జి.యేసువరరాజు, బాలకృష్ణ, ధారేశ్వరరావు, కోటి, పాల్గొన్నారు.

తెదేపా మండల కమిటీ ఎన్నిక

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: మండల తెదేపా అనుబంధ కమిటీలు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండల పార్టీ అధ్యక్షుడు పెద్దిరాజు తెలిపారు. పార్టీ ఉపాధ్యక్షులుగా మధుశేఖర్, సురేష్, ప్రధాన కార్యదర్శిగా గంగాధర్, యువత అధ్యక్షుడిగా అనుదీప్‌లు ఎన్నికయ్యారన్నారు. ఏఎంసీ ఛైర్మన్ లక్ష్మణరావు, సొసైటీ ఛైర్మన్ కేశవ్, పార్టీ సీనియర్ నాయకులు శివరామచంద్రరాజు, తాతారావు, నాయకులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం

జి.మాడుగుల, న్యూస్‌టుడే: జి.మాడుగుల మండల తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జులుగా వి.చిరంజీవినాయుడు, కె.శ్రీనివాసనాయుడు బుధవారం పాడేరులో ప్రమాణ స్వీకారం చేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

అక్రమ కట్టడాలను తొలగించాలి

చింతూరు, న్యూస్‌టుడే: చింతూరు డివిజన్‌లో గిరిజనేతరులు నిర్మించుకున్న అక్రమ కట్టడాలను తొలగించాలని ఏవీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీను రంపచోడవరం ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్‌కు బుధవారం వినతి పత్రం అందించారు. సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లను సిబ్బందిని పోలవరం కార్యాలయాలకు డిప్యూటేషన్‌పై పంపడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

కార్మిక చట్టాల అమలుకు పోరాటం

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: కార్మిక చట్టాల అమలుకు పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణీశ్రీ పిలుపునిచ్చారు. మారేడుమిల్లిలో బుధవారం సీఐటీయూ ఆరో మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకురాలు మేరీమణి జెండాను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వాణీశ్రీ మాట్లాడుతూ కార్మికుల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా ఈతపల్లి సత్యనారాయణ రెడ్డి, కో-కన్వీనర్‌గా బట్టా లచ్చిరెడ్డితోపాటు, మరో 25 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కంభం శాంతిరాజు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకుడు తీగల శ్రీనివాస్ పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరిస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

ఆదివాసీల కల.. నెరవేరిన వేళ!

సందడిగా గృహ ప్రవేశాలు

అరకులోయ, అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఆవాస్ యోజన, పీఎం జన్‌మన్ పథకంలో పూర్తి చేసిన గృహ ప్రవేశాలు జిల్లావ్యాప్తంగా బుధవారం సందడిగా జరిగాయి. అరకులోయ మండలంలోని కొత్తభల్లుగుడ పంచాయతీ సిమిలిగుడ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పాడేరు ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ పాల్గొని లబ్ధిదారులకు తాళాలు అందజేశారు. ఆర్డీవో లోకేశ్వరరావు, తహసీల్దార్ కూమారస్వామి, ఎంపీడీవో లవరాజు, సర్పంచి రాధిక తదితరులు పాల్గొన్నారు. అనంతగిరి మండలంలోని బెడ్డగుడ గ్రామంలో గృహ నిర్మాణ సంస్థ ఏఈ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సందడిగా జరిగింది. గ్రామంలో బురిడి భాగ్యవతి ఇంటి ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, తహసీల్దారు వీరభద్రచారి హాజరయ్యారు.

డుంబ్రిగుడ, ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: కొర్రా పంచాయతీలోని పెదపాడులో గృహ ప్రవేశాలను కూటమి నేతలు, అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి నంద్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ సుబ్బారావు, ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్ లబ్ధిదారులకు హక్కుపత్రాలు అందజేశారు. తెదేపా, జనసేన మండల అధ్యక్షులు ఆనంద్, దన్నేశ్వరరావు, సర్పంచి అర్జున్ పాల్గొన్నారు. ముంచంగిపుట్టు మండలంలో 469 గృహాల ప్రవేశాలు నిర్వహించినట్లు గృహనిర్మాణశాఖ ఏఈ కృష్ణారావు తెలిపారు. ముంచంగిపుట్టులో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ ధర్మారావు, తెదేపా మండల అధ్యక్షురాలు సన్యాసమ్మ, సీడీపీఓ విమలకుమారి పాల్గొన్నారు.

కొయ్యూరు, చింతపల్లి గ్రామీణం, గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: డౌనూరు పంచాయతీ బచ్చింత గ్రామంలో జరిగిన కార్యక్రమంలో జీసీసీ మాజీ ఛైర్మన్ ఎంవీవీ ప్రసాద్, ఎంపీపీ రమేష్‌బాబు, ఎంపీడీవో ప్రసాదరావు, సర్పంచి భవానీ, హౌసింగ్ ఇన్‌ఛార్జి ఏఈ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. చింతపల్లి మండలంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ అనూషాదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, సర్పంచి పుష్పలత పాల్గొన్నారు. దామనాపల్లి పంచాయతీ గొడుగుమామిడిలో గృహప్రవేశాల కార్యక్రమం సందడిగా జరిగింది. ఎంపీడీవో రమణబాబు, ఏఈఈ లక్ష్మీవిమల, సర్పంచి రామకృష్ణ హాజరయ్యారు.

రాజవొమ్మంగి, వరరామచంద్రాపురం: చిన్నయ్యపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఆర్డీవో అంబేడ్కర్, ఏఎంసీ ఛైర్మన్ లక్ష్మణరావు, ఏపీఐఐసీ డైరెక్టర్ పెద్దిరాజు, ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, గృహ నిర్మాణ సంస్థ ఏఈ శ్రీకాంత్ పాల్గొన్నారు. గుల్లేటివాడలో గృహ ప్రవేశాలను తహసీల్దార్ సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీపీ లక్ష్మీ హాజరయ్యారు.

అడ్డతీగల, దేవీపట్నం, ఎటపాక, న్యూస్‌టుడే: అనిగేరు గ్రామంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ రుక్మాంగదయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సర్పంచి పి.చిట్టమ్మ, తహసీల్దార్ దొరకయ్య, ఎంపీడీవో కుమార్ పాల్గొన్నారు. అంగులూరులో సుబ్బారెడ్డి గృహప్రవేశాన్ని అధికారులు, నేతలు నిర్వహించారు. ఎంపీడీవో సాల్మన్‌రాజు, తహసీల్దార్ సత్యనారాయణ, తెదేపా మండలాధ్యక్షుడు చంటిబాబు పాల్గొన్నారు. గౌరిదేవిపేట, గొమ్ముకొత్తగూడెం, పిచుకలపాడు, రాయనిపేట పంచాయతీల్లో సందడిగా ఈ కార్యక్రమం నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యురాలు ఉబ్బా సుష్మిత, తహసీల్దార్ శ్రీనివాసరావు హాజరయ్యారు.

బెడ్డగుడలో లబ్ధిదారుకు తాళం అందజేస్తున్న తహసీల్దారు, జడ్పీటీసీ సభ్యుడు తదితరులు

దేవీపట్నం మండలం అంగులూరులో..

కొయ్యూరు మండలం బచ్చింతలో..

రక్షిత జలంతో ఆరోగ్యం

అరకులోయ/పట్టణం, న్యూస్‌టుడే: కాచిన, శుద్ధనీటితోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐటీడీఏ పీఓ తిరుమణి శ్రీపూజ అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఎస్ఆర్ ప్రాజెక్టులో భాగంగా రూ.3 లక్షల నిధులతో అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను యూబీఐ ప్రాంతీయ హెడ్ జితేంద్ర శర్మతో కలసి పీఓ బుధవారం ప్రారంభించారు. ఆర్వో ప్లాంట్ సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. గ్రామాల్లో కాచిన నీటిని తాగేలా అవగాహన కల్పించేలా విద్యార్థులు చొరవ చూపాలని సూచించారు. సైబర్ నేరాలు, ఏఐపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఏఐకి సంబంధించిన పుస్తకాలను పలువురు విద్యార్థులకు అందజేశారు. యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ జితేంద్ర శర్మ మాట్లాడుతూ.. బ్యాంకుల రుణాలు, స్వయం ఉపాధికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను విద్యార్థులకు తెలిపారు. అంతకు ముందు కళాశాలలో విద్యార్థినులు థింసా నృత్యాలతో స్వాగతం పలికారు. పీఓ విద్యార్థినులతో కలసి నృత్యం చేశారు. ప్రిన్సిపల్ చలపతిరావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులు, సిబ్బందితో కలిసి థింసా నృత్యం చేస్తున్న ఐటీడీఏ పీవో శ్రీపూజ

పురస్కార గ్రహీతకు సన్మానం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మారుమూల గ్రామానికి చెందిన గిరి మహిళ అడపా లక్ష్మి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతులమీదుగా రైతునేస్తం అవార్డును అందుకోవడం అభినందనీయమని తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ దివాకర్‌మూర్తి అన్నారు. చింతపల్లి తపాలాశాఖ కార్యాలయంలో బుధవారం ఆమెను సత్కరించారు. గూడెంకొత్తవీధి మండలం జర్రెల గ్రామానికి చెందిన లక్ష్మి సేంద్రియ ఎరువులతో పలు రకాల పంటలు, కాఫీ, మిరియాలు, రాజ్‌మా చిక్కుళ్లు, పసుపు, అల్లం, మొక్కజొన్న వంటివి సాగు చేస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నారన్నారు. తపాలా సిబ్బంది శ్రీనివాస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చందాలతో రోడ్డు బాగు

పెదబయలు గ్రామీణం: గంపరాయి పంచాయతీ జామిగుడ, ఉర్రాడ గ్రామస్థులు చందాలు వేసుకొని రోడ్డు బాగు చేసుకుంటున్నారు. ఈ గ్రామాలకు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రోడ్డు సదుపాయం కలగానే మిగిలింది. ఈ రెండు గ్రామాలకు వైకాపా ప్రభుత్వంలో రూ.1.24 కోట్లతో రోడ్డు మంజూరైంది. తూతూమంత్రంగా పనులు చేపట్టి నిధులు లేవని అసంపూర్తిగా వదిలేశారు. అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో రెండు గ్రామాల ప్రజలు చందాలు వేసుకుని పొక్లెయిన్‌తో రహదారిని చదును చేసుకున్నారు. అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మించాలని స్థానికులు కొర్రా వీరన్న, కొర్రా నీలకంఠం తదితరులు కోరుతున్నారు.

మరమ్మతులు చేస్తున్న గ్రామస్థులు

ఒకటే బోరు.. 350 మంది విద్యార్థులు


విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నేతల నిరసన

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వసతిగృహంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం నిరసన చేపట్టారు. కళాశాల నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ధర్నా చేశారు. తాగునీరు, మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. కళాశాల ఆవరణలో ఒకే బోరు ఉండటంతో 350 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. హెల్త్ వాలంటీర్లను నియమించాలని గిరిజన సంఘం మండల అధ్యక్షులు శ్రీను, కార్యదర్శి నర్సయ్య డిమాండు చేశారు. ఎంపీడీఓ ధర్మారావుకు వినతిపత్రం అందించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు రాందాసు, పవన్‌చందు, శ్రావణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రాకపోకలకు తీవ్ర అంతరాయం

అనంతగిరి, న్యూస్‌టుడే: అనంతగిరి ఘాట్‌రోడ్డులో రహదారికి అడ్డంగా లారీ నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఐదో నంబరు మలుపు సమీపంలో సిమెంటు లోడుతో వెళుతున్న భారీ లారీ సాంకేతిక కారణంతో నిలిచిపోయింది. రహదారి మధ్యన ఉండిపోవటంతో మిగతా వాహనాల రాకపోకలు స్తంభించాయి. చిన్న వాహనాలు వెళ్తున్నప్పటికీ భారీ వాహనాలు రాకపోకలు సాగించడం లేదు. మెకానిక్ మైదాన ప్రాంతం నుంచి రావాల్సి ఉండటంతో బుధవారం రాత్రి వరకు మరమ్మతు పనులు జరగలేదు. లారీ లోడుతో ఉండటంతో వాహనాన్ని పక్కకు తీసేందుకు వీల్లేకపోయింది. గురువారం మధ్యాహ్నం వరకు లారీ అడ్డంగా ఉండిపోయే పరిస్థితి ఉంది.

ఐదో నంబరు మలుపు వద్ద నిలిచిన లారీ

వైభవంగా రుద్రాభిషేకం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ముంచంగిపుట్టులోని దుర్గమ్మ ఆలయంలో రుద్రాభిషేకం కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆర్ట్‌ఆఫ్‌లివింగ్ సంస్థ(బెంగళూరు) నుంచి వచ్చిన నిర్మలానంద స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. స్వామి మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సర్వరోగాల నివారణకు ప్రతిఒక్కరూ యోగా సాధన చేయాలని చెప్పారు. ఆర్ట్‌ఆఫ్‌లివింగ్ సంస్థ ప్రతినిధి, స్థానిక బాలకల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంవీఎస్ ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అధికసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు, వ్యాపారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రుద్రాభిషేకంలో అర్చకులు, భక్తులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: అల్లూరి జిల్లావ్యాప్తంగా అటవీ వనరులను కాపాడడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. అంజోడ సిల్క్‌ఫాం పీనరీలో అటవీశాఖ ఆధ్వర్యాన కార్తిక వన సమారాధన కార్యక్రమం బుధవారం జరిగింది. డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి, పాడేరు ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ, జిల్లా అధికారులు కుటుంబసమేతంగా పాల్గొన్నారు. మొక్కలను నాటారు. కలెక్టర్ క్రికెట్ బ్యాటింగ్, డీఎఫ్‌వో కీపింగ్ చేశారు. మ్యూజికల్ ఛైర్‌లో పీవో ఉత్సాహంగా పాల్గొన్నారు. అటవీశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాటింగ్ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, కీపింగ్‌లో డీఎఫ్‌వో

ఘనంగా అయ్యప్ప అంబలం పూజ

సీలేరు అంబలం పూజలో మాలధారులు

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరు శివాలయం వీధిలో అయ్యప్ప అంబలం పూజ బుధవారం సాయంత్రం ఘనంగా జరిగింది. కె.భవానీ శంకర్, కాశీ గురుస్వామిల ఆధ్వర్యంలో ఈ పూజ నిర్వహించారు. ధారకొండ, చిత్రకొండ, డొంకరాయి, మోతుగూడెంలకు చెందిన మాలధారులు పాల్గొన్నారు. గురుస్వామి మణీనాయర్, దామోదర్ స్వామి అయ్యప్ప స్వామికి విశేష అలంకరణ చేశారు. అరటి చెట్లతో ఏర్పాటు చేసిన ఆలయ నమూనా, మెట్లు ఆకట్టుకున్నాయి.

ఇరుముడి కట్టు.. అన్నవరం గట్టెక్కు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: ఉమ్మడివరంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం ఉదయం సత్యదేవుని దీక్షాపరులు ఇరుముడి కట్టుకుని ప్రత్యేక వాహనాల్లో అన్నవరం బయలుదేరారు. కొన్నిరోజుల క్రితం పవన్‌గిరి స్వామీజీ సహకారంతో చింతరేవుపల్లి, అన్నవరం, ఉమ్మడివరం, ప్రత్తిపాక తదితర గ్రామాల నుండి 26 మంది ఆదివాసీలు స్వామి దీక్షలు శ్రీరామగిరి రామాలయంలో తీసుకున్నారు. దీక్షరోజులు పూర్తవ్వడంతో వారంతా కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి దర్శనానికి వెళ్లారు.

ఇరుముడితో వీఆర్‌పురంలో సత్యదేవుని దీక్షధారులు

పరిహారం అందించాలని వినతి

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: పోలవరం పరిహారాన్ని తమ పంచాయతీలోని మిగిలిన గ్రామాలకు త్వరగా అందించాలని వడ్డిగూడెం సర్పంచి నర్సమ్మ, కూటమి నాయకులు బొర్రా నరేశ్, సాయికృష్ణ, రాంబాబు ప్రత్యేక ఉప కలెక్టర్లను చింతూరు ఐటీడీఏ బుధవారం కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. నిర్వాసితుల కట్టడాల విలువ, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని వీఆర్‌పురం, వడ్డిగూడెం గ్రామస్థుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. ధర్మతాళ్లగూడెం గ్రామస్థులకు కట్టడాల పరిహారం అందించాలన్నారు. బొడ్డు సత్యనారాయణ, సిద్ధార్థ, అంజనారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డీసీకి వినతిపత్రం అందిస్తున్న సర్పంచి, కూటమి నాయకులు

(c) eenadu

ప్రత్తిపాడు ఎంపీపీపై అవిశ్వాసానికి సిద్ధం

ప్రత్తిపాడు(కాకుమాను), న్యూస్‌టుడే: ప్రత్తిపాడు మండల పరిషత్ అధ్యక్షురాలు అన్నమ్మపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు ఎంపీటీసీ సభ్యులు సిద్ధమయ్యారు. ఈ నెల 21న తీర్మానం ప్రవేశపెట్టేందుకు ఆర్డీవో శ్రీనివాస్ నోటీసులు జారీ చేశారు. ఎంపీపీ అధ్యక్ష పీఠంపై వైకాపాలో వర్గ పోరు రచ్చకెక్కింది. గతంలో కుదిరిన ఒప్పందం ప్రకారం రెండున్నరేళ్లు పూర్తైన తరువాత ఎంపీపీ పదవిని ఆశావహులకు కేటాయించాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న ఎంపీపీ పదవికి రాజీనామా చేయకపోవడంతో సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు సిద్ధమయ్యారు. ఉప ఎంపీపీపై కూడా అవిశ్వాస తీర్మానం చేయాలని మరో [illegible] ఉన్నతాధికారులకు సభ్యులు అందజేశారు.

అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు అవకాశం

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: అనుమతి లేకుండా, ప్లాను కన్నా ఎక్కువగా గత ఆగస్టు 31లోపు నిర్మించిన భవనాల క్రమబద్ధీకరణకు (బీపీఎస్) జీవో నంబరు 225 ద్వారా ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయని పేర్కొన్నారు. వచ్చే 120 రోజుల్లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 1997 డిసెంబరు 1కు ముందు నిర్మించినవాటికి పీనల్ ఛార్జీల్లో 25 శాతం రాయితీ, 60 చదరపు గజాల్లోపు జీ+1 నివాస భవనాలకు పూర్తిగా మినహాయింపు కల్పించినట్లు వివరించారు. జీఎంసీ లైసెన్స్ పొందిన ఇంజినీర్ ద్వారా సంబంధిత భవనం ప్లాన్, దస్తావేజులు, పన్ను రసీదు, ఈసీ, మార్కెట్ విలువ ధ్రువపత్రం, గతంలో ఉన్న భవనం ప్లాను, ప్రస్తుత భవనం ఫొటోలు 2, అండర్ టేకింగ్ లెటర్లు అందజేయాలని పేర్కొన్నారు. రూ.10 వేల ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనుమతుల్లేని లేఅవుట్లలో నిర్మించిన భవనాలకు ఎల్ఆర్ఎస్ పీనల్ ఛార్జీలు చెల్లించి.. నిబంధనలకు లోబడి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

జూదంలో పట్టుబడ్డ పోలీసులపై వేటు

గుంటూరు నేరవార్తలు: జూదం ఆడుతూ పట్టుబడిన ముగ్గురు పోలీసులను సస్పెండ్ చేస్తూ ఎస్పీ వకుల్ జిందాల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల పెదకాకాని పోలీసుస్టేషన్ పరిధిలోని ఓ హోటల్‌లో జూదం ఆడుతున్నారన్న సమాచారంతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మికంగా దాడులు చేశారు. అక్కడ మద్యం తాగి జూదం ఆడుతున్న వారిలో పోలీసులు ఉండటం చూసి నిర్ఘాంతపోయారు. వారిపై కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదికలు అందించారు. పెదకాకాని ఏఎస్సై కె. వెంకటరావు, గుంటూరు తూర్పు ట్రాఫిక్ పోలీసుస్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ సీహెచ్ రాధాకృష్ణ, తుళ్లూరు హెడ్ కానిస్టేబుల్ ఆర్. రాజేంద్రప్రసాద్‌లను సస్పెండ్ చేసినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.

జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు 26న

జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్తు స్థాయీ సంఘ సమావేశాలను ఈనెల 26న ఏర్పాటు చేస్తూ జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 1, 2, 4, 7 స్థాయీ సంఘాలను జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరుగనున్నాయి. జడ్పీ ఉపాధ్యక్షులు శొంఠిరెడ్డి నర్సిరెడ్డి 3వ కమిటీ, బత్తుల అనూరాధ 6వ కమిటీ, తెనాలి జడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి 5వ కమిటీకి అధ్యక్షత వహించి నిర్వహించనున్నారు.

ధర వింటే.. గుండె దడే

భారంగా మారిన కూరగాయలు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: కూరగాయల ధరలు మండిపోతున్నాయి. నెల రోజులతో పోలిస్తే కొన్ని రకాల ధరలు రెట్టింపయ్యాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట దెబ్బతినడం, సరకు తక్కువగా రావడం, డిమాండ్ ఎక్కువగా ఉండడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని రైతులు, వ్యాపారులు, అధికారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా దొండ, బీర, వంగ, పెద్దచిక్కుళ్లు, గోరు చిక్కుళ్లు, క్యారెట్ ధరలు అధికంగా పెరిగాయి. వర్షాలతో పూత, పిందె రాలిపోయి పంట దిగుబడి తగ్గిపోవడం ధరలపై ప్రభావం చూపుతోంది. గతంలో కిలో చొప్పున తీసుకెళ్లేవారు సైతం ఇప్పుడు అరకిలో చాలనే పరిస్థితి నెలకొంది.

సెంచరీ దాటిన పెద్దచిక్కుళ్లు: రైతుబజారులోనే కిలో రూ.114 ఉంది. మార్కెట్, మాల్స్‌లో ఇంకా ఎక్కువే. నారాకోడూరు, వేజండ్ల, నల్లపాడు ప్రాంతాల్లో వర్షాలకు పంట పాడై దిగుబడి తగ్గిపోయింది.

టమాటా: చిత్తూరు, అనంతపురం జిల్లాల నుంచి దిగుమతి అవుతుంది. కృష్ణనగర్ రైతుబజారుకు గతంలో రోజుకు 25 క్వింటాళ్ల సరకు వచ్చేది. ఇప్పుడు 15 క్వింటాళ్లే వస్తుండడంతో ధర రెట్టింపైంది.

బెంబేలెత్తిస్తున్న బీర: నారాకోడూరు, దోసపాలెం, ఓబులనాయుడుపాలెం, పొన్నూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో బీర పండిస్తారు. వర్షాలకు పూత, పిందె రాలిపోవడంతో సకాలంలో పంట రావడం లేదు. కృష్ణనగర్ రైతు బజారుకు నిత్యం 10 క్వింటాళ్లు వచ్చే సరకు ఇప్పుడు ఆరు క్వింటాళ్లకు తగ్గిపోయింది.

వంగ కొనాలంటే బెంగ: దోసపాలెం, యనమదల, నారాకోడూరు, పొత్తూరు, ఓబులనాయుడుపాలెం తదితర ప్రాంతాల్లో వర్షాలకు వంగ పంట దెబ్బ తింది. పొదిలి, మార్కాపురం తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడంతో ధర అమాంతం పెరిగింది.

గుంటూరు కృష్ణనగర్ రైతుబజారులో ధరలు (కిలో రూ.)

కూరగాయలు	అక్టోబరు 13	నవంబరు 12	మార్కెట్లో
పెద్దచిక్కుళ్లు	65	114	130
వంకాయలు	32	72	80
టమాటా	16	30	50
దొండ	27	59	80
బీర	38	50	70
గోరుచిక్కుడు	39	63	80
క్యారెట్	49	69	100
బెండ	20	45	60
దోస	14	27	40
సొర	15	38	60

అర్ధ సెంచరీ దాటిన దొండ: గతంలో 12 క్వింటాళ్ల సరకు రైతు బజారుకు వచ్చేది. ప్రస్తుతం 7 క్వింటాళ్లకు పడిపోయింది. నారాకోడూరు నుంచి దొండకాయలు ఎక్కువగా వచ్చేవి. ప్రస్తుతం డిమాండ్ మేర రావడంలేదు.

క్యారెట్ కోసం ఎదురుచూపులు: క్యారెట్ బెంగళూరు నుంచి వస్తుంది. ఇంతకుముందు క్వింటాళ్లు వచ్చే సరకు ప్రస్తుతం 4క్వింటాళ్లకే పరిమితమైంది. బీట్‌రూట్, గోరుచిక్కుళ్లు, బెండ, కాకర, బీన్స్, సొర ధరలది అదే పరిస్థితి.

★ ధరల్లో పెద్దగా మార్పు లేనివి అరటి, మునగ, బంగాళదుంప మాత్రమే. కూరగాయలు బదులు ఎక్కువగా చారు, ఆకుకూరల పప్పుతో సరిపుచ్చుకోవాల్సి వస్తోందని గృహిణులు అంటున్నారు.

ఆలోచనలు అదిరే.. ఆవిష్కరణలు మెరిసే...

ఏఎన్‌యూలో ఎన్‌సీసీ ఆల్ ఇండియా ఐడియా అండ్ ఇన్నోవేటివ్ కాంపిటీషన్

ఈనాడు, అమరావతి న్యూస్‌టుడే, ఏఎన్‌యూ

హ్యాక్ చేయడానికి వీల్లేని డ్రోన్...

రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే ఆసుపత్రికి, అధికారులకు సమాచారమిచ్చే ఆవిష్కరణ...

అసలు రోడ్డు ప్రమాదాలకు ఆస్కారమే లేకుండా ప్రత్యేక పెయింటింగ్‌తో కట్టడి చేసే ఆలోచన..

పిల్లల ఆరోగ్య పరిస్థితులు వారి కాళ్లకున్న బూట్ల ద్వారా తెలుసుకునేలా రూపొందించిన వ్యవస్థ...

జనసమ్మర్ధ ప్రదేశాల్లో ప్రతి ఒక్కరినీ, అక్కడి పరిస్థితిని పక్కాగా గుర్తించే నిఘా వ్యవస్థ...

ఇలాంటి ఎన్నో వినూత్న ఆలోచనలు.. ఆవిష్కరణలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికైంది. బుధవారం నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) ఆల్ ఇండియా ఐడియా అండ్ ఇన్నోవేషన్ కాంపిటీషన్ (ఐసీసీ)- 2025ను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో కాకినాడ ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్స్ సమన్వయంతో నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఎన్‌సీసీ క్యాడెట్లు 85 వినూత్న ఆవిష్కరణలు ప్రదర్శించారు. ఉత్తమంగా ఎంపికైనవాటిని దిల్లీ ప్రదర్శనలో ఉంచుతామని.. రక్షణ, ఇతర రంగాల్లో వినియోగించడానికి ఉన్న అవకాశాలపై అధ్యయనం చేస్తామని ఎన్‌సీసీ అధికారులు వివరించారు.

ప్రాజెక్టు: ఆప్టికల్ ఫైబర్ డ్రోన్
తయారీదారులు: విక్రాంత్‌చౌదరి, హార్దిక్ మిత్తల్, మయూర్ చౌదరి (బీటెక్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు)
స్వస్థలం: జైపూర్, రాజస్థాన్
పరికరాలు: 6ఎల్‌డీసీ బ్రష్‌లెస్ మోటార్లు, 5,200 ఎంఏహెచ్ బ్యాటరీ, పిక్సో ఫ్లైట్ కంట్రోల్, జీపీఎస్ కంపాస్ మాడ్యుల్.
ప్రత్యేకతలు: ఇది ఆప్టికల్ ఫైబర్ డ్రోన్. హ్యాక్ చేయలేరు. 3 నుంచి 4 కిలోల పేలోడ్ పేలుడు పదార్థాలను తరలిస్తుంది. 2 కిలోమీటర్ల నుంచి 30 కిలోమీటర్ల రేడియస్‌లో పనిచేస్తుంది. సైన్యంలో కౌంటర్ ఎటాక్‌కు ఉపయోగపడుతుంది. వ్యయం రూ.70 వేలలోపే. ఇలాంటివి ప్రస్తుతం రష్యా మాత్రమే వినియోగిస్తోంది.

ప్రాజెక్టు: వ్యర్థాల నుంచి సౌర విద్యుత్తు
తయారీదారులు: అతిష్య లుహాడియా, శౌర్యస్వామి
స్వస్థలం: జైపూర్, రాజస్థాన్
ప్రత్యేకతలు: ఓ హీటింగ్ ఛాంబర్.. దాని చుట్టూ నాలుగు సౌర పలకలు ఏర్పాటు చేసి బ్యాటరీ, ఎల్ఈడీలకు అనుసంధానించారు. ఛాంబర్ పైభాగంలో గ్యాస్ కలెక్టర్ పైపు ఏర్పాటు చేసి, కార్బన్ ఫిల్టర్లతో అనుసంధానించారు. హీటింగ్ ఛాంబర్‌లో వ్యర్థాలను మండించినప్పుడు ఆ వేడి, కాంతితో చుట్టూ ఏర్పాటు చేసిన సౌర పలకలు విద్యుదుత్పత్తి చేసి బ్యాటరీలో నిల్వ చేస్తాయి. బూడిద, ధూళి కణాలు గ్యాస్ కలెక్టర్ పైపు ద్వారా కార్బన్ ఫిల్టర్లలోకి చేరి.. కార్బన్‌గా మారుతాయి. వాటిని కాంక్రీటు మిశ్రమాల్లో, ఇంకు తయారీలో వినియోగించవచ్చు.

ప్రాజెక్టు: ఏఐ యాక్సిడెంట్ అలెర్ట్ సిస్టమ్ యూజింగ్ సీసీటీవీ
రూపకర్తలు: సాక్షి రంజిత్ దియోర్
స్వస్థలం: వడోదర, గుజరాత్
పరికరాలు: సీసీటీవీ లేదా వెబ్‌కెమెరా
ప్రత్యేకతలు: రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్తే ప్రాణాలు దక్కే అవకాశం ఎక్కువ. ప్రమాదం జరిగాక సీసీ కెమెరా లేదా వెబ్‌కెమెరా ద్వారా సమీపంలోని ఆసుపత్రి, పోలీసులు, అధికారులకు క్షణాల్లో సమాచారం చేరేలా ఏఐ ఆధారితంగా ఈ ప్రాజెక్టును రూపొందించారు. గుజరాత్‌లోని వడోదరాలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు.

రూ.18 కోట్లు తినేద్దామని!

- బోగస్, నకిలీ బిల్లులతో గుత్తేదారుల మాయాజాలం
- ఆమోదించకుండా అడ్డుకున్న జీఎంసీ అధికారులు

ఈనాడు - అమరావతి

ప్రజా ధనమే కదా.. పప్పు బెల్లాల్లా పంచేసుకోవాలనుకున్నారు... తప్పుడు, నకిలీ బిల్లులు సృష్టించారు.. వాటితో ఖజానాకు చిల్లు పెట్టేందుకు ప్రయత్నించారు కొంతమంది గుత్తేదారులు.. అదీ ఏకంగా రూ.18 కోట్లకు. అధికారుల క్షేత్ర స్థాయి పరిశీలనలో వాస్తవాలు బయటపడి.. ఆ బిల్లుల చెల్లింపును ఆపేశారు.

పూడిక తీయని పీకల వాగు

పూడికతీతవే ఎక్కువ

పక్కన పెట్టేసిన బిల్లుల్లో అత్యధిక శాతం మురుగుకాలువల్లో పూడిక తీతకు సంబంధించినవే. తొమ్మిది డీసిల్టేషన్ పనులపరంగా కాలువల్లో అక్కడక్కడా కొంతవరకు వ్యర్థాలను తొలగించి.. మొత్తం పనులు చేసేసినట్టుగా బిల్లులు పెట్టడాన్ని అధికారుల బృందం తనిఖీల్లో గుర్తించింది. కొన్ని పనుల్లో గ్రావెల్ తవ్వకాలు, తరలింపు పేరుతో తప్పుడు లెక్కలు చూపినట్టు తెలుస్తోంది. చివరకు జీఎంసీపరంగా నిర్వహించిన ఉత్సవాలు, జాతీయ పండగలు.. ఇలా అనేక కార్యక్రమాల్లో రెట్టింపు మొత్తాల్లో బిల్లులు పెట్టినట్టు తేలింది. ఏకంగా రూ.10 కోట్ల వరకు నకిలీ, బోగస్ బిల్లులున్నట్టు సమాచారం. అరకొరగా పనులు చేసి పెట్టినవి రూ.8 కోట్ల వరకు ఉన్నట్టు చెబుతున్నారు. జీఎంసీలో మొత్తం రూ.75 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉంటే... ఇందులో రూ.18 కోట్లు ఈ తరహాలో ఉండడం గమనార్హం.

విజిలెన్స్‌కు సిఫార్సు?

బిల్లుల మాయాజాలంపై విజిలెన్స్ విచారణ చేయించే దిశగా జీఎంసీ వర్గాలు కసరత్తు చేస్తున్నాయి. కొన్ని కీలక నివేదికలను ఇప్పటికే సిద్ధం చేయగా.. సమగ్ర విచారణకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ తతంగంలో చివరకు వాస్తవాలు నిగ్గు తేలుతాయా.. లేక రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి మిన్నకుండిపోతారా? అన్నది వేచి చూడాల్సిందే.

జీఎంసీలో ఏటా రూ.వందల కోట్ల విలువైన పనులు జరుగుతుంటాయి. గత ఐదు నెలల్లోనే రూ.500 కోట్ల పనులు మొదలయ్యాయి. తాజాగా స్థాయీ సంఘ సమావేశంలో మరో రూ.66 కోట్ల పనులకు ఆమోదం లభించింది. పారదర్శకత, నాణ్యత విషయాల్లో మాత్రం ఎన్నో లోపాలు బయటపడుతున్నాయి. ఓ పక్క చేసిన పనులకు బిల్లులు రావడం లేదని కొంతమంది గుత్తేదారులు ఆవేదన చెందుతుంటే.. మరోవైపు పూర్తిగా చేయనివాటికే బిల్లులు మంజూరు చేయాలంటూ మరికొంతమంది గుత్తేదారులు.. అధికారులపై తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు తీసుకురావడం గమనార్హం.

పేదల సొంతింటి కల నెరవేరుస్తాం

వింజనంపాడు (వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ముందుకెళ్తున్నారని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులో పీఎంఏవై అర్బన్ (ప్రధాన మంత్రి ఆవాస్ యోజన) నిధులతో నిర్మించిన పక్కా భవనాలను ఆమె బుధవారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విజన్-2047 లక్ష్యంగా ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. జిల్లాలో సుమారు 11 వేల గృహాలు నిర్మించాలనే లక్ష్యం పెట్టుకోగా.. 97 శాతం వరకు పూర్తయ్యాయని తెలిపారు. ఇంటి స్థలం లేని పేదలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, అర్హులకు స్థలంతోపాటు నిర్మాణానికి నిధులు ఇస్తామని వెల్లడించారు. ఎమ్మెల్యే బూర్ల మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.ఐదు వేల కోట్లు ఖర్చు చేసి అసంపూర్తిగా ఉన్న ఇళ్లను ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. గత ప్రభుత్వంలో నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో పేదలకు ఇళ్లు నిర్మించి గొప్పగా ప్రచారం చేసుకున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి ఒక్కో లబ్ధిదారుడికి రూ.3 లక్షలు ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. కూటమి నాయకులు కొర్రపాటి నాగేశ్వరరావు, గింజుపల్లి వెంకటేశ్వరరావు, మర్రి సాంబశివరావు, గుంటుపల్లి చింపిరయ్య, నాగరాజు, నార్నె బాబు, సర్పంచి నార్నె రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ ఉప్పుటూరి సుజాత, హౌసింగ్ పీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులతో కలిసి ఇంటిని ప్రారంభిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే రామాంజనేయులు

కృష్ణా వరద తగ్గుముఖం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నది వరద ప్రవాహం బుధవారం తగ్గుముఖం పట్టింది. ఉదయం ఆరు గంటలకు ఎగువ నుంచి 71,150 క్యూసెక్కులు వచ్చింది. ఈక్రమంలో 60,150 క్యూసెక్కులను సముద్రంలోకి, 11,000 క్యూసెక్కులను కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు విడుదల చేశారు. తర్వాత క్రమేపీ తగ్గింది. మధ్యాహ్నం 3 గంటలకు ఎగువ నుంచి 47,250 క్యూసెక్కులు రాగా, సముద్రంలోకి 36,250 క్యూసెక్కులు విడుదల చేశారు. ఎగువ నుంచి వచ్చే వరద సాయంత్రం ఆరు గంటలకు 35,868 క్యూసెక్కులకు తగ్గింది. దీంతో 35 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. మిగతా 35 గేట్లు మూసివేశారు. 25,375 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. అలాగే కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 4,740, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 5,527, గుంటూరు ఛానల్‌కు 226 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి రైవస్‌కు 3,003, ఏలూరు 937, కేఈబీ 500, బందరు కాల్వలకు 300 క్యూసెక్కుల మేర ఇస్తున్నారు.

పోలీసు అధికారులపై అంబటి జులుం

డీఎస్పీ, సీఐలపై అసభ్య పదజాలం.. పట్టాభిపురం సీఐని తోసేసి రౌడీయిజం

కలెక్టరేట్, పట్టాభిపురం, న్యూస్‌టుడే: మాజీ మంత్రి, వైకాపా నేత అంబటి రాంబాబు రెచ్చిపోయారు. విధుల్లో ఉన్న పోలీసు అధికారులపై జులుం ప్రదర్శించి, అసభ్య పదజాలంతో దూషించారు. డీఎస్పీ స్థాయి అధికారిని సైతం ఏకవచనంతో సంబోధిస్తూ వాగ్వాదానికి దిగారు. పట్టాభిపురం సీఐను బలవంతంగా పక్కకు నెట్టి రౌడీయిజం చేశారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై వైకాపా జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీకి పిలుపునిచ్చారు. అనుమతి లేదని డీఎస్పీ అరవింద్, సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపినా వినలేదు. కంకరగుంట వంతెన పైకి వెళ్లనివ్వకుండా పోలీసులు బారికేడ్లను అడ్డుపెట్టారు. అంబటి అనుచరగణంతో బారికేడ్లను బలవంతంగా నెట్టుకుని వంతెన పైకి వెళ్తుండగా అడ్డుకున్న పోలీసులను నెట్టేశారు. సీఐ వెంకటేశ్వర్లు, డీఎస్పీ అరవింద్‌తో వాగ్వాదానికి దిగారు. లా అండ్ ఆర్డర్‌కు ఆటంకం కలిగిస్తున్నారని డీఎస్పీ చెబుతున్నా.. అంబటి 'మాకు తెలియదు మరి.. మేము చిన్నపిల్లలం.. మీరు చెప్తే వినాలి'.. అని కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. సీఐను బలవంతంగా తోసి పక్కకు నెట్టడంతో ఆయన టోపీ కింద పడిపోయింది. అడ్డుకున్న కానిస్టేబుల్‌పైనా దురుసుగా వ్యవహరించారు. గతంలోనూ ఇదే సీఐపై అంబటి జులుం ప్రదర్శించారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ రాజనారాయణ పాల్గొన్నారు.

పోలీసు అధికారులతో వాగ్వాదానికి దిగిన మాజీ మంత్రి అంబటి రాంబాబు

విధులకు ఆటంకం.. బెదిరించినందుకు కేసులు

పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు, బెదిరించినందుకు అంబటి రాంబాబుతో పాటు పలువురు వైకాపా నేతలపై పట్టాభిపురం ఠాణాలో కేసు నమోదు చేశారు. అనుమతులు లేకపోయినా భారీ ప్రదర్శన నిర్వహించి ట్రాఫిక్‌కు ఆటంకం సృష్టించి ప్రజలకు అసౌకర్యం కలిగించడం, పోలీసుల అధికారులపై దౌర్జన్యం చేయడం, మీ సంగతి తేలుస్తామని బెదిరింపులకు దిగడం, 30 పోలీస్ యాక్టు అతిక్రమించినందుకు పోలీసులు బీఎన్ఎస్ 132, 126(2), 351(3), 189(2), రెడ్ విత్ 190 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

విద్యా బోధనలో సమస్య-పరిష్కారం అవసరం

సీఐఐ - విట్ ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ కాంక్లేవ్‌లో మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి - న్యూస్‌టుడే, తుళ్లూరు: రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ కింద ప్రతి యూనివర్సిటీలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, ఇంక్యుబేషన్ హబ్‌లు, పేటెంట్ సెల్‌లు, స్టార్టప్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ సూచించారు. బుధవారం అమరావతిలోని విట్ ఏపీ యూనివర్సిటీలో నిర్వహించిన సీఐఐ - విట్ ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ కాంక్లేవ్ - 2025లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

'కరిక్యులమ్ టు కేరీర్‌లో పుస్తకాల్లోని పాఠాలే కాకుండా నైపుణ్యం, సమస్య-పరిష్కారాలతో కూడిన విద్యాబోధన అవసరం. ఇందుకోసం పరిశ్రమలతో కలిసి సిలబస్ రూపొందించాలి. డిజిటల్ భవిష్యత్తు నైపుణ్యాల్లో భాగంగా ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, సెమీ కండక్టర్స్, గ్రీన్ టెక్నాలజీ అండ్ రోబోటిక్ కోర్సులు విస్తరించాలి. ప్రతీ గ్రాడ్యుయేట్ డిజిటల్ నైపుణ్యం కలిగి ఉండాలి.' **- మంత్రి లోకేశ్**

★ **విట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జి.వి.సెల్వం మాట్లాడుతూ..** సాంకేతికత మన ఉత్పాదకతను పెంచడానికి, పనులను సులభతరం చేయడానికి, కొత్త అవకాశాలను సృష్టించడానికి ఉద్దేశించిందని.. మన సృజనాత్మకత, స్వతంత్ర ఆలోచనలను అది దెబ్బతీయకూడదన్నారు. కార్యక్రమంలో విట్ ఏపీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.వి.కోటారెడ్డి, అశ్విన్ మహాలింగం, ఫిలిప్ ఆస్మస్, కె.రత్న షీలామణి, శరణం నరేంద్రకుమార్ తదితరులు తమ అభిప్రాయాలు తెలిపారు. దాసరి రామకృష్ణ, జి.పార్థసారథివర్మ, బొర్రా సురేష్‌బాబు, పొత్తూరి రవికుమార్‌రాజు, ఎస్.రాజారామ్, గోరంట్ల శ్రీనివాసరావు, ఎం.లక్ష్మీప్రసాద్, స్విట్జర్లాండ్‌కు చెందిన క్లైమెన్స్ కోపేకిన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి

264 అదనపు పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 264 అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రాష్ట్ర ఎన్నికల అధికారికి ఆమోదం కోసం అందించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి తెలిపారు. కలెక్టరేట్‌లోని వీసీ హాలులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఖాజావలి మాట్లాడుతూ 88 పోలింగ్ కేంద్రాల ప్రదేశాల మార్పు, 13 కేంద్రాల పేర్ల మార్పునకు ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో 1,920 పోలింగ్ కేంద్రాలుండగా.. ప్రస్తుతం ప్రతిపాదించిన వాటితో కలిపితే ఆ సంఖ్య 2,184కు చేరుతుందన్నారు. సమావేశంలో ఈఆర్వోలు గంగరాజు, చల్లా ఓటులేసు, ఎన్నికల విభాగ పర్యవేక్షకురాలు మల్లేశ్వరి, పార్టీల ప్రతినిధులు టి.సేవాకుమార్(ఆప్), వాసు(బీఎస్పీ), వైవీ సుబ్బారావు(భాజపా), బి.సునీల్ కుమార్(కాంగ్రెస్), కె.శివరామయ్య(తెదేపా), సీహెచ్.త్రినాథ్(జనసేన) పాల్గొన్నారు.

ఎర్రుపాలెం-నంబూరు రైల్వే లైన్‌కు.. భూసేకరణ వేగవంతం

నందిగామ, కంచికచర్ల, న్యూస్‌టుడే: నవ్యాంధ్ర రాజధాని అమరావతిని కలుపుతూ ఎర్రుపాలెం-నంబూరు మధ్య కొత్త రైల్వే లైన్ ఏర్పాటులో భాగంగా అవసరమైన భూముల సేకరణకు అధికారులు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి 20ఏ నోటిఫికేషన్ జారీ చేశారు. అనంతరం రైతుల పేర్లతో త్వరలో 20ఈ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ❖ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం వద్ద నుంచి అమరావతి మీదుగా గుంటూరు జిల్లా నంబూరు వరకు కొత్త రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీని ద్వారా రాజధానికి రైల్వే లైన్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. ❖ కంచికచర్ల మండలం పరిటాల వద్ద రైల్వేస్టేషన్ రానుంది. దీనికి నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలోని వీరులపాడు, కంచికచర్ల మండలాల్లో 297 ఎకరాలు సేకరించాలని నిర్ణయించారు. ❖ రెండు మండలాల పరిధిలో 8 గ్రామాల్లో ఎక్కడెక్కడ భూములు అవసరమో గుర్తించారు. ఈ మేరకు ప్రాథమికంగా గతంలో నోటిఫికేషన్ జారీ చేసిన విషయం విదితమే. ఆయా గ్రామాల పరిధిలో రైల్వే లైన్ ఏర్పాటు వల్ల కలిగే సమస్యలను రైతులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ❖ పొలాలకు వెళ్లే డొంక రోడ్లు మీదుగా వెళ్తుండడం వల్ల రాకపోకలకు ఇబ్బంది అవుతోందని చెప్పారు. వీటన్నింటిని నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ పరిశీలిస్తున్నారు. ❖ త్వరలో జారీ చేయనున్న 20ఈ నోటిఫికేషన్ అనంతరం గ్రామాల్లో సభలు పెట్టి రైతుల అభిప్రాయాలను స్వీకరిస్తామని ఆర్డీవో తెలిపారు. అనంతరం ఉన్నతాధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పరిధిలోని గ్రామాలు.. కావాల్సిన భూమి (ఎకరాల్లో..)

కంచికచర్ల మండలం:
గొట్టుముక్కల (50.490),
పరిటాల(72.425)

వీరులపాడు మండలం:
జుజ్జూరు (28.894),
గూడెంమాధవవరం (7.712)
చెన్నారావుపాలెం (26.459)
పెద్దాపురం (50.922)
అల్లూరు (43.152)
నరసింహారావుపాలెం (17.445)

ఎక్కడ ఏమున్నాయో?

విస్తృతస్థాయిలో పోలీసుల సోదాలు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: దేశ రాజధానిలో కారు బాంబు పేలుడు ఘటన నేపథ్యంలో బుధవారం పోలీసులు గుంటూరులోని రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, వాణిజ్య సముదాయాలు, రద్దీ ప్రాంతాల్లో విస్తృతంగా సోదాలు చేశారు. పేలుడు పదార్థాలు, మాదక ద్రవ్యాలు సహా ఇతర ప్రమాదకర పరికరాలను గుర్తించేందుకు పోలీసు జాగిలాలతోపాటు బాంబు నిర్వీర్య నిపుణులు వచ్చారు. ప్రయాణికుల లగేజి బ్యాగులు, పార్సిల్ కార్యాలయాల వద్ద పెట్టెలు, గోతాలు, టికెట్ కేంద్రాలు, వాహనాల పార్కింగ్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. అనుమానాస్పదంగా కనిపించినవారి గురించి ఆరా తీసి.. వారి బ్యాగ్‌లు సోదా చేశారు. ఏఎస్పీ హనుమంతు, కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి, జీఆర్పీ సీఐ అంజిబాబు, ఆర్పీఎఫ్ సీఐ వీరయ్య, ఆర్ఐలు సురేష్, శ్రీహరిరెడ్డి, ఎస్సై రమేష్, ఆర్ఎస్సై జ్యోతి సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో పోలీసుల తనిఖీలు

పాతనేరస్థులపై నిఘా.. రాష్ట్రవ్యాప్తంగా పాతనేరస్థులపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)తోపాటు ప్రత్యేక విభాగ పోలీసులు నిఘా పెట్టారు. గుంటూరు జిల్లాలో సంగడిగుంట, పొన్నూరు రోడ్డు, పొత్తూరువారితోట, చేబ్రోలు మండలం వేజండ్లకు చెందిన నలుగురు ఎన్ఐఏ కేసుల్లో ఉన్నట్లు తెలిసింది. వీరి కార్యకలాపాలపై ఆరా తీస్తున్నారు.

శ్రద్ధాంజలి

జననం 08-07-1942

మరణం 03-11-2025

కీ॥శే॥ డా॥ చిరుమామిళ్ల మాధవసాయి గారు
MBBS., M.S
Ophthalmologist, గుంటూరు

ది. 03-11-2025 సోమవారం స్వర్గస్తులైనారని తెలియజేయుటకు చింతిస్తున్నాము.

పెద్దకర్మ: ది: 15-11-2025 శనివారం కృష్ణా జిల్లా, చల్లపల్లి మండలం పాగోలు గ్రామములోని మా స్వగృహము నందు జరుపబడును. కావున తెలియచేయడమైనది.

ఇట్లు
కుటుంబ సభ్యులు

(c) eenadu

రోడ్డు డొల్ల.. ఒళ్లు గుల్ల

తుళ్లూరు-పెదపరిమి మధ్య గోతులు

మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్ రోడ్డు ఇలా..

కీలక రహదారులు అధ్వానంగా మారి వాహనచోదకులు నరకం చూస్తున్నారు. తుళ్లూరు, తాడికొండ మధ్య బీటీ గోతులతో ఆర్ అండ్ బీ రోడ్డు ప్రమాదకరంగా మారింది. గోతుల దాటికి ఐదేళ్ల మూడు టిప్పర్లు అదుపు తప్పి బోల్తా కొట్టాయి. మరో 3 లారీల చక్రాల కట్టలు అకస్మాత్తుగా విరిగిపోయాయి. గుంటూరు వైపు నుంచి రాజధాని ప్రాంతంలోని హైకోర్టు, సచివాలయం, ప్రముఖ యూనివర్సిటీలకు వేల సంఖ్యలో విద్యార్థులు, ఉద్యోగులు జిల్లుగానే రాకపోకలు సాగిస్తున్నారు. మరో వైపు పెదపరిమి నుంచి నెక్కల్లు వెళ్లే మార్గంలో వంతెన వద్ద ఐదేళ్ల కరిసిన వర్షానికి రోడ్డు కోతకు గురై కంకర బయట పడింది.

గుంటూరు గ్రామీణం పరిధిలోని నల్లపాడు నుంచి కలకత్తా-చెన్నై జాతీయ రహదారి చేరేందుకు మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మించారు. వర్షాలకు రహదారి పూర్తిగా ధ్వంసమైంది. అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారు. ఈ రోడ్డు నగరపాలక సంస్థ పరిధిలో రావడంతో ఆర్ అండ్ బీ అధికారులు మరమ్మతుల పని తమ పరిధి కాదని చెబుతున్నారు.

-న్యూస్‌టుడే, గుంటూరు రూరల్, తుళ్లూరు

పీఎఫ్ చందా వివరాలు.. అగమ్యగోచరం

ఉపాధ్యాయులు, ఉద్యోగులకు తిప్పలు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో 2022, జనవరిలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు 10 వేల మందికి సంబంధించిన వేతనాల బిల్లులను డీడీవోలు ఆన్‌లైన్‌లో పెట్టకుండానే రాష్ట్ర ప్రభుత్వం నేరుగా వేతనాలు విడుదల చేసింది. ఉద్యోగుల మూల వేతనంలో ఎంపిక చేసుకున్న విధంగా భవిష్య నిధి (పీఎఫ్)కి సంబంధించి చందా మినహాయించారు. ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఉపాధ్యాయులు, ఉద్యోగుల ఖాతాలకు జమ కాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉపాధ్యాయుల సంఘాల నాయకులు, ఏపీ ఎన్జీవోల నాయకులు సీఎం చంద్రబాబు, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో టీచర్లు, ఉద్యోగుల బకాయిలు రూ.2 కోట్లను ప్రభుత్వం 2024, అక్టోబరులో విడుదల చేసింది. రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు 3,84,547 మందికి 45 బిల్లుల్లో సీఎఫ్ఎంఎస్ ద్వారా బకాయిలు చెల్లించారు. అయితే ఒక్కో బిల్లులో వివిధ జిల్లాలకు చెందిన 8 వేలకు పైగా టీచర్లు, ఉద్యోగుల పేర్లు ఉన్నాయి. దాంతో జిల్లాకు చెందిన 10 వేల మంది ఉద్యోగుల వివరాలను తెలుసుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని జడ్పీ పీఎఫ్ విభాగాల సిబ్బంది పేర్కొంటున్నారు. జిల్లాలో 539 మంది డీడీవోలు ఉన్నారు. వీరి నుంచి ఉద్యోగుల పీఎఫ్‌కు సంబంధించి షెడ్యూళ్లు ఫారాలు వస్తేనే వివరాలు తెలిసే అవకాశముంది.

జడ్పీ అధికారులు బిల్లులు పెట్టినా..

పీఎఫ్ బకాయిలకు సంబంధించి వివరాలు మొదట ట్రెజరీ నుంచి జడ్పీకి చేరతాయి. ట్రెజరీ అధికారులు కూడా వివరాలు సమర్పించకపోవడంతో జడ్పీ పీఎఫ్ విభాగం సిబ్బంది వివరాల కోసం ప్రయత్నించినా సాధ్యం కాలేదంటున్నారు. మరోవైపు అక్టోబరులో ఉద్యోగ విరమణ చేసిన వారు, నవంబరులో ఉద్యోగ విరమణ పొందనున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పీఎఫ్ మొత్తం ముగించేందుకు దరఖాస్తు చేసుకుంటే 2022, జనవరి నెలకు సంబంధించి షెడ్యూళ్లు సమర్పించాలని జడ్పీ సిబ్బంది స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే పలువురు ఉద్యోగులు గతంలో పని చేసిన పాఠశాలలు, కార్యాలయాల నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీలు అయ్యారు. పూర్వం పనిచేసిన పాఠశాలల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పని చేస్తున్న పాఠశాలల హెచ్ఎంలు షెడ్యూళ్లపై సంతకాలు చేయకపోవడంతో ఏం చేయాలో తెలియని గందరగోళ పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. జడ్పీ అధికారులు బిల్లులు పెట్టినా ఆడిట్ అధికారులు అభ్యంతరాలు తెలియజేస్తూ తిరస్కరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల మధ్య పాఠశాలలు, జిల్లాపరిషత్తు కార్యాలయాల చుట్టూ తిరగలేక పలువురు విశ్రాంత ఉద్యోగులు 2022, జనవరి పీఎఫ్ చందా నగదు అవసరం లేదని, భవిష్యత్తులో అడగబోమని లేఖలు రాసిస్తున్నారు. వారి పీఎఫ్ నిధులు క్లియర్ చేసే పనిలో జడ్పీ సిబ్బంది ఉన్నారు. సీఎఫ్ఎంఎస్‌లో 2022, జనవరిలో వేతనాల బిల్లుల వివరాలను తెలియజేస్తే ప్రభుత్వం అక్టోబరులో చెల్లించిన 45 బిల్లుల్లో జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు, ఉద్యోగుల వివరాలను ఆన్‌లైన్‌లో తెలుసుకుని వారి ఖాతాలకు నగదు జమ చేసేలా ప్రణాళిక రూపొందించారు.

జీజీహెచ్‌లో వృద్ధుడికి అరుదైన గుండె శస్త్రచికిత్స

మాట్లాడుతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ, పక్కన డాక్టర్ శ్రీకాంత్ తదితరులు

గుంటూరు(నగరంపాలెం), న్యూస్‌టుడే: గుంటూరు జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స చేసి వృద్ధుడి ప్రాణాలు కాపాడినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వీ రమణ తెలిపారు. గుంటూరు సర్వజనాసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ రమణ మీడియాకు బుధవారం ఆ వివరాలు వెల్లడించారు. ప్రకాశం జిల్లాకు చెందిన యేసయ్యకు గుండెపోటు రావడంతో గత నెలలో జీజీహెచ్‌లో చేరారన్నారు. రోగికి రెండు వాల్వ్‌లు పూడుకుపోవడంతో బైపాస్ సర్జరీ చేయాల్సి ఉందని, అయితే 70 ఏళ్లు దాటడంతో కుటుంబ సభ్యులు ఆసక్తి చూపలేదన్నారు. దీంతో గుండె జబ్బుల విభాగాధిపతి డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో వైద్య నిపుణులు చర్చించి బైఫర్‌కేషన్ విధానంలో రెండు స్టెంట్లు వేసినట్లు తెలిపారు. దాదాపు రూ.7 లక్షల విలువైన శస్త్రచికిత్సను ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఉచితంగా చేసినట్లు పేర్కొన్నారు. రోగి పూర్తిగా కోలుకోవడంతో ఇంటికి పంపామన్నారు. సమావేశంలో గుండెజబ్బుల వైద్య విభాగం వైద్య బృందం డాక్టర్లు బుచ్చిబాబు, శివాజీ, శివశంకర్ పాల్గొన్నారు.

సృజనాత్మకతే నూతన ఆవిష్కరణలకు నాంది

బహుమతులు గెలుపొందిన విద్యార్థులతో ఫిస్ట్ జెన్ ప్రతినిధులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: ఏపీ వీఐటీ విశ్వవిద్యాలయంలో ఫిస్ట్ జెన్ (యూకే) ఆధ్వర్యంలో ఐఈఎస్ ఇన్నోవేషన్, ఏపీ వీఐటీ యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహించిన ఫిస్ట్ జెన్ ఐడియేషన్ ఛాలెంజ్-2025 కార్యక్రమం బుధవారం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా 900 పైగా విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలను సమర్పించారు. 'ఇన్నోవేట్ ఫర్ ఏ బెటర్ టుమారో' అనే థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వీసీ ఎస్.వి కోటా రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని నూతన ఆవిష్కరణల ఆధారిత విద్య ప్రాధాన్యాన్ని వివరించారు. ఫిస్ట్ జెన్ వ్యవస్థాపకుడు సీఈవో ఫిలిప్ అస్మస్ (స్విట్జర్లాండ్) క్లేమెన్స్ ప్రసంగిస్తూ విద్యార్థి ఆధారిత ఇన్నోవేషన్ ప్రపంచంపై చూపే ప్రభావాన్ని వివరించారు. ఐఈఎస్ మేనేజింగ్ డైరెక్టర్ రాజ్ వంగపండు, ప్రొ. డా.బెర్‌ట్రామ్‌లు విద్యావ్యవస్థ, ఆవిష్కరణల మధ్య ఉన్న అనుసంధానంపై ప్రసంగించారు. అనంతరం ఉత్తమ ఆవిష్కరణల విజేతలకు నగదు బహుమతులు అందజేసి సత్కరించారు.

మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎ.కె.బాషా, రామకృష్ణప్రసాద్ తదితరులు

న్యాయవాదుల రక్షణ చట్టం అమలుకు విజ్ఞప్తి

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల రక్షణకు చట్టం తీసుకురావాలని ఏపీ స్టేట్ బార్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎ.కె. బాషా, జనరల్ సెక్రెటరీ వై.శివసుబ్రహ్మణ్యం తదితరులు మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. రక్షణ చట్టం అమలు కోరుతూ డోన్ నుంచి న్యాయవాదులు కృష్ణప్రసాద్, ఈశ్వరయ్య చేపట్టిన పాదయాత్ర మంగళవారం విజయవాడలో ముగిసింది. వీరంతా బుధవారం మంత్రి లోకేశ్‌ను కలిసి, న్యాయవాదుల రక్షణ చట్టం ఆవశ్యకతను వివరించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని.. చట్టం అమలు కోసం విధి విధానాలను రూపొందిస్తున్నామని, త్వరలో చట్టాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారని బాషా తెలిపారు. మంత్రి లోకేశ్‌ను కలిసిన వారిలో బీబీఏ సంయుక్త కార్యదర్శి జి.వరాహలక్ష్మి, సీనియర్ న్యాయవాది గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ తదితరులు ఉన్నారు. తొలుత దిల్లీ మారణహోమానికి నిరసనగా న్యాయవాదులు నల్లబ్యాడ్జీలు ధరించి సంఘీభావం తెలిపారు. మౌనం పాటించి మృతులకు నివాళులర్పించారు.

'రాజకీయ ముసుగులో దళారులను కొంత వరకే సహిస్తా'

మాట్లాడుతున్న ధూళిపాళ్ల నరేంద్రకుమార్

గుంటూరు(పట్టాభిపురం), న్యూస్‌టుడే: 'జనసేన ముసుగులో కొందరు తెదేపాలో విభేదాలు సృష్టిస్తున్నారు. పొన్నూరు నియోజకవర్గంలో వైకాపాలో ఉన్నవారు ఇప్పుడు జనసేనలో చేరుతున్నారు. కార్యకర్తల కోసం ఎంత దూరమైనా వెళ్తా. . రాజకీయ ముసుగులోని దళారులను ఒక్కటే చెబుతున్నా.. కొంత వరకే నేను సహిస్తా'.. అని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ హెచ్చరించారు. గుంటూరు తెదేపా జిల్లా కార్యాలయంలో పొన్నూరు నియోజకవర్గంలోని మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీల నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం బుధవారం జరిగింది. ఏపీఐడీసీ ఛైర్మన్, పరిశీలకులు డేగల ప్రభాకర్, కసుకుర్తి హనుమంతరావు హాజరయ్యారు. ఎమ్మెల్యే నరేంద్ర మాట్లాడుతూ 'మా కుటుంబ పరపతిని దెబ్బ తీయాలని చూస్తే సహించేది లేదు. చాలామంది రాజకీయ దళారులు రాబోతున్నారు. వాళ్లతో జాగ్రత్తగా ఉండాలి. ఎన్నికలకు ముందు తెదేపాతో కలిసి అడుగులు వేసిన జనసేన, భాజపా నాయకులకు అండగా ఉంటాం. కూటమి అధికారంలోకి వచ్చాక పార్టీలు మారేవారు వచ్చి విచ్ఛిన్నం చేయాలనే చూస్తే సహించేది లేదు. వైకాపా అధికారంలోకి వచ్చాక బాబూరావును దారుణంగా కొట్టి రోడ్డుపై పడేశారు. రాష్ట్ర స్థాయి నాయకులు.. గ్రామ స్థాయి నాయకులతో కలిసి పని చేయకపోతే వేరే నియోజకవర్గానికి వెళ్లిపోండి. సంగం డెయిరీపై కేసులు వేస్తారు. అందులో వైకాపా నాయకులతో పాటు తెదేపా, కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా ఉంటారు. నా పోరాటం నేనే చేస్తా.. అందులోకి కార్యకర్తల్ని లాగను. కొన్ని పత్రికల్లో నాపై తప్పుడు ప్రచారాలు చేసి లబ్ధి పొందాలని చూస్తున్నారు. నేను ఎటువంటి తప్పుడు పనులు చేయను. ఎప్పుడూ కార్యకర్తల కోసమే పని చేస్తా. నూతనంగా నిర్మించే వైద్య కళాశాలల్ని ప్రైవేటు పరం చేస్తున్నారని వైకాపా నాయకులు తప్పుదోవ పట్టిస్తున్నారు. సీఎం చంద్రబాబు హయాంలో ఎయిమ్స్ ప్రారంభిస్తే వైకాపా అధికారంలోకి రాగానే మంచినీటి సరఫరా పైపులైను నిధుల్ని నిలిపివేసి జగన్ తన అనుచరులకు నెలకు రూ.2 కోట్లు మంచినీటి సరఫరా కాంట్రాక్టు అప్పగించారు. అటువంటి వ్యక్తి వైద్య కళాశాలల గురించి మాట్లాడటం సిగ్గుచేటు. దేవుడి సొమ్మునూ దోచేసిన నాయకులు ఎవరైనా ఉన్నారంటే వైకాపా నేతలే'.. అని ధ్వజమెత్తారు.

అమ్మే భారమైందా..?

కుమారులతో మాట్లాడుతున్న తహసీల్దార్

కొల్లిపర, న్యూస్‌టుడే: రామచంద్రయ్య ఎంతపనిచేశావయ్య అంటు వృద్ధురాలు విలపించిన తీరు కన్నీరు పెట్టించింది. కుమారుల తీరుపై తహసీల్దార్ సిద్ధార్థ ముందు ఆ వృద్ధురాలు కన్నీటి పర్యంతమైంది. చివలూరుకు చెందిన వృద్ధురాలు కౌశల్య భర్త రామచంద్రయ్య మృతి చెందారు. కుటుంబ ఆస్తిని, వ్యవసాయ భూములను పంచుకున్న కుమారులు ఇంట్లో నుంచి గెంటేశారని ఆ తల్లి వాపోయింది. వృద్ధురాలి ఆవేదనతో చలించిన తహసీల్దార్ బుధవారం క్షేత్రస్థాయిలో కుటుంబ సభ్యులతో సమావేశమయ్యారు. కొడుకుల తీరును తప్పుపట్టారు. కొడుకులు గోపాలకృష్ణ, శ్రీనివాస్‌ల పేరిట దాఖలు చేసిన భూమి దస్తావేజులను రద్దు చేస్తానంటూ హెచ్చరించారు. నివాసస్థలం, డాబాలో తల్లిని ఉంచి మంచిగా చూసుకోవాలని హితవు పలికారు. ఆమె నుంచి తీసుకున్న బంగారం, నగదు తిరిగి ఇవ్వకుంటే చర్యలు తీసుకుంటామని మందలించారు.

అటవీ భూముల్లో మట్టి తరలిస్తే కఠిన చర్యలు

మట్టి తీత పనులు అడ్డుకున్న అటవీశాఖ అధికారులు, రెవెన్యూ సిబ్బంది

గుంటూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ, అటవీ శాఖ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమంగా మట్టి తీస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ఫిరంగిపురం మండలం అమీనాబాద్ గ్రామ శివారులో అక్రమంగా మట్టి తీత పనులు జరుగుతున్నాయని బుధవారం ఫిర్యాదు అందిన నేపథ్యంలో అటవీశాఖ అధికారులు, రెవెన్యూ శాఖ సిబ్బంది అక్కడకు వెళ్లారు. అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ గ్రామంలోని అటవీ ప్రాంతానికి చెందిన స్థలం పక్కన మట్టి తీత పనులు జరుగుతుండగా అడ్డుకున్నామన్నారు. ఆ సమయంలో ఒక ట్రాక్టర్ గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ నేపథ్యంలో అటవీ శాఖ భూమికి చెందిన రోడ్డు దెబ్బతిన్నందుకు కేసు నమోదు చేసి రూ.60 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. అనంతరం డబ్బులు కట్టించుకుని ట్రాక్టర్ వదిలిపెట్టామన్నారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ హిమ శైలజ, గుంటూరు ఫారెస్టు రేంజ్ అధికారి పోతురాజు, డీఆర్వో వెంకటేశ్వరావు, ఎఫ్‌బీవో సంతోష్, స్క్వాడ్ రేంజ్ అధికారి సుబ్బారావు, మండల రెవెన్యూ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్సీ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మృతి

పట్నంబజారు, న్యూస్‌టుడే: ది గుంటూరు పట్టణ ఫ్యాన్సీ, స్టేషనరీ అండ్ జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కోట వెంకటేశ్వర్లు (86) బుధవారం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. భాజపా నగర మాజీ అధ్యక్షుడిగా, శ్రీవాసవీ నిత్యాన్నదాన సత్ర వానప్రస్థాన ఆశ్రమ సేవా సమితి అమరావతి మాజీ ప్రధాన కార్యదర్శిగా, జిన్నాటవర్ సెంటర్లోని కుసుమహరనాథ దేవస్థానం అధ్యక్షుడిగా, వాసవీ సేవా సమితి మాజీ అధ్యక్షుడిగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. షాపు ఎంప్లాయిస్ కాలనీ ఏర్పాటుకు తన వంతు కృషి చేశారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మద్దాళి గిరి... వెంకటేశ్వర్లు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఫోన్ చేసి వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులకు సంతాపం వ్యక్తం చేశారు. వెంకటేశ్వర్లు మృతికి ఛాంబర్ గౌరవ అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ కో-ఆర్డినేటర్ గుడిపాటి భాస్కర్, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, వైకాపా విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, తెదేపా నాయకులు కొనగళ్ల సత్యం, పలువురు వ్యాపారులు సంతాపం వ్యక్తం చేశారు.

ధాన్యం, పత్తి కొనుగోళ్లు సజావుగా సాగాలి

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో రైతుల నుంచి ధాన్యం, పత్తి కొనుగోలు సజావుగా కొనసాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. రైతు సేవా కేంద్రాలు, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ద్వారా ధాన్యం, సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లపై అధికారులతో కార్యాలయంలో బుధవారం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం తేమ శాతం నిర్దిష్ట ప్రమాణాలతో ఉండేలా రైతులకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఈనెల 28 నుంచి తెనాలి, కొల్లిపర మండలాల్లో వరి కోతలు ప్రారంభమవుతాయని, గోనె సంచులు ముందుగానే రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని మిల్లర్లకు సూచించారు. జీపీఎస్ అమర్చిన వాహనాలను మాత్రమే ధాన్యం రవాణాకు ఉపయోగించాలన్నారు. ★ పత్తి సేకరణలో తలెత్తే సందేహాలను నివృత్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. తాడికొండ, ఫిరంగిపురం, ప్రత్తిపాడు, గుంటూరులో పత్తి కొనుగోలు కేంద్రాలు ఉన్నాయన్నారు. ప్రత్తిపాడులో ఇప్పటికే పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. తేమ శాతం 12 కన్నా తక్కువ ఉంటే.. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవచ్చని వివరించారు. ధాన్యం కొనుగోలు ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకుడు సత్యనారాయణ చౌదరి, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ కె.తులసి, జేడీఏ ఎ. నాగేశ్వరరావు, డీఎస్‌వో కె.పద్మ, తెనాలి రవాణా శాఖ అధికారి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో విద్యార్థి ఆత్మహత్య

అనుమానాస్పద మృతిగా కేసు

సృజన్ (పాతచిత్రం)

పట్టాభిపురం, ఏటీ అగ్రహారం, ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం షేర్‌మహ్మద్‌పురంలోని ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో ఇంజినీరింగ్ విద్యార్థి ప్రత్తిపాటి సృజన్ (20) బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా ఏటీ అగ్రహారానికి చెందిన సృజన్ పీయూసీ పూర్తి చేసి మూడో సంవత్సరం ఇంజినీరింగ్ (ఈఈఈ) చదువుతున్నాడు. విద్యార్థులంతా మిడ్ పరీక్షకు వెళ్లిపోగా సృజన్ బాలుర వసతి గృహం నాలుగో అంతస్తులో ఉండిపోయాడు. తర్వాత ఒకటో అంతస్తులో తన స్నేహితుడి గదికి వచ్చి తాడుతో ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. ఉదయం స్నేహితులు వచ్చి చూసేసరికి ఫ్యానుకు తాడు వేలాడుతుండగా, సృజన్ కింద పడి ఉన్నాడు. క్యాంపస్ అధికారులు తలుపులు పగలగొట్టి లోపలకు వెళ్లగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. తండ్రి శివకృష్ణప్రసాద్ ఆటోడ్రైవర్.. తల్లి జ్యోతి గృహిణి. ఎచ్చెర్ల ఎస్సై వి.సందీప్‌కుమార్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఫిలిం మేకింగ్ అంటే ఇష్టమని, చదవడం ఇష్టం లేదని సృజన్ చెప్పేవాడని స్నేహితులు పేర్కొన్నారు. దీనికితోడు ఓ జూనియర్ విద్యార్థినితో మాట్లాడుతున్నాడని ఆరోపిస్తూ సీనియర్ విద్యార్థులు బెదిరింపులకు పాల్పడినట్లు సమాచారం.

ఆత్మహత్య చేసుకునేటంత పిరికివాడు కాదు: 'రోజూ వలే మంగళవారం రాత్రి కూడా ఫోన్ చేసి స్నేహితుడి బర్త్‌డే పార్టీ ఉంటే వచ్చానని వీడియో కాల్ చేశాడు. అదే చివరి ఫోన్. అక్కడి పోలీసులు బుధవారం ఫోన్ చేసి మీ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పడంతో నిర్ఘాంతపోయా'..అని సృజన్ తండ్రి శివకృష్ణప్రసాద్ బోరున విలపించారు. సృజన్ ఏ సమస్య ఉన్నా తమతో పంచుకుంటాడన్నారు. సృజన్ ఆత్మహత్య చేసుకునేటంత పిరికివాడు కాదని తల్లిదండ్రులు, సోదరి షన్నతి, మేనమామ శంకర్ తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

PEOPLE CARE

OLD AGE HOME

గాయిత్రి గ్రూప్స్, VJA వృద్ధులకు పేషెంట్ల సేవకు, ఇంటి/వంట జెబికేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 97040 21122, 96038 42233.

REAL ESTATE

HOUSE FOR SALE

LAKSHMI PURAM

2000 sft, 3 bedroom ground floor sale, @ 6/2 Chandramouli Nagar, Guntur, Mr. Satish. Ph no: 9959544744.

PLOT FOR SALE

GENERAL

ఫార్మ్‌ల్యాండ్ @ వినుకొండ గజం 1,333/- మాత్రమే. సెంటు భూమి కొనండి 3 మకాడమీయా మొక్కలు ఉచితంగా పొందండి. క్లియర్ టైటిల్ మరియు స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 83675 22256.

కొలనుకొండ, జయభేరి కన్‌స్ట్రక్షన్ దగ్గర, KIA షోరూం పక్కన, 918 చ||గ|| తూర్పు (హైవే) ఫేస్ త్రికోణకారంలో ఉన్న స్థలము అమ్మకము. PH: 99662 28370.

JOBS

WANTED- Restaurant Staff (For a reputed restaurant- Immediate Hiring) 1) CASHIER Must have computer knowledge Minimum 2 years of experience. 2) SERVICE BOYS/ GIRLS Minimum 2 years of restaurant service experience. 3) SECURITY GUARD Ex-service personnel preferred. (Contact Time: 11 am to 9 pm) 83338 97607, 78933 34892.

గుంటూరులోని ప్రముఖ కంపెనీ నందు అకౌంటెంట్ కావలెను. GST & TDS నాలెడ్జ్ must. రెజ్యూమ్ వాట్సాప్. 90528 77789. goodharvestspices@gmail.com

గుంటూరులోని శానిటరీషాపులో కంప్యూటర్ బిల్స్‌చేయుటకు అనుభవం ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ (M) కావలెను. వ|| 30సం||లోపు, జీ||12K-15K. ✆ 9493656892.

విశ్రాంతి ఉద్యోగులకు శుభవార్త ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు గుంటూరులో వెంటనే కావలెను. ఫోన్ : 94907 06437.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు క్లాసు ఇన్‌ఛార్జీస్, హాస్టల్ ఇన్‌ఛార్జీస్, వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12,000/- నుండి 15,000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ. వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరముల కొరకు సంప్ర: ఫోన్ నెంబర్: 89784 80429.

రాఘవ ఆటో ఫైనాన్సియర్స్ గుంటూరు బ్రాంచికి సేల్స్ మేనేజర్ కావలెను & తెనాలి, మంగళగిరి, పిడుగురాళ్లలో కలెక్షన్ చేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ కావలెను. వ:21-35. ఆకర్షణీయమైన జీతం, TA+INC. అ: ఇంటర్ ఆపైన. టూవీలర్ మస్ట్. అనుభవమున్న వారికి ప్రాధాన్యత. 9154746824, 9154067714.

ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో మార్కెటింగ్ చేయుటకు జంట్స్ స్టాఫ్ అర్హత: డిగ్రీ, జీతం: 12 to 15K & టెలికాలర్స్ మహిళలు కావలెను. అర్హత: ఇంటర్, జీతం: 8to12K 62815 33982, 96033 10994.

మా కంపెనీ గోలీ సోడా మార్కెటింగ్ చేయుటకు అనుభవంగల సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సిటీవారికి ప్రాధాన్యత ఆకర్షణీయమైన జీతం కలదు. ✆ 8019786366.

ప్రముఖ కలెక్షన్ ఏజెన్సీలో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ మరియు టెలికాలర్స్ అనుభవంగల వారు కావలెను. జీతము: (15K to 20K), కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. DRA సర్టిఫికెట్ ఉన్నావారికి ప్రాధాన్యత కలదు. జీతము: 20K సంప్రదించగలరు. ఫోన్ నెంబర్స్: 8919080894, 8309132382.

VIJAYASREE Multi super speciality Hospital నందు పనిచేయుటకు అసిస్టెంట్ అకౌంటెంట్ కావలెను. 1 సం|| అనుభవం కావలెను. 95531 20127.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం

పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

విద్యారంగంలో కృషి అభినందనీయం

కార్యక్రమంలో కోయి సుబ్బారావు, ఎమ్మెల్సీ ఆలపాటి, రమాదేవి తదితరులు

వింజనంపాడు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: విద్యా రంగంలో వింజనంపాడు కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ కోయి సుబ్బారావు కృషి అభినందనీయమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. సుబ్బారావు సేవలకు మలేషియా, అమెరికా దేశాలకు చెందిన మాస్ట్రో గ్లోబల్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేయడంపై గుంటూరు నగరంలో బుధవారం నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. కోయి సేవాతత్వంతో ఎందరో విద్యార్థులను మహోన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దారని వివరించారు. భారత్ ఎడ్యుకేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డును కూడా ఆయన దక్కించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా నాయకురాలు రమాదేవి, ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ, మలినేని గ్రూపు ఇంజినీరింగ్ కళాశాలల ఛైర్మన్ మలినేని పెరుమాళ్లు, కిట్స్ కార్యదర్శి కోయి శేఖర్, జీఎస్సార్ స్కూల్ అధినేత జి. సాంబశివరావులు పాల్గొన్నారు.

మిర్చి యార్డు సమాచారం (నిన్నటి ధరలు)

వచ్చిన బస్తాలు:	45,295
అమ్మకాలు:	43,348
నిల్వలు:	12,691

నాన్ ఏసీ కామన్ వెరైటీ (క్వింటా రూ.ల్లో)

334	10,000-17,500
నంబర్ 5	10,000-14,300
273	10,500-14,200
341	10,000-17,000

నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	10,000-16,000
బాడిగ	11,000-17,000
దేవనూరు డీలక్స్	10,000-16,400
ఆర్మూర్	10,000-13,500

ఏసీ కామన్ వెరైటీ

334	10,500-17,000
నంబర్ 5	10,000-14,600
341	10,500-17,200
4884	11,000-14,700

ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	10,000-15,500
బాడిగ	10,000-17,500
దేవనూరు డీలక్స్	10,500-16,300
తాలు	5,300-8,800

- న్యూస్‌టుడే, మిర్చియార్డు

కార్తిక మాసం భారతీయ సంస్కృతికి ప్రతిబింబం

పూలతో అలంకరించిన రంగవల్లి వద్ద ప్రిన్సిపల్, విద్యార్థినులు

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: కార్తిక మాసం భారతీయ సంస్కృతికి ప్రతిబింబమని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. కళాశాలలో బుధవారం కార్తిక శోభ కార్యక్రమం సందడిగా సాగింది. ఈ సందర్భంగా సంప్రదాయ చిహ్నాలతో విద్యార్థినులు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు నగదు బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, ఉమెన్ వెల్ఫేర్ కమిటీ కన్వీనర్ డాక్టర్ రాధారాణి తదితరులు పాల్గొన్నారు.

91.9FM Vijayawada Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 80080 03297

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 111, రిటైల్ ధర - 138, చికెన్ విత్‌స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228. కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -109 రిటైల్ ధర 134 చికెన్ విత్ స్కిన్ - 197, చికెన్ స్కిన్‌లెస్ - 224. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 132, 142 చికెన్ విత్ స్కిన్ - 230 చికెన్ స్కిన్‌లెస్ - 240.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 600 (వాణిజ్య & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.93/-.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 80085 10541

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80085 14589

తెనాలి
• తెనాలి • పొన్నూరు

అలరించిన భక్తిరంజని

వెంకటసుబ్బారావును స్వామివారి చిత్రపటం అందిస్తున్న అప్పారావు తదితరులు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: వీరబ్రహ్మేంద్ర చారిటబుల్ ట్రస్టు తెనాలిశాఖ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన భక్తిరంజని అలరించింది. గాయని గాయకులు సుమధుర గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. చర్మ వ్యాధుల వైద్య నిపుణుడు జాస్తి వెంకట సుబ్బారావు బ్రహ్మంగారి చరిత్ర, కాలజ్ఞానం గురించి చక్కగా వివరించారు. ఈ సందర్భంగా ఆయనను ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు ఈ.ఎల్.వి.అప్పారావు ఘనంగా సత్కరించారు.

నాయకులకు అభినందన

కొల్లిపర, న్యూస్‌టుడే: తెదేపా మండల పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన భీమవరపు చినకోటిరెడ్డి, కార్యదర్శి కమ్ముచెర్ల సాల్మన్‌రాజును ఆ పార్టీ నాయకులు బుధవారం అభినందించారు. పార్టీకి అంకితభావంతో సేవలందించిన నేతలకు ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ సముచిత స్థానాన్ని కల్పించారని కొనియాడారు. అమృతరాజు, షేక్ రఫీ, పోతురాజు, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి మార్కెట్ యార్డులో..

నిమ్మకాయల ధరలు రూ. (క్వింటా)



అత్యధికం: 900
అత్యల్పం: 600
సగటు: 800

- న్యూస్‌టుడే, తెనాలి టౌన్

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పొన్నూరు పట్టణ పరిధిలోని అలూరు రోడ్డులో వీధి దీపం వెలగడం లేదు. మరమ్మతులు చేసే విధంగా చర్యలు చేపట్టాలి. - **నర్రా రాంబాబు, అలూరు రోడ్డు** ✔ వీధి దీపాన్ని బాగు చేయించే విధంగా చర్యలు తీసుకుంటాం. - **షేక్ హసీనా, సహాయ ఇంజినీరు** ? పొన్నూరు పట్టణ పరిధిలోని శాంతినగర్‌లో చెత్త పేరుకుంది. - **ఎన్.అబ్రహం, శాంతినగర్** ✔ చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. - **శ్రీనివాసులు, ప్రజారోగ్యశాఖాధికారి** ? తెనాలి పట్టణ 30వ వార్డు ఉడా కాలనీలో రెండు రోజులుగా మంచి నీటి సరఫరా జరగడం లేదు. - **ప్రసాద్, ఉడా కాలనీ** ✔ సమస్యను గుర్తించి సత్వరం పరిష్కరిస్తాం. ? పట్టణ గంగానమ్మపేట, పాత శివాలయం ప్రాంతంలో కాలువల్లో పూడిక లేక మురుగు నిలిచిపోతుంది. - **సురేష్, గంగానమ్మపేట** ✔ సమస్యను సత్వరం పరిష్కరిస్తాం.
- **రామఅప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్**

స్పందనకు వందనం

★ తెనాలి నాలుగు వరుసల రోడ్డులో విభాగిని వెంబడి ఉన్న ప్రధాన దీపాలు వెలగడం లేదని అందిన ఫిర్యాదు మేరకు మున్సిపల్ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించారు. ★ తెనాలి పట్టణం కొత్తపేటలో రోడ్డు వెంబడి వ్యర్థాలు పడి ఉన్నాయని స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించి వాటిని తొలగింపజేశారు. ★ పొన్నూరు పట్టణ పరిధి విద్యానగర్‌లో మురుగు నీటి కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయని అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. పేరుకుపోయిన వ్యర్థాలను కార్మికులతో తొలగింపజేశారు. **- న్యూస్‌టుడే, పొన్నూరు, తెనాలిటౌన్**

దీపాల మరమ్మతు పనుల్లో సిబ్బంది

యాజమాన్య పద్ధతులు పాటించండి

పెదకాకాని, న్యూస్‌టుడే: యాజమాన్య పద్ధతులతో వరి, మినప, పెసర పంటలకు తెగుళ్లు సోకకుండా సంరక్షించుకోవాలని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎ.మనోజ్ పేర్కొన్నారు. నంబూరులో బుధవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఏవో రమణ కుమార్‌తో కలిసి ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం చిలువూరు రోడ్డులోని వరి పొలాలను వారు పరిశీలించారు.

అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తా

చేబ్రోలు, న్యూస్‌టుడే: ఏపీ ఎన్జీవో అధ్యక్షునిగా పోటీ చేస్తున్న తెనాలికి చెందిన భిక్షాలు బుధవారం మండల కేంద్రమైన చేబ్రోలులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల శ్రేయస్సే లక్ష్యంగా పని చేస్తానని.. అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు.

ప్రణాళిక లేకుంటే నిర్వహణ కష్టమే..!

పురపాలికలో ముందుచూపు కొరవడిందంటున్న ప్రజలు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే

పురపాలక సంఘం ఆదాయాన్ని ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేయకపోవడంతో నిర్వహణకు నిధులు చాలవనే ఆందోళనలో అధికారులు కొట్టుమిట్టాడుతున్నారు. నిధుల లభ్యతను బట్టి కాకుండా అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తీసుకుని టెండర్లు పిలవడమే దీనికి కారణమని తెలిసింది. ఇదే పరిస్థితి మున్ముందు కొనసాగితే పురపాలక సంఘం నిర్వహణకు నిధులు వెతుక్కోవాల్సిన దుస్థితి రావడం ఖాయమని ప్రజలు చర్చించుకుంటున్నారు.

సాధారణ నిధులతో రైతుబజార్ వద్ద వేసిన సీసీ రోడ్డు

టెండర్లు వేయని వాటిని రద్దు చేయాలనే యోచనలో..

తెనాలి పురపాలక సంఘం పరిధిలో ఇప్పటికే చేసిన సుమారు రూ.12 కోట్ల అభివృద్ధి పనులకు సాధారణ నిధుల నుంచి బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఇటీవల మరో రూ.14 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచి గుత్తేదారులను ఎంపిక చేశారు. అంటే సుమారు రూ.26 కోట్లు కచ్చితంగా చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం పురపాలక ఖజానాలో రూ.6 కోట్లు సాధారణ నిధులు ఉన్నాయి. ఇవి మూడు నెలలకు పురపాలక సంఘం నిర్వహణకు సరిపోతాయి. వీటి నుంచి జనరల్ ఫండ్‌తో చేసిన పనుల బిల్లులు చెల్లిస్తే నిర్వహణకు నిధులు చాలని పరిస్థితి నెలకొంది. దీనిని నుంచి గట్టెక్కడానికి గుత్తేదార్లు టెండర్లు వేయని వాటిని రద్దు చేయాలనే యోచనలో అధికారులు ఉన్నట్లు సమాచారం.

నిధుల లభ్యత మేరకు టెండర్లు పిలవాలి..

ఏటా పురపాలక ఆదాయం రూ.40 కోట్లు కాగా ఖర్చు రూ.24 కోట్లు. మిగులు రూ.16 కోట్ల సాధారణ నిధుల మేరకు అభివృద్ధి పనులకు టెండర్లు పిలవాల్సి ఉంది. మున్సిపల్ అధికారులు అభివృద్ధి పనులను ప్రభుత్వం ఇచ్చిన గ్రాంటులో నిర్వహించుకునే వెసులుబాటు ఉంది. దీనిని సద్వినియోగం చేసుకోవడంలో ముందుచూపు కొరవడిందని విమర్శలు విన్పిస్తున్నాయి. గత వైకాపా హయాంలో అభివృద్ధి పనులకు ఇచ్చిన 14వ ఆర్థిక సంఘం నిధులను సకాలంలో ఖర్చు చేయక రూ.9 కోట్ల విద్యుత్తు బిల్లులు చెల్లించారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడిని సంప్రదించగా.. నిధుల లభ్యతను బట్టి ఆదాయ వ్యయాలు ఉంటాయని చెప్పారు.

విత్తన కొనుగోళ్లలో అప్రమత్తత తప్పనిసరి

అవగాహన కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు

కొల్లిపర, న్యూస్‌టుడే: జొన్న, మొక్కజొన్న విత్తన కొనుగోళ్లలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం బొమ్మువానిపాలెం తదితర గ్రామాల్లో పర్యటించిన అనంతరం ఆయన మాట్లాడారు. విత్తన కొనుగోలు సమయంలో విధిగా బిల్లు తీసుకోవాలని సూచించారు. లైసెన్సు లేని దుకాణాల్లో విత్తన కొనుగోలు చేయవద్దని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. రైతు సేవాకేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులు సత్వరమే పూర్తి చేయాలి

అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ రామఅప్పలనాయుడు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణ పరిధి చినరావూరులోని టిడ్కో ఇళ్ల సముదాయంలో రోడ్లు, కాలువలు, రక్షిత మంచినీటి ట్యాంకు అసంపూర్తి పనులు సత్వరమే పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం ఆ ఇళ్ల సముదాయంలో పర్యటించారు. వీటిపై మాట్లాడటానికి టిడ్కో ఇళ్ల గుత్తేదార్లను పురపాలక కార్యాలయానికి పిలిపించాలని ఆదేశించారు. క్రమం తప్పకుండా పారిశుద్ధ్య పనులు చేయాలన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు వంతెన ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను కోరారు. వంతెన ప్రతిపాదన ఉందని టిడ్కో అధికారులు బదులిచ్చారు.

వైకాపా అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలి



వివిధ కమిటీల ప్రతినిధులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ప్రజాహితమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త ముందుకు సాగాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన తెదేపా తెనాలి నియోజకవర్గ సంస్థాగత కమిటీ ప్రతినిధుల ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. 'దేశ రాజకీయాల్లో తెలుగుదేశం ఆవిర్భావం ఒక సంచలనం. కొందరికే పరిమితమైన రాజకీయాలు, పదవులను అందరికీ అందించింది. తొలి నాటి నుంచి నేటి వరకు విలువలతో కూడిన నాయకత్వంలో నడుస్తున్నాం. ఇలాంటి పార్టీలో ముందుకు సాగుతున్నందుకు మనమంతా గర్వపడాలి. వైకాపా వద్దని ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చినా.. సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేస్తున్నారు. వాటిని సరైన ఆధారాలతో అదే మాధ్యమాన్ని ఉపయోగించి తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉంది' అని పేర్కొన్నారు. నియోజకవర్గంలో పార్టీ వారికి పనులు కావడం లేదని, కొందరు అధికారులు సహకరించడం లేదని, ముఖ్యంగా పురపాలిక వారు ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని.. కొన్ని అంశాలపై కార్యకర్తలకు సమాధానం చెప్పలేకపోతున్నామని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్ ఆవేదన వ్యక్తం చేశారు. అశోక్‌వర్ధన్, నాగేశ్వరరావు, భరత్, చిన్నకోటిరెడ్డి, సాల్మన్, కోగంటి రోహిత్, పూర్ణచంద్ర, యోగేష్, పవన్‌కుమార్, రమ్య, భావన, హరిప్రసాద్, మొహిద్దీన్, బి.ప్రసాద్, రమేష్ తదితరులు వివిధ కమిటీల అధ్యక్ష, కార్యదర్శులుగా ప్రమాణ స్వీకారం చేశారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

సీడీఈ సూపరింటెండెంట్‌పై నివేదిక ఇచ్చిన కమిటీ

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం (సీడీఈ)లోని ఓ సూపరింటెండెంట్ ఇష్టారాజ్యంపై 'ఈనాడు'లో వచ్చిన కథనానికి స్పందించి ఉన్నతాధికారులు కమిటీ వేశారు. సీడీసీ డీన్ ఆచార్య రవికుమార్, జియాలజీ విభాగాధిపతి ఆచార్య రత్నాకర్‌తో కమిటీ నియమించారు. దాదాపు వారం రోజుల పాటు వివిధ కోణాల్లో విచారించిన కమిటీ సభ్యులు బుధవారం తమ నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. సీడీఈపై వచ్చిన ఆరోపణలను ఆధారాలతో సహా కమిటీ సభ్యులు నివేదిక రూపంలో ఇచ్చినట్లు తెలిసింది. విద్యార్థుల అసైన్‌మెంట్‌ల మూల్యాంకనను సూపరింటెండెంట్‌తో చేయించాలని తమకు ఓ అధికారి లేఖ ఇచ్చారని.. దీనిని టీమ్ లీజ్ నుంచి కమిటీ సేకరించినట్లు సమాచారం. ఏసీబీ కేసులో ఉన్న వ్యక్తి, పైగా బోధనేతర సిబ్బందితో అసైన్‌మెంట్‌లు ఎలా మూల్యాంకన చేస్తారని ఓ అధికారి రాసిన లేఖను కమిటీ సేకరించి దానిని నివేదికలో పొందుపరిచినట్లు తెలిసింది. ఎవరూ పరిధి దాటి వ్యవహరించవద్దని.. అలా చేయడం వల్లే ఇలాంటి సమస్యలు వచ్చాయని కమిటీ తమ నివేదికలో వెల్లడించినట్లు తెలిసింది.

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి

మేడికొండూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి నాగసాయికుమార్ పేర్కొన్నారు. మండలంలోని డోకిపర్రు, మంగళగిరిపాడులో బుధవారం ఆయన పర్యటించారు. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం, డోకిపర్రు గ్రామ సచివాలయాన్ని ఆయన సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. గ్రామ కార్యదర్శి జిలానీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు సహకరించండి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: ప్రపంచ న్యూమోనియా దినోత్సవం సందర్భంగా బుధవారం నుంచి 28వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించి వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి చికిత్స అందించనున్నట్లు నందులపేట యూపీహెచ్‌సీ డాక్టర్ వేముల ప్రియాంక తెలిపారు. ఆమె బుధవారం ఆసుపత్రిలో మాట్లాడారు. ఈ సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు.

రేవేంద్రపాడు(దుగ్గిరాల): సచివాలయాల సిబ్బంది క్షేత్ర స్థాయిలో ప్రతి ఇంటికి వెళ్లి తాము చేయాల్సిన సర్వేలను వేగవంతం చేయాలని డీఎల్‌డీవో కుసుమ శ్రీదేవి చెప్పారు. బుధవారం ఆమె రేవేంద్రపాడు సచివాలయాన్ని ఆమె సందర్శించారు. కౌసలం, ఈకేవైసీ, ఆధార్, బయోమెట్రిక్ అప్‌డేషన్ వంటివి పూర్తి చేయాలన్నారు.

ఐఎంఏ తెనాలిశాఖ అధ్యక్షుడికి సత్కారం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలిశాఖ నూతన అధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ శ్యామ్ ప్రసాద్‌ను ఏపీ మూవీ ఆర్టిస్ట్ అసోయేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు దిలీప్‌రాజా అభినందించారు.

శిక్షణార్థులకు సన్నగిల్లిన ఉపాధి అవకాశాలు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: నేషనల్ అప్రంటీస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్ (నాట్స్) కింద తెనాలి పురపాలక సంఘం పరిధిలోని స్వయం సహాయ సంఘాల సభ్యుల పిల్లల్లో విద్యావంతులకు ఏడాది పాటు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇస్తామని.. ఏడు నెలలే ఇచ్చి సరిపెట్టారు. ఈ ప్రభావం ఉపాధి అవకాశాలపై పడింది.

★ 2020 తరువాత డిగ్రీ పాసైన ఎస్‌హెచ్‌జీ సభ్యుల పిల్లలకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇవ్వడానికి నాట్స్ సంస్థ ఎంవోయూ కుదుర్చుకుంది. ఈ క్రమంలో 2024 జులై నుంచి మే 2025 వరకు 52 గంటలు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ తెలిపింది. శిక్షణకు వచ్చిన వారికి నెలకు 4500 ఉపకార వేతనం, రూ.వెయ్యి వెనక్కి ఇవ్వాలని సూచించింది. శిక్షణకు 500 దరఖాస్తులు రాగా అర్హులను ఎంపిక చేసి ఆన్‌లైన్‌లో శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఐతే ఏడాది పాటు ఇవ్వాల్సిన శిక్షణను ఏడు నెలలు ఇచ్చి సరిపెట్టారు. ఈ శిక్షణ ముగిసిందా? ఇంకా ఉందా అనేది తెలపలేదు. దీనిపై మున్సిపల్ అధికారులను సంప్రదించగా అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరణ, ఎంపిక, శిక్షణ తదితరాలు నాట్స్ సంస్థ వారు నిర్వహించారని.. శిక్షణ పూర్తి తదితరాలపై ఎలాంటి సమాచారం తెలీదని చెప్పారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలి

సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న శివకుమార్

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: గత ప్రభుత్వం తీసుకొచ్చిన వైద్య కళాశాలలను రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ విధానం పేరుతో ప్రైవేటీకరణ చేయడాన్ని ఉపసంహరించుకోవాలని వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్ డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణను నిరసిస్తూ నియోజకవర్గంలో సేకరించిన సంతకాలను ఆయన బుధవారం తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ త్రివేణికి అందించారు. ప్రభుత్వం దిగివచ్చి వైద్య కళాశాలలను ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించాలని లేకుంటే ఉద్యమిస్తామన్నారు.

పొన్నూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాసంక్షేమాన్ని విస్మరించిందని నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం పొన్నూరులో నిర్వహించిన పోరుబాటలో ఆయన పాల్గొన్నారు. డిప్యూటీ తహసీల్దారు మాధవికి వైకాపా నేతలు వినతి పత్రం అందజేశారు.

రహదారి నిర్మాణం పూర్తి

ఈనాడు కథనానికి స్పందన

మండల పరిధి దండమూడి ప్రధాన రహదారి నిర్మించి చాలా సంవత్సరాలు కావడంతో రోడ్డంతా కుంగిపోయింది. వర్షం కురిసినప్పుడు నీరు పోయే మార్గం లేక రోజుల తరబడి రహదారిపై నిల్వ ఉంటున్నాయి. రాకపోకలు నిర్వహించే సమయంలో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదని ఈ ఏడాది జులై 16వ తేదీన 'అడుగు తీసి.. అడుగు వేయలేం' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ప్రభుత్వం నూతన సిమెంటు రహదారి నిర్మాణ పనులకు రూ.15 లక్షలు నిధులు మంజూరు చేసి.. నిర్మాణ పనులను పూర్తి చేసింది. **- న్యూస్‌టుడే, పొన్నూరు**

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20 వరకు స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్లు రికార్డు అసిస్టెంట్ ఎస్.లావణ్య సుధ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వం, క్విజ్, పద్యాల అప్పగింత, వంటి అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తెనాలి పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బడి పిల్లలను ఈ పోటీలకు పంపించి ప్రోత్సహించాలని కోరారు. పోటీలను మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

చేబ్రోలు, న్యూస్‌టుడే: మండలంలోని చేబ్రోలు, వేజండ్ల గ్రంథాలయాల్లో శుక్రవారం నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయ అధికారిణులు వి.పరమేశ్వరి, వెంకాయమ్మలు తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, ఆటల పోటీలు, పుస్తక ప్రదర్శన, ముగ్గుల పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో స్థానికులు, సభ్యులు పాల్గొనాలని కోరారు.

కొల్లిపర, న్యూస్‌టుడే: గ్రంథాలయ వారోత్సవాలు గ్రామీణ ప్రజల్లో, విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతాయని వల్లభాపురం శాఖా గ్రంథాలయ అధికారి సాంబశివనాయక్ అన్నారు. బుధవారం కొల్లిపర విద్యాశాఖాధికారిణి ఝాన్సీలతకు ఆహ్వాన పత్రం అందించిన అనంతరం ఆయన మాట్లాడారు.

పంచాయతీల్లో డిజిటల్ చెల్లింపులు జరగాలి

మాట్లాడుతున్న శ్రీదేవి

కొల్లిపర, న్యూస్‌టుడే: స్వర్ణ పంచాయతీ అమలు, పారిశుద్ధ్యం పనితీరుపై మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో డీఎల్‌డీవో కె.శ్రీదేవి సమావేశం నిర్వహించారు. డిజిటల్ పేమెంట్స్ (ఆన్‌లైన్ చెల్లిపులు)పై సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీలో డిజిటల్ చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. ఇంటి పన్ను, వృత్తి పన్ను తదితర వసూళ్లలో లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. తాగునీరు, వీధి దీపాల సమస్యలపై ఫిర్యాదులు అందడం సరికాదని హితవు పలికారు. గ్రామ సచివాలయ సిబ్బంది చేపట్టిన సర్వేలపై పురోగతి గురించి ప్రశ్నించారు. సమావేశంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో భార్గవ, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరు, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధి చింతలపూడిలో నియోజకవర్గ పరిధిలోని 11 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.12,58,404 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత వైకాపా ప్రభుత్వం పేద ప్రజలను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం విద్య, వైద్య రంగానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు.

జూదం ఆడినా.. ఆడించినా కఠిన చర్యలు

తనిఖీలు చేస్తున్న సీఐ సాంబశివరావు, ఎస్సైలు, సిబ్బంది

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: జూదం ఆడినా.. ఆడించినా కఠిన చర్యలు తప్పవని త్రీ టౌన్ సీఐ సాంబశివరావు హెచ్చరించారు. గతంలో జూదం నిర్వహించిన ప్రాంతాలను డ్రోన్ ద్వారా బుధవారం సాయంత్రం పరిశీలించారు, లాడ్జిలు, అతిథి గృహాలు, వేడుకల వేదికలు, గదులు వంటి వాటిని బుధవారం తనిఖీ చేశారు. తనిఖీలు కొనసాగుతాయని.. జూదంపై ఎటువంటి సమాచారం ఉన్నా తమకు తెలియచేయాలని కోరారు. ఎస్సైలు ప్రకాశరావు, కరిముల్లా, సిబ్బంది ఉన్నారు.

నానో యూరియాతో అధిక దిగుబడులు

మాట్లాడుతున్న ఏవో రాజవరపు వెంకటేశ్వరరావు

పొన్నూరు, న్యూస్‌టుడే: నానో యూరియాతో అధిక దిగుబడులు సాధించవచ్చని పొన్నూరు మండల వ్యవసాయ అధికారి రాజవరపు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఉప్పరపాలెం, కొత్తపాలెం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వరి పైరు గింజ పాలు పోసుకునే దశలో ఉందని, రైతులు పైరును గమనిస్తూ సుడిదోమ రాకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. రైతు సేవ కేంద్రంలో ధాన్యం విక్రయించుకునే రైతులు పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. ఏఏవో శ్రీకాంత్, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాస్టార్లకు అభినందన

రాష్ట్ర స్థాయి సాంస్కృతిక పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన తెనాలి ఉపాధ్యాయులు బెల్లంకొండ వెంకట్, వెలగా సుభాష్ చంద్రబోస్, పాలపర్తి శ్రీనివాసరావు, సోమరౌతు శ్రీనివాసరావు, పురబడి విద్యార్థి విష్ణువర్ధన్‌లను రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. పట్టణంలోని సంఘ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈదర వెంకటపూర్ణచంద్, నల్లూరి వెంకటేశ్వరరావు, నారాయణ, కొల్లి రాజేంద్రప్రసాద్, జాస్తి నరేంద్ర, మల్లాది అర్జున, ఆలపాటి కిరణ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

విశ్రాంత అధ్యాపకుడు వీరప్రకాశరావు మృతి



వీరప్రకాశరావు (పాతచిత్రం)

తెనాలి(కొత్తపేట), తెనాలిటౌన్, న్యూస్‌టుడే: విశ్రాంత అధ్యాపకుడు కొడాలి వీరప్రకాశరావు(86) గుండెపోటుతో బుధవారం ఉదయం నందులపేటలోని స్వగృహంలో మృతి చెందారు. ఆయన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారకరామారావు వద్ద పీఆర్వోగా పనిచేశారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మాజీ ఛైర్మన్ మారౌతు సీతారామయ్య, తుమ్మల రాఘవరావు తదితరులు వీర ప్రకాశరావు భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. అంత్యక్రియలు 14న నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మహిళను వేధించిన కేసులో నిందితుడికి జైలు

కొల్లూరు: 2022లో మహిళను వేధించిన కేసులో నిందితుడు కొల్లూరుకు చెందిన క్రీస్తురాజుకు నెల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తెనాలి న్యాయస్థానంలో న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. సీనియర్ ఏపీపీ పి.సునీల్‌కుమార్ ప్రాసిక్యూషన్ తరుపున వాదించినట్లు చెప్పారు.

గుర్తుతెలియని మృతదేహానికి అంత్యక్రియలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి రైల్వే స్టేషన్‌లో నాలుగు రోజుల కిందట మృతి చెందిన గుర్తు తెలియని సుమారు 35 సంవత్సరాల వ్యక్తి మృతదేహానికి రైల్వే పోలీసుల సూచనల మేరకు బుధవారం రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

రేషన్ బియ్యం పట్టివేత

కొల్లిపర: కోళ్ల ఫారాలకు రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తున్న నిర్మల అనే మహిళ వద్ద 9 బస్తాల చౌక బియ్యాన్ని పట్టుకున్నట్లు కొల్లిపర పోలీసులు బుధవారం తెలిపారు.

రోడ్డు ప్రమాద ఘటనపై కేసు

కొల్లిపర, న్యూస్‌టుడే: ఈ నెల 8న సిరిపురం బస్టాప్ వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో డ్రైవర్, మరో నలుగురు ప్రయాణికులు గాయపడిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు కొల్లిపర పోలీసులు బుధవారం తెలిపారు.

జూద శిబిరంపై దాడి

చేబ్రోలు, న్యూస్‌టుడే: మండలంలోని శేకూరు శివారులో బుధవారం జూద శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని.. వారి నుంచి రూ.7500 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై వీర నారాయణ తెలిపారు.

పసుపు బస్తాలకు వేలం

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డులో దువ్వను, దాదాపు పదేళ్లుగా ఎవరూ తీసుకెళ్లకుండా ఉంచిన 84 పసుపు బస్తాలను వేలం వేసినట్లు కమిటీ ఛైర్‌పర్సన్ ఝాన్సీరాణి, ఉన్నతశ్రేణి కార్యదర్శి జేవీ సుబ్బారావు బుధవారం తెలిపారు. దువ్వ రూ.48 వేలుకు, క్వింటాలుకు రూ.6500 నుంచి రూ.11800కు కొనుగోలు చేశారని చెప్పారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి మంత్రి లోకేశ్ చేయూత

ధ్రువపత్రాలు అందజేస్తున్న తెలుగు మహిళా నాయకులు

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: మంత్రి నారా లోకేశ్ సహకారంతో తాడేపల్లి పట్టణ, గ్రామీణ మండలంలోని 30 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లను తెలుగు మహిళా నాయకులు బుధవారం పంపిణీ చేశారు. మంగళగిరిలోని డాక్టర్ ఎంఎస్‌ఎస్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో స్త్రీశక్తి పథకం కింద మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పించారు. తితిదే పాలకవర్గ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయసత్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు దండమూడి శైలజారాణి, కొయ్యగూర మహాలక్ష్మి, తాడేపల్లి పట్టణ, మండల తెలుగు మహిళ అధ్యక్షులు కుసుమ, కృష్ణవందన తదితరులు పాల్గొన్నారు.

సామూహిక చర్యలతో ఆఫ్రికన్ నత్తల నివారణ

మంగళగిరి, న్యూస్‌టుడే: ఆఫ్రికన్ నత్తలు పంట పొలాల్లో కనిపిస్తున్నాయని రైతులు వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకొచ్చారు. నూతక్కిలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో డాట్ సెంటర్ శాస్త్రవేత్త మనోజ్ మాట్లాడుతూ నత్తల నివారణకు సామూహిక చర్యలు చేపట్టాలని, లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పు కలిపి ఆ ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. అదే విధంగా లీటరు నీటికి మూడు గ్రాముల ఐరన్ సల్ఫేట్ కలిపి స్ప్రే చేసినా మంచి ఫలితాలు ఉంటాయన్నారు.

లౌకికశక్తులు ఏకం కావాలి

దుగ్గిరాల, న్యూస్‌టుడే: మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకిక శక్తులు ఏకం కావాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ చిస్తి అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక ముర్తుజానగర్‌లోని షాదీఖానాలో ఆ కమిటీ సమావేశం జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాగ్దానాల అమలులో విఫలమయ్యాయని విమర్శించారు. వ్యకాసం జిల్లా అధ్యక్షుడు బాలరాజు, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే బాషా, యార్లగడ్డ బ్రహ్మేశ్వరరావు, యేమినేని స్టాలిన్, ఎస్ యోగేశ్వరరావు తదితరులున్నారు.

నిధులు మంజూరు చేసి వంతెన నిర్మించండి..!

నండూరులో ప్రమాదకరంగా ఇలా..

మండల పరిధిలోని నండూరు గ్రామ ప్రధాన రహదారిలో వంతెన ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు విరిగిపోయాయి. ఎలాంటి ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి నూతన వంతెన నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పొన్నూరు**

(c) eenadu

చిరు వ్యాపారికి భరోసా

మంగళగిరి గ్రామీణం: మంగళగిరి 30వ వార్డుకు చెందిన షేక్ రహంతుల్లా జీవనోపాధి కోసం మంత్రి నారా లోకేశ్ బడ్డీ కొట్టు సమకూర్చారు. దీన్ని బుధవారం మంగళగిరి పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్. రియాజ్ లబ్ధిదారుడికి అందజేశారు. నాయకులు భైరబోయిన శివశంకర్, పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శి భైరబోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

సైదానాయక్, శామ్యూల్

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి ఎస్టీయూ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. పట్టణంలోని బీఆర్‌నగర్ మున్సిపల్ పాఠశాలలో జరిగిన సమావేశంలో కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా సైదానాయక్, ఆర్థిక కార్యదర్శిగా శామ్యూల్ ఎన్నికయ్యారు. వీరితో పాటు ఉపాధ్యక్షుడిగా ఇసునూరి వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శి ఉషాకుమారి, గౌరవ అధ్యక్షులుగా ఉషాలక్ష్మి, సహాయ కార్యదర్శిగా పద్మజారాణి, జిల్లా కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు, లలిత సాయి ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: నూతక్కి గ్రామ పరిధిలోని అంబేడ్కర్ కాలనీలో డ్రెయిన్లలో మురుగు నీరు స్తంభించింది. ఈ సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా స్థానికులు శానిటైజేషన్ ఇన్‌స్పెక్టర్ కరుణ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి పారిశుద్ధ్య కార్మికులతో పూడిక తీయించి బ్లీచింగ్ చల్లించారు.

స్పందనకు వందనం

వింజనంపాడు(వట్టిచెరుకూరు): వింజనంపాడు నుంచి పర్చూరు రోడ్డు మూడో మైలు వరకు కోతకు గురైన ఆర్‌అండ్‌బీ రోడ్డుకు సైడ్ బెర్మ్‌లు నిర్మించేందుకు గ్రామ సర్పంచి నార్నె రాజ్యలక్ష్మి ముందుకు వచ్చారు. పంచాయతీ నిధులతో సోమవారం పొక్లెయినర్‌తో ఆయా పనులు చేపట్టారు. గత నెల 24న 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందనగా ఈ చర్యలు తీసుకున్నారు.

తాడికొండ, న్యూస్‌టుడే : తాడికొండ గ్రామం ప్రధాన రహదారికి ఇరుపక్కలా మట్టి కుప్పలు అడ్డుగా ఉన్నాయి. సమస్యను ఈవోపీఆర్డీ రమణ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించి పంచాయతీ కార్మికులతో మట్టిని తొలగింపజేశారు.

మంగళగిరి గ్రామీణం: నీరుకొండ గ్రామ బీసీ ఏరియా సమీపంలో మురుగునీరు స్తంభించింది. సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా స్థానికులు గ్రామ కార్యదర్శి సత్యసాయి దృష్టి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన బుధవారం ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించి ఫాగింగ్ చేయించారు.

☛ : నవులూరు గ్రామ ఉడా కాలనీలో డ్రెయిన్ పూడిపోయి దుర్వాసన దోమలు వ్యాపిస్తున్నాయని స్థానికులు శానిటైజేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన కార్మికులతో పూడిక తీయించి ఫాగింగ్ చేయించారు.

చేనేత కార్మికులను ఆదుకోండి

మంగళగిరి, న్యూస్‌టుడే: చేనేత కార్మికులకు మజూరీ 40 శాతం మేర పెంచాలని కోరుతూ చేనేత కార్మిక సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యాన మంగళగిరిలో బుధవారం కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. ఈ మేరకు చేనేత వస్త్ర ఉత్పత్తిదార్ల అసోసియేషన్ అధ్యక్షుడు జొన్నాదుల వరప్రసాద్, వస్త్ర ఉత్పత్తిదార్ల విక్రయ సంఘం అధ్యక్షుడు కాసుల రవికి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్మిక సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ పిల్లలమర్రి బాలకృష్ణ, గుత్తికొండ ధనుంజయరావు, కూరపాటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు.. లాభాలు బాగు

'రైతునేస్తం' అధ్వర్యంలో రైతులకు శిక్షణ

కొర్నెపాడు(వట్టిచెరుకూరు): రసాయన రహితంగా ప్రకృతి వ్యవసాయం చేయడం, పంటలు పండించడం వల్ల కర్షకులు నష్టాల నుంచి గట్టెక్కించవచ్చని గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తరలి వచ్చిన పలువురు యువ రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వట్టిచెరుకూరు మండలంలోని కొర్నెపాడు 'రైతునేస్తం' ఫౌండేషన్‌లో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ విభాగం నిర్వహిస్తున్న ఐదు రోజుల ప్రకృతి వ్యవసాయంపై సమగ్ర శిక్షణ కార్యక్రమంలో తమకున్న అనుభవాలను కర్షకులు తమ సహచరులతో కలిసి పంచుకున్నారు.

హాజరైన రైతులు, ఔత్సాహికులు

భూమికి ఆరోగ్యదాయకం

భూమిలో రసాయనాలు పిచికారీ చేయకుండా ఆవు మూత్రం, పేడలతో మిళితమైన ఎరువులను ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించడం వల్ల భూసారం పెరుగుతోంది. మొక్కలపై రసాయన మందులు పిచికారీ చేయకపోవడంతో పంటలను పరిశీలించేందుకు వెళ్లే రైతుల ఆరోగ్యం కూడ మెరుగుపడుతుంది. శిక్షణ నేర్పించిన అంశాలను ఆచరణలో పెడతా.

-తబిత, తాడేపల్లి

జీవనోపాధికి చక్కటి మార్గం..

తాజా పరిస్థితుల నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయం యువతకు జీవనోపాధికి మార్గంలా మారుతోంది. ఇందులో స్థిరపడిన రైతులు మంచి జీవనం పొందుతున్నారు. శిక్షణలో సాగు విధానాలతోపాటు ఉపఉత్పత్తుల తయారీ గురించి తెలుసుకున్నాను.

-గణేష్‌బాబు, వల్లూరు

అవగాహనతో అడుగేస్తే ప్రయోజనం..

ప్రకృతి సాగుపై అవగాహన పెంచుకోవాలి. తమకున్న భూమి ఏ పంటలకు అనుకూలం అన్న విషయాన్ని తెలుసుకోవాలి. దీని వల్ల పెట్టుబడి ఖర్చులను సమర్థంగా తగ్గించుకోవచ్చు.

- యడ్లపల్లి వెంకటేశ్వరరావు, రైతునేస్తం ఫౌండేషన్ ఛైర్మన్

రీసర్వే కోసం భూపత్రాలు సమర్పించండి

తుళ్లూరు: హరిశ్చంద్రపురం గ్రామంలో రీసర్వే కార్యక్రమం నిర్వహించేందుకు గ్రామస్థులు భూమి యాజమాన్య పత్రాల వివరాలను తుళ్లూరు అందజేయాలని తహసీల్దార్ ఎం.హరిబాబు సూచించారు. బుధవారం ఆయన గ్రామస్థులతో సమావేశమయ్యారు. రీ సర్వే మధ్యలో నిలిచిపోయిన విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారులకు తెలియజేశామని చెప్పారు. గ్రామంలోని కొన్ని భూములు రైతుల అనుభవంలో ఉన్నప్పటికీ రెవెన్యూ రికార్డుల ప్రకారం దేవాదాయశాఖ పరిధిలోకి వస్తుండటంతో రీ సర్వేకు ఆటంకం ఏర్పడిందని ఆయన వివరించారు.

పసుపు బస్తాలకు వేలం

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డులో దువ్వను, దాదాపు పదేళ్లుగా ఎవరూ తీసుకెళ్లకుండా ఉంచిన 84 పసుపు బస్తాలను వేలం వేసినట్లు కమిటీ ఛైర్‌పర్సన్ ఝాన్సీరాణి, ఉన్నతశ్రేణి కార్యదర్శి జేవీ సుబ్బారావు బుధవారం తెలిపారు. దువ్వ రూ.48 వేలుకు, క్వింటాలుకు రూ.6500 నుంచి రూ.11800కు కొనుగోలు చేశారని చెప్పారు. ఈ మొత్తాన్ని మార్కెట్ నిధులకు జమచేస్తామని చెప్పారు.

'ఇళ్ల స్థలాల పేరుతో భారీ దోపిడీకి పాల్పడిన జగన్'

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: పేదలందరికీ ఇళ్లు ఇస్తానని చెప్పి సెంటు భూమి పట్టా పేరుతో జగన్ భారీ దోపిడీకి పాల్పడారని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ విమర్శించారు. మంగళగిరి పదో వార్డులో దేవరకొండ రమణకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద రూ.2.50 లక్షలు నగదు మంజూరు పత్రాన్ని తెదేపా గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, తితిదే పాలకవర్గ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, పట్టణ తెదేపా అధ్యక్షుడు పడవల మహేష్, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి లబ్ధిదారుడికి బుధవారం అందచేసి ఇంటి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. తెదేపా పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, జనసేన నగర అధ్యక్షుడు మునగపాటి మారుతీరావు తదితరులు పాల్గొన్నారు. ☛ కృష్ణనగర్ లోని బ్రహ్మానందపురంలో నూతన గృహాల నిర్మాణానికి లబ్ధిదారులతో కలిసి తాడేపల్లి పట్టణ తెదేపా అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు బుధవారం భూమి పూజ చేశారు. తెదేపా నియోజకవర్గ పరిశీలకుడు ముమ్మిడి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి దారా దాసు పాల్గొన్నారు.

లబ్ధిదారుడికి ఇంటి మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, చిల్లపల్లి శ్రీనివాసరావు, జానకీదేవి తదితరులు

మంగళగిరిపాడులో లబ్ధిదారులతో కలిసి గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

పేదలందరికీ ఇళ్లు ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు కృషి

మేడికొండూరు: గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాల కొనుగోలు, ఇంటి నిర్మాణ పనుల్లో భారీ కుంభకోణం జరిగిందని తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ ఆరోపించారు. మంగళగిరిపాడు తురకపాలెంలో బుధవారం పీఎంఏవై కింద నిర్మించిన ఇళ్లను ఆయన ప్రారంభించి.. లబ్ధిదారులకు తాళాలు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో అనంతపురం జిల్లాకు చెందిన వైకాపా మాజీ ఎమ్మెల్యే బంధువులు పేరేచర్లలో ఇళ్ల నిర్మాణ పనులు దక్కించుకుని నాణ్యత లేకుండా కట్టారన్నారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు పేదలందరికీ ఇళ్లు కట్టించాలనే దృఢ సంకల్పంతో పని చేస్తున్నారన్నారు. తొలుత షేక్ చిన్న సైదాబి కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే సంప్రదాయబద్ధంగా గృహ ప్రవేశం చేశారు. డీపీవో నాగసాయికుమార్, గృహ నిర్మాణ సంస్థ ఏఈలు సాగర్‌బాబు, శ్రీనివాస్, దివ్య, సాగర్‌సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

తాడికొండ: మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ-ఏఐ విభాగం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోబోటిక్స్, ఏఐ, డ్రోన్ టెక్నాలజీ వంటి ఆధునిక సాంకేతిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా రోబోటిక్ రీసెర్చ్ ఇంజినీర్ మహాన్ ఆర్.కె హాజరై.. ఆయన పరిశోధనలు, ప్రాజెక్టుల గురించి వివరించారు. కళాశాల ఛైర్మన్ వై.వి ఆంజనేయులు, సెక్రటరీ వై.సుజిత్ కుమార్, ప్రిన్సిపల్ కొల్లా నాగ శ్రీనివాసరావు, విభాగాధిపతి శాంతి ప్రియ పాల్గొన్నారు.

విద్యార్థులతో మహాన్

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

వాసంతి

మేడికొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని పొట్లపాడుకు చెందిన విద్యార్థిని వాసంతి ఫుట్‌బాల్ క్రీడలో ప్రతిభ చాటుతోంది. ప్రస్తుతం క్రీడా కోటాలో విశాఖపట్నంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్‌లో సీటు సంపాదించి.. పాలిటెక్నిక్ డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతోంది. అండర్ - 14, అండర్ - 17 విభాగాల్లో ఇప్పటి వరకు మూడు సార్లు జాతీయస్థాయి పోటీల్లో, రాష్ట్రస్థాయిలో నాలుగు సార్లు సత్తా చాటింది. అండర్ - 14 విభాగంలో రాష్ట్రస్థాయిలో వెండి పతకం సాధించింది. ఈ నేపథ్యంలో అనంతపురంలో ఈ నెల 18వ తేదీ నుంచి జరిగే జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. అండర్ - 19 విభాగంలో జట్టుకు ప్రాతినిధ్యం వహించనుంది. ఈ సందర్భంగా ఆమెను జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు క్రాంతికుమార్, కార్యదర్శి దుర్గామోహన్, మండల అధ్యక్షులు మొఖరాల శ్రీనివాసరావు, కార్యదర్శి మానుకొండ బ్రహ్మాజీ తదితరులు అభినందించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి మంత్రి లోకేశ్ చేయూత

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: మంత్రి నారా లోకేశ్ సహకారంతో తాడేపల్లి పట్టణ, గ్రామీణ మండలంలోని 30 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లను తెలుగు మహిళా నాయకులు బుధవారం పంపిణీ చేశారు. మంగళగిరిలోని డాక్టర్ ఎంఎస్ఎస్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో స్త్రీశక్తి పథకం కింద మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పించారు. తితిదే పాలకవర్గ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయసత్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు దండమూడి శైలజారాణి, కొయ్యగూర మహాలక్ష్మి, తాడేపల్లి పట్టణ, మండల తెలుగు మహిళ అధ్యక్షులు కుసుమ, కృష్ణవందన తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు అందజేస్తున్న తెలుగు మహిళా నాయకులు

తెదేపా బలోపేతానికి కృషి చేద్దాం: బూర్ల

కాకుమాను, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు నియోజకవర్గంలో తెదేపా బలోపేతానికి అందరం కలసి కట్టుగా కృషి చేద్దామని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. గుంటూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని కమిటీలను పూర్తి చేశామని చెప్పారు. నాయకులు, కార్యకర్తలతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నాయీ బ్రాహ్మణులు ఐక్యంగా ఉండాలి

ప్రత్తిపాడు(కాకుమాను), న్యూస్‌టుడే: నాయీ బ్రాహ్మణులు రాజకీయ వివక్షకు గురి అవుతున్నారని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు అన్నారు. ప్రత్తిపాడులోని కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నా తమ పరిస్థితిలో మార్పురావడం లేదన్నారు. ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అంకమ్మరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఫైలేరియా నిర్ధారణ పరీక్షలు

తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల: జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణలో భాగంగా మైక్రో ఫైలేరియా నిర్ధారణ పరీక్షలు బుధవారం చేపట్టినట్లు హెల్త్ అసిస్టెంట్ జయరాజు తెలిపారు. మంగళగిరి మార్కండేయ కాలనీ ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రాంతాలు, కుంచనపల్లి, వడ్డేశ్వరం, పెదవడ్లపూడి ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో బుధవారం 1225 మంది నుంచి ఫైలేరియా నిర్ధారణ కోసం రక్త నమూనాలు సేకరించినట్లు మలేరియా అధికారి సుబ్బరాయణం తెలిపారు. ☛ దుగ్గిరాల మండలం మోరంపూడిలో రక్త పూతలు జరుగుతున్న విధానాన్ని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పరిశీలించారు. తెనాలి సహాయ అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి, సబ్ యూనిట్ అధికారి వంగల పున్నారెడ్డి పాల్గొన్నారు.

ఎంఈవోగా బాధ్యతల స్వీకరణ

పెదనందిపాడు: పెదనందిపాడు మండల ఎంఈవో-1 గా సీహెచ్ రమేష్‌బాబు బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈయన పర్చూరు మండలం వీరన్నపాలెం ప్రభుత్వ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు.

రోడ్డు ప్రమాదంలో హోటల్ నిర్వాహకుడి మృతి

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన ఇది. చౌడవరానికి చెందిన ముద్రబోయిన శివయ్య(47) ఆర్వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో హోటల్ నిర్వహిస్తున్నారు. ద్విచక్రవాహనంపై వస్తుండగా కళాశాల సమీపంలో అదుపుతప్పి కిందపడిపోయారు. తలకు తీవ్రగాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బంగారం కోసం వృద్ధురాలిపై దాడి

కాకుమాను: బంగారం కోసం వృద్ధురాలిపై దాడికి పాల్పడిన ఘటన ఇది. కాకుమానులో ఒంటరిగా ఉంటున్న లక్ష్మీరాజ్యం మెడలోని బంగారు గొలుసు దొంగిలించేందుకు అదే గ్రామానికి చెందిన శ్రీనివాసరావు మంగళవారం విఫలయత్నం చేశాడు. ఆమె గట్టిగా అరవడంతో చేతిలో ఉన్న ఆయుధంతో ఆమె ముఖంపై పొడిచాడు. స్థానికులు అక్కడికి చేరుకునే సరికి నిందితుడు పారిపోయాడు. గాయపడిన వృద్ధురాలు ప్రస్తుతం బాపట్ల ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. కాకుమాను పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

'ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు'

మంగళగిరి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మంగళగిరిలో వైకాపా నాయకులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. గౌతమ బుద్ధా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ఉప తహసీల్దార్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పాల్గొన్నారు.

ప్రత్తిపాడు(కాకుమాను): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వద్దని ప్రత్తిపాడు నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ప్రత్తిపాడులో బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

మంగళగిరి: ఉప తహసీల్దార్ కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ హనుమంతరావు, వేమారెడ్డి

ర్యాలీతో ట్రాఫిక్ ఇక్కట్లు

తాడికొండ: తాడికొండలో వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ చేపట్టారు. బైక్ ర్యాలీకి అనుమతి లేకున్నా ప్రదర్శన నిర్వహించారు. నిరసన నేపథ్యంలో ట్రాఫిక్‌కు 30 నిమిషాల పాటు అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు అవస్థలు పడ్డారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

బురద చేరి.. అధ్వానంగా మారి

వట్టిచెరుకూరు మండలంలోని కొర్నెపాడు గ్రామంలో 2021లో ఏర్పాటు చేసిన పీఎంఈవై, ఎన్టీఆర్ కాలనీలకు వెళ్లే ప్రధాన రహదారి ఇటీవల కురిసిన వర్షాలతో బురదమయంగా మారింది. దీనిపై తాజాగా ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని దుస్థితి నెలకొంది. కాలనీకి చుట్టూ విస్తరించిన పంట పొలాలలో పైర్లు సాగుచేస్తున్న రైతులు తమ పంట ఉత్పత్తులను ఇళ్లకు తరలించుకునేందుకు మార్గం లేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతర్గత రహదార్లు, విద్యుత్ దీపాలు, డ్రెయిన్ల సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, వట్టిచెరుకూరు**

ఇళ్లలో ఉండలేం..వీధిలో నడవలేం..

రోడ్డుపై మురుగునీరు

కురగల్లు నుంచి నీరుకొండ గ్రామ ప్రధాన రహదారిపై మురుగు నీరు చేరి జనం అవస్థలు పడుతున్నారు. దుర్వాసన, దోమలతో నిత్యం నరకం చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం నడిచేందుకు వీలు పడడం లేదని, ఇదే పరిస్థితి కొనసాగితే అనారోగ్యం పాలవుతామని, సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, మంగళగిరి గ్రామీణం**

వీధి కుక్కల పట్టివేత

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ఆత్మకూరు గ్రామ బస్‌స్టాండ్ సెంటర్‌లో వీధి కుక్కలు తిష్ఠ వేస్తూ దాడులు చేస్తున్నాయి. మంగళవారం అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులపై దాడి చేసి గాయపరిచాయని స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న మంగళగిరి, తాడేపల్లి నగరపాలక కమిషనర్ అలీంబాషా స్పందించి.. మున్సిపల్ కార్మికులతో వీధి కుక్కలను పట్టించి దూరంగా తరలించారు.

రాత్రి మాటేస్తూ.. మట్టి దోచేస్తూ..

తుళ్లూరు: రాజధాని నిర్మాణ పనుల తవ్వకాల్లో వచ్చిన మట్టిని గుత్తేదారుల ప్రతినిధులు స్థానికంగా నిల్వ చేస్తున్నారు. ఆ మట్టిని రాత్రి వేళ గుట్టు చప్పుడు కాకుండా కొందరు వ్యక్తులు అనధికారికంగా యంత్రాల సహాయంతో లారీల్లో లోడు చేసుకొని తరలించుకు పోతున్నారు. వేరే ప్రాంతాల్లో అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 11న ఐనవోలు గ్రామం సమీపంలోని ఈ-9 రహదారి వద్ద ఆర్‌వీఆర్ ప్రాజెక్టుకు సంబంధించిన నిల్వ చేసిన మట్టిని కొందరు వ్యక్తులు అక్రమంగా లారీల్లో తరలించుకు పోతున్నారు. ఈ విషయాన్ని గమనించిన సంస్థ లైజనింగ్ మేనేజర్ వెంకటేశ్వరరావు లారీని అడ్డుకున్నారు. డ్రైవర్ తప్పించుకొని అక్కడి నుంచి పారిపోయాడు. పోలీసులకు సమాచారం అందించగా అక్రమంగా మట్టి తరలిస్తున్న లారీ, ఎక్స్‌వేటర్‌ను తుళ్లూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై తుళ్లూరు ఎస్సై క్రాంతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బందరు కాలువలో పడి వ్యక్తి మృతి

క్రైమ్ కార్నర్

పెనమలూరు: ప్రమాదవశాత్తు బందరు కాలువలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు జిల్లా నూతక్కికి చెందిన చల్లపల్లి సుధాకర్(55) రైసు మిల్లుల్లో వెల్డింగ్ పనులు చేస్తుంటాడు. అనారోగ్యంతో బాధపడుతున్న అతడు.. పెనమలూరు పీహెచ్‌సీలో చికిత్స చేయించుకుంటున్నాడు. ఈ నెల 12న తాడిగడపలోని బంధువుకు ఫోన్‌చేసి విజయవాడ బస్టాండ్ నుంచి పెనమలూరు పీహెచ్‌సీ వరకు ఆటో బుక్ చేయించుకున్నాడు. మార్గం మధ్యలో పెనమలూరు వంతెన వద్ద దిగి.. కాలకృత్యాలు తీర్చుకునేందుకు బందరు కాలువ వద్దకు వెళ్లి.. ప్రమాదవశాత్తు జారి పడిపోయి గల్లంతయ్యాడు. సుధాకర్ మృతదేహాన్ని పెనమలూరు పోలీసులు గంగూరు సమీపంలో గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీనిపై అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కళాశాలలో చోరీ ఘటనపై కేసు

మేడికొండూరు: చోరీ ఘటనపై మంగళవారం రాత్రి కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని ఒక కళాశాలలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. రూ.50వేలు నగదు, రెండు సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారు. వాటి విలువ మొత్తంగా రూ.60 వేలు ఉంటుందని లెక్క కట్టారు. ముగ్గురు వ్యక్తులు మూతికి మాస్కులు పెట్టుకుని వచ్చి చోరీకి పాల్పడ్డారని కళాశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. కళాశాల సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

టైర్ పంక్చర్.. లారీ బోల్తా

మేడికొండూరు: టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి లారీ పల్టీ కొట్టింది. ఈ సంఘటన మండలంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. మహారాష్ట్ర నుంచి సీతాఫలాల లోడుతో ఓ లారీ గుంటూరు వెళ్తుంది. జంగంగుంట్లపాలెం, 14వ మైలు మధ్య వెనుక టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి పల్టీకొట్టింది. కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న ఏఎస్ఐ బందరాజు సిబ్బందితో కలిసి అక్కడకు వెళ్లి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. లారీలో చోదకుడు, మరో వ్యక్తి ఉన్నారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి

మేడికొండూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి నాగసాయికుమార్ పేర్కొన్నారు. మండలంలోని డోకిపర్రు, మంగళగిరిపాడులో బుధవారం ఆయన పర్యటించారు. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం, డోకిపర్రు గ్రామ సచివాలయాన్ని ఆయన సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. గ్రామ కార్యదర్శి జిలానీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

మంగళగిరి, మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: పదో తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని డీఈవో రేణుక కోరారు. మంగళగిరి సీకే హైస్కూల్‌ను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఏ-1 పరీక్షలను తనిఖీ చేశారు. అవసరమైన సూచనలు చేశారు. పాఠశాల పాలకవర్గం అధ్యక్షుడు చింతిక్రింది కనకయ్య, కరస్పాండెంట్ గంజి చిరంజీవి, ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీమా పరిహారం అందజేత

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి ఏపీఎస్పీ బెటాలియన్ కానిస్టేబుల్ రాఘవరెడ్డి ప్రమాదవశాత్తూ రైలు ఢీకొని ప్రమాదవశాత్తూ ఈ ఏడాది మార్చిలో మృతి చెందారు. ఆయనకు రావాల్సిన వేతన ప్యాకేజీతో పాటు బీమా పరిహారం కింద రూ.కోటి విలువైన చెక్కును బాధిత కుటుంబానికి బెటాలియన్ కమాండెంట్ నగేష్‌బాబు బుధవారం అందజేశారు. అడిషనల్ కమాండెంట్ ఆశీర్వాదం, అసిస్టెంట్ కమాండెంట్ హనుమంతు, ఎస్‌బీఐ అధికారులు పాల్గొన్నారు.

సర్వేలు వేగవంతం చేయండి

రేవేంద్రపాడు(దుగ్గిరాల), న్యూస్‌టుడే: సచివాలయాల సిబ్బంది క్షేత్ర స్థాయిలో ప్రతి ఇంటికి వెళ్లి తాము చేయాల్సిన సర్వేలను వేగవంతం చేయాలని డీఎల్‌డీవో కుసుమ శ్రీదేవి చెప్పారు. బుధవారం ఆమె రేవేంద్రపాడు సచివాలయాన్ని ఆమె సందర్శించారు. కౌసలం, ఈకేవైసీ, ఆధార్, బయోమెట్రిక్ అప్‌డేషన్ వంటివి పూర్తి చేయాలన్నారు.

లౌకికశక్తులు ఏకం కావాలి

దుగ్గిరాల, న్యూస్‌టుడే: మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకిక శక్తులు ఏకం కావాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ చిస్తి అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక ముర్తుజా నగర్‌లోని షాదీఖానాలో ఆ కమిటీ సమావేశం జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాగ్దానాల అమలులో విఫలమయ్యాయని విమర్శించారు. వ్యకాసం జిల్లా అధ్యక్షుడు బాలరాజు, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే బాషా, యార్లగడ్డ బ్రహ్మేశ్వరరావు, యేమినేని స్టాలిన్, ఎన్ యోగేశ్వరరావు తదితరులున్నారు.

అవీ ఇవీ

అసాంఘిక కార్యకలాపాలను ఉపేక్షించం

తుళ్లూరు: తుళ్లూరులోని టిడ్కో గృహాల వద్ద బుధవారం తుళ్లూరు సీఐ-2 ఎం. శ్రీనివాసరావు స్థానికులతో సమావేశం నిర్వహించారు. కొందరు మద్యం, మత్తుపదార్థాలు వినియోగిస్తూ హల్‌చేస్తున్నారని తమ దృష్టి వచ్చిందని, అలాంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ-2 హెచ్చరించారు.

క్రైస్తవుల ఉపవాస ప్రార్థనలు

మంగళగిరి గ్రామీణం: మంగళగిరి టిప్పర్ల బజార్ ఎస్‌కేఆర్ కల్యాణ మండపంలో నిర్వహిస్తోన్న ఉపవాస ప్రార్థనలు మంగళవారం రాత్రితో ముగిశాయి. నిడుమోలు ఐసీబీజీ ప్రెసిడెంట్ రెవ.సీహెచ్ లూథర్ ప్రశాంత్ కుమార్, రెవ. చంద్రశేఖర్ సందేశాలు వినిపించారు. పాస్టర్ మోజేష్ పర్యవేక్షణలో చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు.

పంట నమోదు తప్పనిసరి

ఫిరంగిపురం: 113తాళ్ళూరు, ఫిరంగిపురంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో మండల ఏవో వాసంతి పాల్గొని ప్రత్తి పైరులో తెల్లదోమ నివారణ చర్యలను వివరించారు. రైతులందరూ పంట నమోదు చేసుకోవాలని సూచించారు.

1810 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ

ఫిరంగిపురం గ్రామీణం: మండల పరిధిలో యూరియా కొరత లేదని ఏవో వాసంతి తెలిపారు. రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లు, ప్రయివేటు దుకాణాల ద్వారా మండల పరిధిలో మొత్తం 1,810 మెట్రిక్ టన్నులు యూరియా పంపిణీ చేశామన్నారు.

సామూహిక చర్యలతో నత్తల నివారణ

మంగళగిరి: ఆఫ్రికన్ నత్తలు పంట పొలాల్లో కనిపిస్తున్నాయని రైతులు వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకొచ్చారు. నూతక్కిలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో డాట్ సెంటర్ శాస్త్రవేత్త మనోజ్ మాట్లాడుతూ నత్తల నివారణకు సామూహిక చర్యలు చేపట్టాలని, లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పు, లేదా మూడు గ్రాముల ఐరన్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలన్నారు.

'క్వాంటం క్రిప్టోగ్రఫీ'లో పరిశోధన గ్రంథం

పెదనందిపాడు: పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ వీరరాఘవయ్య బుధవారం రాయలసీమ విశ్వవిద్యాలయం (కర్నూలు) లో జరిగిన స్నాతకోత్సవంలో వీసీ వెంకట బసవరాజు నుంచి 'క్వాంటం క్రిప్టోగ్రఫీ'లో సమర్పించిన పరిశోధన గ్రంథానికి సంబంధించి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు.

(c) eenadu

గుంటూరు తూర్పు

న్యుమోనియా మరణాలు తగ్గించేందుకు అవగాహన

నగరంపాలెం, న్యూస్‌టుడే: న్యుమోనియా మరణాలు తగ్గించేందుకు వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ కె.విజయలక్ష్మి తెలిపారు. జీజీహెచ్‌లోని పిల్లల వార్డు సమావేశ మందిరంలో ప్రపంచ న్యుమోనియా దినోత్సవాన్ని పురస్కరించుకొని పిల్లల వైద్య విభాగాధిపతి డాక్టర్ దేవకుమార్ ఆధ్వర్యంలో సామాజిక అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న డీఎంహెచ్‌వో కె.విజయలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ మాట్లాడుతూ న్యుమోనియా మూలంగా ఐదేళ్ల లోపు పిల్లల మరణాలు సంభవిస్తున్నాయన్నారు.

ధర వరలు

ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 28, వంగ 47, బెండ 45, పచ్చిమిర్చి 39, కాకర 54, క్యారెట్ 70, క్యాబేజీ 30, బీర 40, దొండ 56, బంగాళదుంప 29, ఉల్లిపాయలు 17, గోరుచిక్కుళ్లు 64, దోస 27, పొట్ల 40, చామదుంప 25, మునగ 8, గోంగూర 12, తోటకూర 20, చుక్కకూర 20, కొత్తిమీర 30, బీట్‌రూట్ 44, కీర 29, క్యాప్సికం 65, అల్లం 80, ఫ్రెంచి బీన్స్ 65, సొర 32, అరటి 7. **- న్యూస్‌టుడే, పట్నంబజారు**

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM
94406 38515, 80085 73097

? పాతబస్టాండు సెంటర్‌లో ఆర్టీసీ బస్సుల్ని రోడ్డుపై నిలిపి ప్రయాణికులను ఎక్కిస్తున్నారు. దీనివల్ల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **- అంకిరెడ్డి, నాజ్‌సెంటర్**

✔ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- సామ్రాజ్యం, జిల్లా ప్రజా రవాణా అధికారి**

? దర్గా సెంటర్‌లో సిగ్నల్ లైట్లు వెలగటం లేదు. దీనివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. **- మస్తాన్**

✔ సిగ్నల్ లైట్లకు మరమ్మతులు చేయిస్తాం. **- అశోక్‌కుమార్, ట్రాఫిక్ సీఐ**

? పట్నంబజారులో కొందరు నూనెల వ్యాపారులు తప్పుడు తూకాలతో వినియోగదారుల్ని మోసగిస్తున్నారు. లీటరుకు 50 గ్రాముల నుంచి 100 గ్రాముల వరకు తరుగు వస్తోంది. **- యుగంధర్, చౌత్రాసెంటర్**

✔ తప్పుడు తూకాలు వేసే వారిపై కేసులు నమోదు చేస్తాం. **- అల్లూరయ్య, తూనికలు, కొలతలశాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్**

? నందివెలుగురోడ్డులోని మెయిన్ డ్రెయిన్‌లో పూడిక తీయటం లేదు. వ్యర్థనీరు రోడ్డుపై వస్తోంది. **- పవన్, పార్కుసెంటర్**

✔ సమస్యను అధికారులకు వివరించి పరిష్కరిస్తాం. **- రత్నం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ –న్యూస్‌టుడే, పట్నంబజారు**

★ మద్దిరాల కాలనీ ప్రధానరోడ్డులో చెత్త కుప్పలు రోజులుగా అలాగే ఉండటంతో వీధులు అపరిశుభ్రంగా మారుతున్నాయని స్థానికుడు మోహన్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లడంతో చెత్తకుప్పలు తరలించారు.

★ వెంగయ్యనగర్ రెండోలైన్‌లో సైడుకాలువల్లో పూడికలు పేరుకుపోయి మురుగునీరు పారుదలకాక దోమలవ్యాప్తి అధికంగా ఉందని స్థానికుడు కిరణ్ కుమార్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను ప్రజారోగ్య విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పూడికలు తీయించారు. **- న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ**

స్పందనకు వందనం

అర్ధరాత్రి షికార్లకు చెక్

■ అనవసరంగా రోడ్లపై తిరిగితే కేసులు
■ నిత్యం పోలీసుల స్పెషల్ డ్రైవ్

న్యూస్‌టుడే – నెహ్రూనగర్

అర్ధరాత్రి సమయంలో ఓల్డ్‌క్లబ్ రోడ్డు నుంచి కొత్తపేట వస్తున్న ఓ జంటను తెనాలికి చెందిన వ్యక్తి అడ్డగించి ప్రియుడిని బెదిరించి.. యువతిపై అత్యాచారానికి పాల్పడిన ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది.

గతేడాది ఇద్దరు యువకులు మద్యం, గంజాయి మత్తులో అర్ధరాత్రి దుకాణాల వద్ద ఉన్న కాపలాదారులను దారుణంగా హత్య చేసి, చోరీలకు పాల్పడిన ఘటన సైతం సంచలనం రేపింది.

రాత్రివేళల్లో ఆకతాయిలు, తాగుబోతులు, రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, పాత నేరస్థులు చెలరేగిపోతున్నట్టు పోలీసులు గుర్తించారు. ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ.. నిర్మానుష్య ప్రాంతాల్లో పాగా వేసి అకృత్యాలకు పాల్పడుతున్నారు. మహిళల మెడల్లోని బంగారు గొలుసులు తెంచుకెళ్తున్నారు. తాళాలు వేసిన దుకాణాలు, ఇళ్లల్లో చోరీలకు తెగబడుతున్నారు. మద్యం, గంజాయి మత్తులో దారి దోపిడీలకు పాల్పడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. గొడవలు పెట్టుకొని దాడులు చేయడం, మద్యం సీసాలు, కత్తులతో హత్యాయత్నాలకు ఒడిగట్టడం తరచూ జరుగుతున్నాయి.

రాత్రిపూట తిరుగుతున్నవారికి పోలీసుల కౌన్సెలింగ్

నెల రోజుల్లో 4,200 మందిపై కేసులు

అరాచక శక్తుల ఆట కట్టించడానికి పోలీసు యంత్రాంగం రాత్రిపూట ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు సీఐలు, ఎస్సైలు సిబ్బందితో అర్ధరాత్రి 12 గంటల నుంచి ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. రోడ్లపై కనబడినవారిని ఆరా తీస్తున్నారు. వారు చెప్పిన సమాధానంపై అనుమానం వస్తే న్యూసెన్స్ కేసు నమోదు చేసి పోలీస్‌స్టేషన్లకు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. సినిమాకు వెళ్లినా.. హోటళ్ల నుంచి వస్తున్నా.. ప్రయాణం చేసి ఇళ్లకు వెళ్తున్నా.. సంబంధిత టికెట్లు, బిల్లులు చూపిస్తే వదిలేస్తున్నారు. అత్యవసర పనులు, ఆసుపత్రులకు వెళ్తున్నవారిని ఆపడం లేదు. రాత్రి వేళ అనవసరంగా రోడ్లపై తిరుగుతున్నవారిని కట్టడి చేస్తున్నారు. గత నెల రోజుల్లో 4,200 మందిపై న్యూసెన్సు కేసులు పెట్టారు.

అనవసరంగా రోడ్లపై తిరగొద్దు

– ఎస్పీ వకుల్ జిందాల్

అర్ధరాత్రి పూట మద్యం సేవించి రోడ్లపై తిరుగుతూ గొడవలకు దిగుతున్నారు. అసాంఘిక కార్యకలాపాలు అడ్డుకునేందుకు రాత్రిళ్లు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాం. అనవసరంగా రోడ్లపై తిరగొద్దని చెబుతున్నాం. అనుమానాస్పద వ్యక్తులపై డయల్ 112కు సమాచారం చెప్పొచ్చు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

ప్రయాణికుల భద్రతే ముఖ్యం

మాట్లాడుతున్న డీఆర్ఎం సుధేష్ణసేన్

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ప్రయాణికుల భద్రత విషయంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఆర్ఎం సుధేష్ణసేన్ అన్నారు. బుధవారం డీఆర్ఎం సమావేశ మందిరంలో అధికారులు, పర్యవేక్షకులతో ఆమె సమావేశమయ్యారు. ఫుట్‌ప్లేట్, లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద తనిఖీలు పకడ్బందీగా ఉండాలని ఆదేశించారు.

మురుగుకాలువల సమస్యల పరిష్కారానికి ప్రణాళిక

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో మురుగుకాలువల సమస్యల పరిష్కారానికి ఏఈల వారీగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, భవిష్యత్తు అవసరాలకు తగిన విధంగా నిర్మాణాలు చేపట్టాలని కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. బుధవారం ఆయన శంకర్‌విలాస్ వంతెన వద్ద పనులు జరుగుతున్న అరండల్‌పేట వైపు, నాయుడుపేట ప్రాంతాల్లో అభివృద్ధి, పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మురుగునీటి పారుదల నిలిచిపోవడానికి లెవెల్స్ సరిగా లేకపోవడమే కారణమన్నారు. నగరంలో ఎక్కడా డంపింగ్ పాయింట్‌లు లేకుండా చూడాలని ఆదేశించారు. పర్యటనలో ఏసీపీ రెహ్మాన్, ఈఈ వేణు తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌విలాస్ వద్ద పనులు పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

కష్టపడితే గుర్తింపు తథ్యం

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: కష్టపడిన ప్రతి ఒక్కరికి జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ మనసులో ప్రత్యేక స్థానం ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వడ్రాణం మార్కండేయబాబు అన్నారు. రాష్ట్ర లేబర్ బోర్డు డైరెక్టర్‌గా ఎన్నికైన జనసేన నగర ఉపాధ్యక్షులు చింతా రేణుకారాజుని బుధవారం దేవాదాయశాఖకు చెందిన రంగనాయకస్వామి దేవస్థానంలో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించాయి. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కొర్రపాటి నాగేశ్వరరావు, అడపా మాణిక్యాలరావు, ఆళ్ల హరి, మల్లేశ్వరి, ఆనంద్‌సాగర్, ఉదయ్ పాల్గొన్నారు.

రేణుకారాజుని సత్కరిస్తున్న మార్కండేయబాబు, నాగేశ్వరరావు, మాణిక్యాలరావు, హరి, మల్లేశ్వరి

అనధికార పార్కింగ్‌పై చర్యలు తీసుకోండి

నగరపాలక సంస్థ: జీఎంసీ ట్రావెలర్ బంగ్లా నుంచి నగరంపాలెం మూడు బొమ్మల వరకు అనధికార పార్కింగ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని కమిషనర్ శ్రీనివాసులు ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. పార్కింగ్ చేసిన వాహనాలను గురువారంలోగా స్వచ్ఛందంగా తొలగించాలని లేకుంటే పోలీసు, జీఎంసీ ప్రణాళిక సిబ్బంది తొలగిస్తారని హెచ్చరించారు. ప్రధాన రోడ్డులో ఉన్న ట్రావెల్స్ బస్సుల తొలగింపును పరిశీలించారు. ఇప్పటికే పలుమార్లు టీబీ బంగ్లా నుంచి నగరంపాలెం మూడు బొమ్మల వరకు ఇరువైపులా పార్కింగ్ చేసి ఉన్న వాహనాలను తొలగించినట్లు తెలిపారు. పర్యటనలో సీపీ రాంబాబు, డీసీపీ సూరజ్, ట్రాఫిక్ సీఐ సింగయ్య, డీఈఈ కల్యాణరావు తదితరులు పాల్గొన్నారు.

స్తంభం నిలబెట్టారు

ఈనాడు కథనానికి స్పందన

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: బుచ్చయ్యతోట ప్రధాన రహదారిపై టెలిఫోన్ స్తంభం ఒక పక్కకు ఒరిగిపోయి పడిపోయే స్థితిలో ఉందని 'ఈనాడు'లో ఈ నెల 7న 'స్తంభం ఎప్పుడైనా పడొచ్చు' శీర్షికతో చిత్రవార్త ప్రచురితమయ్యింది. స్పందించిన అధికారులు సిబ్బందితో మరమ్మతులు చేయించి నిలబెట్టారు.

21 నుంచి పోలేరమ్మ తిరునాళ్లు

పట్నంబజారు, న్యూస్‌టుడే: పాతగుంటూరు మాచిరాజువారివీధిలోని పోలేరమ్మ దేవస్థానం వద్ద ఈ నెల 21 నుంచి ద్వితీయ వార్షికోత్సవ తిరునాళ్లు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు చిన్ని కొండయ్య తెలిపారు. బుధవారం అమ్మవారి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21న కుంకుమపూజలు, 22న ప్రత్యేక పూజలు, అభిషేకాలు అనంతరం అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో చిన్న శ్రీనివాసరావు, హరికృష్ణ, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మసీదుల నిర్మాణానికి కట్టుబడి ఉన్నాం

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మసీదుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. బుధవారం లాలాపేట పాతబస్టాండ్ సెంటర్లో ఇక్బాల్ మసీదు పునఃనిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వం ఇమామ్‌లు, మౌజన్లకు గౌరవ వేతనం ఎగ్గొట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.45 కోట్ల గౌరవ వేతనం విడుదల చేసిందని చెప్పారు. హజ్‌యాత్ర వెళ్లే వారి కోసం విజయవాడలో హజ్ భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్సారీ, ముజహిద్, హఫీజ్, చిష్టి, సలీం, హాజీ తయాబ్, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే నసీర్, మతపెద్దలు

ఆలయాల పవిత్రత కాపాడతాం..

నగరపాలక సంస్థ: ఆలయాల పవిత్రతను కాపాడుతూ వాటి అభివృద్ధికి గట్టి చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. బుధవారం రైలుపేట శ్రీప్రసన్నాంజనేయ స్వామి ఆలయం నూతన కమిటీ అధ్యక్షుడిగా వేదాంతం శ్రీనివాసశర్మతోపాటు కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం

నగరపాలక సంస్థ: పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. బుధవారం శారదాకాలనీ, పాతగుంటూరు ప్రాంతాల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో భాగంగా గృహ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మీరావలి, అశోక్, జాగర్లమూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని అక్రమంగా అమ్మేస్తున్నారు

రిజర్వాయర్ల వద్ద తాగునీటి అక్రమ తరలింపును అడ్డుకునేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నా కొన్నిచోట్ల మాత్రం చాటుమాటుగా విక్రయాలు జరుగుతున్నాయి. ట్యాంకర్లకు అనుమతులు ఇచ్చేది లేదని, రిజర్వాయర్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నా అక్రమాలకు అడ్డుకట్ట పడడం లేదు. కొన్ని ట్యాంకర్ల ద్వారా నీటిని ప్రైవేటు నిర్మాణ పనులు, కట్టడాలకు, హోటళ్లు, హాస్టళ్లకు తరలిస్తున్నారు. **- న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ**

హెచ్ఎల్ఆర్ వద్ద నీటిని పట్టుకుంటున్న ట్యాంకర్

సబ్ వే లేదు.. లిఫ్ట్ పని చేయదు

రైల్వే ప్రయాణికులకు తప్పని అవస్థలు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే

గుంటూరు రైల్వే స్టేషన్ మీదుగా నిత్యం 50కి పైగా రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. వేలాది మంది ప్రయాణికులతో రద్దీ ఉంటుంది. సౌకర్యాల విషయంలో మాత్రం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్టేషన్‌లో ఎనిమిది ప్లాట్‌ఫారంలున్నాయి. తూర్పు వైపు ప్రవేశమార్గం నుంచి వచ్చిన ప్రయాణికులు 2 నుంచి 8 ప్లాట్‌ఫారంల వైపు వెళ్లడానికి సబ్‌వేను ఉపయోగించాలి. పశ్చిమ వైపు నుంచి స్టేషన్‌లోకి ప్రవేశించిన ప్రయాణికులు ప్లాట్‌ఫారంలలోకి సబ్‌వే నుంచి వెళ్లాల్సిందే.

ఏడాదిగా ఇందులోకి తరచూ నీరు చేరుతోంది. దీనివల్ల ప్రయాణికుల రాకపోకలకు ఆటంకంగా కలుగుతోంది. సబ్‌వేలో నీరు ఎక్కువగా నిలవడంతో వారం క్రితం రాకపోకలు నిలిపేశారు. ఆ మార్గంలోకి వెళ్లకుండా రెండు వైపులా రేకులు అడ్డుగా పెట్టారు. సబ్‌వే మెట్ల మార్గంలో వెళ్లలేని వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన లిఫ్ట్‌ను తాత్కాలికంగా మూసేశారు. వారం రోజులుగా ఇదే పరిస్థితి. దీంతో ప్రయాణికులు ఫుట్ బ్రిడ్జి ఎక్కి దిగాల్సి వస్తోంది. వృద్ధులు, మహిళలు ఇబ్బంది పడుతున్నారు. రైల్వే అధికారులు దృష్టి సారించి సబ్‌వే, లిఫ్ట్‌లను సాధ్యమైనంత వేగంగా అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.



నిరుపయోగంగా లిఫ్ట్

సబ్‌వేలోకి ప్రయాణికులు వెళ్లకుండా అడ్డుగా రేకు

రహదారి.. రాళ్లు తేలి..

దర్గా రోడ్డు గుంతలమయంగా మారింది. రెండేళ్ల నుంచి అభివృద్ధికి నోచుకోలేదు. హైదరాబాదు వైపు వెళ్లే భారీ వాహనాలు ఇటువైపు నుంచే రాకపోకలు సాగిస్తుంటాయి. భారీ వాహనాల తాకిడికి కంకర కొట్టుకుపోయి రాళ్లు బయట పడ్డాయి. **- న్యూస్‌టుడే, పట్నంబజారు**

చూసి వెళ్లండి

కృష్ణమహల్ రోడ్డులో మురుగుకాలువ ప్రమాదకరంగా మారింది. డ్రైనేజీపై ఏర్పాటు చేసిన మూత పక్కకు తొలగిపోవడంతో అందులోకి పాదచారులు జారి పడుతున్నారు. గుంతలో పడి వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. **- న్యూస్‌టుడే, గుంటూరు నేరవార్తలు**

డివైడర్లకు రంగులు

నగర సుందరీకరణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.. ఇందులో భాగంగా రింగురోడ్డు డివైడర్లకు రంగులు వేయిస్తున్నారు. అవి చూడముచ్చటగా ఉండేలా విభిన్న రంగుల ఆకృతులు, పూలు డిజైన్లను వేయిస్తున్నారు. వచ్చే జనవరికి స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలు జరగనున్నందున నగరంలో స్వచ్ఛత కార్యక్రమాలు అమలు చేయడంతోపాటు పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నారు.- **నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే**

వ్యర్థాల నిర్వహణపై పంజాబ్ బృందం ఆరా

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరాల్లో డంపింగ్‌యార్డుల సమస్య లేకుండా చేసేందుకు చెత్తతో విద్యుదుత్పత్తి ప్లాంట్లు దోహదపడతాయని పంజాబ్ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి పర్మీందర్ పాల్‌సింగ్ అన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ స్టడీ టూర్‌లో భాగంగా బుధవారం పంజాబ్ నుంచి అధికారుల బృందం గుంటూరుకు వచ్చింది. కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి నాయుడుపేటలోని జిందాల్ విద్యుత్తు ఉత్పత్తి ప్లాంటును పరిశీలించారు. వివిధ విభాగాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్లాంటు సామర్థ్యం, ప్రస్తుతం వస్తున్న వ్యర్థాలు, రోజువారీ ఉత్పత్తి వివరాలు ఆరా తీశారు. కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్లాంటు నిర్వహణ, వ్యర్థాల తరలింపునకు జీఎంసీ నోడల్ కార్పొరేషన్‌గా ఉందన్నారు. నిత్యం సుమారు 400 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను జీఎంసీ నుంచి పంపుతున్నట్లు తెలిపారు. పర్యటనలో జీఎంసీ సీఎంవోహెచ్ డాక్టర్ పి.శాంతికళ, జిందాల్ ప్లాంటు ఏపీ ప్రెసిడెంట్ ఎంవీ చారి, ప్లాంటు అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే విజయం

జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే: యువత ప్రణాళికతో చదివితే ఎంపిక చేసుకున్న రంగంలో విజయం సాధిస్తారని జిల్లా యువజన సేవలు, స్టెప్ విభాగం మేనేజర్ బి.రాధిక అన్నారు. నగరంలోని సాంబశివపేటలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు సీహెచ్.వెంకట్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపల్ షేక్ ముంతాజ్, స్టెప్ జేఏ వి.సాయి సాత్విక్, జిల్లా ఉపాధి కార్యాలయ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా స్టెప్ విభాగం మేనేజర్ రాధిక

అధికారులు, ఉద్యోగుల కృషితోనే సదస్సు విజయవంతం

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరులో వాటర్ షెడ్ మహోత్సవ్‌లో భాగంగా ఈనెల 10, 11 తేదీల్లో జాతీయ సదస్సును విజయవంతంగా నిర్వహించినందుకు కలెక్టరు ఎ.తమీమ్ అన్సారియా జిల్లా అధికారులను బుధవారం అభినందించారు. సదస్సు నిర్వహణలో వారికి అప్పజెప్పిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించారని.. ఉద్యోగుల భాగస్వామ్యాన్ని కూడా ప్రత్యేకంగా ప్రస్తావించి అందరికీ కృతజ్ఞతలు చెప్పారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.శశిభూషణ్‌కుమార్, కమిషనర్ మైలవరపు కృష్ణతేజ కూడా.. జిల్లా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, ఉద్యోగుల కృషిని అభినందించారు. వెంగళాయపాలెంలో చెరువు పునరుద్ధరణ పనులతో పాటు ఐటీసీ హోటల్‌లో రెండు రోజుల సదస్సుకు హాజరైన ప్రతినిధులు, అధికారులకు వసతి, ఇతర సదుపాయాలు సమకూర్చు, నల్లపాడు లయోలా పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన బహిరంగ సభను విజయవంతం చేయడంలో ఉద్యోగుల పని తీరు బాగుందన్నారు. కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కూడా వాటర్ షెడ్ మహోత్సవాన్ని విజయవంతం చేయడంపై జిల్లా అధికారులను ప్రశంసించడం విశేషం.

దావా సమను

మహారాజశ్రీ గుంటూరు 4వ అడిషనల్ జిల్లా జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నెం.84/2025

బిట్వీన్:
పోతుగంటి ఫణీంద్ర కుమార్ ...వాది
మరియు
1) కొత్తూరి సత్యవతీదేవి
2) గోపు కృష్ణ రాఘవేంద్రగుప్త
3) కొత్త సూర్య నారాయణ శెట్టి అలియాస్ సూర్యనారాయణ శెట్టి
4) కొత్త సూర్యనారాయణ శెట్టి, అలియాస్ తులసీరాం అలియాస్ కె.యస్. తులసీరాం
...ప్రతివాదులు

టు
1వ ప్రతివాది
కొత్తూరి సత్యవతీదేవి భర్త. వెంకట ప్రసాదరావు, హిందువు, వయస్సు:61, గృహిణి, ఉగ్రావారి వీధి డోర్.నెం.3-39/హెచ్1, 3వ లైను, లాలాపేట, కృష్ణ నగర్, గుంటూరు, గుంటూరు జిల్లా,

పై వారికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా మీరున్నూ 2 నుండి 4 వరకు గల ప్రతివాదులు వాది వద్ద రు. 40,00,000/-లు రొఖము తీసుకొని అందుకుగాను మీరు దావా షెడ్యూలు ఆస్తికి అస్వాధీనపు విక్రయ అగ్రిమెంటు ది.04-08-2018వ తేదీన వ్రాయించి యిచ్చియున్నారు. విక్రయ అగ్రిమెంటు ప్రకారం రిజిష్టరు దస్తావేజు వ్రాయించి యిచ్చుటకు మీరు కలసి రానందున వాది ఇచ్చిన విక్రయ ప్రతిఫలంగాని లేక దస్తావేజు వ్రాయించి యిచ్చులాగున రు. 57,44,595/-లకు వడ్డీ, ఖర్చులతో రాబట్టుకొను నిమిత్తం పై కోర్టులో దావాచేయగా దావాలో మీ నోటీసు నిమిత్తం ది. 25-11-2025 తేదీకి వాయిదా అయి ఉన్నది. కనుక వాయిదా రోజున ఉదయం గం.10.30 ని॥లు మీరు స్వయంగా గాని లేక ప్లీడరుగారి ద్వారాగాని పై కోర్టువారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల మీ పరోక్షమందు దావా తీర్మానము జరుగునని తెలుసుకోగలరు.

వాయిదా ది.25-11-2025 (కోర్టు వారి అనుమతితో)

సం/-
సత్తెనపల్లి 07-11-2025
డి. బాపయ్య చౌదరి
వాది తరపు అడ్వకేట్

పెళ్లి పేరుతో మోసగించారని న్యాయవాదిపై కేసు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ న్యాయవాది తనను మోసగించారని మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై బుధవారం నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసరావుపేటకు చెందిన ఓ మహిళకు అదే ప్రాంతానికి చెందిన వ్యక్తితో 2003లో వివాహమైంది. ఒక బాబు పుట్టాడు. భర్త తరచూ కొట్టడంతో ఆ వేధింపులు భరించలేక విడిపోవాలని నిర్ణయించుకుంది. విడాకులు ఇప్పించాలని 2020లో ఓ న్యాయవాదిని కలిసింది. అప్పట్నుంచి ఆ న్యాయవాది ఆమెతో చనువుగా ఉండేవారు. భర్తతో విడాకులు మంజూరయ్యాక న్యాయవాది ఆమెకు సన్నిహితమయ్యారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆయన మోసం చేశారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతి

పట్నంబజారు, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్టాండులో అపస్మారక స్థితిలో ఉన్న మహిళ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పాతగుంటూరు పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 11న బస్టాండులోని 39వ ప్లాట్‌ఫారం వద్ద గుర్తు తెలియని మహిళ పడి ఉండటాన్ని ప్రయాణికులు గమనించి 108 ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. వయసు సుమారు 45 సంవత్సరాలు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ స్లిప్‌పై కనకాలు అని పేరు రాసి ఉందని పోలీసులు తెలిపారు. తెలిసినవారు పాతగుంటూరు పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సీఐ వెంకట ప్రసాద్ కోరారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ పథకంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అందజేస్తున్న ప్రోత్సాహకాలతో యూనిట్లు ఏర్పాటు చేసి అభివృద్ధి చెందాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ అధిపతి ఎస్.జవహర్ అన్నారు. జీటీ రోడ్డులోని యూబీఐ ప్రాంతీయ కార్యాలయంలో ఎంఎస్ఎంఈ ఖాతాదారులతో అనుబంధం బలోపేతం చేయడం, కేంద్రీకృత ఆర్థిక పథకాల గురించి అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. అధికారులు, లబ్ధిదారుల మధ్య వ్యాపార విస్తరణపై చర్చలు జరిగాయి. అనంతరం రూ.20 కోట్ల విలువైన రుణ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అధికారులు అందజేశారు. సమావేశంలో యూబీఐ డిప్యూటీ రీజినల్ హెడ్ అశ్వర్థ నాయక్, ఎంఎస్ఎంఈ విభాగం అధిపతులు సత్యజిత్ కబి, హరేరామ్ షా తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుడికి రుణ మంజూరు పత్రం అందజేస్తున్న యూబీఐ ప్రాంతీయ అధిపతి జవహర్

వ్యక్తి అదృశ్యం

పట్నంబజారు, న్యూస్‌టుడే: ఆర్టీసీ కాలనీలోని రజకుల కాలనీకి చెందిన నూతలపాటి నాగులమీరా కనిపించటం లేదని బుధవారం పాతగుంటూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నెల 9న చర్చికి వెళ్తున్నట్టు చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన నాగుల మీరా తిరిగి రాలేదు. ఎస్.ఐ ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కులగణన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర్‌రావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను కోరారు. ఈ మేరకు సచివాలయంలోని ఛాంబర్‌లో బుధవారం కలిసి వినతిపత్రం అందించారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోండి

జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే: నిరుపేద విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకురాలు బి.లావణ్య వేణి అన్నారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని సామాజిక పరివర్తన భవన్‌లోని ఆ శాఖ కళాశాల విద్యార్థినుల వసతి గృహాన్ని బుధవారం ఆమె సందర్శించి ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ వసతి గృహంలో అత్యాధునిక వసతులు కల్పించేందుకు నిధులు కేటాయిస్తామని తెలిపారు. విద్యతో అభివృద్ధి చెంది తల్లిదండ్రులతో పాటు రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఏవిధమైన సమస్యలున్నా అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు యు.చెన్నయ్య, గుంటూరు నగర సబ్ డివిజన్ ఏఎస్‌డబ్ల్యూవో శైలజ, హెచ్‌డబ్ల్యూవోలు పాల్గొన్నారు.

ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న సంచాలకురాలు లావణ్య వేణి

సంస్మరణ

డా॥జి.సుబ్బారావు
Rtd.Regional Director : Medical & Health Services
జననం:06-06-1930 మరణం: 13-11-1999
డా॥ పి.హెచ్. ఉషాదేవి - డా॥ శివరామకృష్ణ
డా॥ ఎస్ ఉమాదేవి - డా॥ సాంబశివరావు
జి. కిషోర్ బాబు - వాణీ
డా॥జి. ప్రతాప్ కుమార్ - డా॥ అనూరాధ

నీతిమంతుని జ్ఞాపకము చేసుకొనుట ఆశీర్వాదకరమగును సామెతలు: 10:7
తృతీయ వర్ధంతి

మంచికి మారుపేరుగా నిలచి, క్రమశిక్షణగల వ్యక్తిగా మా ఉన్నతికి శ్రమించిన మీరు మా నుండి దూరమై ప్రభువు చెంతకు చేరి 3 సం॥లు గడచిననూ సదా మా హృదయాలలో ఎల్లప్పుడూ చిరస్మరణీయులే... మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రభువును ప్రార్థిస్తూ...

కీ.శే. శ్రీ వేజండ్ల శ్యామ్‌సుందర్ గారు
M.A., M.A., M.Ed.
స్కూల్ అసిస్టెంట్ సోషల్ Rtd. Teacher, సత్తెనపల్లి
జననం: 11-7-1956 మరణం: 13-11-2022

భార్య: మోహన్ పద్మావతి
తల్లి: వేజండ్ల వసుంధర
కుమారుడు - కోడలు
ప్రదీప్ - వనిత
కుమార్తె - అల్లుడు
సుధారాణి - సుశాంత్
మనుమరాలు: ఖ్యాతి ఐవిలిన్

గుంటూరు పశ్చిమ

పేదల సొంతింటి కల సాకారం చేశాం

మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే మాధవి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: పేదల సొంతింటి కలను సాకారం చేశామని ఎమ్మెల్యే గల్లా మాధవి పేర్కొన్నారు. పీఎంఏవై 2.0 పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆమె మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 560 మంది లబ్ధిదారులు ఎంపికయ్యారన్నారు. అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు మూడు లక్షల ఇళ్లు పూర్తి చేసి పేదలకు పంపిణీ చేస్తున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇళ్ల నిర్మాణంలో ఎటువంటి జాప్యం లేకుండా సమయానికి పనులు పూర్తి చేసి ఇస్తున్నామన్నారు. గత వైకాపా ప్రభుత్వం సెంటు పట్టా పేరుతో రూ.7500 కోట్లు దోపిడీకి పాల్పడిందని విమర్శించారు. ★ నియోజకవర్గంలోని వివిధ డివిజన్లకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆమె సమావేశమై చర్చించారు. కార్యకర్తలతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యల్ని ఆలకించారు. అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80086 22566, 97042 53525, 80085 74897

స్పందనకు వందనం

కాలువల్లో పూడికతీత: నల్లచెరువు ప్రధాన వీధుల్లోని కాలువల్లో మురుగు పేరుకుపోయి పారుదలకు ఆటంకం ఏర్పడిందన్న సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువల్లో పూడిక తీయించారు.

వ్యర్థాల తొలగింపు: గుండారావుపేట చెక్కల బజార్‌లో వ్యర్థాలు, చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. సమస్య 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన సిబ్బందిని పంపి వ్యర్థాలు, చెత్త తొలగించారు. -న్యూస్‌టుడే, నగరంపాలెం

సమస్యల పరిష్కారానికి ప్రణాళిక

నగరపాలక సంస్థ: నగరంలో మురుగుకాలువల సమస్యల పరిష్కారానికి ఏరియా వారీగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, భవిష్యత్తు అవసరాలకు తగినట్లు నిర్మాణాలు చేపట్టాలని కమిషనర్ శ్రీనివాసులు సూచించారు. బుధవారం ఆయన శంకర్‌విలాస్ వంతెన పనులు జరుగుతున్న అరండల్‌పేట వైపు, నాయుడుపేట ప్రాంతాల్లో అభివృద్ధి, పారిశుద్ధ్య పనులు పరిశీలించారు.

నిత్యం ట్రాఫిక్ కష్టాలే..!

కంకరగుంట ఆర్‌యూబీ వద్ద పరిస్థితి

జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే: కంకరగుంట ఆర్‌యూబీ వద్ద నిత్యం ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. ఈ కొంతకాలం సాఫీగా వెళ్లగలిగే దారి అనే పరిస్థితి నెలకొంది. నగరంలో శంకర్‌విలాస్ వంతెన విస్తరణ పనుల కోసం వంతెనని కూల్చివేయడంతో ప్రత్యామ్నాయంగా గుంటూరు తూర్పు నియోజకవర్గం నుంచి వచ్చే వాహనాలతో పాటు కలెక్టరేట్ నుంచి వచ్చే వాహనాలు కంకరగుంట ఆర్‌యూబీ వంతెన కింద నుంచి వెళ్లేలా పోలీసు శాఖ అధికారులు నిర్ణయించారు. వేల సంఖ్యలో వాహనాలు ఇటు వైపు రావడంతో నిత్యం ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుంది. ముందుకు వెళ్లలేక, వెనక్కి రాలేని పరిస్థితి నెలకొంటుంది.

ఆర్‌యూబీ వద్ద నిలిచిన వాహనాలు

మలుపులో నిలిచిన ట్రాక్టర్..

బుధవారం ఉదయం 11 గంటల సమయంలో బ్రాడీపేట నుంచి వచ్చిన ఓ ట్రాక్టర్ ఆర్‌యూబీ మలుపు తిరిగే వద్ద టీజేపీఎస్ కళాశాల వైపు నుంచి వచ్చిన వాహనాలు అడ్డుగా రావడంతో నిలిచిపోయింది. దాంతో పదుల సంఖ్యలో వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ ఆగిపోయింది. ట్రాక్టర్ ఎటూ కదలడానికి వీల్లేక కొద్దిసేపు రోడ్డుపైనే నిలిచిపోవడం.. వాహనదారులు విసుగెత్తి హారన్లు మోగించడంతో ఆ ప్రాంతం రణగొణ ధ్వనులతో మార్మోగింది. ట్రాఫిక్ పోలీసు వచ్చి టీజేపీఎస్ కళాశాల రోడ్డు నుంచి వచ్చిన వాహనాలను ఆపివేయడంతో ట్రాక్టర్ ముందుకు కదిలింది. ఇక్కడ రోజూ ఏదో ఒక వాహనం నిలిచిపోవడం.. ఇదేవిధమైన పరిస్థితి నెలకొనడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, అత్యవసర పనుల నిమిత్తం ఆస్పత్రులకు వెళ్లేవారు ట్రాఫిక్‌లో చిక్కుకోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. పోలీస్ శాఖ అధికారులు ట్రాఫిక్ నియంత్రించేలా పోలీసులను నియమించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

వ్యర్థాల నిర్వహణపై పంజాబ్ బృందం ఆరా

పర్మీందర్ పాల్‌సింగ్, ఇతర అధికారులతో జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరాల్లో డంపింగ్‌యార్డుల సమస్య లేకుండా చేసేందుకు చెత్తతో విద్యుదుత్పత్తి ప్లాంట్లు దోహదపడతాయని పంజాబ్ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి పర్మీందర్ పాల్‌సింగ్ పేర్కొన్నారు. మన వ్యర్థాల నిర్వహణ స్టడీ టూర్‌లో భాగంగా బుధవారం పంజాబ్ నుంచి అధికారుల బృందం గుంటూరుకు వచ్చింది. కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి నాయుడుపేటలోని జిందాల్ విద్యుత్తు ఉత్పత్తి ప్లాంటును సందర్శించారు. వివిధ విభాగాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్లాంటు సామర్థ్యం, ప్రస్తుతం వస్తున్న వ్యర్థాలు, రోజువారీ ఉత్పత్తి వివరాలు అడిగి తీశారు. కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్లాంటు నిర్వహణ, వ్యర్థాల తరలింపునకు జీఎంసీ నోడల్ కార్పొరేషన్‌గా ఉందన్నారు. నిత్యం సుమారు 400 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను జీఎంసీ నుంచి పంపుతున్నట్లు తెలిపారు. పర్యటనలో జీఎంసీ సీఎంవోహెచ్ డాక్టర్ పి.శాంతికళ, జిందాల్ ప్లాంటు ఏపీ ప్రెసిడెంట్ ఎంవీ చారి, ప్లాంటు అధికారులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు

లబ్ధిదారుడికి రుణ మంజూరు పత్రం అందజేస్తున్న యూబీఐ ప్రాంతీయ అధిపతి జవహర్

జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ పథకంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అందజేస్తున్న ప్రోత్సాహకాలతో యూనిట్లు ఏర్పాటు చేసి అభివృద్ధి చెందాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ అధిపతి ఎస్.జవహర్ అన్నారు. జీటీ రోడ్డులోని యూబీఐ ప్రాంతీయ కార్యాలయంలో ఎంఎస్ఎంఈ ఖాతాదారులతో అనుబంధం బలోపేతం చేయడం, కేంద్రీకృత ఆర్థిక పథకాల గురించి అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. అధికారులు, లబ్ధిదారుల మధ్య వ్యాపార విస్తరణపై చర్చలు జరిగాయి. అనంతరం రూ.20 కోట్లు విలువైన రుణ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అధికారులు అందజేశారు. సమావేశంలో యూబీఐ డిప్యూటీ రీజినల్ హెడ్ అశ్వర్థనాయక్, ఎంఎస్ఎంఈ విభాగం అధిపతులు సత్యజిత్ కబి, హరేరామ్ షా తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత జోడించి.. చిత్రాలు తీర్చిదిద్ది..

విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపల్ నర్మద

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: నవభారత్ నగర్‌లోని శ్రీచైతన్య స్కూల్‌లో వైట్ హౌస్ ఫెడిలైట్ కంపెనీ ఆధ్వర్యంలో క్రాఫ్ట్ పోటీలను బుధవారం నిర్వహించారు. పోటీల్లో 150 మంది విద్యార్థులు పాల్గొని సృజనాత్మకతతో ఎంతో అందంగా చిత్రాలు తీర్చిదిద్దారు. ప్రిన్సిపల్ నర్మద, స్కూల్ డీన్ దాస్యం శ్రీనివాస్, ఎస్ బ్యాచ్ ఇన్‌ఛార్జి నీలం మౌర్య, చిత్రలేఖన ఉపాధ్యాయుడు మల్లికార్జున ఆచారి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫ్లోర్ ఇన్‌ఛార్జి శిరీష, సాఫ్ట్ స్కిల్ మాస్టర్ రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే విజయం

మాట్లాడుతున్న స్టెప్ విభాగం మేనేజర్ రాధిక

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: యువత ప్రణాళికతో చదివితే ఎంపిక చేసుకున్న రంగంలో విజయం సాధిస్తారని జిల్లా యువజన సేవలు, స్టెప్ విభాగం మేనేజర్ బి.రాధిక అన్నారు. నగరంలోని సాంబశివపేటలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు సీహెచ్.వెంకట్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపల్ షేక్ ముంతాజ్, స్టెప్ జేఏ వి.సాయి సాత్విక్, జిల్లా ఉపాధి కార్యాలయ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

న్యుమోనియా మరణాలు తగ్గించేందుకు అవగాహన

మాట్లాడుతున్న రాజా కరణం, పక్కన డాక్టర్ పొదిల ప్రసాద్, సూపరింటెండెంట్ రమణ, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

నగరంపాలెం, న్యూస్‌టుడే: న్యుమోనియా మరణాలు తగ్గించేందుకు వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ కె.విజయలక్ష్మి తెలిపారు. జీజీహెచ్‌లోని పిల్లల వార్డు సమావేశ మందిరంలో ప్రపంచ న్యుమోనియా దినోత్సవాన్ని పురస్కరించుకొని పిల్లల వైద్య విభాగాధిపతి డాక్టర్ దేవకుమార్ ఆధ్వర్యంలో సామాజిక అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న డీఎంహెచ్‌వో కె.విజయలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ మాట్లాడుతూ న్యుమోనియా మూలంగా ఐదేళ్ల లోపు పిల్లల మరణాలు సంభవిస్తున్నాయన్నారు. జింఖాన సభ్యుడు రాజా కరణం మాట్లాడారు. డీఐవో డాక్టర్ శ్రావణబాబు, డాక్టర్ పొదిల ప్రసాద్, కాన్పుల విభాగాధిపతి డాక్టర్ అరుణకుమారి, వైద్యులు ఉషారాణి, ఎలిజిబెత్, సునీత, రమేష్, డాక్టర్ వీరేశ్వరరావు, రాంబాబు, శిరీష, హేమ, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్: న్యుమోనియా వ్యాధి రహిత సమాజ నిర్మాణమే లక్ష్యమని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. న్యుమోనియా వ్యాధిపై రూపొందించిన అవగాహన పోస్టర్లను కలెక్టరేట్‌లో బుధవారం ఆవిష్కరించారు. ఈనెల 12 నుంచి వచ్చే సాన్స్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామన్నారు. డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోండి

ఆహార పదార్థాలు పరిశీలిస్తున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకురాలు లావణ్యవేణి

జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే: నిరుపేద విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకురాలు బి.లావణ్య వేణి అన్నారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని సామాజిక పరివర్తన భవన్‌లోని ఆ శాఖ కళాశాల విద్యార్థినుల వసతి గృహాన్ని బుధవారం ఆమె సందర్శించి ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ వసతి గృహంలో అత్యాధునిక వసతులు కల్పించేందుకు నిధులు కేటాయిస్తామని తెలిపారు. విద్యతో అభివృద్ధి చెంది తల్లిదండ్రులతో పాటు రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఏవిధమైన సమస్యలున్నా అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు యు.చెన్నయ్య, గుంటూరు నగర సబ్ డివిజన్ ఏఎస్‌డబ్ల్యూవో శైలజ, హెచ్‌డబ్ల్యూవోలు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతే ముఖ్యం

మాట్లాడుతున్న డీఆర్ఎం సుధేష్ణసేన్

నగరపాలక సంస్థ: ప్రయాణికుల భద్రత విషయంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఆర్ఎం సుధేష్ణసేన్ అన్నారు. బుధవారం డీఆర్ఎం సమావేశ మందిరంలో అధికారులు, పర్యవేక్షకులతో ఆమె సమావేశమయ్యారు. ఫుట్‌ప్లేట్, లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద తనిఖీలు పకడ్బందీగా ఉండాలని ఆదేశించారు.

అధికారులు, ఉద్యోగుల కృషితోనే సదస్సు విజయవంతం

జిల్లాపరిషత్తు(గుంటూరు): గుంటూరులో వాటర్ షెడ్ మహోత్సవ్‌లో భాగంగా ఈనెల 10, 11 తేదీల్లో జాతీయ సదస్సును విజయవంతంగా నిర్వహించినందుకు కలెక్టరు ఎ.తమీమ్ అన్సారియా జిల్లా అధికారులను బుధవారం అభినందించారు. సదస్సు నిర్వహణలో వారికి అప్పజెప్పిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించారని.. ఉద్యోగుల భాగస్వామ్యాన్ని కూడా ప్రత్యేకంగా ప్రస్తావించి అందరికీ కృతజ్ఞతలు చెప్పారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.శశిభూషణ్‌కుమార్, కమిషనర్ మైలవరపు కృష్ణతేజ కూడా.. జిల్లా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, ఉద్యోగుల కృషిని అభినందించారు. వెంగళాయపాలెంలో చెరువు పునరుద్ధరణ పనులతో పాటు ఐటీసీ హోటల్‌లో రెండు రోజుల సదస్సుకు హాజరైన ప్రతినిధులు, అధికారులకు వసతి, ఇతర సదుపాయాలు సమకూర్చు, నల్లపాడు లయోలా పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన బహిరంగ సభను విజయవంతం చేయడంలో ఉద్యోగుల పని తీరు బాగుందన్నారు. కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కూడా వాటర్ షెడ్ మహోత్సవాన్ని విజయవంతం చేయడంపై జిల్లా అధికారులను ప్రశంసించడం విశేషం.

అర్ధరాత్రి షికార్లకు చెక్

- అనవసరంగా రోడ్లపై తిరిగితే కేసులు
- నిత్యం పోలీసుల స్పెషల్ డ్రైవ్

న్యూస్‌టుడే – నెహ్రూనగర్

రాత్రిపూట తిరుగుతున్నవారికి పోలీసుల కౌన్సెలింగ్

అర్ధరాత్రి సమయంలో ఓల్డ్‌క్లబ్ రోడ్డు నుంచి కొత్తపేట వస్తున్న ఓ జంటను తెనాలికి చెందిన వ్యక్తి అడ్డగించి ప్రియుడిని బెదిరించి.. యువతిపై అత్యాచారానికి పాల్పడిన ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది.

గతేడాది ఇద్దరు యువకులు మద్యం, గంజాయి మత్తులో అర్ధరాత్రి దుకాణాల వద్ద ఉన్న కాపలాదారులను దారుణంగా హత్య చేసి, చోరీలకు పాల్పడిన ఘటన సైతం సంచలనం రేపింది.

రాత్రివేళల్లో ఆకతాయిలు, తాగుబోతులు, రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, పాత నేరస్థులు చెలరేగిపోతున్నట్టు పోలీసులు గుర్తించారు. ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ.. నిర్మానుష్య ప్రాంతాల్లో పాగా వేసి అకృత్యాలకు పాల్పడుతున్నారు. మహిళల మెడల్లోని బంగారు గొలుసులు తెంచుకెళ్తున్నారు. తాళాలు వేసిన దుకాణాలు, ఇళ్లల్లో చోరీలకు తెగబడుతున్నారు. మద్యం, గంజాయి మత్తులో దారి దోపిడీలకు పాల్పడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. గొడవలు పెట్టుకొని దాడులు చేయడం, మద్యం సీసాలు, కత్తులతో హత్యాయత్నాలకు ఒడిగట్టడం తరచూ జరుగుతున్నాయి.

నెల రోజుల్లో 4,200 మందిపై కేసులు

అరాచక శక్తుల ఆట కట్టించడానికి పోలీసు యంత్రాంగం రాత్రిపూట ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు సీఐలు, ఎస్సైలు సిబ్బందితో అర్ధరాత్రి 12 గంటల నుంచి ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. రోడ్లపై కనబడినవారిని ఆరా తీస్తున్నారు. వారు చెప్పిన సమాధానంపై అనుమానం వస్తే న్యూసెన్స్ కేసు నమోదు చేసి పోలీస్‌స్టేషన్లకు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. సినిమాకు వెళ్లినా.. హోటళ్ల నుంచి వస్తున్నా.. ప్రయాణం చేసి ఇళ్లకు వెళ్తున్నా.. సంబంధిత టికెట్లు, బిల్లులు చూపిస్తే వదిలేస్తున్నారు. అత్యవసర పనులు, ఆసుపత్రులకు వెళ్తున్నవారిని ఆపడం లేదు. రాత్రి వేళ అనవసరంగా రోడ్లపై తిరుగుతున్నవారిని కట్టడి చేస్తున్నారు. గత నెల రోజుల్లో 4,200 మందిపై న్యూసెన్సు కేసులు పెట్టారు.

అనవసరంగా రోడ్లపై తిరగొద్దు

– ఎస్పీ వకుల్ జిందాల్

అర్ధరాత్రి పూట మద్యం సేవించి రోడ్లపై తిరుగుతూ గొడవలకు దిగుతున్నారు. అసాంఘిక కార్యకలాపాలు అడ్డుకునేందుకు రాత్రిళ్లు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాం. అనవసరంగా రోడ్లపై తిరగొద్దని చెబుతున్నాం. అనుమానాస్పద వ్యక్తులపై డయల్ 112కు సమాచారం చెప్పొచ్చు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

సీపీఆర్ విధానం తెలిస్తే ప్రాణాలు కాపాడొచ్చు

విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ..

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: సీపీఆర్‌పై అవగాహన పెంచుకుంటే.. అత్యవసర పరిస్థితుల్లో మనిషి జీవితాన్ని కాపాడవచ్చని యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ప్రొఫెసర్ దివ్యతేజోమూర్తి అన్నారు. టీజేపీఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో చల్లావారిపాలెంలో ఏర్పాటు చేసిన వారం రోజుల ప్రత్యేక శిబిరంలో భాగంగా బుధవారం సీపీఆర్ శిక్షణ, ప్రథమ చికిత్సపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నరసరావుపేట రెడ్‌క్రాస్ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు, సర్పంచి ఆరుదల సాంబశివరావు మాట్లాడారు. గ్రామంలో 100 మంది యువతకు సీపీఆర్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పీవో డాక్టర్ జె.వి.సుధీర్‌కుమార్, డీడీయూ అండ్ జీకేవై అధ్యాపకులు వెంకట్, శ్రీసత్యానంద్, ఎనఎస్ఎస్ లీడర్లు, విద్యార్థులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

జోహ్రాన్ మమ్దానీ విజయం మార్పునకు నాంది

గోరంట్ల: న్యూయార్క్ మేయర్‌గా విజయం సాధించిన జోహ్రాన్ మమ్దానీ ప్రపంచంలో మార్పునకు నాంది పలికారని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. రామన్నపేటలోని జనచైతన్య వేదిక కార్యాలయంలో బుధవారం న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ విజయంపై విశ్లేషణ సభ జరిగింది. ఎస్.హనుమంతరెడ్డి, వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, డి.ఎ.ఆర్.సుబ్రహ్మణ్యం, చలపతిరావు, టి.ధనుంజయరెడ్డి, వల్లూరి సదాశివరావు ప్రసంగించారు.

పెళ్లి పేరుతో మోసగించారని న్యాయవాదిపై కేసు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ న్యాయవాది తనను మోసగించారని ఒక మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై బుధవారం నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసరావుపేటకు చెందిన ఓ మహిళకు అదే ప్రాంతానికి చెందిన వ్యక్తితో 2003లో వివాహమైంది. ఒక బాబు పుట్టాడు. భర్త తరచూ కొట్టడంతో ఆ వేధింపులు భరించలేక విడిపోవాలని నిర్ణయించుకుంది. విడాకులు ఇప్పించాలని 2020లో ఓ న్యాయవాదిని కలిసింది. అప్పట్నుంచి ఆ న్యాయవాది ఆమెతో చనువుగా ఉండేవారు. భర్తతో విడాకులు మంజూరయ్యాక న్యాయవాది ఆమెకు సన్నిహితమయ్యారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశారని ఫిర్యాదులో పేర్కొంది. కేసు దర్యాప్తు చేస్తున్నామని నగరంపాలెం సీఐ సత్యనారాయణ తెలిపారు.

యుపిక్స్ కేసులో మహిళ అరెస్టు.. రిమాండు

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన యుపిక్స్ కుంభకోణం కేసులో డిపాజిట్ ద్వారా అధిక లాభం పొందిన ఓ మహిళను సత్యనారాయణపురం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నరసరావుపేట రాజుగారి కోటకు చెందిన కొత్తూరి నాగమల్లిక(47).. ఈ సంస్థలో 2023, సెప్టెంబరు 20వ తేదీన 18 బాండ్ల ద్వారా రూ.2.90 కోట్లు డిపాజిట్ చేశారు. దీనికిగాను సంస్థ నుంచి రూ.6.38 కోట్లు తీసుకున్నారు. మొత్తం రూ.3.48 కోట్లు లాభంగా పొందారు. ఆమె కుమార్తెల పేరుతోనూ డిపాజిట్లు చేసి అధిక లాభాలు తీసుకున్నారు. విజయవాడ సత్యనారాయణపురం కేంద్రంగా యుపిక్స్ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా వందల మంది నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసిన సంగతి తెలిసిందే. మోసపూరితమైన సంస్థ అని తెలిసి కూడా డిపాజిట్లు చేసి లబ్ధి పొందడం చట్టరీత్యా నేరమని విజయవాడ నార్త్ ఏసీపీ స్రవంతి రాయ్ పేర్కొన్నారు. నిందితురాలిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండు విధించారు.

17 నుంచి విద్యార్థులకు పోటీలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: లాడ్జి కూడలి పెట్రోల్ బంక్ సమీపంలోని శ్రీకృష్ణ దివ్యజ్ఞాన సమాజం ఆవరణలో ఈనెల 17 నుంచి 22వ తేదీ వరకు విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు సమాజం కార్యదర్శి పి.నరేంద్ర చక్రవర్తి, నిర్వాహకుడు జీవీఎల్ సంజీవరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 17న మధ్యాహ్నం పాఠశాల బాలలకు తర్వాత కళాశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు ఉంటాయన్నారు. 19న తెలుగులో వక్తృత్వ పోటీలు, 20న సుడోకు, 21న ఆంగ్లంలో వక్తృత్వ పోటీలు ఉంటాయన్నారు. వివరాలకు సంజీవరావును, 9441655888 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు. ఈనెల 17 నుంచి 24వ తేదీ వరకు రోజూ సాయంత్రం ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఉంటాయన్నారు.

సంస్మరణ

డా॥జి.సుబ్బారావు
Rtd.Regional Director : Medical & Health Services
జననం:06-06-1930 మరణం: 13-11-1999
డా॥ సి.హెచ్. ఉషాదేవి - డా॥ శివరామకృష్ణ
డా॥ ఎస్ ఉమాదేవి - డా॥ సాంబశివరావు
జి. కిషోర్ బాబు - వాణి
డా॥జి. ప్రతాప్ కుమార్ - డా॥ అనూరాధ

లింకు దస్తావేజులు పోయినవి

ఆళ్ళ అంజిరెడ్డి, తండ్రి: ఆళ్ళ సుబ్బారెడ్డి, ఫ్లాట్ నెం:404, 4వ ఫ్లోర్, ఎస్.వి.ఆర్. అపార్ట్‌మెంట్, చంద్రమౌళి నగర్ 1/2వ లైను, గుంటూరు నివాసి (సెల్: 9866010853) పెదకాకాని గ్రామం డి.నెం:961/1, ఫ్లాట్ నెం: 194, 209 చ॥గ॥ స్థలమునకు పెదకాకాని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ నెం.5919/2014రుగా రిజిస్ట్రార్ కాబడినది. సదరు డాక్యుమెంట్ అయినటువంటి లింకుడాక్యుమెంట్స్ 1) 4932/2007 2) 4598/2007రును ది: 25-10-2025వ తేదిన మా ఇంటి వద్ద నుండి గార్డెన్స్ సెంటర్‌లో వున్న జిరాక్స్ షాపునకు వెళ్తుండగా దారి మధ్యలో పోయినవి. ఎవరికైన దొరికిన యెడల పై నెంబర్‌కు తెలుపుగలరు.

‘కులగణన చేసిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్రంలో కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర్‌రావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను కోరారు. ఈ మేరకు సచివాలయంలోని ఛాంబర్‌లో బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. కమిషన్ వేసి కులగణన చేపట్టి బీసీలకు న్యాయం చేయాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే ముందు, ప్రత్యేక కమిషన్ ద్వారా కులగణన నిర్వహించాలని, తర్వాత విద్య, ఉపాధి, రాజకీయాల్లో వెనుకబడిన తరగతులకు దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు.

వైద్య కళాశాలలపై వైకాపా అసత్య ప్రచారం

మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్

అరండల్‌పేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తుంటే.. జగన్ అండ్ ముఠా వైద్య కళాశాలలపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్ మండిపడ్డారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలోని సెమినార్ హాలులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ అధికారంలో ఉన్న సమయంలో 2021లో కేంద్ర ప్రభుత్వం 17 వైద్య కళాశాలలు మంజూరు చేసిందన్నారు. వాటిని సక్రమంగా నిర్వహించలేక కేంద్రం ఇచ్చిన రూ.వేల కోట్లు పక్కదారి పట్టించి జగన్ తన నియోజకవర్గమైన పులివెందులల్లో మాత్రమే రూ.400 కోట్లు ఖర్చు చేశారని విమర్శించారు. మిగిలిన 16 చోట్ల వైద్య కళాశాలల ఊసే లేదన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో బాపట్ల వైద్య కళాశాలకు రూ.530 కోట్లు కేటాయిస్తే... అసలు పనులే మొదలుపెట్టకుండా రూ.22.10 కోట్లు దోచేశారన్నారు. పిడుగురాళ్లలో కొంత వరకు నిర్మించి నిధులు గోల్‌మాల్ చేశారని తెలిపారు. పార్వతీపురంలో సెంటు భూమి కేటాయించకుండా గిరిజన విద్యార్థులకు ద్రోహం చేశారన్నారు. ఆరు చోట్ల అరకొర పనులు చేసి మిగిలిన 11 కళాశాలలను గాలికి వదిలేశారన్నారు. దీంతో పీపీపీ విధానంలో కళాశాలల నిర్మాణం జరుగుతుంటే కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో భాజపా జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ, తోట రామకృష్ణ, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దారా అంబేడ్కర్, సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

‘ఓర్వలేక ప్రభుత్వంపై విమర్శలు’

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ‘శ్రీవారి తిరుమల లడ్డులో కల్తీ నెయ్యి వాడడమే కాకుండా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్న జగన్ త్వరలో జైలుకు వెళ్లక తప్పదు’.. అని ఏపీ లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు హెచ్చరించారు. తెదేపా జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ‘గత వైకాపా ప్రభుత్వంలో విచ్చలవిడిగా అవినీతి జరిగింది. చివరికి తిరుమల లడ్డూ విషయంలోనూ నెయ్యి కల్తీ చేసి రూ.వేల కోట్లు దోచుకున్నారు. దొరికిపోయామని తెలిశాక కూడా.. ఆవులు మంచి గడ్డి తినకపోతే పాలు కల్తీ అవుతాయని జగన్ చేసిన వ్యాఖ్యలు చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారు’.. అని పేర్కొన్నారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టాబత్తిన చిట్టిబాబు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతుంటే.. జగన్ ఓర్వలేక ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో తెదేపా నాయకులు కంచర్ల శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో భోజనం చేసినందునే..

నగరంపాలెం, న్యూస్‌టుడే: బీసీ వసతి గృహంలో భోజనం చేసిన విద్యార్థులు అస్వస్థతకు గురి కాలేదని, లూథరన్ మోడల్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసినవారే వాంతులు చేసుకున్నారని బీసీ బాలుర వసతి గృహ సంక్షేమాధికారి జీవీ కిరణ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈ ఘటన వసతి గృహంలో జరగలేదని, పాఠశాలలో మధ్యాహ్నం భోజనం చేసిన క్రమంలో పాఠశాల ఆవరణలో జరిగిందని స్పష్టం చేశారు. దీంతో వారిని జీజీహెచ్‌కు తరలించి వైద్య చికిత్స అందించినట్లు చెప్పారు.

మధుమేహంపై యువతకు అవగాహన అవసరం

డాక్టర్ కాశ్యపను సత్కరిస్తున్న డాక్టర్ పృథ్వీరాజ్, ప్రిన్సిపల్ డాక్టర్ రమణ తదితరులు

గుంటూరు సాంస్కృతికం: నగర జీవనశైలి, ఆహార అలవాట్లు, వ్యాయామ లోపం, రాత్రిళ్లు ఆలస్యంగా నిద్రపోవడం వంటివి యువతలోనూ మధుమేహ వ్యాధికి కారణమవుతున్నాయని ఎండోక్రైనాలజిస్టు డాక్టర్ వీబీ కాశ్యప అన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ కాలేజీ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో యువతలో మధుమేహ నివారణపై అతిథి ఉపన్యాసం బుధవారం జరిగింది. ఆరోగ్య భారతి, హిందూ కాలేజీ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విభాగం సంయుక్త నిర్వహణలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్వీ రమణ అధ్యక్షత వహించారు. డాక్టర్ కాశ్యప మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో అన్ని వయసుల వారినీ మధుమేహం పీడిస్తోందన్నారు. యువత బీఎంఐ తెలుసుకోవాలని, రోజూ కనీసం 45 నిమిషాల పాటు వేగంగా నడవాలన్నారు. మద్యపానం, ధూమపానం పూర్తిగా మానాలని, తెల్ల చక్కెర, శీతలపానీయాలు, బేకరీ పదార్థాలు తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.పృథ్వీరాజ్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

నీతిమంతుని జ్ఞాపకము చేసుకొనుట ఆశీర్వాదకరమగును సామెతలు: 10:7

తృతీయ వర్ధంతి



మంచికి మారుపేరుగా నిలచి, క్రమశిక్షణగల వ్యక్తిగా మా ఉన్నతికి శ్రమించిన మీరు మా నుండి దూరమై ప్రభువు చెంతకు చేరి 3 సం॥లు గడచిననూ సదా మా హృదయాలలో ఎల్లప్పుడూ చిరస్మరణీయులే... మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రభువును ప్రార్థిస్తూ...

కీ॥శే॥ శ్రీ వేజండ్ల శ్యామ్‌సుందర్ గారు
M.A., M.A., M.Ed.
స్కూల్ అసిస్టెంట్ సోషల్ Rtd. Teacher, సత్తెనపల్లి
జననం: 11-7-1958 మరణం: 13-11-2022

భార్య: మోహన్ పద్మావతి
తల్లి: వేజండ్ల వసుంధర
కుమారుడు - కోడలు
ప్రదీప్ - వనిత
కుమార్తె - అల్లుడు
సుధారాణి - సుశాంత్
మనుమరాలు: ఖ్యాతి ఐవిలిన్

ఆలోచనలు విరియాలి... ఆవిష్కరణలు మెరవాలి..!

ఈనాడు

ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. పాఠశాల స్థాయిలోనే సృజనాత్మకత వెలికితీసేందుకు 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' నిర్వహిస్తోంది. వినూత్న ఆలోచనలతో ప్రయోగాలు చేసేలా ప్రోత్సహిస్తోంది. **ఇందులో భాగంగా పీవీపీ సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాల, కానూరులో ఈనెల 24వ తేదీన మెగా సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తోంది.**

నిబంధనలు.. ● 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు మాత్రమే ● ప్రాజెక్టును ముందుగా నమోదు చేసుకోవాలి ● ఒక ప్రాజెక్టుకి ఇద్దరు విద్యార్థులకు అనుమతి ● పాఠశాల/ బ్రాంచ్‌కి ఒక ప్రాజెక్టుకు మాత్రమే అనుమతి ● మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులు ఉంటాయి. ● పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం ● **రిజిస్ట్రేషన్ చివరి తేదీ : నవంబరు 17**

నమోదు కొరకు: 91549 91113 సమయం : ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గం॥ల వరకు..

టికెట్టు లేని ప్రయాణికుల ద్వారా రూ.8.59 కోట్ల ఆదాయం

కమర్షియల్ సిబ్బందితో డీఆర్ఎం మోహిత్ సొనాకియా

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: విజయవాడ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజరు బి.ప్రశాంత్‌కుమార్ పర్యవేక్షణలో ఏసీఎం బీవీఎన్ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో అక్టోబరులో నిర్వహించిన తనిఖీల్లో డివిజన్‌కు రికార్డు స్థాయిలో రూ.8.59కోట్ల ఆదాయం లభించింది. ఈ తనిఖీల్లో మొత్తం 56,957 మంది టికెట్టు లేని ప్రయాణికులను గుర్తించి వారి నుంచి రూ.5.06 కోట్లు, సరైన టికెట్టు లేకుండా ప్రయాణించిన 64,998 మంది నుంచి 3.50 కోట్లు, 871 మంది ప్రయాణికుల లగేజీ వ్యత్యాసం ద్వారా రూ.1.77 లక్షలు జరిమానాగా వసూలు చేశారు. ఈ సందర్భంగా బుధవారం డీఆర్ఎం మోహిత్ సొనాకియా విజయవాడ కమర్షియల్ అధికారులు, తనిఖీ సిబ్బందిని అభినందించారు.



కాలభైరవ రూపం.. కరుణామృత దీపం!

ప్రేమకు గుర్తుగా కొందరు విగ్రహాలు ఏర్పాటు చేయడం, సేవా కార్యక్రమాలు చేయడం చేస్తుంటారు. విజయవాడ భవానీపురానికి చెందిన మురాల వెంకటేశ్వర్లు మాత్రం వాటిపై ఉన్న ప్రేమతో సొంతంగా కాలభైరవుడి ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి అయిన ఆయన గత కొన్నేళ్లుగా శునకాలు పెంచుతున్నారు. వాటికోసం ప్రత్యేకంగా భవానీపురంలో ఒక ఆశ్రమాన్ని నిర్మిస్తున్నారు.

అందులోనే కాలభైరవుడి ఆలయాన్ని మూడేళ్ల కిందట నిర్మించారు. ప్రతి రోజు ఆలయంలో దీపారాధన చేసి పూజలు చేస్తుంటారు. అనారోగ్యంతో బాధపడే వాటికి, దెబ్బలు తగిలిన వాటికి చికిత్స చేయిస్తున్నారు. ప్రస్తుతం ఆశ్రమంలో యాభై వరకు శునకాలు ఉన్నాయి. వాటికి నిత్యం ఆహారం పెడుతున్నారు. కాలభైరవుడి ఆలయాన్ని దర్శించుకునేందుకు ఇతర ప్రాంతాల నుంచీ ప్రజలు వస్తున్నారు.

– భవానీపురం, న్యూస్‌టుడే

అక్రమాల వెలుగు.. అతివకు దిగులు!

డీఆర్‌డీఏలో బుక్‌కీపర్ల దందా

☛ గుడివాడ పరిధిలో బుక్‌కీపర్లు, స్థానిక ఆర్పీలు కుమ్మక్కయి పదుల సంఖ్యలో మహిళలను మూడు, నాలుగు గ్రూపుల్లో సభ్యులుగా చేర్చి వచ్చిన రుణాలు మింగేశారు. దాదాపు రూ.7 కోట్ల రుణాలు పక్కదారి పట్టించారు. దీనిపై ఇప్పటికే పోలీసు కేసు నమోదు కాగా కొంత మొత్తం రికవరీ చేశారు.

☛ మోపిదేవి మండలంలో ఓ గ్రామంలో బుక్‌కీపర్, గ్రూపు ప్రెసిడెంట్ కలిసి దోచేశారు. గ్రూపుల్లో తీసుకున్న రుణాలు తీరక ముందే సభ్యులకు తెలియకుండా మళ్లీ రుణాలు తీసుకున్నారు. తీసుకున్న రుణం ఎంతకూ తీరకపోవడంతో సభ్యులు అడిగితే వడ్డీలు చెల్లించాలని.. దోచుకున్న సొమ్మును సభ్యులతోనే కట్టిస్తున్నారు. ఈ బుక్‌కీపర్ పరిధిలో గ్రూపుల్లో రూ.15 లక్షల వరకు సొమ్ము చేసుకున్నారు.

ఈనాడు, అమరావతి

ఉమ్మడి కృష్ణా జిల్లాలో వెలుగు సంఘాల్లో లెక్కలేనన్ని చీకటి దందాలు వెలుగు చూస్తున్నాయి.. కొందరు కింది స్థాయి అధికారులు, బుక్ కీపర్లు, బ్యాంకు సిబ్బంది కుమ్మక్కయి కథ నడిపిస్తున్నారు. సంఘాల అధ్యక్ష, కార్యదర్శులను పావులుగా మార్చి వ్యవహారం చక్కబెడుతున్నారు. అక్రమ సంఘాలను సృష్టించడం, సభ్యులకు తెలియకుండా రుణాలు స్వాహా చేయడంతో రూ.కోట్లు కొల్లగొడుతున్నారు.

★ రుణాలు వచ్చినప్పుడు గ్రూపునకు రూ.2 వేల వరకు కమీషన్ తీసుకోవడం షరా మామూలైంది. ★ తాజాగా కొత్తరకం దందాలు తెరమీదకు వస్తున్నాయి. ★ సభ్యుల అవగాహన రాహిత్యాన్ని ఆసరాగా తీసుకుని బుక్ కీపర్లు దోచేస్తున్నారు. ★ ఒక సభ్యురాలు ఒకే గ్రూపులో ఉండాల్సి ఉంటే.. ఏదారు గ్రూపుల్లో చేర్పిస్తున్నారు. వారికి వచ్చిన రుణాలను వాటాలు వేసుకుంటున్నారు. ★ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా.. తీర్మానాలు చేయకుండా భారీ మొత్తంలో దోచేస్తున్నారు. వీరికి అధికారులు, బ్యాంకు సిబ్బంది సహాయ సహకారాలు ఉంటున్నాయి. ★ ఫలితంగా ప్రభుత్వం మహిళా సాధికారత కోసం కేటాయిస్తున్న రూ.కోట్ల రుణాల లక్ష్యం నీరుగారుతోంది. ★ కొన్ని చోట్ల బుక్‌కీపర్ల దందా బయటకు వస్తున్నా వారినే కొనసాగించడంలో అధికారుల ఆంతర్యం అనుమానాలకు తావిస్తోంది.

వెలుగు మాటున చీకటి దందా...

అక్రమాలపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం..

అక్రమాల నివారణకు మన డబ్బులు, మన లెక్కలు అనే ప్రత్యేక మొబైల్ యాప్ వచ్చింది. అందులో సభ్యుల గ్రూప్ లావాదేవీల వివరాలు చూడవచ్చు. ఇప్పటికే వెలుగులోకి వచ్చిన అక్రమాలపై చర్యలు తీసుకుంటాం. **- హరిహరనాథ్, డీఆర్‌డీఏ పీడీ**

కేటాయింపులులు.. ఫలప్రదం

మల్లవల్లి సీపీసీకి ఎట్టకేలకు మోక్షం

విస్తీర్ణం: 7.48 ఎకరాలు
వ్యయం: రూ.86 కోట్లు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

సీపీసీ భవన సముదాయం

రైతులు, ఫల ఆధారిత పరిశ్రమలు నిర్వహించే వారు పళ్లు, కాయలు తెస్తే.. రసం(జ్యూస్), పల్ప్(గుజ్జు) ప్యాక్‌చేసి ఇచ్చేలా ఏపీఐఐసీ ఆధ్వర్యంలో మల్లవల్లిలో కోర్ ప్రాసెసింగ్ సెంటర్ (సీపీసీ) రూపొందించారు. దీనికి 2017లో అప్పటి తెదేపా ప్రభుత్వం అంకురార్పణ చేస్తే, తర్వాత వచ్చిన వైకాపా సర్కారు మూలకు చేర్చింది. తాజాగా వినియోగంలోకి తెచ్చేలా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించి, ప్రఖ్యాత 'లులు' గ్రూప్ అనుబంధ సంస్థకు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ★ పండ్లను మాగబెట్టడం, వాటి నుంచి గుజ్జు, రసం తీయడం, బియ్యం, జొన్నలు వంటి ఆహార ధాన్యాలు నిల్వ చేసుకునేందుకు, పండ్లు, కూరగాయల నిల్వకు వేర్వేరుగా గిడ్డంగులు, ప్యాకింగ్ యూనిట్లు, ఆహార ఉత్పత్తుల నాణ్యత పరిశీలించేందుకు ఎనలైటికల్ ల్యాబ్ వంటి వసతులతో అధునాతనంగా నిర్మించారు. ★ పంట నిల్వకు వీలుగా 4 వేల టన్నుల సామర్థ్యం ఉన్న గోదాములు నిర్మించారు. ★ 3 వేల టన్నుల పంటలు నిల్వ చేసేలా కోల్డ్ స్టోరేజీని సిద్ధం చేశారు. ★ కాయలను మాగబెట్టేందుకు ఒక్కొక్కటి 200 టన్నుల సామర్థ్యం గల 8 రైపెనింగ్ ఛాంబర్లు ఉన్నాయి

కీలక యంత్ర వ్యవస్థ

అయిదు రోజుల్లో.. పూర్తి ఆటో విధానంలో పనిచేసే రైపెనింగ్ ఛాంబర్లలో అన్ని రకాల కాయలు పక్వానికి వస్తాయి

గంట వ్యవధిలోనే.. 10 టన్నులు పండ్ల రసాలు, వివిధ రకాల గుజ్జు ఉత్పత్తి చేసి, వాటిని స్టెరిలైజేషన్ ట్యాంకుల్లోకి పంపి 104 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద వేడిచేస్తారు, తర్వాత రసాలు, గుజ్జుని సాధారణ ఉష్ణోగ్రతకు తీసుకొచ్చి బ్యారెల్‌లో నింపుతారు. పండ్ల రసాలను తాగేందుకు వీలుగా టెట్రా ప్యాక్‌లు తయారు చేసుకోవచ్చు. చిరు ధాన్యాలు, సుగంధ ద్రవ్యాల పొడులు ప్యాకెట్లను గంటలో 70 తయారు చేసుకోవచ్చు.

మూడేళ్ల కిందటే..

మామిడి, అరటి, జామ, బొప్పాయి వంటి పండ్లతో పాటు టమాటాలను గుజ్జు, రసం రూపంలో శుద్ధి చేసేందుకు అన్ని వసతులు, పూర్తి విదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన యంత్ర వ్యవస్థను సీపీసీలో అమర్చారు. నిర్మాణంతో పాటు నిర్వహణకు అనువుగా కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

రూ.50లక్షలు చెల్లించేలా..

'లులు' గ్రూప్‌కు చెందిన ఫెయిర్ ఎక్స్‌పోర్ట్స్‌కు ఏడాదికి రూ.50 లక్షలు చెల్లించే ప్రాతిపదికన లీజుకు కేటాయించారు. త్వరలో ఈ సంస్థ ఇక్కడ కార్యకలాపాలు ప్రారంభించేలా సన్నాహాలు చేస్తోంది.

ఉప ముఖ్యమంత్రి ఆదేశం.. దీనురాలికి పింఛను మంజూరు

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలతో అవనిగడ్డ మండలం పులిగడ్డకు చెందిన చెన్ను అనూషకు వితంతు పింఛను రూ.4000 మంజూరైంది. బుధవారం పులిగడ్డలో జరిగిన ఒక కార్యక్రమంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ ఎంపీడీవో ఎం.మరియాదేవి, ఈవో అనితలతో కలిసి అనూషకు పింఛను మంజూరు ఉత్తర్వులను అందజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంజూరు చేసిన తొలి వితంతు పింఛను ఇదే.

పవన్ కల్యాణ్‌కు తన కుటుంబ స్థితిగతులను వివరిస్తూ...

అనూషకు ఉత్తర్వులు అందజేస్తున్న వెంకట్రామ్

★ మొంథా తుపానుకు అవనిగడ్డ నియోజకవర్గంలోని కోడూరు మండలంలో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి రైతులకు భరోసా కల్పించే నిమిత్తం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గత నెల 30న దివిసీమ పర్యటనకు వచ్చారు. పులిగడ్డలో చిన్న పాటి దుకాణదారుల్ని పవన్ కల్యాణ్ మాటామంతీగా పలకరించారు. అక్కడే గ్రామానికి చెందిన చెన్ను అనూష ఆయన్ని కలిసి తన కుటుంబ స్థితిగతులను తెలిపారు. తన భర్త చనిపోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలిపారు. అందుకు స్పందించిన పవన్ కల్యాణ్ అనూషకు వితంతు పింఛను మంజూరు చేయాలంటూ కలెక్టర్ బాలాజీని ఆదేశించారు. అంతేకాకుండా తన కార్యాలయం నుంచి ఉత్తర్వులను పంపారు. దీంతో అనూషకు వితంతు పింఛను ఈనెల నుంచే అందించేందుకు కలెక్టర్ ఉత్తర్వులను ఎంపీడీవోకు పంపారు. తన కుటుంబానికి భరోసా కల్పించిన ఉప ముఖ్యమంత్రికి అనూష కృతజ్ఞతలు తెలిపారు.

దుర్గగుడి హుండీ ఆదాయం రూ.2.67 కోట్లు

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను దేవస్థానం సిబ్బంది బుధవారం లెక్కించారు. 49 హుండీల్లో కానుకలను లెక్కించగా రూ. 2,67,93,738 ఆదాయం వచ్చింది. కానుకలతోపాటు 215 గ్రాముల బంగారం, 3.320 కిలోల వెండి వస్తువులను భక్తులు మొక్కుల రూపంలో చెల్లించారు. విదేశీ కరెన్సీ 403 యూఎస్ఏ డాలర్లు, 25 కెనడా డాలర్లు, 16 సింగపూర్ డాలర్లు, 14 కువైట్ దీనార్స్, 10 ఆస్ట్రేలియా డాలర్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కానుకల లెక్కింపును ఆలయ ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ పర్యవేక్షించారు.

ప్రతిష్ఠాత్మక కమిటీలో ఎంపీ బాలశౌరికి చోటు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: లోక్‌సభ, రాజ్యసభలోని 31 మంది ఎంపీలతో 130వ రాజ్యాంగ సవరణ బిల్లు 2025, జమ్మూకశ్మీర్ పునర్ వ్యవస్థీకరణ బిల్లు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ సవరణ బిల్లుకు సంబంధించిన సంయుక్తంగా ఏర్పాటు చేసిన కమిటీలో సభ్యులుగా మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరికి చోటు దక్కింది. పార్లమెంటు వర్గాలు బుధవారం ఈ కమిటీ సభ్యుల పేర్లను విడుదల చేశాయి. ఇంతటి ప్రతిష్ఠాత్మక కమిటీలో తనకు సభ్యుడిగా అవకాశం ఇచ్చినందుకు ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు.

ఇదిగో.. ఆనందాల హరివిల్లు

✦ కొత్తగా 2,449 గృహాల మంజూరు
✦ 11,008 అసంపూర్తి నిర్మాణాల పూర్తి

ఈనాడు, అమరావతి: వైకాపా పాలనలో ఇళ్ల స్థలాలు ఇచ్చి పనులు గాలికొదిలేయడంతో నిరుపేద లబ్ధిదారుల సొంతింటి కల సాకారం కాలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే.. ఆయా పనులను పట్టాలెక్కించి పూర్తి చేసేందుకు శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు.. పూర్తి చేసిన గృహాల ప్రవేశ కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లాలో బుధవారం ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం గృహ ప్రవేశాలు చేయించారు. అంతేకాదు. సొంత స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు ఉమ్మడి కృష్ణాలో కొత్తగా 2,449 గృహాలను మంజూరు చేశారు.

ఉమ్మడి జిల్లాలో అర్బన్ ప్రాంతాల్లో మంజూరైన యూనిట్లు..

నియోజకవర్గం	ఇళ్లు
జగ్గయ్యపేట	347
నందిగామ	223
మైలవరం	314
తిరువూరు	138
విజయవాడ తూర్పు	70
విజయవాడ మధ్య	111
విజయవాడ పశ్చిమ	54
గుడివాడ	465
పెనమలూరు	481
మచిలీపట్నం	140
పెడన	106

సందడే సందడి: వైకాపా పాలనలో ఉమ్మడి జిల్లాలో అసంపూర్తిగా మిగిలిన గృహ నిర్మాణాల్లో. . కృష్ణా జిల్లాలో 6,708, ఎన్టీఆర్ 4,300 కూటమి ప్రభుత్వం పూర్తి చేసింది. ఎన్టీఆర్ జిల్లాలో వత్సవాయి, మచిలీపట్నం మండలాల్లో అధికారికంగా గృహ ప్రవేశ కార్యక్రమాలు నిర్వహించారు. కలెక్టర్, హౌసింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని లబ్ధిదారులతో కలిసి గృహ ప్రవేశాలు చేయించారు. మిగిలిన ప్రాంతాల్లోనూ కార్యక్రమం నిర్వహించారు.

చింతగుంటపాలెంలో నూతనగృహం ప్రారంభిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల తదితరులు

రూ.70.8 కోట్ల లబ్ధి...

★ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (అర్బన్) పథకం కింద ఉమ్మడి జిల్లాకు 2,449 ఇళ్లు మంజూరు చేశారు. ★ ఎన్టీఆర్‌లో 1,257, కృష్ణాలో 1,192 గృహాలు మంజూరయ్యాయి. ★ ఒక్కో లబ్ధిదారుడికి కేంద్రం రూ.1.5 లక్షలు, రాష్ట్రం రూ.లక్ష ఇస్తుంది. ★ అదనంగా ఉపాధి హామీ ద్వారా 90 పని రోజులకు రూ.27 వేలు, స్వచ్ఛభారత్ కింద మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12 వేలు ఇస్తారు. ★ ఒక్కో లబ్ధిదారుడికి రూ.2.89 లక్షలు చెల్లిస్తారు. ★ ఉమ్మడి జిల్లాకు రూ.70.8 కోట్ల లబ్ధి చేకూరనుంది. ★ మంజూరు పత్రం అందిన 45 రోజుల్లోగా ఇంటి పని మొదలు పెట్టాలి. లేకుంటే గృహ మంజూరు ఉత్తర్వు రద్దు చేస్తారు. ★ ఇల్లు కనీసం 420 చదరపు అడుగుల విస్తీర్ణంలో హాలు, పడక, వంట గదులు మరుగుదొడ్లతో కూడిన నిర్మాణం చేపట్టాలి.

మేధను మలిచి.. మేటిగ నిలిచి..!

ఏఎన్‌యూలో ఎన్‌సీసీ ఆల్ ఇండియా ఐడియా అండ్ ఇన్నోవేటివ్ కాంపిటీషన్

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, ఏఎన్‌యూ

హ్యాక్ చేయడానికి వీల్లేని డ్రోన్... రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే ఆసుపత్రికి, అధికారులకు సమాచారమిచ్చే ఆవిష్కరణ... అసలు రోడ్డు ప్రమాదాలకు ఆస్కారమే లేకుండా ప్రత్యేక పెయింటింగ్‌తో కట్టడి చేసే ఆలోచన.. పిల్లల ఆరోగ్య పరిస్థితులు వారి కాళ్లకున్న బూట్ల ద్వారా తెలుసుకునేలా రూపొందించిన వ్యవస్థ.. . జనసమ్మర్థ ప్రదేశాల్లో ప్రతి ఒక్కరినీ, అక్కడి పరిస్థితిని పక్కాగా గుర్తించే నిఘా వ్యవస్థ... ఇలాంటి ఎన్నో వినూత్న ఆలోచనలు.. ఆవిష్కరణలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికైంది. బుధవారం నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) ఆల్ ఇండియా ఐడియా అండ్ ఇన్నోవేషన్ కాంపిటీషన్ (ఐసీసీ)-2025ను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో కాకినాడ ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్స్ సమన్వయంతో నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 170 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు 85 వినూత్న ఆవిష్కరణలు ప్రదర్శించారు. ఉత్తమంగా ఎంపికైనవాటిని దిల్లీ ప్రదర్శనలో ఉంచుతామని వివరించారు.

ఆవిష్కరణలు పరిశీలిస్తున్న జ్యూరీ సభ్యులు

సమరసేనకు చేదోడు..

డ్రోన్ పనితీరు వివరిస్తున్న యువకులు

ప్రాజెక్టు: ఆప్టికల్ ఫైబర్ డ్రోన్
తయారీదారులు: విక్రాంత్‌చౌదరి, హార్దిక్ మిత్తల్, మయూర్ చౌదరి (బీటెక్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు)
స్వస్థలం: జైపూర్, రాజస్థాన్ **పరికరాలు:** 6 ఎల్‌డీసీ బ్రష్‌లెస్ మోటార్లు, 5,200 ఎంఏహెచ్ బ్యాటరీ, పిక్సో ఫ్లైట్ కంట్రోల్, జీపీఎస్ కంపాస్ మాడ్యుల్. **ప్రత్యేకతలు:** ఇది ఆప్టికల్ ఫైబర్ డ్రోన్. హ్యాక్ చేయలేరు. 3 నుంచి 4 కిలోల పేలోడ్ పేలుడు పదార్థాలను తరలిస్తుంది. 2 కిలోమీటర్ల నుంచి 30 కిలోమీటర్ల రేడియస్‌లో పనిచేస్తుంది. సైన్యంలో కౌంటర్ ఎటాక్‌కు ఉపయోగపడుతుంది. వ్యయం రూ.70 వేలలోపే. ఇలాంటివి ప్రస్తుతం రష్యా మాత్రమే వినియోగిస్తోంది.

కొండపల్లి కోట.. శతాబ్దాల చరిత్రకు నిదర్శనం

కొండపల్లి, న్యూస్‌టుడే: శతాబ్దాల చరిత్రకు కొండపల్లి కోట నిలువెత్తు నిదర్శనమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఉత్తరాఖండ్ ముస్సోరిలోని లాల్‌బహదూర్‌శాస్త్రి నేషనల్ అడ్మినిస్ట్రేషన్‌లో శిక్షణ పొందుతున్న 20 మంది శిక్షణ ఐఏఎస్‌లతో కలిసి బుధవారం కొండపల్లి కోటకు ట్రెక్కింగ్ చేశారు. ఈ సందర్భంగా కోట ప్రాధాన్యతపై వారితో మాట్లాడారు. ఫీల్డ్ స్టడీ, రీసెర్చ్ ప్రోగ్రామ్‌కు వచ్చిన శిక్షణార్థులకు కొండపల్లి కోట మంచి హిస్టరీ అంశంగా ఉంటుందన్నారు. అనంతరం మ్యూజియంలోని విశేషాలు.. కోటకు ప్రధాన ద్వారం, పాలనా విభాగం, పర్యవేక్షణ తదితరాలకు సంబంధించిన అనేక అంశాలపై వారికి క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కోట పడమర భాగంలో ఛాయా చిత్రాలు దిగారు.

కోట ప్రాధాన్యాన్ని వివరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

స్వచ్ఛ ఓటర్ల జాబితాకు సహకరించండి

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: జిల్లాలో స్వచ్ఛ ఓటర్ల జాబితా తయారీకి అన్ని రాజకీయపక్షాలు సహకరించాలని కలెక్టర్ డీకే బాలాజీ కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించిన అంశాలు ఏవైనా ఉంటే జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకురావాలన్నారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం, అదనపు పోలింగ్ కేంద్రాలు తదితర విషయాలకు సంబంధించి సలహాలు, సూచనలు అందించవచ్చన్నారు. మార్పులు, చేర్పులు అనంతరం నవంబరు 11 నాటికి జిల్లాలో 15,45,021 మంది ఓటర్లు ఉండగా, వారిలో 7,48,208 మంది పురుషులు, 7,96,762 మంది మహిళలు, 51 మంది ఇతర ఓటర్లు ఉన్నట్టు తెలిపారు. జిల్లాలోని ఏడు శాసనసభా నియోజకవర్గాల్లో ఉన్న 1,769 పోలింగ్ కేంద్రాలకు అదనంగా మరో 73 ఏర్పాటుకు నిబంధనల ప్రకారం ప్రతిపాదించామన్నారు. రాజకీయ పక్షాలు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో చంద్రశేఖరరావు, ఆర్డీవోలు స్వాతి, బాలసుబ్రహ్మణ్యం, రాజకీయ పక్షాల ప్రతినిధులు దిలీప్‌కుమార్, గజేంద్రరావు, సిలార్ దాదా, అబ్దుల్‌మతీన్, కొడాలి శర్మ, బాలాజీ, బత్తిన దాసు పాల్గొన్నారు.

అడ్డంగా తోలేసి.. అడ్డొస్తే తొక్కేసి..!

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

ఇటీవల తెలంగాణలో కంకర టిప్పర్ అదుపు తప్పి ఆర్టీసీ బస్సుపై పడడంతో అక్కడికక్కడే 19 మంది మృత్యువాతపడ్డారు. అధిక లోడ్ చేసుకుని వస్తున్న కంకర లారీ.. మితిమీరిన వేగంతో అదుపుచేయలేక ఆ దుర్ఘటనకు దారితీసింది. కృష్ణా జిల్లాలోనూ తరచూ టిప్పర్లు పరిమితికి మించిన ఇసుక, బుసక, మట్టి, బండ రాళ్లు లోడ్ చేసుకుని.. అతివేగంతో జాతీయ రహదారులు మొదలు జనసంచారాల్లోనూ దూసుకెళ్తున్నాయి. వీటి కారణంగా పలువురు ప్రాణాలు పోగా.. పెనుప్రమాదాలు తప్పాయి. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అధికారులు హడావుడి చేయడం తప్ప ముందస్తు చర్యలు ఉండట్లేదు. జిల్లాలో అధికంగా యనమలకుదురు, చోడవరం, రొయ్యూరు, తోట్లవల్లూరు, పమిడిముక్కల, శ్రీకాకుళం, ఆముదారులంక ఇలా కృష్ణా తీరంలోని గ్రామాల్లో ఇలాంటి లారీల ప్రభావం ఎక్కువ.

తోట్లవల్లూరు వద్ద అధికలోడ్‌తో వెళ్తూ మరమ్మతులకు గురైందిలా..

మచిలీపట్నం కోనేరు సెంటర్ నుంచి హార్బర్‌కు వెళ్లే మార్గంలో అధికలోడ్‌తో ఇలా..

ప్రాణాలు తీశాయిలా..

ఇటీవల జాతీయ రహదారిపై అతివేగంగా వచ్చిన ఇసుక టిప్పరు నిడుమోలు వద్ద వెనక నుంచి ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టడంతో కొల్లిమెర్లకు చెందిన కొల్లి శ్రీలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందారు. ★ కొన్నాళ్ల కిందట మచిలీపట్నం బైపాస్ రోడ్డులో యూటర్న్ తిరుగుతున్న ద్విచక్రవాహనాన్ని మితిమీరిన వేగం.. లోడ్‌తో వచ్చిన టిప్పర్ ఢీ కొట్టడంతో టెంపుల్ కాలనీకి చెందిన అబ్దుల్ ఉస్మాన్ దుర్మరణం పాలయ్యాడు. ★ ఈ ఏడాది జూన్‌లో మంగినపూడి బీచ్‌కు వెళ్లే మార్గంలో ఎస్వీహెచ్ ఇంజినీరింగ్ కాలేజీ వద్ద రాంగ్‌రూట్‌లో వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టడంతో మేకవారిపాలేనికి చెందిన కొఠారి రాజు ప్రాణాలు వదిలాడు.

నిబంధనలు ఇవి.. పాటించరే మరి..?

రవాణాశాఖ నిబంధనల ప్రకారం 12 టైర్ల లారీ 20 టన్నులు, 10 టైర్ల లారీ 16 టన్నుల సామర్థ్యం వరకు లోడ్ చేసుకోవచ్చు. కానీ.. డబ్బు ఆశతో వాహన యజమానులు, డ్రైవర్లు.. పరిమితికి మించిన లోడ్ చేస్తున్నారు. 20 టన్నుల చోట 45 టన్నులకు మించి నింపుతున్నారు. వాస్తవానికి 20 టన్నుల సామర్థ్యం గల లారీ 30-40 కి.మీ వేగంతో మాత్రమే ప్రయాణించాలి. కానీ 45 టన్నులకు పైగా వేసుకొని 50-60 కి.మీ వేగంతో జాతీయ రహదారులు.. రద్దీ రోడ్లలోనూ ప్రమాదకరంగా వెళ్తున్నాయి. ఈ మితిమీరిన తనంతో జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు సుమారు 400పైగా ప్రమాదాలు జరగ్గా పదుల సంఖ్యలో మృత్యువాత పడ్డారు.

జరిమానాలు విధిస్తున్నాం

ఇసుక రేవుల నిర్వాహకులు, లారీల యజమానులు.. డ్రైవర్లకు గతంలో సమావేశం నిర్వహించి నియమాలు చెప్పాం. నిబంధనలు మీరిన సుమారు 1860 సరకు రవాణా వాహనాలతో పాటు.. ట్రాక్టర్లు, ట్రాలర్లకు ఈ ఏడాది రూ.1.23కోట్లు జరిమానాలు విధించాం. టిప్పర్లపైనా ప్రత్యేక దృష్టి పెడతాం.
– శ్రీనివాస్, జిల్లా రవాణాశాఖాధికారి

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 98496 97616

(c) eenadu

ముంచేసిన మానుకాయ

రంగుమారిన ధాన్యంతో వరి రైతు దిగాలు

పామర్రు(గ్రామీణం), న్యూస్‌టుడే

వరి పైరుకు సోకిన మానుకాయ తెగులు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది. పంట పొట్ట, ఈనిక, పాలుపోసుకునే, గింజ గట్టి పడే దశల్లో ఉండగా మొంథా తుపాను ప్రభావంతో దాదాపు మూడు, నాలుగు రోజుల పాటు భారీ ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసిన విషయం విదితమే. ఈ క్రమంలో కాంప్లెక్స్ ఎరువులు ఎక్కువగా వినియోగించిన పొలాల్లో కాటుక తెగులు అని పిలిచే మానుకాయ తెగులు కనిపిస్తోంది. అదే సమయంలో వర్షం పడితే తెగులు ఒక మొక్క నుంచి మరో మొక్కకు ఎక్కువగా వ్యాప్తి చెందే అవకాశం ఉంది. దీనికి గాలి తోడైతే మరింత త్వరగా వ్యాపిస్తుంది. తద్వారా వరి గింజలు రంగుమారి పంటకు నష్టం జరుగుతుంది. సాధారణంగా పైరుపై తెగులు 5 నుంచి 10 శాతం సోకే అవకాశం ఉండగా, ఎలాంటి సస్యరక్షణ చర్యలు తీసుకోకపోతే 20 నుంచి 25 శాతం పంటకు నష్టం కలిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అధికారుల సూచనలతో కొందరు రైతులు వర్షాలు తగ్గిన రెండు, మూడు రోజులకే ప్రొపికోనజోల్ టిల్ట్ మందును పిచికారీ చేశారు. మరికొందరు అదనపు పెట్టుబడి పెట్టలేక, ఇదేం చేస్తుందిలే అని ఎలాంటి సస్యరక్షణ చర్యలు చేపట్టకుండా అశ్రద్ధ చేశారు. ఫలితంగా ఆయా పొలాల్లో అత్యధికంగా మానుకాయ తెగులు కనిపిస్తోంది. ఈ ఏడాది దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని అనుకుంటున్న తరుణంలో ఈ మానుకాయ తెగులు కారణంగా ధాన్యం రంగుమారడంతో దర పడిపోయి నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకటి రెండు రోజుల నుంచి యంత్రాలతో వరికోతలు ప్రారంభం కాగా.. రంగుమారిన ధాన్యం చూసి రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

వరి కంకిపై వచ్చిన మానుకాయ తెగులు

రైల్వేస్టేషన్‌లో భద్రత కరవు..!

జీఆర్పీలో భారీగా సిబ్బంది కొరత

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే

విజయవాడ రైల్వేస్టేషన్ దేశంలోని ప్రధాన 28 రైల్వే స్టేషన్లలో ఒకటి. ఇప్పటికే ఎలైట్ గ్రూప్‌లో కూడా చేరింది. నిత్యం లక్షల మంది రాకపోకలు సాగించే రైల్వే స్టేషన్లో విధులు నిర్వర్తించే పోలీసుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. అమరావతి రాజధానికి దగ్గరగా ఉన్న నేపథ్యంలో వీవీఐపీల రాకపోకలు భారీగా పెరిగాయి. తాజా దేశంలో ఉగ్రవాదుల కదలికల నేపథ్యంలో సిబ్బంది కొరత ఆందోళన కలిగిస్తుంది. విజయవాడ జంక్షన్ జీఆర్పీ స్టేషన్లో సిబ్బంది కేటాయింపు ఏళ్ల తరబడి కాగితాలకే పరిమితం అవుతుందని విమర్శలున్నాయి.

★ విజయవాడ రైల్వే స్టేషన్ ఆదాయం ఏటా రూ.500 కోట్లు దాటింది. నాన్ సబర్బన్ గ్రూపుల్లో ఎన్ఎస్‌జీ-1 కేటగిరీ హోదాను పొందిన రైల్వే స్టేషన్‌గా చరిత్ర సృష్టించింది. వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు కీలకమైన కేంద్రంగా గుర్తింపు పొందినా భద్రతలో మాత్రం నానాటికి దిగజారిపోతోంది. ★ కొన్ని నెలల కిందట రైల్వేలోకో పైలట్ హత్యోదంతంతో రైల్వే సిబ్బందిలో కూడా భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. 2024-25లో దాదాపు 17 మిలియన్ల మంది ప్రయాణికులు విజయవాడ నుంచి రాకపోకలు సాగించారు. సగటున రోజుకు లక్షన్నర మంది ప్రయాణించారు. ★ తాజా ఘటనల నేపథ్యంలో విజయవాడ రైల్వేస్టేషన్‌కు ప్రాధాన్యం ఇస్తూ భద్రత కల్పించాలి. ★ రైల్వేస్టేషన్ లోని అన్ని ప్రవేశ మార్గాల్లో మెటల్ డిటెక్టర్లతో పాటు 24 గంటలు భద్రతా సిబ్బంది నియమించాలి. ★ రైళ్ల నుంచి రవాణా అయ్యే వస్తువులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి. ★ జీఆర్పీ పోలీస్ స్టేషన్‌లో ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా అదనంగా 100 మంది వరకు సిబ్బందిని భర్తీ చేయాలి. ★ అన్ని ప్లాట్ ఫారాల్లో సీసీ కెమెరాల సంఖ్యను పెంచాలి.

దక్షిణ మార్గం వద్ద కనిపించని భద్రత...

వన్‌టౌన్ ప్రవేశం వద్ద మూలన బాంబ్ డిటెక్టర్ ఫ్రేమ్

జిల్లాలో 6,708 గృహాలు పూర్తి

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: జిల్లాలోని పేదలందరూ తమ సొంతింటి కలను సాకారం చేసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ కోరారు. రాయచోటిలో బుధవారం సీఎం చంద్రబాబు గృహప్రవేశాల కార్యక్రమంలో పాల్గొన్న నేపథ్యంలో చింతగుంటపాలెంలోని పీఎంఏవై అర్బన్ పథకం కింద నిర్మించుకున్న గృహప్రవేశాల కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం దేశాయిపేటలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గృహనిర్మాణ పథకం ద్వారా జిల్లాలో 6,708 గృహాలు పూర్తయ్యాయన్నారు. మచిలీపట్నం నియోజకవర్గంలో 1,101 గృహాలు పూర్తిచేసినట్టు తెలిపారు. గతంలో గృహాలు మంజూరు కానివారు పీఎంఏవై 2.0 ద్వారా ఈనెలాఖరు లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గృహ నిర్మాణం నిమిత్తం ప్రభుత్వం రూ.2.50 లక్షల ఆర్థికసాయం అందచేస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే గృహాలు మంజూరైన వారు.. మార్చి 31 లోపు పూర్తి చేయాలని, లేనిపక్షంలో బిల్లులు మంజూరు కావని స్పష్టం చేశారు. నిర్మాణ ఖర్చులకు వెలుగు, మెప్మా సంఘాల ద్వారా రుణం అందజేస్తారన్నారు. కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా.. పేదవారి సొంతింటి కల నెరవేర్చాలన్న కృతనిశ్చయంతో ఉందన్నారు. గృహనిర్మాణ సంస్థ అధికారి పోతురాజు, ఏపీ ఆక్వాకల్చర్ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ లంకే నారాయణప్రసాద్, మచిలీపట్నం అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ దిలీప్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సహకార వారోత్సవాల గోడపత్రికల ఆవిష్కరణ

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: 72వ అఖిలభారత సహకార వారోత్సవాల సందర్భంగా గోడపత్రికలను కలెక్టర్ బాలాజీ బుధవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. జిల్లా సహకారశాఖాధికారి చంద్రశేఖరరెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ఈనెల 14 నుంచి నిర్వహించే వారోత్సవాల్లో భాగంగా ఆత్మనిర్భర్ భారత్ సాధకాలుగా సహకార సంఘాలు అన్న ప్రధాన అంశంపై 14న మచిలీపట్నం, 15న గుండుపాలెం, 16న ఆకులమన్నాడు, 17న నడకుదురు పీఏసీఎస్‌ల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

కార్యక్రమంలో కలెక్టర్ బాలాజీ, సహకార అధికారి చంద్రశేఖరరెడ్డి తదితరులు

వివాహితను రక్షించిన మహిళా కానిస్టేబుల్

విద్యాధరపురం, న్యూస్‌టుడే: కుటుంబ కలహాల కారణంగా ప్రకాశం బ్యారేజీ పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసిన వివాహితను రక్షించిన వన్ ట్రాఫిక్ మహిళా కానిస్టేబుల్ నవ్యను ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం బుధవారం అభినందించారు. కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన వివాహిత కుటుంబ కలహాల కారణంగా మనస్తాపం చెంది ప్రకాశం బ్యారేజీ వద్దకు వచ్చి ఆత్మహత్య చేసుకుందామని భావించింది. అదే సమయంలో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న వన్‌ట్రాఫిక్ మహిళా కానిస్టేబుల్ నవ్య గమనించి ఆమెను రక్షించారు. అనంతరం వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పోలీసు స్టేషనుకు తరలించారు. ఆమె కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ తర్వాత వారికి అప్పగించామని పోలీసులు తెలిపారు.

నవ్య

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -109 రిటైల్ ధర 136 చికెన్ విత్ స్కిన్ - 197, చికెన్ స్కిన్‌లెస్ - 224.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 246 చికెన్ స్కిన్‌లెస్ - 256.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 600 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.93/-.

ప్రకటన

నా క్లయింటు గుంటూరు జిల్లా, తెనాలి, రెవెన్యూ వార్డు నెం.-14, చినరావూరు D.No. 20-30-31/11/A నివాసితురాలు. శ్రీమతి చీతిరాల ఉదయశ్రీ W/o బాల నరేంద్రకుమార్ గారి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియచేయునది ఏమనగా.. కృష్ణా జిల్లా, కంకిపాడు SRO (పోరంకి) పరిధిలో నమోదైన Doc. No. 758/1981 శ్రీ ముంజులూరి (లేటు) అనంతరామారావుకి చెందినటువంటి చ॥గ॥ 291 ఆస్తిని నా క్లయింటు విక్రయం చేయదలచినారు. కావున ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరికైననూ ఏవిధమైన అభ్యంతరములు, క్లెయిములు, తనఖాలు, భాగలబ్ధి తగాయిదాలు, కోర్టు వ్యవహారములు మరియు ఏ విధమైన లావాదేవీలు ఉన్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి 15 రోజులలోగా తగిన ఆధారములతోగాని, లిఖితపూర్వకముగా రిజిస్టరు పోస్టు ద్వారా ఈ క్రింది తెలిపిన అడ్రస్‌కు పంపగలరు. గడువులోపు ఏవిధమైన అభ్యంతరములు లేనియెడల షెడ్యూలు దాఖలా ఆస్తిని నిర్వివాదమైన ఆస్తిగా భావించి మా క్లయింట్ పేరున గాని, వారు కోరిన వారి పేరున రిజిస్ట్రేషన్ పొందగలరు. గడువు తరువాత వచ్చు ఎట్టి అభ్యంతరములు, మా క్లయింటును గాని, షెడ్యూలు ఆస్తిని గాని బైండు చేయజాలవు.

షెడ్యూలు: కృష్ణా జిల్లా, కంకిపాడు సబ్ రిజిస్ట్రారు వారి ఇలాకా, పెనమలూరు మండలం, పోరంకి గ్రామ పంచాయతీ ఏరియాలో చేరిన, దస్తావేజు నెం. 758/1981గా గల చ॥ 291 లేదా య. 0-06ట్లు లేక హె. 0.024ర్లు శేరి మెరక నివేశన స్థలము, అందులో వున్న రేకుల షెడ్డుకు గల హద్దులు: తూర్పు: రాకపోకలకు గ. 1 1/2లు వెడల్పు గల బజారు, దక్షిణం: వీర్ల వెంకటరమణగారి స్థలము, పడమర: రాకపోకలకు లిం. 18లు వెడల్పు గల బజారు, ఉత్తరం: కలిగొట్ల వెంకటరామలక్ష్మి సుబ్రహ్మణ్యశర్మగారి స్థలము. ఈ నాలుగు హద్దుల మధ్య గల చ.గ. 291-0రు స్థిరాస్తి.

ఇట్లు, కమ్మిల రత్నకుమారి, అడ్వకేట్,
Flat No. 307, బి.బ్లాక్, సత్యా రెసిడెన్సీ,
కానూరు, విజయవాడ. సెల్: 85220 82224.

వృద్ధులు.. సమాజానికి మార్గదర్శకులు

కపిలేశ్వరపురం (పమిడిముక్కల), న్యూస్‌టుడే: సమాజానికి మార్గదర్శకులు వృద్ధులేనని వారిని ఆప్యాయంగా, గౌరవంగా చూసుకోవడం మన బాధ్యత, సంస్కారం అని విజయవాడ పటమట సీనియర్ సిటిజన్స్ కార్యదర్శి కొల్లిపర రామమోహనరావు అన్నారు. కపిలేశ్వరపురంలోని లంకమ్మతోటలో బుధవారం వృద్ధుల సత్కార కార్యక్రమం నిర్వహించారు. 85 సంవత్సరాలు దాటిన 15 మంది వృద్ధులను సత్కరించి దుప్పట్లు అందచేశారు. కార్యక్రమానికి రాలేని వారిని ఇంటివద్దనే సత్కరించారు. సన్మానం పొందిన వారిలో వీరంకి నాంచారయ్య(100), కొల్లిపర బ్రహ్మయ్య(98), మైనం అన్నపూర్ణమ్మ (96) తదితరులు ఉన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా సీనియర్ సిటిజన్స్ అధ్యక్ష, కార్యదర్శులు వేమూరి బాబూరావు, మోతుకూరి వెంకటేశ్వరరావు, పటమట సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు పొన్నగంటి సాంబశివరావు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రామాంజనేయులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

వృద్ధురాలిని సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

నిర్వహణ లోపం.. దుర్గంధభరితం!

విజయవాడ-మచిలీపట్నంరోడ్డులో ప్రధానమైన పెనమలూరులో పాదచారులు జాతీయ రహదారిని దాటేందుకు ఇబ్బంది లేకుండా వంతెన నిర్మించారు. అయితే నిర్వాహణ లోపంతో చెత్తతో నిండిపోయింది. మెట్ల మార్గం నుంచి వంతెనపై వరకు అధ్వానంగా ఉండటంతో దీనిపై రాకపోకలు సాగించాలంటే ప్రజలు ముక్కుమూసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. తక్షణమే శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

-ఈనాడు, అమరావతి

'వినియోగదారులపై విద్యుత్తు భారం తగ్గించండి'

గవర్నర్‌పేట: విద్యుత్తు భారం తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ప్రజలను దగా చేసిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సి.హెచ్.బాబూరావు విమర్శించారు. 2022-2024 సంవత్సరాల్లో వినియోగించిన విద్యుత్తుపై రూ.18,243 కోట్లు వసూలు చేశారని పేర్కొన్నారు. తాజాగా 4వ కంట్రోల్ పీరియడ్ పేరుతో మరో రూ.12,771 కోట్ల ట్రూఅప్ ఛార్జీల భారం మోపేందుకు రంగం సిద్ధం చేశారని ఆరోపించారు. బుధవారం సీపీఎం నాయకులు గవర్నర్‌పేటలో పర్యటించారు. విద్యుత్తు వినియోగదారులతో మాట్లాడి, వారి బిల్లులు పరిశీలించారు.

ఒప్పంద ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

గొల్లపూడి, న్యూస్‌టుడే: గ్రామీణ నీటి సరఫరా విభాగంలోని ల్యాబ్‌లలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ల్యాబ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.మూర్తిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం గొల్లపూడిలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మూర్తిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 112 నీటి నాణ్యత ప్రయోగశాలలు ఉన్నాయని, అందులో 526 మంది ల్యాబ్‌లలో పని చేస్తున్నారని వెల్లడించారు. ఉద్యోగులకు ఆగస్టు నుంచి జీతాలు ఇవ్వడం లేదని, కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం లేదన్నారు. గతంతో పోల్చుకుంటే అదనపు పని భారం పెరిగిందని.. జీతాలు ఇవ్వకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.అజయ్‌కుమార్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ఒకే వేతనం తీసుకుంటున్నామని, ప్రతి ఏడాది పని భారం పెరుగుతుంది తప్పితే జీతం పెరగడం లేదన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించే సమయంలో అదనపు ఖర్చు అవుతుందని, అవన్నీ వేతనంలో నుంచే ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి కె.ప్రసాదరావు, కార్యనిర్వాహక కార్యదర్శి ఎ.అనిల్, ఉపాధ్యక్షుడు టి.శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, ఆటోను ఢీకొన్న కారు

ధ్వంసమైన ఆర్టీసీ బస్సు

ప్రమాదంలో పాడైన కారు

గుడివాడ, న్యూస్‌టుడే: ఓ కారు ఆర్టీసీ బస్సును, ఆటోను ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. సేకరించిన వివరాల ప్రకారం.. ఏలూరు నుంచి మచిలీపట్నం వెళుతున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు బలంగా ఢీకొంది. మరో ఆటోను కూడా ఢీకొంది. ఈప్రమాదంలో బస్సులోని ఇద్దరు వ్యక్తులు గాయాల పాలయ్యారు. చాలా పెద్ద ప్రమాదం తప్పిందని బస్సులోని వారు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి కారణాలు విచారణలో తేలాల్సి ఉంది.

అంగన్‌వాడీ కార్యకర్తపై చర్యలకు సిఫార్సు

గూడూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని తరకటూరు గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త నాగలక్ష్మిపై శాఖాపరమైన చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిస్తున్నట్లు సీడీపీవో గ్లోరి, సూపర్‌వైజర్ జన్నురేవతి తెలిపారు. మచిలీపట్నంలో ఇటీవల జరిగిన బాల్యవివాహానికి సంబంధించిన కేసులో ఆమె ప్రమేయం ఉండడంతో కేసు నమోదు చేశారన్నారు. పోలీసుల నుంచి పూర్తి వివరాలు సేకరించి, ఉన్నతాధికారులకు నివేదిస్తున్నామన్నారు. నిబంధనల ప్రకారం ఆమెపై చర్యలు ఉంటాయన్నారు.

విజయ్‌భాస్కర్‌రెడ్డి కస్టడీ.. బెయిల్ పిటిషన్లు వాయిదా

ఈనాడు డిజిటల్ - మచిలీపట్నం: వైకాపా అండతో న్యాయమూర్తులు, కూటమి నేతలు.. వారి కుటుంబ సభ్యులు.. మహిళలే లక్ష్యంగా తీవ్ర అనుచిత పదజాలంతో సామాజిక మాధ్యమాల్లో అసభ్యంగా పోస్టులు పెట్టి అరెస్టు అయి రిమాండ్‌లో ఉన్న మాలపాటి విజయ్‌భాస్కర్‌రెడ్డిని లోతైన విచారణ నిమిత్తం కస్టడీకి ఇవ్వాలని పోలీసులు దాఖలు చేసిన పిటిషన్ ఈ నెల 14కు వాయిదా పడింది. నిందితుడికి బెయిల్ మంజూరు చేయాలని దాఖలైన పిటిషన్‌పై విచారణ సైతం ఇదే రోజుకు వాయిదా వేశారు. కాగా ఈ నెల 13న విజయ్‌భాస్కర్ రెడ్డి తండ్రి పెదకర్మకు ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ మంజూరైన విషయం తెలిసిందే. మధ్యంతర బెయిల్‌లో భాగంగా పోలీసుల పర్యవేక్షణలోనే నిందితుడు ఉండాలి. అతడు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు వాడరాదు.. నిర్దేశిత కార్యక్రమం తప్ప ఇతర ఏ కార్యక్రమాలకు వెళ్లరాదు. మీడియాతో మాట్లాడరాదు. ఎలాంటి రికార్డులు.. సాఫ్ట్‌కాపీలు చూడకూడదని న్యాయాధికారి షరతులు పెట్టారు.

యుపిక్స్ కేసులో మహిళ అరెస్ట్.. రిమాండు

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన యుపిక్స్ కుంభకోణం కేసులో డిపాజిట్ ద్వారా అధిక లాభం పొందిన ఓ మహిళను సత్యనారాయణపురం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నరసరావుపేట రాజుగారి కోటకు చెందిన కొత్తూరి నాగమల్లిక(47).. ఈ సంస్థలో 2023, సెప్టెంబరు 20వ తేదీన 18 బాండ్ల ద్వారా రూ. 2.90 కోట్లు డిపాజిట్ చేశారు. దీనికిగాను సంస్థ నుంచి రూ.6.38 కోట్లు తీసుకున్నారు. మొత్తం రూ.3.48 కోట్లు లాభంగా పొందారు. ఆమె కుమార్తెల పేరుతోనూ డిపాజిట్లు చేసి అధిక లాభాలు తీసుకున్నారు. విజయవాడ సత్యనారాయణపురం కేంద్రంగా యుపిక్స్ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా వందల మంది నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసిన సంగతి తెలిసిందే. మోసపూరితమైన సంస్థ అని తెలిసి కూడా డిపాజిట్లు చేసి లబ్ధి పొందడం చట్టరీత్యా నేరమని విజయవాడ నార్త్ ఏసీపీ స్రవంతిరాయ్ పేర్కొన్నారు. నిందితురాలిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండు విధించారు.

గంటల వ్యవధిలో పోయిన బంగారం గుర్తింపు

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ మహిళ పోగొట్టుకున్న బంగారు ఆభరణాల బ్యాగ్‌ను గంటల వ్యవధిలో రూరల్ సీఐ సోమేశ్వరరావు, సిబ్బంది వెతికి అప్పగించడం అభినందనీయం అని గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ పేర్కొన్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో బుధవారం బాధిత మహిళకు రూ. 6.32 లక్షల విలువైన బంగారు ఆభరణాలు అప్పగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన రాత్రి కొంకేపూడికి చెందిన సూరగాని రూపారాణి గుడివాడ మండలం చినఎరుకపాడు గ్రామానికి వస్తుండగా మార్గంమధ్యలో 55 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగ్‌ను పోగొట్టుకుందన్నారు. వెంటనే రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ సోమేశ్వరరావు, ఇన్‌ఛార్జి ఎస్.ఐ కె.శ్రీనివాస్, ట్రైనీ ఎస్.ఐ లోకేశ్వరిలు సిబ్బందితో ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పరిశీలించి ఓ వ్యక్తికి అది దొరికినట్లు గుర్తించారు. వెంటనే అతని వద్ద నుంచి బ్యాగ్‌ను, అందులో ఉన్న బంగారు ఆభరణాలను తీసుకుని బాధిత మహిళకు అందించామన్నారు. సుమారు గంటన్నర వ్యవధిలో పోయిన బంగారు వస్తువులను వెతికి అప్పగించిన పోలీసులను అభినందించారు.

డీఎస్పీ ధీరజ్ వినీల్ సమక్షంలో బాధిత మహిళకు బంగారు నగలు అందిస్తున్న సీఐ సోమేశ్వరరావు

దాహమని చెప్పి చరవాణితో ఉడాయించారు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: వరుస గొలుసు దొంగతనాలతో బాపులపాడు మండల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న దుండగులు, బుధవారం వీరవల్లిలో ఓ వ్యక్తిని బురిడీ కొట్టించి చరవాణితో ఉడాయించారు. గ్రామానికి చెందిన నార్తిరెడ్డి ఆంజనేయులు అనే వ్యక్తి స్థానిక జడ్పీ హైస్కూల్ సమీపంలో ఒంటరిగా ఉన్న సమయంలో ద్విచక్ర వాహనంపై ఇద్దరు యువకులు వచ్చారు. బాగా దాహంగా ఉందని, మంచినీళ్లు ఎక్కడ దొరుకుతాయంటూ అడిగారు. సమీపంలో ఉన్న ఓ దుకాణం వైపు ఆంజనేయులు చూపుతుండగా, వాహనంపై వెనుక కూర్చున్న యువకుడు బండి దిగి అటుగా వెళ్తున్నట్లు ముందుకు కదిలాడు. ఈలోగా బండి నడుపుతున్న వ్యక్తి వాహనం అదుపు తప్పి తనపై పడినట్లు నటించాడు. బండిని పైకి లేపేందుకు సాయం చేస్తున్న క్రమంలో ఆంజనేయులు వద్ద ఉన్న చరవాణిని లాక్కొని ఇద్దరూ ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. కంగుతిన్న బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం యూపీఐ ద్వారా బ్యాంకులో నగదు తస్కరిస్తారేమోనన్న భయంతో హనుమాన్‌జంక్షన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు వచ్చారు. బిజినెస్ కరస్పాండెంట్ వేగిరెడ్డి బాలాజీ, మేనేజరు సాయంతో యూపీఐ యాప్‌ల ద్వారా నగదు బదిలీ కాకుండా చర్యలు తీసుకున్నారు.

న్యాయవాదుల రక్షణ చట్టం అమలుకు విజ్ఞప్తి

విజయవాడ (గవర్నర్ పేట), న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల రక్షణకు చట్టం తీసుకురావాలని ఏపీ స్టేట్ బార్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎ.కె.బాషా, జనరల్ సెక్రటరీ వై.శివసుబ్రహ్మణ్యం తదితరులు మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. రక్షణ చట్టం అమలు కోరుతూ డోన్ నుంచి న్యాయవాదులు కృష్ణప్రసాద్, ఈశ్వరయ్య చేపట్టిన పాదయాత్ర మంగళవారం విజయవాడలో ముగిసింది. వీరంతా బుధవారం మంత్రి లోకేశ్‌ను కలిసి, న్యాయవాదుల రక్షణ చట్టం ఆవశ్యకతను వివరించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని.. చట్టం అమలు కోసం విధి విధానాలను రూపొందిస్తున్నామని, త్వరలో చట్టాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారని బాషా తెలిపారు. మంత్రి లోకేశ్‌ను కలిసిన వారిలో బీజేపీ సంయుక్త కార్యదర్శి జి.వరాహలక్ష్మి, సీనియర్ న్యాయవాది గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ తదితరులు ఉన్నారు. తొలుత దిల్లీ మారణహోమానికి నిరసనగా న్యాయవాదులు నల్లబ్యాడ్జీలు ధరించి సంఘీభావం తెలిపారు. మౌనం పాటించి మృతులకు నివాళులర్పించారు.

మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎ.కె.బాషా, రామకృష్ణప్రసాద్ తదితరులు

డిసెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

అవనిగడ్డ, న్యూస్‌టుడే: జాతీయ లోక్ అదాలత్‌ను డిసెంబర్ 13వ తేదీన ఏర్పాటు చేసినట్లు ఆరవ అదనపు జిల్లా జడ్జి పాండురంగారెడ్డి చెప్పారు. రాజీ పడదగిన కేసులలో కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సమయాన్ని, ధనాన్ని ఆదా చేసుకోవాలని చెప్పారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజీపడటం వలన ఇరుపక్షాలు గెలిచినట్లే అవుతుందని, కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి పాండురంగారెడ్డి

మాజీ గవర్నర్ దత్తాత్రేయకు ఆహ్వానం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ బుధవారం హైదరాబాద్‌లో కలసి ఈనెల 19న అవనిగడ్డ గాంధీక్షేత్రంలో జరిగే 48వ దివిసీమ ఉప్పెన స్మారక సభకు ఆహ్వానించారు. ఉప్పెన ప్రభావిత గ్రామాలకు ఆనాడు దత్తాత్రేయ చేసిన సహాయం అపూర్వమన్నారు. ఈ సందర్భంగా దత్తాత్రేయను మర్యాద పూర్వకంగా సత్కరించారు.

బండారు దత్తాత్రేయతో మాట్లాడుతున్న బుద్ధప్రసాద్

పారిశుద్ధ్య నిర్వహణపై డీపీవో ఆరా

పెదకళ్లేపల్లి(మోపిదేవి), న్యూస్‌టుడే: మండలంలోని పెదకళ్లేపల్లి పంచాయతీతో పాటు మిగిలిన పంచాయతీలు సర్వేలో వెనుకంజలో ఉండటాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారిణి అరుణ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదకళ్లేపల్లిలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం జరిపారు. పారిశుద్ధ్యం, ఇంటి పన్నులు, పన్నేతర వసూళ్లపై సమీక్షించారు. పెదకళ్లేపల్లి అన్నింటా వెనుకబడి ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశం అనంతరం గ్రామంలో పర్యటించి పలు గృహాలకు స్వయంగా వెళ్లి చెత్త సేకరణపై ఆరా తీశారు. కార్యదర్శులు పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచనలిచ్చారు. సర్పంచ్ అరజా సంధ్యారాణి, అరజా కిరణ్‌కాంత్, ఆశాదేవి, కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై గృహిణుల అభిప్రాయాలను సేకరిస్తున్న డీపీవో అరుణ

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానము, ఇంద్రకీలాద్రి, విజయవాడ-1

ఆర్.సి.నెం. K1/3387/2025, తేది. 05-11-2025

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి, విజయవాడ భవాని దీక్షల విరమణలు 2025 సందర్భముగా తేది. 11-12-2025 నుండి తేది. 15-12-2025 వరకు కాని భక్తుల రద్దీ దృష్ట్యా తేది.18-12-2025 వరకు దేవస్థానము వారు ఏర్పాటు చేయు ప్రదేశములలో భక్తులకు కేశఖండన చేయుటకు (తలనీలాలు తీయుటకు) టిక్కెట్టు ఒక్కటికి రూ. 25/- రెమ్యునరేషన్ చెల్లించు పద్ధతిపై సుమారు 600 మంది ఆసక్తిగల నాయి బ్రాహ్మణులు (బార్బర్లు) సంబంధిత ఆధార్ కార్డు జిరాక్స్, కుల ధృవీకరణ పత్రం జిరాక్స్, 2 పాస్ పోర్టు సైజు ఫోటోలు మరియు నేషనల్ లైజ్ బ్యాంకు అకౌంట్ నెంబరుతో తేది. 05-12-2025 లోపు గా శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానము, ఇంద్రకీలాద్రి, విజయవాడ కొండ దిగువున గల అరండల్ సత్రంలో గల కేశఖండన శాల నందు వారి వారి పేర్లను ఆఫీస్ పని దినములలో నమోదు చేయించుకొనవలెను. దేవస్థానము వారు సూచించిన ప్రదేశములలో పనిచేయవలసియుండును. ఎటువంటి తగాదాలు చేయరాదు

ఆర్జిత సేవ మరియు పరోక్ష సేవ టిక్కెట్లను https://kanakadurgamma.org నందు పొందగలరు

శ్రీ బొర్రా రాధాకృష్ణ, ఛైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు | సం/- వి.కె.శీనా నాయక్, యం.ఎ, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్- కార్యనిర్వహణాధికారి

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166

బంగారం కొనబడును. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 81422 92071

BUSINESS OFFER

పెట్టుబడి లేకుండా HYD కంపెనీలో న్యూప్రొడక్ట్స ద్వారా విజయవాడ చుట్టుప్రక్క ప్రాంతాలలో జిల్లాల & మండలాల వారీగా డిస్ట్రిబ్యూటర్స్ & టీం లీడర్స్ కావలెను. ప్రతిరోజు అన్‌లిమిటెడ్‌గా ఆదాయం తీసుకోవచ్చు. ✆ 9948238050

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్, స్థిరాస్తి ఎక్కడ ఏ సంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్ లోన్, సిబిల్ అవసరం లేదు. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ, ✆ 93969 99669.

PEOPLE CARE

OLD AGE HOME

గాయత్రి గ్రూప్, VJA వృద్ధులకు పేషెంట్ల సేవకు, ఇంటి/వంట బేబికేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 97040 21122, 96038 42233

REAL ESTATE

LAND FOR SALE

తూర్పుగోదావరి జిల్లా లింగంపర్తిలో గల వైఆర్‌సీ కాలువ ఆనుకొని 52 ఎకరాల వ్యవసాయ భూమి ఎకరం 35 లక్షలకు అమ్మకమునకు కలదు. (నదిపాటి గోశాలకు 2 కిలోమీటర్ల దూరం). Contact Cell: 93909 91555.

PLOT FOR SALE

GOLLAPUDI

విజయవాడ గొల్లపూడిలో కొత్త బైపాస్ వద్ద C కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ ప్రక్క రోడ్డులో 200, 400గ. లేఅవుట్ ప్లాట్లు. గజం: 25000లకే. ✆ 92907 63488

GENERAL

ఉచితప్లాటు! ప్రకాశం జిల్లా చిన్నారికట్ల జంక్షన్ దగ్గరలో మాఫామ్ ల్యాండ్‌లో 100 గజాలు 10 శ్రీగంధంచెట్లు, 20 లక్షలు లాభం. సంప్ర: ✆ 88859 99038

కొలనుకొండ, జయభేరి కన్స్ట్రక్షన్ దగ్గర, KIA షోరూం పక్కన, 918 చ॥గ॥ తూర్పు (హైవే) ఫేస్ త్రికోణకారంలో ఉన్న స్థలము అమ్మకము. PH: 99662 28370.

JOBS

విజయవాడ భవానీపురం ఐరన్ కాంప్లెక్స్ షాపు నందు క్లర్క్‌లు, గుమస్తాలు కావలెను. వ: 25-30 సం॥లోపు వారు. Q: ఇంటర్/డిగ్రీ. ✆ 98493 55009.

నిడమానూరు కన్‌స్ట్రక్షన్ కంపెనీ నందు పాలిటెక్నిక్, సివిల్స్ చదివి నిర్మాణరంగంలో 5 సం॥ అనుభవం కలిగిన సూపర్‌వైజర్స్ మరియు లేడి అకౌంటెంట్ కావలెను. ✆ 99664 27765.

విజయవాడ గవర్నర్‌పేటలోని ప్రముఖ ల్యాప్‌టాప్ సర్వీస్ సెంటర్‌కి 20 To 30 సం॥లోపు రిసెప్షనిస్ట్ (F), ఆఫీస్ అసిస్టెంట్ (M) కావలెను. ✆ 93463 45667.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు

రైతులతో మాట్లాడుతున్న జేసీ నవీన్

బంటుమిల్లి, న్యూస్‌టుడే : పారదర్శకంగా ధాన్యం కొనుగోలు జరిగేలా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. బుధవారం అర్తమూరు, ముల్లపర్రులలో పర్యటించిన ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. తేమ శాతం తెలిపే యంత్రాలు, రికార్డులు పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. మండల వ్యవసాయ శాఖాధికారి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ధర వరలు

టమాట 29, వంగ 64, బెండ 44, పచ్చిమిర్చి 38, కాకర 48, క్యాబేజీ 30, క్యారెట్ 78, దొండ 50, బంగాళదుంప 30, ఉల్లిపాయలు 24, గోరుచిక్కుడు 54, దోస 27, సొర 35,30, అరటికాయ 5,6, చిక్కుళ్లు 80,బీర 48, చామదుంప 30,మునగ 10/08, కంద 48, బీట్‌రూట్ 50, కీరదోస 38, బీన్స్ 80, క్యాప్సికం 70, అలసందలు 60, చిలకడదుంప 44, కొత్తిమీర 30/15, పుదీనా 20/5 **గురువారం ఉదయం 7 గంటలవరకు ఈ ధరలు వర్తిస్తాయి. ఫిర్యాదులుంటే ఎస్టేట్ అధికారి బలిచక్రవర్తి, ఫోన్ 91823 61295లో సంప్రదించవచ్చు.**

సినిమాలు

రేవతి: జటాధర
మినీరేవతి: కృష్ణలీల
సిరికృష్ణ: దిగర్ల్‌ఫ్రెండ్
సిరివెంకట్: మాస్ జాతర - **మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే**

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

స్పందనకు వందనం

- దేశాయిపేట రహదారి పక్కన చెత్తమేట తొలగించకపోవడంతో స్థానికులతోపాటు అటుగా రాకపోకలు చేసేవారు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆ ప్రాంతవాసులు సమస్యను మేమున్నాం మీకుతోడుగా దృష్టికి తీసుకురాగా కమిషనర్ బాపిరాజుకు వివరించడంతో ఆయన సిబ్బందిని పంపి చెత్తతొలగించేలా చర్యలు తీసుకున్నారు.
- నగరంలోని బైపాస్‌రోడ్డులో రహదారి పక్కన కేబుల్ పనుల నిమిత్తం తవ్విన గుంత ప్రమాదకరంగా మారింది. ఈ సమస్యను పలువురు మేమున్నాం మీకుతోడుగా దృష్టికి తీసుకురాగా కమిషనర్ బాపిరాజుకు వివరించడం జరిగింది. స్పందించిన ఆయన సంబంధిత విభాగ ఉద్యోగులకు చెప్పి గుంత పూడ్పించేలా చర్యలు తీసుకున్నారు.

- న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

అమృత్.. ఆలస్యం

అసంపూర్తిగా మురుగునీటి శుద్ధి ప్లాంట్

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: అమృత్ 2.0 పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నగరపాలక సంస్థకు నిధులు కేటాయించి మూడేళ్లు దాటిపోతోంది. వైకాపా హయాంలోనే నిధులు కేటాయించినా గత పాలకులు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఈ నిధుల వినియోగం అంశాన్ని కౌన్సిల్ ముందుకు తీసుకురాలేదు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని డీపీఆర్ నివేదించడంతో నిధులు కేటాయించారు. అయినా ఇప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గత వైకాపా ప్రభుత్వం సకాలంలో స్పందించకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయే పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంది. ఈ అంశాన్ని నగరపాలకసంస్థ కౌన్సిల్లో పెట్టేందుకు పాలకవర్గం విముఖత చూపించడంతో కమిషనర్ పరిధిలోనే డీపీఆర్‌కు సంబంధించిన ప్రక్రియ పూర్తయ్యేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. అయితే అమృత్ పనులకు సంబంధించి వైకాపా హయాం నుంచి అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతూనే ఉన్నాయి. ప్రారంభంలో వైకాపా ప్రభుత్వం స్పందించక ఆగిపోతే..ప్రస్తుతం వివిధ కారణాలతో పనులు ఆలస్యం అవుతున్నాయి. పనులు టెండరు దశకు చేరుకున్న సమయంలో పాత ధరలు, ఇప్పటిధరకు ఉన్న వ్యత్యాసంపై గుత్తేదారు సంస్థలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో మళ్లీ అవాంతరం ఏర్పడింది.

పనుల వారీగా వ్యయం అంచనాలిలా..

అమృత్ 2.0 పథకంలో నగరానికి రూ.73.38 కోట్లు విడుదలయ్యాయి. వీటిలో రూ.53.10 కోట్లతో రెండు మురుగునీటిశుద్ధి ప్లాంట్లు ఈడేపల్లి సబ్‌జైల్, ఫతుల్లాబాద ఔట్ ఫాల్ డ్రెయిన్ల వద్ద నిర్మించాలని నిర్ణయించారు. దీంతోపాటు రిజర్వాయర్లు, పైపులైన్లు, ఇతర తాగునీటి సంబంధిత పనులు చేపట్టేందుకు రూ.15.24 కోట్లు కేటాయించారు. నగరంలోని కాలనీలతోపాటు రుద్రవరంలోని టిడ్కో గృహసముదాయం వరకు పైపులైన్ ఏర్పాటు, ఇతర పనులకు రూ.1.12 కోట్లు, కాలనీల్లో భూగర్భ డ్రెయినేజీ నిర్మాణాలకు రూ.1.16 కోట్లు, జిల్లాపరిషత్తు కూడలిలోని ధర్మాన చెరువు అభివృద్ధికి రూ.2.76 కోట్లు వెచ్చించేలా చర్యలు తీసుకున్నారు. ఈ పనులన్నీ పూర్తయితే నగరంలో చాలావరకు సమస్యలు పరిష్కారం అవుతాయని, త్వరితగతిన ప్రారంభించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

ఉత్తర్వులు రాగానే పనులు చేపడతాం



అమృత్ 2.0 పథకానికి సంబంధించిన పనులు వివిధ కారణాలతో ఆలస్యమయ్యాయి. అయితే ఆటంకాలు తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. త్వరలోనే ఉత్తర్వులు విడుదలయ్యే అవకాశం ఉంది. ఉత్తర్వులు వెలువడిన వెంటనే పనులు ప్రారంభించేలా కృషి చేస్తున్నాం.

-సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, నగరపాలకసంస్థ కమిషనర్

కళాశాల విద్యార్థినులతో నటీనటులు

సీమంతం చిత్రం యూనిట్ సందడి

పెడన, న్యూస్‌టుడే: సీమంతం చిత్రం యూనిట్ సభ్యులు బుధవారం నందమూరు వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో సందడి చేశారు. వజ్ర యోగి, శ్రీయలు ప్రధాన పాత్రల్లో నటించిన ఈచిత్రాన్ని క్రైం థ్రిల్లర్‌గా నిర్మించామని దర్శకుడు సుధాకర్‌పాణి చెప్పారు. విద్యార్థులతో కలిసి ప్రధాన పాత్ర దారులు సందడి చేశారు. టీఆర్ డ్రీమ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మించిన ఈచిత్రాన్ని ఈనెల 14న విడుదల చేస్తున్నామని దర్శకుడు చెప్పారు.

కథానాయకుడు జింజేరు వాసి: కథానాయకుడు వజ్ర యోగి పెడన మండలం జింజేరు వాసి. ఇతని అసలు పేరు తాతా ప్రశాంత్. ఇంజినీరింగ్ పూర్తిచేసి సింగపూర్‌లో స్థిరపడ్డారు. ఇటీవల రాష్ట్రానికి వచ్చి సినీ రంగంలోకి అడుగుపెట్టారు. మొట్టమొదటిగా కథనాయకుడి పాత్ర పోషించారు. జింజేరులో ఇంటింటికి వెళ్లి గ్రామస్థులను ఆప్యాయంగా పలకరించారు.

పాడైపోయిన కార్లు, ఇతర వాహనాలు

తుప్పు పట్టి.. మట్టిలో కలిసిపోతూ..

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తూ..పోలీసుల తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న వివిధ వాహనాలు తుప్పుపట్టి పోతున్నాయి. కొన్ని వాహనాలు మట్టిలో కూడా కలిసిపోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో చట్టవిరుద్ధంగా ప్రయాణిస్తూ దొరికిపోయిన వాహనాలన్నింటినీ నగరంలోని రెవెన్యూ అసోసియేషన్ కార్యాలయం పక్కన ఉన్న ఖాళీస్థలంలో ఉంచారు. వాటిలో చాలా వాహనాలను ఏళ్ల తరబడి అక్కడే వదిలేయడంతో వాటి చుట్టూ పొదలు వ్యాపించాయి. సాధారణంగా తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలకు వేలం నిర్వహించి వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వానికి జమ చేస్తుంటారు. మరి ఈ వాహనాల గురించి ఎందుకు పట్టించుకోవడం లేదో తెలియదు. ఇలాగే వదిలేస్తే కనీసం తుక్కు కింద విక్రయించడానికి కూడా పనికిరాకుండా పోతాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముళ్ల పొదల్లో ఇలా..

పేదల వైద్యానికి ముఖ్యమంత్రి తోడ్పాటు

చెక్కు అందజేస్తున్న గోపీచంద్, ఫణికుమార్ తదితరులు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిట వరమని తెదేపా రాష్ట్ర నాయకులు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. బుధవారం ఆయన నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారికి సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. వివిధ అనారోగ్య సమస్యలతో చికిత్స పొంది పేదరికంతో ఇబ్బందులు పడుతున్న బలగం సత్యవతికి రూ.1,64,038, ఈడే మురళికి రూ.70,300 చెక్కుల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతి కుటుంబానికి పెద్దకొడుకులా ఉంటానని ఇచ్చిన మాట నెరవేరుస్తున్నారన్నారు. బందరు నియోజకవర్గంలో మంత్రి కొల్లు రవీంద్ర సిఫార్సుతో ఎంతోమందికి సహాయ నిధి ద్వారా సాయం అందించడం జరిగిందన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పీవీ ఫణికుమార్, తెదేపా నగర అధ్యక్షులు లోగిశెట్టి వెంకటస్వామి, కూటమి నాయకులు పాల్గొన్నారు. 40వ డివిజన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెదేపా నాయకులు రొండి కృష్ణయాదవ్, అక్కుమహంతి రాజా, లోగిశెట్టి వెంకటస్వామి, నాలి మాధవ తదితరులు బృందావనం శ్రీలక్ష్మికి రూ.75,833, ముక్కు జయలక్ష్మి రూ.1,28,000, కొలుసు దుర్గాభవానీకి రూ.42,292లను చెక్కుల రూపంలో అందజేశారు.

అర్హులకు ప్రభుత్వ గృహాలు

నమూనా తాళం చెవి అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

పెడన, న్యూస్‌టుడే: పేదలకు సొంతింటి కల నెరవేర్చాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. స్థానిక 4వ వార్డులో ప్రభుత్వ సహాయంతో సొంత స్థలంలో నిర్మించిన ఇంటిని యజమాని ఆశపుకోట నాగేశ్వరరావుతో కలిసి బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెడన పట్టణంలో 35, మండలంలో 58 గృహాలు నిర్మించినట్లు తెలిపారు. ఈసందర్భంగా 106 నూతన గృహాల నిర్మాణానికి ప్రొసీడింగ్ ఆర్డర్లను అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేశ్, మాజీ వైస్ ఛైర్మన్ అబ్దుల్ ఖయ్యూం, హౌసింగ్ ఏఈ మాధవి, కూటమి నేతలు పాల్గొన్నారు.

చెత్త తొలగించరూ..!

రహదారిపై పేరుకుపోయిన వ్యర్థాలు

పెడన, న్యూస్‌టుడే: స్థానిక జోగానందరావు కాలనీ రోడ్డు మొదట్లో చెత్త పేరుకుపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈరోడ్డులో తహసీల్దార్, వెలుగు, గృహనిర్మాణ సంస్థ కార్యాలయాలు ఉన్నాయి. కాలనీ వాసులకు ఇదే ప్రధాన మార్గం. ఈకాలనీలో సేకరించిన చెత్తను రహదారి పక్కగా డంప్ చేయడంపై ఆప్రాంతవాసులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే సందర్శకులు ఇక్కట్ల పాలవుతున్నారు. చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేందుకు చర్యలు చేపడతామని ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపికిశోర్ చెప్పారు.

హమ్మయ్య.. దారిచ్చారు

ఓపక్కన నిలిపిన వాహనాలు

ఈనాడు కథనానికి స్పందన

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: మచిలీపట్నం సర్వజనాసుపత్రిలో వివిధ విభాగాల ఎదుట ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపడంతో రోగులతోపాటు వారి కుటుంబసభ్యులు, ఉద్యోగులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఈసమస్యపై ఈనెల 11న మారని తీరు..పట్టించుకోవాలి మీరు శీర్షికన ఈనాడులో చిత్రకథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ఆశాలత సిబ్బందితో కలిసి ఆయా ప్రాంతాలను పరిశీలించారు. అడ్డుగా పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. పునరావృతమైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆయిల్‌పామ్ పంట సాగుతో ప్రయోజనాలు

పులిగడ్డ(అవనిగడ్డ గ్రామీణం): ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు దీర్ఘకాల ప్రయోజనాలు చేకూరుతాయని అవనిగడ్డ సబ్‌డివిజన్ ఉద్యానశాఖాధికారి ఎన్.రమేష్ చెప్పారు. రైతులకు జిల్లా ఉద్యానశాఖ, ఉండవల్లి ఆగ్రోస్ ఎల్.ఎల్.పి సంయుక్త అధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఉద్యానశాఖ మండల సహాయకురాలు శ్రీజ, ఉండవల్లి ఆగ్రోస్ డీజీఎం హరికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

జాతీయ ఖోఖో పోటీలకు ఎంపిక

గుడివాడ, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు ఈనెల 8, 9, 10 తేదీలలో విజయనగరంలో జరగ్గా అండర్ 19 పోటీలలో గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చి కాంస్య పతకం సాధించారని స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక స్టేడియంలో ఖోఖో విజేతలు డి.రాజేష్, ఎం.లక్ష్మీధర్‌లను బుధవారం అభినందించారు. వీరు జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనడానికి అర్హత సాధించారన్నారు.

ప్రత్యేక పూజలు.. వ్రతాలు

దేవతామూర్తులను తోడ్కొని వస్తున్న భక్తులు

మచిలీపట్నం(గొడుగుపేట),గూడూరు,న్యూస్‌టుడే: నగరంలోని పలు ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బచ్చుపేట వెంకటేశ్వర స్వామి ఆలయంలో వేదపండితులు ముత్తేవి శశికాంత్ పర్యవేక్షణలో విశేషపూజలు, సామూహిక సత్యన్నారాయణస్వామి వ్రతాలను వైభవంగా నిర్వహించారు. ఆలయఛైర్మన్ ముత్తేవి రవికాంత్, ఈవో గోవాడ వెంకటకృష్ణారావు పర్యవేక్షించారు. ఇస్కాన్ ప్రతినిధి రాధామనోహర్‌దాస్ ప్రవచనం చేశారు. కొజ్జిల్లిపేట నాగేశ్వరస్వామి ఆలయంలో అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ లంకిశెట్టి నీరజ, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. రామలింగేశ్వరస్వామి ఆలయంతోపాటు కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలోని నగరేశ్వరస్వామికి అభిషేకాలు, అర్చనలు జరిగాయి. చెమ్మనగిరిపేట అయ్యప్పస్వామి ఆలయంలో నిర్వహించిన పూజల్లో అయ్యప్పదీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు. గూడూరు మండలంలోని గూడూరు రామలింగేశ్వరస్వామి, ఐదుగుళ్లపల్లి సోమేశ్వరస్వామి తదితర ఆలయాల్లో పూజలు జరిగాయి.

మచిలీపట్నంరూరల్, న్యూస్‌టుడే: కార్తికమాసంలో ముక్కంటిని భక్తిశ్రద్ధలతో కొలుస్తున్నారు. ఎస్.ఎన్.గొల్లపాలెంలోని శ్రీఉమా సమేత సోమేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకరుద్రాభిషేకం, అర్చనలు నిర్వహించారు. మంగినపూడిలో నగరేశ్వర స్వామికి, పోతేపల్లిలో విజయ కనకదుర్గ మల్లేశ్వరస్వామికి, తపసిపూడిలో శ్రీపార్వతి సమేత నాగేశ్వరస్వామికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు.

సామూహిక వ్రతాల్లో భక్తులు

పూజలు అందుకున్న అయ్యప్పస్వామి

మంగినపూడిలో నగరేశ్వరస్వామి

ఐదుగుళ్లపల్లి సోమేశ్వరస్వామి

స్వామివార్లకు అభిషేకం చేస్తున్న అర్చకులు

న్యుమోనియా నివారణకు కార్యాచరణ

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, డీఎంహెచ్‌వో తదితరులు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: ప్రపంచ న్యుమోనియా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో యుగంధర్ మాట్లాడుతూ 2026 ఫిబ్రవరి 28 వరకు జిల్లావ్యాప్తంగా అవగాహన ర్యాలీలు, సదస్సులు జరుగుతాయన్నారు. శిశువుల్లో న్యుమోనియా వ్యాధి నివారణ, త్వరితగతిన గుర్తింపు, సకాలంలో వైద్యం అందించడం తదితర అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడమే కార్యక్రమ లక్ష్యమని అన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ప్రేమ్‌చంద్, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

అప్రమత్తత అవసరం

గూడూరు, న్యూస్‌టుడే: న్యుమోనియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మల్లవోలు పీహెచ్‌సీ వైద్యులు తరుణ్, రూపశ్రీలు అన్నారు. ప్రపంచ న్యుమోనియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్లవోలులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎలాంటి అనుమానిత లక్షణాలు కనిపించినా వెంటనే ఆసుపత్రికి వచ్చి చికిత్స చేయించుకోవాలని సూచించారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

బంటుమిల్లి, న్యూస్‌టుడే : ఐదు సంవత్సరాల లోపు చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని బంటుమిల్లి, పెదతుమ్మిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు పవన్, సౌందర్య, సువర్చల సూచించారు. ప్రపంచ న్యుమోనియా దినోత్సవం సందర్భంగా ఆయా ఆరోగ్య కేంద్రాలలో సిబ్బందికి వైద్యులు అవగాహన కల్పించారు. అనంతరం వైద్యులు, సిబ్బంది ప్రదర్శనలు నిర్వహించారు.

పెదతుమ్మిడి: కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది

గూడూరులో ప్రదర్శన

రోడ్డు పనులు ప్రారంభం

గూడూరు: ముక్కొల్లు గ్రామంలో జిల్లా పరిషత్తు నిధులు రూ.8.75 లక్షలతో నిర్మించనున్న రోడ్డు పనులను బుధవారం ఎంపీటీసీ సభ్యులు యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఉపసర్పంచి సమ్మెట చంతన్ ప్రారంభించారు.

ఒకేషనల్ విద్యార్థులకు శిక్షణ

మొవ్వ: మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒకేషనల్ విద్యార్థులకు బుధవారం ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంటర్ విద్య జిల్లా అధికారి ఎస్.సరళకుమారి పర్యవేక్షణలో శిక్షణ తరగతులు నిర్వహించారు. అకౌంటింగ్, టాక్సేషన్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

ప్రదర్శనలో జడ్పీ ఛైర్‌పర్సన్ హారిక, ఉప్పాల రాము తదితరులు

పెడన, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలన్న ప్రతిపాదనను వైకాపా శ్రేణులు నిరసించాయి. పెడన నియోజకవర్గ వైకాపా ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తోటమూల సెంటర్‌కు చేరుకుని డిప్యూటీ తహసీల్దార్ నరసింహారావుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక, పార్టీ కన్వీనర్ ఉప్పాల రాము, నాయకులు పాల్గొన్నారు.

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించొద్దంటూ వైకాపా నాయకులు, శ్రేణులు బుధవారం మచిలీపట్నం ఉత్తర తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ నాగభూషణంకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో వైకాపా జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య(నాని), నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేర్ని కృష్ణమూర్తి(కిట్టు), నాయకులు లంకే వెంకటేశ్వరరావు, బొర్రా విఠల్, మేకల సుబ్బన్న, సిలార్‌దాదా పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పేర్ని కిట్టు, వైకాపా నాయకులు

నేటి నుంచి స్వామిత్వ గ్రామసభలు

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో స్వామిత్వ గ్రామసభలు ఈనెల 13 నుంచి 27 వరకు నిర్వహించనున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో నాగిరెడ్డి తెలిపారు. 13న లంకలకలువగుంట, 17న కవిపురం, 18న కమలాపురం, 19న నడుపూరు, 20న గురివిందగుంట, 25న పుల్లపాడు, 27న దేవరపల్లిలో జరుగుతాయని తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఉదయం 10.30 గంటలకు సభలు ప్రారంభమవుతాయన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తాం

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా యూనియన్ బ్యాంకు కృషిచేస్తుందని బ్యాంకు ప్రాంతీయ ప్రధాన అధికారి కె.వెంకట్రావు అన్నారు. యూనియన్ బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవాన్ని నగరంలోని జిల్లాపరిషత్ కన్వెన్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ సేవలను కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బ్యాంకు అధికారులు రామలింగారెడ్డి, దాస్, ఉద్యోగుల సంఘం నాయకులు రాజేష్, దుర్గారావు, శ్రీనివాస్, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు కొల్లు సాయిమోహన్‌రావు, తమ్ము విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ప్రకటన

సివిల్ జడ్జి, జూనియర్ డివిజన్, బంటుమిల్లి, కృష్ణా జిల్లా

EP No. 4/2016 in O.S.No. 56/2013

బిట్వీన్
పుప్పాల నారాయణరావు
S/o (లేటు) రామారావు, బంటుమిల్లి, కృష్ణా జిల్లా
... D.Hr / Plaintiff
VS
వల్లబాపురపు జ్ఞానప్రసాద్
S/o (లేటు) వెంకటేశ్వరరావు, బంటుమిల్లి, కృష్ణా జిల్లా
... J.Dr./ Defendent

నోటీసు Under Order 21 R 64 & 66 C.P.C. ప్రకారం J.Dr అయిన వల్లబాపురపు జ్ఞానప్రసాద్ గారిపై D.Hr పైకోర్టులో డిక్రీ పొందియున్నారు. సదరు డిక్రీ అమలుపర్చుటకు EP 4/2016 వేసి J.Dr షెడ్యూలు ఆస్తిని జప్తుచేసి, ఆస్తిని విక్రయ ప్రకటన షరతులను నిర్ణయించుటకు ది. 1-12-2025న పై కోర్టులో నిర్ణయించబడినది. ఇందుమూలముగా J.Dr అయిన వల్లబాపురపు జ్ఞానప్రసాద్ గారు ది. 1-12-2025న ఉదయం 10.30 గం॥ మీరు గాని లేక మీ తరపు లాయర్ ద్వారా గాని, పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయగలరు. అట్లు కాని యెడల మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు షరతులు నిర్ణయించెదరు. కోర్టు ఆదేశాలు మేరకు ఈ ప్రకటన ఇవ్వడమైనది.

ఇట్లు **సుజ్ఞానం అశోక్‌కుమార్**
తమ్మన నాగవెంకట శివసురేష్
D.Hr. తరపు న్యాయవాదులు, బంటుమిల్లి, కృష్ణా జిల్లా. **Cell: 92912 34519.**

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

కారు ఢీకొని మెకానిక్ దుర్మరణం

పూల బ్రహ్మం (పాతచిత్రం)

పెడన, న్యూస్‌టుడే: కారు ఢీకొని బైక్ మెకానిక్ దుర్మరణం చెందిన సంఘటన 216 జాతీయ రహదారిపై మండలంలోని శింగరాయపాలెం సెంటర్‌లో బుధవారం జరిగింది. స్థానిక రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన పూల బ్రహ్మం(50) మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో బైక్‌పై ఇంటికి భోజనానికి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. ఈప్రమాదంలో బ్రహ్మం అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన కారును ఇంజినీరింగ్ విద్యార్థి నడుపుతున్నట్లు సమాచారం. ఈకారులో మరో ఇద్దరు విద్యార్థులు కూడా ఉన్నట్లు పోలీసులు చెప్పారు. మెకానిక్ మృతి చెందడంతో మధ్యాహ్నం నుంచి పట్టణంలో మెకానిక్ షాపులను మూసేసి హర్తాళ్ ప్రకటించారు. మెకానిక్‌ల అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ జానీ, సభ్యులు సంతాపం ప్రకటించారు.

మైక్రోఫిల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన

గూడూరు, న్యూస్‌టుడే: కప్పలదొడ్డి గ్రామంలో ఎంపీ నిధులు రూ.13 లక్షలతో ఏర్పాటు చేయనున్న మైక్రో వాటర్‌ఫిల్టర్ పనులకు సర్పంచి యక్కల మాధవి, ఎంపీటీసీ సభ్యురాలు పేరిశెట్టి తేజోవతి, మాజీ సర్పంచి, తెదేపా సీనియర్ నాయకులు కట్టా మునేశ్వరరావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఐదులక్షల లీటర్ల సామర్థ్యం గల ఫిల్టర్ ఏర్పాటు చేస్తున్నట్లు ఏఈ నాగరాజు తెలిపారు.

(c) eenadu

పెనమలూరు
• పెనమలూరు • గన్నవరం

పంచాయతీ కార్యాలయం ప్రారంభం

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని దావులూరులో నూతనంగా నిర్మించిన పంచాయతీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ఉపాధి హామీ నిధులు రూ.40 లక్షలు, మండల పరిషత్తు నిధులు రూ.19 లక్షలతో రెండంతస్తుల భవనం నిర్మించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014-19లో గ్రామంలో రూ.కోట్లతో సీసీ రహదారులు, డ్రెయిన్లు నిర్మించామని చెప్పారు. అప్పట్లో సచివాలయ నిర్మాణాన్ని ప్రారంభించగా.. ఆ తరువాత దానిని వైకాపా ప్రభుత్వం పూర్తిచేయలేకపోయిందన్నారు. కార్యక్రమంలో సర్పంచి లక్ష్మి, నాయకులు జంపన వెంకటేశ్వరరావు, కొండా ప్రవీణ్, జల్లి కోటేశ్వరరావు, తుమ్మలపల్లి హరికృష్ణ, సంగెపు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పంచారామాలకు ఆర్టీసీ బస్సులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 16, 17వ తేదీల్లో పంచారామాల సందర్శనకు ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు మేనేజరు శివాజీ తెలిపారు. ఉదయం 5గంటలకు డిపో నుంచి బయలుదేరే సర్వీసు అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలోని శైవక్షేత్రాలకు వెళ్లి.. తిరిగి అదేరోజు రాత్రి గన్నవరం చేరుతుందన్నారు. ఒకే గ్రామంలో 35 మంది ఉంటే వారి వద్దకే బస్సు వస్తుందని తెలిపారు. వివరాలకు 8790996090, 7382905653 నంబర్లలో సంప్రదించాలని వెల్లడించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కాలర్: 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

స్పందనకు వందనం

◆ గన్నవరం రాయనగర్ పరిసరాల్లో వ్యర్థాలు పేరుకుపోయాయని స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా.. ఈవో చెన్నకేశవులు స్పందించి.. పంచాయతీ సిబ్బందిని పంపి సమస్య పరిష్కరించారు. ◆ గన్నవరం దళితవాడ శివారులో విద్యుత్తు తీగలు వేలాడుతున్నాయని.. స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా.. ఏఈ రాజు స్పందించి.. సమస్య పరిష్కరించారు. -న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నున్న, న్యూస్‌టుడే: నున్న పోలీసుస్టేషన్ పరిధిలోని పాతపాడు, మీనాక్షినగర్, ఉడతాలిపేట ప్రాంతాల్లో బుధవారం ఈగల్ టీం సభ్యులు, నున్న పోలీసులు డ్రోన్లు ఎగురవేశారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ చేశారు. గంజాయిపై నిరంతర నిఘా ఉందని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

సందడిగా కార్తిక వనసమారాధన

చిన ఓగిరాల (ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే: సమష్టి పూజలు, ఉత్సవాల నిర్వహణతో ప్రజల్లో ఆధ్యాత్మిక భావం పెంపొందడంతో పాటు ఐక్యమత్యం ఏర్పడుతుందని మాజీ ఎమ్మెల్యే వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. చిన ఓగిరాల మారుతినగర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద బుధవారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో వైవీబీ పాల్గొన్నారు. అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి, చిన ఓగిరాల పీఏసీఎస్ అధ్యక్షుడు పాలడుగు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. భక్తులతో ఆలయ పరిసరాలు నిండిపోయాయి.

పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేంద్రప్రసాద్

రూ.కోట్ల పనులు.. నాణ్యతపైనే దిగులు!

కంకిపాడు, న్యూస్‌టుడే: వైకాపా అధికారంలో ఉన్న సమయంలో గ్రామీణ ఉపాధి, ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లించడంతో గ్రామాల్లో అంతర్గత సీసీ రహదారులు, డ్రెయిన్ల పనులు నామమాత్రంగా చేపట్టారు. ఆయా పథకాల లక్ష్యానికి అనుగుణంగా కూటమి ప్రభుత్వం నిధులను నిర్దేశిత పనులకే కేటాయిస్తోంది. గతంలో లేని విధంగా గ్రామాల్లో ఎక్కడ చూసినా పనులు వడివడిగా జరుగుతున్నాయి. పల్లెపండగ పేరుతో మొదటి విడతలో పెనమలూరు నియోజకవర్గంలో సుమారు రూ.75 కోట్ల కేటాయించారు. రెండో విడత అంతకంటే ఎక్కువ నిధులు మంజూరయ్యాయి. దాదాపు 100 పనులకు అనుమతి లభించింది. వీటిలో ఎక్కువగా రోడ్లు, డ్రెయిన్లు ఉన్నాయి. వీటిలో 75శాతం పనులను పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షించాల్సి ఉంది.

శంకుస్థాపన రోజే దర్శనం

ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులను సద్వినియోగం చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉంది. నాణ్యతతో సంబంధం లేకుండా గుత్తేదారులు లాభమే లక్ష్యంగా పనులు చేస్తుంటారు. లోటుపాట్లలేకుండా నాలుగు కాలాల పాటు ప్రజలకు ఉపయోగపడేలా పనులు చేయించే వారు కరవయ్యారని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శంకుస్థాపన రోజునే అధికారులు దర్శనమిస్తుంటారనే అభిప్రాయం ప్రజల్లో ఉంది.

కంకిపాడు: గన్నవరం రోడ్డులో డ్రెయిన్-రహదారి మధ్య పోసిన మట్టి

విజిలెన్స్ తనిఖీలేవీ?

చేపట్టిన పనుల నాణ్యతను వివిధ దశల్లో తనిఖీ చేసి, నిర్ధారించడానికి విజిలెన్స్ విభాగాలున్నాయి. ఎవరైనా రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే గాని వారు రంగంలోకి దిగరు. గుత్తేదారులు, ప్రజాప్రతినిధులు అంతా ఒకే గూటి పక్షులు కావడంతో ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోతోందనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. కంకిపాడు-రొయ్యూరు (వయా గొడవర్రు) జడ్పీ రహదారి అభివృద్ధి పనులను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రెండు పర్యాయాలు స్వయంగా పరిశీలించడం ప్రస్తావనీయం. ఈ పనుల నాణ్యతపై సర్వత్రా సంతృప్తి వ్యక్తమవుతోంది. దీనికి భిన్నంగా పల్లె పండగ మిగత పనులు కొనసాగడంతో ప్రభుత్వానికి చెడు పేరు వస్తుందనే అంతర్మథనంలో చాలామంది కూటమి నాయకులున్నారు.

ప్రభుత్వ సాయంతో ఇళ్లు నిర్మించుకోండి

లబ్ధిదారుకు ఇంటి తాళాలు అందజేస్తున్న విప్ యార్లగడ్డ వెంకట్రావు, నాయకులు రమేష్‌బాబు, కుమారస్వామి

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరికీ సొంతిల్లు ఉండాలన్న లక్ష్యంతో ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0ను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. గన్నవరం చింతలపేట శివారులో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద నిర్మించిన మహమ్మద్ జహీరా నూతన గృహాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా ఓసీ లబ్ధిదారులకు రూ.1.80 లక్షలు, బీసీ, ఎస్సీలకు రూ.2.30 లక్షలు, ఎస్టీలకు రూ.2.75 లక్షలు ప్రభుత్వం ఉచితంగా సాయం అందిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో పథకం కింద 9వేల మంది ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చిగురుపాటి కుమారస్వామి, చలమలశెట్టి రమేష్‌బాబు, చిరుమామిళ్ల సూర్యం, మద్దినేని వెంకటేశ్వరరావు, గూడపాటి తులసీమోహన్, పాలడుగు నాని, కాసరనేని రంగబాబు, మేడేపల్లి రమ పాల్గొన్నారు.

తుపానుతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న శివనాగేంద్రం

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: మొంథా తుపానుతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శివనాగేంద్రం విజ్ఞప్తి చేశారు. బుధవారం మండలంలోని చలివేంద్రపాలెం గ్రామంలో నిర్వహించిన 5వ మహాసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. తేమశాతంతో పనిలేకుండా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. కౌలు రైతులకు 'అన్నదాత సుఖీభవ' వర్తింపజేయాలని కోరారు. అనంతరం సంఘ మండల అధ్యక్షుడిగా వి.శివశంకర్, కార్యదర్శిగా పి.దుర్గారావు, ఉపాధ్యక్షుడిగా కె.రామిరెడ్డి, సహాయ కార్యదర్శిగా సీహెచ్ శ్రీహరి, సభ్యులుగా యు.ఆంజనేయులు, గోవర్ధనరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

14 నుంచి సదరం స్లాట్ బుకింగ్‌లు

పెనమలూరు, న్యూస్‌టుడే: దివ్యాంగుల వైకల్య నిర్ధారణ పరీక్షలకు గాను ఈ నెల 14 నుంచి గ్రామ సచివాలయాల్లో సదరం స్లాట్ బుకింగ్‌లు చేసుకోవాలని పెనమలూరు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపాయి. అనంతరం నిర్దేశించిన ఆసుపత్రుల్లో పరీక్షలు నిర్వహిస్తారని, సంబంధిత వివరాలు వారి ఫోన్లకు సమాచారం వస్తుందని పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యం

ఉయ్యూరు: పేద, మధ్య తరగతి ప్రజలకు సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అడుగులేస్తోందని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తెలిపారు. ఉయ్యూరు పట్టణంలో సొంత స్థలాల్లో ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బుధవారం నూతన వస్త్రాలను బహూకరించారు. అనంతరం చాంద్‌నగర్‌లో ఓ లబ్ధిదారు నిర్మించుకున్న గృహాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళుతోందన్నారు. కార్యక్రమంలో పురపాలక ఛైర్మన్ వల్లభనేని సత్యనారాయణ(నాని), కమిషనరు రామారావు, తెదేపా పట్టణ అధ్యక్షుడు గుర్నాథరావు, తెదేపా క్లస్టర్ కన్వీనర్ కూనపరెడ్డి వాసు, కౌన్సిలర్ తెనాలి పద్మ పాల్గొన్నారు.

ఉయ్యూరులో ఇల్లు నిర్మించుకున్న మహిళకు నూతన వస్త్రాలు బహూకరిస్తున్న ఎమ్మెల్యే బోడే

ఆదమరిస్తే.. అంతే సంగతులు!

కానూరు, న్యూస్‌టుడే: వందడుగుల రోడ్డు నుంచి కానూరు వెళ్లే పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల రోడ్డులో ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. రెండు అడుగుల మేర లోతు ఉండటంతో వాహనదారుల అదుపుతప్పి పడిపోతున్నారు. మరోవైపు రహదారి సైతం అధ్వానంగా ఉంది. ఈ మార్గంలో ఇంజినీరింగ్ కళాశాల, వివిధ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, కానూరు వెళ్లే వారు రాకపోకలు సాగిస్తుంటారు. వీధి దీపాలు కూడ లేవు. రాత్రి సమయాల్లో వాహనదారులు పడిపోతే ప్రాణాలకే ప్రమాదం వచ్చే అవకాశం ఉంది. తక్షణమే అధికారులు సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఖోఖో పోటీల్లో ప్రతిభ

విద్యార్థులతో ప్రిన్సిపల్ కృపావతి

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే: కానుమోలు శ్రీచింతా సీతయ్య జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో సత్తా చాటారు. ఈ నెల 8 నుంచి 10 వరకు విజయనగరంలో నిర్వహించిన అండర్-19 రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో కళాశాలకు చెందిన పి.తిమోతి, బి.మహేష్, డి.రాకేష్, కె.తేజ, డి.శ్రీనివాస్, ఆర్.హర్ష జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. అత్యుత్తమ ఆటతీరుతో జట్టు తృతీయ స్థానంలో నిలిచి, నగదు బహుమతితో పాటు, కాంస్య పతకం దక్కించుకుంది. డి.రాకేష్ జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. బుధవారం కళాశాలలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో కరస్పాండెంట్ చింతా భాస్కరరావు, ప్రిన్సిపల్ కృపావతి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన మడకా ప్రసాద్, మద్దినేని సత్యప్రసాద్‌ను అభినందించారు.

ఆధునిక పరిజ్ఞానంపై పరిశోధనలు అవసరం

సదస్సులో పాల్గొన్న సభ్యులు

కానూరు, న్యూస్‌టుడే: ఆధునిక పరిజ్ఞానంపై సాంకేతిక నిపుణులు పరిశోధనలు చేయాలని జేఎన్‌టీయూహెచ్ ఆచార్యులు విశ్వనాథరాజు అన్నారు. బుధవారం సిద్ధార్థ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఏఐసీటీఈవాణి పథకంలో భాగంగా హ్యాక్‌ప్రూఫ్ ఏఐ, సైబర్ సెక్యూరిటీ ఫర్ ఏఐ సిస్టమ్స్ ఇన్ తెలుగు లాంగ్వేజ్ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. సైబర్ సెక్యూరిటీ, ఏఐ భద్రత, డేటా రక్షణ, నెట్‌వర్క్ సేఫ్టీ తదితర సమాచారాన్ని తెలుగులో అందించినట్లు పేర్కొన్నారు. సదస్సులో ప్రోవైస్‌ఛాన్సలర్ ఏవీ రత్నప్రసాద్, డీన్ డి.వెంకటరావు, ఐటీ విభాగాధిపతి మన్నే సునీత, టీసీఎస్ ప్రతినిధి కె.ప్రతాప్, టి.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ క్రీడాకారుడికి సత్కారం

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి సీనియర్ ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారుడు వర్షంత్ నాయుడును కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజా బుధవారం ఘనంగా సత్కరించారు. మండలంలోని ఈడుపుగల్లు గ్రామానికి వచ్చిన వర్షంత్‌నాయుడును కలిసిన రాజా.. జాతీయ స్థాయిలో రాణించడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ నెల 15న దిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం తరపున వర్షంత్ ప్రాతినిధ్యం వహిస్తాడని శిక్షకుడు ధనియాల నాగరాజు తెలిపారు.

నేటి నుంచి ప్రతిష్ఠా మహోత్సవాలు

నున్న, న్యూస్‌టుడే: నున్న వికాస్ కళాశాల రోడ్డు పోలవరం కాల్వ కట్టపై అభయాంజనేయస్వామి ఆలయంలో నూతన విమాన శిఖర, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలు ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతిష్ఠాపనాచార్యులు జగదీశ్ కుమార్ తెలిపారు.

ప్రకటన

నా క్లయింటు యన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ, పటమట, వై.వెంకటేశ్వరరావు వీధి, డోర్ నెం. 56-4-39/1రు కాపురస్తులు అద్దేపల్లి కళ్యాణ చక్రవర్తి, తండ్రి: హేమసుందరరావు గారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా.. నా క్లయింటు యీ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని హైదరాబాద్ కాపురస్తులు కొడాలి (లేటు) సత్యనారాయణ గారి కుమారుడు కొడాలి వెంకట దుర్గాప్రసాద్ గారి వద్ద నుండి కొనుగోలు చేయబోవుచున్నారు. సదరు కొడాలి వెంకట దుర్గాప్రసాద్ గారికి వారి తల్లిగారైన కొడాలి లలితకుమారి గారు ది. 09-09-2022వ తారీఖున దఖలు దస్తావేజును వ్రాయించుకుని గుణదల సబ్-రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకం, దస్తావేజు నెం. 6737/2022రుగా రిజిష్టరు కాబడి దఖలు దస్తావేజు రీత్యా వారికి సంక్రమించి వారి స్వాధీన సంపూర్ణ సర్వహక్కులతో నిర్వివాదముగా అనుభవించుచున్నారని తెలిపినారు. సదరు ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని నా క్లయింటు కొనుగోలు చేయుటకు విక్రయ ఖరారు పొందియుండి కొంత సొమ్ము అడ్వాన్సుగా చెల్లించి త్వరలో సక్రమమైన విక్రయ దస్తావేజును నా క్లయింటు వారి పేరగాని, వారు కోరిన వారి పేరగాని రిజిష్టరు చేసుకొనబోవుచున్నారు. కావున సదరు విక్రయ ఒప్పందముపై ఎవ్వరికైనా ఎట్టి క్లయిములు, వారసత్వ హక్కులుగాని, ఆక్షేపణలుగాని, అభ్యంతరములు, తగాయిదాలు వగైరా ఏమైననూ వున్నయెడల ఈ ప్రకటన తేదీ నుండి 15 రోజులలోగా నాకు తెలియపరచగలరు. సదరు గడువు తేదీ దాటిన తరువాత నాకు వచ్చు ఎట్టి ఆక్షేపణలుగాని, అభ్యంతరములు గాని నా క్లయింటును బైండ్ చేయజాలవని ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడమైనది.
షెడ్యూలు: యన్.టి.ఆర్. జిల్లా, గుణదల జాయింటు సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, గుణదల, జవహర్ ఆటోనగర్‌లో వున్నటువంటి గుణదల రీ. సర్వే నెం. 494రు దాఖలా బ్లాకు నెం. బి-6, ప్లాటు నెం. 34, డోర్ నెం. 54-8-10, అసెస్‌మెంటు నెం. 277004రు దాఖలా చ.గ. 500లు స్థిరాస్తి పారిశ్రామిక స్థలము అందలి గల ఎ.సి.సి. రేకుల షెడ్డునకు **హద్దులు: తూర్పు:** కార్పొరేషన్ వారి రోడ్డు, **దక్షిణం:** ప్లాటు నెం. 33రు దాఖలా ఆస్తి, **పడమర:** ప్లాటు నెం. 10రు దాఖలా ఆస్తి, **ఉత్తరం:** ప్లాటు నెం.35రు దాఖలా ఆస్తి. యీ నాలుగు హద్దుల మధ్య చ.గ. 500లు లేక చ.మీ. 418.06ర్లు స్థిరాస్తి పారిశ్రామిక స్థలము అందలి గల ఎ.సి.సి. రేకుల షెడ్డు అందలి గల యావత్తు యీజ్‌మెంట్ హక్కులతో సహా.

ఇట్లు **Y. Bala Krishna,** B.Sc., LL.B.
Advocate, Near Patamata Sub Registrar Office, Kalanagar, Benz Circle, Vijayawada-10, Ph: 9347284499
విజయవాడ, తేది: 12-11-2025

గృహోత్సవం..!

రెండు నియోజకవర్గాల్లో 2 వేలు పూర్తి

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం 2024లో అధికారం చేపట్టాక పక్కా గృహాల నిర్మాణాన్ని అత్యంత ప్రాధాన్య అంశాల్లో ఒకటిగా తీసుకుంది. ఇందులో భాగంగా ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం ద్వారా విడతల వారీగా ఇళ్లు మంజూరు చేసింది. వాటిలో చాలా వరకు నిర్మాణాలు పూర్తయ్యాయి. మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. పూర్తయిన వాటికి గృహ ప్రవేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించిన నేపథ్యంలో బుధవారం గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల పరిధిలో 2వేల వరకు ఇళ్లను ప్రారంభించారు.

❖ గత వైకాపా పాలనలో జగనన్న కాలనీల పేరుతో పక్కా ఇళ్ల మంజూరులో భారీగా అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని కూటమి ప్రభుత్వం అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో అధికారంలోకి రాగానే ఈ వ్యవహారంపై దృష్టి సారించి అక్రమాలను గుర్తించడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటివి చోటు చేసుకోకుండా ఉండేందుకు వీలుగా కార్యాచరణ చేపట్టారు. ఓవైపు అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించే ప్రక్రియపై కసరత్తు సాగిస్తూనే, కేంద్రం సాయంతో కొత్త ఇళ్ల మంజూరు వేగవంతం చేసింది.

వివరాలు ఇలా..	
మండలం	పూర్తయిన ఇళ్లు
గన్నవరం	263
బాపులపాడు	251
ఉంగుటూరు	240
పెనమలూరు	214
కంకిపాడు	235
ఉయ్యూరు	111
ఉయ్యూరు అర్బన్	201
తాడిగడప అర్బన్	277

పెరిగిన వేగం

కూటమి ప్రభుత్వ హయాంలో పక్కా ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి వేగం అందుకుంది. నిర్మాణ సామగ్రి, బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా చూడటంతో పాటు ప్రభుత్వం ఇచ్చే మొత్తం సరిపోవడంలేదనే కారణంతో నిర్మాణాలు ఆగిపోకూడదని, ఎస్సీ, బీసీలకు ఒక్కో ఇంటికి రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేల చొప్పున అదనపు ఆర్థిక సాయం అందించారు. దీంతో ఇళ్ల నిర్మాణం జోరందుకుంది. సుదీర్ఘకాలం సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు ఎదురుచూస్తున్న పేదల పక్కా ఇల్లు సాకారమైంది. బుధవారం పలు చోట్ల పండగ వాతావరణంలో వాటిని ప్రారంభించారు.

బాపులపాడులో ఓ లబ్ధిదారు నిర్మించుకున్న ఇల్లు

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యం

జ్యోతి వెలిగిస్తున్న విజిలెన్స్ డీఎస్పీ రాజీవ్‌కుమార్, లక్ష్మణరావు, శశికళ తదితరులు

కానూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా దృష్టి సారించాలని విజిలెన్స్ డీఎస్పీ గోపు రాజీవ్‌కుమార్ అన్నారు. బుధవారం కానూరు కేసీపీ సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పబ్లిక్ పాఠశాలలో స్పోర్ట్స్ ఏథాన్-2025 పేరుతో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో బహుమతులు సాధించడం కన్నా పాల్గొనడమే ముఖ్యమన్నారు. పాఠశాల కన్వీనర్ వీరపనేని శశికళ మాట్లాడుతూ సిద్ధార్థ అకాడమీ స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రెండ్రోజుల పాటు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాతో పాటు ఏలూరు, గుంటూరు జిల్లాల్లోని 25 సీబీఎస్ఈ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, సంయుక్త కార్యదర్శి నిమ్మగడ్డ లలిత్ ప్రసాద్, తాతినేని శ్రీహరిరావు, వీపీఎస్ సిద్ధార్థ ప్రిన్సిపల్ మేడా సీతారామయ్య, ప్రిన్సిపల్ సాయి కృష్ణ, వ్యాయామ అధ్యాపకులు రాఘవేంద్రరావు, కనకరత్నకుమారి పాల్గొన్నారు.

'వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు'

తహసీల్దార్ వెంకటశివయ్యకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వంశీమోహన్ తదితరులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైకాపా ఆధ్వర్యంలో బుధవారం గన్నవరం పట్టణంలో నిరసన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఆధ్వర్యంలో బుద్ధవరం రోడ్డులోని వైకాపా కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. ప్రైవేటీకరణ వద్దు.. ప్రభుత్వపరం ముద్దు అంటూ నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకటశివయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చెన్ను ప్రసన్నకుమారి, అనగాని రవి, వడ్లమూడి సరోజిని, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణం ఆపాలని ఆందోళన

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఉప్పులూరు గ్రామ పరిధి పాతూరులో సెల్‌టవర్ నిర్మాణం ఆపాలంటూ గ్రామస్థులు బుధవారం ఆందోళన చేశారు. టవర్ నిర్మించి తమ ఆరోగ్యాలకు ముప్పు తేవొద్దంటూ గతంలో పలుమార్లు ఆందోళనలు చేసినట్లు వారు పేర్కొన్నారు. అయినప్పటికీ పట్టించుకోవడం ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే బోడే ప్రసాద్ కార్యాలయానికి వెళ్లి.. సమస్యను వివరించి, టవర్ నిర్మాణం ఆపేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

న్యుమోనియా నివారణపై అవగాహన

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే: ప్రపంచ న్యుమోనియా దినం సందర్భంగా బుధవారం బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అయిదేళ్ల చిన్నారుల్లో న్యుమోనియా వ్యాధి లక్షణాలు అధికంగా కనిపిస్తాయని, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి కె.శ్రీనివాస్ సూచించారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో ఇంటింటి సర్వే నిర్వహించనున్నామని తెలిపారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు.

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉంగుటూరు, ఇందుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో న్యుమోనియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను బాలింతలు, అంగన్‌వాడీ పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. తొలుత పీహెచ్‌సీల వద్ద అవగాహన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో వైద్య అధికారిణి శిరీష, డాక్టర్లు విజయ ప్రదీప్, తేజసాయి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాటూరు (ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే: చిన్నారుల్లో జలుబు, దగ్గు ఎక్కువ రోజుల పాటు ఉండటం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, అధిక జ్వరం లాంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు సూచించారు. న్యుమోనియా దినోత్సవం సందర్భంగా కాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనను ఎంపీడీవో ప్రారంభించారు. వైద్యాధికారిణి హిమమహేశ్వరి, పర్యవేక్షకుడు కొలుసు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాపులపాడులో వైద్య సిబ్బంది ప్రదర్శన



కాటూరులో..

తెదేపా కమిటీల ప్రమాణ స్వీకారం నేడు

పెనమలూరు, న్యూస్‌టుడే: తెదేపా పెనమలూరు నియోజకవర్గ నూతన కమిటీల ప్రమాణ స్వీకారం గురువారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోరంకి లోని నియోజకవర్గ తెదేపా కార్యాలయంలో సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. ఆయా కమిటీల సభ్యులంతా పసుపు దుస్తులు ధరించి ప్రమాణ స్వీకారానికి రావాలని సూచించారు.

అక్రమ లేఅవుట్ ధ్వంసం

పెనమలూరు: చోడవరంలో అక్రమలేవుట్‌ను సీఆర్‌డీఏ అధికారులు బుధవారం ధ్వంసం చేశారు. కరకట్ట దిగువన దాదాపు 3 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఈ లేవుట్‌పై సీఆర్‌డీఏ అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. స్పందించిన అధికారులు యంత్రాలతో ఆయా రహదారులను ధ్వంసం చేశారు. అనధికార లేవుట్లలో స్థలాలుకొని మోసపోవద్దని, వాటిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సీఆర్‌డీఏ అధికారిణి భవానీ తెలిపారు.

బందరు కాలువలో పడి వ్యక్తి మృతి

పెనమలూరు, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు బందరు కాలువలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు జిల్లా నూతక్కికి చెందిన చల్లపల్లి సుధాకర్(55) రైసు మిల్లుల్లో వెల్డింగ్ పనులు చేస్తుంటాడు. అనారోగ్యంతో బాధపడుతున్న అతడు.. పెనమలూరు పీహెచ్‌సీలో చికిత్స చేయించుకుంటున్నాడు. ఈ నెల 12న తాడిగడపలోని బంధువుకు ఫోన్‌చేసి విజయవాడ బస్టాండ్ నుంచి పెనమలూరు పీహెచ్‌సీ వరకు ఆటో బుక్ చేయించుకున్నాడు. మార్గం మధ్యలో పెనమలూరు వంతెన వద్ద దిగి.. కాలకృత్యాలు తీర్చుకునేందుకు బందరు కాలువ వద్దకు వెళ్లి.. ప్రమాదవశాత్తు జారిపడిపోయి గల్లంతయ్యాడు. సుధాకర్ మృతదేహాన్ని పెనమలూరు పోలీసులు గంగూరు సమీపంలో గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీనిపై అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

నిత్యాన్నదాన పథకానికి వితరణ

మోపిదేవి, న్యూస్‌టుడే: మచిలీపట్నం వాస్తవ్యులు ఉప్పాల రమారం మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయ నిత్యాన్నదాన పథకానికి అవసరమైన 500 స్టీలు భోజనం పళ్లాలను బుధవారం వితరణగా అందించారు. దాతకు స్వామి దర్శనం కల్పించి సత్కరించారు.

ఉచిత వైద్య పరీక్షలు

ఘంటసాల, న్యూస్‌టుడే: మంటసాల విశ్వేశ్వరస్వామి కల్యాణ మండపంలో మచిలీపట్నం దివ్య శంకర్ చిల్డ్రన్, మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యులు బి.ఆశాజ్యోతి, పి.రంగనాథ్, కె.మురళీకృష్ణ, సీహెచ్.రోజా, ఎస్.రామకృష్ణ రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శ్రీకాకుళం డీసీ ఛైర్మన్ ఆయనపూడి బాలప్రకాష్ ప్రారంభించారు.

మంత్రి లోకేశ్ దృష్టికి కోడూరు మండల సమస్యలు

మంత్రి లోకేశ్‌తో బండే

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: కోడూరు మండల తెదేపా అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు బుధవారం రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను మంగళగిరి తెదేపా కార్యాలయంలో కలిసి మండలంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. పాలకాయతిప్ప అవుట్‌ఫాల్ స్లూయిస్ రక్షణ గేట్ల నిర్మాణం, 22ఏ భూముల సమస్య గురించి మంత్రికి వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు బండే చెప్పారు.

ఎన్నికలు పూర్తి చేయాలి

గుడివాడలో ఎన్జీవోల సంఘ జిల్లా నేతలు

గుడివాడ, న్యూస్‌టుడే: ఏపీ ఎన్జీవోల సంఘ నేతలు సత్వర నమోదులను పూర్తి చేసి ఈనెల 31వ తేదీలోగా జిల్లాలోని అన్ని యూనిట్లకు ఎన్నికలను పూర్తి చేయాలని ఏపీ ఎన్జీవోల సంఘం తూర్పు కృష్ణా అధ్యక్ష కార్యదర్శులు ఆకూరి శ్రీనివాసరావు, ఏ.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ఏపీ ఎన్జీవోల భవనం వద్దకు బుధవారం వచ్చారు. ఈసందర్భంగా గుడివాడ అర్బన్, మండలాల పరిధిలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు షేక్ ఫరీద్ భాషా, ఉపాధ్యక్షుడు రామ్మోహనరావు, గుడివాడ సంఘ అధ్యక్షుడు కేపీ రావు, జి.రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వసతి వెత... విద్యార్థుల వ్యథ!

గుడివాడ (సత్యనారాయణపురం), న్యూస్‌టుడే

అసంపూర్తిగా అదనపు తరగతి భవన నిర్మాణం

ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చుటకని గత ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నాయి. అధికారుల అలసత్వమో... గుత్తేదారుడి నిర్లక్ష్యమో తెలియదు కానీ, పాఠశాల అదనపు తరగతుల భవన నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయి అటు విద్యార్థులను, ఇటు ఉపాధ్యాయులను ఇక్కట్ల పాల్జేస్తోంది. భవనానికి కేటాయించిన నిధులు మొత్తం చెల్లింపులు జరిపినా నిర్మాణం మాత్రం అసంపూర్తిగా మిగిలిపోయింది. గుడివాడ పట్టణం గౌరీశంకరపురంలోని ప్రాథమిక పాఠశాల (పార్కు స్కూల్) ఏళ్ల తరపడి విద్యార్థులకు విద్యా సేవలు అందిస్తోంది. ఒకటో తరగతి నుంచి ఐదవ తరగతి వరకు ఇక్కడ విద్యా సేవలు అందుతాయి. ప్రస్తుతానికి 140 మంది విద్యార్థులు మాత్రమే విద్యనభ్యసిస్తున్నారు. అయితే తరగతి గదులు సరిపోక ఇబ్బంది పడుతున్నారు. పర్యవసానంగా 2023లో నాడు-నేడు పథకం కింద ఇక్కడ అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.42లక్షలు నిధులు మంజూరయ్యాయి. దీంతో గత వైకాపా పాలనలో ముఖ్య నాయకుడి అనుచరుడయిన కొండారు (?) అదనపు తరగతి భవన నిర్మాణం ప్రారంభించారు. రెండు సంవత్సరాలు ముగిసినప్పటికీ శ్లాబ్ దశలోనే భవన నిర్మాణం మిగిలిపోయింది. దీంతో శ్లాబ్ పిల్లర్లకు నాచుపట్టి మెల్లగా శిథిలావస్థకు చేరుకుంటోంది. అధికారులు గుత్తేదారుపై ఒత్తిడి తీసుకువస్తే ఈ పాటికి భవన నిర్మాణం పూర్తయ్యేది. ఇదే విషయంపై ఎంఈఓ సీహెచ్.రజనిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం మూడు విడతలుగా నిధులు మంజూరు అయ్యాయని, ఆ మేరకే భవన నిర్మాణ పనులు జరిగాయని తెలిపారు.

ఆధార్ సేవల్లో అంతరాయం కలగదు

ఆధార్ ఎంట్రీలను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

చల్లపల్లి, న్యూస్‌టుడే: ఆధార్ సేవల్లో సర్వర్ సమస్యలు తలెత్తకుండా వేగవంతంగా అందిస్తామని మచిలీపట్నం డివిజన్ పోస్టల్ జోన్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. చల్లపల్లిలోని పోస్టాఫీసును బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఆధార్ ఎంట్రీలను దగ్గరుండి పరిశీలించారు. ఆధార్ సేవలు అందించడంలో సర్వర్ సమస్యలు తలెత్తుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. గ్రూప్ యాక్సిడెంటల్ గార్డ్ పాలసీ(జీఏజీ) పోస్టాఫీసులో మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉందన్నారు. రూ. 799లు కట్టి ఈ పాలసీని తీసుకోవచ్చునని, ప్రమాదంలో మరణిస్తే రూ. 15లక్షలు అందుతుందని తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.

14న బాలలకు అందాల, ఆరోగ్య పోటీలు

గుడ్లవల్లేరు: స్థానిక లయన్స్ సేవాభవన్‌లో శుక్రవారం మధ్యాహ్నం 2 నుంచి 4 వరకూ 1నుంచి 5 ఏళ్ల బాలబాలికలకు అందాల, ఆరోగ్య పోటీలను నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్లు లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వైపీసీ ప్రసాద్ వెల్లడించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

జీవ నియంత్రణ పద్ధతులతో చీడపీడలు దూరం

మాట్లాడుతున్న కేవీకే సమన్వయకర్త సుధారాణి

ఘంటసాల, న్యూస్‌టుడే: వ్యవసాయంలో జీవ నియంత్రణ పద్ధతులను అనుసరించడం ద్వారా చీడపీడలు దూరం అవుతాయని కేవీకే సమన్వయకర్త డి.సుధారాణి అన్నారు. బుధవారం ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం, జాతీయ సహకార అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ ఇచ్చారు. ఆప్కాబ్ ఎండీ సురేష్‌కుమార్, సహకార సంస్థ రీజనల్ డైరెక్టర్ ఎస్.గోస్వామి, శాస్త్రవేత్తలు కె.రేవతి, ఎం.వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గాంధేయతత్వ శిబిరంలో అవనిగడ్డ విద్యార్థి

వెంకట్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

అవనిగడ్డ: మహారాష్ట్ర లోని జలగావ్ నగరంలో గాంధీ రీసెర్చ్ ఫౌండేషన్ వారు ఏర్పాటు చేసిన జాతీయ గాంధేయతత్వ -నాయకత్వ శిబిరంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి రాయన వెంకట్ పాల్గొన్నాడని ప్రిన్సిపల్ ఉమారాణి చెప్పారు. గాంధీజీ భావాలను, నాయకత్వ లక్షణాలను భావితరాలకు అందించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో పాల్గొనడం గర్వకారణమని చెప్పారు. జలగావ్ నుంచి తిరిగి వచ్చిన వెంకట్‌ను ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

పేదల ఇంటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

లబ్ధిదారు నాగతారకు ఇంటి నమూనా తాళం అందిస్తున్న కూటమి నేతలు

గుడివాడ, న్యూస్‌టుడే: పేదల సొంత ఇంటి కలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని జనసేన బాధ్యుడు బూరగడ్డ శ్రీకాంత్, వాసే మురళీ పేర్కొన్నారు. తటివర్రు గ్రామంలో లబ్ధిదారులకు ఇంటి పత్రాలను బుధవారం అందజేశారు. ఎంపీడీవో బీ.వై.విష్ణు ప్రసాద్, సర్పంచ్ గంజి నిర్మలకుమారి, తెదేపా నేతలు చేకూరు జగన్ మోహన్ రావు, నిమ్మగడ్డ సత్యసాయి, ఇంటూరి గజేంద్ర, గ్రామ నేతలు పాల్గొన్నారు.

పులిగడ్డలో..

పులిగడ్డ (అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: పులిగడ్డలో పీఎంఏవై కింద నిర్మించిన చెన్ను గణేష్‌కుమార్ గృహాన్ని అధికారులతో కలిసి మండలి వెంకట్రామ్ బుధవారం ప్రారంభించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 1236 గృహాలను పూర్తి చేసినట్లు హౌసింగ్ ఏఈ కార్తికేయ చెప్పారు. ఎంపీడీవో మరియాదేవి, ఈవో అనిత, ఉప ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, మండలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నిరుపేదలందరికీ గృహవసతి

గృహ యజమాని జ్యోతితో కలిసి రిబ్బన్ కత్తిరిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు: రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలందరికీ కూటమి ప్రభుత్వం గృహ వసతి కల్పిస్తుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. బుధవారం స్థానిక ఇందిరానగర్‌లో ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం లబ్ధిదారు ఈసాని జ్యోతి నూతన గృహప్రవేశ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. లబ్ధిదారు జ్యోతితో కలిసి రిబ్బన్ కత్తిరించి గృహాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ గణేష్, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ విజిలెన్స్ వారోత్సవాలు

విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

చల్లపల్లి, న్యూస్‌టుడే: యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో చల్లపల్లి జడ్పీ హైస్కూల్‌లో బుధవారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాల నేపథ్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిజ్ఞ చేయించారు. హెచ్‌ఎం ఎం.రాజా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మచిలీపట్నం రీజనల్ ఆఫీస్ హెడ్ కె.వెంకట్రావు, రీజనల్ విజిలెన్స్ ఆఫీసర్ కె.వెంకటరాజు, చల్లపల్లి బ్యాంక్ మేనేజర్ వెంకట్ పాల్గొన్నారు.

కార్తిక దీపకాంతుల్లో అయ్యప్పస్వామి దేవాలయం

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: స్థానిక నరసింహపురం రహదారిలోని అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం సహస్ర దీపాలు వెలిగించడంతో కార్తిక శోభ వెల్లివిరిసింది. అయ్యప్ప దీక్షాధారులు, భక్తులు ఆలయంలో దీపాలు వెలిగించి, స్వామి వారికి పూజలు చేశారు.

ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

సహస్రదీపాల వెలుగులు

శ్రద్ధాంజలి

జననం 10-08-1960

మరణం 03-11-2025

కీ॥శే॥ మేకా వెంకటేశ్వరరావు గారు

ప్రొ॥ శ్రీ వినాయక ఎంటర్‌ప్రైజెస్, PACS మాజీ డైరెక్టర్

శివరామపురం, మోపిదేవి మండలం

మా అందరికీ ఆత్మీయ అనురాగాలను పంచి, మా అభివృద్ధికి అహర్నిశలు శ్రమించి, మాకు ఆదర్శమూర్తిగా నిలిచిన మీరు మా నుండి భౌతికంగా దూరమవడం మాకు తీరని లోటు.. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ.. శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

భార్య: మేకా వెంకట రమణ

కుమారుడు: మేకా దినేష్ కోడలు: ప్రశాంతి

మనుమలు: మేకా లుకేష్, మేకా విశ్వాస్

పెద్దకర్మ: ది. 13-11-2025, గురువారం, మోపిదేవి మండలం, శివరామపురం గ్రామములోని మా స్వగృహము నందు జరుగును.

కొవ్వొత్తులతో ప్రదర్శన

నందివాడ(గుడ్లవల్లేరు): దిల్లీలో బాంబు పేలుళ్లకు నిరసనగా, మృతులకు నివాళిగా నందివాడ మండలం చేదుర్తిపాడులో భాజపా శ్రేణులు, గ్రామస్థులు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు.

దిల్లీలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన 11 మందికి కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న అవనిగడ్డ కూటమి నాయకులు - అవనిగడ్డ, న్యూస్‌టుడే

చలసాని సరోజినికి నివాళి

పెదపారుపూడి, న్యూస్‌టుడే: మండల తెదేపా అధ్యక్షుడు చలసాని రమేష్‌చౌదరి తల్లి చలసాని సరోజిని ఇటీవల అనారోగ్యంతో చనిపోగా బుధవారం స్వగ్రామమైన వెంట్రప్రగడలో ఆమె పెద్దకర్మ జరిగింది. ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పాల్గొని ఆమె చిత్రపటం వద్ద నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి, విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

ఒకేషనల్ విద్యార్థులకు శిక్షణ

మొవ్వ(కూచిపూడి), న్యూస్‌టుడే: మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒకేషనల్ విద్యార్థులకు బుధవారం ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంటర్ విద్య జిల్లా అధికారి ఎస్.సరళకుమారి పర్యవేక్షణలో శిక్షణ తరగతులు నిర్వహించారు. అకౌంటింగ్, టాక్సేషన్ విద్యార్థులకు పీఏసీఎస్, ఎంపీడీవో కార్యాలయాల్లో, ఆఫీస్ అసిస్టెంట్‌షిప్, ఓఏఎస్ వారికి సబ్‌ట్రెజరీ, ఐసీడీఎస్ కార్యాలయాల్లో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ ఉద్యోగ నైపుణ్యతకు ఉపయోగపడుతుందని ప్రిన్సిపల్ డి.సత్యనారాయణ తెలిపారు.

చట్టప్రకారమే పిల్లలను దత్తత తీసుకోండి

పెదపారుపూడి: పిల్లలను చట్ట ప్రకారం దత్తత తీసుకుంటే ఎలాంటి అడ్డంకులు ఉండవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.శివనాగమణి అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ పెద దళితవాడ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలను దత్తత తీసుకునే విషయంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టవిరుద్ధంగా పిల్లలను పెంచుకుంటే నేరమన్నారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు.

పామర్రు, న్యూస్‌టుడే: పిల్లల దత్తత ప్రక్రియలో జాగ్రత్తలు పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి సూచించారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో వేరే వారి పిల్లల్ని దత్తత తీసుకునే విషయంలో పాటించాల్సిన నియమాలను వివరించారు. ప్రభుత్వ నియమాల ప్రకారమే దత్తత తీసుకోవాలన్నారు.

పామర్రు గ్రామీణం: అడ్డాడ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల దత్తతపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.విజయకుమారి పాల్గొని పలు సూచనలు చేశారు. అనంతరం ప్రదర్శన నిర్వహించారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616

ఆయిల్‌పామ్ పంట సాగుతో ప్రయోజనాలు

పులిగడ్డ (అవనిగడ్డ గ్రామీణం): ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు దీర్ఘకాల ప్రయోజనాలు చేకూరుతాయని అవనిగడ్డ సబ్‌డివిజన్ ఉద్యానశాఖాధికారి ఎన్.రమేష్ చెప్పారు. రైతులకు జిల్లా ఉద్యానశాఖ, ఉండవల్లి ఆగ్రోస్ ఎల్.ఎల్.పి సంయుక్త అధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఉద్యానశాఖ మండల సహాయకురాలు శ్రీజ, ఉండవల్లి అగ్రోస్ డీజీఎం హరికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

జాతీయ ఖోఖో పోటీలకు క్రీడాకారులు

గుడివాడ, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు ఈనెల 8, 9, 10 తేదీలలో విజయనగరంలో జరగ్గా అండర్ 19 పోటీలలో గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చి కాంస్య పతకం సాధించారని స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక స్టేడియంలో ఖోఖో విజేతలు డి.రాజేష్, ఎం.లక్ష్మీధర్‌లను బుధవారం అభినందించారు. వీరు జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనడానికి అర్హత సాధించారన్నారు.

కౌశల్ పోటీలకు ఎంపిక

నందివాడ(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: నందివాడ మండలం పోలుకొండ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయి కౌశల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం జి.మణి వెల్లడించారు. పోస్టర్ ప్రెజంటేషన్‌లో వి.ఆమని, కె.నిఖితలు, క్విజ్ పోటీలో సీహెచ్.విజయ్‌బాబు ఎంపికయ్యారు. వీరికి శిక్షణ ఇచ్చిన సైన్స్ ఉపాధ్యాయులు కూరెళ్ల శ్యాంప్రసాద్, వల్లూరి భాగ్యకుమారి, సీఆర్పీ రాధికలను అభినందించారు.

మొవ్వ (కూచిపూడి): రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌కు మొవ్వ జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయిని ఉమాశ్రీ తెలిపారు. డి.శామ్యూల్, ఎం.సాంబశివరావు, జాహ్నవి, స్వీటీ, చందు, ప్రకాష్, సమంతశ్రీ, 14 సంవత్సరాల లోపు విభాగంలో బేస్‌బాల్‌కు నవదీప్, కబడ్డీకి బి.బాలహర్షవర్ధన్, నందేటి సంకీర్తన ఎంపికయ్యారని వెల్లడించారు. వ్యాయామ ఉపాధ్యాయులుగా మనోహరి, క్రాంతి, వినీల్, దానారావు వ్యవహరించారు.

గుడ్లవల్లేరులో ఆక్రమణల తొలగింపు

గుడ్లవల్లేరు: మండల కేంద్రమైన గుడ్లవల్లేరులో ఆక్రమణల తొలగింపునకు బుధవారం పంచాయతీ శ్రీకారం చుట్టింది. తొలుత రహదారులపైకి వచ్చిన దుకాణాల, ఇళ్ల ర్యాంపులను పగులగొట్టే కార్యక్రమం చేపట్టారు. బస్టాండ్ సెంటర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి కుడి వైపుగా ఎంఎన్‌కే రహదారిలో దుకాణాల వద్ద రహదారిపైకి వచ్చిన ర్యాంప్‌లను పగులగొట్టారు.

దుకాణం ఎదుట ర్యాంప్ పగులగొడుతున్న పంచాయతీ సిబ్బంది

నెయ్యల సంఘీయుల వనసమారాధన

గుడ్లవల్లేరు: మండలంలోని కౌతవరం 1వ వార్డులో బుధవారం నెయ్యల సంఘీయులు వనసమారాధన జరుపుకొన్నారు. స్థానిక కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘీయులతో పాటు ఎస్.ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొని సహపంక్తి భోజనాలు చేశారు.

పశుసంపద వృద్ధి చేద్దాం

రైతులకు మిక్చర్ అందజేస్తున్న వైద్యాధికారులు

కాజ(కూచిపూడి): సన్న, చిన్నకారు రైతులకు ఆర్థికంగా తోడ్పడేది పశుసంపదేనని, దానిని అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని పశు పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టరు డాక్టర్ నాగభూషణం సూచించారు. ఆ శాఖ ఆధ్వర్యంలో బుధవారం కాజలో ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 18 ఆవులు, 68 గేదెలకు చూడి నిల్వడానికి, గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించారు. నట్టల నివారణకు ఉచితంగా మందులు ఇచ్చారు. దూడల అందాల పోటీలు నిర్వహించి. పాల్గొన్న రైతులందరకూ పాలక్యాన్లు, మినరల్ మిక్చర్ అందించారు. ఏడీ వై.హరిత, పశువైద్య నిపుణులు మౌర్య, హరీష్, విజయ్, వెంకటరావు, సిబ్బంది, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

సేవా కేంద్రాలు రైతు నేస్తాలుగా పనిచేయాలి

పెదపారుపూడి, న్యూస్‌టుడే: రైతుసేవా కేంద్రాలు అన్నదాతలకు నేస్తాలుగా పనిచేయాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా సూచించారు. పెదపారుపూడిలోని రైతుసేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. రైస్ మిల్లర్లు, రైతుల మధ్య ధాన్యం తేమశాతంలో తేడా వస్తే కస్టోడియన్ ఆఫీసర్లు బాధ్యత తీసుకుని ఆర్.ఎస్.కె.లో వచ్చిన తేమ శాతాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు పారదర్శకంగా జరగాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌడ సంక్షేమ, అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

తగిన చికిత్సతో న్యుమోనియా నియంత్రణ

తోట్లవల్లూరు: ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: ప్రపంచ న్యుమోనియా దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఫిబ్రవరి 28 వరకూ ఆశా కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి రక్తహీనతతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి ఆస్పత్రికి పంపితే పరీక్షలు చేసి చికిత్స అందిస్తామని వైద్యులు ప్రవీణ వెల్లడించారు. సూపర్‌వైజర్ టి.వెంకటాద్రి పాల్గొన్నారు.

పమిడిముక్కల, న్యూస్‌టుడే: న్యుమోనియా ఊపిరితిత్తుల్లో వచ్చే ఇన్‌ఫెక్షన్ మాత్రమేనని, సకాలంలో తగిన వైద్య చికిత్సతో నయమవుతుందని వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి అఖిల తెలిపారు. బుధవారం ఆసుపత్రిలో ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబరు 12న న్యుమోనియా దినోత్సవంగా జరుపుతామని వెల్లడించారు. ఈ సందర్భంగా పిల్లలకు ముందు జాగ్రత్తగా ఇవ్వాల్సిన ఆహారం, టీకాలు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను వివరించారు. వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : న్యుమోనియాపై పిల్లల తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టరు సాయిప్రసన్న పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ న్యుమోనియా దినోత్సవం పురస్కరించుకుని తోట్లవల్లూరు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

గుడివాడ, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద వైకాపా ఆధ్వర్యంలో బుధవారం ప్రదర్శన చేశారు. అనంతరం ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యంకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో వైకాపా పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, నాయకులు మండలి హనుమంతరావు, ఎం.వి.నారాయణ రెడ్డి, పెయ్యల ఆదాం, పాలేటి చంటి, మట్టా జాన్ విక్టర్, చుండూరి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ: స్థానిక ప్రధాన రహదారి వెంట మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ ఆధ్వర్యంలో వైకాపా నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ నాగమల్లేశ్వరరావుకు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు సింహాద్రి వికాస్, తదితరులు పాల్గొన్నారు.

పామర్రు, న్యూస్‌టుడే: ప్రైవేటీకరణను వెంటనే నిలిపేయాలని మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ డిమాండ్‌చేశారు. బుధవారం ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ గోపాలరావుకు వినతి పత్రం సమర్పించారు.

శ్రద్ధాంజలి

జననం 08-07-1942

మరణం 03-11-2025

కీ॥శే॥ డా॥ చిరుమామిళ్ల మాధవసాయి గారు

MBBS., M.S

Ophthalmologist, గుంటూరు

ది. 03-11-2025 సోమవారం స్వర్గస్తులైనారని తెలియజేయుటకు చింతిస్తున్నాము.

పెద్దకర్మ: ది: 15-11-2025 శనివారం కృష్ణా జిల్లా, చల్లపల్లి మండలం పాగోలు గ్రామములోని మా స్వగృహము నందు జరుపబడును. కావున తెలియచేయడమైనది.

ఇట్లు

కుటుంబ సభ్యులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దేవదాయ ధర్మదాయ శాఖ

శ్రీ నాగేశ్వర స్వామి వారి దేవస్థానము, మోటూరు, గుడివాడ మండలం, కృష్ణా జిల్లా

చేపల చెరువు చేపల పెంపకం లైసెన్సు నిమిత్తం టెండర్ (కం) బహిరంగ వేలం పాట ప్రకటన

కృష్ణా జిల్లా, గుడివాడ మండలం, మోటూరు గ్రామములో వేంచేసియున్న శ్రీ నాగేశ్వర స్వామి వారి దేవస్థానములకు చెందిన గుడివాడ రెవెన్యూ మోటూరు గ్రామంలో ఈ క్రింది పేర్కొన్న ప్రకారం చేపల చెరువు & చేపల పెంపకం లైసెన్స్‌నకు 3 సంవత్సరముల కాలపరిమితికి ప్రభుత్వ జి.ఓ.ఎమ్.ఎస్.నెం. 426 రెవెన్యూ (దేవదాయ - ధర్మదాయ శాఖ-1) డిపార్ట్‌మెంట్ తేది: 09-11-2015 ప్రకారం ఈ దిగువ షెడ్యూలు దాఖలా లైసెన్స్ టెండర్ (కం) బహిరంగ వేలము పాట నిర్వహించబడుచున్నది.

షెడ్యూలు వివరములు

వ.నెం.	భూములున్న గ్రామము	భూస్థితి	రీ.సర్వే	విస్తీర్ణం యు.సెం.	ధరావత్తు రూ.	కౌలు కాల పరిమితి	బహిరంగ వేలం జరుగు ప్రదేశము, సమయం, తేది
1	మోటూరు గుడివాడ రెవెన్యూ	చెరువు	146 561/1	2.13 0.22	25,000/- (శ్రీ నాగేశ్వరస్వామి వారి దేవస్థానం)	2025-26 నుండి 2027-28 3 సం.ల కాల పరిమితి	ది. 24-11-2025 అనగా సోమవారం ఉదయం 11-00లకు శ్రీ నాగేశ్వరస్వామి వారి దేవస్థానం మోటూరు వద్ద
		మొత్తం భూమి		2.35			

షరతులు: 1) ఈ బహిరంగ వేలంపాట హిందూ దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల మంజూరు ఉత్తర్వులు లోబడి ఆలయ కార్యనిర్వహణాధికారిచే జరుపబడును. 2) ఈ వేలం పాటలో పాల్గొనుటకు దేవస్థానమునకు బకాయి ఉన్నవారు గాని లేదా లావాదేవీలు ఉన్నవారు గాని పాటలో పాల్గొనరాదు. 3) పాటలో పాల్గొనువారు తమ స్థితిగతులను తెలుపుతూ సాల్వెన్సీ సర్టిఫికెట్, దస్తావేజులు లేదా పట్టాదారు పాసుబుక్ టైటిల్ డీడ్‌తో సహా హామీగా ఇచ్చి షెడ్యూల్ ప్రకారం ధరావతు చెల్లించి పాటలో పాల్గొనవలెను. 4) చేపల చెరువునకు జి.ఓ.ఎమ్.ఎస్.నెం. 426 రెవెన్యూ (దేవదాయ - ధర్మదాయ శాఖ) డిపార్ట్‌మెంట్ తేది. 09-11-2015 ప్రకారం హెచ్చుపాటదారుడు ప్రతి సం. ఎకరమునకు 1కి మొదటి సం. లీజుపై 2 సం.నకు 10% పెంపుదల నిర్ణయం 3 సం.నకు 2 సం.నకు లీజుపై 10% పెంపుదల నిర్ణయం. 5) మిగతా పాట షరతులు ఇతర విషయములు పాటకాలమందు తెలియచేయబడును.

మోటూరు,
ది: 12-11-2025

గోరిపర్తి నాగమౌనిక
కార్యనిర్వహణాధికారి, సెల్: 73377 46699

(c) eenadu

చదువు

బీఈ రెగ్యులర్‌గా చేశాను. ఆంధ్రా యూనివర్సిటీ నుంచి దూరవిద్యలో రెండేళ్ల ఆన్‌లైన్ ఎంఏ (ఎకనామిక్స్)లో చేరాను. ఈ కోర్సుతో పీహెచ్‌డీకీ, ఇండియన్ ఎకనామిక్స్ సర్వీస్(ఐఈఎస్) పరీక్షలకూ అవకాశం ఉంటుందా? – ఆకాంక్ష

ఐఈఎస్‌కు అవకాశం ఉందా?

■ ఇంజనీరింగ్ రెగ్యులర్ విధానంలో పూర్తిచేసి, రెండేళ్ల ఎంఏ (ఎకనామిక్స్) ప్రోగ్రాంను ఆన్ లైన్‌లో చదువుతున్నానని చెప్పారు. జాతీయ విద్యా విధానం 2020 ప్రకారం.. ఆఫ్‌లైన్ డిగ్రీలు, ఆన్‌లైన్ డిగ్రీలు, ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీలు, దూరవిద్య డిగ్రీలకు సమాన గుర్తింపు ఉంటుంది. యూజీసీ వివిధ సందర్భాల్లో విడుదల చేసిన రెగ్యులేషన్స్ ప్రకారం.. ఒక అకడమిక్ ప్రోగ్రాం మధ్యలో, ఓపెన్ నుంచి రెగ్యులర్‌కు, రెగ్యులర్ నుంచి ఆన్‌లైన్‌కు కూడా అకడమిక్ క్రెడిట్లను బదిలీ చేసుకొని డిగ్రీ/పీజీ పూర్తి చేయొచ్చు. కానీ, జాగ్రత్తగా గమనించాల్సింది ఏంటంటే.. ప్రస్తుతం మీరు చదువుతున్న యూనివర్సిటీకి ఆన్‌లైన్‌లో అకడమిక్ ప్రోగ్రామ్స్ నిర్వహించడానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో (యూజీసీ డెబ్) అనుమతి ఉందా, లేదా అనే విషయం నిర్ధారణ చేసుకోండి. ఒకవేళ, అనుమతి ఉంటే, అనుమతించిన ప్రోగ్రామ్స్ జాబితాలో ఎంఏ ఎకనామిక్స్ ఉందో, లేదో తెలుసుకోండి. ఏదైనా యూనివర్సిటీకి ఆన్‌లైన్ లేదా డిస్టెన్స్ మోడ్‌లో కోర్సులు నడపడానికి అనుమతి లేకపోతే ఆ యూనివర్సిటీ అందించే ఆన్‌లైన్ డిగ్రీలు చెల్లుబాటు కావు. ఏదైనా యూనివర్సిటీ ఆన్‌లైన్ విధానంలో అకడమిక్ ప్రోగ్రాంను అందించాలంటే, ఆ యూనివర్సిటీకి కనీసం 3.26 న్యాక్ గ్రేడ్ ఉండాలి. యూజీసీ డెబ్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి, ఆంధ్రా యూనివర్సిటీకి మీరు చేస్తున్న పీజీని నిర్వహించడానికి అన్ని అనుమతులు ఉన్న విషయాన్ని నిర్ధారించుకోండి. వెబ్‌సైట్‌లో ఉన్న సమాచారం మేరకు, మీరు చేస్తున్న డిగ్రీకి యూజీసీ డెబ్ గుర్తింపు ఉంది. కాబట్టి, మీరు నిరభ్యంతరంగా ఇండియన్ ఎకనామిక్ సర్వీస్, పీహెచ్‌డీలకు సన్నద్ధం కావొచ్చు.

–ప్రొ.బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఇంటర్న్‌షిప్స్

హైదరాబాద్‌లో..

మెర్న్ స్టాక్ డెవలప్‌మెంట్
సంస్థ: జీగ్లర్ ఏరోస్పేస్
నైపుణ్యాలు: అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్), సీఐ/సీడీ, సీఎస్ఎస్ 3, ఇంగ్లిష్ మాట్లాడటం, ఎక్స్‌ప్రెస్.జేఎస్, హెచ్‌టీఎంఎల్ 5, జావాస్క్రిప్ట్, మెర్న్, మాంగోడీబీ, నోడ్.జేఎస్, రియాక్ట్, టైప్‌స్క్రిప్ట్, వెబ్‌సాకెట్స్
స్టైపెండ్: రూ.5,000
☛ https://shorturl.at/2Nm8G

హ్యూమన్ రిసోర్సెస్
సంస్థ: ఆస్మియం ఎనర్జీ ప్రై.లి.
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం స్టైపెండ్: రూ.10,000-20,000
☛ https://shorturl.at/dct0N

ఏఐ ఏజెంట్ డెవలప్‌మెంట్
సంస్థ: ఆటంప్రిక్స్ టెక్నాలజీస్ ప్రై.లి.
నైపుణ్యాలు: డేటా స్ట్రక్చర్స్, ఫాస్ట్‌ఏపీఐ, జనరేటివ్ ఏఐ టూల్స్, గిట్, గిట్‌హబ్, పోస్ట్‌గ్రేఎస్‌క్యూఎల్, ప్రాబ్లమ్ సాల్వింగ్, ప్రాంప్ట్.
స్టైపెండ్: రూ.12,000-15,000
☛ https://shorturl.at/wYvw6

వీటికి దరఖాస్తు గడువు: డిసెంబరు 5

సమగ్ర కథనాలు, మరిన్ని ఇంటర్న్‌షిప్పులు, ఉద్యోగ నోటిఫికేషన్లు https://epaper.eenadu.net లో.

గీత దాటితే.. వేతలు తప్పవు

ఆకర్షణీయమైన జీతం, అంతర్జాతీయ అవకాశాలు, ఆధునిక జీవనశైలి.. ఇవన్నీ యువతరాన్ని కార్పొరేట్ ఉద్యోగాలవైపు ఆకర్షించే అంశాలు. అయితే అక్కడ ఎదురయ్యే కంటికి కనిపించని సవాళ్ల గురించి చాలామంది ఉద్యోగార్థులకు అవగాహన ఉండకపోవచ్చు. ఎందుకంటే.. వీటిని ఎవరూ చెప్పరు, ఎక్కడా లిఖిత పూర్వకంగా ఉండవు. కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు ఆశించే యువతతో పాటూ, ఇటీవలే కొలువుల్లో చేరినవారూ ఈ అంశాలపై అవగాహన పెంచుకోవాలి. దీంతో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా, కెరియర్‌లో ఉన్నత స్థితికి చేరుకోవచ్చు.

అంతర్గత సాంకేతిక సమాచారం, క్లయింట్స్ డేటా, వ్యూహాలు, ఆర్థిక విషయాలు బయట ప్రపంచానికి వెల్లడికావడాన్ని ఏ సంస్థలూ అంగీకరించవు.

సోషల్ మీడియా

స్వాతి ఒక ఐటీ సంస్థలో ప్రాజెక్ట్ ట్రెయినీగా చేరి, బృందంలో చురుకుగా, ప్రొడక్టివ్‌గా ఉంటూ టీమ్‌కు అప్పగించిన ప్రాజెక్టును పూర్తి చేసి, 'ఎంప్లాయీ ఆఫ్ ద మంత్'గా గుర్తింపు పొందింది. 'ప్రాజెక్టు పూర్తి చేయడంలో నేను ఎదుర్కొన్న సవాళ్లు - ఆనందమయ క్షణాలు' అంటూ ఒక వ్యాసం రాసి, ప్రాజెక్ట్‌లో ఎదురైన సాంకేతిక సమస్యలను తానెలా పరిష్కరించింది, బృంద సభ్యుల మధ్య ఏర్పడ్డ సంఘర్షణలు, క్లయింట్ ఒత్తిడిని హ్యాండిల్ చేసిన విధానం, బ్లాగ్‌లో పోస్ట్ చేసింది. ఎంతో గోప్యంగా ఉంచాల్సిన అంతర్గత సమాచారం బయటపెట్టడంతో యాజమాన్యం స్వాతిని హెచ్చరించింది. ఆమెకు మరో ప్రాజెక్ట్‌లో అవకాశం రావడానికి చాలా సమయం పట్టింది. ఈ పరిణామంతో సంస్థకు చెందిన ఏ సమాచారమైనా అనుమతి లేకుండా బహిర్గతపరచడం ప్రమాదకరమన్న సత్యాన్ని స్వాతి గ్రహించింది.

◗ గోప్యతను ఒక పాలసీగానే కాకుండా, నమ్మకాన్ని నిలబెట్టే నైతిక బంధంగా భావించే వారిని ఉద్యోగులుగా కోరుకుంటాయి కార్పొరేట్ సంస్థలు.

సెల్ఫీల అత్యుత్సాహం

ఉద్యోగంలో చేరిన ఉత్సాహంలో, కార్పొరేట్ జీవన శైలిని, పని వాతావరణాన్ని మిత్రులకు తెలపడానికి.. పని ప్రదేశ ఫొటోలు సోషల్ మీడియాలో పోస్టు చేస్తుంటారు కొంత మంది. ఈ చర్య వల్ల ఉద్యోగికి ఏ విధమైన నిర్దిష్ట ప్రయోజనం లేకపోయినప్పటికీ, వాటి ప్రభావం కెరియర్‌పై తీవ్రంగా ఉంటుంది.

ప్రియాంక ఒక 'బల్క్ డ్రగ్స్' కంపెనీ ఆర్‌అండ్‌డీలో ట్రెయినీగా చేరింది. క్లాస్‌మేట్‌తో వీడియో కాల్ మాట్లాడుతూ.. తన ఛాంబర్ చూపించి, సెల్ఫీ తీసి వాట్సాప్‌లో పోస్టు చేసింది. ఆ ఫ్రెండ్ ఆ ఫొటోను మరో క్లాస్‌మేట్‌కు ఫార్వర్డ్ చేసింది. ఆ ఫొటో మేనేజ్‌మెంట్ వరకూ చేరింది. ప్రియాంక వెనుక ఉన్న వైట్ బోర్డులో కొన్ని ఫార్ములాలున్నాయి. అవి కేవలం అక్కడ ఆర్‌అండ్‌డీ విభాగంలో పనిచేసే వారికి ఉద్దేశించిన అత్యంత గోప్యమైన అంశాలు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన మేనేజ్‌మెంట్ పనిలో నిర్లక్ష్యానికి ప్రియాంకకు నోటీస్ జారీచేసింది.

◗ మీ సోషల్ మీడియా ప్రజెన్స్ మీ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా ఉండాలి. సంస్థ గోప్యత బహిర్గతం కాకూడదు. ఒక అంశం సోషల్ మీడియాలో పోస్టు చేసే ముందు ఆలోచించి అడుగువేయాలి.

గోప్యత

సోషల్ మీడియా వాడకంలోని పరిధిని ఎవరూ తెలియజెప్పరు. ఈ పరిధి తెలుసుకోలేకపోవడం యువ ఉద్యోగుల కెరియర్‌పై తీవ్ర పరిణామాలు చూపడానికి దారితీయొచ్చు.

అభిషేక్, ఒక ఐటీ సంస్థలో డెవలపర్‌గా చేరాడు. తన నియామక పత్రంలో అంగీకరించిన నిబంధనలకు విరుద్ధంగా.. కొన్ని ప్రాజెక్ట్ వివరాలు వృత్తిలో సాధించిన విజయాలుగా 'లింక్డ్ ఇన్'లో పోస్టు చేశాడు. ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక సమాచారం గోప్యతతో కూడింది కావడంతో యాజమాన్యం అభిషేక్‌పై చర్య తీసుకుంది.

◗ ఉద్యోగులు అందుకునే నియామక పత్రాలు నిబంధనలతో కూడి ఉంటాయి. కొన్ని ముఖ్యమైన గోప్యతా సూచనలు చదివి, అర్థం చేసుకోకుండా, నిబంధనలకు అంగీకరిస్తున్నట్లు సంతకం చేసి కాలక్రమంలో మర్చిపోతుంటారు. కొన్ని సంస్థల్లో 'నాన్ డిస్‌క్లోజర్ అగ్రిమెంట్' అంటే 'రహస్య ఒప్పందం'పై సంతకం తీసుకుంటుంటారు. ఇది ఉద్యోగి సంస్థలోని సున్నిత సమాచారాన్ని బయటకి వెల్లడించనని హామీ ఇచ్చే ఒక నిబంధన. ఇందులో పేర్కొన్న వాటిని ఉల్లంఘిస్తే సమస్యలు తప్పవు.

నైతిక బంధం

కార్పొరేట్ కెరియర్‌లో విజయవంతం కావాలంటే సాంకేతిక నైపుణ్యాలతోపాటు నైతికత, గోప్యత, వృత్తి ధర్మాలు కీలక పాత్ర పోషిస్తాయి.

రమేష్ ఒక తయారీరంగ సంస్థలో న్యూ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ టీమ్‌లో ట్రెయినీగా చేరాడు. ఒక ప్రోగ్రాంలో స్నేహితుడు రాజేష్‌ని క్యాజువల్‌గా కలిశాడు. ఇద్దరూ ఒకే తరహా ప్రాజెక్ట్ చేస్తున్నామని తెలుసుకుని సంతోషించారు. అయితే, రాజేష్ తనకు ఎదురైన ప్రాజెక్టులో కొన్ని సందేహాలను అడిగాడు. ఇది చాలా సున్నితమైన అంశం అని, ఈ సమాచారం బయటపెట్టలేనని, సున్నితంగా రాజేష్ అభ్యర్థనను రమేష్ తిరస్కరించాడు.

కొన్నాళ్ల తర్వాత ఈ విషయం మేనేజ్‌మెంట్‌కు తెలిసింది. రమేష్‌కు వృత్తిపై ఉన్న నిబద్ధత, పాటించిన గోప్యతకు ఎంతో సంతోషించిన యాజమాన్యం అతడికి కీలకమైన శాఖ బాధ్యతలు అప్పజెప్పింది.

◗ సంస్థ గోప్యతను కాపాడితే నమ్మకం బలపడుతుంది. విశ్వాసం కెరియర్ ప్రగతికి సహకరిస్తుంది.

దొరైరాజ్
సీనియర్ జనరల్ మేనేజర్, ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్

ప్రొబేషనరీ ఆఫీసర్లు..

ఈసీజీసీ లిమిటెడ్, ముంబయి... ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కేడర్‌లో ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తుంది.
◗ ప్రొబేషనరీ ఆఫీసర్: 30
విభాగాలు: జనరలిస్ట్ 28, స్పెషలిస్ట్ 02
అర్హత: జనరలిస్ట్ పోస్టులకు ఏదైనా విభాగంలో డిగ్రీ. స్పెషలిస్ట్ పోస్టులకు సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ.
వయసు: 01.11.2025 నాటికి 21 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి.
వేతన శ్రేణి: నెలకు రూ.88,635 - 1,69,025.
ఎంపిక: ఆన్‌లైన్ పరీక్ష (ఆబ్జెక్టివ్ టెస్ట్), ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామ్‌లతో. **దరఖాస్తు రుసుము:** ఎస్సీ/ఎస్టీ/ దివ్యాంగులకు రూ.175. ఇతరులకు రూ.950. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 02.12.2025. **ఆన్‌లైన్ పరీక్ష తేదీ:** 11-01-2026.
వెబ్‌సైట్: https://www.ecgc.in/

మేనేజ్‌మెంట్ ట్రెయినీలు..

బ్రహ్మపుత్ర వ్యాలీ ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ లిమిటెడ్, అసోం.. ఒప్పంద ప్రాతిపదికన పలు విభాగాల్లో మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ మేనేజ్‌మెంట్ ట్రెయినీ: 16 పోస్టులు
విభాగాల వారీ: ◗ ప్రొడక్షన్: 07 ◗ మెకానికల్: 04 ◗ ఇన్‌స్ట్రుమెంటేషన్: 02 ◗ సివిల్: 01 ◗ హెచ్‌ఆర్ అండ్ అడ్మిన్: 01 ◗ ఫైనాన్స్: 01
అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, పీజీ, డిప్లొమా, సీఏ/సీఎంఏతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
వయసు: 01.11.2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూలతో. **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్‌కు రూ.500; ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు ఫీజు లేదు. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 09.12.2025.
వెబ్‌సైట్: https://bvfcl.com/

నిట్ వరంగల్‌లో..

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్), వరంగల్.. వివిధ విభాగాల్లో టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ ప్రొఫెసర్: 02 ◗ అసోసియేట్ ప్రొఫెసర్: 08
◗ అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-1: 08
◗ అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-2: 27
అర్హత: సంబంధిత విభాగంలో ఎంఈ/ఎంటెక్, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఏతో పాటు పని అనుభవం ఉండాలి. **గరిష్ఠ వయసు:** ప్రొఫెసర్‌కు 50 ఏళ్లు, అసోసియేట్ ప్రొఫెసర్‌కు 45 ఏళ్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు 40 ఏళ్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-2కు 35 ఏళ్లు.
దరఖాస్తు ఫీజు: జనరల్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్‌కు రూ.2000, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీలకు రూ.1000. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబరు 12. **ఎంపిక:** పరీక్ష, ఇంటర్వ్యూతో.
వెబ్‌సైట్: https://nitw.ac.in/page/?url=/careersnitw/Jobs/

నైజీరియన్ల నుంచి ఎండీఎంఏ కొనుగోలు

- అందులో కొంత వినియోగించి, మిగిలింది అమ్మేవాడు
- ఇంజినీరింగ్‌లో చేరిన తొలి ఏడాదే దారి తప్పిన మ్యాడీ

ఈనాడు – అమరావతి

నిందితుడు మధుసూదన్‌రెడ్డి

బెంగళూరులో స్నేహితుల ద్వారా నైజీరియన్లతో పరిచయంతో మ్యాడీ పెడ్లర్‌గా మారాడు. నైజీరియన్లకు వాట్సాప్‌లో కాల్ చేసి డ్రగ్స్ అడిగేవాడు. వారు వాట్సాప్‌లోనే యూపీఐ క్యూఆర్ కోడ్ పెడితే.. దానిని స్కాన్ చేసి డబ్బులు పంపేవాడు. వారు సరకును ఒక లొకేషన్‌లో పెట్టి.. దానిని ఫొటో తీసి పంపేవారు. మ్యాడీ అక్కడకు వెళ్లి తెచ్చుకునేవాడు. ఇలా కొనుగోలు చేసిన ఎండీఎంఏలో కొంత సొంతంగా వాడుకుని.. మిగిలింది లాభం చూసుకుని అమ్మడం ప్రారంభించాడు. అమ్మకాలలో భాగంగా కాలేజీలో సీనియర్ అయిన గురుప్రసాద్‌తో కలసి హైదరాబాద్‌కు వెళ్లారు. అక్కడ కూకట్‌పల్లి పోలీసులు దాడి చేసి అరెస్టు చేశారు.

చెన్నైలో మత్తుకు బానిస...

చెన్నైలో ఇంజినీరింగ్‌లో చేరిన తొలి ఏడాదే మధుసూదన్‌రెడ్డి అలియాస్ మ్యాడీ మత్తుకు బానిసగా మారాడు. చెడు సావాసాలతో దారితప్పాడు. సిగరెట్లు, మద్యం, గంజాయి అలవాటైంది. బీటెక్ రెండో ఏడాదిలో ఎండీఎంఏ తీసుకోవడం అలవాటు చేసుకున్నాడు. దీంతో చదువుపై దృష్టి సారించలేక తరగతులు ఎగ్గొట్టి స్నేహితులతో తిరిగేవాడు. ఫలితంగా పరీక్షలు రాసేందుకు హాజరు సరిపోక ఇంజినీరింగ్ పూర్తి చేయలేని పరిస్థితి. 2022లో కాలేజీ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఉపాధి నిమిత్తం బెంగళూరు వెళ్లాడు. అక్కడ పలు ఉద్యోగాలు చేశాడు. ఎండీఎంఏ కేసులో బెంగళూరులో అరెస్టు అయిన నిందితుడు మ్యాడీని మాచవరం పోలీసులు నగరంలోని ఒకటో ఏసీఎంఎం కోర్టులో న్యాయాధికారి ఎదుట హాజరుపరిచారు. ఈనెల 26 వరకు రిమాండ్ విధించడంతో విజయవాడ కారాగారానికి తరలించారు. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం కంబాలపల్లికి చెందిన మ్యాడీ తండ్రి 13 ఏళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. తల్లి పొలం పనులకు వెళ్తుండేది.

డ్రగ్స్ బదులు ఉప్పుతో టోకరా...

ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న సమయంలో డ్రగ్స్ కొనుగోలు చేయలేక.. ఎండీఎంఏ బదులు ఉప్పును సరఫరా చేసి పలువురికి టోకరా వేసేవాడు. ర్యాపిడో డ్రైవర్ అవతారమెత్తిన మ్యాడీ. . వాట్సాప్‌లో డ్రగ్స్ కోసం ఆర్డర్ ఇస్తే వారికి బెంగళూరులోని ఏదో ఒక ప్రదేశంలో పెట్టి.. దాని లొకేషన్‌ను అవతలి వారికి పంపేవాడు. విశాఖ నుంచి బెంగళూరు వెళ్లిన శ్రీవాత్సవ్, హావీలాను కూడా ఇలాగే మోసం చేశాడు. డబ్బులు తీసుకుని.. ఎండీఎంఏ బదులు ఓ పార్కులో ఉప్పును పెట్టాడు. ఇలా పలువురిని మోసం చేసేవాడని విచారణలో తేలింది.

డ్రగ్స్ కేసులో నిందితుడిగా వైకాపా విద్యార్థి నేత కొండారెడ్డి!

ఈనాడు - అమరావతి : విజయవాడలో నమోదైన డ్రగ్స్ కేసులో వైకాపా విద్యార్థి నేత కొండారెడ్డిని పోలీసులు నిందితుడిగా చేర్చారు. బెంగళూరులో దొరికిన ఎండీఎంఏ సరఫరాదారుడు మధుసూదన్‌రెడ్డి అలియాస్ మ్యాడీ.. తన నేరాంగీకార స్టేట్‌మెంట్‌లో విశాఖపట్నానికి చెందిన కొండారెడ్డితో లింకుల గురించి పోలీసులకు వివరించాడు. తన నుంచి ఎండీఎంఏను విశాఖకు తెప్పించుకునే వాడని చెప్పాడు. బెంగళూరు వెళ్లిన వారితో తెప్పించుకునే వాడని తేలింది. దీనిపై ఆధారాలు లభించడంతో పోలీసులు వైకాపా నేతను ఏ5గా చేర్చారు. ఇప్పటికే విశాఖలో డ్రగ్స్ కేసులో కొండారెడ్డి అరెస్టు అయి రిమాండ్‌లో ఉన్న నేపథ్యంలో విజయవాడలోని కోర్టులో పీటీ వారెంటు దాఖలు చేయనున్నారు. కోర్టు నుంచి అనుమతి లభించిన తర్వాత ఇక్కడి న్యాయస్థానంలో హాజరుపరుస్తారు. అనంతరం కస్టడీకి తీసుకుని మరింత లోతుగా విచారించనున్నారు.

వీడిన బాలికల అదృశ్యం కేసు మిస్టరీ

కాకినాడలో అదుపులోకి తీసుకున్న పోలీసులు

పెదన, న్యూస్‌టుడే: కృష్ణాజిల్లా పెదన మదర్సా నుంచి ఈనెల 10న అదృశ్యమైన ముగ్గురు బాలికలను పోలీసులు కాకినాడలో గుర్తించారు. వారు సోమవారం అదృశ్యం కాగా. .సంస్థ నిర్వాహకులు మంగళవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సెల్‌ఫోన్ టవర్ లొకేషన్ ఆధారంగా కాకినాడ సముద్ర తీరానికి సమీపంలోని ఒక హోటల్‌లో మంగళవారం అర్ధరాత్రి బాలికలను గుర్తించి బుధవారం ఉదయం పెదన పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. బాలికల అదృశ్యం వెనుక కాకినాడ, బంటుమిల్లికి చెందిన వింజరపు విజయ రత్నకుమార్(20), కుంభా సందీప్(19) ఉన్నట్లు పోలీసులు నిర్ధారించి ఇరువురిపై కిడ్నాప్ కేసు నమోదు చేశారు. ఈ యువకులు కూడా ప్రస్తుతం పెదన పోలీసుల అదుపులో ఉన్నారు. బాలికలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ప్రత్యేక అరలు.. వేర్వేరు లారీలు

- తనిఖీలకు దొరక్కుండా రెండేళ్లుగా గంజాయి రవాణా
- రూ.కోట్లలో సంపాదన.. తొలిసారిగా పట్టుబడ్డ అంతర్రాష్ట్ర స్మగ్లర్
- దాడులు చేసిన ఈగల్, డీఆర్ఐ.. 248 కిలోల గంజాయి స్వాధీనం, ఐదుగురి అరెస్టు

నిందితుడు రాహుల్ కుమార్

లారీలో ప్రత్యేక అర ఏర్పాటు

పట్టుబడ్డ గంజాయి ప్యాకెట్లు

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే– పెనమలూరు

పుష్ప సినిమాలోని స్మగ్లింగ్ సన్నివేశాలకు ఏ మాత్రం తీసిపోని రీతిలో గత రెండేళ్లుగా గంజాయిని రహస్యంగా రవాణా చేస్తున్నాడు.. ఎక్కడా తనిఖీలకు దొరక్కుండా లారీల్లో ప్రత్యేక అరలు ఏర్పాటు చేసి.. రెండు వాహనాలు, ఇద్దరు డ్రైవర్లను ఉపయోగిస్తూ ఒడిశా నుంచి ఉత్తరాదికి రవాణా చేస్తూ రూ.కోట్లు ఆర్జించాడు. చివరకు సమాచారం అందుకున్న ఏపీ ఈగల్, డీఆర్ఐ అధికారులు దాడులు చేసి పట్టుకోవడంతో గుట్టురట్టయ్యింది. డీఆర్ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారులు లారీలను స్వాధీనం చేసుకుని, ప్రధాన నిందితుడు రాహుల్‌కుమార్ సహా ఐదుగురిని అరెస్టు చేశారు. రెండేళ్ల నుంచి రవాణా చేస్తున్నా.. అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ రాహుల్ తొలిసారిగా దొరకడం గమనార్హం.

వ్యవసాయం వదిలి..

కృష్ణా జిల్లా అవనిగడ్డ ప్రాంతానికి చెందిన రాహుల్‌కుమార్ స్వగ్రామంలో వ్యవసాయం చేస్తుండేవాడు. అది గిట్టుబాటు కాక.. విజయవాడ శివారు యనమలకుదురు వచ్చి.. ఫ్లాట్ తీసుకుని నివాసం ఉంటున్నాడు. తక్కువగా సమయంలో రూ.కోట్లు సంపాదించాలన్న ఆశతో గంజాయి రవాణాను మార్గంగా ఎంచుకున్నాడు. దీనికిగాను విజయవాడ, విశాఖపట్నంకు చెందిన కొందరు డ్రైవర్లతో ఒప్పందం చేసుకున్నాడు. అనంతరం ఐదు పెద్ద లారీలను కొనుగోలు చేశాడు. వీటిలో రెండింటిని విశాఖపట్నం నగరానికి చెందిన డ్రైవర్ ఆనంద్‌కుమార్ పేరున ఏపీలో రిజిస్ట్రేషన్ చేయించాడు. ఇందుకుగాను అతడికి రూ.10వేలు ముట్టజెప్పి ఒప్పించాడు. మరో మూడు వాహనాలను రాహుల్.. తన పేరునే యూపీలో రిజిస్ట్రేషన్ చేయించాడు.

తనిఖీలు తప్పించుకునేందుకే..

ఒడిశా నుంచి గంజాయి రవాణా చేయాలని నిర్ణయించుకుని.. ఆ రాష్ట్రంలోని భవానీపట్నంకు చెందిన దీపు అనే వ్యక్తితో ఒప్పందం కుదుర్చుకున్నాడు. అక్కడి నుంచి విజయవాడకు చేర్చి.. ఇక్కడి నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు వేర్వేరు వాహనాల్లో తరలించాలని ప్రణాళిక వేశాడు. దీని కోసం కానూరులోని కొత్త ఆటోనగర్‌లో రూ.25వేల అద్దెకు గోదాము తీసుకున్నాడు. ఒడిశా నుంచి ఏపీ రిజిస్ట్రేషన్ వాహనాలను మాత్రమే ఉపయోగించేవాడు. ఏపీ రిజిస్ట్రేషన్‌వి అయితే ఆంధ్ర సరిహద్దుల్లో తనిఖీలు ఉండవని ప్లాన్ వేశాడు. ఒక్కో డ్రైవర్‌కు ప్రతి ట్రిప్పునకు రూ.40 వేలు చెల్లించేవాడు. ప్రతి లారీకి అడుగు భాగాన ప్రత్యేక అర ఏర్పాటు చేయించాడు. ఇది డ్రైవర్ వెనుక నుంచి మాత్రమే తీసేందుకు వీలుగా మార్చాడు. ఒడిశాలో కొన్న గంజాయిని ఈ అరలోకి చేర్చి.. పైన కంకర చిప్స్ పోసి విజయవాడకు వచ్చేవి. తర్వాత ఏపీ రిజిస్ట్రేషన్ వాహనం నుంచి సరకును యూపీ రిజిస్ట్రేషన్ వాహనంలోకి మార్చేవాడు. ఇక్కడి నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు వెళ్లే వాటిని.. అక్కడ సరిగా తనిఖీలు చేయరని ఈ ఎత్తుగడ వేశాడు. వాహనాలతో పాటు డ్రైవర్లను కూడా మార్చేవాడు.

రెండేళ్లలో తొలిసారి దొరికి..

గత రెండేళ్లుగా రహస్యంగా గంజాయిని రవాణా చేస్తూ రాహుల్‌కుమార్ పెద్ద మొత్తంలో సంపాదించాడు. అటు స్వగ్రామం, ఇటు యనమలకుదురులో ఎవరికీ అనుమానం రాకుండా మేనేజ్ చేశాడు. ముందస్తు సమాచారం మేరకు ఈగల్, డీఆర్ఐ బృందాలు ఈ నెల 10న విజయవాడ శివారు కానూరులోని కొత్త ఆటోనగర్‌లోని నిందితుడి గోదాముపై దాడులు చేశాయి. ఈ సందర్భంగా 242 ప్యాకెట్లలోని 248.82 కిలోల గంజాయిని సీజ్‌చేశారు. వీటి రవాణాకు ఉపయోగిస్తున్న ఐదు లారీలు, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు శాయన రాహుల్ కుమార్, హుస్సేన్ (గోదాము ఇన్‌ఛార్జి, విజయవాడ), సోహన్ లాల్ (డ్రైవర్, హరియాణా), ఆనంద్‌కుమార్ (డ్రైవర్, విశాఖపట్నం), అబ్దుల్ హసన్ (డ్రైవర్, విశాఖపట్నం)లను అరెస్టు చేశారు.

ట్రైన్ మేనేజర్ల సమస్యలు పరిష్కరించండి

ఏడీఆర్‌ఎం శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిల్ నాయకులు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: రైల్వే ట్రైన్ మేనేజర్ల(గార్డు)ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆలిండియా గార్డ్స్ కౌన్సిల్ విజయవాడ డివిజనల్ కార్యదర్శి కె.మోహన్‌దాస్ డిమాండ్ చేశారు. ట్రైన్ మేనేజర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కేంద్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం డీఆర్‌ఎం కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 8వ వేతన సంఘాన్ని తక్షణమే అమలు చేయాలని, ట్రైన్ మేనేజర్లకు సముచిత వేతన స్థాయిలను నిర్ధారించాలని కోరారు. 2024వ సంవత్సరం జనవరి 1 నుంచి రన్నింగ్ అలవెన్సులను 25 శాతం పెంచాలని, ఆదాయపు పన్ను మినహాయింపు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది జనవరిలో రైల్వే బోర్డు జారీ చేసిన జేపీవోను రద్దు చేయాలని, ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఏఐఎల్‌ఆర్‌ఎస్‌ఏ, డీఎంఆర్‌కేఎస్, సీఐటీయూ తదితర కార్మిక సంఘ నాయకులు హాజరై సంఘీభావం తెలిపారు. అనంతరం ఏడీఆర్‌ఎం కొండా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం సమర్పించారు.

అందుబాటులోకి రూ.100 టికెట్



ట్రావెల్ 24 గంటలు అని ముద్రించిన టికెట్

విజయవాడ బస్‌స్టేషన్, భాస్కరపురం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బుధవారం నుంచి రూ.100 ట్రావెల్ యాస్‌యూలైక్ టికెట్‌తో నగర పరిధిలో 24 గంటలలోపు ఎన్ని సార్లు అయిన ప్రయాణించే అవకాశం కల్పించింది. టికెట్ తీసుకున్న సమయం నుంచి మరుసటి రోజు అదే సమయం వరకు టికెట్ చెల్లుబాటు అవుతుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. కండక్టరు వద్ద టికెట్ తీసుకునే సమయంలో ప్రయాణికుల పేరు, చరవాణి నంబరు, వయసు నమోదు చేసుకుని టికెట్ అందిస్తారు. దీని ద్వారా ప్రయాణికులు నగర పరిధిలో నడిచే సిటీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ బస్సులు వెళ్లే మార్గాల్లో సూరంపల్లి అడ్డరోడ్డు, కొండపల్లి, గన్నవరం, కంకిపాడు, మంగళగిరి, కొత్తూరు తాడేపల్లి వరకు బస్సులు రాకపోకలు సాగించే సమయంలో ప్రయాణించవచ్చు. విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో బుధవారం నుంచి ఏపీఎస్‌ఆర్టీసీ ఈ విధానం అమల్లోకి తీసుకొచ్చింది.

సంజయ్ బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

ఈనాడు - అమరావతి: అగ్నిమాపక, సీఐడీ విభాగాల్లో డీజీగా పనిచేసిన సమయంలో అక్రమాలకు పాల్పడ్డారని నమోదైన కేసులో ఐపీఎస్ అధికారి సంజయ్ బెయిల్ పిటిషన్‌పై ఏసీబీ కోర్టులో వాదనలు ముగిశాయి. పిటిషన్‌పై బుధవారం విచారణ జరిగింది. ఇరుపక్షాలు వాదనలు వినిపించాయి. గత ప్రభుత్వ హయాంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని, ఇంకా దర్యాప్తు సాగుతోందని.. ఈ దశలో బెయిల్ ఇస్తే నిందితుడు తన పలుకుబడి ఉపయోగించి సాక్షులను బెదిరించే ప్రమాదం ఉందని ప్రాసిక్యూషన్ తరఫు న్యాయవాది వాదించారు. ఇంత వరకు ఏసీబీ ప్రాథమిక సాక్ష్యాలు కూడా సేకరించ లేకపోయిందనీ, నిందితుడు చాలా రోజుల నుంచి రిమాండ్‌లో ఉన్నారనీ, ఈ దృష్ట్యా బెయిల్ మంజూరు చేయాలని సంజయ్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు.. వాదనలు ముగియడంతో తీర్పు నిమిత్తం ఈనెల 17కు న్యాయాధికారి వాయిదా వేశారు.

వంశీ బెయిల్ ఆంక్షల్లో సడలింపు

ఈనాడు - అమరావతి: సత్యవర్ధన్ అపహరణ, దాడి కేసులో వైకాపా నేత వల్లభనేని వంశీ బెయిల్ ఆంక్షల్లో ఎస్సీ, ఎస్టీ కోర్టు సడలించింది. ఈ మేరకు న్యాయాధికారి బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. ప్రతినెలా రెండో శనివారం పటమట స్టేషన్‌కు వెళ్లి సంతకం చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో వంశీకి బెయిల్ మంజూరు చేసినప్పుడు. . ప్రతి నెలా రెండో, నాలుగో శనివారాలు స్టేషన్‌కు వెళ్లి సంతకం చేయాలని ఎస్సీ, ఎస్టీ కోర్టు షరతు విధించింది. ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నానని, ఆంక్షలు సడలించాలని వంశీ పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. దీనిపై ఉత్తర్వులు వెలువడ్డాయి.

నకిలీ మద్యం కేసులో నిందితులకు రిమాండ్

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో ములకలచెరువు ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న నలుగురు నిందితులను బుధవారం పీటీ వారెంట్‌పై సిట్ అధికారులు విజయవాడ ఎక్సైజ్ కోర్టులో హాజరుపరిచారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి కారాగారంలో ఉన్న మిథున్ దాస్, అంతదాస్, హాజి, రాజులను న్యాయాధికారి ఎదుట హాజరుపరిచారు. వీరికి ఈనెల 25 వరకు రిమాండ్ విధించారు. అనంతరం నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు. ★ ఈ కేసులో అజ్ఞాతంలో ఉన్న నిందితుడు తలారి రంగయ్య (ఏ14) దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్.. 8వ ఏడీజే కోర్టులో బుధవారం విచారణకు వచ్చింది. ప్రాసిక్యూషన్ కౌంటరు దాఖలు చేసేందుకు ఈనెల 17వ తేదీకి న్యాయాధికారి వాయిదా వేశారు.

(c) eenadu

ఆలోచనలు విరియాలి... ఆవిష్కరణలు మెరవాలి..!

ఈనాడు

ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. పాఠశాల స్థాయిలోనే సృజనాత్మకత వెలికితీసేందుకు 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' నిర్వహిస్తోంది. వినూత్న ఆలోచనలతో ప్రయోగాలు చేసేలా ప్రోత్సహిస్తోంది. **ఇందులో భాగంగా పీవీపీ సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాల, కానూరులో ఈనెల 24వ తేదీన మెగా సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తోంది.**

నిబంధనలు.. ● 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు మాత్రమే ● ప్రాజెక్టును ముందుగా నమోదు చేసుకోవాలి ● ఒక ప్రాజెక్టుకి ఇద్దరు విద్యార్థులకు అనుమతి ● పాఠశాల/ బ్రాంచ్‌కి ఒక ప్రాజెక్టుకు మాత్రమే అనుమతి ● మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులు ఉంటాయి. ● పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం ● **రిజిస్ట్రేషన్ చివరి తేదీ : నవంబరు 17**

నమోదు కొరకు: 91549 91113 సమయం : ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గం॥ల వరకు..

తాగునీటి సరఫరాపై పర్యవేక్షణ అవసరం

పాయకాపురం, న్యూస్‌టుడే : తాగునీటి పథకాల పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, సరఫరాపై పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గ్రామీణ నీటి సరఫరా పథకాల పనుల ప్రగతి, తాగునీటి సరఫరాపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. క్లోరినేషన్ కలిపిన నీటిని మాత్రమే తాగాలన్నారు. నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, వైద్యారోగ్యం, భూగర్భ జల శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, సమస్యలు పరిష్కరించాలని సూచించారు. జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా 584 పనులు చేపట్టి, 262 పనులు పూర్తి చేశామని చెప్పారు. మిగతావి త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. అలసత్వం వహించే గుత్తేదారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో జడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఎస్.విద్యాసాగర్, ఐసీడీఎస్ పీడీ షేక్ రుక్సానా సుల్తానా బేగం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.ఎం.ఎఫ్.విజయకుమారి, డీఈ వి.రవి కుమార్, ఏఈ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు అమరావతి
ఎన్టీఆర్

కేటాయింపులులులు.. ఫలప్రదం

మల్లవల్లి సీపీసీకి ఎట్టకేలకు మోక్షం

విస్తీర్ణం: 7.48 ఎకరాలు
వ్యయం: రూ.86 కోట్లు

సీపీసీ భవన సముదాయం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

రైతులు, ఫల ఆధారిత పరిశ్రమలు నిర్వహించే వారు పళ్లు, కాయలు తెస్తే.. రసం(జ్యూస్), పల్ప్(గుజ్జు) ప్యాక్‌చేసి ఇచ్చేలా ఏపీఐఐసీ ఆధ్వర్యంలో మల్లవల్లిలో కోర్ ప్రాసెసింగ్ సెంటర్ (సీపీసీ) రూపొందించారు. దీనికి 2017లో అప్పటి తెదేపా ప్రభుత్వం అంకురార్పణ చేస్తే, తర్వాత వచ్చిన వైకాపా సర్కారు మూలకు చేర్చింది. తాజాగా వినియోగంలోకి తెచ్చేలా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించి, ప్రఖ్యాత 'లులు' గ్రూప్ అనుబంధ సంస్థకు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ★ పండ్లను మాగబెట్టడం, వాటి నుంచి గుజ్జు, రసం తీయడం, బియ్యం, జొన్నలు వంటి ఆహార ధాన్యాలు నిల్వ చేసుకునేందుకు, పండ్లు, కూరగాయల నిల్వకు వేర్వేరుగా గిడ్డంగులు, ప్యాకింగ్ యూనిట్లు, ఆహార ఉత్పత్తుల నాణ్యత పరిశీలించేందుకు ఎనలైటికల్ ల్యాబ్ వంటి వసతులతో అధునాతనంగా నిర్మించారు. ★ పంట నిల్వకు వీలుగా 4 వేల టన్నుల సామర్థ్యం ఉన్న గోదాములు నిర్మించారు. ★ 3 వేల టన్నుల పంటలు నిల్వ చేసేలా కోల్డ్ స్టోరేజీని సిద్ధం చేశారు. ★ కాయలను మాగబెట్టేందుకు ఒక్కొక్కటి 200 టన్నుల సామర్థ్యం గల 8 రైపెనింగ్ ఛాంబర్లు ఉన్నాయి

కీలక యంత్ర వ్యవస్థ

అయిదు రోజుల్లో.. పూర్తి ఆటో విధానంలో పనిచేసే రైపెనింగ్ ఛాంబర్లలో అన్ని రకాల కాయలు పక్వానికి వస్తాయి

గంట వ్యవధిలోనే.. 10 టన్నులు పండ్ల రసాలు, వివిధ రకాల గుజ్జు ఉత్పత్తి చేసి, వాటిని స్టెరిలైజేషన్ ట్యాంకుల్లోకి పంపి 104 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద వేడిచేస్తారు, తర్వాత రసాలు, గుజ్జుని సాధారణ ఉష్ణోగ్రతకు తీసుకొచ్చి బ్యారెల్‌లో నింపుతారు. పండ్ల రసాలను తాగేందుకు వీలుగా టెట్రా ప్యాక్‌లు తయారు చేసుకోవచ్చు. చిరు ధాన్యాలు, సుగంధ ద్రవ్యాల పొడులు ప్యాకెట్లను గంటలో 70 తయారు చేసుకోవచ్చు.

మూడేళ్ల కిందటే..
మామిడి, అరటి, జామ, బొప్పాయి వంటి పండ్లతో పాటు టమాటాలను గుజ్జు, రసం రూపంలో శుద్ధి చేసేందుకు అన్ని వసతులు, పూర్తి విదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన యంత్ర వ్యవస్థను సీపీసీలో అమర్చారు. నిర్మాణంతో పాటు నిర్వహణకు అనువుగా కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

రూ.50లక్షలు చెల్లించేలా..
'లులు' గ్రూప్‌కు చెందిన ఫెయిర్ ఎక్స్‌పోర్ట్స్‌కు ఏడాదికి రూ.50 లక్షలు చెల్లించే ప్రాతిపదికన లీజుకు కేటాయించారు. త్వరలో ఈ సంస్థ ఇక్కడ కార్యకలాపాలు ప్రారంభించేలా సన్నాహాలు చేస్తోంది.

అక్రమాల వెలుగు.. అతివకు దిగులు!

డీఆర్‌డీఏలో బుక్‌కీపర్ల దందా

☛ గొల్లపూడిలో స్థానిక సీసీ, ఏపీఎం కలిసి నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లో మహిళలను నాలుగైదు గ్రూపుల్లో సభ్యులుగా చేర్చి 14 అనధికార గ్రూపులు సృష్టించారు. వారి వివరాలు ఎంసీపీ (మైక్రో క్రెడిట్ ప్లాన్) చేస్తే బండారం బయట పడుతుందని మాన్యువల్‌గా దరఖాస్తు చేసి బ్యాంకు అధికారులను ఒప్పించారు. ఏకంగా రూ.2.8 కోట్లు కొల్లగొట్టారు.

☛ రెడ్డిగూడెం మండలంలో ఓ బుక్‌కీపర్ స్త్రీ నిధి రుణం ఇప్పిస్తున్నట్లు ప్రెసిడెంట్, సెక్రటరీలను బ్యాంకుకు తీసుకువెళ్లారు. ఖాళీ బ్యాంకు ఓచర్లపై సంతకాలు చేయించి రూ.లక్ష బదులు రూ.3 లక్షలు నమోదు చేశారు. అదనంగా నమోదైన రూ.2 లక్షలను.. మరో బుక్‌కీపర్ ఖాతాలో జమయ్యేలా బ్యాంకు అధికారులను ఒప్పించారు. రూ.2 లక్షలకు ఇద్దరు బుక్‌కీపర్లు వాటాలేసుకున్నారు. అలా అన్ని గ్రూపుల్లో కలిపి రూ.20 లక్షల మేర దారి మళ్లాయి.

ఈనాడు, అమరావతి

ఉమ్మడి కృష్ణా జిల్లాలో వెలుగు సంఘాల్లో లెక్కలేనన్ని చీకటి దందాలు వెలుగు చూస్తున్నాయి.. కొందరు కింది స్థాయి అధికారులు, బుక్ కీపర్లు, బ్యాంకు సిబ్బంది కుమ్మక్కయి కథ నడిపిస్తున్నారు. సంఘాల అధ్యక్ష, కార్యదర్శులను పావులుగా మార్చి వ్యవహారం చక్కబెడుతున్నారు. అక్రమ సంఘాలను సృష్టించడం, సభ్యులకు తెలియకుండా రుణాలు స్వాహా చేయడంతో రూ.కోట్లు కొల్లగొడుతున్నారు.

వెలుగు మాటున చీకటి దందా...

★ రుణాలు వచ్చినప్పుడు గ్రూపునకు రూ.2 వేల వరకు కమీషన్లు తీసుకోవడం షరా మామూలైంది. ★ తాజాగా కొత్త రకం దందాలు తెరమీదకు వస్తున్నాయి. ★ సభ్యుల అవగాహన రాహిత్యాన్ని ఆసరాగా తీసుకుని బుక్ కీపర్లు దోచేస్తున్నారు. ★ ఒక సభ్యురాలు ఒకే గ్రూపులో ఉండాల్సి ఉంటే.. ఐదారు గ్రూపుల్లో చేర్పిస్తున్నారు. వారికి వచ్చిన రుణాలను వాటాలు వేసుకుంటున్నారు. ★ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా.. తీర్మానాలు చేయకుండా భారీ మొత్తంలో దోచేస్తుండగా.. వీరికి అధికారులు, బ్యాంకు సిబ్బంది సహాయ సహకారాలు ఉంటున్నాయి. ★ ఫలితంగా ప్రభుత్వం మహిళా సాధికారత కోసం కేటాయిస్తున్న రూ.కోట్ల రుణాల లక్ష్యం నీరుగారుతోంది. ★ కొన్ని చోట్ల బుక్‌కీపర్ల దందా బయటకు వస్తున్నా వారినే కొనసాగించడంలో అధికారుల ఆంతర్యం అనుమానాలకు తావిస్తోంది.

అక్రమాలపై చర్యలు తీసుకుంటాం..
అక్రమాల నివారణకు మన డబ్బులు, మన లెక్కలు అనే యాప్ వచ్చింది. అందులో సభ్యుల గ్రూప్ లావాదేవీల వివరాలు చూడవచ్చు. ఇప్పటికే వెలుగులోకి వచ్చిన అక్రమాలపై చర్యలు తీసుకుంటాం. **- నాంచారరావు, డీఆర్‌డీఏ పీడీ**



కాలభైరవ రూపం.. కరుణామృత దీపం!

ప్రేమకు గుర్తుగా కొందరు విగ్రహాలు ఏర్పాటు చేయడం, సేవా కార్యక్రమాలు చేయడం చేస్తుంటారు. విజయవాడ భవానీపురానికి చెందిన మురాల వెంకటేశ్వర్లు మాత్రం వాటిపై ఉన్న ప్రేమతో సొంతంగా కాలభైరవుడి ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి అయిన ఆయన గత కొన్నేళ్లుగా శునకాలు పెంచుతున్నారు. వాటికోసం ప్రత్యేకంగా భవానీపురంలో ఒక ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులోనే కాలభైరవుడి ఆలయాన్ని మూడేళ్ల కిందట నిర్మించారు. ప్రతి రోజు ఆలయంలో దీపారాధన చేసి పూజలు చేస్తుంటారు. అనారోగ్యంతో బాధపడే వాటికి, దెబ్బలు తగిలిన వాటికి చికిత్స చేయిస్తున్నారు. ప్రస్తుతం ఆశ్రమంలో యాభై వరకు శునకాలు ఉన్నాయి. వాటికి నిత్యం ఆహారం పెడుతున్నారు. కాలభైరవుడి ఆలయాన్ని దర్శించుకునేందుకు ఇతర ప్రాంతాల నుంచీ ప్రజలు వస్తున్నారు.

- భవానీపురం, న్యూస్‌టుడే

దుర్గగుడి హుండీ ఆదాయం రూ.2.67 కోట్లు

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను దేవస్థానం సిబ్బంది బుధవారం లెక్కించారు. 49 హుండీల్లో కానుకలను లెక్కించగా రూ. 2,67,93,738 ఆదాయం వచ్చింది. కానుకలతోపాటు 215 గ్రాముల బంగారం, 3.320 కిలోల వెండి వస్తువులను భక్తులు మొక్కుల రూపంలో చెల్లించారు. విదేశీ కరెన్సీ 403 యూఎస్ఏ డాలర్లు, 25 కెనడా డాలర్లు, 16 సింగపూర్ డాలర్లు, 14 కువైట్ దీనార్స్, 10 ఆస్ట్రేలియా డాలర్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కానుకల లెక్కింపును ఆలయ ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ పర్యవేక్షించారు.

ఎర్రుపాలెం-నంబూరు రైల్వే లైన్‌కు.. భూసేకరణ వేగవంతం

నందిగామ, కంచికచర్ల, న్యూస్‌టుడే: నవ్యాంధ్ర రాజధాని అమరావతిని కలుపుతూ ఎర్రుపాలెం-నంబూరు మధ్య కొత్త రైల్వే లైన్ ఏర్పాటులో భాగంగా అవసరమైన భూముల సేకరణకు అధికారులు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి 20ఏ నోటిఫికేషన్ జారీ చేశారు. అనంతరం రైతుల పేర్లతో త్వరలో 20ఈ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ❖ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం వద్ద నుంచి అమరావతి మీదుగా గుంటూరు జిల్లా నంబూరు వరకు కొత్త రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీని ద్వారా రాజధానికి రైల్వే లైన్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. ❖ కంచికచర్ల మండలం పరిటాల వద్ద రైల్వేస్టేషన్ రానుంది. దీనికి నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలోని వీరులపాడు, కంచికచర్ల మండలాల్లో 297 ఎకరాలు సేకరించాలని నిర్ణయించారు. ❖ రెండు మండలాల పరిధిలో 8 గ్రామాల్లో ఎక్కడెక్కడ భూములు అవసరమో గుర్తించారు. ఈ మేరకు ప్రాథమికంగా గతంలో నోటిఫికేషన్ జారీ చేసిన విషయం విదితమే. ఆయా గ్రామాల పరిధిలో రైల్వే లైన్ ఏర్పాటు వల్ల కలిగే సమస్యలను రైతులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ❖ పొలాలకు వెళ్లే డొంక రోడ్లు మీదుగా వెళ్తుండడం వల్ల రాకపోకలకు ఇబ్బంది అవుతోందని చెప్పారు. వీటన్నింటిని నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ పరిశీలిస్తున్నారు. ❖ త్వరలో జారీ చేయనున్న 20ఈ నోటిఫికేషన్ అనంతరం గ్రామాల్లో సభలు పెట్టి రైతుల అభిప్రాయాలను స్వీకరిస్తామని ఆర్డీవో తెలిపారు. అనంతరం ఉన్నతాధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పరిధిలోని గ్రామాలు..
కావాల్సిన భూమి (ఎకరాల్లో..)

కంచికచర్ల మండలం:
గొట్టుముక్కల (50.490),
పరిటాల(72.425)

వీరులపాడు మండలం:
జుజ్జూరు (28.894),
గూడెంమాధవవరం (7.712)
చెన్నారావుపాలెం (26.459)
పెద్దాపురం (50.922)
అల్లూరు (43.152)
నరసింహారావుపాలెం (17.445)

వరద గాయం.. గోడలు మాయం

వంతెన రక్షణ దిమ్మెలు విరిగిపోయి ప్రమాదకరంగా..

గత నెలలో తెలంగాణలో కురిసిన వర్షాల కారణంగా మునేరుకు భారీగా వరద రావడంతో ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం లింగాల వద్ద కాజ్‌వే పైనుంచి నీరు ఉద్ధృతంగా ప్రవహించింది. మక్కపేట నుంచి లింగాల వెళ్లే కాజ్‌వే రోడ్డు బాగానే ఉన్నా వంతెనకు సపోర్టుగా రాళ్లతో నిర్మించిన గోడలు ధ్వంసమైపోయాయి. విద్యుత్తు స్తంభాలు పడిపోయి, నీటి పైపులైన్లు విరిగి కొట్టుకుపోయాయి. చోదకులు వంతెన అంచుల్లోకి వెళితే పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. ప్రభుత్వం స్పందించి వంతెన రక్షణ గోడలు నిర్మించాల్సి ఉంది.

వంతెనకు రక్షణగా నిర్మించిన రాతి సపోర్టు గోడలు ధ్వంసమైన తీరిది..

- ఈనాడు, అమరావతి

కరెంటు స్తంభాలు విరిగిపోయి కొట్టుకొచ్చి..

అత్యంత పారదర్శకంగా రెవెన్యూ సేవలు

పాయకాపురం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిపెట్టిందని, అత్యంత పారదర్శకంగా నిర్దేశిత గడువులోగా ప్రజల సమస్యలు పరిష్కరించాలని జేసీ ఎస్.ఇలక్కియా.. ఆర్డీవోలు, తహసీల్దార్‌లను ఆదేశించారు. పట్టాదారు పాస్ పుస్తకం, మ్యూటేషన్ సేవలు సక్రమంగా అందించాలని బుధవారం ఆమె ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుల పరిష్కార విధానాలు వివరించారు. ఆన్‌లైన్ సేవలపై దరఖాస్తుదారులకు అవగాహన పెంపొందించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు తనిఖీలు ఉంటాయని హెచ్చరించారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం కనిపిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. రెవెన్యూ సేవల్లో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే ప్రజలు 91549 70454 ఫోన్ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని జేసీ సూచించారు.

ఇదిగో.. ఆనందాల హరివిల్లు

✦ కొత్తగా 2,449 గృహాల మంజూరు
✦ 11,008 అసంపూర్తి నిర్మాణాల పూర్తి

ఈనాడు, అమరావతి: వైకాపా పాలనలో ఇళ్ల స్థలాలు ఇచ్చి పనులు గాలికొదిలేయడంతో నిరుపేద లబ్ధిదారుల సొంతింటి కల సాకారం కాలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే.. ఆయా పనులను పట్టాలెక్కించి పూర్తి చేసేందుకు శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు.. పూర్తి చేసిన గృహాల ప్రవేశ కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లాలో బుధవారం ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం గృహ ప్రవేశాలు చేయించారు. అంతేకాదు. సొంత స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు ఉమ్మడి కృష్ణాలో కొత్తగా 2,449 గృహాలను మంజూరు చేశారు.

సందడే సందడి: వైకాపా పాలనలో ఉమ్మడి జిల్లాలో అసంపూర్తిగా మిగిలిన గృహ నిర్మాణాల్లో.. కృష్ణా జిల్లాలో 6,708, ఎన్టీఆర్ 4,300 కూటమి ప్రభుత్వం పూర్తి చేసింది. ఎన్టీఆర్ జిల్లాలో వత్సవాయి, మచిలీపట్నం మండలాల్లో అధికారికంగా గృహ ప్రవేశ కార్యక్రమాలు నిర్వహించారు. కలెక్టర్, హౌసింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని లబ్ధిదారులతో కలిసి గృహ ప్రవేశాలు చేయించారు. మిగిలిన ప్రాంతాల్లోనూ కార్యక్రమం నిర్వహించారు.

ఉమ్మడి జిల్లాలో అర్బన్ ప్రాంతాల్లో మంజూరైన యూనిట్లు..

నియోజకవర్గం	ఇళ్లు
జగ్గయ్యపేట	347
నందిగామ	223
మైలవరం	314
తిరువూరు	138
విజయవాడ తూర్పు	70
విజయవాడ మధ్య	111
విజయవాడ పశ్చిమ	54
గుడివాడ	465
పెనమలూరు	481
మచిలీపట్నం	140
పెడన	106



వత్సవాయిలో నూతన గృహం ప్రారంభిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య

రూ.70.8 కోట్ల లబ్ధి...

★ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (అర్బన్) పథకం కింద ఉమ్మడి జిల్లాకు 2,449 ఇళ్లు మంజూరు చేశారు. ★ ఎన్టీఆర్‌లో 1,257, కృష్ణాలో 1,192 గృహాలు మంజూరయ్యాయి. ★ ఒక్కో లబ్ధిదారుడికి కేంద్రం రూ.1.5 లక్షలు, రాష్ట్రం రూ.లక్ష ఇస్తుంది. ★ అదనంగా ఉపాధి హామీ ద్వారా 90 పని రోజులకు రూ.27 వేలు, స్వచ్ఛభారత్ కింద మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12 వేలు ఇస్తారు. ★ ఒక్కో లబ్ధిదారుడికి రూ.2.89 లక్షలు చెల్లిస్తారు. ★ ఉమ్మడి జిల్లాకు రూ.70.8 కోట్ల లబ్ధి చేకూరనుంది. ★ మంజూరు పత్రం అందిన 45 రోజుల్లోగా ఇంటి పని మొదలు పెట్టాలి. లేకుంటే గృహ మంజూరు ఉత్తర్వు రద్దు చేస్తారు. ★ ఇల్లు కనీసం 420 చదరపు అడుగుల విస్తీర్ణంలో హాలు, పడక, వంట గదులు మరుగుదొడ్లతో కూడిన నిర్మాణం చేపట్టాలి.

మేధను మలిచి.. మేటిగ నిలిచి..!

ఏఎన్‌యూలో ఎన్‌సీసీ ఆల్ ఇండియా ఐడియా అండ్ ఇన్నోవేటివ్ కాంపిటీషన్

ఈనాడు, అమరావతి - న్యూస్‌టుడే, ఏఎన్‌యూ

హ్యాక్ చేయడానికి వీల్లేని డ్రోన్... రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే ఆసుపత్రికి, అధికారులకు సమాచారమిచ్చే ఆవిష్కరణ... అసలు రోడ్డు ప్రమాదాలకు ఆస్కారమే లేకుండా ప్రత్యేక పెయింటింగ్‌తో కట్టడి చేసే ఆలోచన.. పిల్లల ఆరోగ్య పరిస్థితులు వారి కాళ్లకున్న బూట్ల ద్వారా తెలుసుకునేలా రూపొందించిన వ్యవస్థ.. . జనసమ్మర్ద ప్రదేశాల్లో ప్రతి ఒక్కరినీ, అక్కడి పరిస్థితిని పక్కాగా గుర్తించే నిఘా వ్యవస్థ... ఇలాంటి ఎన్నో వినూత్న ఆలోచనలు.. ఆవిష్కరణలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికైంది. బుధవారం నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) ఆల్ ఇండియా ఐడియా అండ్ ఇన్నోవేషన్ కాంపిటీషన్ (ఐసీసీ)-2025ను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో కాకినాడ ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్స్ సమన్వయంతో నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 170 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు 85 వినూత్న ఆవిష్కరణలు ప్రదర్శించారు. ఉత్తమంగా ఎంపికైనవాటిని దిల్లీ ప్రదర్శనలో ఉంచుతామని వివరించారు.

ఆవిష్కరణలు పరిశీలిస్తున్న జ్యూరీ సభ్యులు

సమరసేనకు చేదోడు..

యువ

ప్రాజెక్టు: ఆప్టికల్ ఫైబర్ డ్రోన్
తయారీదారులు: విక్రాంత్‌చౌదరి, హార్దిక్ మిత్తల్, మయూర్ చౌదరి (బీటెక్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు)
స్వస్థలం: జైపూర్, రాజస్థాన్
పరికరాలు: 6 ఎల్‌డీసీ బ్రష్‌లెస్ మోటార్లు, 5,200 ఎంఏహెచ్ బ్యాటరీ, పిక్సో ఫ్లైట్ కంట్రోల్, జీపీఎస్ కంపాస్ మాడ్యుల్.
ప్రత్యేకతలు: ఇది ఆప్టికల్ ఫైబర్ డ్రోన్. హ్యాక్ చేయలేరు. 3 నుంచి 4 కిలోల పేలోడ్ పేలుడు పదార్థాలను తరలిస్తుంది. 2 కిలోమీటర్ల నుంచి 30 కిలోమీటర్ల రేడియస్‌లో పనిచేస్తుంది. సైన్యంలో కౌంటర్ ఎటాక్‌కు ఉపయోగపడుతుంది. వ్యయం రూ.70 వేలలోపే. ఇలాంటివి ప్రస్తుతం రష్యా మాత్రమే వినియోగిస్తోంది.

డ్రోన్ పనితీరు వివరిస్తున్న యువకులు

త్వరబడితేనే సుజలం!

✧ 99 పాఠశాలల్లో బిగించని తీరు ✧ మూలకు చేరిన ఆర్వో ప్లాంట్లు

ఆర్వో ప్లాంట్ల మంజూరు: 671
ప్రస్తుతం పని చేస్తున్నవి: 316
మూలకు చేరినవి: 256
అసలు బిగించనివి: 99

☛ విజయవాడ ఆటోనగర్.. ఏపీఐఐసీ కాలనీలో రేగుల అనూరాధ ఉన్నత పాఠశాలకు గతేడాది వచ్చిన ఆర్వో ప్లాంట్‌కు విద్యుత్తు సరఫరా ఇవ్వక వృథాగా ఉంది. ఇక్కడ 200 మంది చదువుతున్నారు.

ఈనాడు, అమరావతి
- విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శుద్ధ జలాన్ని అందించేందుకు మంజూరు చేసిన ఆర్వో ప్లాంట్ల పరిస్థితి అగమ్యగోచరంలా మారింది. గత ప్రభుత్వంలో కొన్ని పాఠశాలలకు కేటాయించిన ఈ శుద్ధజల కేంద్రాలు.. మూణ్నాళ్లకే మూలకు చేరాయి. కనీసం మరమ్మతులు కూడా చేయక అలాగే వదిలేశారు. మరికొన్నిచోట్ల శుద్ధజల యంత్రాలను పాఠశాలలకు పంపినా.. వాటిని బిగించడానికి నిధులు ఇవ్వలేదు. కొన్నిచోట్ల గుత్తేదారులకు బిల్లులు చెల్లించలేదు. వెరసి చాలా పాఠశాలల్లో వాటిని ఆరంభించకుండానే.. వృథాగా వదిలేశారు. వీటిలో కొన్ని ఆరంభించకుండానే.. పాడయ్యే పరిస్థితికి చేరాయి. ఈ యంత్రాల కోసం గత ప్రభుత్వం రూ.కోట్లు కరిగించినా ఏమాత్రం లాభంలేదు. ఇప్పటికీ చేతి బోర్లు, నగర, పురపాలికల, పంచాయతీ సరఫరా చేస్తున్న నీళ్లే తాగుతున్నారు.

☛ మాచవరం టీఎంఆర్‌సీ ఉన్నత పాఠశాలలో 600 మంది చదువుతున్నారు. ఈ బడికి ఆర్వో ప్లాంట్ మంజూరైనా.. బడికెళ్లే దారి ఇరుకుగా ఉండడం, యంత్రం పెట్టే ఖాళీ లేక గుణదలలో దాసరి గిరిధర్ అవంతి ప్రాథమిక పాఠశాలలో ఉంచారు. రెండేళ్లుగా ఇదే తీరు.

యంత్రాలనూ బిగించని దారుణం..
కొన్ని ఆర్వో ప్లాంట్లను ఆరుబయటే అలా వదిలేశారు. ఎండకు ఎండి.. వానకు తడిసి వీటిలో చాలావరకూ పాడయ్యాయి. ఈ యంత్రాలకు చిన్న మరమ్మతులొస్తే.. అంతే వాటినలా వదిలేశారు. వాస్తవంగా వీటిని పెట్టిన గుత్తేదారు సంస్థ సిబ్బందే నిర్వహణ చూడాలి. కానీ.. వాళ్లకు బిల్లులు చెల్లించక పోవడంతో రావడం మానేశారు.

అన్నింటినీ వినియోగంలోకి తెస్తాం
- రజనీకుమారి, సమగ్రశిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్

ఆర్వో ప్లాంట్లలో పనిచేయనవి, బిగించకుండా వదిలేసిన వాటిని పరిశీలిస్తాం. అన్నీ వినియోగంలోకి తీసుకొచ్చి విద్యార్థులకు శుద్ధజలం అందిస్తాం.

శ్రద్ధాంజలి

జననం 08-07-1942
మరణం 03-11-2025

కీ॥శే॥ డా॥ చిరుమామిళ్ల మాధవసాయి గారు
MBBS., M.S
Ophthalmologist, గుంటూరు

ది. 03-11-2025 సోమవారం స్వర్గస్తులైనారని తెలియజేయుటకు చింతిస్తున్నాము.

పెద్దకర్మ: ది: 15-11-2025 శనివారం కృష్ణా జిల్లా, చల్లపల్లి మండలం పాగోలు గ్రామములోని మా స్వగృహము నందు జరుపబడును. కావున తెలియచేయడమైనది.

ఇట్లు
కుటుంబ సభ్యులు

14న మీ డబ్బు - మీ హక్కు శిబిరం

పాయకాపురం, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ ఏడాది మీ డబ్బు - మీహక్కు నినాదంతో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తోందని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ కె.ప్రియాంక బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ జి.లక్ష్మీశ మార్గదర్శకంలో కలెక్టరేట్‌లో ఈ నెల 14వ తేదీ శుక్రవారం ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్టు వెల్లడించారు. పదేళ్లు, అంతకు మించి లావాదేవీలు జరగని బ్యాంకు ఖాతాల్లోని సొమ్మును.. బ్యాంకులు తిరిగి అర్హులకు ఇచ్చేస్తాయని తెలిపారు. ఖాతాదారుల మరణం, చిరునామా మార్పు లేదా, నామినీ వివరాల్లో లోపాలు, వంటి కారణాలతో కొన్ని ఖాతాల్లో డబ్బు లబ్ధిదారులకు చేరలేదని, అలాంటి వాటిని ఇవ్వడం జరుగుతుందని ఆమె వెల్లడించారు.

AXIS BANK LIMITED రిటైల్ లెండింగ్ అండ్ పేమెంట్ గ్రూప్ (సౌత్ జోనల్ కార్యాలయం/ శాఖ): యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డి.నెం.43-9-141, శ్రీ గాయత్రి టవర్స్, 4వ అంతస్తు, శ్రీ కన్య మెయిన్ రోడ్, దొండపర్తి, విశాఖపట్నం-530016

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, 5వ అంతస్తు, గిగాప్లెక్స్ ఎన్‌పిసి-1, టిటిసి ఇండస్ట్రియల్ ఏరియా, ముగల్సాన్ రోడ్, ఐరోలి, నవీ ముంబాయి- 400708. నమోదిత కార్యాలయం: 'త్రిషూల్', 3వ అంతస్తు, సమర్థేశ్వర్ టెంపుల్ లా గార్డెన్, ఎల్లిస్‌బ్రిడ్జి, అహ్మదాబాద్-380006.

స్థిరాస్తి అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) & 9(1)లోని నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్ ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

రిజర్వు ధర: రూ. 4,46,30,400/- ; ధరావతు: రూ. 44,63,040/- ; బిడ్ పెంపుదల మొత్తం: రూ. 1,00,000/- ; తనిఖీ తేది: 04.12.2025 ; ఇ-వేలం తేది: 05.12.2025

తేది: 13-11-2025, ప్రదేశం: విజయవాడ. సం/- అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

రింగ్‌రోడ్డు బ్రాంచ్, 40-9-27, రింగ్ రోడ్డు, క్రింద అంతస్తు, బెంజ్ సర్కిల్, విజయవాడ-520008, ఫోన్: (866) 2475029, 2485260. E-Mail : iob1067@iob.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ - వేలం బహిరంగ ప్రకటన

ఇ-వేలం తేది మరియు సమయం: తేది.28-11-2025, ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 01.00 గం॥ల వరకు. https://baanknet.com

తేది: 12-11-2025, ప్రదేశం: విజయవాడ. సం/- అధీకృత అధికారి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

రైల్వేస్టేషన్‌లో భద్రత కరవు..!

జీఆర్పీలో భారీగా సిబ్బంది కొరత

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే

విజయవాడ రైల్వేస్టేషన్ దేశంలోని ప్రధాన 28 రైల్వే స్టేషన్లలో ఒకటి. ఇప్పటికే ఎలైట్ గ్రూప్‌లో కూడా చేరింది. నిత్యం లక్షల మంది రాకపోకలు సాగించే రైల్వే స్టేషన్లో విధులు నిర్వర్తించే పోలీసుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. అమరావతి రాజధానికి దగ్గరగా ఉన్న నేపథ్యంలో వీఐపీల రాకపోకలు భారీగా పెరిగాయి. తాజా దేశంలో ఉగ్రవాదుల కదలికల నేపథ్యంలో సిబ్బంది కొరత ఆందోళన కలిగిస్తుంది. విజయవాడ జంక్షన్ జీఆర్పీ స్టేషన్లో సిబ్బంది కేటాయింపు ఏళ్ల తరబడి కాగితాలకే పరిమితం అవుతుందని విమర్శలున్నాయి.

★ విజయవాడ రైల్వే స్టేషన్ ఆదాయం ఏటా రూ.500 కోట్లు దాటింది. నాన్ సబర్బన్ గ్రూపుల్లో ఎన్ఎస్‌జీ-1 కేటగిరీ హోదాను పొందిన రైల్వే స్టేషన్‌గా చరిత్ర సృష్టించింది. వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు కీలకమైన కేంద్రంగా గుర్తింపు పొందినా భద్రతలో మాత్రం నానాటికి దిగజారిపోతోంది.

వన్‌టౌన్ ప్రవేశం వద్ద మూలన బాంబ్ డిటెక్టర్ ఫ్రేమ్

దక్షిణ మార్గం వద్ద కనిపించని భద్రత...

★ కొన్ని నెలల కిందట రైల్వే లోకో పైలట్ హత్యోదంతంతో రైల్వే సిబ్బందిలో కూడా భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. 2024-25లో దాదాపు 17 మిలియన్ల మంది ప్రయాణికులు విజయవాడ నుంచి రాకపోకలు సాగించారు. సగటున రోజుకు లక్షన్నర మంది ప్రయాణించారు. ★ తాజా ఘటనల నేపథ్యంలో విజయవాడ రైల్వేస్టేషన్‌కు ప్రాధాన్యం ఇస్తూ భద్రత కల్పించాలి. ★ రైల్వేస్టేషన్ లోని అన్ని ప్రవేశ మార్గాల్లో మెటల్ డిటెక్టర్లతో పాటు 24 గంటలు భద్రతా సిబ్బందిని నియమించాలి. ★ రైళ్ల నుంచి రవాణా అయ్యే వస్తువులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి. ★ జీఆర్పీ పోలీస్ స్టేషన్‌లో ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా అదనంగా 100 మంది వరకు సిబ్బందిని భర్తీ చేయాలి. ★ అన్ని ప్లాట్ ఫారాల్లో సీసీ కెమెరాల సంఖ్యను పెంచాలి.

న్యాయవాదుల రక్షణ చట్టం అమలుకు విజ్ఞప్తి

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల రక్షణకు చట్టం తీసుకురావాలని ఏపీ స్టేట్ బార్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎ.కె.బాషా, జనరల్ సెక్రటరీ వై.శివసుబ్రహ్మణ్యం తదితరులు మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. రక్షణ చట్టం అమలు కోరుతూ డోన్ నుంచి న్యాయవాదులు కృష్ణప్రసాద్, ఈశ్వరయ్య చేపట్టిన పాదయాత్ర మంగళవారం విజయవాడలో ముగిసింది. వీరంతా బుధవారం మంత్రి లోకేశ్‌ను కలిసి, న్యాయవాదుల రక్షణ చట్టం ఆవశ్యకతను వివరించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని.. చట్టం అమలు కోసం విధి విధానాలను రూపొందిస్తున్నామని, త్వరలో చట్టాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారని బాషా తెలిపారు. మంత్రి లోకేశ్‌ను కలిసిన వారిలో బీబీఏ సంయుక్త కార్యదర్శి జి.వరాహలక్ష్మి, సీనియర్ న్యాయవాది గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ తదితరులు ఉన్నారు. తొలుత దిల్లీ మారణహోమానికి నిరసనగా న్యాయవాదులు నల్లబ్యాడ్జీలు ధరించి సంఘీభావం తెలిపారు. మౌనం పాటించి మృతులకు నివాళులర్పించారు.

మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎ.కె.బాషా, రామకృష్ణప్రసాద్ తదితరులు

నాగవంశ వన సమారాధనకు విరాళం

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : ఈ నెల 16వ తేదీన నాగవంశ పెద్దలు, యువత ఆధ్వర్యంలో కొత్తూరు తాడేపల్లిలోని తోటల్లో కార్తిక వన సమారాధన నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర నాగవంశ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ఎరుబోతు రమణారావు తెలిపారు. బుధవారం న్యూరాజరాజేశ్వరిపేటలోని తెదేపా కార్యాలయంలో కార్యక్రమ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. నిర్వాహక కమిటీ సభ్యులకు తన సొంత నిధులు రూ.10 లక్షల చెక్కును విరాళంగా అందజేశారు. రాజకీయాలకు అతీతంగా.. సామాజిక ఐక్యత కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

కమిటీ సభ్యులకు చెక్కు అందిస్తున్న రమణారావు

కొండపల్లి కోట.. శతాబ్దాల చరిత్రకు నిదర్శనం

కొండపల్లి, న్యూస్‌టుడే: శతాబ్దాల చరిత్రకు కొండపల్లి కోట నిలువెత్తు నిదర్శనమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ... రింగ్ టెక్నాలజీ అద్భుతమని..కోట పిల్లర్లపైన ఇప్పటికీ చెరగని అలనాటి వైభవ ఆకృతులు దర్శనమిస్తున్నాయని ...

కోట ప్రాధాన్యాన్ని వివరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ప్రజలకు మేలు చేయడమే కూటమి లక్ష్యం

... ప్రమాణ స్వీకారం చేయించారు. జి.కొండూరు మండల అధ్యక్ష, కార్యదర్శులుగా నియమితులైన వేములకొండ వెంకటేశ్వరరావు, లంకా నాగేశ్వరరావులకు కృతజ్ఞతలు తెలియజేశారు. తొలుత తెదేపా పార్టీ పతాకావిష్కరణ చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో సీనియర్ తెదేపా నాయకులు నూర్ భాషా, దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్‌మీరా, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, మైలవరం నియోజకవర్గ పరిశీలకులు ధారూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యుపిక్స్ కేసులో మహిళ అరెస్టు.. రిమాండు

... సత్యనారాయణపురం కేంద్రంగా యుపిక్స్ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా వందల మంది నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసిన సంగతి తెలిసిందే. మోసపూరితమైన సంస్థ అని తెలిసి కూడా డిపాజిట్లు చేసి లబ్ధి పొందడం చట్టరీత్యా నేరమని విజయవాడ నార్త్ ఏసీపీ స్రవంతిరాయ్ పేర్కొన్నారు. నిందితురాలిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండు విధించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో రూ.లలో)

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 600 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.93/-.

వృద్ధురాలి ప్రాణం తీసిన మైనర్లు

విజయవాడ (పాయకాపురం), న్యూస్‌టుడే : ముగ్గురు మైనర్లు అతివేగంతో ద్విచక్ర వాహనంపై వెళ్తూ.. ఓ వృద్ధురాలిని ప్రాణం తీసిన ఘటన విజయవాడ శివారు నున్న పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాష్‌నగర్, సుందరయ్య నగర్ కట్ట ప్రాంతానికి బెజ్జం కుమారి(50) తన కుమారుడితో కలిసి నివసిస్తున్నారు. భర్త పదేళ్ల క్రితమే మృతి చెందారు. పెళ్లి కాని కుమారుడితో ప్రకాష్‌నగర్ కూడలిలో కర్రీస్ పాయింట్ నిర్వహిస్తూ జీవిస్తున్నారు. బుధవారం సాయంత్రం దుకాణం నుంచి ఆమె ఇంటికి వెళుతున్నారు. ఆవారాగా తిరుగుతున్న 14ఏళ్ల వయసున్న ఇద్దరు బాలురు, ఒక బాలిక కలిసి ద్విచక్రవాహనంపై అతి వేగంతో వెళ్తూ.. ప్రకాష్‌నగర్‌లో వృద్ధురాలు కుమారిని ఢీకొట్టారు. తలకు బలమైన గాయమై ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర రక్తస్రావమైంది. నున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వాహనం నడిపిన బాలుడిపై కేసు నమోదు చేశారు. ముగ్గురు మైనర్లు నాలుగో తరగతి వరకు చదివి, తర్వాత మానేశారు. ఆవారా తిరుగుతుంటారని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ కృష్ణమోహన్

'వినియోగదారులపై విద్యుత్తు భారం తగ్గించండి'

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : విద్యుత్తు భారం తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ప్రజలను దగా చేసిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సి.హెచ్.బాబూరావు విమర్శించారు. 2022-2024 సంవత్సరాల్లో వినియోగించిన విద్యుత్తుపై రూ.18,243 కోట్లు వసూలు చేశారని పేర్కొన్నారు. తాజాగా 4వ కంట్రోల్ పీరియడ్ పేరుతో మరో రూ.12,771 కోట్ల ట్రూ అప్ ఛార్జీల భారం మోపేందుకు రంగం సిద్ధం చేశారని ఆరోపించారు. బుధవారం సీపీఎం నాయకులు గవర్నర్‌పేటలో పర్యటించారు. విద్యుత్తు వినియోగదారులతో మాట్లాడి, వారి బిల్లులు పరిశీలించారు. ఛార్జీల భారాన్ని ప్రజలకు వివరించారు. యూనిట్‌కు 13 పైసలు మాత్రమే తగ్గించడం శోచనీయమన్నారు. గత ప్రభుత్వ హయాంలో వేసిన భారాలు కొనసాగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తం రూ. 31,014 కోట్ల భారం మోపుతున్నారని విమర్శించారు. వీటికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం పునరాలోచన చేసి రూ.12,771 కోట్ల భారాన్ని ప్రజలపై వేయకుండా ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దోనేపూడి కాశీనాథ్, కె.దుర్గారావు, ఎం.సీతారాములు, వై.సుబ్బారావు, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు బిల్లును పరిశీలిస్తున్న బాబూరావు తదితరులు

ఒప్పంద ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

గొల్లపూడి, న్యూస్‌టుడే: గ్రామీణ నీటి సరఫరా విభాగంలోని ల్యాబ్‌లలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ల్యాబ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.మూర్తిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం గొల్లపూడిలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మూర్తిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 112 నీటి నాణ్యత ప్రయోగశాలలు ఉన్నాయని, అందులో 526 మంది ల్యాబ్‌లలో పని చేస్తున్నారని వెల్లడించారు. ఉద్యోగులకు ఆగస్టు నుంచి జీతాలు ఇవ్వడం లేదని, కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం లేదన్నారు. గతంతో పోల్చుకుంటే అదనపు పని భారం పెరిగిందని..జీతాలు ఇవ్వకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.అజయ్‌కుమార్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ఒకే వేతనం తీసుకుంటున్నామని, ప్రతి ఏడాది పని భారం పెరుగుతుంది తప్పితే జీతం పెరగడం లేదన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించే సమయంలో అదనపు ఖర్చు అవుతుందని, అవన్నీ వేతనంలో నుంచే ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి కె.ప్రసాదరావు, కార్యనిర్వాహక కార్యదర్శి ఎ.అనిల్, ఉపాధ్యక్షుడు టి.శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లపూడిలోని కార్యాలయం వద్ద ల్యాబ్ ఉద్యోగుల నిరసన

91.9FM Vijayawada 91.9 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008003297

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానము, ఇంద్రకీలాద్రి, విజయవాడ-1

ఆర్.సి.నెం. K1/3387/2025, తేది. 05-11-2025

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి, విజయవాడ భవాని దీక్షల విరమణలు 2025 సందర్భముగా **తేది. 11-12-2025 నుండి తేది. 15-12-2025** వరకు కాని భక్తుల రద్దీ దృష్ట్యా **తేది.18-12-2025** వరకు దేవస్థానము వారు ఏర్పాటు చేయు ప్రదేశములలో భక్తులకు కేశఖండన చేయుటకు (తలనీలాలు తీయుటకు) టిక్కెట్టు ఒక్కటికి రూ. 25/- రెమ్యునరేషన్ చెల్లించు పద్ధతిపై సుమారు 600 మంది ఆసక్తిగల నాయి బ్రాహ్మణులు (బార్బర్లు) సంబంధిత ఆధార్ కార్డు జిరాక్స్, కుల ధృవీకరణ పత్రం జిరాక్స్, 2 పాస్ పోర్టు సైజు ఫోటోలు మరియు నేషనల్ లైజ్ బ్యాంకు అకౌంట్ నెంబరుతో **తేది. 05-12-2025** లోపు గా శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానము, ఇంద్రకీలాద్రి, విజయవాడ కొండ దిగువున గల అరండల్ సత్రంలో గల కేశఖండన శాల నందు వారి వారి పేర్లను ఆఫీస్ పని దినములలో నమోదు చేయించుకొనవలెను. దేవస్థానము వారు సూచించిన ప్రదేశములలో పనిచేయవలసియుండును. ఎటువంటి తగాదాలు చేయరాదు

అర్జిత సేవ మరియు పరోక్ష సేవ టిక్కెట్లను https://kanakadurgamma.org నందు పొందగలరు

శ్రీ బొర్రా రాధాకృష్ణ, ఛైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు

సం/- వి.కె.శీనా నాయక్, యం.ఎ, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్- కార్యనిర్వహణాధికారి

EENADU Classifieds

BUSINESS SERVICES · REAL ESTATE · LAND FOR SALE · PLOT FOR SALE · BUSINESS OFFER · GOLLAPUDI · GENERAL · FINANCIAL SERVICES · PEOPLE CARE · JOBS · OLD AGE HOME

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616

ప్రకటనలపై జీఎస్‌టీ 5% అదనం

గమనిక

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
రెడ్డిగూడెం: 80085 74707 జి.కొండూరు 9063144762

? వెల్లటూరు ఎస్సీ ఏరియాలో పంచాయతీ బోరు మరమ్మతులకు గురై నీటికి అవస్థలు పడుతున్నాం. - **సురేష్ గ్రామస్థుడు** ✔ సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందితో మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా పునరుద్ధరిస్తాం. **- మురళి, పంచాయతీ కార్యదర్శి**

స్పందనకు వందనం

★ వెల్లటూరు గ్రామ శివారు మాలపల్లిలోని కాలువల్లో పూడిక పేరుకుపోయి మురుగు పారక అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన ఈ నెల 11వ తేదీన ప్రచురించగా పంచాయతీ కార్యదర్శి మురళి స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందితో కాలువల్లో పూడిక తీయించి దోమల నివారణకు బ్లీచింగ్ చల్లించారు.

★ జూపూడి గ్రామానికి సరఫరా అవుతున్న తాగునీటిలో నలకలు వస్తున్నాయని వాటర్ ట్యాంకును శుభ్రం చేయించాలని స్థానికులు తెలిపిన సమస్యను మేమున్నాం మీకు తోడుగా శీర్షికన ప్రచురించగా గ్రామ కార్యదర్శి భాగ్యలక్ష్మి స్పందించారు. సిబ్బందితో గ్రామంలోని ఓహెచ్‌ఆర్‌లను శుభ్రం చేయించి సమస్యను పరిష్కరించారు.

- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం, జి.కొండూరు

★ పట్టణంలోని 3వ వార్డులోని డ్రెయినేజీల్లో మట్టి, బురద పేరుకుపోయి మురుగు పారుదలకు ఆటంకంగా ఉందని స్థానికుడు శ్రీకాంత్ చేసిన ఫిర్యాదుపై శానిటరీ అధికారి సంతోష్ స్పందించారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. ★ పట్టణంలోని 14వ వార్డులోని కాలువల్లో మురుగు నిలిచిపోయి దోమల బెడద ఎక్కువైందని స్థానికులు చేస్తున్న ఫిర్యాదును పారిశుద్ధ్య అధికారుల దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. సిబ్బందితో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. - **న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

మైలవరం, జి.కొండూరు, పెనుగొలను న్యూస్‌టుడే: గ్రంథాలయాల్లో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారులు నాగార్జున, విజయ కృష్ణ, టి.వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రతి రోజు విద్యార్థులకు వివిధ కార్యక్రమాలు, పోటీలతో పాటు ముగింపు రోజు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

స్వదేశీ వస్తువులు కొనండి

జి.కొండూరు, న్యూస్‌టుడే: ప్రజలంతా తమవంతు బాధ్యతగా స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ దేశ స్వయం సమృద్ధికి పాటు పడాలని భాజపా టీచర్స్ సెల్ సమన్వయకర్త కొల్లి నాగేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్ర భాజపా అధిష్ఠానం పిలుపు మేరకు చెవుటూరులో ప్రవాస యోజన కార్యక్రమం స్థానిక నాయకులతో కలిసి ఆయన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వదేశీ ప్రతిజ్ఞ చేసి, ఇంటింటికీ తిరిగి స్వదేశీ స్టిక్కర్లను పంచిపెట్టారు. భాజపా ప్రవాస యోజన మండల ఇన్‌ఛార్జులుగా మరసు కృష్ణ, అద్దేపల్లి ఆంజనేయులను నియమించారు. కార్యక్రమంలో మండల భాజపా అధ్యక్షుడు చల్లా మల్లేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అనుమతిలేని నిర్మాణాలు కూల్చేస్తాం

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: తిరువూరు నగర పంచాయతీ పరిధిలో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే వాటిని కూల్చివేస్తామని పురపాలిక కమిషనర్ కె.మనోజ హెచ్చరించారు. పట్టణంలోని 9వ వార్డులో అనుమతి లేకుండా రెండో అంతస్తు నిర్మిస్తుండగా గుర్తించి పట్టణ ప్రణాళిక అధికారులు బుధవారం ఆ నిర్మాణాన్ని తొలగించినట్లు తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబరు నుంచి అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తిస్తే కూల్చివేస్తామన్నారు.

మద్దతు దక్కేనా.. మభ్యపెట్టేనా..?

కొనుగోలు చేయని మార్క్‌ఫెడ్.. మొక్కజొన్న రైతుల్లో నిరాశ

మైలవరం, న్యూస్‌టుడే: పండించిన మొక్కజొన్న పంటను అమ్ముకోవడానికి రైతులకు తిప్పలు తప్పడంలేదు. వారికి బాసటగా నిలవాల్సిన మార్క్‌ఫెడ్, మార్కెటింగ్ శాఖలు కొనుగోళ్లకు సకాలంలో స్పందించకపోవడంతో ప్రైవేటు వ్యాపారులే దిక్కవుతున్నారు. మార్కెట్‌లో పోటీ లేకపోవడంతో, మద్దతు ధరలకు బదులు, వ్యాపారులు చెప్పిందే మద్దతుగా మారుతోంది. ఈ లోగా వాతావరణ పరిస్థితులు కలవరపెడుతుంటే, వచ్చినకాడికి అమ్ముకుంటున్నారు.

బాడవ వద్ద జాతీయ రహదారిపై ఆరబోసిన మొక్కజొన్నలు

ఆశగా సాగు చేసి: మైలవరం నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌గా సాగు చేసిన మొక్కజొన్న దిగుబడులు మొదలయ్యాయి. ఇతర పంటల దిగుబడులు ఆశాజనకంగా లేకపోవడంతో గడిచిన నాలుగైదేళ్లుగా మొక్కజొన్న సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. విత్తన కంపెనీలతో ఒప్పందాలతో రబీ సీజన్‌లో ప్రారంభిస్తుండగా, ఖరీఫ్‌లో సాధారణ విత్తనాలతోనే సాగు చేస్తున్నారు. రబీ కంటే ఖరీఫ్‌లో దిగుబడులు తక్కువగా వచ్చే అవకాశం ఉన్నా, ఎంతో కొంత గిట్టుబాటు అవుతుందని మొక్కజొన్నకే మొగ్గు చూపుతున్నారు. గడిచిన రెండు వారాలుగా దిగుబడులు ప్రారంభమవగా, విత్తనాలను ఎండబెట్టుకోవటానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



ఒడిదుడుకుల్లో బేరాలు: మొంథా తుపానుకు ముందు వచ్చిన పంటకు కనీస ధర లభించలేదు. తుపాను అనంతరం క్వింటా రూ.2 వేల వరకు ధర పలికింది. తిరిగి వారం రోజులుగా గ్రామాల్లో కొనుగోలు చేస్తున్న వ్యాపారులు రూ.1900లే ఇస్తున్నారని రైతులు చెబుతున్నారు. దిగుబడులు ప్రారంభమయ్యే నాటికి మార్క్‌ఫెడ్ రంగంలో ఉంటే, బయట మార్కెట్ సైతం ధర పెరుగుతుందని రైతులు భావిస్తున్నా ఆ శాఖ నుంచి కొనుగోలుకు సంబంధించి ఇప్పటి వరకు ఎటువంటి ప్రకటనా రాలేదు. దీంతో స్థానిక యార్డు నిండా, గ్రామాల్లో తారు రోడ్ల వెంబడి పెద్ద ఎత్తున మొక్కజొన్నలే కనిపిస్తున్నాయి.

వదలని తుపాను భయం: పంట కోతలు పూర్తి చేసి, అమ్మకానికి సిద్ధంగా ఉన్న రైతులకు వాతావరణంలో మార్పులు కలవరపెడుతున్నారు. ఆరుదల కోసం రోజుల తరబడి ఎండలో ఉంచుతుంటే, రెండ్రోజులుగా మబ్బు పడుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. పరదాలపై పరిచిన విత్తనాలను ఉదయం తెరవడం, మధ్యాహ్నానికి మూయడంతోనే సరిపోతోంది. యార్డులో ఆరబెడుతున్న రైతులు ప్రత్యేకంగా కాపలా ఉండాల్సి వస్తోందని చెబుతున్నారు. మార్క్‌ఫెడ్ కొంటే ఇబ్బందులు తొలగుతాయని కోరుతున్నారు.

మళ్లింపు రహదారికి మరమ్మతులు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని తోటమూల సమీప కట్లేరు వంతెన వద్ద మళ్లింపు రహదారికి మరమ్మతు పనులు బుధవారం ప్రారంభించారు. ఈ ఏడాది ఆగస్టు మూడో వారంలో భారీ వరదలకు మళ్లింపు రోడ్డుకు గండ్లుపడి రాకపోకలు నిలిచాయి. దాదాపు మూడు నెలలకు ఇప్పుడు జేసీబీ ఏర్పాటు చేసి వాహనాలు రాకపోకలకు వీలుగా మరమ్మతులు చేపట్టారు. గురువారం నాటికి మళ్లింపు రోడ్డుపై పూర్తి స్థాయిలో రాకపోకలు సాగుతాయని అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పనులు పరిశీలించి మాట్లాడారు. త్వరలో ప్రభుత్వం హైలెవల్ వంతెనకు నిధులు మంజూరు చేస్తుందని, వెంటనే టెండర్లు కూడా పూర్తి నిర్మాణ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ వి.రాజకుమారి, తెదేపా నాయకుడు బి.నారాయణ పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గొల్లపూడి, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా గొల్లపూడి సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం రెండున్నర గంటల పాటు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. గొల్లపూడి హైస్కూలు ప్రాంతం, మహాత్మాగాంధీ హోల్‌సేల్ మార్కెట్, మహేంద్రనగర్, టెలికంకాలనీ, అంబేద్కర్‌నగర్, వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంతాల్లో ఉదయం 7:30 నుంచి 10 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఉపకేంద్రానికి స్థల పరిశీలన

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలిలో విద్యుత్తు ఉపకేంద్రం నిర్మించేందుకు అవసరమైన స్థలాన్ని ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. గత కొంత కాలంగా స్థలాభావంతో నిర్మాణంలో జాప్యం ఏర్పడింది. రెవెన్యూ, విద్యుత్తు శాఖ అధికారులు, తెదేపా నాయకులు పాల్గొని చర్చించారు.

అవార్డు అందుకున్న ఉపాధ్యాయుడు

ఇబ్రహీంపట్నం(గ్రామీణం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం కాచవరం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉర్దూ ఉపాధ్యాయుడు ఎండీ ఇర్ఫాన్ పాషాకు ఉర్దూ అకాడమి ప్రకటించిన జీవనసాఫల్య అవార్డును మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ అందజేశారు. మైనార్టీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మంత్రితోపాటు పలువురు నాయకులు పాల్గొని ఇర్ఫాన్ పాషాకు అవార్డు జ్ఞాపికతో పాటు రూ.25వేల నగదును అందించి ఆయనను సత్కరించారు.

నెమలి కృష్ణుడి సన్నిధిలో ఎమ్మెల్యే

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలి వేణుగోపాలస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు బుధవారం సందర్శించారు. ఆలయ మర్యాదలతో ఆయన్ను అధికారులు, అర్చకులు స్వాగతించారు. ఆలయ సహాయ కమిషనర్ ఎన్.సంధ్య ఆయనకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

ధాన్యం కల్లాల వద్ద రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో మాధురి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం అమ్మి మద్దతు ధర పొందాలని ఆర్డీవో మాధురి రైతులకు సూచించారు. బుధవారం పుట్రేలలో ఆరబోసిన ధాన్యం కల్లాల వద్దకు వెళ్లి అన్నదాతలతో మాట్లాడారు. ధాన్యం బస్తాలు సరిపడా అందుబాటులో ఉన్నాయని రైతులు ఆందోళన చెందవద్దన్నారు. ప్రైవేటు వ్యాపారులు, దళారుల వలలో చిక్కి తక్కువ రేటుకే అమ్మి నష్టపోవద్దన్నారు. అనంతరం స్థానిక రామవ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసి తేమశాతం, కాటా, కొనుగోళ్ల రికార్డులను పరిశీలించారు. గన్నీ బ్యాగులను పారదర్శకంగా సరఫరా చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్.ఉజ్వల్‌భాష, మండల వ్యవసాయాధికారి టిప్పు సుల్తాన్, ఆర్‌ఐ సుజాత, పీడీఎస్ డీటీ శివనాగరాజు పాల్గొన్నారు.

రైతుల కష్టాన్ని గుర్తించి పత్తి కొనాలి

గంపలగూడెం, ఎ.కొండూరు, న్యూస్‌టుడే: రైతులు కష్టాన్ని, పెట్టుబడిని గుర్తించి సీసీఐ అధికారులు పత్తి కొనుగోలులో నాణ్యతా ప్రమాణాల పేరుతో ఆంక్షలు విధించకుండా మద్దతు ధర చెల్లించాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కోరారు. గంపలగూడెం, ఎ.కొండూరు మార్కెట్ యార్డుల్లో బుధవారం భారత పత్తి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. మద్దతు ధరపై ఆంక్షలు విధించవద్దని, ప్రతిరోజూ దూది కొనాలని సీసీఐ అధికారులను కోరారు. గత వైకాపా ఐదేళ్ల పాలనలో సీసీఐ కేంద్రాలు తెరవలేదని, కిలో పత్తి కొనలేదన్నారు. రైతులు కూడా మద్దతు ధర పొందేందుకు ఇంటి వద్దనే గ్రేడింగ్ చేసి నాణ్యమైన దూదిని తీసుకురావాలన్నారు. ఏఎంసీ కార్యదర్శి బి.రాజబాబు మాట్లాడుతూ పత్తి విక్రయించే రైతులు ముందస్తుగా స్లాట్ బుక్ చేసుకుని తీసుకురావాలన్నారు. ఏఎంసీ ఛైర్‌పర్సన్ ఆర్.లక్ష్మీఅనిత, తహసీల్దార్ వి.రాజకుమారి, సీసీఐ బయ్యర్ బాలనరసింహానాయక్, సర్పంచి కె.పుల్లమ్మ, ఏవో వి.హరీష్‌కుమార్ పాల్గొన్నారు.

బయ్యర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, పక్కన అధికారులు

భగవంతుడిని భక్తితో పూజించండి

చాగంటి ప్రవచనం వింటున్న ప్రజలు

గంపలగూడెం, తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: భగవంతుడు కాంతి స్వరూపుడని, అందుకే కార్తిక మాసంలో ప్రతి ఇంటా దీపాన్ని వెలిగించాలని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు సూచించారు. వెలిగించిన దీపానికి పసుపు, కుంకుమ, పూలు, అక్షితలు వేసి శివకేశవులను ఆహ్వానిస్తూ పూజ చేయాలన్నారు. కార్తికమాసం సందర్భంగా తిరువూరు బాలికోన్నత పాఠశాలలో బుధవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని భక్తులకు ఆధ్యాత్మిక సందేశం అందించారు. దీపం వెలిగించడం అనేది యావత్ భారతదేశంలో ఉన్న సర్వమంగళకరమైన సంప్రదాయమన్నారు. ఇంట్లో దీపం వెలిగించి పూజ చేసేందుకు ఏ వస్తువు అందుబాటులో లేకపోతే సూర్యనారాయణ మూర్తి వెలుగును చూస్తూ చేసినా ఆ ఫలితం లభిస్తుందన్నారు. వెంకటేశ్వర స్వామి పాదాలపై తులసీదళం, శివలింగంపై మారేడుదళం వేస్తే భక్తులకు లభించే పుణ్యఫలాన్ని ఆయన వివరించారు. కార్తికమాసంలో కాకినాడ నుంచి తిరువూరు పట్టణం వచ్చినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం ఆలకించేందుకు విశేషంగా ప్రజలు తరలివచ్చారు. నిర్వాహకులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

భారీగా తరలిన కార్యకర్తలు

మైలవరం, న్యూస్‌టుడే: నియోజకవర్గ తెదేపా సంస్థాగత కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మండలం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మైలవరం పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల నుంచి కమిటీల్లో నియమించిన నాయకులు, కార్యకర్తలు బుధవారం ఉదయం చెవుటూరు వెళ్లారు. మైలవరం నుంచి ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు.

వల్లభ్ భాయ్ పటేల్ మార్గం అనుసరణీయం

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

మైలవరం, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య పోరాటంతో, దేశ సమైక్యతలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చూపిన చొరవ, సంకల్పం ఆయనను సమైక్యతామూర్తిగా నిలబెట్టాయని శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా మై భారత్ (నెహ్రూ యువ కేంద్ర) ఆధ్వర్యంలో బుధవారం స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మిలియన్‌మార్చ్ నిర్వహించారు. పెద్ద ఎత్తున విద్యార్థులతో కళాశాల నుంచి కేఎల్ రావు విగ్రహం వరకు ప్రదర్శన చేశారు. మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఎల్బీఆర్ ట్రస్ట్ సభ్యుడు లకిరెడ్డి హనిమిరెడ్డి, కళాశాల అధ్యక్షుడు జి.శ్రీనివాసరెడ్డి, మైభారత్ జిల్లా అధికారి ఎస్.రాము, మేనేజర్ సుబ్బారావు, ప్రిన్సిపల్ అప్పారావు, ఎన్ఎస్ఎస్ అధికారి శివహరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో అపరాధ రుసుం తొలగించుకోండి

కొండపల్లి, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారులంతా విద్యుత్తు వాడకానికి తగ్గట్టుగా లోడు డిపాజిట్లు చెల్లించి అపరాధ రుసుం నుంచి తప్పించుకోవాలని ఎన్టీఆర్ జిల్లా సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ హనుమయ్య సూచించారు. ఇబ్రహీంపట్నం సబ్ డివిజన్ పరిధిలోని కొండపల్లి సెక్టార్‌లో విద్యుత్తు విజిలెన్స్ బృందం బుధవారం తనిఖీలు నిర్వహించింది. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. కొండపల్లి సెక్టార్ పరిధిలో మొత్తం 42 బృందాలు తనిఖీలు నిర్వహించాయన్నారు. అత్యధిక మంది లోడుకు మించి విద్యుత్తు వాడకం చేస్తున్నట్లు గుర్తించామన్నారు. అటువంటి వారందరికీ ప్రస్తుతం మంచి అవకాశం ఉందన్నారు. డిసెంబరు 31 వరకూ రాయితీతో కూడిన లోడును విద్యుత్తు శాఖ అందిస్తుందన్నారు. దానిని ప్రతి వినియోగదారుడు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. పీఎం సూర్యఘర్ పేరుతో సోలార్ పథకానికి ప్రభుత్వం అందిస్తున్న రాయితీని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు వసంతరావు, గురు కిషోర్, పి.నాగేశ్వరరావు, పవిత్రారాణి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అధికారులు

'వైద్య కళాశాలలను ప్రభుత్వం నిర్వహించాల్సిందే'

మైలవరంలో ప్రదర్శనలో అవినాష్, రాజీవ్, నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే: రాష్ట్రానికి మంజూరైన 17 వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం సరికాదని, వాటిని ప్రభుత్వమే నిర్వహించాలని వైకాపా జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ డిమాండ్ చేశారు. పీపీపీ విధానానికి వ్యతిరేకంగా పార్టీ పిలుపు మేరకు బుధవారం జోగి రమేష్ తనయుడు రాజీవ్ ఆధ్వర్యంలో మైలవరంలో కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. ఎల్‌హెచ్ కాంప్లెక్స్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద మాట్లాడుతూ.. ప్రభుత్వ తీరుతో పేదలకు వైద్యవిద్య దూరమవుతుందన్నారు. అనంతరం ప్రదర్శన తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. వైఎస్సార్ విగ్రహం వద్ద కార్యకర్తలు పోగై, రహదారిపై ద్విచక్ర వాహనాలతో ఉండడంతో, కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించగా ఎస్సై సుధాకర్ క్రమబద్ధీకరించారు.

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: తిరువూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి నల్లగట్ల స్వామిదాసు ఆధ్వర్యంలో తిరువూరు అయ్యప్పస్వామి గుడి నుంచి మండల తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించి, రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లా జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ ఎన్.సుధారాణి పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలో ప్రతిభ

మేఘనను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలో మూలపాడు జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని వి.మేఘన మొదటి స్థానం సాధించింది. విజయవాడ పటమట కేబీఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 8 నుంచి 11 వరకు రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలు నిర్వహించారు. వాటిల్లో అండర్-17 విభాగంలో సత్తాచాటిందన్నారు. ప్రధానోపాధ్యాయులు డేవిడ్ రాక్ ఫెల్లర్, క్రీడా ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, వహీదా బేగం, రషీద్‌లు విద్యార్థినిని అభినందించారు.

నేత్రాలు దానం

కొత్తపల్లి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపల్లికి చెందిన గువ్వల మాధవరెడ్డి (78) మంగళవారం రాత్రి మృతి చెందగా ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు విజయవాడ ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు. లయన్స్‌క్లబ్ సభ్యుడు జి.కృష్ణారెడ్డి చొరవతో కుటుంబ సభ్యులు అంగీకరించడంతో వైద్యులు చేరుకుని మాధవరెడ్డి కళ్లలోని కార్నియాను సేకరించి తీసుకెళ్లారు.

మాధవరెడ్డి (పాత చిత్రం)

నేటి నుంచి స్వామిత్వ సర్వే గ్రామ సభలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట మండలం పరిధిలో 9(2) నోటీసులు జారీ చేసిన గ్రామ పంచాయతీల్లో స్వామిత్వ గ్రామ సభలు ఈనెల 13 నుంచి 21వ తేదీల్లో నిర్వహిస్తారని ఎంపీడీవో చిన్న రాట్నాలు ఓ ప్రకటనలో తెలిపారు. 13, 14 తేదీల్లో కొర్లమండ, తాతకుంట్లలో, 18 నుంచి 19 వరకు తెల్లదేవరపల్లి, కలగరలో, 20, 21 వరకు కొండపర్వలో సభలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలు వరకు జరుగుతాయన్నారు.

పంటల సంరక్షణపై శ్రద్ధ అవసరం

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: రాబోయే రబీ సీజన్‌లో పంటల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని వ్యవసాయ అధికారిణి పి.పద్మ సూచించారు. మండల పరిధిలోని మునుకుళ్ల, అక్కపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించి రైతులకు తేమనిల్వ, తెగుళ్ల నియంత్రణ, ఎరువుల వినియోగం వంటి అంశాలపై సూచనలు చేశారు. పశు వైద్యులు అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ జిల్లా సహాధ్యక్షుడి ఎంపిక

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని గొల్లమందల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నావేటి జార్జ్‌వాషింగ్టన్ రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా సహాధ్యక్షుడిగా నియమితులయ్యారు. సంఘం ఎన్టీఆర్ జిల్లా 79వ వార్షిక కౌన్సిల్ సమావేశంలో ఆయన్ను నియమించినట్లు రాష్ట్ర నాయకులు బుధవారం ప్రకటించారు.

పోక్సో కేసులో నిందితుడికి జైలు

జి.కొండూరు, న్యూస్‌టుడే: కరోనా సమయంలో బాలికను వేధింపులకు గురి చేసిన నిందితుడికి మచిలీపట్నం పోక్సో కోర్టు సెషన్స్ జడ్జి గాజుల వెంకటేశ్వర్లు బుధవారం శిక్ష విధించినట్లు జి.కొండూరు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. జి.కొండూరుకు చెందిన శీలం మహేష్ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఓ బాలిక స్నానం చేస్తుంటే చూశాడని ఫిర్యాదు చేయగా 2021లో అప్పటి ఎస్సై ఆర్.ధర్మరాజు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఎనిమిది మంది సాక్షులను విచారించిన పిమ్మట మహేష్‌ను నిందితుడిగా పరిగణించి ఒక సంవత్సరం జైలు, రూ.1000 జరిమానా విధించినట్లు ఎస్సై వివరించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట మండలంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటుదామని తెదేపా సీనియర్ నాయకుడు వల్లభనేని గిరిబాబు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన తెదేపా శ్రేణుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాయల సుబ్బారావు, నాయకులు కోటిరెడ్డి, సుబ్రహ్మణ్యేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు

జూదరుల అరెస్టు

ఎ.కొండూరు: మండలంలోని కోడూరు, అట్లప్రగడలో జూదమాడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై జి.మహాలక్ష్మణుడు బుధవారం తెలిపారు. వారి నుంచి రూ.6వేలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

రైతు భూమి తనిఖీ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: కలెక్టర్ ఆదేశాల మేరకు రెడ్డిగూడెం గ్రామానికి చెందిన కొప్పాల వీరయ్య (అర్జీదారు)భూమిని తహసీల్దార్ జె.సుశీలాదేవి, ఇరిగేషన్ ఏఈ విజయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బి.కల్యాణిలతో కలిసి బుధవారం తనిఖీ చేశారు. ఆర్ఐ జి.పుల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డిగూడెం గ్రామానికి చెందిన రైతు కొప్పాల వీరయ్య గ్రామంలోని తన భూమి కొండపల్లి వీరయ్య కుంట అని తప్పుగా 22(ఎ) వచ్చిందని సరిచేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఇచ్చిన ఆదేశాల మేరకు అధికారులు జాయింట్ తనిఖీ చేశారు.

ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్ల పట్టివేత

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: తిరువూరు నియోజకవర్గంలోని కనుమూరు గ్రామం నుంచి మునుకుళ్ల మీదుగా తెలంగాణకు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు బుధవారం తనిఖీ చేయగా రెండు ట్రాక్టర్లు దొరికాయి. ట్రాక్టర్ల యజమానులను, డ్రైవర్లపై కేసు నమోదు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఎస్సై సత్యనారాయణ చెప్పారు.

రక్షణ కల్పించాలని వేడుకోలు

ఇబ్రహీంపట్నం: చంద్రన్న, లోకేశ్‌బాబు నాకు రక్షణ కల్పించండి అంటూ ఇబ్రహీంపట్నానికి చెందిన పాలబోయిన సుగుణ వాపోయారు. ఇబ్రహీంపట్నం సహాయ మాతా పాఠశాల పరిసరాల్లో నివాసముంటున్న ఈమె సామాజిక మాధ్యమాల ద్వారా తన బాధను చెప్పారు. స్థానిక సహాయ మాతా పాఠశాల పరిసరాల్లో తనకు కలిగిన ఆస్తిని కొందరు స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారని.. అందులో భాగంగానే గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని అందులో వేసి తనను ఇరుకున పెట్టేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. పంట పొలంలో వీరయ్య అనే వ్యక్తి మందు చల్లడానికి వెళ్తే అక్కడ మృతదేహం ఉందంటూ కేసు నమోదు చేయించారని ఆమె వీడియోలో వాపోయారు. మృతదేహం దొరికిన పొలం తనదని రెవెన్యూ సిబ్బందికి తెలిసినా ఆక్రమణ చేద్దామని భావిస్తున్న వ్యక్తికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్నారు. తనను, బిడ్డలను బెదిరిస్తున్న వారికి స్థానికంగా కొందరు అండగా ఉన్నారని తెలియజేశారు. ఈ విషయం పోలీసులకు చెప్పానని, అయినా ఏ క్షణమైనా ఆ దుండగులు దాడి చేస్తారని, తనను రక్షించాలని వేడుకున్నారు.

ప్రకటన

[illegible]

ఇట్లు:- ఎండి యానిస్ షరీఫ్, [illegible] సెల్: 90597 86660.

జానకిరామయ్య సేవలు ఎనలేనివి

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: కృష్ణా మిల్క్ యూనియన్ అభివృద్ధిలో దివంగత జానకిరామయ్య కీలకంగా ఉన్నారని కేఎంయూ అధ్యక్షుడు సీహెచ్.ఆంజనేయులు అన్నారు. తిరువూరు మండలం లక్ష్మీపురంలో బుధవారం నిర్వహించిన జానకిరామయ్య సంతాపసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేఎంయూ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

సత్రం తొలగింపుపై ఆగ్రహం

గొల్లపూడి, న్యూస్‌టుడే: కొత్తూరుతాడేపల్లి గ్రామంలోని కాళీ మాత ఆలయానికి సంబంధించిన సత్రంను ఆర్‌అండ్‌బీ అధికారులు బుధవారం తొలగించారు. దీంతో ఆలయ నిర్వాహకులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నాలుగు దశాబ్దాలుగా ఆలయానికి సంబంధించి సత్రాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పుడు హఠాత్తుగా అధికారులు వచ్చి తొలగించడం తగదన్నారు. స్థానికంగా ఉన్న ఒక పొలానికి వెళ్లేందుకు అడ్డుగా ఉందనే ఉద్దేశంతో ఇలా చేశారని ఆరోపించారు. ఆలయంలోని అమ్మవారి మూలవిరాట్‌ను తొలగించేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నట్లు తెలిపారు.

భూసార పరీక్షలపై విద్యార్థులకు శిక్షణ

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని పెదకొమిర ఆదర్శ పాఠశాల, గంపలగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నేల ఆరోగ్యంపై గొల్లపూడి భూసార పరీక్ష కేంద్రం అధికారులు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. నేలకు అవసరమైన స్థూల, సూక్ష్మ పోషకాలపై వివరించారు. పాఠశాలకు మినీ మట్టి పరీక్ష ప్రయోగశాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. విద్యార్థులు రైతుల నుంచి మట్టి నమూనాలు సేకరించి పరీక్ష చేసి సాగు భూముల్లో పోషకాలు, ఎరువుల సిఫార్సులు చేయాల్సి ఉందన్నారు. భూసార పరీక్షా కేంద్రం అధికారులు ఎం.సువర్ణకుమారి, ప్రియాంక, ఏవో హరీష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంపలగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పిస్తూ..

రూ.79 లక్షలతో అభివృద్ధి పనులు

శంకుస్థాపనలో శాసనసభ్యుడు కృష్ణప్రసాద్, నాయకులు

గొల్లపూడి, న్యూస్‌టుడే: గొల్లపూడి శ్రీనివాస నగర్, వస్త్రలతకాలనీలో రహదారులు, కాలువల నిర్మాణానికి మైలవరం శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్ బుధవారం శంకుస్థాపన చేశారు. రూ.79లక్షల 90 వేల వ్యయంతో ఈ అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ నర్రా వాసు, నాయకులు బొమ్మసాని సుబ్బారావు, గూడపాటి పద్మశేఖర్, నారదా తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

విజయవాడ తూర్పు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80085 74652

❖ నాలుగో డివిజన్ వెటర్నరీ కాలనీలో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పొంగుతున్నాయని స్థానిక నివాసి జాస్తి కృష్ణారావు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా ఏఈ దీక్షిత్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన యంత్ర సాయంతో పూడిక తీయించారు. ❖ 3వ డివిజన్ శ్రీ గణేష్ నగర్ కాలనీలో దోమలు ఎక్కువగా ఉన్నాయని స్థానిక నివాసి సత్యనారాయణ.. మలేరియా అధికారి హెచ్.శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందిని పంపి దోమల నివారణ చర్యలు తీసుకున్నారు. ❖ మూడో డివిజన్ కరెన్సీనగర్, జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు వెంబడి 3-14/38 విద్యుత్తు స్తంభానికున్న దీపం వెలగడం లేదని స్థానిక నివాసి కుమార్.. ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు. - న్యూస్‌టుడే, కరెన్సీనగర్

14 నుంచి జాతీయ సదస్సు

మాచవరం, న్యూస్‌టుడే : స్థానిక ఎస్సార్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బోటనీ, బయోకెమిస్ట్రీ విభాగాల ఆధ్వర్యంలో ఈ నెల 14, 15వ తేదీల్లో 'కృత్రిమ మేధస్సు -యంత్ర అభ్యాసం'పై జాతీయ సదస్సు నిర్వహిస్తామని ప్రిన్సిపల్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. దీనికి సంబంధించిన గోడపత్రికను బుధవారం మంగళగిరిలోని కళాశాల విద్యా కమిషనరేట్‌లో కళాశాల విద్యాశాఖ సంచాలకుడు నారాయణ భరత్‌గుప్తా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో కృత్రిమ మేధ కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. ఇలాంటి సదస్సులు విద్యార్థులకు బాగా ఉపయోగపడతాయని చెప్పారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

పటమట, న్యూస్‌టుడే: విద్యుత్తు తీగల మరమ్మతుల నేపథ్యంలో ప్రూఫ్‌బ్రిడ్జి ఉపకేంద్రం పరిధిలో గురువారం ఉదయం 8 నుంచి 11 గంటల మధ్య వీఎం రంగా పార్క్ ఏరియా, ఆశ్రమం రోడ్డు, కోగంటివారి వీధి, ట్రెండ్‌సెట్ అపార్ట్‌మెంట్, సేవానికేతన్, పరుచూరివారి వీధి, మసీదు, జాస్తివారి వీధి, సర్వీస్ రోడ్డు, నేతాజీ రోడ్డు, సీతారామ్ నగర్, కుర్ర సూర్యనారాయణ వీధి, నారా చంద్రబాబు నాయుడు కాలనీ, కన్నా నగర్, మోడరన్ సూపర్ మార్కెట్, ఎస్‌బీఐ కాంప్లెక్స్, రాఘవ నగర్, చెన్నుపాటి రామయ్య కోటయ్య వీధి, ఎయిర్‌టెల్ హెచ్‌టీ సర్వీస్, సత్యనారాయణనగర్, పోలీస్ కాలనీ, హెడ్ పోస్టాఫీసు, ఎస్‌బీఐ బాలాజీనగర్, ఉదగిరి గంగయ్య రోడ్డు, కోరవారి వీధి, కొత్త ఆంజనేయ స్వామి గుడి ఏరియా, మహిత పబ్లిక్ స్కూల్, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సతీష్ తెలిపారు.

అక్రమ కట్టడాలకు బీపీఎస్

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

అక్రమ కట్టడాలు, భవనాలపై జరిమానా విధింపునకు ఉద్దేశించిన బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం(బీపీఎస్) అమలుకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందుకోసం భవన నిర్మాణదారుల నుంచి దాదాపు 18-20 వేల దరఖాస్తులు రావచ్చని, తద్వారా రూ.50-70 కోట్ల పీనలైజేషన్ రుసుము కింద ఆదాయం సమకూరుతుందని లెక్కిస్తున్నారు. 2017కి ముందు బీపీఎస్ పలుమార్లు అమలయ్యింది. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి ఈ పథకం అమలు కాకపోగా నగరంలో వేలాది అక్రమ కట్టడాలు వెలిశాయి. ప్రస్తుతం వీటిని గుర్తించేందుకు సచివాలయ సిబ్బందితో గురువారం నుంచి ఇంటింటి సర్వే చేసేందుకు నిర్ణయించారు. బీపీఎస్ కింద అక్రమ కట్టడాలను క్రమబద్ధీకరించేందుకు ఈనెల 22 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. అక్రమ నిర్మాణదారులు గడువులోపు ఆన్‌లైన్ వెబ్‌సైట్ www.bps.ap.gov.in ద్వారా మాత్రమే తమ దరఖాస్తులను అర్హత కలిగిన ఎల్‌టీపీల ద్వారా సమర్పించాలని సూచించారు.

అనుమతిలేని భవనం

నిబంధనలు ఇవీ.. ☛ ఈ ఏడాది ఆగస్టు 31కి ముందు నిర్మించిన కట్టడాలే పీనలైజేషన్ చేస్తారు. భిన్నంగా సమర్పించిన ఎల్‌టీపీని బ్లాక్‌లిస్టులో పెడతారు. ☛ 120 రోజుల్లోపు రూ.10 వేలు చెల్లించి ప్రాథమికంగా దరఖాస్తు చేసుకోవాలి. ☛ దరఖాస్తు తర్వాత నిర్మాణంలో మార్పులు, చేర్పులు చేసినట్లు వెల్లడైతే ఎల్‌టీపీపై క్రిమినల్ చర్యలు తీసుకుంటారు. ☛ బీపీఎస్ కింద దరఖాస్తు చేసుకుంటే నేరంగా పరిగణించి బిల్డర్, డెవలపర్‌ను బ్లాక్‌లిస్టులో పెడతారు.

పీనలైజేషన్ ఉత్తర్వులు జారీ

మూడు నియోజకవర్గాల్లో..: నిబంధనలు ఉల్లంఘించి మూడు నియోజకవర్గాల్లో అక్రమ కట్టడాలు కోకొల్లలుగా ఉన్నాయి. పాలక సభ్యులు, ముఖ్యప్రజాప్రతినిధులు, నాయకులు వీటిని ప్రధాన ఆదాయ వనరులుగా మార్చుకుని దండుకున్నారు. నగరంలో ప్రాథమికంగా 10 వేల అక్రమ కట్టడాలు ఉంటాయని అధికారులు భావించినా.. మరింత ఎక్కువ ఉంటాయన్న అంచనా వేశారు. సచివాలయ కార్యదర్శులు, క్షేత్రస్థాయి ప్రణాళికాధికారుల ఇంటింటి సర్వే ద్వారా అక్రమకట్టడాల గుర్తింపు సంఖ్య 20 వేలు మించుతుందని భావిస్తున్నారు.

రూ.కోట్ల ఆదాయం..: 2001లో మొదట బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీం(బీఆర్ఎస్) అమలు కాగా.. 2007, 2015, 2017, 2019లో బీపీఎస్ అమలయ్యింది. ఆ సమయంలో 26,770 దరఖాస్తులు అందగా.. 23 వేల నిర్మాణాలు క్రమబద్ధీకరించారు. రూ.120 కోట్ల ఆదాయం సమకూరింది. పలు దరఖాస్తులు షార్ట్‌ఫాల్‌కి వెళ్లగా.. వాటిని బీపీఎస్ కింద తిరిగి క్రమబద్ధీకరించేలా చర్యలు తీసుకుంటున్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

మధురానగర్, న్యూస్‌టుడే : నగరంలోని బి.ఆర్.టి.ఎస్. రోడ్డు పడవల రేవు కూడలి సమీపంలో మంగళవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నలుపు రంగు కారు ఒకటి మితిమీరిన వేగంతో వెళుతోంది. పడవల రేవు వద్ద కుక్క అడ్డు రావడంతో బ్రేక్ కొట్టే వ్యవధి కూడా లేకపోవడంతో కారును పక్కనున్న తిప్పేశారు. గోడను ఢీకొట్టడంతో ముందు భాగం ధ్వంసమైంది. అదే సమయంలో అటు వైపు నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న లావాటి జనార్దన్ (30)ను కారు ఢీకొట్టబోగా త్రుటిలో తప్పించుకున్నారు. ఆ సమయంలో రోడ్డు ఖాళీగా ఉండటంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. డ్రైవర్‌కు చిన్నపాటి గాయం కూడా కాకపోవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. జనార్దన్ ఫిర్యాదు మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త ఆలోచనలు.. విధానాలే తెదేపా బలం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: పార్టీని ప్రజలకు మరింత చేరువచేసేందుకు కొత్త ఆలోచనలు, విధానాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ ముందుకు వెళుతున్నారని, అవే పార్టీకి బలమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. తూర్పు నియోజకవర్గంలోని గురునానక్ కాలనీ నాక్ కల్యాణ మండపంలో క్లస్టర్, కో-క్లస్టర్స్, యూనిట్, కో-యూనిట్, బూత్ కమిటీ ఇన్‌ఛార్జ్‌ల ప్రమాణ స్వీకారం బుధవారం జరిగింది. గద్దె మాట్లాడుతూ ఎన్నికల్లో పార్టీ అపజయం పాలైన సమయంలో బెదరకుండా, నాయకులంతా పార్టీకి అండగా ఉన్నారన్నారు. దేశ విదేశాల్లో పార్టీని విస్తరించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. రానున్న కాలంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఈ నూతన కమిటీలు దోహదపడతాయన్నారు. ఉడా మాజీ ఛైర్మన్ తూమాటి ప్రేమ్‌నాథ్, సీనియర్ నాయకుడు శంకర్‌బాబు, నాయకులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, కార్పొరేటర్లు, మాజీలు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ తదితరులు

పుస్తక పఠనంతో మెరుగైన అవకాశాలు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఆధునిక యాంత్రిక యుగంలో యువతకు ఎన్నో అవకాశాలున్నాయని వాటిని అందిపుచ్చుకోవాలని ఆంధ్రా లయోలా కళాశాల ఇంటర్ వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ బి.సురేష్ కుమార్ అన్నారు. నెల్సన్ మండేలా రచించిన 'లాంగ్ వాక్ టు ఫ్రీడమ్' పుస్తక సమీక్ష కార్యక్రమం బుధవారం కళాశాలలో జరిగింది. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఎం.ధనుష్యశ్రీ పుస్తకాన్ని సమీక్ష చేస్తూ 20వ శతాబ్దపు గొప్ప నాయకుల్లో నెల్సన్ మండేలా ఒకరని పేర్కొన్నారు. ఈ పుస్తకం కేవలం ఒక వ్యక్తి కథ కాదని, సమానత్వం, న్యాయం, మానవ గౌరవం కోసం ఒక దేశం చేసిన పోరాటమని పేర్కొంది. గత 12 ఏళ్లుగా కళాశాలలో పుస్తక సమీక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని గ్రంథాలయాధికారి ప్రసాదరావు వివరించారు. ఈ కార్యక్రమానికి చందన కావ్య సమన్వయకర్తగా వ్యవహరించారు.

బాలికకు బహుమతి అందజేస్తున్న ఫాదర్ సురేష్ కుమార్ తదితరులు

భవన నిర్మాణాలకు అనుమతి తప్పనిసరి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో అనుమతిలేని నిర్మాణాల కూల్చివేత ప్రక్రియ కొనసాగుతోంది. మూడు నియోజకవర్గాల పరిధిలో అక్రమ నిర్మాణాలను నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు బుధవారం కూల్చి వేశారు. పటమట వంక రామయ్య వీధి, విద్యాధరపురం, ముత్యాలంపాడు, వన్‌టౌన్ శివాలయం వీధి, కృష్ణలంక బాబూరావు వీధి ప్రాంతాల్లో నిర్మించిన పలు అక్రమ కట్టడాలతో పాటు, అనుమతిలేకుండా వేసిన నిర్మాణాల శ్లాబులను తొలగించారు. తూర్పులోని పలు నిర్మాణాలను ప్రణాళికాధికారి వసీఉల్లా, మహేష్ ఆధ్వర్యంలో కూల్చి వేశారు. పశ్చిమంలో రిజ్వాన, కృష్ణ ఆధ్వర్యంలో, మధ్య నియోజకవర్గంలో ప్రణాళికాధికారి గిరి నేతృత్వంలో తొలగించారు. చీఫ్ సిటీప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్ మాట్లాడుతూ ప్రతి భవన నిర్మాణానికి అనుమతి తప్పనిసరి అని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పిల్లర్లను తొలగిస్తున్న సిబ్బంది

ప్రజారోగ్య పరిరక్షణకు వైద్య శిబిరాలు దోహదం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: ప్రజారోగ్య పరిరక్షణకు ఉచిత వైద్యశిబిరాలు దోహదపడతాయని విశ్వహిందూ పరిషత్ జాతీయ ట్రస్టీ, పుట్టగుంట హెల్త్ ఫౌండేషన్ ఛైర్మన్ పుట్టగుంట వెంకట సతీష్ కుమార్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ డైమండ్స్, శ్యామనగర్ బిల్డింగ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పుట్టగుంట హెల్త్ ఫౌండేషన్, ఆంధ్ర హాస్పిటల్స్, విన్ విజన్, దుహితా డెంటల్, కిరణ్ వ్యాస్కులర్, ఎంజే నాయుడు హాస్పిటల్స్ సౌజన్యంతో శ్యామనగర్ కమ్యూనిటీ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని సతీష్ ప్రారంభించారు. గుండె, 2డీ ఏకో, కంటి, దంత, చర్మ సంబంధింత వైద్య నిపుణులు హాజరై వైద్యసేవలందించి మందులు అందజేశారు. కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, లయన్స్‌క్లబ్ విజయవాడ డైమండ్స్ అధ్యక్షుడు సూరపనేని వెంకటరత్నం, డాక్టర్ కామినేని అచ్యుత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకుంటున్న సతీష్

క్రీడాకారుడికి అభినందన

విజయవాడ (క్రీడలు): మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ జూనియర్ కళాశాలకు చెందిన ఎస్.లక్ష్మీకుమార్‌ను బుధవారం కళాశాలలో పలువురు అధ్యాపకులు అభినందించారు. ఈ విషయాన్ని ప్రిన్సిపల్ చండి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు కాకినాడలోని డీఎస్ఏ స్టేడియంలో జరిగిన 69వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ అండర్-19 జూడో పోటీల్లో లక్ష్మీకుమార్ కృష్ణా జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి -55 కేజీల కేటగిరీలో తలపడి పసిడి పతకం కైవసం చేసుకున్నాడని పేర్కొన్నారు. ఈ ప్రతిభ ఆధారంగా త్వరలో దిల్లీలో జరిగే జాతీయ స్కూల్ గేమ్స్ జూడో పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు.

రహదారి గుంతలమయం

గురునానక్ కాలనీ నుంచి ఆటోనగర్‌కు వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. ఆటోనగర్ టెక్నీషియన్ హాలు మలుపు వద్ద ఏర్పడిన గోతుల్లో మురుగునీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. వాటిలో వాహనచోదకులు పడిపోతూ గాయాల బారిన పడుతున్నారు. గుంతలు పూడ్చాలని స్థానికులు కోరుతున్నా నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదు. - న్యూస్‌టుడే, కరెన్సీనగర్

దుర్గంధభరితం

రెండో డివిజన్ గుణదల కమ్మరి బజారు పాండురంగ స్వామి గుడి సమీపంలో డ్రైనేజీ మ్యాన్‌హోల్ పొంగుతోంది. ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దుర్గంధం వెదజల్లుతుండడంతో ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని సిబ్బందికి చెప్పినా పూడిక తీయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. - కరెన్సీనగర్, న్యూస్‌టుడే

కొవ్వొత్తుల తయారీలో శిక్షణ

గవర్నర్‌పేట: గుణదల 1వ డివిజన్‌లోని మడోనా జూనియర్, డిగ్రీ మూగ, చెవిటి కళాశాల విద్యార్థులకు ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యంలో సెంటెడ్ కొవ్వొత్తుల తయారీలో శిక్షణ ఇచ్చారు. క్లబ్ జిల్లా కోశాధికారి ఎస్.ఎన్.వి.రాధిక మాట్లాడుతూ.. ప్రస్తుతం మార్కెట్‌లో వీటికి మంచి డిమాండ్ ఉందని తెలిపారు.

12న జిల్లా ఆర్చరీ జట్ల ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా ఆర్చరీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన నగరంలోని వీఎంసీ ఓల్గా ఆర్చరీ మైదానంలో ఉమ్మడి కృష్ణా జిల్లా జూనియర్, సీనియర్ బాలబాలికల రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని ఆ సంఘం అధ్యక్షుడు వీవీ వేణుగోపాలరావు(బుజ్జి), ప్రధాన కార్యదర్శి చెరుకూరి కృష్ణకుమారి తెలిపారు. పాల్గొనే వారు అదేరోజు ఉదయం 7 గంటలకు ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువపత్రం, పాస్‌పోర్టు సైజు ఫొటోతో ఆర్చరీ మైదానంలో రిపోర్టు చేయాలన్నారు. పోటీలో తలపడే వారు కృష్ణా జిల్లా ఆర్చరీ సంఘంలో తమ పేర్లు నమోదు చేసుకున్న వారై ఉండాలన్నారు. ఎంపికైన ఆర్చర్లు ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు నూజివీడులోని శ్రీసారథి ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగే రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల జూనియర్, సీనియర్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో కృష్ణా జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

ఉత్సాహంగా 'స్పోర్ట్స్-ఎ-థాన్' పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: సిద్ధార్థ అకాడమీ స్వర్ణోత్సవాల్లో భాగంగా మొగల్రాజపురంలోని వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ మైదానంలో రెండు రోజులు జరిగే 'స్పోర్ట్స్-ఎ-థాన్' అంతర్ పాఠశాలల ఆటల పోటీలు బుధవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్ బాలబాలికల విభాగాల్లో జరుగుతున్న ఈ పోటీల్లో పలు జట్లు హోరా.. హోరీగా తలపడుతున్నాయి. బాస్కెట్‌బాల్ బాలుర విభాగంలో ఎన్ఎస్ఎం పబ్లిక్ స్కూల్ జట్టుపై నలంద విద్యానికేతన్ జట్టు, విశ్వశాంతి ఇంగ్లిష మీడియం స్కూల్ జట్టుపై గుంటూరు వివా స్కూల్ జట్టు, సెయింట్ ఆన్స్ జట్టుపై ఆతిథ్య వీపీ సిద్ధార్థ, ఎస్పీ సీతారామయ్య హైస్కూల్ జట్టుపై గుంటూరు వివా స్కూల్ జట్టు విజయం సాధించాయి. బాలికల విభాగంలో కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్షియల్ స్కూల్ జట్టుపై ఎన్ఎస్ఎం, ఏఐఎంఈఈ ఇంటర్నేషనల్ స్కూల్ జట్టుపై ఆతిథ్య వీపీ సిద్ధార్థ, డిల్లీ పబ్లిక్ స్కూల్ జట్టుపై నలంద విద్యా నికేతన్ జట్టు విజయం సాధించాయి. స్థానిక ఎస్‌డీఎం సిద్ధార్థ మహిళా కళాశాలలోని ఇండోర్ స్టేడియంలో ప్రారంభమైన బ్యాడ్మింటన్ పోటీలను కళాశాల ప్రిన్సిపల్ వీవీఎస్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అండర్-14 బాలికల సింగిల్స్‌లో నలంద విద్యానికేతన్, వీపీ సిద్ధార్థ, బాలుర విభాగంలో డిల్లీ పబ్లిక్, డాన్ బాస్కో, బాలికల డబుల్స్‌లో వీపీ సిద్ధార్థ, కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్, బాలుర డబుల్స్‌లో వీపీ సిద్ధార్థ, ఎన్ఎస్ఎం, అండర్-17 బాలికల సింగిల్స్‌లో ఎన్ఎస్ఎం, వీపీ సిద్ధార్థ, బాలుర సింగిల్స్‌లో ఎన్ఎస్ఎం, డిల్లీ పబ్లిక్, బాలికల డబుల్స్‌లో వీపీ సిద్ధార్థ, కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్, బాలుర డబుల్స్‌లో ఎన్ఎస్ఎం, సెయింట్ జాన్స్ స్కూల్ జట్లు ఫైనల్‌లో ప్రవేశించాయని స్కూల్ ప్రిన్సిపల్ మేడా సీతారామయ్య తెలిపారు.

బాలికల డబుల్స్‌లో తలపడుతున్న క్రీడాకారిణులు

'వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వద్దు'

పటమట: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఎన్టీఆర్ జిల్లా వైకాపా అధ్యక్షుడు దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో బుధవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. రామలింగేశ్వరనగర్ నుంచి పటమటలంక, దర్శిపేట పటమట మీదుగా తూర్పు తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి ఆర్ఐ బి.ఈశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ వైకాపా డివిజన్ నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఐకు వినతిపత్రం అందజేస్తున్న అవినాష్

షూటింగ్ పోటీల్లో సత్తా

విజయవాడ క్రీడలు: తాడిగడపలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని దాయం అక్షయి రాష్ట్ర స్థాయి షూటింగ్ పోటీల్లో సత్తా చాటి పసిడి పతకం కైవసం చేసుకుందని ప్రిన్సిపల్ కె.కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 9వ తేదీన ఒంగోలులో జరిగిన 69వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ అండర్-19 రైఫిల్ షూటింగ్ పోటీల్లో అక్షయి కృష్ణా జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి 10 మీటర్ల పీప్ సైట్ ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో పసిడి పతకం సొంతం చేసుకుందని పేర్కొన్నారు. ఈ ప్రతిభ ఆధారంగా వచ్చే నెలలో భోపాల్‌లో జరిగే జాతీయ స్కూల్ గేమ్స్ షూటింగ్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని వివరించారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్ సంతోష్‌రెడ్డి, సీఈవో సురేంద్రరెడ్డి, జీఎం రాజేంద్రప్రసాద్ అక్షయిని అభినందించారు.

పాత పాస్‌పోర్ట్ పోయినది
విజయవాడ పటమటలంక వాస్తవ్యులు సూరపనేని సాత్విక్ S/o. సురేష్ D.No. 40-25-30 SNR విల్లా, పాస్‌పోర్ట్ నెం: M4354962 నెంబరు గల పాత పాస్‌పోర్ట్ పోయినది. దొరికిన వారు ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు.
✆ 95503 91234

ప్రకటన

నా క్లయింటు యన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ, పటమట, వై.వెంకటేశ్వరరావు వీధి, డోర్ నెం. 56-4-39/1రు కాపురస్తులు అద్దేపల్లి కళ్యాణ చక్రవర్తి, తండ్రి: హేమసుందరరావు గారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా.. నా క్లయింటు యీ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని హైదరాబాద్ కాపురస్తులు కొడాలి (లేటు) సత్యనారాయణ గారి కుమారుడు కొడాలి వెంకట దుర్గాప్రసాద్ గారి వద్ద నుండి కొనుగోలు చేయబోవుచున్నారు. సదరు కొడాలి వెంకట దుర్గాప్రసాద్ గారికి వారి తల్లిగారైన కొడాలి లలితకుమారి గారు ది. 09-09-2022వ తారీఖున దఖలు దస్తావేజును వ్రాయించుకుని గుణదల సబ్-రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకం, దస్తావేజు నెం. 6737/2022రుగా రిజిష్టరు కాబడి దఖలు దస్తావేజు రీత్యా వారికి సంక్రమించి వారి స్వాధీన సంపూర్ణ సర్వహక్కులతో నిర్వివాదముగా అనుభవించుచున్నారని తెలిపినారు. సదరు ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని నా క్లయింటు కొనుగోలు చేయుటకు విక్రయ ఖరారు పొందియుండి కొంత సొమ్ము అడ్వాన్సుగా చెల్లించి త్వరలో సక్రమమైన విక్రయ దస్తావేజును నా క్లయింటు వారి పేరగాని, వారు కోరిన వారి పేరగాని రిజిష్టరు చేసుకొనబోవుచున్నారు. కావున సదరు విక్రయ ఒప్పందముపై ఎవ్వరికైనా ఎట్టి క్లయిములు, వారసత్వ హక్కులుగాని, ఆక్షేపణలుగాని, అభ్యంతరములు, తగాయిదాలు వగైరా ఏమైననూ వున్నయెడల ఈ ప్రకటన తేదీ నుండి 15 రోజులలోగా నాకు తెలియపరచగలరు. సదరు గడువు తేదీ దాటిన తరువాత నాకు వచ్చు ఎట్టి ఆక్షేపణలుగాని, అభ్యంతరములు గాని నా క్లయింటును బైండ్ చేయజాలవని ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడమైనది.
షెడ్యూలు: యన్.టి.ఆర్. జిల్లా, గుణదల జాయింటు సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, గుణదల, జవహర్ ఆటోనగర్‌లో వున్నటువంటి గుణదల రీ. సర్వే నెం. 494రు దాఖలా బ్లాకు నెం. బి-6, ప్లాటు నెం. 34, డోర్ నెం. 54-8-10, అసెస్‌మెంటు నెం. 277004రు దాఖలా చ.గ. 500లు స్థిరాస్తి పారిశ్రామిక స్థలము అందలి గల ఎ.సి.సి. రేకుల షెడ్డునకు **హద్దులు: తూర్పు:** కార్పొరేషన్ వారి రోడ్డు, **దక్షిణం:** ప్లాటు నెం. 33రు దాఖలా ఆస్తి, **పడమర:** ప్లాటు నెం. 10రు దాఖలా ఆస్తి, **ఉత్తరం:** ప్లాటు నెం.35రు దాఖలా ఆస్తి. యీ నాలుగు హద్దుల మధ్య చ.గ. 500లు లేక చ.మీ. 418.06ర్లు స్థిరాస్తి పారిశ్రామిక స్థలము అందలి గల ఎ.సి.సి. రేకుల షెడ్డు అందలి గల యావత్తు యీజ్‌మెంట్ హక్కులతో సహా.

ఇట్లు **Y. Bala Krishna,** B.Sc., LL.B.
Advocate, Near Patamata Sub Registrar Office, Kalanagar, Benz Circle, Vijayawada-10, Ph: 9347284499
విజయవాడ, తేది: 12-11-2025

ప్రయాణికుడి నిజాయతీ

కృష్ణలంక, న్యూస్‌టుడే: బస్సులో తనకు దొరికిన నగదుతో ఉన్న బ్యాగును ఓ ప్రయాణికుడు నిజాయతీగా పోలీసులకు అప్పగించిన ఘటన బుధవారం కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. విశాఖపట్నం మధురవాడ పీఎం పాలెంకు చెందిన మాదినేని సునీల్ కుమార్ రియల్ ఎస్టేట్, కేటరింగ్ తదితర వ్యాపారాలు చేస్తుంటారు. విజయవాడలో ఒకరికి నగదు ఇవ్వాల్సి రావడంతో బ్యాగుతో మంగళవారం రాత్రి విశాఖలో బస్సెక్కి బుధవారం ఉదయం బస్‌స్టేషన్‌లో దిగారు. ఈ క్రమంలో బ్యాగును బస్సులో వదిలి వెళ్లిపోయారు. అదే బస్సులో ప్రయాణిస్తున్న వేరొక ప్రయాణికుడైన శ్రీనివాసరావుకు ఆ బ్యాగు దొరకడంతో దానిని తీసుకుని విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు అప్పగించారు. కొద్ది సేపటికి బాధితుడు సునీల్‌కుమార్ కృష్ణలంక పీఎస్‌కు వచ్చి తాను బస్సులో రూ.6 లక్షలున్న బ్యాగు మర్చిపోయినట్లుగా ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. ఎస్సై భానుప్రసాద్ అతడి వద్ద వివరాలు సేకరించి నగదుతో ఉన్న బ్యాగును అందజేశారు. శ్రీనివాసరావు నిజాయతీని పలువురు ప్రశంసించారు.

ఎస్ఐ, కానిస్టేబుల్ సమక్షంలో నగదు అందుకుంటున్న సునీల్ కుమార్, వృత్తంలో శ్రీనివాసరావు(బ్యాగు అప్పగించిన వ్యక్తి)

టికెట్టు లేని ప్రయాణికుల ద్వారా రూ.8.59 కోట్ల ఆదాయం

విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: విజయవాడ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజరు బి.ప్రశాంత్‌కుమార్ పర్యవేక్షణలో ఏసీఎం బీఎన్ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ ఏడాది అక్టోబరులో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో డివిజన్‌కు రికార్డు స్థాయిలో రూ.8.59కోట్ల ఆదాయం లభించింది. ఈ తనిఖీల్లో మొత్తం 56,957 మంది టికెట్టు లేని ప్రయాణికులను గుర్తించి వారి నుంచి రూ.5.06 కోట్లు, సరైన టికెట్టు లేకుండా ప్రయాణించిన 64,998 మంది నుంచి 3.50 కోట్లు, 871 మంది ప్రయాణికుల లగేజీ వ్యత్యాసం ద్వారా రూ.1.77 లక్షలు జరిమానాగా వసూలు చేశారు. ఈ సందర్భంగా బుధవారం డీఆర్ఎం మోహిత్ సొనాకియా విజయవాడ కమర్షియల్ అధికారులు, తనిఖీ సిబ్బందిని అభినందించారు.

కమర్షియల్ సిబ్బందితో డీఆర్ఎం మోహిత్ సొనాకియా

సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు డిమాండ్

బెంజిసర్కిల్ (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: ఎంతో మంది భవన నిర్మాణ కార్మికులకు ప్రయోజనం చేకూర్చే సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సీఐటీయూ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ విజయవాడ తూర్పు నగర కమిటీ ఆధ్వర్యంలో బెంజిసర్కిల్ వద్ద బుధవారం కార్మికులు నిరసన చేశారు. ఆయన మాట్లాడుతూ బోర్డులో ఉన్న రూ.2 వేల కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. తూర్పు నగర బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.బి.రాజు మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన భవన నిర్మాణ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, నగరంలో అలంకార్ కూడలి వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. పనులు బంద్ చేసి పాల్గొనాలని పిలుపునిచ్చారు. నగర నాయకులు వి.గురుమూర్తి, వై.ఏడుకొండలు, ఎం.నాగమల్లేశ్వరరావు, బి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల అందజేత

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: పాఠశాల స్థాయిలో విద్యార్థులను తీర్చిదిద్దేది పోటీలేనని ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ జి.సమరం అన్నారు. హెల్త్ వర్సిటీ సమీపంలోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో వివిధ అంశాలపై రెండు రోజులు నిర్వహించిన పోటీలు బుధవారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సమరం విజేతలకు బహుమతులు అందజేశారు. ముందుగా పాఠశాల కరస్పాండెంట్ టి.సుమన్, షామ్రాక్ ఇంటర్నేషనల్ స్కూల్ అధ్యక్షుడు మోనికా సుమన్, విద్యా సంస్థల సీఏవో కె.రామ భారతి, ప్రిన్సిపల్ తరుణ్, షర్మిలలు పర్యవేక్షించగా, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విజేతలతో డాక్టర్ సమరం తదితరులు

రెండు రోజుల పోలీస్ కస్టడీకి అరుణ

విజయవాడ నేరవార్తలు: ఎస్సై, అంగన్‌వాడీ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ వృద్ధుడిని మోసం చేసిన కేసులో నిందితురాలైన నిడిగుంట అరుణను రెండు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ విజయవాడలోని ఒకటో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడకు చెందిన రమేష్‌బాబు బంధువులకు ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ అరుణ అతడి నుంచి రూ.24.5 లక్షలు వసూలు చేసింది. దీనిపై సూర్యారావుపేట పోలీసులు గత నెల 13న కేసు నమోదు చేశారు. పీటీ వారెంట్‌పై ఆమెను విజయవాడ న్యాయస్థానంలో హాజరుపరిచారు. మరిన్ని వివరాలు రాబట్టేందుకు ఆమెను నాలుగు రోజుల పోలీసకస్టడీకి ఇవ్వాలని పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఈ నెల 13, 14 తేదీల్లో కస్టడీకి అనుమతిస్తూ న్యాయమూర్తి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న అరుణను విజయవాడకు తీసుకువచ్చేందుకు పోలీసులు బుధవారం రాత్రి బయలుదేరారు. 13, 14 తేదీల్లో విచారణ అనంతరం తిరిగి ఆమెను 15వ తేదీన నెల్లూరు కేంద్ర కారాగారంలో అప్పగించాలని న్యాయమూర్తి ఆదేశించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య ఆమెను విచారించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

ప్రథమ వర్ధంతి



జననం 20-12-1941
మరణం 25-11-2024
కీ॥శే॥ ఆరిగపూడి విశ్వకుమార్ గారు
ప్రేమ, మంచితనం, మానవత్వం మూర్తీభవించిన మహోన్నత వ్యక్తి మా ఉన్నతికి అహర్నిశలు కృషిచేసిన ఆదర్శమూర్తి.. దివికేగి నేటికి ఒక సంవత్సర కాలము గడిచిననూ సదా మీ స్మృతినే స్మరిస్తూ..
కుమారుడు – కోడలు: ఆరిగపూడి శ్యామ్‌కుమార్ - మాధవి
కుమార్తె – అల్లుడు: కోనేరు ఇందిరాదేవి - వెంకటవిష్ణువర్ధనప్రసాద్ (విష్ణు)
మనుమరాండ్రు, మనుమలు
డా॥ కోనేరు మానసదేవి - పమిడి భానుచందర్
కోనేరు సౌమ్యదేవి - కర్లపూడి మురళీకృష్ణ
ఆరిగపూడి నవ్య మరియు కుటుంబ సభ్యులు
ప్రథమ వర్ధంతి: ది. 14-11-2025 శుక్రవారం నాడు విజయవాడ బెంజిసర్కిల్ దగ్గర, వి.కన్వెన్షన్ సెంటర్ నందు జరుపబడును.

నందిగామ

•నందిగామ •జగ్గయ్యపేట

కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు

ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ప్రభుత్వ విప్ సౌమ్య

నందిగామ, న్యూస్‌టుడే: తెదేపాలో కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య తెలిపారు. స్థానిక కాకాని నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం నందిగామ పట్టణ, మండల గ్రామ, వార్డు, మండల కమిటీలు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్ కన్వీనర్లతో ఆమె ప్రమాణ స్వీకారం చేయించారు. సౌమ్య మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి పని చేస్తున్న బీసీ నాయకుడు మనతోటల శ్రీరామ్‌ను దాసరి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని కోరారు. ఎన్ఎస్పీ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు, పార్టీ పరిశీలకుడు బచ్చుల సుబ్రహ్మణ్యం బోస్, మున్సిపల్ వైస్‌ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

★ రాష్ట్ర దాసరి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన తెదేపా సీనియర్ నాయకుడు మనతోటల శ్రీరామ్‌ను ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య బుధవారం తన కార్యాలయంలో సత్కరించారు.

పరిపాలనపై అవగాహన తప్పనిసరి

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో పరిపాలన, ప్రజల అవసరాలు, సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన అవసరమని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. మండలంలోని ముచ్చింతాలలో మూడు రోజుల నుంచి ఏడుగురు శిక్షణ ఐఏఎస్‌లు పర్యటిస్తున్నారు. బుధవారం శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఈసందర్భంగా ప్రత్యేకంగా కలెక్టర్ గ్రామానికి వచ్చి వారితో మాట్లాడి పలు సూచనలు ఇచ్చారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో శిక్షణ తీరును ప్రత్యేకంగా పరిశీలించి మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.బాలకృష్ణ, తహసీల్దారు శాంతలక్ష్మి, ఎంపీడీవో శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ ఐఏఎస్‌లకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

అసంపూర్తిగా సహకార భవనం

పేరకలపాడు (కంచికచర్ల), న్యూస్‌టుడే: నాటి వైకాపా పాలకుల తప్పిదాలు పేరకలపాడు రైతులకు శాపంలా మారాయి. పీఏసీఎస్ భవనం, గోదాము నిర్మాణానికి 2022లో అప్పటి ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు శంకుస్థాపన చేశారు. నిబంధనలు ఏ మాత్రం పాటించకుండా నిర్మాణం చేపట్టడంతో స్థానికులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో భవనం పనులు ఆదిలోనే నిలిచిపోయాయి. మంజూరైన నిధులు సైతం పక్కదారి పట్టాయని గ్రామస్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. మరోపక్క రైతులు రుణాల కోసం కంచికచర్ల వెళ్లాల్సి వస్తోంది. వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ ఉంచుకునేందుకు గోదాము లేక ప్రైవేటు గోదాములను ఆశ్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా సహకార శాఖ ఉన్నతాధికారులు పక్కదారి పట్టిన నిధుల లెక్క తేల్చడంతో పాటు గ్రామంలో నూతన భవన నిర్మాణం చేయాలని కోరుతున్నారు.

ఇంట్లో పంట.. కంట్లో మంట

★ కొనేవారు లేక పుచ్చిపోతున్న పెసలు ★ ఆందోళనలో రైతులు

కంచికచర్ల, న్యూస్‌టుడే

విపత్తు వాతావరణ పరిస్థితులు, తెగుళ్ల బెడద, పెరిగిన పెట్టుబడులతో ఆరుగాలం శ్రమించి పంటను పండించిన రైతులకు పంట అమ్ముకోవడంలో కష్టాలు తప్పడం లేదు. ఖరీఫ్ సీజన్‌లో పండించిన పెసర పంట చేతికొచ్చి మూడు నెలలు దాటినా పంటను అమ్ముకోలేక రైతులు దిక్కులు చూస్తున్నారు.

మార్కెట్ యార్డులో నిల్వ ఉన్న పెసలు

★ నందిగామ డివిజన్ పరిధిలో సుమారు 3500 హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో పెసర సాగు చేశారు. ఇందులో అత్యధికంగా కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో సాగులో ఉంది. అనేక కష్టనష్టాల నడుమ పండించిన పంట రైతుల చేతికొచ్చి మూడు నెలలు దాటింది. ప్రభుత్వం పెసరకు మద్దతు ధర క్వింటా రూ.8768గా నిర్ణయించింది. కానీ అధికారులు ఇంతవరకు కొనుగోళ్ల గురించి పట్టించుకోలేదు. ఇతర పంటల పెట్టుబడులకు ఉపయోగపడుతుంది అనుకున్న పెసర సాగులో అమ్ముకోలేక రైతులు తిరిగి పెట్టుబడుల కోసం ఇతర మార్గాల్లో ప్రయత్నించాల్సి వస్తోంది. నెల తరబడి పెసలు నిల్వ ఉంచలేక, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్పు దొరకడం లేదు

నేను 10 ఎకరాల్లో పెసర వేశా. పంట చేతికి రాగానే ఇస్తామంటూ పెట్టుబడికి డబ్బులు తీసుకొచ్చాం. తీరా కొనేవారు లేక పంట అలాగే ఉంది. ఇతర పంటలకు పెట్టుబడికి అప్పు ఇచ్చే వారు లేరు. మా పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ప్రభుత్వం వెంటనే పెసర పంట కొనాలి. **-కనకాల వాసు, రైతు పేరకలపాడు**

పెట్టుబడిపై వడ్డీ కూడా రాదు

నేను 10 ఎకరాల్లో వేసిన పెసరకు పెట్టుబడులు భారీగా అయ్యాయి. ఎకరం రూ.15 వేలు చొప్పున కౌలుకు తీసుకొని పంట వేశా. పెట్టుబడి బయట వడ్డీకి తెచ్చినదే. ఇప్పుడు వాటి వడ్డీకి కూడా వచ్చేలా లేదు. అధికారుల నిర్లక్ష్యం మాకు శాపంలా మారింది. వెంటనే పెసలు కొని రైతులను ఆదుకోవాలి. **- ఇలాసాగరపు భాగ్యరాజ్, రైతు**

సొంతింటి కల సాకారం

జగ్గయ్యపేట, వత్సవాయి, న్యూస్‌టుడే: పేద ప్రజలకు సొంత ఇంటిలో ఉండాలన్న కలను కూటమి ప్రభుత్వం సాకారం చేయడం వారికి ఒక వరమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. వత్సవాయిలో బుధవారం ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య చేపట్టిన పక్కా గృహాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న సామూహిక గృహ ప్రవేశాలు పేదల కళ్లలో వెలుగులు నింపుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటాగా రూ.1.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం 60 శాతం వాటాగా రూ.2.5 లక్షలు అందించడం ద్వారా జరుగుతున్న నిర్మాణాల్లో ఎక్కడా బిల్లు చెల్లింపుల్లో జాప్యం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను సూచించారు. కూటమి ప్రభుత్వం ప్రతి పేదవారికి ఇల్లు ఉండేలా కృషి చేస్తుందని అన్నారు. 17 నెలల్లోనే రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్లు పేదలకు అందించడం అభ్యుదయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ బాలకృష్ణ, నాయకులు వడ్లమూడి రాంబాబు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మఠం శివాలయానికి విరాళం

జగ్గయ్యపేట: పట్టణంలోని కృష్ణశిలలతో నిర్మిస్తున్న మఠం శివాలయానికి స్థానికులు వేముల ఆంజనేయులు, మధుసూదనరావు, సుధీర్ ఉపేందర్ తమ తండ్రి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం రూ.25 వేలు విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వారికి జ్ఞాపికలు అందించారు.

స్వామిత్వపై సమావేశం

చందర్లపాడు: ముప్పాళ్లలో శిక్షణ ఐఏఎస్‌ల క్షేత్ర స్థాయి అధ్యయనం ముగిసింది. ప్రభుత్వం చేపడుతున్న స్వామిత్వ కార్యక్రమంపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అనంతరం మండల, గ్రామస్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పలు అంశాలపై చర్చించారు. సర్పంచి కుసుమరాజు వీరమ్మ, పంచాయతీ కార్యదర్శి సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

నందిగామ, న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాలను ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య బుధవారం నందిగామలో తన కార్యాలయంలో ఆవిష్కరించారు. వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయని గ్రంథాలయ అధికారి అల్లూరు రామచంద్రుడు తెలిపారు. దీనిలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వక్తృత్వం, చిత్రలేఖనం తదితర విభాగాల్లో జూనియర్, సీనియర్లకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామన్నారు. అనంతరం బహుమతులు పంపిణీ చేస్తామని చెప్పారు.

మొక్కజొన్న కొనుగోలుకు వినతి

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: సొసైటీల ద్వారా మొక్కజొన్న కొనుగోలు చేయాలని కోరుతూ వెలగపూడి సచివాలయంలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ రాజశేఖర్‌కు గోళ్లమూడి సొసైటీ అధ్యక్షుడు గాడిపర్తి శ్రీనివాసరావు బుధవారం వినతిపత్రం అందజేశారు. సొసైటీ చుట్టుపక్కల గ్రామాల్లో వెయ్యి ఎకరాల్లో ఈ పంటను సాగు చేశారని చెప్పారు. తుపాన్‌వల్ల వర్షాలకు దిగుబడి తగ్గిందని, గ్రామాల్లో దళారులు క్వింటా రూ.1800లకు కొనుగోలు చేయడంవల్ల రెండు విధాలా నష్టపోతున్నారని తెలిపారు. రైతులు ఎకరానికి రూ.15 వేలు నష్టపోతున్నారని అన్నారు. సొసైటీల ద్వారా క్వింటా రూ.2300 మద్దతు ధరకు కొనుగోలు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

చంద్రమౌళీశ్వరాలయంలో ద్వాదశ ప్రదక్షిణలు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని పురాతన చంద్రమౌళీశ్వరాలయం కల్యాణోత్సవంలో భాగంగా బుధవారం అర్చకులు పిల్లలమర్రి నాగకృష్ణశర్మ, పల్లికూన కేశవప్రసాద్‌ల ఆధ్వర్యంలో స్వామివారికి ద్వాదశ ప్రదక్షిణల క్రతువు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రానికి మోక్షం లేదా?

పేదలకు ఆరోగ్య సేవలు అందుబాటులోకి తేవాలని కేంద్ర ప్రభుత్వం 2019-24 మధ్య గ్రామాల్లో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రాలను నిర్మించేందుకు ఉపాధి పథకం కింద నిధులు మంజూరు చేసింది. గండేపల్లిలో ఆరోగ్య కేంద్ర నిర్మాణం దాదాపు పూర్తయ్యింది. మరికొన్ని నిధులు కేటాయిస్తే ఈ భవనం అందుబాటులోకి తీసుకురావచ్చని ఆ దిశగా అధికారులు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, గండేపల్లి (కంచికచర్ల)**

నష్టపోయాం.. ఆదుకోరూ..

మండలంలోని మాగల్లు వద్ద మునేటి వరదకు పంట నష్టం ఏర్పడి రైతులు ఆందోళన చెందుతున్నారు. తువ్వ కాలువ తలుపుల బంధం ఆయకట్టులో 50 ఎకరాల్లో వరిపంట నీట మునిగింది. పొట్టదశలో ఉన్న వరిపంట నీటిలో మునిగి తాలు కంకి ఏర్పడి నష్టపోయామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వరి కంకుల్లో గింజు గట్టిపడక తీవ్రంగా నష్టపోయామని, ఎకరాకు రూ.35 వేలు పెట్టుబడి పెట్టామని చెప్పారు. మునేటి వరదతో ముచ్చింతాల వద్ద ఏర్పడ్డ మైసమ్మ గండిని పూడ్చాలని మాగల్లు తెదేపా నాయకుడు మాచారపు రామకోటేశ్వరరావు కోరారు. ఈ గండివల్ల 50 ఎకరాల్లో వరిపంట కొట్టుకుపోయిందని చెప్పారు.

- నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

అండర్ పాస్ వద్ద అగచాట్లు

పట్టణంలోని విద్యానగర్, ధనంబోడు కాలనీలకు వెళ్లే మార్గంలో ఉన్న రైల్వే అండర్ పాసింగ్ నిరంతరం బురద నీటితో నిండి ఉండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రెండేళ్లుగా సమస్యకు శాశ్వత పరిష్కారం లేకపోవడంతో రాకపోకలు సాగిస్తున్న వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం అదే ప్రాంతంలోని నాగలక్ష్మీ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో పలు జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలి రానున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జగ్గయ్యపేట**

మలుపులో.. జాగ్రత్త..!

అడవిరావులపాడు-లింగాలపాడు ఆర్అండ్‌బీ రహదారిలో ప్రమాదకర మలుపులు వాహనచోదకులను వణికిస్తున్నాయి. అడవిరావులపాడు శివాలయం వద్ద మలుపు ప్రమాదకరంగా ఉంది. ఎదురెదురు వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించని పరిస్థితి నెలకొంది. అధికారులు మలుపు రహదారిని విస్తరించాల్సి ఉంది. ఇక్కడ హెచ్చరిక బోర్డులు కనిపించడం లేదు. రాత్రి వేళ మరింత ప్రమాదభరితంగా ఉంది. ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, నందిగామ గ్రామీణం**

ఆలయాల్లో రుద్రాభిషేకం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ శివాలయంలో బుధవారం అర్చకుడు దండిబొట్ల బాలకృష్ణశాస్త్రి.. రామలింగేశ్వరస్వామికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. పల్లగిరిపై భవానీశంకరుని వాయులింగానికి రుద్రాభిషేకం చేశారు. గోళ్లమూడిలో శంభులింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం చేశారు.

14 నుంచి పవిత్రోత్సవాలు

విద్యుత్తు వెలుగులో రామాలయం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: ఈనెల 14 నుంచి పవిత్రోత్సవాల నేపథ్యంలో నందిగామ రామాలయం ముస్తాబు చేశారు. వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవాలయ పరిసరాలను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు.

నాగలక్ష్మి దేవాలయ వార్షికోత్సవాలు ప్రారంభం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: స్థానిక విద్యానగర్‌లోని నాగలక్ష్మి అమ్మవారి దేవాలయ 37వ వార్షికోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈనెల 20 వరకూ వార్షికోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. ఈనెల 20న అమ్మవారి ఊరేగింపుతో కార్యక్రమాలు ముగుస్తాయని ఆలయ అర్చకులు తెలిపారు.

అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకుడు

విద్యార్థుల హాజరు శాతం పెంచండి

వత్సవాయి: మండలంలో భీమవరం, మక్కపేట, వత్సవాయి పాఠశాలల్లో సమగ్ర శిక్షా అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో ఏ విధంగా మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు హాజరు, సమగ్ర శిక్షా ద్వారా విద్యార్థులకు పంపిణీ చేసిన స్టూడెంట్స్ కిట్స్, గ్రంథాలయ పుస్తకాలు, ఎస్ఏ-1 పరీక్షలు నిర్వహణ అంశాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం పెరగాలని ఉపాధ్యాయులకు సూచించారు. సమగ్ర శిక్షా అధికారులు అశోక్, చంద్రశేఖర్, ఎంఈవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు పరిశీలిస్తున్న అధికారులు

ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించండి

చందర్లపాడు, న్యూస్‌టుడే: స్థానిక తెదేపా కార్యాలయంలో పార్టీ గ్రామ కమిటీలు, క్లస్టర్ యూనిట్ సమన్వయకర్తలు, బూత్ కన్వీనర్ల ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం రాత్రి నిర్వహించారు. ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య సమక్షంలో ఎన్ఎస్పీ ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు ప్రమాణం చేయించారు. సౌమ్య మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని కోరారు. మేకల సుధాకర్, వాసిరెడ్డి ప్రసాద్, కందుల కల్పన, షేక్ సైదా, బొందల రామకృష్ణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవ్‌లో 'శ్రీవిద్య' సత్తా

విద్యార్థులతో డైరెక్టర్ రాము, ప్రిన్సిపల్ చిన్నజోష్

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: వీవీఐటీ బాలోత్సవ్ పోటీల్లో నందిగామ శ్రీవిద్య ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారు. మొత్తం 625 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక పాఠశాల విద్యార్థులు 32 అంశాల్లో ప్రతిభ చాటి ఈ విజయాన్ని సొంతం చేసుకున్నారని పాఠశాల ఛైర్మన్ కందుల మల్లికార్జునరావు తెలిపారు. ఆంగ్ల వక్తృత్వంలో ఎస్‌డీ షాహిద్ ప్రథమ, చిత్రలేఖనంలో టి.తనూష ద్వితీయ, డిజిటల్ చిత్రలేఖనంలో కె.సృజన్ రెండో స్థానం, స్కిట్‌లో పి.స్వాతిక్ గ్రూప్‌నకు రెండో బహుమతి, విచిత్ర వేషధారణలో డి.హిమాన్యకు రెండో బహుమతి, సంస్కృత శ్లోకంలో కె.వర్షితకు మూడో బహుమతి, జానపద నృత్యం గ్రూపులో, ఆంగ్ల వక్తృత్వంలో డి.దేవర్షిణి, ఎస్‌కే ఆసిఫ్, తెలుగు వక్తృత్వంలో వదనాశ్రీ, మైమ్‌లో కె.సూక్ష్మదర్శి, విచిత్ర వేషధారణలో సత్యప్రేరణ, ఎం.ఉమాశ్రీజ ప్రత్యేక బహుమతులు సాధించారని చెప్పారు. బుధవారం వీరిని పాఠశాల డైరెక్టర్ మేకల రాము, ప్రిన్సిపల్ ఐ.చిన్నజోష్, ఛైర్మన్ అభినందించారు.

క్రీడాకారులకు దుస్తుల వితరణ

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ కేవీఆర్ కళాశాలకు చెందిన 25 మంది క్రీడాకారులకు బుధవారం స్థానిక కాకతీయ రెస్టారెంట్ యజమాని గింజుపల్లి పుల్లారావు దుస్తులు వితరణ చేశారు. త్వరలో ఇక్కడ నిర్వహించే అంతర కళాశాలల పోటీలకు హాజరయ్యే వారికి వీటిని అందజేయనున్నారు. ప్రిన్సిపల్ పి.రాయప్ప, ఫిజికల్ డైరెక్టర్ వాసిరెడ్డి నాగేశ్వరరావు దాతను అభినందించారు.

వైద్య శిబిరానికి స్పందన

విద్యార్థులతో తెదేపా నాయకుడు సీతారామయ్య, నరసింహారావు తదితరులు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: జయప్రద ఫౌండేషన్ ఛైర్మన్ తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ తొండెపు దశరథ జనార్దన్ ఆధ్వర్యంలో కొల్లికూళ్ల గ్రామంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 326 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 295 మందికి కంటి పరీక్షలు చేయగా.. 119 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. వారికి ఫౌండేషన్ తరపున ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేస్తామని కోఆర్డినేటర్ కట్టా వెంకట నరసింహరావు తెలిపారు. దృష్టి లోపాలు, శుక్లాలు ఉన్న 39 మందిని గుర్తించామని.. వీరికి త్వరలో విజయవాడలోని శంకర కంటి చికిత్సాలయంలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని వెల్లడించారు. 189 మందికి మధుమేహం, రక్తపోటు తదితర పరీక్షలు చేశారు. గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 155 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి అనారోగ్యానికి గురైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జయప్రద ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ చింతల వెంకట సీతారామయ్య, మాజీ సర్పంచి జిల్లేపల్లి సుధీర్‌బాబు, నాయకులు ఆర్.శ్రీను, కె.ఉమామహేశ్వరరావు, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలి

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: విశ్రాంత ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న గ్రాట్యుటీ, సరెండర్ సెలవులు, ఏపీజీఎల్‌బీ, పీఎఫ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు కోరారు. స్థానిక జీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో సంఘ సమావేశం నిర్వహించారు. దీనిలో సంఘ సహ అధ్యక్షురాలు పి.లీల సౌజన్యంతో మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్లు పంపిణీ చేశారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మైనార్టీ ఉపాధ్యాయురాలు షాహినాబేగంను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంఘ సహ అధ్యక్షుడు కృష్ణయ్య, సంఘ జిల్లా కార్యదర్శులు షేక్ ఖైమర్, జిల్లేపల్లి సుధానంద్, మండల శాఖ అధ్యక్షుడు అల్లిక నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పెనుగంచిప్రోలు మండల శాఖ ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఎన్నికల అధికారి మన్నేపల్లి కృష్ణయ్యల సమక్షంలో ఎన్నిక నిర్వహించారు. సంఘ గౌరవాధ్యక్షుడిగా పాము నాగేశ్వరరావు, అధ్యక్షురాలిగా నందం భారతి, ప్రధాన కార్యదర్శిగా చాగర్ల రామారావు, సహ అధ్యక్షురాలిగా షాహినాబేగం, కోశాధికారిగా మంగినేని రామకృష్ణ, కార్యదర్శులుగా బిట్ట వెంకటరమణ, బాణావత్ వెంకటేశ్వర్లు నాయక్, నవకోటి, పి.ఉష, డి.రవీంద్రకుమార్, మేకల సూర్యనారాయణ, నల్లపునేని సుబ్రమణ్య స్వామి, కౌన్సిలర్లుగా చాగర్ల రామారావు, ఎల్.త్రివేణి, సుబ్బారావు, కిశోర్ ఎన్నికయ్యారు.

'వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు'

నందిగామ: ప్రదర్శనలో ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్, జగన్మోహనరావు తదితరులు

నందిగామ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ నందిగామలో వైకాపా ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. బుధవారం స్థానిక వైకాపా కార్యాలయం వద్ద నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ ప్రదర్శన చేశారు. అనంతరం గాంధీ సెంటర్‌లో మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో ఏవో రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వంలో 15 వైద్య కళాశాలలను జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారని చెప్పారు. వీటిల్లో ఏడు కళాశాలలు ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే విధంగా చర్యలు తీసుకున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, పార్టీ నాయకులు మహ్మద్ మస్తాన్, చల్లా బ్రహ్మం, మార్త శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్ల, జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: కొత్తపేట, గని ఆత్కూరు గ్రామాల్లో వైకాపా ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, నాయకులు పాల్గొన్నారు.

★ వైకాపా ఆధ్వర్యంలో జగ్గయ్యపేటలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు టి.జె.సుధాకర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు ఇంటూరి చిన్నా, వివిధ విభాగాల శ్రేణులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ

జగ్గయ్యపేట: గరికిపాడు కేవీఎల్‌రావు కృషి విజ్ఞాన కేంద్రంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో భాగంగా పలువురు రైతులకు అధిక దిగుబడులు ఇచ్చే వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. వత్సవాయి మండంలోని పోచవరం, కన్నెవీడు తదితర గ్రామాల రైతులకు టీసీజీఎస్ 1694 విశిష్ట రకం విత్తనాలు అందించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ఎం.రవికిషోర్, శాస్త్రవేత్తలు ఎన్.రాజశేఖర్, పి.ఎన్.శివప్రసాద్, కె.లక్ష్మీకళ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో సమస్యల కొలువు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే

జగ్గయ్యపేట మండలంలోని ప్రసిద్ధ తిరుమలగిరి పుణ్యక్షేత్రంలో పలు సమస్యలు తిష్ఠ వేశాయి. ప్రతి శని, ఆదివారాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో ఇక్కడకు తరలి వస్తుంటారు. ఈ క్షేత్రానికి వెళ్లేందుకు ఉన్న ఏకైక రహదారి అధ్వానంగా ఉండడంతో భక్తులు, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమస్యపై స్థానిక పారిశ్రామికవేత్త ముల్లంగి నర్సిరెడ్డి రెండుసార్లు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. దేవస్థానానికి వెళ్లే రోడ్డు అసలే ఇరుగ్గా ఉందంటే.. కొంతమంది ఆక్రమించుకుని చప్టాలు కట్టుకొని మరింత ఇరుకు చేస్తున్నారు. మరోపక్క రోడ్డుపై చిరువ్యాపారాలు సాగిస్తున్నారు. రహదారి అంచులను, మురుగు కాలువను సైతం ఆక్రమించేస్తున్నారు. ఒక వాహనం వెళ్లాలంటే.. ఎదురొచ్చే మరో వాహనం ఆగిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇరుకు రోడ్డు, ఆక్రమణలపై ఫిర్యాదులను పరిష్కరించకుండానే సమస్య పరిష్కారం అయ్యిందంటూ అధికారులు లేఖలు పంపడం గమనార్హం. గ్రామ స్థాయి కార్యాలయం మొదలుకొని మండల స్థాయి కార్యాలయాలు, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి కార్యాలయాల వరకు వెళ్లిన ఫిర్యాదులకు కూడా స్పందన ఉండడం లేదంటూ గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇరుకైన రహదారి

➠ఎన్‌హెచ్-65 నుంచి మూడు కి.మీ దూరంలో ఉండే తిరుమలగిరి మార్గంలో కిందకు దిగే సర్వీస్ రోడ్డు, అండర్‌పాసింగ్‌ల వద్దే సమస్య మొదలవుతుంది. ఇవి అత్యంత ప్రమాదకరంగా మారినా ఇంతవరకు ఏ శాఖ అధికారి కూడా చర్యలు తీసుకోలేదు. ఈ సమస్యపై తహసీల్దార్ మనోహర్‌ని వివరణ కోరగా త్వరలోనే ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటామని, ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలకు సూచిస్తానని తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టుకు ఎంపిక

మహిని అభినందిస్తున్న ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య

నందిగామ, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయిలో జరిగే అండర్-14 కబడ్డీ జట్టుకు నందిగామ మండలం లింగాలపాడు జడ్పీ స్కూలు నుంచి ఎంపికైన మందా మహిని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అభినందించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం విద్యార్థిని ఎమ్మెల్యే సత్కరించారు. సౌమ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థికి మంచి భవిష్యత్తు ఉందని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు రాంబాబు, వ్యాయామ ఉపాధ్యాయిని డి.లక్ష్మి, ఎస్ఎంసీ ఛైర్మన్ షేక్ నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

ఒరిజినల్ డాక్యుమెంట్స్ పోయినవి
లగడపాటి నాగేశ్వరరావు, S/o ప్రసాదరావు, మాగల్లు రెవెన్యూ పరిధిలో సర్వే నెం. 592-4/A2లో 0-26 సెంట్లు, 592-4A/1Bలో 0-26 సెంట్లు డాక్యుమెంట్ నెంబర్ 88/2005 నందిగామలో రైతుపేట సెంటర్ నుండి గాంధీ సెంటర్‌కు జిరాక్స్ నిమిత్తం బైకు మీద వెళుతుండగా జారి పడిపోయినవి. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది ఫోన్ నెంబర్‌కు సంప్రదించగలరు.
సెల్: 96400 72624

(c) eenadu

విజయవాడ పశ్చిమ

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

స్పందనకు వందనం

★ గొల్లపాలెంగట్టు వీఎంసీ స్కూల్ ప్రాంతంలో కుక్కలు అధికంగా ఉన్నాయని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనికి స్పందించిన వెట ర్నరీ విభాగం అధికారులు వాటిని పట్టారు. ★ వాగు సెంటర్ వద్ద [illegible] ప్రాంతంలో చెత్తను సేకరించేందుకు సిబ్బంది రావడం లేదని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇవ్వగా, స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికుల తో చెత్త తీయించారు. - న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

? కొత్తపేట నెహ్రూబొమ్మ కూడలి కొండ ప్రాంతంలో రంగుమా రిన మంచినీరు సరఫరా అవుతోంది. - కుసుమ, స్థానికురాలు
✔ చర్యలు తీసుకుంటాం. రామకృష్ణ, మంచినీటి విభాగం ఏఈ
? కేఎల్‌రావు నగర్ మూడోలైన్‌లోని మురుగు కాలువలో పూడిక పేరుకుంది. - భాస్కరరావు, స్థానికుడు. ✔ పూడిక తీయిస్తాం.
- ఆంజనేయప్రసాద్, స్థానిక శానిటరీ అధికారి.
? హెచ్‌బీ కాలనీ పాత పోలీసు స్టేషన్ రోడ్డు మార్గం గుంతల మయంగా మారింది. - సూర్యకుమారి, స్థానికురాలు.
✔ వాటిని పూడ్చివేస్తాం. - శ్రీనివాస్, సర్కిల్-1 ఈఈ
- న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

వివాహితను రక్షించిన మహిళా కానిస్టేబుల్

నవ్య

విద్యాధరపురం, న్యూస్‌టుడే: కుటుంబ కలహాల కారణంగా ప్రకాశం బ్యారేజీ పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసిన వివాహితను రక్షించిన వన్‌టౌన్ ట్రాఫిక్ మహిళా కానిస్టేబుల్ నవ్యను ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం బుధవారం అభినందించారు. కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన వివాహిత కుటుంబ కలహాల కారణంగా మనస్తాపం చెంది ప్రకాశం బ్యారేజీ వద్దకు వచ్చి ఆత్మహత్య చేసుకుందామని భావించింది. అదే సమయంలో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న వన్‌టౌన్ ట్రాఫిక్ మహిళా కానిస్టేబుల్ నవ్య గమనించి ఆమెను రక్షించారు. అనంతరం వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పోలీసు స్టేషనుకు తరలించారు. ఆమె కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ తర్వాత వారికి అప్పగించామని పోలీసులు తెలిపారు.

రూ.8 లక్షలతో మరమ్మతులు

ప్రధాన రహదారు గోతుల మయంగా మారడంతో ప్రమాదాలకు తావిస్తున్న నేపథ్యంలో ఈనెల 6న 'ఈనాడు' విజయవాడ పశ్చిమ పేజీలో 'గోతుల రహదారితో ఇబ్బందులు' శీర్షిక కథనం ప్రచురిత మైంది. దీనికి సర్కిల్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరావు స్పందించారు. చిట్టినగర్, పాల ఫ్యాక్టరీ, కేటీరోడ్డు, ఎర్రకట్ట రోడ్డు, అంబేడ్కర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో రహదారులపై పడిన గోతులకు సుమారు రూ.8 లక్షలతో మరమ్మతులు చేస్తున్నారు. దీంతో స్థానికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, చిట్టినగర్

స్పందనకు వందనం

ఎత్తులో అమర్చిన ఫ్యూజ్ బాక్సు

ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డులో ప్రమాదకర స్థితిలో ఉన్న ఫ్యూజ్ బాక్సును ఆర్ఆర్ నగర్ ట్రాన్స్‌కో అధికారులు ఎత్తు పెంచేందుకు బుధవారం చర్యలు తీసుకున్నారు. రోడ్డుపై చేతికి అందే విధంగా విద్యుత్తు తీగలు ఉన్నాయి. దీనిపై 'ప్రమాదకరంగా విద్యుత్తు నియంత్రికలు' శీర్షికన ఈనెల 9న 'ఈనాడు'లో వచ్చిన కథనంపై ఆర్ఆర్ నగర్ ట్రాన్స్‌కో ఏఈ సతీష్‌కుమార్ స్పందించారు. ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, ఫ్యూజ్ బాక్సులను సిబ్బందితో ఎత్తులో పెట్టించారు. - న్యూస్‌టుడే, విద్యాధరపురం

అభివృద్ధి పనులపై సమావేశం

భవానీపురం, న్యూస్‌టుడే: పశ్చిమ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో చేపడుతున్న అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన పనులపై చర్చించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, విశ్రాంత అధికారులతో సమావేశం నిర్వహించారు. భవానీపురంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని 35, 45, 48, 49, 54, 55, 56 డివిజన్లకు సంబంధించిన నాయకులు హాజరయ్యారు. రహదారులు, డ్రెయినేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం, వర్షపు నీటి కాలువల నిర్మాణం, భూగర్భ డ్రెయినేజీ పనులపై చర్చించారు. సమావేశంలో విశ్రాంత ఎస్ఈ ఉదయ్‌కుమార్, విశ్రాంత ఈఈలు నారాయణ మూర్తి, శ్రీనివాస్, డీఈ మాధవి, ప్రత్తిపాటి శ్రీధర్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో సుహాసిని

ఆరోగ్య కేంద్రాల పరిశీలన

విజయవాడ పాతాసుపత్రి, న్యూస్‌టుడే: జిల్లాలోని పెండ్యాల, కేసర, గొల్లపూడి ప్రాంతాల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా.ఎం. సుహాసిని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పీహెచ్‌సీల్లో మందులను, ఓపీ రికార్డులను సిబ్బంది సమయ పాలన రికార్డులు పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కోడి గుడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా పీహెచ్‌సీల వైద్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ గేటు కష్టాలు..?

- ఆర్‌యూబీ నిర్మించాలని వినతులు
- చుట్టూ తిరిగి రావడంతో సమయం వృథా

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే

పాతబస్తీ వించిపేట నైజాంగేటు నుంచి పాతరాజరాజేశ్వరీపేటకు కంసాలిపేట మీదుగా గతంలో రైల్వే ట్రాక్‌పై రాకపోకలు సాగేవి. కేంద్ర ప్రభుత్వం రైలు ప్రమాదాల నివారణలో భాగంగా ఆ గేటును మూసివేశారు. విజయవాడ ఎర్రకట్ట పైవంతెనపై నిత్యం వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. గత పదేళ్లుగా మూసివేయడంతో పాతరాజరాజేశ్వరీపేట మీదుగా కొత్తరాజరాజేశ్వరీపేటకు వెళ్లే ప్రజలు, అదే మార్గంలో నైజాంగేటు-వించిపేట, పంజా సెంటర్ మీదుగా కేఆర్ మార్కెట్‌కు వెళ్లే వారు అపసోపాలు పడుతున్నారు. ఎర్రకట్ట పైవంతెన ఎక్కి, చుట్టూ తిరిగి ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

★ 2014కు ముందు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాంతంలో అండర్‌బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. 2019లో వైకాపా నేత మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు సైతం ఎన్నికల ప్రచారంలో అధికారంలోకి వస్తే ఆర్‌యూబీ నిర్మిస్తామని హామీ ఇచ్చి వదిలేశారు.

★ ఈ ప్రాంతంలో ఆర్‌యూబీ నిర్మిస్తే సమయం కలిసి వస్తుందని ద్విచక్ర వాహనదారులు, స్థానిక ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని కోరుతున్నారు.

నైజాంగేటు-కంసాలిపేట మధ్య రైల్వే ట్రాక్

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా..

రైలుగేటు మూసి వేయడం, ఆ ప్రాంతం మీదుగా రాకపోకలు తగ్గడంతో గంజాయి, మద్యం బ్యాచ్‌ల ఆగడాలకు ఈ ప్రాంతం కేంద్రమైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆరు నెలల కిందట మద్యం తాగి ఓ వ్యక్తి రైల్వే గేటు పక్కన ఉన్న ఇంట్లోకి చొరబడి ఇంట్లో వ్యక్తులను బెదిరించాడు. ★ గంజాయి, బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు కూడా రోజు రోజుకు మితిమీరిపోతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్ మీదుగా నడిచి ఇళ్లకు వెళ్లే బాటసారులకు తీవ్ర భయంగా ఉంటుందని వారంతా వాపోతున్నారు.

★ నైజాంగేటు-కంసాలిపేట ప్రాంతాలకు మధ్య రైల్వే ట్రాక్ ఉండడం, అటు రైల్వే పోలీసులు, ఇటు లా అండ్ ఆర్డర్ పోలీసులు ఇరువురు దృష్టి సారించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే దృష్టి సారించాలని విజ్ఞప్తి

ఎమ్మెల్యే సుజనా చౌదరి దృష్టి సారించి దానిని పూర్తి చేసేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతిపాదనలను ప్రాథమిక స్థాయిలోనే నిలిచిపోవడం, ఆర్‌యూబీ నిర్మాణానికి రైల్వే బోర్డు నుంచి ఆమోదం రాకపోవడం కారణాలతో ఇబ్బందులు తప్పడం లేదని ప్రజలు చెబుతున్నారు.

నిధుల లోటుతో అభివృద్ధికి ఆటంకాలు

రోడ్డు పనులు పరిశీలిస్తున్న సత్యబాబు

చిట్టినగర్, న్యూస్‌టుడే: నగరానికి రావాల్సిన నిధులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో నిధుల కొరతతో అభివృద్ధి పనులు నత్తనడకగా సాగుతుందని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు పేర్కొన్నారు. 50వ డివిజన్ మహంతిపురం ప్రాంతంలో బుధవారం పర్యటించి జడా పాపయ్యవీధిలో రోడ్డు పనులు పరిశీలించారు. ఆరు నెలల కిందట రూ.13 లక్షలతో మంజూరైన నిధుల కొరతతో అభివృద్ధి పనులు సక్రమంగా సాగడం లేదన్నారు. చిన్న వర్షానికి గొల్లపాలెం గట్టు, మహంతిపురం తదితర ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేసి కొండ ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

క్రతువు నిర్వహిస్తున్న రుత్విక్కులు

విజయేశ్వరాలయంలో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న దేవస్థానం సిబ్బంది

ఆది దంపతులకు ఊంజల్ సేవ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: కార్తిక మాసాన్ని పురస్కరించుకొని ఇంద్రకీలాద్రిపై ఆది దంపతులకు ఊంజల్ సేవను బుధవారం నేత్రపర్వంగా నిర్వహించారు. సహస్ర దీపాలంకరణ మండపంలో గంగా, పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవమూర్తులను భక్తులు దర్శించుకున్నారు. ఊంజల్ సేవలో దుర్గగుడి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ పాల్గొన్నారు. మల్లేశ్వరాలయ ప్రాంగణంలో సహస్ర లింగార్చన కార్యక్రమాన్ని భక్తుల సమక్షంలో అర్చకులు నిర్వహించారు. ★ వన్‌టౌన్‌లోని శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం(పాత శివాలయం)లో అమ్మవారికి బుధవారం సాత్వికాదేవిగా అలంకరించారు. మహిళలు పెద్ద సంఖ్యలో కుంకుమార్చన సేవలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో నటరాజన్ షణ్ముగం పాల్గొన్నారు. విజయేశ్వరాలయంలో భక్తులకు అన్నప్రసాదాన్ని దేవస్థానం సిబ్బంది పంపిణీ చేశారు. ఈవో వెంకటరెడ్డి, అర్చకులు సూర్యకుమార శర్మ, మోహనకృష్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

సాత్వికాదేవిగా భ్రమరాంబ

నిత్యాన్నదాన పథకానికి విరాళం

దాత రామకృష్ణ కుమార్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న సూపరింటెండెంట్ జగదీష్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి విజయవాడ మల్లికార్జునపేటకు చెందిన ఎస్.గీతా రామకృష్ణ కుమార్ రూ.1,01,116 విరాళాన్ని బుధవారం అందజేశారు. సుందరి వరలక్ష్మి పేరుతో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేయాలని దాత కుటుంబ సభ్యులు కోరారు. దాత కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచనం మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం సూపరింటెండెంట్ జగదీష్ వారికి విరాళం రసీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

12న ఉమ్మడి కృష్ణా జిల్లా ఆర్చరీ జట్ల ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా ఆర్చరీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన నగరంలోని వీఎంసీ ఓల్డ్ ఆర్చరీ మైదానంలో ఉమ్మడి కృష్ణా జిల్లా జూనియర్, సీనియర్ బాలబాలికల రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని ఆ సంఘం అధ్యక్షుడు వీవీ వేణుగోపాలరావు(బుజ్జి), ప్రధాన కార్యదర్శి చెరుకూరి కృష్ణకుమారి తెలిపారు. పాల్గొనే వారు ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువపత్రం, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో ఆర్చరీ మైదానంలో రిపోర్టు చేయాలన్నారు. పోటీలో తలపడే వారు కృష్ణా జిల్లా ఆర్చరీ సంఘంలో తమ పేర్లు నమోదు చేసుకున్న వారై ఉండాలన్నారు. ఎంపికైన ఆర్చర్లు ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు నూజివీడులోని శ్రీసారథి ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగే రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల జూనియర్, సీనియర్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో కృష్ణా జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు అవకాశం

నగరపాలక సంస్థ, వన్‌టౌన్, న్యూస్‌టుడే

అక్రమ కట్టడాలు, భవనాలపై జరిమానా విధింపునకు ఉద్దేశించిన బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం(బీపీఎస్) అమలుకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఫలితంగా ఏళ్లుగా భవన నిర్మాణదారులు ఎదురుచూస్తున్న ఈ పథకం అమలులోకి వచ్చింది. ఇందుకోసం భవన నిర్మాణదారుల నుంచి దాదాపు 18-20 వేల దరఖాస్తులు రావచ్చని, తద్వారా రూ.50-70 కోట్ల పీనలైజేషన్ రుసుము కింద ఆదాయం సమకూరుతుందని లెక్కిస్తున్నారు.

నిర్మించిన భవనం

2017కి ముందు బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం(బీపీఎస్) పలుమార్లు అమలుకాగా.. అప్పట్లో రూ.కోట్లలో ఆదాయం సమకూరింది. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి బీపీఎస్ అమలు కాకపోగా నగరంలో వేలాది అక్రమ కట్టడాలు వెలిశాయి. ప్రస్తుతం వీటిని గుర్తించేందుకు సచివాలయ సిబ్బందితో గురువారం నుంచి ఇంటింటి సర్వే చేసేందుకు నిర్ణయించారు. బీపీఎస్ కింద అక్రమ కట్టడాలను క్రమబద్ధీకరించేందుకు ఈనెల 22 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు.

మూడు నియోజకవర్గాల్లో..: నిబంధనలు ఉల్లంఘించి మూడు నియోజకవర్గాల్లో అక్రమ కట్టడాలు కోకొల్లలుగా ఉన్నాయి. పాలక సభ్యులు, ముఖ్యప్రజాప్రతినిధులు, నాయకులు వీటిని ప్రధాన ఆదాయ వనరులుగా మార్చుకుని దండుకున్నారు. నగరంలో ప్రాథమికంగా 10 వేల అక్రమ కట్టడాలు ఉంటాయని అధికారులు భావించినా.. మరింత ఎక్కువ ఉంటాయన్న అంచనా వేశారు. సచివాలయ కార్యదర్శులు, క్షేత్రస్థాయి ప్రణాళికాధికారుల ఇంటింటి సర్వే ద్వారా అక్రమకట్టడాల గుర్తింపు సంఖ్య 20 వేలు మించుతుందని భావిస్తున్నారు.

రూ.కోట్ల ఆదాయం..: 2001లో మొదట బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీం(బీఆర్ఎస్) అమలు కాగా.. 2007, 2015, 2017, 2019లో బీపీఎస్ అమలయ్యింది. ఆ సమయంలో 26,770 దరఖాస్తులు అందగా.. 23 వేల నిర్మాణాలు క్రమబద్ధీకరించారు. రూ.120 కోట్ల ఆదాయం సమకూరింది. పలు దరఖాస్తులు షార్టుఫాల్‌కి వెళ్లగా.. వాటిని బీపీఎస్ కింద తిరిగి క్రమబద్ధీకరించేలా చర్యలు తీసుకుంటున్నారు.

నిబంధనలు ఇవీ.. ☛ ఈ ఏడాది ఆగస్టు 31కి ముందు నిర్మించిన కట్టడాలే పీనలైజేషన్ చేస్తారు. భిన్నంగా సమర్పించిన ఎల్‌టీపీని బ్లాక్‌లిస్టులో పెడతారు.

☛ 120 రోజుల్లోపు రూ.10 వేలు చెల్లించి ప్రాథమికంగా దరఖాస్తు చేసుకోవాలి.

☛ దరఖాస్తు తర్వాత నిర్మాణంలో మార్పులు, చేర్పులు చేసినట్లు వెల్లడైతే ఎల్‌టీపీపై క్రిమినల్ చర్యలు తీసుకుంటారు.

☛ బీపీఎస్ కింద దరఖాస్తు చేసుకోకుంటే నేరంగా పరిగణించి బిల్డర్, డెవలపర్‌ను బ్లాక్‌లిస్టులో పెడతారు.

టికెట్ లేని ప్రయాణికుల ద్వారా రూ.8.59 కోట్ల ఆదాయం

కమర్షియల్ సిబ్బందితో డీఆర్ఎం మోహిత్ సొనాకియా

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: విజయవాడ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజరు బి.ప్రశాంత్‌కుమార్ పర్యవేక్షణలో ఏసీఎం బీవీఎన్ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ ఏడాది అక్టోబరులో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో డివిజన్‌కు రికార్డు స్థాయిలో రూ.8.59కోట్ల ఆదాయం లభించింది. ఈ తనిఖీల్లో మొత్తం 56,957 మంది టికెట్ లేని ప్రయాణికులను గుర్తించి వారి నుంచి రూ.5.06 కోట్లు, సరైన టికెట్ లేకుండా ప్రయాణించిన 64,998 మంది నుంచి 3.50 కోట్లు, 871 మంది ప్రయాణికుల లగేజీ వ్యత్యాసం ద్వారా రూ.1.77 లక్షల జరిమానా వసూలు చేశారు. ఈ సందర్భంగా బుధవారం డీఆర్ఎం మోహిత్ సొనాకియా విజయవాడ కమర్షియల్ అధికారులు, తనిఖీ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

ఎల్‌ఓసీ పత్రం అందజేత

భవానీపురం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న 46వ డివిజన్ భీమనవారిపేటకు చెందిన పి.మల్లీశ్వరికి మంజూరైన రూ.6 లక్షల ఎల్‌ఓసీని భవానీపురంలోని ఎమ్మెల్యే సుజనాచౌదరి కార్యాలయంలో బుధవారం అందజేశారు. కార్యాలయ కార్యదర్శి శ్రీధర్, నాయకులు షేక్ బాజీ, కోగంటి రామారావు, వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'స్పోర్ట్స్-ఎ-థాన్' పోటీలు

విజయవాడ క్రీడలు: సిద్ధార్థ అకాడమీ స్వర్ణోత్సవాల్లో భాగంగా మొగల్రాజపురంలోని వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ మైదానంలో రెండు రోజులు జరిగే 'స్పోర్ట్స్-ఎ-థాన్' అంతర్ పాఠశాలల ఆటల పోటీలు బుధవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్ బాలబాలికల విభాగాల్లో జరుగుతున్న ఈ పోటీల్లో పలు జట్లు హోరా.. హోరీగా తలపడుతున్నాయి. బాస్కెట్‌బాల్ బాలుర విభాగంలో ఎన్ఎస్ఎం పబ్లిక్ స్కూల్ జట్టుపై నలంద విద్యానికేతన్ జట్టు, విశ్వశాంతి ఇంగ్లిష్ మీడియం స్కూల్ జట్టుపై గుంటూరు వివా స్కూల్ జట్టు, సెయింట్ ఆన్స్ జట్టుపై ఆతిథ్య వీపీ సిద్ధార్థ, ఎస్వీ సీతారామయ్య హైస్కూల్ జట్టుపై గుంటూరు వివా స్కూల్ జట్టు విజయం సాధించాయి. బాలికల విభాగంలో కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్షియల్ స్కూల్ జట్టుపై ఎన్ఎస్ఎం, ఏఐఎంఈఈ ఇంటర్నేషనల్ స్కూల్ జట్టుపై ఆతిథ్య వీపీ సిద్ధార్థ, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ జట్టుపై నలంద విద్యా నికేతన్ జట్టు విజయం సాధించాయి. స్థానిక ఎస్‌డీఎం సిద్ధార్థ మహిళా కళాశాలలోని ఇండోర్ స్టేడియంలో ప్రారంభమైన బ్యాడ్మింటన్ పోటీలను కళాశాల ప్రిన్సిపల్ వీవీఎస్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అండర్-14 బాలికల సింగిల్స్‌లో నలంద విద్యానికేతన్, వీపీ సిద్ధార్థ, బాలుర విభాగంలో ఢిల్లీ పబ్లిక్, డాన్ బాస్కో, బాలికల డబుల్స్‌లో వీపీ సిద్ధార్థ, కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్, బాలుర డబుల్స్‌లో వీపీ సిద్ధార్థ, ఎన్ఎస్ఎం, అండర్-17 బాలికల సింగిల్స్‌లో ఎన్ఎస్ఎం, వీపీ సిద్ధార్థ, బాలుర సింగిల్స్‌లో ఎన్ఎస్ఎం, ఢిల్లీ పబ్లిక్, బాలికల డబుల్స్‌లో వీపీ సిద్ధార్థ, కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్, బాలుర డబుల్స్‌లో ఎన్ఎస్ఎం, సెయింట్ జాన్స్ స్కూల్ జట్లు ఫైనల్‌లో ప్రవేశించాయని స్కూల్ ప్రిన్సిపల్ మేడా సీతారామయ్య తెలిపారు.

నీ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో పెడతా...

యువతిని బెదిరిస్తున్న యువకుడిపై కేసు

భవానీపురం, న్యూస్‌టుడే: యువతిని బెదిరిస్తున్న యువకుడిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. భవానీపురం ప్రాంత పరిధిలో యువతి(21) కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. ఆమె వన్‌టౌన్‌లోని ఒక కళాశాలలో ఉద్యోగం చేస్తున్నారు. మూడేళ్ల కిందట కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో గురునాథ్ అనే యువకుడితో ఆమెకు పరిచయం ఏర్పడింది. అనంతరం వారిద్దరు కలిసి బయటకు వెళ్లేవారు. ఆ సమయంలో చిత్రాలు, వీడియోలు తీసుకున్నారు. ఇటీవల వారిద్దరూ వివాహం చేసుకోవాలని భావించగా ఇరు కుటుంబాల్లో అంగీకరించలేదు. దీంతో గురునాథ్‌ను యువతి దూరం పెట్టింది. దీంతో ఆగ్రహించిన అతడు ఆమె వెంట పడటం, వేరే నంబర్లతో ఫోన్‌లు చేయడం, సందేశాలు పంపడం చేస్తున్నాడు. ఈనెల 9న ఫోన్ చేసి బెదిరించాడు. ఇద్దరం కలిసి తీసుకున్న ఫొటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పెడతానని, వేరే ఎవరూ వివాహం చేసుకోకుండా చేస్తానంటూ బెదిరించాడు. దీంతో భయపడిన యువతి పోలీసులను ఆశ్రయించగా యువకుడిపై కేసు నమోదు చేశారు.

మలుపులతో జర భద్రం

భవానీపురం, న్యూస్‌టుడే

భవానీపురం పోలీసుస్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. ముఖ్యంగా విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి, బైపాస్ రహదారులపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మార్గంలో సరైన భద్రతా చర్యలు లేకపోవడం, హెచ్చరిక బోర్డులు కనిపించపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

★ భవానీపురం పరిధిలోని నల్లకుంట సెంటర్, వ్యవసాయ మార్కెట్ యార్డు, దర్గా హరిజనవాడ, స్వాతి సెంటర్, ఊర్మిళానగర్ తదితర ప్రాంతాల్లో ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు కూడా లేవు. దీంతో ప్రమాదాలకు జరుగుతున్నాయి.

★ ప్రధాన రహదారులపై రాత్రి పూట వీధి దీపాలు వెలగని కారణంగా ప్రమాదాలకు గురై పలువురు మృతి చెందారు. రాత్రి సమయంలో రహదారులపై చిమ్మ చీకట్లు కమ్ముకుంటున్నాయి. రహదారులపై ముందు ఎవరు వెళ్తున్నారో కూడా తెలియని పరిస్థితి. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనచోదకులు అధికారులను కోరుతున్నారు.

'వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు'

తహసీల్దారు ఇంతియాజ్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

భవానీపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం అన్యాయమని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైకాపా ఆధ్వర్యంలో భవానీపురంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ.. పీపీపీ పేరుతో ప్రైవేటీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని తెలిపారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో 17 కళాశాలల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశామని చెప్పారు. బ్యాంకు సెంటర్, కోళ్లఫారం రోడ్డు, ఆర్టీసీ వర్క్ షాపు రోడ్డు మీదుగా పశ్చిమ తహసీల్దారు కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. తహసీల్దారు ఇంతియాజ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

చిట్టినగర్: గాయాలతో చికిత్స పొందుతూ వృద్ధురాలు బుధవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట పడాలవారివీధిలో చిట్టిబోయన కుమారి నివాసం ఉంటున్నారు. అనకాపల్లి పరవాడ మండలం, కట్టవానిపాలెంలో ఆమె అన్నయ్య వద్ద ఉంటున్న తల్లి వరాలమ్మ(68) నెల రోజుల కిందట కొత్తపేటలో ఉండే కుమార్తె ఇంటికి వచ్చారు. అక్టోబరు 31న ఇంట్లో ఎవరు లేని సమయంలో వరాలమ్మ టీ పెడదామని గ్యాస్ స్టవ్ వెలిగించి.. లైటర్ కోసం వెతికి వెలిగించగా ఒక్కసారిగా మంటలు వచ్చి ఆమెకు పలు చోట్ల గాయాలయ్యాయి. అప్పటి నుంచి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఈ మేరకు మృతురాలి కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

క్రేన్ ఢీ.. ఆటో డ్రైవర్ దుర్మరణం

భవానీపురం: క్రేన్ ఢీకొనడంతో ఆటోడ్రైవర్ చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి... ఆంజనేయవాగు సెంటర్‌లో చాట్ల నాగరాజు(43) ఆటో డ్రైవర్.. కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. బుధవారం ఆటో కిరాయికి వెళ్తూ సీవీఆర్ పైవంతెన వద్దకు వచ్చే సరికి ఆటో ఆగిపోయింది. ఆటో స్టార్ట్ కావడం లేదంటూ చూస్తుండగా పైవంతెన నుంచి వస్తున్న క్రేన్ ఆటో డ్రైవర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ నాగరాజును స్థానికులు ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ద్విచక్ర వాహనం ఢీకొని తాపీ కార్మికుడికి గాయాలు

చిట్టినగర్, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం ఢీకొని తాపీ కార్మికుడు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా కేవీఎల్‌పురం, యాతపేటకు చెందిన కొలుసు గణేష్ పనుల నిమిత్తం పంజాసెంటర్ ప్రాంతంలో తల్లిదండ్రులతో ఉంటున్నారు. ఈ నెల 9న రాత్రి గాంధీకొండ నుంచి విద్యుత్తు ఉపకేంద్రం వైపు వెళుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎడమ కాలికి గాయమైంది. స్థానికులు గమనించి 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందిన అనంతరం బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వేధిస్తున్న భర్తపై ఫిర్యాదు

భవానీపురం, న్యూస్‌టుడే: భార్యను వేధిస్తున్న భర్తపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యాధరపురం సితార సెంటర్ వద్ద సీతామహాలక్ష్మి తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటున్నారు. ఆమెకు వెంకటేశ్వరరావుతో 20 ఏళ్ల కిందట వివాహమైంది. వెంకటేశ్వరరావు లారీ డ్రైవర్. వారిద్దరూ కృష్ణలంకలో ఉండేవారు. ఈ క్రమంలో వెంకటేశ్వరరావు మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యను వేధిస్తున్నాడు. దీంతో విద్యాధరపురంలోని పుట్టింటికి వచ్చేసింది. అయినా వేధింపులు ఆగకపోవడంతో సీతామహాలక్ష్మి పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకటన

నా క్లయింటు State Bank of India, RACPC, Vijayawada వారి సంజాయిషీ పొంది ఇందుమూలంగా యావన్మందికీ తెలియచేయునది ఏమనగా..

ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి ఒడుగు (లేటు) వీరయ్య గారి కుమారుడు ఒడుగు వేమరాజు గారికి వారి దత్తత తల్లిదండ్రులైన ఒడుగు వీరయ్య గారు మరియు వారి భార్య ఒడుగు సైదులమ్మ గారు వారి జీవిత కాలములో వారి స్వార్జితపు సొమ్ముతో సంపాదించుకొన్న స్థిర చరాస్తులను, జాయింటు ఆస్తులను వారి స్వాధీన హక్కు భుక్తములతో అనుభవించుచూ, వారి తండ్రిగారైన ఒడుగు వీరయ్య గారు ఎటువంటి లిఖిత పూర్వకమైన ఏర్పాట్లు చేయకుండా ది. 10-04-1975న ఇంటెస్టేట్‌గా పరమపదించిన దర్మిలా సదరు జాయింటు ఆస్తులను మరియు యితర ఆస్తులను మా తల్లిగారైన ఒడుగు సైదులమ్మ గారు స్వాధీనపరుచుకొని అనుభవించుచూ సదరు జాయింటు ఆస్తులు మరియు యితర ఆస్తులను గురించి ది. 11-12-1990న ఒక వీలునామా వ్రాయించి సదరు వీలునామాను శ్రీ విజయవాడ సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు నెం. 570/1990రుగా రిజిష్టరు చేయించి వారి స్వాధీన హక్కు భుక్తములతో అనుభవించుచూ ది. 23-01-1994వ తేదీన పరమపదించిన దర్మిలా సదరు వీలునామా రీత్యా ఒడుగు (లేటు) వీరయ్య గారి కుమారుడు ఒడుగు వేమరాజు గారికి సంక్రమించబడి తదాది ఒడుగు వేమరాజు గారు షెడ్యూలు ఆస్తిని సర్వ సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములతో అనుభవించుచున్నారని తెలుపుచున్నారు.

గమనిక: సదరు ఒడుగు వేమరాజు పేరు పొరపాటున కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రములో మరియు పన్ను రశీదులలో ఒడుగు హేమరాజు అని తప్పుగా పేర్కొనడం జరిగినది. కావున సదరు తప్పును ది. 15-10-2025న విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ వారు జారీచేసిన నిర్ధారణ పత్రములో మార్పు చేయడం జరిగినది అని తెలుపుచున్నారు.

కాగా సదరు ఒడుగు (లేటు) వీరయ్య గారి కుమారుడు ఒడుగు వేమరాజు గారి వద్ద నుండి ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని క్రయము పొందుటకు తిరుమలశెట్టి మల్లికార్జునుడు గారు ది. 25-10-2025న క్రయము ఖరారు చేసుకొనియున్నారు. సదరు ఆస్తిని కొనుగోలు చేయుటకు ఋణసదుపాయము పొందుటకు, సదరాస్తిని కొనుగోలు చేసిన దరిమిలా సదరాస్తిని బ్యాంక్ వారికి తనఖా చేయుటకు State Bank of India, RACPC, Vijayawada వారికి అభ్యర్థన చేసియున్నారు.

కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తిపై ఎవరికైననూ ఏవిధమైన హక్కులుగాని, చట్టరీత్యా చెల్లదగు క్లయిములు గాని, మరి ఏవిధమైన అభ్యంతరములు గాని ఉన్న యెడల వారు ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజులలోపుగా లిఖితపూర్వక ఆధారములతో తెలియపరచగలరు. సదరు గడువు తేదీలోగా చట్టప్రకారము చెల్లదగు ఎటువంటి అభ్యంతరములుగాని రాని యెడల, మా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని హామీగా స్వీకరించి ఋణ సదుపాయము కలుగజేయుదురు. ఆ దర్మిలా వచ్చు ఎట్టి అభ్యంతరములు గానీ, క్లయిములుగానీ, నా క్లయింట్లును గాని, షెడ్యూలు ఆస్తిని గాని బైండు చేయజాలవని, మా క్లయింటు షెడ్యూలు ఆస్తిపై పొందు హామీ మరియు తనఖా హక్కులను భంగము చేయజాలవనియూ ఇందుమూలముగా తెలియచేయటమైనది.

షెడ్యూలు: యన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి యిలాకా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన విజయవాడ టౌన్, గొల్లపాలెం గట్టు వీధిలో యున్నట్టి ఆస్తికి యన్.టి.యస్. నెం. 1231రు, టి.యస్.ఆర్. నెం 1472, పాత డోరు నెం. 6-13-82, కొత్త డోరు నెం. 7-2-27ర్లు దాఖలా చ.గ. 185-1/9లు స్థిరాస్తి నివేశన స్థలము అందలి గ్రౌండ్ ఫ్లోర్ ఆర్.సి.సి. బిల్డింగున్నూ, ఫస్టు ఫ్లోరు సగభాగం ఆర్.సి.సి. మరియు ఎ.సి.సి. రేకుల యింటికి హద్దులు. తూర్పు: సాయిబాబా గుడి ప్రహరీ గోడ, దక్షిణం: మున్సిపల్ స్థలము, పడమర: పైడిపాటి అప్పలస్వామి గారి ఆస్తి హద్దు, ఉత్తరం : రోడ్డు.

NIMMAGADDA SRINIVASU, M.A., LL.B., ADVOCATE
Door No.41-3-41/1, Rice Shops Street, Krishnalanka,
Vijayawada-520013, Cell No: 94406 30396

విజయవాడ మధ్య

రూ.24 కోట్లతో ఆరు ఆర్‌యూబీలు

అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : విజయవాడ మధ్య నియోజకవర్గంలో రూ.24 కోట్ల వ్యయంతో ఆరు రైల్ అండర్ బ్రిడ్జిలు నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం 30వ డివిజన్, దేవినగర్-వాంబే కాలనీ మధ్య మంజూరైన ఆర్‌యూబీ ప్రాజెక్టు ప్రాంతాలను రైల్వే అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉమా మాట్లాడుతూ.. రైల్వే ట్రాక్‌లు దాటే క్రమంలో ప్రమాదాలు జరగకుండా, ప్రజల భద్రతకు వీటిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. గత పదేళ్లలో వంద మందికిపైగా ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో.. ఈ బ్రిడ్జిలు ప్రాణ రక్షణతో పాటు ప్రాంతాల అభివృద్ధికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు. ప్రయాణం సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ఎంపీ కేశినేని శివనాథ్ కృషితో రైల్వే శాఖ ఆమోదం తెలిపిందని వివరించారు. డ్రైనేజీ సమస్యలు పరిష్కరించి త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో 30వ డివిజన్ క్లస్టర్ ఇన్‌ఛార్జి ఘంటా కృష్ణమోహన్, అధ్యక్షుడు లక్కమరాజు శ్రీనివాసరాజు, ఇన్‌ఛార్జి కరణం వెంకటరమణ, వెలగపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి జాతీయ సదస్సు

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న నారాయణ భరత్‌గుప్తా, భాగ్యలక్ష్మి తదితరులు

మాచవరం, న్యూస్‌టుడే : స్థానిక ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బోటనీ, బయోకెమిస్ట్రీ విభాగాల ఆధ్వర్యంలో ఈ నెల 14, 15వ తేదీల్లో 'కృత్రిమ మేధస్సు -యంత్ర అభ్యాసం'పై జాతీయ సదస్సు నిర్వహిస్తామని ప్రిన్సిపల్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. దీనికి సంబంధించిన గోడపత్రికను బుధవారం మంగళగిరిలోని కళాశాల విద్యా కమిషనరేట్‌లో కళాశాల విద్యా శాఖ సంచాలకుడు నారాయణ భరత్‌గుప్తా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో కృత్రిమ మేధ కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. ఇలాంటి సదస్సులు విద్యార్థులకు బాగా ఉపయోగపడతాయని చెప్పారు. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. పలు రాష్ట్రాలకు చెందిన విశ్వవిద్యాలయాల ఆచార్యులు, శాస్త్రవేత్తలు, వక్తలు పాల్గొంటారన్నారు. ఇప్పటి వరకు 300 రిజిస్ట్రేషన్లు, వందకు పైగా పరిశోధనా పత్రాలు స్వీకరించామని సదస్సు కన్వీనర్లు స్వప్న, సయ్యద్ హజీహా తహసీన్ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. పలు విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

తోపుడు బళ్లను తరలిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : స్థానిక శివాలయం వీధిలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న పలు వ్యాపారసంస్థల వస్తువులు, బళ్లు ఇతర సామగ్రిని బుధవారం మూడో ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా రహదారులను ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ కొత్తూరు [illegible] హెచ్చరించారు. వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలిపితే జరిమానాలు తప్పవన్నారు. ఇబ్బంది కలిగించేలా వీధి వ్యాపారాలు నిర్వహించవద్దని సూచించారు. ఆక్రమణలపై ప్రతి రోజూ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు.

సీఐటీయూ నూతన కార్యవర్గం

కొత్తగా ఎన్నికైన సభ్యులు వీరే

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : సీఐటీయూ సెంట్రల్ సిటీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. బుధవారం గవర్నర్‌పేట శ్రీశ్రీభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా ఎం.వి.సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా కె.దుర్గారావు, కోశాధికారిగా వై.సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా ఎం.సీతారాములు, ఎం.వి.రమణ, ఎం.హనుమంతరావు, టి.గజలక్ష్మి, బి.గోవిందు, కార్యదర్శులుగా టి.ప్రవీణ్, ఎం.బాబూరావు, ఎం.సోమేశ్వరరావు, సి.హెచ్.మురళీ, టి.తిరుపతమ్మ, సి.హెచ్.మహేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

అక్రమ కట్టడాలకు బీపీఎస్

విజయవాడ నగరపాలక సంస్థ, మధురానగర్

అక్రమ కట్టడాలు, భవనాలపై జరిమానా విధింపునకు ఉద్దేశించిన బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం(బీపీఎస్) అమలుకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందుకోసం భవన నిర్మాణదారుల నుంచి దాదాపు 18-20 వేల దరఖాస్తులు రావచ్చని, తద్వారా రూ.50-70 కోట్ల పీనలైజేషన్ రుసుము కింద ఆదాయం సమకూరుతుందని లెక్కిస్తున్నారు.

2017కి ముందు బీపీఎస్ పలు మార్లు అమలయ్యింది. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి ఈ పథకం అమలు కాకపోగా నగరంలో వేలాది అక్రమ కట్టడాలు వెలిశాయి. ప్రస్తుతం వీటిని గుర్తించేందుకు సచివాలయ సిబ్బందితో గురువారం నుంచి ఇంటింటి సర్వే చేసేందుకు నిర్ణయించారు. బీపీఎస్ కింద అక్రమ కట్టడాలను క్రమబద్ధీకరించేందుకు ఈనెల 22 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. అక్రమ నిర్మాణదారులు గడువులోపు ఆన్‌లైన్ వెబ్‌సైట్ www.bps.ap.gov.in ద్వారా మాత్రమే తమ దరఖాస్తులను అర్హత కలిగిన ఎల్‌టీపీల ద్వారా సమర్పించాలని సూచించారు.

అనుమతిలేని భవనం

నిబంధనలు ఇవీ.. ☛ ఈ ఏడాది ఆగస్టు 31కి ముందు నిర్మించిన కట్టడాలే పీనలైజేషన్ చేస్తారు. భిన్నంగా సమర్పించిన ఎల్‌టీపీని బ్లాక్‌లిస్టులో పెడతారు.

☛ 120 రోజుల్లోపు రూ.10 వేలు చెల్లించి ప్రాథమికంగా దరఖాస్తు చేసుకోవాలి.

☛ దరఖాస్తు తర్వాత నిర్మాణంలో మార్పులు, చేర్పులు చేసినట్లు వెల్లడైతే ఎల్‌టీపీపై క్రిమినల్ చర్యలు తీసుకుంటారు.

☛ బీపీఎస్ కింద దరఖాస్తు చేసుకోకుంటే నేరంగా పరిగణించి బిల్డర్, డెవలపర్‌ను బ్లాక్‌లిస్టులో పెడతారు.

పీనలైజేషన్ ఉత్తర్వుల జారీ

మూడు నియోజకవర్గాల్లో..: నిబంధనలు ఉల్లంఘించి మూడు నియోజకవర్గాల్లో అక్రమ కట్టడాలు కోకొల్లలుగా ఉన్నాయి. పాలక సభ్యులు, ముఖ్యప్రజాప్రతినిధులు, నాయకులు వీటిని ప్రధాన ఆదాయ వనరులుగా మార్చుకుని దండుకున్నారు. నగరంలో ప్రాథమికంగా 10 వేల అక్రమ కట్టడాలు ఉంటాయని అధికారులు భావించినా. మరింత ఎక్కువ ఉంటాయన్న అంచనా వేశారు. సచివాలయ కార్యదర్శులు, క్షేత్రస్థాయి ప్రణాళికాధికారుల ఇంటింటి సర్వే ద్వారా అక్రమకట్టడాల గుర్తింపు సంఖ్య 20 వేలు మించుతుందని భావిస్తున్నారు.

రూ.కోట్ల ఆదాయం..: 2001లో మొదట బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీం(బీఆర్ఎస్) అమలు కాగా.. 2007, 2015, 2017, 2019లో బీపీఎస్ అమలయ్యింది. ఆ సమయంలో 26,770 దరఖాస్తులు అందగా.. 23 వేల నిర్మాణాలు క్రమబద్ధీకరించారు. రూ.120 కోట్ల ఆదాయం సమకూరింది. పలు దరఖాస్తులు షార్ట్‌ఫాల్‌కి వెళ్లగా.. వాటిని బీపీఎస్ కింద తిరిగి క్రమబద్ధీకరించేలా చర్యలు తీసుకుంటున్నారు.

సీఎం సహాయ నిధితో ఆర్థిక భరోసా

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : అనారోగ్య పరిస్థితిలో నిరుపేదలు ఆర్థిక ఇబ్బందులు పడకూడదని ప్రభుత్వం సీఎం సహాయ నిధి ద్వారా ఆదుకుంటోందని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని తెదేపా కార్యాలయంలో 64వ డివిజన్‌కు చెందిన ఆరుగురికి రూ.7.27 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ప్రజల సమస్యలు తీర్చడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. డివిజన్ అధ్యక్షుడు కాకొల్లు రవికుమార్, ప్రధాన కార్యదర్శి బాబు, సొసైటీ బ్యాంకు ఛైర్మన్ సాధం శ్రీనాథ్, డైరెక్టర్ పొన్నం శేషగిరి, పలగాని భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : విద్యుత్తు లైన్ల తనిఖీలు, మరమ్మతుల కారణంగా గవర్నర్‌పేట విద్యుత్తు సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాలకు గురువారం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు చెరుకుపల్లి వారి వీధి, మల్లాది వారి వీధి, కాళేశ్వరరావురోడ్డు, కోదండరామిరెడ్డి వీధి తదితర ప్రాంతాలకు విద్యుత్తు ఉండదని ఈఈ తెలిపారు.

ముత్యాలంపాడు సెక్షన్‌లో..

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : మరమ్మతు పనుల దృష్ట్యా గురువారం ఉదయం 8 గంటల నుంచి 10 వరకు ముత్యాలంపాడు సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాలకు విద్యుత్తు ఉండదని ఈఈ పి.రవీంద్రబాబు తెలిపారు. భగత్‌సింగ్ రోడ్డు, దండమూరి రామ్మోహన్‌వీధి, వందనపు వారి వీధి, శివాలయం వీధి, శివరావు వీధి, బ్రహ్మయ్య పంతులు వీధి, గిరి వీధి ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన వివరించారు.

టికెట్ లేని ప్రయాణికుల ద్వారా రూ.8.59 కోట్ల ఆదాయం

కమర్షియల్ సిబ్బందితో డీఆర్ఎం మోహిత్ సొనాకియా

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: విజయవాడ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజరు బి.ప్రశాంత్‌కుమార్ పర్యవేక్షణలో ఏసీఎం బీవీఎన్ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ ఏడాది అక్టోబరులో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో డివిజన్‌కు రికార్డు స్థాయిలో రూ.8.59కోట్ల ఆదాయం లభించింది. ఈ తనిఖీల్లో మొత్తం 56,957 మంది టికెట్ లేని ప్రయాణికులను గుర్తించి వారి నుంచి రూ.5.06 కోట్లు, సరైన టికెట్టు లేకుండా ప్రయాణించిన 64,998 మంది నుంచి 3.50 కోట్లు, 871 మంది ప్రయాణికుల లగేజీ వృత్తాంతం ద్వారా రూ.1.77 లక్షలు జరిమానాగా వసూలు చేశారు. ఈ సందర్భంగా బుధవారం డీఆర్ఎం మోహిత్ సొనాకియా విజయవాడ కమర్షియల్ అధికారులు, తనిఖీ సిబ్బందిని అభినందించారు.

పేదలకు అన్నదానం

ఆహార పదార్థాలు వడ్డిస్తున్న నిర్వాహకులు

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : అజిత్‌సింగ్‌నగర్‌లో లలిత ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం పేదలకు అన్నదానం చేశారు. లలిత జ్ఞాపకార్థం ప్రతి నెలా అన్నదానం చేస్తున్నామని ట్రస్టు అధ్యక్షుడు నాగేశ్వరరావు తెలిపారు. డైరెక్టర్ ముప్పూరి హరీష్, ఎం.జశ్విన్, జి.ధ్రువన్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీఏ జట్టులో స్థానం

పూజిత

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : అజిత్‌సింగ్‌నగర్ ఎంబీపీ స్టేడియంలోని ఏసీఏ-కేడీసీఏ, వీఎంసీ క్రికెట్ అకాడమీలో సాధన చేస్తున్న ఎం.పూజిత ఏసీఏ అండర్-23 మహిళా టీ20 క్రికెట్ జట్టులో స్థానం సాధించిందని కోచ్ కె.శ్రీనివాస్ తెలిపారు. ఏసీఏ ఇంటర్ జోనల్ అండర్-23 మహిళా టీ20 క్రికెట్ టోర్నీ, సీనియర్ మహిళా టీ20 క్రికెట్ టోర్నీ, మహిళా ఏపీఎల్‌లో ప్రతిభ ఆధారంగా జట్టులో చోటు దక్కిందని పేర్కొన్నారు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఈ నెల 24వ తేదీ నుంచి జరిగే బీసీసీఐ అండర్-23 మహిళా టీ20 క్రికెట్ టోర్నీలో తలపడే ఆంధ్రా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని ఆయన తెలిపారు.

రఘురామరాజుకు వినతి పత్రం అందిస్తున్న సంఘాల నాయకులు

కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించండి

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును అమలు చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఎఫ్‌టియూ), భవన నిర్మాణ కార్మికుల యూనియన్ (టీసీడబ్ల్యూయూ)లు కోరాయి. బుధవారం అజిత్‌సింగ్‌నగర్ ఇందిరా నాయక్ నగర్‌లో భవన నిర్మాణ సంక్షేమ బోర్డు అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ గొట్టిముక్కల రఘురామరాజును కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఎఫ్‌టియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ, టీసీడబ్ల్యూయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.హరికృష్ణారెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 36 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఏళ్లుగా సంక్షేమ పథకాలు నిలిపివేసి, 42వేల మంది కార్మికులకు ఇవ్వాల్సిన నష్టపరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, బకాయిలు విడుదల చేయాలని కోరారు. రఘురామరాజు స్పందిస్తూ.. కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, త్వరలో కార్మికశాఖతో సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కె.వి.రమణ, కె.రవీంద్ర, పి.సుబ్బారావు, జి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

◆ గోడ కట్టారు... కంచె మరిచారు

మధురానగర్ వి.వి.నరసరాజు రోడ్డులో అసంపూర్తి నిర్మాణాలు అధికారుల పర్యవేక్షణ లోపానికి మచ్చుతునకగా నిలుస్తున్నాయి. ఏళ్ల తరబడి నెమ్మదిగా సాగుతూ.. స్థానికుల సహనానికి పరీక్ష పెడుతున్నాయి. ఏలూరు కాలువ గట్టు రక్షణకు గోడ నిర్మించారు. కొంత మేరకు నిర్మాణం పూర్తయింది. నేతాజీరోడ్డు మొదలు నుంచి పప్పుల మిల్లు మలుపు వరకు గోడ పైభాగంలో కంచె ఏర్పాటు చేయాల్సి ఉంది. దీన్ని నిర్మిస్తే.. కాలువగట్టుపై ఆక్రమణలకు అడ్డుకట్ట పడుతుంది. రెండేళ్ల క్రితం దసరా ఉత్సవాల్లో ఇక్కడ అమ్మవారు వెలిశారంటూ కొందరు హడావుడి చేశారు. మున్సిపల్ కమిషనర్ ఈ ప్రాంతాన్ని పరిశీలించి.. తక్షణం రక్షణ గోడ నిర్మించాలని ఆదేశాలు జారీ చేశారు. కాలువగట్టు తక్కువగా ఉన్నా.. ఆక్రమణలకు తావులేకుండా చూడాలని నిర్ణయించారు. గోడ నిర్మాణం పూర్తయి ఏడాది గడిచినా కంచె పూర్తి కాలేదు. అధికారులకు దీనిపై స్థానికులు పలు మార్లు విజ్ఞప్తులు చేసినా పట్టించుకోలేదు. ఇది పూర్తి చేస్తేనే ఆక్రమణదారులకు చెక్ పెట్టవచ్చని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

- మధురానగర్, న్యూస్‌టుడే

◆ వీధిలోనే విక్రయాలు?

అజిత్‌సింగ్‌నగర్, ఆంధ్రప్రభ కాలనీ 3వ లైనులో ఇసుక, కంకరను రోడ్డుపై పోసి జోరుగా విక్రయిస్తున్నారు. రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోందని, టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, అజిత్‌సింగ్‌నగర్**

◆ మురుగులో నడిచేదెలా!

అజిత్‌సింగ్‌నగర్, ఆంధ్రపత్రిక కాలనీ రెండో లైనులో మ్యాన్ హోల్ పొంగుతోంది. రహదారిపై మురుగు ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతోంది. పాదచారులు భరించలేక.. ముక్కు మూసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి భూగర్భ డ్రైనేజీ పూడిక తీయించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, అజిత్‌సింగ్‌నగర్**

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహించే జాతీయ గ్రంథాలయ వారోత్సవాల బ్రోచర్‌ను ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు బుధవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి పాల్గొన్నారు.

12న ఆర్చరీ జట్ల ఎంపిక

విజయవాడ క్రీడలు: కృష్ణా జిల్లా ఆర్చరీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన నగరంలోని వీఎంసీ ఓల్గా ఆర్చరీ మైదానంలో ఉమ్మడి కృష్ణా జిల్లా జూనియర్, సీనియర్ బాలబాలికల రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని ఆ సంఘం అధ్యక్షుడు వీవీ వేణుగోపాలరావు(బుజ్జి), ప్రధాన కార్యదర్శి చెరుకూరి కృష్ణకుమారి తెలిపారు. పాల్గొనేవారు అదేరోజు ఉదయం 7 గంటలకు ఆర్చరీ మైదానంలో రిపోర్టు చేయాలన్నారు.

రెండు రోజుల పోలీస్ కస్టడీకి అరుణ

విజయవాడ నేరవార్తలు : ఎన్సైస్, అంగన్‌వాడీ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ వృద్ధుడిని మోసం చేసిన కేసులో నిందితురాలైన నిడిగుంట అరుణను రెండు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ విజయవాడలోని ఒకటో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడకు చెందిన రమేష్‌బాబు బంధువులకు ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ అరుణ అతడి నుంచి రూ.24.5 లక్షలు వసూలు చేసింది. దీనిపై సూర్యారావుపేట పోలీసులు గత నెల 13న కేసు నమోదు చేశారు. పీటీ వారెంట్‌పై ఆమెను విజయవాడ న్యాయస్థానంలో హాజరుపరిచారు. మరిన్ని వివరాలు రాబట్టేందుకు ఆమెను నాలుగు రోజుల పోలీస్ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఈ నెల 13, 14 తేదీల్లో కస్టడీకి అనుమతిస్తూ న్యాయమూర్తి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న అరుణను విజయవాడకు తీసుకువచ్చేందుకు పోలీసులు బుధవారం రాత్రి బయలుదేరారు. 13, 14 తేదీల్లో విచారణ అనంతరం తిరిగి ఆమెను 15వ తేదీన నెల్లూరు కేంద్ర కారాగారంలో అప్పగించాలని న్యాయమూర్తి ఆదేశించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య ఆమెను విచారించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కొవ్వొత్తుల తయారీలో శిక్షణ

విద్యార్థినికి వివరిస్తున్న నిర్వాహకులు

గవర్నర్‌పేట : గుణదల 1వ డివిజన్‌లోని మడోనా జూనియర్, డిగ్రీ మూగ, చెవిటి కళాశాల విద్యార్థులకు ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యంలో సెంటెడ్ కొవ్వొత్తుల తయారీలో శిక్షణ ఇచ్చారు. క్లబ్ జిల్లా కోశాధికారి ఎస్.ఎన్.వి.రాధిక మాట్లాడుతూ.. ప్రస్తుతం మార్కెట్‌లో వీటికి మంచి డిమాండ్ ఉందని తెలిపారు. జనశిక్షణా సంస్థాన్ సహకారంతో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీగంగ, జనశిక్షణా సంస్థాన్ ఛైర్‌పర్సన్ నాగళ్ల విద్యాఖన్నా, పూర్ణిమ కళాశాల ప్రిన్సిపల్ స్టెల్లా తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

భారత రాజ్యాంగం.. ప్రపంచంలో అత్యుత్తమం

కరపత్రం ఆవిష్కరిస్తున్న విప్ ఉమా తదితరులు

అజిత్‌సింగ్‌నగర్: ప్రపంచ దేశాల రాజ్యాంగాలలో భారత రాజ్యాంగమే అత్యంత విశిష్టమైనదని, దానిని రూపకల్పన చేసిన డా.బి.ఆర్.అంబేడ్కర్ కృషి మరువలేనిదని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను బుధవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. భారత రాజ్యాంగ దినోత్సవ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 18న అజిత్‌సింగ్‌నగర్‌లోని షాదీఖానా మండపంలో పోటీలు నిర్వహించనున్నట్లు సభ్యులు తెలిపారు. పాఠశాల విద్యార్థులు పాల్గొనాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజ్యాంగం వల్లే భారతదేశం సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం విలువలను స్థిరపరచగలిగిందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో రాజ్యాంగంపై అవగాహన పెంచడమే ఈ పోటీల లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో బెజ్జం జయపాల్, వేల్పుల రాజేష్, కాటుమాలు చంటి, దుర్గాసి రాము తదితరులు పాల్గొన్నారు.

'పీపీపీ విధానాన్ని రద్దు చేయాలి'

సంఘీభావం తెలుపుతున్న కోటేశ్వరరావు

గాంధీనగర్: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుకు అప్పగిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు డిమాండ్ చేశారు. బుధవారం ధర్నా చౌక్‌లో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. పీపీపీ విధానంలో ప్రైవేటుకు అప్పగించడం వల్ల పేద, మధ్య తరగతి వర్గాల విద్యార్థులకు విద్య దూరం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు తదితరులు ధర్నాకు సంఘీభావం తెలిపారు. నాయకులు రవిచంద్ర పాల్గొన్నారు.

పిల్లల ఆటల్లో... కంటికి గాయం

మధురానగర్: గుణదల 1వ డివిజన్‌లోని ఒక పాఠశాలలో విద్యార్థులు ఆడుకుంటుండగా.. బాలుడు గాయపడ్డాడు. దీనిపై సరైన సమాచారం ఇవ్వలేదంటూ తండ్రి ఆగ్రహం వ్యక్తం చేసి గుణదల పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగరానికి చెందిన ఒక బాలుడు.. కర్మెల్‌నగర్‌లోని వసతిగృహంలో ఉంటూ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. గత శుక్రవారం విద్యార్థులు ఆడుకుంటుండగా.. కంకర రాయి తగిలి, బాలుడి కన్నుకు బలమైన గాయమైంది. పాఠశాల యాజమాన్యం ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఆదివారం తండ్రి కుమారుడిని చూసేందుకు వసతిగృహానికి వచ్చారు. కంటికి అయిన గాయాన్ని చూసి, పాఠశాల యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ఇంత ప్రమాదం జరిగినా సమాచారం ఇవ్వరా అంటూ? నిలదీశారు. గుణదల పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు విద్యార్థులను, పాఠశాల యాజమాన్యాన్ని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. బాలుడు గాయపడగానే చికిత్స చేయించామని, గాయం పెద్దది కాకపోవటంతో తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వలేదని తెలిపారు. అంతకుమించి ఏ విధమైన దురుద్దేశం లేదని చెప్పటంతో తండ్రి శాంతించారు. మరో వైపు ప్రమాదానికి కారణమైన మరో బాలుడి తల్లిదండ్రులు కూడా క్షమాపణ చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

కుక్కను తప్పించబోయి గోడను ఢీకొట్టారు

ధ్వంసమైన కారు

మధురానగర్, న్యూస్‌టుడే : నగరంలోని బి.ఆర్.టి.ఎస్. రోడ్డు పడవల రేవు కూడలి సమీపంలో మంగళవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నలుపు రంగు కారు ఒకటి మితిమీరిన వేగంతో వెళుతోంది. పడవలరేవు వద్ద కుక్క అడ్డు రావడంతో బ్రేక్ కొట్టే వ్యవధి కూడా లేకపోవడంతో కారును పక్కను తిప్పేశారు. గోడను ఢీకొట్టడంతో ముందు భాగం ధ్వంసమైంది. అదే సమయంలో అటు వైపు నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న లావాటి జనార్దన్ (30)ను కారు ఢీకొట్టబోగా త్రుటిలో తప్పించుకున్నారు. ఆ సమయంలో రోడ్డు ఖాళీగా ఉండటంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. డ్రైవర్‌కు చిన్నపాటి గాయం కూడా కాకపోవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. జనార్దన్ ఫిర్యాదు మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలల హక్కుల సాధనకు టీవీ కృషి

నివాళులర్పిస్తున్న రమేష్, కోటయ్య తదితరులు

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : దివంగత నగర మాజీ మేయర్ టి.వెంకటేశ్వరరావు (టీవీ) బాలల హక్కుల సాధనకు, ఆపదలో ఉన్న పిల్లల రక్షణకు ఎంతో కృషి చేశారని ఫోరం ఫర్ ఛైల్డ్ రైట్స్ సమన్వయకర్త అరవ రమేష్ అన్నారు. నగర ప్రథమ మేయర్ టీవీ జయంతి వేడుకలు బుధవారం దుర్గాపురంలోని ఎస్‌టీవీఆర్ ప్రభుత్వ పాఠశాల వద్ద నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హక్కుల పరిరక్షణకు ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలను ఒక తాటిపైకి తెచ్చిన ఘనత వెంకటేశ్వరరావుకే దక్కుతుందన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కుమారులు రమేష్, సురేష్‌లు చేస్తున్న కృషి అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కోటయ్య, ప్రకాష్‌కుమార్, పి.విజయ్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, భానుప్రకాష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

సత్యనారాయణపురం(గాంధీనగర్) : రైతుబజార్‌లో పనికి వెళ్లిన భర్త కనిపించడం లేదంటూ ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సత్యనారాయణపురం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. బావాజీపేటకు చెందిన మద్దాల గణేష్.. సాంబమూర్తి రోడ్డులోని రైతుబజార్‌లో పని చేస్తారు. ఈ నెల 5వ తేదీన పనికని వెళ్లి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మద్యం తాగే అలవాటు ఉందని, గతంలోనూ ఇంటి నుంచి వెళ్లిపోయి రెండు, మూడు రోజుల తర్వాత వచ్చేవారని భార్య కనకదుర్గాదేవి పేర్కొన్నారు.

☛ సత్యనారాయణపురం మారుతీ వ్యాయామశాల వద్ద నందనా టవర్స్‌లో విశ్రాంత బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి పి.సూర్యప్రకాశరావు(75) భార్యతో కలిసి నివసిస్తున్నారు. కుమారై అమెరికాలో ఉంటున్నారు. బుధవారం వాకింగ్‌కు వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ చేసి ఉంది. బంధువుల సాయంతో నగరంలో వెతికినా ఎక్కడా కనిపించలేదు. భార్య రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సత్యనారాయణపురం పోలీసులు తెలిపారు.

In the Court of the Senior Civil Judge: Atmakur, SPSR Nellore District.
I.A. No. 92 / 2025
O.S. No. 95 / 2019
Parimi Narasimha Rao - Petitioner/ Plaintiff
Vs.
1. Challa Malakondaiah and 5 others - Respondents/ Defendants
NOTICE
To,
R4. Challa @ Duggi Vijaya Kumari D/o. Late Ramanaiah
R6. Challa Anil Kumar S/o. Late Ramanaiah
R4 & R6 are resident of Sri Lakshmi Venkateswara Rest House, D.No. 14-3-3/3, Hanumanpet, Vijayawada-3
పై నెంబరుగల పిటిషనరు/ వాది దావాను రెస్టోర్ చేయమని కోరుతూ పై తెలిపిన కోర్టులో ఆర్డరు 9, రూల్ 9 ఆఫ్ సి.పి.సి. ప్రకారం పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం తే. 20-11-2025దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదారోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని పై తెలిపిన కోర్టులో హాజరై అభ్యంతరములు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
R.N. సునీత,
పిటిషనరు/ వాది తరఫు అడ్వకేట్, నెల్లూరు

In the Court of the Senior Civil Judge: Atmakur, SPSR Nellore District.
I.A. No. 307 / 2024
O.S. No. 96 / 2019
1. Mallampati Kondamma and 5 others - Petitioners/ Plaintiffs
Vs.
1. Challa Malakondaiah and 5 others - Respondents/ Defendants
NOTICE
To,
R4. Challa @ Duggi Vijaya Kumari D/o. Late Ramanaiah
R6. Challa Anil Kumar S/o. Late Ramanaiah
R4 & R6 are resident of Sri Lakshmi Venkateswara Rest House, D.No. 14-3-3/3, Hanumanpet, Vijayawada-3
పై నెంబరుగల పిటిషనర్లు/ వాదులు దావాను రెస్టోర్ చేయమని పిటిషన్ వేయడంలో ఆలస్యమైనందున ఆలస్యాన్ని మన్నించమని కోరుతూ పై తెలిపిన కోర్టులో సెక్షన్ 5 ఆఫ్ లిమిటేషన్ యాక్ట్ ప్రకారం పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం తే. 20-11-2025దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదారోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని పై తెలిపిన కోర్టులో హాజరై అభ్యంతరములు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
R.N. సునీత,
పిటిషనర్లు/ వాదుల తరఫు అడ్వకేట్, నెల్లూరు

(c) eenadu

చదువు

బీఈ రెగ్యులర్‌గా చేశాను. ఆంధ్రా యూనివర్సిటీ నుంచి దూరవిద్యలో రెండేళ్ల ఆన్‌లైన్ ఎంఏ (ఎకనామిక్స్)లో చేరాను. ఈ కోర్సుతో పీహెచ్‌డీకీ, ఇండియన్ ఎకనామిక్స్ సర్వీస్(ఐఈఎస్) పరీక్షలకూ అవకాశం ఉంటుందా? – ఆకాంక్ష

■ ఇంజనీరింగ్ రెగ్యులర్ విధానంలో పూర్తిచేసి, రెండేళ్ల ఎంఏ (ఎకనామిక్స్) ప్రోగ్రాంను ఆన్ లైన్‌లో చదువుతున్నానని చెప్పారు. జాతీయ విద్యా విధానం 2020 ప్రకారం.. ఆఫ్‌లైన్ డిగ్రీలు, ఆన్‌లైన్ డిగ్రీలు, ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీలు, దూరవిద్య డిగ్రీలకు సమాన గుర్తింపు ఉంటుంది. యూజీసీ వివిధ సందర్భాల్లో విడుదల చేసిన రెగ్యులేషన్స్ ప్రకారం.. ఒక అకడమిక్ ప్రోగ్రాం మధ్యలో, ఓపెన్ నుంచి రెగ్యులర్‌కు, రెగ్యులర్ నుంచి ఆన్‌లైన్‌కు కూడా అకడమిక్ క్రెడిట్లను బదిలీ చేసుకొని డిగ్రీ/పీజీ పూర్తి చేయొచ్చు. కానీ, జాగ్రత్తగా గమనించాల్సింది ఏంటంటే.. ప్రస్తుతం మీరు చదువుతున్న యూనివర్సిటీకి ఆన్‌లైన్‌లో అకడమిక్ ప్రోగ్రామ్స్ నిర్వహించడానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో (యూజీసీ డెబ్) అనుమతి ఉందా, లేదా అనే విషయం నిర్ధారణ చేసుకోండి. ఒకవేళ, అనుమతి ఉంటే, అనుమతించిన ప్రోగ్రామ్స్ జాబితాలో ఎంఏ ఎకనమిక్స్ ఉందో, లేదో తెలుసుకోండి. ఏదైనా యూనివర్సిటీకి ఆన్‌లైన్ లేదా డిస్టెన్స్ మోడ్‌లో కోర్సులు నడపడానికి అనుమతి లేకపోతే ఆ యూనివర్సిటీ అందించే ఆన్‌లైన్ డిగ్రీలు చెల్లుబాటు కావు. ఏదైనా యూనివర్సిటీ ఆన్‌లైన్ విధానంలో అకడమిక్ ప్రోగ్రాంను అందించాలంటే, ఆ యూనివర్సిటీకి కనీసం 3.26 న్యాక్ గ్రేడ్ ఉండాలి. యూజీసీ డెబ్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి, ఆంధ్రా యూనివర్సిటీకి మీరు చేస్తున్న పీజీని నిర్వహించడానికి అన్ని అనుమతులు ఉన్న విషయాన్ని నిర్ధారించుకోండి. వెబ్‌సైట్‌లో ఉన్న సమాచారం మేరకు, మీరు చేస్తున్న డిగ్రీకి యూజీసీ డెబ్ గుర్తింపు ఉంది. కాబట్టి, మీరు నిరభ్యంతరంగా ఇండియన్ ఎకనామిక్ సర్వీస్, పీహెచ్‌డీలకు సన్నద్ధం కావొచ్చు.

ఐఈఎస్‌కు అవకాశం ఉందా?

–ప్రొ.బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఇంటర్న్‌షిప్స్

హైదరాబాద్‌లో..

మెర్న్ స్టాక్ డెవలప్‌మెంట్

సంస్థ: జీగ్లర్ ఏరోస్పేస్
నైపుణ్యాలు: అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్), సీఐ/సీడీ, సీఎస్ఎస్ 3, ఇంగ్లిష్ మాట్లాడటం, ఎక్స్‌ప్రెస్.జేఎస్, హెచ్‌టీఎంఎల్ 5, జావాస్క్రిప్ట్, మెర్న్, మాంగోడీబీ, నోడ్.జేఎస్, రియాక్ట్, టైప్‌స్క్రిప్ట్, వెబ్‌సాకెట్స్
స్టైపెండ్: రూ.5,000
☛ https://shorturl.at/2Nm8G

హ్యూమన్ రిసోర్సెస్

సంస్థ: ఆస్మియం ఎనర్జీ ప్రై.లి.
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం స్టైపెండ్: రూ.10,000-20,000
☛ https://shorturl.at/dct0N

ఏఐ ఏజెంట్ డెవలప్‌మెంట్

సంస్థ: ఆటంప్రిక్స్ టెక్నాలజీస్ ప్రై.లి.
నైపుణ్యాలు: డేటా స్ట్రక్చర్స్, ఫాస్ట్‌ఏపీఐ, జనరేటివ్ ఏఐ టూల్స్, గిట్, గిట్‌హబ్, పోస్ట్‌గ్రేఎస్‌క్యూఎల్, ప్రాబ్లమ్ సాల్వింగ్, ప్రాంప్ట్.
స్టైపెండ్: రూ.12,000-15,000
☛ https://shorturl.at/wYvw6

వీటికి దరఖాస్తు గడువు: డిసెంబరు 5

సమగ్ర కథనాలు, మరిన్ని ఇంటర్న్‌షిప్పులు, ఉద్యోగ నోటిఫికేషన్లు https://epaper.eenadu.net లో.

గీత దాటితే.. వెతలు తప్పవు

ఆకర్షణీయమైన జీతం, అంతర్జాతీయ అవకాశాలు, ఆధునిక జీవనశైలి.. ఇవన్నీ యువతరాన్ని కార్పొరేట్ ఉద్యోగాలవైపు ఆకర్షించే అంశాలు. అయితే అక్కడ ఎదురయ్యే కంటికి కనిపించని సవాళ్ల గురించి చాలామంది ఉద్యోగార్థులకు అవగాహన ఉండకపోవచ్చు. ఎందుకంటే.. వీటిని ఎవరూ చెప్పరు, ఎక్కడా లిఖిత పూర్వకంగా ఉండవు. కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు ఆశించే యువతతో పాటూ, ఇటీవలే కొలువుల్లో చేరినవారూ ఈ అంశాలపై అవగాహన పెంచుకోవాలి. దీంతో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా, కెరియర్‌లో ఉన్నత స్థితికి చేరుకోవచ్చు.

అంతర్గత సాంకేతిక సమాచారం, క్లయింట్స్ డేటా, వ్యూహాలు, ఆర్థిక విషయాలు బయట ప్రపంచానికి వెల్లడికావడాన్ని ఏ సంస్థలూ అంగీకరించవు.

సోషల్ మీడియా

స్వాతి ఒక ఐటీ సంస్థలో ప్రాజెక్ట్ ట్రెయినీగా చేరి, బృందంలో చురుకుగా, ప్రొడక్టివ్‌గా ఉంటూ టీమ్‌కు అప్పగించిన ప్రాజెక్టును పూర్తి చేసి, 'ఎంప్లాయీ ఆఫ్ ద మంత్'గా గుర్తింపు పొందింది. 'ప్రాజెక్టు పూర్తి చేయడంలో నేను ఎదుర్కొన్న సవాళ్లు - ఆనందమయ క్షణాలు' అంటూ ఒక వ్యాసం రాసి, ప్రాజెక్ట్‌లో ఎదురైన సాంకేతిక సమస్యలను తానెలా పరిష్కరించింది, బృంద సభ్యుల మధ్య ఏర్పడ్డ సంఘర్షణలు, క్లయింట్ ఒత్తిడిని హ్యాండిల్ చేసిన విధానం, బ్లాగ్‌లో పోస్ట్ చేసింది. ఎంతో గోప్యంగా ఉంచాల్సిన అంతర్గత సమాచారం బయటపెట్టడంతో యాజమాన్యం స్వాతిని హెచ్చరించింది. ఆమెకు మరో ప్రాజెక్ట్‌లో అవకాశం రావడానికి చాలా సమయం పట్టింది. ఈ పరిణామంతో సంస్థకు చెందిన ఏ సమాచారమైనా అనుమతి లేకుండా బహిర్గతపరచడం ప్రమాదకరమన్న సత్యాన్ని స్వాతి గ్రహించింది.

◗ గోప్యతను ఒక పాలసీగానే కాకుండా, నమ్మకాన్ని నిలబెట్టే నైతిక బంధంగా భావించే వారిని ఉద్యోగులుగా కోరుకుంటాయి కార్పొరేట్ సంస్థలు.

సెల్ఫీల అత్యుత్సాహం

ఉద్యోగంలో చేరిన ఉత్సాహంలో, కార్పొరేట్ జీవన శైలిని, పని వాతావరణాన్ని మిత్రులకు తెలపడానికి.. పని ప్రదేశ ఫొటోలు సోషల్ మీడియాలో పోస్టు చేస్తుంటారు కొంత మంది. ఈ చర్య వల్ల ఉద్యోగికి ఏ విధమైన నిర్దిష్ట ప్రయోజనం లేకపోయినప్పటికీ, వాటి ప్రభావం కెరియర్‌పై తీవ్రంగా ఉంటుంది.

ప్రియాంక ఒక 'బల్క్ డ్రగ్స్' కంపెనీ ఆర్‌అండ్‌డీలో ట్రెయినీగా చేరింది. క్లాస్‌మేట్‌తో వీడియో కాల్ మాట్లాడుతూ.. తన ఛాంబర్ చూపించి, సెల్ఫీ తీసి వాట్సాప్‌లో పోస్టు చేసింది. ఆ ఫ్రెండ్ ఆ ఫొటోను మరో క్లాస్‌మేట్‌కు ఫార్వర్డ్ చేసింది. ఆ ఫొటో మేనేజ్‌మెంట్ వరకూ చేరింది. ప్రియాంక వెనుక ఉన్న వైట్ బోర్డులో కొన్ని ఫార్ములాలున్నాయి. అవి కేవలం అక్కడ ఆర్‌అండ్‌డీ విభాగంలో పనిచేసే వారికి ఉద్దేశించిన అత్యంత గోప్యమైన అంశాలు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన మేనేజ్‌మెంట్ పనిలో నిర్లక్ష్యానికి ప్రియాంకకు నోటీస్ జారీచేసింది.

◗ మీ సోషల్ మీడియా ప్రజెన్స్ మీ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా ఉండాలి. సంస్థ గోప్యత బహిర్గతం కాకూడదు. ఒక అంశం సోషల్ మీడియాలో పోస్టు చేసే ముందు ఆలోచించి అడుగువేయాలి.

గోప్యత

సోషల్ మీడియా వాడకంలోని పరిధిని ఎవరూ తెలియజెప్పరు. ఈ పరిధి తెలుసుకోలేకపోవడం యువ ఉద్యోగుల కెరియర్‌పై తీవ్ర పరిణామాలు చూపడానికి దారితీయొచ్చు.

అభిషేక్, ఒక ఐటీ సంస్థలో డెవలపర్‌గా చేరాడు. తన నియామక పత్రంలో అంగీకరించిన నిబంధనలకు విరుద్ధంగా.. కొన్ని ప్రాజెక్ట్ వివరాలు వృత్తిలో సాధించిన విజయాలుగా 'లింక్డ్ ఇన్'లో పోస్టు చేశాడు. ప్రాజెక్ట్‌కు సంబంధించిన సాంకేతిక సమాచారం గోప్యతతో కూడింది కావడంతో యాజమాన్యం అభిషేక్‌పై చర్య తీసుకుంది.

◗ ఉద్యోగులు అందుకునే నియామక పత్రాలు నిబంధనలతో కూడి ఉంటాయి. కొన్ని ముఖ్యమైన గోప్యతా సూచనలు చదివి, అర్థం చేసుకోకుండా, నిబంధనలకు అంగీకరిస్తున్నట్లు సంతకం చేసి కాలక్రమంలో మర్చిపోతుంటారు. కొన్ని సంస్థల్లో 'నాన్ డిస్‌క్లోజర్ అగ్రిమెంట్' అంటే 'రహస్య ఒప్పందం'పై సంతకం తీసుకుంటుంటారు. ఇది ఉద్యోగి సంస్థలోని సున్నిత సమాచారాన్ని బయటకి వెల్లడించనని హామీ ఇచ్చే ఒక నిబంధన. ఇందులో పేర్కొన్న వాటిని ఉల్లంఘిస్తే సమస్యలు తప్పవు.

నైతిక బంధం

కార్పొరేట్ కెరియర్‌లో విజయవంతం కావాలంటే సాంకేతిక నైపుణ్యాలతోపాటు నైతికత, గోప్యత, వృత్తి ధర్మాలు కీలక పాత్ర పోషిస్తాయి.

రమేష్ ఒక తయారీరంగ సంస్థలో న్యూ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ టీమ్‌లో ట్రెయినీగా చేరాడు. ఒక ప్రోగ్రాంలో స్నేహితుడు రాజేష్‌ని క్యాజువల్‌గా కలిశాడు. ఇద్దరూ ఒకే తరహా ప్రాజెక్ట్ చేస్తున్నామని తెలుసుకుని సంతోషించారు. అయితే, రాజేష్ తనకు ఎదురైన ప్రాజెక్టులో కొన్ని సందేహాలను అడిగాడు. ఇది చాలా సున్నితమైన అంశం అని, ఈ సమాచారం బయటపెట్టలేనని, సున్నితంగా రాజేష్ అభ్యర్థనను రమేష్ తిరస్కరించాడు.

కొన్నాళ్ల తర్వాత ఈ విషయం మేనేజ్‌మెంట్‌కు తెలిసింది. రమేష్‌కు వృత్తిపై ఉన్న నిబద్ధత, పాటించిన గోప్యతకు ఎంతో సంతోషించిన యాజమాన్యం అతడికి కీలకమైన శాఖ బాధ్యతలు అప్పజెప్పింది.

◗ సంస్థ గోప్యతను కాపాడితే నమ్మకం బలపడుతుంది. విశ్వాసం కెరియర్ ప్రగతికి సహకరిస్తుంది.

దొరైరాజ్
సీనియర్ జనరల్ మేనేజర్, ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్

ప్రొబేషనరీ ఆఫీసర్లు..

ఈసీజీసీ లిమిటెడ్, ముంబయి... ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కేడర్‌లో ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తుంది.
◗ ప్రొబేషనరీ ఆఫీసర్: 30
విభాగాలు: జనరలిస్ట్ 28, స్పెషలిస్ట్ 02
అర్హత: జనరలిస్ట్ పోస్టులకు ఏదైనా విభాగంలో డిగ్రీ. స్పెషలిస్ట్ పోస్టులకు సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ.
వయసు: 01.11.2025 నాటికి 21 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి.
వేతన శ్రేణి: నెలకు రూ.88,635 - 1,69,025.
ఎంపిక: ఆన్‌లైన్ పరీక్ష (ఆబ్జెక్టివ్ టెస్ట్), ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామ్‌లతో. **దరఖాస్తు రుసుము:** ఎస్సీ/ఎస్టీ/ దివ్యాంగులకు రూ.175. ఇతరులకు రూ.950. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 02.12.2025. **ఆన్‌లైన్ పరీక్ష తేదీ:** 11-01-2026.
వెబ్‌సైట్: https://www.ecgc.in/

మేనేజ్‌మెంట్ ట్రెయినీలు..

బ్రహ్మపుత్ర వ్యాలీ ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ లిమిటెడ్, అసోం.. ఒప్పంద ప్రాతిపదికన పలు విభాగాల్లో మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ మేనేజ్‌మెంట్ ట్రెయినీ: 16 పోస్టులు
విభాగాల వారీ: ◗ ప్రొడక్షన్: 07 ◗ మెకానికల్: 04 ◗ ఇన్‌స్ట్రుమెంటేషన్: 02 ◗ సివిల్: 01 ◗ హెచ్‌ఆర్ అండ్ అడ్మిన్: 01 ◗ ఫైనాన్స్: 01
అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, పీజీ, డిప్లొమా, సీఏ/సీఎంఏతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
వయసు: 01.11.2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూలతో. **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్‌కు రూ.500; ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు ఫీజు లేదు. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 09.12.2025.
వెబ్‌సైట్: https://bvfcl.com/

నిట్ వరంగల్‌లో..

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్), వరంగల్.. వివిధ విభాగాల్లో టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ ప్రొఫెసర్: 02 ◗ అసోసియేట్ ప్రొఫెసర్: 08
◗ అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-1: 08
◗ అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-2: 27
అర్హత: సంబంధిత విభాగంలో ఎంఈ/ఎంటెక్, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఏతో పాటు పని అనుభవం ఉండాలి. **గరిష్ఠ వయసు:** ప్రొఫెసర్‌కు 50 ఏళ్లు, అసోసియేట్ ప్రొఫెసర్‌కు 45 ఏళ్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు 40 ఏళ్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-2కు 35 ఏళ్లు.
దరఖాస్తు ఫీజు: జనరల్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్‌కు రూ.2000, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీలకు రూ.1000. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబరు 12. **ఎంపిక:** పరీక్ష, ఇంటర్వ్యూతో.
వెబ్‌సైట్: https://nitw.ac.in/page/?url=/careersnitw/Jobs/

నైజీరియన్ల నుంచి ఎండీఎంఏ కొనుగోలు

- అందులో కొంత వినియోగించి, మిగిలింది అమ్మేవాడు
- ఇంజినీరింగ్‌లో చేరిన తొలి ఏడాదే దారి తప్పిన మ్యాడీ

ఈనాడు – అమరావతి

నిందితుడు మధుసూదన్‌రెడ్డి

బెంగళూరులో స్నేహితుల ద్వారా నైజీరియన్లతో పరిచయంతో మ్యాడీ పెడ్లర్‌గా మారాడు. నైజీరియన్లకు వాట్సాప్‌లో కాల్ చేసి డ్రగ్స్ అడిగేవాడు. వారు వాట్సాప్ లోనే యూపీఐ క్యూఆర్ కోడ్ పెడితే.. దానిని స్కాన్ చేసి డబ్బులు పంపేవాడు. వారు సరకును ఒక లొకేషన్‌లో పెట్టి.. దానిని ఫొటో తీసి పంపేవారు. మ్యాడీ అక్కడకు వెళ్లి తెచ్చుకునేవాడు. ఇలా కొనుగోలు చేసిన ఎండీఎంఏలో కొంత సొంతంగా వాడుకుని.. మిగిలింది లాభం చూసుకుని అమ్మడం ప్రారంభించాడు. అమ్మకాలలో భాగంగా కాలేజీలో సీనియర్ అయిన గురుప్రసాద్‌తో కలిసి హైదరాబాద్‌కు వెళ్లారు. అక్కడ కూకట్‌పల్లి పోలీసులు దాడి చేసి అరెస్టు చేశారు.

చెన్నైలో మత్తుకు బానిస...

చెన్నైలో ఇంజినీరింగ్‌లో చేరిన తొలి ఏడాదే మధుసూదన్‌రెడ్డి అలియాస్ మ్యాడీ మత్తుకు బానిసగా మారాడు. చెడు సావాసాలతో దారితప్పాడు. సిగరెట్లు, మద్యం, గంజాయి అలవాటైంది. బీటెక్ రెండో ఏడాదిలో ఎండీఎంఏ తీసుకోవడం అలవాటు చేసుకున్నాడు. దీంతో చదువుపై దృష్టి సారించలేక తరగతులు ఎగ్గొట్టి స్నేహితులతో తిరిగేవాడు. ఫలితంగా పరీక్షలు రాసేందుకు హాజరు సరిపోక ఇంజినీరింగ్ పూర్తి చేయలేని పరిస్థితి. 2022లో కాలేజీ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఉపాధి నిమిత్తం బెంగళూరు వెళ్లాడు. అక్కడ పలు ఉద్యోగాలు చేశాడు. ఎండీఎంఏ కేసులో బెంగళూరులో అరెస్టు అయిన నిందితుడు మ్యాడీని మాచవరం పోలీసులు నగరంలోని ఒకటో ఏసీఎంఎం కోర్టులో న్యాయాధికారి ఎదుట హాజరుపరిచారు. ఈనెల 26 వరకు రిమాండ్ విధించడంతో విజయవాడ కారాగారానికి తరలించారు. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం కంబాలపల్లికి చెందిన మ్యాడీ తండ్రి 13 ఏళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. తల్లి పొలం పనులకు వెళ్తుండేది.

డ్రగ్స్ బదులు ఉప్పుతో టోకరా...

ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న సమయంలో డ్రగ్స్ కొనుగోలు చేయలేక.. ఎండీఎంఏ బదులు ఉప్పును సరఫరా చేసి పలువురికి టోకరా వేసేవాడు. ర్యాపిడో డ్రైవర్ అవతారమెత్తిన మ్యాడీ. వాట్సాప్‌లో డ్రగ్స్ కోసం ఆర్డర్ ఇస్తే వారికి బెంగళూరులోని ఏదో ఒక ప్రదేశంలో పెట్టి.. దాని లొకేషన్‌ను అవతలి వారికి పంపేవాడు. విశాఖ నుంచి బెంగళూరు వెళ్లిన శ్రీవాత్సవ్, హవీలాను కూడా ఇలాగే మోసం చేశాడు. డబ్బులు తీసుకుని.. ఎండీఎంఏ బదులు ఓ పార్కులో ఉప్పును పెట్టాడు. ఇలా పలువురిని మోసం చేసేవాడని విచారణలో తేలింది.

డ్రగ్స్ కేసులో నిందితుడిగా వైకాపా విద్యార్థి నేత కొండారెడ్డి!

ఈనాడు - అమరావతి : విజయవాడలో నమోదైన డ్రగ్స్ కేసులో వైకాపా విద్యార్థి నేత కొండారెడ్డిని పోలీసులు నిందితుడిగా చేర్చారు. బెంగళూరులో దొరికిన ఎండీఎంఏ సరఫరాదారుడు మధుసూదన్‌రెడ్డి అలియాస్ మ్యాడీ.. తన నేరాంగీకార స్టేట్‌మెంట్‌లో విశాఖపట్నానికి చెందిన కొండారెడ్డితో లింకుల గురించి పోలీసులకు వివరించాడు. తన నుంచి ఎండీఎంఏను విశాఖకు తెప్పించుకునే వాడని చెప్పాడు. బెంగళూరు వెళ్లిన వారితో తెప్పించుకునే వాడని తేలింది. దీనిపై ఆధారాలు లభించడంతో పోలీసులు వైకాపా నేతను ఏ5గా చేర్చారు. ఇప్పటికే విశాఖలో డ్రగ్స్ కేసులో కొండారెడ్డి అరెస్టు అయి రిమాండ్‌లో ఉన్న నేపథ్యంలో విజయవాడలోని కోర్టులో పీటీ వారెంటు దాఖలు చేయనున్నారు. కోర్టు నుంచి అనుమతి లభించిన తర్వాత ఇక్కడి న్యాయస్థానంలో హాజరుపరుస్తారు. అనంతరం కస్టడీకి తీసుకుని మరింత లోతుగా విచారించనున్నారు.

వీడిన బాలికల అదృశ్యం కేసు మిస్టరీ

కాకినాడలో అదుపులోకి తీసుకున్న పోలీసులు

పెడన, న్యూస్‌టుడే: కృష్ణాజిల్లా పెడన మదర్సా నుంచి ఈనెల 10న అదృశ్యమైన ముగ్గురు బాలికలను పోలీసులు కాకినాడలో గుర్తించారు. వారు సోమవారం అదృశ్యం కాగా. .సంస్థ నిర్వాహకులు మంగళవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సెల్ ఫోన్ టవర్ లొకేషన్ ఆధారంగా కాకినాడ సముద్ర తీరానికి సమీపంలోని ఒక హోటల్‌లో మంగళవారం అర్ధరాత్రి బాలికలను గుర్తించి బుధవారం ఉదయం పెడన పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. బాలికల అదృశ్యం వెనుక కాకినాడ, బంటుమిల్లికి చెందిన వింజరపు విజయ రత్నకుమార్(20), కుంభా సందీప్(19) ఉన్నట్లు పోలీసులు నిర్ధారించి ఇరువురిపై కిడ్నాప్ కేసు నమోదు చేశారు. ఈ యువకులు కూడా ప్రస్తుతం పెడన పోలీసుల అదుపులో ఉన్నారు. బాలికలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ప్రత్యేక అరలు.. వేర్వేరు లారీలు

- తనిఖీలకు దొరక్కుండా రెండేళ్లుగా గంజాయి రవాణా
- రూ.కోట్లలో సంపాదన.. తొలిసారిగా పట్టుబడ్డ అంతర్రాష్ట్ర స్మగ్లర్
- దాడులు చేసిన ఈగల్, డీఆర్ఐ.. 248 కిలోల గంజాయి స్వాధీనం, ఐదుగురి అరెస్టు

నిందితుడు రాహుల్ కుమార్

లారీలో ప్రత్యేక అర ఏర్పాటు

పట్టుబడ్డ గంజాయి ప్యాకెట్లు

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే– పెనమలూరు

పుష్ప సినిమాలోని స్మగ్లింగ్ సన్నివేశాలకు ఏ మాత్రం తీసిపోని రీతిలో గత రెండేళ్లుగా గంజాయిని రహస్యంగా రవాణా చేస్తున్నాడు.. ఎక్కడా తనిఖీలకు దొరక్కుండా లారీల్లో ప్రత్యేక అరలు ఏర్పాటు చేసి.. రెండు వాహనాలు, ఇద్దరు డ్రైవర్లను ఉపయోగిస్తూ ఒడిశా నుంచి ఉత్తరాదికి రవాణా చేస్తూ రూ.కోట్లు ఆర్జించాడు. చివరకు సమాచారం అందుకున్న ఏపీ ఈగల్, డీఆర్ఐ అధికారులు దాడులు చేసి పట్టుకోవడంతో గుట్టురట్టయ్యింది. డీఆర్ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారులు లారీలను స్వాధీనం చేసుకుని, ప్రధాన నిందితుడు రాహుల్‌కుమార్ సహా ఐదుగురిని అరెస్టు చేశారు. రెండేళ్ల నుంచి రవాణా చేస్తున్నా.. అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ రాహుల్ తొలిసారిగా దొరకడం గమనార్హం.

వ్యవసాయం వదిలి..

కృష్ణా జిల్లా అవనిగడ్డ ప్రాంతానికి చెందిన రాహుల్‌కుమార్ స్వగ్రామంలో వ్యవసాయం చేస్తుండేవాడు. అది గిట్టుబాటు కాక.. విజయవాడ శివారు యనమలకుదురు వచ్చి.. ఫ్లాట్ తీసుకుని నివాసం ఉంటున్నాడు. తక్కువగా సమయంలో రూ.కోట్లు సంపాదించాలన్న ఆశతో గంజాయి రవాణాను మార్గంగా ఎంచుకున్నాడు. దీనికి గాను విజయవాడ, విశాఖపట్నంకు చెందిన కొందరు డ్రైవర్లతో ఒప్పందం చేసుకున్నాడు. అనంతరం ఐదు పెద్ద లారీలను కొనుగోలు చేశాడు. వీటిలో రెండింటిని విశాఖపట్నం నగరానికి చెందిన డ్రైవర్ ఆనంద్‌కుమార్ పేరున ఏపీలో రిజిస్ట్రేషన్ చేయించాడు. ఇందుకుగాను అతడికి రూ.10వేలు ముట్టజెప్పి ఒప్పించాడు. మరో మూడు వాహనాలను రాహుల్.. తన పేరునే యూపీలో రిజిస్ట్రేషన్ చేయించాడు.

తనిఖీలు తప్పించుకునేందుకే..

ఒడిశా నుంచి గంజాయి రవాణా చేయాలని నిర్ణయించుకుని.. ఆ రాష్ట్రంలోని భవానీపట్నంకు చెందిన దీపు అనే వ్యక్తితో ఒప్పందం కుదుర్చుకున్నాడు. అక్కడి నుంచి విజయవాడకు చేర్చి.. ఇక్కడి నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు వేర్వేరు వాహనాల్లో తరలించాలని ప్రణాళిక వేశాడు. దీని కోసం కానూరులోని కొత్త ఆటోనగర్‌లో రూ.25వేల అద్దెకు గోదాము తీసుకున్నాడు. ఒడిశా నుంచి ఏపీ రిజిస్ట్రేషన్ వాహనాలను మాత్రమే ఉపయోగించేవాడు. ఏపీ రిజిస్ట్రేషన్‌వి అయితే ఆంధ్ర సరిహద్దుల్లో తనిఖీలు ఉండవని ప్లాన్ వేశాడు. ఒక్కో డ్రైవర్‌కు ప్రతి ట్రిప్పునకు రూ.40 వేలు చెల్లించేవాడు. ప్రతి లారీకి అడుగు భాగాన ప్రత్యేక అర ఏర్పాటు చేయించాడు. ఇది డ్రైవర్ వెనుక నుంచి మాత్రమే తీసేందుకు వీలుగా మార్చాడు. ఒడిశాలో కొన్న గంజాయిని ఈ అరలోకి చేర్చి.. పైన కంకర చిప్స్ పోసి విజయవాడకు వచ్చేవి. తర్వాత ఏపీ రిజిస్ట్రేషన్ వాహనం నుంచి సరకును యూపీ రిజిస్ట్రేషన్ వాహనంలోకి మార్చేవాడు. ఇక్కడి నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు వెళ్లే వాటిని.. అక్కడ సరిగా తనిఖీలు చేయరని ఈ ఎత్తుగడ వేశాడు. వాహనాలతో పాటు డ్రైవర్లను కూడా మార్చేవాడు.

రెండేళ్లలో తొలిసారి దొరికి..

గత రెండేళ్లుగా రహస్యంగా గంజాయిని రవాణా చేస్తూ రాహుల్‌కుమార్ పెద్ద మొత్తంలో సంపాదించాడు. అటు స్వగ్రామం, ఇటు యనమలకుదురులో ఎవరికీ అనుమానం రాకుండా మేనేజ్ చేశాడు. ముందస్తు సమాచారం మేరకు ఈగల్, డీఆర్ఐ బృందాలు ఈ నెల 10న విజయవాడ శివారు కానూరులోని కొత్త ఆటోనగర్‌లోని నిందితుడి గోదాముపై దాడులు చేశాయి. ఈ సందర్భంగా 242 ప్యాకెట్లలోని 248.82 కిలోల గంజాయిని సీజ్‌చేశారు. వీటి రవాణాకు ఉపయోగిస్తున్న ఐదు లారీలు, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు శాయన రాహుల్ కుమార్, హుస్సేన్ (గోదాము ఇన్‌ఛార్జి, విజయవాడ), సోహన్ లాల్ (డ్రైవర్, హరియాణా), ఆనంద్‌కుమార్ (డ్రైవర్, విశాఖపట్నం), అబ్దుల్ హసన్ (డ్రైవర్, విశాఖపట్నం)లను అరెస్టు చేశారు.

ట్రైన్ మేనేజర్ల సమస్యలు పరిష్కరించండి

ఏడీఆర్ఎం శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిల్ నాయకులు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: రైల్వే ట్రైన్ మేనేజర్లు(గార్డు)ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆలిండియా గార్డ్స్ కౌన్సిల్ విజయవాడ డివిజనల్ కార్యదర్శి కె.మోహన్‌దాస్ డిమాండ్ చేశారు. ట్రైన్ మేనేజర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కేంద్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం డీఆర్ఎం కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 8వ వేతన సంఘాన్ని తక్షణమే అమలు చేయాలని, ట్రైన్ మేనేజర్లకు సముచిత వేతన స్థాయిలను నిర్ధారించాలని కోరారు. 2024వ సంవత్సరం జనవరి 1 నుంచి రన్నింగ్ అలవెన్సులను 25 శాతం పెంచాలని, ఆదాయపు పన్ను మినహాయింపు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది జనవరిలో రైల్వే బోర్డు జారీ చేసిన జేపీవోను రద్దు చేయాలని, ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఏఐఎల్ఆర్ఎస్ఏ, డీఎంఆర్‌కేఎస్, సీఐటీయూ తదితర కార్మిక సంఘ నాయకులు హాజరై సంఘీభావం తెలిపారు. అనంతరం ఏడీఆర్ఎం కొండా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం సమర్పించారు.

అందుబాటులోకి రూ.100 టికెట్

ట్రావెల్ 24 గంటలు అని ముద్రించిన టికెట్

విజయవాడ బస్‌స్టేషన్, భాస్కరపురం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బుధవారం నుంచి రూ.100 ట్రావెల్ యాస్‌యూలైక్ టికెట్‌తో నగర పరిధిలో 24 గంటలలోపు ఎన్ని సార్లు అయిన ప్రయాణించే అవకాశం కల్పించింది. టికెట్ తీసుకున్న సమయం నుంచి మరుసటి రోజు అదే సమయం వరకు టికెట్ చెల్లుబాటు అవుతుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. కండక్టరు వద్ద టికెట్ తీసుకునే సమయంలో ప్రయాణికుల పేరు, చరవాణి నంబరు, వయసు నమోదు చేసుకుని టికెట్ అందిస్తారు. దీని ద్వారా ప్రయాణికులు నగర పరిధిలో నడిచే సిటీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ బస్సులు వెళ్లే మార్గాల్లో సూరంపల్లి అడ్డరోడ్డు, కొండపల్లి, గన్నవరం, కంకిపాడు, మంగళగిరి, కొత్తూరు తాడేపల్లి వరకు బస్సులు రాకపోకలు సాగించే సమయంలో ప్రయాణించవచ్చు. విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో బుధవారం నుంచి ఏపీఎస్ఆర్టీసీ ఈ విధానం అమల్లోకి తీసుకొచ్చింది.

సంజయ్ బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

ఈనాడు - అమరావతి: అగ్నిమాపక, సీఐడీ విభాగాల్లో డీజీగా పనిచేసిన సమయంలో అక్రమాలకు పాల్పడ్డారని నమోదైన కేసులో ఐపీఎస్ అధికారి సంజయ్ బెయిల్ పిటిషన్‌పై ఏసీబీ కోర్టులో వాదనలు ముగిశాయి. పిటిషన్‌పై బుధవారం విచారణ జరిగింది. ఇరుపక్షాలు వాదనలు వినిపించాయి. గత ప్రభుత్వ హయాంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని, ఇంకా దర్యాప్తు సాగుతోందని.. ఈ దశలో బెయిల్ ఇస్తే నిందితుడు తన పలుకుబడి ఉపయోగించి సాక్షులను బెదిరించే ప్రమాదం ఉందని ప్రాసిక్యూషన్ తరఫు న్యాయవాది వాదించారు. ఇంత వరకు ఏసీబీ ప్రాథమిక సాక్ష్యాలు కూడా సేకరించ లేకపోయిందనీ, నిందితుడు చాలా రోజుల నుంచి రిమాండ్‌లో ఉన్నారనీ, ఈ దృష్ట్యా బెయిల్ మంజూరు చేయాలని సంజయ్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు.. వాదనలు ముగియడంతో తీర్పు నిమిత్తం ఈనెల 17కు న్యాయాధికారి వాయిదా వేశారు.

వంశీ బెయిల్ ఆంక్షల్లో సడలింపు

ఈనాడు - అమరావతి: సత్యవర్ధన్ అపహరణ, దాడి కేసులో వైకాపా నేత వల్లభనేని వంశీ బెయిల్ ఆంక్షల్లో ఎస్సీ, ఎస్టీ కోర్టు సడలించింది. ఈ మేరకు న్యాయాధికారి బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. ప్రతినెలా రెండో శనివారం పటమట స్టేషన్‌కు వెళ్లి సంతకం చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో వంశీకి బెయిల్ మంజూరు చేసినప్పుడు. . ప్రతి నెలా రెండో, నాలుగో శనివారాలు స్టేషన్‌కు వెళ్లి సంతకం చేయాలని ఎస్సీ, ఎస్టీ కోర్టు షరతు విధించింది. ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నానని, ఆంక్షలు సడలించాలని వంశీ పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. దీనిపై ఉత్తర్వులు వెలువడ్డాయి.

నకిలీ మద్యం కేసులో నిందితులకు రిమాండ్

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో ములకలచెరువు ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న నలుగురు నిందితులను బుధవారం పీటీ వారెంట్‌పై సిట్ అధికారులు విజయవాడ ఎక్సైజ్ కోర్టులో హాజరుపరిచారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి కారాగారంలో ఉన్న మిథున్ దాస్, అంతదాస్, హాజి, రాజులను న్యాయాధికారి ఎదుట హాజరుపరిచారు. వీరికి ఈనెల 25 వరకు రిమాండ్ విధించారు. అనంతరం నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు. ★ ఈ కేసులో అజ్ఞాతంలో ఉన్న నిందితుడు తలారి రంగయ్య (ఏ14) దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్.. 8వ ఏడీజే కోర్టులో బుధవారం విచారణకు వచ్చింది. ప్రాసిక్యూషన్ కౌంటరు దాఖలు చేసేందుకు ఈనెల 17వ తేదీకి న్యాయాధికారి వాయిదా వేశారు.

(c) eenadu

పొలం గట్లపై.. పాడె మోత



రావికమతం మండలం కొమిరతోపాటు చిన పాచిల శివారు మత్స్యపురంలో ఆత్మీయులు ఎవరైనా మరణిస్తే ఆ బాధకంటే భౌతిక కాయాలను అంత్యక్రియలకు తరలించేందుకు పడుతున్న వేదనే అధికంగా ఉంటోంది. శ్మశానానికి తరలించే క్రమంలో పాడెపై నుంచి మృతదేహం ఎక్కడ కిందపడుతుందోనని జాగ్రత్తగా అడుగులో అడుగేస్తూ ముందుకు సాగాల్సి వస్తోంది. ఈ రెండు గ్రామాలకు సర్వే నంబరు 45లో సుమారు 20 సెంట్ల స్థలంలో శ్మశానం ఉంది. అక్కడకు చేరుకునేందుకు దారి లేదు. పొలాల గట్ల మీదుగా మృతదేహాలను తరలించాల్సి వస్తోంది. జూన్ నుంచి అక్టోబర్ వరకు వర్షాలు అధికంగా పడే సమయంలో ఇక్కట్లు రెట్టింపు అవుతున్నాయి. కొమిర అంబేడ్కర్ కాలనీకి చెందిన ఓ మహిళ మంగళవారం రాత్రి మృతి చెందింది. బుధవారం ఉదయం అంత్యక్రియలు చేసేందుకు పొలం గట్లు, సరుగుడు తోటల్లోంచి శ్మశానానికి చేరుకునేందుకు కుటుంబ సభ్యులు, బంధువులు పడరాని పాట్లు పడ్డారు. – న్యూస్‌టుడే, రావికమతం

వ్యవసాయ రుణాలపై అవగాహన రేపు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని ప్రాంతీయ కార్యాలయంలో ఈ నెల 14న వ్యవసాయ రుణాలపై అవగాహన కార్యక్రమం జరగనుంది. వివరాలకు సమీప బ్రాంచిలో/ టోల్ ఫ్రీ నంబరు 1800 3030లో సంప్రదించవచ్చని బ్యాంకు ప్రతినిధి శ్రీనివాసరావు చెప్పారు. అనకాపల్లి జిల్లాలోనూ త్వరలోనే సదస్సు నిర్వహిస్తామన్నారు.

సీఎంకు ఘన స్వాగతం

విశాఖ నగరంలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప నుంచి ప్రత్యేక విమానంలో బుధవారం రాత్రి 7 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు మంత్రులు అనిత, కొల్లు రవీంద్ర, డోలా బాల శ్రీవీరాంజనేయస్వామి, ఎంపీలు భరత్, సీఎం రమేశ్, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, విజయకుమార్, పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, తదితరులు స్వాగతం పలికారు. – న్యూస్‌టుడే, విశాఖపట్నం

ఇంటింటికీ మన మిత్ర

వాట్సాప్ గవర్నెన్స్‌పై విస్తృత ప్రచారం

కలెక్టరేట్, న్యూస్‌టుడే

కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా క్షణాల్లో సేవలు పొందేలా వాట్సాప్ గవర్నెన్స్ (మన మిత్ర)ను కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. చేతిలో స్మార్ట్ ఫోనుంటే చాలు.. 738 రకాల సేవలను పొందవచ్చు. అవగాహన లేక చాలామంది నేటికీ సచివాలయాలకు వస్తున్నారు. ఈ క్రమంలో మనమిత్రను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. సచివాలయ ఉద్యోగులు ప్రతి శుక్రవారం తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి వాట్సాప్ సేవలపై అవగాహన కల్పించాలని గ్రామ, వార్డు సచివాలయ శాఖ డైరెక్టర్ శివప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

జిల్లా వ్యాప్తంగా 522 సచివాలయాల పరిధిలో 3,748 మంది ఉద్యోగులు మన మిత్ర సేవలను ఇంటింటికీ చేరువ చేసేందుకు వస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రతి శుక్రవారం ఇంటింటికీ వెళ్లి యాప్ వినియోగంపై అవగాహన కల్పించనున్నారు.

జిల్లాలో 5,59,793 కుటుంబాలను సర్వే చేసి మన మిత్ర సేవలపై అవగాహన కల్పిస్తారు. వాట్సాప్ ద్వారా సేవలు ఎలా పొందాలో వివరిస్తారు. క్యూఆర్ కోడ్ ముద్రించిన కరపత్రాలు అందజేస్తారు. ఇళ్ల సంఖ్య, నమోదైన పౌరుల వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు. వీటన్నింటినీ పంచాయతీ కార్యదర్శి, వార్డు పరిపాలనా కార్యదర్శి సమన్వయం చేస్తూ సర్వే విజయవంతంగా జరిగేలా పర్యవేక్షిస్తారు.

ఎనర్జీ అసిస్టెంట్లు, కార్యదర్శులు విద్యుత్తు బిల్లులు, కొత్త కనెక్షన్ల ఫిర్యాదులపై వాట్సాప్ సేవలను వివరిస్తారు. వ్యవసాయ, ఉద్యాన, పట్టు, పశు సంవర్ధక, మత్స్య, ఏఎన్ఎం, వార్డు హెల్త్ కార్యదర్శులు శాఖల వారీగా వాట్సాప్ సేవలపై అవగాహన కల్పిస్తారు.

అనకాపల్లి మండలం అక్కిరెడ్డిపాలెంలో అవగాహన కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు

సేవలు పొందండి ఇలా.. 95523 00009

నంబరుకు హాయ్ అని సందేశం పంపడం ద్వారా అన్ని ప్రభుత్వ సేవల జాబితా కనిపిస్తుంది. కావాల్సిన సేవను ఎంచుకుని అవసరమైన వివరాలు పొందుపరచాలి. సేవలకు సంబంధించిన చాట్‌బాట్‌లో అడిగిన వివరాలను అక్షరాలు, వాయిస్ రూపంలో అందించాలి. వివరాలు ఒకసారి తనిఖీ చేసిన తరవాత రియల్ టైమ్ అప్‌డేట్ / కన్ఫర్మేషన్ సందేశం వస్తుంది. వాట్సాప్ గవర్నెన్స్‌లో చాట్ బాట్ ఈ ధ్రువీకరణ పత్రాలు, రసీదులు, తిరుగు రసీదు అందిస్తుంది.
– మంజులవాణి, జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారిణి

సింగపూర్‌కు మన గురువులు

★ జిల్లా నుంచి ముగ్గురికి అవకాశం
★ ఉత్తమ విధానాలపై అధ్యయనం

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఐదేళ్ల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిలో 78 మందిని సింగపూర్‌లో అమలవుతున్న అధునాతన విద్యా విధానాలను వారం రోజుల పాటు (ఈ నెల 27 నుంచి డిసెంబరు 2 వరకు) అధ్యయనం చేసేందుకు పంపనుంది. వీరిలో అనకాపల్లి జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులకు అవకాశం దక్కింది. అక్కడి పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అనుసరిస్తున్న నూతన సాంకేతిక విధానాలు, బోధనారీతులను పరిశీలించనున్నారు. రాష్ట్రంలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉన్న అంశాలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తారు. ఎంపికైన వారితో బుధవారం 'న్యూస్‌టుడే' మాట్లాడింది. వారేమన్నారంటే..

మంచి ఫలితాలకు దోహదం

సింగపూర్‌లో విద్యా విధానాలను పరిశీలించడం ద్వారా అక్కడ అమలులో ఉన్న మెరుగైన పద్ధతులు ఇక్కడ అమలు చేసేందుకు వీలుంటుంది. పాఠశాలల నిర్వహణ మరింత బలోపేతం అయ్యేందుకు ఈ పర్యటన దోహదపడుతుందని భావిస్తున్నా. విద్యాపరంగా అభివృద్ధి చెందిన దేశాల్లో ఉన్న వసతులు, పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలు తదితర అంశాలను పరిశీలించి రాష్ట్రంలో విద్యా ప్రమాణాల మెరుగునకు ఏం చేయాలో ప్రభుత్వానికి నివేదిస్తాం.
– డీవీవీ, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు, నర్సీపట్నం

ఉత్తమ విధానాల అమలు...

క్రీడారంగంలో ఏది దేశాలు వెళ్లొచ్చా అక్కడి మెరుగైన విధానాలను పరిశీలించి నేను పనిచేసే పాఠశాలలో అమలు చేసేందుకు ప్రయత్నిస్తుంటా. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సింగపూర్ పంపాలని ప్రభుత్వం నిర్ణయించడం నూతన ఒరవడికి నిదర్శనం. ఉపాధ్యాయుల్లో ఉత్సాహం, అంకితభావం పెరుగుతుంది. ఉత్తమ విధానాల అమలుకు ఈ పర్యటన మరింత దోహదపడుతుందని భావిస్తున్నా.
– పీవీఎం నాగజ్యోతి, ఆంగ్ల ఉపాధ్యాయిని, రోలుగుంట

విద్యారంగ అభివృద్ధికి ఊతం

సింగపూర్ అభివృద్ధి చెందిన దేశం. మన వాతావరణానికి తగ్గట్లుగా అక్కడి విద్యా విధానాలు అమలుకు ఏ మేరకు అవకాశం ఉంటుందో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిస్తాం. ఎంపికైన ఉపాధ్యాయులకు వీసా, ఇతర ప్రక్రియలు నడుస్తున్నాయి. విద్యారంగాన్ని మరింత అభివృద్ధి దిశగా నడిపించేందుకు సింగపూర్ పర్యటన దోహదపడుతుంది.
– నారాయణరావు, గొందుపాలెం, కె.కోటపాడు మండలం

యువతే దేశ భవిష్యత్తు

★ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి
★ హోంమంత్రి వంగలపూడి అనిత

ప్లకార్డులు చూపుతున్న మంత్రి అనిత తదితరులు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: డ్రగ్స్ రహితంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని హోం మంత్రి అనిత చెప్పారు. గంజాయి, మత్తు పదార్థాల రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. యువతే దేశ భవిష్యత్తని, మత్తుకు బానిసై భవితను నాశనం చేసుకోవద్దని కోరారు. విశాఖ రేంజ్ పరిధిలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా 'అభ్యుదయం' పేరిట సైకిల్ యాత్రకు బుధవారం పాయకరావుపేట నుంచి శ్రీకారం చుట్టారు. సభలో ప్రసంగిస్తూ.. ఇచ్ఛాపురం వరకు యాత్ర కొనసాగుతుందన్నారు. కొందరు యువకులు మత్తుకు బానిసలుగా మారి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి వినియోగించినా, సరఫరా చేసినా ఆ సమాచారాన్ని 1972 నంబర్‌కు తెలియజేస్తే పది నిమిషాల్లో పోలీసులు అక్కడికి చేరుకుంటారని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న ఫ్లాష్‌మాబ్

డీఐజీ గోపీనాథ్ జెట్టి మాట్లాడుతూ.. 'మాదక ద్రవ్యాల వినియోగం అతిపెద్ద సమస్యగా మారింది. అల్లూరి సీతారామ రాజు జిల్లాలో గంజాయి సాగును సమర్థంగా అరికట్టగలిగాం. ఏజెన్సీలోని 20 మండలాల్లో 35 వేల మంది రైతులకు నచ్చజెప్పి 30 వేల ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తున్నాం. డ్రోన్లు, ఉపగ్రహ చిత్రాలను విశ్లేషించి గంజాయి సాగును అరికడుతున్నాం. గంజాయి రవాణా కేసుల్లో ఇప్పటికే 2,500 మందిని అరెస్టు చేశాం. 61 మందిపై పీడీ చట్టం ప్రయోగించి'నట్లు చెప్పారు. ఎస్పీ తుహిన్‌సిన్హా, నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు, పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ శివదత్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబాబు, నగేష్, ప్రదీప్, వరహాలబాబు పాల్గొన్నారు.

2029 నాటికి పేదలందరికీ ఇళ్లు

అనకాపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా 2029 నాటికి పేదలందరికీ సొంతింటి కల సాకారం చేస్తామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులతో బుధవారం గృహ ప్రవేశాలు చేయించారు. ఇళ్ల తాళాలు, నిధుల మంజూరు పత్రాలు, పండ్లు అందజేశారు. ఓ ఇంటిని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం 17 నెలల్లోనే రాష్ట్రంలో మూడు లక్షల ఇళ్లు నిర్మించి పేదలకు అందిస్తోందన్నారు. వైకాపా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాలనీల్లో కనీస సదుపాయాల్లేవన్నారు. ఇళ్ల స్థలాల కోసం సేకరించిన భూమి విలువను మూడు రెట్లు పెంచి సుమారు రూ.7,500 కోట్లు దోచేశారన్నారు. గతంలో తెదేపా ప్రభుత్వం 1.5 సెంట్ల స్థలం ఇవ్వగా, వైకాపా ప్రభుత్వం కేవలం సెంటు స్థలమే ఇచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలం కేటాయిస్తున్నట్లు చెప్పారు. పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ.. అనకాపల్లి పట్టణంలో స్థల సమస్య ఉందన్నారు. సుమారు 1,500 మంది పేదలకు ఇళ్లు, నివేశన స్థలాల్లేవన్నారు. వారందరికీ గ్రామీణ ప్రాంతాల్లో స్థలాలు కేటాయించాలని కోరారు. జాయింట్ కలెక్టర్ జాహ్నవి మాట్లాడుతూ పట్టణంలోని 98 మంది పేదల ఇంటి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కొక్కరికి రూ.2.5 లక్షల చొప్పున మంజూరు చేశాయన్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో 3,200 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, లబ్ధిదారులు అందరికీ ఇంటి తాళాలు అందజేస్తున్నట్లు చెప్పారు. గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రత్నాకర్, జోనల్ కమిషనర్ చక్రవర్తి, గృహనిర్మాణ పీడీ శ్రీనివాసరావు, ఆర్డీఓ ఆయిషా, కార్పొరేటర్ నీలిమ, నాయకులు జోగినాయుడు, నీలిబాబు పాల్గొన్నారు.

ఇంటి యజమానికి వస్త్రాలు, పండ్లు అందజేస్తున్న మంత్రి రవీంద్ర, పీలా గోవింద సత్యనారాయణ, జేసీ జాహ్నవి

చుట్టూ కాసారం.. తాగునీరు కలుషితం

బుచ్చెయ్యపేట మండలం పి.భీమవరం గ్రామంలో తాగునీరు కలుషితమవుతోంది. బోరు చుట్టూ కాసారంలా నీరు నిల్వ ఉంటోంది. మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలతో సమస్య తీవ్రత రెట్టింపు అయింది. తప్పనిసరి పరిస్థితుల్లో బురద నీటిలో నుంచే బోరు వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. బోరు నుంచి వచ్చే నీరు బురదగా ఉంటోందని స్థానికులు చెబుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, బుచ్చెయ్యపేట

మత్స్యకారుల ఉపాధికి తోడ్పాటు

నాతవరం, న్యూస్‌టుడే: మత్స్యకారుల ఉపాధికి ఇబ్బంది కలగకుండా తాండవ జలాశయంలో ఏటా పది లక్షల చేప పిల్లలు విడుదల చేస్తున్నట్లు సభాపతి అయ్యన్నపాత్రుడు చెప్పారు. కలెక్టరు విజయ్ కృష్ణన్‌తో కలిసి బుధవారం జలాశయంలో చేప పిల్లలను విడుదల చేశారు. చేపల పెంపకం ద్వారా నాతవరం, గొలుగొండ, కొయ్యూరు మండలాల్లోని 14 గ్రామాల్లో జాలర్లకు ఉపాధి లభిస్తుందన్నారు. ఆరు నెలల్లోనే ఇవి కేజీ బరువు తూగుతాయని ఎంపీడీవో నాగమణి చెప్పారు. జాలారిపేట గ్రామంలో అయ్యన్న మాట్లాడుతూ.. జిల్లాలోనే పెద్ద జలాశయం కావడంతో తాండవ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. నాతవరం నుంచి తాండవ వరకు రూ.6.36 కోట్ల నిధులతో రహదారి నిర్మాణం రెండు నెలల్లో ప్రారంభమవుతుందని చెప్పారు. జలాశయం నుంచి స్పిల్‌వే గేట్ల వరకు 3.2 కి.మీ. దూరం రోడ్డు నిర్మాణానికి సీఎస్ఆర్ నిధులు రూ.2 కోట్లు కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. మర్రిపాలెంలోని కస్తూర్బా విద్యాలయానికి రూ.ఆరు లక్షలతో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వీవీ కృష్ణారావు సమకూర్చిన బల్లలను అయ్యన్నపాత్రుడు కేజీబీవీ ప్రత్యేకాధికారిణికి అందజేశారు. తాండవ జలాశయ కమిటీ ఛైర్మన్ సత్యనారాయణ, మత్స్య శాఖ జేడీ లక్ష్మణరావు, ఆర్డీవో రమణ, కేజీబీవీ ప్రత్యేకాధికారి భవాని, కూటమి నాయకులు రాజాన సూర్యచంద్ర, ఎన్‌వీ రమణ పాల్గొన్నారు.

జలాశయంలో చేప పిల్లలను విడుదల చేస్తున్న సభాపతి అయ్యన్న, కలెక్టరు విజయకృష్ణన్

అందుబాటులో సదరం స్లాట్లు

రేపటి నుంచి నమోదుకు అవకాశం

నక్కపల్లి, న్యూస్‌టుడే

వైకల్యంతో బాధపడుతున్న వారంతా సదరం ధ్రువపత్రాలు పొందేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు అవకాశం కల్పించింది. ఈ నెల 14 నుంచి డిసెంబరు వరకు నమోదు చేసుకోవచ్చు. మీ సేవ, సచివాలయాలకు వెళ్లి సమస్యను వివరిస్తే సిబ్బంది ఆయా ఆసుపత్రుల్లో ఖాళీలు, తేదీలను పరిశీలించి స్లాట్ బుక్ చేస్తారు.

★ స్లాట్ బుక్ చేసుకున్న వారికి అనకాపల్లి, నర్సీపట్నం, నక్కపల్లి, ఎలమంచిలి ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు చేస్తారు. విశాఖ పరిధిలో కేజీహెచ్, ప్రాంతీయ నేత్ర వైద్యశాల, ఈఎన్‌టీ, మానసిక వైద్యశాలతో పాటు పెందుర్తి, అగనంపూడి, భీమిలి ఆసుపత్రుల్లో పరీక్షలు చేస్తారు. నర్సీపట్నం, అనకాపల్లిలో వారానికి రెండు రోజుల చొప్పున ఆర్థోకు సంబంధించి 100 స్లాట్‌లు, కంటికి సంబంధించి వారానికి 25 స్లాట్‌లు ఉన్నాయి. నక్కపల్లి, ఎలమంచిలి ఆసుపత్రుల్లో వారానికి 30 చొప్పున ఆర్థోకు స్లాట్లు కేటాయించారు.

★ కాళ్లు, చేతులు, దృష్టి, మానసిక స్థితి సరిగా లేని వారికి ప్రభుత్వం అందించే సదరం ధ్రువపత్రం తప్పనిసరి. ఈ పత్రం ఆధారంగా పింఛను పొందడంతోపాటు చదువు, ఉద్యోగం, ప్రయాణాల్లో ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుంది. ప్రభుత్వ సేవలు పొందవచ్చు. కూటమి ప్రభుత్వం ప్రతి నెలా రూ.ఆరు వేల చొప్పున పింఛను అందిస్తోంది.

నక్కపల్లి ఆసుపత్రిలో దివ్యాంగులు

ముందుగా స్లాట్ బుక్ చేసుకుని ఎంచుకున్న ప్రభుత్వాసుపత్రుల్లో వారికి నిర్దేశించిన తేదీల్లో సంబంధిత విభాగాల వైద్యులు వైద్య పరీక్షలు చేస్తారు. సదరం ధ్రువపత్రంలో వైకల్య శాతం నమోదు చేస్తామని డీసీహెచ్ **శ్రీనివాసరావు** పేర్కొన్నారు.

గ్రంథాలయాలకు పండగొచ్చింది

రేపటి నుంచి వారోత్సవాలు

పాయకరావుపేట, న్యూస్‌టుడే

'చిరిగిన చొక్కా అయినా తొడుక్కో కానీ ఒక మంచి పుస్తకం కొనుక్కో' అన్న కందుకూరి వీరేశలింగం పంతులు మాటలు పుస్తకాల ప్రాధాన్యానికి అద్దం పడతాయి. గ్రంథాలయాలను చిన్నారులకు మరింత చేరువ చేసేందుకు ఏటా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. పుస్తక పఠనంపై ఆసక్తి పెంచడమే లక్ష్యంగా 58వ గ్రంథాలయ వారోత్సవాలకు పుస్తక భాండాగారాలు వేదిక కానున్నాయి. ఈ నెల 14 నుంచి 20 వరకు గ్రంథాలయాల్లో బాలబాలికలను పోటీలతో పండగ వాతావరణం నెలకొననుంది.

నర్సీపట్నం గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులు

★ గ్రంథాలయాల్లో శుక్రవారం నుంచి ఆట, పాట, వక్తృత్వం, చదరంగం, పద్య పఠనం, ముగ్గులు వేయడం తదితర పోటీల్లో విద్యార్థులు పోటీ పడనున్నారు. పుస్తక ప్రదర్శన ద్వారా అవగాహన పెంచనున్నారు. నిరుద్యోగుల పాలిట కల్పతరువులైన పుస్తకాలు, సాహిత్యం, నవలలు, సైన్సు పుస్తకాలను పరిచయం చేయనున్నారు.

★ ఉమ్మడి విశాఖ జిల్లాలో 64 గ్రంథాలయాలు ఉండగా సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇన్‌ఛార్జిలతోనే నడిపిస్తున్నారు. పాఠకుల డిమాండ్ మేరకు కొత్త పుస్తకాలు సమకూర్చుతున్నారు. 'పాడైన భవనాలకు కొత్తరూపు తీసుకువచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. వారోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఏటా పాఠకుల డిమాండ్ మేరకు రూ.5 లక్షల విలువైన పుస్తకాలు కొంటున్నా'మని గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి కుమార్‌రాజా పేర్కొన్నారు.

అందెల రవళులు

హరిపాలెంలో గౌరీపరమేశ్వరుల అనుపు ఉత్సవం బుధవారం వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా చిన్నారులు కాళ్లకు గజ్జెలు కట్టి చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. బాణసంచా పేలుళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.
– న్యూస్‌టుడే, అచ్యుతాపురం

ధాన్యం సేకరణకు రంగం సిద్ధం

పాయకరావుపేట, నర్సీపట్నం, న్యూస్‌టుడే

జిల్లాలో ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధమైంది. గతేడాది కన్నా మద్దతు ధర పెరిగింది. పాయకరావుపేట, ఎలమంచిలి, ఎస్.రాయవరం, నర్సీపట్నం, చోడవరం, అనకాపల్లి, రాంబిల్లి, కోటవురట్ల, నక్కపల్లి, నాతవరం మండలాల పరిధిలో సుమారు 3.5 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. ఈ ఏడాది 3,41,234 టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారుల అంచనా. తిండి గింజలకు 1,94,503 టన్నులు పోను కొనుగోలు కేంద్రాలకు 1,46,731 టన్నుల వరకు రావచ్చని భావిస్తున్నారు. కోతల సమయానికి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు ఇప్పట్నుంచే పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు, శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నారు. మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిల్లో ఈ నెల 14, 15 తేదీల్లో సదస్సులు నిర్వహించనున్నారు.



కేంద్రంలో ధాన్యం నాణ్యత విశ్లేషణలో సిబ్బంది

జిల్లాలో వరి సాగు:
3.5 లక్షల ఎకరాలు

గతేడాది మద్దతు ధర (క్వింటాల్‌కు):
గ్రేడ్ 'ఎ' : రూ.2,320,
సాధారణ రకాలు రూ.2,300

ప్రస్తుతం
గ్రేడ్ 'ఎ': రూ.2,389,
సాధారణ రకాలు రూ.2,369

గోనె సంచికి చెల్లించేది: రూ.4.74
కూలీ ఖర్చు: క్వింటాల్‌కు రూ.22

65 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

★ గతేడాది 27 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఈ ఏడాది అంతకు మించి (సుమారు 35 వేల టన్నులు) సేకరించాలన్నదే లక్ష్యం. సకాలంలో రైతుల బ్యాంకు ఖాతాలకు సొమ్ములు జమయ్యేలా చర్యలు చేపడుతున్నారు. రైతు సేవా కేంద్రాలను క్లస్టర్ విధానంలో విభజించి వాటికి అనుగుణంగా మిల్లులను కేటాయించారు. డిసెంబరు మొదటి వారం నుంచి కొనుగోలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 65 సేకరణ కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి.

రవాణా ఖర్చులు కి.మీ.లోపు	(రూ.లలో)
0-8	295
8-20	302
20-40	308.50
40-80	314.50
80 కి.మీ. దాటితే	320

దళారీ వ్యవస్థకు ఆస్కారం లేకుండా..: తేమ శాతం, తూకాల్లో తేడాలు రాకుండా కట్టుదిట్టం చేశాం. మిల్లర్లు 50 శాతం వరకు గోనె సంచులను సమకూరుస్తారు. పౌర సరఫరాల అధికారులు, రెవెన్యూ ఉద్యోగులను మిల్లుల వద్ద కస్టోడియన్లుగా నియమించి సరకు అన్‌లోడ్ తదితర వాటిలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపతాం. దళారీ వ్యవస్థకు ఆస్కారం లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నాం.
– జయంతి, మేనేజర్, పౌరసరఫరాల శాఖ

విశాఖకు 'భాగస్వామ్య' కళ

సీఐఐ సదస్సుకు సర్వం సిద్ధం

ఉపరాష్ట్రపతి పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు

విశాఖపటం, న్యూస్‌టుడే: సీఐఐ భాగస్వామ్య సదస్సుకు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నారు. బుధవారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖ చేరుకున్నారు. విమానాశ్రయంలో పలువురు అధికారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నేతలు ఘన స్వాగతం పలికారు. తరువాత నగరంలో హోటల్‌కు చేరుకున్న చంద్రబాబు.. పారిశ్రామిక వేత్తలతో భేటీ అయ్యారు. సదస్సు నేపథ్యంలో నగరాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. కూడళ్లన్నీ అందంగా తీర్చిదిద్దారు.

★ ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ నగరానికి రానున్నారు. 14న ఉదయం 8.30గంటలకు విమానంలో విశాఖ చేరుకుంటారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి అల్పాహార విందులో పాల్గొంటారు. అనంతరం ఉదయం 8.55 గంటలకు సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొంటారు. అదే రోజు ఉదయం 11.15గంటలకు బయలు దేరి ఐఎన్ఎస్ డేగ చేరుకొని అక్కడి నుంచి దిల్లీ బయలుదేరి వెళ్తారు. ఈ మేరకు బుధవారం ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలోని డాక్టర్ వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఉప రాష్ట్రపతి సెక్యూరిటీ అధికారి సింగ్, ఇతర ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించారు.

నేడు మంత్రి లోకేశ్ రాక

విశాఖపట్నం, న్యూస్‌టుడే : రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం విశాఖ రానున్నారు. దిల్లీ నుంచి మధ్యాహ్నం 12.45 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని, అక్కడ నుంచి నేరుగా రోడ్డు మార్గం ద్వారా నగర తెదేపా కార్యాలయానికి చేరుకుని బస చేస్తారు. 14, 15 తేదీల్లో జరిగే భాగస్వామ్య సదస్సులో పాల్గొంటారు.

సదస్సు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కార్యదర్శి కార్తికేయ మిశ్రా, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తదితరులు

★ ఉపరాష్ట్రపతి పర్యటనకు రక్షణ ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని అధికారులకు సూచించారు. అనంతరం ముఖ్యమంత్రి కార్యదర్శి కార్తికేయ మిశ్రా, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.

ఏర్పాటు చేసిన సీఆర్‌డీఏ స్టాల్

అతిథులకు.. పర్యాటక ఆతిథ్యం!

ఈనాడు, విశాఖపట్నం : ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖ కేంద్రంగా జరుగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు దేశ, విదేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారు. వారంతా కార్యక్రమానికి హాజరైన తరువాత నగర అందాలు వీక్షించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఆసక్తి ఉన్న వారికి అరకు ప్రాంతాలను చూపించనుంది. ప్రశాంత వాతావరణం, ప్రకృతి అందాలు, ఆహ్లాదకర తీర ప్రాంతాలకు తీసుకువెళ్లనుంది. శాఖల వారీగా జరిగే ఒప్పందాలకు హాజరయ్యే పెట్టుబడిదారులను సంబంధిత విభాగాల అధికారులే వివిధ పర్యాటక ప్రాంతాలకు తీసుకువెళ్లనున్నారు. ■ రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో 410 ఒప్పందాలు చేసుకునేందుకు 1,200 మంది వరకు హాజరవుతున్నారు. వీరితో పాటు 2 వేల నుంచి 4 వేల మంది పర్యటనల కోసం ప్రత్యేక వోల్వో బస్సులు ఏర్పాటు చేశారు. ■ సదస్సు నేపథ్యంలో ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని పర్యాటక ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దారు.

రేపటి నుంచి..

నరెడ్కో 'వైజాగ్ ప్రోపర్టీ ఫెస్ట్'

★ మూడు రోజుల పాటు నిర్వహణ
★ ప్రవేశం ఉచితం

ఈనాడు, విశాఖపట్నం: సొంతింటి కలలను నిజం చేసుకోవాలని, స్థలాలు కొనుగోలు చేయాలని భావిస్తున్న వారి కోసం 'నరెడ్కో (విశాఖపట్నం)' స్థిరాస్తుల ప్రదర్శన నిర్వహిస్తోంది. బీచ్ రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్‌లో ఈ నెల 14, 15, 16 తేదీల్లో 'వైజాగ్ ప్రోపర్టీ ఫెస్ట్' పేరుతో నిర్వహిస్తున్నట్లు నరెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధర్ తెలిపారు. 14న కేంద్రపౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి లోకేశ్ చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అరవైకిపైగా స్టాళ్లతో ప్రదర్శన ఉంటుందని అందులో స్థిరాస్తివే కాకుండా శానిటరీ, ఎలక్ట్రికల్ స్టాళ్లు ఉంటాయన్నారు. నాలుగు బ్యాంకులు కూడా స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ద వ్యాలీ, ఎస్‌బీఐ, జాక్వర్ ప్రధాన స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. ఒక భారీ స్టాల్‌లో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నమూనాను జీఎంఆర్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. భోగాపురం ఏరియా డెవలప్‌మెంట్ పేరుతో ఆ పరిసర ప్రాంతాల్లోని ప్రాజెక్టులతో మరో స్టాల్ ఉంటుందన్నారు. ప్రతి గంటకు లక్కీ డ్రాలు ఉంటాయని, ద్విచక్ర వాహనాలు బహుమతులుగా అందజేస్తామన్నారు.

గంజాయి సమాచారం అందించండి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: గంజాయికి సంబంధించిన ఏ సమాచారమైన 1972 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని, వివరాలను గోప్యంగా ఉంచుతామని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా స్థాయి నార్కో కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పనిచేసి గంజాయి రవాణాను పూర్తిగా అరికట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యాసంస్థల్లో ఈగల్ క్లబ్‌లను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలు, కళాశాలలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. టోల్ ఫ్రీ నంబరుపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ గంజాయి రవాణా నిరోధానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామన్నారు. పోలీసు, ఎక్సైజ్ శాఖలు సమన్వయంతో తనిఖీలు చేపట్టి రోజువారి కేసులు నమోదు చేయనున్నారు. తాటిపర్తి, కోనాం, దొనూరు, భీమవరం, శ్రీరాంపురం ప్రాంతాల్లో శాశ్వత చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. 38 వాహన తనిఖీల పాయింట్లు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. రైల్వే మార్గాల ద్వారా గంజాయి రవాణా అధికంగా జరుగుతోందని, వీటిపై ప్రత్యేక నిఘా ఉంచి అనుమానితులను తనిఖీ చేయాలన్నారు. గంజాయి నిరోధానికి నెలరోజుల ప్రణాళిక రూపొందించామన్నారు. ఈ ఏడాదిలో 116 కేసులు నమోదు చేసి 382 మందిని అరెస్టు చేసి 8504 కేజీల గంజాయి, 109 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎన్టీఆర్ ఆసుపత్రిలో 15 పడకల డీ-అడిక్షన్ కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు.

మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా

ప్రజల భాగస్వామ్యంతో కుష్టు నిర్మూలన

కుష్టు వ్యాధి నిర్మూలనలో ప్రజలు భాగస్వామ్యం ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఈ వ్యాధి నిర్మూలనకు సంబంధించిన గోడపత్రులను ఎస్పీ తుహిన్ సిన్హాతో కలిసి ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను కుష్టు రహితంగా మార్చడానికి ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఈనెల 17 నుంచి 30 వరకు జిల్లా వ్యాప్తంగా ఎల్‌సీడీసీ కార్యక్రమంలో వైద్యసిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలన నిర్వహిస్తారన్నారు. ఇంటింటికీ వెళ్లి అవగాహన పెంచాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఆరోగ్య, అవగాహన కార్యక్రమాల్లో పోలీసు శాఖ కూడా భాగస్వామ్యం అవుతుందన్నారు. డీఎంహెచ్‌ఓ ఎం. హైమావతి తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీలకు ఎంపిక

మౌనిక, లక్ష్మీ తేజస్విని

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: పంజాబ్‌లో జరగనున్న ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయాల బాక్సింగ్ పోటీలకు నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని బొంతు మౌనిక (75 కేజీల విభాగం), ఏపీఎం కళాశాల డిగ్రీ విద్యార్థిని ఏడిద లక్ష్మీ తేజస్విని (81 కేజీల విభాగం)లో ఎంపికయ్యారు. ఈ పోటీలు డిసెంబరులో జరగనున్నాయి. ఆంధ్రా యూనివర్సిటీలో మంగళవారం నిర్వహించిన ఎంపికల్లో వీరిద్దరూ స్వర్ణ పతకాలు సాధించారని శాప్ కోచ్ అబ్బు చెప్పారు.

నాణ్యతలో ఇంత నిర్లక్ష్యమా..?

తాగునీటి ట్యాంకు ప్రారంభించకుండా వెనుదిరిగిన మంత్రి

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: దీర్ఘకాలం పటిష్ఠంగా ఉండాల్సిన తాగునీటి ట్యాంకు ప్రారంభానికి ముందే లీకులు ఏర్పడటంతో హోంమంత్రి అనిత గుత్తేదారు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసి ప్రారంభించకుండానే వెనుదిరిగారు. ఎస్.రాయవరం మండలం పెట్టుగోళ్లపల్లిలో జల్‌జీవన్ మిషన్ పనుల్లో భాగంగా రూ.1.09 కోట్లతో ఇంటింటి కుళాయి పనులు చేపట్టారు. సుమారు రూ.40 లక్షలతో ట్యాంకు నిర్మించారు. దీని ప్రారంభోత్సవానికి బుధవారం అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రారంభోత్సవానికి ముందు కొబ్బరికాయ కొడుతుండగా ట్యాంకు నుంచి నీరు లీకవడం గమనించారు. నీరు ఎందుకు లీకవుతుందని గుత్తేదారు సిబ్బందిని ప్రశ్నించారు. ప్రారంభానికి ముందు పరిశీలించలేదా, రూ.కోట్లతో చేపట్టిన పనులు ఇలా నాణ్యత లేకుండా చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్థులు ట్యాంకు నిర్మాణం బాగుంది, లీకేజీలు లేవని చెబితేనే ప్రారంభిస్తానని వస్తానని చెప్పి వెళ్లిపోయారు. నిర్మాణంలో నాణ్యత లేకపోతే గుత్తేదారును బ్లాక్ లిస్టులో పెట్టిస్తానని స్పష్టం చేశారు.

గుత్తేదారు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న హోంమంత్రి అనిత

EENADU e Classifieds

JOBS

Civil CAD, Excel & Sketchup experienced Female Staff for Naqsha Interiors @ Vizag. Salary + PF. Ph: 8096910470 (Mr. Sheriff).

WANTED
An ISO 2001 కార్పోరేట్ కంపెనీనందు దిగువ తెలుపబడిన ఉద్యోగములు కలవు.
❖ CUSTOMER INTERFACE BRANCH HEAD: 5 Nos
❖ TERRITORY MANAGERS: 7
❖ OFFICE SUPPORT STAFF: 10
Age: 30 Years above - M/F
Qlf: 10th, Inter, Any Degree, Any PG
క్వాలిఫికేషన్స్ మరియు అనుభవాన్ని బట్టి తగు కేడర్ నిర్ణయించబడును.
ఏదైనా సెక్టారులో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
స్టేట్ మరియు సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగ విరమణ పొందిన వారికి తగు ప్రాధాన్యత ఇవ్వబడును.
ఇంటర్వ్యూ తేదీలు: 13th, 14th & 15th Time: 10 AM to 7 PM
Con: V. RAMA RAO Doctors Colony, VSP
9391471241 9550757172

కాంట్రాక్ట్ / ఔట్ సోర్సింగ్ పద్ధతిలో వైజాగ్, VZM, SKLM జిల్లాలో మైన్స్, హస్పిటల్స్, బ్యాంక్స్, స్కూల్స్, చెక్ పోస్ట్ ఆపరేటర్స్, అటెండర్స్, డేటాఎంట్రీ & కంప్యూటర్ ఆపరేటర్స్, జూనియర్&రికార్డ్ అసిస్టెంట్స్, P.O's క్లర్క్స్, GNM, స్పీచ్‌థెరపీ, ఫిజియోథెరపీ, ECG & Lab టెక్నీషియన్స్ 10th, ఎనీ డిగ్రీ, ITI, B.Tech. ఆల్ బ్రాంచ్. Age:18 to 42 జీ:20 to 50k M/F ✆9908656555.

విశాఖపట్నం డిపోలో మెకానిక్స్‌గా పనిచేయుటకు ఐటిఐ చదివి 1,2 సం|| అనుభవంగల అభ్యర్థులు కావలెను. 15000/- జీతం PF, ESI. ✆ 98480 78290.

ప్రైవేటు బ్యాంకులు & NBFCలో బంగారు రుణాల కోసం సిస్టమ్ ఆపరేటర్లు, టెలికాలర్లు, CRO ఎగ్జిక్యూటివ్‌లు కావలెను. జీ:15k to35k ✆ 7995439539.

SECURITY GUARDS

సెక్యూరిటీగార్డ్స్ : ఆటోనగర్, పెందుర్తి, శొంఠ్యాం ఏరియాల్లో చేయుటకు గార్డ్స్ కావలెను. అర్హత: 10th, 8గం|| డ్యూటీ, Age:25-45. ✆ 2721672, 9440387815

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

BUILDING CONSTRUCTION

Give your home a fresh new look complete Home Renovation, Painting & Interior work quality, Timely & Budget. ✆ 9885824528.

VIZAG TDR | BPS
Contact for BPS PLAN APPROVALS
PILLA BRAHMAJI RAO
Rtd. BUILDING INSPECTOR
GVMC PRESENT LICENSED SURVEYOR
92904 41348

FINANCIAL SERVICES

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదా లేదా నెలవారీ వడ్డీ పద్ధతిలో పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ ✆ 73862 01191.

PERSONAL CLASSIFIEDS

BIRTHDAY GREETINGS

Happy 12th Birthday

Chi. Chikkala Shyumdana
Wishing you Joy, Laughter & Love today and always Love from
Father: CHIKKALA LOKESH KUMAR
Mother: CHIKKALA MANOGHNA
Sister: CHIKKALA SHRISTI SHAARVI
GrandMother: CHIKKALA UMA DEVI
S. TANUJA (AUNTY)
S. DINESH & FAMILY

MISSING

కనబడుటలేదు

గంధం నాగేశ్వరరావు (నాగేష్)
S/o. గంధం అప్పారావు (Late)
వయస్సు: 49 సం॥లు
కలర్: చామన చాయ
గాజువాక BC రోడ్‌కి చెందిన పై ఫొటోలోని వ్యక్తి తేది. 25-10-2025న ఇంటి నుండి బయటికివెళ్ళి తిరిగి రాలేదు. (తనకు మాటలు రావు)
పై వ్యక్తి ఆచూకి తెల్పిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును.
Contact: 9701000255 9948568188 9121838655 GAJUWAKA

REAL ESTATE

FLAT FOR SALE

GENERAL

MVP కాలనీలో 3BHK ఫ్లాట్, సాగర్‌నగర్ మరియు PM పాలెంలో 2BHK ఫ్లాట్ బ్యాంక్‌లోన్ సదుపాయంతో అమ్మకం. ✆ 8686997700.

LAND FOR SALE

GENERAL

తూర్పుగోదావరి జిల్లా, లింగంపర్తిలో గల వైఆర్‌సి కాలువ ఆనుకొని 52 ఎకరాల వ్యవసాయ భూమి ఎకరం 35 లక్షలకు అమ్మకమునకు కలదు. (నదిపాటి గోశాలకు 2 కిలోమీటర్ల దూరం), Contact Cell: 93909 91555.

TO LET

COMMERCIAL

GENERAL

Warehouse / Office Space for Rent @ Dwarakanagar 5th Lane, VSP. 2 Floors - Each 3000 Sft (Total 6000 Sft) 9652661542.

వేతన బకాయిలు చెల్లించాలంటూ ఆదేశం

విశాఖపట్నం, న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు ఉద్యోగుల వేతన బకాయిలు 2026 జనవరి నాటికి చెల్లించేలా చర్యలు తీసుకోవాలంటూ ప్రాంతీయ జాయింట్ లేబర్ కమిషనర్ బుధవారం ఉక్కు యాజమాన్యానికి ఆదేశాలు జారీచేశారు. గత ఏడాది సెప్టెంబరు నుంచి ఉక్కు యాజమాన్యం ఉద్యోగులకు పూర్తిస్థాయిలో జీతాలు చెల్లించకపోవడంతో ఏఐటీయూసీ లేబర్ కమిషనర్ దృష్టికి తెచ్చింది. దీంతో బుధవారం ఆయన ఉక్కు యాజమాన్య ప్రతినిధులు, కార్మిక సంఘ నాయకుల మధ్య చర్చలు జరిపారు. వేతన బకాయిలు 2026 జనవరి నాటికి చెల్లించాలని ఆదేశించినట్టు నాయకులు తెలిపారు. సమావేశంలో యాజమాన్యం తరపున వైహెచ్.శంకర్, ఎస్.రామప్రసాద్, యూనియన్ తరపున డి.ఆదినారాయణ, దేముడు, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతంపై దృష్టి: మంత్రి డోలా

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. ఆంధ్ర వైద్యకళాశాల క్యాబ్ భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఆయన బుధవారం సాయంత్రం ఆవిష్కరించారు. అనంతరం కళాశాల దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ఆంధ్ర వైద్య కళాశాల యూజీల కోసం రూ.8 కోట్లతో రెండు అంతస్తుల భవనం నిర్మించనున్నామని మంత్రి ప్రకటించారు. ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, దక్షిణం తెదేపా బాధ్యులు సీతంరాజు సుధాకర్, ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, క్యాబ్ ఛైర్మన్ డాక్టర్ టి.రవిరాజు, వైద్యుల సంఘం అధ్యక్షులు డాక్టర్ జయధీర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం మంత్రిని సత్కరించి, జ్ఞాపిక అందించారు.

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామికి జ్ఞాపిక అందజేస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యాదేవి

వివాహిత అనుమానస్పద మృతి..?

చోడవరం, న్యూస్‌టుడే: చోడవరం పట్టణంలో ఓ వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. అదే సమయంలో ఆమె బిడ్డ మంచంపై విగతజీవిగా పడి ఉండటం కలకలంరేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ శివారు లక్ష్మీపురం రోడ్డులోని కనకలక్ష్మి లేవుట్‌లో ఉమామహేశ్వరరావు, వీణ నివాసముంటున్నారు. వీరిద్దరిది ప్రేమ వివాహం. వీరికి ఏడునెలల బాలుడు ఉన్నాడు. బుచ్చెయ్యపేట మండలం కె.బి. అగ్రహారం పాఠశాలలో ఉమామహేశ్వరరావు ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం దాదాపు రెండు గంటల సమయంలో ఉమామహేశ్వరరావు వీణాకు ఫోన్ చేశారు. తర్వాత మరోసారి ఆయన తిరిగి ఫోన్ చేసినా స్పందించలేదు. యథావిధిగా ఆయన విధులు ముగించుకుని ఇంటికి వెళ్లి చూడగా తలుపువేసి ఉంది. దీంతో కిటికీ అద్దం పగలగొట్టి చూసేసరికి వీణ ఫ్యాన్‌కు వేళాడుతుండటం చూసి భయంతో కేకలు వేశాడు. పోలీసులకు సమాచారమివ్వడంతో తలుపులు పగలగొట్టి చూడగా మంచంపై నిర్జీవంగా ఉన్న బిడ్డ మోహంపై దిండ్లు ఉన్నాయి. మృతురాలి తల్లిదండ్రులకు ఫోన్‌ద్వారా సమాచారమిచ్చారు. ఇన్‌స్పెక్టర్ అప్పలరాజు మాట్లాడుతూ ఆమె తల్లిదండ్రులు పార్వతీపురం నుంచి వస్తున్నారని, అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. ముందస్తు విచారణగా మృతురాలి భర్తను విచారిస్తున్నట్లు తెలిపారు. వారు వచ్చిన తర్వాత కేసు దర్యాప్తు అంశం తెలుస్తుందన్నారు. ఆత్మహత్యా.. లేదా ఇతరత్రా కారణాలున్నాయా అనేది దర్యాప్తులో తేలాల్సి ఉందన్నారు.

విగతజీవిగా పడి ఉన్న వీణ, తలగడల కింద చిన్నారి

సీపీఐ జిల్లా కార్యదర్శి రామునాయుడు బలవన్మరణం

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు (53) గడ్డి మందు తాగి బుధవారం బలవనర్మణానికి పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నర్సీపట్నం ప్రశాంతినగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో భార్య, పిల్లలతో నివసిస్తున్నారు. కొయ్యూరు మండలంలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న భార్య సత్యవేణిని ఉదయం తన బైకుపై బస్టాండ్‌లో విడిచిపెట్టి తిరిగి వచ్చి ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. పనులపై బయటికి వెళ్లి వచ్చిన కుమార్తె రోషిత తండ్రి అపస్మారకంగా పడి ఉండటం గమనించి చుట్టుపక్కల వారి సాయంతో ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. పెద్ద కుమారుడు ప్రదీప్ మూడు నెలల క్రితం ఆకస్మికంగా మరణించడం, తను మధుమేహం, రక్తపోటు, కాళ్లు నొప్పులతో బాధపడుతుండటంతో మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని భార్య పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. రామునాయుడు రెండు దఫాలు గొలుగొండ మండల సీపీఐ కార్యదర్శిగా, రైతుసంఘం మండల అధ్యక్షుడుగా పనిచేశారు. ఈ ఏడాది మేలో ఎలమంచిలిలో జరిగిన మహాసభల్లో ఆయన జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు శివలెంక కొండలరావు, క్రాంతి దళిత హక్కుల పోరాట సమితి కన్వీనర్ రాజబాబు, పట్టణ సీపీఐ కార్యదర్శి గురుబాబు తదితరులు ఆసుపత్రికి చేరుకున్నారు. గురువారం గొలుగొండ మండలం చోద్యంలో అంత్యక్రియలు జరుగుతాయని పార్టీ నాయకులు తెలిపారు.

రామునాయుడు (పాతచిత్రం)



గాలింపు చర్యలు పర్యవేక్షిస్తున్న ఎస్సై శ్రీనివాసరావు

పెద్దేరులో యువకుడి గల్లంతు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: వడ్డాది సమీపంలోని పెద్దేరులో ఓ యువకుడు గల్లంతయ్యాడు. అతడి ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. వడ్డాదికి చెందిన మొగ్గ నాగఅప్పారావు మంగళవారం పెద్దేరులో చేపల వేటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఈ మేరకు కుటుంబ సభ్యులు బుచ్చెయ్యపేట స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై శ్రీనివాసరావు సిబ్బందితో పెద్దేరు వద్దకు చేరుకుని పరిసరాల్లో గాలించారు. గజ ఈతగాళ్లను రప్పించి పెద్దేరు, తాచేరులో గాలించినా ఆచూకీ లభించలేదు.

బాలికను గర్భవతిని చేసిన యువకుడిపై పోక్సో కేసు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ఓ బాలికను (14) ప్రేమపేరుతో వంచించి గర్భవతిని చేశాడన్న ఆరోపణపై పెదబొడ్డేపల్లికి చెందిన పూడి చరణ్ (25)పై పట్టణ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. చరణ్ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనులు చేస్తుంటాడు. ఈ నెల ఏడున పాఠశాలకు వెళ్లిన బాలిక కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు చరణ్‌పై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక ఇంటికి తిరిగి రావడంతో ఆమె నుంచి వాంగ్మూలం తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

పెద్ద ప్రమాదమే తప్పింది..

షీలానగర్ కూడలిలో కంటైనర్ బోల్తా

విశాఖపట్నం, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై షీలానగర్ కూడలి వద్ద కంటైనర్ బోల్తా పడింది. కూడలిలో కంటైనర్ పడటంతో సుమారు 3 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. వివరాల్లోకి వెళ్తే బుధవారం తెల్లవారుజామున అచ్యుతాపురం నుంచి విశాఖపట్నం పోర్టుకు ఏపీ05 టీసీ 6660లారీపై పాల్ సీలింగ్ మెటీరియల్‌తో కంటైనర్ లారీ వెళ్తోంది. షీలానగర్ కూడలిలో పోర్టు రోడ్డువైపు మలుపు తిరుగుతుండగా కంటైనర్ లారీపై నుంచి కిందపడింది. తెల్లవారుజామున కావడంతో అటుగా ఎటువంటి రాకపోకలు లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది. కూడలి మధ్యలో కంటైనర్ పడిపోవడంతో విమానాశ్రయం నుంచి షీలానగర్ వైపు వచ్చే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కిలోమీటర్ల మేర వాహనాలు ఆగిపోయాయి. పోలీసులు కంటైనర్‌ను పక్కకు తొలగించేందుకు నాలుగు క్రేన్లు తెచ్చి దాదాపు గంటన్నర అనంతరం ఎట్టకేలకు తొలగించారు. సుమారు 3 గంటల పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందుల పడ్డారు.

రోడ్డుపై పడిపోయిన కంటైనర్‌ను తొలగిస్తున్న క్రేన్లు

పిచ్చికుక్క దాడిలో 20 మందికి గాయాలు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: వడ్డాదిలో బుధవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. దారినపోయేవారందరిపై దాడి చేసి గాయపరిచింది. కొద్దిసేపటికే కుక్కకాటు బాధితులతో ఆసుపత్రి నిండిపోయింది. వీరికి స్థానిక పీహెచ్‌సీలో డాక్టరు రమ్య దుర్గ, ల్యాబ్‌టెక్నీషియన్ శ్రీను ఇతర సిబ్బంది ప్రాథమిక వైద్యసేవలు అందించారు. అనంతరం మెరుగైన వైద్యసేవలు కోసం రెండు 108 వాహనాల్లో చోడవరం ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారికి రేబిస్ నివారణ టీకాలు, టి.టి. ఇంజక్షన్లు చేసి పంపించారు. పశువులు, మేకలు, గొర్రెలను వదిలిపెట్టకుండా పిచ్చికుక్క గాయపరిచింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అన్ని వీధుల్లో పరుగులు పెడుతూ స్థానికులను బెంబేలెత్తించింది. స్థానిక యువకులందరూ దీన్ని పట్టుకోవడానికి ప్రయత్నం చేసినప్పటికీ దొరకలేదు. తర్వాత బంగారుమెట్ట వైపు వెళ్లిపోయి మరికొందరిపైనా దాడి చేసింది.

108 వాహనంలో చోడవరం ఆసుపత్రికి వెళ్తున్న బాధితులు

పసిబిడ్డ మృతిపై ఆందోళన

విశాఖపట్నం: కింగ్‌జార్జ్ ఆసుపత్రి పిల్లల వార్డులో ఆరు నెలల మగబిడ్డ మృతి చెందిన ఘటనపై బుధవారం బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యమే కారణమని వారు ఆరోపించారు. పార్వతీపురం మన్యం జిల్లా, గుమ్మలక్ష్మీపురం మండలం వంగర గ్రామానికి చెందిన వై. అఖిల్ దంపతులకు ఆరు నెలల కిందట మగబిడ్డ (ధన్వీర్) జన్మించాడు. ఆ బిడ్డ అనారోగ్యం బారిన పడడంతో తొలుత పార్వతీపురంలో ఆసుపత్రికి, అక్కడ నుంచి విజయనగరంలో ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో 8వ తేదీ రాత్రి కేజీహెచ్‌కు తీసుకొచ్చి పిల్లల వార్డులో చేర్పించారు. బ్లడ్ ఇన్‌ఫెక్షన్ కారణంగా బిడ్డ ఇబ్బంది పడుతున్నాడని చెప్పిన వైద్యులు, అవసరమైన చికిత్స అందించారు. బుధవారం ఉదయం ఆరోగ్యం విషమించడంతో బిడ్డ మృతి చెందాడు. ★ అయితే ఆసుపత్రికి వచ్చిన తర్వాత బిడ్డకు రెండుసార్లు మూర్ఛ వచ్చినా, వైద్యులు సమాచారం ఇవ్వలేదని, ఎలాంటి చికిత్స అందించారో చెప్పలేదని, బిడ్డ మృతి చెందే వరకు ఆరోగ్య స్థితి మెరుగ్గానే ఉందంటూ మోసం చేశారని బాధిత కుటుంబీకులు ఆందోళనకు దిగారు. న్యాయం చేయాలని కోరుతూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిరసన కొనసాగించారు. ★ ఆసుపత్రి సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ శ్రీహరి బాధితులతో మాట్లాడడంతో వారు శాంతించారు

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	108	105
లైవ్	135	125
డ్రెస్‌డ్	196	220
స్కిన్‌లెస్	223	230

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా: మాస్ జాతర, సత్యనారాయణ స్క్రీన్2: బేడ్‌లాండ్స్, పర్తిసాయి: కృష్ణలీల, షిర్డిసాయి: గర్ల్‌ఫ్రెండ్, రామచంద్ర: ప్రేమిస్తున్నా, సత్య నారాయణ స్క్రీన్1: జటాధర, వెంకటేశ్వర: ఆర్యన్, అచ్యుతాపురం: ఎస్‌టీబీఎల్ సినీవరల్డ్ స్క్రీన్-1 జటాధర, స్క్రీన్-2: గర్ల్‌ఫ్రెండ్

మహిళా పోలీస్‌స్టేషన్ సీఐగా నీలిమ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లి మహిళా పోలీస్‌స్టేషన్ సీఐగా కె.నీలిమ బుధవారం బాధ్యతలు చేపట్టారు. వీఆర్‌లో ఉన్న ఈమెను అనకాపల్లిలోని స్టేషన్‌కు సీఐగా బదిలీ చేశారు. ఇక్కడ సీఐగా ఉన్న చంద్రశేఖర్‌ను అచ్యుతాపురం పోలీస్‌స్టేషన్ సీఐగా బదిలీ చేసిన విషయం తెలిసిందే!

సందడిగా ఉద్యోగుల వన భోజనాలు

కోటవురట్ల, న్యూస్‌టుడే : గొట్టివాడలో ఉద్యోగుల వన భోజన కార్యక్రమం బుధవారం సందడిగా జరిగింది. ఉదయం తొమ్మిది గంటలకే మండల, గ్రామ స్థాయి అధికారులు ఇక్కడకు చేరుకుని సాయంత్రం వరకు గడిపారు. తమ హోదాలను పక్కన పెట్టి అంతా ఆటలు ఆడారు. కార్తిక మాసంలో అందరూ ఒకే చోట కలుసుకోవడం ఆనందంగా ఉందని ఎంపీడీఓ చంద్రశేఖర్ పేర్కొన్నారు.

గొట్టివాడలో కార్యక్రమానికి హాజరైన ఉద్యోగులు

చినదొడ్డిగల్లులో వైద్య శిబిరం

నక్కపల్లి, న్యూస్‌టుడే: చినదొడ్డిగల్లులో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. తునికి చెందిన ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో గ్రామంలో కొద్దిరోజులుగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా ఇక్కడి వైద్య శిబిరం ఏర్పాటు చేయగా, స్థానికులు పలువురిని తీసుకువచ్చి పరీక్షలు చేయించారు. విద్యార్థులు, అధ్యాపకులు కలిసి స్థానికులకు పర్యావరణంపై అవగాహన కల్పించి మొక్కలు నాటారు. ప్రిన్సిపల్ దీప్తి, ప్రతినిధులు రాజేంద్ర, శివపార్వతి, మన్నియ్య తదితరులు పాల్గొన్నారు.

రామునాయుడు మృతి తీరని లోటు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: సీపీఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు అకాల మృతి ప్రజా ఉద్యమాలు, పోరాటాలకు తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. హక్కుల పరిరక్షణకు కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు వామపక్ష, ప్రజా సంఘాలు కృషి చేస్తాయన్నారు.

కాలువలో పూడికతీత పనులు

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ఊడేరు సచివాలయం వద్ద పెద్ద కాలువలో బుధవారం పొక్లెయిన్‌తో పూడిక తీత పనులు చేపట్టారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు సర్పంచి కృష్ణమోహన్, ఉపసర్పంచి బొబ్బిలి రాజు కాలువలో వ్యర్థాలు, మట్టిదిబ్బలను తొలగించి మురుగు ప్రవహించేలా సమస్యకు పరిష్కారం చూపారు.

ఐక్య పోరాటాలతో శరణ్యం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసనగా ఐక్య పోరాటాలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రొంగలి రాము పిలుపునిచ్చారు. వివిధ ప్రాంతాల్లో బుధవారం సీఐటీయూ అనుబంధ సంస్థల సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు విశాఖలో జరిగే సీఐటీయూ మహాసభల్లో అన్ని వర్గాల ప్రజలు ఐక్యతను చాటాలన్నారు. ప్రతినిధులు సోమునాయుడు, తాతారావు, నర్సింగరావు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తం

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పశువులకు సంక్రమించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి రామ్మోహనరావు పేర్కొన్నారు. తుమ్మపాలలో బుధవారం మండల పశువైద్యాధికారి అనిల్ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. 48 దూడలకు నట్టల నివారణ మందులు, పశు దాణా పంపిణీ చేశారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

అనకాపల్లి, న్యూస్‌టుడే: చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పేదలకు దుప్పట్లు అందించినట్లు విశ్రాంత అధ్యాపకులు ఎంఆర్‌జీ కుమారి తెలిపారు. స్థానిక భోగలింగేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో బుధవారం 20 మంది పేదలకు దుప్పట్లు అంజేశారు. దేవస్థానం ఛైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, ధర్తకర్తలు దూలం సత్యవతి, ఎలమంచిలి బంగారురాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎలమంచిలి, న్యూస్‌టుడే: గోకులపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తెదేపా నాయకుడు పూడి రంజిత్ కుమార్ కుటుంబ సభ్యులను బుధవారం రాత్రి మాజీ ఎంపీ పప్పల చలపతిరావు పరామర్శించారు. పెదపల్లిలో బాధిత కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. ఈ ప్రమాదంలో గాయపడిన దట్ల గణేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అదృశ్యంపై ఫిర్యాదు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: కొప్పాక గ్రామానికి వచ్చిన ఓ వ్యక్తి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతనెల 26న వడ్డాదికి చెందిన ఎ.నానాజీ కొప్పాక వచ్చాడు. ఇంటికి వెళ్తానని చెప్పి అప్పటి నుంచి కనిపించడం లేదు. ఎప్పటికీ ఆచూకీ తెలియకపోవడంతో బుధవారం అనకాపల్లి గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

వరిలో సమగ్ర సస్య రక్షణ

పాయకరావుపేట గ్రామీణం: మాసాహెబ్‌పేట, పెంటకోట గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారులు బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో ఆదినారాయణ పంటల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు పలు సూచనలు చేశారు.

యాచకులకు పునరావాసం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

భిక్షాటనను నిర్మూలించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది రహదారులు, రైల్వే, బస్‌స్టేషన్, ఆలయాల వద్ద భిక్షాటన చేసుకునే వారిని గుర్తించి వారికి పునరావాసం కల్పించేలా చర్యలు చేపట్టనున్నారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు. బుధవారం రైల్వేస్టేషన్ సమీపంలో చంటి బిడ్డలతో భిక్షం ఎత్తుకుంటున్న నలుగురు మహిళలను శిశుగృహకు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు.

అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేసే వారు పెరుగుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తున్న వారి సంఖ్య పెరిగింది. నిరాశ్రయులైన వారు అధికంగా ఉంటున్నారు. రాత్రివేళల్లో ఫుత్‌పాత్‌లపై పడుకుని, ఉదయం వేళలో భిక్షాటన చేస్తున్నారు. ఇలాంటి వారిని గుర్తించి వీరికి పునరావాసం కల్పించి ఈ వృత్తి నుంచి బయటపడేలా చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంట్లో భాగంగా అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. అనకాపల్లి జిల్లాగా ఏర్పడ్డాక నిరాశ్రయుల పునరావాస కేంద్రం ఏర్పాటుపై అధికారులు చర్యలు తీసుకోలేదు. వీరు ఉండేందుకు వీలుగా శిశు సంరక్షణ, మెప్మా ఆధ్వర్యంలో షెల్టర్ ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఆ దిశగా జిల్లాలో చర్యలు తీసుకోవడం లేదు.

చంటి బిడ్డలతో భిక్షాటన చేస్తున్న వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న సిబ్బంది

అరికట్టేలా చర్యలు: భిక్షాటన చేయడాన్ని పూర్తిగా నిర్మూలించాలని ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంట్లో భాగంగా అన్నిశాఖల అధికారుల సమన్వయంతో జిల్లాలో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం. ఎక్కడైనా భిక్షం ఎత్తుకున్నవారు కనబడితే అధికారులకు సమాచారం ఇవ్వొచ్చు. అనకాపల్లిలో గుర్తించిన వారిని శిశుగృహకు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి పునరావాసం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– మేరీ సువర్త, జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్

గ్రామాలను వీడని అంధకారం

పాయకరావుపేట, న్యూస్‌టుడే

"పాయకరావుపేటలోని రైల్వేట్రాక్ పక్కన వుడా (వీఎంఆర్డీఏ) అనుమతితో వేసిన లే అవుట్‌కు చెందిన కాలనీ వాసులు నెల రోజుల నుంచి వీధి దీపాలు వేయాలంటూ అధికారులు, ప్రజా ప్రతినిధులను ఆశ్రయిస్తున్నారు. అయినప్పటికీ స్పందన శూన్యం" ఇది ఒక్క కాలనీ పరిస్థితి కాదు... నియోజకవర్గంలోని వందకు పైగా గ్రామాల్లో ఉన్న దుస్థితికి అద్దం పడుతోంది. గ్రామాల్లో పూర్తిస్థాయిలో విద్యుద్దీపాలు వెలగకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. చీకటిలో భయాందోళనలు చెందుతున్నారు. వీధి దీపాల నిర్వహణ పేరుతో ఏటా రూ. లక్షల వ్యయం అవుతోంది. ఎక్కడా పూర్తిస్థాయిలో చీకట్లు తొలగడం లేదు. నేటికి గ్రామాల్లో అంధకారం వీడటంలేదు.

★ పాయకరావుపేటలో సుమారు మూడు వేల వీధిదీపాలు ఉండగా ఏడాదికి రూ.8 లక్షలు వ్యయం చేస్తున్నారు. వీటితోపాటు మరో 300 సోలార్ దీపాలు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ పూర్తిస్థాయిలో వీధి దీపాలు వెలగడం లేదు. కొన్నిచోట్ల దీపాలు వేసినా మూన్నాళ్లకే మూలకు చేరుతున్నాయి. మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో 2,500 వీధి దీపాలు ఉండగా రూ.15 లక్షలు ఖర్చు చేస్తున్నారు. ★ నక్కపల్లి మండల పరిధిలో సుమారు 2,600 దీపాల నిర్వహణకు రూ.25 లక్షలు, ఎస్.రాయవరం మండలంలో రూ.22 లక్షలకు పైగా, కోటవురట్ల మండలంలోని రూ.20 లక్షలకు పైగా ఏటా వెచ్చిస్తున్నారు. ఇంత ఖర్చు చేస్తున్నా వీధి దీపాల కొరత వేధిస్తూనే ఉంది. ★ కొన్నిచోట్ల దీపాలు ఆర్పేందుకు స్విచ్‌లు ఏర్పాటు కాలేదు. పెదరామభద్రపురం, రాజవరం, మంగవరం, గోపాలపట్నం, సత్యవరం, కేశవరం, రాజగోపాలపురం తదితర గ్రామాల్లో ఎక్కడ చూసినా పగటిపూట విద్యుద్దీపాలు వెలుగుతూనే ఉంటున్నాయి. దీనివల్ల విద్యుత్తు వృథా అవుతోంది. ★ పంచాయతీలకు విద్యుత్తు పరికరాలు, దీపాలు ఆధీకృత డీలరు నుంచి సరఫరా చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లోని ధరలకు ఇక్కడ వాటికి హస్తిమశకాంతరంగా ఉంటోంది. ఇదంతా అధికారులకు తెల్సినా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.

పాయకరావుపేటలో వీధి దీపాలు లేని కాలనీ

ఏర్పాటుకు చర్యలు: అవసరమైన చోట కొత్తగా వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్నాం. ఫిర్యాదులను సకాలంలో పరిష్కరిస్తున్నాం. పగటి పూట వెలగకుండా స్విచ్‌లు ఏర్పాటు చేయిస్తాం.

– కె.డేవిడ్, డిప్యూటీ ఎంపీడీఓ

వంతెనకు రక్షణ గోడలు ఏవి?

ఎలమంచిలి, న్యూస్‌టుడే: సోమలింగపాలెంలో మైనర్ శారద నదిపై కాలిబాట వంతెన ప్రమాదకరంగా మారింది. ఈ వంతెనకు రెండువైపులా రక్షణ గోడలు లేవు. తాత్కాలికంగా ఇనుప గొట్టాలు సగం ఊడిపోయి ఊగుతున్నాయి. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా జలవనరులశాఖ అధికారులు పట్టించుకోలేదు. పొలాలకు చేరుకోడానికి రైతులకు ఈ వంతెనే ఆధారం. రాత్రి సమయాల్లో ఇక్కడ వీధి దీపాలు లేక చీకట్లో రావాడానికి భయపడుతున్నారు. ప్రమాదకరంగా మారిన ఈవంతెనకు రెండు వైపులా రక్షణగోడలు నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

రోడ్డంతా బీటలే

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఎలమంచిలి-రామారాయుడుపాలెం రోడ్డు బీటలు వారి ప్రమాదకరంగా మారింది. సుమారు 25 ఏళ్ల కిందట వేసిన సిమెంటు రోడ్డు సుమారు రెండు కిలోమీటర్ల మేర దెబ్బతింది. పంచాయతీ నుంచి పురపాలికలోకి మారినా రోడ్డు మరమ్మతులు పట్టించుకునే నాథుడే లేరని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బస్టాండ్‌లో కుక్కల బెడద

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పాయకరావుపేట బస్టాండ్ ఆవరణలో కుక్కల సంచారం అధికంగా ఉంది. గుంపులుగా సంచరిస్తూ ప్రయాణికులపై దాడులు చేస్తున్నాయి. ఈ ప్రాంతానికి సమీపంలో చేపలు, మాంసం విక్రయించే మార్కెట్లు ఉండటంతో వీటి బెడద ఎక్కువగా ఉంది. వీటిని నిరోధించాలని పలుమార్లు స్థానికులు, వ్యాపారులు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఇవి బస్టాండ్ ఆవరణలోకి రాకుండా నియంత్రించాలని ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది కోరుతున్నారు.

నిలిచిన సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లి కూరగాయాల మార్కెట్ వద్ద నిర్మిస్తున్న సులభ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. రూ. 16 లక్షలతో కాంప్లెక్స్ పనులకు శ్రీకారం చుట్టారు. నిధులు ఆలస్యంగా రావడంతో పనులు నిలిపేశారు. రూ. 11 లక్షలతో అదనపు పనుల నిధులకు ప్రతిపాదనలు చేశారు. ఇవి మంజూరైనా పనులు చేపట్టలేదు. అత్యవసర సమయంలో ఇబ్బందులు పడుతున్నామని వ్యాపారులు, కొనుగోలుదారులు వాపోతున్నారు.

సైకిల్ ర్యాలీకి స్వాగతం

నక్కపల్లి, న్యూస్‌టుడే: మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా చేపట్టిన సైకిల్ అవగాహన ర్యాలీకి నక్కపల్లి మండలంలో నాయకులు, ప్రజలు స్వాగతం పలికారు. దేవవరం కూడలిలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ దేవర సత్యనారాయణ, తెదేపా గ్రామశాఖ అధ్యక్షుడు కొలిమి సూర్యగణేష్ తదితరుల ఆధ్వర్యంలో పూలు చల్లారు.

చిట్టిబాబుకు సత్కారం

పాయకరావుపేట, న్యూస్‌టుడే: కాపు కార్పొరేషన్ డైరెక్టరుగా నియమితులైన పెదిరెడ్డి చిట్టిబాబును పట్టణంలో మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు సీలాపు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలి

కశింకోట, న్యూస్‌టుడే: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వంద శాతం సీట్లు కూటమి అభ్యర్థులు సాధించేలా తెదేపా శ్రేణులు పనిచేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. కశింకోటలో బుధవారం కశింకోట మండల తెదేపా అధ్యక్షుడిగా గొంతిన శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కాండ్రేగుల సతీష్‌తో పాటు అనుబంధ కమిటీలకు ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెదేపాకు కంచుకోటగా నిలిచిన సోమవరం గ్రామాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి పదవులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారన్నారు. పాలనను గాడిలో పెట్టేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం మంత్రిని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి రత్నాకర్ ఘనంగా సత్కరించారు. మళ్ల సురేంద్ర, కోట్ని బాలాజీ, పీలా శ్రీకాంత్, పచ్చికూర రాము పాల్గొన్నారు.

కశింకోటలో తెదేపా మండల కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి రవీంద్ర

అనకాపల్లి పట్టణం: మంత్రి కొల్లు రవీంద్ర మాజీ మంత్రి దాడివీరభద్రరావుతో బుధవారం భేటీ అయ్యారు. అనకాపల్లి పర్యటనకు వచ్చిన ఆయన వీరభద్రరావు ఇంటికి వెళ్లి అక్కడ విందు చేశారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి దాడిరత్నాకర్ పాల్గొన్నారు.

పేదలకు పక్కా గృహాలు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: పేదలందరికీ పక్కాగృహాలు ఇవ్వాలన్నదే కూటమి ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. బుధవారం ఎలమంచిలిలోని ఎన్టీఆర్ కాలనీలో సామూహిక గృహప్రవేశాల కార్యక్రమంలో ప్రభుత్వ సాయంతో ఇళ్లు నిర్మించుకున్న వారికి ఆయన తాళాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరికీ సొంత ఇంటి కల నెరవేరుస్తామన్నారు. స్థానిక సమస్యలను జనసేన నాయకులు గణేష్ వివరించారు. నాయకులు కిల్లాడ అప్పలరాజు, పతివాడ గణేష్, రాగూర్, సుందరపు బాబ్జీ, గోకివాడ నాయుడు, బి.అప్పారావు పాల్గొన్నారు.

పాయకరావుపేట గ్రామీణం, నక్కపల్లి, న్యూస్‌టుడే: సత్యవరంలో కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు ఆధ్వర్యంలో గృహ నిర్మాణ సంస్థ అధికారులు ఇళ్ల ప్రారంభోత్సవాలు చేశారు. నాయకులు చించెలపు పద్దు, పల్లా విలియం కేరీ, అప్పారావు, కీర్తి సీతారాం, బొంది కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు. వేంపాడులో తెదేపా నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం నిర్వహించారు. గింజాల లక్ష్మణరావు, దేవర సత్యనారాయణ, కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి బుజ్జి, వెలగా శ్రీను పాల్గొన్నారు.

ఎలమంచిలిలో ఇంటి ధ్రువపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఖాతాదారులకు సన్మానం

లక్ష్మీదేవిపేట(అనకాపల్లి), న్యూస్‌టుడే: యూనియన్ బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవాన్ని పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. బ్యాంకు కార్యాలయంలో ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. కేకే కోసి సీనియర్ ఖాతాదారులను వంకాయల ఈశ్వరరావు, ముప్పన సుబ్రహ్మణ్యంలను సీనియర్ బ్రాంచి మేనేజర్ శోభనాద్రి సత్కరించారు. బ్యాంకు అభివృద్ధికి ఖాతాదారుల సహకారం వెలకట్టలేనిదని కొనియాడారు. బ్యాంకు ఉద్యోగులు నానాజీ, రవి కృష్ణ, హరికృష్ణ, రాజు పాల్గొన్నారు.

ఈశ్వరరావును సన్మానిస్తున్న బ్యాంకు మేనేజర్

పేలుళ్లు నిలిపివేయండి

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పోలవరం కాలువ తవ్వకానికి పట్టణంలోని దుర్గానగర్ సమీపంలో చేపడుతున్న పేలుళ్లను నిలిపివేయాలంటూ అనకాపల్లికి చెందిన జనసేన నాయకుడు బొలిశెట్టి సత్యనారాయణ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పోస్టును ఎక్స్‌లో పెట్టారు. నివాస ప్రాంతాలకు, బ్లాస్టింగుకు మధ్య దూరాన్ని 500 మీటర్లకు పెంచుతూ ఈ నెల మూడున నేషనల్ గ్రీన్‌ట్రిబ్యూనల్ తీర్పు ఇచ్చిందన్నారు. దుర్గానగర్‌లో నివాస ప్రాంతాలకు పేలుళ్లు జరిపే ప్రాంతానికి 100 మీటర్ల దూరమే ఉందన్నారు. హోంమంత్రి వంగలపూడి అనితకు దీనిపై స్థానికులు ఫిర్యాదు చేశారని వివరించారు. పేలుళ్లు ఆపుతామని ఇచ్చిన హామీ నెరవేరలేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న పేలుళ్ల నిలుపుదలకు హైకోర్టు, నేషనల్ గ్రీన్‌ట్రిబ్యూనల్ సుమోటాగా స్వీకరించాలని కోరారు.

వేంకటేశ్వరస్వామికి చక్రస్నానం

ఊంజల్ సేవ చేస్తున్న అర్చకులు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: వైభవ వేంకటేశ్వరస్వామి కల్యాణ వార్షికోత్సంలో చివరి రోజు స్వామివారికి చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం భారీగా అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి ఊంజల్ సేవ చేశారు. హోంమంత్రి వంగలపూడి అనిత దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ ధర్మకర్త దంపతులు బొలిశెట్టి గోవిందరావు, శారదా కుమారి స్వాగతం పలికారు. ఎంపీపీ కేసుబోయిన వెంకటలక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి స్వామిని దర్శించుకున్నారు.

జానకయ్యపేటలో..

నక్కపల్లి, న్యూస్‌టుడే: జానకయ్యపేట సమీపంలోని ఓ చెరువులో లభించిన శివలింగానికి స్థానికులు పూజలు చేస్తున్నారు. గ్రామానికి సమీపంలోని చెరువు గట్టు వద్ద మట్టిలో కప్పుకొనిపోయి ఉన్న దీన్ని ఇటీవల ఓ వ్యక్తి గుర్తించారు. సమీపంలోని ఓ తోటలో పెట్టి పూజలు చేస్తున్నారు.



శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

భారీ అన్నసమారాధన

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలో గవరపాలెం గౌరీపరమేశ్వరుల ఆలయం వద్ద బుధవారం భారీ అన్నసమారాధనను గౌరవ అధ్యక్షులు కొణతాల రఘునాథ్ ప్రారంభించారు. ఆలయ శాశ్వత ఛైర్మన్ భీమరశెట్టి వరాహనూకరాజు, అధ్యక్షులు మహాలక్ష్మి నాయుడు, కార్యదర్శి బుద్ధ శివ, కోశాధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల విజేత జట్టు అచ్యుతాపురం

రాంబిల్లి, న్యూస్‌టుడే: దిమిలిలో దల్లమాంబ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో అచ్యుతాపురం జట్టు విజేతగా నిలిచింది. రెండు, మూడు స్థానాల్లో విశాఖ అంబేడ్కర్, ఒరియర్స్ జట్లు, నాలుగోస్థానంలో సోమలింగపాలెం జైదుర్గా జట్టు గెలుపొందాయి. విజేతలైన జట్లకు నగదు బహుమతులను అందజేశారు.

జనవాణిలో ఫిర్యాదుల వెల్లువ

ఎలమంచిలి, న్యూస్‌టుడే: జనవాణిలో వచ్చిన ఫిర్యాదు మళ్లీ రాకుండా సత్వరం పరిష్కరించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అధికారులను ఆదేశించారు. ఎలమంచిలిలో బుధవారం ఆయన జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో అర్జీదారులు తరలివచ్చి వినతులు అందించారు. నాయకులు రమేష్ నాయుడు, కొఠారు శ్రీనివాసరావు, బొద్దపు శ్రీను, పిట్టా శ్రీను, గంధం శివ, అప్పలరాజు, పతివాడ గణేష్ పాల్గొన్నారు.

మరిడిమాంబ జాతర నేడు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: దార్లపూడి గ్రామదేవత గురువారం నిర్వహించనున్న మరిడిమాంబ జాతరకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. విద్యుద్దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ తెలిపింది.

ఉన్నత లక్ష్యాలతోనే భవిష్యత్తు

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉన్నతమైన లక్ష్యాలు నిర్దేశించుకోవడం ద్వారా భవిష్యత్తుకు మంచి మార్గం ఏర్పడుతుందని బిగ్ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఛైర్మన్ చాంద్‌పాషా అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో వేంపాడు, ఉద్దండపురం, గొడిచెర్ల ఉన్నత పాఠశాలల్లోని పేద విద్యార్థులకు ఈ సంస్థ చదువు నిమిత్తం సాయం అందిస్తోంది. దీనిలో భాగంగా బుధవారం ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశలోనే తగు నిర్ణయాలు తీసుకోవాలన్నారు. పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు గ్లోబల్ స్టార్ పేరిట బహుమతులు అందించారు. కార్యక్రమాల్లో జోనల్ డైరెక్టర్ కోడి శ్రీనివాసరావు, హెచ్ఎంలు నాగన్నదొర, సత్యకుమార్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722	పాయకరావుపేట- 80085 74750
ఎలమంచిలి- 80085 74726	

అనకాపల్లి, న్యూస్‌టుడే: ?: నూకాలమ్మ రహదారిలో మురుగు నిలిచిపోతోంది. – బీఎంఎల్ ప్రసాద్, అనకాపల్లి ✓: రహదారికి ఇరువైపులా కాలువలు నిర్మిస్తాం. – కె.చక్రవర్తి, జోనల్ కమిషనర్

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ?: పాయకరావుపేటలోని పాత పంచాయతీ కార్యాలయ ఆవరణ శుభ్రం చేయించాలి. పక్కనే చెరువు ఉండటంతో విష సర్పాలు వస్తున్నాయి. – చంద్రశేఖర్, పాయకరావుపేట ✓: ఆవరణలో పారిశుద్ధ్యం మెరుగుపరుస్తాం. – కె.డేవిడ్, ఈవో

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ?: గాంధీనగరంలో కుక్కల సమస్య ఎక్కువగా ఉంది. – రమాదేవి, గాంధీనగరం ✓: కుక్కలకు కు.ని. శస్త్రచికిత్సలు చేయిస్తాం. – చక్రవర్తి, జోనల్ కమిషనర్

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ?: ఎలమంచిలి ఎన్టీఆర్ కాలనీలో తాగునీరు కలుషితం అవుతోంది. కాలువల్లో మురుగు పైపుల్లోకి చేరుతోంది. – వి.రమణమ్మ, ఎలమంచిలి ✓: స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం. – బాకూరి ప్రసాదరాజు, కమిషనర్

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ?: తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు తిమ్మరాజుపేట వద్ద పొలాలు, ఇంటిస్థలాలు ముంపులోనే ఉన్నాయి. – పరమేశ్వరరావు, తిమ్మరాజుపేట ✓: ముంపు నీరు బయటకు తరలించే విధంగా ఏర్పాట్లు చేస్తాం. – సత్యనారాయణ, తహసీల్దార్

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని లక్ష్మీనగర్ ప్రాంతంలో మురుగు, వర్షపు నీరు పోయేందుకు కాలువలు ఏర్పాటు చేయాలి. కాలువలు లేకపోవడంతో నీరు నిలిచిపోయి రోగాలు వ్యాపించే ప్రమాదముంది. – ఏసుబాబు, కాలనీ వాసి ✓: తర్వాత సర్వేచేసి కాలువలపై ఆక్రమణలు తొలగించి నీరు పోయేందుకు చర్యలు తీసుకుంటాం.

– డేవిడ్, డిప్యూటీ ఎంపీడీవో

?: మంగవరం- అరట్లకోటకు వెళ్లే దారిలో గుంతలు అధికంగా ఉన్నాయి. రాకపోకలు సాగించే చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. – రాంబాబు, అరట్లకోట ✓: రహదారి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అయ్యాయి. త్వరలో సమస్య తీరుతుంది

– డేవిడ్, డిప్యూటీ ఎంపీడీవో

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై నిరసన

అనకాపల్లి పట్టణం, పాయకరావుపేట, ఎలమంచిలి, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వెనక్కి తీసుకోవాలని కోరుతూ అనకాపల్లిలో వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. రింగు రోడ్డు నుంచి ఆర్డీవో కార్యాలయం వద్ద ప్రదర్శన చేపట్టి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బీవీ సత్యవతి, నాయకులు దంతులూరి దిలీప్‌కుమార్, జాజుల రమేశ్, బొడ్డేడ శివ పాల్గొన్నారు. పేటలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంబాల జోగులు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టిన అనంతరం వినతిపత్రం అందజేశారు. నాయకులు చిక్కాల రామారావు, వీసం రామకృష్ణ, దగ్గుపల్లి సాయిబాబా, గెడ్డమూరి శ్రీనివాసరావు, కె.కనక సుందరలత పాల్గొన్నారు. ఎలమంచిలిలో వైకాపా ఇన్‌ఛార్జి కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో పాత జాతీయ రహదారిపై ర్యాలీ చేసి ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఎంపీపీ బోదెపు గోవింద్, నాయకులు బొడ్డేటి ప్రసాద్, బొద్దపు ఎర్రయ్యదొర, బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా, కోన సంధ్యారాణి పాల్గొన్నారు.

కాలనీల పేరుతో సంపద లూటీ

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: జగనన్న కాలనీల పేరుతో వైకాపా ప్రభుత్వం రాష్ట్ర సంపదను లూటీ చేస్తే, చంద్రబాబు పేదలకు నీడనిచ్చారని ఏపీ రహదార్ల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. అచ్యుతాపురంలోని తెదేపా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు 17 నెలలో పాలనలో మూడు లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి పేదలకు అందిస్తున్నారని తెలిపారు. జగన్ చేసిన విధ్వంసాన్ని తట్టుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం వైపు పరుగులు పెట్టిస్తున్నారని పేర్కొన్నారు. ఈవిషయాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు. ఇళ్లు మంజూరుచేసి వదిలేయకుండా రోడ్లు, కాలవలు, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించినట్లు చెప్పారు. జగనన్న లేఅవుట్ పేరుతో వైకాపా నాయకులు కోట్లు వెనకేసుకున్నారన్నారు. టిడ్కో ఇళ్లు తాకట్టు పెట్టి రుణాలు పొందారని మండిపడ్డారు. మండల కమిటీ అధ్యక్షులు పీలా తులసీరామ్, లాలం శ్రీభరత్, తెదేపా రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్‌కుమార్, మేరుగు బాపునాయుడు, పతివాడ చిన్నయ్యనాయుడు పాల్గొన్నారు.

నాయకులతో కలిసి మాట్లాడుతున్న ప్రగడ

మహారాజశ్రీ యలమంచిలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.33/2022 O.S.71/2017
Between:
కారుకుండి అప్పలనరస ...పిటీషనర్/ DHR
And
జోగా అప్పారావు వగైరాలు ..రెస్పాండెంట్స్/ JDRs
వేలం ప్రకటన
పై నెంబరు అమలులో JDRs చెందునటువంటి ఈ క్రింది షెడ్యూల్ ఆస్తిని పై నెంబరు డిక్రీ బాకీ వసూలు నిమిత్తం మహారాజశ్రీ యలమంచిలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారు కోర్టు ఎదుట తేది: 28-11-2025న ఉదయం 10.30 గం॥ నుండి ఈ క్రింది షెడ్యూల్ ఆస్తిని శ్రీ కోర్టువారు వేలం షరతులకు లోబడి వేలం వేయుదురు. కావున శ్రీ కోర్టు వారు ఎదుట హాజరై వేలంలో పాల్గొనవచ్చునని ఇందుమూలంగా ఈ ప్రకటన ద్వారా తెలియపరచడం అయినది.
వేలం షెడ్యూల్ వివరాలు
విశాఖపట్నం జిల్లా, యలమంచిలి సబ్ రి., అచ్యుతాపురం మండలం, చోడపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 258/10లో Ac 0.23 సెంట్లు భూమి అందు రెండు Floors Building with followings హద్దులు:
East: రోడ్డు; South: పెంకే చంటిబాబు వగైరాలు భూమి; West: ప్రతివాదులు/JDRs తాలూకు భూమి; North: Layout
DHR విలువ: 1,50,000/-
అమీనా విలువ : 15,00,000/-
S.అప్పలనాయుడు
Srinivasa Patnaik
యలమంచిలి,
తేది:10-11-2025. DHR తరపు అడ్వకేట్స్

(c) eenadu

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య **ఆడి 1:** డియాస్ ఈరే బాహుబలి,ఆర్యన్ **ఆడి 2:** మాస్ జాతర, **ఆడి 3:** ది గర్ల్ ఫ్రెండ్ **ఆడి 4:** ప్రిడేటర్: బ్యాడ్ ల్యాండ్స్, జటాధార, **బంగార్రాజు:** మాస్ జాతర **రాజు:** ది గర్ల్ ఫ్రెండ్ **చోడవరం: శ్రీసాయిలక్ష్మి:** కాంత **సాయిలక్ష్మి:** శివ, **పూర్ణ:** జటాధర

నిందితుడికి 14 రోజుల రిమాండు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: లంచం తీసుకుంటూ అనిశాకు మంగళవారం చిక్కిన ఎం.అలమండ వీఆర్వో చుక్క సూర్యనారాయణకు ఈ నెల 26 వరకు అనిశా న్యాయస్థానం రిమాండు విధించింది. ఈ విషయాన్ని ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ఎస్ రమణమూర్తి బుధవారం విలేకరులకు తెలిపారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఆయన్ను కేంద్ర కారాగారానికి అప్పగించామన్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి భజనలు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: సత్యసాయి శత జయంతి వేడుకల్లో భాగంగా కె.ఎం.పాలెం రామాలయంలో భజన కార్యక్రమం బుధవారం జరిగింది. ఇందులో సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు, జోన్ ఇన్‌ఛార్జి రవి శంకర్, భజన బృందం జోన్ ఇన్‌ఛార్జి గురన్నాచారి, పెంటారావు, గంధం సూర్యం, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కె.ఎం.పాలెం రామాలయంలో భజన

భక్తితో పారవశ్యం..

చోడవరం, న్యూస్‌టుడే: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ధ్వజ స్తంభాలున్నా ఆలయాలన్నింటి వద్ద ప్రతిరోజు ఆకాశదీపం వెలిగించే ఆధ్యాత్మిక కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వయంభూ గౌరీశ్వర ఆలయంలో బుధవారం అర్చకులు కొడమంచిలి చలపతి ఆధ్వర్యంలో మంత్రోచ్ఛారణ మధ్య ధ్వజ స్తంభం చుట్టూ మహిళలు దీపాలు వెలిగించారు.

యువత భవితకు వాట్సాప్ గ్రూపు

నాతవరం, న్యూస్‌టుడే: యువతకు ఉద్యోగ కల్పనకు తగిన సమాచారం తక్షణం అందించేందుకు వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశామని ఎస్సై తారకేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే వివిధ గ్రామాల్లో యువతను కలిసి మాట్లాడి వారిలో నిరుత్సాహాన్ని తొలగించి మనోధైర్యం నింపుతున్నామన్నారు. చదువుకున్న నిరుద్యోగులకు సహకారం అందిస్తే వారు ఉద్యోగావకాశాలు పొందే అవకాశం ఉందని తెలిపారు.

ఆమ్‌ఆద్మీ దీక్షలకు మద్దతు

చోడవరం, న్యూస్‌టుడే: రహదారుల అభివృద్ధి చేయాలంటూ ఆమ్‌ఆద్మీ పార్టీ చేపట్టిన నిరాహార దీక్షలు బుధవారం నాటికి 17వ రోజుకు చేరుకున్నాయి. వైకాపా నాయకులు డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ ముక్కా మహాలక్ష్మినాయుడు, పండల దేవ, తలారి ఆదిమూర్తి, రొబ్బు గుంటకు చెందిన పోతల శ్రీను, ముక్కా తాతారావులు బుధవారం శిబిరంలో కూర్చొని దీక్షాపరులకు సంఘీభావం తెలిపారు.

నేడు తంగుడుబిల్లిలో అన్నసమారాధన

చీడికాడ: మండలంలోని తంగుడుబిల్లి మరిడిమాంబ గుడి వద్ద గురువారం కార్తిక అన్నసమారాధన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చెప్పారు. పరిసర గ్రామాల భక్తులు తరలివచ్చి కార్తిక వనసమారాధనలో పాల్గొనవచ్చన్నారు.

ఫిర్యాదు చేసిన వ్యక్తిపై దాడి : ఒకరి అరెస్టు

కె.కోటపాడు, న్యూస్‌టుడే: కింతాడకు చెందిన ఒకరిపై దాడి చేసిన వ్యక్తిని బుధవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండ బంజరు భూమి విషయమై సెప్టెంబరులో కింతాడకు చెందిన బండారు నారునాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే సమయంలో బండారు నారునాయుడు, ఇదే గ్రామానికి చెందిన బండారు నర్సింహనాయుడు మధ్య తగాదా జరిగింది. ఈ క్రమంలో నారునాయుడు తీవ్ర గాయమైనట్లు వైద్యాధికారి పరీక్షలో నిర్ధారణ కావడంతో నర్సింహనాయుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై ధనుంజయ తెలిపారు.

దాలివలసలో కార్తిక వనసమారాధన

కె.కోటపాడు, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టరు విజయకృష్ణన్ సూచనల మేరకు ఈ నెల 14న గురువారం దాలివలసలో కార్తిక వనసమారాధన నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ సాంబశివరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, సచివాలయాల కార్యదర్శులు, సిబ్బంది, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బంది హాజరుకావాలని కోరారు.

పశు వ్యాధులపై అప్రమత్తం

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పశువులకు సంక్రమించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రామ్మోహనరావు పేర్కొన్నారు. తుమ్మపాలలో బుధవారం మండల పశువైద్యాధికారి అనీల్ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భశోక చికిత్స శిబిరం నిర్వహించారు. 48 దూడలకు నట్టల నివారణ మందులు, పశు దాణా పంపిణీ చేశారు.

ఊరికి చేరే దారేది?

శంకరం పంచాయతీ పరిధిలో కొత్తవలస, రాయిపాలెం, మామిడిపాలెం, రాజంపేట, గొప్పూరు, గవరవరం, కొండలపాడు, ములంపాడు, గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో ఉరకగెడ్డ ప్రవహిస్తోంది. వర్షాకాలంలో వరద ప్రవాహం ఉద్ధృతంగా ఉన్న సమయాల్లో ప్రజలు ఇందులో దిగి ప్రయాణించడానికి సాహసించరు. అయితే ఈ వాగు దాటితేనే ఈ గ్రామాల ప్రజలకు విద్య, వైద్యం, నిత్యావసర సరకులు అందవు. పాలకేంద్రాలకు సైతం రైతులు సరఫరా చేయలేరు. దీంతో ఈ ప్రాంత ప్రజల సౌకర్యార్థం ఇక్కడ ఓ కాలిబాటను నిర్మించారు. ఇది కూడా తుపానుకు గండిపడి కొట్టుకుపోయింది. పాలకులు, అధికారులు క్షేత్రపరిశీలన చేసి తమ ఇబ్బందులను కళ్లారా చూసి వంతెనలు నిర్మించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మాడుగుల గ్రామీణం



గొర్రిగెడ్డపై నిచ్చెన

అజయపురానికి వెళ్లే కర్రల వంతెన

ఇదీ పరిస్థితి..

» తాడివలస గ్రామానికి వెళ్లేందుకు గెడ్డపై వంతెనలేక గిరిజనులు తాడు సాయంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగిస్తుంటారు. మామిడిపాలెం గ్రామస్థులు ఉరకగెడ్డ జలాశయం దిగువన ఉన్న గెడ్డపై పెద్ద చెట్టుకు కర్రలతో నిచ్చెన ఏర్పాటు చేసుకొని ప్రయాణిస్తున్నారు. అజయపురానికి తారకరామ జలాశయం దిగువ తాచేరు పై గిరిజనులు చిన్న కర్రెల వంతెన ఏర్పాటు చేసుకున్నారు. ఇలా మండలంలోని గిరిజన గ్రామాల ప్రజల రహదారులు, వంతెనలు లేక అవస్థలు పడుతున్నారు.

» నాలుగువైపులా గెడ్డలే ఉండటంతో వరదల సమయాల్లో కనీసం వైద్య సేవలకు కూడా నోచుకోవడం లేదు. దీంతో ఏడు గ్రామాల గిరిజనులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.

» ప్రవాహం మోస్తరుగా ఉన్నప్పుడు పురుషులు మాత్రమే సాహసం చేసి వాటిని దాటుతుంటారు. ప్రతి చిన్న అవసరానికి పంచాయతీ లేదా మండల కేంద్రానికి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. వైద్యం కోసం అత్యవసర సమయాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. నాయకులు ఓట్ల రాజకీయాలు చేయకుండా వంతెన నిర్మించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

బొమ్మలు గీస్తున్న విద్యార్థులు

విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఏడమ్స్ స్కూల్ ప్రిన్సిపల్ బద్రీమహంతి ఫాల్గుణ

చిత్రాల్లో పండగ శోభ..

చోడవరం, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఐకమత్యానికి చిహ్నమైన పండగల్లో ఉత్సాహాన్ని చిన్నారులు తమ చిత్రాల్లో ప్రతిబింబించారు. గాంధీగ్రామంలోని ఏడమ్స్ స్కూల్‌లో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో బుధవారం ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'మీకు ఇష్టమైన పండగ' పేరిట నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు సత్తాచాటారు. ఈ పోటీలో ఎక్కువ మంది విద్యార్థులు నాగుల చవితి పండగ విశిష్టతను తెలుపుతూ గీసిన చిత్రాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ఇంకొందరు దీపావళి, సంక్రాంతి తదితర పండగల గొప్పతనాన్ని చిత్రాల రూపంలో ప్రదర్శించారు. ఎం.లాస్య, జి.నిరూప్, కె.జ్యోతిర్మయి బహుమతులు గెలుచుకున్నారు. వీరికి ఏడమ్స్ స్కూల్ ప్రిన్సిపల్ బద్రిమహంతి ఫాల్గుణ ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేశారు. న్యాయనిర్ణేతలుగా ఉష, రాజేష్ వ్యవహరించారు. విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఓర్పుతో అక్షరాస్యులుగా తీర్చిదిద్దండి

దేవరాపల్లి, న్యూస్‌టుడే : నిరక్షరాస్యులకు ఓర్పుతో అక్షరాలు నేర్పించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి పేర్కొన్నారు. అక్షర ఆంధ్ర-ఉల్లాస్ కార్యక్రమంపై స్వచ్ఛంద వాలంటీర్లకు ఒక రోజు శిక్షణ బుధవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ఇప్పటికీ అనేక మంది అక్షరజ్ఞానానికి దూరంగా ఉన్నారని తెలిపారు. వారిని అక్షరాస్యులుగా మార్చాలని పుస్తకాలు అందజేశారు. ఎంపీడీఓ లక్ష్మీనారాయణ అన్నారు. ఉపాధిహామీ పథకం ఏపీఓ దేవి, వెలుగు ఏపీఎం ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాస్ వాలంటీర్లకు పుస్తకాలు అందజేస్తున్న ఎంపీపీ బుల్లి లక్ష్మి తదితరులు

కుంగిన జలాశయ గట్టు పరిశీలన

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: మొంథా తుపాను సమయంలో కుంగిన రావణాపల్లి జలాశయ గట్టుని జల వనరుల శాఖ పర్యవేక్షక ఇంజినీరు పి.అప్పలనాయుడు బుధవారం పరిశీలించారు. గట్టు కుంగిన ప్రదేశాన్ని, రాతికట్టు దెబ్బతిన్న ప్రాంతాన్ని నిశితంగా చూసి చేపట్టాల్సిన రక్షణ చర్యలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. గట్టుని పటిష్ఠం చేయడానికి రూ.1.30 కోట్లు, కాలువ మరమ్మతులకు రూ.90 లక్షలు అవసరమని ప్రతిపాదించినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే నిధులు విడుదలవుతాయని వివరించారు. కార్యనిర్వాహక ఇంజినీరు వెంకట బాల సూర్యం, నీటి సంఘం అధ్యక్షుడు రుత్తల రాజేశ్వరరావు, ఎతుకు రామస్వామినాయుడు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న పర్యవేక్షకాధికారి అప్పలనాయుడు

భారీ వాహనాల రాకపోకలతో రహదారి శిథిలం

మాకవరపాలెం, న్యూస్‌టుడే: సభాపతి అయ్యన్నపాత్రుడు మంత్రిగా ఉన్నప్పుడు రూ.కోట్లు ఖర్చు చేసి బొడ్డపల్లి నుంచి తాళ్లపాలెం వరకు 32 కిలోమీటర్ల మేరకు 30 అడుగుల రహదారి, గ్రామాల్లో 40 అడుగుల సిమెంట్ రోడ్డు వేయించారు. మండలంలో పయనీర్ పరిశ్రమ, మాకవరపాలెం, రోలుగుంట, నాతవరం మండలాల నల్లరాయి క్వారీలకు సంబంధించి భారీ వాహనాలు రోడ్డు సామర్థ్యానికి మించి రేయింబవళ్లు తిరుగుతుండటంతో రోడ్డంతా శిథిలమైంది.

✦ నర్సీపట్నం తాళ్లపాలెం మార్గంలో తరచు తిరుగుతున్న భారీ వాహనాల కారణంగా రోడ్డు శిథిలమైంది. సభాపతి మండల పర్యటనలో భాగంగా మంగళవారం జడ్.గంగవరం రహదారికి శంకుస్థాపన అనంతరం రూ.లక్షలు ఖర్చు చేసి రహదారులు వేస్తున్నామని భారీ వాహనాలను తిరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

కన్నూరుపాలెం సమీపంలో శిథిలమైన కల్వర్టు

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కరపత్రం బుధవారం ఆవిష్కరించారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజు పాల్గొని కరపత్రం ప్రారంభించారు. ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమవుతున్న సంగతి తెలిపారు. జోగేశ్వరి, పద్మావతి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల గ్రామీణం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరుగనున్నాయని గ్రంథాలయాధికారి వై. వెంకటేశ్వర్లు తెలిపారు. 14 నుంచి 20 వరకు విద్యార్థులకు పలు పోటీలు, కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు.

కె.కోటపాడు, రావికమతం, న్యూస్‌టుడే: నెహ్రూ, సర్వేపల్లి దేవి విగ్రహాలకు పూలమాలలు వేసి వారోత్సవాలు ప్రారంభిస్తామని చెప్పారు. 15న పుస్తక ప్రదర్శన, సభ్యత్వ సేకరణ, చిత్రలేఖనం, 16న గ్రంథాలయ పితామహుడు ఎస్.ఆర్.రంగనాథన్ నివాళి, చదరంగం పోటీలు, 17న స్వచ్ఛ భారత్ విద్యార్థి పాత్రపై వ్యాసరచన పోటీ, 18న ముగ్గుల పోటీలు, ఇంటర్ విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు, 19న మహిళా దినోత్సవం సందర్భంగా ఇందిరా గాంధీ జయంతి, క్విజ్ పోటీలు నిర్వహించడం జరుగుతుంది. 20న గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ, బహుమతుల ప్రదాన కార్యక్రమం జరుగుతుందని లైబ్రేరియన్ వరహాలమ్మ తెలిపారు.

కరపత్రం ఆవిష్కరిస్తున్న జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజు, అధికారిణి జోగేశ్వరి

క్వారీ ప్రభావిత గ్రామాలను సందర్శించాలి

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని క్వారీ ప్రభావిత గ్రామాలను జిల్లా కలెక్టర్ సందర్శించి వారి సమస్యలను తెలుసుకోవాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, నాయకులు ధర్నా చేశారు. చిన గొర్రిగెడ్డ గిరిజన గ్రామాల్లో వాటర్‌బాటిల్‌తో కలుషిత జలాన్ని చూపిస్తూ నిరసనలు చేశారు. గ్రామానికి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను పరిష్కారం చేయకపోతే కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జరు నరసింహమూర్తి, రైతు వ్యవసాయ కమిటీ సభ్యులు కె. భవాని గిరిజనులు పాల్గొన్నారు.

కలుషిత నీరు చూపుతున్న సీపీఎం నాయకులు, గిరిజనులు

సమాజ హితం.. చిన్నారుల అభిమతం

▼ జిల్లా బహుమతులు దక్కించుకున్న బాల చిత్రకారులు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: బోధనకే పరిమితం కాకుండా పీఆర్‌టీయూ సభ్యులు పిల్లల్లో దాగిన ప్రతిభను వెలికి తీసేందుకు ఇరవై ఏళ్లుగా ఏటా నవంబరులో నర్సీపట్నం కేంద్రంగా జిల్లాస్థాయి చిత్రలేఖన పోటీలను నిర్వహిస్తున్నారు. వివిధ మండలాల నుంచి వందల సంఖ్యలో చిన్నారులు ఇక్కడికి వచ్చి చక్కటి చిత్రాలతో తమలోని ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. ఎక్కువమంది సందేశాత్మకంగా గీసిన చిత్రాలు భళా అనిపిస్తున్నాయి.

✦ కొద్దిరోజుల క్రితం నిర్వహించిన చిత్రలేఖన పోటీలో వివిధ విభాగాల్లో మొదటి బహుమతికి ఎంపికైన చిత్రాలను 'న్యూస్‌టుడే' సేకరించింది. పర్యావరణ పరిరక్షణ, కాలుష్యం నివారణ, బాలికల విశిష్టత, నీటి సంరక్షణ, ప్లాస్టిక్ నిషేధం, యోగ ప్రాధాన్యం వంటి అంశాలను ఎంచుకుని సందేశాత్మకంగా చిత్రాలు రూపొందించారు. జాతీయభావం ఉట్టిపడేలా కొందరు, మొంథా తుపాను ప్రభావం చూపుతూ కొందరు, దేవతామూర్తులను కొందరు చిత్రాలుగా గీశారు.

✦ సీనియర్స్ విభాగంలో పట్టణంలోని నారాయణ స్కూల్ విద్యార్థి పి.సాయి శివతేజ రూపొందించిన 'ప్రకృతిని కాపాడకపోతే జరిగే నష్టం'పై, సబ్ జూనియర్స్ విభాగంలో సాయి కిడ్స్ స్కూల్ విద్యార్థి ఎల్.గిరీష్ కాలుష్యం వల్ల పర్యావరణానికి జరిగే నష్టంపై, జూనియర్స్ విభాగంలో స్టేన్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థినికి జె.లేఖని రూపొందించిన చిత్రాలు మొదటి బహుమతికి ఎంపికయ్యాయి. ఈ మూడు విభాగాల్లో అయిదుగురు చొప్పున ప్రోత్సాహక బహుమతులకు ఎంపికయ్యారు. వీరందరికీ ఈనెల 14న బహుమతులు అందజేయనున్నారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్ మాట్లాడుతూ విద్యార్థులంతా వివిధ కళల్లో రాణించేలా ప్రోత్సహించేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు.



పి.సాయి శివతేజ, నారాయణ స్కూల్



ఎల్.గిరీష్, సాయి కిడ్స్ స్కూల్



జే.లేఖని, స్టేన్‌ఫర్డ్ స్కూల్

మేజరు పంచాయతీలకు తెదేపా సారథులు

చోడవరం, న్యూస్‌టుడే: మేజరు పంచాయతీలైన చోడవరం, గోవాడలకు తెదేపా పార్టీ యువకులను సారథులుగా బాధ్యతలు అప్పగించారు. చోడవరానికి ఎర్రంశెట్టి అప్పారావు(చిన్న), గోవాడకు ఏడువాక ఆనంద్‌లను పార్టీ నియమించింది. చురుకైన యువకులకు పార్టీ బాధ్యతలను అప్పగించి మేజరు పంచాయతీల్లో యువతను ఆకట్టుకునే చర్యలకు నాయకత్వం ఆలోచన చేసింది. గోవాడకు తెదేపా పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఏడువాక వెంకట లక్ష్మణ కుమార్‌ను ఎంపికయ్యారు. చోడవరానికి అధ్యక్షుడు చిన్నతో పాటు ప్రధాన కార్యదర్శిగా కిల్లి ప్రకాష్, ఉపాధ్యక్షునిగా బొబ్బిలి ప్రసాదు కార్యనిర్వాహక కార్యదర్శులుగా కిల్లి సోమునాయుడు, వేచలపు అప్పలనాయుడు, రొంగలి మంగ, కార్యదర్శులుగా రాపేటి ప్రసాదురావు, బెల్ల సుగుణ, కొమార శ్రీనివాసరావు, కోశాధికారిగా దేవర అప్పలరాజులను పార్టీ నియమించింది.

పేదల సొంతింటి కల సాకారమే లక్ష్యం

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: పేదవారికి సొంత ఇంటి కల నిజం చేయడమే లక్ష్యం ప్రభుత్వం ముందుకు నడుస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. మండలంలోని పోనతపూడి అగ్రహారం పంచాయతీ పరిధిలో కొండయ్యపాలెం, పెంటయ్యపాలెం గ్రామాలు ఉన్నాయి ఈ గ్రామాల్లో బుధవారం సామూహిక గృహప్రవేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై రిబ్బన్ కటింగ్ చేశారు. రానున్న రోజుల్లో సొంతస్థలం ఉన్నవారికి రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు సుమారుగా 2.50 లక్షలు అందజేస్తుందని అన్నారు. ఇల్లు లేని వారు ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అప్పలరాజు.పి, మండల పార్టీ అధ్యక్షుడు సన్యాసిరావు. ఎన్, తెలుగు యువత అధ్యక్షుడు వడ్డిరాజ్‌కుమార్, ఉందూరు దేముడు, నాయన సత్యనారాయణ, సర్పంచి భర్త కొరుకొండ సాంబ, గ్రామపెద్దలు, కూటమి నాయకులు, గృహనిర్మాణశాఖ అధికారి నాయుడు పాల్గొన్నారు.

30 మందికి సీఎం సహాయనిధి చెక్కులు

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ముఖ్యమంత్రి సహాయక నిధి నిరుపేదలకు ఆసరాగా ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మంజూరైన చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన నాలుగు మండలాలు కలిపి 30 మంది లబ్ధిదారులకు రూ. 16,25,080 మేరకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, మండల పార్టీ అధ్యక్షుడు నందారపు సన్యాసిరావు, కార్యదర్శి పుప్పాల రమేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కె.కోటపాడు, న్యూస్‌టుడే: కె.కోటపాడు మండలం మేడిచర్ల, దేవరాపల్లిల్లో నియోజకవర్గ స్థాయి పార్టీ పదవుల ప్రమాణస్వీకారాలు గురువారం జరుగుతాయి. ఈ కార్యక్రమాలలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొంటారు.

లబ్ధిదారుతో కలిసి రిబ్బన్ కటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తి

ఆక్రమణలు తొలగించాలంటూ వినతి

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: కరక గ్రామంలో ప్రభుత్వభూమిలో ఆక్రమణలు తొలగించాలని స్థానికులు బుధవారం తహసీల్దారు లక్ష్మికి వినతిపత్రం అందించారు. సర్వేనెంబరు 54లో రెండున్నర ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని పేర్కొన్నారు. యన్నం శెట్టి నాయుడు, సన్యాసిరావు, రాజు ఈ స్థలాన్ని ఆక్రమించున్నారన్నారు. దీన్ని ఖాళీ చేయించి గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి, మిగిలిన భూమిని పేదలకు కేటాయించాలని రామారావు తదితరులు కోరారు.

తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

ఉన్నత లక్ష్యాలతోనే భవిష్యత్తు

నక్కపల్లి: ఉన్నతమైన లక్ష్యాలు నిర్దేశించుకోవడం ద్వారా భవిష్యత్తుకు మంచి మార్గం ఏర్పడుతుందని బిగ్‌హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఛైర్మన్ చాంద్ పాషా అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో వేంపాడు, ఉద్దండపురం, గొడిచెర్ల ఉన్నత పాఠశాలల్లోని పేద విద్యార్థులకు ఈ సంస్థ చదువు నిమిత్తం సాయం అందిస్తోంది. దీనిలో భాగంగా బుధవారం ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశలోనే తగు నిర్ణయాలు తీసుకోవాలన్నారు. పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు గ్లోబల్‌స్టార్ పేరిట బహుమతులు అందించారు. కార్యక్రమాల్లో జోనల్ డైరెక్టర్ కోడి శ్రీనివాసరావు, హెచ్‌ఎంలు నాగన్నదొర, సత్యకుమార్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిండుకుండలా తాండవ జలాశయం

జోగుంపేట, పొగచెట్లపాలెం, గాధంపాలెం సమీపంలో తాండవ జలాశయం నిండుకుండలా ఉంది. ఈ మధ్య కురిసిన వర్షాలకు బొడ్డేరు, దారగెడ్డల నుంచి భారీగా వరద చేరడంతో పరివాహక ప్రాంతాలు నీటితో కళకళలాడుతున్నాయి. సాలికమల్లవరం నుంచి నాతవరం వెళ్లే రోడ్డుకు ఆనుకుని ఉండే జలాశయం నీటిలో రోజూ పలువురు యువకులు చేపలకు గేలాలు వేస్తున్నారు.

– న్యూస్‌టుడే, గొలుగొండ

జోగుంపేట సమీపంలో ..

మరిడిమాంబ జాతర నేడు

ఎస్.రాయవరం: దార్లపూడి గ్రామదేవత గురువారం నిర్వహించనున్న మరిడిమాంబ జాతరకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. విద్యుద్దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ తెలిపింది.

బడిఈడు పిల్లలను పాఠశాలకు పంపండి

దేవరాపల్లి: బడిఈడు పిల్లలు పాఠశాలలో ఉండాలి తప్ప బయట ఉండకూడదని సమగ్ర శిక్షా సీఆర్పీ పూడి వెంకటరావు పేర్కొన్నారు. బేతపూడిలోని కస్తూర్బా బాలికల విద్యాలయ విద్యార్థిని ఒకరు గతేడాది నుంచి బడికి రాలేదని తెలుసుకున్న సీఆర్పీ బుధవారం ఆమె గ్రామం వాలాబులో పర్యటించారు. బాలికను తిరిగి గురువారం నుంచి పాఠశాలకు పంపించేందుకు అంగీకార పత్రం తీసుకున్నారు.

సీఆర్పీకి అంగీకారపత్రం అందిస్తున్న బాలికతో తల్లి

రామునాయుడు మృతి తీరని లోటు

కొత్తూరు: సీపీఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు అకాల మృతి ప్రజా ఉద్యమాలు, పోరాటాలకు తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. హక్కుల పరిరక్షణకు కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు వామపక్ష ప్రజా సంఘాలు కృషి చేస్తాయన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743	చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74740	చీడికాడ - 80085 74742

గొలుగొండ, న్యూస్‌టుడే: చీడిగుమ్మల వంతెన దరి విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఏపుగా తుప్పలు పెరిగాయి. దీంతో ఇక్కడ తరచూ సరఫరా నిలిచిపోతుంది. **– అప్పలనాయుడు, చీడిగుమ్మల,** ✓: తుప్పల సమస్యను స్థానికులు తమ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఇక్కడ తుప్పలు తొలగించి విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటాం.

– రాజుబాబు, లైన్ పర్యవేక్షకుడు

అల్లుకున్న తీగల తొలగింపు

స్పందనకు వందనం

గొలుగొండ, న్యూస్‌టుడే: కొండగోకిరి-గుజ్జుమానుపాకల మధ్య విద్యుత్తు స్తంభానికి తీగజాతి పాదులు అల్లుకున్నాయి. వీటిని తొలగించక పోవడంతో తరచూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడేది. దీనిపై ఈ నెల 8న 'మేమున్నాం..మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన సంబంధిత శాఖ యంత్రాంగం చర్యలు తీసుకుంది.

వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయొద్దు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: వైద్య కళాశాలలను ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్వహించాలని, ప్రైవేటీకరణ చేయొద్దని డిమాండ్ చేస్తూ నర్సీపట్నంలో బుధవారం వైకాపా నాయకులు ఆందోళన నిర్వహించారు. తొలుత అబీద్‌కూడలిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఎన్టీఆర్ మినీస్టేడియంలోని మహాత్మాగాంధీ విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే గణేష్ పూలమాలల వేశారు. ఆర్డీవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అంజేశారు. నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

చోడవరం, న్యూస్‌టుడే: చోడవరం పట్టణంలో పార్టీ అధిష్ఠానం ఇచ్చిన పిలుపు మేరకు వైద్య కళాశాల ప్రైవేట్ పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైకాపా నాయకులు ర్యాలీ బుధవారం ర్యాలీ చేపట్టారు. మాజీమంత్రి, వైకాపా జిల్లాధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో గాంధీగ్రామం నుంచి కొత్తూరు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ గాడి కాసు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల గ్రామీణం: కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు పేర్కొన్నారు. మండలంలోని వైకాపా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. దేవీ ఆడిటోరియం నుంచి తాహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేశారు.

న్యాయ సేవకులకు గుర్తింపు కార్డులు

నర్సీపట్నం: న్యాయ సేవా కార్యకర్తలు (పారా లీగల్ వాలంటీర్లు) ఆరుగురికి స్థానిక సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) పి. షియాజ్ ఖాన్ బుధవారం గుర్తింపు కార్డులు అందజేశారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల ఉచితంగా సేవలందించేందుకు ముందుకొచ్చిన వీరిని వాలంటీర్లుగా న్యాయమూర్తి నియమించారు. కోర్టు సముదాయంలోనే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీరికి మూడు రోజులుపాటు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు.

గుర్తింపు కార్డులు అందజేస్తున్న న్యాయమూర్తి షియాజ్‌ఖాన్

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్ స్క్రీన్-1
మాస్ జాతర
స్క్రీన్-2
ది గర్ల్‌ఫ్రెండ్

నేడు తెదేపా క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జుల ప్రమాణ స్వీకారం

సబ్బవరం, న్యూస్‌టుడే: పార్టీ ఆదేశాల మేరకు పెందుర్తి నియోజకవర్గం తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ ఆధ్వర్యంలో సబ్బవరం మండలంలోని క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జుల ప్రమాణ స్వీకారం గురువారం ఉదయం 9 గంటలకు ఇరువాడలోని ఓ కల్యాణ మండలంలో నిర్వహించనున్నట్లు మండల తెదేపా అధ్యక్షుడు గండి ముత్యాలునాయుడు బుధవారం తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని తెదేపా నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ అభిమానులు హాజరు కావాలని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే ?: పురుషోత్తపురం ఎల్‌బీనగర్‌లో వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. - రామారావు
✓: సిబ్బందితో మరమ్మతులు చేయిస్తాం. - హరిబహదూర్, ఏఈ, జోన్-8

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం కేజీబీవీ బాలికల వసతి గృహం పక్కన వ్యర్థాలు పేరుకుపోయాయి. - పి.ఈశ్వరరావు
✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - జె.రాజేశ్వరరావు, గ్రామ కార్యదర్శి

?: పాత సబ్బవరం నీళ్ల ట్యాంకు సమీపంలోని కాలువలో పూడికలు పేరుకుపోయాయి. - జి.అక్కునాయుడు, ✓: పూడిక తీసే ఏర్పాటు చేస్తాం. - డి.ప్రసాదరావు, సర్పంచి, సబ్బవరం

తుప్పలు తొలగించారు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం నుంచి చోడవరం వెళ్లే మార్గంలో రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు, తుప్పలు పెరిగిపోయి ప్రమాదకరంగా మారడంతో ఈ నెల 10న 'రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలు' శీర్షికతో 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. బుధవారం పొక్లెయిన్‌తో తుప్పలు తొలగించే ఏర్పాటు చేశారు. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈనాడు కథనానికి స్పందన

ఎట్టకేలకు శుభ్రత పనులు

నరవ(వేపగుంట), న్యూస్‌టుడే : నరవ పరిసర ప్రాంత కాలనీల్లో బుధవారం పారిశుద్ధ్య సిబ్బంది పరిశుభ్రత చర్యలు చేపట్టారు. రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్తను తొలగించి, కాలువల్లో పూడిక తొలగించారు. ఆయా కాలనీల్లో అపరిశుభ్రతపై 12న 'నరవ కాలనీలు... అపరిశుభ్రతకు ఆనవాళ్లు' శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీంతో ఏఎంహెచ్ఓ కిరణ్‌కుమార్, ఎస్ఎస్ కోటేశ్వరరావు, పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ కృష్ణ స్పందించి.. తమ సిబ్బందితో శుభ్రత పనులు చేయించారు. వ్యర్థాలు తొలగించిన ప్రాంతాల్లో ముగ్గులు వేయించారు. శుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించి, నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

అధికారులు.. పరిశీలించి వెళ్లిపోతారంతే..!

ప్రమాదకరంగా పినగాడి - మొగలిపురం రోడ్డు

పినగాడి కూడలి సమీప రహదారిపై నిలిచిన నీరు

పినగాడి(పెందుర్తి), న్యూస్‌టుడే

పెందుర్తి మండలంలోని పలు రహదారులు అధ్వానంగా ఉన్నాయి. అధికారులు ఏదో తూతూమంత్రంగా పరిశీలించి వెళ్లిపోతున్నారే తప్ప ఎటువంటి కార్యాచరణ చేపట్టడం లేదు. దీంతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు.

★ పినగాడి కూడలి నుంచి మొగలిపురం వెళ్లే రోడ్డులో ఆపద పొంచి ఉందని వాహన చోదకులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కూడలిలోని జాతీయ రహదారి పైవంతెనకు సమీపంలోని కోటపాడు ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమైపోయింది. భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుకు ఎగువ వైపున ఉన్న పొలాల నుంచి నీరు రోడ్డుపైకి ప్రవహిస్తోంది. దీంతో గోతుల్లో పెద్దఎత్తున నీరు నిలిచిపోతోంది. పగటి పూట ప్రయాణమే ప్రమాదకరంగా ఉంటే రాత్రివేళ ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటే వాహనచోదకులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే పలువురు ద్విచక్ర వాహన చోదకులు ఈ మార్గంలో గాయపడ్డారు. ఓ భారీ గుంత వద్ద ప్రమాదాలు జరగకుండా స్థానికులు ఒక డ్రమ్ము ఏర్పాటు చేశారు.

గోతిలో ఉంచిన డ్రమ్ము

రహదారిపై నీరు ప్రవహించడంతో: ఇటీవల ఈ రహదారి దుస్థితిని ప్రత్యేక ఉప కలెక్టర్ పరిశీలించారు. ఇది జరిగి నెల రోజులవుతున్నా రహదారి అభివృద్ధిలో ఎటువంటి కదలికలు జరగలేదని స్థానికులు వాపోతున్నారు. గతంలో జాతీయ రహదారి నిర్మాణం జరిగినప్పుడు ఇక్కడ ఉన్న కల్వర్టు ధ్వంసం కావడంతో వర్షం నీరు రోడ్డుపైకి వచ్చేదని తెలిపారు. అప్పటి నుంచి ర.భ.శాఖ అధికారులు ఈ రహదారి నిర్వహణను గాలికొదిలేయడంతో పూర్తిగా గోతులు పడ్డాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి ప్రమాదాల రహదారిని బాగు చేయాలని పలువురు కోరుతున్నారు.

న్యాయం చేయాలంటూ వినతి

సుజాతనగర్(పెందుర్తి), న్యూస్‌టుడే: భూములను సేకరిస్తున్న ప్రభుత్వం రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని జీవీఎంసీ 88వ వార్డు కార్పొరేటర్, నరవ గ్రామం రైతులు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక రత్నగిరినగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందించారు. నరవ రెవెన్యూ పరిధిలోని భూములు పూర్వకాలం నుంచి రైతుల స్వాధీనంలో ఉన్నాయన్నారు. తాజాగా రెవెన్యూ అధికారులు సర్వే ప్రారంభించారని రైతులకు సరైన పరిహారం అందించి న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. వార్డు జనసేన అధ్యక్షుడు జనార్దన శ్రీకాంత్, నాయకులు గవర సత్తిబాబు, ఇల్లపు శ్రీనివాసరావు, గంతకోరు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, రైతులు

గ్రంథాలయ వారోత్సవాలకు సన్నాహాలు

పెందుర్తి: న్యూస్‌టుడే: పెందుర్తి శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు శాఖా గ్రంథాలయాధికారిణి బి.చంద్రకళ తెలిపారు. ఈ మేరకు బుధవారం వారోత్సవాల ఏర్పాట్లపై ఆమె అభివృద్ధి కమిటీ సభ్యులతో సమావేశమై మాట్లాడారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 14న జరగనున్న బాలల దినోత్సవంతో వారోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 15న సాహిత్య సమ్మేళనం, ధరావతు సేకరణ, 16న గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ, పుస్తక ప్రదర్శన, 17న బాలలకు చిత్రలేఖనం పోటీలు, 18న విద్యార్థులకు వ్యాసరచన, 19న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మహిళా దినోత్సవం, మహిళలకు ముగ్గుల పోటీలు, 20న బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు. ఔత్సాహికులు, పాఠకులు ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వివరాలు వెల్లడిస్తున్న గ్రంథాలయాధికారిణి చంద్రకళ

బాక్సింగ్‌లో విద్యార్థి ప్రతిభ

సబ్బవరం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఈనెల 11న జరిగిన అంతర్ జిల్లా బాక్సింగ్ పోటీల్లో సబ్బవరం డిగ్రీ కళాశాల విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. ఖండపల్లి జశ్వంత్ 60 కిలోల విభాగంలో పాల్గొని తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సొంత చేసుకున్నాడు. ఈ మేరకు బుధవారం కళాశాల ప్రిన్సిపల్ బి.శంకర్, వైస్ ప్రిన్సిపల్ ఎస్.సత్యనారాయణ, అధ్యాపకుడు ఎంవీ రామకృష్ణ తదితరులు జశ్వంత్‌ను అభినందించారు.

జశ్వంత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ బి.శంకర్, అధ్యాపకులు

దత్తతకు అర్హులైన బాలల గుర్తింపు

పెందుర్తి, న్యూస్‌టుడే : పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో దత్తతకు అర్హులైన బాలలను గుర్తించాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారిణి మమత సూచించారు. జాతీయ దత్తత మాసాన్ని పురస్కరించుకుని బుధవారం పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు భవనంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అర్హులైన బాలలను గుర్తిస్తే, ప్రోత్సాహకాలు అప్పగించే ప్రక్రియ చేపడతామన్నారు. దత్తత, బాలల హక్కులు, బాల్యవివాహాల నిర్మూలన, పోక్సో చట్టంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మానస, గీత, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాలల సంరక్షణ విభాగం అధికారిణి మమత

ఆలయానికి వెండి వితరణ

చింతలగ్రహారం(వేపగుంట), న్యూస్‌టుడే : చింతలగ్రహారం కృష్ణాపురంలోని జగన్నాథస్వామి ఆలయానికి కస్పా నరసింహమూర్తి, విజయలక్ష్మి దంపతులు అరకేజీ వెండి వితరణ చేశారు. బుధవారం ఆలయ ధర్మకర్త ఆళ్ల తాతారావుకు వెండి అందజేశారు. దాతలు అందించిన వెండితో పాటు ఇంకొంత వెండిని సమకూర్చి రథోత్సవం నాటికి వెండి చీపురు తయారు చేయిస్తామని తాతారావు తెలిపారు.

ధర్మకర్తకు వెండి అందిస్తున్న దాతలు

వైద్య శిబిరానికి స్పందన

చీమలాపల్లి(వేపగుంట), న్యూస్‌టుడే : జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా గోపాలపట్నం ఆదిత్య కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం చీమలాపల్లిలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నగరంలోని మెడికవర్ ఆసుపత్రి వైద్యులు హాజరై స్థానికులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గణపతిరావు పర్యవేక్షించారు.

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న స్థానికులు

ఐహెచ్ఆర్‌సీ నూతన కమిటీ ఎన్నిక

కృష్ణానగర్(వేపగుంట), న్యూస్‌టుడే : కృష్ణానగర్ ఐహెచ్ఆర్‌సీ (ఇండో హ్యూమన్‌రైట్స్ కేర్) సంస్థ సర్వసభ్య సమావేశం బుధవారం సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగింది. సంస్థ ఛైర్మన్ రాజాన ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పలువిభాగాల నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. రాష్ట్ర క్రిస్టియన్ అడ్వైజర్‌గా ఆర్.షడ్రక్, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విభాగ జనరల్ సెక్రటరీగా కె.హనుమంతరావు, ఉపాధ్యక్షులుగా కె.సుబ్బారెడ్డి, కార్యదర్శిగా బి.నరసింగరావు, బి.శంకర్రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎన్.సురేశ్, కె.శ్రీదేవిలను ఎన్నుకున్నారు. అనంతరం సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలల్లో డ్రగ్స్‌నివారణ, పరిసరాలు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ఉచిత వైద్యశిబిరాలు వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

నూతనంగా ఎన్నికైన సభ్యులు

సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

వేపగుంట, న్యూస్‌టుడే : పేదలకు సొంతింటి కలను నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, పీఎంఏవై అర్బన్ బీఎల్‌సీ 2.0. కార్యక్రమంలో భాగంగా నిర్మాణం పూర్తి చేసుకుని గృహప్రవేశాలు చేసిన వారికి ఇంటి తాళాలు అందించడం, కొత్తగా నిర్మిస్తున్న ఇళ్లకు శంకుస్థాపన చేసే కార్యక్రమాన్ని మేయరు పీలా శ్రీనివాసరావుతో కలిసి ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జోన్-8 పరిధిలో 719 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. మేయరు మాట్లాడుతూ అధికారులు ఇళ్ల మంజూరు విషయాన్ని తెలియజేయకుండా ఎవరికి వారే కార్యక్రమాలు ఏర్పాటు చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. దరఖాస్తు చేసుకున్న అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలని సూచించారు. కార్పొరేటర్లు బల్ల శ్రీనివాసరావు, రాపర్తి కన్నా, శానాపతి వసంత మాట్లాడారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ దీపక్, పరవాడ, సబ్బవరం మండలాలకు చెందిన హౌసింగ్ అధికారులు, ఇన్‌ఛార్జి జోనల్ కమిషనర్ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, తదితరులు

పోలీసులకు బాలిక ఫిర్యాదు

పరవాడ(సబ్బవరం), న్యూస్‌టుడే: పరవాడ మండలం పి.భోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాల విద్యార్థిని పాఠశాల ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డి(60)పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు.. అసభ్యకర పదజాలంతో తిట్టి, కొట్టాడని, చాలాసార్లు ఆమెను తాకడం, చేయి పట్టుకోవడం వంటివి చేశాడని బాలిక ఫిర్యాదులో పేర్కొనడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నైపుణ్యత, నాయకత్వ లక్షణాలపై శిక్షణ

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కునగరం హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంటు సెంటర్‌లో బుధవారం ఎస్సీ, ఎస్టీ సభ్యులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎస్సీ, ఎస్టీ లైజన్ అధికారులు ఎన్.సుందరం, బాబూనాయక్ ప్రారంభించారు. డాక్టర్ ముత్యాలు, బాలాజీ, కంచర్ల సంజీవరావు, ఉక్కు ఎస్సీ, ఎస్టీ సంఘ నాయకులు బి.తౌడన్న, బయ్యే మల్లయ్య, ఎల్.వి.రమణ, మోహన్‌బాబు, హెచ్ఆర్‌డీ విభాగం అధికారి రమేష్ పాల్గొన్నారు.

'సంతాన ప్రాప్తిరస్తు' చిత్ర బృందం సందడి

అక్కయ్యపాలెం, జగదాంబకూడలి, న్యూస్‌టుడే: సంతాన ప్రాప్తిరస్తు సినిమా ప్రేక్షకుల్ని అలరిస్తుందని ఆ సినిమా హీరో, హీరోయిన్ విక్రాంత్, చాందిని పేర్కొన్నారు. డైమండ్ పార్కు సమీపంలోని ఓ హోటల్‌లో బుధవారం మధ్యాహ్నం సినిమా యూనిట్ సందడి చేసింది. ఈ సందర్భంగా హీరో హీరోయిన్ మాట్లాడుతూ మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్‌పై మధుర శ్రీధర్‌రెడ్డి, నిర్వి హరిప్రసాద్‌రెడ్డి నిర్మిస్తున్నారని, దర్శకుడు సంజీవ్‌రెడ్డి తెరకెక్కిస్తున్నారన్నారు. ఈ సినిమా ఈ నెల 14న విడుదల కానుందన్నారు. సమాజానికి చెప్పాల్సిన అంశాలు ఉన్నాయన్నారు. వెన్నెల కిశోర్, అభినవ్, తరుణ్‌భాస్కర్ వంటి నటులు ఉన్నారన్నారు.

అంతర కళాశాలల వాలీబాల్ పోటీల విజేత ఏయూ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం క్రీడలు, వ్యాయామ విద్య ఆధ్వర్యంలో ఏయూ సిల్వర్ జూబ్లీ క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న అంతర కళాశాల పురుషుల వాలీబాల్ పోటీలు బుధవారం ముగిశాయి. చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మధ్య జరిగిన ఫైనల్స్‌లో 46-38 పాయింట్ల తేడాతో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజయం సాధించి విజేతగా నిలిచింది. ఏయూ క్రీడా, వ్యాయామ విద్య సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్, విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి, పీడీలు గోపీకృష్ణ, వై.శ్రీనివాసరావు, రామకృష్ణ, లక్ష్మణ రెడ్డి, దిలీప్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

విజేత జట్టుకు జ్ఞాపిక అందజేస్తున్న ఏయూ అధికారులు

భక్తిశ్రద్ధలతో కాలభైరవ పూజలు

పెందుర్తి, న్యూస్‌టుడే : కార్తిక మాసం బహుళ అష్టమిని పురస్కరించుకుని 96వ వార్డు పెందుర్తి సూర్యానగర్‌లోని కాలభైరవ స్వామి సన్నిధిలో బుధవారం విశేష పూజలు జరిగాయి. అర్చకులు స్వామిని పంచామృతాలతో అభిషేకించారు. నూతన వస్త్రాలతో అలంకరించి ధూపదీప సేవలు చేశారు. వడమాలలు నైవేద్యంగా సమర్పించి భక్తులకు వితరణ చేశారు.

ఘనంగా అంబలం పూజ

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం అంతకాపల్లి శివారు రావులమ్మపాలెంలో మంగవారం రాత్రి అభయాంజనేయ స్వామి అంబలం పూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. వివిధ గ్రామాల నుంచి భక్తులు పూజా వేదికను సుందరంగా అలంకరించారు. వేదికపై వినాయకుడు, పార్వతీ పరమేశ్వరులు, శ్రీరాముని మందిరాలు ఏర్పాటు చేశారు. పురోహితులు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమ నిర్వాహకులు చొక్కాకుల వెంకట్రావు, లక్ష్మి దంపతులు భక్తులకు అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి నారాయణమూర్తి, చొక్కాకుల గోవింద, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న నిర్వాహకులు

పరిశోధనలు సమాజానికి ఉపయోగపడాలి

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: నవ్య ఆలోచనలతో పరిశోధనలు చేయాలని, వాటి ఫలితాలు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ(శ్రీకాకుళం) పూర్వ ఉపకులపతి ఆచార్య నిమ్మ వెంకటరావు అన్నారు. ఏయూ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా విద్యా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'రీసెర్చ్ మెథడాలజీ' అంశంపై కార్యశాల ముగింపు కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొని ప్రసంగించారు. విశిష్ట పరిశోధనలతోనే విశ్వవిద్యాలయానికి గుర్తింపు లభిస్తుందన్నారు. సదస్సు కన్వీనర్, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ కార్యశాలలో నేర్చుకున్న అంశాలు పరిశోధనలు జరిపే దిశగా ప్రేరణ కలిగిస్తాయన్నారు. ఏయూ వ్యాయామ విద్య సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్, ఆచార్య నాగార్జున వర్సిటీ డీన్ ఆచార్య టి.స్వరూపరాణి, కేంద్రీయ విశ్వవిద్యాలయం (ఒడిశా) విద్యా విభాగ ఆచార్యులు అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కార్యశాలలో ప్రసంగిస్తున్న ఆచార్య నిమ్మ వెంకటరావు

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

విజయవాడ(చిట్టినగర్), న్యూస్‌టుడే: గాయాలతో చికిత్స పొందుతూ వృద్ధురాలు బుధవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట పడాలవారివీధిలో చిట్టిబోయిన కుమారి నివాసం ఉంటున్నారు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలం, కట్టవానిపాలెంలో ఆమె అన్నయ్య వద్ద ఉంటున్న తల్లి వరాలమ్మ(68) నెల రోజుల కిందట కొత్తపేటలో ఉండే కుమార్తె ఇంటికి వచ్చారు. అక్టోబరు 31న ఇంట్లో ఎవరు లేని సమయంలో వరాలమ్మ టీ పెడదామని గ్యాస్ స్టవ్ వెలిగించి.. లైటర్ కోసం వెతికి వెలిగించగా ఒక్కసారిగా మంటలు వచ్చి ఆమెకు పలు చోట్ల గాయాలయ్యాయి. అప్పటి నుంచి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఈ మేరకు మృతురాలి కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

నిబంధనల ప్రకారం ఆటోలు నడపాలి

మాధవధార, న్యూస్‌టుడే: నేటి నుంచి మూడు రోజుల పాటు నగరంలో భాగస్వామ్య సదస్సు నిర్వహించనున్నందున ఆటో డ్రైవర్లందరూ రవాణా, పోలీస్ శాఖ నిబంధనల ప్రకారం ఆటోలను నడపాలని డీటీసీ ఆర్.సి.హెచ్.శ్రీనివాస్ తెలియజేశారు. ప్రయాణికులు, ఇతర వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నడపాలని సూచించారు. సదస్సుకు కేంద్ర, రాష్ట్ర మంత్రులతో పాటు, దేశ, విదేశాల నుంచి వివిధ సంస్థల ప్రతినిధులు వస్తుండటంతో సభ ప్రాంగణం వద్దకు చేర్చడానికి 900 వరకు వాహనాలను కేటాయించడం జరిగిందని రవాణా శాఖ అధికారులు తెలియజేశారు. బస్సులు, మినీ బస్సులు, కార్లు ఇతర వాహనాలు అందుబాటులో ఉంచామని తెలిపారు.

మత్తు పదార్థాల నిర్మూలనే ఎజెండా

పరవాడ(సబ్బవరం), న్యూస్‌టుడే: మత్తు పదార్థాల నిర్మూలనే ఎజెండాగా అందరూ బాధ్యత వహించాలని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు అన్నారు. పరవాడ జెడ్పీ హైస్కూల్‌లోని విద్యార్థులకు మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. అనంతరం గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు.

మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు

నైపుణ్యాల మెరుగుదలకు దోహదం

నరవ(వేపగుంట), న్యూస్‌టుడే : నరవ విశాఖ ఇంజినీరింగ్ కళాశాలకు జేఎన్‌టీయూ-జీవీ రీసెర్చ్ సెంటర్‌ను మంజూరు చేసిందని కళాశాల ఛైర్మన్ జి.సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు బుధవారం మంజూరు ధ్రువపత్రాలను ఆయా విభాగాల అధ్యాపకులకు అందజేశారు. రీసెర్చ్ సెంటర్ ద్వారా విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మెకానికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ విభాగాల అధ్యాపకులు డి.శాంతారావు, బి.జీవనరావు, కె.తేజస్విని, తదితరులు పాల్గొన్నారు.

మంజూరు పత్రాలు అందుకున్న అధ్యాపకులతో ఛైర్మన్ జి. సత్యనారాయణ

19 నుంచి సత్యసాయి శత జయంతి వేడుకలు

వేపగుంట, న్యూస్‌టుడే: ప్రహ్లాదపురం సత్యసాయిబాబా మందిరంలో ఈనెల 19 నుంచి 23 వరకు సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు కమిటీ తెలిపింది. వేడుకల్లో భాగంగా 19న మహిళ, 20న సేవ, 21న యువజన, 22న బాలవికాస్ దినోత్సవాలు జరపనున్నట్లు తెలిపారు. 23న సత్యసాయి శత జయంతి కార్యక్రమం జరుపుతామన్నారు.

పచ్చిక మాటున.. పొంచి ఉన్న ఆపద

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి బృందావన్ గార్డెన్స్ ప్రాంతంలోని పలు ఖాళీ స్థలాలతో ఆపద పొంచి ఉందని స్థానికులు వాపోతున్నారు. లిటిల్ ఫ్లవర్స్ పాఠశాల సమీపంలోని ఖాళీ స్థలంలో పెద్దఎత్తున వర్షం నీరు నిలిచిపోయింది. వారాలుగా నీరు తొలగకపోవడంతో పాదులు పెరిగిపోయి పచ్చిక బయలును తలపిస్తోంది. ఈ ప్రాంతం దోమలకు ఆవాసంగా మారింది. పాములు, విషకీటకాలు సంచరిస్తున్నాయి. అధికారులు కనీసం దోమల నివారణ చర్యలు కూడా తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించాలని పలువురు కోరుతున్నారు.

ఫోకస్

పాలకులు కరుణించరు.. వెతలు తీరవు

చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ సప్తగిరినగర్‌లో రహదారులు అధ్వానంగా మారాయని స్థానికులు వాపోతున్నారు. మసీదు నుంచి కాలనీలోకి వెళ్లే మార్గంలో పలు బహుళ అంతస్తుల భవనాలున్నాయి. ఆయా అపార్టుమెంట్లలో వందలాది మంది నివసిస్తున్నారు. అయినప్పటికీ పక్కా రహదారి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. భవనాల ఎదుట ఇటీవల భారీ గుంత ఏర్పడింది. వర్షం కురిస్తే చెరువులా మారుతోంది. గోతుల దారితో అవస్థలు పడలేక స్థానికులు భవన నిర్మాణ వ్యర్థాలు వేసి పూడ్చారు. చదును చేసే అవకాశం లేకపోవడంతో అలాగే వదిలేశారు. ఇలాంటి దారిలో నిత్యం నరకం చూస్తున్నామని తెలిపారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

భార్య అప్పగింత

పెందుర్తి, న్యూస్‌టుడే : పెందుర్తి మండలానికి చెందిన ఓ మహిళ భర్తతో గొడవ పడి ఈనెల 6న ఇల్లు విడిచి వెళ్లిపోయింది. ఈ మేరకు ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు అదృశ్యం కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. చరవాణి సంకేతాల ఆధారంగా ఆమె దిల్లీలో ఉన్నట్లు హెచ్‌సీ సుమిత్ గుర్తించారు. పెందుర్తి తీసుకొచ్చి, భర్తకు అప్పగించారు. దంపతులిద్దరికీ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు.

(c) eenadu

ముద్దుల బసవన్నకూ..
ముచ్చటైన కోవెల

శివుడికి ఎదురుగా ఉండేది బసవన్న. శ్రీశైలం, యాగంటి, మహానంది లాంటి పుణ్యక్షేత్రాల్లో ఇదే ఒరవడి. అనంతపురం నగరంలో ఇలా కాదు.. ఏకంగా నంది విగ్రహానికే ఓ అందమైన గుడి ఉంది. పాతూరు గాంధీ బజారు ప్రధాన రోడ్డు పక్కనే శ్రీపేట బసవేశ్వరస్వామి ఆలయం అత్యంత పురాతనమైనదిగా చెబుతారు. 500 సంవత్సరాల క్రితమే బసవేశ్వరుడిని ప్రతిష్ఠించారు. ఒకప్పుడు ఇక్కడ నివాసాలు లేకపోవడంతో కేవలం కట్ట మాత్రమే ఉండేది. గ్రామంలోకి ప్రవేశించగానే బసవేశ్వరుని దర్శనం చేసుకొనే వారు. బసవేశ్వర జయంతి, కార్తికమాసంలో భక్తులు అధికంగా వస్తారని ఆలయ కమిటీ ఛైర్మన్ సాంబశివుడు, ప్రధాన అర్చకులు శాంతమూర్తి చెబుతున్నారు.

- న్యూస్‌టుడే, అశోక్‌నగర్, ఈనాడు, అనంతపురం

నమ్మకాలు..

★ పురాతన కాలంలో ఇక్కడికి సమీపంలో ఎక్కడైనా శివలింగం ఉండవచ్చని, నగర విస్తరణలో భాగంగా కన్పించకుండా పోయిందని.. ★ బసవేశ్వరుని చెవిలో కోరికలు చెబితే నెరవేరుతాయని..

మార్చిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి

ఇంటి పత్రాలు ఇస్తున్న కలెక్టర్ ఆనంద్, ఎంపీ లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే జయరాం

గుత్తి: గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లను వచ్చే మార్చిలోగా పూర్తి చేస్తామని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. 37,997 ఇళ్ల నిర్మాణాలను చేపట్టగా 30 శాతం మేరకు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పూర్తి అయ్యాయని.. రూ.22 కోట్లను వెచ్చించి 10వేల ఇళ్లను సిద్ధం చేశామని తెలిపారు. బుధవారం గుత్తిలోని నేమితాబాదు రోడ్డు కాలనీలో లబ్ధిదారులను. . ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంతో కలిసి గృహ ప్రవేశం చేయించారు. ఇంటి పత్రాలను అందజేశారు. కలెక్టర్, ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాలు, పట్టణాల్లో అర్హులైన పేదలకు నివేశన స్థలాలు ఇచ్చి గృహాలను నిర్మిస్తుందన్నారు. ఎంపీఆర్ డ్యామ్ నుంచి గుత్తికి పైపులైన్ ద్వారా తాగునీటిని అందించే పథకం త్వరలోనే మొదలు కానుందన్నారు. అనంతరం రూ.20 లక్షలతో చేపడుతున్న తాగునీటి పైపులైన్ పనులకు భూమి పూజ చేశారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, మార్కెట్‌యార్డు ఛైర్మన్ ప్రతాప్ పాల్గొన్నారు.

కోనేటి నీరు..
ఔషధం తీరు

కోనేటి నీటిని దాహం తీర్చుకోవడానికి తాగుతాం.. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండల కేంద్రంలో అలా కాదు. కోనేటి నీటిని ఔషధంలా భావిస్తారు. 500 సంవత్సరాల క్రితం విజయనగర రాజు మాధవరాయుడు నిర్మించిన ఆలయం అది. శతాబ్దాలు గడిచినా చెక్కుచెదరని నిర్మాణ కౌశలం దీని సొంతం. అంతేకాదు అప్పటి నమ్మకం ఒకటి కొనసాగుతూనే ఉంది. పిల్లలకు తలలో పుండ్లు, పొక్కులు ఏర్పడితే వరుసగా ఆది, మంగళ, శుక్రవారాల్లో కోనేటి నీటితో స్నానం చేయిస్తే నయం అవుతాయని భావిస్తారు. ఇప్పటికీ పరిసర గ్రామాల నుంచి తల్లిదండ్రులు పిల్లలను పిలుచుకుని పెద్దసంఖ్యలో వచ్చి.. తలస్నానం చేయిస్తారు. 'ఈ నీటిలో కాపర్, జింక్ మూలకాలు ఉన్నాయని పరిశోధనలో తేలింది.. ఇవియాంటి బయాటిక్‌గా పని చేస్తున్నందున చర్మ సంబంధ రోగాలు తగ్గిపోతున్నాయి' అని విశ్రాంత ఆయుర్వేద వైద్య అధికారి రామయ్య చెబుతున్నారు.

- న్యూస్‌టుడే, గోరంట్ల

ఆ గంట గడిస్తే చాలు

న్యూస్‌టుడే, అనంతపురం (వైద్యం)

గుండె నిమిషానికి 72 సార్లు కొట్టుకుంటుంది. 2 వేల గ్యాలన్ల రక్తాన్ని శుద్ధిచేసి 60 వేల మైళ్ల దూరం పంపింగ్ చేయగలుగుతుంది. ఆధునిక మనిషి పరుగు వేగం అందుకునేందుకు అంతటి గుండెకు సైతం ఒత్తిడి పెరుగుతోంది. అలుపెరుగని హృదయానికి వచ్చే జబ్బులపై కన్నేసి కాపాడుకుంటేనే మనకు జీవితం..

1 **ఆందోళన :** ఇటీవల కాలంలో వయసుతో సంబంధం లేకుండా ఎక్కువ మంది గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు

2 **కారణాలు :** కల్తీ ఆహార పదార్థాలు తినటం, సరైన ఆహారం తీసుకోక, చెడు వ్యసనాలకు అలవాటు, శారీరక వ్యాయామం లేకపోవడం

3 **ఊరట :** ఆసుపత్రుల్లో రూ.45 విలువ చేసే టెనెక్టప్లేస్ ఇంజక్షన్ అందుబాటులో..

గోల్డెన్ అవర్..

గుండె సమస్యతో సదరు ఆసుపత్రులకు రోగులు వస్తే వెంటనే వారికి బీపీ, ఈసీజీ పరీక్ష చేసి వచ్చే పలితాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టెమీ యాప్ ద్వారా గుండె వైద్య నిపుణులకు పంపితే వారు వాటిని పరిశీలించి రోగికి ఎలాంటి చికిత్సలు అందించాలో సూచిస్తారు. ఆ మేరకు టెనెక్టెప్లేస్ ఇంజక్షన్‌ను వైద్యులు, సిబ్బంది రోగికి వేసి ప్రాణాలను కాపాడుతున్నారు. గుండె సమస్య తలెత్తిన గోల్డెన్ అవర్‌లో రోగిని ఆసుపత్రికి తీసుకువస్తే వారికి సకాలంలో ఇంజక్షన్ వేసి పునర్జన్మ ఇస్తున్నారు.

● గుండెపోటు బాధితులకు సీపీఆర్ చేయాలి. వారిని గోల్డెన్ అవర్‌లోనే తీసుకొస్తేనే బతికించడం సాధ్యం అవుతుంది. వైద్యులు సూచించిన చికిత్స విధానాలు చేపడితే కొన్ని నిమిషాల్లో కుదుట పడతారు. అప్పటికీ ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోతే వెంటనే టెనెక్టెప్లేస్ ఇంజక్షన్ వేయాలి. ఆరోగ్యం నిలకడగా ఉన్న తరువాత ఆసుపత్రులకు తరలిస్తే శస్త్రచికిత్స ఉచితంగా చేస్తారు.

- డాక్టర్ డేవిడ్ సిల్వన్‌రాజ్, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త

ఈ లక్షణాలుంటే..

గుండెదడ, ఛాతీపై బరువు, మంటగా ఉండటం, శ్వాసలో ఇబ్బంది, వాంతులు, దవడ నొప్పి, చెమటలు పట్టడం, తలతిరిగి కిందపడిపోవటం, ఛాతినొప్పి, ఎడమచేతి వరకూ రావటం వంటి లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

అనంతపురం జిల్లాలో ఆసుపత్రుల వారీగా ఇలా..

ఆసుపత్రి పేరు	ఇంజక్షన్ల సరఫరా	వినియోగించివి
రాయదుర్గం	69	57
తాడిపత్రి	38	31
గుంతకల్లు	163	149
అనంతపురం సీడీ ఆసుపత్రి	4	2
గుత్తి	50	41
కళ్యాణదుర్గం	19	17
కణేకల్లు	18	16
పామిడి	30	26
శింగనమల	32	15
ఉరవకొండ	13	1
కొనకొండ్ల	4	1

తీసుకో సైకిల్..
చుట్టెయ్ క్యాంపస్

ఫ్రెండ్స్.., స్కూటీ, బైక్‌లపై దూసుకెళ్లే ఈ వయసులో సైకిలా? అని ఆలోచించకండి. సైక్లింగ్ ఆరోగ్యానికి ఎంతో మేలని గుర్తించండి. పని మీద శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీకి వెళ్తే మాత్రం ఈ విషయాన్ని మరవకండి.. కేవలం రూ.5 చెల్లించి సుమారు 500 ఎకరాల్లో ఉన్న వర్సిటీ ప్రాంగణాన్ని హాయిగా తిలకించవచ్చు. ఇక్కడ ఏ విభాగానికి వెళ్లాలన్నా హాయిగా వెళ్లి రావొచ్చు. డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు తమ ధ్రువపత్రాల కోసం వివిధ ప్రాంతాల నుంచి వస్తుంటారు. ఇలాంటి వారి కోసం ఎస్బీఐ, కెనరా బ్యాంకు సౌజన్యంతో గంటకు రూ.5 అద్దె వసూలు చేస్తూ సైకిల్ ఇస్తున్నారు.

- ఈనాడు అనంతపురం

నేడు ఆడిట్ బృందం రాక

అనంతపురం (వ్యవసాయం): పశుసంవర్ధకశాఖలో నిధుల గోల్‌మాల్‌పై విచారణ చేపట్టేందుకు ఆశాఖ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ దామోదర్‌నాయుడు ముగ్గురుతో కూడిన రాష్ట్ర ఆడిట్ బృందాన్ని నియమించారు. 'పశుసంవర్ధకశాఖలో నిధులు మేసేశారు' శీర్షికన బుధవారం 'ఈనాడు'లో కథనం వచ్చింది. దీనికి స్పందనగా పరిశీలనకు ఆ బృందం సభ్యులు గురువారం జిల్లాకు రానున్నారు. ఉదయం 11.30 గంటలకు జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయానికి అధికారులు చేరుకుంటారు. ముందుగా జేడీఏహెచ్ ప్రేమచంద్‌తో సమావేశమవుతారు. అనంతరం కార్యాలయంలో సెక్కషన్ సీ-1లోని బిల్లు పుస్తకాలు, ఇతర రికార్డులను క్షుణంగా పరిశీలించనున్నారు. నిధుల గోల్‌మాల్‌పై కలెక్టర్ సైతం ఆరా తీశారు.

ఇటీవల ఎన్టీఆర్ మార్గ్‌లో ఆగిన బస్సు

ఎక్కడ ఆగుతాయో ఏమో!

అనంత ఆర్టీసీ, న్యూస్‌టుడే: నిరంతర ప్రయాణం.. సంవత్సరాలు పెరిగే కొద్దీ బస్సులు రిపేర్లు రావడం సాధారణం. ఎప్పటికప్పుడు సక్రమంగా చూసుకొని మరమ్మతులు సాగిస్తేనే బండి ముందుకు కదులుతుంది. నిత్యం వేలాది ప్రయాణికులను గమ్యానికి చేర్చే ఆర్టీసీ బస్సుల సామర్థ్యాన్ని నిరంతరం పరిశీలించాల్సిందే. అయితే అలాంటి వాతావరణం ఉందా.. ఆర్టీసీలో ప్రస్తుతం ఉన్న బస్సుల్లో సగానికి పైగా పదేళ్లు దాటినవే.

● అనంతపురం ఆర్టీసీ డిపోలో రెండు బస్సులు తుక్కుకు పంపగా మరో 4 బస్సులు పంపాల్సి ఉంది. 2026లో మరో 15 బస్సులు గడువు ముగుస్తోంది. వాటిని తుక్కుకు పంపాల్సి ఉంది. జిల్లాలోని 7 డిపోల పరిధిలో కాలం సమీపిస్తున్న బస్సులు ఇదే తరహాలోనే ఉన్నాయి. వాహనచట్టం ప్రకారం 15 ఏళ్ల కంటే ఎక్కువ సంవత్సరాలు బస్సుల్ని నడపకూడదు. 14 సంవత్సరాలు దాటిన బస్సులు కాలం సమీపిస్తుండటంతో అవి ఎక్కడికక్కడ ఆగిపోతున్నాయి.

● ఆగస్టు 15 నుంచి స్త్రీ శక్తి పథకం ప్రారంభం తర్వాత 72 శాతం ఉన్న ఆక్యుపెన్సీ రేటు తాజాగా 85కు చేరుకుంది. గడువు సమీపిస్తున్న బస్సుల్లో ఈ తరహా ప్రయాణాలు ఆపేయాల్సి ఉంది.

● ఈనెల 3న అనంతపురం డిపో బస్సు తాడిపత్రికి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో ప్రయాణికులతో వస్తుండగా క్లచ్ పని చేయలేదు. డ్రైవర్ బస్సును పాతూరు మార్కెట్ మీదుగా కాకుండా ఎన్టీఆర్ మార్గ్ మీదుగా తీసుకొచ్చి ప్రధాన రోడ్డులో ఆపి దించాల్సి వచ్చింది.

● ఈనెల 5,6 తేదీల్లో వరుసగా పుట్లూరు మండలంలో బస్సులు అదుపు తప్పాయి. 5న చింతకుంటలో అదుపు తప్పి గుంతలోకి దూసుకెళ్లింది. 60 మంది ప్రయాణికులకు ప్రమాదం తప్పింది.

- ● అనంతలో ఆర్టీసీ డిపోలు: 7
- ● బస్సులు: 470
- ● 15 సంవత్సరాలకు దగ్గరలో ఉన్న బస్సులు: 70
- ● సగటున రోజుకు ప్రయాణికులు: 2.10 లక్షలు

మరమ్మతులు చేసి పంపుతున్నాం..

షెడ్యూల్ ప్రకారం బస్సును పరిశీలించి మరమ్మతులు చేసి పంపుతున్నారు. సక్రమంగా లేని విడిభాగాలను తొలగిస్తున్నాం. 15 సంవత్సరాల గడువు తీరిన బస్సులు ఎక్కడా పంపడం లేదు.

- శ్రీలక్ష్మి, జిల్లా ప్రజా రవాణా అధికారిణి

నేర్చుకో.. నెరవేర్చుకో!

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: ప్రస్తుత పరిస్థితుల్లో బీటెక్, ఎంటెక్ పూర్తి చేసినా ఉద్యోగాలు లభించడం గగనంగా మారింది. సాఫ్ట్‌వేర్ రంగం మాత్రమే కాదు అన్నింటా ఇదే పరిస్థితి. యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలని ప్రభుత్వం చొరవ చూపుతోంది. జిల్లాలో ప్రతి మూడు నెలలకోసారి నియోజకవర్గస్థాయిలో ఉద్యోగమేళాలు నిర్వహిస్తోంది. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, ఉద్యోగకల్పన శాఖల సమన్వయంతో మేళాలు ఏర్పాటు చేసి.. కొలువులకు ఎంపిక చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా యువతలో నైపుణ్యం లేకపోవడం, భావవ్యక్తీకరణ లోపం, సమస్య పరిష్కార సామర్థ్యం కొరవడటం, ఓర్పులేమితో చాలామంది ఉద్యోగాలు సాధించలేకపోతున్నారు. వీటిని అధిగమిస్తేనే కొలువు కల సాకారమవుతుంది.

గత ఆరు నెలల్లో..

- ఉద్యోగమేళాలు: 14
- పేర్లు నమోదు: 13,210
- ఎంపికైన వారు: 6,430
- కొలువులో చేరింది: 2,498

పేర్లు నమోదు తీరు..

- డిగ్రీ చేసిన వారు: 50 శాతం
- బీటెక్ విద్యార్థులు: 20 శాతం
- డిప్లొమా, ఐటీఐ విద్యార్థులు: 30-40 శాతం
- పదో తరగతి : 20-30 శాతం

అనంత ఆర్ట్స్ కళాశాలలో ఇటీవల జరిగిన ఉద్యోగ మేళాలో సంస్థల ప్రతినిధులు, యువత

కంపెనీలు ఏం ఆశిస్తున్నాయి

● భావ వ్యక్తీకరణ సామర్థ్యం. చక్కగా మాట్లాడటం.
● నడవడిక, ఆకర్షించే వేషధారణ, సమయపాలన, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, బృంద స్ఫూర్తి, వాక్చాతుర్యం
● డిప్లొమా, డిగ్రీ పూర్తయిన తరువాత అదనపు నైపుణ్య కోర్సులు, తగిన అనుభవం

ముందుకు సాగాలి బ్రో..

● ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ చేసిన యువత అక్కడితో ఆగిపోకుండా సంబంధిత స్వల్పకాలిక కోర్సులను పూర్తి అయ్యేలా ప్రణాళిక వేసుకోవాలి.
● వేతనం తక్కువైనా.. చిన్న ఉద్యోగమైనా వదులుకోవద్దు. వివిధ కంపెనీలు, సంస్థల్లో పనిచేయడం వల్ల అనుభవం వస్తుంది. ఇది ఉన్నత ఉద్యోగావకాశాలకు బాటలు వేస్తుంది. భవితను నిర్దేశిస్తుంది.
● రంగం ఏదైనా కొలువు చేయడానికి ఆసక్తి చూపితే భవిష్యత్తులో అవకాశాలు వస్తాయి. వినియోగించుకుంటూ సాగడం ఉత్తమం.

అవకాశాలు ఏమున్నాయ్..

నియోజకవర్గస్థాయిలో జరిగే ఉద్యోగ మేళాల్లో సుమారు 20 కంపెనీలు పాల్గొంటున్నాయి.
● సేవ, ఐటీ, ఉత్పత్తి రంగాలు, మార్కెటింగ్, బ్యాంకింగ్, ఫార్మా కంపెనీలు యువతకు ఉద్యోగాలు కల్పించడానికి ముందుకొస్తున్నాయి.
● అనంతపురం, రాప్తాడు, శింగనమల, తాడిపత్రి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో మేళాలు నిర్వహిస్తున్నారు.

ఏవీ వదులుకోవద్దు

ప్రతాప్‌రెడ్డి, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి

ఏ ఉద్యోగం వచ్చినా వదులుకోవద్దు. ఇతర ప్రాంతాల్లో.. చిన్నదైనా సరే ఉద్యోగంలో చేరాలి. అన్ని నియోజకవర్గాల్లో నైపుణ్య శిక్షణ కేంద్రాలున్నాయి. అందులో ఉచిత శిక్షణ పొందవచ్చు. అదనపు నైపుణ్యంతో కొలువులు సాధించవచ్చు.

సత్యరూపం.. శతజయంతి వైభవం

ప్రశాంతి నిలయంలో గోపురానికి అలంకరణ

ఈనాడు, పుట్టపర్తి: ప్రేమమూర్తి సత్యసాయి ఖ్యాతి ఖండాంతరాలు దాటేలా శతజయంతి ఉత్సవాలు నిర్వహించేందుకు సెంట్రల్ ట్రస్టు ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీశ్‌కుమార్ పర్యవేక్షణలో అధికారులు సౌకర్యాల కల్పనలో నిమగ్నమయ్యారు.

★ ఆధ్యాత్మిక పట్టణం విద్యుత్తు కాంతుల్లో వెలుగులీనుతోంది. చిత్రావతి నది వద్ద పార్కులు, సుందరీకరణ చేపట్టారు. పుట్టపర్తి బైపాస్ నుంచి మందిరం వెస్టుగేట్ వరకు రహదారి నిర్మించారు.

★ ప్రశాంతి మందిరం, వెస్టుగేట్, విద్యుత్తు సబ్‌స్టేషన్ పక్కన, చైతన్యజ్యోతి మ్యూజియం వద్ద భక్తులకు వసతి, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. 50 వేల మందికి చొప్పున 4 చోట్ల ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గురువారం నుంచి ప్రతిఒక్కరికీ అన్నప్రసాదం ప్రత్యేక కౌంటర్లను సిద్ధం చేశారు.

పది పార్కింగ్ ప్రదేశాలు

చెన్నై నుంచి వచ్చే వాహనాల కోసం కర్ణాటక నాగేపల్లి వద్ద 3 చోట్ల, బెంగళూరు, అనంతపురం నుంచి వచ్చేవారి కోసం శిల్పారామం వద్ద 3, అలాగే ఆనంద్ విల్లాస్, పోలీసు పరేడ్ మైదానం, మందిరం వెస్టుగేట్ చింత తోపు, చిన్నపల్లి స్కూల్ వద్ద వీఐపీ, వీవీఐపీలకు ప్రత్యేక వసతులుంటాయి.

చిత్రావతిలో లేజర్‌షో..

కాలువ గేటు కదిలింది

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ఐదు రోజుల ఇంజినీర్ల శ్రమ ఫలించింది. ఎట్టకేలకు ఎంపీఆర్ దక్షిణ కాలువ ప్రధాన గేటును కదిలించారు. గేటు కదలక నీటి ప్రవాహం ఆగిన తీరుపై బుధవారం 'ఆయకట్టు రైతుల్లో కలవరం' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. బుధవారం ఉదయమే ప్రధాన గేటుకు మరమ్మతు చేసి ఎట్టకేలకు పైకి ఎత్తారు. దీంతో ఉదయం 200 క్యూసెక్కులతో మొదలైన ప్రవాహం.. సాయంత్రానికి 700 క్యూసెక్కులకు పెంచినట్లు హెచ్చెల్సీ లోకలైజేషన్ డివిజన్ ఈఈ పార్థసారథి తెలిపారు.

● దక్షిణ కాలువకు నీటి ప్రవాహం పునఃప్రారంభం కావడంతో సుబ్బరాయసాగర్ నుంచి పుట్లూరు చెరువుకు గురువారం నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. పుట్లూరు, కోమిటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులకు సుబ్బరాయసాగర్ ప్రాంతాల ప్రజలు కొంతకాలంగా నీటి కోసం నిరీక్షిస్తున్నారు.

తాడిపత్రి రాళ్లలో.. ఎన్నెన్ని సొబగులో

తక్కువ ధరకే గ్రానైట్ పలకలు

- గ్రానైట్ పరిశ్రమలు: 180
- నెలకు వచ్చే ముడిసరకు: 1500 క్యూబిక్ మీటర్లు
- ఏటా టర్నోవర్: రూ.100కోట్లకుపైనే
- ప్రభుత్వానికి ఆదాయం (నెలకు): పన్ను, విద్యుత్తు ఛార్జీల రూపంలో రూ.2.50 కోట్లు
- ఎగుమతులు: ముంబయి, చెన్నై, దిల్లీ, కోల్‌కతా తదితర రాష్ట్రాలకు
- లభించే రకాలు: గ్రీన్, బ్లాక్, ఫిషర్ బ్లాక్, వైట్, రెడ్

తాడిపత్రి, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా తాడిపత్రిలో లభించే గ్రానైట్ బండలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. 25 ఏళ్లుగా ఇక్కడి పాలిషింగ్ యూనిట్లలో కోస్తున్న రంగు బండలు మన్నిక, నాణ్యతకు పేరు గాంచాయి. ముడిసరకు ఇక్కడ లభించకపోయినా ఇతర జిల్లాల నుంచి తెప్పించి...కటింగ్, పాలిషింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. తాడిపత్రి పరివాహక ప్రాంతంలోని పెన్నా నది ఒడ్డున పుష్కలంగా నీరు ఉండటంతో పెద్ద సంఖ్యలో పరిశ్రమలు వెలిశాయి. ప్రతి నెలా పన్నులు, విద్యుత్తు బిల్లుల రూపంలో ప్రభుత్వానికి రూ.2.50 కోట్లకు పైనే ఆదాయం వస్తోంది. ఈ పరిశ్రమల ద్వారా కర్నూలు, కడప జిల్లాలతో పాటు కదిరి, గుంతకల్లు ప్రాంతాలకు చెందిన దాదాపు 8 వేలకు పైగా కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలు, జిల్లాలతో పోలిస్తే తాడిపత్రిలో గ్రానైట్ తక్కువ ధరకు లభించడం ముదావహం.

చుక్కలూరు రోడ్డులోని క్వారీ పరిశ్రమలో వివిధ రంగుల్లో సిద్ధంగా ఉన్న గ్రానైట్ బండలు

బండను కటింగ్ చేస్తున్న యంత్రం

అనన్య సాధన
అమూల్య ప్రతిభ

బ్యాట్స్‌ఉమెన్, వికెట్ కీపర్‌గా దూకుడు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లు పట్టణంలో నాయీబ్రాహ్మణ కాలనీకి చెందిన ధనుంజయ క్షౌరశాల నడుపుతూ జీవనం.. భార్య లీల గృహిణి. ఈ కుటుంబం నుంచి క్రికెట్‌లో ప్రతిభ చాటుతూ గుర్తింపు తెచ్చుకుంటోంది పెద్ద కుమార్తె అమూల్య. బ్యాట్స్‌ఉమెన్‌గా, వికెట్ కీపర్‌గా రాణిస్తూ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్-19 విభాగం పోటీల్లో సత్తాచాటి జాతీయస్థాయికి ఎంపికైంది.

చదువు సంగతి

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం.

ప్రతిభ ఏ విభాగంలో

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో అనంతపురం జట్టు తరపున ఓ మ్యాచ్‌లో 25 పరుగులు. వికెట్ కీపర్‌గా 3 స్టంప్ అవుట్లు, రెండు క్యాచ్‌లు

ఎంపిక

ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయికి అనంత జట్టు తరపున ఐదుగురు ఎంపిక కాగా. . వీరిలో అమూల్య ఒకరు.

'చదువు, క్రీడల్లో అమ్మానాన్నా ప్రోత్సహిస్తున్నారు. ఆరోతరగతి చదువుతున్నపుడు 2019 నుంచి ఆర్డీటీ నిర్వహిస్తున్న క్రికెట్ శిక్షణ శిబిరంలో చేర్పించారు. 2022 నుంచి ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌ల్లో బ్యాట్స్‌ఉమెన్‌గా, వికెట్ కీపర్‌గా రాణించాను. 2024లో జిల్లాలో జరిగిన ఏపీఎల్, సౌత్‌జోన్, జిల్లా, స్థాయి టోర్నీల్లో వెయ్యికి పైగా పరుగులు చేశా. డిసెంబర్‌లో ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి అండర్-19 విభాగంలో సత్తాచాటుతా..

- అమూల్య

కుదిరితే కప్పు కాఫీ..
నాలుగు మాటలు

న్యూస్‌టుడే, అనంతపురం (అశోక్‌నగర్)

నగరాల్లో నలుగురు మిత్రులు కలిసి సరదాగా మాట్లాడుకోవడానికి, ఉరుకులు పరుగులతో అలసిన మనసుకు ఒత్తిడి తగ్గించుకునేందుకు, స్థిరాస్తి వ్యాపార లావాదేవీలకు టీ కేఫ్‌లు వేదికలవుతున్నాయి. ఎక్కడా లేని టీ కేఫ్ సంస్కృతి అనంతపురం నగరంలో, 44వ జాతీయ రహదారి వెంబడి రోజురోజుకు విస్తరిస్తోంది. అర కిలోమీటరు విస్తీర్ణం కూడా లేని ఆదిమూర్తినగర్‌లో 60కి పైగా ఉన్నాయంటే మార్పు ఏ రీతిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఏ కేఫ్‌లో, ఏ సమయంలో చూసినా ఉదయం నుంచి సాయంత్రం దాకా సగటున 50, 60 మందికి తగ్గకుండా ఉంటున్న తీరు మారుతున్న ధోరణికి అద్దం పడుతోంది.

ఏమేం ఉంటాయి

ఇరానీ టీ, గ్రీన్, తాటిబెల్లం, అల్లం, జింజర్, బ్లాక్, మసాలా, బ్లూ, బ్లాక్ జింజర్, దమ్, రాగి మాల్ట్



భారీ పెట్టుబడి లేకుండానే..

నగరంలో కనీసం 5 నుంచి 10 సెంట్ల ఖాళీ స్థలం ఉంటే చాలు. వ్యాపారం చేద్దామనుకున్న వారికి టక్కున మదిలోకి వచ్చేది టీ కేఫ్ పెట్టాలన్న ఆలోచనే. పైన రేకులు వేయడం, గుండ్రని టేబుళ్లు పరవడం, కింద రాళ్లతో చిప్స్ వేయడం, కొంతభాగం ఖాళీగా ఉంచి తక్కువ ఖర్చుతో ఏర్పాటు చేసేస్తున్నారు.

విస్తరణ ఇలా..

నగరంలోని సాయినగర్ నుంచి అశోక్‌నగర్, విద్యుత్తు నగర్ కూడలి, హౌసింగ్ బోర్డు, జేఎన్‌టీయూ రోడ్డు, బెంగళూరు రోడ్డు, రాంనగర్ నుంచి శ్రీనగర్ కూడలి, ఆదిమూర్తినగర్, ఎన్టీఆర్ మార్గ్, 44వ జాతీయ రహదారి తపోవనం కూడలి, బళ్లారి, కళ్యాణదుర్గం, రుద్రంపేట నడక దారి, రాప్తాడు సమీపంలో ప్రసన్నాయపల్లి కూడలి వరకు పెద్ద సంఖ్యలో కేఫ్‌లు విస్తరిస్తున్నాయి.

ఇక్కడ దాచుకుంటే..
దోచుకోవడం కష్టం



ఇళ్ల మధ్యలో ఈ బురుజేంటి? ఆశ్చర్యం కలిగించే రీతిలో ఉన్న ఈ నిర్మాణం శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం దొరిగల్లు గ్రామంలో ఉంది. 1800 సంవత్సరానికి ముందు పాలెగాడు నారాయణరెడ్డి కాలంలో మరాఠా దొంగలు, దివిటీ దొంగలు లాంతర్లతో ముసుగులు వేసుకుని గుర్రాలపై వచ్చి గ్రామస్థుల విలువైన ఆభరణాలు, వస్తువులు, నగదు దోచుకునేవారు. వారి నుంచి రక్షణకు అప్పట్లో గ్రామాల్లో ఇలా ఇళ్ల మధ్య రాళ్లతో బురుజును నిర్మించారు. విలువైన ఆభరణాలు, ధనం, వస్తువులు, దాన్యం బురుజు కింద దాచుకునేవారు. ఆ బురుజు పైన ఉండే చిన్నరంధ్రాల్లోంచి దొంగల రాకను గమనిస్తూ కాపలా ఉండి.. ప్రతిదాడులు చేసేవారని రాయలసీమ చరిత్ర పరిశోధకుడు హరనాథ్‌రెడ్డి చెబుతున్నారు.

- ఈనాడు అనంతపురం, న్యూస్‌టుడే, ముదిగుబ్బ

(c) eenadu

ఆధ్యాత్మిక సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నేడు(గురువారం) ఉదయం ఆరుగంటలకు స్వామి వారి సాధారణ దర్శనం ఉంటుంది. ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల మధ్య అభిషేక, స్వర్ణకవచ సేవలు ఉంటాయి. తర్వాత ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తిరిగి సాయంత్రం 5నుంచి రాత్రి 8.30గంటల వరకు భక్తులకు స్వామి వారి సర్వదర్శనం ఉంటుంది.

జుబేదాకు అండగా ఉంటాం: మంత్రి లోకేశ్

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: మస్కట్ దేశంలో నరకం చూస్తున్నానంటూ అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన జుబేదాబేగం సెల్ఫీ వీడియో ద్వారా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌ను వేడుకున్న విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన మంత్రి లోకేశ్ జుబేదాకు అన్నివిధాలుగా సాయమందించి స్వదేశానికి క్షేమంగా తీసుకొస్తామన్నారు. అక్కడి అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని, ఆమె ఒంటరి కాదని, ఇండియాకు వచ్చేవరకు అండగా ఉంటామని మంత్రి ఎక్స్‌లో పోస్టు చేశారు.

నేడు ప్రత్యేక విద్యుత్తు అదాలత్

అనంతపురం(విద్యుత్తు): విద్యుత్తు వినియోగదారులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం గురువారం మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కూడేరులోని విద్యుత్తుశాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో ప్రత్యేక విద్యుత్తు అదాలత్(విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ శేషాద్రిశేఖర్, ఈఈ జె.వి.రమేశ్ తెలిపారు. అదాలత్ ఛైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు మధుకర్‌బాబు, సాంకేతిక సభ్యుడు శ్రీనివాసబాబు, స్వతంత్ర సభ్యురాలు విజయలక్ష్మి పాల్గొని వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు.

జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు కార్తిక్

అభినందిస్తున్న ప్రిన్సిపల్ బాలకృష్ణ

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: జాతీయస్థాయి అండర్ 11 బ్యాడ్మింటన్ పోటీలకు కార్తిక్ అనే విద్యార్థి ఎంపికయ్యారు. ఆ విద్యార్థి భాష్యం పాఠశాలలో చదువుతున్నాడు. స్కూల్‌గేమ్స్ వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి దక్కించుకొని జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. భాష్యం పాఠశాల ప్రిన్సిపల్ బాలకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

గుంటూరు పోలీసుల అదుపులో వైకాపా కార్యకర్త

కళ్యాణదుర్గం గ్రామీణం, శెట్టూరు: ముఖ్యమంత్రి చంద్రబాబుకు సంబంధించి అసభ్యకరంగా సామాజిక మాధ్యమంలో పోస్టుపెట్టిన శెట్టూరు మండలం ఐదుకల్లుకు చెందిన వైకాపా కార్యకర్త యశ్వంత్‌ను గుంటూరు పోలీసులు అరెస్టు చేశారు. ఈ పోస్టును గుంటూరుకు చెందిన ఓ వ్యక్తి మరో సామాజిక మాధ్యమంలో పెట్టగా స్థానిక తెదేపా కార్యకర్త పాలపాటి వంశీ గుర్తించి పట్టిచెరుకూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి మంగళవారం రాత్రి ఎస్సై, కానిస్టేబుళ్లు ఐదుకల్లు గ్రామానికి వచ్చి యశ్వంత్‌ను అదుపులో తీసుకున్నట్లు స్థానిక పోలీసుల ద్వారా తెలిసింది.

రాయితీ, ప్రోత్సాహకం ఏదీ?

పట్టుగూళ్ల రైతుల ఆందోళన | పురం మార్కెట్‌లో క్రయవిక్రయాలు బంద్

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం మార్కెట్‌లో బుధవారం పట్టుగూళ్ల క్రయవిక్రయాలు జరగలేదు. ప్రభుత్వం బైవోల్టిన్ రైతులకు ప్రోత్సాహక మొత్తం, మల్బరీ సాగుకు ఎరువులు, మందులపై రాయితీ ఇవ్వకపోవటంతో పంట సాగుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైకాపా ప్రభుత్వ పాలనలోనే వాటిని నిలిపేయడంతో రూ.20 కోట్ల వరకు బకాయి ఉంది. చెల్లించాలని రైతులు ఆందోళనలు చేపట్టినా ఫలితం లేకపోయింది. దీంతో కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. పంటసాగు, పట్టుగూళ్ల పెంపకానికి పెరిగిన పెట్టుబడి వ్యయంతో రైతులు అవస్థలు పడుతున్నారు. 1985లో పట్టుగూళ్ల మార్కెట్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు క్రయవిక్రయాలు బంద్ అయిన సందర్భాలు లేవని స్థానికంగా చెబుతున్నారు. ఇక్కడి మార్కెట్‌లో లావాదేవీల ద్వారా ప్రభుత్వానికి ఏటా రూ.కోటికిపైగా ఆదాయం వస్తోంది.

ఉపాధిపై ప్రభావం

మార్కెట్‌లో జరిగే పట్టుగూళ్ల లావాదేవీ ద్వారా రీలర్లు, కూలీల దాదాపు 8వేల మంది రీలింగ్ యూనిట్లపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పట్టుగూళ్లు రాకపోతే రీలింగ్ యూనిట్లు కొనసాగక ఉపాధికి విఘాతం కలుగుతుంది. యూనిట్లు కొనసాగాలంటే ఇతర ప్రాంతాలకు తరలిపోతున్న గూళ్లు ఇక్కడికి తీసుకురావాలని రీలర్లు కోరుతున్నారు.

హిందూపురంలో బోసిపోయిన మార్కెట్

ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి



జిల్లా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని బైవోల్టిన్ రైతులకు రాయితీ, ప్రోత్సాహకం అందేలా చూడాలి. లేదంటే రైతులు కర్ణాటకకే పట్టుగూళ్లు తరలించుకొని వెళ్లే అవకాశం ఉంది. నాలుగు దశాబ్దాల మార్కెట్ చరిత్రలో పట్టుగూళ్లు రాని రోజంటూ లేదు. దీనిని గుణపాఠంగా భావించాలి.

\- సిద్ధారెడ్డి, కార్యదర్శి, ఉమ్మడి జిల్లా పట్టు రైతుల సంఘం

కర్ణాటకకు తరలిస్తూ..

కర్ణాటక రాష్ట్రంలోని రాంనగర్, శిడ్లఘట్ట మార్కెట్‌లలో కిలోకు రూ.50 నుంచి 100 వరకు అదనంగా ధర లభిస్తుండటంతో ఈ ప్రాంతంలోని రైతులు బైవోల్టిన్, సీబీ పట్టుగూళ్లు తీసుకెళుతున్నారు. గతంలో బైవోల్టిన్ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం కిలోకు రూ.50 ప్రోత్సాహకం అందిస్తుండటంతో అధికశాతం మంది పురం తీసుకొచ్చి విక్రయించేవారు. ప్రస్తుతం కర్ణాటక మార్కెట్ మేలు అనే అభిప్రాయాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడి తక్కువగా ఉంటోంది

చలికాలంలో పట్టుగూళ్ల దిగుబడి తక్కువగా ఉంటోంది. ప్రస్తుతం చలి తీవ్రత పెరిగినందున పట్టుగూళ్లు అంతంతమాత్రంగా వస్తున్నాయి. గురువారం నుంచి గూళ్లు మార్కెట్‌కు వచ్చే అవకాశాలు ఉన్నాయి. - హంపయ్య, హిందూపురం మార్కెట్ ఇన్‌స్పెక్టర్

ప్రభుత్వ వైద్యకళాశాలకు నూతనంగా 15 పీజీ సీట్లు

విభాగాధిపతులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ విజయశ్రీ, సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే : అనంతపురం ప్రభుత్వ వైద్యకళాశాలలోని పలు విభాగాలకు నూతనంగా 15 పీజీ సీట్లను కేటాయిస్తూ జాతీయ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) అనుమతి ఇచ్చిందని ప్రిన్సిపల్ డాక్టర్ విజయశ్రీ, సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. నూతనంగా పీజీ సీట్లు వచ్చేందుకు కృషి చేసిన ఆయా విభాగాలకు సంబంధించిన అధిపతులను ప్రిన్సిపల్ ఛాంబర్‌లో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో కళాశాలలో 121 పీజీ సీట్లు ఉండేవని, ప్రస్తుతం నూతనంగా 15 సీట్లు రావటంతో ఆ సంఖ్య 136కి చేరిందని తెలిపారు. ఎన్ఎంసీ పీడియాట్రిక్, అనస్తీయా, గైనిక్ విభాగాలకు నాలుగు సీట్లు చొప్పున, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి 3 సీట్లు అదనంగా కేటాయించారని వివరించారు. వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ షారోన్‌సోనియా, డాక్టర్ సుచిత్ర, డాక్టర్ భాస్కర్, మధుసుధన్, డాక్టర్ రేణుక, డాక్టర్ నిసార్‌బేగంతో పాటు వైద్యవిద్యార్థులు పాల్గొన్నారు.

వర్సిటీలో ఏబీవీపీ నాయకుల నిరసన

ప్రిన్సిపల్‌తో వాగ్వాదానికి దిగిన ఏబీవీపీ నాయకులు

ఎస్కేయూ, న్యూస్‌టుడే : విశ్వవిద్యాలయంలో మత కార్యకలాపాలు నిర్వహిస్తే సహించేదిలేదని ఏబీవీపీ నాయకులు ధ్వజమెత్తారు. ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాల సెమినార్ హాల్లో కొందరు విద్యార్థులు సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తుండగా ఏబీవీపీ నాయకులు అడ్డుకున్నారు. సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అఖిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ప్రభుత్వ విద్యాలయాల్లో మతపరమైన కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. కార్యక్రమాల నిర్వహణకు ఎలా అనుమతి ఇచ్చారని ప్రిన్సిపల్ రామచంద్రతో వాగ్వాదానికి దిగారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఇన్‌ఛార్జి వీసీ అనితకు ఫిర్యాదు చేశారు. తగిన చర్యలు తీసుకుంటామని వీసీ చెప్పడంతో ఆందోళన విరమించారు. విద్యార్థి సంఘం నాయకులు యుగంధర్, దివాకర్‌నాయక్, నాగార్జున, ఉపేంద్ర, యశ్వంత్, గణేష్, బాబు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

అవసరమైతే ఫ్యాక్షన్ చేస్తా..!

అడ్డుకున్న పోలీసులతో మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి

సీఐలతో వాగ్వాదం చేస్తున్న పెద్దారెడ్డి

తాడిపత్రి, న్యూస్‌టుడే: 'పెద్దారెడ్డి ఫ్యాక్షన్ చేస్తారని తెదేపా నాయకులు పదేపదే అంటున్నారు. దేవుడు కరుణించి నాకు అనుకూలిస్తే వారి కోరిక నెరవేరుస్తానని' మాజీ ఎమ్మెల్యే, వైకాపా నేత కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. తాడిపత్రిలో బుధవారం వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పెద్దారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అదే సమయంలో ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేపట్టారు. ఈ నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడుతుందని భావించిన పట్టణ, గ్రామీణ సీఐలు ఆరోహనరావు, శివగంగాధర రెడ్డి నేతృత్వంలో పోలీసులు పెద్దారెడ్డిని అడ్డుకున్నారు. ఆగ్రహించిన పెద్దారెడ్డి ఇక్కడ మీకు ఇబ్బందైతే యాడికిలో జరిగే కార్యక్రమానికి వెళతానని, దానికి పోలీసుల అనుమతి ఉంది కదా అని పట్టుబట్టారు. ఆయన అక్కడికి వెళితే, తాము వెళతామని తెదేపా వర్గీయులు అల్టిమేట్ ఇవ్వడంతో పోలీసులు వద్దని వారించారు. తాను వెళ్లకూడదని రాత పూర్వకంగా నోటీసు ఇస్తే ఆగుతానంటూ వాగ్వాదానికి దిగడంతో పోలీసులు, వైకాపా వర్గీయుల నడుమ కొద్దిసేపు తోపులాట జరిగింది. అనంతరం పెద్దారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, అయన అనుచరులు తాను ఫ్యాక్షన్ చేస్తానని అంటున్నారని, దేవుడు కరుణిస్తే వారి కోరిక నెరవేరుస్తానన్నారు. వైకాపాలోని చురుకైన కార్యకర్తలపై తెదేపా శ్రేణులు దాడులు చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. చివరికి పోలీసులు పెద్దారెడ్డిని గృహనిర్బంధం చేయడంతో సమస్య సద్దుమణిగింది.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి

అందుకే ఇంటికి పంపారు: ఎమ్మెల్యే

పెద్దారెడ్డి గతంలో ఫ్యాక్షన్ చేస్తానని అన్నందుకే ఎన్నికల్లో ఇంటికి పంపించారని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి అన్నారు. ఆయన పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌లో జరుగుతున్న భూగర్భ మురుగునీటి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే పెద్దారెడ్డిని ప్రజలు నిరాకరించారని, మళ్లీ ఫ్యాక్షన్ చేస్తాననడం అవివేకమన్నారు. ఆయన వెంట ఎవరూ లేరని, ఒక్కరే కత్తి పట్టుకుని రోడ్డుపైకి రావాల్సి ఉంటుందని అన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులు చేస్తుంటే, వైకాపా వర్గాలు అడ్డుకోవడానికి రోడ్డెక్కుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైకాపా ప్రభుత్వం భూగర్భ మురుగునీటి వ్యవస్థను నాశనం చేసిందని, తిరిగి గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం రూ.11కోట్లు మంజూరు చేసిందని గుర్తుచేశారు.

590 గ్రామాలకు నిలిచిన ఎస్ఆర్‌పీ నీళ్లు

బోరంపల్లి-ఒంటిమిద్ది గ్రామాల మధ్య జరుగుతున్న బీటీపీ కాలువ పనులు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం(ఎస్ఆర్‌పీ)నీటి సరఫరా నిలిచింది. భైరవానితిప్ప ప్రాజెక్టు కాలువ పనులు కొనసాగుతుండటంతో ఈ ప్రాంతంలో పైపులు తాత్కాలికంగా తొలగించారు. దీంతో కళ్యాణదుర్గం, మడకశిర, పెనుకొండ, హిందూపురం నియోజకవర్గాల్లోని 590 గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. బీటీపీ ప్రాజెక్టు పనులు శరవేగంగా సాగుతున్న నేపథ్యంలో పైపులు పగిలిపోకుండా ఉండేందుకు ముందస్తుగా తొలగించినట్లు శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం డీఈ శిరీష పేర్కొన్నారు. ప్రత్యామ్నాయంగా పైపులు ఏర్పాటు చేసే పనులు కొనసాగుతున్నాయని, సుమారు 10 రోజుల వరకు నీళ్లు వచ్చే అవకాశం లేదని, ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ)

అనంతపురం మెయిన్-I బ్రాంచ్
12-3-50, సాయి ఎన్‌క్లేవ్, సాయి నగర్, 3వ క్రాస్, అనంతపురం-515001. ఫోన్: 08554-274740.

స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్, అనంతపురం మెయిన్-1 బ్రాంచ్ వారికి **ఋణగ్రహీత(లు): మెస్సర్స్ ఎయిర్ అండ్ సీ, ప్రొప్రయిటర్: ప్రణీత్ టివియస్, తండ్రి: టి. నరేంద్ర, 4/3/100, జనశక్తి నగర్, అనంతపురం-515001 మరియు హామీదారు(లు): శ్రీ టి.వి.యస్. శ్రీహర్ష, తండ్రి: యస్.టి.నరేంద్ర** వారు తేది.14.09.2021 నాటికి చెల్లించవలసిన బకాయి **రూ. 11,04,341.62/- (అక్షరాల పదకొండు లక్షల నాలుగు వేల మూడు వందల నలభై ఒక్క రూపాయలు మరియు అరవై రెండు పైసా మాత్రమే)** మొత్తమును రాబట్టుకొనుటకు **కెనరా బ్యాంక్, అనంతపురం మెయిన్-1** బ్రాంచ్ అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు ఛార్జ్/తనఖాపెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తిని తేది **29.11.2025** న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని ప్రజానీకానికి మరియు ముఖ్యంగా పైన తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది: 29.11.2025. ఉ॥ 11.45 గం.ల నుండి మ॥ 12.45 గం.ల వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ధరావత్తును RTGS/NEFT ద్వారా చలాన్‌లోని ఖాతా వివరములుకు తేది: 28.11.2025, సా॥ 5.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:

కర్నూలు ఆర్‌డి పరిధి మరియు కల్లూరు యస్ఆర్‌డి మరియు చట్లమల్లాపురం గ్రామము, చట్లమల్లాపురం రూరల్ పంచాయతీ ఏరియా ఓపెన్ ప్లాట్. ఆస్తి వివరములు: **ది.17.04.2017 తేదీ గల విక్రయ దస్తావేజు నెం.3370/2017** ప్రకారము చట్లమల్లాపురం గ్రామము సర్వే నెం.93/1, 93/2, 94/1, సబ్‌డివైడ్ సర్వే నెం.93/1సి, 93/2సి, 94/1 పైకి సర్వే నెం.93/1సి నందు ప్లాట్స్, న్యూ కల్కినగర్ నందు ప్లాట్ నెం.9 మరియు 10 కి సంబంధించిన యావత్తు. **హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం.23 మరియు 24; **పడమర:** కర్నూలు నుండి డోన్ నేషనల్ హైవే; **ఉత్తరం:** ప్లాట్ నెం.8; **దక్షిణం:** ప్లాట్ నెం.11. **కొలతలు: తూర్పు-పడమర:** 70 అ॥ లేదా 21.336 మీ॥; **ఉత్తరం-దక్షిణం:** 80 అ॥ లేదా 24.384 మీ॥, **విస్తీర్ణం: 622.22 చ॥గ॥ లేదా 5600 చ॥అ॥. టైటిల్ హోల్డర్: శ్రీ టివియస్ శ్రీ హర్ష, తండ్రి: టి. నరేంద్ర.**

రిజర్వు ధర: రూ. 23,00,000/- ధరావత్తు సొమ్ము: రూ. 2,30,000/-

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింకును రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, అనంతపురం మెయిన్-1, బ్రాంచ్ మేనేజర్ గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 8919430724.
ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ (baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com/ హెల్ప్‌డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com.

తేది: 12.11.2025, ప్రదేశం: అనంతపురం సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

తూతూమంత్రంగా జిల్లాస్థాయి యువజనోత్సవాలు

జ్యోతి వెలిగిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే : ఏటా జిల్లా యువజన సర్వీసుల శాఖ నిర్వహించాల్సిన జిల్లాస్థాయి యువజనోత్సవాలు ఈసారి ఒక యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించడం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యువతలో దాగి ఉన్న కళా నైపుణ్యాలను వెలికితీయడానికి యువజనోత్సవాలు ఏటా ఆ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించేవారు. ఈసారి బడ్జెట్ లేదని అధికారులు చేతులెత్తేయడంతో ఈ ఉత్సవాలు ప్రగతి పథం యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించడాన్ని యువత తప్పుబట్టారు. కనీసం మీడియాకు కూడా సమాచారం ఇవ్వకుండా ముగించడం వెనుక అంతర్యమేమిటో అర్థం కాలేదు. ఆర్ట్స్ కళాశాలలో జరిగిన ఈ ఉత్సవాల ప్రారంభోత్సవానికి ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, ఆన్‌సెట్ సీఈఓ రవిశంకర్‌రెడ్డి, కళాశాల ఉప ప్రిన్సిపల్ సహదేవుడు, కేంద్రీయ విద్యాలయ లెక్చరర్ ప్రణతి, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బి.జీవన్‌కుమార్, జయకుమార్, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకులు ఎస్.రమేష్ తదితరులు హాజరయ్యారు.

ఏఎంసీలో ఆగంతుకుడి దుశ్చర్య

విద్యుత్తు తీగ కట్ చేసిన వైనం

అనంతపురం(వైద్యం),న్యూస్‌టుడే : అనంతపురం సర్వజన వైద్యశాలలోని అక్యూట్ మెడికల్ కేర్ (ఏఎంసీ)లో ప్రాణాపాయ స్థితిలో ఉండే రోగులు చికిత్సలు పొందుతుంటారు. ఈ విభాగం రోగులు, క్షతగాత్రులతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక్కడ ఎక్కువ శాతం వెంటిలేటర్‌పైన ఉండే రోగులే ఎక్కువగా ఉంటారు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో ఉన్నఫలంగా 20 ని.షా విద్యుత్తు సరఫరా నిలిచిపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సంబంధిత ఎలక్ట్రికల్ సిబ్బంది సరఫరా ఎందుకు ఆగిందని పరిశీలించగా విద్యుత్తు తీగ కట్ అయినట్లు గుర్తించారు. ప్రధాన తీగను కట్ చేయటంతో జనరేటర్ ద్వారా కూడా సరఫరా ఇవ్వలేని పరిస్థితి తలెత్తింది. కొంతసేపటికి సరఫరాను పునరుద్ధరించారు. సీసీ కెమెరాలో ఒక గుర్తుతెలియని వ్యక్తి ముఖానికి మాస్క్ ధరించి కేబుల్‌ను కత్తిరించినట్లు గుర్తించారు. అతను ఎందుకిలా చేశాడు? దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల కిందట ఘటన జరిగితే ఎందుకు ఫిర్యాదు విషయంలో ఆలస్యం చేశారన్న దానికి ఎవరూ సమాధానం చెప్పకపోవడం గమనార్హం. వెంటిలేటర్‌పై ఉన్న వారెవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవటంతో వైద్యాధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

EENADU Classifieds

JOBS

Urgent Civil Site Supervisors Required with or without Experience. Location Karnataka. Contact: 9347083151.

కదిరి జి-డిజిటల్ షోరూంలో మేనేజర్‌గా పనిచేయుటకు 10 సం.ల సేల్స్ అనుభవం కలిగిన వ్యక్తులు కావలెను. జీతం: 15K+ ఇన్సెంటివ్. Ph:97058 26033.

మా కంపెనీలో పనిచేయుటకు M/F కావలెను. జీతం: 25K + Q: 12th, Degree. Age: 23+ Smart Phone తప్పనిసరి. 9347472381.

ప్రముఖ కంపెనీకి అడ్మినిస్ట్రేషన్ వర్క్ (Male) అభ్యర్థులు కావలెను. గుడ్ కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి యాక్టివ్‌గా ఉండవలెను. Exp: 3 Years above, Qly: డిగ్రీ / పీజీ. ✆ 89857 17076, 97034 02722.

IT HARDWARE

Internship / Final Year Projects. Web App | Data Analytics | Digital Marketing | Cloud | HR Certification Placement Support Bangalore. Ph: 8105577689

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU Classifieds 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...
వివరాలకు: 8008709784
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్
(incorporated under the State Financial Corporation Act LXIII of 1951)
28/453-E2, కలెక్టరేట్ దగ్గర, పెన్నార్ భవన్ వెనుక, అనంతపురము-515001, ఫోన్:08554-275511

ఇ -వేలం విక్రయ ప్రకటన
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(6) & 9(1)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 రూల్ 8(6) & 9(1) తో కలిపి చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ప్రకారం స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం విక్రయ ప్రకటన

ఇ-వేలం విక్రయ ప్రకటన

[illegible] "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా", "అక్కడ ఏమున్నదో అది" మరియు "ఏది ఉన్నదో అదే" ప్రాతిపదికన తేది. 14.12.2025 విక్రయించబడునని [illegible] డిమాండు నోటీసు తేది:06.01.2023 స్వాధీనత తేది04.09.2023

రుణగ్రహీత / గ్యారంటార్లు	31.10.2025 నాటికి రుణ మొత్తం	ఆస్తి వివరములు	రిజర్వు ధర (రూ.లక్షల్లో)	ధరావత్తు రూ.లక్షల్లో	బిడ్ పెంపుదల ధర
మెసర్స్ లక్ష్మి ఇండస్ట్రీస్, సర్వే నం.115-1, శ్రీనివాసపురం గ్రామము, సందలపాడు గ్రామము, తాడిపత్రి మున్సిపాలిటీ మరియు మండలం, అనంతపురము జిల్లా. ప్రొ: శ్రీమతి డి. లక్ష్మీదేవి గ్యారంటార్లు 1. శ్రీ డి. రాజేశ్వర రెడ్డి 2. శ్రీ డి. సుధీర్ రెడ్డి	రూ.36.87 లక్షలు మరియు తేది.01.11.2025 నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు కలుపు బకాయిలు	ఐటమ్ నెం.1. యూనిట్ కలిగిన భూమి మరియు భవనము [illegible] 435.60 చ.గజాలు [illegible]	భూమి & భవనము మరియు ప్లాంటు & మెషినరీ ఐటమ్ నెం. 1 & 2 50.51	1 & 2 5.61	1 & 2 0.50
		ఐటమ్ నెం.2. ప్లాంటు మరియు మెషినరీ: [illegible]	ప్లాంటు & మెషినరీ ఐటమ్ నెం.2 7.06	0.78	0.10
		ఐటమ్ నెం.3. అనంతపురము జిల్లా, తాడిపత్రి మున్సిపాలిటీ మరియు మండలం, సందలపాడు గ్రామము, సర్వే నెం.115/1 నందు 787.95 [illegible]	ఖాళీ స్థలం ఐటమ్ నెం.3 117.22	13.02	0.50

ఇ-వేలం తేది మరియు సమయము:
https://www.bankauctions.in ద్వారా 14.12.2025 ఉ.11.30 నుండి మ.12.30 వరకు [illegible]
https://esfc.ap.gov.in and https://bankauctions.in [illegible]
ధరావత్తు చెల్లించుటకు ఆఖరు తేది: 12.12.2025 సా. 5.00 గం.లలోపు
[illegible] సెల్: 7799881693.
ప్రదేశం: అనంతపురము
తేది:13.11.2025 సం/- అధీకృత అధికారి, ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్, అనంతపురము శాఖ.

ముగ్గురు యువకులపై పోక్సో కేసు

రాప్తాడు, న్యూస్‌టుడే : చిన్మయనగర్‌కు చెందిన కుపేంద్ర, మల్లికార్జున, గంగాధర్‌లపై బుధవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపారు. ఆయన బుధవారం ఆయా వివరాలు వెల్లడించారు. కళ్యాణదుర్గం సమీపంలోని ఓ గ్రామానికి చెందిన బాలుడు నాన్నమ్మ వద్ద ఉంటూ ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. వారం కిందట నగరంలోని ఓ కాలనీకి చెందిన అమ్మమ్మ వద్దకు వచ్చాడు. ఈక్రమంలో శనివారం ఆర్డీటీ స్టేడియంలో క్రీడాపోటీలు ఉంటే స్నేహితులతో కలిసి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో చిన్మయనగర్‌కు చెందిన కుపేంద్ర, మల్లికార్జున, గంగాధర్‌లు బాలుడిని ముళ్లపొదల్లోకి తీసుకెళ్లి లైంగిక వేధింపులకు గురి చేశారు. బాలుడు జరిగిన విషయాన్ని ఎవరికీ చెప్పకుండా ఆదివారం స్వగ్రామానికి వెళ్లిపోయాడు. బుధవారం బాలుడి అమ్మమ్మను పిలిపించి విచారిస్తే జరిగిన విషయం తనకు తెలియదని సమాధానమిచ్చింది. తర్వాత బాలుడిని తీసుకొచ్చి విచారించగా లైంగిక దాడి జరిగిన విషయాన్ని చెప్పాడు. దీంతో సదరు యువకులను అరెస్టు చేసి పోక్సో కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

'బంగారు నగలు తనఖా పెడితే మోసం చేశారు'

బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అవసరం నిమిత్తం బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారు నగలను ఇవ్వకుండా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సిబ్బంది ఇబ్బంది పెడుతున్నారని తమ నగలను ఇప్పించాలని కోరుతూ బాధితులు రాంనగర్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎదుట బుధవారం ఆందోళన నిర్వహించారు. బ్యాంకు సిబ్బందికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నగలు ఇవ్వకపోతే ఆత్మహత్యే శరణ్యమని హెచ్చరించారు. ఒకానొక దశలో బ్యాంకు లోపలికి చొచ్చుకెళ్లడానికి ప్రయత్నించారు. సమాచారం అందుకున్న నాలుగో పట్టణ సీఐ జగదీశ్ బ్యాంకు వద్దకు చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పారు. ఈ సందర్భంగా బాధితులు వేణుగోపాల్ రెడ్డి, ఆరోగ్యంరెడ్డిలు మీడియాతో మాట్లాడుతూ ..తాము ఏడాది క్రితం బ్యాంకులో ఇరవై తులాలకు పైగా బంగారు నగలను తనఖా పెట్టి రుణం తీసుకున్నామన్నారు. ఐదు నెలల క్రితం రుణాన్ని రెన్యువల్ చేసుకోవడానికి వెళ్తే బ్యాంకు సిబ్బంది జయరామ్, సతీశ్‌కుమార్‌లు క్లోజింగ్ ఫారాలపై సంతకాలు పెట్టించుకుని, ఇక్కడ ఉన్న బంగారాన్ని కీర్తన ఫైనాన్స్‌లో పెట్టి ఎక్కువ డబ్బులు తీసుకున్నారని ఆరోపించారు. సుమారు ముప్పై మందికి పైగా బాధితులు ఉన్నారన్నారు. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. ఇప్పటికీ ఎలాంటి న్యాయం జరగలేదని వాపోయారు. ఆడపిల్లల వివాహాలకు, ఇంటి కొనుగోళ్ల కోసం తాకట్టు పెడితే బ్యాంకు సిబ్బంది మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

'వైద్యకళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం'

నగరంలో వైకాపా నాయకుల ర్యాలీ

అనంత నగరపాలక, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర పన్నిందని, దీన్ని అడ్డుకుంటామని వైకాపా జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో నగరంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి గడియార స్తంభం మీదుగా నగరంలో ప్రజా ఉద్యమం నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకు పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. ఈకార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, మాజీ అహుడా ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనుమానంతో భార్య గొంతు కోసిన భర్త

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బోరంపల్లిలో భార్య రత్నమ్మపై అనుమానం పెంచుకున్న భర్త ఎర్రిస్వామి బుధవారం సాయంత్రం ఆమె గొంతు కోసి పరారయ్యాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... బుధవారం భార్యభర్తలు ఇంటి ఎదుట గొడవ పడగా మాటామాటా పెరిగింది. మద్యం మత్తులో ఉన్న ఎర్రిస్వామి ఆవేశానికి గురై కత్తితో భార్య గొంతు కోసి పారిపోయాడు. ఆమె రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతుండగా స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం 108లో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. ఇన్‌ఛార్జి సీఐ హరినాథ్, పోలీసులు వివరాలు సేకరించి విచారణ చేస్తున్నారు.

కర్ణాటకలో ఒకరి మృతి.. దుర్గం వాసులపై కేసు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తిని ఇటీవల కళ్యాణదుర్గం మండలం ఎర్రంపల్లికి చెందిన పలువురు కొట్టగా మృతి చెందడంతో స్థానికులపై కేసు నమోదైంది. కర్ణాటకలోని తుంకూరు జిల్లా పావగడ తాలూకా వై.ఎన్.హెచ్‌కోట గ్రామానికి చెందిన హనుమంతరాయ(38) ఎర్రంపల్లిలోని ఓ మహిళతో చనువుగా ఉండేవాడు. ఈ విషయంలో స్థానికులతో ఆయనకు పలుసార్లు గొడవ జరిగింది. ఈనెల 7న హనుమంతరాయ ఎర్రంపల్లికి రావడంతో స్థానికులైన మహేష్, ఆయన తల్లి హంబక్క ఘర్షణపడి కొట్టినట్లు తెలిసింది. అదేరోజు రాత్రి ఆయన స్వగ్రామానికి వెళ్లిపోగా.. తదుపరి మృతిచెందాడు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఎర్రంపల్లికి చెందిన కొందరు కొట్టడంతోనే హనుమంతరాయ మృతిచెందినట్లు గుర్తించి ఈ కేసు కళ్యాణదుర్గం పట్టణ స్టేషన్‌కు బదిలీ చేశారు. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

పైపులైన్ వేయిస్తున్న తెదేపా నాయకులు

భక్తులకు తాగునీటి వసతి కల్పన

బొమ్మనహాళ్: శ్రీధరఘట్ట గ్రామ సమీపంలో ప్రసిద్ధి చెందిన స్వప్న ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు తెదేపా నాయకులు సొంత నిధులతో పైపులైన్ ఏర్పాటు చేయించి తాగునీటి వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ బలరామిరెడ్డి, సొసైటీ ఛైర్మన్ ఎర్రిస్వామి, మాజీ ఎంపీటీసీ తిప్పేస్వామి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, లింగప్ప, డీలర్ పోతప్ప, వీరేష్, ఆచారి, గాదింగ, చంద్ర, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఏఈని నియమించాలని వినతి

శెట్టూరు, న్యూస్‌టుడే: శెట్టూరు మండలానికి విద్యుత్తు ఏఈని నియమించాలని కోరుతూ శెట్టూరు మండల ఎంఆర్‌పీఎస్ నాయకులు బుధవారం అనంతపురంలో ఎస్ఈ శేషాద్రి శేఖర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా, తాలూకా, మండల నాయకులు గురుమూర్తి, బ్రహ్మయ్య, నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

పొగాకుతో ఆరోగ్యానికి హానికరం

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: పొగాకు ఉత్పత్తులు వాడటం ఆరోగ్యానికి హానికరమని సోషల్ వర్కర్ శ్రీరాములు పేర్కొన్నారు. బుధవారం ఒంటిమిద్ది గ్రామంలోని పాఠశాలలో పొగాకు నియంత్రణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ చేపట్టారు. సిగరేట్, ఇతర పొగాకు సంబంధిత ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిద్ది ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: మహంతపురం నుంచి కెంచంపల్లి గ్రామాల మధ్య రోడ్డు కంకరతేలి అస్తవ్యస్తంగా మారింది. మరమ్మతులు చేయించండి. **-వెంకటేష్, అప్పాజిపాల్యం గ్రామం**
సమాధానం: మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. త్వరలో పనులు చేయిస్తాం. **- లక్ష్మీశంకర్, ఇన్‌ఛార్జి ఎంపీడీఓ**
సమస్య: కుందుర్పి మండలం కొల్లారట్టిలో ఆగిపోయిన అంగన్‌వాడీ భవనాన్ని వెంటనే పూర్తి చేయాలి. **- గిరీష్, గ్రామస్థుడు**
సమాధానం: ఉన్నతాధికారులకు నివేదించి త్వరగా నిర్మాణం చేయిస్తాం. **-సుశీల, అంగన్‌వాడీ సూపర్‌వైజర్**
సమస్య: తెనగల్లు పాఠశాల ఎదుట తాగునీటి ట్యాంకు వద్ద అపరిశుభ్రత నెలకొంది. **- రామంజనేయులు, గ్రామస్థుడు**
సమాధానం: వెంటనే పరిశీలించి శుభ్రం చేయిస్తాం. **-లక్ష్మీశంకర్, ఇన్‌ఛార్జి ఎంపీడీఓ**
సమస్య: మండలపల్లి రోడ్డు అధ్వానంగా మారింది. **- గంగాధర్, యువకుడు**
సమాధానం: అపిలేపల్లి గేటు నుంచి మండలపల్లి వరకూ తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభమవుతాయి. **-లక్ష్మీశంకర్, ఇన్‌ఛార్జి ఎంపీడీఓ**

– న్యూస్‌టుడే, కుందుర్పి

భల్లూకం.. భయం.. భయం!

➤ పంటలకు నష్టం కలిగిస్తున్న వైనం
➤ ఊర్లలోకి వస్తున్నాయని ప్రజల ఆందోళన

న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం

రోజురోజుకు ఎలుగుబంట్ల సంతతి పెరిగిపోతుండటంతో ప్రజలు, అన్నదాతలు భయాందోళనకు గురవుతున్నారు. వాటివల్ల పంటను, ప్రాణాలను రక్షించుకోలేక పోతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళ్యాణదుర్గం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఎక్కడ చూసినా ఎలుగుబంట్ల సంచారం అధికమైంది. వ్యవసాయ క్షేత్రాల్లో సాగుచేసిన పంటలను, డ్రిప్ పరికరాలు, గేట్‌వాల్వ్‌లను ధ్వంసం చేస్తున్నాయి. తొలగించి రాసిగా వేసిన పంటను చెల్లాచెదురు చేసి నష్టపరుస్తున్నాయని రైతులు వాపోతున్నారు.

పంటలకు తీవ్ర నష్టం

మామిడి, నేరేడు చెట్లకు ఏర్పాటు చేసిన డ్రిప్ పరికరాలు, యంత్రాలు ధ్వంసం చేసినట్లు కామక్కపల్లికి చెందిన వెంకటేశులు వాపోయారు. వ్యవసాయ క్షేత్రంలో పోసిన వేరుసెనగ రాసిని చెల్లాచెదురు చేయడంతో రూ.14 వేలు నష్టం వాటిల్లిందని రైతు జనార్దన్ ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో డ్రిప్ గేట్‌వాల్వ్‌లను ఎలుగుబంట్లు గుంపులుగా వచ్చి విరగొట్టాయన్నారు. వేరుసెనగ, టమాటా, బొప్పాయి పంటలను రక్షించుకునేందుకు రాత్రుళ్లు జాగరణ చేయాల్సి వస్తోందని పలువురు రైతులు పేర్కొంటున్నారు. రాత్రిళ్లు పంటకు కాపలా ఉన్న సమయంలో ఎక్కడ తమపై దాడి చేస్తాయోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నామని అన్నదాతలు వాపోతున్నారు.

బిందు సేద్యం పైపులు, గేట్‌వాల్వ్ ధ్వంసం ఇలా..

కట్టడి చేసేందుకు చర్యలు

రామచంద్రుడు, అటవీశాఖ రేంజర్

ఎలుగుబంట్లు పంటలకు నష్టం కలిగిస్తున్నట్లు ఇటీవల అధికారులు మా దృష్టికి తీసుకొచ్చారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని కట్టడి చేసేందుకు కృషి చేస్తున్నాం. ఆదేశాలు రాగానే తదుపరి చర్యలు తీసుకొంటాం.

బహుమతులు అందుకున్న విజేతలతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

ప్రతి అంశంపై అవగాహన తప్పనిసరి

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చిన్న వయసు నుంచే ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవాలని ప్రిన్సిపల్ విజయభాస్కర్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. 'ప్రకృతి-అందాలు' అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించగా విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కె.సుస్మిత ప్రథమ స్థానంలో, మొదటి ఏడాది చదువుతున్న వై.చందన, జి.కవిత వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రశంసా పత్రాలతోపాటు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో జ్ఞానేశ్వర్, రమేష్, శ్రీరాములు, జయరాజ్, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లను నిషేధించండి

ఉరవకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని కిరాణా దుకాణాలు, హోటళ్లు, ఇతరత్రా వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నా.. పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల రామాంజనేయులు పేర్కొన్నారు. వీటిని నియంత్రించే దిశగా చర్యలు చేపట్టాలని బుధవారం కార్యదర్శి గౌస్‌సాహెబ్‌కు వినతిపత్రం ఇచ్చారు.

డి.హీరేహాళ్‌లో రోడ్డు స్థలం పరిశీలిస్తున్న జేసీ శివనారాయణ్ శర్మ, ఆర్డీవో వసంతబాబు

పేదలందరికీ పక్కా ఇళ్లు: కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని పేదల సొంతింటి కలను సాకారం చేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని శాంతినగర్‌లో బుధవారం పీఎంఏవై, ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకాల్లో పూర్తయిన ఇళ్లను ఎమ్మెల్యే ప్రారంభించి మరికొన్నింటికి భూమిపూజ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆగిన 773 ఇళ్లను పూర్తిచేసి పంపిణీ ప్రారంభించినట్లు తెలిపారు. అసంపూర్తిగా ఉన్న 1790 టిడ్కో ఇళ్లను త్వరలో పూర్తిచేస్తామన్నారు. ఈఏడాది 321 కొత్త ఇళ్లు మంజూరైనట్లు చెప్పారు. తదుపరి 18వ వార్డు సచివాలయాన్ని ఎమ్మెల్యేతోపాటు కమిషనర్ దివాకర్‌రెడ్డి, ప్రత్యేకాధికారి నాగేశ్వరరావు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ చైతన్య, తెదేపా నాయకులు హనుమంతు, కృష్ణమూర్తి, పురుషోత్తం, రాజశేఖర్, బళేశంకర్, యల్లప్ప, కరెన్న, తిప్పేస్వామి, కౌన్సిలర్ ప్రశాంతి, భారతి, పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

కుందుర్పి: అపిలేపల్లిలో నిర్మాణాలు పూర్తయిన గృహాలను ఆ శాఖ డీఈ విజయభాస్కర్ రావు, తహసీల్దార్ ఓబులేశు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈ మారుతిప్రసాద్, వీఆర్‌ఓ రాజశేఖర్, తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షుడు ఈరన్న, నాయకులు రామాంజినేయులు, ఓబులేషు, విరుపాక్షి, బొజ్జప్ప, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జాతీయ రోడ్డు విస్తరణ స్థలాలు పరిశీలన

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: డి.హీరేహాళ్ మండల కేంద్రంలో ఒక కిలోమీటరు వరకు ఆగిపోయిన జాతీయ రోడ్డు విస్తరణ పనులను బుధవారం జేసీ శివనారయణ్ శర్మ, ఆర్డీవో వసంతబాబు స్థానిక రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఎన్‌హెచ్ రోడ్డుకు స్థలాలు కోల్పోయిన పోలీస్‌స్టేషన్, క్వార్టర్స్, రోడ్డు పక్కన దుకాణాలు ఇతరత్రాలు పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. స్థలం కోల్పోయి డబ్బులు ఖాతాల్లో జమ కాకుంటే తక్షణం వచ్చేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం అధికారులతో కలిసి ఓబుళాపురం మైనింగ్ కంపెనీ వివాదాస్పద గనుల లీజు ప్రాంతాన్ని పరిశీలించారు. 15 రోజులుగా చేసిన సర్వే వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దారు శ్రీనివాసులు, ఎస్సై గురుప్రసాద్‌రెడ్డి, డీటీ సురేష్‌బాబు, సర్వేయర్ రవితేజ, ఆర్ఐ సాయివంశీకృష్ణ పాల్గొన్నారు.

సమస్యలు స్థానికంగానే పరిష్కరించండి

బొమ్మనహాళ్: మండలంలో పనిచేస్తున్న అధికారులు ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలని జిల్లా సంయుక్త కలెక్టర్ శివనారాయణ శర్మ సూచించారు. బుధవారం మండల రెవెన్యూ కార్యలయాన్ని తనిఖీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను పరిష్కారం చూపాలని ఆదేశించారు. తహసీల్దారు మునివేలు పాల్గొన్నారు.

వ్యర్థాలు తగలబడకుండా చర్యలు

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ పట్టణంలో డంపింగ్‌యార్డులో కొన్నాళ్లుగా తగలబడుతున్న వ్యర్థాలు కాలిపోకుండా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం 'ఈనాడు'లో 'సంపద... తగలబడుతోంది' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో రవిప్రసాద్, కార్యదర్శి గౌస్‌సాహెబ్ స్పందించారు. అగ్నిమాపక అధికారుల సాయంతో అక్కడ చెలరేగిన మంటలను పూర్తిగా ఆర్పించారు.

వైభవంగా కడ్లే గౌరమ్మ రథోత్సవం

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: గోవిందవాడలో బుధవారం కడ్లే గౌరమ్మ రథోత్సవం అత్యంత వైభవంగా సాగింది. మహిళలు గౌరమ్మకు పూజలు నిర్వహించారు. రథోత్సవం వైభవంగా సాగింది. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రత్యేకాలంకరణలో కడ్లే గౌరమ్మ

వేడుకగా ఏరి నాగముత్తస్వామి ప్రతిష్ఠ

రాయదుర్గం గ్రామీణం: చదం గొల్లలదొడ్డి గ్రామంలో వెలసిన ఏరి నాగముత్త స్వామి ఆవులదేవర పండుగ పురస్కరించుకుని బుధవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి పవిత్ర జలాలతో గంగపూజ, వెండి, బంగారు ఆభరణాలు, పలు రకాల పుష్పాలతో అలంకరించారు. గ్రామ శివారులో ఏర్పాటు చేసిన శిబిరంలో స్వామి వారిని ప్రతిష్ఠించారు.

శిథిలావస్థలో అంగన్‌వాడీ కేంద్రం

కుందుర్పిలోని 3వ నంబరు అంగన్‌వాడీ కేంద్ర భవనం గోడలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఈ కేంద్రాన్ని మరో ప్రాంతానికి మార్చారు. అక్కడి భవనంలో చిన్నారులు, సరకుల నిర్వహణకు కష్టంగా మారుతున్నట్లు కార్యకర్తలు, ఆయాలు వాపోతున్నారు. పాత అంగన్‌వాడీ కేంద్రం స్థానంలో కొత్త భవనాన్ని నిర్మించి వసతులు కల్పించాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు. ప్రతిపాదనలు పంపించామని, నిధులు రాగానే పనులు చేయిస్తామని సూపర్‌వైజర్ ఓబుళమ్మ పేర్కొన్నారు. **- న్యూస్‌టుడే, కుందుర్పి**

తాగునీటి వృథాను అరికట్టేవారే లేరా?

హెచ్.సిద్ధాపురంలోని ప్రధాన రోడ్డు పక్కన తాగునీటి ట్యాంకు పైపులు మరమ్మతుకు గురవడంతో స్వచ్ఛనీరు వృథా పోతోంది. అలాగే ట్యాంకు వద్ద ఉన్న కుళాయిలకు బిరడాలు లేవు. పంచాయతీ అధికారులు, పాలకులు స్పందించి పైపులకు మరమ్మతులతోపాటు బిరడాలు ఏర్పాటు చేసిన సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, డి.హీరేహాళ్**

రోడ్డుపై మురుగు.. ఆగేదెప్పుడు?

కంబదూరు మారెమ్మ గుడి నుంచి పాత బస్టాండుకు దారిలో రహదారిపై నిత్యం మురుగు ఏరులై పారుతున్నా.. పట్టించుకునే నాథుడే కరవయ్యారు. కొన్ని నెలలపాటు ఇలాగే ఉండటంతో దారి పాచి పట్టింది. రాత్రి సమయంలో వీధి దీపాలు వెలగక దారి వెంబడి వెళ్లాలంటే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పంచాయతీ కార్యదర్శి అశ్వర్థరెడ్డి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ పరిశీలించి త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, కంబదూరు**

దారుల్లో పేరుకుపోయిన వ్యర్థాలు

ఉరవకొండ వీరశైవ నగర్ ప్రధాన వీధిలో చెత్తాచెదారంతో కూడిన వ్యర్థాలు పేరుకుపోయాయి. పంచాయతీ అధికారులు అక్కడ చెత్త కుండీని ఏర్పాటు చేసినా.. దానిని ఎప్పటికప్పుడు తరలించే ఏర్పాటు చేయడం లేదు. దీంతో ఈ ప్రదేశమంతా చెత్తతో నిండి అపరిశుభ్రత నెలకొంది. దారి వెంట రాకపోకలు సాగించే వారు అసహనానికి గురవుతున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఉరవకొండ**

పాఠశాలలో పశువుల సంచారం

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో పశువులు సంచరించడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రాంగణంలో గడ్డి ఏపుగా పెరగడంతో జీవాలు వచ్చి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఆట స్థలంలో విషపురుగు సంచరిస్తున్నాయని పీడీ కిరణ్ చౌదరి పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: రెండు దిచక్రవాహనాలు హిర్దేహాళ్ సమీపంలో ఎదురెదురుగా ఢీకొనడంతో పులకుర్తికి చెందిన అనిల్(22) మృతిచెందగా.. ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో హొసగుడ్డకు చెందిన ఎర్రిస్వామి, వన్నూరస్వామితోపాటు మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్సై గురుప్రసాద్ రెడ్డి కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాల ఘర్షణ.. 11 మందికి గాయాలు

రాయదుర్గం పట్టణం: ఇరువర్గాల ఘర్షణతో 11 మంది గాయపడిన ఘటన డి.హీరేహాళ్ మండలం కల్యంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గతంలో ప్రదర్శించిన 'బయలు' నాటకం విషయంలో బుధవారం రాత్రి రచ్చకట్ట వద్ద ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇరువురి మధ్య మాటామాట పెరగడంతో ఇరువర్గాలు సరస్పరం దాడులు చేసుకున్నారు.

దుకాణంలో చోరీ

ఉరవకొండ, న్యూస్‌టుడే: పట్టణంలో గుంతకల్లు రహదారిలో రాజ్‌కుమార్ అనే వ్యక్తికి చెందిన దుకాణంలో మంగళవారం రాత్రి పొద్దుపోయిన తరువాత చోరీ జరిగింది. దొంగలు తాళాలు ధ్వంసం చేసి కొన్ని వస్తువులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫిర్యాదు స్వీకరిస్తున్న డీపీవో నాగరాజు నాయుడు

గ్రామసభల సద్వినియోగంతో మేలు

ఉరవకొండ, గుమ్మఘట్ట, కణేకల్లు, బెళుగుప్ప, న్యూస్‌టుడే: గ్రామకంఠాల్లోని ఆస్తులకు హక్కులు కల్పించేందుకు నిర్వహిస్తున్న గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు పేర్కొన్నారు. బుధవారం మైలారంపల్లి గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఉప ఎంపీడీవో సతీశ్‌కుమార్ హాజరయ్యారు. ● గుమ్మఘట్ట మండలంలో రీసర్వే జరిగిన పూలకుంట, ఎస్.హొసళ్లి, గలగల గ్రామాల్లో రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తహసీల్దార్ రజాక్‌వలి పేర్కొన్నారు. బుధవారం పూలకుంట సభలో ఆయన మాట్లాడారు. ● మాల్యం, ఎన్.హనుమాపురం, సొల్లాపురం గ్రామాల్లో నిర్వహించిన సభల్లో కణేకల్లు తహసీల్దారు బ్రహ్మయ్య పాల్గొని మాట్లాడారు. ● అవకతవకలు లేకుండా కోనంపల్లి, గంగవరం గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తున్నట్లు బెళుగుప్ప తహసీల్దార్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు.

పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ శివశరణ

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ఆవులదట్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడాపోటీల్లో ప్రతిభ చూపినట్లు హెచ్ఎం విజయభారతి, పీడీ శివశరణ తెలిపారు. నెట్‌బాల్ పోటీల్లో నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో 9వ తరగతి చదువుతున్న నేత్రావతి, అండర్ -17 విభాగంలో సుధీర్‌నాయక్, 10వ తరగతి విద్యార్థులు స్వాతి, లక్ష్మీబాంను సాన్మినించారు. వీరు ఉబయ గోదావరి జిల్లాల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. జిల్లాస్థాయి కబడ్డీలో దుర్గేష్, నితిష్, లక్ష్మీబాయి, స్వాతి, హేమావతి ప్రతిభ చాటారు.

నెట్‌బాల్ క్రీడలకు సుస్మిత...

కణేకల్లు: హనకనహాళ్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బోయ సుస్మిత జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం వేణుగోపాల్, పీడీ సరిత పేర్కొన్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన అండర్-17 పోటీల్లో ప్రతిభ చూపినట్లు తెలిపారు.

డి.హీరేహాళ్: నెట్‌బాల్ పోటీల్లో సోమలాపురం ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి హెచ్.ప్రవీణ్ జాతీయస్థాయికి ఎంపికవడంతో బుధవారం పలువురు ఆయనను సన్మానించారు. ఎంపీటీసీ సభ్యులు మొండి మల్లికార్జున రూ.2 వేల నగదు, 20 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు.

క్రీడాకారులతో రాయల్ వెంకటేష్, గాయత్రి తదితరులు

నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలి

కళ్యాణదుర్గం: ఆటలో నైపుణ్యాన్ని మెరుగు పరుచుకుని జాతీయ స్థాయిలోనూ ప్రతిభచూపాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్, హెచ్ఎం గాయత్రి క్రీడాకారులను అభినందించారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను బుధవారం నార్త్ ఉన్నత పాఠశాలలో సన్మానించిన సందర్భంగా పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో పీడీలు సుగుణమ్మ, సిద్ధన్న, ఉపాధ్యాయులు నిర్మల, రాజేశ్వరి, ఓబులరెడ్డి, శాంతమ్మ, లావణ్య, వెంకటేశులు, షకీలా, రామచంద్రనాయక్ పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి: వైకాపా

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలని వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మెట్టు విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వినాయక సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ నాగరాజుకు అందించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ శిల్ప, సీనియర్ నాయకులు మోహన్‌రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఉపేంద్ర రెడ్డి, వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్లు ఉష, బోజరాజు పట్టణ అధ్యక్షులు మేకల శ్రీనివాసులు, మండల కన్వీనర్లు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం: వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదని వైకాపా సమన్వయకర్త తలారి రంగయ్య పేర్కొన్నారు. ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వైకాపా సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ఉమామహేశ్వరనాయుడు, నియోజకవర్గం పరిశీలకులు మహేంద్రరెడ్డి, వైకాపా నాయకురాలు పాల్గొన్నారు.

ఉరవకొండ: రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమంలో భాగంగా వైకాపా నాయకులు ఉరవకొండలో నిరసన ర్యాలీని చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, అక్కడి అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వైకాపా మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, నియోజకవర్గ వైకాపా నాయకులు పాల్గొన్నారు.

రాయదుర్గం తహసీల్దార్ కార్యాలయం ఎదుట వైకాపా నాయకుల నిరసన

తవ్వారు.. వదిలేశారు!

తరచుగా ప్రమాదాలు జరుగుతున్న వైనం

న్యూస్‌టుడే, ఉరవకొండ

ఉరవకొండ మండలం మోపిడి నుంచి ఇంద్రావతికి వెళ్లే ప్రధాన దారి పొడవునా చరవాణి టవర్ కేబుల్ ఏర్పాటు నిమిత్తం ఇరవై రోజుల కిందట దారిని తవ్వి అలాగే వదిలేయడంతో ప్రమాదకరంగా మారింది. పని పూర్తయిన తరువాత దానిని సంబంధిత సంస్థ పూర్తిస్థాయిలో పూడ్చించలేదు. దీనికారణంగా రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ దారిలో కొన్నిచోట్ల గుంతలున్న ప్రాంతంలో కీనసం ప్రమాద హెచ్చరికలు కూడా ఏర్పాటు చేయలేదు. అలాంటి చోట్ల వాహనదారులు తరచుగా ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రిపూట ఎక్కువగా మరింత కష్టంగా మారింది. దీనిని పంచాయతీ అధికారులు గుర్తించినా పట్టదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. దీనిపై ఎంపీడీవో రవిప్రసాద్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సస్యరక్షణతో అధిక దిగుబడి

బొమ్మనహాళ్: వరిలో తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు వస్తాయని ఏవో సాయికుమార్ పేర్కొన్నారు. బుధవారం ఏళంజిలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

రస్తా చూపి న్యాయం చేయండి

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: పొలంలో రోడ్డు కోసం గొడవలు జరుగుతున్నాయని, క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలని మారెంపల్లి గ్రామానికి చెందిన గొల్ల మారెన్న దంపతులు తహసీల్దార్ రజాక్‌వలి, ఎస్సై ఈశ్వరయ్యను బుధవారం కోరారు.

అ వీ.. ఇ వీ.. అ న్నీ..

చెక్కు పంపిణీ

డి.హీరేహాళ్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన డి.హీరేహాళ్‌కు చెందిన తెదేపా నేత భీమన్న కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును బుధవారం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అందజేశారు. తెదేపా మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, రాజు, శ్రీరాములు, తిప్పేస్వామి పాల్గొన్నారు.

స్థల పరిశీలన

వజ్రకరూరు: కొనకొండ్లలోని జంభూద్వీపం, రస సిద్ధులగుట్ట స్థలాలను బుధవారం జేసీ శివనారాయణశర్మ సందర్శించారు. కొండ వద్ద స్థలాన్ని పరిశీలించారు. పురావస్తు శాఖ ఏడీ స్వామినాయక్, టెక్నికల్ సహాయకులు రంగస్వామినాయుడు, తహసీల్దార్ నరేష్‌కుమార్, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

14న బాలల దినోత్సవం

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని రాధాకృష్ణ ఉన్నత పాఠశాలలో ఈనెల 14న శుక్రవారం మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు జడ్జి రమ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ శాఖల అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని జడ్జి పేర్కొన్నారు.

తాగునీటి కోసం నిరసన

కుందుర్పి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని పలు వీధులకు తాగునీరు సరఫరా చేయాలని మహిళలు బుధవారం ఎంపీడీవో కార్యాలయ ప్రధాన గేటు ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. 20 రోజులుగా కళశాయిగుట్ల, దర్గానగర్, మెయిన్ రహదారి పక్కనున్న కాలనీలకు నీరు సరఫరా కావడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అనేకసార్లు సమస్య విన్నవించినా ఏమాత్రం స్పందించలేదని ఆరోపించారు. డిప్యూటీ ఎంపీడీఓ బాలాజీ మాట్లాడుతూ కాలనీలకు ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేయిస్తామని హామీ ఇచ్చారు.

(c) eenadu

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

క్రీడలను విజయవంతం చేయండి

గుంతకల్లు, న్యూస్‌టుడే: క్రీడా పోటీలను విజయవంతం చేయడానికి ఆటగాళ్లు కృషి చేయాలని ఏడీఆర్ఎం సుధాకర్, డివిజన్ క్రీడాధికారి, సీనియర్ డీఓఎం శ్రావణ్‌కుమార్ అన్నారు. రైల్వే క్రీడా మైదానంలో జరుగుతున్న డివిజనల్ అంతర్ విభాగాల పోటీల్లో రెండోరోజు బుధవారం వారు రైల్వే మైదానంలో క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభించి మాట్లాడారు. ఆటలో గెలుపోటములు సహజమని, ఉల్లాసంగా పోటీపడాలన్నారు. అనంతరం కమర్షియల్, ఎస్అండ్‌టీ జట్ల మధ్య తొలి పోటీ జరగ్గా, ఎస్అండ్‌టీ గెలిచింది. ఇతర మ్యాచ్‌ల్లో ట్రాక్షన్‌పై ఆపరేటింగ్, సీఅండ్ డబ్ల్యూపై ఎలక్ట్రికల్ జట్లు విజయం సాధించాయి. రైల్వేకు చెందిన వివిధ విభాగాల సహాయ అధికారులు, రంజీ క్రికెటర్ గులాంఖాదిర్ పోటీలను పర్యవేక్షించారు.

యానిమేటర్ల తొలగింపుపై ఆందోళన

నార్పల, న్యూస్‌టుడే: నార్పలలోని వెలుగు కార్యాలయం వద్ద యానిమేటర్లు బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 17 పంచాయతీల్లోని 49 గ్రామ సంఘాల్లో 49 మంది పనిచేస్తున్నామని అన్నారు. వెలుగు అధికారులు రాజకీయ ఒత్తిళ్లతో దశల వారీగా తమను తొలగించి, కొత్తవారిని నియమించడానికి చూస్తున్నారన్నారు. 20 ఏళ్లుగా డ్వాక్రా సంఘాల్లో సేవలందిస్తున్నామని, తమ పొట్ట కొట్టవద్దని వేడుకున్నారు. అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. అధికారులు తీరు మార్చుకోకుంటే పెద్దఎత్తున ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఏపీఎం తిప్పమ్మ మాట్లాడుతూ కర్ణపుడికి, ముచ్చుకుంటపల్లి గ్రామ పంచాయతీల్లో పనిచేసే యానిమేటర్లకు 60 ఏళ్లు పైబడటంతో హోల్డ్‌లో ఉంచామని, మిగిలిన వారిని తొలగించడం లేదని స్పష్టం చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 8008612342

సమస్య: భాగ్యనగర్‌లో చెత్తకుండీలు రంధ్రాలు పడటంతో పశువులు వ్యర్థాలను చిందరవందర చేస్తున్నాయి. **-తిమ్మయ్య, స్థానికుడు**

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తాం. **-సుదర్శన, శానిటేషన్ కార్యదర్శి, 26వ సచివాలయం**

సమస్య: ఆంథోని స్ట్రీట్‌లోని కొన్ని వీధుల్లో కాలువల్లో పూడికతీత చేపట్టడం లేదు. **-రాజేశ్, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి కాలువల్లో పూడికతీత చేపడతాం. **-వేణుగోపాల్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పురపాలిక**

-న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

సమస్య: బుక్కరాయసముద్రంలోని గాంధీనగర్ కాలనీలో సామాజిక భవన నిర్మాణానికి 20ఏళ్ల క్రితం స్థలం కేటాయించి, పునాది మాత్రమే వేశారు. **-కుళ్లాయిరాజు, గాంధీనగర్**

సమాధానం: జిల్లా అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి సామాజిక భవనాన్ని నిర్మించేలా చర్యలు తీసుకుంటాం. **-సాల్మన్‌రాజు, ఎంపీడీవో, బుక్కరాయసముద్రం**

-న్యూస్‌టుడే, బుక్కరాయసముద్రం

సమస్య: అంబేడ్కర్‌నగర్‌లో లలితా మెగామాల్ పక్కవీధిలో మురుగు మార్గ బిలాల నుంచి బయటకు వచ్చి రోడ్డుపై పారుతోంది. భరించలేని దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. **-భాస్కర్, స్థానికుడు**

సమస్య: అంబేడ్కర్‌నగర్ సచివాలయం పక్కనున్న తాగునీటి ట్యాంకు వద్ద మురుగు చేరుతోంది. కుళాయిల నుంచి నీరు పట్టుకోవాలంటే మురుగులో దిగాల్సి వస్తోంది. **-ఓబుళమ్మ, స్థానికురాలు**

సమాధానం: మెగామాల్ పక్క వీధితో పాటు తాగునీటి ట్యాంకు వద్ద మురుగును శుభ్రం చేయిస్తాం. **-తేజ, మున్సిపల్ ఏఈ**

-న్యూస్‌టుడే, తాడిపత్రి

నాడైనా.. నేడైనా.. అంతే!

☛ పూర్తికాని పనులు
☛ విద్యార్థులకు తప్పని తిప్పలు

చెట్నేపల్లిలో అసంపూర్తిగా అదనపు తరగతి గదుల భవనం

ఆగిన పనుల వివరాలు

నియోజకవర్గం	నిధుల మంజూరు (రూ.కోట్లలో)	విడుదల
గుంతకల్లు	31.68	9.82
తాడిపత్రి	6.23	11.55
శింగనమల	42.94	12.51

గుత్తి, గుంతకల్లు, తాడిపత్రి, న్యూస్‌టుడే: గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో 'నాడు-నేడు' పనులు నేటికీ పూర్తికాక పోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు తిప్పలు తప్పడం లేదు. నాటి వైకాపా ప్రభుత్వం ఎన్నికల ముందు నాడు-నేడు కింద పాఠశాలల్లో రెండో విడత కింద పాత భవనాలకు మరమ్మతులు, మరుగుదొడ్లు, వంట గదులు, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను మంజూరు చేసింది. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో పనులు మంజూరు చేయడంతో నిధులు ఇవ్వలేకపోయింది. అప్పటివరకు జరిగిన తొలి విడత పనుల్లో నాణ్యతలేమి కారణంగా నిర్మాణాలు దెబ్బతింటున్నాయి. మరోవైపు మూడు నియోజకవర్గాల్లోని పాఠశాలలకు సరఫరా చేసిన స్టీల్, మరుగుదొడ్ల సామగ్రి తుప్పు పడుతోంది. సిమెంటు గడ్డలు కట్టుకుపోయింది. గుత్తి మండలం తొండపాడు ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి వైకాపా ప్రభుత్వం గుత్తేదారు సంస్థలతో సిమెంటు బస్తాలు సరఫరా చేయించింది. అవి పనికి రాకుండా పోతుండటంతో అప్రమత్తమైన ఎస్‌ఎంసీ ప్రతినిధులు ఇతర పనులు చేయించారు. గుత్తి పురపాలిక పరిధి చెట్నేపల్లిలో పనులు ఆగిపోయాయి. ఉపాధ్యాయులు సొంతంగా రూ.30వేలు వెచ్చించి అసంపూర్తి అదనపు తరగతి గదుల్లో విద్యార్థులు కూర్చొనేందుకు వీలుగా ఫ్లోరింగ్ చేయించారు.

సామగ్రి నిల్వలపై కూటమి ప్రభుత్వం ఆరా: రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లోని నిర్మాణ సామగ్రి నిల్వలపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. సిమెంటు, స్టీల్‌తో పాటు వాకిళ్లు, కిటికీల రెక్కలు, మరుగుదొడ్ల సామగ్రి ఎక్కడెక్కడ ఎంతెంత ఉందో లెక్క తేల్చేందుకు నడుం బిగించింది. వారం రోజుల క్రితం పాఠశాలల విద్యా శాఖ కమిషనర్ ఈమేరకు ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం సామగ్రి నిల్వలపై ఉద్యోగులు లెక్కలు తీస్తున్నారు. టన్నుల కొద్దీ సిమెంటు బస్తాలు వర్షాలు, చలికి గడ్డలు కట్టుకుపోయాయి. మరుగుదొడ్లకు వాడే పింగాణి వస్తువులు పలుచోట్ల పగిలిపోయాయి. ఎస్‌ఎంసీలతోనే పనులు చేయిస్తామని చెప్పిన గత ప్రభుత్వం మొత్తం సామగ్రిని గుత్తేదారుల సంస్థలతోనే సరఫరా చేయించడం గమనార్హం.

సామగ్రి వివరాలు సేకరిస్తున్నాం

నాడు-నేడు పథకం కింద పాఠశాలలకు సరఫరా చేసిన నిర్మాణ సామగ్రి నిల్వల వివరాలు సేకరిస్తున్నాం. ప్రతి బడికి వెళ్లి సామగ్రి లెక్కలు సేకరించి ప్రభుత్వానికి పంపుతాం. త్వరలోనే కూటమి ప్రభుత్వం 'మన బడి-మన భవిష్యత్తు' పథకం కింద అసంపూర్తి పనులను పూర్తిచేయించనుంది. అత్యవసర పనులకు నిధులు ఇస్తోంది. **-రవినాయక్, ఎంఈఓ, గుత్తి**

నెట్టికంటిని దర్శించుకున్న న్యాయమూర్తి

న్యాయమూర్తి రాజా వెంకటాద్రికి తీర్థప్రసాదాలు అందజేస్తున్న విజయరాజు తదితరులు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని బుధవారం ఒంగోలు జిల్లా అడిషనల్ జడ్జి రాజా వెంకటాద్రి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు, వేదపండితులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాధికారులు ఆయనకు స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు.

కోర్టుకు నటుడు రాజ్‌కుమార్ హాజరు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిలో 2009 ఏప్రిల్‌లో సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి వచ్చిన సినీ నటుడు రాజ్‌కుమార్‌పై కేసు నమోదైంది. దీనికి సంబంధించిన వాయిదాకు ఆయన బుధవారం స్థానిక కోర్టుకు హాజరయ్యారు. తెదేపా తరఫున జరిగిన రోడ్డుషోలో రాత్రి పది గంటల తర్వాత పాల్గొని ఎన్నికల నియమావళి ఉల్లంఘించినట్లు పోలీసులు ఆయనతో పాటు స్థానిక నాయకులు కోనంకి కృష్ణ, ప్రకాశ్‌నాయుడు, పట్టణ బ్యాంకు అధ్యక్షుడు అబ్దుల్‌జిలాన్‌పై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

అతివల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటే లక్ష్యం

గుత్తి, న్యూస్‌టుడే: డ్వాక్రా సంఘాల్లోని మహిళా సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని డీఆర్‌డీఏ పీడీ శైలజ తెలిపారు. ఆమె బుధవారం గుత్తిలోని వెలుగు కార్యాలయంలో గుత్తి, గుంతకల్లు, పామిడి మండలాలకు చెందిన వెలుగు ఉద్యోగులు, అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటి నుంచి ఓ మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్న ప్రభుత్వ కలను సాకారం చేసేందుకు ఏపీఎంలు, ఉద్యోగులు కృషి చేయాలన్నారు. సభ్యులకు బ్యాంకులు ఇస్తున్న రుణాలు సద్వినియోగమయ్యేలా చూడాలన్నారు. అతివల అభ్యున్నతికి ప్రభుత్వం అన్నివిధాలా సహకరిస్తోందని గుర్తుచేశారు. జీవ యూనిట్ల ఏర్పాటుకు సభ్యులు ముందుకొచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏపీడీ రాధారాణి, ఏపీఎంలు పాల్గొన్నారు.

ఏపీఎంలతో సమీక్షిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శైలజ

సంతకాల సేకరణ హాస్యాస్పదం

గుంతకల్లు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తుంటే, వైకాపా నాయకులు వారి ఉనికి చాటడానికి ర్యాలీలు, సంతకాల సేకరణ వంటి కార్యక్రమాలు చేపట్టడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే జయరాం అన్నారు. స్థానిక సాయినగర్‌లోని బలిజ కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం ఆయన పార్టీ నియోజకవర్గ కార్యకర్తలు, పట్టణ, మండల అధ్యక్షులు, క్లస్టర్, వార్డుల ఇన్‌ఛార్జులతో సమావేశమై మాట్లాడారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో ఎవరికీ అన్యాయం జరగదని ప్రభుత్వం చెబుతున్నా, వైకాపా ఆందోళనకు దిగడం సరికాదన్నారు. కార్యకర్తలు కష్టపడి పార్టీని మరింత బలోపేతం చేయాలని, తాము అండగా ఉంటామన్నారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తామంటూ వారితో ప్రమాణం చేయించారు. 26మంది రోగులకు రూ.17.48లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. సమావేశంలో తెదేపా పట్టణ ఇన్‌ఛార్జి నారాయణస్వామి, పట్టణ, మండల అధ్యక్షులు గుణశేఖర్, రామన్న చౌదరి, నాయకులు కేసీ హరి, మస్తానప్ప, కృష్ణారెడ్డి, హేమాద్రి, హిమబిందు, అంజి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ పట్టణ, మండల కమిటీల ఎన్నిక

సమావేశంలో మాట్లాడుతున్న రామప్పచౌదరి

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులోని బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం సాయంత్రం యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు రామప్పచౌదరి, జిల్లా కోశాధికారి రాఘవేంద్ర మాట్లాడారు. ఏకీకృత సర్వీసు రూల్స్ అమలు, పదోన్నతుల కల్పన, ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పాత పింఛను కావాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను పునరుద్ధరించి, ఐఆర్ ప్రకటించాలని కోరారు. అనంతరం యూటీఎఫ్ పట్టణ, మండల శాఖల నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ గౌరవాధ్యక్షుడిగా శంకరయ్య, అధ్యక్షుడిగా ఎల్లన్న, ప్రధాన కార్యదర్శిగా రమేశ్, మండల గౌరవ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, అధ్యక్షుడిగా గిరిబాబు, ప్రధాన కార్యదర్శిగా రామాంజినేయులు ఎన్నికైన వారిలో ఉన్నారు.

గంగిరెడ్డి కాలువ ప్రక్షాళన

ఈనాడు కథనానికి స్పందన

పామిడి, న్యూస్‌టుడే: ఈ నెల 11న 'గంగిరెడ్డి కాలువలో జమ్ముగడ్డి' శీర్షికన ప్రచురితమైన కథనంపై పంచాయతీ ఈఓ అశ్వర్థమ నాయుడు స్పందించారు. పంచాయతీ మేస్త్రీ సురేశ్ పర్యవేక్షణలో మాల దిగువ కాలనీలో ఇళ్ల మధ్య నుంచి వెళ్తున్న గంగిరెడ్డి కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. కాలువ పక్క గోడలు అడ్డుగా ఉండడంతో జేసీబీతో జమ్ముగడ్డిని తొలగించేందుకు ఇబ్బందులు ఉన్నట్లు తెలిపారు. అనంతరం దోమల నివారణకు చర్యలు చేపట్టారు. పరిసర ప్రాంతాల్లో బ్లీచింగ్ చేయించారు. కాలనీవాసులు ఈనాడు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

వైకాపా పాలనలో గ్రామాలు నిర్వీర్యం

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం గ్రామాభివృద్ధిని నిర్వీర్యం చేసిందని అనంత ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ఆరోపించారు. మండలంలోని కరిడికొండ గ్రామంలోని కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం చుట్టూ ఎంపీ నిధులు దాదాపు రూ.10లక్షలతో మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సూరి అధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మించారు. దాన్ని బుధవారం వారు ప్రారంభించి మాట్లాడారు. గతంలో గ్రామాల్లో తాగునీరు, సీసీ రోడ్లు, విద్యుత్తు సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనతో పాటు వివిధ అభివృద్ధి పనులు చేస్తోందని గుర్తుచేశారు. అనంతరం వారు స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈఈ మురళీధర్, డీఎల్‌డీవో విజయలక్ష్మి, మార్కెట్‌యార్డు ఛైర్మన్ సూర్యప్రతాప్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు శ్రీనివాసులు యాదవ్, మాజీ సర్పంచి శ్రీనివాస్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

రిబ్బన్ కత్తిరిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే జయరాం తదితరులు

ఉద్యాన పంటల సాగు పెరగాలి

రైతులతో పంట వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఆనంద్

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే: ఉద్యాన పంటల సాగు పెంచాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. ఆయన బుధవారం గుత్తి మండలంలోని ఊబిచెర్ల, బాచుపల్లి, కరిడికొండ గ్రామ శివార్లలో రైతులు సాగు చేసిన దానిమ్మ, చీనీ పంటలను పరిశీలించి మాట్లాడారు. హార్టికల్చర్ అధికారులు గ్రామాల్లో పర్యటించి ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కల్పించి సాగు చేసేలా చూడాలన్నారు. ప్రభుత్వం ఉద్యాన రైతులకు అండగా ఉంటుందన్నారు. చీనీ, దానిమ్మ పంటల దిగుబడిపై ఉద్యాన అధికారులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. మండలవ్యాప్తంగా పండ్ల తోటల విస్తీర్ణం, ఏయే పంటలు సాగు చేస్తున్నారో ఆరా తీశారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి మిత్రవింద, తహసీల్దారు పుణ్యవతి, వ్యవసాయాధికారి ముస్తాక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలకు అర్హత

అభినందనలు అదుకుంటున్న ప్రియాంక

గుంతకల్లు, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి చిత్రలేఖనం పోటీల్లో గుంతకల్లులోని నారాయణ పాఠశాల విద్యార్థిని ప్రియాంక ప్రథమ బహుమతి సాధించింది. ఈ పోటీలను బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ సంస్థ అనంతపురంలో ఇటీవల నిర్వహించింది. తమ విద్యార్థిని సత్తాచాటి ప్రథమ బహుమతి అందుకొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక‌వడం ఆనందంగా ఉందని పాఠశాల ఏజీఎం రామకృష్ణ, ప్రధానాచార్యుడు గురుశంకర్ తెలిపారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రియాంకను అభినందించారు.

ప్రగతే కూటమి ప్రభుత్వ అభిమతం

తాడిపత్రి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అధికారంలో వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం ప్రగతే లక్ష్యంగా ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి అన్నారు. ఆయన బుధవారం తాడిపత్రి పురపాలికలోని ఐదు కాలనీల్లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి మాట్లాడారు. పురవాసులకు అన్ని రకాల వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. భగత్‌సింగ్‌నగర్‌లోని నీటి ట్యాంకు పక్క వీధుల్లో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు రూ.12.5 లక్షలు, సంజీవనగర్‌లోని ఆఖరి వీధుల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువలకు రూ.34లక్షలు, శ్రీనివాసపురంలోని శ్రీకృష్ణ దేవరాయల విగ్రహం వద్ద భూగర్భ డ్రైనేజీ పనుల కోసం రూ.18లక్షలు, నంద్యాల రోడ్డులోని విశాల్‌మార్ట్ వెనకాలి వీధిలో తాగునీటి పైపులైన్ల ఏర్పాటుకు రూ.36లక్షలు, జయనగర్ కాలనీలో సీసీ రోడ్ల పొడిగింపునకు రూ.24లక్షలతో చేపట్టిన పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పురపాలిక కమిషనర్ శివరామకృష్ణ, డీఈ రాంప్రసాద్, ఏఈ తేజ, తెదేపా కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

తెదేపా మండల కార్యవర్గం ఎన్నిక

గుత్తి గ్రామీణం: తెదేపా గుత్తి మండల ప్రధాన కార్యదర్శిగా పల్లా సాంబశివ యాదవ్, కన్వీనర్‌గా లక్ష్మీరంగయ్య ఎన్నికయ్యారు. వారు బుధవారం ఎమ్మెల్యే జయరాం సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. తమ ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

నెట్టికంటి ఆలయానికి రూ.3లక్షల విరాళం

గుంతకల్లు పట్టణానికి చెందిన మణికంఠ గ్యాస్ సర్వీస్ నిర్వాహకుడు సుధాకర్ బుధవారం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయాభివృద్ధికి రూ.3లక్షల విరాళాన్ని ఈవో విజయరాజుకు అందజేశారు. దేవస్థానం అభివృద్ధిలో భాగంగా స్వామివారి ప్రసాదాల తయారీకి నిర్మిస్తున్న షెడ్డుకు దాత విరాళం ఇచ్చినట్లు ఆలయాధికారులు పేర్కొన్నారు.

-న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

రజకుల సంక్షేమమే ధ్యేయం

తాడిపత్రి, న్యూస్‌టుడే: రజకులకు సౌకర్యాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రజక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సావిత్రి అన్నారు. ఆమె బుధవారం ఆర్అండ్‌బీ అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. తాను ప్రతి జిల్లాలో పర్యటించి వారి సమస్యలు తెలుసుకుంటున్నట్లు చెప్పారు. మెకానిజం ధోబీఘాట్ల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఆ వర్గం యువతను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందని తెలిపారు. త్వరలో ఆరువేల మందితో అనంతపురం జిల్లా కేంద్రంలో రజకుల ఆకాంక్ష సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. తొలుత స్థానిక ఎమ్మెల్యేను కలిసి రజకులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. ఆమె వెంట రజక కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, నాయకులు సుబ్బరాయుడు, నాగరాజు, నాగముని, ఈశ్వరయ్య తదితరులున్నారు.

'వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు'

శింగనమల (బుక్కరాయసముద్రం), న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేస్తే ఊరుకునేది లేదని వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త శైలజానాథ్ హెచ్చరించారు. ఆయన బుధవారం మండల కేంద్రంలో వైకాపా, సీపీఐ నాయకులు, కార్యకర్తలతో ప్రదర్శనగా వెళ్లి తహసీల్దారు కార్యాలయం ముందు బైఠాయించారు. తొలుత వైకాపా నాయకులు డీజే వాహనాలు ఏర్పాటు చేయడంతో పోలీసులు అనుమతి లేదంటూ అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది.

గుంతకల్లు పట్టణం: వైకాపా మాజీ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

యాడికిలో కొద్దిసేపు ఉద్రిక్తత

యాడికి: యాడికిలో వైకాపా నాయకులు చేపట్టిన నిరసన ర్యాలీ ఉద్రిక్తతకు దారితీసింది. తొలుత తాడిపత్రిలో ర్యాలీ చేపట్టాలని చూడగా, పోలీసులు అనుమతించక పోవడంతో యాడికి వచ్చారు. అదే సమయానికి తెదేపా నాయకులు, కార్యకర్తలు తరలిరావడంతో ఉత్కంఠ నెలకొంది. సీఐలు ఈరన్న, రామసుబ్బయ్య, ఎస్సైలు, పోలీసులు భారీగా మోహరించడంతో ఏమవుతుందోనని స్థానికులు భయాందోళన చెందారు. ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి బందోబస్తును పర్యవేక్షించారు. ఇరు పార్టీల నాయకులకు సూచనలు చేయడంతో ఎలాంటి గొడవలు జరగలేదు. అనంతరం వైకాపా నాయకులు రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

అర్హులందరికీ పక్కా ఇళ్లు తథ్యం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: శింగనమల నియోజవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ స్థలం మంజూరు చేయడంతో పాటు పక్కా ఇల్లు నిర్మించి ఇస్తామని ఎమ్మెల్యే శ్రావణిశ్రీ తెలిపారు. ఆమె బుధవారం అమ్మవారిపేటలో గృహ నిర్మాణ శాఖ ఏడీ రామ్మూర్తితో కలిసి ప్రభుత్వం కట్టించిన గృహాలను ప్రారంభించి మాట్లాడారు. వైకాపా ప్రభుత్వ హయాంలో పునాదులతో ఆగిన ఇళ్లకు కూటమి ప్రభుత్వం బిల్లులు మంజూరు చేసి పూర్తి చేయించిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఆర్డీవో కేశవనాయుడు, ఎంపీపీ సునీత, తెదేపా నాయకులు ఓబులపతి, పెద్దప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: అమ్మవారిపేటలో లబ్ధిదారురాలికి ఇంటి తాళం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ తదితరులు

గుంతకల్లు, న్యూస్‌టుడే: ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను లబ్ధిదారులు త్వరగా నిర్మించుకోవాలని మున్సిపల్ కమిషనర్ నయీం అహమ్మద్, తెదేపా పట్టణ ఇన్‌ఛార్జి నారాయణస్వామి సూచించారు. ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద పూర్తయిన ఇళ్లను వారు లబ్ధిదారులకు అప్పగించారు. నాగప్పకాలనీలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. గతంలో తెదేపా ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను ఇపుడు లబ్ధిదారులు పూర్తి చేసుకుంటున్నారని చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిలో గుర్తుతెలియని వ్యక్తి (50) అనుమానాస్పద స్థితిలో మతి చెందిన ఘటన చోటుచేసుకుంది. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో మూతబడిన వసతిగృహంలో మృతదేహం లభించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలియరాలేదని, వయసు 50 ఏళ్లు ఉండొచ్చని, కేసు విచారిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

వివాహిత ఆత్మహత్య

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో తిలక్ నగర్‌కు చెందిన చాకలి లీలావతి(50) అనే మహిళ బావిలో పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఒకటో పట్టణ పోలీసులు తెలిపారు. ఆమె మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. తిలక్ నగర్‌లో రజకుల పెద్దవీరన్న, లీలావతి దంపతులు నివాసం ఉంటున్నారు. ఆమె గంగానగర్‌లో కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. దుకాణం, ఇంటి అవసరాల కోసం భర్తకు తెలియకుండా అప్పులు చేసింది. ఈ విషయం భర్తకు తెలుస్తుందని భయపడి మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసింది. బుధవారం ఉదయం బావిలో మృతదేహంగా తేలడంతో స్థానికులు సమాచారం ఇచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. మృతురాలి భర్త పెద్దవీరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

పశుబీమా.. రైతుకేదీ ధీమా

అవగాహన లేమితో అవస్థలు

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే: గుంతకల్లు నియోజకవర్గంలో అధిక శాతం రైతులు పాడి పశువులు, ఇతర జీవాల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. వాటిని కొనాలంటే ఒక్కొక్క దానికి రూ.50వేల నుంచి రూ.90వేల వరకు వెచ్చించాల్సి ఉంటుంది. వివిధ కారణాలతో పశువులు చనిపోయి కర్షకులకు నష్టాల పాలవుతున్నారు. ఆదుకోవాల్సిన పశుబీమాపై అన్నదాతలకు పశుసంవర్ధక అధికారులు, పశు వైద్యులు అవగాహన కల్పించకపోవడం శాపంగా మారింది. వాన, చలి కాలాల్లో గొర్రెలు, పొట్టేళ్లు, మేకలు, ఆవులు, ఎద్దులకు వివిధరకాల వ్యాధులు సోకి చనిపోతున్నాయి. పాడి రైతులతో పశుసంవర్ధక అధికారులు పశుబీమా కంతులు కట్టించకపోవడంతో నష్టాలు తప్పడం లేదు.

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి

నియోజకవర్గంలో గుత్తి, పామిడి, గుంతకల్లు మండలాలు ఉన్నాయి. సుమారు 68 గ్రామ పంచాయతీలుండగా, పదుల సంఖ్యలో రైతులు, భూమిలేని పేదలు గొర్రెలు, పొట్టేళ్లు, మేకలు పెంచుకుంటున్నారు. గుత్తి మండలంలోని ఊటకల్లు, బేతాపల్లి, తొండపాడు, ఇసురాళ్లపల్లి, గొందిపల్లి, ఎంగిలిబండ, టి.కొత్తపల్లి, గుంతకల్లు మండలంలో నాగసముద్రం, వైటీ చెరువు, పాతకొత్తచెరవు, కసాపురం, మల్లేనిపల్లి, గుర్రబ్బాడు, వెంకటాంపల్లి, కొంగనపల్లి, ఓబుళాపురం, పామిడి మండలంలో ఎద్దులపల్లి, రామగిరి, పాళ్యం, కోనేపల్లి, తదితర గ్రామాల్లో జీవాల పెంపకం ఎక్కువగా ఉంది. పశువుల బీమా చేసేందుకు లబ్ధిదారుల వాటాగా (తెల్లరేషన్ కార్డుదారులు) కంతులో 20 శాతం చెల్లిస్తే, మిగిలింది ప్రభుత్వం భరిస్తుంది. తెల్ల రేషన్‌కార్డు లేని వారు 50 శాతం కంతు చెల్లించాల్సి ఉంటుంది. సాధారణంగా పశువులకు మూడేళ్లు, జీవాలకు రెండు లేదా మూడేళ్ల వరకు బీమా పథకం వర్తిస్తుందని ప్రభుత్వం చెబుతోంది.

అన్నదాతలు ముందుకు రావాలి

పాడి రైతులు పశుబీమా పథకం కింద పేర్లు నమోదు చేసుకోవడానికి ముందుకు రావాలి. గ్రామగ్రామాల్లో ఈ పథకంపై అవగాహన కల్పిస్తున్నాం. వారు ప్రీమియం కడితే కచ్చితంగా బీమా మొత్తం వచ్చేలా చర్యలు తీసుకుంటాం. వ్యాధులు, ప్రకృతి వైపరీత్యాలు, ఇతర కారణాలతో జీవాలు చనిపోతే బీమా వర్తిస్తుంది. **-ప్రదీప్‌కృష్ణ, పశు వైద్యాధికారి, జక్కలచెరువు**

నాణ్యమైన బోధనతోనే ఉత్తమ ఫలితాలు

విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఏఎస్‌ఓపీ వేణుగోపాల్

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులకు అత్యుత్తమ బోధన అందించినప్పుడే చక్కటి ఫలితాలు వస్తాయని అనంతపురం జిల్లా ఏఎస్‌ఓపీ వేణుగోపాల్ అన్నారు. గుత్తి మండలం జక్కలచెరువు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఆయన బుధవారం పరిశీలించి మాట్లాడారు. ప్రాథమిక దశలోనే పిల్లలకు నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. వారు సమయానికి పాఠశాలకు రావాలన్నారు. అనంతరం ఆయన పిల్లల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు చేరవేయాలని సూచించారు. జాదూయి పిటారా అభ్యసన సామగ్రిని సక్రమంగా వినియోగించాలన్నారు. ఆయన వెంట ఏఎస్‌ఓ కన్నడ రామనారాయణ, ప్రధానోపాధ్యాయుడు కేశవనాయుడు, జిల్లా ప్రథమ్ కో-ఆర్డినేటర్ లక్ష్మణ్ తదితరులున్నారు.

డైట్ అధ్యాపకుల తనిఖీ

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే: మండలంలోని చిక్కేపల్లి, నామనాంకపల్లి ప్రాథమిక పాఠశాలలను డైట్ అధ్యాపక బృంద సభ్యులు బుధవారం తనిఖీ చేశారు. బాలబాలికల అభ్యసన సామర్థ్యం, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తెలుగు, ఆంగ్లం, గణిత పాఠ్యాంశాల్లో విద్యార్థుల అభ్యసన స్థాయిని స్వయంగా పరిశీలించారు. బృందంలో సభ్యులు గోవిందరాజులు, అస్లాంబాష, శ్రీనివాసులు, ఎంఈవో ఓబుళపతి తదితరులున్నారు.

వేర్వేరుచోట్ల ఇద్దరి అదృశ్యం

గార్లదిన్నె, న్యూస్‌టుడే: మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో యువతి, వివాహితుడు అదృశ్యంపై ఫిర్యాదు అందినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి కనబడకపోవడంతో బుధవారం ఆమె తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. రెండు రోజుల క్రితం ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ● మండలంలోని సంజీవపురానికి చెందిన భాస్కర్ అనే వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోవడంతో భార్య మంజుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

చోరీ కేసులో నిందితుడి పట్టివేత

గార్లదిన్నె, న్యూస్‌టుడే: గార్లదిన్నెలోని శింగనమల క్రాస్ వద్దనున్న ఓ ఇంట్లో బుధవారం చోరీకి పాల్పడి పారిపోతున్న నిందితుడిని స్థానికులు కనుగొని పోలీసులకు అప్పగించిన సంఘటన ఇది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యర్రగుంట్ల గ్రామానికి చెందిన ప్రవీణ్ అనే యువకుడు గార్లదిన్నెలోని హాజీవలి అనే వ్యక్తి ఇంటికి వేసిన తాళాన్ని పగలగొట్టి లోపలికి వెళ్లాడు. రెండు తులాల బంగారు నగలు, రూ.50వేలు నగదును తస్కరించారు. అక్కడి నుంచి పారిపోతుండగా గమనించిన స్థానికులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.

(c) eenadu

ఆధ్యాత్మిక సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నేడు(గురువారం) ఉదయం ఆరుగంటలకు స్వామి వారి సాధారణ దర్శనం ఉంటుంది. ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల మధ్య అభిషేక, స్వర్ణకవచ సేవలు ఉంటాయి. తర్వాత ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తిరిగి సాయంత్రం 5నుంచి రాత్రి 8.30గంటల వరకు భక్తులకు స్వామి వారి సర్వదర్శనం ఉంటుంది.

జుబేదాకు అండగా ఉంటాం: మంత్రి లోకేశ్

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: మస్కట్ దేశంలో నరకం చూస్తున్నానంటూ అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన జుబేదాబేగం సెల్ఫీ వీడియో ద్వారా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌ను వేడుకున్న విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన మంత్రి లోకేశ్ జుబేదాకు అన్నివిధాలుగా సాయమందించి స్వదేశానికి క్షేమంగా తీసుకొస్తామన్నారు. అక్కడి అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని, ఆమె ఒంటరి కాదని, ఇండియాకు వచ్చేవరకు అండగా ఉంటామని మంత్రి ఎక్స్‌లో పోస్టు చేశారు.

నేడు ప్రత్యేక విద్యుత్తు అదాలత్

అనంతపురం(విద్యుత్తు): విద్యుత్తు వినియోగదారులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం గురువారం మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కదిరిలోని విద్యుత్తుశాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో ప్రత్యేక విద్యుత్తు అదాలత్(విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ శేషాద్రిశేఖర్, ఈఈ జె.వి.రమేశ్ తెలిపారు. అదాలత్ ఛైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు మధుకర్‌బాబు, సాంకేతిక సభ్యుడు శ్రీనివాసబాబు, స్వతంత్ర సభ్యురాలు విజయలక్ష్మి పాల్గొని వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు.

ప్రసంగిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

'విద్యార్థి సమస్యలపై ఆందోళనకు సిద్ధం'

ఆర్కేనగర్ (అనంతపురం): కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య హెచ్చరించారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి అనంతపురం వరకు 23 రోజుల పాటు బస్సు జాతా నిర్వహించి, బుధవారం అనంతపురం నగరంలోని సప్తగిరి కూడలి వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సభకు ఈశ్వరయ్యతో పాటు జాతీయ కార్యదర్శి శివారెడ్డి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలరాజు బందెల, నాసర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ విద్యను పేద విద్యార్థులకు అందని ద్రాక్షలా మార్చి ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. నాయకులు చలపతి, మస్తాన్, ఫణీంద్ర, నాగభూషణం, సాయి, సాబీర్, రవికుమార్, నారాయణస్వామి, మల్లికార్జున, రాజారెడ్డి పాల్గొన్నారు.

రాయితీ, ప్రోత్సాహకం ఏదీ?

పట్టుగూళ్ల రైతుల ఆందోళన

పురం మార్కెట్‌లో క్రయవిక్రయాలు బంద్

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం మార్కెట్‌లో బుధవారం పట్టుగూళ్ల క్రయవిక్రయాలు జరగలేదు. ప్రభుత్వం బైవోల్టిన్ రైతులకు ప్రోత్సాహక మొత్తం, మల్బరీ సాగుకు ఎరువులు, మందులపై రాయితీ ఇవ్వకపోవటంతో పంట సాగుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైకాపా ప్రభుత్వ పాలనలోనే వాటిని నిలిపేయడంతో రూ.20 కోట్ల వరకు బకాయి ఉంది. చెల్లించాలని రైతులు ఆందోళనలు చేపట్టినా ఫలితం లేకపోయింది. దీంతో కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. పంటసాగు, పట్టుగూళ్ల పెంపకానికి పెరిగిన పెట్టుబడి వ్యయంతో రైతులు అవస్థలు పడుతున్నారు. 1985లో పట్టుగూళ్ల మార్కెట్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు క్రయవిక్రయాలు బంద్ అయిన సందర్భాలు లేవని స్థానికంగా చెబుతున్నారు. ఇక్కడి మార్కెట్‌లో లావాదేవీల ద్వారా ప్రభుత్వానికి ఏటా రూ.కోటికిపైగా ఆదాయం వస్తోంది.

ఉపాధిపై ప్రభావం

మార్కెట్‌లో జరిగే పట్టుగూళ్ల లావాదేవీ ద్వారా రీలర్లు, కూలీల దాదాపు 8వేల మంది రీలింగ్ యూనిట్లపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పట్టుగూళ్లు రాకపోతే రీలింగ్ యూనిట్లు కొనసాగక ఉపాధికి విఘాతం కలుగుతుంది. యూనిట్లు కొనసాగాలంటే ఇతర ప్రాంతాలకు తరలిపోతున్న గూళ్లు ఇక్కడికి తీసుకురావాలని రీలర్లు కోరుతున్నారు.

హిందూపురంలో బోసిపోయిన మార్కెట్

ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి

జిల్లా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని బైవోల్టిన్ రైతులకు రాయితీ, ప్రోత్సాహకం అందేలా చూడాలి. లేదంటే రైతులు కర్ణాటకకే పట్టుగూళ్లు తరలించుకొని వెళ్లే అవకాశం ఉంది. నాలుగు దశాబ్దాల మార్కెట్ చరిత్రలో పట్టుగూళ్లు రాని రోజంటూ లేదు. దీనిని గుణపాఠంగా భావించాలి.

- సిద్ధారెడ్డి, కార్యదర్శి, ఉమ్మడి జిల్లా పట్టు రైతుల సంఘం

కర్ణాటకకు తరలిస్తూ..

కర్ణాటక రాష్ట్రంలోని రాంనగర్, శిద్దలఘట్ట మార్కెట్‌లలో కిలోకు రూ.50 నుంచి 100 వరకు అదనంగా ధర లభిస్తుండటంతో ఈ ప్రాంతంలోని రైతులు బైవోల్టిన్, సీబీ పట్టుగూళ్లు తీసుకెళుతున్నారు. గతంలో బైవోల్టిన్ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం కిలోకు రూ.50 ప్రోత్సాహకం అందిస్తుండటంతో అధికశాతం మంది పురం తీసుకొచ్చి విక్రయించేవారు. ప్రస్తుతం కర్ణాటక మార్కెట్ మేలు అనే అభిప్రాయాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడి తక్కువగా ఉంటోంది

చలికాలంలో పట్టుగూళ్ల దిగుబడి తక్కువగా ఉంటోంది. ప్రస్తుతం చలి తీవ్రత పెరిగినందున పట్టుగూళ్లు అంతంతమాత్రంగా వస్తున్నాయి. గురువారం నుంచి గూళ్లు మార్కెట్‌కు వచ్చే అవకాశాలు ఉన్నాయి. **- హంపయ్య, హిందూపురం మార్కెట్ ఇన్‌స్పెక్టర్**

ప్రభుత్వ వైద్యకళాశాలకు నూతనంగా 15 పీజీ సీట్లు

విభాగాధిపతులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ విజయశ్రీ, సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: అనంతపురం ప్రభుత్వ వైద్యకళాశాలలోని పలు విభాగాలకు నూతనంగా 15 పీజీ సీట్లను కేటాయిస్తూ జాతీయ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) అనుమతి ఇచ్చిందని ప్రిన్సిపల్ డాక్టర్ విజయశ్రీ, సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. నూతనంగా పీజీ సీట్లు వచ్చేందుకు కృషి చేసిన ఆయా విభాగాల సంబంధించిన అధిపతులను ప్రిన్సిపల్ ఛాంబర్‌లో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో కళాశాలలో 121 పీజీ సీట్లు ఉండేవని, ప్రస్తుతం నూతనంగా 15 సీట్లు రావటంతో ఆ సంఖ్య 136కి చేరిందని తెలిపారు. ఎన్ఎంసీ పీడియాట్రిక్, అనస్తీయా, గైనిక్ విభాగాలకు నాలుగు సీట్లు చొప్పున, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి 3 సీట్లు అదనంగా కేటాయించారని వివరించారు. వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ షారోన్‌సోనియా, డాక్టర్ సుచిత్ర, డాక్టర్ భాస్కర్, మధుసుదన్, డాక్టర్ రేణుక, డాక్టర్ నిసార్‌బేగంతో పాటు వైద్యవిద్యార్థులు పాల్గొన్నారు.

వర్సిటీలో ఏబీవీపీ నాయకుల నిరసన

ప్రిన్సిపల్‌తో వాగ్వాదానికి దిగిన ఏబీవీపీ నాయకులు

ఎస్కేయూ, న్యూస్‌టుడే : విశ్వవిద్యాలయంలో మత కార్యకలాపాలు నిర్వహిస్తే సహించేదిలేదని ఏబీవీపీ నాయకులు ధ్వజమెత్తారు. ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాల సెమినార్ హాల్లో కొందరు విద్యార్థులు సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తుండగా ఏబీవీపీ నాయకులు అడ్డుకున్నారు. సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అభిలాష్‌రెడ్డి మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ప్రభుత్వ విద్యాలయాల్లో మతపరమైన కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. కార్యక్రమాల నిర్వహణకు ఎలా అనుమతి ఇచ్చారని ప్రిన్సిపల్ రామచంద్రతో వాగ్వాదానికి దిగారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఇన్‌ఛార్జి వీసీ అనితకు ఫిర్యాదు చేశారు. తగిన చర్యలు తీసుకుంటామని వీసీ చెప్పడంతో ఆందోళన విరమించారు. విద్యార్థి సంఘం నాయకులు యుగంధర్, దివాకర్‌నాయక్, నాగార్జున, ఉపేంద్ర, యశ్వంత్, గణేష్, బాబు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

అవసరమైతే ఫ్యాక్షన్ చేస్తా..!

అడ్డుకున్న పోలీసులతో మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి

తాడిపత్రి, న్యూస్‌టుడే: 'పెద్దారెడ్డి ఫ్యాక్షన్ చేస్తారని తెదేపా నాయకులు పదేపదే అంటున్నారు. దేవుడు కరుణిస్తే నాకు అనుకూలిస్తే వారి కోరిక నెరవేరుస్తా' అని మాజీ ఎమ్మెల్యే, వైకాపా నేత కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. తాడిపత్రిలో బుధవారం వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పెద్దారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అదే సమయంలో ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేపట్టారు. ఈ నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడుతుందని భావించిన పట్టణ, గ్రామీణ సీఐలు ఆరోహణరావు, శివగంగాధర్‌రెడ్డి నేతృత్వంలో పోలీసులు పెద్దారెడ్డిని అడ్డుకున్నారు. ఆగ్రహించిన పెద్దారెడ్డి ఇక్కడ మీకు ఇబ్బందైతే యాడికిలో జరిగే కార్యక్రమానికి వెళతానని, దానికి పోలీసుల అనుమతి ఉంది కదా అని పట్టుబట్టారు. ఆయన అక్కడికి వెళితే, తాము వెళతామని తెదేపా వర్గీయులు అల్టిమేట్ ఇవ్వడంతో పోలీసులు వద్దని వారించారు. తాను వెళ్లకూడదని రాత పూర్వకంగా నోటీసు ఇస్తే ఆగుతానంటూ వాగ్వాదానికి దిగడంతో పోలీసులు, వైకాపా వర్గీయుల నడుమ కొద్ది సేపు తోపులాట జరిగింది. అనంతరం పెద్దారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఆయన అనుచరులు తాను ఫ్యాక్షన్ చేస్తానని అంటున్నారని, దేవుడు కరుణిస్తే వారి కోరిక నెరవేరుస్తానన్నారు. వైకాపాలోని చురుకైన కార్యకర్తలపై తెదేపా శ్రేణులు దాడులు చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. చివరికి పోలీసులు పెద్దారెడ్డిని గృహనిర్బంధం చేయడంతో సమస్య సద్దుమణిగింది.

సీఐలతో వాగ్వాదం చేస్తున్న పెద్దారెడ్డి

అందుకే ఇంటికి పంపారు: ఎమ్మెల్యే

మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి

పెద్దారెడ్డి గతంలో ఫ్యాక్షన్ చేస్తానని అన్నందుకే ఎన్నికల్లో ఇంటికి పంపించారని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి అన్నారు. ఆయన పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌లో జరుగుతున్న భూగర్భ మురుగు నీటి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే పెద్దారెడ్డిని ప్రజలు నిరాకరించారని, మళ్లీ ఫ్యాక్షన్ చేస్తాననడం అవివేకమన్నారు. ఆయన వెంట ఎవరూ లేరని, ఒక్కరే కత్తి పట్టుకుని రోడ్డుపైకి రావాల్సి ఉంటుందని అన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులు చేస్తుంటే, వైకాపా వర్గాలు అడ్డుకోవడానికి రోడ్డెక్కుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైకాపా ప్రభుత్వం భూగర్భ మురుగు నీటి వ్యవస్థను నాశనం చేసిందని, తిరిగి గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం రూ.11కోట్లు మంజూరు చేసిందని గుర్తుచేశారు.

590 గ్రామాలకు నిలిచిన ఎస్ఆర్‌పీ నీళ్లు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం(ఎస్ఆర్‌పీ)నీటి సరఫరా నిలిచింది. భైరవానితిప్ప ప్రాజెక్టు కాలువ పనులు కొనసాగుతుండటంతో ఈ ప్రాంతంలో పైపులు తాత్కాలికంగా తొలగించారు. దీంతో కళ్యాణదుర్గం, మడకశిర, పెనుకొండ, హిందూపురం నియోజకవర్గాల్లోని 590 గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. బీటీపీ ప్రాజెక్టు పనులు శరవేగంగా సాగుతున్న నేపథ్యంలో పైపులు పగిలిపోకుండా ఉండేందుకు ముందస్తుగా తొలగించినట్లు శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం డీఈ శిరీష పేర్కొన్నారు. ప్రత్యామ్నాయంగా పైపులు ఏర్పాటు చేసే పనులు కొనసాగుతున్నాయని, సుమారు 10 రోజుల వరకు నీళ్లు వచ్చే అవకాశం లేదని, ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.

బోరంపల్లి-ఒంటిమిద్ది గ్రామాల మధ్య జరుగుతున్న బీటీపీ కాలువ పనులు

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate

అనంతపురం మెయిన్-I బ్రాంచ్ 12-3-50, సాయి ఎన్‌క్లేవ్, సాయి నగర్, 3వ క్రాస్, అనంతపురం-515001. ఫోన్: 08554-274740.

స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్, అనంతపురం మెయిన్-1 బ్రాంచ్ వారికి **ఋణగ్రహీత(లు): మెస్సర్స్ ఏయిర్ అండ్ సీ, ప్రొప్రయిటర్: ప్రణీత్ టివియస్, తండ్రి: టి. నరేంద్ర, 4/3/100, జనశక్తి నగర్, అనంతపురం-515001 మరియు హామీదారు(లు): శ్రీ టి.వి.యస్. శ్రీహర్ష, తండ్రి: యస్.టి.నరేంద్ర** వారు తేది.14.09.2021 నాటికి చెల్లించవలసిన బకాయి **రూ. 11,04,341.62/- (అక్షరాల పదకొండు లక్షల నాలుగు వేల మూడు వందల నలభై ఒక్క రూపాయలు మరియు అరవై రెండు పైసా మాత్రమే)** మొత్తమును రాబట్టుకొనుటకు **కెనరా బ్యాంక్, అనంతపురం మెయిన్-1** బ్రాంచ్ అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు ఛార్జ్/తనఖాపెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తిని తేది **29.11.2025** న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని ప్రజానీకానికి మరియు ముఖ్యంగా పైన తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది: 29.11.2025, ఉ॥ 11.45 గం.ల నుండి మ॥ 12.45 గం.ల వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ధరావత్తును RTGS/NEFT ద్వారా చలాన్‌లోని ఖాతా వివరములుకు తేది: 28.11.2025, సా॥ 5.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:

కర్నూలు ఆర్‌డి పరిధి మరియు కల్లూరు యస్‌ఆర్‌డి మరియు చల్లమల్లాపురం గ్రామము, చల్లమల్లాపురం రూరల్ పంచాయతీ ఏరియా ఓపెన్ ప్లాట్. ఆస్తి వివరములు: **ది.17.04.2017 తేదీ గల విక్రయ దస్తావేజు నెం.3370/2017** ప్రకారము చల్లమల్లాపురం గ్రామము సర్వే నెం.93/1, 93/2, 94/1, సబ్‌డివైడ్ సర్వే నెం.93/1సి, 93/2సి, 94/1 పైకి సర్వే నెం.93/1సి నందు ప్లాట్స్, న్యూ కల్కినగర్ నందు ప్లాట్ నెం.9 మరియు 10 కి సంబంధించిన యావత్తు. హద్దులు: **తూర్పు:** ప్లాట్ నెం.23 మరియు 24; **పడమర:** కర్నూలు నుండి డోన్ నేషనల్ హైవే; **ఉత్తరం:** ప్లాట్ నెం.8; **దక్షిణం:** ప్లాట్ నెం.11. **కొలతలు: తూర్పు-పడమర:** 70 అ॥ లేదా 21.336 మీ॥; **ఉత్తరం-దక్షిణం:** 80 అ॥ లేదా 24.384 మీ॥, **విస్తీర్ణం: 622.22 చ॥గ॥ లేదా 5600 చ॥అ॥. టైటిల్ హోల్డర్: శ్రీ టివియస్ శ్రీ హర్ష, తండ్రి: టి. సరేంద్ర.**

రిజర్వు ధర: రూ. 23,00,000/-   ధరావత్తు సొమ్ము: రూ. 2,30,000/-

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, అనంతపురం మెయిన్-1, బ్రాంచ్ మేనేజర్ గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 8919430724.
ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ (baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com/ హెల్ప్‌డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com.

తేది: 12.11.2025, ప్రదేశం: అనంతపురం   సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్
(incorporated under the State Financial Corporation Act LXIII of 1951)
28/453-E2, కలెక్టరేట్ దగ్గర, పెన్నార్ భవన్ వెనుక, అనంతపురము-515001, ఫోన్:08554-275511

ఇ -వేలం విక్రయ ప్రకటన
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(6) & 9(1)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 రూల్ 8(6) & 9(1) తో కలిసి చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ప్రకారం స్థిర/చర ఆస్తుల విక్రయానికి

ఇ-వేలం విక్రయ ప్రకటన

అధీకృత అధికారి ద్వారా భౌతికంగా స్వాధీనం చేసుకొనబడినట్టి, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టబడిన/ఛార్జ్ చేయబడిన క్రింది రుణగ్రస్తులు మరియు హామీదారులనుండి బకాయిలు రాబట్టుకొనుటకు వారికి సంబంధించిన స్థిర/చర ఆస్తులు **"ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా", "అక్కడ ఏమున్నదో అది"** మరియు **"ఏది అక్కడ ఉన్నదో అదే"** ప్రాతిపదికన తేది.**14.12.2025** విక్రయించబడతాయని ఇందుమూలముగా ముఖ్యంగా రుణగ్రహీత (లు), హామీదారు (లు) మరియు సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది. **రిజర్వు ధర,** బయానా కూడా దిగువ తెలుపబడినవి. **డిమాండు నోటీసు తేది:06.01.2023 స్వాధీనత తేది04.09.2023 రూ॥ లక్షలలో**

రుణగ్రహీత / గ్యారంటార్లు	31.10.2025 నాటికి గల బకాయి మొత్తము	ఆస్థి వివరములు	రిజర్వు ధర (రూ.లక్షలలో)	ధరావత్తు రూ.లక్షలలో	బిడ్ హెచ్చింపు ధర
మెసర్స్ లక్ష్మి ఇండస్ట్రీస్, సర్వే నం.115-1, శ్రీనివాసపురము, నందలపాడు గ్రామము, తాడిపత్రి మున్సిపాలిటి మరియు మండలము, అనంతపురము జిల్లా. ప్రొ॥ శ్రీమతి డి. లక్ష్మిదేవి గ్యారంటార్లు 1. శ్రీ డి. రాజేశ్వర రెడ్డి 2. శ్రీ డి. సుధీర్ రెడ్డి	**రూ॥36.87 లక్షలు మరియు తేదీ.01.11. 2025 నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు కలుప బడుతాయి.**	**ఐటమ్ నెం.1.** యూనిట్ కలిగిన భూమి మరియు భవనము. అనంతపురము జిల్లా, తాడిపత్రి మున్సిపాలిటి మరియు మండలము, నందలపాడు గ్రామము, సర్వే నెం.115/1 నందు కలిగిన భూమి విస్తీర్ణము 435.60 చ॥గ॥లు. దీనికి హద్దులు: తూర్పు: లక్ష్మీదేవికి చెందిన ఆస్తి మరియు రోడ్డు, పడమర: డి. నారాయణమ్మకు చెందిన ఖాళీ స్థలము, ఉత్తరము: డి. నారాయణమ్మకు చెందిన ఖాళీ స్థలము, దక్షిణము: రోడ్డు (ప్రస్తుతము నివాస భవనము)	భూమి & భవనము మరియు ప్లాంటు & మెషినరి ఐటమ్ నెం. 1 & 2 **50.51**	భూమి & భవనము మరియు ప్లాంటు & మెషినరి ఐటమ్ నెం. 1 & 2 **5.61**	భూమి & భవనము మరియు ప్లాంటు & మెషినరి ఐటమ్ నెం. 1 & 2 **0.50**
		ఐటమ్ నెం.2. ప్లాంటు మరియు మెషినరీ: 90mm ఎక్స్‌ట్రూడర్, మిక్సర్, 65 mm ఎక్స్‌ట్రూడర్, ట్విస్టింగ్ మెషిన్, టెన్సిల్ టెస్టింగ్ మెషిన్, రాడ్ బ్రేకింగ్ మెషిన్ .	ప్లాంటు & మెషినరి ఐటమ్ నెం.2. **7.06**	ప్లాంటు & మెషినరి ఐటమ్ నెం.2. **0.78**	ప్లాంటు & మెషినరి ఐటమ్ నెం.2. **0.10**
		ఐటమ్ నెం.3. అనంతపురము జిల్లా, తాడిపత్రి మున్సిపాలిటి మరియు మండలము, నందలపాడు గ్రామము, సర్వే నెం.115/1 నందు 787.95 చ॥గ॥లు కల నివాస స్థలము. దీనికి హద్దులు: తూర్పు: పబ్లిక్ రోడ్డు, పడమర:ప్రకాష్ రెడ్డికి చెందిన ఖాళీ స్థలము, ఉత్తరము: చెన్నా రెడ్డికి చెందిన ఖాళీ స్థలము, దక్షిణము: 12 అడుగుల రోడ్డు.	ఇంటి స్థలం ఐటమ్ నెం.3. **117.22**	ఇంటి స్థలం ఐటమ్ నెం.3 **13.02**	ఇంటి స్థలం ఐటమ్ నెం.3. **0.50**

ఇ-వేలం తేది మరియు సమయము:
https://www.bankauctions.in ద్వారా 14.12.2025 న ఉ॥ 11.30 నుండి మ॥ 12.30 వరకు అపరిమితంగా 5 నిమిషముల ఆటో ఎక్స్‌టెన్షన్‌తో

టెండరు నందు పాల్గొనదలచిన బిడ్డర్లు ఇ-ఆక్షన్ కొరకు సవివరమైన నియమనిబంధనల కొరకు మరియు టెండరు దాఖలు కొరకు వెబ్‌సైట్ https://esfc.ap.gov.in and https://bankauctions.in చూడవచ్చు. మరియు వెబ్‌సైట్ నందు కల అన్ని నియమనిబంధనలకు టెండరుదారులు కట్టుబడిఉండవలెను. ధరావత్తును అకౌంట్ నెం.147711100000098, (IFSC Code:UBIN0814776), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అశోక్ నగర్, అనంతపురము శాఖకు నెఫ్ట్ లేదా ఆర్.టి.జి.ఎస్ ద్వారా చెల్లించవలెను.

ధరావత్తుతో కూడిన టెండరును సమర్పించడానికి ఆఖరు తేది:12.12.2025 సా॥ 5.00 గం॥లోపు

ఇ-ఆక్షన్ టెండరు ఫారము, బిడ్ డాక్యుమెంట్, డిక్లరేషన్, సాధారణ నియమ నిబంధనలు, ఆన్‌లైన్ ఆక్షన్ వివరములు అన్నీ వెబ్‌సైట్:https://esfc.ap.gov.in and https://bankauctions.in నందు కలవు. టెండరు నందు పాల్గొనదలచిన టెండరుదారులు అన్ని సాధారణ ఇతర నియమనిబంధనలు/క్లారిఫికేషన్లు కొరకు అధీకృత అధికారిని సంప్రదించవలెను. సెల్: 7799881693.

ప్రదేశం: అనంతపురము   సం/-అధీకృత అధికారి, ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్,
తేది:13.11.2025   అనంతపురము శాఖ.

తూతూమంత్రంగా జిల్లాస్థాయి యువజనోత్సవాలు

జ్యోతి వెలిగిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే : ఏటా జిల్లా యువజన సర్వీసుల శాఖ నిర్వహించాల్సిన జిల్లాస్థాయి యువజనోత్సవాలు ఈసారి ఒక యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించడం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యువతలో దాగి ఉన్న కళా నైపుణ్యాలను వెలికితీయడానికి యువజనోత్సవాలు ఏటా ఆ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించేవారు. ఈసారి బడ్జెట్ లేదని అధికారులు చేతులెత్తేయడంతో ఈ ఉత్సవాలు ప్రగతి పథం యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించడాన్ని యువత తప్పుబట్టారు. కనీసం మీడియాకు కూడా సమాచారం ఇవ్వకుండా ముగించడం వెనుక అంతర్యమేమిటో అర్థం కాలేదు. ఆర్ట్స్ కళాశాలలో జరిగిన ఈ ఉత్సవాల ప్రారంభోత్సవానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఆన్‌సెట్ సీఈఓ రవిశంకర్‌రెడ్డి, కళాశాల ఉప ప్రిన్సిపల్ సహదేవుడు, కేంద్రీయ విద్యాలయ లెక్చరర్ ప్రణతి, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బి.జీవన్‌కుమార్, జయకుమార్, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకులు ఎస్.రమేష్ తదితరులు హాజరయ్యారు.

ఏఎంసీలో ఆగంతుకుడి దుశ్చర్య

విద్యుత్తు తీగ కట్ చేసిన వైనం

అనంతపురం(వైద్యం),న్యూస్‌టుడే : అనంతపురం సర్వజన వైద్యశాలలోని అక్యూట్ మెడికల్ కేర్ (ఏఎంసీ)లో ప్రాణాపాయ స్థితిలో ఉండే రోగులు చికిత్సలు పొందుతుంటారు. ఈ విభాగం రోగులు, క్షతగాత్రులతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక్కడ ఎక్కువ శాతం వెంటిలేటర్‌పైన ఉండే రోగులే ఎక్కువగా ఉంటారు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో ఉన్నఫలంగా 20 ని.షా విద్యుత్తు సరఫరా నిలిచిపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సంబంధిత ఎలక్ట్రికల్ సిబ్బంది సరఫరా ఎందుకు ఆగిందని పరిశీలించగా విద్యుత్తు తీగ కట్ అయినట్లు గుర్తించారు. ప్రధాన తీగను కట్ చేయటంతో జనరేటర్ ద్వారా కూడా సరఫరా ఇవ్వలేని పరిస్థితి తలెత్తింది. కొంతసేపటికి సరఫరాను పునరుద్ధరించారు. సీసీ కెమెరాలో ఒక గుర్తుతెలియని వ్యక్తి ముఖానికి మాస్క్ ధరించి కేబుల్‌ను కత్తిరించినట్లు గుర్తించారు. అతను ఎందుకిలా చేశాడు? దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల కిందట ఘటన జరిగితే ఎందుకు ఫిర్యాదు విషయంలో ఆలస్యం చేశారన్న దానికి ఎవరూ సమాధానం చెప్పకపోవడం గమనార్హం. వెంటిలేటర్‌పై ఉన్న వారెవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవటంతో వైద్యాధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

EENADU Classifieds

JOBS

Urgent Civil Site Supervisors Required with or without Experience. Location Karnataka. Contact: 9347083151.

కదిరి జి-డిజిటల్ షోరూంలో మేనేజర్‌గా పనిచేయుటకు 10 సం.ల సేల్స్ అనుభవం కలిగిన వ్యక్తులు కావలెను. జీతం: 15K+ ఇన్సెంటివ్. Ph:97058 26033.

మా కంపెనీలో పనిచేయుటకు M/F కావలెను. జీతం: 25K + Q: 12th, Degree. Age: 23+ Smart Phone తప్పనిసరి. 9347472381.

ప్రముఖ కంపెనీకి అడ్మినిస్ట్రేషన్ వర్క్ (Male) అభ్యర్థులు కావలెను. గుడ్ కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి యాక్టివ్‌గా ఉండవలెను. Exp: 3 Years above, Qly: డిగ్రీ / పీజీ. ✆ 89857 17076, 97034 02722.

IT HARDWARE

Internship / Final Year Projects. Web App | Data Analytics | Digital Marketing | Cloud | HR Certification Placement Support Bangalore. Ph: 8105577689

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు : 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

ముగ్గురు యువకులపై పోక్సో కేసు

రాప్తాడు, న్యూస్‌టుడే : చిన్మయనగర్‌కు చెందిన కుపేంద్ర, మల్లికార్జున, గంగాధర్‌లపై బుధవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపారు. ఆయన బుధవారం ఆయా వివరాలు వెల్లడించారు. కళ్యాణదుర్గం సమీపంలోని ఓ గ్రామానికి చెందిన బాలుడు నాన్నమ్మ వద్ద ఉంటూ ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. వారం కిందట నగరంలోని ఓ కాలనీకి చెందిన అమ్మమ్మ వద్దకు వచ్చాడు. ఈక్రమంలో శనివారం ఆర్డీటీ స్టేడియంలో క్రీడాపోటీలు ఉంటే స్నేహితులతో కలిసి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో చిన్మయనగర్‌కు చెందిన కుపేంద్ర, మల్లికార్జున, గంగాధర్‌లు బాలుడిని ముళ్లపొదల్లోకి తీసుకెళ్లి లైంగిక వేధింపులకు గురి చేశారు. బాలుడు జరిగిన విషయాన్ని ఎవరికీ చెప్పకుండా ఆదివారం స్వగ్రామానికి వెళ్లిపోయాడు. బుధవారం బాలుడి అమ్మమ్మను పిలిపించి విచారిస్తే జరిగిన విషయం తనకు తెలియదని సమాధానమిచ్చింది. తర్వాత బాలుడిని తీసుకొచ్చి విచారించగా లైంగిక దాడి జరిగిన విషయాన్ని చెప్పాడు. దీంతో సదరు యువకులను అరెస్టు చేసి పోక్సో కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

'వైద్యకళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం'

నగరంలో వైకాపా నాయకుల ర్యాలీ

అనంత నగరపాలక, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర పన్నిందని, దీన్ని అడ్డుకుంటామని వైకాపా జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో నగరంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి గడియార స్తంభం మీదుగా నగరంలో ప్రజా ఉద్యమం నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకు పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. ఈకార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, మాజీ అహుడా ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'బంగారు నగలు తనఖా పెడితే మోసం చేశారు'

బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అవసరం నిమిత్తం బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారు నగలను ఇవ్వకుండా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సిబ్బంది ఇబ్బంది పెడుతున్నారని తమ నగలను ఇప్పించాలని కోరుతూ బాధితులు రాంనగర్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎదుట బుధవారం ఆందోళన నిర్వహించారు. బ్యాంకు సిబ్బందికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నగలు ఇవ్వకపోతే ఆత్మహత్యే శరణ్యమని హెచ్చరించారు. ఒకానొక దశలో బ్యాంకు లోపలికి చొచ్చుకెళ్లడానికి ప్రయత్నించారు. సమాచారం అందుకున్న నాలుగో పట్టణ సీఐ జగదీశ్ బ్యాంకు వద్దకు చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పారు. ఈ సందర్భంగా బాధితులు వేణుగోపాల్ రెడ్డి, ఆరోగ్యంరెడ్డిలు మీడియాతో మాట్లాడుతూ ..తాము ఏడాది క్రితం బ్యాంకులో ఇరవై తులాలకు పైగా బంగారు నగలను తనఖా పెట్టి రుణం తీసుకున్నామన్నారు. ఐదు నెలల క్రితం రుణాన్ని రెన్యువల్ చేసుకోవడానికి వెళ్తే బ్యాంకు సిబ్బంది జయరామ్, సతీశ్‌కుమార్‌లు క్లోజింగ్ ఫారాలపై సంతకాలు పెట్టించుకుని, ఇక్కడ ఉన్న బంగారాన్ని కీర్తన ఫైనాన్స్‌లో పెట్టి ఎక్కువ డబ్బులు తీసుకున్నారని ఆరోపించారు. సుమారు ముప్పై మందికి పైగా బాధితులు ఉన్నారన్నారు. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. ఇప్పటికీ ఎలాంటి న్యాయం జరగలేదని వాపోయారు. ఆడపిల్లల వివాహాలకు, ఇంటి కొనుగోళ్ల కోసం తాకట్టు పెడితే బ్యాంకు సిబ్బంది మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

అనుమానంతో భార్య గొంతు కోసిన భర్త

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బోరంపల్లిలో భార్య రత్నమ్మపై అనుమానం పెంచుకున్న భర్త ఎర్రిస్వామి బుధవారం సాయంత్రం ఆమె గొంతు కోసి పరారయ్యాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... బుధవారం భార్యభర్తలు ఇంటి ఎదుట గొడవ పడగా మాటామాటా పెరిగింది. మద్యం మత్తులో ఉన్న ఎర్రిస్వామి ఆవేశానికి గురై కత్తితో భార్య గొంతు కోసి పారిపోయాడు. ఆమె రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతుండగా స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం 108లో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. ఇన్‌ఛార్జి సీఐ హరినాథ్, పోలీసులు వివరాలు సేకరించి విచారణ చేస్తున్నారు.

కర్ణాటకలో ఒకరి మృతి.. దుర్గం వాసులపై కేసు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తిని ఇటీవల కళ్యాణదుర్గం మండలం ఎర్రంపల్లికి చెందిన పలువురు కొట్టగా మృతి చెందడంతో స్థానికులపై కేసు నమోదైంది. కర్ణాటకలోని తుంకూరు జిల్లా పావగడ తాలూకా వై.ఎన్.హెచ్‌కోట గ్రామానికి చెందిన హనుమంతరాయ(38) ఎర్రంపల్లిలోని ఓ మహిళతో చనువుగా ఉండేవాడు. ఈ విషయంలో స్థానికులతో ఆయనకు పలుసార్లు గొడవ జరిగింది. ఈనెల 7న హనుమంతరాయ ఎర్రంపల్లికి రావడంతో స్థానికులైన మహేష్, ఆయన తల్లి హంబక్క ఘర్షణపడి కొట్టినట్లు తెలిసింది. అదేరోజు రాత్రి ఆయన స్వగ్రామానికి వెళ్లిపోగా.. తదుపరి మృతిచెందాడు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఎర్రంపల్లికి చెందిన కొందరు కొట్టడంతోనే హనుమంతరాయ మృతిచెందినట్లు గుర్తించి ఈ కేసు కళ్యాణదుర్గం పట్టణ స్టేషన్‌కు బదిలీ చేశారు. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

అనంతపురం

• అనంతపురం • రాప్తాడు

రేపటి నుంచి శివకోటిలో ఉత్సవాలు

వివరాలు తెలుపుతున్న అప్పాస్వామి, ఆలయ నిర్వాహకులు

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే : స్థానిక శివకోటి శ్రీపీఠంలో ఈనెల 14 నుంచి 17 వరకు మహారుద్ర, సహస్ర కుంభాభిషేకం ఉత్సవాలు వైభవోపేతంగా జరగనున్నాయి. బుధవారం శివకోటి ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శ్రీపీఠం వ్యవస్థాపకులు, సద్గురువులు అప్పాస్వామితో పాటు ట్రస్టు కార్యదర్శి అమరనాథ్‌రెడ్డి, ప్రధాన అర్చకుడు హరికృష్ణ, సభ్యుడు నరసింహం పాల్గొని ఉత్సవ విశేషాలను వివరించారు. మన సనాతన ధర్మం మరింత బలోపేతం చేయాలన్న ఆకాంక్షతో శ్రీశివకోటి పీఠం ప్రారంభించామన్నారు. దీక్షలో భాగంగా ఈనెల 14నుంచి 17వరకు శ్రీపీఠంలో విశిష్టమైన శివారాధన కార్యక్రమాలు ఉంటాయన్నారు. మరింత సమాచారానికి చరవాణులు 98660 05751, 85008 50016 నంబర్లలో భక్తులు సంప్రదించాలని సూచించారు.

నిధుల గోల్‌మాల్‌పై విచారణకు డిమాండ్

ఆర్వేనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: పశుసంవర్ధక శాఖలో నిధుల గోల్‌మాల్‌పై విచారణ జరిపించి, అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. పశుసంవర్ధక శాఖ ద్వారా రైతులకు గొర్రెలు, మేకల పెంపకందార్లకు అమలవుతున్న సంక్షేమ పథకాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాడి పశువులకు, గొర్రెలకు వ్యాధులు సోకినపుడు పశువుల ఆసుపత్రులకు వెళితే అక్కడి వైద్యులు ప్రైవేట్ మందుల దుకాణాలకు వెళ్లి మందులు తెచ్చుకోవాలని సూచిస్తున్నారన్నారు. ప్రస్తుతం నిధులు రాలేదని అధికారులు సమాధానం చెబుతున్నారు. శాఖలో కొందరు అధికారులు వ్యక్తిగత ఖాతాలకు నిధులను మళ్లించుకున్నారని ఆరోపించారు.

అన్నక్యాంటీన్ పేదల ఆకలి తీరుస్తోంది

రాప్తాడులోని అన్నక్యాంటీన్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు, నాయకులు

రాప్తాడు, న్యూస్‌టుడే : పేదలు ఆకలితో ఉండకూడదన్న ఉద్దేశంతోనే అన్న క్యాంటీన్ నిర్మాణం రాప్తాడులో చేపట్టినట్లు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. రాప్తాడులో అన్న క్యాంటీన్ పేదల ఆకలి తీరుస్తోందన్నారు. బుధవారం సాయంత్రం అన్న క్యాంటీన్ పనులు పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నక్యాంటీన్ కావాలని చంద్రబాబును అడిగిన వెంటనే మంజూరు చేశారు. రూ.61 లక్షలతో అన్నక్యాంటీన్ నిర్మాణం చేపట్టగా ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. మిగిలిన 10శాతం పనులు పూర్తి త్వరగా పూర్తిచేసి త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. రాప్తాడు మండల కేంద్రానికి రోజూ వందలాది మంది వచ్చి వెళుతుంటారని, వారికి ఉపయోగపడేలా క్యాంటీన్ ఉంటుందన్నారు. ప్రభుత్వ వైద్యశాల పక్కన రూ.50 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు పరిశీలించి, పనులు నాణ్యతగా చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ వైస్ ఛైర్మన్ కృష్ణ, దగ్గుపాటి శ్రీనివాసులు, జిల్లా, మండల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు పచ్చజెండా

● దశలవారీగా కార్యాచరణ
● నగర వాసులకు తప్పనున్న కష్టాలు

అశోక్‌నగర్, న్యూస్‌టుడే : నగరంలోని పలు సమస్యలకు సత్వర పరిష్కారానికి నగరపాలక శ్రీకారం చుట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు ప్రాంతాల్లో అత్యవసరమైన, ప్రాధాన్యత పనులను గుర్తించి వాటికి ఆమోద ముద్ర వేశారు. ఈనేపథ్యంలో గత కౌన్సిల్లో తీర్మానించిన సమస్యలకు పరిష్కారం కాబోతున్నాయి.

● ప్రధానంగా రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, తాగునీరు, వీధిలైట్లు, పారిశుద్ధ్యం తదితర అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఆయా పనులకు టెండర్లు పిలవడంతో కొన్ని పనులకు 13వతేదీ, ఇంకొన్ని పనులకు 14, 18, 20, 21 తేదీ వరకు గడువు విధించారు.

బాగుపడనున్న నగరంలోని భాగ్యనగర్ శివారు ప్రాంతంలోని రోడ్డు

సిమెంటు రోడ్లు.. మురుగు కాలువలు

రాంనగర్‌లో నాలుగు ప్రాంతాల్లో రూ.65 లక్షలు, హమాలీనగర్‌లో రూ.31.03లక్షలు, జనశక్తినగర్‌లో రెండు ప్రాంతాల్లో రూ.15 లక్షలతో సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు.

● భాగ్యనగర్‌లో మురుగు కాలువ రూ.12.08 లక్షలు, సైఫుల్లా వంతెన నుంచి మొదటి రోడ్డుకు వెళ్లే మార్గంలో మురుగు కాలువ నిర్మాణం చేపడతారు.

తాగునీరు, పారిశుద్ధ్యం మెరుగు

పాతూరులో పింక్ టాయిలెట్లు ఆరు ఏర్పాటు చేయడానికి రూ.18.33 లక్షలు కేటాయించారు. తాగునీరుకు సంబంధించి ట్యాంకుల వద్ద సౌకర్యాలు, లిక్విడ్ ఏర్పాటుకు రూ.17 లక్షలు వెచ్చిస్తారు. రంగస్వామి నగర్, రజకనగర్‌లో తాగునీటి బోర్లకు మోటార్లకు రూ.8.16 లక్షలు కేటాయించారు.

● వ్యాపార సముదాయ ప్రాంతాల్లో చెత్త సేకరించడానికి అద్దె ప్రాతిపదికన చేపట్టడానికి రూ.22 లక్షలు వెచ్చిస్తారు.

అత్యవసర పనులకు ప్రాధాన్యం

నగరంలోని అత్యవసర పనులకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఆ క్రమంలోనే అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతాం. ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పిస్తాం. త్వరలోనే నగరంలో కుక్కల సమస్యకు పరిష్కారం చూపబోతున్నాం. **-బాలస్వామి, నగర కమిషనర్**

మేమున్నాం.. మీకు తోడుగా

శ్రీనివాస్‌నగర్ : 8008573000
మూడోరోడ్డు: 8008573002
ఆజాద్‌నగర్: 9652620265

సమస్య : ఎన్టీఆర్ మార్గ్‌లో హైమాస్ట్ దీపాలు కొన్ని వెలుగుతూ ఇంకొన్ని వెలగడం లేదు. **-మారుతీకుమార్**

సమాధానం : దీపాలు సక్రమంగా వెలిగే విధంగా మరమ్మతులు చేయిస్తాం.

సమస్య : వినాయకనగర్‌లోని కే1/17 స్తంభానికి ఉన్న దీపం వెలగడం లేదు. **-ఆనంద్**

సమాధానం : వెంటనే దీపాలు వెలిగే విధంగా చర్యలు తీసుకుంటాం.

(పై ప్రశ్నలకు నగరపాలక డీఈ దాక్షాయణి సమాధానాలు ఇచ్చారు.)

–న్యూస్‌టుడే, అశోక్‌నగర్, శ్రీనివాస్‌నగర్

ప్రమాదాన్ని తప్పించారు

రుద్రంపేట, న్యూస్‌టుడే : మారుతీనగర్ మొదటి క్రాస్‌లో మిద్దె ఎత్తు పెరిగిన వేప చెట్టు ఆకులు రాలి పూర్తిగా ఎండిపోయింది. చెట్టు కొమ్మలు ఇళ్ల మీద, రహదారిపై పడే ప్రమాదం ఉంది. ఈక్రమంలో 'ఎప్పుడు కూలుతుందో?' అనే శీర్షికతో ఈనెల 8న ఇచ్చిన చిత్ర వార్తకు నగర కార్పొరేషన్ అధికారులు స్పందించారు. ఈనెల 11న ఎండిన వేప చెట్టును పూర్తిగా తొలగించి ప్రమాదాన్ని తప్పించారు.

స్పందనకు వందనం

ముళ్లపొదల తొలగింపు

అనంత నగరపాలక, న్యూస్‌టుడే : రోడ్డును కప్పేస్తున్న ముళ్ల పొదళ్లను తొలగించారు. ఈనెల 11న 'రోడ్లను కప్పేస్తున్న ముళ్ల పొదళ్లు' అనే శీర్షికన 'ఈనాడు'లో వచ్చిన చిత్ర వార్తకు కమిషనరు బాలస్వామి తక్షణమే స్పందించారు. ముళ్ల పొదలు తొలగించి ప్రజల సమస్యను తీర్చాలని అధికారులు ఆదేశించారు. నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు జేసీబీతో ఆయా పనులు చేపట్టి సమస్యను పరిష్కరించారు.

ఉద్యోగుల బీమా ప్రీమియం టెండర్లు ఖరారు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగుల కుటుంబాల బీమాకు సంబంధించి ప్రీమియం టెండర్లు ఎట్టకేలకు బుధవారం సాయంత్రం ఖరారు చేశారు. తక్కువగా కోట్ చేసిన స్టార్ బీమా సంస్థకు ఈసారి టెండరును ఖరారు చేశారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో పనిచేసే ఉద్యోగులకు ఏటా బీమా ప్రీమియం బ్యాంకు యాజమాన్యం చెల్లిస్తుంది. ఏటా బీమా ప్రీమియానికి సంబంధించి టెండర్లు పిలుస్తారు. గతేడాది బజాజ్ సంస్థకు ప్రీమియం చెల్లించగా.... ఈసారి స్టార్ కంపెనీ తక్కువగా కోట్ చేయడంతో ఆ సంస్థకే ఖరారు చేశారు.

సంక్షేమ వసతిగృహాల్లో సమస్యలు తీర్చరూ

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే : సంక్షేమ వసతి గృహాల్లోని సమస్యలు తీర్చాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి పరమేశ్, జిల్లా అధ్యక్షుడు గిరి డిమాండ్ చేశారు. బుధవారం బీసీ, సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి ఖుష్బు కొఠారికి విన్నవించారు. తాడిపత్రి ఎస్సీ వసతి గృహంలో శుద్ధ జలం యంత్రం ఏర్పాటు చేయాలని, ప్రహరీ నిర్మాణం చేపట్టాలన్నారు. గుత్తిలోని ఎస్సీ వసతి గృహం విద్యార్థులు రెండున్నర కిలోమీటర్ల దూరంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. గుంతకల్లులో మూసివేసిన బాలిక వసతి గృహం మళ్లీ ప్రారంభించాలన్నారు. ఆత్మకూరు, ఉరవకొండ ప్రాంతాల్లో వసతి గృహాలు కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు.

104 ఉద్యోగులు సమయపాలన పాటించాలిందే!

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే : 104 వాహనాల్లో పనిచేసే ఉద్యోగులు కచ్చితంగా సమయపాలన పాటించాలని, గ్రామాలకు వెళ్లినప్పుడు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ సంబంధిత గ్రామంలో వాహనం ఉంచి ప్రజలకు వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఈ.బి.దేవి తెలిపారు. బుధవారం ఆమె 104 వాహనాల్లో పనిచేసే సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామాలకు వెళ్లినప్పుడు సిబ్బంది వాహనంలో అందుబాటులో లేకపోయినా, సమయానికి కంటే ముందు వాహనం ఉంచకుండా వచ్చేసినా సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోగులకు అందజేసే మందులు, వారికి నిర్వహించాల్సిన వివిధ ఆరోగ్యపరీక్షలకు సంబంధించిన కిట్‌లను అందుబాటులో ఉంచుకోవాలని స్పష్టం చేశారు.

పేద వ్యాపారుల షెడ్లు కూల్చివేత

షెడ్లు కూల్చి, స్తంభాలు నాటారిలా..

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే : జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ స్థలంపై మళ్లీ వివాదం రాజుకుంది. పేద వ్యాపారులకు చెందిన రెండు షెడ్లను జాఫర్ అనే ప్రైవేట్ వ్యక్తి దౌర్జన్యంగా తొలగించడాన్ని ప్రజలు తీవ్రంగా తప్పుబడుతున్నారు. దీనిపై బాధితులు మూడో పట్టణ పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేయకుండా వెనక్కు పంపడంతో ఏకంగా బాధితులు బుధవారం ఎస్పీని ఆశ్రయించారు. అనంతపురం నగరం గుత్తిరోడ్డు హెచ్ఎల్‌సీ సమీపంలో డీసీఎంఎస్‌కు ఎకరాకు పైగా స్థలం ఉంది. ఈ స్థలాన్ని అధికారులు అక్రమ పద్ధతుల్లో అద్దెలకు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరితో ముక్కుపిండి అద్దెలు వసూలు చేయగా, మరికొందరితో ఎలాంటి అద్దె తీసుకోలేదు. ఏళ్లుగా ఇదే తంతు కొనసాగుతోంది. ఎస్.రహంతుల్లా వెల్డింగ్ షెడ్డు, జహంగీర్ టీకొట్టు పెట్టుకున్నారు. వీరిద్దరూ గతంలో రూ.25 వేలు అడ్వాన్సు రూపంలో డీసీఎంఎస్ అధికారులకు ఇచ్చారు. పలు కారణాలతో అడ్వాన్సును తిరిగి వ్యాపారులకు ఇచ్చేశారు. దుకాణాలకు అద్దె నిర్ణయించకుండా వెనక్కి ఎందుకిచ్చారో అర్థం కాలేదని బాధితులు వాపోతున్నారు. అద్దె చెల్లిస్తామని చెబుతున్నా ఎందుకు తమ దుకాణాలు తొలగించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మా ప్రమేయం లేదు

రహంతుల్లా, జహంగీర్‌లు వేసుకున్న షెడ్లకు అద్దె చెల్లించలేదు. పైగా వారు న్యాయవాది నుంచి నోటీసు పంపారు. దీంతో వారిని ఖాళీ చేయించాలని నిర్ణయించాం. షెడ్లు తొలగించే విషయంతో మా ప్రమేయం లేదు.
-నెట్టెం వెంకటేష్, డీసీఎంఎస్ అధ్యక్షుడు

'సఖీ' పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే : ఐసీడీఎస్ అనుబంధ వన్‌స్టాప్ కేంద్రం(సఖీ)లో ఖాళీగా ఉన్న నాలుగు పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పీడీ అరుణకుమారి తెలిపారు. సైకో సోషల్ వర్కర్(మహిళలు మాత్రమే), మల్టీ పర్పస్ స్టాఫ్ కుక్ కేటగిరీలో ఒక్కొక్క పోస్టు, సెక్యూరిటీ గార్డ్/నైట్ వాచ్‌మెన్‌గా రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇవన్నీ ఒప్పంద ప్రాతిపదికన మాత్రమే భర్తీ చేస్తామన్నారు. ఈనెల 13 నుంచి జిల్లా వెబ్‌సైట్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. తమ కార్యాలయంలో ఈనెల 15 నుంచి 25వ తేదీ దాకా భర్తీ చేసిన దరఖాస్తులను స్వీకరిస్తామని ఆమె చెప్పారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా జయమ్మ

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అనంతకు చెందిన జయమ్మ ఎంపికయ్యారు. ఈ నెల 11వ తేదీన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి పురస్కరించుకొని జరుపుకొనే జాతీయ విద్యాదినోత్సవం రోజున విజయవాడలో మైనార్టీ సంక్షేమశాఖ పురస్కారాలు ప్రదానం చేసింది. రాష్ట్ర మంత్రి ఎండీ ఫరూక్ చేతుల మీదుగా బహుమతి ఆమె అందుకున్నారు. ఆమె కుందుర్పి మండలం కరిగానిపల్లిలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు.

ప్రతి విద్యార్థి పారిశ్రామికవేత్త కావాలి

ఎస్కేయూ విభాగాధిపతి మురళీకృష్ణ, వక్త రాజేశ్వరితో ఎంబీఏ విద్యార్థులు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి పారిశ్రామికవేత్త కావాలని సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ ప్రతినిధి రాజేశ్వరి పేర్కొన్నారు. ఎస్కేయూలోని ఎంబీఏ విభాగంలో ఇంటర్‌ప్రెన్యూషిప్‌పై బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. విభాగాధిపతి మురళీకృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. వక్తగా హాజరైన రాజేశ్వరి మాట్లాడుతూ స్టార్టప్‌లపై విద్యార్థులు దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులు ఉద్యోగాల కోసం అన్వేషించకుండా ఉద్యోగాలు కల్పించేస్థాయికి ఎదగాలన్నారు. వినూత్న ఆలోచనలతో అంకురసంస్థలు స్థాపనకు కృషి చేయాలన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ప్రభాకర్, కృష్ణుడు, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఖాళీల వివరాలు ఇవ్వాలి

అనంతపురం విద్య, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల నివేదిక సిద్ధం చేయాలని ఇన్‌ఛార్జి డీఈవో మల్లారెడ్డి పేర్కొన్నారు. స్థానిక సైన్స్ సెంటర్‌లో ఎంఈవోలతో ఆయన సమావేశం నిర్వహించారు. మంజూరైన పోస్టులు, ఖాళీల వివరాలు వెంటనే ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు నమోదుపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. ఎఫ్ఏ, ఎస్ఏ పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కులు ఆన్‌లైన్‌లో వెంటనే నమోదు చేయాలన్నారు. ఉప విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు, ఏఎస్ఓ శ్రీనివాసులు, ఏపీఓ మంజునాథ్ పాల్గొన్నారు.

సంక్షేమ అధికారుల ఐకాస నూతన కమిటీ ఏకగ్రీవం

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే : జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల వసతి గృహాల్లోని సంక్షేమ అధికారుల ఐకాస ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆసంఘం నాయకులు రామునాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఐకాస ఛైర్మన్‌గా రామునాయక్, అసోసియేట్ ప్రసిడెంటుగా మస్తాన్, ప్రధాన కార్యదర్శిగా మారుతి ప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా చంద్రశేఖర్‌బాబు, కోశాధికారిగా సూరాంజనేయులు ఎంపికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఆరుగురు, సంయుక్త కార్యదర్శులుగా ఏడుగురిని ఎంపిక చేశారు.

ఉచిత వైద్యశిబిరం పేదలకు వరం

వైద్యపరీక్షలు చేయించుకుంటున్న ఎస్కేయూ ఇన్‌ఛార్జి వీసీ అనిత

ఎస్కేయూ, న్యూస్‌టుడే : ఉచిత వైద్యశిబిరాలు పేదలకు వరం లాంటివని ఎస్కేయూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య అనిత పేర్కొన్నారు. ఎస్కేయూ ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్-1 ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఎస్కేయూ సమీపంలోని ఆకుతోటపల్లి గ్రామంలో కార్యక్రమం జరిగింది. శివసాయి ఆసుపత్రి వైద్యులు గౌరిశంకర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అపెక్స్ ల్యాబొరేటరీస్ చలపతి రక్తపరీక్షలు చేశారు. స్మార్ట్ ఐ విజన్ రాజగోపాల్ కంటివైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇన్‌ఛార్జి వీసీ అనితతో పాటు రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మురళీధర్‌రావు, ఆచార్యులు రమణ, జీవీ రమణ, ప్రిన్సిపల్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు నిర్ధారణకు ఇంటింటి సర్వే

అనంతపురం(వైద్యం),న్యూస్‌టుడే : కుష్ఠువ్యాధి నిర్ధారణ కోసం ఈ నెల 17వతేదీ నుంచి 30వ తేదీ వరకూ ఇంటిఇంటి సర్వే నిర్వహిస్తున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ ఈ.బి.దేవి తెలిపారు. బుధవారం అనంతపురంలోని జిల్లావైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో కుష్ఠువ్యాధి సర్వేకు సంబంధించిన గోడపత్రాలను ఆమె అధికారులతో కలిసి విడుదల చేసి మాట్లాడారు. ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జయలక్ష్మి, నారాయణస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, డెమోనాగరాజు, త్యాగరాజు, గంగాధర్ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణలో ఆర్యవైశ్యులు

వాసవీ దీక్షలకు 30 ఏళ్లు

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే : నగరంలోని పాతూరు కన్యకాపరమేశ్వరీ ఆలయంలో బుధవారం రాత్రి ప్రధాన సంఘం అనుబంధ సంస్థ శ్రీవాసవీ దీక్ష సమితి ఆధ్వర్యంలో కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చల్లా కృష్ణరంగయ్య, అరుణ్‌కుమార్, ధర్మకర్తనాగరాజు, వాసవీ దీక్షా సమితి అధ్యక్షుడు శ్రీనివాసులు, భజన మండలి అధ్యక్షుడు శ్రీధర్‌లు మాట్లాడుతూ నగరంలో వాసవి దీక్షలు ప్రారంభించి నేటితో 30 ఏళ్లు పూర్తయిందన్నారు. 31వ ఏడాదిలో అడుగిడుతున్న నేపథ్యంలో త్వరలో ప్రారంభం కానున్న మండల,అర్ధ మండల దీక్షలు, మహిళల ప్రత్యేక దీక్షలు, యజ్ఞముడి కార్యక్రమం, విశ్వరూప సందర్శనం తదితర వివరాలు తెలియచేసే కరపత్రాలు విడుదల చేశారు. మరింత సమాచారానికి వాసవి దీక్షా సమితిని సంప్రదించాలని వారు సూచించారు. ఈకార్యక్రమంలో సంఘం, దాని అనుబంధ సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

16న భట్రాజుల కార్తిక వనమహోత్సవం

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లా భట్రాజుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 16న కార్తిక వనమహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి మనోహర్‌కుమార్ బుధవారం తెలిపారు. అనంతపురం శివార్లలో ఉన్న శిల్పారామం (నేషనల్ పార్కు)లో ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళలకు ప్రత్యేకంగా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని భట్రాజులు తమ కుటుంబ సభ్యులతో హాజరై సంతోషంగా గడపాలని కోరారు.

జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు కార్తిక్

అభినందిస్తున్న ప్రిన్సిపల్ బాలకృష్ణ

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: జాతీయస్థాయి అండర్ 11 బ్యాడ్మింటన్ పోటీలకు కార్తిక్ అనే విద్యార్థి ఎంపికయ్యారు. ఆ విద్యార్థి భాష్యం పాఠశాలలో చదువుతున్నాడు. స్కూల్‌గేమ్స్ వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి దక్కించుకొని జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. భాష్యం పాఠశాల ప్రిన్సిపల్ బాలకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

అథ్లెటిక్ పోటీలకు ఎంపిక

అనంతపురం విద్య : కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి లోకేశ్ అండర్-14 జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ఇండియా వారు ఈ నెల 7, 8వ తేదీల్లో శ్రీకాకుళంలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు. హైజంప్‌లో రజత పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రవీణ్ తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీరన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా ప్రగతిపై దృష్టి సారించండి

న్యామద్దల (చెన్నేకొత్తపల్లి): విద్యా ప్రగతిపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని రెండో మండల విద్యాధికారి ప్రసన్నకుమార్ నాయుడు పేర్కొన్నారు. మండలంలోని న్యామద్దల ఎస్సీ కాలనీ, హర్యాయాన్ చెరువు ప్రాథమిక పాఠశాలలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల మార్కుల నమోదు దస్త్రాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన నాణ్యత తనిఖీ చేశారు. మాట్లాడుతూ విద్యలో వెనుక బడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు.

తెరపై ఈనాడు

కమలానగర్ : గంగ : **ఫోనిక్స్,** గౌరి : **మాస్ జాతర,** గాయత్రి : **కృష్ణలీల, కె-ర్యాంప్,** తరంగిణి : **జటాధర,** ఎస్వీ సినిమా : **ఆర్యన్,** నీలిమ : **ప్రిడేటర్ బ్యాడ్‌ల్యాండ్స్,** త్రివేణి, శాంతి : **ది గర్ల్ ఫ్రెండ్,** తేజస్విని, సుధా : **ప్రీ వెడ్డింగ్ షో, డైస్ ఏరియా**

చికిత్స పొందుతూ ఒకరి మృతి

రాప్తాడు, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈఘటన రాప్తాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ శ్రీహర్ష తెలిపిన వివరాల మేరకు రాప్తాడుకు చెందిన మంగళ శ్రీనివాసులు తన భార్యను పిలుచుకొని రావడానికి శుక్రవారం రుద్రంపేట బైపాస్‌కు వెళ్తుండగా రాప్తాడు సమీపంలోని జాతీయరహదారిపై లక్కీనైన్ హోటల్ వద్ద కుక్క అడ్డురావడంతో తప్పించబోయి కిందపడ్డాడు. ఈఘటనలో తీవ్ర గాయాలు కావడంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ఆపరేషన్ చేయగా చికిత్స పొందుతూ బుధవారం చనిపోయినట్లు వైద్యులు తెలిపారు.

మట్కా నిర్వాహకురాలి అరెస్ట్

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే : అనంతపురం నగరంలో ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్కేడీ నగర్‌కు చెందిన మట్కా నిర్వాహకురాలు పద్మావతిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఆమె స్థానికంగా కొంతకాలంగా మట్కా నిర్వహిస్తోంది. ఏజెంట్లను నియమించుకుని పెద్ద ఎత్తున మట్కా ఆడిస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆమె ఇంటిపై ఆకస్మిక దాడి చేశారు. దాడిలో నిందితురాలిని అరెస్టు చేసి, ఆమె వద్ద నుంచి రూ. 15వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

సచివాలయంలో దొంగలు పడ్డారు

రాప్తాడు, న్యూస్‌టుడే : రాప్తాడు మండలం మరూరు గ్రామంలోని సచివాలయంలో దొంగలు పడి టీవీ, బ్యాటరీలు, ఎలక్ట్రికల్ వస్తువులు ఎత్తికెళ్లినట్లు సీఐ శ్రీహర్ష తెలిపారు. మంగళవారం రాత్రి సచివాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి దోపిడీ చేశారన్నారు. రైతు సేవా కేంద్రంలోనూ టీవీ, యూపీఎస్ బ్యాటరీ, అదే ఆవరణలోని సహకార సంఘం కార్యాలయంలోనూ దొంగతనం చేశారన్నారు. బుధవారం మరూరు ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి విజయ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వృథాగా చెత్త తరలింపు వాహనాలు

తుప్పు పట్టిన యంత్రం

చెత్తసేకరణ ఒట్టిదేనా?

రుద్రంపేట, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఆస్తి ప్రజల సొమ్ము..దానిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉంది. రూ.లక్షలు ఖర్చు చేసి నగర కార్పొరేషన్ పరిధిలో చెత్త సేకరణకు వినియోగించే యంత్రాలు ఎక్కడ పడితే అక్కడ వదిలేయడంతో అవి తుప్పు పట్టి, వినియోగానికి పనికి రాకుండా పోతున్నాయి. మారుతీనగర్ మొదటి క్రాస్‌లో ఓ ప్రైవేట్ స్కూల్ ఎదురుగా చెత్త సేకరణకు వినియోగంచే యంత్రాలు నిరూపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఓ యంత్రం పూర్తిగా పనికి రాకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

విద్యుత్తు తీగలు.. ప్రమాద ఘంటికలు

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే : నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్తు తీగలను చెట్టు కొమ్మలు తగులుతూ ప్రమాదంగా ఉన్నాయి. వీటి వల్ల కాలనీల్లో నిత్యం విద్యుత్తు అంతరాయాలు ఏర్పడుతున్నాయి. తీవ్రంగా గాలులు వీచిన సమయంలో చెట్టు కొమ్మలు విద్యుత్తు తీగలకు తగిలి నిప్పు రవ్వలు వస్తున్నాయి. ప్రజలు ఏం క్షణం ఏం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు.

ఈ చిత్రంలో కనిపిస్తున్నది అరవిందనగర్ లోని ప్రభుత్వ బాలికల వసతి గృహం ముందు ఉన్న విద్యుత్తు స్తంభం. నిత్యం వందల మంది విద్యార్థులు ఈ స్తంభాన్ని దాటుకుంటూ వసతి గృహంలోకి రాకపోకలు సాగిస్తుంటారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా విద్యుత్తు తీగల నుంచి నిప్పు రవ్వలు పడే అవకాశాలు ఉన్నాయి.

రెండో రోడ్డు వైకాపా కార్యాలయ సమీపంలో విద్యుత్తు తీగలకు చెట్టు కొమ్మలు ప్రమాదంగా తాకుతున్నాయి. ఇదే చెట్టు కింద తాగునీటి శుద్ధజల యంత్రం ఉంది. ప్రజలు నిత్యం తాగునీటి కోసం వస్తుంటారు. గాలి వీచిన సమయాల్లో చెట్టు కొమ్మలు విద్యుత్తు తీగలకు తగులుతున్నాయి. కొమ్మల కారణంగా విద్యుత్తు తీగలు తెగిపడే ప్రమాదం ఉంది.

జీసస్‌నగర్ చర్చి సమీపంలో ఇలా విద్యుత్తు స్తంభానికి చెట్టు తీగలు ప్రమాదంగా అల్లుకున్నాయి. రాత్రిళ్లు తరచూ విద్యుత్తు అంతరాయం ఏర్పడుతోందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. విద్యుత్తు అంతరాయం కారణంగా రాత్రిళ్లు విషపురుగులు సంచరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్టు తీగలను తొలగించి ప్రమాదాలు తప్పించాలని కోరుతున్నారు.

(c) eenadu

దేవగుడిపల్లికి చంద్ర కాంతులు

గృహ నిర్మాణ లబ్ధిదారులకు తాళాలు అందిస్తున్న సీఎం చంద్రబాబు

నూతన గృహ ప్రవేశం అనంతరం ముంతాజ్‌తో సీఎం చిరు దరహాసం

హెలికాప్టర్ దిగి అభివాదం చేస్తున్న సీఎం

ముస్లిం చిన్నారులతో ముఖ్యమంత్రి ముచ్చట్లు

చిన్నమండెం, రాయచోటి, రామాపురం, న్యూస్‌టుడే : 'ప్రజలు కులం, మతం, ప్రాంతం అని చూడకుండా అభివృద్ధి నిరంతరం కొనసాగేందుకు మద్దతుగా నిలవాలి' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. చిన్నమండెం మండలం దేవగుడిపల్లిలో పేదల ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో ఆయన బుధవారం పాల్గొన్నారు.

ప్రజా వేదికలో మాట్లాడారు. ఇవీ ఆ వివరాలు.. ● రాయచోటి ప్రాంతానికి సాగు, తాగునీటి కష్టాలు లేకుండా చూస్తాం. ● వెలిగల్లు ప్రాజెక్ట్ కింద అన్ని చెరువులను నీటితో నింపేలా కలెక్టర్‌కు అనుమతిచ్చాం. ● శ్రీనివాసపురం రిజర్వాయర్‌ను హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా నింపి చిత్తూరుకు నీరు తీసుకెళ్తాం. ● నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీరు అందిస్తాం. రాయచోటి నియోజకవర్గంతో పాటు తంబళ్లపల్లె, పీలేరు, రాయచోటి పురపాలకకు తాగునీరందిస్తాం.

● **సాదర స్వాగతం:** ఉదయం 11.40 గంటలకు హెలికాప్టర్‌లో సీఎం చిన్నమండెం చేరుకున్నారు. మంత్రులు పార్థసారథి, రాంప్రసాద్ రెడ్డి, కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్, ఎమ్మెల్యేలు అరవ శ్రీధర్, నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, తెదేపా నేత చమర్తి జగన్‌మోహన్‌రాజు, తితిదే బోర్డు మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్‌రాయుడు స్వాగతం పలికారు.

● **మార్గదర్శకులకు బాధ్యతలు :** ● దేవగుడిపల్లిలో లబ్ధిదారులతో ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా ఇళ్లల్లోకి సీఎం గృహ ప్రవేశం చేయించారు. గ్రామస్థులను ఆప్యాయంగా పలకరించారు. అంతకు ముందు ప్రజా వేదికలో లబ్ధిదారులకు ఇంటి తాళాలతో పాటు ఎనర్జీ సేవింగ్ పరికరాలను అందజేశారు. ● 54 బంగారు కుటుంబాల బాధ్యతను 13 మంది మార్గదర్శకులకు అప్పగించారు. ● సీఎం పర్యటన ఆద్యంతం పలకరింపులు, చలోక్తులతో సాగింది.

ఇళ్ల పట్టాలతో సభలో మహిళా లబ్ధిదారులు


రాజీవ్ కాలనీలో మహిళలతో మాటామంతీ

అక్రమాలు గ్లోబల్

కిడ్నీ రాకెట్ ఘటనకు కేంద్ర బిందువైన గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో అన్నీ ఉల్లంఘనలేనని ప్రత్యేక బృందం విచారణలో తేలింది. ప్రధానంగా వైద్యశాఖ నిబంధనలను ఉల్లంఘించి ఇక్కడ కిడ్నీ శస్త్రచికిత్సలు చేయడం, అక్రమ వ్యాపారం జరుగుతున్నట్లు విచారణలో తేలింది. ప్రజల ప్రాణాలకు భరోసా కల్పించాల్సిన వైద్యులే ఇలా అడ్డదారుల్లో వెళ్తూ పేదల రక్తాన్ని సొమ్ముగా చేసుకుంటున్నారు. దీంతో ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. **- న్యూస్‌టుడే, మదనపల్లె వైద్యం, పట్టణం**

గ్లోబల్ ఆసుపత్రిని జప్తు చేస్తూ నోటీసును అతికిస్తున్న వైద్య బృందం

ఉల్లంఘన ఇలా..

మదనపల్లెలోని గ్లోబల్ మల్టీ స్పెషాలిటి ఆసుపత్రిలో నిబంధనలను ఉల్లంఘించి చికిత్సలు, శస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు సమాచారం. మృతురాలు యమునకు శస్త్రచికిత్స చేసి కిడ్నీ తొలగించిన వైద్యుడు కర్ణాటక రాష్ట్రానికి చెందిన వారు కావడం గమనార్హం.

● కిడ్నీ ఇవ్వాలనుకునే వ్యక్తి జిల్లా కలెక్టర్ వద్ద ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్ తీసుకోవాలి. కలెక్టర్ స్థాయి కంటే తక్కువ స్థాయి అధికారి ఇచ్చే ధ్రువీకరణ చెల్లుబాటు కాదు. దీంతో పాటు డీఎన్ఏ రిపోర్టు కూడా అందజేయాలి.

● ఈ రెండు పత్రాలు తీసుకుని కిడ్నీ మార్పిడి అనుమతి కోరుతూ ప్రత్యేక కమిషన్‌కు దరఖాస్తు చేయాలి. కమిషన్ ఇచ్చిన ధ్రువీకరణ పత్రం స్థానిక డీఎస్పీకి ఇచ్చి అనుమతి పొందాలి.

నిబంధనలు ఏం చెబుతున్నాయంటే

● కుటుంబ సభ్యులు లేనిపక్షంలో కోర్టును ఆశ్రయించి అనుమతి పొందాల్సి ఉంటుంది. ఈ విభాగానికి చెందిన వైద్య నిపుణులు ఆ రాష్ట్రంలోని మెడికల్ కౌన్సిల్ ద్వారా ధ్రువీకరణ పొందాల్సి ఉంటుంది.

● ఒక రాష్ట్రంలో తీసుకున్న మెడికల్ కౌన్సిల్ ధ్రువీకరణ ద్వారా వేరే రాష్ట్రంలో శస్త్రచికిత్స చేయరాదని వైద్య నిపుణులు చెబుతున్నారు.

● ఒకవేళ చేయాలనుకుంటే ఆ రాష్ట్రం అందజేసిన మెడికల్ కౌన్సిల్ సర్టిఫికెట్‌ను రద్దు చేసుకుని తాను ఎక్కడైతే పనిచేయాలనుకుంటారో ఆ రాష్ట్రంలో ధ్రువీకరణ పత్రం పొందాల్సి ఉంటుంది. శస్త్రచికిత్స చేసే ముందు గుండె సంబంధిత, అనస్తీషియా వైద్యులు ఫిట్‌నెస్ పత్రం ఇవ్వాల్సి ఉంటుంది.

రెండు జిల్లాలకు 1,140 టన్నుల యూరియా

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: రెండు జిల్లాలకు 1,140 టన్నుల యూరియా వచ్చింది. కడప రైల్వేస్టేషన్ రేక్ పాయింట్‌కు వచ్చిన యూరియా వివరాలను కడప జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రానాయక్ బుధవారం పరిశీలించారు. కడపకు వచ్చిన 942 టన్నుల్లో ప్రైవేట్ డీలర్లకు 342, మార్క్‌ఫెడ్‌కు 600 టన్నులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లాకు సంబంధించి వచ్చిన 198 టన్నుల్లో ప్రైవేట్ డీలర్లకు 60, మార్క్‌ఫెడ్‌కు 138 టన్నులు కేటాయిస్తున్నట్లు ఆయన వివరించారు.

వివరాలు తెలుసుకుంటున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రానాయక్

కిడ్నీ రాకెట్‌లో వైద్యాధికారే సూత్రధారి

◆ మరికొందరు వైద్యుల ప్రమేయం
◆ కేసు నీరుగార్చేందుకు తీవ్ర యత్నాలు

మదనపల్లెలో వెలుగు చూసిన కిడ్నీ రాకెట్‌లో ప్రధాన సూత్రధారి, పాత్రధారి జిల్లా వైద్యశాలల సమన్వయ అధికారి ఆంజనేయులు కావడం సంచలనం రేకెత్తించింది. మొత్తం ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేయగా ఇతనే ఏ-1 కావడం గమనార్హం. జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో అక్రమాలు జరగకుండా అడ్డుకోవాల్సిన బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వైద్యుడే దీని వెనుక నిలవడం జిల్లా మొత్తం ఒక్కసారిగా ఉలిక్కి పడేలా చేసింది. గ్లోబల్ ఆసుపత్రిలో ముగ్గురు వైద్యులు ఉండగా ఒక్క వైద్యుడిపైనే కేసు నమోదు చేయడంపై కూడా పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇతర వైద్యుల హస్తం ఉన్నా ఒక్కరినే బాధ్యుడిని చేయడం వెనుక అంతర్యమేమిటనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. **- న్యూస్‌టుడే, మదనపల్లె వైద్యం**

● సాధారణంగా అన్ని ప్రైవేటు ఆసుపత్రులపై జిల్లా వైద్యశాఖ అధికారులు, స్థానిక వైద్యాధికారులు నిఘా వేసి పరిశీలించాల్సి ఉంది. అయితే ఏదైనా ప్రమాదకర సంఘటన జరిగిన సమయంలో తప్ప మిగతా సమయాల్లో తనిఖీల ఊసెత్తడం లేదు. ఇదే అదునుగా జిల్లాలో కొన్ని ప్రైవేటు వైద్యశాలలు అక్రమాలకు తెరలేపుతున్నాయి.

● మదనపల్లె నుంచి 900 కిలోమీటర్ల దూరంలో ఉన్న విశాఖపట్నం వాసులతో ఇక్కడున్న వారు పరిచయాలు పెంచుకుని కిడ్నీ అక్రమ రవాణా రాకెట్‌ను నిర్వహించారని బయట పడటంతో దీని వెనుక ఇంకా ఎంతమంది ఉన్నారోనని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

● ఒకప్పుడు హైదరాబాదు, విశాఖపట్నం వంటి పెద్ద పెద్ద నగరాలకే పరిమితమై కిడ్నీల అక్రమ రవాణా నేడు జిల్లాలకు పాకుతోంది. మదనపల్లె లాంటి పట్టణాల్లో గుట్టుచప్పుడు కాకుండా అక్రమ రవాణా సాగిస్తూ యథేచ్ఛగా తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. మదనపల్లెలో బయటపడిన కిడ్నీ అక్రమ రవాణా వ్యవహారమే ఇందుకు నిదర్శనం. ప్రైవేటు ఆసుపత్రులపై వైద్యశాఖ అధికారుల నిఘా లేకపోవడంతో ఇలాంటి అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు బలంగా విన్పిస్తున్నాయి.

ఆపరేషన్ కిడ్నీ.. వెల రూ.50 లక్షలు

ఆపరేషన్ కిడ్నీలో భాగంగా పోలీసులు చేపట్టిన విచారణలో అనేక వివరాలు వెలుగు చూశాయి. ఒక్కో కిడ్నీ అమ్మకానికి రూ.50 లక్షలు వైద్యులు డిమాండ్ చేస్తున్నట్లు తేలింది. శస్త్ర చికిత్స చేసేందుకు బెంగళూరు నుంచి వచ్చే ప్రత్యేక వైద్యుడికి రూ.5 లక్షలు, అమ్ముకునే బాధితులకు రూ.8 లక్షలు చెల్లిస్తున్నట్లు తేలింది.

గ్లోబల్ ఆసుపత్రిలో తనిఖీలు చేస్తున్న వైద్యశాఖ అధికారుల, పోలీసులు

మృతిచెందిన యమున (పాత చిత్రం)

జిల్లాలో పరిస్థితి ఇది

ప్రైవేటు ఆసుపత్రులు: 184
కిడ్నీ ఆసుపత్రులు 2 (మదనపల్లెలోనే ఉన్నాయి)
డయాలసిస్ కేంద్రం 1 (మదనపల్లె)
బాధితులు : 120

సహకరించిన ఇతర వైద్యులు, సిబ్బందికి రూ.10 లక్షల వరకు అందజేస్తున్నారు. ఇలా ఒక్కో కిడ్నీ అమ్మినందుకు రూ.25 లక్షల వరకు ఖర్చులు పోనూ నిర్వాహకులు రూ.25 లక్షలు వరకు వెనకేసుకుంటున్నారు. కిడ్నీ రాకెట్‌లో స్థానికులైతే ఇబ్బందులు ఎదురవుతాయని బయట ప్రాంతాలకు చెందిన వారిని ఎంపిక చేసుకుని ఇక్కడ శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఈ వ్యవహారం ఎంతకాలంగా జరుగుతోందన్నది పోలీసు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

● గతంలో కూడా పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో లింగ నిర్ధారణ చేస్తున్నారని ఆరోపణలు వచ్చినా అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి వెళ్లిపోయారు. పలు ప్రైవేటు ఆసుపత్రులను జప్తు చేసినా విచారణ సమయంలో తూతూమంత్రంగా ముగించారు. ఇప్పుడు కిడ్నీ అక్రమ రవాణా వ్యవహారంలో అలాగే చేస్తారని ఆరోపణలు వస్తున్నాయి.

● ఈ విషయమై డెమో దేవ శిరోమణి మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రుల్లో అక్రమాలకు పాల్పడితే ఎలాంటి వారినైనా ఉపేక్షించేది లేదని చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం బయట పడిన కిడ్నీ అక్రమ రవాణాపై కూడా శాఖాపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు.

● ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటుకు చెందిన 12 డయాలసిస్ కేంద్రాలు ఉండగా 900 మంది వరకు చికిత్స పొందుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో కేవలం కిడ్నీలో రాళ్లు తొలగించడం, డయాలసిస్ చికిత్సలు అందించడానికి మాత్రమే అనుమతి ఉంది. జిల్లాలో ఎవరికి కిడ్నీ మార్పిడి చేసేందుకు అనుమతి లేదని వైద్యాధికారులు అంటున్నారు.

● ప్రతి నెల ప్రైవేటు ఆసుపత్రులను తనిఖీ చేసి చెక్ లిస్ట్ ప్రకారం పరిశీలించాల్సి ఉంటుంది. అలాగే ప్రతి మూడు నెలలకు ఒకసారి అన్ని ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించి లోటుపాట్లపై అవగాహన కల్పించాలి.

● జిల్లాలో ఇటీవల కాలంలో ఈ అవగాహనా కార్యక్రమాలు, తనిఖీలు నిర్వహించలేదు. గతంలో పీలేరు, మదనపల్లెలో స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన సమయంలో మాత్రమే సమావేశం నిర్వహించారు. తర్వాత పట్టించుకోలేదు.

ఇంతింతై.. స్త్రీశక్తి 5 కోట్ల అంతై



కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: 'కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం దిగ్విజయంగా అమలవుతోంది. ఉచిత ప్రయాణంతో మహిళలు ఆలయాలు, పుణ్యక్షేత్రాలను సంతోషంగా సందర్శించుకుంటున్నారు' అని కడప ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూలనాగరాజు అన్నారు. కడపలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇవీ ఆ వివరాలు...

● జోన్ వ్యాప్తంగా నెలకు రూ.390 కోట్లు ఆదాయం సమకూరుతోంది.

● స్త్రీశక్తి పథకానికి జోన్ వ్యాప్తంగా అక్టోబరు వరకు రూ.207 కోట్లను ప్రభుత్వం వెచ్చించింది.

● ఆగస్టు 15 నుంచి అక్టోబరు వరకు జోన్ పరిధిలో అయిదు కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

● కడప ఆర్టీసీ జోన్(కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు) పరిధిలో నాలుగు వేల బస్సులు నడుస్తున్నాయి. అందులో ప్రత్యేకించి 2,921 వరకు మహిళలకు తిప్పుతున్నాం.

● నానాటికీ రద్దీ పెరుగుతున్న దృష్ట్యా జోన్‌కు మరో 1,000 కొత్త బస్సులు వచ్చే అవకాశముంది.

● స్త్రీశక్తి పథకంతో ఒక్కో కుటుంబానికి నెలకు రూ. 5 వేల వరకు ఆదా అవుతోంది.

● కార్తిక మాసం సందర్భంగా జోన్ వ్యాప్తంగా వంద బస్సులు నడుపుతున్నాం. రూ.5 కోట్ల ఆదాయం వచ్చింది.

మాట్లాడుతున్న కడప ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు

అతనో మేత.. ఆమె ఓ కీలుబొమ్మ!

◆ వైకాపా నేత అరాచకాలకు అండదండలు!

ఈ చిత్రంలోని ఇంటి నిర్మాణానికి ఇది వరకు కురవంక పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన అధికారిణి అనుమతులిచ్చింది. వైకాపాకు చెందిన వ్యక్తి రహదారి అడ్డంగా ఇంటి నిర్మాణం చేపట్టారు. ఇందులో మదనపల్లెలో దందాలకు పాల్పడే మహిళ ప్రమేయం ఉండగా ఆపై నియోజకవర్గ కీలక నేత మహిళా అధికారిణి ద్వారా అక్రమాలు చేయిస్తున్నారు. కురవంక పంచాయతీలోకి రాకపోకలకు వీలుగా ఉండే సర్వే నంబరు 420/14లో రహదారిపై వైకాపా వ్యక్తి ఇంటి నిర్మాణం చేపట్టారు. దీనిపై ప్రజాసంఘాలు సైతం పోరాటం చేసినా ఫలితం లేదు. ఇంటి నిర్మాణం మాత్రం కొలిక్కి వచ్చింది. ఇలాంటి అక్రమాలు కోకొల్లలుగా మదనపల్లె నియోజకవర్గంలో నిరంతరం సాగుతున్నాయి. **- ఈనాడు, కడప**

● మదనపల్లె మండలంలో పంచాయతీ కార్యదర్శి నియోజకవర్గ వైకాపా నేత చేతిలో కీలుబొమ్మగా మారింది. మదనపల్లె జిల్లా కేంద్రం అవుతుండడంతో చుట్టూ ఉన్న గ్రామ పంచాయతీల్లో భూముల ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. ఇదే సమయంలో కీలక నేత అరాచకాలు మితిమీరిపోయాయి. గ్రామ పంచాయతీ అధికారాలు కార్యదర్శి చేతిలో ఉండటంతో నిర్మాణాలకు అనుమతులు, పన్నులు వసూళ్లు జరుగుతుంటాయి. కీలక నేత మహిళా అధికారిణి చేతిలో పెట్టుకుని తనకు అవసరమైన పంచాయతీకి డిప్యుటేషన్‌పై నియమించుకోవడం, ఆమె ద్వారా అక్రమాలు సాగిస్తున్నారు. ఇదే విధంగా కురవంక గ్రామానికి వెళ్లే దారిలో ఇంటి నిర్మాణానికి అక్రమ అనుమతులిచ్చారు. సమీపంలో కీలక నేత ఎకరాకు పైగా భూమిని ఆక్రమించారు. రహదారి మూసివేత ద్వారా ప్రయోజనం ఉండటంతో వైకాపా నేత ఇంటి నిర్మాణానికి అవకాశం కల్పించారు. పురపాలక సంఘంలో దినసరి మార్కెట్, వారపు సంత వేలంలోనూ వైకాపా పెత్తనం, దోపిడీ జరుగుతున్నా పట్టించుకోలేదు.

పంచాయతీ కార్యదర్శి మంజుల సస్పెన్షన్

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: కోళ్లబైలు గ్రామ పంచాయతీ కార్యదర్శి మంజులను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు బుధవారం జిల్లా పంచాయతీ అధికారిణి రాధమ్మ చెప్పారు. గ్రామ పంచాయతీల్లోని పన్ను, పన్నేతర వసూళ్లు, ఫీజులు తదితర లావాదేవీలకు సంబంధించి స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా యూపీఐ, ఆన్‌లైన్ మోడ్‌లో మాత్రమే చెల్లింపులు, వసూళ్లు చేయాలని పీఆర్ కమిషనర్ ఈ ఏడాది ఏప్రిల్‌లో ఉత్తర్వులు జారీ చేశారన్నారు. మంజుల చేతివాటం ప్రదర్శించి, గ్రామ పంచాయతీలో పన్నులకు నగదు వసూలు చేసి రసీదుల ద్వారా ఇచ్చినట్లు బాధితులిచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. వివిధ అక్రమాలు రుజువు కావడంతో చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

ఆశాజనకంగా టమాట ధరలు

కలకడ, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని దినసరి మార్కెట్‌లో టమాట ధరలు గత రెండు రోజులుగా ఆశాజనకంగా ఉన్నాయి. మూడు రోజుల వరకు 15 కిలోల టమాట పెట్టె రూ.70 నుంచి రూ.270 వరకు అమ్ముడుపోయాయి. మార్కెట్‌కు కాయలు రావడం తగ్గుముఖం పట్టడంతో ధరలు పెరుగుతున్నాయి. బుధవారం కలకడ మార్కెట్‌లో 15 కిలోల పెట్టె ధరలు రూ.200 నుంచి రూ.500 వరకు అమ్ముడు పోయాయి. దీంతో రైతులకు కొంత ఊరట లభించింది. వర్షాలు కురవడంతో తోటలు ఎక్కువగా దెబ్బతిన్నాయి. కాయలకు మచ్చలు రావడంతో నాణ్యత తగ్గి పడేయాల్సి వచ్చింది.

నేటి నుంచి విభిన్న ప్రతిభావంతులకు శిబిరాలు

పీలేరు, న్యూస్‌టుడే: సహిత విద్య భవిత కేంద్రాల్లో ఉన్న విభిన్న ప్రతిభావంతులైన పిల్లలకు అవసరమైన పరికరాల పంపిణీ చేసేందుకు అర్హులను ఎంపిక చేసేందుకు గురువారం నుంచి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు భవిత కేంద్రాలకు బుధవారం సమాచారం వచ్చింది. గురువారం రాజంపేటలో, 14న రాయచోటి, 15న పీలేరు, 17న తంబళ్లపల్లె, 18న మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నతా పాఠశాలల్లో శిబిరాలు జరగనున్నాయి. శిబిరం జరిగే ప్రాంతానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని భవిత కేంద్రాల్లో ఉన్న విభిన్న ప్రతిబావంతులైన పిల్లలను కేంద్రాల నిర్వాహకులు తీసుకురావాలని అధికారులు కోరారు. శిబిరాల్లో 'అలింకో' సంస్థ ఆధ్వర్యంలోని నలుగురు వైద్యులు పిల్లలను పరిశీలించి వారికి అవసరమైన పరికరాల వివరాలను నమోదు చేసుకుంటారు. ఎంపికైన వారికి ప్రభుత్వపరంగా ఉచితంగా పరికరాలను పంపిణీ చేస్తారు.

అటల్ ప్రయోగశాల.. పరిశోధనలు పెరిగేలా!

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి వారిని పరిశోధనల దిశగా ప్రోత్సహించడమే లక్ష్యంగా 2016 నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తోంది. ప్రస్తుత ఏడాది దేశవ్యాప్తంగా మరో 50 వేల అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో జిల్లా నుంచి పలు పాఠశాలలకు ఆ భాగ్యం దక్కనుంది. దీంతో నిధులతో పాటు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తుంది.

విద్యార్థులకు ఉపయోగం: అటల్ టింకరింగ్ ల్యాబ్ అనేది నీతి అయోగ్ నిర్వహించే పథకాల్లో ముఖ్యమైంది. ల్యాబ్‌ను మంజూరు చేసే ఒక్కో పాఠశాలకు రూ.12 లక్షలు నిధులు విడుదల అవుతాయి. నిర్వహణకు ఏటా రూ.2 లక్షలు అందుతాయి. త్రీడీ ప్రింటర్, కంప్యూటర్, ప్రొజెక్టర్, రోబోటిక్స్, మెకానిక్ టూల్స్, ఇతర పరికరాలతో విద్యార్థులు ప్రయోగశాలల్లో నవ్యావిష్కరణలు తయారు చేసేలా సైన్స్ టీచర్లు ప్రోత్సహిస్తారు. దీంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా ఉన్నతంగా ఎదగడానికి ఈ ల్యాబ్‌లు ఎంతో పయోగపడుతున్నాయి.

జిల్లాకు మంజూరు అయినవి

డివిజన్	గతంలో	ప్రస్తుతం
రాయచోటి	13	11
రాజంపేట	05	08
మదనపల్లె	09	08

జిల్లాలో ఇలా..

జిల్లాకు 27 నూతన అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు మంజూరయ్యాయి. వీటి నిర్వహణకు సంబంధించి ఏటా రూ.2 లక్షలు ప్రభుత్వం వెచ్చిస్తోంది.

విద్యార్థులకు వరం

గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యాలను పెంపొందించడానికి అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు అద్భుతంగా తోడ్పడుతున్నాయి. విద్యార్థులు తమ సృజనాత్మకతను పెంపొందించుకుంటూ.. నూతన ఆవిష్కరణలు చేయడానికి ఈ ల్యాబ్‌లు ఎంతో ఉపయోగపడతాయి. విద్యార్థులు ఈ ల్యాబ్‌లను సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చు.

- మార్ల ఓబుల్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి

పులుల గణనపై శిక్షణ

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: పులుల గణనపై కడప, కర్నూలు, నంద్యాల అటవీ విభాగాలకు చెందిన సిబ్బందికి కడప నగర వనంలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా M-STrIPES మొబైల్ యాప్ ద్వారా పులుల జాడను నమోదు చేసే విధానం, జీపీఎస్ ఆధారిత ట్రాకింగ్ పద్ధతులు, క్షేత్రస్థాయి సర్వేలో ఉపయోగపడే సాంకేతిక అంశాలపై కడప డీఎఫ్‌వో వినీత్‌కుమార్ వివరించారు. అటవీ ప్రదేశాల్లో పనిచేసే ప్రతి సిబ్బందికి ఈ రకమైన శిక్షణ అత్యవసరమన్నారు. శాస్త్రీయ పద్ధతులతో వన్యప్రాణి సంపదను కాపాడగలుగుతామని చెప్పారు.

మాట్లాడుతున్న కడప డీఎఫ్‌వో వినీత్ కుమార్

కట్టెలతో వంట.. కళ్లు మంట!

గ్యాస్‌బండ భారమైన వేళ పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వాహకులు గత్యంతరం లేక విద్యార్థులకు పొగబెడుతున్నారు. కట్టెలపై చేస్తున్న వంటలతో బడులు పొగచూరడంతో పాటు విద్యార్థులకు శ్వాసకోశ ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో గ్యాస్‌పై భోజనాన్ని వండాలని నిర్వాహకులను ఆదేశించినా కట్టెల పొయ్యిలపైనే వంటలు సాగిస్తున్నారు. పెరిగిన ధరలతో గ్యాస్‌తో వంటలు వండలేమని చేతులెత్తేస్తున్నారు. గాలివీడు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 480 మంది విద్యార్థులుండగా వంట గదులు లేవు. దీంతో రేకులు షెడ్డులో కట్టెల పొయ్యిపై వంట చేస్తున్నారు. ఈ తరహాలో జిల్లాలో పలు పాఠశాలలు పొగచూరుతున్నాయి.

- న్యూస్‌టుడే, గాలివీడు

ప్రసంగిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

అభివృద్ధిలో రాయచోటి ముందడుగు

రాయచోటి, చిన్నమండెం, న్యూస్‌టుడే: అభివృద్ధిలో రాయచోటి నియోజకవర్గం ముందడుగు వేసిందని రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. చిన్నమండెం మండలం దేవగుడిపల్లి వద్ద బుధవారం నిర్వహించిన ప్రజా వేదికలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 16 నెలల కాలంలోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రూ.300 కోట్లతో జల్‌జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి తాగునీరు ఇచ్చే పథకం పనులు ప్రారంభమయ్యాయన్నారు. రూ.70 కోట్లతో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేశామన్నారు. గత 30 ఏళ్లుగా 50 పడకల ఆసుపత్రిగా ఉన్న రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిని 150 పడకలకు పెంచామన్నారు. రూ.30 కోట్లతో తాగునీటి బోర్లు వేసి నీటి ఎద్దడిని నివారించగలిగామని తెలిపారు. రూ.25 కోట్లతో వెలిగల్లు కాలువల ఆధునీకరణ, చెరువులకు గ్రావిటీ ద్వారా నీటి సరఫరా పనులకు సీఎం నిధులు మంజూరు చేయడం సంతోషాన్నిచ్చిందని ఆయన చెప్పారు. రానున్న మూడన్నరేళ్లల్లో మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

మాయలోళ్లు.. మామూలోళ్లు కాదు

- కన్నీటి పర్యంతమైన యమున తల్లిదండ్రులు
- కిడ్నీ రాకెట్ వ్యవహారంపై పలుకోణాల్లో విచారణ

మదనపల్లె నేరవార్తలు, పట్టణం న్యూస్‌టుడే : 'అమ్మా స్నేహితులతో కలిసి అరకు వెళ్తున్నా' అని చెప్పి వెళ్లిన నా బిడ్డ ఇలా మదనపల్లెకు వచ్చి చనిపోయిందే అంటూ కిడ్నీ తొలగించగా మృతి చెందిన యమున తల్లిదండ్రులు సూరమ్మ, నరసింగరావు కన్నీటి పర్యంతమయ్యారు. మదనపల్లెలోని గ్లోబల్ ఆసుపత్రిలో విశాఖపట్నం చెందిన యమునకు ఆదివారం శస్త్రచికిత్స చేసి కిడ్నీ తీసిన తరువాత సోమవారం ఆమె మృతి చెందింది. ఈ విషయం తెలుసుకుని ఆమె తల్లిదండ్రులు విశాఖపట్నం నుంచి మదనపల్లెకు మంగళవారం వచ్చారు. సోమవారం యమున చరవాణి నుంచి ఎవరో ఫోన్ చేసి మీ బిడ్డ కిడ్నీ అమ్ముకునేందుకు వచ్చి మూర్ఛ రావడంతో చనిపోయిందని చెప్పారంటూ వారిద్దరూ విలపించారు. తమ బిడ్డతో సన్నిహితంగా ఉన్న సూరిబాబుకు ఫోన్ చేసి అడిగితే కిడ్నీ వ్యవహారం బయటకు వచ్చిందని వాపోయారు. తమ బిడ్డకు తిండికి ఎలాంటి ఇబ్బంది లేదని, ఎందుకు కిడ్నీ అమ్ముకునేందుకు వచ్చిందో తెలియడం లేదని వారు కన్నీటి పర్యంతమయ్యారు. తమ బిడ్డ యమున మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

విశాఖపట్నం నుంచి మదనపల్లెకు వచ్చిన యమున తల్లిదండ్రులు, బంధువులు

అనుమతులు లేకున్నా కిడ్నీ శస్త్రచికిత్సలు

మదనపల్లె గ్లోబల్ ఆసుపత్రిలో యమున మృతి చెందిన విషయం బయటకు రావడంతో పోలీసులు విచారణ ప్రారంభించారు. ఆసుపత్రి నిర్వాహకుల్లో ఒకరైన డీసీహెచ్ఎస్ డాక్టర్ ఆంజనేయులును బుధవారం ఉదయాన్నే అదుపులోకి తీసుకుని విచారణ మొదలు పెట్టారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రం ఇన్‌ఛార్జి బాలరంగడు, కదిరి డయాలసిస్ కేంద్రంలో పనిచేసే మెహరాజ్‌లకు విశాఖపట్నానికి చెందిన పద్మ, సత్యతో పరిచయం ఉందని.. ఈ నేపథ్యంలో వారిద్దరి ద్వారానే కిడ్నీ మార్పిడికి యమునను మదనపల్లెకు పిలిపించినట్లు తెలిసింది. మదనపల్లెలోని గ్లోబల్ ఆసుపత్రిలో కిడ్నీ ఆపరేషన్లకు సంబంధించి ఎలాంటి అనుమతులు లేకున్నా అక్రమంగా శస్త్రచికిత్స చేసినట్లు పోలీసులు నిర్ధారించారు.

వైద్యఆరోగ్యశాఖ అధికారుల విచారణ

మదనపల్లెలోని గ్లోబల్ ఆసుపత్రిలో జరిగిన కిడ్నీ అక్రమ ఆపరేషన్ వ్యవహారంపై డీఈఎంఓ దేవశిరోమణి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రమేశ్‌బాబు, పీపీ యూనిట్ ఇన్‌ఛార్జి, 104 నోడల్ అధికారి డాక్టర్ శ్రీధర్, డిప్యూటీ హెచ్ఈఓ రాజగోపాల్, 104 ఓఈ ప్రవీణ్, టీబీ సూపర్‌వైజర్ ప్రభాకర్‌తో కూడిన బృందం విచారణ నిర్వహించింది. మదనపల్లె డయాలసిస్ కేంద్రానికి వెళ్లి బాలరంగడు గురించి ఆరా తీశారు. గ్లోబల్ ఆసుపత్రిలో రికార్డులు, ఆపరేషన్ థియేటర్లు పరిశీలించి వివరాలు నమోదు చేశారు. జిల్లా అధికారుల ఆదేశానుసారం ఆసుపత్రిని తాత్కాలికంగా సీజ్ చేశారు. కదిరి డయాలసిస్ కేంద్రంలోనూ విచారణ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

డయాలసిస్ కేంద్రంలో అపోలో రీజినల్ మేనేజర్‌తో వివరాలు తెలుసుకుంటున్న వైద్య బృందం

మదనపల్లె, కదిరి సిబ్బందితో పరిచయంపై ఆరా!

మదనపల్లె ఆసుపత్రి డయాలసిస్ కేంద్రం ఇన్‌ఛార్జి బాలరంగడు, కదిరి ఆసుపత్రి డయాలసిస్‌లో పనిచేసే మెహరాజ్‌కు విశాఖపట్నంలో ఉన్న మధ్యవర్తులు ఏవిధంగా పరిచయమయ్యారు. గతంలో వీరు ఏమైనా ఇంకా ఇలాంటి కిడ్నీ మార్పిడిలో పాల్గొన్నారా..? అని పోలీసులు విచారణ చేస్తున్నారు. బాలరంగడు మదనపల్లె డయాలసిస్ కేంద్రానికి వచ్చే పలువురిని పరీక్షల కోసం ప్రైవేటు ల్యాబ్‌లకు పంపి వారి ద్వారా పెద్ద మొత్తంలో డబ్బు తీసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. కిడ్నీ వ్యవహారంపై మదనపల్లె రెండో పట్టణ సీఐ రాజారెడ్డి, ఎస్ఐ రహీముల్లా ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం విచారణ నిర్వహిస్తోంది.

మినీ ట్రక్కు ఢీకొని ఒకరి దుర్మరణం

కలకడ, న్యూస్‌టుడే : కలకడ మండలంలోని పోతువారిపల్లె సమీపాన చిత్తూరు - కర్నూలు జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని మినీట్రక్కు ఢీకొనడంతో పి.పాలేటి (65) మృతి చెందారు. కంభంవారిపల్లె మండలం తీతీగానంపల్లె పంచాయతీ కురవపల్లెకు చెందిన పాలేటి కలకడలోని వారపు సంతకు వచ్చారు. సంతలో కూరగాయలు, సరుకులు తీసుకుని స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా పోతువారిపల్లె సమీపాన పీలేరు మార్గం నుంచి కలకడకు వస్తున్న మినీట్రక్కు ఢీకొనడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. అతని కుమారుడు చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ. రామాంజనేయులు పేర్కొన్నారు.


పాలేటి (దాచిన చిత్రం)

ఎంబీఏ విద్యార్థి ఆత్మహత్య

గుర్రంకొండ, న్యూస్‌టుడే : మండలంలోని సంగసముద్రం పంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన నరేశ్ (22) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. యువకుడు అంగళ్లలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కొద్దిరోజులుగా ముభావంగా ఉంటున్నట్లు తల్లిదండ్రులు చెప్పారన్నారు. ఇంట్లోని అందరూ పొలం పనులకు వెళ్లగా అతను ఇంట్లోనే మంగళవారం సాయంత్రం ఉరి వేసుకుని మృతి చెందినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి శవ పంచనామా చేసినట్లు పేర్కొన్నారు.

మాజీ సైనికుడి అదృశ్యంపై ఫిర్యాదు


రెడ్డిశేఖర్‌రెడ్డి (పాతచిత్రం)

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : మాజీ సైనికుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు మదనపల్లె రూరల్ స్టేషన్ సీఐ కళా వెంకటరమణ తెలిపారు. పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఎల్. రెడ్డిశేఖర్‌రెడ్డి (60) మాజీ సైనిక ఉద్యోగి. అతను ఈ నెల 11వ తేదీన ఎస్టేట్ వద్ద ఉన్న తన ఇటుకల ఫ్యాక్టరీ నుంచి ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులు, బంధువులకు తాను భూ సమస్యల కారణంగా చనిపోతున్నట్లు సంక్షిప్త సమాచారం పంపి కన్పించకుండా పోయాడు. దీంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం రూరల్ పోలీసులను ఆశ్రయించారు. రెడ్డిశేఖర్‌రెడ్డి భార్య శ్రీదేవి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వరకట్నం వేధింపులపై కేసు

రామసముద్రం: రామసముద్రం మండలం కమతంపల్లెకు చెందిన బాధితురాలు నందుకు కర్ణాటక రాష్ట్రం జీడిమాకులపల్లెకు చెందిన మునిరెడ్డితో ఆరేళ్ల కిందట వివాహమైంది. వీరి కాపురం నాలుగేళ్లపాటు సజావుగానే సాగింది. గత రెండేళ్లుగా అదనపు కట్నం తేవాలని భర్త, అత్తమామల నుంచి వేధింపులు అధికమయ్యాయి. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రమేశ్‌బాబు కేసు నమోదు చేశారు. కేసులో భాగంగా విచారణ చేపట్టారు. నిందితులకు నోటీసులు జారీ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్

మైదుకూరు: బాలికలతో అసభ్యంగా ప్రవర్తించిన హెచ్‌ఎంను సస్పెండ్ చేస్తూ విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉత్వర్వులు జారీ చేశారు. గత నెల 25న కందిమల్లయ్యపల్లె హెచ్‌ఎం రాధాకృష్ణమూర్తి విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో డీఈవో శంషుద్దీన్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం బుధవారం సదరు హెచ్‌ఎంను విధుల నుంచి తొలగించినట్లు ఆదేశాలు వచ్చాయని ఎంఈవో పుల్లయ్య తెలిపారు.

కిడ్నీ రాకెట్ ముఠాను కఠినంగా శిక్షించాలి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : కిడ్నీ ముఠాను కఠినంగా శిక్షించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ప్రభుత్వానికి డిమాండు చేశారు. బుధవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆ సంఘం నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక గ్లోబల్ ఆసుపత్రిలో కిడ్నీ ముఠా కారణంగా మహిళ మృతి చెందడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన ఆసుపత్రి వైద్యులు ఇలాంటి కిడ్నీ వ్యాపార కేంద్రంగా మార్చి ఆదాయం పొందడం దారుణమన్నారు. ఈ దారుణానికి పాల్పడిన వైద్యులు, ఆసుపత్రి యాజమాన్యం, కిడ్నీ ముఠా సభ్యులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ కార్యదర్శి కృష్ణప్ప, మురళి, తిరుమల, దేవా, గజపతి, మౌళి పాల్గొన్నారు. ఈ సంఘటనను సీపీఐ నాయకులు కృష్ణప్ప, మురళి ఖండించారు.

మదనపల్లె పట్టణం : నిబంధనలకు విరుద్ధంగా కిడ్నీ వ్యాపారం చేస్తున్న గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని శాశ్వతంగా సీజ్ చేసి బాధ్యులపై క్రిమినల్ కేసులు బనాయించాలని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్‌కుమార్ డిమాండు చేశారు. బుధవారం ఆ సంఘం నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కిడ్నీ మాఫియా కారణంగా విశాఖకు చెందిన యమున మృతి చెందడం బాధాకరమన్నారు. డీసీహెచ్ఎస్ ఆంజనేయులు ఆధ్వర్యంలో గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని వైద్యశాఖ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు ఆరోపించారు. కిడ్నీలు మార్పిడి వ్యాపారం చేయడానికి ఈ ఆసుపత్రి పనిచేస్తోందని విమర్శించారు. పట్టణంలో నకిలీ స్కాన్ సెంటర్లు, అనుమతి లేని ఆసుపత్రులు, కిడ్నీ వ్యాపారం చేసే మాఫియా పెరిగిపోయిందని ఆరోపించారు. అవినీతికి పాల్పడుతున్న వైద్యులపై తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండు చేశారు.

మదనపల్లె నేరవార్తలు : కిడ్నీ దొంగలను కఠినంగా శిక్షించాలని సీపీఐ కృష్ణప్ప, మురళి బుధవారం విచారణకు వచ్చిన డెమో దేవశిరోమణికి ఫిర్యాదు చేశారు. డాక్టర్ ఆంజనేయులు వైద్య పట్టా రద్దు చేయడంతో పాటు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని కోరారు.

మాట్లాడుతున్న సాంబశివ, పక్కన నాయకులు

మదనపల్లెకు నేడు మంత్రుల రాక

మదనపల్లె గ్రామీణ: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్, వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌లు గురువారం మదనపల్లెకు వస్తున్నట్లు రెవెన్యూ అధికారులు బుధవారం సమాచారం అందించారు. మంత్రి మనోహర్ బెంగళూరు మీదుగా మదనపల్లెకు చేరుకుని వ్యవసాయమార్కెట్‌యార్డులో ఉదయం 10 గంటలకు మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గం ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం పార్టీ సభ్యులతో సమావేశం నిర్వహిస్తారు. తర్వాత బెంగళూరుకు చేరుకుని అక్కడి నుంచి విమానంలో విశాఖపట్నానికి బయలుదేరి వెళ్తారు. అదే విధంగా మంత్రి సత్యకుమార్‌యాదవ్ బుధవారం రాత్రి ధర్మవరం నుంచి బయలుదేరి హార్సిలీహిల్స్‌లో బస చేస్తారు. 13న ఉదయం వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొననున్నారు.

పరిశోధనల్లో రాణించిన వారికి నగదు ప్రోత్సాహకం

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : మిట్స్ డీమ్డ్ టుబీ విశ్వవిద్యాలయం 2024-25 సంవత్సరానికి గాను పరిశోధనల్లో రాణించిన అధ్యాపకులు, విద్యార్థులకు బుధవారం పరిశోధన అవార్డులతో పాటు నగదు ప్రోత్సాహకం అందించినట్లు వీసీ యువరాజ్ తెలిపారు. వెబ్ ఆఫ్ సైన్స్, స్కోపస్, ఎస్‌సీఐ, ఐఈఈఈఎల్ వంటి వాటిలో అధ్యాపకులు, విద్యార్థులు పరిశోధన పత్రాలు ప్రచురించడం జరిగిందన్నారు. ఇందులో 500 మంది విద్యార్థులు, అధ్యాపకులకు రూ.21.31 లక్షలు ప్రోత్సాహకాలు పొందారని తెలిపారు. ఈ సందర్భంగా అవార్డులు, ప్రోత్సాహకాలు పొందిన అధ్యాపకులు, విద్యార్థులను వీసీతో పాటు ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ప్రో ఛాన్సలర్ ఎన్.ద్వారకానాథ్, రిజిస్ట్రార్ ప్రదీప్‌కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ రామనాదన్, అడ్వైజర్ డాక్టర్ తులసీరామనాయుడు, అసోసియేట్ డీన్ శివయ్య, శ్రీమంతబాబు అభినందించారు.

అవార్డులు, నగదు ప్రోత్సాహకం పొందిన అధ్యాపకులతో వీసీ యువరాజ్ తదితరులు

నైజీరియన్ల నుంచి ఎండీఎంఏ కొనుగోలు

- అందులో కొంత వినియోగించి, మిగిలింది అమ్మేవాడు
- ఇంజినీరింగ్‌లో చేరిన తొలి ఏడాదే దారి తప్పిన మ్యాడీ

ఈనాడు - అమరావతి

బెంగళూరులో స్నేహితుల ద్వారా నైజీరియన్లతో పరిచయంతో మ్యాడీ పెడ్లర్‌గా మారాడు. నైజీరియన్లకు వాట్సాప్‌లో కాల్ చేసి డ్రగ్స్ అడిగేవాడు. వారు వాట్సాప్‌లోనే యూపీఐ క్యూఆర్ కోడ్ పెడితే.. దానిని స్కాన్ చేసి డబ్బులు పంపేవాడు. వారు సరకును ఒక లొకేషన్‌లో పెట్టి.. దానిని ఫొటో తీసి పంపేవారు. మ్యాడీ అక్కడకు వెళ్లి తెచ్చుకునేవాడు. ఇలా కొనుగోలు చేసిన ఎండీఎంఏలో కొంత సొంతంగా వాడుకుని.. మిగిలింది లాభం చూసుకుని అమ్మడం ప్రారంభించాడు. అమ్మకాలలో భాగంగా కాలేజీలో సీనియర్ అయిన గురుప్రసాద్‌తో కలసి హైదరాబాద్‌కు వెళ్లారు. అక్కడ కూకట్‌పల్లి పోలీసులు దాడి చేసి అరెస్టు చేశారు.

చెన్నైలో మత్తుకు బానిస...

చెన్నైలో ఇంజినీరింగ్‌లో చేరిన తొలి ఏడాదే మధుసూదన్‌రెడ్డి అలియాస్ మ్యాడీ మత్తుకు బానిసగా మారాడు. సిగరెట్లు, మద్యం, గంజాయి అలవాటైంది. బీటెక్ రెండో ఏడాదిలో ఎండీఎంఏ తీసుకోవడం అలవాటు చేసుకున్నాడు. ఫలితంగా పరీక్షలు రాసేందుకు హాజరు సరిపోక ఇంజినీరింగ్ పూర్తి చేయలేని పరిస్థితి. 2022లో కాలేజీ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఉపాధి నిమిత్తం బెంగళూరు వెళ్లాడు. ఎండీఎంఏ కేసులో బెంగళూరులో అరెస్టు అయిన నిందితుడు మ్యాడీని మాచవరం పోలీసులు నగరంలోని ఒకటో ఏసీఎంఎం కోర్టులో న్యాయాధికారి ఎదుట హాజరుపరిచారు. ఈనెల 26 వరకు రిమాండ్ విధించడంతో విజయవాడ కారాగారానికి తరలించారు. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం కంబాలపల్లికి చెందిన మ్యాడీ తండ్రి 13 ఏళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. తల్లి పొలం పనులకు వెళ్తుండేది.

280 మంది ఉద్యోగాలకు ఎంపిక

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : నిరుద్యోగులు స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ వారు నిర్వహించే ఉద్యోగ మేళాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగ అవకాశాలు పొందాలని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. బుధవారం మదనపల్లెలోని శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ నిర్మూలనకు ఎంతో కృషి చేస్తోందన్నారు. ఎన్నో పరిశ్రమలను తీసుకొచ్చి రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన వారికి అర్హతా పత్రాలు ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. ఈ జాబ్ మేళాలలో 540 మంది అభ్యర్థులు హాజరుకాగా 280 మంది ఉద్యోగాలు సాధించినట్లు కరస్పాండెంట్ డాక్టర్ ఆర్.గురుప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి, జిల్లా జూనియర్ ఎంప్లాయిమెంట్ అధికారి దోణప్ప, ఏపీ స్కిల్‌డెవలప్‌మెంట్ జిల్లా అదనపు నైపుణ్య అధికారి ఆరీఫ్, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి వెంకటేశ్‌గౌడ్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.


అభ్యర్థికి అర్హత పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.గురుప్రసాద్ తదితరులు

నెలాఖరు వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు

పీలేరు, న్యూస్‌టుడే : పేదలకు గృహ నిర్మాణ పథకంలో ఇళ్ల మంజూరుకు ఈ నెల చివరి వరకు అర్హులైన పేదలు దరఖాస్తు చేసుకోవచ్చని ఆ శాఖ డీఈ రమణయ్య తెలిపారు. ఇప్పటి వరకు పీలేరు నియోజకవర్గంలో మొత్తం 11,976 దరఖాస్తులు వచ్చాయన్నారు. మండలాల వారీగా గుర్రంకొండ 1,730, కంభంవారిపల్లె 1,091, కలకడ 1,554, పీలేరు 4,178, కలికిరి 1,520, వాల్మీకిపురం 1,903 మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. నిజమైన అర్హులను ఎంపిక చేస్తామని రమణయ్య బుధవారం చెప్పారు.

నకిలీ మద్యం కేసులో.. నలుగురు నిందితులకు రిమాండ్

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం కేసులో ములకలచెరువు ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న నలుగురు నిందితులను బుధవారం పీటీ వారెంట్‌పై సిట్ అధికారులు విజయవాడ ఎక్సైజ్ కోర్టులో హాజరుపరిచారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి కారాగారంలో ఉన్న మిథున్ దాస్, అంతదాస్, హాజి, రాజులను న్యాయాధికారి ఎదుట హాజరుపరిచారు. వీరికి ఈనెల 25 వరకు రిమాండ్ విధించారు. అనంతరం నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు.

★ ఈ కేసులో అజ్ఞాతంలో ఉన్న నిందితుడు తలారి రంగయ్య (ఏ14) దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్.. 8వ ఏడీజే కోర్టులో బుధవారం విచారణకు వచ్చింది. ప్రాసిక్యూషన్ కౌంటరు దాఖలు చేసేందుకు ఈనెల 17వ తేదీకి న్యాయాధికారి వాయిదా వేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

చిట్వేలి (పుల్లంపేట), న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు చిట్వేలి ఉన్నత పాఠశాల విద్యార్థిని కుసుమిత ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు దుర్గరాజు తెలిపారు. బుధవారం స్థానిక పాఠశాలలో ఆ విద్యార్థిని అభినందించారు. ఈ నెల 9న ప్రొద్దుటూరులో నిర్వహించిన తైక్వాండో జిల్లా స్థాయి సబ్ జూనియర్ విభాగంలో ప్రతిభ చూపడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 14, 15వ తేదీల్లో కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి కడప జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్, సుహాసిని, రామదేవి తదితరులు పాల్గొన్నారు.

కుసుమితకు ప్రశంసాపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయుడికి అభినందనలు

గుర్రంకొండ, న్యూస్‌టుడే : గుర్రంకొండ ఎంపీపీ పాఠశాల ఉర్దూ ఉపాధ్యాయుడు ముక్తియార్‌అలీఖాన్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని సోమవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో మైనారిటీ వ్యవహారాల మంత్రి ఫారూక్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేసినందుకు ఆయనకు రూ.10 వేలు నగదు, ప్రశంసాపత్రం ఇచ్చి సన్మానించారు. ఆయన ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైనందున స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

మంత్రి ఫరూక్ నుంచి పురస్కారం అందుకుంటున్న ఉపాధ్యాయుడు ముక్తియార్ అలీఖాన్

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

రామసముద్రం, న్యూస్‌టుడే : విజయనగరంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-19 బాలికల ఖోఖో పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ప్రతినిధ్యం వహించి జట్టును మూడో స్థానంలో నిలిపిన మట్లవారిపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థి సుకన్య, అండర్-19 బాలుర విభాగంలో రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి రాణించిన విద్యార్థి గంగాద్రిని బుధవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ, పీడీ పార్థసారథి, ఉపాధ్యాయులు అభినందించి సన్మానించారు. పాఠశాల కీర్తి ప్రతిష్ఠలను క్రీడా రంగంలో రాష్ట్ర స్థాయిలో నిలిపిన విద్యార్థులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, ఉపాధ్యాయులు

అమ్మాయిలు.. తైక్వాండోలో అగ్గిరవ్వలు

- జాతీయ స్థాయి పోటీలకు కోడూరు విద్యార్థినులు
- పట్టుదల, క్రమశిక్షణతో బంగారు పతకాల సాధన

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: రైల్వేకోడూరుకి చెందిన విద్యార్థులు చదువుతో పాటు తైక్వాండో క్రీడలో రాణిస్తున్నారు. మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయి దాటి జాతీయ స్థాయి పోటీలకు సిద్ధమవుతున్నారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో కోడూరు నుంచి నలుగురు విద్యార్థినులు త్వరలో జమ్మూ, అరుణాచల్‌ప్రదేశ్‌లో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆత్మరక్షణతో పాటు చదువు, ఉద్యోగావకాశాలకు నిరంతర క్రమశిక్షణ, కఠోర సాధనతో పోటీలకు సిద్ధమవుతున్నారు. పట్టణంలోని ఎస్‌కే, ఎస్‌వీకే స్పోర్ట్స్ అకాడమీ కోచ్‌లు షేక్ మౌలా, శివాజీలు విద్యార్థినులకు జాతీయ స్థాయిలో రాణించేలా శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులు జాతీయ స్థాయిలోనూ ఆ జోరును కొనసాగిస్తామంటున్నారు.

తైక్వాండో సాధన చేస్తున్న విద్యార్థులు

విజయం సాధిస్తా

అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించాను. త్వరలో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో కూడా తప్పకుండా విజయం సాధిస్తా. ప్రస్తుతం ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్నాను. స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని పట్టుదలతో ఉన్నాను. రోజూ ఉదయం రెండు గంటలు, సాయంత్రం రెండు గంటలు తైక్వాండో సాధనకు కేటాయిస్తున్నాను. నిరంతర సాధనతో కచ్చితంగా లక్ష్యాన్ని సాధిస్తా. - షేక్ సారా, ఇంటర్ విద్యార్థిని, రైల్వేకోడూరు

పోలీస్ అధికారి కావాలని

క్రీడల కోటాలో పోలీస్ అధికారి ఉద్యోగం సాధించాలని పట్టుదలగా ఉంది. ఎస్‌జీఎఫ్ పోటీల్లో అండర్ - 19 విభాగంలో రాష్ట్ర స్థాయి బంగారు పతకం సాధించాను. కఠోర సాధన ద్వారా ప్రత్యర్థులను ఓడించడం, మనల్ని మనం గెలిపించుకోవడం నేర్చుకుంటాం. ప్రతి రోజు తైక్వాండో సాధన చేస్తాను. దాని వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. శారీరక దృఢత్వంతో పాటు ఉద్యోగ అవకాశాలు కూడా బాగుంటాయని ఈ క్రీడను ఎంచుకున్నాను. - బి.హారిక, ఇంటర్ విద్యార్థిని, రైల్వేకోడూరు

ఏకాగ్రత మెరుగవుతుంది

అండర్ - 14 విభాగంలో బంగారు పతకం సాధించాను. తైక్వాండో సాధన చేయడం వల్ల ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం కలుగుతాయి. దానివల్ల చదువులో కూడా మంచి మార్కులు తెచ్చుకుంటున్నాను. తైక్వాండో నేర్చుకోమని మా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. జాతీయ స్థాయిలో తప్పకుండా బంగారు పతకం తెచ్చుకుంటాను.

- టి.సోహిత, ఎనిమిదో తరగతి విద్యార్థిని, రైల్వేకోడూరు

తల్లిదండ్రుల ప్రోత్సాహం

జీవితంలో ఏదైనా సాధించాలని మా అమ్మా నాన్నలు ప్రోత్సహిస్తుంటారు. అందువల్ల తైక్వాండోలో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనాలని పట్టుదలతో ఉన్నాను. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నాను. ఎస్‌జీఎఫ్ అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించాను. జాతీయ స్థాయి పోటీలకు సిద్ధమవుతున్నాను. అక్కడ కూడా గెలుపు సాధిస్తాను. మా ఉపాధ్యాయులు, కోచ్ మంచి ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. - అఖిల, పదోతరగతి విద్యార్థిని, రైల్వేకోడూరు

EENADU e Classifieds

REAL ESTATE

PLOT FOR SALE

రంగంపేట, మోహన్‌బాబు కాలేజ్ ఎదురుగా, తిరుపతి మదనపల్లి హైవేకి 15 అ॥. దూరంలో 66 అంకణాల ప్లాట్ కలదు. వివరాలకు సం||. 8008685569.

WANTED

రాజంపేట శ్రీ సత్యా గార్డెన్‌లో టెలీకాలర్స్, ఆఫీసు ఇన్‌ఛార్జ్, అకౌంటెంట్‌లుగా పని చేయుటకు ఆసక్తిగల యువతీ యువకులు కావలెను. #9688888179.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఫీజు డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తలను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

JOBS

కడప మరియు చిత్తూరు జిల్లాలో పనిచేయుటకు Sales Person (Male) కావలెను. జీతం: 25-30K+TA, DA. సంప్ర: 83286 75684.

ప్రొద్దుటూరులోని శ్రీ సంగమేశ్వర హైస్కూల్ వారి చక్కటి వసతి కలిగిన హాస్టల్‌కు వార్డెన్స్ కావలెను. Cell : 94407 29641, 9059585727.

FACULTY/ TEACHERS

Wanted Local Teachers Lower Section. TKR High School, Jammalamadugu. Cell : 9603737014

ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
రూ॥ 350/- మాత్రమే
Contact:
KDP: 9989997626
8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

(c) eenadu

మదనపల్లె

•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

భక్తిశ్రద్ధలతో ఉరుసు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : బెంగళూరు బస్టాండ్‌లోని బడేమకాన్ హజరత్ సైదానిమా సాహెబ ఉరుసు ఉత్సవాలు మంగళవారం రాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. దర్గా మకాన్‌దార్ హాషీమ్ ఆధ్వర్యంలో సైదానిమా సాహెబ గంధోత్సవాన్ని పవిత్ర మేళతాళాల భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. బుధవారం వేకువజామున మత గురువులైన పరేష్ హుసేని, ఆరిఫ్‌పీర్ సాహెబ్, గౌసుల్లా సాహెబ్, సిద్దిఖ్‌ఉల్లాషాలు దర్గాలోని మాసాహెబ మజ్జార్ వద్ద గంధాన్ని అంకితం చేశారు. అనంతరం ప్రజలు సుఖసంతోషాలతో స్నేహభావాలతో మెలగాలని, సకాలంలో వర్షాలు కురిసి పసిడి పంటలు పండాలని దువా చేశారు.

గంధోత్సవంలో ముస్లిం మత గురువులు

నేడు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ ఛైర్మన్ శివరాం, కమిటీ సభ్యులు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : టమాటా మార్కెట్ యార్డు ప్రాంగణంలో గురువారం ఉదయం 10 గంటలకు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ నూతన ఛైర్మన్ జంగాల శివరాం తెలిపారు. బుధవారం మార్కెట్ యార్డులో ప్రమాణ స్వీకారోత్సవానికి సంబంధించి ఏర్పాట్లపై కమిటీ వైస్ ఛైర్మన్ ఆంజనేయులు, కమిటీ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్, రాష్ట్ర రవాణా, యువజన క్రీడలశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విచ్చేయునున్నట్లు చెప్పారు. అదేవిధంగా మదనపల్లె, పీలేరు, రైల్వేకోడూరు ఎమ్మెల్యేలు షాజహాన్‌బాషా, కిశోర్‌కుమార్‌రెడ్డిలు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి రైతులు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

విద్యుత్తు.. మారని పాత పద్ధతులు

సాంకేతికతకు దూరంగా ఉపకేంద్రాలు

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే : పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్తు ఉప కేంద్రాల్లో అవసరాలకు సరిపడా ఆధునిక సాంకేతికత లేకపోవడంతో విద్యుత్తు సరఫరాలో సమస్యలు ఏర్పడుతున్నాయి. పెరిగిన విద్యుత్తు వినియోగం కారణంగా అధిక ఉప కేంద్రాల్లో సాంకేతికత పెంచాల్సిన అవసరం ఏర్పడింది. మదనపల్లె నియోజకవర్గంలోని రామసముద్రం, తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పీటీఎం, ములకలచెరువు, బి.కొత్తకోట, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట, ముదివేడు, కాండ్లమడుగు క్రాస్ వంటి ఎనిమిది ఉప కేంద్రాల్లో ఆధునిక సాంకేతికతను తక్షణమే మార్చాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. గతంలో ఈ ఉప కేంద్రాల్లో సాంకేతికత లోపం ఏర్పడితే, అన్ని ప్రాంతాల ఫీడర్లను ఆఫ్ చేయాల్సి ఉండటంతో ఆయా ప్రాంతాలకు గంటల తరబడి విద్యుత్తు సరఫరా నిలిచిపోయేది. సమస్యను మదనపల్లె ఈఈ గంగాధరం దృష్టికి తీసుకెళ్లగా డివిజన్‌లోని 47 ఉప కేంద్రాల్లో ఆధునిక సాంకేతికతను ఏర్పాటు చేయాలని గుర్తించామన్నారు. తొలి విడతలో మదనపల్లెలోని రామసముద్రం, తంబళ్లపల్లె నియోజకవర్గంలోని బి.కొత్తకోట, పీటీఎం, ములకలచెరువు, పెద్దమండ్యం, తంబళ్లపల్లె, కురబలకోట, ముదివేడు, పెద్దపల్లె వంటి ఉప కేంద్రాల్లో ఆధునిక సాంకేతిక వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అంశాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లామన్నారు. తొలి విడతలో మదనపల్లె పట్టణంలోని ఉత్తర విభాగంలోని ఉప కేంద్రం ఆధునికీకరణ పనులు రూ.2 కోట్లతో చేపట్టామని మదనపల్లె ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎం.గంగాధరం తెలిపారు.



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న విద్యుత్తు శాఖ ఈఈ గంగాధరం

లోఓల్టేజీ సమస్య లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతాం

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : లోఓల్టేజీ సమస్యలు లేని ప్రాంతాలుగా వాల్మీకిపురం, చింతపర్తి మేజర్ పంచాయతీలను తీర్చిదిద్దుతామని పీలేరు నియోజకవర్గ తెదేపా నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణ శివారు ప్రాంతంలోని పునుగుపల్లె విద్యుత్తు సబ్‌స్టేషన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను విండో ఛైర్మన్ కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ చంద్రమౌళితో ఆయన కలిసి ప్రారంభించి మాట్లాడారు. వాల్మీకిపురం, చింతపర్తి మేజర్ పంచాయతీలలో పరిధిలో త్వరలోనే 100 కేవీ సామర్థ్యం గల 8 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో వాల్మీకిపురం పట్టణంతో పాటు చింతపర్తిలో లోఓల్టేజీ సమస్య పూర్తిగా తొలిగిపోతుందన్నారు. అనంతరం స్థానిక మార్కెట్ యార్డులో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో విద్యుత్తు శాఖ ఏఈ రాజశేఖర్, నాయకులు దాము రెడ్డి, మాజీ సర్పంచి రాజేంద్రఆచారి, శేషరెడ్డి, పీవీ, కేకే, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాతృత్వం ఒక వరం

కలకడ : మహిళలకు మాతృత్వం ఒక వరమని.. దత్తత అందుకు మరో మార్గమని జిల్లా శిశుగృహ మేనేజర్ సుప్రియ పేర్కొన్నారు. బుధవారం కలకడలోని వెలుగు కార్యాలయంలో అంతర్జాతీయ దత్తత మాసోత్సవ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దత్తత ప్రక్రియలో భాగంగా పిల్లలు లేని తల్లిదండ్రులకు కావాల్సిన పత్రాలతో పాటు అనాథపిల్లలు, వదిలేసిన పిల్లలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ లావణ్య, వెలుగు సిబ్బంది, పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యేలు

సీఎం చంద్రబాబునాయుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : గృహాలను లబ్ధిదారులకు అప్పగించేందుకు చిన్నమండ్యం వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పలు సమస్యలపై ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు. తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు కూడా సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. హెలిప్యాడ్ నుంచి సభా స్థలికి వస్తున్న సీఎంకు రోజా పువ్వు అందజేసి స్వాగతం పలికారు.

కలికిరి: అన్నమయ్య జిల్లా చిన్నమండ్యంకు విచ్చేసిన సీఎం చంద్రబాబునాయుడును పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించారు.

వైద్యకళాశాల ప్రైవేటీకరణ వద్దు

ప్రభుత్వ వైద్యకళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు పీపీపీ విధానాన్ని మానుకోవాలని కోరుతూ బుధవారం మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో వైకాపా నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

- న్యూస్‌టుడే, బృందం

పీలేరు : ర్యాలీ నిర్వహిస్తున్న వైకాపా నాయకులు

రాయితీ ఉలవల పంపిణీ 13న

గుర్రంకొండ : మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఈ నెల 13న రాయితీ ఉలవలు పంపిణీ చేస్తామని ఏవో రత్నమ్మ తెలిపారు. 80 శాతం రాయితీతో ఇస్తామన్నారు. 10 కిలోల ధర రూ.112లని, అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు తీసుకుని సేవా కేంద్రాల్లో కొనుగోలు చేసుకోవచ్చన్నారు. మండలానికి 200 క్వింటాళ్లు వచ్చాయన్నారు.

న్యాయం చేయాలని సూచన

మదనపల్లె పట్టణం : రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణాచారి మర్యాదపూర్వకంగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారాలోకేశ్‌ను మంగళవారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో కలిశారు. తనకు రాష్ట్ర డైరెక్టర్‌గా పదవి ఇచ్చి గౌరవించినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. పదవిని దుర్వినియోగం చేసుకోవద్దని, ఆ సామాజిక వర్గానికి తగు న్యాయం చేయాలని మంత్రి సూచించారు.

16న మాల మహానాడు రాష్ట్రమహాసభ

వాల్మీకిపురం : ఈనెల 16వ తేది మదనపల్లె సీఎస్ఐ కమ్యూనిటీ భవనం ఆవరణలో నిర్వహించే మాల మహానాడు రాష్ట్ర మహాసభకు పీలేరు నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున మాలలు తరలివచ్చి జయప్రదం చేయాలని మాల మహానాడు నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం వాల్మీకిపురంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. అంతకు మునుపు మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు.





(c) eenadu

రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ

కొర్లకుంటలో మురుగుపై బ్లీచింగ్ చల్లుతున్న జాతీయ సేవా పథకం వాలంటీర్లు

ఓబులవారిపల్లె: అనంతరాజపేట ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం వాలంటీర్లు, ఓబులవారిపల్లె మండలంలోని కొర్లకుంట గ్రామంలో బుధవారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని వీధుల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. మురుగుపై బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. స్థానికులకు పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ నిశ్చల, డాక్టర్ హరి మల్లికార్జునరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గంగమ్మజాతర రోడ్డు నిర్మాణానికి చర్యలు

స్థానికులతో మాట్లాడుతున్న డీఈ రవీంద్రారెడ్డి

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండల పరిధిలోని రవీంద్రనగర్ నుంచి గంగమ్మ జాతర వరకు రూ. 2.80 కోట్లతో తారు రోడ్డుకు నివేదికలు పంపామని పంచాయతీరాజ్‌శాఖ డీఈ రవీంద్రారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ప్రజలతో మాట్లాడారు. రాయలసీమకు తలమానికమైన గంగమ్మ జాతరకు 30 ఏళ్ల క్రితం రహదారి వేశారన్నారు. ప్రస్తుతం గుంతలమయంగా మారి ప్రజలు అవస్థలు పడుతున్నారని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో శాశ్వత రహదారి పనులు చేపడతామని స్థానికులు చెప్పారు. కార్యక్రమంలో జేఈ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ యజమానులు నిబంధనలు పాటించాలి

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: బొప్పాయి మొలకలను ఉత్పత్తి చేస్తున్న నర్సరీల యజమానులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని రైల్వేకోడూరు ఉద్యాన శాఖ అధికారి వెంకట భాస్కర్, ఏవో సందీప్ సూచించారు. మండల పరిధిలోని రాఘవరాజపురం, అనంతరాజుపేట గ్రామాలలో నిర్వహిస్తున్న బొప్పాయి మొలకల ఉత్పత్తి నర్సరీలను బుధవారం వారు పరిశీలించారు. నర్సరీ యాక్ట్ 2010 నిబంధనల ప్రకారం రైతులకు నాణ్యమైన మొక్కలను అందించాలన్నారు. మొక్కల కొనుగోలు, విక్రయాలకు సంబంధించిన రికార్డులను నమోదు చేయాలని, రైతులకు కొనుగోలుకు సంబంధించి రసీదులు ఇవ్వాలని సూచించారు. విత్తనాలలో ఎలాంటి కల్తీలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో చిట్వేలి ఉద్యాన శాఖ అధికారి లోకేశ్, ఉద్యాన సహాయకుడు సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బొప్పాయి నర్సరీ నిర్వాహకుడితో మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారి భాస్కర్, ఏవో సందీప్

తడి పొడి... పర్యవేక్షణ తడబడి

✦ ఖాళీ స్థలాల్లో పేరుకుపోతున్న చెత్త

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛత కోసం కార్యక్రమాలు చేపడుతున్నట్లు ప్రచారమే తప్ప.. క్షేత్రస్థాయిలో మాత్రం చెత్త నిర్వహణ అధ్వానంగా మారింది. కేవలం ప్రధాన రహదారుల్లో చెత్త సేకరిస్తున్నారు. పురపాలక శివారు ప్రాంతాల్లో రోడ్లపై ఉన్న చెత్తను కూడా శుభ్రం చేయడం లేదు. రాజంపేట పట్టణంలోని 29వార్డులు ఉంటే వీటిల్లో ఎక్కువ వార్డుల్లో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉంది. రాజంపేట పట్టణంలో చక్రాలమడుగు ప్లాస్టిక్ మయం కావడం, పట్టణం నుంచి నేరుగా మురుగు నీరు చక్రాల మడుగులోకి వచ్చి చేరడం, బయటకు వెళ్లడానికి అవకాశం లేక నిల్వ ఉండడంతో రాంనగర్ వాసులు ఇక్కడి నుంచి వచ్చే దుర్వాసను భరించలేకపోతున్నారు.

● రాజంపేట పట్టణంలోని సరస్వతీపురం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్టీ వసతి సముదాయం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం, పాత బస్సు స్టాండ్, నూనెవారిపల్లి, ఎర్రబల్లి, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆసుపత్రి వద్ద, సాయిబాబా ఆలయం, సాయినగర్, నారపురురెడ్డిపల్లి, మన్నూరు వంటి ప్రాంతాల్లో పారిశుధ్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చెత్త రహదారిపై చేరి ప్రజలు అవస్థలు పడతున్నారు.

● క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో పారిశుద్ధ్యం సమస్యలు వస్తున్నాయి. పురపాలక నుంచి నెల రూ. 4.50 లక్షలు, ఇతర జీతాలుతో కలిసి దాదాపు ఎనిమిది లక్షలు వరకు ప్రజా ధనం ఖర్చు చేస్తున్నా... ప్రజలకు మాత్రం మెరుగైన సేవలు అందడం లేదు. కేవలం పురపాల కమిషనర్ ఉంటేనే పనులు జరుగుతున్నాయి. పురపాలకలో పని చేసే సిబ్బందికి రాజకీయంగా పలుకుబడి ఉండడంతో కమిషనర్ ఆదేశించినా పట్టించుకోవడం లేదు.

■ రాజంపేటలోని వార్డుల సంఖ్య	: 29
■ పట్టణ జనాభా	: 60వేలు
■ నెలకు ఖర్చు	: రూ.4.5 లక్షలు
■ రోజుకు సేకరించే చెత్త	: 32.33 టన్నులు
■ పని చేసే సిబ్బంది	: 104 మంది

ఆర్డీవో కార్యాలయం సమీపంలో నిలువ ఉన్న చెత్త

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

మురుగు కాలువను పరిశీలిస్తున్న అధికారులు

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ నిర్మల్ అలెగ్జాండర్ అన్నారు. బుధవారం ఆయన ముక్కావారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. స్థానిక వైద్యులు రాజశేఖర్‌తో సీజనల్ వ్యాధులపై చర్చించారు. ఫ్రైడే డ్రైడే, వెక్టర్ కంట్రోల్ హైజీన్‌ను అంతర్జాలంలో నమోదు చేయాలని ఏఎన్ఎంలకు సూచించారు. అనంతరం ఏపీఎండీసీ సీపీవో గోపినాథ్‌తో చర్చించారు. మైనింగ్ ప్రాంతంలో శానిటేషన్‌ను తప్పని సరిగా వినియోగించాలన్నారు.

పెద్దూరు (గాలివీడు): ప్రతి ఒక్కరూ శుక్రవారం డ్రైడే పాటించాలని లక్కిరెడ్డిపల్లె ఉప యూనిట్ మలేరియా అధికారి జయరామయ్య తెలిపారు. గాలివీడు-1 సచివాలయం పరిధిలోని పెద్దూరు కస్పాలో బుధవారం పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటింటా లార్వా సర్వే జరిపారు. వీధుల్లో నిలువ ఉన్న మురుగునీటిలో బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు సురేంద్రారెడ్డి, జి. మల్లికార్జున, ఆర్ సిద్దమ్మ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
రాజంపేట : 9441872651
రాయచోటి : 9703622242
రైల్వేకోడూరు : 9703572572

స్పందనకు వందనం

చెత్త తొలగింపునకు చర్యలు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట మండలం పెద్దకారంపల్లి పంచాయతీ మిట్టపల్లికి వెళ్లే ప్రధాన రహదారికి రోడ్డు ఇరువైపులా పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో ఈనాడులో సోమవారం దారిని కమ్మేసిన చెట్లు... చోదకులకు ఇక్కట్లు అన్న శీర్షిక కథనం ప్రచురితం కావడంతో కారంపల్లి పంచాయతీ అధికారులు స్పందించారు. రోడ్డుకు ఇరువైపులా అడ్డంగా ఉన్న పిచ్చి మొక్కలు జేసీబీలు ఏర్పాటు చేసి తొలగించారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్యం పనులు చేశారు.

గాలివీడు, న్యూస్‌టుడే: అందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని లక్కిరెడ్డిపల్లె సబ్ యూనిట్ మలేరియ అధికారి జయరామయ్య తెలిపారు. గాలివీడు పద్దె చెరువు కట్టపై పడేసిన చెత్తా చెదారంను పారిశుద్ధ్య కార్మికులచే తొలగించారు. ఈ నెల 7న మేమున్నాం.. మీకు తోడుగాలో సమస్య ప్రచురితమైంది. దీనిపై పంచాయతీ, ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు.

- న్యూస్‌టుడే, ఓబులవారిపల్లె

?: చిన్న ఓరంపాడు దళితవాడ వద్ద ప్రధాన రహదారికి ఇరువైపులా చెత్త పేరుకుని దుర్వాసన వస్తోంది.. పరిస్థితులు అస్తవ్యస్తంగా మారాయి? **- సుబ్బయ్య, చిన్నఓరంపాడు**

✓: పారిశుద్ధ్య కార్మికులను పంపి రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించి, ఇబ్బందులు కలగకుండా చూస్తాం. **- రామ్‌మోహన్‌రెడ్డి, ఈవోపీఆర్డీ, ఓబులవారిపల్లె**

?: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో రహదారిపై మురుగు పారుతోంది. దేవాలయంలోకి పోవాలంటే మురుగు నీటిలో నుంచే వెళ్లాల్సి వస్తోంది? **- వెంకటస్వామి, ఓబులవారిపల్లె**

✓: పరిశీలించి కాలువను బాగు చేయిస్తాం. మురుగు రోడ్డుపై పారకుండా చూస్తాం. **- విజయరావు, ఎంపీడీవో, ఓబులవారిపల్లె**

- న్యూస్‌టుడే, పుల్లంపేట

?: మండల కేంద్రమైన పుల్లంపేటలో ఉన్న పంట కాలువ మురికితో నిండి దోమలు, పందులకు నిలయంగా మారింది. దీనిపై చర్యలు తీసుకోవాలి. **- సుబ్బరాయుడు, పుల్లంపేట**

✓: వెంటనే సిబ్బందిని పంపి కాలువలోని మురుగును తొలగిస్తామన్నారు. **- శ్రీనివాసులు, ఈవోపీఆర్డి, పుల్లంపేట**

ప్రశాంతంగా ముగిసిన సీఎం పర్యటన

సీఎం చంద్రబాబుతో చమర్తి జగన్‌మోహన్ రాజు

చంద్రబాబుతో మాట్లాడుతున్న బత్యాల చెంగల్రాయుడు

తెదేపా రాష్ట్ర కార్యదర్శి ముస్తాక్ హుస్సేన్‌తో మాట్లాడుతున్న బాబు

రాయచోటి నియోజకవర్గంలోని దేవగుడిపల్లికు బుధవారం విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఘన స్వాగతం లభించింది. ఆయనకు రైల్వేకోడూరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, పీలేరు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి, తెదేపా జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్‌రాయుడు పుష్ప గుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు సభా ప్రాంగణం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రజలకు భోజన సౌకర్యం కల్పించారు. **- న్యూస్‌టుడే, రాయచోటి క్లస్టర్ బృందం**

రామాపురం: కసిరెడ్డిగారిపల్లె నుంచి తరలి వెళ్తున్న తెదేపా శ్రేణులు

అక్రమ లేఅవుట్‌కు నోటీసుల జారీ

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట పట్టణం పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన లేఅవుట్‌కు రాజంపేట పురపాలక నుంచి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని పురపాలక కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం మాట్లాడుతూ ఉస్మాన్‌నగర్ సచివాలయం పరిధిలో దాదాపు 49 ఎకరాల్లో ఏర్పాటు చేసిన మిత్ర టౌన్ షిప్ లేఅవుట్‌కు బుధవారం నోటీసులు జారీ చేశామన్నారు. ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు జరిగినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం

చిన్నఓరంపాడు: గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, తెదేపా నేత రూపానందరెడ్డి

షికారుపాళెంలో ఇంటిని ప్రారంభిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు, నాయకులు

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించి, వారికి గూడు కల్పిస్తామని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు. మండల పరిధిలోని చిన్నఓరంపాడు పంచాయతీలో నూతన గృహాలను ఆయన బుధవారం ప్రారంభించారు. రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలు ఎవరూ ఉండకూడదనే ఉద్దేశంతోనే కూటమి ప్రభుత్వం ఇల్లు నిర్మించి ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేకోవాలన్నారు. కార్యక్రమంలో కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వీరబల్లి: పేదల సొంతింటి కలను నెరవేర్చడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని తెదేపా నియోజగక వర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. మండల పరిధిలోని షికారుపాళెంలో బుధవారం పీఎంఏవై స్కీం కింద పూర్తి చేసిన ఇళ్లను ఆయన, తెదేపా నాయకులతో కలిసి ప్రారంభించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, హౌసింగ్ డీఈ మురళీకృష్ణ, ఏఈ మల్లికార్జున, నాయకులు పాల్గొన్నారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్తుకు బాటలు

సుండుపల్లి, న్యూస్‌టుడే: విద్యతో భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని వీరభద్ర డిగ్రీకళాశాల ఛైర్మన్ డి. రామ్ సునీల్‌రెడ్డి అన్నారు. కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. చెడు అలవాట్లకు బానిసలు కాకుండా మంచి మార్గంలో నడవాలని, కళాశాలకు, చదువు చెప్పిన అధ్యాపకులకు, తల్లి దండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి బాబురెడ్డి, ప్రిన్సిపల్ త్రివేణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థుల నృత్య ప్రదర్శన

అడవుల రక్షణకు కార్యాచరణ

సుండుపల్లి, న్యూస్‌టుడే: మానవాళి మనుగడకు, వాతావరణ సమతుల్యతకు అడవులే ప్రధానమని తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ రేంజి అధికారి సుబ్బరాయుడు అన్నారు. రాయవరం సెక్షన్ వానరాచపల్లి బీట్‌పరిధి ఎర్రకొండ అటవీ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాత ప్లాంటేషన్, చెక్‌డ్యాంలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ... బీటులో తిరుగుతూ రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రాయవరం డీఆర్వో రమేష్‌బాబు, వానరాచపల్లి బీటు అధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

పంటల మార్పిడితో అధిక దిగుబడి

పుల్లంపేట, న్యూస్‌టుడే: రైతులు పంట మార్పిడి చేయడంతో అధిక దిగుబడులు పొందవచ్చునని మండల వ్యవసాయశాఖాధికారి ప్రవీణ్ తెలిపారు. బుధవారం పుల్లంపేట మండల పరిధిలోని రెడ్డిపల్లె, రామక్కపల్లె గ్రామాల్లో పొలంపిస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. సమీపంలోని రైతు సేవా కేంద్రాలలో యూరియా, డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అటక దిగని బల్లలు.. నేల పైనే చదువులు

తరగతి గదిలో బల్లలు లేక నేలపై కూర్చొని పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

సంబేపల్లె, న్యూస్‌టుడే : ఆ పాఠశాలకు 60 ఏళ్ల చరిత్ర ఉంది. ఎందరో విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చిన బడిగా పేరొందింది. సంబేపల్లె మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాదాపు 350 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. నేడు విద్యార్థులకు తరగతి గదిలో బల్లలు లేక నేలపైనే పాఠ్యాంశాలు వింటూ, పరీక్షలు రాస్తున్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఉన్న బల్లలను ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశాలకు ఉపయోగించుకుంటున్నారు. 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు ఏ తరగతిలోనూ బల్లలు లేవు.. గత వైకాపా పాలనలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో మారుస్తామని హామీలు ఇవ్వగా ఆ మాటల్లోని డొల్లతనం ఈ పాఠశాలను చూస్తే తెలుస్తుంది. దాతలు, నేతలు పాఠశాల అభివృద్ధికి ఎంతో తోడ్పాటునందించారు. పర్యవేక్షణ, నిబద్ధత కొరవడి విద్యార్థులకు కనీస అవసరాలు కూడా సమకూరడం లేదు. ఈ పాఠశాల 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు కేంద్రంగా కూడా సేవలందిస్తోంది, బడిలో బల్లలు లేకపోవడంతో రాబోయే మార్చిలో జరిగే 10వ తరగతి పబ్లిక్ పరీక్షల కేంద్రాన్ని కొనసాగిస్తారా? మరో పాఠశాలకు తరలిస్తారా? అన్నది వేచి చూడాలి. కూటమి ప్రభుత్వం పాఠశాలలో బల్లల కొరతపై దృష్టి సారించాలని విద్యార్థులు కోరుతున్నారు.

పాఠశాల ఆవరణలో చెట్ల కింద చదువుకుంటున్న విద్యార్థులు

నియంత్రిక.. ప్రమాదం నియంత్రించరా!

నందలూరు మండలంలోని నాగిరెడ్డిపల్లి నుంచి ఇసుకపల్లికు వెళ్లె దారిలో ఏర్పాటు చేసిన విద్యుత్ నియంత్రిక ప్రమాదకరంగా మారింది. నియంత్రిక చుట్టూ అధికారులు రక్షణ ఏర్పాటు చేయలేదు. ఆ మార్గం గుండానే నిత్యం పాఠశాలకు విద్యార్థులు వెళ్తుంటారు. ఆ నియంత్రిక చుట్టూ మొక్కలు పెరగడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పిచ్చి మొక్కలు తొలగించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, నందలూరు**

భారీ పైపులు.. తీరేలా బాధలు

రాయచోటి నియోజకవర్గంలో జల్ జీవన్ పథకాన్ని అమలు చేసేందుకు వేగంగా పావులు కదులుతున్నాయి. మెట్ట ప్రాంతమైన ఈ మండలాల్లో తాగు, సాగునీటి తిప్పలు కొన్నేళ్లుగా స్థానికులను వెంటాడుతున్నాయి. ఈ ప్రాంతం గొంతు తడపాలని జల్ జీవన్ పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు భారీ లారీల్లో గాలివీడుకు పైపులను సరఫరా చేస్తున్నారు. అనువైన స్థలాల్లో పైపులను నిల్వ చేస్తున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకట కృష్ణయ్య మాట్లాడుతూ నీటి పథకానికి అవసరమైన పెద్ద పైపులను గుత్తేదారు బళ్లారి నుంచి సరఫరా చేస్తున్నారన్నారు. నీటి పథకం పనులు జోరుగా సాగుతున్నాయన్నారు. **- న్యూస్‌టుడే, గాలివీడు**

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రాయచోటి, న్యూస్‌టుడే: రెండు ద్విచక్రవాహనాలు పరస్పరం ఢీకొనడంతో ఒకరు గాయపడిన ఘటన బుధవారం రాయచోటి - గాలివీడు మార్గంలో చోటుచేసుకుంది. పెద్దరామిరెడ్డిగారిపల్లెకు చెందిన లక్ష్మీదీపిక వ్యక్తిగత పనులపై స్కూటీపై గాలివీడు రహదారిపైకి వెళ్లారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఆమె గాయపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

రాజంపేట: ఏవోకు వినతి పత్రం అందిస్తున్న రాజంపేట ఎమ్మెల్యే, ఎంపీ, వైకాపా నేతలు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని వైద్య కళాశాలలను ప్రైవేటీకరించడం తగదని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. కూటమి ప్రభుత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా ఆయన ఆధ్వర్యంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి 17 వైద్య కళాశాలలను తీసుకు వస్తే ప్రస్తుత ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసేలా నిర్ణయాలు తీసుకుంటోందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు. **రాజంపేట గ్రామీణ:** రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం మంజూరు చేసిన 17 మెడికల్ కళాశాలను ప్రైవేట్ పరం చేసే కార్యక్రమాన్ని వెంటనే తెదేపా ప్రభుత్వం విరమించుకోవాలని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, ఎంపీ రాఘునాథరెడ్డి, రాజంపేట పురపాలక ఛైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డిలు తెలిపారు. రాజంపేట పట్టణం రోడ్డు భవనాల శాఖ కార్యాలయం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు బుధవారం వైకాపా నేతలు ర్యాలీ నిర్వహించి, అనంతరం సబ్ కలెక్టర్ ఏవో శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. **రాయచోటి:** వైద్య కళాశాలలు ప్రభుత్వ ఆస్తి అని మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు. తన కార్యాలయంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. పేదల కలల వైద్య విద్యను పీపీపీ పేరుతో బినామీలకు దోచిపెట్టేలా ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి చేరుకొని ఏవో తులసమ్మకు వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్‌అహ్మద్, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

LOST

ఓల్డ్ అండ్ న్యూ వుడ్ ట్రేడర్స్, కడప వారికి సంబంధించినటువంటి IDBI బ్యాంక్ కరెంట్ అకౌంట్ A/c 020710xxxxxx8518గా పేరు రాయని MT చెక్కులు నెంబర్ (1) 219850--Amount 3,00,000/-, (2) 219851--Amount 1,60,000/- మరియు కంపెనీకి సంబంధించినటువంటి డాక్యుమెంట్లు రైల్వేకోడూరు నుండి ఓబులవారిపల్లి వెళ్ళు దారిలో నా యొక్క బైక్ నుండి మిస్ అయినవి. కావున పై బ్యాంకు చెక్కులు ఎవరికైనా దొరికినచో వాటిని ఓబులవారిపల్లి పోలీస్ స్టేషన్ లేదా రైల్వేకోడూరు పోలీస్ స్టేషన్ నందు ఇవ్వవలసినదిగా ఇందుమూలంగా ప్రజలను కోరడమైనది. పై చెక్కులను ఎవరైనా బ్యాంక్ నందు ప్రెజెంట్ చేసినచో వారిపై మేం పోలీస్ స్టేషన్ ద్వారా కోర్టు వారు తీసుకొను చర్యలకు బాధ్యులు కాగలరని ఇందుమూలంగా తెలపడం అయినది.

ఇట్లు: ఓల్డ్ అండ్ న్యూ వుడ్ ట్రేడర్స్, కడప.

డీఈవో పాఠశాలల ఆకస్మిక తనిఖీ

సిద్ధవటం, న్యూస్‌టుడే: సిద్దవటం మండలంలోని భాకరాపేట, ఏపీఎస్పీ పదకొండో బెటాలియన్, సిద్ధవటంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలను బుధవారం డీఈవో షంషుద్దీన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భాకరాపేటలో ప్రార్థన నిర్వహణ తీరును, బెటాలియన్‌లో ఎస్ఏ-1 పరీక్ష కేంద్రం, సిద్ధవటంలో మధ్యాహ్న భోజనం, కేంద్రీకృత వంటశాల భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. తమకు కెమిస్ట్రీ అధ్యాపకుడు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వెంటనే నియమించేలా చర్యలు తీసుకోవాలని సిద్దవటంలోని ఇంటర్ విద్యార్థులు డీఈవోను కోరారు. ఎంఈవోతో మాట్లాడి అధ్యాపకుడిని నియమించే చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. హెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పతకాలు సాధిస్తాం.. ఉద్యోగం పట్టేస్తాం

గాలివీడు, న్యూస్‌టుడే: వారంతా పేదింటి బిడ్డలు.. చదువుతో పాటు ఆటలే ప్రాణంగా నిత్య సాధన చేస్తున్నారు. గాలివీడు మండలం గ్రామీణ ప్రాంతాల్లోని ఎగువగొట్టివీడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయిలో ప్రతిభ కనపరిచారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటడానికి ఎంపికయ్యారు. వీరు జాతీయ స్థాయి పతకాలే లక్ష్యంగా ముమ్మర సాధన చేస్తున్నారు. పతకాలు సాధించడమే కాదు.. ప్రభుత్వ ఉద్యోగం కూడా సాధిస్తామని ధీమాగా చెబుతున్నారు. వీరిపై ప్రత్యేక కథనం.

ఎగువగొట్టివీడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రీడల గురించి వివరిస్తున్న పీడీ శ్రీనివాసులు

ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తా..

ఎగువగొట్టివీడు పంచాయతీ నాగన్నగుట్టపాళెంకు చెందిన **కె. శివ** గొట్టివీడు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు రమణయ్య, రమణమ్మలది వ్యవసాయ కుటుంబం. ఆటల్లో పాల్గొనేందుకు పాఠశాలలో పీడీ శ్రీనివాసులు ప్రోత్సహించారు. ఖోఖో క్రీడపై మక్కువ పెంచుకున్నాడు. మండల, నియోజక వర్గ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానం నిలిచేవాడు. ఈ నెల 8న జిల్లా స్థాయి పోటీలు కడప మున్సిపల్ పాఠశాలలో (ఉర్దూ) నిర్వహించారు. జాతీయ స్థాయిలో రాణించి పతాకాలు సాధించాలనే లక్ష్యంగా తగిన శిక్షణ తీసుకుంటున్నాడు.

పోలీసు అవుతా..

ఎగువగొట్టివీడు కస్పాకు చెందిన **ఎస్.సనాకౌసర్** జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. తల్లిదండ్రులు ఖదీరున్, అన్వర్‌బాషా వ్యవసాయం చేస్తారు. క్రీడలతో పాటు ఉన్నత చదువులు చదివి పోలీస్ అధికారి అవ్వాలన్న లక్ష్యంతో పట్టుదలగా రాణిస్తోంది. దీనికి ఖోఖో ఆటను ఎంచుకుని మండల, నియోజక స్థాయి క్రీడల్లో సత్తా చాటి జిల్లా జట్టుకు ఎంపికైయ్యారు. చదువుల్లో ప్రథమ స్థానంలో ఉంటూ అంతే కృషితో క్రీడల్లో పట్టు సాధించింది. ఉన్నత చదువులతో పాటు జాతీయ స్థాయి క్రీడల్లో సత్తా చాటుతానని తెలిపారు.

శిక్షణకు ప్రత్యేక ప్రణాళిక

మా పాఠశాలలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థులు ఎంపికయ్యారు. జాతీయ స్థాయిలో అండర్-17 విభాగంలో ఇద్దరు ఖోఖో క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ప్రత్యేక ప్రణాళికతో తగిన శిక్షణ ఇస్తున్నాం. ఉదయం, సాయంత్రం పాఠశాలల వేళల్లో మరికొందరికి తర్ఫీదు ఇస్తున్నాం.. వచ్చే రాష్ట్ర స్థాయి క్రీడల్లో ఎగువ గొట్టివీడు విద్యార్థులు జాతీయ స్థాయిలో మెరిచే విధంగా ఉత్సాహంగా ముందుకు సాగుతున్నారు. **- శ్రీనివాసులు, పీడీ, ఎగువగొట్టివీడు జడ్పీ ఉన్నత పాఠశాల, గాలివీడు మండలం**

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

జన్మదిన శుభాకాంక్షలు

నువ్వు దూరమై నాలుగు నెలలైనా ప్రతిరోజు, ప్రతిగంట, ప్రతిక్షణం నీ జ్ఞాపకాలతోనే గడుస్తుంది. నువ్వు, నీ మాట, నీ ప్రేమ అన్నీ తీరని లోటుగా మిగిలాయి. నువ్వులేని ఈ ప్రపంచంలో నీ ప్రేమ మాత్రమే నా తోడు. ఎప్పటికీ నీ వాడిగానే బ్రతుకుతాను. నీకు జన్మదిన శుభాకాంక్షలు నా ప్రాణమా...

భర్త : దేరంగుల అశోక్
కుమార్తె : దేరంగుల ధన్విక

కీ॥శే॥ శ్రీమతి దేరంగుల లక్ష్మివైష్ణవి

(c) eenadu

ఈ రోడ్డుపై విమానాలు దిగుతాయ్

జాతీయ రహదారి రన్‌వేపై సరకు రవాణా విమానం

మేదరమెట్ల, న్యూస్‌టుడే: నిత్యం లారీలు, బస్సులు, కార్లు రయ్.. రయ్ మంటూ రాకపోకలు సాగించే జాతీయ రహదారి అది. అత్యవసర సమయంలో విమానాలు దిగేందుకు సిద్ధంగా ఉంటుంది. బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం కొరిశపాడు గ్రామం నుంచి జె.పంగులూరు మండలం రేణింగవరం వరకు 4.1 కిలోమీటర్ల పొడవు, 33 మీటర్ల వెడల్పుతో ల్యాండింగ్ స్ట్రిప్ నిర్మించారు. ఇప్పటికే ఈ అత్యవసర రన్‌వేపై రెండుసార్లు వైమానిక దళం ఆధ్వర్యంలో ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలోనూ, అత్యవసర పరిస్థితుల్లోనూ ఇక్కడ విమానాలు ల్యాండ్ చేయడానికి ఈ రన్‌వేను సిద్ధం చేశారు. రన్‌వే కోసం మలుపులు లేని నాలుగు కిలోమీటర్ల రహదారి, అత్యవసరంగా ట్రాఫిక్ మళ్లించేందుకు అనువైన మార్గాలు ఉన్న రహదారిని ఎంచుకున్నట్లు వైమానిక దళం అధికారులు వెల్లడించారు.

సహకార వ్యవస్థ పటిష్ఠానికి చర్యలు

బాపట్ల: సహకార వ్యవస్థ పటిష్ఠం ద్వారా రైతులు, సామాన్య మధ్య తరగతి వర్గాలకు మెరుగైన సేవలు అందుతాయని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహిస్తున్న అఖిల భారత సహకార వారోత్సవాల గోడపత్రికలను బుధవారం ఆయన ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆత్మనిర్భర్ భారత్‌లో సహకార సంఘాల వాహకాలు అనే నినాదంతో ఈ ఏడాది సహకార వారోత్సవాలు నిర్వహించాలని కేంద్రం ప్రకటించిందన్నారు.

పామాయిల్ తోటల పెంపకానికి ప్రోత్సాహం.. జిల్లాలో పామాయిల్ తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్లో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి నెలా వంద హెక్టార్లలో పామాయిల్ తోటలు పెంచేలా ఉద్యాన శాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యాన, పట్టు, సూక్ష్మ సేద్యం శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు.

నేతన్న ఎదురీత

పట్టు, జరీ ధరల పెరుగుదల... తగ్గిన చీరల ఉత్పత్తి



చీరాల అర్బన్, వేటపాలెం, న్యూస్‌టుడే: నేత కార్మికులకు మళ్లీ కష్టాలు మొదలవుతున్నాయి. పట్టు, జరీ ధరలు పెరగడమే దీనికి ప్రధాన కారణం. నాలుగు నెలల ధరలతో పోల్చుకుంటే ఇవి పెరిగాయి. ఆ మేరకు తయారైన వస్త్రానికి గిట్టుబాటు ధర లేదు. దీంతో చీరల ఉత్పత్తికి మాస్టర్ వీవర్లు వెనుకంజ వేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీనివల్ల కార్మికులకు చేతినిండా పని దొరకడం కష్టంగా మారే ప్రమాదం ఉంది. ఇపుడే ఈ పరిస్థితి ఉంటే రాబోయే మూడు నెలల పాటు వివాహాలు లేకపోవడంతో చీరలకు డిమాండ్ తగ్గనుంది. దీంతో కార్మికులు చేతి నిండా పనిలేక మరింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 7567 చేనేత మగ్గాలుండగా దాదాపు ఆరు వేల మగ్గాలపై చీరలు తయారవుతాయి. వీటిలో అయిదువేల వరకు ఒక్క చీరాలలోనే ఉన్నాయి. ఇక్కడ తయారయ్యే చీరలకు పట్టు, జరీ వినియోగిస్తారు. అయిదు చీరలకి కిలో పట్టు, 8 నుంచి 10 జరీ మార్కులు వినియోగిస్తారు. మన ప్రాంతానికి బెంగళూరు, కర్ణాటక ప్రాంతాల నుంచి పట్టు దిగుమతి అవుతోంది. ఇదే సమయంలో దీన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేస్తుండటంతో వీటి ధరలు పెరుగుతున్నాయి. ఇక జరీ అయితే మార్కెట్‌లో వెండి ధరలు ఎక్కువగా ఉండటమే నని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ధరలు ఇలా..

పట్టు రకాలు	ప్రస్తుతం కిలో ధర	నాలుగు నెలల క్రితం (రూపాయల్లో)
చరక	6,200	5,200
ఫ్లేచర్	7,200	6,200

జరీ మార్క్
ప్రస్తుత ధర రూ.600
నాలుగు నెలల క్రితం రూ.480

ఉత్పత్తి వ్యయం అధికమై..

పట్టు, జరీ ధరలు పెరుగుదలతో అయిదు చీరల తయారీకి రూ.2200 వరకు అదనంగా వ్యయం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అంటే ఒక్కొక్క చీరకు ఉత్పత్తి వ్యయం రూ.550 వరకు అదనంగా భారం పడుతోందని మాస్టర్ వీవర్లు పేర్కొంటున్నారు. దీనివల్ల మార్కెట్‌లో వీటి ధరలు పెరగకపోవడంతో గిట్టుబాటు కావడంలేదని వారు వాపోతున్నారు. దీంతో తయారీ తగ్గిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం పెళ్లి సీజన్ కావడంతో మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో నెట్టుకొస్తున్నామని, రాబోయే నెల నుంచి మూడు నెలల పాటు ముహూర్తాలు లేవని, దీని వల్ల వ్యాపారం పూర్తిగా తగ్గే అవకాశం ఉందని వారి వాదన.

వస్తే పోలేరు.. వెళ్తే రాలేరు

న్యూస్‌టుడే, బాపట్ల

వేటపాలెం మండలం పొట్టిసుబ్బయ్యపాలెం వద్ద కూలిన కల్వర్టు

రామాపురం వద్ద ధ్వంసమై ఇలా..

మొంథా తుపానుకు బాపట్ల జిల్లాలో చీరాల-వేటపాలెం మండలాల్లో బీచ్ రోడ్డు అయిదు చోట్ల ధ్వంసమై కల్వర్టులు కూలి రాకపోకలు నిలిచిపోయాయి. పర్యాటకులు, మత్స్యకారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. వరదనీటి ఉద్ధృతికి పొట్టి సుబ్బయ్యపాలెం సమీపంలో కల్వర్టు, రహదారి కొట్టుకుపోయింది. చీరాల, వేటపాలెం మండలాల్లో బీచ్‌లను కలిపే రోడ్డు ధ్వంసమైంది. రామాపురం వద్ద కల్వర్టు కూలింది. దీంతో వాడరేవు నుంచి రామాపురం, పొట్టిసుబ్బయ్యపాలెం, కఠారిపాలెం బీచ్‌లకు వెళ్లే మార్గాన్ని మూసివేశారు. తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.39.20 లక్షలు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. పునరుద్ధరణలో జాప్యం జరిగేలా ఉండటంతో ఈ మార్గంలో రవాణాకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. 167ఏ ఎన్‌హెచ్‌లో బీచ్‌లకు వచ్చే సందర్శకులు బైపాస్ రోడ్డులోకి మళ్లి రామాపురం దారిలోకి వెళ్లాల్సి వస్తోంది. ఇతర బీచ్‌లకు చేరుకోవటానికి ఏడు నుంచి ఎనిమిది కి.మీ. చుట్టూ తిరిగి వెళ్తున్నారు. తుపానుకు ముందు కార్లు, ద్విచక్ర వాహనాల్లో వచ్చే పర్యాటకులు బీచ్ రోడ్డులో విహరించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. రెండువారాలుగా పర్యాటకుల సంఖ్య తగ్గింది.

త్వరగా నిధులు వస్తేనే..

● బాపట్ల నుంచి పాండురంగాపురం, రామచంద్రాపురం, కొత్త ఓడరేవు బీచ్‌లకు వెళ్లే రహదారి దారుణంగా దెబ్బతిని గోతులమయంగా మారింది. బాపట్ల-సూర్యలంక రోడ్డుది అదే పరిస్థితి. తాత్కాలిక మరమ్మతులకు రూ.60 లక్షల వరకు కావాల్సి ఉంది. బీచ్‌లకు వెళ్లే మార్గాల్లో కొత్తగా హైలెవల్ వంతెనలు, కాజ్‌వేలు, కల్వర్టుల నిర్మాణం, రహదారుల అభివృద్ధికి రూ.14 కోట్ల వరకు నిధులు అవసరం. కేంద్ర బృందం ధ్వంసమైన రోడ్లు, కల్వర్టులను పరిశీలించి వెళ్లింది. కొత్తగా వీటి నిర్మాణ ఆవశ్యకతను కేంద్ర బృందంలో సభ్యులకు కలెక్టర్ వినోద్‌కుమార్ వివరించి సాయం చేయాలని కోరారు. దీనిపై పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ రాజన్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ నుంచి నిధులు మంజూరు కాగానే రోడ్లు, కల్వర్టుల మరమ్మతుల పనులు చేపడతామన్నారు.

పేదలకు గృహ యోగం

పండగ వాతావరణంలో కొత్త ఇళ్లల్లోకి ప్రవేశాలు

చదలవాడలో ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు, కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల: పేదల సొంతింటి కలను కూటమి ప్రభుత్వం సాకారం చేస్తుందని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో నూతన గృహప్రవేశాల కార్యక్రమాన్ని బుధవారం పండగ వాతావరణంలో నిర్వహించారు. వేమూరు మండలం చదలవాడలో కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే ఆనందబాబు కలిసి నూతన గృహాలు ప్రారంభించి లబ్ధిదారులకు తాళాలు పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లకు బీసీలు, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనంగా సాయం చేస్తున్నట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళలకు రూ.30 వేల రుణం మంజూరు చేస్తున్నామన్నారు. బాపట్ల మండలం గోపాపురంలో లబ్ధిదారులతో కలిసి కొత్త గృహాలను ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ ప్రారంభించారు. ఇళ్లు లేని పేదలందరికీ పక్కా గృహాలు మంజూరు చేస్తామన్నారు. చీరాల పట్టణం రెండో వార్డు ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే కొండయ్య లబ్ధిదారునితో నూతన గృహ ప్రవేశం చేయించారు. నమూనా తాళాలు అందజేశారు. కొత్తగా ఇరవై మందికి గృహాల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. అద్దంకి రాజీవ్‌నగర్, మార్టూరు మద్ది సీతాదేవినగర్‌లో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నేతల సమక్షంలో కొత్త గృహ ప్రవేశాలు కోలాహలంగా జరిగాయి. అద్దంకిలో 188 మంది, రేపల్లెలో 20 మంది లబ్ధిదారులకు పక్కా గృహాల మంజూరు పత్రాలు అందజేశారు. ఆర్డీవో రామతులసి, గృహనిర్మాణ శాఖ పీడీ వెంకటేశ్వరరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ధర దక్కక కంది పోతున్న రైతు

న్యూస్‌టుడే, బాపట్ల



కందులకు మార్కెట్లో కనీస మద్దతు ధర లభించటం లేదు. ఎంఎస్‌పీ, వ్యాపారులు చెల్లిస్తున్న ధరకు రూ.1200 నుంచి రూ.1500 వరకు వ్యత్యాసం ఉంటోంది. రైతులు తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారు. జిల్లాలో అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో రెండున్నర వేల ఎకరాల్లో పైగా కంది సాగు చేస్తున్నారు. ఎకరాకు కౌలు కింద రూ.15 వేలు చెల్లిస్తున్నారు. పెట్టుబడి కింద మరో రూ.30 వేల వరకు ఖర్చు అవుతోంది. ఈ ఏడాది ప్రతికూల పరిస్థితుల్లో పండిస్తున్నారు. క్వింటా కందులకు కనీస మద్దతు ధర రూ.8 వేలుగా కేంద్రం నిర్ణయించింది. గతేడాది క్వింటాకు రికార్డు స్థాయిలో రూ.10వేల వరకు ధర లభించింది. కొంతమంది రైతులు పంట విక్రయించకుండా ధర మరింత పెరుగుతుందని ఆశించారు. ప్రస్తుతం ధర దిగజారి రూ.6500 నుంచి 6800 మాత్రమే పలుకుతోంది. ఎకరాకు ఐదు నుంచి ఎనిమిది క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. ధర పడిపోవటం వల్ల రైతులు రూ.వేలల్లో నష్టపోతున్నారు. అపరాలతో కలిపి కొత్తగా వచ్చే కందుల దిగుబడులుకు మార్చిలోనే ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది.

జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలి

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన బాలుర జట్టుతో కలెక్టర్

బాపట్ల, బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే: కడపలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-16 కబడ్డీ పోటీల్లో బాలుర విభాగంలో జిల్లా జట్టు విజేతగా నిలవటం గర్వంగా ఉందని కలెక్టర్ వినోద్ కుమార్ అన్నారు. కలెక్టరేట్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాలికల విభాగంలో జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచిందన్నారు. క్రీడా నైపుణ్యానికి మెరుగులు దిద్దుకుని జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలన్నారు. కబడ్డీ, ఇతర క్రీడల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. బాలుర, బాలికల కబడ్డీ జట్లను కలెక్టర్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అభినందించారు. డీఎస్‌డీవో శ్రీనివాసులు, పీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆలోచనలు అదిరే.. ఆవిష్కరణలు మెరిసే

ఏఎన్‌యూలో ఎన్‌సీసీ ఆల్ ఇండియా ఐడియా అండ్ ఇన్నోవేటివ్ కాంపిటీషన్

ఆవిష్కరణలు పరిశీలిస్తున్న జ్యూరీ సభ్యులు

ఈనాడు, అమరావతి - న్యూస్‌టుడే, ఏఎన్‌యూ: హ్యాక్ చేయడానికి వీల్లేని డ్రోన్... రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే ఆసుపత్రికి, అధికారులకు సమాచారమిచ్చే ఆవిష్కరణ... అసలు రోడ్డు ప్రమాదాలకు ఆస్కారమే లేకుండా ప్రత్యేక పెయింటింగ్‌తో కట్టడి చేసే ఆలోచన.. పిల్లల ఆరోగ్య పరిస్థితులు వారి కాళ్లకున్న బూట్ల ద్వారా తెలుసుకునేలా రూపొందించిన వ్యవస్థ... జనసమ్మర్ద ప్రదేశాల్లో ప్రతి ఒక్కరినీ పక్కాగా గుర్తించే నిఘా వ్యవస్థ... ఇలాంటి ఎన్నో వినూత్న ఆలోచనలు.. ఆవిష్కరణలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికైంది. బుధవారం నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) ఆల్ ఇండియా ఐడియా అండ్ ఇన్నోవేషన్ కాంపిటీషన్ (ఐసీసీ)- 2025ను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో కాకినాడ ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్స్ సమన్వయంతో నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 170 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు 85 వినూత్న ఆవిష్కరణలు ప్రదర్శించారు. ఉత్తమంగా ఎంపికైనవాటిని దిల్లీ ప్రదర్శనలో ఉంచుతామని.. రక్షణ, ఇతర రంగాల్లో వినియోగించడానికి ఉన్న అవకాశాలపై అధ్యయనం చేస్తామని ఎన్‌సీసీ అధికారులు వివరించారు.

ప్రాజెక్టు: ఆప్టికల్ ఫైబర్ డ్రోన్
తయారీదారులు: విక్రాంత్‌చౌదరి, హార్దిక్ మిత్తల్, మయూర్ చౌదరి (బీటెక్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు)
స్వస్థలం: జైపూర్, రాజస్థాన్
పరికరాలు: 6 ఎల్‌డీసీ బ్రష్‌లెస్ మోటార్లు, 5,200 ఎంఏహెచ్ బ్యాటరీ, పిక్సో ఫ్లైట్ కంట్రోల్, జీపీఎస్ కంపాస్ మాడ్యుల్.
ప్రత్యేకతలు: ఇది ఆప్టికల్ ఫైబర్ డ్రోన్. హ్యాక్ చేయలేరు. 3 నుంచి 4 కిలోల పేలోడ్ పేలుడు పదార్థాలను తరలిస్తుంది. 2 కిలోమీటర్ల నుంచి 30 కిలోమీటర్ల రేడియస్‌లో పనిచేస్తుంది. సైన్యంలో కౌంటర్ ఎటాక్‌కు ఉపయోగపడుతుంది. వ్యయం రూ.70 వేలలోపే. ఇలాంటివి ప్రస్తుతం రష్యా మాత్రమే వినియోగిస్తోంది.

ప్రాజెక్టు: ఏఐ యాక్సిడెంట్ అలెర్ట్ సిస్టమ్ యూజింగ్ సీసీటీవీ
రూపకర్తలు: సాక్షి రంజిత్ దియోర్
స్వస్థలం: వడోదర, గుజరాత్
పరికరాలు: సీసీటీవీ లేదా వెబ్‌కెమెరా
ప్రత్యేకతలు: రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్తే ప్రాణాలు దక్కే అవకాశం ఎక్కువ. ప్రమాదం జరిగాక సీసీ కెమెరా లేదా వెబ్‌కెమెరా ద్వారా సమీపంలోని ఆసుపత్రి, పోలీసులు, అధికారులకు క్షణాల్లో సమాచారం చేరేలా ఏఐ ఆధారితంగా ఈ ప్రాజెక్టును రూపొందించారు. గుజరాత్‌లోని వడోదరాలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు.

ప్రాజెక్టు: ఎ కిట్ విత్ ఎ పెయింట్
రూపకర్తలు: దీప్తిషామిశ్రా, ఆశిష్‌దాస్
స్వస్థలం: ఒడిశా **పరికరాలు:** ప్రత్యేక పెయింట్, డివైజ్, ల్యాప్‌టాప్
ప్రత్యేకతలు: ఎత్తైన కొండలు, ఘాట్‌రోడ్లలో రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనేది ఈ ప్రాజెక్టు ఉద్దేశం. ఫొటోలూమినెస్ పెయింట్‌ను ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో విస్తరించడం ద్వారా మలుపుల్లో విజిబులిటీని పెంచవచ్చు.

మానసిక దివ్యాంగులకు శాశ్వత ఆటిజం కేంద్రం ఏర్పాటు

బాపట్ల: పురపాలక ఉన్నత పాఠశాల నూతన భవనంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఆటిజం కేంద్రాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్ బుధవారం సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో మానసిక దివ్యాంగుల కోసం శాశ్వత ఆటిజం కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కేంద్రం నిర్మాణానికి స్థల సేకరణ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం రూ.28 లక్షలు కేటాయించిందన్నారు. తూర్పు పిన్నిబోయినవారిపాలెంలో రూ.7.55 ఎకరాల్లో జిల్లా క్రీడల సముదాయాన్ని నిర్మించనున్నట్లు చెప్పారు. తహసీల్దారు సలీమా, పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి, ఐఈడీ సమన్వయకర్త జ్యోత్స్న పాల్గొన్నారు.

అంబటి సహా పలువురిపై కేసులు

గుంటూరు: మాజీ మంత్రి, వైకాపా నేత అంబటి రాంబాబు రెచ్చిపోయారు. విధుల్లో ఉన్న పోలీసు అధికారులపై జులుం ప్రదర్శించారు. నోటికొచ్చినట్లు అసభ్య పదజాలంతో దూషించారు. చివరకు డీఎస్పీ స్థాయి అధికారిని సైతం ఏకవచనంతో సంబోధిస్తూ వాగ్వాదానికి దిగారు. పట్టాభిపురం సీఐను బలవంతంగా పక్కకు నెట్టి రౌడీయిజం చేశారు. వీధి రౌడీలా అంబటి వ్యవహరించిన తీరుపై తీవ్ర చర్చనీయాంశమైంది. పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు, బెదిరించినందుకు వైకాపా జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబుతో పాటు పలువురు వైకాపా నేతలపై పట్టాభిపురం ఠాణాలో కేసు నమోదు చేశారు.

ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు

పర్చూరు: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం కింద వండే అన్నంలోని గంజిని పారబోయడంపై రాష్ట్ర ఫుడ్ కమిటీ సభ్యురాలు జి.దేవి నాగులపాలెం ఎంపీపీ(ఎల్ఈ) పాఠశాల హెచ్‌ఎం రేణుకాదేవికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని మండల విద్యాశాఖాధికారి-2 పి.వెంకట్రామయ్యను ఆదేశించారు. బుధవారం ఈ పాఠశాల తనిఖీ సమయంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని సిద్ధం చేసే వంట మహిళతో ఆమె మాట్లాడారు. భోజనం ఎక్కడ సిద్ధం చేస్తున్నారని, గంజిని ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. గంజి పారబోస్తున్నామని, ఇంటి నుంచి భోజనాన్ని తయారు చేసి తీసుకొస్తున్నామని చెప్పారు. గంజిని పారబోస్తే పోషకాలు ఉండవని, ఇలాగైతే ఎలా అంటూ హెచ్‌ఎం రేణుకాదేవిని ఆమె ప్రశ్నించారు. సరైన సమాధానం చెప్పకపోవడంతో షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. బడిలోనే భోజనాన్ని సిద్ధం చేయాలని సూచించారు. ఈ విషయంపై ఎంఈవో-2 వెంకట్రామయ్యను వివరణ కోరగా నోటీసులుజారీ చేస్తామని తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా 30 కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు

పత్తిలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న సంచాలకురాలు విజయసునీత

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 30 సీసీఐ కేంద్రాల ద్వారా 62 జిన్నింగు మిల్లుల్లో రైతుల నుంచి పత్తి కొనుగోళ్లు చేపడుతున్నట్లు వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ సంచాలకురాలు ఎం.విజయసునీత తెలిపారు. ఖరీఫ్‌లో సుమారు 4.56 లక్షల హెక్టార్లలో పత్తి సాగు కాగా, 8 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. సత్తెనపల్లిలోని పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆమె బుధవారం పరిశీలించారు. పత్తి తేమ, నాణ్యత పరిశీలించారు. తేమ శాతం ఆధారంగా రైతులకు లభిస్తున్న నగదు వివరాలను గమనించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పత్తి రైతులు తొలుత రైతుసేవా కేంద్రాల్లో సిబ్బంది ద్వారా కపాస్ కిసాన్ యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. నిర్దేశించిన రోజున, సంబంధిత కేంద్రానికి సరకు తరలించాలని సూచించారు. నందిగామ ఆర్ఎస్‌కేలోనూ వివరాల నమోదు ప్రక్రియను గమనించారు. పత్తి పొలాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. సంయుక్త సంచాలకుడు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ మధ్యవర్తులను ఆశ్రయించవద్దని రైతులను కోరారు. మాచర్ల, పిడుగురాళ్ల, నడికుడి, క్రోసూరు, చిలకలూరిపేట, సత్తెనపల్లి, నరసరావుపేట కేంద్రాల్లోని 11 మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు మొదలైనట్లు చెప్పారు. విజిలెన్స్ జేడీ రాజశేఖర్, డిప్యూటీ డైరెక్టర్ దివాకర్, యార్డు ఛైర్‌పర్సన్ శోభారాణి, కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, పారిశ్రామికవేత్త శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూమోనియా నియంత్రణపై ప్రజలకు అవగాహన

బాపట్ల, న్యూస్‌టుడే: న్యూమోనియా నియంత్రణపై వైద్యాధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో విజయమ్మ అన్నారు. న్యూమోనియా దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ప్రచురించిన కరపత్రాలను కలెక్టరేట్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారుల్లో న్యూమోనియా మరణాలు తగ్గించేందుకు టీకాలు, శుభ్రత, సమయానుకూల వైద్యం కీలకమని ఆమె తెలిపారు.

ఫీజు వసూళ్లలో అవకతవకలపై ఆందోళన

పాఠశాల వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న విద్యార్థులు

చీరాల గ్రామీణం: చీరాల మండలం ఈపూరుపాలెంలోని చీరాల ఆదర్శ పాఠశాల విద్యార్థులు బుధవారం ఎస్ఎంసీ ఛైర్మన్ రాంబాబు ఆధ్వర్యంలో గేటు ముందు బైఠాయించి, నిరసన తెలిపారు. ప్రిన్సిపల్ ఫీజు వసూళ్ల విషయంలో అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. జిల్లా అధికారులు తక్షణం విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. డీఈవో పురుషోత్తం విద్యార్థులను బడిలోకి తీసుకెళ్లి, వారి వాదనలు విని లిఖిత పూర్వక ఫిర్యాదు తీసుకున్నారు. ప్రవేశ ఫీజుతో పాటు పరీక్ష ఫీజులు సైతం అదనంగా వసూలు చేశారని వసతి గృహ విద్యార్థినులు డీఈవోకి చెప్పారు. ఆరోగ్యం సరిగ్గా లేక ఇంటికి వెళ్లే వారి వద్ద రూ.500 వసూలు చేశారన్నారు. సింగిల్ పేరెంట్ ఉన్నవారు తాము చెల్లించలేమని మొత్తుకున్నా.. కనికరించలేదని వాపోయారు. ప్రిన్సిపల్ సరళ వైద్య సెలవులో ఉండటంతో వైస్ ప్రిన్సిపల్ శామ్యూల్‌జాన్, హాస్టల్ వార్డెన్ వద్ద వివరణ తీసుకున్నారు. విచారణలో ఆదర్శ పాఠశాలల రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ విద్యాసాగర్, జీసీడీవో చారులత, చీరాల ఉప విద్యాశాఖాధికారి గంగాధర్, ఎంఈవో 2 సుధారాణి తదితరులున్నారు.

ఆదర్శ మండలాల అభివృద్ధికి ప్రణాళిక

శిక్షణకు హాజరైన వెలుగు సిబ్బంది

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో డ్వాక్రా సంఘాల సహకారంతో ఆదర్శ మండలాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు డీఆర్‌డీఏ సెర్ప్ పీడీ లవన్న పేర్కొన్నారు. జిల్లాలో ఎంపికైన 10 మండలాల వెలుగు ఏపీఎం, ఇతర సిబ్బంది, డ్వాక్రా యానిమేటర్లు, సభ్యులకు రెండు రోజులుగా ఏపీఎం మధుసూదనరావు అధ్యక్షతన ఈపూరుపాలెం వెలుగు శాఖ కార్యాలయం, కుర్రి కోటయ్య, ప్రగడ కోటయ్య సామాజిక భవనాల్లో శిక్షణ నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజన్ బిల్డింగ్ కింద తొలి దశలో చీరాల, యద్దనపూడి, బల్లికురవ, ఇంకొల్లు, కొరిశపాడు, పిట్టలవానిపాలెం, నిజాంపట్నం, రేపల్లె, భట్టిప్రోలు, చుండూరు మండలాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ మండలాల్లోని డ్వాక్రా సంఘాల నుంచి సూచనలు తీసుకొని ప్రత్యేక రుణాలు ఇచ్చేలా వారికి ముందస్తు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మండలాల వారీగా కుటుంబ పోషణకు ఆధారమైన కుటీర పరిశ్రమలను గుర్తించి, అందులో సమగ్ర అభివృద్ధి సాధించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. శిక్షకులుగా జి.సుబ్బారావు వ్యవహరించగా.. జిల్లా డీపీఎంలు రమేష్, రవి, ఏపీఎంలు హాజరయ్యారు.

(c) eenadu

ఆన్‌లైన్లో పోలీసు సిబ్బంది సర్వీసు వివరాలు నమోదు

సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల, న్యూస్‌టుడే: పోలీసు సిబ్బంది సర్వీసు వివరాలను ఈ నెలాఖరు లోగా ఆన్‌లైన్లో ఎంప్లాయీ సర్వీస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో పొందుపరచాలని ఎస్పీ ఉమామహేశ్వర్ అన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో కొనసాగుతున్న పోలీసు ఉద్యోగుల సర్వీసు వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఆయన బుధవారం పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ వివరాలు ఆన్‌లైన్లో పొందుపరిచే ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన 18 మంది సిబ్బందిని వివిధ పోలీస్‌స్టేషన్ల నుంచి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పిలిపించి వివరాలు పొందుపరిచే బాధ్యతలు అప్పగించామన్నారు. ప్రక్రియ పూర్తయితే పోలీసులు డీపీవోకు రావాల్సిన అవసరం లేకుండా తమ సర్వీసు వివరాలను ఎక్కడి నుంచైనా ఈఎస్ఎంలో లాగిన్లై స్వయంగా చూసుకోగలుగుతారని తెలిపారు. ఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

వేమూరు, న్యూస్‌టుడే: ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన పథకాలను వినియోగించుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు పక్కా ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి వేమూరు మండలం చదలవాడలో ఎమ్మెల్యే ఆనందబాబుతో కలిసి ఆయన పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్లు నిర్మించుకున్న వారు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మరుగుదొడ్డి, ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 14 నెలలో నియోజకవర్గంలో 3,879 ఇళ్లు నిర్మించిందని చెప్పారు. అనంతరం నూతనంగా నిర్మించిన ఇళ్లను ప్రారంభించారు. రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, వేమూరు మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ ఎ.కిశోర్, కుచ్చెళ్లపాడు సర్పంచి వెంకటసుబ్బయ్య, సొసైటీ అధ్యక్షుడు నాగకుమార్ పాల్గొన్నారు.

జడ్పీ సర్వసభ్య సమావేశం ఎప్పుడు?

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: జడ్పీ సర్వసభ్య సమావేశం అక్టోబరు 29న ఏర్పాటు చేసినా కోరం కాలేదు. మొత్తం 82 మంది సభ్యుల్లో మూడో వంతు 27 మంది హాజరైతేనే కోరం సరిపోతుంది. మొంథా తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురవడంతో బాధిత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి, సహాయ కార్యక్రమాలు చేయడంలో మూడు జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధులు నిమగ్నమయ్యారు. ఈక్రమంలో ఏడుగురు మాత్రమే హాజరవడంతో కోరం లేనందున సమావేశాన్ని ముగిస్తున్నామని ఛైర్‌పర్సన్ క్రిస్టినా ప్రకటించారు.

పీఎంశ్రీ నిధులు.. అభివృద్ధిలో సర్కారు బడులు

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే

ఎంపికైన బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాల

జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించడంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. విద్యార్థులు అన్ని విధాలుగా చదువులో రాణించేందుకు పీఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకంతో శ్రీకారం చుట్టింది. పాఠశాలలను ఎంపిక చేసి అభివృద్ధి పథకం కింద నిధులు కేటాయిస్తుండడంతో వసతులు సమకూరుతున్నాయి.

117కు 108 పనులు పూర్తి : జిల్లాలోని 25 మండలాల్లో 33 పాఠశాలలు పీఎంశ్రీ కింద ఎంపిక చేశారు. మొదటి విడతలో 24 పాఠశాలలు, రెండో విడతలో 7, 7వ విడతలో 2 పాఠశాలలను ఎంపిక చేశారు. 3,4,5,6 విడతల్లో జిల్లాకు నిధులు మంజూరు కాలేదు. 25 మండలాల్లో మండలానికొచ్చి ఒక్కటి చొప్పున 25. మిగిలిన 8 అద్దంకి, రేపల్లె మండలాల్లో రెండేసి చొప్పున, బాపట్ల, చీరాల మండలాల్లో ఒకటి చొప్పున పాఠశాలలను ఎంపిక చేశారు. ఏడో విడతలో మిగిలిన రెండు రేపల్లె, వేటపాలెం పాఠశాలలు ఒకటి చొప్పున ఎంపికయ్యాయి. జిల్లాకు ఈ పథకం కింద మంజూరైన నిధులు మొత్తం రూ. 4.87 కోట్లు. చేసిన ఖర్చు రూ. 3.62 కోట్లు. మొత్తం 117 పనులకు గాను 108 పనులు పూర్తయ్యాయి.

చేస్తున్నవి ఇలా: ఈ పథకం కింద సైన్సు, కెమిస్ట్రీ, ఫిజిక్స్ ల్యాబ్స్ నిర్మాణం. క్రీడా ప్రాంగణాల అభివృద్ధి, కంప్యూటర్ ల్యాబ్స్, పాఠశాల ఆవరణంలో కూరగాయల పెంపకం నిమిత్తం ఫెన్సింగ్, దివ్యాంగుల ఉపయోగార్థం ర్యాంపులు నిర్మిస్తున్నారు. బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో లైబ్రరీ, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్స్ నిర్మించారు. యాజలి ఉన్నత పాఠశాలలో ఆటస్థలం నిర్మాణ పనులు పూర్తిచేశారు. గుళ్లపల్లి ఉన్నత పాఠశాలలో ల్యాబ్, ఆటస్థలం, కిచెన్ గార్డెన్ ఫెన్సింగ్ నిర్మించారు.

☛ 7వ విడతలో ఎంపిక చేసిన రేపల్లె బాలయోగి గురుకుల పాఠశాలకు రూ.92.6 లక్షలు, వేటపాలెంలో బాలికల పాఠశాలకు రూ.69.3 లక్షలు మంజూరయ్యాయి. ఈ పాఠశాలల్లో పనులు చేయాల్సి ఉంది.

క్లూస్ టీం పాత్ర కీలకం

బాపట్ల, న్యూస్‌టుడే: నేర స్థలంలో సాక్ష్యాల సేకరణలో క్లూస్ టీమ్‌కు ఎంతో ప్రాధాన్యం ఉందని ఎస్పీ ఉమామహేశ్వర్ అన్నారు. జిల్లా క్లూస్ టీంకు కొత్తగా కేటాయించిన మూడు వాహనాలు, పరికరాలను ఆయన బుధవారం పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ నేరస్థలంలో భౌతిక సాక్ష్యాల సేకరణ ఆధారంగా నిందితులను గుర్తించి వారికి శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవటంలో సాంకేతిక బృందం పాత్ర ఎంతో కీలకమన్నారు. బృందం వేగంగా నేర స్థలానికి చేరుకోవటానికి వాహనాలు ఉపయోగపడతాయన్నారు. రక్తపు నమూనాలు, వేలిముద్రలు, చిత్రాలు తీయటానికి, స్కెచ్ వేయటానికి ఉపయోగపడే పరికరాలు కేటాయించినట్లు తెలిపారు. ఎస్పీ ఇన్‌స్పెక్టర్ నారాయణ, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, క్లూస్ టీం ఎస్సై వెంకటేష్ పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలి

ఫుడ్ కమిటీ సభ్యురాలు దేవి

నాగులపాలెం గురుకుల పాఠశాలలో భోజనాన్ని రుచిచూస్తున్న దేవి, పక్కన అధికారులు

అద్దంకి, పర్చూరు, మార్టూరు, న్యూస్‌టుడే : ప్రజలకు అందించే ఆహారపదార్థాలు నాణ్యమైనవిగా ఉండాలని రాష్ట్రఫుడ్ కమిటీ సభ్యురాలు జి.దేవి అన్నారు. బాపట్ల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లో బుధవారం పర్యటించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, రేషన్ దుకాణాలు, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు తనిఖీ చేశారు. అద్దంకి ఎం.ఎల్.ఎస్.పాయింట్‌ను తనిఖీ చేశారు. చక్రాయపాలెం రేషన్ దుకాణాన్ని తనిఖీ చేసిన ఆమె స్టాకును రికార్డులతో సరిపోల్చారు. స్థానికులతో మాట్లాడి సరకుల బట్వాడా తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. మార్టూరులో చౌకధరల దుకాణాలు, సోషల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. పర్చూరు, నాగులపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, ఉప్పుటూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి భోజనాన్ని రుచిచూశారు. అన్నం వండే సమయంలో గంజి వార్చవద్దని, పోషకాలు బయటకు వెళ్లిపోతాయని తెలిపారు. జిల్లా పౌరసరఫరాల అధికారి బాషా, అద్దంకి ఎంఈవో-2 కేవీ.శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్ మేనేజర్ నాగేశ్వరరావు, సీడీపీవో జి.సుభద్ర, సీఎస్ డీటీ గఫూర్, వీఆర్వో వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్ చిరునామా: శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034.

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 లోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పిలువబడేది, ఎన్.సి.ఎల్.టి బెంచ్-II, చెన్నై, తేది: 09-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేదీ నాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్డ్ కంపెనీ అయి ఉన్నాము. మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద రిజిస్టర్డ్ ఆఫీస్ కలిగియున్నది. మరియు జోనల్ ఆఫీస్: శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు-522034, బ్రాంచి ఆఫీస్ చిరునామా: పొన్నూరు లో మరియు నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్.బి.ఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ / ఋణదాతగా సూచిస్తారు). ఇందుమూలముగా ఈ క్రింది నోటీసు జారీ చేస్తున్నాము.

ఋణగ్రహీతలు / సహ-ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 3తో చదువబడు సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసులు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులో తెలిపిన మొత్తం పై కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతో పాటు నోటీసులో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసి చట్టం 2002లోని 13(2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

చివరగా తెలిసిన వారి చిరునామాలోనే వారికి జారీ చేయబడిన నోటీసులు అందజేయబడకుండ తిరిగి వచ్చినందుకు సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

ఋణగ్రహీత (లు) / సహ ఋణగ్రహీతలు / హామీదారు(లు) పేరు	ఎన్.పి.ఏ తేది ఋణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది బకాయి మొత్తం
1. శ్రీ దేవి గంజి, భర్త: కోటేశ్వర రావు, డోర్ నెం. 9-18-5(1), ఎ.ఆర్. నగర్, పేరాల హైస్కూల్ వెనుక వైపు, సెంటర్ మెయిన్ రోడ్డు, పేరాల పోస్ట్, చీరాల మండలం, ప్రకాశం జిల్లా-523157. 2. కోటేశ్వర రావు గంజి, తండ్రి: ఆంజనేయులు జి, డోర్ నెం. 9-18-5(1), ఎ.ఆర్. నగర్, పేరాల హైస్కూల్ వెనుక వైపు, సెంటర్ మెయిన్ రోడ్డు, పేరాల పోస్ట్, చీరాల మండలం, ప్రకాశం జిల్లా-523157. 3. విజేంద్ర రావు కొలాటి, తండ్రి: చిత్తయ్య, డోర్ నెం. 6-7-19/2, శాంతి నగర్, పేరాల పోస్ట్, చీరాల మండలం, ప్రకాశం జిల్లా-523157.	30.11.2018 రూ. 10,00,000/- (అక్షరాలా పది లక్షల రూపాయలు మాత్రమే)	28-10-2025 ది. 28-10-2025 తేది నాటికి రూ. 29,10,660/- (అక్షరాలా ఇరవై తొమ్మిది లక్షల పదివేల ఆరు వందల అరవై రూపాయలు మాత్రమే)

ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. PONNRTF1801270001

గంజి వెంకట శ్రీదేవి @ శ్రీదేవి గారికి చెందిన స్థిరాస్తి యొక్క వివరములు: ప్రకాశం జిల్లా, చీరాల సబ్ జిల్లా, చీరాల మున్సిపల్ ఏరియా, పేరాల గ్రామం, చీరాల పాత మున్సిపల్ వార్డు నెం. 6, ప్రస్తుత వార్డు నెం. 9, బ్లాక్ నెం. 5, టి.ఎస్.నెం. 256/10, పేరాల గ్రామం, సర్వే నెం. 326/10. డోర్ నెం. 9-18-5 సమీపంలో, ఆంధ్ర రత్న నగర్ ఏరియాలో ఉన్న 97 చదరపు గజాలు లేదా 80.51 చదరపు మీటర్ల ఇంటి స్థలం మరియు దానిపై 720 చదరపు అడుగుల ప్లింత్ ఏరియాలో నిర్మించిన ఏసిసి షీట్ రూఫ్ గల ఇంటితో సహా. డోర్ నెం. 9-18-5/1 మరియు అసెస్‌మెంట్ నెం. 1032021168. హద్దులు: తూర్పు: గోలి చిన పోలయ్య గారి స్థలం - 25.00 అడుగులు, పడమర: కార్యేమాపుడి వెంకట మోహన రావు గారి స్థలం - 21.04 అడుగులు, ఉత్తరం: 12.00 అడుగుల వెడల్పు గల ఉమ్మడి దారి - 38.00 అడుగులు, దక్షిణం: గుంటి మాధవి, వంశీ కృష్ణమన్ కిషోర్ గారి స్థలం - 38.00 అడుగులు. పై హద్దులలో డోర్ నెం. 9-18-5/1 మరియు అసెస్‌మెంట్ నెం. 1032021168 గల 97 చదరపు గజాలు లేదా 80.51 చదరపు మీటర్ల ఇంటి స్థలం మరియు దానిపై 720 చదరపు అడుగుల ప్లింత్ ఏరియాలో నిర్మించిన ఏసిసి షీట్ రూఫ్ గల ఇల్లు మాత్రమే. (ఈ ఆస్తి ఎస్.ఆర్.ఓ. చీరాల యొక్క డాక్యుమెంట్ నెం. 5675/2012 కు సంబంధించినది.)

పైన పేర్కొన్న పరిస్థితులలో ఈ నోటీసు ప్రచురించబడిన తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్తు వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతో పాటు పైన పేర్కొన్న విధంగా చెల్లించవలసిన మిగులు బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు / సహ-ఋణగ్రహీతలు మరియు / లేదా వారి హామీదార్లు (వర్తించునపుడు) కు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది. ఆ విధంగా చేయుటలో విఫలమైతే ఈ నోటీసు తేది నుండి 60 రోజులు ముగిసిన తరువాత సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని సెక్షన్ 13(4) మరియు దాని క్రింద వర్తించే రూల్స్ క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా పెట్టిన వ్యక్తుల సెక్యూర్డ్ ఆస్తుల స్వాధీనం చేసుకొనుటతో సహా సెక్యూర్డ్ ఆస్తుల పైన తదుపరి చర్యలు చేపట్టబడును. సదరు చట్టంలోని సెక్షన్ 13(13) క్రింద ఏ ఋణగ్రహీత సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు వ్రాతపూర్వక సమ్మతి లేకుండా పొందకుండా నోటీసులో రిఫర్ చేసిన అతని సెక్యూర్డ్ ఆస్తులు వేటిని అమ్మకం, లీజు ఇతరత్రా బదిలీ చేయరాదని గమనించవలెను.

ప్రదేశం: గుంటూరు
అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

తిమ్మాయపాలెంలో తరగతి గదిలో పరిశీలిస్తున్న పరీక్షల సహాయ కమిషనర్ శివకుమార్

పది విద్యార్థులకు అపార్ ఐడీ తప్పనిసరి

అద్దంకి, సంతమాగులూరు, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అపార్ గుర్తింపు కార్డు తప్పనిసరి అని పరీక్షల సహాయ కమిషనర్ కె.శివకుమార్ అన్నారు. తిమ్మాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల, సంతమాగులూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతో పాటు ఏల్చూరు, మక్కెనవారిపాలెం జిల్లా పరిషత్తు, ప్రైవేటు పరిధిలో బాలాజీ ఉన్నత పాఠశాలలను బుధవారం పరిశీలించారు. విద్యార్థుల్లో సీడీ గ్రేడ్ వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వంద రోజుల ప్రణాళికను సమర్థంగా అమలు చేయాలన్నారు. ఎంఈవో దినేష్‌కుమార్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శివనాగలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వాస్తుకు విరుద్ధంగా రాజగోపురాలు

విజయభాస్కరశాస్త్రితో పాలకమండలి సభ్యులు, సహాయ కమిషనర్

శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే: శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ రాజగోపురాలు, ప్రహరీలు వాస్తుకు, ఆగమనంకు విరుద్ధంగా ఉన్నాయని స్మార్త, ఆగమ సలహాదారు విజయభాస్కరశాస్త్రి అన్నారు. ఆలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. రాతి ముఖ మండపం నిర్మాణం జరిగిన నేపథ్యంలో రాజగోపురాలు, ప్రాకార మండపాలు అనుగుణంగా ఉండాలన్నారు. వీటినంత త్వరగా రాజగోపురాలు, ప్రాకార మండపాలను పునర్నిర్మించుకోవాలని సూచించారు. లేకపోతే ఆలయ అభివృద్ధి విషయంలో ఆటంకాలు ఏర్పడతాయన్నారు. గుడి ప్రాంగణంలోని గణపతి, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల నిర్మాణాలపైన సలహాలు ఇచ్చారు. సహాయ కమిషనర్ ఎం.తిమ్మానాయుడు, పాలక మండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు. మండలంలోని చిన్నకొత్తపల్లికి చెందిన దాత కొల్లా వెంకటనారాయణ-నాగలక్ష్మిప్రసన్న దంపతులు అన్నదానానికి రూ.10,116 అందించారు.

నష్టపరిహారం పెంచాలి

రైతుల నుంచి అభ్యంతరాలు తెలుసుకుంటున్న చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

జె.పంగులూరు, న్యూస్‌టుడే: బీవీసీ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంతో జీవనాధారమైన పంట పొలాలను కోల్పోతున్నామని రైతులు జాగర్లమూడి మహేష్, దూళిపాళ్ల సుబ్బారావు అన్నారు. ముప్పవరం సచివాలయం వద్ద భూముల కోల్పోతున్న రైతుల అభ్యంతరాలు తెలుసుకునేందుకు తహసీల్దార్ పోఫూరి సింగారావు అధ్యక్షతన బుధవారం గ్రామ సభ నిర్వహించారు. చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పాల్గొన్నారు. రెండో విడత భూసేకరణ వ్యవహారాలు సంబంధించి 1.58 ఎకరాలకు నోటిఫికేషన్ విడుదల చేశామని ఆర్డీవో తెలిపారు. అభ్యంతరాలుంటే తెలపాలన్నారు. నష్టపరిహారం ఎకరాకు రూ.50 లక్షలు ఇవ్వాలని రైతులు కోరారు. సర్వీసు రోడ్డు నిర్మించాలని చుక్కపల్లి ఏడుకొండలు, హైవే అధికారి షేక్ హుస్సేన్‌కు కోరగా రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీఆర్వో సుబ్బారావు, కర్షకులు గరిమిడి జగన్మోహనరావు, జాగర్లమూడి నాగేశ్వరరావు, రామయ, ఆంజనేయులు, సుబ్బారావు పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు విస్తరించరూ


మాట్లాడుతున్న కొల్లా రాజమోహన్‌రావు

పర్చూరు, న్యూస్‌టుడే: గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు విస్తరించాలని నల్లమడ రైతు సంఘం నాయకుడు కొల్లా రాజమోహన్‌రావు కోరారు. స్థానిక కొల్లా వారి కల్యాణ మండపంలో బుధవారం నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. గడిచిన 80 ఏళ్లుగా గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలని ఉద్యమాలు చేస్తున్నా నేటికీ సమస్య పరిష్కారం కాపోవడం దురదృష్టకరమన్నారు. గత ఆగస్టులో గుంటూరు జిల్లాలో మాత్రమే భూసేకరణకు నోటిఫికేషన్ విడుదల చేశారని, బాపట్ల జిల్లాలోనూ విడుదల చేసి భూసేకరణ చేపట్టాలని కలెక్టర్‌ను పలుమార్లు విన్నవించామని తెలిపారు.

విద్యుత్తు చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్ఈ ఆంజనేయులు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: విద్యుత్తు చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఆంజనేయులు హెచ్చరించారు. రేపల్లె మండలంలో బుధవారం 120 మంది విద్యుత్తు సిబ్బంది ఆధ్వర్యంలో 4,946 సర్వీసులను తనిఖీ చేశారు. 53 మంది అధిక లోడ్ వాడుతున్నట్లు గుర్తించి రూ.4.04 లక్షల అపరాధ రుసుం విధించారు. కేటగిరీ మార్పు నాలుగు సర్వీసులకు గుర్తించి రూ.19,000, దొంగతనంగా విద్యుత్తు వినియోగిస్తున్న ఓ వ్యక్తికి రూ.వెయ్యి పెనాల్టీ విధించారు. తొలుత కార్యాలయ ప్రాంగణంలో విద్యుత్తు సిబ్బందితో సమావేశం నిర్వహించి సూచనలిచ్చారు. ఈఈ భాస్కరరావు, ఏడీఈ ఎం.భాస్కరరావు, శ్యాంసుందరబాబు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులో గందరగోళం సృష్టించిన యువకుడు

మార్టూరు: మార్టూరు ఎస్‌బీఐ ఖాతాలో తన నగదు భారీ ఎత్తున ఉందని, తనకు ఇవ్వాలంటూ ఓ యువకుడు చేసిన గందరగోళం చర్చనీయాంశమైంది. బ్యాంకు సిబ్బందిని ఆందోళనకు గురిచేసింది. మార్టూరు తండాకు చెందిన 30 ఏళ్ల యువకుడు బుధవారం స్థానిక ఎస్‌బీఐలో కొద్దిసేపు వివాదం సృష్టించడంతో చేసేది లేక బ్యాంకు అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఇచ్చి అతడ్ని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కొద్దిరోజులుగా అప్పుడప్పుడు మతిస్థిమితం తప్పి ప్రవర్తిస్తున్నాడని, ఇటీవల భార్య వెళ్లిపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని ఆ యువకుడి సోదరుడు, బంధువులు పోలీసులకు తెలిపారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

ప్రమాదాలు నివారించండి

చిలకలూరిపేట (గ్రామీణ), న్యూస్‌టుడే: [illegible] 16[illegible] జాతీయ రహదారిలో ప్రమాదాలు నివారించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు జాతీయ రహదారుల ప్రాంతీయ అధికారికి బుధవారం లేఖ రాశారు. నూతనంగా నిర్మించిన ఈ రహదారిలో పసుమర్రు ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇది బ్లాక్ స్పాట్‌గా మారిందన్నారు.

దొరికిన ఏటీఎం దొంగ

రాజాం, న్యూస్‌టుడే: వృద్ధుడిని మోసం చేసి సొమ్ము కాజేసిన నిందితుడ్ని గుంటూరు పోలీసులు పట్టుకుని జైలుకు పంపారు. సీఐ కె.అశోక్‌కుమార్ వివరాల ప్రకారం.. వంగర మండలం మరువాడ గ్రామానికి చెందిన సింగిరెడ్డి పైడిరాజు ఈనెల 10న రాజాం పట్టణంలోని ఎస్‌బీఐ బ్రాంచి వద్ద ఏటీఎంలో రూ.98,500 పోగొట్టుకున్నారు. ఏటీఎంలోని నగదు జమయంత్రంలో తన కుమారుడి ఖాతాలో నగదు జమచేసేందుకు వచ్చి. ఎలా చేయాలో తెలియకపోవడంతో పక్కనున్న వ్యక్తి సాయం కోరాడు. నిందితుడు తన సొంత ఖాతాలో జమ చేసుకున్నాడు. మోసపోయానని గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకు ఖాతాల, సీసీ టీవీ దృశ్యాలను పోలీసులు పరిశీలించారు. గుంటూరు జిల్లా నగరం మండలం ధూళిపాడు పంచాయతీ వీరంగివారిపాలెం గ్రామానికి చెందిన కాటూరి వెంకటేష్ (36) నిందితుడని తేల్చారు. అతన్ని పట్టుకుని రూ.91,000 రికవరీ చేశారు. ఇతనిపై ఇదే తరహా కేసులు 30 ఉన్నట్లు గుర్తించామని సీఐ వెల్లడించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

మౌర్యుడుతో హెచ్ఎం భూపతిరావు, పీడీ కరీముల్లా

ఖాజీపాలెం(పిట్టలవానిపాలెం): ఖాజీపాలెం మంతెన సుబ్బరాజు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి మౌర్యుడు బాలుర అండర్ -14 వాలీబాల్ ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. గుంటూరు బీఆర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పీడీ కరీముల్లా తెలిపారు. నవంబరు నెలాఖరులో నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. విద్యార్థిని ప్రధానోపాధ్యాయులు భూపతిరావు, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు అభినందించారు.

26న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్తు స్థాయీ సంఘ సమావేశాలను ఈనెల 26న ఏర్పాటు చేస్తూ జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రైలు ఢీకొని ఏల్చూరు మహిళ మృతి

మహాలక్ష్మమ్మ (పాత చిత్రం)

ఏల్చూరు (సంతమాగులూరు): మండలంలోని ఏల్చూరుకు చెందిన పి.మహాలక్ష్మమ్మ (60) పల్నాడు జిల్లా నరసరావుపేట మార్కెట్ సెంటర్‌లో రైలు ఢీకొని మృతిచెందారు. స్థానికంగా తినుబండారాలు అమ్ముకుంటూ జీవిస్తున్న ఆమె వాటిని కొని తెచ్చుకునేందుకు బుధవారం నరసరావుపేట వెళ్లారు. వాటిని కొనుక్కుని రైలు పట్టాలు దాటుతుండగా ఇది చోటుచేసుకుంది. భర్త గతంలో మృతిచెందారు. ఆమెకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని నరసరావుపేట ఏరియా వైద్యశాలలోని మార్చురీలో ఉంచినట్లు జీఆర్పీ ఎస్సై రాజమోహనరావు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరు..

వెల్లలచెరువు (సంతమాగులూరు): అమరావతి-అనంతపురం జాతీయ రహదారిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందినట్లు ఎస్సై ఎం.పట్టాభిరామయ్య బుధవారం తెలిపారు. వెల్లలచెరువు తిరుమల డెయిరీ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి ఢీకొనడంతో వెల్లలచెరువుకు చెందిన పి.ఏడుకొండలు (60) తీవ్రంగా గాయపడ్డారన్నారు. 108 సిబ్బంది క్షతగాత్రుడ్ని నరసరావుపేట ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 111, రిటైల్ ధర - 138, చికెన్ విత్‌స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -109 రిటైల్ ధర 134 చికెన్ విత్ స్కిన్ - 197, చికెన్ స్కిన్‌లెస్ - 224.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 132, 142 చికెన్ విత్ స్కిన్ - 230 చికెన్ స్కిన్‌లెస్ - 240.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 600 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.93/-.

91.9FM Vijayawada Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ దర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

PEOPLE CARE

OLD AGE HOME

గాయిత్రి గ్రూపు, VJA వృద్దులకు పేషెంట్ల సేవకు, ఇంటి/వంట జేబీకేరేకు వర్కర్లను బారతదేశం అంతటా పంపగలము. ✆ 97040 21122, 96038 42233.

REAL ESTATE

HOUSE FOR SALE

LAKSHMI PURAM

2000 sft, 3 bedroom ground floor sale, @ 6/2 Chandramouli Nagar, Guntur, Mr. Satish. Ph no: 9959544744.

PLOT FOR SALE

GENERAL

ఫార్మ్‌ల్యాండ్ @ వినుకొండ గజం 1,333/- మాత్రమే. సెంటు భూమి కొనండి 3 మకాడమీయా మొక్కలు ఉచితంగా పొందండి. క్లియర్ టైటిల్ మరియు స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 83675 22256.

కొలనుకొండ, జయభేరి కన్‌స్ట్రక్షన్ దగ్గర, KIA షోరూం పక్కన, 918 చ||గ|| తూర్పు (ఫ్లైవే) ఫేస్ త్రికోణకారంలో ఉన్న స్థలము అమ్మకము. PH: 99662 28370.

JOBS

WANTED- Restaurant Staff (For a reputed restaurant- Immediate Hiring) 1) CASHIER Must have computer knowledge Minimum 2 years of experience. 2) SERVICE BOYS/ GIRLS Minimum 2 years of restaurant service experience. 3) SECURITY GUARD Ex-service personnel preferred. (Contact Time: 11 am to 9 pm) 83338 97607, 78933 34892.

గుంటూరులోని ప్రముఖ కంపెనీ నందు అకౌంటెంట్ కావలెను. GST & TDS నాలెడ్జ్ must. రెజ్యూమ్ వాట్సాప్. 90528 77789. goodharvestspices@gmail.com

గుంటూరులోని శానిటరీషాపులో కంప్యూటర్ బిల్స్‌చేయుటకు అనుభవం ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ (M) కావలెను. వ|| 30సం||లోపు, జీ||12K-15K. ✆ 9493656892.

విశ్రాంతి ఉద్యోగులకు శుభవార్త ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు గుంటూరులో వెంటనే కావలెను. ఫోన్ : 94907 06437.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజ నందు క్లాసు ఇన్‌ఛార్జీస్, హాస్టల్ ఇన్‌ఛార్జీస్, వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12,000/- నుండి 15,000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యాఅర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ. వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరముల కొరకు సంప్ర: ఫోన్ నెంబర్: 89784 80429.

రాఘవ ఆటో ఫైనాన్సియర్స్ గుంటూరు బ్రాంచికి సేల్స్ మేనేజర్ కావలెను & తెనాలి, మంగళగిరి, పిడుగురాళ్లలో కలెక్షన్ చేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ కావలెను. వ:21-35. ఆకర్షణీయమైన జీతం, TA+INC. అ: ఇంటర్ ఆపైన. టూవీలర్ మస్ట్. అనుభవమున్న వారికి ప్రాధాన్యత. 9154746824, 9154067714.

ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో మార్కెటింగ్ చేయుటకు జంట్స్ స్టాఫ్ అర్హత: డిగ్రీ, జీతం: 12 to 15K & టెలికాలర్స్ మహిళలు కావలెను. అర్హత: ఇంటర్, జీతం: 8to12K 62815 33982, 96033 10994.

మా కంపెనీ గోలి సోడా మార్కెటింగ్ చేయుటకు అనుభవంగల సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సిటీవారికి ప్రాధాన్యత ఆకర్షణీయమైన జీతం కలదు. ✆ 8019786366.

ప్రముఖ కలెక్షన్ ఏజెన్సీలో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ మరియు టెలికాలర్స్ అనుభవంగల వారు కావలెను. జీతము: (15K to 20K), కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. DRA సర్టిఫికెట్ ఉన్నవారికి ప్రాధాన్యత కలదు. జీతము: 20K సంప్రదించగలరు. ఫోన్ నెంబర్స్: 8919080894, 8309132382.

VIJAYASREE Multi super speciality Hospital నందు పనిచేయుటకు అసిస్టెంట్ అకౌంటెంట్ కావలెను. 1 సం|| అనుభవం కావలెను. 95531 20127.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

బాపట్ల

• బాపట్ల • రేపల్లె • వేమూరు

కార్తిక వనసమారాధన

రేపల్లె అర్బన్: రేపల్లె చంద్రమౌళీ పార్కులో మున్సిపల్ అధికారులు, సిబ్బంది బుధవారం వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రామచంద్రరావు దంపతులను సన్మానించారు. తెదేపా నేత అనగాని శివప్రసాద్, ఛైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్ ఛైర్మన్లు ప్రశాంతకుమార్, విశ్వనాథగుప్తా, తహసీల్దారు శ్రీనివాసరావు, కమిషనర్ సాంబశివరావు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా లక్ష బిల్వార్చన

భట్టిప్రోలు: కార్తికమాసం పురస్కరించుకొని స్థానిక విఠలేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం వైభవంగా లక్ష బిల్వార్చన మహోత్సవం నిర్వహించారు. అర్చకులు మారేడు దళాలతో పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులకు వనసమారాధన నిర్వహించారు.

సైబర్ క్రైం పై అవగాహన అవసరం

అప్పికట్ల (బాపట్లటౌన్) న్యూస్‌టుడే : విద్యార్థులు తమ తల్లిదండ్రుల సెల్‌ఫోన్‌లో శక్తి యాప్ డౌన్ లోడ్ చేసుకుని సైబర్ క్రైం గురించి అవగాహన పెంచుకోవాలని బాపట్ల రూరల్ ఎస్సై ఎం.శ్రీనివాసరావు అన్నారు. అప్పికట్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శక్తి బృందం సైబర్ క్రైం, గుడ్ బ్యాడ్ టచ్ గురించి బుధవారం అవగాహన కల్పించారు.

విద్యుత్తు స్తంభానికి మరమ్మతులు

ఈనాడు కథనానికి స్పందన

జిల్లెళ్లమూడి (బాపట్ల టౌన్): జిల్లెళ్లమూడి గ్రామంలో విద్యుత్తు స్తంభం కూలే దశలో ఉంది. సమస్యపై ఒరిగిన స్తంభం... కూలేందుకు సిద్ధం అనే శీర్షికతో ఈనెల 11న ఈనాడులో కథనం ప్రచురితమైంది. సంబంధిత అధికారులు స్పందించారు. బుధవారం ఒరిగిన స్తంభానికి మరమ్మతులు నిర్వహించి స్తంభాన్ని నిలబెట్టారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

? ఖాజీపాలెం ప్రధాన రహదారి నుంచి పోతనకట్టవారి పాలెం వెళ్లే రోడ్డుపైకి ముళ్లపొదలు అల్లుకోవటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. **- గుడారు వెంకయ్య, ఖాజీపాలెం**

✔ పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. **- శివకుమార్, పంచాయతీ కార్యదర్శి, ఖాజీపాలెం –న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం**

స్పందనకు వందనం

30 వీధిదీపాలు ఏర్పాటు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె 1, 28 వార్డుల్లో పలుచోట్ల వీధిదీపాలు వెలగడం లేదు. సమస్యను మేమున్నాం.. మీకు తోడుగా శీర్షికన ఈనెల 12న ఈనాడు అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన మున్సిపల్ ఏఈ శామ్యూల్ బుధవారం కార్మికులను పంపించి రెండు వార్డుల్లో 30 వీధి దీపాలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టారు.

పైపులైనుకు మరమ్మతులు

రేపల్లె మండలం పెనుమూడి దళితవాడలో ప్రధాన పైపు లైనుకు లీకు ఏర్పడి నీరు వృథా అవుతోంది. మేమున్నాం. .మీకు తోడుగా శీర్షికన సమస్యను ఈనెల 12న ఈనాడు అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి అబీద్‌హుస్సేన్ బుధవారం కార్మికులను పంపి పైపు లైనుకు మరమ్మతులు చేయించారు.

రూ.లక్షలతో నిర్మించారు.. అలాగే ఉంచారు

అప్రోచ్ వేయక నిరుపయోగంగా వంతెన

పెదపులివర్రు (భట్టిప్రోలు), న్యూస్‌టుడే

రూ.లక్షల నిధులు వెచ్చించి వంతెన నిర్మించారు. అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయకపోవడంతో తొమ్మిదేళ్లుగా వంతెన నిరుపయోగంగా ఉంది. వెల్లటూరు కృష్ణా పశ్చిమ బ్యాంక్ కెనాల్‌పై పెదపులివర్రు వద్ద సుమారు రూ.90 లక్షలతో అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో ప్యాకేజీ నిధులతో వంతెన నిర్మించారు. పనులను శరవేగంగా చేసి ఏడాదిలోపే నిర్మాణ పనులు చేపట్టారు. అప్రోచ్ రోడ్డు లేక నేటికీ ఆ వంతెనకు గ్రహణం వీడటంలేదు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన పాత వంతెనకు కాలం చెల్లింది. ఏ క్షణంలో కూలుతుందోనని భయపడుతున్నారు. నిత్యం ఈ రహదారిలో భారీ వాహనాలు ప్రయాణిస్తుంటాయి. లంక గ్రామాల రైతులు పండించిన అరటి, పసుపు, కంద, కూరగాయలు వంటి పంటలను వాహనాలపై ఈ మార్గం ద్వారానే మార్కెట్‌లకు తరలిస్తుంటారు.

నూతన వంతెన

మోక్షమెప్పుడు?..

రూ. లక్షలు ఖర్చు చేసి నిర్మించిన వంతెన ఏళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డును ఏర్పాటు చేస్తే వాహనాల రాకపోకలు కొనసాగుతాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో వంతెన నిరుపయోగంగా మారింది. వంతెనపై అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. చిన్న పాటి నిధులను వెచ్చిస్తే ఉపయోగంలోకి వస్తుంది. పాత వంతెన చిన్నదిగా ఉండటంతో ధాన్యం లోడులతో వెళ్లే పెద్ద లారీలకు ఇబ్బందిగా ఉంది. విశాలంగా నిర్మించిన నూతన వంతెన వినియోగంలోకి వస్తే వాహనాలు రాకపోకలకు వీలుగా ఉంటుంది. గతంలో ఆ ప్రాంత వాసులు వంతెన సమస్యను ప్రజాప్రతినిధులు, ఆ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన వంతెన ప్రారంభమయ్యేలా చూడాలని కోరుతున్నారు.

★ ఈ విషయంపై జలవనరుల శాఖ ఏఈ ఏఈ రవి మాట్లాడుతూ వంతెనను నిర్మించడం తమ శాఖ పరిధిలోనిదని అన్నారు. ఇరువైపులా అప్రోచ్ రోడ్డును ఏర్పాటు చేయాల్సింది ఆర్అండ్‌బీ అధికారులదని తెలిపారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే ధ్యేయం

కమిటీలతో ప్రమాణం చేయిస్తున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబు, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, న్యూస్‌టుడే: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెదేపా విజయమే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. తెదేపా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన మండల, క్లస్టర్, గ్రామ, బూత్, అనుబంధ కమిటీలతో పార్టీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబుతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. వేగేశన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలన్నారు. సలగల మాట్లాడుతూ పార్టీ కోసం అంకితభావంతో కష్టపడి పని చేయాలన్నారు. ఏఎంసీ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, తెదేపా నేతలు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు చిత్తశుద్ధితో కృషి

పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. మండల పరిధిలోని గోపాపురంలో గృహ ప్రవేశాల వేడుక బుధవారం నిర్వహించారు. నూతన గృహాన్ని ఆయన ప్రారంభించారు. తహసీల్దారు సలీమా, డీఈ శ్రీనివాసరావు, తెదేపా మండల అధ్యక్షుడు శివ, భాజపా నేతలు రామ రాజు, శ్రీరామయ్య తదితరులు పాల్గొన్నారు.

తెదేపాకు కార్యకర్తలే బలం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని ఎమ్మెల్యే ఆనందబాబు అన్నారు. నియోజకవర్గంలోని చుండూరు, అమృతలూరు, వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు మండలాల తెదేపా మండల, క్లస్టర్, గ్రామ, బూత్ కమిటీలతో బుధవారం వేమూరులోని ఎన్టీఆర్ పురవేదిక వద్ద సామూహిక ప్రమాణస్వీకారం చేయించారు. ఆయన మాట్లాడుతూ నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన కమిటీలు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. తెదేపా నాయకులు జె.విజయబాబు, ఎం. మురళీకృష్ణ, టి.సాయిబాబా, శివారెడ్డి, కె.రవీంద్ర బాబు, వెంకటసుబ్బయ్య, శేషుబాబు, వేమూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ జి.పూర్ణకుమారి, వైస్ ఛైర్మన్ ఎ.కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు

చందోలు(పిట్టలవాని పాలెం), న్యూస్‌టుడే : జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని డీఎస్పీ రామాంజనేయులు ఎస్సై శివకుమార్, సిబ్బందికి సూచించారు. చందోలు పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. సంవత్సర కాలంలో స్టేషన్ పరిధిలో జరిగిన పరిణామాలు క్షుణ్ణంగా పరిశీలించారు. రహదారులపై జరుగుతున్న ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి సిబ్బందికి వివరించారు.

రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ రామాంజనేయులు

14న సత్యనారాయణ స్వామి వ్రతాలు

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే : శ్రీ లలితా త్రిపుర సుందరీ పీఠం ఆధ్వర్యంలో బాపట్ల పట్టణంలోని ఏజీ కళాశాల ఎదురు ఉన్న కోన కల్యాణ మండపంలో ఈనెల 14న ఉదయం 7:30 గంటలకు శ్రీ సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గ్రంథాలయాలను ఆధునీకీకరిస్తాం

బాపట్ల, న్యూస్‌టుడే: గ్రంథాలయాలను ఆధునీకీకరించి యువతకు అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14న ప్రారంభం సందర్భంగా కరపత్రాలను ఆయన బుధవారం ఆవిష్కరించారు. వేగేశన మాట్లాడుతూ శాఖా గ్రంథాలయానికి త్వరలో కొత్త భవనాన్ని నిర్మిస్తామన్నారు. యువత కోసం పోటీ పరీక్షల పుస్తకాలు తెప్పిస్తామని పేర్కొన్నారు. శాఖాగ్రంథాలయాధికారి శివాజీ గణేషన్ పాల్గొన్నారు.

మహిళను వేధించిన కేసులో నిందితుడికి జైలు

కొల్లూరు: 2022లో మహిళను వేధించిన కేసులో నిందితుడు కొల్లూరుకు చెందిన క్రీస్తురాజుకు నెల జైలు శిక్ష, రూ. 1000 జరిమానా విధిస్తూ తెనాలి న్యాయస్థానంలో న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. సీనియర్ ఏపీపీ పి.సునీల్‌కుమార్ ప్రాసిక్యూషన్ తరుపున వాదించినట్లు చెప్పారు.

పేదల సొంతింటి కల ప్రభుత్వం నెరవేరుస్తోంది

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: అందరికీ సొంతిల్లు ఉండాలన్న మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ కలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని వక్తలు అన్నారు. రేపల్లె పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం పక్కా గృహాలు మంజూరైన 81 మంది లబ్ధిదారులకు ధ్రువపత్రాల అందజేత కార్యక్రమం నిర్వహించారు. రేపల్లె పట్టణం, నగరం, నిజాంపట్నం, రేపల్లె, చెరుకుపల్లి మండలాల్లో గృహం నిర్మించుకున్న అయిదుగురికి ఇంటి తాళాలు అందజేశారు. కూటమి నేత అనగాని శివప్రసాద్ ఛైర్‌పర్సన్ కట్టా మంగ, తహసీల్దారు శ్రీనివాసరావు, కమిషనర్ సాంబశివరావు, గృహ నిర్మాణశాఖ డీఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏఈ అనిత పాల్గొన్నారు.

ఇల్లు మంజూరు పత్రం అందజేస్తున్న అనగాని శివప్రసాద్ తదితరులు

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

నగరం, అమృతలలూరు, న్యూస్‌టుడే: ఈనెల 14నుంచి నుంచి 20వ తేదీ వరకు మంత్రిపాలెం, అమృతలూరు, ఇంటూరు, కూచిపూడి గ్రామాల్లోని శాఖ గ్రంథాలయాల్లో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారులు బ్రహ్మం, శ్రీదేవి, సుధీర్, రామచంద్రరావు బుధవారం తెలిపారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి రోజు విద్యార్థులకు వేరు వేరు అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు.

కౌశల్ జిల్లా పోటీ పరీక్షలకు చెరుకుపల్లి విద్యార్థులు

ఎంపికైన విద్యార్థులు

చెరుకుపల్లి (గ్రామీణ), న్యూస్‌టుడే: చెరుకుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఈనెలలో నిర్వహించనున్న కౌశల్ పోటీ పరీక్షలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం కె.లక్ష్మీనారాయణ తెలిపారు. ఈనెల తొలి వారంలో ఆన్‌లైన్ ద్వారా పాఠశాల స్థాయిలో పోటీ పరీక్ష నిర్వహించారు. ఇందులో తాత సాహితీ (8వ తరగతి), వాకా తేజస్విని (9వ తరగతి), గంజర బోయిన వైష్ణవి (10వ తరగతి) క్విజ్ పోటీలు, ఎ.వరప్రసాద్ (9వ తరగతి), వేము లావణ్య (8వ తరగతి), ఎ.శశికళ (9వ తరగతి) పోస్టర్ ప్రజెంటేషన్, జొన్న అక్షయ (10వ తరగతి) రీల్స్ విభాగంలో జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. 8, 9వ తరగతి విద్యార్థులకు ఈనెల 27న, 10వ తరగతి విద్యార్థులకు 28న బాపట్లలో పోటీలు జరుగుతాయన్నారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులతో కలిసి ఆయన విద్యార్థులను అభినందించారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారం

విద్యార్థులతో కలిసి కరపత్రాలు ప్రదర్శిస్తున్న సీఐ రాంబాబు

బాపట్ల, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలు వినియోగిస్తే భవిష్యత్తు అంధకారమవుతుందని పట్టణ సీఐ రాంబాబు అన్నారు. పట్టణంలోని వీజేఆర్ఎం కళాశాలలో శక్తి, ఈగల్ బృందాల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్లో మోసపూరిత ప్రకటనలు నమ్మి నగదు పోగొట్టుకోరాదన్నారు. వ్యక్తిగత సమాచారం, చిత్రాలను ఆన్‌లైన్లో ఉంచరాదని పేర్కొన్నారు.

అసంపూర్తి భవనం.. జీవాలకు ఆవాసం

మండలంలోని అల్లూరులో వైకాపా పాలనలో ప్రారంభించిన వెల్‌నెస్ కేంద్ర భవన నిర్మాణం శ్లాబ్ దశలోనే నిలిచిపోయింది. ప్రభుత్వం రూ.18 లక్షలు మంజూరు చేసినా భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. ఇది గొర్రెలు, మేకలకు ఆవాసంగా మారింది. ఆరోగ్య సిబ్బంది సామాజిక భవనంలోని ఇరుకు గదిలో సేవలు అందిస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి భవనాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం**

ఎవరో వస్తారని ఎదురుచూడక..

నడింపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: రైతుల కష్టాలను పట్టించుకునేవారు లేక వారే తమ సమస్యకు పరిష్కారం వెతుక్కుంటున్నారు. మండలంలోని నడింపల్లి వద్ద జాతీయ రహదారి నుంచి పాంచళవరం ఆర్అండ్‌బీ రోడ్డు వరకు 3కి.మీ మట్టి రోడ్డు పూర్తి అధ్వానంగా మారింది. వ్యవసాయ పనుల కోసం వాహనాల రాకపోకలకు ఈ రోడ్డు కీలకం. యంత్ర పరికరాలను తరలించడానికి, ధాన్యం బయటకు తీసుకు రావడానికి ఈ రోడ్డు అవసరం. తుపాను కారణంగా దెబ్బతిన్న రోడ్డు గుంతలమయం కావడంతో గ్రామ రైతులు దాదాపు 25 ట్రాక్టర్లతో మట్టిగాలు రోడ్డును దుక్కి చేశారు. వెనుక మరొక మూడు ట్రాక్టర్లు దుక్కిచేసిన రోడ్డుపై మట్టిని బ్లేడుతో సరిచేశాయి. నాలుగు రోజుల్లో రోడ్డుపై తేమ పోయి గట్టిపడుతుందని రైతులు అంటున్నారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ మట్టి రోడ్లకు మోక్షం కల్పించాలని వారు కోరుతున్నారు.

ట్రాక్టర్ల నాగళ్లతో మట్టిరోడ్డుపై బళ్లగాళ్లను దుక్కిచేస్తున్న రైతులు

పైపులైన్ల లీకులతో తాగునీటికి అవస్థలు

పంచాయతీ పరిధిలో నిత్యం రక్షిత మంచినీటి పథకానికి చెందిన పైపులైన్లు తరచూ మరమ్మతులకు గురికావడంతో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడంలేదు. రూ.కోటికి పైగా నిధులు వెచ్చించి గ్రామంలో నలుమూలల నాలుగు ఓవర్‌హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేసినా ప్రయోజనం లేకపోతోంది. నిత్యం ఏదొక ప్రాంతంలో ఈ లీకులు ఏర్పడి తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. బుధవారం మండల విద్యావనరుల కేంద్రం వద్ద ప్రధాన పైపులైన్లు దెబ్బతినడంతో మంచినీటిని విడుదల చేయలేదు. నాలుగు రోజుల క్రితం విద్యుత్తు మోటారు మరమ్మతులకు గురై రెండు రోజులుగా నీరందలేదు. సమస్యపై పంచాయతీ కార్యదర్శి నాయక్ మాట్లాడుతూ పైపులైన్ల లీకులను సరిచేయిస్తున్నామని, వెంటనే తాగునీటిని విడుదల చేస్తామని అన్నారు. **-న్యూస్‌టుడే, భట్టిప్రోలు**

రక్షణ గోడలు లేవు.. ప్రమాదాలకు నెలవు

పిట్టలవానిపాలెం నుంచి ఖాజీపాలెం వెళ్లే రహదారికి పశ్చిమ ఛానల్‌పై ఉన్న వంతెనకు రెండు వైపులా రక్షణ గోడలు కూలిపోయి ప్రమాద భరితంగా ఉంది. కనీసం ప్రమాద సూచికలు లేకపోవడంతో వాహనదారులకు రాత్రుళ్లు కనిపించడం లేదు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆవేదన చెందుతున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, ఖాజీపాలెం(పిట్టలవానిపాలెం)**

ఆధ్యాత్మిక చింతనతో ఆరోగ్యం

నగరం, న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక చింతనతో ఆరోగ్యం చేకూరుతుందని తెదేపా నాయకుడు అనగాని శివప్రసాద్ అన్నారు. నగరం శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం నిర్వహించిన పడిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దేవాలయంలో గురుస్వాములు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థినికి అభినందనలు

జంపని (వేమూరు), న్యూస్‌టుడే: జంపని ఉన్నత పాఠశాలకు చెందిన జి.తేజశ్రీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన లాంగ్ జంప్ పోటీలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం బదరీనారాయణ తెలిపారు. బాలికను, వ్యాయామోపాధ్యాయుడు రాంబాబును విద్యా కమిటీ ఛైర్మన్ విజయబాబు అభినందించారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి

కొల్లూరు, న్యూస్‌టుడే: హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడుతూ హత్యకు గురైన స్వామి లక్ష్మణానంద సరస్వతిని ఆదర్శంగా తీసుకొని హిందూధర్మ రక్షణ కోసం కృషి చేయాలని సమరసత ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశ్రావు పిలుపునిచ్చారు. సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానికంగా నిర్వహించిన స్వామి లక్ష్మణానంద సరస్వతి సంస్మరణ దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

గో మాంసం విషయంలో దుష్ప్రచారం తగదు

బాపట్ల: గో మాంసం వ్యాపారంతో తనకెలాంటి సంబంధం లేదని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. తెదేపా కార్యాలయంలో ఆయన బుధవారం మాట్లాడుతూ గో మాంసం వ్యాపారంలో తనకు భాగస్వామ్యం ఉందని ఓ టీవీ ఛానల్, పత్రికలో దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. తాను ఏ వ్యాపారం అయినా నీతి, నిజాయితీ, ధర్మంగా చేస్తానన్నారు. విశాఖలో గోమాంసం దొరికిన కోల్డ్ స్టోరేజీ యజమాని సుబ్రహ్మణ్యం గుప్తా తన అనుచరుడు కాదన్నారు. బాపట్లలో అతనితో కలిసి షటిల్ ఆడతానని, మిత్రుడు మాత్రమేనని తెలిపారు. కోల్డ్ స్టోరేజీని వేరే సంస్థకు గుప్తా లీజుకిచ్చాడన్నారు. ఆ సంస్థ గో మాంసం నిల్వ చేశారని అతడికి తెలియదన్నారు. తెలిసిన తర్వాత మాంసాన్ని కాల్చివేయమని చెప్పానన్నారు. గో మాంసాన్ని నిల్వ చేసిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారిస్తున్నారని పేర్కొన్నారు.

పంట దరి చేరేదెలా?

అధ్వానంగా డొంక మార్గాలు

వేమూరు, న్యూస్‌టుడే

పంచాయతీ రాజ్ శాఖ అధికారులు అందించిన వివరాల ప్రకారం నియోజకవర్గంలో 320 కిలోమీటర్ల మేర వ్యవసాయ పనులకు వినియోగించే మట్టి డొంక మార్గాలు ఉన్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో వీటి సంగతి పట్టించుకున్న నాథులు లేకపోవడంతో ప్రస్తుతం అవి అధ్వానంగా మారాయి. ఇంకో రెండు వారాల్లో వ్యవసాయ పనులు ప్రారంభం కానున్నాయి. దెబ్బతిన్న డొంక మార్గాల గుండా ధాన్యం చేరవేత ఎలాగని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

మరమ్మతులు చేస్తే..

రైతుల అభ్యర్థన మేరకు నియోజకవర్గంలో 18 డొంక మార్గాలను అభివృద్ధి చేయడానికి నాలుగు నెలల క్రితం రూ.13 కోట్ల జాతీయ ఉపాధి హామీ నిధులు మంజూరయ్యాయి. అప్పట్లో వర్షాల నేపథ్యంలో వాటి సంగతి పట్టించుకోలేదు. కనీసం ఇప్పుడైనా డొంకలపై మరమ్మతులు చేపట్టి గ్రావెల్ తోలితే వ్యవసాయ పనులకు, పంట చేరవేతకు ఇబ్బందులు తప్పుతాయని అన్నదాతలు చెబుతున్నారు.

★ అమృతలూరు మండలంలో మూల్పూరు నుంచి అమృతలూరు వెళ్లే డొంక, మోపర్రు నుంచి బోడపాడు వెళ్లే డొంకమార్గం అధ్వానంగా మారింది. చుండూరు మండలంలో పెదగాదెలవర్రు నుంచి నడిగడ్డపాలెం, వేటపాలెం నుంచి నడిగడ్డపాలెం, అయ్యన్నపాలెం నుంచి చుండూరుకు వెళ్లే డొంక దారులు పాడయ్యాయి. ఒక్కొక్క చోట రెండడుగుల లోతున గుంతలు పడ్డాయి. భట్టిప్రోలు మండలంలో అద్దేపల్లి నుంచి బాడవపొలాలకు వెళ్లే డొంక, ఐలవరం పొలాల వైపు వెళ్లే మార్గాలు దెబ్బతిన్నాయి. వేమూరు మండలం జంపనిలో తెనాలి- వెల్లటూరు అడ్డ రోడ్డు నుంచి ఉత్తరం వైపు పొలాలకు వెళ్లే డొంక మార్గం నాలుగు కిలోమీటర్ల మేర ఉంటుంది. ఈ డొంక మార్గం గుండా జంపనితో పాటు, బూతుమల్లి, చదలవాడ, కాకర్లమూడి తదితర గ్రామాల పొలాల్లో వ్యవసాయం చేయాల్సి ఉంది. కొల్లూరు మండలంలో అనంతరం నుంచి కొల్లూరు వైపు వెళ్లే డొంక, దోనేపూడి, చినపులివర్రు తదితర మట్టిడొంకలు బాగా దెబ్బతిన్నాయి. దీనిపై పంచాయతీ రాజ్ శాఖ డీఈ శివకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఐదు మండలాల్లో 18 డొంక మార్గాలను అభివృద్ధి చేసేందుకు రూ.13 కోట్ల నిధులు మంజూరయ్యాయని, వర్షాల కారణంగా పనులు ప్రారంభించేందుకు గుత్తేదారులు ముందుకు రాలేదని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

నడిగడ్డపాలెం నుంచి వేటపాలెం వెళ్లే డొంకమార్గం ఇలా

దేశభక్తి చాటిన విద్యార్థులు

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : వందేమాతరం వార్షికోత్సవం పురస్కరించుకొని బుధవారం స్థానిక దేశభక్తిని చాటారు. వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకోవడంతో టీఎంరావు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు 150 ఆకారంలో కూర్చుని జాతీయ జెండాలతో దేశభక్తిని చాటారు. వందేమాతరం గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మల్లికార్జునరావు, ప్రధానోపాధ్యాయుడు రామకోటేశ్వరరావు, విద్యాకమిటీ ఛైర్మన్ సుగుణకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

150వ ఆకారంలో విద్యార్థినులు

దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని వినతి

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే : ప్రభుత్వం మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు దివ్యాంగులకు కూడా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని బాపట్ల జనసేన పార్టీ దివ్యాంగుల నాయకుడు ఆదిశేష అన్నారు. బుధవారం ఆయన దివ్యాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ నారాయణస్వామిని విజయవాడలో కలిసి దివ్యాంగుల సమస్యలను నారాయణస్వామికి విన్నవించారు.

వైద్య కళాశాలలు ప్రభుత్వం ఆధీనంలో ఉండాలి

ర్యాలీలో రఘుపతి, నాయకుల కార్యకర్తలు

బాపట్ల టౌన్, బాపట్ల వెస్ట్ న్యూస్‌టుడే : పేదలకు అందించే వైద్యం, వైద్య కళాశాలల నిర్మాణం ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. వైద్య కళాశాలలు ప్రైవేటు పరంపై వైకాపా ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ప్రజాఉద్యమ కార్యక్రమం నిర్వహించారు. కోన మాట్లాడుతూ కూటమి పభుత్వం ప్రజలను మోసం చేసిందని, వైద్యాన్ని కార్పొరేట్ సంస్థలకు అందించేందుకు ప్రయత్నాలు చేస్తుందని ఆయన విమర్శించారు. అంబేడ్కర్ కూడలి నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

అమృతలూరు, న్యూస్‌టుడే : అమృతలూరులో వరికూటి అశోక్ బాబు ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. తహసీల్దారు నెహ్రూ బాబుకు వినతి పత్రం అందజేశారు.

కుంగిన రోడ్డుతో అవస్థలు

బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీనివాస మహల్ వద్ద చీరాల మార్గంలో 216 ఏ జాతీయ రహదారి కుంగి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పైప్‌లైన్ వేయటానికి రోడ్డును పురపాలక ఇంజినీరింగ్ విభాగ సిబ్బంది తవ్వారు. పైప్‌లైన్ పనులు పూర్తి చేసిన తర్వాత సరిగా రోలింగ్ చేయకుండా తారు వేశారు. భారీ వాహనాల రాకపోకల వల్ల పైప్‌లైన్ కోసం తవ్విన ప్రాంతంలో రోడ్డు కుంగింది. వేగంగా వస్తున్న వాహనాలు ఈ ప్రాంతంలో కుదుపునకు లోనవుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కుంగిన రహదారికి మరమ్మతులు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

శ్రీనివాసమహల్ వద్ద కుంగిన రోడ్డు

నేటి నుంచి శిక్షణ తరగతులు

జె.పంగులూరు, న్యూస్‌టుడే: మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిరాభివృద్ధి- సుపరిపాలనపై ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో కె.స్వరూపరాణి తెలిపారు. గురువారం సర్పంచి, ఉపసర్పంచి, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని హాజరుకావాలని కోరారు.

వేటపాలెంలో ఎన్‌సీసీ క్యాడెట్ల ర్యాలీ

వేటపాలెం, న్యూస్‌టుడే: బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాలలో 23వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో వందేమాతర గీతం 150 వసంతాలు పూర్తి చేసుకోవడాన్ని పురస్కరించుకుని బుధవారం 'మేరి మిట్టి మేరా దేశ్' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ పురవీధులు గుండా సాగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ములకల గంగాధర్‌రావు మాట్లాడుతూ నేటి సమకాలీన సమాజంలో ప్రజలందరు ఒక్కటే అనే భావనను పెంపొందించుకోవాలన్నారు. 23వ బెటాలియన్ సుబేదార్ భల్వీర్ సింగ్, హవల్దార్ టీఎల్ కుమార్ లింబు, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

(c) eenadu

చీరాల

•చీరాల •అద్దంకి •పర్చూరు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? మాబునగర్‌లో రెండు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. వీటికి మరమ్మతులు చేయించి, వినియోగంలోకి తేవాలి. -స్థానికులు, ఏల్చూరు ✔ తక్షణం పరిశీలిస్తాం. వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేయించి, వినియోగంలోకి తెస్తాం. - **పూర్ణచంద్, పంచాయతీ కార్యదర్శి, ఏల్చూరు.**

– సంతమాగులూరు, న్యూస్‌టుడే

? ప్రసాద్‌నగర్‌లోని ఎస్సీ కాలనీలో రెండు వారాలుగా చెత్త తొలగించడంలేదు. దీంతో దుర్వాసన వస్తోంది. పంచాయతీ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడంలేదు. - **సుబ్బారావు, స్థానికుడు.** ✔ వెంటనే సిబ్బందిని పంపించి అక్కడ బాగుచేయిస్తా. ఎస్.చక్రవర్తి, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి, కొత్తపేట. – **వేటపాలెం, న్యూస్‌టుడే**

? రావినూతలలోని గాంధీ బొమ్మ రోడ్డు, ఉత్తరం బజారు వరకు గత 15 రోజులుగా తాగునీరు రావడం లేదు. సమస్యను పరిష్కరించగలరు. - **స్థానికులు, రావినూతల** ✔ రోడ్డు పగులకొట్టి పైపు వేయాల్సి ఉన్నందున ఆలస్యమైంది. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాను. - **నరేంద్ర, పంచాయతీ కార్యదర్శి, రావినూతల.**

– మేదరమెట్ల, న్యూస్‌టుడే

పారిశుద్ధ్యం మెరుగు

స్పందనకు వందనం

పర్చూరు: పర్చూరు-ఇంకొల్లు రహదారిలో సాయిబాబా దేవాలయం ఎదురు డిగ్రీ కళాశాల పక్కన మురుగునీరు చేరి దుర్వాసన వెదజల్లుతుండటంపై ఈనెల 11న 'మేమున్నాం... మీకుతోడుగా' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ అధికారులు బుధవారం ఆ ప్రాంతంలో చెత్తా చెదారం, తొలగించి బ్లీచింగ్ చల్లించి మురుగుపారుదల య్యేలా చర్యలు చేపట్టారు.

కోలాహలంగా నూతన కమిటీల ప్రమాణం

చీరాల, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని వాటిని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సూచించారు. నూతనంగా ఎన్నికైన వివిధ కమిటీల సభ్యుల ప్రమాణ స్వీకారం బుధవారం రాత్రి స్థానిక పార్టీ కార్యాలయంలో కోలాహలంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తల బలం కలిగిన పార్టీ తెదేపా అని అన్నారు. జగన్ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టిన పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఒక్కో కార్యకర్త చేసిన పోరాటం మరువలేనిదన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను ప్రమాణం చేయించారు. పార్టీ పట్టణాధ్యక్షుడిగా డి.వి.సురేష్‌బాబు, చీరాల, వేటపాలెం మండలాల అధ్యక్షులుగా జి.పురుషోత్తం, జి.సీతారామాంజనేయులు, ఇతర కమిటీల కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. ఎం.సాంబశివరావు, కె.జనార్దన్ పాల్గొన్నారు.

సెంటు పట్టా పేరుతో భారీ దోపిడీ

మార్టూరు: సెంటు పట్టా పేరుతో జగన్ రెడ్డి ముఠా రూ.7500 కోట్ల భారీ దోపిడీకి పాల్పడిందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆరోపించారు. గత ప్రభుత్వం పేదల కలలకు తాళం వేసిందని, నేటి సర్కారు గృహ నిర్మాణాన్ని వేగవంతం చేసి తాళం తెరిచి, పేదలకు సొంతిల్లు ఇస్తోందన్నారు.

సొంతింటి కల నెరవేరిన వేళ

చీరాల, న్యూస్‌టుడే: సొంతిల్లు కట్టుకోవాలనే కల ఇల్లు లేని ప్రతి ఒక్కరిలో ఉంటుంది. అది నెరవేరిన సమయంలో వారిలో ఉండే ఆనందం అంతా ఇంతా కాదు. కూటమి ప్రభుత్వం పెద్దఎత్తున బుధవారం గృహ ప్రవేశాలు చేయించింది. ఈసందర్భంగా లబ్ధిదారులు తమ సంతోషాన్ని 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.

అనుమతి వచ్చింది

మా వారు ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తారు. సొంతిల్లు నిర్మించుకోవాలని ఎంతోకాలంగా ప్రయత్నిస్తున్నాం. ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నాం. అన్ని అర్హతలు ఉండటంతో ఎటువంటి పైరవీలు లేకుండా అనుమతి మంజూరు చేశారు. - **కె.హరితశ్రీ, 6వ వార్డు**

ఎన్నో ఏళ్ల ఎదురుచూపు

మేం ఎన్నో ఏళ్లుగా సొంతిల్లు నిర్మించుకోవాలని అనుకున్నాం. మా శక్తి సరిపోలేదు. ప్రభుత్వం అందించిన తోడ్పాటుతో ఇల్లు నిర్మించుకున్నాం. ఈ రోజు గృహ ప్రవేశం చేశాం. ఇన్నేళ్లకు మా కల నెరవేరింది. చంద్రబాబునాయుడికి, ఎమ్మెల్యే కొండయ్యకు కృతజ్ఞతలు. - **సుబ్బమ్మ, 300 కాలనీ**

సంతోషంగా ఉంది

ఎన్నో ఏళ్లుగా అద్దింట్లో ఉంటున్నాం. కూటమి ప్రభుత్వ సహకారంతో సొంతిల్లు నిర్మించుకున్నాం. ఈ రోజున సామూహిక గృహ ప్రవేశాల్లో భాగంగా మేం గృహ ప్రవేశం చేశాం. సొంతింట్లోకి వెళ్లడం చాలా సంతోషంగా ఉంది. - **భూదాటి భారతి, శ్రీనివాసరావు, చేనేతపురి కాలనీ**

సోలార్ ప్రాజెక్టు భూములపై సమీక్ష

బల్లికురవ, న్యూస్‌టుడే: మండలంలోని ఎస్.ఎల్.గుడిపాడు గ్రామంలో సోలార్ పవర్ ప్రాజెక్టు భూసేకరణకు సంబంధించి రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లింపులు తుది దశకు చేరిన నేపథ్యంలో బుధవారం చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతులకు నగదు లావాదేవీలు మరో రెండు రోజుల్లో పూర్తి కానున్నట్లు ఆర్డీవో తెలిపారు. బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో 850 ఎకరాల్లో నిర్మించనున్న ప్రాజెక్టుకు శాశ్వతపరమైన అడ్డంకులు లేకుండా చూడాలని తహసీల్దార్లను ఆదేశించారు. తహసీల్దార్లు రవినాయక్, రవిబాబు, సంతమాగులూరు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ తెల్లపోలు రమేష్‌బాబు, డీటీ ప్రహర్ష, ఆర్‌ఐ పోతురాజు పాల్గొన్నారు.

వేటపాలెంలో ఎన్‌సీసీ క్యాడెట్ల ర్యాలీ

వేటపాలెం, న్యూస్‌టుడే: బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాలలో 29వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో వందేమాతర గీతం 150 వసంతాలు పూర్తి చేసుకోవడాన్ని పురస్కరించుకుని బుధవారం 'మేరి మిట్టి మేరా దేశ్' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ పురవీధుల గుండా సాగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ములకల గంగాధర్‌రావు మాట్లాడుతూ నేటి సమకాలీన సమాజంలో ప్రజలందరు ఒక్కటే అనే భావనను పెంపొందించుకోవాలన్నారు. 29వ బెటాలియన్ సుబేదార్ టర్బీర్ సింగ్, హవల్దార్ టీఎల్ కుమార్ లింబు, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

అర్జీలపై ఆర్డీవో విచారణ

అద్దంకి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో చీరాల రెవెన్యూ డివిజన్ కార్యాలయం పరిధిలో నమోదైన 25 అర్జీలను ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు గురువారం విచారించారు. అద్దంకి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఆయా మండలాల తహసీల్దార్లు హాజరయ్యారు. ఆర్డీవో మాట్లాడుతూ రెవెన్యూ పరంగా సమస్యలు ఎక్కువగా నమోదవుతున్నాయని, సకాలంలో వాటిని పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. తహసీల్దార్లు జి.శ్రీచరణ్, జీవీ.సుబ్బారెడ్డి, రవినాయక్, కె.రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా గృహ ప్రవేశాలు

పర్చూరులో గృహ ప్రవేశాలు చేయిస్తున్న నాయకులు, అధికారులు

గృహపత్రాలతో లబ్ధిదారులు, ఎమ్మెల్యే కొండయ్య

అద్దంకిలో గృహ నిర్మాణ పత్రాలు అందిస్తున్న అధికారులు, నేతలు

చీరాల, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరికీ సొంతిల్లు అనేది ఒక కలలాంటిదని, దానిని నెరవేర్చడానికి కూటమి ప్రభుత్వం చేయూతనిస్తోందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఒకటో వార్డు 300 కాలనీలో లబ్ధిదారులను గృహప్రవేశం చేయించారు. అనుమతి పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే పేదలకు ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యతనిచ్చి పూర్తిచేశారన్నారు. కమిషనర్ రషీద్, వైస్‌ఛైర్మన్ సుబ్బయ్య, కౌన్సిలర్లు, అధికారులు, నేతలు పాల్గొన్నారు.

పర్చూరు, మార్టూరు: పేదలకు సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా అర్హులతో గృహ ప్రవేశాలు చేయించినట్లు ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ షంషుద్దీన్, తెదేపా మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అబ్దుల్‌రజాక్ తెలిపారు. పర్చూరు, మార్టూరులో అర్హులతో గృహ ప్రవేశాలు చేయించారు. ఎంపీడీవో వి.ప్రద్యుమ్నకుమార్ పాల్గొన్నారు.

రాజీవ్‌కాలనీ(అద్దంకి), న్యూస్‌టుడే: సొంతిల్లు లేని పేదలు ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని గృహనిర్మాణ సంస్థ డీఈ శివకుమార్ అన్నారు. పురపాలక సంఘం పరిధిలోని రాజీవ్‌కాలనీ వద్ద ప్రభుత్వ నిధులతో నిర్మించిన గృహాల ప్రవేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కొత్తగా 185 మంది లబ్ధిదారులకు నూతన గృహ నిర్మాణ మంజూరు పత్రాలు అందించారు. కమిషనర్ డిరవీంద్ర, వైస్‌ఛైర్మన్ దేసు పద్మేష్, కౌన్సిలర్లు మాగులూరి తిరుపతమ్మ, కంపా రజని, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సంచాలకుడు చిన్ని శ్రీనివాసరావు, తెదేపా నేతలు వడ్డవల్లి పూర్ణచంద్రరావు, కాకాని అశోక్, గార్లపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాలువ పూడికతీత

పొక్లెయిన్‌తో కాలువ పూడిక తీస్తూ..

స్పందనకు వందనం

బల్లికురవ, న్యూస్‌టుడే: మండలంలోని చెన్నుపల్లిలో వరి పొలాలకు 10 రోజులుగా నీరులేక పొలాలు ఎండుముఖం పట్టాయి. దీనిపై బుధవారం 'ఈనాడు'లో 'పొలం బీడువారే.. రైతు కన్నీరే' శీర్షికన కథనం ప్రచురితం కాగా రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పందించారు. వెంటనే కాలువ పనులు చేపట్టి అన్నదాతల ఆవేదన తీర్చాలని స్థానిక నేతలు, అధికారులను ఆదేశించారు. దీంతో చెన్నుపల్లి గ్రామ నాయకులు గొట్టిపాటి శంకర్, దివ్వె రామాంజనేయులు ఆధ్వర్యంలో కాలువ పూడికతీత పనులు చేపట్టారు. దీంతో రైతులకు ఊరట లభించనుంది.

ఈకేవైసీ చేయించుకున్న కూలీలకే 'ఉపాధి'

అద్దంకి, న్యూస్‌టుడే: ఈకేవైసీ పూర్తి చేసుకున్న కూలీలకే ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని ఎంపీడీవో బి.వరూధిని తెలిపారు. ఉపాధి హామీ క్షేత్ర సహాయకులతో బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మండలంలో మొత్తం 18112 మంది ఉపాధి కూలీలు ఉండగా ఇప్పటి వరకు 15325 మంది ఈకేవైసీ నమోదు చేయించుకున్నారన్నారు. నెలాఖరు నాటికి మిగిలిన వారు నమోదు చేయించుకోవాలని చెప్పారు. ఏపీవో ఐఎన్‌ఎస్.కోటేశ్వరి పాల్గొన్నారు.

నేడు మండల తెదేపా కమిటీ ప్రమాణ స్వీకారం

బల్లికురవ, న్యూస్‌టుడే: తెదేపా మండల కార్యవర్గ కమిటీ ప్రమాణ స్వీకారం గురువారం చేయనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు ధూళిపాళ్ల హనుమంతరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో తెదేపా శ్రేణులు సమావేశమయ్యాయి.

వంతెనల అప్రోచ్ రహదారులపై రాకపోకలు

చిలకలేరు అప్రోచ్ గండిపూడ్చిన అనంతరం ఇలా..

మొంథా తుపాను ప్రభావంతో దెబ్బతిన్న మోదేపల్లి చిలకలేరు, పేరాయపాలెం దోర్నపువాగు వంతెనల వద్ద అప్రోచ్ రహదారుల గండ్లకు మరమ్మతులు అనంతరం బుధవారం సాయంత్రం రాకపోకలు పునః ప్రారంభమయ్యాయి. రెండు చోట్ల రోడ్లకు సుమారు 20 అడుగుల లోతులో గండ్లు పడటంతో రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. దీంతో పొలాలకు వెళ్లాలనుకునే కూలీలు కొంతమేర ఇబ్బంది పడ్డారు. స్పందించిన ర.భ.శాఖ అధికారులు వీటి మరమ్మతులకు తాత్కాలికంగా రూ.25 లక్షలు మంజూరు చేశారు. తొలివిడతలో పేరాయపాలెం దోర్నపువాగు వంతెన అప్రోచ్ రహదారికి మరమ్మతులు పూర్తిచేశారు. రెండు రోజులుగా చిలకలేరు వద్ద మరమ్మతులు పూర్తి చేశారు. చిలకలేరు వంతెనకు ఉత్తరం వైపున మూడు సిమెంటు తూములు ఏర్పాటు చేసి, పైన కొండమట్టిని పోసి చదును చేశారు. దీంతో రాకపోకలు పునః ప్రారంభమయ్యాయి. - **మోదేపల్లి(అద్దంకి), న్యూస్‌టుడే**

చిలుకూరివారిపాలెంలో సినీ నటి లయ సందడి

లయతో అభిమానులు

చిలుకూరివారిపాలెం (యద్దనపూడి), న్యూస్‌టుడే: వెండితెర కథానాయకి లయ యద్దనపూడి పంచాయతీ పరిధిలోని చిలుకూరివారిపాలెంలో సందడి చేశారు. బుధవారం రాత్రి ప్రముఖ యువకుడు దర్శకుడు అనిల్ రావిపూడి స్వగృహానికి విచ్చేయడంతో సమాచారం అందుకున్న అభిమానులు, మహిళలు పెద్దసంఖ్యలో తరలి వచ్చి ఆమెతో ఫొటోలు దిగారు. లయను దర్శకుడు రావిపూడి తల్లిదండ్రులు అనంతలక్ష్మి, బ్రహ్మయ్యలు స్వాగతించారు. దర్శకుడు అనిల్ అభిమాన సంఘం అధ్యక్షుడు కృపారావు లయను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

'వైద్య కళాశాలలు ప్రైవేటు పరం కానీయం'



అద్దంకిలో వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ మాధవరావు, నేతలు

అద్దంకి, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల నిర్మాణంలో పీపీపీ విధానాన్ని ప్రభుత్వం రీకాల్ చేయాల్సిందేనని వైకాపా శాసనమండలి సభ్యుడు తూమాటి మాధవరావు అన్నారు. అద్దంకి భవానీ కూడలి నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు గురువారం ప్రదర్శన నిర్వహించారు. అధికార ప్రతినిధి శ్యామల ఆధ్వర్యంలో ఉప తహసీల్దార్ సురేష్‌బాబుకు వినతిపత్రం అందించారు.

చీరాల: జగన్ ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాలలను ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రైవేటు పరం కానీయమని వైకాపా నియోజకవర్గ బాధ్యుడు కరణం వెంకటేష్‌బాబు పేర్కొన్నారు. బుధవారం వైకాపా ఆధ్వర్యంలో ప్రజాఉద్యమ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ప్రారంభమైన ప్రదర్శన ఆర్డీవో కార్యాలయం వరకు కొనసాగింది. అక్కడ కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందజేశారు. పరిశీలకులు బసవపున్నారెడ్డి పాల్గొన్నారు.

పర్చూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం తగదని వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూదన రెడ్డి, పర్చూరు, చీరాల నియోజకవర్గాల పరిశీలకులు మోదుగుల బసవపున్నారెడ్డి తెలిపారు. వైకాపా ఆధ్వర్యంలో పర్చూరులో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు.

విద్యుత్తు బిల్లులు ట్రూడౌన్

బిల్లులు తీస్తూ..

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం విద్యుత్తు ఛార్జీలు పెంచమని, వీలైనంత వరకు తగ్గించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చింది. ఆ మేరకు వీటిని ఈనెల నుంచి తగ్గిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ట్రూఅప్ ఛార్జీల పేరిట ఎడాపెడా పెంచింది. దీంతో పేద, మధ్య తరగతి వారు వీటిని చెల్లించేందుకు అల్లాడిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈసారి కరెంటు ఛార్జీలు ట్రూడౌన్‌లో రానున్నాయని తెలియడంతో వినియోగదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చీరాల విద్యుత్తు డివిజన్ పరిధిలోని చినగంజాం, వేటపాలెం, ఇంకొల్లు, పర్చూరు, చీరాల, కారంచేడు మండలాలున్నాయి. మొన్నటి వరకు విద్యుత్తు కొనుగోలు, సరఫరా ఖర్చు, పంపిణీ నష్టాలు, ఇతర వ్యయాలు కలిపి ట్రూఅప్ ఛార్జీల కింద యూనిట్‌కి అదనంగా రూ.40 పైసలు వసూలు చేసేవారు. కూటమి ప్రభుత్వం వీటిపై సమీక్షించి అదనంగా వసూలు చేసే మొత్తంలో కొంత తిరిగి వినియోగదారులకు ఇవ్వాలని నిర్ణయించింది. డివిజన్ పరిధిలో 2024-25 సంవత్సరంలో 2 కోట్ల 84 లక్షల యూనిట్ల వినియోగం జరిగిందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఒక్కొక్క యూనిట్‌కి 13 పైసలు వరకు తగ్గించనున్నారు. దీనివల్ల వినియోగదారులకు దాదాపు రూ.2 కోట్లపైనే లబ్ధి చేకూరనుందని అధికారులు తెలుపుతున్నారు. వచ్చేనెల బిల్లులో ఈ వ్యత్యాసం కనపడుతుందని చీరాల విద్యుత్తు ఈఈ జాన్‌థామస్ తెలిపారు.

☆ **డివిజన్‌లో సర్వీసుల సంఖ్య: 1,70,999**

☆ **హెచ్‌టీ సర్వీసులు: 80**

☆ **పరిశ్రమలు, కమర్షియల్: 20,919**

తక్షణ చర్యలు చేపడతాం

సాయిబాబా గుడి సమీపంలో నీరు నిలిచే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జె.పంగులూరు, న్యూస్‌టుడే: జాతీయ రహదారి ముప్పవరం సాయిబాబా గుడి వైపు నుంచి గ్రామంలోకి వచ్చే సర్వీసు రోడ్డులో కోటేలు డొంక సమీపంలో చిన్న వర్షానికి నీరు నిలిచి, పాఠశాల విద్యార్థులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని గ్రామస్థులు హైవే అధికారి హసన్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే గ్రామంలోని శివాలయం వద్ద జల్లులకు గుడిలోకి నీరు చేరుతోందని గ్రామస్థులు కుక్కపల్లి ఏడుకొండలు, గరిమిడి జగన్మోహనరావు సమస్యను వివరించారు. తక్షణం స్పందించిన హసన్ నీరు నిలిచే ప్రాంతాలను బుధవారం పరిశీలించారు. వారం రోజుల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు చేపడతామని తెలిపారు.

విద్యార్థులు మంచిగా మెలగాలి

అద్దంకి, న్యూస్‌టుడే: ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుకునే వారు మంచి బుద్ధితో మెలగాలని, అపుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారని శిక్షణ ఎస్సై వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ప్రకాశం బాలుర ఉన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు సైబర్ నేరాలు, అంతర్జాల మోసాలు, నివారణ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో-2 కేవీ.శ్రీనివాసరావు నేతృత్వం వహించారు. ఎస్సై పీవీ.నరసింహ, ఉపాధ్యాయులు మాట్లాడారు.

అవీ ఇవీ

నేడు ప్రమాణ స్వీకారం

మార్టూరు, న్యూస్‌టుడే: ఇసుకదర్శిలోని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం 5గంటలకు పార్టీ పదవుల ప్రమాణ స్వీకార మహోత్సవం నిర్వహిస్తున్నట్లు బుధవారం క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపాయి. ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు.

శిక్షణ తరగతులు

జె.పంగులూరు, న్యూస్‌టుడే: మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిరాభివృద్ధి- సుపరిపాలనపై ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో కె.స్వరూపరాణి తెలిపారు. గురువారం సర్పంచి, ఉప సర్పంచి, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని హాజరుకావాలని కోరారు.

ఇంకొల్లు: మండలంలోని పంచాయతీల సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. అందరూ హాజరు కావాలని చెప్పారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం శాఖ గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకుడు ఆచారులు తెలిపారు. ఈ సందర్భంగా రోజుకొక కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

కార్తిక వన భోజనాలు రేపు

జె.పంగులూరు,న్యూస్‌టుడే: చందలూరులోని చిట్టాబత్తిన వారి వంశ దేవర రేణుకమ్మ అమ్మవారి ఆలయంలో ఈ నెల 14న కార్తిక వన భోజనాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు చిట్టాబత్తిన శేషారావు తెలిపారు. ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సత్యనారాయణ స్వామి వ్రతాలు

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే : శ్రీ లలితా త్రిపుర సుందరీ పీఠం ఆధ్వర్యంలో బాపట్ల పట్టణంలోని ఏజీ కళాశాల ఎదురు ఉన్న కోన కళాక్షేత్రంలో ఈనెల 14న ఉదయం 7:30 గంటలకు ఉచిత సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

క్రమశిక్షణతో మెలగాలి

పర్చూరు, కారంచేడు: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని పర్చూరు, కారంచేడు ఎస్సైలు జీవీ చౌదరి, షేక్ ఖాదర్‌బాషాలు తెలిపారు. బుధవారం పర్చూరు మండలం ఉప్పుటూరులోని జడ్పీ ఉన్నత పాఠశాల, కారంచేడు వైఎన్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నివారణ, అంతర్జాలం వినియోగంపై పలు సూచనలు చేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై కళాజాతా

పర్చూరు, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం పర్చూరు బొమ్మల సెంటర్‌లో కళాజాతా నిర్వహించారు. ప్రజల్లో ఆర్థిక చైతన్యాన్ని తీసుకొచ్చేలా నాబార్డు సహకారంతో కళాజాత నిర్వహిస్తున్నట్లు పర్చూరు బ్రాంచ్ మేనేజర్ విశ్వేశ్వరరావు తెలిపారు.

కొబ్బరి సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

మైలవరం(అద్దంకి), న్యూస్‌టుడే: కొబ్బరి సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన శాఖాధికారిణి ఎస్.దీప్తి అన్నారు. మండలంలోని మైలవరం, ఉప్పలపాడు గ్రామాల రైతులతో ఆమె బుధవారం మాట్లాడారు. రైతులకు హెక్టారుకు ప్రభుత్వం రూ.56 వేల రాయితీ అందిస్తుందన్నారు. వెదురు సాగు చేసే వారికి హెక్టారుకు రూ.60 వేలు రాయితీగా అందిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న రైతులు ఉద్యాన శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. వ్యవసాయ విస్తరణాధికారి కోటేశ్వరరావు, వ్యవసాయ సహాయకుడు పవన్‌సాయి పాల్గొన్నారు.

అక్రమాలపై చర్యలు తీసుకోవాలని వినతి

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: చీరాల ఆదర్శ పాఠశాలలో చోటుచేసుకున్న అక్రమాలపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ప్రతినిధి వెంకటకుమార్ కోరారు. ఈమేరకు డీఈవో పురుషోత్తంను కలిసి వినతిపత్రం అందించారు.

అయిదు నియంత్రికలు మంజూరు

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఇంకొల్లు పరిధిలో లోవోల్టేజి సమస్య నివారణకు ప్రభుత్వం అయిదు నియంత్రికలు మంజూరు చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ జాగర్లమూడి రామకృష్ణ తెలిపారు. వీటిని శుక్రవారం నుంచి ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఎలుకల మందు తిని ఆత్మహత్య

వేటపాలెం, న్యూస్‌టుడే: ఎలుకల మందు తిన్న వ్యక్తి చికిత్స పొందుతూ మరణించాడు. రామన్నపేట పంచాయతీ సమైక్య నగర్‌కి చెందిన పఠాన్ గౌస్ ఆలీఖాన్(44) లారీ డ్రైవరుగా పనిచేస్తాడు. ఇతనికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. భార్యాభర్తల మధ్య కలహాల నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఎలుకల మందు తినడంతో గమనించిన కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై జనార్దన్ తెలిపారు.

తెగిన విద్యుత్తు తీగలు.. ప్రజల ఇబ్బందులు

మార్టూరు, న్యూస్‌టుడే: మార్టూరు పరిధిలో విద్యుత్తు సరఫరా ఒక్కసారిగా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బుధవారం రాత్రి పట్టణానికి సరఫరా అయ్యే కరెంటు తీగలు పలుచోట్ల తెగడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని గ్రామస్థులు ఆరోపించారు. దీంతో విద్యుత్తు సరఫరా పునరుద్ధరణకు ఎక్కువ సమయం పట్టడంతో చిన్నారులు, పెద్దలు అల్లాడిపోయారు. దోమలు, ఉక్కపోతతో తల్లడిల్లారు.

రెండు కేసుల నమోదు

వలపర్ల(మార్టూరు), న్యూస్‌టుడే: మండలంలోని వలపర్లలో న్యాయస్థానం ఆదేశాల మేరకు బుధవారం రెండు కేసులు నమోదైనట్లు మార్టూరు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన శ్రీదేవి, సుబ్రహ్మణ్యంల మాంసం దుకాణంలోకి అదే గ్రామానికి చెందిన వెంకటరామాంజనేయులు, లక్ష్మీనారాయణ తదితర ఆరుగురు అక్రమంగా ప్రవేశించి కర్రతో దాడి చేసినట్లు, అసభ్యంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదైందన్నారు. మరో కేసులో జి.రమాదేవిని తప్పుడు ప్రకటనల ద్వారా ఓ సంస్థ ఎంబ్రాయిడింగ్ యంత్రం మార్చి, కొత్తది ఇస్తామని, దాంతో పాటు రూ.2 లక్షల నగదు తీసుకుని లోపభూయిష్టమైన యంత్రాన్ని పంపిందన్నారు. దీనిపై హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన సంస్థ ప్రతినిధులు దీనబంధు సాహు, సుధీర్ భల్లవ తదితర ఆరుగురిపై మోసం, బెదిరింపులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

శ్రద్ధాంజలి

జననం 16-12-1959

మరణం 01-11-2025

కీ॥శే॥ శ్రీమతి ముత్యాలపాటి అంజనాదేవి గారు

చినగానుగపాలెం, అద్దంకి

"జాతస్య హి ధ్రువో మృత్యు ర్ధ్రువం జన్మ మృతస్య చ తస్మా దరపరిహార్యేర్థే న త్వం శోచితు మర్హసి"

ప్రేమ ఆప్యాయతానురాగాలను పంచి, కల్మషమెరుగని మనస్సుతో కుటుంబ ఉన్నతికి అహర్నిశలు కృషిచేసిన మా అమ్మ "కీ॥శే॥ శ్రీమతి ముత్యాలపాటి అంజనాదేవి గారి" మరణానికి చింతిస్తూ వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

అశ్రునయనాలతో అంజలిఘటిస్తూ...

భర్త: ముత్యాలపాటి నాగేశ్వరరావు; అత్తగారు: ముత్యాలపాటి నారాయణమ్మ

కుమారులు - కోడళ్ళు: రజనీష్‌కృష్ణ - శిరీష, చంద్రశేఖర్ - సుధారాణి

మనుమలు: మోదిత్ ఆరోహ్, భవిన్ మహవీర్, మనుమరాలు: హన్‌స్వి హోమజా

అన్నయ్య - వదిన: చిట్టెంశెట్టి కోటేశ్వరరావు - హైమావతి

కుటుంబసభ్యులు మరియు బంధుమిత్రులు

పెదకర్మ: ది: 13-11-2025 గురువారం అద్దంకి, చినగానుగపాలెంలోని మా స్వగృహం నందు జరుగును.

గమనిక: సమయాభావం వలన కార్డు అందనివారు ఇదే కార్డుగా భావించి రాగలరని మనవి.

(c) eenadu

ప్రణాళికాయుత అడుగులతోనే ఉన్నత శిఖరాలు

విద్యార్థులు అనుకున్న లక్ష్యాలు చేరుకోవాలంటే అందుకు తగ్గట్లుగా ముందస్తు ప్రణాళికలు అవసరమని, విద్యార్థి జీవితంలో ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అందుకోవాలని వక్తలు సూచించారు. బుధవారం తిరుపతి గ్రామీణ మండలం పేరూరులోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో (శ్రీమీనాక్షి సౌధం క్యాంపస్) 'ఈనాడు- కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయం' సంయుక్తంగా నిర్వహించిన 'దశ దిశ' కార్యక్రమం విద్యార్థుల్లో సరికొత్త ఆలోచనలకు నాంది పలికింది. ఇంటర్ తరువాత ఉజ్వల భవిష్యత్తుకు ఏఏ కోర్సులపై దృష్టి సారించాలనే అంశాలపై నిపుణులు దిశానిర్దేశం చేశారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసి.. భవితపై భరోసా కల్పించారు. అంతకుముందు కేఎల్ యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డా. జె. శ్రీనివాసరావు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 'ఈనాడు' తిరుపతి యూనిట్ ఇన్‌ఛార్జి శ్రీధర్‌లాల్, కేఎల్‌యూ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ జేవీ షణ్ముఖ కుమార్, జోనల్ హెడ్ డా. రఘు, కళాశాల ప్రిన్సిపాళ్లు రాజేంద్ర, మల్లిక పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, తిరుపతి (విద్య)

ప్రభుత్వ విద్యార్థి.. అందుకో బహుమతి

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: మీరు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారా.. అయితే మీకో అవకాశం. మీ ప్రతిభకు పరీక్ష. ఇందులో విజయం సాధిస్తే నగదు ప్రోత్సాహకాలు ఇస్తారు. ఏపీపీఈ మెరిట్ టెస్ట్ (ఈఈఎంటీ 2025)లో సత్తా చాటితే చాలు. ఈ వివరాలు ఏంటో తెలుసుకుందామా..!

ప్రోత్సాహకాలు

- **అర్హులు:** ప్రభుత్వ పాఠశాలల్లో 7, 10వ తరగతి విద్యార్థులు.
- **ఫీజు:** రిజిస్ట్రేషన్ ఉచితం.
- **బహుమతులు:** రాష్ట్ర, జిల్లా స్థాయిలో విజేతలకు మొత్తం రూ.9 లక్షల వరకు నగదు, సర్టిఫికెట్లు.
- **పదో తరగతి:** రాష్ట్ర స్థాయిలో మొదటి మూడు ర్యాంకులకు రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు.
- **7వ తరగతి:** రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు అందిస్తారు.
- మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన వారికి గుర్తింపు (సర్టిఫికెట్లు, మెడల్స్) లభిస్తుంది.

పరీక్షా విధానం

- పరీక్ష రెండు దశల్లో ఉంటుంది.
- ప్రిలిమ్స్ ఇంటి నుంచి లేదా పాఠశాలలోనైనా ఆన్‌లైన్‌లో రాయాలి. ఇందులో ప్రతిభ కనబరిచితే మెయిన్స్‌కు ఎంపిక చేస్తారు. నిర్దేశించిన కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు.
- **సిలబస్:** ఏపీ ప్రభుత్వ, ఎస్‌సీఈఆర్టీ, పాఠ్యపుస్తకాలపై (గణితం, సైన్స్, సోషల్, మానసిక సామర్థ్యం) ప్రశ్నలు ఉంటాయి.
- **పరీక్ష సమయం:** 60 నిమిషాలు

ముఖ్యమైన తేదీలు:
- రిజిస్ట్రేషన్‌కు గడువు: ఈ నెల 14
- ప్రిలిమ్స్: డిసెంబర్ 29
- మెయిన్స్: జనవరి 19

ఆపరేషన్ స్వర్ణతో ఆటకట్టు

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: విశాలమైన లేఅవుట్‌లు, ఎనిమిది ఎకరాల్లో ఫాంహౌస్‌లు, అపార్టుమెంట్లు, అక్రమ కట్టడాలు, వందల ఎకరాల్లో మామిడి తోటలు. ఇలా ఎన్నో అక్రమాలకు నెలవుగా మారింది స్వర్ణముఖి పరీవాహక ప్రాంతం. 'ఆపరేషన్ స్వర్ణ'లో భాగంగా తిరుపతి గ్రామీణ మండలంలో చేపట్టిన సర్వేలో గుర్తించిన ఆక్రమణల విలువ రూ. వెయ్యి కోట్ల పైమాటే. కొందరు రియల్టర్లు లేఅవుట్లు వేసి విక్రయించగా.. కొందరు ఐదారు అంతస్తుల భవనాలు నిర్మించుకున్నారు. వందల ఎకరాల్లో మామిడి తోటలు ఏపుగా పెరిగాయి. కుంట్రపాకం వద్ద విలాసవంతమైన ఫామ్ హౌస్ స్వర్ణముఖిలో వెలిసింది.

- ఆక్రమణదారుల్లో గుబులు
- సర్వేలో విస్తుగొలిపే నిజాలు వెలుగులోకి

తిరుపతి గ్రామీణ మండలంలోనే ఎక్కువ

జిల్లాలోని 9 మండలాల మీదుగా ప్రవహించే స్వర్ణముఖి ఎక్కువగా ఆక్రమణకు గురైంది మాత్రం తిరుపతి గ్రామీణ మండలంలోనే. స్వర్ణముఖి, దాని బఫర్ జోన్‌లో సుమారు 2 వేల కట్టడాలు ఉన్నట్లు తెలుస్తోంది. చిగురువాడ, వేదాంతపురం, దుర్గసముద్రం, తిరుచానూరు, అవిలాల ప్రాంతాల్లో కుంట్రపాకం ప్రాంతాల్లో ఎక్కువగా ఆక్రమణలు ఉన్నాయి. పరీవాహక ప్రాంతాల్లో 10 నుంచి 50 ఎకరాల వరకు ఆక్రమించుకుని పొలాలుగా మార్చారు. తిరుపతి గ్రామీణ మండలం తరువాత చంద్రగిరి, ఏర్పేడు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో ఎక్కువగా ఆక్రమణలు ఉన్నాయని రెవెన్యూ అధికారులు అంటున్నారు.

తిరుచానూరు సమీపంలో ఆక్రమణలు

జన్మస్థానం:	ముగింపు:	పొడవు:	విస్తీర్ణం:
పాకాల మండలం శంఖంపల్లె	వాకాడు మండలం పామంజి వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది.	155 కి.మీ.లు	3.10 లక్షల హెక్టార్లు

లక్షల మందిని ప్రమాదంలో పెట్టలేం: సి.దివాకర్‌రెడ్డి, ఛైర్మన్, తుడా

ఆపరేషన్ స్వర్ణ ముఖ్యమంత్రి అనుమతితో ప్రారంభమైంది. వేలాది ఆక్రమణలతో లక్షలాది మందిని ప్రమాదంలో పెట్టలేం. ఇలాగే వదిలేస్తే భావితరాలకు స్వర్ణముఖి పవిత్రను, ప్రయోజనాల్ని ఇవ్వలేం. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో ఆక్రమణల్ని గుర్తించగలిగాం. వంద మీటర్ల బఫర్ జోన్‌ను 50 మీటర్లకు కుదించారు. ఆ నిబంధనల ప్రకారం సరిహద్దు రాళ్లు పాతుతాం. స్వర్ణముఖి కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకుంటాం.

నది పొడవునా ఇలా..

- ముక్కోటి నుంచి కుంట్రపాకం వరకు సర్వే చేశారు.
- స్వర్ణముఖి నది, దానికి ఇరువైపులా 50 మీటర్ల బఫర్ జోన్ హద్దుల్ని నిర్ణయించారు.
- వీటి మధ్యలో ఉన్న కట్టడాలు, పొలాలు, లేఅవుట్‌లను గుర్తించి వాటి వివరాలు సేకరిస్తున్నారు.
- తొలి విడతలో చంద్రగిరి నుంచి శ్రీకాళహస్తి వరకు సర్వే పూర్తి చేసి.. జనవరి నుంచి క్షేత్రస్థాయిలో సరిహద్దురాళ్లు పాతనున్నారు.
- నిరుపేదలుంటే వారికి ప్రత్యామ్నాయంగా స్థలాలు కేటాయిస్తారు.
- అక్రమార్కుల చెరలోని నిర్మాణాలు కూల్చివేస్తారు. స్థలాలను స్వాధీనం చేసుకుంటారు.
- అవసరమైన ప్రాంతాల్లో పూడిక తొలగిస్తారు.
- స్వర్ణముఖి విస్తరించిన 155 కి.మీల మేర సర్వే పూర్తయ్యాక.. ఆక్రమణకు గురవుతున్న ప్రాంతాలకు ఇరువైపులా 4 మీటర్ల వెడల్పు గల తాత్కాలిక రోడ్లను నిర్మిస్తారు.

వంతెన.. అంతేనా..!

చిత్తూరు నగర శివారు తిరుపతి రోడ్డులోని దొడ్డిపల్లి వద్ద ఉన్న రైల్వే అండర్ పాస్ వంతెన కింద ఇటీవల కురిసిన వర్షాలకు భారీగా నీరు చేరింది. దీంతో నెల రోజులుగా రాకపోకలు నిలిపివేశారు. అధికారులు వాటిని తోడే ప్రయత్నం కూడా చేయడం లేదు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. – ఈనాడు, చిత్తూరు

మీదే భారం

తిరుపతి జిల్లా డీపీ కండ్రిగ ఆర్.మల్లవరం గ్రామానికి చెందిన ఎన్. మునిశేఖర్ దివ్యాంగుడు. ఇతనికి ప్రస్తుతం రూ.6 వేల పింఛను వస్తోంది. సదరంలో 90 శాతం వైకల్యం ఉంది. రూ.15 వేల పింఛను మంజూరు కోసం బుధవారం రుయా ఆసుపత్రికి వచ్చారు. అతడికి సాయంగా బావమరిది రాగా.. బావను ఇలా భుజానికెత్తుకొని వైద్యుల వద్దకు ఇలా తీసుకెళ్తూ కనిపించారు.

నిత్యం దారుణం

రుయా ఆసుపత్రిలో రోగిని స్ట్రెచర్‌పై తీసుకెళ్లాలంటే కుటుంబ సభ్యులో, బంధువులో ఉండాల్సిందే. బుధవారం ఉదయం ఆక్సిజన్ సిలిండర్ అమర్చిన ఓ రోగిని అత్యవసర విభాగం వైపు నుంచి పరీక్షల విభాగానికి ఇలా తీసుకెళ్తూ కనిపించారు. వృద్ధులైన రోగి బంధువులే స్ట్రెచర్‌ను లాక్కుంటూ వెళ్లారు. ర్యాంపు చిన్నగా ఉండటంతో ఇద్దరూ లాగలేక ఇబ్బందులు పడ్డారు. ఆసుపత్రి సిబ్బంది ఎంఎన్‌వో ఆక్సిజన్ సిలిండర్‌ను, స్ట్రెచర్‌ను వెనక నుంచి నెట్టుకుంటూ వచ్చారు.

– ఈనాడు, తిరుపతి

జిల్లాలో 10,168 గృహ నిర్మాణాలు పూర్తి

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: పేదలకు ఇళ్లు మంజూరు చేయాలనే సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎంఏవై ద్వారా గృహాలు మంజూరు చేస్తున్నాయని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. పీఎంఏవై 1.0 కింద నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు సీఎం చంద్రబాబు బుధవారం అన్నమయ్య జిల్లా రాయచోటిలో సామూహిక గృహప్రవేశం నిర్వహించారు. జిల్లా స్థాయిలో చిత్తూరు నగరం తిమ్మసముద్రంలోని లబ్ధిదారుడికి ఇంటి తాళాన్ని ఎంపీ దగ్గుమళ్ల అందజేశారు. ఎంపీ మాట్లాడుతూ జిల్లాలో పీఎంఏవై 1.0 కింద 10,168 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. పీఎంఏవై 2.0 కింద గృహ నిర్మాణ పథకం కోసం లబ్ధిదారులు ఈ నెల 30వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే జగన్మోహన్, మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, గృహ నిర్మాణ పీడీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుడికి నమూనా తాళం అందిస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు తదితరులు

సెమిస్టర్ ఫలితాలు విడుదల

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలో ఈ నెల మొదటి వారంలో నిర్వహించిన ఎంఫార్మసీ నాల్గవ సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసినట్లు పరీక్షల కార్యాలయం అధికారులు బుధవారం తెలిపారు.

ఫలితాలకు వెబ్‌సైట్ www.spmvv.ac.in

19న పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: శ్రీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఫార్మసీ డిప్లొమో (డీఫార్మసీ) కోర్సులో ప్రవేశానికి ఈ నెల 19న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ పద్మావతమ్మ బుధవారం తెలిపారు. ఈ నెల 14 నుంచి 18లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ/బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులు అర్హులని తెలిపారు. అభ్యర్థులకు 19న ఉదయం 10నుంచి సాయంత్రం 5వరకు ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. సీటు పొందిన వారికి ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు.

వివరాలకు చరవాణి సంఖ్య: 9299008151లో సంప్రదించాలి

ఈ నంబర్లు సేవ్ చేసుకోండి..!

ఏదైనా ప్రమాదం జరిగిందా.. సైబర్ నేరగాళ్లు మీ డబ్బులు కొట్టేశారా.. అత్యవసర వైద్య సాయం కావాలా.. ఎవరిని సంప్రదించాలో తెలియడం లేదా.. అయితే మీ కోసమే ఈ నంబర్లు ఉన్నాయి. అవేంటో తెలుసుకోండి.. వెంటనే మీ ఫోన్‌లో సేవ్ చేసుకోండి.

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే:

- **1077** వరదలు, విపత్తులు ఎదురైనప్పుడు ఈ నంబరును సంప్రదించాలి. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వచ్చి కాపాడుతాయి. 24 గంటలూ అందుబాటులో ఉంటారు.
- **1930** సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి డబ్బు పోగొట్టుకున్న వారు ఈ నంబరును సంప్రదించాలి. గుర్తించిన వెంటనే ఫిర్యాదు చేస్తే డబ్బు జమ అయిన బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేస్తారు. ఫోన్లో డేటా దుర్వినియోగం కాకుండా నిలువరిస్తారు.
- **101** ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఈ నంబరుకు కాల్ చేయవచ్చు. సంబంధిత ఫైర్ స్టేషన్‌కు.. కలవకపోతే జిల్లా అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ కలుపుతారు. వారి సమాచారంతో సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేస్తారు.
- **102** బాలింతలు, పిల్లల వైద్య సహాయం కొరకు నంబరును వినియోగించవచ్చు. ఆస్పత్రికి వెళ్లేందుకు అంబులెన్స్ సహాయం కోరినా స్పందిస్తారు. నిత్యం అందుబాటులో ఉంటారు.
- **112** వైద్య, పోలీసు సహాయం పొందవచ్చు. ఎలాంటి ఘటనలు జరిగినా సమాచారం ఇస్తే సమన్వయ కేంద్రం కొన్ని నిమిషాల్లో సేవలు అందేలా చూస్తోంది. వెంటనే బ్లూ కోల్ట్, రక్షక్ సిబ్బంది అక్కడికి చేరుకుని సేవలందిస్తారు.
- **181** ఇది మహిళా హెల్ప్‌లైన్ నంబరు. దేశ వ్యాప్తంగా పని చేస్తోంది. మహిళలకు సంబంధించిన పథకాలు, సేవలను తెలుసుకోవచ్చు. పోలీసులు, ఆస్పత్రులు, న్యాయసేవలు పొందవచ్చు.
- **14416** ఇది టెలీమానస్ టోల్‌ఫ్రీ నంబరు. ఆరోగ్యపరమైన ఒత్తిడికి గురైనా.. కుంగుబాటుతో ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన వచ్చినా.. మద్యం అలవాటు మానలేకపోయినా సంప్రదించవచ్చు.
- **1098** ఇది చైల్డ్ హెల్ప్ లైన్ నంబరు. బాల్య వివాహాలు నిలువరించడం, పిల్లల దత్తతకు కాల్ చేయవచ్చు. శిశు విహార్ కేంద్రాల్లోని చిన్నారులను దత్తత తీసుకోవచ్చు.

కలల గూడు.. సర్కారు తోడు

- రెండు జిల్లాల్లో టిడ్కో గృహాలకు 132.21 ఎకరాలు కేటాయింపు

ఈనాడు– చిత్తూరు, తిరుపతి: పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గత ప్రభుత్వంలో మంజూరైన గృహనిర్మాణాలు వేగవంతం చేయాలని ఓవైపు అధికారులకు ఆదేశాలు ఇస్తూనే గ్రామాల్లోని పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని నిర్ణయించారు. నగర, పురపాలికల పరిధిలో భూముల లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి సమాయత్తమైంది. సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో చిత్తూరు, కేవీబీపురంలో టిడ్కోకు భూములు కేటాయించాలని నిర్ణయించారు.

వైకాపా హయాంలో కదలిక లేక

తెలుగుదేశం 2014-19 పాలనలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పుంగనూరు, పలమనేరు, చిత్తూరు, పుత్తూరు, నగరి, తిరుపతి, శ్రీకాళహస్తిలో టిడ్కో గృహాలకు పునాది పడింది. అప్పట్లో 40,250 గృహాలు మంజూరయ్యాయి. చిత్తూరు, శ్రీకాళహస్తిలో దాదాపు నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈలోపు ఎన్నికలు రావడం. వైకాపాకు అధికారం దక్కడంతో 25 శాతం లోపు పనులు జరిగిన వాటిని రద్దు చేయాలని ఆదేశించారు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు చిత్తూరు, పుంగనూరులో హడావుడిగా తాళాలిచ్చారు.

తిరుపతి, పలమనేరు, నగరిలో..

గతంలో తిరుపతిలో 2,560 టిడ్కో గృహాలు మంజూరుకాగా 2,160 గ్రౌండింగ్ అయ్యాయి. వైకాపా వీటిని రద్దు చేసింది. పలమనేరు, నగరిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

చిత్తూరు నగరం ఇరువారంలో కేటాయించిన భూమి

డిమాండ్ సర్వే తర్వాత

ఈ ప్రభుత్వం టిడ్కో ఇళ్లలో పెండింగ్ పనులు, సదుపాయాల కల్పనను వేగవంతం చేసింది. పట్టణాల్లో డిమాండ్ ఉండటంతో చిత్తూరు నగర పరిధి ఇరువారంలో వందెకరాలు కేటాయించారు. అనంతరం డిమాండ్ సర్వే చేస్తారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన- అర్బన్ 2.0 (ఎన్టీఆర్ నగర్) కింద ఎన్ని నిర్మించాలో నిర్ణయించి ప్రతిపాదనలు రూపొందిస్తారు.

ఐఐటీ చూసొద్దామా..!

ఏర్పేడు, న్యూస్‌టుడే: ఐఐటీలో విద్యాభ్యాసం, తరగతుల నిర్వహణ, అందుబాటులో ఉన్న సదుపాయాలు, పరిశోధన కేంద్రాలతో పాటు 500 ఎకరాలకు పైబడి ఉన్న అందమైన ప్రాంగణాన్ని వీక్షించేందుకు పాఠశాల విద్యార్థులకు తిరుపతి ఐఐటీ అవకాశం కల్పించింది. ఏటా నిర్వహించే ఓపెన్ స్కూల్ డే కార్యక్రమానికి ఈ నెల 15న శ్రీకారం చుట్టింది. తొమ్మిది, పదో తరగతి చదివే 170 మందికి అవకాశం ఉంటుంది. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించడమే కాకుండా ఉత్తమ విద్యార్థులకు బహుమతుల ప్రదానం, టెక్ వర్క్‌షాప్ వంటివి చేపట్టనున్నారు.

- సంప్రదించాల్సిన నంబరు
- 87124 09921
- ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త సింధూరి

రూ.50 కోట్లతో పద్మావతి ఘాట్

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: పవిత్ర స్వర్ణముఖి తీరంలోని తిరుచానూరులో పద్మావతి ఘాట్ ఏర్పాటుకు తుడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నది. పద్మావతి అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగే పంచమీ తీర్థం నాడు లక్షలాది మంది ఇక్కడ పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఘాట్ నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించడంతో యంత్రాంగం రంగంలోకి దిగింది.

సుమారు 50 ఎకరాల్లో..

తిరుచానూరు నుంచి పాడిపేటకు వెళ్లే మార్గంలో ప్రస్తుతం వాహనాల పార్కింగ్ కోసం వినియోగిస్తున్న స్థలం వద్ద సుమారు 50 ఎకరాల్లో పద్మావతి ఘాట్ నిర్మించాలని నిర్ణయించారు. స్నానాలు ఆచరించడానికి నీటి నిల్వ చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎగువ భాగంలో 11 చెక్‌డ్యాంలను నిర్మించి నీటిని నిల్వ చేసేలా సర్వే చేపట్టారు. అందుకోసం రూ.18 కోట్లు అవసరమని అధికారులు నివేదికలు పంపించారు. రాజమండ్రికి చెందిన ఓ నిపుణుడు ఇప్పటికే ఘాట్ ప్రతిపాదిత ప్రాంతాన్ని పరిశీలించి నమూనాలు సిద్ధం చేసేందుకు అంగీకారం కోరినట్లు చెబుతున్నారు. ప్రతి శుక్రవారం పద్మావతి ఘాట్‌లో హారతి ఇచ్చేలా కార్యాచరణ రూపొందించారు. జలవనరుల శాఖతో సంబంధం లేకుండా రూ.50 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తుడా ప్రతిపాదించింది.

పద్మావతి ఘాట్ ప్రతిపాదిత ప్రాంతం

మురుగును అడ్డుకోవడమే సవాలు

ఘాట్ ప్రతిపాదిత ప్రాంతానికి ఎగువ భాగంలో స్వర్ణముఖిలోకి పలు ప్రాంతాల్లో మురుగునీరు ప్రవేశిస్తోంది. ఇవి నది పవిత్రతను దెబ్బతీస్తున్నాయనే ఆవేదన భక్తుల్లో ఎక్కువగా ఉంది. దీంతో అవసరమైన ప్రాంతాల్లో మురుగు నీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేసి కలుషితాలను నియంత్రించేందుకు నగరపాలిక సహకారం తీసుకోనున్నారు. ఇందులో రెవెన్యూ, జలవనరుల శాఖ, తుడా ప్రణాళిక విభాగం, సర్వే శాఖలను భాగస్వాములను చేశామని తుడా ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి తెలిపారు.

35 రోజులకు రూ.2.20 కోట్లు

శ్రీకాళహస్తి,న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 35 రోజులకు రూ.2,20,13,724 ఆదాయం, స్వల్పంగా బంగారం, 599 కిలోల వెండి నిల్వలు వచ్చినట్లు ఆలయ ఈవో బాపిరెడ్డి తెలిపారు. 132 విదేశీ కరెన్సీ నోట్లు కూడా వచ్చాయని చెప్పారు. ఆలయ డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డితో పాటు పలువురు అధికారులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు. డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డితో పాటు అధికారులు పాల్గొన్నారు.

104FM Tirupati
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

ఎప్పుడైనా విత్తుకునేలా..

కొత్త రకం వరి వంగడం ఎన్ఎల్ఆర్-3648

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: తెగుళ్లను తట్టుకుని అధిక దిగుబడులనిచ్చే కొత్త వరి వంగడాన్ని వ్యవసాయ శాఖ అందుబాటులోకి తెచ్చింది. నెల్లూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం పరిశోధన చేపట్టి ఎన్ఎల్ఆర్-3648 రకం కొత్త వరి వంగడాన్ని సిద్ధం చేసింది. ఇది సన్న రకం. పొట్టిగా ఉంటుంది. వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశోధన క్షేత్రంలోనే ప్రయోగాత్మకంగా తొలుతగా దీని సాగు చేపట్టారు. ఆశించిన స్థాయిలో మంచి ఫలితాలు వచ్చాయి. దీంతో దీని విస్తరణకు మొదటగా జిల్లాకు 15కిట్లు(కిట్‌లో రెండు కిలోలు) అందజేశారు.

ఏపుగా పెరిగిన ఎన్ఎల్ఆర్-3648 రకం వరి

అగ్గి తెగులు దరిచేరదు

కొత్త రకం ఎన్ఎల్ఆర్-3648 వంగడం జిల్లాకు ఎంతో అనుకూలం. ఈ నెలలోనే సాగు చేపట్టాలనే నిబంధన లేదు. ఏడాదిలో ఎప్పుడైనా, ఏరోజైనా విత్తు కోవచ్చు. పంట కాలం 125 రోజులు. వరి కాండం గడుసుగా, వెన్ను దట్టంగా పెరుగుతుంది. ఎకరాకు 34-35 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. జిల్లాలో ప్రయోగాత్మకంగా దీని సాగుకు ఆసక్తి కలిగిన రైతులకు విత్తన కిట్లు అందజేస్తామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ బుధవారం తెలిపారు. మంచి దిగుబడులు లభిస్తే కొత్త రకం వంగడం సాగు విస్తరణకు చర్యలు తీసుకుంటామన్నారు. విత్తన కిట్లు కావలసిన రైతులు ఏవోలను సంప్రదించాలని ఆయన కోరారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటల్లో, రూ.300 ఎస్ఈడీ టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. మంగళవారం శ్రీవారిని 67,367 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.4.30 కోట్లు హుండీ కానుకలు లభించాయి.

వాతావరణం: తిరుమలలో మేఘావృతమై ఉంది. చలితీవ్రత పెరిగింది.

(c) eenadu

శిక్షణలో భాగంగా తుపాకీ చేబూనిన ఏఎస్పీ రాజశేఖర్‌రాజు

లక్ష్యం వైపే తూటాలు దూసుకెళ్లాలి

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: పోలీసులు తుపాకులు పేలిస్తే తూటాలు లక్ష్యం వైపే దూసుకెళ్లాలని ఏఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. గంగాధరనెల్లూరులోని ఫైరింగ్ రేంజ్‌లో పోలీసులకు జరుగుతున్న కాల్పుల శిక్షణలో ఏఎస్పీ మాట్లాడారు.

వేలంలో ఆలయానికి రూ.1.06 కోట్ల ఆదాయం

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయ ప్రాంగణంలో ఏడాది కాలానికి దుకాణాలు, హోటళ్ల నిర్వహణకు బుధవారం ఆన్‌లైన్, సీల్డ్ టెండర్లలో బహిరంగ వేలం నిర్వహించారు. మొత్తం ఆదాయం రూ.1,06,99,997 వచ్చిందని ఈవో పెంచల కిశోర్ తెలిపారు.

35 బ్రాడ్ గేట్ల వితరణ

కాణిపాకం, న్యూస్‌టుడే: ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి నాగార్జున సిమెంటు కంపెనీ ప్రతినిధులు 35 బ్రాడ్ గేట్లు బుధవారం వితరణగా అందజేశారు. కంపెనీ తిరుపతి మేనేజర్ నందన్, ఆలయ ఈఈ వెంకటనారాయణ పాల్గొన్నారు.

ముసాయిదా సవరణకు ఉత్తర్వులు

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: స్థానిక పాత న్యూట్రిన్ కర్మాగారం స్థలం 10.35 ఎకరాల విస్తీర్ణానికి సంబంధించి వర్క్ సెంటర్ జోన్ నుంచి మిశ్రమ వినియోగ జోన్ మార్పునకు అవసరమైన ముసాయిదా సవరణను ధ్రువీకరిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

పకడ్బందీగా కుష్ఠు సర్వే

చిత్తూరు(వైద్యవిభాగం): జిల్లాలో ఈ నెల 17 నుంచి 30 వరకు జరగనున్న ఇంటింటా కుష్ఠు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా క్షయ నివారణాధికారి వెంకటప్రసాద్ తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం పారామెడికల్ సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఇద్దరికి ఉద్యోగోన్నతి

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లా పశుసంవర్ధక శాఖలో ఇద్దరు ఏడీలు ఉద్యోగోన్నతి పొందారు. చిత్తూరులోని బహువిధ పశు వైద్యశాల ఏడీ రాజశేఖర్‌రెడ్డిని హిందూపురం డీడీగా, కుప్పం ఏడీ రెడ్డికుమారిని ఉమ్మడి చిత్తూరు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారిగా నియమిస్తూ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

గొలుసు దుకాణాలు నియంత్రించాలి

చిత్తూరు (నేరవార్తలు): జిల్లాలోని మద్యం దుకాణాలలో విక్రయాలను పర్యవేక్షిస్తూ గొలుసు దుకాణాల నియంత్రణకు కృషి చేయాలని చిత్తూరు ఎక్సైజ్ డీసీ విజయశేఖర్ ఆదేశించారు. చిత్తూరులోని అంబేడ్కర్ భవనంలో బుధవారం జరిగిన ఎక్సైజ్ అధికారుల సమావేశంలో మాట్లాడారు. కొన్ని ప్రాంతాల్లో గొలుసు దుకాణాలు ఉన్నట్లు విమర్శలు వస్తున్నాయని, వాటిపై నిఘా పెట్టాలన్నారు.

సాంకేతిక నైపుణ్యమే.. విద్యార్థి భవితకు చుక్కాని

👉 'ఈనాడు- కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ' అవగాహన సదస్సులో వక్తలు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: 'ఇంటర్‌లోనే విద్యార్థులు భవిష్యత్తు లక్ష్యాలు నిర్దేశించుకోవాలి.. అందుకు స్పష్టమైన ప్రణాళికలు ఇక్కడే రచించుకోవాలి. సాంకేతిక మార్పులు, మేధస్సు అందుకు చుక్కానిగా మార్చుకోవాలి.. అప్పుడే కలలు సాకారం అవుతాయి' అంటూ వక్తలు పేర్కొన్నారు. బుధవారం తిరుపతి గ్రామీణ మండలం పేరూరులోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో 'ఈనాడు- కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ' సంయుక్త ఆధ్వర్యంలో 'దశదిశ' పేరుతో విద్యార్థినులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వర్సిటీ ప్రతినిధులు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. వర్సిటీ తరఫున కిట్లు, కూపన్లు అందజేశారు. లక్కీడిప్ తీసి ఎం.అంకిత, డి.చేతనశ్రీలకు స్మార్ట్‌వాచీలు అందజేశారు. కేఎల్‌యూ అడ్మిషన్స్ డైరెక్టర్ డా.జె.శ్రీనివాసరావు, ప్రవేశాల అసిస్టెంట్ డైరెక్టర్ జేవీ షణ్ముఖ కుమార్, జోనల్ హెడ్ డా.రఘు, శ్రీచైతన్య కళాశాల ప్రిన్సిపాళ్లు రాజేంద్ర, మల్లిక, 'ఈనాడు' తిరుపతి యూనిట్ ఇన్‌ఛార్జి శ్రీధర్‌లాల్ పాల్గొన్నారు.

లక్కీడిప్ కార్యక్రమంలో విద్యార్థులు, అతిథులు

సదస్సుకు హాజరైన విద్యార్థులు

కార్పొరేట్ ప్రాధాన్యాలు గుర్తించాలి

ఇంజినీరింగ్ డిగ్రీ సార్థకం కావాలంటే సృజనాత్మక ఆలోచనలు, నైపుణ్యాలు అవసరం. పారిశ్రామిక, పరిశోధనాత్మక అంశాలపై దృష్టిసారిస్తూ అదనపు కోర్సులు అధ్యయనం చేస్తేనే అత్యుత్తమ ప్యాకేజీలు సాధ్యం. కేఎల్‌యూలో చదివిన ఓ విద్యార్థిని రూ.75 లక్షల ప్యాకేజీ పొందడం ఆనందంగా ఉంది. లక్ష్యంతో చదివితే ప్యాకేజీలు, ఉద్యోగాలు వాటంతటవే వరిస్తాయి. ఇంజినీరింగ్ కోర్సులను పాత పద్ధతుల్లో ఎంచుకోవడం సరైన ప్రక్రియ కాదు. కార్పొరేట్ కంపెనీల ప్రాధాన్యాలు మారాయి. అదనపు నైపుణ్యాలకు జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. శాటిలైట్ ప్రయోగాలతో జాతీయస్థాయిలో గుర్తింపు పొందాం. ఫీజుల్లో రాయితీ కల్పిస్తున్నాం.

- డా.జె.శ్రీనివాసరావు, కేఎల్ యూనివర్సిటీ ప్రవేశాల డైరెక్టర్

టెక్నాలజీకి అనుగుణంగా మార్చుకోవాలి



ప్రతి విద్యార్థి టెక్నాలజీకి అనుగుణంగా ఎదగాలి. ఆలోచనా విధానాలు మార్చుకోవాలి. ప్రతి క్షణం మంచి మార్కులు సాధించే దిశగా శ్రమించాలి. ఇతర దేశాలు విద్యపై ఎక్కువ ఖర్చు పెడుతున్నాయి. ఇది మన దేశంలోనూ పెరుగుతోంది.

- జె.వి. షణ్ముఖ కుమార్, ప్రవేశాల సహాయ డైరెక్టర్

మనకంటూ ప్రత్యేకత ఉండాలి

ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చే దిశగా పయనించాలి. కోర్సులు, ఉపకార వేతనాలు పరిశీలించి సరైన నిర్ణయం తీసుకోవాలి. విద్యార్థుల విజయాలు పరిశీలించాలి. ఇతర ప్రత్యేకతలు, విద్యా ప్రణాళికలు క్షుణ్నంగా తెలుసుకుని సరైన నిర్ణయం తీసుకోవాలి.

- డా.రఘు, జోనల్ హెడ్, కేఎల్‌యూ

మామిడి బకాయిల చెల్లింపులపై సమీక్షించాలి

చిత్తూరు(వ్యవసాయం): తోతాపురి మామిడి రైతులకు చెల్లించాల్సిన బకాయిలపై కలెక్టరు సమీక్షించాలని జిల్లా మామిడి రైతుల సంక్షేమ సంఘం నాయకులు పేర్కొన్నారు. వారు బుధవారం సమావేశమయ్యారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిబాబుచౌదరి, ఆనందనాయుడు మాట్లాడుతూ గుజ్జు పరిశ్రమలు తోతాపురి మామిడికి కిలో రూ.8 చెల్లించేలా కలెక్టర్ వెంటనే సమీక్షించాలన్నారు. తమ సమస్యపై జిల్లాలోని ఎమ్మెల్యేలందరూ దృష్టి సారించాలన్నారు. నేడు మామిడి రైతుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని చెప్పారు.

చిన్న అప్పన్న బెయిల్ పిటిషన్ వాయిదా

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: శ్రీవారి లడ్డూ ప్రసాదాల కల్తీ నెయ్యి కేసులో అరెస్టు అయిన వైవీ సుబ్బారెడ్డి మాజీ వ్యక్తిగత కార్యదర్శి చిన్న అప్పన్న (ఏ24) బెయిల్ పిటిషన్ వాయిదా పడింది. కల్తీ నెయ్యి కేసులో నిందితుడైన అతన్ని గతనెల చివరి వారంలో సిట్ అరెస్టు చేసింది. బెయిల్ నిమిత్తం చిన్న అప్పన్న దరఖాస్తు చేయగా న్యాయస్థానం ఈనెల 17వ తేదీకి వాయిదా వేసింది.

పవిత్ర జలాలు ఊరేగింపుగా తీసుకెళుతున్న అర్చకులు, అధికారులు

ముగిసిన పవిత్రోత్సవాలు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో బుధవారం పవిత్రోత్సవాలు ముగిశాయి. ఆలయంలోని కల్యాణ వేదిక వద్ద చివరిరోజు మహా పవిత్ర సమర్పణ, మహా పూర్ణాహుతి తదితర పూజలు చేశారు. పవిత్ర జలాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈవో పెంచల కిశోర్, డీఈవో సాగర్‌బాబు, ఏఈవో రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంత నిర్లక్ష్యమా..!

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: చిత్తూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న భూసార పరీక్ష కేంద్రం భవనం పునరుద్ధరణ పనుల్లో తీవ్ర అలసత్వం నెలకొంది. వైకాపా పాలనలో ఒక్క మట్టి పరీక్ష జరగలేదు. కనీసం గదులను సైతం తెరవక పోవడంతో భవనం శిథిలావస్థకు చేరుకుంది. లోపల ఉన్న యంత్రాలు, పరికరాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కూటమి ప్రభుత్వం ఈ కేంద్ర భవనాన్ని పునరుద్ధరించి అందుబాటులోకి తేవాలని గతేడాది డిసెంబరులో రూ.16 లక్షలు మంజూరు చేసింది. నెలలు గడుస్తున్నా నేటికి పనులు పూర్తికాలేదు. ఖరీఫ్ సీజన్‌కు ముందే పరీక్ష కేంద్రాన్ని అందుబాటులోకి తేవాలనే జిల్లా వ్యవసాయ శాఖ ప్రణాళికలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఉన్నతాధికారులు దృష్టిసారిస్తే తప్ప సమస్య పరిష్కారమయ్యే అవకాశం లేదు.

ద్రవిడ వర్సిటీలో పరిశోధనం

- గ్రంథాలు సమర్పించినా.. అందని పట్టాలు
- ఆచార్యుల చుట్టూ విద్యార్థుల ప్రదక్షిణ

ఉదంతాలెన్నో

● వి.కోట ప్రాంతానికి చెందిన ఓ పరిశోధక విద్యార్థిని 'చిత్తూరు జిల్లా స్త్రీవాద రచయిత్రుల కథలు, స్త్రీ జీవిత చిత్రణ' అంశంపై పరిశోధన చేశారు. దీనిపై సిద్ధాంత గ్రంథాన్ని ద్రవిడ వర్సిటీలో ఓ ఆచార్యుడికి సమర్పించగా.. తిరుపతిలోని ఓ వ్యక్తికి సిఫార్సు చేశారు. సదరు వ్యక్తి రూ.80 వేలు ఇస్తే.. ఈ పరిశోధన అంశాన్ని పూర్తిచేస్తామని చెప్పగా... రూ.10 వేలు అడ్వాన్స్‌గా ఇచ్చింది. రెండేళ్ల తర్వాత గ్రంథాన్ని తిరిగిచ్చినట్లు విద్యార్థిని ఆవేదన చెందుతోంది.

● ద్రవిడ విశ్వవిద్యాలయంలోని ఓ విభాగంలో పేరు చెప్పేందుకు ఇష్టపడని ఓ పరిశోధక విద్యార్థి తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి జిల్లాలో 'హోసూరు తెలుగు కథల'పై క్షేత్రస్థాయిలో తిరిగారు. అంతరించిపోతున్న కళలు.. కథలు.. సంస్కృతి.. సంప్రదాయాలపై పరిశోధన చేసి 2023లో పరిశోధన సిద్ధాంత గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించారు. ఇంతవరకు పట్టా అందకపోవడంతో అతను వర్సిటీ చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన పరిస్థితి కొనసాగుతోంది.

● కుప్పానికి చెందిన ఓ పరిశోధకురాలు తమిళనాడు రాష్ట్రం కంచి, మదురై ప్రాంతాల్లో పర్యటించి 'తొండనాడు కథలు'పై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని వర్సిటీలో సమర్పించుకునేందుకు యత్నించారు. అక్కడ సరైన స్పందన లభించలేదని ఆమె ఆవేదన చెందడం గమనార్హం.

- న్యూస్‌టుడే, కుప్పం గ్రామీణ

ద్రవిడ భాషలు.. సంస్కృతి.. సంప్రదాయాలు పరిరక్షించాలనే లక్ష్యంతో త్రిరాష్ట్ర కూడలి అయిన కుప్పంలో ద్రవిడ విశ్వవిద్యాలయం ఏర్పాటైంది. పరిశోధనల దిశగా అడుగులు వేస్తూ యూజీ, పీజీ కోర్సులకు కూడా శ్రీకారం చుట్టింది. కాలక్రమేణా నాటి పాలకులు.. అధ్యాపకులు.. ఆచార్యుల ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. పర్యవేక్షణ కొరవడటంతో విద్యార్థులు నాణ్యమైన పరిశోధనలు చేపట్టలేకపోతున్నారు.

ద్రవిడ వర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశాల కోసం సెప్టెంబరు 11న వర్సిటీ రిజిస్ట్రార్ నోటిఫికేషన్ విడుదల చేశారు. మొత్తం 14 విభాగాల్లో 62 సీట్ల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా.. ఇప్పటివరకు నెట్, జేఆర్‌ఎఫ్‌లో ఉత్తీర్ణత సాధించిన 26 మందికి ప్రవేశాలు కల్పించారు. ఇక్కడ నెలకొన్న లోపాలతో పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ అవుతాయన్న నమ్మకం కొరవడింది.

సమర్పించినా.. కాలయాపన

కొందరు విద్యార్థులు పరిశోధన గ్రంథాలను సమర్పించినా.. ఏదో ఒక కారణాలు చూపుతూ పట్టాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనివల్ల విద్యార్థుల సంఖ్య కనీస స్థాయికి పడిపోయి ఉద్యోగులకు సైతం జీతాలు ఇవ్వలేని పరిస్థితుల్లో ద్రవిడ విశ్వవిద్యాలయం కొట్టుమిట్టాడుతోంది.

కిం కర్తవ్యం

కొందరు పరిశోధక విద్యార్థులను పలుకరిస్తేనే ఇన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయంటే.. ఇక పీహెచ్‌డీ పట్టాల జారీలో జాప్యం.. ప్రవేశాల రద్దు తదితర విషయాలపై లోతుగా ఆరా తీస్తే ఏ స్థాయిలో పరిశోధకులు ఇబ్బందులు పడుతున్నారో వెల్లడవుతుంది.

30 శాతం సీట్లు భర్తీ చేశాం..

యూజీసీ నిబంధనల ప్రకారం 30 శాతం నెట్, జేఆర్‌ఎఫ్‌లో ఉత్తీర్ణత సాధించిన 26 మందికి వర్సిటీలో నేరుగా ప్రవేశాలు కల్పించాం. మిగిలిన సీట్ల వివరాలను ఏపీఆర్‌సెట్‌కు సమర్పించాం. అర్హులందరికీ పీహెచ్‌డీ పట్టాలు ఇస్తున్నాం. ఏదైనా సమస్యలుంటే మా దృష్టికి తీసుకురావాలి.

- ఆచార్య కిరణ్‌కుమార్, రిజిస్ట్రార్

ఫుట్‌బాల్ పోటీల్లో పుత్తూరుకు ప్రథమ స్థానం

పుత్తూరు, న్యూస్‌టుడే: క్రీడలు విద్యార్థుల జీవితంలో ముఖ్యమైన భాగమని, అవి శారీరకంగా, మానసికంగా, సామాజికంగా అభివృద్ధి చేస్తాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చంద్రమౌళి పేర్కొన్నారు. ఎస్వీయూ పరిధిలో నిర్వహించిన అంతర్ కళాశాలల ఫుట్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన క్రీడాకారులను కళాశాలలో బుధవారం అభినందించారు. వరుసగా మూడోసారి ప్రథమ స్థానం పొందడం కళాశాలకు గర్వకారణమన్నారు. పీడీ సూర్యబాబు, వైస్ ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య, అధ్యాపకులు నరసింహులు, ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ ఉదయ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపల్ చంద్రమౌళి, అధ్యాపకులు

నవభారత నిర్మాణంలో పటేల్ పాత్ర కీలకం

చిత్తూరు(క్రీడలు): నవభారత నిర్మాణంలో ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ పాత్ర కీలకమని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా మై భారత్ ఆధ్వర్యంలో బుధవారం చిత్తూరులో రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ హేమలత ఇతర ప్రముఖులు ఏక్తా దివస్ ర్యాలీలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ యువత సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ బాటలో నడిచి దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, మైభారత్ జిల్లా అధికారి ప్రదీప్, గణాంకాధికారి బాబురెడ్డి, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏక్తా దివస్ ర్యాలీలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే జగన్మోహన్ తదితరులు

EENADU Classifieds

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

రంగంపేట, మోహన్‌బాబు కాలేజ్ ఎదురుగా, తిరుపతి మదనపల్లి హైవేకి 15 అ॥. దూరంలో 66 అంకణాల ప్లాట్ కలదు. వివరాలకు సం॥. 8008685569.

TO LET

తుమ్మలగుంట - ఉప్పరపల్లి రోడ్ నందు 70x52=3640 sft, 37x46 = 1702 sft గోడౌన్‌లకు అద్దెకు ఇవ్వబడును. ✆ 90306 66269.

తిరుపతి, LIC రోడ్డులోని Ist ఫ్లోర్‌లో 700 Sq.Ft, ఉత్తర ముఖం ఫ్లాట్‌ను కమర్షియల్ పర్పస్‌కు మరియు IIIrd ఫ్లోర్‌లో (హెడ్‌రూమ్) సింగల్ బెడ్‌రూంను బాడుగకు ఇవ్వబడును. 24hrs వాటర్, బాత్ రూం సౌకర్యం కలదు ✆ 91001 55254, 62815 61213.

JOBS

తిరుపతిలోని ప్రముఖ కంపెనీకి బిజినెస్, రిటైర్డ్‌పర్సన్స్, వివాహితులు & యువత కావలెను. Age: 30 to 65, Qua: Inter to PG ✆ 7675095860

శారీస్ & ఫ్యాబ్రిక్స్ షాపుకు అనుభవజ్ఞులైన ఇద్దరు Salesman కావలెను. జీతం 15,000 to 24,000/-. శ్రీ వెంకటరమణ కట్‌పీసెస్ 8-3287, కొత్తవీధి, తిరుపతి ✆ 9440397253

శ్రీ వెంకటేశ్వర ఫైనాన్స్ మదనపల్లి, చిత్తూరు బ్రాంచ్‌ల నందు పని చేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్, కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. ✆ 99898 66066, 76808 86106

తిరుపతి APSRTC బస్టాండు లోని పార్శిల్ కౌంటర్ నందు పనిచేయుటకు బాయ్/ గర్ల్స్ కావలెను. సంప్ర: ✆ 86888 18881.

ప్రముఖ కంపెనీకి అడ్మినిస్ట్రేషన్ వర్క్ (Male) అభ్యర్థులు కావలెను. గుడ్ కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి యాక్టివ్‌గా ఉండవలెను. Exp: 3 Years above, Qly: డిగ్రీ / పీజీ. ✆ 89857 17076, 97034 02722

IT HARDWARE

Internship / Final Year Projects. Web App | Data Analytics | Digital Marketing | Cloud | HR Certification Placement Support Bangalore. Ph: 8105577689

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU THE WAY CLASSIFIEDS

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే

అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు

వివరాలకు...

80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి

B/W: రూ. 600

Colour: రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

అమ్మో.. బడి బస్సులా..?

- ☛ చిన్నారుల భద్రత.. గాలిలో దీపం
- ☛ 40 శాతం వాహనాల్లో సమస్యలు
- ☛ పట్టించుకోకుంటే ప్రమాదం

న్యూస్‌టుడే, పుత్తూరు

ఈ ఏడాది పాఠశాలల బస్సుల సామర్థ్య పరీక్షలు నిర్వహించారు.. లోపాలు గుర్తించి వాటిని సరిచేస్తే ఫిట్‌నెస్ ధ్రువపత్రాలు అందజేశారు.. ఇటీవలి రోడ్డు ప్రమాదాలు దృష్టిలో ఉంచుకుని మోటారు వాహనాల తనిఖీ అధికారులు పాఠశాలల బస్సులు తనిఖీలకు ఉపక్రమించారు.. వారి తనిఖీల్లో విస్తుపోయే అంశాలు వెలుగుచూస్తున్నాయి.. ఐదు నెలల్లోనే 40 శాతం బస్సుల్లో డొల్లతనం బయట పడటంతో అధికారులు కంగుతిన్నారు.. ఫలితంగా బడికి బస్సుల్లో వెళ్లే చిన్నారుల భద్రత గాలిలో దీపంలా మారుతోంది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2,950 పాఠశాలల బస్సులున్నాయి. తరచూ తనిఖీలు నిర్వహించి లోపాలు సరిచేయాలని చెబుతున్నా పాఠశాల, కళాశాలల యాజమాన్యాలు మాత్రం పెడచెవిన పెడుతుండటం గమనార్హం. విద్యాసంవత్సరం ఆరంభంలో తనిఖీల సమయంలో బస్సులను చక్కగా ముస్తాబు చేసి తెచ్చిన కొందరు ఆపై నిబంధనలు గాలికొదిలేశారు. ఎఫ్‌సీ రాగానే.. మళ్లీ ఏడాదికి కదా అంటూ చిన్నపాటి జాగ్రత్తలు సైతం తీసుకోవడం మానేశారు.

ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు పాఠశాలల బస్సులు 2,950

ఇవీ నిబంధనలు..

మోటారు వాహనాల చట్టం ప్రకారం పాఠశాల, కళాశాలల బస్సుల్లో 185వ చట్టంలో క్లాజ్(ఎఫ్) కింద అన్ని నిబంధనలు పాటించాల్సిందే.

● పాఠశాల బస్సులో విధిగా అత్యవసర ద్వారాలు ఏర్పాటు చేయాలి ● అగ్నిమాపక యంత్రాలు, ప్రథమ చికిత్స కిట్లు ఉండాలి ● బస్సులు ముందు, వెనుక లైట్లు ఉండాలి ● తలుపులకు లాకింగ్ సిస్టమ్ ఉండాలి. ● పిల్లలు ఎక్కి దిగేందుకు అనువైన ఫుట్‌బోర్డులు ఉండాలి. ● చేతులు బయట పెట్టకుండా అద్దాలకు ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేయాలి. ● ఫైర్ అలారం, మంటలు ఆర్పే స్ప్రే పరికరాలు ఉండాలి. ● బస్సు టైర్లు, ఇంజిన్ సామర్థ్యం, పరికరాలన్నీ బాగుండాలి.

పుత్తూరులో బస్సులు తనిఖీ చేస్తున్న ఎంవీఐ చంద్రశేఖర్, డీఎస్పీ రవికుమార్, సీఐ రెడ్డిశేఖర్ తదితరులు

తనిఖీల్లో గుర్తించిన సమస్యలు..

❖ చాలా బస్సుల టైర్లు అరిగిపోయాయి. ❖ బస్సులకు సక్రమంగా అద్దాల్లేవు. ❖ బస్సుల తలుపులకు సురక్షిత లాకింగ్ సిస్టమ్ లేదు. ❖ చేతులు బయటపెట్టకుండా గ్రిల్స్ కొన్నిటికి లేవు ❖ అగ్ని నిరోధక పరికరాలు పత్తాలేవు.

హద్దు మీరితే తీవ్ర చర్యలు..

పాఠశాలలు, కళాశాలల బస్సులు నిబంధనల మేరకు లేకుంటే కేసులు నమోదు చేస్తాం. డ్రైవర్లను యాజమాన్యాలు ఓ కంట కనిపెట్టాలి. హైవేలు, గ్రామీణ మార్గాల్లో వేగంగా వెళ్లడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. పుత్తూరు పరిధిలో రవాణా, పోలీసు శాఖ సంయుక్తంగా 180 బస్సులను తనిఖీ చేశాం. లోపాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నాం. **- చంద్రశేఖర్, ఎంవీఐ, పుత్తూరు**

శబరిమల యాత్రకు పన్ను మినహాయింపు ఇవ్వాలి

కేరళ రవాణా కమిషనర్ నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న చిత్తూరు డీపీటీవో రాము, ఉన్నతాధికారులు

చిత్తూరు (కొంగారెడ్డిపల్లి), న్యూస్‌టుడే: శబరిమల యాత్ర ప్రారంభం కావడం ఆర్టీసీ బస్సుల్లో కేరళకు భక్తుల సంఖ్య పెరగనుండటంతో పన్ను మినహాయింపు ఇవ్వాలని బుధవారం కేరళ రవాణా శాఖ కమిషనర్ చకిలం నాగరాజును.. ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు కలిశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో శబరిమల రానున్నారని ఆర్టీసీ బస్సుల ట్రిప్పులు పెరగనున్నాయని ఏపీఎస్ ఆర్టీసీ ప్రధాన కార్యాలయ మార్కెటింగ్ చీఫ్ మేనేజరు విజయగీత, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజరు జాన్‌సుకుమార్, చిత్తూరు డీపీటీవో రాము.. ఆయనకు వివరించారు. శబరిమల ప్రయాణ సమయంలో ఏపీఎస్ ఆర్టీసీ బస్సులకు కేరళలో పన్ను మినహాయింపు ఇవ్వాలని విన్నవించగా కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఆర్టీసీ అన్నమయ్య జిల్లా సహాయ ట్రాఫిక్ మేనేజర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిరుత భయంతో ఆందోళన

తవణంపల్లె, ఐరాల, న్యూస్‌టుడే: తవణంపల్లె, ఐరాల మండలాల్లోని అటవీ ప్రాంత సమీప ప్రజలు కొద్ది రోజులుగా చిరుత భయంతో ఆందోళన చెందుతున్నారు. పొలాల దగ్గరకు ఒంటరిగా వెళ్లాలన్నా భయపడుతున్నారు. తవణంపల్లె మండలంలోని గురుకువారిపల్లె సమీపంలో బుధవారం ఉదయం చిరుత వచ్చిందని, అది చెర్లోపల్లి గ్రామ సమీపంలో ఆవుపై దాడి చేసిందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో ఐరాల మండలం అబ్బుగుండ దగ్గర దాని అడుగులు కనిపించాయంటూ ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటనపై 'న్యూస్‌టుడే' ఎఫ్‌బీవో జబ్బిని వివరణ కోరగా.. చెర్లోపల్లిలో పొలాలకు వేసిన కంచెలో దూరడం వల్ల ఆవు మెడకు గాయమైందన్నారు. చిరుతను చూసిన వారు వాస్తవం చెబితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

బతుకుదెరువుకు వెళ్లొస్తూ..

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరి మృతి



రంజిత్‌నాయుడు (పాత చిత్రం)

నరసింహరాజు (పాత చిత్రం)

పుత్తూరు, వడమాలపేట: బతుకుదెరువు కోసం వెళ్లి.. పనులు ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు మృతి చెందిన ఘటన తడుకు రైల్వే స్టేషన్ వద్ద బుధవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు.. విజయపురం మండలం కేవీపురానికి చెందిన రంజిత్ నాయుడు(52) కాటన్‌మిల్లు వద్ద ఉన్న వడమాలపేట మండలం ఎస్‌బీఆర్‌పురానికి చెందిన దివంగత సుదర్శన వర్మ పొలంలో పనులు చేయిస్తుంటాడు. వడమాలపేట మండలం ఎస్‌బీఆర్‌పురానికి చెందిన బాబురాజు అలియాస్ నరసింహరాజు(50) తిరుచానూరు వద్దనున్న సుదర్శనవర్మ బాలాజీ కల్యాణ మండపంలో మేనేజరుగా పనిచేస్తున్నాడు. ఇద్దరూ పనులు ముగించుకుని బుధవారం రాత్రి తడుకు రైల్వే స్టేషన్ వద్ద బస్సు దిగారు. అక్కడ రోడ్డు పక్కన నిలబడి ఉండగా తిరుపతి నుంచి పుత్తూరు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రంజిత్‌నాయుడు, నరసింహరాజుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని పుత్తూరు ఆస్పత్రికి తరలిస్తుండగా.. రంజిత్‌నాయుడు మార్గమధ్యలోనే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధరించారు. తీవ్రంగా గాయపడిన నరసింహరాజుకు ప్రథమ చికిత్స నిర్వహించి రేణిగుంట సమీప అమరా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనతో ఇరు కుటుంబాలు శోకసముద్రంలో మునిగిపోయాయి. ఎస్సై ధర్మారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయం విరమించాలి

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: పీపీపీ పేరుతో వైద్య కళాశాలల ప్రైవేటీకరణ విరమించుకోవాలని డిమాండు చేస్తూ బుధవారం వైకాపా నాయకులు నిరసన చేపట్టారు. గంగినేనిచెరువు వద్ద నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో వైకాపా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. వైద్య కళాశాలలను సీఎం చంద్రబాబు.. స్వప్రయోజనాల కోసం బినామీలకు కట్టబెట్టేందుకు యత్నిస్తున్నారని, పీపీపీ విధానం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి హెచ్చరించారు. అనంతరం వినతిపత్రాన్ని ఆర్డీవో కార్యాలయ ఏవో మురళీమోహన్‌కు అందజేశారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకులు రెడ్డెప్ప, నాయకులు చంద్రశేఖర్, కేపీ శ్రీధర్ పాల్గొన్నారు.

ఏవో మురళీమోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కరుణాకర్‌రెడ్డి, నాయకులు

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు

కల్లూరు, న్యూస్‌టుడే: పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లె పంచాయతీలో సోమవారం జరిగిన మహిళ హత్య కేసులో నిందితుడిని బుధవారం అరెస్టు చేశారు. సంబంధిత వివరాలను కల్లూరు సీఐ జయరామయ్య, ఎస్సై వెంకటేశ్వర్లు వెల్లడించారు. గ్రామంలోని బీసీ కాలనీలో నివాసం ఉంటున్న వృద్ధురాలు కళావతమ్మ ఇంట్లో సోమవారం ఉదయం గోపన్నగారిపల్లెకు చెందిన మోహన్ చొరబడి ఆమెను కత్తితో బెదిరించి మెడలోని బంగారు గొలుసు చోరీకి యత్నించాడు. ఎదురుతిరిగిన కళావతమ్మను గాయపరుస్తుండగా.. అదే మిద్దెపై ఉంటున్న విమల (59) గమనించి కేకలు వేశారు. దీంతో దుండగుడు విమలను గొంతు కింద పొడిచి పరారయ్యాడు. తీవ్రరక్తస్రావంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కొంత సేపటి తర్వాత ఇంటికి వచ్చిన విమల కుమార్తె కోమల గమనించి స్థానికులకు చెప్పడంతో కళావతమ్మను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కళావతమ్మ చెప్పిన వివరాలతో డాగ్ స్క్వాడ్ సాయంతో దర్యాప్తు చేపట్టగా పులిచెర్ల రైల్వేస్టేషన్‌లో మోహన్ పట్టుబడ్డాడు. ఆయనను రిమాండు నిమిత్తం పాకాల కోర్టుకు తరలించినట్లు సీఐ, ఎస్సై చెప్పారు.

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: రోడ్డు నిర్మాణ పనుల్ని వేగవంతం చేయాలని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. స్థానిక కోకావాండ్లఊరు వెళ్లే మార్గంలో చేపట్టిన 1.2 కి.మీ మేర బీటీ రోడ్డు నిర్మాణ పనుల్ని బుధవారం ఆయన పరిశీలించారు. కలెక్టర్, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఈ గ్రామానికి రోడ్డు నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టామని తెలిపారు. ఎంఈ వెంకట్రామిరెడ్డి, డీఈఈ రమణ తదితరులు పాల్గొన్నారు.

కోకావాండ్లఊరులో అధికారులతో చర్చిస్తున్న కమిషనర్

నేడు నగరంలో జాబ్‌మేళా

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: నగరంలోని విజయం ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నామని విజయం విద్యాసంస్థల ఛైర్మన్ తేజోమూర్తి బుధవారం తెలిపారు. క్యాడ్‌మ్యాక్స్, ఇండోమైమ్ తదితర సంస్థలు ఈ మేళాలో పాల్గొంటాయని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 9866112017
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 9505557466

న్యూస్‌టుడే, తవణంపల్లె: సమస్య: ద్వారకాపురంలో కొన్ని రహదారులు అధ్వానంగా ఉన్నాయి. **-స్థానికులు**

సమాధానం: మండల అధికారులతో మాట్లాడి అవసరమైన వీధుల్లో సీసీరోడ్లు నిర్మింపజేస్తాం.

-శివప్రసాద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి

సమస్య: ఎం.బోయపల్లిలోని కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. **- స్థానికులు**

సమాధానం: పంచాయతీ అధికారులతో మాట్లాడి వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం.

- హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో, తవణంపల్లె

న్యూస్‌టుడే, పెనుమూరు: సమస్య: సాయినగర్ ఆఖరు వీధి చివరలో ముళ్లపొదలు కమ్ముకున్నాయి. **- స్థానికులు**

సమాధానం: సిబ్బంది ద్వారా తొలగింపజేస్తాం.

-ప్రభుకిరణ్‌కుమార్, కార్యదర్శి

న్యూస్‌టుడే, గుడిపాల: సమస్య: మండిక్రిష్టాపురం ఎస్సీ కాలనీలోని మురుగునీటి కాల్వలు చెత్తాచెదారంతో నిండి అపరిశుభ్రత నెలకొంది. **-సెల్వకుమార్, స్థానికుడు**

సమాధానం: కాల్వలు శుభ్రం చేయిస్తాం.

- కృష్ణప్రసాద్, ఈవోపీఆర్డీ

న్యూస్‌టుడే, పూతలపట్టు: సమస్య: పూతలపట్టులో దోమల బెడదతో జ్వరాలు వ్యాపిస్తున్నాయి, **- స్థానికులు**

సమాధానం: ఫాగింగ్ చేయించి సమస్య పరిష్కరిస్తాం.

-శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం: సమస్య: దుర్గానగర్ కాలనీ నాగలమ్మ ఆలయ వీధిలో నివాసాల మధ్య కాలువలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. **- స్థానికులు**

సమాధానం: కాలువలో పూడిక తొలగింపజేస్తాం.

-లోకేష్, ఆరోగ్యాధికారి, నగరపాలక సంస్థ

తాగునీటి పైపునకు మరమ్మతులు

స్పందనకు వందనం

కాటప్పగారిపల్లెలో పాడైన తాగునీటి పైపు సమస్యపై స్పందించి వెంటనే మరమ్మతులు చేయించామని, నీటి వృథా అరికట్టామని ఎంపీడీవో మహేష్ తెలిపారు. **-న్యూస్‌టుడే, బంగారుపాళ్యం**

పాచిగుంట గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసులు

పరిష్కరిస్తే సమస్యలు ఎందుకున్నాయ్..?

యాదమరి, న్యూస్‌టుడే: రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తే ప్రజలు మళ్లీ వినతులు ఎందుకు ఇస్తున్నారని ఆర్డీవో శ్రీనివాసులు మండల అధికారులను ప్రశ్నించారు. తహసీల్దారు కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించి రెవెన్యూ, సర్వే అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. పాచిగుంటలో చౌకదుకాణ డీలర్‌ను గతంలో సస్పెండ్ చేయడంతో వీఆర్వో ఆధ్వర్యంలో రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నారని, అయితే పంపిణీ సక్రమంగా జరగడం లేదన్న స్థానికుల ఫిర్యాదుతో ఆర్డీవో ఆ గ్రామాన్ని సందర్శించి స్థానికులతో మాట్లాడి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. ఇకపై రేషన్ సక్రమంగా అందేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ పార్థసారథి పాల్గొన్నారు.

వినాయకస్వామి సేవలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే

కాణిపాకం: శ్రీవరసిద్ధి వినాయకస్వామిని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ దర్శించుకున్నారు. దర్శనం అనంతరం స్వామివారి చిత్రపటాన్ని, శేషవస్త్రాన్ని, తీర్థప్రసాదాలు ఆలయ అధికారులు అందజేశారు.

గృహం.. సాకారం

• పూర్తయిన 4,841 ఇళ్లు
• పీఎంఏవై 1.0 కింద చేయూత
• కూటమి ప్రభుత్వ చొరవతో లబ్ధిదారుల్లో ఆనందం

న్యూస్‌టుడే, చిత్తూరు కలెక్టరేట్

పేదల సొంతింటి కలను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నెరవేర్చింది.. ఏళ్ల తరబడి స్వగృహాల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూసిన లబ్ధిదారుల కళ్లలో వెలుగులు నింపింది.. నాటి వైకాపా హయాంలో అరకొరగా మొదలుపెట్టి మధ్యలోనే నిలిపేయడంతో లబ్ధిదారులు విసిగి వేసారిపోయారు.. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని వీటిని పేదలకు అందజేసింది.. ఎట్టకేలకు సొంతింటికి చేరుకోవడంతో గృహ యజమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది..

తిమ్మసముద్రం లేఔట్‌లో పూర్తయిన గృహం

వైకాపా ప్రభుత్వ హయాంలో చాలీచాలని నిధులతో ప్రారంభమైన గృహ నిర్మాణాలు పలు కారణాలు, సమస్యలతో ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. వైకాపా ప్రభుత్వం ఒక గృహ నిర్మాణానికి రూ.1.80 లక్షలు మాత్రమే నిధులు అప్పట్లో కేటాయించింది. ఆకాసిన్ని నిధులు చాలకపోవడం, పెరిగిన వస్తుసామగ్రి ధరల కారణంగా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయలేకపోయారు. ఇచ్చిన డబ్బులు ఏమూలకూ రాకపోవడంతో గోడల ఇళ్లు, అసంపూర్తి ప్రహరీతో ఆగిపోయిన నిర్మాణాలు దర్శనమిచ్చాయి. వాటిని చూసి లబ్ధిదారులు నిత్యం కన్నీటిపర్యంతమవడం తప్ప ఏమీ చేయలేకపోయారు. చివరకు అసలు తమ సొంతింటి కల ఎప్పటికి నెరవేరుతుందోనని వేకళ్ల ఎదురు చూడటం తప్ప వారు హతాశులయ్యారు. బయటకు ఎవరికీ చెప్పుకోలేక సతమతమయ్యారు. నాటి వైకాపా పాలకులు హడావుడిగా కొండలు, గుట్టల్లో కేటాయించిన లేఅవుట్లలో ఎక్కడ చూసినా మొండి

గృహ ప్రవేశాలు నియోజకవర్గాల వారీగా	
నియోజకవర్గం	పూర్తయిన ఇళ్లు
చిత్తూరు	801
జీడీనెల్లూరు	1,614
నగరి	1,343
పూతలపట్టు	1,083
మొత్తం	4,841

ఆశలు నెరవేరలేదు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో అర్ధాంతరంగా ఆగిన నిర్మాణాల పూర్తికి చర్యలు చేపట్టింది. పేదల సొంతింటి కలను సాకారం చేసేలా అదనపు సాయాన్ని విడుదల చేసింది. ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనపు లబ్ధి చేకూర్చింది. నిర్మాణ దశలో ఉన్న గృహాలకు అదనపు సాయాన్ని వర్తింపజేసి ఇళ్ల నిర్మాణాల్ని యుద్ధప్రాతిపదికన పూర్తిచేసింది. తాజాగా చిత్తూరు, జీడీనెల్లూరు, నగరి, పూతలపట్టు నియోజకవర్గాల్లో 4,841 ఇళ్లు పూర్తిచేసి సామూహిక గృహ ప్రవేశాలు చేపట్టారు. నేడు ఆయా కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. తమ సొంతింటి కల సాకారమైందని వారు ఉబ్బితబ్బిబ్బవుతున్నారు.

పీఎంఏవై 2.0 ద్వారా దరఖాస్తులు..

అర్హులై ఉండి గృహ నిర్మాణ పథకం దక్కని లబ్ధిదారులకు పీఎంఏవై 2.0 ద్వారా ప్రభుత్వం మరొక అవకాశాన్ని కల్పించింది. ఇంటి స్థలం ఉండి.. గతంలో గృహ నిర్మాణ పథకం పొందని వారికి చక్కటి అవకాశం కల్పించింది. ఈ నెల 30వ తేదీ వరకు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు గృహ నిర్మాణం నిమిత్తం స్వీకరించనుంది.

విజేతలతో విజయం విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ శైలజామూర్తి, హెచ్‌ఎం

శ్రీవిశ్వం పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ జయచంద్రారెడ్డి, ఉపాధ్యాయులతో విజేతలు

ఉపన్యసించి.. రాణించి

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు ఇతర పోటీల్లో పాల్గొని చక్కగా రాణించాలని విజయం విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ శైలజామూర్తి తెలిపారు. 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా.. నగరంలోని విజయం పాఠశాలలో ఏడు, ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కేఆర్.సాధన, వి. మోహన్, టి.ప్రవల్లిక ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచారు. వీరికి శైలజామూర్తి.. ప్రశంసా పత్రం, బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ● శ్రీవిశ్వం పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన పోటీలో ఎస్.తపస్వి, డి.హాసిని, బి.అన్నెక్రిస్టీ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నారు. వీరికి కరస్పాండెంట్ జయచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ చిట్టిబాబు బహుమతులు, ప్రశంసా పత్రం అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పరిశీలన

తవణంపల్లె: నూతనంగా ఎన్నికైన ఐసీఆర్‌పీ సిబ్బంది మూడో రోజు శిక్షణలో భాగంగా టి.పుత్తూరులో రైతులు చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని బుధవారం పరిశీలించారు. 30 రకాల పండ్ల తోటలు పరిశీలించి వాటి సాగు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. డీపీఎం వాసు, ఏవో ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

మందులు అందజేయాలి

బంగారుపాళ్యం: ఎయిడ్స్ బాధితులకు సకాలంలో మందులు అందజేయాలని ఏటీఆర్ క్లస్టర్ కార్యనిర్వహణాధికారి కోటిరెడ్డి, ఐసీటీసీ పర్యవేక్షకులు సురేంద్రబాబు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని ఐసీటీసీ కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు.

ఈ నీరు తొలగేదెన్నడో..?

బంగారెడ్డి హరిజనవాడలో 30 కుటుంబాలు ఉన్నాయి. వర్షాలకు కాలనీలో మూడడుగుల మేర వర్షం నీరు నిలిచి రోడ్డు చెరువును తలపిస్తోంది. దీంతో సమీప నివాసాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమల బెడదతో సతమతమవుతున్నారు. పిల్లలు పాఠశాలకు వెళ్లాలన్నా, నీటిలో నడవాల్సిందే. ఇటీవల అధికారులు కొంత తొలగించినా ప్రస్తుతం నీరు అలానే ఉండటం గమనార్హం. **- న్యూస్‌టుడే, వడమాలపేట**

రూ.లక్షలు పెట్టి నిర్మించారు.. మూత వేశారు

పరమేశ్వరమంగళం పంచాయతీ పరిధిలోని కైలాసపురం వద్ద రూ.లక్షలు వ్యయం చేసి డీఆర్‌డీఏ అధికారులు పాలశీతలీకరణ కేంద్రం నిర్మించారు. దీన్ని ప్రారంభించకనే తాళం వేయడంతో ఇది శిథిలావస్థకు చేరింది. అందులో ఉన్న యంత్ర సామగ్రి సైతం తుప్పుపడుతోంది. కనీసం ప్రైవేటు వ్యక్తులకు అద్దెకు ఇచ్చినా భవనంతో పాటు యంత్ర సామగ్రి వాడుకలో ఉండేది. ఆ దిశగా అధికారులు ఆలోచన చేయకుండా తాళాలు వేశారు. **- న్యూస్‌టుడే, పుత్తూరు**

మఠంపల్లె వద్ద తొలగిన పూడిక

రెండు నెలల సమస్యకు పరిష్కారం

మఠంపల్లె బస్టాపు ఎదురుగా ఉన్న పొలాల్లో నిలిచిన నీరు ఎట్టకేలకు తొలగింది. కల్వర్టు పూడిపోవడంతో విద్యుత్తు ఉపకేంద్రం చుట్టూ వర్షపు నీరు చేరడమే కాక సమీప పొలాల్లో నిలిచి నెలన్నరపాటు రోడ్డుపై ప్రవహించడంతో రోడ్డు దెబ్బతింది. దీన్ని పరిష్కరించేందుకు మఠంపల్లెకు చెందిన మాజీ ఎంపీపీ వి.హరిబాబునాయుడు చొరవతో గ్రామానికి చెందిన గుణశేఖర్‌నాయుడు, యువకులు ముందుకొచ్చారు. జేసీబీలు, కంప్రెషర్ సాయంతో పూడిన కల్వర్టును బాగుచేయించడంతో నీరు మొత్తం కాలువ ద్వారా నీవానదిలోకి చేరింది.

-న్యూస్‌టుడే, పెనుమూరు

అదనపు నియంత్రికలు అమర్చాలి

చిత్తూరు(మిట్టూరు): నాణ్యమైన విద్యుత్తు సరఫరాకు అవసరమైన ప్రాంతాల్లో విరివిగా అదనపు నియంత్రికలు ఏర్పాటు చేయాలని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఆదేశించారు. తన కార్యాలయంలో చిత్తూరు అర్బన్ డివిజన్ ఇంజినీర్లు, అధికారులతో బుధవారం ఆయన సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న వర్క్ ఆర్డర్లు సత్వరమే పరిష్కరించుకోవాలన్నారు.

'విద్యను వ్యాపారం చేస్తున్నారు'

గంగాధరనెల్లూరు: మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసి విద్యను సీఎం చంద్రబాబు వ్యాపారం చేస్తున్నారని జిల్లా వైకాపా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆరోపించారు. బుధవారం జీడీనెల్లూరులో నియోజకవర్గ బాధ్యురాలు కృపాలక్ష్మి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ర్యాలీలో వారు పాల్గొన్నారు. డీటీ మహేష్‌కు వినతిపత్రం అందజేశారు. **పూతలపట్టు:** మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, జడ్పీ మాజీ ఛైర్మన్ కుమారరాజ, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

పుత్తూరు: ఎగువ కనకంపాళెం పంచాయతీ పరిధిలోని ఆదిఆంధ్రవాడలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, ఆ సమస్యను పరిష్కరించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. బుధవారం నిరసన తెలియజేశారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

చిత్తూరు విద్య: కేజీబీవీల్లోని ఇంటర్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా వంద రోజుల ప్రణాళిక పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఎస్ఎస్ ఏపీసీ వెంకటరమణ తెలిపారు. ఈ పుస్తకాలను ఆయన బుధవారం అధికారులు, ఎస్‌వోలకు అందజేశారు.

పూతలపట్టు: మన్నారుపల్లె హౌసింగ్ కాలనీలో లబ్ధిదారుడికి తాళం అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పేదల పాలిటి పెన్నిధి కూటమి ప్రభుత్వం

పూతలపట్టు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం పేదల పాలిటి పెన్నిధిగా నిలిచిందని ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. మండలంలోని మన్నారుపల్లె, కొత్తూరు దళితవాడలో నిర్మించిన గృహాలను ఆయన బుధవారం ప్రారంభించారు. లబ్ధిదారులకు ఆయన తాళాలు అందజేశారు. కొత్తూరు దళితవాడలో రూ.11 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డుకు శంకుస్థాపన చేశారు. గృహనిర్మాణ శాఖాధికారులు, తెదేపా మండల కన్వీనర్ దొరబాబుచౌదరి పాల్గొన్నారు. **నగరి:** ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్.. నగరిలో లబ్ధిదారులకు సొంతిళ్ల తాళాలు అందజేసి మాట్లాడారు. ● ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెదేపా నాయకులకు ఎమ్మెల్యే సూచించారు. పట్టణ తెదేపా కార్యాలయంలో నూతనంగా ఎంపికైన తెదేపా మండల నాయకులు, రాష్ట్రస్థాయి పదవులు పొందిన వారిచే ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ● డైయింగ్ యూనిట్లు ఎంఎస్ఎంఈకి తరలించేందుకు ప్రయత్నించాలని ఎమ్మెల్యే కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో డైయింగ్ యూనిట్లు యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధికి చేయూతనిస్తోందని, వస్త్రఉత్పత్తిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వెంటనే దరఖాస్తు చేసుకుంటే, ప్రత్యేక సిఫారసుతో స్థలాలు కేటాయిస్తామన్నారు. కమిషనర్ కృష్ణారెడ్డి, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో వాణి, హౌసింగ్ ఏఈ భాస్కర్, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముగంరెడ్డి, మండలాల అధ్యక్షులు గుణశేఖర్, జవహర్‌రెడ్డి, రమేష్‌రాజు, జీవరత్నం, బాలాజీ, దాము యాదవ్, వెంకటేశ్వర్లు, గ్రామీణ బ్యాంకు ఛైర్మన్ బాలాజీ పాల్గొన్నారు. **పుత్తూరు:** ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్.. గేటు పుత్తూరులోని తాటితోపు వీధిలో ఇళ్లు ప్రారంభించి లబ్ధిదారులకు తాళాలు అందజేశారు. పద్మశాలి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్లు గంజి మాధవయ్య, ధనపాల్, మాజీ ఎంపీపీ ఏలుమలై, పుత్తూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ గణేష్, పట్టణ తెదేపా అధ్యక్షుడు జీవరత్నం, మున్సిపల్ మాజీ ఛైర్మన్ కరుణాకరన్, తడుకు సింగిల్‌విండో అధ్యక్షుడు కరుణ ఉన్నారు. **జీడీనెల్లూరు:** ఏఎంసీ ఛైర్మన్ కృష్ణమ నాయుడు, సహకార సంఘ అధ్యక్షుడు మోహన్‌నాయుడు.. బోడపూరులో జరిగిన ప్రభుత్వ పక్కాఇళ్ల గృహ ప్రవేశాల కార్యక్రమంలో నేతలతో కలిసి పాల్గొన్నారు.

పుత్తూరు.. గేటుపుత్తూరులోని తాటితోపు వీధిలో లబ్ధిదారు కుమార్‌వేల్‌కు తాళం అందజేస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

మెనూ ప్రకారం వంటలు చేయాలి

వడమాలపేట, న్యూస్‌టుడే: మధ్యాహ్న భోజన నిర్వాహకులు మెనూ ప్రకారం విద్యార్థులకు వంటలు తయారుచేయాలని ఫుడ్ కార్పొరేషన్ సభ్యుడు కాంతారావు సూచించారు. బుధవారం ఆయన వడమాలపేట పీఎంశ్రీ జడ్పీ బాలుర ఉన్నతపాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ఆయన బియ్యం, గుడ్లు, చిక్కీలు, సరకుల నిల్వ, నాణ్యత తనిఖీ చేశారు. పిల్లలతో పాటు ఆహారం స్వీకరించి సంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దార్ జరీనా, డీవైఈవో ఉమామహేశ్వరరావు, ఎంఈవోలు పద్మావతమ్మ, తులసీరాం పాల్గొన్నారు.

భోజనం రుచి చూస్తున్న కాంతారావు

చట్టవిరుద్ధ చర్యలపై అవగాహన కల్పించాలి

వెదురుకుప్పం: చట్ట విరుద్ధ చర్యలపై ఆకర్షితులయ్యే యువతకు వాటి వల్ల కలిగే దుష్పరిణామాలు తెలియజేసి అవగాహన కల్పించాలని నగరి డీఎస్పీ అజీజ్ అహ్మద్ సూచించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ తనిఖీ చేసి దస్త్రాలు పరిశీలించారు. ఎస్సై వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరామాపురంలో పశువైద్యశిబిరం

నింద్ర: శ్రీరామాపురంలో పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక ఉచిత పశువైద్య శిబిరం బుధవారం ఏర్పాటు చేశారు. పరిసర గ్రామాల పాడి రైతులు తమ పశువులను తెచ్చి పరీక్షలు చేయించారు. ఏడీ మునిలక్ష్మీపతి, పశువైద్యాధికారిణి సాయి సౌందర్య, సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే జీవితం నాశనం

పుత్తూరు: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడినా, డ్రగ్స్ బారిన పడినా జీవితం నాశనమవుతుందని శిక్షణ ఎస్ఐ కమల్‌రాజ్ పేర్కొన్నారు. హిమజ జూనియర్ కళాశాలలో యాంటీ ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో ర్యాగింగ్, డ్రగ్స్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. పోస్టర్లు ఆవిష్కరించారు. ప్రిన్సిపల్ శ్రీధర్, ఇంఛార్జి భాస్కర్, ఏవో నరసింహులు పాల్గొన్నారు.

భాజపాలో చేరిన ఎంపీపీ భర్త

పాలసముద్రం: వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఎంపీపీ శ్యామల భర్త శివప్రకాష్‌రాజు బుధవారం భాజపా తీర్థం పుచ్చుకున్నారు. తిరుపతి జిల్లాలో నిర్వహించిన భాజపా ఆత్మీయ సభలో రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు నిషిధరాజు, రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వద్దు

పెనుమూరు: విధుల్లో నిర్లక్ష్యం వీడి జాగ్రత్తగా పనిచేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వీఎస్ఎస్‌శర్మ అన్నారు. బుధవారం ఆయన స్థానిక శాఖా గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పాఠకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

అనుమతులు వేగంగా మంజూరు చేయాలి

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులు వేగంగా మంజూరు చేయాలని ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. చిత్తూరులోని ఏపీఐఐసీ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఏపీఐఐసీ, పరిశ్రమల శాఖ కార్యక్రమాలు, పెండింగ్ పనులపై చర్చించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం సూరిబాబు, ఏపీఐఐసీ డీజడ్ఎం భార్గవి తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణ కేసులో ముగ్గురికి రెండేళ్ల జైలు

చిత్తూరు(న్యాయవిభాగం), న్యూస్‌టుడే: భూ వివాదం కారణంగా చోటుచేసుకున్న ఘర్షణ కేసులో ముగ్గురికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ బుధవారం స్థానిక ఒకటో అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి మాధవి తీర్పు చెప్పారు. ఏపీపీ స్వాతి కథనం మేరకు.. యాదమరి మండలం చిన్నిరెడ్డిపల్లికు చెందిన దంపతులు రాణి, సుధాకర్‌రెడ్డి కుటుంబానికి అదే మండలం మోటాండ్లపల్లిలో పొలం ఉంది. వీరు అందులో ఇల్లు నిర్మిస్తుండగా 2022 జనవరి 30న ఉదయం 11 గంటలకు అదే గ్రామానికి చెందిన యోగమూర్తి, నందకిషోర్, లక్ష్మణ్ అలియాస్ చందు ఆయా పనులను అడ్డుకుని గోడ కూల్చివేసి రాణిని తీవ్రంగా దుర్భాషలాడారు. దీనిపై బాధితురాలు రాణి ఫిర్యాదుతో ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. పూర్వాపరాలు పరిశీలించిన పిదప నేరం రుజువు కావడంతో ముగ్గురు నిందితులకు రెండేళ్ల జైలు, రూ.1500 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

స్థల వివాదమై ఇరువర్గాల గొడవ.. వెదురుకుప్పం: కేవీఎం అగ్రహారానికి చెందిన తులసమ్మ కుటుంబానికి, మునిరామిరెడ్డి కుటుంబానికి మధ్య ఇంటి స్థల విషయమై కొద్దికాలంగా తగాదా ఉంది. బుధవారం తులసమ్మ తన కుమారులు లక్ష్మణ్, జానకిరామ్‌తో కలిసి మునిరామిరెడ్డి కుటుంబంపై దాడికి పాల్పడినట్లు అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని ఎస్సై వెంకటసుబ్బయ్య తెలిపారు.

బాధితులకు సాయం అందజేత

ఐరాల, న్యూస్‌టుడే: నాగమవాండ్లపల్లె గ్రామానికి చెందిన ఎస్.గణపతి ఇటీవల ఏనుగు దాడిలో మరణించాడు. డిప్యూటీ రేంజర్ రాకేష్ ఆయన భార్య మునీశ్వరికి అటవీశాఖ నుంచి రూ.5 లక్షల చెక్కు అందజేశారు. కామినాయనపల్లిలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తెదేపా కార్యకర్త రాజేంద్ర నాయుడి కుటుంబానికి ఎమ్మెల్యే మురళీమోహన్ చొరవతో ఆయన కుటుంబ సభ్యుల ఖాతాలో రూ.5 లక్షలు జమ అయిన పత్రాన్ని తెదేపా మండల అధ్యక్షుడు హరిబాబునాయుడు అందజేశారు. మట్టపల్లెలో కేశవులు ఇంట్లో విద్యుదాఘాతంతో వస్తువులన్నీ దగ్ధమవడంతో ఎమ్మెల్యే చొరవతో వారికి తక్షణ సాయంగా తెదేపా మండల అధ్యక్షుడు హరిబాబునాయుడు రూ.10 వేలు అందజేశారు.

మునీశ్వరికి రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న డిప్యూటీ రేంజర్ రాకేష్

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

గోవిందరాజు (పాత చిత్రం)

యాదమరి : అప్పుల బాధ తాళలేక చిన్నంపల్లికి చెందిన గోవిందరాజు(62) ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం మేరకు మండల కేంద్రంలో ఎలక్ట్రికల్ దుకాణం నడిపే గోవిందరాజు అప్పులు చేశాడని, ఆ ఒత్తిడి భరించలేక రెండ్రోజుల క్రితం పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటో డ్రైవర్‌కు గాయాలు.. పూతలపట్టు: కిచ్చన్నగారిపల్లెకి చెందిన శరత్ (32).. ఆటోలో చిత్తూరు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన టాటా ఏస్ వాహనం ఢీకొని గాయపడ్డాడు. అతడిని 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మద్యం స్వాధీనం.. పాలసముద్రం: శ్రీకావేరిరాజుపురం పంచాయతీ డంపింగ్‌యార్డ్ వద్ద పాలసముద్రం దళితవాడకు చెందిన మునిక్రిష్ణ మద్యం సీసాలు విక్రయిస్తున్నారనే సమాచారం రావడంతో దాడిచేసి 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని, అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై రాజశేఖరరెడ్డి బుధవారం తెలిపారు.

పైపులైన్ విషయమై వివాదం.. నింద్ర: నెట్టేరి దళితవాడకు చెందిన ఫల్గుణ.. అదే ప్రాంతానికి చెందిన మహిళా రైతు మల్లిక.. పొలం వద్ద సాగునీటి పైపులైన్ విషయమై గొడవపడ్డారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మల్లికార్జున తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు.. వడమాలపేట: పాదిరేడు ఏఏడబ్ల్యూ సమీపంలో జూద స్థావరంపై దాడి చేసి ఐదుగురు జూదరుల నుంచి రూ.1,530 నగదు, కొన్ని పేకముక్కలు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై ధర్మారెడ్డి బుధవారం తెలిపారు. పాదిరేడు ఏఏడబ్ల్యూకి చెందిన రామచంద్రయ్య, నాగరాజు, రామకృష్ణయ్య, మధు, మునికృష్ణయ్యను అరెస్టు చేశామని ఎస్సై చెప్పారు.

ఆటలు ఆడేస్తున్నారు..

● అందివచ్చిన ప్రోత్సాహం
● రాణిస్తున్న విద్యార్థులు

న్యూస్‌టుడే, ఐరాల

ఉన్న కొద్దిపాటి వనరులతో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచి ఇటు పాఠశాల.. అటు తల్లిదండ్రులకు మంచిపేరు తెస్తున్నారు.. అందివచ్చిన ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని ముందుకు సాగుతున్నారు.. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో చదువుతున్నా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా క్రీడల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు.

అంతర్జాతీయ పోటీలే లక్ష్యం..

నాగంవాండ్లపల్లెకు చెందిన ఆటో డ్రైవర్ బాలకృష్ణ, ఏఎన్ఎంగా పనిచేస్తున్న సునీతల కుమార్తె కావలి భవిత. చదువు, క్రీడల్లో మంచిపేరు సాధిస్తోంది. క్రీడలపై ఉన్న ఆసక్తితో సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, ఫెన్సింగ్‌లో తర్ఫీదు పొందింది. ఇటీవల నర్సీపట్నంలో జరిగిన జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో వెండి పతకాన్ని సాధించింది. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో నాలుగో స్థానంలో నిలిచింది. జమ్ముకశ్మీర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండో స్థానం దక్కించుకుంది. అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొనడమే తన లక్ష్యమని చెబుతోంది.

చక్కటి ప్రతిభ చూపుతా..



వీఎస్అగ్రహారానికి చెందిన లారీ డ్రైవర్ హుసేన్, గృహిణి జబీనా దంపతుల కుమార్తె షేక్ ఆసియా. పదో తరగతి చదువుతున్నది. క్రీడలపై ఉన్న మక్కువతో ఉపాధ్యాయుల వద్ద సాఫ్ట్‌బాల్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకుంటోంది. నిత్యం పాఠశాలలో శిక్షణ పొంది నర్సీపట్నంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వెండి పతకాన్ని సాధించి పాఠశాలకు గుర్తింపు తెచ్చింది. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడమే తన ధ్యేయమని పేర్కొంది.

ఉన్నత శిఖరాలు చేరుకోవాలని..



జీడీనెల్లూరు మండలం పాత వెంకటాపురానికి చెందిన రాజేష్, కోకిల కుమారుడు ఆర్.ప్రకాష్. ఈ విద్యార్థి స్థానికంగా ఉన్న వసతిగృహంలో ఉండి చదువుతున్నాడు. చదువు, క్రీడల్లో చాలా చురుకు. బేస్‌బాల్‌లో ఉత్తమ శిక్షణ పొందాడు. పశ్చిమ, తూర్పు గోదావరి, విశాఖపట్నం, శ్రీకాకుళంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించాడు. జమ్ముకశ్మీర్‌లో జరిగిన సబ్‌జూనియర్స్ పోటీల్లో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. క్రీడల్లో ఉన్నత శిఖరాలు చేరుకోవాలనేది లక్ష్యమని చెబుతున్నాడు.

(c) eenadu

పలమనేరు

•పలమనేరు •కుప్పం •పుంగనూరు

స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యం

శాంతిపురం, రామకుప్పం, న్యూస్‌టుడే: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్ష విజయం సాధించేలా తెదేపా శ్రేణులు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ మండల కార్యాలయంలో నాయకులతో సమావేశమై మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సిట్ దూకుడుతో తిరుమల లడ్డూ కల్తీ చేసిన నాయకుల్లో వణుకు పుడుతోందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉదయ్‌కుమార్, మంజునాథ్, మాజీ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, కుప్పం ప్రాధికారసంస్థ సలహా మండలి సభ్యులు, సహకార బ్యాంకు అధ్యక్షుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లపై చర్యలు

పలమనేరు, న్యూస్‌టుడే: అనధికార లేఅవుట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని పుర కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి హెచ్చరించారు. బుధవారం పట్టణంలో పాటు గడ్డూరు, బొమ్మిదొడ్డి ప్రాంతాల్లోని అనధికార లేఅవుట్లను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులను అడ్డుకున్నారు. ఇప్పటికే కొందరు యజమానులకు నోటీసులు జారీ చేశామన్నారు. నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు ఉండాలని స్పష్టం చేశారు. ఈ ఏడాది జూన్ నాటికి రిజిస్టర్ అయిన లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. అనంతరం గుడియాత్తం రోడ్డులో పట్టణంలో అనుమతులు లేకుండా చేపడుతున్న పనులను గుర్తించి ఆపించారు. ఆయన వెంట టీపీవో ఇందిర, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ కుప్పం సాధనకు కృషి

జ్యోతి వెలిగిస్తున్న పురాధ్యక్షుడు సెల్వరాజ్, కమిషనర్ శ్రీనివాసరావు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయాలకు అనుగుణంగా స్వచ్ఛ కుప్పం సాధనకు కృషి చేస్తున్నట్లు పురాధ్యక్షుడు సెల్వరాజ్, కమిషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. పురపాలిక కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో సిబ్బందికి రెండు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ రహిత పురపాలికగా కుప్పాన్ని మార్చేందుకు మన వ్యర్థాల నిర్వహణ పక్కాగా చేపట్టాలన్నారు. కౌన్సిలర్ సోమశేఖర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ ఉపాధి కల్పించడమే ధ్యేయం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కడా కార్యాలయంలో బుధవారం హోసూర్ రాండ్ స్టాడ్ ఆపరేషనల్ పరిశ్రమ జాబ్‌మేళా నిర్వహించింది. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో మేళాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. 50 మంది అభ్యర్థులు హాజరవగా పరిశ్రమ ప్రతినిధులు రాత, బృంద పరీక్షలు, ముఖాముఖి నిర్వహించారు. ఏఎంసీ, పురాధ్యక్షులు బీఎం రాజు, సెల్వరాజ్, ఆసుపత్రి కమిటీ ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలం.. కనిపిస్తే మాయం

✦ పట్టణాల్లో యథేచ్ఛగా ఆక్రమణలు

పుంగనూరు, పలమనేరు, కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దుల్లోని పుంగనూరు, పలమనేరు, కుప్పం పట్టణాలు విస్తరిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలతో పాటు పొరుగు రాష్ట్రాల వారు రావడంతో స్థలాలకు గిరాకీ పెరుగుతోంది. దీంతో కొందరు చెరువులు, కాలువలను ఆక్రమించి షెడ్లు, దుకాణాలు నిర్మిస్తున్నారు.

కాలువలోకి చొచ్చుకొచ్చి..

పుంగనూరు మధ్య నుంచి వెళ్లే కౌండిన్య కాలువ గట్టుపై ప్రస్తుతం షెడ్లు వెలిశాయి. ఇటీవల పట్టణంలో పర్యటించిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధ్యక్షుడు పట్టాభిరామ్ వాటిని గుర్తించారు. వరద ఎలా పారుతుందని అధికారులను ప్రశ్నించినా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ✦ రాయలచెరువుకు అనుబంధంగా ఉన్న కాలువలు, ఆర్టీసీ డిపో ఎదుట, మినీ బైపాస్ రోడ్డు మీదుగా ఎన్టీఆర్ కూడలి వరకు కాలువను ఆక్రమించారు. ఇక్కడ గుంట స్థలం విలువ రూ.40 లక్షల పైమాటే. ఈ ప్రాంతంలో 2 ఎకరాల భూమి ఆక్రమణకు గురైంది. ఇటీవల వర్షాలతో దోబీ, స్కావెంజర్స్ కాలనీలు మునిగాయి.

కౌండిన్య కాలువ అంతర్భాగంలో వెలసిన షెడ్లు

రూ.కోట్ల స్థలం కబ్జా..

పలమనేరు పట్టణానికి ఆనుకుని ఉన్న పెద్దచెరువును కొందరు ఆక్రమించారు. ఇక్కడ స్థలం విలువ రూ.కోట్లలోనే ఉంటుంది. చెరువు నిండితే తమ ఇళ్లలోకి నీరు చేరే ప్రమాదం ఉందని తూములను తొలగిస్తున్నారు. పట్టణంలోని మదనపల్లె రోడ్డు, ఏఎంసీ ప్రాంతం, గ్రంథాలయం వద్ద కాలువలపై దుకాణాలు నిర్మించేశారు.

బక్కచిక్కుతున్న చెరువులు..

కుప్పం పట్టణంలోని వెంకటరామయ్య చెరువు స్థలం, డీకేపల్లెలోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమణదారులు సొంతం చేసుకున్నారు. పరమనాయన చెరువు, కుప్పం మొరవ కాలువలను కబ్జా చేస్తుండటంతో రోజురోజుకూ బక్కచిక్కుతున్నాయి. జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది.

నోటీసులు జారీ చేస్తాం..

పుంగనూరు, పలమనేరు, కుప్పం పట్టణాల్లో ప్రభుత్వ స్థలాలను పర్యవేక్షిస్తున్నాం. ఆక్రమణలకు గురైన చెరువులు, కాలువలను పరిశీలించి చర్యలు చేపడతాం. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే నోటీసులు జారీ చేసి దుకాణాలు, ఆక్రమణలు తొలగిస్తాం.

– మధుసూదనరెడ్డి, రమణా రెడ్డి, శ్రీనివాసరావు, కమిషనర్లు, పుంగనూరు, పలమనేరు, కుప్పం

నమూనా తాళంచెవి అందజేస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

రామకుప్పం, న్యూస్‌టుడే: అర్హులకు సంక్షేమ పథకాలు చేరువ చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కె.శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం పేర్కొన్నారు. బుధవారం మండలంలోని లబ్ధిదారులకు రామకుప్పంలో నమూనా ఇంటి తాళాలు అందజేశారు. నియోజకవర్గ పరిధిలో ఇళ్లు లేని పేదలను గుర్తించి త్వరలో మంజూరు చేయిస్తామన్నారు. ఏఎంసీ అధ్యక్షుడు రాజు, గ్రంథాలయ శాఖ రాష్ట్ర డైరెక్టర్ మునస్వామి, రెస్కో ఉపాధ్యక్షుడు విశ్వనాథ్, ఎంపీడీవో లక్ష్మీకాంత్, తహసీల్దారు కౌలేశ్, నాయకులు పాల్గొన్నారు. ✦ పుంగనూరు: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమం ధ్యేయంగా ముందుకు వెళ్తున్నట్లు నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రొంపిచర్లలో పీఎంఏవై గృహ ప్రవేశాలను పూజలు చేసి ప్రారంభించారు. కురబ కార్పొరేషన్ డైరెక్టరు రమణ, సింగిల్‌విండో ఛైర్మన్ రఘునాథరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మురుగు కాలువ కనుమరుగు

పుంగనూరు పట్టణంలోని మల్లారమ్మ ఆలయం వీధిలో మురుగు కాలువ రూపురేఖలు మారిపోయాయి. పనికిరాని మొక్కలు పెరిగిపోవడంతో మురుగు ప్రవహించకుండా నిలిచిపోతోంది. దుర్వాసనతో పాటు దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. బాగు చేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పుంగనూరు

నిర్మించారు.. వదిలేశారు..

పుంగనూరు మండలంలోని ఏటవాకిలి ఎస్సీ కాలనీలో ఏడాది క్రితం జల్‌జీవన్ నిధులు రూ. 11.54 లక్షలతో కొత్త ట్యాంకు నిర్మించినా ప్రారంభించలేదు. ఇక్కడున్న ట్యాంకు పాతది కావడంతో గొట్టాలు పాడై నీరు వృథాగా పోతోంది. విషయం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చందన వద్ద ప్రస్తావించగా.. త్వరలో ట్యాంకు వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.

– న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణం

గోడు వినండి.. గోడ కట్టండి

పుంగనూరు ప్రభుత్వ బాలికల కళాశాలకు సంబంధించిన ప్రహరీ కొన్నాళ్ల క్రితం కూలిపోయింది. అప్పటి నుంచి అలానే వదిలేశారు. అధ్యాపకులు స్పందించి షేడ్ నెట్ అడ్డంగా కట్టారు. కళాశాల వస్తువులు, దస్త్రాలు, భద్రత దృష్ట్యా గోడ నిర్మించాలని విద్యార్థినులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పుంగనూరు

అంచుల కోత.. చోదకుల అవస్థ

బైరెడ్డిపల్లె మండలంలోని కొలమాసనపల్లె- నెల్లిపట్ల రోడ్డు అంచులు కోతకు గురయ్యాయి. ఇరువైపులా పాడవడంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తే ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యను పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా స్పందన కరవైందని స్థానికులు వాపోతున్నారు. – న్యూస్‌టుడే, బైరెడ్డిపల్లె

క్వారీకి అనుమతులు వద్దని నిరసన

శాంతిపురం, న్యూస్‌టుడే: మండలంలోని రాళ్లబూదుగూరు పంచాయతీలో గ్రానైట్ క్వారీ నిర్వహణకు ప్రభుత్వం అనుమతులు ఇస్తే తామంతా ఉపాధి కోల్పోతామని గొల్లపల్లె గ్రామస్థులు అన్నారు. స్థానిక ప్రజలు ఏళ్లుగా రాళ్లు కొట్టి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నామని, క్వారీ వస్తే రోడ్డున పడతామని నిరసన తెలిపారు. దీనికి తోడు పేలుళ్లతో పంట భూముల్లో దుమ్ము చేరి నష్టం జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ కె.శ్రీకాంత్, తహసీల్దారు ప్రకాశ్‌బాబుకు వినతిపత్రాలు ఇచ్చామని చెప్పారు.

జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక

పుంగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 ఫుట్‌బాల్ జిల్లా జట్టుకు మండలంలోని చంద్రమాకులపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి **కె. ఆనంద్** ఎంపికైనట్లు హెచ్ఎం వెంకటరమణ బుధవారం తెలిపారు. ఆనంద్‌ను పీడీ మురళీధర్, ఉపాధ్యాయులు వెంకటరమణారెడ్డి, సుజాత, రమణమ్మ, మణి, శంకర్‌రెడ్డి, రఘు, విద్యార్థులు అభినందించారు.

జేడీ దృష్టికి సమస్యలు

పుంగనూరు, న్యూస్‌టుడే: పుంగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రతినిధులు, అధికారుల సమష్టి సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టాలని జేడీ సుధాకర్ సూచించారు. బుధవారం కార్యాలయాన్ని సందర్శించి అధ్యక్షుడు సమీపతియాదవ్‌ను సత్కరించారు. వ్యాపారులు, రైతులు, కమీషన్ ఏజెంట్ల సౌకర్యార్థం ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించి నీరు సరఫరా చేయాలని, రోడ్లపై గుంతలు పూడ్చాలని, పరిశుభ్రత పనులు చేపట్టాలని ఛైర్మన్ కోరారు.

చట్టాలపై అవగాహన అవసరం

పలమనేరు, న్యూస్‌టుడే: విద్యార్థులు అన్ని రకాల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పలమనేరు సిఐ మురళీమోహన్ సూచించారు. బుధవారం పట్టణంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. పోక్సో చట్టం, సైబర్ నేరాల నియంత్రణ, బాల్య వివాహాలతో నష్టాల గురించి వివరించారు. ఎస్సై స్వర్ణతేజ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

150 మందికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

పుంగనూరు, న్యూస్‌టుడే: పుంగనూరు బీఎంఎస్ క్లబ్ ఆవరణలో బుధవారం క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. పట్టణానికి చెందిన రోటరీ క్లబ్, మానవతా సేవా సంస్థ, స్విమ్స్ ఆసుపత్రి సంయుక్తంగా నిర్వహించిన శిబిరంలో 150 మందికి నోరు, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా చేశారు. జూనియర్ సివిల్ జడ్జి వంశీకృష్ణ శిబిరాన్ని ప్రారంభించారు. స్విమ్స్ డైరెక్టరు ఆర్వీ కుమార్, రోటరీ, మానవతా సంస్థల ప్రతినిధులు డా.విజయకుమారి, డా.ప్రభాకర్, గణేష్, ఏసీ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు నిర్వహిస్తున్న స్విమ్స్ వైద్య నిపుణులు

వివాదం పరిష్కరించాలని వినతి

పలమనేరు, న్యూస్‌టుడే: కోర్టుల్లో పోలీసులు, న్యాయవాదుల నడుమ ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలని పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్.భాస్కర్ కోరారు. బార్ తీర్మానం కాపీని డీఎస్పీ డేగల ప్రభాకర్‌కు బుధవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఒకరిద్దరు కానిస్టేబుళ్లు, కొందరు న్యాయవాదుల నడుమ వివాదంతో మొత్తం వ్యవహారాలకు ఇబ్బందులు తలెత్తకూడదని, డీఎస్పీ సమస్యను సరిదిద్దాలని కోరారు. బార్ సభ్యులు బర్కత్, షేక్‌షరీఫ్, చంద్రశేఖర్, రవి, రంజిత్‌షా పాల్గొన్నారు.

డీఎస్పీకి తీర్మాన ప్రతులు ఇస్తున్న న్యాయవాదులు

ఘర్షణ కేసులో ముగ్గురికి రెండేళ్ల జైలు

చిత్తూరు(న్యాయవిభాగం), న్యూస్‌టుడే: భూ వివాదం కారణంగా జరిగిన ఘర్షణ కేసులో ముగ్గురికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ బుధవారం చిత్తూరు ఒకటో అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి మాధవి తీర్పు చెప్పారు. యాదమరి మండలం చిన్నిరెడ్డిపల్లికు చెందిన దంపతులు రాణి, సుధాకర్‌రెడ్డి మోటాండ్లపల్లిలో ఇల్లు నిర్మిస్తుండగా 2022లో అదే గ్రామానికి చెందిన యోగమూర్తి, నందకిషోర్, లక్ష్మణ్ అలియాస్ చందు పనులు అడ్డుకుని గోడ కూల్చివేసి రాణిని తీవ్రంగా దుర్భాషలాడారు. బాధితురాలి ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో ముగ్గురికి జైలు శిక్ష, రూ.1500 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

స్నేహం కుదిరి.. సేవకు కదిలి..

✦ అండగా పూర్వ విద్యార్థులు

పుంగనూరు, చౌడేపల్లె, న్యూస్‌టుడే: విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలల ఉన్నతికి కొందరు పూర్వ విద్యార్థులు పాటుపడుతున్నారు. ఒకప్పటి స్నేహితులతో కలిసి సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తున్నారు.

ఒకప్పుడు పదో తరగతి వరకు కలిసి చదువుకొని ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఇటీవల కాలంలో కలుసుకుంటున్నారు. వారి యోగక్షేమాలతో పాటు పాఠశాలల పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. సామాజిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారించి పాఠశాలకు మంచి చేసేందుకు ప్రణాళికలు వేస్తున్నారు. కొన్నిచోట్ల కార్యాచరణతో ముందుకు వెళ్తూ స్ఫూర్తిదాతలుగా నిలుస్తున్నారు.

చౌడేపల్లె మండలం మర్రిమాకులపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో 2003-04లో పదో తరగతి చదివిన విద్యార్థులు రూ. 2.5 లక్షలు పోగు చేశారు. ఇక్కడ తరగతి గది, భోజన శాలగా వినియోగించేలా షెడ్లు, ప్రహరీ నిర్మించారు.

✦ చౌడేపల్లె మండలం చారాల జడ్పీ ఉన్నత పాఠశాల గ్రామానికి దూరంగా ఉంది. చౌడేపల్లె- పలమనేరు మార్గంలో ఉన్న పాఠశాల వద్ద బస్సులు, ఆటోల కోసం ఉపాధ్యాయులు, విద్యార్థులు వేచి ఉండేందుకు గదులు లేక ఇబ్బందులు పడేవారు. 1988-89లో పదో తరగతి చదివిన వారు రూ.1.50 లక్షలు పోగు చేసి బస్సు షెల్టరు నిర్మించారు.

✦ పుంగనూరు పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాలకు వచ్చే విద్యార్థినులు, అధ్యాపకులు సైకిళ్లు, వాహనాలను బయటే వదిలి వెళ్లేవారు. దీంతో ఎండ, వానకు పాడయ్యేవి. బెంగళూరులో బిల్డర్‌గా స్థిరపడిన పట్టణానికి చెందిన పూర్వ విద్యార్థి విజయభాస్కర్‌రాజు గుర్తించి రూ.60 వేలు వెచ్చించి వాహనాల షెడ్డు ఏర్పాటు చేయించారు.

కాలువలు శుభ్రం

స్పందనకు వందనం

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని అంగడి వీధిలో మురుగు కాలువలను మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేశారు. దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు. కాలువలు అపరిశుభ్రంగా ఉన్నాయని 'ఈనాడు' మేమున్నాం మీకు తోడుగాలో వార్త ప్రచురితమవగా వారు స్పందించారు.

మురుగు సమస్యకు పరిష్కారం

సోమల, న్యూస్‌టుడే: మండలంలోని అగ్రహారం వడ్డిపల్లె, దళితవాడ గ్రామాల మధ్య దశాబ్దాలుగా 40 కుటుంబాల ప్రజలు నివాసం ఉంటున్నారు. రెండు నెలల క్రితం ఆ గ్రామాల రైతుల మధ్య రేగిన వివాదంతో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వర్షం నీరు చెరువులోకి వెళ్లకుండా కాలువకు అడ్డంగా మట్టివేశారు. దీంతో నీరు గ్రామ వీధుల్లోకి రావడంతో పలువురు జ్వరాల బారిన పడ్డారు. విషయం అధికారుల దృష్టికి వెళ్లడంతో తహసీల్దార్ మధుసూదన్, ఎస్సై శివశంకర్ గ్రామానికి చేరుకొని పొక్లెయిన్ సాయంతో మట్టి తొలగించి సమస్య పరిష్కరించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు మురళి, రామనాథం, మురళి, రవి ఉన్నారు.

పంట పొలాలపై ఏనుగుల దాడులు

కల్లూరు, న్యూస్‌టుడే: పులిచెర్ల మండలంలోని కమ్మపల్లె పంచాయతీ పంట పొలాలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. మంగళవారం రాత్రి 16 ఏనుగులు బాలిరెడ్డిగారిపల్లె, దేశిరెడ్డిగారిపల్లె, జాండ్రపేట, కమ్మపల్లెకు చెందిన కేశవరెడ్డి, చంద్రారెడ్డి, రేణుక, జగన్నాథరెడ్డి, వెంకట్రామయ్య, జయరాంరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, అన్నయ్యనాయుడు, మోహన్‌రెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డి, నారాయణరెడ్డి, సురేంద్రరెడ్డి, గరుడారెడ్డి సాగు చేసిన మామిడి, అరటి, వక్క, పశుగ్రాసం, వరిసాగు, వేరుసెనగ పంటలను ధ్వంసం చేసినట్లు రైతులు వాపోయారు.

పాడైన వరి పంట

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

? చెర్లోపల్లెలో చెత్త, వ్యర్థాలు తొలగించి, మురుగు కాలువలు శుభ్రం చేయాలి. - **కుమార్**
☛ గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేస్తాం. - **దొరబాబు, కార్యదర్శి** – పుంగనూరు గ్రామీణం

? రాశెట్టివారిపల్లెలో రోడ్డుపై మురుగు పారుతోంది. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. - **స్థానికులు**
☛ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. - **రెడ్డెప్ప, సర్పంచి** – న్యూస్‌టుడే, సోమల

? పలమనేరులోని రాధాకృష్ణయ్య వీధిలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగడం లేదు. దోమలు విజృంభిస్తున్నాయి. - **సుందర్**
☛ సిబ్బందిని పంపించి పనులు చేయిస్తాం. - **ఎన్వీరమణారెడ్డి, పుర కమిషనర్** – పలమనేరు

వరకట్న వేధింపులపై కేసు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం భర్త వేధిస్తున్నాడని కొత్తపేటకు చెందిన భవ్య ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఆమె భర్త వివేక్‌పై కేసు నమోదు చేశామన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా!

కుప్పం గ్రామీణం: ద్రవిడ విశ్వవిద్యాలయంలో 2025-26లో యూజీలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు వీసీ ఆచార్య దొరస్వామి, రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్ చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు. అకడమిక్ డీన్ ఆచార్య శ్యామల, పీఆర్వో గణేష్‌మూర్తి పాల్గొన్నారు. ✦ పలమనేరు: విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తును ఉన్నతంగా మార్చుకోవాలని పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్ సూచించారు. పట్టణంలోని మదర్ థెరెసా ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్‌డే కార్యక్రమంలో పాల్గొన్నారు.

ద్రవిడ విశ్వ విద్యాలయంలో విద్యార్థినులకు బహుమతులు ఇస్తున్న వీసీ ఆచార్య దొరస్వామి

నృత్యం చేస్తున్న పలమనేరు మదర్ థెరెసా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు

15న ఉపాధ్యాయులకు పోటీలు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని ఉపాధ్యాయులకు 15న క్రికెట్, త్రోబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు కేశవరెడ్డి, తిరుమలమ్మ తెలిపారు కేపీఎల్ క్రీడా మైదనంలో క్రికెట్, చౌడేపల్లె ఉన్నత పాఠశాలలో త్రోబాల్ పోటీలు ఉంటాయన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

కల్లూరు, న్యూస్‌టుడే: మాల మహానాడు రాష్ట్ర మహా సభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.ధరణీకుమార్ కోరారు. బుధవారం మండలంలోని అశోక్‌నగర్ కాలనీలో కరపత్రాలు ఆవిష్కరించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఈనెల 16న సభ ఉంటుందన్నారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాసులు, మాజీ సర్పంచి నడిపన్న, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు చిత్తూరు నగరంలో ఉద్యోగ మేళా

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: నగరంలోని విజయం ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నామని విజయం విద్యాసంస్థల ఛైర్మన్ తేజోమూర్తి బుధవారం తెలిపారు. క్యాడ్‌మ్యాక్స్, ఇండోమైమ్ తదితర సంస్థలు ఈ మేళాలో పాల్గొంటాయని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

న్యుమోనియా నివారణకు ఉచిత టీకాలు

పుంగనూరు గ్రామీణ, కల్లూరు. న్యూస్‌టుడే: న్యుమోనియా వ్యాధి నివారణకు 0- 1.5 ఏళ్లలోపు వయసున్న పిల్లలకు ప్రభుత్వం ఉచిత టీకాలు వేస్తున్నట్లు మండల వైద్యాధికారి పవన్‌కుమార్ తెలిపారు. బుధవారం భీమగానిపల్లెలో అవగాహన కల్పించారు. తీవ్ర జ్వరం, జలుబు, దగ్గు, శ్వాస సమస్యలు వ్యాధి లక్షణాలని తెలిపారు. టీకా ధర రూ.5 వేలు, మూడు డోసులు రూ.15 వేలు. వీటిని ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగా వేస్తున్నట్లు చెప్పారు. ఎంపీహెచ్ఈవో మురళి, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ✦ పులిచెర్ల పీహెచ్‌సీలో వైద్యాధికారులు వేణుగోపాల్‌రెడ్డి, అపర్ణ అవగాహన కల్పించారు.

అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి పవన్‌కుమార్

IN THE COURT OF THE HON'BLE CIVIL JUDGE (JUNIOR DIVISION) :: PALAMANER
O.E.P.No. 4 of 2024
in
O.S.No.389 of 2014

Between:
C.Janaki ..Decree Holder
And:
1. K.Chittemma
2. S. Wahida ..Judgement Debtors

AUCTION NOTICE

To
The General Public

The Decree Holder brought the schedule mentioned property of Judgement debtors for sale for realization of the E.P. amount in the above case. The schedule mentioned property will be put to public auction in the above said Court premises at 10.30 AM to 5.00 PM on 26.11.2025 and those who are interested can participate in the said auction and bid the same.

SCHEDULE

Chittoor District - Palamaner Sub-District - Palamaner Mandal - Palamaner Town - Kothapeta - 27th Ward-Yeddulasantha Road Veedhi - Eastern Side Santha Veedhi. **East:** Land of K.Chittemma; **West:** Sandu Dhari; **North:** House of Shamshad Bi, W/o Ghouse; **South:** House of Anwar & D.Wahab Saheb. In Between : **East-West:** 27 Feet or 8.230 Metres; **North-South:** 20 Feet or 6.096 Metres, Vacant site full including 27 × 20 = 540 Square Feet. RCC Moulding House including Door, Door Frames and Electricity Service Connection-Door No.27-131-2 (Old Door No.27-79.

D.Hr. Value } Rs.12,54,600/-
S.R. Value. }
Amins Value Rs.50,00,000/-
Sub-Registration Value Rs.12,54,600/-
Encumbrances-Nil.

//BY ORDER OF COURT//
Date 11-11-2025
Place:- Palamaner

Sd/- V.CHANDRASEKHAR,
ADVOCATE, PALAMANER.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

పుంగనూరు, పలమనేరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయొద్దని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం పుంగనూరులో నాయకులతో కలిసి ర్యాలీ చేశారు. ప్రైవేటీకరణతో పేద, మధ్య తరగతి వర్గాల విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. తహసీల్దారు రాముకు వినతిపత్రం ఇచ్చారు. జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎంపీ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు. ❖ పలమనేరులో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో నాయకులు నిరసన చేపట్టారు. ఆర్డీవో కార్యాలయం ఏవో కుమారస్వామికి వినతిపత్రం ఇచ్చారు.

ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి, నాయకులు

ప్రజాప్రతినిధులంటే గౌరవం లేదా?

కల్లూరు, న్యూస్‌టుడే: పులిచెర్ల మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టే కార్యక్రమాలకు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులను పిలవకపోవడం సరికాదని, ప్రజాప్రతినిధులంటే కనీస గౌరవం లేదా అని ఐసీడీఎస్ సీడీపీవో వాణిశ్రీదేవిపై ఎంపీపీ సురేంద్రనాథ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలోనూ ఇలానే వ్యవహరించారని, విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. మూడేళ్లుగా పంటలను ఏనుగులు ధ్వంసం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఎంపీడీవో రాజశేఖర్ బాబు, తహసీల్దారు జయసింహ తదితరులు పాల్గొన్నారు.

సీడీపీవోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ

జాగ్రత్తలు పాటించాలి

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎస్టీకాలనీలో జిల్లా మలేరియా నివారణాధికారి వేణుగోపాల్, వైద్య సిబ్బంది పర్యటించారు. జ్వరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. నీటి నిల్వల కారణంగా దోమలు విజృంభించి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలన్నారు. డెంగీ, మలేరియా గురించి తెలియజేశారు. సబ్‌యూనిట్ అధికారి జయశంకర్, ఆరోగ్య సహాయకుడు ఉన్నారు.

IDBI BANK
IDBI బ్యాంక్ లిమిటెడ్
ఆర్‌వీఆర్ టవర్స్ (న్యూ బిల్డింగ్), మదనపల్లి రోడ్, పలమనేరు

బంగారు ఆభరణాల వేలం కోసం బహిరంగ ప్రకటన

దిగువ వివరించిన విధంగా బ్యాంక్ రుణగ్రహీతలచే పొందిన బకాయిలను రాబట్టుకొను నిమిత్తం బ్యాంక్ పేరున తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాల బహిరంగ వేలం కోసం ఆఫర్లు కోరబడుచున్నవి. వేలం ది.25-11-2025 ,సా॥ 04.30 ని॥ల నుండి పలమనేరు బ్రాంచి యొక్క బ్యాంక్ ఆవరణలో నిర్వహించబడును

వ. నెం.	ఖాతా నెం	ఋణగ్రహీత మరియు చిరునామా	తాకట్టు పెట్టిన బంగారు ఆభరణముల వివరములు	స్థూల బరువు	బయానా (రూ.)
1.	1245671100185004	శ్రీఎస్.అఫ్సర్,S/o ఎస్.అబ్దుల్ నజీర్ 28-188,బిసి కాలనీ,పలమనేరు	ప్లెయిన్ హారం 1 (విత్ బీడ్స్)	20.08	15,000/-

బ్యాంక్ నిర్ణయించిన అమ్మకం యొక్క నియమనిబంధనలకు లోబడి వేలం జరుగుతుంది. దాని కాపీ ఒకటి పలమనేరు బ్రాంచి యొక్క నోటీసు బోర్డులో ది.13.11.2025 నుండి ది.24.11.2025 వరకు ప్రదర్శించబడును మరియు ఆసక్తిగల పార్టీలు దానిని చూడవచ్చును. ఈ వేలంలో పాల్గొంటున్న బిడ్డరు అమ్మకం యొక్క పైన తెలిపిన నియమనిబంధనల గురించి పూర్తి అవగాహన ఉన్నట్లుగా భావించబడును. బయానా రూ.15000/- డిడితో పాటు బిడ్ దాఖలుకు చివరి తేది ది.24.11.2025 సాయంత్రం 5.00 గం॥ల వరకు.
ప్రదేశం : పలమనేరు, తేది : 13-11-2025 సం/- అధీకృత అధికారి,ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్

(c) eenadu



పత్రాల ఛత్రం

సాధారణంగా కొబ్బరి చెట్ల తలకట్టు(పై భాగం) చిందరవందరగా ఉంటాయి. పి.గన్నవరం మండలం లంకలగన్నవరంలో డొక్కా జగన్నాథానికి చెందిన తోటలోని ఓ కొబ్బరిచెట్టు అందమైన తలకట్టుతో ఆకట్టుకుంటోంది. ఆకులు గొడుగు ఆకారంలో అలరిస్తున్నాయి. -న్యూస్‌టుడే, పి.గన్నవరం

కీర్తి గుర్తొచ్చేలా.. స్ఫూర్తి రగిలేలా..

మహనీయుల స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు మామిడికుదురు మండలం అప్పనపల్లికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు కంకిపాటి వెంకటేశ్వరరావు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా వారి విగ్రహాలను ఇంటి ఆవరణలో నెలకొల్పారు. సూర్యారావు, ఆదిలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 20 సెంట్ల స్థలం కేటాయించి విగ్రహాలు ఉంచారు. 2017 నుంచి ఒక్కొక్కటీ ఆవిష్కరిస్తున్నారు. జయంతి, వర్ధంతి నిర్వహిస్తున్నారు. వివిధ వృత్తుల్లో సేవలందిస్తున్న వారిని గుర్తించి సత్కరిస్తున్నారు. విద్యార్థులు ఈ విగ్రహాలను సందర్శిస్తూ వారి జీవిత విశేషాలను తెలుసుకుంటారని ఆయన తెలిపారు.
- న్యూస్‌టుడే, మామిడికుదురు

గుర్తుంచుకో.. గమ్యం చేరుకో..

రహదారిపై ప్రయాణం చేసే సమయంలో బోర్డులపై కొన్ని సంకేతాలు కనిపిస్తుంటాయి. సురక్షితంగా గమ్యం చేరేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. లైసెన్స్ పొందాలంటే ముందు వీటి గురించి తెలుసుకోవాల్సిందే. ఇవేమీ తెలియకపోయినా కొందరు రయ్..రయ్‌మంటూ దూసుకుపోతున్నారు.ఏ గుర్తు ఏం చూపిస్తుందో..పరిశీలిస్తే.. -న్యూస్‌టుడే, రావులపాలెం పట్టణం

3 ఆకారాలు: చతురస్రాకారం, త్రిభుజాకారం, వృత్తాకారం

దూసుకెళ్లొద్దు: డివైడర్ మధ్య ఖాళీ ఉందని ఈ గుర్తు సూచిస్తుంది. మలుపు తిరగడానికి, రెండు మూడు మార్గాలను కలపడానికి, రోడ్డు దాటడానికి ఏర్పాట్లు ఉండటంతో అక్కడ నెమ్మదిగా వెళ్లాలి.

ఇరుక్కోవద్దు..: ముందు ఇరుకైన వంతెన సమీపిస్తుందని సూచన. అక్కడ నెమ్మదిగా వెళ్లాలి. ఆ ప్రాంతంలో వాహనం ఆపకూడదు.

వేగం తగ్గించు..: కొంతదూరంలో ఎడమ వైపు నుంచి గ్రామీణ రోడ్డు ఉందని సూచన. అటు నుంచి వాహనాలు వచ్చే వీలుండటంతో వేగం తగ్గించాలి.

పని జరుగుతోంది: ముందు రోడ్డు పనులు జరుగుతున్నాయని అర్థం. వేగాన్ని నియంత్రించాలని సూచిస్తుంది.

కుడి.. ఎడమలు: రహదారికి ఎడమవైపు వెళ్లమని నిర్దేశించే తప్పనిసరి సంకేతం ఇది. రహదారి వద్ద డివైడర్.. మలుపు ఉన్నా ఆ ప్రాంతాల్లో వాహనాలు తిరుగుతాయని.. ఎడమ వైపు వెళ్లాలని సూచిస్తుంది. అదే కుడి వైపు గుర్తు ఉంటే అటువైపు వెళ్లాలని అర్థం చేసుకోవాలి.

విద్యాసంస్థలు: ఆ ప్రాంతంలో విద్యాసంస్థలు ఉన్నాయని సూచిస్తుంది. పిల్లలు రోడ్డు దాటే అవకాశం ఉండటంతో నెమ్మదిగా వెళ్లాలి.

అధిగమిస్తే ఆపదే..!: ముందు వాహనాన్ని ఎట్టి పరిస్థితుల్లో అధిగమించొద్దు. కూడళ్లు, ప్రమాదకర ప్రదేశాలు ఉండవచ్చు.

ఉపయోగకరం: రహదారులపై ప్రమాదాల నివారణకు గుర్తులతో కూడిన బోర్డులను ఏర్పాటు చేస్తాం. చాలా మందికి వీటిపై అవగాహన ఉండటం లేదు. ఇవి తెలుసుకుంటే సురక్షితంగా ప్రయాణం సాగించవచ్చు.
-ఓలేటి శ్రీనివాసరావు, రవాణాశాఖాధికారి, రావులపాలెం

3 రకాలు: 1. హెచ్చరిక 2. తప్పనిసరి 3. సమాచారం

ఉమామహేశ్వరా.. పాహిమాం

కార్తిక మాసం సందర్భంగా రావులపాలెం మండలం రావులపాడు శివాలయంలో ఉమామహేశ్వరస్వామి, ఉమాదేవికి బుధవారం ఆలయ అర్చకులు వెండి ఆభరణాలు అలంకరించారు. పలు రకాల పుష్పాలతో సుందరంగా తీర్చిదిద్దారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు.
- న్యూస్‌టుడే, రావులపాలెం గ్రామీణం

నౌకా నిర్మాణం.. కాకినాడలోనూ

తయారీకి ముందుకొస్తున్న మెరైన్ సంస్థలు

ఈనాడు, కాకినాడ: కాకినాడ తీరం ఇప్పటివరకు జల రవాణా కేంద్రంగానే గుర్తింపు పొందింది. ఇకపై నౌకా నిర్మాణ కేంద్రంగానూ అభివృద్ధి చెందనుంది. ప్రస్తుతం నగరంలో శాన్ మెరైన్ సంస్థ చిన్న, మధ్యస్థ నౌకల నిర్మాణం చేపడుతోంది. విద్యుత్తు నౌకల తయారీకి ఇటీవల ముంబయిలో కేంద్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది.



తీర ప్రాంత అభివృద్ధికి.. హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ గతంలో శాటిలైట్ షిప్‌యార్డు ఏర్పాటుకు స్థలం పరిశీలించింది. తాజాగా మ్యాక్ మెరైన్ సంస్థ యాంకరేజ్ పోర్టు వద్ద టగ్‌లు, బార్జీలు నిర్మించనుంది. తీర ప్రాంత అభివృద్ధికి ఉపయుక్తంగా చెబుతున్నారు.

కీలక స్థావరంగా.. గతంలో చిన్నపాటి నౌకలు, బార్జీల కోసం సింగపూర్, మలేషియా వెళ్లి ఆర్డర్లు పెట్టాల్సి వచ్చేది. నిర్వహణ, మరమ్మతులకు ఇబ్బంది ఎదురయ్యేది. ఇప్పుడు మెరైన్ సంస్థల రాకతో కాకినాడ కీలకంగా మారబోతుంది. బోట్ల నుంచి భారీ నౌకల తయారీకి అవకాశాలుండి యువతకూ ఉపాధి దక్కనుంది.

ఇవీ అనుకూల పరిస్థితులు ❖ పోర్ట్ ఏరియాలో అలల తాకిడి తక్కువ. ❖ తీరం వెంబడి ప్రభుత్వ భూములు ఎక్కువ. ❖ నౌకలు, బార్జీలు, టగ్‌లు తయారుచేసి పక్కనే సముద్ర జలాల్లోకి దించి..సరకు రవాణాకు ఉపయోగించొచ్చు. ❖ జగన్నాథపురం వంతెన నుంచి యాంకరేజ్ పోర్టు వరకు రెండు కి.మీ మేర సీఫ్రంట్ విస్తరించి ఉండడం అనుకూలం.

కందికుప్ప.. భవనాలెంతో గొప్ప!

కాట్రేనికోన మండలం కందికుప్ప.. దశాబ్దాల నాటి పురాతన బంగ్లాలకు ప్రసిద్ధి చెందింది. గ్రామంలో ఎటు చూసినా విశాల బంగ్లాలు, మండువా లోగిళ్లు కనిపిస్తాయి. ఇక్కడ భూస్వాముల కుటుంబాలు ఎక్కువగా ఉండటంతో అప్పట్లో ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. దిగుమతి చేసుకున్న టేకు వంటి కలపను ఉపయోగించడం గమనార్హం. ఏడెనిమిది దశాబ్దాల నుంచి ఇవి చెక్కు చెదరకుండా ఉన్నాయి. వందేళ్లు పూర్తయినవీ ఉన్నాయి. ఒక్కో భవనంలో 15 నుంచి 25 వరకు గదులు ఉన్నాయి. విశాలమైన హాలు, ఆవరణ, వంట గది, మరుగుదొడ్లు, అతిథులు కూర్చునేందుకు కారిడార్ వంటివి ఈ నిర్మాణాల్లో భాగం. ఆ రోజుల్లో వీటిలో ఉమ్మడి కుటుంబాలు నివసించేవి. ఒక్కో ఇంట్లో 15 నుంచి 20 మందిపైనే ఉండేవారు. ప్రస్తుతం కొన్ని కుటుంబాలు మాత్రమే వీటిలో నివసిస్తున్నాయి. విద్య, వ్యాపారం, ఉద్యోగం తదితర కారణాలతో కొందరు పట్టణాల్లో ఉంటున్నారు. పండగల వేళ స్వగ్రామాలకు వస్తుంటారు.
-న్యూస్‌టుడే, కాట్రేనికోన

ఉపాధి పనికి వెళ్లాలంటే..

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

ఉపాధి హామీ పథకంలో అక్రమాల అడ్డుకట్టకు ప్రభుత్వం ఈకేవైసీ విధానం తీసుకొచ్చింది. పనులు కల్పించాలన్నా, వేతనాలు చెల్లించాలన్నా ఈకేవైసీ చేయించుకోవాలని నిర్ణయించి గత నెలలో ఈ ప్రక్రియను ప్రారంభించారు. అంబాజీపేట మండలంలో అత్యధికంగా 86.30 శాతం ఈ-కేవైసీ పూర్తవగా, మండపేటలో 66.24 శాతమే నమోదైంది.

కారణాలు ఇవీ.. ★ సిబ్బంది ఇళ్లకు వెళ్లినా, కొంతమంది అందుబాటులో లేకపోవడం. ★ కొందరు పట్టణాల్లో ఉండడం, వలస వెళ్లడం, మృతి చెందడం. ★ పనులకు వచ్చే వేతనదారుల్లో 88.06 శాతం ఈకేవైసీ పూర్తయింది.

ఈ-కేవైసీ చేస్తున్న సిబ్బంది

జిల్లాలో వేతనదారులు: 3.36 లక్షలు ● ఈ-కేవైసీ పూర్తి: 2.59 లక్షలు

విదేశీ చదువులకు సిద్ధమవుతున్నారా

మీ కోసం

రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ స్టడీస్ అండ్ రీసెర్చ్(సీఐఎస్ఆర్) భవనం సిద్ధమైంది. ఇక్కడి సైన్స్ బ్లాక్‌లో రూ.12 లక్షలతో నిర్మించారు. అధ్యాపకుడు జి.చంద్రశేఖర్ నోడల్ అధికారిగా, నూజిళ్ల శ్రీనివాస్ కంప్లైంట్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారన్నారు. ఈ నెల 18న మంత్రి లోకేశ్ దీనిని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఏం తెలుసుకోవచ్చు..: ◗ విదేశీ వర్సిటీల వివరాలు ◗ కోర్సులు, శిక్షణ ◗ దరఖాస్తు విధానం ◗ వీసా, పాస్‌పోర్ట్ గురించి..

ఇంటర్న్‌షిప్‌కు ఉపకార వేతనాలు.. విదేశీ వర్సిటీల్లో మూడు నెలలు ఇంటర్న్‌షిప్‌కు వెళ్లే విద్యార్థులు, అధ్యాపకులకు కళాశాల యాజమాన్యం ఉపకార వేతనాలు అందిస్తుందని ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే వెల్లడించారు. –న్యూస్‌టుడే, దేవీచౌక్

ప్రారంభోత్సవానికి సిద్ధమైన సీఐఎస్ఆర్ భవనం

జిల్లాలో సెక్షన్ 30 అమలు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో సెక్షన్ 30 అమలు చేస్తున్నట్లు ఎస్పీ రాహుల్ మీనా ఓ ప్రకటనలో తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు వంటివి చేయరాదన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు సహకరించాలని కోరారు. ఏదైనా ప్రాంతంలో శాంతి భద్రతలు భంగం కలిగే అవకాశం ఉందని భావిస్తే ఆ సమావేశాన్ని నిషేధించవచ్చునని అన్నారు.

కావేరి.. నీకు నువ్వే సాటి

ఉపాధ్యాయినికి మంత్రి లోకేశ్ అభినందన



మండపేట: స్థానిక శారదా మున్సిపల్ పాఠశాల ఉపాధ్యాయురాలు అమలదాసు కావేరి పాఠ్యాంశాలు బోధించే తీరును ప్రశంసిస్తూ మంత్రి నారా లోకేశ్ తన ఎక్స్ ఖాతాలో బుధవారం ట్వీట్ చేశారు. కావేరి గురించి సెప్టెంబర్ 5వ తేదీన 'చదువులమ్మలకు వందనం' శీర్షికతో 'ఈనాడు' వసుంధరలో కథనం ప్రచురితమైంది. అందులో ఆమె బోధనా పద్ధతుల గురించి తెలుసుకుని స్పందించారు. విద్యార్థులు లేని పాఠశాలలో 11 మంది చేరేలా ప్రోత్సహించారని, హ్యాట్సాఫ్ అంటూ పేర్కొన్నారు.

తెలిసినోళ్లే.. బూచోళ్లు

పిల్లల అపహరణ, అఘాయిత్యాల్లో వీరిపాత్రే ఎక్కువ

▮ తుని పట్టణ పరిధిలో గురుకుల పాఠశాల విద్యార్థినికి మాయమాటలు చెప్పి బయటకు తీసుకెళ్లి ఓ వృద్ధుడు అఘాయిత్యానికి ప్రయత్నించాడు. తాతయ్యనని సిబ్బందిని నమ్మించే ప్రయత్నం చేశాడు.

▮ ఐ.పోలవరం మండలంలో పాఠశాల విద్యార్థినికి చాక్లెట్లు కొనిస్తూ ఓ వ్యక్తి పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడ్డాడు.

▮ రామచంద్రపురం పరిధిలో ఇంట్లో ఒంటరిగా ఉన్న పదేళ్ల బాలికను తెలిసిన యువకుడు గొంతునులిమి హత్యచేశాడు.

▮ అమలాపురంలో ఇటీవల దూరపు బంధువైన యువకుడు బాలికకు మాయమాటలు చెప్పి అపహరణకు పాల్పడ్డాడు.

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

తాతయ్యో, మావయ్యో.. దగ్గర, దూరపు బంధువుల్లో ఎవరొకరు.. తెలిసిన వాళ్లే చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అభం.. శుభం.. తెలియని పిల్లలకు మాయమాటలు చెప్పి మోసాలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి చెడులను వివరించడంతో పాటు, ఆపద సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

కిడ్నాప్‌లు, కేసులు ఇలా.. (● పోక్సో ■ కిడ్నాప్)

సంవత్సరం	పోక్సో	కిడ్నాప్
2023	101	40
2024	67	17
2025	57	3

ప్రవర్తన గమనిస్తున్నారా..?

★ పాఠశాలలకు వెళ్లే చిన్నారుల పట్ల బంధువులు, చుట్టుపక్కల వాళ్లు, తెలిసిన వ్యక్తులు ఎలా మసులుతున్నారో ఓ కంట గమనిస్తుండాలి. ★ వారికి నిత్యం తినుబండారాలు కొనిస్తున్నా, వారు అడగకపోయినా బయటకు తీసుకు వెళ్తున్నా అనుమానించాల్సిందే. ★ కళాశాలకు వెళ్తున్న యువతులు ఖరీదైన వస్తువులు (ఫోన్లు, దుస్తులు, అలంకరణ సామగ్రి) వినియోగిస్తున్నా ఎక్కడి నుంచి వచ్చాయి..? ఎలా కొనుగోలు చేశారో సున్నితంగా తెలుసుకునే ప్రయత్నం చేయాలి. ★ వాటిని కొనిస్తున్న వారి దురుద్దేశాన్ని అర్థమయ్యేలా వారికి స్పష్టంగా వివరించాలి.

ఆదేశాలు ఇస్తున్నాం..

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే చిన్నారులను తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వస్తేనే వారిని బయటకు పంపించాలని ఆదేశాలు ఇస్తాం. ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలి.
-సలీం బాషా, డీఈవో

ముందే చెప్పాలి

పాఠశాలకు తాము వస్తే మాత్రమే పిల్లల్ని పంపించేలా పాఠశాలల యాజమాన్యాలకు చెప్పాలి. అత్యవసరమైతే ముందస్తు సమాచారం ఇచ్చిన తర్వాతనే ఇతరులతో పంపించేలా ఏర్పాట్లు చేసుకోవాలి. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.
-రాహుల్ మీనా, జిల్లా ఎస్పీ

నమూనా తాళాలను అందిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే ఆనందరావు

ఇంటి కల సాకారం

అమలాపురం గ్రామీణం: పేదల ఇంటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. పాలగుమ్మి, జనుపల్లె గ్రామాల్లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా పూర్తయిన గృహ నిర్మాణాలను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జేసి నిశాంతితో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ పేద వర్గాలకు ఇళ్లు అందించడంతో జీవన ప్రమాణాలు పెరుగుతాయన్నారు. జిల్లాలో 8,876 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకుడు ఎం.వి. నరసింహారావు, కార్యనిర్వాహక ఇంజినీర్ జె. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరికాయల ధర పతనం

న్యూస్‌టుడే, అంబాజీపేట

జిల్లాలో కొబ్బరికాయల ధరలు పడిపోయాయి. ప్రాంతీయ మార్కెట్‌లో బాగా దిగజారాయి. వెయ్యింటికి రూ.4 వేల నుంచి రూ.5 వేల మేర పతనమైనట్లు రైతులు, వర్తకులు చెబుతున్నారు. కార్తిక మాసం ప్రారంభానికి ముందు వెయ్యి పచ్చికాయలు రూ.23-25 వేల మధ్య ఉంది. ప్రస్తుతం రూ.19-20 వేల వరకు దిగజారాయి. తమిళనాడులో ఉత్పత్తి ఆశాజనకంగా ఉండటం ప్రస్తుత పరిస్థితికి కారణంగా భావిస్తున్నారు. శీతాకాలం ప్రారంభమైన తరుణంలో ఉత్తరాది రాష్ట్రాల్లో పండగల సమయం ముగియడంతో కాయల వినియోగం తగ్గింది. ఆయా రాష్ట్రాలకు ఎగుమతులు పెద్దగా లేకపోవడంతో ధరలు క్షీణించినట్లు వర్తకులు అంటున్నారు. బిహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు సైతం కొబ్బరికాయల ఎగుమతులు నామమాత్రంగానే ఉన్నాయి. ఈ కారణాల వల్ల ధరలు తగ్గినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు దిగజారిన వైనం

బ్రేక్ పడింది..

దిండి-చించినాడ వశిష్ఠ వారధికి సంబంధించి బేరింగులు మారుస్తున్న నేపథ్యంలో భారీ వాహనాల రాకపోకలు నిషేధించిన విషయం తెలిసిందే. ఈ మేరకు గత నెలలో భారీ బారికేడ్లను ఇరువైపులా ఏర్పాటు చేశారు. ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్లేలా సుమారు 9 అడుగుల ఎత్తులో దీన్ని అమర్చారు. పర్యవేక్షకుడు లేని సమయంలో ఓ భారీ వాహనం వెళ్లేందుకు ప్రయత్నించిన క్రమంలో దిండి వైపున ఊడిపోయింది. దీనికి బుధవారం మరమ్మతులు చేసి తిరిగి అమర్చారు. -న్యూస్‌టుడే, మలికిపురం

12వేల మంది జమకాని 'తల్లికి వందనం' సొమ్ము ఎదురుచూపులు..!

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

సూపర్ సిక్స్ పథకాల్లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వం ఈ ఏడాది జూన్‌లో ప్రారంభించింది. అర్హులైన లబ్ధిదారులకు ఖాతాల్లో నగదు జమైంది. ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికీ పథకాన్ని వర్తింపజేశారు. అప్పట్లో ఒకటో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరే విద్యార్థులపై స్పష్టత లేకపోవడంతో తర్వాత ఇస్తామని ప్రకటించారు. ఆయా పాఠశాలలు, కళాశాలల్లో యూడైస్‌లో నమోదైన తర్వాత నిధులను విడుదల చేస్తామన్నారు. జులై తర్వాత వీరికి నిధులు విడుదల చేసినా చాలా మందికి నేటికీ అందలేదు.

ఇంటర్ విద్యార్థులే అధికం.. విద్యార్థుల వివరాలను యూడైస్ పోర్టల్ ద్వారా తీసుకుని హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌తో సరిపోల్చి జాబితా రూపొందించారు. అభ్యంతరాలు, సవరణలకు అవకాశం కల్పించారు. ఒకటో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులు 12వేల మందికి పైగా ఇంకా డబ్బులు అందలేదు. త్వరలోనే తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ విజయ్ తెలిపారు.

వివరాలు ఇలా..

లబ్ధిదారులు	1.80 లక్షలు
నిధులు జమైనవారు	1.65 లక్షలు
జమకావాల్సిన వారు	12 వేలు
అనర్హులుగా తేలినవారు	1200

14 నుంచి ఫ్రెంచ్ చలన చిత్రోత్సవం

యానాం: ఫ్రెంచ్ సంస్కృతిలోని భావోద్వేగాలు, జీవన విధానం, చలనచిత్ర రీతుల్ని తెలియజేయడం కోసం యానాంలోని బీఆర్ అంబేడ్కర్ పాలిటెక్నిక్ కాన్ఫరెన్స్ హాల్లో శుక్ర, శని, ఆదివారాల్లో ఫ్రెంచ్ చలన చిత్రోత్సవం నిర్వహించనున్నారు. పుదుచ్చేరికి చెందిన అలియెన్స్ ఫ్రాన్సెస్ సంస్థ, యానాం భాగస్వామ్యంతో 'ఫెస్టివల్ దే ఫిల్మ్ ఫ్రాన్సెస్' వేడుకల్లో సాయంత్రం 6.30కు చలన చిత్రాలను ప్రదర్శించనున్నారు.

ఓ గురువు.. శిష్యుల బృందం

స్ఫూర్తి

న్యూస్‌టుడే, యానాం

ఒలింపిక్స్ పోటీల్లో చేప పిల్లల్లా ఈత కొట్టే అంతర్జాతీయ క్రీడాకారులను టీవీలో చూసి చిన్నతనంలోనే స్ఫూర్తి పొందాడు. తర్వాత ఈత నేర్చుకుని అనతికాలంలోనే అంతర్జాతీయ స్థాయిలో 17..రాష్ట్ర, జాతీయ స్థాయిలో 120 పతకాలు సాధించాడు. ఆయనే యానాం శాయ్ శిక్షణ కేంద్రం సహాయ కోచ్ రవితేజ గ్రంధి. ఎం.టెక్ చదివిన రవి పాటియాలలోని నేతాజీ సుభాష్ జాతీయ క్రీడా సంస్థలో ఈత విభాగంలో మాస్టర్ ఆఫ్ సైన్స్ చేశారు. గతనెల ఆస్ట్రేలియాలోని కాన్‌బెర్రాలో జరిగిన పోటీల్లో 34 ఏళ్ల విభాగంలో 3 వెండి, కాంస్య పతకంతో మెరిశారు.

మలుపుతిప్పిన విజయం

2018లో కజకిస్థాన్ మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో నాలుగు పసిడి, రెండు వెండి పతకాలు సాధిండంతో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసే అవకాశం లభించింది. ఆ సందర్భంగా సీఎం సూచనల మేరకు ఈత శిక్షకుడిగా మారారు. ఆయన వద్ద శిక్షణ పొందుతున్నవారిలో కొందరు రాష్ట్ర స్థాయి పోటీల్లో 40కు పైగా పతకాలు సాధించడం గమనార్హం.

ఈజిప్ట్‌లో పోటీలకు వెళ్లిన జట్టు సభ్యులు, కోచ్ రవితేజ

ప్రత్యేక శిక్షణతో...

ఈతలో రవితేజ వద్ద తర్ఫీదు పొందే క్రీడాకారుల్లో కొందరు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తున్నారు. గత ఏడాది ఆయన నేతృత్వంలో వీసం వెంకట నాగసాయి, వరద మణికంఠ నవీన్, టెంకా ప్రేమ్‌కుమార్, జస్విన్ నాయుడు ఈజిప్ట్‌లో జరిగిన పోటీల్లో పాల్గొన్నారు. నవీన్‌కు కాంస్యం దక్కింది. ఇక్కడి క్రీడాకారులు ఏషియన్ గేమ్స్, ఒలింపిక్స్‌లో పతకాలు తెచ్చేలా శిక్షణ ఇవ్వడమే లక్ష్యమని రవి పేర్కొన్నారు. వచ్చేనెలలో దక్షిణాఫ్రికాలో జరిగే మోడ్రన్ పెంటాథ్లాన్ పోటీలకు ప్రేమ్‌కుమార్, వెంకటనాగసాయి, బి.పురానందీశ్వర రాజులను సన్నద్ధం చేస్తున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

వెరికోస్ వెయిన్స్ (సిరల వాపు) ఫైల్స్ & ఫిస్టుల సమస్యలకు
మొట్టమొదటిసారిగా అత్యాధునికమైన లేజర్ చికిత్స
ఎటువంటి కోత లేకుండా లేజర్ చికిత్స
Dr. Nitin Rimmalapudi, M.S.
Laser & Laparoscopic Surgeon
అపాయింట్‌మెంట్ కొరకు సంప్రదించండి
93 922 922 00
సోమవారం నుండి శనివారం
APEX HOSPITALS LASER CENTRE
ప్రకాష్ నగర్, రాజమండ్రి | 0883-2449191

(c) eenadu

విశ్వేశ్వరునికి లక్ష బిల్వార్చన

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కార్తిక మాసోత్సవాల్లో భాగంగా వాడపల్లి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం లక్ష బిల్వార్చన కనులపండువగా జరిగింది. ఈ కార్యక్రమం తిలకించడానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

తివాచీ కాదు.. పంచాయతీ చెరువు

చూసేందుకు పచ్చని తివాచీ పరిచినట్లుగా కనిపిస్తున్నా.. వాస్తవానికి ఇది ఒక పంచాయతీ చెరువు. అంబాజీపేట మండలం ముక్కామల ప్రాథమిక పాఠశాల చెంతన ఉంది. గుర్రపుడెక్క, తూడు బాగా పెరిగిపోవడంతో ఇలా కనిపిస్తోంది. దీనిపై సర్పంచి బందారు వెంకటలక్ష్మిని వివరణ కోరగా చెరువును అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, అంబాజీపేట

కాలభైరవం భజే..!

రాచపల్లిలోని ఆంధ్రా అరుణాచలంలో స్వామితో సహా పరివార దేవతలకు బుధవారం విశేష పూజలు జరిగాయి. విజయగణపతి, ఉపాలయంలోని కాలభైరవ స్వామికి జరిగిన అభిషేకాలు, హారతి కార్యక్రమాల్లో పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. రుత్విజులు శ్రీవల్లభ హోమాన్ని నిర్వహించారు. - న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

అందుబాటులోకి.. రైల్‌వన్

యాప్ ఇలా..

రైలు ప్రయాణం మరింత సులువుగా సాగేందుకు భారతీయ రైల్వే అన్ని ప్రధాన సేవలు ఒకచోట లభించేలా 'రైల్ వన్' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. గతంలో వివిధ యాప్‌లలో వేర్వేరు సేవలు ఉండేవి.

మీకు తెలుసా

ఈ సేవలు పొందొచ్చు..: ఆండ్రాయిడ్ ఫోన్లో గూగుల్ ప్లే స్టోర్, యాప్ స్టోర్ల నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సాధారణ, రిజర్వేషన్, ప్లాట్‌ఫాం, సీజన్ టిక్కెట్లు పొందవచ్చు. రైళ్ల సమాచారం, పీఎన్ఆర్ స్థితి, కోచ్ స్థానం, రైలును ట్రాక్ చేయడం, భోజనం ఆర్డర్ ఇవ్వడం, ఫిర్యాదులు, సూచనలు తదితర సేవలు పొందొచ్చు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు, సిబ్బంది సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే అనేక మంది దీన్ని డౌన్‌లోడ్ చేసుకుని వాడుతుండడంతో స్టేషన్లలోని టికెట్ కౌంటర్ల వద్ద రద్దీ తగ్గింది. - న్యూస్‌టుడే, తుని

అంతర్వేది ఆలయదర్శిని

అంతర్వేది, న్యూస్‌టుడే: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయం గురువారం ఉదయం 5 గంటలకు తెరిచి సుప్రభాత సేవ చేస్తారు. ● ఉదయం 7 గంటలకు స్వామివారికి పంచామృతాలతో అభిషేకం. ● 10 గంటల నుంచి సుదర్శన నరసింహ హోమం ● 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రత్యేక, ఉచిత దర్శనాలు ● ఒంటిగంట నుంచి సాయంత్రం 3 గంటల వరకు విరామం. ● 3 నుంచి రాత్రి 7.30 వరకు దర్శనాల అనంతరం ఆలయాన్ని మూసివేస్తారు.

ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ పురస్కారం ప్రదానం

మామిడికుదురు, న్యూస్‌టుడే: మామిడికుదురు జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న షేక్ సుభానీ రాష్ట్ర ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మంగళవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఫరూక్ చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని ప్రదానం చేశారని ఆయన వివరించారు. ఉర్దూ విద్యా బోధన, భాషాభివృద్ధికి మరిన్ని సేవలందిస్తానని ఈ సందర్భంగా చెప్పారు. బుధవారం పలువురు ఆయన్ను అభినందించారు.



మంత్రి ఫరూక్ నుంచి పురస్కారం అందుకుంటున్న సుభానీ

తెదేపాలో క్రమశిక్షణకు తొలి ప్రాధాన్యం

జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి

పి.గన్నవరం, న్యూస్‌టుడే: తెదేపాలో క్రమశిక్షణకు మొదటి ప్రాధాన్యం ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, రాష్ట్ర బీసీ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్పర్సన్ రెడ్డి అనంతకుమారి అన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి, పి.గన్నవరం నియోజకవర్గ కోకన్వీనర్ మోకా ఆనందసాగర్, మరో కోకన్వీనర్ దాసరి వీరవెంకటసత్యనారాయణ సంయుక్త ఆధ్వర్యంలో పి.గన్నవరంలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆమె బుధవారం ప్రారంభించారు. ముందుగా పార్టీ జెండాను అంబాజీపేట ఏఎంసీ ఛైర్మన్ చిట్టూరి శ్రీనివాస్ ఆవిష్కరించారు. కార్యాలయానికి మౌలిక వసతుల కల్పనకు సహకరించాలని శాసనమండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్, పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం విజ్ఞప్తి చేశారు. కార్యాలయ నిర్వహణకు వాడ్రేవుపల్లి సర్పంచి ప్రతినిధి ఉమామహేశ్వరి రూ.50 వేలు, నాయకుడు ఎ.వెంకట్రామయ్య ఇనుప బీరువా ఇచ్చేందుకు ముందుకొచ్చారు. ప్రతి శుక్రవారం అక్కడ ప్రజల నుంచి వినతులు స్వీకరించి పరిష్కరించేందుకు కృషి చేయాలని సుబ్రహ్మణ్యం సూచించారు. ఎన్టీఆర్‌కు నివాళి అర్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ పురోభివృద్ధి సాధిస్తుందని పలువురు కొనియాడారు. వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు మట్టపర్తి భారతి, చెల్లుబోయిన గంగాదేవి, అంబటి భూలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, నాయకులు జాలెం సుబ్బారావు, సలాది పుల్లయ్యనాయుడు, ఆరుమిల్లి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రెడ్డి అనంతకుమారి, చిత్రంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం తదితరులు

ఫెన్సింగ్ క్రీడను ప్రోత్సహించాలి

రాజానగరం, న్యూస్‌టుడే: కళ్లు, చేతులు, కాళ్లు, మెదడు మధ్య అనుసంధానాన్ని, ఏకాగ్రతను, అప్రమత్తతను పెంచే సంప్రదాయక దేశీయ క్రీడ ఫెన్సింగ్ (కత్తిసాము)ను యువతీ యువకుల్లో విస్తరింపజేయాలని జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల ఛైర్మన్ డా.గన్ని భాస్కరరావు పిలుపునిచ్చారు. ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్‌గా బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల యూనిట్ల అధ్యక్షులు, కార్యదర్శులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

పోటీలో క్రీడాకారులు

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక: 12వ రాష్ట్రస్థాయి సీనియర్ల ఫెన్సింగ్ పోటీలు కళాశాలలోని సుశ్రుత ఆడిటోరియంలో మంగళవారం అర్ధరాత్రి వరకు నిర్వహించారు. 13 జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అధిక పాయింట్లు సాధించిన వారిని మూడేసి విభాగాల్లో నలుగురు చొప్పున బాలబాలికల నుంచి 12 మంది చొప్పున జాతీయ ఫెన్సింగ్ పోటీలకు రాష్ట్రం తరఫున ఎంపిక చేసినట్లు నిర్వాహకుడు ఎన్.సతీష్‌బాబు తెలిపారు.

రబీకి పుష్కలంగా నీరు

● 90 టీఎంసీలకు మించి లభ్యత
● రైతన్నలకు నూరుశాతం అందించే అవకాశం

పి.గన్నవరం, న్యూస్‌టుడే: ఖరీఫ్ ఈ నెలాఖరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో రానున్న రబీకి గోదావరి డెల్టా పరిధిలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలకు సంబంధించి ఎంత ఆయకట్టుకు సాగునీటి లభ్యత ఉంటుందనే అంశంపై జిల్లాల జలవనరులశాఖ ఇంజినీరింగ్ అధికారులు లెక్కలు కట్టారు. నూరుశాతం ఆయకట్టుకు అందించే అవకాశం ఉన్నట్లు అన్నదాతలకు భరోసా ఇస్తున్నారు. త్వరలోనే అధికారికంగా వెల్లడించే అవకాశం ఉందని జలవనరులశాఖ ధవళేశ్వరం సర్కిల్ ఎస్ఈ కె.గోపీనాథ్ వెల్లడించారు.

అంచనా ఇలా..

ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల పరిధిలోని తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాలు కలిపి రబీ వరి ఆయకట్టు 8.96 లక్షల ఎకరాలు ఉంది. జలవనరుల శాఖ ఇంజినీరింగ్ అధికారుల గణాంకాల ప్రకారం 90 టీఎంసీలు మించి నీరు లభిస్తుందని అంచనా వేశారు. ఒక టీఎంసీ నీటితో 10 వేల ఎకరాలకు సాగు చేయొచ్చు. ఈ లెక్కన 8.96 లక్షల ఎకరాలకు 89 టీఎంసీలు సరిపోతాయి. తాగునీటి అవసరాలకు 4, పరిశ్రమలకు 3 వెరసి 7 టీఎంసీలు అవసరం ఉంటుంది. 95 టీఎంసీలు ఉన్నందున అవసరమైనప్పుడు వంతులవారీ విధానం అమలు చేయడం, రైతులు నీటి వృథా చేయకుండా వినియోగించుకోవడం వంటి చర్యలతో మొత్తం నూరుశాతం ఆయకట్టుకు నీరు అందే వీలుంది. సీలేరు నుంచి 50 టీఎంసీలపైనే తీసుకునే అవకాశం ఉంది. మిగిలిన జలాలు గోదావరిలో సహజ ప్రవాహం, పోలవరం ప్రాజెక్టు నుంచి లభిస్తాయని అంచనా.

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో.. (లక్షల ఎకరాల్లో) డెల్టా	వరి ఆయకట్టు
పశ్చిమ	4.60
తూర్పు	2.64
మధ్య	1.72

ఈ నెల 20 లోగా..

రబీలో రైతులు సాగు చేసేందుకు వీలుగా నవంబరు 20లోగా ఐ.ఏ.బి. (సాగునీటి సలహా మండలి) సమావేశాలు ఏర్పాటు చేసి అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. గతంలో కాకినాడ కలెక్టరేట్‌లో సమావేశం ఏర్పాటు చేసి ప్రజాప్రతినిధుల సమక్షంలో వెల్లడించేవారు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ఆయా జిల్లాల కలెక్టరేట్‌ల వద్ద సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు.

ధవళేశ్వరం బ్యారేజీ

చేనేత రంగ సమస్యలు పరిష్కరించండి

మంత్రి లోకేశ్‌కు వినతి

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, సంఘాల పూర్వ వైభవానికి చర్యలు చేపట్టాలని కోరుతూ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం సమర్పించినట్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా చేనేత ప్రతినిధులు తెలిపారు. మంగళగిరిలోని తెదేపా ప్రధాన కార్యాలయంలో మంత్రిని కలిసినట్లు పేర్కొన్నారు. బకాయిలు వెంటనే చెల్లించాలని, వివిధ పథకాల అమలు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, జీఎస్టీ రద్దు మొదలైన అంశాలపై ఆయనకు వివరించామన్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి వెంటనే అమలయ్యేలా చర్యలు చేపడతామని, చేనేత పరిశ్రమను ఆదుకొనేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చినట్టు చేనేత ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోకేశ్‌ను కలిసినవారిలో హసనబాద నుంచి దొంతంశెట్టి సత్యప్రకాష్, ఆదివారపుపేట నుంచి అల్లకరాజు, అద్దంపల్లి నుంచి కేవీవీ సత్యనారాయణ, శివల నుంచి వీర్రాజు తదితరులు ఉన్నారు.

వెంకటేశ్వరరావుకు త్రిచక్ర వాహనం..

మండపేట, రాయవరం: రాయవరం మండలం చెల్లూరుకు చెందిన దివ్యాంగుడు మోర్ల వెంకటేశ్వరరావుకు మంత్రి నారా లోకేశ్ త్రిచక్ర వాహనం బహూకరించారు. గత నెల 25న తనకు వాహనం కావాలని, ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఫొటో తీయించుకోవాలని ఉందని నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని పాలకొల్లులో కలిసి వెంకటేశ్వరరావు విన్నవించిన విషయం విదితమే. ఈ విషయాన్ని నిమ్మల. ఐటీ శాఖ మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా అప్పట్లో ఆయన విదేశీ పర్యటనలో ఉన్న కారణంగా వాహనం సమకూర్చుతానని హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం మంగళగిరిలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో తనకు వాహనం అందించారని ఆయన సంతోషంగా చెప్పారు.

వెంకటేశ్వరరావుకు వాహనం అందిస్తున్న మంత్రి లోకేశ్

పటేల్ సంకల్పం యువతకు స్ఫూర్తి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: దేశ ఐక్యత, సమగ్రతను కాపాడిన మాజీ ఉప ప్రధాని వల్లభాయ్ పటేల్ సంకల్పాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఎంపీ హరీష్ మాథుర్ బాలయోగి పిలుపునిచ్చారు. పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని బుధవారం అమలాపురం పట్టణంలో ఎంపీ ఆధ్వర్యంలో ఐక్యత కోసం పరుగు (రన్ ఫర్ యూనిటీ) కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌కేబీఆర్ కళాశాల నుంచి గడియార స్తంభం కూడలి వరకు ర్యాలీ సాగింది. ఇందులో ఎంపీ, కలెక్టర్ ఆర్.మహేశ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు. గడియార స్తంభం ప్రాంగణంలో బహిరంగ సభ నిర్వహించారు. కలెక్టర్ మహేశ్‌కుమార్ మాట్లాడుతూ స్వాతంత్య్రానంతరం సంస్థానాలు భారతదేశంలో విలీనం కావడానికి వల్లభాయ్ పటేల్ కృషి చేశారన్నారు. భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమ, భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ చిక్కాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రన్ ఫర్ యూనిటీలో ఎంపీ హరీష్ మాథుర్, కలెక్టర్ మహేశ్‌కుమార్

'శంకరగుప్తం' ఆధునికీకరణకు చర్యలు

మలికిపురం, న్యూస్‌టుడే: తీర గ్రామాల్లో కొబ్బరి చెట్లు చనిపోవడానికి కారణమవుతున్న మలికిపురం మండలంలోని శంకరగుప్తం మేజర్ డ్రెయిన్‌లో పూడికతీత, గట్ల పటిష్ఠతకు రూ.20.62 కోట్లు మంజూరు చేయడానికి జలవనరులశాఖ అధికారులు తెలిపినట్లు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ బుధవారం తెలిపారు. జలవనరులశాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావును కలిసి తీర గ్రామాల దయనీయ పరిస్థితిని వివరించినట్లు చెప్పారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. త్వరలో నిధులు మంజూరు ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందన్నారు. కరవాక, గొగ్గనమఠం మధ్య డ్రెయిన్ ముఖద్వారం వద్ద రెగ్యులేటరు, రోడ్డు వంతెన నిర్మించాలని, ఎల్‌ఎస్ ఛానల్ ఆధునికీకరణ ఆవశ్యకత గురించి కూడా వివరించినట్లు చెప్పారు.

కేంద్ర మంత్రి ఓఎస్డీగా కృష్ణ

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా అమలాపురం పట్టణానికి చెందిన కొమ్ముల కృష్ణమనాయుడు నియమితులయ్యారు. ఆయన ఆదాయపన్ను విభాగంలో డిప్యూటీ సెక్రటరీ హోదాలో ఉన్నారు.

ఉత్తరం రాద్దాం.. బహుమతి సాధిద్దాం

ఢాయీ ఆఖర్ లేఖల పేరిట తపాలా శాఖ పోటీలు

బిక్కవోలు, పెదపూడి, న్యూస్‌టుడే: స్టాంపుల సేకరణ (ఫిలాటలీ) అభిరుచిని ప్రజల్లో పెంపొందించాలనే ఉద్దేశంతో తపాలాశాఖ నాలుగేళ్లుగా ఏటా 'ఢాయీ ఆఖర్' లేఖల పేరిట పోటీలను ఏర్పాటు చేస్తోంది. 2025-26 సంవత్సరానికి కూడా పోటీలు నిర్వహిస్తోంది. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఉంటాయి. జాతీయ స్థాయిలో ప్రథమస్థానం సాధించిన వారికి రూ. 50,000, రాష్ట్రస్థాయిలో విజేతలైన వారికి రూ.25,000 నగదును తపాలాశాఖ అందిస్తుంది. ఈ ఏడాది 'నన్ను ప్రభావితం చేసే వ్యక్తి'(లెటర్ టు మై రోల్ మోడల్) అనే అంశంపై రాయాలి.

అవగాహన కల్పిస్తున్నాం..

ఈ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్నాం. ఆసక్తి ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలి. జాతీయ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు వరుసగా రూ. 50,000, రూ. 25,000, రూ. 10,000 నగదు బహుమతి లభిస్తుంది. రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు వరుసగా రూ. 25,000, రూ. 10,000, రూ. 5,000 నగదు లభిస్తుంది.
- కె.శేషారావు, సూపరింటెండెంట్, తపాలాశాఖ, రాజమహేంద్రవరం

అర్హులు ఎవరంటే..

ఈ పోటీలో పాల్గొనటానికి అందరూ అర్హులే. పోటీలను 18 ఏళ్ల వయసులోపు, 18 ఏళ్ల వయసు తరువాత అని వర్గీకరించారు. వీరు వయసుకు సంబంధించిన స్వీయ ధ్రువీకరణ పత్రం అందించాల్సి ఉంటుంది.

● అక్టోబరు 25 నాటికి నా వయసు 18 ఏళ్లలోపు లేదా, 18 ఏళ్లు పైన అని రాసి ఇవ్వాలి. ఈ నెల ఆరవ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

● పోటీలో పాల్గొనేవారు ఇన్‌ల్యాండ్ లెటరుపై రాస్తే 500 పదాలు, ఎన్వలాప్ కవర్‌లో పంపేవారు ఏ-4 కాగితంపై 1000 పదాలకు మించకుండా పంపాలి. రాసిన ఉత్తరాలను సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్‌ఆఫీసు, రాజమహేంద్రవరం పోస్టల్ డివిజన్, రాజమహేంద్రవరం పేరున పంపాలి.

● దరఖాస్తులు చేరాల్సిన చివరి తేదీ డిసెంబరు: 08

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో అర్హులందరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు చేరువ కావాలని ఎంపీ హరీష్‌మాథుర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన జిల్లా సమన్వయ, అభివృద్ధి(దిశ) సమావేశం నిర్వహించారు. వివిధ పథకాల అమలు తీరును ఎమ్మెల్యేలు, జేసీ, ఇతర అధికారుల సమక్షంలో సమీక్షించారు. పలుశాఖల అధికారులు పనితీరును మెరుగు పరచుకోవాలన్నారు. అన్ని శాఖల ఉన్నతాధికారులు విధిగా సమావేశానికి హాజరయ్యేలా చూడాలని జడ్పీ సీఈవో లక్ష్మణరావుకు సూచించారు. బుధవారం నిర్వహించిన సమావేశానికి జలవనరులు, డ్రెయిన్స్, రైల్వే, మరికొన్ని శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై ప్రజా ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కోటిపల్లి- నరసాపురం రైల్వే నిర్మాణ పనుల పురోగతిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జొన్నాడ ఫ్లైఓవర్ పనులు, అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాల నిర్మాణంపై సూచనలు చేశారు. రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణరావు, జేసీ నిశాంతి, డీఆర్వో కె. మాధవి అధికారులు పాల్గొన్నారు.

తాండవ అక్విడక్టు పనులు పూర్తిచేయాలి: ఎస్ఈ

తుని గ్రామీణం: మరో 20 రోజుల్లో తాండవ నదిపై అక్విడక్టు పనులు పూర్తి చేయాలని పోలవరం కాలువ ఎస్ఈ ఏసుబాబు స్థానిక అధికారులకు సూచించారు. తుని మండలంలోని పోలవరం కాలువ నిర్మాణ పనుల్లో భాగంగా సుమారు రూ. 65 కోట్లతో తాండవ నదిపై కత్రాళ్లకొండ నుంచి రేఖవానిపాలెం వరకు సుమారు 452 మీటర్ల పొడవు, 28 మీటర్ల వెడల్పున అక్విడక్టు పనులు చేపట్టారు. ప్రస్తుతం 90 శాతం పనులు పూర్తి చేసినట్లు ఈఈ గోవింద్ ఆయనకు వివరించారు.

దైవ దర్శనానికి వెళ్లివస్తుండగా ప్రమాదం

ఆటోచోదకుడి మృతి.. నలుగురికి గాయాలు

ప్రత్తిపాడు, కిర్లంపూడి, న్యూస్‌టుడే: దైవ దర్శనాలు చేసుకుని ఆటోలో వెళ్తున్న బృందం ప్రమాదంలో చిక్కుకుంది. ఈ ఘటన ప్రత్తిపాడు హైవే సమీపంలో పుత్తరేవు కూడలిలో బుధవారం జరిగింది. వివరాలివీ.. కిర్లంపూడి మండలం ముక్కొల్లు గ్రామానికి చెందిన దొడ్డ వీరలక్ష్మి, సాపిరెడ్డి గని లక్ష్మి, పోసిన సత్యనారాయణ, ఉమ్మిడి సీతామహాలక్ష్మి, ఆటోచోదకుడు రావు ఆదివిష్ణు(43)లు రాచపల్లి, ఇర్రిపాక తదితర ఆలయాలు దర్శించి ఇంటికి వస్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న ఆటోను ప్రత్తిపాడు సమీపంలో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి రాసుకుంటూ వెళ్లడంతో పక్కన ఉన్న విభాగినిని ఢీకొంది. ఆటోచోదకుడు ఆదివిష్ణు మృతి చెందగా వీరలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్తిపాడు సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడకు తరలించారు. మిగిలిన వారికి ప్రత్తిపాడు సీహెచ్‌సీలో డా.సౌమ్య, సిబ్బంది చికిత్స చేశారు. ఎస్సై లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీధిన పడిన కుటుంబం

ఆదివిష్ణు మరణంతో అతని కుటుంబం వీధిన పడింది. ముక్కొల్లులో ఉండే బంధువులు అందరూ ఆలయాలకు వెళ్దామంటే ఆదివిష్ణు ఆటోలో తీసుకెళ్లాడు. రాచపల్లి, ఇర్రిపాక శివాలయాలు దర్శించారు. ప్రత్తిపాడులో హైవే కూడలి దాటితే 30 నిమిషాల్లో అంతా ఇంటికి చేరేవారే. ఈలోగా వెనుక నుంచి ప్రమాదం చోటుచేసుకుంది. ఆదివిష్ణుకు భార్య, 17 ఏళ్ల లోపు ఇద్దరు అబ్బాయిలు, అమ్మాయి ఉన్నారు.

వైకాపా నాయకుల గృహనిర్బంధం

పి.గన్నవరం, న్యూస్‌టుడే: పి.గన్నవరంలో పలువురు వైకాపా నాయకులను పోలీసులు గృహనిర్బంధంలో ఉంచారు. వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తోందని ఆరోపిస్తూ నియోజకవర్గ స్థాయిలో ర్యాలీ చేపట్టేందుకు ఆ పార్టీ నాయకులు బుధవారం పిలుపునిచ్చారు. దీనికి అనుమతులు లేని కారణంగా మండల వైకాపా అధ్యక్షుడు యన్నాబత్తుల ఆనంద్‌తో సహా నలుగురిని గృహనిర్బంధంలో ఉంచామని ఎస్సై బి.శివకృష్ణ వెల్లడించారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	22,000
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	20,000-21,000
కొత్త (పచ్చి) కాయ	19,000-20,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	109-00
రిటైల్ లైవ్	134-00
డ్రెస్డ్	197-00
స్కిన్‌లెస్	224-00

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

Union Bank of India — A Government of India Undertaking
ద్వారపూడి బ్రాంచి, మెయిన్ రోడ్డు, ద్వారపూడి, ఫోన్.నెం. 9939131641

స్థిరాస్తుల అమ్మకం కొరకు వేలం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని 8(6)/9(1)ల నిబంధనలలో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం. 2002 ప్రకారం స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం నోటీసు)

ఇందుమూలముగా నోటీసు జారీచేస్తూ సాధారణ ప్రజానీకానికి మరియు "ఋణగ్రహీత(లు) & హామీదారు(లు)"లరు ప్రత్యేకముగా తెలుపునది ఏమనగా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యొక్క అధీకృత అధికారిచే లాంఛనంగా స్వాధీనం తీసుకొనబడిన బ్యాంక్ తనఖాలో/ ఛార్జీలో ఉన్న దిగువ పేర్కొన్న స్థిరాస్తిని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదారులు బకాయి పడిన దిగువ తెలిపిన బకాయిలు మొత్తం+వడ్డీ,కాస్ట్స్,ఇతర ఖర్చులతో సహా సదరు మొత్తం రాబట్టుకొనుటకు సదరు ఆస్తులను "ఎక్కడ ఉన్నది అలాగే" "ఏది ఉంటే అది & అక్కడ ఏది ఉన్నదో అలాగే" పద్ధతిలో తేది: 28.11.2025 న అమ్మకం చేయుటకు నిర్ణయించినారు.

ఇ-వేలం తేది & సమయం: 28.11.2025, మ॥12.00 గం॥ నుండి సా॥05.00 గం॥ వరకు

ఋణగ్రహీత: 1ఎ) మహేంద్ర రెడీమేడ్ మెసర్స్ చిరునామా: శ్రీ సాపిరెడ్డి శివ శంకర్, షాప్ నెం. 215, యం.జి.యన్.సి కాంప్లెక్స్, ద్వారపూడి, మండపేట మండలం - 533341. **1బి) శ్రీ సాపిరెడ్డి శివ శంకర్, తండ్రి: సాపిరెడ్డి శ్రీనివాస్,** డి.నెం. 8-50, బంట్రోతు వీధి, ద్వారపూడి, మండపేట మండలం - 533341. **హామీదారు: 2ఎ) శ్రీ భీమాల వీర వెంకట సత్యనారాయణ, తండ్రి: భీమాల సత్యనారాయణ** డి.నెం. 5-151/9, దివాన్ తోట, వేములపల్లి, ద్వారపూడి, మండపేట మండలం - 533341 వారు చెల్లించవలిసిన బకాయిమొత్తం తేది 07.06.2024 నాటికి **రూ.35,70,914.58/- (అక్షరాల ముప్పై ఐదు లక్షల డెబ్భై వేల తొమ్మిది వందల పద్నాలుగు రూపాయల యాభై ఎనిమిది పైసలు మాత్రమే)**+ తదుపరి వడ్డీ, కాస్ట్ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి.

స్థిరాస్తుల వివరములు

డా॥ బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా , మండపేట మండలం, ద్వారపూడి, యం.జి.యన్.సి కాంప్లెక్స్,షాప్ నెం. 126, ఆర్ యస్ నెం. 7/2 లో **శ్రీ సాపిరెడ్డి శివ శంకర్** చెందిన 95.50 చ॥గ॥ల విస్తీర్ణంలో ఉన్న కమర్షియల్ షాప్‌కు సంబంధించిన యావత్తు. **దీనికి హద్దులు: తూర్పు:** 26 అ॥- షెడ్యూల్ ఆస్తి సంబంధించిన ఉమ్మడి గోడ కొంతమేర మరియు ఖాళీ స్థలం కొంతమేరకు, **పడమర :** 26 అ॥- పోకల సత్యనారాయణకి చెందిన షాప్ నెం. 125 ఉమ్మడి గోడ కొంతమేర మరియు ఖాళీ స్థలం కొంతమేరకు, **దక్షిణం :** 11.09 అ॥-కాంప్లెక్స్ రోడ్, **ఉత్తరం :** 11.02 అ॥- అసోసియేషన్ కి చెందిన ఖాళీ స్థలము.

రిజర్వుధర: రూ.44,37,000/- ధరావత్తు: రూ.4,43,700/-

స్టాట్యుటరీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)/రూల్ 9(1)ల ప్రకారం చట్టబద్ధమైన 15 రోజుల విక్రయ నోటీసు. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క 8(6)/రూల్9(1) క్రింద పై ఋణం తీసుకొన్న ఋణగ్రహీత/లు మరియు హామీదారు/లకు పైన తెలిపిన తేదీన ఇ-వేలం జరుపబడుతుందని జారీ చేయబడుతున్న నోటీసుగా కూడా దీనిని పరిగణించాలి.

అమ్మకం యొక్క సవివరమైన, నియమ నిబంధనల కోసం ఈ వెబ్‌సైట్స్ https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx (or) www.unionbankofindia.co.in మరియు ఇ-వేలం పోర్టల్: వెబ్‌పోర్టల్: https://baanknet.comలో సందర్శించగలరు

తేది: 10.11.2025, ప్రదేశము: ద్వారపూడి, సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

EENADU eClassifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

FINANCIAL SERVICES

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభమైనదా లేదా నెలవారీ వడ్డీ పద్ధతిలో పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ, ✆ 73862 01191.

అన్ని రకముల లోన్స్ చేయించబడును నో CIBIL ప్రైవేట్ ఫైనాన్స్ ఇప్పించబడును. బంగారం విడిపించు కొనుటకు డబ్బులు ఇప్పించబడును. Cell: 96663 99944.

REAL ESTATE

LAND FOR SALE

GENERAL

రాజమండ్రికి 30 కి.మీ. దూరంలోగల మురారి - గండేపల్లి మధ్య నేషనల్ హైవేకి చేర్చి 100 అ॥ల రోడ్ ఫేసింగ్‌తో 60 సెంట్లు భూమి అమ్మబడును. (నో బ్రోకర్స్), ✆ 90329 88265.

తూర్పుగోదావరి జిల్లా, లింగంపర్తిలో గల వైఆర్‌సి కాలువ ఆనుకొని 52 ఎకరాల వ్యవసాయ భూమి ఎకరం 35 లక్షలకు అమ్మకమునకు కలదు. (నదిపాటి గోశాలకు 2 కిలోమీటర్ల దూరం), Contact Cell: 93909 91555.

JOBS

WANTED STAFF Ravindra High School. Exp. High School Teachers for English, Social, Science & Telugu, B.Tech. Graduates eligible. Sal: 20K to 22K, Location: Madiki, Vemagiri. ✆ 95334 31103, 91105 67164.

శ్రీనివాస గ్రూప్, VJA. ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/ వంట, బేబి కేర్‌కు వర్కర్లు కావలెను. భో+ వ+ జీతం. ✆ 92814 52843, 92814 52827

రామకృష్ణ గ్రూప్ Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు, ఇంటిపని, వంటపని, బేబికేర్ కొరకు స్త్రీ/పు కావలెను. భో+ వ+, జీతం: 16 - 18K. ✆ 9705297788, 9515108830.

శాఖాహార (వెజిటేరియన్) వంటలు, ఇంటిపని చేయుటకు కాకినాడ ఇంటిలో ఉంటూ ఏ బాదరబందీ లేని 35 సం॥లలోపు స్త్రీ కావలెను. ✆ 99853 57819, 94911 95169.

సేల్స్ మేనేజర్‌గా రాజమండ్రి కాకినాడ Livspace ఫ్రాంచైజ్‌లో పనిచేయుటకు కావలెను. 2-5 సం.ల సేల్స్ (ఇంటీరియర్, రియల్‌ఎస్టేట్) అనుభవం కలిగి ఉండాలి. మీ రెజ్యూమ్ vyshnosrigroup@gmail.comకు పంపండి. ✆ 96146 56789.

యాక్సెస్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ NGO సంస్థ వరి-AWD ప్రాజెక్ట్‌లో తూ॥గో॥ జిల్లాలో పనిచేయుటకు ఫీల్డ్ స్టాఫ్/ ఫీల్డ్ సూపర్‌వైజర్స్ కావలెను. అర్హత: ఇంటర్/ డిగ్రీ. Cont. Cell: 98857 35563.

రాజమండ్రి ఉమెన్స్ కాలేజ్ దగ్గర బ్రాహ్మణ కుటుంబంలో వంట చేయుటకు బ్రాహ్మణ ఆడ వంట మనిషి కావలెను. Contact Cell: 80991 91919.

MARKETING/ SALES

ప్రముఖ MNCలో మేనేజర్‌గా పని చేయుటకు డిగ్రీ బైక్ కలిగిన వారు సంప్రదించండి. Cell: +91 91218 56488 రాజమండ్రి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-05 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

రాజోలు
• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

ఉచిత మెగా క్యాన్సర్ వైద్యశిబిరం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఆత్రేయపురం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం ఎడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్, కిమ్స్, మెడ్ యునైటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ మెగా వైద్యశిబిరం, అవగాహన సదస్సు జరిగింది. 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అమలాపురం కిమ్స్ ఆసుపత్రి అధిపతి కేవీవీ సత్యనారాయణ రాజు(చైతన్యరాజు) ప్రారంభించారు. ఎడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండర్ ఛైర్మన్ భూపతిరాజు పందేటి సహకారం అందించారు. నాయకులు బండారు సంజయ్, ముదునూరి వెంకటరాజు, గాదిరాజు ప్రసాదరాజు, ముదునూరి రామరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ శిబిరం గురువారం కూడా కొనసాగుతుందన్నారు. ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

విద్యార్థులకు ప్రతిభా ప్రోత్సాహకాలు

మామిడికుదురు: పెదపట్నంలంక జడ్పీ ఉన్నత పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన 13 మంది విద్యార్థులకు శరత్‌చంద్ర ఫౌండేషన్ సీఈవో కొమ్ముల రాణి రూ.24 వేలు నగదు ప్రోత్సాహకాలను బుధవారం అందజేశారు. పదోతరగతి పరీక్షల్లో 600కు గాను 557 మార్కులు సాధించిన ముత్యాల సత్యశ్రీవల్లిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసచక్రవర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ✦ మామిడికుదురులోని ప్రభుత్వ బాలుర వసతిగృహానికి జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, ఎన్.హెచ్. డీఈ తులనేల శ్రీనివాసరావు రూ.40 వేలు విలువ చేసే వాషింగ్ మెషిన్‌ను బుధవారం అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు బి.చిరంజీవిరావు, ఉపాధ్యాయులు దాతను అభినందించారు.

గుంతల రోడ్లతో అవస్థలు పడుతున్నారా..?

రాజోలు, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో రాజోలు పంచాయతీ రాజ్ సబ్‌డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.వి.కృష్ణంరాజుతో 'ఫోన్ ఇన్' కార్యక్రమం జరగనుంది. రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల ప్రజలు గుంతల రోడ్లతో ఎదుర్కొంటున్న అవస్థలు, సూచనలు ఫోన్ ద్వారా తెలపొచ్చు. పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలకు సంబంధించిన వివరాలు తెలుసుకోవచ్చు. పంచాయతీరాజ్ రోడ్లకు సంబంధించిన సమస్యలను మాత్రమే వివరించాలి.

తేదీ: నేడు (గురువారం)
సమయం: ఉదయం 11 నుంచి 12 గంటల వరకు
సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 98661 34456

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174 పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట: 90323 93884

స్పందనకు వందనం

చెత్త తరలించారు

రావులపాలెం (గ్రామీణం), న్యూస్‌టుడే: రావులపాలెం మండలం పొడగట్లపల్లిలో రహదారి చెంత వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయి దుర్వాసన రావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి సుధాకర్ దృష్టికి తీసుకుని వెళ్లగా సిబ్బందిని పంపించి వాటిని దూరంగా తరలించారు.

మంచినీటి ట్యాంకుల శుభ్రం

మామిడికుదురు: ఆదుర్రు పరిధి కొమరాడలంకలోని మంచినీటి ట్యాంకుల నుంచి నీరు సక్రమంగా వచ్చేలా చూడాలని స్థానికులు చెప్పిన విషయాన్ని సర్పంచి బళ్ల శ్రీనివాసరావు, కార్యదర్శి బీవీవీ సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. గ్రామంలోని అన్ని ట్యాంకులను శుభ్రం చేయించి స్వచ్ఛమైన తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నారు.

డ్రెయినేజీ..

రావులపాలెం పట్టణం: రావులపాలెం మండలం ఊబలంకలో డ్రెయిన్ పూడిపోవడంతో మురుగునీరు పారక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి రాజు దృష్టికి తీసుకుని వెళ్లడంతో సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

రూ.కోట్ల నిధులు.. నెరవేరని ప్రయోజనం!

– న్యూస్‌టుడే, మామిడికుదురు

మామిడికుదురు, పి.గన్నవరం మండలాల్లోని 32 గ్రామాలతో అనుసంధానమైన నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీలో రూ.6.51 కోట్ల నిధులు నిల్వ ఉన్నా గత ఆరేళ్లుగా రైతులకు ఉపయోగపడే పనులేవీ చేపట్టకపోవడంతో ఆశించిన ప్రయోజనం నెరవేరడం లేదు. ఏటా రూ.కోట్ల మేర ఆదాయం వస్తున్నా అభివృద్ధి జాడ కరవైపోయింది. పన్నుల రూపేణా వచ్చే ఆదాయంలో 45 శాతం వివిధ పద్దుల కింద పోను మిగతా నిధులైనా అవసరాలకు వినియోగించకపోవడంతో అటు రైతులు, ఇటు కమిటీ సభ్యుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది.

నగరం మార్కెట్ కమిటీ ఆవరణలోని గోదాములు

మార్కెట్ కమిటీ ఆవరణలో వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న రెండు గోదాముల్లో ఒకటి పౌరసరఫరాల శాఖ బియ్యం బస్తాల నిల్వకు అద్దెకు తీసుకుంది. 2009 వరకు రూ.7 వేలు, 2015 నుంచి రూ.19 వేలు ఇచ్చే నెలవారీ అద్దెను దాదాపు రెండేళ్ల క్రితం రూ.35 వేలకు పెంచినా ఆ సొమ్ములు వసూలు కాకపోవడంతో ఇబ్బందులు నెలకొన్నాయి. పౌరసరఫరాల శాఖ ద్వారా మార్కెట్ కమిటీకి రూ.3 లక్షల వరకు బకాయిలు రావాలి. వీటిని వసూలు చేయడంతో పాటు ఖాళీగా ఉన్న మరో గోదామును ఉపయోగంలోకి తీసుకురావాలి. ఆవరణలో శిథిలమైన వ్యవసాయశాఖ భవనాలను తొలగించడంలోనూ, గెయిల్ ద్వారా మంజూరైన రూ.20 లక్షలతో పనులు చేపట్టడంలోనూ ఎటువంటి కదలికలు లేవు.

పేరుకుపోయిన బకాయిలు

రహదారులకు ప్రతిపాదనలు

అనుసంధాన రహదారులు, కల్వర్టులు నిర్మించేందుకు పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం. శీతల గిడ్డంగుల నిర్మాణానికి, ఆవరణలో మరో ద్వారం ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని సేకరించేందుకు దృష్టి పెట్టాం.

- పెనుమాల లక్ష్మి, ఏఎంసీ ఛైర్మన్, నగరం

చేపట్టాల్సిన పనులివీ..

వచ్చిన నిధుల్లో 20 శాతాన్ని రైతులకు అవసరమైన అనుసంధాన రహదారులు, కల్వర్టుల నిర్మాణాలకు వినియోగించాలి. రైతు కుటుంబాలకు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలు, పశువైద్యానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి. నగరం ఏఎంసీని ఆనుకుని సుమారు ఎకరా భూమిని సేకరించి శీతల గిడ్డంగులు నిర్మించాలన్న ప్రతిపాదనకు కార్యరూపం ఇవ్వడంతో పాటు స్థానికంగా రైతుబజారు ఏర్పాటు చేస్తే అన్నివిధాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

పన్నుల వివరాలు (శాతాల్లో)..	
పంట	వసూలు
వరి	2
ఉద్యానం	1
ఆక్వా	0.5

● 2022-25లో వచ్చిన ఆదాయం: రూ.5.89 కోట్లు

● రూ.3.94 కోట్లలో 25 శాతం సెంట్రల్ మార్కెటింగ్ ఫండ్, 20 శాతం పింఛన్లకు కేటాయింపు

రాజోలులో 'ఇంటింటా అంబేడ్కర్'

రాజోలు, న్యూస్‌టుడే: దళితుల ఆలోచనల్లో మార్పు రానంతవరకు అంబేడ్కర్ కలలుకన్న రాజ్యాధికారం అందని ద్రాక్షగానే మిగిలిపోతుందని దళితవేదిక నాయకులు అన్నారు. ఇంటింటా అంబేడ్కర్ కార్యక్రమంలో భాగంగా బుధవారం బొడ్డపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో రాజోలులోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విప్పర్తి సాయిబాబు, దేవ రాజేంద్రప్రసాద్, బత్తుల మురళీకృష్ణ, చిలకపాటి శ్రీధర్, లిఖితపూడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా పరిహారం పంపిణీ

రాజోలు, న్యూస్‌టుడే: మొంథా తుపానుతో నష్టపోయిన మత్స్యకారులందరికీ పరిహారం సక్రమంగానే అందిందని రాజోలు ఫిషర్‌మెన్ సొసైటీ ప్రెసిడెంట్ పొన్నమండ కొండబాబు అన్నారు. రాజోలులో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కూటమి నాయకులకు అనుకూలంగా పరిహారం అందించారంటూ వైకాపా నాయకులు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం ముందుందన్నారు.

ఆక్వా రైతులకు అవగాహన

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: ఆక్వా చెరువుల చుట్టూ పరిశుభ్రంగా ఉంటే రొయ్యల్లో వైరస్ సోకదని, నాణ్యమైన ఉత్పత్తులు సాధించవచ్చని ఎంపడా, నక్సా అధికారి సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం అంతర్వేదిలో రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం మొక్కలు పంపిణీ చేసి గట్లపై నాటించారు.

ఆలయ భూముల డిజిటల్ సర్వే

అయినవిల్లి, న్యూస్‌టుడే: ముక్తేశ్వరం ఆలయాలకు సంబంధించి తొత్తరమూడి పరిధిలోని పళ్ల స్వామి ఛారిటీస్, శ్రీకాకోళపు కృష్ణమూర్తి, వారణాశి సుబ్బారాయుడు సత్రాలకు చెందిన 1.61 ఎకరాల్లో అధికారులు బుధవారం డిజిటల్ సర్వే నిర్వహించారు. ఇక్కడ దుకాణ సముదాయం నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు అయినవిల్లి సిద్ధివినాయకస్వామి ఆలయ అధికారులు తెలిపారు. సుమారు 50 ఏళ్ల కిందట ఆక్రమణకు గురైన ఈ భూములను 2023లో దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకుంది. రానున్న పుష్కరాల నాటికి అభివృద్ధి చేయనున్నట్లు ఏసీ సత్యనారాయణరాజు తెలిపారు.

పేదల సొంతింటి కల నెరవేరుస్తాం

మలికిపురం, రావులపాలెం గ్రామీణం, పి.గన్నవరం, న్యూస్‌టుడే: అర్హులైన పేదలందరికీ సొంతింటి కలను నెరవేర్చడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు.

దేవరపల్లిలో ఎమ్మెల్యే సత్యానందరావు, ఆర్డీవో శ్రీకర్

ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై)-గ్రామీణ్ గృహనిర్మాణ పథకం నిధులతో మలికిపురంలో నిర్మించుకున్న ఇంటిని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీఎంఏవైలో రాజోలు నియోజకవర్గంలో 1,057 మంది ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. లబ్ధిదారుకు కొత్త దుస్తులు, తాళంచెవి అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషను డైరెక్టర్ గుబ్బల ఫణికుమార్, గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యవాణి, సర్పంచులు గెడ్డం రాజ్యలక్ష్మి, ఆనందకుమార్, ఎంపీటీసీ సభ్యురాలు జక్కంపూడి శ్రీదేవి, యుగంధర్, మల్లిపూడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. ✦ రావులపాలెం మండలం దేవరపల్లిలో సామూహిక గృహప్రవేశాల కార్యక్రమాన్ని కొత్తపేట ఆర్డీవో శ్రీకర్‌తో కలిసి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. ✦ పి.గన్నవరం మండలం పోతవరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, వైస్ ఎంపీపీలు చెల్లుబోయిన గంగాదేవి, పప్పుల సాయిబాబు, సర్పంచి వడలి కొండయ్య, నియోజకవర్గ తెదేపా కోకన్వీనర్ దాసరి వీరవెంకటసత్యనారాయణ పాల్గొన్నారు.

మలికిపురంలో లబ్ధిదారుకు కొత్త దుస్తులు అందిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మందలపల్లి గ్రామానికి చెందిన గారపాటి సూర్యనారాయణ, అనురాధ దంపతులు రూ.1,00,116 విరాళాన్ని బుధవారం సమర్పించారు. వీరికి స్వామివారి చిత్రపటం అందజేసి దేవస్థానం ఈవో నల్లం సూర్యచక్రధరరావు అభినందించారు.

✦ ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయ నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌లోని బాగ్‌అంబర్‌పేట్‌కు చెందిన గొల్లపూడి మారుతీ పట్టాభిరామారావు, శైలజ దంపతులు రూ.50,116 విరాళంగా సమర్పించారు. వీరికి స్వామివారి చిత్రపటం అందించి దేవస్థానం ప్రతినిధి దత్తు అభినందించారు.

పార్టీకి కార్యకర్తలే బలం

కొత్తపేట, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం అని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. బుధవారం కొత్తపేట కాపు కల్యాణ మండపంలో మండల, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు, గ్రామ, బూత్ కమిటీల ప్రమాణస్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై ముందుగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మండల, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు, గ్రామ, బూత్ కమిటీలతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలు, నాయకులకు స్వయంగా భోజనాలు వడ్డించారు. నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి రాంబాబు, రాష్ట్ర రైతు నాయకులు ఆకుల రామకృష్ణ, బండారు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే బండారు

కాలిబాటలు.. ప్రమాద కారకాలు

రాజోలు జాతీయ రహదారి పక్కన ఉన్న ఫుట్‌పాత్‌లు ప్రమాదకరంగా మారాయి. నాలుగేళ్ల క్రితం సోంపల్లి పుష్కరాల రేవు నుంచి రాజోలు పోలీస్‌స్టేషన్ వరకు రెండు కిలోమీటర్ల మేర వీటిని నిర్మించారు. ఇటీవల రాజోలు, సోంపల్లిలో జరిగిన ప్రమాదాలకు ఇవే కారణమయ్యాయి. ఈ విషయాన్ని హైవే ఏఈ వెంకటరమణ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి తొలగిస్తామన్నారు. – న్యూస్‌టుడే, రాజోలు

రంధ్రాలు పడి.. అధ్వానంగా మారి

పెదపట్నం పరిధి కొర్లగుంట పంటకాలువ తూము తలుపునకు రంధ్రాలు పడటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నీరు వృథా కావడంతో పాటు మానేపల్లి ఛానల్‌లో శివారుకు నీరు వెళ్లని పరిస్థితులు ఉన్నాయి. ఈ ఛానల్‌పై ఏడు గ్రామాల్లో సుమారు 1,900 ఎకరాల ఆయకట్టు ఉంది. మరమ్మతులు చేయిస్తామని ఏఈ రమేష్‌బాబు తెలిపారు. – న్యూస్‌టుడే, మామిడికుదురు

గుంతలు.. ప్రయాణికుల తిప్పలు

అమలాపురం-రావులపాలెం ప్రధాన రహదారిపై ముక్కామల వద్ద వంతెనపై గోతులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వీటిల్లో ప్రయాణికులు వాహనాలతో సహా పడిపోతున్నారు. తక్షణం మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై ర.భ.శాఖ ఏఈ రమేష్‌ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, అంబాజీపేట

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పి.గన్నవరం, న్యూస్‌టుడే: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్యానెల్ న్యాయవాదులు యడ్ల ఆదినారాయణరావు, అల్లు భాస్కరరావు, డి.బాలప్రతాప్ సూచించారు. పి.గన్నవరంలోని లక్ష్మి ఐ.టి.ఐ.లో బుధవారం ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకొనేలా లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని కోరారు. ఐ.టి.ఐ. కరస్పాండెంట్ రవిచంద్ర, ప్రిన్సిపల్ వి.ఎస్.ఎన్.మూర్తి, నక్కా కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో పాల్గొన్న న్యాయవాదులు

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ఆత్రేయపురం: ఈ నెల 14 నుంచి ఆత్రేయపురం, పేరవరం శాఖా గ్రంథాలయాల ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తమ్మా నమశ్శివాయ, నిర్మలా శ్రీదేవి తెలిపారు. పుస్తక ప్రదర్శన, వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు.

ఆలయాల్లో కార్తిక పూజలు

వ్యాఘ్రేశ్వరంలో మదనగోపాలస్వామి

అంబాజీపేట, ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని బుధవారం అంబాజీపేట మండలంలోని నందంపూడి, ఇరుసుమండ గ్రామాల్లోని ఆలయాల్లో స్వామివార్లకు లక్ష బిల్వార్చనలు, లక్షపత్రి పూజలు నిర్వహించారు. ఏకాదశరుద్రులను దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

ర్యాలి గ్రామంలో లక్ష బిల్వార్చన

కూటమి నేతల నిరసన

అయినవిల్లి, అంబాజీపేట, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణపై అసత్య ఆరోపణలు చేసిన నియోజకవర్గ వైకాపా కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు తక్షణం క్షమాపణలు చెప్పాలని కూటమి నేతలు డిమాండ్ చేశారు. బుధవారం ముక్తేశ్వరం కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. పోలిశెట్టి రాజేష్, సర్పంచులు కాకర శ్రీనివాసరావు, సలాది బుచ్చిరాజు, యోడిద దుర్గాప్రసాద్, కముజు రామప్రసాద్, మద్దా చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

● అంబాజీపేట నాలుగు రహదారుల కూడలిలో చేపట్టిన ఆందోళనలో అరిగెల సూరిబాబు, దొమ్మేటి సాయికృష్ణ, మహిపాల తాతాజీ, కొర్లపాటి గోపి, రవణం రాము, పేరాబత్తుల పెద్దసుబ్బరాజు, నాగవరపు అన్నవరం పాల్గొన్నారు.

ముక్తేశ్వరంలో నిరసన తెలుపుతున్న కూటమి నేతలు

వైకాపా శ్రేణుల ఆందోళన

అంబాజీపేట, మలికిపురం: వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైకాపా అంబాజీపేట మండల అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు బుధవారం అంబాజీపేట-గంగలకుర్రు రహదారిపై బైఠాయించారు. నిరసన ప్రదర్శనకు ఎలాంటి ముందస్తు అనుమతులు లేవని, ఆందోళన విరమించాలని పోలీసులు అడ్డుకున్నారు. కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ ఆదేశాలతో పి.గన్నవరం, రాజోలు సీఐలు రుద్రరాజు భీమరాజు, టి.వి.నరేష్‌కుమార్‌లు చర్చించడంతో ఆందోళన విరమించారు. పి.కె.రావు, జడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి, సర్పంచి కోట బేబిరాణి, కొర్లపాటి కోటబాబు తదితరులు పాల్గొన్నారు.

✦ మలికిపురంలో మండల శాఖ అధ్యక్షుడు అడబాల బ్రహ్మాజీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేశారు. ఉప తహసీల్దార్ ఎస్.శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇచ్చారు. వైద్యకళాశాలల ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు కోరారు. కర్రి పాపారాయుడు, జిన్నూరి బాబి, పాటి శివకుమార్, రుద్రరాజు చినరాజు, పాముల రాజేశ్వరీదేవి, కటకంశెట్టి ఆదిత్య, కేవీఎన్ రాజు పాల్గొన్నారు.

గంగలకుర్రులో రోడ్డుపై బైఠాయించిన నాయకులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
రాజోలు బ్రాంచ్ (00910), రాజోలు, డా.బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా

అమ్మకము కొరకు ముందస్తు ప్రకటన

SARFAESI చట్టం 2002 యొక్క సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 లోని రూల్ 8 (6) ప్రకారం జారీ చేయబడినది.

ఋ. చట్టబద్ధమైన వారసుల పేర్లు: (లేటు) శ్రీ మెల్లెల నాగేశ్వరరావు. (1) శ్రీమతి మెల్లెల దేవ లక్ష్మి ... (2) శ్రీ మెల్లెల వెంకట సూర్య కృష్ణ ... (3) శ్రీమతి కట్టా సాయి ప్రసన్న ... [illegible]

సహరుణగ్రహీత: శ్రీమతి కట్టా రామకృష్ణ మంగతాయారు ... [illegible]

లోన్ ఖాతా మరియు అకౌంట్ నెం: HTL:31186378930; Suraksha: 37249526301; Home Topup: 37839182198; HTL: 39675085900; Suraksha: 39713268961; Home Topup: 43756433231.

[illegible]

డిమాండ్ నోటీసు తేదీ: 28-07-2025 ... రూ. 28,10,340/- ... [illegible]

ఆస్తి వివరములు: శ్రీ మెల్లెల నాగేశ్వరరావు, తండ్రి: వెంకటరత్నం ... టైటిల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 1786/2007 ... [illegible]

తేది: 12-11-2025 అధీకృత అధికారి
ప్రదేశం: రాజోలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అమృతమూర్తికి అశ్రునివాళి



ప్రేమ, ఆప్యాయతలకు మారుపేరుగా మా అందరి హృదయాలలో సుస్థిరస్థానం సంపాదించి మా ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన శ్రీ తాడి సూర్యనారాయణరెడ్డి గారి అకాల మరణానికి చింతిస్తూ, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ...

శ్రీ తాడి సూర్యనారాయణ రెడ్డి గారు
జననం: 1946 మరణం: 03-11-2025
జొన్నాడ.

భార్య: శ్రీమతి అచ్చియ్యమ్మ

కుమారులు: తాడి సత్తిరెడ్డి, USA - కోడళ్లు: శ్రీమతి మోహిని, USA
తాడి శ్రీనివాస్‌రెడ్డి (బట్టి శ్రీను) - శ్రీమతి సూర్యప్రభ
కుమార్తె: వెలగల మల్లిక - అల్లుడు: శ్రీనివాస్‌రెడ్డి
మనుమలు: తాడి సోహన్ వెంకట సాయిరెడ్డి, USA, తాడి సూర్య తేజారెడ్డి
మనుమరాండ్రు: తాడి శ్రావ్య - పూర్ణ చంద్రశేఖర్‌రెడ్డి మునిమనుమరాలు: తాడి ఆరా
వెలగల రమ్య
తాడి అఖిలారెడ్డి, తాడి ఆశ్రిత ఈషారెడ్డి, USA
అన్నయ్య: తాడి సత్యనారాయణరెడ్డి (లేటు) - వదిన: శ్రీమతి పూర్ణహంస
తమ్ముళ్లు: తాడి రామకృష్ణారెడ్డి, USA - మరదళ్లు: శ్రీమతి ఉమా నాగేంద్ర వరకుమారి, USA
తాడి సుబ్బారెడ్డి - శ్రీమతి నాగమణి
చెల్లెలు: నల్లమిల్లి రాజేశ్వరి - బావ: సత్యనారాయణరెడ్డి మరియు కుటుంబసభ్యులు

పెద్దకార్యం: ది. 13-11-2025 గురువారం, జొన్నాడ గ్రామంలోని మా స్వగృహమునందు జరుగును.

(c) eenadu

అభినందిస్తున్న ఎంపీ హరీష్ మాధుర్

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి

అమలాపురం పట్టణం: అనంతపురం జిల్లాలో జరిగిన అండర్ -14 రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సెపక్‌తక్రా పోటీల్లో జిల్లా క్రీడాకారులు బంగారు పతకం సాధించారని జిల్లా సంఘం అధ్యక్షుడు తాతబాబు తెలిపారు. అమలాపురంలో ఎంపీ హరీష్ మాధుర్ క్రీడాకారులను బుధవారం అభినందించారు. శిక్షకులు యాండ్ర గౌతమ్, కేతా సాయిదుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

రైతుబజార్‌లో నిన్నటి ధరలు (కిలోకు)



అమలాపురం పట్టణం: టమాట - 30, వంకాయలు(నలుపు)- 75, తెలుపు - 50, బెండకాయలు - 53, పచ్చిమిర్చి - 42, కాకరకాయ - 42, బీరకాయలు - 58, క్యాబేజీ - 40, క్యారెట్ - 60, దొండకాయలు - 50, బంగాళదుంపలు - 25, ఉల్లిపాయలు - 26, గోరుచిక్కుళ్లు - 45, దోసకాయలు - 40, చిక్కుడుకాయలు -120, చేమదుంపలు - 43, కంద - 55, బీట్‌రూట్- 52, కీరదోసకాయలు -39, అల్లం - 82, క్యాప్సికం -90, చిలకడదుంపలు - 50, గుమ్మడి -30, ముల్లంగి -45, ఉసిరి -80, నిమ్మకాయలు -30.

ఒక్కొక్కటి చొప్పున: ఆనబకాయ -44, పొట్లకాయ -25, అరటికాయ -6, ఆకుకూరలు కట్ట - 10, కొత్తిమీర కట్ట -30, కొబ్బరికాయ - 25.

గ్రంథాలయ వారోత్సవాలకు వేళాయే..

• ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహణ

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలోని 13 గ్రంథాలయాలు ఉన్నాయి. వారోత్సవాల్లో భాగంగా వివిధ అంశాలపై గ్రంథాలయ పాఠకులకు అవగాహన కల్పించడంతోపాటు విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించనున్నారు.



అమలాపురంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయం

ఏర్పాట్లు పూర్తి చేశాం..

గ్రంథాలయ వారోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశాం. యువత, పిల్లలు అందులో పాలుపంచుకోవాలి. విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొనాలి.

-జి.వి.ఆర్.ఎస్.హెచ్.కె.వర్మ, గ్రంథాలయాధికారి, అమలాపురం

రోజూ ఒక్కో అంశంపై..

14న: గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ వేడుకలు, బాలల దినోత్సవం, **15:** పుస్తక ప్రదర్శన, **16:** గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ, **17:** కవి సమ్మేళనం, రచయితల సందేశాలు, **18:** విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, వక్తృత్వ, క్రీడల పోటీల నిర్వహణ, **19:** మహిళలకు పోటీల నిర్వహణ, రంగవల్లు, అల్లికలు నేర్పించడం, **20న:** వారోత్సవాల ముగింపు, డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన, సామూహిక పుస్తక పఠనం, వివిధ పోటీల విజేతలకు బహుమతుల అందజేత

ఈ ప్రాంతాల్లో..

- అమలాపురం పట్టణం, సవరప్పాలెం, ఉప్పలగుప్తం, భీమనపల్లి, అల్లవరం, గోడి, కొమరగిరిపట్నం.
- ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, కందికుప్ప, తాళ్లరేవు, కోరంగి

సౌర విద్యుత్తుపై ఆసక్తి

• పెరుగుతున్న వినియోగం

న్యూస్‌టుడే, యానాం

సౌర విద్యుత్తు వినియోగించి సహజ వనరులపై భారం తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సౌర విద్యుత్తు పథకం పట్ల యానాం వినియోగదారుల్లో ఆసక్తి పెరిగింది. గతంలో పుదుచ్చేరిలో దేశంలోనే అతి తక్కువ విద్యుత్తు ఛార్జీలు ఉండేవి. 2012లో జాయింట్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ అథారిటీ పరిధిలోకి వెళ్లడంతో ఛార్జీలు పెరుగుదల మొదలైంది. యూనిట్ 55 పైసలు ఉండే గృహ వినియోగ ఛార్జీలు ప్రస్తుతం కనిష్ఠ ధర రూ.2.70కు, గరిష్ఠ ధర రూ.7కు చేరింది. ఏపీతో పోల్చుకుంటే కాస్త తక్కువైనా బిల్లుల మోత పెరిగిపోవడం పట్ల ప్రజల్లో అలజడి మొదలైంది. ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్న వినియోగదారులకు 'ప్రధాన మంత్రి - సౌర గృహ ఉచిత విద్యుత్తు పథకం' మంచి అవకాశంగా కనిపిస్తోంది. ముందుగా కొంత పెట్టుబడి పెడితే ఛార్జీలు బాగా తగ్గుతాయని అంచనా వేస్తున్నారు.

రాయితీ ఇలా..

- ఒకటి, రెండు, మూడు కిలోవాట్లకు వరుసగా రూ.30వేలు, రూ.60వేలు, రూ.78వేలు రాయితీ ఇస్తున్నారు. బ్యాంకుల నుంచి 7 శాతం వడ్డీకి సులభ రుణం లభిస్తుంది. ఆన్‌లైన్ ద్వారా www.pmsuryaghar.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని యానాం విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ ముగ్గళ్ల వీర వెంకట సత్యనారాయణ తెలిపారు. ఈ పథకం గురించి మూడు నెలలుగా యానాంలో ప్రతివారం ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటే ఛార్జీల భారం తగ్గుతుందన్నారు.

చెల్లింపు ధర ఆంధ్రా కన్నా ఎక్కువ

సౌర గృహ విద్యుత్తు పథకం లబ్ధిదారులు వాడుకోగా మిగిలిన విద్యుత్తు గ్రిడ్‌కు సరఫరా చేస్తారు. దానికి చెల్లించే నగదు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పోల్చుకుంటే యానాంలో చాలా ఎక్కువ. ఏపీలో యూనిట్‌కు రూ.2.09 వరకు ఇస్తే.. యానాం రూ.5.77 చెల్లిస్తుంది.

సౌర విద్యుత్తు గృహం నమూనా

ముందుకు వస్తున్నారు..

2019 నుంచి 2024 వరకు 15 మంది మాత్రమే సౌర విద్యుత్తు వినియోగించుకుంటుండగా ఈ ఏడాది కొత్తగా 28 మంది ముందుకు వచ్చారు.

- వీర వెంకట సత్యనారాయణ, ఏఈ

నేడు తెదేపా కమిటీల ప్రమాణ స్వీకారం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ముమ్మిడివరం నియోజకవర్గ తెదేపా మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, పట్టణ, బూత్ స్థాయి కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం గురువారం ముమ్మిడివరం పల్లిపాలెంలోని పద్మావతి వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల బుచ్చిబాబు హాజరై కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తారని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ముమ్మిడివరం మండల తెదేపా అధ్యక్షుడిగా అర్ధాని శ్రీనివాసరావు, కాట్రేనికోన మండల తెదేపా అధ్యక్ష, కార్యదర్శులుగా చెల్లి సురేష్, ఇసుకపల్లి శివశంకర్, ఐ.పోలవరం మండల అధ్యక్ష, కార్యదర్శులుగా సాగిరాజు వెంకట సూర్యనారాయణవర్మ, బొంతు శ్రీరాములు, తాళ్లరేవు మండలానికి దూళిపూడి వెంకటరమణ, కట్టా త్రిమూర్తులు, ముమ్మిడివరం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులుగా కట్టా సత్తిబాబు, తాడి జానకిరామ్‌లు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

కష్టపడి పని చేయాలి

ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆనందరావు

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: మండల తెదేపా కమిటీల ప్రమాణ స్వీకారోత్సవాన్ని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారు. కష్టపడి పని చేయాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

అమలాపురం పట్టణం: 79939 35935, గ్రామీణం: 91000 20948
అల్లవరం: 91548 46718 , ముమ్మిడివరం: 80085 74166
కాట్రేనికోన: 79950 67044 ఉప్పలగుప్తం: 91548 46716

సమస్య: అమలాపురం విత్తనాలవారి కాలువగట్టుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. అటువైపు వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. **-ఈశ్వర్, గాంధీనగర్**

సమస్య: కాలేజీరోడ్డులో ప్రధాన రహదారి పక్కన చుట్టుపక్కల వారు చెత్త వేస్తున్నారు. ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారుతోంది. **-శ్రీనివాస్, వ్యాపారి.**

సమస్య: ఎత్తురోడ్డు దిగువన మురుగు కాలువలో పూడికలు పేరుకుపోయాయి. **-ఫణి, స్థానికుడు.**

సమస్య: నల్లవంతెన బైపాస్‌రోడ్డు చెత్త, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. **-శంకర్, స్థానికుడు**

సమస్య: కొంకాపల్లి కురసాలవారివీధి రోడ్డు దుమ్ము, ధూళితో నిండి అపరిశుభ్రంగా ఉంది. **-సతీష్, స్థానికుడు**

పరిష్కారం: విత్తనాలవారి కాలువగట్టు, కాలేజీరోడ్డు, ఎత్తురోడ్డు, నల్లవంతెన బైపాస్‌రోడ్డు, కురసాలవారివీధిల సమస్యలపై సచివాలయ కార్యదర్శులు స్పందించారు. పురపాలక సిబ్బందితో వాటిని తొలగింపజేశారు. **-న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం**

స్పందనకు వందనం

సమస్య: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని ఆసుపత్రి వీధిలో డ్రెయిన్ పూడిపోయి నీరు ముందుకు సాగడం లేదు. అధికారులు స్పందించి పూడిక తొలగింపునకు చర్యలు తీసుకోవాలి. **- కె.సింహాద్రి, స్థానికుడు**

సమస్య: నగర పంచాయతీ పరిధిలోని బళ్లగేటు సెంటర్ ప్రాంతంలో మురుగుకాలువ పూడికతో మూసుకుపోయింది. అధికారులు సమస్యను పరిష్కరించాలి. **- పి.వీరవెంకటసత్యనారాయణ, స్థానికుడు**

పరిష్కారం: నగర పంచాయతీ పరిధిలోని ఆసుపత్రి వీధి, బళ్లగేటు సెంటర్ ప్రాంతాల్లో డ్రెయినేజీ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా.. పారిశుద్ధ్య కార్మికులను పంపి సమస్యను పరిష్కరించారు. **- న్యూస్‌టుడే, ముమ్మిడివరం**

రాళ్లుతేలి రాకపోకలకు కష్టం

సిరిపల్లి- మునిపల్లి రహదారి పలుచోట్ల రాళ్ల తేలి గుంతలు పడటంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల ఈ రహదారికి మరమ్మతులు చేసినప్పటికీ ఫలితం లేదు. భీమనపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద రహదారి దుస్థితి ఇది. వాహనాల ధాటికి రాళ్లు వెనుక వచ్చే వారిపై పడి గాయాలవుతున్నాయి. **- న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం**

కొమ్మలు కాలువలో వదిలేశారు..!

మొంథా తుపాను ప్రభావంతో మండల వ్యాప్తంగా ఉన్న పంటకాలువల్లో పలుచోట్ల విరిగిపడిన చెట్లు, వాటికొమ్మలు చాలాచోట్ల నేటికి అలాగే వదిలేశారు. బలమైన ఈదురుగాలులు వీయడంతో చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్తు తీగలకు అడ్డుగా ఉండటంతో ఆ శాఖ సిబ్బంది కొన్నింటిని తొలగించారు. అవన్నీ ఎక్కడికక్కడ పంటకాలువల్లోనే ఉన్నాయి. సాగునీరు శివారు ప్రాంతాలకు ప్రవహించేలా సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, కాట్రేనికోన**

నిర్మించినా.. ఏం లాభం..!

అమలాపురం పట్టణంలోని సూర్యనగర్ శివారు అందంగా ఉన్న ఈ రహదారిని రూ.20 లక్షలతో నిర్మించారు. రహదారి అంచు పూర్తి చేయకపోవడంతో అటుగా వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. చీకటిలో ఏ మాత్రం చూసుకోకుండా వెళ్లినా ప్రమాదమే. **-న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం**

కార్తిక వనసమారాధన కరపత్రికలను ఆవిష్కరిస్తున్న యువకులు

అధిక సంఖ్యలో తరలి రావాలి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: శెట్టిబలిజల ఐక్యతను చాటేందుకు అమలాపురంలో నిర్వహించే కార్తిక వన సమారాధనకు అధిక సంఖ్యలో తరలిరావాలని సంఘ నాయకులు పిలుపునిచ్చారు. అమలాపురం రావులచెరువులో యువకులు శెట్టిబలిజ కార్తిక వనసమారాధన కరపత్రికలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దొంగ శ్రీను మాట్లాడుతూ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో వనసమారాధనకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి సంఘీయులు హాజరవుతారని తెలిపారు. ఈ నెల 16న కొంకాపల్లి ఎత్తురోడ్డు సత్తెమ్మతల్లి ఆలయం ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ప్రశాంతంగా సొసైటీ ఎన్నికలు

• తొలిసారి రహస్య బ్యాలెట్ పద్ధతిలో నిర్వహణ

అల్లవరం, న్యూస్‌టుడే: అల్లవరం మండలం బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని శ్రీవెంకటేశ్వర సాండ్, క్వారీ బోట్‌మెన్, ఫిషర్ మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు మొదటి సారి రహస్య బ్యాలెట్ పద్ధతిలో బుధవారం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలల్లో పోలింగ్ నిర్వహించారు. ఈ సొసైటీ 1976లో 40 మందితో ఏర్పాటైంది. ఆ సంఖ్య 360కు చేరింది. కొందరు మృతి చెందడంతో 309 మంది ఓటర్లు ఉన్నారు.

ఓట్ల లెక్కింపు నిర్వహిస్తున్న అధికారులు

బ్యాలెట్ పద్ధతి కావాలని..

ఈ సొసైటీకి ఎన్నికలు జరిగి ఏడేళ్లు కావస్తోంది. అప్పటి వరకు సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి చేతులు ఎత్తే పద్ధతిలో అధ్యక్షుడిని ఎంపిక చేసేవారు. ఇటీవల కొంత మంది సభ్యులు తమకు రహస్య బ్యాలెట్ విధానం కావాలని కలెక్టర్ మహేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఇక్కడ ఎన్నికలు అనివార్యంగా మారాయి.

పోటీలో 18 మంది

డైరెక్టర్లుగా పోటీ చేసేందుకు 19 మంది నామపత్రాలు దాఖలు చేయగా వారిలో ఒకరు ఉపసంహరించుకున్నారు. మిగిలిన 18 మంది బరిలో నిలిచారు. వీరిలో 9 మంది డైరెక్టర్లుగా ఎన్నికవుతారు. వారి నుంచి ఇద్దరిని అధ్యక్ష, కార్యదర్శి పదవులకు ఎన్నుకుంటారు. సొసైటీ ఏర్పాటైన తర్వాత బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ జరగడం ఇదే మొదటి సారి. [illegible]

284 మంది ఓటు హక్కు వినియోగం

బుధవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ మధ్యాహ్నం 3 గంటలతో ప్రశాంతంగా ముగిసింది. ఈ ఎన్నికల్లో 309 మంది ఓటర్లకు 284 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 3.45 గంటలకు లెక్కింపు ప్రారంభించి 12 రౌండ్‌లలో రాత్రి 8.30 గంటలకు పూర్తి చేశారు. గెలుపొందిన డైరెక్టర్లు అధ్యక్ష కార్యదర్శులను గురువారం ఎన్నుకుంటారు. అల్లవరం ఎస్సై సంపత్ కుమార్ బందోబస్తు నిర్వహించారు. అమలాపురం గ్రామీణ సీఐ ప్రశాంత్ కుమార్ ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించారు.

కష్టపడే వారికి పార్టీలో గుర్తింపు

అల్లవరం మండల తెదేపా అధ్యక్షుడిగా ఎన్నికైన సత్తిబాబురాజును సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అల్లవరం, న్యూస్‌టుడే: పార్టీలో కష్టపడి పనిచేసే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే ఆనందరావు అన్నారు. బుధవారం తెదేపా మండల, గ్రామ, బూత్ కమిటీ అధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు. అల్లవరం మండలం తెదేపా అధ్యక్షుడిగా [illegible] సత్తిబాబురాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం 21 గ్రామ కమిటీలను, నాలుగు క్లస్టర్లు, 24 యూనిట్ అధ్యక్షుల ఎన్నిక పూర్తి చేశారు. నియోజకవర్గ పరిశీలకుడు పెచ్చెట్టి బాబు మాట్లాడుతూ నియోజకవర్గ పార్టీ సూచించిన కార్యక్రమాలను అమలు చేయడంలో వెనుకబడుతోందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. నడింపల్లి సుబ్రహ్మణ్యం రాజు, కడలి వెంకటేశ్వరరావు, దాట్ల గోపీ రాజు, వేగిరాజు వెంకట్రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బూట్లు పంపిణీ

బూట్లు పరిశీలిస్తున్న సమగ్రశిక్షా జీఎంవో సుబ్రహ్మణ్యం, డీవైఈవో సూర్యప్రకాశం

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్రలో భాగంగా 91,078 మంది విద్యార్థులకు బూట్లు వచ్చాయని సమగ్రశిక్షా జీఎంవో సుబ్రహ్మణ్యం తెలిపారు. అమలాపురం జడ్పీ బాలుర పాఠశాల నుంచి వాటిని బుధవారం మండలాలకు తరలించారు. గతంలో అసమతుల్యమైన బూట్లకు బదులు ఈ నెల 28లోగా ఒకటి నుంచి పదో తరగతి బాలురకు 4,314, బాలికలకు 3,273 ఇవ్వాలని ఆదేశించారు.

పేదలకు సొంతింటి కల సాకారం

సీహెచ్ గున్నేపల్లిలో ఇంటిని ప్రారంభిస్తున్న నాయకులు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే పేదలకు సొంతింటి కల సాకారమవుతుందని తెదేపా నాయకులు గుత్తుల సాయి అన్నారు. సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమంలో భాగంగా ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలో సర్పంచి గొలకోటి దొరబాబు ఆధ్వర్యంలో గృహాలను ప్రారంభించారు. కార్యక్రమంలో అర్ధాని శ్రీనివాసరావు, గుద్దటి జమ్మి, యాళ్ల ఉదయ్, తహసీల్దారు టి.సుభాష్, కట్టా సత్తిబాబు, చిక్కాల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలి

కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతి అందజేస్తున్న వైకాపా నాయకులు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని వైకాపా నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వారు నల్లవంతెన నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినితి పత్రం అందజేశారు. పినిపే శ్రీకాంత్, బొమ్మి ఇజ్రాయిల్, చింతా అనురాధ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదంటూ వైకాపా నాయకులు బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పితాని బాలకృష్ణ, కాశి బాలమునికుమారి, జగతా బాబ్జి, కోలా బాబ్జి, పిన్నమరాజు శ్రీనురాజు, పెయ్యల చిట్టిబాబు, కుడిపూడి శంకరరావు, కాదా గోవింద తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలతో నేల సారవంతం

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: ఖరీఫ్, రబీ సాగుకు ముందు పచ్చిరొట్ట విత్తనాలను చల్లడం వల్ల నేల సారవంతం అవుతుందని ఐ.పోలవరం మండల వ్యవసాయాధికారి వాణి తెలిపారు. తిళ్లకుప్పలో హరిత బీఆర్‌సీ కేంద్రంలో తయారు చేసిన ఆర్‌డీఎస్ కిట్లు (పెసర, మినుము, పిల్లిపెసర, జీలుగ, జనుము, బొబ్బర్లు, జొన్న, రాగులు, సజ్జలు, నువ్వులు, తోటకూర, పాలకూర విత్తనాల మిశ్రమం)ను ఏవో బుధవారం పరిశీలించారు. రాజేష్, ఎంఎల్టీ తిరుమలరావు, ఎంటీ ఏడుకొండలు, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

కార్తిక వన సమారాధన

యానాం, న్యూస్‌టుడే: యానాం ఎలక్ట్రీషియన్, రీవైండింగ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్‌బీచ్‌లో బుధవారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. పుదుచ్చేరి ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు వర్మ, శ్రీనివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రైతు ఉత్పత్తుల సంఘం సమస్యలు తీర్చాలి

యానాం: ఎరువులు, పురుగుల మందులు, విత్తనాల విక్రయ లైసెన్సు జారీ సమస్య పరిష్కారానికి వ్యవసాయ, వాణిజ్యపన్నుల శాఖ కార్యదర్శి చౌదరి మహమ్మద్ యాసిన్ ఆదేశాలు జారీ చేశారని యానాం రైతు ఉత్పత్తుల సహకార సంఘం అధ్యక్షుడు మాజేటి సత్యభాస్కర్ తెలిపారు. పుదుచ్చేరిలో వివిధ అంశాలపై ఆయనతో చర్చించి వినతిపత్రాలు అందజేసినట్లు బుధవారం తెలిపారు.

ఆలయ భూముల డిజిటల్ సర్వే

అయినవిల్లి, న్యూస్‌టుడే: ముక్తేశ్వరం ఆలయాలకు సంబంధించి తొత్తరమూడి పరిధిలోని పళ్ల స్వామి ఛారిటీస్, శ్రీకాకోళపు కృష్ణమూర్తి, వారణాశి సుబ్బారాయుడు సత్రాలకు చెందిన 1.61 ఎకరాల్లో అధికారులు బుధవారం డిజిటల్ సర్వే నిర్వహించారు. ఇక్కడ దుకాణ సముదాయం నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు అయినవిల్లి సిద్ధివినాయకస్వామి ఆలయ అధికారులు తెలిపారు. సుమారు 50 ఏళ్ల కిందట ఆక్రమణకు గురైన ఈ భూములను 2023లో దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకుంది. రానున్న పుష్కరాల నాటికి అభివృద్ధి చేయనున్నట్లు ఏసీ సత్యనారాయణరాజు తెలిపారు.

పారపట్టిన ప్రధానోపాధ్యాయుడు

కాట్రేనికోన మండలం బలుసుతిప్ప జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో తాగునీటి ట్యాంకు వద్ద నీరు నిలిచిపోతోంది. విద్యార్థులు ఇబ్బంది పడటం చూసిన ప్రధానోపాధ్యాయుడు పీవీ సత్యనారాయణ స్పందించారు. నీరు ముందుకు సాగేలా పనులు చేయించారు. ఆయన సైతం స్వయంగా పారపట్టుకుని మట్టి, మురుగు తొలగించారు.

– న్యూస్‌టుడే, కాట్రేనికోన

మురుగు తొలగిస్తూ...

డ్రెయిన్‌లో పూడిక తొలగింపు

ఉప్పలగుప్తం, వానపల్లిపాలెం తదితర గ్రామాల్లో ముంపునీరు దిగే పాయకరావుకోడు డ్రెయిన్ తూడు, గుర్రపుడెక్కతో నిండిపోయింది. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఉప్పలగుప్తం నీటిసంఘం ఛైర్మన్ రవిశంకర్ కూలీల సాయంతో పూడికలు తొలగిస్తున్నారు.

– న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

తొలగింపు పనుల్లో నీటిసంఘం ఛైర్మన్ రవి

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మొబైల్‌పేట బ్రాంచ్, అమలాపురం, తూర్పుగోదావరి జిల్లా

సంక్షిప్త డిమాండ్ నోటీసు

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 సెక్షన్ 13(2) క్రింద - జారీ చేయబడిన నోటీసు 2002.)

I) రుణగ్రహీత పేరు మరియు చిరునామా: [illegible]

II) లోన్ ఖాతా నంబరు: H.L. 62273434887, Personal loan 42375805905

III) చెల్లించవలసిన బాకీ మొత్తము: [illegible] రూ.38,65,252/- [illegible]

IV) డిమాండ్ నోటీసు తేదీ : 24-10-2025 NPA Date : 22-05-2025

V) ఆస్తి వివరములు: [illegible]

[illegible]

తేది : 12-11-2025
ప్రదేశం : అమలాపురం

అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మండపేట
•మండపేట • రామచంద్రపురం

పండితులను సత్కరిస్తున్న నల్లమిల్లి శ్రీహరిరెడ్డి దంపతులు

అర్తమూరులో వేదపండితులకు సత్కారం

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: అర్తమూరులోని ఉమాఅగస్త్యేశ్వరస్వామి ఆలయంలో 12 ఏళ్లుగా కార్తిక మాస బ్రహ్మ ముహూర్తంలో శివాభిషేకాలు చేస్తున్న వేద పండితులను గ్రామానికి చెందిన ప్రముఖుడు నల్లమిల్లి శ్రీహరిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. తొలుత కరప బాలకృష్ణశర్మ ఆధ్వర్యంలో రుద్రహోమం, ద్వాదశ జ్యోతిర్లింగ అభిషేకం, రుద్రహోమం నిర్వహించారు.

సమాజసేవతోనే నిజమైన గుర్తింపు

కాజులూరు, న్యూస్‌టుడే: సమాజానికి చేసే సేవలతోనే నిజమైన గుర్తింపు లభిస్తుందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం అన్నారు. బుధవారం కాజులూరులో జనసేన నాయకుడు, ప్రవాస భారతీయుడు అన్యం శ్రీరామచంద్రమూర్తి పుట్టినరోజు వేడుకల్లో ఆయన మాట్లాడారు. తండ్రిబాటలో సమాజ సేవ చేస్తున్న ఆయనను అభినందించారు. అనంతరం వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లు, విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామచంద్రపురం నియోజకవర్గం కూటమి నాయకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1	మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు	కపిలేశ్వరపురం: 97044 16418 పామర్రు: 80085 74228

స్పందనకు వందనం

మురుగు పారుదలకు చర్యలు

సమస్య: మండపేట మండలం అర్తమూరు గ్రామం ఎస్సీకాలనీవీధి డ్రైనేజీలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు పారడంలేదు. – పి.అర్జునరావు, అర్తమూరు

పరిష్కారం: సమస్యను పంచాయతీ కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్‌కు తెలియజేయగా వెంటనే స్పందించారు. సిబ్బందిని పంపించి వ్యర్థాలు తొలగించే పనులు చేయించారు. - న్యూస్‌టుడే, ద్వారపూడి

చెత్తకుప్పలు తొలగించారు..

రాయవరం మండలం పసలపూడి గోపడితోటవీధిలో చెత్తకుప్పలు పేరుకుపోయాయి. సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా పంచాయతీ కార్యదర్శి ఎ.గోవిందరాజు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులతో చెత్తకుప్పలను తొలగింపజేశారు. - న్యూస్‌టుడే, రాయవరం

కుక్కలపై లెక్కలేనితనం

✦ శస్త్రచికిత్సల పేరిట మాయాజాలం

మండపేట, రామచంద్రపురం, న్యూస్‌టుడే: వీధి కుక్కలు క్రూరంగా మనుషులపై దాడులకు తెగబడుతుంటే అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గత 10 నెలల కాలంలో మండపేట, రామచంద్రపురం పట్టణాలతో పాటు నియోజకవర్గాల పరిధిలోని పలు ప్రాంతాల్లో 2,448 మందిని కరిచాయి. ఇలా రోజుకు 8 మంది వాటి కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. వీరిలో చిన్నారులు, విద్యార్థులు, వృద్ధులు, మహిళలు ఎక్కువగా ఉన్నారు. బాధితులకు వెంటనే ఏఆర్‌వీ వ్యాక్సిన్ అందకపోతే ర్యాబిస్ సోకి ప్రాణాంతకంగా మారుతోంది. అలాగే శునకాలకు కు.ని. శస్త్రచికిత్సలు చేయించడంలో అధికారుల వైఫల్యం కనపడుతోంది. ఈ కారణంగా వీటి సంతతి పెరుగుతోంది. గతంలో ఏజెన్సీ బృందాలు మండపేటలోనే బోన్లు ఏర్పాటుచేసి కుక్కలను పట్టుకుని శస్త్ర చికిత్సలు చేయగా అప్పట్లో కొంతవరకు పరిస్థితి అదుపులోకి వచ్చింది. ప్రస్తుతం అలాంటి ఏర్పాట్లు లేకపోవడంతో ఏ వీధిలో చూసినా శునకాలే కనిపిస్తున్నాయి. ఇటీవల సుప్రీంకోర్టు ఈ విషయమై తీవ్రంగా స్పందించి జనావాసాల నుంచి శునకాలను దూరంగా తరలించాలని ఆదేశించడంతో అధికారులు ఆ దిశగా చర్యలు చేపడుతున్నా కొన్నిచోట్ల మొక్కుబడిగా మారిందనే విమర్శలు వస్తున్నాయి.

మండపేటలో శునకాలకు శస్త్రచికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది (పాతచిత్రం)

కుక్కకాటుతో చికిత్స పొందుతున్న చిన్నారి

ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు వరకు కుక్కకాటు బాధితులు..

పట్టణం	సీహెచ్‌సీ/ ఏరియా ఆస్పత్రి	యూహెచ్‌సీ/ పీహెచ్‌సీ
మండపేట	1321	127
రామచంద్రపురం	794	871

● రామచంద్రపురంలో ఇటీవల బాలుడిపై కుక్క దాడికి పాల్పడితే మంత్రి సుభాష్ స్పందించి పట్టించాలని చెప్పినా అధికారులు పట్టించుకోలేదు.

పట్టణాల్లో ఇదీ పరిస్థితి..

వీధికుక్కలు ఎక్కువగా పాఠశాలలు, హోటళ్లు, కళాశాలలు, ఆసుపత్రులు, కబేళాలు, మాంసం దుకాణాలు, బస్టాండ్ల పరిసరాల్లో విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. పాఠశాలలకు వెళుతున్నా పిల్లల వెంట పడుతున్నాయి. వృద్ధులు, మహిళలను వెంబడిస్తున్నాయి. మండపేట ఇందిరాగాంధీ బైపాస్‌రోడ్డు దిబ్బగరువు దూళ్ల పాకల్లోకి చొరబడి దూడపిల్లల్ని చంపితిన్న ఘటనలు గతంలో వెలుగులోకి వచ్చాయి. హోటళ్లు, పాఠశాలలు, చెత్తకుప్పల వద్ద ఆహారం సులభంగా దొరకడం, కొత్తకాలనీలు, ఇళ్లు పెరగడంతో వీటి సంఖ్య పెరుగుతోంది. మరోవైపు శస్త్రచికిత్సలు నిర్వహించే పశు వైద్యులు, సిబ్బంది కొరతతో ఇవి పెరుగుతున్నాయి.

ఎక్కడెక్కడ ఎలా అంటే..

● మండపేట పట్టణంలోని 30 వార్డుల్లో 1600 వరకు కుక్కలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీటిలో కొన్నింటికి కాకినాడలోని స్నేహ ఏజెన్సీ ద్వారా శస్త్రచికిత్సలు చేయించారు. ఇంకా 100 వరకు ఉన్నాయని, వాటిని ఏజెన్సీ సిబ్బంది పట్టుకుని ప్రత్యేక వాహనంలో తరలిస్తారని మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావు చెప్పారు. ● రామచంద్రపురం పట్టణంలోని 28 వార్డుల పరిధిలో 4000 కుక్కలు ఉండగా వీటిలో 1500 జీవాలకు ఆపరేషన్లు చేయించినట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. వీటిని పట్టుకోడానికి ప్రత్యేకంగా వాహనాన్ని తయారుచేయించామని, రెండు పట్టణాల్లో తిరుగుతుందని మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు.

● వీధికుక్కలను నిత్యం పట్టివేస్తూ శస్త్రచికిత్సలు చేస్తుండాలి. యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి. చెత్తకుప్పలను ఎక్కడికక్కడ సకాలంలో తొలగించాలి.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం శాఖ గ్రంథాలయంలో శుక్రవారం నుంచి జాతీయ వారోత్సవాలు నిర్వహిస్తామని గ్రంథాలయాధికారి డి.శివకుమారి తెలిపారు. ఆ రోజు ఉదయం బాలల దినోత్సవం, వారోత్సవాల ప్రారంభం, 15న పుస్తక ప్రదర్శన, 16న పాఠశాల స్థాయి విద్యార్థులకు వ్యాసరచన, 17న చిత్రలేఖనం, 18న క్విజ్, 19న మహిళా సాధికారితపై చర్చ, బాలికలకు రంగవల్లుల పోటీలు, 20న ముగింపు సభ జరుగుతాయని వివరించారు. పోటీల్లో విజేతలైన వారికి ముగింపు వేడుకల్లో బహుమతులు అందిస్తామన్నారు.

ఐఎస్‌ఎన్‌కు ఎమ్మెల్యే పరామర్శ

మండపేట, న్యూస్‌టుడే: మాతృవియోగంతో బాధపడుతున్న యినపకోళ్ల సత్యనారాయణ (ఐఎస్‌ఎన్)ను రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు బుధవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఐఎస్‌ఎన్ మాతృమూర్తి సత్యవతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ, పలువురు కౌన్సిలర్లు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ఐఎస్‌ఎన్‌ను పరామర్శించిన వారిలో ఉన్నారు.

59 మందికి గృహ మంజూరు పత్రాల అందజేత

లబ్ధిదారుకు గృహ అనుమతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) అర్బన్ 2.0 పథకం ద్వారా ఎంపికచేసిన 59 మంది లబ్ధిదారులకు గృహాల మంజూరు పత్రాలను రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అందించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులందరూ పథకాన్ని సద్వినియోగం చేసుకుని సొంత గృహాలు నిర్మించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కూటమి నాయకులు, మున్సిపల్, గృహ నిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రావుల చెరువు అభివృద్ధికి కృషి

మండపేట: అమృత్ 2.0లో ఎంపికైన 19వ వార్డులోని రావుల చెరువును మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. బుధవారం మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కమిషనర్ టి.వి. రంగారావు, అధికారులతో కలిసి పరిశీలించారు. చెరువు అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. తెదేపా నాయకుడు జొన్నపల్లి సూర్యారావు, కొవ్వాడ అప్పన్నబాబు, శెట్టి రవి తదితరులు పాల్గొన్నారు.

గొల్లపుంతలో గోపూజలు

మండపేట: గొల్లపుంతలోని విశ్వహిందూ పరిషత్ ప్రఖండ్ గోశాలలో శ్రీకామేశ్వరి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గోపాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని గోవులకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అయినవిల్లి రుద్రశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడిపై ప్రజాసంఘాల ఆగ్రహం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం పట్టణంలోని 5వ తరగతి విద్యార్థిని చిర్రా రంజితను క్రూరంగా హతమార్చిన నిందితుడు పెయ్యల వీరవెంకట శ్రీనివాస్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేస్తూ విద్యార్థి సంఘాలు, దళిత, ప్రజా సంఘాల నేతల ఆధ్వర్యంలో బుధవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కొండేపూడి ఉదయ్‌కుమార్, నియోజకవర్గ కన్వీనర్ చిర్రా సురేష్, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధు, ప్రజాసేన నాయకులు కాశీ సుబ్రహ్మణ్యం, దూళి జయరాజు, ఖండవిల్లి శ్రీనివాస్, చిర్రా రాజ్‌కుమార్ తదితరులు మాట్లాడారు. కేసు విచారణ ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటుచేయాలని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. చిన్నారుల భద్రతకు పాఠశాలల్లో సీసీ కెమెరాలు పెట్టాలని, సిబ్బంది పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రదర్శనకు ముందు రంజిత తల్లిదండ్రులు చిర్రా సునీత, రాజు, ప్రజా సంఘాల నాయకులు బాలికకు నివాళులర్పించారు. రామచంద్రపురం రాజగోపాల్‌సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ప్రదర్శన సాగింది. బీసీస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షేక్ అలీ, ఎమ్మార్పీఎస్ నాయకులు చింతా రాజారెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు మండపల్లి చిట్టిబాబు, దొమ్మలపాటి సత్యనారాయణ, బాష్యం స్కూల్, విశ్వ జూనియర్ కళాశాల, మోడరన్, సెయింట్ ఆన్ గ్లోరియా విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాలీలో బాలిక తల్లిదండ్రులు రాజు, సునీత, నాయకులు

టిడ్కో ఇళ్లలో పోలీసుల తనిఖీ

అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న డీఎస్పీ రఘువీర్

మండపేట, న్యూస్‌టుడే: దిల్లీలో పేలుడు నేపథ్యంలో రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారుజామున గొల్లపుంతలోని టిడ్కో గృహాల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండపేట, రామచంద్రపురం పట్టణాలకు చెందిన 80 మంది పోలీసులు 13 బృందాలుగా ఏర్పడి 1600 ఇళ్లను పరిశీలించారు. రికార్డులు లేని 25 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని ఓ అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ రఘువీర్ చెప్పారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారు, గంజాయి విక్రయించేవారు, అధిక మొత్తంలో బంగారం నిల్వలు, నగదు, చోరీ వాహనాలను గుర్తించేందుకు, అనుమానిత వ్యక్తులు, పాత నేరస్థులను గుర్తించేందుకు విస్తృత తనిఖీలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మండపేట సీఐ డి.సురేష్, రూరల్ సీఐ దొరరాజు, రామచంద్రపురం సీఐ వెంకటనారాయణ, ఎస్సైలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

నిరంతరాయంగా బ్యాంకింగ్ సేవలు

రాయవరం: ఖాతాదారులకు నిరంతరాయంగా బ్యాంకింగ్ సేవలు అందించేందుకు యూబీఐ కృషిచేస్తోందని యూబీఐ వెదురుపాక శాఖ మేనేజర్ ఎల్.మహేష్ అన్నారు. గ్రామంలో శాఖా కార్యాలయాన్ని ప్రారంభించి రెండు దశాబ్దాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని సీనియర్ ఖాతాదారులు బుధవారం కేక్‌కోసి వేడుకలు నిర్వహించారు. ప్రస్తుతం రూ.75 కోట్ల టర్నోవర్‌తో ఉన్న శాఖ ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ సేవలు అందిస్తున్నామన్నారు. సీనియర్ ఖాతాదారులు సుబ్రహ్మణ్యం, హరిశ్చంద్ర, వడ్డాది రాంబాబు, యానిమేటర్లు నాగమణి, ప్రసన్నకుమారి, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం

మండపేట: పాఠశాలల్లో చదువుతో పాటు క్రీడల్లో రాణించేవారిని ప్రోత్సహించాలని మండపేట పట్టణ సీఐ డి.సురేష్ కోరారు. ఎంపీఎస్ పాఠశాలలో వార్షిక క్రీడా పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. క్రీడాజ్యోతి వెలిగించి పోటీలు ప్రారంభించారు. మూడు రోజుల పాటు వివిధ పోటీలు నిర్వహిస్తామని కరస్పాండెంట్ వల్లూరి చిన్నారావు తెలిపారు.

ఇక్కడే పోయాలా..?

మండపేట పట్టణంలోని 16వ వార్డులోని వీధుల్లో సేకరించిన వ్యర్థాలు, తొలగించిన చెట్లకొమ్మలు, ఆకులు, ఇతరత్రా వ్యర్థాలను చంద్రబాబు ఉద్యాన వనం ప్రహరీ, సమీపంలోని శ్రీరామ మందిరం, కమ్యూనిటీ హాలు ఎదురుగా రోడ్డు పక్కన గుట్టగా పోస్తున్నారు. ఎండకు ఎండి.. వర్షానికి తడిసి, గాలికి ఎగురుతూ చెల్లాచెదురుగా పడున్నాయి. ఎప్పటికపుడు వీటిని తొలగించాల్సిన మున్సిపల్ సిబ్బంది మరింత చెత్తవేసి వ్యర్థాలు పెరిగేలా చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.సత్తిరాజు వద్ద ప్రస్తావించగా వ్యర్థాలను వెంటనే తరలించే పనులు చేపడతామని తెలిపారు. - న్యూస్‌టుడే, మండపేట

పాదులతో ప్రమాదం..

మండపేట మండలం జడ్.మేడపాడు రైల్వేగేటు సమీపంలో విద్యుత్తు స్తంభాన్ని పిచ్చిమొక్కల పాదులు, తీగలు అల్లుకున్నాయి. స్తంభం సమీపంలోంచే వాహనాల రాకపోకలు ఎక్కువగా సాగుతుంటాయి. ఎప్పుడే ప్రమాదం ముంచుకొస్తుందోనని చోదకులు భయాందోళన చెందుతున్నారు. దీనిపై విద్యుత్ శాఖ ఏఈ రవికుమార్‌ను వివరణ కోరగా స్తంభాన్ని అల్లుకున్న తీగలను వెంటనే తొలగిస్తామన్నారు. - న్యూస్‌టుడే, ద్వారపూడి

క్రీడా ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులు

ప్రాంగణాన్ని శుభ్రం చేయిస్తున్న ఛైర్మన్ నాయుడు

రామచంద్రపురం: పట్టణవాసులు నిత్యం వ్యాయామం, నడక, క్రీడా సాధనకు ఉపయోగించే కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణాన్ని బుధవారం శుభ్రం చేశారు. చెత్త, గడ్డి పెరిగిపోయి ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో నడక దారిలో వ్యర్థాలను తొలగించారు. విద్యా ట్రస్టుబోర్డు ఛైర్మన్ నాయుడు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి సహకారంతో ప్రాంగణంలో పనులు చేపట్టారు. చైతన్య రైస్‌మిల్ అధినేత చింత వెంకటరెడ్డి (బాబులు) సమకూర్చిన బ్లేడ్ ట్రాక్టర్‌తో పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించారు.

వన సమారాధనలు ఐక్యతకు ప్రతీకలు

విద్యుత్తు ఉపకేంద్రం వద్ద దామోదర పూజలో అధికారులు

రాయవరం, న్యూస్‌టుడే: కార్తిక వన సమారాధనలు ఐక్యతకు ప్రతీకలని ఏపీ ఈపీడీసీఎల్ మండపేట ఏడీఈ సీహెచ్.శ్రీధర్ అన్నారు. బుధవారం రాయవరం విద్యుత్తు ఉపకేంద్రంలో ఉద్యోగుల వన సమారాధనలో ఆయన మాట్లాడారు. ముందుగా ఉసిరిచెట్టు వద్ద దామోదరునికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ, గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ వుండవిల్లి రాంబాబు, ఎస్ఎంసీ ఛైర్మన్ దేవిశెట్టి చిన్ని, రామచంద్రపురం సబ్ డివిజనల్‌లోని పదకొండు ఉప కేంద్రాల ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

16న శెట్టిబలిజ వనసమారాధన

ద్రాక్షారామ: రామచంద్రపురం గ్రామీణ మండలంలోని తాళ్లపొలంలో ఈనెల 16న నియోజకవర్గ శెట్టిబలిజ వన సమారాధన నిర్వహిస్తామని ఆ సంఘం తాలూకా అధ్యక్షుడు కట్టా సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమానికి సంబంధించి గోడపత్రికలను బుధవారం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. పట్టణంతో పాటు మూడు మండలాల పరిధిలోని కులస్థులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి కట్టా గోవిందు, మేడిశెట్టి ఇజ్రాయెల్ టేకుమూడి సత్యనారాయణ, వల్లు శివ, కడలి రాంపండు, పెంకే సత్యనారాయణ, ఎల్లమిల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌పీఎం గ్రామసభలు

అంగర: పడమరఖండ్రికలో బుధవారం ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (ఎల్‌పీఎం)పై గ్రామసభలు నిర్వహించారు. తహసీల్దార్ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ సంయుక్త ఎల్‌పీఎంలున్న రైతులు విభజన చేయించుకోవాలని సూచించారు. ఎల్‌పీఎం దరఖాస్తుకు రూ.50 చెల్లించాల్సి ఉంటుందని, డిసెంబరు నెలాఖరుతో గడువు ముగుస్తుందని చెప్పారు. దీని ద్వారా అన్నదాత సుఖీభవ, పీఎంకిసాన్ తదితర ప్రభుత్వ పథకాలకు అర్హత పొందుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచి తిరునాతి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు పెద్దిరెడ్డి శేషారత్నం, వీఆర్వో టి.సత్యనారాయణ, సర్వేయర్ టి.కుమార్, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత అందిపుచ్చుకోవాలి

పామర్రు, న్యూస్‌టుడే: ప్రస్తుత సమాజంలో పలు రకాలుగా జరుగుతున్న ఆర్థిక దోపిడీలను అరికట్టాలంటే విద్యార్థులంతా ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలని డీసీసీబీ ఛీఫ్ మేనేజర్ ఏవీ హనుమంతరావు అన్నారు. కె.గంగవరం ఉన్నత పాఠశాలలో డీసీసీబీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మన ఆర్థిక వ్యవస్థ, బ్యాంకుల దోహదం అంశంపై బుధవారం వ్యాసరచన, వృక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. బ్యాంకింగ్ లావాదేవీలు సురక్షితంగా నిర్వహించే పద్ధతులు, సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తెలియని నంబర్ల నుంచి ఓటీపీలు వస్తే చెప్పకూడదని అవగాహన కల్పించారు. డీసీసీబీ మేనేజర్ జి.సూర్యారావు, కార్యక్రమ సమన్వయకర్తలు సుమతి, లల్లి, ఉపాధ్యాయులు పితాని శ్రీనివాసు, జి.ఏడుకొండలు, వి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న డీసీసీబీ ఛీఫ్ మేనేజర్, హెచ్ఎం తదితరులు

రైతు వద్దకే వెళ్లి ధాన్యం కొనుగోలు

పామర్రు, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఊపందుకొంది. బుధవారం కె.గంగవరం మండలం దంగేరులో రైతు సేవా కేంద్రం ద్వారా పలువురు అధికారులు కళ్లాల వద్దకు వెళ్లి ధాన్యం కొనుగోలు ప్రారంభించారు. సర్పంచి కొప్పిశెట్టి వెంకటరమణ రైతుకు ట్రక్ షీట్ అందించారు. సొసైటీ సీఈవో పద్మ, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

దంగేరులో రసీదు అందిస్తున్న సర్పంచి, అధికారులు

వరి పొలాల్లో కాల్చవద్దు

పామర్రు: వరి కోతల అనంతరం పొలాల్లోని వరి మూడులను ఎట్టిపరిస్థితుల్లోనూ కాల్చకూడదని ఏవో ఎ.సద్గురుమూర్తి కోరారు. మండలంలోని అద్దంపల్లి, విలాసగంగవరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వరికోతల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన వివరించారు. కోయగా మిగిలిన మూడులను కాల్చడం వల్ల భూమిలోని సూక్ష్మజీవులు నశించి భూసారం తగ్గిపోతుందని చెప్పారు. రైతుల సందేహాలకు సమాధానాలిచ్చారు. గ్రామపెద్ద, రైతు సత్తిరాజు (పెదకాపు), సొసైటీ అధ్యక్షుడు దూడల నరేష్, మాజీ అధ్యక్షుడు కొప్పిశెట్టి నారాయణరావు (బుజ్జి), వీఏఏ భవాని, పలువురు రైతులు పాల్గొన్నారు.

అనధికార లేఔట్లలో రాళ్ల తొలగింపు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని కాకినాడ రోడ్డు సర్వే నం.329/పిలోని కొంతభాగాన్ని లేఔట్ అనుమతులు లేకుండా అనధికారికంగా విభజిస్తూ రాళ్లు పాతారనే సమాచారంతో టీపీవో శేషగిరి ఆధ్వర్యంలో పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు, సిబ్బందితో వెళ్లి బుధవారం వాటిని తొలగించారు. సంబంధిత యజమాని అనుమతులు తీసుకున్న తర్వాతే ప్లాట్లుగా విభజించి విక్రయాలు చేయాలని శేషగిరి సూచించారు. అనుమతులు లేకుండా లేఔట్లు ఏర్పాటు చేయవద్దని, వాటిలో ప్లాట్లను కొనుగోలు చేయవద్దని కోరారు.

వైకాపా నేతల నిరసన ర్యాలీలు

కేశవరంలో ఎమ్మెల్సీ తోట, జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు

మండపేట, మండపేట గ్రామీణం, రామచంద్రపురం, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా శాసనమండలి సబార్డినేట్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో బుధవారం మండపేటలో ద్విచక్రవాహనాల ర్యాలీ నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపి తహసీల్దారు తేజేశ్వరరావుకు వినతిపత్రం అందించారు.
● కేశవరం గ్రామంలో ఎమ్మెల్సీ తోట ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. వైకాపా కోనసీమ జిల్లా పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ సంతకాలను రాష్ట్ర గవర్నర్‌కు అందిస్తామన్నారు.
● రామచంద్రపురం పట్టణంలో నియోజకవర్గం వైకాపా ఇన్‌ఛార్జి పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం సమీపంలోని వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి అనంతరం ఆర్డీవో డి.అఖిలకు వినతిపత్రం సమర్పించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, జడ్పీటీసీ సభ్యుడు వనుము సుబ్బారావు, ఎంపీపీ అంబటి భవాని తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ

రామచంద్రపురం: కోనసీమ జిల్లాస్థాయిలో బుధవారం సెట్‌రాజ్ నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభచూపి 3 విభాగాల్లో ప్రథమ బహుమతులు పొందారని ప్రిన్సిపల్ సీహెచ్.రామకృష్ణ తెలిపారు. జానపద బృంద నృత్యం, జానపద గేయాలాపన, చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు ప్రథమ బహుమతులు సాధించిన సందర్భంగా బుధవారం కళాశాలలో అభినందించారు.

మాజీ సర్పంచి సత్యనారాయణ మృతి

పామర్రు, న్యూస్‌టుడే: కె.గంగవరం మండలం ఊడిమూడి మాజీ సర్పంచి, సీనియర్ నాయకుడు యర్రంశెట్టి సత్యనారాయణ మృతి వైకాపాకు తీరనిలోటని నియోజకవర్గం పార్టీ ఇన్‌ఛార్జి పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. బుధవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎంపీపీ పంపన నాగమణి, మాజీ ఎంపీపీలు వి.సూర్యచంద్రరాజశేఖర్, పెట్టా శ్రీనివాసు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ పండు గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

నమోదుతో అభయం..

న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం

అసంఘటిత రంగ కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా క్షేత్రస్థాయిలో వారి చెంతకు చేరడం లేదు. ప్రచార లోపాలతో పాటు పథకాలపై అవగాహన కొరవడి వినియోగించుకునేవారు తక్కువ సంఖ్యలో ఉంటున్నారు. మండపేట మండలం రాయవరం గ్రామంలో గత నెల 8న బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడులో యజమాని సహా 10 మంది కార్మికులు మృతిచెందారు. వీరిలో ఎవరూ ఈ-శ్రమ్ పోర్టల్ ద్వారా పేర్లు నమోదు చేయించుకోలేదు. వివరాలు నమోదు చేసుకుని ఉంటే ప్రభుత్వం నుంచి రూ.2 లక్షల ఆర్థిక సాయం బాధిత కుటుంబ సభ్యులకు అందేది. అధికారులు ప్రచారం చేయకపోవడం, కార్మికులకు అవగాహన లేకపోవడంతో బీమా సౌకర్యం అందలేదు. కార్మిక కుటుంబాల సంక్షేమమే ధ్యేయంగా బీమా సౌకర్యం కల్పిస్తుందీ పథకం. ఏడాది పొడుగునా ఉచితంగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉంది.

ఈ-శ్రమ్ పోర్టల్‌తో కార్మికులకు భరోసా

కార్మికులకు అవగాహన కల్పిస్తున్న కార్మిక శాఖ, పోలీసు అధికారులు

ఇవీ ప్రయోజనాలు..

ఇందులో నమోదైన కార్మికుల్లో ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షల ఆర్థిక సాయం కుటుంబ సభ్యులకు అందుతుంది. అలాగే 50 శాతానికి మించి అంగవైకల్యం సంభవిస్తే రూ.లక్ష వరకు ప్రభుత్వం అందిస్తుంది.

నమోదుకు అర్హతలివే..

కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ 26 ఆగస్టు 2021న ఈ-శ్రమ్ పోర్టల్‌ను ప్రారంభించింది. ఆదాయ పన్ను పరిధిలోకి రాని 18 నుంచి 60 ఏళ్లలోపు వయసున్నవారెవరైనా అర్హులే. గ్రామ, వార్డు సచివాలయాలు, మీసేవా కేంద్రాలు, కార్మిక శాఖ కార్యాలయంలో పనివేళల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. మండపేట నియోజకవర్గంలో 57,867 మంది, రామచంద్రపురంలో 53,281 మంది కార్మికులు ఇప్పటికే పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకుని గుర్తింపు కార్డులు పొందారు.

అవకాశం సద్వినియోగం చేసుకోవాలి..

అసంఘటిత రంగంలోని కార్మికులు పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకుంటే బీమా సదుపాయం వర్తిస్తుంది. ఈ పథకం ప్రారంభించిన నాటి నుంచి ఎవరూ బీమా పొందలేదు. పట్టణంలోని ప్రతి దుకాణానికి వెళ్లి యజమానులతో పాటు కార్మికులకు అవగాహన కల్పిస్తున్నాం. దుకాణాలను తనిఖీచేసి బాలలను పనిలో పెట్టుకున్న మండపేటలో ఎనిమిది మందిపై నమోదు చేసి జరిమానా విధించాం.

- కాశీ శివనాగ మల్లేశ్వరరావు,
- పెందుర్తి మనోజ్,

కార్మిక శాఖ అధికారులు

(c) eenadu

రేపు 'ఈటీవీ' కార్తిక దీపోత్సవం

అనపర్తి గ్రామీణం: కార్తిక మాసం శివకే శివుడికే ప్రీతికరమైంది. ఈ మాసంలో దీపారాధనకు విశేష ప్రాధాన్యత ఉంది. ఈ పవిత్రమైన నెలలో దీపారాధన చేస్తే తెలియక చేసిన పాపాలు నశిస్తాయని శాస్త్ర వచనం. అపార పుణ్య సముపార్జనకు ఇదో మార్గమని భక్తుల విశ్వాసం. అనపర్తిలో ఈనెల 14వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ, ఈటీవీ లైఫ్ ఆధ్వర్యంలో కార్తిక దీపోత్సవం జరగనుంది. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆతిథ్యంలో జరగనున్న ఈ కార్యక్రమంలో మహిళలకు మాత్రమే దీపారాధన అవకాశం ఉంది. ప్రవేశం, పూజా సామగ్రి ఉచితం.

వేద పఠనం: బ్రహ్మశ్రీ కోటమర్తి హర కుమారశర్మ అవధాని బృందం
వైదిక నిర్వహణ: బ్రహ్మశ్రీ పులుపుల వెంకట ఫణికుమార్‌శర్మ బృందం
ప్రవచనకర్త: డా.బులుసు అపర్ణ
అష్టోత్తరం: అన్నపూర్ణ
సమయం: శుక్రవారం సాయంత్రం 5 గంటలకు
స్థలం: శ్రీ రామారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అనపర్తి
ప్రత్యక్ష ప్రసారం సాయంత్రం 6-8

ETV ఆంధ్రప్రదేశ్ | ETV తెలంగాణ | ETV Life

నేడు పాసుల పంపిణీ: గురువారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు శ్రీ రామారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద పరిమిత సంఖ్యలో ఎంట్రీ పాసులు ఇస్తారు.

రత్నగిరిపై వేడుకగా అనుగ్రహ పూజ

అన్నవరం: అన్నవరం సత్యదేవుని నామస్మరణతో రత్నగిరి మార్మోగింది. స్వామి అనుగ్రహ పూజ (వడి పూజ) బుధవారం రాత్రి వేడుకగా జరిగింది. సత్యదీక్ష చేపట్టిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలోని వార్షిక కల్యాణవేదిక వద్ద పూజ నిర్వహించారు.

సప్త రుషులు.. గోపంచక క్షేత్రపాలకులు



క్షేత్రాన్ని అనుకుని సప్తరుషులు

మన ప్రత్యేకం

దేవాలయాల సమాహారమైన కొవ్వూరు ఆధ్యాత్మిక వైభవ కేంద్రం. గోవు, గోపురం, గోష్పాదం, గోపాలుడు, గోదావరితో గోపంచక క్షేత్రంగా విలసిల్లుతోంది. కొవ్వూరు గోష్పద క్షేత్రానికి సప్తరుషులు స్వాగతం పలుకుతున్నారు. పవిత్ర గోదావరి తీరాన సప్త రుషులు క్షేత్ర పాలకులుగా దర్శనమిస్తున్నారు. వరుసగా కశ్యప, అత్రి, భారద్వాజ, గౌతమ, విశ్వామిత్ర, జమదగ్ని, వశిష్ఠ మహర్షుల విగ్రహాలు గోదావరి తీరాన అలరారుతున్నాయి. తీరంలో రుషుల విగ్రహాలున్నా అవి అందరికీ కనిపించవు. కొవ్వూరులో మాత్రం సప్త రుషుల స్వభావం, వారి లక్షణాలను పురాణాల నుంచి సేకరించి విగ్రహాలను ఏర్పాటు చేశారు. విశాఖ- విజయవాడ వైపు వెళ్లే వారంతా ఆసక్తిగా చూస్తుంటారు. 2003 పుష్కరాల సమయంలో అప్పటి పాలకవర్గం పండితుల సూచనలు, సలహాల మేరకు వీటిని ఏర్పాటు చేశారు. రెండు దశాబ్దాలు దాటినా ఇప్పటికీ సజీవంగా క్షేత్ర ప్రాభవానికి తోడ్పడుతున్నాయి. - న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

పత్రాల ఛత్రం

సాధారణంగా కొబ్బరి చెట్ల తలకట్టు(పై భాగం) చిందరవందరగా ఉంటాయి. పి.గన్నవరం మండలం లంకలగన్నవరంలో డొక్కా జగన్నాథానికి చెందిన తోటలోని ఓ కొబ్బరిచెట్టు అందమైన తలకట్టుతో ఆకట్టుకుంటోంది. ఆకులు గొడుగు ఆకారంలో అలరిస్తున్నాయి. -న్యూస్‌టుడే, పి.గన్నవరం

నగరం రద్దీ.. విస్తరణ ఏమైంది..!

రాజమహేంద్రవరం నగరంలో జనాభా, వాహనాల సంఖ్య పెరుగుతున్నప్పటికీ అందుకు తగ్గట్టుగా ట్రాఫిక్ నియంత్రణ పరిష్కారం, కూడళ్ల అభివృద్ధి జరగడం లేదు. ప్రధాన రహదారులకు అనుసంధానంగా ఉండే రోడ్లను వాహనాల రద్దీకి అనుగుణంగా విస్తరించకపోవడంతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. వాహనంతో బయటకు రావాలంటే భయపడాల్సి వస్తోంది. ఉదయం పది గంటల్లో సాయంత్రం నాలుగు తరువాత ఈ సమస్య మరింత జటిలమవుతోంది. నడక దారులపై వ్యాపారాలు.. ప్రధాన మలుపుల దగ్గర తోపుడు బండ్లతో ట్రాఫిక్ సమస్యలతోపాటు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటన్నింటిని చక్కదిద్దేలా ఈసారి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని చారిత్రక నగరి రాజమహేంద్రవరంలో కూడళ్లు, ప్రధాన రహదారులకు అనుసంధానంగా ఉండే కీలక లింకు రోడ్లను విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– న్యూస్‌టుడే, కంబాలచెరువు, కోటగుమ్మం(రాజమహేంద్రవరం)

ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ట్రాఫిక్ ఇలా..

21 ప్రధాన కూడళ్లు..

✦ రాజమహేంద్రవరం నగరంలో 21 ప్రధాన కూడళ్లు ఉన్నాయి. వీటిలో చాలా చోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నాయి. కొత్తగా సిటీ ఆసుపత్రి రోడ్డు, నందంగనిరాజు కూడలి, లాలాచెరువు కూడలి దగ్గర క్వారీ మార్కెట్ రోడ్డు కెళ్లే వైపు, ఏవీఏ రోడ్డుకు సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేసినప్పటికీ అలంకార ప్రాయంగా ఉంది. ఇంకా వీటిని వినియోగించడం లేదు.

✦ ఆర్టీసీ కాంప్లెక్స్, తిలక్ రోడ్డు, వీఎల్‌పురం కూడళ్లలో సాయంత్రం సమయాల్లో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. ఫుట్‌పాత్‌లపై అడ్డంకుల వల్ల పాదచారులకు సైతం ఇక్కట్లు తప్పడం లేదు. చాలా ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లను సైతం సరి చేయాల్సిన అవసరం ఉంది.

ఉల్లంఘనలు నియంత్రిస్తేనే..

✦ వాహనదారులంతా ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా తనిఖీలు పెంచాల్సిన అవసరం ఉంది. ✦ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రోడ్లపై ఆక్రమణలు తొలగించాల్సి ఉంది. నో పార్కింగ్‌లో వాహనాలను నిలుపకుండా చూడాలి. ✦ సిగ్నల్ పడినా పట్టించుకోకుండా దాటడం వంటి వాటిని అరికట్టాలి. ✦ గీత దాటితే జరిమానా విధించే పద్ధతి మన నగరానికి రావాలి. ✦ ట్రాఫిక్ ఉల్లంఘనలు నియంత్రిస్తే సమస్యను కొంతమేర తగ్గించవచ్చు.

రోజుకు 300 కొత్త వాహనాలు..

జిల్లాలో మొత్తం నాలుగున్నర లక్షలకు పైగా వాహనాలున్నాయి. ఒకప్పుడు రోజుకు వంద కొత్త వాహనాల రిజిస్ట్రేషన్లు జరిగివి. జీఎస్టీ తగ్గడంతో సెప్టెంబరు నుంచి రోజుకు మూడొందల వరకు వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయి. అందుకు తగ్గట్లుగా రోడ్లు లేకపోవడం, ఉన్నవి ఆక్రమణలతో కుంచించుకుపోవడంతో ఇక్కట్లు తప్పడం లేదు. పుష్కరాల్లోపు పూర్తిస్థాయి ప్రక్షాళన చేయకపోతే తిప్పలు తప్పవు.

కాకినాడ.. నౌకల జాడ

ఈనాడు, కాకినాడ: కాకినాడ తీరం ఇప్పటివరకు జల రవాణా కేంద్రంగానే గుర్తింపు పొందింది. ఇకపై నౌకా నిర్మాణ కేంద్రంగానూ అభివృద్ధి చెందనుంది. ప్రస్తుతం నగరంలో శాన్ మెరైన్ సంస్థ చిన్న, మధ్యస్థ నౌకల నిర్మాణం చేపడుతోంది. విద్యుత్తు నౌకల తయారీలోనూ అడుగు పెట్టడానికి ఇటీవల ముంబయిలో కేంద్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది.

తీర ప్రాంత అభివృద్ధికి..

ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) ఇదివరకు కాకినాడ పోర్టు పరిసరాల్లో శాటిలైట్ షిప్‌యార్డు ఏర్పాటుకు స్థల పరిశీలన చేసి వెళ్లింది. తాజాగా మ్యాట్ మెరైన్ సర్వీసెస్ సంస్థ యాంకరేజ్ పోర్టు సమీపంలో టగ్‌లు, బార్జీల నిర్మాణం చేయబోతుంది. ఇవి తీర ప్రాంత అభివృద్ధికి దోహదపడతాయని చెబుతున్నారు.

తయారీకి ముందుకొస్తున్న మెరైన్ సంస్థలు

● కూటమి ప్రభుత్వ పారిశ్రామిక పాలసీతో పారిశ్రామికవేత్తలకు నమ్మకం వచ్చింది.

సర్కారు సానుకూలం..

● హిందుస్థాన్ షిప్‌యార్డు సంస్థ కాకినాడ, మూలపేట పోర్టులను పరిశీలించి వంద ఎకరాలిస్తే శాటిలైట్ షిప్‌యార్డు ఏర్పాటు చేస్తామంది.

● శాన్ మెరైన్ సంస్థ ఆధునిక సాంకేతికత.. నార్వే, జపాన్ దేశాల పరిజ్ఞానంతో విద్యుత్తు ఆధారిత నౌకల తయారీకి ముందుకొచ్చింది. రూ.600 కోట్ల పెట్టుబడి పెట్టనుంది.

● మ్యాట్ మెరైన్ రూ.100 కోట్లతో ఇక్కడ టగ్‌లు నిర్మిస్తానంది. దీని వల్ల 300 మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

కీలక స్థావరంగా..

గతంలో చిన్నపాటి నౌకలు, బార్జీల కోసం సింగపూర్, మలేషియా వెళ్లి అక్కడి కంపెనీలకు ఆర్డర్లు పెట్టాల్సి వచ్చేది. వాటి నిర్వహణ, మరమ్మతులకు ఇబ్బందులు ఎదురయ్యేవి. ఇప్పుడు మెరైన్ సంస్థలు వస్తుండడంతో ఈ రంగంలో కాకినాడ కీలక స్థావరంగా మారబోతుంది. బోట్ల నుంచి భారీ నౌకల తయారీకి అవకాశాలుండి యువతకూ ఉపాధి దక్కనుంది.

ఇవీ అనుకూల పరిస్థితులు

❖ హోప్ ఐలాండ్ కారణంగా అలల తాకిడి తక్కువ. ❖ తీరం వెంబడి ప్రభుత్వ భూములు ఎక్కువ. ❖ నౌకలు, బార్జీలు, టగ్‌లు తయారుచేసి పక్కనే ఉన్న సముద్ర జలాల్లోకి దించి.. పరీక్షలు చేసి సరకు రవాణాకు ఉపయోగించొచ్చు. సీఫ్రంట్‌గా పిలిచే ఈ సౌకర్యం కాకినాడలోనే ఉంది. ❖ జగన్నాథపురం వంతెన నుంచి యాంకరేజ్ పోర్టు వరకు రెండు కిలోమీటర్ల మేర సీఫ్రంట్ విస్తరించి ఉండడం నౌకల తయారీకి అనుకూలం.

పేదలందరికీ ఇళ్లే ప్రభుత్వ లక్ష్యం

మంజూరు పత్రాలను అందిస్తున్న మంత్రి దుర్గేష్, ఆర్డీవో రాణిసుస్మిత, ఛైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు, న్యూస్‌టుడే: ఇల్లు లేని పేదలు ఉండకూడదన్న సదుద్దేశంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ పథకం 2.0 కింద నిడదవోలు నియోజకవర్గానికి 41 వేల ఇళ్లు మంజూరు చేసినట్లు రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. నిడదవోలు రోటరీ ఆడిటోరియంలో బుధవారం గృహ ప్రవేశ, భూమిపూజ, గృహ నిర్మాణ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందించారు. మాట్లాడుతూ గత ప్రభుత్వం ఒక ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేస్తే.. దానిని కూటమి ప్రభుత్వం రూ.2.50 లక్షలు చేసి నిర్మాణానికి రాయితీ రూపంలో అందిస్తున్నట్లు తెలిపారు. దీంతో నిడదవోలు నియోజకవర్గంలో 626 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్నారన్నారు. కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, పురపాలక సంఘ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ తోట కృష్ణవేణి, వైస్‌ఛైర్మన్ షేక్ వజీరుద్దీన్, గృహ నిర్మాణ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రియా సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 8773 మంది లబ్ధిదారుల గృహప్రవేశం..

గోకవరం: జిల్లాలో మొత్తం 8773 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు చేసుకుంటున్నారని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. గోకవరం మండలం కామరాజుపేటలో గృహ ప్రవేశాల కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పీఎంఏవై అర్బన్ కింద రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు మున్సిపాలిటీలలో 800 ఇళ్లు మంజూరు అయ్యాయన్నారు.

గుర్తుంచుకో.. గమ్యం చేరుకో..

రహదారిపై ప్రయాణం చేసే సమయంలో బోర్డులపై కొన్ని సంకేతాలు కనిపిస్తుంటాయి. సురక్షితంగా గమ్యం చేరేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. లైసెన్స్ పొందాలంటే ముందు వీటి గురించి తెలుసుకోవాల్సిందే. ఇవేమీ తెలియకపోయినా కొందరు రయ్..రయ్‌మంటూ దూసుకుపోతున్నారు. ఏ గుర్తు ఏం చూపిస్తుందో..పరిశీలిస్తే.. -న్యూస్‌టుడే, రావులపాలెం పట్టణం

దూసుకెళ్లొద్దు
డివైడర్ మధ్య ఖాళీ ఉందని ఈ గుర్తు సూచిస్తుంది. మలుపు తిరగడానికి, రెండు మూడు మార్గాలను కలపడానికి, రోడ్డు దాటడానికి ఏర్పాట్లు ఉండటంతో అక్కడ నెమ్మదిగా వెళ్లాలి.

3 ఆకారాలు: చతురస్రాకారం, త్రిభుజాకారం, వృత్తాకారం

ఇరుక్కోవద్దు..
ముందు ఇరుకైన వంతెన సమీపిస్తుందని సూచన. అక్కడ నెమ్మదిగా వెళ్లాలి. ఆ ప్రాంతంలో వాహనం ఆపకూడదు.

వేగం తగ్గించు..
కొంతదూరంలో ఎడమ వైపు నుంచి గ్రామీణ రోడ్డు ఉందని సూచన. అటు నుంచి వాహనాలు వచ్చే వీలుండటంతో వేగం తగ్గించాలి.

పని జరుగుతోంది
ముందు రోడ్డు పనులు జరుగుతున్నాయని అర్థం. వేగాన్ని నియంత్రించాలని సూచిస్తుంది.

కుడి.. ఎడమలు
రహదారికి ఎడమవైపు వెళ్లమని నిర్దేశించే తప్పనిసరి సంకేతం ఇది. రహదారి వద్ద డివైడర్.. మలుపు ఉన్నా ఆ ప్రాంతాల్లో వాహనాలు తిరుగుతాయని.. ఎడమ వైపు వెళ్లాలని సూచిస్తుంది. అదే కుడి వైపు గుర్తు ఉంటే అటువైపు వెళ్లాలని అర్థం చేసుకోవాలి.

విద్యాసంస్థలు
ఆ ప్రాంతంలో విద్యాసంస్థలు ఉన్నాయని సూచిస్తుంది. పిల్లలు రోడ్డు దాటే అవకాశం ఉండటంతో నెమ్మదిగా వెళ్లాలి.

అధిగమిస్తే ఆపదే..!
ముందు వాహనాన్ని ఎట్టి పరిస్థితుల్లో అధిగమించొద్దు. కూడళ్లు, ప్రమాదకర ప్రదేశాలు ఉండవచ్చు.

3 రకాలు: 1. హెచ్చరిక 2. తప్పనిసరి 3. సమాచారం

ఉపయోగకరం
రహదారులపై ప్రమాదాల నివారణకు గుర్తులతో కూడిన బోర్డులను ఏర్పాటు చేస్తాం. చాలా మందికి వీటిపై అవగాహన ఉండటం లేదు. ఇవి తెలుసుకుంటే సురక్షితంగా ప్రయాణం సాగించవచ్చు.
-ఓలేటి శ్రీనివాసరావు, రవాణాశాఖాధికారి, రావులపాలెం

మత్స్య రైతులకు శిక్షణ నేడు

బిక్కవోలు: రాష్ట్ర మత్స్య విశ్వవిద్యాలయం ఆధీనంలో బలభద్రపురంలో ఉన్న శిక్షణ, పరిశోధన కేంద్రంలో మత్స్య రైతులకు గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ శాస్త్రవేత్త, హెడ్ డా.సి.ప్రభంజన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జాతీయ మత్స్య అభివృద్ధి మండలి ఆర్థికసాయంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాణ్యమైన చేపపిల్లల ఉత్పత్తి తదితర విషయాలపై శిక్షణ ఇస్తారన్నారు.

విదేశీ చదువులకు వెళ్తున్నారా..?

ఏం తెలుసుకోవచ్చు..
- అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల వివరాలు
- కోర్సులు, శిక్షణ
- దరఖాస్తు విధానం
- వీసా, పాస్‌పోర్ట్‌పై మార్గదర్శకం

రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ స్టడీస్ అండ్ రీసెర్చ్(సీఐఎస్ఆర్) భవనం సిద్ధమైంది. ఇక్కడి సైన్స్ బ్లాక్‌లో రూ.12 లక్షలతో నిర్మించారు. అధ్యాపకుడు జి.చంద్రశేఖర్ నోడల్ అధికారిగా, నూజిళ్ల శ్రీనివాస్ కంప్లైంట్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారన్నారు. ఈ నెల 18న మంత్రి నారా లోకేశ్ దీనిని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

మీ కోసం

ప్రారంభోత్సవానికి సిద్ధమైన సీఐఎస్ఆర్ భవనం

ఇంటర్న్‌షిప్‌కు ఉపకార వేతనాలు..

విదేశీ విశ్వవిద్యాలయాల్లో మూడు నెలలు ఇంటర్న్‌షిప్‌కు వెళ్లే విద్యార్థులు, అధ్యాపకులకు కళాశాల యాజమాన్యం ఉపకార వేతనం అందించనుంది. విద్యార్థులకు మెట్‌కాఫ్ స్టూడెంట్ ఇంటర్నేషనల్ ఫెలోషిప్ రూ.25 వేలు, అధ్యాపకులకు మెట్‌కాఫ్ టీచర్స్ ఇంటర్నేషనల్ ఫెలోషిప్ రూ.10 వేలు చొప్పున మంజూరు చేయనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే వెల్లడించారు.
–న్యూస్‌టుడే, దేవీచౌక్ (రాజమహేంద్రవరం)

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

రూ.30 పెరిగితే మరింత భరోసా

ప్రభుత్వ ప్రత్యామ్నాయ చర్యలపై ఆక్వా రైతుల ఆశాభావం

న్యూస్‌టుడే, నిడదవోలు

ప్రస్తుతం రొయ్య ధర గతేడాది పోలిస్తే కేజీకి రూ.30 వరకు వ్యత్యాసం ఉన్నా.. సుమారు 50 రోజులుగా ధర నిలకడగా ఉండడంతో రైతులు కొంత ఊపిరి పీల్చుకుంటున్నారు. 30 కౌంట్‌కు కేజీ రూ.430 వరకు పలుకుతోంది. అయితే రూ.450 నుంచి రూ.460 వరకు ఉంటే తప్ప గిట్టుబాటు కాదని రైతులు అంటున్నారు... జిల్లాలో 5,600 ఎకరాల్లో రొయ్య సాగు చేస్తున్నారు. గత కొంతకాలంగా ఒడుదొడుకులు ఎదురైనా ఆక్వా రంగం కొంత వరకు బాగానే నిలబడింది. ఎక్కువ శాతం ఎగుమతులు మన రాష్ట్రం నుంచి అమెరికాకు వెళ్లడం, ఆ దేశ అధ్యక్షుడు సుంకాల భారం మోపడంతో వరకు రొయ్య రైతులు కొంత అయోమయానికి గురైన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించడంతో కొంత వరకు సత్ఫలితాలు వచ్చాయి.

ప్రస్తుతం ధరలు ఇలా...

కౌంట్	కిలో ధర (రూ.)
100	230
90	240
80	260
70	290
60	310
50	330
40	360
30	430
20	500

● గత ఏడాది డిసెంబర్ 21న 90 కౌంట్ కిలో రూ.270 కాగా.. ప్రస్తుతం రూ.240 అంటే కిలో రూ.30 తక్కువకు కొంటున్నారు.

● ఈ ఏడాది జనవరి 23న 60 కౌంట్ కిలో రూ.340లకు కొనుగోలు చేయగా ప్రస్తుతం రూ.310 పలుకుతోంది. రూ.30 పెరిగితే భరోసా ఉంటుందని రైతులు అంటున్నారు.

● రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్కెట్లపై అన్వేషణ చేయడంతో కొంత భరోసా.

● ఇప్పటికే రష్యా, ఆస్ట్రేలియాలకు ఎగుమతులు ప్రారంభమయ్యాయి. సౌదీ ఆరేబియా, యూఏఈల్లో కూడా మార్కెట్ విస్తరణ పెరిగితే ఇబ్బందులు ఉండవనేది అన్నదాతల అభిప్రాయం.

ఉమామహేశ్వరా.. పాహిమాం

కార్తిక మాసం సందర్భంగా రావులపాలెం మండలం రావులపాడులోని ఉమామహేశ్వర స్వామి, ఉమాదేవికి బుధవారం ఆలయ అర్చకులు వెండి ఆభరణాలు అలంకరించారు. పలు రకాల పుష్పాలతో సుందరంగా తీర్చిదిద్దారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు.
– న్యూస్‌టుడే, రావులపాలెం గ్రామీణం

వెంటాడుతున్న వీధి శునకాలు



న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

నగరం, పట్టణాల్లో వీధి శునకాలు వెంటాడుతున్నాయి. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు వీటి నియంత్రణకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేసేందుకు ఏబీసీ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా.. ఆ దిశగా ఎటువంటి చర్యలు కానరావడం లేదు. అంతంత మాత్రంగా టీకాలు వేసి చేతులు దులిపేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బాధితుల సంఖ్య పెరుగుతోంది.

✦ ఒక్క ప్రభుత్వ ఆసుపత్రికే రోజు 25 నుంచి 30 మంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు 3 నుంచి 10 మంది వరకు కుక్కకాటు బాధితులు వస్తున్నారు. యాంటీ రేబిస్ ఇంజక్షన్లు ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందుబాటులో ఉంటున్నాయి.

✦ కరోనా తర్వాత పురపాలికల్లో వీధి కుక్కల సంఖ్య మూడు రెట్లయింది. ఒక్క రాజమహేంద్రవరంలోనే 25 వేలు వరకు ఉన్నట్లు అంచనా. వీటిలో 9120 కుక్కలకు మాత్రమే ఏబీసీ ఆపరేషన్లు చేశారు.

✦ కొవ్వూరులో సుమారు 5 వేలు, నిడదవోలులో 6 వేల వరకు వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇక్కడ ఏబీసీ శస్త్ర చికిత్సల ప్రక్రియ ఇంకా ఆరంభం కాలేదు.

✦ నిబంధనలు ప్రకారం కలెక్టర్ అధ్యక్షతన కమిటీ, అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా అంతంత మాత్రంగానే జరుగుతుంది.

కాళ్లు, చేతులు కట్టేసినా ఈదేస్తాడు..

న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

దార్ల శివ సత్యతేజ్ హయగ్రీవ.. కొవ్వూరులోని పీఎంఎంఎం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థి. పట్టుమని పదిహేనేళ్లు కూడా లేవు. తండ్రి, ఈత కొలనుల్లోని నిపుణుల వద్ద మెలకువలు నేర్చుకుని గంటకు 5 కిలో మీటర్లు ఈత కొడుతూ ఫ్రీస్టైల్, బ్రెస్ట్ స్ట్రోక్, బటర్ ఫ్లై, బ్యాక్‌స్ట్రోక్ విభాగాలను దాటి ఈతలో మేటిగా మారాడు. జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చి త్వరలో దక్షిణాది రాష్ట్రాల సాయి పోటీలకు వెళ్లే సత్తా సాధించాడు.

విజేత

గోదావరిలో ఈత కొడుతున్న హయగ్రీవ

ప్రశంసలు.. పతకాలు

● గతేడాది ఏలూరులో ఎస్‌జీఎఫ్ (స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్) ద్వారా బ్రెస్ట్ స్ట్రోక్ విభాగంలో 2వ, ఫ్రీ స్టైల్‌లో తొలి స్థానం పొందాడు.

● నరసరావు పేటలో రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లి నాలుగో స్థానం.. ● ఈ ఏడాది జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్‌లో 400, 800 మీటర్లలో ప్రథమ స్థానం. ● గత నెల 26న రాజమహేంద్రవరం కార్పొరేషన్ స్థాయిలో బ్రెస్ట్‌స్ట్రోక్‌లో 50 మీటర్లలో బంగారు పతకం, 100 మీటర్లలో రజిత పతకం కైవసం.

● సౌత్‌జోన్ పోటీల్లో బ్రెస్ట్‌స్ట్రోక్ 100, 200 మీటర్లలో రెండో స్థానంలో నిలవడంతో ఈనెల 22, 23 తేదీల్లో విశాఖ పట్టణంలో జరిగే సౌత్‌జోన్ స్టేట్‌మీట్‌కు ఎంపికయ్యాడు. ● అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున గోష్పద క్షేత్రంలో సుమారు రెండు గంటలు ఆసనాలు వేసి అందరి ప్రశంసలు పొందాడు.

తనకంటూ ప్రత్యేకత ఉండాలని..

తనకంటూ ప్రత్యేకత ఉండాలన్న హయగ్రీవ పట్టుదలను చూసిన తండ్రి సూర్య ప్రోత్సహించారు. కాళ్లు, చేతులను తాళ్లతో గట్టిగా కట్టి గోదావరిలో దింపి ముందు 10, ఆ తర్వాత 20, 30 మీటర్లు.. అలా పెంచుకుంటూ ఈత కొట్టించారు. కేవలం అరిచేతులు, అరికాళ్లు మాత్రమే కొంచెం కదిలే స్థితిలో ఉంటుంది. అలాగే పట్టుదలతో చేయించగా ప్రస్తుతం దండకుంట రేవు వద్ద గామన్ వంతెన నుంచి గోష్పద క్షేత్రానికి సుమారు 4.5 కిలోమీటర్లు గంటన్నరలో చేరుకుంటున్నాడు.

ప్రపంచ రికార్డు సాధిస్తా..

ఎప్పటికైనా ప్రపంచ స్థాయి ఈత పోటీలకు వెళ్లి ప్రతిభ చూపిస్తా. గిన్నిస్ రికార్డు సాధించాలని పట్టుదలతో ఉన్నా. ప్రభుత్వం ప్రోత్సహిస్తే రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకొస్తా.
- దార్ల శివ సత్యతేజ్ హయగ్రీవ, కొవ్వూరు



(c) eenadu

విశ్వేశ్వరునికి లక్ష బిల్వార్చన

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కార్తిక మాసోత్సవాల్లో భాగంగా వాడపల్లి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం లక్ష బిల్వార్చన కనులపండువగా జరిగింది. ఈ కార్యక్రమం తిలకించడానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

షష్ఠి ఉత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

కోరుకొండ, న్యూస్‌టుడే: కోరుకొండ వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవాల గోడపత్రికను బుధవారం ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ నెల 26 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు వి.బుజ్జిబాబు, నిర్వాహకులు బి.దొర, కె.సత్యనారాయణ, బాబ్జి, కె.వీరేష్ తెలిపారు.

కాలభైరవం భజే..!

రాచపల్లిలోని ఆంధ్రా అరుణాచలంలో స్వామితో సహా పరివార దేవతలకు బుధవారం విశేష పూజలు జరిగాయి. విజయగణపతికి, ఉపాలయంలోని కాలభైరవ స్వామికి జరిగిన అభిషేకాలు, హారతి కార్యక్రమాల్లో పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. రుత్వికులు శ్రీవల్లభ హోమాన్ని నిర్వహించారు.

- న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

అందుబాటులోకి.. రైల్‌వన్

యాప్ ఇలా...

రైలు ప్రయాణం మరింత సులువుగా సాగేందుకు భారతీయ రైల్వే అన్ని ప్రధాన సేవలు ఒకేచోట లభించేలా 'రైల్ వన్' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. గతంలో వివిధ యాప్‌లలో వేరువేరు సేవలు ఉండేవి.

మీకు తెలుసా

ఈ సేవలు పొందొచ్చు...: ఆండ్రాయిడ్ ఫోన్లో గూగుల్ ప్లే స్టోర్, యాప్ స్టోర్‌ల నుంచి ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవచ్చు. సాధారణ, రిజర్వేషన్, ప్లాట్‌ఫామ్, సీజన్ టిక్కెట్లు పొందవచ్చు. రైళ్ల సమాచారం, పీఎన్‌ఆర్ స్థితి, కోచ్ స్థానం, రైలును ట్రాక్ చేయడం, భోజనం ఆర్డర్ ఇవ్వడం, ఫిర్యాదులు, సూచనలు తదితర సేవలు పొందొచ్చు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు, సిబ్బంది సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే అనేక మంది దీన్ని డౌన్లోడ్ చేసుకుని వాడుతుండడంతో స్టేషన్లలోని టికెట్ కౌంటర్ల వద్ద రద్దీ తగ్గింది. **- న్యూస్‌టుడే, తుని**

కైవల్యకు మంత్రి దుర్గేష్ అభినందన

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలుకు చెందిన కుంచాల కైవల్యా రెడ్డి అంతర్జాతీయ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రాంకు ఎంపిక కావడంపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అభినందించారు. బుధవారం నిడదవోలు రోటరీ ఆడిటోరియంలో కైవల్య తన తల్లిదండ్రులతో మంత్రి దుర్గేష్‌ను కలిసింది. తాను సాధించిన రికార్డులను మంత్రి దుర్గేష్‌కు వివరించగా.. అంతరిక్ష పరిశోధన రంగంలో రాష్ట్రం తరపున చిన్న వయసులోనే ప్రతిభ చాటుకుని పదుల సంఖ్యలో రికార్డులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. వ్యోమగామి కావాలన్న తన కల నెరవేరాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఫ్లోరిడాలోని టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో జరిగే వ్యోమగామి శిక్షణకు ప్రపంచ వ్యాప్తంగా 36 దేశాల నుంచి వేలాది మంది పోటీపడ్డారు. అర్హత సాధించిన 150 మందిలో కైవల్య ఉండటం విశేషం.

ఉత్తరం రాద్దాం.. బహుమతి సాధిద్దాం

ఢాయి ఆఖర్ లేఖల పేరిట తపాలా శాఖ పోటీలు

బిక్కవోలు, పెదపూడి, న్యూస్‌టుడే: స్టాంపుల సేకరణ(ఫిలాటలీ) అభిరుచిని ప్రజల్లో పెంపొందించాలనే ఉద్దేశంతో తపాలాశాఖ నాలుగేళ్లుగా ఏటా 'ఢాయి ఆఖర్' లేఖల పేరిట పోటీలను ఏర్పాటు చేస్తోంది. 2025-26 సంవత్సరానికి కూడా పోటీలు నిర్వహిస్తోంది. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఉంటాయి. జాతీయ స్థాయిలో ప్రథమస్థానం సాధించిన వారికి రూ.50,000, రాష్ట్రస్థాయిలో విజేతలైన వారికి రూ.25,000 నగదు తపాలాశాఖ అందిస్తుంది. ఈ ఏడాది 'నన్ను ప్రభావితం చేసే వ్యక్తి (లెటర్ టు మై రోల్ మోడల్)' అనే అంశంపై రాయాలి.

3,000 మందికి తగ్గకుండా..

ఏటా రాజమహేంద్రవరం తపాలా డివిజనులో 3వేల మందికి తగ్గకుండా ఈ పోటీలో పాల్గొంటున్నారు. 2023-24 సంవత్సరానికి రాజమహేంద్రవరం ఆర్యాపురానికి చెందిన జి. హేమాభీమేష్ 18+ కేటగిరిలో మూడో బహుమతి గెలుచుకున్నారు.

అర్హులు ఎవరంటే..

ఈ పోటీలో పాల్గొనటానికి అందరూ అర్హులే. పోటీలను 18 ఏళ్ల వయసులోపు, 18 ఏళ్ల వయసు తరువాత అని వర్గీకరించారు. వీరు వయసుకు సంబంధించిన స్వీయ ధ్రువీకరణ పత్రం అందించాల్సి ఉంటుంది.

● అక్టోబరు 25 నాటికి నా వయసు 18 ఏళ్లలోపు లేదా, 18 ఏళ్ల పైన అని రాసి ఇవ్వాలి. ఈ నెల ఆరవ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

● పోటీలో పాల్గొనేవారు ఇన్‌ల్యాండ్ లెటర్‌పై రాస్తే 500 పదాలు, ఎన్వలప్ కవర్‌లో పంపేవారు ఏ-4 కాగితంపై 1000 పదాలకు మించకుండా పంపాలి. రాసిన ఉత్తరాలను సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్‌ఆఫీసు, రాజమహేంద్రవరం పోస్టల్ డివిజన్, రాజమహేంద్రవరం పేరున పంపాలి.

● దరఖాస్తులు చేరాల్సిన చివరి తేదీ డిసెంబరు: 08

అవగాహన కల్పిస్తున్నాం..

ఈ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్నాం. ఆసక్తి ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలి. జాతీయ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు వరుసగా రూ.50,000, రూ.25,000, రూ.10,000 నగదు బహుమతి లభిస్తుంది. రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు వరుసగా రూ. 25,000, రూ. 10,000, రూ. 5,000 నగదు లభిస్తుంది.

- కె.శేషారావు, సూపరింటెండెంట్, తపాలాశాఖ, రాజమహేంద్రవరం

శోభాయమానంగా తితిదే హారతి

14న జరిగే కార్యక్రమంపై సమావేశం

మాట్లాడుతున్న ఆర్డీవో, చిత్రంలో ఆనందతీర్థాచార్యులు, డీఎస్పీ

కొవ్వూరు పట్టణం: శోభాయమానంగా తితిదే గోదావరి హారతి నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నామని ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. తితిదే దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఈనెల 14న (శుక్రవారం) గోదావరి హారతి కార్యక్రమంపై స్థానిక కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టు విశేషాధికారి పి.ఆనంద తీర్థాచార్యులు అతిథిగా హాజరయ్యారు. ఆర్డీవో మాట్లాడారు. 'గోష్పద క్షేత్రం సాయంత్రం హారతి కార్యక్రమానికి తరలివచ్చే భక్తజనానికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా యంత్రాంగం చూసుకోవాలి. తాగునీరు, బందోబస్తు, పడవల ఏర్పాటు, వాహనాల పార్కింగ్, ప్రసాదాల వితరణ, పరిసరాల శుభ్రత, బారికేడింగ్ వ్యవస్థ, ప్రథమ చికిత్స కేంద్రాలు, ఈతగాళ్ల ఏర్పాట్లను ఆయా శాఖలు సమన్వయం చేసుకోవాలి' అని అన్నారు.. ఆనంద తీర్థాచార్యులు మాట్లాడారు. డీఎస్పీ జి.దేవకుమార్ మాట్లాడుతూ బందోబస్తు నిర్వహణ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

తాండవ అక్విడక్టు పనులు పూర్తిచేయాలి: ఎస్ఈ

తుని గ్రామీణం: మరో 20 రోజుల్లో తాండవ నదిపై అక్విడక్టు పనులు పూర్తి చేయాలని పోలవరం కాలువ ఎస్ఈ ఏసుబాబు స్థానిక అధికారులకు సూచించారు. మండలంలోని పోలవరం కాలువ నిర్మాణ పనుల్లో భాగంగా సుమారు రూ.65 కోట్లతో తాండవ నదిపై కత్రాళ్లకొండ నుంచి రేఖవానిపాలెం వరకు సుమారు 452 మీటర్ల పొడవు, 28 మీటర్ల వెడల్పున అక్విడక్టు పనులు చేపట్టారు. ప్రస్తుతం 90 శాతం పనులు పూర్తి చేసినట్లు ఈఈ గోవింద్ ఆయనకు వివరించారు. వర్షాల కారణంగా పనుల్లో జాప్యం జరిగిందన్నారు. ఉన్నతాధికారులు సూచించిన గడువులోగా పనులు పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు. డీఈ మురళీ సిబ్బంది ఉన్నారు.

పేదల సొంతింటి కల సాకారానికి కృషి: ఎంపీ

గోకవరం: పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ అన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కలెక్టర్ కీర్తి చేకూరితో కలిసి గోకవరం మండలం కామరాజుపేటలో పీఎం అవాస్ యోజన 2.0లో భాగంగా నిర్మించిన గృహాలను బుధవారం ప్రారంభించారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ.. గోకవరం మండలంలో 168 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. త్వరలోనే వెయ్యి ఇళ్లు నిర్మిస్తామన్నారు.

గోకవరం మండలంలోనే ..

గోకవరం మండలంలో 870మంది అర్హులున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. కామరాజుపేటలో తాగునీటి సమస్యల పరిష్కారానికి జలజీవన్ మిషన్ నిధులలో నిర్మించిన 60 వేల లీటర్ల ఓహెచ్‌ఆర్ ట్యాంకును ప్రారంభించామన్నారు. జిల్లా హౌసింగ్ పీడీ నాతి బుజ్జి, ఎస్‌ఎస్‌ఏ పీడీ సుబాషిణి, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, డీసీవో ఎం.వెంకటరమణ, సర్పంచి అడపా వెంకట్రావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అడపా భరత్‌బాబు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందిస్తున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, కలెక్టర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే నెహ్రూ

పాఠశాల అభివృద్ధికి నిధులు

పీఎం శ్రీ పథకం కింద కామరాజుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.76.26 లక్షల నిధులతో చేపట్టే పనుల శిలాఫలకాలను ఆవిష్కరించారు. కొత్తపల్లి ఆర్‌ఎస్‌కేలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

కాకినాడ సిగ.. పారిశ్రామిక నగ

● ఉప్పాడ సమీపంలో గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ పరిశ్రమ

● రూ.44 వేల కోట్ల పెట్టుబడి.. 3 వేల మందికి ఉపాధి

ఈనాడు, కాకినాడ

కాకినాడ జిల్లాలో మరో భారీ పరిశ్రమ ఏర్పాటుకాబోతుంది. ఏఎం గ్రీన్‌కు చెందిన ఏఎంజీ మెటల్ అండ్ మెటీరియల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉప్పాడ సమీపంలో గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ పరిశ్రమను నెలకొల్పబోతుంది. అవసరమైన భూముల కొనుగోలు, మౌలిక వసతుల కల్పన రాయితీలకు సంబంధించి బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సుమారు వెయ్యి ఎకరాల్లో రూ.44 వేల కోట్లతో ఈ పరిశ్రమను స్థాపించబోతున్నారు. రెండు దశల్లో 3 వేల మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

పునరుత్పాదక ఇంధనంతో..

ఏఎం గ్రీన్ కంపెనీ ఇప్పటికే నగరంలో ఎన్ఎఫ్‌సీఎల్ పరిశ్రమ భూములు, యూనిట్‌ను కొనుగోలు చేసింది. ఇందులో రూ.10,050 కోట్ల పెట్టుబడితో ఏడాదికి రెండు మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియా తయారుచేయనుంది. ఈ కంపెనీకి ఇటీవల రాయితీలిచ్చారు. అదే సంస్థకు చెందిన ఏఎంజీ మెటల్, నెదర్లాండ్స్ కంపెనీ భాగస్వామిగా ఏడాదికి ఒక మిలియన్ టన్ను గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఇది పూర్తిగా పునరుత్పాదక ఇంధనంతోనే నడుస్తుంది.



రాయితీలు ఇలా..

● ఈ పరిశ్రమకు 250 ఎకరాలు భూసేకరణ చేసి మార్కెట్ ధరకు అందివ్వనున్నారు.

● గ్రీన్ కారిడార్ ద్వారా 2000-2,500 మెగావాట్ల విద్యుత్తు కనెక్షన్

● రోజుకు 17.5 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేసేలా సదుపాయాలు

● సింగిల్ డెస్క్ విధానంలో సంబంధిత శాఖలన్నీ అనుమతులివ్వాలి.

● ఎలక్ట్రిసిటీ డ్యూటీ, మూలధన పెట్టుబడిపై రాయితీలు, నీటి సరఫరా ఛార్జీల తగ్గింపు, స్టాంపు డ్యూటీ మినహాయింపు, ఇతరత్రా రాయితీలు కల్పించాల్సి ఉంది.

ముందస్తు వైద్య పరీక్షలతో గుండె పదిలం

కంబాలచెరువు, కోటగుమ్మం: ముందస్తు వైద్య పరీక్షలతో పుట్టుకతో వచ్చే గుండె జబ్బులను నివారించవచ్చని రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ అన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోని డైస్(డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంట్రవెన్షన్ సెంటర్)లో చిన్నారులకు విజయవాడ ఇండో బ్రిటిష్ ఆసుపత్రి సహకారంతో గుండె వైద్య పరీక్షలు నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావుతో కలిసి సూపరింటెండెంట్ కార్యక్రమాన్ని బుధవారం ఉదయం ప్రారంభించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆర్‌బీఎస్‌కేల ద్వారా గుండె వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులకు స్క్రీనింగ్ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. జిల్లాలో 61 మంది పిల్లలకు పరీక్షలు నిర్వహించగా ఐదుగురికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించినట్లు ఆర్‌బీఎస్‌కే నోడల్ అధికారి డాక్టర్ హరిచంద్ర తెలిపారు. డీఈఐసీ వైద్య అధికారి డాక్టర్ ఇంద్రజ, ఇండో బ్రిటిష్ ఆసుపత్రి చిన్నపిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ అనుషా, తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న సూపరింటెండెంట్ సత్యనారాయణ

రబీకి పుష్కలంగా నీరు

● 90 టీఎంసీలకు మించి లభ్యత

● రైతన్నలకు నూరుశాతం అందించే అవకాశం

పి.గన్నవరం, న్యూస్‌టుడే: ఖరీఫ్ ఈ నెలాఖరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో రానున్న రబీకి గోదావరి డెల్టా పరిధిలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలకు సంబంధించి ఎంత ఆయకట్టుకు సాగునీటి లభ్యత ఉంటుందనే అంశంపై ఇప్పటికే జలవనరులశాఖ ఇంజినీరింగ్ అధికారులు లెక్కలు కట్టారు. నూరుశాతం అందించనున్నట్లు అన్నదాతలకు భరోసా ఇస్తున్నారు. త్వరలోనే అధికారికంగా వెల్లడించే అవకాశం ఉందని జలవనరులశాఖ ధవళేశ్వరం సర్కిల్ ఎస్ఈ కె.గోపీనాథ్ వెల్లడించారు.

అంచనా ఇలా..

ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల పరిధిలోని తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాలు కలిపి రబీ వరి ఆయకట్టు 8.96 లక్షల ఎకరాలు ఉంది. జలవనరుల శాఖ ఇంజినీరింగ్ అధికారుల గణాంకాల ప్రకారం 90 టీఎంసీలు మించి నీరు లభిస్తుందని అంచనా వేశారు. ఒక టీఎంసీ నీటితో 10 వేల ఎకరాలు సాగు చేయొచ్చు. ఈ లెక్కన 8.96 లక్షల ఎకరాలకు 89 టీఎంసీలు సరిపోతుంది. తాగునీటి అవసరాలకు 4, పరిశ్రమలకు 3 వెరసి 7 టీఎంసీలు అవసరం ఉంటుంది. 95 టీఎంసీల ఉన్నందున అవసరమైనప్పుడు వంతులవారీ విధానం అమలు చేయడం, రైతులు నీటి వృథా చేయకుండా వినియోగించుకోవడం వంటి చర్యలతో మొత్తం నూరుశాతం ఆయకట్టుకు నీరు అందే వీలుంది. సీలేరు నుంచి 50 టీఎంసీల పైనే తీసుకునే అవకాశం ఉంది. మిగిలిన జలాలు గోదావరిలో స్వయం జలవృద్ధి, పోలవరం ప్రాజెక్టు నుంచి లభిస్తుందని అంచనా.

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో.. (లక్షల ఎకరాల్లో..)

డెల్టా	వరి ఆయకట్టు
పశ్చిమ	4.60
తూర్పు	2.64
మధ్య	1.72

ఈ నెల 20 లోగా..

రబీలో రైతులు సాగు చేసేందుకు వీలుగా నవంబరు 20లోగా ఐ.ఎ.బి. (సాగునీటి సలహా మండలి) సమావేశాలు ఏర్పాటు చేసి అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. గతంలో కాకినాడ కలెక్టరేట్‌లో సమావేశం ఏర్పాటు చేసి ప్రజాప్రతినిధుల సమక్షంలో వెల్లడించేవారు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ఆయా జిల్లాల కలెక్టరేట్‌ల వద్ద సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు.

ధవళేశ్వరం బ్యారేజీ

ఉద్యోగావకాశాల కల్పనకు చర్యలు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: జిల్లాస్థాయిలో యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగావకాశాల విస్తరణ దిశగా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. రాజమహేంద్రవరంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అకాడమిక్ విద్యతోపాటు నైపుణ్య శిక్షణ కార్యక్రమాతో ఉద్యోగావకాశాలు పెరుగుతాయన్నారు. ప్రతి నియోజకవర్గంలో స్కిల్‌హబ్‌లు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎస్.ప్రసన్న మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించే శిక్షణ పద్ధతులు ప్రారంభించినట్లు తెలిపారు. కళాశాలస్థాయిలో టూరిజం, సంప్రదాయ కళలు, వనరుల వినియోగం వంటి అంశాలపై శిక్షణతో విద్యార్థులు ఉపాధి అవకాశాలు పొందుతారన్నారు. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డి.మునిరత్నంనాయుడు, నైపుణ్యాభివృద్ధి, వికాస, విద్యాశాఖ అధికారులు, ఇంటర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నది విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

FINANCIAL SERVICES

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభవాయిదా లేదా నెలవారీ వడ్డీ పద్ధతిలో పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ, ✆ 73862 01191.

అన్ని రకముల లోన్స్ చేయించబడును నో CIBIL ప్రైవేట్ ఫైనాన్స్ ఇప్పించబడును. బంగారం విడిపించి కొనుటకు డబ్బులు ఇప్పించబడును. Cell: 96663 99944.

REAL ESTATE

LAND FOR SALE

GENERAL

రాజమండ్రికి 30 కి.మీ. దూరంలోగల మురారి - గండేపల్లి మధ్య నేషనల్ హైవేకి చేర్చి 100 అ||ల రోడ్ ఫేసింగ్‌తో 60 సెంట్లు భూమి అమ్మబడును. (నో బ్రోకర్స్), ✆ 90329 88265.

తూర్పుగోదావరి జిల్లా, లింగంపర్తిలో గల వైఆర్‌సి కాలువ అనుకొని 52 ఎకరాల వ్యవసాయ భూమి ఎకరం 35 లక్షలకు అమ్మకమునకు కలదు. (నదిపాటి గోశాలకు 2 కిలోమీటర్ల దూరం), Contact Cell: 93909 91555.

JOBS

WANTED STAFF Ravindra High School. Exp. High School Teachers for English, Social, Science & Telugu. B.Tech. Graduates eligible. Sal: 20K to 22K, Location: Madiki, Vemagiri. ✆ 95334 31103, 91105 67164.

శ్రీనివాస గ్రూప్, VJA. ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/వంట, బేబి కేర్‌కు వర్కర్లు కావలెను. బో+ వ+ జీతం. ✆ 92814 52843, 92814 52827

రామకృష్ణ గ్రూప్ Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు, ఇంటిపని, వంటపని, బేబికేర్ కొరకు స్త్రీ/పు కావలెను. బో+ వ+, జీతం: 16 - 18K. ✆ 9705297788, 9515108830.

శాఖాహార (వెజిటేరియన్) వంటలు, ఇంటిపని చేయుటకు కాకినాడ ఇంటిలో ఉంటూ ఏ బాదరబందీ లేని 35 సం||లలోపు స్త్రీ కావలెను. ✆ 99853 57819, 94911 95169.

సేల్స్ మేనేజర్‌గా రాజమండ్రి, కాకినాడ Livspace ఫ్రాంచైజ్‌లో పనిచేయుటకు కావలెను. 2-5 సం.ల సేల్స్ (ఇంటీరియర్, రియల్‌ఎస్టేట్) అనుభవం కలిగి ఉండాలి. మీ రెజ్యూమ్ vyshnosrigroup@gmail.comకు పంపండి. ✆ 96146 56789.

యాక్సెస్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ NGO సంస్థ వరి-AWD ప్రాజెక్ట్‌లో తూ||గో|| జిల్లాలో పనిచేయటకు ఫీల్డ్ స్టాఫ్/ ఫీల్డ్ సూపర్‌వైజర్స్ కావలెను. అర్హత: ఇంటర్/ డిగ్రీ. Cont. Cell: 98857 35563.

రాజమండ్రి ఉమెన్స్ కాలేజ్ దగ్గర బ్రాహ్మణ కుటుంబంలో వంట చేయుటకు బ్రాహ్మణ ఆడ వంట మనిషి కావలెను. Contact Cell: 80991 91919.

MARKETING/ SALES

ప్రముఖ MNCలో మేనేజర్‌గా పని చేయుటకు డిగ్రీ బైక్ కలిగిన వారు సంప్రదించండి. Cell: +91 91218 56488 రాజమండ్రి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-05 పైII

అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	22,000
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	20,000-21,000
కొత్త (పచ్చి) కాయ	19,000-20,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	109-00
రిటైల్ లైవ్	134-00
డ్రెస్డ్	197-00
స్కిన్‌లెస్	224-00

ఫెన్సింగ్ క్రీడను ప్రోత్సహించాలి

రాజానగరం: కళ్లు, చేతులు, కాళ్లు, మెదడు మధ్య అనుసంధానాన్ని, ఏకాగ్రతను, అప్రమత్తతను పెంచే సంప్రదాయక దేశీయ క్రీడ ఫెన్సింగ్ (కత్తిసాము)ను యువతీ యువకుల్లో విస్తరింపజేయాలని జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల ఛైర్మన్ డా.గన్ని భాస్కరరావు పిలుపునిచ్చారు. ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్‌గా బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ ఫెన్సింగ్ క్రీడలో దేశాన్ని ఒలింపిక్స్‌కు తీసుకువెళ్లడమే మన లక్ష్యం కావాలన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల యూనిట్ల అధ్యక్షులు, కార్యదర్శులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

12వ రాష్ట్రస్థాయి సీనియర్ల ఫెన్సింగ్ పోటీలు జీఎస్ఎల్ వైద్య కళాశాలలోని సుశ్రుత ఆడిటోరియంలో మంగళవారం అర్ధరాత్రి వరకు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అధిక పాయింట్లు సాధించిన వారిని మూడేసి విభాగాల్లో నలుగురు చొప్పున బాలబాలికల నుంచి 12 మంది చొప్పున జాతీయ ఫెన్సింగ్ పోటీలకు రాష్ట్రం తరపున ఎంపిక చేసినట్లు నిర్వాహకుడు ఎన్.సతీష్‌బాబు తెలిపారు.

92.7 FM Rajamahendravaram

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

ఆటో ఢీకొని మెకానిక్ మృతి

చాగల్లు, మోరంపూడి: మోటారుసైకిల్‌ను ఆటో ఢీకొట్టడంతో తీవ్రగాయాలై వ్యక్తి మృతి చెందిన ఘటన కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరం పిడింగొయ్యి పంచాయతీ గంగిరెద్దుల కాలనీలో నివాసముంటున్న దేవగుప్తాపు వెంకటరమణ(50) సైకిల్ మెకానిక్‌గా పనిచేస్తుంటారు. పని నిమిత్తం మోటారుసైకిల్‌పై పిడింగొయ్యి నుంచి కొవ్వూరు మీదుగా ఆరికిరేవుల వైపు ఏటిగట్టుపై వెళ్తున్నారు. తాళ్లపూడి నుంచి కొవ్వూరు వైపు వస్తున్న ఆటో ఆరికిరేవుల వద్దకు వచ్చే సరికి ఆయనను ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన వెంకటరమణను ప్రైవేటు అంబులెన్సులో రాజమహేంద్రవరం తీసుకువెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందారు. కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి పంచనామా నిమిత్తం తరలించారు.

వెంకటరమణ (పాత చిత్రం)

స్వాముల భోజనానికి వస్తానన్నారు..

అయ్యప్ప స్వాములకు భిక్ష పెడుతున్నామని ఫోన్ చేస్తే పది నిమిషాల్లో వస్తానని చెప్పారని, అవే ఆయన ఆఖరు మాటలయ్యాయని వెంకటరమణ మేనల్లుడు కన్నీటిపర్యంతమయ్యారు. వెంకటరమణకు భార్య మంగ, కుమారుడు, వివాహమైన కుమార్తె ఉన్నారు. కుమారుడు సతీష్‌కు ప్రైవేటు కంపెనీలో మెడికల్ రిప్రెజెంటేటివ్‌గా చేరేందుకు రెండు రోజుల క్రితమే నియామకపత్రం అందింది. బుధవారం ఉదయం అనారోగ్యంతో ఉన్న బావమరిదిని ఆసుపత్రిలో చేర్పించిన అనంతరం తాళ్లపూడి వెళ్తున్నానని, మధ్యాహ్నం తిరిగి వస్తానని చెప్పారని, ఇంతలోనే ఘోరం జరుగుతుందని అనుకోలేదని కుటుంబ సభ్యులు విలపిస్తుండటం చూపరులను కంటతడి పెట్టించింది.

బాలింత మృతి కేసు.. వైద్యురాలిపై చర్యలు

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో బాలింత మృతికి సంబంధించిన వ్యవహారంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్, గైనకాలజిస్టు సుజాతపై శాఖపరమైన చర్యలు తీసుకున్నారు. వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ పద్మ ఆమెను సీహెచ్‌సీ నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని డీసీహెచ్ఎస్ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 13న గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన శ్రీదుర్గకు పిఠాపురం సీహెచ్‌సీలో ప్రసవం జరిగింది. ఆమె ఆరోగ్య పరిస్థితి బాగోక కాకినాడ జీజీహెచ్‌కు పంపించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమెకు పుట్టిన బిడ్డకు పరిస్థితి బాగోలేదని కుటుంబ సభ్యులు స్థానిక పాడా కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో గత నెల 23న కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాల మేరకు వైద్యబృందం, పాడా పీడీ చైత్రవర్షిని విచారణ చేపట్టి కలెక్టర్‌కి నివేదిక ఇచ్చారు. దాని ఆధారంగా ఎట్టకేలకు ఆమెపై శాఖపరమైన చర్యలకు ఆదేశించారు. ప్రస్తుతం సామర్లకోట సీహెచ్‌సీ నుంచి గైనకాలజిస్టు కన్యాకుమారిని డిప్యూటేషన్‌పై బుధవారం నియమించారు.

కత్తులతో దాడి.. నలుగురిపై కేసు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: ఓ యువకుడిపై కత్తులతో దాడిచేసిన నలుగురిపై కాకినాడ మూడో పట్టణ పోలీసులు బుధవారం హత్యాయత్నం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ సాంబమూర్తినగర్‌కు చెందిన ఎద్దు గణేష్ అనే యువకుడు ప్రైవేటు బస్సు క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. స్థానిక రేచర్లపేటకు చెందిన కోడిదాసు శివకు గణేష్ అప్పుగా కొంత నగదు ఇచ్చాడు. ఎన్నిసార్లు అడిగినా తిరిగి ఇవ్వలేదు. అడిగితే చంపేస్తానని బెదిరించాడు. మంగళవారం రాత్రి సాంబమూర్తినగర్ కాస్మో హోటల్ వద్ద రూ.12వేలు ఇవ్వమని గణేష్ అడగ్గా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం గణేష్‌పై శివ దాడిచేశాడు. అదేసమయంలో సాంబమూర్తినగర్‌కు చెందిన ఆల్తాఫ్, విజయ్, రేచర్లపేటకు చెందిన వీరు, కలిసి గణేష్‌ను కొట్టడంతో పాటు కత్తులతో దాడి చేశారు. బాధితుడిని జీజీహెచ్‌కు తరలించారు. ఎస్సై సాగర్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

(c) eenadu

విద్యార్థినులకు దేశభక్తి గీతాల పోటీలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: వందేమాతర గీతం 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాలిటిక్స్ విభాగం ఇన్‌ఛార్జి బి. లక్ష్మి ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం విద్యార్థినులకు వైస్ ప్రిన్సిపల్ పి. శ్రీవల్లి నిర్వహణలో దేశభక్తి గీతాల పోటీలు జరిగాయి. గీతాలు ఆలపించి, వాటి భావార్థం వివరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు రూస్వెల్ట్‌బాబు, పద్మజ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లో)

దేవీచౌక్, న్యూస్‌టుడే: టమాట-24, వంకాయలు నలుపు-48/ గులాబీ-80/తెలుపు-50/దొమ్మేరు-70, బెండ-54, కాకర-38, బీర పొట్ల-50, దొండ-50, క్యారెట్-56, బీట్‌రూట్-44, గోరు చిక్కుళ్లు-46, దోస-36, ఆనపకాయ-46, చిక్కుళ్లు-90/118, పచ్చిమిర్చి-38/ రావులు-36, బంగాళదుంపలు-22, ఉల్లిపాయలు-20

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల శ్రమదానం

చెరువును శుభ్రం చేస్తున్న వాలంటీర్లు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కొంతమూరులో ప్రత్యేక సేవ శిబిరం నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం ఇక్కడి అంజనా నగర్‌లోని చెరువులో పూడిక, వ్యర్థాలు, తుప్పలు తొలగించి శుభ్రపరిచారు. అక్షరాస్యత ఆవశ్యకత వివరిస్తూ గ్రామంలో అవగాహన ర్యాలీ చేశారు. నిపుణులు హాజరై వ్యక్తిత్వ వికాసంపై ప్రసంగించారు. ఎన్ఎస్ఎస్ అధికారి జి.వి.ఎస్.నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే

ఇకపై సమయానికి కళాశాలకు వస్తాం

దేవీచౌక్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు పదుల సంఖ్యలో బుధవారం ఆలస్యంగా హాజరయ్యారు. దీంతో ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. తల్లితండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తుంటే బాధ్యత లేకుండా ఉండటం సరికాదని తెలిపారు. బుద్ధిగా చదువుకుని ఎంతో పేరున్న కళాశాల, కష్టపడి చదివిస్తున్న తల్లితండ్రులకు పేరు తీసుకువస్తామని, ఇక నుంచి కళాశాలకు సమయానికి వస్తామని ప్రతిజ్ఞ చేయించి తర్వాత లోపలికి అనుమతించారు.

వృత్తి నైపుణ్యంతో ఉపాధికి బాటలు

• న్యాక్‌లోని అర్బన్ స్కిల్‌హబ్‌లో త్వరలో తరగతులు

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన(పీఎంకేవీవై) పథకం కింద నిరుద్యోగ యువతకు ప్రభుత్వం పలు వృత్తి నైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించనుంది. పరిశ్రమలు, వివిధ సంస్థల అవసరాలకు అనుగుణంగా ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్, రోడ్డువే సర్వేయర్, అసిస్టెంట్ సర్వేయర్, కన్‌స్ట్రక్షన్ ఫిట్టర్ ట్రేడ్‌లలో బ్యాచ్ వారీగా శిక్షణ అందించేందుకు నిర్ణయించింది. కలెక్టరేట్ వద్ద ఉన్న నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్)లోని రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గ స్కిల్ హబ్‌లో శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి, అర్హత ఉన్న నిరుద్యోగ అభ్యర్థుల నుంచి ప్రస్తుతం దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. అభ్యర్థులు నేరుగా న్యాక్ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. వచ్చిన దరఖాస్తుల నుంచి అర్హులను ఎంపిక చేసి త్వరలో బ్యాచ్ వారీగా శిక్షణ తరగతులు ప్రారంభించనున్నారు.

120 మందికి ఉచిత శిక్షణ..

ఒక్కొక్క కోర్సులో 30 మంది చొప్పున మొత్తం 120 మంది నిరుద్యోగ యువతను ఎంపిక చేసి ఇక్కడ ఉచిత శిక్షణ అందించనున్నారు. శిక్షణ సమయంలో స్టైఫండ్ ఉచితంగా అందిస్తారు. విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి కేంద్ర ప్రభుత్వం ద్వారా ఎన్ఎస్‌డీసీ సర్టిఫికెట్లు అందించడంతో పాటు వివిధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు(ప్లేస్‌మెంట్) కల్పించనున్నట్లు న్యాక్ నోడల్ అధికారి పి. మురళీధర్ తెలిపారు.

ఎలక్ట్రీషియన్ కోర్సులో ప్రాక్టికల్ శిక్షణ పొందుతున్న యువత (పాత చిత్రం)

దరఖాస్తుకు జతచేయాల్సినవి ఇవే..

ఈ నాలుగు ట్రేడ్‌లలో దేనిలోనైనా చేరదలిచిన అభ్యర్థులు తమ దరఖాస్తుకు ఆధార్‌కార్డు, ఎస్ఎస్‌సీ మార్కుల జాబితా, ఇతర విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలు, మూడు పాస్‌పోర్టు ఫొటోలు జతచేసి సమర్పించాల్సి ఉంటుందని న్యాక్ అధికారులు తెలిపారు.

కాలవ్యవధి.. అర్హతలు

● ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్ కోర్సు కాలవ్యవధి 68 రోజులు. మాస్టర్ ట్రైనర్ ఎం. కె. డి. మహాలక్ష్మి పర్యవేక్షణలో ప్రాక్టికల్, థియరీ శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. ఈ కోర్సులో చేరేందుకు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ ఏదైనా విద్యార్హత ఉంటే సరిపోతుంది. వయసు 18 నుంచి 45 ఏళ్లలోపు ఉండాలి. దరఖాస్తు, ఇతర వివరాల కోసం 62811 14627 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.

● రోడ్డువే సర్వేయర్ కోర్సు కాలవ్యవధి 68 రోజులు. మాస్టర్ ట్రైనర్ డి. ఎస్. ఎన్. మూర్తి పర్యవేక్షణలో థియరీతోపాటు ప్రాక్టికల్ శిక్షణ అందిస్తారు. ఈ కోర్సులో చేరేందుకు పదో తరగతి, ఇంటర్, లేదా డిప్లొమో విద్యార్హతలు కలిగి 18 నుంచి 45 ఏళ్లలోపు వయసు ఉండాలి. దరఖాస్తు, ఇతర వివరాల కోసం 96667 71765 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.

● అసిస్టెంట్ సర్వేయర్ కోర్సు కాలవ్యవధి 38 రోజులు. మాస్టర్ ట్రైనర్ వి. బి. పి. జయలక్ష్మి పర్యవేక్షణలో థియరీ, ప్రాక్టికల్ శిక్షణ తరగతులు జరుగుతాయి. ఈ కోర్సులో చేరేందుకు పదో తరగతి విద్యార్హత ఉంటే చాలు. వయసు 18 నుంచి 45 ఏళ్లు ఉండాలి. మరిన్ని వివరాలకు 96667 70760 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.

● కన్‌స్ట్రక్షన్ ఫిట్టర్ కోర్సు కాలవ్యవధి 45 రోజులు. మాస్టర్ ట్రైనర్ జె. ఆనంద్‌కుమార్ పర్యవేక్షణలో థియరీ, ప్రాక్టికల్ శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. ఈ కోర్సులో చేరేందుకు పదో తరగతి లేదా ఐటీఐ(ఫిట్టర్) విద్యార్హత ఉండాలి. వయసు 18 నుంచి 45 ఏళ్లు ఉండాలి. దరఖాస్తు, మరిన్ని వివరాలకు 93981 88639 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఆర్ఏఎంపీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పారిశ్రామిక అధికారి వనిధర్ రమణ్ సూచించారు. రాజమహేంద్రవరంలోని ఆదిత్య బిజినెస్ స్కూల్ ఆఖరు ఏడాది విద్యార్థులతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. వివిధ అంశాలపై 20 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తామని చెప్పారు. పూర్తి వివరాలు 89781 26841 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, శిక్షణ టీం సభ్యులు పాల్గొన్నారు.

వైద్యకళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మాజీ ఎంపీ భరత్‌రామ్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలో వైకాపా శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. తొలుత కంబాలచెరువు వద్ద గాంధీజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించిన అనంతరం ర్యాలీని ప్రారంభించారు. దేవీచౌక్ సెంటర్, లక్ష్మీవారపుపేట మీదుగా సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని అక్కడ రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మాట్లాడుతూ ప్రజలకు మేలు చేయాలని ప్రభుత్వం ఆశిస్తే తక్షణం వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలని లేని పక్షంలో తమ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు.

ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి

మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ నరసింహకిషోర్, చిత్రంలో అధికారులు, సిబ్బంది

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం టూ టౌన్ పోలీసు స్టేషన్ వార్షిక తనిఖీలో భాగంగా ప్రజల భాగస్వామ్యంతో 'నా పోలీస్- నా పోలీస్ స్టేషన్' అనే నూతన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ శ్రీకారం చుట్టారు. గ్రామ, వార్డు దత్తత కానిస్టేబుళ్లు, గ్రామ మహిళా పోలీసులు, ప్రజల భాగస్వామ్యంతో వారి సమస్యలు నేరుగా పరిష్కరించే దిశగా అడుగులు వేశారు. ఈ సందర్భంగా టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి విషయాన్ని రికార్డులో నమోదు చేయాలని, స్టేషన్ వచ్చే ప్రజలపట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. మహిళ భద్రతా, సైబర్ నేరాలు, ఇంటి, రోడ్డు భద్రతా, యాంటీ డ్రగ్స్, మహిళలపై జరిగే నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు ఉపయోగించే డ్రోన్లు, సోలార్ కెమెరాలు, శక్తి యాప్, డయిల్ 112 తదితర పరికరాలతో స్టాల్ ఏర్పాటు చేశారు. టు టౌన్ స్టేషన్ విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందని ఎస్పీ సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీఠానికి పంచముఖి రుద్రాక్షల అందజేత

బాలాజీకి జ్ఞాపిక అందిస్తున్న పీఠాధిపతి వెంకన్నబాబు స్వామీజీ

రాజమహేంద్రవరం సాంస్కృతికం: గాడాలలో కొలువైన శ్రీమహాలక్ష్మీ సమేత చిన్న వేంకన్న బాబు పీఠంలో సినీనటుడు బాలాజీ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో పీఠంలో కొలువైన శ్రీచక్రవాహినీ భద్రకాళీ సమేత శ్రీవీరేశ్వరస్వామికి కార్తిక మాసం సందర్భంగా ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే పూజల వివరాలను పీఠాధిపతి వెంకన్నబాబు స్వామీజీ బాలాజీకి వివరించారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు భక్తులచే స్వయంగా 1,08,999 పంచముఖి రుద్రాక్షలతో విశేషంగా అర్చన జరిపిస్తామన్నారు. బాలాజీ 108 పంచముఖి రుద్రాక్షలను పీఠానికి అందజేశారు. సింగంశెట్టి మహితోష్, మతల రమేష్, అంబటి శ్రీనివాసరావు, పూర్ణిమారాజ్ తదితరులు పాల్గొన్నారు.

నెరవేరుతున్న పేదల సొంత ఇంటి కల

లబ్ధిదారునికి ఇంటి తాళం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరి

టి.నగర్, న్యూస్‌టుడే: పేద, మధ్య తరగతి ప్రజల సొంత ఇంటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. 46వ డివిజన్ రామదాసుపేటలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో పూర్తయిన ఇళ్లలో బుధవారం గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ షరతులు లేని సంక్షేమం దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. పేదలకు అర్బన్ ప్రాంతాల్లో రెండు సెంట్లు భూమి ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీని ప్రకారం త్వరలో పట్టాలు పంపిణీ ప్రక్రియ చేపడుతున్నామన్నారు. రుడా ఛైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరికీ భూమిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ పేదలను గుర్తించి, వారికి పథకాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మూత లేక వెతలు

స్థానిక టి.నగర్ హిందు సమాజ్ వద్ద రహదారి వెంబడి ఉన్న మ్యాన్‌హోల్‌పై మూత దెబ్బతింది. ప్రధాన వాణిజ్య సంస్థలు, బ్యాంకులకు ఈ ప్రాంతం కేంద్రం కావడంతో నిత్యం వందలాది మంది సంచరిస్తూంటారు. ఈ ప్రాంతంలో సుమారు రెండు నెలల నుండి డ్రెయినేజీపై మూత లేక వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూత ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు తోడ్పడాలని కోరారు. - న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

చెత్త పేరుకుపోయి ఇక్కట్లు

రాజమహేంద్రవరం నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లను చెత్తతో నింపేస్తున్నారు. దీనివల్ల పరిసరాల్లోని వారితోపాటు అటుగా రాకపోకలు సాగించే వారికీ ఇబ్బందులు తప్పడం లేదు. ఇంటింటా చెత్త సేకరణ మొదలైన తర్వాత కుండీలు తొలగించడంతో వ్యర్థాలను రోడ్లపై వేస్తున్నారు. స్థానిక జయకృష్ణపురంలోని పార్కు సమీపంలో చెత్త పేరుకుపోయింది. వెంటనే చెత్తను తొలగించడంతోపాటు రోడ్లపై చెత్త వేసేవారిపై చర్యలు తీసుకోవాలని పలువరు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, దేవీచౌక్

శుభ్రత పడకేసి అవస్థలు

నిత్యం సాయంత్రం వేళ యువత, కుటుంబాలతో సందడిగా ఉండే ఈట్ స్ట్రీట్ ప్రాంతంలో శుభ్రత పడకేసింది. నడకదారి, బల్లల వద్ద మురుగు రోడ్డెక్కుతుండడంతో ఇబ్బందులు తప్పలేదు. ఖాళీ ప్లేట్లు, గ్లాసులు చిన్న కాలువ వద్ద పారేయడంతో మురుగు పారే దారి లేక పైకి చేరుతోందని పలువురు అంటున్నారు. వ్యాపారులు సైతం దుకాణాలు మూసే ముందు తమ పరిసరాలు పూర్తిగా శుభ్రపరిస్తే పారిశుద్ధ్య కార్మికులకు శ్రమ తగ్గించనవారవుతారు. - న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

రోడ్డుపైనే దిమ్మలతో చిక్కులు

స్థానిక టి. టి. డి కల్యాణ మండపంలో మార్గంలో ఉమెన్స్ కళాశాల వద్ద మలుపులో రోడ్డుపై వదిలేసిన డివైడర్ దిమ్మలు వాహనదారులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. మ్యాన్‌హోల్ మరమ్మతుల నిమిత్తం వీటిని ఏర్పాటు చేసి తర్వాత అలాగే వదిలేశారు. నిత్యం విద్యార్థులు, వాహనదారులు, కళాశాల బస్సులతో రద్దీగా ఉండే మార్గంలో నడి మధ్య ఉన్న దిమ్మలను గుర్తించడంలో తడబడుతూ దగ్గరగా రాగానే సడన్ బ్రేకులు వేస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

వసతి గృహాన్ని కళాశాలకు అప్పగించాలి

ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: శ్రీ కందుకూరి రాజ్యలక్ష్మి (ఎస్‌కేఆర్) కళాశాలలోని వసతి గృహం తమదేనంటూ హితకారిణి సమాజం చెప్పటం దారుణమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్. రాజా అన్నారు. 2023లో ఎస్‌కేఆర్ కళాశాల ప్రభుత్వ పరం కాగా వసతిగృహం మాత్రం తమదేనని చెబుతుండడం బాధాకరమన్నారు. ఈ నేపథ్యంలో కళాశాల విద్యార్థినులు బుధవారం ఆందోళన చేపట్టి వసతి గృహాన్ని కళాశాలకు వెంటనే అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కె.జ్యోతి, లహరి, సౌమ్య, కార్తిక్, హేమంత్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియలో బీఎల్‌వోల పాత్ర కీలకం

కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ రాహుల్ మీనా

టి.నగర్, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితాలో తప్పులకు ఆస్కారం లేకుండా బీఎల్‌వోలు జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం బీఎల్‌వోలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఓటర్ల జాబితా రూపొందించడంలో మెలకువలు, జాబితా తయారీ, మార్పులు చేర్పులు వంటి అంశాలపై వివరించారు. ఎన్నికల కమిషనర్ నిబంధలను తప్పకుండా అమలు చేస్తూ, ఓటరు జాబితా రూపొందించడానికి కృషి చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ వెంకట రమణ, ఎమ్మార్వో పాపారావు , డిప్యూటీ తహశీల్దారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ● నగరపాలక సంస్థ పరిధిలో యంత్రాంగం సకాలంలో పన్నులు వసూలు చేయాలని కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. రెవెన్యూ విభాగం అధికారులు, పరిపాలన కార్యదర్శులతో సమావేశమయ్యారు. సచివాలయం ఉద్యోగులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పన్నుల చెల్లింపుపై సర్వే నిర్వహించాల్సి ఉందన్నారు.

ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దుర్గేష్ తదితరులు

హిందీలో చేతి రాత బైబిల్

టి.నగర్, న్యూస్‌టుడే: విశ్రాంత ప్రధానోపాధ్యాయిని శాంతకుమారి హిందీలో చేతి రాతతో రూపొందించిన బైబిల్ లూథర్‌గిరిలో బుధవారం ఆవిష్కరించారు. మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గతంలోనే తెలుగు, ఆంగ్ల భాషల్లో బైబిల్‌ను చేతి రాతతో పూర్తి చేశారన్నారు. హిందీలో పూర్తి చేసిన శాంతకుమారిని అభినందించారు. ఆమెతోపాటు భర్త, పేపరుమిల్లు ఐఎన్‌టీయూసీ నేత భయ్యా జోసఫ్ రాజును సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, కోలమూరు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాలు విలీనం

సమావేశంలో మాట్లాడుతున్న డీఐ బి.దిలీప్‌కుమార్

శ్యామలా సెంటర్: జాతీయ విద్యా విధానం 2020కి అనుగుణంగా విద్యార్థుల్లో పునాది అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు డీఐ బి. దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక కోటగుమ్మంలోని డీఐ కార్యాలయంలో ఐసీడీఎస్ పీవో, సూపర్‌వైజర్లతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరంలోని 165 అంగన్‌వాడీ కేంద్రాలను 37 పాఠశాలలకు అనుసంధానం చేసేందుకు ప్రభుత్వం అనుకూలంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శిశు సంక్షేమ ప్రాజెక్టు అధికారి యు.పద్మ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలతో కొత్త ఆవిష్కరణలకు నాంది

సమావేశంలో మాట్లాడుతున్న చైతన్యరాజు

రాజానగరం: ప్రపంచం సమాచార, సాంకేతికతలో వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో డాక్టరేట్ పరిశోధన విద్యార్థులు కొత్త ఆవిష్కరణలను నాంది పలకాలని జీజీయూ కులపతి కె. వి. వి. సత్యనారాయణరాజు (చైతన్య రాజు) అన్నారు. జీజీయూ పరిశోధనాభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పీహెచ్‌డీ స్కాలర్స్ రెండో బ్యాచ్ ఒరియంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇక్కడ పరిశోధనలు చేస్తున్న వారిలో ప్రసిద్ధ పారిశ్రామిక సంస్థల్లో పనిచేస్తున్న నిపుణులు కూడా ఉండటం వర్సిటీకి గర్వకారణమన్నారు. విశ్వవిద్యాలయంలో లభిస్తున్న ఆధునిక, సాంకేతిక వనరులను, అనుభవజ్ఞులైన అధ్యాపకుల మార్గదర్శకత్వాన్ని సమర్థంగా వినియోగించుకుని పీహెచ్‌డీని విజయవంతంగా పూర్తిచేయాలని విద్యార్థులను ప్రోత్సహించారు. జీజీయూ వీసీ యు. చంద్రశేఖర్, ప్రొ వీసీ కె. వి. బి. రాజు, రిజిస్ట్రార్ పి. ఎం. ఎం. ఎస్. శర్మ, డైరెక్టర్లు ఎం. శ్రీనివాసరావు, ఆర్. ఎస్. రాజు, సహాయ డైరెక్టర్ ఎస్. ఎస్. ఎన్. రాజు, డీన్లు, ప్రిన్సిపల్స్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

కంబాలచెరువు: కుటుంబ కలహాలు, అప్పుల బాధలు తాళలేక ఒక వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం ఇన్నీసుపేట ప్రకృతి వారి వీధిలో కాకి భవానీ శంకర్ (37) అల్పాహార దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇటీవల ఇంటి నిర్మాణం నిమిత్తం బంగారం తాకట్టుపెటి, వివిధ రూపాల్లో రుణాలు తీసుకున్నాడు. ఆయనకు తల్లిదండ్రులతో మనస్పర్థలు ఉన్నాయి. ఈ నెల 9న పురుగు తాగాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన జీజీహెచ్‌లో చేర్చారు. తర్వాత మెరుగైన వైద్యం నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. రెండో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భయపెడుతున్న బయో వ్యర్థాలు

రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో జీవ, వైద్య వ్యర్థాల నిర్వహణ సక్రమంగా సాగడం లేదు. నిత్యం పోగయ్యే వ్యర్థాలను ఆసుపత్రి నుంచి ప్రత్యేక సంచుల్లో నిర్వహణ కేంద్రాలకు తరలించాల్సి ఉండగా.. సిరంజులు, గౌజులు, శస్త్ర చికిత్స అనంతరం వినినియోగించిన దూది, ఐవీ క్యానులాలు, ఖాళీ సెలైన్లు తదితరాలను మార్చురీకి వెళ్లే దారిలో పడేస్తున్నారు. అప్పుడప్పుడు వీటికి నిప్పు పెట్టి ప్రజారోగ్యానికి పొగ పెడుతున్నారు. సంచుల్లో భద్రపరిచి నిర్వాహకులకు అందించాల్సిన బయో వ్యర్థాలను బయట చిందర వందరగా వేస్తుండటం కలవరపాటుకు గురిచేస్తోంది. కుక్కలు, పందులు, పశువులు ఆ వ్యర్థాలను చిందరవందర చేస్తున్నాయి. ప్రమాదాన్ని గుర్తించి బయో వ్యర్థాల నిర్వహణపై దృష్టి సారించాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కంబాలచెరువు, కోటగుమ్మం

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 83282 39927, 80089 02897

సమస్య: స్థానిక క్వారీ మార్కెట్ ప్రాంతంలోని శివాలయానికి వెళ్లే మార్గంలో వీధిదీపాలు చాలా కాలంగా వెలగడం లేదు. రాత్రివేళలో అంధకారంగా ఉంటోంది. - నాగేశ్వరరావు, స్థానికుడు

సమస్య: స్థానిక జేఎన్‌రోడ్డులోని అభయ ఆసుపత్రి ఎదురు వీధిలో వీధిదీపాలు చాలారోజులుగా వెలగడం లేదు. రాత్రివేళ అంధకారంగా ఉండటంతో వాహనాల్లో బ్యాటరీల చోరీలు జరుగుతున్నాయి. - సూర్యకుమార్, స్థానికుడు

సమాధానం: సిబ్బందిని పంపించి వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. - విమల, ఎలక్ట్రికల్ ఏఈ

సమస్య: స్థానిక విద్యుత్తు కాలనీ ఏడో వీధిలో ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుండటంతో పాటు దోమలు పెరిగిపోయి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. - భానుమతి, స్థానికురాలు

సమాధానం: పారిశుధ్య సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తాం. - వినూత్న, ఎంహెచ్‌వో

- న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

(c) eenadu

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

గ్రామస్థాయిలోనే సమస్యలు పరిష్కరించాలి

బిక్కవోలు, న్యూస్‌టుడే: గ్రామస్థాయి సమస్యలను అక్కడే పరిష్కరించాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ అన్నారు. బుధవారం బిక్కవోలులో మండల, సచివాలయాల సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యయప్రయాసలకోర్చి జిల్లా కేంద్రాలకు వచ్చి ఫిర్యాదుల ఇస్తున్నారన్నారు. తీసుకున్న ప్రతి ఫిర్యాదుకు రసీదు ఇవ్వాలని, సమస్యను స్థానికంగానే పరిష్కరిస్తే ప్రజలకు నమ్మకం కలుగుతుందని చెప్పారు. 1100కు ఫోన్ చేసి సమస్యను నమోదు చేయించుకోవచ్చని తెలియజేయాలన్నారు. తహసీల్దారు కృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలి

మోరంపూడి, న్యూస్‌టుడే: తడి, పొడి చెత్త నిర్వహణను విస్మరించి సంపద కేంద్రాలను నిరుపయోగంగా వదిలేశారని మండల భాజపా అధ్యక్షుడు మట్టా నాగబాబు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల శ్రీనివాస్, నియోజకవర్గ కోకన్వీనర్ యానాపు ఏసు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం వీరు శాటిలైట్ సిటీలో పర్యటించి ఎ, బి, సి బ్లాకుల్లో పేరుకుపోయిన చెత్తను చూసి విస్మయం వ్యక్తం చేశారు. ఇళ్ల నుంచి చెత్త సేకరణ చేయడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చాయన్నారు. గ్రామమంతా చెత్తతో అపరిశుభ్రంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి నాయకుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మన్నెం శ్రీనివాస్, మజ్జి సాయి, పబిత్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దయలేని జీవితం వ్యర్థం

తెలుగు వర్సిటీలో సాహితీవేత్తలతో ఉపకులపతి మునిరత్నం

బొమ్మూరు: ప్రతి ఒక్కరూ ప్రేమ, దయ కలిగి ఉండాలని, అది లేని జీవితం వ్యర్థమని బొమ్మూరులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి డి. మునిరత్నంనాయుడు అన్నారు. పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు అదంకి రాజాయోనా ఆధ్వర్యంలో ప్రపంచ దయ దినోత్సవాన్ని బుధవారం యూనివర్సిటీలో నిర్వహించారు. సాటి మనిషికి సహాయం చేయాలని సూచించారు. సామాజికవేత్త కొయ్యాన కుమారి మాట్లాడుతూ తెలుగు వర్సిటీ పూర్వ వైభవానికి తమవంతు కృషి చేస్తామన్నారు. రాజా మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నవారికి ఏదోవిధంగా సహాయం చేయడమే మానవజన్మకు సార్థకత అన్నారు. సామాజిక వేత్తలు పట్నాల వెంకటరమణ, పుత్ర హనోక్, డా. వి. ఐజక్, పి. జె. సుందర్‌లకు పురస్కారాలు అందజేసి సత్కరించారు.

విద్యాలయాలకు రక్షణ ఏదీ..?

ప్రహరీల్లేక ఆవరణ అపరిశుభ్రం

న్యూస్‌టుడే – రాజానగరం, కోరుకొండ

గత ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లూ ప్రభుత్వ పాఠశాలలను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. అనాలోచిత నిర్ణయాలతో పాఠశాలల్లో ప్రవేశాలు, హాజరు తగ్గిపోయాయి. విద్యా వ్యవస్థను గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అయినప్పటికీ పలు సమస్యలు వేధిస్తున్నాయి. ప్రహరీలు లేక రాత్రి వేళల్లో ఆకతాయిలు లోపలికి ప్రవేశించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఆవరణలో మద్యం తాగి సీసాలను మైదానాలు, అసంపూర్తి భవనాల్లో విసిరేస్తున్నారు. పాఠశాల ఆవరణ, పరిసరాలను నాశనం చేస్తున్నారని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి.

మండలం	పాఠశాలలు	ప్రహరీ లేనివి
రాజానగరం	61	25
కోరుకొండ	55	10
సీతానగరం	57	15

నియోజకవర్గంలో 50 పాఠశాలల్లో..

రాజానగరం నియోజకవర్గంలో 173 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 50 పాఠశాలలకు ప్రహరీలు లేవు. కొన్నిటికి సగం కట్టి వదిలేశారు. నాడు-నేడు పనుల్లో భాగంగా మంజూరైన పలు పాఠశాలల్లోను ఇంకా పూర్తి కాలేదు. బిల్లుల బకాయిలు పూర్తిస్థాయిలో రాకపోవడంతో గుత్తేదారులు మధ్యలోనే నిర్మాణాలను నిలిపివేశారు. ● కోరుకొండ మండలం నర్సాపురంలో పొలాల మధ్య ప్రధాన రహదారిని ఆనుకుని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉంది. ప్రధాన ద్వారానికి ఎటువంటి రక్షణా లేదు. రెండేళ్ల క్రితం భవనానికి ఒకవైపు ప్రహరీ నిర్మాణం ప్రారంభించి స్తంభాల కోసం ఇనుపచువ్వలు కట్టి వదిలేశారు. రక్షణ లేకపోవడంతో గతంలో ఇదే పాఠశాలలో కంప్యూటర్ చోరీకి గురైంది. ● దివాన్‌చెరువు, రామస్వామిపేట, కోటికేశ్వరం, రాఘవాపురం తదితర గ్రామాల్లోని పాఠశాలలు రహదారులకు ఆనుకుని ఉన్నాయి. విద్యార్థుల రాకపోకల సమయంలో వాహనాలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఆయా పాఠశాలలకు ప్రహరీల నిర్మాణం పూర్తి చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పూర్తిస్థాయిలో ప్రహరీ, గేటు లేని రాఘవాపురం పాఠశాల

ప్రహరీల నిర్మాణానికి చర్యలు

నియోజకవర్గంలోని అన్ని పాఠశాలలకు ప్రహరీలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం. కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించి మార్పులు తీసుకువస్తోంది. ఇప్పటికే పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకున్నాం.

- బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్యే

విద్యుత్తు సరఫరాకు అంతరాయం రేపు

అనపర్తి గ్రామీణం: రామవరంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ జేపీబీ నటరాజన్ తెలిపారు. కుతుకులూరు సబ్‌స్టేషన్ నుంచి వచ్చే రామవరం ఫీడర్‌కు 24 గంటల విద్యుత్తు లైన్ వేసేందుకు పనులు చేపట్టనున్నట్లు చెప్పారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

రాజానగరం, బిక్కవోలు: ఈ నెల 14 నుంచి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు రాజానగరం, కొంకుదురు శాఖల అధికారులు కె.సత్యనారాయణ, బాల తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, వక్తృత్వం, దేశభక్తి గీతాలు తదితర పోటీలు నిర్వహిస్తామన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు

బిక్కవోలు: స్థానిక శ్రీలక్ష్మీగణపతి దేవాలయాన్ని రూ. 16 కోట్ల అంచనా వ్యయంతో పునర్నిర్మించేందుకు ప్రతిపాదనలు చేశారు. బుధవారం దేవాదాయ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఉదయ్‌కుమార్, ఏఈ కల్యాణ్, స్థపతులు శ్రీనివాసాచార్యులు, నాగేశ్వరరావు వచ్చి పరిశీలించారు. నిర్మాణ విషయమై ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో చర్చించారు.

15న సామూహిక సీమంతాలు

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: అనపర్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శనివారం ఉదయం 9 గంటలకు గర్భిణులకు సామూహిక సీమంతాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. తాడి రామగుర్రెడ్డి తెలిపారు. కాకినాడ పరంజ్యోతి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, డీసీహెచ్ఎస్ డా. పద్మ పాల్గొంటారన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన నాయకులు

గోకవరం, దేవీపట్నం: సమస్యలు పరిష్కరించాలని పోలవరం నిర్వాసితులు మంత్రి లోకేశ్‌ను కోరారు. తెదేపా నాయకులు లంక హరిబాబు, పాసాల సతీష్, నాగార్జున తదితరులు మంగళగిరిలో పార్టీ కార్యాలయం వద్ద బుధవారం మంత్రి లోకేశ్‌ను కలిసి పోలవరం నిర్వాసితుల సమస్యలను వివరించారు.

కడియంలో లబ్ధిదారులకు పట్టువస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి

శ్రీకృష్ణపట్నంలో గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల, బీవీఆర్ చౌదరి

బిక్కవోలులో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పేదల సొంతింటి కల సాకారమే ధ్యేయం

కడియం, న్యూస్‌టుడే: పేదలకు సొంతింటి కల సాకారం చేయడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని గ్రామీణ ఎమ్మెల్యే, తెదేపా రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. కడియంలో పీఎంఏవై కింద ఇల్లు నిర్మించుకుని గృహప్రవేశం చేసిన మురముళ్ల వీరభద్రరావు దంపతులకు బుధవారం ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు అందించారు. నియోజకవర్గంలో 375 ఇళ్లు పూర్తిచేసుకున్న లబ్ధిదారులు గృహప్రవేశాలు చేశారని తెలిపారు. కడియపుసావరంలో రూ. 22 లక్షలతో సీసీ డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దామిరెడ్డిపల్లిలో రూ. 43.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనంతో పాటు రూ. 1.8 కోట్ల నాబార్డు నిధులతో నిర్మించిన సీసీ రహదారిని ప్రారంభించారు. దుళ్లలో ముంపు సమస్య పరిష్కారానికి రూ. 3 లక్షలతో సంప్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యనారాయణ, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, సర్పంచులు మోసిగంటి సత్యవతి, ముద్రగడ సత్యస్వరూప, చెళ్లపిల్ల మురళీకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

776 మంది గృహప్రవేశం

బిక్కవోలు: అనపర్తి నియోజకవర్గంలో రూ. 14 కోట్ల వ్యయంతో 776 గృహాల నిర్మాణం పూర్తయిందని, అంతా నూతన గృహప్రవేశాలు చేస్తున్నారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బిక్కవోలులో గోలి వెంకటరత్నం గృహాన్ని ఆయన ప్రారంభించి గృహప్రవేశం చేయించారు. ఇంటి నిర్మాణంపై ఆసక్తి ఉన్నవారు పీఎంఏవై కింద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తెదేపా నాయకుడు నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ సూర్యకుమారి, ఎంపీపీ తేతలి సుమ, మాజీ ఎంపీపీ బేరా వేణమ్మ, గృహనిర్మాణ సంస్థ డీఈఈ వనమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి రుణం

రాజానగరం: రాష్ట్రంలో పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కృతనిశ్చయంతో ఉన్నారని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా ఛైర్మన్, తెదేపా రాజానగరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొడ్డు వెంకటరమణచౌదరి అన్నారు. శ్రీకృష్ణపట్నంలో నూతన గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు చొప్పున స్థలం ఇవ్వడమేకాక ఇంటి నిర్మాణం నిమిత్తం రూ. 2.87 లక్షలు రుణంగా ఇస్తారని తెలిపారు. ఆర్డీవో కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: 91212 29057, కడియం: 91212 29062, అనపర్తి: 91000 20947

పైపులైన్‌కు మరమ్మతు

స్పందనకు వందనం

రాజవోలు చర్చి వీధిలో కొళాయి మూడు రోజులుగా పనిచేయక ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమస్యను గ్రామకార్యదర్శి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందిని పంపి పైపులైన్ల ఏర్పాటు చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. – న్యూస్‌టుడే, బొమ్మూరు

విద్యార్థులకు ఆటల పోటీలు

ఖోఖో పోటీలో విద్యార్థినులు

రాజానగరం, న్యూస్‌టుడే: బాలల దినోత్సవం సందర్భంగా రాజానగరం మండల ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సెంట్ జే ఉన్నత పాఠశాలలో సబ్‌జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో విద్యార్థులకు చదరంగం, క్యారమ్స్, స్కిప్పింగ్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించినట్లు సంఘం అధ్యక్షుడు అవ్వారు జయరాజ్, కార్యదర్శి శేషారావు తెలిపారు. మండలంలోని 15 పాఠశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారని, విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, ధ్రువపత్రాలను బహూకరించినట్లు ప్రాజెక్ట్ డైరెక్టర్ ఐ.నాగేశ్వరరావు చెప్పారు.

నీటిచుక్క రాదు... అధికారులు పట్టించుకోరు

హుకుంపేట చైతన్యనగర్‌వాసులు తాగునీరు అందక ఇబ్బంది పడుతున్నారు. సచివాలయం-4 పరిధిలో నిర్మించిన ట్యాంకును ఆరు నెలల క్రితం ప్రారంభించినా నీరు సరఫరా చేయడం లేదు. ప్రజలు తాగునీటి డబ్బాలు కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. ట్యాంకు నిర్మాణం వరకే తమ పని అని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు. ఈ సమస్యపై పంచాయతీ కార్యదర్శి కాశీని వివరణ కోరగా ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలో నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– న్యూస్‌టుడే, బొమ్మూరు (హుకుంపేట)

అంత్యక్రియలకు అవస్థలు

దుళ్ల కైలాసభూమి వద్ద పేరుకున్న వ్యర్థాలు

దుళ్ల శ్మశానవాటికలో వ్యర్థాలు పేరుకుపోవడంతో అంత్యక్రియల సమయంలో దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల పలువురు జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోర్టు వివాదం నెపంతో సమీపంలో పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి ముందుకు రావడం లేదని అంటున్నారు. దీనిపై ఎంపీడీవో రమేశ్‌ను వివరణ కోరగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

– న్యూస్‌టుడే, కడియం

రాళ్లుతేలి.. గుంతలుగా మారి..

మోరంపూడి పైవంతెన దిగువ రోడ్డుపై గుంతలు

కొంతమూరు అఫీషియల్ కాలనీ, బ్రాహ్మణ అగ్రహారంలోని పలువీధుల్లో ఇంకా మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. రహదారులు నిర్మించాలంటూ నాయకులు, అధికారులకు అనేకసార్లు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకపోయిందని నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రద్దీగా ఉండే మోరంపూడి పైవంతెన దిగువ రోడ్డు పరిస్థితి ఘోరంగా తయారవడంతో రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని చోదకులు గగ్గోలు పెడుతున్నారు. మోరంపూడి నుంచి గాదాలమ్మనగర్, బుచ్చయ్యనగర్‌లను కలుపుతూ నిర్మించిన రహదారిలో సుమారు మూడు కిలోమీటర్ల మేర భారీ గుంతలు ఏర్పడ్డాయి. నగరంలో పాల విక్రయానికి రోజూ రాకపోకలు సాగిస్తుంటామని తరచూ వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నామని పాడిరైతు ఎన్. త్రిమూర్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

– న్యూస్‌టుడే, మోరంపూడి, కొంతమూరు

CHANGE OF NAME

I, MANDALAPU TRIMURTHULU S/o Somalingachari, D.No.18-12-9, Krishnanagar, Aryapuram, Janmabhumi Road, Rajahmundry (Urban) E.G.Dt. A.P-533101. I have changed my name from MANDALAPU TRIMURTHY (Old name) to MANDALAPU TRIMURTHULU (New name) hence forth I am being called MANDALAPU TRIMURTHULU S/o Somalingachari, for all purposes.

మొక్కలు నాటి సంరక్షించండి

ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ధవళేశ్వరం, మోరంపూడి, న్యూస్‌టుడే: కార్తిక వనసమారాధనలో భాగంగా ధవళేశ్వరం ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో బుధవారం అటవీ శాఖ అధికారులు ఉసిరి, జామ, నేరేడు, దబ్బ తదితర రకాల మొక్కలను తీసుకువచ్చి విద్యార్థులతో నాటించారు. మొక్కలు నాటితే ప్రయోజనాలు, నరకడం వల్ల అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపల్ సిహెచ్. సునీల్‌కుమార్, కె. యు. పి. లత, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజానగరం: హౌసింగ్ బోర్డు కాలనీలోని జడ్పీ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలలో సత్య ఛారిటబుల్ ట్రస్ట్ వారు బుధవారం విద్యార్థులతో మొక్కలు నాటించారు. ట్రస్ట్ అధ్యక్షుడు తమ్మా రవి మాట్లాడుతూ ప్రాణాధారమైన ఆక్సిజన్ ఎక్కువగా లభించాలంటే మొక్కలను అధికంగా నాటి సంరక్షించాలని విద్యార్థులకు సూచించారు. ట్రస్ట్ ఐకాన్ టి. సత్యనారాయణ మాట్లాడుతూ వాతావరణ సమతుల్యతను కాపాడాలని సూచించారు. హెచ్‌ఎంలు రమేష్, రత్నాకర్‌రావు, ట్రస్ట్ కార్యదర్శి ఉపాధ్యాయుల శ్రీరామ్మూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ జ్యాతిష్ అనంతలక్ష్మి, కోశాధికారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలతో కొత్త ఆవిష్కరణలకు నాంది

సమావేశంలో మాట్లాడుతున్న చైతన్యరాజు

రాజానగరం: ప్రపంచం సమాచార, సాంకేతికతలో వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో డాక్టరేట్ పరిశోధన విద్యార్థులు కొత్త ఆవిష్కరణలను నాంది పలకాలని జీజీయూ కులపతి కె.వి.వి.సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అన్నారు. జీజీయూ పరిశోధనాభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పీహెచ్‌డీ స్కాలర్స్ రెండో బ్యాచ్ ఒరియంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇక్కడ పరిశోధనలు చేస్తున్న వారిలో ప్రసిద్ధ పారిశ్రామిక సంస్థల్లో పనిచేస్తున్న నిపుణులు కూడా ఉండటం వర్సిటీకి గర్వకారణమన్నారు. విశ్వవిద్యాలయంలో లభిస్తున్న ఆధునిక, సాంకేతిక వనరులను, అనుభవజ్ఞులైన అధ్యాపకుల మార్గదర్శకత్వాన్ని సమర్థంగా వినియోగించుకుని పీహెచ్‌డీని విజయవంతంగా పూర్తిచేయాలని విద్యార్థులను ప్రోత్సహించారు. జీజీయూ వీసీ యు. చంద్రశేఖర్, ప్రొ వీసీ కె.వి.బి. రాజు, రిజిస్ట్రార్ పి.ఎం.ఎం.ఎస్. శర్మ, డైరెక్టర్లు ఎం. శ్రీనివాసరావు, ఆర్.ఎస్. రాజు, సహాయ డైరెక్టర్ ఎస్.ఎస్.ఎన్.రాజు, డీన్లు, ప్రిన్సిపల్స్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

తెదేపా కమిటీల ప్రమాణస్వీకారం

ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

కోరుకొండ, న్యూస్‌టుడే: రాజానగరం నియోజకవర్గ తెదేపా కమిటీల ప్రమాణ స్వీకారం బుధవారం అట్టహాసంగా జరిగింది. బూరుగుపూడి గేటు సమీపంలోని తెదేపా కార్యాలయం వద్ద రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాలకు చెందిన మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ స్థాయి కమిటీలకు నియమితులైన వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. నియోజకవర్గ రైతు అధ్యక్షుడిగా పుప్పాల వెంకటరత్నం, కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాల అధ్యక్షులుగా దూది కాంతారావు, గెడ్డం తిమ్మారావు, గంగిశెట్టి చంటిబాబుతోపా కమిటీల సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. పరిశీలకుడు రాజా సూరిబాబురాజు, తనకాల నాగేశ్వరరావు, కంటే కేశవరావు పాల్గొన్నారు.

బిక్కవోలు: అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల తెదేపా అధ్యక్షులుగా దత్తుడు శ్రీనివాసరెడ్డి, పడాల వెంకటరామారెడ్డి, ఉద్దండరావు శ్రీనివాసరావు, తిబిరిశెట్టి గణేశ్, ఇతర కార్యవర్గ సభ్యులతో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ప్రమాణస్వీకారం చేయించారు. బూత్‌స్థాయి, ఇతర కమిటీల సభ్యులు కూడా ప్రమాణస్వీకారం చేశారు. నాయకుడు నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, పార్టీ పరిశీలకుడు ఆకుల రామకృష్ణ, ఏఎంసీ ఛైర్మన్ సూర్యకుమారి, ఆళ్ల గోవిందు తదితరులు పాల్గొన్నారు.

బూరుగుపూడిలో బీవీఆర్‌కు నాగలి బహూకరిస్తున్న వెంకటరత్నం

చరవాణి పోగొట్టుకుంటే ఫిర్యాదు చేయండి

గోకవరం: సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే తమకు ఫిర్యాదు చేయాలని ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. ఇటీవల కాలంలో వివిధ ప్రదేశాలలో పోయిన వాటిలో 11 ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా కనుగొని స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ. 2.50 లక్షలు విలువైన ఈ ఫోన్లను బుధవారం గోకవరం పోలీస్ స్టేషన్ వద్ద వాటి యజమానులకు అందజేశారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు

రంగంపేట, న్యూస్‌టుడే: ముకుందవరానికి చెందిన వృద్ధుడు జుత్తుక సుబ్బారావు అదృశ్యంపై బుధవారం రంగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయనకు రెండేళ్ల క్రితం తలకు దెబ్బ తగలడంతో మతిస్థిమితం లేదని, ఇటీవల బొర్రంపాలెంలో కుమార్తె ఇంటికి వెళ్తానని బయలుదేరి అక్కడకు చేరలేదని, తిరిగి రాలేదని కుమారుడు నవీన్ పోలీసులకు తెలిపారు. ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివప్రసాద్ తెలిపారు.

36 మద్యం సీసాల స్వాధీనం

రంగంపేట, న్యూస్‌టుడే: జి.దొంతమూరులోని ఓ గొలుసు దుకాణంపై దాడి చేసి 36 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. నిందితుడు ఎం.సూరిబాబుని అరెస్టు చేసినట్టు చెప్పారు.

నిధులున్నా గ్రామాభివృద్ధి పట్టించుకోరా?

అధికారులపై ఎమ్మెల్యే బత్తుల ఆగ్రహం

రాజానగరం, న్యూస్‌టుడే: ప్రత్యేకాధికారుల పాలనలో దివాన్‌చెరువు పంచాయతీలో అభివృద్ధి కుంటుపడిందని, ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయిందని మురికికూపంగా మారిందని, సుమారు రూ. 1.70 కోట్ల నిధులున్నప్పటికీ సమస్యలు పరిష్కరించకుండా మీనమేషాలు లెక్కించారని ఇందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తానని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన దివాన్‌చెరువులో గ్రామసభ నిర్వహించారు. గ్రామస్థులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా, పంచాయతీ కార్యదర్శి హనుమంతరావును వివరణ కోరారు. జిల్లా కలెక్టర్ దివాన్‌చెరువుకు ప్రత్యేకాధికారిగా ఉన్నంత కాలం గ్రామాభివృద్ధికి సంబంధించిన తీర్మానాలకు ఒక్క సంతకం కూడా పెట్టకపోవడం శోచనీయమన్నారు. నిధులున్నా ఖర్చు చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయాలను తనదృష్టికి ఎందుకు తీసుకురాలేదంటూ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో, తహసీల్దారు, ఈవోపీఆర్డీ హాజరుకాకపోవడంపై అసంతృప్తి వెలిబుచ్చారు. సచివాలయం-3 ఇంజినీరింగ్ అసిస్టెంట్ విధులకు సక్రమంగా హాజరుకాకుండా వేతనం తీసుకుంటున్నట్టు తనదృష్టికి వచ్చిందని, దీనిపై విచారణ జరిపిస్తానన్నారు.

దివాన్‌చెరువులో బురదమయంగా రహదారి



(c) eenadu

కొవ్వూరు

•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

ఎంపికైన విద్యార్థులతో, ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

గోపాలపురం: దేవరపల్లిలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో వాదాలకుంట ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు హెచ్ఎం విజయకుమార్ బుధవారం తెలిపారు. అండర్-14 బాలబాలికల విభాగంలో అక్షర, అశ్రీత, మృదుల, మధుకర్, అజయ్‌కుమార్, అండర్-17లో ప్రణతి, గీతిక, మధునిష, సోహిత్ ఎంపికైనట్లు తెలిపారు. చిత్తూరు, పల్నాడు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు ఫణిని గ్రామస్థులు అభినందించారు.

కబడ్డీలో విద్యార్థుల ప్రతిభ

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: కబడ్డీలో రాణించి కొవ్వూరుకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. వాడపల్లిలోని మహాత్మా జ్యోతిరావు పులే గురుకుల పాఠశాలకు చెందిన కె.లోకేశ్ (పదో తరగతి), జె.రుషి (8వ తరగతి) రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన నేపథ్యంలో బుధవారం వారిని అభినందించారు. ఏలూరు జిల్లా గోపన్నపాలెంలో జరిగిన అండర్-17, అండర్-14 విభాగాల్లో కబడ్డీలో ప్రతిభ కనబర్చారని, అదే స్ఫూర్తితో రాష్ట్ర స్థాయిలోనూ రాణించాలన్నారు. ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ, ప్రిన్సిపల్ జ్యోతి, పాఠశాల సిబ్బంది క్రీడాకారులను అభినందించారు.

స్వయం ఉపాధికి సాయం

నిడదవోలు, న్యూస్‌టుడే: ప్రవాస ఆంధ్రుల సంస్థ హోప ర్4 స్పందన సంస్థ ఆధ్వర్యంలో సంస్థ ఉపాధ్యక్షుడు కోట లక్ష్మీనరసింహ చేసిన ఆర్థిక సాయంతో శంకరాపురం హృదయాలయ ప్రత్యేక పాఠశాల పర్యవేక్షణలో దివ్యాంగులకు రెండు దుకాణాలు ఏర్పాటు చేశారు. ప్రవాసాంధ్రుల కేడీబీ విలేజ్ ఛైర్మన్ రాధా కాశీనాధుని(యూఎస్ఏ) బుధవారం ప్రారంభించారు. డి.ముప్పవరంలో రాజు, భవాని, తాడిమళ్లలో బాలాజీ, సురేఖరాణి దివ్యాంగ దంపతులకు ఒక్కొక్కరికి రూ.1.75 లక్షలతో వారి స్వయం ఉపాధికి వీటిని ఏర్పాటు చేశారు.

దుకాణాన్ని ప్రారంభిస్తున్న రాధాకాశీనాధుని

కొత్త వంగడాలతో అధిక దిగుబడులు

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన కొత్త వరి వంగడాలతో అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాసు అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పసలపూడి, సూర్యారావుపాలెం తదితర గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో వరిపొలాల్లో బుధవారం పరిశీలించారు. వరిపైరు పరిశీలించి, ధాన్యం దిగుబడి నిర్ధరించారు. సొసైటీ అధ్యక్షుడు వి.మంగారావు, మండల వ్యవసాయాధికారి బి.రాజారావు, అభ్యుదయ రైతులు బలుసు వెంకటరత్నం, కళ్ళిరాల సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ధాన్యం పరిశీలిస్తున్న శాస్త్రవేత్త శ్రీనివాసు, తదితరులు

చెరకుపై పంట కోత ప్రయోగం

గోపాలపురం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గోపాలపురం వాసి పుప్పాల శ్రీనివాసరెడ్డికి చెందిన చెరకుతోటలో పంట కోత ప్రయోగం బుధవారం నిర్వహించారు. దీని ద్వారా ఎకరాకు 34 టన్నుల దిగుబడి వచ్చినట్లు ఉప గణాంక అధికారిణి జయభారతి తెలిపారు. మండలం మొత్తం మీద వరి, చెరకు, మినుము పంటలపై ప్రయోగాలు చేసినట్లు ఏఎస్‌వో జోగారావు వెంకట్ వివరించారు. మంచి విత్తనం నాటుకుంటే దిగుబడి బాగుంటుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఏసుబాబు, సిబ్బంది జానీ, రాజు ఉన్నారు.

పంటకోత ప్రయోగం చేస్తున్న అధికారులు

సీపీఐ జిల్లా కార్యదర్శిగా భాస్కరరావు ఎన్నిక

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలుకు చెందిన సీనియర్ సీపీఐ నాయకుడు రేఖా భాస్కరరావును సీపీఐ జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శిగా పనిచేస్తూ పలు కార్మిక సంఘాల నిర్మాణంలో తనదైన ముద్ర వేశారు. ఈ సందర్భంగా భాస్కరరావును బుధవారం నిడదవోలులో పలువురు అభినందించారు.

ఆట.. భవితకు బాట

సెపక్‌తక్రా పోటీల్లో సత్తాచాటుతున్న దేవరపల్లి విద్యార్థులు

న్యూస్‌టుడే, దేవరపల్లి

అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ చదువుతోపాటు సెపక్‌తక్రా పోటీల్లో సత్తా చాటుతున్నారు దేవరపల్లి మండలంలోని విద్యార్థులు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకుంటూ.. తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజయాలు సాధిస్తున్నారు. వీరి గురించి తెలుసుకుందామా..

క్రీడా కోటాలో ఉద్యోగం సాధిస్తా..

నేను దేవరపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నా. చిన్నప్పటి నుంచి సెపక్‌తక్రాపై మక్కువ. గతంలో అనంతపురం, కర్నూలు, శ్రీకాకుళం, ప్రకాశం జిల్లాలు, దొమ్మేరు, చీరాలలో జరిగిన రాష్ట్ర స్థాయిలో పాల్గొని విజయాలు సాధించా. వచ్చే నెల 12 నుంచి రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యా. క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యం.

\- మిరియాల మహాలక్ష్మి, దేవరపల్లి

మా ప్రాంతానికి పేరు తెస్తా..

దేవరపల్లి అంబటి సత్యనారాయణ రావు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని తృతీయ స్థానంలో నిలిచా. వచ్చే నెలలో జమ్మూ కశ్మీర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అయ్యాను. దేశం తరపున ఆడి మా ప్రాంతానికి మంచి పేరు తెస్తా.

\- కీళ్ల ఝాన్సీరాణి, దేవరపల్లి

పోలీసు కొలువే లక్ష్యం..

నేను రామన్నపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాను. ఉరవకొండ-2, దుద్దుకూరు, కర్నూల్, విజయవాడ, ఏలూరు, ప్రాంతాల్లో ఏడు సార్లు రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొని బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించా. వచ్చేనెల 15 నుంచి రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నాను. క్రీడా కోటాలో పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించడమే లక్ష్యం.

\- ఎంట్రపాటి ఆంథోని, రామన్నపాలెం

వ్యాయామ ఉపాధ్యాయుడినవుతా..

నేను రామన్నపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాను. అనంతపురం, విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయిలో పాల్గొని విజయాలు సాధించా. వచ్చేనెలలో తెలంగాణ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నాను. వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించి అమ్మానాన్నలను బాగా చూసుకోవాలి.

\- జొన్నకూటి ప్రహర్ష, రామన్నపాలెం

జాతీయస్థాయి పోటీలకు నిడదవోలు విద్యార్థి

నిడదవోలు, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా గోవిందపురంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో నిడదవోలు సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి కాకి అహరోను స్కూల్ గేమ్స్ సెలక్షన్ అండ్ అథ్లెటిక్స్ అండర్-14 విభాగంలో మంచి ప్రతిభ చూపినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ అంతుమేరి బుధవారం తెలిపారు.

ఉజ్వల భవితకు గ్రంథాలయాలు సోపానం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ఉజ్వల భవితకు గ్రంథాలయాలు సోపానాలని గ్రంథాలయాధికారిణి కె.సుగుణకుమారి అన్నారు. కొవ్వూరు ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో బుధవారం ఆమె మాట్లాడారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. బాలల దినోత్సవ సభతో వారోత్సవాలు ప్రారంభిస్తామన్నారు. విజ్ఞాన పోటీలు, పుస్తక ప్రదర్శన, మహిళా దినోత్సవం, ముగింపు సభ నిర్వహిస్తామన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని విద్యాశాఖ సహాయ ఎగ్జామినేషన్ కమిషనర్ ఎం.ఆదిలక్ష్మి అన్నారు. ఆమె బృందంగా పర్యటించి ఉండ్రాజవరం, వేలివెన్ను తదితర గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి పరీక్షా కేంద్రాలను బుధవారం పరిశీలించారు. తరగతి గదులు, పరిసరాలు పరిశీలించి పలు సూచనలిచ్చారు. ఎంఈవోలు డి.శారదాజ్యోతి, సీహెచ్ సత్యనారాయణ, హెచ్ఎం పాల్గొన్నారు.

శ్రేణులకు అండగా జనసేన పార్టీ

నల్లజర్ల, న్యూస్‌టుడే: పార్టీ శ్రేణులకు జనసేనపార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు అన్నారు. మండలంలోని ముసుళ్లకుంట గ్రామానికి చెందిన శిరంగుల వెంకట సుబ్బారావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బుధవారం ఆ కుటుంబ సభ్యులను సువర్ణరాజు కలసి రూ.10 వేల నగదుతో పాటు నిత్యావసర సరకులను అందజేశారు. జనసేన గ్రామశాఖ అధ్యక్షుడు డి.శ్రీనివాస్, యు.సత్య, కె.హరిబాబు, జి.వరుణ్, డి.బాబు పాల్గొన్నారు.

సుబ్బారావుకు నగదు అందజేస్తున్న సువర్ణరాజు తదితరులు

తెదేపా పటిష్ఠమే ధ్యేయంగా పనిచేయాలి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెదేపా విజయం సాధించేలా పార్టీ నూతన కార్యవర్గాలు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు పట్టణం, మండల (గ్రామీణ) తెదేపా నూతన కమిటీలు, అనుబంధ కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని కొవ్వూరు లిటరరీ క్లబ్ ప్రాంగణంలో బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఎమ్మెల్యే అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా సీనియర్ నాయకులు పెండ్యాల అచ్చిబాబు హాజరయ్యారు. పట్టణ, గ్రామీణ అధ్యక్షులుగా ఆళ్లగడ్డ రామకృష్ణ, బేతిన నారాయణ, ఇతర కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రమశిక్షణ గల తెదేపా కార్యకర్తలే కీలకమని, పార్టీ పటిష్ఠమే ధ్యేయంగా పని చేయాలన్నారు. అచ్చిబాబు, ద్విసభ్య కమిటీ సభ్యుడు పూలగడ్డ సుబ్బారాయచౌదరి, తెదేపా పక్ష నాయకుడు సూరపనేని చిన్ని, పరిశీలకుడు గొర్రెల శ్రీధర్ మాట్లాడారు.

ప్రమాణస్వీకారం చేస్తున్న కొవ్వూరు పట్టణ, మండల కమిటీలు, అనుబంధ సంఘాలు

రహదారికి మరమ్మతులు

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు నుంచి పెండ్యాల వెళ్లే ర.భ.శాఖ ప్రధాన రహదారిలో అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఈ రహదారి అధ్వానంగా మారడంతో ప్రయాణికులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత నెల 29న 'ఈనాడు'లో 'రహదారులకు వర్షం దెబ్బ' శీర్షికన ప్రచురితమైన కథనంపై స్పందించిన అధికారులు గోతులు పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు.

అంకితభావంతో చేసే విధులు ఆదర్శం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: సుమారు అయిదు దశాబ్దాల పాటు న్యాయవాదిగా కలవచర్ల శేషగిరిరావు అంకితభావంతో పని చేశారని కొవ్వూరు న్యాయవాదులు పేర్కొన్నారు. కొవ్వూరు బార్ అసోసియేషన్ పూర్వపు అధ్యక్షుడు శేషగిరిరావు మృతి నేపథ్యంలో బుధవారం సంతాప సభను నిర్వహించారు. అసోసియేషన్ భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి న్యాయవాదులు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు వద్రే మురళీకృష్ణ, న్యాయవాదులు ఎన్వీ సుబ్బారావు, నిమ్మగడ్డ పుల్లారావు, చామర్తి నాగకుమార్, ఆత్కూరి సత్యనారాయణ, టీఎన్వీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంతాపం సభలో మాట్లాడుతున్న న్యాయవాదులు

చెట్ల కొమ్మల తొలగింపు

స్పందనకు వందనం

తాళ్లపూడి, న్యూస్‌టుడే: మలకపల్లిలో నాలుగో వార్డులో విద్యుత్తు తీగలపై ఉన్న చెట్ల కొమ్మలను విద్యుత్తు శాఖ సిబ్బంది తొలగించారు. రహదారిపై వాటిని ఉంచడంతో రాకపోకలు సాగించే స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో ఈనాడులో మేమున్నాం... మీకుతోడుగాలో వచ్చిన సమస్యను కార్యదర్శి కామేశ్వరి దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించారు. సర్పంచి రాపాక రాజేశ్వరి, కార్యదర్శి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది పరిసరాలను శుభ్రం చేశారు.

తుప్పలు.. రాకపోకలకు చిక్కులు

ప్రకాశరావుపాలెం నుంచి ఆవపాడు, సింగరాజుపాలెం గ్రామాల్లోని ఆయా మలుపుల వద్ద రహదారికి ఇరువైపులా తుప్పలు ఏపుగా పెరిగిపోయాయి. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వాటిని తొలగింపజేయాలని కోరుతున్నారు. సమస్యపై ర.భ. శాఖ డీఈ వెంకటరమణను వివరణ కోరగా సిబ్బందిని పంపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. - **న్యూస్‌టుడే, నల్లజర్ల**

ప్రమాదకరంగా కల్వర్టు

రెడ్డిచెరువు గ్రామంలో ప్రధాన రహదారిలో పంట కాలువకు నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరింది. ఈ కల్వర్టు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో ప్రయాణికులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. సూర్యారావుపాలెం, పసలపూడి, వడ్లూరు, సత్యవాడ గ్రామాలకు ఈ దారి మీదుగానే వెళ్లాల్సి ఉంది. ప్రమాదం జరగకముందే ప్రాధాన్యత గల కల్వర్టు పునర్నిర్మించాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పరిశీలించి అభివృద్ధి చేయిస్తామని ఆర్అండ్‌బీ ఏఈ శ్రీనివాసు తెలిపారు. - **న్యూస్‌టుడే, ఉండ్రాజవరం**

ఈ భవనాల ప్రారంభమెప్పుడో..!

దేవరపల్లి మండలం బంధపురం పంచాయతీ పరిధిలో నిర్మించిన సచివాలయం, రైతు సేవా కేంద్రం, విలేజ్ క్లినిక్ భవనాలు నిర్మాణాలు పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో వాటి చుట్టూ పిచ్చిమొక్కలు, తుప్పలు పెరిగిపోయాయి. ఆకతాయిలకు అడ్డాగా మారుతున్నాయి. రాత్రి సమయంలో కొందరు మద్యం తాగి వీరంగం సృష్టిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎంపీడీవో నాగార్జునరావును వివరణ కోరగా పరిశీలించి భవనాలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. - **న్యూస్‌టుడే, దేవరపల్లి**

గుంతల రోడ్డుతో అవస్థలు

నిడదవోలు పట్టణంలో సంతమార్కెట్ నుంచి సెయింట్‌ఆన్స్ వరకు రహదారి గుంతలు ఏర్పడి అధ్వానంగా ఉంది. సింగవరం, ఎన్టీఆర్‌కాలనీ, సుబ్బరాజుపేట, ఎంవీనగర్, తీరుగూడెం ప్రాంతాలకు చెందిన ప్రజలతో పాటు, ఈ రహదారిపై నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రహదారికి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై పురపాలక సంఘ ఏఈ హేమంత్ దృష్టికి తీసుకువెళ్లగా ఈ రోడ్డుతో పాటు ఇతర రహదారుల మరమ్మతులకు రూ.12 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. - **న్యూస్‌టుడే, నిడదవోలు**

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ర్యాలీ

గోపాలపురం, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదని, ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని మాజీ హోంమంత్రి, వైకాపా నియోజకవర్గ కన్వీనర్ తానేటి వనిత అన్నారు. గోపాలపురం ఆ పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం ఇచ్చారు.

కొవ్వూరు పట్టణం: పీపీపీ విధానం పేరుతో వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలన్న ప్రయత్నం దుర్మార్గమని కొవ్వూరు వైకాపా ఇన్‌ఛార్జి తలారి వెంకట్రావు అన్నారు. వైకాపా ప్రజా ఉద్యమం పేరుతో బుధవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, గండ్రోతు సురేంద్ర, చిట్టూరి అన్నవరం, దేవగుప్తాపు లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైకాపా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం నిడదవోలు మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో నిడదవోలులో ప్రదర్శన నిర్వహించారు.

గోపాలపురంలో ప్రదర్శనగా వస్తున్న వైకాపా శ్రేణులు

లబ్ధిదారుకు నమూనా ఇంటి తాళం అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటరాజు

సొంతింటి కల సాకారం

నల్లజర్ల, న్యూస్‌టుడే: పేద, మధ్య తరగతి కుటుంబాల సొంతింటి కల సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పేర్కొన్నారు. నల్లజర్ల తెదేపా కార్యాలయం వద్ద బుధవారం పోతవరం గ్రామానికి చెందిన పెదపాటి వెంకమ్మకు ఇంటి తాళం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సొంతిళ్లు లేని కుటుంబాలు ఎక్కువగా ఉన్నట్లు సర్వే ద్వారా గుర్తించి, అర్హులకు సాయం అందించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించుకున్నారన్నారు. గత వైకాపా పాలనలో పక్కా ఇళ్ల నిర్మాణాలు సక్రమంగా సాగలేదని విమర్శించారు. తహసీల్దార్ నాయుడు, ఎంపీడీవో సత్యనారాయణ, తెదేపా మండలశాఖ అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, సొసైటీ ఛైర్మన్ రావూరి వెంకటరమణ, మాజీ సర్పంచి యలమాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గృహ మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

కొవ్వూరు పట్టణం: పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ పథకం ద్వారా మన ఇల్లు- మన గౌరవం కార్యక్రమాన్ని పట్టణ పరిధి ఒకటో వార్డు శ్రీరామాకాలనీలో బుధవారం నిర్వహించారు. ఇంటి నిర్మాణ ప్రక్రియ, ప్రభుత్వ సాయంపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఎంత ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా.. అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే 3 లక్షల ఇళ్లు పూర్తి చేయించి పేదలతో గృహ ప్రవేశాలు చేయించనుందన్నారు. పట్టణంలో 172 మందికి కొత్తగా ఇళ్లు మంజూరయ్యాయని, ఒకొక్కరికి రూ.2.50 లక్షలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అందిస్తున్నాయన్నారు. బొండాడ సత్యనారాయణ, అర్జెల్లి రామకృష్ణ, పిల్లలమర్రి మురళీకృష్ణ, బీవీ ముత్యాలరావు, పెనుమాక జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావును పరామర్శించిన మంత్రి దుర్గేష్

చాగల్లు, న్యూస్‌టుడే: ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందిన జనసేన పార్టీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావును బుధవారం మంత్రి కందుల దుర్గేష్ పరామర్శించారు. ఆరోగ్యం మెరుగుపరుచుకొని పార్టీ, ప్రజల కోసం పనిచేయాలన్నారు. సుంకర సత్తిబాబు, ఉప్పులూరి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఇకపై సమయానికి కళాశాలకు వస్తాం

దేవీచౌక్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు పదుల సంఖ్యలో బుధవారం ఆలస్యంగా హాజరయ్యారు. దీంతో ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే వారికి క్లాస్ తీసుకున్నారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తుంటే బాధ్యత లేకుండా ఉండటం సరికాదని తెలిపారు. బుద్ధిగా చదువుకుని ఎంతో పేరున్న కళాశాల, కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రులకు పేరు తీసుకువస్తామని, ఇక నుంచి కళాశాలకు సమయానికి వస్తామని ప్రతిజ్ఞ చేయించి తర్వాత లోపలికి అనుమతించారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల శ్రమదానం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: రాజమహేంద్రవరం ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కొంతమూరులో ప్రత్యేక సేవా శిబిరం నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం కొంతమూరు అంజనా నగర్‌లోని చెరువులో పూడిక, వ్యర్థాలు, తుప్పలు తొలగించి శుభ్రపరిచారు. అక్షరాస్యత ఆవశ్యకత వివరిస్తూ గ్రామంలో అవగాహన ర్యాలీ చేశారు. నిపుణులు హాజరై వ్యక్తిత్వ వికాసంపై ప్రసంగించారు. ఎన్ఎస్ఎస్ అధికారి జి.వి.ఎస్.నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తాళ్లపూడి: 80085 74498 ఉండ్రాజవరం: 80085 74503, నల్లజర్ల: 97011 37112

వ్యర్థాలతో ఇబ్బంది..

సమస్య: దేవరపల్లిలోని పల్లంట్ల వెళ్లే రహదారిలో ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో వ్యర్థాలు పేరుకుపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. – స్థానికులు

సమాధానం: సిబ్బందిని ఏర్పాటు చేసి వెంటనే సమస్య పరిష్కరిస్తాం.

– రవికిషోర్, కార్యదర్శి, దేవరపల్లి

\- న్యూస్‌టుడే:, దేవరపల్లి

మురుగుతో ఇక్కట్లు

సమస్య: స్థానిక జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల వీధిలోని కాలువలో వ్యర్థాలు ఉన్నాయి. మురుగునీరు కదలక దుర్వాసన వస్తోంది. – స్థానికుడు

సమాధానం: సిబ్బందిని పంపి మురుగుకాలువలో పూడిక తీత పనులు చేయిస్తాం.

– వీరన్న, పంచాయతీ కార్యదర్శి

\- న్యూస్‌టుడే, తాళ్లపూడి

ఘనంగా లక్షపత్రి పూజలు

చాగల్లులో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న దంపతులు

పెరవలి, తాళ్లపూడి, ఉండ్రాజవరం, చాగల్లు, నిడదవోలు, న్యూస్‌టుడే: తీపర్రులో వేంచేసిన పార్వతీ సమేత రాజరాజనరేంద్రస్వామి వారికి అభిషేకాలు, పూజలు, విశేష అలంకరణ, దీపారాధన చేశారు. ● కె.సావరంలో కొలువైన దుర్గామల్లేశ్వరస్వామి వారికి వేదమంత్రాలతో రుద్రాభిషేకాలు, లక్షపత్రి పూజ చేశారు. ● చాగల్లు, మండల గ్రామాల్లోని పలు శైవ, సత్యనారాయణ ఆలయాల్లో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. ● మునిపల్లి గ్రామంలో వేంచేసిన లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు.

కె.సావరం: అలంకరణలో దుర్గామల్లేశ్వరస్వామి

ప్రత్యేకాలంకరణలో మునిపల్లి లక్ష్మీనారాయణస్వామి

రథంపై అయ్యప్ప, కుమారస్వామి, గణపతి విగ్రహాలు

పేటతుల్లి మహోత్సవం

తాళ్లపూడి: తాళ్లపూడిలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్పపీఠం ఆధ్వర్యంలో బుధవారం పేటతుల్లి మహోత్సవంలో భాగంగా అయ్యప్పస్వామిని రథంపై ఊరేగింపు నిర్వహించారు. పీఠం నుంచి సుమారు 500మంది అయ్యప్పభక్తులు తాళ్లపూడి, ప్రక్కిలంక మీదుగా తాసామేళ్లం వాయిద్యాలతో సాగింది.

CHANGE OF NAME

I, **MUTHA SATYAVATHI** (Old Name), W/o Subbarao, Age:53, D.No.2-82, Ramalayam Street, D.Muppavaram Village, Nidadavole Mandal, East Godavari Dist., A.P. I have changed my name as **MUGATA SATYAVATHI** (New Name). Here after my Name is known as **MUGATA SATYAVATHI** (New Name).

(c) eenadu

ఈనాడు కర్ణాటక

గురువారం నవంబరు 13, 2025

గనసాన్ని హాంగ్‌ను సత్కరించిన డీకే

డీకేతో సింగపూర్ మంత్రి చర్చలు

బెంగళూరు (ఆడుగోడి), న్యూస్‌టుడే : ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో సింగపూర్ వ్యవహారాల, పర్యావరణ శాఖ మంత్రి గన సాన్ని హంగ్ బుధవారం బెంగళూరులో సమావేశమయ్యారు. వ్యవసాయ పెట్టుబడుల అంశంపై వారు సుదీర్ఘంగా చర్చించారు. యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ అంశాలను సమీక్షించారు. నిరుద్యోగ యువతకు ఆయా రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు సహకరించాలని డీకే ప్రతిపాదించారు. మౌలిక సౌకర్యాల విస్తరణకు తీసుకోవాల్సిన చర్యలపైనా చర్చించారు.

తప్పు చేశాననే భయంతో బాలుడి బలవన్మరణం

చిక్కమగళూరు, న్యూస్‌టుడే : స్నేహితులతో కలిసి ఒక బాలుడు (13) సరదాగా మద్యం తాగాడు. ఈ విషయం ఇంట్లో తెలిస్తే కొడతారన్న భయంతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎన్‌ఆర్‌పుర తాలూకా బాళెహొన్నూరు మెల్పాల్ గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఆ బాలుడు తొమ్మిదో తరగతి విద్యార్థి. తల్లిదండ్రులు ఒక శుభకార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్లిన సమయంలో స్నేహితుల ఒత్తిడితో మద్యం తాగాడు. ఇదే విషయం తన ఇంట్లో తెలుస్తుందన్న భయంతో ఆత్మహత్య చేసుకున్నాడని ఎన్‌ఆర్‌పుర గ్రామీణ ఠాణా పోలీసులు బుధవారం ప్రకటించారు.

దివ్యాంగురాలిపై అత్యాచారయత్నం?

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే : ఆడుగోడి ఎంజీఆర్ నగర సమీపాన ఒక దివ్యాంగురాలిపై విఘ్నేశ్ అలియాస్ దాదు అనే యువకుడు అత్యాచారానికి ప్రయత్నించాడు. బాధితురాలు కేకలు వేయడంతో స్థానికులు అతణ్ని పట్టుకుని దేహశుద్ధి చేసి ఆడుగోడి ఠాణా పోలీసులకు అప్పగించారు. మాటలు రాని, కాళ్లు స్వాధీనంలో లేని యువతి (21) గత ఆదివారం ఇంట్లో ఒక్కర్తే ఉన్నప్పుడు నిందితుడు ఇంట్లోకి చొరబడ్డాడని సమాచారం. బయటకు వెళ్లిన బాలిక తల్లి ఇంటి వద్దకు వచ్చినప్పుడు కుమార్తె సమస్యలో చిక్కుకున్నట్లు గుర్తించింది. అదే సమయంలో బాధితురాలు కేకలు వేయడంతో ఇరుగు పొరుగుల సహాయంతో తలుపు పగలగొట్టి లోపలకు వెళ్లారు. స్థానికులు అందరూ కలిసి నిందితుడికి దేహశుద్ధి చేశారు. బాధితురాలిని చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్చిన పోలీసులు అతణ్ని అరెస్టు చేశామని బుధవారం ప్రకటించారు.

రేడియాలజిస్టు దుశ్చర్య

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : కడుపులో తరచూ నొప్పి వస్తుందని వైద్యుని వద్దకు వెళితే స్కానింగ్ చేయించుకోవాలని వైద్యుడు సూచించాడు. భర్తతో కలిసి ఆమె జయకుమార్ అనే రేడియాలజిస్టు వద్దకు వెళ్లింది. స్కానింగ్ చేసేందుకు ఆమె ఒక్కర్తినే గదిలోకి తీసుకువెళ్లిన లైంగిక దౌర్జన్యానికి ప్రయత్నించాడు. ఆమె అడ్డుకోవడంతో దూషణలకు దిగాడు. ఈ ఘటన మొత్తాన్ని ఆమె చరవాణిలో రికార్డు చేసుకుంటూ గది నుంచి బయటకు వచ్చి భర్తకు చెప్పింది. అతణ్ని పట్టుకునేందుకు ప్రయత్నించగా అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదుతో ఆనేకల్ ఠాణా పోలీసులు బుధవారం దర్యాప్తు ప్రారంభించారు.

భీమ జాడ కోసం వేట

హాసన, న్యూస్‌టుడే : అడవి ఏనుగుతో జరిగిన పోరులో ఒక దంతాన్ని విరగ్గొట్టుకున్న ఏనుగు 'భీమ' మళ్లీ బేలూరు గ్రామంలో బుధవారం కనిపించింది. బేలూరు ముట్టుకున్న మదగజ దాడులు ఎక్కువ కావడంతో దాన్ని బంధించేందుకు కుమ్కి ఏనుగు భీమను అధికారులు రప్పించారు. గత వారంలో అడవి ఏనుగుతో పోరాటంలో దాని దంతం విరిగిపోయింది. మావటీలు, ఇతర సిబ్బంది విడిది అది అడవిలోకి వెళ్లిపోయింది. మళ్లీ అది కనిపించినా గాయం నొప్పి నుంచి ఇంకా కోలుకోలేదని గుర్తించారు. భీమను మరోసారి మచ్చిక చేసుకుని శిబిరానికి తరలించేందుకు అధికారులు కార్యాచరణను చేపట్టారు.

అనారోగ్యంతో ఖైదీ మృతి

శివమొగ్గ : శివమొగ్గ కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్న కేపీ బాబు అలియాస్ సజె బాబు చికిత్స పొందుతూ మరణించాడు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో చికిత్స కోసం స్థానిక మెగ్గాన్ ఆసుపత్రిలో గత సోమవారం చేర్పించారు. హృద్రోగ సమస్యను ఎదుర్కొంటున్న బాధితుడు చికిత్స పొందుతూ బుధవారం మరణించాడని వైద్యులు తెలిపారు.

సంచార గ్రహచారం

ఏటా 117 గంటలు ట్రాఫిక్‌లో చిక్కి శల్యం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : ఉద్యాననగరిలో వాహన రద్దీ అందరికీ చుక్కలు చూపిస్తుంది. నగరవాసి ఏటా 117 గంటలు, (4.8 రోజులు) వాహన రద్దీలోనే గడుపుతాడు. ఒక స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన అధ్యయనంలో ఈ చేదు నిజం వెల్లడైంది. తదుపరి స్థానాల్లో పుణె (110 గంటలు), ముంబయి (108), కోల్‌కతా (103), చెన్నై (94), హైదరాబాద్ (85), జైపూర్ (83), దిల్లీ (76), అహ్మదాబాద్ (73 గంటలు) ఉన్నాయి. బెంగళూరులో పది కి.మీ. ప్రయాణానికి 34.10 నిమిషాల సమయం పడుతుండగా, హైదరాబాద్‌లో 31.30 నిమిషాల సమయం పడుతోంది. నగర జనాభా 1.4 కోట్లు దాటగా.. వాహనాల సంఖ్య 1.2 కోట్లు పైమాటే. రహదారులపై గుంతలు, ఇరుకు సందులు, వంతెనలు, ఇతర నిర్మాణ పనులతో వీధులను బ్లాక్ చేయడం, వన్‌వేలు ఎక్కువ కావడం, ఎక్కువ మందికి ట్రాఫిక్ సెన్సు లేకపోవడం, ప్రజా రవాణా వ్యవస్థ కన్నా సొంత వాహనాలపై అధికంగా ఆధారపడడం తదితర కారణాలతో ఎయిర్‌కండిషన్డ్ సిటీ ఇప్పుడు ట్రాఫిక్ సిటీగా మారిపోయింది.

విమానాశ్రయం రోడ్డులో నిత్యం.. వాహన రద్దీనే

ఉల్లాసంగా ఆటాడేద్దాం.. రా!

- నేటి నుంచే పికిల్‌బాల్ పోటీలు
- సబల ఉత్పత్తులతో ఉత్సాహం

బెంగళూరు 'ది స్పోర్ట్స్ స్కూల్'లో క్రీడాకారుల కసరత్తు

ఈనాడు, బెంగళూరు : దేశంలో అత్యంత వేగంగా ఆదరణ పొందుతున్న క్రీడల్లో పికిల్ బాల్ ఒకటి! నగరీకరణ విస్తరిస్తున్న చోట అతి తక్కువ స్థలంలో చిన్నపాటి కోర్ట్‌ను తయారు చేసుకుని వయసుతో సంబంధం లేకుండా ఆడే ఈ క్రీడకు ఆదరణ పెరుగుతోంది. బ్యాడ్మింటన్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్‌ల మేళవింపుతో సులువుగా ఆడొచ్చు. క్రికెట్ మాయలో పడి యువతకు ఈ క్రీడను ప్రత్యేకంగా పరిచయం చేయాల్సి ఉన్నా 40 ఏళ్ల వయసున్న వారికి అంతగా చెప్పాల్సిన అవసరం లేదు. కర్ణాటకలోనూ పదేళ్లుగా ఈ క్రీడపై ఆసక్తి పెరగటంతో 2016లో ఏర్పాటైన కర్ణాటక పికిల్ బాల్ సమాఖ్య (కేపీఎఫ్) యువతనూ ఈ కోర్టుల వైపు రప్పిస్తోంది. ఈ సమాఖ్యకు గతేడాది జాతీయ పికిల్ బాల్ సమాఖ్య గుర్తింపు దొరకగా తొలిసారి దక్షిణాదిన జాతీయ పోటీలకు వేదిక సిద్ధం చేసింది.

- గురువారం నుంచి ఈనెల 16 వరకు బెంగళూరులోని కనకపుర రహదారిలో 'ది స్పోర్ట్స్ స్కూల్' ఆవరణలో ఈ జాతీయ పోటీలు నిర్వహిస్తున్నారు. తొలి రోజున ఉదయం 11 గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీల్లో నాలుగు దశల ఫైనల్ పోటీలు కొనసాగుతాయి. 14 ఏళ్లలోపు బాలురు, బాలికలు, 40 ఏళ్ల పురుషులు, మహిళలు, 50 ఏళ్ల పురుషులు, మహిళల పోటీలు ఓపెన్ మెన్స్ కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తారు. ఫైనల్ విజేతలకు బహుమతులు అందజేస్తారు. 14న ఓపెన్ ఈవెంట్‌లో భాగంగా 12 ఏళ్లలోపు బాలురు, బాలికల పోటీల నుంచి 60 ఏళ్ల పురుషులు, మహిళల విభాగాల్లో పోటీలు ఉగ్రరూతలూగిస్తాయి. ఇదే తరహా కేటగిరీ పోటీలు ఈనెల 16వరకు నిర్వహిస్తారు. మొత్తం 1500 మంది క్రీడాకారులు 20 రాష్ట్రాల నుంచి విచ్చేసి పాల్గొంటారని కర్ణాటక పికిల్ బాల్ సమాఖ్య వెల్లడించింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర పికిల్ బాల్ చాంపియన్‌షిప్ విజేత రయాన్ సింగ్ తమ రాష్ట్రం తరఫున ఈ పోటీలో పాల్గొంటారు. అత్యధికంగా తెలంగాణా నుంచి 55 మంది క్రీడాకారులు తలపడతారు.

ఉత్తరప్రదేశ్ తరఫున ఆడనున్న రయాన్ సింగ్

ఎవరైనా సులువుగా ఆడే పికిల్ బాల్

ఆటాడగ వస్తే.. అవసరమైన శక్తిని అందిస్తాం

అందుకే సబల..

ఈ పోటీల టైటిల్ భాగస్వామిగా పలు సంస్థల నుంచి దరఖాస్తులు, ప్రతిపాదనలు వచ్చాయి. జాతీయ స్థాయిలో ప్రియా పచ్చళ్లతో ఓ బ్రాండ్‌ను ఏర్పాటు చేసుకున్న సంస్థ నుంచి 'సబల మిల్లెట్స్' చేసిన ప్రతిపాదనలో క్రీడాకారులకు విలువ ఆధారిత పోషకాలు అందుతాయని నిర్వాహకులు భావించారు. పైగా ఈ సంస్థ క్రీడాకారుల కోసం ప్రతిపాదించిన పోషకాల జాబితా శ్రేష్ఠంగా అనిపించింది. చిరుధాన్యాల ఆహార ఉత్పత్తులు కేవలం క్రీడాకారులకే కాదు. . ఆరోగ్య భారత నిర్మాణానికి దోహదపడతాయి. వీరి సహకారంతో ఈ పోటీలకు ప్రాధాన్యం సంతరించుకుంటుందని భావిస్తున్నాం.

-ప్రవృత్, సహ వ్యవస్థాపకులు, కేపీఎఫ్

కార్తికేయుడికి నయనతార పూజలు

మంగళూరు, న్యూస్‌టుడే : దక్షిణ భారతదేశంలో ప్రజాదరణ ఉన్న నటి, లేడీ సూపర్‌స్టార్‌గా పేరొందిన నయన తార, ఆమె భర్త-దర్శకుడు విఘ్నేశ్ శివన్‌తో కలిసి కుక్కె సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి బుధవారం చేరుకున్నారు. భర్తతో కలిసి సర్ప సంస్కార పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు, దేవస్థానం సిబ్బంది వారి సేవకు కావలసిన సదుపాయాలను కల్పించారు. ఆలయం తరఫున దంపతులకు సమితి అధ్యక్షుడు హరీశ్ ఇంజాడి స్మరణిక అందజేశారు. ఆలయం వెలుపల వీరితో స్వీయచిత్రాలు, ఫొటోలు దిగేందుకు కొందరు పోటీ పడ్డారు.

- కుక్కెలో నవంబరు 16 నుంచి డిసెంబరు 2 వరకు చంపాషష్ఠి నిర్వహిస్తున్నామని హరీశ్ తెలిపారు. శేషవాహన బండి ఉత్సవం, లక్ష దీపోత్సవాలు, అశ్వవాహనోత్సవం, మయూర వాహనోత్సవం, పూల రథం, పంచమి రథోత్సవం, తైలాభ్యంజన, ప్రాతఃకాల చంపాషష్ఠి, మహారథోత్సవం, దేవుని నౌకా విహారం, నీరు బండి ఉత్సవాలను డిసెంబరు 2 వరకు నిర్వహిస్తామని ఆయన వివరించారు.

ఆలయం ఆవరణలో నయనతార తదితరులు

ఉపేంద్ర- ప్రియాంకకూ సైబర్ కాటు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : ప్రముఖ నట దర్శకుడు ఉపేంద్ర, ఆయన భార్య ప్రియాంక చరవాణులను హ్యాక్ చేసి వంచనకు ప్రయత్నించిన బిహారుకు చెందిన వికాస్ కుమార్ అనే సైబర్ నేరగాడిని సదాశివనగర ఠాణా పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. బిహారుకు వెళ్లి నిందితుడ్ని అరెస్టు చేసి నగరానికి తీసుకువచ్చారు. ఇతని గ్రామంలో పాతికేళ్లలోపు యువకులు 150 మంది వరకు ఇదే తరహా వంచనలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. సెప్టెంబరు 15న ప్రియాంక వాట్సప్‌ను హ్యాక్ చేసిన నిందితుడు రూ.55 వేలు పంపించాలని ఆమె కాంటాక్ట్ లిస్టులో ఉన్న వారందరికీ సందేశాన్ని పంపించాడు. ఆ తర్వాత ఉపేంద్ర, ఆయన మేనేజరు వాట్సప్ ఖాతాలను నిందితుడు హ్యాక్ చేశాడు. నిజమేననుకుని ఆమె చెప్పిన నంబరుకు కొందరు నగదు పంపించారు. ఆమె కుమారుడు కూడా రూ.50 వేలు పంపించాడు. తమ ఫోన్లు హ్యాక్ అయ్యాయని గుర్తించి, తక్షణమే సదాశివనగర ఠాణాలో ఫిర్యాదు చేశారు. అప్పటికే నిందితుని ఖాతాకు రూ.1.50 లక్షలు బదిలీ అయ్యాయి. నిందితుడి నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు విచారణను తీవ్రం చేశారు.

ప్రియాంక, ఉపేంద్ర (పాతచిత్రం)

పరప్పన అగ్రహార కారాగారంలో తనిఖీలు

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే : పరప్పన అగ్రహార కారాగారంలో మద్యం తాగడం, చరవాణులు వినియోగిస్తున్న వీడియోలు బయటకు రావడంతో పోలీసులు, అధికారులు సోదాలు, తనిఖీలు, విచారణను బుధవారం కొనసాగించారు. బ్యారక్‌లో డ్యాన్స్ చేసిన కార్తిక్, ధనుంజయ్, మంజునాథ్, చరణ్ రావ్ అనే నిందితులపై కొత్తగా కేసులు నమోదు చేసుకున్నారు. మద్యం తాగుతూ, చరవాణులు పట్టుకుని ఫోజులు ఇచ్చిన కొందరు నిందితులు బెయిలుపై బయటకు వెళ్లారని గుర్తించారు. కారాగారంలో ఎనిమిదో బ్యారక్‌లోని ఏడో నంబరు గదిలో విచారణ ఖైదీలపై కారాగారం అధికారి ఇమామ్ సాబ్ ఇప్పటికే పరప్పన అగ్రహార ఠాణాలో ఫిర్యాదు చేశారు.

ఆస్తి మీద ఆశతో తల్లిని చంపిన కుమార్తె

చిక్కమగళూరు, న్యూస్‌టుడే : ఆస్తి మీద ఆశతో తనను పెంచిన తల్లినే సుధ (30) అనే మహిళ హత్య చేసింది. పెంపుడు కుమార్తె చేతిలో హత్యకు గురైన మహిళను కుసుమ (62)గా గుర్తించారు. చిక్కమగళూరు జిల్లా నరసింహరాజపుర పట్టణానికి చెందిన కుసుమ ఉపాధి కోసం బాళెహొన్నూరు సమీపంలోని బండిమఠకు వచ్చింది. భర్త ఇల్లు విడిచి వెళ్లడంతో కూలిపనులు చేసుకుంటూ ఉపాధి కల్పించుకుంది. కష్టపడి సంపాదించిన దాంతో కొంత పొలాన్ని కొనుగోలు చేసుకుని కాఫీ తోట సిద్ధం చేసుకుంది. పిల్లలు లేకపోవడంతో తన చెల్లెలు కుమార్తె సుధను పెంచుకుంది. మైసూరుకు చెందిన వ్యక్తితో వివాహం చేసింది. ఇటీవలే తన పొలం, ఆభరణాలు, నగదు అన్నీ సుధకే చెందాలని వీలునామా కూడా రాసింది. బండిమఠం భద్రానది తీరంలో ఉంది. వర్షాకాలంలో నది నుంచి వరద వస్తుండడంతో గ్రామాన్ని ఖాళీ చేయించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. తల్లి చనిపోతే ఇంటికి పరిహారం వస్తుందని, తోటలు, బంగారాన్ని విక్రయించుకుని సొమ్ము చేసుకోవచ్చని భావించింది. గత సోమవారం రాత్రి నిద్ర పోతున్న తల్లి ముఖంపై దిండుతో అదిమి హత్య చేసింది. గుండెపోటుతో ఆమె మరణించిందని అందరినీ నమ్మించే ప్రయత్నం చేసింది. కుసుమ ముఖంపై గాయం అయినట్లు గుర్తించిన స్థానికులు కొందరు బాళెహొన్నూరు ఠాణా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమెను అదుపులోనికి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయగా.. బుధవారం అసలు విషయం అంగీకరించిందని పోలీసులు వివరించారు.

జనజాగృతే లక్ష్యంగా సైకిల్ యాత్ర

బెంగళూరు నుంచి పుట్టపర్తి దాకా..

జెండా ఊపుతున్న ఆచార్య రాఘవేంద్ర ప్రసాద్

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే : పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు కాడుగోడి శ్రీ సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్‌లోని బృందావన్ క్యాంపస్ నుంచి 150 మంది విద్యార్థులు, ఆచార్యులు సైకిళ్లపై పుట్టపర్తికి బయలుదేరి వెళ్లారు. సంస్థ ఆచార్యుడు బి.రాఘవేంద్ర ప్రసాద్ జెండా ఊపి ఈ జాతాను బుధవారం ఉదయం ప్రారంభించారు. వీరు 161 కి.మీ. ప్రయాణించి ప్రశాంతి నిలయానికి గురువారం సాయంత్రం చేరుకోనున్నారు. సత్యసాయి బోధించిన ప్రేమ, జాగృతి, అందరినీ కలుపుకొని వెళ్లేలా ప్రజలను ఉత్తేజపరిచేందుకు ఈ జాతా ఏర్పాటు చేశామని ఆచార్య ప్రసాద్ తెలిపారు. దైహిక, మానసిక, సామాజిక, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలను ప్రోత్సహించే దిశగా సైక్లిస్టులు ప్రచారం చేస్తూ, పర్యటనను పూర్తి చేయనున్నారు. సంస్థ ప్రతినిధులు డాక్టర్ శ్రీకాంత్ ఖన్నా, వినయ్ కుమార్, డాక్టర్ డీసీ సుందరేశ్ తదితరులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సైకిళ్లపై వెళుతున్న విద్యార్థులు, ఆచార్యులు

చెరకు రైతు కన్నెర్ర

కొనసాగుతున్న ఆందోళనలు

శిరోళ సమీపంలో రహదారి దిగ్బంధానికి కదలివచ్చిన రైతులు

బాగలకోటె, న్యూస్‌టుడే : ప్రతి టన్ను చెరకుకు రూ.3500 మద్దతు ధర చెల్లించాలని కోరుతూ రైతులు తమ ఆందోళనను బుధవారం కొనసాగించారు. బెళగావి, బాగలకోటె జిల్లాల్లో పంచదార మిల్లుల వద్ద, పలు కూడళ్లలో రైతు, కార్మిక సంఘాల కార్యకర్తలతో కలిసి ధర్నా, రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. కొన్ని చోట్ల ఆందోళనలను విరమించినా, కొత్తగా మరికొన్ని ప్రాంతాల్లో ధర్నాలను ప్రారంభించారు. ప్రభుత్వం ఇప్పటికే మద్దతు ధరను రూ.3300గా ప్రకటించింది. దానికి మరో రూ.50, రూ.100 అదనంగా ఇచ్చేందుకు కొన్ని చక్కెర పరిశ్రమల యాజమాన్యాలు అంగీకరించాయి. ముధోళ తాలూకాలో చక్కెర పరిశ్రమల యాజమాన్యాలతో మంగళవారం రాత్రి పొద్దుపోయేంత వరకు కొనసాగిన చర్చలు విఫలం కావడంతో బుధవారం ఉదయం రైతులు కొంత సమయం రోడ్డురోకోకు దిగారు. జిల్లాధికారి సంగప్ప నేతృత్వంలో మరో విడత నిర్వహించిన చర్చలు కూడా సఫలం కాలేదు. శిరోళ వద్ద ముళ్ల తీగలను రహదారిపై అడ్డుగా ఉంచి, కొన్ని చోట్ల వరిగడ్డికి నిప్పు పెట్టి వాహనాలను అడ్డుకున్నారు. ముధోళ, జమఖండి మార్గంలో రెండు గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి. టన్ను చెరకుకు రూ.3500 చెల్లించేంత వరకు ఆందోళన కొనసాగుతుందని రైతులు స్పష్టం చేశారు. ఆందోళనకు కబ్బిణకంతి, నెగళూరు, కర్జగి గౌరీ మఠం, బణ్ణద మఠాల పీఠాధిపతులు మద్దతు పలికారు. బాగలకోటె కాంగ్రెస్ జిల్లాధ్యక్షుడు సంజీవ్ కుమార్ నీరలగి, నాయకుడు ఆనంద స్వామి గడ్డదేవరమఠ, హానగల్ ఎమ్మెల్యే శ్రీనివాస మాను ధర్నాలో పాల్గొన్నారు.

- బీదర్ జిల్లాలో కొత్తగా ఉద్యమం తీవ్రత కానవచ్చింది. హైదరాబాద్- ముంబయి ప్రధాన రహదారిపై రైతులు ఆందోళనకు దిగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వారిని శాంతపరచడానికి అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.
- చిక్కబళ్లాపురలో కర్ణాటక రాజ్య రైతు సంఘం, హసిరుసేన నేతలు వివిధ సమస్యలపై ఉద్యమించారు. రైతులు సాగు చేసే పంటభూములను వివిధ అభివృద్ధి పనుల పేరిట స్వాధీనం చేసుకోవడం తగదని, వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు.

వివిధ పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ చిక్కబళ్లాపురలో ఆందోళనకు దిగిన కర్ణాటక రాజ్యరైతు సంఘం, హసిరుసేన కార్యకర్తలు

మళ్లీ తెరపైకి.. ప్రత్యేక రాష్ట్ర వాదన

బెళగావి, న్యూస్‌టుడే : హైదరాబాద్ కర్ణాటక, ముంబయి కర్ణాటక ప్రాంతాలను కలిపి ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలన్న డిమాండ్ మళ్లీ తెరపైకి వస్తోంది. ఉత్తర కర్ణాటక ప్రాంతంలోని 15 జిల్లాలతో కొత్త రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని ఉత్తర కర్ణాటక వికాస వేదికె డిమాండ్ చేసింది. పార్టీలకు అతీతంగా తమకు చట్టసభ ప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, కన్నడ సంఘాల ప్రతినిధులు మద్దతు ఇస్తున్నారని కాగవాడ ఎమ్మెల్యే రాజు కాగె వెల్లడించారు. తమ డిమాండ్‌ను రాష్ట్రపతి, ప్రధాని, గవర్నరు, ముఖ్యమంత్రికి లేఖల ద్వారా తెలియజేశామని ఆయన చెప్పారు. బీదర్, కలబురగి, రాయచూరు, యాదగిరి, బాగలకోటె, ఉత్తర కన్నడ తదితర 15 జిల్లాలతో రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తేనే ఈ ప్రాంతంలో అభివృద్ధి సాధ్యమని ఆయన పేర్కొన్నారు. రానున్న రోజుల్లో స్థానికులతో సంతకాల సేకరణ చేపట్టి, ఆందోళనను తీవ్రం చేస్తామని హెచ్చరించారు. గతంలో ప్రత్యేక రాష్ట్రం ఈ ప్రాంత నాయకుడు ఉమేశ్ కత్తి పలుసార్లు ప్రకటనలు చేశారు. కత్తి అనంతరం రాజు కాగెతో పాటు ఉత్తర కర్ణాటక పోరాట సమితి, వేదికెలు కొత్త రాష్ట్రం డిమాండ్‌ను మళ్లీ తెరపైకి తీసుకురావడం ప్రస్తావనార్హం.

అనంత జ్ఞాపకాలతో నడక

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే : దివంగత ఎంపీ అనంతకుమార్ స్మరణార్థం భాజపా నాయకులు బుధవారం రాత్రి బెంగళూరులో కాగడాలతో స్మృతి నడకను చేపట్టారు. అనంత్‌కుమార్ భౌతికంగా తమకు దూరమై ఏడేళ్లయినా, ప్రజలు, భాజపా కార్యకర్తలు, లబ్ధిదారుల హృదయాల్లో ఆయన నిలిచే ఉన్నారని అదమ్య చేతన వ్యవస్థాపకురాలు తేజస్విని అనంతకుమార్ పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి సదానందగౌడ, ఎమ్మెల్యే రామమూర్తి, పార్టీ సీనియరు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాగడాల ప్రదర్శనలో తేజస్విని అనంతకుమార్, సదానందగౌడ తదితరులు

తిథి నటుడు గడ్డప్ప కన్నుమూత

మండ్య, న్యూస్‌టుడే : అంతర్జాతీయ పురస్కారాన్ని అందుకున్న తిథి సినిమా ఫేం గడ్డప్ప (89) బుధవారం ఉదయం కన్నుమూశారు. మండ్య తాలూకా నోదెకొప్పలు గ్రామానికి చెందిన చెన్నేగౌడ (89) అందరికీ గడ్డప్పగా సుపరిచితులు. వృద్ధాప్య, అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ఆయనకు ఆస్తమా, హృద్రోగ సమస్యలు ఎదురయ్యాయి. తిథి అనంతరం తర్లే విలేజ్, జానీ మేరానామ్, హళ్లి పంచాయతీ తదితర ఎనిమిది సినిమాల్లో ఆయన నటించారు. అత్యంత సహజ నటనకు ఆయన పెట్టింది పేరు. కుటుంబ సభ్యులు ఆయన మృతదేహానికి బుధవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.



'తిథి' పోస్టర్.. గడ్డప్ప (పాతచిత్రం)

నీడలేని పేదలకు గూడు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పేదల కోసం నిర్మిస్తున్న వసతి గృహాల ప్రగతిపై ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో బుధవారం గృహ నిర్మాణశాఖ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్‌తో చర్చించారు. రాజీవ్‌గాంధీ గృహ నిర్మాణ సంస్థ చేపట్టిన ముఖ్యమంత్రి వసతి పథకం, రాష్ట్ర మురికివాడల నిర్మూలన మండలి చేపట్టిన పనులపై ఆయన చర్చించారు. వివిధ పథకాల ప్రగతిని మంత్రి ఈ సందర్భంగా డీకేకు వివరించారు. త్వరలో పేదలకు పక్కా గృహాలను అందించేందుకు సిద్ధమని తెలిపారు. ఐదేళ్లలో ఆరులక్షలు గృహాలను నిర్మించి పేదలకు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే. చర్చల్లో మురికివాడల నిర్మూలన మండలి అధ్యక్షుడు ప్రసాద్ అభయ్ తదితరులు పాల్గొన్నారు.

డీకే శివకుమార్‌తో చర్చిస్తున్న జమీర్ తదితరులు

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 9121167525

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 9945050116

(c) eenadu

దావణగెరెకు ఉల్లాస పయనం!

ప్లై బస్సు సేవలు షురూ

బెంగళూరు (గ్రామీణం), యలహంక, న్యూస్‌టుడే : 'బెణ్ణె నగరి' దావణగెరె నుంచి కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చి వెళ్లే ప్రయాణికుల కోసం కేఎస్ఆర్టీసీ అత్యాధునిక- విలాసవంత ప్లై బస్సు సేవలను అందుబాటులోకి తీసుకు వచ్చింది. మైసూరుకు తొమ్మిది ట్రిప్పులు, మడికేరికి 2, కుందాపురకు 2 వాహనాలతో పాటు ఇప్పుడు దావణగెరెకు రెండు ప్లై బస్సు సేవలు అందుబాటులోకి వచ్చాయి. నిత్యం ఈ బస్సులు 44 ట్రిప్పులతో 10,240 కి.మీ. దూరం ప్రయాణిస్తున్నాయి. ప్రతి కి.మీ.కి రూ.90 ఆదాయం సమకూరుతుండగా, సగటున నిత్యం 1,050 మంది ప్రయాణిస్తున్నారని రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి తెలిపారు. కెంపేగౌడ విమానాశ్రయం నుంచి అర్ధరాత్రి 12.45కు, ఉదయం 10 గంటలకు, దావణగెరె నుంచి ఉదయం 8 గంటలకు, సాయంత్రం 5 గంటలకు ఒక ట్రిప్పు ఉంటుంది. తుమకూరు, చిత్రదుర్గ బైపాస్‌లలో మాత్రమే ప్రయాణికుల కోసం బస్సును నిలుపుతారు. విమానాశ్రయం నుంచి తుమకూరు వరకు రూ.400, చిత్రదుర్గకు రూ.980, దావణగెరెకు రూ.1250ను టికెట్టు ధరగా ప్రకటించారు. ప్రయాణికులకు అల్పాహారం (చిరుతిండ్లు) కోసం నందిని ఫ్లేవర్ పాలు, కుకీలు, కేక్, మురుకులు, ఒక నీటి బాటిల్‌ను ఉచితంగా అందిస్తున్నామని మంత్రి వివరించారు. ఆర్టీసీ అధికారులు అక్రం పాషా, డాక్టర్ కె.నందిని దేవి, ఇబ్రహీం మైగుర్, విమానాశ్రయం అధికారులు కెన్నెత్, ప్రవత్, సంజయ్ చంద్ర, పాల సమాఖ్య ప్రతినిధి స్వాతి రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రయాణికునికి 'నందిని' అల్పాహార కిట్ అందిస్తున్న మంత్రి

అధికారులతో కలిసి బస్సుకు జెండా ఊపుతున్న రామలింగారెడ్డి

ప్రశ్నించే తత్వమే ప్రగతికి సంకేతం

కురుబ విద్యార్థి భవన్ నమూనా ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తదితరులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : చరిత్ర తెలుసుకుంటే ప్రశ్నించే తత్వం పెరుగుతుందని, ప్రతి అంశాన్నీ అధ్యయనపూర్వకంగా సమీక్షించాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. ఆయన బుధవారం గాంధీనగరలో కురుబ విద్యార్థి వసతి నిలయ భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ప్రశ్నించే తత్వం లేకపోతే సమాజం ముందుకు సాగదన్నారు. ప్రశ్న సమాజాన్ని ముందుకు తీసుకుపోతుందని వివరించారు. ప్రశ్నించకపోతే సమాజం బానిసత్వంలో కూరుకుపోతుందని హెచ్చరించారు. ఉపాధ్యాయుడు రాజప్ప తనను ఐదోతరగతిలో చేర్చుకోకపోతే న్యాయవాది, ముఖ్యమంత్రి అయ్యేవాడినే కాదన్నారు. రైతు ఉద్యమకారుడు ఆచార్య నంజుండస్వామి వల్ల తాను రాజకీయాల్లోకి వచ్చినట్లు గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరువందల కురుబ భవనాలను నిర్మించాలని తీర్మానించిందని గుర్తు చేశారు. మైసూరు, హుబ్బళ్లి, శివమొగ, దావణగెరె తదితర ప్రాంతాల్లో కురుబ భవన్‌లను నిర్మించడంతో పాటు సంగొళ్లి రాయణ్ణ సైనిక పాఠశాల కూడా ప్రారంభించాలని తెలిపారు. కురుబ సమాజానికి చెందిన ఆస్తులను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. లేక పోతే కబ్జాలకు గురవుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మంత్రి భైరతి సురేష్, మాజీ మంత్రి హెచ్.ఎం.రేవణ్ణ, మాజీ ఎమ్మెల్యే వర్తూరు ప్రకాశ్ తదితరులతో పాటు కురుబ మఠాధిపతులు హాజరయ్యారు.

అన్నదాతకు వెన్నుదన్నుగా..
కృషిమేళాకు వేళాయె!

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కరవు కాలానికి అనుగుణంగా తక్కువ నీటితో చక్కగా పంటలు పండించేందుకు ఉపకరించే వంగడాల కోసం అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. అందుకు అనుగుణంగా బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం నూతన వంగడాలను అందించేందుకు సిద్ధమైంది. నగరంలోని జీకేవీకే ఆవరణలో బుధవారం కృషిమేళ-2025 పేరిట ఈ వంగడాల ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రదర్శన.. 16వ తేదీ వరకు కొనసాగుతుంది. ఐదేళ్ల పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేసిన తరవాత వాటిని రైతులకు అందిస్తున్నట్లు ఉపకులపతి డాక్టర్ ఎస్.వి.సురేష్ తెలిపారు. అభివృద్ధి చేసిన నూతన వంగడాలు, విదేశీ ఆకుకూరలను ఆయన శాస్త్రవేత్తలతో కలిసి వీక్షించి, వాటి ప్రత్యేకతలను విలేకరులకు వివరించారు.

● కరవు ప్రదేశాల్లో అతి తక్కువ నీటితో పండే రాగి ఎం.ఎల్-322ను అభివృద్ధి చేశారు. సాగు చేసిన 105 రోజులకు పంట దిగుబడికి వస్తుంది. ప్రతి ఎకరాకు 15 నుంచి 20 కింట్వాళ్ల రాగులు దిగుబడి సాధించవచ్చని శాస్త్రవేత్తలు వివరించారు.

● అతి తక్కువ కరవు ప్రదేశాల్లో సామె జీపీయూఎల్-11 రకం చిరుధాన్యాల సాగు రైతులకు ఉత్తమ దిగుబడి 90 రోజుల్లో చేతికందుతుంది. ఆరు నుంచి ఎనిమిది కింట్వాళ్ల దిగుబడి పొందవచ్చని శాస్త్రవేత్త డాక్టర్ నాగరాజు తెలిపారు. వాటితో పాటు బరగు జీపీయూపీ-32 వంగడం కరవు ప్రదేశాల్లో ఉత్తమ సాగుకు అవకాశం కల్పిస్తుంది. 80 రోజుల్లో ఎకరానికి ఏడు నుంచి ఎనిమిది క్వింటాళ్ల దిగుబడి సాధించవచ్చు.

● సూర్యకాంతి కేబీఎస్‌హెచ్ మొక్కజొన్న వంగడాన్ని ఇదే సందర్భంగా విడుదల చేయనున్నారు. తక్కువ వర్షపాత సమయంలోనూ, రోగులు సోకకుండా విత్తనం నాటిన తరువాత 80 రోజుల్లో ఎకరానికి తొమ్మిది నుంచి పది క్వింటాళ్ల దిగుబడి సాధించవచ్చని శాస్త్రవేత్తలు ప్రకటించారు. జీకేవీకే అభివృద్ధి చేసిన పనస ప్రత్యేకత ఇక్కడ చెప్పుకోవాల్సిందే. ఈ పనసతో మూడున్నరేళ్లలో లాభాలు గడించవచ్చు.

● జీకేవీకే ఆవరణలో సాగే కృషిమేళాలో 650 దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. చిరుధాన్యాలు, విత్తనాలు, సేంద్రియ, ప్రకృతి వ్యవసాయానికి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేస్తారు. నిత్యం ఉదయం పదిగంటల నుంచి సాయంత్రం ఆరింటి వరకు ప్రదర్శన కొనసాగిస్తారు. తొలిరోజు ప్రదర్శనను గవర్నరు థావర్ చంద్ గహ్లోత్ ప్రారంభిస్తారు.

నూతన వంగడం.. రాగి ఎంఎల్-322 పంట కళకళ

జీకేవీకే అభివృద్ధి చేసిన కాషాయ రంగు పనసకాయల దిగుబడి జోరు

రసాయనిక మందులను పిచికారి చేయడానికి ఉపకరించే ట్రాక్టర్

రూ.2 కోట్ల వంచన

మంగళూరు, న్యూస్‌టుడే : ఆన్‌లైన్ వ్యాపారంలో మదుపు చేస్తే త్వరగా మీ పెట్టుబడి రెట్టింపు అవుతుందని వచ్చిన వాట్సప్ సందేశాలను విశ్వసించి మంగళూరుకు చెందిన ఒక వ్యక్తి వంచనకు గురయ్యాడు. అంకిత్, సుమిత్ జైస్వాల్, కుశాగర్ జైన్, అఖిల్ అనే వ్యక్తులు వాట్సప్‌లో మూడేళ్లుగా సందేశాలు పంపిస్తూ వచ్చారు. మొదట కంపెనీ ప్రతినిధిగా చేరాలని సూచించారు. మొదట చిన్న మొత్తాలను పారితోషికంగా అందించారు. విదేశీ సంస్థల్లో పెట్టుబడి పెడితే పెద్ద మొత్తం లాభం కళ్లజూడవచ్చని చెప్పడంతో మంగళూరువాసి దశలవారీగా రూ.2 కోట్లు మదుపు చేశాడు. కొద్ది రోజులుగా వంచకుల ఫోన్లు మూగబోవడంతో తాను మోసపోయానని గుర్తించిన బాధితుడు బుధవారం నగర సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు.

మాటల 'ప్రతాపం'

మైసూరు, న్యూస్‌టుడే : దిల్లీ ఎర్రకోట సమీపంలో కారుపేలుడు ఘటనకు సంబంధించి మాజీ ఎంపీ ప్రతాప్ సింహ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ముస్లింలకు పిల్లలను పుట్టించడం మాత్రమే పనిగా మారిందని విమర్శించారు. విద్యావంతులైన ముస్లింలే ఎక్కువ మంది ఉగ్రవాదులుగా మారుతున్నారంటూ ఆరోపించారు. వారు ఉగ్రవాదులుగా మారడానికి పేదరికం కారణం కాదని, మనసులో ఉన్న స్థితే కారణమని దుయ్యబట్టారు. భారత్‌ను హిందూ దేశంగా మారేందుకు తాము అంగీకరించబోమని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ వారికి అవకాశం వస్తే భారత్‌ను ముస్లిం దేశంగా చేస్తారేమో అని పేర్కొన్నారు.

ఈశాన్య రాష్ట్రాల విద్యార్థినుల సందడి

ఉద్యాననగరిలో ఈశాన్య సొబగులు

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : ఈశాన భారత సంయుక్త మండలి (నార్త్ ఈస్ట్ యునైటెడ్ ఫోరం) నిర్వహించిన ఈశాన్య రాష్ట్రాల సమ్మేళనోత్సవానికి చక్కని స్పందన లభించింది. శాంతినగరలోని సెయింట్ జోసెఫ్ విశ్వవిద్యాలయం ఆడిటోరియం నిర్వహించిన ఉత్సవాలు.. మంగళవారం రాత్రి తెరదించారు. చివరిరోజు.. వేర్వేరు ప్రాంతాల నుంచి ఇక్కడికి విద్య, ఉపాధి, ఉద్యోగాలకు వచ్చిన యువత, పెద్దలు ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఏకత, సంస్కృతి, వైవిధ్యత, తమ సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేడుక చేసుకున్నారు. ఎనిమిది ఈశాన్య రాష్ట్రాల నృత్య ప్రదర్శనలు, హస్తకళా ఉత్పత్తుల ప్రదర్శన, చర్చాగోష్ఠులను నిర్వహించారు. మొదటి విభాగంలో త్రిపుర రాయల్‌హౌస్ ప్రతినిధి ప్రద్యోత్ బిక్రమ్, ఎన్‌సీపీ జాతీయ అధ్యక్షుడు పీకే సంగ్మా పాల్గొన్నారు. రెండో విభాగంలో నాగాల్యాండ్ మాజీ ఎమ్మెల్యే, కవి ఎం.కిశోన్, పీపుల్స్ పార్టీ సంచాలకుడు డేనియల్ ల్యాంగ్యాసా పాల్గొన్నారు. కర్ణాటక ఎమ్మెల్సీ సురేశ్‌బాబు, ఆదాయ పన్ను శాఖ కమిషనర్ నందిని దాస్, మణిపురకు చెందిన అధికారి ఏఎం రాజేశ్ తదితరులు విద్యార్థులు, యువతను ఉద్దేశించి మాట్లాడారు.

'మహిళా చైతన్యం..మహదానందం'

సింధనూరు, న్యూస్‌టుడే: మహిళా చైతన్యంతో మస్కి నియోజకవర్గంలో అభివృద్ధికి బాటలు పడుతున్నాయని, ఇది నాకెంతో ఆనందంగా ఉందని మస్కి నియోజకవర్గం శాసనసభ్యుడు, రాష్ట్ర ఖాదీ గ్రామోద్యోగ మండలి అధ్యక్షుడు ఆర్.బసనగౌడ తుర్విహాళ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన ఒకే రోజున తన క్షేత్రంలో మొత్తం ఆరు మహిళా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలను ప్రారంభించి సంతోషం వ్యక్తం చేశారు. ఒక్కసారిగా ఇన్ని సహకార సంఘాలు ఏర్పడటం మహిళా చైతన్యమేనన్నారు. గుడిహాళ, బప్పూరు, రంగాపూర, బెలగుర్కి, జక్కేరమడు, మూడదిన్ని గ్రామాల్లో ఆయన మహిళా పాల సొసైటీలను ప్రారంభించారు. కర్ణాటక పాల సమాఖ్య (ఆర్‌బీకేఎంయూఎల్) నిర్దేశకులు ఎన్.సీతారామ లక్ష్మి, అమరగుండప్ప, మధ్యకర్ణాటక ప్రముఖులు నెక్కుంటి సూర్యనారాయణరావు, సింధనూరు కేఎంఎఫ్ అధికారులు సతీశ్, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

బప్పూరులో సొసైటీని ప్రారంభించి ఓ మహిళ నుంచి పాలు కొనుగోలు చేస్తున్న ఎమ్మెల్యే

డిజిటల్ రంగానికి ప్రాధాన్యం

బెంగళూరు (ఆడుగోడి) : డిజిటల్ ప్రత్యేక విధానంతోనే ఆర్థిక ప్రగతి సాధ్యమని, ఆ ఆలోచనతోనే అజ్మాన్ న్యూవెంచర్ కేంద్రం ప్రత్యేక విధానం అమలు చేస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు షేక్ మహ్మద్ వెల్లడించారు. ఆయన బుధవారం ఇక్కడ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నూతన డిజిటల్ విధానం అమలులోకి వచ్చిన తరువాత 6,500 కంపెనీల ఏర్పాటుకు మార్గం సుగమమైందన్నారు.

దివ్య కళా ప్రతిభ

పదేళ్లలో పలు వేదికలపై ప్రదర్శనలు

ఉత్సవాల్లో దివ్యశ్రీ బృందం శివతాండవం

గేయాలాపనకు ప్రశంసాపత్రం అందుకుంటున్న బాలిక

హొసపేటె, న్యూస్‌టుడే: పట్టుమని పదేళ్లు నిండకముందే తనదైన ప్రతిభతో శభాష్ అనిపించుకుంటోంది దివ్యశ్రీ కెంభావిమఠ. స్థానికులు జగదీశ్, శ్రీదేవి కుమార్తె ఈ బాలిక. చిరుప్రాయంలోనే పలు రంగాల్లో తనదైన ఉనికిని చాటుకుంటోంది. సినిమా, నృత్యం, గేయాలాపన, ఫ్యాషన్ షోలలో పాల్గొని పురస్కారాలు సొంతం చేసుకుంది. ఐదో తరగతి చదువుతున్న దివ్యశ్రీ చిన్న వయసు నుంచే కళలపై ఆసక్తి పెంచుకుంది. ముఖ్యంగా శివతాండవ నృత్య ప్రదర్శనలో దివ్యశ్రీ పలు ప్రశంసలు అందుకుంది. నిరుడు హంపీ ఉత్సవ వేదికపై శివతాండవ నృత్యప్రదర్శనతో శభాష్ అనిపించుకుంది. 2023లో జరిగిన హంపీ ఉత్సవాల్లో గేయాలాపనతో ప్రేక్షకులను కట్టిపడేసింది. స్థానిక కళాకారుడు జోగి తాయప్ప నిర్మిస్తున్న ఓ సినిమాలో బాలనటిగా నటిస్తోంది. చిన్నారుల ఫ్యాషన్ షోల్లోనూ దివ్యశ్రీ మెరిసింది. మైసూరు, ఆనెగుంది, కనకగిరి ఉత్సవాల్లో పాల్గొని కళాప్రదర్శన చేసింది. హిందుస్థానీ సంగీతం ఆమెకి ప్రాణం. స్థానిక వ్యాపారవేత్తల వాణిజ్య ప్రకటనల్లోనూ ఆమెదే హవా. బాలిక బహుముఖ ప్రతిభను స్థానికులు ప్రశంసిస్తున్నారు.

ఉత్సవ వేదికలో బాల కళాకారిణి గేయాలాపన

చదువు సహా ఆరోగ్య అవగాహన

సింధనూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు కేవలం చదువులకే పరిమితం కాకుండా తమ వ్యక్తిగత ఆరోగ్య విషయాలపై కూడా అవగాహన పెంచుకోవాలని స్థానిక గౌతమ్ ఆసుపత్రి ప్రముఖ స్త్రీ వ్యాధుల నిపుణురాలు డా.కింజల్ జైన్ విద్యార్థినులకు సూచించారు. సింధనూరు లయన్స్ క్లబ్ స్థానిక పాటిల్ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం మహిళా క్యాన్సర్ సంబంధిత వ్యాధులపై అవగాహన సదస్సును ఏర్పాటు చేసింది. పాటిల్ కళాశాల విద్యార్థినులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి మహిళలు కూడా ఈ సదస్సులో పాల్గొన్నారు. కార్యక్రమానికి లయన్స్ అధ్యక్షుడు గూడపాటి వెంకటేశ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డా.కింజల్ విద్యార్థినులు క్యాన్సర్‌పై అడిగిన పలు ప్రశ్నలు, సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో లయన్స్ సీనియర్ ప్రతినిధులు రవికుమార్, మోహన్, సత్యనారాయణ, శివరామకృష్ణ, నాగరాజ్, పాటిల్ కళాశాల కార్యదర్శి ఆర్.సి.పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కింజల్ జైన్‌ను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు

విద్యారంగం అభివృద్ధికి రూ.12 కోట్లు

హొసపేటె, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యత శాతం పెంపునకు తీవ్రంగా కృషి చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే గవియప్ప పేర్కొన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం తాలూకాలోని పాపినాయకనహళ్లిలో నిర్మించిన మాధ్యమిక పాఠశాల భవన నిర్మాణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా విద్యార్థినులు అర్ధంతరంగా బడి మానకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలిచ్చామన్నారు. రెండున్నరేళ్లలో విద్యాభివృద్ధికి నియోజకవర్గంలో రూ.12కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ప్రతీ పాఠశాలలో తప్పనిసరిగా శౌచాలయాలు, క్రీడామైదానం ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తాలూకా విద్యాశాఖ అధికారి శేఖరప్ప హొరపేటె, గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు అంకమ్మ, టీపీ ఈవో ఆలంబాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మాధ్యమిక పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గవియప్ప

ఎమ్మెల్యే సాహస యాత్ర

71వ పుట్టినరోజున 300 కి.మీ సైక్లింగ్

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: క్రియాశీలక రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనే రాజాజీనగర్ ఎమ్మెల్యే ఎస్.సురేశ్‌కుమార్ తన 71వ జన్మదినోత్సవాన్ని ప్రత్యేకంగా జరుపుకొన్నారు. అందులో భాగంగా 300 కి.మీ సైకిల్‌పై సాహసయాత్ర చేశారు. బెంగళూరు నుంచి స్నేహితులతో కలిసి ధర్మస్థలానికి సైకిల్‌పై చేరుకొన్నారు. మంగళవారం ఆయన ధర్మస్థలంలోని శ్రీమంజునాథుణ్ని దర్శనం చేసుకొన్నారు. రెండు రోజుల పాటు సైకిల్ తొక్కి ఎమ్మెల్యే బృందం గమ్యం చేరింది. ఏడు పదుల వయసులోనూ శక్తి సామర్థ్యాలు చెక్కుచెదరలేదని ఆయన నిరూపించారు. దారి మధ్యన సోమవారం వారు హాసన్‌లో బేలూరు ఎమ్మెల్యే సురేశ్‌కు చెందిన కళాశాలలో బస చేశారు. ఉదయాన్నే మళ్లీ యాత్ర కొనసాగించి పూర్తి చేశారు. సురేశ్‌కుమార్‌తో పాటు రాజాజీనగర్‌కు చెందిన అశ్విన్, హరీశ్, సాగర్, దివాకర్, ప్రసన్న తదితర 15 మంది స్నేహితులు సైకిల్ యాత్రలో పాల్గొన్నారు.

రాజాజీనగర్‌కు చెందిన స్నేహితులతో కలిసి సైక్లింగ్

ధర్మస్థలం చేరుకొన్న ఎమ్మెల్యే సురేశ్‌కుమార్

కృషి పురస్కారానికి గడువు

బళ్లారి, న్యూస్‌టుడే: వ్యవసాయశాఖ 2025-26 ఏడాది ఖరీఫ్‌లో వర్షాధారం కింద పండించిన జొన్న, పొద్దుతిరుగుడు, కంది పంటల్లో శాస్త్రీయ పద్ధతిలో సాగు, అధిక దిగుబడి సాధించిన రైతులు నుంచి కృషి పురస్కారానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వ్యవసాయశాఖాధికారి తెలిపారు. పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను ఈ నెల 30 లోపు కె-కిసాన్ పోర్టల్‌లో సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలకు అధికారులను సంప్రదించాలని కోరారు.

దరఖాస్తులకు ఆహ్వానం

బళ్లారి, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి మత్స్యశాఖ పథకం కింద 2024-25 ఏడాదికి మత్స్యకారులు సహాయధనం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారి శివణ్ణ తెలిపారు. అర్హులైన మత్స్యకారులు పూర్తి వివరాలు నింపిన దరఖాస్తులతో ఈ నెల 19 లోపు సంబంధిత తాలూకా అధికారులను సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర జెస్కాం ఉపవిభాగం-2లో న్యాయస్థానం విద్యుత్ నిర్వహణ మరమ్మతు పనులు జరుగుతుండడం వల్ల ఈ నెల 13న ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. స్థానిక తాళూరు రహదారి, స్నేహకాలనీ, శ్రీనగర, రేణుకానగర, భగత్‌సింగ్ నగర, కన్నడ నగర, మహనంది కొట్టం, పార్వతినగర, వాల్మీకి కూడలి, శాస్త్రినగర, బ్యాంకు కాలనీ, సిరగుప్ప రహదారి, హవంబావి చుట్టుపక్క కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిస్తున్నట్లు తెలిపారు.

పోటీని ఎదుర్కొంటేనే భవిష్యత్తు

హొసపేటె, న్యూస్‌టుడే: విద్యతోపాటు ఉద్యోగ వేటలో కూడా పోటీని దీటుగా ఎదుర్కొన్నప్పుడే ఉత్తమ భవిష్యత్తు మీ సొంతమవుతుందని జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి మొహ్మద్ అలి అక్రమ్ షా అన్నారు. జాతీయ విద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం, జడ్పీ సంయుక్తంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన వ్యక్తిత్వ వికాస జాగృతి శిబిరంలో ఆయన మాట్లాడారు. ఉత్తర కర్ణాటక ప్రాంతం నుంచి ఐఏఎస్, ఐపీఎస్ ఉత్తీర్ణుల సంఖ్య చాలా తక్కువ ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కూడా పలు సంస్థల ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తోంది, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మైనార్టీ శాఖ అధికారి జావీద్ కరంగి తదితరులు పాల్గొన్నారు.

మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ సీఈవో

సర్దార్ పటేల్ ఆదర్శాలను ఆచరించాలి

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ ఆదర్శాలను విద్యార్థులు పాటించాలని లోకసభ సభ్యుడు గోవింద్‌కారజోళ పేర్కొన్నారు. బుధవారం పటేల్ 150వ జయంత్యుత్సవాల్లో భాగంగా ఏకతా పాదయాత్రను ప్రారంభించి మాట్లాడారు. భారతావనిని ఏకం చేయడానికి ఆయన చేసిన కృషి మరువజాలమన్నారు.

ఏక్తా పాదయాత్రలో ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు, క్రీడాకారులు, కళాకారులు

ఎమ్మెల్యే మునిరత్నకు సేవారత్న పురస్కారం

సింధనూరు, న్యూస్‌టుడే: తాలూకా కమ్మవారి సంఘం ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక పురస్కారాలకు కర్ణాటకకు చెందిన ఇద్దరు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒకరు ఎంపికయ్యారు. కార్తిక మాసం వనభోజన వేడుకల్లో సింధనూరు కమ్మసంఘం ఈ పురస్కారాలను ఏటా అందిస్తుంటుంది. ఇందులో భాగంగా ఈ నెల 16న స్థానిక శ్రీయలమంచలి కల్యాణ మండపంలో పెద్దఎత్తున ఏర్పాటు చేసిన ఉత్సవంలో ఈ ప్రశస్తులు ప్రముఖులకు అందిస్తున్నారు. బెంగళూరు రాజరాజేశ్వరినగర్ ఎమ్మెల్యే మునిరత్న నాయుడు రాజకీయంగానే కాకుండా వివిధ రంగాల్లో చేస్తున్న ప్రజాసేవకు గాను ఆయనకు సింధనూరు కమ్మసంఘం 'సేవారత్న-2025' పురస్కారాన్ని అందించనుంది. శ్రీశైలం దేవస్థానం బోర్డు ఛైర్మన్ పోతుగుంట రమేశ్‌నాయుడుకు 'ధర్మ రక్షక' పురస్కారాన్ని, సీనియర్ మాజీ ఎమ్మెల్యే, కర్ణాటక ప్రాంత కమ్మసంఘాల సమాఖ్య అధ్యక్షులు జీహెచ్.తిప్పారెడ్డికి 'సాధక రత్న' పురస్కారాలు ఇచ్చి గౌరవించనుంది. ఈ విషయాన్ని స్థానిక కమ్మసంఘం అధ్యక్ష, కార్యదర్శులు బూరుగుపల్లి శ్రీహర్ష, మల్లిన శేషగిరిరావు వెల్లడించారు.

ఎమ్మెల్యే మునిరత్న నాయుడు

రమేశ్ నాయుడు

తిప్పారెడ్డి

అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన ఎబెనెజర్

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో బళ్లారి శ్రీనంది పాఠశాలకు చెందిన ఎబెనెజర్ సత్తా చాటి, ఛాంపియన్‌గా నిలిచింది. 100 మీటర్ల పరుగు, డిస్కస్ త్రో, హామ్మర్ త్రో మూడింటిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

కదంతొక్కిన రైతన్నలు

కారటగి, న్యూస్‌టుడే: రెండో పంటకు నీరు విడుదల చేయాలంటూ వివిధ సంఘ సంస్థలు, రైతుల సహకారంతో భాజపా కారటగిలో బుధవారం నిరవధిక ధర్నా చేపట్టింది. తొలుత ఏపీఎంసీ నుంచి ప్రదర్శన నిర్వహించారు. కనకదాస కూడలి వద్ద కొంత సేపు రాస్తారోకో నిర్వహించి మంత్రులు శివరాజ్ తంగడగి, డి.కె.శివకుమార్, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ధర్నా వేదికపై భాజపా జిల్లా అధ్యక్షుడు దడేసుగూరు బసవరాజ్, నాయకులు శరణప్ప కొత్వాళ, నాగరాజ బిల్గార్, మరియప్ప సాలోణి, చంద్రశేఖర ముసాలి, మంజుల పూజారి, నారాయణ ఈడిగేర తదితరులు మాట్లాడారు. పలు సంఘ సంస్థలు, రైతు సంఘాల నాయకులు, వివిధ గ్రామాలు, క్యాంపుల రైతులు పాల్గొన్నారు.

ప్రదర్శనగా వస్తున్న భాజపా వివిధ పార్టీల నాయకులు, రైతులు

(c) eenadu

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

వినాయక ఆలయంలో దీపోత్సవం

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: గొల్లనరసప్ప కాలనీ వరసిద్ధి వినాయక ఆలయంలో కార్తిక మాసం సందర్భంగా స్వామి వారికి పూజలు వైభవంగా నిర్వహించారు. స్వామివారిని విశేషంగా పుష్పాలతో అలంకరించారు. తులసీ బృందావనం రూపంలో రంగవల్లులు వేసి దీపాలంకరణ చేశారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసరావు కార్తిక పురాణం చదివి విన్పించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

← తులసీబృందావనం రూపంలో దీపాలంకరణ

నవజాత శిశువులకు వినికిడి పరీక్షలు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి శ్రావణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్, బళ్లారి వైద్య కళాశాల పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం నవజాత శిశువు కేంద్రంలో వినికిడి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బీఎంసీఆర్‌సీ నిర్దేశకుడు డా. గంగాధరగౌడ, ప్రధాన ఆచార్యులు డా. మంజునాథ్, ఆసుపత్రి ముఖ్య పర్యవేక్షకులు డా. ఇందుమతి, శ్రావణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ కళాశాల ఛైర్మన్ చంద్రిక, రాఘవేంద్ర ప్రసాద్, ప్రధాన ఆచార్యులు రాజలక్ష్మి ప్రారంభించి మాట్లాడారు.

శిశువులను పరీక్షిస్తున్న వైద్యులు

అమృతధారె కేంద్రం.. శిశువులకు ప్రాణాధారం

స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న తల్లులు

బళ్లారి, న్యూస్‌టుడే: నవజాత శిశువులకు అమృతధారె సంజీవనిగా మారింది. తల్లులు తమ పిల్లలకు పాలు ఇచ్చిన తర్వాత మిగిలిన పాలు వృథా చేయకుండా స్వచ్ఛందంగా బళ్లారి వైద్య కళాశాల, పరిశోధన కేంద్రంలోని అమృతధారె కేంద్రానికి వచ్చి పాలు ఇస్తున్నారు. ఆ పాలను వైద్యులు పరీక్షించిన తర్వాత నవజాత శిశువులకు అందజేస్తున్నారు. మూడు నెలల్లో 196 మంది తల్లులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అమృతధారెలో పాలు ఇచ్చారు. ఈ పాలను నిపుణులు సేకరించి, సంస్కరణ తర్వాత నిల్వ చేసిన ఎన్.ఐ.సి.యు. వార్డులో చికిత్స పొందుతున్న సుమారు 150 మంది నవజాత శిశువులకు అందజేస్తున్నారు.

కల్యాణ కర్ణాటకలోనే మొదటిది

ఏ కారణం వల్లనైనా నవజాత శిశువులు తల్లిపాలు దక్కక అనారోగ్యం బారినపడ్డం లేదా మృతి చెందడం వంటి ఘటనలు నివారించడానికి బళ్లారి వైద్య కళాశాల, పరిశోధన కేంద్రంలో రూ.75 లక్షలతో అమృతధారె కేంద్రం ఏర్పాటు చేశారు. కల్యాణ కర్ణాటకలో తొలి కేంద్రమిది. ఈ కేంద్రంలో 50 లీటర్ల తల్లిపాలను ఆరు నెలల పాటు నిల్వ ఉంచే అధునాతన పరికరాలు ఉన్నాయి. వైద్యుడు డా. దుర్గప్పతో పాటు 10 మంది నిపుణులు, స్టాఫ్ నర్సులు, డి. గ్రూపు సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటున్నారు.

బీఎంసీఆర్‌సీలో ఏర్పాటు చేసిన అమృతధారె కేంద్రం

● తల్లి పాలు కాకుండా పాలపొడి, ఆవు, గేదె పాలు ఇవ్వడం వల్ల శిశువుకు అనారోగ్య సమస్యలు, బరువు తగ్గిపోవడం, ఎదుగుదల లేకపోవడం, అనారోగ్య సమస్యలతో శిశువు మృతి చెందే అవకాశాలు ఉన్నాయి.

● తల్లి పాల ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. వాంతులు, విరేచనాలు రావు. ఎదుగుదల ఉంటుంది. న్యూట్రియంట్స్ దేహానికి అందడం వల్ల ఆరోగ్యంగా ఉంటారు.

● కేంద్రంలోని స్టాఫ్ నర్సులు, ఆరోగ్య సిబ్బంది ప్రసవమైన వార్డులకు వెళ్లి బాలింతలకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. తల్లి పాలు ఇవ్వడం ద్వారా మరింత ఉత్పత్తి అవుతాయి. మీ బిడ్డకు పాలు ఇచ్చిన తర్వాత మిగిలిన పాలు కేంద్రానికి వచ్చి ఇవ్వొచ్చని నచ్చచెబుతున్నారు.

పాలు నిల్వ చేసే యంత్రాలు

పాల దానం..ప్రాణ దానమే

తల్లి పాలకు వేరేవీ సాటి రావు. శిశువులు ఆరోగ్యంగా ఉంటారు. తమ బిడ్డకు పాలు ఇచ్చిన తర్వాత మిగిలితే కేంద్రంలో పాలు ఇవ్వడం ద్వారా మరొకరికి జీవితం ప్రసాదించినట్లు అవుతుంది.

- డా.దుర్గప్ప, అమృతధారె నోడల్ అధికారి

వ్యాధి నిరోధక శక్తి పెంపు



నవజాత శిశువుకు ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. తల్లిపాలు కాకుండా ఆవు, గేదె, పౌడర్ పాలు ఇవ్వకూడదు. జిల్లా వాసులకు అమృతధారె కేంద్రం ఓ వరం.

-డా.విశ్వనాథ, బీఎంసీఆర్‌సీ, పిల్లలు విభాగం, ఆచార్యులు

మహిళా వైద్యుల్ని నియమించాలని ఆందోళన

కంప్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళా వైద్యుల్ని నియమించాలంటూ వివిధ సంఘాల నాయకులు స్థానిక పుర సభ కార్యాలయం ముందు బుధవారం ధర్నా నిర్వహించారు. ప్రగతిపర సంఘాల సమాఖ్య నాయకులు కె.లక్ష్మణ, కరియప్ప గుడిమని మాట్లాడుతూ ఆసుపత్రిలో మహిళా డాక్టర్ లేక గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్యురాలిని నియమించాలని పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేక ధర్నా చేస్తున్నామన్నారు. జిల్లా వైద్యాధికారి వచ్చి సమాధానం చెప్పాలని డిమాండు చేశారు. విషయం తెలిసి కుటుం సంక్షేమ జిల్లా అధికారిణి డాక్టర్ పూర్ణిమ కట్టిమని ఘటనాస్థలానికి వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. తాత్కాలికంగా తోరణగల్లు వైద్యురాలు రజియా బేగం, రూపనగుడి వైద్యురాలు చిత్ర తలా మూడు రోజులు ఇక్కడ విధులు నిర్వహిస్తారని నచ్చజెప్పారు. సమస్యను త్వరగా పరిష్కరించకపోతే పోరాటం తీవ్రతరం చేస్తామని ఆందోళనకారులు తెలిపారు. కార్యక్రమంలో రవి మణ్ణూరు, సి.బసవరాజ్, సణ్ణప్ప తళవార్, కె.మహబూబ్, పురుషోత్తం, శోభా రాంపుర, శివ గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

హంపీలో రఘునందన తీర్థుల మధ్యారాధన

హొసపేటె, న్యూస్‌టుడే: రఘునందన తీర్థుల ఆరాధనోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హంపీ సమీప బృందావనంలో మధ్యారాధన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మంత్రాలయం మఠాధిపతి సుబుధేంద్ర తీర్థ స్వామి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి భక్తులనుద్దేశించి ప్రసంగించారు. జగద్గురు మధ్వాచార్యుల మూల సంస్థానమఠమైన రాఘవేంద్ర స్వామి మఠానికి మూలరాముడిని తిరిగి తీసుకొచ్చిన రఘునందన తీర్థుల సేవలు అజరామరమని కొనియాడారు. మంత్రాలయం మఠంలో నేటికీ ఎలాంటి వివక్షలు లేవని చెప్పారు. మంత్రాలయం దాససాహిత్య ప్రాజెక్ట్ సంచాలకుడు సుళాది హనుమేశాచార్, ప్రముఖులు శర్మాచార్, ద్వారకానాథాచార్, భీమసేనాచార్, గురురాజ్ దిగ్గావి, సుమంత్ కులకర్ణి, అనంతపద్మనాభరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు చేసిన మంత్రాలయం మఠాధిపతి సుబుధేంద్ర తీర్థ స్వామి

రెండురాష్ట్రాల వాటా నీరు వదలండి

తుంగభద్ర మండలి కార్యదర్శికి వినతిపత్రం సమర్పిస్తున్న రైతు నాయకుడు

హొసపేటె, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల వాటా కలిపి ఎల్లెల్సీకి వేసవి పంటలకు నీటిని విడుదల చేయాలని బళ్లారి రైతు సంఘం నాయకుడు దరూరు పురుషోత్తమగౌడ తుంగభద్ర మండలిని కోరారు. బుధవారం ఆయన హొసపేటెలో తుంగభద్ర మండలి కార్యదర్శి రామకృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. డిసెంబరు తర్వాత వేసవి పంటలకు నీటిని విడుదల చేయాలన్నారు. ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు పరిధిలోని ఎల్లెల్సీ రైతులు ఇప్పటికే మండలికి వినతిపత్రం ఇచ్చారు. ఆంధ్రవాటా మాత్రమే విడుదల చేస్తే, కర్ణాటక రైతులకు అన్యాయం చేసిన వారవుతారు. ఈ నేపథ్యంలో రెండు రాష్ట్రాల వాటా కలిపి మార్చి వరకూ వేసవి పంటలకు నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. జలాశయంలో సుమారు 76 టీఎంసీ జలాలు నిల్వ ఉన్నాయి. రెండోపంటకు సులువుగా సాగునీరు విడుదల చేయొచ్చని తెలిపారు.

జిల్లా ఛాంపియన్‌గా బళ్లారి బాలిక

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖ, పంచాయతీశాఖ సంయుక్తంగా జిల్లా క్రీడామైదానంలో మంగళవారం నిర్వహించిన అథ్లెటిక్ పోటీల్లో బళ్లారి శ్రీ నంది పాఠశాలకు చెందిన లక్ష్మీప్రియ ఛాంపియన్‌గా నిలిచింది. ఈ సందర్భంగా పలువురు ఆమెను అభినందించారు. లక్ష్మీ ప్రియ 100 మీటర్లు, 400 మీటర్ల పరుగు, 400 మీటర్ల హర్డిల్స్ మొత్తం మూడుపోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి అత్యధిక పాయింట్లు సాధించింది. రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక యింది.

30న జాతీయ స్థాయి కరాటే పోటీలు

బళ్లారి, న్యూస్‌టుడే: ఈ నెల 30న మూడో జాతీయ స్థాయి కరాటే టోర్నమెంట్ పోటీలు స్థానిక తిలక్‌నగర్ కింగ్స్ ప్యాలెస్‌లో నిర్వహిస్తున్నట్లు కరాటే శిక్షకుడు కట్టేస్వామి తెలిపారు. బుధవారం పత్రికాభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ జాతీయ స్థాయి కరాటే పోటీలకు దేశ వ్యాప్తంగా 600 మంది విద్యార్థులు పాల్గొనున్నారు. ఇప్పటికే 15 రాష్ట్రాలకు చెందిన కరాటే సాధకులు పేర్లు నమోదు చేసుకున్నారు. బళ్లారిలో మూడో సారి జాతీయ స్థాయి కరాటే పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠాపన

బళ్లారి, న్యూస్‌టుడే: కురుగోడు రహదారిలోని శ్రీశైల మల్లికార్జున దేవస్థానం ఆవరణలో ఉన్న వీరభద్రేశ్వరస్వామి, అభయాంజనేయస్వామి, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపనను పురస్కరించుకుని నాగప్రతిష్ఠ, సర్ప సంస్కార, ఆశ్లేషబలి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలో విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. తాలూకాలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. విజయవాడకు చెందిన బ్రహ్మయ్య బృందంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరభద్ర ఆచార్యులు, అమరేశ్వర తదితర ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

కార్యక్రమానికి తరలివచ్చిన భక్తులు

రెండో పంట నీటి కోసం రైతుల పాదయాత్ర

బళ్లారి, న్యూస్‌టుడే: తుంగభద్ర జలాశయం ఆయకట్టు ప్రాంతంలోని జిల్లాలకు రెండో పంటకు కాలువలకు నీటిని విడుదల చేయాలని కోరుతూ కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం, హసిరు సేనె సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కరూరు మాధవరెడ్డి నేతృత్వంలో బుధవారం పాదయాత్ర ప్రారంభమైంది. సిరుగుప్ప తాలూకా కరూరు గ్రామం నుంచి ప్రారంభమైన పాదయాత్ర సింధిగేరి, బైలూరు, కురుగోడు, కంప్లి కమలాపురం నుంచి హొసపేటె మీదుగా ఈ నెల 17న తుంగభద్ర జలాశయానికి చేరుకుంటుంది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కరూరు మాధవరెడ్డి మాట్లాడుతూ నవంబరు 14న జరగనున్న నీటిపారుదల సలహా సమితి సమావేశంలో మూడు జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు. .రైతులు తరపున మాట్లాడాలన్నారు. క్రస్ట్ గేట్ల ఏర్పాటుపై సరైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి బైలూరు మల్లప్ప తాత మఠం చేరుకున్నాక పాదయాత్రను ఆపి విశ్రాంత తీసుకుంటారు. గురువారం ఉదయం అక్కడ నుంచి తిరిగి ప్రారంభిస్తామని వివరించారు. పాదయాత్రలో బళ్లారి, సిరుగుప్ప, కురుగోడు, కంప్లిలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

ఊరేగింపుగా వెళ్తున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కరూరు మాధవరెడ్డి, రైతులు

ఇంటింటికీ కిచెన్ కిట్ల వితరణ

బళ్లారి, న్యూస్‌టుడే: ఇంటింటి భరత్-సలాం బళ్లారి అభియాన్ కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి బుధవారం బళ్లారి నగర పాలికె నగర విధాన క్షేత్రం పరిధిలోని మిల్లర్‌పేటెలో ఇంటింటికి కిచెన్‌కిట్లును పంపిణీ చేశారు. జన్మదినోత్సవం సందర్భంగా నగర క్షేత్రం వాసులకు తమ వంతు సహాయం చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు కార్పొరేటర్ రాజేశ్వరి, మించు శ్రీనివాసులు, నూర్ మహమ్మద్, పి.గాదెప్ప, జబ్బార్, కె.పి.సి.సి. వ్యాఖ్యాత వెంకటేశ్ హెగ్డే తదితరులు పాల్గొన్నారు.

పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భరత్‌రెడ్డి తదితరులు

కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులతో డాక్టర్ చిగురుపాటి ప్రసాద్

యువత చేతుల్లో దేశ ప్రగతి

హుబ్బళ్లి (కారటగి), న్యూస్‌టుడే: దేశ ప్రగతి యువత చేతుల్లో ఉంది. యువత విద్య, మానవతా విలువలు పెంపొందించుకుని జవాబుదారీతనంతో ముందుకు సాగాలని హుబ్బళ్లి స్వర్ణ సమూహ సంస్థల అధిపతి డాక్టర్ చిగురుపాటి వి.ఎస్.వి. ప్రసాద్ పిలుపునిచ్చారు. హుబ్బళ్లి విద్యానగర్ కేఎల్ఈ అంతర కళాశాల ఉత్సవ 'ఈక్వినాక్స్-25' ను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా స్వర్ణ గ్రూప్ కంపెనీల సహకారంతో నగరంలో వందకు పైగా మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపల్ రమాకాంత దియోజీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంప్లిలో మక్కళ సంసత్-2025

కంప్లి, న్యూస్‌టుడే: స్థానిక సత్యనారాయణ పేటె ప్రభుత్వ పాఠశాలలో జిల్లా స్థాయి మక్కళ సంసత్-2025 బుధవారం నిర్వహించారు. తాలూకా పంచాయతీ సహాయ నిర్దేశకుడు కె.ఎస్.మల్లన గౌడ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి సంసత్ సమావేశాల్లో తమ సమస్యలపై చర్చించి ప్రభుత్వం దృష్టికి తేవాలన్నారు. పిల్లల హక్కుల రక్షణ రాష్ట్ర సమితి సభ్యుడు హెచ్.సి.రాఘవేంద్ర మాట్లాడారు. అంగన్‌వాడీ అధికారిణి లతీఫా బేగం, ప్రధానోపాధ్యాయుడు హనుమంతప్ప, రీడ్స్ సంస్థ ప్రతినిధి కరిస్వామి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, విద్యార్థులు

రాష్ట్ర స్థాయి పోటీలకు రారావి విద్యార్థిని

సిరుగుప్ప, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి లాంగ్ జంప్ పోటీలకు ఆర్. రేఖ అర్హత సాధించింది. రారావిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న రేఖ జిల్లా స్థాయి అథ్లెటిక్ క్రీడల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్ర స్థాయికి అర్హత సాధించడంతో బుధవారం క్రీడా ఉపాధ్యాయులు చెన్నప్ప, ఉపేంద్ర, ఈరణ్ణ తదితరులు అభినందించారు. రాష్ట్ర స్థాయిలోనూ గెలుపొంది జిల్లాకు గుర్తింపు తేవాలని కోరారు.

రేఖను సన్మానిస్తున్న క్రీడా ఉపాధ్యాయులు



కోళూరులో బృందావనానికి పుష్పాలంకరణ

నేత్రానందంగా ఆరాధనోత్సవం

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: కోళూరులో వెలసిన రఘునందన తీర్థుల మఠంలో బుధవారం శ్రీపాదుల మధ్యారాధన కమనీయంగా నిర్వహించారు. అభిషేకాలు, పూజలు ఆచరించారు. బృందావనానికి పట్టువస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. భక్తులకు మఠం ఆధ్వర్యంలో అన్న సంతర్పణ చేశారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

12-11-2025 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1625.08	1631.66
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	2,812	5,017
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	7,220	10,084
నీటి నిల్వ (టి.ఎం.సి)	76.746	100.445

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

విద్యతోనే విద్యార్థుల వికాసాభివృద్ధి

మాన్వి, న్యూస్‌టుడే : విద్యని మించిన సంపద మరొకటి లేదని, బాలల వికాసాభివృద్ధి విద్యతోనే సాధ్యపడుతుందని ఎమ్మెల్యే హంపయ్యనాయక్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాషుమియా కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థుల స్వాగత కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ కళాశాలలో ఉత్తమ ఫలితాలు వస్తుండటం హర్షించతగ్గ విషయమన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ జె.ఎల్.ఈరణ్ణ మాట్లాడుతూ కళాశాల న్యాక్ నుంచి బీ గ్రేడ్ సాధించిందని, ఏ గ్రేడ్ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సి ఉందన్నారు. కార్యదర్శి డాక్టర్ సయ్యద్ ఉల్ హసన్ కళాశాల 38 ఏళ్ల పనితీరును వివరించారు. కార్యక్రమంలో ప్రముఖులు గఫూర్‌సాబ్, అమరేశప్ప, డి.జి.కర్కిహళ్లి, ఆర్.వెంకయ్యశెట్టి, మధుకుమారి పాండే, సిద్ధనగౌడ ఆల్దాళ, శంకర్ జగ్గీ, హొన్నప్పహెళవర్, భీరప్ప తదితరులు పాల్గొన్నారు.

మొక్కకు నీరు పోస్తున్న హంపయ్యనాయక్

మహబలేశ్వరప్ప సేవలు చిరస్మరణీయం

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి రావు బహద్దూర్ వై.మహబలేశ్వరప్ప సాంకేతిక మహావిద్యాలయంలో బుధవారం వై.మహబలేశ్వరప్ప పుణ్యతిథి, సమాజ సేవ స్మరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానాచార్యులు డా. హనుమంతరెడ్డి, ఉప ఆచార్యులు డా. సవిత సూనూళి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొని రావు బహద్దూర్ వై. మహబలేశ్వరప్ప విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను శ్లాఘించారు.

విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రధానాచార్యులు,అధ్యాపకులు

పంచాయతీని సందర్శించిన ఐఏఎస్ అధికారులు

సిరివార, (మాన్వి) : ఐఏఎస్ పూర్తి చేసిన ప్రొబేషనరీ అధికారుల బృందం తాలూకాలోని మాడగిరి గ్రామ పంచాయతీని సందర్శించింది. అభిషేక్ నెహార, సత్యం, చతుర్వేధి, జనార్ధన్ యాదవ్, హునార్ కులార్, అనుశ్రీ సచ్చన్, త్రిలోక్‌సింగ్ బృందంలో అధికారులకు సిరివార పట్టణ పంచాయతీ ముఖ్యాధికారి శశిధర్‌స్వామి, పంచాయతీ సభ్యులు, ప్రముఖులు సాదరంగా స్వాగతం పలికారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, యోజనలు ఏ విధంగా అమలవుతున్నదీ పరిశీలించారు. అధికారుల వెంట తాలూకా అధికారులు ఉన్నారు.

పర్యటనకు విచ్చేసిన ప్రొబేషనరీ అధికారులు

(c) eenadu

ప్రశ్నించే తత్వమే ప్రగతికి సంకేతం

కురుబ విద్యార్థి భవన్ నమూనా ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తదితరులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : చరిత్ర తెలుసుకుంటే ప్రశ్నించే తత్వం పెరుగుతుందని, ప్రతి అంశాన్నీ అధ్యయనపూర్వకంగా సమీక్షించాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. ఆయన బుధవారం గాంధీనగరలో కురుబ విద్యార్థి వసతి నిలయ భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ప్రశ్నించే తత్వం లేకపోతే సమాజం ముందుకు సాగదన్నారు. ప్రశ్న సమాజాన్ని ముందుకు తీసుకుపోతుందని వివరించారు. ప్రశ్నించకపోతే సమాజం బానిసత్వంలో కూరుకుపోతుందని హెచ్చరించారు. ఉపాధ్యాయుడు రాజప్ప తనను ఐదోతరగతిలో చేర్చుకోకపోతే న్యాయవాది, ముఖ్యమంత్రి అయ్యేవాడినే కాదన్నారు. రైతు ఉద్యమకారుడు ఆచార్య నంజుండస్వామి వల్ల తాను రాజకీయాల్లోకి వచ్చినట్లు గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరువందల కురుబ భవనాలను నిర్మించాలని తీర్మానించిందని గుర్తు చేశారు. మైసూరు, హుబ్బళ్లి, శివమొగ, దావణగెరె తదితర ప్రాంతాల్లో కురుబ భవన్‌లను నిర్మించడంతో పాటు సంగొళ్లి రాయణ్ణ సైనిక పాఠశాల కూడా ప్రారంభించాలని తెలిపారు. కురుబ సమాజానికి చెందిన ఆస్తులను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. లేక పోతే కబ్జాలకు గురవుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మంత్రి భైరతి సురేష్, మాజీ మంత్రి హెచ్.ఎం.రేవణ్ణ, మాజీ ఎమ్మెల్యే వర్తూరు ప్రకాశ్ తదితరులతో పాటు కురుబ మఠాధిపతులు హాజరయ్యారు.

దావణగెరెకు ఉల్లాస పయనం!

ఫ్లై బస్సు సేవలు షురూ

బెంగళూరు (గ్రామీణం), యలహంక, న్యూస్‌టుడే : 'బెణ్ణె నగరి' దావణగెరె నుంచి కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చి వెళ్లే ప్రయాణికుల కోసం కేఎస్‌ఆర్టీసీ అత్యాధునిక- విలాసవంత ఫ్లై బస్సు సేవలను అందుబాటులోకి తీసుకు వచ్చింది. మైసూరుకు తొమ్మిది ట్రిప్పులు, మడికేరికి 2, కుందాపురకు 2 వాహనాలతో పాటు ఇప్పుడు దావణగెరెకు రెండు ఫ్లై బస్సు సేవలు అందుబాటులోకి వచ్చాయి. నిత్యం ఈ బస్సులు 44 ట్రిప్పులతో 10,240 కి.మీ. దూరం ప్రయాణిస్తున్నాయి. ప్రతి కి.మీ.కి రూ.90 ఆదాయం సమకూరుతుండగా, సగటున నిత్యం 1,050 మంది ప్రయాణిస్తున్నారని రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి తెలిపారు. కెంపేగౌడ విమానాశ్రయం నుంచి అర్ధరాత్రి 12.45కు, ఉదయం 10 గంటలకు, దావణగెరె నుంచి ఉదయం 8 గంటలకు, సాయంత్రం 5 గంటలకు ఒక ట్రిప్పు ఉంటుంది. తుమకూరు, చిత్రదుర్గ బైపాస్‌లలో మాత్రమే ప్రయాణికుల కోసం బస్సును నిలుపుతారు. విమానాశ్రయం నుంచి తుమకూరు వరకు రూ.400, చిత్రదుర్గకు రూ.980, దావణగెరెకు రూ.1250ను టికెట్టు ధరగా ప్రకటించారు. ప్రయాణికులకు అల్పాహారం (చిరుతిండ్లు) కోసం నందిని ఫ్లేవర్ పాలు, కుకీలు, కేక్, మురుకులు, ఒక నీటి బాటిల్‌ను ఉచితంగా అందిస్తున్నామని మంత్రి వివరించారు. ఆర్టీసీ అధికారులు అక్రం పాషా, డాక్టర్ కె.నందిని దేవి, ఇబ్రహీం మైగుర్, విమానాశ్రయం అధికారులు కెన్నెత్, ప్రవత్, సంజయ్ చంద్ర, పాల సమాఖ్య ప్రతినిధి స్వాతి రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రయాణికునికి 'నందిని' అల్పాహార కిట్ అందిస్తున్న మంత్రి

అధికారులతో కలిసి బస్సుకు జెండా ఊపుతున్న రామలింగారెడ్డి

రాజాజీనగర్‌కు చెందిన స్నేహితులతో కలిసి సైకిళ్లపై ధర్మస్థలం చేరుకున్న సురేశ్‌కుమార్

ఎమ్మెల్యే సాహస యాత్ర

71వ పుట్టినరోజున 300 కి.మీ సైక్లింగ్

చెళ్లకెర(చిత్రదుర్గ),న్యూస్‌టుడే: క్రియాశీలక రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనే రాజాజీనగర్ ఎమ్మెల్యే ఎస్.సురేశ్‌కుమార్ తన 71వ జన్మదినోత్సవాన్ని ప్రత్యేకంగా జరుపుకొన్నారు. అందులో భాగంగా 300 కి.మీ సైకిల్‌పై సాహసయాత్ర చేశారు. బెంగళూరు నుంచి స్నేహితులతో కలిసి ధర్మస్థలానికి సైకిల్‌పై చేరుకొన్నారు. మంగళవారం ఆయన ధర్మస్థలంలోని శ్రీమంజునాథుణ్ని దర్శనం చేసుకొన్నారు. రెండు రోజుల పాటు సైకిల్ తొక్కి ఎమ్మెల్యే బృందం గమ్యం చేరింది. ఏడు పదుల వయసులోనూ శక్తి సామర్థ్యాలు చెక్కుచెదరలేదని ఆయన నిరూపించారు. దారి మధ్యన సోమవారం వారు హాసన్‌లో బేళూరు ఎమ్మెల్యే సురేశ్‌కు చెందిన కళాశాలలో బస చేశారు. ఉదయాన్నే మళ్లీ యాత్ర కొనసాగించి పూర్తి చేశారు. సురేశ్‌కుమార్‌తో పాటు రాజాజీనగర్‌కు చెందిన అశ్విన్, హరీశ్, సాగర్, దివాకర్, ప్రసన్న తదితర 15 మంది స్నేహితులు సైకిల్ యాత్రలో పాల్గొన్నారు.

అన్నదాతకు వెన్నుదన్నుగా.. కృషిమేళాకు వేళాయె!

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కరవు కాలానికి అనుగుణంగా తక్కువ నీటితో చక్కగా పంటలు పండించేందుకు ఉపకరించే వంగడాల కోసం అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. అందుకు అనుగుణంగా బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం నూతన వంగడాలను అందించేందుకు సిద్ధమైంది. నగరంలోని జీకేవీకే ఆవరణలో బుధవారం కృషిమేళా–2025 పేరిట ఈ వంగడాల ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రదర్శన.. 16వ తేదీ వరకు కొనసాగుతుంది. ఏళ్ల పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేసిన తరువాత వాటిని రైతులకు అందిస్తున్నట్లు ఉపకులపతి డాక్టర్ ఎస్.వి.సురేష్ తెలిపారు. అభివృద్ధి చేసిన నూతన వంగడాలు, విదేశీ ఆకుకూరలను ఆయన శాస్త్రవేత్తలతో కలిసి వీక్షించి, వాటి ప్రత్యేకతలను విలేకరులకు వివరించారు.

నూతన వంగడం.. రాగి ఎంఎల్-322 పంట కళకళ

జీకేవీకే అభివృద్ధి చేసిన కాషాయ రంగు పనసకాయలు దిగుబడి జోరు

● కరవు ప్రదేశాల్లో అతి తక్కువ నీటితో పండే రాగి ఎం.ఎల్-322ను అభివృద్ధి చేశారు. సాగు చేసిన 105 రోజుల్లో పంట దిగుబడికి వస్తుంది. ప్రతి ఎకరాకు 15 నుంచి 20 కింటాళ్ల రాగులు దిగుబడి సాధించవచ్చని శాస్త్రవేత్తలు వివరించారు.

● అతి తక్కువ కరవు ప్రదేశాల్లో సామె జీపీయూఎస్-11 రకం చిరుధాన్యాల సాగు రైతులకు ఉత్తమ దిగుబడి 90 రోజుల్లో చేతికందుతుంది. ఆరు నుంచి ఎనిమిది కింటాళ్ల దిగుబడి పొందవచ్చని శాస్త్రవేత్త డాక్టర్ నాగరాజు తెలిపారు. వాటితో పాటు బరగు జీపీయూపీ-32 వంగడం కరవు ప్రదేశాల్లో ఉత్తమ సాగుకు అవకాశం కల్పిస్తుంది. 80 రోజుల్లో ఎకరానికి ఏడు నుంచి ఎనిమిది క్వింటాళ్ల దిగుబడి సాధించవచ్చు.

● సూర్యకాంతి కేబీఎస్‌హెచ్ మొక్కజొన్న వంగడాన్ని ఈ సందర్భంగా విడుదల చేయనున్నారు. తక్కువ వర్షపాత సమయంలోనూ, రోగాలు సోకకుండా విత్తనం నాటిన తరువాత 80 రోజుల్లో ఎకరానికి తొమ్మిది నుంచి పది క్వింటాళ్ల దిగుబడి సాధించవచ్చని శాస్త్రవేత్తలు ప్రకటించారు. జీకేవీకే అభివృద్ధి చేసిన పనస శాస్త్రవేత్తలు ఇక్కడ చెప్పుకోవాల్సిందే. ఈ పనసతో మూడున్నరేళ్లలో లాభాలు గడించవచ్చు.

● జీకేవీకే ఆవరణలో సాగే కృషిమేళాలో 650 దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. చిరుధాన్యాలు, విత్తనాలు, సేంద్రియ, ప్రకృతి వ్యవసాయానికి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేస్తారు. నిత్యం ఉదయం పదిగంటల నుంచి సాయంత్రం ఆరింటి వరకు ప్రదర్శన కొనసాగిస్తారు. తొలిరోజు ప్రదర్శనను గవర్నరు థావర్ చంద్ గహ్లోత్ ప్రారంభిస్తారు.

రసాయనిక మందులను పిచికారి చేయడానికి ఉపకరించే ట్రాక్టర్

రూ.2 కోట్ల వంచన

మంగళూరు, న్యూస్‌టుడే : ఆన్‌లైన్ వ్యాపారంలో మదుపు చేస్తే త్వరగా మీ పెట్టుబడి రెట్టింపు అవుతుందని వచ్చిన వాట్సప్ సందేశాలను విశ్వసించి మంగళూరుకు చెందిన ఒక వ్యక్తి వంచనకు గురయ్యాడు. అంకిత్, సుమిత్ జైస్వాల్, కుశాగర్ జైన్, అఖిల్ అనే వ్యక్తులు వాట్సప్‌లో మూడేళ్లుగా సందేశాలు పంపిస్తూ వచ్చారు. మొదట కంపెనీ ప్రతినిధిగా చేరాలని సూచించారు. మొదట చిన్న మొత్తాలను పారితోషికంగా అందించారు. విదేశీ సంస్థల్లో పెట్టుబడి పెడితే పెద్ద మొత్తం లాభం కళ్లజూడవచ్చని చెప్పడంతో మంగళూరువాసి దశలవారీగా రూ.2 కోట్లు మదుపు చేశాడు. కొద్ది రోజులుగా వంచకుల ఫోన్లు మూగబోవడంతో తాను మోసపోయానని గుర్తించిన బాధితుడు బుధవారం నగర సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు.

మాటల 'ప్రతాపం'

మైసూరు, న్యూస్‌టుడే : దిల్లీ ఎర్రకోట సమీపంలో కారుపేలుడు ఘటనకు సంబంధించి మాజీ ఎంపీ ప్రతాప్ సింహ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ముస్లింలకు పిల్లలను పుట్టించడం మాత్రమే పనిగా మారిందని విమర్శించారు. విద్యావంతులైన ముస్లింలే ఎక్కువ మంది ఉగ్రవాదులుగా మారుతున్నారంటూ ఆరోపించారు. వారు ఉగ్రవాదులుగా మారడానికి పేదరికం కారణం కాదని, మనసులో ఉన్న స్థితే కారణమని దుయ్యబట్టారు. భారత్‌ను హిందూ దేశంగా మారేందుకు తాము అంగీకరించబోమని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ వారికి అవకాశం వస్తే భారత్‌ను ముస్లిం దేశంగా చేస్తారేమో అని పేర్కొన్నారు.

మారుతోంది.. కమల గళం

● ఆర్ఎస్ఎస్ నేత ఉద్బోధ ఫలితం

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే : ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య ఉన్నా, రేపు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు అవకాశం వచ్చినా, లేదా ఎవరైనా దళిత నాయకుడు ముఖ్యమంత్రి అయితే భాజపాకు ఏమిటి సంబంధం? అని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ ప్రశ్నించినప్పటి నుంచి కమలనాథుల నోళ్లు మూతపడ్డాయి. అధికార మార్పిడి అంశం కాంగ్రెస్‌కు చెందినదని, దాన్ని పట్టుకుని భాజపా వేలాడడం హాస్యాస్పదమని ఆయన ఇటీవల తప్పుబట్టారు. గత వారం బెంగళూరుకు వచ్చిన మోహన్ భగవత్ భాజపా నాయకులను ఉద్దేశించి వరుసగా విమర్శలు గుప్పించారు. అప్పటి నుంచి అధికార మార్పిడిపై సీనియర్ నేతలు విజయేంద్ర, అశోక్, సీటీ రవి, చలువాది నారాయణ స్వామి, అశ్వత్థనారాయణ తదితరులు స్వరం మార్చారు. సమస్యలపై ప్రత్యేకంగా గళం పెంచారు. కర్ణాటకలో ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, బెంగళూరులో ట్రాఫిక్, రహదారులపై గుంతలకు సంబంధించి మాట్లాడడం మానేసి అధికార పార్టీలో వ్యక్తిగత అంశాలపై చర్చించడం వల్ల ఏమాత్రం ప్రయోజనం లేదని వారికి హితవు పలకడం ఫలించింది. ఈసారి ఎన్నికల్లో అధికారంలోకి రావాలన్న లక్ష్యంగా పని చేయాలని సూచించారు. భాజపా అధికారంలోకి వస్తే అవసరానికి అనుగుణంగా అధికార మార్పిడి ఉండదా అని ఆర్ఎస్ఎస్ నేత ప్రశ్నించారు.

మోహన్ భగవత్

● పీఠం మార్పు లేకుండా చూసుకునేందుకు భాజపా రాష్ట్రాధ్యక్షుడు విజయేంద్ర రైతుల సమస్యలను ముందుంచుకుని పోరాటం చేస్తుండగా. స్థానిక సంస్థల ఎన్నికలకు భాజపాతో కలిపి జనతాదళ్ కోర్ కమిటీలను ఏర్పాటు చేసేందుకు కేంద్ర మంత్రి కుమారస్వామి చర్యలు చేపట్టారు. దళ్‌లో కోర్‌కమిటీ అధ్యక్షునిగా ఉన్న జీటీ దేవేగౌడ ఆ స్థానం నుంచి తప్పుకోవడం ప్రస్తావనార్హం. అన్నింటికన్నా కీలకంగా.. స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని దళపతులు భావిస్తున్నారు. ఏతా వాతా రాష్ట్ర రాజకీయాలు నివురుగప్పిన నిప్పులా మారాయి.

● మరో వైపు మంత్రివర్గ విస్తరణ వచ్చే నెలకు వాయిదా పడే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. బిహారు ఎన్నికల అనంతరం రాహుల్ విదేశీ పర్యటనకు వెళ్లి నెలాఖరుకు భారత్‌కు తిరిగి రానున్నారు. ఆ సమయానికి బెళగావిలో శాసనసభ సమావేశాలు ప్రారంభమవుతాయి. జనవరి నాటికి స్థానిక సంస్థల ఎన్నికలను ప్రకటించే అవకాశం ఉంది. ఈ సమయంలో మంత్రివర్గంలో మార్పులు చేర్పులు, ముఖ్యమంత్రి మార్పు ఉంటే తమ ఎమ్మెల్యేలలో అసమ్మతి పెరుగుతుందని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది. మంత్రి పదవి వదులుకోవలసి వస్తే సీనియరు నాయకులే తిరుగుబాటు ప్రారంభిస్తారన్న అనుమానం కూడా ఆ పార్టీ నేతలను వెంటాడుతోంది. మండలి కార్పొరేషన్ల నియామకాలు, ఆ తర్వాత బడ్జెట్‌కు సన్నాహాలు ఉంటాయి. ఈ సమయంలో మార్పులు, చేర్పులు అంటే ఇబ్బందులు ఎదురవుతాయని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు మద్దతుగా ఉన్న నేతలు ప్రచారం చేస్తున్నారు.

ఉద్యాననగరిలో ఈశాన్య సొబగులు

విద్యార్థుల సమ్మేళనోత్సవం భళా

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : ఈశాన భారత సంయుక్త మండలి (నార్త్ ఈస్ట్ యునైటెడ్ ఫోరం) నిర్వహించిన ఈశాన్య రాష్ట్రాల సమ్మేళనోత్సవానికి చక్కని స్పందన లభించింది. శాంతినగరలోని సెయింట్ జోసెఫ్ విశ్వవిద్యాలయం ఆడిటోరియం నిర్వహించిన ఉత్సవాలు.. మంగళవారం రాత్రి తెరదించారు. చివరిరోజు.. వేర్వేరు ప్రాంతాల నుంచి ఇక్కడికి విద్య, ఉపాధి, ఉద్యోగాలకు వచ్చిన యువత, పెద్దలు ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఏకత, సంస్కృతి, వైవిధ్యత, తమ సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేడుక చేసుకున్నారు. ఎనిమిది ఈశాన్య రాష్ట్రాల నృత్య ప్రదర్శనలు, హస్తకళా ఉత్పత్తుల ప్రదర్శన, చర్చాగోష్ఠులను నిర్వహించారు. మొదటి విభాగంలో త్రిపుర రాయల్‌హౌస్ ప్రతినిధి ప్రద్యోత్ బిక్రమ్, ఎన్‌పీపీ జాతీయ అధ్యక్షుడు పీకే సంగ్మా పాల్గొన్నారు. రెండో విభాగంలో నాగాల్యాండ్ మాజీ ఎమ్మెల్యే, కవి ఎం.కిశోన్, పీపుల్స్ పార్టీ సంచాలకుడు డేనియల్ ల్యాంగ్యాసా పాల్గొన్నారు. కర్ణాటక ఎమ్మెల్సీ సురేశ్ బాబు, ఆదాయ పన్ను శాఖ కమిషనర్ నందిని దాస్, మణిపురకు చెందిన అధికారి ఏఎం రాజేశ్ తదితరులు విద్యార్థులు, యువతను ఉద్దేశించి మాట్లాడారు.

వేదికపై కళాకారుల బృందగాన లహరి

సంప్రదాయ అలంకరణలో విద్యార్థినులు

ఈశాన్య రాష్ట్రాల విద్యార్థినుల సందడి

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	95
క్యారెట్-	105
బీరకాయలు-	60
క్యాబేజి-	35
క్యాలీఫ్లవర్(ఒక్కోటి)-	30
సొరకాయ-	50
దొండకాయలు-	45
పొట్లకాయ-	45
పచ్చి మిరపకాయలు-	95
కాకర కాయలు-	55
టమాటా(నాటు)-	25
టమాటా(సాధారణ)-	20
గుమ్మడి-	35
ఆలుగడ్డ-	35
ఉల్లి(మేలురకం)-	25
ఉల్లి(సాధారణ)-	20
వెల్లుల్లి-	160
సాంబారు ఉల్లి-	165
బీట్‌రూట్-	55
వంకాయలు-	70
బెండకాయలు-	55
ముల్లంగి-	55
నిమ్మకాయ-	160

పండ్లు, ఫలాలు ధరలు

వాషింగ్టన్ ఆపిల్-	385
సిమ్లా ఆపిల్-	135
గ్రీన్ ఆపిల్-	295
అరటి కాయలు-	35
సపోటా-	65
పైనాపిల్-	65
బొప్పాయి-	35
ఆరంజి-	65
బత్తాయి-	65

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

ఆలయాల్లో దొంగతనాలు

కోలారు, న్యూస్‌టుడే : బంగారపేట పరిధిలోని ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కొమ్మేనహళ్లి గ్రామానికి చెందిన లోకేశ్ (31), సోమ (25), వెంకటప్ప (62), మురుగేశ్, మునియప్ప (28) అనే వ్యక్తులను నిందితులుగా గుర్తించారు. దొంగిలించిన దేవుని సొత్తును తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలోని నగల దుకాణాల్లో విక్రయించుకునేవారని దర్యాప్తులో తేలింది. ఆరు నెలల్లో జిల్లాలోని 18 గ్రామాల్లోని ఆలయాల హుండీలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడ్డారని గుర్తించారు. నిందితుల నుంచి రూ.31,800 జప్తు చేసుకున్నారు. విక్రయించుకున్న దేవుని ఆభరణాల వివరాలను రాబట్టేందుకు విచారణను తీవ్రం చేశామని ఇన్‌స్పెక్టర్ దయానంద్ తెలిపారు.

బోనులో పడిన చిరుత

రామనగర : కనకపుర తాలూకా కసబా హోబళి శివనహళ్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉంచిన బోనులో చిరుత పడింది. రామనహళ్లి, శివనహళ్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో జాగిలాలు, లేగదూడలపై ఈ చిరుత దాడి చేసి చంపింది. వారం రోజులుగా చిరుత కోసం అటవీశాఖ అధికారులు గాలిస్తూ వచ్చారు. ఒక బోనులో పడిన చిరుతను బుధవారం ఉదయం గుర్తించారు.

డిజిటల్ రంగానికి ప్రాధాన్యం

బెంగళూరు (ఆడుగోడి) : డిజిటల్ ప్రత్యేక విధానంతోనే ఆర్థిక ప్రగతి సాధ్యమని, ఆ ఆలోచనతోనే అజ్మాన్ న్యూవెంచర్ కేంద్రం ప్రత్యేక విధానం అమలు చేస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు షేక్ మహ్మద్ వెల్లడించారు. ఆయన బుధవారం ఇక్కడ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నూతన డిజిటల్ విధానం అమలులోకి వచ్చిన తరువాత 6,500 కంపెనీల ఏర్పాటుకు మార్గం సుగమమైందన్నారు. ప్రపంచ బ్యాంకు సహకారంతో చిన్నతరహా డిజిటల్ సంస్థలకు ఉపకారం లభిస్తోందన్నారు.

దోశ విరిగి నేతిలో పడ్డట్టే!

అసలైన ముళబాగిలు దోశ రూపమిలా!

ఆహా.. ఏమిరుచి..

చిన్నపాటి పెనంపై సాధారణ బియ్యం– ఉద్దులు– అటుకుల మిశ్రమంతో సిద్ధమైన పిండిని అలా పోసి.. కావాల్సినంత నెయ్యి దట్టించి.. చివరన ఎర్రకారం పూసి.. వేరుసెనగ విత్తనాల పొడి జల్లితే చాలు.. కరకరలాడే ముళబాగిలు దోశ సిద్ధమైనట్లే! ఇక అందులోకి రెండు మూడు రకాల చట్నీలు.. రుచికర ఆలూ క్రీ జోడించి లాగిస్తే వాహ్వా.. అనాల్సిందే!

ముళబాగిలు, న్యూస్‌టుడే : కర్ణాటకాంధ్ర సరిహద్దు చారిత్రక పట్టణం.. ముళబాగిలు! అక్కడ పుట్టి.. దేశవ్యాప్తమైందే 'ముళబాగిలు దోశ'! ఆ పేరు వింటేనే తిండి ప్రియులు లొట్టలేయాల్సిందే! ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి.. అనే చందంగా చాలా ఏళ్లుగా ఈ దోశ ప్రజలను ఊరిస్తోంది. ఇక్కడ అన్ని హోటళ్లు దోశలకు కేరాఫ్‌గా నిలుస్తాయంటే నమ్మండి. ఇక్కడికి చేరువలోని అగరం గ్రామానికి చెందిన తెలుగు వారైన అంజప్పశెట్టి కుటుంబం పండగలు, జాతర్లలో తీపి, స్నాక్స్ తయారు చేయడంలో ప్రసిద్ధి చెందింది. ఆయన కుటుంబ సభ్యులు 1979లో ముళబాగిలు వలస వచ్చి హోటల్ ప్రారంభించారు. ఆ కుటుంబంలోని వారి ఆలోచనల్లోంచి పుట్టిందే రుచికర ముళబాగిలు దోశ! కేవలం రుబ్బిన పిండి.. నెయ్యి మాత్రమే వాడి దోశ తయారు చేస్తారు. అల్లం, కొబ్బరి, వేరుసెనగ విత్తనాల చట్నీలు ప్రత్యేకం. దీన్ని ఆస్వాదించడానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తిరుపతి కొండకు వెళ్లే భక్తులు ఇక్కడ కాసేపు ఆగడం ఓ మరపురాని జ్ఞాపకంగా భావిస్తారు. ఈ 'రుచి' ప్రచారం సుదూరాలకు వ్యాపించింది. రాష్ట్రంలోనే కాకుండా పొరుగు రాష్ట్రాల్లోనూ ముళబాగిలు మసాల దోశ పేరుతో హోటళ్లు ప్రారంభమయ్యాయి. ఇదొక బ్రాండ్‌గా మారిపోయింది. పేటెంట్ ఏదీ నమోదు చేసుకోనప్పటికి.. మా హోటల్‌ను సందర్శించే వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతూనే ఉందని ప్రస్తుతం వీటి తయారీలో మమేకమైన యజమానులు రాజేంద్రప్రసాద్, గౌతమ్ వివరించారు.

తయారీకర్త రాజేంద్రప్రసాద్

దోశ తయారీలో పాకశాస్త్ర ప్రవీణుడు

రోడ్డుప్రమాదంలో యువకుడి మృతి

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : స్నేహితురాలితో కలిసి బైకులో వెళుతున్న సమయంలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో దీపక్ (31) అనే వ్యక్తి మరణించారు. దేహరాడూన్‌కు చెందిన దీపక్ దేవనహళ్లి విమానాశ్రయం సమీపంలో ఉంటున్నారు. తన సహోద్యోగిని రోహిణితో కలిసి బెంగళూరుకు వచ్చి భోజనం చేసి మంగళవారం అర్ధరాత్రి 2.30కు వెళుతున్న సమయంలో బైకు అదుపు తప్పి పడిపోయింది. తలకు తీవ్ర గాయాలైన బాధితుడ్ని చికిత్స కోసం చేర్పించగా, చికిత్స పొందుతూ బుధవారం వేకువ జామున మరణించాడు. చిన్నపాటి గాయాలతో రోహిణి ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది.

పేరుమోసిన నిందితుని అరెస్టు

బెంగళూరు (రామమూర్తినగర), న్యూస్‌టుడే : పగటి వేళల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి, రాత్రుళ్లు దొంతనాలకు పాల్పడుతున్న ఒక చోరుడ్ని కాడుగోడి ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. బజాజ్ వీధిలో దొంగతనానికి ప్రయత్నిస్తున్న అతణ్ని అదుపునకు తీసుకుని విచారణ చేయగా, ఇటీవల ఆరు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడ్డానని అతను అంగీకరించాడు. అతని నుంచి రూ.16.52 లక్షల ఆభరణాలను జప్తు చేసుకుని విచారణ కొనసాగించామని పోలీసులు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగులకు ఆత్మీయ స్పర్శ

వేదికపై జ్యోతి వెలిగిస్తున్న జేకే గెరా

బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే : రక్షణ శాఖ నుంచి పింఛను అందుకుంటున్న విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని ఏఎస్‌సీ సెంటర్ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ జేకే గెరా తెలిపారు. ఆరోగ్య వైద్య పరీక్షలు, పింఛను విడుదల, లైఫ్ సర్టిఫికెట్లు, కుటుంబం ఒకచోటు నుంచి మరో చోటుకు బదిలీ అయినప్పుడు ఎదురయ్యే సాధారణ అంశాలను ఆలకించేందుకు పీసీడీఏ ఆడిటోరియంలో 'స్పర్శ్' పేరిట నిర్వహించిన ఔట్‌రీచ్ కార్యక్రమాన్ని ఆయన బుధవారం బెంగళూరులో ప్రారంభించి మాట్లాడారు. గురువారం నాడూ కొనసాగే కార్యక్రమంలో భాగంగా పింఛనుదారులకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లను అందిస్తామని అధికారులు తెలిపారు. బుధవారం నాటి కార్యక్రమంలో 250 మంది పింఛనుదారుల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. రక్షణ శాఖ అధికారులు వీటీ మ్యాథ్యూ, హరీశ్ భూతాని, ప్రమోద్ కుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న విశ్రాంత ఉద్యోగులు, సీనియరు సిబ్బంది

'దివ్య' కళా ప్రతిభ

హొసపేటె, న్యూస్‌టుడే: పట్టుమని పదేళ్లు నిండకముందే తనదైన కళాప్రతిభతో శభాష్ అనిపించుకుంటోంది దివ్యశ్రీ కెంభావిమఠ. స్థానికులు జగదీశ్, శ్రీదేవి కుమార్తె ఈ బాలిక. చిరుప్రాయంలోనే పలు రంగాల్లో తనదైన ఉనికిని చాటుకుంటోంది. సినిమా, నృత్యం, గేయాలాపన, ఫ్యాషన్ షోలలో పాల్గొని పురస్కారాలు సొంతం చేసుకుంది. ఐదో తరగతి చదువుతున్న దివ్యశ్రీకి చిన్న వయసు నుంచే కళలపై ఆసక్తి పెరిగింది. ముఖ్యంగా శివతాండవ నృత్య ప్రదర్శనలో దివ్యశ్రీ పలు ప్రశంసలు అందుకుంది. నిరుడు హంపీ ఉత్సవ వేదికపై శివతాండవ నృత్యప్రదర్శనతో శభాష్ అనిపించుకుంది. 2023లో జరిగిన హంపీ ఉత్సవాల్లో గేయాలాపనతో ప్రేక్షకులను కట్టిపడేసింది. స్థానిక కళాకారుడు జోగి తాయప్ప నిర్మిస్తున్న ఓ సినిమాలో బాలనటిగా నటిస్తోంది. చిన్నారుల ఫ్యాషన్ షోల్లోనూ దివ్యశ్రీ మెరిసింది. బాలిక బహుముఖ ప్రతిభను స్థానికులు ప్రశంసిస్తున్నారు.

ఉత్సవ వేదికలో బాల కళాకారిణి గేయాలాపన

(c) eenadu

బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

మేలుకోటెలో ప్రతిభా కారంజి

మొక్కకు నీరు పోసి ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

మండ్య : మేలుకోటె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ప్రతిభా కారంజి ప్రదర్శనకు చక్కని స్పందన లభించింది. యదుగిరి ఎస్‌ఈటీ, బళిఘట్ట, కనగోనహళ్లి, పగడేకల్లహళ్లి గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రస్ పోటీలు, చిత్రలేఖనం, బంకమట్టితో బొమ్మలు చేయడం, నాటక ప్రదర్శనలు, వ్యాసరచన పోటీలు, వక్తృత్వం తదితర పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయుడు వెంకటరామేగౌడ పోటీలను ప్రారంభించారు. పాఠశాలల ప్రతినిధులు సంతానరామన్, ఎండీ కుమార్, రవి, హఫీజుల్లా, మేలుకోటె గ్రామ పంచాయతీ పీడీఓ రాజేశ్వర తదితరులు విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

కుమార్, చంద్రులకు సత్కార దండ

తుమకూరు కె.ఆర్.బడావణేలోని శ్రీకృష్ణ మందిరంలో బుధవారం జరిగిన బభ్రు వాహనం యక్షగానం కార్యక్రమంలో 25 ఏళ్లుగా శ్రీకృష్ణమందిరంలో ఫొటోలు, వీడియో చిత్రీకరణకు శ్రమించిన మల్నాడు స్టుడియో కుమార్, చంద్రులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ తల్వార్, నాగరాజధన్య, అనంతరావ్, జనార్ధన్ భట్ తదితరులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, తుమకూరు**

హో సూ రు క బు ర్లు

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, మేయర్, ఉప మేయర్ తదితరులు

సారక్కి చెరువు శుద్ధీకరణకు శ్రీకారం

చెరువు గట్టుపై గడ్డి తొలగిస్తున్న సిబ్బంది

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నగరంలోని సారక్కి చెరువు శుద్ధీకరణ పనులను పాలికె సిబ్బంది చేపట్టారు. కురిసిన వర్షాలకు చెరువు పూర్తిగా నిండింది. గట్టులపై మొలిచిన గడ్డిని యంత్రాలతో తొలగించారు. అక్కడ పేరుకుపోయిన చెత్తను ఏరివేశారు. నడకదారి ఇరువైపులా పిచ్చి మొక్కలను తొలగించి సర్పాలు సంచరించకుండా చర్యలు తీసుకున్నారు. 70 ఎకరాల విస్తీర్ణం కలిగిన సారక్కి చెరువు ఆక్రమణలను గతంలో తొలగించిన విషయం తెలిసిందే. ఉదయం, సాయంత్రం ప్రజలు చెరువు గట్టు దారిపై వాయువిహారం చేస్తున్నారు. వాయువిహారానికి వచ్చిన కొందరు ప్రజలు స్వచ్ఛత పనుల్లో భాగస్వామ్యమయ్యారు. చెరువు చుట్టు పక్కల ఉన్న మట్టి రాళ్లను తొలగించారు. ప్రస్తుతం మంచి నీటి కొలనుగా మారిన సారక్కి చెరువును శుభ్రంగా మార్చారు. చెరువు నిండటంతో చుట్టు పక్కల ఐదు కిలోమీటర్ల పరిధిలో భూగర్భజలాలు, బోరుబావుల్లో నీరు మట్టం పెరిగింది.

రహదారులకు వైట్ టాపింగ్

బెంగళూరు (ఆడుగోడి), న్యూస్‌టుడే : నగరంలో ప్రధాన రహదారులను వైట్‌టాపింగ్‌గా మార్చుతామని గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ) చీఫ్ కమిషనర్ మహేశ్వర్‌రావు తెలిపారు. బుధవారం తెల్లవారుజామున ఆయన ఉన్నతాధికారులతో కలిసి హెణ్ణూరు-బాగలూరు రహదారిలో సాగుతున్న వైట్ టాపింగ్ పనులను పరిశీలించారు. నూతన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వైట్‌టాపింగ్ పనులు

నడకదారి ఇరువైపులా శుభ్రం చేస్తున్న కార్మికులు

యంత్రంతో చేస్తున్న పనులను తిలకిస్తున్న అధికారులు

సాగిస్తున్నామని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేస్తామన్నారు. తరుచు గుంతలు పడే రహదారులు గుర్తించి వాటిని సిమెంట్ దారులుగా మార్చుతామని తెలిపారు. తద్వారా గుంతల రహితంగా మారడంతో పాటు సంచార రద్దీ అదుపులోకి వస్తుందన్నారు. పనుల్లో నాణ్యత లేక పోతే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఆ రహదారిలో సంచార రద్దీపై ఆయన పోలీసు అధికారులతో చర్చించారు.

వైభవంగా మహా కుంభాభిషేకం

కార్యక్రమానికి హాజరైన భక్తులు

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు-తళి రోడ్డు టీవీఎస్ నగర్‌లోని దివంగత ఉమాపతిస్వామీజీ నిర్మించిన కైలాసాదీశ్వర స్వామి, ఎల్లమ్మ దేవత ఆలయం ప్రాంగణంలో బుధవారం మహా కుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. కార్పొరేషన్ ట్యాక్స్ కమిటీ ఛైర్మన్ చెన్నీరప్ప బృందం నేతృత్వంలో స్వామికి మంగళవారం రాత్రి ప్రత్యేక పూజలు, హోమం జరిపించారు. ఆలయ ధర్మకర్త చెన్నీరప్ప, సభ్యులు సరోజ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదం వినియోగం జరిగింది. మహా కుంభాభిషేకంలో హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాష్, మేయర్ ఎస్.ఎ.సత్య, ఉప మేయర్ సి.ఆనందయ్య, ఆరోగ్య కమిటీ ఛైర్మన్ ఎన్.ఎస్.మాదేశ్వరన్, డీఎంకే ప్రముఖులు అరసనట్టి రవి, రాజ, అందివాడి అంజప్ప ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నిర్వాహకులు నాయకులకు పూర్ణకుంభాలతో స్వాగతం పలికారు.

విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలి

తుమకూరు, న్యూస్‌టుడే : సాంకేతిక రంగంలో సంభవిస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా అంతర్జాలంలో లభ్యమయ్యే విషయాలను సద్వినియోగం చేసుకుని విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే జ్యోతిగణేశ్ అభిప్రాయపడ్డారు. తుమకూరు సిద్ధగంగా కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ, రెడ్‌క్రాస్ కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. సిద్ధగంగా విద్యాసంస్థ 1965 నుంచి పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తోందని, ప్రాథమిక విద్య నుంచి వైద్య విద్య వరకు ఇక్కడ అందుబాటులో ఉండడం అభినందనీయమన్నారు. సిద్ధగంగా మఠం చిన్నస్వామి శివశిద్ధేశ్వర స్వామీజీ మాట్లాడుతూ దేశంలో ఉపన్యాసం ఇచ్చేందుకు చాలా మంది మేధావులు ఉన్నారని..వాటిని అనుసరించేవారు తక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు. దేశ నిర్మాణం, అభ్యున్నతికి నాణ్యమైన విద్యాబోధన అవసరమని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నిజలింగప్ప, కళాశాల పూర్వ విద్యార్థి విజయ్, కళాశాల ప్రతినిధి యోగేశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతిగణేశ్, స్వామీజీ తదితరులు

ఢిల్లీ పేలుడు ఘటన.. పోలీసుల అప్రమత్తం

తుమకూరు, న్యూస్‌టుడే : దేశ రాజధాని ఢిల్లీలో పేలుడు ఘటన నేపథ్యంలో తుమకూరు పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఎస్పీ అశోక్ ఆదేశం మేరకు రైల్వేస్టేషన్, బస్టాండ్, సివిల్ బస్టాండ్, జిల్లా కోర్టు, జిల్లాధికారి కార్యాలయం, సిద్ధగంగా మఠం, క్యాత్సంద్ర, హిరేహళ్లి రైల్వేస్టేషన్లలో బాంబు నియంత్రణ సిబ్బంది డాగ్ స్క్వాడ్‌తో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

తనిఖీలు చేస్తున్న బాంబు నియంత్రణ దళం

28 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

హోసూరు, న్యూస్‌టుడే : ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి జన్మదినం సందర్భంగా తళి రోడ్డులో ఈనెల 28, 29, 30వ తేదీల్లో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల నిర్వహణపై ఎమ్మెల్యే వై.ప్రకాష్ నేతృత్వంలో సలహా కమిటీ సమావేశం జరిగింది. హోసూరు, ఆనేకల్, అత్తిపల్లి, సర్జాపుర, మాలూరు, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొననున్నారు. క్రీడాకారుల బస, భద్రత ఏర్పాట్లపై డీఎంకే నాయకులతో చర్చించారు.

ప్రారంభానికి నోచుకోని 'కన్నడభవన్'

ముళబాగిలు, న్యూస్‌టుడే : గత ఏడాది నవంబర్‌లో పునరుద్ధరణ పేరుతో మూసివేసిన నగరంలోని డీవీజీ కన్నడభవన్ తలుపులు ఇంకా తెరుచుకోలేదు. నిధుల లేమి కారణంగా పనులు పూర్తికాలేదు. కన్నడభవన్ మరమ్మతులకు ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్ రూ 1.17 కోట్లతో ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగానికి నివేదికలు పంపించారు. జిల్లా యంత్రాంగం రూ.30 లక్షలు విడుదల చేసినప్పటికీ ఇంకా పనులు పూర్తి కాలేదు. నగరంలోని ఏకైక భవనం మూతపడడంతో సభలు, సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోలేకపోతున్నారు. జిల్లా కన్నడ సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగం రూ.30 లక్షలు విడుదల చేసిందని, మరో రూ.30 లక్షలు మున్సిపల్ కౌన్సిల్ నుంచి తీసుకుంటామన్నారు. త్వరగా పనులు చేపట్టి కన్నడభవన్‌ను అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

నిరుపయోగంగా కన్నడభవన్

రేపు వీరలోక పుస్తక సంత ప్రారంభం

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : ఈనెల 14, 15, 16 తేదీల్లో పుస్తక మేళా (సంత) జరుగుతుందని వీరలోక పుస్తక ప్రచురణ సంస్థ వ్యవస్థాపకుడు వీరకపుత్ర ఎం.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జయనగర్‌లోని శాలినిగ్రౌండ్‌లో ఈ సంతను శుక్రవారం సాయంత్రం ముఖ్యమంతి సిద్ధరామయ్య, మంత్రులు సి.సుధాకర్, రామలింగారెడ్డి, మధు బంగారప్ప ప్రారంభిస్తారన్నారు. మూడేళ్లుగా నిర్వహిస్తున్న పుస్తకమేళాకు పాఠకులు, రచయితల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. గత ఏడాది రెండు లక్షల మంది పాఠకులు, అభిమానులు పాల్గొనగా రూ.3 కోట్ల విలువైన పుస్తక క్రయవిక్రయాలు జరిగాయన్నారు. ఈసారి మూడు లక్షల మంది వస్తారని అంచనా వేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1000 మందికి పైగా రచయితలు, 300 పుస్తక ప్రచురణ సంస్థలు పాల్గొని చర్చాగోష్టులు, ప్రసంగాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా 25కు పైగా ప్రముఖ రచయితల పుస్తకాలను ఆవిష్కరిస్తారన్నారు. మూడు రోజుల పాటు ఉదయం 10గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సాహిత్య సమావేశాలు, సమాలోచనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించనున్నాయి. కర్ణాటక రక్షణా వేదికె అధ్యక్షుడు టి.ఎ.నారాయణగౌడ, మాజీ మంత్రి సోమశేఖర్, ముఖ్యమంత్రి మాధ్యమ సలహాదారుడు కె.వి.ప్రభాకర్, మాజీ ఎంపీ ఉగ్రప్ప, ఎమ్మెల్యే సి.కె.రామమూర్తి ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. సమావేశంలో మాజీ ఎంపీ ఉగ్రప్ప, రచయిత దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంతలో పుస్తకాలను వీక్షిస్తున్న పాఠకులు, ప్రముఖులు (పాతచిత్రం)

మాట్లాడుతున్న శ్రీనివాస్, ఉగ్రప్ప, దివాకర్ తదితరులు

కెలవరపల్లి రాజర్వాయర్‌లో నురుగు

దక్షిణ పెన్నానది పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా కెలవరపల్లి రిజర్వాయర్‌లో వరదనీటి ఉధృతి పెరిగింది. వరదనీటిని దిగువకు విడుదల చేశారు. సమీపంలోని పరిశ్రమల నుంచి విషపూరిత రసాయన వర్థ్యాలు రిజర్వాయర్ నీటిలో కలుస్తున్నాయి. వర్షం నీటితో కలుషిత నీరు కలవడంతో తెల్లని నురుగు ఏర్పడుతోంది. ఈ నీటిని పంటలకు వినియోగిస్తే పంటలు దెబ్బతింటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటిపారుదల శాఖ అధికారులు వ్యర్థాలు కలిపే పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు, రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, కెలవరపల్లి (బేరికె)**

'మాధ్యమగళ్లి మహిళె' పుస్తకావిష్కరణ

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : ప్రముఖ రచయిత్రి, ప్రసార భారతి విశ్రాంత అధికారి డాక్టర్ నిర్మలా ఎలిగార్ రచించిన సంప్రదాయక మాధ్యమగళ్లి మహిళె అనే పుస్తకం బుధవారం విడుదలైంది. మల్లేశ్వరంలోని గ్రీన్‌పాథ్ రెస్టారెంట్‌లో కన్నడ నవలా లోకంలో తమదైన ప్రత్యేక ముద్రవేసుకున్న కన్నడ పాఠకుల హృదయాల్లో గుర్తింపు పొందిన రచయిత్రులే ముఖ్యఅతిథులు. వారి సమక్షంలోనే ఈ పుస్తకం విడుదల అయింది. నవలారచయిత్రి డాక్టర్ కె.వి.రాజేశ్వరి, గాయత్రి రామణ్ణ, డాక్టర్ వి.జయలక్ష్మి బాళేకుంద్రి, డాక్టర్ పద్మానాగరాజ్, బి.కె.సుమతి, తదితరులు రచయిత్రిని అభినందించారు.

పుస్తకాన్ని విడుదల చేస్తున్న నిర్మలా, రాజేశ్వరి

తెలుగు విద్యార్థులకు పురస్కారాలు

బెంగళూరు ఉత్తర తాలూకా పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో యలహంక నీలకంఠేశ్వర తెలుగు, కన్నడ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు పురస్కారాలు సాధించి ముందంజలో నిలిచారు. అభినయగీత, రంగోలి పోటీలో తెలుగు విద్యార్థులు ప్రథమ పురస్కారాలు పొందినట్లు ప్రధానోపాధ్యాయురాలు రెడ్డిరాణి తెలిపారు. పురస్కారాలను బీఈఓ అందజేసినట్లు తెలిపారు. పాఠశాల అభివృద్ధి సమితి ప్రధాన కార్యదర్శి వై.వెంకటనారాయణ తదితరులు విద్యార్థులను అభినందించారు.

- న్యూస్‌టుడే, బెంగళూరు (యలహంక)

ముగింపు వేడుకల్లో బిజేంధర్‌గోయల్, అనిల్‌కుమార్, తదితరులు

ముగిసిన జాతీయ సాంస్కృతిక ఫైథియాన్

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : బెంగళూరు విశ్వవిద్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన రెండో జాతీయ సాంస్కృతిక ఫైథియాన్ క్రీడోత్సవాలకు బుధవారం తెరపడింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ ఫైథియాన్ వేడుకలతో పండగ వాతవరణం నెలకొంది. పది రాష్ట్రాలు, కేంద్రాపాలిత ప్రాంతాల నుంచి రెండు వేల మంది పోటీదారులు సందడి చేశారు. కళాకారులు నృత్యం, సంగీతంలో కొత్త అనుభూతిని పొందారు. ఫైథియన్ క్రీడా పోటీల సంస్థాపకుడు బిజేంధర్‌గోయల్ ఈ వేడుకలకు నేతృత్వం వహించారు. జూనియర్ డాన్స్ విభాగంలో కర్ణాటక లయ ధ్వని అకాడమీ బంగారు పతకాన్ని సాధించగా ఉత్తరాఖండ్ రెండో స్థానం, హర్షిత్‌నాయక్ గ్రూపు-కర్ణాటక మూడోస్థానాన్ని చేపట్టాయి. ముగింపు వేడుకల్లో ఐఏఎస్ అధికారి అనిల్‌కుమార్, కర్ణాటక కుస్తీ సంఘం అధ్యక్షుడు గుణరంజన్‌శెట్టి, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

మేడ అగ్రహారంలో రేషన్‌షాపు ప్రారంభం

డెంకణీకోట, న్యూస్‌టుడే : డెంకణీకోట తాలూకా రాయకోట శివారు మేడ అగ్రహారంలో బుధవారం హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాష్ రేషన్‌షాపు ప్రారంభించారు. స్థానికులు వినతి మేరకు అధికారులతో చర్చించి కొత్త షాపును ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వేపనపల్లి మాజీ ఎమ్మెల్యే మురుగన్, రాష్ట్ర యువజన కార్యదర్శి శ్రీనివాస్, సభ్యుడు జయరామన్, కార్యదర్శి చిన్నరాజు పాల్గొన్నారు.

దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

కృష్ణగిరి (డెంకణీకోట) న్యూస్‌టుడే : కృష్ణగిరి జిల్లా కావేరిపట్టణం శివారు పైయూరులో రూ.70.18 కోట్లతో చేపట్టిన ఉద్యానవన శిక్షణా కేంద్రం, కళాశాల భవన నిర్మాణాల కలెక్టర్ దినేశ్‌కుమార్ పరిశీలించారు. త్వరగా భవన నిర్మాణాలు పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీలేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఉప డైరెక్టర్ ఇందిరా, కళాశాల ప్రన్సిపల్ అనిషారాణి, ఇంజినీర్ రాజ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

చేతివృత్తులను ప్రోత్సహించాలి

చిత్రదుర్గం, న్యూస్‌టుడే : మన దేశం చేతివృత్తులకు ప్రసిద్ధి చెందిందని, కోట్లాది మంది చేతివృత్తుల ఉత్పత్తుల విక్రయాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, వారిని ప్రోత్సహించాలని మాజీ ముఖ్యమంత్రి, ఎంపీ బసవరాజ్ బొమ్మై తెలిపారు. బుధవారం ఇక్కడ ప్రభుత్వ సైన్స్ కళాశాల మైదానంలో స్వదేశీ జాగరణ మంచ్ ఏర్పాటు చేసిన స్వదేశీ మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మన దేశంలో ఉత్పత్తి అయ్యే వస్తువులను కొనుగోలు చేసి స్వదేశీ ఉత్పత్తులను వినియోగించాలన్నారు. వారం రోజుల పాటు కొనసాగే ఈ మేళాలో రెండు వందలకు పైగా ప్రదర్శన, విక్రయ దుకాణాలను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్సీ నవీన్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ గోవిందకారజోళ, అధ్యాత్మిక గురువు శివమూర్తి శివాచార్యస్వామి, జడ్పీ మాజీ అధ్యక్షురాజు సౌభాగ్య, భాజపా జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

మేళాను ప్రారంభిస్తున్న బసవరాజ్ బొమ్మై, తదితరులు

భాజపాలో మార్పులు ఉండవు

శివమొగ్గ : భాజపా అధ్యక్షుని మార్పు అంటూ పార్టీ వ్యతిరేకులు చేస్తున్న ప్రచారాన్ని విశ్వసించాల్సిన అవసరం లేదని మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప పేర్కొన్నారు. విజయేంద్రే పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతారని చెప్పారు. బుధవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, విజయేంద్ర నాయకత్వంలోనే ఎన్నికలకు వెళ్లాలని పార్టీ కార్యకర్తలు కోరుకుంటున్నారని చెప్పారు. నవంబరులో రాజకీయాల్లో మార్పులు వస్తాయని జరుగుతున్న ప్రచారం కాంగ్రెస్‌కు సంబంధించిందని, తమది కాదని తేల్చి చెప్పారు.

అంతర కళాశాలల అథ్లెటిక్స్ ప్రారంభం

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు క్రీడా కార్యక్రమాల్లో పాల్గొని దైహిక సామర్థ్యాలను పెంచుకోవాలని బెంగళూరు నగర విశ్వవిద్యాలయం ఉపకులపతి బి.రమేశ్ పిలుపునిచ్చారు. బుధవారం ఇక్కడి కంఠీరవ క్రీడాప్రాంగణంలో అంతర కళాశాలల అథ్లెటిక్స్ పోటీలను రమేశ్ ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ క్రీడోత్సవాల్లో 136 కళాశాలల నుంచి 1200 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు నవీన్‌జోసెఫ్, విజయలక్ష్మీ, సుప్రీత్, మహమ్మద్, కె.శివశంకర, జగదీశయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న రమేశ్, తదితరులు

క్రీడాకారులకు ఫిజియోథెరఫీ అవసరం

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : క్రీడాకారులు బలిష్టంగా, ఆరోగ్యంగా ఉండడానికి ఫిజియోథెరఫీ చాలా అవసరమని కర్ణాటక క్రికెటర్ రాజేశ్వరి గైక్వాడ్ తెలిపారు. ఏసీఈసీహెచ్ఎస్ లేఅవుట్‌లో డాక్టర్ నివేదా దిలీప్, డాక్టర నివ్ నేతృత్వంలోని ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ క్లినిక్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఫిజియోథెరఫీ ద్వారా దైహిక సామర్థ్యంతో పాటు క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందన్నారు. గాయపడిన క్రీడాకారులకు ఇక్కడ స్వాంతన చేకూరుతుందని ఆమె అభిప్రాయపడ్డారు.

క్లినిక్‌ను ప్రారంభిస్తున్న రాజేశ్వరి గైక్వాడ్, నివేదా దిలీప్, తదితరులు

'అర్ణవ'కు చక్కని స్పందన

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే : జయనగర నేషనల్ కళాశాలలో రెండు రోజులు నిర్వహించిన సాంస్కృతిక, సినర్జియా ఉత్సవం 'అర్ణవ'కు తెరపడింది. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పీయూ, డిగ్రీ కళాశాలల విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. నటి సుమన్ నగర్కర్ విజేతలకు పురస్కారాలు, ప్రశంస పత్రాలు, ట్రోఫీలు అందజేశారు. తాను బసవగుడి కళాశాలలో చదువుకున్నానన్నారు. కళలు, సాహిత్యం, క్రీడలు, సాంకేతికతకు పెద్దపీట వేయాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధులు వి.వెంకట శివారెడ్డి, సుధాకర్ ఇస్తూరి, డాక్టర్ పీఎల్ వెంకటరామరెడ్డి, జీఎం రవీంద్ర, డి.జయదేవప్ప, మమత తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాసన్ ప్రదర్శనలో విద్యార్థులు

కన్నడ భాషాభివృద్ధికి కృషిచేయాలి

బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే : ప్రతి కన్నడిగుడు కన్నడ భాషాభ్యున్నతికి కృషి చేయాలని బెంగళూరు జిల్లా మాజీ పంచాయతీ అధ్యక్షుడు మరిస్వామీ తెలిపారు. రాజగోపాల్‌నగరలో ఏర్పాటు చేసిన అభినందనసభలో ఆయన మాట్లాడారు. తమ మాతృభాషను మర్చిపోకుండా భాషాభివృద్ధికి, బలోపేతానికి పాటుపడాలన్నారు. గోవాలో ఉన్న కన్నడిగులకు డాక్టర్ సంగనబసప్ప బిరాదార్ చేస్తున్న సేవలకు గుర్తుగా గోవా రాష్ట్ర కన్నడ సంస్కృతిక సదస్సుకు అధ్యక్షుడిగా నియమించారన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు మోహన్‌కుమార్, ఎం.ఎస్.పాటిల్, శంకర్‌పాటిల్, హనుమంతప్ప, మధుసూధన్, ఈశ్వర్, మహేశ్, కృష్ణప్ప పాల్గొన్నారు.

సంగనబసప్పను సత్కరిస్తున్న మరిస్వామి, తదితరులు

జర్నలిస్ట్ ప్రసన్నకుమార్‌కు పురస్కారం

బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే : నిత్యం సమాజంలో జరిగే సంఘటనలను నిర్భయంగా వెలికితీసి సమాజానికి తెలియజేస్తున్న సీనియర్ జర్నలిస్ట్ ప్రసన్నకుమార్ యాదవ్‌కు బుద్ధ బసవగాంధీ కల్చరల్ ట్రస్టు నేతృత్వంలో పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ భోజేగౌడ మాట్లాడుతూ ప్రజలకు సమాజంలో జరిగే విషయాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తుస్తూ సమాజాభివృద్ధికి నిరంతరం కృషిచేస్తున్న ప్రసన్నకుమార్ యాదవ్‌కు అవార్డు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు కృష్ణప్ప, డాక్టర్ షారిఫా, మంగళగౌరి, హేమవతి, జయశ్రీ, శాంతివాసు, చరణ్‌చంద్ర పాల్గొన్నారు.

ప్రసన్నకుమార్ యాదవ్‌ను సత్కరిస్తున్న కృష్ణప్ప, భోజేగౌడ తదితరులు

(c) eenadu

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

భాజపాకు బాబురావు రాజీనామా

రాయచూరు, న్యూస్‌టుడే : భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు బాబురావు పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. సీనియర్ల సేవలను పరిగణలోకి తీసుకోక పోవడం, నిజాయతీగా పనిచేసే వారికి గుర్తింపు లేనందునే కలత చెంది రాజీనామా నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు వీరనగౌడకు పంపిన లేఖలో పేర్కొన్నారు. మాజీ ఎంపీ అమరేశ్వర నాయక్‌కు సన్నిహితుడైన బాబురావు బాబాపూర్ ప్రభుత్వ హయాంలో (2008-09) ఏపీఎంసీ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. గత విధానసభ ఎన్నికల్లో రాయచూరు ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ గెలుపునకు శ్రమించారు. 2019-24 మధ్య దక్షిణ మధ్య రైల్వే సలహా సమితి సభ్యుడిగా సేవలందించారు.

ఘనంగా నారాయణతీర్థుల రథోత్సవం

స్థానిక నారాయణతీర్థ ఆశ్రమంలో నారాయణతీర్థుల ఆరాధన మహోత్సవం సందర్భంగా బుధవారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నారాయణతీర్థుల వంశస్థులు, వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరయ్యారు. తీర్థులకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆశ్రమం నిర్వాహకులు, బ్రాహ్మణ, ఆర్యవైశ్య సముదాయాల ప్రముఖులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, మాన్వి

ఐసీసీలో అనుకూలమా, ప్రతికూలమా?

రేపు బెంగళూరులో సమావేశం

గిల్లేసూగూరు వద్ద ప్రవహిస్తున్న తుంగభద్ర నది

రాయచూరు, న్యూస్‌టుడే : తుంగభద్ర, విజయనగర కాలువల 125వ నీటిపారుదల సలహా సమితి (ఐసీసీ) సమావేశాన్ని శుక్రవారం రాజధాని బెంగళూరులో నిర్వహించనున్నారు. ఈ నెల 5న జరగాల్సిన ఐసీసీ 14వ తేదీకి వాయిదా పడిన విషయం తెలిసిందే. క్రస్ట్‌గేట్లను అమర్చాల్సిన కారణంగా రెండో పంటకు నీరు ఇవ్వలేమని జలవనరుల శాఖ మంత్రి డి.కె.శివకుమార్ గతంలోనే స్పష్టం చేశారు. కేంద్ర జలమిషన్, టీబీ బోర్డు ఐసీసీ సమావేశం నీరు సరఫరా చేస్తారని ఆరంభంలోనే ప్రకటించారని, డ్యామ్‌లో మిగిలిన నీటిలో ఆంధ్రకు కేటాయించాల్సినందున రబీ సీజన్‌కు విడుదల చేయడం కుదరని కొప్పళ్ జిల్లా బాధ్యమంత్రి శివరాజ్ తంగడగి వివరణ ఇచ్చారు. అయితే సమావేశం ఏర్పాటు చేసినందుకు కొంత మేర అయినా ప్రయోజనం చేకూర్చే నిర్ణయాన్ని ప్రకటిస్తారని రాయచూరు, కొప్పళ, బళ్లారి, విజయనగరం జిల్లా రైతాంగం ఆశిస్తోంది. తొలి వారంలో జరగాల్సిన సమావేశాన్ని అర్ధాంతంగా నిలిపివేసినందున రైతు ప్రతినిధులు ఈ సారి రాజధానికి వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. ఒక వేళ ప్రతికూల తీర్మానం చేస్తే తుంగభద్ర జిల్లాల్లో పోరాటాలకు సన్నద్ధమవుతామని రైతు సంఘం రాజ్య గౌరవాధ్యక్షుడు చామరస్ మాలిపాటిల్ హెచ్చరించారు. ప్రస్తుతం జలాశయంలో 76.746 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

మార్చి వరకూ ఇవ్వాలంటున్న రైతు సంఘాలు

వచ్చే ఏడాది మార్చి చివరి వరకు నీటిని సరఫరా చేసేలా నిర్ణయం తీసుకోవాలని రైతు సంఘాలు సర్కారుపై ఒత్తిడి తెచ్చాయి. రిజర్వాయర్లో 40 టీఎంసీలు ఇవ్వవచ్చని ఉదాహరణలు చెబుతున్నారు. నాలుగు జిల్లాల్లో అత్యధికంగా వరి సాగు చేస్తున్నందునే నాలుగునెలలపాటు నీరు విడుదల చేయాలని కోరుతున్నారు. సాగునీటి కోసం ఒత్తిడి పెంచేందుకు భాజపా ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం హొసపేటలోని టీబీ డ్యామ్ దగ్గర్లో ప్రజా ప్రతినిధులు, రైతు నాయకులతో సమావేశం ఏర్పాటు చేయడం గమనార్హం. వాస్తవ పరిస్థితి ప్రతిపక్షాలకు తెలిసినా.. అన్నదాతలను తప్పుదోవ పట్టిస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.

అన్నదాతకు వెన్నుదన్నుగా..

కృషిమేళాకు వేళాయె!

నూతన వంగడం.. రాగి ఎంఎల్-322 పంట కళకళ

జీకేవీకే అభివృద్ధి చేసిన కాపారు రంగు పనసకాయల దిగుబడి జోరు

రసాయనిక మందులను పిచికారి చేయడానికి ఉపకరించే ట్రాక్టర్

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కరవు కాలానికి అనుగుణంగా తక్కువ నీటితో చక్కగా పంటలు పండించేందుకు ఉపకరించే వంగడాల కోసం అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. అందుకు అనుగుణంగా బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం నూతన వంగడాలను అందించేందుకు సిద్ధమైంది. నగరంలోని జీకేవీకే ఆవరణలో బుధవారం కృషిమేళ-2025 పేరిట ఈ వంగడాల ప్రదర్శన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రదర్శన.. 16వ తేదీ వరకు కొనసాగుతుంది. వీటితో పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేసిన తరవాత వాటిని రైతులకు అందిస్తున్నట్లు ఉపకులపతి డాక్టర్ ఎస్.వి.సురేష్ తెలిపారు. అభివృద్ధి చేసిన నూతన వంగడాలు, విదేశీ ఆకుకూరలు ఆయన శాస్త్రవేత్తతో కలిసి వీక్షించి, వాటి ప్రత్యేకతలను విలేకరులకు వివరించారు.

● కరవు ప్రదేశాల్లో అతి తక్కువ నీటితో పండే రాగి ఎం.ఎల్-322ను అభివృద్ధి చేశారు. సాగు చేసిన 105 రోజులకు పంట దిగుబడికి వస్తుంది. ప్రతి ఎకరాకు 15 నుంచి 20 కింట్వాళ్ల రాగులు దిగుబడి సాధించవచ్చని శాస్త్రవేత్తలు వివరించారు.

● అతి తక్కువ కరవు ప్రదేశాల్లో సామె జీకేయూఎల్-11 రకం చిరుధాన్యం సాగు రైతులకు ఉత్తమ దిగుబడి 90 రోజుల్లో చేతికందుతుంది. ఆరు నుంచి ఏనిమిది కింట్వాళ్ల దిగుబడి పొందవచ్చని శాస్త్రవేత్త డాక్టర్ నాగరాజు తెలిపారు. వాటితో పాటు బరగు జీపీయూపీ-32 వంగడం కరవు ప్రదేశాల్లో ఉత్తమ సాగుకు అవకాశం కల్పిస్తుంది. 80 రోజుల్లో ఎకరాకు ఏడు నుంచి ఎనిమిది క్వింటాళ్ల దిగుబడి సాధించవచ్చు.

● సూర్యకాంతి కేబీఎస్‌హెచ్ ముఖ్యంగా వంగడాన్ని ఇదే సందర్భంగా విడుదల చేయనున్నారు. తక్కువ వర్షపాత సమయంలోనూ, రోగాలు సోకకుండా విత్తనం నాటిన తరువాత 80 రోజుల్లో ఎకరానికి తొమ్మిది నుంచి పది క్వింటాళ్ల దిగుబడి సాధించవచ్చని శాస్త్రవేత్తలు ప్రకటించారు. జీకేవీకే అభివృద్ధి చేసిన పనస ప్రత్యేకత ఆకర్షణ చెప్పుకోవాల్సింది. ఈ పనసతో మూడున్నరేళ్లలో లాభాలు గడించవచ్చు.

● జీకేవీకే ఆవరణలో సాగే కృషిమేళాలో 650 దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. చిరుధాన్యాలు, విత్తనాలు, సేంద్రియ, ప్రకృతి వ్యవసాయానికి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేస్తారు. నిత్యం ఉదయం పదిగంటల నుంచి సాయంత్రం ఆరింటి వరకు ప్రదర్శన కొనసాగిస్తారు. తొలిరోజు ప్రదర్శనను గవర్నరు థావర్ చంద్ గహ్లోత్ ప్రారంభిస్తారు.

ఊపిరి సమస్యను తేలికగా తీసుకోవద్దు

ప్రసంగిస్తున్న డీహెచ్‌వో సురేంద్రబాబు, తదితరులు

రాయచూరు, న్యూస్‌టుడే : న్యూమోనియా (ఊపిరి తిత్తుల వాపు)తో బాధపడే పెద్దల్లో చిన్నారులకు చికిత్స చేయించాలని, నిర్లక్ష్యం వహించరాదని డీహెచ్‌వో డాక్టర్ సురేంద్రబాబు హితవు పలికారు. నగరంలోని తల్లీబిడ్డల ఆసుపత్రిలో బుధవారం ప్రపంచ న్యూమోనియా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీహెచ్‌వో మాట్లాడుతూ వాయు కాలుష్యం, ధూమపానం, నాసిరకం వంట నూనెల వాడకం తదితర కారణాలతో ఈ వ్యాధి బారిన పడుతున్నారని వివరించారు. ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తినా, దగ్గితే గుండెలో పట్టుకున్నట్లు అనిపించినా న్యూమోనియాగా అనుమానించి వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. ఆర్‌సీహెచ్ అధికారి డాక్టర్ నందితా మాట్లాడుతూ ప్రతి శుక్రవారం అన్ని ఆరోగ్య కేంద్రాల్లో న్యూమోకాకల్, హిబ్ బాక్టీరియాను నిరోధించేందుకు వ్యాక్సిన్ వేస్తారని వివరించారు. ఎంసీహెచ్ ఆసుపత్రి వైద్యాధికారి ప్రజ్వల్ కుమార్, వైద్యులు శాలిని, భువనేశ్వరి, ఇమ్రాన్ పర్వేజ్, జిల్లా ఆరోగ్య శిక్షణాధికారి ఈశ్వర్ దానప్ప, ఉప అధికారి బసయ్య తదితరులు పాల్గొన్నారు.

జనజాగృతే లక్ష్యంగా సైకిల్ యాత్ర

బెంగళూరు నుంచి పుట్టపర్తి దాకా..

జెండా ఊపుతున్న ఆచార్య బి.రాఘవేంద్ర ప్రసాద్

సైకిళ్లపై వెళుతున్న విద్యార్థులు, ఆచార్యులు

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే : పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు కాడుగోడి శ్రీసత్య సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్‌లోని బృందావన్ క్యాంపస్ నుంచి 150 మంది విద్యార్థులు, ఆచార్యులు సైకిళ్లపై పుట్టపర్తికి బయలుదేరి వెళ్లారు. సంస్థ ఆచార్యుడు బి.రాఘవేంద్ర ప్రసాద్ జెండా ఊపి ఈ జాతాను బుధవారం ఉదయం ప్రారంభించారు. వీరు 161 కి.మీ. ప్రయాణించి ప్రశాంతి నిలయానికి గురువారం సాయంత్రం చేరుకోనున్నారు. సత్యసాయి బోధించిన ప్రేమ, జాగృతి, అందరినీ కలుపుకొని వెళ్లేలా ప్రజలను ఉత్తేజపరిచేందుకు ఈ జాతా ఏర్పాటు చేశామని ఆచార్య ప్రసాద్ తెలిపారు. దైహిక, మానసిక, సామాజిక, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలను ప్రోత్సహించే దిశగా సైక్లిస్టులు ప్రచారం చేస్తూ, పర్యటనను పూర్తి చేయనున్నారు. సంస్థ ప్రతినిధులు డాక్టర్ శ్రీకాంత్ ఖన్నా, వినయ్ కుమార్, డాక్టర్ డీసీ సుందరేశ్ తదితరులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రహదార్ల పనులను మూడు మాసాల్లో పూర్తి చేయాలి

గుంతల రహదారిని పరిశీలిస్తున్న కమిషనర్

రాయచూరు, న్యూస్‌టుడే : నగరంలోని రహదారుల నిర్మాణ పనులను మూడు మాసాల్లో ముగించాలని నగర పాలక సంస్థ కమిషనర్ జుబిన్ మహోపాత్ర ఇంజినీర్లకు గడువు విధించారు. నిర్ణీత వ్యవధిలో పనులు పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు. బుధవారం ఆయన పాలక సంస్థ, ప్రజాపనుల శాఖ ఇంజినీర్లతో కలసి గుంతలు పూడ్చే పనులను వీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆగస్టు నుంచి అక్టోబరు వరకు కురిసిన వర్షాల వల్ల పనులు వేగంగా చేయలేకపోయారని తెలిపారు. ఇటీవల కోటి రూపాయిల పనులను గుత్తేదార్‌కు కట్టబెట్టామని, ఇవి కాక గుంతలను మూసే పనులను అప్పగించామని వివరించారు. ఎనిమిది మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లతో నియమించిన బృందం నిత్యం 5 నుంచి 6 పనులను పరిశీలిస్తుందని తెలిపారు. నిర్మాణం మందగతిన జరుగుతున్నా, నాణ్యత లోపించినా చర్యలు తప్పవన్నారు. ప్రజాపనుల శాఖ ఏఈ వెంకటేశ్, ఏఈఈ మహేశ్, ఇంజినీర్లు రష్మి, సయ్యద్, నిగమ వలయ కమిషనర్ హెబ్బాళ్ తదితరులు కమిషనర్ వెంట ఉన్నారు.

పంచాయతీని సందర్శించిన ఐఏఎస్ అధికారులు

అధికారులను స్వాగతిస్తున్న ప్రతినిధులు

సిరివార, (మాన్వి) : ఐఏఎస్ పూర్తి చేసిన ప్రొబేషనరీ అధికారుల బృందం తాలూకాలోని మాడగిరి గ్రామ పంచాయతీని సందర్శించింది. అభిషేక్ నెహార, సత్యం, చతుర్వేధి, జనార్ధన్ యాదవ్, హునార్ కులార్, అనుశ్రీ సచ్చున్, త్రిలోక్‌సింగ్ బృందానికి సిరివార పట్టణ పంచాయతీ ముఖ్యాధికారి శశిధర్‌స్వామి, పంచాయతీ సభ్యులు, ప్రముఖులు సాదరంగా స్వాగతం పలికారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, యోజనలు ఏ విధంగా అమలవుతున్నదీ పరిశీలించారు. అధికారుల వెంట తాలూకా అధికారులు ఉన్నారు.

‘ప్రయాణికులతో సత్సంబంధాలు ఉండాలి’

ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న అరుణకుమార్, అధికారులు

రాయచూరు, న్యూస్‌టుడే : రాయచూరు ఆర్టీసీలో దశలవారీగా అభివృద్ధి పనులు చేస్తామని కేకేఆర్టీసీ (కల్యాణ కర్ణాటక రహదారి రవాణా సంస్థ) నూతన అధ్యక్షుడు అరుణకుమార్ పాటిల్ వెల్లడించారు. మంగళవారం రాత్రి ఆయన నగరంలోని ప్రధాన బస్టాండ్, సిటీ బస్టాండ్, గ్రామీణ బస్‌డిపో 1, బస్‌డిపో 2లో పర్యటించారు. ఉద్యోగులతో చర్చించి సమస్యలను తెలుసుకున్నారు. ప్రాంగణాలను స్వచ్ఛతగా ఉంచుకోవాలని, ప్రయాణికులతో ప్రేమ పూర్వకంగా మెలగాలని సూచించారు. బస్సుల సంఖ్యను పెంచాలని విద్యార్థులు, వృద్ధుల విజ్ఞప్తికి అధ్యక్షుడు సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణ కర్ణాటక రవాణా సంస్థ అందిస్తున్న జనస్నేహ సేవలకు జాతీయంగా అనేక పురస్కారాలు దక్కాయని వివరించారు. ప్రయాణికులతో మెరుగైన సంబంధాలు కొనసాగించేందుకు పలు మార్పులు తీసుకొస్తామని తెలిపారు. పాటిల్ వెంట విభాగ నియంత్రణ మేనేజర్ ఎం.ఎస్.చంద్రశేఖర్, ఇంజినీర్ రాజగోపాల్, విద్యాసాగర్, ముద్దుకృష్ణ, విజయకుమార్ ఉన్నారు.

15న రాయచూరులో సహకార సప్తాహ

పాత్రికేయులకు వివరిస్తున్న విశ్వనాథ్, తదితరులు

రాయచూరు, న్యూస్‌టుడే : స్థానిక వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రేక్షక భవనంలో ఈ నెల 15న అఖిల భారత 72వ సహకార సప్తాహ కార్యక్రమం జరుగుతుందని ఆర్‌డీసీసీ బ్యాంకు అధ్యక్షుడు విశ్వనాథ్ పాటిల్ వెల్లడించారు. ఆయన బుధవారం పత్రికా భవన్‌లో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర సహకార మహా మండళ నియమిత, సౌహార్ద సంయుక్త సహకారి నియమిత, బసవేశ్వర దుద్ధి-మాధ్యమ సహకార మహా మండలి సహకారంతో నిర్వహించే కార్యక్రమాన్ని చిన్న నీటిపారుదల శాఖ మంత్రి బోసురాజు ప్రారంభిస్తారన్నారు. ఎంపీ కుమారనాయక్ వస్తు ప్రదర్శనను ప్రారంభిస్తారని, రాయచూరు, కొప్పళ జిల్లా ఎమ్మెల్యేలు హాజరవుతారని వివరించారు. స్వాభిమాన సహకార ప్రత్యేక సంచికను ఎమ్మెల్యే జి.టి.దేవెగౌడ (మైసూరు జిల్లా) విడుదల చేస్తారని వెల్లడించారు. సమావేశంలో జిల్లా సౌహార్ద సహకార ఒక్కూట అధ్యక్షుడు దొడ్డ బసవరాజ్, విజయకుమార్ పాటిల్, తిమ్మయ్య శెట్టి, కల్లయ్య స్వామి, సూర్యకాంత్, మనోహర్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

సిరివార, (మాన్వి) : పట్టణంలోని రహదారి పక్కన, ఫుట్‌పాత్‌లు, మురుగు కాల్వలపై అక్రమ నిర్మాణాలను బుధవారం తెల్లవారుజామున జేసీబీ యంత్రంతో తొలగించారు. వ్యాపారులు అడ్డుపడి అధికారులతో వాదనలకు దిగారు. ఇప్పటికే అనేక సార్లు నోటీసులు జారీ చేశామని, నిర్లక్ష్యంగా ఉండడంతో తొలగిస్తున్నామని అధికారులు తేల్చిచెప్పారు. తహసీల్దార్ అశోక్ పవార్, సిరివార ఎస్ఐ వెంకటేశ్, కవితాళ ఎస్ఐ గురుచంద్రయాదవ్, పట్టణ పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలిపై అత్యాచారయత్నం?

బెంగళూరు (మారతహళ్లి): ఆడుగోగి ఎంఆర్ నగర సమీపాన ఒక దివ్యాంగురాలిపై విఘ్నేశ్ అలియాస్ దాదు అనే యువకుడు అత్యాచారానికి ప్రయత్నించాడు. బాధితురాలు కేకలు వేయడంతో స్థానికులు అతన్ని పట్టుకుని దేహశుద్ధి చేసి ఆడుగోడి ఠాణా పోలీసులకు అప్పగించారు. మాటలు రాని, కాళ్లు స్వాధీనంలో లేని యువతి (21) గత ఆదివారం ఇంట్లో ఒక్కర్తే ఉన్నప్పుడు నిందితుడు ఇంట్లోకి చొరబడ్డాడని సమాచారం. బయటకు వెళ్లిన బాలిక తల్లి ఇంటి వద్దకు వచ్చినప్పుడు కుమార్తె సమస్యలో చిక్కుకున్నట్లు గుర్తించింది. అదే సమయంలో బాధితురాలు కేకలు వేయడంతో ఇరుగు పొరుగుల సహాయంతో తలుపు పగలగొట్టి లోపలకు వెళ్లారు. స్థానికులు అందరూ కలిసి నిందితుడికి దేహశుద్ధి చేశారు.

ఎమ్మెల్యే మునిరత్నకు ‘సేవారత్న’ పురస్కారం

మునిరత్న నాయుడు

పోతుగుంట రమేశ్ నాయుడు

జీహెచ్.తిప్పారెడ్డి

సింధనూరు, న్యూస్‌టుడే: తాలూకా కమ్మవారి సంఘం ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక పురస్కారాలకు కర్ణాటకకు చెందిన ఇద్దరు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒకరు ఎంపికయ్యారు. కార్తిక మాసం వనభోజన వేడుకల్లో సింధనూరు కమ్మసంఘం ఈ పురస్కారాలను ఏటా అందిస్తుంటుంది. ఇందులో భాగంగా ఈ నెల 16న స్థానిక శ్రీయల మంచలి కల్యాణ మండపంలో పెద్దఎత్తున ఏర్పాటు చేసిన ఉత్సవంలో ఈ ప్రశస్తులు ప్రముఖులకు అందిస్తున్నారు. బెంగళూరు రాజరాజేశ్వరినగర్ ఎమ్మెల్యే మునిరత్న నాయుడు రాజకీయంగానే కాకుండా వివిధ రంగాల్లో చేస్తున్న ప్రజాసేవకు గాను ఆయనకు సింధనూరు కమ్మ సంఘం ‘సేవారత్న-2025’ పురస్కారాన్ని అందించనుంది. శ్రీశైలం దేవస్థానం బోర్డు ఛైర్మన్ పోతుగుంట రమేశ్‌నాయుడుకు ‘ధర్మరక్షక’ పురస్కారాన్ని, సీనియర్ మాజీ ఎమ్మెల్యే, కర్ణాటక ప్రాంత కమ్మసంఘాల సమాఖ్య అధ్యక్షులు జీహెచ్.తిప్పారెడ్డికి ‘సాధక రత్న’ పురస్కారాలు ఇచ్చి గౌరవించనుంది. ఈ విషయాన్ని స్థానిక కమ్మసంఘం అధ్యక్ష, కార్యదర్శులు బూరుగుపల్లి శ్రీహర్ష, మల్లిన శేషగిరిరావు వెల్లడించారు.

ప్రకృతి చికిత్సతో ఉత్సాహం, ఉత్తేజం

చికిత్స చేయించుకుంటున్న ప్రముఖులు

రాయచూరు, న్యూస్‌టుడే : ప్రకృతి చికిత్సతో దీర్ఘకాలిక జబ్బులను నయం చేసుకోవచ్చని ఆర్‌ఏపీఎంసీ అధ్యక్షుడు జయంత రావ్ పతంగె తెలిపారు. జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, ధర్మస్థల, యోగ విజ్ఞానుల విద్యాలయం నేతృత్వంలో బుధవారం ఆర్‌ఏపీఎంసీ కార్యాలయంలో జాతీయ ప్రకృతి దినోత్సవాన్ని నిర్వహించారు. రైతులు, కార్మికులు, డైరెక్టర్లు, సిబ్బంది చికిత్స చేయించుకున్నారు. ఈ సందర్భంగా పతంగె మాట్లాడుతూ భూమి, నీరు, గాలి, అగ్ని, ఆకాశాన్ని ఆసరాగా తీసుకుని చేసే చికిత్స వల్ల కోలుకోవడమే కాక శరీరంలో ఉత్సాహం, ఉత్తేజం కలుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వైద్యులు పవన్, భరత్, మాణిక్య, ఉమేష్ జాధవ్, వీరనగౌడ, ఆర్‌ఏపీఎంసీ ఉపాధ్యక్షుడు శశిధర్ పాటిల్, డైరెక్టర్లు మల్లనగౌడ పాటిల్, శరబనగౌడ, శంకరరెడ్డి, మేనేజర్ బందయ్యస్వామి, సహాయ మేనేజర్ జగదీశ్‌స్వామి, అకౌంటెంట్ నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే విద్యార్థుల వికాసాభివృద్ధి

మొక్కకు నీరు పోస్తున్న హంపయ్యనాయక్

మాన్వి, న్యూస్‌టుడే : విద్యను మించిన సంపద మరొకటి లేదని, విద్యార్థుల వికాసాభివృద్ధి విద్యతోనే సాధ్యపడుతుందని ఎమ్మెల్యే హంపయ్యనాయక్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాషుమియా కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థుల స్వాగత కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ కళాశాలలో ఉత్తమ ఫలితాలు వస్తుండటం హర్షించతగ్గ విషయమన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ జె.ఎల్.ఈరణ్ణ మాట్లాడుతూ కళాశాల న్యాక్ నుంచి బీ గ్రేడ్ సాధించిందని, ఏ గ్రేడ్ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సి ఉందన్నారు. కార్యదర్శి డాక్టర్ సయ్యద్ ఉల్ హసన్ కళాశాల 38 ఏళ్ల పనితీరును వివరించారు. కార్యక్రమంలో ప్రముఖులు గఫూర్‌సాబ్, అమరేశప్ప, డి.జి.కర్కిహళ్లి, ఆర్.వెంకయ్యశెట్టి, మధుకుమారి పాండే, సిద్ధనగౌడ ఆల్దాళ, శంకర్ జగ్గీ, హొన్నప్పహెళవర్, భీరప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే తత్వమే ప్రగతికి సంకేతం

కురుబ విద్యార్థి భవన్ నమూనా ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : చరిత్ర తెలుసుకుంటే ప్రశ్నించే తత్వం పెరుగుతుందని, ప్రతి అంశాన్నీ అధ్యయనపూర్వకంగా సమీక్షించాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. ఆయన బుధవారం గాంధీనగరలో కురబ విద్యార్థి వసతి నిలయ భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ప్రశ్నించే తత్వం లేకపోతే సమాజం ముందుకు సాగదన్నారు. ప్రశ్న సమాజాన్ని ముందుకు తీసుకుపోతుందని వివరించారు. ప్రశ్నించకపోతే సమాజం బానిసత్వంలో కూరుకుపోతుందని హెచ్చరించారు. ఉపాధ్యాయుడు రాజప్ప తనను ఐదోతరగతిలో చేర్చుకోకపోతే న్యాయవాది, ముఖ్యమంత్రి అయ్యేవాడినే కాదన్నారు. రైతు ఉద్యమకారుడు ఆచార్య నంజుండస్వామి వల్ల తాను రాజకీయాల్లోకి వచ్చినట్లు గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరువందల కురుబ భవనాలను నిర్మించాలని తీర్మానించిందని గుర్తు చేశారు. మైసూరు, హుబ్బళ్లి, శివమొగ, దావణగెరె తదితర ప్రాంతాల్లో కురుబ భవన్‌లను నిర్మించడంతో పాటు సంగొళ్లి రాయణ్ణ సైనిక పాఠశాల కూడా ప్రారంభించాలని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి భైరతి సురేష్, మాజీ మంత్రి హెచ్.ఎం.రేవణ్ణ, మాజీ ఎమ్మెల్యే వర్తూరు ప్రకాశ్ తదితరులతో పాటు కురుబ మఠాధిపతులు హాజరయ్యారు.

హృదయపూర్వక కృతజ్ఞతలు

నన్ను బళ్లారి డిస్ట్రిక్ట్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ & ఇండస్ట్రీ అధ్యక్షులుగా ఎన్నికకు కృషి చేసిన సంస్థ సమస్త సభ్యులకు పదాధికారులకు, ...

అవ్వారు మంజునాథ్

అధ్యక్షులు బళ్లారి డిస్ట్రిక్ట్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ & ఇండస్ట్రీ, బళ్లారి

ధర్మో రక్షతి రక్షితః

రాయచూరు తాలూకా కమ్మవారి సంఘం (రి)

రాయచూరు

కార్తిక మాస వనభోజన మహోత్సవ ఆహ్వానము

తేదీ: 14-11-2025 శుక్రవారం

(c) eenadu

డిసెంబరు 17న ఓటీఈటీ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఒడిశా టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఓటీఈటీ) డిసెంబరు 17న రెండు సిట్టింగ్‌లలో జరుగుతాయని రాష్ట్ర మాధ్యమిక విద్యాపరిషత్ అధికారవర్గాలు మంగళవారం రాత్రి ప్రకటించాయి. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపాయి.

'కాగ్' అధికారులకు గవర్నరు సూచనలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కాగ్ అధికారులు బుధవారం మధ్యాహ్నం రాజ్‌భవన్‌లో గవర్నరు కంభంపాటి హరిబాబును కలిశారు. 2023 మార్చి వరకు 'కాగ్' వివరాల దస్త్రాలు అందజేశారు. వాటిని పరిశీలించిన హరిబాబు ఆడిట్ నివేదికల్లో పారదర్శకత ఉండాలని, ఆదివాసీ ప్రాంతాల్లో (ఐటీడీఏ) పనుల ప్రగతి పరిశీలించాలని, ముఖ్యంగా ఐటీడీఏ కార్యక్రమాలు, ఆయా చోట్ల ఉపాధిహామీ పనులపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థలు (పీఎస్‌యూలు) సకాలంలో ఆదాయ, వ్యయాలు సమర్పిస్తున్నాయా అన్నది అధ్యయనం చేయాలన్నారు. కార్యక్రమంలో కాగ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ సుబు.ఆర్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సంజీవ్‌కుమార్ మిశ్ర, ఎస్సీ, ఎస్టీ శాఖ కమిషనర్ బి.పరమేశ్వరన్, గవర్నరు ప్రిన్సిపల్ కార్యదర్శి రూపాలోచన్ సాహు, ఇతర అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో 'కాగ్' నివేదికపై స్థూలంగా సమీక్షించారు.

అధికారులతో మాట్లాడుతున్న హరిబాబు

81.09 శాతం పోలింగ్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: నువాపడ అసెంబ్లీ స్థానానికి మంగళవారం జరిగిన ఉప ఎన్నికలో 81.09 శాతం పోలింగ్ నమోదైంది. సాయంత్రం 6.30 గంటల వరకు కేంద్రాల్లో ఓటర్లున్నందున యంత్రాంగం అవకాశం కల్పించింది. అనంతరం ఈవీఎంలు గట్టి బందోబస్తు మధ్య నువాపడలోని నేషనల్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలో ఈవీఎంలు భద్రపరిచారు. శుక్రవారం ఇక్కడ ఓట్ల లెక్కింపు ఫలితాలు ప్రకటిస్తారు.

బాధితుల పునరావాసానికి పటిష్ఠ చర్యలు

బాలల హక్కుల సంరక్షణ కమిషన్ అధ్యక్షురాలు బబితా పాత్ర్

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ఒడిశా రాష్ట్ర బాలల హక్కుల సంరక్షణ కమిషన్ (ఓఎస్‌సీపీసీఆర్) అధ్యక్షురాలు బబితా పాత్ర్ బుధవారం గంజాం జిల్లాలో పర్యటించారు. తొలుత ఆమె స్థానిక గుసానినువాగాం మెయిన్ రోడ్డులోని ఉత్కళ బాలాశ్రమం సందర్శించారు. ఇటీవల ఇక్కడి నుంచి ఇద్దరు బాలికలు గోడ దూకి పరారయ్యారు. ఇంతవరకూ వారి ఆచూకీ తెలియలేదు. బాలికల ప్రత్యేక పర్యవేక్షణ కేంద్రం నుంచి కూడా ఇద్దరు మహిళలు పరారయ్యారు. ఈ ఘటనలపై పరిశీలనకు వచ్చిన పాత్ర్ విలేకరులతో మాట్లాడుతూ బాలాశ్రమంలో బాలికలు ఎలా పరారయ్యారు?, భద్రతలో లోటుపాట్లు తదితరాలు పరిశీలించానని, భద్రతను పటిష్ఠం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి బాలాశ్రమం నిర్వాహకులకు సూచించానన్నారు. పర్యవేక్షణ కేంద్రం నుంచి పరారైన ఇద్దర్ని కనుగొని కాపాడి, తిరిగి కేంద్రానికి తరలించినట్లు పోలీసులు తెలిపారన్నారు. బాలాశ్రమం నుంచి పరారైన బాలికల ఆచూకీపై ముమ్మర దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారని బబితా పాత్ర్ చెప్పారు. బాధితులకు పునరావాసం తదితర అంశాలపై గట్టి చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. అనంతరం బబితా పాత్ర్ పర్యవేక్షణ కేంద్రాన్ని పరిశీలించి వివిధ విభాగాల అధికారులతో సమీక్షించారు. కార్యక్రమాల్లో బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం., ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉత్కళ బాలాశ్రమం ఆవరణలో బబితా పాత్ర్. చిత్రంలో బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం.

చదువుకోండి... రాష్ట్ర గౌరవం పెంచండి

సీఎం మోహన్‌చరణ్ మాఝి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ప్రతిభావంతులు చదువుకొని ప్రయోజకులు కావాలని, రాష్ట్ర గౌరవం ఇనుమడింపజేయాలని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి పిలుపునిచ్చారు. బుధవారం భువనేశ్వర్‌లోని యూనిట్-3 పరిధిలోని క్యాపిటల్ హైస్కూల్‌లో రాష్ట్రస్థాయి 'సురభి-2025' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను పూర్వాశ్రమంలో ఉపాధ్యాయుడ్నని, తర్వాత ఎన్నో ఆటుపోట్లు తట్టుకుని ముఖ్యమంత్రి పదవి అందుకున్నానని చెప్పారు. ఇది చదువు వల్లే సాధ్యమైందని, ప్రభుత్వం విద్యార్థులు, పిల్లలు ఉన్నత చదువులు ధ్యేయంగా అన్ని సౌకర్యాలు సమకూర్చుతోందన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి నిత్యానంద గోండ్, భువనేశ్వర్ ఏకామ్ర ఎమ్మెల్యే బాబూసింగ్, ఉత్తర ఎమ్మెల్యే సుశాంత్‌కుమార్ రౌత్, అధికారులు పాల్గొన్నారు. ఈ వేదికలో అన్ని జిల్లాల నుంచి వచ్చిన బాలబాలికలు పర్యావరణం, అంతరిక్షం, సాగర సంపద, గ్రామీణ వాతావరణం, ప్రకృతి సోయగాలపై తీర్చిదిద్దిన ప్రాజెక్టులను ముఖ్యమంత్రి పరిశీలించి విద్యార్థులను అభినందించారు.

బాలికలతో ముఖ్యమంత్రి ముచ్చట్లు

వేదికపై సీఎం మోహన్, మంత్రి నిత్యానంద తదితరులు

జల్ సంచయ్ అవార్డులకు ఐదు జిల్లాలు ఎంపిక

రాయగడలో నీటి సంరక్షణకు వాటర్‌షెడ్ శాఖ నిర్మించిన చెరువు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జల్ సంచయ్ జన్ భగీదారి (జేఎస్‌జేబీ) అవార్డులు-2025కు మన రాష్ట్రం నుంచి ఐదు జిల్లాలు ఎంపికయ్యాయి. నీటి సంరక్షణకు మెరుగైన చర్యలు తీసుకున్న వాటికిచ్చే ఈ అవార్డుల జాబితాలో రాయగడ జిల్లా చోటు దక్కించుకుంది. జల్‌శక్తి మంత్రిత్వ శాఖ ఈ విషయాన్ని ప్రకటించింది. ఆ వివరాల మేరకు దిల్లీలో నవంబరు 18న విజ్ఞాన్‌భవన్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా వీటిని ప్రదానం చేయనున్నారు. అవార్డులకు ఎంపికైన జిల్లాల జాబితాలో రాయగడ, కలహండి, గంజాం, కటక్, మయూర్‌భంజ్ ఉన్నాయి. జల్‌శక్తి అభియాన్ ద్వారా వాన నీటిని ఒడిసిపట్టడం అనే అంశం కింద ఈ జిల్లాలు నీటి సంరక్షణ, భూగర్భ

జాబితాలో రాయగడకు చోటు

జలాల మెరుగుకు మంచి ప్రదర్శన కనబరిచారు. మూడో కేటగిరీ కింద పై ఐదు జిల్లాలు అవార్డులను స్వీకరించనున్నాయి. ఉత్తమ ఫలితాలు కనబర్చిన మొదటి కేటగిరీ జిల్లాలకు రూ.3 కోట్లు, రెండో కేటగిరీలో రూ.1 కోటి, మూడో కేటగిరీ జిల్లాలకు రూ.25 లక్షల చొప్పున నగదు నజరానా దక్కనుంది. జలవనరులు, నదుల అభివృద్ధి శాఖ కార్యదర్శి సంతకంతో అవార్డులు ప్రదానం చేయనున్నారు. దేశవ్యాప్తంగా 100 అవార్డులను ప్రకటించగా, వీటిలో మూడు రాష్ట్రాలు, 67 జిల్లాలు, 6 మున్సిపల్ కార్పొరేషన్లు, ఒక పట్టణ స్థానిక సంస్థ(యూఎల్‌జీ) ఉన్నాయి. వీటితో పాటు 14 మంది నోడల్ అధికారులు, రెండు శాఖలు, రెండు పరిశ్రమలు, మూడు ఎన్జీవోలు, ఇద్దరు దాతలకు అవకాశం దక్కింది.

మెరుగైన బడ్జెట్ రూపకల్పనకు సహకరించండి

ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వ శాఖలకు లేఖలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే

రాష్ట్ర ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ కసరత్తు చేపట్టింది. మంగళవారం రాత్రి ఆర్థిక శాఖ ఈమేరకు ప్రభుత్వ శాఖలన్నింటికీ లేఖలు రాసింది. బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని సూచించింది.

వ్యవసాయానికి ఊతమిస్తారా..

ఫిబ్రవరి తృతీయార్ధంలో రాష్ట్ర బడ్జెట్

ఫిబ్రవరి తృతీయార్ధంలో రాష్ట్ర బడ్జెట్ శాసనసభలో ప్రవేశపెట్టాలని నిర్ణయించిన ప్రభుత్వం డిసెంబరు 20లోగా ప్రతిపాదనలు పంపాలని ఆయా శాఖలకు రాసిన లేఖల్లో పేర్కొంది. జనవరి 5న ఆర్థికశాఖ అధికార వర్గాలు బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్షిస్తాయి. 2026 ఫిబ్రవరి 3న ఆర్థికశాఖ సలహాదారులు, నిపుణులతో కూలంకషంగా చర్చిస్తారు. ఫిబ్రవరి 6న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహుజా, అభివృద్ధి కమిషనర్ అనూగార్గ్‌లు ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం ప్రభుత్వ శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శులతో చేపడతారు. బడ్జెట్ పద్దులకు తుదిరూపునిస్తారు. ఫిబ్రవరి 7 లేదా 10న మంత్రివర్గం బడ్జెట్‌కు ఆమోదం తెలుపుతుంది. ఆ తర్వాత కొలువు దీరనున్న సభలో పద్దులు ప్రవేశపెడతారు.

సమగ్రాభివృద్ధి ధ్యేయం

2036 నాటికి స్వతంత్ర్య ఒడిశా శతాబ్ది వేడుకలు జరుపుకోనుంది. ఈ వ్యవధిలోగా రాష్ట్ర ఆర్థిక రంగాన్ని 500 బిలియన్ డాలర్లకు చేర్చాలి. 2047 నాటికి స్వతంత్ర్య భారత్ వందేళ్ల ఉత్సవాలకు చేరువవుతుంది. ఈ వ్యవధి నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 1.5 ట్రిలియన్ డాలర్లుగా ఉండాలని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి పునరుద్ఘాటిస్తున్నారు. ఇది సాధ్యం కావాలంటే రాష్ట్ర ఆర్థిక రంగం 15 రెట్లు పెరగాలి. ఖనిజ సంపద, ఇతర వనరులు పుష్కలంగా ఉన్నందున ధ్యేయం నెరవేరుతుందని సీఎం పేర్కొంటున్నారు.

చిత్తశుద్ధి ఉంది



ఉపముఖ్యమంత్రి **కనకవర్ధన్ సింగ్ దేవ్** మంగళవారం రాత్రి భువనేశ్వర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ సంకల్పబలం, చిత్తశుద్ధి తమకుందని రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సమగ్ర కార్యాచరణతో ముందుకెళుతున్నామన్నారు. వికసిత్ ఒడిశా-2036 ధ్యేయంగా తమ ప్రభుత్వం 36 కార్యక్రమాలతో అజెండా సిద్ధం చేసిందని, 2026-27 బడ్జెట్‌లో ఇది ప్రతిబింబిస్తుందని చెప్పారు.

10 శాతం వృద్ధిరేటు అంచనాతో...

ప్రస్తుతం రాష్ట్రాభివృద్ధి రేటు (బీడీపీ) 8 శాతంగా ఉందని అంచనా వేస్తున్న మోహన్ సర్కారు 2026-27లో ఇది 10 శాతం అవుతుందన్న ఆశాభావంతో ఉంది. వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో వృద్ధిరేటు ఆశాజనకంగా ఉందంటున్న పాలకులు రానున్న ఆర్థిక సంవత్సరంలో ఆరోగ్యం, విద్య, పర్యాటకం, నైపుణ్యాభివృద్ధి, మానవ వనరులు, ప్రాధాన్యతా రంగాలకు బడ్జెట్‌లో పెద్దపీట వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పారిశ్రామిక రంగానికి ప్రాధాన్యం

రసగుల్లాలు చాలా బాగున్నాయి

కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు ఉప ముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్ సోమవారం పహలా వద్ద రసగుల్లా తినిపించారు. మిలెట్ డే కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన కేంద్రమంత్రి కటక్‌లోని వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని సందర్శించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సింగ్‌దేవ్, చౌహాన్‌లు ఒకే కారులో కటక్ వెళుతూ మార్గమధ్యంలో పహలా వద్ద ఆగి రసగుల్లాలు తిన్నారు. కల్తీ లేని జున్నుతో తయారయ్యే ఇక్కడి రసగుల్లాలు ప్రాచుర్యం పొందాయి. ఇది తిన్న కేంద్రమంత్రి బుధవారం తాను ఉప ముఖ్యమంత్రితో కలిసి రసగుల్లా తిన్న ఫొటో సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేసి 'రసగుల్లాలు చాలా బాగున్నాయి' అని పేర్కొన్నారు.

18, 19 తేదీల్లో కలెక్టర్లు, ఎస్పీల సదస్సు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఈ నెల 18, 19 తేదీల్లో భువనేశ్వర్‌లోని లోక్ సేవా భవన్ వేదికగా 30 జిల్లాల పాలనాధికారులు, ఎస్పీల సదస్సు జరగనుంది. కార్యక్రమంలో మూడు రెవెన్యూ డివిజన్ల కమిషనర్లు పాల్గొంటారు. ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాఝి అధ్యక్షతన జరగనున్న సదస్సులో ఆయాశాఖల మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహుజా, ప్రిన్సిపల్ కార్యదర్శులు హాజరవుతారు. సాధారణ పాలనా విభాగం (జీఏ) అధికారవర్గాలు ఈ సదస్సు నిర్వహణకు సంబంధించి బుధవారం ప్రకటించాయి. సుపరిపాలన, అభివృద్ధి, కార్యక్రమాల అమలు, శాంతిభద్రతలకు సంబంధించి సీఎం అధికారులకు దిశా నిర్దేశం చేయనున్నారు. ఆయా జిల్లాల్లో అమలవుతున్న ప్రాజెక్టులు, కొత్త నిర్మాణాల ప్రగతిపై సమీక్షించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ కసరత్తుకు శ్రీకారం చుడుతున్న ప్రభుత్వం కలెక్టర్ల సూచనలు పరిగణనలోకి తీసుకోనుంది.

సరైన చికిత్స అందక బాలింత మృతి

నవరంగపూర్, న్యూస్‌టుడే: కవల పిల్లలకు జన్మనిచ్చి సరైన చికిత్స అందక బాలింత మృతి చెందిన ఘటన నవరంగపూర్ జిల్లా జొరిగావ్ సమితి చచర పంచాయతీ గబాగూడలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... గ్రామానికి చెందిన దుర్యోధన హరిజన్ భార్య జ్యోతి (30)కు మంగళవారం రాత్రి పురిటి నొప్పులు మొదలయ్యాయి. వెంటనే ఆమెను జొరిగావ్ ఆసుపత్రికి తరలించగా ఇద్దరు కవల మగ శిశువులకు జన్మనిచ్చింది. ఆమె పరిస్థితి విషమించడంతో వెంటనే ఉమ్మర్‌కోట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది.

జొరిగావ్ ఆసుపత్రిలో స్త్రీ, ప్రసూతి నిపుణుడు లేకపోవడంతో, అత్యవసర సమయంలో గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సకాలంలో వైద్యం అందక జ్యోతి మరణించిందని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆమె సికిల్‌సెల్ (రక్త హీనత)తో బాధపడుతుందని, ఆలస్యంగా ఆసుపత్రిలో చేర్చటంతో మృతి చెందినట్లు జొరిగావ్ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డా.అరవింద్ పండా తెలిపారు.

శ్రీక్షేత్రంలో ప్రథమాష్టమి వేడుకలు

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ శ్రీక్షేత్రంలో బుధవారం ప్రథమాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. మార్గశిర మాసం బహుళ పక్షమి అష్టమి తిథినాడు ఈ ఉత్సవం చేపట్టడం ఆనవాయితీ. తొలి సంతతిగా జన్మించే వారికి తల్లిదండ్రులు కొత్త వస్త్రాలు ధరింపజేసి ఆలయాలకు తీసుకెళ్లి వారి పేరిట పూజలు చేయించి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకుంటారు. ఈ సందర్భంగా శ్రీక్షేత్రంలో అగ్రజుడు బలభద్రునికి, పురుషోత్తమునికి, సుభద్రమ్మలను అలంకరించిన సేవాయత్‌లు 56 రకాల పిండి వంటకాలు నైవేద్యంగా పెట్టారు. స్వామికి మేనమామ వరస అయిన కటక్ జిల్లా నియాలిలోని బలదేవ్‌జీ ఆలయ యాజమాన్యం శ్రీక్షేత్రానికి మిఠాయి, పళ్లు కావిళ్లలో తెచ్చారు. వీటిని స్వామికి అర్పించారు. మరో వైపు రాష్ట్రవ్యాప్తంగా ప్రథమాష్టమి వేడుకలు చేపట్టిన ప్రజలు పిల్లలతో పూజలు చేయించారు.

ముగ్గురు మూర్తులు

ఎస్.ఐ. రాత పరీక్షల్లో అక్రమాల కేసులో మరొకరి అరెస్టు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరు (ఎస్సై) రాత పరీక్షల పేపరు లీకేజీకి జరిగిన యత్నంలో సాగర్ కుమార్ గౌడ (22) అనే నిందితుడ్ని క్రైంబ్రాంచి పోలీసులు అరెస్టు చేశారు. బ్రహ్మపుర సదర్ ఠాణా బలిపడకు చెందిన సాగర్‌ను స్థానిక బి.ఎన్.పూర్ ఠాణా పరిధిలోని ఎమ్కేసీజీ వైద్య కళాశాల ఆసుపత్రి ఆవరణలోని క్వార్టర్‌లో అరెస్టు చేసినట్లు సీఐడీ, క్రైంబ్రాంచి ప్రజా సంబంధాల అధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అరెస్టయిన నిందితుడు సాగర్, కుంభకోణం ప్రధాన సూత్రధారి శంకర్ ప్రుష్టికి అత్యంత సన్నిహితుడని తెలిపారు. దీంతో ఇంతవరకూ ఈ కేసులో 126 మందిని అరెస్టు చేసినట్లు ఆ ప్రకటనలో వెల్లడించారు.

టీ-20 మ్యాచ్‌పై సీఎం సమీక్ష

సమీక్షా సమావేశంలో సీఎం మోహన్, మంత్రి సూర్యవంశీ, అధికారులు, ఓసీఏ ప్రతినిధులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కటక్‌లోని బారాబటి క్రీడా మైదానం వేదికగా డిసెంబరు 9న భారత్, దక్షిణాఫ్రికాల మధ్య తొలి టీ-20 క్రికెట్ మ్యాచ్ జరగనుంది. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం భువనేశ్వర్‌లోని లోక్‌సేవాభవన్‌లో ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. కార్యక్రమంలో క్రీడల శాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహుజా, ఉన్నతాధికారులు, ఒడిశా క్రికెట్ అకాడమీ (ఓసీఏ) ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర గౌరవంతో ముడిపడిన క్రికెట్ మ్యాచ్ సమర్థంగా నిర్వహించాలని, అపశ్రుతులకు తావీయొద్దని, అధికారులు, ఓసీఏ ప్రతినిధులు కలిసికట్టుగా ఏర్పాట్లు చేయాలని సీఎం కోరారు.

బలిజాత్ర ఒకరోజు పొడిగింపు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కటక్ బలిజాత్ర వ్యవధి 13వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి బుధవారం ప్రకటించారు. సందర్శకుల సంఖ్య, దుకాణాల్లో అమ్మకాలు ధ్యేయంగా అందరి అభ్యర్థన మేరకు యాత్రను ఒకరోజు పొడిగించారు. కార్తిక పౌర్ణమి (నవంబరు 5) నుంచి 12 వరకు వేడుకలు చేపట్టాలని యంత్రాంగం తొలుత నిర్ణయించిన సంగతి తెలిసిందే.



సందర్శకులకు నేత్ర పర్వం చేస్తున్న బలిజాత్ర

ప్రైవేటు చిల్డ్రెన్ హోమ్‌లో విద్యార్థిని కన్నుమూత

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా నుదహండి సమితి పురుణా పాణిగూడ గ్రామంలో ఉన్న మిరాకల్ చిల్డ్రెన్ హోమ్‌లో ఉంటున్న రెండో తరగతి విద్యార్థిని బుధవారం మృతి చెందింది. చిన్నారి మరణం తరువాత ఈ హోమ్ వెలుగులోకి వచ్చింది. మూడేళ్లుగా నడుస్తున్నా ఈ హోమ్ గురించి అధికారుల వద్ద ఎటువంటి సమాచారం లేకపోవడం శోచనీయం. మృతురాలు కొరాపుట్ జిల్లా బొయిపరిగూడ సమితి జొడియాగూడ గ్రామానికి చెందిన బాబులా ఖండపాన కుమార్తె లిప్సా ఖండపాన (7)గా గుర్తించారు. లిప్సాకు మంగళవారం జ్వరంగా ఉండటంతో హోమ్ నిర్వాహకులు పారాసిటమాల్ ఇచ్చారు. బుధవారం ఉదయం ఆమె నిద్ర లేవకపోవడంతో వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. సమాచారం అందుకున్న తండ్రి ఆసుపత్రికి చేరుకున్నాడు. బాలిక మృతిపై ఫిర్యాదు చేయలేదు. తన కుమార్తెను ఈ ఏడాది హోమ్‌లో చేర్చానని, నెలకు రూ.1500 చొప్పున ఫీజు కడుతున్నానని తెలిపారు. కలహండి, నవరంగపూర్‌కు చెందిన 60 మంది చిన్నారులు ఈ హోమ్‌లో ఉంటున్నారు. ఇక్కడ ఉంటూ సమీప ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. పాలనాధికారి ఆదేశాల మేరకు జిల్లా శిశు మంగల కమిటీ అధ్యక్షుడు అజంతాశుభదర్శిని, జిల్లా శిశు సురక్ష అధికారి సురేష్ పట్నాయక్ తదితరులు హోమ్‌కు చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు.

దర్యాప్తు చేస్తున్న అధికారులు

బీఎస్ఎఫ్ జవానుకు అంతిమ వీడ్కోలు

నారాయణ చంద్ర జెనా భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న అనిల్ కుమార్. చిత్రంలో జవానులు, స్థానికులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: జమ్ము-కశ్మీరులోని ఉదంపూర్‌లో సేవలందిస్తున్న బ్రహ్మపురకు చెందిన బీఎస్ఎఫ్ జవాను నారాయణ చంద్ర జెనా (48) సోమవారం హఠాత్తుగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆయనను ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. బుధవారం ఆయన భౌతికకాయం బ్రహ్మపురలో అయోధ్యనగర్ మూడో లైనులోని నివాస భవనానికి తీసుకొచ్చారు. బ్రహ్మపుర ఎమ్మెల్యే కె.అనిల్‌కుమార్ వెళ్లి జెనా భౌతికకాయాన్ని దర్శించుకుని శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. అనంతరం భౌతికకాయంపై జాతీయ పతాకాన్ని ఉంచిన జవాన్లు గౌరవ వందనంతో అంతిమ వీడ్కోలు పలికారు. ఖొడాసింగిలోని శ్మశానం వరకూ జరిగిన అంతిమయాత్రలో భాజపా నాయకుడు రామ్‌కుమార్ పాత్ర్‌తోపాటు పలువురు స్థానిక ప్రముఖులు, బంధుమిత్రులు, వీధి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఏనుగుల దాడులను నివారించండి

కుతబ్ గ్రామస్థుల నిరసన

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: గజరాజుల దాడుల నుంచి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ సంబల్‌పూర్ జిల్లా కుతబ్ గ్రామస్థులు నిరసన చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. ఉషాకోఠి వన్యప్రాణుల అభయారణ్య పరిధి కుతబ్ గ్రామంలో ఏనుగుల గుంపు దాడి చేయడంతో ఇద్దరు మృతిచెందారు. దీంతో చనిపోయిన గంగారాం పటేల్ (62), జుజుమర గ్రామానికి చెందిన ప్రదీప్ ఘటువాల్ (45) మృతదేహాలతో గ్రామస్థులు నిరసనకు దిగారు. తరచూ ఏనుగులు, ఇతర వన్యప్రాణుల దాడి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని, వీటికి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో అటవీ సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. దీనిపై బామ్రా డీఎఫ్ఓ బిక్రందేవ్ పట్నాయక్ స్పందిస్తూ ఉషాకోఠి పరిధిలోని 27 గ్రామాలున్నాయన్నారు. ఆయా గ్రామాల్లో ఏనుగుల బెడద ఉంటుందని అంగీకరించిన పట్నాయక్, పీడిత ప్రాంతాల్లో అటవీ సిబ్బందిని మోహరింపజేశామన్నారు. బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారాన్ని అందజేస్తామని, సమస్యకు పరిష్కారమార్గం ఆలోచిస్తామని హామీ ఇవ్వడంతో నిరసనకారులు శాంతించారు.

గ్రామస్థులతో మాట్లాడుతున్న అటవీ, పోలీసు సిబ్బంది

తాగునీటి పథకాలు పూర్తి చేయండి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: నిరంతర విద్యుత్తు, మంచినీటి సరఫరా, ఇతర మౌలిక సౌకర్యాల కల్పనలో ఇబ్బందులు ఉండకూడదని ఉప ముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవన్‌లో విద్యుత్తు, గ్రామీణాభివృద్ధి, మంచినీటి సరఫరా, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి సమీక్షా సమావేశం జరిగింది. కార్యక్రమంలో పంచాయతీరాజ్, మంచినీటి సరఫరా, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి రబి నారాయణ నాయక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహుజా, అభివృద్ధి కమిషనర్ అనూగార్గ్, ఇతర అధికారులు పాల్గొన్నారు. కొండకోనల్లో ఉన్న గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నందున రోడ్డు సౌకర్యాలు కల్పించే దిశగా యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని, జల్ జీవన్ మిషన్ కార్యక్రమం కింద నిర్మాణంలో ఉన్న మంచినీటి సరఫరా ప్రాజెక్టులు పూర్తిచేయాలని, లోవోల్టేజీ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని, విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి ఆదేశించారు. సమావేశానంతరం మంత్రి నాయక్ విలేకర్లతో మాట్లాడుతూ 2026 మార్చి నాటికి 80 శాతం గ్రామాలకు కుళాయి నీటి సరఫరా అవుతుందని, వేసవిలో నీటి ఎద్దడి ఉండకుండా చూడాలని ఆదేశించారు.

సమావేశంలో ఉపముఖ్యమంత్రి సింగ్‌దేవ్, మంత్రి నాయక్, ప్రధాన కార్యదర్శి మనోజ్, కమిషనర్ అనూగార్గ్

(c) eenadu

లక్ష్మీపూర్‌లో పరబ్ ఉత్సవాలు ప్రారంభం

జయపురం, కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ సమితి కుటునిపొదర్‌లో గిరిజన 'పరబ్' ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. పాలనాధికారి మనోజ్ సత్యవాన్, కొరాపుట్, పొట్టంగి, లక్ష్మీపూర్ ఎమ్మెల్యేలు రఘురాం మచ్చొ, రామచంద్ర కడం, పవిత్ర శాంత, మాజీ ఎంపీ జయరాం పంగి, జిహ్నా హిక్కాక తదితరులు పాల్గొని ఆరంభజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఇప్పటినుంచి ప్రతి సమితిలో సమితిస్థాయి పరబ్ ఉత్సవాలు నిర్వహించి చివరిగా కొరాపుట్‌లో జిల్లాస్థాయిలో డిసెంబరు 18 నుంచి 22 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని అధికారులు పేర్కొన్నారు.

బాలేశ్వర్‌లో రాష్ట్ర పాఠశాలల క్రీడలు

షాట్‌పుట్‌లో బహుమతులందుకున్న బాలురు

హైజంప్ చేస్తున్న బాలిక

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఒడిశా రాష్ట్ర పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యంలో బాలేశ్వర్‌లో రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్- 14, 17 బాలబాలికల అథ్లెటిక్స్, బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ పోటీలు కొనసాగుతున్నాయి. బాలేశ్వర్‌లోని క్రిస్టియన్ ఉన్నత పాఠశాల మైదానంలో 15 వరకు జరుగుతున్న ఆయా క్రీడాంశాల్లో వివిధ జిల్లాలకు చెందిన 900 మంది బాలబాలికలు పోటీపడుతున్నారు. బుధవారం నిర్వహించిన షాట్‌పుట్ సీనియర్ విభాగంలో నవరంగపూర్, గంజాం, బాలేశ్వర్ జిల్లాల బాలురు వరుసగా మొదటిమూడు స్థానాల్లో నిలిచారు.

బాలుర క్రికెట్ విజేత సెయింట్ జేవియర్స్

విన్నర్ ట్రోఫీతో సెయింట్ జేవియర్స్ పాఠశాల బాలురు. చిత్రంలో అతిథులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక మహాత్మాగాంధీ క్రీడా మైదానంలో వారం రోజులుగా జరిగిన అంతర పాఠశాలల అండర్-16 శ్రీ కౌషిక్ క్రికెట్ టోర్నీ సీజన్-2 బుధవారం సాయంత్రం ముగిసింది. ఇందులో బాలుర ఫైనల్ మ్యాచులో సెయింట్ జేవియర్స్ పాఠశాల (మీనాక్షి నగర్) జట్టు డీఏవీ పబ్లిక్ స్కూల్ జట్టుపై గెలుపొంది విజేతగా నిలిచింది. ముగింపు కార్యక్రమంలో అతిథులుగా హాజరైన బ్రహ్మపుర కళ్లికోట విశ్వవిద్యాలయం పీజీ కౌన్సిల్ అధ్యక్షుడు మనోజ్‌కుమార్ పట్నాయక్, టోర్నీ నిర్వాహక పాఠశాల ప్రిన్సిపల్ కన్హుచరణ్ పండా విన్నర్, రన్నర్ జట్లకు ట్రోఫీలు, నగదు పురస్కారం అందజేశారు.

నవీన్‌ను కలిసిన సౌమ్య స్వామినాథన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఎం.ఎస్.స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సౌమ్య స్వామినాథన్ మంగళవారం రాత్రి నవీన్ నివాస్‌లో మాజీ ముఖ్యమంత్రి, విపక్షనేత నవీన్‌పట్నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తమ ఫౌండేషన్ రాష్ట్రంలో చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు.

మాజీ సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సౌమ్య స్వామినాథన్

పోలీసు క్వార్టర్లు ప్రారంభం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: రూర్కుగుడ జిల్లాలో రూర్కుగుడ రాజా ఆవరణలో కానిస్టేబుళ్ల కోసం నిర్మించిన 'ఏ' టైప్ ఆరు క్వార్టర్ల ప్రారంభోత్సవం బుధవారం జరిగింది. రూర్కుగుడ ఎస్పీ రెడ్డి రాఘవేంద్ర గుండాల పాల్గొని ఆయా క్వార్టర్లను ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

క్వార్టర్లు ప్రారంభించిన రూర్కుగుడ ఎస్పీ రాఘవేంద్ర. చిత్రంలో ఇతర పోలీసు అధికారులు

రిజిస్ట్రేషన్లు పూర్తి చేయండి

బరగఢ్ కలెక్టర్ కార్యాలయం ముందు అన్నదాతల నిరసన

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణ సంబంధించి తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతూ అన్నదాతలు నిరసనకు దిగారు. ఈ మేరకు బరగఢ్ కలెక్టర్ కార్యాలయం ముందు బైఠాయించి పలు డిమాండ్లు వినిపించారు. ధాన్యం సేకరణ కోసం పేర్లను జాబితాలో చేర్చాలని మొత్తం 11 డిమాండ్లకు పరిష్కారం కోరుతూ రైతులు నిరసనకు దిగారు. డిమాండ్లను పరిష్కరించే వరకు నిరసన కొనసాగుతుందని కర్షకులు స్పష్టం చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గుమ్మ సమితి కార్యాలయంలో బుధవారం తమ్మిడి సమితి సమావేశం అధ్యక్షురాలు సునేమి మండల్ అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్యే రూపేష్ మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాల్లో ఇప్పటికీ ఆయుష్మాన్ ఆరోగ్య కార్డుల పంపిణీ సక్రమంగా చేపట్టలేదని కార్డుల పంపిణీ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. బీడీఓ దూలారం మారండి, సమితి ఉపాధ్యక్షుడు ఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రహి, చిత్రంలో సమితి అధ్యక్షురాలు సునేమి మండల్

గంజాయి మొక్కల ఏరివేత

కొరాపుట్, న్యూస్‌టుడే: జిల్లాలో గంజాయి మొక్కల ఏరివేత కొనసాగుతోంది. జిల్లా యంత్రాంగం, పోలీస్, అటవీ విభాగం అధికారులు మిళిత ఆపరేషన్ నిర్వహిస్తున్నట్టు అటవీ శాఖాధికారి కె.వి.భాస్కరరావు తెలిపారు. జిల్లాలో రెండురోజుల్లో 44 ఎకరాల గంజాయి సాగును ధ్వంసం చేసినట్టు తెలిపారు.

భారత్, ఆస్ట్రియా విద్యాసంస్థల మధ్య ఒప్పందం

ఒప్పందంలో ఇరుపక్షాల ప్రతినిధులు

ఖరగ్‌పూర్: టెక్నికల్ యూనివర్సిటీ ఆస్ట్రియా ప్రతినిధి బృందం మంగళవారం ఐఐటీ ఖరగ్‌పూర్ సందర్శించింది. ఇరు పక్షాల మధ్య పరిశోధన ఒప్పందాలు జరిగినట్లు ప్రకటించారు.

పింఛనుదారులకు అవగాహన

కొరాపుట్: ఈస్ట్ కోస్ట్ రైల్వే కొరాపుట్ జంక్షన్ వద్ద పింఛనుదారులకు డిజిటల్ జీవ ప్రమాణ ధ్రువపత్రాలపై అవగాహన కల్పించారు. కొరాపుట్, జగదల్‌పూర్, కిరండూల్, లక్ష్మీపురం తదితర ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు చేపట్టారు.

ఉత్పాదకత ఎగుమతులు జరిగేదెప్పుడు

తూర్పు మిడ్నాపూర్ జిల్లా హల్దియా పారిశ్రామిక వాడలో రూ.500 కోట్ల వ్యయంతో 36 ఎకరాల స్థలంలో మల్టీ మోడల్ టెర్మినల్ రెండు సంవత్సరాల కిందట ప్రారంభమైనా ఇప్పటికీ పనులు జరగడం లేదు. తాప విద్యుత్ కేంద్రాల నుంచి వచ్చే ఫ్లై ఆయాష్‌ను ఇక్కడ నుంచి బంగ్లాదేశ్‌కు ఎగుమతి చేయాలన్న ఉద్దేశంతో ఉన్న ప్రాజెక్టు అనుమతి, ఇతర రాజకీయ ఒత్తిడికి ఉత్పాదకత ఎగుమతులు నిలిచిపోయాయి. 2023లో నరేంద్ర మోదీ ఈ పరిశ్రమను వర్చువల్ మాధ్యమంలో ప్రారంభించారు. దీనిపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని పలువురు అంటున్నారు.- న్యూస్‌టుడే, ఖరగ్‌పూర్

ఉత్పాదకతకు సిద్ధంగా ఉన్న పరిశ్రమ

సహకార మంత్రిత్వ శాఖ డైరెక్టర్ పర్యటన

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా జయపురంలో కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ డైరెక్టర్ రామ్‌కుమార్ బుధవారం పర్యటించారు. కొరాపుట్ సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర సహకార శాఖ తరఫున అందుతున్న పథకాలు ఎలా అమలవుతున్నాయో ఆరా తీశారు. సమావేశంలో బ్యాంకు సీనియర్, జూనియర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న కేసీసీ బ్యాంకు అధ్యక్షుడు, డైరెక్టర్ తదితరులు

అభివృద్ధి పనులపై సమీక్ష

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండిలోని జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జడ్పీ అధ్యక్షుడు గవర తిరుపతిరావు అధ్యక్షతన రెండు రోజుల జిల్లాస్థాయి స్టాండింగ్ కమిటీ (స్థాయి సంఘం) సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులను నాణ్యంగా చేపట్టాలని అధికారులకు తిరుపతిరావు సూచించారు. జడ్పీ కార్య నిర్వహణ అధికారి శంకర్ కెర్కేటా, జడ్పీ ఉపాధ్యక్షురాలు కుంతల మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గవర తిరుపతిరావు, పక్కన జడ్పీ కార్య నిర్వహణ అధికారి శంకర్ కెర్కేటా తదితరులు

19న బ్రహ్మకుమారి శివాని ఆధ్యాత్మిక ప్రసంగం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ప్రపంచ ఖ్యాతిగాంచిన ప్రముఖ వక్త బ్రహ్మకుమారి శివాని ఆధ్యాత్మిక ప్రసంగం బ్రహ్మపురలో ఈనెల 19న జరుగుతుందని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బ్రహ్మపుర సబ్ జోన్ ఇన్‌ఛార్జి బ్రహ్మకుమారి మాల అన్నారు. బుధవారం స్థానిక గిరిరోడ్డులోని బ్రహ్మకుమారీల శాంతి కుండ్ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు తెలిపారు. స్థానిక కళ్లికోట వర్సిటీ మైదానంలో ఉదయం, సాయంత్రం రెండు విడతల్లో బ్రహ్మకుమారి శివాని ఆధ్యాత్మిక ప్రసంగం గాలుంటాయని తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

మల్కాన్‌గిరి, పర్లాఖెముండి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి పోలీసులు పద్మగిరి గ్రామంలో సైబర్ మోసం అరికట్టడానికి చైతన్య కార్యక్రమం బుధవారం ఏర్పాటు చేశారు. ● పర్లాఖెముండిలోని గుసాని సమితి గురండి గ్రామంలోని మినీ క్రీడా మైదానంలో బుధవారం సైబర్ మోసాలపై నాటక రూపంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

నాటక రూపంలో ఓ సన్నివేశం

గర్భిణులకు పాడైపోయిన గుడ్లు సరఫరా



జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి కొరియా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు పాడైపోయిన గుడ్లను మంగళవారం సరఫరా చేశారు. దాంతో వారు అసంతృప్తి వ్యక్తం చేస్తూ... వాటిని ఆసుపత్రిలోనే విడిచిపెట్టి వెళ్లిపోయారు. మమత దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీకి పరీక్షలు చేయించుకోవడానికి వచ్చిన 15 మంది గర్భిణులకు ఈ గుడ్లు అందజేశారు.

చెత్తలోకి చేరుతున్న మధ్యాహ్న భోజనం

బకెట్‌లో భోజనం తీసుకెళ్తున్న విద్యార్థినులు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా నంద హండి సమితి మెంట్రి ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాసిరకంగా ఉంది. దాంతో ప్రతీరోజు విద్యార్థులు బకెట్లతో మోసుకెళ్తూ చెత్తలో పారేస్తున్నారు. దీనిపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకోకపోతే సమితి విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని స్థానికులు హెచ్చరించారు.

శిథిలావస్థలో విశ్రాంతి భవనం

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడ కెరడ ప్రధాన రహదారి జగనాథపూరు కూడలిలో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన విశ్రాంతి భవనం శిథిలావస్థకు చేరుకుంది. బస్సుల కోసం వచ్చే ప్రయాణికులు రోడ్డు పక్కన ఉంటూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మంగళవారం జరిగిన ప్రమాదానికి ఇదో కారణంగా చెప్పవచ్చు. విశ్రాంతి భవనంలో ఉండాల్సిన ప్రయాణికులు రోడ్డు పక్కన వేచి ఉండటంతో ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా కొత్త భవనం నిర్మించాలని కోరుతున్నారు.

ప్రపంచ న్యుమోనియా దినోత్సవం

రోగులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండిలోని జిల్లా ప్రధాన ఆసుపత్రిలో మంగళవారం ప్రపంచ న్యుమోనియా దినోత్సవం నిర్వహించారు. సెంచూరియన్ వర్సిటీ నర్సింగ్ పాఠశాల సిబ్బంది మాట్లాడుతూ 'న్యుమోనియా ఒక తీవ్రమైన అంటువ్యాధి. ఇది దగ్గు, తుమ్ముల ద్వారా శ్వాసకోశ వ్యవస్థకు వేగంగా వ్యాపిస్తుంది. వాతావరణంలో మార్పులు, వాయు కాలుష్యం వల్ల సాధారణంగా సీజన్ మారేటప్పుడు, ఇమ్యూనిటీ శక్తి తక్కువగా ఉండే పిల్లల్లో ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది' అని వివరించారు. వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు పలురకాల సూచనలు అందజేశారు. సిబ్బంది శుభశ్రీ పాణిగ్రహి, నిబేదిత తదితరులు పాల్గొన్నారు.

కొడింగలో ఆహార మేళా ప్రారంభం

నవరంగపూర్, న్యూస్‌టుడే: కొగగుముడా సమితి కొడింగ పంచాయతీలో అన్నా అభిజాన్‌లో భాగంగా బుధవారం ఆహార మేళా జరిగింది. జిల్లా వ్యవసాయ శాఖాధికారి బిశ్వజిత్ సాహు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. మేళాలో 8 ఎస్‌హెచ్‌సీ బృందాలు తదితరులు పాల్గొని రాగులతో తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు.

మేళాను ప్రారంభించిన జిల్లా వ్యవసాయ శాఖాధికారి తదితరులు

చేపల పెంపకంతో ఆదాయం

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యజిత్

రాయగడ, గుణుపురం, న్యూస్‌టుడే: పశువులు, చేపల పెంపకంతో నిత్య ఆదాయం పొంది ఆర్థికాభివృద్ధి సాధ్యం అవుతుందని గుణుపురం ఎమ్మెల్యే సత్యజిత్ గొమాంగో అన్నారు. మంగళవారం సమితి కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమితి స్థాయి పశు, మత్స్య ప్రదర్శన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పశు వైద్యాధికారి మృన్మయ కుమార్ పండా, పురాధ్యక్షురాలు మమత హాజరై ప్రసంగించారు. జిల్లా గౌడ్, ఉపాధ్యక్షుడు శివ ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పరబ్ ఉత్సవం బహిష్కరిస్తాం

జయపురం, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి లోకోత్సవం పరబ్ ఉత్సవానికి 29 ఏళ్లు పూర్తయ్యాయి. ఇన్నేళ్లలో కొరాపుట్ జిల్లా కేంద్ర సమితిలో ప్రారంభ ఉత్సవం జరగలేదు. కుంద్రలో తప్ప జిల్లాలో ఉన్న ప్రతీ సమితిలో జరిగింది. బుధవారం స్థానిక జగన్నాథ్ ఆలయ ప్రాంగణంలో సహీద్ లక్ష్మణ్ నాయక్ ఆదివాసీ సంఘం అధ్యక్షుడు భజమన్ శాంటా అధ్యక్షతన సమావేశం జరిగింది. 20 ఏళ్లుగా సమితిలో ప్రారంభ ఉత్సవం జరపాలని విజ్ఞప్తి చేసినా ఫలితం లేక పోవడంతో, ఈ ఏడాది జరపకపోతే ఉత్సవాన్ని బహిష్కరిస్తామని హెచ్చరిస్తూ బీడీవోకు వినతి పత్రాలను అందజేశామని, లక్ష్మీపూర్‌లోనే జరిపేందుకు యంత్రాంగం సన్నాహాలు చేసిందని, ఉత్సవాన్ని బహిష్కరించి, ఆరంభ జ్యోతిని తీసుకురాకూడదని నిర్ణయించుకున్నారు.

EENADU Classifieds
JOBS
హైదరాబాద్‌లో సెక్యూరిటీ గార్డ్స్, సె. సూపర్‌వైజర్స్, ఫీల్డ్ ఆఫీసర్స్ & హెల్పర్స్ కావలెను రూం ఫ్రీ. మెట్రో మేనేజ్‌మెంట్. సంప్ర: 9885657755, 9963077722.
ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
కేవలం 315 /-
(GST 5% అదనం)
మాత్రమే
సంప్రదించండి:
8008597609
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

30 వేల టన్నుల మొక్కజొన్న అమ్మకాలు లక్ష్యం

నవరంగపూర్, న్యూస్‌టుడే: జిల్లా వ్యవసాయ శాఖాధికారి సుధీర్ రంజన్ బెహరా అధ్యక్షతన బుధవారం మొక్కజొన్న అమ్మకాలకు సంబంధించి జోనల్ స్థాయి క్రయ, విక్రయ సంస్థ సభ్యులతో సమావేశంలో జరిగింది. జిల్లాలో 24 వ్యవసాయ ఉత్పత్తి సంస్థలు పాల్గొనగా, ఈ ఏడాది జిల్లాలో 30 వేల టన్నుల మొక్కజొన్న విక్రయించడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు పేర్కొన్నారు. కొరాపుట్ జిల్లా వ్యవసాయ శాఖాధికారి గోకుల్ చంద్ర ప్రధాన్ ముఖ్య అతిథిగా హాజరై అవిభక్త కొరాపుట్ జిల్లా వాతావరణం, జీవవైవిధ్యం గురించి మాట్లాడారు.

రండి బడికి పోదాం...!

బాలుడితో మాట్లాడుతున్న బీఈడీ విద్యార్థినులు

జయపురం, న్యూస్‌టుడే: పట్టణంలో జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా డ్రాపౌట్ అయిన విద్యార్థులను బడిబాట పట్టించేందుకు స్థానిక అప్పర్ కొలాబ్ ప్రాజెక్టు విద్యాలయం తరఫున 'లెట్స్ గో టు స్కూల్' కార్యక్రమం నిర్వహించారు. విక్రమ్ దేవ్ విశ్వవిద్యాలయంలో బీఈడీ విద్యార్థినులు బుధవారం 15 మంది డ్రాపౌట్‌లను గుర్తించి వారికి నచ్చజెప్పి బడికి రావాలని సూచించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

ట్రాక్టర్‌పై నుంచి పడి ఒకరి మృత్యువాత

జయపురం, న్యూస్‌టుడే: ట్రాక్టర్ పైనుంచి పడి ఒకరు మృతి చెందగా, ఐదుగురు గాయపడిన ఘటన కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితిలో జరిగింది. మృతిచెందిన వ్యక్తి తొలగొలూరు పంచాయతీ మునగులబాలసార గ్రామానికి చెందిన పాత్రల్ తౌడు(45)గా గుర్తించారు. గాయపడిన వారిని సాలూరులో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. భారత్‌మాల రహదారి నిర్మాణంలో భాగంగా ఆరుగురు కార్మికులు రాళ్ల లోడుతో ఉన్న ట్రాక్టర్‌లో వెళ్తుండగా, అంపాబాలి ఘాటీపైన వాహనం అదుపు తప్పడంతో పైన కూర్చున్న కార్మికులు పడిపోయారు. దాంతో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు.

రైలు ఢీకొని ఒకరి దుర్మరణం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పశ్చిమబెంగాల్‌లోని పశ్చిమ మిడ్నాపూర్ జిల్లా గడబెత్తా మూడో బ్లాక్ చంద్ర కోణారోడ్డు వద్ద రైల్వే ట్రాక్ దాటుతుండగా సోమవారం మధ్యాహ్నం రైలు ఢీకొని అశ్విని ముర్ము (45) మృతి చెందాడు. సాల్బోనికి చెందిన అశ్విని మృతదేహం జీఆర్పీలు స్వాధీనం చేసుకుని కుటుంబీకులకు అప్పగించారు.

యువతి మృతదేహం స్వాధీనం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: కొంధమాల్ జిల్లా బలిగుడ ఠాణా పరిధిలో బుడుకియా పంచాయతీలోని డపాసాహి గ్రామం శివారున అడవుల్లో చెట్టు కొమ్మకు ఉరిలా వేలాడుతున్న గుర్తు తెలియని యువతి మృతదేహాన్ని బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కత్తిపీటతో మహిళపై దాడి

గంజాం జిల్లా పురుషోత్తంపూర్ ఠాణా పరిధిలోని బెడ దేవులపల్లి గ్రామంలో భూవివాదం నేపథ్యంలో మంగళవారం రాత్రి కుని మహంతి అనే మహిళపై పొరుగింట్లో ఉంటున్న వారు కత్తిపీటతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ మహంతికి పురుషోత్తంపూర్ ఆరోగ్య కేంద్రంలో చికిత్స అనంతరం ఆమె ఆరోగ్యం విషమించడంతో స్థానిక ఎమ్కేసీజీ ఆసుపత్రికి స్థానాంతరం చేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో అయిదుగురికి తీవ్ర గాయాలు

క్షతగాత్రుల్ని కాపాడి ఆసుపత్రికి తరలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లాలో రెండు వేర్వేరు ఠాణాల పరిధుల్లో మంగళవారం రాత్రి జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో అయిదుగురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వారికి అడపడ ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స అనంతరం స్థానిక ఎమ్కేసీజీ ఆసుపత్రికి తరలించారు. దిగపొహండి ఠాణా పరిధిలోని మౌళాభంజ వంతెన సమీపాన రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో రెండు వాహనాలపై ఉన్న ఇద్దరు గాయపడ్డారు. పట్టపూర్ ఠాణా పరిధిలోని పలాసపూర్ సమీపాన ఘొడాహడొ నది వంతెనపై ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఆయా ఘటనల్లో అగ్నిమాపక కేంద్రాల సిబ్బంది ఘటనా స్థలాలకు చేరుకుని క్షతగాత్రుల్ని కాపాడి ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

బాలేశ్వర్‌లో ఇద్దరు గ్యాంగ్‌స్టర్ల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ప్రత్యూష, పోలీసుల అదుపులో నిందితులు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: బాలేశ్వర్‌లో ఇద్దరు గ్యాంగ్‌స్టర్లను పోలీసులు అరెస్టు చేసి, వారి నుంచి మారణాయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ ప్రత్యూష్ దివాకర్ ఈ వివరాలను బుధవారం మీడియాకు వెల్లడించారు. పట్టుబడిన నిందితుల్లో కైలాస్‌దాస్, అనిమేష్ ఘోష్ ఉన్నారు. వీరిలో ఘోష్‌పై 32 కేసులు, దాస్‌పై 25 కేసులు నమోదయ్యాయి. వీటిలో హత్యలు, హత్యాయత్నం, స్థానిక వ్యాపారులపై బెదిరింపులకు పాల్పడి డబ్బుల వసూళ్లు వంటి తీవ్ర నేరాలకు సంబంధించి నిందితులపై కేసులు ఉన్నాయి. నిందితుల నుంచి పిస్తోళ్లు, రెండు కత్తులు, ఇతర మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరూ బాలేశ్వర్‌లోకి ప్రవేశించి నేరాలకు పాల్పడుతున్నారని, నిందితులను అదుపులోకి తీసుకునేందుకు ప్రత్యేక బృందాన్ని నియమించినట్లు దివాకర్ వెల్లడించారు.

ఆటో బోల్తా

కొరాపుట్: కొరాపుట్-రాయగడ రోడ్ మార్గంలో బరిగూడ వద్ద ఆటోను లారీ ఢీ కొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. వారిని స్థానికులు కొరాపుట్ ఆసుపత్రికి తరలించారు. వారంతా బరిగుడకి చెందిన వారిగా స్థానికులు చెబుతున్నారు. పోలీసులు అక్కడికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి అదృశ్యం

వినోద్‌కుమార్

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా బొరిగుమ్మకు చెందిన కె.వినోద్‌కుమార్ మంగళవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో అదృశ్యమయ్యారు. హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న వినోద్ మంగళవారం బొరిగుమ్మకు వచ్చాడు. కారు పార్కింగ్ చేస్తానన్న వినోద్ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గంజాయి స్వాధీనం...

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్లా మత్తిలి పోలీసులు గంజాయి స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం రాత్రి మత్తిలి ఠాణా ఝులునిబహాల్ గ్రామం కూడలి వద్ద ఐదుగురు వ్యక్తులు సూట్‌కేసులు పట్టుకొని అనుమానాస్పదంగా ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని తనిఖీ చేయగా అందులో 58 కిలోలు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీంతో వారిని అరెస్టు చేశారు.

ద్విచక్ర వాహనంతో పరారైన వ్యక్తి అరెస్టు

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: జిల్లాలోని బలిమెల పోలీసులు ద్విచక్ర వాహనంతో పరారైన నిందితుడిని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బలిమెల ఠాణా కెందుగుడ గ్రామానికి చెందిన లఖ్మణ్‌ఖిలో కొరాపుట్ జిల్లా బొరిగుమ్మ ఠాణా మాలదా గ్రామానికి చెందిన నారాయణ్ మాలి ద్విచక్రవాహనం తీసుకెళ్లి తిరిగి రాకపోవడంతో అక్టోబర్ 18న లఖ్మణ్ బలిమెల ఠాణాలో ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేసి బొరిగుమ్మ ఠాణా మాలదా గ్రామానికి వెళ్లి నారాయణ్‌ను అరెస్టు చేసి, ద్విచక్ర వాహనం, ఓ చరవాణి స్వాధీనం చేసుకున్నారు.

ప్రమాదానికి కారణమైన వ్యాన్‌కు నిప్పు

పూర్తిగా కాలిపోయిన వ్యాన్

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడ-కెరడ ప్రధాన రహదారి జగన్నాథపూర్ కూడలిలో మంగళవారం రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యాన్‌కు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో వాహనం కాలిపోయింది. బుధవారం ఉదయం సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యాన్ ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతిచెందగా, మరో ముగ్గురు గాయపడిన విషయం తెలిసిందే.

సారా తయారీ కేంద్రాలపై దాడులు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా మోహనసమితి ఖాలమేరి, పతరగడ ప్రాంతాల్లో సారా తయారీ కేంద్రాలపై ఆబ్కారీ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఎస్సై దండ్రు సబర్ ఆధ్వర్యంలో బృందం దాడులు చేపట్టి 2 వేల లీటర్ల బెల్లం ఊటతో పాటు 180 లీటర్ల నాటు సారాను ధ్వంసం చేశారు.

విద్యార్థులు ప్రతిభ చూపాలి

బాన్‌పూల్ ఉత్సవాల్లో చిత్రాలు గీసిన చిన్నారులు

కొరాపుట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని అనాథల వికాస కేంద్రంలో బాన్‌పూల్ ఉత్సవాలు నిర్వహించారు. విద్యార్థులు తమలో ప్రతిభ చూపేందుకు వీలుగా ఈ ఉత్సవాలు సాగుతాయని నిర్వాహకులు సంజిత్ పట్నాయక్ తెలిపారు. కథలు చెప్పడం, రాయడం, సంగీత ప్రతిభ, చిత్ర లేఖనం తదితర పోటీలు ఉంటాయన్నారు.

వృద్ధులకు దుప్పట్ల అందజేత

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మేజర్ పంచాయతీకి చెందిన రామరాజు చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారిశెల్లి రామరాజు బుధవారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. గొట్టిపల్లి ఖగేశ్వరరావు జ్ఞాపకార్థం గజపతి జిల్లా గుసాని సమితి కొర్సండ పంచాయతీ వంగరాడ గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గుంపు కృష్ణారావు, సమితి మాజీ సభ్యులు కామేశ్వరరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న జిల్లా యంత్రాంగం

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: మరికొద్ది రోజుల్లో జరగనున్న బాల్య వివాహాన్ని జిల్లా యంత్రాంగం మంగళవారం సాయంత్రం అడ్డుకుంది. జిల్లా శిశు సంరక్షణ అధికారి అరుణ్ కుమార్ త్రిపాఠి తెలిపిన వివరాల ప్రకారం.. సమాచారం మేరకు కాశీనగర్ ఎన్ఏసీలోని ఓ వార్డులో మరికొద్ది రోజుల్లో జరగనున్న వివాహాన్ని ఓ బృందం అడ్డుకుందని, అనంతరం వివాహం చేస్తే జరిగే నష్టాల గురించి వారి కుటుంబ సభ్యులకు వివరించినట్లు తెలిపారు. బాల్య వివాహ నిరోధక చట్టం, శిక్ష గురించి కుటుంబానికి వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి నాగవంశ, ఎస్సై అలోకరంజన్ జగదల్ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

ఏన్నాళ్లీ మోత.. వంతెన లేక చింత

దోలీతో వృద్ధురాలిని నది దాటిస్తున్న గ్రామస్థులు

వంతెన లేక కొమరాడ మండలం చోళ్లపదం పంచాయతీ పరిధి రెబ్బ, వనదార గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. ఈ రెండు ఊర్లు నాగావళి నదికి అవతల, ఒడిశా సరిహద్దులో ఉన్నాయి. వీరు అవసరాలకు బయటికి రావాలంటే నది దాటాలి. బుధవారం ఉదయం రెబ్బ గ్రామానికి చెందిన వృద్ధురాలు టి.నరసమ్మ (82) అనారోగ్యానికి గురికావడంతో డోలీలో నది దాటించి.. రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పార్వతీపురం ప్రాంతీయాసుపత్రి, విజయనగరం తరలించారు. పరిస్థితి విషమించి సాయంత్రం మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆటోలో ఒడిశా మీదుగా రామభద్రపురం తరలిస్తే 10 కి.మీ. అదనంగా వెళ్లాల్సి వస్తుందని, అందుకే డోలీతో నది దాటి 3 కి.మీ. దూరంలోని ఆసుపత్రికి చేర్చామని గ్రామ యువకులు చెప్పారు. వంతెన నిర్మించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కొమరాడ

రైతుల పనులు పూర్తి చేయాలి: కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించి గుర్తించిన ఉపాధి పథక పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రాజెక్టు డైరెక్టర్ సుధాకర్ అన్నారు. బుధవారం కవిటిలోని ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 2026- 27 ఆర్థిక సంవత్సరంలో 266 పనులు గుర్తించారని అందులో రైతులకు సంబంధించినవి 163 పనులున్నాయని పేర్కొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న 20 కిలోల గంజాయితోపాటు ఇద్దరిని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ మీసాల చిన్నంనాయుడు బుధవారం విలేకరులతో మాట్లాడారు. తమిళనాడు రాష్ట్రం తిరునవల్లి జిల్లా తుతుక్కుడి పట్టణానికి చెందిన వి.సతీష్‌కుమార్, ఓ బాలుడు అదే రాష్ట్రం మెలపాలయం గ్రామానికి చెందిన హుస్సేన్ (అలియాస్ షౌఖక్ ఆలీ)కి కావాల్సిన గంజాయిని తీసుకొచ్చేందుకు ఒడిశా వచ్చారు. ఒడిశా రాష్ట్రం మోహన సమితి చంద్రగిరికి చెందిన ఇసాక్ బీర వద్ద 20.670 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. తిరుగు ప్రయాణంలో ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ విషయమై పట్టణ ఎస్సై ముకుందరావుకు సమాచారం రావడంతో తమ సిబ్బందితో రైల్వే స్టేషన్‌కు చేరుకుని వారి బ్యాగులు తనిఖీ చేశారు. సరకు స్వాధీనం చేసుకుని, సతీష్‌ను అరెస్ట్ చేసి ఇచ్ఛాపురం మెజిస్ట్రేట్ వద్ద హాజరు పరిచారు. బాలుడిని శ్రీకాకుళం జేజేజీ బోర్డు వద్ద హాజరుపరిచినట్లు ఎస్సై ముకుందరావు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

దుర్గారావు(పాతచిత్రం)

కాశీనగర్, న్యూస్‌టుడే: కాశీనగర్ ఠాణా పరిధిలోని మిలగాం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. మృతిచెందిన వ్యక్తి మిలగాం గ్రామానికి చెందిన రైవాడ దుర్గారావు(45)గా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధికి చేయూత: ఇచ్ఛాపురం గ్రామీణం, కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: దాతల సహకారంతోనే పాఠశాలలు అభివృద్ధి సాధ్యమని ప్రధానోపాధ్యాయులు జి.యశోద, ప్రదీప్ కుమార్ అన్నారు. ఇచ్ఛాపురం మండలం బలరాంపురం పాఠశాలకు గ్రామస్థులు రూ.25 వేలు విలువ చేసే కలర్ ప్రింటర్ ప్రధానోపాధ్యాయినికి బుధవారం అందించారు. ఎస్ఎంసీ ఛైర్‌పర్సన్ యువరాణి, ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్, గౌరీ, శంకరం, తేజేశ్వరరావు, రవికుమార్, సంతోష్, దాశరథి పాల్గొన్నారు.

ఛత్రం.. భళారే విచిత్రం..!

సాధారణంగా మంచినీరు తాగేశాక ఆ సీసాలు ఎందుకూ పనికిరావని పారేస్తాం కదా.. శ్రీకాకుళం నగరపాలక సంస్థ సిబ్బంది మాత్రం అలా ఆలోచించలేదు. వాటితోనే ఆకర్షణీయమైన గొడుగులను తయారు చేసి.. నలుగురికీ నీడనిచ్చేలా ఇలా దామోదర సంజీవయ్య పార్కులో ఏర్పాటు చేశారు. వ్యర్థమనుకున్న వస్తువుకు జీవం పోసి పర్యావరణ పరిరక్షణలో భాగమయ్యారు.
– న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)

జీవాలకు మందులేవీ..?

న్యూస్‌టుడే, జి.సిగడాం

● జి.సిగడాం మండలం సీతంపేటకు చెందిన పాడి రైతు రామప్పడు పోషిస్తున్న ఆవు కొన్ని రోజులుగా పాలు ఇవ్వడం లేదు. నీరసంగా ఉందని సమీపంలోని రైతు సేవా కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడి పశువైద్య సహాయకుడు చికిత్స చేసి పంపారు. మందులు బయట కొనుగోలు చేసుకోవాలని సూచించడంతో ఆయన రూ.800 ఖర్చు చేశారు.

జిల్లాలో పశువైద్యం గాలిలో దీపంలా మారింది. పాడి రైతులు, పశు పోషకులకు ఆదరువుగా నిలిచే జీవాలు వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్నాయి. పోషకులు ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తుండటంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. వైకాపా ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసినా మందుల సరఫరాలో నిర్లక్ష్యం చేయడంతో పాడి రైతులకు ఇబ్బందులు తప్పలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మందులు అందుబాటులోకి రాకపోవడంతో పాడి రైతులకు భారం తప్పడం లేదు.

ఆనందపురం రైతు సేవా కేంద్రంలో అరకొరగా మందులు

రెండేళ్లుగా సరఫరా బంద్

● గతంలో రైతు భరోసా కేంద్రాల పరిధిలో సుమారు రూ.30 వేల నుంచి రూ.40 వేల విలువైన పశువుల మందుల కోసం ఇండెంట్ పెట్టుకునేందుకు అవకాశం కల్పించారు.
● 2021, 2022లో అరకొరగా సరఫరా చేశారు. ● 2023 నుంచి ఇప్పటివరకు ఆ ఊసే లేదు.

అక్కరకు రాని రైతు సేవా కేంద్రాలు

ఇదీ పరిస్థితి

● రైతు సేవా కేంద్రాల్లో పశుసంవర్ధక శాఖ సహాయకుల వద్దకు పశువుల్ని తీసుకెళ్తున్న పోషకులను మందుల కోసం ప్రైవేటు దుకాణాలకు పంపుతున్నారు. ● ప్రధాన పశువైద్య కేంద్రాలకు వెళ్లాలంటే వ్యయ, ప్రయాసలు తప్పడం లేదు. ● ఈ నేపథ్యంలో ప్రైవేటు వైద్యుల్ని, దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. ● తరచూ పశువులకు జ్వరాలు, పారుడు, మేత మేయకపోవడం, నులిపురుగులు తదితర సమస్యలు వస్తున్నాయి. ● రైతు సేవా కేంద్రాల్లో జీవాలకు ప్రాథమిక చికిత్స చేయడానికి మందులు అందుబాటులో లేవు. సాధారణ, కృత్రిమ గర్భధారణ టీకాలు వేయడానికి పశుసంవర్ధక సహాయకులు పరిమితమవుతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం

రైతు సేవా కేంద్రాలకు అవసరమైన మందులు సమకూర్చాలని ప్రభుత్వానికి నివేదించాం. పాడి రైతులకు ఆర్థిక భారం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. – కె.రాజగోపాలరావు, జేడీ, పశుసంవర్ధక శాఖ, శ్రీకాకుళం

జిల్లాలో బహుళ పశువుల ఆసుపత్రి: 01 ● ప్రాంతీయ పశువైద్యశాలలు: 15
● పశువుల ఆసుపత్రులు: 77 ● గ్రామీణ పశువైద్యశాలలు: 61 ● రైతు సేవా కేంద్రాలు: 300

హ్యాష్ ఆయిల్ విక్రేత అరెస్టు

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీలో హ్యాష్ ఆయిల్ విక్రయించేందుకు వచ్చిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై లింగం వివరాల ప్రకారం.. ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లా కంగురుకొండ గ్రామానికి చెందిన వాడల్ హల్దార్(20) అదే గ్రామానికి చెందిన రాజ్ అనే వ్యక్తి వద్ద రూ.8 వేలకు 730 మి.లీ. హ్యాష్ ఆయిల్ కొనుగోలు చేశాడు. బుధవారం ఉదయం తెలంగాణలోని హైదరాబాద్ నగరానికి చేరుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేపీహెచ్‌బీ బస్టాప్ వద్ద క్యాబ్ దిగిన హల్దార్‌ను పట్టుకుని ఠాణాకు తరలించారు. తొలిసారి నగరానికి రావడంతో పాటు హ్యాష్ ఆయిల్‌ను రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు విక్రయించేందుకు తీసుకొచ్చినట్లు విచారణలో తేలింది. పోలీసులు నిందితుడి నుంచి హ్యాష్ ఆయిల్‌తో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

బాలబడి తోట.. పోషకాల కోట..!

సరుబుజ్జిలి, పొందూరు, ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. కేంద్రాల్లోనే సేంద్రియ పద్ధతిలో ఆకు కూరలు, కూరగాయలు పండించేందుకు పోషణ వాటికలు (కిచెన్ గార్డెన్లు) ఏర్పాటుకు గతేడాది చర్యలు చేపట్టారు. ఇందుకోసం ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.10 వేల చొప్పున మంజూరు చేశారు.

ఫలితాలనిస్తున్న అంగన్‌వాడీ కిచెన్ గార్డెన్లు

■ ఆమదాలవలస నియోజకవర్గంలో 348 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో సరుబుజ్జిలి మండలంలో పురుషోత్తపురం-2, 3, ఆమదాలవలస మండలంలో సంతకొత్తవలస, సీతారాంనగర్, ఎస్‌ఆర్‌సీపేట, నెల్లిపర్తి-1, 2, పొందూరు మండలంలో కనిమెట్ట-1, 2, వీఆర్‌గూడెం, బూర్జ మండలంలో గుత్తావల్లి, వీడివలస, కొల్లివలస కేంద్రాల్లో పోషణ వాటికలు నిర్వహిస్తున్నారు.

■ ఆకు కూరలు, కూరగాయలు పండించి అందిస్తున్నారు. ఐసీడీఎస్, ఉపాధిహామీ పథకం, ఉద్యానశాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వాటి అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు.

■ ఎంపిక చేసిన కేంద్రాల్లో అందుబాటులో ఉన్న స్థలంలో గోరు చిక్కుడు, పచ్చిమిరప, టమాట, వంగ, బెండ, బీర, తోటకూర, గోంగూర, పాలకూర, కొత్తిమీర, మెంతికూర వంటివి సేంద్రియ పద్ధతిలో పెంచుతున్నారు. దీనివల్ల పోషకాలు, ఆరోగ్య ప్రయోజనాలు చిన్నారులు, గర్భిణులకు అందిస్తున్నారు.

■ ఎంపిక చేసిన కేంద్రాల్లోని పోషకవాటికలను సందర్శించి సిబ్బందికి సూచనలు ఇస్తున్నాం. వాటిని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్నామని నాలుగు మండలాల ఐసీడీఎస్ పీవోలు గీత, సత్యశ్రీ తెలిపారు.

ఆమదాలవలస మండలం ఎస్‌ఆర్‌సీపేట అంగన్‌వాడీ కేంద్రం వద్ద సాగు చేస్తున్న ఆకు కూరలు, కూరగాయలు

హద్దులు చెరిపేశారు.. దందాకు దారిచ్చారు..!

– ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం

జిల్లాలో ఉచిత ఇసుక మాటున అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ముఖ్యంగా సిక్కోలు సరిహద్దుల్లో కాసుల వర్షం కురిపిస్తోంది. వంశధార నదీతీర గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారీతిన తవ్వకాలు చేపడుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్లకు ఎత్తి రాత్రీ పగలు తేడా లేకుండా రవాణా చేస్తున్నారు. రూ.లక్షల్లో ఆర్జిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ తంతు స్థానిక అధికారులకు తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ఉచిత ఇసుక ఒడిశాకు అక్రమ రవాణా

ఇక్కడి నుంచి యథేచ్ఛగా..

● **కొత్తూరు:** వంశధార నది నుంచి కడుము, పొన్నుటూరు, హంస, కుద్దిగాం, బంకి గ్రామాల నుంచి ట్రాక్టర్ల ద్వారా పర్లా ఖెముండి, కాశీనగర్‌కు తరలిస్తున్నారు. ట్రాక్టరు రూ.3 వేలకు రవాణా చేస్తున్నారు. మాకవరం, కురిగాం, మాతల బలద, కడుము గ్రామాల్లో ఖాళీ స్థలాల్లో పగలు సమయంలో నిల్వ చేస్తూ రాత్రి రవాణా చేస్తున్నారు.

● **హిరమండలం:** సుభలయ, భగీరథపురం, కొమనాపల్లి, రుగడ, గులుమూరు, కొండరాగోలు, పిండ్రువాడ, రెల్లివలస గ్రామాల్లో నిత్యం ట్రాక్టర్ల జాతరతో నదుల్లో ఇసుక తవ్వకాలు చేసి ఒడిశాకు తరలిస్తున్నారు.

● **మెళియాపుట్టి** మండలం నుంచి ఒడిశాలోని బిన్నాల, బాగుసల, బడగాం, అగరగంటి, శారదాపురం, సర్దాపురం, జంగాలపాడు గ్రామాల మీదుగా దందా సాగుతోంది.

మెళియాపుట్టి కూడలి నుంచి ఒడిశా గ్రామాలకు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న ఇసుక

కేసులు పెడతాం.. అనుమతి లేకుండా ఇసుక తవ్వి ఇతర రాష్ట్రాలకు తరలించడం నేరం. వాటికి స్థానిక అధికారులదే బాధ్యత. తనిఖీలు చేపట్టి వాహనాలు సీజ్ చేస్తాం. శాఖాపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తాం. – ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జేసీ

చర్యలు తీసుకునేవారేరీ..?

పాతపట్నం నియోజకవర్గంలో ఉచిత ఇసుక విధానానికి తూట్లు పొడుస్తూ అక్రమ దందా సాగిస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకునే అధికారులే లేకపోయారు. నిత్యం వంద సంఖ్యలో ట్రాక్టర్లు జాతరలా నాలుగు మండలాల నుంచి రాష్ట్ర సరిహద్దు దాటుకొని వెళ్తున్నా రెవెన్యూ, పోలీసు, గనుల శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. పాతపట్నం, మెళియాపుట్టి వద్ద ఉన్న వసుంధర తనిఖీ కేంద్రాల వద్ద కూడా పచ్చ జెండా ఊపేస్తున్నారు.

రేవులు మూతపడటంతో డిమాండ్..

ఒడిశాలోని కాశీనగర్ మండలం ఈదుడి, బూదర గ్రామాల్లోని ఇసుక రేవులు వరదల కారణంగా గత కొద్ది రోజులుగా నిలిచిపోయాయి. దీంతో అక్కడ ఇసుక కొరత ఏర్పడింది. ఇదే అదనుగా ఒడిశాలోని ఇసుక వ్యాపారులు, ట్రాక్టర్ యజమానులు, జిల్లాకు చెందిన కొందరు ఏకమయ్యారు. నదీతీర గ్రామాల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతూ.. అక్కడి రిజిస్ట్రేషన్‌తో ఉన్న వాహనాల్లోనే రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారు.

గేట్లు పడితే... పాట్లు మొదలైనట్లే

న్యూస్‌టుడే, పలాస, ఇచ్ఛాపురం/గ్రామీణం

అండర్ పాసేజ్, పై వంతెన లేక అవస్థలు

పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని రైలు నిలయాల సమీపంలో ఉండే రైల్వేగేట్లతో తిప్పలు తప్పడం లేదు. పూండి నుంచి పలాస మీదుగా ఇచ్ఛాపురం వరకు ఉండే రైల్వేగేట్లలో కాశీబుగ్గ, తాళభద్ర, బారువ, ఇచ్ఛాపురం ఎం.తోటూరు గేట్ల వద్ద అరగంటపైగా వాహనాలు నిలిచిపోతుండటంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇచ్ఛాపురం ఎం.తోటూరు గేటు వద్ద నిరీక్షిస్తున్న వాహనదారులు

ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల పరిధిలో పలాస రైలు నిలయం సమీపంలో ఉండే కాశీబుగ్గ లెవల్ క్రాసింగ్ గేటు పడితే 10 నిమిషాల నుంచి అరగంటపాటు వాహనాలు బారులుదీరుతున్నాయి. ఇంటర్ లాకింగ్ వ్యవస్థతో రైల్వే గేట్లు పనిచేస్తుండటంతో రైలు గేటు దాటిన 5 నిమిషాల తర్వాత లాక్ తెరుచుకోవడంతో రద్దీ తప్పడం లేదు.

ముందుగా ఒకవైపు వెళ్లే రైళ్లకు సిగ్నల్ ఇచ్చి గేటు మూసివేసి అదే సమయంలో రెండోవైపు నుంచి వచ్చే రైళ్ల కోసం గేటు తీయకపోవడంతో వాహనదారులు వేచి ఉండక తప్పడం లేదు.

కాశీబుగ్గలో పైవంతెన పనులు పూర్తికాకపోవడంతో గేటు పడితే అవస్థలే ఎదురవుతున్నాయి. ఇరువైపులా ట్రాఫిక్ నియంత్రించే అధికారులు లేకపోవడంతో గేటు తీసే సమయంలో ఒకేసారి రెండువైపుల నుంచి వాహనాలు వచ్చేసి ట్రాఫిక్ జాం అవుతుంది. వాస్తవంగా ఒక రైలు వెళ్లిన వెంటనే గేటు ఎత్తి ట్రాఫిక్ క్లియర్ అయిన తర్వాత రెండో రైలుకు గేటు వేయాల్సి ఉన్నా గూడ్స్, ప్యాసింజర్ రైళ్ల సంఖ్య పెరగడంతో ఒకేసారి రెండు రైళ్లు వెళ్లేలా గేట్లు వేస్తున్నారు.

పరిష్కార మార్గాలు

పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల పరిధిలో పూండి రైలు నిలయం వద్ద వాహనాల రద్దీలో అండర్ పాసేజ్ రహదారి నిర్మాణం చేయగా, కాశీబుగ్గ వద్ద పై వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కంచిలి వద్ద పైవంతెన పూర్తికావడంతో రైల్వేగేటు ఎత్తివేశారు. ఇచ్ఛాపురం ఎం.తోటూరు వద్ద అండర్ పాసేజ్ అవకాశమున్నా చిన్నపాటి వర్షం పడితే వరదనీరు నిల్వతో రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది.

● ఇచ్ఛాపురం, జాడుపూడి, కంచిలి, బారువ, మందస, సుమ్మాదేవి, పలాస, రాజపురం వద్ద ప్రాంతాల్లో రైల్వేగేట్లు ఉన్నా ఇచ్ఛాపురం, తాళభద్ర, కాశీబుగ్గ రైల్వేగేట్ల వద్ద ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉండటంతో త్వరతగతిన అండర్ పాసేజ్ లేదా పై వంతెనల నిర్మాణం చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

అదిగదిగో బోరు.. నీళ్లందని తీరు..

ఇచ్ఛాపురం పుర పరిధి పురుషోత్తపురం బృందావనం కాలనీలో మంచినీటి బోరు ఇబ్బందికర పరిస్థితిలో ఉంది. కాలనీ వాసులు వాడుకనీరు, తాగేనీటి కోసం బోర్లు, బావులపైనే ఆధారపడుతున్నారు. దీంతో పనికిరాని ముళ్ల మొక్కల్లో ఉన్న బోరు వద్దకు వెళ్లి నీరు సేకరించేందుకు మహిళలు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను కమిషనర్ నల్లి రమేష్ దృష్టికి తీసుకెళ్లగా.. బోరు పరిసరాలు శుభ్రం చేయిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

దారి.. కోతకు గురి

బహాడపల్లి నుంచి రాంపురం వెళ్లే దారి ఇది. ఉపాధి పథకం నిధులతో పదేళ్ల కిందట మట్టిరోడ్డు నిర్మించారు. గత ప్రభుత్వంలో కనీస నిర్వహణ పనులు జరగక పొదలతో ఇరుకుగా మారింది. మొంథా తుపాను వరదలకు రోడ్డు మొత్తం కోతకు గురై గోతులు ఏర్పడి అసౌకర్యంగా మారింది. ఉపాధి నిధులతో కొత్త పనుల్లో మరమ్మతులు చేయిస్తామని మండల ఇంజినీరు యామిని తెలిపారు. – న్యూస్‌టుడే, మందస

నిర్లక్ష్య తోరణం

మందస కంచుమయికాలనీలో ఓ వీధి శివారులోదీ దృశ్యం. విద్యుత్తు స్తంభం, తీగలను లతలు చుట్టుకున్నాయి. సోంపేట, మెళియాపుట్టి రహదారి పక్కనే ఈ దుస్థితి నెలకొని ఉన్నా.. విద్యుత్తు శాఖ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశీలించి అల్లుకున్న లతలను తొలగిస్తామని విద్యుత్తు శాఖ ఏఈ జి.వి.రమణ తెలిపారు.
– న్యూస్‌టుడే, మందస

పొంచి ఉన్న ప్రమాదం

బెనుగానిపేటలో ఉన్న బావి స్థానికుల నీటి అవసరాలు తీరుస్తుంది. ప్రస్తుతం బావి చుట్టూ నాలుగువైపులా పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో మహిళలు బావి దగ్గరకు వెళ్లాలంటే భయపడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఏవో కె.రామారావుకు వివరణ కోరగా సర్పంచితో మాట్లాడి మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

భవనం పూర్తయ్యేనా..?

కవిటి మండలం లండారిపుట్టుగలో గత వైకాపా ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన రైతు సేవా కేంద్రం అసంపూర్తిగా నిలిచిపోయింది. ఆ కేంద్ర సిబ్బంది సచివాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. దీంతో సిబ్బంది, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. త్వరగా భవనం పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. దీనిపై ఏడీఏ భవానీ శంకర్‌ను వివరణ కోరగా నిధులు రాగానే భవన నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు.
– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

కలిసి పోతోంది.. కన్నీరు పెట్టిస్తోంది

వరి దిగుబడులను దెబ్బతీస్తున్న కలుపు

– న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

వరి పంటను పోలి ఉండే కలుపు రైతులు వేసిన ఎరువులతో ఏపుగా పెరిగి దిగుబడులపై ప్రభావం చూపుతూ రైతులను కోలుకోలేని దెబ్బతీస్తోంది. పూతిక, బంట్లు తదితర కలుపు మొక్కలతో అన్నదాతలు కుదేలవుతున్నారు. నరసన్నపేట మండలం చెన్నాపురం, ఉర్లాం, నడగాం, చింతువానిపేట, బడ్డవానిపేట, బాలసీమ గ్రామాల్లో దీని ప్రభావం ఎక్కువగా ఉంది.

బడ్డవానిపేట సమీపంలో చేనుతో పాటు ఏపుగా పెరిగిన కలుపు

అదనపు భారం

అచ్చం వరిలాగే ఉండటంతో పంట పొట్టదశకు వచ్చే వరకు గుర్తించలేక తీవ్రంగా నష్టపోతున్నారు. పొలంలో ఎక్కువ మొత్తంలో వ్యాపిస్తే చేతులెత్తేసి అలాగే వదిలేస్తున్నారు. తక్కువగా ఉన్నచోట కూలీలతో తీయించి రెక్కల కష్టాన్ని రక్షించుకుంటున్నారు. అదనపు భారంతో అవస్థలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యాజమాన్య పద్ధతులతో నివారణ

ఈ కలుపు మొక్కలను వైల్డ్‌రైస్, ప్లాస్టిక్ వరి, కొండ వరి అని పిలుస్తారు. ఈ కలుపు మొక్కలు గాలి, నీరుతో పాటు గొర్రెలు, మేకల విసర్జితాల వల్ల వ్యాప్తి చెందుతాయి. వెద విధానం ద్వారా సాగు చేస్తుండటంతో సమస్య అధికమైంది. గతంలో వరి పొలాలను దమ్ము చేసి కొన్ని రోజులు మురగబెట్టి నాట్లు వేసే వారు. దీంతో కలుపు మొక్కల జాడ ఉండేది కాదు. యాజమాన్య పద్ధతులతో వీటిని పూర్తిగా నివారించేందుకు అవకాశం ఉంది. రైతులు ఆ దిశగా ప్రయత్నాలు చేయాలి. – పైడి సూర్యకుమారి, వ్యవసాయాధికారిణి

తీవ్రంగా నష్టపోయా..

ఈ సీజన్‌లో 15 ఎకరాల్లో వరిసాగు చేశాను. అందులో సుమారు 5 ఎకరాలు కలుపు ధాటికి నష్టపోయాను. పంట చేతికి వచ్చే సమయం వరకు తెలియలేదు. పైరు బాగుందని, మంచి దిగుబడులు వస్తాయని ఆశించాను. చివరికి నిరాశే మిగిలింది. – పండి కృష్ణారావు, రైతు, బడ్డవానిపేట

నరసన్నపేట నియోజకవర్గం వివరాలు

మండలం	నరసన్నపేట	పోలాకి	జలుమూరు	సారవకోట	మొత్తం
వరిసాగు (ఎకరాల్లో)	18,771	20,868	21,871	18,840	80,350

18 కిలోల గంజాయి స్వాధీనం ఇద్దరి అరెస్టు

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: ఒడిశా రాష్ట్రం రాయగడ నుంచి ముంబయికి రైళ్ల ద్వారా గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరిని తెలంగాణలోని సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.9.41 లక్షల విలువైన 18 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సాయిఈశ్వర్‌గౌడ్‌తో కలిసి డీఎస్పీ జావేద్ వివరాలు వెల్లడించారు. బిహార్ రాష్ట్రం నలంద జిల్లా మార్సింగ్‌పూర్ కాతోల గ్రామానికి చెందిన అజయ్‌కుమార్(35), అతని వదిన రినాదేవి(40) గంజాయి సరఫరా చేసి సులభంగా డబ్బులు సంపాదించవచ్చని నిర్ణయించుకున్నారు. ఒడిశాలో గంజాయిని సరఫరా చేసే పంకజ్‌తో వారికి పరిచయం ఏర్పడింది. గంజాయి బ్యాగులను తీసుకెళ్లి ముంబయిలో ఇస్తే రూ.5 వేల వంతున అందజేస్తానని పంకజ్ చెప్పడంతో వీరు అంగీకరించారు. ఈ నెల 10వ తేదీన పంకజ్ నుంచి 18 కిలోల గంజాయిని రెండు సూట్‌కేసుల్లో తీసుకుని రాయగడ నుంచి దువ్వాడకు వచ్చారు. అక్కడి నుంచి ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ రైలులో ముంబయికి బయలుదేరారు. 11వ తేదీన రైలు సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకున్న సమయంలో తనిఖీలు చేపడుతున్న జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు వీరి వద్ద ఉన్న సూట్‌కేసులను తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న పంకజ్‌పై కేసు నమోదు చేశారు.



(c) eenadu

అర్హులందరికీ మగళిర్ ఉరిమై తొగై

వినతి అందుకుంటున్న మంత్రి నాజర్

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా ఆవడి సమీపం తిరునిండ్రవూరులో ఉంగళుడన్ స్టాలిన్ శిబిరం బుధవారం నిర్వహించారు. మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ ఉషారాణి అధ్యక్షతన రాష్ట్ర మంత్రి నాజర్ ముఖ్య అతిథిగా హాజరై 524 మంది నుంచి వినతులు స్వీకరించి సంబంధిత అధికారులకు అప్పగించి 45 రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. రాష్ట్రంలో అర్హులందరికీ మగళిర్ ఉరిమై తొగై అందుతుందని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ జీవిత తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతపై ఆరోపణలు అవాస్తవం

మంత్రి గీతాజీవన్

ప్యారిస్, న్యూస్‌టుడే: లైంగిక నేరాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పించినట్లు మంత్రి గీతాజీవన్ అన్నారు. నాగర్‌కోవిల్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదని అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారన్నారు. దేశంలో సురక్షితమైన నగరాలు చెన్నై, కోయంబత్తూరు అని కేంద్ర ప్రభుత్వమే వెల్లడించిందని గుర్తు చేశారు. లైంగిక నేరాలకు గురయ్యే మహిళలు డీఎంకే హయాంలో ఫిర్యాదు చేసేందుకు ధైర్యంగా ముందుకు వస్తున్నారన్నారు. సామాజిక సంక్షేమశాఖలో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు చేపడతామని తెలిపారు.

కలైజ్ఞర్ ట్రస్టు తరఫున ఆర్థిక సాయం

చెన్నై, న్యూస్‌టుడే: కలైజ్ఞర్ ట్రస్టు తరఫున నవంబరులో డీఎంకేకు చెందిన 8 మంది నిరుపేదలకు రూ.25వేలు చొప్పున రూ.2లక్షల సాయాన్ని పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ అందించారు. అరియలూర్ జిల్లా జయంకొండంకు చెందిన పునితం, చేరన్‌మాదేవికి చెందిన సౌందరవల్లి, తూత్తుకుడి జిల్లా కళుగుమలైకు చెందిన కరుప్పసామి పాండియన్, కన్నియాకుమరి జిల్లా చెరుప్పానూర్‌కు చెందిన సిమ్సన్, చెన్నై జిల్లా తిరువొట్రియూర్‌కు చెందిన తిరుమలై, వేలూర్ జిల్లా సెతుక్కరైకు చెందిన గోమతి, తిరువణ్ణామలై జిల్లా కీళ్‌వణక్కంపాడికి చెందిన రాధాకృష్ణన్, విళుపురం జిల్లా వల్లైయాంపట్టుకు చెందిన జయరామన్‌కు ఈ మొత్తానికి సంబంధించిన డీడీలను తపాలా ద్వారా పంపుతున్నట్లు కలైజ్ఞర్ ట్రస్టు ప్రకటనలో తెలిపింది.

తారాస్థాయికి తండ్రీకొడుకుల తగవు

✦ పీఎంకేలో కొలిక్కిరాని సమస్యలు ✦ ఎన్నికలు దగ్గరపడుతున్నా అదే తీరు ✦ తీవ్రమవుతున్న విభేదాలు

- న్యూస్‌టుడే, సైదాపేట

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్నాయి. అన్ని పార్టీలు ప్రచారం, కూటముల ఏర్పాటు తదితర పనుల్లో నిమగ్నమయ్యాయి. అదే సమయంలో పీఎంకేలో అంతర్గత సమస్యలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. దీంతో పీఎంకే కూటమి చర్చల మాట అటుంచితే అసలు ఎన్నికల్లోపు అంతర్గత సమస్యలు పరిష్కారమవుతాయా? అనే ప్రశ్న మొదలైంది.

పీఎంకే వ్యవస్థాపకులు రామదాస్ ● అన్బుమణి రామదాస్

జయాపజయాలు

మూడు ఎన్నికల్లో ప్రధాన పార్టీలతో పొత్తు లేకుండా 6 శాతం ఓట్లు సాధించింది ఒక్క పీఎంకేనే. తర్వాత 1998లో అన్నాడీఎంకే కూటమిలో ఐదు నియోజకవర్గాల్లో పోటీ చేసి నాలుగింట విజయం సాధించింది. 1999 లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే.. ఎన్డీయే నుంచి వైదొలగడంతో డీఎంకేతో భాజపా జతకట్టింది. ఆ కూటమిలో ఏడు నియోజకవర్గాల్లో పోటీ చేసిన పీఎంకే ఐదు చోట్ల విజయం సాధించి వాజ్‌పేయీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకుంది. 2001లో అన్నాడీఎంకేతో కూటమి ఏర్పాటు చేసి 20 చోట్ల గెలుపొందింది. 2004 లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని కూటమిలో పోటీ చేసిన అన్ని నియోజకవర్గాల్లో జయకేతనం ఎగురవేసింది. అయితే 2009 లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో జతకట్టి పోటీ చేసిన అన్నిచోట్లా పరాజయం పాలైంది. తర్వాత 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయేలో చేరి ఒక్కచోట మాత్రమే విజయం సాధించింది. తర్వాత 2016లో ద్రావిడ పార్టీలతో కూటమి లేదని చెప్పి అన్బుమణి ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించి ఎన్నికలు ఎదుర్కొంది. అయితే ఒక్క చోట కూడా విజయం దక్కలేదు. అయినా 5.36 శాతం ఓట్లు దక్కించుకుంది. అయితే మళ్లీ 2019 లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే-భాజపాతో కూటమి ఏర్పాటు చేయటంతో పీఎంకేపై విమర్శలు వెల్లువెత్తాయి. ఆ ఎన్నికల్లోనూ పీఎంకే ప్రభావం చూపలేదు. 2021లో అదే కూటమిలో పోటీ చేసి 23 స్థానాల్లో పోటీ చేయగా ఐదుచోట్ల గెలిచింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే లేని ఎన్డీయేలో 10 స్థానాల్లో పోటీ చేసి ఎక్కడా గెలుపు సాధించలేదు. అంతేకాకుండా 4.4 శాతం ఓట్లు పొంది రాష్ట్ర పార్టీ హోదా కోల్పోయింది.

అవి రెండే అవకాశాలు

చివరిగా జరిగిన 2024 లోక్‌సభ ఎన్నికల్లో భాజపా కూటమిలో పీఎంకే పోటీ చేసింది. అన్నాడీఎంకే డీఎండీకేలు కలిసి పోటీ చేశాయి. 2026 అసెంబ్లీ ఎన్నికలకు అన్నాడీఎంకే, భాజపా పొత్తు కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. అయితే ఎన్డీయేలో ఉన్న పీఎంకే ఇంతవరకు పొత్తు నిర్ణయం ప్రకటించలేదు. ప్రస్తుతం పీఎంకేకు ఉన్న ఒకేఒక్క అవకాశం ఎన్డీయేలో చేరడం. లేదా టీవీకేతో కలవడం. ఇందుకు అవకాశం చాలా తక్కువని రాజకీయ నిపుణుల అంచనా. అన్బుమణి వర్గం మాత్రం ఎన్డీయేకు దగ్గరవుతుండగా, రామదాస్ వర్గం మాత్రం డీఎంకే వైపు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

రంగంలోకి కుమార్తె

2026 ఎన్నికలు దగ్గర పడుతుండగా పీఎంకే వ్యవస్థాపకులు రామదాస్, ఆయన కుమారుడు అన్బుమణి మధ్య పొరపొచ్చాలు వచ్చాయి. ఎక్కువ మంది పార్టీ నిర్వాహకులు అన్బుమణి వైపు ఉన్నారని, అయితే కార్యకర్తల మద్దతు మాత్రం రామదాస్‌కు ఉన్నట్లు తెలుస్తోంది. అన్బుమణికి చెక్ పెట్టేందుకు ఇటీవల కుమార్తె గాంధీమతిని కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా రామదాస్ నియమించడం గమనార్హం. ఇటీవల సేలంలో రామదాస్ మద్దతు ఎమ్మెల్యే అరుళ్ వర్గానికి, అన్బుమణి వర్గానికి ఘర్షణ జరిగింది. ఎన్నికల నాటికి సమస్యలు సర్దుమణుగుతాయా? లేక తండ్రీకొడుకులు వేర్వేరుగా ఎన్నికలు ఎదుర్కొంటారా? అనేది తేలాల్సి ఉంది.

‘శ్రీరామచంద్ర’కు ఈటీఏపీ ధ్రువపత్రం

వడపళని, న్యూస్‌టుడే: ‘శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్’ (ఎస్ఆర్ఐహెచ్ఈఆర్) లోని రేడియాలజీ విభాగానికి యూరోపియన్ ట్రైనింగ్ అక్రెడిటేషన్ ప్రోగ్రాం(ఈటీఏపీ) ధ్రువపత్రం లభించింది. 6న సర్టిఫికెట్ అందినట్లు శ్రీరామచంద్ర బుధవారం ఒక ప్రకటన వడుదల చేసింది. రేడియాలజీ విద్య, రేడియోలజీ ద్వారా కచ్చితమైన వ్యాధిని గుర్తించడం వంటి వాటిల్లో చేస్తున్న సేవలకు గుర్తుగా ధ్రువపత్రం అందినట్లు, ఐదేళ్ల పాటు చెల్లుబాటులో ఉంటుందని ఆ విభాగ హెడ్, డాక్టర్ పీఎం వెంకటసాయి పేర్కొన్నారు.

పాండి వర్సిటీలో కార్యశాల

ప్రసంగిస్తున్న ప్రకాశ్‌బాబు

వడపళని, న్యూస్‌టుడే: ‘లెర్నింగ్ హిస్టరీ, రైటింగ్ ఫ్యూచర్స్ ఏ వర్క్‌షాప్ ఫర్ రిఫ్లెక్షన్ అండ్ రైటింగ్’ అంశంపై పాండిచ్చేరి వర్సిటీలో కార్యశాల జరిగింది. వర్సిటీలోని ‘సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్,’ ‘ఇండియన్ అసోసియేషన్ ఫర్ ఉమెన్స్ స్టడీస్’(ఐఏడబ్ల్యూఎస్)తో కలిసి 10, 11, తేదీల్లో కార్యశాల జరిగిందని వర్సిటీ బుధవారం ప్రకటన విడుదల చేసింది. ఉపకులపతి, ఆచార్యులు పి.ప్రకాశ్‌బాబు కార్యశాలను ప్రారంభించారు. దేశంలో మహిళా అధ్యయనాలు ఒక విద్యా విభాగంగా, సామాజిక పరివర్తన కోసం ఓ ఉద్యమంగా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. ఐఐటీ ఆచార్యులు, ఐఏడబ్ల్యూఎస్ డాక్టర్ కల్పన కరుణాకరన్ తదితరులు ప్రసంగించారు.

వరద మృతులకు నివాళులు

వేలూరు, న్యూస్‌టుడే: వాణియంబాడి సమీపాన 1903లో పాలారు నదిలో సంభవించిన వరదల్లో 200 మంది మృతి చెందారు. మృతుల జ్ఞాపకార్థం బుధవారం వాణియంబాడి వారసంత మైదానంలోని స్మారక స్తూపం వద్ద నివాళులు అర్పించారు. తిరుపత్తూరు జిల్లా కలెక్టర్ శివసౌందరవల్లి, వాణియంబాడి ఎమ్మెల్యే సెందిల్‌కుమార్, వాణియంబాడి మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఉమాబాయి శివాజీ గణేశన్ తదితరులు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

తిరుచ్చెందూర్ ఆలయంలో నటుడు యోగి బాబు

ప్యారిస్: తిరుచ్చెందూర్ ఆలయంలోని సుబ్రహ్మణ్యస్వామిని నటుడు యోగి బాబు చేసుకున్నారు. మంగళవారం రాత్రి ఆలయానికి వచ్చిన ఆయన బంగారు రథం లాగారు. ఆలయ అర్చకుల తరఫున పూలమాల వేసి స్వాగతం పలికారు.

మృతుల కుటుంబానికి ప్రభుత్వ సాయం వెల్లడి

చెన్నై, న్యూస్‌టుడే: మదురై జిల్లాలో పోలీసు వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో ముగ్గురి మృతిపై ముఖ్యమంత్రి స్టాలిన్ దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రురాలు సోనేశ్వరికి మదురై ప్రభుత్వ ఆస్పత్రిలో ఉత్తమ చికిత్స అందించాలని ఆదేశించారు. మృతుల కుటుంబానికి, బంధువులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతులకు రూ.3 లక్షలు చొప్పున బాధిత కుటుంబీకులకు, రూ.లక్షను క్షతగాత్రురాలికి సీఎం పబ్లిక్ రిలీఫ్ ఫండ్ నుంచి అందించాలని ఆదేశించారు.

పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న గవర్నర్ ఆర్.ఎన్.రవి

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై జిల్లా జవ్వాదుకొండ గునిగన్నూర్ గ్రామంలో నూతన పాఠశాల భవనానికి మంగళవారం గవర్నర్ ఆర్.ఎన్.రవి శంకుస్థాపన చేశారు. భవనాన్ని సీఎస్ఆర్ కింద ఆర్మోర్డ్ వెహికల్స్ నిగం లిమిటెడ్ ఆవడి సహాయంతో నిర్మించారు. అనంతరం తల్లిదండ్రులకు వెల్ఫేర్ కిట్లను గవర్నర్ పంపిణీ చేశారు. చెన్నై ఆవడి ఏవీఎన్ఎల్ సీఎండీ సంజయ్ దివివెడి సహా పలువురు పాల్గొన్నారు.

రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

☛ మాజీ మంత్రి కె.సి.వీరమణి

వేలూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, వాటిని సరిదిద్దేందుకు ప్రభుత్వం అగచాట్లు పడుతోందని మాజీ మంత్రి వీరమణి విమర్శించారు. వేలూరు సమీపంలోని కాంగేయనల్లూరు మురుగ కృపానంద స్వామి వారియర్ 32వ గురుపూజ బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి మాట్లాడుతూ.. శాంతిభద్రతలపై ఈపీఎస్ చెప్పిన విషయాలు వాస్తవమేనన్నారు.

ఐపీఎస్ అధికారిపై ఆరోపణలు రుజువు చేయకపోతే జరిమానా

మదురై ధర్మాసనం హెచ్చరిక

ప్యారిస్, న్యూస్‌టుడే: విచారణ ఖైదీల దంతాలను పీకేసిన కేసులో ఐపీఎస్ అధికారి బల్వీర్ సింగ్‌పై ఆరోపణలు రుజువు చేయకపోతే ప్రభుత్వానికి రూ.20 లక్షలు జరిమానా విధించాల్సి వస్తుందని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం హెచ్చరించింది. తిరునెల్వేలి జిల్లా అంబాసముద్రం ఏఎస్పీగా ఉన్న బల్వీర్ సింగ్ విచారణ ఖైదీల దంతాలను పీకేసి, హింసించినట్లు బల్వీర్ సింగ్ తదితర 12 మందిపై తిరునెల్వేలి సీబీసీఐడీ కేసు నమోదు చేసింది. ఇందుకు వ్యతిరేకంగా బల్వీర్ సింగ్ మదురై ధర్మాసనంలో పిటిషన్ దాఖలు చేశారు. అంబాసముద్రంలో 2022లో ఏఎస్పీగా నియమితులైనట్లు, మత్తుపదార్థాలు తరలించిన వారిని అరెస్టు చేసినట్లు, వారి నుంచి 130 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు, ఇందుకు డీజీపీ ప్రశంసించారన్నారు. నిజాయితీగా విధులు నిర్వహించి, ప్రజల రక్షణకు సామాజిక విద్రోహులు, రౌడీలపై కఠిన చర్యలు చేపట్టినట్లు, తనపై ఉన్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. దురుద్దేశంతో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. తమిళం తన మాతృభాష కాదని, అభియోగపత్రం, సాక్షుల వాంగ్మూలం ఆంగ్లంలోకి అనువదించకుండా అందించడం చట్ట ప్రకారం ఆమోదించదగ్గది కాదన్నారు. ఈ పిటిషన్‌ను విచారించిన న్యాయమూర్తి జస్టిస్ సమీమ్ అహ్మద్.. ఎస్సై ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదు చేశారని, అలా చేస్తే అధికారులు నిజాయితీగా పని చేయడానికి ఎలా ముందుకొస్తారని ప్రశ్నించారు. అనంతరం ఆరోపణలకు నిషేధం విధించాలని పిటిషన్ దాఖలు చేయడానికి పిటిషనర్‌కు అనుమతిచ్చారు. పిటిషనర్‌పై నమోదైన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను నివేదికగా దాఖలు చేయాలని సీబీసీఐడీకి ఉత్తర్వులు ఇచ్చారు. విచారణ 21కి వాయిదా వేశారు.

క్షతగాత్రులతో సీబీఐ దర్యాప్తు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కరూర్ తొక్కిసలాటలో గాయపడినవారు సీబీఐ దర్యాప్తునకు హాజరయ్యారు. నాలుగు రోజులుగా క్షతగాత్రుల వద్ద వివరాలు ఆరా తీస్తున్నారు. బుధవారం ఉదయం ముగ్గురు హాజరయ్యారు.

దర్యాప్తునకు హాజరయ్యేందుకు వస్తున్న క్షతగాత్రులు

వన్నియర్లకు రిజర్వేషన్ కోరుతూ డిసెంబరు 17న జైల్‌భరో

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: వన్నియర్లకు 15 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా 234 శాసనసభ నియోజకవర్గాల్లో డిసెంబరు 17న జైల్‌భరో చేపట్టనున్నట్లు పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి ప్రకటించారు. చెన్నై ఈస్ట్‌కోస్ట్ రోడ్డు అక్కరైలోని కల్యాణ మండపంలో పీఎంకే కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తన ప్రాణం ఉన్నంత వరకు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఉద్ఘాటించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ తనకు మామిడి గుర్తు కేటాయిస్తూ ఆదేశించిందని, అలాంటప్పుడు కొందరు సుప్రీంకోర్టులో కేసు వేస్తామని బెదిరిస్తుండటం హాస్యాస్పదంగా ఉందని తన తండ్రి రామదాస్‌ను ఉద్దేశించి అన్నారు.

రేషన్ దుకాణాల్లో గోధుమల కొరత

విల్లివాక్కం, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా వెయ్యికి పైగా రేషన్ దుకాణాల్లో గోధుమ కొరత కనిపిస్తోందని పలు పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అవసరమైన ఆహార వస్తువులు కేటాయిస్తున్న నేపథ్యంలో వాటిని ప్రజలకు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని తెలిపారు.

యూపీఎస్సీలో 155 మంది ఉత్తీర్ణత

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: యూపీఎస్సీలో రాష్ట్రానికి చెందిన 155 మంది ఉత్తీర్ణులవడం అమితానందంగా ఉందని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఏటా వంద మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలనే ఉన్నత ఆశయంతో ప్రవేశపెట్టిన నాన్ ముదల్వన్ పథకం కింద లబ్ధిపొందుతున్న 87 మంది యూపీఎస్సీ పరీక్షల్లో నెగ్గడం రెట్టింపు ఉత్సాహం ఇచ్చిందన్నారు.

ఆళియార్-వాల్‌పారై రోడ్డులో ఏనుగు సంచారం

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: కోయంబత్తూరు జిల్లా పొళ్లాచ్చిలో బుధవారం ఉదయం సిల్లికొంబన్ అనే అడవి ఏనుగు నీరు తాగడానికి ఆళియార్-వాల్‌పారై రహదారిలో వెళ్లింది. సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న అటవీశాఖ అధికారులు పర్యాటక వాహనాలను రోడ్డు దాటకుండా ఆపారు. నీరు తాగిన ఏనుగు కొన్ని నిమిషాల్లో ఆళియార్ అటవీ ప్రాంతానికి వెళ్లిపోయింది. అనంతరం వాహనాల రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి.

చెన్నై నందనంలోని సమీకృత వాణిజ్య పన్నుల శాఖ సమావేశ హాలులో బుధవారం వాణిజ్యపన్నులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి మూర్తి అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. ఉన్నతాధికారులు శిల్పా ప్రభాకర్ సతీష్, ఎస్.రాజన్, ఎంఎన్ పూంగొడి తదితరులు పాల్గొన్నారు.
–వేళచ్చేరి, న్యూస్‌టుడే

స్టాలిన్‌తో వైగో భేటీ

స్టాలిన్‌ను శాలువాతో సత్కరిస్తున్న వైగో

చెన్నై, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి స్టాలిన్‌తో ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో భేటీ అయ్యారు. రాబోయే శాసనసభ ఎన్నికలు దృష్ట్యా డీఎంకే కూటమి గెలుపు కోసం జనవరి 2న తిరుచ్చి నుంచి మదురై వరకు వైగో నేతృత్వంలో సమానత్వ పాదయాత్ర జరగనుంది. అన్నా అరివాలయంలో బుధవారం స్టాలిన్‌ను వైగో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. పాదయాత్ర విజయవంతం కావాలంటూ వైగోకు స్టాలిన్ శుభాకాంక్షలు తెలిపారు.

మూడు నియోజకవర్గాల నిర్వాహకులతో..

చెన్నై: మూడు శాసనసభ నియోజకవర్గాల డీఎంకే నిర్వాహకులతో ఆ పార్టీ అధ్యక్షుడు ముఖ్యమంత్రి స్టాలిన్ భేటీ అయ్యారు. శాసనసభకు మరి కొన్ని నెలల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నియోజకవర్గాల వారీగా డీఎంకే నిర్వాహకులతో స్టాలిన్ ‘ఉడన్‌పిరప్పే వా’ పేరిట వన్ టు న్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అన్నా అరివాలయంలో బుధవారం పుదుకోట్టై, వేదారణ్యం, పల్లావరం నియోజకవర్గాల నిర్వాహకులతో వన్ టు వన్ నిర్వహించారు. నియోజకవర్గాల్లో రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకుని పలు సూచనలు అందించారు. పుస్తకాలు కానుకగా అందించారు.

వన్ టు వన్ నిర్వహిస్తున్న స్టాలిన్

డీఎంకేలో చేరిక

చెన్నై: డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన ఆ పార్టీలో 500 మంది చేరారు. శివగంగై, ఈరోడ తదితర జిల్లాలకు చెందిన పలు పార్టీల నిర్వాహకులు, కార్యకర్తలు సుమారు 500 మంది బుధవారం అన్నా అరివాలయంలో స్టాలిన్ సమక్షంలో డీఎంకేలో చేరారు. వెంట మంత్రి కేఆర్ పెరియకరుప్పన్, డీఎంకే సమాచార సంబంధాల కమిటీ ఉపాధ్యక్షుడు మరుదు అళగురాజ్, విద్యార్థి విభాగం ఉప కార్యదర్శి రామకృష్ణన్ తదితరులు ఉన్నారు.

రూ.32 కోట్లతో పొరునైలో మ్యూజియం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరునెల్వేలి జిల్లా పొరునైలో రూ.32 కోట్లతో నిర్మితమవుతున్న మ్యూజియం తమిళ సంస్కృతిని ప్రపంచ దేశాలకు చాటిచెప్పనుందని మంత్రి తంగం తెన్నరసు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అతి ప్రాచీన నాగరికతకు ఆనవాళ్లుగా ఉన్న తిరునెల్వేలి తామరభరణి నదీ తీరం వెంబడి ఉన్న ఆదిచ్చనల్లూర్, కొర్కై, శివకళలో, నంబియార్ నదీ తీరంలోని తులకర్‌పట్టిలో పురావస్తుశాఖ నిర్వహించిన తవ్వకాల్లో లభించిన వస్తువులను పొరునై మ్యూజియంలో ఉంచనున్నట్లు వెల్లడించారు.

అభివృద్ధి పనులపై మంత్రి సమీక్ష

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కడలూర్ జిల్లా చిదంబరం పురపాలక సంఘంలో పలు పథకాల కింద రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పురపాలక సంఘంలో రూ.208 కోట్లతో చేపడుతున్న కొల్లిడం సంయుక్త నీటి పథకం పనులు తుది దశకు చేరుకున్నాయి. బుధవారం ఉదయం కడలూర్ కలెక్టర్ శిబి ఆదిత్య సెందిల్ కుమార్ నేతృత్వంలో మంత్రి ఎంఆర్కే పన్నీర్‌సెల్వం పురపాలక సంఘం సమావేశం హాల్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించి పనుల వివరాలను అడిగి తెలుసుకొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయండి

సామాజిక భవనం నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మంత్రి శేఖర్‌బాబు

చెన్నై, న్యూస్‌టుడే: రాయపురం శాసనసభ నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మంత్రి పి.కె.శేఖర్‌బాబు బుధవారం పరిశీలించారు. 57వ డివిజన్ వాల్ టాక్స్ రోడ్డు వీవోసీ వీధిలో రూ.8.55 కోట్ల వ్యయంతో జరుగుతున్న సామాజిక భవనం, ఉత్తర చెన్నై అభివృద్ధి పథకం కింద 54వ డివిజన్ చెన్నై ఉన్నత పాఠశాలలో రూ.1.41 కోట్లతో జరుగుతున్న అదనపు తరగతి గది, సీఎండీఏ తరఫున అన్నాపిళ్లై వీధిలోని సమీకృత ప్రాంగణం, మూలకొత్తళంలో జరుగుతున్న కమ్యూనిటీ హాళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వెంట మేయర్ ప్రియ, సీఎండీఏ ముఖ్య కార్యదర్శి శివజ్ఞానం తదితరులు ఉన్నారు.

ఎంపీ కదిర్ ఆనంద్ కేసు విచారణ నేటికి వాయిదా

వేలూరు, న్యూస్‌టుడే: 2019 పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఆదాయ పన్ను శాఖ నిర్వహించిన తనిఖీల్లో అధికారులు రూ.11 కోట్లు స్వాధీనం చేసుకోగా ఈ నగదును డీఎంకే అభ్యర్థి కదిర్ ఆనంద్ తరఫున ఓటర్లకు పంపిణీ చేసేందుకు కాట్పాడికి చెందిన డీఎంకే నాయకుడు పూంజోలై శ్రీనివాసన్ సిమెంట్ గోదాములో దాచి ఉంచినట్లు గుర్తించారు. ఎన్నికను రద్దు చేసి తిరిగి నిర్వహించగా కదిర్ ఆనంద్ గెలుపొందారు. ఈ నిమిత్తంగా ఎంపీ, అతని మద్దతుదారులు పూంజోలై శ్రీనివాసన్, దామోదరన్‌లపై పలు సెక్షన్ల కింద కాట్పాడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కేసు వేలూరు జ్యుడిషియల్ ఆర్బిట్రేషన్ కోర్టులో బుధవారం విచారణకు వచ్చింది. 13న గురువారం కోర్టుకు హాజరుకావాలని ఎంపీని ఆదేశించారు.

మెట్రో ప్రాజెక్టు పనుల పరిశీలన

మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) ఆధ్వర్యంలో జరుగుతున్న మెట్రో రెండో దశ ప్రాజెక్టు పనులను ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్(ఏఐఐబీ) బృందం పరిశీలించింది. ఎయిర్‌పోర్ట్ నుంచి కిళాంబాక్కం(15.46 కి.మీ), పట్టాభిరాం నుంచి ఆవడి మీదుగా కోయంబేడు(21.76 కి.మీ) ప్రాంతాలను మంగళవారం, బుధవారం పూనమల్లి బైపాస్ నుంచి సుంగువాసత్రం(28 కి.మీ) ప్రాంతాన్ని సందర్శించారు. సీఎంఆర్ఎల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ టి.అర్జునన్, జాయింట్ జనరల్ మేనేజరు నరేంద్రకుమార్ తదితర అధికారులు వెంట ఉన్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

వడపళని, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ చేపడుతున్న మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాంగాడు, మాతూరు ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలగనుంది. ఈ మేరకు అధికారులు ప్రకటన విడుదల చేశారు.

ఆదాయపు పన్నుశాఖ సోదాలు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: చెన్నై ఈస్ట్‌కోస్ట్ రోడ్డులో ఈచ్చంబాక్కం సమీపంలోని వెటుట్టవాంగేనికి చెందిన డాక్టర్ సామ్యూవేల్ మధుమేహం క్లినిక్ నిర్వహిస్తున్నారు. ఆదాయపు పన్ను ఎగవేతకు పాల్పడినట్లు ఫిర్యాదు అందడంతో సదరు శాఖ అధికారులు ఆయన ఇంట్లో బుధవారం తెల్లవారుజామున సోదాలు నిర్వహించారు. అదే ప్రాంతంలోని సార్బానంద అనే ప్రముఖుని నివాసంలోనూ సోదాలు చేపట్టారు.

ప్రైవేటు బస్సు యజమానుల సమ్మె

మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు తిరుమూర్తి

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: ప్రైవేటు బస్సుల సమ్మె ప్రారంభమై నాలుగు రోజులైన నేపథ్యంలో కార్మికులు జీవనోపాధిని కోల్పోయారని, రాష్ట్ర ప్రభుత్వం సమస్యకు పరిష్కారం చూపాలని బస్సు యజమానుల సంఘం డిమాండ్ చేసింది. పొరుగు రాష్ట్రాల్లో ప్రత్యేక పన్నులు విధించడాన్ని నిరసిస్తూ సమ్మె చేస్తున్నారు. కోయంబత్తూరు జిల్లా ప్రైవేటు బస్సు యజమానుల సంఘం అధ్యక్షుడు తిరుమూర్తి, కార్యదర్శి సెందిల్‌కుమార్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఇంత పన్ను చెల్లించి వాహనాలు నడపలేమన్నారు. కోయంబత్తూరులోనే 3500 మందికి పైగా కార్మికులు ప్రభావితమయ్యారని చెప్పారు.

జనవరి 12 నుంచి వందేభారత్ రైలు నరసాపురం వరకు పొడిగింపు

వడపళని, న్యూస్‌టుడే: డాక్టర్ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ నుంచి విజయవాడ వరకు వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును జనవరి 12వ తేదీ నుంచి నరసాపురం వరకు పొడిగిస్తున్నట్లు దక్షిణ రైల్వే బుధవారం ప్రకటన విడుదల చేసింది. ● **20677** చెన్నై సెంట్రల్‌లో జనవరి 12వ తేదీ 05.30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 14.10కి నరసాపురం చేరుతుంది. ● **20678** నరసాపురంలో అదే రోజు 14.50కి బయలుదేరి 23.45 గంటలకు చెన్నై సెంట్రల్ వస్తుంది. రేణిగుంట, నెల్లూరు, ఒంగోలు, తెనాలి, విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నరసాపురం స్టేషన్లలో ఆగుతుంది.

పతక వీరులకు అభినందనలు

విజేతలతో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: చైనాలో నిర్వహించిన ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్ పోటీల్లో పతకాలు సాధించిన వారిని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధిని చెన్నైలో బుధవారం అభినందించారు. ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

నేడు పలు సబర్బన్‌లలో మార్పులు

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై సెంట్రల్- గూడూరు సెక్షనులో జరుగుతున్న లైన్ బ్లాక్, ఇతర సాంకేతిక పనుల కారణంగా గురువారం పలు మెము సర్వీసులు రద్దయినట్లు దక్షిణ రైల్వే బుధవారం ప్రకటన విడుదల చేసింది. ● సూళ్లూరు పేట-ఎంఎంసీ మెము 18.40, ఎంఎంసీ-ఆవడి 21.25 సర్వీసులు రద్దయ్యాయి.

పాక్షికంగా...

● ఎంఎంసీ-సూళ్లూరుపేట 10.15, 12.10, 14.30 ఎలావూరు వరకు నడుస్తాయి. ● సూళ్లూరుపేట-ఎంఎంసీ 13.15, 15.10 ఎలావూరు నుంచి బయలుదేరుతుంది. ● సూళ్లూరుపేట-చెన్నై బీచ్ 17.20 ఎలావూరు నుంచి నడుస్తుంది. ● ఎంఎంసీ-సూళ్లూరుపేట 15.30 గుమ్మిడిపూండి నుంచి బయలుదేరుతుంది. ●సూళ్లూరుపేట- ఎంఎంసీ 18.15 గుమ్మిడిపూండి నుంచి నడుస్తుంది.

తిరువణ్ణామలైలో భద్రత కట్టుదిట్టం

తిరువణ్ణామలై: దిల్లీ కారు బాంబు పేలుడు ఘటన నేపథ్యంలో తిరువణ్ణామలైలో పోలీసులు భద్రత కట్టుదిట్టం చేశారు. అరుణాచలేశ్వర స్వామి ఆలయానికి పలు రాష్ట్రాలు, విదేశాల నుంచి భక్తులు వస్తుంటారు. భక్తులు తీసుకొస్తున్న వస్తువులు, సంచులను తనిఖీ చేసిన తర్వాతే దర్శనానికి అనుమతిస్తున్నారు. దీంతో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య తగ్గింది.

అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి

తిరుత్తణి: తిరుత్తణి మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వం తరఫున చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడంలో అందరూ ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ సరస్వతి భూపతి పిలుపునిచ్చారు. తిరుత్తణి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం జరిగింది. ప్రజల సమస్యల పరిష్కారానికి కౌన్సిలర్లు, అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.

నిర్వాసితులకు ఓటు హక్కు కల్పించాలి

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: అనకాపుత్తూరు నిర్వాసితులకు ఓటు హక్కు కల్పించాలని ఎస్‌డీపీఐ రాష్ట్ర కార్యదర్శి హమీద్ ఫెరోజ్ బుధవారం ప్రకటనలో డిమాండు చేశారు. చెన్నై అనకాపుత్తూరులో అడయారు నది ఒడ్డున ఏళ్ల తరబడి ఉన్న 750 గృహాలను ఆక్రమణల తొలగింపు పేరిట కోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ఇటీవల తొలగించడాన్ని గుర్తు చేశారు. నిర్వాసితులు సుదూరంలోని పడప్పై, పెరుంబాక్కం, సెమ్మంజేరి, గూడువాంజేరి తదితర ప్రాంతాలకు వెళ్లిపోయారని, పిల్లల చదువు దెబ్బతిందని విమర్శించారు. రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును నిర్వాసితులు వినియోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వ చర్యలు చేపట్టాలని కోరారు.

(c) eenadu

ఉత్కంఠను కలిగించే 'మిడిల్ క్లాస్'

చెన్నై, న్యూస్‌టుడే: కిశోర్ ముత్తురామలింగం దర్శకత్వంలో మునీశ్‌కాంత్, విజయలక్ష్మీ ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్న చిత్రం 'మిడిల్ క్లాస్'. ఈ నెల 21న చిత్రం విడుదల కానున్న సందర్భంగా ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం నగరంలో జరిగింది. దర్శకుడు రవికుమార్ మాట్లాడుతూ... మధ్య తరగతి కుటుంబం కష్టాలు మాత్రమే కాకుండా సరదాగా సాగే సన్నివేశాలతో ఈ చిత్రాన్ని దర్శకుడు రూపొందించారని ప్రశంసించారు. దర్శకుడు ఏ.ఆర్.కె.శరవణన్ మాట్లాడుతూ... ఈ చిత్రం ముగింపులో ఓ ధార్మిక సందేశం ఉంటుందన్నారు. దర్శకుడు సతీశ్ సెల్వకుమార్ మాట్లాడుతూ... మన అందరి కుటుంబాల్లో ఉన్న విషయాలనే ఈ చిత్రంలో చూపించారని, ఇది చాలా ముఖ్యమైన కథ అని తెలిపారు. దర్శకుడు కిశోర్ మాట్లాడుతూ... ఈ చిత్రంలో రాధారవిని బిన్నమైన కథ పాత్రలో చూస్తారన్నారు. 'కుటుంబస్తాన్', 'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్రాలకు మించిన విషయం చూడొచ్చని, అనుక్షణంగా ఉత్కంఠను కలిగిస్తుందని తెలిపారు.

కార్యక్రమంలో చిత్రబృందం

పోలీసు వాహనం ఢీకొని
ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి మృతి

ప్రసాద్, సత్య, అశ్విన్ (పాతచిత్రాలు)

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: పోలీసు వాహనం ఢీకొని ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందిన ఘటన తమిళనాడులో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. మదురై జిల్లా సిట్టపట్టికి చెందిన కార్మికుడైన ప్రసాద్(25), సత్య(20) దంపతులకు రెండేళ్ల అశ్విన్ అనే కుమారుడు ఉన్నాడు. మదురై అనంజియూర్‌లోని బంధువు అంత్యక్రియలకు వెళ్లిన ప్రసాద్ కుటుంబీకులు మంగళవారం రాత్రి ద్విచక్రవాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. వారి వెంట బంధువు సోనై ఈశ్వరి కూడా ఉంది. సక్కుడి- పూవంది రోడ్డులో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన రామనాథపురం జిల్లా పోలీసు వాహనం అతి వేగంగా ఢీకొట్టింది. ప్రసాద్ ఘటనాస్థలిలోనే మృతిచెందాడు. దగ్గర్లో ఉన్న తిరుప్పువనం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా సత్య, అశ్విన్ మృతిచెందారు. సోనై ఈశ్వరి గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. సమాచారం అందిన బంధువులు మృతదేహాలు తీసుకెళ్లకుండా పోలీసు వాహన డ్రైవర్‌ను అరెస్టు చేయాలని రాస్తారోకో చేపట్టారు. శివగంగై ఎస్పీ శివప్రసాద్ ఘటనాస్థలికి చేరుకుని ఘటనకు కారణమైన డ్రైవర్‌పై తగిన చర్యలు చేపడతారని తెలిపి ఆందోళనకారులను సమాధానపరిచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

12 గంటలు ఆలస్యంగా బయలుదేరిన విమానం

వడపళని, న్యూస్‌టుడే: కొలంబోకు వెళ్లాల్సిన శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ విమానం మంగళవారం 12 గంటలు ఆలస్యంగా నడిచింది. ఉదయం 9.45 గంటలకు సిబ్బంది, ప్రయాణికులు మొత్తం 262 మందితో విమానం రన్‌వేలో ఉండగా పైలట్ సాంకేతిక లోపాన్ని గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చారు. విమానం ఆగేందుకు కావలసిన ఏర్పాట్లు చేశారు. స్వల్ప సమస్య అనుకుని రెండు గంటల్లో విమానం బయలుదేరుతుందన్నారు. ప్రయాణికులను విమానం నుంచి దింపి లాంజ్‌లో బస ఏర్పాటు చేశారు. సమస్యను పరిష్కరించడంలో ఆలస్యం కావడంతో సాయంత్రం 4 గంటలకు బయలుదేరుతుందని తెలపడంతో విసుగెత్తిన ప్రయాణికులు వివరణ, పరిహారం కావాలని ఆందోళనకు దిగారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ కొలంబో నుంచి మరో విమానాన్ని ఏర్పాటు చేసింది. ఆ విమానం రాత్రి 7.30 గంటలకు చేరుకుంది. ప్రయాణికులను మళ్లీ తనిఖీ చేసిన తర్వాత రాత్రి 9.30 గంటలకు దాదాపు 12 గంటలు ఆలస్యంగా బయలుదేరి శ్రీలంకకు రాత్రి 10.28 గంటలకు చేరుకుందని అధికారులు పేర్కొన్నారు.

24న జిల్లా కార్యదర్శుల సమావేశం: అన్నాడీఎంకే

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే కార్యకర్తల హక్కుల పరిరక్షణ కమిటీ జిల్లా కార్యదర్శులు, ప్రధాన కార్యాలయ నిర్వాహకుల సమావేశం 24న చెన్నై వేప్పేరి రిథర్టన్ రోడ్డులోని వైఎంసీఏ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీరుసెల్వం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. తన అధ్యక్షతన, సీనియర్ నేత బన్రుట్టి రామచంద్రన్ ఆధ్వర్యంలో సాయంత్రం 5 గంటలకు జరగనున్న సమావేశానికి అందరూ హాజరుకావాలని ఆదేశించారు.

ఆక్రమణలు తొలగింపు

అమ్మయార్‌కుప్పంలో ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేట యూనియన్ అమ్మయార్‌కుప్పం బస్టాండు నుంచి ఆంధ్ర రాష్ట్రం చిత్తూరు జిల్లా ఆవలకొండ గ్రామానికి వెళ్లే రోడ్డు వెడల్పు తక్కువగా ఉండి వాహన రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. పోలీసుల సహకారంతో బుధవారం ఐదు జేసీబీ యంత్రాలతో ఆక్రమణలను తొలగించే పనులు చేపట్టారు

ఎన్నికల చిహ్నం కోసం ఎంఎన్ఎం వినతి

చెన్నై, న్యూస్‌టుడే: ఎన్నికల చిహ్నం కోసం ఎంఎన్ఎం తరఫున ఎన్నికల కమిషన్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. వచ్చే ఏడాది శాసనసభ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా గుర్తింపు పొందని రాజకీయ పార్టీలు ఎన్నికల చిహ్నం కోసం దరఖాస్తు చేసుకోవాలంటూ ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఎంఎన్ఎం తరఫున పది చిహ్నాలను సూచిస్తూ వాటిలో ఒకదానిని కేటాయించాలని వినతిపత్రం అందించారు. గత శాసనసభ ఎన్నికల్లో ఎంఎన్ఎం పార్టీకి టార్చి లైటు చిహ్నం కేటాయించిన విషయం తెలిసిందే.

కోర్టులో ఉన్నతవిద్యాశాఖ మంత్రి హాజరు

కోర్టు ప్రాంగణంలో మంత్రి తదితరులు

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: కాల్పుల ఘటనను ఖండించి నిరసన తెలిపిన కేసులో మంత్రి, మాజీ ఎంపీ సహా తొమ్మిదిమంది కోర్టులో హాజరయ్యారు. తూత్తుకుడిలో 2018 మే 22న జరిగిన కాల్పుల ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోయారు. దీనిని ఖండిస్తూ 2018 మే 24న తిరువిడైమరుదూరులో జరిగిన నిరసన కార్యక్రమంలో మాజీ ఎంపీ ఎస్.రామలింగం, అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్ సహా పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. అనుమతి లేకుండా నిరసనలో పాల్గొన్నారని తిరువిడైమరుదూర్ పోలీసులు ఎస్.రామలింగం, కోవి చెళియన్, యూనియన్ కార్యదర్శి అన్నాదురై, జయపాల్, కోషి, ఇళంగోవన్, పంచనాథన్ సహా తొమ్మిది మందిపై కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ తిరువిడైమరుదూర్ కోర్టులో కొనసాగగా ఎంపీ ఎమ్మెల్యేల తంజావూరు ప్రత్యేక కోర్టుకు బదిలీ చేశారు. బుధవారం వారంతా కోర్టులో హాజరయ్యారు. 25కి విచారణ వాయిదా వేశారు.

ఆచార్యుల సమ్మెకు సీపీఎం మద్దతు

చెన్నై, న్యూస్‌టుడే: అన్నా విశ్వవిద్యాలయం ఆచార్యుల సమ్మెకు సీపీఎం రాష్ట్ర కమిటీ సంఘీభావం తెలిపింది. 7వ వేతన సంఘం బకాయిలను అందించాలని, ఉద్యోగ విరమణ పొందే ఆచార్యులకు వెంటనే నగదు ప్రయోజనాలు అందించాలని, సెనేట్, విద్యా కమిటీల్లో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులకు ప్రాతినిధ్యం ఇవ్వాలని తదితర పలు డిమాండ్లతో 10వ తేది నుంచి నిరవధిక సమ్మె చేపట్టారు. అధ్యాపకుల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం ప్రకటించారు. ఆచార్యులను రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించి పరిష్కారం చూపాలని తన ప్రకటనలో కోరారు.

ఉగ్రవాదులుగా మారకుండా
100 మందిని రక్షించిన పోలీసులు

ప్యారిస్, న్యూస్‌టుడే: ఐఎస్ ఉగ్రవాదులు విద్యావంతులైన యువకులను బ్రెయిన్ వాష్ చేసి తమ సంస్థల వైపు లాక్కుంటున్నట్లు పోలీసుల దర్యాప్తులో తెలిసింది. ఇప్పటి వరకు బ్రెయిన్‌వాష్ చేసిన 100 మంది యువకులను పోలీసులు రక్షించారు. పోలీసులు మాట్లాడుతూ.. నిషేధిత ముస్లిం విద్యార్థి సంస్థ 'సిమి' కోయంబత్తూరు జిల్లా అధ్యక్షుడిగా ఉన్న అబూతాహీర్‌ను 2019లో శ్రీలంకలో ఈస్టర్ పండగ రోజు వరుస బాంబు దాడులు జరిపిన ఐఎస్ ఉగ్రవాది సహ్రాన్ హాషిమ్ బ్రెయిన్ వాష్ చేసి తమ సంస్థలోకి తీసుకున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఉగ్రవాదిగా మారిన జమేషా ముబిన్ 2022లో కోయంబత్తూరు ఉక్కడం కోట్టై ఈశ్వరన్ ఆలయం ముందు ఆత్మాహుతి బాంబర్‌గా మారి కారు పేలుడుకి పాల్పడ్డాడని, ఈ కేసులో 17 మంది అరెస్టు అయ్యారన్నారు. వారిలో 12 మంది గ్రాడ్యుయేట్లు, ఇంజినీరింగ్ చదివిన వారని చెప్పారు. ఈ బృందానికి అధ్యక్షుడిగా వ్యవహరించిన జమేషా ముబిన్ ఇంజినీర్ అని, ఐఎస్ ఉగ్రవాద సంస్థ సులభంగా భావోద్వేగానికి గురై, ఉన్నత విద్య చదివిన వారినే లక్ష్యంగా చేసుకుంటోందన్నారు. ముస్లింలు అధికంగా ఉండే ప్రాంతాలు, రాజకీయ ఆసక్తి ఉన్న యువకులను గుర్తించి, వారి అభిప్రాయాలు తెలుసుకుని తమ వైపు లాక్కొంటారన్నారు. ఇలాంటి వ్యక్తులపై నిఘా పెట్టి చర్యలు తీసుకుంటారని తెలిపారు. 2021 నుంచి ఇప్పటి వరకు ఉగ్రవాదుల వల్ల బ్రెయిన్ వాష్‌కు గురైన 100 మందిని రక్షించినట్లు తెలిపారు. మానసిక వైద్యుల ద్వారా కౌన్సిలింగ్ ఇచ్చినట్లు, ప్రస్తుతం వారిలో పలువురు వివాహం చేసుకుని, భార్య, పిల్లలతో ఉంటున్నారన్నారు. కొందరు ఆటో నడుపుతున్నారని, ఇంకొందరు సొంతంగా వ్యాపారాలు చేసుకుంటున్నట్లు చెప్పారు.

వాగ్గేయకారులకు సంగీతాంజలి

గానం చేస్తున్న పృథ్వీ హరీష్

వడపళని: ఇండియన్ ఫైనార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆళ్వారుపేటలోని యతిరాజ కల్యాణ నిలయంలో వాగ్గేయకారుల సంస్మరణ దినోత్సవం మూడు రోజుల కార్యక్రమం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. స్వాతి తిరునాళ్ కృతులను యువ గాయకుడు పృథ్వీ హరీష్, జీవన్ బాలసుబ్రహ్మణ్యం కృతులను కుమారి రంజని రాధా, పురందరదాసు కృతులను స్మిత సోదరీమణులు శ్రావ్యంగా గానం చేసి మహనీయులకు సంగీతాంజలి ఘటించారు. సొసైటీ కార్యదర్శి డాక్టర్ ఆర్.రాధాకృష్ణన్ కళాకారులను సత్కరించారు. తిరువనంతపురం ట్రస్ట్ యువరాజు మార్తాండవర్మ, చెన్నైలోని జీవన్ ట్రస్ట్, బెంగళూరులోని కర్ణాటక ప్రభుత్వం పోషకులుగా వ్యవహరించాయి. 'నారాయణ గురవయ్య శెట్టి ఎస్టేట్ అండ్ చారిటీస్' హాలును ఉచితంగా అందించింది.

లైంగిక సంబంధంలో గొడవలొస్తే క్రిమినల్ కేసు కాదు

మదురై ధర్మాసనం

ప్యారిస్, న్యూస్‌టుడే: వివాహానికి ముందు ఇద్దరు పరస్పర అంగీకారంతో లైంగిక సంబంధం పెట్టుకుని, గొడవలు జరిగి విడిపోతే క్రిమినల్ కేసు దాఖలు చేయడం కుదరదని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం తెలిపింది. పలుసార్లు తనతో లైంగిక సంబంధం పెట్టుకుని పెళ్లి చేసుకోవడానికి నిరాకరిస్తున్నట్లు తమిళనాడులోని దిండుక్కల్‌కు చెందిన యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ యువకుడిపై కేసు నమోదైంది. దీనిని సవాలు చేస్తూ ఆ యువకుడు మదురై ధర్మాసనాన్ని ఆశ్రయించాడు. ఈ కేసు బుధవారం విచారణకు వచ్చింది. వ్యక్తిగత సంబంధాల గొడవల్లో క్రిమినల్ చట్టాన్ని ఉపయోగించే ధోరణి పెరుగుతోందని న్యాయమూర్తి జస్టిస్ పుగళేంది తెలిపారు. ఇద్దరి అంగీకారంతో ఏర్పడిన లైంగిక సంబంధంలో గొడవలు వస్తే క్రిమినల్ కేసు దాఖలు చేయడం కుదరదని పేర్కొన్నారు. వ్యక్తిగత లేదా భావోద్వేగపరమైన గొడవలు పరిష్కరించడానికి క్రిమినల్ చట్టాన్ని ఉపయోగించడాన్ని అనుమతి ఇవ్వరన్నారు. బలవంతం, మోసం, అసమర్థత కారణంగా ప్రభావితమైన చోట మాత్రమే చట్టం జోక్యం చేసుకుంటుందన్నారు. వ్యక్తిగత వైరుధ్యాలను దుష్ప్రవర్తనగా చిత్రీకరించే హక్కు ఎవరికీ లేదన్నారు. భావోద్వేగ వివాదాలను పరిష్కరించడానికి ఒక వ్యక్తిపై కేసు వేయడం చట్టాన్ని దుర్వినియోగం చేయడంతో సమానమన్నారు. యువకుడిపై ఉన్న కేసు రద్దు చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

ఘనంగా మహాయజ్ఞం

శోభాయాత్రలో భక్తులు నృత్యం చేస్తున్న దృశ్యం

టీనగర్, న్యూస్‌టుడే: శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్‌స్వామి దివ్య మంగళశాసనములతో చెన్నై పెరంబూరులో జరుగుతున్న సాప్తాహిక పంచకుండాత్మక సమతా ఇష్టి మహాయాగం బుధవారం ఆరో రోజుకు చేరుకుంది. బుధవారం శ్రీలక్ష్మీనారాయణ ఇష్టి నిర్వహించారు. తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కుటుంబీకులతో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. స్వామివారు ఆమె జ్ఞాపిక అందజేశారు. సాయంత్రం ఎస్బీయార్ సిటీ పరిసర వీధుల్లో జీయర్ స్వామి శోభాయాత్ర జరిగింది.

కోయంబత్తూరు రానున్న ప్రధాని మోదీ

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: కోయంబత్తూరులోని కొడిసియా మైదానంలో జరగనున్న సమావేశానికి ప్రధాని మోదీ హాజరవుతారని దక్షిణ భారత సేంద్రియ వ్యవసాయ సమాఖ్య సమన్వయకర్త పి.ఆర్.పాండియన్ తెలిపారు. కోయంబత్తూరులో బుధవారం విలేకరులతో మాట్లాడారు. 19, 20, 21వ తేదీల్లో కొడిసియా మైదానంలో సమావేశాలు జరుగనున్నాయని తెలిపారు. 19న ప్రధాని మోదీ ప్రత్యేక అతిథిగా పాల్గొని ప్రత్యేక ప్రసంగం చేయనున్నట్లు చెప్పారు. అనంతరం 50మంది వ్యవసాయ శాస్త్రవేత్తలతో ఆయన ప్రైవేటు చర్చలో పాల్గొంటారని అన్నారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరి నుంచి 5 వేల మందికి పైగా పాల్గొంటారని తెలిపారు. నేల సారవంతం, అధికస్థాయిలో విషపూరితం కారణంగా ప్రభావితమయ్యే ఆహార ఉత్పత్తులు, తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు.

దాడి కేసులో టీఎన్‌ఈబీ కార్మికుడికి మూడేళ్లు శిక్ష

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: చెన్నై ఎన్నూరుకు చెందిన మణిమారన్ 2019లో మణలి ఎంఎఫ్ రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ట్రాఫిక్ పోలీసులు ఆపారు. మద్యం మత్తులో ఉండడంతో జరిమానా విధించారు. దీంతో మణిమారన్ స్నేహితుడైన టీఎన్‌ఈబీలో పనిచేస్తున్న పన్నీరుసెల్వం అక్కడికి చేరుకుని పోలీసులతో వాగ్వాదానికి దిగి ఆవేశంతో ఎస్సై ఎళిలన్‌పై దాడి చేశాడు. ఎన్నూరు పోలీసులు పన్నీరుసెల్వంను అరెస్టు చేసి తిరువొత్తియూరు కోర్టులో కేసు దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో అతనికి మూడేళ్లు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ బుధవారం న్యాయమూర్తి కార్తిక్ తీర్పు ఇచ్చారు.

ఎస్సైపై మహిళ దాడి: కేసు నమోదు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా పుళల్ సమీపంలోని జానకిరామన్‌నగర్‌కు చెందిన వరుణ్‌కు చెన్నై వడపళనికి చెందిన యువశ్రీతో జులైలో వివాహం జరిగింది. కట్నంగా నగదు, నగలు అందజేశారు. అదనపు కట్నం తీసుకురావాలని భర్త వేధిస్తున్నాడని యువశ్రీ పుళల్ మహిళా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై ప్రసిద్‌దీప దర్యాప్తు చేస్తుండగా ఆవేశం చెందిన యువశ్రీ ఎస్సైపై దాడి చేసింది. పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు.

హత్యాయత్నం కేసులో నిందితుల కోసం గాలింపు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: హోసూరు సమీపంలో హత్య కేసులో బెయిల్‌పై బయటికొచ్చిన వ్యక్తి ప్రాణాలు తీసేందుకు యత్నించినవారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. కృష్ణగిరి జిల్లా హోసూరు సమీపంలోని తొరపల్లి అగ్రహారం ప్రాంతానికి చెందిన వెంకట్రావ్ రుణాలు వసూలు చేసే సంస్థలో పనిచేశారు. గత ఆగస్టు నెలలో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. హోసూరు నగర పోలీసులు కేసు నమోదు చేసి అదే ప్రాంతానికి చెందిన మంజునాథ్(35) సహా నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. బెయిల్‌పై బయటికొచ్చిన మంజునాథ్ మంగళవారం వ్యవసాయ పనులు పూర్తి చేసుకొని ఇంటికి వెళుతుండగా వెనుక వచ్చిన కారు ఢీకొని వెళ్లిపోయింది. తీవ్ర గాయాలపాలైన మంజునాథ్‌ను హోసూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. సమాచారం అందుకున్న నగర పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మంజునాథ్‌ను ఢీకొన్న కారు, వ్యక్తుల ఆచూకీ కోసం ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాల పుటేజీల ద్వారా దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ కాపలాదారుల హత్య కేసు నిందితుడిపై తుపాకీ కాల్పులు

ప్యారిస్, న్యూస్‌టుడే: ఆలయ కాపలాదారులను హత్య చేసిన కేసులో నిందితుడిపై పోలీసులు తుపాకీ కాల్పులు జరిపి అరెస్టు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. విరుదునగర్ జిల్లా రాజపాళెయం శివాలయంలోకి సోమవారం రాత్రి వెళ్లిన దుండగులు కాపలాదారులు పేచ్చిముత్తు, శంకరపాండియన్‌లను హత్య చేసి హుండీలో ఉన్న నగలు, నగదు ఎత్తుకెళ్లిపోయారు. నిందితులను పట్టుకోవడానికి ఆరు ప్రత్యేక బృందాలు ఏర్పాటై అనుమానంతో ముగ్గురిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నాగరాజ్ అనే వ్యక్తి కాపలాదారులను హత్య చేసి, హుండీ దోచుకున్నట్లు అంగీకరించాడు. అతనితో పాటు మునియాండి ఈ ఘటనకు పాల్పడినట్లు తెలిపాడు. చోరీ చేసిన వస్తువులను ఆంజనేయ ఆలయం వద్ద దాచి ఉంచినట్లు చెప్పడంతో స్వాధీనం చేసుకోవడానికి నాగరాజ్‌ను తీసుకెళ్లారు. అక్కడ దాచి ఉంచిన కత్తితో ఎస్సై కోడైసామిపై దాడిచేసి పారిపోవడానికి యత్నించాడు. ఇన్‌స్పెక్టరు రమేష్ కణ్ణన్ నాగరాజ్ మోకాలిపై తుపాకీతో కాల్చాడు. గాయపడిన సబ్ ఇన్‌స్పెక్టరు, నాగరాజ్‌లను ఆస్పత్రికి తరలించారు. మునియాండి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

పంచాయతీ అధ్యక్షుడి హత్యకేసులో

న్యాయవాది సహా 10 మందికి జీవిత ఖైదు

సుభాష్ (పాతచిత్రం)

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కడలూర్ సమీప కిళ్ అరుంగుణం గ్రామానికి చెందిన సుభాష్(34) వీసీకే యూనియన్ కార్యదర్శిగా వ్యవహరించారు. ఆయనకు అదే ప్రాంతానికి చెందిన దామోదరన్(55)తో స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో తగాదా జరిగింది. 2019లో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగడంతో దామోదరన్ తరఫు వ్యక్తి తంగవేల్ హత్యకు గురయ్యాడు. ఈ కేసులో అరెస్టైన సుభాష్ బెయిలుపై విడుదలయ్యాడు. 2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కిళ్ అరుంగుణం పంచాయతీ అధ్యక్ష పదవికి సుభాష్ పోటీ చేసి గెలుపొందాడు. 2020 జులై 19న సాయంత్రం సుభాష్, ముగ్గురు స్నేహితులతో కలిసి సొంతభూముల వద్దకు వెళ్లాడు. దామోదరన్ సహా 10 మందికి పైగా వ్యక్తులు అక్కడికి వెళ్లి సుభాష్‌పై మారణాయుధాలతో దాడి జరపడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సుభాష్ సోదరుడు సుధాకర్ ఫిర్యాదు మేరకు నెల్లికుప్పం పోలీసులు రాజదురై, కవియరసన్, సుభగణేష్, తమిళ్ వణ్ణన్, మణిమారన్, న్యాయవాది ధర్మరాజ్, దినేష్ కుమార్, పక్కిర్‌సామి, మణివణ్ణన్, వేంకటపతి, దామోదరన్‌తో సహా 12 మందిని అరెస్టు చేసి కడలూర్ మొదటి అదనపు జిల్లా సెషన్సు కోర్టులో కేసు దాఖలు చేశారు. విచారణ సమయంలో వెంకటపతి అనారోగ్యంతో మృతి చెందగా పక్కిర్‌సామి నిర్దోషిగా విడుదలయ్యాడు. హత్యతో సంబంధం ఉన్న న్యాయవాది సహా 10 మందికి జీవిత ఖైదు విధిస్తూ బుధవారం న్యాయమూర్తి సరస్వతి తీర్పునిచ్చారు.

వివాహేతర సంబంధంలో గొడవ

మహిళను కత్తితో పొడిచి లొంగిపోయిన వ్యక్తి

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: తిరుప్పూరు జిల్లాలోని పెరుంతోళ్‌లో వివాహేతర సంబంధం కారణంగా మహిళను కత్తితో పొడిచిన వ్యక్తి చికిత్స కోసం ఆమెను ఆస్పత్రిలో చేర్పించిన తర్వాత పోలీసులకు లొంగిపోయాడు. పోలీసుల కథనం మేరకు.. తిరుప్పూరు జిల్లా పెరుంతోళ్‌కు చెందిన జాన్సన్ భార్య చిత్ర. జాన్సన్ 2020న కరోనాతో మృతి చెందాడు. వారికి 14 ఏళ్ల కుమార్తె ఉంది. ఒంటరిగా ఉన్న చిత్రకు పక్కింటికి చెందిన కరుప్పన్‌తో పరిచయం ఏర్పడింది. తర్వాత ఇద్దరి మధ్య గొడవ రావడంతో అక్టోబరులో అవినాశి పాళ్యం పోలీసుస్టేషన్‌లో ఇద్దరికీ ఎలాంటి సంబంధం లేదని రాతపూర్వకంగా వాంగ్మూలం ఇచ్చారు. కరుప్పన్ గతవారం మళ్లీ చిత్రతో మాట్లాడటానికి యత్నించగా నిరాకరించింది. బుధవారం ఉదయం ఆమె ఇంట్లోకి వెళ్లేందుకు యత్నించిన కరుప్పన్‌ను చిత్ర అడ్డుకుంది. ఆగ్రహించిన అతను కత్తితో పొడిచి, చికిత్స కోసం ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి అంబులెన్స్‌లో పంపించాడు. సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసుల ముందు కరుప్పన్ లొంగిపోయాడు. కేసు దర్యాప్తులో ఉంది.

డిజిటల్ అరెస్టు పేరిట రూ.83 లక్షల మోసం

వేలూరు, న్యూస్‌టుడే: డిజిటల్ అరెస్టు పేరిట సైబర్ మోసగాడు ఓ వృద్ధురాలి నుంచి భారీగా నగదు లాక్కున్నాడు. వేలూరు సమీపంలోని కాట్పాడి మిషన్ కాంపౌండ్ ప్రాంతానికి చెందిన గ్లోరి(86) ఆంబూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో డాక్టర్‌గా పని చేస్తూ పదవీ విరమణ పొందారు. ఆమె ఇద్దరు కుమార్తెలు అమెరికాలో వైద్యులుగా పనిచేస్తున్నారు. గ్లోరి భర్త చనిపోయాడు. సర్వెంట్ సాయంతో ఇంట్లో ఒంటరిగా ఉంది. గత నెల ఓ వ్యక్తి గ్లోరితో వీడియో కాల్‌లో మాట్లాడాడు. తాను ముంబయి సీబీఐ క్రైమ్ బ్రాంచి నుంచి కాల్ చేస్తున్నానని, ఆమె ఆధార్, పాన్‌కార్డులను ఉపయోగించి మోసం జరుగుతోందని, కేసు నమోదు చేసి డిజిటల్ అరెస్టు చేశామని చెప్పారు. బ్యాంకు ఖాతా వివరాలు మోసగాడికి అందజేసింది. మ్యూచువల్ ఫండ్‌లో రూ.83 లక్షలు ఉన్నట్లు గుర్తించి అంత మొత్తం ఎలా వివరాలివ్వాలని, ఆ నగదు తాము చెప్పిన ఖాతాకు బదిలీ చేయాలని బెదిరించాడు. నగదు బదిలీ చేయగానే ఎలాంటి సమాచారం రాకపోవడంతో గ్లోరి మోసపోయానని గ్రహించి వేలూరు సైబర్ క్రైమ్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసింది.

ఆన్‌లైన్ స్టాక్ మార్కెట్ పేరిట..

వేలూరు: వేలూరు సమీపంలోని తైవాళి ఇలవంబాడి గ్రామానికి చెందిన విశ్రాంత సైనిక ఉద్యోగి కుమారుడు గోపి. సౌదీ అరేబియాలో పనిచేస్తున్నాడు. కొద్దినెలల కిందట ఓ యువతి గోపితో వీడియోకాల్‌లో మాట్లాడింది. ఆన్‌లైన్ స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించింది. నమ్మిన గోపి తండ్రి కూడా విషయం తెలియజేశాడు. ఇద్దరూ కలిసి రూ.30.50 లక్షలు డిపాజిట్ చేశారు. స్టాక్ మార్కెట్ ఖాతా లాభాలు చూపినా డ్రా చేసేందుకు సాధ్యం కాలేదు. మోసపోయామని గ్రహించి ఇద్దరూ వేలూరు సైబర్ క్రైం పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. దు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

నగలు చోరీ చేసిన మహిళ అరెస్టు

కాళీశ్వరి

ప్యారిస్, న్యూస్‌టుడే: నగలు చోరీ చేసిన మహిళను పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై అన్నానగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న ఉమాపతి ఈనెల 5న బీరువాలో పెట్టిన బంగారు నగలను సరిచూడగా సుమారు 10 సవర్ల ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఫిర్యాదు మేరకు తిరుమంగళం పోలీసులకు దర్యాప్తు చేపట్టగా అతని ఇంటికి తరచూ వచ్చే బంధువు కాళీశ్వరి చోరీ చేసినట్లు గుర్తించి ఆమెను మంగళవారం అరెస్టు చేసి 10 సవర్ల నగలు స్వాధీనం చేసుకున్నారు.

భర్తకు గంజాయి ఇచ్చేందుకు యత్నించిన భార్య..

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: చెన్నై ఎన్నూరు సమీపం కత్తివాక్కానికి చెందిన అజిత్‌ను దాడి కేసుకు సంబంధించి పోలీసులు ఇటీవల అరెస్టు చేసి పుళల్ జైల్లో ఉంచారు. జైల్లో ఉన్న భర్తను కలిసి మాట్లాడేందుకు భార్య దేశమ్మాళ్ బుధవారం జైలు వద్దకు చేరుకుంది. పోలీసులు ఆమెను తనిఖీ చేసి 10 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పుళల్ పోలీసులు అరెస్టు చేశారు.

క్రైం కార్నర్

చోరీ కేసులో ఏడుగురు..

అరెస్టయిన వారితో పోలీసులు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నామక్కల్ జిల్లా పరమత్తివేలూర్ సమీపంలోని పాండమంగళంకు చెందిన కరుణానిధి కరూర్ జిల్లా నొయ్యల్ సమీపంలోని ప్రైవేట్ పాఠశాల కరస్పాండెంట్‌గా వ్యవహరిస్తున్నారు. ఈనెల 8వ తేదీ సాయంత్రం పాఠశాల నుంచి ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు దుండగులు కత్తి చూపి బెదిరించి 7 సవర్ల చైను లాక్కొని పరారయ్యారు. ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టి చెన్నై ఎర్ణావూరు కడర్కరై సాలై నేతాజీనగర్‌కు చెందిన భూమినాథన్, కరూర్ జిల్లా మణ్మంగళం సమీపంలోని సోమూర్‌కు చెందిన గిజాబ్బాయ్, నామక్కల్ జిల్లా పరమత్తి వేలూర్‌కు చెందిన సిలంబరసన్‌లను ఈనెల 10వ తేదీ రాత్రి అరెస్ట్ చేశారు. వారిచ్చిన సమాచారంతో నామక్కల్ జిల్లా పరమత్తివేలూర్ సమీపంలోని తన్నీర్‌పందల్ మేట్టెకి చెందిన అబ్దుల్ షారుక్, పడముడిపాలయంకు చెందిన వడివేల్, పొత్తనూర్ భజనై మఠవీధికి చెందిన సత్యరాజ్, నన్‌సెయ్ ఇడైయారుపైకి చెందిన శక్తివేల్‌లను మంగళవారం అరెస్ట్ చేసి ఏడు సవర్ల నగ, కారు, రెండు ద్విచక్ర వాహనాలు, కత్తి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కరూర్ క్రిమినల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచి జైలుకు తరలించారు.

లైంగిక వేధింపుల కేసులో యువకుడు..

ట్రిప్లికేన్: తిరుప్పూరు జిల్లా పల్లడంకి చెందిన ప్రతీప్ కణ్ణన్ తంజావూరులోని బంధువుల ఇంటికి ఆలయ ఉత్సవానికి వెళ్లాడు. అక్కడి ఓ గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలిక అదే ప్రాంతంలో ఉన్న అవ్వ ఇంటికి వచ్చింది. ప్రతీప్‌కణ్ణన్, బాలిక బంధువులని తెలిసింది. బాలికను లైంగికంగా వేధించడంతో ఫిర్యాదు మేరకు వల్లం ఆల్ ఉమెన్ పోలీసులు ప్రతీప్‌కణ్ణన్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

మత్తు చాక్లెట్లు విక్రయిస్తున్న మహిళ..

రెడ్‌హిల్స్: అంబత్తూరు ఎస్టేట్ సమీపంలోని ఓ దుకాణంలో పోలీసులు బుధవారం తనిఖీ చేపట్టారు. 3 కిలోల బరువున్న 516 మత్తు చాక్లెట్లను స్వాధీనం చేసుకుని దుకాణం నిర్వహిస్తున్న గీతను అరెస్టు చేశారు.

ఘర్షణలో ముగ్గురికి కత్తిపోట్లు

రెడ్‌హిల్స్: తిరువళ్లూరు జిల్లా రెడ్‌హిల్స్ సమీపం గోనిమేడుకు చెందిన బాలసుబ్రహ్మణ్యం, సురేందర్ ఫుట్‌పాత్‌పై పక్కపక్కనే దుకాణాలు నిర్వహిస్తున్నారు. దుకాణాలు ఏర్పాటు చేసే విషయమై ఇద్దరి మధ్య బుధవారం ఉదయం వాగ్వాదం చోటుచేసుకుంది. ఆవేశంతో బాలసుబ్రహ్మణ్యం కత్తితో దాడి చేయడంతో సురేందర్, అతని స్నేహితులు అల్బర్ట్, రామ్‌కీ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను బంధువులు చెన్నై స్టాన్లీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రెడ్‌హిల్స్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

విద్యాశాఖ ఉన్నతాధికారికి అరెస్ట్ వారెంట్

ప్యారిస్, న్యూస్‌టుడే: కోర్టు ఆదేశాలను నెరవేర్చని విద్యాశాఖ ఉన్నతాధికారికి అరెస్ట్ వారెంట్ జారీచేస్తూ మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. కన్నియాకుమరి జిల్లా మార్తాండంలో ఉన్న నేసమణి మెమోరియల్ క్రిస్టియన్ కళాశాలలో భౌతికశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా విధుల్లో చేరిన పద్మజ నియామకానికి ఆమోదం ఇచ్చి, తగిన నగదు ప్రయోజనాలను అందించాలని తమిళనాడు విద్యా డైరక్టర్, తిరునెల్వేలి మనోన్మనియం సుందరనార్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కి మద్రాసు హైకోర్టు 2022లో ఉత్తర్వులు ఇచ్చింది. ఆదేశాలు అమలు చేయలేదని తెలిపి పద్మజ కోర్టు ధిక్కరణ కేసు దాఖలు చేసింది. కేసును బుధవారం విచారించిన న్యాయమూర్తి జస్టిస్ ఎమ్ ఎస్ రమేష్.. కోర్టుకు హాజరుకాకపోవడం దురదృష్టమని తెలిపారు. కోర్టు ధిక్కరణ చర్య అని తెలిపిన న్యాయమూర్తి.. కళాశాల విద్యా డైరక్టర్‌ను నవంబరు 21న కోర్టులో హాజరుపరిచేలా అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. విచారణ నవంబరు 21కి వాయిదా వేశారు.

పురిటి బిడ్డ మృతి.. బంధువుల ఆందోళన

వేలూరు, న్యూస్‌టుడే: ప్రసవించిన బిడ్డ చనిపోవడాన్ని నిరసిస్తూ తల్లిదండ్రులు, బంధువులు బుధవారం ఆస్పత్రిని ముట్టడించి ఆందోళనకు దిగారు. తిరుపత్తూరు పట్టణ పోలీసుల వివరాల మేరకు.. కృష్ణగిరి జిల్లా, హోసూరుకు చెందిన యోన్యాతుల్లా, సమీరా(20) దంపతులకు రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం నిండు గర్భిణిగా ఉన్న సమీరా బుధవారం తెల్లవారుజామున స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. శిశువు చనిపోయిందని నర్సులు దురుసుగా చెప్పడంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు, బంధువులు ప్రసవ వార్డును ముట్టడించి వైద్యుడితో వాగ్వివాదానికి దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఆస్పత్రి వైద్యాధికారి శివకుమార్ శిశువు బంధువులతో చర్చించారు. తల్లి కడుపులోనే బిడ్డ మెడకు పేగులు చుట్టుకుని ఆక్సిజన్ అందక చనిపోయిందని బంధువులకు వివరించారు. ఆందోళనకారులు శాంతించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తిరుపత్తూరు పట్టణ పోలీసులు తెలిపారు.

పైకప్పు కూలి ॥ నెలల చిన్నారి మృతి

ప్యారిస్, న్యూస్‌టుడే: ఇంటి పైకప్పు కూలి 11 నెలల చిన్నారి మృతిచెందిన ఘటన తూత్తుకుడిలో చోటు చేసుకుంది. చిన్నకన్నూపురానికి చెందిన ఆనంద్, రాధా మహేశ్వరి దంపతులకు 13 ఏళ్ల కుమారుడు, ఆదిర అనే 11 నెలల కుమార్తె ఉంది. వారి ఎదురింట్లో ఉంటున్న శివరంజిని కుమార్తెకు నామకరణం వేడుక బుధవారం జరిగింది. రాధా మహేశ్వరి తన కుమార్తెతో కలిసి వెళ్లింది. కార్యక్రమం జరుగుతున్నప్పుడే ఇంటి పైకప్పు కూలిపోయింది. నేలపై ఆడుకుంటున్న ఆదిరపై శిథిలాలు పడడంతో ఘటనాస్థలిలోనే మృతిచెందింది. రాధా మహేశ్వరి తలకు గాయమైంది. తూత్తుకుడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అదృష్టవశాత్తు ఇంట్లో ఉన్న మరో 10 మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టు పైనుంచి పడి వ్యాపారి..

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా పెరియపాళ్యం సమీపం మంగళం గ్రామానికి చెందిన అరసు(55) కొబ్బరిబొండాల వ్యాపారి. బుధవారం పుదువాయల్‌లోని చెట్టు ఎక్కి కొబ్బరిబొండాలు కోస్తుండగా అదుపుతప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. బంధువులు చెన్నై జీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కవరప్పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పైనుంచి పడి ప్రైవేటు ఉద్యోగి..

గుమ్మిడిపూండి: తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి సమీపం తానిపూండిలో పైపులు తయారు చేసే ప్రైవేటు కర్మాగారం ఉంది. బిహార్‌కు చెందిన చోటిలాల్‌రాం(32) అందులో పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం భవనంపై నిలుచుని పనిలో నిమగ్నమై ఉండగా అదుపుతప్పి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. పాదిరివేడు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుక్క కాటుతో కార్మికుడు..

టీనగర్, న్యూస్‌టుడే: తిరునెల్వేలి జిల్లా కళక్కాడు సమీపంలోని చిదంబరపురానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు అయ్యప్పన్(31) మూడు నెలల కిందట కావల్‌కినరు ప్రాంతంలోని ఓ ఇంటి మరమ్మతు పనులకోసం వెళ్లాడు. ఇంటి యజమాని పెంపుడు కుక్క అయ్యప్పన్‌ను కరిచింది. చికిత్స పొందకుండా నిర్లక్ష్యం చేశాడు. రెండు రోజుల కిందట తీవ్ర ముందు అస్వస్థతకు గురైన అయ్యప్పన్‌ను కుటుంబీకులు ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్చారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

(c) eenadu

నేడు 'ఈటీవీ' కార్తిక దీపోత్సవం

శివకేశవులు ఇద్దరికీ ఎంతో ప్రీతికరమైనది కార్తిక మాసం. దీంతో సమానమైన మాసం, గంగతో సమానమైన తీర్థం లేదని పురాణోక్తి. విశేష పుణ్య సంపదను ప్రసాదించే ఈ మాసంలో దీపారాధనకు ఉన్న ప్రాధాన్యం అసమానమైనది. 'ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ, ఈటీవీ లైఫ్' ఛానళ్ల ఆధ్వర్యంలో కార్తిక దీపోత్సవం నిర్వహించనున్నారు. ఈ దీపోత్సవంలో పాల్గొనే మహిళలకు పూజ సామగ్రి నిర్వాహకులే సమకూరుస్తారు. చిన్నపిల్లలకు అనుమతి లేదు. నేలపై కూర్చొగలిగే వారు మాత్రమే హాజరు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు. – ఈనాడు, తణుకు

గమనిక: ఈ నెల 4న జరగాల్సిన కార్తిక దీపోత్సవం వర్షం కారణంగా వాయిదా పడినందున ఆ కార్యక్రమం నిమిత్తం పంపిణీ చేసిన ఎంట్రీ పాసులు ఈ రోజు నిర్వహించే కార్తిక దీపోత్సవం కార్యక్రమానికి చెల్లవు. నిన్న పంపిణీ చేసిన కొత్త పాసులు మాత్రమే చెల్లుబాటు అవుతాయి.

సమయం: ఈరోజు (గురువారం) సాయంత్రం 5 గంటలకు

స్థలం: నూలి గ్రౌండ్స్, జ్యూయల్ హోమ్స్ పక్కన, ఎస్ఎన్‌వీటీ జూనియర్ కాలేజ్ వద్ద, తణుకు

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ | ఈటీవీ తెలంగాణ | ఈటీవీ Life

ఈ ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారం నేటి సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు.

చేతిలో దీపం.. మదిలో మావుళ్లమ్మ రూపం

భీమవరం మావుళ్లమ్మ మాలధారులు బుధవారం రాత్రి పట్టణంలో జ్యోతుల ప్రదర్శన నిర్వహించారు. అమ్మవారి పూరిగుడి మీదుగా పంచారామక్షేత్రం సోమేశ్వరజనార్దన స్వామి తదితర ఆలయాలను దర్శించుకుంటూ ప్రధాన రహదారి మీదుగా ఆలయానికి చేరుకున్నారు. దీక్షలు స్వీకరించిన సుమారు 500 మందితో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, భీమవరం ఆధ్యాత్మికం

నారీ.. ర్యాపిడోపై సవారీ

ఇప్పటి వరకు ర్యాపిడో అంటే పురుషులే చోదకులు. ఇకపై ఫోన్ చేస్తే మహిళలు రయ్‌మని వాలిపోతారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల్లోని ఆసక్తి కలిగిన వాహన చోదకులకు జీవనోపాధి కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా ర్యాపిడో సంస్థతో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఒప్పందం కుదుర్చుకుంది.

ఉమ్మడి పశ్చిమలోని ఏలూరు, భీమవరం, జంగారెడ్డిగూడెం, నూజివీడు, చింతలపూడి, పాలకొల్లు, ఆకివీడు, తాడేపల్లిగూడెం, నరసాపురం, తణుకులో 25 చొప్పున ర్యాపిడ్ వాహనాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ పట్టణాల్లో ఇప్పటికే ఎంపిక ప్రక్రియ కొనసాగుతుండగా వాహనాల కొనుగోలుకు సంబంధించి ఒప్పందం దిశగా అడుగులు పడుతున్నాయి.

ఇవి తప్పనిసరి

- ఆసక్తి, లైసెన్సు ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు.
- తక్కువ ధరకే వాహనాలు కొనుగోలు చేసేలా ర్యాపిడో ఒప్పందం కుదుర్చుకుంది.
- నెలకు 250కు పైగా బుకింగ్స్ ద్వారా మహిళలకు ఆదాయం సమకూరే మార్గాలను అన్వేషిస్తున్నారు.
- ర్యాపిడో పికప్, డ్రాపింగ్ పాయింట్లు ప్రారంభించి నిర్దేశిత ప్రాంతాల్లో వాటిని నిలిపే అవకాశం కల్పిస్తారు.

జిల్లా, స్వయం సహాయక సంఘాలు, సభ్యులు		
ఏలూరు	7,500	75,000
పశ్చిమ	9,500	95,000

- న్యూస్‌టుడే, భీమవరం పట్టణం

దాచుకున్నారు... తీసుకోరా మరి?

పదేళ్లుగా ఖాతాల్లో ఉండిపోయిన రూ.106.53 కోట్లు

ఆధారాలతో వచ్చి తీసుకెళ్లమంటున్న బ్యాంకులు

ఈనాడు–ఏలూరు: చింతలపూడి, న్యూస్‌టుడే

చదువుకునే రోజుల్లో బ్యాంకు ఖాతా తెరిచి అందులో కొంత నగదు దాచుకుని ఆ విషయమే మరిచిపోయినవారు కొందరైతే.. వ్యాపార, వర్తక అవసరాలకు 2-3 ఖాతాలు ప్రారంభించి ఏదో ఒక ఖాతానే కొనసాగిస్తూ మిగిలినవి పట్టించుకోనివారు మరికొందరు. ఇలా జిల్లాలో 6.49 లక్షలకు పైగా ఖాతాల్లో పదేళ్లకు పై నుంచి ఎలాంటి లావాదేవీలు జరపకుండా నిస్తేజంగా ఉన్నాయని ఆర్‌బీఐ గుర్తించి ఆ వివరాలను జిల్లాకు పంపింది. వాటిల్లో రూ.106.53 కోట్ల నగదు మూలుగుతోంది.

పిలిచి ఇస్తున్న బ్యాంకర్లు

ఖాతాలే కాదు వాటిల్లో ఉన్న నగదును మరిచిపోయిన వారికి బ్యాంకు అధికారులే తెలియజేసి పట్టుకెళ్లాలని కోరుతున్నారు. జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో అన్ని బ్యాంకులు అవగాహన సదస్సులు నిర్వహించి ఖాతాదారులకు ఈ మరిచిపోయిన ఖాతాలపై అవగాహన కలిపిస్తున్నారు. వ్యక్తిగత ఖాతాలతో పాటు ఈ వరుసలో కొన్ని ప్రభుత్వ శాఖల ఖాతాలు ఉన్నాయి. ఆ విషయం బ్యాంకు అధికారులు తెలియజేస్తే ఆయా శాఖల అధికారులు నోరెళ్లబెడుతుండటం గమనార్హం. ఆయాశాఖలు సైతం ఖర్చు పెట్టకుండా ఉండిపోయిన నిధులను వెనక్కు తీసుకుంటున్నాయి.

గతంలో ఏ అవసరాల కోసం ఖాతా తెరిచాయో అందుకు సంబంధించిన రికార్డులను పట్టుకెళ్లి చూపితే అవే ఆధారాలుగా భావించి డబ్బులు వెనక్కు ఇస్తున్నాయి. కొన్ని ఖాతాల్లో రూ.10-20 లక్షలు మరికొన్ని ఖాతాల్లో వేలల్లో ఉంటే మరి కొన్ని శూన్య ఖాతాలు లేకపోలేదు. ఇప్పటి దాకా రూ.1.50 కోట్లు వెనక్కు ఇచ్చాయి. డిసెంబరు నాటికి ఈఖాతాలను పరిష్కరించాలని ఆర్‌బీఐ నిర్దేశించింది.

వారసుల మధ్య పేచీలు వచ్చి..

చనిపోయిన ఖాతాదారుల వారసుల మధ్య డబ్బులు పంపకం విషయంలో పేచీలు వచ్చి ఖాతాల్లోనే ఉండిపోయిన నగదు పలువురి ఖాతాల్లో ఉంది. ఖాతాదారు చనిపోతే మరణ ధ్రువపత్రంతోపాటు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అందజేయాలి. వాటిని బ్యాంకు అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి ఇరుగుపొరుగును విచారించుకుని ధ్రువీకరించుకుని నగదు అందజేస్తున్నారు. డబ్బులు తీసుకునేవారి నుంచి కేవైసీ చేయించుకుంటున్నారు. వారి ఆధార్, పాన్, ఓటరు ఐడీ నకలు తీసుకుంటున్నారు. ఇవన్నీ 2025 ఆగస్టు 31 నాటికి ముందు పదేళ్లకు పైగా ఎలాంటి లావాదేవీలు జరపని ఖాతాలని లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ నీలాద్రి తెలిపారు. బాధ్యులైన ఖాతాదారులు ఆధారాలతో వచ్చి నగదు తీసుకోవాలని కోరారు.

జిల్లాలో ఇలా..

ఖాతా వివరం	మొత్తం	రూ.నగదు(కోట్లలో)
వ్యక్తిగత	6,34,244	79.22
వర్తక, వ్యాపార సంస్థలు	9,247	20.00
ప్రభుత్వశాఖలు	6,304	7.31

ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న నీలాద్రి

విరిగిన చక్రం అవస్థలే నిత్యం

భీమడోలు మండలం చెట్టున్నపాడుకు చెందిన స్వరూప అనారోగ్యంతో ఏలూరులోని సర్వజన ఆసుపత్రికి వచ్చారు. నడవలేని స్థితిలో ఉన్న ఆమెను వైద్య పరీక్షల నిమిత్తం కుటుంబ సభ్యులు చక్రాల కుర్చీపై తీసుకెళ్లారు. ముందు చక్రం విరిగిన కుర్చీలో అవస్థలు పడుతూ వెళ్తున్న చిత్రమిది. అధికారులు పరిశీలించి పాడైన వాటికి మరమ్మతులు చేపట్టాలని రోగులు, సహాయకులు కోరుతున్నారు. -ఈనాడు, ఏలూరు

అపూర్వం.. అపురూపం

అణువణువునా కళాత్మకతతో.. అవందేళ్లు దాటినా వన్నె తరగని శోభతో అబ్బురపరుస్తోంది ఆచంటలో ఉన్న ఈ భవనం. స్థానికులు గంధర్వ మహల్‌గా పిలుచుకొనే ఈ భవనం ఘన కీర్తి ఉన్న చారిత్రక వస్తువులకూ నిలయంగా విలసిల్లుతోంది. స్థానిక జమిందారు గొడవర్తి నాగేశ్వరరావు హయాంలో 1918లో మొదలైన భవన నిర్మాణం 1924 నాటికి పూర్తయింది. 1885లో లండన్‌లో నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో రజత పతకం పొందిన అరుదైన పియానో ఇక్కడ ఉంది. గొడవర్తి కుటుంబీకులు సంగీత ప్రియులు కావడంతో దీనిని లండన్ నుంచి ఇక్కడకు రప్పించారు. 140 ఏళ్ల కిందట తయారైన ఈ పియానో ఇప్పటికీ సుస్వరాలు పలుకుతోంది. వందేళ్ల క్రితం బెల్జియం నుంచి దిగుమతి చేసుకున్న నిలువుటద్దాలు, బర్మా టేకుతో చేసిన ద్వారాలు, అలనాటి విద్యుత్తు దీపాలు ఔరా అనిపిస్తాయి.

- న్యూస్‌టుడే, ఆచంట

శ్రీరస్తు.. గృహమస్తు!

జిల్లాలో ఘనంగా 15,024 ఇళ్ల ప్రవేశాలు

నిడమర్రు మండలం బువ్వనపల్లిలో లబ్ధిదారులకు ఇంటి తాళం అందజేస్తున్న ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: పేద, మధ్య తరగతి ప్రజల సొంతింటి కలను కూటమి ప్రభుత్వం సాకారం చేస్తోంది. పేదలకు కలల గూడు నిర్మించి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పేదలందరికీ ఇళ్లంటూ ఆశ పెట్టి.. మధ్య పెట్టడంతో లబ్ధిదారులు డీలా పడిపోయారు. కానీ, కూటమి సర్కారు రాకతో వారి ఆశలు మళ్లీ చిగురించాయి. జిల్లా వ్యాప్తంగా 15,024 ఇళ్లు పూర్తి చేసి. బుధవారం అట్టహాసంగా గృహ ప్రవేశాలు చేపట్టారు. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని ప్రవేశాలు చేయించారు.

పండగ వాతావరణంలో.. నూజివీడులో కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించారు. కలెక్టర్ వెట్రిసెల్వి పాల్గొని లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందజేశారు. చింతలపూడి నియోజకవర్గంలో 2,328, దెందులూరులో 1,793, ఏలూరులో 2,678 గోపాలపురంలో 675, కైకలూరులో 1,401, నూజివీడులో 2,271, పోలవరంలో 3,030, ఉంగుటూరులో 845 ఇళ్లు పూర్తి చేసి యజమానులకు అప్పగించారు. కలెక్టర్ ఆదేశానుసారం ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకొని గృహ నిర్మాణాలను త్వరితం పూర్తి చేయించామని జిల్లా గృహ నిర్మాణ సంస్థ పీడీ సత్యనారాయణ తెలిపారు.

27 నుంచి అంతరాలయ దర్శనం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి ముఖ మండపం, అంతరాలయ ప్రవేశ దర్శనం ఈ నెల 27 నుంచి పునఃప్రారంభిస్తామని ఆలయ ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. భక్తుల రద్దీని అనుసరించి లఘు దర్శనం కల్పిస్తామన్నారు. గతంలో కరోనా నేపథ్యంలో ఈ దర్శనాలను రద్దు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం భక్తుల కోరిక మేరకు పునఃప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అంతరాలయ దర్శనం టిక్కెట్టు ధర రూ.500గా నిర్ణయించినట్లు వెల్లడించారు.

రేపట్నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం వారోత్సవాల గోడపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో ప్రజలు, పాఠకులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

గోడు విన్నారు.. గూడు కట్టించారు 6లో

కదలనన్నా కట్టబెట్టారు!

- జడ్పీలో కాసుల ఉద్యోగోన్నతులు!
- అన్యాయమంటూ జూనియర్లు గగ్గోలు

ఈనాడు–ఏలూరు: జిల్లా పరిషత్తు పరిధిలో పనిచేసే కొందరు నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు ప్రభుత్వ ఉత్తర్వులు, మెమోలను ధిక్కరించి అడ్డగోలుగా ఉద్యోగోన్నతులు కల్పించారు. ఉన్న చోట నుంచి కదలడం ఇష్టం లేక ఉద్యోగోన్నతులు వద్దని రాసిచ్చిన వారికే ఏరికోరి ఇవ్వటంపై వివాదం నెలకొంది. నిబంధనల ఉల్లంఘనపై ఉద్యోగులు భగ్గుమంటున్నారు. దీనిపై కలెక్టర్, జడ్పీ సీఈవో, పీఆర్ కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. కలెక్టర్ విచారణకు ఆదేశించారు.

ముడుపులు ఆశించి.. ఉద్యోగోన్నతులు వద్దని లేఖలు రాసిచ్చిన వారిలో కొందరికి కోరుకున్న చోట పోస్టింగ్ ఇస్తామని ఆశచూపి బలవంతంగా ఉద్యోగోన్నతులిచ్చారనే ఆరోపణలున్నాయి. దగ్గరి ప్రాంతాల్లో పోస్టింగ్ ఇస్తామనేసరికి వారు మెత్తబడుతున్నారు. ముడుపులు ముట్టజెబుతున్నారు. ఒకరు వద్దని తిరస్కరిస్తే వెనక ఉన్న ఉద్యోగికి త్వరగా ఉద్యోగోన్నతి వస్తుందనే ఆశ ఉంది. కాని అక్రమ ఉద్యోగోన్నతులతో తమకు అన్యాయం జరుగుతోందని వారు వాపోతున్నారు.

ప్యానల్ ఇయర్‌కే వక్ర భాష్యం..

ప్యానల్ ఇయర్ ప్రకారం సెప్టెంబరు 1 నుంచి ఆగస్టు 31లోపు ఎవరైనా ఉద్యోగోన్నతికి అర్హులై నిరాసక్తత తెలియజేస్తే తిరిగి ఏడాది పాటు ఉద్యోగోన్నతి కల్పించకూడదు. దీనికి వక్రభాష్యం చెప్పారు.

చర్యలకు సిఫార్సు చేస్తా.. ఈ అక్రమాలు నా హయాంలో జరగలేదు. సంఘ నాయకులతో మాట్లాడి నిబంధనలకు విరుద్ధంగా ఉంటే బాధ్యులైన అధికారులు, ఉద్యోగులపై చర్యలకు సిఫార్సు చేస్తా. -శ్రీహరి, జడ్పీ సీఈఓ, ఉమ్మడి పశ్చిమగోదావరి

మచ్చుకు కొన్ని..

- జడ్పీ కార్యాలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ ఒకరు మార్చి 2024న పదోన్నతి వద్దని లేఖ ఇచ్చారు. కానీ జూన్‌లో ఉద్యోగోన్నతి కల్పించి పెరవలిలో పోస్టింగ్ ఇచ్చారు
- జంగారెడ్డిగూడెంలో పనిచేసే ఉద్యోగి ఒకరు 2024 మార్చిలో తిరస్కరించినా అక్టోబరులో ఏవోగా ఉద్యోగోన్నతినివ్వటం గమనార్హం.
- తణుకులో పనిచేస్తున్న ఒక ఉద్యోగి 2023లో తిరస్కరించారు. సదరు ఉద్యోగికి తణుకులోనే ఉద్యోగోన్నతి కల్పించి పోస్టింగ్ ఇవ్వటంతో విధుల్లో చేరారు.

రీకాల్ చేసే వరకు పోరాడతాం

2023కు ముందు వద్దని రాసిచ్చిన వారికి నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగోన్నతులు కల్పించారు. అభ్యంతరం తెలిపి కలెక్టర్, జడ్పీ సీఈఓ, ఛైర్మన్‌కు ఫిర్యాదు చేయటం జరిగింది. పీఆర్ కమిషనర్‌కు లేఖ రాశాం. అక్రమ ఉద్యోగోన్నతులు రద్దయ్యే వరకు పోరాడతాం.

-శ్రీధర్ రాజు, జిల్లా అధ్యక్షుడు, ఏపీ మినిస్టీరియల్ పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం

పురమిత్రకు చెబితే పనైపోద్ది

సమస్యను ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తే పరిష్కారం

ప్రత్యేక డ్రైవ్‌లో పాల్గొన్న జంగారెడ్డిగూడెం కమిషనర్ కేవీ రమణ

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే:

ప్రభుత్వం పురాల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు 'పురమిత్ర' అనే యాప్‌ను తీసుకొచ్చింది. ఇందులో విద్యుత్తు సమస్యలు, డ్రెయినేజీ, ఆక్రమణలు, నీటి ఇబ్బందులు లాంటివి ఉంటే అప్‌లోడ్ చేయాలి. దీంతో సమస్యను వెంటనే సంబంధిత అధికారులు పరిష్కరిస్తారు. వీటితో పాటు ఇల్లు, ఖాళీ స్థలాలు, నీటి పన్నులు, సీనరేజి ట్రేడ్ లైసెన్స్, ప్రకటనల పన్నులను కూడా చెల్లించవచ్చు.

ఇలా పంపితే చాలు..

యాప్‌లో 8 అంశాలు కనిపిస్తాయి. అందులో పబ్లిక్ హెల్త్, వాటర్ సప్లై, టౌన్‌ప్లానింగ్, మెప్మా, అడ్మినిస్ట్రేటివ్, ఇంజినీరింగ్, స్ట్రీట్ లైటింగ్, రెవెన్యూ వంటివి ఉంటాయి. ఫిర్యాదు చేసే విషయం ఏ అంశానికి సంబంధించినదైతే దానిని సెలెక్ట్ చేయాలి. అలా కాకుండా కేవలం ఫొటో తీసి పంపినా ఏఐ పరిజ్ఞానంతో సంబంధిత విభాగానికి చేరుతుంది.



పురమిత్ర యాప్

పట్టణం	కుటుంబాలు	యాప్ డౌన్‌లోడ్	సమస్యల పరిష్కారం
ఏలూరు	93,160	22,414	725
నూజివీడు	18,146	2,324	169
చింతలపూడి	7,454	1,404	55
జంగారెడ్డిగూడెం	17,846	6,232	308

మరుసటి రోజే.. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన వి.నాగరాజు వెలంపేట రామాలయం వీధిలో వెలగని దీపాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేశారు. మరుసటి రోజే సంబంధిత అధికారులు సమస్య పరిష్కరించారు. జిల్లాలో యాప్ వినియోగం పెరిగింది. పురపాలక అధికారులు కూడా ప్రత్యేక డ్రైవ్ పెట్టి.. కుటుంబంలో ఒక్కరైనా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచిస్తున్నారు. ప్రజలు దీని వినియోగంపై ఇప్పుడిప్పుడే శ్రద్ధ పెడుతున్నారని అధికారులు పేర్కొంటున్నారు.

చిన్నారులకు చలితో ముప్పు!

ఫిబ్రవరి 28 వరకు ఇంటింటా న్యుమోనియా పరీక్షలు

ఉంగుటూరు, చాట్రాయి, న్యూస్‌టుడే: చలి కాలం వచ్చిందంటే చాలు చిన్నారులు తరచూ జలుబు, దగ్గుతో బాధపడుతుంటారు. శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడతారు. న్యుమోనియా బారిన పడుతున్నారు. తొలిదశలోనే కట్టడి చేయకపోతే ప్రాణాంతకంగా మారతాయని ప్రభుత్వం గుర్తించి అప్రమత్తమైంది. ఈ నెల 12 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు సర్వే చేపట్టింది.

6 నెలలలోపు చిన్నారులైతే తీవ్ర ఇబ్బంది పడతారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న పిల్లలపై ప్రభావం ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. బుధవారం నుంచి ఇంటింటా సర్వే ప్రారంభమైంది.

అప్రమత్తత అవసరం

ఈ సీజన్‌లో చంటి పిల్లలు న్యుమోనియా బారిన పడకుండా వారి చుట్టూ వెచ్చని వాతావరణం ఉండేలా చూడాలి. తలుపులు, కిటికీలు తెరిచి పెట్టడం, బయట వాతావరణంలో తిప్పడం వల్ల న్యుమోనియా బారిన పడే ప్రమాదం ఉంది. క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలకు దగ్గు, ఆయాసం, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్నవారు కనిపిస్తున్నారు.

నరసింహారావుపాలెంలో చిన్నారిని పరీక్షిస్తున్న ఆరోగ్య సిబ్బంది

నిర్లక్ష్యం వద్దు

'చిన్నారుల్లో శ్వాస సంబంధ సమస్యలు కన్పిస్తే నిర్లక్ష్యం చేయొద్దు అని చాట్రాయి వైద్యాధికారిణి విజయలక్ష్మి తెలిపారు. 'శ్వాస సంబంధ సమస్యలతో బాధపడుతున్న చిన్నారులను సర్వేలో గుర్తిస్తే వెంటనే వారికి వైద్యం అందిస్తాం' అని నూజివీడు డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎస్. పద్మావతి తెలిపారు.

జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు: 10	అంగన్‌వాడీ కేంద్రాలు 2,225
చిన్నారులు: 1,05,616 మంది	



నిధులు పారితేనే.. నీరు నిండేది!

చెరువుల మరమ్మతులకు ప్రతిపాదనలు

గోపాలపురం సప్లయ్ ఛానల్ గట్టుకు గండి పడి వృథాగా పోతున్న నీరు ఇది. కొయ్యలగూడెం మండలం దిప్పకాయలపాడు వద్ద రాజు చెరువు నుంచి తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలంలోని సుమారు ఏడు చెరువులకు ఈ ఛానల్ ద్వారా నీరందాల్సి ఉంది. సప్లయ్ ఛానల్ దెబ్బతినడంతో అక్కడి ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: భారీ వర్షాలు, ఇటీవల మొంథా తుపాను కారణంగా చిన్ననీటి వనరుల శాఖ కొయ్యలగూడెం అప్‌ల్యాండ్ సబ్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో 47 చెరువులు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. ఏలూరు జిల్లాలో 22, తూర్పుగోదావరి జిల్లాలో 24, పశ్చిమగోదావరి జిల్లాలో ఒక చెరువు మరమ్మతుల కోసం నిధులు మంజూరు కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆ శాఖ కొయ్యలగూడెం ఏఈ రాహుల్ భాస్కర్ తెలిపారు.

అనుమతులు రాగానే..

వీటిలో తాత్కాలిక మరమ్మతులకు ఒక్కో చెరువుకు రూ.2 లక్షల చొప్పున రూ.94 లక్షలు, శాశ్వత అభివృద్ధి పనులకు రూ.12.87 కోట్లు, మొత్తం రూ.13.81 కోట్లు అవసరమని అంచనా వేసినట్లు చెప్పారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే మరమ్మతులు చేపడతామన్నారు.

కొబ్బరి దట్టించి.. పాకంలో ముంచి!

'మధురా'నుభూతి నింపే పెనుగొండ కజ్జికాయ

పెనుగొండ, న్యూస్‌టుడే: నిండా కొబ్బరికోరు, ఎండు ఫలాలు దట్టించి.. వేడి వేడి తీపి పాకంలో ముంచి తీసిన పెనుగొండ కజ్జికాయ రుచి చూసిన వారెవరైనా.. వెంటనే మరోటి తినకుండా ఉండలేరు. 50 ఏళ్ల కిందట ఇక్కడ ప్రాణం పోసుకున్న ఈ మిఠాయి ఖ్యాతి ఖండాంతరాలకూ విస్తరించింది. పండగలు, పెళ్లిళ్ల సీజన్‌లో దీనికున్న డిమాండే వేరు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సినీ, రాజకీయ ప్రముఖులు ప్రత్యేకంగా వీటిని తయారు చేయించుకొని తీసుకెళ్తారు.

చిన్న బండిపై మొదలై...

పెనుగొండకు చెందిన విసుమర్తి కాళిదాసు వీటిని తయారు చేసి బండిపై విక్రయించేవారు. ప్రత్యేక రుచి కారణంగా కొద్దికాలంలోనే దీనికి ప్రత్యేక గుర్తింపు వచ్చింది. గతంలో దీనిలో కొబ్బరికోరు మాత్రమే వేసేవారు. కాళిదాసు కుమారులు కొబ్బరికోరుకు జీడిపప్పు, ఎండు ఫలాలు జోడించి దీనికి మరింత వన్నె తెచ్చారు. కజ్జికాయ తయారయ్యాక పాకంలో వేస్తారు. ఏ సమయంలోనైనా వీటిని వేడి పాకంలోంచి తీసి అందిస్తారు.

ముగిసిన ఉద్యోగుల క్రీడా ఎంపికలు

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జిల్లా శాప్ ఆధ్వర్యాన సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా ఎంపిక పోటీలు బుధవారంతో ముగిశాయి. రెండో రోజు క్రికెట్, యోగా, నృత్య విభాగాల్లో ఎంపికలు చేపట్టారు. జిల్లా స్థాయిలో ఎంపికైన ఉద్యోగులు ఎన్టీఆర్ జిల్లాలో ఈ నెల 19 నుంచి 22 వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని డీఎస్‌డీవో ఎస్.ఎ.అజీజ్ తెలిపారు.

ఎంపికైన వారి వివరాలిలా..క్రికెట్: పవన్ శ్రీనివాస్ రెడ్డి, బి.నవీన్ సూర్య, కె.రాజేశ్, ఎం.కృష్ణారావు, ఎ.సునీల్ బాబు, ఎండీ మొహసీన్, పీపీఎస్‌డీవీ ప్రసాద్, జె.సత్యనారాయణ, డి.రవికుమార్, జి.సతీశ్ కుమార్, షేక్ రియాజ్, డి.వెంకటేశ్వరరావు. **యోగా:** మొనగంటి మహేంద్రాచార్యులు, ఇరప అమ్మాజి. **నృత్యం:** పాయం రత్నకుమారి

జనవరి 12 నుంచి వందే భారత్ నరసాపురం వరకు పొడిగింపు

చెన్నై, న్యూస్‌టుడే: డాక్టర్ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ నుంచి విజయవాడ వరకు వెళ్లే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును జనవరి 12వ తేదీ నుంచి నరసాపురం వరకు పొడిగిస్తున్నట్లు దక్షిణ రైల్వే బుధవారం ప్రకటన విడుదల చేసింది. ● నెం.20677 రైలు చెన్నై సెంట్రల్‌లో జనవరి 12న 05.30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 14.10కి నరసాపురం చేరుతుంది. ● నెం.20678 రైలు నరసాపురంలో అదే రోజు 14.50కి బయలుదేరి 23.45 గంటలకు చెన్నై సెంట్రల్ వస్తుంది. ● రేణిగుంట, నెల్లూరు, ఒంగోలు, తెనాలి, విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నరసాపురం స్టేషన్లలో ఆగుతుంది.

(c) eenadu

దేశంలోనే అద్భుత కట్టడం గాంధీ భవనం

గాంధీ, మూర్తిరాజు విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, విద్యార్థులు

నిడమర్రు, న్యూస్‌టుడే: పెదనిండ్రకొలనులోని గాంధీ భవనం దేశంలోనే అద్భుత కట్టడమని సర్వోదయ మండలి ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు కొనియాడారు. గాంధీ భవనంలో మాజీ మంత్రి, గాంధేయవాది చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గాంధీ ఆశయాలకు అనుగుణంగా పని చేసిన మహా వ్యక్తి మూర్తిరాజు అని ప్రశంసించారు. ప్రభుత్వం గాంధీ భవనాన్ని స్వాధీనం చేసుకుని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరారు. అంతకుముందు మూర్తిరాజు, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతిభావంతులైన పత్తేపురం, పెదనిండ్రకొలను, తోకలపల్లి ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. సర్వోదయ మండలి జిల్లా సంయుక్త కార్యదర్శి సాగిరాజు జానకిరామరాజు, నాయకులు లక్ష్మీపతిరాజు, సత్తిరాజు, శివ, బంగర్రాజు, అప్పారావు, ప్రధానోపాధ్యాయులు సత్యేంద్ర కుమార్‌రెడ్డి, గోపాలకృష్ణ, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

సమాజహితం.. వీరి అభిమతం

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: తాము చదువుకుని ప్రయోజకులు కావాలనే కాకుండా సమాజహితమైన ప్రాజెక్టులను రూపొందించాలనే సత్సంకల్పం ఈ యువతది. జిల్లా యువజన సేవల శాఖ ఆధ్వర్యంలో ఏలూరులో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో సైన్సు ప్రాజెక్టుల పోటీలో వివిధ కళాశాలల యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా వీరు రూపొందించిన కొన్ని ప్రాజెక్టుల గురించి తెలుసుకుందాం.

కాలుష్యాన్ని తగ్గించొచ్చు

ప్రకృతి సహజసిద్ధంగా లభించే సౌరశక్తి, వాయుశక్తి, బయో గ్యాస్‌లను వినియోగించి విద్యుత్తు ఉత్పత్తి చేయడం ఈ ప్రాజెక్టు విశిష్టత. ఇటువంటి వాటిని ఇళ్లు, పరిశ్రమలు, వ్యాపార సంస్థల్లో ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం రాయితీని కూడా కల్పిస్తోంది. దీన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా తక్కువ ఖర్చుతో విద్యుత్తును పొందడమే కాకుండా పర్యావరణ కాలుష్యాన్ని కూడా నివారించవచ్చు.

- రూపకర్తలు: టి.ప్రశాంత్‌కుమార్, కె.కాశీ, కె.పావని, కె.సిద్ధు, ఐ.సూర్యతేజ, జి.స్టీవెన్(ఏలూరు సీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల)

విద్యుత్తు ఆదా చేయొచ్చు..

విద్యుత్తు వినియోగాన్ని తగ్గించే ఉపకరణాలను అవసరాలకు తగ్గట్టు వదిలేస్తుంటారు. మైక్రోసెన్సర్ మోటారు ద్వారా అల్ట్రా సెన్సర్ పరికరాన్ని ఉపయోగించి విద్యుత్తు వృథాను అరికట్టవచ్చని ఈ విద్యార్థులు చెబుతున్నారు. ఆర్డినో యూనో రాడార్‌తో ఇది పనిచేస్తూ విద్యుత్తు పరికరాలను నియంత్రిస్తుంది. ఈ ప్రత్యేకమైన సెన్సార్ 360 డిగ్రీల వరకు వంపు తిరుగుతుంది. విద్యుత్తు అవసర వినియోగాన్ని నియంత్రిస్తుంది.

- రూపకర్తలు: ఎం.శ్రీవిద్య, సీహెచ్ నాగపూర్ణిమ (ఏలూరు సెయింట్ థెరిసా కళాశాల)

ముందే ఆపొచ్చు

చోరీ జరిగిన తర్వాత దొంగలను కనుగొనేందుకు మాత్రమే సీసీ కెమెరాలు ఉపకరిస్తాయి. కానీ ఈ విద్యార్థులు రూపొందించిన ప్రత్యేకమైన ప్రాజెక్టు చోరీ ముందే దొంగలను పసిగడతాయి. ఇంటికి లేదా వ్యాపార సంస్థకు ఎల్‌డీఆర్ దీపాన్ని అమర్చాలి. ఎవరైనా వ్యక్తులు ఇంటికి సమీపంలోకి రాగానే దీపం వెలుగుతుంది. విద్యుత్‌తో కూడిన ఈ దీపాన్ని అనుసంధానిస్తారు. ఇంటి సమీపానికి ఎవరైనా చేరుకోగానే ఆ సమాచారాన్ని గృహ యజమాని చరవాణికి తెలియజేస్తుంది. తద్వారా అప్రమత్తమై దొంగతనాన్ని ముందుగానే నివారించొచ్చు.

- రూపకర్తలు: యోగానంద్, హర్షిత, హర్ష (ఏలూరు ఆదిత్య డిగ్రీ కళాశాల)

ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై ఉద్యమిస్తాం

మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై ఉద్యమాలను ఉధృతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య, రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు చలసాని వెంకటరామారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ పిలుపునిచ్చారు. ఏలూరులో స్టూడెంట్ హాలులో ఏఐటీయూసీ జిల్లా విస్తృత సమావేశం జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్‌డాంగే అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో భాజపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను ఎత్తివేసి, కార్పొరేట్ సంస్థలకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లు మార్పులు తెచ్చిందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గం పోరాడాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కృష్ణచైతన్య, గౌరవాధ్యక్షుడు కృష్ణమాచార్యులు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు ప్రసంగించారు. కార్యక్రమంలో నాయకులు కన్నబాబు, కిషోర్, పుల్లారావు, భజంత్రీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మీ తీరు ఏం బాగోలేదు

నూజివీడు ఆసుపత్రిలో పరిస్థితులపై కలెక్టర్ అసహనం

సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వెట్రిసెల్వి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ వెట్రిసెల్వి బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. సీసీ కెమెరాలు పని చేయకపోవడం, రోగులకు అవసరమైన మందులు అందుబాటులో లేకపోవడం, వార్డుల్లో అపరిశుభ్రత తదితర సమస్యలను గుర్తించి సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం ప్రదర్శించారు. మీ పని తీరు బాగాలేదని సూపరింటెండెంట్ పద్మజారాణి, ఆర్‌ఎంవో శ్రీనివాస్‌లపై మండిపడ్డారు. వార్డుల్లో రోగులకు కనీసం తాగునీరు అందుబాటులో ఉంచకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. పలువురు రోగులతో ఆమె మాట్లాడారు. వారికి స్వాంతన చేకూర్చే వైద్యం అందుతున్నట్లు కనిపించడం లేదన్నారు. అత్యాధునిక పరికరాలు వినియోగించకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రోగుల మంచాలపై నిరుపయోగంగా పడేసిన వెంటిలేటర్లు, ఆక్సిజన్ ప్లాంట్ తదితరాలపై ప్రశ్నించారు. ఎన్టీఆర్ వైద్యసేవకు సంబంధించిన సమాచారం అందుబాటులో లేకపోవడం, క్యాబిన్ ఏర్పాటు చేసిన తీరును తప్పుపట్టారు. ఆస్పత్రికి సంబంధించిన పూర్తి నివేదికను తనకు వెంటనే అందించాలని డీసీహెచ్‌ఎస్ పాల్ సతీశ్‌ను ఆదేశించారు. సబ్‌కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, తహసీల్దారు బద్రు, మున్సిపల్ కమిషనర్ పీరయ్య తదితరులు ఆమె వెంట ఉన్నారు.

సమష్టి కృషితో కుష్టు నివారణ

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఏలూరును కుష్టు రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. కుష్టు బాధితుల గుర్తింపు, నిర్ధారణ ప్రత్యేక కార్యక్రమంపై అధికారులతో కలెక్టరేట్‌లో బుధవారం సమావేశమై మాట్లాడారు. ఈ నెల 17 నుంచి 30 వరకు ఇంటింటి సర్వే చేయాలన్నారు. ఈ వ్యాధి రాకుండా పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించాలన్నారు. మల్టీ డ్రగ్ థెరపీతో కుష్టును పూర్తిగా నివారించవచ్చన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు ఉచితంగా లభిస్తాయని పేర్కొన్నారు. అనంతరం కుష్టు నివారణపై ముద్రించిన గోడపత్రాలను ఆమె విడుదల చేశారు. డీఎంహెచ్‌వో అమృతం, డీసీహెచ్‌ఎస్ పాల్ సతీశ్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ★ న్యుమోనియా నియంత్రణపై స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో న్యుమోనియాతో ఎవరూ మరణించకూడదని స్పష్టం చేశారు. అనంతరం వ్యాధి నివారణపై ముద్రించిన గోడపత్రాలు ఆవిష్కరించారు.

పారిశ్రామికవాడల ఏర్పాటుపై ఎంపీ హర్షం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో పారిశ్రామికవాడల ఏర్పాటుకు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబునాయుడు వర్చువల్ విధానంలో ఎంఎస్‌ఎంఈ పార్కులకు శంకుస్థాపన చేయడం సంతోషదాయకమన్నారు. జిల్లాలో ఆహార శుద్ధి పరిశ్రమ ఏర్పాటు చేయాలని గతేడాది నవంబరులో కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వ శాఖ కార్యదర్శి అవినాశ్ ప్రవీణ్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తున్నట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌కు దరఖాస్తులు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌నకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విజయవాడ జోనల్ శిక్షణ కళాశాల ప్రధానాచార్యురాలు వి.నీలిమ ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ నెల 15 నుంచి 30వ తేదీలోగా www.apprenticeshipindia.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు.

పరీక్ష వాయిదా వేయాలని వినతి

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: బాలల దినోత్సవం రోజు విద్యార్థులకు నిర్వహించాల్సిన ఎస్‌ఏ-1 పరీక్షను వాయిదా వేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్టీఏ) నాయకులు కోరారు. ఈ మేరకు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రాంబాబు తదితరులు బుధవారం డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మకు వినతి పత్రం అందజేశారు. ఈనెల 14న బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు పలు కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉన్నందున ఈ రోజు పరీక్షను వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు.

బిల్లుల బకాయిల మంజూరుకు..

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన వివిధ రకాల పెండింగు బిల్లులను వెంటనే మంజూరు చేయాలని ఏపీఎన్జీవో సంఘం నాయకులు కోరారు. ఆ సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విద్యాసాగర్, డీవీ రమణ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ తదితరులు బుధవారం మంగళగిరిలో రాష్ట్ర ఖజానా శాఖ సంచాలకుడు ఎన్.మోహనరావుకు వినతి పత్రం అందజేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగు బిల్లుల మంజూరుకు చర్యలు చేపడతానని ఈ సందర్భంగా మోహనరావు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఆహార పట్టిక అమలు తప్పనిసరి

భీమడోలు: మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న లక్ష్మీరెడ్డి తదితరులు

ఉంగుటూరు, భీమడోలు, ఏలూరు అర్బన్- న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెనూ ప్రకారం తప్పనిసరిగా నాణ్యమైన భోజనం పెట్టాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు ఇ.లక్ష్మీరెడ్డి సూచించారు. ఉంగుటూరు మండలం కైకరం, భీమడోలు మండలం జె.ఎం.ఎం.పురం, భీమడోలులోని ప్రభుత్వ పాఠశాలలు, పాతూరు అంగన్‌వాడీ కేంద్రం, ఏలూరు ఎంఎల్‌ఎస్ పాయింట్లను బుధవారం ఆయన తనిఖీ చేశారు. కైకరంలో మెనూ ప్రకారం మిక్స్‌డ్ వెజిటేబుల్ కర్రీ వండాల్సి ఉండగా.. కంద కూర చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులకు తాకీదులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డీఎస్వో విలియమ్స్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు శివరామమూర్తి, ఐసీడీఎస్ పీడీ శారద, సీడీపీవో రాజశేఖర్, విద్యాశాఖ ఏడీ వెంకటప్పయ్య, జిల్లా మధ్యాహ్న భోజన పథకం సమన్వయకర్త బి.ఎస్.ఎస్.కుమార్ తదితరులున్నారు.

ఆటే వ్యాపకం.. విజయాల జ్ఞాపకం!

టెన్నిస్‌లో సత్తా చాటుతున్న సీనియర్ క్రీడాకారులు

పాలకొల్లు, న్యూస్‌టుడే

మలి వయసులోనూ టెన్నిస్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొంటూ సత్తాచాటుతున్నారు పలు ప్రాంతాలకు చెందిన సీనియర్ క్రీడాకారులు. పాలకొల్లు కాస్మో స్పోర్ట్స్ క్లబ్ నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సీనియర్ ర్యాకింగ్ టెన్నిస్ టోర్నీలో ఉభయ తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలకు చెందినవారు పాల్గొంటున్నారు. నిత్యం క్రీడా సాధనతో చక్కటి వ్యాయామం లభిస్తోందని, ఇలాంటి పోటీల్లో సాధించే విజయాలు ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు మధుర స్మృతులుగా నిలుస్తాయని వీరు చెబుతున్నారు.

తనయుడి కోసం వెళ్లి

గుంటూరు జిల్లా తెనాలికి చెందిన సాయి రాంబాబు వయసు 84 ఏళ్లు. ఆర్టీసీ డిపో మేనేజర్‌గా ఉద్యోగ విరమణ పొందారు. 1965లో బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి రాష్ట్ర జట్టు కెప్టెన్‌గా వ్యవహరించారు. ఏడు సార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని రాణించారు. కుమారుడికి టెన్నిస్ నేర్పించే యత్నాల్లో భాగంగా ఈయన కూడా 1992లో ఆ క్రీడలో సాధన ప్రారంభించారు. అప్పటి నుంచి 200కు పైగా పోటీల్లో తలపడి 70 సార్లు విజేతగా నిలిచారు. నిత్యం టెన్నిస్ సాధనతో ఆరోగ్యకర జీవనం సాగిస్తున్నట్లు రాంబాబు చెప్పారు.

అసలైన పండగలా..



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట సమీపాన అవిడి గ్రామానికి చెందిన 75 ఏళ్ల వైవీ రామకృష్ణ విశ్రాంత న్యాయమూర్తి. అదనపు ట్రిబ్యునల్ వైస్ ఛైర్మన్‌గా వ్యవహరించిన ఈయన 200కు పైగా టోర్నీల్లో పాల్గొన్నారు. ఏటా అక్టోబరులో మొదలయ్యే టెన్నిస్ టోర్నీల సీజన్ తమ బృందానికి అసలైన పండగలాంటిదని రామకృష్ణ చెబుతున్నారు. క్రీడా సాధనతో శరీరానికి తగినంత వ్యాయామం లభించి అనారోగ్యాలను దూరం చేస్తుందని పేర్కొన్నారు.

ఏటా ఏడు టోర్నీలు

భీమవరానికి చెందిన 65 ఏళ్ల ఎ.రాంబాబు ఉభయ తెలుగు రాష్ట్రాల సీనియర్ టెన్నిస్ క్రీడాకారుల సంఘానికి అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఏటా దేశవ్యాప్తంగా ఏడు సీనియర్ ర్యాకింగ్ టెన్నిస్ టోర్నీలు జరుగుతాయని, ఈ ఏడాది అక్టోబరులో విజయవాడలో ఒకటి పూర్తికాగా.. ఇప్పుడు పాలకొల్లులో రెండో టోర్నీ జరుగుతోందని ఆయన చెప్పారు. తదుపరి టోర్నీలు హైదరాబాద్, విశాఖ, శ్రీకాళహస్తి, భీమవరం, బెంగళూరుల్లో జరుగుతాయని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 150కు పైగా పోటీల్లో తలపడి దాదాపు వంద విజయాలు నమోదు చేసినట్లు రాంబాబు చెప్పారు.

బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న సంస్థ సభ్యులు

క్యాన్సర్ బాధిత బాలుడికి చేయూత

భీమడోలు, న్యూస్‌టుడే: దెందులూరు మండలం కొవ్వలిలో బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్న బాలుడికి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు ఆర్థిక చేయూతనిచ్చారు. మొత్తం రూ.1,10,165 విరాళాలు సేకరించి భీమడోలు ఉప తహసీల్దారు సుధాకర్ ద్వారా బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. సంస్థ సభ్యులు శేఖర్, రాంబాబు, కుమార్‌బాబు, లీలాకృష్ణ, రాము, వాసు, నాగు, త్రినాథ్ తదితరులను పలువురు అభినందించారు.

నాలుగు నెలల కిందట అదృశ్యమై.. నేడు అస్థి పంజరంగా మారి


తులసీమాధవరావు (పాత చిత్రం)

ముదినేపల్లి, న్యూస్‌టుడే: నాలుగు నెలల కిందట అదృశ్యమైన వ్యక్తి అతని ఇంటి సరిహద్దులో ఉన్న పాడుబడిన పెంకుటింటిలో అస్థిపంజరంగా మారి కనిపించిన ఘటన బుధవారం ముదినేపల్లి మండలం పెదపాలపర్రులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిల్లలు పట్టుకునేవారు గ్రామంలో తిరుగుతూ బి.పూర్ణచంద్రరావుకు చెందిన పాడుబడిన పెంకుటింటిలోకి వెళ్లారు. అక్కడ కుళ్లిపోయిన మగ మృతదేహాన్ని గుర్తించి స్థానికులకు సమాచారం అందించారు. ఎస్సై వీరభద్రరావు సిబ్బందితో కలిసి సంఘటనా ప్రదేశానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహం కుళ్లిపోయి అస్థిపంజరంగా మారింది. అతని దుస్తుల ఆధారంగా సంక్రాంతి తులసీ మాధవరావు(59) మృతదేహంగా బంధువులు గుర్తించారు. ఎస్సై వీరభద్రరావు అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని గుడివాడ ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మాధవరావు తెదేపాలో క్రియాశీలంగా వ్యవహరించేవారు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అతనిది ఆత్మహత్య లేక హత్యా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని వైద్య విద్యార్థిని మృతి

భీమవరం గ్రామీణ, వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఉరి వేసుకుని వైద్య విద్యార్థిని మృతి చెందిన ఘటన భీమవరంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన నిమ్మల హేమవర్షిణి (22) స్థానిక కొవ్వాడ డ్రైవర్స్ కాలనీలో నివాసం ఉంటూ.. భీమవరం దంత వైద్య కళాశాలలో బీడీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్నారు. మంగళవారం కైకలూరు వైద్య శిబిరానికి వెళ్లి వచ్చి.. కొవ్వాడలోని తన ఇంటికి వెళ్లిపోయారు. అదేరోజు సాయంత్రం తల్లిదండ్రులు ఫోన్ చేస్తే.. తీయకపోవడంతో వారు కంగారు పడి.. యువతి స్నేహితులను అక్కడకు వెళ్లి చూడమని పంపారు. వారు స్థానికులతో కలిసి వెళ్లి చూడగా.. హేమవర్షిణి పంకాకు ఉరి వేసుకుని ఉన్నారు. దీనిపై యువతి తండ్రి సింహాచలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భీమవరం గ్రామీణ ఎస్సై ఐ.వీర్రాజు బుధవారం తెలిపారు.

రైలు నుంచి పడి యువకుడు.. **ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** రైలు నుంచి జారి పడి యువకుడు మృతి చెందిన ఘటన జిల్లాలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన సుధీబోరో(30) చెన్నై నుంచి స్వగ్రామానికి వివేకా ఎక్స్‌ప్రెస్‌లో వెళ్తున్నారు. మార్గం మధ్యలోని దెందులూరు రైల్వే గేటు సమీపంలో బుధవారం రైలు నుంచి జారి పడి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించారు. మృతదేహాన్ని సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ముగిసిన నన్నయ వర్సిటీ అథ్లెటిక్స్ పోటీలు

ఓవరాల్ ఛాంపియన్‌షిప్ డీఎన్‌ఆర్ కళాశాల కైవసం

ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న సెయింట్ థెరిస్సా కళాశాల క్రీడాకారిణులు

శ్యామలాసెంటర్ (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ఆదికవి నన్నయ యూనివర్సిటీ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు బుధవారంతో ముగిసాయి. మెన్ ఛాంపియన్‌షిప్‌ను డీఎన్‌ఆర్ (భీమవరం), ఉమన్ ఛాంపియన్‌షిప్‌ను సెయింట్ థెరిస్సా కళాశాల (ఏలూరు), ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను డీఎన్‌ఆర్ కళాశాల కైవసం చేసుకున్నాయి. ఈ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన చేసిన 14 మందిని బెంగళూరులోని రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాలలో జరిగే ఆలిండియా అథ్లెటిక్స్ పోటీలకు పంపించనున్నట్లు వ్యవస్థాపక కార్యదర్శి విజయ దుర్గ తెలిపారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్రరావు బహుమతులు అందజేశారు.

దేవస్థానం ఉద్యోగి సస్పెన్షన్

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల దేవస్థానం కల్యాణ మండపానికి లైటింగ్ వేసేందుకు రుసుం కట్టించుకుని నెల రోజుల వరకు జమ చేయనందుకు దేవాలయ ఉద్యోగి అప్పన్నను ఈవో మూర్తి సస్పెండ్ చేశారు. గత నెల 11న మాధవకల్యాణ మండపం సముదాయంలోని వైజయంతి కల్యాణ మండపానికి లైటింగ్ వేసేందుకు రూ.5,990 అప్పన్న ఫోన్ పే చేయించుకున్నాడు. ఈ సొమ్మును ఈ నెల 11న దేవస్థానానికి జమ చేశాడు. విచారణ జరిపిన అధికారులు బుధవారం సస్పెండ్ చేశారు.

అడుగు దూరంలో మెరుగైన వైద్యం

తుది దశకు వంద పడకల ఆసుపత్రి

చింతలపూడి, న్యూస్‌టుడే: మెట్ట ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రారంభించిన చింతలపూడి వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు తుది దశకు చేరాయి. 2020లో ప్రారంభమైన ఆసుపత్రి నిర్మాణ పనులు నిధుల లేమి కారణంగా వైకాపా హయాంలో పూర్తి కాలేదు. ఎమ్మెల్యే రోషన్‌కుమార్ వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో మాట్లాడి నిధులు విడుదలయ్యేలా చొరవ తీసుకోవడంతో గుత్తేదారు వేగంగా పనులు చేపడుతున్నారు.

రూ.16 కోట్ల వ్యయంతో..

ఆసుపత్రి పనులను రూ.16 కోట్ల నిర్మాణ వ్యయంతో ప్రారంభించారు. నాబార్డ్ సహకారంతో పనులు చేపడుతున్నారు. రూ.12 కోట్లతో ఆసుపత్రి ప్రధాన భవనంతో పాటు వైద్యులకు ప్రత్యేక గదులు, ఐసీయూ, మార్చురీ ఇతర భవనాలకు సంబంధించిన పనులను గుత్తేదారు ఇప్పటికే పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం ఇటీవలే రూ.3.30కోట్లు నిధులు మంజూరు చేయడంతో 90 శాతం పనులు ఇప్పటికే పూర్తయ్యాయి.

డిసెంబర్ నాటికి పూర్తి.. ఆసుపత్రి ప్రధాన భవన నిర్మాణ పనులతో పాటు ఎలక్ట్రికల్ వర్క్, ఇంటీరియల్ పనులు పూర్తయ్యాయి. ఆసుపత్రికి రంగులు కూడా ఒక కోటింగ్ పూర్తయింది. ఇంకా టైల్స్ వర్క్ మాత్రమే పెండింగ్‌లో ఉంది. డిసెంబర్ చివరి నాటికి మిగిలిన పని పూర్తి చేసి జనవరిలో ఆసుపత్రి ప్రారంభోత్సవం చేయాలనే లక్ష్యంతో పనులు జోరుగా సాగుతున్నాయి.

సరైన వసతులు లేక.. ప్రస్తుతం ఉన్న సీహెచ్‌సీ భవనంలో సరైన వసతులు లేక రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వైద్యుల నియామకం జరిగినా స్పెషలిస్ట్ వైద్యుల కొరతతో పాటు పూర్తి స్థాయిలో వైద్య పరీక్షలు కూడా అందుబాటులో లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలంతా ఏలూరు, జంగారెడ్డిగూడెం వెళ్లాల్సి వస్తోంది. ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే చింతలపూడి, లింగపాలెం, టి.నరసాపురం, చాట్రాయి మండలాల ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయం అందుబాటులోకి వస్తోంది. 'చింతలపూడి వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇంకా టైల్స్ వర్క్ మాత్రమే మిగిలి ఉంది.' అని ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ రాజాబాబు తెలిపారు.

గోడు విన్నారు.. గూడు కట్టించారు

ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో నెరవేరిన వృద్ధురాలి కల

నిర్మించిన ఇల్లు

కృష్ణవేణితో కలిసి గృహప్రవేశం చేస్తున్న పశ్చిమ కలెక్టర్ నాగరాణి

ఆకివీడు, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలతో ఓ వృద్ధురాలి కల నెరవేరింది. మూడు నెలల కిందటి వరకు ఇల్లు లేని ఆమెకు అధికారులు 60 రోజుల్లో నిర్మాణ పనులు పూర్తి చేసి ఇంటిని అప్పగించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలం కుప్పనపూడిలోని తాళ్లకోడు ప్రాంతంలోని లేఅవుట్‌లో ఆకివీడుకు చెందిన కంకణాల కృష్ణవేణికి కొన్నేళ్ల కిందట స్థలాన్ని కేటాయించారు. అయితే ఆమెకు భర్త లేడు.. చిత్తు కాగితాలు ఏరుకుంటూ జీవిస్తున్నారు. ఆమెకు ఇల్లు కట్టుకునే ఆర్థిక స్తోమత లేదు. దీంతో మూడు నెలల కిందట మంగళగిరిలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కలిసి గూడు లేదని తన గోడు విన్నవించుకున్నారు. ఆయన ఆదేశాలతో అధికారులు ఇంటి నిర్మాణ పనులు ఆగమేఘాలపై పూర్తిచేశారు. బుధవారం గృహ ప్రవేశ కార్యక్రమాన్ని అధికారులు, కూటమి నాయకులు పండగ వాతావరణంలో నిర్వహించారు. కలెక్టర్ నాగరాణి పాల్గొని ఆమెతో గృహప్రవేశం చేయించారు. నూతన వస్త్రాలు, పండ్లు, మిఠాయిలు అందజేశారు. ఎన్నో ఏళ్ల కల నెరవేరడంతో కృష్ణవేణి ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -109 రిటైల్ ధర 136 చికెన్ విత్ స్కిన్ - 197, చికెన్ స్కిన్‌లెస్ - 224. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 246 చికెన్ స్కిన్‌లెస్ - 256.

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే:

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కేసులు

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని.. ఈ తరహా పరీక్షలు చేస్తే స్కానింగ్ కేంద్రాల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీఎంహెచ్‌వో పీజే అమృతం హెచ్చరించారు. స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో పీసీపీ ఎన్డీటీ యాక్ట్ సలహా కమిటీ జిల్లా సమావేశం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. సమాజంలో స్త్రీ, పురుషులిద్దరూ సమానమేనన్నారు. నేటితరం మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులకు దీటుగా రాణిస్తున్నారని కొనియాడారు. ఇలాంటి సమయంలో బాలికలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కానీ, కొందరు పుట్టబోయేది ఆడ బిడ్డలని తెలియగానే గర్భస్రావానికి సిద్ధమవుతుండటం బాధాకరమన్నారు. జిల్లాలో 115 ప్రభుత్వ, ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలున్నాయని, వీటిని అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని ఆమె ఆదేశించారు.

నిత్యం భయమే

ఊడిపడుతున్న శ్లాబు కింద విద్యార్థులు


చెట్టు పడి ధ్వంసమైన మరుగుదొడ్డి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: పెదకామనపూడి శివారు తూర్పుపాకల పాఠశాలలో విద్యార్థులు నిత్యం భయం భయంతో విద్యాభ్యాసం సాగిస్తున్నారు. ఈ పాఠశాలలో 21 మంది విద్యార్థులు ఉన్నారు. శ్లాబు శిథిలావస్థకు చేరి పెచ్చులు ఊడిపడుతున్నాయి. వర్షపు నీరు గదుల్లోకి లీకవుతోంది. మరుగుదొడ్ల గోడలు కూలిపోతున్నాయి. ఇటీవల చెట్టు కూలి మరుగుదొడ్లపై ఉన్న శ్లాబు దెబ్బతింది. ఎప్పుడు ఏ గోడ పడిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. 'వర్షం వచ్చినప్పుడు నీరు కారుతోందని, మరుగుదొడ్లపై చెట్టుకూలి శ్లాబు పగిలినట్లు నా దృష్టికి వచ్చింది. వెంటనే పరిశీలించి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతా. ప్రమాదభరితంగా ఉంటే వేరే చోట తరగతులు నిర్వహించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తా' అని ముదినేపల్లి ఎంఈవో-1 డి.రామారావు తెలిపారు.

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

రామకృష్ణ గ్రూప్ Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషెంట్ల సేవకు, ఇంటిపని, వంటపని, బేబికేర్ కొరకు స్త్రీ/పు కావలెను. భో+వ+ జీతం 16- 18K ✆ 9705297788, 9515108830.

JOBS

ప్రముఖ బ్యాంకింగ్ అనుబంధ సంస్థ యందు పనిచేయుటకు పార్ట్‌టైమ్/ఫుల్‌టైమ్ ఉద్యోగస్తులు కావలెను. Q: 10th- PG., 25-65Y. ✆ 90001 43296.

శ్రీనివాస గ్రూప్ VJA ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/వంట బేబి కేర్‌కు వర్కర్లు కావలెను. భో+వ+జీతం ✆ 92814 52843, 92814 52827

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.05 పైII
తణుకు ఆఫీసు: 08819-224254

(c) eenadu

మూర్తిరాజు సేవలు చిరస్మరణీయం

విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, నాయకులు

గణపవరం, న్యూస్‌టుడే: గాంధేయవాది, విద్యా దాత మూర్తి రాజు సమాజానికి అందించిన సేవలు చిరస్మరణీయమని ప్రధా నోపాధ్యాయురాలు పి.నిర్మలకుమారి అన్నారు. స్థానిక శ్రీచింతలపాటి వరప్రసాద మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఆయన వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. మూర్తిరాజు విగ్రహా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భాజపా నాయకుడు నంద్యాల రామలింగరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలూరు

● ఏలూరు ● దెందులూరు ● ఉంగుటూరు

నేటి నుంచి విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఆర్‌డీఎస్ఎస్ పథకంలో భాగంగా కొత్త 11 కేవీ విద్యుత్తు తీగలు లాగుతున్నందున.. గుడి వాకలంక ఉపకేంద్రం పరిధిలో గురు, శుక్ర, శనివారాల్లో సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ అంబేడ్కర్ తెలిపారు. మూర్తిరాజుపేట ప్రత్తికోళ్లలంక, పెదయాగ రమిల్లి, కోమటిలంక తదితర ప్రాంతాలకు ఉదయం 10. 30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలి పివేస్తామని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

భీమడోలు: ఆగడాలలంక ఉపకేంద్రం పరిధిలో చెట్లు కొమ్మలు తొలగిస్తున్న నేపథ్యంలో.. గురు వారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ అంబేడ్కర్ తెలిపారు. ఆగడాలలంక, చెట్టున్నపాడు, మల్లవరం, లక్ష్మీపురం గ్రామాలకు సరఫరా ఉండదని, వినియో గదారులు సహకరించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు అర్బన్:	80085 74486	ఏలూరు టూటౌన్:	80085 74487
దెందులూరు:	80085 74535	పెదపాడు, పెదవేగి:	80085 74483
భీమడోలు:	80085 74527	నిడమర్రు గ్రామీణం:	97040 21765
ఉంగుటూరు:	94939 90333	గణపవరం:	99480 66777

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: ? క్రొవ్విడిలోని అంతర్గత దారుల్లో పారిశుద్ధ్య సిబ్బంది చెత్త తొలగించడం లేదు. రోజుల తర బడి పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది. **- హరి, స్థానికుడు**

✓ సమస్య నా దృష్టికి రాలేదు. వెంటనే చెత్త తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- స్వామి, ఈవోపీఆర్డీ**

? బువ్వనపల్లి పరిసర ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రాత్రివేళ ఇళ్ల నుంచి బయటకొచ్చేందుకు పిల్లలు, వృద్ధులు భయపడాల్సి వస్తోంది. **- తిలక్, స్థానికుడు**

✓ వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. స్థానికులకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం. **- సంజీవరావు, పంచాయతీ కార్యదర్శి**

వరి కోత.. రైతన్నకు మోత

- 'మొంథా' ప్రభావంతో నేలకొరిగిన చేలు
- అదనపు ఖర్చులతో ఆర్థికంగా కుదేలు

ఉంగుటూరు నియోజకవర్గ వ్యాప్తంగా 52,837 ఎకరాల్లో వరి సాగు చేశారు. మొంథా తుపానుతో 1,302.8 హెక్టార్లలో పంటకి నష్టం వాటిల్లింది. ప్రస్తుతం కోతలు కోస్తుండటంతో యంత్రానికి ఎక రాకు రూ.9-10 వేలు చెల్లించాల్సి వస్తోంది. పొలం దిగుబడుతుండటంతో పెట్టుబడి నగదు చెల్లించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

నియోజకవర్గ వివరాలిలా..

మండలం	విస్తీర్ణం (ఎకరాల్లో)	దిగుబడి (టన్నుల్లో)	నష్టం (హెక్టార్లలో)
ఉంగుటూరు	24,650	86,275	425.8
భీమడోలు	12,843	38,528	279.7
నిడమర్రు	3,630	10,982	229.1
గణపవరం	11,714	35,142	368.2

ఉంగుటూరు, న్యూస్‌టుడే: దుక్కి మొదలు.. పంట విక్రయం వరకు వ్యయప్రయాసలెదుర్కొంటున్న అన్నదాత లకు పెట్టుబడులు భారంగా మారుతున్నాయి. ఈ ఏడాది పంట చేతికొచ్చే సమయంలో మొంథా తుపాను తీవ్ర నష్టాన్ని మిగి ల్చింది. వర్షం, ఈదురు గాలులకు వరి చేలు నేలకొరిగాయి. ఫలితంగా పంట కోత రైతులకు తలకుమించిన భారంగా మారింది. సాధారణంగా ఎకరా పొలంలో యంత్రంతో కోత కోయడానికి 60-75 నిమిషాలు పడుతుంది. ప్రస్తుతం నేలకొ రగడంతో మూడున్నర గంట లకు పైగా సమయం పడు తోంది. ఎకరానికి రూ.5-6వేలు అదనపు భారం పడుతోంది.

33 శాతం నిబంధనతో.. మొంథా తుపాను నష్టాన్ని అంచనా వేసేందుకు వ్యవసాయాధికా రులు క్షేత్ర స్థాయిలో వరి చేలను పరిశీ లించారు. కానీ, నిబంధనల ప్రకారం 33 శాతం కంటే ఎక్కువ నష్టం వాటిల్లితేనే పరిహారం అందుతుందని చెప్పడంతో.. రైతులు నిరాశకు గురయ్యారు. మరో వైపు పంట నేలకొరగడంతో కోత సమ యంలో గింజ రాలిపోతోంది. ఫలితంగా ఎకరాకు 7-8 బస్తాల దిగుబడి తగ్గిపో తోందని వారు వాపోతున్నారు.

కాగుపాడులో పడిపోయిన వరి పంట

నా పేరు కేశవ. మాది ఉంగుటూరు మండలం బొమ్మిడి గ్రామం. నాకున్న రెండెకరాలకు మరో 16 ఎక రాలు కౌలుకు తీసుకుని సర్వ రకం వరి వేశా. ఎకరానికి రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టా. తుపానుకు వరి చేలు నేలకొరిగాయి. అడుగు భాగంలో నీరుండ టంతో.. యంత్రంతో కోయడానికి ఎక్కువ సమయం పడుతోంది. ఎకరాకు అదనంగా రూ. 5 వేలు అదనంగా చెల్లించాల్సి రావడంతోపాటు 7 బస్తాల మేర దిగుబడి తగ్గింది.

రిబ్బన్ కత్తిరిస్తున్న ఎమ్మెల్యే చంటి, మేయర్ నూర్జహాన్

ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యం: బడేటి

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. స్థానిక సీతారామ్ భర్తియా కల్యాణ మండపంలో బుధవారం సఖి సురక్ష కార్యక్ర మాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహి ళల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. మేయర్ నూర్జహాన్, ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథి, నగర కమిషనర్ భానుప్రతాప్, మెప్మా పీడీ మాధవీలత, నాయకులు వెంకట రత్నం, పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు గ్రామీణ: మాదేపల్లి ఇందిరమ్మ కాల నీలో సామూహిక గృహ ప్రవేశాలను బుధవారం పండగ వాతావరణంలో నిర్వహించారు. ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ నూర్జహాన్ పాల్గొని రిబ్బన్ కత్తిరించి గృహ ప్రవేశాలు చేయించారు. అంతకుముందు కాలనీలో పర్యటించి, అక్కడి మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు.

ఎట్టకేలకు గుంతలు పూడ్చారు

ఈనాడు స్పందన

గణపవరం, న్యూస్‌టుడే: గణపవరం- పిప్పర రహదారికి ఎట్టకేలకు మరమ్మతులు చేశారు. 'అధ్వాన దారి.. అవస్థల తీరిది' శీర్షికన ఈ నెల 7న 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి ఆర్‌ అండ్‌ బీ అధికారులు స్పందించారు. పిప్పర నుంచి గణపవరం వర కున్న భారీ గుంతలను మట్టితో తాత్కాలికంగా పూడ్చారు.

అక్రమ కనెక్షన్లపై చర్యలకు డిమాండ్

భీమడోలు, న్యూస్‌టుడే: భీమడోలులో విద్యుత్తు అక్రమ కనె క్షన్లు మంజూరుపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు ఆలగ రవికుమార్ డిమాండ్ చేశారు. స్థానిక విద్యుత్తు ఉపకేంద్రం ఎదుట బుధవారం సంఘం నాయకులు ఆందోళన చేపట్టారు. నాయకులు స్వామి, జయరాజు, రత్నం, వినీత్, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న వెట్రిసెల్వి, చిత్రంలో డీఎంహెచ్‌వో అమృతం, ఏడీ రామ్‌కుమార్ తదితరులు

విభిన్న ప్రతిభావంతులను ఆదరిద్దాం: కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: విభిన్న ప్రతిభావంతులను ఆద రించి, వారి సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాలని కలెక్టర్ వెట్రిసెల్వి సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. విభిన్న ప్రతిభావంతులకు వృత్తి పరమైన శిక్షణనివ్వడంతో పాటు ఉద్యోగ మేళాలు నిర్వహించాల న్నారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులకు అమలు చేస్తున్న చట్టాలపై ముద్రించిన గోడపత్రాలను ఆమె ఆవిష్కరించారు. విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ రామ్‌కు మార్, డీఎంహెచ్‌వో అమృతం తదితరులు పాల్గొన్నారు.

వైకాపా దుష్ప్రచారాన్ని తిప్పికొడదాం

మాట్లాడుతున్న ఆప్కాబ్ ఛైర్మన్ వీరాంజనేయులు

భీమడోలు, న్యూస్‌టుడే: ఉనికిని కాపాడుకునేందుకు వైకాపా చేస్తున్న దుష్ప్రచారా లను క్షేత్ర స్థాయిలో తెదేపా నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు పిలు పునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం తెదేపా మండల, గ్రామ, బూత్, క్లస్టర్ కమిటీల పదవీ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీల అధ్యక్ష, కార్యద ర్శులు, సభ్యులతో గన్ని ప్రమాణం చేయించి మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా సమష్టిగా పని చేద్దామని ఆయన పిలుపునిచ్చారు.

భీమడోలు: అర్జావారిగూడెంలో సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమంలో ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు నూతన వస్త్రాలు, మిఠాయిలు పంపిణీ చేశారు.

మహాసభల విజయవంతానికి పిలుపు

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: విశాఖపట్నం వేదికగా డిసెంబరు 31 నుంచి నాలుగు రోజులపాటు నిర్వహించనున్న సీఐటీయూ జాతీయ మహాసభలను విజ యవంతం చేయాలని ఆ సంఘ నాయకులు కోరారు. నిడమర్రు, బువ్వనపల్లి గ్రామాల్లో బుధవారం ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు రమణారావు, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: సాయి హెల్పింగ్ హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వ ర్యంలో బుధవారం వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. అనారోగ్యంతో బాధపడు తున్న సీఆర్పీ బి.రమేశ్‌కు రూ.10 వేలు, రహదారి ప్రమాదానికి గురైన విద్యార్థి ఎన్.శ్రీహర్షకు రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ జి.మోహన్, సంస్థ సభ్యులు జి.శ్రీనివాసరావు, శ్రీధర్ తదితరులున్నారు.

నిర్లక్ష్యానికి తావివ్వొద్దు

రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావివ్వద్దని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సూచించారు. స్థానిక విడిది కార్యాలయంలో స్వర్ణాంధ్ర విజన్-2047పై నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్(సీవీఏపీ)పై బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రత్యేకా ధికారి, ఉద్యాన శాఖ డీడీ షాజ నాయక్ అధ్య క్షత వహించారు. 'పల్లెపల్లెకు పత్సమట్ల'లో వచ్చిన వినతులు, వాటి పరిష్కారంపై సమీక్షిం చారు. అనంతరం విడిది కార్యాలయం సమీ పంలో ధాన్యం పట్టుబడి ప్రక్రియను ఎమ్మెల్యే ధర్మరాజు పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.

నిడమర్రు గ్రామీణం: నిడమర్రు మండలం బువ్వనపల్లిలో ప్రధానమంత్రి ఆవాస్ యోజ నలో భాగంగా నిర్మించిన ఇళ్లకు బుధవారం సామూహిక గృహ ప్రవేశాలు చేశారు. ఎమ్మెల్యే ధర్మరాజు పాల్గొని లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందజేశారు. సామాన్యుడి సొంతింటి కల సాకా రానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. గృహ నిర్మాణ సంస్థ డీఈ శేఖర్, ఏఈ అలీముల్లా, సర్పంచి కిలారి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

తెదేపా కార్యకర్తల త్యాగం ఎనలేనిది

కమిటీలతో ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి, పెదపాడు- న్యూస్‌టుడే: తెదేపా కార్యకర్తల కృషి, పట్టుదల, త్యాగం ఎనలేనివని. . వారి సంక్షేమానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల జీకే కన్వె న్షన్ హాలులో బుధవారం తెదేపా దెందులూరు నియోజకవర్గ నూతన కమిటీల ప్రమాణ స్వీకా రోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. తొలుత ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మా తెలుగుతల్లి గీతాన్ని ఆలపించి.. భారీ కేక్ కోసి అందరికీ పంచిపె ట్టారు. అనంతరం నూతన మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ స్థాయి కమిటీలతో నియోజకవర్గ పరిశీలకుడు చెన్నుపాటి గాంధీతో కలిసి ప్రమాణం చేయించారు. చింతమనేని మాట్లాడుతూ.. నాయకులు కార్యకర్తలను నూతన కమిటీ సభ్యులు సమన్వయం చేసు కుంటూ పార్టీని నియోజకవర్గ స్థాయిలో బలో పేతం చేయాలని పేర్కొన్నారు.

బహుమతి అందుకుంటున్న గాయత్రి

అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: తూర్పు గోదావరి జిల్లా రాజానగరంలోని నన్నయ విశ్వవి ద్యాలయంలో సోమ, మంగళవారాల్లో నిర్వహిం చిన అథ్లెటిక్స్ పోటీల్లో ఏలూరు ఆదిత్య డిగ్రీ కళా శాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. డిస్కస్ త్రోలో ఎండీ అమీనా(స్వర్ణం), 110 మీటర్ల హర్డిల్స్ విభాగంలో జి.నరేంద్ర సిద్ధు(కాంస్యం) పతకాలు సాధించారు. ఏలూరులో జరిగిన జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో కూచిపూడి నాట్యంలో బి.బృంద(ప్రథమ), చిత్రలేఖనంలో సీహెచ్ గాయత్రి(ద్వితీయ), జానపద నృత్యంలో ఎ. కాంతిశ్రీ(ద్వితీయ) స్థానాల్లో నిలిచారు. వారిని కళాశాల ప్రధానాచార్యుడు వి.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు బుధవారం అభినందించారు.

14న పిల్లలకు వైద్య శిబిరం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రపంచ మధుమేహ నివారణ దినోత్సవం సందర్భంగా.. దెందులూరు తితిదే కల్యాణ మండపంలో ఈ నెల 14న ఇండియన్ మెడికల్ అసోసియేషన్, హైదరా బాద్ నార్త్ సంఘ సభ్యుల సంయుక్త ఆధ్వర్యాన మధుమేహమున్న పిల్లలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. బాధిత పిల్లలకు రూ.5 లక్షలు విలు వైన మందులు, ఇన్సులిన్ ఇంజెక్షన్లు, సూదులు, రక్త పరీక్షలు, పరికరాలు ఉచితంగా అందజేస్తా మని చెప్పారు. ఇప్పటికే 70 మంది పిల్లలు మందులకు నమోదు చేసుకున్నారని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గ్రామాల్లో వసతులు కల్పిస్తాం

భీమడోలు, న్యూస్‌టుడే: గ్రామాల్లో రహదా మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే ధర్మ రాజు, ఆప్కాబ్ ఛైర్మన్ వీరాంజనేయులు అన్నారు. భీమడోలు పంచాయతీ పెదలింగంపా డులో రూ.95 లక్షలతో నిర్మించనున్న రోడ్డు పనులకు బుధవారం వారు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఎంపీడీవో పద్మావతిదేవి, సర్పంచి సుజాత, ఏఎంసీ ఛైర్మన్ శేషగిరి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక వసంత మహల్ కూడలిలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వ ర్యాన బుధవారం రక్తదాన శిబిరం నిర్వహిం చారు. ఏలూరు టూ వీలర్స్ ఆటో కన్సల్టెంట్స్ ఫైనాన్స్ అసోసియేషన్ సహకారంతో శిబిరం జరగ్గా.. పలువురు స్వచ్ఛందంగా పాల్గొని రక్త దానం చేశారు. వారిని రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా ఛైర్మన్ ఎంబీఎస్‌వీ ప్రసాద్ అభినందించారు.

బీఎల్వోలకు శిక్షణ

పెదపాడు, పెదవేగి, న్యూస్‌టుడే: పెదపాడు, పెదవేగి మండల పరిషత్తు కార్యాలయాల్లో బీఎ ల్వోలకు బుధవారం శిక్షణ నిర్వహించారు. మ్యాపింగ్, అందులో తలెత్తే ఇబ్బందులు తదిత రాలపై పెదపాడు, పెదవేగి తహసీల్దార్లు కృష్ణ జ్యోతి, భ్రమరాంబ అవగాహన కల్పించారు.

ఏలూరు సినిమాలు

అంబిక డీలక్స్	ది గర్ల్‌ఫ్రెండ్
అంబిక మినీ	ప్రిడేటర్ బ్యాడ్‌ల్యాండ్స్
సాయిబాలాజీ	తెలుసు కదా
బాలాజీ	కృష్ణలీల
సత్యనారాయణ స్క్రీన్ 1	ధామా
సత్యనారాయణ స్క్రీన్ 2	డ్యూడ్
సత్యనారాయణ స్క్రీన్ 3	మాస్ జాతర
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	జటాధర
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	కర్మణ్యే వాధికారస్తే
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	మాస్ జాతర
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	ప్రిడేటర్ బ్యాడ్‌ల్యాండ్స్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	జటాధర
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4	ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో

భస్మాలంకరణలో గణనాథుడు

ఏలూరు ఆధ్యాత్మికం: సత్రంపాడు లోని లక్ష్మీగ ణపతి ఆల యంలో బుధవారం స్వామివారి భస్మ అలం కరణలో భక్తులకు దర్శనమి చ్చారు. ఉదయం గణనాథుడికి పంచామృతాలు, సుగంధ ద్రవ్యా లతో అభిషేకాలు చేశారు.

దీపం వెలిగించి.. మది పులకించి!

స్థానిక భీమేశ్వరాలయంలో బుధవారం స్వామివారికి లక్షపత్రి పూజ నిర్వహించారు. సాయంత్రం లక్ష దీపోత్సవం చేపట్టారు. ఎమ్మెల్యే ధర్మరాజు స్వామివా రిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పత్తేబాద చౌడేశ్వరి రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసోత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి లక్ష బిల్వార్చన పూజలు చేశారు. సాయంత్రం ఆలయావరణలో భక్తులు లింగాకారంలో కార్తిక దీపాలు వెలిగించారు. శివ నామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.

సామూహిక అనఘాలక్ష్మి వ్రతం.. ఏలూరు గ్రామీణ: దొండపాడు శ్రీనం దత్తనాథ క్షేత్రంలో బుధ వారం మహిళలు సామూహిక అనఘాలక్ష్మి వ్రతం ఆచరించారు. అంతకుముందు దత్తాత్రేయస్వామి, అన ఘాలక్ష్మికి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు.

భక్తిశ్రద్ధలతో లక్షపత్రి పూజ.. ఉంగుటూరు:

విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు.. ఉంగుటూరు: బాదంపూడిలో పునర్నిర్మించిన భక్తాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 13 నుంచి 15 వరకు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నారు. 13న గణపతి పూజ, గ్రామోత్సవం, 14న పుణ్యాహవాచనం, మండప పూజ, 15న ఆలయ శిఖర, ధ్వజ, యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ చేపట్టనున్నారు.

వేడుకగా భైరవ జయంతి

పెదవేగి (పెదపాడు): పెదవేగి మండలం రాట్నా లకుంటలోని రాట్నాలమ్మ ఆల యంలో భైరవ జయంతిని బుధ వారం భక్తిశ్రద్ధ లతో నిర్వహిం చారు. ఈ సంద ర్భంగా కాలభైరవుడి విగ్రహానికి క్షీరా భిషేకం చేశారు. అనంతరం రామలిం గేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంక రించి పూజలు చేపట్టారు.

కమ్మేసిన చీకట్లు!

గ్రామాల్లో వెలగని వీధి దీపాలు

చాటపర్రు (ఏలూరు గ్రామీణ), నిడమర్రు గ్రామీణ- న్యూస్‌టుడే: ఏలూరు నగర శివారు ప్రాంతాల్లో అంధకారం రాజ్యమేలుతోంది. పలు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. అక్కడి ప్రజలు ఇళ్లల్లోంచి బయటకొచ్చేందుకు భయప డుతున్నారు. ప్రధానంగా నగరపాలక సంస్థలో విలీనమైన వెంకటాపురం పంచాయతీ బూరా యిగూడేనికి వెళ్లే ప్రధాన దారిలో నెలలుగా వీధి దీపాలు వెలగడం లేదు. ఈ రోడ్డుకిరువై పులా పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగిపోయి దర్శనమిస్తున్నాయి.

సర్పాలకు నిలయం.. పొదల్లోంచి సర్పాలు, విష పురుగులు బయటకొచ్చి రహదారిపై సంచరిస్తున్నాయి. ఈ మార్గంలో రాత్రివేళ రాకపోకలు సాగించేందుకు పాదచారులు, ప్రయాణికులు, వాహనదా రులు బెంబేలెత్తిపోతున్నారు. దీనికితోడు దారంతా గుంతలు పడి అధ్వానంగా తయారైంది. ఓవైపు చీకట్లు, మరోవైపు గోతులతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సమస్యను నగరపాలక సంస్థ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని స్థానికులు వాపోతున్నారు. సిబ్బందిని పంపి దీపాలకు మరమ్మతులు చేయించి వెలిగిస్తామని నగరపాలక సంస్థ విద్యుత్తు ఏఈ పవన్ తెలిపారు.

200 కుటుంబాలున్నా.. నిడమర్రు మండలం ఇందిరమ్మ కాలనీ సుమారు 200 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇక్కడ వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారంలో నెలకొంటోంది. రాత్రిళ్ల సర్పాలు ఇళ్లలోకి వచ్చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. స్థానికులు పాము కాటుకు గురై ప్రాణాలు ప్రాణ నష్టం జరగక ముందే దీపాలు బాగు చేయాలని వారు కోరుతున్నారు.

చెల్లని చెక్కు కేసులో జైలు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: చెల్లని చెక్కు కేసులో నిందితుడికి ఆర్నెల్లు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. అధికారుల కథనం మేరకు.. ఒకటో పట్టణం తూర్పువీధికి చెందిన ముదపాక సాయిరామ్ అగ్నిమాపక కేంద్రం కూడ లిలో క్రీడా సామగ్రి దుకాణం నిర్వహించేవారు. ఆయన కుటుంబ అవసరార్థం నగరానికి చెందిన ఎం.సుధాకరరెడ్డి వద్ద 2022లో రూ.6 లక్షలు అప్పు తీసుకున్నారు. బాకీ తీర్చే నిమిత్తం 2023 అక్టోబ రులో రూ.4.5 లక్షల చెక్కు సుధాకరరెడ్డికి ఇచ్చారు. దాన్ని బ్యాంకులో జమ చేయగా బౌన్స్ అయ్యింది. బాధితుడు సుధాకరరెడ్డి న్యాయస్థా నంలో కేసు వేశారు. బుధవారం స్పెషల్ జ్యుడీషి యల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టులో అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి తుది విచారణ చేపట్టారు. నేరం రుజువు కావడంతో సాయిరామ్‌కు ఆర్నెల్లు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. రూ.4.50 లక్షలు చెల్లించాలని ఆదేశించారు.

మద్యం దుకాణంలో చోరీ

ఏలూరు నేరవార్తలు: ఇటీవల ఓ ఘటనలో స్థానిక జీవీ మాల్ సమీప ఎస్ఆర్ మద్యం దుకా ణాన్ని ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారు. మంగ ళవారం రాత్రి తలుపు తాళాలను దుండగులు పగులగొట్టి సుమారు రూ.లక్షన్నర విలువైన మద్యం సీసాలు దొంగిలించుకెళ్లారు. సమాచారం అందుకున్న రెండో పట్టణ సీఐ అశోక్ కుమార్ బుధవారం తన సిబ్బందితో కలిసి దుకాణాన్ని పరిశీలించారు. నిందితులను పట్టుకునేందుకు పోలీసు జాగిలాలను రంగంలోకి దింపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చోదకులపై కేసులు

పెదవేగి(పెదపాడు): పెదవేగి మండలం లక్ష్మీ పురం పంచాయతీ దిబ్బగూడెంలో ఎస్సై కె.రామ కృష్ణ బుధవారం వాహనాలు తనిఖీ చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరు చోదకులను అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు.

బస్సు, ఆటోను ఢీకొన్న కారు

గుడివాడ: ఓ కారు ఆర్టీసీ బస్సును, ఆటోను ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. సేకరించిన వివరాల ప్రకారం.. ఏలూరు నుంచి మచిలీపట్నం వెళుతున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు బలంగా ఢీకొంది. మరో ఆటోను కూడా ఢీకొంది. ఈప్రమాదంలో బస్సులోని ఇద్దరు వ్యక్తులు గాయాల పాల య్యారు. చాలా పెద్ద ప్రమాదం తప్పిందని బస్సు లోని వారు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి కారణాలు విచారణలో తేలాల్సి ఉంది.

తాగునీటి ఎద్దడి రానీయొద్దు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: నగరంలో తాగునీటి ఎద్దడి రానీయొద్దని నగ రపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. పంపుల చెరు వులో నిర్మించిన ఎలక్ట్రికల్ డీఈ, సిబ్బంది గదిని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నగరవాసులు తాగునీటికి ఇబ్బందులు పడకుండా గోదావరి జలాల సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ లీకేజీలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టనున్నట్లు చెప్పారు. కమిషనర్ భానుప్రతాప్, ఎంఈ సురేంద్రబాబు, ఎలక్ట్రికల్ డీఈ నారా యణరావు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వైకాపా శ్రేణుల ప్రదర్శన

ధర్నా చేస్తున్న వాసుబాబు, నాయకులు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకర ణను వ్యతిరేకిస్తూ.. ఉంగుటూరులో మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యాన వైకాపా నాయకులు బుధ వారం నిరసన చేపట్టారు. జాతీయ రహదారి నుంచి తహసీల్దారు కార్యా లయం వరకు ర్యాలీ చేపట్టారు. సీని యర్ సహాయకుడు లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు.

పెదవేగి(పెదపాడు): పెదవేగి మండలం కొండలరావుపాలెంలో వైకాపా శ్రేణులు ర్యాలీ చేపట్టాయి. ఆ పార్టీ నాయకుడు కొఠారు రామచంద్రరావు, జడ్పీ వైస్‌ఛైర్మన్ విజయ్‌బాబు ఆధ్వర్యంలో.. పెద్దఎత్తున తహసీల్దారు కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ జూనియర్ సహాయకురాలు శాంతిప్రియకు వినతిపత్రం అందజేశారు.

మహిళా సంఘాల పురోగతికి కృషి

దెందులూరు, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల పురోగతికి మండల సమాఖ్య కార్యవర్గం కృషి చేయాలని ఏపీడీ ఇ.అనిత సూచిం చారు. స్థానిక సమాఖ్య కార్యాలయంలో బుధవారం మండల సమా వేశం నిర్వహించారు. ఏజీఎం చెన్నకేశవులు అధ్యక్షత వహించారు. బ్యాంక్ అనుసంధాన, స్త్రీనిధి, ఉన్నతి రుణాల రికవరీపై చర్చించారు. అనంతరం మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. అధ్యక్షురాలిగా జయలక్ష్మి, కార్యదర్శిగా నాగలక్ష్మి, కోశాధికా రిగా దుర్గ, ఉపాధ్యక్షురాలిగా జయంతి, సంయుక్త కార్యదర్శిగా మణిని ఎన్నికయ్యారు. ఏపీఎం సురేశ్‌కుమార్, సీసీలు పాల్గొన్నారు.

నిరీక్షించి.. నిరాశతో నీరసించి!

ఆసుపత్రి ఆవరణలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ వేచి ఉన్న దివ్యాంగులు, సహాయకులు

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో బుధవారం సదరం ధ్రువ పత్రాల కోసం దెందులూరు మండలం నుంచి 28 మంది దివ్యాంగులు అవ స్థలు పడుతూ వచ్చారు. వైద్యులు వీరిని పరీక్షించి సదరం పోర్ట ల్‌లో నమోదు చేయాల్సి ఉంది. అయితే పోర్టల్‌లో వారి పేర్లు లేకపోవ డంతో ప్రక్రియ నిలిచిపోయింది. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం అందించినా స్పందించకపోవడంతో ఉదయం వచ్చిన వారంతా సాయంత్రం 4 గంటల వరకూ నిరీక్షించారు. ఫలితం లేకపోవడంతో నిరాశగా వెనుది రిగారు. వ్యయ ప్రయాసలకోర్చి సహాయకులతో వచ్చినా ధ్రువపత్రాల నమోదు కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. **- ఈనాడు, ఏలూరు**

చిన్నారి భవిత.. ఏదీ భద్రత!

అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాల లేమి

పెదపాడు, న్యూస్‌టుడే: ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్య అభ్యసించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలకొస్తున్న పిల్లలకు సరైన సదుపాయాల్లేక అల్లాడిపోతున్నారు. ఐసీడీఎస్ పెదపాడు ప్రాజెక్టు పరిధిలోని పెదవేగి, పెదపాడు, ఏలూరు గ్రామీణ మండలాలున్నాయి. సింహభాగం కేంద్రా లకు ప్రహరీల్లేకపోవడంతో భద్రత కర వైంది. దీనికితోడు పిచ్చిమొక్కలు పెరిగి పోయి, చెత్తాచెదారం పేరుకుపోయాయి. కొన్నిచోట్ల దారి సదుపాయమూ లేకపోవ డంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు.

సమస్యల మోత.. పెదపాడు మండలం లోని వసంతవాడ, కొత్తముప్పర్రు, గోగుంట, పెదపాడు, నాయుడుగూడెం తదితర అంగ న్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు నెలకొ న్నాయి. పెదవేగి, ఏలూరు గ్రామీణ మండలాల్లోని కేంద్రాల్లోనూ ఇవే ఇబ్బందులున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి సౌకర్యాలు మెరుగుపరచాలని, ప్రహరీలు నిర్మించాలని, పరిసరాల శుభ్ర తకు ప్రాధాన్యమివ్వాలని కోరుతున్నారు. 'అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాల మెరు గుకు చర్యలు తీసుకుంటాం. ప్రహరీల నిర్మాణాలకు సంబంధించి ఉన్నతాధికారు లకు నివేదిక పంపాం' అని ఇన్‌ఛార్జి సీడీ పీవో ఫాతిమాబేగం తెలిపారు.

పెదపాడు మండలం ఏపూరులో ప్రాథమిక పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయిన దృశ్యమిది. ఈ కేంద్రానికొచ్చేందుకు సరైన దారి లేకపోవడంతో.. చిన్నారులు, గర్భి ణులు, సిబ్బంది ఇబ్బందులు పడు తున్నారు. ఇక్కడ ప్రహరీ సైతం లేకపోవడంతో వారి భద్రతకు సవాల్ ఎదురవుతోంది. సెలవు దినాలు, రాత్రివేళల్లో కొందరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు.

పెదపాడు ప్రాజెక్టు వివరాలిలా..

మండలాలు:	3
అంగన్‌వాడీలు:	247
పిల్లలు:	12,515
గర్భిణులు:	837
బాలింతలు:	885

దస్తావేజు పోయినది

ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, కైకరం గ్రామం, కందుకూరి వారి వీధి, D.No. 5-59 కాపురస్తులు కోనా హనుమాన్‌బాబు, S/o. కోనా సత్యనారాయణ (లేటు)కి చెందిన ఒరిజినల్ దస్తావేజు నెం. 5630/2017 కైకరం నుండి ఉంగుటూరు వెళ్ళుచుండగా మార్గమధ్యలో పడిపోయినది. కావున దొరికిన వారు క్రింది అడ్రస్‌కు సంప్రదించగలరు.

కోనా హనుమాన్‌బాబు
కైకరం, సెల్: 98486 19239

CHANGE OF NAME

I, ALAVA LAKSHMI DEEPIKA, W/o. ALAVA SESHAGIRI RAO, Residing at H.No. 7D-9-38, Mote Palli Vari Street, Near Gowramma Temple, Eastern Street, Eluru, Eluru District, Andhra Pradesh-534001. Changing My Name from PASUPULETI DADABAI (Old Name) To ALAVA LAKSHMI DEEPIKA (New Name) Hence forth I am being Called as ALAVA LAKSHMI DEEPIKA (New Name) For all Purpose.

(c) eenadu

పోలవరం

•పోలవరం •చింతలపూడి

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఐసీడీఎస్ ప్రాంతీయ సంయుక్త సంచాలకురాలు సుజాతా రాణి తెలిపారు. బుట్టాయగూడెం మండలం చీమలవారిగూడెం, కేఆర్‌పురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె సందర్శించారు. కేఆర్ పురంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. దస్త్రాల నిర్వహణపై పలు సూచనలు ఇచ్చారు. బుట్టాయగూడెం సీడీపీవో పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్ష కేంద్రాల తనిఖీ

కుక్కునూరు, జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: కుక్కునూరు మండలంలో 2026 పదో తరగతి కామన్ పరీక్షల కేంద్రాలను పరీక్షల నిర్వహణ సహాయ కమిషనర్ ఆశ బుధవారం పరిశీలించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల, కస్తూర్బా పాఠశాలలను తనిఖీ చేసి, అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఆమె వెంట కొయ్యలగూడెం డిప్యూటీ డీఈవో రామన్నదొర, ఎంఈవోలు కృష్ణప్రసాదు, భగవాన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు. జీలుగుమిల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్, బర్రింకలపాడు గిరిజన గురుకుల పాఠశాలల్లోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను కూడా ఆమె సందర్శించారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన అంశాలు, ఏర్పాట్లను పరిశీలించారు. ఎంఈవో-1, 2లు శ్రీనివాసరావు, బుచ్చియ్య తదితరులు పాల్గొన్నారు.

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..

జంగారెడ్డిగూడెం:	80085 74478
కొయ్యలగూడెం:	80085 74947
చింతలపూడి:	76759 19086

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ? అంకాలగూడెం పరిధి కొత్తపేటలో వీధి పొడవునా విద్యుత్తు స్తంభాలు, వీధి దీపాలు లేవు. - కె.రాజారత్నం

✔ క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం.- వై.మధు, ఏడీ, ట్రాన్స్‌కో, కొయ్యలగూడెం సబ్ డివిజన్, సురేష్, పంచాయతీ కార్యదర్శి, బోడిగూడెం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ? జడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యర్థాలకు నిప్పు పెడుతున్నారు. వెనుక గోడ వైపు ఉన్న టీచర్స్ కాలనీలోకి వీటి పొగ వస్తోంది. ఇబ్బంది పడుతున్నాం. - రమణమూర్తి

✔ వ్యర్థాలు వేసేందుకు పాఠశాల వద్ద డస్ట్ బిన్స్ ఏర్పాటు చేశాం. ఇక నుంచి నిప్పు పెట్టకుండా చూస్తాం. -వి.రమణ, పురపాలక కమిషనర్, జంగారెడ్డిగూడెం

నీళ్లు తెచ్చుకుంటేనే దాహం తీరేది..!

పాఠశాలల్లో నిరుపయోగంగా శుద్ధిజల పరికరాలు

కొయ్యలగూడెం, టి.నరసాపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లోని బాలలు తాగేందుకు శుద్ధి జలం సరఫరా అనేది కలగానే మిగిలింది. చాలా పాఠశాలల్లో శుద్ధి జలం కోసం ఏర్పాటు చేసిన ప్లాంట్లు నిరుపయోగంగానే మిగిలాయి. కొన్నిచోట్ల అసలు పరికరాలను బిగించకుండా వదిలేశారు. దీంతో విద్యార్థులు ఇంటి నుంచే సీసాలతో తాగునీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. గత ప్రభుత్వం నాడు - నేడు పథకం కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలని తలచి అందుకు అవసరమైన పరికరాలను పంపించింది. అయితే వాటిలో కొన్ని పాఠశాలల్లో శుద్ధి జలం కోసమని ఆర్వోప్లాంట్లను బిగించారు. కొన్నిచోట్ల గుత్తేదారుకు సొమ్ములు ఇవ్వలేదని పాఠశాలలకు పరికరాలు వచ్చినా వాటిని బిగించకుండా వదిలేశారు.

● కొయ్యలగూడెం మండలంలో 21 ఆర్వో ప్లాంట్లు మంజూరు కాగా వాటిలో 11 అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన 10 ప్లాంట్ల పరికరాలు అలానే ఆయా పాఠశాలల్లో వదిలేశారు.

● టి.నరసాపురం మండలంలో పదికి పైగా పాఠశాలలకు ఆర్వో ప్లాంట్లు మంజూరు చేసినా వాటిని బిగించలేదు. నీటి ట్యాంకులకు అనుసంధానం చేయాల్సిన ఆయా ప్లాంటులకు సంబంధించిన పరికరాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. విద్యార్థులు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

చిన్నగురువాయిగూడెంలో ఆర్వో ప్లాంటు ఇలా..

ఉన్నతాధికారులకు నివేదించినా.. ఏలూరు జిల్లాలో 589ఆర్వో ప్లాంట్లు మంజూరు కాగా చాలా వరకు పాఠశాలల్లో అందుబాటులోకి తీసుకురాలేదు. వాటిని బిగించాలని పలుమార్లు ఉన్నతాధికారులకు నివేదించినా ఫలితం లేక పోయిందని ఉపాధ్యాయులు తెలిపారు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులే సొంతంగా చందాలు వేసుకుని తమ పాఠశాలల్లో నీటిశుద్ధి ప్లాంట్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లను మంజూరు చేశారు.

వ్యయం ఇలా... ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో వంద మంది విద్యార్థులు ఉన్న చోట శుద్ధినీటి యంత్రాల ఏర్పాటుకు 24 వేలు - 70 వేలు వరకు వెచ్చించారు. 300 మంది కంటే తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో రూ.1.84 లక్షలు, 300-500 ఉన్న పాఠశాలలకు రూ.4.80 లక్షలు విలువ చేసే యంత్రాలను సరఫరా చేశారు. వీటిలో చాలా వరకు పరికరాలు ఆయా పాఠశాలలో బిగించకోవడంతో నిరుపయోగంగా పడి ఉన్నాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ప్రస్తుత ప్రభుత్వమైనా పాఠశాలల్లో విద్యార్థులకు శుద్ధిజలం అందేలా ప్లాంట్‌లను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

త్వరలోనే అందుబాటులోకి తెస్తాం..

పాఠశాలలకు సరఫరా చేసిన శుద్ధిజల యంత్రాలు కొన్ని చోట్ల బిగించకపోవడం వాస్తవమే. త్వరలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- పంకజకుమార్, ఏపీసీ, సమగ్రశిక్షా, ఏలూరు.

కొత్తపట్టిసీమలో కొనుగోలు కేంద్రం ప్రారంభించిన బొరగం శ్రీనివాసులు

ధాన్యం అమ్మిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము

పోలవరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలన్న కృతనిశ్చయంతో ఉందని ట్రైకార్ సంస్థ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. మండలంలోని పట్టిసీమ, కొత్తపట్టిసీమ గ్రామాల్లో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను బొరగం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో మండలంలో 8,150 ఎకరాల్లో వరి పంట వేశారని ధాన్యం సేకరణ కోసం కొనుగోలు కేంద్రాల వద్ద ఆరు లక్షల గోనె సంచులు అందుబాటులో ఉంచారని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఈ పంట ప్రామాణికంగా ధాన్యం సేకరించడం జరుగుతుందని, 24 గంటల్లో రైతుల ఖాతాలకు నగదు జమ చేస్తారని వెల్లడించారు. పట్టిసీమ, కొత్తపట్టిసీమ సహకార సంఘాల అధ్యక్షులు ఎన్.రాంబాబు, పి.వెంకట్రావు, వ్యవసాయాధికారి కె.రాంబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి ఎమ్మెల్యే హర్షితకు సత్కారం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఇటీవల నిర్వహించిన పోటీల్లో బయ్యనగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని పి.హర్షిత పోలవరం నియోజకవర్గ స్థాయిలో విజేతగా నిలిచింది. ఈ నెల 26న రాజధాని అమరావతిలో శాసనసభలో నిర్వహించనున్న 'విద్యార్థి అసెంబ్లీ'లో ఒక రోజు ఎమ్మెల్యేగా పాల్గొనేందుకు అవకాశం దక్కించుకుంది. దీంతో ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు పారేపల్లి నరేశ్, ఆరేటి ఏసుబాబు, టెక్కెం సీతారాం తదితరులు ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో బుధవారం ఆమెను సత్కరించారు.

వృద్ధులు సమాజ సంపద

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: వృద్ధులు సమాజ సంపద అని ఏఎస్పీ సుస్మిత తెలిపారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏఎస్పీ మాట్లాడుతూ వృద్ధులకు అండగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీని ఘనంగా సత్కరించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామచంద్రరావును కూడా సత్కరించారు.

17 ఆత్మగౌరవ ప్రదర్శన

టి.నరసాపురం, న్యూస్‌టుడే: దిల్లీలో ఈ నెల 17న నిర్వహించే దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు విస్సంపల్లి సిద్ధూ మాదిగ కోరారు. బండివారిగూడెంలో నిర్వహించిన ఆ సంఘ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

రాజీకి అవకాశం ఉన్న కేసుల పరిష్కారానికి కృషి

సమీక్షలో పాల్గొన్న న్యాయమూర్తులు కిశోర్‌కుమార్, తేజస్వి

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: డిసెంబరు 13న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి అవకాశం ఉన్న వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) సి.హెచ్.కిశోర్‌కుమార్ కోరారు. లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహణ చర్యల్లో భాగంగా కోర్టు ప్రాంగణంలో బుధవారం పోలీసు, ఎక్సైజ్ అధికారులు, న్యాయవాదులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి కిశోర్‌కుమార్ మాట్లాడారు. జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.ఎస్.ఆర్.తేజస్వి మాట్లాడుతూ ప్రతి న్యాయవాది తమ పరిధిలోని చెక్ బౌన్స్ కేసులు, మనోవర్తి, గృహహింస తదితర కేసులు రాజీ అయ్యేలా చూడాలని సూచించారు. పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు, జంగారెడ్డిగూడెం సీఐ సుభాశ్, పోలవరం సీఐ బాలసురేశ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే ప్రాంతాల గుర్తింపు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: గుండుగొలను నుంచి ద్వారకాతిరుమల మండలం లక్ష్మీనగర్ వరకు జాతీయ రహదారిపై తరచూ జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు అన్ని శాఖల అధికారులతో కూడిన సంయుక్త తనిఖీ బృందం బుధవారం పరిశీలించింది. భీమడోలు సీఐ విల్సన్, ద్వారకాతిరుమల ఎస్సై సుధీర్, చేబ్రోలు ఎస్సై సూర్యభగవాన్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ద్వారకా విఠల్, ఆర్ అండ్‌బీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మీరావలి, డీటీఆర్బీ సిబ్బంది కలిసి పరిశీలించి అధికంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, నేషనల్ హైవే అధికారులకు నివేదించారు.

ఆర్థిక సాయం అందజేత

పోలవరం, న్యూస్‌టుడే: తోటి మిత్రుడు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చేరడంతో 1984-85 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆర్థిక సహాయం అందజేశారు. ఎడ్లగూడేనికి చెందిన ఏళ్ల రాధాకృష్ణ ప్రమాదంలో గాయపడి ఆసుపత్రి నుంచి బుధవారం ఇంటికి చేరడంతో మిత్రులు వెళ్లి పరామర్శించడంతోపాటు రూ.17,616 అందజేశారు.

చింతలపూడి, న్యూస్‌టుడే: ఎండపల్లి గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని మిద్దే వసంతికి పట్టణ లయన్స్‌క్లబ్ సభ్యులు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేసినట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు తెలిపారు.

శిక్షణలో పాల్గొన్న కార్యదర్శులు

పంచాయతీల ఆదాయం పెంచాలి

కామవరపుకోట, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల ఆదాయ వనరుల పెంపుతో అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. బుధవారం పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు.

టి.నరసాపురం, న్యూస్‌టుడే: పంచాయతీల అభివృద్ధికి ప్రజాప్రతినిధులతోపాటు ప్రజలంతా సహకరించాలని ఎంపీడీవో జి.మణికుమారి అన్నారు. టి.నరసాపురంలో రెండు రోజుల పాటు సర్పంచులకు, కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

సచివాలయాల్లో ప్రధాని ఫొటోలు పెట్టండి

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: సచివాలయాల్లో ప్రధాన మంత్రి మోదీ ఫొటో ఉండటం లేదని భాజపా జిల్లా ఉపాధ్యక్షురాలు పీవీ రామలక్ష్మి బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తోపాటు ప్రధాని మోదీ ఫొటో కూడా ఏర్పాటు చేయాల్సి ఉందని చెప్పారు.

పవన సుతునికి లక్ష తమలపాకుల పూజ..

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మద్ది క్షేత్రంలో జరుగుతున్న కార్తిక మాస ఉత్సవాల్లో భాగంగా పవన సుతునికి బుధవారం లక్ష తమలపాకుల పూజలు నిర్వహించారు. వేలాది మంది స్వామిని దర్శించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. పూజా టిక్కెట్లు, విరాళాల ద్వారా రూ.1.99 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఏసీ ఆర్.వి.చందన తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

చింతలపూడి, న్యూస్‌టుడే: ఇటీవల లింగపాలెం మండలం జూబ్లీనగర్ వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో మృతిచెందిన అయ్యపరాజుగూడెంకు చెందిన వీరంకి ప్రవీణ్ బాబు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే రోషన్ కుమార్ బుధవారం పరామర్శించారు. ప్రవీణ్ బాబు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజల ఫిర్యాదులపై వీఆర్వోల మార్పు

పోలవరం, న్యూస్‌టుడే: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు పలువురు గ్రామరెవెన్యూ అధికారులను మార్పులు చేసినట్లు తహసీల్దార్ సాయిరాజు తెలిపారు. పట్టిసీమ, వెంకటాపురంలో విధులు నిర్వహిస్తున్న వీఆర్వోను, పోలవరం-3కు, చేగొండపల్లి వీఆర్వోను పట్టిసీమ, వెంకటాపురానికి, ప్రగడపల్లి వీఆర్వోను చేగొండపల్లికి, గెడ్డపల్లి వీఆర్వోకు అదనంగా ప్రగడపల్లి, పోలవరం-3 వీఆర్వోకు పోలవరం-1, 2 బాధ్యతలు అప్పగించామని వెల్లడించారు.

పుంత.. నడవ లేక చింత

ప్రగడపల్లి సమీపంలో అధ్వానంగా దారి

పోలవరం, న్యూస్‌టుడే: కొంత కాలంగా వీడని వర్షాల కారణంగా పుంతదారులు అధ్వానంగా మారడంతో వ్యవసాయ ఉత్పత్తులు బయటకు తీసుకురావడానికి రైతులు శ్రమదానం చేసి బాటలు సరిచేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రగడపల్లి సమీపంలో కొత్తూరు చెరువు ఆయకట్టులో పండించిన పంట తీసుకొచ్చే పుంత దారి వర్షాల కారణంగా అధ్వానంగా మారింది. వరి చేలు కోత దశకు చేరడంతో ఈ దారిలో ట్రాక్టర్లపై ధాన్యం బయటకు వచ్చే పరిస్థితి కనిపించక గ్రామంలోని రైతులంతా కలిసి దాదాపు రూ.లక్ష వసూలు చేసి పుంత దారికి గ్రావెల్ వేయించే పనిలో పడ్డారు. కొంత మేర దారి బాగు చేసుకున్నామని అధికారులు మిగిలిపోయిన బాటను బాగు చేయించాలని రైతులు కోరుతున్నారు.

అథ్లెటిక్స్‌లో ప్రతిభ

చింతలపూడి, న్యూస్‌టుడే: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధి రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఈ నెల 10, 11 తేదీల్లో జరిగిన అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని వి.భార్గవి ప్రతిభ కనబరిచింది. డిస్కస్ త్రో విభాగంలో కాంస్య పతకం సాధించడంతో ప్రిన్సిపల్ శ్రీనివాసరావు కళాశాలలో ఆమెను బుధవారం అభినందించారు.

భార్గవిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాసరావు

గృహ పత్రం అందజేస్తున్న బాలరాజు

అందరికీ ఇళ్లు... ప్రభుత్వ ధ్యేయం

జీలుగుమిల్లి(బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: ప్రతి పేద కుటుంబానికి సొంతింటిని సమకూర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. తాటియాకులగూడెంలో అందరికీ ఇల్లు పథకం కింద నిర్మించిన ఇళ్లలో గృహప్రవేశాల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. గృహ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. జనసేన నాయకులు గడ్డమనుగు రవికుమార్, కరాటం సాయి తదితరులు పాల్గొన్నారు.

పేదవాడి సొంతింటి కల సాకారం

చింతలపూడి, న్యూస్‌టుడే: ప్రతి పేదవాడికి ఇంటిని నిర్మించి ఇవ్వాలనేది కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తెలిపారు. మల్లాయిగూడెం పంచాయతీ ఏసీ అగ్రహారంలో సామూహిక గృహప్రవేశాల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక పేదవాడి సొంతింటి కల సాకారం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మండలంలో నూతనంగా నిర్మించిన 241 గృహాల్లో ప్రవేశాలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లబ్ధిదారునికి ఇంటి పత్రం అందజేస్తున్న రోషన్ కుమార్

'వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వద్దు'

బుట్టాయగూడెం, కామవరపుకోట, న్యూస్‌టుడే: వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయొద్దని కోరుతూ బుధవారం వైకాపా ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు నేతృత్వంలో బుట్టాయగూడెంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కామవరపుకోటలో వైకాపా నాయకులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా అటుగా ఓ ప్రైవేటు కార్యక్రమానికి వెళ్తున్న శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు అక్కడ కొంత సేపు ఆగి వైకాపా నేతలతో మంతనాలు జరిపి వెళ్లారు. పోలీసులు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయవద్దని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్ కోరారు. స్థానిక యూటీఎఫ్ భవనంలో ఎస్ఎఫ్ఐ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లెనిన్ మాట్లాడారు. 13 మందితో మండల కమిటీ ఏర్పాటు చేశారు.

గ్రంథాలయ కమిటీల నియామకం

జంగారెడ్డిగూడెం, చింతలపూడి, న్యూస్‌టుడే: లక్కవరం శాఖా గ్రంథాలయం అధ్యక్షుడిగా పఠాన్ అన్వర్ బాషా నియమితులయ్యారు. కమిటీ ఉపాధ్యక్షుడిగా దల్లి హరికృష్ణ, కార్యదర్శిగా మాగంటి మౌనిక, సంయుక్త కార్యదర్శిగా కలపాల బాలాజీ, ఇతర సభ్యులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం మొదటి సమావేశం నిర్వహించి గ్రంథాలయ వారోత్సవాల నిర్వహణపై చర్చించారు.

★ చింతలపూడిలోని శాఖా గ్రంథాలయం ఛైర్మన్‌గా తనగాల అనిల్‌కుమార్ నియమితులయ్యారు. సభ్యులుగా ఎ.నాగు, కె.సత్యనారాయణ, పి.రామారావు, ఇ.బలివేంద్రరావు, సయ్యద్ మీర్జాఫర్ ఆలీ, కార్యదర్శిగా బి.రమేష్ నియమితులయ్యారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ, రగ్బీ పోటీలకు విద్యార్థులు

ఉపాధ్యాయులతో విజేతలు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి కబడ్డీ, రగ్బీ పోటీలకు టి.నరసాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.లింగస్వామి తెలిపారు. టి.నరసాపురంలో ఈ నెల 3న జరిగిన జిల్లాస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో సీహెచ్ వినయ్, ఆర్.నాగరాణి, కె.లావణ్య విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 8న గోపన్నపాలెంలో జరిగిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ కబడ్డీ అండర్ 14 విభాగంలో కె.సాయిదీపక్, అండర్ 17 విభాగంలో కె.సందీప్ విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 4న జంగారెడ్డిగూడెంలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ రగ్బీ అండర్ 14 బాలికల విభాగంలో సిరిబిందు, అండర్ 17 బాలికల విభాగంలో ప్రసన్న, దుర్గ, బాలుర అండర్ 14విభాగంలో పవన్, ప్రశాంత్, నాగచైతన్య, అండర్ 17బాలురు విభాగంలో దయాకర్, కౌశిక్ విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

లారీ చోదకుడి మృతి

బలిజిపేట, న్యూస్‌టుడే: కుటుంబ పోషణకు లారీ చోదకుడిగా మారిన ఆయన ప్రాణం ఊరుకాని ఊరిలో ఆగింది. పోలీసుల వివరాల మేరకు.. ఏలూరు జిల్లా కొయ్యలగూడెంకు చెందిన దారపురెడ్డి భాస్కరరావు(58) సిమెంటు లోడుతో ఒంటరిగా పార్వతీపురం జిల్లా బలిజిపేటకు సోమవారం సాయంత్రం వచ్చారు. దాన్ని అన్‌లోడ్ చేసేందుకు మంగళవారం ఉదయం నుంచి చరవాణికి ఫోన్ చేసినా స్పందించలేదు. ఈ లోపు లారీ తలుపులు వేసి ఉండటం, అందులో మనిషి ఉండటాన్ని గుర్తించిన స్థానిక కళాసీలు సిమెంటు కంపెనీ, ట్రాన్సుపోర్టు యాజమాన్యానికి సమాచారం ఇచ్చారు. వారు పోలీసులతో వచ్చి పరిశీలించగా భాస్కరావు విగతజీవిగా కనిపించారు. గుండెపోటుతో మృతిచెంది ఉంటారని ప్రాథమికంగా భావిస్తున్నారు. బుధవారం ఏఎస్సై శశికుమార్ కేసు నమోదు చేశారు.

వాహనాల తనిఖీ

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం ఏటిగట్టు సెంటర్‌లో బుధవారం చేపట్టిన వాహనాల తనిఖీలో రికార్డులు లేని రెండు ద్విచక్ర వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై పవన్‌కుమార్ చెప్పారు. కొంత మంది పిల్లలు ద్విచక్రవాహనాలు నడపడం చూసి వారికి ఎస్సై కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు పిల్లలకు వాహనాలు ఇచ్చి కేసుల్లో ఇరుక్కోవద్దని తల్లిదండ్రులను ఎస్సై హెచ్చరించారు.

'దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి'

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడేనికి చెందిన దళితుడు బాషా శ్యాంబాబు ఇంటిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మాల సురేశ్, జిల్లా కమిటీ సభ్యుడు కారం రాఘవ కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

జీలుగుమిల్లి(బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: దర్భగూడెంలో వెంకటేశ్వరరావు అనే వ్యాపారి ఇంట్లో బుధవారం తనిఖీ చేసి అక్రమంగా 8 మూటల్లో నిల్వ చేసిన 248 కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు పౌర సరఫరాల ఉప తహసీల్దార్ రమణ తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ముగ్గురి బైండోవర్

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో నాటు సారా కేసుల్లో ముగ్గురు పాత ముద్దాయిలపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు సీఐ అశోక్ బుధవారం తెలిపారు.

దొంగతనం కేసులో అరెస్టు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: దొంగతనం కేసులో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ద్వారకాతిరుమల ఎస్సై సుధీర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ద్వారకాతిరుమలకు చెందిన కనిగొళ్ల లక్ష్మీ కాశీ విశ్వనాథం ఈ నెల 1న ఇంటికి తాళాలు వేసి కుటుంబ సమేతంగా అశ్వారావుపేట వెళ్లారు. ఆ రోజు రాత్రి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఏలూరులోని తంగెళ్లమూడికి చెందిన దత్తి నవీన్, అతని స్నేహితులైన తాడేపల్లిగూడెంకు చెందిన జి.సాయి కిరణ్, కోనసీమ జిల్లా మండపేట మండలం కేతవరానికి చెందిన పి.అరవింద్ ఇంటి తాళాలు పగలగొట్టి లోపలకు వెళ్లి బీరువాలో ఉన్న 2 కాసుల బంగారు వస్తువులు, రూ.1.70 లక్షలు నగదు దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ద్వారకాతిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులు బుధవారం అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P.No.53/2017 in O.S.No.523/2012

Between:

Sri Arumilli Sridhar, S/o Siva Narayana Rao, D.No.59-8-3/20, P and T Colony, Korukonda Road, Rajahmundry, E.G.Dt. ...DHR

AND

1) Sri Janga Kutumba Reddy (Died)
2) Janga Prasanna, W/o Kutumba Reddy Late , Hindu, aged 45 years, 2nd floor, Sangeeta Venkata Reddy Street, Jawaharlal Nehru Road, Rajahmundry.
3) Janga Karthik, S/o Kutumba Reddy Late, Hindu, aged 25 years, 2nd floor, Sangeeta Venkata Reddy Street, Jawaharlal Nehru Road, Rajahmundry ...2, 3 JDRS

పై నెంబరు డిక్రీ బాకీ వసూలు నిమిత్తం జె.డి.ఆర్స్ తాలూకు ఈ దిగువ ఉదహరించిన షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిని పై కోర్టు వారి సమక్షంలో ది.1-12-2025న ఉదయం గం.10.30 నిలల లగాయితు బహిరంగవేలం జరుగును. కావలసిన వారు వచ్చి పాడుకొనవచ్చును. పాట షరతులు కోర్టు నజారత్ గారిని అడిగి తెలుసుకొనవచ్చును.

వేలం ఆస్తి వివరములు

Vacant site of an extent of 635.5 sq. yards situated near D.No.7-167 (Cashew nut factory) in R.S.No.599/1, Jangareddygudem Panchayat, Jangareddygudem Sub Registrar, West Godavari District bounded by: **East:** 52 ft Road leading to Parampeta; **South:** 115 feet remaining land in S.No.599/1; **West:** Road; **North:** 105 feet remaining land in S.No.599/1

A total extent of 635.5 sq. yards is equal to 534 sq. mtrs with all standing trees etc.

DHR విలువ : రూ. 9,00,000/-
అమీనా విలువ : రూ. 10,16,000/-
JDR విలువ ఇవ్వలేదు

(శ్రీ కోర్టువారి అనుమతితో)

కరుటూరి శంకరరాజు, అడ్వకేట్
D.No.2-238, పంచాయతీ ఆఫీస్ దగ్గర వేములూరు, కొవ్వూరు
Dt: 11-11-2025 సెల్: 99123 98006

కష్టం కరిగి.. కన్నీరు మిగిలి..!

తుపాను తాకిడికి మినుము రైతు కుదేలు

వేలేరుపాడు, న్యూస్‌టుడే: మొంథా తుపాను వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని మినుము రైతులను కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. పుట్టిన చోటల్లా అప్పులు చేసి తీరా పంట చేతికొస్తుందనే తరుణంలో అనూహ్యంగా తుపాను విరుచుకుపడటంతో పంటంతా తడిచి ముద్దయింది. దీంతో ఎకరాకు కేవలం ఒకటి, రెండు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తుండటంతో అన్నదాతలు తీవ్ర నష్టాలకు గురై గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు.

వేలాది ఎకరాల్లో దెబ్బతిన్న పంట..

రెండు మండలాల్లోని మేడేపల్లి, కమ్మరిగూడెం, కోయమాదారం, పాతరెడ్డిగూడెం, బండ్లబోరు, భూదేవిపేట, పెదబుర్రతోగు, దాచారం, అర్వాయిపల్లి, బెస్తగూడెం తదితర గ్రామాల రైతులు ఈ ఏడాది గంపెడాశతో సుమారు 2 వేల ఎకరాల్లో మినుము సాగు చేశారు. పలువురు రైతులు ఎకరాకు రూ.5 నుంచి 10 వేల వరకు కౌలు చెల్లించడంతోపాటు రూ.30 నుంచి 40 వేల వరకు పెట్టుబడి పెట్టారు. అయితే పంట ఆశాజనకంగా ఉండగా, ఒక్కసారిగా వచ్చి పడిన వర్షంతో తడిచిపోయి గింజలు బూజు పట్టాయి. దీంతో చేసేది లేక పండిన కొద్ది పంటను ఒన్ను చేసి రోజుల తరబడి ఎండలో ఆరబెడుతున్నారు. అయినా ఫలితం లేకుండా పోతోంది. తాలు గింజలు ఏర్పడి దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. కాగా, బహిరంగ మార్కెట్‌లో మినుము క్వింటా ధర కేవలం రూ.2 వేలు పలుకుతుండటంతో అటు పంటను తెగనమ్ముకోలేక ఇటు దాచుకునే పరిస్థితి లేక అయోమయ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు.

ఎండలో ఆరబోసిన మినుములు

కొనే దిక్కులేక...



ఈ ఏడాది రెండెకరాల్లో మినుము సాగు చేశా. ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టగా, పంట చేతికొస్తుందనుకునే సమయంలో అనుకోకుండా వచ్చి పడిన తుపానుతో చేనంతా నీటిలో మునిగిపోయింది. పది రోజుల పాటు పంటను ఎండలో ఆరబెట్టినప్పటికీ కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. - మేడవరపు రామకృష్ణ, భూదేవిపేట

రూ.60 వేలకు పైగా నష్టపోయా..

పుట్టిన చోటల్లా అప్పులు చేసి గ్రామ సమీపంలోని మూడెకరాల్లో సాగు చేసిన మినుము తుపాను తాకిడికి గురై పూర్తిగా దెబ్బతింది. తాలు గింజలు ఏర్పడటంతో ఎకరాకు అర క్వింటా దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో రెక్కల కష్టంతో పాటు రూ.60 వేలకు పైగా నష్టం మిగిలింది.

- సప్కా వెంకటేశ్వరరావు, పెదబుర్రతోగు

(c) eenadu

నూజివీడు
• నూజివీడు • కైకలూరు

సామర్థ్యానికి అనుగుణంగా బోధన
ముదినేపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థుల సామర్థ్యానికి అనుగుణంగా ఉపాధ్యాయులు బోధన చేయాలని ఎంఈవో-2 నరేశ్ కుమార్ సూచించారు. చిగురుకోట ఎంపీపీ పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్ఏ-1 పరీక్షను బుధవారం ఆయన పరిశీలించారు. సకాలంలో పరీక్ష పత్రాలను మూల్యాంకనం చేయాలని సూచించారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చిగురుకోటలో పరీక్షల ప్రక్రియను పరిశీలిస్తున్న నరేశ్‌కుమార్

చెత్త కుప్పలు వద్దు.. చెట్లెంతో ముద్దు
ముదినేపల్లి, న్యూస్‌టుడే: ప్రజారోగ్యాన్ని దెబ్బతీసేలా రహదారి పక్కన చెత్త వేయొద్దని, అక్కడ మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడదామని డిప్యూటీ ఎంపీడీవో బి.అశోక్ అన్నారు. బుధవారం ఊటుకూరు శివారు నారాయణపురంలో చెత్తకుప్పలు తొలగించి గ్రామస్థులతో కలిసి మొక్కలు నాటారు. నాయకులు సుధాబత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థులతో కలిసి మొక్కలు నాటుతున్న డిప్యూటీ ఎంపీడీవో అశోక్

పాతాళ భోగేశ్వరునికి ప్రత్యేక పూజలు
కలిదిండి, న్యూస్‌టుడే: కలిదిండిలోని పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామివారి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా
ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో హీల్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు ప్రిన్సిపల్ వై.బాలచౌదరి తెలిపారు. ఈనెల 11న విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఇంటర్ స్కూల్ ఇన్విటేషన్ స్పోర్ట్స్ మీట్‌లో తోటపల్లిలోని హీల్ పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించారు. 100 మీ. పరుగు పందెంలో వి.హేమంత్ కుమార్, 200 మీ. పరుగు పందెంలో జి.సంజన, టి.కిరణ్ కుమార్ ప్రథమ స్థానంలో నిలిచారు. 400 మీ. పరుగు పందెంలో కె.ప్రశాంత్, 800 మీ. పరుగు పందెంలో బి.పవన్ కుమార్, జి.సంజన ప్రథమ, దినేశ్‌కుమార్ తృతీయ, జావెలిన్ త్రోలో కె.బన్నూ ద్వితీయ, డిస్కస్ త్రోలో సాయి దీక్షిత్ తృతీయ, లాంగ్ జంప్‌లో హేమంత్ కుమార్ తృతీయ స్థానం కైవసం చేసుకున్నారని వివరించారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హీల్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేరు సత్య ప్రసాద్, సీఈవో కె.అజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ ఎం.లలిత, పీఈటీలు నాగరాజు, శ్రీనివాసరెడ్డి, జెట్టి, ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు.

విజేతలతో ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, పీఈటీలు

బాస్కెట్‌బాల్‌లో ప్రతిభ
ముసునూరు, న్యూస్‌టుడే: విశాఖపట్నంలో ఇటీవల జరిగిన 11వ సీనియర్ బాల బాలికల రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి కృష్ణాజిల్లా బాలికల జట్టు నాలుగో స్థానంలో నిలిచి సెమీఫైనల్‌కు అర్హత సాధించిందని ముసునూరు మండలం రమణక్కపేట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పసుమర్తి రామకృష్ణారావు, వ్యాయామ ఉపాధ్యాయుడు వాకా నాగరాజు బుధవారం తెలిపారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన టి.నాగసుధ, డి.జెస్సీ కృష్ణ జట్టుకు ప్రాతినిధ్యం వహించారని తెలిపారు. ఈ మేరకు వారిని ఆయన, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడాకారిణులతో ఉపాధ్యాయులు

పెద్ద చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం
నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పట్టణంలోని పెద్ద చెరువులో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. బహిర్భూమికి వచ్చి ప్రమాదవశాత్తు పడిపోయి ఉండొచ్చని పట్టణ ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీసే ప్రయత్నాలు చేపట్టారు. పోస్టుమార్టం అనంతరం కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

పల్లెలకు నిరంతర వెలుగులు
త్వరలో అమలు కానున్న త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా

నూజివీడు, న్యూస్‌టుడే: పట్టణాలతో పాటు పల్లెల్లోనూ త్రీఫేజ్ విద్యుత్తు సరఫరాకు వేగంగా అడుగులు పడుతున్నాయి. పల్లెల్లోనూ 24 గంటల వెలుగులకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. విద్యుత్తు పునర్ వ్యవస్థీకరణ పథకం(ఆర్‌డీఎస్ఎస్)లో భాగంగా 24 గంటల విద్యుత్తు సరఫరాకు ప్రత్యేక త్రీఫేజ్ తీగల ఏర్పాటు పనులను గత వైకాపా ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసింది.

చురుగ్గా పనులు
నూజివీడు డివిజన్ పరిధిలో 266 సెక్షన్లు ఉన్నాయి. వాటిలో 11 కేవీ సబ్ స్టేషన్లు 140లో, 33 కేవీ సబ్‌స్టేషన్లు 15లో వ్యవసాయ ఫీడర్లతో అనుసంధానమైన గ్రామీణ ప్రాంతాలు నిరంతర వెలుగులకు నోచుకోలేదు. దీంతో చిన్న తరహా పరిశ్రమలు, గిడ్డంగులు, ఆహార శుద్ధి కేంద్రాలు సరిగా పనిచేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పనులు చురుగ్గా సాగుతున్నాయి.

చిన్న తరహా పరిశ్రమలకు ప్రయోజనం
ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న ఆర్‌డీఎస్ఎస్ పనులతో చిన్నతరహా పరిశ్రమలకు ప్రయోజనం చేకూరుతోంది. ఈ పనులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాల్లోనూ 24 గంటలు త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా అవుతుంది. చిన్నతరహా పరిశ్రమలు, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. ఔత్సాహికులు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. ఇప్పటికే నూజివీడు డివిజన్‌లో 30 ఫీడర్లలో త్రీఫేజ్ విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయి.

వడ్లమాను దగ్గర ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో సిబ్బంది

సకాలంలో పూర్తి
నూజివీడు విద్యుత్తు డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో పనులు త్వరలోనే పూర్తవుతాయి. తరచూ ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నారు. క్షేత్ర స్థాయి పర్యటనతో పనులు వేగవంతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. - **సత్యనారాయణ, విద్యుత్తు ఈఈ , నూజివీడు**

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు	80085 74698	ఆగిరిపల్లి	9121229090
ముసునూరు	93983 81268	చాట్రాయి	8008574700
కైకలూరు	73060 88555	మండవల్లి	8106099008
కలిదిండి	90594 84862	ముదినేపల్లి	8008574693

ఈనాడు స్పందన

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు 9వ వార్డులో డ్రైనేజీ నీరు ముందుకు కదలక దుర్వాసనతో స్థానికులు అవస్థలు పడుతున్నారని గ్రామస్థుడు ప్రతాప్ 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా పంచాయతీ ఈవో ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన డ్రైనేజీలో పూడిక తీయించారు.

వీధి దీపాలు ఏర్పాటు.. ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం సూరేపల్లిలో పలు వీధుల్లో కొంతకాలం నుంచి వీధి దీపాలు వెలగడం లేదని గ్రామస్థుడు బొల్లిన శివకృష్ణ 'ఈనాడు' నిర్వహిస్తున్న 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా సమస్యను గ్రామ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె కొత్తలైట్లు ఏర్పాటు చేయించి సమస్యను పరిష్కరించారు.

రోడ్డుపై బురద తొలగింపు.. సానారుద్రవరం (కలిదిండి), న్యూస్‌టుడే: సానారుద్రవరంలో మునిపిటి చెరువు మట్టు ఉన్న రహదారిపై బురద పేరుకుపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని గ్రామస్థుడొకరు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సర్పంచి నున్న రాజేశ్వరమ్మ స్పందించి రోడ్డుపై మేటలేసిన బురదను తొలగింపజేశారు.

చెత్త శుభ్రం.. ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో రహదారిపై వ్యర్థాలతో దుర్వాసన వస్తుండటంతో ఈనెల 12న 'చెత్త తొలగించేదెప్పుడు' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. డిప్యూటీ ఎంపీడీవో బి.ఆనంద్‌బాబు ఆదేశాలతో గ్రామ కార్యదర్శి లక్ష్మి పారిశుద్ధ్య సిబ్బందితో చెత్త తొలగించి బ్లీచింగ్ చల్లించారు.

పేదల సొంతింటి కల సాకారమే ధ్యేయం
కైకలూరు, ఆగిరిపల్లి, నూజివీడు రూరల్, చాట్రాయి, ముసునూరు, న్యూస్‌టుడే: పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి వీరమల్లు నరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు అన్నారు. మండలంలోని వేమవరప్పాడులో బుధవారం సామూహిక గృహప్రవేశాల కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఇచ్చిన కాలనీల్లో కనీస మౌలిక వసతులు కల్పించకుండా నిర్మాణ సాధ్యంకాని ప్రదేశాల్లో స్థలాలను కేటాయించి లబ్ధిదారులను అష్టకష్టాల పెట్టారని విమర్శించారు. గృహనిర్మాణంలో ఇబ్బందులను గుర్తించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ లబ్ధిదారులకు అదనపు సాయం అందించారని కొనియాడారు. తెదేపా మండల అధ్యక్షుడు త్రినాధరాజు, నాయకులు, పి.లక్ష్మీరాణి, బి.విజయలక్ష్మి, పూల రాజీ, ఎండీ జానీ, కొటప్రోలు కృష్ణ, అధికారులు పాల్గొన్నారు. ✦ ఆగిరిపల్లి మండలంలో నూతనంగా నిర్మించిన 132 ఇళ్లకు గృహప్రవేశాలు చేశారు. ఎంపీడీవో బి.భార్గవి, తెదేపా మండల అధ్యక్షుడు నక్కనబోయిన వేణు ఇంటి యజమానులను సత్కరించారు. ✦ నూజివీడు మండలం వెంకటాయపాలెంలో జరిగిన గృహప్రవేశాల కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు యనమదల వాసు ఎంపీడీవో చెన్నా రాఘవేంద్రనాథ్, సీడీపీవో విజయకుమారి, నాయకులు లబ్ధిదారుడికి నిత్యావసరాలు అందజేశారు. ✦ చాట్రాయి మండలం ఆరుగోలనపేటలో తెదేపా మండల అధ్యక్షుడు ఇజ్జగాని వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గృహ ప్రవేశం చేసిన దంపతులను కూటమి నాయకులు సత్కరించారు. ✦ ముసునూరు మండల వ్యాప్తంగా 223 సామూహిక గృహ ప్రవేశాలు చేశారు. ముసునూరులో లబ్ధిదారులను తెదేపా మండలాధ్యక్షుడు గద్దె రాము, ఉప సర్పంచి తోట శ్రీనివాసరావు, గ్రామ అధ్యక్షుడు గార్లపాటి నరసింహారావు సత్కరించి వారికి నూతన వస్త్రాలు, స్వీట్లు అందజేశారు. తహసీల్దార్ ప్రశాంతి, ఎంపీడీవో ఏసుబాబు, నాయకులు పాల్గొన్నారు.

వేమవరప్పాడులో లబ్ధిదారుడికి నమూనా తాళం అందిస్తున్న కూటమి నేతలు

జిల్లాలో 15,024 ఇళ్లకు గృహ ప్రవేశాలు
నూజివీడు, న్యూస్‌టుడే: జిల్లాలో బుధవారం 15,024 ఇళ్లకు గృహప్రవేశాల కార్యక్రమం నిర్వహించినట్లు కలెక్టరు వెట్రిసెల్వి వెల్లడించారు. బుధవారం నూజివీడులో 25వ వార్డులోని గొడుగువారిగూడెంలో ఠాకూర్ అంకమ్మ గృహాన్ని నూజివీడు సబ్‌కలెక్టరు బొల్లిపల్లి వినూత్నతో కలిసి ప్రారంభించారు. లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందించారు. అనంతరం జ్యోతి వెలిగించి పాలు పొంగించారు. నూతనంగా మంజూరైన గృహాలకు సంబంధించిన పత్రాలను లబ్ధిదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. మాజీ కౌన్సిలర్ పాదం సత్యనారాయణ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ, వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, కమిషనర్ పీరయ్య, తహసీల్దారు బద్రు, తెదేపా పట్టణ అధ్యక్షుడు ఎం.జగదీశ్ పాల్గొన్నారు.

సింగరాయపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

స్వదేశీ వస్తువులనే వాడదాం
ముదినేపల్లి, ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువులు వినియోగించి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేద్దామని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి కొటప్రోలు కృష్ణ అన్నారు. ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం సింగరాయపాలెంలో ప్రచారం నిర్వహించారు. 'ఇంటింటా స్వదేశీ.. ప్రతి ఇంటా స్వదేశీ' నినాదంతో ఉన్న స్టిక్కర్లను ఇంటి గోడలపై అతికించారు. మండల అధ్యక్షులు సత్యవోలు నాగలక్ష్మి, నాయకులు నాగరాజు, ప్రసాద్, శ్రీలక్ష్మి, జలగంరావు పాల్గొన్నారు. ✪ ఆగిరిపల్లి మండలం నుగొండపల్లిలో 'ఆత్మ నిర్భర్ భారత్' కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంలో భాజపా మండల బాధ్యుడు మాగంటి వాసు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో స్వదేశీ వస్తు వాడకంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు దొడ్డా నాగరాజు, ఎం.వెంకటేశ్వరరావు, కె.బాబూరావు, ఎం.సూరిబాబు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం
ముసునూరు, న్యూస్‌టుడే: సూరేపల్లిలో గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తామని నిర్వాహకులు బుధవారం తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పీఆర్ అర్బన్ డెంటల్ స్పేస్ రేఖ ఆసుపత్రి వైద్యులు రోగులకు అన్నిరకాల పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు
ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: గ్రంథాలయ వారోత్సవాలను ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి ఈజేవీవీ కుమార్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు 20న బహుమతులు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు.

వరికోతల్లో జాగ్రత్తలు అవసరం
ముదినేపల్లి, న్యూస్‌టుడే: వరికోతల్లో రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ సూచించారు. దేవపూడి, వణుదుర్రులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

కనిపించే దారేది
ముదినేపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన ముదినేపల్లిని దుమ్ము, ధూళి వీడటం లేదు. జాతీయ రహదారి విస్తరణ పనులు ఏళ్ల తరబడి కొనసాగుతుండటంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాల రాకపోకలతో రోడ్లపై దుమ్ము లేస్తోంది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి. ధూళి కళ్లలోపడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దుమ్ము, ధూళితో శ్వాస, నేత్ర సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రారంభించారు.. తాళం వేశారు
ముసునూరు, న్యూస్‌టుడే: గ్రంథాలయ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తామని, ప్రతి గ్రామంలో డిజిటల్ గ్రంథాలయం ఏర్పాటు చేస్తామని గత వైకాపా ప్రభుత్వం ప్రగల్భాలు పలికింది. గ్రామీణ పాఠకులకు విజ్ఞానాన్ని అందించడంతోపాటు ఇతర దేశాలు, రాష్ట్రాల నుంచి వచ్చే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు గ్రామంలోనే పనిచేసుకునేందుకు వీలుగా అన్ని వసతులు కల్పిస్తామని చెప్పింది. అయిదేళ్ల పాలనలో అవేవీ కార్యరూపం దాల్చలేదు. ఒక్కొక్క భవనానికి రూ.16 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. ముసునూరు మండలంలో 16 డిజిటల్ గ్రంథాలయాలకు ఒక్క లోపూడిలో మాత్రమే మూడేళ్ల కిందట భవన నిర్మాణం పూర్తయింది. కానీ ఇందులో సామగ్రి, కంప్యూటర్లు సమకూర్చకుండా తాళం వేసి ఉంచారు. దీంతో భవనం నిరుపయోగంగా మిగిలింది. దీనిపై పంచాయతీరాజ్ ఏఈ దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా త్వరితగతిన అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

లోపూడిలో నిరుపయోగంగా భవనం

మౌలిక వసతులు కల్పించండి
మండవల్లి, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయంలో ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో కనీస మౌలిక వసతులు కల్పించకుండా గృహ నిర్మాణాలు ఎలా సాధ్యపడతాయని లబ్ధిదారులు అధికారులను ప్రశ్నించారు. బుధవారం మండలంలోని ఇంగిలిపాకలంక గ్రామ సచివాలయంలో గృహనిర్మాణ సంస్థ వర్క్ ఇన్‌స్పెక్టర్ లలిత, వీఆర్వో వీర్రాజు గృహ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని, ప్రభుత్వం ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. ఈక్రమంలో కొందరు లబ్ధిదారులు మాట్లాడుతూ గ్రామంలో కొల్లేరు సరస్సు చెంతనే 39 మందికి గతంలో ఇళ్ల స్థలాలు ఇచ్చారని, రెండుసార్లు మట్టి పూడిక చేసినా నల్లమట్టి కావడంతో పిల్లర్లు వేసేందుకు వీలుపడటం లేదన్నారు. పూర్తిస్థాయి పూడిక చేసి రవాణా, విద్యుత్తు, నీటి సౌకర్యం కల్పిస్తే ఇళ్ల నిర్మాణాలు చేపడతామని స్పష్టం చేశారు.

నత్తనడకన చెరువుల రిజిస్ట్రేషన్లు
నియోజకవర్గంలో 28 శాతమే పూర్తి

కలిదిండి, న్యూస్‌టుడే: ఆక్వా రైతులు విద్యుత్తు రాయితీ పొందేందుకు చెరువులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించి 50 రోజులైనా ఆ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఇప్పటివరకు ఏలూరు జిల్లాలో 49 శాతం చెరువులకు మాత్రమే రిజిస్ట్రేషన్ పూర్తయింది. జిల్లాలో అత్యధికంగా ఆక్వా సాగు చేస్తున్న కైకలూరు నియోజకవర్గంలో ఇది 28 శాతంగా ఉంది.

కలిదిండిలో ..

కారణాలివీ
చేపల చెరువుల్లో విద్యుత్తు వినియోగం తక్కువగా ఉండటంతో సాగుదారులు ఆసక్తి చూపడం లేదు. పట్టా భూములకు సంబంధించి 11 నెలలకు సాగు అనుమతి పత్రం పొందడానికి అత్యధికులు ముందుకు రావడం లేదు. ప్రభుత్వం పట్టా పొందిన వ్యక్తి సాగులో ఉంటేనే 128 జీవో ప్రకారం శాశ్వత సాగు అనుమతి పత్రం తీసుకునే అవకాశం ఉంది. కానీ క్షేత్రస్థాయిలో పట్టాలు చేతులు మారిపోయాయి. దీంతో పాటు మత్స్యశాఖలో సిబ్బంది కొరత ప్రధాన సమస్యగా ఉంది.

వేగవంతం చేస్తున్నాం
'కైకలూరు నియోజకవర్గంలో తక్కువ శాతం నమోదైంది. దానిపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. ఎప్పటి నుంచి రాయితీ అమల్లోకి వస్తుందనేదానిపై స్పష్టత ఇవ్వలేదు. వీలైనంత త్వరగా ఈ ప్రక్రియ పూర్తిచేసి అర్హులైన రైతులందరికీ రాయితీ వర్తించేలా చర్యలు తీసుకుంటాం' అని జిల్లా మత్స్యశాఖ అధికారి నరసయ్య తెలిపారు.

కైకలూరు నియోజకవర్గంలో (ఎకరాల్లో..)	ఆక్వా సాగు విస్తీర్ణం
	84,775
రిజిస్ట్రేషన్ :	అవ్వాల్సినవి
23,492	61,283

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కూటమి నాయకులు, అధికారులు

రైతులు నేరుగా అమ్మకాలు చేయొచ్చు
మండవల్లి, న్యూస్‌టుడే: వరి రైతులు పండించిన పంటను నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రంలో అమ్మకాలు చేయొచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి జి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలో కానుకొల్లు రైతుసేవా కేంద్రం పరిధిలోని అల్లినగరంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం కూటమి నేత చాపరాల దుర్గాప్రసాద్, డీసీ ఛైర్మన్ నారగాని వెంకట నాగేశ్వరరావు పలువురు నాయకులతో కలిసి ప్రారంభించారు. గ్రామ సర్పంచి జంపన వీరబాబు, నాయకులు పాల్గొన్నారు.

దారిలో స్తంభాలు.. గాలిలో ప్రాణాలు
➠ మూడు నెలల క్రితం నెక్కలం గొల్లగూడెంలోని కుశలవ పారిశ్రామిక కేంద్రం సమీపంలో ఓ కారు రహదారిపై ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టడంతో ముందు భాగం దెబ్బతింది. అందులో ఉన్నవారికి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

➠ 20 రోజుల క్రితం అడవినెక్కలం సమీపంలో ఓ ద్విచక్ర వాహనం విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టింది. చోదకుడు స్వల్పంగా గాయపడగా.. ద్విచక్ర వాహనం దెబ్బతింది. ఈ ప్రాంతంలో ఇలాంటి ఘటనలు నిత్యకృత్యంగా మారాయి.

అడవినెక్కలం (ఆగిరిపల్లి), న్యూస్‌టుడే: నూజివీడు- విజయవాడ ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా నాలుగేళ్ల క్రితం రోడ్డును విస్తరించారు. నెక్కలం గొల్లగూడెం- అడవినెక్కలం గ్రామాల మధ్యలో ప్రధాన రహదారిపై ఉన్న విద్యుత్తు స్తంభాలను తొలగించలేదు. ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారు స్తంభాలను ఢీకొట్టి గాయపడుతున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణించడానికి చోదకులు భయపడుతున్నారు. ఈ ప్రాంతంలో ప్రమాదాలు నిత్య కృత్యంగా మారాయి. స్తంభాలను రహదారిపై నుంచి తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. 'అడ్డుగా ఉన్న విద్యుత్తు స్తంభాలు తొలగించాలంటే ఆర్‌అండ్‌బీ అధికారులు విద్యుత్తు శాఖకు నగదు చెల్లించాలి. ఇప్పటికే రెండు సార్లు అంచనాలు రూపొందించి ఆ శాఖకు ఇచ్చాం' అని విద్యుత్తు ఏఈ ఎం.రామారావు తెలిపారు. 'ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. నిధులు మంజూరు కావాల్సి ఉంది' అని ఆర్‌అండ్‌బీ డీఈ బాబురావు తెలిపారు.

విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టి ధ్వంసమైన కారు

ప్రైవేటీకరణతో పేదలకు అన్యాయం
కైకలూరు, నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ప్రభుత్వ అధీనంలో ఉండాల్సిన వైద్య కళాశాలలను పీపీపీ విధానమంటూ ప్రైవేటీకరణ చేయడం సమంజసం కాదని వైకాపా జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఆధ్వర్యంలో స్థానిక సంతమార్కెట్ వద్ద వైఎస్సార్ విగ్రహం నుంచి తాలూకా కూడలి వరకు పార్టీ శ్రేణులతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. నాలుగు మండలాల నుంచి వైకాపా శ్రేణులు పాల్గొన్నాయి. ● మెడికల్ కళాశాలల వ్యవహారంలో కూటమి నాయకులు తమ జేబులు నింపుకొంటున్నారని, ప్రైవేటీకరణతో పేదలకు అన్యాయం జరుగుతోందని నూజివీడు మాజీ ఎమ్మెల్యే ఎంవీ.ప్రతాప అప్పారావు తెలిపారు. పార్టీ కార్యాలయం నుంచి శ్రేణులతో కలిసి ప్రదర్శనగా సబ్‌కలెక్టరు కార్యాలయానికి వచ్చి వినతిపత్రం అందించారు. నూజివీడు ప్రభుత్వ ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా మార్చాలని డిమాండ్ చేశారు.

ప్రదర్శన నిర్వహిస్తున్న శ్రేణులు

అవి ఇవి అన్నీ
ఎంపీడీవోకు మంత్రి ప్రశంసలు.. నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: మొంథా తుపాను సమయంలో అంకితభావంతో కూడిన సేవలను అందించినందుకు తనకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలాంజనేయ వీరాస్వామి ప్రశంసా పత్రం పంపించారని బుధవారం నూజివీడు ఎంపీడీవో చెన్నా రాఘవేంద్రనాథ్ తెలిపారు.

రూ.1.67 లక్షల ఆదాయం.. నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నేరాల్లో పట్టుబడిన పలు వాహనాలకు బుధవారం వేలం నిర్వహించారు. మొత్తం 27 వాహనాల ద్వారా రూ.1.67 లక్షల ఆదాయం లభించినట్లు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు.

ఖననానికి సాయం.. ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లి కాలువగట్టుపై ఒంటరిగా నివసిస్తూ బుధవారం మృతిచెందిన యాచకురాలు మానికల దుర్గమ్మ ఖననం నిమిత్తం అమరావతి బ్రాండ్ అంబాసిడర్ వైష్ణవి బుధవారం రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. ఆమె తండ్రి మనోజ్ దగ్గరుండి ఖననం చేయించారు.

ముగిసిన శిక్షణ తరగతులు.. ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సమగ్ర శిక్షా ఏఎంవో రెడ్డి రామారావు తెలిపారు. మెగా డీఎస్సీ 2025లో ఉపాధ్యాయ కొలువులు సాధించినవారికి ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ పాఠశాలలో నిర్వహిస్తున్న రాష్ట్ర వ్యాప్త శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యలను మెరుగు పరిచేందుకు కృషి చేయాలన్నారు. కోర్సు కోఆర్డినేటర్లు కె.ఆనంద్ కుమార్, బీవీఎస్ సుబ్బారావు, రాష్ట్ర రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామారావు

ప్రింటర్ వితరణ .. మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి ఎంపీపీ పాఠశాల-1లో ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయుడు పి.ప్రతాప్‌కుమార్ మండవల్లి విద్యాశాఖ కార్యాలయానికి ప్రింటర్‌ను వితరణ చేశారు. ఎంఈవో కుమార్‌కు అందించారు.

అక్రమ తవ్వకాలపై ఆరా.. ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి మండలంలో అక్రమ తవ్వకాలపై మైనింగ్ అధికారులు ఆరా తీశారు. బుధవారం ఆగిరిపల్లి మండలంలోని అమ్మవారిగూడెం, నరసింగపాలెం తదితర ప్రాంతాలకు వెళ్లి ఎంత మేరకు తవ్వకాలు చేపట్టారో మైనింగ్ సిబ్బంది నమోదు చేసుకున్నారు.

ప్రకృతి వ్యవసాయం పై శిక్షణ.. మండవల్లి, న్యూస్‌టుడే: మండలంలోని అల్లినగరంలో ప్రకృతి వ్యవసాయ సాగు విధానాలపై ఐసీఆర్పీలు, ఎన్ఎంఎన్ఎఫ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్లు గౌతమ్‌కుమార్, నాగవిజయ మండవల్లి, ముదినేపల్లి మండలాల పరిధిలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి సిబ్బందికి పలు అంశాలను వివరించారు.

మద్యం సీసాల స్వాధీనం
కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు మండలం శృంగవరప్పాడు, పందిరిపల్లెగూడెం, కొట్టాడ గ్రామాల్లో బుధవారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని ఎక్సైజ్ సీఐ ఎస్‌కే.రమేష్ తెలిపారు. వారి నుంచి 16 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

జూదశిబిరంపై దాడి
చాట్రాయి, న్యూస్‌టుడే: చిత్తపూరు గ్రామ శివారులో జూద శిబిరంపై బుధవారం దాడి చేసి రూ.31,300 నగదు, ఎనిమిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ డి.రామకృష్ణ తెలిపారు. పదకొండు మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (దేవదాయ - ధర్మదాయ శాఖ)
గ్రూపు దేవాలయములు - శింగరాయపాలెం, ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా
చేపల చెరువులు లైసెన్సు నిమిత్తం టెండర్ (కం) బహిరంగ వేలం పాట ప్రకటన

ఏలూరు జిల్లా, ముదినేపల్లి మండలం, శింగరాయపాలెం గ్రామంలో గల శ్రీ భావాజీ మఠం చేవూరు, చెన్నూరు గ్రామాలలో సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములు కలిగియున్న చేపల చెరువులు ఈ క్రింది పేర్కొన్న విధముగా ది. 25-11-2025వ తేదీ మంగళవారం ఉదయం దేవదాయ-ధర్మదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో సంస్థ కార్యనిర్వహణాధికారి వారిచే ఈ దిగువ షెడ్యూలు ప్రకారం మరియు షరతులకు లోబడి కౌలుకు టెండరు (కం) బహిరంగ వేలం పాట నిర్వహించబడును.

షెడ్యూలు

వ. నెం.	దేవాలయం పేరు గ్రామము, మండలం, జిల్లా	చెరువులు ఉన్న గ్రామం	రీ.సర్వే నెం.	భూ స్థితి	విస్తీర్ణం య. ట్లు	కౌలు కాలపరిమితి	ధరావతు రూ.	బహిరంగ వేలం నిర్వహించు తేదీ, ప్రదేశం మరియు, సమయం
1	శ్రీ భావాజీ మఠం, శింగరాయపాలెం గ్రామం, ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా	చెన్నూరు	5/B	చెరువు	9-80	01.01.2026 నుండి 31.12.2028 వరకు అనగా 3 సం॥రములు	50,000/-	ది. 25-11-2025వ తేదీ మంగళవారం ఉదయం గం. 11:00 లకు చెన్నూరు పంచాయతీ కార్యాలయం
		చేవూరు	152/2	చెరువు	2-70		25,000/-	ది. 25-11-2025వ తేదీ మంగళవారం మధ్యాహ్నం గం.12:00లకు చేవూరు పంచాయతీ కార్యాలయం

మిగతా వివరములకు కార్యనిర్వహణాధికారి, శ్రీ భావాజీ మఠం, శింగరాయపాలెం గ్రామం, ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా నందు లేదా కార్యనిర్వహణాధికారి వారి సెల్ నెంబర్ 94935 14777 కు సంప్రదించగలరు.
శింగరాయపాలెం, ది: 10-11-2025 సం/- ఎ.కొండలరావు, కార్యనిర్వహణాధికారి, సెల్: 99084 50979

(c) eenadu

సత్యదేవా నమో నమః

రత్నగిరిపై వేడుకగా అనుగ్రహ పూజ

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యదేవుని నామ స్మరణతో రత్నగిరి మార్మోగింది. స్వామి అనుగ్రహ పూజ (పడిపూజ) బుధవారం రాత్రి వేడుకగా జరిగింది. సత్యదీక్ష చేపట్టిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలోని వార్షిక కల్యాణవేదిక వద్ద పూజ నిర్వహించారు. వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆశీనులను చేసి వైదిక బృందం ఆధ్వర్యంలో పూజలు చేశారు. దీక్షాపరులకు నిత్యాన్నదానంలో అల్పాహారం ఏర్పాటు చేశారు. సత్యదీక్ష విరమణ గురువారం చేయనున్నారు. తెల్లవారుజామున 1 గంటకు స్వామివారి సుప్రభాత సేవ, 2 గంటల నుంచి 4 గంటల వరకు మఖ నక్షత్ర అభిషేకం నిర్వహించి అనంతరం 5 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. తెల్లవారుజామున 2 గంటల నుంచే ఇరుముడి సమర్పణ, దీక్ష విరమణకు ఏర్పాట్లు చేశారు.

పూజలకు హాజరైన సత్యదీక్షాపరులు

విదేశీ చదువులకు సిద్ధమవుతున్నారా

మీ కోసం

రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ భవనం సిద్ధమైంది. ఇక్కడి సైన్స్ బ్లాక్‌లో రూ.12 లక్షలతో నిర్మించారు. అధ్యాపకుడు జి.చంద్రశేఖర్ నోడల్ అధికారిగా, శ్రీనివాస్ కంప్లైంట్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. ఈనెల 18న మంత్రి లోకేశ్ ప్రారంభించనున్నారు. విదేశీ వర్సిటీల్లో ఇంటర్న్‌షిప్‌నకు వెళ్లే విద్యార్థులు, అధ్యాపకులకు కళాశాల యాజమాన్యం ఉపకార వేతనాలు అందిస్తుందని ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే వెల్లడించారు. –న్యూస్‌టుడే, దేవీచౌక్

ఏం తెలుసుకోవచ్చు..:
- విదేశీ వర్సిటీల వివరాలు
- కోర్సులు, శిక్షణ
- దరఖాస్తు విధానం
- వీసా, పాస్‌పోర్ట్ గురించి..

మెట్టింటి మహాలక్ష్మికి ఆరళ్లు

❛ జూన్‌లో కాకినాడ రేచర్లపేటకు చెందిన ఓ మహిళను భర్త, అత్తింటి వారు శారీరకంగా, మానసికంగా వేధించారు. ఆమె తట్టుకోలేక నాలుగేళ్ల కుమారుడిని చంపి, తానూ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ❜

❛ కాకినాడ డెయిరీఫారం సెంటర్‌కు చెందిన ఓ మహిళకు పలాసకు చెందిన వ్యక్తితో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలం బాగానే చూసుకున్నాడు. ఆ తర్వాత అదనపు కట్నంగా రూ.10 లక్షలు తేవాలని వేధించేవాడు. మరో పెళ్లి చేసుకుంటానని బెదిరించేవాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. ❜

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: రోజుకో కొత్త సాంకేతికత వస్తుంది. కృత్రిమ మేధ పరుగులు పెడుతోంది. అన్ని రంగాల్లో మహిళలు తమ సత్తా చాటుతున్నారు. అయినా అత్తింట్లో మాత్రం వేధింపులు తప్పట్లేదు. వరకట్న నిషేధ చట్టం ఉన్నా అదనపు కట్నం కోసం ఆరళ్లు తప్పట్లేదు. ఉన్నత చదువులు అభ్యసించి, ఉద్యోగం చేస్తున్న మహిళలు సైతం బాధితులుగా నిలవడం గమనార్హం.



కొన్ని ప్రధాన కారణాలు..

దీనికి సంబంధించి పోలీసులు ప్రధానంగా కొన్ని కారణాలు చెబుతున్నారు. ● అదనపు కట్నం, బంగారం, ఆస్తి. ● ప్రేమ లేదా కులాంతర వివాహం. ● ఆమె తమకు నచ్చిన విధంగానే ఉండాలని అత్తింటి వారు భావించడం. ● ఉద్యోగినులైతే జీతమంతా తమకే ఇవ్వాలని డిమాండ్ చేయడం. ● పలు కారణాలతో ఆమెపై అయిష్టత. ● అత్తింటి వారంతా ఒక్కటై ఆమెను వేరుగా చూడటం.

ఉచితంగా సేవలు

◗ వేధింపులకు గురవుతున్న మహిళలు పోలీసు టోల్‌ఫ్రీ నంబర్లు 112, 100 ఫోన్ చేసి సహాయం పొందవచ్చు. ◗ నేరుగా మహిళా పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయొచ్చు. ◗ మహిళా సహాయ కేంద్రం 181కు ఫోన్ చేయొచ్చు. ◗ లీగల్ సర్వీస్ అథారిటీ ద్వారా ఉచితంగా న్యాయవాదిని కూడా సమకూరుస్తారు.

కాకినాడ సిగ.. పారిశ్రామిక నగ

- ఉప్పాడ సమీపంలో గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ పరిశ్రమ
- రూ.44 వేల కోట్ల పెట్టుబడి.. 3 వేల మందికి ఉపాధి

ఈనాడు, కాకినాడ

కాకినాడ జిల్లాలో మరో భారీ పరిశ్రమ ఏర్పాటుకాబోతుంది. ఏఎం గ్రీన్‌కు చెందిన ఏఎంజీ మెటల్ అండ్ మెటీరియల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉప్పాడ సమీపంలో గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ పరిశ్రమను నెలకొల్పబోతుంది. అవసరమైన భూముల కొనుగోలు, మౌలిక వసతుల కల్పన రాయితీలకు సంబంధించి బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సుమారు వెయ్యి ఎకరాల్లో రూ.44 వేల కోట్లతో ఈ పరిశ్రమను స్థాపించబోతున్నారు. రెండు దశల్లో 3 వేల మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

పునరుత్పాదక ఇంధనంతో..

ఏఎం గ్రీన్ కంపెనీ ఇప్పటికే నగరంలో ఎన్ఎఫ్‌సీఎల్ పరిశ్రమ భూములు, యూనిట్‌ను కొనుగోలు చేసింది. ఇందులో రూ.10,050 కోట్ల పెట్టుబడితో ఏడాదికి రెండు మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియా తయారుచేయనుంది. ఈ కంపెనీకి ఇటీవల రాయితీలిచ్చారు. అదే సంస్థకు చెందిన ఏఎంజీ మెటల్, నెదర్లాండ్స్ కంపెనీ భాగస్వామిగా ఏడాదికి ఒక మిలియన్ టన్ను గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఇది పూర్తిగా పునరుత్పాదక ఇంధనంతోనే నడుస్తుంది. పర్యావరణానికి హాని కలిగే అవకాశం ఉండదని తెలుస్తోంది. ఈ కంపెనీ ఇదివరకే నేమాం వద్ద మూతపడిన స్పెక్ట్రం పవర్ జనరేషన్ కంపెనీ భూములు సుమారు 800 ఎకరాలు కొనుగోలుచేసింది. ఇప్పుడు అందులోనే పరిశ్రమ ఏర్పాటుచేయనుంది. దీనికి అదనంగా మరో 250 ఎకరాలు కావాలని ప్రభుత్వాన్ని కోరింది.

రాయితీలు ఇలా..

- ఈ పరిశ్రమకు 250 ఎకరాలు భూసేకరణ చేసి మార్కెట్ ధరకు అందివ్వనున్నారు.
- గ్రీన్ కారిడార్ ద్వారా 2000-2,500 మెగావాట్ల విద్యుత్తు కనెక్షన్
- రోజుకు 17.5 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేసేలా సదుపాయాలు
- సింగిల్ డెస్క్ విధానంలో సంబంధిత శాఖలన్నీ అనుమతులివ్వాలి.
- ఎలక్ట్రిసిటీ డ్యూటీ, మూలధన పెట్టుబడిపై రాయితీలు, నీటి సరఫరా ఛార్జీల తగ్గింపు, స్టాంపు డ్యూటీ మినహాయింపు, ఇతరత్రా రాయితీలు కల్పించాల్సి ఉంటుంది.

పత్రాల ఛత్రం
సాధారణంగా కొబ్బరి చెట్ల పైభాగం చిందరవందరగా ఉంటాయి. పి.గన్నవరంలోని లంకలగన్నవరంలో డొక్కా జగన్నాథానికి చెందిన తోటలోని ఓ చెట్టు గొడుగు మాదిరిగా ఆకట్టుకుంటోంది. -న్యూస్‌టుడే, పి.గన్నవరం

ఒక్క సందేశం చాలు.. కల్లాల్లోనే ధాన్యం కొనుగోలు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో వరి కోతలు మొదలయ్యాయి. ప్రభుత్వం కనీస మద్దతు ధరకు ఎంత ధాన్యమైనా కొనేందుకు సిద్ధంగా ఉంది. రైతులు ఆర్ఎస్‌కే(రైతు సేవా కేంద్రం)కు వెళ్లాల్సిన పనిలేకుండా సంబంధిత వివరాలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాట్సాప్ నంబరు 7337359375కు తెలియజేస్తే చాలు. ఆర్ఎస్‌కే సిబ్బంది మీ వద్దకు వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తారు. ఈ నంబరుకు మీ ఫోను నంబరు నుంచి 'హాయ్' అని సమాచారం పంపి షెడ్యూలు చేసుకునే అవకాశం కల్పించారు. దళారులు, మధ్యవర్తులు, మిల్లర్ల చేతిలో నష్టపోకుండా ఈ ఏర్పాట్లు చేశారు. కల్లం వద్దకే వచ్చి ధాన్యం సేకరించి, ఎఫ్‌టీవో (ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్) ప్రతిని అందజేస్తారు. 24 నుంచి 48 గంటల్లో ధాన్యం సొమ్ములు జమ చేస్తారు.

మద్దతు ధర ఇలా

సాధారణ రకం 100 కిలోలు రూ.2,300, 75 కిలోలు రూ.1,725. గ్రేడ్-ఏ రకం 100 కిలోలు రూ.2,320, 75 కిలోలు రూ.1,740.

కంట్రోల్ రూం

ధాన్యం విక్రయాల్లో సందేశాల నివృత్తికి ప్రభుత్వం రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో టోల్‌ఫ్రీ, కంట్రోల్ రూం నంబర్లు ఏర్పాటు చేసింది.

రాష్ట్రస్థాయి టోల్‌ఫ్రీ నంబరు 1967, 18004250082

జిల్లాస్థాయి కంట్రోల్ రూం 8886903611

గండేపల్లి మండలంలో ధాన్యం ఒబ్బిడి చేస్తున్న రైతులు

160 టన్నుల సేకరణ..

జిల్లాలో గతనెల 22 నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.దేవులనాయక్ తెలిపారు. ఇప్పటివరకు 160 టన్నుల ధాన్యాన్ని 32 మంది రైతుల నుంచి సేకరించి, రూ.35లక్షలు వారి ఖాతాలకు జమ చేశారు.

కనుల ముందు కలల గూడు

జిల్లాలో ఉత్సాహంగా గృహప్రవేశాలు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం 1.40లక్షల మందికి పట్టాలిచ్చింది. వీరిలో 60వేల మందికి కేంద్రం పీఎంఏవై-1 కింద ఇళ్లు మంజూరు చేసింది. గత అయిదేళ్లలో కనీసం పది శాతం కూడా పూర్తి చేయలేదు. కూటమి ప్రభుత్వం వీటి నిర్మాణంపై దృష్టిసారించింది. ఏడాదిన్నర వ్యవధిలో 7వేలకు పైగా నిర్మాణాలను పూర్తి చేసింది. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా 3లక్షల గృహప్రవేశాలను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. జిల్లాలో 216 మంది గృహప్రవేశాలు చేశారు. పిఠాపురం నియోజకవర్గంలోని దుర్గాడలో ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి లబ్ధిదారులతో కలిసి చేయించారు. కాకినాడ నగర నియోజకవర్గంలో ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే వరపుల సత్యప్రభ, తుని నియోజకవర్గంలో ద్వితీయ శ్రేణి నాయకులు పాల్గొన్నారు. లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప స్థానికంగా అందుబాటులో లేక ఇక్కడ గృహప్రవేశాలు వాయిదా పడ్డాయి. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని జగ్గంపేట నియోజకవర్గానికి చెందిన గోకవరం మండలంలో పాల్గొన్నారు. కాకినాడ గ్రామీణం, తుని ఎమ్మెల్యేలు పంతం నానాజీ, యనమల దివ్య గురువారం చేయించనున్నారు.

కాకినాడలో లబ్ధిదారుకు హక్కుపత్రాలు, నూతన వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు, చిత్రంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల, గృహ నిర్మాణ శాఖ పీడీ సత్యనారాయణ

చదువులో ప్రథమం.. వసతుల్లో శూన్యం

యు.కొత్తపల్లి మండలం వాకతిప్ప జడ్పీ పాఠశాల గత కొన్నేళ్లుగా చదువులో, క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచి మండలంలోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రతి విద్యాసంవత్సరంలో ఇతర జడ్పీ పాఠశాలలను దాటుకుని తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పాఠశాలలో చేర్చేందుకు పోటీపడతారు. గత మూడేళ్లుగా చాలా మంది విద్యార్థులను చేర్చుకునేందుకు ఉపాధ్యాయులు నిరాకరించారు. దీనికి కారణం పాఠశాలలో అన్ని వసతులు అందుబాటులో లేకపోవడం. ఇప్పటికే 472 మంది విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. వీరికి సరిపడా తరగతి గదులు లేకపోవడంతో వరండాలో, ఆరుబయట తరగతులు నిర్వహించాల్సి వస్తుంది. పూర్తిస్థాయిలో బల్లలు లేకపోవడంతో కింద కూర్చునే పరిస్థితి ఏర్పడింది. గత వైకాపా పాలనలో నాడు- నేడు పథకంలో అదనపు తరగతి గదులకు నిధుల కొరత కారణంగా పనులు నిలిచిపోయాయి. ఇప్పటికైనా పాలకులు పట్టించుకుని పాఠశాల సమస్య తీర్చాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కొత్తపల్లి

వాకతిప్ప జడ్పీ పాఠశాల ఆవరణలో కూర్చున్న విద్యార్థులు

ఉపాధి పని.. అక్రమార్కుల గని

సాంకేతికత వినియోగిస్తున్నా పథకంలో అవకతవకలు

సామర్లకోట మండలంలో 18 గ్రామాల పరిధిలో 944 పనులకు కూలీల పనిదినాలు, మెటీరియల్ కాంపొనెంట్ కలిపి రూ.10,71,42,448 చెల్లించారు. జి.కొత్తూరులో క్షేత్ర సహాయకుడిగా పనిచేసిన వ్యక్తి దొంగ మస్తర్లు, అక్రమాలకు పాల్పడినటు గుర్తించి, రివకరీకి ఆదేశించారు. ఇదే రీతిలో బోయినపూడి, వేట్లపాలెం, పి.వేమవరం, పెదబ్రహ్మదేవం, కాపవరం, చంద్రంపాలెం, అచ్చంపేట, ఉండూరు గ్రామాల్లోనూ అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. లెక్కల్లో చూపిన పనులు క్షేత్రస్థాయిలో లేనట్లు నిర్ధారించారు.

ఉపాధి పనులు చేస్తున్న శ్రామికులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో ఎన్ని సంస్కరణలు తెచ్చినా అక్రమాలకు అడ్డుకట్ట పడట్లేదు. మస్తర్లు, కొలతలు, గుర్తించిన చోట కాకుండా పనులు మరోచోట చేయడం, సాంకేతికతలో లోపాలతో ఈ పథకానికి తూట్లు పడుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 2,22,809 జాబ్‌కార్డులు రిజిస్టర్ కాగా 1,40,301 మందికి పని కల్పించారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి 45 లక్షల పనిదినాలు కల్పించగా వేతన వ్యయం కింద రూ.121 కోట్లు వెచ్చించారు. ఇప్పటివరకు జరిగిన పనులకు సంబంధించి తనిఖీలు చేయగా కొన్ని అక్రమాలు వెలుగుచూశాయి.

4 మండలాల్లో రూ.6.97లక్షలు..

కరప, పెదపూడి, సామర్లకోట, తాళ్లరేవు మండలాల్లో సామాజిక తనిఖీ పూర్తయ్యింది. రూ.48కోట్ల వరకు వేతన వ్యయం కింద ఖర్చు చేయగా, అందులో రూ.6.97లక్షల వరకు అక్రమాలు జరిగినట్లు గుర్తించింది. క్షేత్రస్థాయి సిబ్బంది అవకతవకలకు పాల్పడినట్లు నిర్ధారించింది. వీరి నుంచి సొమ్ము రికవరీకి ఆదేశించింది. ఇంకా 16 మండలాల్లో తనిఖీ చేయాల్సి ఉండగా మరిన్ని బయటకు వచ్చే అవకాశం ఉంది.

2025-26లో సామాజిక తనిఖీలు ఇలా.. (రూ.ల్లో)

● మండలం ▮ వ్యయం ◆ రివకరీకి ఆదేశం

● మండలం	▮ వ్యయం	◆ రివకరీకి ఆదేశం
కరప	13,27,63,780	24,454
పెదపూడి	10,88,49,587	93,478
సామర్లకోట	10,71,42,448	5,19,139
తాళ్లరేవు	13,16,03,113	60,658

కొన్ని ప్రధాన లోపాలు..

● ఉపాధి పనుల్లో పారదర్శకతకు ఎన్ఎంఎంఎస్ యాప్, పని చేసే ముందు తర్వాత ఫొటో, ఈకేవైసీ వంటి సంస్కరణలు తెచ్చినా అక్రమాలు ఆగట్లేదు. ● సరైన పర్యవేక్షణ లేకపోవడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ● మృతిచెందిన వారికి మస్తర్లు వేయడం. ● పనిలోకి రాకున్నా మస్తర్ల నమోదు. ● చేసిన పనికన్నా ఎక్కువ కొలతలు నమోదు చేయడం. ● పని గుర్తింపు ఒకచోట, మరోచోట పనులు చేయడం.

కొబ్బరి ధర పతనం

అంబాజీపేట: జిల్లాలో కొబ్బరికాయల ధరలు పడిపోయాయి. ప్రాంతీయ మార్కెట్‌లో బాగా దిగజారాయి. వెయ్యింటికి రూ.4 వేల నుంచి రూ.5 వేల మేర పతనమైనట్లు రైతులు, వర్తకులు చెబుతున్నారు. కార్తిక మాసం ప్రారంభానికి ముందు వెయ్యి పచ్చికాయలు రూ.23-25 వేల మధ్య ఉంది. ప్రస్తుతం రూ.19-20 వేల వరకు దిగజారాయి. తమిళనాడులో ఉత్పత్తి ఆశాజనకంగా ఉండటం ప్రస్తుత పరిస్థితికి కారణంగా భావిస్తున్నారు. శీతాకాలం ప్రారంభమైన తరుణంలో ఉత్తరాది రాష్ట్రాల్లో పండగల సమయం ముగియడంతో కాయల వినియోగం తగ్గింది. ఆయా రాష్ట్రాలకు ఎగుమతులు పెద్దగా లేకపోవడంతో ధరలు క్షీణించినట్లు వర్తకులు అంటున్నారు. ఉత్తరాది రాష్ట్రాలకు సైతం కొబ్బరికాయల ఎగుమతులు నామమాత్రంగానే ఉన్నాయి.

గుర్తుంచుకో.. గమ్యం చేరుకో..

రహదారిపై ప్రయాణం చేసే సమయంలో బోర్డులపై కొన్ని సంకేతాలు కనిపిస్తుంటాయి. సురక్షితంగా గమ్యం చేరేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. లైసెన్స్ పొందాలంటే ముందు వీటి గురించి తెలుసుకోవాల్సిందే. ఇవేమీ తెలియకపోయినా కొందరు రయ్..రయ్‌మంటూ దూసుకుపోతున్నారు. ఏ గుర్తు ఏం చూపిస్తుందో.. పరిశీలిస్తే.. -న్యూస్‌టుడే, రావులపాలెం పట్టణం

3 ఆకారాలు: చతురస్రాకారం, త్రిభుజాకారం, వృత్తాకారం

దూసుకెళ్లొద్దు: డివైడర్ మధ్య ఖాళీ ఉందని ఈ గుర్తు సూచిస్తుంది. మలుపు తిరగడానికి, రెండు మూడు మార్గాలను కలపడానికి, రోడ్డు దాటడానికి ఏర్పాట్లు ఉండటంతో అక్కడ నెమ్మదిగా వెళ్లాలి.

ఇరుక్కోవద్దు..: ముందు ఇరుకైన వంతెన సమీపిస్తుందని సూచన. అక్కడ నెమ్మదిగా వెళ్లాలి. ఆ ప్రాంతంలో వాహనం ఆపకూడదు.

వేగం తగ్గించు..: కొంతదూరంలో ఎడమ వైపు నుంచి గ్రామీణ రోడ్డు ఉందని సూచన. అటు నుంచి వాహనాలు వచ్చే వీలుండటంతో వేగం తగ్గించాలి.

పని జరుగుతోంది: ముందు రోడ్డు పనులు జరుగుతున్నాయని అర్థం. వేగాన్ని నియంత్రించాలని సూచిస్తుంది.

కుడి.. ఎడమలు: రహదారికి ఎడమవైపు వెళ్లమని నిర్దేశించే తప్పనిసరి సంకేతం ఇది. రహదారి వద్ద డివైడర్.. మలుపు ఉన్నా ఆ ప్రాంతాల్లో వాహనాలు తిరుగుతాయని.. ఎడమ వైపు వెళ్లాలని సూచిస్తుంది. అదే కుడి వైపు గుర్తు ఉంటే అటువైపు వెళ్లాలని అర్థం చేసుకోవాలి.

విద్యాసంస్థలు: ఆ ప్రాంతంలో విద్యా సంస్థలు ఉన్నాయని సూచిస్తుంది. పిల్లలు రోడ్డు దాటే అవకాశం ఉండటంతో నెమ్మదిగా వెళ్లాలి.

అధిగమిస్తే ఆపదే..!: ముందు వాహనాన్ని ఎట్టి పరిస్థితుల్లో అధిగమించొద్దు. కూడళ్లు, ప్రమాదకర ప్రదేశాలు ఉండవచ్చు.

3 రకాలు: 1. హెచ్చరిక 2. తప్పనిసరి 3. సమాచారం

ఉపయోగకరం: రహదారులపై ప్రమాదాల నివారణకు గుర్తులతో కూడిన బోర్డులను ఏర్పాటు చేస్తాం. చాలా మందికి వీటిపై అవగాహన ఉండటం లేదు. ఇవి తెలుసుకుంటే సురక్షితంగా ప్రయాణం సాగించవచ్చు. -ఓలేటి శ్రీనివాసరావు, రవాణాశాఖాధికారి, రావులపాలెం

ట్రామా కేర్ కేంద్రాల ఏర్పాటుకు కృషి

సర్పవరం, న్యూస్‌టుడే: జాతీయ రహదారులు వెంబడి జరుగుతున్న ప్రమాదాల్లో గాయాలబారిన పడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అనువైన ప్రదేశాలలో అత్యాధునిక వసతులతో కూడిన ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ప్రమాదాలలో తీవ్రంగా గాయపడిన వారికి సకాలంలో వైద్య సేవలు అందక మృత్యువాత పడుతున్నారు. వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో సమస్యను లేవనెత్తి కేంద్ర వైద్యశాఖ మంత్రులు, అధికారులను వ్యక్తిగతంగా కలిసి త్వరగా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

ప్రస్తుతం రాకపోకలకు అనువుగా తీర్చిదిద్దారిలా..

మొంథా చిదిమేసింది.. కూటమి రూపునిచ్చింది..

తుపానుకు దెబ్బతిన్న రహదారి

మొంథా తుపాను ధాటికి కాకినాడ నుంచి ఉప్పాడ మీదుగా వెళ్లే బీచ్ రహదారి పూర్తిగా దెబ్బతింది. తారు మొత్తం లేచిపోయి భారీ గుంతలు పడి అధ్వానంగా మారింది. దీంతో అధికారులు ఆ మార్గాన్ని మూసేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అనతి కాలంలోనే రహదారిని బాగు చేసి పూర్వ వైభవం తీసుకొచ్చింది. మొదటగా లేచిపోయిన తారు, రాళ్లను పూర్తిగా శుభ్రం చేసి అనంతరం సిమెంటుతో గుంతలను పూడ్చింది. రోడ్డు బాగుపడటంతో ప్రస్తుతం ఎప్పటిలాగే రహదారిపై రాకపోకలు సాగుతున్నాయి. - ఈనాడు, కాకినాడ

కేటుగాళ్లకు అరదండాలు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: ఓ ముఠా రూ.లక్షల విలువైన బంగారాన్ని దోచేశారు. మరో ముఠా కిలోల కొద్దీ గంజాయిని తరలిస్తున్నారు. ఈ రెండు ఘటనలపై పోలీసులు ముమ్మర దర్యాప్తు చేశారు. వీరందరి ఆట కట్టించారు. బుధవారం కాకినాడలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు.

బంగారు ఆభరణాలు పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్ తదితరులు

రూ.60 లక్షల విలువైన బంగారం..: ఈ ఏడాది సెప్టెంబర్ 10న ఓ నగల వ్యాపారి విజయనగరంలో ప్రైవేటు ట్రావెల్ బస్సు ఎక్కారు. గండేపల్లి మండలం, తాళ్లూరు హనీ దాబా వద్ద భోజనానికి దిగాడు. విజయనగరం నుంచి ఆ వ్యాపారిని వెంబడిస్తూ అదే బస్సులో వచ్చిన ముగ్గురు ఆ నగల బ్యాగుతో ఉడాయించారు. దీనిపై గండేపల్లి పోలీసులు కేసు నమోదు చేయగా ఎస్పీ పర్యవేక్షణలో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాస్, ఎస్సైలు శివనాగబాబు, ఎస్సై జి.సతీష్, ఎం.రాజా బృందాలుగా దర్యాప్తు చేశారు. చోరీ చేసిన టి.నరసింహ, పి.తేజ, మహీందర్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.60 లక్షల విలువైన 624 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

రూ.10.66 లక్షల విలువైన గంజాయి..: ఈనెల 10న మధ్యాహ్నం పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు పర్యవేక్షణలో జగ్గంపేట మండలం, రామవరం, రంగవల్లినగర్ ఎదురుగా వైజాగ్ నుంచి రాజమహేంద్రవరం వైపు వస్తున్న వాహనాలు తనిఖీ చేశారు. ఓ గూడ్స్ వాహనంలో గంజాయి బస్తాలు కనిపించడంతో జగ్గంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. రూ.10.66 లక్షల విలువైన 213.28కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మహమ్మద్ షాహిద్(36), రోహిత్ శర్మ(21)ను రిమాండ్‌కు తరలించారు. మరో అయిదుగురు కోసం కోసం గాలిస్తున్నారు.



సారొచ్చారు.. రూపు మార్చారు

ఐదేళ్లపై వచ్చిన ఉపాధ్యాయుడు పాఠశాల రూపురేఖలనే మార్చేసి పలువురి మన్ననలు అందుకుంటున్నారు. కొత్తపల్లి ఎంపీపీ పాఠశాలలో అయిదేళ్ల క్రితం పనిచేసిన ఉపాధ్యాయుడు ప్రసాద్ మళ్లీ ఇదే పాఠశాలకు బదిలీపై వచ్చారు. గతంలో తను పని చేసే సమయంలో సుమారు 50 మంది విద్యార్థులతో కళకళలాడే పాఠశాల ప్రస్తుతం అయిదుగురితో ఉండటంతో ఆవేదన చెందారు. దీంతో పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంఖ్య పెరగడానికి ఆయన వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. సొంత నగదుతో పాఠశాలకు రంగులు వేయించి, ఆవరణ అంతా శుభ్రం చేయించారు. వచ్చే విద్యాసంవత్సరానికి విద్యార్థుల సంఖ్య పెంచి పూర్వ వైభవం తీసుకొచ్చేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు. – న్యూస్‌టుడే, కొత్తపల్లి

ప్రస్తుతం రంగులతో ఆకర్షణీయంగా పాఠశాల

గూడేల మార్గాలకు మహర్దశ

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని ఎత్తైన కొండలపై ఉన్న బురదకోట పంచాయతీ పరిధిలోని తండాలకు రహదారి కల నెరవేరనుంది. ధారపల్లి నుంచి కె.మిర్తివాడ వరకు 'నరేగా' నిధులు రూ.2.8 కోట్లతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ బుధవారం శంకుస్థాపన చేశారు. భూమిపూజ అనంతరం గిరిజనులతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. బురదకోట పంచాయతీలోని నాలుగు తండాలకు ధారపల్లి నుంచి రోడ్డు నిర్మాణం దశాబ్దాలుగా ఊరిస్తోంది. గతంలో తెదేపా హయాంలో నిధులు కేటాయించి పనులు ప్రారంభించిన అటవీశాఖ అనుమతులు లేవని ఆపేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గూడేలకు పక్కాదారి ఏర్పడనుంది. నియోజకవర్గంలోని ప్రతి గిరిజన గ్రామానికి మౌలిక సదుపాయాలను కల్పిస్తామని ఎమ్మెల్యే అన్నారు. ఖాదీబోర్డు వైస్ ఛైర్మన్ కొమ్ముల కన్నబాబు, జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్ పాల్గొన్నారు.

ధారపల్లి-కె.మిర్తివాడ రోడ్డు శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రజా భద్రతకు పోలీసులు ముందుండాలి: ఎంపీ

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: ప్రజా భద్రత, శాంతిభద్రతల రక్షణకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ ముందుండాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎంపీ నిధుల నుంచి రూ.36 లక్షల విలువైన నాలుగు టీయూవీ వాహనాలను జిల్లా పోలీసుశాఖకు అందజేశారు. బుధవారం కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో వీటిని ఎంపీ ప్రారంభించారు. ఎస్పీ బిందుమాధవ్ అధ్యక్షత వహించారు. ఎంపీ మాట్లాడుతూ పోలీసు శాఖకు మౌలిక వసతుల సాయం చేయడం బాధ్యతగా భావిస్తున్నానన్నారు. రానున్న రోజుల్లో మరో 5 వాహనాలు అందిస్తామన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఈ వాహనాలతో సిబ్బంది తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకోవచ్చన్నారు. అనంతరం వాహనాన్ని ఎస్పీ నడపగా, ఎంపీ, ఇతర ప్రజాప్రతినిధులు అందులో కూర్చుని ర్యాలీగా వెళ్లారు. ఏఎస్పీ మనీష్‌దేవరాజ్ పాటిల్, ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ సత్యనారాయణ, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల బాబు, మాజీ ఎమ్మెల్యే దొరబాబు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

జెండా ఊపి వాహనం ప్రారంభిస్తున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, ఎస్పీ బిందుమాధవ్ తదితరులు

అందుబాటులోకి.. రైల్‌వన్

న్యూస్‌టుడే – తుని

రైలు ప్రయాణం మరింత సులువుగా సాగేందుకు భారతీయ రైల్వే అన్ని ప్రధాన సేవలు ఒకేచోట లభించేలా 'రైల్‌వన్' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. గతంలో వివిధ యాప్‌లలో వేర్వేరు సేవలు ఉండేవి. వాటన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెస్తూ రైల్‌వన్ రూపొందించింది.

ఈ సేవలు పొందొచ్చు..

ఆండ్రాయిడ్ ఫోన్లో గూగుల్ ప్లే స్టోర్, యాప్ స్టోర్ల నుంచి ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవచ్చు. సాధారణ, రిజర్వేషన్, ప్లాట్‌ఫామ్, సీజన్ టిక్కెట్లు పొందవచ్చు. రైళ్ల సమాచారం, పీఎన్ఆర్ స్థితి, కోచ్ స్థానం, రైలును ట్రాక్ చేయడం, భోజనం ఆర్డర్ ఇవ్వడం, ఫిర్యాదులు, సూచనలు తదితర సేవలు పొందొచ్చు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు, సిబ్బంది సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే అనేక మంది దీన్ని డౌన్లోడ్ చేసుకుని వాడుతుండడంతో స్టేషన్లలోని టికెట్ కౌంటర్ల వద్ద రద్దీ తగ్గింది.

శివయ్యా.. సేదదీరేది ఎక్కడయ్యా?

● భీమేశ్వరాలయంలో అసంపూర్తిగా డార్మిటరీ భవనం

సామర్లకోట, న్యూస్‌టుడే: పంచారామాలలో ప్రసిద్ధి చెందిన సామర్లకోట భీమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు సేదదీరేందుకు డార్మిటరీ భవనం లేక నిత్యం అనేక ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు ఎంతో కష్టపడి వచ్చి విశ్రాంతి తీసుకోవడానికి గదులు లేక చెట్లకింద, సమీపంలోని మండగుల్మ్ము ఆలయం అరుగులపై, ఆటోలు, వాహనాల్లోనే ఆలయం తెరిచే వరకు వేచి ఉంటున్నారు. భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు వినియోగంలోకి తీసుకురావాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

మండగుల్మ్ము ఆలయం వద్ద అరుగులపై సేదదీరుతున్న భక్తులు

దర్శనవేళలు..

భీమేశ్వరాలయంలో సాధారణ రోజుల్లో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు స్వామివారిని దర్శించుకునేందుకు అనుమతి ఉంటుంది. పర్వదినాల్లో తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు, నైవేద్యం అనంతరం 4 గంటల నుంచి స్వామి దర్శనం లభిస్తుంది.

గతంలో రూ.95 లక్షలతో నిర్మాణం ప్రారంభం..

భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర పర్యాటక శాఖ ద్వారా రూ.95 లక్షలతో డార్మిటరీ భవనం నిర్మాణ పనులను ఆరేళ్ల కిందట ఆలయ సమీపంలో చేపట్టారు. వైకాపా ప్రభుత్వ హయాంలో నిధుల విడుదలలో జాప్యం కారణంగా భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా మధ్యలో నిలిచిపోయాయి. భక్తుల ఇబ్బందిని తీర్చేందుకు అసంపూర్తిగా మిగిలిపోయిన డార్మిటరీ భవనాన్ని పూర్తి చేసి

రూ.60 లక్షలతో ప్రతిపాదనలు..

డార్మిటరీ భవనం పనులు పూర్తి చేసేందుకు రూ.60 లక్షల నిధులు అవసరం ఉందని ప్రతిపాదనలు పంపాం. ఎమ్మెల్యే చినరాజప్ప నిధుల కోసం మంత్రి ద్వారా కృషి చేస్తున్నారు. త్వరలో భక్తుల ఇబ్బంది తీరుతుంది. నిధులు రాగానే పనులు పూర్తిచేసి భక్తుల సౌకర్యార్థం భవనాన్ని వినియోగంలోకి తీసుకువస్తాం.
– సత్యనారాయణ, రాష్ట్ర పర్యాటకశాఖ డీఈ కాకినాడ

తాండవ అక్విడక్టు పనులు పూర్తిచేయాలి: ఎస్ఈ

తుని గ్రామీణం: మరో 20 రోజుల్లో తాండవ నదిపై అక్విడక్టు పనులు పూర్తి చేయాలని పోలవరం కాలువ ఎస్ఈ ఏసుబాబు స్థానిక అధికారులకు సూచించారు. మండలంలోని పోలవరం కాలువ నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. భాగంగా సుమారు రూ.65 కోట్లతో తాండవ నదిపై కట్టాలకొండ నుంచి రేఖవానిపాలెం వరకు సుమారు 452 మీటర్ల పొడవు, 28 మీటర్ల వెడల్పున అక్విడక్టు పనులు చేపట్టారు. ప్రస్తుతం 90 శాతం పనులు పూర్తి చేసినట్లు ఈఈ గోవింద్ ఆయనకు వివరించారు. వర్షాల కారణంగా పనుల్లో జాప్యం జరిగిందన్నారు. ఉన్నతాధికారులు సూచించిన గడువులోగా పనులు పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. డీఈ మురళీ సిబ్బంది ఉన్నారు.

తాండవ నదిపై అక్విడక్టు పనులు పరిశీలిస్తున్న ఎస్ఈ ఏసుబాబు

ఆ కుటుంబాల మాటేమిటి?

● అందని మొంథా నిత్యావసరాల సాయం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో మొంథా తుపాను బాధిత కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ పూర్తయ్యింది. 9 మండలాల పరిధిలో 44,885 కుటుంబాలు ప్రభావితమైనట్లు గుర్తించారు. వీరికి సరకులు విడుదల చేశారు. మత్స్యకార, చేనేత కుటుంబాలకు 50 కిలోల బియ్యం, మిగతా వారికి 25 కిలోల చొప్పున విడుదల చేశారు. వీరందరికి కేజీ చొప్పున పంచదార, కందిపప్పు, బంగాళదుంపలు, ఉల్లిపాయలు, లీటరు వంటనూనె చొప్పున మంజూరు చేశారు. 10 రోజులుగా నిత్యావసరాల పంపిణీని చేపట్టారు. 43,735 కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ చేయగా, వీరిలో 30,787 మత్స్యకార కుటుంబాలు, 536 మంది నేతకార్మికులు ఉన్నారు. ఇంకా 1,150 కుటుంబాలకు అందలేదు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతోనే వీరికి అందలేదనే ఆరోపణలు ఉన్నాయి. కొంత మంది కాకినాడ నగరంలో ఆవాసం ఉంటూ తాళ్లరేవు మండలం నుంచి సముద్రంలో వేటకు వెళ్తున్నారు. ఇలాంటి వారికి రెండు మండలాల్లోనూ మొండిచేయి చూపారనే విమర్శలు ఉన్నాయి. దీనిపై డీఎస్‌వో సత్యనారాయణరాజును న్యూస్‌టుడే సంప్రదించగా రెవెన్యూ అధికారులు ఇచ్చిన జాబితా ప్రకారం చౌక దుకాణాల్లో పంపిణీ చేశామన్నారు. మిగిలిపోయిన సరకులను జిల్లా కేంద్రానికి తరలించాలని డీలర్లను ఆదేశించామన్నారు. ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు వినియోగిస్తామన్నారు.

కాకినాడ అర్బన్ మండలంలో ఓ చౌక దుకాణంలో మిగిలిన సరకులు

సరకులు అందని కుటుంబాలు

మండలం	సంఖ్య
కాకినాడ నగరం	519
కాకినాడ గ్రామీణం	331
తాళ్లరేవు	414
కరప	21
ఉప్పాడ	5

అవిశ్వాస తీర్మాన సమావేశం వాయిదా

నిరసన వ్యక్తం చేసిన సామర్లకోట కౌన్సిల్ సభ్యులు

సామర్లకోట, న్యూస్‌టుడే: పురపాలిక అధికారుల నిర్లక్ష్యం కారణంగా రెండో సారి అవిశ్వాస తీర్మాన సమావేశం వాయిదా పడిందని పురపాలిక వైస్ ఛైర్మన్ ఊబా జాన్‌మోజెస్ అన్నారు. బుధవారం సామర్లకోట పురపాలిక కార్యాలయంలో ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణపై అవిశ్వాస సమావేశం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేశారు. సభకు 22 మంది కౌన్సిల్ సభ్యులు హాజరయ్యారు. 11.30 గంటలకు కమిషనర్ శ్రీవిద్య సమావేశానికి వచ్చి సమావేశం రద్దు చేయాలని హైకోర్టు నుంచి ఉత్తర్వులు అందాయని దానితో జిల్లా కలెక్టర్ సభ వాయిదా వేయాలని నోటీసు ఇచ్చారన్నారు. దీనిపై వైస్ ఛైర్మన్, కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ సభకు రమ్మని నోటీసు ఇచ్చారని సభకు హాజరైతే సమావేశం వాయిదా వేశామని ఎలా చెబుతారని వాయిదా పడినట్లు ముందుగా సర్క్యులర్ ఎందుకు పంపలేదని సభ్యులు ప్రశ్నించారు. తమకు ఆర్డీవో కార్యాలయం నుంచి ఆలస్యంగా వచ్చిందని, నోటీసు బోర్డులో పెట్టామన్నారు. అలా ఎలా పెడతారని, కౌన్సిల్ సమావేశం అజెండా పత్రాలు అర్ధరాత్రి ఇంటికి పంపి సంతకాలు చేయించుకునేవారన్నారు. వాయిదా పడిన అంశాన్ని ఎందుకు తెలియజేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గౌరవ సభ్యులను అవమాన పరిచే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. అధికారుల తీరుపై కార్యాలయం బయట సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆవాల లక్ష్మినారాయణ, జట్ల మోహన్, పాగా సురేష్‌కుమార్, పిట్టా సత్యనారాయణ, సేపేని సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో అధికారులను నిలదీస్తున్న మున్సిపల్ వైస్ ఛైర్మన్ జాన్‌మోజెస్

జాతీయ స్థాయి పరుగు పోటీలకు ఎంపిక

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయం అథ్లెటిక్స్ పోటీల్లో కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని జాతీయ స్థాయికి ఎంపికైంది. బీఏ మొదటి సంవత్సరం చదువుతోన్న బి.నాగ విహారిక 100, 200 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాన్ని సాధించింది. యూనివర్సిటీ ఫాస్టెస్ట్ ఉమెన్‌గా టైటిల్‌ను దక్కించుకుంది. వచ్చే ఏడాది జనవరి 12న బెంగళూరులో రాజీవ్‌గాంధీ హెల్త్ యూనివర్సిటీలో జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీల అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొనుంది. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా. ఆంజనేయులు, పీడీలు డా. వర్మ, డా. దుర్గారావు, తదితరులు ఆమెను అభినందించారు.

నాగ విహారికను అభినందిస్తున్న ప్రిన్సిపల్ ఆంజనేయులు

ఫెన్సింగ్ క్రీడను ప్రోత్సహించాలి

రాజానగరం, న్యూస్‌టుడే: కళ్లు, చేతులు, కాళ్లు, మెదడు మధ్య అనుసంధానాన్ని, ఏకాగ్రతను, అప్రమత్తతను పెంచే సంప్రదాయక దేశీయ క్రీడ ఫెన్సింగ్ (కత్తిసాము)ను యువతీ యువకుల్లో విస్తరింపజేయాలని జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల ఛైర్మన్ డా. గన్ని భాస్కరరావు పిలుపునిచ్చారు. ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్‌గా బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల యూనిట్ల అధ్యక్షులు, కార్యదర్శులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

పోటీలో క్రీడాకారులు

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక: 12వ రాష్ట్రస్థాయి సీనియర్ల ఫెన్సింగ్ పోటీలు కళాశాలలోని సుశ్రుత ఆడిటోరియంలో మంగళవారం అర్ధరాత్రి వరకు నిర్వహించారు. 13 జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అధిక పాయింట్లు సాధించిన వారిని మూడేసి విభాగాల్లో నలుగురు చొప్పున బాలబాలికల నుంచి 12 మంది చొప్పున జాతీయ ఫెన్సింగ్ పోటీలకు రాష్ట్రం తరపున ఎంపిక చేసినట్లు నిర్వాహకుడు ఎన్. సతీష్‌బాబు తెలిపారు.

మన నగరం.. నౌకలూ నిర్మాణం

కాకినాడ తీరంలో ఏర్పాటుకు ఆసక్తి

ఈనాడు, కాకినాడ: కాకినాడ తీరం ఇప్పటివరకు జల రవాణా కేంద్రంగానే గుర్తింపు పొందింది. ఇకపై నౌకా నిర్మాణ కేంద్రంగానూ అభివృద్ధి చెందనుంది. ప్రస్తుతం నగరంలో శాన్ మెరైన్ సంస్థ చిన్న, మధ్యస్థ నౌకల నిర్మాణం చేపడుతోంది. విద్యుత్తు నౌకల తయారీలోనూ అడుగుపెట్టడానికి ఇటీవల ముంబయిలో కేంద్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది.

తీర ప్రాంత అభివృద్ధికి..

ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) ఇదివరకు కాకినాడ పోర్టు పరిసరాల్లో శాటిలైట్ షిప్‌యార్డు ఏర్పాటుకు స్థల పరిశీలన చేసి వెళ్లింది. తాజాగా మ్యాట్ మెరైన్ సర్వీసెస్ సంస్థ యాంకరేజ్ పోర్టు సమీపంలో టగ్‌లు, బార్జీల నిర్మాణం చేయబోతుంది. ఇవి తీర ప్రాంత అభివృద్ధికి దోహదపడతాయని చెబుతున్నారు.

కీలక స్థావరంగా..

గతంలో చిన్నపాటి నౌకలు, బార్జీల కోసం సింగపూర్, మలేషియా వెళ్లి అక్కడి కంపెనీలకు ఆర్డర్లు పెట్టాల్సి వచ్చేది. వాటి నిర్వహణ, మరమ్మతులకు ఇబ్బందులు ఎదురయ్యేవి. ఇప్పుడు మెరైన్ సంస్థలు ముందుకు వస్తుండడంతో ఈ రంగంలో కాకినాడ రాష్ట్రంలోనే కీలక స్థావరంగా మారబోతుంది. బోట్ల నుంచి భారీ నౌకల తయారీకి అవకాశాలుండి యువతకూ ఉపాధి దక్కనుంది.

ఇవీ అనుకూల పరిస్థితులు

● హోప్ ఐలాండ్ కారణంగా అలల తాకిడి తక్కువ. ● తీరం వెంబడి ప్రభుత్వ భూములు ఎక్కువ. ● నౌకలు, బార్జీలు, టగ్‌లు తయారుచేసి పక్కనే ఉన్న సముద్ర జలాల్లోకి దించి.. పరీక్షలు చేసి సరకు రవాణాకు ఉపయోగించొచ్చు. సీఫ్రంట్‌గా పిలిచే ఈ సౌకర్యం కాకినాడలోనే ఉంది. ● జగన్నాథపురం వంతెన నుంచి యాంకరేజ్ పోర్టు వరకు రెండు కిలోమీటర్ల మేర సీఫ్రంట్ విస్తరించి ఉండడం నౌకల తయారీకి అనుకూలం.

సర్కారు సానుకూలం..

● కూటమి ప్రభుత్వ పారిశ్రామిక పాలసీతో పారిశ్రామికవేత్తలకు నమ్మకం వచ్చింది. ● హిందుస్థాన్ షిప్‌యార్డు సంస్థ కాకినాడ, మూలపేట పోర్టులను పరిశీలించి వంద ఎకరాలిస్తే శాటిలైట్ షిప్‌యార్డు ఏర్పాటు చేస్తామంది. ● శాన్ మెరైన్ సంస్థ ఆధునిక సాంకేతికత.. నార్వే, జపాన్ దేశాల పరిజ్ఞానంతో విద్యుత్తు ఆధారిత నౌకల తయారీకి ముందుకొచ్చింది. రూ.600 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ● మ్యాట్ మెరైన్ రూ.100 కోట్లతో ఇక్కడ టగ్‌లు నిర్మిస్తానంది. దీనివల్ల 300 మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

కాలభైరవం భజే..!

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: రాచపల్లిలోని ఆంధ్రా అరుణాచలంలో స్వామితో సహా పరివార దేవతలకు బుధవారం విశేష పూజలు జరిగాయి. విజయగణపతికి, ఉపాలయంలోని కాలభైరవ స్వామికి జరిగిన అభిషేకాలు, హారతి కార్యక్రమాల్లో పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. రుత్వికులు శ్రీవల్లభ హోమాన్ని నిర్వహించారు.

కాలభైరవుడికి అభిషేకాలు

'శివరావుగారి దివాన్‌గిరి' గ్రంథం రూపకల్పన

పిఠాపురం: పిఠాపురం సంస్థానం మహారాజా గంగాధర రామారావు కాలం నుంచి మూడు తరాలు వారి దగ్గర మేనేజర్లుగా పనిచేసిన తిమ్మరాజు పంతులు, దిగవల్లి వేంకట శివరావు కాలానికి సంబంధించిన గ్రంథాన్ని రూపకల్పన చేస్తున్నామని విశ్రాంత ఎంపీడీవో దిగవల్లి వెంకట చంద్రశేఖరరావు తెలిపారు. పిఠాపురం మహారాజా తనయుడు రామరత్నారావుతో ఈ విషయంపై చర్చించినట్లు బుధవారం తెలిపారు. 18వ శతాబ్దంలో రాజుల పరిపాలన, దివాన్‌ల యంత్రాంగం తదితర విషయాలపై వాస్తవ చరిత్ర ఆధారంగా 'శివరావుగారి దివాన్ గిరి' పేరుతో గ్రంథం రూపకల్పన చేస్తున్నామన్నారు.

వ్యాన్ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

● ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కొనసాగుతున్న చికిత్స

గండేపల్లి, న్యూస్‌టుడే: ఇంటి వద్ద ఉంటే కిరాణా దుకాణంలో తండ్రికి చేదోడుగా ఉండే ఆ యువకుడిని పాలవ్యాన్ అతి వేగంతో ఢీ కొట్టడంతో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. వివరాలివీ.. గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామానికి చెందిన మామిడిపాక ఈశ్వర కల్యాణ్(23) ద్విచక్ర వాహనంపై కాట్రావులపల్లిలో ఉన్న అమ్మమ్మ ఇంటికి బయలుదేరాడు. యల్లమిల్లి గ్రామం మీదుగా నాయకంపల్లి శివారున ఉన్న చెరువువద్ద మలుపు దగ్గరకు వచ్చేసరికి నాయకంపల్లి నుంచి యల్లమిల్లి వేగంగా వెళ్తున్న పాలవ్యాన్ బలంగా ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కల్యాణ్ తలకు బలమైన గాయాలు తగలడంతో హుటాహుటిన రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స అందుతోంది. దీనిపై ఎటువంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నది విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

FINANCIAL SERVICES

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభవాయిదా లేదా నెలవారీ వడ్డీ పద్ధతిలో పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటి, ✆ 73862 01191.

అన్ని రకముల లోన్స్ చేయించబడును నో CIBIL ప్రైవేట్ ఫైనాన్స్ ఇప్పించబడును. బంగారం విడిపించు కొనుటకు డబ్బులు ఇప్పించబడును. Cell: 96663 99944.

REAL ESTATE

LAND FOR SALE

GENERAL

రాజమండ్రికి 30 కి.మీ. దూరంలోగల మురారి - గండేపల్లి మధ్య నేషనల్ హైవేకి చేర్చి 100 అ॥ల రోడ్ ఫేసింగ్‌తో 60 సెంట్లు భూమి అమ్మబడును. (నో బ్రోకర్స్), ✆ 90329 88265.

తూర్పుగోదావరి జిల్లా, లింగంపర్తిలో గల వైఆర్‌సి కాలువ అనుకొని 52 ఎకరాల వ్యవసాయ భూమి ఎకరం 35 లక్షలకు అమ్మకమునకు కలదు. (నదిపాటి గోశాలకు 2 కిలోమీటర్ల దూరం), Contact Cell: 93909 91555.

EENADU eClassifieds

JOBS

WANTED STAFF Ravindra High School. Exp. High School Teachers for English, Social, Science & Telugu, B.Tech. Graduates eligible. Sal: 20K to 22K, Location: Madiki, Vemagiri. ✆ 95334 31103, 91105 67164.

శ్రీనివాస గ్రూప్, VJA. ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/వంట, బేబి కేర్‌కు వర్కర్లు కావలెను. బో+ వ+ జీతం. ✆ 92814 52843, 92814 52827

రామకృష్ణ గ్రూప్ Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు, ఇంటిపని, వంటపని, బేబికేర్ కొరకు స్త్రీ/పు కావలెను. బో+ వ+, జీతం: 16 - 18K. ✆ 9705297788, 9515108830.

శాఖాహార (వెజిటేరియన్) వంటలు, ఇంటిపని చేయుటకు కాకినాడ ఇంటిలో ఉంటూ ఏ బాదరబందీ లేని 35 సం||లలోపు స్త్రీ కావలెను. ✆ 99853 57819, 94911 95169.

సేల్స్ మేనేజర్‌గా రాజమండ్రి, కాకినాడ Livspace ఫ్రాంఛైజ్‌లో పనిచేయుటకు కావలెను. 2-5 సం.ల సేల్స్ (ఇంటీరియర్, రియల్‌ఎస్టేట్) అనుభవం కలిగి ఉండాలి. మీ రెజ్యూమ్ vyshnosrigroup@gmail.comకు పంపండి. ✆ 96146 56789.

యాక్సెస్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ NGO సంస్థ వరి-AWD ప్రాజెక్ట్‌లో తూ||గో|| జిల్లాలో పనిచేయుటకు ఫీల్డ్ స్టాఫ్/ ఫీల్డ్ సూపర్‌వైజర్స్ కావలెను. అర్హత: ఇంటర్/ డిగ్రీ. Cont. Cell: 98857 35563.

రాజమండ్రి ఉమెన్స్ కాలేజ్ దగ్గర బ్రాహ్మణ కుటుంబంలో వంట చేయుటకు బ్రాహ్మణ ఆడ వంట మనిషి కావలెను. Contact Cell: 80991 91919.

MARKETING/ SALES

ప్రముఖ MNCలో మేనేజర్‌గా పని చేయుటకు డిగ్రీ బైక్ కలిగిన వారు సంప్రదించండి. Cell: +91 91218 56488 రాజమండ్రి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-05 పైౖ
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	22,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	20,000-21,000
కొత్త (పచ్చి) కాయ	19,000-20,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	109-00
రిటైల్ లైవ్	134-00
డ్రెస్డ్	197-00
స్కిన్‌లెస్	224-00

బాలింత మృతి కేసు.. వైద్యురాలిపై చర్యలు

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో బాలింత మృతికి సంబంధించిన వ్యవహారంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్, గైనకాలజిస్టు సుజాతపై శాఖపరమైన చర్యలు తీసుకున్నారు. వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ పద్మ ఆమెను సీహెచ్‌సీ నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని డీసీహెచ్ఎస్ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 13న గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన శ్రీదుర్గకు పిఠాపురం సీహెచ్‌సీలో ప్రసవం జరిగింది. ఆమె ఆరోగ్య పరిస్థితి బాగోక కాకినాడ జీజీహెచ్‌కు పంపించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమెకు పుట్టిన బిడ్డకు పరిస్థితి బాగోలేదని కుటుంబ సభ్యులు స్థానిక పాడా కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో గత నెల 23న కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాల మేరకు వైద్యబృందం, పాడా పీడీ చైత్రవర్షిని విచారణ చేపట్టి కలెక్టర్‌కి నివేదిక ఇచ్చారు. దాని ఆధారంగా ఎట్టకేలకు ఆమెపై శాఖపరమైన చర్యలకు ఆదేశించారు. ప్రస్తుతం సామర్లకోట సీహెచ్‌సీ నుంచి గైనకాలజిస్టు కన్యాకుమారిని డిప్యూటేషన్‌పై బుధవారం నియమించారు.

కత్తులతో దాడి.. నలుగురిపై కేసు

మసీదు సెంటర్ (కాకినాడ): ఓ యువకుడిపై కత్తులతో దాడిచేసిన నలుగురిపై కాకినాడ మూడో పట్టణ పోలీసులు బుధవారం హత్యాయత్నం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ సాంబమూర్తినగర్‌కు చెందిన ఎద్దు గణేష్ అనే యువకుడు ప్రైవేటు బస్సు క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. స్థానిక రేచర్లపేటకు చెందిన కోడిదాసు శివకు గణేష్ అప్పుగా కొంత నగదు ఇచ్చాడు. ఎన్నిసార్లు అడిగినా తిరిగి ఇవ్వలేదు. అడిగితే చంపేస్తానని బెదిరించాడు. మంగళవారం రాత్రి సాంబమూర్తినగర్ కాస్మో హోటల్ వద్ద రూ.12వేలు ఇవ్వమని గణేష్ అడగ్గా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం గణేష్‌పై శివ దాడి చేశాడు. అదేసమయంలో సాంబమూర్తినగర్‌కు చెందిన ఆల్తాఫ్, విజయ్, రేచర్లపేటకు చెందిన వీరు, కలిసి గణేష్‌ను కొట్టడంతో పాటు కత్తులతో దాడి చేశారు. బాధితుడిని జీజీహెచ్‌కు తరలించారు. ఎస్సై సాగర్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

దైవ దర్శనానికి వెళ్లివస్తుండగా ప్రమాదం

● ఆటో చోదకుడి మృతి.. నలుగురికి గాయాలు

ప్రత్తిపాడు, కిర్లంపూడి, న్యూస్‌టుడే: దైవ దర్శనాలు చేసుకుని ఆటోలో వెళ్తున్న బృందం రోడ్డు ప్రమాదంలో చిక్కుకుంది. ఈ ఘటన ప్రత్తిపాడు హైవే సమీపంలో పుత్రచెరువు కూడలిలో బుధవారం జరిగింది. వివరాలివీ.. కిర్లంపూడి మండలం ముక్కొల్లుకు చెందిన దొడ్డ వీరలక్ష్మి, సాపిరెడ్డి గనిలక్ష్మి, పోసిన సత్యనారాయణ, ఉమ్మిడి సీతామహాలక్ష్మి, ఆటోచోదకుడు రావు ఆదివిష్ణు(43)లు రాచపల్లి, ఇర్రిపాక తదితర ఆలయాలు దర్శించి ఇంటికి వస్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న ఆటోను ప్రత్తిపాడు సమీపంలో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి రాసుకుంటూ వెళ్లడంతో పక్కన ఉన్న విభాగినిని ఢీకొంది. ఆటోచోదకుడు ఆదివిష్ణు మృతి చెందగా వీరలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్తిపాడు సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడకు తరలించారు. మిగిలిన వారికి ప్రత్తిపాడు సీహెచ్‌సీలో డా. సౌమ్య, సిబ్బంది చికిత్స చేశారు. ఎస్సై లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో నుజ్జయిన ఆటో (అంతర చిత్రంలో) రావు ఆదివిష్ణు (పాత చిత్రం)

వీధిన పడిన కుటుంబం

ఆదివిష్ణు మరణంతో అతని కుటుంబం వీధిన పడింది. ముక్కొల్లులో ఉండే బంధువులు అందరూ ఆలయాలకు వెళ్దామంటే ఆదివిష్ణు ఆటోలో తీసుకెళ్లాడు. రాచపల్లి, ఇర్రిపాక శివాలయాలు దర్శించారు. ప్రత్తిపాడులో హైవే కూడలి దాటితే 30 నిమిషాల్లో అంతా ఇంటికి చేరేవారే. ఈలోగా ప్రమాదం చోటుచేసుకుంది. ఆదివిష్ణుకు భార్య, 17 ఏళ్ల లోపు ఇద్దరు అబ్బాయిలు, అమ్మాయి ఉన్నారు.

(c) eenadu

కాకినాడ

నగరంలో సినిమాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆనంద్ సినిమాస్ 4ప్లెక్స్- కృష్ణలీల, ఆర్యన్, ప్రిడేటర్, వినెక్స్, బాహుబలి ది ఎపిక్, దేవీ మల్టీప్లెక్స్ 4ప్లెక్స్- వినెక్స్, మాస్ జాతర, డిగ్రీఫ్రెండ్, కాంతార 1, లక్ష్మి- డిగ్రీఫ్రెండ్ ప్రీవ్యూ షో(ఉ.సా), బైసన్(మ,రా), సత్యగౌరి - ప్రిడేటర్, తిరుమల - ఆర్యన్, నీలాద్రి 1- జటాధర, నీలాద్రి 2- ప్రేమిస్తున్నా(ఉ,సా), కె.ర్యాంప్, శ్రీప్రియ - మాస్ జాతర, పద్మప్రియ- డిగ్రీఫ్రెండ్, బాహుబలి ది ఎపిక్(మ), సూర్య1(వాకలపూడి) - మాస్ జాతర, సూర్య 2 - జటాధర.

రైతుబజారులో నిన్నటి ధరలు (కిలోకు)

గాంధీనగర్: టమాటా- 24, వంకాయలు- 58, 64, 78, బెండకాయలు- 60, పచ్చిమిర్చి- 38, 42, 50, కాకరకాయ- 50, బీర- 56, 60, కాలీఫ్లవర్- 25, 32, క్యాబేజీ- 36, క్యారెట్- 60, దొండకాయలు- 58, బంగాళాదుంపలు- 23, 27, ఉల్లి- 22, 28, గోరుచిక్కుడు- 36, దోసకాయలు- 38, చిక్కుడు- 140, చేమదుంపలు- 38, 36, బీట్‌రూట్- 48, కీరదోస- 30, బీన్స్‌కాయలు- 60, అల్లం- 68, క్యాప్సికం- 60, బొబ్బర్లు- 56, చిలకడదుంపలు- 40, ఒకటి బొప్పాయి అనపకాయ- 45, 50, పొట్లకాయ- 20, 22.

బడి ఆటో.. గమ్యం ఎటో..!

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఓ వైపు రవాణా శాఖ అధికారులు.. మరోవైపు ట్రాఫిక్ అధికారులు అవగాహన కల్పిస్తున్నా కొంత మంది ఆటోవాలాల తీరు మారట్లేదు. పరిమితికి మించి పిల్లలను ఎక్కించుకుని ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. అసలే చిన్నారులు.. ఏ మాత్రం పట్టుతప్పినా ప్రమాదం కొని తెచ్చుకున్నట్లే. ఆటోలో పోడవుగా పక్కన వద్దని లోపల సీట్లో ఉండరు. వెనుకపై మరో నలుగురు, వెనుకాల మరో నలుగురిని కూర్చోబెట్టి ప్రయాణాలను సాగిస్తుండటం కలవరపెడుతోంది. దీనిపై ఇరు శాఖల అధికారులు ఎన్నిసార్లు అవగాహన కల్పిస్తున్నా మార్పు రావట్లేదు. దీనిపై అధికారులు మరింత పర్యవేక్షణ పెంచాల్సి ఉంది.

ఆటోలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న విద్యార్థులు

3,000 వాహనాలు..

జిల్లాలో మొత్తం 5,27,000 వాహనాలు ఉండగా అందులో రవాణా శాఖ ఆటోలు 3,517, గూడ్స్ క్యారియర్లు 13,741 వరకు ఉన్నాయి. పీటీలో 13,726 ఆటోలు వరకు ఉన్నాయి. ఇందులో సుమారు 3వేల వరకు వాహనాలు పిల్లలను తీసుకెళ్తున్నాయి. ఇందులో అధిక సంఖ్యలో ఆటోవాలాలు నిబంధనలు బేఖాతరు చేస్తూ విద్యార్థులను కిక్కిరిసి తీసుకెళ్తున్నారు.

ఇవీ నిబంధనలు..

❖ ఆటోలో చిన్నారులను తరలించేటప్పుడు రవాణా శాఖ నిబంధనలు పాటించాలి. ❖ అయిదో తరగతి కన్నా చిన్న పిల్లలు అయితే ఒక ఆటోకు ఎనిమిది మంది, కొంచెం పెద్ద పిల్లలు అయితే ఆరుగురిని మాత్రమే ఎక్కించుకోవాలి. ❖ కానీ ఒక్కో ఆటోలో 12 నుంచి 15 మందిని తీసుకెళ్తున్నారు. ❖ వెనుక బ్యాగులు పెట్టాల్సిన చోట ప్రమాదకరంగా కూర్చోబెడుతున్నారు. ❖ ఏటా ఆటోను రవాణాశాఖ అధికారులతో తనిఖీ చేయించి గుర్తింపు పొందాలి. కానీ ఇవేమీ అమలు కావట్లేదు.

తల్లిదండ్రులూ.. బాధ్యత తీసుకోవాలి

బడి సమయం మించిపోతుందన్న హడావుడిలో తమ పిల్లలను ఆటోలో కూర్చోబెట్టి తల్లిదండ్రులు పంపిస్తున్నారు. ఈ విషయంలో రవాణా, పోలీసు శాఖ అధికారులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలూ బాధ్యత తీసుకోవాలి. పిల్లలు ఆటోల్లో ఎలా వెళ్తున్నారో గమనించి, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇవ్వాలి. నిబంధనల ప్రకారం నడుచుకునేలా వారిలో చైతన్యం తేవాలి.

విస్తృత తనిఖీలు..

జిల్లాలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఎంవీఐలతో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం. వారికి అవగాహన కల్పిస్తున్నాం. నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. ఆటోలో వెనుక, డ్రైవర్ సీటు పక్కన కూర్చోబెడితే కఠిన చర్యలు తీసుకుంటాం.
- ఎంవీ మురళీకృష్ణ, ప్రాంతీయ రవాణా అధికారి

మేమున్నాం.. మీకు తోడుగా

వెలిగిన దీపం

ఎల్విన్‌పేటలోని మసీదు ఆలయం సమీపంలో వీధి దీపం వెలగట్లేదు. రాత్రి వేళ కారణంగా రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించారు.

మరమ్మతులు చేయాలి..

శశికాంత్‌నగర్ శివారు సౌజన్యనగర్ వెళ్లే దారిలో నాలుగు రోడ్ల కూడలి వద్ద కాలువపై ఏర్పాటు చేసిన స్లాబు రాయి దెబ్బతింది. మధ్యలో రంధ్రం ఏర్పడటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు
ఉ. 10 - మ. 1
కాకినాడ నగరం: 80085 74157
సాంబమూర్తినగర్: 91548 46719
మసీదుసెంటర్: 91541 18210
గాంధీనగర్: 80085 74159

డీపీవోకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ ప్రతినిధులు

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కాకినాడ కలెక్టరేట్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం యూనియన్ ప్రతినిధి వర్గం సీహెచ్.అజయ్‌కుమార్, టి.రాజా, పెంకే వీరభద్రరావు, వాసంశెట్టి చంద్రరావు జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. కనీస జీతాలు చెల్లించి కార్మికుల కుటుంబాలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కార్మికులకు మాదిరిగా నెలకు రూ.21వేల వేతనం చెల్లించాలని కోరారు.

ముందస్తు జాగ్రత్తలతో వ్యాధులు దూరం

మసీదు సెంటర్ (కాకినాడ): నిమోనియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండి వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స పొందాలని కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. లావణ్యకుమారి సూచించారు. బుధవారం కాకినాడ జీజీహెచ్‌లోని లెక్చరల్ గ్యాలరీలో హెచ్‌ఓడీ డా. మాణిక్యాంబ ఆధ్వర్యంలో ప్రపంచ నిమోనియా దినోత్సవాన్ని నిర్వహించారు. వ్యాఖ్యాతగా పీడియాట్రిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. వెంకటేశ్వర్లు వ్యవహరించగా ముఖ్యఅతిథిగా జీజీహెచ్ సూపరింటెండెంట్ హాజరై ప్రసంగించారు. ఐదేళ్ల లోపు పిల్లల్లో నిమోనియాతో వచ్చే మరణాలు ఎలా నివారించాలో, తల్లిదండ్రులకు, నర్సింగ్ సిబ్బందికి, వైద్యవిద్యార్థులకు వైద్యాధికారులు తెలియజేశారు. అలాగే నిమోనియా వ్యాధిని ఎలా నివారించాలి, ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలి వంటి వాటిపై అవగాహన సదస్సులో వివరించారు. ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపల్ డా. శశి, డా. విజయశేఖర్, డీఐవో డా. సుబ్బరాజు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, వైద్యవిద్యార్థులు పాల్గొన్నారు.

14న లక్ష గాజులతో అమ్మవారికి అలంకరణ

గాంధీనగర్: కాకినాడ సూర్యారావుపేటలోని శ్రీబాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో అమ్మవారిని లక్ష గాజులతో విశేష అలంకరణ చేయనున్నట్లు ఆలయ ఈవో వీర్రాజు చౌదరి తెలియజేశారు. కార్తికమాసం సందర్భంగా శుక్రవారం ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 9 వరకు దర్శించుకోవచ్చన్నారు. శనివారం ఉదయం 8 నుంచి ఆలయంలో గాజులను పంపిణీ చేస్తామన్నారు.

కూటమి పాలనలో నెరవేరిన సొంతింటి కల

కాకినాడ నగరం: కూటమి ప్రభుత్వంలో సొంతింటి కల నెరవేరిందని నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. స్థానిక 10, 12వ డివిజన్ పరిధిలోని పర్లోవపేట, దుమ్ములపేటలో పీఎంఏవై-1 అర్బన్ పథకం కింద నిర్మాణం పూర్తయిన ఇళ్లకు ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్, కర్రి పద్మశ్రీతో కలిసి ఎమ్మెల్యే కొండబాబు సామూహిక గృహ ప్రవేశాలు చేశారు. గృహ నిర్మాణ శాఖ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. గృహ నిర్మాణ శాఖ పీడీ సత్యనారాయణ మాట్లాడుతూ 2024 జూన్ నుంచి నగర పరిధిలో 13,278 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటికి 1,759 ఇళ్లను పూర్తి చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ రాజశేఖరం మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం ఇళ్ల స్థలాల పేరుతో రూ.కోట్లు దోచుకున్నారన్నారు. గృహ నిర్మాణ శాఖ డీఈ సత్యనారాయణరెడ్డి, ఈఈ వై.శ్రీనివాస్, ఏఈ సోమిరెడ్డి సురేష్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ పనితీరుతోనే నాయకులుగా ఎదుగుదల

ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు, పరిశీలకుడు లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ రాజశేఖర్ తదితరులు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ప్రజలతో మమేకం అవ్వడం ద్వారా నాయకత్వానికి మెరుగు పెట్టుకోవాలని నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పిలుపునిచ్చారు. స్థానిక సూర్యకళా మందిరంలో బుధవారం నగర నియోజకవర్గ పార్టీ క్లస్టర్, యూనిట్, డివిజన్, బూత్ కమిటీ పదవులకు నియమితులైన వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ మాట్లాడారు. పనిచేసే కార్యకర్తలే నాయకులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. మల్లిపూడి వీరు, పాసాని తిరుమలకుమార్, నున్న హరేరామ్, గ్రంధి బాబ్జి, బచ్చు శేఖర్, డా.కొండమూరి సత్యనారాయణ, గదుల సాయిబాబా, మెంటా రావు, పంతాడి రాజా, కొల్లాబత్తుల అప్పారావు, ఎస్‌కే రహీం, వనమాడి మోహనవర్మ, అమన్‌జైన్, తుమ్మల రమేష్, వమ్మి బాలాజీ, చింతా పేర్రాజు, ఎంఏ తాజుద్దీన్, హోతా రవి, సీకోటి అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన మార్కెట్ కమిటీ ప్రతినిధులు

కాకినాడ కలెక్టరేట్: కాకినాడ అర్బన్ మార్కెట్ కమిటీ ప్రతినిధులు బుధవారం ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌ను ఆయన విడిది కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కమిటీ ఛైర్మన్ బచ్చు శేఖర్, వైస్ ఛైర్మన్ బి.దేవి, పాలక వర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం అనంతరం ఎంపీని కలిసి నగరంలోని మార్కెట్ యార్డు అభివృద్ధికి సహకరించాలని కోరారు. అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

చెత్త వాహనాలకు మరమ్మతులు చేయాలి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థకు చెందిన వెహికల్ యార్డ్‌ను బుధవారం ఇన్‌ఛార్జి కమిషనర్ కేటీ సుధాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వినియోగంలో ఉన్న, మూలనపడ్డ వాహనాల సంఖ్యపై ఆరా తీశారు. వాహనాల కొరతతో చెత్త తరలింపులో ఇబ్బందులు వస్తున్నాయని గుర్తుచేశారు. తక్షణం మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంహెచ్‌వో డా. పృథ్వీచరణ్, శానిటరీ ఎస్సై నాయుడు పాల్గొన్నారు.

బాధ్యతగా ప్రయాణం.. భవిత భద్రం

శిరస్త్రాణం ధరించిన వారికి గులాబి, చాక్లెట్ అందజేసి అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, ట్రాఫిక్ సీఐలు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: శిరస్త్రాణం ధరించని ద్విచక్రవాహనాలు, మైనర్, ఓవర్ స్పీడ్ డ్రైవింగ్ చేస్తున్న వాహనదారులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సుమారు 130పై భారీ జరిమానాలు విధించినట్లు ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ తెలిపారు. బుధవారం ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు, ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో కాకినాడ ట్రాఫిక్-1, 2 సీఐలు ఎన్.రమేష్, డి. రామారావు ట్రాఫిక్ నిబంధనలు పాటించిన వారిపై కేసులు నమోదు చేసి అనంతరం వారిని ట్రాఫిక్-2 స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ మాట్లాడుతూ ద్విచక్రవాహనాలు ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. దీంతో ప్రాణాలు రక్షించుకోవచ్చన్నారు. దీన్ని చట్టపరమైన బాధ్యతగా కాకుండా వ్యక్తిగత భద్రతగా భావించాలన్నారు. వాహనాలను వేగంగా, మద్యం సేవించి నడపటం, ట్రిబుల్ రైడింగ్, బైక్ స్టంట్స్ చేయడం చేయరాదన్నారు. మైనర్లకు వాహనం ఇచ్చిన యజమానులు, తల్లిదండ్రులపై కేసులు, జరిమానాలు విధిస్తామన్నారు. వారికి గులాబీలు, చాక్లెట్లు అందజేశారు.

CHANGE OF NAME

I, **MOHAMMED HASINA** , W/o **MOHAMMED ABDUL AZEEZ**, Resident of Door. No. 3-20-1/10/1, Flat .No. f-4 , Sainadh Residency , Ram Mohan Raja Nagar, Godarigunta , Kakinada urban , Kakinada District, A. P. I have changed my name from **KHAMARUNNISA MOHAMMED** (Old Name) to **MOHAMMED HASINA** (New Name) Hence I am being called **MOHAMMED HASINA** As per Affidavit dated 12.11.2025 for all Purposes PINAPOTHU KOTESWARA RAO Advocate - Notary , Kakinada.

ఆదమరిచారో.. ఆసుపత్రి పాలే!

కాకినాడ 9వ డివిజన్ పరిధిలోని పళ్లంరాజునగర్ నగరపాలక ఉద్యానం మలుపు వద్ద కాలువపై స్లాబు రాళ్లు లేక ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. రాత్రి సమయంలో మలుపు తిరిగే క్రమంలో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి కాలువపై స్లాబురాళ్లు వేయించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, భానుగుడి సెంటర్

వ్యర్థాలకు నిప్పు..

ప్రతాప్‌నగర్ ప్రాంతంలోని వీధుల్లో వ్యర్థాలకు నిప్పు పెడుతున్నారు. వీధుల్లో సేకరించిన చెత్త తరలించకుండా ఎక్కడికక్కడ పోగుగా పెడుతున్నారు. దీంతో శ్వాసకోశ సమస్యలు తలెత్తుతాయని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

అధ్వానంగా రహదారి..

నగరంలోని పలు ప్రధాన రహదారులు గుంతలతో అధ్వానంగా కనిపిస్తున్నాయి. వెంకట్‌నగర్‌లోని ప్రధాన కూడలి వద్ద రహదారి గుంతలతో ప్రమాదకరంగా ఉంది. రద్దీగా ఉండే మార్గంలో గుంతలతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, మసీదు సెంటర్

అల్లుకున్న విద్యుత్తు తీగలు..

జయేంద్రనగర్ ప్రధాన రహదారి పక్కన విద్యుత్తు స్తంభాలకు, పొదులు, తీగలు అల్లుకున్నాయి. వర్షాలకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. గాలులు వీస్తే విద్యుత్తుకు అంతరాయం ఏర్పడచ్చు. ప్రమాదాలు జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మసీదు సెంటర్

రాకపోకలకు అడ్డుగా..

శాంతినగర్ జీవోస్ కాలనీ 4వ వీధిలో రహదారి పక్కన అడ్డుగా కంటైనర్ ఉంది. కూడలి సమీపంలో ఉండటంతో ముందు వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొంతకాలంగా ఇదే పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ఈ కంటైనర్‌ను మరొక చోటకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.
- న్యూస్‌టుడే, మసీదు సెంటర్

సంస్మరణ

(13-11-2025)
ఈ జన్మలో మరువలేని మహనీయుడు, మా ఉన్నతికి కారకులైన
కీ॥శే॥ కె.వి.ఆర్.చౌదరి గారి
24వ వర్థంతిని నిత్యం స్మరించుకుంటూ...
బొడ్డు బాపిరాజు
శ్రీ కనకమహాలక్ష్మి టెంట్‌హౌస్
క్లాత్ వర్క్స్ & లైటింగ్
గంగరాజునగర్, రోడ్ నెం-3, కాకినాడ
ఫోన్: 94406 88419, 79015 28899

వీడిన బాలికల అదృశ్యం కేసు మిస్టరీ

కాకినాడలో అదుపులోకి తీసుకున్న పోలీసులు

పెడన, న్యూస్‌టుడే: కృష్ణాజిల్లా పెడన మదర్సా నుంచి ఈనెల 10న అదృశ్యమైన ముగ్గురు బాలికలను పోలీసులు కాకినాడలో గుర్తించారు. వారు సోమవారం అదృశ్యం కాగా సంస్థ నిర్వాహకులు మంగళవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు చరవాణి టవర్ లొకేషన్ ఆధారంగా కాకినాడ సముద్ర తీరానికి సమీపంలోని ఒక హోటల్‌లో మంగళవారం అర్ధరాత్రి బాలికలను గుర్తించి బుధవారం ఉదయం పెడన పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. బాలికల అదృశ్యం వెనుక కాకినాడ, బంటుమిల్లికి చెందిన వింజరపు విజయ రత్నకుమార్(20), కుంభా సందీప్(19) ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఇద్దరిపై కిడ్నాప్ కేసు నమోదు చేశారు. యువకులు కూడా ప్రస్తుతం పెడన పోలీసుల అదుపులో ఉన్నారు. బాలికలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బంగారు ఆభరణాల చోరీ

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: బంగారు ఆభరణాల చోరీపై కాకినాడ రెండో పట్టణ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం. . కాకినాడ గొల్లపేటకు చెందిన ఎ.వెంకటరమ్యకు చెందిన ఇంటి బీరువాలో బంగారు ఆభరణాలు కనిపించలేదు. వేసిన బీరువా వేసినట్లు ఉండగా, అందులో వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. గతనెల 25న బీరువాలో చూడగా ఇటీవల చోరీకి గురైనట్లు గుర్తించారు. సుమారు 40 గ్రాములు విలువైన బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

8 మందిపై కేసులు

మసీదుసెంటర్: వన్‌టౌన్ పరిధిలో మద్యం తాగి వాహనం నడుపుతున్న 8 మందిపై కేసులు నమోదు చేశారు. న్యాయమూర్తి ముందు హాజరు పర్చగా ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష, 6 గురికి ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారని కాకినాడ ఒకటో పట్టణ సీఐ నాగదుర్గారావు బుధవారం తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రోడ్డుప్రమాదాలను తగ్గించాలనే ఉద్దేశంతో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించామన్నారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలు వినియోగించుకోవాలి

గాంధీనగర్: ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంలో 120 ఏళ్లుగా బ్యాంక్ ఆఫ్ ఇండియా అంకిత భావంతో కృషి చేస్తుందని బ్యాంక్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం జోన్ డిప్యూటీ జోనల్ మేనేజర్ ఎన్. సీతారాం పేర్కొన్నారు. బ్యాంకు సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. బుధవారం భానుగుడి సెంటర్‌లోని బ్రాంచిలో కస్టమర్ మీట్, గ్రీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. అతి తక్కువ వడ్డీకి గృహ, వాహన, విద్య, పీఎం సూర్యఘర్ ఋణాలు అందిస్తుందన్నారు. బ్రాంచి మేనేజర్ ఎం. ప్రవీణ్‌కుమార్, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విశాఖ జోన్ డిప్యూటీ జోనల్ మేనేజర్ సీతారాం

100 రోబోటిక్ శస్త్రచికిత్సలు

మసీదు సెంటర్: అత్యాధునిక వైద్య సదుపాయాలతో సిద్ధార్థ ఆసుపత్రిలో ఏడాదిలో 100 రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు పూర్తి చేసినట్లు ఆర్థోపెడిక్స్ సర్జన్ డా. ముత్తా ఆదిత్య కృష్ణ తెలిపారు. బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళల్లో 40 ఏళ్లు పైబడిన వారికి ఎముకల సమస్యలు వస్తున్నాయని, పాలు, పోషకాహారం తీసుకోవాలన్నారు.

బాలల హక్కులకు కృషి

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: బాలలకు వారికి ఉన్న ప్రతి హక్కును వారు పొందేలా మనం అందరం కృషిచేయాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ(ఐసీడీఎస్) ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్.లక్ష్మి పేర్కొన్నారు. నవంబరు 14న బాలల హక్కుల వారోత్సవాలను పురస్కరించుకుని పీడీ కార్యాలయం బుధవారం గోడ పత్రికను విడుదల చేశారు. ఈసందర్భంగా పీడీ మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. డీసీపీఓ సిహెచ్.వెంకట్రావు, పీఓఐసీ శ్రీనివాస్, కోఆర్డినేటర్ బి.కుమారి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల చేస్తున్న ఐసీడీఎస్ పీడీ లక్ష్మి తదితరులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

సాంబమూర్తినగర్: ప్రభుత్వ రంగ సంస్థ మినిస్ట్రీ ఆఫ్ పవర్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న నేషనల్ పెయింటింగ్ కాంపిటీషన్ ఆన్ పవర్ కన్జర్వేషన్ 2025 పోటీల్లో రామారావుపేట నారాయణ పాఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థి మోహిత్ వీరేంద్ర, 9వ తరగతి ఒలింపియాడ్ విద్యార్థి నిఖిత ప్రహసిని రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ షర్మిల తెలిపారు. నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పొంగూరు రమాదేవి, ఆర్అండ్‌డీ హెడ్ రవికుమార్, ఏజీఎం రాఘవేంద్రరావు, కోఆర్డినేటర్స్ రామతులసి, సుంకరమూర్తి డీన్ రమణారావు, వైస్ ప్రిన్సిపల్ శిరీష, విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ షర్మిల తదితరులు

'మోదీ పాలనలో కార్పొరేట్లకే ప్రాధాన్యం'

గాంధీనగర్: మోదీ ఆధ్వర్యంలోని ప్రభుత్వం కార్పొరేట్ వర్గాలకే ప్రాధాన్యం ఇస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు ఆరోపించారు. బుధవారం సాంబమూర్తినగర్‌లోని సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మత వైషమ్యాలు రెచ్చగొడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరుస్తున్నారన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సీపీఐ వందేళ్ల సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. ఈ సందర్భంగా ఈనెల 25 నుంచి డిసెంబర్ 26 వరకూ రాష్ట్రవ్యాప్తంగా శత వార్షికోత్సవ వేడుకలను నిర్వహించాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్‌లు మాట్లాడారు. రాష్ట్రంలో కూడా జనగణనలో కులగణన చేపట్టి, బీసీలకు స్థానిక సంస్థల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. ఈనెల 18న రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఆందోళనలను జయప్రదం చేయాలన్నారు.

ప్రకటన

మా క్లయింటు సూరంపూడి సతీష్ గారి భార్య మేరి ప్రమీల గారి తరుపున వారి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్ కాకినాడ జిల్లా, గాంధీనగర్, డోర్.నెం. 9-11-2/2, లేటు బిక్కిన వీర్రాజు గారి భార్య బందిల సంధ్య గారు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

మా క్లయింటు రిజిష్టర్డ్ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్ అయిన బందిల సంధ్య ది.3-10-2025 తారీకున ఆటోలో జిరాక్స్ తీయించుటకు 1)రిజిష్టర్డ్ గిఫ్ట్ డీడ్ ది.02-08-1994, డాక్యుమెంట్ నెం.7770 ఆఫ్ 1984, 2) రిజిష్టర్డ్ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ ది.23-02-1991, డాక్యుమెంట్ నెం.113 of 1991, 3) రిజిష్టర్డ్ సేల్ డీడ్ ది.27-05-1998, డాక్యుమెంట్ నెం.3253 of 1998, ఒరిజినల్ డాక్యుమెంట్సు వాటితో పాటు సదరు బందిల సంధ్య గారి పాస్‌పోర్ట్, ఆధార్‌కార్డ్, శ్యామ్‌సంగ్ సెల్ ఫోన్, పొసెషన్ సర్టిఫికెట్, రూ.10,000/- క్యాష్, సుమారు 4 గ్రాములు గల చిన్న బంగారు దుద్దులు మరియు ఇతర పేపర్లు ఒక బ్యాగులో పెట్టి తీసుకొని వెళ్ళు క్రమములో ఆటోలో వెళ్ళుచుండగా గాంధీ సర్కిల్, రమ్య హాస్పిటల్ రోడ్డు, గాంధీనగర్ కాకినాడ చేరుకొని దగ్గరలో ఉన్న జిరాక్స్ షాపు దగ్గర ఆటో దిగిన తరువాత జిరాక్స్ తీయించుటకు డాక్యుమెంట్స్ వెతకగా, డాక్యుమెంట్స్ తో పాటు పై తెలిపిన అర్టికల్స్ ఉన్న బ్యాగు కనపించ లేదు, మా క్లయింటు పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్ బందిల సంధ్య ఆటో డ్రైవర్‌తో కలిసి ఎంత వెతికినను కనిపించలేదు నా క్లయింటు పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్ కాకినాడ 2 టౌన్ పోలీస్ స్టేషనులో కంప్లయింటు రిజిష్టర్ చేసియున్నారు.

కావున ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, మా క్లయింటు యొక్క పై లిస్టు ప్రకారము చెప్పబడిన ఒరిజినల్ దస్తావేజులు మరియు మా క్లయింట్ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ హోల్డరు బందిల సంధ్య గారి డాక్యుమెంట్స్, వస్తువులు, వగైరాలు ఉండుకున్న బ్యాగు వగైరాలు ఎవరికైన దొరికిన యెడల వారు మా క్లయింటు యొక్క రిజిష్టర్డ్ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్ అయిన బందిల సంధ్య గారికి గాని మాకు గాని తెలియజేసి అప్పజెప్ప వలసినదిగా కోరడమైనది.

సదరు మా క్లయింటు యొక్క దస్తావేజులు మరియు ఆపై రిజిష్టర్డు జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ హోల్డరు బందిల సంధ్య గారి పాస్‌పోర్టు, వస్తువులు, డాక్యుమెంట్స్ వగైరాలు ఎవరైన అక్రమ లాభము పొందు ఉద్దేశ్యముతో వివిధమైన లావాదేవీలు వగైరాలు జరపినచో మా క్లయింటు, మరియు బందిల సంధ్య గారు సదరు వ్యక్తులపై సివిల్ మరియు క్రిమినల్ చట్టముల ప్రకారము తీసుకొనబోవు యావత్తు చర్యలకు బాధ్యులగుదురని ఇందుమూలముగా హెచ్చరించడమైనది.

G.V. కృష్ణ ప్రకాష్, అడ్వకేట్
డో.నెం. 1-22-14, ప్రకాష్ నిలయం, ప్రకాష్ వీధి
శ్రీరామ్ నగర్, కాకినాడ-3. సెల్: 98481 62554

జాతీయ స్థాయిలో రాణించాలి

గాంధీనగర్: రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో విజయం సాధించిన జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయిలోనూ రాణించి విజేతలుగా నిలవాలని కాకినాడ జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు, రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ అప్పసాని కృష్ణకుమారి అన్నారు. బుధవారం కాకినాడ భానుగుడిసెంటర్‌లో కృష్ణకుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈనెల 8, 9తేదీల్లో బాపట్లలో జరిగిన 42వ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన కె.శివశంకర ప్రసాద్ రెండోస్థానం, బి.సత్యనారాయణ మూడు, ఎన్.గౌతం సంజయ్ నాలుగో స్థానంలో నిలవగా వారిని సత్కరించారు. విజేతలు ఈనెల 26 నుంచి 30 వరకు జమ్మూలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కుంచే రమేష్, కోనసీమ జిల్లా కార్యదర్శి చింతా రవివర్మ, కొత్తపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

వైకాపా నాయకుల నిరసన

కాకినాడ కలెక్టరేట్: వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం నగరంలో వైకాపా ఆధ్వర్యంలో నిరసన ర్యాలీని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో జడ్పీ కూడలి నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ప్రదర్శన చేపట్టారు. జడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావుతో కలిసి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్డీవో మల్లిబాబుకు వినతిపత్రం అందజేశారు. సుంకర శివప్రసన్న, రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి

శ్రీ భమిడిపాటి వెంకట సుబ్బలక్ష్మి గారు
రిటైర్డ్ జ్యుడిషియల్ డిపార్ట్‌మెంట్, కాకినాడ
జననం: 15-01-1950 మరణం: 10-11-2025
10-11-2025 సోమవారం నాడు పరమపదించారు.
అశ్రునయనాలతో..
భమిడిపాటి రాజ్యలక్ష్మి మరియు కుటుంబ సభ్యులు
కాకినాడ

(c) eenadu

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

పండూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రామ్‌కుమార్

సర్పవరం, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణం పండూరు రైతు సేవాకేంద్రంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ భాజపా జిల్లా అధ్యక్షుడు, పీఏసీఎస్ ఛైర్మన్ చిలుకూరి రామ్‌కుమార్ ప్రారంభించారు. రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా అనఘా దత్త వ్రతం

పిఠాపురం శ్రీపాద వల్లభ మహాసంస్థానంలో బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో అనఘా దత్త వ్రతాలు వైభవంగా జరిగాయి. ఈవో సౌజన్య ఏర్పాట్లు పర్యవేక్షించారు. - న్యూస్‌టుడే, పిఠాపురం

పార్టీ అభ్యున్నతే లక్ష్యంగా పనిచేయండి

పిఠాపురం, న్యూస్‌టుడే: తెదేపాలో వివిధ పదవులు చేపట్టిన వారంతా పార్టీ అభ్యున్నతే లక్ష్యంగా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సూచించారు. బుధవారం పిఠాపురం మున్సిపల్ కల్యాణ మండపంలో పిఠాపురం పట్టణ, మండల, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్ కన్వీనర్లు, అసెంబ్లీ అనుబంధ కమిటీ సభ్యులతో వర్మ ప్రమాణ స్వీకారం చేయించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం వర్మ మాట్లాడుతూ క్రమశిక్షణతో పార్టీ పిలుపునిచ్చే కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ప్రమాణస్వీకారం చేయిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

ప్రతి గింజను కొంటాం: ఏడీఏ

పిఠాపురం: ఖరీఫ్‌లో రైతులు పండించిన ప్రతి గింజను కొంటామని ఏడీఏ స్వాతి తెలిపారు. బుధవారం పిఠాపురం మండలంలో పలు గ్రామాల్లో రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాల గురించి అవగాహన కల్పించారు. పిఠాపురంలో 23, కొత్తపల్లిలో 13, గొల్లప్రోలులో 08 మొత్తం 44 కేంద్రాలు ఆర్ఎస్‌కేల్లో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కొనుగోళ్లకు టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, సహాయకులను నియమించామన్నారు. సాధారణ రకం 75 కేజీలు 1,777, ఏ గ్రేడ్ రూ.1,792 ధర నిర్ణయించినట్లు చెప్పారు. ఏవో గంగాధర్ పాల్గొన్నారు.

గురిపెట్టి కొట్టారు

ఆట ఏదైనా.. విజయమే లక్ష్యం

• రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో పిఠాపురం ఛాంపియన్స్ పతకాలు కైవసం

ఆర్చరీ, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, రగ్బీ ఇలా ఆటేదైనా విజేతలుగా వీరే నిలుస్తున్నారు. కృషి, పట్టుదలతో పిఠాపురం క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. జాతీయస్థాయిలో కూడా రాణిస్తూ పతకాలు కైవసం చేసుకుంటున్నారు. సరైన క్రీడా సదుపాయాలు లేకున్నా అవకాశాలు అందిపుచ్చుకుని విజయ శిఖరాలను చేరుకుంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పిఠాపురంలోని పాఠశాలలు, కళాశాలల్లోని మైదానాల్లో సదుపాయాలు మెరుగుపరిస్తే అంతర్జాతీయ స్థాయిలోనూ రాణిస్తామని చెబుతున్నారు. తల్లిదండ్రులు, కోచ్‌ల సహకారంతో క్రీడల్లో గుర్తింపు కోసం పాటుపడుతూ, భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్నారు. - న్యూస్‌టుడే, పిఠాపురం

అక్టోబరు 26న పిఠాపురంలో ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఆర్చరీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీలకు ఉమ్మడి తూర్పు గోదావరి నుంచి ఇండియన్ రౌండ్ పోటీల్లో తలపడేందుకు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, పురుషుల విభాగంలో పోటీలు నిర్వహించారు. ఇందులో పిఠాపురం ఆర్చర్లే మొదటి స్థానంలో నిలిచి ఛాంపియన్‌గా నిలిచారు. వివిధ వయసుల విభాగాల్లో 12 మంది తలపడి, విజేతలుగా నిలిచారు. దాంతో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. కోచ్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిరంతరం ప్రదీప్‌కుమార్ స్థానిక ఆర్‌ఆర్‌బీహెచ్ ఆర్ కళాశాలలో శిక్షణ తీసుకుంటుంటారు.

బాక్సింగ్ పోటీల్లో ఛాంపియన్స్‌గా నిలిచిన క్రీడాకారులు

బలంగా ఎదుర్కొంటూ మొదటిస్థానంలో..

పిఠాపురంలో ఈ నెల 9న జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలు జరిగాయి. ప్రత్యర్థిని బలంగా ఎదుర్కొంటూ బాల, బాలికలు పోటీపడ్డారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి 300 మంది హాజరయ్యారు. వివిధ వయసుల వారీగా పోటీలు నిర్వహించారు. ఇందులో కూడా పిఠాపురం బాక్సర్లే మొదటి స్థానంలో నిలిచి ఓవరాల్ ఛాంపియన్స్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. వీరికి బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్ర బహుమతులు ప్రదానం చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పిఠాపురంలోని చెందిన క్రీడాకారులు పిఠాపురం ఆర్ ఆర్‌బీహెచ్‌ఆర్ కళాశాలలో శిక్షణ తీసుకుంటున్నారు.

ఆర్చరీ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిన పిఠాపురం క్రీడాకారులు

స్త్రీలు ఎందులో తక్కువకాదని..

రామచంద్రపురంలో అక్టోబరు 31 నుంచి నవంబరు 2వరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్త్రీ, పురుషుల బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఇందులో పిఠాపురం మహిళా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఇక్కడి కోచ్ బొజ్జా మాణిక్యాలరావు ఆధ్వర్యంలో స్థానిక ఓటీఎస్ బాస్కెట్‌బాల్ క్రీడా మైదానంలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళలతోపాటు, సెలవుల్లో ప్రత్యేక క్యాంపు నిర్వహించి ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఇలాంటి అవకాశాలు సద్వినియోగం చేసుకుని స్త్రీలు బాస్కెట్‌బాల్ ఛాంపియన్స్‌గా నిలుస్తున్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన

సర్పవరం: రమణయ్యపేట ఏపీఎస్పీ జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బుధవారం పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన సమావేశం నిర్వహించారు. 43లక్ష్యాల్లో పబ్లిక్ పరీక్షలు ఉన్నందున విద్యార్థుల నడవడిక, సమయపాలన పరిశీలించాలన్నారు.

స్త్రీనిధి రుణాలతో ఆర్థికాభివృద్ధి

తాళ్లరేవు: బ్యాంకుల ద్వారా తీసుకుంటున్న స్త్రీనిధి రుణాలతో ఆర్థికాభివృద్ధికి బాటలు వేసుకుని తిరిగి చెల్లించాలని ఏపీఎం తైలేంద్ర అన్నారు. తాళ్లరేవు డీఆర్‌డీఏ కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం జట్టి దనలక్ష్మి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సమీక్షించారు. స్త్రీనిధి రుణాలు, ప్రకృతి వ్యవసాయంపై చర్చించారు.

ప్రాంగణ ఎంపికల్లో 9మందికి ఉద్యోగాలు

గొల్లప్రోలు: చేబ్రోలు ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు బుధవారం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన సూర్య టెక్ సొల్యూషన్స్ ప్రతినిధులు ఇంజినీరింగ్ విద్యార్థులకు రాతపరీక్ష, ముఖాముఖి నిర్వహించారు. 9 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల టీపీవో టి.ప్రేమ్‌బాస్కో తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ సూర్య అనూహ్య, సెక్రటరీ, డైరెక్టర్ అభిలేష్, ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసరావు అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవోలు త్యాజాబు, నారాయణరావు

జాతీయస్థాయిలోనూ సత్తా చాటాలి

పిఠాపురం: రాష్ట్రస్థాయి ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు జాతీయస్థాయిలోనూ సత్తా చాటాలని కాకినాడ డీఎంఈవో సత్యనారాయణ సూచించారు. బుధవారం పిఠాపురం బీసీడబ్ల్యూ బాలికోన్నత పాఠశాల ఫుట్‌బాల్ చదువుతున్న బూర వెన్నెల, మండపల్లి తేజస్విని, గుత్తుల మహాలక్ష్మి స్కాట్స్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో వారిని అభినందించారు. ఢిల్లీ, మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు వీరు రాష్ట్రజట్టు తరఫున వెళ్తున్నారని చెప్పారు. ఆర్డీవో కూడా విజయం సాధించేలా తర్ఫీదు ఇవ్వాలని పీఈటీలు మంగాయమ్మ, శేషుకుమారి, సత్యప్రియలకు తెలిపారు.

నిర్ణయించిన మేరకు ఉపాధి పనులు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: నిర్ణయించిన లక్ష్యం మేరకు ఉపాధి హామీ పథకం పనులు జరిగేలా ముందస్తుగా ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీవో సలాట్ రాజు ఆదేశించారు. గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పథకం అధికారులు, సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. గ్రామాలవారీగా ఉపాధి పథకం కూలీలకు సంబంధించి సర్వే నిర్వహణపై సమీక్షించి త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. డిప్యూటీ ఎంపీడీవో కుమార్, ఏపీవో గంగాభవాని, సిబ్బంది, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే లక్ష్యం నిర్దేశించుకోవాలి

కరప, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని వాటి సాధనకు కృషిచేయాలని లేకుంటే కృషి చేయాలని విజయవాడ ఆదిసవిల్ డీఎస్పీ ఉడతా బంగార్రాజు సూచించారు. కరప జడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్2 విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రూ.60వేల విలువ కలిగిన పది సైకిళ్లను ఆయన తల్లి ఉడతా అచ్చియమ్మ జ్ఞాపకార్థం బుధవారం పాఠశాలకు అందజేశారు. విద్యతోనే ఉజ్వల భవిత చేకూరుతుందన్నారు. పొలిశెట్టి నారాయ్య పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలందరికీ సొంత గృహాలు సమకూరేలా చర్యలు

గొల్లప్రోలు: పేదలందరికీ సొంత గృహాలు సమకూరేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ అన్నారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో గృహనిర్మాణ పథకంలో నిర్మించిన నాలుగు గృహాలను ఎంపీ బుధవారం సామూహిక గృహప్రవేశాలు ప్రారంభించారు. అనంతరం గృహ లబ్ధిదారులతో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. గృహనిర్మాణానికి రూ.1.80 లక్షలు చొప్పున ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తున్నట్లు గృహనిర్మాణ సంస్థ డీఈఈ శ్రీనివాస్ తెలిపారు. డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, రాష్ట్ర పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ జయకృష్ణ, పంపన సూర్యచంద్రరావు, జ్యోతుల శ్రీనివాస్, గంగా ఈశ్వరుడు, ఎంపీడీవో సలాట్ రాజు, తహసీల్దార్ రామకుమార్, ఏఈ రాజేశ్వరి పాల్గొన్నారు.

కరపలో సూచనలు చేస్తున్న జేడీఏ విజయ్‌కుమార్

దుర్గాడలో మాట్లాడుతున్న ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

కరప: రబీలో రైతులకు ఎరువుల సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని జేడీఏ విజయ్‌కుమార్ సూచించారు. కరప మండలంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణ డీలర్లతో సమావేశం నిర్వహించి రబీ సీజన్ కార్యచరణ పట్ల సూచనలు చేశారు. రబీ పంటకు అన్ని ఎరువుల దుకాణాలలో, పీఏసీఎస్‌లు, రైతు సేవా కేంద్రాల్లో యూరియా, డీఏపీ తదితర ఎరువులు గ్రామ అవసరాలను మేరకు డీలర్లు నిల్వలు ముందుగానే ఉంచుకోవాలన్నారు. ఏడీఏ బాబూరావు, ఏవో సత్య, ఏఈవో సతీష్ పాల్గొన్నారు.

నిర్వహణ కొరవడి.. మూతపడి

- న్యూస్‌టుడే, తాళ్లరేవు

మహిళలను వ్యాపారులుగా మార్చేందుకు, వారి ఆర్థికాభివృద్ధే లక్ష్యమని చెబుతూ వైకాపా ప్రభుత్వ పాలనలో కోరింగలో మహిళా మార్ట్‌ను ప్రారంభించారు. వేల స్వయం సహాయక సంఘాల నుంచి సొమ్ము వసూలు చేసి పెట్టుబడి పెట్టారు. వ్యాపారంలో వచ్చిన లాభాన్ని గ్రూపులకు పంచుతామని హామీ ఇచ్చారు. తర్వాత నిర్వహణ విషయంలో చేతులు ఎత్తేయడంతో మూతపడింది. అది నుంచి ఈ మార్ట్‌పై సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఆర్థిక కష్టాల్లో కురుకుపోయింది. కొన్ని నెలలుగా నిర్వహించిన వ్యాపార లావాదేవీలకు లెక్కలు తేలలేదు. ఈ మార్ట్ తెరవాలంటే ఆ లెక్కలు తేలాల్సి ఉంది. డీఆర్‌డీఏ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మార్ట్ మూసివేశారు. మండలంలో 2,100 గ్రూపుల నుంచి తీసుకున్న సొమ్మును చెల్లించాలని పలువురు మహిళలు కోరుతున్నారు.

కోరింగలో తెరుచుకోని వెలుగు మహిళా మార్ట్

రహదారిలో స్తంభంతో ఇక్కట్లు

పెద్దాపురం కబడ్డీవీధిలో తొలగించిన సిమెంటు విద్యుత్తు స్తంభాన్ని రహదారి పక్కన వేశారు. వాహనదారులు ఏ మాత్రం ద్విచక్రవాహనదారులు పక్కకు వెళితే ప్రమాదం జరుగుతుంది. విద్యుత్తుశాఖాధికారులు తొలగించడానికి చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతప్రజలు కోరుతున్నారు. విద్యుత్తుశాఖ ఏఈ సుబ్బారావు అడగగా తొలగించమని సిబ్బందిని ఆదేశిస్తానన్నారు. - న్యూస్‌టుడే, పెద్దాపురం

పశువులతో ప్రమాదాలు

కరప మండలం పెనుగుదురు-నడకుదురు ప్రధాన రహదారిలో రాత్రి సమయంలో పశువులు రోడ్డుపై నిద్రిస్తుండటంతో వాటిని గమనించని వాహనచోదకులు ప్రమాదాల బారిన పడాల్సి వస్తోంది. ఎంపీడీవో శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా వాటి యజమానులతో మాట్లాడి రోడ్లపై వదిలిపెట్టకుండా చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, కరప

వాహనాలు కనిపించక ఇక్కట్లు

గొల్లప్రోలు ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్టాండు సమీపంలో మలుపు దగ్గర వాహనాలు నిలుపుతుండడంతో ఎదురుగా వచ్చేవి కనిపించక వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితులతో ప్రమాదాలు జరిగే అవకాశం నెలకొంది. ప్రధాన రహదారిపై మలుపులో వాహనాలు నిలపకుండా చర్యలు చేపడతామని ఎస్సై రామకృష్ణ తెలిపారు. - న్యూస్‌టుడే, గొల్లప్రోలు

అయిదేళ్లుగా.. అసంపూర్తిగా

పిఠాపురం మండలం భోగాపురంలో సచివాలయ భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. భవన నిర్మాణం పూర్తి చేయాలని పలుమార్లు గ్రామ పెద్దలు సైతం అధికారులను కోరారు. గ్రామ శివారులో ఉన్న ఈ భవనంలో ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఏఈ నూకరాజుకు పనులు త్వరలోనే పూర్తి చేసి, అందుబాటులోకి తెస్తామన్నారు. - న్యూస్‌టుడే, పిఠాపురం

కలుపు మొక్కల తొలగింపు

సర్పవరం: తిమ్మాపురం పంచాయతీ అవంతి, మారుతీ నగర్ కాలనీల్లో రహదారి పక్కన కలుపు మొక్కలు పెరిగిపోయి విషకీటకాలు వల్ల రాత్రి సమయాల్లో ఇబ్బందులు పడుతున్నారని స్థానికుడు రామారావు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి.. మొక్కలు తొలగించే చర్యలు తీసుకున్నారు.



సంస్మరణ

(13-11-2025)

ఈ జన్మలో మరువలేని మహనీయుడు, మా ఉన్నతికి కారకులైన

శ్రీ॥శ్రీ॥ కె.వి.ఆర్.చౌదరి గారి

24వ వర్ధంతిని నిత్యం స్మరించుకుంటూ...

బొడ్డు బాపిరాజు

శ్రీ కనకమహాలక్ష్మి టెంట్‌హౌస్

క్లాత్ వర్క్స్ & లైటింగ్

గంగరాజునగర్, రోడ్ నెం-3, కాకినాడ

ఫోన్: 94406 88419, 79015 28899

ప్రకటన

నా క్లయింటు అనగా లంక యూసఫ్ (లేటు) గారి భార్య లంక మేరికుమారి డో.నెం.1-72, అంబేద్కర్‌నగర్, S.అచ్యుతాపురం, కాకినాడ రూరల్ మండలం వాస్తవ్యురాలు నాకిచ్చిన సంజాయిషీపై జనం యావన్మందికీ తెలియజేయునది.

నా క్లయింటు పెదబ్రహ్మదేవం గ్రామంలోని డో.నెం.1-75, గణపతిపేట, సామర్లకోట మండలం వాస్తవ్యులు అయిన ఆకుల కన్నయ్య గారి కుమారుడు ఆకుల పనసరాముడు అనే పనసరాముడు అను వారివద్ద నుండి ఈ క్రింది షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిని కొనుగోలుచేయుట ప్రయత్నంలో ఉన్నారు.

కాగా, సదరు క్రయదారు తన దస్తావేజులలోని లింకు ఒరిజినల్ దస్తావేజులు 1753/2008 SRO Samalkota మరియు దస్తావేజు నెం.1754/2008 కాగల రెండు క్రయ ఒరిజినల్ దస్తావేజులు మానుపూడి సూకరాజు గారి పేరిట కలవని సదరు రెండు క్రయ ఒరిజినల్ దస్తావేజులు నా క్లయింటు క్రయదారు తన గ్రామమైన పెదబ్రహ్మదేవం నుండి సామర్లకోట టౌన్‌కు కార్యార్థియై షెడ్యూల్ దాఖలా స్థిరాస్తికి సంబంధించిన దస్తావేజులతో తన బండిపై Samalkota Town కు వచ్చి కాపీలు తీయించుకొని తిరిగి 10-11-2025న సాయంత్రం తన గ్రామమునకు ఇంటికి వెళ్ళి చూసుకొనగా తన బండికి తగిలించిన సంచి తెగి దస్తావేజులు జారుచుండుట గమనించి తనిఖీ చేసుకొనగా తన పేరిట గల ఒరిజినల్ దస్తావేజు నెం.7488/2025 ఒక్కటిమిగిలి ఉండి మిగిలిన ఒరిజినల్ దస్తావేజులు పోయినవని తెలుసుకొని తిరిగి వచ్చిన దారినే వెనువెంటనే దారి మార్గములో వెతుకుతూ మరియు విచారణ చేస్తూ వెళ్ళగా సదరు దస్తావేజులు లభ్యం కాలేదు. సదరు దస్తావేజులు విశదపరిచిన దస్తావేజు నెం's.1753,1754/2008 పోయినవని తెలుసుకొని ఈ ప్రకటన గావించుచున్నారు.

కావున సదరు ఒరిజినల్ దస్తావేజు నెంబర్లు ఎవరికైనా దొరికినా లేక లభ్యమైన యెడల నాకుగాని,నా క్లయింటుకు గాని తెలియపరచవలసినదిగా ఇందుమూలముగా తెలియచేయడమైనది. దొరికిన వారు ఎవరైనా సదరు దస్తావేజులు ఇచ్చిన యెడల నాకుగాని నా క్లయింటుకు గాని తెలియపరిచిన యెడల నా క్లయింటు క్రయదారు సదరు దస్తావేజులు పొంది తగిన పారితోషకము బహుమతిగా ఇవ్వగలరని ఆ సందర్భంలో షెడ్యూల్ దాఖలా ఆస్థి నా క్లయింటు కొనుగోలు చేయటంలో సహాకరించవలసినదిగా కోరడమైనది.

షెడ్యూలు: పూర్వం తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, సామర్లకోట మండలం, శ్రీ సామర్లకోట సబురిజిస్ట్రారు వారి ఏరియాలోని గ.మేడపాడు గ్రామ పంచాయితీ ఏరియాలోని గ.మేడపాడు గ్రామం తాలూకు 1వ వార్డు, రామాలయం వీధి, (గాంధీ గ్రామ్) రి.సర్వే నెం.167/1రు పూరా య.6-28ట్లులో చ.గ.242లు లేక చ.మీ.202.23ర్లు నివేశన స్థలము, అందలి అసెస్మెంట్ నెం.158రు, డోరు.నెం.1-156రు (2024-25) గల ఆర్.సి.సి.మేడభవంతి వగైరాలకు కొలతలు, హద్దులు, వివరం. (ఇదివరలో సమీప డోర్.నెం.1-155రుకు పడమర వైపున వున్నటువంటిన్నీ ప్రస్తుతము డోరు నెంబరు 1-156రుగా కలిగిన యిల్లు)

తూర్పు: అ.66-00లు మాలెళ్లపూడి సూర్యనారాయణ మహేశ్వర శర్మ గారి స్థలం.
పడమర: అ.66-06లు రజకుల స్థలం. ప్రస్తుతం పంచాయితీ వారి సి.సి.రోడ్డు.
ఉత్తరం: అ.33-00లు సర్కారు వారి పుంత. **దక్షిణం:** అ.33-00లు రాజవీధి.

సదరు హద్దుల మధ్యస్తమైన చ.గ.242లు నివేశన స్థలం, యిందలి డోరు నెం.1-156రు గల ఆర్.సి.సి.మేడభవంతి వగైరాలున్నూ, పై కప్పు తలుపులు, ద్వారబంధములు, నెం.636రు మరియు 2480ర్లు గల కరెంటు మీటరు సర్వీసు వగైరాలున్నూ సమస్త నీటి, దారి, రానుపోను రివాజు దారిమార్గములు వగైరా సమస్త యీజిమెంటు హక్కులతో సహా.

భమిడిపాటి వెంకటరామశర్మ, న్యాయవాది
#25-4-50/1, కొమ్మిరెడ్డివారి వీధి, కాకినాడ.
సెల్: 92465 89838, 98492 89838

'వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేస్తున్నారు'

సర్పవరం: రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటు పరం చేస్తుందని.. దీంతో పేదలకు ఉచిత వైద్యం అందదని మాజీ మంత్రి కురసాల కన్నబాబు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం కాకినాడ గ్రామీణం నాగమల్లితోట కూడలి నుంచి సర్పవరం జంక్షన్ వరకు వైకాపా నాయకులు, కార్యకర్తలతో పాదయాత్ర నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. **పిఠాపురం:** పిఠాపురం రాజుగారి కోటలోని వైకాపా కార్యాలయం నుంచి కోటగుమ్మం సెంటర్ మీదుగా, స్టేట్ బ్యాంకు, ఉప్పాడ సెంటర్ మీదుగా పాడా కార్యాలయం వరకు వైకాపా ఇన్‌ఛార్జి వంగా గీత నాయకులతో కలిసి ర్యాలీ చేశారు. నాయకులు వర్దీనీడి సుజాత, రావుల మాధవరావు, అడపా రఘు, కొప్పున శివ పాల్గొన్నారు. **పెద్దాపురం:** పెద్దాపురం పట్టణంలో నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు, పురపాలిక ఛైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, ఉపాధ్యక్షుడు నెక్కంటి సాయిప్రసాద్ మరిడమ్మ ఆలయం నుంచి ప్రదర్శనగా బయలుదేరి ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కార్యాలయ డీటీ భానుమూర్తికి వినతి పత్రం అందజేశారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పెద్దాపురం: పెద్దాపురం పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 20 వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శాఖ గ్రంథాలయం అధికారి పాలంకి నాగరాజు తెలిపారు. ప్రతిరోజూ వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

రోడ్డు పనులను అడ్డుకుని ఆందోళన

గొల్లప్రోలు: గొల్లప్రోలు కరణంగారితోట వీధిలో రూ.6.20 లక్షలతో సిమెంటు రోడ్డు, కాంక్రీటు డ్రెయిను నిర్మించేందుకు పొక్లెయిన్‌తో చదునుచేసే పనులు బుధవారం చేపట్టగా స్థానికులు అడ్డుకున్నారు. నగర పంచాయతీ ఇన్‌ఛార్జి కమిషనర్ అలీషా, టీపీవో నీలిమాదీప్తి, ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య పర్యవేక్షకుడు రఘుప్రసాద్ సిబ్బందితో అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నవారితో మాట్లాడారు. ప్రైవేటు పాఠశాల కోసం రోడ్డు, డ్రెయిను నిర్మిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. ఇక్కడి కుటుంబాలకు ఈరోడ్డు వల్ల ఉపయోగం లేదన్నారు. దీంతో పనులు నిలిపివేసి అధికారులు, సిబ్బంది వెనుదిరిగారు.

పనసపాడులో ఎన్ఎస్ఎస్ శిబిరం

సామర్లకోట గ్రామీణం: పనసపాడులో కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం యూనిట్ 2 కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. 5వ రోజు కార్యక్రమంలో భాగంగా వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థుల్లో సేవాభావం అలవడుతుందని సర్పంచి చీకట్ల వెంకటేష్ తెలిపారు. ప్రిన్సిపల్ కరుణ, అకడమిక్ డైరెక్టర్ నాయుడు, పీడీవో ముసలయ్య పాల్గొన్నారు.

సమాజ సేవతోనే గుర్తింపు

కాజులూరు: సమాజానికి చేసే సేవలతోనే నిజమైన గుర్తింపు లభిస్తుందని వాసంశెట్టి సత్యం అన్నారు. బుధవారం కాజులూరులో జనసేన నాయకుడు, ప్రవాస భారతీయుడు అన్యం శ్రీరామచంద్రమూర్తి పుట్టినరోజు వేడుకల్లో ఆయన మాట్లాడారు. అనంతరం వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లు, విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, మిఠాయిలు పంపిణీ చేశారు.

200 కేజీల ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం

పెద్దాపురం: పెద్దాపురం పట్టణంలో బుధవారం దుకాణాలపై అధికారులు దాడులు నిర్వహించి 200 కేజీల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ కవర్లు విక్రయిస్తున్న వర్తకుల నుంచి రూ.18,500 అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. ఈ దాడుల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణరావు, దుర్గాప్రసాద్, వరప్రసాద్, జయరాం, దాదాజీ, హైమా, ప్రత్యూష, భవానీ పాల్గొన్నారు.

వ్యాపారులకు రుణ సదుపాయం

పిఠాపురం: వ్యాపారాలు చేయాలనుకునే వారికి బ్యాంకులు రుణ సదుపాయం కల్పించాలని మెప్మా సీఎంఎం వెంకటలక్ష్మి కోరారు. పిఠాపురం మెప్మా కార్యాలయంలో వివిధ బ్యాంకుల మేనేజర్లతో స్వానిధి సంకల్పలభియాన్ 2.0 గురించి చర్చించారు. ప్రతి కుటుంబం నుంచి వ్యాపారవేత్తలుగా మారాలంటే బ్యాంకుల సహకారం కావాలని పేర్కొన్నారు. స్టేట్‌బ్యాంకు, కెనరా, డీసీసీబీ, సెంట్రల్, బ్యాంకు ఆఫ్ బరోడా అధికారులు పాల్గొన్నారు.

బస్సుల సంఖ్య పెంచాలంటూ వినతి

పెద్దాపురం: పెద్దాపురం పట్టణానికి వస్తున్న ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలని కోరుతూ బుధవారం పెద్దాపురం ఆర్డీవో కార్యాలయం డీటీ భానుమూర్తికి సీపీఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు, ఎస్.శ్రీనివాస్, జి.పెంటయ్య, హనుమంతు, కూనిరెడ్డి అప్పన్న, రొంగల సుబ్బలక్ష్మి, వీర్రాజు పాల్గొన్నారు.

పులిమేరులో అమరవీరుల సంస్మరణ సభ

పెద్దాపురం: పులిమేరు గ్రామంలో బుధవారం పుల్లారెడ్డి 41వ వర్ధంతి సందర్భంగా అమరవీరుల సంస్మరణ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు పాల్గొని ప్రసంగించారు. అంతకుముందు ప్రదర్శన నిర్వహించారు. నాయకులు కె.సతీష్, గుడాల నారాయణరావు, బి.నాగేశ్వరరావు, భూషణం, శివాజీ, తుంగపల్లి సూజం, దాకే మరిడమ్మ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325
పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

సమస్య: పండూరు గ్రామ ఎస్సీ కాలనీ మురుగుకాలువలో పూడిక తీయడం లేదు. - రామనాథం

పరిష్కారం: సమస్యను కార్యదర్శి రామ్మోహన్‌చౌదరి దృష్టికి తీసుకువెళ్లగా శుభ్రం చేయించారు.

- న్యూస్‌టుడే, సర్పవరం

సమస్య: కరపమండలం వేళంగిలో కూరాడ కల్వర్టు వద్ద చెత్త, వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. - శ్రీనివాస్

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి పి.వీరభద్రరావు దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందితో వ్యర్థాలను తొలగించారు.

- న్యూస్‌టుడే, కరప

సమస్య: స్థానిక శివాలయంవీధిలో మురుగు కాలువ శుభ్రం చేయక దుర్వాసన వస్తోంది. చర్యలు తీసుకోవాలి. - శ్రీనివాసరావు

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ఆదినారాయణకు తెలపగా కాలువను శుభ్రం చేయించారు.

- న్యూస్‌టుడే, పెద్దాపురం

సమస్య: గొల్లప్రోలు దేవీనగర్‌లో వ్యర్థాలతో కాలువ మూసుకుపోయి మురుగునీరు ప్రవహించక దుర్వాసన వస్తోంది. - స్థానికులు

పరిష్కారం: ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్ సిబ్బందితో వ్యర్థాలు తొలగింపజేశారు.

- న్యూస్‌టుడే, గొల్లప్రోలు

సమస్య: కొత్తపల్లి గ్రామం కాపుల వీధిలో మురుగు కాలువ పూడికతో నిండిపోయి దుర్వాసన వస్తుంది. - స్థానికులు

పరిష్కారం: కార్యదర్శి సత్యనారాయణ సిబ్బందిని పంపి పూడిక తీయించారు.

- న్యూస్‌టుడే, కొత్తపల్లి

ఉద్యానం.. అధ్వానం..

పెద్దాపురంలో చంద్రబాబు శతాబ్ది పార్కుకు నిర్వహణ కరవు

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం నుంచి జగ్గంపేట వెళ్లే రహదారి సత్తెమ్మతల్లి గుడి పక్కన చంద్రబాబు శతాబ్దిపార్కు నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో పిచ్చి మొక్కలు, గడ్డిపెరిగిపోయి అధ్వానంగా తయారైంది. 2015లో తెదేపా హయాంలో ఈపార్కును సుమారు రూ.2 కోట్ల వ్యయంతో సుందరంగా తీర్చిదిద్దారు. ఈ ఉద్యానానికి అప్పట్లో తెదేపా హయాంలో రెండుసార్లు ఉత్తమ అవార్డులు వచ్చాయి. కరోనా తర్వాత పార్కును మూసేయడం, గత వైకాపా పాలనలో పట్టించుకోకపోవడంతో కళావిహీనంగా తయారైంది. ప్రస్తుతం పార్కు నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు వ్యక్తికి అప్పగించారు. దీనిపై పెద్దగా ఆదాయం రాకపోవడంతో గుత్తేదారుడు పట్టించుకోలేదు. గుబురుగా గడ్డి పెరిగిపోవడంతో విషసర్పాలు స్వైరవిహారం చేస్తున్నాయని సందర్శనకై వచ్చే ప్రజలు తెలిపారు. సెలవులు, పండుగ రోజుల్లో సందర్శకులు, వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులను పాఠశాలల యాజమాన్యం తీసుకువస్తారు. పురపాలిక అధికారులు పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పార్కులో గుబురుగా పెరిగిన గడ్డి

ప్రతిరోజూ నడుస్తాను..

ఉద్యానంలో వాతావరణం బాగుండటంతో ప్రతిరోజూ కట్టమూరు నుంచి వచ్చి ఇక్కడ నడక చేస్తాను. నడక ప్రాంతంలో పిచ్చి మొక్కలు గుబురుగా పెరిగిపోవడంతో వీలు ఉండడంలేదు. నడుస్తున్నప్పుడు విషపురుగులు తారసపడుతున్నాయి. దీపాలు సరిగ్గా వెలగడంలేదు.

- బిక్కిన విశ్వేశ్వరరావు, భాజపా జిల్లా అధ్యక్షుడు

శుభ్రం చేస్తాం..

పార్కులో పిచ్చి మొక్కలు, గుబురుగా పెరిగిపోయిన గడ్డిని శుభ్రం చేయడానికి చర్యలు తీసుకుంటాం. దీపాలు వెలిగేలా సిబ్బందిని ఆదేశిస్తాను. -కె.శ్రీకాంత్‌రెడ్డి, కమిషనర్, పెద్దాపురం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పంచాయతీరాజ్ శాఖ

సంక్షిప్త టెండర్ నోటీస్ నెం.55/2025 **తేది: 13-11-2025**

ఎంజీఎన్ఆర్ఈజీఎస్ (MGNREGS) కార్యక్రమం క్రింద కాకినాడ రూరల్ మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలలో చేపట్టవలసిన పనుల కొరకు పదార్థాలు/నైపుణ్యం కలిగిన మరియు అర్ధ నైపుణ్యం కలిగిన కార్మికులు/యంత్రాలు సరఫరా చేయుటకు మూసివేసిన టెండర్లు ఆహ్వానించబడుతున్నాయి.

టెండర్ షెడ్యూల్స్ అమ్మే తేదీలు: 20-11-2025 నుండి 27-11-2025 వరకు సాయంత్రం 05.00 గంటల వరకు ఎంపీడీవో కార్యాలయము, కాకినాడ రూరల్ మండలంలో.

టెండర్ షెడ్యూల్స్ స్వీకరణకు చివరి తేది : 28-11-2025 మధ్యాహ్నం 03.00 గంటల వరకు

బిడ్ సమర్పణకు చివరి తేది	: 28-11-2025 మధ్యాహ్నం 03.00 గంటలకు
టెండర్లు తెరవడం	: 28-11-2025 సాయంత్రం 04.00 గంటలకు
టెండర్ షెడ్యూల్ ధర	: రూ. 2,000/-

టెండర్ ఆమోదించే అధికారి ఏదైనా టెండర్ లేదా అన్ని టెండర్లను అంగీకరించే లేదా తిరస్కరించే హక్కును కలిగి ఉంటారు. అలాగే పనులు ఇవ్వక ముందే ఎప్పుడైనా టెండర్ ప్రక్రియను రద్దుచేసే అధికారం అయనకు ఉంది. ఈ చర్య వల్ల ప్రభావిత బిడ్డర్ లేదా బిడ్డర్లపై ఎటువంటి బాధ్యత లేదా వారికి ఆ నిర్ణయానికి గల కారణాలు తెలియజేయాల్సిన బాధ్యత టెండర్ ఆమోదించే అధికారికి ఉండదు.

సం/- **పి.సతీష్,** మండల పరిషత్ అభివృద్ధి అధికారి
మండల ప్రజా పరిషత్, కాకినాడ రూరల్ (మం)

(c) eenadu

తుని

•తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

సంతోషంగా సొంతింటిలోకి..!

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: సొంతింటి కల నెరవేరిన సంతోషం లబ్ధిదారుల్లో తొణికిసలాడింది. పేదల ఇళ్ల గృహప్రవేశాలు నియోజకవర్గం అంతటా ఘనంగా జరిగాయి. ప్రత్తిపాడులో ఎమ్మెల్యే సత్యప్రభ ఇంటిని ప్రారంభించారు. కూటమి నాయకులు కొమ్ముల కన్నబాబు, మేడిశెట్టి సూర్యకిరణ్, తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబులతో కలిసి లబ్ధిదారులకు ఇంటి పత్రాలు, తాళాలు అందజేశారు.

ఇన్‌ఛార్జి డీసీహెచ్‌గా మహేష్

తుని పట్టణం: తుని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి సివిల్ సర్జన్ ఆర్థో వైద్యుడు కె.మహేశ్వరరావు కాకినాడ జిల్లా ఇన్‌ఛార్జి డీసీహెచ్‌గా నియమితులయ్యారు. తుని సూపరింటెండెంట్‌గా సివిల్ సర్జన్ గైనకాలజీ వైద్యురాలు ఎస్.అన్నపూర్ణ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

న్యూస్‌టుడే, తుని గ్రామీణం

నిర్వాసితుల కాలనీ.. నిధుల వెల్లువ

• మౌలిక వసతులకు రూ.కోట్లు మంజూరు

పోలవరం కాలువ నిర్మాణంలో భాగంగా తొలగించిన కుమ్మరిలోవ కాలనీవాసుల కోసం ఏర్పాటు చేసిన నిర్వాసిత కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో ఆయా కాలనీల్లో పనులు చేపట్టేందుకు గుత్తేదారులు ముందుకు రావడంతో ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. 25 ఏళ్లుగా కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో అడుగులు వేస్తుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కుమ్మరిలోవ: పోలవరం నిర్వాసిత కాలనీల్లో ముమ్మరంగా పనులు

ముమ్మరంగా నిర్మాణాలు

కుమ్మరిలోవ కాలనీవాసులకు నష్టపరిహారంతో పాటు సమీపంలోని దుద్దుగలోవలో 472 మంది లబ్ధిదారులకు, చేపూరు హైవే పక్కన 173 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ లేఅవుట్ వేశారు. కాలువ పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో ఇళ్లను ఖాళీ చేయించారు. దీంతో వారికి కేటాయించిన స్థలాల్లో నిర్మాణ పనులు చేపట్టేందుకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. దీంతో కుమ్మరిలోవ కాలనీకి రూ.22.22 కోట్లు, చేపూరు కాలనీకి రూ.16.40 కోట్లు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో కాలనీల్లో సీసీ రోడ్లు, కాలువలు, అంగన్‌వాడీ, పాఠశాల భవనాలతోపాటు తాగునీరు, విద్యుత్తు తదితర మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు ర.భ.శాఖ డీఈ ప్రకాశరావు తెలిపారు. ఈ పనుల నిమిత్తం ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ ముగిసింది. పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

ప్రకృతితో మమేకమైతేనే శాంతి

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రత్తిపాడు శాఖ ఆధ్వర్యంలో మండలంలోని లంపకలోవ సమీప తోటలో వనసమారాధన బుధవారం వేడుకగా జరిగింది. బ్రహ్మకుమారీల జిల్లా ఇన్‌ఛార్జి రజని దీదీ నేతృత్వంలో శివలింగానికి పూజ, ధ్యానం, రాజయోగ తరగతులు జరిగాయి. ప్రకృతితో అణువణువూ సదాశివుని భావనతోనే ఉంటుందని ఆమె అన్నారు. ఎమ్మెల్యే సత్యప్రభ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బ్రహ్మకుమారీలు తులసి, లక్ష్మి, సుధ, సీత, అంజని తదితరులు పాల్గొన్నారు.

సమారాధనలో బ్రహ్మకుమారీల ప్రవచనం

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

జగ్గంపేట గ్రామీణం: పేద ప్రజలను కూటమి ప్రభుత్వం అన్నివిధాల ఆదుకుంటుందని తెదేపా కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. రావులమ్మనగర్ కాలనీలో క్యాంపు కార్యాలయంలో అర్హులైన నియోజకవర్గంలో 20మంది లబ్ధిదారులకు రూ.20.56 లక్షల విలువైన చెక్కులను బుధవారం నవీన్ అందజేశారు. నాయకులు అప్పలరాజు, జీను మణిబాబు, కొండబాబు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అవీ ఇవీ అన్నీ

చెత్త సేకరణ పరిశీలన

గండేపల్లి, న్యూస్‌టుడే: ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా జరగాలని, గ్రామంలో తడిపొడి చెత్తలను వేరుచేసి ఇవ్వాలని జిల్లా డిప్యూటీ సీఈవో రామ్‌గోపాల్ అన్నారు. గండేపల్లిలో బుధవారం చెత్త సేకరణ, సంపద కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. కాకినాడ, అంజు కంటి వైద్యశాల వారు పరీక్షలు చేసి మందులు అందజేశారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

రౌతులపూడి: ఉద్యానశాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానశాఖాధికారి వీర సిరిల్ అన్నారు. శృంగవరంలో మామిడి, జీడిమామిడిలో సమగ్ర సస్య రక్షణకు సంబంధించి నిర్వహించిన రైతు శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జీడిమామిడి ప్రాసెసింగ్ యూనిట్లకు 35 శాతం రాయితీ ఉందన్నారు.

కిర్లంపూడి: చిరు ధాన్యాలు సాగుచేయడం వల్ల రైతులకు అధికలాభాలు ఉంటాయని పెద్దాపురం ఏడీఏ మాలకొండయ్య తెలిపారు. జగపతినగరంలో మండల వ్యవసాయాధికారిణి సుధామాధురి ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు.

స్వదేశీ వస్తువులనే వాడదాం

తుని పట్టణం: 'ఇంటింటా స్వదేశీ...' నినాదంతో భాజపా నాయకులు పట్టణప్రజలకు అవగాహన కల్పించారు. నాయకులు వెలుగుల గోపాలకృష్ణ, కాదంబరి రామకృష్ణ తదితరులు కరపత్రాలు పంపిణీ చేశారు.

నేత్ర శిబిరం

గండేపల్లి: మల్లేపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు సొసైటీ అధ్యక్షుడు దిడ్డి చిన్నశ్రీను తెలిపారు.

పనులకు శంకుస్థాపన

తుని: 2వ వార్డు అంబేడ్కర్ నగర్ వద్ద రూ.2.50 లక్షలు సాధారణ నిధులతో సీసీరోడ్డు పనులకు ఛైర్‌పర్సన్ భువనసుందరి భూమిపూజ చేశారు. నాయకులు నాగమణి, సత్యవతి, అధికారులు పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాలు జరిపితే చర్యలు

రౌతులపూడి: గ్రామాల్లో గ్రావెల్ తవ్వకాలకు అనుమతి లేదని తహసీల్దార్ ఎస్వీనరేష్ అన్నారు. అనుమతులు లేకుండా తవ్వకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌతులపూడి శివారున గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నట్టు భావించిన ప్రదేశాన్ని సిబ్బందితో కలిసి బుధవారం పరిశీలించారు.

బీఎల్వోలకు శిక్షణ

శంఖవరం: మండల పరిషత్ కార్యాలయం వద్ద బీఎల్వోలకు బుధవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. తహసీల్దార్ తాతారావు మాట్లాడుతూ.. ఓటర్ల చేర్పులు, తొలగింపులు చేసి వచ్చే నెలాఖరులోగా సమగ్ర జాబితా సిద్ధం చేయాలని సూచించారు.

ప్రకటన

నా క్లయింట్ అయినటువంటి ఆంధ్రప్రదేశ్, కాకినాడ జిల్లా, తుని మండలం, K.O.మల్లవరం గ్రామ వాస్తవ్యులు **యల్లాకుల రాంబాబు గారి** కుమారుడు తాతాజీ గారి తరపున యావన్మందికి తెలియచేయునది ఏమనగా,

గత కొన్ని రోజుల క్రితం నా క్లయింట్ అయిన **యల్లాకుల తాతాజీ** గారు తన గ్రామం K.O. మల్లవరం నుండి తుని పట్టణానికి మోటారు సైకిల్‌పై వస్తూ తనతో పాటు తన H.D.F.C బ్యాంక్, తుని బ్రాంచ్‌కు చెందిన ఒరిజినల్ ఖాళీ చెక్కు (సిరీస్ 000006 to 000030 మరియు 000031 to 000055) మరియు కొన్ని నా క్లయింటు సంతకాలు చేసి యున్న ఖాళీ ప్రింటెడ్ ప్రామిసరీ నోట్స్ తుని మండలం, గండి సెంటర్ వద్దకు వచ్చేసరికి పడిపోయియున్నవి. నా క్లయింట్ వెంటనే వాటి గురించి చుట్టు ప్రక్కల వెతికి, తెలిసి ఉన్న వారిని విచారణ చేసినా వాటి ఆచూకి తెలియలేదు. కావున ఎవరైనా పై డాక్యుమెంట్స్‌ను దుర్వినియోగం చేస్తారేమో అని ముందస్తుగా నా క్లయింట్ H.D.F.C బ్యాంక్, తుని బ్రాంచ్‌కు సమాచారం ఇచ్చి స్టాప్ పేమెంట్ పెట్టమని తెలియచేసియున్నారు. ఎంత వెతికినా పై ఖాళీ చెక్కు, సంతకాలు చేసియున్న ఖాళీ ప్రింటెడ్ ప్రామిసరీ నోట్స్ దొరకక పోయేసరికి పై జరిగిన విషయమై మీ సేవా సెంటర్, తుని నుండి తుని రూరల్ పోలీస్‌స్టేషన్ వారికి కంప్లయింట్ ది.04-11-2025న ఇవ్వగా పోలీస్ వారు విచారణ చేసి పై ఖాళీ చెక్కు నా క్లయింట్ సంతకాలు చేసియున్న ఖాళీ ప్రింటెడ్ ప్రామిసరీ నోట్స్ దొరకలేదని ది.06-11-2025న నా క్లయింట్‌కు సర్టిఫికెట్ ఇచ్చియున్నారు. అలాగే Note This document should not be used for any fraudulent purpose అని తెలియచేసియున్నారు. కావున నా క్లయింట్ యొక్క పై ఖాళీ చెక్కు, సంతకాలు చేసియున్న ఖాళీ ప్రింటెడ్ ప్రామిసరీ నోట్స్ ఎవరికైనా దొరికిన వాటిని నా క్లయింట్‌కు తెచ్చి ఇచ్చిన యెడల నా క్లయింట్ వారికి తగిన బహుమతి ఇవ్వడానికి సిద్ధంగా యున్నారు. ఎవరైనా వాటిని నా క్లయింట్‌కు వ్యతిరేకంగా దుర్వినియోగం చేసినా నా క్లయింట్ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొనగలవారని ఈ ప్రకటన ద్వారా తెలియచేయడమైనది.

తేది.12-11-2025, తుని.

బర్ల రవికుమార్
అడ్వకేట్, తుని
Cell: 92466 40555

సారొచ్చారు.. రూపు మార్చారు

బదిలీపై వచ్చిన ఉపాధ్యాయుడు పాఠశాల రూపురేఖలనే మార్చేసి పలువురి మన్ననలు అందుకుంటున్నారు. కొత్తపల్లి ఎంపీపీ పాఠశాలలో ఐదేళ్ల క్రితం పనిచేసిన ఉపాధ్యాయుడు ప్రసాద్ మళ్లీ ఇదే పాఠశాలకు ఇటీవల బదిలీపై వచ్చారు. గతంలో తను పని చేసే సమయంలో సుమారు 50 మంది విద్యార్థులతో కళకళలాడే పాఠశాల ప్రస్తుతం ఐదుగురితో ఉండటంతో ఆవేదన చెందారు. దీంతో పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంఖ్య పెరగడానికి ఆయన వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. సొంత నగదుతో పాఠశాలకు రంగులు వేయించి, ఆవరణ అంతా శుభ్రం చేయించారు. వచ్చే విద్యాసంవత్సరానికి చిన్నారుల సంఖ్య పెంచి పూర్వ వైభవం తీసుకొచ్చేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు. - న్యూస్‌టుడే, కొత్తపల్లి

ప్రస్తుతం రంగులతో ఆకర్షణీయంగా పాఠశాల

గూడేల మార్గాలకు మహర్దశ

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని ఎత్తైన కొండలపై ఉన్న బురదకోట పంచాయతీ పరిధిలోని తండాలకు రహదారి కల నెరవేరనుంది. ధారపల్లి నుంచి కె.మిర్తివాడ వరకు 'నరేగా' నిధులు రూ.2.8 కోట్లతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ బుధవారం శంకుస్థాపన చేశారు. భూమిపూజ అనంతరం గిరిజనులతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. బురదకోట పంచాయతీలోని నాలుగు తండాలకు ధారపల్లి నుంచి రోడ్డు నిర్మాణం దశాబ్దాలుగా ఊరిస్తోంది. గతంలో తెదేపా హయాంలో నిధులు కేటాయించి పనులు ప్రారంభించిన అటవీశాఖ అనుమతులు లేవని ఆపేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గూడేలకు పక్కాదారి ఏర్పడనుంది. నియోజకవర్గంలోని ప్రతి గిరిజన గ్రామానికి మౌలిక సదుపాయాలను కల్పిస్తామని ఎమ్మెల్యే అన్నారు. వైస్ ఛైర్మన్ కొమ్ముల కన్నబాబు, జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్ పాల్గొన్నారు.

ధారపల్లి-కె.మిర్తివాడ రోడ్డు శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రజా భద్రతకు పోలీసులు ముందుండాలి: ఎంపీ

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: ప్రజా భద్రత, శాంతిభద్రతల రక్షణకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ ముందుండాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎంపీ నిధుల నుంచి రూ.36 లక్షల విలువైన నాలుగు బొలెరో వాహనాలను జిల్లా పోలీసులకు అందజేశారు. బుధవారం కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో వీటిని ఎంపీ ప్రారంభించారు. ఎస్పీ బిందుమాధవ్ అధ్యక్షత వహించారు. ఎంపీ మాట్లాడుతూ పోలీసు శాఖకు వీలైనంత సాయం చేయడం బాధ్యతగా భావిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో మరో 5 వాహనాలను అందిస్తామన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఈ వాహనాలతో సిబ్బంది తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకోవచ్చన్నారు. అనంతరం వాహనాలను ఎస్పీ నడపగా, ఎంపీ, ఇతర ప్రజాప్రతినిధులు అందులో కూర్చుని ర్యాలీగా వెళ్లారు. ఏఎస్పీ మనీష్‌దేవరాజ్ పాటిల్, ఎస్పీ శ్రీనివాసరావు, ఎస్పీ డీఎస్పీ సత్యనారాయణ, డీసీసీబీ ఛైర్మన్ బాబు, మాజీ ఎమ్మెల్యే దొరబాబు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

జెండా ఊపి వాహనం ప్రారంభిస్తున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, ఎస్పీ బిందుమాధవ్ తదితరులు

అందుబాటులోకి.. రైల్‌వన్

న్యూస్‌టుడే – తుని

రైలు ప్రయాణం మరింత సులువుగా సాగేందుకు భారతీయ రైల్వే అన్ని ప్రధాన సేవలు ఒకేచోట లభించేలా 'రైల్‌వన్' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. గతంలో వివిధ యాప్‌లలో వేర్వేరు సేవలు ఉండేవి. వాటన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెస్తూ రైల్‌వన్ రూపొందించింది.

మీకు తెలుసా?

ఈ సేవలు పొందొచ్చు..

ఆండ్రాయిడ్ ఫోన్లో గూగుల్ ప్లే స్టోర్, యాప్ స్టోర్ల నుంచి ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవచ్చు. సాధారణ, రిజర్వేషన్, ప్లాట్‌ఫామ్, సీజన్ టిక్కెట్లు పొందవచ్చు. రైళ్ల సమాచారం, పీఎన్ఆర్ స్థితి, కోచ్ స్థానం, రైలును ట్రాక్ చేయడం, భోజనం ఆర్డర్ ఇవ్వడం, ఫిర్యాదులు, సూచనలు తదితర సేవలు పొందొచ్చు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు, సిబ్బంది సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే అనేక మంది దీన్ని డౌన్లోడ్ చేసుకుని వాడుతుండడంతో స్టేషన్లలోని టికెట్ కౌంటర్ల వద్ద రద్దీ తగ్గింది.

శివయ్యా.. సేదదీరేది ఎక్కడయ్యా?

● భీమేశ్వరాలయంలో అసంపూర్తిగా డార్మిటరీ భవనం

సామర్లకోట, న్యూస్‌టుడే: పంచారామాల్లో ప్రసిద్ధి చెందిన సామర్లకోట భీమేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు సేదదీరేందుకు డార్మిటరీ భవనం లేక నిత్యం అనేక ప్రాంతాలనుంచి వచ్చినవారు ఇబ్బందులు పడుతున్నారు. దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు ఎంతో కష్టపడి వచ్చి విశ్రాంతి తీసుకోవడానికి గదులు లేక చెట్లకింద, సమీపంలోని మదుగులమ్మ ఆలయం అరుగులపై, ఆటోలు, వాహనాల్లోనే ఆలయం తెరిచే వరకు వేచి ఉంటున్నారు. భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు వీలు వినియోగంలోకి తీసుకురావాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

మదుగులమ్మ ఆలయం వద్ద అరుగులపై సేదదీరుతున్న భక్తులు

దర్శనవేళలు..

భీమేశ్వరాలయంలో సాధారణ రోజుల్లో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు స్వామివారిని దర్శించుకునేందుకు అనుమతి ఉంటుంది. పర్వదినాల్లో తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, అనంతరం 4 గంటల నుంచి స్వామి దర్శనం లభిస్తుంది.

గతంలో రూ.95 లక్షలతో నిర్మాణం ప్రారంభం..

భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర పర్యాటక శాఖ ద్వారా రూ.95 లక్షలతో డార్మిటరీ భవనం నిర్మాణ పనులను ఆరేళ్ల కిందట ఆలయ సమీపంలో చేపట్టారు. వైకాపా ప్రభుత్వ హయాంలో నిధుల విడుదలలో జాప్యం కారణంగా భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా మధ్యలో నిలిచిపోయాయి. భక్తుల ఇబ్బందిని తీర్చేందుకు అసంపూర్తిగా మిగిలిపోయిన డార్మిటరీ భవనాన్ని పూర్తి చేసి

రూ.60 లక్షలతో ప్రతిపాదనలు..

డార్మిటరీ భవనం పనులు పూర్తి చేసేందుకు రూ.60 లక్షల నిధులు అవసరం ఉందని ప్రతిపాదనలు పంపాం. ఎమ్మెల్యే చినరాజప్ప నిధుల కోసం మంత్రి ద్వారా కృషి చేస్తున్నారు. త్వరలో భక్తుల ఇబ్బంది తీరుతుంది. నిధులు రాగానే పనులు పూర్తిచేసి భక్తుల సౌకర్యార్థం భవనాన్ని వినియోగంలోకి తీసుకువస్తాం.

- సత్యనారాయణ, రాష్ట్ర పర్యాటకశాఖ డీఈ కాకినాడ

తాండవ అక్విడక్టు పనులు పూర్తిచేయాలి: ఎస్‌ఈ

తుని గ్రామీణం: మరో 20 రోజుల్లో తాండవ నదిపై అక్విడక్టు పనులు పూర్తి చేయాలని పోలవరం కాలువ ఎస్‌ఈ ఏసుబాబు స్థానిక అధికారులకు సూచించారు. మండలంలోని పోలవరం కాలువ నిర్మాణ పనుల్లో భాగంగా సుమారు రూ.65 కోట్లతో తాండవ నదిపై కృష్ణాకొండ నుంచి రేఖవానిపాలెం వరకు సుమారు 452 మీటర్ల పొడవు, 28 మీటర్ల వెడల్పున అక్విడక్టు పనులు చేపట్టారు. ప్రస్తుతం 90 శాతం పనులు పూర్తి చేసినట్లు ఈఈ గోవింద్ ఆయనకు వివరించారు. వర్షాల కారణంగా పనుల్లో జాప్యం జరిగిందన్నారు. ఉన్నతాధికారులు సూచించిన గడువులోగా పనులు పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. డీఈ మురళీ సిబ్బంది ఉన్నారు.

తాండవ నదిపై అక్విడక్టు పనులు పరిశీలిస్తున్న ఎస్‌ఈ ఏసుబాబు

పేదల సొంతింటి కల సాకారానికి ప్రభుత్వం కృషి

గోకవరం, న్యూస్‌టుడే: పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ అన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కలెక్టర్ కీర్తి చేకూరితో కలిసి గోకవరం మండలం కామరాజుపేటలో పీఎం ఆవాస్ యోజన 2.0లో భాగంగా నిర్మించిన గృహాలను బుధవారం ప్రారంభించారు. జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ.. పేదలకు సొంత ఇల్లు అందించేందుకు సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ చేస్తున్న కృషిని వివరించారు. గోకవరం మండలంలో 168 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. త్వరలోనే వెయ్యి ఇళ్లు నిర్మిస్తామన్నారు.

లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందిస్తున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, కలెక్టర్ కీర్తి , ఎమ్మెల్యే నెహ్రూ

గోకవరం మండలంలోనే ..

870 మంది అర్హులున్నారని కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. కామరాజుపేట గ్రామంలో తాగునీటి సమస్యల పరిష్కారానికి జలజీవన్ మిషన్ నిధులలో నిర్మించిన 60 వేల లీటర్ల ఓహెచ్‌ఆర్ ట్యాంకును ప్రారంభించామన్నారు. గోకవరం ఠాణా సెంటర్ ఇరుకు వంతెన సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామన్నారు. జిల్లా హౌసింగ్ పీడీ నాతి బుజ్జి, ఎస్ఎస్ఏ పీడీ సుబాషిణి, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాదవరావు, డీసీవో ఎం.వెంకటరమణ, సర్పంచి అడపా వెంకట్రావు, జగ్గంపేట వ్యవసాయమార్కెట్ కమిటీ ఛైర్మన్ అడపా భరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి నిధులు

పీఎం శ్రీ పథకం కింద కామరాజుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో కెమిస్ట్రీ ల్యాబ్‌కు రూ.23.10 లక్షలు, కంప్యూటర్ ల్యాబ్‌కు రూ.18.50 లక్షలు, ఫిజిక్స్ ల్యాబ్‌కు రూ.23.10 లక్షలు తదితర పనులకు మొత్తంగా రూ.76.26 లక్షల నిధులు మంజూరయ్యాయి. కొత్తపల్లి రైతుసేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

మదినిండా భక్తిభావం..

ఉసిరి చెట్టువద్ద డీఎల్పీవో బాలమణి, అధికారులు

గురుస్వాములతో అయ్యప్పమాలధారులు

రాచపల్లిలో అభిషేకాలు

రౌతులపూడి, కిర్లంపూడి, జగ్గంపేట గ్రామీణం: ఎస్.పైడిపాలలో గౌరీదేవి అమ్మవారి జాతర బుధవారం నిర్వహించారు. ● రాజుపాలెం గ్రామంలోని దత్తసాయి ఆలయంలో అనగాదేవి సామూహిక వ్రతాన్ని బుధవారం నిర్వహించారు. ● కాండ్రేగులలో కొత్తవీధి వినాయక గుడి వద్ద మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సంప్రదాయబద్ధంగా వనసమారాధన

గండేపల్లి, శంఖవరం : మండల అధికారుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించినట్లు డీఎల్పీవో బాలమణి అన్నారు. పామాయిల్ తోటలో అధికారులు, సచివాలయ సిబ్బంది వనభోజనాలు చేశారు. ● కత్తిపూడి శివారు తోటలో వనసమారాధన జరిగింది. ఎమ్మెల్యే సత్యప్రభ పాల్గొన్నారు. ● గ్రామశివారున తోటల్లో అయ్యప్పమాలధారులు వనమహోత్సవం నిర్వహించారు. గురుస్వాములను మాలధారులు సత్కరించారు.

కాలభైరవం భజే..!

ప్రత్తిపాడు : రాచపల్లిలోని ఆంధ్రా అరుణాచలంలో స్వామితో సహా పరివార దేవతలకు బుధవారం విశేష పూజలు జరిగాయి. విజయగణపతికి, ఉపాలయంలోని కాలభైరవ స్వామికి అభిషేకాలు, జరిగాయి. రుత్వికులు శ్రీవల్లభ హోమాన్ని నిర్వహించారు.

కబడ్డీ పోటీల్లో విజేతగా తుని జట్టు

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: కేవో మల్లవరం గ్రామదేవత చీటికమ్మతల్లి పండగ సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో విజేతగా తుని పట్టణానికి చెందిన కొండవారుపేట జట్టు విజేతగా నిలిచినట్లు పోటీల నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో మొదటి స్థానంలో తుని, రెండో స్థానంలో అనూరు, మూడో స్థానంలో కేవో మల్లవరం జట్లు విజేతలుగా నిలిచాయి. వీరికి నగదు బహుమతిని నాయకులు, యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, చిటికెల శ్రీనివాస్, బోడయ్య అందజేశారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న నాయకులు

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

తుని పట్టణం: రోటరీ యువజనోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు రాజా క్రీడామైదానంలో ఉత్సాహంగా ఆడారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు క్రీడాకారులను పరిచయం చేసుకునిప్రోత్సహించారు.

గిరిజన గ్రామాలతో ప్రత్యేక మండలం ఏర్పాటుచేయాలి

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ఉపప్రణాళిక మన్యంలోని 59 గ్రామాలను పెదమల్లాపురం మండలంగా ఏర్పాటు చేయాలని గిరిజన హక్కుల సాధన సమితి కోరింది. మండలంలోని ఇ.గోకవరం గ్రామంలో మండలంలోని గిరిజన గ్రామాల ప్రజలతో సమావేశం బుధవారం జరిగింది. గిరిజన నాయకుడు బూసాల బాలరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బెన్నోజు నాగరాజు, ఎన్.రమేష్, అప్పారావు తదితరులు మాట్లాడారు. పెదమల్లాపురం కేంద్రంగా ప్రత్యేక మండలం ఏర్పాటు చేయాలన్నారు. తమ డిమాండును అసెంబ్లీలోనూ ఎమ్మెల్యే ప్రస్తావించారని గుర్తు చేశారు. గిరిజన పంచాయతీల్లో మైదాన ప్రాంత గ్రామాలను తొలగించాలన్నారు. ఇ.గోకవరం పంచాయతీ పరిధిలో వేములపాలెంను తొలగించి ఆదివాసీలున్న గ్రామాలను చేర్చాలన్నారు. తమకు ప్రత్యేక మండలం చేయడంతో పాటు నిధుల కేటాయించి అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందేలా చేయూతనివ్వాలన్నారు. తమ హక్కుల సాధనకు కలిసికట్టుగా కృషి చేస్తామన్నారు.

ఇ.గోకవరంలో గిరిజన గ్రామాల సమావేశం

మన నగరం.. నౌకలూ నిర్మాణం

కాకినాడ తీరంలో ఏర్పాటుకు ఆసక్తి

ఈనాడు, కాకినాడ: కాకినాడ తీరం ఇప్పటివరకు జల రవాణా కేంద్రంగానే గుర్తింపు పొందింది. ఇకపై నౌకా నిర్మాణ కేంద్రంగానూ అభివృద్ధి చెందనుంది. ప్రస్తుతం నగరంలో శాన్ మెరైన్ సంస్థ చిన్న, మధ్యస్థ నౌకల నిర్మాణం చేపడుతోంది. విద్యుత్తు నౌకల తయారీలోనూ అడుగుపెట్టడానికి ఇటీవల ముంబయిలో కేంద్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది.

తీర ప్రాంత అభివృద్ధికి..

ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్) ఇదివరకు కాకినాడ పోర్టు పరిసరాల్లో శాటిలైట్ షిప్‌యార్డు ఏర్పాటుకు స్థల పరిశీలన చేసి వెళ్లింది. తాజాగా మ్యాట్ మెరైన్ సర్వీసెస్ సంస్థ యాంకరేజ్ పోర్టు సమీపంలో టగ్‌లు, బార్జీల నిర్మాణం చేయబోతుంది. ఇవి తీర ప్రాంత అభివృద్ధికి దోహదపడతాయని చెబుతున్నారు.

కీలక స్థావరంగా..

గతంలో చిన్నపాటి నౌకలు, బార్జీల కోసం సింగపూర్, మలేషియా వెళ్లి అక్కడి కంపెనీలకు ఆర్డర్లు పెట్టాల్సి వచ్చేది. వాటి నిర్వహణ, మరమ్మతులకు ఇబ్బందులు ఎదురయ్యేవి. ఇప్పుడు మెరైన్ సంస్థలు ముందుకు వస్తుండడంతో ఈ రంగంలో కాకినాడ రాష్ట్రంలోనే కీలక స్థావరంగా మారబోతుంది. బోట్ల నుంచి భారీ నౌకల తయారీకి అవకాశాలుండి యువతకూ ఉపాధి దక్కనుంది.

ఇవీ అనుకూల పరిస్థితులు

● హోప్ ఐలాండ్ కారణంగా అలల తాకిడి తక్కువ. ● తీరం వెంబడి ప్రభుత్వ భూములు ఎక్కువ. ● నౌకలు, బార్జీలు, టగ్‌లు తయారుచేసి పక్కనే ఉన్న సముద్ర జలాల్లోకి దించి.. పరీక్షలు చేసి సరకు రవాణాకు ఉపయోగించొచ్చు. సీఫ్రంట్‌గా పిలిచే ఈ సౌకర్యం కాకినాడలోనే ఉంది. ● జగన్నాథపురం వంతెన నుంచి యాంకరేజ్ పోర్టు వరకు రెండు కిలోమీటర్ల మేర సీఫ్రంట్ విస్తరించి ఉండడం నౌకల తయారీకి అనుకూలం.

సర్కారు సానుకూలం..

● కూటమి ప్రభుత్వ పారిశ్రామిక పాలసీతో పారిశ్రామికవేత్తలకు నమ్మకం వచ్చింది. ● హిందుస్థాన్ షిప్‌యార్డు సంస్థ కాకినాడ, మూలపేట పోర్టులను పరిశీలించి వంద ఎకరాలిస్తే శాటిలైట్ షిప్‌యార్డు ఏర్పాటు చేస్తామంది. ● శాన్ మెరైన్ సంస్థ ఆధునిక సాంకేతికత.. నార్వే, జపాన్ దేశాల పరిజ్ఞానంతో విద్యుత్తు ఆధారిత నౌకల తయారీకి ముందుకొచ్చింది. రూ.600 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ● మ్యాట్ మెరైన్ రూ.100 కోట్లతో ఇక్కడ టగ్‌లు నిర్మిస్తానంది. దీనివల్ల 300 మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

బాలికలను అభినందిస్తున్న డీఈవో రమేష్

కుస్తీ పోటీలకు కస్తుర్బా విద్యార్థినుల ఎంపిక

తుని గ్రామీణం: వి.కొత్తూరు పరిధిలో కస్తుర్బాగాంధీ పాఠశాల విద్యార్థినులు ఇటీవల అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారు. వీరు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ అమృతవాణి తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రణతి, సమీరా బంగారు పతకాలు సాధించగా తునుశ్రీ వెండిపతకం, నిఖిత కాంస్యపతకం సాధించారన్నారు.

రాష్ట్ర మహాభలను జయప్రదం చేయాలి

ఏలేశ్వరం: ప్రజల జీవనస్థాయి, నిరుద్యోగం తదితర అంశాలపై సీపీఐ(ఎం.ఎల్) లిబరేషన్ పార్టీ పోరాటాలు చేస్తుందని పొలిట్‌బ్యూరో సభ్యులు శంకర్ అన్నారు. ఏలేశ్వరంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బంగార్రావు అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించారు. డిసెంబరు 6,7లలో కడపలో రాష్ట్ర మహాసభలు జరగనున్నాయి.

17న చలో దిల్లీ

జగ్గంపేట గ్రామీణం: సీజేఐపై అనుచిత దాడికి నిరసనగా 17న చలో దిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాకాడ నూకరాజు మాదిగ పిలుపునిచ్చారు. నెహ్రూ కాంప్లెక్ ఆవరణలో బుధవారం దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. అనంతారపు రాజుమాదిగ, డేవిడ్‌రాజు, జిల్లా కార్యదర్శి అరుగోలు పండు పాల్గొన్నారు.

కంటెయినర్‌ను ఢీకొట్టిన కారు..

నలుగురికి గాయాలు

గండేపల్లి, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. హైవే పోలీసులు తెలిపిన వివరాలివీ.. అన్నవరం నుంచి ఏలూరు వైపు కారులో చేపలు, రొయ్య పిల్లలు తీసుకెళ్తున్నారు. గండేపల్లి శివారున బాబాయ్ హోటల్ సమీపానికి వచ్చేసరికి ముందు వెళ్తున్న కంటెయినర్‌ను బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురు యువకులకు బలమైన గాయాలయ్యాయి. వారిని జడ్.రాగంపేట సీహెచ్‌సీకి తరలించారు. కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది.

కారు ముందు భాగం ఇలా..

'వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడం తగదు'

తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట, జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడం తగదని తునిలో వైకాపా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, జగ్గంపేటలో మాజీ మంత్రి తోట నరసింహం, ప్రత్తిపాడులో ముద్రగడ గిరిబాబు అన్నారు. వివిధ ప్రాంతాల్లో బుధవారం ప్రధాన వీధుల మీదుగా నిరసన ర్యాలీలు నిర్వహించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. వైకాపా నాయకులు యనమల కృష్ణుడు, వాసిరెడ్డి జమీలు, లక్ష్మీశివకుమారి, కాంతి సుధాకర్, రాజరాజేశ్వరి, రామిశెట్టి నాని, తోట రాంజీ, రావుల గణేష్‌రాజా, చలగళ్ల దొరబాబు తదితరులు పాల్గన్నారు.

తునిలో నిరసన ర్యాలీ చేస్తున్న మాజీ మంత్రి రాజా, నాయకులు

దైవ దర్శనానికి వెళ్లివస్తుండగా ప్రమాదం

● ఆటో చోదకుడి మృతి.. నలుగురికి గాయాలు

ప్రత్తిపాడు, కిర్లంపూడి, న్యూస్‌టుడే: దైవ దర్శనాలు చేసుకుని ఆటోలో వెళ్తున్న బృందం రోడ్డు ప్రమాదంలో చిక్కుకుంది. ఈ ఘటన ప్రత్తిపాడు హైవే సమీపంలో పుత్రచెరువు కూడలిలో బుధవారం జరిగింది. వివరాలివీ.. కిర్లంపూడి మండలం ముక్కొల్లుకు చెందిన దొడ్డ వీరలక్ష్మి, సాపిరెడ్డి గనిలక్ష్మి, పోసిన సత్యనారాయణ, ఉమ్మిడి సీతామహాలక్ష్మి, ఆటోచోదకుడు రావు ఆదివిష్ణు(43)లు రాచపల్లి, ఇర్రిపాక తదితర ఆలయాలు దర్శించి ఇంటికి వస్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న ఆటోను ప్రత్తిపాడు సమీపంలో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి రాసుకుంటూ వెళ్లడంతో పక్కన ఉన్న విభాగినిని ఢీకొంది. ఆటోచోదకుడు ఆదివిష్ణు మృతి చెందగా వీరలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్తిపాడు సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడకు తరలించారు. మిగిలిన వారికి ప్రత్తిపాడు సీహెచ్‌సీలో డా.సౌమ్య, సిబ్బంది చికిత్స చేశారు. ఎస్సై లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో నుజ్జయిన ఆటో (అంతర చిత్రంలో) రావు ఆదివిష్ణు (పాత చిత్రం)

వీధిన పడిన కుటుంబం

ఆదివిష్ణు మరణంతో అతని కుటుంబం వీధిన పడింది. ముక్కొల్లులో ఉండే బంధువులు అందరూ ఆలయాలకు వెళ్దామంటే ఆదివిష్ణు ఆటోలో తీసుకెళ్లాడు. రాచపల్లి, ఇర్రిపాక శివాలయాలు దర్శించారు. ప్రత్తిపాడులో హైవే కూడలి దాటితే 30 నిమిషాల్లో అంతా ఇంటికి చేరేవారే. ఈలోగా ప్రమాదం చోటుచేసుకుంది. ఆదివిష్ణుకు భార్య, 17 ఏళ్ల లోపు ఇద్దరు అబ్బాయిలు, అమ్మాయి ఉన్నారు.

వ్యాన్ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

ప్రైవేట్ ఆసుపత్రిలో కొనసాగుతున్న చికిత్స

గండేపల్లి, న్యూస్‌టుడే: ఇంటి వద్ద ఉంటే కిరాణా దుకాణంలో తండ్రికి చేదోడుగా ఉండే ఆ యువకుడిని పాలవ్యాన్ అతి వేగంతో ఢీ కొట్టడంతో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. వివరాలివీ.. గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామానికి చెందిన మామిడిపాక ఈశ్వర కల్యాణ్(23) ద్విచక్ర వాహనంపై కాట్రావులపల్లిలో ఉన్న అమ్మమ్మ ఇంటికి బయలుదేరాడు. యల్లమిల్లి గ్రామం మీదుగా నాయకంపల్లి శివారున ఉన్న చెరువువద్ద మలుపు దగ్గరకు వచ్చేసరికి నాయకంపల్లి నుంచి యల్లమిల్లి వేగంగా వెళ్తున్న పాలవ్యాన్ బలంగా ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కల్యాణ్ తలకు బలమైన గాయాలు తగలడంతో హుటాహుటిన రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స అందుతోంది. దీనిపై ఎటువంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	22,000
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	20,000-21,000
కొత్త (పచ్చి) కాయ	19,000-20,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	109-00
రిటైల్ లైవ్	134-00
డ్రెస్డ్	197-00
స్కిన్‌లెస్	224-00

EENADU eClassifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నది విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

FINANCIAL SERVICES

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభవాయిదా లేదా నెలవారీ వడ్డీ పద్ధతిలో పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ, ✆ 73862 01191.

అన్ని రకముల లోన్స్ చేయించబడును నో CIBIL ప్రైవేట్ ఫైనాన్స్ ఇప్పించబడును. బంగారం విడిపించు కొనుటకు డబ్బులు ఇప్పించబడును. Cell: 96663 99944.

REAL ESTATE

LAND FOR SALE

GENERAL

రాజమండ్రికి 30 కి.మీ. దూరంలోగల మురారి - గండేపల్లి మధ్య నేషనల్ హైవేకి చేర్చి 100 అ॥ల రోడ్ ఫేసింగ్‌తో 60 సెంట్లు భూమి అమ్మబడును. (నో బ్రోకర్స్), ✆ 90329 88265.

తూర్పుగోదావరి జిల్లా, లింగంపర్తిలో గల వైఆర్‌సి కాలువ ఆనుకొని 52 ఎకరాల వ్యవసాయ భూమి ఎకరం 35 లక్షలకు అమ్మకమునకు కలదు. (నదిపాటి గోశాలకు 2 కిలోమీటర్ల దూరం), Contact Cell: 93909 91555.

JOBS

WANTED STAFF Ravindra High School. Exp. High School Teachers for English, Social, Science & Telugu, B.Tech. Graduates eligible. Sal: 20K to 22K, Location: Madiki, Vemagiri. ✆ 95334 31103, 91105 67164.

శ్రీనివాస గ్రూప్, VJA. ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/ వంట, బేబి కేర్‌కు వర్కర్లు కావలెను. భో+ వ+ జీతం. ✆ 92814 52843, 92814 52827

రామకృష్ణ గ్రూప్ Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు, ఇంటిపని, వంటపని, బేబికేర్ కొరకు స్త్రీ/పు కావలెను. భో+ వ+, జీతం: 16 - 18K. ✆ 9705297788, 9515108830.

శాఖాహార (వెజిటేరియన్) వంటలు, ఇంటిపని చేయుటకు కాకినాడ ఇంటిలో ఉంటూ ఏ బాదరబందీ లేని 35 సం॥లలోపు స్త్రీ కావలెను. ✆ 99853 57819, 94911 95169.

సేల్స్ మేనేజర్‌గా రాజమండ్రి, కాకినాడ Livspace ఫ్రాంఛైజ్‌లో పనిచేయుటకు కావలెను. 2-5 సం.ల సేల్స్ (ఇంటీరియర్, రియల్‌ఎస్టేట్) అనుభవం కలిగి ఉండాలి. మీ రెజ్యూమ్ vyshnosrigroup@gmail.comకు పంపండి. ✆ 96146 56789.

యాక్సెస్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ NGO సంస్థ వరి-AWD ప్రాజెక్ట్‌లో తూ॥గో॥ జిల్లాలో పనిచేయుటకు ఫీల్డ్ స్టాఫ్/ ఫీల్డ్ సూపర్‌వైజర్స్ కావలెను. అర్హత: ఇంటర్/ డిగ్రీ. Cont. Cell: 98857 35563.

రాజమండ్రి ఉమెన్స్ కాలేజ్ దగ్గర బ్రాహ్మణ కుటుంబంలో వంట చేయుటకు బ్రాహ్మణ ఆడ వంట మనిషి కావలెను. Contact Cell: 80991 91919.

MARKETING/ SALES

ప్రముఖ MNCలో మేనేజర్‌గా పని చేయుటకు డిగ్రీ బైక్ కలిగిన వారు సంప్రదించండి. Cell: +91 91218 56488 రాజమండ్రి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారంగేటు ధర రూ. 6-05 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం
కార్యక్రమము — ప్రసార వేళలు
ఉషోదయం — ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్ — ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా — ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ — మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో — సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు — రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ — రా॥ 12 - తె॥ 5
/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

(c) eenadu

జాతి నిర్మాణానికి విద్య అత్యంత కీలకం

● రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్

ఆర్‌యూ స్నాతకోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

ఈనాడు, కర్నూలు, కర్నూలు విద్య, న్యూస్‌టుడే : సమాజంలోని ప్రతి ఒక్కరూ వారి తల్లిదండ్రులు, వారి పిల్లలు కూడా గర్వపడేలా జీవించాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. కర్నూలులోని రాయలసీమ విశ్వవిద్యాలయ నాలుగో స్నాతకోత్సవానికి ఆయన బుధవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎ.ఎం.గ్రీన్ సంస్థ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎస్.వి.రామకుమార్‌కు గవర్నర్ అబ్దుల్ నజీర్, వీసీ ఆచార్య వి.వెంకటబసవరావులు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. 75 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. పలువురు పట్టాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతవిద్య ఎన్నో అవకాశాలకు ముఖద్వారం లాంటిదన్నారు. సామాజికంగా, ఆర్థికంగా ఎదిగేందుకు, ఉత్తమ పౌరుడిగా ఎదిగేందుకు విద్య అండగా నిలుస్తుందన్నారు. కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావం విద్యారంగంపైనా గణనీయంగా ఉందన్నారు. దీంతో లభించే ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవడంతోపాటు సవాళ్లను సైతం దీటుగా ఎదుర్కోవాలని సూచించారు. కర్నూలు.. గొప్ప చరిత్ర, సాంస్కృతిక వారసత్వం కలిగిన నగరమని అభివర్ణించారు. ఎన్నో ఉన్నత విద్యాలయాలు ఉన్నాయని పేర్కొన్నారు.

● వీసీ వెంకట బసవరావు మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి ఆర్‌యూ క్యాంపస్‌లో డిగ్రీలో బీకాం, బీఎస్సీ కోర్సులతోపాటు పీజీలో ఫుడ్ సైన్సుకు సంబంధించిన కోర్సులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

● ఎ.ఎం.గ్రీన్ సంస్థ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎస్.వి.రామకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో దూరదృష్టితో ఆలోచించి అమరావతి గ్రీన్ హైడ్రోజన్‌వ్యాలీ, క్వాంటమ్ మిషన్ ఏర్పాటు చేస్తున్నారని, పునరుత్పాదక ఇంధన వనరుల విధానాన్ని తీసుకొచ్చారని ప్రశంసించారు. ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి, రెక్టార్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ విజయ్ కుమార్ నాయుడు, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒంటికాలి ప్రయాణం

గోనెగండ్లకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువులకు ఎమ్మిగనూరు పట్టణానికి వెళ్తుంటారు. కర్నూలు నుంచి ఎమ్మిగనూరు వెళ్లే ప్రతి బస్సు రద్దీగా ఉంటోంది.. గోనెగండ్లలో ఎక్కే ప్రయాణికులకు స్థలం ఉండటం లేదు. ప్రమాదకరంగా తలుపు వద్ద నిల్చొని ప్రయాణిస్తున్నారు. గోనెగండ్ల నుంచే విద్యార్థుల కోసం ఒక ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయాలని విద్యార్థులు విన్నవిస్తున్నారు.

– న్యూస్‌టుడే, గోనెగండ్ల

నిఘాకు మసక.. వ్యాపారి మస్కా

పరిశీలన

పాణ్యం మార్కెట్ కమిటీ చెక్‌పోస్టులో సెల్‌ఫోన్ చూస్తున్న సిబ్బంది

- చేతికొచ్చిన పంట దిగుబడులు
- తనిఖీ కేంద్రాలపై కొరవడిన పర్యవేక్షణ
- సరిహద్దులు దాటిస్తున్న అక్రమార్కులు

పంట చేతికొచ్చింది.. అమ్మకానికి సిద్ధంగా ఉన్న దిగుబడులను ఇటీవల వచ్చిన మొంథా తుపాన్ నిండా ముంచేసింది.. తడిసిన గింజలను వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకొంటున్నారు. తనిఖీ కేంద్రాల వద్ద సిబ్బంది జేబులు నింపి సరిహద్దులు దాటిస్తున్నారు. సీసీ కెమెరాలు లేకపోవడంతో సిబ్బంది వసూళ్ల దుకాణం పెట్టారు.

– న్యూస్‌టుడే, కర్నూలు, నంద్యాల వ్యవసాయం, బనగానపల్లి

కనిపించని సీసీ కెమెరాలు

● నంద్యాల జిల్లాలో 24, కర్నూలులో 12 వ్యవసాయ తనిఖీ కేంద్రాలు ఉన్నాయి. కొన్ని చోట్ల డబ్బా రేకుల్లో కేంద్రాలుండగా. . మరికొన్ని చోట్ల అవికూడా కూడా లేవు. ఆయా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.

● ప్రతి 12 గంటలకు ఇద్దరు చొప్పున పని చేయాల్సి ఉంది. ఉద్యోగులు లేక కొన్ని ఉదయం.. మరికొన్ని రాత్రిళ్లు మూతపడుతున్నాయి. మార్కెటింగ్ శాఖ సూపర్‌వైజర్ స్థాయి అధికారులు విధులు నిర్వహించాలి. అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో సెక్యూరిటీ గార్డులు పనిచేస్తున్నారు.

సాగు (హెక్టార్లలో)	
సాధారణం	4,22,540
సాగైంది	3,83,072

రైతు పేరుతో దాటిస్తున్నారు

● రైతులే స్వయంగా ఇతర ప్రాంతాల్లో ధాన్యాన్ని విక్రయించడానికి తరలిస్తే మార్కెట్ కమిటీలకు ఎలాంటి ఫీజు చెల్లించనక్కర్లేదు. వ్యాపారులైతే రెండు శాతం ఫీజు చెల్లించాల్సి ఉంది. కొందరు వ్యాపారులు రైతుల పేరుతో సరిహద్దు దాటిస్తున్నారు.

● సెక్యూరిటీ గార్డులు, మార్కెట్ కమిటీ సిబ్బంది కలిసి వసూళ్లకు పాల్పడుతున్నారు. బిల్లు పుస్తకాలు వారి దగ్గరే ఉన్నా.. ఐదు లారీలు రవాణా చేస్తే.. ఒక లారీకి మార్కెట్ సెస్ వసూలు చేయడం.. డబ్బులు తీసుకొని మిగిలిన లారీలను పంపిస్తున్నట్లు ఫిర్యాదులొచ్చాయి. ఒక్కో కేంద్రం వద్ద నిత్యం రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

తగ్గిన ఆదాయం

● క్వింటా ధాన్యం రూ.2 వేల ధర ఉంటే ఒక లారీ 30 టన్నుల సామర్థ్యంతో రవాణా చేస్తారు. నిబంధనల ప్రకారం మార్కెట్ కమిటీకి 2 శాతం అంటే రూ.12 వేలు ఫీజు చెల్లించాలి. పర్యవేక్షణ లేకపోవడంతో మార్కెటింగ్ శాఖకు భారీగా గండి పడుతోంది.

● కర్నూలు జిల్లాలో ఏడు మార్కెట్ కమిటీలుండగా.. ఒక్క పత్తికొండ మినహా మిగతా మార్కెట్లలో ఆదాయం తగ్గిపోయింది. నంద్యాల జిల్లాలో 8 వ్యవసాయ మార్కెట్లు ఉండగా 23 చెక్‌పోస్టులున్నాయి. రూ.12.57 కోట్లు వసూలైంది.

● ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు.. రైతులకు వ్యాపారులే దిక్కయ్యారు. దీన్ని ఆసరాగా తీసుకొని ధర అమాంతం తగ్గించారు. రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసిన వ్యాపారులు సరిహద్దు జిల్లాలకు తరలిస్తున్నారు.

ఆదాయం (రూ.కోట్లలో)	ఈ ఏడాది లక్ష్యం	40.40	ఇప్పటికీ వసూలైంది	13.07

గెలుపు బాట.. పతకాల మోత

ఆదోని పట్టణానికి చెందిన కుర్రాడు ఆబోయ సురేంద్ర బరువులెత్తి బంగారు పతకాలు సాధిస్తున్నారు. హైదరాబాదులో ఈ నెల 9న జరిగిన రాష్ట్ర స్థాయి బెంచ్ ప్రెస్‌లో 97 కిలోలు, డెడ్ లిఫ్ట్‌లో 205 కిలోల బరువు ఎత్తి బంగారు పతకం సొంతం చేసుకొన్నారు. గత నెల బెంగళూరులో జరిగిన జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో డెడ్ లిఫ్ట్‌లో 175 కిలోలు, స్క్వాడ్‌లో 175 కిలోలు, బెంచ్ ప్రెస్‌లో 95 కిలోల బరువులు (మొత్తం 445 కిలోలు) ఎత్తి రెండో స్థానంలో నిలిచారు. డిగ్రీ పూర్తి చేసిన సురేంద్ర ప్రభుత్వ శాఖలో 'కొలువు'దీరాలని సాధన చేస్తున్నారు.. ఖాళీ సమయంలో జిమ్‌కు వెళ్తున్నారు.. అక్కడ నిత్యం రెండు గంటల పాటు తర్ఫీదు పొందుతున్నారు. జాతీయ స్థాయిలో రాణించడమే తన లక్ష్యమని అతను పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, ఆదోని క్రీడలు

కానాలలో పింగళి సూరన రాతలు

అష్టదిగ్గజాల్లో ఒకరైన పింగళి సూరన నంద్యాల మండలం కానాల గ్రామ నివాసి. అందుకే అప్పటి గ్రామ పెద్ద.. డాక్టర్ సురేశ్‌రెడ్డి 1988లో పింగళి సూరన పేరుతో ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేశారు. శ్రీకృష్ణదేవరాయల కొలువులో అష్టదిగ్గజాల్లో ఒకరైన పింగళి సూరన తొలి ప్రబంధ నవల కళాపూర్ణోదయం రచించారు. ఈ నవలను అప్పటి నంద్యాల రాజు ఆరవీటి కృష్ణమరాజుకు అంకితమిచ్చారు. దీనికి రాజు మెచ్చి కానాల గ్రామాన్ని సూరనకు అగ్రహారంగా ఇచ్చినట్లు ఆధారాలు ఉన్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. అనంతరం సూరన గ్రామ శివారులో బుగ్గరామేశ్వరస్వామి దేవాలయాన్ని నిర్మించి దాని నిర్వహణకు 70 ఎకరాల మాన్యాన్ని అప్పగించారు. 2009లో పూదోట స్వామి ఆలయ ఆవరణలోని ఉద్యానవనంలో పింగళి సూరన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సూరన కానాల వాసి అని.. ఆయన స్ఫూర్తితో పింగళి సూరన సారస్వత సంఘాన్ని ప్రముఖ వైద్యుడు గెలివి సహదేవుడు, తెలుగు పండితుడు గొట్టిముక్కల సుబ్రహ్మణ్యశాస్త్రిలు ఏర్పాటు చేసి తెలుగు భాష అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల గ్రామీణం

ఆధార్ అధనంపై ఫిర్యాదు చేయొచ్చు

ఆధార్ కార్డుల్లోని తప్పుల సవరణ, పేరు, చిరునామాల్లో మార్పులు, నవీకరణ తదితరాల కోసం జనం ఆధార్ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధార్‌కు సంబంధించిన వివిధ మార్పులు చేర్పుల కోసం ఇదివరకు ఉన్న సర్వీసు రుసుము కాస్త పెంచింది. కేంద్రాల నిర్వాహకులు ఆ మేరకే వసూలు చేయాలి.

– న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

ఆన్‌లైన్లో సంప్రదించొచ్చు

- రెసిడెంట్.యూఐడీఏఐ.ఇన్ లోకి వెళ్లి లింక్ ద్వారా నేరుగా ఫిర్యాదు చేయొచ్చు లేదంటే హెల్ప్(అట్)యూఐడీఏఐ.జీవోవీ.ఇన్‌కు ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు.
- ఫిర్యాదు చేసిన వెంటనే రెఫరెన్స్ నంబరు వస్తుంది. దాని ద్వారా నివేదికను ట్రాక్ చేసుకోవచ్చు.

కొత్త సర్వీసు ఛార్జీలు

- కొత్తగా ఆధార్ నమోదు ఉచితం. డాక్యుమెంటు అప్‌లోడ్ చేయడానికి రూ.75 ఛార్జీలు ఉంటాయి.
- 5-7, 15-17 ఏళ్ల లోపు వారికి బయోమెట్రిక్ అప్‌డేట్ ఉచితం.
- పేరు, చిరునామా, పుట్టిన తేదీ, జెండర్, చరవాణి నంబరు, ఈ మెయిల్ ఐడీ నమోదుకు రూ.75 ఛార్జీలు ఉంటాయి.
- 17ఏళ్ల పైనున్న వారికి బయోమెట్రిక్ అప్‌డేట్ రూ.125 ఛార్జీలు ఉన్నాయి.
- ఆధార్ కార్డు డౌన్‌లోడ్, ప్రింట్‌కు రూ.40 ఛార్జీలు ఉన్నాయి.

1947 నంబరుకు ఫోన్ చేస్తే..

- ఆధార్ కేంద్రాల్లో నిర్దేశిత రుసుము కంటే అధికంగా వసూలు చేస్తే 1947 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు.

కాట్లు దాచి.. రూ.కోట్లు దోచి

■ కుక్కలకు సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు చేస్తున్నారట

ఆదోని, నంద్యాల, కర్నూలు, పురపాలికలు, వైద్యాలయం, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలో రోజురోజుకు కుక్కల బారిన పడిన వారి సంఖ్య పెరుగుతోంది. ఓవైపు శునకాలకు సంతాన నియంత్రణ శస్త్ర చికిత్సలు, వ్యాక్సినేషన్ పేరుతో రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో ఫలితాలు కానరావడం లేదు. ఉమ్మడి జిల్లాలో ప్రతి నెలా వెయ్యి మంది బాధితులు నమోదవుతున్నారు. పరిస్థితి తీవ్రత నేపథ్యంలో ఈ ఏడాది జూన్ నుంచి కు.ని.శస్త్ర చికిత్స పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో బాధితుల కేసుల సంఖ్య తగ్గాల్సి ఉండగా.. మరింత ఎక్కువవడం అనుమానాలకు తావిస్తోంది. జనవరి నుంచి ఇప్పటి వరకు కర్నూలులో 11,921, నంద్యాలలో 10,826 మందిని శునకాలు కరిచాయి.

పెడచెవిన పెడుతున్నారు

▸▸ గతంలో చికిత్స అనంతరం చెవికి క్లిప్పు వేసేవారు. ప్రస్తుతం వాటి చెవులను కొద్దిగా కత్తిరిస్తున్నారు. అలా చెవికోసిన శునకాలు ఎక్కడా కనిపించడం లేదు. చికిత్సలు చేయని వాటికి కూడా కాట్లు పెడుతున్నారన్న ఆరోపణలున్నాయి.

▸▸ కు.ని. చికిత్సలు చేసి యాంటీ రేబిస్ టీకాలు వేయాల్సి ఉంది. అనంతరం ఐదు రోజులపాటు నియంత్రణలో ఉంచాలి. వీటికి ఆహారం, చికిత్సకయ్యే ఖర్చు కలిపి ఒక్కోదానికి రూ.1,500 కేటాయించారు.

ఎక్కడ.. ఎంత ఖర్చు

▸▸ కర్నూలు నగరంలో 52 వార్డులున్నాయి. గార్గేయపురం ప్రాంతంలో చికిత్స విభాగం ఏర్పాటు చేశారు. 2022 నుంచి 2025 వరకు 13,597 శునకాలకు కు.ని. చికిత్సలు చేసి టీకాలు వేసినట్లు అధికారులు చెబుతున్నారు. రోజూ 20-40 కుక్కలకు చికిత్స చేయాలని నిర్ణయించారు. ఈ లెక్కన రూ.2.03 కోట్లు ఖర్చు చేసినట్లు లెక్కలు రాశారు.

▸▸ ఆదోనిలో మొదటి విడత కింద 1,407 కుక్కలకు కు.ని. చికిత్సలు చేయాలని నిర్ణయించారు. రాంజల చెరువు ప్రాంతంలో ఏబీసీ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జూన్‌లో పనులు ప్రారంభించారు. రోజూ ఏడు కుక్కలకు కు.ని. చికిత్సలు చేయాలని భావించారు. ఇప్పటివరకు 307 కుక్కలకు చేశారు. గత మూడు నెలలుగా సేవలు నిలిచిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో రెండుసార్లు రూ.20 లక్షల చొప్పున కేటాయించినట్లు చూపారు. వీటికి సంబంధించిన దస్త్రాలు మాయం చేశారు.

▸▸ నంద్యాలలో భీమవరం రహదారిలో కు.ని. చికిత్స విభాగం ఏర్పాటు చేశారు. రోజూ 20 శునకాలకు ఆపరేషన్లు చేయాలని భావించారు. జూన్ నుంచి ఇప్పటివరకు 1,167 వరకు చేసినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఒక్కో శునకానికి రూ.1,650 ఖర్చు చేస్తున్నారు.

ఆదోని మార్కెట్ యార్డు నిండా పత్తి సంచులు

దూది రైతు వెలవిల

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు రోజురోజుకు పతనమవుతున్నాయి. బుధవారం 7,735 క్వింటాళ్ల పత్తి అమ్మకానికి వచ్చింది. క్వింటా కనిష్ఠ ధర రూ.3,969, గరిష్ఠం రూ.7,289 పలికింది. మధ్యస్థం రూ.7,089 నమోదైంది. ఈనెల మొదటి వారం నుంచి ధరలు తగ్గుతూ వస్తున్నాయి. " ఎకరాకు రూ.30-40 వేలు ఖర్చు చేసి సాగు చేశాం.. తుపాన్ల కారణంగా పంట దెబ్బతింది.. ఎకరాకు 10-15 క్వింటాళ్లు వస్తోంది.. చేతికొచ్చిన పంటకు ధర రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తేదీ	గరిష్ఠ ధర(రూ.)
5	7,470
6	7,389
7	7,449
10	7,639
11	7,322

శ్రీరాముడి శోభాయాత్ర

ఎమ్మిగనూరులోని వీవర్స్ కాలనీ చేనేత మైదానంలో చేపట్టిన విశ్వశాంతి యాగం నేత్రపర్వంగా కొనసాగుతోంది. పట్టణంలో బుధవారం రాత్రి కృష్ణజ్యోతి స్వరూపానందస్వామి ఆధ్వర్యంలో సీతారాముల శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, పార్థసారథి పాల్గొని భక్తులతో కోలాటం ఆడారు.

–న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు గ్రామీణం

నిధులు దండి.. వివరాలు తొండి

■ ఎన్టీఆర్ వైద్యసేవల అడ్మిషన్లలో తేడాలు ■ పెద్దాసుపత్రిలో అధికారుల తనిఖీ

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : కర్నూలు సర్వజన వైద్యశాలలో ఎన్టీఆర్ వైద్య సేవ 'లెక్క' తప్పింది.. ప్రతి నెలా సుమారు 3,200 మంది సేవలు పొందుతున్నారు.. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మొదటిస్థానంలో ఉన్నట్లు వైద్యాధికారులు గొప్పలు చెప్పుకొంటున్నారు. ఈ లెక్కలన్నీ డొల్లే అన్నట్లు తేలిపోయింది. ఆన్‌లైన్‌లోని లెక్కలకు.. ఆస్పత్రిలో రోగుల సంఖ్యకు సరిపోలని విషయం బయటపడింది.

నమోదు 800.. ఉన్నది 300

❍ ఎన్టీఆర్ వైద్య సేవల కింద చికిత్స పొందుతున్న వివరాలు పరిశీలించాలని ఆదేశాలు రావడంతో ఎన్టీఆర్ వైద్యసేవల జిల్లా సమన్వయకర్త భాస్కర్‌రెడ్డి తదితరులు బుధవారం తనిఖీలు చేశారు. ఆస్పత్రిలో ఎన్టీఆర్ వైద్యసేవల కింద 860 అడ్మిషన్లు ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపుతోంది. వివిధ విభాగాల్లో ఉన్న పడకలపై 300 మందికి మించి రోగులు లేరు.

సం॥	కేసులు	అప్రూవల్ అయినవి	క్లెయిమైన కేసులు	మంజూరైన నిధులు(రూ.లలో)
2021	21,255	20,872	15,004	20,56,91,987
2022	25,754	24,666	21,121	8,57,97,629
2023	29,412	29,784	19,408	1,79,44,712
2024	36,432	34,899	17,695	18,36,64,809
2025	32,456	32,365	28,781	29,04,35,101

నాడితప్పిన పర్యవేక్షణ

- జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్, గైనిక్‌కు సంబంధించి కేసుల తీవ్రతను బట్టి ఎన్టీఆర్ వైద్యసేవల కింద రోగులను అడ్మిట్ చేసుకోవాలి. అలాకాక ప్రతి ఒక కేసును ఎన్టీఆర్ వైద్యసేవల కింద చేర్చారు.
- ఒకటి, రెండు రోజుల్లో నయమైపోవడంతో పలువురు చెప్పకుండా వెళ్లిపోయారు. ఇలాంటి వారు వందల సంఖ్యలో ఉన్నారు. వారందరూ ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపుతోంది.
- శస్త్రచికిత్సలు వాయిదా వేయడం.. నిరంతరం తిప్పుకొంటుండటంతో పలువురు వైద్యులకు చెప్పకుండా వెళ్లిపోయిన కేసులు వందల సంఖ్యలో ఉన్నాయి.
- చనిపోయినవారు 120 మంది వరకు ఉన్నారు. ఈ కేసులను మూసేయాల్సి ఉండగా అలానే ఉంచేశారు.

నమోదు నలత

- ఎన్టీఆర్ వైద్యసేవల కింద విధులు నిర్వహించే డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను ఆసుపత్రిలో ఆయా విభాగాల హెచ్‌వోడీలు సమన్వయం చేసుకోవాలి. వైద్యాలయంలో ఆ పరిస్థితి కానరావడం లేదు.
- ఆస్పత్రిలో ఎంతమంది చేరుతున్నారు.. ఎంతమంది డిశ్చార్జి అవుతున్నారన్న వివరాలు పర్యవేక్షకుడికి తెలియడం లేదు.
- ఎన్టీఆర్ వైద్య సేవలు కింద చికిత్స తీసుకుని డిశ్చార్జి అయి వెళ్లినవారికి ఛార్జీలు, మందులతోపాటు వైద్య పరీక్షలు బయట చేసి ఉంటే వాటికి సంబంధించిన బిల్లులు ఇవ్వాల్సి ఉంది. గత ఆరు నెలలుగా చాలామందికి ఇవ్వలేదు. ఖాతాల్లో వేస్తామని రోగులకు చెప్పి పంపేస్తున్నారు.

మీ డబ్బు.. మీ హక్కు

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ బ్యాంకుల్లో పదేళ్లకుపైగా లావాదేవీలు జరగని ఖాతాలు లక్షల్లో ఉన్నాయి. 7,57,818 ఖాతాలకు సంబంధించి ఎలాంటి లావాదేవీలు జరగడం లేదని అధికారులు గుర్తించారు. ఆయా ఖాతాల్లో రూ.157.14 కోట్ల నగదు మూలుగుతోంది. ఈ మొత్తాన్ని సంబంధిత వ్యక్తులు తిరిగి పొందేందుకు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా అవకాశం కల్పించింది. దీని కోసం 'మీ డబ్బు-మీ హక్కు' పేరుతో అవగాహన కల్పిస్తోంది.

– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

ఏళ్లుగా నిల్వ

కర్నూలు జిల్లాలో 4,38,740 ఖాతాల్లో రూ.92.55 కోట్లు, నంద్యాల జిల్లా పరిధిలో 3,19,078 ఖాతాల్లో రూ.64.59 కోట్ల నిధులు ఏళ్లుగా మురుగుతున్నాయి. లావాదేవీలు నిర్వహించని ఖాతాల్లో వ్యక్తిగత, ప్రభుత్వ, వివిధ సంస్థల ఖాతాలు ఉన్నాయి.

కారణాలెన్నో..

- ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఈ ఖాతాలు ఉన్నాయి. ఖాతాదారులు మృతి చెందడం.. దీర్ఘకాలిక పెట్టుబడుల కింద వీటిని ఉంచడం, బ్యాంకుల్లో నగదుకు గ్యారెంటీ ఉంటుందన్న ధీమాతో అలానే వదిలేస్తున్నారు.
- ఖాతా తెరిచినప్పుడు నామినీ వివరాలు నమోదు చేయకపోవడంతో ఆ మొత్తం ఎవరికీ రాకుండా అలాగే ఉండిపోయింది.
- బ్యాంకులో నగదు జమ చేసి అకాల మృత్యువాత పడటం.. ఆ వివరాలు కుటుంబ సభ్యులకు తెలియకపోవడం మరో కారణం. సరైన పత్రాలు లేకపోవడం, చిరునామాల్లో తప్పులు దొర్లడం లాంటి వాటితో నిల్వలు పేరుకుపోయాయి.

ఇలా పొందొచ్చు

- ఖాతాల్లో డబ్బులను సంబంధిత ఖాతాదారులు అసలైన ధ్రువపత్రాలు ఇచ్చి తీసుకోవచ్చు. ఖాతాదారులు చనిపోతే వారికి సంబంధించిన మరణ ధ్రువీకరణ పత్రం చూపి కుటుంబసభ్యుల అంగీకార పత్రాన్ని తీసుకెళ్లి నామినీలు డబ్బు తీసుకునే సదుపాయాన్ని ఆర్‌బీఐ కల్పించింది. ఖాతాదారుడు ఉంటే సంబంధించిన పత్రాలు తీసుకెళ్లి ఈకేవైసీ చేయించుకోవడం ద్వారా ఖాతాను పునరుద్ధరించుకోవచ్చు.

	ఖాతాలు	నగదు (రూ.కోట్లలో)
వ్యక్తిగతం	4,24,109	72.89
సంస్థలు	11,749	12.52
ప్రభుత్వం	2,882	7.14

వనితకు 'శక్తి' యాప్

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన శక్తియాప్‌ను సెల్‌ఫోన్లలో డౌన్‌లోడు చేసుకోవాలని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ సూచించారు. ఆపద సమయంలో మహిళలు, బాలికలు యాప్‌తో పాటు శక్తి వాట్సప్-7993485111, డయల్ 112, డయల్ 100లను సంప్రదించవచ్చన్నారు.

పట్నమొచ్చారు.. పట్టా పొందారు

పేదింటి బిడ్డలు.. ఉన్నత చదువులకు ఊరొదిలి వచ్చారు.. పట్టుపట్టి చదివారు.. చదువులో 'మార్కు' చూపారు.. రాయలసీమ విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించిన స్నాతకోత్సవంలో సందడి చేశారు. ఇంజినీరింగ్‌లో 15, పీజీలో 60 మంది అభ్యర్థులు.. గవర్నరు చేతులమీదుగా బంగారు పతకాలు అందుకొన్నారు. 394 మందికి పట్టాలు ప్రదానం చేశారు. తమ ఆనందాన్ని కుటుంబ సభ్యులతో పంచుకొన్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు విద్య

అమ్మ నడిపించింది

– సరస్వతి, ఎంఏ ఇంగ్లిష్, కర్నూలు

నాన్న రాజశేఖర్ చనిపోయినప్పటి నుంచి అమ్మ సునంద అన్నీ తానై కష్టపడి నన్ను చదివించింది. పీజీ చేస్తానని ఆమెను అడిగితే గౌరవించారు. ఆమె నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎంఏ ఇంగ్లిష్ పూర్తి చేశా. దీంతోపాటు బంగారు పతాకం రావడం సంతోషంగా ఉంది. కళాశాలలో నేర్చుకున్న అంశాలను భవిష్యత్తులో విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పేందుకు ఉపయోగిస్తా.

తెలుగు భాషాభివృద్ధికి కృషి

– నీలిమ, ఆత్మకూరు

వర్సిటీ ప్రాంగణంలోనే తెలుగులో పీజీ పూర్తి చేశా. బంగారు పతాకం రావడం ఎంతో ఆనందంగా ఉంది. ఇదే స్ఫూర్తితో ఉపాధ్యాయినిగా రాణించడంతోపాటు తెలుగు భాష అభ్యున్నతికి నావంతు కృషి చేస్తా. చిన్నప్పటి నుంచే తెలుగు భాషంటే మమకారం. అమ్మ నాగసులోచన, నాన్న నాగరాజు వ్యవసాయం చేస్తారు. కష్టపడి నన్ను చదివించారు. వారి కష్టాన్ని వృథా చేయకుండా భవిష్యత్తులో ఉన్నత హోదాకి చేరుకుంటా. ఎలాంటి కష్టాలు లేకుండా చూసుకుంటా.

నాన్న ప్రోత్సాహంతోనే..

– యశ్విత, బీటెక్, బత్తలపల్లె

మాది అనంతపురం జిల్లా బత్తలపల్లె గ్రామం. ఆర్‌యూ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ (ఈసీఈ) పూర్తి చేశా. బంగారు పతకం రావడం సంతోషంగా ఉంది. నాన్న త్రిమూర్తి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. మొదట్లో ఇంటికి దూరంగా వెళ్లేందుకు ధైర్యం సరిపోలేదు. నాన్న ప్రోత్సాహంతోనే ఆర్‌యూ ఇంజినీరింగ్ కళాశాలలో చదివా. పాఠ్యాంశాల్లో సందేహాలొస్తే అధ్యాపకుల దృష్టికి తీసుకెళ్లి నివృత్తి చేసుకునేవాళ్లం. నాన్న మాటలే నా విద్యాభివృద్ధికి మార్గదర్శకంగా నిలిచాయి.

(c) eenadu

పనుల్లో పురోగతి పెంచాలి

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గాజుల దిన్నె జలాశయం వద్ద రూ.19.50 లక్షలతో నిర్మిస్తున్న నూతన గాజుల దిన్నె మల్టివిలేజ్ స్కీం పనులు జరుగుతున్నట్లు జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సీహెచ్ మనోహర్ తెలిపారు. జలాశయం వద్ద నిర్మించిన ఇన్‌టెక్ వెల్, నీటిట్యాంకు, పైపులైను పనులను బుధవారం పరిశీలించారు.

IN THE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE, AT: GADWAL
OS. No. 280 of 2023

Between:
Canara Bank Ltd, A Banking Company registered under, the companies Act, 1956 having its registered office at premises of Estate section Head office No 112, JC Road, BANGLORE-560002 and having its Branch office af Gadwal Represented by the manager, Nageshwara Rao S/o. Rama Rao, Age: 32 years, R/o Gadwal.
...Plaintiff

AND

1) **Chinna Reddy S/o. K. Hanmi Reddy**, Age:42 yrs, occ: Agriculture, R/o H.No. 2-17, Neelahalli Village, Dhasoor Mandal, Jogulamba Gadwal Dist.,
2) **Musti Veeranna S/o. Hanumanthu**, Age: 34 yrs, Occ: Agriculture, R/O H.No. 1/98/1, Neelahalli Village, Dharoor Mandal, Jogulamba Gadwal District.
...Defendants

whereas the above named plaintiff has filed a suit against Defendants for recovery of loan amount of **Rs:19,48,829/-** and the Hon'ble court has ordered substituted service of summons on Defendant No.2 under order V Rule 20 C.P.C. by way of publication in the Eenadu newspaper. Therefore, the said Defendant No.2 is hereby informed to appear before the Hon'ble court of principal Junior civil Judge **on or before 28-11-2025**, either in person (or) through Advocate, failing which the summon deemed as saved and the matter will be heard and decided.

Sd/- D. Prabhakar, D. Shashank
Advocates,
Raja Veedhi Gadwal

IN THE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE, AT GADWAL
OS. No. 279 of 2023

Between:
Canara Bank Ltd, A Banking Company registered under, the companies Act, 1956 having its registered office at premises of Estate section Head office No 112, JC Road, BANGLORE-560002 and having its Branch office af Gadwal Represented by the manager, Nageshwara Rao S/o. Rama Rao, Age: 32 years, R/o Gadwal.
...Plaintiff

AND

1) **K. Eswaramma @ Kurva Eeshwaramma**, W/o. K. Rangaswamy, Age: 45 years, occ: Agriculture, R/o H.No. 1-56, Neelahalli Village, Dharoor Mandal, Jogulamba Gadwal District.
2) **K. Rangaswamy S/o late K. Yellappa**, Age: 52 years, occ: Agriculture, Dharoor Mandal, Jogulamba Gadwal District.
3) **Musti Veeranna S/o Hanumanthu**, Age: 34 year, occ: Agriculture R/o H. No. 1/98/1, Neelahalli Village, Dharoor Mandal, Jogulamba Gadwal District.
...Defendants

Where as the above named plaintiff has filed a suit against Defendantes for recovery of loan amount of **Rs: 19,56,118/-** and the Hon'ble cout has ordered substituted service of summons On Defendant No. 3 under order V Rule 20 C.P.C. by way of publication in the news paper. Therefore, the said Defendant No.3 is hereby informed to appear before the Hon'ble court of principal Junior civil Judge **on or before 28-11-2025**, either in person (or) through advocate, failing which the matter will & summon deemed as saved and the matter will be heard and decided.

Sd/- D. Prabhakar, D. Shashank
Advocates,
Raja Veedhi Gadwal

బస్సులు ఆపక.. నిరీక్షణ తప్పక

మండలంలోని జూలకల్లు స్టేజీ వద్ద బస్సు ఆపక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఆదర్శ పాఠశాలలో 652 మంది విద్యార్థులు ఉన్నారు. ఒకటే విద్యార్థి బస్సు నడుపుతున్నారు. అది వెళ్లే మార్గంలోని విద్యార్థులకే కిక్కిరిసిపోతోంది. మిగతా 10 గ్రామాల విద్యార్థులు నిత్యం ఆటోలు, వివిధ వాహనాల ద్వారా వస్తుంటారు. కర్నూలు-గూడూరు- ఎమ్మిగనూరుకు వెళ్లే బస్సులు జూలకల్లు స్టేజీ వద్ద ఆగడం లేదు. గంటల తరబడి రహదారిపై పడిగాపులు కాస్తూ.. ఉదయం తరగతులకు, సాయంత్రం ఇంటికి వెళ్లేందుకు ఆలస్యం అవుతుందని విద్యార్థినులు వాపోతున్నారు. – న్యూస్‌టుడే, జూలకల్లు(గూడూరు గ్రామీణం)

చెదిరిన మెట్లు.. నిత్యం పాట్లు

ఆదోని పట్టణంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వచ్చే రోగులకు, సహాయకులకు మెట్లు లేక పాట్లు తప్పడం లేదు. ఆస్పత్రి ప్రాంగణంలోని ఓపీ విభాగం సీసీ రహదారి నిర్మించాలని, అక్కడ మెట్లు తొలగించారు. పనులు ప్రారంభించవపోవడంతో, ఓపీ విభాగం కట్ట ఎక్కాలంటే.. ఎత్తు ఎక్కువగా ఉంది. దీంతో అక్కడ పగిలిపోయిన సిమెంటు దిమ్మెలు, సింకు వేశారు. అవి ఎగుడు దిగుడుగా ఉండటంతో రోగులు, సహాయకులు ఇబ్బందులు పడుతున్నారు. రోజూ సరాసరి ఓపీ 600-700 నమోదవుతుంది. అందరికీ ఇబ్బందులు తప్పడం లేదు. వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం చూస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇది వరకే సమస్య పరిష్కరించాలని ఉన్నతాధికారులకు పుర ప్రజలు వేడుకున్నా చర్యలు తీసుకోవడం లేదు. త్వరితగతిన సీసీ రహదారి వేసి, వాటిపై మెట్లు నిర్మించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆదోని వైద్యం

డబ్బులు వేరే ఖాతాకు వెళ్లాయా.. ఇలా చేయండి

మీ కోసం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ప్రస్తుతం నగదు బదలాయింపులన్నీ చరవాణి ద్వారానే చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పొరపాటున చరవాణి నుంచి యూపీఐలో పంపిన డబ్బులు వేరే వారి ఖాతాలకు వెళ్తుంటాయి. అలాంటప్పుడు నిబంధనల మేరకు సంస్థలను సంప్రదిస్తే డబ్బు తిరిగి పొందవచ్చు. అదెలాగో తెలుసుకుందాం..

☛ నగదు వేరే ఖాతాకు పొరపాటున బదిలీ జరిగితే.. ఎంత త్వరగా చర్య తీసుకుంటే.. డబ్బు తిరిగి పొందే అవకాశం అంత ఎక్కువగా ఉంటుంది. డబ్బు పంపిన యూపీఐ ఐడీ, తేదీ, మొత్తం వంటి వివరాలు సేకరించాలి.

☛ ముందుగా ఏ నంబరుకు డబ్బులు పంపారో చూసుకోవాలి. తర్వాత యూపీఐ యాప్ కస్టమర్ సర్వీస్ సెంటరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి. పంపిన యూపీఐ ఐడీ వివరాలు అందజేయాలి. తర్వాత మీ బ్యాంకును సంప్రదిస్తే డబ్బులు తిరిగి పొందేలా సహాయం చేస్తారు.

☛ సంబంధిత బ్యాంకు కస్టమర్ సర్వీస్ నంబరుకు ఫోన్ చేసి వివరాలు ఇవ్వాలి. వాళ్లకు మీరు డబ్బులు పంపిన యూపీఐ ఐడీ, వివరాలు తెలపాలి. అప్పుడు బ్యాంకు మీరు డబ్బు పంపిన వ్యక్తికి సందేశాన్ని పంపుతుంది. తిరిగి వచ్చేందుకు వీలుంది.

☛ యూపీఐ సేవలు అందించే నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేయవచ్చు. పంపిన డబ్బు పెద్ద మొత్తంలో ఉంటే సైబర్ పోలీసు స్టేషన్‌లో సమాచారమివ్వాలి.

సూర్యనారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆలయంలో ఆశ్లేషబలి సర్ప పూజలు చేస్తున్న అర్చకులు

కర్నూలు అధ్యాత్మికం, న్యూస్‌టుడే: కార్తిక మాసం ఆశ్లేష నక్షత్రాన్ని పురస్కరించుకుని గుత్తి రోడ్డులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో బుధవారం ఆశ్లేష బలి సర్ప శాంతి నాగ మండల పూజలు విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు సర్పాకారంలో అలంకరణ చేసి, హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ శివరామకృష్ణ, సభ్యులు డా.సి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ నడవడికతోనే విజయాలు

○ గవర్నర్ అబ్దుల్ నజీర్



జ్యోతి వెలిగిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, వేదికపై ఎంపీ నాగరాజు, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, కలెక్టర్ డా.సిరి, మాంటిస్సోరి పాఠశాల అధినేత రాజశేఖర్

ఈనాడు, కర్నూలు, కర్నూలు విద్య, న్యూస్‌టుడే : విద్యార్థులు పాఠశాలల్లో నేర్చుకునే అంశాలు, అలవర్చుకునే క్రమశిక్షణ, నడవడికే.. జీవితంలో విజయం సాధించేందుకు బాటలు వేస్తాయని గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. కర్నూలు ఎ.క్యాంపులోని మాంటిస్సోరి విద్యాసంస్థల స్వర్ణోత్సవ ప్రారంభ కార్యక్రమానికి ఆయన బుధవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 50 ఏళ్ల పాఠశాల ప్రస్థానంలో మాంటిస్సోరిలో చదువుకున్న ఎందరో నేడు ఉన్నత స్థానాల్లో ఉండటం ప్రశంసనీయ విషయమని తెలిపారు. కాలానుగుణంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, ఉపకరణాల సాయంతో విద్యాబోధన చేస్తూ విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడం అభినందనీయమని పేర్కొన్నారు. మాజీ ఎంపీ టి.జి.వెంకటేశ్ మాట్లాడుతూ తన కుమారుడు భరత్, కుమార్తెను కూడా మాంటిస్సోరిలోనే చదివించానని తెలిపారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, ఎస్పీ విక్రాంత్‌పాటిల్, ఆ విద్యాసంస్థల ఛైర్మన్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా స్వర్ణోత్సవ లోగోను, గీతాన్ని గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆవిష్కరించారు. పాఠ్య ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఆ పాఠశాల వ్యవస్థాపకురాలు కల్యాణమ్మ విగ్రహానికి నివాళులర్పించారు.

పురస్కారాల అందజేత

కర్నూలు, అనంతపురం, హైదరాబాద్‌లో ఉన్న మాంటిస్సోరి విద్యాలయాలకు ఉత్తమ పాఠశాలల పురస్కారాలను గవర్నర్ చేతులమీదుగా అందజేశారు. కర్నూలు విద్యానగర్‌లోని మాంటిస్సోరి స్కూల్, మోంట్ ఇంటర్నేషనల్ స్కూల్, మైండ్స్ ఇన్ఫినిటీ స్కూల్, అలంపూర్‌లోని మాంటిస్సోరి రెసిడెన్షియల్ స్కూల్, కర్నూలు ఎ.క్యాంపులోని మాంటిస్సోరి సీనియర్ సెకండరీ స్కూల్, ఐండ్స్ రెసిడెన్షియల్ స్కూల్, మంచిలింగాలలోని బలంప్స్ స్కూల్, అనంతపురంలోని ఎలైట్ స్కూల్, హైదరాబాద్‌లోని స్ప్రౌట్జ్ స్కూల్, మాంటిస్సోరి ఇన్విక్టస్ స్కూల్స్‌కు చెందిన ప్రధానోపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేశారు. డీఈవో శామ్యూల్ పాల్ కరస్పాండెంట్లు రవి, డా.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించింది తెదేపానే

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించింది తెదేపా అని మంత్రి టీజీ భరత్ అన్నారు. నగరంలోని మౌర్యఇన్‌లో బుధవారం నిర్వహించిన శ్రీ వాసవి మహిళా మండలి 35వ వార్షికోత్సవంలో మంత్రి, ఆయన సతీమని శిల్పా భరత్, వాసవి మహిళా మండలి గౌరవ అధ్యక్షురాలు టీజీ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 35 ఏళ్లుగా శ్రీ వాసవి మహిళా మండలి ప్రణాళిక బద్ధంగా కార్యక్రమాలు రూపొందిస్తుందని కొనియాడారు. ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన మహిళలు మరింత చైతన్యవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ఈ నెల 16న జరగనున్న ఆర్యవైశ్యుల కార్తిక వన భోజన కార్యక్రమంలో ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొని తమ ఐక్యతను చాటాలన్నారు. గత ఎన్నికల్లో 95 శాతం మంది ఆర్యవైశ్యులు కూటమి అభ్యర్థులకు ఓట్లు వేశారని, ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆర్యవైశ్యులకు సముచిత ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. అనంతరం లక్కీడిప్ తీసి విజేతలకు మంత్రి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్

ఉర్దూ వర్సిటీ అభివృద్ధికి కృషి

ఛైర్మన్ మధుమూర్తిని సత్కరిస్తున్న ప్రొఫెసర్లు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ వర్సిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ మధుమూర్తి పేర్కొన్నారు. బుధవారం ఆర్‌యూ స్నాతకోత్సవానికి హాజరైన ఆయన ఉర్దూ వర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న [illegible] కోర్సులు అన్ని విశ్వవిద్యాలయాల్లో అమలు చేసే విధంగా ప్రణాళికలు రచించుకోవాలన్నారు. ఏఐ కోర్సులతో విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ షావలి ఖాన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లోకనాథ, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పనిచేసేవారికి సముచిత స్థానం

ప్రమాణ స్వీకారం చేయిస్తున్న నంద్యాల పార్లమెంటు నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, వేదికపై ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, తెదేపా నేత గౌరు వెంకటరెడ్డి తదితరులు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : పార్టీ కోసం పనిచేసేవారికి సముచిత స్థానం లభిస్తుందని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, తెదేపా నేత గౌరు వెంకటరెడ్డి అన్నారు. కర్నూలు నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని ఓ ఫంక్షన్ హాలులో పాణ్యం నియోజకవర్గ పరిధిలోని బూత్, క్లస్టర్, యూనిట్, గ్రామ, మండలాల కమిటీల్లో కొత్తగా ఎన్నికైన సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన వారిచేత నంద్యాల పార్లమెంటు నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైనవారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వలస విద్యార్థులకు సీజనల్ వసతి గృహాలు

ఢణాపురం(ఆదోని విద్య), న్యూస్‌టుడే: కూలి పనుల కోసం నగరాలకు వలసలు వెళ్లే గ్రామస్థుల పిల్లల కోసం గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం సీజనల్ వసతి గృహాలను ప్రారంభిస్తోందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆదోని ఎమ్మెల్యే డాక్టరు పార్థసారథి అన్నారు. ఆదోని మండలం ఢణాపురం గ్రామంలో విద్యా శాఖ ఆధ్వర్యంలో సీజనల్ వసతి గృహాన్ని ఆదోని ఎమ్మెల్యే డాక్టరు పార్థసారథి, ఎమ్మెల్సీ బి.టి.నాయుడు బుధవారం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు పేస్టు, బ్రష్ తదితర కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు రమేశ్, ఎంపీడీవో జనార్దన్, మండల విద్యాధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బి.టి.నాయుడు, ఎమ్మెల్యే డాక్టరు పార్థసారథి

OFFICE OF THE DISTRICT MEDICAL & HEALTH OFFICER, KURNOOL

Rc. No.009 School Children/ DBCS/KNL. Dated: 06-11-2025

DRAFT TENDER NOTIFICATION

The sealed tenders are invited from the standard agencies/ manufactures and registered suppliers for supply of THE FOLLOWING SPECTECLES to District Medical & Health Officer/ District Blindness Control Society, Kurnool **FOR SUPPLY TO SCHOOL HEALTH PROGRAMME.**

SPECTACLES Quality Specification

1. Frame: TR-90/Polycarbonate full frame (Boys and Girls with different Colours)
2. Lenses: CR-39 (Plastic Lenses)
3. Frame Size (s): 32/34/36/38/40/42/44/46
4. Cleaning Cloth with good Quality for cleaning the lens
5. Hard Case fixed with sticker on front side of the frame box as following:
6. National Programme for Control of Blindness and Visually Impaired along with logo
7. District Name: 8. Name of the School: 9. Village/ Town:
10. Name of Student 11. Student ID: 12. Class:
13. Power of the Lens: R/E________L/E________

Cost of Tenders Application is Rs. 1,000/- (One Thousand Only) each.
EMD Amount will be Rs. 12,000/- (Twelve Thousand Only) per Bidder to be paid through Demand Draft in favour of DM & HO, Kurnool, while submitting the Tender.

No correspondence will be entertained in this regard.
The District Procurement Committee Decision is final in deciding the Spectacles as per Standards.

- The tender application forms will be issued from: 13-11-2025 to 19-11-2025, 4.00 PM at O/o. DBCS, Govt. Regional Eye Hospital, Kurnool.
- Last date to submit filled in application is on: **20-11-2025 by - 4.00 PM**
- Date of Opening of Tenders: **21-11-2025 - 3.30 at the Chambers of Joint Collector.**

Sd/- **DM & HO** Sd/- **JOINT COLLECTOR**

సమస్యల పరిష్కారంలో ముందుంటాం

ఉద్యోగులతో ఎన్జీవో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జవహర్‌లాల్

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఏపీ ఎన్జీవో సంఘం ఎప్పుడూ ముందుంటుందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.జవహర్‌లాల్ పేర్కొన్నారు. సభ్యత్వ నమోదు అనంతరం ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. నగరంలోని సమీకృత ఆర్థిక భవన సముదాయంలో బుధవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డి.సాంబశివారెడ్డి, ఆర్.వి.రమణ, జిల్లా కోశాధికారి ఎం.భాస్కర్ నాయుడు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రామకృష్ణారెడ్డి, ఏపీటీఎస్ఏ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, వ్యవసాయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, ట్రెజరీ శాఖ రాష్ట్ర నాయకులు కరుణాకర్ పాల్గొన్నారు.

◆ ఏపీ ఎన్జీవో సంఘం నగర శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టినట్లు ఆ సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నగర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ కాశన్న, రామకృష్ణ పేర్కొన్నారు. వివిధ కార్యాలయాల్లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా అధ్యక్షురాలు లీలావతి, కార్యదర్శి బంగారి, మెడికల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

తొలి కాన్పులోనే ముగ్గురికి జననం

ముగ్గురు పిల్లలతో తల్లి భారతి, వైద్యులు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: ఒకే కాన్పులోనే తల్లి ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. మహబూబ్‌నగర్‌కు వీపనగండ్ల మండలం రగడపల్లె గ్రామానికి చెందిన భాస్కర్, భారతి దంపతులు. భారతిని ప్రసవం నిమిత్తం కర్నూలు నగరం ఎన్‌ఆర్‌పేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. గర్భంలో ముగ్గురు శిశువులు ఉన్నట్లు గుర్తించిన వైద్యులు ఈ నెల 5న శస్త్ర చికిత్స చేసి బయటకు తీశారు. వారిలో ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నట్లు తెలిపారు. వారి బరువులు 1.4, 1.7, 1.8 కేజీలు ఉన్నట్లు చెప్పారు. తల్లి, పిల్లలు ఆరోగ్యంగా ఉండటంతో బుధవారం డిశ్చార్జ్ చేశారు. శస్త్రచికిత్సలో డా.శశికళ, పీడియాట్రిక్ వైద్యురాలు డా.లక్ష్మి, మత్తు వైద్యుడు డా.రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగి వాహనం నడిపితే జైలుకే

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో వాహనం నడిపి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలో పోలీసులకు చిక్కితే జైలుశిక్ష తప్పదని జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ హెచ్చరించారు. మద్యం మత్తులో వాహనాలు నడపటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని అదుపు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారికి నెల రోజులు జైలుశిక్ష పడేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది జనవరి 1 నుంచి నవంబరు 11 వరకు 7890 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశామన్నారు.

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

KIA Carens Model 2022 AP39QL0002, Mahindra Bolero Maxx Model 2023 AP39VA0254, TATA SFC712 Model 2023 AP39VA6794, Eicher 1075 School Bus Model 2018 AP39UB4089, Eicher 3015 Model 2022 AP39UB8633, and Eicher 3019 Model 2024 AP39UV6112 for Details Contact: SUNDARAM FINANCE Limited, Kurnool. ✆ 94409 09740.

JOBS

ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, లేడీ టెలికాలర్స్ కావలెను. ఫిక్స్‌డ్ సాలరీ 10 to 15K + ఇన్సెంటివ్స్, నో టార్గెట్. ✆ 6305597809.

D.A. & V.R. గేమింగ్ జోన్ నందు పనిచేయుటకు 1 మేల్ & 1 ఫీమేల్ కావలెను. పంప్ హౌస్ దగ్గర సీతారామనగర్, కర్నూలు. ✆ 95816 66064.

IT HARDWARE

Internship / Final Year Projects. Web App | Data Analytics | Digital Marketing | Cloud | HR Certification Placement Support Bangalore. Ph: 81055 77689.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కెనరా బ్యాంక్ Canara Bank
అనంతపురం మెయిన్-I బ్రాంచ్
12-3-50, సాయి ఎన్‌క్లేవ్, సాయి నగర్, 3వ క్రాస్, అనంతపురం-515001. ఫోన్: 08554-274740.

స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **కెనరా బ్యాంక్, అనంతపురం మెయిన్-1 బ్రాంచ్** వారికి ఋణగ్రహీత(లు): మెసర్స్ ఎయిర్ అండ్ సీ, ప్రొప్రయిటర్: ప్రణీత్ టివియస్, తండ్రి: టి. నరేంద్ర, 4/3/100, జనశక్తి నగర్, అనంతపురం-515001 మరియు హామీదారు(లు): శ్రీ టి.వి.యస్. శ్రీహర్ష, తండ్రి: యస్.టి.నరేంద్ర వారు తేది.14.09.2021 నాటికి చెల్లించవలసిన బకాయి **రూ. 11,04,341.62/-** (అక్షరాల పదకొండు లక్షల నాలుగు వేల మూడు వందల నలభై ఒక్క రూపాయలు మరియు అరవై రెండు పైసా మాత్రమే) మొత్తమును రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్, అనంతపురం మెయిన్-1 బ్రాంచ్ అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు ఛార్జ్/తనఖాపెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తిని తేది **29.11.2025** న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని ప్రజానీకానికి మరియు ముఖ్యంగా పైన తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది: 29.11.2025, ఉ॥ 11.45 గం.ల నుండి మ॥ 12.45 గం.ల వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ధరావత్తును RTGS/NEFT ద్వారా చలాన్‌లోని ఖాతా వివరములుకు తేది: 28.11.2025, సా॥ 5.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:

కర్నూలు ఆర్‌డి పరిధి మరియు కల్లూరు యస్ఆర్‌డి మరియు చల్లమల్లాపురం గ్రామము, చల్లమల్లాపురం రూరల్ పంచాయతీ ఏరియా ఓపెన్ ప్లాట్. ఆస్తి వివరములు: **ది.17.04.2017** తేదీ గల విక్రయ దస్తావేజు **నెం.3370/2017** ప్రకారము చల్లమల్లాపురం గ్రామము సర్వే నెం.93/1, 93/2, 94/1, సబ్‌డివైడ్ సర్వే నెం.93/1సి, 93/2సి, 94/1 పైకి సర్వే నెం.93/1సి నందు ప్లాట్స్, న్యూ కల్కినగర్ నందు ప్లాట్ నెం.9 మరియు 10 కి సంబంధించిన యావత్తు. **హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం.23 మరియు 24; **పడమర:** కర్నూలు నుండి డోన్ నేషనల్ హైవే; **ఉత్తరం:** ప్లాట్ నెం.8; **దక్షిణం:** ప్లాట్ నెం.11. **కొలతలు: తూర్పు-పడమర:** 70 అ॥ లేదా 21.336 మీ॥; **ఉత్తరం-దక్షిణం:** 80 అ॥ లేదా 24.384 మీ॥, **విస్తీర్ణం:** 622.22 చ॥గ॥ లేదా 5600 చ॥అ॥. **టైటిల్ హోల్డర్:** శ్రీ టివియస్ శ్రీ హర్ష, తండ్రి: టి. నరేంద్ర.

రిజర్వు ధర: రూ. 23,00,000/- **ధరావత్తు సొమ్ము: రూ. 2,30,000/-**

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ **www.canarabank.com** లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను లిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, అనంతపురం మెయిన్-1, బ్రాంచ్ మేనేజర్ గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 8919430724.
ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ (baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com/ హెల్ప్‌డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com.

తేది: 12.11.2025, ప్రదేశం: అనంతపురం సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

స్లీపర్ బస్సుగా మార్చేందుకు ఎలా అనుమతులిచ్చారు?

○ కర్నూలు రవాణా శాఖాధికారుల విచారణ

ఈనాడు, కర్నూలు : కర్నూలు శివారు చెట్లమల్లాపురం గ్రామ పరిధిలో గత నెల 24వ తేదీ తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదానికి గురైన బస్సుకు ఉన్న అనుమతులపై రవాణాశాఖాధికారులు విచారణ ముమ్మరం చేశారు. బస్సును కొనుగోలు చేసిన సమయంలో సీట్లు ఉన్న బస్సు కాగా.. దానిని వేమూరి కావేరి ట్రావెల్స్ యాజమాన్యం స్లీపర్ బస్సుగా మార్చింది. ఆ మేరకు ఒడిశా రాష్ట్రంలోని రాయగడ రవాణాశాఖ అధికారులు అనుమతులు ఇచ్చారు. బస్సులో మార్పులు.. చేర్పులు చేసినా ప్రయాణికుల భద్రతకు ఎలాంటి ఢోకా లేదని నిర్ధారించుకున్న తర్వాతే ఆయా అనుమతులివ్వాలి. దీంతోపాటు ఆయా మార్పుచేర్పులు జాతీయ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. బస్సు ప్రమాదం జరిగిన తర్వాత ఆయా మార్పులు.. చేర్పుల్లో చాలా లోపాలు బయటపడ్డాయి. ప్రమాదం జరిగితే ప్రయాణికులు బయటపడేందుకు మార్గాలు కూడా సరిగా లేకుండా మూసేసినట్లు వెలుగులోకి వచ్చింది. దీంతోపాటు నిషేధిత వస్తువులు, ఉత్పత్తులను రవాణా చేస్తున్నట్లు నిర్ధరణ అయింది. బస్సు యాజమాన్యం నిర్లక్ష్యం కూడా ఉందని తేలింది. ఈ నేపథ్యంలో బస్సు యజమానిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయన్ను న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టగా బెయిల్ వచ్చింది. దానిని రద్దు చేయాలని కోరుతూ పోలీసులతో పిటిషన్ వేయించాలని ఉన్నతాధికారులు యోచిస్తున్నారు.

మూడు నిమిషాల్లో భారీగా మంటలు..

వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి దానిని ఈడ్చుకెళ్లి ఆగిన మూడు నిమిషాల వ్యవధిలోనే భారీగా మంటలు వ్యాపించినట్లు పోలీసులు గుర్తించారు. ఆ మేరకు కీలక సీసీ టీవీ ఫుటేజీ పోలీసులకు లభ్యమైంది. ద్విచక్రవాహనం పెట్రోలు ట్యాంకు నుంచి పెట్రోలు లీకవడం.. ద్విచక్రవాహనాన్ని ఈడ్చుకెళ్లే క్రమంలో రాపిడి కారణంగా ఎగసిన నిప్పురవ్వలతో మంటలు చెలరేగాయి. ఇంచుమించు అదే సమయంలో బస్సు డీజిల్ ట్యాంకు నుంచి డీజిల్ లీకై అక్కడా మంటలు వ్యాపించాయి. ఉష్ణోగ్రత 56 డిగ్రీలు దాటితే డీజిల్ కూడా భారీగా మండుతుందని నిపుణులు తేల్చారు. ఫలితంగానే స్వల్పంగా ప్రారంభమైన మంటలు కేవలం మూడు నిమిషాల వ్యవధిలోనే ఉద్ధృతమైనట్లు పోలీసులు గుర్తించారు. ఆయా ఫుటేజీల్లో డ్రైవర్లు ఇద్దరూ ప్రయాణికులను రక్షించేందుకు ప్రయత్నం చేసినట్లు స్పష్టంగా కనపడింది. అద్దాలు బద్దలు కొట్టి ప్రయాణికులను బయటకు లాగినట్లు కొన్ని దృశ్యాలు ఆయా ఫుటేజీల్లో ఉన్నట్లు గుర్తించారు.

ఓ బస్సు ముందుభాగంలోనూ సీసీ కెమెరా

ఇటీవలికాలంలో బస్సుల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తున్న విషయం తెలిసిందే. ఓ ప్రైవేటు ట్రావెల్స్ సంస్థకు చెందిన బస్సు ముందుభాగంలోనూ కెమెరా ఏర్పాటుచేశారు. దీంతో ఆ బస్సు ప్రయాణిస్తున్నప్పుడు బస్సు ముందుభాగంలో రహదారిపై పరిస్థితి ఎలా ఉందన్న దృశ్యాలు అందులో నమోదయ్యాయి. గత నెల 24వ తేదీ తెల్లవారుజామున నమోదైన వీడియో ఫుటేజీ మొత్తాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రమాదానికి కారణమైన శివశంకర్ ఉపయోగించిన పల్సర్ వాహనం, శివశంకర్ మృతదేహం, దాని పక్కనే శివశంకర్ మిత్రుడు ఎర్రిస్వామి నిల్చున్న దృశ్యాలన్నీ అందులో నమోదయ్యాయి. ద్విచక్రవాహనం ప్రమాదానికి గురైన తర్వాత అది రోడ్డుపై పడినా దానిని పక్కకు తొలగించేందుకు వాహనదారులెవరూ ప్రయత్నించలేదు.

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

అయ్యప్పస్వామికి మెట్లపూజ చేస్తున్న భక్తులు

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: స్థానిక జర్నలిస్టు కాలనీలోని వెంకటేశ్వరస్వామి, అయ్యప్ప, సద్గురు సాయినాథ స్వామి ఆలయాల పదో వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అయ్యప్పస్వామికి భక్తులు పడిపూజ చేశారు. అయ్యప్పస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు గోపినాథ్ నాయుడు, చిరంజీవి, మధు, గురుస్వాములు పాల్గొన్నారు.

పెద్దలతో పిల్లలు వలస వెళ్లొద్దు

హాలహర్వి, న్యూస్‌టుడే: పెద్దలతో పాటు పిల్లలను తీసుకెళ్లకుండా స్థానికంగా రాష్ట్ర ప్రభుత్వం వసతిగృహాలు ఏర్పాటు చేసిందని ఎంఈవో-2 శ్రీనివాసరెడ్డి తెలిపారు. నిట్రవట్టి గ్రామంలో సీజనల్ వసతి గృహాన్ని బుధవారం ప్రారంభించారు. ఉపాధ్యాయులు, సీఆర్పీ ముక్కన్న, సురేష్, ఇషాదయ గ్రామీణాభివృద్ధి వ్యవసాయ సంఘం నాగరాజు, అయ్యన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 80085 73822

తుగ్గలి, న్యూస్‌టుడే: ?: చెన్నంపల్లి గ్రామ శివారులో రామాలయం పక్కనే ఉన్న తాగునీటి పథకం పనిచేయడం లేదు. – రంగన్న, చెన్నంపల్లి

✓: గ్రామ పంచాయతీ అధికారి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. - శ్రీహరి, డిప్యూటీ ఎంపీడీవో తుగ్గలి

మద్దికెర, న్యూస్‌టుడే: ?: మద్దికెరలోని మధ్యమ్మ తేరుబజారు వీధిలో మురుగు కాల్వలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. - వారణాసి రామాంజనేయులు, మద్దికెర

✓: పరిశీలించి వెంటనే తొలగిస్తాం. - శివకుమార్, పంచాయతీ కార్యదర్శి, మద్దికెర

చిప్పగిరి, న్యూస్‌టుడే: ?: చిప్పగిరి ఎస్సీ కాలనీకి సక్రమంగా తాగునీరు రావడంలేదు. రోజు విడిచి రోజు నీటి సరఫరా చేపట్టాలి. - నారాయణస్వామి, చిప్పగిరి

✓: అన్ని కాలనీలకు తాగునీరు అందేలా చర్యలు చేపడతాం. - దాసరి గోవిందరాజులు, సర్పంచి చిప్పగిరి

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ?: ఆదోని పట్టణంలోని లంగరబావివీధిలో ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం ప్రాంతంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. రోగాలు వ్యాపిస్తున్నాయి. సమస్యను పరిష్కరించాలి.
- రమేష్, ఆదోని

✓: ప్రజారోగ్య విభాగం సిబ్బందికి సూచించి శుభ్రత పనులు చేయిస్తాం.
నాసిర్‌హుసేన్, ఇన్‌ఛార్జి కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

సంక్షిప్త సమాచారం

ఆస్పరి, న్యూస్‌టుడే: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కురువ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఉదయ్‌కుమార్ ఆర్డీవో భరత్‌నాయక్‌ను కోరారు. పత్తికొండ కార్యాలయంలో ఆయనను కలిసి, వినతిపత్రం సమర్పించారు.

హొళగుంద, న్యూస్‌టుడే: ఉపాధి హామీ కార్యాలయంలో ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమం చేపట్టినట్లు వయోజన విద్య జిల్లా సూపర్‌వైజర్ రమణయ్య అన్నారు. కార్యక్రమంలో ఏపీవో తిమ్మారెడ్డి, మండలంలోని క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

హాలహర్వి, న్యూస్‌టుడే: హాలహర్వి శివారులోని ఛత్రగుడిలో వెలసిన అయ్యప్పస్వామికి బుధవారం పూజలు చేశారు. అయ్యప్ప భక్తులు స్వామికి అభిషేకం చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెరలోని బెస్త వీధిలోని విద్యుత్తు సమస్యను పరిష్కరిస్తామని ఏఈ రఫీక్ పేర్కొన్నారు. తెదేపా నాయకులు గడ్డం రామాంజులు, విఠోభ తదితరులతో కలిసి బుధవారం ఆయన ఆ వీధిలో ఉన్న విద్యుత్తు స్తంభాలను పరిశీలించారు.

పల్లె కబుర్లు

పందికోన(పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ప్రాంతీయ ఉప సంచాలకుడు సూర్యారావు అన్నారు. పందికోన గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు.

జొన్నగిరి(తుగ్గలి), న్యూస్‌టుడే: జొన్నగిరి గ్రామంలో గురువారం నుంచి మూడు రోజులపాటు రామలింగేశ్వర స్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలు నిర్వహిస్తున్నట్లు పెద్దలు తెలిపారు.

మల్లెపల్లి(వెల్దుర్తి), న్యూస్‌టుడే: మల్లెపల్లి గ్రామంలోని మొక్కజొన్న, కంది సాగుచేసిన రైతులకు ఆత్మ క్షేత్ర అవగాహన శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏవో సునీత, ఏడీఏ మోహన్‌విజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, శ్యామ్‌వేర్, నరేష్, వెల్దుర్తి ఏవో అక్బర్‌బాషా, సర్పంచి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిట్రవట్టి (హాలహర్వి), న్యూస్‌టుడే: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎంఈవో-2 శ్రీనివాసరెడ్డి అన్నారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. అనంతరం దస్త్రాలను పరిశీలించారు.

భవనం ఉన్నా.. చదివేవారు లేరు

- ప్రారంభానికి నోచుకోని ఆదోని ఐటీఐ కళాశాల
- ఆలూరులో శిథిల గదుల్లో పాఠాలు

ఆదోని మండలం అరేకలు గ్రామంలో గత తెదేపా పాలనలో మైనారిటీ విద్యార్థుల కోసం ఐటీఐ మైనారిటీ కళాశాల, వసతి గృహం కోసం భవనాలు నిర్మించారు. గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కళాశాల తరగతులు మాత్రం ప్రారంభించలేదు.

★ ఆలూరు పట్టణంలో దశబ్దానికి పైగానే ఐటీఐ కళాశాలను ఓ శిథిల భవనంలో నిర్వహిస్తున్నారు. పాలకులు మారుతున్నారే కాని.. కళాశాలకు సొంత భవనం లేక విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఓ ప్రాంతంలో కళాశాల భవనం సిద్ధంగా ఉన్నా.. కళాశాలను ప్రారంభించకపోవడం.. మరో చోట కళాశాలకు సొంత భవనం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆదోని మండలం అరేకల్ గ్రామంలో రూ.కోట్లతో నిర్మించిన ఐటీఐ కళాశాల భవనం

ఆలూరులో శిథిలమైన భవనంలో కొనసాగుతున్న ఐటీఐ కళాశాల

ఆదోని విద్య, ఆలూరు, న్యూస్‌టుడే: ఆదోని డివిజన్ ప్రాంతంలో ముస్లిం మైనారిటీలు అధికంగా ఉండడంతో అప్పటి తెదేపా ప్రభుత్వం 2018 సంవత్సరంలో రూ.3.91 కోట్లతో ఆదోని మండలం అరేకల్ గ్రామంలో ఐటీఐ కళాశాల(పారిశ్రామిక శిక్షణ సంస్థ), వసతి గృహం భవనాలను మంజూరు చేసింది. ఆ వెంటనే రెండు కళాశాల భవనాలు, వసతి గృహం భవనాలను సైతం నిర్మించింది. ఆ తర్వాత 2018-19 విద్యా సంవత్సరం నుంచి కళాశాలను ప్రారంభించాలని విద్యాధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ కళాశాల భవనం వైపు కన్నెత్తి చూడలేదు. ఫలితంగా ఈ భవనాలు అలంకారప్రాయంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా.. పట్టించుకోకపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కళాశాల ప్రారంభించేందుకు భవనాలు సిద్ధంగా ఉండడంతో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు స్పందించి ఐటీఐ కళాశాల తరగతులు ప్రారంభించి విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

అక్కడ అలా.. ఇక్కడ ఇలా

ఆలూరు కేంద్రంలో 2008 సంవత్సరంలో ఐటీఐ కళాశాలను ప్రారంభించారు. ఈ కళాశాలలో విద్యార్థుల కోసం నాలుగు కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కళాశాలకు సొంత భవనం లేకపోవడంతో 17 ఏళ్లుగా ఆలూరు ప్రభుత్వ బాలుర-1 పాఠశాల భవనంలోని తరగతి గదుల్లో నిర్వహిస్తున్నారు. ఈ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని ఆలూరు-ఆస్పరి ప్రధాన రహదారి మార్గంలోని 2.35 ఎకరాల స్థలం కేటాయించారు. రూ.5 కోట్లతో ప్రతిపాదనలు సైతం పంపారు. నిధులు మాత్రం సమాయత్తలేదు. పెరిగిన ధరలను దృష్టిలో పెట్టుకొని రెండేళ్ల కిందట మరోసారి రూ.7.50 కోట్లతో నివేదికలు పంపినా నిధులు మాత్రం మంజూరు కాలేదు. ఫలితంగా విద్యార్థులు శిథిల భవనంలోనే చదువులు కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లా అధికారులు స్పందించి విద్యార్థుల కోసం ఐటీఐ కళాశాల సొంత భవనం నిర్మించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

CHANGE OF NAME

I, MALA OBULESH, S/o MALA THIMMANNA, residing at H.No. 2/46A, Pulikonda Village, Pattikonda Mandal, Kurnool District, Andhra Pradesh, have changed my Son's name from the existing DASARI RAKESH S/o. D. OBULESH to MALA RAKESH S/o MALA OBULESH as per affidavit dated: 06/11/2025 executed in presence of Notary Public, Kurnool.

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION): ADONI.
I.A.No. 64/2024 IN
O.S.No. 16/2024

Between:
Ediga Siva Shankar Goud and another **-Plaintiffs/ Petitioners**
V/s
Madiga Madike Sudhakar and 5 others
-Defendants/ Respondents

NOTICE

To,
R6. Mala Ravi S/o. Mala Giddanna, aged 40 yrs, R/o.Kunkanur Village, Devanakonda Mandal.
Sir,
Whereas the above named plaintiffs have filed the above suit for permanent injuction, the said suit is posted on 28-11-2025 for your appearance at 10.30 AM you're hereby directed to appear before the Hon'ble court on the above said date and time either in person or through your counsel, else the matter will be decided in your absence by setting you ex-parte.

sd/- T.MADHUSUDHAN
ADVOCATE FOR PLAINTIFFS
ADONI. Cell: 99663 90700

రాతి లోడుతో రాత్రి ప్రయాణం

అధిక లోడు.. అతి వేగం.. మితిమీరిన నిర్లక్ష్యంతో వెళ్తున్న ట్రాక్టర్లు ప్రజలను హడలెత్తిస్తున్నాయి. గుత్తి- పత్తికొండ రహదారిపై నాపరాళ్ల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్లు సర్కస్ ఫీట్లు చేస్తున్నాయి. రహదారిపై గుంతలు పడిన ప్రదేశంలో ట్రాక్టర్ ఇంజిన్ ముందు చక్రాలు ఒక్కసారిగా పైకిలేస్తుండటంతో ఇతర వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. కొలిమిగుండ్ల ప్రాంతంలోని గనుల నుంచి జొన్నగిరి మీదుగా నిత్యం నాపరాతి లోడుతో రాత్రిపూట అతివేగంగా వెళ్లడంతో పల్లెజనం భయాందోళనకు గురవుతున్నారు. – న్యూస్‌టుడే, తుగ్గలి

ఆక్రమణల దారిలో.. సాగేదెలా..!

ఆదోని పట్టణంలోని బంగారుబజారు రహదారి పూర్తిగా ద్విచక్ర వాహనాలతో ఆక్రమించేసింది. ఈ ప్రాంతంలో పండిత్ నెహ్రూ, తానాజీ రహదారుల వైపు వెళ్లేందుకు ఇదే కీలకమైన దారి. ఈ రెండు దారుల్లో వన్ వే ఉంటుంది. బంగారుబజారు రహదారి మీదుగానే రాకపోకలకు సాగించాలి. ఇలాంటి దారిని పూర్తిగా వాహనాల పార్కింగ్‌కు వినియోగిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, అగ్నిమాపక శకటం రాకపోకలు సాగించాలన్నా.. కష్టమే. – న్యూస్‌టుడే, ఆదోని పాతపట్టణం

ముఖం చూపించి వెళ్లిపోతున్నారు

(గ్రామ సచివాలయాల్లో పూర్తిస్థాయిలో సిబ్బంది లేరు. ఇటీవల బదిలీల నేపథ్యంలో నియామకాలు చేపట్టలేదు. ఉన్న సిబ్బంది సైతం సరిగా హాజరు కావడం లేదు. ముఖ హాజరు వేసి, సర్వే పేరుతో బయటకు వెళ్లిపోతున్నారు. సిద్ధాపురం గ్రామ సచివాలయంలో బుధవారం ఉదయం 11.13 గంటల సమయంలో రెండు బ్యాగులు, ఖాళీ కుర్చీలు దర్శనం ఇచ్చాయి. అంతర్జాలంలో మాత్రం ముగ్గురు హాజరు వేసినట్లు నమోదైంది. సిబ్బంది మాత్రం కనిపించలేదు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులతో ఈ విషయాన్ని ప్రస్తావించగా.. సిబ్బంది సర్వే చేస్తున్నారని తెలిపారు. – న్యూస్‌టుడే, హాలహర్వి

ఎల్లెల్సీ నీరందేనా!

హాలహర్వి, న్యూస్‌టుడే: ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు తాగు, సాగు నీరు అందించే తుంగభద్ర జలాశయం నుంచి రెండో పంటకు నీరు అందేనా అని అనుమానం తలెత్తుతోంది. నీటి లభ్యత, నిల్వల ఆధారంగా శుక్రవారం బెంగళూరులో ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శివకుమార్ అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం జరగనుంది. నీటి విడుదల తేదీలను ప్రకటించే అవకాశం ఉందని కర్ణాటక రైతులతో పాటు కర్నూలు జిల్లా రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం డ్యాంలో 76.75 టీఎంసీలు నీటి నిల్వ ఉండగా.. ఎగువ నుంచి 2,812 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. వివిధ కాల్వలకు, నదికి 7,220 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

తాగి వాహనం నడిపితే జైలుకే

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని మండలం పెద్దతుంబళం పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఆరుగురు వాహన చోదకులకు బుధవారం ఆదోని రెండో అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ శ్రీవల్లి జరిమానా విధించినట్లు ఎస్సై మల్లికార్జున తెలిపారు. ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున ఆరుగురికి రూ.60వేలు జరిమానా విధించారన్నారు. ఇకపై ఎవరైనా డ్రంక్ అండ్ కేసులో పట్టుబడితే వారికి 15 రోజులు పాటు రిమాండ్ విధించనున్నట్లు తెలిపారు.

సర్పంచిని ఆహ్వానించరా?

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఢణాపురం గ్రామంలో బుధవారం అందరికీ ఇళ్లు పథకం కింద నూతన గృహప్రవేశ కార్యక్రమం, విద్యార్థుల కోసం సీజనల్ వసతి గృహాన్ని ఆదోని ఎమ్మెల్యే డాక్టరు పార్థసారథి, ఎమ్మెల్సీ బి.టి.నాయుడు ప్రారంభించారు. కార్యక్రమానికి ప్రొటోకాల్ ప్రకారం తను పిలవాల్సి ఉండగా.. పిలవలేదని సర్పంచి చంద్రశేఖర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఎంపీడీవో జనార్దన్‌తో 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా.. గ్రామ పంచాయతీ కార్యదర్శి సర్పంచికి సమాచారం ఇచ్చారని.. ఆయన

వైద్య విద్య కళాశాలల ప్రైవేటీకరణ సరికాదు

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వైద్య విద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోమని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, వైకాపా రాష్ట్ర నాయకుడు సురేంద్రరెడ్డి, వైకుంఠం మల్లికార్జున చౌదరి అన్నారు. ఆలూరులో బుధవారం ఆందోళన చేపట్టారు. తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, రామాంజనేయులు, వెంకటేష్, వీరేష్,ఎస్‌కే గిరి, దత్తారెడ్డి, చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, అనిల్, జహీర్, ఎల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల ప్రైవేటీకరణను రద్దు చేయాలని కోరుతూ వైకాపా నాయకులు అంబేడ్కర్ కూడలి వద్ద ఆందోళన నిర్వహించారు. పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, వైకాపా రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్‌రెడ్డి ఆర్డీవో కార్యాలయ అధికారిణికి వినతిపత్రం అందజేశారు.

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: స్థానిక పార్టీ కార్యాలయం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ లోకేశ్వరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిని పూర్తిగా నిర్మూలిద్దాం

మాట్లాడుతున్న వైద్యాధికారి మలికార్జునరెడ్డి

ఆదోని వైద్యం, న్యూస్‌టుడే: కుష్ఠు వ్యాధి నిర్మూలనకు అందరం కృషిచేయాలని జిల్లా కుష్ఠు నివారణ వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జునరెడ్డి అన్నారు. స్థానిక సర్వజన ఆస్పత్రిలో జిల్లా ఉపవైద్యాధికారిణి సత్యవతి అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకు జాతీయ కుష్ఠు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తోందన్నారు. ఇందుకు జిల్లా వ్యాప్తంగా 1681 బృందాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డెర్మటాలజిస్ట్ డాక్టర్ షైనిప్రియాంక, జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, టీబీ, కార్యాలయాల డీపీఎంవోలు చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, సీతారాముడు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు రక్షణ కల్పించాలి

పత్తికొండలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: న్యాయవాదులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని పత్తికొండ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వై.మధుబాబు అన్నారు. ఈ నెల 7న పుత్తూరు కోర్టు ప్రాంగణంలోనే సీనియర్ న్యాయవాది రాజశేఖర్‌పై కక్షిదారుడు కారుతో ఢీకొట్టి చంపేందుకు యత్నించడం దురదృష్టకరమన్నారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పత్తికొండ నాలుగు స్తంభాల కూడలిలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆలూరులో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి ఆందోళనన చేపట్టారు. ప్రభుత్వం న్యాయవాదుల రక్షణకు చట్టం తీసుకురావాలని ఆలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి షాకీర్ అన్నారు. కోర్టు నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు మాధవకృష్ణ, రంగప్ప, లక్ష్మీకాంత్, శ్రీధర్, తిమ్మయ్య, హెచ్‌కే రవి, ఈరన్నరావు, విజయభాస్కర్, రంగప్ప, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం

పత్తికొండ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

ఢణాపురం గ్రామంలో గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ బి.టి.నాయుడు, ఎమ్మెల్యే డాక్టరు పార్థసారథి, ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ అజయ్‌కుమార్

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రతి నిరుపేదకు ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. పుచ్చకాయలమడలో బుధవారం నూతన గృహాలను గృహనిర్మాణ శాఖ అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీవో భరత్‌నాయక్, డీఎల్‌పీవో రామచంద్రారెడ్డి, తెదేపా నాయకులు సాంబశివారెడ్డి, గృహనిర్మాణశాఖ డైరెక్టర్ రామకృష్ణ, డీఈ ఆదినారాయణ, ఎంపీడీవో కవిత పాల్గొన్నారు.

ఢణాపురం(ఆదోని ఎస్కేడీ కాలనీ), న్యూస్‌టుడే: ఢణాపురం గ్రామంలో ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం కింద నిర్మించిన నూతన గృహాలను ఎమ్మెల్సీ బి.టి.నాయుడు, ఆదోని ఎమ్మెల్యే డాక్టరు పార్థసారథి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆదోని ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ అజయ్‌కుమార్, గృహ నిర్మాణ శాఖ ఈఈ చంద్రశేఖర్, తహసీల్దారు రమేశ్, ఎంపీడీవో జనార్దన్, మండల విద్యాధికారి శ్రీనివాసులు, ఏఈ ఆదెప్ప, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తిప్పన్న, తిక్కన్న తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు, న్యూస్‌టుడే: హత్తిబెళగల్ గ్రామంలో తెదేపా ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వైకుంఠం జ్యోతి లబ్ధిదారులతో కలిసి పలు ఇళ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా నీటి సరఫరా

దేవనకొండ, న్యూస్‌టుడే: బండగట్టు నీటి పథకం నుంచి అంతరాయం లేకుండా తాగునీరు సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ మనోహర్ అన్నారు. మండలంలోని బండగట్టు తాగునీటి పథకాన్ని బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ మహబూబ్‌ఖాన్, పత్తికొండ ఆర్‌బ్ల్యూఎస్ ఏఈ విష్ణువర్దన్‌రెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.

బండగట్టు నీటి పథకాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్

పల్లెల్లో తీరని సమస్యలు

- కనిపించని సీసీ రహదారులు
- కాల్వలు మరిచారు

మారెల్లలో లీకవుతున్న తాగునీరు

పత్తికొండ, తుగ్గలి, న్యూస్‌టుడే: పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లోని పలు పల్లెల్లో కనీస వసతులు లేక ప్రజలు సతమతమవుతున్నారు. వీధుల్లో నేటికీ మట్టిదారులే దర్శనమిస్తున్నారు. కాల్వలు లేక మురుగంతా రహదారిపైకే చేరుతోంది. పారిశుద్ధ్యం సరిగా లేక ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

తుగ్గలి మండలం మారెల్ల గ్రామంలో ప్రధాన రహదారి తప్ప సీసీ వేయలేదు. మురుగు కాల్వలు లేక నీరంతా రోడ్డుపైనే పారుతోంది. మురుగులో నడిచి వెళ్లేందుకు గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి పూట దోమల బెడద భరించలేక పోతున్నామని స్థానికులు వాపోతున్నారు. కొత్తగా ఏర్పడిన ఎస్సీ, బీసీ కాలనీల్లో కనీస వసతులు కరవయ్యాయి. గ్రామంలో ఉన్న నీటి ట్యాంకు శిథిలావస్థకు చేరుకోవడంతో తాగునీరంతా వృథాగా పోతోంది. పత్తికొండకు వెళ్లే దారిలో తాగునీటి పైపులైన్ దెబ్బతిని నీరంతా వృథా అవుతోంది. అక్కడక్కడ గ్రామంలో ప్రధాన రహదారిపై మురుగు, వర్షం నీరు నిలిచి అపరిశుభ్రంగా ఉంది. గ్రామంలో మురుగు సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

– శ్రీహరి, డిప్యూటీ ఎంపీడీవో, తుగ్గలి

మారెల్ల గ్రామంలో మురుగు కాల్వలు లేనిచోట్ల సర్వే చేయించి, నిధులు కోసం పై అధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం. పత్తికొండకు వెళ్లే దారిలో తాగునీటి పైపులైన్ లీకేజీ సమస్యను గ్రామ పంచాయతీ అధికారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకొంటాం.

ఊరంతా మురుగే

ఆస్పరి, న్యూస్‌టుడే: ఆ గ్రామంలోకి వెళ్లాలంటే మురుగులో కాలు పెట్టాల్సిందే. చిగళి గ్రామంలోని ప్రధాన రహదారి మురుగుమయంగా మారింది. కొన్నేళ్ల క్రితం సీసీ రహదారి ఏర్పాటు చేశారు. ఇరువైపులా మురుగు కాల్వలు నిర్మించలేదు. ఇళ్లలోని మురగంతా రహదారిపైనే నిలుస్తోంది. దోమల బెడద అధికంగా ఉందని, రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. మురుగు దాటుకుంటూ ఇళ్లలోకి వెళ్లక తప్పడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) : ADONI
I.P.No.14/2019

Between:
Gurevala Vijaya Kumar S/o Late Gurevala Gopal Shetty, Hindu, aged about 45 years, resident of D.No.21/90, Bhagyalakshmi apartments, Adoni, Kurnool District. **-Petitioner**

- Vs -

1. E.C.L Finance Ltd, 19A, 1st floor, TJ Shopping Mall, Near SBI Circle, R.S.Road, Kurnool-518002, A.P represented by its Manager., resident of Kurnool.
2. Bajaj Finance Ltd, upstairs of Bank of India, beside Balaji Nursing Home, Adoni represented by its Manager., resident of Kurnool.
3. India Infoline Finance, 40353C1, 1st floor, Park Road, Gandhi Nagar, Kurnool, represented by its Manager., resident of Kurnool.
4. Lendingkart Finance Ltd,, Registered office at 14th floor, The First, First Avenue, Beside Keshavbaug party plot, Vastrapur, Ahmedabad, Gujarat 380015 represented by its Manager.
5. D.Srinivasa Rao, S/o Late D.Ramaswamy, Hindu, aged about 52 years, private employee, resident of D.No.13/266, Khazipura, Adoni, Kurnool District.
6. V.Suryanarayana S/o V.Venkata Subbaiah, Hindu, aged about 56 years, Flower Bazar, resident of D.No.11-628-2, Adoni, Kurnool District.
7. Boya Lakshmi Devi W/o B.Govindulu, Hindu, aged about 52 years, house wife, resident of D.No.21/180/1, Sai baba Nagar, Adoni, Kurnool District.
8. Boya Vijay S/o Boya Obulesh, Hindu, aged about 28 years, private employee, D.No.21/118, Sai baba Nagar, Adoni.
9. A.Narasimha Reddy S/o Chenchu Reddy, Hindu, aged about 41 years, resident of D.No.3-27, Narava Village, Giddalur Mandal, Prakasham District. **-Respondents**

GENERAL NOTICE

Please take notice that the above named petitioner filed above IP Under Section 6, 10 & 13 of Provincial Insolvency Act 1920 to declare him as Insolvent. The Respondents and whom so ever it may concerned may appear before the Honorable Court on 01-12-2025 at 10-30 AM, either in person or through your advocate and file counter if nay, failing which the matter will be decided in your absence and will be set ex-parte accordingly.

Hearing Date: 01-12-2025

sd/- Y.R.MALLIKARJUNA, ADVOCATE FOR PETITIONER,
ADONI-518301. Cell:- 98493 14050

(c) eenadu

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

రహదారి పనులకు చర్యలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని గంజహళ్లి రహదారిలో పనుల వేగవంతానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు పురపాలక కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. రహదారి పనులపై బుధవారం ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రధాన రహదారికి దాదాపు రూ. కోటి పైగానే టెండర్లు పూర్తయినట్లు చెప్పారు. త్వరలోనే పనులు చేపట్టేందుకు గుత్తేదారులను ఆదేశించారు. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు చెయెద్దన్నారు. టీపీఎస్ రాజేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారిని పరిశీలిస్తున్న కమిషనర్

వేరుసెనగ క్వింటా రూ.5,810

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ. 5,810 మధ్యస్థం రూ. 5,420 కనిష్ఠం రూ. 3,580 వ్యాపారులు కొన్నారు. ఆముదాలు క్వింటా గరిష్ఠ ధర రూ. 5,846 మధ్యస్థ ధర రూ. 5,363 కనిష్ఠ ధర రూ. 5,230 పలికింది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు గ్రామీణం 80085 73794
కోసిగి 9550434095

నందవరం, న్యూస్‌టుడే: ?: మాచాపురం గ్రామంలో మురుగు కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. శుభ్రం చేయాలి. - **రాముడు, గ్రామస్థుడు**

✔: సమస్యను సంబంధిత అధికారులకు తెలియజేసి కాల్వలు శుభ్రం చేయిస్తాం.

- సందీప్, ఈవోఆర్డీ సందీప్, నందవరం

గూడూరు, న్యూస్‌టుడే: ?: నగర పంచాయతీలోని పడమర బీసీ కాలనీలో కాల్వలపై కల్వర్టులు నిర్మించాలి. **- ఉసేన్‌బీ, స్థానికురాలు.**

✔: పాలకమండలి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం. **- కృపాకర్, ఏఈ**

?: పడకాన వీధిలో కాల్వలు శుభ్రం చేయడం లేదు. **- చాంద్, గూడూరు.**

✔: సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తాం.

- రాఘవేంద్ర, శానిటరీ పర్యవేక్షకులు.

మంత్రాలయం, న్యూస్‌టుడే: ?: మంత్రాలయంలోని రాఘవేంద్రపురంలో సమయానికి కుళాయి నీరు రావడం లేదు. చర్యలు తీసుకోవాలి. **- మంచాలమ్మ, మరియమ్మ**

✔: సమయానికి నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం. **- ఉపేంద్రరెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి, మంత్రాలయం**

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ?: పట్టణంలో ఎద్దుల మార్కెట్ వద్ద గుంతల పడి రహదారి అధ్వానంగా మారింది. **- లక్ష్మన్న, కాలనీవాసి**

✔: టెండర్లు పిలిచాం. త్వరలోనే పనులు చేపడతాం.

- గంగిరెడ్డి, పురపాలక కమిషనర్

?: కొండవీటి ప్రాంతంలో రోడ్డు తవ్వి కంకర పరిచారు. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం.

- శ్రీనివాసులు, కాలనీవాసి

✔: గుత్తేదారులపై ఒత్తిడి చేసి పనులు పూర్తి చేస్తాం.

- గంగిరెడ్డి, పురపాలక కమిషనర్

'గృహ నిర్మాణాల పేరుతో వైకాపా దోపిడీ'

లబ్ధిదారులకు ఇంటి తాళం అప్పగిస్తున్న ఎమ్మెల్యే బీవీ

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గత వైకాపా హయాంలో గృహ నిర్మాణాల పేరుతో నాయకులు, కార్యకర్తలు ఇంటి స్థలాల పట్టాలు ఇసుక దోపిడి చేశారని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి ఆరోపించారు. గోనెగండ్లలో బుధవారం మన ఇల్లు.. మన గౌరవం కార్యక్రమం సర్పంచి హైమావతి ఆధ్వర్యంలో గృహ నిర్మాణశాఖ ఏఈ షేక్షావలి నిర్వహించారు. ఎమ్మెల్యే, జడ్పీ సీఈవో నాసరరెడ్డి హాజరై.. లక్ష్మీదేవి నూతన గృహాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ.. ప్రభుత్వం నియోజకవర్గానికి కొత్తగా 650 గృహాలు మంజూరు చేసిందన్నారు. నిర్మాణాలకు ఉచితంగా 20 టన్నుల ఇసుక అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ వరప్రసాద్, ఎంపీడీవో మణిమంజరి తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పేద, మధ్య తరగతి ప్రజల సొంతింటి కల సాకారం అవుతుందని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. గూడూరు నగర పంచాయతీలో బుధవారం నూతన గృహాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నారని లబ్ధిదారులు కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్, హౌసింగ్, రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు, స్థానిక తెదేపా నాయకులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యే దస్తగిరి తదితరులు

పేదల గూడు.. ప్రభుత్వం తోడు

○ నెరవేరనున్న పేదింటి కల

ఎమ్మిగనూరులో ఖాళీ స్థలాలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకోలేని స్థితిలో ఉన్న పేదల సొంతింటి కల సాకారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. పీఎంఏవై పథకం కింద గృహాలు మంజూరు చేశాయి. గత వైకాపా హయాంలో అరకొరగా నిధులు కేటాయించారు. చాలా మంది ఇళ్లు కట్టుకోలేదు. పేదింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల పేదలకు పీఎంఏవై.2 కింద గృహాలు మంజూరు అయ్యాయి.

ఎమ్మిగనూరు పట్టణంలో రెండు సెంట్లు స్థలాలు ఉన్న వారికి ఎంపిక ప్రక్రియను సర్వే చేస్తున్నారు. ప్రభుత్వం రూ.2.50లక్షల మంజూరు చేస్తోంది. ప్రస్తుతం మున్సిపాలిటీకి 676 మంజూరు అయ్యాయి. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారి ఆధార్ కార్డు, ఇంటి పత్రాలు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డులను పరిశీలించి ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆయా దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల అర్జీలను పరిశీలించారు. దాదాపు సగం పైగానే పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

6 వేలకు పైగానే గృహాల మంజూరు

మండలం	మంజూరైన గృహాలు
ఎమ్మిగనూరు	1964
ఎమ్మిగనూరు పట్టణం	676
నందవరం	1263
గోనెగండ్ల	1755

సొంత స్థలం ఉన్న వారు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు అర్హులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పీఎంఏవై.2 కింద ప్రతిపాదనలు పంపారు. వారికి త్వరలో అనుమతి పత్రాలు రానున్నాయి. వైకాపా హయంలో సొంత స్థలాలు ఉండి ఇల్లు కట్టుకునేందుకు అనుమతులు లేని వారి నుంచి కూడా కూటమి ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. కేంద్ర ప్రభుత్వం రూ. 1.50లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ. లక్ష ఇవ్వనున్నాయి. ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల్లో దాదాపు 6వేల గృహాలకు పైగానే మంజూరు చేశారు. మంజూరైన ఇంటికి నిర్మాణాల కోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు.

పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం

- ప్రసాద్, హౌసింగ్ డీఈ ఎమ్మిగనూరు

పీఎంఏవై కింద గృహాలు మంజూరు చేశారు. లబ్ధిదారుల అర్హుల జాబితాను తయారు చేస్తున్నాం. త్వరలో పూర్తి చేసి ఎంపిక చేస్తాం.

ఆద మరిస్తే.. అంతే సంగతి

ఎమ్మిగనూరు మండలంలోని రాళ్ల దొడ్డి గ్రామం వద్ద కర్నూలు-ఎమ్మిగనూరు ప్రధాన రహదారి వంతెన కుంగి ప్రమాదకరంగా మారింది. ఆ దారిలో నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. వర్షాలకు కల్వర్టు దెబ్బతిని రంధ్రం ఏర్పడింది. వాహనదారులు ఏ మాత్రం అదుపు తప్పినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఆ ప్రదేశంలో అధికారులు ఎలాంటి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. శిథిలావస్థకు చేరిన కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

– గోనెగండ్ల, న్యూస్‌టుడే

ఒరిగిన విద్యుత్ స్తంభాలు.. రైతుల బెంబేలు

కోడుమూరు పట్టణ శివార్లలోని పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. స్తంభాలు ఏళ్లనాటివి కావడంతో దెబ్బతిని ఒరిగిపోయాయి. విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతున్నాయి. దాంతో పొలంలో పనుల సమయంలో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. స్తంభాలు ఎక్కడ పడిపోతాయోనని రైతులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేయాల్సి ఉంది. – న్యూస్‌టుడే, కోడుమూరు పట్టణం

శునకం భయానకం

ఎమ్మిగనూరు పట్టణంలో వీధి కుక్కల బెడద అధికమైంది. కుక్కలు రహదారులపై గుంపు గుంపులుగా సంచరిస్తున్నాయి. వాహనదారులపై దాడికి యత్నిస్తున్నాయి. కాలనీల్లో సైతం పాదాచారులను పరుగులెత్తిస్తున్నాయి. దాంతో చిన్నారులు, వృద్ధులు బయటకు రావాలంటే అవి ఎక్కడ కరుస్తాయోనని భయాందోళన చెందుతున్నారు. అధికారులు కుక్కలు పట్టించి నివారించాలని వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

ఇరుకు గదులు ఆపై అవస్థలు

మధ్యాహ్న భోజన పథకం అమలు అస్తవ్యస్తంగా మారింది. సరైన వసతులు లేవు. ఇరుకు గదులు ఆపై అవస్థలు పడుతున్నారు నిర్వాహకులు. నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1100 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల ఆవరణలో చెట్టు కింద వంట చేస్తున్నారు. గతంలో పాఠశాలకు గ్యాస్ పొయ్యి ఇచ్చారు. గ్యాస్ సిలిండర్ కొనుగోలుకు నిధులు కేటాయించలేదు. వంట సమయంలో విద్యార్థులు పొగతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వసతులు కల్పించాల్సి ఉంది. – న్యూస్‌టుడే, నందవరం

పాఠశాల ఆవరణలో ప్రమాదం

కోడుమూరు పట్టణ శివారులో ఉన్న ఆదర్శ పాఠశాల ఆవరణలో విద్యుత్ నియంత్రిక తక్కువ ఎత్తులో ఉంది. ఇది పాఠశాల మైదానం సమీపంలో ఉండటం, రక్షణ గోడ లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ప్రతిరోజూ విద్యార్థులు ఆడుకోవడానికి వస్తుంటారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రక్షణ గోడను నిర్మించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కోడుమూరు పట్టణం

'కూటమితోనే సొంతింటి కల సాకారం'

మాధవరం (మంత్రాలయం), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే పేదలకు సొంతింటి కల సాధ్యమవుతుందని మంత్రాలయం తెదేపా ఇన్‌ఛార్జి రాఘవేంద్రరెడ్డి పేర్కొన్నారు. మాధవరంలో బుధవారం ప్రభుత్వ గృహ ప్రవేశ కార్యక్రమంలో ఆయనతో పాటు మంత్రాలయం భాజపా, జనసేన ఇన్‌ఛార్జులు విష్ణువర్ధన్‌రెడి, లక్ష్మన్న, కూటమి ప్రభుత్వ నాయకులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. మొత్తం 8వేల దరఖాస్తులు అందాయన్నారు. అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీపీవో భాస్కర్, హౌసింగ్ డీఈవో లాల్ కృష్ణయ్య, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో నూర్జహాన్, మంత్రాలయం మార్కెట్ యార్డు ఛైర్మన్ నర్సిరెడ్డి, తెదేపా మండలాధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, గ్రామ సర్పంచి ఇంద్రమ్మ, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్ పాల్గొన్నారు.

గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న తెదేపా, జనసేన, భాజపా నాయకులు

క్వింటా రూ.12 వేలకు కొనుగోలు చేయాలి

గోనెగండ్ల: పత్తి క్వింటా రూ. 12వేలకు కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడు, సీపీఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజాసాబ్, మద్దిలేటినాయుడు డిమాండ్ చేశారు. గోనెగండ్లలోని వైఎస్సార్ కూడలిలో బుధవారం జీపుజాత కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. వర్షాలకు పత్తి దెబ్బతింది. రైతులను ప్రభుత్వామే ఆదుకోవాలన్నారు. ఈ నెల 18, 19 తేదీల్లో ఆదోనిలో జరిగే పత్తి రైతుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలన్నారు.

మొక్కజొన్నలో పురుగు నివారించాలి

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మొక్కజొన్నలో సకాలంలో కత్తెర పురుగు నివారణ చర్యలు చేపట్టాలని ఎమ్మిగనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు మహ్మద్‌ఖాద్రి పేర్కొన్నారు. కులుమాలలో బుధవారం వ్యవసాయాధికారిణి హేమలత పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ హాజరై మాట్లాడుతూ.. రైతులకు పురుగు నివారణలో పలు విషయాలు సూచించారు.

సేంద్రియ వ్యవసాయంతో నేల ఆరోగ్యం

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సేంద్రియ వ్యవసాయంతో నేల ఆరోగ్యంతో పాటు అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి శివశంకర్ అన్నారు. పెసలదిన్నె, గార్లదిన్నె గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది, భూమాత రక్షణ కమిటీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. భూసార పరీక్షలను అనుసరించి ఎరువులు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో నరసింహుడు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా బంగారు పల్లకి సేవ

మంత్రాలయం, న్యూస్‌టుడే: శ్రీమఠంలో మృత్తికా బృందావనానికి బుధవారం బంగారు పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. శ్రీమఠంలో ఉదయం మృత్తిక బృందావనాన్ని వెండి సింహాసనంపై ఉంచి అర్చకులు పాద పూజ నిర్వహించారు. అనంతరం బంగారు పల్లకిలో శ్రీమఠం ప్రాకారంలో వైభవంగా ఊరేగించారు. సహాయ పీఆర్వో వ్యాజరాజాచార్, మఠం అర్చకులు, సిబ్బంది పల్లకి సేవ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

బంగారు పల్లకి సేవలో భక్తులు

● కర్ణాటక రాష్ట్రం హంపీ క్షేత్రంలో కొలువైన రఘునందన తీర్థుల ఆరాధనలో బుధవారం మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేత్రపర్వంగా అష్టలక్ష్మి హోమం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: విశ్వశాంతి మహాయాగం మహోత్సవంలో భాగంగా బుధవారం మహాలక్ష్మి, అష్టలక్ష్మి హోమాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం లక్ష్మీ వ్రతం పూజలు చేశారు. వేద పండితులు మధ్య హోమాలు జరిపారు. యాగశాలలో బ్రాహ్మణ పండితులు ప్రత్యేకంగా అతిరుద్ర పూజలు చేశారు. హోమంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి దంపతులు పాల్గొని పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఆరోపణలు చేయడం సరికాదు

కౌతాళం, న్యూస్‌టుడే: మంత్రాలయం నియోజకవర్గ తెదేపా బాధ్యుడిపై మండల తెదేపా నాయకుడు నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని మండల తెదేపా అధ్యక్షుడు సురేష్‌నాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు వెంకటపతిరాజు, డైరెక్టర్ కురువ వీరేష్ అన్నారు. వారు మాట్లాడుతూ.. రెండ్రోజుల క్రితం సుబ్రహ్మణ్యంరాజు సీనియర్ నాయకుడిగా చెప్పుకొంటూ..పార్టీ కోసం ఏదో చేశానని వ్యవహరించడం సమంజసం కాదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై మీడియాతో ఇష్టానుసారంగా మాట్లాడి, మొత్తం వైకాపా కైవసం అవుతాయనడం ఏంటని ప్రశ్నించారు. సుబ్రహ్మణ్యంరాజుపై తగిన చర్యలు తీసుకునేలా పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామన్నారు. మండల తెదేపా నాయకుడు రాజానంద్, గిరి, ఉరుకుంద మాదేవ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా స్వామిత్వ సర్వే

నందవరం, న్యూస్‌టుడే: ప్రజల నివాస ప్రాంతాలకు సంబంధించి తమ ఆస్తిపై పూర్తి హక్కు కల్పించేలా చేపట్టిన స్వామిత్వ సర్వే పకడ్బందీగా పూర్తి చేస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి కె.వీరేశ్ తెలిపారు. నదికైరవాడి గ్రామ సచివాలయంలో బుధవారం చేపట్టిన స్వామిత్వ సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ..వచ్చే ఏడాది మార్చిలోపు రాష్ట్రంలో ప్రతి గ్రామంలోని హక్కుదారులకు స్థిరాస్తి కార్డులు అందిస్తామన్నారు. గ్రామస్థులకు స్వామిత్వ సర్వే పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సందీప్, పంచాయతీ కార్యదర్శి వెంకటనరసమ్మ, వీఆర్వో కొండన్న, సర్వేయర్ తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థులకు పత్రాలు అందజేస్తున్న జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్

సుంకేసులకు 5200 క్యూసెక్కుల వరద

సుంకేసుల(గూడూరు గ్రామీణం),న్యూస్‌టుడే: సుంకేసుల జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతుంది. ఎగువ నుంచి 5200 క్యూసెక్కుల వరద నీరు జలాయానికి చేరుతుంది. దాంతో ఒక గేటు సగం మీటరు మేర ఎత్తి దిగువకు 4725 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జలాశయ ఇంజినీరు మహేంద్ర రెడ్డి తెలిపారు. కేసీ కాల్వకు 2445 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతుంది.

నేడు మండల కన్వీనర్ల ప్రమాణస్వీకారం

కోడుమూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని స్నేహ వినాయక కల్యాణ మండపంలో గురువారం తెదేపా మండల కన్వీనర్ల ప్రమాణస్వీకారం నిర్వహించనున్నట్లు పార్టీ శ్రేణులు ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా కేడీసీసీబీ ఛైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హాజరవుతారన్నారు.

అనుమతిలేని నిర్మాణాలు చేపడితే చర్యలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టణ ప్రణాళికలలో అనుమతిలేని నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని టౌన్‌ప్లానింగ్ అధికారి రాజేష్ పేర్కొన్నారు. శిల్పా కాలనీలో అనుమతిలేని కట్టడాలను బుధవారం అడ్డుకున్నారు. రాజేష్ మాట్లాడుతూ.. ప్రణాళిక ప్రకారం ప్లాన్ అప్రువల్ అయితే నిర్మించుకోవాలని సూచించారు. పట్టణంలో అనుమతిలేని కట్టడాలు నిర్మిస్తే కూలివేస్తామన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఉపాధ్యాయ సమస్యలపై ఉద్యమాలు చేస్తామని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఎస్టీయూ మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించాలని డిమాండు చేశారు. ఎస్టీయూ నూతన అధ్యక్షుడు తులసీరామ్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఆర్థిక కార్యదర్శి లక్ష్మన్న, మహిళ కన్వీనర్ గాయత్రి, సీపీఎస్ కన్వీనర్ లక్ష్మణ్, గౌరవ అధ్యక్షుడు వెంకటరాముడు, కౌన్సిల్ సభ్యులుగా బాబయ్య, అడివన్న, ఎల్లప్ప, ఎర్రిస్వామి, భాగ్యరాజు, నాగభూషణం తదితరులను ఎన్నుకున్నారు.



ఎన్నికైన ఎస్టీయూ మండల నాయకులు

పంటలో సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

సంగాల, గుండ్రేవుల(సి.బెళగల్): మండలంలోని సంగాల, గుండ్రేవుల గ్రామాల్లో రైతు సేవాకేంద్రాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏవో మల్లేషకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ.. మొక్కజొన్నలో తీసుకోవలసిన సస్యరక్షణ పద్ధతులను వివరించారు.

తాగునీటి ట్యాంకుల శుభ్రతకు చర్యలు

స్పందనకు వందనం

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని పుట్టపాశం గ్రామ పంచాతీయతీలో అపరిశుభ్రంగా ఉన్న నీటి ట్యాంకుల స్థితిగతులపై ఈనెల 12న 'ఈనాడు'లో 'కలుషిత జలం.. రోగాలతో జనం' అనే శీర్షికన ప్రచురితమైన చిత్ర కథనానికి ఎంపీడీవో మణిమంజరి స్పందించారు. పంచాయతీ కార్యదర్శి మద్దిలేటితో నీటి ట్యాంకుల శుభ్రతకు చర్యలు చేపట్టారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.

నందవరం, న్యూస్‌టుడే: ప్రాథమిక సహకార సొసైటీ సమీపంలో ఏర్పాటు చేసిన శుద్ధజలం కేంద్రం వద్ద అపరిశుభ్రత నెలకొంది. దీనిపై 'ఈనాడు'లో ఈనెల 12వ తేదీన 'శుద్ధజలం.. పరిసరాలు అపరిశుభ్రం' శీర్షికతో చిత్ర వార్త ప్రచురితమైంది. స్పందించిన ఈవోఆర్డీ సందీప్ శుద్ధజలం కేంద్రం వద్ద పరిసరాలను శుభ్రం చేయించారు.

సంక్షిప్త సమాచారం

సి.బెళగల్: మండలంలోని కొండాపురం, సంగాల, గుండ్రేవుల, ముడుమాల,కొత్తకోట గ్రామాల్లో వ్యవసాయకూలీలకు రూ. 400 వేతనంతో చేతినిండా పనులతో నిమగ్నమైయ్యారు. ఇప్పటికే 1950ఎకరాల్లో మొక్కజొన్న విత్తారు. 2000 ఎకరాలు సాగవుతుందని ఏవో మల్లేషకుమార్ తెలిపారు.

కోడుమూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని కొత్త బస్టాండు సమీపంలో బుధవారం లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం వెనుక వైపు ఓ ఇంటి గుమ్మం ఎదుట గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేశారని ఇంటి యజమానులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సి.బెళగల్, న్యూస్‌టుడే: సి.బెళగల్‌లో పీజీపై ఆర్‌అండ్‌బీ రహదారి నిర్మాణం పనులు యంత్రాలతో సిమెంట్ కంకర పరచే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గ్రామ సచివాలయం కార్యదర్శి శ్యామల ఆధ్వర్యంలో సచివాలయం సర్వేయర్లు హద్దులు ఏర్పాట్లు చేసేందుకు కొలతలు వేశారు. కార్యక్రమంలో గ్రామ సేవకులు తదితరులు పాల్గొన్నారు.

సి.బెళగల్:స్థానిక బస్‌స్టాండులో ఎర్రమట్టిలో బస్సు ముందుచక్రం ఇరుక్కుపోయవడంతో తీసేందుకు ఇబ్బందులు పడ్డారు.

కోడుమూరు: రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ కర్నూలు జిల్లా పర్యటనకు బుధవారం వచ్చారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఓర్వకల్ ఎయిర్‌పోర్టులో గవర్నర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : నియోజకవర్గంలోని మసీదు, మదర్సా అధ్యక్ష, కార్యదర్శులకు ఈనెల 15వ తేదీన జామియా మసీదులో సమావేశం ఉంటుందని ప్రతి ఒక్కరూ తప్పకుండా హాజరు కావాలని జామియా మసీదు అధ్యక్షులు షాబీర్ కోరారు. డిజిటల్ యాప్‌లో రిజిస్ట్రేషన్ గురించి అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమానికి అందరూ రావాలన్నారు.

కౌతాళం, న్యూస్‌టుడే : విశాఖపట్నంలో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ బాస్కెటు బాల్ పోటీలకు కౌతాళం కేజీబీవీ చెందిన ఆరుమంది విద్యార్థులు హాజరయ్యారని. పిన్సిపల్ పుష్పలత పేర్కొన్నారు.

పనులు పరుగు పెట్టేనా?

◆ పూర్తైతే రైతులకు మేలు

హాల్వీ వద్ద నిల్వ ఉంచిన గొట్టాలు

మంత్రాలయం గ్రామీణం(కౌతాళం), న్యూస్‌టుడే: మంత్రాలయం నియోజకవర్గంలో ఐదు ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. వాటి నిర్మాణాలు పూర్తి కాలేదు. సగం పనులతో నిలిచిపోయాయి. గోతులదొడ్డి(హాల్వి) రూ. 21.35కోట్లు, మంత్రాలయం మండలం బసాపురం రూ. 10.42కోట్లు, కగ్గల్లు రూ. 6.90కోట్లు, ఐరన్‌గల్ రూ. 18.52 కోట్లు, కందుకూరు రూ. 11.95 కోట్లు నిధులు మంజూరయ్యాయి. వాటికి ఒకేసారి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. అన్ని చోట్ల సగం పనులే పూర్తయ్యాయి. మిగిలిన 50 శాతం పనులు పూర్తయితే సుమారు 7 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది.

50 శాతం పనులే పూర్తయ్యాయి

కౌతాళం మండలంలో గోతుల దొడ్డి(హాల్వి) ఎత్తిపోతల పథకం నుంచి సుమారు 2 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. 2022లో పనులు ప్రారంభించి కొంతమేర పనులు చేశారు. నిధులు రాకపోవడంతో గుత్తేదారులు పనులు నిలిపేశారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులకు, గుత్తేదారులకు ఆశలు చిగురించాయి. సీఎం చంద్రబాబునాయుడు పశ్చిమ ప్రాంతంలోని పెండింగ్‌లో ఉన్న ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేస్తామన్నారు. పనులు ప్రారంభమై నాలుగేళ్లు గడుస్తున్నా. . పూర్తి కాకపోవడంతో అన్నదాతలు నిరాశకు గురయ్యారు. ఈ ఏడాది డిసెంబరులో పనులు ప్రారంభిస్తామని గుత్తేదార్లు చెబుతున్నారు. ప్రస్తుతం పంప్ హౌస్, మోటార్లు, డైవర్షన్ ట్యాంకులు, మినీ లైన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు కేవలం సగం శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన 50 శాతం పనులు పూర్తి చేయాల్సి ఉంది.

ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, నాయకులు

ప్రజా ఉద్యమ ర్యాలీ

మంత్రాలయం, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో విద్యార్థులు నష్టపోతారని మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక అబౌడే హోటల్ నుంచి వైకాపా నాయకులు బుధవారం ప్రజా ఉద్యమ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు భీమిరెడ్డి, నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడుమూరు గ్రామీణం: పట్టణంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ.. కుడా మాజీ ఛైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి కోట్ల కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందచేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

లక్ష్మీదేవమ్మ (పాతచిత్రం)

పెద్దనెలటూరు (గోనెగండ్ల), న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మండలంలోని పెద్దనెలటూరు గ్రామానికి చెందిన మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ.. కోలుకోలేక బుధవారం మృతి చెందినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దనెలటూరు గ్రామానికి చెందిన శేషప్పనాయుడు, లక్ష్మీదేవమ్మ(75) దంపతులకు వ్యవసాయమే జీవనాధారం. వీరికి ఇద్దరు కుమారులు. గతనెల 25వ తేదీన ఆమె సమీప బంధువులను చూసేందుకు గ్రామంలో విద్యార్థులను వదిలి వెళుతున్న ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. గ్రామ శివారులోని వంతెన వద్ద ఆర్టీసీ బస్సు అదుపు తప్పింది. దాంతో ఇద్దరి ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఇందులో లక్ష్మీదేవమ్మ కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. ఆమెను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందారు. ఇంటి పెద్ద మృతి చెందటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

కోసిగి, న్యూస్‌టుడే: పొట్టకూటి కోసం వలస వెళ్లిన కోసిగి మండలం ఆర్లబండ గ్రామానికి చెందిన దిద్ది హరికృష్ణ, మూగలదొడ్డి గ్రామానికి చెందిన తలారి వెంకటరెడ్డి అనే ఇద్దరు వలస కూలీలు సోమవారం ప్రమాదవశాత్తు మృతి చెందారు. వారి మృతి బాధాకరమని వెంటనే ఆ బాధిత కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలని బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా, మండల నాయకులు తిక్కన్న, నాగేంద్ర, రాముడు డిమాండు చేశారు.

(c) eenadu

ఉల్లి క్వింటా గరిష్ఠ ధర రూ. 1,328

కర్నూలు మార్కెట్, న్యూస్‌టుడే: కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం వివిధ పంట ఉత్పత్తుల ధరల వివరాలు ఇలా ఉన్నాయి. మార్కెట్‌కు 935 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు రాగా క్వింటా కనిష్ఠ ధర రూ. 250, మధ్యస్థ ధర రూ. 630, గరిష్ఠ ధర రూ. 1,328 పలికింది. వేరుసెనగ కాయలు క్వింటా గరిష్ఠ ధర రూ. 6,409, పూల విత్తనాలు రూ. 5,619, ఆముదాలు రూ. 5,822, మొక్కజొన్న రూ. 1,759, కందులు రూ. 6,570, కందులు వడకలు రూ. 1,856, శనగలు రూ. 5,200, ఎండుమిర్చి రూ. 10,201, కొర్రలు రూ. 2,349, మినుములు రూ. 6,449, సోయాబీన్స్ రూ. 3,390, సజ్జలు రూ. 2,321 పలికాయి. వ్యాపారులు ఈ-నామ్ పద్ధతిలో పంట ఉత్పత్తులను కొనుగోలు చేశారు.

నేడు నగరంలో విద్యుత్తు అంతరాయం

కర్నూలు వెంకటరమణ కాలనీ: నగరంలో గురువారం ఉదయం 7 నుంచి 9 గంటల మధ్యలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు కర్నూలు డివిజన్ ఈఈ శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనుల్లో భాగంగా బి.క్యాంపు, అరోరానగర్, సిక్యాంపు తదితర ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు డీ2 సెక్షన్ ఏడీఈ చంద్రమోహన్ చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632,
కర్నూలు గ్రామీణం : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : ?: ఇందిరాగాంధీనగర్, సీతారాంనగర్‌లలో మురుగు కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో దోమలు వృద్ధి చెంది జ్వరాలు ప్రబలే అవకాశముంది. - రఘు, స్థానికుడు

?: కలెక్టరేట్ సమీపంలో రహదారులపై పశువులు సంచరిస్తున్నాయి. వాహనదారుల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. - మనోజ్, స్థానికుడు

✔: సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తాం.
- నగరపాలక అధికారులు

పేదల సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పేదల సొంతింటి కల నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. కల్లూరు పట్టణం 35వ వార్డు గని గుంతలలో బుధవారం గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జేసీ నూరుల్ ఖమర్, కమిషనర్ పి.విశ్వనాథ, గృహ నిర్మాణ శాఖ పీడీ చిరంజీవి, డీఆర్డీఏ పీడీ రమణారెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల స్థలం కేటాయిస్తున్నట్లు తెలిపారు. టిడ్కో గృహ సముదాయాల్లో వసతులు పూర్తి చేసి ప్రజలకు ఇళ్లు అందజేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అనంతరం ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లు మంజూరైన వారికి పత్రాలను అందజేశారు. లబ్ధిదారులతో ఎమ్మెల్యే, జేసీ గృహప్రవేశాలు చేయించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పార్వతమ్మ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లు మురళీనాయుడు, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

డెఫ్‌లింపిక్స్‌కు కర్నూలు డివిజనల్ సహకార అధికారిణి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: జపాన్‌లోని టోక్యోలో జరుగుతున్న డెఫ్‌లింపిక్స్-2025 పోటీల్లో పాల్గొనేందుకు కర్నూలు డివిజనల్ కోఆపరేటివ్ అధికారిణి షేక్ జఫ్రీన్‌కు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ నెల 15 నుంచి 26వ వరకు క్రీడల్లో పాల్గొనేందుకు అనుమతి ఇస్తూ రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఉత్తర్వులు ఇచ్చారు.

స్మార్ట్‌గా నిధులు వృథా

- సుందరీకరణ పేరుతో ప్రజాధనం దుర్వినియోగం

పరిశీలన

నగరంలో గతంలో సుందరీకరణ పేరుతో భారీగా నిధులు వెచ్చించారు. ప్రజా ప్రయోజనాలను విస్మరించి నిధులు దుబారా చేశారు. అవి ప్రజలకు ఏ రకంగానూ ఉపయోగం లేకుండా పోయాయి. స్మార్ట్‌స్ట్రీట్ నిర్మాణంలో భాగంగా బిర్లాగేటు సమీపంలో రహదారులకు ఇరువైపులా వేసిన పాదబాటల్లో టైల్స్ పగిలిపోయాయి. కొందరి స్వార్థ ప్రయోజనాల కోసమే పనులు చేశారంటూ అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. అయితే అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరించారు. ప్రస్తుతం నగరంలో జరుగుతున్న సుందరీకరణ పనుల్లో సైతం నిధులు పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

-న్యూస్‌టుడే, కర్నూలు నగరపాలకసంస్థ

పాదబాటపై దెబ్బతిన్న టైల్స్

రూ.2 కోట్లు ‘వీధి’పాలు

నగరంలో రూ. రెండు కోట్లతో స్మార్ట్ స్ట్రీట్ ఏర్పాటు చేశారు. బిర్లాగేటు నుంచి సి.క్యాంపు కూడలి వరకు.., ఇటు పాత ఎస్బీఐ బ్యాంకు వరకు నిర్మాణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా రహదారికి ఇరువైపులా టైల్స్ ఏర్పాటు, సైక్లింగ్ జోన్, చిరువ్యాపారుల కోసం వెండర్ జోన్, వీధి దీపాల అమరిక పనులు చేశారు.

అలంకారప్రాయంగా మారిన విద్యుద్దీపాలు

అవసరం లేని చోట్ల

- బిర్లాగేటు నుంచి పాత ఎస్బీఐ బ్యాంకు వరకు రహదారికి ఇరువైపులా పార్కింగ్ టైల్స్ వేశారు. అలాగే కాలువలపై సిమెంట్ కాంక్రీట్ వేసి వాటిపై టైల్స్ పరిచారు. దీంతో కాలువల్లో పూడిక తొలగించడం కష్టతరంగా మారింది.
- అలాగే రహదారికి ఇరువైపులా ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు ఉన్నాయి. వీటి ప్రహరీలను ఆనుకొని టైల్స్ వేశారు. మరికొన్ని ఖాళీ స్థలాల వద్ద ప్రహరీలు నిర్మించడం గమనార్హం.
- స్మార్ట్ స్ట్రీట్ నిర్మాణంలో భాగంగా వేసిన టైల్స్ మొత్తం ధ్వంసమయ్యాయి. పాదబాటలను పలువురు వాహనాల పార్కింగ్‌కు వాడుకుంటుండగా.. ఇంకొందరు ఆక్రమించేసి దర్జాగా వ్యాపారాలు సాగిస్తున్నారు. అధికారులు ఆక్రమణలను తొలగించి మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రచారంలో పాల్గొన్న ఏపీ రైతు సంఘం నాయకులు

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, క్వింటా రూ. 12 వేలకు కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సీఆర్ భవన్ వద్ద బుధవారం నాయకుడు డి.శ్రీనివాసరావు అధ్యక్షతన పత్తి రైతుల రాష్ట్ర స్థాయి సమ్మేళనం నిర్వహించారు. ప్రచార ఆటో వద్ద నాయకులు మాట్లాడుతూ.. జిల్లాలో సుమారు 7 వేల హెక్టార్లలో పత్తి పంటను సాగు చేసినట్లు తెలిపారు. పత్తి రైతులు మొంథా తుపాను కారణంగా దిగుబడి తగ్గి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పత్తి రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 18, 19 తేదీల్లో ఆదోనిలో రాష్ట్ర స్థాయి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాముడు, కృష్ణానాయక్, పుల్లన్న, బాషా తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ల లీకేజీలకు మరమ్మతులు

స్పందనకు వందనం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: నగరంలో పలు చోట్ల తాగునీటి పైపులైన్ల లీకేజీలకు అధికారులు మరమ్మతులు చేయించారు. ‘పైపులకు చిల్లులు.. ప్రజలకు చిక్కులు’ శీర్షికన బుధవారం ‘ఈనాడు’లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. స్థానిక కొత్త బస్టాండు సమీపంలోని చల్లావారి వీధి ఎదురుగా, బళ్లారి చౌరస్తా నుంచి కొత్త బస్టాండుకు వెళ్లే మార్గంలో పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు. అలాగే కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం పక్కన తాగునీటి పైపులైన్ల లీకేజీల ప్రాంతంలో సిబ్బంది మరమ్మతులు చేపట్టారు.

ఖాళీ జాగా.. వ్యాధులు పాగా

నగరంలోని సంతోష్ నగర్ ఈద్గా సమీపంలో పారిశుద్ధ్యం లోపించింది. హైదరాబాదు- బెంగళూరు జాతీయ రహదారి సర్వీసు రోడ్డు పక్కన ఖాళీ స్థలంలో మురుగు నీరు నిలిచి కుంటను తలపిస్తోంది. ఖాళీ స్థలంలో నుంచి కాలువలోకి మురుగునీరు వెళ్లే మార్గం లేకపోవడంతో ఎక్కడికక్కడే నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది.

– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

ఆ కొద్ది దూరం.. ఒళ్లు హూనం

కల్లూరు మీదుగా కొత్త బస్టాండు లోపలకు వెళ్లే మార్గం. బస్సులు వెళ్లే దారి కంకర తేలి.. గుంతలమయంగా మారింది. చిన్నపాటి వర్షం పడితే దారంతా బురదమయంగా మారుతోంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి దారి బాగు పడేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణ

రక్షణ ప్రశ్నార్థకం.. ప్రమాద భయం

కల్లూరు నుంచి దేవనగర్‌కు వెళ్లే దారిలో హంద్రీ నదిపై కాజ్ వేకు ఇరువైపులా ఏర్పాటు చేసిన రక్షణ దిమ్మెలు శిథిలమయ్యాయి. రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధి దీపాలు సైతం లేకపోవడంతో రాత్రి వేళల్లో మరింత ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణ

రూ.లక్షలు పోయే.. లక్ష్యం నెరవేరదాయె

నగరంలోని ఆర్ఎస్ రోడ్డు ఐదు రోడ్ల కూడలి నుంచి బంగారు పేట వరకు విభాగిని ఏర్పాటు చేశారు. దీని మధ్యలో రూ.లక్షలు వెచ్చించి పూలమొక్కలు నాటించారు. నెలరోజులైనా కాకముందే 30 శాతానికి పైగా మొక్కలు ఎండిపోయాయి. వాటికి నీరు పోయకపోవడంతో ఆకులు రాలిపోయి, వాడిపోతున్నాయి. సుందరీకరణ పేరుతో రూ.లక్షలు వెచ్చించి నిర్వహణ పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. అధికారులు స్పందించి పచ్చదనం పెంపొందించాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో ప్రతిభ

పతకాలు సాధించిన చదరంగం క్రీడాకారిణులు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: పార్వతీపురంలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో జిల్లా క్రీడాకారిణులు పతకాలు సాధించారు. అండర్-19 టీం ఈవెంట్‌లో కర్నూలు జిల్లాకు చెందిన ఐదుగురు క్రీడాకారిణులు పతకాలు సాధించి అత్యధిక పాయింట్లతో రన్నర్స్ ట్రోఫీని అందుకున్నారు. వీరిని ఉమ్మడి జిల్లాల డీవీఈవోలు లాలప్ప, సురేష్‌బాబు, డీఈవోలు శ్యాముల్‌పాల్, శంకర్ నాయక్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ డీసీవో శ్రీదేవి, ఉమ్మడి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రాఘవేంద్రలు ప్రత్యేకంగా అభినందించారు.

ప్రతిభ చాటిన జిల్లా స్విమ్మర్లు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: విశాఖపట్నం స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని ఈత కొలనులో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 రాష్ట్రస్థాయి ఆక్వెటిక్ పోటీల్లో జిల్లా స్విమ్మర్లు పతకాలు సాధించారు. బాలికల విభాగంలో వైశాలికి 400 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో స్వర్ణం, 50 మీటర్ల బెస్ట్‌స్ట్రోక్‌లో కాంస్యం, జూనియర్ కళాశాల విభాగంలో అర్చనకు 800 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో రజతం, 200 మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో కాంస్యం, హేమలతకు 50 మీటర్ల విభాగంలో స్వర్ణం, 100 మీటర్ల విభాగంలో స్వర్ణం, 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో కాంస్య పతకాలను గెలిచారు. గోవర్ధిని 100 మీటర్ల ఫ్రీస్టైల్‌లో నాలుగో స్థానం సాధించారు. వీరిని ఉమ్మడి జిల్లాల డీవీఈవోలు లాలప్ప, సురేష్‌బాబు, డీఈవోలు శామ్యూల్ పాల్, శంకర్‌నాయక్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ డీసీవో శ్రీదేవి, ఉమ్మడి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రాఘవేంద్రలు అభినందించారు.

గవర్నర్‌కు సాదర స్వాగతం

గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న మంత్రి టీజీ భరత్, కలెక్టర్ డాక్టర్. ఎ.సిరి

ఓర్వకల్లు, కర్నూలు సచివాలయం న్యూస్‌టుడే: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్‌కు బుధవారం ఓర్వకల్లు విమానాశ్రయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సాదర స్వాగతం పలికారు. గవర్నర్ జిల్లా పర్యటనకు వచ్చిన నేపథ్యంలో గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 11.00 గంటలకు ఓర్వకల్లు విమానాశ్రయం చేరుకోగా మంత్రి టీజీ భరత్, కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, ఎస్పీ విక్రాంత్‌పాటిల్, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, ఆర్డీవో సందీప్‌కుమార్, విమానాశ్రయ డైరెక్టర్ విద్యాసాగర్ గవర్నర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి ప్రత్యేక వాహనాల్లో రాయలసీమ యూనివర్సిటీలో జరిగే కార్యక్రమానికి వెళ్లారు.

ఉగ్రవాదుల కార్యకలాపాల్లో వైద్యుల పాత్ర బాధాకరం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: న్యూ దిల్లీలోని ఎర్రకోట వద్ద ఉగ్రవాదులు జరిపిన బాంబు పేలుళ్ల ఘటన వెనుక వైద్యుల పాత్ర ఉండటం బాధకరమని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి డా. వినుషారెడ్డి అన్నారు. నెహ్రూనగర్‌లోని బృందావన్ అపార్ట్‌మెంట్‌లో ఉన్న భాజపా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వైద్య కళాశాలల స్థాపనలో పీపీపీ విధానంపై వైకాపా చేస్తున్న అసత్య ప్రచారాన్ని భాజపా తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించి రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవడమే వారి ప్రధాన అజెండాగా అభివర్ణించారు. పీపీపీ విధానంలో భూమి, భవనాలు, కళాశాలలు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయన్నారు. ఔట్ పేషంట్, ల్యాబ్, మందులన్నీ పూర్తిగా ఉచితంగా అందిస్తాయని వెల్లడించారు. 50 శాతం సీట్లు ప్రభుత్వ కోటా, అన్ని రిజర్వేషన్లు వర్తిస్తాయన్నారు. వైకాపా హయాంలో 17 కళాశాలకు 8,480 కోట్లు అంచనా వేసి.. కేవలం 1,550 కోట్లు మాత్రమే ఐదేళ్లలో ఖర్చు చేశారని విమర్శించారు.

శ్వాసకోస సమస్యలపై అవగాహన అవసరం

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే: శ్వాసకోస సమస్యపై తల్లులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీహెచ్ఎస్ పర్యవేక్షకురాలు ఎం.దానమ్మ అన్నారు. ప్రపంచ నిమోనియా దినోత్సవం సందర్భంగా బుధవారం ఇ.తాండ్రపాడు పిహెచ్‌సీ పరిధిలోని గొందిపర్లలో బాలింతలు, గర్భిణులకు నిమోనియాపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు వ్యాధి లక్షణాల గురించి తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా 2-5 నెలలలోపు పిల్లలు ఉన్న బాలింతలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన సర్పంచుల సంఘం నాయకులు

కర్నూలు గాయత్రీఎస్టేట్, న్యూస్‌టుడే: ఏపీ పంచాయితీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి, సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి భూమా వెంకట వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్, జిల్లా ఉపాధ్యక్షురాలు భాగ్యరత్న, జిల్లా కార్యదర్శి మహేశ్వరరెడ్డి, జిల్లా సహ కార్యదర్శులు బండ్ల చిన్నరామప్ప, ఎం.షేక్ బాషాలు బుధవారం స్థానిక మున్సిఫ్ కోర్టులో హాజరయ్యారు. సర్పంచుల నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ 2023 డిసెంబర్ 16న కోడుమూరు పట్టణానికి విచ్చేసిన కేంద్రమంత్రి దేవసింగ్‌చౌహాన్‌ను అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు కోడుమూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు వాయిదాకు హాజరైన సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయితీ అభివృద్ధి కార్యక్రమాలకు అవరోధాలు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో హక్కుల కోసం పోరాడతామని చెప్పారు.

వ్యభిచారం గుట్టు రట్టు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలులో గుట్టుగా నిర్వహిస్తున్న వ్యభిచార కార్యకలాపాలను పోలీసులు రట్టు చేశారు. పత్తికొండ పరిధిలోని దూదెకొండకు చెందిన వడ్డె మధుసూదన్(25) కర్నూలు నగర శివారు ఉల్చాల రోడ్డులోని ఆదిత్యనగర్‌లో ఇంటిని అద్దెకు తీసుకున్నారు. వేర్వేరు ప్రాంతాల నుంచి అమ్మాయిలను తెప్పించి వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. దీనిపై పోలీసులకు సమాచారం అందడంతో మంగళవారం రాత్రి కర్నూలు నాలుగో పట్టణ పోలీసుస్టేషన్ ఎస్సై చంద్రశేఖర్‌రెడ్డి సిబ్బందితో దాడి చేశారు. నిర్వాహకుడితో సహా ఏడుగురు విటులు, ముగ్గురు అమ్మాయిలను అదుపులోకి తీసుకున్నారు. అమ్మాయిలను కర్నూలు, చిలకలూరిపేట, అనంతపురానికి చెందిన వారిగా గుర్తించిన వారి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. ఏడుగురు విటులు, నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: అధిక వడ్డీలు వసూలు చేస్తూ అక్రమ వ్యాపారం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎం.డి.ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలో మాట్లాడారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ: రజక వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గురుశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఐలమ్మ కార్యాలయంలో నాయకులు శ్రీనివాసులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: ప్రైవేటు, కార్పొరేటు సంస్థలు లాభాలే ధ్యేయంగా పని చేస్తున్నాయని.. ఉద్యోగులకు తక్కువ వేతనాలిస్తూ మానసిక ఒత్తిడిని పెంచుతున్నాయని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా అన్నారు. ఐటీసీ కంపెనీలో యువకుడి ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: నగర శివారులోని షిర్డీ సాయి వృద్ధాశ్రమానికి పి.హరిహరనాథశర్మ కుటుంబ సభ్యులు దుప్పట్లు, నిత్యావసరాలను బుధవారం అందించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

బస్తిపాడు, తడకనపల్లె (కల్లూరు గ్రామీణ), న్యూస్‌టుడే: కల్లూరు మండల పరిధి బస్తిపాడు, తడకనపల్లె గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతర పంటలు, మిశ్రమ పంటల ప్రాధాన్యం, సమగ్ర సస్య రక్షణ గురించి రైతులకు వివరించారు.

ఉలిందకొండ (కల్లూరు గ్రామీణ), న్యూస్‌టుడే: హంద్రీనీవా కాలువ ద్వారా ఉలిందకొండ, చిన్నటేకూరు, తడకనపల్లె, కొల్లంపల్లి తండా గ్రామాల్లోని చెరువులకు నీళ్లు నింపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ కోరారు. బుధవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఉలిందకొండలోని చెరువును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. చెరువులకు నీళ్లు నింపడంలో పాలకులు నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు.

కర్నూలు నగరపాలకసంస్థ: నగర శివారులోని ఎన్టీఆర్ కాలనీ టిడ్కో గృహాల్లో అన్ని వసతులు తీర్చిదిద్దుతున్నామని కమిషనర్ పి.విశ్వనాథ అన్నారు. ఈ నెల 17న 187 మంది లబ్ధిదారులకు ఇళ్లను అప్పగిస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఆయన టిడ్కో గృహాలను పరిశీలించారు. లబ్ధిదారులు సౌకర్యవంతంగా నివసించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: చిన్నారుల్లో నిమోనియో నివారణలో వ్యాక్సినేషన్ కీలక పాత్ర అని పోషిస్తుందని మెడికవర్ హాస్పటల్ పీడియాట్రిక్ వైద్యుడు డాక్టర్ గణేష్ అన్నారు. ప్రపంచ నిమోనియో దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం హాస్పిటల్‌లో చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

నిరసన ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తదితరులు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: వైద్య కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్వగృహం నుంచి కల్లూరు తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొత్త వైద్య కళాశాలలను తన అనుయాయులకు కట్టబెట్టాలని నిర్ణయించారన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా వార్డులకు చెందిన కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ విజయలక్ష్మికి తాఖీదులు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: కర్నూలు వైద్య కళాశాలలో గైనిక్ విభాగంలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న సమయంలో డాక్టర్ విజయలక్ష్మి బదిలీ చేయగా అప్పుడు విధుల్లో చేరలేదు. తరువాత వేరే కళాశాలకు బదిలీ అయ్యారు. దీనిపై ఆమెకు తాఖీదులు ఇచ్చి ఆమె వివరణ ఆధారంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేసింది.

కబడ్డీ కోర్టులో పతకాల కూత

- గ్రామీణ క్రీడలో సత్తా చాటుతున్న వైద్య విద్యార్థులు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: నిత్యం స్టెతస్కోప్ చేతపట్టి రోగుల నాడి చూసే వైద్య విద్యార్థులు మైదానంలోనూ పట్టు పట్టేస్తున్నారు. పుస్తకాలు చేతపట్టి.. ఎంబీబీఎస్ సీటు పొందిన వైద్య విద్యార్థులు గ్రామీణ క్రీడ అయిన కబడ్డీలో పాయింట్ పట్టి తొడ గొడుతున్నారు. అంతర్ వైద్య కళాశాలల కబడ్డీ పోటీల్లో కర్నూలు వైద్య కళాశాల విద్యార్థులు దూకుడైన ఆటతో క్రీడా నిపుణులను ఆకట్టుకొంటున్నారు. డిసెంబర్ 9, 10 తేదీల్లో రాజమండ్రిలోని జీఎస్ఎల్ వైద్య కళాశాలలో జరిగే వైద్య కళాశాలల పోటీల్లో సైతం చాటేందుకు మైదానంలో సాధన చేస్తున్నారు.

ట్రోఫీ అందించడమే లక్ష్యం- రాజేష్



రాజేష్ ఎంబీబీఎస్ చివరి సంవత్సరం చదువుతున్నారు. స్వస్థలం అనంతపురం. తల్లిదండ్రులు నిర్మల, వెంకటేష్. తండ్రిది చీరల వ్యాపారం. 2016 నుంచి శిక్షణ పొందుతున్నారు. 2023 ఫిబ్రవరిలో రాజమండ్రిలోని జీఎస్ఎల్ వైద్య కళాశాలలో జరిగిన అంతర్ కళాశాలల పోటీల్లో లెఫ్ట్ కార్నర్‌గా ఆడి జట్టును రెండో స్థానంలో నిలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో నెల్లూరులోని నారాయణ వైద్య కళాశాలలో జరిగిన అంతర్ కళాశాలల పోటీల్లో సైతం ప్రతిభ కనబరిచి జట్టును సెమీ ఫైనల్స్ వరకు తీసుకెళ్లారు. రానున్న పోటీల్లో జట్టుకు ట్రోఫీని అందించడమే లక్ష్యమంటున్నారు.

పాయింట్‌తో వస్తేనే విజయం - నితిన్

నితిన్ ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నారు. స్వగ్రామం చిత్తూరు జిల్లా పుంగనూరు గ్రామం. తల్లిదండ్రులు లక్ష్మి, మల్లికార్జున. 2017 నుంచి కబడ్డీ ఆటలో ప్రావీణ్యం పొందారు. 2023లో రాజమండ్రిలోని జీఎస్ఎల్ వైద్య కళాశాలలో జరిగిన అంతర్ కళాశాలల పోటీల్లో లెఫ్ట్ కార్నర్, రైడర్‌గా ఆడి జట్టును రెండో స్థానంలో నిలిపారు. 2025 ఏప్రిల్‌లో నెల్లూరులో జరిగిన అంతర్ కళాశాలల పోటీల్లో సైతం సత్తా చాటి జట్టును సెమీ ఫైనల్స్‌కు చేర్చారు. ప్రతి రైడ్‌లో పాయింట్‌తో రాగలిగితేనే విజయం వరిస్తుందంటున్నారు.

జట్టును ముందుండి నడిపిస్తా - దినేష్

దినేష్ ఎంబీబీఎస్ ఫైనల్ ఈయర్ చదువుతున్నారు. వీరి స్వగ్రామం నెల్లూరు. తల్లిదండ్రులు చంద్రమ్మ, ఈశ్వర్‌రెడ్డి. తండ్రిది బియ్యం వ్యాపారం. 2016 నుంచి కబడ్డీ సాధన చేస్తున్నారు. పాఠశాల స్థాయి నుంచే కబడ్డీలో రాణిస్తూ వస్తున్నారు. 2023 ఫిబ్రవరిలో రాజమండ్రిలో జరిగిన పోటీల్లో రైట్ కార్నర్‌గా ఆడి ప్రతిభ చాటారు. ఈ ఏడాది నెల్లూరులో జరిగిన అంతర్ కళాశాల పోటీల్లో సైతం మంచి ఆటతీరు కనబరిచారు. రాజమండ్రిలో జరిగే పోటీల్లో జట్టును ముందుండి నడిపిస్తానన్నారు.

(c) eenadu

కళారాధన

శ్రీశైలం మహాక్షేత్రంలో దేవస్థానం నిర్వహిస్తున్న కళారాధనలో భాగంగా బుధవారం నిర్వహించిన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. విశాఖపట్నానికి చెందిన శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్టు కళాకారులు నృత్య ప్రదర్శనలు చేశారు. కళాకారులను దేవస్థానం అధికారులు సత్కరించారు. – న్యూస్‌టుడే, శ్రీశైలం, నంది సర్కిల్

శక్తి యాప్ డౌన్‌లోడు చేసుకోండి

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన శక్తియాప్‌ను చరవాణుల్లో డౌన్‌లోడు చేసుకోవాలని పోలీసులు ఒక ప్రకటనలో సూచించారు. ఏదైనా ఆపద సమయంలో మహిళలు, బాలికలు శక్తియాప్‌తోపాటు డయల్ 112, డయల్ 100ను సంప్రదించొచ్చని పేర్కొన్నారు.

కైలాసగిరి

ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో ఈనెల 14న కోటి దీపోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు దేవస్థానం సమాయత్తం అవుతోంది. గంగాధర మండపం వద్ద కైలాసాన్ని తలపించే భారీ సెట్టింగ్‌ను నిర్మిస్తున్నారు. వేదికపై శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామివార్ల ఉత్సవమూర్తులను కొలువుదీర్చనున్నారు. – న్యూస్‌టుడే, శ్రీశైలం ఆలయం

నిఘాకు మసక.. వ్యాపారి మస్కా

- చేతికొచ్చిన పంట దిగుబడులు
- తనిఖీ కేంద్రాలపై కొరవడిన పర్యవేక్షణ
- సరిహద్దులు దాటిస్తున్న అక్రమార్కులు

తెరుచుకోని బనగానపల్లి మార్కెట్ యార్డు తనిఖీ కేంద్రం

పంట చేతికొచ్చింది.. అమ్మకానికి సిద్ధంగా ఉన్న దిగుబడులను ఇటీవల వచ్చిన మొంథా తుపాన్ నిండా ముంచేసింది.. తడిసిన గింజలను వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకొంటున్నారు. తనిఖీ కేంద్రాల వద్ద సిబ్బంది జేబులు నింపి సరిహద్దులు దాటిస్తున్నారు. సీసీ కెమెరాలు లేకపోవడంతో సిబ్బంది వసూళ్ల దుకాణం పెట్టారు.
– న్యూస్‌టుడే, కర్నూలు, నంద్యాల వ్యవసాయం, బనగానపల్లి

కనిపించని సీసీ కెమెరాలు

- నంద్యాల జిల్లాలో 24, కర్నూలులో 12 వ్యవసాయ తనిఖీ కేంద్రాలు ఉన్నాయి. కొన్ని చోట్ల డబ్బా రేకుల్లో కేంద్రాలుండగా. . మరికొన్ని చోట్ల అవికూడా కూడా లేవు. ఆయా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.
- ప్రతి 12 గంటలకు ఇద్దరు చొప్పున పని చేయాల్సి ఉంది. ఉద్యోగులు లేక కొన్ని ఉదయం.. మరికొన్ని రాత్రిళ్లు మూతపడుతున్నాయి. మార్కెటింగ్ శాఖ సూపర్‌వైజర్ స్థాయి అధికారులు విధులు నిర్వహించాలి. అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో సెక్యూరిటీ గార్డులు పనిచేస్తున్నారు.

సాగు (హెక్టార్లలో)
3,83,072 సాధారణం
2,21,377 సాగైంది
నంద్యాల

రైతు పేరుతో దాటిస్తున్నారు

- రైతులే స్వయంగా ఇతర ప్రాంతాల్లో ధాన్యాన్ని విక్రయించడానికి తరలిస్తే మార్కెట్ కమిటీలకు ఎలాంటి ఫీజు చెల్లించనక్కర్లేదు. వ్యాపారులైతే రెండు శాతం ఫీజు చెల్లించాల్సి ఉంది. కొందరు వ్యాపారులు రైతుల పేరుతో సరిహద్దు దాటిస్తున్నారు.
- సెక్యూరిటీ గార్డులు, మార్కెట్ కమిటీ సిబ్బంది కలిసి వసూళ్లకు పాల్పడుతున్నారు. బిల్లు పుస్తకాలు వారి దగ్గరే ఉన్నా.. ఐదు లారీలు రవాణా చేస్తే.. ఒక లారీకి మార్కెట్ సెస్ వసూలు చేయడం.. డబ్బులు తీసుకొని మిగిలిన లారీలను పంపిస్తున్నట్లు ఫిర్యాదులొచ్చాయి. ఒక్కో కేంద్రం వద్ద నిత్యం రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

తగ్గిన ఆదాయం

- క్వింటా ధాన్యం రూ.2 వేల ధర ఉంటే ఒక లారీ 30 టన్నుల సామర్థ్యంతో రవాణా చేస్తారు. నిబంధనల ప్రకారం మార్కెట్ కమిటీకి 2 శాతం అంటే రూ.12 వేలు ఫీజు చెల్లించాలి. పర్యవేక్షణ లేకపోవడంతో మార్కెటింగ్ శాఖకు భారీగా గండి పడుతోంది.
- కర్నూలు జిల్లాలో ఏడు మార్కెట్ కమిటీలుండగా.. ఒక్క పత్తికొండ మినహా మిగతా మార్కెట్లలో ఆదాయం తగ్గిపోయింది. నంద్యాల జిల్లాలో 8 వ్యవసాయ మార్కెట్లు ఉండగా 23 చెక్‌పోస్టులున్నాయి. రూ.12.57 కోట్లు వసూలైంది.
- ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు.. రైతులకు వ్యాపారులే దిక్కయ్యారు. దీన్ని ఆసరాగా తీసుకొని ధర అమాంతం తగ్గించారు. రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసిన వ్యాపారులు సరిహద్దు జిల్లాలకు తరలిస్తున్నారు.

ఆదాయం (రూ.కోట్లలో)	ఈ ఏడాది లక్ష్యం	ఇప్పటికీ వసూలైంది
	26.60	12.57

గెలుపు బాట.. పతకాల మోత

ఆదోని పట్టణానికి చెందిన కుర్రాడు బోయ సురేంద్ర బరువులెత్తి బంగారు పతకాలు సాధిస్తున్నారు. హైదరాబాదులో ఈ నెల 9న జరిగిన రాష్ట్ర స్థాయి బెంచ్ ప్రెస్‌లో 97 కిలోలు, డెడ్ లిఫ్ట్‌లో 205 కిలోల బరువు ఎత్తి బంగారు పతకం సొంతం చేసుకొన్నారు. గత నెల బెంగళూరులో జరిగిన జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో డెడ్ లిఫ్ట్‌లో 175 కిలోలు, స్క్వాడ్‌లో 175 కిలోలు, బెంచ్ ప్రెస్‌లో 95 కిలోల బరువులు (మొత్తం 445 కిలోలు) ఎత్తి రెండో స్థానంలో నిలిచారు. డిగ్రీ పూర్తి చేసిన సురేంద్ర ప్రభుత్వ శాఖలో 'కొలువు'దీరాలని సాధన చేస్తున్నారు.. ఖాళీ సమయంలో జిమ్‌కు వెళ్తున్నారు.. అక్కడ నిత్యం రెండు గంటల పాటు తర్ఫీదు పొందుతున్నారు. జాతీయ స్థాయిలో రాణించడమే తన లక్ష్యమని అతను పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, ఆదోని క్రీడలు

కానాలలో పింగళి సూరన రాతలు

అష్టదిగ్గజాల్లో ఒకరైన పింగళి సూరన నంద్యాల మండలం కానాల గ్రామ నివాసి. అందుకే అప్పటి గ్రామ పెద్ద.. డాక్టర్ సురేశ్‌రెడ్డి 1988లో పింగళి సూరన పేరుతో ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేశారు. శ్రీకృష్ణదేవరాయల కొలువులో అష్టదిగ్గజాల్లో ఒకరైన పింగళి సూరన తొలి ప్రబంధ నవల కళాపూర్ణోదయం రచించారు. ఈ నవలను అప్పటి నంద్యాల రాజు ఆరవీటి కృష్ణమరాజుకు అంకితమిచ్చారు. దీనికి రాజు మెచ్చి కానాల గ్రామాన్ని సూరనకు అగ్రహారంగా ఇచ్చినట్లు ఆధారాలు ఉన్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. అనంతరం సూరన గ్రామ శివారులో బుగ్గరామేశ్వరస్వామి దేవాలయాన్ని నిర్మించి దాని నిర్వహణకు 70 ఎకరాల మాన్యాన్ని అప్పగించారు. 2009లో పూదోట స్వామి ఆలయ ఆవరణలోని ఉద్యానవనంలో పింగళి సూరన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సూరన కానాల వాసి అని.. ఆయన స్ఫూర్తితో పింగళి సూరన సారస్వత సంఘాన్ని ప్రముఖ వైద్యుడు గెలివి సహదేవుడు, తెలుగు పండితుడు గొట్టిముక్కల సుబ్రహ్మణ్యశాస్త్రిలు ఏర్పాటు చేసి తెలుగు భాష అభివృద్ధికి కృషి చేస్తున్నారు.
– న్యూస్‌టుడే, నంద్యాల గ్రామీణం

జాతి నిర్మాణానికి విద్య అత్యంత కీలకం

- రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్
- ఆర్‌యూలో వైభవంగా స్నాతకోత్సవం

ఈనాడు, కర్నూలు, కర్నూలు విద్య, న్యూస్‌టుడే : సమాజంలోని ప్రతి ఒక్కరూ వారి తల్లిదండ్రులు, వారి పిల్లలు కూడా గర్వపడేలా జీవించాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. కర్నూలులోని రాయలసీమ విశ్వవిద్యాలయ నాలుగో స్నాతకోత్సవానికి ఆయన బుధవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎ.ఎం.గ్రీన్ సంస్థ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎస్.వి.రామకుమార్‌కు గవర్నర్ అబ్దుల్ నజీర్, వీసీ ఆచార్య వి.వెంకటబసవరావులు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. 75 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. పలువురు పట్టాలు అందుకున్నారు. గవర్నర్ మాట్లాడుతూ ఉన్నతవిద్య ఎన్నో అవకాశాలకు ముఖద్వారం లాంటిదన్నారు. సామాజికంగా, ఆర్థికంగా ఎదిగేందుకు, ఉత్తమ పౌరుడిగా రాణించేందుకు విద్య అండగా నిలుస్తుందన్నారు.

స్నాతకోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

- వీసీ వెంకట బసవరావు మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి ఆర్‌యూ క్యాంపస్‌లో డిగ్రీలో బీకాం, బీఎస్సీ కోర్సులతోపాటు పీజీలో ఫుడ్ సైన్సుకు సంబంధించిన కోర్సులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు.
- ఎ.ఎం.గ్రీన్ సంస్థ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎస్.వి.రామకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో దూరదృష్టితో ఆలోచించి అమరావతి గ్రీన్ హైడ్రోజన్‌వ్యాలీ, క్వాంటమ్ మిషన్ ఏర్పాటు చేస్తున్నారని, పునరుత్పాదక ఇంధన వనరుల విధానాన్ని తీసుకొచ్చారని ప్రశంసించారు. ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి, రెక్టార్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ విజయ్ కుమార్ నాయుడు, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లెసీమలో పచ్చతివాచీ

కనుచూపుమేరా వరి పైరు.. పల్లెసీమలో పచ్చతివాచీలా ఆహ్లాదకరంగా మారింది. జిల్లాలో ఈ ఏడాది అధిక వర్షపాతం నమోదు కావడంతో రైతన్నలు వరి సాగుపై ఆసక్తి చూపారు. నంద్యాల జిల్లా కేంద్రం నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్తపల్లె గ్రామం వరకు రోడ్డుకు ఒకవైపు వందకు పైగా ఎకరాల్లో వరి సాగు చేశారు. డ్రోన్ కెమెరాలో తీసిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటోంది. అటుగా వెళ్లేవారు ఇక్కడి పచ్చదనాన్ని ఆస్వాదిస్తున్నారు.
– న్యూస్‌టుడే, బొమ్మలసత్రం

కాట్లు దాచి.. రూ.కోట్లు దోచి

■ కుక్కలకు శస్త్రచికిత్సలు చేస్తున్నారట

ఆదోని, నంద్యాల, కర్నూలు, పురపాలికలు, వైద్యాలయం, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలో రోజురోజుకు కుక్కల బారిన పడిన వారి సంఖ్య పెరుగుతోంది. ఓవైపు శునకాలకు సంతాన నియంత్రణ శస్త్ర చికిత్సలు, వ్యాక్సినేషన్ పేరుతో రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో ఫలితాలు కానరావడం లేదు. ఉమ్మడి జిల్లాలో ప్రతి నెలా వెయ్యి మంది బాధితులు నమోదవుతున్నారు. పరిస్థితి తీవ్రత నేపథ్యంలో ఈ ఏడాది జూన్ నుంచి కు.ని.శస్త్ర చికిత్స పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో బాధితుల కేసుల సంఖ్య తగ్గాల్సి ఉండగా.. మరింత ఎక్కువవడం అనుమానాలకు తావిస్తోంది. జనవరి నుంచి ఇప్పటి వరకు కర్నూలులో 11,921, నంద్యాలలో 10,826 మందిని శునకాలు కరిచాయి.

పెడచెవిన పెడుతున్నారు

- గతంలో చికిత్స అనంతరం చెవికి క్లిప్పు వేసేవారు. ప్రస్తుతం వాటి చెవులను కొద్దిగా కత్తిరిస్తున్నారు. అలా చెవికోసిన శునకాలు ఎక్కడా కనిపించడం లేదు. చికిత్సలు చేయని వాటికి కూడా కాట్లు పెడుతున్నారన్న ఆరోపణలున్నాయి.
- కు.ని. చికిత్సలు చేసి యాంటీ రేబిస్ టీకాలు వేయాల్సి ఉంది. అనంతరం ఐదు రోజులపాటు నియంత్రణలో ఉంచాలి. వీటికి ఆహారం, చికిత్సకయ్యే ఖర్చు కలిపి ఒక్కోదానికి రూ.1,500 కేటాయించారు.

ఎక్కడ.. ఎంత ఖర్చు

- కర్నూలు నగరంలో 52 వార్డులున్నాయి. గార్గేయపురం ప్రాంతంలో చికిత్స విభాగం ఏర్పాటు చేశారు. 2022 నుంచి 2025 వరకు 13,597 శునకాలకు కు.ని. చికిత్సలు చేసి టీకాలు వేసినట్లు అధికారులు చెబుతున్నారు. రోజూ 20-40 కుక్కలకు చికిత్స చేయాలని నిర్ణయించారు. ఈ లెక్కన రూ.2.03 కోట్లు ఖర్చు చేసినట్లు లెక్కలు రాశారు.
- ఆదోనిలో మొదటి విడత కింద 1,407 కుక్కలకు కు.ని. చికిత్సలు చేయాలని నిర్ణయించారు. రాంజల చెరువు ప్రాంతంలో ఏఆర్‌వీ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జూన్‌లో పనులు ప్రారంభించారు. రోజూ ఏడు కుక్కలకు కు.ని. చికిత్సలు చేయాలని భావించారు. ఇప్పటివరకు 307 కుక్కలకు చేశారు. గత మూడు నెలలుగా సేవలు నిలిచిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో రెండుసార్లు రూ.20 లక్షల చొప్పున కేటాయించినట్లు చూపారు. వీటికి సంబంధించిన దస్త్రాలు మాయం చేశారు.
- నంద్యాలలో భీమవరం రహదారిలో కు.ని. చికిత్స విభాగం ఏర్పాటు చేశారు. రోజూ 20 శునకాలకు ఆపరేషన్లు చేయాలని భావించారు. జూన్ నుంచి ఇప్పటివరకు 1,167 వరకు చేసినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఒక్కో శునకానికి రూ.1,650 ఖర్చు చేస్తున్నారు.

ఆధార్ అధనంపై ఫిర్యాదు చేయొచ్చు

ఆధార్ కార్డుల్లోని తప్పుల సవరణ, పేరు, చిరునామాల్లో మార్పులు, నవీకరణ తదితరాల కోసం జనం ఆధార్ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధార్‌కు సంబంధించిన వివిధ మార్పులు చేర్పుల కోసం ఇదివరకు ఉన్న సర్వీసు రుసుము కాస్త పెంచింది. కేంద్రాల నిర్వాహకులు ఆ మేరకే వసూలు చేయాలి.
– న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

ఆన్‌లైన్లో సంప్రదించొచ్చు

- రెసిడెంట్.యూఐడీఏఐ.ఇన్‌లోకి వెళ్లి లింక్ ద్వారా నేరుగా ఫిర్యాదు చేయొచ్చు లేదంటే హెల్ప్(అట్)యూఐడీఏఐ.జీవోవీ.ఇన్‌కు ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు.
- ఫిర్యాదు చేసిన వెంటనే రెఫరెన్స్ నంబరు వస్తుంది. దాని ద్వారా నివేదికను ట్రాక్ చేసుకోవచ్చు.

కొత్త సర్వీసు ఛార్జీలు

- కొత్తగా ఆధార్ నమోదు ఉచితం. డాక్యుమెంటు అప్‌లోడ్ చేయడానికి రూ.75 ఛార్జీలు ఉంటాయి.
- 5-7, 15-17 ఏళ్ల లోపు వారికి బయోమెట్రిక్ అప్‌డేట్ ఉచితం.
- పేరు, చిరునామా, పుట్టిన తేదీ, జెండర్, చరవాణి నంబరు, ఈమెయిల్ ఐడీ నమోదుకు రూ.75 ఛార్జీలు ఉంటాయి.
- 17ఏళ్ల పైనున్న వారికి బయోమెట్రిక్ అప్‌డేట్ రూ.125 ఛార్జీలు ఉన్నాయి.
- ఆధార్ కార్డు డౌన్‌లోడ్, ప్రింట్‌కు రూ.40 ఛార్జీలు ఉన్నాయి.

1947 నంబరుకు ఫోన్ చేస్తే..

- ఆధార్ కేంద్రాల్లో నిర్దేశిత రుసుము కంటే అధికంగా వసూలు చేస్తే 1947 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు.

ఒకే గ్రామం.. రెండు మండలాలు

నంద్యాల మండల శివారులోని బాబానగర్ నంద్యాల, గోస్పాడు మండలాల్లో ఉంది. 70 ఏళ్ల క్రితం మాజీ ఎంపీ సుబ్బరామిరెడ్డి తండ్రి బాబుల్‌రెడ్డి ఇక్కడికి వచ్చి పొలాలు కొనుగోలు చేసి నివాసం ఏర్పాటు చేసుకొన్నారు. దాంతో ఈ గ్రామం బాబుల్‌రెడ్డినగర్‌గా.. బాబానగర్‌గా మారింది. బాబానగర్‌లో కొంతభాగం నంద్యాల మండలం కానాల పంచాయతీలో, మరికొంత గోస్పాడు మండలం దీబగుంట పంచాయతీ పరిధిలో ఉంది. గ్రామం మధ్యలో విద్యుత్తు స్తంభం, దానికి ఎదురుగా సిమెంటు రోడ్డులో ఒక గీత హద్దుగా ఉంది. స్తంభానికి ఆనుకుని ఉన్న గీతకు ఓ వైపు ఉన్నవారు గోస్పాడు మండలంలోని దీబగుంటకు, మరోవైపు ఉన్నవారు కానాల పంచాయతీకి చెందుతారు. – న్యూస్‌టుడే, నంద్యాల గ్రామీణం

మీ డబ్బు.. మీ హక్కు

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ బ్యాంకుల్లో పదేళ్లకుపైగా లావాదేవీలు జరగని ఖాతాలు లక్షల్లో ఉన్నాయి. 7,57,818 ఖాతాలకు సంబంధించి ఎలాంటి లావాదేవీలు జరగడం లేదని అధికారులు గుర్తించారు. ఆయా ఖాతాల్లో రూ.157.14 కోట్ల నగదు మూలుగుతోంది. ఈ మొత్తాన్ని సంబంధిత వ్యక్తులు తిరిగి పొందేందుకు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా అవకాశం కల్పించింది. దీని కోసం 'మీ డబ్బు-మీ హక్కు' పేరుతో అవగాహన కల్పిస్తోంది.
– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

ఏళ్లుగా నిల్వ

కర్నూలు జిల్లాలో 4,38,740 ఖాతాల్లో రూ.92.55 కోట్లు, నంద్యాల జిల్లా పరిధిలో 3,19,078 ఖాతాల్లో రూ.64.59 కోట్ల నిధులు ఏళ్లుగా మురుగుతున్నాయి. లావాదేవీలు నిర్వహించని ఖాతాల్లో వ్యక్తిగత, ప్రభుత్వ, వివిధ సంస్థల ఖాతాలు ఉన్నాయి.

కారణాలెన్నో..

- ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఈ ఖాతాలు ఉన్నాయి. ఖాతాదారులు మృతి చెందడం.. దీర్ఘకాలిక పెట్టుబడుల కింద వీటిని ఉంచడం, బ్యాంకుల్లో నగదుకు గ్యారెంటీ ఉంటుందన్న ధీమాతో అలానే వదిలేస్తున్నారు.
- ఖాతా తెరిచినప్పుడు నామినీ వివరాలు నమోదు చేయకపోవడంతో ఆ మొత్తం ఎవరికీ రాకుండా అలాగే ఉండిపోయింది.
- బ్యాంకులో నగదు జమ చేసి అకాల మృత్యువాత పడటం.. ఆ వివరాలు కుటుంబ సభ్యులకు తెలియకపోవడం మరో కారణం. సరైన పత్రాలు లేకపోవడం, చిరునామాల్లో తప్పులు దొర్లడం లాంటి వాటితో నిల్వలు పేరుకుపోయాయి.

ఇలా పొందొచ్చు

- ఖాతాల్లో డబ్బులను సంబంధిత ఖాతాదారులు అసలైన ధ్రువపత్రాలు ఇచ్చి తీసుకోవచ్చు. ఖాతాదారులు చనిపోతే వారికి సంబంధించిన మరణ ధ్రువీకరణ పత్రం చూపి కుటుంబసభ్యుల అంగీకార పత్రాన్ని తీసుకెళ్లి నామినీలు డబ్బు తీసుకునే సదుపాయాన్ని ఆర్‌బీఐ కల్పించింది. ఖాతాదారుడు ఉంటే సంబంధించిన పత్రాలు తీసుకెళ్లి ఈకేవైసీ చేయించుకోవడం ద్వారా ఖాతాను పునరుద్ధరించుకోవచ్చు.

	ఖాతాలు	నగదు (రూ.కోట్లలో)
వ్యక్తిగతం	3,05,525	54.05
సంస్థలు	10,645	7.66
ప్రభుత్వం	2,908	2.88

డిగ్రీ కళాశాలలో ఉచిత శిక్షణ 28 నుంచి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ కేంద్రంలో ఈ నెల 28 నుంచి సెక్యూరిటీ, అనలిస్టు, క్లౌడ్ కంప్యూటింగ్ విత్ ఏడబ్ల్యూఎస్, అజ్యూర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ డా.శశికళ తెలిపారు. డిగ్రీ, బీటెక్‌తో కంప్యూటర్, డిప్లొమో చదివిన యువకులు అర్హులన్నారు. 82978 12530 నంబరును సంప్రదించాలన్నారు.

మాన్యమున్నా.. నైవేద్యమేదీ

■ శిథిలావస్థలో చెన్నకేశవస్వామి ఆలయం

ప్యాపిలి, న్యూస్‌టుడే : ప్యాపిలి పట్టణం నడిమిగేరిలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం శిథిలావస్థకు చేరింది. ఒకప్పుడు ధూపదీప నైవేద్యాలతో కళకళలాడగా నేడు పట్టించుకునేవారే కరవయ్యారు. ఆలయానికి 201 ఎకరాల మాన్యం ఉన్నప్పటికీ అభివృద్ధి చేయడం లేదు. దేవాదాయ శాఖ అధికారులు సైతం పట్టించుకోకపోవడం గమనార్హం.

కూలిపోయేలా ఉన్నా..

లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయాన్ని శతాబ్దాల కిందట నిర్మించారు. ప్రస్తుతం ఆలనాపాలనా కరవైంది. గుడి స్తంభాలు, పైకప్పు దూలాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో భక్తులు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. దేవాదాయ శాఖ అధికారులు పలుమార్లు ఆలయాన్ని పరిశీలించినా ప్రయోజనం శూన్యమే.

దేవాదాయ శాఖ పట్టించుకోక..

దేవాలయానికి 201 ఎకరాల మాన్యం ఉంది. నలుగురు పూజారులు 30 ఎకరాలు సాగు చేసుకుంటున్నారు. ఇనాం భూముల కింద స్వామి సేవకులకు సంబంధించి 143 ఎకరాలు వారి ఆధీనంలో ఉంది. ఇందులో కొందరు మాత్రమే సాగు చేసుకుంటున్నారు. మిగిలిన 28 ఎకరాలకు మాత్రమే ఏటా కౌలుకు వేలం నిర్వహిస్తుంటారు. దీనిద్వారా రూ.35 వేలు మాత్రమే వస్తోంది. ఈ నిధులతోనే ఉత్సవాల సమయంలో ధూపదీప నైవేద్యాలకు వినియోగిస్తున్నారు. ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి ఇటీవల ఆలయాన్ని పరిశీలించారు.. అభివృద్ధికి తమవంతు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో దేవాదాయ శాఖ అధికారులు స్పందించి ఆలయ అభివృద్ధికి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

పట్నమొచ్చారు.. పట్టా పొందారు

పేదింటి బిడ్డలు.. ఉన్నత చదువులకు ఊరొదిలి వచ్చారు.. పట్టుపట్టి చదివారు.. చదువులో 'మార్కు' చూపారు.. రాయలసీమ విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించిన స్నాతకోత్సవంలో సందడి చేశారు. ఇంజినీరింగ్‌లో 15, పీజీలో 60 మంది అభ్యర్థులు.. గవర్నరు చేతులమీదుగా బంగారు పతకాలు అందుకొన్నారు. 394 మందికి పట్టాలు ప్రదానం చేశారు. తమ ఆనందాన్ని కుటుంబ సభ్యులతో పంచుకొన్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు విద్య

అమ్మ నడిపించింది

– సరస్వతి, ఎంఏ ఇంగ్లిష్, కర్నూలు

నాన్న రాజశేఖర్ చనిపోయినప్పటి నుంచి అమ్మ సునంద అన్నీ తానై కష్టపడి నన్ను చదివించింది. పీజీ చేస్తానని ఆమెను అడిగితే గౌరవించారు. ఆమె నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎంఏ ఇంగ్లిష్ పూర్తి చేశా. దీంతోపాటు బంగారు పతాకం రావడం సంతోషంగా ఉంది. కళాశాలలో నేర్చుకున్న అంశాలను భవిష్యత్తులో విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పేందుకు ఉపయోగిస్తా.

తెలుగు భాషాభివృద్ధికి కృషి

– నీలిమ, ఆత్మకూరు

వర్సిటీ ప్రాంగణంలోనే తెలుగులో పీజీ పూర్తి చేశా. బంగారు పతాకం రావడం ఎంతో ఆనందంగా ఉంది. ఇదే స్ఫూర్తితో ఉపాధ్యాయినిగా రాణించడంతోపాటు తెలుగు భాష అభ్యున్నతికి నావంతు కృషి చేస్తా. చిన్నప్పటి నుంచే తెలుగు భాషంటే మమకారం. అమ్మ నాగసులోచన, నాన్న నాగరాజు వ్యవసాయం చేస్తారు. కష్టపడి నన్ను చదివించారు. వారి కష్టాన్ని వృథా చేయకుండా భవిష్యత్తులో ఉన్నత హోదాకి చేరుకుంటా. ఎలాంటి కష్టాలు లేకుండా చూసుకుంటా.

నాన్న ప్రోత్సాహంతోనే..

– యశ్విత, బీటెక్, బత్తలపల్లె

మాది అనంతపురం జిల్లా బత్తలపల్లె గ్రామం. ఆర్‌యూ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ (ఈసీఈ) పూర్తి చేశా. బంగారు పతకం రావడం సంతోషంగా ఉంది. నాన్న త్రిమూర్తి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. మొదట్లో ఇంటికి దూరంగా వెళ్లేందుకు ధైర్యం సరిపోలేదు. నాన్న ప్రోత్సాహంతోనే ఆర్‌యూ ఇంజినీరింగ్ కళాశాలలో చదివా. పాఠ్యాంశాల్లో సందేహాలొస్తే అధ్యాపకుల దృష్టికి తీసుకెళ్లి నివృత్తి చేసుకునేవాళ్లం. నాన్న మాటలే నా విద్యాభివృద్ధికి మార్గదర్శకంగా నిలిచాయి.

(c) eenadu

భూగర్భ శివాలయం.. పునర్నిర్మాణం

సంజామల మండలంలోని పేరుసోములలో ఇటీవల బయటపడ్డ పురాతన భూగర్భ శివాలయం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. గ్రామానికి చెందిన తిరుపాలు ఇంటి కింద భూగర్భంలో విజయనగరరాజుల కాలంలో నిర్మితమైన శివాలయం ఇటీవల బయటపడిన విషయం తెలిసిందే. దీంతో ఇంటి యజమాని ఖాళీ చేసి మరో ఇంటికి చేరారు. ఆలయ పునర్నిర్మాణానికి గ్రామస్తులు ముందుకొచ్చారు. పైనున్న ఇంటిని కూల్చి వేసి గుడిలోకి చేరుకునేందుకు వీలుగా మెట్లమార్గాన్ని ఏర్పాటు చేశారు. భక్తుల పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయం అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని భక్తులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సంజామల

పూజలందుకుంటున్న శివుడు　నిర్మాణంలో ఆలయం

ఆటో ప్రయాణం.. ప్రాణాలే పణం

పొట్టకూటి కోసం పొలం పనులకు వెళ్లే కూలీలు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ఆటోల్లో పరిమితికి మించి అధిక లోడుతో రాకపోకలు చేస్తున్నారు. ఆళ్లగడ్డ మండలం ఎస్.లింగందిన్నె, పాతకందుకూరు, అహోబిలం, ఓబులంపల్లె రహదారుల్లో నిత్యం కూలీలతో ఆటోలు తిరుగుతుంటాయి. ఒక్కో ఆటోలో సుమారు 20 మంది వరకు కూర్చొని ప్రయాణాలు సాగిస్తుంటారు. ఏ కొంచెం అదుపు తప్పినా పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ప్రమాద ఘటనలు దృష్టిలో ఉంచుకొని కూలీలు ఇలాంటి ప్రయాణాలకు స్వస్తి పలకాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం

'దారి'వ్వని పంట దిగుబడులు

ఆళ్లగడ్డ మండలంలోని అహోబిలం అటవీ ప్రాంతంలో రహదారి పొడవునా రైతన్నలు మొక్కజొన్న దిగుబడులను ఆరేశారు. వాటిని వాహనాలు తొక్కకుండా ఉండేందుకు దారిపై పెద్ద గుండ్రాళ్లు ఏర్పాటు చేశారు. గండ్లేరు నుంచి అహోబిలం వరకు 7 కి.మీ. ఉండగా రెండు చోట్ల ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఆ ప్రాంతాల్లోనూ మక్కలు, రాళ్లు ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు సగం వరకు దిగుబడులు, పెద్ద రాళ్లు ఉండటంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రెండు రోజుల క్రితం లారీ అదుపు తప్పడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. రాత్రి సమయాల్లో రాళ్లు కనిపించక పెను ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది.
– న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం

పరుగుల రాణులు.. అక్కాచెల్లెళ్లు

కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: పేదింట్లో పుట్టిన ఆ అక్కాచెల్లెళ్లు అథ్లెటిక్స్ పోటీల్లో రాణిస్తున్నారు. కొలిమిగుండ్ల మండలం తిమ్మనాయునిపేట గ్రామానికి చెందిన రమణయ్య, ఓబులమ్మ నిరుపేద దంపతులు. కూలీ పనులు చేస్తూ జీవనం చేస్తున్నారు. వీరి పెద్దకుమార్తె లక్ష్మీశాంతి కొలిమిగుండ్లలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. చిన్నకుమార్తె అవంతిరాణి జడ్పీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. కోచ్ విజయ్‌కుమార్‌రెడ్డి దగ్గర శిక్షణ తీసుకుంటూ క్రీడల్లో పాల్గొంటూ పతకాలు సాధిస్తున్నారు. గ్రామంలో సరైన మైదానం లేకపోయినా ఆటలపై ఉన్న ఇష్టంతో పట్టువీడకుండా తమ లక్ష్యం కోసం 10 కి.మీ. దూరంలో ఉన్న పేరుసోములలోని మైదానానికి రోజూ వచ్చి సాధన చేస్తున్నారు.

జాతీయ స్థాయి పతకమే లక్ష్యం : లక్ష్మీశాంతి, ఇంటర్ విద్యార్థిని

రెండేళ్లుగా లక్ష్మీశాంతి ప్రత్యేక శిక్షణ తీసుకుంటూ పోటీల్లో విజయాలు సాధిస్తోంది. 2024 నవంబర్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో 1500 మీటర్ల రాష్ట్రస్థాయి పరుగు పందెంలో పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి బహుమతి గెలిచింది. ఇదే నెలాఖరులో లఖ్‌నవూలో జరిగిన 68వ జాతీయస్థాయి స్కూల్ గేమ్స్‌లో ప్రశంసలు అందుకుంది. 2025 జనవరిలో ఏలూరులో ఏపీ క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పరుగు పందెం పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచింది. 2025 జనవరిలో ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగిన జాతీయ క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఏడో స్థానంలో నిలిచింది. ఇటీవల కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి 1500 మీటర్లు, 3 వేల మీటర్ల పరుగు పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. జాతీయ స్థాయి పతకమే లక్ష్యమంటోంది లక్ష్మీశాంతి.

ఐపీఎస్ కావాలన్నదే ధ్యేయం : అవంతిరాణి, తొమ్మిదో తరగతి

చిన్నతనం నుంచే పరుగు పందెం అంటే ఇష్టంతో పోటీల్లో పాల్గొంటూ విజయాలు సాధిస్తోంది అవంతిరాణి. దత్తత తీసుకున్న స్వచ్ఛంద సంస్థ చదువుతోపాటు ఆటల్లోనూ ప్రోత్సహించింది. ఏడాది నుంచి కోచ్ దగ్గర శిక్షణ పొందుతూ పరుగు పందెంలో ఉన్నత శిఖరాలు చేరుకునేందుకు సాధన చేస్తోంది. ఈనెల 8, 9న 69వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు శ్రీకాకుళంలో జరిగాయి. అక్కడ అండర్-14 విభాగంలో 600 మీటర్ల పరుగుపందెంలో పాల్గొని ప్రథమ స్థానంలో విజయం అందుకొని మధ్యప్రదేశ్‌లో డిసెంబర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. క్రీడల్లో రాణించి ఐపీఎస్ ఉద్యోగం సాధనే తన లక్ష్యమంటోంది అవంతిరాణి.

నందవరంలో హుండీ లెక్కింపు

హుండీ లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

నందవరం (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం నందవరం గ్రామంలోని చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం ఆలయాధికారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా ఆలయానికి రూ.52,10,466 నగదు, 44.510 గ్రాముల బంగారం, 1.7 కేజీల వెండి లభించాయి. దాదాపుగా ఆరు నెలల కాలానికి భక్తులు సమర్పించిన హుండీని లెక్కించినట్లు ఆలయాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి, ఆలయ సిబ్బంది, పలువురు భక్తులున్నారు.

శ్రీశైలం జలాశయం నీటిమట్టం 883.20 అడుగులు

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: శ్రీశైలం జలాశయం నీటిమట్టం బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి 883.20 అడుగులు, నీటినిల్వ 205.6627 టీఎంసీలుగా నమోదైంది. జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 10,129 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. శ్రీశైలం ఎడమ గట్టు జలవిద్యుత్తు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

ఉత్తమ నడవడికతోనే విజయాలు

○ గవర్నర్ అబ్దుల్ నజీర్

ఈనాడు, కర్నూలు, కర్నూలు విద్య, న్యూస్‌టుడే : విద్యార్థులు పాఠశాలల్లో నేర్చుకునే అంశాలు, అలవర్చుకునే క్రమశిక్షణ, నడవడికే.. జీవితంలో విజయం సాధించేందుకు బాటలు వేస్తాయని గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. కర్నూలు ఎ.క్యాంపులోని మాంటిస్సోరి విద్యాసంస్థల స్వర్ణోత్సవ ప్రారంభ కార్యక్రమానికి ఆయన బుధవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 50 ఏళ్ల పాఠశాల ప్రస్థానంలో మాంటిస్సోరిలో చదువుకున్న ఎందరో నేడు ఉన్నత స్థానాల్లో ఉండటం ప్రశంసనీయ విషయమని తెలిపారు. కాలానుగుణంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, ఉపకరణాల సాయంతో విద్యాబోధన చేస్తూ విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడం అభినందనీయమని పేర్కొన్నారు. మాజీ ఎంపీ టి.జి.వెంకటేశ్ మాట్లాడుతూ తన కుమారుడు భరత్, కుమార్తెను కూడా మాంటిస్సోరిలోనే చదివించానని తెలిపారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, ఎస్పీ విక్రాంత్‌పాటిల్, ఆ విద్యాసంస్థల ఛైర్మన్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా స్వర్ణోత్సవ లోగోను, గీతాన్ని గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆవిష్కరించారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఆ పాఠశాల వ్యవస్థాపకురాలు కల్యాణమ్మ విగ్రహానికి నివాళులర్పించారు.

జ్యోతి వెలిగిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, వేదికపై ఎంపీ నాగరాజు, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, కలెక్టర్ డా.సిరి, మాంటిస్సోరి పాఠశాల అధినేత రాజశేఖర్

పురస్కారాల అందజేత

కర్నూలు, అనంతపురం, హైదరాబాద్‌లో ఉన్న మాంటిస్సోరి విద్యాలయాలకు ఉత్తమ పాఠశాలల పురస్కారాలను గవర్నర్ చేతులమీదుగా అందజేశారు. కర్నూలు విద్యానగర్‌లోని మాంటిస్సోరి స్కూల్, మోంట్ ఇంటర్నేషనల్ స్కూల్, మైండ్స్ ఇన్ఫినిటీ స్కూల్, అలంపూర్‌లోని మాంటిస్సోరి రెసిడెన్షియల్ స్కూల్, కర్నూలు ఎ.క్యాంపులోని మాంటిస్సోరి సీనియర్ సెకండరీ స్కూల్, ఇండస్ రెసిడెన్షియల్ స్కూల్, పంచలింగాలలోని ఒలంపస్ స్కూల్, అనంతపురంలోని ఎలైట్ స్కూల్, హైదరాబాద్‌లోని స్ప్రౌట్జ్ స్కూల్, మాంటిస్సోరి ఇన్విక్టస్ స్కూల్స్‌కు చెందిన ప్రధానోపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేశారు. డీఈవో శామ్యూల్ పాల్ కరస్పాండెంట్లు రవి, డా.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

బనగానపల్లి, న్యూస్‌టుడే: ప్రజల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వయంగా పరిశీలించారు. కొన్ని సమస్యలకు అక్కడి నుంచే సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా తెలిపి వీటిని పరిష్కరించాలని సూచించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని అన్నారు. రెవెన్యూ పరిధిలో అంశాలను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని అధికారులకు తెలిపారు.

పేదలకు సొంతింటి కల సాకారం

చాపిరేవుల(నంద్యాల గ్రామీణం), న్యూస్‌టుడే: పేదల సొంతింటి కలను కూటమి ప్రభుత్వం సాకారం చేసిందని రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. మండలంలోని చాపిరేవుల గ్రామంలో బుధవారం లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై.. మారెళ్ల వైష్ణవి గృహాన్ని ప్రారంభించారు. అనంతరం వైష్ణవి దంపతులకు నూతన వస్త్రాలు బహూకరించారు. కార్యక్రమంలో సర్పంచి రాజు, తహసీల్దారు శ్రీవాణి, ఎంపీడీవో సుగుణశ్రీ, హౌసింగ్ డీఈ విజయబాబు, గ్రామ తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొట్లవారిపల్లె సర్కిల్ వద్ద ఆందోళన చేస్తున్న పరిశ్రమల యజమానులు

ప్రైవేటు తనిఖీ కేంద్రాలను తొలగించాలి

డోన్, న్యూస్‌టుడే: మైనింగ్ తనిఖీ కేంద్రాలను ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడంతో పరిశ్రమల యజమానులు, గని కార్మికులకు ఇబ్బందులు తప్పటం లేదని మైనింగ్ నిర్వాహకులు లక్ష్మీనారాయణ, శేఖర్ తదితరులు వాపోయారు. బుధవారం కొట్లవారిపల్లె సర్కిల్‌లో సున్నం బట్టీల వద్ద గని కార్మికులు, పరిశ్రమల యజమానులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం విధించిన మైనింగ్ భారాలు, విద్యుత్తు ఛార్జీల భారంతో పరిశ్రమలు నడపాలంటేనే ఇబ్బంది పడుతున్నామని, అలాంటిది ఇప్పుడు చెక్‌పోస్టులు ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంతో మరింత ఇబ్బందులు ఎదుర్కొంటామన్నారు. ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఈ నిర్ణయంతో వేలాది మంది కార్మికులపై భారంపడి, వారి ఉపాధి దెబ్బతింటుందన్నారు. ఈ కార్యక్రమంలో అంకిరెడ్డి, గిరిప్రసాద్, ఎన్ఎల్ మధు, చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ఓబుల్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మురళీరెడ్డి, రఘురెడ్డి పాల్గొన్నారు.

డబ్బులు వేరే ఖాతాకు వెళ్లాయా.. ఇలా చేయండి

మీ కోసం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ప్రస్తుతం నగదు బదలాయింపులన్నీ చరవాణి ద్వారానే చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో యూపీఐ నుంచి పంపిన డబ్బులు పొరపాటున వేరే వారి ఖాతాలకు వెళ్తుంటాయి. అలాంటప్పుడు నిబంధనల మేరకు సంస్థలను సంప్రదిస్తే డబ్బు తిరిగి పొందవచ్చు. అదెలాగో తెలుసుకుందాం..

☛ నగదు వేరే ఖాతాకు పొరపాటున బదిలీ జరిగితే.. ఎంత త్వరగా చర్య తీసుకుంటే.. డబ్బు తిరిగి పొందే అవకాశం అంత ఎక్కువగా ఉంటుంది. డబ్బు పంపిన యూపీఐ ఐడీ, తేదీ, మొత్తం వంటి వివరాలు సేకరించాలి.

☛ ముందుగా ఏ నంబరుకు డబ్బులు పంపారో చూసుకోవాలి. తర్వాత యూపీఐ యాప్ కస్టమర్ సర్వీస్ సెంటరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి. పంపిన యూపీఐ ఐడీ వివరాలు అందజేయాలి. తర్వాత మీ బ్యాంకును సంప్రదిస్తే డబ్బులు తిరిగి పొందేలా సహాయం చేస్తారు.

☛ సంబంధిత బ్యాంకు కస్టమర్ సర్వీస్ నంబరుకు ఫోన్ చేసి వివరాలు ఇవ్వాలి. వాళ్లకు మీరు డబ్బులు పంపిన యూపీఐ ఐడీ, వివరాలు తెలపాలి. అప్పుడు బ్యాంకు మీరు డబ్బు పంపిన వ్యక్తికి సందేశాన్ని పంపుతుంది. తిరిగి వచ్చేందుకు వీలుంది.

☛ యూపీఐ సేవలు అందించే నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేయవచ్చు. పంపిన డబ్బు పెద్దమొత్తంలో ఉంటే సైబర్ పోలీసు స్టేషన్‌లో సమాచారమివ్వాలి.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ

సంజామల, న్యూస్‌టుడే: తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో ఇటీవల జరిగిన ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 40 ప్లస్ పురుషుల షాట్‌పుట్ విభాగంలో సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాల వ్యాయామ సంచాలకుడు బి.బాషా పాల్గొని ప్రశంసా పత్రం అందుకున్నట్లు ప్రధానోపాధ్యాయులు షబ్బీర్‌హుసేన్ చెప్పారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో అభినందన సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పరమేశ్వరరెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, వెంకటరంగన్న, రాజశేఖర్, మనోహర్, వసంతలక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

శ్రీశైలంలో సినీ నటులు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లను బుధవారం ఉదయం సినీ హీరో శ్రీకాంత్ దర్శించుకున్నారు. ఆయన స్వామివారి స్పర్శ దర్శనం చేసుకొని అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. రాత్రి 9 గంటలకు సినీ హీరో నితిన్ శ్రీశైలం చేరుకున్నారు. గురువారం వేకువజామున ఆయన శ్రీస్వామి అమ్మవార్లను దర్శించుకోనున్నారు.

మెరుగైన సేవలు అందించేందుకు కృషి

టంగుటూరు(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ తెలిపారు. మండల పరిధిలోని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రోగులకు అందే సేవలను పరిశీలించారు. ఆరోగ్య సేవలను వైద్యులు సొహైల్‌బాబును అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు సూచనలు చేశారు. దస్త్రాలు పరిశీలించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది ఉన్నారు.

వసతి గృహాల మరమ్మతులకు ప్రతిపాదనలు

చిన్నవంగలి(చాగలమర్రి), న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా బీసీ సంక్షేమ వసతి గృహాల మరమ్మతులకు రూ.3.15కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి జగ్గయ్య తెలిపారు. చిన్నవంగలి గ్రామంలోని ఎస్సీ సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. పలు దస్త్రాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు అందే భోజనం మెనూ, పారిశుద్ధ్యం ఇతర సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డెన్ ఖాశీం పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బంది సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ టీచర్లు నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని చరవాణిలో యాప్ పనులు పూర్తి చేయాలని ఐసీడీఎస్ పీడీ లీలావతి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని పొదుపు భవనంలో సీడీపీవో నాగసుంకమ్మ ఆధ్వర్యంలో బుధవారం బనగానపల్లి ప్రాజెక్టు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ లీలావతి టీచర్లు యాప్‌లో చేయాల్సిన పనులను వివరించారు. కేంద్రాల్లో చిన్నారులకు, గర్భిణులు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పీడీ లీలావతి తదితరులు

జిల్లాలో 6,303 గృహాలను ప్రారంభించాం : కలెక్టర్

ఆత్మకూరు, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లాలో 6,303 గృహాలను ప్రారంభించినట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. కొట్టాల చెరువు గ్రామంలో ఆర్డీటీ సహకారంతో నిర్మించిన 54 ఇళ్లను బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. కొట్టాల చెరువు చెంచు గూడెంలో భూ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని అన్నారు. ప్రజలు సహకరిస్తే సాంకేతిక పద్ధతిలో సర్వే చేసి సాగులో ఉన్నవారికి పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. భూమి నిజ నిర్ధారణకు వచ్చిన సిబ్బందికి సహకరించాలని కోరారు.

చెంచు లబ్ధిదారునితో ఇంటిని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజకుమారి, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

ప్రైవేటీకరణతో పేద విద్యార్థులకు నష్టం

కార్యక్రమంలో మాట్లాడుతున్న బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో పేద విద్యార్థులు తీవ్రంగా నష్ట పోతారని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైకాపా ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తే పేదలకు వైద్యం దూరమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో ప్రస్తుతం సగం మంది వైద్యులు ఖాళీ అయితే ఇంత వరకు పట్టించుకునే దిక్కేలేదని ఆరోపించారు. ఆసుపత్రిలో వైద్య పరికరాలు, యంత్రాలు మంజూరు కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, రాజశేఖర్ రెడ్డి, బుగ్గన నాగభూషణంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

WALK-IN-INTERVIEW

MARGADARSI CHIT FUND PRIVATE LIMITED

REQUIRES ASSISTANTS IN BUSINESS DEVELOPMENT & RECOVERIES FOR OUR NEW BRANCH AT NANDYAL

Business Development cum Recoveries Assistants:

Male graduates with pleasing personality below 30 years with 2/3 years of experience in the relevant fields. Candidates having valid two wheeler driving licence are preferred. The above posts are mainly field oriented. Experience in Chit Fund/ Financial Institutions will be given preference.

Fresh graduates also can attend for Trainee position.

Please attend **WALK-IN-INTERVIEW ON EITHER 15th November, 2025 (SATURDAY) OR 16th November, (SUNDAY) AT OUR NANDYAL BRANCH from 10.30 A.M. to 4.00 P.M.** alongwith latest Resume, xerox copies of educational certificates, recent colour passport size photographs and copy of Pan Card, Aadhaar Card & Bank passbook first page at the following address.

The Branch Manager,
MARGADARSI CHIT FUND PRIVATE LIMITED
D.No. 25-140A, 2nd Floor, Tourist Arcade,
Sanjeeva Nagar,
NANDYAL - 518 501. A.P.
☎ Cell No. 8008222864.

వేమారెడ్డి మల్లమ్మ ఆలయంలో లక్ష దీపోత్సవం

శ్రీశైలం, నంది సర్కిల్, న్యూస్‌టుడే: శ్రీశైలం మహాక్షేత్రంలోని వేమారెడ్డి మల్లమ్మ ఆలయంలో లక్ష దీపోత్సవాన్ని బుధవారం శ్రీశైల జగద్గురు పీఠాధిపతి డా.చెన్నాసిద్ధరామ మహాస్వామి ప్రారంభించారు. కర్ణాటక భక్తులు గంగాధర మండపం నుంచి కలశాలను ఊరేగింపుగా తీసుకొచ్చి మల్లమ్మకు అభిషేకాలు, విశేషపూజలు నిర్వహించారు. కర్ణాటక రెడ్డి సమాజ భక్త బృందం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అర్చకులు గురుపాదయ్యా స్వామి తెలిపారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆలయానికి కలశాలతో వస్తున్న కన్నడ భక్తులు

రోగులకు అన్ని పరీక్షలు చేయండి

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులకు అవసరమైన రక్తపరీక్షలు చేసి తగిన మందులు ఇవ్వాలని డీఎంఅండ్‌హెచ్‌వో డా.వెంకటరమణ అన్నారు. గోస్పాడు, టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి గర్భిణి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పిల్లలకు, గర్భిణులకు సమయానికి వ్యాక్సిన్లు ఇవ్వాలన్నారు.

వైద్యులతో మాట్లాడుతున్న డా.వెంకటరమణ

ఆర్ఎస్ రంగాపురంలో వ్యక్తి దారుణ హత్య

మహబూబ్ బాషా (పాత చిత్రం)

బేతంచెర్ల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. సీఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఎస్.మహబూబ్‌బాషా(41) అదే గ్రామానికి చెందిన బోయ మదన భూపాల్‌తో కలిసి మూడేళ్ల కిందట గుజరీ దుకాణం నిర్వహిస్తుండేవాడు. ఏడాది కిందట మహబూబ్‌బాషా మద్యం కేసులో పట్టుబడి జైలుకు వెళ్లాడు. అతన్ని విడిపించే క్రమంలో మృతుడి భార్యతో కలిసి మదనభూపాల్ ద్విచక్ర వాహనంపై తరచూ తిరుగుతుండేవారు. ఈ క్రమంలో తన భార్యతో మదన భూపాల్‌తో అక్రమ సంబంధం ఉందని అనుమానం పెంచుకొని తరచూ గొడవలు పడుతుండేవాడు. ఈ క్రమంలో కోపోద్రిక్తుడైన మదన భూపాల్ బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో నిద్రిస్తున్న మహబూబ్‌బాషాను బల్లెంతో పొడిచి, రోకలి బండతో తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ఉరేసుకుని వివాహిత బలవన్మరణం



నీతమ్మ(పాత చిత్రం)

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎస్వీ నగర్‌లోని నీతమ్మ(40) అనే వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత కొన్నేళ్లుగా అనారోగ్య కారణాలతో సక్రమంగా లేక ఇబ్బందులు పడేదని, బంధువులు పలు వైద్యశాలల్లో చూపించినా పరిస్థితిలో మార్పు కన్పించలేదన్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సీహెచ్‌సీకి తరలించారు.

వాహనం ఢీకొని ఆటో డ్రైవర్ మృతి

శివయ్య (పాత చిత్రం)

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ పరిధిలోని టిడ్కో గృహ సముదాయాల వద్ద జరిగిన రహదారి ప్రమాదంలో శివయ్య(48) అనే ఆటో డ్రైవర్ మృతి చెందారు. మంగళవారం రాత్రి ఇతడు తన సొంత ఆటోలో పట్టణం నుంచి నివాసం ఉంటున్న టిడ్కో గృహ సముదాయాల్లోని ఇంటికి వెళ్లే క్రమంలో బైపాస్ రోడ్డు నుంచి జాతీయ రహదారిపైకి చేరుతుండగా ఎదురుగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఆటో బోల్తా పడి ఇతడు తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందారు. ఈ ఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

అదృశ్యమైన యువకుడి ఆచూకీ లభ్యం

మనోహరాబాద్, న్యూస్‌టుడే: మండల పరిధి ముప్పిరెడ్డిపల్లిలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన కట్టడి ముట్టడి కార్యక్రమంలో ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. బుధవారం ఉదయం ఇంటింటి తనిఖీలు చేపట్టగా ఓ యువకుడు అనుమానాస్పదంగా కనిపించాడు. పూర్తి వివరాలు అడగ్గా.. ప్యాపిలి మండలం ఓటులదేవరపల్లి గ్రామం అని తన పేరు సుగురు రామానాయుడు అని చెప్పాడు. తల్లిదండ్రులతో గొడవపడి వచ్చి ఇక్కడ ఓ పరిశ్రమలో పనిచేస్తున్నట్లు చెప్పాడు. వెంటనే మనోహరాబాద్ పోలీసులు నంద్యాల పోలీసులకు సమాచారం ఇవ్వగా ప్యాపిలి ఠాణాలో అదృశ్యం కేసు నమోదైన వారు తెలిపారు. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలుపగా నంద్యాల నుంచి యువకుడి తండ్రి వెంకటేశ్ మనోహరాబాద్ రాగా కొడుకును అప్పగించినట్లు ఎస్సై సుభాష్ గౌడ్ తెలిపారు.

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

KIA Carens Model 2022 AP39QL0002, Mahindra Bolero Maxx Model 2023 AP39VA0254, TATA SFC712 Model 2023 AP39VA6794, Eicher 1075 School Bus Model 2018 AP39UB4089, Eicher 3015 Model 2022 AP39UB8633, and Eicher 3019 Model 2024 AP39UV6112 for Details Contact: SUNDARAM FINANCE Limited, Kurnool. ✆ 94409 09740.

JOBS

ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, లేడీ టెలికాలర్స్ కావలెను. ఫిక్స్‌డ్ సాలరీ 10 to 15K + ఇన్సెంటివ్స్, నో టార్గెట్. ✆ 6305597809.

D.A. & V.R. గేమింగ్ జోన్ నందు పనిచేయుటకు 1 మేల్ & 1 ఫీమేల్ కావలెను. పంప్ హౌస్ దగ్గర సీతారామనగర్, కర్నూలు. ✆ 95816 66064.

IT HARDWARE

Internship / Final Year Projects. Web App | Data Analytics | Digital Marketing | Cloud | HR Certification Placement Support Bangalore. Ph: 81055 77689.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

నంద్యాల
•నంద్యాల •నందికొట్కూరు •శ్రీశైలం •పాణ్యం

రసాయన ఎరువులు తగ్గించాలి

రైతులతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

జిల్లెల్ల(గోస్పాడు), న్యూస్‌టుడే: రైతులు జొన్న సాగులో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు సూచించారు. ఆయన ఏడీఏ విజయశేఖర్‌తో కలిసి బుధవారం జిల్లెల్లలో 25 రోజుల దశలో ఉన్న జొన్న పొలాలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంలో పంటలు పండిస్తున్న బాలమద్దిలేటి స్వాకను సందర్శించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఏవో స్వప్నిక, వెటర్నరీ డా. అలీఖాన్, ఏఈవోలు రామకృష్ణ, నాగార్జున, దివాకర్‌రెడ్డి పలువురు రైతులు పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట సంఖ్య తప్పనిసరి

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: అన్నదాతకు వ్యవసాయ సేవలను సులభతరం చేసి మరింత పారదర్శకంగా అందించేందుకు ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరని తహసీల్దారు పద్మావతి, ఏవో పవన్‌కుమార్ అన్నారు. తహసీల్దారు కార్యాలయంలో బుధవారం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఏఎస్‌వో అరుణ, రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరిస్తాం

☛ 'ఈనాడు - ఫోన్‌ఇన్'లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ శర్మ

నంద్యాల రైతునగరం, పురపాలకం న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరిస్తామని నంద్యాల పురపాలక శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ శర్మ అన్నారు. పట్టణంలో పారిశుద్ధ్య సమస్యలపై బుధవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో 'ఈనాడు' ఆధ్వర్యంలో 'ఫోన్ ఇన్' కార్యక్రమం జరిగింది. ప్రజలు తమ సమస్యలను ఫోన్ చేసి అధికారి దృష్టికి తీసుకొచ్చారు. వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. పారిశుద్ధ్య సమస్యలు తలెత్తితే పురమిత్ర యాప్‌లో ఫిర్యాదు చేయాలని లేదా అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

? పట్టణంలోని విశ్వనగర్ నుంచి ఎన్జీవోస్ కాలనీకి వెళ్లే దారిలో డ్రైనేజీ కాల్వ పూడింది. కాల్వను పెద్ద కాల్వతో అనుసంధానం చేయలేదు. - రఘురామిరెడ్డి

✔ పరిశీలించి కాల్వలను శుభ్రం చేయిస్తాం. త్వరలో కచ్చా కాల్వను పెద్ద కాల్వతో అనుసంధానం చేయిస్తాం.

? రైల్వే స్టేషన్ దారిలో కేంద్ర ప్రభుత్వ గిడ్డంగుల సమీపంలో గోదాముల వద్ద మురుగు నిలిచి దుర్వాసన వస్తోంది. ఫాగింగ్ చేయాలి. - సుహాసిని, బర్మశాల

✔ మురుగు నిల్వ ఉండకుండా చేస్తాం. ఫాగింగ్ చేసి సమస్యను పరిష్కరిస్తాం.

? ఇస్లాంపేటలో బీసీ హాస్టల్ వెనక కాల్వలో మురుగు పారడం లేదు. రోడ్లపై మురుగు పొంగి ప్రవహిస్తోంది. - షేక్ గూడుబై

✔ కాల్వలో పూడిక తీయించి సమస్య లేకుండా చేస్తాం.

? రామకృష్ణ పీజీ కళాశాల నుంచి గంగమ్మ దేవాలయం వెళ్లే దారిలో గార్బేజ్ బిన్ ఏర్పాటు చేయాలి. చెత్త సేకరణ సిబ్బంది రోజూ రావడం లేదు. - లక్ష్మీనారాయణ

✔ త్వరలోనే గార్బేజ్ బిన్ ఏర్పాటు చేస్తాం. సిబ్బంది రోజూ వచ్చేలా చర్యలు చేపడతాం.

? నందమూరినగర్‌లో కాల్వలు శుభ్రం చేయడం లేదు. దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. - లక్ష్మి.

✔ కాల్వలు శుభ్రం చేయిస్తాం. దోమల మందు పిచికారీ చేయిస్తాం.

? చాంద్‌బాడ సౌజన్య కాంప్లెక్స్ వద్ద వేగనియంత్రికను ఎత్తుగా నిర్మించారు. ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. - నాగభూషణం.

✔ సిబ్బందితో వేగ నియంత్రిక ఎత్తు తగ్గిస్తాం.

? విజయపురి కాలనీలో ఫాగింగ్ చేయడం లేదు. - కళావతి.

✔ ఫాగింగ్ చేయించి, కాల్వల్లో దోమల మందు పిచికారీ చేయిస్తాం.

? బైర్మల్ వీధి, బేకర్స్ పార్కుల వద్ద కుక్కల బెడద అధికంగా ఉంది. పాదచారులు, ద్విచక్ర వాహనదారుల వెంటపడి గాయపరుస్తున్నాయి. - నాగరాజు, రవి

✔ కుక్కలను పట్టించి కు.ని. శస్త్ర చికిత్సలు చేయిస్తాం.

? తెలుగు పేటలో కాల్వలో నుంచి పూడిక తీశారు. కానీ, తొలగించలేదు. ఆరు బయట మల, మూత్ర విసర్జన అధికంగా ఉంది. - రాజేష్.

✔ కాల్వలో నుంచి తీసిన పూడికను తొలగిస్తాం. బహిరంగ మల, మూత్ర విసర్జనపై అవగాహన కల్పిస్తాం.

? సమస్య: ఎన్జీవోస్ కాలనీలో కుక్కలకు కు.ని. చికిత్స చేయించి మళ్లీ వాటిని అక్కడే వదిలారు. ఇబ్బందిగా ఉంది. - పరమేశ్వరరెడ్డి

✔ సమాధానం: కుక్కలను పట్టించి సమస్య పరిష్కరిస్తాం.

పోటీల్లో పాల్గొని.. విజేతలుగా నిలిచి

పోటీల్లో పాల్గొన్న నారాయణ కళాశాల విద్యార్థిని

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలని నంద్యాల నారాయణ కళాశాల ఏజీఎం అంజన్‌కుమార్‌రెడ్డి అన్నారు. నారాయణ కళాశాలలో 'కృత్రిమ మేధ(ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై బుధవారం ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటి మూడు స్థానాల్లో మణిశ్రీ, తేజశ్రీ, రిషత నిలిచారు. వారికి కళాశాల ఏజీఎంతోపాటు ప్రిన్సిపల్ రమేష్ బహుమతులు అందజేశారు.

పాములుంటే.. ఫోన్ కొట్టండి

మహానంది, న్యూస్‌టుడే: ఆటో నడుపుతూ ఉపాధి పొందుతున్నాడు. రెండేళ్లుగా పాములు పట్టడంలోనూ నైపుణ్యం సాధించాడు. చుట్టుపక్కల ఎక్కడ పాములు సంచరించినా.. సమాచారం అందిన వెంటనే అక్కడికి వెళ్లి వాటిని పట్టి సమీపంలోని అడవిలో వదిలేస్తాడు మహానంది మండలంలోని అయ్యన్ననగర్ గ్రామానికి చెందిన మోహన్. మహానంది మండలం శ్రీనగరం గ్రామానికి చెందిన వ్యక్తి ఇంటిలోకి మంగళవారం ఓ కోడెనాగుపాము దూరింది. తరువాత ఎంత వెతికినా కనిపించలేదు. మరోసారి బుధవారం కూడా రావడంతో ఇంటి సభ్యులు స్నేక్‌క్యాచర్ మోహన్‌కు సమాచారం అందించారు. ఆయన వెంటనే వెళ్లి దాన్ని చాకచక్యంగా పట్టుకొని మహానంది సమీపంలోని నల్లమల అడవిలో వదిలేశాడు. కొండచిలువలు, నాగుపాములు, జెర్రిపోతులు వంటివి ఇప్పటి వరకు 100కు పైగా పాములు పట్టానని, ఎక్కడైనా పాముల సంచారం ఉంటే తన నంబరు 76808 03094కు సమాచారం అందిస్తే వెంటనే వచ్చి పట్టేస్తానని చెబుతున్నాడు.

కోడెనాగుతో మోహన్

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
నందికొట్కూరు: 94403 61729
ఆత్మకూరు: 90149 09024
నంద్యాల: 98853 28120

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ?: అగ్నిమాపక కేంద్రం పక్కన ఉన్న డ్రైనేజీ నిండిపోయి చెత్తాచెదారం రోడ్డుపై చేరుతోంది. కుక్కలు, పశువులు సంచరించడంతో అపరిశుభ్రమవుతోంది. - నారాయణ, స్థానికుడు.

✔: డ్రైనేజీ తొలగిస్తాం. - జీవన్, శానిటరీ ఇన్‌స్పెక్టరు.

?: సంగమేశ్వరం సర్కిల్ నుంచి నందికొట్కూరు మార్గంలో రెండు వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి సమయంలో చీకటిగా ఉంది. - సుబ్బయ్య, స్థానికుడు.

✔: వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. - షామీర్‌బాషా, పురపాలక ఏఈ.

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని విశ్వనగర్, మూలాన్ పేటలో కాల్వలు మురుగుతో ఇబ్బంది పడుతున్నాం. దోమల బెడద అధికమైంది. - రాజు, రమేష్, స్థానికులు.

?: గాంధీనగర్‌లో కుక్కల బెడద అధికమైంది. - సురేష్, స్థానికుడు.

✔: కాల్వలను శుభ్రం చేయిస్తాం. దోమల మందు పిచికారీ చేసి సమస్య పరిష్కరిస్తాం. త్వరలోనే కుక్కలను పట్టించి సమస్య పరిష్కరిస్తాం. - లక్ష్మీనారాయణ శర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్.

పగిడ్యాల: ?: లక్ష్మాపురం గ్రామంలో మూలమలుపు కాలనీ నుంచి దర్గా వద్దకు వెళ్లే రహదారిలో మురుగునీటి కాల్వలు లేకపోవడంతో వర్షపు, ఇళ్లలోని వచ్చే నీరు రహదారులపై నిలుస్తోంది. దోమల బెడదతో అనారోగ్యం బారిన పడుతున్నాం. - వలి, స్థానికుడు.

✔: బ్లీచింగ్ పౌడర్ చల్లించి, చర్యలు తీసుకుంటాం. - గురు తరుణ్, గ్రామ కార్యదర్శి.

?: మండల పరిధిలోని పాలమర్రి గ్రామంలోని రహదారిలో విద్యుత్తు తీగలు కిందికి వేలాడుతున్నాయి. - దాను, స్థానికుడు.

✔: విద్యుత్తు లైన్‌మెన్‌లకు సూచించి సమస్యను పరిష్కరిస్తాం. - క్రాంతికుమార్, ఏఈ

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: ?: పాణ్యంలోని ప్రధాన కూడలిలో చెత్తను పడేస్తున్నారు. చెత్తకుప్పగా ఏర్పడి రహదారిపై పడుతోంది. - రమణ, స్థానికుడు

✔: చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - ఆనందరావు, పంచాయతీ కార్యదర్శి,

పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వండి: కలెక్టరు

సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి, జేసీ కార్తీక్

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో ఇసుక రవాణా, విక్రయాల్లో పూర్తి పారదర్శకతతో చర్యలు చేపట్టి ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఇసుక కమిటీతో బుధవారం జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్‌తో కలిసి సమీక్షించారు. మైనింగ్ ఏడీఏ వేణుగోపాల్, కేసీ. కెనాల్ ఈఈ ప్రతాప్, ఆర్టీవో శివారెడ్డి, ఆర్డీవో విశ్వనాథ్, భూగర్భజల శాఖ అధికారి రఘురాం తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ. .నంద్యాల, ఆళ్లగడ్డ స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వలు లేకపోవడం, ఫిర్యాదులు రావడం, రికార్డుల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో వాటి రెన్యూవల్‌కు అవకాశం లేదన్నారు. డోన్‌లో ఇసుక స్టాక్ యార్డు ఏర్పాటుకు టెండర్లు నిర్వహించాలన్నారు. మైనింగ్ గుంతల వద్ద ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

మురుగు.. రహదారిపై మడుగు

నంద్యాల పట్టణం సరస్వతీనగర్ నుంచి శ్యాంనగర్‌కు వెళ్లే దారిలో కాల్వలోని మురుగు రోడ్డుపై పారుతోంది. ఈ దారిలో ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని నెలలుగా ఇక్కడ మురుగు నిలుస్తుండడంతో స్థానికులు దుర్వాసన, అపరిశుభ్ర వాతావరణంతో అవస్థలు పడుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టి మురుగు సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

శిథిలావస్థలో ఆరోగ్య ఉపకేంద్రం

పాములపాడు ఆరోగ్య ఉపకేంద్రం శిథిలావస్థకు చేరడంతో వైద్య సిబ్బంది, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం దాతల సాయంతో చాలీచాలని గదుల్లో అద్దె భవనాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఆరోగ్య ఉపకేంద్రం నూతన భవనం నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నందికొట్కూరు గ్రామీణం

తగిలితే.. దిమ్మెతిరిగేను

కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిలో విభాగినులు ప్రమాదకరంగా ఉన్నాయి. వరద నీరు ప్రవాహానికి అడ్డుగా ఉండటంతో పురపాలక కార్మికులు పగిలిపోయిన దిమ్మెలను తొలగించి డివైడర్‌ను ఆనుకునేలా ఉంచారు. వరద పోయి పది రోజులైనా డివైడర్ ముక్కలు అలాగే వదిలేశారు. ప్రధాన రహదారి కావటంతో రోజూ వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతున్నాయి. వాహనడ్రైవర్లు అప్రమత్తంగా లేకపోతే డివైడర్ ముక్కలను ఢీకొని ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. - న్యూస్‌టుడే, ఆత్మకూరు పట్టణం

సంక్షిప్త సమాచారం

నంద్యాల రైతునగరం: నంద్యాలకు చెందిన ఉపాధ్యాయుడు అంజద్ బాషా సిద్ధిఖీకి డా.అబ్దుల్ హక్ అవార్డు రావడంపై జిల్లా ఇమాముల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని ఖలీల్ సిద్ధిఖీ హైస్కూల్‌లో బుధవారం ఆయన్ను సన్మానించారు.

నంద్యాల రైతునగరం: మహానంది మండలం అబ్బీపురం గ్రామాన్ని ఐటీడీఏలో చేర్చాలని ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దానయ్య, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు డిమాండు చేశారు. విజయవాడలోని గిరిజన సంక్షేమ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆ శాఖ డైరెక్టర్ సరస్వతికి వినతి పత్రం అందజేశారు.

తిమ్మాపురం(మహానంది): చాచా నెహ్రూ జయంతిని పురస్కరించుకొని ఈనెల 14నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని గ్రంథాలయాధికారి మధు పేర్కొన్నారు.

గడివేముల: సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ మహాసభల్లో రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టులపై చర్చిస్తామని పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు అన్నారు. గడివేములలో బుధవారం సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ మహాసభల కరపత్రాలను విడుదల చేశారు.

బుక్కాపురం(మహానంది): ప్రోగ్రెస్ పెంచడానికి మరింత కృషిచేయాలని డీఎల్‌డీవో శివారెడ్డి పేర్కొన్నారు. బుక్కాపురంలోని మండల ఐక్య పొదుపు భవనంలో ఎంపీడీవో మహబూబ్‌దౌలా ఆధ్వర్యంలో గ్రామ, వార్డు సచివాలయాల్లో అమలవుతున్న పలు పథకాల ప్రోగ్రెస్‌లో మహానంది మండలం వెనుకబడిందన్నారు.

పాణ్యం గ్రామీణం: ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో రాయలసీమ పరిధిలోని ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులకు ఇన్ఫోసిస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రాంగణ ఎంపికల ప్రక్రియ ముగిసినట్లు డీన్ అశోక్‌కుమార్ తెలిపారు.

పాణ్యం గ్రామీణం: శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో ఎన్ఎంసీలలో ఎంబీఏ విద్యార్థులకు అనే అంశంపై సదస్సు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం తెలిపారు.

పాణ్యం గ్రామీణం: మండలంలోని సుగాలిమెట్ట వద్ద జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించినట్లు ఎస్సై నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. నిబంధనలు పాటించని వారికి జరిమానా విధించినట్లు తెలిపారు.

పాణ్యం గ్రామీణం: గోరుకల్లు తండాకు చెందిన, కేఆర్ఆర్ పాఠశాలలో చదివి కర్నూలు వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థులు చందునాయక్, హరిప్రసాద్‌నాయక్‌లను అభినందించినట్లు పాఠశాల కరస్పాండెంట్ వాసుదేవారెడ్డి తెలిపారు.

నంద్యాల గాంధీచౌక్: పట్టణంలోని ప్రథమనంది ఆలయంలో కార్తిక మాస ఉత్సవ కమిటీ, దేవస్థాన అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

నంద్యాల రైతునగరం: పద్మావతినగర్‌లోని కృష్ణ మందిరంలో యాదవ కులస్థులకు ఆదివారం కార్తిక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు యాదవ సంఘం నాయకులు పేర్కొన్నారు.

నంద్యాల గ్రామీణం: మండలంలోని అయ్యలూరిమెట్టలో ఉన్న ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో చుదువుతున్న క్రీడాకారిణి యామ వర్షిణి జాతీయ స్థాయి పెన్సింగ్ పోటీల్లో పాల్గొని 46వ స్థానం సాధించినందున బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యాపకులు, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

నంద్యాల రైతునగరం: బాల్యదశ నుంచే ఆరోగ్య నియమాలు పాటించాలని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాయలసీమ బ్రాంచి అధ్యక్షుడు డా.కిశోర్ కుమార్ అన్నారు. పట్టణంలోని సన్‌రైజ్ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం విద్యార్థులకు దంత సంరక్షణపై ఇండియన్ డెంటల్ అసోసియేషన్ డాక్టర్లు అవగాహన సదస్సు నిర్వహించారు.

కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల సంతోషం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో చెంచులకు ఒక్క ఇల్లు నిర్మించలేదని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. కొట్టాల చెరువు గూడెంలో నూతన గృహాల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. కురుకుంద, వడ్లరామాపురం, కరివేన గ్రామాలతోపాటు

వెలుగోడులో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

మున్సిపల్ కార్యాలయం వద్ద రెండు స్వచ్ఛ భారత్ ట్రాక్టర్లను ప్రారంభించారు. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఆర్డీఓ నాగజ్యోతి, తహసీల్దార్ రత్నరాధిక తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడు: వెలుగోడు పట్టణంలో సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గిరిజన(చెంచు) మహిళలకు జూట్ బ్యాగ్ తయారీలో ఉచిత శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని బుధవారం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఎంపీడీవో మధుసుదన్‌రెడ్డి పాల్గొన్నారు.

వినతి స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గిత్తజయసూర్య

యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, మండల కన్వీనర్ గుండ్రెడ్డి మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

నందికొట్కూరు గ్రామీణం: పట్టణంలోని కోటావీధిలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిర్మించిన నూతన గృహాలను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. తెదేపా మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య సూచించారు. జూపాడుబంగ్లా ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. పలువురు ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్ర

పనిచేసేవారికి సముచిత స్థానం

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పార్టీ కోసం పనిచేసేవారికి సముచిత స్థానం లభిస్తుందని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, తెదేపా నేత గౌరు వెంకటరెడ్డి అన్నారు. కర్నూలు నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని ఓ ఫంక్షన్ హాలులో పాణ్యం నియోజకవర్గ పరిధిలోని బూత్, క్లస్టర్, యూనిట్, గ్రామ, మండలాల కమిటీల్లో కొత్తగా ఎన్నికైన సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. నంద్యాల పార్లమెంటు నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ప్రమాణ స్వీకారం చేయించారు. నూతనంగా ఎన్నికైనవారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

ప్రమాణ స్వీకారోత్సవంలో రాజశేఖర్, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, గౌరు వెంకటరెడ్డి తదితరులు

ప్రైవేటీకరణ ఆలోచనను వెనక్కి తీసుకోవాలి

జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలన్న ఆలోచన విరమించుకోవాలని ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. వైకాపా ఆధ్వర్యంలో బుధవారం నూనెపల్లె ఉపరితల వంతెన నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు వినతిపత్రం అందజేశారు. మాజీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ పీపీ నాగిరెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాబున్నిసా, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

నందికొట్కూరు గ్రామీణం: నందికొట్కూరు నియోజకవర్గం వైకాపా సమన్వయకర్త సుధీర్ దారా ఆధ్వర్యంలో పట్టణంలోని పటేల్ సెంటర్లో ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి డిప్యూటీ తహసీల్దార్ సోమేశ్వరికి వినతిపత్రం అందజేశారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలి

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల ఐఎంఏకు నూతనంగా ఎన్నికైన వైద్యులు సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని

ప్రమాణ స్వీకారం చేసిన సభ్యులు

ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ పేర్కొన్నారు. మధుమణి ఆసుపత్రి సమావేశ భవనంలో నూతనంగా ఎన్నికైన ఐఎంఏ సభ్యులతో బుధవారం ప్రమాణ స్వీకారం చేయించారు. డా.రవికృష్ణతోపాటు సభ్యులు డా.మధుసూదన్‌రావు, డా.పనిల్ జ్యోతి ప్రారంభించారు. ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డా.శ్రీనివాసరావు, మహమ్మద్ రఫీ మాట్లాడారు. సంఘం సభ్యులు డా.విజయభాస్కర్‌రెడ్డి, డా.మాధవి, డా.సునీత, డా.శైలజ, డా.లక్ష్మీసౌజన్య, డా.మధుమణి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను బడికి పంపండి

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు తమ పిల్లలను భిక్షాటనకు, పనికి పంపకుండా పాఠశాలలకు పంపించాలని సీడబ్ల్యూసీ ఛైర్‌పర్సన్ జుబైదా బేగం అన్నారు. పట్టణంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తున్న ఆరుగురు చిన్నారులను బుధవారం గుర్తించారు. వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి, వారిని బడికి పంపాలని ఆదేశించారు. జిల్లా బాలల సంరక్షణ శాఖ అధికారి స్వప్న ప్రియదర్శిని, హెచ్ఈఆర్‌డీఎస్ జిల్లా సమన్వయకర్త సంపత్‌కుమార్, సభ్యులు రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులతో వలసలు నివారించాలి

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేపట్టి వలసలు నివారించా

నినాదాలు చేస్తున్న సంఘం నాయకులు

లని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ డిమాండు చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ తాలుకా కార్యదర్శి ప్రతాప్ అధ్యక్షతన వ్యవసాయ కార్మిక సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా అన్వర్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా శివన్నారాయణతోపాటు తొమ్మిది మంది సభ్యులను ఎన్నుకున్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: అవుకు మండలానికి సంబంధించిన ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని స్థానిక కార్యాలయంలో ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ శివయ్య తెలిపారు. మండలాధ్యక్షుడిగా నాగార్జున, ప్రధాన కార్యదర్శిగా మహేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా బాలకృష్ణ, సర్వేశ్వరుడు, శ్రీనివాసులు, మేరి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. మరో ఐదుగురిని కౌన్సిలర్లుగా నియమించినట్లు చెప్పారు. సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

అక్రమ పార్కింగ్.. తప్పని ట్రాఫిక్

☛ నందికొట్కూరు పట్టణంలో ప్రయాణ పాట్లు

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: నందికొట్కూరు పట్టణంలో వాహనాల రద్దీ పెరుగుతుండటంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. పగిడ్యాల, మిడుతూరు, జూపాడుబంగ్లా, నందికొట్కూరు మండలాలకు నందికొట్కూరు పట్టణం కేంద్ర బిందువు కావడంతో నిత్యావసరాలకు ఆయా మండలాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రహదారుల విస్తరణ చేపట్టకపోవడం, ఉన్నదారులపై ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది. దాంతో రెండు భారీ వాహనాలు ఒకేసారి ఎదురైతే వెనకాల వాహనాలు బారులు తీరాల్సిన పరిస్థితి నెలకొందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాకపోకలకు అంతరాయం

మిడుతూరు, పగిడ్యాల రోడ్డులో దుకాణాలు పోటాపోటీగా రోడ్డు పైకి ముందుకొస్తున్నాయి. వాటి ముందు వినియోగదారులు వాహనాలు ఉంచుతున్నారు. దీంతోపాటు ఆటోలు రహదారి పైనే పార్కింగ్ చేయడంతో

పగిడ్యాల రోడ్డులో ఇష్టానుసారంగా నిలిపిన ఆటోలు

రహదారి ఇరుకుగా మారి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఈ రహదారుల్లో రెండు బస్సులు, లారీలు, ఇతర భారీ వాహనాలు ఒకేసారి ఎదురెదురుగా వస్తే తీవ్ర సమస్య తలెత్తుతోంది. ఈ రహదారిపై పాఠశాలు, కళాశాలలకు విద్యార్థులు వెళ్తుంటారు. ఉదయం, సాయంత్రం వేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సంతకు వెళ్లాలంటే నరకమే..

సంత మార్కెట్‌కు వెళ్లేందుకు జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా సోమవారం పట్టణంలో వారపు సంత కావడంతో వివిధ గ్రామాల నుంచి జనం భారీగా తరలి వస్తారు. ఆ రోజు పగిడ్యాల రోడ్డుపై వాహనాల రద్దీ భారీగా ఏర్పడుతోంది. సంత మార్కెట్‌కు వెళ్లేందుకు వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోజు పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకుని ట్రాఫిక్ సమస్య లేకుండా చూసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

నందికొట్కూరు గ్రామీణం: మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీపీఎం, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నందికొట్కూరులోని పటేల్ సెంటర్లో బుధవారం ఆందోళన చేపట్టారు. రోడ్డుపై పడుకొని ధర్నా చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు

ప్రేమించి మోసం చేశాడంటూ యువకుడిపై కేసు

కొత్తపల్లి, న్యూస్‌టుడే: ప్రేమించి మోసం చేశాడని ఓ యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జయశేఖర్ తెలిపారు. పాములపాడు మండలంలోని తుమ్మలూరు గ్రామానికి చెందిన సూర్య ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని కొత్తపల్లికి చెందిన యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

ఇంటి నుంచి వెళ్లిన యువతి అదృశ్యం

నంద్యాల గ్రామీణం: క్రాంతినగర్‌కు చెందిన యువతి(19) కనపడడం లేదని గ్రామీణ సీఐ ఈశ్వరయ్య తెలిపారు. ఇంటి నుంచి ఈనెల 9న వెళ్లిన యువతి తిరిగి రాలేదని, ఆచూకీ లభించకపోవడతో తండ్రి బుధవారం రాత్రి ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అపోలో హాస్పిటల్స్, హైదరాబాద్
ప్రఖ్యాత వైద్య నిపుణులు ఇప్పుడు
కర్నూల్, నంద్యాలలో
Apollo HOSPITALS
అపోలో మెడికల్ సెంటర్, కర్నూలు. మెడిసేవా డయాగ్నోస్టిక్ సెంటర్, నంద్యాల. 13 నవంబర్ 2025
అపోలో మెడికల్ సెంటర్, కర్నూలు. 19 నవంబర్ 2025
అపోలో మెడికల్ సెంటర్, కర్నూలు. 19 నవంబర్ 2025
డా. వరుణ్ కొమ్మలపాటి MBBS, MS (Ortho), MRCS, ECFMG Cert. కన్సల్టెంట్ - ఆర్థోపెడిక్ ఫుట్ & యాంకిల్ సర్జన్
డా పెరెడ్డి సోమశేఖర్ రెడ్డి MBBS, MS (Ortho), M.Ch (Ortho), Fellow Arthroplasty (Joint Replacement Surg.) Sr కన్సల్టెంట్ - ఆర్థోపెడిక్ సర్జన్
డా సంజయ్ కుమార్ అగర్వాల్ MBBS, MS (Gen. Surg.), M.Ch (CTVS) కన్సల్టెంట్ - కార్డియోథొరాసిక్ & వాస్కులర్ సర్జన్
అపాయింట్మెంట్ కొరకు: 040-69321065 / 9030213838
అత్యవసర సేవలకై కాల్ చేయండి: CALL 1066

(c) eenadu

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంగా మారిందని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నియోజకవర్గంలోని 41 మంది బాధితులకు రూ.25,90,767 విలువ చేసే చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ.. ఎంతో మంది పేదలు అప్పులు చేసి వైద్యం చేయించుకొని ఉంటారన్నారు. ఇలాంటి వారికి ఈ నగదు ఉపయోగపడుతుందన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనాలివ్వాలి

బనగానపల్లి, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వి.ఏసురత్నం, డివిజన్ కార్యదర్శి సుబ్బయ్య డిమాండు చేశారు. బుధవారం బనగానపల్లి పొదుపు భవనంలో ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యావసర ధరలు, ఇతర ఖర్చులు పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి వేతనాలు పెంచాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో వెంకటలక్ష్మి, రోజారమణి, శశికళ, మల్లేశ్వరి, రేణుక పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి

రాంపురం(ప్యాపిలి), న్యూస్‌టుడే: అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. రచ్చబండ కార్యక్రమంలో భాగంగా బుధవారం డి. రంగాపురం, రాచవాండ్లపల్లె, రాంపురం, మామిళ్లపల్లె గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నామన్నారు. గ్రామాల్లో పర్యటించి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ ఛైర్మన్ నాగేశ్వరరావుయాదవ్, లక్ష్మీరెడ్డి, టి.శ్రీనివాసులు, మెట్టుపల్లి సుదర్శన్, సత్యం, రాజశేఖర్ పాల్గొన్నారు.

వైద్య విద్యకు ప్రాధాన్యం

మామిళ్లపల్లె(ప్యాపిలి),న్యూస్‌టుడే: రాష్ట్రంలో పీపీపీ (పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్) విధానంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల రాష్ట్ర విద్యార్థులకు అదనంగా 220 మెడికల్ సీట్లు లభించనున్నాయని ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వైద్య విద్యకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. రాబోయే రెండేళ్లలో పది కొత్త వైద్య కళాశాలల నిర్మాణం, వైద్య సిబ్బంది నియామకాలు పూర్తవుతాయన్నారు.

భక్తులు, సిబ్బంది మధ్య వాగ్వాదం

నందవరం(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: నందవరం గ్రామంలోని చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో మధ్యాహ్నం అమ్మవారి దర్శనం విషయంలో భక్తులు, ఆలయ సిబ్బంది మధ్య వాగ్వాదం జరిగింది. కొందరు భక్తులు ఆలయానికి మధ్యాహ్నం 1 గంట సమయంలో రావడంతో నిబంధనల మేరకు ఆలయం మూసివేశారు. దర్శనానికి పంపాలంటూ భక్తులు సిబ్బందితో వాదనకు దిగారు.

స్తంభించిన జల జీవనం

◆ ఎక్కడికక్కడ నిలిచిపోయిన పనులు

పరిశీలన

గ్రామాల్లో ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇచ్చి తాగునీరు సమృద్ధిగా అందించాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జల్ జీవన్ మిషన్ పథకాన్ని ప్రారంభించాయి. ఈ పనులు పలు గ్రామాల్లో అసంపూర్తిగానే మిగిలిపోయాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిధుల భాగస్వామ్యం లేకపోవడంతో పనులు చేపట్టేందుకు గుత్తేదారులు ముందుకు రాలేదు. కొన్ని చోట్ల పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు.

నత్తనడకన నిర్మాణాలు

ఆళ్లగడ్డ మండలంలో జల్ జీవన్ మిషన్ కింద మంజూరైన ట్యాంకు నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. అహోబిలంలో బండ్లగడ్డ చెంచుగూడెం, విద్యుత్తు సబ్ స్టేషన్ సమీపంలో ట్యాంకు నిర్మాణాలు జరుగుతున్నాయి. బండ్లగడ్డ చెంచుగూడెంలో 60 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి ట్యాంకు ముగింపు దశకు చేరుకుంది. ట్యాంకు పైభాగం నిర్మించాల్సి ఉంది. సబ్‌స్టేషన్ సమీపంలోని ట్యాంకు పిల్లర్ల దశలో ఉంది. గుత్తేదారులకు నిధులు విడుదల కాకపోవడంతో ఆశించిన స్థాయిలో పనులు ముందుకు సాగడం లేదు. ఫలితంగా నెలల తరబడి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. బిల్లులు అందితే త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేస్తామని గుత్తేదారులు చెబుతున్నారు.
– న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం

గత పాలనలో లోపాలతోనే..

చాగలమర్రి మండల వ్యాప్తంగా జల్ జీవన్ మిషన్ కింద గత వైకాపా ప్రభుత్వంలో రూ. 11.25 కోట్ల నిధులను మంజూరు చేశారు. గత ప్రభుత్వ వైఫల్యంతో నేటికీ పనులు పూర్తికాలేదు. కేవలం పది శాతం పనులు కూడా నిర్మాణంలో లేవు. మండల వ్యాప్తంగా రూ. 11.25 కోట్లకు గాను కేవలం రూ. 43.5 లక్షల పనులు మాత్రమే జరుగుతున్నాయి. డి.వనిపెంటలో రూ. 31.75 లక్షలతో 40 వేల లీటర్ల ట్యాంకు నిర్మాణంలో ఉంది. చెంచుగూడెంలో రూ. 11.75 లక్షలతో బోరు, మోటారు, పైపులైన్ల నిర్మాణం జరుగుతోంది. మిగిలిన రూ. 10.8 కోట్ల నిర్మాణ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. కొన్ని చోట్ల పనులు ప్రారంభానికి నోచుకోలేదు. పనులు ప్రారంభానికి నోచుకోక ముందే నిలిచిపోయాయి. – న్యూస్‌టుడే, చాగలమర్రి

ఎన్నటికి పూర్తయ్యేనో?

బేతంచెర్ల మండలంలో 33 గ్రామాలు, 19 పంచాయతీలు, 45 వేల జనాభా, 13 వేల గృహాలు ఉన్నాయి. మండలంలో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు కల్పించాలన్న ఉద్దేశంతో 2020-21లో జల్‌జీవన్ పథకం కింద రూ. 4.44 కోట్లు మంజూరు చేసింది. ఇందులో 27 పనుల్లో 16 పనులు చేపట్టి 10 గ్రామాల్లో పూర్తి చేశారు. 9 గ్రామాల్లో పనులు జరగాల్సి ఉంది. 11 పనులు వివిధ స్థాయుల్లో పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. చేసిన పనులకు గుత్తేదారుడికి రూ. 1.80 కోట్ల బిల్లులు రావాల్సి ఉంది. బిల్లులు వచ్చిన వెంటనే గుత్తేదారుడు పనులు కొనసాగిస్తాడని అధికారులు పేర్కొంటున్నారు. నాలుగేళ్లుగా పనులు సాగిస్తూనే ఉన్నారు.
– న్యూస్‌టుడే, బేతంచెర్ల

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్

డోన్ పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో వాహనాల పార్కింగ్ అస్తవ్యస్తంగా ఉంది. వాహనదారులు ఇష్టారాజ్యంగా ద్విచక్రవాహనాలు, ఆటోలను నిబంధనలను ఉల్లంఘించి ఇష్టారాజ్యంగా నిలుపుతున్నారు. ఇదేమిటని ప్రశ్నించే వారు కరవయ్యారు. కమర్షియల్ పార్సిల్ కార్యాలయం వైపు, స్టేషన్ బయట పలు చోట్ల వాహనాలను నిలుపుతున్నారు. ఆర్పీఎఫ్ పోలీసు అధికారుల పర్యవేక్షణ కొరవడిందని పుర వాసులు చెబుతున్నారు.
– న్యూస్‌టుడే, డోన్ పట్టణం

రహదారి గుంత.. పడితే చింత..

ఆళ్లగడ్డ మండలంలోని అహోబిలం గ్రామంలో ప్రధాన రహదారిపై గుంత ప్రమాదకరంగా మారింది. నీటి పైపు మరమ్మతుల కారణంగా రోడ్డు ధ్వంసం చేసి గుంత తీశారు. మరమ్మతులు పూర్తి చేశారు కానీ గుంతను మాత్రం పూడ్చలేదు. ఫలితంగా వాహనదారులు గమనించకుంటే గుంతలో పడే ప్రమాదముంది. నిత్యం భక్తులు రాకపోకలు చేసే దారి కావడంతో గుంతను పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం)

భయం.. భయం.. ఆటో ప్రయాణం

బనగానపల్లి మండలంలోని కృష్ణగిరి, మంగంపేట, తండా గ్రామాలకు బస్సు సౌకర్యం తక్కువగా ఉండటంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తుంటారు. ఆటోలో సామార్థ్యానికి మించి ప్రయాణిస్తుండటంతో ఎటువంటి ప్రమాదం జరిగిన ఇబ్బందులు తప్పవు. ఆటో టాపుపై కూర్చొని ప్రమాదకరంగా ప్రయాణికులు ప్రయాణం సాగిస్తున్నారు. పల్లెలకు బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, బనగానపల్లి గ్రామీణం

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

ఆందోళన చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ, ఇతర మండలాల్లో వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి.రామచంద్రుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఏపీ రైతు సంఘం, ఎస్‌డీపీఐ నాయకులు ఏడీఏ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. టి.రామచంద్రుడు మాట్లాడుతూ ఓ వైపు వర్షాలతో, మరోవైపు కనీస మద్దతు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దళారుల చెప్పిందే ధరగా ధాన్యం విక్రయాలు చేస్తూ నష్టపోతున్నారన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

బనగానపల్లి, న్యూస్‌టుడే: వైద్య కళాశాలను ప్రైవేటీకరిస్తే ప్రజా ఉద్యమం చేస్తామని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హెచ్చరించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం బనగానపల్లిలో ర్యాలీ చేశారు. కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ ప్రైవేటీకరణ చేస్తే పేద విద్యార్థులు వైద్య విద్య చదువుకునే అవకాశం కోల్పోతారన్నారు. కార్యక్రమంలో జడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైకాపా నాయకులు చల్లా విఘ్నేశ్వరరెడ్డి, భూమా కిషోర్ రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కాటసాని రామిరెడ్డి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: వైద్యకళాశాల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి అన్నారు. బుధవారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పట్టణంలో వైకాపా నాయకులు ర్యాలీ నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ?: కొత్తపేటలోని మారుతిలాడ్జి వీధిలో కోతుల బెడద అధికమైంది. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. -కేశవ్, కొత్తపేట.

?: నెహ్రూనగర్‌లో గోవిందరాజులు ఇంటి సమీపంలోని వీధుల్లో వానర సంచారం అధికమైంది. -వాణిరెడ్డి, నెహ్రూనగర్.

✔: వానరాలను పట్టణం నుంచి దూరంగా తరలించేందుకు త్వరలో చర్యలు తీసుకుంటాం.

(పై రెండు సమస్యలకు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ సమాధానాలు ఇచ్చారు)

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ?: మీరాపురం గ్రామంలో ఆలయాల సమీపంలో ఉన్న విద్యుత్ నియంత్రికలు ప్రమాదకరంగా ఉన్నాయి. - రంగా, మీరాపురం.

✔: గ్రామంలోని సమస్యను గుర్తించి చర్యలు తీసుకుంటాం. - శ్రీనివాసులు, ఏఈ, బనగానపల్లి.

సంజామల, న్యూస్‌టుడే: ?: ఆల్వకొండ గ్రామంలో కొత్తగా నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు పైప్‌లైన్ ఏర్పాటు చేయక పోవటంతో వృథాగా మారింది. -బాషా, ఆల్వకొండ.

✔: త్వరలో తాగునీటి గొట్టాలను ఏర్పాటు చేస్తాం. - రషీద్, పీఆర్‌ఏఈ. సంజామల.

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: ?: ఇంజేడు సమీపంలో కుందర వాగుపై ఏర్పాటు చేసిన వంతెన పైభాగంలో కంకర లేచి దెబ్బతింది. - ప్రతాప్‌రెడ్డి, ఇంజేడు.

✔: వారం రోజుల వ్యవధిలో మరమ్మతులు చేయిస్తాం. - రెడ్డిగోవిందు, డీఈ, కోవెలకుంట్ల.

కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని సంత మార్కెట్ వద్ద ఉన్న ఉచిత శుద్ధ జల కేంద్రం పని చేయడం లేదు. - ఉదయ్, గ్రామస్థుడు.

✔: పరిశీలించి చర్యలు చేపడతాం. - ప్రకాష్‌నాయుడు, ఇన్‌ఛార్జి ఈవో.

ఐక్యతకు వనభోజనాలు దోహదం

బేతంచెర్ల, న్యూస్‌టుడే: కార్తిక వనభోజనాలతో ఐక్యత పెంపొందుతుందని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జి.గోపాల్, కందగడ్డల రామ్మూర్తి పేర్కొన్నారు. అయ్యలచెరువు సమీపంలో కార్తిక వనభోజనాల కార్యక్రమం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. చిన్నారులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న పుర ప్రజలు

అహోబిలం హుండీ ఆదాయం రూ.30.90 లక్షలు

హుండీ సొమ్ము లెక్కిస్తున్న సిబ్బంది

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం దిగువ అహోబిలంలో ఆలయ నిర్వాహకులు బుధవారం హుండీ సొమ్మును లెక్కించారు. నాలుగు నెలల పాటు భక్తులు కానుకల రూపంలో హుండీల్లో సమర్పించిన నగదు లెక్కించగా రూ. 30.90లక్షలు వచ్చినట్లు మఠం సీవోవో సుందరరాజన్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ పాల్గొన్నారు.

పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్యాపిలి, న్యూస్‌టుడే: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న అర్చన రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయురాలు సరళ పేర్కొన్నారు. ఈ మేరకు పాఠశాలలో బుధవారం అర్చనను పాఠశాల యాజమాన్యం సన్మానించారు. ఉపాధ్యాయులు, పీడీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

అర్చనను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

ప్యాపిలి,న్యూస్‌టుడే: విశాఖపట్నంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో కోట వైశాలి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఈ మేరకు కళాశాలలో బుధవారం విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామకృష్ణయ్య, నవీన పాటి, మద్దిలేటి, ముస్తాక్, ఓబులేసు, వెంకటరమణ పాల్గొన్నారు.

ఘనంగా గృహ ప్రవేశాలు

రుద్రవరం: లబ్ధిదారుడికి తాళాన్ని అందజేస్తున్న ఆర్డీవో విశ్వనాథ్

రుద్రవరం, ఉయ్యాలవాడ, చాగలమర్రి, సంజామల, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామాల్లో లబ్ధిదారులు సామూహిక గృహ ప్రవేశాలకు శ్రీకారం చుట్టారు. రుద్రవరంలో ఆర్డీవో విశ్వనాథ్ సామూహిక గృహ ప్రవేశాలను ప్రారంభించారు. రెండు గృహాలను ప్రారంభించి లబ్ధిదారులకు తాళాలను అందజేశారు.

మున్సిపల్ స్థలం ఆక్రమణకు యత్నం

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని సాక్షి లేఅవుట్‌లో 321 సర్వే నంబరులో రోడ్డును ఒక పార్టీకి చెందిన వ్యక్తి 19 అడుగుల మేర ఆక్రమించి ఫెన్సింగ్ వేసేందుకు ప్రయత్నించారు. సమాచారం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు సదరు వ్యక్తికి మున్సిపాలిటీ ఓపెన్ సైట్ ఎంత వరకు ఉందో తెలియజేసి.. ఆ తర్వాతే ఫెన్సింగ్ వేసుకోవాలని సూచించినట్లు టీపీవో శబరీశ్ తెలిపారు.

మరమ్మతులతో రైల్వే గేటు మూసివేత

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని రైల్వే ట్రాక్ మరమ్మతు పనులను రైల్వే అధికారులు బుధవారం రాత్రి శ్రీకారం చుట్టారు. ఈ పనులు ఈ నెల 17వ తేదీ సాయంత్రం వరకు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ కారణంగా గేటును మూసివేస్తున్నట్లు తెలిపారు. వాహనదారులు ప్రత్యామ్నాయంగా ఉపరితల వంతెనపై గానీ, ఇతర మార్గాల్లోకాని వెళ్లాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ పురపాలిక పరిధిలోని పి.నాగిరెడ్డిపల్లెలో మసీదు నిర్మాణానికి వైకాపా రాష్ట్ర కార్యదర్శి భూమా కిశోర్‌రెడ్డి రూ. 40వేల విరాళంగా అందించారు.

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: గ్రామీణాభివృద్ధి, మెరుగైన వైద్య సేవల కోసం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చొరవతో రూ. 3.46 కోట్ల నిధులు విడుదలైనట్లు బుధవారం పీఆర్ ఏఈ వెంకటయ్య తెలిపారు.

డోన్, న్యూస్‌టుడే: పేదల సమస్యలపై మరిన్ని రాజీలేని పోరాటాలు చేసేందుకు సీపీఐ రాష్ట్ర కార్యవర్గం తరపున ప్రణాళికలు రూపొందిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు రామాంజనేయులు అన్నారు.

ప్యాపిలి, న్యూస్‌టుడే: డోన్ పట్టణానికి చెందిన బ్రహ్మయ్య, ప్రశాంతి దంపతులు పని నిమిత్తం కారులో ప్యాపిలి మీదుగా పత్తికొండకు వెళ్లారు. పని ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఏనుగుమర్రి సమీపంలో కారులో నుంచి మంటలు చెలరేగి దగ్ధమైంది. దంపతులకు ఏమీ కాలేదు.

ఆర్‌ఎస్ రంగాపురం(బేతంచెర్ల),న్యూస్‌టుడే: కుష్ఠు వ్యాధి నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆర్‌ఎస్ రంగాపురంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్లు అబ్దుల్ అలీం, డాక్టర్ మూర్తుజావలి ఆధ్వర్యంలో వ్యాధి నివారణపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: మున్సిపాలిటీ అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేపడితే శాఖాపరమైన చర్యలు తప్పవని మున్సిపల్ టీపీవో శబరీశ్ పేర్కొన్నారు. రైల్వేస్టేషన్ రోడ్డులో ఓ వ్యక్తి ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న నిర్మాణాన్ని పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది తొలగించారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: శ్రీవాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్రం ఆధ్వర్యంలో పక్షి శాస్త్రవేత్త డాక్టర్ సలీం అలీ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: శనగ విత్తనం వేసేటప్పుడు ట్రైకోడెర్మా విరిడితో విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలని ఏడీఏ సుధాకర్ అన్నారు. కోవెలకుంట్ల మండలంలోని జోలదరాశి, కలుగొట్ల గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం బుధవారం నిర్వహించారు.

తరచూ మూలన.. తరలింపు యాతన

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: పురపాలికల్లో చెత్త తరలింపు వాహనాలకు సరైన నిర్వహణ లేక మూలకు చేరుతున్నాయి. డోన్ పురపాలక పరిధిలో 32 వార్డులు ఉండగా, 18 వేలకు పైగా కుటుంబాలు ఉన్నాయి. పట్టణంలో 80 వేలకు పైగా జనాభా ఉంది. పారిశుద్ధ్యానికి ఉద్దేశించిన వాహనాల్లో కొన్ని పని చేస్తుండగా. మరికొన్ని మరమ్మతులకు గురయ్యాయి. పట్టణంలోని 24 నుంచి 32వ వార్డు వరకు ఉన్న కాలనీల్లోని వీధుల్లో చెత్తను తరలించే ట్రాక్టర్ మరమ్మతునకు గురై మూలకు చేరింది. ప్రస్తుతం రెండు ట్రాక్టర్లు పని చేస్తున్నాయి. మూడు కంప్యాక్టర్లలో ఒకటి పనిచేయడం లేదు. గతంలో రూ. 20లక్షలతో తెప్పించిన డంపర్ ట్రక్ పనిచేయడం లేదు. ఎనిమిది మినీ ఆటోల్లో ఆరు పనిచేస్తున్నాయి. స్వీపింగ్ మిషన్, లోడర్ యంత్రాలు మరమ్మతులకు నోచుకోక తుప్పు పట్టిపోతున్నాయి.

తీవ్రమైన పారిశుద్ధ్య సమస్య

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ పట్టణంలోని 14,500 గృహాలు ఉన్నాయి. రోజుకు 10 టన్నుల చెత్త వెలువడుతుంది. పురపాలికలోని కంప్యాక్టర్ ఎప్పుడు పనిచేస్తుందో ఎప్పుడు మూలకు చేరుతుందో అర్థం కాదు. మరమ్మతులకు గురైతే నెలల కొద్దీ సేవలకు దూరమవుతోంది. డ్రెయిన్ క్లీనర్ (పెద్ద మురుగు కాల్వల్లో పూడిక తీసే యంత్రం) ఉన్నదాన్ని ఇతర సేవలకు వినియోగిస్తున్నారు. పట్టణంలో ఇప్పటికే 30 చోట్ల చెత్త కుండీలు ఉన్నాయి. వాటిలో కొన్ని తప్ప అన్నీ మూలకు చేరాయి. చెత్త కుండీలు లేకపోవడంతో ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడే వేస్తున్నారు.

నిరుపయోగంగా కంప్యాక్టర్

అవగాహన కరవు

ప్రజలకు తడి, పొడి, ప్రమాదకర చెత్త కోసం మూడు వేర్వేరు రంగుల డబ్బాలు ఇచ్చారు. ఇందుకోసం రూ. 15 లక్షలు ఖర్చు చేశారు. అయితే ప్రజలకు అవగాహన కల్పించకపోవడం, వర్మీ కంపోస్టు యూనిట్ లేకపోవడంతో ప్రజలు ఈ డబ్బాలను వినియోగించడం లేదు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ఉండేందుకు పట్టణంలో రద్దీ కూడళ్లలో స్టీల్ చెత్త కుండీలను ఏర్పాటు చేసినా కొంత కాలానికే దెబ్బతిన్నాయి.

వృథాగా స్టీలు చెత్తకుండీలు

రూ. 2 లక్షల విలువైన స్టీలు చెత్తకుండీలు పురపాలక కార్యాలయంలోనే వృథాగా ఉన్నాయి. చెత్తను సేకరించే తోపుడు బండ్ల చక్రాలు విరిగిపోయాయి. పారిశుద్ధ్య కార్మికులకు చాలా నెలల నుంచి సబ్బులు, కొబ్బరి నూనె, చేతి తొడుగులు ఇవ్వడం లేదు. కొందరు కార్మికుల చేతులకు గాయాలైనా అదే స్థితిలోనే విధులు నిర్వహిస్తున్నారు.

(c) eenadu

26న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

గుంటూరు: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్తు స్థాయీ సంఘ సమావేశాలను ఈనెల 26న ఏర్పాటు చేస్తూ జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 1, 2, 4, 7 స్థాయీ సంఘాలను జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరగనున్నాయి. జడ్పీ ఉపాధ్యక్షులు శౌరిరెడ్డి నర్సిరెడ్డి 3వ కమిటీ, బత్తుల అనురాధ 6వ కమిటీ, తెనాలి జడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి 5వ కమిటీకి అధ్యక్షత వహించి నిర్వహించనున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల కలెక్టర్లతో పాటు మూడు జిల్లాలకు చెందిన జడ్పీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులను స్థాయీ సంఘాల సమావేశాలకు హాజరుకావాలని ఉత్తర్వులు పంపారు.

నూతన ఇంటిని ప్రారంభిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

పేదలకు గృహ యోగం

పండగ వాతావరణంలో కొత్త ఇళ్ల ప్రారంభోత్సవం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పేదల ఆనందాల లోగిళ్లు పండగ వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఎన్నో ఏళ్ల కల నెరవేరిన వేళ సంతోషంగా కొత్త ఇంటిలోకి పేద కుటుంబాలు ప్రవేశించాయి. రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కల సాకారానికి నిర్మించిన గృహాలను బుధవారం ప్రారంభించింది. చిలకలూరిపేటలోని 21వ వార్డులో నూతన గృహాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, కలెక్టర్ కృతికా శుక్లా ప్రారంభించారు. వినుకొండ నియోజకవర్గం నూజండ్ల మండలం గురపనాయుడుపాలెంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, సత్తెనపల్లిలోని 31వ వార్డులో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, గురజాల నియోజకవర్గం పిడుగురాళ్లలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు నూతన గృహాలను ప్రారంభించారు. మాచర్లలో గృహ మంజూరు పత్రాలను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గృహనిర్మాణ సంస్థ జిల్లా అధికారి శివలింగం, ఈఈ ప్రసాద్, అధికారులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించేలా..

3 వేల మంది ఉపాధ్యాయులకు శిక్షణ

న్యూస్‌టుడే, నరసరావుపేట అర్బన్

శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు

జిల్లాలో పదోతరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో 3వేల మంది ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ శిబిరం ఏర్పాటు చేసింది. 10వ తేదీ నుంచి 17వరకు నరసరావుపేట, సత్తెనపల్లి డివిజన్లలోని ఉపాధ్యాయులకు సబ్జెక్టు నిపుణులను రీసోర్స్ పర్సన్లుగా నియమించి శిక్షణ ఇస్తున్నారు. వెనకబడిన విద్యార్థులు అందరూ ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో ప్రత్యేక స్టడీమెటీరియల్ రూపొందించిన నిపుణులైన ఉపాధ్యాయులతో తరగతులు నిర్వహిస్తున్నారు.

స్టడీ మెటీరియల్ ప్రత్యేకతలు .. పదిలో ఉత్తీర్ణతకు కనీస మార్కులు సాధించాల్సి ఉంది. 40 శాతం మార్కులు ప్రతి విద్యార్థి సాధించేలా స్టడీ మెటీరియల్ తయారు చేశారు. సిలబస్‌లో ఎక్కువగా మార్కులు వచ్చే అవకాశం ఉన్న పాఠ్యాంశాలను గుర్తించారు. వాటిని సులభశైలిలో విద్యార్థులు అర్థం చేసుకునేందుకు అనుగుణంగా మెటీరియల్‌ను తయారు చేయించారు. వాటిని ఉపయోగించి ఉపాధ్యాయులు బోధించాలి. గతంలో 11 ప్రశ్నాపత్రాలు రాయాల్సి ఉండగా, మారిన విధానం ప్రకారం ప్రస్తుతం 7 పేపర్లు రాయాలి.

పక్కా ప్రణాళిక

పది పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలంటే వెనకబడిన విద్యార్థులు రాణించాల్సి ఉంటుంది. కలెక్టర్ ప్రత్యేక చొరవతో స్టడీ మెటీరియల్ తయారీతో పాటు వాటిని రూపొందించిన వారితోనే ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నాం. దీంతో సమస్యలను సైతం నివృత్తి చేయగలిగే అవకాశం వారికి ఉంటుంది. - **చంద్రకళ, డీఈవో, పల్నాడు జిల్లా**

ఆట స్థలంతో ఆడుకుంటున్నారు!

నిర్వహణ కొరవడిన కోడెల స్టేడియం

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, నరసరావుపేట క్రీడలు

వాహనాల రాకపోకలతో దెబ్బతిన్న వాకింగ్ ట్రాక్

ఏపుగా పెరిగిన గడ్డి, కంపచెట్లు.. నడవడానికి వీలులేని వాకింగ్ ట్రాక్. వర్షం వస్తే చెరువులా మారి వారం వరకు తొలగని బురద. ఇదంతా సత్తెనపల్లిరోడ్డులోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో పరిస్థితి. కనీసం ఉదయం నడకదారులకు కూడా అగచాట్లు తప్పడం లేదంటే నిర్వహణ ఎలా ఉందో అర్థమవుతోంది. ప్రస్తుతం శాప్ అధికారులకు సంబంధించి భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీనికోసం సామగ్రి తెచ్చే వాహనాలతో ఉన్న కొద్దిపాటి చదును ప్రాంతం కాస్త ధ్వంసమైంది. క్రీడాకారులు, నడక కోసం వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎలాంటి క్రీడా పోటీలూ జరగడం లేదు. నిర్వహణకు ముందుకొచ్చేవారు మైదానాన్ని చూసి వెనకడుగు వేస్తున్నారు.

గతంలో రోజుకు మైదానాన్ని వినియోగించుకునే వారు: 5 వేల మంది
ప్రస్తుతం: 500 మంది
2000 నుంచి 2019 మధ్య జరిగిన టోర్నమెంట్లు: 15 రాష్ట్రస్థాయి, 2 జాతీయ స్థాయి
2019 నుంచి ఇప్పటి వరకు జరిగినవి: 4

కళ తప్పిన మైదానం

20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్టేడియంలో జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలు, ఖేలో ఇండియా వంటి పోటీలు గతంలో జరిగాయి. ఇండోర్ కోర్టులు, జిమ్‌లు జాతీయస్థాయి ప్రమాణాలతో నిర్మించారు. బాస్కెట్‌బాల్, క్రికెట్, ఫుట్‌బాల్, కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేశారు. ఇప్పుడు అవి కనిపించవు. జిల్లా ఏర్పాటుతో క్రీడా ప్రాంగణాన్ని స్వాధీనం చేసుకున్న శాప్ నిర్వహణను పట్టించుకోలేదు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించడం లేదు. రాత్రిళ్లు మందుబాబులకు అడ్డాగా మారుతోంది. దీనిపై జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి నరసింహారెడ్డి మాట్లాడుతూ 'స్విమ్మింగ్‌పూల్‌ను జనవరి నుంచి అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నామని, మిగతా వసతులు కల్పించేలా ఉన్నతాధికారులతో మాట్లాడమని చెప్పారు.

ఈత కొలనుకు మోక్షమెప్పుడు?.. కోడెల శివప్రసాదరావు సభాపతిగా ఉన్న సమయంలో రూ.2.10 కోట్లతో ఈతకొలను నిర్మించి పట్టణ ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. వైకాపా అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లకు అది మూతపడింది. ఇప్పటివరకు తెరుచుకోలేదు. రూ.కోట్లతో నిర్మించిన ఈత కొలను తాళాలు వేయటంపై క్రీడాభిమానులు, పట్టణవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అయినా పూర్వవైభవం వస్తుందనుకుంటే అదీ లేదని నిట్టూర్పుతున్నారు.

కొనేదెలా.. తినేదెలా..

పెరిగిన కూరగాయల ధర

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, చిలకలూరిపేట టౌన్: కూరగాయల ధరలు పెరగడంతో మధ్యతరగతిపై ప్రభావం పడుతోంది. పలు రకాలు కిలో రూ.వందకు చేరాయి. ఓ వైపు తుపాను.. మరోవైపు కార్తీక మాసం నేపథ్యంలో కూరగాయల ధరలు ఆకాశం వైపు చూస్తున్నాయి. తుపాను వల్ల జిల్లాలో దాదాపు 29 హెక్టార్లలో కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది. పల్నాడు ప్రాంతానికి బాపట్ల, విజయవాడ, కృష్ణా జిల్లాల నుంచి కూరగాయలు వస్తుంటాయి. అక్కడ కూడా తుపాను వల్ల ఎక్కువ నష్టం వాటిల్లింది. 15 రోజుల కిందట వరకు అన్నీ కిలో రూ.60 లోపు ఉన్నవి ప్రస్తుతం కిలో రూ.100కు చేరాయి. జిల్లాలో సత్తెనపల్లి, చిలకలూరిపేట మినహా ఎక్కడా రైతుబజార్లు లేవు. దీంతో ధరలు పెరిగినప్పుడు ఇబ్బందులు తప్పడం లేదు. ఆరు మున్సిపాలిటీల పరిధిలో రోజుకు 100 మెట్రిక్ టన్నుల కూరగాయలు దిగుమతి అవుతున్నాయి. స్థానికంగా కూరగాయల ఉత్పత్తి లేకపోవడం.. బెంగళూరు, మహారాష్ట్ర నుంచి వచ్చే సరకులకు డిమాండ్ పెరగడంతో ధరలు పెరిగాయని కూరగాయల వ్యాపారులు చెబుతున్నారు. రూ.500 లేనిదే కనీసం ఐదు రకాలైనా ఇంటికి తెచ్చుకోలేకపోతున్నామని సగటు మధ్యతరగతి వారు వాపోతున్నారు.

రైతుబజారు, బహిరంగ మార్కెట్‌లో ధరలు (కిలో/రూ.ల్లో)

రకం	మార్కెట్	రైతు బజార్
బీర	100	42
దొండ	100	36
బెండ	100	53
వంకాయ	80	55
గోరుచిక్కుడు	80	40
సొరకాయ(ఒక్కటి)	50	30
టమాట	50	32
పచ్చిమిర్చి	100	53
దోసకాయ	80	47
బంగాళదుంప	100	66

30 కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు

పత్తిలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న విజయసునీత

సత్తెనపల్లి గ్రామీణ: రాష్ట్రంలో 30 సీసీఐ కేంద్రాల ద్వారా 62 జిన్నింగు మిల్లుల్లో రైతుల నుంచి పత్తి కొనుగోళ్లు చేపడుతున్నట్లు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సంచాలకురాలు విజయసునీత తెలిపారు. ఖరీఫ్‌లో సుమారు 4.56 లక్షల హెక్టార్లలో పత్తి సాగు కాగా, 8 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. సత్తెనపల్లిలోని పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆమె బుధవారం పరిశీలించారు. తేమ శాతం ఆధారంగా రైతులకు లభిస్తున్న నగదు వివరాలను గమనించారు. అనంతరం మాట్లాడుతూ పత్తి రైతులు తొలుత రైతుసేవా కేంద్రాల్లో సిబ్బంది ద్వారా కపాస్ కిసాన్ యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. నందిగామ ఆర్‌ఎస్‌కేలోనూ వివరాల నమోదు ప్రక్రియను గమనించారు. సంయుక్త సంచాలకుడు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ మధ్యవర్తులను ఆశ్రయించవద్దని రైతులను కోరారు. మాచర్ల, పిడుగురాళ్ల, నడికుడి, క్రోసూరు, చిలకలూరిపేట, సత్తెనపల్లి, నరసరావుపేట కేంద్రాల్లోని 11 మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు మొదలైనట్లు చెప్పారు. విజిలెన్స్ జేడీ రాజశేఖర్, డిప్యూటీ డైరెక్టర్ దివాకర్, యార్డు ఛైర్‌పర్సన్ శోభారాణి తదితరులున్నారు.

ఈ రోడ్డుపై .. విమానాలు దిగుతాయ్

జాతీయ రహదారి రన్‌వేపై సరకు రవాణా విమానం

నిత్యం లారీలు, బస్సులు, కార్లు రయ్.. రయ్ మంటూ రాకపోకలు సాగించే జాతీయ రహదారి అది. అత్యవసర సమయంలో విమానాలు దిగేందుకు సిద్ధంగా ఉంటుంది. బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం కొరిశపాడు గ్రామం నుంచి జె.పంగులూరు మండలం రేణింగవరం వరకు 4.1 కిలోమీటర్ల పొడవు, 33 మీటర్ల వెడల్పుతో ల్యాండింగ్ స్ట్రిప్ నిర్మించారు. ఇప్పటికే ఈ అత్యవసర రన్‌వేపై రెండుసార్లు వైమానిక దళం ఆధ్వర్యంలో ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలోనూ, అత్యవసర పరిస్థితుల్లోనూ ఇక్కడ విమానాలు ల్యాండ్ చేయడానికి ఈ రన్‌వేను సిద్ధం చేశారు. రన్‌వే కోసం మలుపులు లేని నాలుగు కిలోమీటర్ల రహదారి, అత్యవసరంగా ట్రాఫిక్ మళ్లించేందుకు అనువైన మార్గాలు ఉన్న రహదారిని ఎంచుకున్నట్లు వైమానిక దళం అధికారులు వెల్లడించారు. **- న్యూస్‌టుడే, మేదరమెట్ల**

ఫీజు వసూళ్లలో అవకతవకలపై ఆందోళన

చీరాల గ్రామీణం: బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపూరుపాలెంలోని చీరాల ఆదర్శ పాఠశాల విద్యార్థులు బుధవారం ఎస్‌ఎంసీ ఛైర్మన్ రాంబాబు ఆధ్వర్యంలో గేటు ముందు బైఠాయించి, నిరసన వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ ఫీజు వసూళ్ల విషయంలో అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. జిల్లా అధికారులు తక్షణం విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. డీఈవో పురుషోత్తం విద్యార్థులను బడిలోకి తీసుకెళ్లి లిఖిత పూర్వక ఫిర్యాదు తీసుకున్నారు. ప్రవేశ ఫీజుతో పాటు పరీక్ష ఫీజులు సైతం అదనంగా వసూలు చేశారని వసతి గృహ విద్యార్థినులు డీఈవోకి చెప్పారు. ప్రిన్సిపల్ సరళ వైద్య సెలవులో ఉండటంతో వైస్ ప్రిన్సిపల్ శామ్యూల్‌జాన్, హాస్టల్ వార్డెన్ వద్ద వివరణ తీసుకున్నారు. విచారణలో ఆదర్శ పాఠశాలల రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ విద్యాసాగర్, జీసీడీవో చారులత, చీరాల ఉప విద్యాశాఖాధికారి గంగాధర్, తదితరులున్నారు.

6లో బంతి సాగు.. భలే బాగు
అప్రమత్తతే.. పశువులకు రక్ష..! రైతేరాజు

ముద్ర పడితేనే..

సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ఈకేవైసీ

జిల్లాలో ఈకేవైసీ చేయాల్సిన లబ్ధిదారులు: 1,83,341
ఇప్పటివరకు పూర్తి చేయించుకున్న వారు: 18,480
బయోమెట్రిక్ చేయించుకోవాల్సినవారు: 60,835 మంది
ఇప్పటివరకు చేయించుకున్నవారు: 6,533

న్యూస్‌టుడే, నరసరావుపేట

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుకుంటున్న లబ్ధిదారుల ఈకేవైసీ ప్రక్రియను గ్రామ, వార్డు సచివాలయ (జీఎస్‌డబ్ల్యూఎస్) శాఖ చేపడుతోంది. ముద్ర పడితేనే ఇకనుంచి లబ్ధి అందనుంది. ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అమలుచేసేందుకు, లబ్ధిదారుల సంతృప్తిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఈకేవైసీ, బయోమెట్రిక్ వివరాలు సేకరిస్తున్నారు. విద్యార్థుల బయోమెట్రిక్ ప్రక్రియనూ వేగవంతం చేశారు. లబ్ధిదారుల ఈకేవైసీలో జిల్లా 11వ స్థానంలో ఉంది.

ఈకేవైసీ చేస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగులు

ఆధార్ నవీకరణలోనూ వెనకడుగు..

ఆధార్ నవీకరణలోనూ జిల్లాలో ప్రగతి తక్కువగా ఉంది. 15 ఏళ్ల లోపు, ఆపైబడిన విద్యార్థులు, పిల్లల మ్యాన్‌డేటరీ బయోమెట్రిక్ వెరిఫికేషన్ ప్రక్రియ చేపడుతున్నారు. ఇందుకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నా చాలామంది ముందుకు రావట్లేదు. బయోమెట్రిక్ చేయించుకోని పిల్లల్ని గుర్తించి వారితో ఆ ప్రక్రియ పూర్తి చేయించడంలో క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం కనిపిస్తోంది.

ఆలోచనలు అదిరే.. ఆవిష్కరణలు మెరిసే

ఏఎన్‌యూలో ఎన్‌సీసీ ఆల్ ఇండియా ఐడియా అండ్ ఇన్నోవేటివ్ కాంపిటీషన్

ఆవిష్కరణలు పరిశీలిస్తున్న జ్యూరీ సభ్యులు

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, ఏఎన్‌యూ: హ్యాక్ చేయడానికి వీల్లేని డ్రోన్... రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే ఆసుపత్రికి, అధికారులకు సమాచారమిచ్చే ఆవిష్కరణ... అసలు రోడ్డు ప్రమాదాలకు ఆస్కారమే లేకుండా ప్రత్యేక పెయింటింగ్‌తో కట్టడి చేసే ఆలోచన.. పిల్లల ఆరోగ్య పరిస్థితులు వారి కాళ్లకున్న బూట్ల ద్వారా తెలుసుకునేలా రూపొందించిన వ్యవస్థ... జనసమ్మర్థ ప్రదేశాల్లో ప్రతి ఒక్కరినీ పక్కాగా గుర్తించే నిఘా వ్యవస్థ... ఇలాంటి ఎన్నో వినూత్న ఆలోచనలు.. ఆవిష్కరణలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికైంది. బుధవారం నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) ఆల్ ఇండియా ఐడియా అండ్ ఇన్నోవేషన్ కాంపిటీషన్ (ఐసీసీ)- 2025ను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో కాకినాడ ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్స్ సమన్వయంతో నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 170 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు 85 వినూత్న ఆవిష్కరణలు ప్రదర్శించారు. ఉత్తమంగా ఎంపికైనవాటిని దిల్లీ ప్రదర్శనలో ఉంచుతామని.. రక్షణ, ఇతర రంగాల్లో వినియోగించడానికి ఉన్న అవకాశాలపై అధ్యయనం చేస్తామని ఎన్‌సీసీ అధికారులు వివరించారు.

ప్రాజెక్టు: ఆప్టికల్ ఫైబర్ డ్రోన్
తయారీదారులు: విక్రాంత్‌చౌదరి, హార్దిక్ మిత్తల్, మయూర్ చౌదరి (బీటెక్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు)
స్వస్థలం: జైపూర్, రాజస్థాన్

పరికరాలు: 6 ఎల్‌డీసీ బ్రష్‌లెస్ మోటార్లు, 5,200 ఎంఏహెచ్ బ్యాటరీ, పిక్సో ఫ్లైట్ కంట్రోల్, జీపీఎస్ కంపాస్ మాడ్యూల్.
ప్రత్యేకతలు: ఇది ఆప్టికల్ ఫైబర్ డ్రోన్. హ్యాక్ చేయలేరు. 3 నుంచి 4 కిలోల పేలోడ్ పేలుడు పదార్థాలను తరలిస్తుంది. 2 కిలోమీటర్ల నుంచి 30 కిలోమీటర్ల రేడియస్‌లో పనిచేస్తుంది. సైన్యంలో కౌంటర్ ఎటాక్‌కు ఉపయోగపడుతుంది. వ్యయం రూ.70 వేలలోపే. ఇలాంటివి ప్రస్తుతం రష్యా మాత్రమే వినియోగిస్తోంది.

ప్రాజెక్టు: ఏఐ యాక్సిడెంట్ అలెర్ట్ సిస్టమ్ యూజింగ్ సీసీటీవీ
రూపకర్తలు: సాక్షి రంజిత్ దియోర్
స్వస్థలం: వడోదర, గుజరాత్
పరికరాలు: సీసీటీవీ లేదా వెబ్‌కెమెరా
ప్రత్యేకతలు: రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్తే ప్రాణాలు దక్కే అవకాశం ఎక్కువ. ప్రమాదం జరిగాక సీసీ కెమెరా లేదా వెబ్‌కెమెరా ద్వారా సమీపంలోని ఆసుపత్రి, పోలీసులు, అధికారులకు క్షణాల్లో సమాచారం చేరేలా ఏఐ ఆధారితంగా ఈ ప్రాజెక్టును రూపొందించారు. గుజరాత్‌లోని వడోదరాలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు.

ప్రాజెక్టు: ఎ కిట్ విత్ ఎ పెయింట్
రూపకర్తలు: దీప్తిషామిశ్రా, ఆశిష్‌దాస్
స్వస్థలం: ఒడిశా **పరికరాలు:** ప్రత్యేక పెయింట్, డివైజ్, ల్యాప్‌టాప్
ప్రత్యేకతలు: ఎత్తైన కొండలు, ఘాట్‌రోడ్లలో రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనేది ఈ ప్రాజెక్టు ఉద్దేశం. ఫొటోల్యూమినెస్ పెయింట్‌ను ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో విస్తరించడం ద్వారా మలుపుల్లో విజిబులిటీని పెంచవచ్చు.

ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తిచేయాలి

మురికిపూడి (చిలకలూరిపేట గ్రామీణ): 2024-25 ఆర్థిక సంవత్సరంలో లైవ్‌స్టాక్ మిషన్ పథకం ద్వారా అనుమతి పొందిన ప్రాజెక్టులను బ్యాంక్ అధికారులు లబ్ధిదారులతో మాట్లాడి త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా పశుసంవర్ధశాఖ అధికారులను ఆదేశించారు. చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామంలో కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ పథకం ద్వారా నడుపుతున్న గొర్రెల యూనిట్‌ను జిల్లా కలెక్టర్ బుధవారం సందర్శించి లబ్ధిదారు ఉసర్తి విజయకుమారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆర్డీవో మధులత, తహసీల్దార్ మహ్మద్ హుస్సేన్, పశుసంవర్ధశాఖ ఏడీ శ్రీనివాసరావు, పశువైద్యాధికారి డాక్టర్ దీప్తి తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

ఏపీఎంఐడీసీ భూముల పరిశీలన.. చిలకలూరిపేట మండలం యడవల్లి వద్ద ఏపీఎంఐడీసీకి కేటాయించిన భూములను కలెక్టర్ కృతికా శుక్లా పరిశీలించారు. సర్వే నెంబరు 381-44లో మొత్తం 427 ఎకరాలు భూములు గతంలో వీకర్స్ సెక్షన్ సొసైటీ కింద ఉండేవన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులు సాగు చేసుకునేందుకు అప్పట్లో ఇచ్చారన్నారు. పంటలు పండకపోవడంతో గత వైకాపా ప్రభుత్వంలో సదరు లబ్ధిదారులకు పరిహారం చెల్లించి 223 ఎకరాలు ఏపీఎంఐడీసీకి కేటాయించారన్నారు. మిగిలిన భూముల్లో 170 ఎకరాలు వాగు పోరంబోకుగా, మిగిలిన భూమి రహదారుల కింద ఉందని కలెక్టర్‌కు అధికారులు వివరించారు.

నిబంధనల పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దు

పత్తిలో తేమశాతం పరిశీలిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : సీసీఐ నిబంధనల పేరుతో రైతులను ఇబ్బంది పెట్టకుండా పత్తి కొనుగోలు చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. నాదెండ్ల మండలం గణపవరంలోని వెంకటకృష్ణ జిన్నింగ్ మిల్లులో మార్కెట్ యార్డు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని బుధవారం మంత్రి ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాతో కలిసి పత్తిని పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ పత్తికి మద్దతు ధర 6 నుంచి 7 శాతానికి పెరిగిందని, కొనుగోలుకు 11 సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పత్తి పూర్తిగా ఆరబెట్టాకే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, అప్పుడే రైతులు ధర విషయంలో గట్టిగా డిమాండ్ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ తుపానుతో తీవ్రంగా నష్టపోయిన పత్తి రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ జిల్లాలో 11 సీసీఐ కేంద్రాలు ఏర్పాటు అవుతున్నాయని, రైతులు ముందుగా సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకుని సీసీఐ కేంద్రంలో విక్రయించుకోవాలన్నారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ షేక్ కరీముల్లా, ఆర్డీవో మధులత, జిల్లా వ్యవసాయాధికారి జగ్గారావు, సీసీఐ బయ్యర్ రమేష్, జనసేన ఇన్‌ఛార్జి తోట రాజారమేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో తనిఖీలు

మాచర్ల సీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ ప్రసూన

ఈనాడు కథనానికి స్పందన

మాచర్ల, విజయపురిసౌత్, న్యూస్‌టుడే: రోగుల నుంచి వైద్య సిబ్బంది డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని డీసీహెచ్‌ఎస్ ఎం.ప్రసూన హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిబ్బంది రోగుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తుండటంతో 'ఎనిమాకు రూ.100.. కుట్టుకు రూ.1000' శీర్షికతో 'ఈనాడు'లో బుధవారం కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన డీసీహెచ్‌ఎస్ మాచర్ల, విజయపురిసౌత్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అత్యవసర, ఓపీ, ఐపీ విభాగాలు, కాన్పుల వార్డు, జనరల్ వార్డులను పరిశీలించారు. రికార్డులు, ల్యాబ్, ఇ-హాస్పిటల్, సిబ్బంది పనితీరు, హాజరు తదితర వాటిపై ఆరా తీశారు. సిబ్బంది పనితీరుపై రోగులకు అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు.

మహిళను పరీక్షిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

రక్తం పోటెత్తి.. దేహం తీపెక్కి..

ఎన్‌సీడీసీడీ 3.0 సర్వేలో ప్రజల ఆరోగ్య వివరాల వెల్లడి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

ఆహార అలవాట్లు.. ఒత్తిడి.. వ్యాయామం లేకపోవడం.. వెరసి రక్తపోటు, మధుమేహం కాటుతో జిల్లాలో ఎక్కువ మంది బాధపడుతున్నారు. క్యాన్సర్ బాధితులు క్రమంగా పెరుగుతున్నారు. అసాంక్రమిక రోగాల (ఎన్‌సీడీ) వ్యాప్తిని తెలుసుకునేందుకు కూటమి ప్రభుత్వం చేపట్టిన ఎన్‌సీడీసీడీ 3.0 సర్వే ముగిసింది. ఇందులో రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్), క్యాన్సర్ వ్యాధుల బారిన ఎక్కువ మంది పడినట్లు గుర్తించారు. ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇచ్చేందుకు నాలుగో విడత సర్వేను ఇటీవల ప్రారంభించారు. ఏప్రిల్ నాటికి పూర్తి చేయనున్నారు. జిల్లాలో 18 ఏళ్లు పైబడిన ప్రజల ఆరోగ్య స్థితిగతులను అసాంక్రమిక రోగాల సర్వే 3.0 ద్వారా తెలుసుకున్నారు. ఒకటికి రెండుసార్లు సర్వే వివరాల్ని పునఃపరిశీలన చేయించారు. వైద్య పరీక్షలతో ధ్రువీకరించాక దీర్ఘకాల వ్యాధిగ్రస్థులను గుర్తించారు. వ్యాధి విషయం పరీక్షలు నిర్వహించే వరకు ఎక్కువ మందికి తెలియదని వైద్య సిబ్బంది తెలిపారు. ఆరోగ్య జాగ్రత్తలు తెలియజేసి వారి జీవనశైలిలో మార్పులు తీసుకు రావడంతో పాటు మెరుగైన వైద్యసేవలందేలా చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ రవి, ఆర్‌బీఎస్‌కే కార్యక్రమ జిల్లా సమన్వయకర్త డాక్టర్ రాజరాజేశ్వరి తెలిపారు.

ఎన్‌సీడీసీడీ 3.0 సర్వే వివరాలిలా..

పరీక్షల లక్ష్యం మొత్తం	17,01,817 మంది
పరీక్షలు చేసింది	15,37,652 మందికి
రక్తపోటు బాధితులు	1,67,353 (15.7 శాతం)
మధుమేహం ..	1,38,257 (13.3 శాతం)
క్యాన్సర్ పీడితులు	918 మంది

(నోటి: 160, రొమ్ము: 377, గర్భాశయ: 381)

ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు

పర్చూరు, న్యూస్‌టుడే: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం కింద వండే అన్నంలోని గంజిని పారబోయడంపై రాష్ట్ర ఫుడ్ కమిటీ సభ్యురాలు జి.దేవి నాగులపాలెం ఎంపీపీ(ఎల్‌ఈ) పాఠశాల హెచ్‌ఎం రేణుకాదేవికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని మండల విద్యాశాఖాధికారి-2 పి.వెంకట్రామయ్యను ఆదేశించారు. బుధవారం ఈ పాఠశాల తనిఖీ సమయంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని సిద్ధం చేసే వంట మహిళతో ఆమె మాట్లాడారు. భోజనం ఎక్కడ సిద్ధం చేస్తున్నారని, గంజిని ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. గంజిని పారబోస్తున్నామని, ఇంటి నుంచి భోజనాన్ని తయారు చేసి తీసుకొస్తున్నామని చెప్పారు. గంజిని పారబోస్తే పోషకాలు ఉండవని, ఇలాగైతే ఎలా అంటూ హెచ్‌ఎం రేణుకాదేవిని ఆమె ప్రశ్నించారు. సరైన సమాధానం చెప్పకపోవడంతో షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. బడిలోనే భోజనాన్ని సిద్ధం చేయాలని సూచించారు. ఈ విషయంపై ఎంఈవో-2 వెంకట్రామయ్యను వివరణ కోరగా నోటీసులు జారీ చేయమని ఆదేశాలు ఇచ్చారని, కంప్యూటర్ ఆపరేటర్ అందుబాటులో లేరని, వచ్చిన వెంటనే జారీ చేస్తామని తెలిపారు.

(c) eenadu

లబ్ధిదారులకు హక్కు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు

పేదల సొంతింటి కల సాకారం

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: పేదలకు సొంతింటి కల సాకారమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు జీవితాశయమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, ఎమ్మెల్యే పట్టణంలోని 207 మంది లబ్ధిదారులకు హక్కు పత్రాలను బుధవారం అందజేశారు. ముందుగా కొత్తగా నిర్మించిన గృహ ప్రవేశం చేసిన దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా పురపాలకసంఘ కౌన్సిల్ భవనంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కేవలం 17 నెలల్లోనే పేదల సొంతింటి కల నెరవేర్చిందన్నారు. లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ పత్రాలు అందించడం సంతోషించాల్సిన విషయమన్నారు. నియోజకవర్గంలో మరో 1148 ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి పేదలకు అందిస్తామన్నారు. సొంత స్థలంలో ఇళ్లు నిర్మించుకునేవారికి కూటమి ప్రభుత్వం రూ.2.50 లక్షల వరకు అందిస్తోందని ఆ సొమ్మును తిరిగి చెల్లించే పనిలేదన్నారు. స్థలంలేని వారికి ప్రభుత్వం త్వరలోనే ఉచితంగా స్థలాలు మంజూరు చేయనుందని చెప్పారు. కలెక్టర్ కృతిక శుక్లా మాట్లాడుతూ ప్రభుత్వం తమకు కేటాయించిన ఇళ్లను లబ్ధిదారులు సకాలంలో వెంటనే నిర్మించుకోవాలన్నారు. పల్నాడు జిల్లాలో కూటమి ప్రభుత్వం వచ్చాక 11,200 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట రాజారమేష్, పురపాలకసంఘ ఛైర్మన్ ఎస్కే రఫాని, మార్కెట్‌యార్డు ఛైర్మన్ కోలి మల్లి, ఏపీ గృహ నిర్మాణ సంస్థ పల్నాడు జిల్లా పీడీ బండారు శివప్రసాద్, కమిషనర్ శ్రీహరిబాబు, తెదేపా నాయకులు నెల్లూరి సదాశివరావు, పఠాన్ సమద్ ఖాన్, ముద్దనా రవి, నెల్లూరి రంజిత్, మల్లెల శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు సాంకేతిక దన్ను

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రైతులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా సాయం అందిస్తుండటంతో ఇప్పటికే చాలా మందికి ప్రయోజనం చేకూరింది. సాంకేతిక సమస్యలతో నేటికీ పలువురు ఈ పథకానికి దూరంగా ఉన్నారు. రెవెన్యూశాఖ వద్ద దరఖాస్తులు పెండింగ్‌లో ఉండిపోయాయి. ఈ పరిస్థితుల్లో ప్రత్యేక జీవో ద్వారా పథకానికి అర్హులయ్యేలా సులువైన పద్ధతిని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. పైసా ఖర్చు లేకుండానే రైతుల సమస్యలు పరిష్కరించేందుకు ఏర్పాట్లు చేసింది. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో శివలలిత

16,268 మంది దూరం

జిల్లాలో 2,39,959 లక్షల మంది రైతులను అన్నదాత సుఖీభవకు అర్హులుగా గుర్తించి వారికి రూ.167.97 కోట్లు నగదు అందజేశారు. ఇంకా 16,268 వేల మంది సాంకేతిక చిక్కులతో దూరంగా ఉన్నారు. ప్రధానంగా ఆధార్ మ్యాపింగ్‌లో తప్పిదం, ఒక ఆధార్ నంబరే ఎక్కువ మందికి మ్యాపింగ్ కావడం, పట్టాదారు పాసుపుస్తక నంబరు ఆధార్ లింక్ కాకపోవడంతో ఆన్‌లైన్‌లో ఆమోదానికి నోచుకోవడం లేదు. జాయింట్ ఎల్పీ నంబర్లతో కొంత మందికి సాంకేతిక చిక్కులు ఏర్పడ్డాయి. ఒక్కొక్కటిగా అధిగమిస్తున్నా ఇంకా కొత్త సమస్యలతో అర్హులైన చాలా మంది సాయం పొందలేకపోతున్నారు. ఇప్పుడు ఒకేసారి సమస్యల్ని సులువుగా పరిష్కరించుకొనేలా సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. పెండింగ్‌లో ఉన్నవారంతా రైతు సేవా కేంద్రాల్లో తమ అన్నదాత సుఖీభవ స్టేటస్ తీసుకుని దానిని మీ సేవ కేంద్రాల్లో అందజేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి ఎం. జగ్గారావు తెలిపారు.

ప్రమాదాలు నివారించాలని ఎంపీ లేఖ

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: వాడరేవు- పిడుగురాళ్ల 167ఎ జాతీయ రహదారిలో ప్రమాదాలు నివారించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు జాతీయ రహదారుల ప్రాంతీయ అధికారికి బుధవారం లేఖ రాశారు. నూతనంగా నిర్మించిన ఈ రహదారిలో పలు ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇది బ్లాక్ స్పాట్‌గా మారిందన్నారు. ఇటీవల కాలంలో పలువురు ప్రమాదాలకు గురై మృతి చెందారన్నారు. మరిన్ని ప్రమాదాలు జరగకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని సూచించారు. ఇటీవల తుపాను కారణంగా పసుమర్రు గ్రామంలోని ఎస్సీ కాలనీలో తీవ్రమైన వరదలు వచ్చాయన్నారు. హైవే నుంచి వర్షపు నీరు కాలనీలోకి చేరిందన్నారు. భవిష్యత్తులో ప్రమాదాలతో పాటు కాలనీ నీటమునగకుండా నివారించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. డ్రైవర్లను హెచ్చరించేలా స్పష్టమైన బోర్డులు ఏర్పాటు, వేగాన్ని తగ్గించేలా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. రాత్రివేళల్లో రోడ్డు కనిపించేలా లైటింగ్, అవసరమైన కల్వర్టులు, అండర్‌పాస్ ఏర్పాటు చేయాలన్నారు.

రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలి

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: సీసీఐ ద్వారా పత్తిని అమ్ముకోవాలనుకునే రైతులు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ఆధార్, పట్టాదారు పుస్తకం జిరాక్స్ అందజేసి సీఎం యాప్‌లో నమోదు చేసుకుని కపాస్ కిసాన్ యాప్‌ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు సూచించారు. మండలంలోని వేలూరులో రైతు సేవా కేంద్రాన్ని బుధవారం సందర్శించి వీఏఏలకు నమోదుపై సూచనలు చేశారు. స్లాట్ బుక్ చేసుకున్న రైతులు తాము ఎంచుకున్న సీసీఐ కొనుగోలు కేంద్రం ఉన్న జిన్నింగ్‌మిల్లుకు పత్తిని తెచ్చుకోవచ్చన్నారు. రైతులు తాము బుక్ చేసుకున్న తేదీలో మాత్రమే సంబంధిత జిన్నింగ్ మిల్లుకు పత్తిని తెచ్చుకోవాలన్నారు. లేకపోతే స్లాట్ రద్దు అవుతుందన్నారు. రంగు మారిన, పురుగు పట్టిన, ముడుచుకుపోయిన పత్తిని అమ్ముకోవడానికి వీలుండదన్నారు. శుభ్రమైన పత్తిని తెచ్చుకొని మద్దతు ధర పొందాలన్నారు. రైతులు తప్పనిసరిగా వాడుకలో ఉన్న బ్యాంక్ ఖాతాలను ఆధార్ నెంబర్‌తో అనుసంధానం చేసుకోవాలని, అటువంటి ఖాతాలకు నేరుగా ఆధార్ బేస్ చెల్లింపులు జరుగుతాయన్నారు. ఏడీఏ కేవీ శ్రీనివాసరావు, ఏవో సీహెచ్ సరిత పాల్గొన్నారు.

సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి జగ్గారావు, ఏడీఏ శ్రీనివాసరావు

బహిరంగ ప్రకటన

[illegible]

హద్దులు: తూర్పు: ప్రత్తిపాటి శ్రీనివాసరావు గారి భూమి, దక్షిణం: పొదిలి బ్రహ్మయ్య గారి భూమి, పడమర: మదాసు రమాదేవి గారి భూమి, ఉత్తరం: డొంక రోడ్డు. యీ నాలుగు హద్దుల మధ్య య.0.97ట్లు లేక హె. 0.392ర్లు స్థిరాస్తి మెరక భూమి. సదరు భూమికి యావత్ యీజ్‌మెంట్ హక్కులతో సహా.

ఇట్లు:- **Lemini Narra,** Advocate, #66-15-5, Siddartha Nagar, Navodaya Colony, Vijayawada-10. Cell Ph: 98660 66789

Vijayawada, Date: 12/11/2025

వాటర్‌గ్రిడ్‌కు 1.856 టీఎంసీలు కేటాయించాలి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం చేపట్టిన వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టుకు 1.856 టీఎంసీల నీటి కేటాయింపులు సాధించాలని కలెక్టర్ కృతిక శుక్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జలజీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్, గ్రామీణ నీటి సరఫరా విభాగం పనులపై సమీక్ష చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ నాగార్జునసాగర్ నుంచి రాష్ట్రానికి 132 టీఎంసీల కేటాయింపులు ఉన్నాయని, అందులో వాటర్ గ్రిడ్‌కు అవసరమైన నీటిని వినియోగించుకునేందుకు అనుమతులు తీసుకోవాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు, వివిధశాఖల అధికారులు ఉన్నారు.

సమీక్ష చేస్తున్న కలెక్టర్ కృతికాశుక్లా, హాజరైన అధికారులు

బంతి సాగు.. భలే బాగు

దాచేపల్లి, న్యూస్‌టుడే: ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందేందుకు బంతి పూల సాగు అనువైనది. ఏటా దసరా, దీపావళి, కార్తిక మాసంలో గౌరీ నోములు, లక్ష్మీ పూజలు, వ్రతాలు, వివాహాలు పలు శుభకార్యాలకు బంతిపూలను ఎక్కువగా వినియోగిస్తారు. పూల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా గురజాల డివిజన్‌లో దాచేపల్లి, పిడుగురాళ్ల, గురజాల మండలాల్లో కొందరు రైతులు పావు, అర ఎకరంలో బంతి పూలు సాగు చేస్తూ ఆదాయం పొందుతున్నారు.

తక్కువ సమయంలో పంట దిగుబడి: బంతి పూల సాగులో తక్కువ సమయంలో దిగుబడి వచ్చే అవకాశం ఉంది. దీంతో దాచేపల్లి మండలంలో వివిధ గ్రామాల సన్న, చిన్నకారు రైతులు ఈ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. సాధారణంగా ఎకరం తోటలో 90 నుంచి 100 క్వింటాళ్ల వరకు పూల దిగుబడి వస్తుంది. ఎకరా పంటకు రూ.60 వేలు నుంచి రూ.70 వేలు వరకు ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. పలువురు రైతులు తమకు చెందిన వ్యవసాయ భూమిలో కొంత మేర బంతి పూల సాగు చేస్తున్నారు. సాధారణంగా పంట కాలం 100 నుంచి 120 రోజులకు వరకు ఉంటుంది. సాగు చేసిన 50, 60 రోజుల నుంచే దిగుబడి వస్తుంది. పెట్టుబడి, శ్రమ తక్కువగా ఉన్నందున రైతులు బంతి సాగుకు ఎక్కువ మొగ్గు చూపుతున్నారు.

సాగు చేసిన బంతి పూల తోట

ధర బాగుంటే ఆదాయమే.. మూడెకరాల భూమిని రూ.50 వేలకు కౌలుకు తీసుకుని అందులో ఓ ఎకరంలో బెండ, చిక్కుడు, టమాటా తదితర కూరగాయ పంటలు వేస్తా. మిగిలిన రెండెకరాల్లో విడతల వారీగా అరెకరం చొప్పున బంతి తోట సాగు చేస్తా. రూ.28వేలు ఖర్చవుతుంది. మార్కెట్‌లో ధర ఉంటే రెండెకరాలకు దాదాపు రూ.2.5 లక్షలు వస్తాయి. ఖర్చులు పోనూ రూ.1.20లక్షలు మిగులుతాయి. **- చాప రామారావు, గామాలపాడు, దాచేపల్లి(మం)**

రైతేరాజు

రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సమాధానం

? పొద చిక్కుడు విత్తన మోతాదు, విత్తే సమయం, ఎరువులు, నీటి యాజమాన్యం పద్ధతులు వివరించండి?

– ఎం.బాబూరావు, రైతు, యండకుదురు

✔ పొద చిక్కుడు రకానికి ఎకరానికి 16 కిలోలు విత్తనం అవసరం అవుతాయి. రబీలో అక్టోబరులో, వేసవిలో జనవరి-ఫిబ్రవరి నెలల్లోనూ విత్తవచ్చు. ఆఖరి దుక్కిలో పశువుల ఎరువు ఎకరానికి 8-10 టన్నులను విత్తడానికి వారం రోజులు ముందు వేసి దున్నాలి. ఎకరానికి 24 కిలోలు భాస్వరం, 12 కిలోల పొటాష్‌తో పాటు మొదటి దఫా 15 కిలోల నత్రజని వేయాలి. రెండో దఫా 15 కిలోల నత్రజనిని విత్తిన 30 రోజులకు వేయాలి. ఎరువులు వేసిన వెంటనే నీరు కట్టాలి. నీటి యాజమాన్యంనకు ప్రతి 7-10 రోజులకు ఒకసారి నీటి తడి ఇవ్వాలి. పూత, కాయ అభివృద్ధి దశలో నేలను 50శాతం తేమ ఉండేలా చూడాలి. కాయలు లేతగా ఉన్నప్పుడే కోయాలి. పూతకి వచ్చిన 2-3 వారాల్లో కాయలు కోతకు సిద్ధంగా ఉంటాయి.

? మిరప పంటకు నేలలు, విత్తన మోతాదు, విత్తన శుద్ధి, ఎరువుల వాడకం వివరించండి? - కె.శ్రీనివాస్

✔ మిరప వర్షాధారపు పంట. నల్ల నేలలు, లంక భూములు, ఇసుకతో కూడిన ఒండ్రు నేలలు అనుకూలం. మిరపకు మెత్తటి దుక్కి కావాలి. 3-4 సార్లు దున్ని 2సార్లు గుంటక తోలాలి. విత్తన మోతాదుకు నారు పెంచేందుకు సెంటుకు 650 గ్రాములు (ఎకరాకు సరిపడా నారు). విత్తనశుద్ధికి కిలో మిరప విత్తనానికి రసం పీల్చే పురుగులు నివారణకు 8 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్, తెగుళ్ల నివారణకు 3గ్రా కాప్టాన్ లేదా 3గ్రా మాంకోజెబ్ కలిపి శుద్ధిచేయాలి. ఎకరానికి 10 టన్నుల పశువుల ఎరువు వాడాలి. ఎకరాకు 120 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 48 కిలోల పొటాషియం అందించే ఎరువులు వేయాలి.

– వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల

– న్యూస్‌టుడే, ఘంటసాల

అప్రమత్తతే.. పశువులకు రక్ష..!

అమృతలూరు, న్యూస్‌టుడే: పిచ్చికుక్కల దాడిలో పశువులు గాయపడితే వాటికి రేబిస్ వ్యాధి సోకే అవకాశం ఉందని పశు వైద్యులు చెబుతున్నారు. కుక్క కాటు వేసిన సమయంలో పశు పోషకులు సకాలంలో స్పందించకపోతే వ్యాధి సోకి పశువులు మరణించేందుకు అవకాశం ఉందని అమృతలూరు పశు వైద్యాధికారి బొంతా గోపీకృష్ణ తెలిపారు. రైతులు వాటికి వెంటనే వైద్యం చేయించాలన్నారు. వ్యాధి కారకాలు, నివారణ పద్ధతులు ఆయన మాటల్లోనే..

గోపీకృష్ణ, పశువైద్యాధికారి

కరిచిన వెంటనే.. గొర్రెలు, పశువులను కుక్కలు కరిస్తే వెంటనే గాయాన్ని సబ్బుతో శుభ్రంగా కడగాలి. వారం నుంచి ఆరు మాసాల వరకు ఎప్పుడైనా వ్యాధి లక్షణాలు కనిపించవచ్చు. నోటి వెంట సొంగ కారడం, పశువు మగతగా ఉండడం, కండరాలు వణకడం, అసందర్భంగా అరవడం లాంటివి వ్యాధి లక్షణాలు. వ్యాధి సోకే వరకు వేచి ఉండకుండా కుక్క కరిచిన 48 గంటల్లోపు పశువులు, గొర్రెలకు వైద్యం చేయించి వాటిని మరణాపాయం నుంచి రక్షించుకోవాల్సిన అవసరం ఉంది.

నివారణ: కుక్కలు కరిస్తే రేబిస్ సోకకుండా 1, 3, 7, 14, 28వ రోజు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి. పశు వైద్యశాలల్లో టీకాలు ఉచితంగా వేస్తారని ఆయన తెలిపారు.

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: పంట ఎదుగుదలకు నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి మూలకాలు ఎంతో కీలకం. వీటిలో భాస్వరం మొక్క, వేర్ల పెరుగుదల, పుష్ప, ఫలాల తయారీ, శక్తి మార్పిడి ప్రక్రియకు అత్యవసరం. ఇష్టానుసారంగా కాంప్లెక్స్ ఎరువులు వినియోగించడంతో నేలలో భాస్వరం నిల్వలు అధికమవుతున్నాయి. వీటిని మొక్కలు వినియోగించుకునే విధంగా మార్చగలిగితే ఎరువుల ఖర్చు తగ్గించడంతో పాటు నేల ఆరోగ్యాన్ని పెంపొందించవచ్చని వ్యవసాయ శాఖ అధికారిణి శివలలిత తెలిపారు.

జీవన ఎరువు.. సాగుకు ఆదరువు

జీవన ఎరువు తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

భాస్వరం రూపం మారుతుందిలా.. ఆమ్ల గుణం కలిగిన నేలల్లో భాస్వరం ఐరన్ లేదా అల్యూమినియం ఫాస్ఫేట్‌గా మారి మొక్క దానిని స్వీకరించలేకపోతుంది. భూమి క్షార గుణం కలిగినప్పుడు కాల్షియం లేదా మెగ్నీషియం ఫాస్ఫేట్‌గా మారుతుంది. ఫాస్ఫేట్ సాల్యుబులైజింగ్ బ్యాక్టీరియా (పీఎస్‌బీ) కలిగిన జీవన ఎరువును వినియోగిస్తే దాన్ని కరిగించవచ్చు. తద్వారా 20-25 శాతం వరకు భాస్వరం ఎరువుల వినియోగాన్ని తగ్గించవచ్చు.

❖ ఎకరాకు 500 మి.లీ పీఎస్‌బీ ఎరువును బాగా కుళ్లిన 200 కిలోల పశువుల ఎరువు లేదా ఏదైనా సేంద్రియ ఎరువులో బాగా కలిపి అప్పుడప్పుడూ నీటితో తడిపి 15 రోజుల వరకు ఉంచి దానిని భూమిలో వేయాలి. ఈ మిశ్రమాన్ని ఎప్పుడూ నీడలో తయారు చేయాలి. ఇలా తయారు చేసుకున్న మిశ్రమాన్ని పొలంలో వినియోగించుకోవటం ద్వారా జీవన సూక్ష్మజీవులు వృద్ధి చెంది అవి పంటకు ఎటువంటి చీడపీడలు, తెగుళ్లు, ముఖ్యంగా ఎండు తెగులు రాకుండా కాపాడుకోవచ్చు.

జడ్పీ స్థలం వేలంపై ఆరా

బెల్లంకొండ, న్యూస్‌టుడే: బెల్లంకొండలోని జడ్పీ స్థలానికి నిర్వహించిన వేలం పాటలో లోపాలు జరిగినట్లు జడ్పీటీసీ సభ్యుడు గాదె వెంకటరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జడ్పీ డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఇరు వర్గాలతో మాట్లాడారు. వేలం పాట సక్రమంగా జరిగిందని, ఎలాంటి లోపాలు లేవని, ఈ విషయాన్ని జిల్లా అధికారులకు నివేదిస్తామని ఆయన తెలిపారు.

బెల్లంకొండలో స్థలాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ తదితరులు

దుకాణ సముదాయం నిర్మాణానికి పరిశీలన

రాజుపాలెం: ఎంపీడీవో కార్యాలయ స్థలంలో రహదారి పొడవునా దుకాణ సముదాయం ఏర్పాటు చేసే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు జడ్పీ డిప్యూటీ సీఈవో కృష్ణ పేర్కొన్నారు. బుధవారం రాజుపాలెం మండల పరిషత్ కార్యాయాన్ని ఆయన సందర్శించారు. కొండమోడు-పేరేచర్ల రహదారి విస్తరణలో భాగంగా ఇరువైపులా ఆక్రమణలు తొలగించటంతో పలువురు జీవనోపాధి కోల్పోయారన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో మండల పరిషత్ స్థలంలో సముదాయం నిర్మిస్తే ఇటు ప్రభుత్వానికి, అటు చిరు వ్యాపారులకు ఉపయోగంగా ఉంటుందన్నారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ ముక్కంటి తదితరులు పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

PEOPLE CARE

OLD AGE HOME

గాయిత్రి గ్రూపు, VJA వృద్ధులకు పేషెంట్ల సేవకు, ఇంటి/వంట బేబికేర్‌కు పర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 97040 21122, 96038 42233.

REAL ESTATE

HOUSE FOR SALE

LAKSHMI PURAM

2000 sft, 3 bedroom ground floor sale, @ 6/2 Chandramouli Nagar, Guntur, Mr. Satish. Ph no: 9959544744.

PLOT FOR SALE

GENERAL

ఫార్మ్‌ల్యాండ్ @ వినుకొండ గజం 1,333/- మాత్రమే. సెంటు భూమి కొనండి 3 మకాడమీయా మొక్కలు ఉచితంగా పొందండి. క్లియర్ టైటిల్ మరియు స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 83675 22256.

కొలనుకొండ, జయభేరి కన్‌స్ట్రక్షన్ దగ్గర, KIA షోరూం పక్కన, 918 చ||గ|| తూర్పు (హైవే) ఫేస్ త్రికోణకారంలో ఉన్న స్థలము అమ్మకము. PH: 99662 28370.

JOBS

WANTED- Restaurant Staff (For a reputed restaurant- Immediate Hiring) 1) CASHIER Must have computer knowledge Minimum 2 years of experience. 2) SERVICE BOYS/ GIRLS Minimum 2 years of restaurant service experience. 3) SECURITY GUARD Ex-service personnel preferred. (Contact Time: 11 am to 9 pm) 83338 97607, 78933 34892.

గుంటూరులోని ప్రముఖ కంపెనీ నందు అకౌంటెంట్ కావలెను. GST & TDS నాలెడ్జ్ must. రెజ్యూమ్ వాట్సాప్. 90528 77789. goodharvestspices@gmail.com

గుంటూరులోని శానిటరీషాపులో కంప్యూటర్ బిల్స్‌చేయుటకు అనుభవం ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ (M) కావలెను. వ|| 30సం||లోపు, జీ||12K-15K. ✆ 9493656892.

విశ్రాంతి ఉద్యోగులకు శుభవార్త ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు గుంటూరులో వెంటనే కావలెను. ఫోన్ : 94907 06437.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు క్లాసు ఇన్‌ఛార్జిస్, హాస్టల్ ఇన్‌ఛార్జిస్, వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12,000/- నుండి 15,000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యాఅర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ. వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరముల కొరకు సంప్ర: ఫోన్ నెంబర్: 89784 80429.

రాఘవ ఆటో ఫైనాన్సియర్స్ గుంటూరు బ్రాంచికి సేల్స్ మేనేజర్ కావలెను & తెనాలి, మంగళగిరి, పిడుగురాళ్లలో కలెక్షన్ చేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ కావలెను. వ:21-35. ఆకర్షణీయమైన జీతం, TA+INC. అ: ఇంటర్ ఆపైన. టూవీలర్ మస్ట్. అనుభవమున్న వారికి ప్రాధాన్యత. 9154746824, 9154067714.

ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో మార్కెటింగ్ చేయుటకు జంట్స్ స్టాఫ్ అర్హత: డిగ్రీ, జీతం: 12 to 15K & టెలికాలర్స్ మహిళలు కావలెను. అర్హత: ఇంటర్, జీతం: 8to12K 62815 33982, 96033 10994.

మా కంపెనీ గోలి సోడా మార్కెటింగ్ చేయుటకు అనుభవంగల సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సిటీవారికి ప్రాధాన్యత ఆకర్షణీయమైన జీతం కలదు. ✆ 8019786366.

ప్రముఖ కలెక్షన్ ఏజెన్సీలో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ మరియు టెలికాలర్స్ అనుభవంగల వారు కావలెను. జీతము: (15K to 20K), కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. DRA సర్టిఫికెట్ ఉన్నావారికి ప్రాధాన్యత కలదు. జీతము: 20K సంప్రదించగలరు. ఫోన్ నెంబర్స్: 8919080894, 8309132382.

VIJAYASREE Multi super speciality Hospital నందు పనిచేయుటకు అసిస్టెంట్ అకౌంటెంట్ కావలెను. 1 సం|| అనుభవం కావలెను. 95531 20127.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం

పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

నిర్లక్ష్యమా.. మమకారమా?

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో సచివాలయ సిబ్బంది, అధికారులకు మాజీ ముఖ్యమంత్రిపై ఇంకా మమకారం తగ్గనట్లుంది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర దాటుతున్నా సచివాలయాల్లో ఇంకా జగన్ బొమ్మలు దర్శనమిస్తుండటంపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉప్పలపాడులోని సచివాలయంపై నవరత్నాల లోగోతో పాటు జగన్ చిత్రం ఉంది. అలాగే సిబ్బంది వినియోగించే టేబుల్ ప్యాడ్‌లూ జగన్ బొమ్మ ఉన్నవే వినియోగిస్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో టి.వి.కృష్ణకుమారి దృష్టికి తీసుకెళ్లగా సచివాలయానికి పెయింటింగ్ వేయిస్తామని, పాత ప్యాడ్‌లు తీసివేయిస్తామని చెప్పారు.

ఉప్పలపాడు సచివాలయం గోడపై జగన్ బొమ్మ

పరీక్ష కేంద్రం తనిఖీ

విజయపురిసౌత్: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆధ్వర్యంలో స్థానిక ఏపీఆర్‌డీసీ విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్షలను డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ ఎన్వీ కృష్ణారావు బుధవారం పరిశీలించారు. అన్ని గదులను సందర్శించి, పరీక్షల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. డిగ్రీ 5వ సెమిస్టర్ పరీక్షలకు 132 మంది విద్యార్థులు హాజరయ్యారని, 100 శాతం నమోదైనట్లు తెలిపారు. కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ సరోజినిదేవి, చీఫ్ సూపరింటెండెంట్ లింగేశ్వరరావు ఆయన వెంట ఉన్నారు.

పవర్ గ్రిడ్ నిర్మాణానికి స్థల పరిశీలన

రెంటచింతల, న్యూస్‌టుడే: మండలంలోని పవర్ గ్రిడ్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. బుధవారం తాళ్లపల్లి పవర్‌గ్రిడ్ చీఫ్ మేనేజరు రాము, ఉప జనరల్ మేనేజర్ దివాకర్ తహసీల్దార్ మేరి కనకంతో కలిసి సత్రశాల, తుమృకోట, మల్లవరం వద్ద 200 ఎకరాల ప్రభుత్వ స్థలాలను చూశారు. నాగార్జునసాగర్‌లో తయారయ్యే విద్యుత్తును తాళ్లపల్లి పవర్‌గ్రిడ్ ద్వారా, సత్రశాల టెయిల్‌పాండ్ జలాశయంలో తయారయ్యే విద్యుత్తు పశర్లపాడు కేంద్రం ద్వారా సరఫరా చేస్తున్నారు. తాళ్లపల్లి పవర్‌గ్రిడ్ 400 కేవీ సామర్థ్యంతో గతంలో నిర్మించారు. ఇదే తరహాలో మరో గ్రిడ్ నిర్మించనున్నట్లు తెలిసింది.

స్థలాన్ని పరిశీలిస్తున్న పవర్‌గ్రిడ్ అధికారులు

వ్యసనాలకు బానిసై.. చోరీలకు దగ్గరై

పోలీసులకు చిక్కిన ఎనిమిది మంది ముఠా

దొనకొండ, న్యూస్‌టుడే: కొద్ది రోజులుగా దొంగతనాలు చేస్తూ దొరక్కుండా తిరుగుతున్న ఎనిమిది మంది ముఠాను పోలీసులు పట్టుకున్నారు. సీఐ హసన్, ఎస్సై త్యాగరాజులు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. వ్యసనాలకు బానిసై ఒక ముఠాగా ఏర్పడిన వీరంతా కొంత కాలంగా చోరీ సొత్తుతో జల్సాలు చేస్తున్నారు. దొనకొండలోని నాలుగు రోడ్ల కూడలి సమీపంలో వీరు తిరుగుతున్నారనే సమాచారంతో పోలీసులు చాకచక్యంగా వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. ముండ్లమూరు మండలానికి చెందిన ఏడుకొండలు, సాగర్, వెంకటనారాయణ, గణేష్, వేణుగోపాల్‌రెడ్డి, నాగూర్, పల్నాడు జిల్లా నూజెండ్ల మండలానికి చెందిన ఎలీషా, పొదిలికి చెందిన రాజశేఖర్‌లు ఒక బృందంగా ఏర్పడ్డారు. దొనకొండ మండలంలో 4, నూజెండ్లలో 2, ముండ్లమూరులో 1, అద్దంకిలో 1 ద్విచక్రవాహనాలు, దొనకొండలో 3, కొనకనమిట్లలో 4 గొర్రెలను అపహరించారు. వీటి విలువ రూ.7.70 లక్షలు ఉంటుంది. ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని నిందితులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గురువారం దర్శి న్యాయస్థానంలో వారిని హాజరు పరుస్తామన్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి

సంతమాగులూరు, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: మండలంలోని ఏల్చూరుకు చెందిన పి. మహాలక్ష్మమ్మ (60) పల్నాడు జిల్లా నరసరావుపేట మార్కెట్ సెంటర్‌లో రైలు ఢీకొని మృతిచెందారు. స్థానికంగా తినుబండారాలు అమ్ముకుంటూ జీవిస్తున్న ఆమె వాటిని కొని తెచ్చుకునేందుకు బుధవారం నరసరావుపేట వెళ్లారు. వాటిని కొనుక్కుని రైలు పట్టాలు దాటుతుండగా ఇది చోటుచేసుకుంది. భర్త గతంలో మృతిచెందారు. ఆమెకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని నరసరావుపేట ఏరియా వైద్యశాలలోని మార్చురీలో ఉంచినట్లు జీఆర్పీ ఎస్సై రాజమోహనరావు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 111, రిటైల్ ధర - 138, చికెన్ విత్‌స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -109 రిటైల్ ధర 134 చికెన్ విత్ స్కిన్ - 197, చికెన్ స్కిన్‌లెస్ - 224.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 132, 142 చికెన్ విత్ స్కిన్ - 230 చికెన్ స్కిన్‌లెస్ - 240.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 600 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.93/-.

91.9FM Vijayawada ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 – ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 – ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 – మ. 2
సత్యభామ	మ. 2 – సా. 5
లైట్ తీస్కో	సా. 5 – రా. 9
సరదాగా కాసేపు	రా. 9 – రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 – తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు Cell: 80085 10541

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి Cell: 80085 14589

(c) eenadu

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

సామాజిక బాధ్యతగా సహకరించాలి

జ్ఞాపిక అందుకుంటున్న ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: సమాజంలోని సమస్యలను పరిష్కరించేందుకు కార్పొరేట్ సంస్థలు, వ్యాపారవేత్తలు బాధ్యతగా సహకరించాలని ఎమ్మెల్యే అరవిందబాబు అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన దక్షిణభారత సీఎస్ఆర్ సదస్సులో పాల్గొన్నారు. ఈసందర్భంగా నియోజకవర్గంలోని తాగునీరు, విద్య, వైద్యరంగాల్లో సమస్యల పరిష్కరించేందుకు సేవాభావంతో ముందుకు రావాలని ఎమ్మెల్యే కోరారు. హర్యానా గవర్నర్ దత్తాత్రేయ చేతుల మీదుగా జ్ఞాపిక అందుకున్నారు.

అధికారుల ఆటాపాట

నరసరావుపేట క్రీడలు: జిల్లాలోని సివిల్ సర్వీసు ఉద్యోగులు కోడెల శివప్రసాదరావు మైదానంలో వివిధ క్రీడల్లో హోరా హోరీగా తలపడ్డారు. బుధవారం స్టేడియంలో శాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో సుమారు 100 మంది ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన వారు ఈ నెల 19 నుంచి విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి తెలిపారు.

కొత్త నాటకానికి తెర

వినుకొండ: కోటి సంతకాల పేరుతో వైకాపా కొత్త నాటకానికి తెరతీసిందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు విమర్శించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సు ద్వారా వచ్చే పెట్టుబడులకు గండికొట్టేందుకు జగన్ యత్నిస్తున్నాడన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? చిలకలూరిపేట పట్టణంలోని జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో డైక్‌మెన్‌కాలనీకి వెళ్లే రహదారిలో చెత్త డబ్బాలను రోడ్డుపైనే ఉంచారు. అవి సగం రహదారిని ఆక్రమించాయి. వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. **- అనిల్**

✔ రహదారి మీద చెత్త డబ్బాలు లేకుండా చర్యలు తీసుకుంటాం. **- రమణారావు, పారిశుద్ధ్య అధికారి.**

– న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

? నరసరావుపేట పట్టణం ప్రకాష్‌నగర్ తిలక్ ఉన్నత పాఠశాల ఎదుట కాలువల్లో పూడిక తీయడంలేదు. దుర్వాసన వెదజల్లుతోంది. **- సోమేశ్వరరావు, స్థానికుడు** ✔ సిబ్బందికి చెప్పి డ్రెయినేజీ కాలువలో పూడిక తీయిస్తా. **- రమాదేవి, పారిశుద్ధ్య అధికారిణి**

– న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట)

స్పందనకు వందనం

వ్యర్థాల తొలగింపు

యడ్లపాడు, న్యూస్‌టుడే: యడ్లపాడులో ఎర్రకొండ పక్కన ఉన్న హిందూ శ్మశానవాటిక వ్యర్థాలతో అధ్వానంగా మారిందని, దుర్వాసన, పొగతో మృతుల అంత్యక్రియలు నిర్వహణలో ఇబ్బంది పడుతున్నారని 'ఈనాడు'లో ప్రచురితమవగా అధికారులు స్పందించారు. మూడు రోజులుగా పంచాయతీ అధికారులు, సిబ్బంది, జేసీబీ, ట్రాకర్ల ద్వారా వ్యర్థాలు తొలగించి శ్మశానవాటికను శుభ్రపరిచారు.

ప్లాస్టిక్ భూతం.. ఎప్పుడో అంతం..!

మాటలు, ప్రకటనలకే పరిమితమైన నిషేధం

తనిఖీలు నామమాత్రం.. విచ్చలవిడిగా వినియోగం

నరసరావుపేటసెంట్రల్, న్యూస్‌టుడే

ప్లాస్టిక్ వినియోగంతో మానవాళి మనుగడకు పెను ప్రమాదం పొంచి ఉంది.. ఈ భూతాన్ని అంతం చేయడమే లక్ష్యం. . ప్రణాళిక రచించాం.. కార్యాచరణను తక్షణమే అమలు చేస్తాం. లాంటి మాటలు అధికారులు తరచూ చెబుతున్నవే. క్షేత్రస్థాయిలో ప్లాస్టిక్ భూతాన్ని అంతం చేసే విషయంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. పల్నాడు జిల్లాను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని ఉన్నతాధికారులు పలుమార్లు సెలవిచ్చినప్పటికీ జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోనే ఇది ఆచరణకు నోచుకోవడం లేదు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో పట్టణంలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నారు. చిల్లర దుకాణాలు, కూరగాయలు, పండ్లు, హోటళ్లు, కర్రీ పాయింట్స్ ప్రతిచోటా ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నారు. వినియోగించిన ప్లాస్టిక్ కవర్లను ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారు. అవి ఎక్కడికక్కడ కాలువల్లో పేరుకుపోయి మురుగు పారకుండా అడ్డుపడుతున్నాయి. రోడ్డుపక్కన పడేస్తున్న వాటిని పశువులు తిని అనారోగ్యం పాలవుతున్నాయి. కట్టడి చేసి ప్రజలకు ప్రత్యామ్నాయ వినియోగంపై అవగాహన కల్పించాల్సిన అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అవగాహన కల్పిస్తున్నాం

ప్లాస్టిక్ కట్టడికి ప్రణాళిక రచించి అమలు చేస్తున్నాం. పట్టణంలో తనిఖీలు చేసి కవర్లు వినియోగిస్తున్న వారికి జరిమానాలు విధిస్తున్నాం. నెల రోజుల్లో రూ.30 వేలు జరిమానాలు వేశాం. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలు, ప్రత్యామ్నాయంగా బయో కవర్లు, పేపరు, జూట్ సంచుల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ చర్యలతో గతం కంటే ప్లాస్టిక్ వినియోగం తగ్గింది.

-రామకోటయ్య, శానిటరి ఇన్‌స్పెక్టర్

మొక్కుబడి తనిఖీలు..

నరసరావుపేట పట్టణంలో 34 వార్డులు ఉన్నాయి. దాదాపు 2 లక్షలు జనాభా ఉంటుంది. రోజుకు ప్లాస్టిక్ కవర్లు 40 కేజీలకుపైగా వినియోగిస్తున్నారు. అధికారులు అరకొర తనిఖీల కారణంగా వ్యాపారులు భయం లేకుండా కవర్లు కొని వినియోగిస్తున్నారు. అక్టోబరు 5 నుంచి ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న దుకాణాలు, వ్యాపారులకు అధికారులు, సిబ్బంది జరిమానాలు వేస్తున్నారు. తనిఖీలు మొక్కుబడిగా చేస్తున్నారని, ఆసమయంలో చేతులు తడిపిన వారికి జరిమానాలు వేయడంలేదన్న ఆరోపణలున్నాయి. శానిటరి అధికారులు, సచివాలయ సిబ్బంది, వార్డు మేస్త్రీలు ఒకటై తనిఖీల పేరుతో అక్రమవసూళ్లకు తెరదీశారని, ఫలితంగా ప్రభుత్వ ఆశయం నీరు గారుతోందని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. మార్కెట్ సెంటర్‌లోని హోల్‌సేల్ వ్యాపారులతో నెలవారి మామూళ్లు ఇచ్చేలా ఒప్పందాలు చేసుకున్నట్లు కార్యాలయ సిబ్బంది బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

మంచి, చెడు స్పర్శకు తేడా తెలియాలి

మాట్లాడుతున్న ఒకటో పట్టణ ఎస్సై అరుణ

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: ప్రస్తుత సమాజంలో ఆకృత్యాలు పెరిగిపోయాయని, చిన్నారులకు మంచి స్పర్శకు, చెడు స్పర్శకు తేడా తెలిసుండాలని ఒకటో పట్టణ ఎస్సై అరుణ అన్నారు. నరసరావుపేట పట్టణం ప్రకాష్‌నగర్‌లోని తిలక్ ఉన్నత పాఠశాలలో 'గుడ్ టచ్- బ్యాడ్ టచ్' అంశంపై 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంచి స్పర్శ అనేది తల్లిదండ్రుల ఆలింగనం, గురువులు, స్నేహితులతో చేతుల కలపడం, తల్లిదండ్రుల సమక్షంలో వైద్యులు పరీక్షలు చేయడం వంటివని, ఇది భద్రత, ప్రేమ, సంతోషాలకు నిదర్శనమన్నారు. చెడు స్పర్శ వలకల భయం, అసహ్యం పుడుతుందన్నారు. ప్రైవేటు భాగాలపై ఎవరైనా తాకినప్పుడు వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, తెలిసిన పెద్దలకు చెప్పాలన్నారు. ఏఎంరెడ్డి కళాశాల అధ్యాపకులు ఎల్.మోహన్‌రావు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్య బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వి.రమణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు తప్పక న్యాయం

పట్టణ, మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : తల్లిలాంటి పార్టీ అధికారంలో ఉంటే ఎప్పటికైనా బిడ్డలు లాంటి కార్యకర్తలకు తప్పక న్యాయం జరుగుతుందని, ఈ సత్యాన్ని తెదేపా నాయకులు, కార్యకర్తలు గ్రహించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. చిలకలూరిపేట ప్రత్తిపాటి గార్డెన్స్‌లో బుధవారం రాత్రి జరిగిన నియోజకవర్గ స్థాయి మండల, పట్టణ, క్లస్టర్, యూనిట్, బూత్, గ్రామ, వార్డు కమిటీల ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ముందుగా నియోజకవర్గ పరిశీలకురాలు దాసరి ఉషారాణి పార్టీ జెండాను ఆవిష్కరించి, జ్యోతిప్రజ్వలన చేసి ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. తెదేపాతో పాటు మిత్రపక్షాలైన కూటమిపార్టీలను గౌరవించాలన్నారు. మూడు పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు పదవుల సర్దుబాటులో అసంతృప్తులు ఉంటాయని, ఏదో ఒక రోజు న్యాయం జరుగుతుందనే నమ్మకంతో ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు.

స్థలం లేనివారు దరఖాస్తు చేసుకోవాలి

నూజండ్ల, న్యూస్‌టుడే: పేదల సొంతింటి కలను నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. గురప్పనాయుడుపాలెంలో బుధవారం గృహ ప్రవేశ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలో 6,273 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ గృహాలు మంజూరు అయ్యాయన్నారు. మంజూరైనవారు వెంటనే నిర్మాణాలు ప్రారంభించాలని సూచించారు. పేదలను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతూ అభివృద్ధిలో ముందుకెళుతోందని, నివేశన స్థలం లేని వారికి గ్రామీణ ప్రాంతాల్లో మూడు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు చొప్పున అందిస్తుందని వివరించారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గృహాలను ప్రారంభించి ఇంటి తాళాలు అందించారు. కార్యక్రమంలో జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ఎంపీడీవో ఉమాదేవి, హౌసింగ్ ఏఈ యలమంద, గంగినేని బాబు, ఆంజనేయులు, చందారావు, గంగరవపు శ్రీను, రొడ్డా వీరాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుకు తాళం చెవి అందజేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శిక్షణ

విత్తన గుళికల తయారీని పరిశీలిస్తున్న అధికారులు

ఈపూరు, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయ విధానంలో ప్రధాన పంటల్లో అంతరపంటలను సాగు చేసుకోవడంద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజరు కె.అమలకుమారి అన్నారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో ట్రైనింగ్ ఇంటర్నల్ రిసోర్స్ పర్సన్స్‌కు బుధవారం శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఈపూరులో ప్రకృతి వ్యవసాయ విధానంలో రైతులు ప్రకాశరావు, భాస్కరరావు సాగుచేసిన వరి మిరప కంది పైర్లను సందర్శించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర అధికారి మధుమోహన్, వినుకొండ ఏడీఏ రవికుమార్, ఏవో రామినేని రామారావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రాజవంశీ, సైదయ్య, నందకుమార్, మేరీ, అప్పలరాజు, సౌజన్య పాల్గొన్నారు.

నూజండ్ల, న్యూస్‌టుడే: రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని ఏవో ఆంజనేయ నాయక్ అన్నారు. నూజండ్ల మండలంలో బుధవారం రైతులకు అవగాహన ఇచ్చారు.

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: అందుగులపాడు రైతు సేవా కేంద్రంలో సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో రైతులకు వివిధ పంటల మీద యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఏడీఏ జ్యోతిప్రసాద్, ఏవో వరలక్ష్మి , ఏఈవో ఆరిఫ్, వీహెచ్ఏ నారాయణ, రైతులు పాల్గొన్నారు.

నరసరావుపేటసెంట్రల్, న్యూస్‌టుడే: సేంద్రియ ఎరువుల వినియోగంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని అల్లూరివారిపాలెం గ్రామంలో బుధవారం వ్యవసాయా సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో రైతుశిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

యడ్లపాడు, న్యూస్‌టుడే: లాంఫాం వ్యవసాయ శాస్త్రవేత్త రాజమౌళి, విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త వేణుగోపాలరావు బుధవారం మండలంలోని లింగారావుపాలెం సందర్శించారు. గ్రామానికి చెందిన ఆదర్శ రైతు గుంటుపల్లి రమణయ్య స్వల్ప విత్తన వ్యయంతో ప్రయోగాత్మకంగా సాగు చేసిన సూటిరకం పత్తి పంటను పరిశీలించారు. అధిక దిగుబడి సాధనకు పలు సూచనలు చేశారు.

నరసరావుపేటసెంట్రల్, న్యూస్‌టుడే: ఇంటి వద్దనే ఎరువు తయారు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు అన్నారు. మున్సిపల్ బంగ్లాలో బుధవారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో మెప్మా, రిసోర్స్ పర్సన్స్‌కు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు.

అసిస్ట్ సంస్థ సేవలు నిరుపమానం

ఆశ్రమంలో వృద్ధులతో మాట్లాడుతున్న మంత్రి రామానాయుడు, పక్కన జాష్టి రంగారావు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ సమాజానికి చేస్తున్న సేవలు నిరుపమానమని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కొనియాడారు. చిలకలూరిపేటలోని అసిస్ట్ సేవా సంస్థను బుధవారం మంత్రి రామానాయుడు సందర్శించి సంస్థ చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, నిర్వహిస్తున్న వృద్ధాశ్రమాన్ని పరిశీలించారు. వృద్ధులకు కల్పిస్తున్న సౌకర్యాలు, సేవలను చూసి ప్రశంసించారు. అసిస్ట్ సంస్థ అధినేత డాక్టర్ జాష్టి రంగారావు, అసోసియేట్ డైరెక్టర్లు కృష్ణ హరీష్, విష్ణుప్రియ, ఎంఎస్ఆర్ మూర్తిలను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ డిప్యూటీ డైరెక్టర్లు పి.రవిబాబు, ఎం.వి.రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి కనిపించడం లేదని ఫిర్యాదు

వినుకొండ రూరల్: బొల్లాపల్లి మండలం వెల్లటూరుకు చెందిన 15 ఏళ్ల గోపనబోయిన మహీదర్ వినుకొండలోని లయోలా పాఠశాల్లో 10వ తరగతి చదువుతూ వసతి గృహంలో ఉంటున్నాడు. ఈనెల 23న సిగరెట్ కాల్చాడని వసతి గృహ ఇన్‌ఛార్జి మందలించారు. అప్పటి నుంచి కనిపించలేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మల్లమ్మ సెంటర్: నరసరావుపేట పట్టణం షాలేమ్‌నగర్‌కు చెందిన శ్యామ్‌కుమార్ ప్రకాష్‌నగర్ తిలక్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 9 న ఇంటి నుంచి వెళ్లిన బాలుడు కనిపించలేదని తల్లి సుజాత ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

తెదేపా నాయకుల వాగ్వాదం

వినుకొండ, న్యూస్‌టుడే: నూజండ్ల మండలం ఉప్పలపాడుకు చెందిన మాజీ డీసీ ఛైర్మన్ మద్దుల సత్యనారాయణ, సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ రొడ్డా వీరాంజనేయరెడ్డి పార్టీ కార్యాలయంలో బుధవారం నువ్వెంత అంటే నువ్వు ఎంత అనుకుంటూ బహిరంగంగా కేకలు వేసుకున్నారు. అక్కడే ఉన్న చీఫ్‌విప్ భద్రతా సిబ్బంది జోక్యం చేసుకుని సర్దిచెప్పి పంపించారు.

క్రీడలకు ప్రాధాన్యం..: పట్టణంలోని ఐగ్రో పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలని నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ జీపీ రాజు అన్నారు.

పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

శావల్యాపురం,న్యూస్‌టుడే : ప్రతి నెల విద్యుత్ బకాయిలు వసూళ్లు చేయడంలో సిబ్బంది చూపిస్తున్న కృషి లాగానే ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై క్షేత్రస్థాయిలోని వినియోగదారులకు మరింత అవగాహన కల్పించి ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునే విధంగా చూడాలని ఎస్.ఈ. డాక్టరు పి.విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం శావల్యాపురం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఏడీఏ, ఏఈ క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా సిబ్బంది క్షేత్రస్థాయిలోని వినియోగదారులకు పథకం వల్ల కలిగే ప్రయోజనాలను, బ్యాంకుల ద్వారా కల్పించే రుణ సదుపాయాన్ని వివరించాలని, జిల్లా మొత్తం మీద 178 ఏజన్సీలు సిద్ధంగా ఉన్నాయని, ఇప్పటి వరకు జిల్లా మొత్తం 1,161 మంది పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని, నవంబరు 31 నాటికి మరో 990 మంది లబ్ధిదారులకు ఏర్పాటు చేసే విధంగా సిబ్బంది కృషి చేయాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈఈ చేజర్ల రాంబొట్ల, నరసరావుపేట డివిజన్ ఏడీఏ భవనం వెంకటేశ్వరరెడ్డి, ఏఈ జవ్వాజి నటరాజ్ తదితరులు ఉన్నారు.

✿ మండలంలోని ఇర్లపాడు, వేల్పూరు, శానంపూడి, గుంటుపాలెం, కొత్తలూరు, కృష్ణాపురం గ్రామాల్లో విద్యుత్తు విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టి రూ.3.12లక్షలు అపరాధ రుసుం విధించినట్లు ఈఈ చేజర్ల రాంబొట్ల విజిలెన్స్ డీపీఈ ఎస్ఏ కరీమ్ తెలిపారు.

వైకాపా నిరసన ప్రదర్శన

నరసరావుపేట వ్యవసాయం, వినుకొండ, చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ద్వారా కూటమి ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని జిల్లా వైకాపా కార్యనిర్వాహక అధ్యక్షుడు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం వైకాపా ఆధ్వర్యంలో ర్యాలీలు చేపట్టారు. ✿ వినుకొండలో వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో తహసీల్దార్ సురేష్‌కు వినతి పత్రం అందజేశారు. ✿ కాంగ్రెస్‌పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు అలెగ్జాండర్ సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానంతో పేదలకు ప్రభుత్వ వైద్యం దూరం అవుతుందన్నారు. ✿ చిలకలూరిపేటలో మాజీ మంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులకు సాయం

వినుకొండ రూరల్: విఠంరాజుపల్లిలోని మానసిక దివ్యాంగ పాఠశాల విద్యార్థులకు ఈపూరు ఆదర్శ పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు వల్లెపు శ్రీను కొబ్బరి నూనె డబ్బాలు, టూత్‌పేస్టులు, బ్రష్‌లు, సబ్బులు, బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నిర్మల జ్యోతి, ఈపూరు సోషల్ ఉపాధ్యాయులు మోహన్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ వినుకొండ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P. No: 30/2019 IN O.S. No. 217/2015

Between:
గోనుగుంట్ల లక్ష్మీరాజేష్ కుమార్
S/o Venkala Gurunadha Rao, R/o Old Vegetable Market Bazar, Vinukonda Town, Palnadu District. ..... Decree Holder

And
యక్కల భానుప్రకాష్
S/o (Late) Ramamohan Rao, Presently R/o. Near Ramalayam Temple, 11th Line, Shops Employeer Colony, Guntur Town and District. ....Judgment Debtor

పై నెంబర్ దావా అమలు E.P.లో డిక్రీ బాకీ వసూలు నిమిత్తం జడ్జిమెంట్ డెటార్ తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టు వారి ఎదుట ది.01-12-2025 తేదిన ఉదయం గం.10-30ని.ల నుండి శ్రీ కోర్టు వారు బహిరంగ వేలం జరుపబడును. వేలంలో పాట పాడదలుచుకున్నవారు పై కోర్టు వారి ఎదుట పై తేదీన ఉదయం గం.10-30ని.లకు హాజరు కావలెను. వేలం షరతులు పై కోర్టులో కోర్టు అమీనా గారి ద్వారా తెలుసుకొనవలయును. E.C దాఖలా ఎటువంటి అన్యాక్రాంతములు లేవు.

వేలం షెడ్యూలు ఆస్తి: పల్నాడు జిల్లా, నరసరావుపేట ఆర్.డి., వినుకొండ సబ్ డి., వినుకొండ మండలం, వినుకొండ మున్సిపాలిటీ లిమిట్స్, వినుకొండ టౌన్, మెయిన్ బజార్, ప్యాన్సీ షాపు సెంటర్లో గల, వినుకొండ రెవెన్యూ గ్రామ సర్వే నెం: 390/1ఎ1లో 277-0చ.గ.ల స్థలము అందులో డోర్.నెం:26-75, 26-78, 26-78/1 మరియు 26-178గల ఆర్.సి.సి. రూఫ్ గ్రౌండ్ ఫ్లోర్ షాప్స్ మరియు ఆర్.సి.సి. రూఫ్ ఫస్ట్ అండ్ సెకండ్ ఫ్లోర్ రెసిడెన్షియల్ హౌసెస్ బిల్డింగుకు హద్దులు:

తూర్పు: తెలగంశెట్టి మోహన్ రావు ఇల్లు, పడమర: మెయిన్ బజార్ కొంతవరకు, స్వామి నాగేశ్వర రావు షాపు మరియు ఇల్లు కొంత వరకు మరియు ఇతరులు, ఉత్తరం: రోడ్డు కొంత వరకు, స్వామి నాగేశ్వర రావు షాపు మరియు ఇల్లు కొంతవరకు, దక్షిణం: బొగ్గుల నాసర్ సాహెబ్ మరియు ఇతని కుమారుడు నబి సాహెబ్ మరియు ఇతరుల ఇల్లు.

ఈ హద్దుల మధ్యగల ఆర్.సి.సి. రూఫ్ గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ మరియు సెకండ్ ఫ్లోర్ బిల్డింగ్ నందు జడ్జిమెంట్ డెటార్ అయిన యక్కల భాను ప్రకాష్‌కు గల 1/4వ వంతు జాయింట్ భాగము.

వేలం తేది:01-12-2025 (సోమవారం)
డిక్రీ హోల్డర్ విలువ:రూ.14,00,000/-లు
కోర్టు అమీనా విలువ:రూ.55,00,000/-లు
ఫరదర్ హియరింగ్: 10-12-2025
వినుకొండ,
తేది:13-11-2025. (శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)

ఇట్లు, జి.వెంకటేశ్వర్లు, బి.ఎ. బి.యల్.
డిక్రీహోల్డర్ తరపు న్యాయవాది
వినుకొండ, పల్నాడు జిల్లా, సెల్: 7382041343.

అనుమతిలేని నిర్మాణాల తొలగింపు

వినుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని 29 వార్డులో నిబంధనలు ఉల్లఘించి నిర్మించిన ఓ ఇంటి ప్రహరీని బుధవారం మున్సిపల్ అధికారులు తొలగించారు. అనుమతి లేని నిర్మాణాలను తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. నిబంధనలకు లోబడి భవనం చుట్టూ ఖాళీ స్థలం వదలాలని, ప్రతి ఒక్కరు ఇంటికి ప్లాన్ అనుమతి తీసుకోవాలని ఆయన సూచించారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : స్థానిక గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తేళ్ల సుబ్బారావు పేర్కొన్నారు. ఈ మేరకు గ్రంథాలయంలో బుధవారం కరపత్రాలను ఆవిష్కరించారు.

జాతీయస్థాయి శిక్షణకు ఎంపిక

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ పూర్ణసాయి వినయ్‌కుమార్ డెహ్రాడూన్‌లో ఇండియన్ మిలిటరీ అకాడమీ నిర్వహించే జాతీయస్థాయి శిక్షణ శిబిరానికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం విద్యార్థిని అభినందించారు.

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. కళాశాల కార్యదర్శి రావెల సత్యనారాయణ, విభాగాధిపతులు పాల్గొన్నారు.

అవీ ఇవీ

ఫోన్ మాట్లాడుతూ నడిపితే చర్యలు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ ప్రభాకర్ హెచ్చరించారు. వాహనాలు నడుపుతూ ఫోన్ మాట్లాడేవారిని గుర్తించి పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. రోడ్డుపైన పరిశీలిస్తే 20 నిమిషాల్లో 20 మంది సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపుతున్నారని, ఇది చాలా ప్రమాదకరమన్నారు. దీనిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి కేసులు నమోదైతే రూ.10 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

యడ్లపాడు: వినుకొండలోని లయోలా పాఠశాలలో ఇటీవల నిర్వహించి ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి అండర్-14, అండర్ -17 ఖోఖో పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయికి యడ్లపాడు మండలం సొలస జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎం వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

(c) eenadu

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

వీరుల ఉత్సవాలకు ఏర్పాట్లు

ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరనాయక్

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: ఈనెల 19 నుంచి 23 వరకు పల్నాటి వీరుల ఆరాధనోత్సవాలను అధికారులు, ఆచారవంతుల సమన్వయంతో ఘనంగా నిర్వహిస్తామని తహసీల్దార్ వెంకటేశ్వరనాయక్ తెలిపారు. బుధవారం వీరుల ఆలయాన్ని ఆయన పీఠం నిర్వాహకుడు విజయ్‌తో కలిసి పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఉత్సవాలకు వచ్చే భక్తులు, ఆచారవంతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని, ఆలయ ప్రాంగణం ముస్తాబు చేస్తున్నామన్నారు. నాగులేరు వాగును శుభ్రం చేయిస్తామన్నారు. ఆచారవంతులకు వసతులు కల్పిస్తామని తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

గంగవరంలో మిరప పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త, ఉద్యాన శాఖ అధికారులు

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: మిరపలో రసం పీల్చే పురుగుల నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని శాస్త్రవేత్త సైదా నాయక్ సూచించారు. గంగవరం, పులిపాడు గ్రామాల్లో మిరప పంటలను బుధవారం పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. తెగుళ్ల నివారణకు సూచనలు చేశారు. ఉద్యాన అధికారి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ పాఠశాల సందర్శన

విద్యార్థులతో మాట్లాడుతున్న డీవైఈవో ఏసుబాబు

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: క్రోసూరు జడ్పీ ఉన్నత పాఠశాలను డీవైఈవో ఏసుబాబు బుధవారం సందర్శించారు. పలు దస్త్రాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ఒక గమ్యాన్ని నిర్దేశించుకుని విద్యనభ్యసించాలన్నారు. విద్యాశాఖ అందించిన మెటీరియల్‌ను తప్పక చదవాలన్నారు.

వీధి కుక్కల భయం వీడేనా?

షెల్టర్ల ఏర్పాటుపై తర్జనభర్జన

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

వీధి కుక్కల సమస్య తీవ్రంగా ఉంది. ప్రజలపై దాడి చేస్తూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా పట్టణాల్లో ప్రత్యేక షెల్టర్లు ఏర్పాటు చేసి, వాటిని అక్కడికి తరలించి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై రెండు వారాల్లోగా నివేదిక ఇవ్వాలని సూచించింది. ఈ నేపథ్యంలో పురపాలికలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. పట్టణాల్లో షెల్టర్లు లేకపోవడంతో మున్సిపల్ అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. గతంలోనూ కుక్కల నియంత్రణకు మార్గదర్శకాలు చేసినా అధికారులు పట్టించుకోలేదు. వాటి సంతానోత్పత్తి నిలువరించేందుకు ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్) శస్త్రచికిత్సలు, యాంటీ ర్యాబిస్ టీకాలు వేయడం వంటివి చేయట్లేదు.

సత్తెనపల్లి ప్రధాన రహదారిలో కుక్కల సంచారం

☛ సత్తెనపల్లిలో ఏర్పాటు చేసిన వ్యాక్సినేషన్ కేంద్రానికి స్థానిక మున్సిపాల్టీతోపాటు పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల నగర పంచాయతీల్లోని వీధి కుక్కలను తరలించి ఏబీసీ శస్త్రచికిత్సలు, వ్యాక్సినేషన్ చేస్తున్నారు. ఇప్పటివరకు 40 శాతం శస్త్రచికిత్సలు, యాంటీ ర్యాబిస్ టీకాలు పూర్తి చేశారు. మిగిలిన వాటి పరిస్థితి ఏంటో తెలియడం లేదు. సత్తెనపల్లిలో 950 వీధి కుక్కలకుగాను 550 కుక్కలకు శస్త్రచికిత్సలు, టీకాలు వేశారు.

☛ శ్రీకాకుళం చెందిన బ్లూక్రాస్ సొసైటీ సంస్థ ఏబీసీ శస్త్రచికిత్సలు, యాంటీ ర్యాబిస్ టీకాలు, పోషకాహారాన్ని అందజేస్తోంది. ఒక్కోదానికి రూ. 1,650 చొప్పున ఆ సంస్థకు చెల్లిస్తున్నారు. అన్ని జిల్లాల్లోనూ అలాంటి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాల్సి ఉంది.

☛ పాఠశాలలు, ఆసుపత్రులు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, క్రీడా సముదాయాలు, జనసంచారం ఉండే ప్రాంతాల నుంచి కుక్కలను షెల్టర్లకు తరలించి ఆహారం, నీరు అందించాలని కోర్టు సూచించింది. జిల్లాలో పట్టణాలు, నగర పంచాయతీల్లో వాటి సమస్య ఎక్కువగానే ఉంది. షెల్టర్లకు తరలిస్తే ఇబ్బందులు తొలగుతాయని ప్రజలు చెబుతున్నారు.

వసతి గృహాల్లో సదుపాయాలు కల్పిస్తాం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. గురజాలలోని బుధవారం ఆయన పర్యటించారు. తొలుత కాపు కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భవనానికి రూ. 50 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులపై సమీక్షించారు. గురజాలలోని సాంఘిక సంక్షేమ గృహం శిథిలావస్థకు చేరి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన దృష్టికి రాగా.. మరో భవనంలోకి మార్పు చేయాలని సూచించారు. అనంతరం అర్బన్ హౌసింగ్ స్కీమ్ కింద లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

మాడుగుల రహదారిలోని ఉమామహేశ్వర కాటన్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే యరపతినేని ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఛైర్మన్ కాంతారావు, నియోజకవర్గ పరిశీలకులు రాజశేఖర్ రెడ్డి, తెదేపా మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ ఛైర్మన్ బడేజాని పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో పేదల సొంతింటి కల సాకారం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పేదల సొంతింటి కలను కూటమి ప్రభుత్వంతో సాకారం చేస్తామని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 31వ వార్డులో ప్రభుత్వ నిధులతో సొంత స్థలాల్లో పేదలు నిర్మించుకున్న పక్కాగృహాలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గృహ నిర్మాణ లబ్ధిదారులు కస్తల సైదమ్మ, జిల్లెళ్లమూడి సీతామహాలక్ష్మి కుటుంబ సభ్యులతో మాటామంతి జరిపారు. గృహనిర్మాణ సంస్థ ఈఈ ప్రసాద్, ఇన్‌ఛార్జి డీఈ ప్రవీణ్, కౌన్సిలర్ మేరిగ్రేస్, యార్డు ఛైర్‌పర్సన్ శోభారాణి పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం: సీసీఐ నూతనంగా అమల్లోకి తీసుకొచ్చిన నిబంధనలతో ఉన్న ఇబ్బందులు, పత్తి రైతుల సమస్యల్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే కన్నా అన్నారు. పట్టణంలోని అమరావతి మేజర్ కాల్వ వద్ద ఉన్న లక్ష్మీ కాటన్ ట్రేడ్‌లో బుధవారం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు.

పిడుగురాళ్ల: పట్టణంలోని రజకకాలనీలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్ హౌసింగ్ స్కీమ్ ద్వారా నిర్మించిన గృహాన్ని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బుధవారం రాత్రి ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, ఏఈ బంగారయ్య, యార్డు ఛైర్మన్ వీరస్వామి పాల్గొన్నారు.

పులి దాడిలో మృతి చెందిన పశువులకు పరిహారం

చెక్కులు అందుకున్న రైతులతో అధికారులు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: గత రెండు నెలల్లో నల్లమల అటవీ ప్రాంతంలో పులి దాడిలో మరణించిన గేదెలు, ఎద్దుల యజమానులకు బుధవారం శిరిగిరిపాడు అటవీశాఖ కార్యాలయంలో రేంజర్ సుజాత పరిహారం చెక్కులను అందించారు. దావుపల్లితండకు చెందిన అంజనాయక్‌కు రూ. 40 వేలు, బాలునాయక్‌కు రూ.50 వేలు, శంకర్‌నాయక్‌కు రూ.40 వేలు, బోడెనాయక్‌కు రూ.40 వేలు, లక్ష్మినాయక్‌కు రూ.60 వేల చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. సెక్షన్ ఆఫీసర్ మహేష్‌బాబు, బీట్ ఆఫీసర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

హోటళ్ల నిర్వాహకులపై ఆగ్రహం

నిర్వాహకుడిని హెచ్చరిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారథి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ఎన్నిసార్లు చెప్పినా పద్ధతి మారదా? ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని పట్టించుకోరా? అని హోటళ్ల నిర్వాహకులపై మున్సిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారథి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. నిషేధిత ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు.

పల్లెల ప్రగతికి ప్రభుత్వం కృషి

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రతి పల్లె ప్రగతి బాట పట్టేలా మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. భట్లూరులో సుమారు రూ. 40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఎంపీపీ జైబున్‌బీ, యార్డు ఛైర్‌పర్సన్ శోభారాణి, సర్పంచి రామారావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల తనిఖీ

మాచవరం, న్యూస్‌టుడే: మండలంలోని చౌక దుకాణాలను పౌరసరఫరాల రెవెన్యూ అధికారులు తనిఖీ చేస్తున్నారు. కార్డుదారులకు బియ్యం ఇవ్వకుండా నగదు అందజేస్తున్నారని ఆరోపణల నేపథ్యంలో రెండ్రోజులుగా వీఆర్వోలు తనిఖీలు చేస్తున్నారు. ఎక్కడైనా అక్రమాలు బయటపడితే కేసు నమోదు చేస్తామని తహసీల్దారు నాగమల్లేశ్వరావు తెలిపారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

బెల్లంకొండ, న్యూస్‌టుడే: బెల్లంకొండ శాఖాగ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అధికారి విజయ తెలిపారు. పుస్తక ప్రదర్శనతోపాటు విద్యార్థులకు పుస్తక పఠనం, వ్యాసరచన, చిత్రలేఖనం, ముగ్గుల పోటీలు నిర్వహించి, 20వ తేదీన విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

తెదేపాకు కార్యకర్తలే కీలకం

సత్తెనపల్లిలో ప్రమాణ స్వీకారోత్సవం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: తెదేపా వివిధ కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రజావేదికలో బుధవారం కార్యక్రమం జరిగింది. నియోజకవర్గం నుంచి గ్రామ, వార్డుస్థాయి వరకు తెదేపా కమిటీల సభ్యులు ఒకేసారి ప్రమాణస్వీకారం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా అందరూ పనిచేయాలని ఎమ్మెల్యే కోరారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జయప్రకాష్‌నారాయణ, ప్రత్తి కార్యదర్శులు శౌరయ్య, బాజీచౌదరి, వందనాదేవి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల (కారంపూడి): తెదేపా కార్యకర్తలే కీలకమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని అన్ని తెదేపా కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం పట్టణంలోని మానుకొండ కల్యాణ మండపంలో నిర్వహించారు. తొలుత పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు అండగా ఉండి, సముచిత స్థానం కల్పిస్తామని ఆయన తెలిపారు.

మాచర్లలో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

రసాయన ఎరువుల వాడకం తగ్గిస్తే మేలు

మాచర్ల (కారంపూడి): రైతులు భూసారాన్ని పరిరక్షించాలంటే రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని జిల్లా శిక్షణ కేంద్రం వ్యవసాయాధికారి అరుణ అన్నారు. బుధవారం మాచర్ల మండలం కంభంపాడు రైతుభరోసా కేంద్రంలో భూసార పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కంభంపాడు, గన్నవరం, జమ్మలమడక, పసువేముల, తాళ్లపల్లి, మాచర్ల అర్బన్ గ్రామాలకు చెందిన రైతులకు ఎలుక నివారణ మందులను పంపిణీ చేశారు. ఏడీఏ మార్కండేయులు పాల్గొన్నారు.

మినీ గోకులాల నిర్మాణాలు ప్రారంభించాలి

దుర్గి, న్యూస్‌టుడే: మండలంలో రెండోవిడత మంజూరైన మినీ గోకులాల నిర్మాణాలను శనివారంలోపు ప్రారంభించాలని ఎంపీడీవో సుగుణ తెలిపారు. బుధవారం ఆమె ఉపాధి సిబ్బందితో తన కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సకాలంలో పనులు ప్రారంభించని లబ్ధిదారుల పేర్లను తొలగించి, అర్హులైన కొత్తవారికి మంజూరు చేస్తామన్నారు. నిర్మాణాలు డిసెంబరు 25లోగా పూర్తి చేయాలని సూచించారు.

గ్రామీణులకు వైద్య పరీక్షలు

పెదకూరపాడు, న్యూస్‌టుడే: లగడపాడు, కన్నెగండ్ల గ్రామాల్లో బుధవారం కాకతీయ కళాశాల ఎన్ఎస్ఎస్ సేవా విభాగం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గుంటూరుకు చెందిన అగర్వాల్ కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది శిబిరంలో పాల్గొని కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేసి, మందులు అందజేశారు.

నిబంధనలు అతిక్రమించొద్దు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: భవన నిర్మాణాల విషయంలో నిబంధనలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. భవనం చుట్టూ సెట్‌బ్యాక్ వదలాలని సూచించారు. కమ్యూనిటీలో నిబంధనలు అతిక్రమించి పైఅంతస్తు భవన నిర్మాణం చేస్తుండటంతో అడ్డుకొని తొలగించినట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన

దుర్గి: ఓబులేశునపల్లిలోని శివాలయంలో కార్తిక మాసం సందర్భంగా లక్ష బిల్వార్చన బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురోహితుడు నరసింహయ్య ఆధ్వర్యంలో 30 మంది రుత్వికులు మహా రుద్రాభిషేకం, రుద్రహోమం, లక్ష బిల్వార్చన నిర్వహించారు.

నత్తనడకన ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణం

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఎల్ఐసీ కృష్ణారావు బజారు పట్టణ ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం 90శాతం నిధులు, మున్సిపాలిటీ 10 శాతం నిధులతో నిర్మాణం చేస్తున్నారు. సుమారు రూ.86 లక్షల వ్యయంతో 2023లో శంకుస్థాపన చేశారు. మొదట్నుంచి పనులు నత్తనడకన సాగుతున్నాయి. బిల్లుల చెల్లింపులు సక్రమంగా చేయకపోవడమే అందుకు ప్రధాన కారణం. ప్రస్తుతం ఆరోగ్య కేంద్రాన్ని పాత భవనంలో నిర్వహిస్తున్నారు. అక్కడ అరకొర వసతులతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిస్తే పాత భవనం చిత్తడిగా మారుతోంది. దీనిపై మున్సిపల్ ఇంజినీర్ రోహిణి మాట్లాడుతూ 15 రోజుల నుంచి పనులు జరుగుతున్నాయి. డిసెంబరు మొదటి వారానికి పూర్తి చేయిస్తామని చెప్పారు. **- న్యూస్‌టుడే, పిడుగురాళ్ల**

వరికి తెగులు.. రైతుకు గుబులు

మాదల వద్ద తెగులు సోకిన వరి పైరు

మొంథా తుపాను నష్టం నుంచి కోలుకోక ముందే వరి రైతులకు తెగులు గుబులు పట్టుకుంది. పంటకు బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు పట్టింది. దుబ్బుల్లో గింజ నిలవక రాలిపోతోంది. పంట ఎండుతోంది. చల్లటి వాతావరణం, తేమ ఎక్కువగా ఉండటంతో ఈ తెగులు వస్తుందని ఏవో శ్రీధర్‌రెడ్డి చెప్పారు. నివారణకు మందులు పనిచేయవని, యూరియా వాడకం తగ్గించి పొటాష్ వాడాలన్నారు. పొలంలో నీరు లేకుండా ఆరబెట్టాలన్నారు. నత్రజని ఎరువులను తగ్గించి ఎకరాకు 20 కిలోల పొటాష్ పైరుకు అందించాలన్నారు. అలాగే కోసైడ్ 400 ఎంజీ, సేఫ్టోసైక్లిన్ 200 ఎంఎల్ ఒక ఎకరాకు పిచికారీ చేయాలని ఏవో సూచించారు. **- న్యూస్‌టుడే, ముప్పాళ్ల**

భద్రత గాలికి..

ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు మాత్రమే అధికారులు హడావుడి చేస్తున్నారు. ఆ తర్వాత ఎవరేం చేసినా పట్టించుకోరు. ప్రస్తుతం కృష్ణానది నిండుగా ప్రవహిస్తోంది. అమరావతిలోని అమరేశ్వరఘాట్‌లో పడవ నిర్వాహకులు భద్రతను గాలికి వదిలేశారు. పర్యాటకులు, భక్తులను ఎక్కించుకుని పడవలో నదిలో బోట్ షికారు పేరుతో తిప్పుతున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ. 50 వరకు వసూలు చేస్తున్నారు. లైఫ్ జాకెట్లు, పడవకు రేలింగ్ వంటి సౌకర్యాలు లేవు. అనుభవం లేని వారు వాటిని నడుపుతున్నారు. ఏదైనా ముప్పు రాకముందే అధికారులు మేల్కొని, భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, అమరావతి**

కృష్ణానదిలో పడవ ప్రయాణం

'ఒకే పాఠశాల నుంచి ఇద్దరిని బదిలీ చేస్తారా?'

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: ఒకే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను ఎంఈవోలుగా నియమించడంపై ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. బుధవారం గుంటూరులో ఆర్జేడీ లింగేశ్వరరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. విజయపురిసౌత్‌లోని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతికి గతంలో మాచర్ల ఎంఈవో బాధ్యతలు అప్పగించారు. ఆమెను తాజాగా ఈపూరు మండలానికి నియమించారు. అదే పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడు కోటేశ్వరరావును మాచర్ల ఎంఈవోగా నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. ఒకే పాఠశాల నుంచి ఇద్దరిని బదిలీ చేయడంతో బోధనపై ప్రభావం పడుతోందన్నారు. వారిద్దరినీ పాఠశాలలోనే కొనసాగించాలని నాయకులు విన్నవించారు.

వైకాపా నాయకుల నిరసన

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: వైద్య కళాశాలలను ప్రైవేటీకరించి, ప్రభుత్వ వైద్యాన్ని పేదలకు దూరం చేస్తున్నారంటూ వైకాపా నాయకులు, కార్యకర్తలు బుధవారం పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట: అచ్చంపేటలోనూ నిరసన ప్రదర్శన చేశారు. మాజీ ఎమ్మెల్యే శంకరరావు ఆధ్వర్యంలో ర్యాలీగా తహసీల్దారు కార్యాలయం వద్దకు చేరుకున్నారు.

ఎలుకల నివారణకు చర్యలు

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దమ్మాలపాడులో ఏవో శ్రీధర్‌రెడ్డి వరి పైరులో ఎలుకల నివారణ చర్యలను రైతులకు వివరించారు.

అచ్చంపేట: వరి సాగు చేసిన గ్రామాల్లో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం బుధవారం జరిగింది. క్రోసూరు ఏడీఏ మస్తానమ్మ, ఏవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కొండూరులో రైతులకు అవగాహన కల్పించారు.

కొమెరపూడి(సత్తెనపల్లి గ్రామీణ): సామూహికంగా ఎలుకల నిర్మూలన చర్యలతో రైతులకు ఎంతో మేలని జిల్లా డాట్ సెంటర్ సమన్వయకర్త నగేష్ అన్నారు. కొమెరపూడిలో రైతులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: తెదేపా జెండా మోసే కార్యకర్తల సంక్షేమం గురించి ఆలోచించే పార్టీ తెదేపా అని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చెప్పారు. మాచవరం మండలం కొత్తగణేశునిపాడు గ్రామానికి చెందిన తెదేపా కార్యకర్త ఈ ఏడాది ఆగస్టులో మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల బీమా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.

ముంపు సమస్యకు పరిష్కారం

క్రోసూరు(అచ్చంపేట): క్రోసూరు మండలం దొడ్లేరులో ముంపు సమస్యను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చొరవతో తెదేపా మండల అధ్యక్షుడు మొగలజాన్ పర్యవేక్షణలో అధికారులు పరిష్కరించారు. గ్రామంలోని ఎస్సీ, బీసీ, ఓసీ కాలనీల్లో వర్షాల సమయంలో ముంపు సమస్యను తీర్చారు. సుడిగుండాల వాగులో పెరిగిన ముళ్లకంప, పిచ్చిమొక్కలు, పూడికను పొక్లెయిన్ సాయంతో 1.5 కిలోమీటర్ల మేరకు తొలగించారు. నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా చేశారు. వాగు కట్టలు బలపరిచారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో ఎలుకల మందు తిని రోజువారి కూలీ మృతి చెందిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. నాగార్జున నగర్‌కు చెందిన రవికుమార్, అంజమ్మ భార్యాభర్తలు. వీరిద్దరూ కూలీ పనులతో జీవనం సాగిస్తున్నారు. భర్త మద్యం తాగడంపై తరచూ గొడవలు జరగడం, తర్వాత సర్దుబాటు కావడం పరిపాటిగా మారింది. ఈనెల 10న మరోసారి భార్యాభర్త గొడవపడ్డారు. వివాదం సద్దుమణిగాక అంజమ్మ పనికి వెళ్లింది. ఇంట్లో ఎవరూలేని సమయంలో రవికుమార్ ఎలుకల మందు తిన్నాడు. వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి అక్కడి నుంచి గుంటూరు సమగ్రాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు.

పశువుల కాపరి మృతి

అమరావతి, న్యూస్‌టుడే: పశువుల కాపలాకు కృష్ణా నది అవతలి వైపు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో నీటిలో పడి కాపరి మృతి చెందిన ఘటన మునగోడులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన షేక్ బరాన్(60) మంగళవారం ఉదయం పశువులను తోలుకుని కృష్ణా నది వైపు వెళ్లాడు. సాయంత్రం పశువులు మాత్రమే వచ్చాయి. కాపరి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. బుధవారం ఉదయం కృష్ణానదిలో వెతకగా అతడి మృతదేహం కనిపించింది.

రైతు సంక్షేమమే ధ్యేయం

పత్తిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి, జేసీ గనోరే

దుర్గి, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం అడిగొప్పులలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని జేసీ సూరజ్ గనోరేతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పత్తి రైతులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు మద్దతు ధర కల్పిస్తున్నారన్నారు. మార్చి నెలాఖరు వరకే సాగర్ నీటిని ప్రభుత్వం అందించే అవకాశం ఉందని, రైతులు రెండో పంటగా తక్కువ కాలపరిమితి ఉన్న పైరును సాగు చేయాలన్నారు. జేసీ మాట్లాడుతూ 8 నుంచి 12 శాతం తేమ ఉన్న పత్తినే రైతులు విక్రయ కేంద్రానికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కరుణకుమార్, నాయకులు పుల్లయ్య, మధుయాదవ్ పాల్గొన్నారు.

అమ్మవారికి పూజలు.. నిదానంపాటి అమ్మవారిని బుధవారం ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

గృహ నిర్మాణ అనుమతి పత్రాల అందజేత

మాచర్ల (కారంపూడి): ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 ద్వారా మాచర్లలో గృహ నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేస్తూ బుధవారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి పత్రాలను లబ్ధిదారులకు అందించారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 160 మందికి అనుమతి పత్రాలను పంపిణీ చేశారు. మున్సిపల్ ఛైర్మన్ మదార్‌సాహెబ్, కమిషనర్ వేణుబాబు, డీఈ బాబూనాయక్ హాజరయ్యారు.

న్యాయం చేయాలని ధర్నా

రోడ్డుపై బైఠాయించిన మృతుడి బంధువులు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: జూలకల్లు - కారంపూడి గ్రామాల మధ్య మంగళవారం ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో మృతి చెందిన సేవానాయక్ కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని బంధువులు బుధవారం పట్టణంలోని పోలీసుస్టేషన్ వద్ద ప్రధానరోడ్డుపై ధర్నా చేశారు. సుమారు అరగంటపాటు ఆందోళన చేశారు. గ్రామీణ ఎస్సై మోహన్ ఆందోళనకారులతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు.

బాధిత కుటుంబానికి సాయం

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: వీరాపురం గ్రామ పరిధిలోని శాంతినగర్ చర్చి పాస్టర్ దేవసహాయం మృతి చెందారు. గ్రామానికి చెందిన పర్వతనేని రామారావు బాధిత కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల కోసం రూ.10 వేలు ఆర్థిక సహాయం చేశారు.

జూదరుల అరెస్టు

రెంటచింతల: పశర్లపాడులో 8 మంది జూదరులను అరెస్టు చేశామని ఎస్సై నాగార్జున తెలిపారు. రూ. 6,730 స్వాధీనం చేసుకున్నామన్నారు.

దస్తావేజులు పోయినది

పల్నాడు జిల్లా, అమరావతి మండలం, లింగాపురం గ్రామం డోరు నెం.120/1 నివాసి గోవిందు నాగరత్నం, భర్త: రామారావు (సెల్:9949459143) అను నేను నా పేరిటగల 50 సెంట్ల పొలంకు విక్రయ దస్తావేజు నెం. 1191/2007. 01/11/2025న అమరావతిలో జిరాక్స్ సెంటర్‌నందు జిరాక్స్ తీయించుకొని మా గృహముకు వెళ్ళుచుండగా ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది. ఎవరికైనా సదరు దస్తావేజు దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు

★ 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో అవగాహన

సూచనలిస్తున్న వైద్యాధికారి లక్ష్మీప్రసన్న

వెల్దుర్తి, న్యూస్‌టుడే: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమ కాటుకు గురికాకుండా దోమతెరలు వాడాలని ఉప్పలపాడు ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి లక్ష్మీప్రసన్న తెలిపారు. బుధవారం మండలంలోని గుండ్లపాడు గ్రామంలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో పరిసరాల శుభ్రతపై, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో జ్వర సర్వే జరుగుతోందని, బాధితులను గుర్తించి వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. ఎవరికైనా జ్వరం వస్తే నిర్లక్ష్యం వహించకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహిస్తే ప్రాణాంతకం అవుతుందన్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతో రోగాలు దూరం అవుతాయన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని గ్రామస్థులకు సూచించారు. తొట్టెల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు.

ఖోఖో జిల్లా జట్టుకు ఎంపిక

ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కారంపూడి, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఖోఖో జట్టుకు కారంపూడి, ఒప్పిచర్ల విద్యార్థులు ఎంపికయ్యారు. 14 ఏళ్లలోపు బాలుర జట్టుకు కారంపూడి ఉన్నత పాఠశాల విద్యార్థులు అఖిల్, దత్తు, జాన్ జీవన్, 17 ఏళ్లలోపు విభాగంలో శ్రీను, అరుణ్, బాలికల విభాగంలో హర్షిత, 14 ఏళ్లలోపు బాలికల విభాగంలో ఒప్పిచర్ల పాఠశాల విద్యార్థులు రాధిక, 17 ఏళ్లలోపు విభాగంలో శివమణి, కల్యాణి, బాలుర విభాగంలో మనోహర్ ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

నీతిమంతుని జ్ఞాపకము చేసుకొనుట ఆశీర్వాదకరమగును సామెతలు: 10:7

తృతీయ వర్ధంతి



జననం : 11-7-1958 మరణం : 13-11-2022

కీ॥శే॥ శ్రీ వేజండ్ల శ్యామ్‌సుందర్ గారు
M.A., M.A., M.Ed.
స్కూల్ అసిస్టెంట్ సోషల్, Rtd. Teacher, సత్తెనపల్లి

మంచికి మారుపేరుగా నిలచి, క్రమశిక్షణగల వ్యక్తిగా మా ఉన్నతికి శ్రమించిన మీరు మా నుండి దూరమై ప్రభువు చెంతకు చేరి 3సం॥ల గడచినను సదా మా హృదయాలలో ఎల్లప్పుడూ చిరస్మరణీయులే... మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రభువును ప్రార్థిస్తూ...

భార్య: మోహన్ పద్మావతి తల్లి: వేజండ్ల వసుంధర
కుమారుడు - కోడలు: ప్రదీప్ - వనిత
కుమార్తె - అల్లుడు: సుధారాణి - సుశాంత్
మనుమరాలు: ఖ్యాతి ఐవిలిన్

కన్నీరు ఆరేలా.. కష్టం తీరేలా..

ఇటీవల వచ్చిన మొంథా తుపాను వర్షాలకు జిల్లాలోని 1100 హెక్టార్ల మేర వరి పంట దెబ్బతింది. దీంతో చాలాచోట్ల పనలన్నీ పాడయ్యాయి. ఈక్రమంలో ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. బలిజిపేట మండలంలోని పెదపెంకి, బర్లి, వంతరాం తదితర గ్రామాల రహదారుల్లో 20 రోజులుగా ఇలా పెద్దఎత్తున పోస్తున్నారు. తేమ ఉంటే మిల్లర్లు తీసుకోరనే భయంతో ఇలా చేస్తున్నట్లు అన్నదాతలు చెబుతున్నారు. – న్యూస్‌టుడే, బలిజిపేట

బలిజిపేట మండలంలోని పెదపెంకి గ్రామానికి వెళ్లే రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

ప్రమాదంపై.. ప్రయాణం

గమ్యం చేరుకోవాలంటే ప్రమాదం అని తెలిసినా బండి ఎక్కాల్సిందే. కొంచెం పొద్దుపోయినా వాహనాలు ఉండవు. పోనీ సొంతవాటిల్లో వెళ్దామంటే దారులు దారుణంగా ఉంటాయి. సాలూరు నుంచి గిరిశిఖర, ఒడిశా సరిహద్దు గ్రామాలకు గిరిజనులు రాకపోకలు సాగించాలంటే వారికి ఇలా ప్రైవేటు వాహనాలే దిక్కు. ప్రయాణ ఛార్జీల సైతం ఎక్కువే.. అయినప్పటికీ ప్రమాదకరంగా వెళ్తున్నారు. కొందరు ఇలా పైకెక్కి మరీ గ్రామాలకు చేరుతున్నారు. దీంతో ముప్పు పొంచి ఉంది. – న్యూస్‌టుడే, సాలూరు



జీపు పై భాగంలో ప్రయాణిస్తున్న గిరిజనులు

విజయనగరాన.. విహంగ మార్గాన

– ఈనాడు, విజయనగరం

ఏ నగరానికి ఎంత దూరం.. విశాఖ నగరానికి 55 కి.మీ. విజయనగరం: 25 కి.మీ శ్రీకాకుళం: 65 కి.మీ.

విమానం ఎక్కాలంటే.. విశాఖ వెళ్లాలి. లేకుంటే విజయవాడో.. హైదరాబాదో చేరాలి.. ఇక నుంచి ఆ అవసరం ఉండదు. ఉత్తరాంధ్రుల ఏళ్ల నాటి కల నెరవేరనుంది. మరికొన్ని నెలల్లోనే గగన విహారానికి అవకాశం కలగనుంది. భోగాపురంలోని అంతర్జాతీయ విమానాశ్రయం సిద్ధమవుతోంది. ఇప్పటికే 92 శాతం పనులు పూర్తయ్యాయి. కూటమి రాకతో వేగవంతమయ్యాయి. ప్రస్తుత పరిస్థితిని రెండు రోజుల కిందట ‘ఈనాడు’ పరిశీలించింది.

పురోగతి ఇలా..

- ★ శంకుస్థాపన: 2019 ఫిబ్రవరిలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. 2023 మే 3న మాజీ సీఎం జగన్ మరోసారి భూమిపూజ చేపట్టారు.
- ★ భూముల కేటాయింపు: 2,708.26 ఎకరాలు
- ★ పనుల పూర్తికి గడువు: డిసెంబరు 2026
- ★ గడువు లక్ష్యం కుదింపు: వచ్చే ఏడాది జూన్
- ★ టెర్మినల్ బిల్డింగ్ విస్తీర్ణం: 81 వేల చ.మీ.
- ★ రన్‌వే: 3.8 కిలో మీటర్ల పొడవున రెండు
- ★ ఏరో బ్రిడ్జిలు: 22

★ అంచనా వ్యయం: తొలిదశలో రూ.4,750 కోట్లు

★ ఆరంభంలో ఏడాదికి సేవలు: 60 లక్షల మందికి

పనుల ప్రగతి ఇలా.. (శాతాల్లో..)

- ★ మట్టి పని: 100
- ★ రన్‌వే : 99.9
- ★ టాక్సీవే: 98.6
- ★ పీటీబీ : 86.2
- ★ ఏటీసీ : 84.4
- ★ యాన్సలరీ బిల్డింగ్స్: 76



అత్యాధునికంగా టెర్మినల్ బిల్డింగ్

జరగాల్సిన పనులు

- ★ విశాఖపట్నం బీచ్ రోడ్ నుంచి ఆరు వరుసల రహదారి అభివృద్ధి
- ★ బీచ్ కారిడార్, మెట్రో.. విమానాశ్రయానికి అనుసంధానం
- ★ విశాఖ నలుమూలల నుంచి ఇక్కడికి చేరుకునేందుకు 15 మార్గాల నవీకరణ
- ★ ఉత్తరాంధ్ర సంస్కృతి ఉట్టి పడేలా సుందరీకరణ పనుల ప్రారంభం

త్వరలో భారీ విమానం రాక..

★ డిసెంబరు నెలాఖరు లేదా జనవరిలో బోయింగ్ విమానంతో రన్‌వేపై పరీక్షలు నిర్వహించనున్నారు. నాలుగు నెలల క్రితం చిన్న పాటి విహంగంతో ట్రయల్ రన్ పూర్తి చేశారు.

★ జాతీయ రహదారి-16లో పోలిపల్లి వద్ద నిర్మించిన ట్రంపెట్ నుంచి స్పీడ్ యాక్సెస్ రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

ఆక్రమణలపై కదిలిన యంత్రాంగం

ఈనాడు కథనానికి స్పందన

పార్వతీపురం, న్యూస్‌టుడే: పార్వతీపురంలోని ప్రభుత్వ, జల వనరుల శాఖకు చెందిన స్థలాలను ఆక్రమించుకొని, పక్క సర్వే నంబర్లు వేసి రిజిస్ట్రేషన్లు చేయడంపై ఈనెల 8న ‘ఈనాడు’లో ‘పక్క నంబర్లు.. పక్కా రిజిస్ట్రేషన్లు’ శీర్షికన వచ్చిన కథనంలో అధికార యంత్రాంగం కదిలింది. వరహాల గెడ్డ స్థలాన్ని ఆక్రమణదారులు అమ్మేసినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బుధవారం పురపాలక కమిషనరు శ్రీనివాసరాజు జేసీబీతో అక్కడ చదును చేయించారు. అది ప్రభుత్వమేనని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని కమిషనరు తెలిపారు.

ఆక్రమిత ప్రాంతంలో చదును పనులు

అదనపు నిధులతో సొంతింటి కల సాకారం

జిల్లాలో 15,661 నిర్మాణాల పూర్తి

సాలూరు, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అదనపు సాయం అందించి సొంతింటి కలను సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదే అని మంత్రి జి.సంధ్యారాణి అన్నారు. సాలూరు పట్టణంలోని 12వ వార్డులో పీఎంజేవై గృహ ప్రవేశాల కార్యక్రమంలో బుధవారం పాల్గొన్న ఆమె లబ్ధిదారులకు తాళాలు అందించారు. కొత్తగా మంజూరైన ఇళ్లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ‘గత ప్రభుత్వం అయిదేళ్లలో చేయని అభివృద్ధిని 16 నెలల్లో చేసి చూపించాం. కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో 22,833 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 15,661 వరకు పూర్తయ్యాయి. పీఎం జన్‌మన్ పథకం కింద 5,169 మంది పీవీటీజీ గిరిజనులకు ఇళ్లు మంజూరు చేశాం. సాలూరు, పార్వతీపురం, పాలకొండ పట్టణాలకు 634 గృహాలను కేటాయించాం. రూ.2 కోట్ల నిధులు తెచ్చినా వైకాపా పాలకవర్గం పనులు చేయలేకపోయింది. మూడు నెలల తర్వాత ఆ పాలకవర్గం మారుతుంది’ అని అన్నారు. గృహనిర్మాణ శాఖ పీడీ, డీఈలు ధర్మచంద్రారెడ్డి, చిన్నంనాయుడు, ఏఈ శ్రీనివాసరావు, పుర మాజీ అధ్యక్షురాలు కె.గాయత్రి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సాలూరులో గృహ లబ్ధిదారుకు నమూనా తాళం అందిస్తున్న మంత్రి సంధ్యారాణి

అతివకు చిరుసాయం

– న్యూస్‌టుడే, రాజాం, గుమ్మలక్ష్మీపురం

ఉమ్మడి జిల్లాలో చిరుధాన్యాల సాగు ఎక్కువ. ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ తదితర అంశాల్లో మన రైతులు ముందున్నారు. మహిళలు సైతం ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఈక్రమంలో స్థానికంగా మిల్లెట్ క్లస్టర్ ఏర్పాటు చేయాలనే డిమాండు ఎప్పటినుంచో వినిపిస్తోంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రానికి అనేక ప్రతిపాదనలు వెళ్లాయి. తాజాగా సూత్రప్రాయ అంగీకారం తెలిపింది. తమ ఆమోదంతో సంబంధం లేకుండా పనులు ప్రారంభించాలని ఇప్పటికే రాష్ట్రానికి సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో విజయనగరంలోని వైద్య కళాశాల సమీపంలో 13.48 ఎకరాలు గుర్తించినట్లు డీఆర్డీఏ అధికారులు తెలిపారు.

విజయ నగరం కేంద్రంగా మిల్లెట్ క్లస్టర్

ఉత్పత్తుల తయారీకి అవకాశం

విజయనగరం జిల్లాలో.. సంఘాల ఆధ్వర్యంలో సాగు.. (ఎకరాల్లో / రైతులు)

పంట	ఎకరాల్లో	రైతులు
రాగులు	846	886
గంటెలు	330	535
కొర్రలు	27.5	59
జొన్నలు	15	25

గుమ్మలక్ష్మీపురంలో జంతికలు తయారు చేస్తున్న మహిళలు

★ మన్యంలో 5,400 ఎకరాల్లో చిరుధాన్యాలు సాగవుతున్నాయి

ప్రస్తుతం ఉన్నవి..

రాగి బిస్కెట్లు, రాగి లడ్డూలు, కొర్రలతో జంతికలు, మురుగులు తదితరాలు తయారు చేస్తున్నారు. మన్యంలో ఊదలతో ఇడ్లీలు, మిల్లెట్ పెరుగన్నం, మిల్లెట్ పెసరట్టు, కిచిడీ, మల్టీగ్రైన్ చపాతీలు, నువ్వుండలు, జొన్న గారెలు దుకాణాల్లో కనిపిస్తున్నాయి. ఇప్పటికే రస్తాకుంటుబాయిలోని కేవీకేలో మహిళలకు శిక్షణ ఇచ్చారు. అక్కడే యంత్రాలను బిగించి తయారీపై అవగాహన కల్పిస్తున్నారు.

1000 మందికి లబ్ధి..

దేశవ్యాప్తంగా చిరుధాన్యాల ఉత్పత్తులకు ప్రాధాన్యం పెరిగింది. ఆరోగ్యం దృష్ట్యా చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో డ్వాక్రా సంఘాల మహిళలకు లబ్ధి కలగనుంది. క్లస్టర్ పరిధిలో ఏర్పాటయ్యే యూనిట్లతో వివిధ రకాల వంటల తయారీకి అవకాశం ఏర్పడుతుంది. ఈ విధంగా దాదాపు 1000 మంది లబ్ధి పొందుతారని భావిస్తున్నారు.

సర్వే జరుగుతోంది..

‘సాగు విస్తీర్ణం, ఉత్పత్తి అంశాలపై సర్వే చేపడుతున్నాం. యూనిట్ల ఏర్పాటుకు ఎంత మంది ఆసక్తి చూపుతారు? ఏఏ ఉత్పత్తులకు అవకాశం ఉంది.. విలువ జోడింపు తదితర అంశాలపై కసరత్తు చేస్తున్నాం. పూర్తిస్థాయి అనుమతులు వస్తే ముందుకెళతాం’ అని **డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్** తెలిపారు. ● తృణధాన్యాల వినియోగంతో ఆరోగ్యంగా ఉండొచ్చని, వ్యాపారాలు బాగుంటాయని **కేవీకే గృహవిజ్ఞాన విభాగం శాస్త్రవేత్త ఉమాజ్యోతి** తెలిపారు.

శిక్షణ మాది.. కొలువు మీది!

స్కిల్‌హబ్ కేంద్రంలో తర్ఫీదు

ప్రస్తుత పోటీ ప్రపంచంలో కొలువులు సాధించాలంటే కేవలం విద్యార్హత ఉంటే చాలదు. అందుకు తగిన నైపుణ్యాలు కావాలి. ఈమేరకు యువతను అన్నివిధాలా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ముందుకొచ్చింది. గుమ్మలక్ష్మీపురంలోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ కేంద్రం ద్వారా ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. – న్యూస్‌టుడే, జీఎల్‌పురం

యువతకు వరం

150 మందికి ఉద్యోగాలు

ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌కు సమన్వయకర్తలను నియమించారు. వారి పర్యవేక్షణలో కోర్సులు నిర్వహిస్తున్నారు. రోజుకు 5 గంటల చొప్పున మూడు నెలల పాటు ఉచితంగా తర్ఫీదునిచ్చి, ధ్రువపత్రాలు అందజేస్తున్నారు. ముందుగా తరగతులు నిర్వహించి తర్వాత విభాగాలకు సంబంధించి ప్రయోగాత్మక శిక్షణ ఇస్తున్నారు. ప్రతి బ్యాచ్‌కు 30 మందికి అవకాశం కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు 325 మంది డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, జనరల్ డ్యూటీ సహాయకులు, అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్, ఫీల్డ్ టెక్నీషియన్, ఎయిర్ కండీషనర్, ఐటీ హెల్ప్ డెస్క్, రిసెప్షనిస్టు తదితర అంశాల్లో అవగాహన పొందారు. వీరిలో సుమారు 150 మందికి పలు కంపెనీల్లో కొలువులు దక్కాయి.

నమ్మకం కలుగుతోంది..

డిగ్రీ, డైట్ పూర్తి చేశాను. ప్రభుత్వ కొలువు కోసం సాధన చేసినా ప్రయోజనం లేకపోయింది. ఈక్రమంలో ఉచిత శిక్షణ గురించి తెలియడంతో కేంద్రంలో చేరాను. కంప్యూటర్‌లో పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. స్వయం ఉపాధితో పాటు ఉద్యోగంలో చేరే అవకాశం ఉంటుందన్న నమ్మకం కలుగుతోంది. **- సత్యనారాయణ, మొండెంఖల్లు**

మంచి అవకాశం

పదో తరగతి వరకు చదువుకున్నా. ఆర్థిక పరిస్థితి కారణంగా మూడేళ్ల నుంచి చదువుకు దూరంగా ఉంటున్నా. శిక్షణ కేంద్రంలో చేరడం సంతోషంగా ఉంది. దీనివల్ల స్వయం ఉపాధి సాధించగలనన్న భరోసా వస్తోంది. పేదలకు ఇది మంచి అవకాశం. **- హేమ, ఎల్విన్‌పేట**

సద్వినియోగం చేసుకోవాలి

శిక్షణకు మంచి స్పందన వస్తోంది. యువతి, యువకులు సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధిపై దృష్టిసారించి భవితకు బాటలు వేసుకోవాలి. ఇప్పటికే సుమారు 300 మందికి పైగా ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ పొందారు. – **జగదీశ్వరరావు, ప్రిన్సిపల్**

డోలీ కట్టినా దక్కని ప్రాణం!

డోలీలో వృద్ధురాలిని నది దాటిస్తున్న గ్రామస్థులు

వంతెన లేక కొమరాడ మండలంలోని రెబ్బ, వనదార గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. ఈ రెండు ఊర్లు నాగావళి నదికి అవతల ఒడిశా సరిహద్దులో ఉన్నాయి. బుధవారం ఉదయం రెబ్బ గ్రామానికి చెందిన వృద్ధురాలు టి.నరసమ్మ(82) అనారోగ్యానికి గురికావడంతో డోలీలో నది దాటించి రామభద్రపురం పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పార్వతీపురం, అక్కడి నుంచి విజయనగరం తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి సాయంత్రం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆటోలో ఒడిశా మీదుగా రామభద్రపురం తరలిస్తే 10 కి.మీ అదనంగా వెళ్లాల్సి వస్తుందని, అందుకే డోలీతో నది దాటి 3 కి.మీ దూరంలోని ఆసుపత్రికి చేర్చామని గ్రామ యువకులు చెప్పారు. వంతెన నిర్మించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కొమరాడ

బెంచీలు 9... విద్యార్థులు 11

చిత్రంలో కనిపిస్తున్న విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నాయనుకుంటే పొరబడినట్లే. తరగతి గదిలో ఉపాధ్యాయుడు పాఠాలు బోధిస్తున్నారు. ఈ పరిస్థితికి కారణం గతంలో కంటే హాజరు తగ్గిపోవడమే. సాలూరు మండలంలోని జీగిరాం జూట్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో 11 మంది బాలలు చదువుతున్నారు. వీరికి రెండు గదుల్లో ఇద్దరు ఉపాధ్యాయులు తరగతులు చెబుతున్నారు. గ్రామంలోని జూట్ పరిశ్రమను మూసేసి దాదాపు మూడేళ్లవుతోంది. దీంతో ఉపాధి లేక కొన్ని కుటుంబాలు వలస పోయాయి. దీంతో విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిపోతూ వచ్చింది. ప్రస్తుతం బెంచీలు 9 ఉంటే 11 మంది చిన్నారులు మాత్రమే ఉన్నారు. – న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

ఆరుగురు విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

కొలకలూరి ఇనాక్‌కు గురజాడ విశిష్ట పురస్కారం

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: గురజాడ విశిష్ట పురస్కారాన్ని ఈ ఏడాది ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్‌కు ప్రదానం చేయనున్నట్లు గురజాడ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వెంకటేశ్వరరావు, కాపుగంటి ప్రకాష్ బుధవారం తెలిపారు. గురజాడ వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 30న విజయనగరంలో నిర్వహించే సాహితీ చైతన్య ఉత్సవం రోజున హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ చేతుల మీదుగా అందిస్తామన్నారు. గురజాడ వారసులు ఇందిర, వెంకటేశ్వరప్రసాద్ పాల్గొన్నారు.

చిన్న నంబరే.. పెద్ద సహాయం

మహిళలు, బాలల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్‌లు

– న్యూస్‌టుడే, విజయనగరం అయ్యన్నపేట, రింగురోడ్డు

మహిళలు, బాలికల భద్రత, రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా సహాయ కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. రోజులో 24 గంటలూ పనిచేస్తాయి. గృహహింసకు గురైనా, భౌతిక, లైంగిక దాడుల బారిన పడినా సంప్రదించవచ్చు. చిన్న నంబర్లే అయినా.. పెద్ద సహాయం పొందొచ్చు.

వేధిస్తే అంతే..

అధిక కట్నం కోసం వేధించడం, శారీరక, మానసికంగా ఇబ్బంది పెడితే 181కు ఫోన్ చేయొచ్చు. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ సంచాలకుల కార్యాలయంలో సిబ్బంది వివరాలు నమోదు చేసి ఆయా జిల్లాల పోలీసు, ఇతర శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రక్షణ కల్పిస్తారు. వన్‌స్టాప్ సెంటర్, అంగన్‌వాడీ సిబ్బంది, రెవెన్యూ అధికారులు చేరుకుంటారు.

ఉచితంగానే..: న్యాయ స్థానాల్లో కేసులకు సంబంధించి 15100ను సంప్రదించాలి. ఫోన్ చేసి సేవలు పొందవచ్చు. న్యాయవాదులను పెట్టుకోలేని బాధిత మహిళలకు ప్రభుత్వమే ఆసరాగా నిలుస్తుంది.

వెంటనే చెప్పండి..: సామాజిక మాధ్యమాల్లో పరిచయాలు పెంచుకుని అశ్లీల చిత్రాలు తీసినా, ఇతర మార్గాల్లో మోసం చేసినా 1930కు వెంటనే చెప్పాలి.

రక్షణ కోసం..: ఎవరైనా ఇబ్బంది పెట్టినా, వ్యక్తిగత, కుటుంబ, మరే ఇతర సమస్యలున్నా.. 100 నొక్కితే.. పోలీసులు ఇట్టే వాలిపోతారు.

★ బాలలతో వెట్టి చాకిరీ చేయించడం, కర్మాగారాల్లో పనులు చేయిస్తే 1098కు ఫోన్ చేస్తే వారికి విముక్తి కల్పిస్తారు. బాలలపై హింస, దాడులకు పాల్పడినా, అపహరణకు గురైనా ఈ నంబరును వెంటనే సంప్రదించవచ్చు.

మరికొన్ని ఇలా..

★ అత్యవసర వైద్యం	108
★ వైద్య సేవల్లో సందేహాల నివృత్తి	104
★ వయోవృద్ధుల హెల్ప్‌లైన్	14567
★ రోడ్డు ప్రమాదం జరిగితే	1973
★ డ్రగ్స్ నివారణ, సహాయం	1972
★ అత్యవసర స్థితి	112
★ రైల్వే ప్రయాణ సమయంలో	139

★ ఇవే కాకుండా పోలీసు శాఖ శక్తి వారియర్స్ పేరుతో శక్తి యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్లే స్టోర్‌లో నుంచి డౌన్‌లోడ్ చేసుకొని విపత్కర, అత్యవసర పరిస్థితుల్లో సద్వినియోగం చేసుకోవచ్చు. అదేవిధంగా 79934 85111ను సంప్రదించవచ్చు.

ఇక చకచకా.. ధాన్యం కొనుగోళ్లు

నేటి నుంచి ప్రక్రియ ప్రారంభం

కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు సిద్ధం చేస్తున్న ధాన్యం

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానుంది. సాలూరులో మంత్రి సంధ్యారాణి, నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు.

సంచులతో సమస్య

ధాన్యాన్ని సంచుల్లోకి ఎత్తి కొనుగోలు కేంద్రాలకు అప్పగించాలి. వీటిని మిల్లర్లు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాకు 62 లక్షలు అవసరం కాగా.. 11 లక్షలే ఉన్నాయి. భామిని, బలిజిపేట, గరుగుబిల్లి, మక్కువ మండలాల్లో కొరత కనిపిస్తోంది.

జిల్లాలో ఇలా (మెట్రిక్ టన్నుల్లో)..

- దిగుబడి అంచనా: 4.23 లక్షలు
- మార్కెట్లో ఉన్నది: 3.38 లక్షలు
- సొంతానికి వినియోగం: 86,198
- కొనుగోలు లక్ష్యం: 2.50 లక్షలు
- రైతులు: 36 వేల మంది

సమస్యలుంటే ఫోన్ చేయండి: 1967 (టోల్‌ఫ్రీ), 08963-221003, 77020-03582 (కంట్రోల్‌రూం)

బ్యాంకు గ్యారెంటీ రూ.300 కోట్లు

- ● 2.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి రూ.600 కోట్ల వరకు బ్యాంకు గ్యారెంటీ ఇవ్వాలి.
- ● ప్రాథమికంగా 50 శాతానికి పరిమితం చేస్తే రూ.300 కోట్లకు ఇవ్వాలి.
- ● 72 మిల్లుల్లో తేమ యంత్రాలను సిద్ధం చేశారు.

దేనికెంత..

- ● గోనె సంచి (40 కిలోలు): రూ.4.74
- ● హమాలీ ఛార్జీ (క్వింటాకు): రూ.22

ఇబ్బందులు లేకుండా..

ధాన్యం సేకరణలో ఎవరికీ ఇబ్బందులు లేకుండా సానుకూలంగా పూర్తి చేయాలని సూచించాం. ప్రభుత్వం అన్ని స్థాయిల్లోనూ పరిశీలిస్తోంది. ఎక్కడ లోపం ఉన్నా, బాధ్యులపై చర్యలు ఉంటాయి. - సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, జేసీ

వ్యవసాయ శాఖ అధికారిణిగా అన్నపూర్ణ

పార్వతీపురం: జిల్లా వ్యవసాయాధికారిగా పనిచేసిన రాబర్ట్ పాల్ కాకినాడ బదిలీ అయ్యారు. గుమ్మలక్ష్మీపురం ఏడీగా పనిచేస్తున్న **అన్నపూర్ణ**కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

జ్ఞాపకాల మదిలో...
జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి
మీరు చూపిన ఆత్మీయత.. అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట.. మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.. ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని భావాలను అక్షరరూపంలో నివేదించడం తప్ప...

ప్రకటనలపై ప్రత్యేకంగా 5% తగ్గింపు
నిర్యాణం, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ఈనాడు ప్రకటనల విభాగం
9000866020, 8008597609

(c) eenadu

ఉపాధిలో వెనుకబాటు

న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమల్లో జిల్లాలో ప్రగతి కొరవడుతోంది. పనిదినాల కల్పన, సగటు వేతనం అంశాల్లో వెనుకంజలో ఉంది. దీనిపై కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి పలు సమావేశాల్లో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మెంటాడ, రామభద్రపురం, వంగర, మెరకముడిదాం మండలాల్లో పనులు ప్రారంభించేలా ప్రత్యేక ఆదేశాలు జారీచేశారు.

కుటుంబానికి ఏదీ ఆసరా

ప్రతి కుటుంబానికి ఏడాదిలో వంద రోజుల పనిదినాలు కల్పించాలి. జిల్లాలో 2.77 లక్షల కుటుంబాలు పనుల్లోకి వస్తున్నాయి. వీరిలో ఇప్పటివరకు 1,645 కుటుంబాలే వంద రోజులు పూర్తిచేస్తుకున్నాయి. 23 మండలాల్లో వంద రోజులు పనిదినాలు పూర్తిచేసుకున్న కుటుంబాల సంఖ్య రెండంకెల్లోనే ఉంది. గంట్యాడ 178, సంతకవిటి 161, రేగిడి ఆమదాలవలస 159, గజపతినగరం మండలంలో 101 కుటుంబాలకు వందరోజులు పనిదినాలు కల్పించారు.

ఉపాధి పనుల్లో వేతనదారులు

పనిదినాలు

ఆర్థిక సంవత్సరంలో 1.25 కోట్ల పనిదినాలు కల్పించడం లక్ష్యం. ఇప్పటివరకు 1.06 కోట్లు కల్పించారు. వేపాడ, జామి, తెర్లాం, రామభద్రపురం, డెంకాడ మండలాల్లో ప్రగతి 80 శాతంలోపే ఉంది. వేపాడలో అతి తక్కువగా 57.10 శాతం పనిదినాలే కల్పించారు.

సగటు వేతనం

ప్రభుత్వం నిర్దేశించిన వేతనం రూ.307. ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్‌లో రూ.189 ఉండేది. క్రమేపీ పెరుగుతూ వస్తోంది. నవంబరు నెలలో రూ.287గా ఉంది. రాజాం నియోజకవర్గంలో సగటు వేతనం తక్కువగా ఉంది. రేగిడి ఆమదాలవలసలో రూ.207.20 ఉండగా, మిగిలిన మూడుచోట్ల రెండు వందల్లోపే. గరిష్ఠంగా భోగాపురం రూ.231.47, గుర్ల మండలంలో రూ.229.76, విజయనగరంలో రూ.229, నెల్లిమర్లలో రూ.228.40 వేతనం కార్మికులకు లభిస్తోంది.

సొంత నిధులు పెంచుకునేలా!!

రూ.400 కోట్ల లక్ష్యంతో..

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)కు సొంత నిధులు లేవు. ఆప్కాబ్, నాబార్డు ఇచ్చే సొమ్ముపైనే ఆధారపడుతోంది. అందులోనుంచే రుణాలిస్తోంది. తగినంత డిపాజిట్లు లేకపోవడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణం. ఉమ్మడి జిల్లాలో 24 సహకార బ్యాంకులున్నాయి. వీటి ద్వారా డిపాజిట్ల సేకరణపై దృష్టిసారించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పర్సన్ ఇన్‌ఛార్జుల ఆధ్వర్యంలో రూ.23 కోట్లు వచ్చాయి.

– న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్

బ్యాంకు పరంగా ఏటా రూ.2,232 కోట్ల మేర టర్నోవర్ జరుగుతోంది. ఇందులో రుణాల కింద రూ.1893 కోట్లు ఇస్తున్నారు. దీని ప్రకారం రూ.800 కోట్ల మేర డిపాజిట్ ఉండాలి. ప్రస్తుతం రూ.339 కోట్లు మాత్రమే ఉన్నాయి. ఆరు నెలల వ్యవధిలో రూ.27 కోట్లను సేకరించారు. డిసెంబరు నాటికి మరో రూ.375 కోట్లను సమీకరించాలని నిర్ణయించారు. 2026 మార్చి నాటికి రూ.400 కోట్లు వచ్చేలా లక్ష్యంగా పెట్టుకున్నారు. వినియోగదారులను ఆకట్టుకునేందుకు సహకార బ్యాంకుల్లో అయితే 7.90 శాతం వడ్డీ, సొసైటీల్లో అయితే 8.90 శాతం వడ్డీ ఇవ్వనున్నారు.

ఇదీ పరిస్థితి..
- సహకార బ్యాంకులు: 24
- సొసైటీలు : 94
- ప్రస్తుత డిపాజిట్ : రూ.339 కోట్లు
- డిసెంబరు నాటికి లక్ష్యం: రూ.375

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు

కారణాలివీ..

గత పాలకవర్గాల్లో సొసైటీల స్పందన అంతంత మాత్రమే కావడంతో బ్యాంకు నష్టాల్లోకి వెళ్లింది. తొలి నాళ్లలో డిపాజిట్లపై నిషేధం ఉండడం కూడా ప్రధాన కారణంగా కనిపిస్తోంది. సహకార రంగంలో కొన్ని బ్యాంకులు, సంస్థలు దివాలా తీయడంతో ఆ ప్రభావం సైతం పడింది. రెండు జిల్లాల్లో 94 సొసైటీలున్నాయి. ఇందులో కెల్ల, తెట్టంగి, సతివాడ మినహా మిగిలిన అన్నింట్లో ధాన్యం కొనుగోలు ద్వారా వచ్చిన కమిషన్‌నే డిపాజిట్‌గా చూపుతున్నారు. వ్యక్తిగతంగా సేకరించడం లేదు. ఈ నేపథ్యంలో ప్రచారం చేయనున్నారు.

రైతుల మేలు కోసమే..

డిపాజిట్లు పెంచే దిశగా సొసైటీలతో సంప్రదింపులు జరుపుతున్నాం. ఇప్పటికే గాజులరేగ, చీపురుపల్లి తదితర కార్యాలయాలను సందర్శించాం. సొంత నిధులు పెంచుకోవడంతో తక్కువ వడ్డీకే రైతులకు రుణాలు ఇవ్వొచ్చు. దీంతో లక్ష్యాలు విధించాం.

– కిమిడి నాగార్జున, డీసీసీబీ ఛైర్మన్

అందిపుచ్చుకుంటే అడుగు బయటపెట్టక్కర్లే

'పురమిత్ర' యాప్‌పై కొరవడిన చైతన్యం

న్యూస్‌టుడే– రాజాం

నగర, పురపాలక సంఘాల్లోని 119 రకాల సేవలతో పాటు సమస్యల పరిష్కారానికి తీసుకొచ్చిన పురమిత్ర యాప్‌పై ప్రజల్లో అవగాహన కొరవడింది. ఇంటింటికీ వెళ్లి ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకునేలా ప్రోత్సహించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినా స్పందించడం లేదు. ఉమ్మడి జిల్లాలోని విజయనగరం, రాజాం, నెల్లిమర్ల, బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు, పాలకొండ పట్టణాల్లో 1,46,135 కుటుంబాలు ఉండగా.. ఇంతవరకు 34,670 కుటుంబాలు మాత్రమే యాప్ వినియోగిస్తున్నాయి.

ఒక్క చిత్రంతో పరిష్కారం..

సమస్య ఏదైనా ఒక్క ఫొటోతో పరిష్కరించే దిశగా దీన్ని రూపొందించారు. వీధి దీపం వెలగడంలేదని చిత్రం తీసి యాప్‌లో అప్‌లోడ్‌చేస్తే సంబంధిత వార్డు కార్యదర్శి లాగిన్‌కు వెళ్తుంది. యాప్‌నకు కృత్రిమ మేధ (ఏఐ) అనుసంధానించడంతో వివరాలు ఆటోమెటిక్‌గా వెళ్తాయి. వెంటనే పరిష్కరిస్తారు. ఫొటో తీయలేనప్పుడు సమస్యను నోటితో చెబితే చాట్‌బాట్ ద్వారా సంబంధిత అధికారులకు చేరుతుంది. ఇంటి నిర్మాణ అనుమతులు, దరఖాస్తు ప్రాసెస్ విధానం, ఫీజుల చెల్లింపు వంటి విషయాలను తెలుగు, ఆంగ్ల భాషల్లో చాట్‌బాట్ తెలుపుతుంది.



పురమిత్ర యాప్ హోమ్ పేజీ

8 విభాగాలు.. 119 సేవలు

యాప్‌లో ఎనిమిది ప్రధాన విభాగాల్లో 119 వరకు సేవలు పొందుపరిచారు. రెవెన్యూ, మెప్మా, నీటి సరఫరా, ప్రజారోగ్యం, వీధి దీపాలు, పరిశుభ్రత, ఇంజినీరింగ్ పట్టణ ప్రణాళిక విభాగాలు ప్రధానమైనవి. వీటికి ఒక్కో దానిలో 25 సేవలు అనుసంధానించారు. సేవలను అందించేందుకు కనిష్ఠంగా 24 గంటలు, గరిష్ఠంగా 30 రోజులుగా ప్రభుత్వం కాల వ్యవధి పెట్టింది. యాప్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకునేలా చైతన్యం కల్పించాలని పురపాలికల అధికారులకు ఆదేశించినట్లు పురపాలక ఆర్డీ రవీంద్ర తెలిపారు.

ప్రతిభకు ఉపకారం

విజయనగరం రింగ్‌రోడ్డు, న్యూస్‌టుడే: ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిత సాధ్యమని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి నిర్వహించిన పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన హోంగార్డుల పిల్లలను ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందించారు. బుధవారం తన కార్యాలయంలో 16 మంది పిల్లలను పిలిపించి, ప్రత్యేకంగా అభినందించి వారికి ఉపకార వేతనాలను అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, వెల్ఫేర్ ఆర్ఐ గోపాలనాయుడు, పోలీసు ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ఎస్పీ ఏఆర్ దామోదర్

ఉద్యోగుల ఆటవిడుపు

విజయనగరం క్రీడా విభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల(పురుషులు-స్త్రీలు) క్రీడా పోటీలు బుధవారం ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి. విజ్జీ రాజీవ్ మైదానాల్లో రెండు రోజుల పాటు జరిగిన ఈ క్రీడా పోటీల్లో వివిధ విభాగాల్లో ఉద్యోగులు తలపడ్డారు. మంగళవారం క్యారమ్స్, చదరంగం, క్రికెట్, బెస్ట్ ఫిజిక్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, టెన్నిస్, కుస్తీ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిని ఈ నెల 19 నుంచి 22 వరకు విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని క్రీడాధికారి ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా గెలుపొందిన వారిని ఆయన అభినందించారు.

క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు

క్యారమ్స్‌లో పోటీపడుతున్న ఉద్యోగులు

స్వగ్రామంలో సినీ నటుడు సాయికుమార్

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: సినీ రంగంలో 50 ఏళ్లు పూర్తిచేసుకున్నానని, సుమారు 300 చిత్రాల్లో నటించానని, అంతకుమించి చిత్రాల్లో డబ్బింగ్ చెప్పానని ప్రముఖ సినీ నటుడు సాయికుమార్ అన్నారు. బుధవారం తన స్వగ్రామం మండలంలోని కళ్లేపల్లి గ్రామానికి ఆయన వచ్చారు. సమీపంలోని రేగ గ్రామంలో ఉన్న వేదమాత గాయత్రీ దేవి, కాశీ విశ్వేశ్వర ఆలయాలను సందర్శించారు. అంతకు ముందు కళ్లేపల్లిలో గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అరకులో ఎస్వీ కృష్ణారెడ్డి దర్శకత్వంలో నిర్మిస్తున్న వేదవ్యాస్ సినిమా షూటింగ్‌లో పాల్గొనేందుకు చిత్ర బృందంతో కలిసి వెళ్తున్నట్లు చెప్పారు. మార్గంమధ్యలో స్వగ్రామాన్ని చూడాలని వచ్చినట్లు చెప్పారు. గ్రామంలో తన తండ్రి పీజే శర్మ జ్ఞాపకార్థం కల్యాణ మండపం నిర్మించాలన్న ఆలోచన ఉందన్నారు. చుట్టుపక్కల గ్రామస్థులు పెద్ద సంఖ్యలో ఆయనను చూసేందుకు వచ్చి, సెల్ఫీలు తీసుకున్నారు.

విద్యార్థినులతో సాయికుమార్ సెల్ఫీ

పోలీసులు ఇబ్బంది పెట్టారు: బొత్స

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో మార్చబోతున్నట్టు ప్రకటన నేపథ్యంలో వైకాపా చేపట్టిన ప్రజా ఉద్యమ ర్యాలీ సందర్భంగా పోలీసులే రాస్తారోకో.. ధర్నా చేసినట్లు ఉందని శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. విజయనగరంలో బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గరివిడి నుంచి చీపురుపల్లి వరకు బైక్ ర్యాలీ జరిగినప్పుడు పోలీసులు గంటన్నరపాటు ఇబ్బందులు పెట్టారని ఆరోపించారు. రాష్ట్రంలో మూడు లక్షల ఇళ్లు ప్రధాన మంత్రి ఆవాస యోజన కింద కట్టామని ప్రకటనలు ఇచ్చారని, వాటికి భూసేకరణ, శంకుస్థాపనలు ఎప్పుడు చేసింది చెప్పాలని ప్రభుత్వాన్ని బొత్స ప్రశ్నించారు. మొంథా తుపాను నష్టం అంచనా వేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. విశాఖ సమ్మిట్ వంటివి వైకాపా హయాంలో ఎందుకు ఏర్పాటు చేయలేదని ముఖ్యమంత్రి ప్రశ్నిస్తున్నారని ఓ విలేకరి అడుగగా.. తమ హయాంలో సమ్మిట్‌కు అత్యధిక పెట్టుబడులు వచ్చాయన్నారు. రిలయన్స్ అధినేత అంబానీ, గూగుల్ అధినేత కుమారుడు వచ్చారు కదా అంటూ చెప్పారు. ఇప్పుడు దానికి కొనసాగింపే విశాఖ గూగుల్ సంస్థ ఏర్పాటని బొత్స వ్యాఖ్యానించారు.

శంబర ట్రస్టుబోర్డ్ ప్రమాణ స్వీకారం

శంబర(మక్కువ), న్యూస్‌టుడే: శంబర పోలమాంబ అమ్మవారి ట్రస్టుబోర్డ్ ఛైర్మన్‌గా నైదాన తిరుపతిరావు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆధ్వర్యంలో ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం చేశారు. పోలమాంబ అమ్మవారి దర్శనం అనంతరం చదురుగుడి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో రూ.3 కోట్లకు పైగా శంబర అమ్మవారి ఆలయ పరిధిలో అభివృద్ధి పనులు చేశామన్నారు. ప్రస్తుతం ఆలయ విస్తరణ, భక్తుల విశ్రాంతికి షెడ్ల నిర్మాణంతో పాటు ఇతర సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఛైర్మన్‌తో పాటు తీళ్ల సింహాచలం, అక్యాన సింహాచలం, గొట్టాపు భవాని, ఎ.వెంకటేష్, వి.నారాయణమ్మ, ఎస్.సత్యవతమ్మ, జి.లలితకుమారి, సీహెచ్.దాక్షరాణి, వి.రాము ప్రమాణస్వీకారం చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు గుళ్ల వేణుగోపాలనాయుడు, ఈవో బండ్లమూడి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ట్రస్టు బోర్డు సభ్యులతో మంత్రి సంధ్యారాణి

చల్లగాలి వీస్తోంది.. చిన్నారులు జాగ్రత్త

విజయనగరం వైద్య విభాగం, న్యూస్‌టుడే: అయిదేళ్లలోపు పిల్లల్లో న్యుమోనియా లక్షణాలు అధికంగా కనిపిస్తాయని, ఈ వ్యాధి శీతాకాలంలో ఎక్కువగా వ్యాపిస్తుందని డీఎంహెచ్‌వో ఎస్.జీవనరాణి తెలిపారు. న్యుమోనియా నియంత్రణ దినోత్సవం సందర్భంగా బుధవారం తన కార్యాలయంలో అవగాహన కల్పించే గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దగ్గు, జలుబు, జ్వరం, వేగంగా శ్వాస తీసుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. తక్షణమే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం అందించాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాల అధికారి ఆర్.అచ్యుతకుమారి, అదనపు డీఎంహెచ్‌వో కె.రాణి తదితరులు పాల్గొన్నారు.

గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో జీవనరాణి

మోసానికి పాల్పడిన యువకుడి అరెస్టు

నిందితుడిపై 30 కేసులు

రాజాం, న్యూస్‌టుడే: వృద్ధుడిని మోసం చేసి సొమ్ము కాజేసిన నిందితుడ్ని రాజాం పోలీసులు పట్టుకుని జైలుకు పంపారు. సీఐ కె.అశోక్‌కుమార్ వివరాల ప్రకారం.. వంగర మండలం మరువాడ గ్రామానికి చెందిన సింగిరెడ్డి పైడిరాజు ఈనెల 10న రాజాం పట్టణంలోని ఎస్‌బీఐ ప్రధాన బ్రాంచి వద్ద ఏటీఎంలో రూ.98,500 తన కుమారుడి ఖాతాలో జమచేసేందుకు వెళ్లి.. ఎలా చేయాలో తెలియకపోవడంతో పక్కనున్న వ్యక్తి సాయం కోరారు. నిందితుడు తన సొంత ఖాతాలో జమ చేసుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు గుంటూరు జిల్లా వీరంగివారిపాలెం గ్రామానికి చెందిన కాటూరి వెంకటేష్(36) నిందితుడిగా గుర్తించారు. రూ.91,000 రికవరీ చేశారు. ఇతనిపై ఇదే తరహా కేసులు 30 ఉన్నట్లు గుర్తించామని సీఐ వెల్లడించారు.

నిందితుడు వెంకటేష్

ప్రాజెక్టులకు త్వరితగతిన భూసేకరణ

విజయనగరం అర్బన్: ప్రాజెక్టులకు అవసరమైన భూములను వెంటనే సేకరించాలని కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం దూరదృశ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మురుగునీరు శుద్ధి ప్లాంట్లకు పురపాలక సంస్థల్లో ప్రభుత్వ భూములను గుర్తించాలని, లేకుంటే ప్రైవేటుగా తీసుకోవాలన్నారు. 22 బీఎస్ఎన్ఎల్ టవర్లు, డెంకాడ మండలం పెదతాడివాలో విద్యుత్తు సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు.

రెవెన్యూ వసూళ్లు ముమ్మరం చేయండి

విజయనగరం పట్టణం: రెవెన్యూ వసూళ్లను ముమ్మరం చేసి సంస్థల ఆర్థిక పరిపుష్టికి కృషి చేయాలని రీజియన్ పరిధి మున్సిపల్ కమిషనర్లను ఇన్‌ఛార్జి ఆర్డీ పి.నల్లనయ్య ఆదేశించారు. ఈ మేరకు బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ అంశాలపై చర్చించారు. రెవెన్యూ మందకోడిగా ఉన్న పురపాలక సంఘాలు ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు త్వరితగతిన వసూలు చేసి లక్ష్యాలను అధిగమించాలన్నారు.

'పీపీపీపై చర్చకు సిద్ధమా'

గజపతినగరం, న్యూస్‌టుడే: వైద్యవిద్య, బోధనాసుపత్రులపై వైకాపా చేస్తున్న అసత్య ఆరోపణలపై బహిరంగ చర్చకు రావాలని ఆ పార్టీ నేతలకు బుధవారం కార్యకర్తల సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సవాలు విసిరారు. రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేసి, వాటిలో అయిదు ఆసుపత్రుల నిర్మాణాలు చేపట్టి అసంపూర్తిగా వదిలేసి కూటమి ప్రభుత్వంపై బురద జల్లడం సరికాదన్నారు. విజయనగరం కళాశాలను పూర్తి చేసేందుకు రూ.500 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు.

చంద్రబాబు కృషితోనే పరిశ్రమల రాక

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ కృషితోనే ఆంధ్రప్రదేశ్‌లో దిగ్గజ సంస్థలు పరిశ్రమలు పెట్టడానికి ఒప్పందాలు చేసుకుంటున్నాయని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చెప్పారు. విజయనగరం దుప్పాడలో ఎమ్మెల్యే అదితిగజపతిరాజుతో కలిసి బుధవారం ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో నిర్మించిన గృహాలను ఆయన ప్రారంభించారు. ప్రతి నియోజక వర్గంలో పారిశ్రామిక పార్కులు పెడుతున్నామన్నారు. ఎమ్మెల్యే అదితి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలోనే పేదల సొంతింటి కల సాకారమవుతోందని వివరించారు. తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పాలవలస యశస్వి, తహసీల్దారు నీలా కూర్మనాథరావు, ఎంపీడీవో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుకు నమూనా ఇంటి తాళం అందిస్తున్న ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే అదితి

EENADU Classifieds

REAL ESTATE

HOUSE FOR SALE

విజయనగరం-ప్రియనగర్ కాలనీ D-మార్ట్ దగ్గర 167 (30x50) గజాలు G+2 ఉత్తరం ఫేస్ ఇల్లు అమ్మకం. బ్యాంక్ లోన్ సౌకర్యం. సం|| 9441749727.

PLOT FOR SALE

విజయనగరం- విశాఖపట్నం NH-26 కు & రాయపూర్ హైవేకు ప్రక్కన 4 ఊర్లకు మధ్యలో VMRDA అప్రూవ్డ్‌తో Fully గేటెడ్ కమ్యూనిటి లేఅవుట్‌లో Open ప్లాట్లు అమ్మకమునకు కలవు. డైరెక్ట్ కంపెనీ సేల్స్. సంప్ర|| 8883375999.

SECOND SALE

VZMలో GYM అమ్మకంనకు కలదు Cost:10 లక్షలు మాత్రమే ✆ 7075546232.

JOBS

క్రాంట్రాక్ట్ / ఔట్ సోర్సింగ్ పద్ధతిలో వైజాగ్, VZM, SKLM జిల్లాలో మైన్స్, హస్పిటల్స్, బ్యాంక్స్, స్కూల్స్, చెక్ పోస్ట్ ఆపరేటర్స్, అటెండర్స్, డేటాఎంట్రీ & కంప్యూటర్ ఆపరేటర్స్, జూనియర్&రికార్డ్ అసిస్టెంట్స్, P.O's క్లర్క్స్, GNM, స్పీచ్‌థెరపీ, ఫిజియోథెరపీ, ECG&Lab టెక్నీషియన్స్ 10th, ఏదీ డిగ్రీ, ITI, B.Tech. ఆల్ బ్రాంచ్. Age:18 to 42 జీ:20 to 50k M/F ✆9908656555.

మదర్‌ని చూసుకోవడానికి మహిళ కావలెను, లోలుగు, శ్రీకాకుళం జిల్లా జీతం: 13000/ కాంటాక్ట్: 9424933002.

మైపైసా డిజిటల్ చిట్స్‌లో ఉద్యోగ అవకాశాలు (M/F) పోస్ట్: అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్స్, బిజినెస్ అసోసియేట్స్ కావలెను. మార్కెటింగ్ అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత, కొత్తవారికి అవకాశాలు కల్పించబడును. ఇంటర్వ్యూ తేది : 15-11-2025. కొత్తపేట, గౌడ వీధి, వేణుగోపాలస్వామి ఆలయం ఎదురుగా, భారతీ ఎన్‌క్లేవ్ ఫస్ట్ ఫ్లోర్, VZM. ✆7997599996, 9989051745.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

గొల్లపల్లిలో అతిసారం

బాధితుల్లో నలుగురు బాలలు

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పట్టణంలోని గొల్లపల్లి హరిజనవీధిలో అతిసారం లక్షణాలతో పలువురు బాధపడుతున్నారు. రెండు రోజులుగా వాంతులు, విరోచనాలతో ఆసుపత్రుల్లో చేరుతున్నారు. బుధవారం అయిదుగురు బొబ్బిలి సీహెచ్‌సీలో చేరారు. రెయ్యి మహేష్(12), తాన్యశ్రీ (9), కాకల చిరు (8), రామకృష్ణ చికిత్స పొందుతున్నారు. యువకుడు సన్యాసిరావుకు మెరుగుపడడంతో సాయంత్రం ఇంటికి వెళ్లిపోయారు. రెండు రోజుల కిందట కె.రామకృష్ణ, ఆర్.రామకృష్ణ, ఆర్.మహేశ్, తామేశ్వరి చేరారు. వారికి నయం కాగానే మరికొన్ని కేసులు వచ్చాయి. మంగళవారం సాయంత్రం ధరణి (9) చేరగా.. విజయనగరం రిఫర్ చేశారు. నాలుగు రోజుల కిందట వీధిలో జరిగిన ఓ శుభకార్యంలో అల్పాహారం చేశారని, అప్పటి నుంచి వాంతులు, విరోచనాలు మొదలయ్యాయని చెబుతున్నారు. కలుషిత ఆహారమే కారణమని వైద్య సిబ్బంది భావిస్తున్నారు. పురపాలిక సిబ్బంది హరిజనవీధిలో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేశారు. తాగునీటి పరీక్షలు నిర్వహించారు. కాలనీలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పరిస్థితి అదుపులో ఉందని కమిషనర్ రామలక్ష్మి అన్నారు. తహసీల్దారు ఎం.శ్రీను కాలనీని పరిశీలించి, స్థానికులతో మాట్లాడారు.

చికిత్స పొందుతున్న రెయ్యి మహేష్

అస్వస్థతకు గురైన తాన్యశ్రీ

చదువుకోమంటే.. తనువు చాలించాడు

కొమరాడ, న్యూస్‌టుడే: పిల్లల భవిష్యత్తు ఉన్నతంగా ఉండాలని.. వారికి తమ కష్టాలు రాకూడదని శ్రమిస్తున్నారు ఆ తల్లిదండ్రులు.. పొలాన్ని నమ్ముకుని పంట దిగుబడులే ఆధారంగా ఇద్దరు కుమారుల్ని చదివిస్తున్నారు. బిడ్డల భవిష్యత్తు బాగుంటుందని కలలు కంటున్న తరుణంలో కుమారుడు కళాశాలకు వెళ్లకుండా బయట తిరుగుతున్నాడని తెలుసుకుని ఆవేదనతో మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన బాలుడు క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకుని కన్నవారికి తీరని శోకాన్ని మిగిల్చాడు. ఈ విషాద ఘటన కొమరాడ మండలంలో చోటుచేసుకుంది.

పోలీసుల వివరాల ప్రకారం..

మండలంలోని గుమడ సీతమాంబపురం గ్రామానికి చెందిన బాలకృష్ణ, సుగుణ దంపతుల మొదటి కుమారుడు వర్ధన్ బీటెక్, రెండో బాబు వై.ధనుష్(16) కొమరాడ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. కాగా ధనుష్ రోజూ కళాశాలకు వెళ్లకుండా బయట తిరుగుతున్నాడని తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన బాలుడు కన్నవారు పొలానికి వెళ్లిన సమయంలో ఇంట్లో పురుగు మందుతాగి, పక్కింటి వాళ్లకి చెప్పాడు. కుటుంబీకులు చేరుకుని కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అక్కడి నుంచి జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎన్నో ఆశలతో అల్లారుముద్దుగా పెంచిన బిడ్డ మృతితో తల్లిదండ్రులు విలపిస్తున్నారు. ఇన్‌ఛార్జ్ ఎస్సై ఎల్ఆర్ నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధనుష్(పాతచిత్రం)

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97609

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80081 11237

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	125	220	230

పసిబిడ్డ మృతిపై ఆందోళన

విశాఖపట్నం(వన్‌టౌన్), న్యూస్‌టుడే: కింగ్‌జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్) పిల్లల వార్డులో ఆరు నెలల మగబిడ్డ మృతి చెందిన ఘటనపై బుధవారం బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యమే కారణమని వారు ఆరోపించారు. ఆ వివరాలు... పార్వతీపురం మన్యం జిల్లా, గుమ్మలక్ష్మీపురం మండలం వంగర గ్రామానికి చెందిన వై.అఖిల్ దంపతులకు ఆరు నెలల కిందట మగబిడ్డ (ధన్వీర్) జన్మించాడు. ఆ బిడ్డ అనారోగ్యం బారిన పడడంతో తొలుత పార్వతీపురంలో ఆసుపత్రికి, అక్కడ నుంచి విజయనగరంలో ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో 8వ తేదీ రాత్రి కేజీహెచ్‌కు తీసుకొచ్చి పిల్లల వార్డులో చేర్పించారు. బ్లడ్ ఇన్‌ఫెక్షన్ కారణంగా బిడ్డ ఇబ్బంది పడుతున్నాడని చెప్పిన వైద్యులు, అవసరమైన చికిత్స అందించారు. బుధవారం ఉదయం ఆరోగ్యం విషమించడంతో బిడ్డ మృతి చెందాడు.

● అయితే ఆసుపత్రికి వచ్చిన తర్వాత బిడ్డకు రెండుసార్లు మూర్ఛ వచ్చినా, వైద్యులు సమాచారం ఇవ్వలేదని, ఎలాంటి చికిత్స అందించారో చెప్పలేదని, బిడ్డ మృతి చెందే వరకు ఆరోగ్య స్థితి మెరుగ్గానే ఉందంటూ మోసం చేశారని బాధిత కుటుంబీకులు ఆందోళనకు దిగారు. న్యాయం చేయాలని కోరుతూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిరసన కొనసాగించారు.

● ఆసుపత్రి సీఎస్ఆర్ఎంవో డాక్టర్ శ్రీహరి స్పందించి బాధితులు, వైద్యులతో మాట్లాడారు. జరిగిన పరిణామాలు బాధిత కుటుంబీకులకు వివరించడంతో వారు శాంతించారు. అనంతరం అంబులెన్స్ ఏర్పాటు చేయడంతో బిడ్డ మృతదేహాన్ని తీసుకుని స్వగ్రామానికి వెళ్లారు.

బాధితులు, వైద్యులతో మాట్లాడుతున్న సీఎస్ఆర్ఎంవో శ్రీహరి

(c) eenadu

గుర్రపుడెక్క కప్పేసింది!

పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలకు సాగునీరందించే తోటపల్లి కుడి ప్రధాన కాలువ ఇది. గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర వద్ద నాగావళి కాలువలో గుర్రపుడెక్క, పిల్లి తామర బాగా వ్యాపించాయి. ఇటీవల తుపాను వర్షాలకు కాలువ షట్టర్ల వద్దకు వచ్చి నిలిచిపోవడంతో సిబ్బందికి నిర్వహణ కష్టమవుతోంది. గేట్ల వద్ద సాగునీరు పోయేలా గుర్రపుడెక్క తొలగిస్తామని ప్రాజెక్టు ఏఈ కిశోర్ తెలిపారు. – న్యూస్‌టుడే, గరుగుబిల్లి గ్రామీణం

సొంతగూడు లేక సతమతం

అంగన్‌వాడీ భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో అద్దె భవనాల్లో నిర్వహించాల్సి వస్తోంది. ఏళ్లుగా శిథిల భవనాలకు మరమ్మతులు, నూతన భవనాల నిర్మాణం చేపట్టడం లేదు. కందులపదం పంచాయతీ మడతనవలసలోని భవనం ఇలా శిథిలావస్థకు చేరుకోగా ప్రస్తుతం ఓ అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. సాలూరు మండలంలో 62 సొంత భవనాలుండగా, ప్రస్తుతం అయిదు ఇలా ఖాళీ చేసి అద్దె ఇళ్లలో నిర్వహిస్తున్నారు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించామని సీడీపీవో మంగమ్మ తెలిపారు. – న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

వంతెన వద్ద రక్షణ ఏదీ?

గరుగుబిల్లి మండలంలోని తోటపల్లి ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాల సమీప రహదారి వంతెన శిథిలావస్థకు చేరి కూలిపోయింది. మలుపు వద్ద చోదకుడు ఏమాత్రం ఆదమరిచినా.. వాహనంతోపాటు లోతైన నదిలో పడే ప్రమాదం ఉంది. పాత వంతెన ఇరుగ్గా ఉండటం వల్ల వాహనాలకు తగిలి గోడ పాడవుతోందని, బాగు చేయిస్తామని ర.భ.శాఖ డీఈఈ రామ్మోహనరావు 'న్యూస్‌టుడే'తో అన్నారు. – న్యూస్‌టుడే, గరుగుబిల్లి గ్రామీణం

సచివాలయానికి దారేది!

పాలకొండలోని నీలమ్మ కాలనీ వార్డు సచివాలయానికి వెళ్లాలంటే స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ కాలువలు అధ్వానంగా ఉండడంతో.. నీరు రహదారులపై ప్రవహిస్తోంది. సచివాలయ వీధి, ప్రభుత్వ ఆసుపత్రి, నీలమ్మ కాలనీ రహదారి తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఉంది. దీంతో రాకపోకలు సాగించేందుకు నిత్యం ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. నీరు రోడ్లపై ప్రవహించకుండా చర్యలు తీసుకుంటామని కమిషనర్ రత్నరాజ్ పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

ఆగిన పనులు.. తేలిన రాళ్లు

తాళ్లబురిడి నుంచి జమదాల వరకు చేపట్టిన తారు రోడ్డు నిర్మాణం సగంలో ఆగింది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం 3.4 కి.మీ మేర రహదారికి రూ.2.80 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు గుత్తేదారు రాళ్లు వేసి, బిల్లుల సమస్యతో వదిలేశారు. నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని పీఆర్ ప్రాజెక్టు డీఈఈ నాగేశ్వరరావు అన్నారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

లారీకి నిప్పు.. తప్పిన ముప్పు

పార్వతీపురం పట్టణం, కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: చిన్నపాటి తప్పిదం పెద్ద ప్రమాదాన్ని తెచ్చిపెట్టింది. స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తం కావడంతో ముప్పు తప్పిన ఘటన పార్వతీపురం పట్టణంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. బెలగాం శివారులో ఓ ప్రైవేటు పాఠశాలకు వెళ్లే మార్గంలో లారీపై జేసీబీ తరలిస్తున్నారు. పక్కనే ఉన్న విద్యుత్తు తీగలకు యంత్రం తగలడంతో మంటలు చెలరేగి.. లారీకి నిప్పు అంటుకుంది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

అనుమతులు లేకుంటే కూల్చేస్తాం

పాలకొండ, న్యూస్‌టుడే: నగర పంచాయతీ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కూల్చేస్తామని కమిషనర్ రత్నరాజ్ బుధవారం స్పష్టం చేశారు. ముందస్తు అనుమతులు తీసుకున్న తర్వాత మాత్రమే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ కాంప్లెక్సు ఎదురుగా ఉన్న అనుమతిలేని నిర్మాణాలను తొలగించారు.

14న న్యాయ అవగాహన సదస్సు

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: నర్సిపురంలో ఈనెల 14న న్యాయ అవగాహన సదస్సు నిర్వహిస్తామని రెండో అదనపు న్యాయమూర్తి, మండల న్యాయసేవ కమిటీ అధ్యక్షుడు ఎస్.దామోదరరావు బుధవారం తెలిపారు. ఈనెల 14న బాలల దినోత్సవం సందర్భంగా ఉన్నత పాఠశాల ఆవరణలో మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

వస్తున్నారండీ.. కొత్త వైద్యులు

త్వరలో తీరనున్న కొరత

–న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

కూటమి ప్రభుత్వం పేదల వైద్యానికి శ్రద్ధ చూపుతోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలకు అవసరమైన ఆధునిక పరికరాలు సమకూర్చుతోంది. అదేవిధంగా సీహెచ్‌సీలు, ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రుల్లో వైద్యుల ఖాళీలను కొంతమేర భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇన్‌సర్వీసు పీజీ చేసిన వైద్య నిపుణులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 227 మంది స్పెషలిస్టులకు పోస్టింగ్‌లు ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. 142 సెకండరీ ఆసుపత్రులకు కొత్త వైద్యులను కేటాయించనుంది. జిల్లాకు కొంతమంది కొత్త వైద్యులు వచ్చే అవకాశం ఉండటంతో మెరుగైన సేవలకు ఆస్కారం ఉంటుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పడకలు తక్కువ.. రోగులు ఎక్కువ

జిల్లా పరిధిలో వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో నడిచే మూడు సీహెచ్‌సీలు, మూడు ప్రాంతీయ, ఒక జిల్లా ఆసుపత్రి ఉన్నాయి. వీటిలో ప్రతిరోజు ఓపీ 2,300 నుంచి 2,500 వరకు నమోదవుతోంది. 600 పడకలు ఉన్నాయి. ఇన్‌పేషెంట్లు 550 నుంచి 650 మంది వరకు ఉంటున్నారు. జిల్లా ఆసుపత్రిలో 150 పడకలకు నిత్యం 300 మంది ఉంటున్నారు. సీజనల్ వ్యాధుల కాలంలో ఆ సంఖ్య 410-430కు చేరుతోంది.

రద్దీగా పార్వతీపురం ఆసుపత్రి చిన్న పిల్లల వార్డు

ఖాళీలు ఇలా..

జిల్లాలోని అన్ని ఆసుపత్రుల్లో సుమారు 12 వరకు వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం కొత్త వైద్యుల నియామకానికి పచ్చజెండా ఊపడంతో సుమారు 10 పోస్టులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అలాగైతే దాదాపుగా భర్తీ అయినట్లే.

ఈ విషయాన్ని డీసీహెచ్‌ఎస్ నాగభూషణరావు వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా.. కొత్త పోస్టులు రానున్నాయని, ఏయే స్పెషలిస్టులు అన్నది ఇంకా నివేదిక రావాల్సి ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న మేరకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు.

గురుకుల పాఠశాలలో విచారణ

పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: కురుపాం గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ఇద్దరు విద్యార్థినుల మరణాలతోపాటు పదుల సంఖ్యలో బాలికలు అనారోగ్యంతో ఆసుపత్రి పాలవ్వడంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ విచారణ చేపట్టింది. దర్యాప్తు విభాగం నుంచి యతి ప్రకాశ్‌శర్మ, సంజయ్ కుమార్‌తో కూడిన బృందం బుధవారం కురుపాం పాఠశాలను పరిశీలించారు. ఘటనకు దారి తీసిన కారణాలను వైద్యాధికారులు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ విజయలక్ష్మి, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబాలను కలిసి వివరాలు సేకరించారు. విద్యాశాఖ అధికారులు ఉన్నారు.

న్యుమోనియా లక్షణాలు గుర్తించాలి

అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: పిల్లల్లో న్యుమోనియా లక్షణాలు గుర్తించి సకాలంలో తగిన చికిత్స అందించాలని డీఎంహెచ్‌వో భాస్కరరావు సూచించారు. బుధవారం ప్రపంచ న్యుమోనియా నియంత్రణ దినం సందర్భంగా బెలగాం 17 వార్డు బంగారమ్మ కాలనీలో అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్నారుల్లో శ్వాస సంబంధ సమస్యల్లో న్యుమోనియా ప్రాణాంతకమైందని డీఎంహెచ్‌వో వివరించారు. గోడపత్రికలను ఆవిష్కరించారు. డీఐవో విజయమోహన్, ప్రోగ్రాం అధికారులు జగన్‌మోహన్, రఘుకుమార్, సూర్య కౌశిక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆపదలో సహాయ నిధి అండ

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్న నిరుపేదలకు సీఎం సహాయనిధి అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. కురుపాం, గరుగుబిల్లికి చెందిన ఆరుగురు బాధితులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను గుమ్మలక్ష్మీపురంలో అందించారు. నరేష్, రంజిత్‌కుమార్, కొండయ్య తదితరులు ఉన్నారు. ★ పార్వతీపురం గ్రామీణం: నియోజకవర్గంలోని వివిధ గ్రామాల బాధితులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.81 లక్షల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే బి.విజయచంద్ర అందించారు. స్థానిక తెదేపా కార్యాలయంలో చెక్కులు అందించి, ధైర్యం చెప్పారు. నాయకులు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

17లోగా టెండర్లు వేయండి

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని చెరువుల్లో చేప పిల్లలను పెంచుకునేందుకు ఔత్సాహిక కమిటీలు ఈనెల 17లోగా టెండర్లు వేయాలని జిల్లా మత్స్యశాఖ అధికారి పి.సంతోష్‌కుమార్ తెలిపారు. తోటపల్లి జలాశయంలో 10 వేల చేప పిల్లలను ఇటీవల వేశామన్నారు. వెంగళరాయ సాగరంలో మరో 4 వేలు వేసేందుకు సిద్ధం అవుతున్నట్లు చెప్పారు. ఇవి కాకుండా జిల్లాలో 110 చెరువులు ఉన్నాయని, వాటిలో చేప పిల్లలు వేసుకునేందుకు ఈనెల 7 నుంచి టెండర్లు వస్తున్నాయని చెప్పారు.

సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

లప్పటిలో రిబ్బను కత్తిరిస్తున్న జగదీశ్వరి

లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

పార్వతీపురం పట్టణం, పురపాలక, గుమ్మలక్ష్మీపురం, పాలకొండ, న్యూస్‌టుడే: ఒక వైపు పేదల సంక్షేమం, మరోవైపు రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. బుధవారం పట్టణంలోని జగన్నాథపురంలో జరిగిన గృహ ప్రవేశ కార్యక్రమంలో మాట్లాడారు. సమస్యలు ఏమైనా ఉంటే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి గృహాలను అందించడమే పీఎంఏవై 2.0 పథకం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పేదలు తమ సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు ఇది గొప్ప అవకాశం అన్నారు. పురపాలక పరిధిలో 340 మందికి ఇళ్లు మంజూరు చేశామంటూ లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. సబ్ కలెక్టరు వైశాలి, భాజపా జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టరు లక్ష్మణరావు, జి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. పేదలందరికీ పక్కా ఇళ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలం లప్పటిలో 3 లక్షల ఇళ్ల గృహ ప్రవేశాల కార్యక్రమం నిర్వహించారు. మండంగి సనారమ్మ ఇంటిని రిబ్బను కత్తిరించి ప్రారంభించారు. ప్రత్యేకాధికారిణి కనకదుర్గ, డీఈఈ వెంకటరావు, ఎంపీడీవో లక్ష్మి, కూటమి నాయకులు ఉన్నారు. పాలకొండ మండలం నవగాం గ్రామంలో గృహనిర్మాణశాఖ ఈఈ జి.రవి ఆధ్వర్యంలో గృహ ప్రవేశాల కార్యక్రమం నిర్వహించారు. పాలకొండ పట్టణంలో అర్బన్ హౌసింగ్ నూతన గృహాలకు భూమిపూజ చేశారు. 93 గృహాలు ఈ పథకంలో మంజూరైనట్లు ఈఈ తెలిపారు.

నవగాంలో నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న అధికారులు

ఉపాధికొస్తే.. ఊపిరి పోయింది

బలిజిపేట, న్యూస్‌టుడే: కుటుంబ పోషణకు లారీ చోదకుడిగా మారిన ఆయన ప్రాణం ఊరుకాని ఊరిలో ఆగింది. పోలీసుల వివరాల మేరకు.. పశ్చిమ గోదావరి జిల్లా కొయ్యలగూడెంకు చెందిన దారపురెడ్డి భాస్కరరావు(58) సిమెంటు లోడుతో ఒంటరిగా బలిజిపేటకు సోమవారం సాయంత్రం వచ్చారు. సిమెంటు అన్‌లోడ్ చేసేందుకు మంగళవారం ఉదయం నుంచి ఫోన్ చేసినా ఆయన స్పందించలేదు. ఈ లోపు లారీ తలుపులు వేసి ఉండటం, అందులో మనిషి ఉండటాన్ని గుర్తించిన స్థానిక కళాసీలు సిమెంటు కంపెనీ, ట్రాన్స్‌పోర్టు యాజమాన్యానికి సమాచారం ఇచ్చారు. వారు పోలీసులతో వచ్చి పరిశీలించగా భాస్కరరావు విగతజీవిగా కనిపించారు. గుండెపోటుతో మృతిచెంది ఉంటారని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఏఎస్సై శశికుమార్ కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని..

పార్వతీపురం పట్టణం, జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: భార్య కన్నవారింటికి వెళ్లిపోయిందని మనస్తాపం చెందిన భర్త పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన జియ్యమ్మవలస మండలంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. తురకనాయుడువలసకు చెందిన సిద్ధ దంపతుల మధ్య కొన్నాళ్లుగా గొడవలు ఉన్నాయి. ఇటీవల కోపంతో ఆయన భార్యను కొట్టాడు. దీంతో అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. తిరిగి రాకపోవడంతో పురుగు మందు తాగాడు. కుటుంబీకులు గమనించి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతానికి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

వ్యక్తికి తీవ్ర గాయాలు

కొమరాడ, న్యూస్‌టుడే: మండలంలోని సూర్యపీఠం వద్ద నడిచి వెళ్తున్న స్థానికుడు ఆర్.వంశీకృష్ణను ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడినట్లు ఇన్‌ఛార్జి ఎస్సై ఎల్ఆర్ నాయుడు బుధవారం చెప్పారు. కాళ్లకు గాయాలు కాగా జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు వెల్లడించారు.

PUBLIC NOTICE

Under the instructions of my client **M/S SHRIRAM FINANCE LIMITED, Parvathipuram Branch, Parvathipuram Manyam District,** I issue the following notice to general public. My client intends to grant loan to **SMT. PATHIVADA BHAVANI** W/o P Venkata Rao by keeping the below mentioned schedule property as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, mortgages Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices. Otherwise, later objections will not bind my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

Erstwhile Vizianagaram District, Presently Parvathipuram Manyam District, Parvathipuram Mandalam, Addapuseela Gram panchayat and village accounts covered by S. Nos. 151-1A & 151-3A part in which Plot No.599 measuring East to West 15 feet or 4.57 meters and North to South 50 feet or 15.25 meters totaling 83.33 Sq. yards or 69.99 Sq. meters of vacant site is bounded by:

East	Plot No.600 site
South	Road
West	Plot No.598 site
North	Plot no.591 site

KODURI SREENIVASA RAO
SMT. SIVA KUMARI JALADI
Advocates,
S-2, Bharat Apartments,
Seethammadhara,
Visakhapatnam-13.
Mobile No. **9885166648**
Mail: **sreenivaskoduri@gmail.com**

Visakhapatnam
Dt.12.11.2025

చిత్తశుద్ధితో పనిచేయాలి

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని పంచాయతీల్లో పారిశుద్ధ్య సిబ్బంది పనులను చిత్తశుద్ధితో చేయాలని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి(డీపీవో) టి.కొండలరావు అన్నారు. వెంకంపేట పంచాయతీ కాలనీలో పనుల తీరును పరిశీలించారు. కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పడి ఉండటంపై పారిశుద్ధ్య సిబ్బందిని ప్రశ్నించారు. ఇకపై ఇలానే కనిపిస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ఎంపీడీవో సత్యం, ఉప ఎంపీడీవో పాపారావు, సర్పంచి టి.కృష్ణారావు పాల్గొన్నారు.

బాలల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: బాలల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎ.సత్యనారాయణ అన్నారు. అంతర్జాతీయ దత్తత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం బాలల సంరక్షణ, ప్రత్యేక దత్తత సిబ్బందితో సమావేశమై, మాట్లాడారు. పిల్లలు లేని తల్లిదండ్రులకు దత్తత ఏ విధంగా చేసుకోవాలి, ఎలా దరఖాస్తు చేసుకోవాలి తదితర విషయాలపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా బాలల సంరక్షణ లీగల్ అధికారి పి.శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

సీతానగరం: బూర్జ పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ సభ్యులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అధ్యక్షుడిగా పి.గౌరునాయుడు, సభ్యులుగా చిన్నంనాయుడు, పి.వెంకటనాయుడుతో సీఈవో సత్యారావు ప్రమాణ స్వీకారం చేయించారు. తెదేపా మండల అధ్యక్ష, కార్యదర్శులు సత్యంనాయుడు, వేణుగోపాలనాయుడు, కె.బలరాం, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

శస్త్రచికిత్సలకు 31 మంది ఎంపిక

వీరఘట్టం, న్యూస్‌టుడే: మండలంలోని చిట్టపుడివలస కూడలి వద్ద శ్రీ సత్యసాయి నిత్య అన్నపూర్ణ సేవా సమితి భవనం ఆవరణలో బుధవారం ఉచిత నేత్ర తనిఖీలు నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన నేత్ర పరీక్షలకు 51 మంది హాజరవ్వగా.. 31 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని విశాఖ శంకర్ ఫౌండేషన్‌కు తరలించారు. నేత్ర వైద్య నిపుణుడు ఎస్.జాక్సన్ పరీక్షలు జరిపారు. క్యాంపు ఇన్‌ఛార్జి వెంకటరమణ పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని డీసీహెచ్‌ఎస్ జి.నాగభూషణరావు బుధవారం తనిఖీ చేశారు. రక్త పరీక్షలు నిర్వహించే ల్యాబ్, మందుల గది, ఎక్స్‌రే ప్లాంట్‌ను పరిశీలించారు. ఆసుపత్రి సమస్యలపై అభివృద్ధి కమిటీ సభ్యులతో మాట్లాడారు. సూపరింటెండెంటు కృష్ణచైతన్య, వైద్యులు దుర్గాప్రసాద్, రమ్య ఉన్నారు.

వాణిజ్యంపై అవగాహన పెంచుకోండి

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు వాణిజ్య రంగంపై అవగాహన పెంచుకోవడం చాలా అవసరమని ప్రిన్సిపల్ ఎం.శ్యాంబాబ్ పేర్కొన్నారు. పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ అకౌంటింగ్ దినోత్సవాన్ని నిర్వహించారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉప ప్రధానాచార్యులు బి.జయమణి, వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి పి.రాజ్యలక్ష్మి, బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

కష్టకాలంలో పనిచేసేవారికే పదవులు

గ్రామ, వార్డు, బూత్ ఇన్‌ఛార్జులతో ప్రమాణం చేయిస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, మక్కువ, న్యూస్‌టుడే: కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసేవారికే పదవులని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శంబర గ్రామంలో నియోజకవర్గ తెదేపా సమావేశం బుధవారం నిర్వహించారు. గ్రామ, వార్డు, బూత్, క్లస్టర్, మండల, పట్టణ కమిటీ సభ్యులుగా నియమితులైన వారితో పదవీ ప్రమాణం చేయించి, మాట్లాడారు. తెదేపా పట్టణ, సాలూరు, పాచిపెంట, మక్కువ, మెంటాడ మండల అధ్యక్షులుగా నిమ్మాది చిట్టి, ఎ.పరమేశు, జి.యుగంధర్, జి.వేణుగోపాల్, సీహెచ్ వెంకటరావులను నియమించామన్నారు. స్థానిక ఎన్నికల్లో శతశాతం ఫలితాలే లక్ష్యంగా పనిచేయాలని వారికి సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా

పార్వతీపురం జిల్లా జట్టుతో ఉపాధ్యాయులు

పార్వతీపురం పట్టణం, వీరఘట్టం, సీతంపేట, న్యూస్‌టుడే: జన జాతీయ గౌరవ్ దివస్ కార్యక్రమంలో భాగంగా ఐటీడీఏల పరిధిలోని గిరిజన విద్యార్థులకు విశాఖలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో జిల్లా జట్టు సత్తాచాటింది. బుధవారం జరిగిన తుది పోటీల్లో జిల్లా బాలుర జట్టు.. రంపచోడవరం జట్టుపై విజయం సాధించి బంగారు పతకం అందుకుంది. బాలికల జట్టుకు మూడో స్థానం దక్కింది. స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ వాసుదేవరావు నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ★ ఇదే పోటీల్లో వీరఘట్టం మండలం గంగంపేట గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థులు నిమ్మక విశాల్ వక్తృత్వ, నిమ్మక వంశీ వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానం సాధించినట్లు గైడ్ టీచర్ వై.కైలాసరావు తెలిపారు. ★ విశాఖలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిజన విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించారని ఐటీడీఏ క్రీడా అధికారి ఎన్.జాకోబ్‌దయానందం తెలిపారు.

జ్ఞాపిక అందుకుంటున్న సీతంపేట ఐటీడీఏ విద్యార్థులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ.
జిల్లా పౌర సరఫరాల మేనేజర్ వారి కార్యాలయము
సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణం, పౌరసరఫరాల సంస్థ భవనము. పార్వతీపురం.

టెండరు ప్రకటన

రిఫ్. నెం. Mktg/A8/Proc./13/Khariff 2025-26 తేది. 13.11.2025

ఖరీఫ్ 2025-26 సీజన్‌కు సంబంధించి, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో భాగంగా, అకాల వర్షాల వలన ధాన్యం తడవకుండా ఉండుటకు గాను అవసరమయ్యే టార్పాలిన్‌ల కొనుగోలు కొరకు ఇ-టెండర్లు కోరబడుచున్నవి. టెండర్ ప్రక్రియ వివరములు అన్నియు www.apeprocurement.gov.in నుండి డౌన్ లోడ్ చేసుకొనవచ్చును.

టెండరు షెడ్యూలు

1.	టెండరు ఫారము డౌన్ లోడింగ్ ప్రారంభపు తేదీ:	ది. 13.11.2025 సాయంత్రం గం. 05.00 నుండి
2.	టెండరు ఫారము డౌన్ లోడింగ్ ముగింపు తేదీ:	ది. 20.11.2025 సాయంత్రం గం. 05.00 నుండి
3.	టెండరు ఫారము దాఖలు చేయుటకు చివరి తేదీ:	ది. 21.11.2025 సాయంత్రం గం. 5.00 వరకు
4.	టెండర్లు తెరచు తేదీ:	ది. 25.11.2025 ఉదయం గం. 11.00

సం/- జాయింట్ కలెక్టర్, పార్వతీపురం మన్యం జిల్లా.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

సీతానగరం, న్యూస్‌టుడే: జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని సీతానగరం ఎమ్మార్సీలో బుధవారం మండల స్థాయి పోటీలను నిర్వహించినట్లు ఎంఈవో-2 వెంకటరమణ తెలిపారు. మండలంలోని ఆరు ఉన్నత పాఠశాలల విద్యార్థులు నృత్యం, నాటికల విభాగంలో పోటీపడినట్లు చెప్పారు. కేజీబీవీ(థింసా), మరిపివలస(జాతీయ గేయం), సీతానగరం(బృంద గీతం) ఉన్నత పాఠశాలల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో బహుమతులు గెలుచుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఎంపీడీవో వెంకటరావు, ఎంఈవో సూరి దేముడు తదితరులు పాల్గొన్నారు. ★ జియ్యమ్మవలస: జియ్యమ్మవలస ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో-2 ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండలస్థాయి ఆటలు పోటీలు నిర్వహించారు. ★ వీరఘట్టం: వీరఘట్టం బాలికోన్నత పాఠశాలలో ఎంఈవో ఆనందరావు పర్యవేక్షణలో మండలస్థాయి పోటీలు జరిగాయి. నృత్యం, పాటలు, స్కిట్ పోటీల్లో బిటివాడ, వండువ, నడిమికెల్ల పాఠశాలలకు చెందిన బృందాలు ప్రథమ స్థానాలు సాధించాయి.

బాలికల థింసా నృత్యం

OFFICE OF THE DISTRICT BLINDNESS CONTROL SOCIETY-PARVATHIPURAM MANYAM

Rc.No 15/NPCB&VI/DM&HO/SCES/DBCS/PPM/2025-26 Dated:12.11.2025

SHORT TENDER NOTIFICATION

The sealed tenders are invited from the standard agencies manfactures and registered for supply of **SPECTACLES** with the following specification to **DISTRICT PROGRAMMEMANAGER, DISTRICT BLINDNESS CONTROL SOCIETY, PARVATHIPURAM MANYAM.** For supply to School Children Eye Screening Programme 2025-26.

SPECTACLES QUALITY SPECIFICATIONS

1. Frame TR-90/Polycarbonate Full Frame with Spring Action in Legs (Boys & Girls with Different Colours)
2. Lenses CR39 (Plastic Lenses)
3. Frame Size(s): 32/34/36/38/40/42/44/46
4. Cleaning Cloth with good quality for cleaning the lens.
5. Hard case fixed with sticker on front side of the frame box as following

1. National programme for Control of Blindness & Visually Impaired along with logo
2. District Name :
3. Name of the school :
4. Village/Town :
5. Name of the Student :
6. Student ID :
7. Class/Sex
8. Power of the Lens: RE.......... LE.........

The Tender application forms will be issued from **Dt: 14.11.2025 To 18.11.2025** at DISTRICT BLINDNESS CONTROL SOCIETY (DBCS), O/o The DISTRICT MEDICAL & HEALTH OFFICE, Parvathipuram Manyam. Last date to submit filled in application is on **Dt: 18.11.2025** by 5 PM. Date of opening of tenders **Dt: 19.11.2025** at 10 AM at O/o Chamber of Joint Collector, Collectorate, Parvathipuram. Cost of Tenders application is **Rs. 500/-** (Five Hundred Rupees) by cash. EMD amount will be **Rs. 5000/-** (Five Thousand Rupees only) Non-Refundable per Bidder to be paid through Demand Draft in favour of THE DISTRICT BLINDNESS CONTROL SOCIETY, PARVATHIPURAM. While submitting for the Tender No correspondence will be entertained in this regard. The District Procurement Committee decision is final in deciding the spectaclesas for the standards for further details contact D.B.C.S, PARVATHIPURAM MANYAM: 7382194363.

District Programme Manager, DBCS Parvathipuram	District Medical and Health Officer, Vice-Chairman, DBCS Parvathipuram	Joint Collector DPC, Chairman Parvathipuram	District Collector and Chairman DBCS Parvathipuram

మన పంట.. మనమే అమ్ముకుందాం

కొమరాడ, కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: అటవీ ప్రాంతాల్లో సాగు చేసిన ఉత్పత్తులను మనమే అమ్ముకుందామని.. ప్రతి పంట జీసీసీ కొనుగోలు చేస్తుందని జీసీసీ డివిజనల్ ప్రబంధకుడు రామారావు అన్నారు. మంగళవారం పెదశాఖలో అటవీ ఉత్పత్తులపై గిరిజనులకు అవగాహన కల్పించారు. గిరిజనం కోసమే గిరిజన సహకార సంస్థ పుట్టిందని, మధ్యవర్తుల మాటలు విని ఆర్థికంగా మోసపోవద్దన్నారు. ఏ పంటకు ఎంత ధర నిర్ణయించారో వివరించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ ఎం.సాంబశివరావు, ఎ.మంగ, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

కురుపాంలో అవగాహన కల్పిస్తున్న జీసీసీ అధికారులు

ప్రైవేటీకరణతో పేదలకు విద్య దూరం

కురుపాంలో పుష్పశ్రీవాణి, నాయకుల ర్యాలీ

కురుపాం గ్రామీణం, కలెక్టరేట్ ప్రాంగణం, సాలూరు, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో పేదలకు వైద్య విద్య దూరం అవుతుందని మాజీ ఉపముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి అన్నారు. కురుపాంలో నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పార్వతీపురం పట్టణంలో మాజీ ఎమ్మెల్యే జోగారావు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. జేసీకి వినతి పత్రాన్ని అందించారు. పాలకొండ పట్టణంలోని కార్గిల్ కూడలిలో వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పూలమాలలు వేసి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యాలయ పరిపాలనాధికారి సావిత్రికి వినతిపత్రం అందించారు.

దుస్తుల పంపిణీ

వీరఘట్టం: విక్రమపురం గ్రామంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, నటుడు సాకేటి కృష్ణమూర్తినాయుడు సంస్మరణ సభ బుధవారం నిర్వహించారు. 225 మంది పురుషులకు కుటుంబ సభ్యులు దుస్తులు అందించారు.

సేవలు విస్తరించాలి

పార్వతీపురం గ్రామీణం: జిల్లాలో 104 సేవలను విస్తరించాలని జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి పద్మావతి అన్నారు. అడ్డూరివలసలో శిబిరాన్ని తనిఖీ చేశారు. ఓపీ, మందుల నిల్వను పరిశీలించారు.

(c) eenadu

గ్యాస్ ఏజెన్సీలపై కఠిన చర్యలు: డీఎస్వో

ఈనాడు కథనానికి స్పందన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్యాస్ సిలిండర్ల డెలివరీ బాయ్స్ వినియోగదారుల నుంచి అదనపు వసూళ్లకు పాల్పడుతున్న వైనంపై 'ఈనాడు'లో బుధవారం 'గ్యాస్ సిలిండర్లపై అదనపు బాదుడు' శీర్షికన ప్రచురితమైన కథనంపై జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు స్పందించారు. గ్యాస్ సిలిండర్ల సరఫరాలో డెలివరీ బాయ్స్ అదనపు వసూలు చేస్తూ వినియోగదారులను ఇబ్బంది పెట్టిన ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు డీఎస్వో పద్మశ్రీ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ ఇప్పటికే ఎనిమిది 6ఏ కేసులు నమోదు చేయడం ద్వారా 56 సిలిండర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. కొన్ని గ్యాస్ ఏజెన్సీల్లో అదనపు వసూళ్లకు పాల్పడిన డెలివరీ బాయ్స్‌ను తొలగించినట్లు ఆమె పేర్కొన్నారు.

14న ఉద్యోగ మేళా

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలు నగరంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 14వ తేదీన ఉదయం 10 గంటలకు ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి కె.రమాదేవి తెలిపారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు కలిగి ఐటీఐ, డిప్లొమా, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ అర్హత కలిగినవారు మేళాకు అర్హులన్నారు. ఆసక్తి గలవారు తమ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని ఆమె ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఇలా వచ్చారు.. అలా వెళ్లారు!

- పంట నష్టాలపై కేంద్ర బృందం పర్యటనపై విమర్శలు
- రైతుల వివరాల ధ్రువీకరణలో అధికార యంత్రాంగం

నాగులుప్పలపాడులో పంట నష్టాలపై కేంద్ర బృందానికి వివరిస్తున్న కలెక్టర్ రాజాబాబు, జేసీ గోపాలకృష్ణ, అధికారులు

ఈనాడు, ఒంగోలు

మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు, నష్టం అంచనా వేసేందుకు జిల్లాకు వచ్చిన కేంద్ర బృందం కేవలం మూడు గంటల సమయం మాత్రమే పరిశీలించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకరోజైనా కేటాయించకుండా ముగించడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మూడున్నర గంటలకు కలెక్టరేట్‌కు వచ్చిన బృందం సభ్యులు ఒక గంట పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చూశారు. తొలుత కొత్తపట్నం మండలం అల్లూరు వెళ్లి పంటలను చూశారు. ఆ తరువాత నాగులుప్పలపాడు వెళ్లేసరికి చీకటి పడింది. అక్కడ పత్తి పంటలను పరిశీలించిన బృంద సభ్యులు పంటలు బాగానే ఉన్నట్లు మాట్లాడారు. జిల్లా అధికారులు మొక్కలను పీకి తీసుకొచ్చి కాయలు పాడైన విషయాన్ని చూపించారు. వాస్తవానికి పశ్చిమ ప్రకాశం ప్రాంతంలో అత్యధిక విస్తీర్ణంలో పత్తి పంట సాగవుతోంది. మరుసటి రోజు ఇక్కడ పరిస్థితిని పరిశీలించి ఉంటే తీవ్రత తెలిసేది. కేంద్ర బృంద సభ్యులు ఇలా వచ్చి అలా వెళ్లిపోవడంపై రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వీరిచ్చే నివేదిక ఆధారంగానే కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించే అవకాశం ఉన్నందున తమకు తీరని నష్టం వాటిల్లుతుందని వాపోతున్నారు. ఉన్న సమయంలోనే నష్టం వివరాలను కేంద్ర బృంద సభ్యులకు తాము వివరించే ప్రయత్నం చేసినట్లు డీఏవో శ్రీనివాసరావు తెలిపారు.

రూ.27.27 కోట్ల మేర నష్టం

జిల్లాలోని పంటలు రోజుల తరబడి నీటిలో నానిపోవడంతో సజ్జ కంకులకు మొలకలు సైతం వచ్చాయి. తొలుత వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా పంటల నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించారు. అనంతరం క్షేత్రస్థాయిలో సర్వే చేసి నష్టాన్ని లెక్కగట్టారు. మొత్తం రూ.27.27 కోట్ల మేర రైతులకు పంట నష్టపరిహారం పంపిణీ చేయాల్సి ఉంది. తుపానుకు వారం ముందు కురిసిన భారీ వర్షాలకు పంట పొలాల్లోకి నీళ్లు చేరాయి. అనంతరం మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు నదులు, వంకలు, వాగులు పొంగిపొర్లి పంట పొలాలను ముంచెత్తాయి. జిల్లాలో 12 వేలకు పైగా హెక్టార్లలో పంటలకు తీరని నష్టం వాటిల్లింది. అధికంగా పత్తి పంట దెబ్బతినగా, ఆ తరువాత వరి, మొక్కజొన్న, సజ్జ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇప్పటికే ఈ-క్రాప్‌లో వివరాలు నమోదు చేసుకున్న రైతుల వివరాల ఆధారంగా క్షేత్రస్థాయిలో పంట ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేశారు.

33 శాతానికిపైగా ఉంటేనే...

33 శాతానికిపైగా పంట దెబ్బతిన్న రైతుల వివరాలను నష్టపరిహారానికి అర్హులుగా ఎంపిక చేశారు. వీటి వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయగా నష్టాన్ని లెక్కగట్టారు. వరి, పత్తి తదితర పంటలకు హెక్టారుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నష్టపరిహారం రూ.25 వేలు చొప్పున, మిగిలిన ఆరుతడి పంటలకు హెక్టారుకు రూ.17 వేలు చొప్పున అందించేందుకు ఇప్పటికే ప్రకటించారు. ఈ లెక్కన చూస్తే జిల్లాలో అన్ని రకాల పంటలు కలుపుకొని రూ.27 కోట్ల మేర పంట నష్టం వాటిల్లినట్లు లెక్కగట్టారు. అర్హులైన రైతులెవరనేదానిపై వ్యవసాయశాఖ అధికారులు పరిశీలిస్తున్నారు.

సొంతింటితో ఆత్మగౌరవం

ఒంగోలు నగరంలోని కేశవరాజుకుంటలో రమాదేవి, శ్రీనివాసరావు దంపతుల నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, అధికారులు, నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: సొంతింటితో ఆత్మగౌరవం లభిస్తుందని కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. ఒంగోలు నగరంలోని కేశవరాజుకుంటలో బుధవారం జిల్లా గృహనిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి గృహప్రవేశాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 7,372 గృహాలు పూర్తికాగా, రూ.17.77 కోట్ల నగదు చెల్లించినట్లు తెలిపారు. వివిధ దశల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న 11,443 మంది లబ్ధిదారులకు రూ.18.36 కోట్ల సాయం అందించినట్లు వివరించారు. పీఎంఏవై-2.0 కింద ఇక నుంచి ఇంటికి రూ.2.50 లక్షలు మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ టిడ్కో ఇళ్లను కూడా త్వరలోనే లబ్ధిదారులకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఒంగోలు నగరంలోని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రతి మూడు నెలల కొకసారి ఉద్యోగ మేళాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, జిల్లా గృహనిర్మాణశాఖ అధికారి శ్రీనివాసప్రసాద్, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ఏఎంసీ ఛైర్మన్ రాచగర్ల వెంకటరావు, మాజీ ఛైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, ఉప మేయర్ వేమూరి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిధుల కొరతే అసలు పరీక్ష

చిత్రంలో కనిపిస్తోంది జిల్లా కేంద్రం ఒంగోలు నగరంలో గత వైకాపా ప్రభుత్వంలో రూ.1.10 కోట్లతో నిర్మాణం చేపట్టిన కేంద్రీయ ఎరువులు, విత్తన పరీక్ష కేంద్రం. భవనం నిర్మాణ బాధ్యతలను ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించారు. సుమారు 70 శాతం పనులు పూర్తయిన అనంతరం నిధుల్లేక ఇలా అర్ధంతరంగా నిలిచిపోయింది. సుమారు రూ.40 లక్షల విలువైన పనులు జరగాల్సి ఉంది. ఇక్కడ యంత్రాల కేటాయింపు సైతం జరగలేదు.

–న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

వెలిగొండపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

- గుత్తేదారు సంస్థ ప్రతినిధులు, ఇంజినీర్లపై మంత్రి నిమ్మల ఆగ్రహం

రెండో సొరంగం నుంచి నీటిని బయటకు పంపే విధానాన్ని పరిశీలిస్తున్న జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇంజినీరింగ్ అధికారులు, గుత్తేదారు సంస్థ ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు నిర్మాణ పనులతోపాటు తీగలేరు వాగు ఫీడరు కాలువ కోతకు గురైన ప్రాంతంలో చేపడుతున్న పనులను మంత్రి పరిశీలించారు. గత నాలుగు రోజులుగా పనులు చేయకుండా నిర్లక్ష్యం వహించి తాజాగా మొదలుపెడతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రెండో సొరంగంలోని వరద నీటిని బయటకు పంపే విధానాన్ని పరిశీలించిన ఆయన ఈ నెల 10వ తేదీలోగా నీరంతా బయటకు పంపుతామని నేటికీ పంపకపోవడమేమిటని గుత్తేదారు సంస్థ ప్రతినిధి కృష్ణారెడ్డిని ప్రశ్నించారు. లక్ష్యానికి అనుగుణంగా పనులు చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. అనంతరం వెలిగొండ క్యాంపు కార్యాలయంలో అధికారులు, గుత్తేదారులతో సమీక్షించారు. సొరంగంలో డీవాటరింగ్, ఫీడరు కాలువ గండ్లు పూడ్చడంలో ఇంజినీరింగ్ అధికారులు, గుత్తేదారులు నిర్లక్ష్యం వహించడంతోనే పనులు ముందుకు సాగడంలేదన్నారు. జులై నాటికి రెండో సొరంగం లైనింగ్ పనులు పూర్తి కావాల్సి ఉందని, నెలకు 580 మీటర్ల మేర పనులు చేపడితేనే సాధ్యమవుతుందన్నారు. సొరంగంలోని టీబీఎంను బయటకు తెచ్చే పనిపై దృష్టి సారించాలని సూచించారు. ఫీడరు కాలువ లైనింగ్, రిటైలింగ్ వాల్ నిర్మాణ పనులను త్వరగా చేపట్టాలని ఆదేశించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ 2026 నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్ణయించారన్నారు. వచ్చే సీజన్ నాటికి ప్రాజెక్టును ప్రారంభించేవిధంగా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. ఆయనవెంట మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ముత్తుమల అశోక్‌రెడ్డి, తెదేపా వైపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, నీటిపారుదలశాఖ సలహాదారు వెంకటేశ్వరరావు, సీఈ శ్యాంప్రసాద్, ఎస్ఈ అబూతాలీం, ఈఈ కృష్ణారెడ్డి, ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ సుబ్బారావు తదితరులున్నారు.

25లోగా పదోతరగతి ఫీజు చెల్లింపునకు అవకాశం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: పదోతరగతి పరీక్షల ఫీజు ఈ నెల 25వ తేదీలోగా చెల్లించవచ్చునని డీఈవో ఎ.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. అపరాధ రుసుం లేకుండా ఈ నెల 13 నుంచి 25వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చునన్నారు. రూ.50 అపరాధ రుసుంతో డిసెంబరు 3వ తేదీ, రూ.200 అపరాధ రుసుంతో డిసెంబరు 10వ తేదీ, రూ.500 అపరాధ రుసుంతో అదే నెల 15వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. రెగ్యులర్ విద్యార్థులకు రూ.125 కాగా, మూడు సబ్జెక్టులకు మించి రూ.125, మూడు లోపు రూ.110, ఒకేషనల్ విద్యార్థులు అదనంగా రూ.60, వయసు మినహాయింపునకు రూ.300 చెల్లించాలన్నారు. మైగ్రేషన్ సర్టిఫికేట్ అవసరమైతే రూ.80 చెల్లించాలన్నారు. వయసు మినహాయింపు ఫీజు చలనా సీఎఫ్ఎంఎస్ ద్వారానే చెల్లించాలన్నారు.

సీనరేజీ వసూళ్లపై చర్చలు సానుకూలం

చీమకుర్తి, న్యూస్‌టుడే: సీనరేజీ వసూళ్ల విషయమై గ్రానైట్ పరిశ్రమల యజమానులు, ఏఎంఆర్ సంస్థ ప్రతినిధుల మధ్య బుధవారం జరిగిన చర్చలు సానుకూలంగా సాగాయి. ఈ వివరాలు తెలియజేసేందుకు గురువారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. గ్రానైట్, చిన్నతరహా ఖనిజాల సీనరేజీ వసూళ్లను ప్రైవేటు సంస్థకు అప్పగించడం, రాయల్టీని 30 శాతానికి పెంచి అదనపు మొత్తం చెల్లించాలని కోరుతున్న నేపథ్యంలో గత నెలన్నర రోజులుగా గ్రానైట్ పరిశ్రమల్లో సందిగ్ధత నెలకొంది. సమస్య ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో పరిష్కారం దిశగా కమిటీ వేశారు. సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు.

తెలిసీ సాహసం.. పడితే ప్రమాదం

ఆటోలు, ట్రాలీ వాహనాల చోదకులు ప్రయాణికులు, కూలీల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. 10 మంది పట్టేచోట 20 మందిని కుక్కేస్తూ ఆదాయం కోసం ఆరాటపడుతున్నారు. కొందరు వెనుకవైపు నిల్చొని ప్రమాదకరంగా వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. ఏ మాత్రం పట్టు జారినా ప్రమాదం తప్పదని తెలిసినా గత్యంతరం లేక వెళ్తున్నారు. గొట్లగట్టు నుంచి వెలిగొండ వైపు మంగళవారం సామర్థ్యానికి మించి మహిళలను ఎక్కించుకుని ఓ ఆటో ఇలా వెళ్తుండగా 'న్యూస్‌టుడే' క్లిక్ మనిపించింది.

– న్యూస్‌టుడే, కొనకనమిట్ల

ఇసుక మాఫియా అరాచకం

- లారీ డ్రైవర్ కుటుంబం ఆత్మహత్యాయత్నం

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన లారీ డ్రైవరు కుటుంబాన్ని స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: యర్రగొండపాలెంలో ఇసుక మాఫియా అరాచకాలు తట్టుకోలేక ఓ లారీ డ్రైవరు కుటుంబం ఆత్మహత్యకు యత్నించింది. సీఐ అజయ్‌కుమార్, స్థానికులు తెలిపిన ప్రకారం.. వై.పాలెంకు చెందిన లారీ డ్రైవరు ముక్తిపూడి యాకోబు తన భార్య, బిడ్డలతో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం సాయంత్రం పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇతనికి ఒక సొంత లారీ ఉండగా, అతనే డ్రైవరుగా ఉంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నాలుగు రోజుల కిందట అమరావతి నుంచి ఇసుక లారీ లోడుతో బిల్లులతో సహా వై.పాలెంకు తెచ్చాడు. విషయం తెలుసుకున్న ఇసుక మాఫియా పోలీసులను పంపించి లారీని పోలీసు స్టేషన్‌కు తరలించింది. లారీ వదలాలంటే రూ.50 వేలు మైనింగ్ అధికారులకు జరిమానా కట్టాలని పోలీసులు తెలిపారు. ఇసుక మాఫియా శక్తులు టన్నుకు రూ.250 కడితే లారీ విడిపిస్తామంటే, పోలీసులు జరిమానా కట్టి లారీ తీసుకెళ్లాలన్నారు. ఈ గందరగోళ పరిస్థితులతో ఏం చేయాలో దిక్కుతోచక అతని కుటుంబం పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ప్రధాన రహదారిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద తాము చనిపోతున్నామని కేకలేయడంతో అటుగా వెళ్తున్న సీఐ అజయ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎంతో కొంత జరిమానా కట్టి లారీని తీసుకెళ్లమని చెప్పి అతనిని సముదాయించారు. ఈ విషయమై మైనింగ్ అధికారులతో మాట్లాడతానని చెప్పి ఇంటికి పంపించారు.

ప్లాంటుకు కావాలి ప్రాణవాయువు

- కనిగిరి సీహెచ్‌సీలో మూలకు చేరిన ఆక్సిజన్ తయారీ యూనిట్
- రూ.కోటిన్నరతో ఏర్పాటు చేసినా తప్పని సిలిండర్ల కొనుగోలు

పనిచేయని ఆక్సిజన్ ప్లాంటు

న్యూస్‌టుడే, కనిగిరి

కనిగిరి పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆక్సిజన్ తయారీ ప్లాంటు నిర్వహణ లేక మూలకు చేరింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రూ.1.50 కోట్లతో కొవిడ్ రోగులు, ప్రమాదంలో గాయపడి పరిస్థితి విషమంగా ఉన్న వారికి, ఇతర అత్యవసర రోగుల సౌకర్యార్థం వైద్య, ఆరోగ్య శాఖ కొనుగోలు చేసి ఏర్పాటు చేసింది. ఏడాదిపాటు బాగానే పనిచేసింది. అనంతరం దీనికి సంబంధించిన నిర్వాహకుడు లేకపోవడంతో అది కాస్త మూలకు చేరింది. ప్రస్తుతం దానిని పట్టించుకునేవారు లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతోపాటు జనరేటర్ సైతం వృథాగా తయారైంది. ప్రస్తుతం ఈ ఆసుపత్రికి వచ్చే రోగుల అవసరార్థం ఆక్సిజన్ సిలిండర్లను ప్రతినెలా బయట కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులకు గురైన ఆక్సిజన్ ప్లాంటును బాగు చేయించాలని, నిర్వాహకుడిని ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు. ఈ విషయమై సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ వి.సుబ్బయ్య మాట్లాడుతూ ఇక్కడ ఆక్సిజన్ ప్లాంటు వినియోగంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పనిచేసేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నిరుపయోగంగా జనరేటర్

ఆదా చేద్దామని అడ్డదిడ్డంగా..

సమయం ఆదా చేద్దామని, దూరం తగ్గుతుందని వాహనచోదకులు అపసవ్య మార్గంలో ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఒంగోలు నుంచి మద్దిపాడు వైపు వెళ్లే జాతీయ రహదారిలో త్రోవగుంట, మద్దిపాడు వద్ద వాహనచోదకులు అడ్డదిడ్డంగా రాకపోకలు సాగిస్తున్నారు. త్రోవగుంట నుంచి వాహన చోదకులు ఎదురుగా వస్తున్న భారీ వాహనాలకు ఎదురెళ్లుతూ ఒంగోలు వైపు ప్రమాదకరంగా పయనిస్తున్నారు. మద్దిపాడు, వెల్లంపల్లి సమీపంలో పొగాకు లారీలతోపాటు ద్విచక్రవాహన చోదకులు అపసవ్య మార్గంలో ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. సర్వీసు రోడ్డులోకి వెళ్లి వంతెన కింద నుంచి సరైన దారిలో వెళ్లడానికి సమయం, దూరం ఎక్కువగా ఉండడంతో ఇలా అడ్డదిడ్డంగా ప్రయాణాలు సాగిస్తుండడం గమనార్హం. –ఈనాడు, ఒంగోలు

"మనోహర స్థలములో నాకు పాలు ప్రాప్తించెను శ్రేష్ఠమైన స్వాస్థ్యము నాకు కలిగెను" కీర్తన -16:6

4వ జ్ఞాపకార్థ స్తుతి కూడిక

జననం: 21-11-1942

కీర్తిశేషులు శ్రీ బొమ్మాజీ దానం గారు

B.E (Hons), IAS (Rtd)

మరణం 13-11-2021

అత్యంత వెనుకబడిన ప్రాంతంలో పుట్టినా, దేవుడు ఇచ్చిన తెలివితేటలు, చదువుతో IAS సాధించి, మూడు దశాబ్దాలకు పైగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సేవలు అందించిన, ఏ హోదాలో ఉన్నా బడుగుల అభ్యున్నతే లక్ష్యంగా నిబద్ధతతో ధైర్యంగా పనిచేసి ఎందరో జీవితాల్లో వెలుగులు నింపి, పుట్టిన ప్రాంత అభివృద్ధికి కృషి చేసిన గొప్ప మానవతావాది, మా కుటుంబ సారథి మాకు మార్గదర్శకులు శ్రీ బొమ్మాజీ దానం గారికి అంజలి ఘటిస్తూ... మీ ప్రియమైన జ్ఞాపకాలతో...

భార్య: B.H.K. సరోజిని

కుమారులు:

B.N.విజయ్‌కుమార్, B.E MLA సంతనూతలపాడు నియోజకవర్గం

B.కిషోర్ IRS, & కెశాంగ్ IRS, శ్రియ, సిద్ధార్థ

B.సునీల్ MS, వర్ష, వరుణ్

B.అనిల్ M.S, & మంజరి M.S, రియాన్

(c) eenadu

ఆంగ్ల బోధనా నైపుణ్యాలపై ఎస్జీటీలకు శిక్షణ

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల్లో ఆంగ్ల బోధనా నైపుణ్యాల మెరుగుకు ఈ నెల 17, 18 తేదీల్లో మైనంపాడు డైట్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపల్ సామా సుబ్బారావు తెలిపారు. రాష్ట్ర సమగ్ర శిక్షా అభియాన్ ఎస్పీడీ ఆదేశాల మేరకు మండలానికి నలుగురు చొప్పున... ఎంఈవోలు ఎంపిక చేసిన ఎస్జీటీలకు ఒక రోజు శిక్షణ ఉంటుందన్నారు. 17న ఒంగోలు, 18న మార్కాపురం డివిజన్ వారికి ఉదయం పది నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు ఇది కొనసాగుతుందని... భోజన వసతి కల్పిస్తున్నట్లు వివరించారు.

22 నుంచి ఎస్పీ జపాన్ పర్యటన

ఒంగోలు, న్యూస్‌టుడే: జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు కుటుంబంతో సహా జపాన్ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నెల 22 నుంచి డిసెంబర్ రెండో తేదీ వరకు సెలవు అనుమతి కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఆ మేరకు అనుమతి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సత్రం.. అక్రమ తంత్రం

- గుంటి గంగ ఆలయ ట్రస్ట్ నిర్వాహకుడి సొంత పెత్తనం
- శాశ్వత ట్రస్ట్ ఛైర్మన్‌గా పేరు నమోదు

గుంటిగంగలో నిర్మించిన అన్నదాన సత్రం

భక్తికి, ఆధ్యాత్మికతకు పెట్టింది పేరైన తాళ్లూరు మండలం సోమవరప్పాడు పరిధి గుంటిగంగ గంగాభవాని అమ్మవారి ఆలయం అక్రమాలకు నిలయంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. - న్యూస్‌టుడే, తాళ్లూరు

రూ.లక్షల చందాల వసూలు..

ఆలయానికి విచ్చేసే భక్తులకు ఉచిత అన్నదాన సౌకర్యం కల్పించాలని రెండేళ్ల క్రితం ఆలయ ట్రస్ట్ నిర్ణయించింది. 2023 డిసెంబరు నెలలో తీర్మానించి దాతల సాయంతో ఆలయ ట్రస్ట్ ఛైర్మన్ కొసనా గురుబ్రహ్మం నిర్మాణానికి చొరవ చూపారు. ఇందుకోసం దాతలు, వ్యాపారులు, దూర ప్రాంతాల వారు, భక్తుల నుంచి రూ.లక్షల చందాలు వసూలు చేశారు. 2024 డిసెంబరులో ప్రారంభించాలని నిర్ణయించి ఏర్పాటు చేసిన శిలాఫలకంపై ప్రజాప్రతినిధులతోపాటు దేవదాయశాఖ ప్రధాన అధికారుల పేర్లను వేయించారు. సత్రాన్ని గత నెలలో ఎంపీ మాగుంట చేతుల మీదుగా ప్రారంభింపజేశారు.

అంతా బాగానే ఉందనుకుంటే..

ఎంపీ ప్రారంభోత్సవం వరకు అంతా సవ్యంగా నడిచింది. ఆ తదుపరే అక్రమాలు మొదలయ్యాయి. తొలుత ఆలయ కమిటీ తరఫున వేసిన శిలాఫలకాన్ని తీసి వేసి మళ్లీ మరో శిలాఫలకాన్ని వేయించారు. తాను సొంత నిధులతోపాటు దాతల సహకారంతో గుంటిగంగమ్మ అన్నదాన సత్రం నిర్మింపజేసినట్లు, దీనికి శాశ్వత ట్రస్ట్ ఛైర్మన్‌గా కొసనా గురుబ్రహ్మం పేరును రిజిస్టర్ చేయించిన విషయం బయటకు వచ్చింది. కమిటీలో వైస్‌ఛైర్మన్‌గా తన కుమారుడు కొసనా శివరాం, మరో ముగ్గురు సానె ఆంజనేయులు, అవిశనేని వెంగన్న, నన్నూరి శ్రీనివాసరెడ్డిల పేర్లమీద రిజిస్టర్ చేయించినట్లు సమాచారం. దీనిపై స్థానికంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కలెక్టర్‌కు విశ్రాంత ఉద్యోగి ఫిర్యాదు

ఈ విషయమై విచారణ జరిపి ఆలయానికి సత్రాన్ని అప్పగించాలని కోరుతూ విశ్రాంత ఉద్యోగి ఒకరు జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఈవిషయమై దేవాలయ ఈఓ జి.వాసుబాబును వివరణ కోరగా ఇక్కడ జరిగిన అక్రమాల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే సత్రాన్ని ఆలయానికి స్వాధీనం చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ఇదే విషయమై ఒంగోలు సహాయ కమిషనర్ పానకాలరావును సంప్రదించగా విచారణచేసి తగుచర్యలు చేపడతామన్నారు.

విద్యార్థులు సమాజాన్ని చదవాలి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: న్యాయ చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి సూచించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు... ఒంగోలులోని పీవీఆర్ బాలికల, బాలుర, డీఆర్ఆర్ఎం ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సమాజంలో చోటు చేసుకుంటున్న పరిణామాలను గమనించాలన్నారు. జీవితంలో మంచి, చెడులపై తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు పిల్లల్లో అవగాహన కల్పించాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రమణకర్, వీరాంజనేయులు, న్యాయవాదులు ప్రమీలారాణి, గ్రేస్ కుమారి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

బహుమతి అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి, పక్కన న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఈ నెల 14 నుంచి 20 వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. సంబంధిత గోడపత్రికలను ప్రకాశం భవన్‌లో బుధవారం ఆవిష్కరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జీవీ.శివారెడ్డి, గ్రంథపాలకులు కె.సంపూర్ణ, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెట్టికంటిని దర్శించుకున్న అదనపు జడ్జి

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లాలోని కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని బుధవారం ఒంగోలు జిల్లా అదనపు జడ్జి రాజా వెంకటాద్రి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు, వేదపండితులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాధికారులు ఆయనకు స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు.

న్యాయమూర్తి రాజా వెంకటాద్రికి తీర్థప్రసాదాలు అందజేస్తున్న విజయరాజు తదితరులు

విద్యుత్తు చౌర్యంపై రూ.3.32 లక్షల అపరాధ రుసుం

బేస్తవారపేట, న్యూస్‌టుడే: బేస్తవారపేట మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం విద్యుత్తుశాఖ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. జిల్లా విద్యుత్తుశాఖ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.హైమావతి ఆధ్వర్యంలో మొత్తం 22 మంది అధికారులు 114 మంది సిబ్బందితో 38 బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా విద్యుత్తు వినియోగిస్తున్న వారిపై జరిమానాలు విధించారు. మీటర్ లేకుండా విద్యుత్తు చౌర్యానికి పాల్పడుతున్న 32 మందికి రూ.41 వేలు, అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్తు వాడుతున్న 16 మందికి రూ.36 వేలు, మీటర్ ఉండి విద్యుత్తు చౌర్యానికి పాల్పడిన 17 మందికి గానూ రూ.1.80 లక్షలు, మొత్తంగా 3.32 లక్షల అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. దాడుల్లో జిల్లా విజిలెన్స్ డీఈఈలు నారాయణ, కె.వెంకటేశ్వర్లు, మార్కాపురం ఈఈ శ్రీనివాసరావు, కంభం డీఈఈ శ్రీనివాసరెడ్డి, మార్కాపురం విద్యుత్తు ఆపరేషన్ సబ్ డివిజన్‌లోని అన్ని మండలాల ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.హైమావతి, అధికారులు

అరటి తోటలో కొండచిలువ

కొండ చిలువ పట్టివేత

రాచర్ల, న్యూస్‌టుడే: స్థానిక ఈద్గా సమీపంలోని బొద్దు వెంకట సుబ్బారెడ్డి అరటి తోటలో బుధవారం కొండ చిలువను రైతులు గుర్తించారు. వెంటనే తురిమెళ్ల అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి దాన్ని పట్టుకున్నారు. కొండప్రాంతంలో విడిచి పెట్టనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో అటవీ సిబ్బంది మౌలాలీ, ప్రసాద్, శివ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా జనగణన నిర్వహణ

పొదిలి, న్యూస్‌టుడే: జనగణన -2027 ముందస్తు ప్రణాళికలో భాగంగా పొదిలి నగర పంచాయతీలోని వార్డుల్లో ప్రీ-టెస్ట్ మొదటి దశను పక్కాగా నిర్వహించాలని రాష్ట్ర జనాభా గణన డైరెక్టర్ జె.నివాస్ చెప్పారు. బుధవారం పొదిలి బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లతో సమావేశమై మాట్లాడారు. సర్వేలో ప్రతి కుటుంబానికి సంబంధించిన ఇళ్ల స్థితి, కుటుంబ యజమాని వివరాలు, ఇళ్లలో ఉన్న సౌకర్యాలపై 34 ప్రశ్నలకు సంబంధించిన వివరాలు సేకరించాలన్నారు. వివరాలను మొబైల్ యాప్‌లో కచ్చితంగా నమోదు చేయాలన్నారు. 18, 20 వార్డుల్లో ఎన్యుమరేటర్లు యాప్ ద్వారా భవనాల జియోట్యాగింగ్ విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి జనగణనను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి, జనాభా గణన అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, పొదిలి కమిషనరు కె.ఎల్.నారాయణరెడ్డి, తహసీల్దార్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పొదిలిలో వార్డులో జనాభా గణన క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న అధికారులు

ఉద్యోగ విరమణ చెల్లింపులపై విచారణ

బేస్తవారపేట, న్యూస్‌టుడే: మండలంలోని పిటికాయగుళ్ల ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో డాక్టర్ కనిగిరి శేఖర్ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేశారు. ఆయనకు ఉద్యోగ విరమణ అనంతరం ప్రభుత్వం నుంచి అందాల్సిన చెల్లింపులు పలు కారణాలతో నిలిపివేసి ఆయనపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సౌరబ్‌గౌర్ ఆదేశాలు జారీచేశారు. వారు తెలిపిన ప్రకారం.. విచారణలో ఉన్నాయి..

లాస్ ఆఫ్ పే ఇవ్వకున్నా ఇచ్చారని భావించి..

గతంలో ఆయన ఉద్యోగ విరమణ పొందే ముందు వ్యక్తిగత కారణాల చేత 18 నెలల పాటు విధులు హాజరుకాలేకపోయారు. అందుకు లాస్ ఆఫ్ పే అమలు చేయాలని సంబంధిత ఆయుష్ శాఖ అధికారులకు రాతపూర్వకంగా విన్నవించారు. అనంతరం వారి నుంచి స్పష్టమైన ఆదేశాలు రాకపోవటంతో సెలవులు మంజూరైనట్టుగా భావించి అనధికార సెలవుపై వెళ్లి విధులకు గైర్హాజరయ్యారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందే 15 రోజుల ముందుగా ఆయుష్ శాఖ అధికారుల అనుమతితో తిరిగి విధుల్లోకి హాజరై తరువాత రిటైర్ అయ్యారు. కాగా లాస్ ఆఫ్ పే సెలవులు అనధికార సెలవులుగా భావించిన ఆయుష్‌శాఖ ఉన్నతాధికారులు ఉద్యోగ విరమణ అనంతరం ఆయనకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పలు చెల్లింపుల మంజూరును నిలిపివేశారు. దీనిపై తాజాగా ఆయనపై విచారణకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అధికారులను ఆదేశించారు.

14 నుంచి సహకార వారోత్సవాలు

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఈ నెల 14 నుంచి 20 వరకు అఖిల భారత సహకార వారోత్సవాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. సంబంధిత గోడప్రతులను బుధవారం ఆవిష్కరించారు. 'ఆత్మ నిర్భర్ భారత్ సాధకాలుగా సహకార సంఘాలు' అన్న అంశంపై ఉత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అన్ని సహకార సంఘాల్లో ఏడు రంగుల పతాకావిష్కరణ, ప్రతిజ్ఞ, ర్యాలీలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీవో శ్రీలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వారోత్సవాల గోడప్రతులు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజాబాబు, అధికారులు

అనుమతి లేకుండా నిర్మిస్తే కఠిన చర్యలు

మార్కాపురం అర్బన్, న్యూస్‌టుడే: అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని ప్రణాళికా విభాగం రీజనల్ కార్యాలయం అధికారి పవన్ కుమార్ హెచ్చరించారు. మార్కాపురం పట్టణంలోని పలు చోట్ల నిర్మాణాలు చేపట్టిన పలు భవనాలను బుధవారం అధికారులు పరిశీలించారు. బహుళ అంతస్తుల నిర్మాణాలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో వారు పర్యటించారు. జవహర్ నగర్ కాలనీ, కాలేజ్ రోడ్డు, తర్లుపాడు రోడ్డు తదితర ప్రాంతాల్లో కొత్తగా నిర్మాణాలు చేపడుతున్న భవనాలను సందర్శించారు. అనుమతులు ఉన్నాయా లేదా వంటి విషయాలపై ఆరాతీశారు. అనుమతులు లేని అంతస్తులు ఉంటే బిల్డింగ్ ఫైనలైజేషన్ స్కీమ్ కింద రెగ్యులైజేషన్ ఫీజులు చెల్లించి అనుమతులు పొందాలన్నారు. లేదంటే నోటీసులు జారీ చేసి అంతస్తులను కూల్చేయాలని పట్టణ ప్రణాళికా విభాగం అధికారులకు సూచించారు.

నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

జాతీయస్థాయి విలువిద్య పోటీలకు ఒంగోలు విద్యార్థి

ఒంగోలు క్రీడావిభాగం, న్యూస్‌టుడే: అల్లూరి జిల్లా పాడేరులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 విలువిద్య పోటీల్లో ఒంగోలులోని లోటస్ గ్లోబల్ స్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థి కటకంశెట్టి గోవర్ధన్ నాయుడు సత్తా చాటాడు. మూడో స్థానంలో నిలిచి జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యార్థితో పాటు కోచ్ బి.గోపీచంద్‌ను కరస్పాండెంట్ బత్తుల శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

గోవర్ధన్‌నాయుడిని అభినందిస్తున్న కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి

హ్యాండ్‌బాల్ పోటీల్లో చందు ప్రతిభ

తాళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని తూర్పుగంగవరం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని జి.చందు అండర్-17 విభాగంలో జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయుడు కె.శివనాగరాజు తెలిపారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి ప్రతిభను కనబర్చినట్లు తెలిపారు. త్వరలో గుజరాత్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున ఆ బాలిక పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్కే.ప్రసాద్, ఉపాధ్యాయులు బుధవారం సాయంత్రం ఆమెను అభినందించారు.

చౌక ధరల దుకాణం ఏర్పాటుకు వినతి

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి పట్టణంలోని ఇస్లాంపేట, బీసీకాలనీ, ప్రకాశ్‌నగర్, బ్యాంకు కాలనీ ప్రాంతాల్లో చౌక దుకాణాలు ఏర్పాటు చేయాలని తెదేపా నాయకుడు షేక్ మస్తాన్‌వలీ స్థానికులతో కలిసి జేసీ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. బుధవారం పొదిలి బాలుర ఉన్నత పాఠశాల వద్దకు జనగణన ఎన్యుమరేటర్ల సమావేశానికి వచ్చిన ఆయనకు ఇస్లాంపేట ప్రజలు సమస్యలను విన్నవించారు. సరకుల కోసం ఒంగోలు-కర్నూలు ప్రధాన రహదారిని దాటుకుని మూడు కిలోమీటర్ల మేర వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. మహిళలు ఇబ్బంది పడుతున్నారన్నారు. దూరంగా ఉన్న చౌకదుకాణాలను ప్రజలకు అందుబాటులో ఉండేలా మార్చాలని వారు కోరారు. పరిశీలించి తప్పకుండా చర్యలు తీసుకుంటామని జేసీ హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆ ప్రాంత ఖాసిం పీరా, తదితరులు ఉన్నారు.

జేసీ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ఇస్లాంపేట ప్రజలు

చిరుకూరపాడు పంచాయతీ కార్యదర్శిపై వేటు

ఒంగోలు గ్రామీణం: విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన జరుగుమల్లి మండలం చిరుకూరపాడు పంచాయతీ కార్యదర్శి యు.అనిల్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ పి.రాజాబాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వలేటివారిపాలెం మండలం చుండి పంచాయతీలో విధులు నిర్వహించిన సమయంలో... గ్రామకంఠం ఆస్తిని ఇతరుల పేరిట మార్చి ధ్రువీకరణ పత్రం జారీ చేశారు. ఈ విషయమై స్థానికులు నెల్లూరు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా అధికారులు విచారణ చేపట్టారు. క్రమశిక్షణ చర్యలు నిమిత్తం నివేదికను ప్రకాశం కలెక్టర్‌కు పంపారు. ఆ మేరకు ఆయనపై చర్యలు తీసుకున్నారు.

'చలో దిల్లీ' విజయవంతానికి విజ్ఞప్తి

చీమకుర్తి: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ ఈ నెల 17న తలపెట్టిన 'హలో మాదిగ.. చలో దిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భిక్షాలు, జిల్లా అధ్యక్షుడు టి.ఆనంద్ తదితరులు కోరారు. సంబంధిత గోడపత్రాలను చీమకుర్తిలో బుధవారం ఆవిష్కరించారు. దళితుల ఆత్మగౌరవ సభకు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఎన్.రాజు, టి.ప్రభుదాస్, క్రిస్టోఫర్, జి.కాంతారావు, పి.సురేష్, బి.సాల్మన్, బి.లింగయ్య, జె.రాజు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 600 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.93/-.

16న మహాత్మా జ్యోతిరావ్ ఫులే నాటక ప్రదర్శన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: సింధూర కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న మహాత్మా జ్యోతిరావ్ ఫులే నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నూకసాని బాలాజీ తెలిపారు. ఒంగోలులోని హైదరీ క్లబ్‌లో సాయంత్రం ఆరు గంటలకు ఇది ప్రారంభమవుతుందన్నారు. సంబంధిత ప్రచారపత్రాలను భాగ్యనగర్‌లోని కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. అంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. సంఘం ప్రతినిధులు డి.విజయభాస్కర్, పాటిబండ్ల ఆనందరావు, బాలినేని నాగేశ్వరరావు, బంకా చిరంజీవి, కేఎల్.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 111, రిటైల్ లైవ్ - 138, చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్- 228

శ్రీ దరిశి సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో
SOP No.01/2025

1. షేక్ హిదయతుల్లా
2. షేక్ మైమున
3. షేక్ అయష సిద్దిక ... పిటీషనర్స్

V/s

నిల్ ... రెస్పాండెంట్

జనరల్ నోటీస్

పైన తెలిపిన SOP నందు మేము పిటీషనర్స్ అయి ఉన్నాము. సదరు SOP నందు హాఫిజ్ షేక్ అబ్దుల్ అజీజ్ మరియు అతని భార్య తేది. 11.07.2023న మరణించినందున మేము వారసుల పిటీషను శ్రీ పై కోర్టు నందు దాఖలు పరిచినందున ఇంకా ఎవరైన వారి తరుపున వారసులు ఉంటే కోర్టుకు వచ్చి వాదన పెట్టుకోవలసినది. అందులకు తెలుగు పత్రిక ద్వారా తెలియపరచటమైనది. ఇందులకు కోర్టు వారు తేది. 28.11.2025న పై కోర్టులో ఉదయం 10.30 గంటలకు స్వయంగా కానీ, వకీలు ద్వారాకాని హాజరు కావలసినది. లేని యెడల శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు దయ చేయగలరని తెలియజేయడమైనది. కావున యావన్మందికి తెలియ చేయడం అయినది.

ప్రదేశం: పొదిలి
తేది.12.11.2025
సం/- బొమ్మరాజు సురేష్ కుమార్, అడ్వకేటు, పొదిలి, ప్రకాశం జిల్లా. ఫోన్ నెం. 98662 80305

క్యూఆర్ కోడ్‌తో ఇంటి పన్ను చెల్లించాలి

టంగుటూరు, న్యూస్‌టుడే: ఇంటి పన్ను సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు కోరారు. మండలంలోని జమ్ములపాలెంలో బుధవారం పర్యటించారు. ఇంటి పన్ను వసూలు, పరిశుభ్రత, చెత్త సేకరణ వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది గ్రామాల్లో ప్రతి ఇంటిని సందర్శించి పన్ను వసూలుపై అవగాహన కల్పించాలన్నారు. చెల్లింపులు క్యూఆర్ కోడ్ ద్వారా ఆన్‌లైన్‌లోనే చేయాలని సూచించారు. అనంతవరం పంచాయతీ పరిధిలోని తాళ్లపాలెంలో స్వామిత్వ ఫేజ్-2పై ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. దీనికి హాజరైన డీపీవో ప్రాపర్టీ పార్సిల్ గురించి ప్రజలకు వివరించారు. ఎంపీడీవో దేవసేన కుమారి, డిప్యూటీ ఎంపీడీవో రామసుబ్బారావు, సర్పంచి శివరామరాజు, ఉప సర్పంచి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జీవో 77 రద్దు చేయాలని డిమాండు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్ డిమాండ్ చేశారు. ఒంగోలులోని మాదాల నారాయణ స్వామి భవన్‌లో బుధవారం నిర్వహించిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పీజీ విద్యార్థులకు నష్టం కలిగించేలా గత ప్రభుత్వం తెచ్చిన జీవో నం.77ను రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో నిర్వహించాలన్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్, ఎం.సునీల్, రాజేష్, వీరేంద్ర ప్రసాద్, నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్

కారు బోల్తా.. ఇద్దరు యువకులకు గాయాలు

మార్కాపురం అర్బన్: మద్యం తాగి వేగంగా నడపడంతో కారు బోల్తా పడిన ఘటన బుధవారం సాయంత్రం మార్కాపురం శివారులోని ఎల్వీ ప్రసాద్ వైద్యశాల వద్ద చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులు అక్కడి నుంచి ఆటోలో చికిత్స నిమిత్తం వైద్యశాలకు వెళ్లారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో పట్టణంలోనుంచి ఇద్దరు యువకులు అతి వేగంగా కారు నడుపుతూ వచ్చినట్లు స్థానికులు తెలిపారు. ఆ ప్రాంతంలో ఉన్న వారు వేగం తగ్గించాలని వారిస్తున్నా వినిపించుకోలేదని అక్కడున్న వారు తెలిపారు. కారు వెళ్లే సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందన్నారు.

బోల్తా పడిన కారు

లారీని ఢీకొన్న బస్సు... నలుగురికి గాయాలు

మద్దిపాడు, న్యూస్‌టుడే: ముందు వెళ్తున్న లారీని వెనుకగా వస్తున్న బస్సు ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. పదహారో నంబరు జాతీయ రహదారిపై బుధవారం వేకువజామున ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటసూర్య తెలిపిన వివరాల ప్రకారం... ఉదయగిరి డిపోకు చెందిన బస్సు విజయవాడ నుంచి ఉదయగిరికి వెళ్తోంది. ఏడుగుండ్లపాడు వంతెనపై ముందు వెళ్తున్న లారీని వెనుకగా బలంగా ఢీకొట్టింది. డ్రైవర్‌తో పాటు ముగ్గురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కనిగిరికి చెందిన ప్రయాణికుడు పీరూసాహెబ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యసనాలకు బానిసై.. చోరీలకు దగ్గరై

- పోలీసులకు చిక్కిన ముఠా

దొనకొండ, న్యూస్‌టుడే: కొద్ది రోజులుగా దొంగతనాలు చేస్తూ దొరక్కుండా తిరుగుతున్న ఎనిమిది మందితో కూడిన ముఠాను పోలీసులు పట్టుకున్నారు. సీఐ హసన్, ఎస్సై త్యాగరాజులు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. వ్యసనాలకు బానిసై ఒక ముఠాగా ఏర్పడిన వీరంతా కొంత కాలంగా చోరీ సొత్తుతో జల్సాలు చేస్తున్నారు. దొనకొండలోని నాలుగు రోడ్ల కూడలి సమీపంలో వీరు తిరుగుతున్నారనే సమాచారంతో పోలీసులు చాకచక్యంగా వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. ముండ్లమూరు మండలానికి చెందిన ఏడుకొండలు, సాగర్, వెంకటనారాయణ, గణేష్, వేణుగోపాల్‌రెడ్డి, నాగూర్, పల్నాడు జిల్లాలోని నూజెండ్ల మండలానికి చెందిన ఎలీషా, పొదిలికి చెందిన రాజశేఖర్‌లు ఒక బృందంగా ఏర్పడ్డారు. దొనకొండ మండలంలో 4, నూజెండ్లలో 2, ముండ్లమూరులో 1, అద్దంకిలో 1 ద్విచక్రవాహనాలు, దొనకొండలో 3, కొనకనమిట్లలో 4 గొర్రెలను అపహరించారు. వీటి విలువ రూ.7.70 లక్షలు ఉంటుంది. ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని నిందితులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గురువారం దర్శి న్యాయస్థానంలో వారిని హాజరు పరుస్తామన్నారు.

స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలను చూపుతున్న పోలీసులు

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

SECOND SALE

ఒంగోలు RTC బస్టాండ్ ఎదురు కీర్తి మెడికల్స్ ప్రక్కన బాలాజి లాడ్జిలో పాత బలార్షాటేకు దరవాజాలు, కిటికీలు, మంచాలు అమ్మకమునకు కలవు. 9010989289.

EDUCATION

B.Pharmacy, Bachelor of Physiotherapy (BPT), B.Sc, Nursing, GNM Nursing మేనేజ్‌మెంట్ సీట్ల కొరకు సంప్ర: 98669 39320, 70134 48102.

JOBS

Wanted Female Computer Operators With M.S Office Vaviletipadu Village, Jarugumalli Mandal. Cell: 7675054559.

Situation Vacant. 1) Ward Nurse (Male & Female) With Experience in Ward/ ICU/OT/Night Duties. 2) Pharmacist with Billing Exp. 3) Security Staff 9491666047, 9440942757.

HDFC లైఫ్ ఇన్స్యూరెన్సు ఏజెంట్‌గా చేరండి ఆకర్షణీయమైన కమీషన్, జీతం. ప్రతినెల ఫారిన్ టూర్ లేదా క్యాష్ బహుమతులు పొందండి వివరములకు. ✆ 93813 41066.

REAL ESTATE

FLAT FOR SALE

ఒంగోలు కర్నూల్ రోడ్డు, మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ దగ్గర గుప్తాస్ అపార్ట్మెంట్ 2BHK 5వ అంతస్తు పడమర ఫేస్ 1250Sft అమ్మబడును. కార్‌పార్కింగ్ కలదు. నో బ్రోకర్స్. సెల్: 9247131337.

TO LET

COMMERCIAL

ఒంగోలు, కర్నూలురోడ్డు బైపాస్ పాల బజార్ నందు గోడౌన్/ షాపు 1500Sft అద్దెకు ఇవ్వబడును. సెల్: 7013918438.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మ రియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మార్కాపురం

•మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

రాచర్ల, న్యూస్‌టుడే: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామికి మాలధారులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని తమలపాకులు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి ఆకు పూజ చేశారు. ధగడ్స్ యూత్ ఆధ్వర్యంలో మాలధారులకు మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం అల్పాహారం ఏర్పాటు చేశారు.

రాచర్ల: ప్రదర్శన నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు, రైతులు

పొగాకు సాగు వద్దు

రాచర్ల, న్యూస్‌టుడే: తెల్లబర్లీ పొగాకు, సీడ్ మొక్కజొన్న సాగుకు ముందు కంపెనీల నుంచి రైతులు తప్పక ఒప్పంద పత్రాలు తీసుకోవాలని వ్యవసాయాధికారి మహబూబ్ బాష తెలిపారు. మండలంలోని గంగంపల్లి, రాచర్ల గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పొగాకు సాగు వద్దని సూచించారు. వీఏఏలు లలిత ఈశ్వరి, రైతులు పాల్గొన్నారు. ❖ కంభం: మొక్కజొన్న, తెల్లబర్లీ పొగాకు సాగు చేసే రైతులు తప్పనిసరిగా ఒప్పంద పత్రాలు తీసుకోవాలని వ్యవసాయాధికారి మహమ్మద్ తెలిపారు. గంగంపల్లి, రాచర్ల గ్రామాల్లో మాట్లాడారు. ❖ పొదిలి: కంది పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని పొదిలి ఏవో శ్రీనివాసులరెడ్డి చెప్పారు. మండలంలోని సూదనగుంట, తుమ్మగుంట గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి: పెద్దారవీడు, న్యూస్‌టుడే: రబీ సీజన్‌కు సంబంధించి మండలానికి 40క్వింటాళ్ల మినుములు కేటాయించారని మండల వ్యవసాయ అధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. మద్దలకట్ట, సానికవరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మొంథా తుపాను కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం వారి ఖాతాలకు జమ చేస్తుందని రైతులకు వివరించారు. జీవో నంబర్ 740 ప్రభుత్వ ఆదేశాల మేరకు నల్లబర్లీ పొగాకును సాగు చేయవద్దని సూచించారు. ఒప్పంద పత్రాలు, అనుమతులు తీసుకుని తెల్లబెర్లీ పొగాకును సాగు చేసుకోవాలని తెలిపారు.

వారోత్సవాల గోడప్రతుల ఆవిష్కరణ

పెద్దారవీడు: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఎంఈవో శ్రీనివాసులు, గ్రంథపాలకుడు వెంకటేశ్వరరెడ్డి బుధవారం స్థానిక గ్రంథాలయంలో గోడ ప్రతులను ఆవిష్కరించారు. 14 నుంచి 20వ తేదీ వరకూ నిర్వహించే వారోత్సవాల్లో విద్యార్థులు, మండల ప్రజలు పాల్గొనాలని కోరారు.

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032

బ్రాంచ్: మార్కాపూర్, డి.నెం.7/308, కృష్ణా ప్లాజా, గ్రౌండ్ ఫ్లోర్, వాసవి స్కూల్ ఎదురు, పేరం బజార్, మార్కాపూర్-523316 (ఎ.పి), వెబ్‌సైట్ : www.shriramfinance.in

లాంఛనముగా స్వాధీనత ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో **'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్'** గా పిలువబడేది. ఎన్‌సిఎల్‌టి బెంచ్-II చెన్నై, తేది.09-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా** తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్డ్ కంపెనీ అయి ఉన్నాము మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 మరియు **మార్కాపురం నందు బ్రాంచి ఆఫీస్ కలిగి** నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ/ఋణదాతగా సూచిస్తారు)

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారం **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (యస్‌యఫ్‌యల్)** యొక్క అధీకృత అధికారి సదరు చట్టంలోని సెక్షన్ 13(12)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 నందలి రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **ఋణగ్రహీతలు ఈ క్రింద తెలిపిన ప్రకారం బకాయి సొమ్ము మొత్తంను** చెల్లించవలసినదిగా **క్రింద ఉదహరించబడిన తేదీన డిమాండు నోటీసు జారీ చేయడమైనది.**

బకాయిసొమ్ము చెల్లించడంలో ఋణగ్రహీతలు విఫలమైనందున సదరు చట్టంలోని సెక్షన్ 13(4) తో అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు 8 ప్రకారం సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ పేర్కొన్న ఆస్తిని **ది.08-11-2025న లాంఛనముగా స్వాధీనం చేసుకోవడమైనదని** ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఋణగ్రహీతల యొక్క పేరు మరియు చిరునామా :

1) **గాయం లక్ష్మీరెడ్డి, తండ్రి : కాశిరెడ్డి,** డి.నెం.10-88డి, విజ్ఞాన్ స్కూల్ దగ్గర, మార్కాపురం పోస్ట్ & మండలం, ప్రకాశం జిల్లా, పిన్ కోడ్ : 523316.

2) **తిరుమలరెడ్డి రామలీలావతి, భర్త : గాయం లక్ష్మీరెడ్డి,** డి.నెం.10-88డి, విజ్ఞాన్ స్కూల్ దగ్గర, మార్కాపురం పోస్ట్ & మండలం, ప్రకాశం జిల్లా, పిన్ కోడ్ : 523316.

3) **పొందుగుల రాజశేఖర్‌రెడ్డి, తండ్రి : కాశిరెడ్డి,** డి.నెం.10-105-బి-11, జవహర్ నగర్ కాలనీ, మార్కాపురం పోస్ట్ & మండలం, ప్రకాశం జిల్లా, పిన్ కోడ్ : 523316.

4) **గాయం వెంకట రెడ్డి, తండ్రి: కాశిరెడ్డి,** డి.నెం.1-73, పోతలపాడు విలేజ్, తర్లుపాడు మండలం, ప్రకాశం జిల్లా, పిన్ కోడ్ : 523315.

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి సొమ్ము : **రూ. 91,67,519/-** (అక్షరాల తొంభై ఒక్క లక్షల అరవై ఏడు వేల ఐదు వందల పంతొమ్మిది రూపాయలు మాత్రమే),

లోన్ అకౌంట్ నెంబరు : MRKPRTF2303240010

డిమాండ్ నోటీసు తేది : 27-06-2025

స్థిరాస్తుల వివరములు

ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్, మార్కాపూర్ సబ్-రిజిస్ట్రేషన్, మార్కాపూర్ మునిసిపల్ పరిధి, మార్కాపూర్ గ్రామ సర్వేనెం.265, అసెస్‌మెంట్ నెం.1034013909, డోర్ నెం.10-1050-L-Z-J-6, ఎకరం 1-01 సెంట్ల నందలి 139 చదరపు గజాలు లేదా 116.76 చ॥మీ॥ల స్థలం, తూర్పు నుండి పడమర వరకు 57 అడుగులు లేదా 17.10 మీటర్లు, ఉత్తరం నుండి దక్షిణం వరకు 22 అడుగులు లేదా 6.6 మీటర్లు, నందలి నిర్మించిన ఆర్‌సిసి భవనం గ్రౌండ్ ఫ్లోర్ 1122 చ॥అడుగులు, మొదటి అంతస్థు 1122 చ॥అడుగులు, రెండొవ అంతస్థు 594 చ॥అడుగులు మొత్తము కలిపి 2838 చ॥అడుగులు. దీనికి **హద్దులు: తూర్పు** : దారి, **పడమర:** దూదేకుల మీరా సాహెబ్ మరియు ఇతరుల స్థలం, **ఉత్తరం :** కార్యనిర్వాహకుల స్థలం, **దక్షిణం:** బద్వేలు బాల వెంకటరెడ్డి గారి స్థలం.

షెడ్యూలు ఆస్థి దస్తావేజు నెం. 2264/2023 గాయం లక్ష్మీరెడ్డి, తండ్రి : కాశిరెడ్డి పేరున కలదు.

సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా **(యస్‌యఫ్‌యల్) అధీకృత అధికారి పైన పేర్కొనబడిన స్థిరాస్తులను ఋణగ్రహీతల నుండి లాంఛనముగా స్వాధీనత తీసుకొనడమైనది. ఈ నోటీసు తరువాత ఏ వ్యక్తికి విక్రయించుట గాని, ట్రాన్స్‌ఫర్ చేయుట గానీ, లీజు లేదా తనఖాఆస్తులను దారి మళ్ళించుట గానీ యస్‌యఫ్‌యల్ వారి లిఖితపూర్వక అనుమతి లేకుండా చేయరాదు.**

తేది : 08-11-2025, ప్రదేశం: ఒంగోలు — సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

20న ఉద్యోగ మేళా

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: యర్రగొండపాలెం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 20న ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీధర్‌నాయుడు బుధవారం తెలిపారు. ఈ జాబ్ మేళాలో తొమ్మిది కంపెనీలు పాల్గొంటాయన్నారు. పది, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి 18 నుంచి 27 ఏళ్ల వయస్సు గల నిరుద్యోగ యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

కార్మిక ర్యాలీ విజయవంతానికి పిలుపు

మార్కాపురం అర్బన్: ఈనెల 26న కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగే నిరసన ప్రదర్శన ర్యాలీని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వడ్డే హనుమారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పూల సుబ్బయ్య భవనంలో రైతు సంఘం నాయకుల సమావేశం నిర్వహించి మాట్లాడారు.

ప్రహరీలు లేవు.. పాట్లు పట్టవు

❖ సర్కారు పాఠశాలల అభివృద్ధికి చొరవ అవసరం

న్యూస్‌టుడే, బేస్తవారపేట:

ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అనేకచోట్ల సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. మార్కాపురం డివిజన్‌లోని పలు ప్రభుత్వ పాఠశాలలకు నేటికీ ప్రహరీలు లేకపోవడంతో విద్యార్థులు భయం భయంగా తరగతులకు హాజరవుతున్నారు.

బేస్తవారపేట బాలుర పాఠశాల ముందు భాగంలో తొలగించిన గోడ

ఎన్నెన్నో సమస్యలు

❖ రక్షణ గోడలు లేకపోవడంతో పాఠశాలల ఆవరణలోని మొక్కలకు, సామగ్రికి రక్షణ లేకుండాపోతోంది.

❖ పశువులు, విషకీటకాలు వచ్చేస్తుండటంతో తరగతుల నిర్వహణకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

❖ మధ్యాహ్న భోజన సమయంలో పందులు, కుక్కలు లోపలికి వచ్చేస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

❖ పాఠశాల ప్రాంగణాలు రాత్రి వేళల్లో మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు నెలవులుగా మారుతున్నాయి.

రోడ్డు విస్తరణ పనులకు అడ్డుగా ఉందనే నెపంతో..

మార్కాపురం డివిజన్‌లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ ఉన్నత, కేజీబీవీ తదితర పాఠశాలలు మొత్తం కలిపి 898 ఉన్నాయి. వాటిల్లో 70 పాఠశాలలకు నేటికీ ప్రహరీలు లేవు.

❖ బేస్తవారపేటలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రహరీని ఏడాది కిందట రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రహదారి నిర్మాణానికి అడ్డుగా ఉందనే నెపంతో గుత్తేదారు పాఠశాల ప్రహరీని జేసీబీతో తొలగించారు. అదే సమయంలో అక్కడి ప్రాంగణంలోని ప్రాథమిక పాఠశాల భవనాన్ని సైతం కొంతమేర కూలదోశారు. దీంతో పాఠశాలకు రక్షణ కరవై ఆవరణలో పశువులు, కుక్కలు పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

ప్రహరీలు లేని విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కాగా అత్యవసర సమస్య కింద వాటిల్లోని 10 పాఠశాలల్లో ప్రహరీ నిర్మాణాల ఏర్పాటుకు ఇటీవలే ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. మిగిలిన వాటిపై మరోమారు అధికారులకు నివేదిస్తాం.

– ఎం.శ్రీనివాసులు, ఉప విద్యాశాఖాధికారి, మార్కాపురం.

లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి వసంతలక్ష్మి

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి మండలంలోని పలు గ్రామాల్లో సీఎం సహాయనిధి చెక్కులను బుధవారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి సతీమణి వసంతలక్ష్మి పంపిణీ చేశారు. కాటూరివారిపాలెం, బుచ్చన్నపాలెం, కంభాలపాడు, ఓబులక్కపల్లి, పోతవరం, టి.సల్లూరు, ఏలూరు, అన్నవరం, ఆముదాలపల్లి గ్రామాల్లో 15 మందికి రూ.6,43,434 లను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో తెదేపా రాష్ట్ర కార్యదర్శి జి.భాస్కర్, మండల అధ్యక్షులు అంజిరెడ్డి, నాయకులు శ్రీదేవి, మాధవి, వెంకట్రావు పాల్గొన్నారు.

20వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

సింధు జ్యువెలర్స్

కోటక్ మహేంద్ర బ్యాంక్ వీధి, గిద్దలూరు, ప్రకాశం జిల్లా

"ఆభరణం కేవలం అలంకరణకాదు"

20 ఏళ్ల -విశ్వాసం, వెలుగు ప్రేమ
మాపై నమ్మకం - ఎందుకంటే
ప్రతి కస్టమర్ మా కుటుంబసభ్యుడే
మా ప్రయాణంలో భాగమైన
ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు!
నేడు 21వ వసంతంలోకి
అడుగుపెడుతున్న శుభసందర్భంగా
మా ఖాతాదారులకు, శ్రేయోభిలాషులకు
సింధు జ్యువెలర్స్ వారి 20వ
వార్షికోత్సవ శుభాకాంక్షలు

91.6 kdm Hall Mark మా ప్రత్యేకత

ప్రొ॥ వేమిరెడ్డి రామలింగారెడ్డి, సెల్: 9948913224
అధ్యక్షులు: బులియన్ మర్చంట్స్ అసోసియేషన్, గిద్దలూరు, కొమరోలు
ప్రొ॥ మదిరె పోలిరెడ్డి, సెల్: 9493265646

అధ్వాన రోడ్లు .. రాకపోకలకు అవస్థలు

కంభం బస్టాండ్ నుంచి యశస్విని ఆసుపత్రి వెనక వైపు ఉన్న హజరత్ గూడెం మందయాళీలోని రహమానియా నగర్ ప్రాంతాల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. నడిచేందుకు సైతం వీలు కావడంలేదు. ఇటీవల కురిసిన వర్షాలు, పెద్దబుబ్బతూము కాలువ నిండుగా నీరు పారడంతో పొంగి సమీప ప్రాంతాల మీదుగా ప్రవహించింది. నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడం ఎక్కడికక్కడ నిలిచి పోయింది. పంచాయతీ అధికారులు కనీసం మట్టి కూడా వేయక పోవడంతో చాలా ఇబ్బందిగా ఉంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారులను బాగు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వరం తెలిపారు. – న్యూస్‌టుడే, కంభం

సరిపోని సంపులు... నీరు నేలపాలు

పొదిలి ఎన్‌ఏపీ సంపు నుంచి పలుమార్లు నీరు పొంగిపొర్లి నేలపాలవుతున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. దర్శి నుంచి తాగునీటిని సరఫరా చేసినప్పుడు పొదిలిలోని రెండు సంపుల్లో నింపుతారు. ఆ నీటిని పట్టణంలోని పలు ప్రాంతాలకు మోటార్ల ద్వారా సరఫరా చేస్తుంటారు. బుధవారం కనిగిరి వైపు వెళ్లే పైపులైన్లకు పలుచోట్ల మరమ్మతులు చేపట్టారు. దీంతో పంపింగ్ జరగలేదు. దర్శి నుంచి వచ్చిన నీరు ఓవర్‌ఫ్లో అయి బయటకు వెళ్లిపోయింది. ఎన్‌ఏపీ సంపు వద్ద వృథా నీరు బయటకు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో స్థానిక ఎస్టేట్ వైపు చిన్నకాలువ మీదుగా రోడ్డుపైకి చేరుతోంది. అక్కడ చిన్నకుంటను తలపిస్తోంది. అటుగా రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎన్‌ఏపీ నీటి నిల్వ చేసే సంపుల సామర్థ్యం పెంచాలని, వృథా నీరు బయటకు వెళ్లేందుకు పక్కా కాలువలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పొదిలి

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం : 8008574135
యర్రగొండపాలెం : 8008552658

బేస్తవారపేట, న్యూస్‌టుడే:

?: స్థానిక పంచాయతీలోని పాత జెడ్పీ పాఠశాల వద్ద ఉన్న మురుగు రోడ్డు కాలువలో నూతన నిర్మాణానికి గానూ గత ఆరు నెలల కిందట గుంతలు తీసి వదిలేయడంతో పక్కనే ఉన్న మురుగునీరు రహదారిపై పారుతోంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి. -స్థానికులు, బేస్తవారపేట.

✓: గుత్తేదారుతో మాట్లాడి పనుల్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. -రామకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి, బేస్తవారపేట.

కుళాయిలకు మూత ఏర్పాటు

ఈనాడు కథనానికి స్పందన

కంభం, న్యూస్‌టుడే: కంభం మండలంలోని యర్రబాలెం గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న కుళాయిలకు మూత ఏర్పాటు చేశారు. గ్రామంలోని కుళాయిలకు మురుగు రావడంతో బుధవారం 'ఈనాడు'లో 'ఆరు నెలలుగా కలుషిత నీరే' శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రవీంద్రారెడ్డి గ్రామంలో పర్యటించి పాత పట్టి అధ్వానంగా ఉన్న కుళాయిలకు మూతలు ఏర్పాటు చేయించారు. కలుషిత నీరు రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు.

సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: పేదల సొంత ఇంటి కలను నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. ఆయన బుధవారం రాత్రి గిద్దలూరు పురపాలికలోని రాజానగర్‌లో ఎన్టీఆర్ గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండుగాల కాశర్ల లక్ష్మీదేవి నిర్మించిన గృహాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం గిద్దలూరు పట్టణంలో ఎన్టీఆర్ గృహాలు మంజూరైన 114 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి చేతుల మీదుగా పత్రాలు పంపిణీ చేశారు.

మార్కాపురం పట్టణం, మార్కాపురం అర్బన్: పేదలందరికీ సొంతింటి కలను సాకారం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని 15వ వార్డులో పూల సుబ్బయ్య కాలనీలో పేద ప్రజలకు పక్కా గృహాల మంజూరు పత్రాలు, శంకుస్థాపన కార్యక్రమాలకు ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ డీఈ పవన్ కుమార్, ఏఈ చంద్ర, తెదేపా పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, తెదేపా నాయకులు

పెద్దారవీడు: ప్రగళ్లపాడు నూతన గృహాలను ప్రారంభిస్తున్న తెదేపా ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు

మార్కాపురం పట్టణం: గృహాల మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, తదితరులు

సంతకాల సేకరణ

బేస్తవారపేట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తుండటాన్ని వ్యతిరేకిస్తూ వైకాపా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టింది. దీన్లో భాగంగా బుధవారం బేస్తవారపేటలో గిద్దలూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి కుందురు నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ ఓసూరారెడ్డి, జడ్పీటీసీ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. ❖ మార్కాపురం అర్బన్: మార్కాపురంలోని మెడికల్ కళాశాల ప్రైవేటు పరం చేయడం సరికాదని వైకాపా బాధ్యులు అన్నా రాంబాబు అన్నారు. స్థానిక కోర్టు కూడలి నుంచి ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు.

కాలభైరవుడికి ప్రత్యేక పూజలు

త్రిపురాంతకం గ్రామీణం: త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయంలోని కాలభైరవునికి బుధవారం కార్తీక బహుళ అష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, కూష్మాండ దీపోత్సవం, కాలభైరవ హోమం చేశారు.

వెలుగులు ప్రసరించేనా.. ఇక్కట్లు తొలగేనా?

❖ అలంకారప్రాయంగా వీధి దీపాలు

న్యూస్‌టుడే, రాచర్ల, కంభం: నియోజకవర్గంలోని పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా అధిక శాతం వీధి దీపాలు సక్రమంగా వెలగడంలేదు. వీటి నిర్వహణకు రూ. లక్షలు వెచ్చిస్తున్నా ప్రయోజనం కనిపించడం లేదు. దీంతో ప్రజలు రాత్రివేళల్లో అంధకారంలో గడపాల్సి వస్తోంది. వర్షాలు కురిసిన సమయంలో మరింతగా ఇబ్బందులు పడుతున్నారు.

సంగపేట వద్ద ఒరిగిపోయి కూలేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్తు

కొత్తవి వేసేందుకు నెలల సమయం

దీపాలు కాలిపోతే మళ్లీ వాటిని వేసేందుకు నెలల సమయం పడుతోంది. రాచర్ల, కంభం, బేస్తవారపేట, ఇలా చాలా మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

❖ కొన్నిచోట్ల పగలూ, రాత్రి తేడాలేకుండా వెలుగుతూ విద్యుత్తు వృథా అవుతున్నా పట్టించుకునే వారు లేకపోవడం. అర్ధవీడు మండలంలోని బొమ్మిలింగం, వెలగలపాయ, యాచవరం, తదితర మారుమూల పల్లెల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

కొన్ని ఉదాహరణలు..

❖ రాచర్ల మండలంలో 34 గ్రామాలున్నాయి. వాటిల్లో విద్యుత్తు దీపాలు, ఇతర సామగ్రి కొనుగోలు కోసం సుమారు రూ. 8.78 లక్షలు ఖర్చు చేస్తున్నారు. విద్యుత్తు ఛార్జీల కింద రూ. 10.92 లక్షలు వస్తోంది. ఏడాది ఆర్థిక సంఘం, ఇతర నిధులు సుమారు రూ. 1.60 కోట్లు వస్తున్నాయి. కానీ చాలా గ్రామాల్లో వీధి దీపాలు సక్రమంగా వెలగడంలేదు.

❖ బేస్తవారపేట మండలంలో 43 గ్రామాలున్నాయి. వీధి దీపాలు, ఇతర విద్యుత్తు సామగ్రి కోసం రూ. 15.87 లక్షలు ఖర్చు చేశారు. విద్యుత్తు ఛార్జీలు రూ. 17.78 లక్షలైంది. మండలానికి ఆర్థిక సంఘం, ఇతర నిధులు సుమారు రూ. 1.02 కోట్లు వచ్చాయి. విద్యుత్తు దీపాల నిర్వహణ సమస్య తొలగలేదు.

❖ కంభం మండలంలోని లింగాపురం గ్రామంలో 2022 మే 10వ తేదీన ఇక్కడ ముందు నిర్మిస్తున్న వారిపై విద్యుత్తు తీగలు తెగిపడటంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాచర్ల ఎంపీడీవో వెంకటరమణారెడ్డి తెలిపారు.

కనిగిరి

•కనిగిరి •దర్శి •కొండపి

వగ్గంపల్లిలో ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

కొత్తపల్లిలో లబ్ధిదారులకు గృహ మంజూరు పత్రాలు అందజేస్తున్న తెదేపా నాయకురాలు గొట్టిపాటి లక్ష్మి

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

పామూరు, న్యూస్‌టుడే: మండలంలోని వగ్గంపల్లిలో గృహ ప్రవేశం నిర్వహించారు. జూన్ 2024 నుంచి ఇప్పటి వరకు మండలంలో 91 ఇళ్లు పూర్తయ్యాయి. వగ్గంపల్లికి చెందిన లబ్ధిదారులు పునూరి ఎలిసమ్మ, భర్త జాన్‌వర్గీస్ దంపతులకు ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి చేతుల మీదుగా ఇంటి తాళం అందజేశారు. అనంతరం ఆయన రిబ్బన్ కట్ చేసి గృహాన్ని ప్రారంభోత్సవం చేశారు. పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు.

◗ దర్శి: కనీస మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెదేపా దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. దర్శి మండలం కొత్తపల్లిలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద పక్కా గృహాల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు బుధవారం ఆమె అందజేశారు. డా.లలిత్‌సాగర్, ఎంపీడీవో కల్పన, హౌసింగ్ ఏఈ షాకీర్‌బాషా, కూటమి నాయకులు పాల్గొన్నారు. ◗ జరుగుమల్లి: మండలంలోని చతుకుపాడులో షేక్ మస్తానమ్మ, మీరా సాహెబ్ దంపతులు గృహప్రవేశం చేశారు. సర్పంచి ఇస్తేరమ్మ, మండల తెదేపా అధ్యక్షుడు పోకూరి రవీంద్ర లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందజేశారు. డీఈ సత్యనారాయణ, ఏఈ కేఎస్ ఆర్ సింగ్ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ..

కనిగిరి: ఆపదలో అండగా నిలిచేది సీఎం సహాయ నిధి అని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక అమరావతి మైదానంలో అనారోగ్యంతో బాధపడుతున్న నియోజకవర్గంలోని 25 కుటుంబాలకు రూ.16 లక్షలకు పైగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి..

రోగులకు మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కమ్యూనిటీ వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. రెండు డయాలసిస్ సెంటర్లు అవసరమన్నారు. కొత్తగా ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేసి శుద్ధ జలాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఫిల్మ్‌తో కూడిన ఆధునిక ఎక్స్‌రే ప్రింటర్ యంత్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదనంగా ఆర్థోపెడిక్ సేవలు ప్రారంభించడం సంతోషకరమన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బయ్య, వైద్యులు పాల్గొన్నారు.

పారదర్శకంగా రీసర్వే

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: గ్రామాల్లో భూ రీసర్వేను పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ ఎస్.నాగుల్ మీరా ఆదేశించారు. బుధవారం దాసళ్లపల్లి, ముప్పాళ్లపాడులలో గ్రామసభలు నిర్వహించి రైతులు, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఆర్ఐ కృష్ణచైతన్య, సర్వేయర్ రమణయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలనపై శిక్షణ

జరుగుమల్లి, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ముందస్తు కార్యక్రమంలో భాగంగా బుధవారం తహసీల్దార్ పి.మురళి ఆధ్వర్యంలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా పాత ఓటర్ల జాబితాను 2025 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేయనున్నట్లు తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో చేయాల్సిన అంశాలు, బీఎల్‌వో యాప్ పనితీరు గురించి అవగాహన కల్పించారు. ఎన్నికల డీటీ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

వార్డుల పెంపుతో మరింత పర్యవేక్షణ

☛ రూ.1.5 కోట్లతో పట్టణంలో మౌలిక వసతులు

☛ 'న్యూస్‌టుడే'తో దర్శి మున్సిపల్ కమిషనర్ మహేష్

ముఖాముఖి

నియోజకవర్గ కేంద్రమైన దర్శి 2020లో పంచాయతీ నుంచి నగర పంచాయతీగా, ఈ ఏడాది మేలో గ్రేడ్-2 మున్సిపాలిటీగా మార్పు చెందింది. 42 వేల మంది జనాభా, 16 వేల కుటుంబాలు, 5 సచివాలయాలు, 27 వార్డులతో కూడిన ఈ పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వసతులు సమకూరక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వార్డుల పెంపుదల, ప్రధాన సమస్యలు, అభివృద్ధి పనులు తదితర వివరాలను కమిషనర్ మహేష్ 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో వెల్లడించారు. - న్యూస్‌టుడే, దర్శి

?: న్యూస్‌టుడే: 20 వార్డులను 27గా పెంచడం వల్ల కలిగే సౌలభ్యత ఏమిటి?

✓: కమిషనర్: వార్డుల పెంపుదల వల్ల ప్రజా ప్రతినిధులు ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు, ఇతర కార్యకలాపాలను తేలికగా పర్యవేక్షణ చేయడానికి వీలవుతుంది. వార్డుల విభజనతో గతంలో ఉన్న పరిధి తగ్గి ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకోవడానికి, తద్వారా మెరుగైన ఫలితాలు సాధించడానికి అనువుగా మారుతుంది.

?: ప్రస్తుతం నిధుల మంజూరు, అభివృద్ధి పనుల పరిస్థితి ఏమిటి?

✓: మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ(ఒడా) నుంచి రూ.1.5 కోట్ల నిధులు కేటాయించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం రూ.1 కోటి, 15వ ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్ నుంచి రూ.50 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో పట్టణంలో కాలువలు, ఇతర ఇంజినీరింగ్ పనుల కోసం టెండర్లు పిలిచాము. ఈ పనులు వేగంగా చేపట్టటానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

?: పట్టణంలో ట్రాఫిక్ సమస్య వేధిస్తుంది. దీనికి చేపడుతున్న చర్యలేమిటి?

✓: పట్టణంలో రోడ్ల పక్కన ఆక్రమణలను తొలగించడానికి చర్యలు చేపడుతున్నాం. ట్రాఫిక్ సమస్యను నివారించేందుకు ఆర్అండ్‌బీ, ఇతర శాఖల సమన్వయంతో సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నాం. ప్రజల నుంచి అవసరమైన సూచనలు, అభ్యంతరాలను తీసుకున్న తరువాత అమలు చేస్తాం.

?: పట్టణంలో అనుమతులు లేని లేఅవుట్ల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారు ?

✓: ప్రస్తుత ప్రభుత్వం ప్రజల ఆసక్తిని దృష్టిలో పెట్టుకుని లేఅవుట్లు, భవనాల క్రమబద్ధీకరణ పథకాన్ని ప్రవేశపెట్టింది. దర్శిలో అనుమతులు లేని లేఅవుట్లను గుర్తించి, నోటీసు బోర్డులో పెట్టాము. ఈ అవకాశాన్ని యజమానులు వినియోగించుకుని క్రమబద్ధీకరించుకునేలా చర్యలు తీసుకుంటున్నాం.

?: ఆస్తి పన్ను అసెస్‌మెంట్‌లో లోపాల సవరణకు ఏం చేస్తారు?

✓: పట్టణంలో ఆస్తి వివరాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. వీటిపై సమగ్ర సర్వే నిర్వహించి, అమలులో ఉన్న నిబంధనల ప్రకారం పన్ను విధించి లోపాలను సరిచేస్తాం.

11వ వార్డులో శుభ్రం చేసిన కాలువ

రైలు బండి.. ఇలా వెళ్లొద్దండి!

సింగరాయకొండ రైల్వే స్టేషనులో మొదటి ప్లాట్‌ఫాం నుంచి రెండవ ప్లాట్‌ఫాంకు వెళ్లేందుకు తాత్కాలిక వంతెన ఏర్పాటు చేసినా ప్రయాణికులు కొందరు పట్టాలు దాటుతూ నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లు వస్తున్న సమయంలో రైల్వే పోలీసులు పర్యవేక్షణ లేకపోవడంతో ప్లాట్‌ఫాంల నుంచి పట్టాలపై వెళ్తూ రైళ్లు ఢీకొని ఇటీవల కాలంలో ఇద్దరు మృతి చెందారు. కొందరు ప్రయాణికులు రెండో ప్లాట్‌ఫాంకు వెళ్లేందుకు అదనపు ప్లాట్‌ఫాంపై నిలిచి ఉన్న గూడ్స్ రైలు కింద నుంచి ఇలా ప్రమాదకరంగా వెళ్తున్నారు. ఈ క్రమంలో రైలు కదిలితే ప్రాణాపాయం తప్పదు. ఈ విషయంపై ఒంగోలు జీఆర్పీ ఎస్సై మధుసూధనరావును వివరణ కోరగా.. ప్రయాణికుల రద్దీ సమయంలో సిబ్బందిని నియమించి ప్రమాదాలు జరగకుండా పర్యవేక్షిస్తామని తెలిపారు.

-న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం

దారి కాచిన ప్రమాదం

రహదారులపై ఏర్పడిన చిన్న గోతులతోనే పెను ప్రమాదాలు చోటుచేసుకుంటాయి. మద్దిపూడి మండలంలోని కాకర్ల పంచాయతీ శివరాయునిపేట బస్టాండు కూడలిలో సీసీరోడ్డు మధ్యలో పగిలి గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులకు ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ కూడలి నుంచి ఒక వైపు గుండ్లసముద్రం, మరో వైపు కాకర్ల, ఎదురుగా వినుకొండ, మరో వైపు వల్లాయపాలెం గ్రామాలకు వెళ్లే రోడ్లు ఉన్నాయి. దీనిపై అధికారులను వివరణ కోరగా.. పరిశీలించి కూడలిలో రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

-న్యూస్‌టుడే, మద్దిపూడి

బడి చెంత.. పిచ్చిమొక్కల చింత

తాళ్లూరు మండలంలోని తూర్పుగంగవరం వాణిజ్య కేంద్రం. వివిధ గ్రామాల నుంచి అధికంగా ప్రజలు సరకుల కొనుగోళ్ల కోసం ఇక్కడికే వస్తుంటారు. గ్రామంలోని ఏ వీధికైనా పారిశుద్ధ్య లేమి కనిపిస్తోంది. రహదారుల మార్జిన్లలో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఈ చిత్రం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల పక్కది. ప్రహరీ పక్కనే పిచ్చిమొక్కలు, గడ్డి మొలిచి కంపరంగా మారింది. ఈ విషయమై ఎంపీడీవో పి.అజిత మాట్లాడుతూ వెంటనే సమస్యపై విచారిస్తామని, త్వరితగతిన పరిశుభ్రతా చర్యలు చేపడతామని తెలిపారు. -న్యూస్‌టుడే, తాళ్లూరు

జూడోలో కామేపల్లి విద్యార్థుల ప్రతిభ

జరుగుమల్లి, న్యూస్‌టుడే: మండలంలోని కామేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో సత్తాచాటారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో కాకినాడలో జరిగిన అండర్-17 విభాగంలోని పోటీల్లో జిల్లా తరఫున పాల్గొని ప్రతిభ కనబరిచారు. కళ్లగుంట బాలచరణ్ 66 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు నర్రా కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎల్. అనూరాధ మాట్లాడుతూ.. క్రీడా కారులకు చాగంటి శ్రీహరి రూ.20 వేల ఆర్థిక సాయం అందించారని తెలిపారు. ఎస్ఎంసీ ఛైర్మన్ పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు అనూరాధ

డివిజన్ స్థాయిలో సత్తా..

దర్శి: డివిజన్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో రాజంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. పొతకమూరులో జరిగిన 17 విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో వెంకటరావు, రాజు ప్రథమ స్థానంలో నిలిచారు. వెంకటరావు షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానం, రాజు 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించారు. శివ, మనోహర్ అనే విద్యార్థులు ఖోఖో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఉపాధ్యాయుడు

పీసీపల్లి: ఒంగోలులోని మినీ స్టేడియంలో బుధవారం జరిగిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో పీసీపల్లి మండలంలోని వెంగళాయపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు స్వర్ణ రమణయ్య ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 21న విజయవాడలో జరిగే పోటీల్లో పాల్గొంటారని అధికారులు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

కనిగిరి : 8008574114, (10 AM TO 1 PM)
దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

?: సింగరాయకొండ మండలం పాతసింగరాయకొండ పరిధిలోని అయ్యప్పనగర్‌లో రాత్రి సమయంలో వీధిదీపాలు వెలగక అంధకారం అలముకొంది. మరికొన్ని వీధుల్లో నిత్యం వెలుగుతూనే ఉన్నాయి. -బ్రహ్మేశ్వరరావు, ఉపసర్పంచి

✓: గత నెలలో కురిసిన భారీ వర్షాలకు గ్రామంలోని కొన్ని ప్రాంతాల్లో వీధిదీపాలు కాలిపోయాయి. నిత్యం వెలిగే వీధిదీపాలకు త్వరలో స్విచ్‌లు ఏర్పాటు చేసి మరమ్మతులకు గురైన చోట నూతన దీపాలు అమర్చుతాం. -శారద, పంచాయతీ కార్యదర్శి

?: మద్దిపూడి మండలంలోని గుండ్లసముద్రం ఎస్సీ కాలనీలో కాలువ లేక పోవడంతో మురుగునీరు నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది. -శ్రీనువాసులు, స్థానికుడు

✓: వెంటనే పారిశుద్ధ్య పనులు చేయించి ఇబ్బంది లేకుండా చూస్తాం. -దుర్గాప్రసాద్, పంచాయతీ కార్యదర్శి

?: తాళ్లూరులోని పూర్వపు ఎస్సీ కాలనీలోని కాలువల్లో పెద్ద ఎత్తున పూడికలు పేరుకుపోయాయి. మురుగునీరు నిలిచిపోవడంతో దుర్వాసన వస్తోంది. -వెంకటేశ్వర్లు, స్థానికుడు

✓: వెంటనే కాలువలు శుభ్రం చేయించి సమస్యను పరిష్కరిస్తాం. -షహనాజ్‌బేగం, పంచాయతీ కార్యదర్శి

- న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం, మద్దిపూడి, తాళ్లూరు

మద్యం దుకాణం వద్ద వ్యక్తి మృతి

హనుమంతునిపాడు: మద్యం తాగేందుకు దుకాణం వద్దకు వెళ్లిన ఓ వ్యక్తి అక్కడే మృతిచెందిన సంఘటన హెచ్‌ఎంపాడులో బుధవారం చోటుచేసుకుంది. అతడి కుటుంబీకుల వివరాల మేరకు.. నీలకంఠాపురానికి చెందిన ఆర్.ఆదినారాయణ (40) మద్యానికి బానిసై కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వారం రోజులుగా మద్యం తాగుతూ ఇంటికి వెళ్లడం లేదు. బుధవారం మద్యం కోసం హెచ్‌ఎంపాడులోని దుకాణం వద్దకు వెళ్లి అక్కడే కుప్పకూలి మరణించినట్లు దుకాణ నిర్వాహకులు చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

తాగి వాహనాలు నడిపిన వారికి జరిమానా

దర్శి: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఇలా వాహనాలు నడుపుతున్న 13 మందిపై కేసు నమోదు చేశారు. వీరిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున జరిమానా విధించారని ఎస్సై మురళి బుధవారం తెలిపారు.

దర్శి ఎంఈవోగా మాలకొండయ్య



దర్శి, న్యూస్‌టుడే: దర్శి నూతన ఎంఈవోగా కె.మాలకొండయ్య నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆర్జేడీ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న ఆయనను ఎంఈవో-1 (ఎఫ్ఏసీ) గా నియమించారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఎంఈవో-2 రమాదేవి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మిని ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

కొండపి నియోజకవర్గ అభివృద్ధికి కృషి

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక సీతారామ కల్యాణ మండపంలో కొండపి నియోజకవర్గ స్థాయిలో తెదేపా నేతల పదవీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య హాజరయ్యారు. ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు, నూతనంగా ఎన్నుకున్న క్లస్టర్, బూత్ లెవల్, గ్రామ స్థాయి నాయకులతో పార్టీ ఆశయాలకు, లక్ష్యాలకు కట్టుబడి ఉంటామని ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోటి సభ్యత్వాలు కలిగిన పార్టీ తెలుగుదేశం అన్నారు. కూటమి ప్రభుత్వంపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి బాలవీరాంజనేయ స్వామి, దామచర్ల కుటుంబం కష్టపడుతూనే ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామయ్య చౌదరి, ఆరు మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తెదేపా మండల అధ్యక్షులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య

ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన

వస్త్ర సంచులు పంపిణీ చేస్తున్న జేవీవీ నాయకులు

పామూరు, న్యూస్‌టుడే: పామూరులో జనవిజ్ఞాన వేదిక మండల శాఖ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నియంత్రణపై బుధవారం అవగాహన కల్పించారు. దీనికి ముఖ్య అతిథిగా డాక్టర్ ఎం.శ్రీకాంత్ హాజరయ్యారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి కలిగే హానిని జేవీవీ ప్రతినిధులు వివరించారు. వస్త్ర సంచులనే ఉపయోగించాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యుడు ఆకుపాటి వెంకటేష్, పోతురాజు వెంకటరత్నంలు వెయ్యి వస్త్ర సంచులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైకాపాకు ఉప ఎంపీపీ రాజీనామా

తాళ్లూరు: మండల వైస్ ఎంపీపీ ఇడమకంటి వెంకటేశ్వరరెడ్డి బుధవారం వైకాపాకు రాజీనామా చేశారు. పార్టీలో సీనియర్ నాయకుడిగా కొనసాగుతున్నప్పటికీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి తీరు నచ్చకపోవడంతోనే తాను రాజీనామా చేస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు.

పాఠశాలలో సామాజిక తనిఖీలు

టంగుటూరు: మండలంలోని ఆలకూరపాడు ప్రాథమిక పాఠశాలలో సమగ్ర శిక్షా తనిఖీ బృందం బుధవారం సోషల్ ఆడిట్ నిర్వహించింది. మధ్యాహ్న భోజనం పరిశీలించి, పాఠశాలలో కల్పించాల్సిన సౌకర్యాలపై ఆరా తీశారు. ఆడిట్ బృంద సభ్యులు నాగరాజు, ఏడుకొండలు, ప్రధానోపాధ్యాయుడు పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వామిత్వపై సిబ్బందికి అవగాహన

జరుగుమల్లి: జరుగుమల్లి, పాలేటిపాడు, తూమాడు గ్రామాల్లో బుధవారం పంచాయతీ సిబ్బందికి ఇంటి పన్ను వసూలు, స్వామిత్వ కార్యక్రమాలపై డిప్యూటీ ఎంపీడీవో కామేశ్వరరావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ప్రతి పంచాయతీలో ఇంటి పన్ను వసూలు పూర్తి చేయాలన్నారు.

నాయకుల నిరసన ర్యాలీ

దర్శి: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తుందంటూ వైకాపా ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ వెంకాయమ్మ, అయిదు మండలాల పార్టీ నాయకులు హాజరయ్యారు. పొదిలి రోడ్డులోని పార్టీ కార్యాలయం నుంచి గడియారస్తంభం వరకు ర్యాలీ సాగింది. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ దేవప్రసాద్‌కు వినతి పత్రం ఇచ్చారు.

రోడ్లు వేయరు.. కాలువలు కట్టరు

కొండపి మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు సరిగా లేక, కాలువలు నిర్మించక వాహన చోదకులు, స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని కె.ఉప్పలపాడు ప్రధాన రహదారి పక్కనే ఎస్సీ కాలనీలో కాలువలు పూర్తి స్థాయిలో లేవు. ఉన్న ప్రాంతాల్లో పూడికలు పేరుకుపోయి నీరు నిలిచి అధ్వానంగా కనిపిస్తున్నాయి. దీనివల్ల దుర్వాసనతోపాటు, రాత్రివేళ దోమల బెడద అధికంగా ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. విషజ్వరాలు వ్యాపిస్తున్నాయని భయాందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి తాత్కాలికంగా అయినా మురుగు నీరు తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి పుష్పలతను వివరణ కోరగా.. కాలువల నిర్మాణ విషయమై ఇప్పటికే ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. త్వరలోనే మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. ◗ మండలంలోని పెట్లూరు వెళ్లాలంటే గుంతలమయమైన రహదారిలో అష్టకష్టాలు పడాల్సిందే. ఇటీవల గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించారు. గతంలో టంగుటూరు నుంచి గ్రామ శివారు వరకు తారు రోడ్డు వేసి కొంత మేర వదిలేశారు. సుమారు అర కిలో మీటరు మేర ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, కొండపి గ్రామీణం

కె.ఉప్పలపాడు ఎస్సీ కాలనీ వద్ద నిలిచిన మురుగు నీరు

లోగ్రేడ్ పొగాకు బేళ్ల కొనుగోలుకు ఆదేశం

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు తీసుకొచ్చే లోగ్రేడ్ పొగాకు బేళ్లను కంపెనీల ప్రతినిధులు కొనుగోలు చేయాలని ఇన్‌ఛార్జి రీజనల్ మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం కొండపి వేలం కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం రైతులు కొనుగోలుదారులతో మాట్లాడారు. బోర్డు సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ పాల్గొన్నారు. కొండపి వేలం కేంద్రంలో కిలో పొగాకు కనిష్ఠ ధర రూ.60 పలికింది. రైతులు కేంద్రానికి 1,398 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా, అందులో 1,195 కొనుగోలు చేశారు. మిగిలినవాటిని వివిధ కారణాలతో తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.340, సరాసరి ధర రూ.181.56 పలికింది. ◗ టంగుటూరు: టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో బుధవారం కిలో గరిష్ఠ ధర రూ.340 పలికింది. రైతులు 1,153 బేళ్లను తీసుకురాగా..937 కొనుగోలు చేశారు. కనిష్ఠ ధర రూ.60, సరాసరి ధర రూ.224 పలికినట్లు వేలం కేంద్ర నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

వేలం ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

సీపీఎం మండల కమిటీ సమావేశం

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: పశ్చిమ ప్రకాశం ప్రజలను మరోసారి మోసం చేయడానికి పాలకులు ప్రయత్నం చేస్తున్నారని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సయ్యద్ హనీఫ్ విమర్శించారు. బుధవారం ఆ పార్టీ మండల కమిటీ సమావేశం ఎం.రత్నారెడ్డి అధ్యక్షతన సీఎస్‌పురంలో జరిగింది. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కావాలంటే పెండింగ్ పనులు, నిర్వాసితులకు రూ.నాలుగువేల కోట్లు అవసరం కాగా, గత ఏడాది రెండు బడ్జెట్లలో రూ.699 కోట్లు మాత్రమే కేటాయించినట్లు తెలిపారు.

2వ వర్ధంతి

మరణం: 13-11-2023

కీ॥శే॥ పూసల తిరుపతమ్మ గారు

మంచికి మానవత్వానికి మారుపేరుగా, అందరి హృదయాలలో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకొని ఆకస్మికంగా మా నుండి దూరమై 2 వసంతాలు గడిచిననూ మీరు మాలో ఒకరిగా లేరన్న చేదు నిజాన్ని జీర్ణించుకోలేకపోతున్నాం.. మీరు మాతో గడిపిన క్షణాలు, మధుర స్మృతులు మరువలేకున్నాం. విధి వక్రించి మిమ్ములను మా నుండి దూరం చేసినా మీరు మా గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారు. మీ ఆకస్మిక మరణానికి చింతిస్తూ... నీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భర్త: పూసల సంజీవయ్య Ex.M.P.P., దర్శి

కుటుంబ సభ్యులు & బంధుమిత్రులు

(c) eenadu

జాలువారిన ప్రకృతి చిత్రం

'ఈనాడు' ప్రతిభాపాటవ పోటీల్లో భాగంగా ఒంగోలులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన చిత్రలేఖనం పోటీలు ఉత్సాహంగా సాగాయి. 'ప్రకృతి అందాలు, నదులు, పక్షులు' అన్న అంశంపై విద్యార్థులు ఆకట్టుకునేలా బొమ్మలు గీశారు. జె.స్పందన.. ప్రథమ, డి.గౌతమ్.. ద్వితీయ, ఈ.హేమంత్.. తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ కె.అలీబాబా చేతులమీదుగా బహుమతులు అందజేశారు. - న్యూస్‌టుడే, ఒంగోలు విద్య

విజేతలతో కళాశాల ప్రిన్సిపల్ అలీబాబా

ఒంగోలు

•ఒంగోలు •సంతనూతలపాడు

ఎమ్మెల్యేను కలిసిన మైనార్టీ నాయకులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యులుగా నియమితులైన షేక్ కలీల్‌బాషాతో పాటు నగరానికి చెందిన మైనార్టీ నాయకులు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు పఠాన్ హనీఫ్ ఖాన్, హజీముస్తఫా, మహమ్మద్ ఖాన్, అల్లాభక్షు, మున్నా, సిలార్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాలపై కొరడా

చీమకుర్తిలో అనుమతి లేని నిర్మాణాన్ని తొలగిస్తున్న సిబ్బంది

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగర పాలక సంస్థ పరిధిలో అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాలను పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది కూలగొట్టారు. పేర్నమిట్ట, మర్రిచెట్ల కాలనీ ప్రాంతంలో ప్లాన్ విరుద్ధంగా అపార్ట్‌మెంట్లపై అంతస్తులు నిర్మించారు. వీరికి ముందుగా నోటీసులు ఇచ్చిన సిబ్బంది... బుధవారం ఆయా ప్రాంతాలకు వెళ్లి నిర్మాణాలను తొలగించారు. ఏసీపీ సుధాకర్, టీపీవో బాబూరావు పర్యవేక్షించారు. నగరంలో గుర్తించిన మరికొన్నింటిని తొలగించనున్నట్లు టీపీవో తెలిపారు. ● చీమకుర్తి: పట్టణంలో అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలను నిలిపివేయించారు. రెండు చోట్ల అనధికార నిర్మాణాలను తొలగించారు. పట్టణాల్లో అనుమతి లేని కట్టడాలపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక విభాగం ఉన్నతాధికారుల సూచనల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ రామకృష్ణయ్య తెలిపారు. టీపీవో శరధ, వార్డు ప్రణాళిక విభాగం కార్యదర్శులు పాల్గొన్నారు.

మొంథా గాయం... రూ.91.63 కోట్ల నష్టం

మొంథా తుపాను ఒంగోలు నియోజకవర్గానికి తీరని నష్టం మిగిల్చింది. పంటలు దెబ్బతినడంతో పాటు... వాగులు, నదులు పొంగి పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ రహదారులు కోతకు గురయ్యాయి. విద్యుత్తు స్తంభాలు, పరివర్తకాలు నేలకొరిగాయి. మొత్తంగా రూ.91.63 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. ఈ నెల 10న ఒంగోలు వచ్చిన కేంద్ర బృందం సభ్యులకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఈ వివరాలు సమర్పించారు. అన్ని విధాలా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. - న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

ఇటీవల కొత్తపట్నంలో నష్టం వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర బృందం సభ్యులు

● అన్నదాత కంట కన్నీరు : గత నెల 27 నుంచి 29 వరకు కుండపోతగా కురిసిన వర్షం, ఈదురు గాలుల కారణంగా ఒంగోలు, కొత్తపట్నం మండలాల పరిధిలోని సుమారు వెయ్యి మంది రైతులు 312 హెక్టార్లలో ఆక్వా సాగు, 850 ఎకరాల్లో వివిధ రకాల పంటలు నష్టపోయారు. ఎక్కువ విస్తీర్ణంలో వరి దెబ్బతింది. చింతాయగారిపాలెం, దేవర నారుమళ్ల కుప్పలపాడు, తీరప్రాంత గ్రామాల్లో కూరగాయలు, ఆకుకూరలు, చేమదుంప, పూల తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఒంగోలు మండలం పెళ్లూరు, కొత్తపట్నం మండలం అల్లూరు సాగు నీటి చెరువులకు ఎగువ నుంచి వరద పోటెత్తడంతో కట్టలు తెగి... నాలుగు రోజుల పాటు దిగువ ప్రాంతాలకు ఉద్ధృతి కొనసాగింది.

● రహదారులు ఛిద్రం... : వాగులు వంకలు పొంగి పొర్లడంతో పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ రహదారులు ఎక్కడికక్కడ కోతకు గురయ్యాయి. భాగన్న దారుల్లో సైతం భారీ గుంతలు ఏర్పడ్డాయి. బీరంగుంట - మోటుమాల మధ్య కల్వర్టు కోతకు గురైంది. గుండ్లకమ్మ జలాశయం గేట్లు ఎత్తడంతో దిగువన ఉన్న మద్దిపాడు, నాగులుప్పలపాడు, కొత్తపట్నం మండలాల్లోని పలు గ్రామాల్లోకి నీరు చేరి... రక్షిత పథకాలకు చెందిన విద్యుత్తు మోటార్లు, ఫిల్టర్ బెడ్లు మరమ్మతులకు గురయ్యాయి. త్రాగునీరు ఉప కేంద్రంలోకి వరద చేరింది. పరివర్తకాలు, స్తంభాలు నేలకొరగడం, పలు చోట్ల తీగలు తెగిపడటంతో విద్యుత్తుశాఖకు అపార నష్టం వాటిల్లింది.

శాఖల వారీగా నష్టం వివరాలు (రూ.కోట్లలో)	ఆర్‌అండ్‌బీ	నగరపాలక సంస్థ	జలవనరులు	ఆక్వా, వ్యవసాయ పంటలు, పీఆర్ దారులు, విద్యుత్తు తదితరాలు
	47.99	19.91	2.97	20.76

రైతులను ఆదుకోవాలని వినతి

మద్దిపాడు, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో పొగాకు నారుమళ్లు నీట మునిగి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఉబ్బా వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. గాజులపాలెం ఎస్సీ రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని పరిహారం చెల్లించాలని కోరారు. కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు బాలకోటయ్య, కనపర్తి సుబ్బారావు పాల్గొన్నారు.

లోగ్రేడ్ బేళ్లు కొనుగోలు చేయాలి

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు తెచ్చే లోగ్రేడ్ పొగాకు బేళ్లను కొనుగోలు చేయాలని ఇన్‌ఛార్జి రీజినల్ మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. కొండపి వేలం కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. వేలం ప్రక్రియను పరిశీలించి... రైతులు, కొనుగోలుదారులతో మాట్లాడారు. రైతుల కష్టానికి తగ్గట్టు, గిట్టుబాటు ధరలు కల్పించాలని తెలిపారు. అనంతరం బోర్డు సిబ్బందితో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. కేంద్రం నిర్వహణాధికారి జె.సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆహార కమిషన్ సభ్యురాలికి స్వాగతం

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా పర్యటన నిమిత్తం రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి... బుధవారం రాత్రి ఒంగోలుకు చేరుకున్నారు. బాపట్ల జిల్లా పర్యటన ముగించుకుని స్థానిక ఎన్నెస్పీ అతిథి గృహానికి వచ్చారు. డీఎస్‌వో పద్మశ్రీ, జిల్లా పౌరసరఫరాల సంస్థ డీఎం వరలక్ష్మి, పీడీ, గిరిజన, సాంఘిక సంక్షేమశాఖల అధికారులు నిర్మలజ్యోతి, వరలక్ష్మి, ఎస్.లక్ష్మానాయక్ తదితరులు ఆమెకు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు.

'కూటమి'తోనే సొంతింటి కల సాకారం

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ - ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కింద మంగమూరు ఎస్సీ కాలనీలో ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారు కందుల ఆదిలక్ష్మితో బుధవారం గృహప్రవేశం చేయించారు. ఇంటి తాళం, పట్టు వస్త్రాలు అందజేశారు. పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పండగ వాతావరణంలో గృహ ప్రవేశాలు చేపట్టినట్లు తెలిపారు. డీఈ పి.చెన్నరాయుడు, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీవో సురేష్‌బాబు, తెదేపా మండలాధ్యక్షుడు మద్దినేని హరిబాబు, అబ్బూరి శ్రీనివాసరావు, ఎంపీపీ విజయ, డీసీ ఛైర్మన్ నల్లూరి కృష్ణారావు, సొసైటీ అధ్యక్షుడు నల్లూరి నారాయణరావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుకు పట్టు వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

స్వయం ఉపాధికి వాసవీ చేయూత

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: నిరుపేదలకు స్వయం ఉపాధికి అండగా నిలుస్తున్నట్లు వాసవీ క్లబ్ అంతర్జాతీయ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ కొంజేటి వెంకటసురేష్‌బాబు తెలిపారు. ఉప్పుగుండూరు గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఏడుగురు యువకులకు ఒక్కొక్కరికి రూ.25 వేలు చొప్పున వడ్డీ లేని రుణాలు అందజేశారు. జీఎంఆర్ ఫౌండేషన్ ద్వారా దేశవ్యాప్తంగా ఇలా రూ.కోటి మేర అందజేస్తున్నట్లు చెప్పారు. నిధులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైస్ గవర్నర్ అమరా వేణు తెలిపారు. సమన్వయకర్త పులకాని రాజు, క్లబ్ అధ్యక్షుడు కొంజేటి జలంధర్, సభ్యులు గుండా వెంకటసుబ్బారావు, గాదెంశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

ప్రకృతి సేద్యంపై ఐసీఆర్పీలకు శిక్షణ

కొత్తపట్నం, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయ ఐసీఆర్పీ శిక్షకులు అవసరమైన మెలకువలు తెలుసుకోవాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి తెలిపారు. శిక్షణలో భాగంగా బుధవారం.. కొత్తపట్నం, మోటుమాల, పాదర్తి గ్రామాల్లోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి అక్కడ అనుసరిస్తున్న విధానాలపై అవగాహన కల్పించారు. ఘన, ద్రవ జీవామృతాలు, విత్తన గుళికల తయారీని ప్రయోగాత్మకంగా చూపారు. ఈ అంశాలపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సిబ్బంది నరసింహులు, వికాస్ రెడ్డి, బ్రహ్మయ్య, మహేష్ రెడ్డి, రూప్సిరాణి పాల్గొన్నారు.

శిక్షణార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి

తెదేపా గ్రామ కమిటీల ప్రమాణ స్వీకారం

మద్దిపాడు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని తెదేపా గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, అనుబంధ కమిటీల సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మందపల్లి శ్రీనివాస్, పొగాకు ఉత్పత్తిదారుల సమాఖ్య అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు మాట్లాడారు. అంతా సమన్వయంతో పనిచేసి రానున్న స్థానిక ఎన్నికల్లో విజయదుందుభి మోగించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సభ్యులతో ప్రమాణం చేయించారు. అడకా స్వాములు, గోరంట్ల చిరంజీవి, అబ్బూరి శేషగిరి, వడ్డెంపూడి శ్రీను, పోతినేని శ్రీనివాస్, సర్పంచులు రావిపాటి అంజమ్మ శేషయ్య, మండవ శివానందరావు, పూనూరి సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యురాలు భవాని తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణం చేస్తున్న కమిటీల సభ్యులు

ప్రవాస భారతీయుడి వితరణ

మద్దిపాడు, న్యూస్‌టుడే: పట్టుదలగా చదివి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ఎంతటి విజయాలనైనా సాధించవచ్చని టైమ్స్ ఫౌండేషన్ అధినేత, ప్రవాస భారతీయుడు పూనాటి రవీంద్రబాబు పేర్కొన్నారు. మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. గత ఏడాది పది ఫలితాల్లో గణితం, సైన్స్ సబ్జెక్టుల్లో 90 మార్కులు దాటిన విద్యార్థులను సొంత ఖర్చుతో గుంటూరులోని కార్పొరేట్ కళాశాలలో [illegible] మని తెలిపారు. అనంతరం పాఠశాలలోని సుమారు 450 మంది విద్యార్థులకు [illegible] .. సంస్థ అధ్యక్షురాలు గద్దె అపర్ణ, సభ్యులు మోపర్తి శేషగిరి, రామినేని శ్రీరంజని చేతుల మీదుగా పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు, ఝాన్సీ, అమర్‌నాథ్, మస్తాన్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు అందుకున్న బాలికలతో ఎన్నారై రవీంద్రబాబు, ప్రతినిధులు

దారంతా మురుగే

కొత్తపట్నంలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాలనీకి వెళ్లే ప్రధాన మార్గం దుస్థితి ఇది. మొన్నటి తుపాను ప్రభావంతో లోతట్టుగా ఉన్న దారి పూర్తిగా జలమయమై... అక్కడి నివాసితులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కొత్తపట్నం

ఇక్కడో కాలువ ఉంది

నియోజకవర్గ కేంద్రం సంతనూతలపాడులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెనుక బజారులోని కాలువ దుస్థితి ఇది. వ్యర్థాలతో పూడిపోయి నిండా పిచ్చి మొక్కలు పెరగడంతో... అక్కడో కాలువ ఉందన్న విషయమే తెలియడం లేదు. గ్రామంలోని మరికొన్నింటి పరిస్థితీ ఇలానే ఉండి... వర్షాల సమయంలో మురుగంతా రోడ్ల పైకి చేరుతోంది.

- న్యూస్‌టుడే, సంతనూతలపాడు

హైవేపైనే నిలిపేస్తున్నారు

గుండ్లాపల్లి పారిశ్రామికవాడ వద్ద పదహారో నంబరు జాతీయ రహదారిపై పరిస్థితి ఇది. అల్పాహారం, భోజనాల కోసం రోడ్డుపైనే లారీలు నిలిపేస్తుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సీతారామపురం కొష్టాలు, వెకటరాజుపాలెం - ఏడుగుండ్లపాడు మధ్యా ఇదే దుస్థితి నెలకొని ఇతర వాహనదారులు అవస్థలు పడుతున్నారు. - న్యూస్‌టుడే, మద్దిపాడు

సరకులు అందజేస్తున్న మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు

వరద బాధితులకు నిత్యావసరాలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో చెరువుకొమ్ముపాలెం తుపానునగర్, కర్నూలు రోడ్డు పీర్లమాన్యంలోని వరద బాధిత కుటుంబాలకు బుధవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి అయిదు కిలోల బియ్యం, తొమ్మిది రకాల సరకులతో కూడిన కిట్ అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ బాధితులకు సాయం అందించడం అభినందనీయమన్నారు. నగర కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, డీబీఆర్సీ ప్రతినిధులు మల్లెల చిన్నప్ప, శ్రీనివాసరావు, కిరణ్‌కుమార్, కరుణాకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత : చీమకుర్తి, న్యూస్‌టుడే: నిప్పట్లపాడు ఉప కేంద్రంలో నిర్వహణ పనుల కారణంగా ఆ పరిధిలోని నిప్పట్లపాడు, దేవరపాలెం, బక్కిరెడ్డిపాలెం, ఓబచెత్తపాలెం గ్రామాలకు... గురువారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ మోహన్‌రావు తెలిపారు.

పాఠశాలకు ఆర్వో ప్లాంట్ వితరణ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: సూర్యశ్రీ దివ్యాంగుల ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో భీమరాజు వీధిలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు రూ.40 వేల విలువైన ఆర్వో ప్లాంట్‌ను బుధవారం అందజేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన నీరు అందించాలన్న ఉద్దేశంతో ఈ వితరణ చేపట్టినట్లు ట్రస్టు వ్యవస్థాపకులు మండువ మురళీకృష్ణ తెలిపారు. నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, ట్రస్టు కార్యదర్శి షేక్ సర్దార్ బాషా, ప్రధానోపాధ్యాయిని ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మురళీకృష్ణ, ప్రతినిధులు

భూసార పరీక్షలతో రైతులకు ప్రయోజనం

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: భూసార పరీక్షల ఆధారంగా రైతులు ఎరువులు వినియోగించాలని జిల్లా వనరుల కేంద్రం ఏవో వి.వి.శేషమ్మ, ఏవో పి.పావని సూచించారు. మంగమూరు, పేర్నమిట్టలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో భూసార పరీక్షల పత్రాలు అందజేశారు. సేంద్రియ, జీవన ఎరువుల ప్రాధాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవోలు సుబ్బారెడ్డి, వీఏఏ అమూల్య, జానకి పాల్గొన్నారు. ● మద్దిపాడు, న్యూస్‌టుడే: లైసెన్స్ కలిగిన డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలని ఏవో స్వర్ణలత తెలిపారు. మద్దిపాడు, వెల్లంపల్లిలో నిర్వహించిన కార్యక్రమాల్లో మాట్లాడారు. మద్దిపాడులో వరి పైరును పరిశీలించి యాజమాన్య పద్ధతులు తెలియజేశారు. ఏఈవో శేషయ్య, వీఏఏలు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్ష పత్రాలు అందజేస్తున్న ఏవోలు పావని, శేషమ్మ

ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా కార్తిక వన సమారాధన

చీమకుర్తి, న్యూస్‌టుడే: రామతీర్థంలోని కాకతీయ కమ్మవారి సత్రంలో బుధవారం కార్తిక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. విశేష పూజలు నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కౌన్సిలర్ గొల్లపూడి రమాదేవి, సంఘం నాయకులు రావిపాటి సుబ్బారావు, గంగాధరరావు, యోగయ్య, హనుమంతరావు, లక్ష్మీనర్సయ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
కొత్తపట్నం : 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: **కొత్తపట్నం:** పాదర్తి గ్రామంలో పలు చోట్ల వీధి దీపాలు వెలగక అంధకారం నెలకొంటోంది. - **సురేష్**

✓: పరిశీలించి... అవసరమైన చోట కొత్తవి ఏర్పాటు చేస్తాం.

- **హుస్నారా బేగం, పంచాయతీ కార్యదర్శి**

?: నాగులుప్పలపాడు: కనపర్తిలో చాన్నాళ్లుగా వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళ రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం.

- **వెంకటేశ్వరరెడ్డి**

✓: సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - **రవికుమార్, ఎంపీడీవో**

కష్టాల దారిది.. కావాల్సిందే వారధి

న్యూస్‌టుడే - మద్దిపాడు, నాగులుప్పలపాడు

● నేల చప్టాలతో ఏళ్లుగా కొనసాగుతున్న సమస్య

తుపాన్లకే కాదు చిన్నపాటి వర్షాలు పడినా మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల పరిధిలో నేల చప్టాలపై వరద పొంగి ఆ పరిధిలోని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఆ సమయంలో అటుగా ఎవరూ రాకపోకలు సాగించకుండా అధికారులు సైతం గస్తీ ఏర్పాటు చేయాల్సి వస్తోంది. ఏళ్లుగా కొనసాగుతున్న సమస్యకు వంతెనల నిర్మాణంతోనే పరిష్కారం లభిస్తుందని... ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి... : ● మద్దిపాడు మండల పరిధిలోని ముదిగొండ వాగు పొంగితే... నేలటూరు, గురవారెడ్డిపాలెం, పెదకొత్తపల్లి గ్రామాల్లోని నేల చప్టాలపై అయిదారడుగుల మేర నీరు పారుతోంది. ఆ ఉద్ధృతి తగ్గేవరకు ఆయా గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. మొన్నటి తుపాను ప్రభావానికి నేలటూరు వాసులు అయిదు రోజుల పాటు బయటకు రాలేక అవస్థలు పడ్డారు. దొడ్డవరప్పాడు పరిసరాల్లోకి నీరు చేరింది.

● గ్రోత్ సెంటర్ నుంచి నాగులుప్పలపాడుకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలోని కొత్తకోట, హనుమాపురం, నిడమానూరు వద్ద ఉన్న నేల చప్టాలపైనా ఇదే దుస్థితి నెలకొంటోంది. ఏ మాత్రం వర్షం పడినా కార్మికులు, సాధారణ పౌరులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ● వాగులు పూడ్చి వెంచర్లు వేయడంతో దిగువకు నీరు పోయేదారి లేక దొడ్డవరప్పాడు, వెంకటరాజుపాలెం ప్రాంతాల్లో సమస్య నెలకొంటోంది.

ఇటీవల భారీ వర్షాలకు పెద కొత్తపల్లి వాగు పొంగడంతో కంచె వేసి కాపలాగా ఉన్న రెవెన్యూ సిబ్బంది

వైకాపా నిరసన... కేసు నమోదు

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: పీపీపీ పద్ధతిలో వైద్య కళాశాలల నిర్వహణను వ్యతిరేకిస్తూ వైకాపా ఆధ్వర్యంలో సంతనూతలపాడులో బుధవారం నిరసన ర్యాలీ చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. మాజీ మంత్రి మేరుగు నాగార్జున, దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ విజయ, జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ, చీమకుర్తి మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, బత్తుల బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సీఐ శ్రీకాంత్‌బాబు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించి ర్యాలీ చేపట్టడంతో మాజీ మంత్రి నాగార్జున, చెంచిరెడ్డితో పాటు 77 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వృద్ధాశ్రమంలో పండ్ల పంపిణీ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: తెదేపా యువ నాయకుడు మాగుంట రాఘవరెడ్డి జన్మదిన వేడుకను రామనగర్‌లోని కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. బెజవాడ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కేకు కోశారు. బైపాస్ రోడ్డులోని సమతా వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. నాయకులు బెల్లం సత్యనారాయణ, తాతా ప్రసాద్, కుప్పా రంగనాయకులు, కండే శ్రీనివాసులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల ఢీ.. ఇద్దరికి గాయాలు

మద్దిపాడు, న్యూస్‌టుడే: అడ్డంగా రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. బుధవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. హైవే మొబైల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అద్దంకి మండలం ధేనువకొండకు చెందిన రామాంజనేయులు... ఒంగోలు నుంచి ద్విచక్ర వాహనంపై గ్రామానికి వెళ్తున్నారు. సీతారామపురం కొష్టాలు వద్ద మరో వాహనంపై అడ్డంగా రోడ్డు దాటుతున్న గురవారెడ్డిపాలేనికి చెందిన వెంకటరావును ఢీకొట్టారు. రామాంజనేయులుకు తీవ్ర గాయాలు కావడంతో 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. వెంకటరావుకు స్వల్ప గాయాలయ్యాయి.

(c) eenadu

మూడేళ్ల పోరాటం..

ఊరి పేరుపై విజయం

తీర్మానంపై నాటి సర్పంచితో సంతకాలు చేయిస్తూ..

పెద పుత్తేడు.. దగదర్తి మండలంలోని మేజర్ పంచాయతీ. అయిదు మజరా గ్రామాలతో సువిస్తృత విస్తీర్ణం. జనాభా 4,275 కాగా.. ఇందులో పురుషులు 2,156, మహిళలు 2,119. ఇంత వరకు బాగానే ఉన్నా.. పంచాయతీ పేరు చెప్పాలంటే గ్రామస్థులు కొంచెం ఇబ్బంది పడే వారు. అందుకే కలిసి కట్టుగా పేరు మార్పునకు పోరాటం చేశారు. తొలుత నాటి సర్పంచి జ్యోతి.. 12 మంది సభ్యులతో పంచాయతీ కార్యాలయంలో సమావేశమై.. 2014, అక్టోబరులో ఆ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేయించారు. దాన్ని జిల్లా పంచాయతీ అధికారి, ఏపీ పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్‌కు పంపించారు. తర్వాత కమిషనర్ ప్రిన్సిపల్ సెక్రటరీకి చేరవేశారు. అలా సుదీర్ఘ ప్రయత్నాల అనంతరం సెప్టెంబరు 2017లో 'శ్రీరామపురం'గా మార్పుతూ.. నాటి సీఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. యువకుల మూడేళ్ల కృషికి ఫలితం దక్కింది. - న్యూస్‌టుడే, దగదర్తి

స్వాతంత్య్రానికి ముందు.. తర్వాత ఎదుర్కొన్న అవహేళనను.. ఉమ్మడి ప్రయత్నంతో ఆ ఊరి యువకులు అధిగమించారు. స్థానిక ఇంజ్ల కృష్ణయ్య ఆధ్వర్యంలో మూడేళ్ల పోరాటంతో.. గ్రామ పంచాయతీ పేరును మార్పు కున్నారు. మీరూ చదవండి కథ.

లబ్ధిదారుకు తాళం చెవి ఇస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తదితరులు

ఇంతి మోమున ఇంటి కాంతి

నెల్లూరు (బృందావనం), కోవూరు, న్యూస్‌టుడే: పేదల సొంతింటి కల నెరవేరింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిన్నర కాలంలోనే జిల్లాలో 19,678 గృహాలను పూర్తి చేయగా.. బుధవారం 85 ఇళ్లలో లబ్ధిదారులు గృహ ప్రవేశం చేశారు. తద్వారా లబ్ధిదారుల మోముల్లో సంతోష కాంతులు వెల్లివిరిశాయి. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలతో పాటు వెంకటగిరి నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ఎమ్మెల్యేలు లబ్ధిదారులకు తాళాలు అందజేశారు. కోవూరు మండలం చిన్నపడుగుపాడు ఎన్టీఆర్ లేఅవుట్‌లో కలెక్టర్ హిమాన్షుశుక్లాతో కలిసి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గృహాలను ప్రారంభించారు. 38 మందికి తాళాలు అందజేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో 'అందరికీ ఇళ్లు.. జగనన్న కాలనీలు' అంటూ అయిదేళ్లు ఊరించారు. కాలనీలు ఏర్పాటు చేసినా ఇళ్ల నిర్మాణాలు కొలిక్కిరాలేదు. పైగా పెద్దఎత్తున అక్రమాలు చోటు చేసుకుని పేదలు నష్టపోయారు. దీనిపై దృష్టిసారించిన కూటమి ప్రభుత్వం అదనపు తోడ్పాటు అందించగా.. నిర్మాణాలు పూర్తయ్యాయి. గృహ ప్రవేశాలు జరిగాయి.

తీరిక దొరికేనా.. తిప్పట తప్పేనా!

జిల్లాలో 12,293 ఖాతాలకు ఆధార్ సమస్య ● కార్యాలయాల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణలు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలని కూటమి ప్రభుత్వం స్పష్టం చేస్తున్నా.. కొందరు రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంగా కారణంగా లక్షిత వర్గాలకు లబ్ధి చేరడం లేదు. చిన్న చిన్న సమస్యలనూ సరిచేయకపోవడమే అందుకు కారణంగా తెలుస్తోంది. మరోవైపు రైతులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న పరిస్థితి నెలకొంది.

ఉలవపాడు తహసీల్దార్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ హిమవంశీకి అర్జీలు ఇస్తున్న రైతులు

2 లక్షల మందికి జమ

అన్నదాత-సుఖీభవ, పీఎం కిసాన్ యోజన ద్వారా కూటమి ప్రభుత్వం రైతుల బ్యాంకు ఖాతాలకు ఏడాదికి రూ. 20వేల చొప్పున జమ చేస్తోంది. అర్హత కలిగిన రైతుల పొలం ఖాతాలకు, బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింకై.. దస్త్రాలన్నీ సక్రమంగా ఉన్న జిల్లాలోని 2 లక్షల మందికిపైనే ఈ ఏడాది ఆగస్టులో మొదటి విడత నిధులు వేసింది.

సాయానికి 12,313 మంది దూరం

ఖాతాలకు ఆధార్ నమోదు కాకపోవడం.. తప్పుగా పడటం.. తల్లిదండ్రులు మృతి చెంది సదరు భూములు వారసులకు మ్యుటేషన్ కాకపోవడం.. కోర్టు వివాదాలు తదితరాలతో 12,313 మంది తొలి విడత సాయం పొందలేకపోయారు. సర్వే నంబర్లు, విస్తీర్ణం, ఇతర వివరాలు సక్రమంగా ఉన్నా వెబ్‌ల్యాండ్‌లో ఆధార్ నంబరు తప్పుగా పడటం.. రీసర్వే అనంతరం కేటాయించిన ఎల్‌పీఎం నంబరుకు ఆధార్, మొబైల్ నంబరు తప్పుగా నమోదు కావడం ఇక్కట్లకు గురి చేస్తోంది.

ఎల్‌పీఎం ప్రకారం..	
విడవలూరు	651
సీతారామపురం	373
పొదలకూరు	302
దగదర్తి	281
ఉదయగిరి	231
ఉలవపాడు	181
రాపూరు	181
అల్లూరు	177

ఆధార్ సీడింగ్ ఉచితమే...

ఆధార్ సీడింగ్ సమస్యలు ఉన్నవారి జాబితా మూడు నెలల కిందటే వ్యవసాయశాఖ నుంచి 'రెవెన్యూ'కు చేరినా నేటికీ పరిష్కారం కాలేదు. ఖాతాల ఆధార్ సీడింగ్‌కు వసూలు చేసే రూ. 50 రుసుంను ప్రభుత్వం రద్దు చేసింది. ఉచితంగా చేయించుకునే అవకాశం కల్పించింది. సమస్యలు ఉన్న వాటిపై ఉన్నతాధికారులే స్పష్టత ఇవ్వాలన్న భావన కూడా పరిష్కారం దిశగా అడుగులు పడకపోవడానికి కారణమన్న మాట వినిపిస్తోంది.

● ఈ సమస్యలపై జిల్లా రెవెన్యూ అధికారి విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. భూ ఖాతాలకు ఆధార్ సీడింగ్ సమస్యలు ఉన్న రైతులు దరఖాస్తు చేసుకుంటే.. పరిశీలించి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

రైతుల ఖాతా సమస్యలు ఇలా.. సర్వే నంబర్ల ప్రకారం

మండలం	సంఖ్య
కొండాపురం	1547
సీతారామపురం	1154
సైదాపురం	975
దగదర్తి	863
లింగసముద్రం	812
అల్లూరు	648
విడవలూరు	495
ఉలవపాడు	460
పొదలకూరు	449
వింజమూరు	364
కందుకూరు	305

కోన కాలువలో అమృత ధార

న్యూస్‌టుడే, ఉదయగిరి: ఉదయగిరి దుర్గం.. రాచరిక పాలనకు.. నాటి వైభవానికి చిహ్నం. శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించిన అనేక అపురూప కట్టడాలు.. చారిత్రక ఆనవాళ్లు.. ఇప్పటికీ ఇక్కడ దర్శనమిస్తాయి. అలాంటి వాటిలో విశేషంగా చెప్పుకోదగింది కోన కాలువ. పట్టణ సమీపంలోని కొండ పై నుంచి జాలువారే నీటిని పట్టుకునేందుకు వీలుగా అలనాటి రాజులు సుమారు 3 కి.మీ. మేర కాలువ నిర్మించారు. దీని ద్వారా వచ్చే జలం స్థానిక ఆర్టీసీ డిపో సమీపంలోకి చేరుతుంది. దుర్గం కొండ పై నుంచి అనేక వృక్షాలను తాకుతూ జాలువారే ఈ నీటిలో ఔషధ గుణాలు ఉంటాయని ప్రజల నమ్మకం. మండు వేసవిలోనూ ఈ నీరు చల్లగా ఉండటం మరో విశేషం. ఉద్యోగ, ఉపాధి అవసరాల నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు.. ఇక్కడ అడుగు పెట్టగానే కోన జలం తాగి చక్కటి అనుభూతిని పొందుతారు. పట్టణంలో సుమారు నాలుగు వేల కుటుంబాలు ఉంటే.. 70 శాతం ఈ నీటినే వాడుతుంటారు. కరవు కాటకాల్లోనూ పరవళ్లు తొక్కే కోన కాలువ శతాబ్దాలుగా ప్రజల దప్పిక తీర్చుతోంది.

బాలిక..

రాణి లక్ష్మీబాయిలా!

విద్యాలయాల్లో ఆత్మరక్షణ విద్యపై శిక్షణ

న్యూస్‌టుడే, దుత్తలూరు

బాలికలు ఏ పరిస్థితులనైనా ధైర్యంగా ఎదుర్కొనేలా... ఆకతాయిలు, అఘాయిత్యాలకు పాల్పడే వారిపై రుద్రమదేవిలా పోరాడేలా పాఠశాలల్లో ఆత్మరక్షణ విద్య నేర్పనున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం 'రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ శిక్షణ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ విద్యా సంవత్సరం నుంచే కరాటే నేర్పించనుంది.

తొలి విడత 314 చోట్ల..

జిల్లాలో 2,517 పాఠశాలలు ఉండగా- మొదటి విడతలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినులకు ఆత్మరక్షణ విద్యపై శిక్షణ ఇవ్వనున్నారు. తొలి విడతగా 314 బడుల్లో ప్రారంభించనున్నారు. రెండు నెలల్లో 20 శిక్షణ తరగతులు.. ఒక్కో దానికి గంటన్నర సమయం ఉంటుంది.

తర్ఫీదు ఇలా..

ఎంపిక చేసిన బడుల్లో ఒక శిక్షకుడిని నియమిస్తారు. స్వీయ రక్షణ పద్ధతులు, అత్యవసర సమయంలో ప్రతిస్పందన, దాడులను దీటుగా ఎదుర్కొని, స్వీయరక్షణ పొందడంలో మెలకువలు నేర్పిస్తారు. వ్యాయామ ఉపాధ్యాయులకూ తర్ఫీదు ఇస్తారు. వారు నేర్చుకుని తర్వాత విద్యార్థినులతో సాధన చేయించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి.

బాలికలకు మెలకువలు నేర్పిస్తున్న శిక్షకుడు

త్వరలోనే ప్రారంభం

ప్రస్తుతం బాలికలకు ఆత్మరక్షణ విద్య ఆవశ్యకత ఎంతో ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో ఈ కార్యక్రమం ప్రారంభిస్తున్నాం. కొన్నిచోట్ల ఇప్పటికే ప్రారంభమైంది. - వెంకటసుబ్బయ్య, ఏపీసీ, సమగ్రశిక్షా అభియాన్

దివ్యాంగులారా.. దిగులొద్దు!

ఉచితంగా త్రిచక్ర వాహనాలు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు తీపి కబురు చెప్పింది. నడవలేని వారికి ఉచితంగా ట్రై మోటారు సైకిళ్లు(త్రిచక్ర వాహనాలు) ఇవ్వాలని నిర్ణయించింది. ఆ మేరకు ఒక్కో నియోజకవర్గానికి పది చొప్పున జిల్లాలోని 8 నియోజకవర్గాలకు 80 వాహనాలు మంజూరయ్యాయి. వీటిలో 50 శాతం మహిళలకు కేటాయించారు. ఒక్కో దాని విలువ రూ. 1.30 లక్షలు. అర్హులైన వారికి వంద శాతం రాయితీపై అందించనుంది. ఈ నెల 25వ తేదీలోపు అర్హులైన వారు వృద్ధుల సహాయ సంస్థ (ఏపీడీఏఎస్‌సీఏసీ) అధికారిక వెబ్‌సైట్ www.apdascac.ap.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఆ శాఖ ఏడీ మహమ్మద్ అయూబ్ తెలిపారు.

అర్హులెవరంటే..

● రాష్ట్రానికి చెందిన వారై ఉండాలి. ● ఈ నెల 25వ తేదీ నాటికి 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు. ● శారీరక వైకల్యం 70 శాతం.. అంతకంటే ఎక్కువ కలిగి, కుటుంబ వార్షికాదాయం రూ.3 లక్షల లోపు ఉండాలి. ● పథకానికి ఎంపికయ్యే నాటికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. గతంలో ప్రభుత్వ, ఏ ఇతర ప్రైవేటు సంస్థల ద్వారా మోటారు వాహనం తీసుకుని ఉండకూడదు. ● దరఖాస్తుదారు పేరుపై ఏ వాహనం ఉండకూడదు. ● డిగ్రీ.. అంత కంటే ఎక్కువ కోర్సులు రెగ్యులర్ పద్ధతిలో చదువుతున్న వారు.. పదో తరగతి ఉత్తీర్ణులై స్వయం ఉపాధి, వ్యవసాయ అనుబంధ రంగాల్లో కనీసం ఏడాది అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యమిస్తారు.

కావలి ఆసుపత్రిలో సిద్ధంగా రేడియో వార్మర్లు

నవజాత శిశువులకు

వెలుగు వెచ్చని ఊపిరి

కావలి, న్యూస్‌టుడే: నవజాత శిశువుల సంరక్షణకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా రాష్ట్రంలో తొమ్మిది నవజాత శిశు సంరక్షణ కేంద్రాల(ఎస్‌ఎన్‌సీయూ)కు శ్రీకారం చుట్టగా.. ఆ జాబితాలో కావలి ప్రాంతీయ ఆసుపత్రి కూడా చోటు దక్కించుకుంది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానంలో దీన్ని ప్రారంభించనుండగా.. అందుకు అనుగుణంగా ఆసుపత్రిలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఒప్పంద విధానంలో ఇద్దరు వైద్యాధికారులు, ఓ వైద్యుడు, ఆరుగురు నర్సింగ్ సిబ్బంది, ఇద్దరు ఆయాలు, ఒక కాపలాదారుడిని నియమిస్తారు. ఇప్పటికే సుమారు పది రేడియో వార్మర్లు సమకూరాయి. ప్రాంతీయ ఆసుపత్రికి నిత్యం 50 నుంచి 60 మంది గర్భిణులు సేవల నిమిత్తం వస్తుంటారు. రోజూ ఆరు నుంచి ఏడు ప్రసవాలు జరుగుతుంటాయి. ఈ క్రమంలో ప్రతి రెండు, మూడు రోజులకు ఒకరికైనా ఎస్‌ఎన్‌సీయూ చికిత్స అనివార్యమవుతోంది.

సేవలు ఇలా..

అప్పుడే పుట్టిన శిశువుల్లో శ్వాస ఇబ్బందులు తొలగేలా, తల్లిగర్భంలో ఉష్ణోగ్రతకు.. ప్రసవానంతరం వాతావరణం మధ్య వ్యత్యాసం తగ్గించేలా ఈ కేంద్రం ద్వారా వీలు కలుగుతుంది. ఫిట్స్ వచ్చినా.. తక్షణ చికిత్స ద్వారా జీవితకాల సమస్యను మొగ్గ దశలోనే అదుపు చేయవచ్చు. మధుమేహ లక్షణాలు ఉంటే.. తీవ్రతను తగ్గించేలా యూనిట్‌లో సదుపాయం ఉంటుంది. కామెర్లు, తక్కువ బరువుతో పుట్టే వారికి మెరుగైన చికిత్స అందుబాటులోకి వస్తుంది.

● దీనిపై డీసీహెచ్‌ఎస్ పరిమళను వివరణ కోరగా... ఇప్పటి వరకు ఎన్‌బీఎస్‌యూ మాత్రమే ఉంది. ఎస్‌ఎన్‌సీయూ అందుబాటులోకి వస్తే మరింత మెరుగైన వైద్యం అందుతుంది. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా శిశువులకు మంచి వైద్యం అందుబాటులోకి రానుంది అన్నారు.

ప్రగతి కల..

పారిశ్రామికమిలా!

సర్వేపల్లిలో పరిశ్రమల కేంద్రం ఏర్పాటు

వెంకటాచలం, న్యూస్‌టుడే: జిల్లా పారిశ్రామికంగా మరింత పురోగమించనుంది. ఓ వైపు పరిశ్రమల ఏర్పాటుకు భూములను కేటాయించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ.. మరోవైపు స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందులో భాగంగానే సర్వేపల్లి నియోజకవర్గం వెంకటాచలం మండలంలో పరిశ్రమల కేంద్రం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.

పోర్టు ప్రధాన రహదారిలో..

రామదాసుకండ్రిగ పంచాయతీ.. కృష్ణపట్నం పోర్టు ప్రధాన రహదారి పక్కన ఏపీఐఐసీ ఆధ్వర్యంలో పరిశ్రమల కేంద్రం ఏర్పాటు కానుంది. ఇక్కడ వంద ఎకరాల వరకు అందుబాటులో ఉండగా- ప్రస్తుతం 57 ఎకరాలు సేకరించారు. ఈ ప్రాంతం అటు పోర్టుకు, ఇటు జాతీయ రహదారికి దగ్గరగా ఉండటం అనుకూలం కానుంది. రెండు విడతల్లో అభివృద్ధి పనులు చేయాలని నిర్ణయించారు.

5.5 కోట్లు.. 20 ఎకరాలు

సేకరించిన 57 ఎకరాల్లో.. తొలి విడతగా 20 ఎకరాల్లో పరిశ్రమల కేంద్రం ఏర్పాటు చేసి.. రూ. 5.50 కోట్లతో రోడ్లు, విద్యుత్తు, డ్రైనేజీ, కల్వర్టుల నిర్మాణం చేపడతారు. ఈ స్థలంలో 59 ప్లాట్లు పడే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. వసతుల కల్పన తర్వాత ప్లాట్లు వేసి.. ధరలు నిర్ణయించి.. ఆన్‌లైన్ ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కేటాయిస్తారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి.

అయిదు వేల మందికి ఉపాధి

తొలి విడత ఏర్పాటవుతున్న పరిశ్రమల్లో రెండు వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మిగిలిన మొత్తం(37 ఎకరాలు)లోనూ పరిశ్రమలు సాకారమైతే అయిదు వేల మందికిపైగా లబ్ధి చేకూరనుంది. దీనిపై ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శివకుమార్ మాట్లాడుతూ.. ఏడు నెలల్లో మొత్తం పనులు పూర్తవుతాయన్నారు.

అలంకారం.. అంధకారం

నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం ప్రధాన గేటు నుంచి లోపలికి ఇరువైపులా ఏర్పాటు చేసిన ఆధునిక విద్యుద్దీపాలు ఇవి. మొత్తం 150 ఉండగా.. ఒక్కొక్కటి రూ. 2వేలు. కొంత కాలం సక్రమంగానే వెలుగులు విరజిమ్మినా.. నిర్వహణ కొరవడి కళావిహీనంగా మారాయి. కొన్నిచోట్ల తీగలు తెగిపోయి.. మరికొన్ని చోట్ల ధ్వంసమై.. ఇంకొన్నిచోట్ల దీపాలు లేక.. నిరుపయోగంగా మారాయి. - ఈనాడు, నెల్లూరు

కనిగిరి కనరే మరి!

కనిగిరి రిజర్వాయరు... సుమారు 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఈ జలనిధి ద్వారా కోవూరు, కావలి నియోజకవర్గాల్లోని రెండు లక్షల ఎకరాలకుపైగానే సాగునీరందుతుంది. ఇంతటి కీలకమైన ఈ జలాశయంపై అధికారుల పర్యవేక్షణ ఆశించిన స్థాయిలో లేదు. ఫలితంగా కీలకమైన గేట్లు, రెగ్యులేటర్ల వద్ద పగుళ్లు ఏర్పడ్డాయి. కొందరు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు నీటిని దారి మళ్లించి సొంత అవసరాలకు వాడుకుంటున్నారని.. అందుకే ఈ ప్రాజెక్టు వైపు అధికారులు కన్నెత్తి చూడటం లేదని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. తక్షణం దృష్టిసారించాలని కోరుతున్నారు. - ఈనాడు, నెల్లూరు

ట్రాఫిక్ సమస్య ఫిర్యాదుపై..

జిల్లా జడ్జి విచారణ

జిల్లా జడ్జితో సమావేశమైన ట్రాఫిక్ నియంత్రణ అధికారులు

నెల్లూరు (లీగల్), న్యూస్‌టుడే: నెల్లూరు నగరంలో నానాటికి పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ.. కాలం చెల్లిన వాహనాలపై చర్యలు తీసుకోవాలని దాఖలైన కేసులో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఛైర్మన్, జిల్లా జడ్జి జి. శ్రీనివాస్ ఎదుట నగర ట్రాఫిక్ నియంత్రణ అధికారులు బుధవారం హాజరయ్యారు. నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. అయ్యప్పరెడ్డి గతంలో ప్రిలిటిగేషన్ దాఖలు చేశారు. దాంతో ప్రతివాదులుగా ఉన్న అధికారులకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. వాణి నోటీసులు జారీ చేశారు. ఈ కేసులో ఫిర్యాదుదారుడుతో పాటు ప్రతివాదులు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నందన్, హెల్త్ ఆఫీసర్ కనకాద్రి, ట్రాఫిక్ డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి వివరణ ఇచ్చేందుకు జిల్లా జడ్జి ఎదుట హాజరయ్యారు. జిల్లా జడ్జి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. విచారణలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. వాణి పాల్గొన్నారు.

మ్యాపింగ్ చిక్కులు.. మార్పునకు అడుగులు

పోలింగ్ కేంద్రాల సిబ్బందికి శిక్షణ



సంగం, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఓటర్ల జాబితా నవీకరణ ముమ్మరంగా సాగుతోంది. అదే సమయంలో పలు సమస్యల పరిష్కారంతో పాటు సందేహాల నివృత్తే లక్ష్యంగా అధికారులకు ఎన్నికల సంఘం నేటి నుంచి శిక్షణ ఇచ్చేందుకు సమాయత్తమైంది. ఎనిమిది నియోజకవర్గాల పరిధిలోని 2,470 పోలింగ్ కేంద్రాల సిబ్బందికి సాంకేతిక నిపుణులు అవగాహన కల్పించనున్నారు. తద్వారా ప్రక్రియ మరింత వేగం పుంజుకోనుంది.

2002 సమగ్ర జాబితాతో...

నియోజకవర్గం	ఓటర్ల సంఖ్య
కందుకూరు	2,28,698
కావలి	2,39,659
ఆత్మకూరు	2,15,266
కోవూరు	2,66,828
నెల్లూరు నగరం	2,39,260
నెల్లూరు గ్రామీణం	2,81,291
సర్వేపల్లి	2,32,146
ఉదయగిరి	2,41,516

గత ఏడాది జిల్లాలో 20,39,426 మంది ఓటర్లు ఉండగా- ప్రస్తుతం ఆ సంఖ్య 19,44,664 గా ఉంది. ఈ లెక్కన 94,762 మంది తగ్గినట్లు తేలింది. దీంతో 2002 ప్రత్యేక సమగ్ర జాబితాతో(ఎస్.ఐ.ఆర్).. ప్రస్తుత జాబితాను మ్యాపింగ్ చేస్తుండగా.. పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అప్పట్లో పునర్విభజన జరగలేదు. జిల్లాలో 11 నియోజకవర్గాలు ఉండేవి. తర్వాత ఆ సంఖ్య పదికి, ఇప్పుడు ఎనిమిదికి చేరింది. దీంతో పాటు నియోజకవర్గాల క్రమ సంఖ్యలు మారిపోయాయి. పునర్విభజనకు ముందు తీసుకుంటే సంగం మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో.. 14 కోవూరు, 6 ఆత్మకూరు పరిధిలో ఉండేవి. కోవూరు పరిధిలో నియోజకవర్గం సంఖ్య 127గా ఉండేది. ఇప్పుడు ఆత్మకూరులో ఉండటంతో 115గా మారింది. సంగం పంచాయతీలో గత జాబితాలో 8,600 మంది ఓటర్లు ఉండగా- మ్యాపింగ్ అనంతరం సుమారు 2,500 మంది వివరాలు మాత్రమే అనుసంధానమయ్యాయి. అప్పటి వారి సంతానాన్ని మ్యాపింగ్ చేసేందుకు ఎన్నికల సంఘం అనుమతిచ్చినా.. స్పష్టత లేకపోవడంతో ప్రక్రియ ముందుకు సాగడం లేదు. దాంతో మ్యాపింగ్ పురోగతి తక్కువగా ఉంది. దీన్ని చక్కదిద్దడానికి శిక్షణ ఇవ్వనున్నారు.

దారి మూసేశారు

ఎట్టకేలకు ట్రాఫిక్ పోలీసులు కదిలారు. నెల్లూరు నగరంలోని జాతీయ రహదారిపై.. ఎన్టీఆర్ నగర్ వద్ద.. మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగిన నేపథ్యంలో చర్యలకు ఉపక్రమించారు. అవతలి వైపు నుంచి ద్విచక్ర వాహనదారుడు రావడంతోనే ప్రమాదం జరిగిందని గుర్తించిన పోలీసులు.. ఇకపై వాహనాలు అటువైపు వెళ్లకుండా మూసేశారు. జాతీయ రహదారి సంస్థ అధికారుల సాయంతో బారికేడ్లు ఏర్పాటు చేశారు. - నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే

(c) eenadu

అదుపు తప్పితే చెరువులోకే..

పొదలకూరు నసరోరెడ్డి కాలనీ మీదుగా చిట్టేపల్లికి వెళ్లే రోడ్డు చెరువు మధ్యలో వంతెన ప్రమాదకరంగా ఉంది. రక్షణ గోడలు లేకపోవడంతో ఎదురెదురుగా వాహనాలు కనిపించక తేడా వస్తే చెరువులో పడే ప్రమాదం ఉంది. ఇటుగా కలువాయి, చేజర్ల, సోమశిల ఎక్కువ మంది రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించి వంతెనపై రక్షణ గోడలు నిర్మించాలని పలువురు విన్నవిస్తున్నారు. - న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

ప్రమాదమని తెలిసినా పట్టదా..!

గత నెలలో కురిసిన భారీ వర్షాలకు సంగం కొండ మీద నుంచి నెల్లూరు-ముంబయి జాతీయ రహదారి మీదకు రాళ్లు జారడం ప్రారంభమైనా ఇప్పటి వరకు ఆగలేదు. కేవలం కొండ మధ్య భాగంలోనే కాకుండా, సంగం వైపు దిగువ వేరొక ప్రాంతంలో మట్టి, రాళ్లు కిందకు జారుతున్నాయి. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సంగం

పూడికతీత పనులు ముమ్మరం

కలువాయి, న్యూస్‌టుడే: కలువాయి మండల పరిధిలో ముమ్మరంగా కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. ఈనెల 6న 'ఈనాడు'లో 'సాగుకు సన్నద్ధం.. కాలువలు అధ్వానం' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించారు. కలెక్టర్, ఎస్‌ఈ ఆదేశాల మేరకు పనులు చేపడుతున్నామని సోమశిల ప్రాజెక్ట్ కార్యాలయ కలువాయి డివిజన్ ఏఈ నారాయణ రాజు తెలిపారు. కన్నెగ్గ తరువాత పనులు జరుగుతుండడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్తు రాయితీకి లైసెన్సు తప్పనిసరి

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: ఆక్వా రైతులు విద్యుత్తు రాయితీ పొందాలంటే లైసెన్సు తప్పనిసరని నెల్లూరు ఆర్డీవో అనూష తెలిపారు. నగరంలోని తన కార్యాలయంలో మత్స్య శాఖ అధికారులతో బుధవారం సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ ఆక్వా రైతులందరికీ విద్యుత్తు రాయితీ వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గ్రామ మత్స్య సహాయకులను సంప్రదించి లైసెన్సు పొందేందుకు తగిన ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని చెప్పారు. లైసెన్సు లేకుంటే రాయితీ రాదని తెలిపారు.

మత్స్యశాఖ అధికారులతో సమావేశమైన ఆర్డీవో

భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి: ఆర్డీవో

కలిగిరి, న్యూస్‌టుడే: మండల స్థాయిలో రెవెన్యూ సదస్సులను నిర్వహించి, భూసమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు కావలి ఆర్డీవో వంశీకృష్ణ తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. అర్జీదారులతోనూ, సంబంధిత అధికారులతోనూ సమీక్ష జరిపారు. నెల రోజుల వ్యవధిలో అర్జీలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దారు గిరిధ, మండల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో వంశీకృష్ణ

చిన్న అప్పన్న బెయిల్ పిటిషన్ వాయిదా

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: శ్రీవారి లడ్డూ ప్రసాదాల కల్తీ నెయ్యి కేసులో అరెస్టు అయిన వైవీ సుబ్బారెడ్డి మాజీ వ్యక్తిగత కార్యదర్శి చిన్న అప్పన్న(ఏ24) బెయిల్ పిటిషన్ వాయిదా పడింది. కల్తీ నెయ్యి కేసులో నిందితుడైన అతడిని గతనెల చివరి వారంలో సిట్ అరెస్టు చేసింది. బెయిల్ నిమిత్తం చిన్న అప్పన్న దరఖాస్తు చేయగా న్యాయస్థానం ఈనెల 17వ తేదీకి వాయిదా వేసింది.

వసతి గృహాలు.. సమస్యల లోగిళ్లు

పొదలకూరు బాలుర వసతిగృహంలో ట్యాంకు ద్వారా శుద్ధి యంత్రానికి అనుసంధానం చేయడంతో విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంది. రెండు నెలలుగా యంత్రం పనిచేయకపోవడంతో సిబ్బంది డబ్బా నీరు తెచ్చిపెడుతున్నారు. కొన్ని సార్లు ట్యాంకు నీరే తాగడంతో వ్యాధుల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి శుద్ధి యంత్రం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

న్యూస్‌టుడే, పొదలకూరు, తోటపల్లిగూడూరు, రాపూరు, కొడవలూరు, సైదాపురం

సంక్షేమ వసతిగృహాల్లో అసౌకర్యాలు వెక్కిరిస్తున్నాయి... శిథిల భవనాలు.. తలుపులు లేని మరుగుదొడ్లు.. వర్షం కురిస్తే ఉరిసే గదులతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వైకాపా పాలనలో పట్టించుకోక పోవడంతో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిధులు మంజూరు చేసింది. జిల్లా అధికారుల పర్యవేక్షణ సరిగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

- తోటపల్లిగూడూరు మండలంలోని వసతి గృహాల్లో 75 మంది చొప్పున విద్యార్థులున్నారు. బీసీ బాలుర వసతిగృహం అద్దె భవనంలో కొనసాగుతుండగా 28మంది ఉన్నారు. చిన్నచెరుకూరులో భవనం శిథిలావస్థలో ఉంది. మరమ్మతులకు నిధులు మంజూరైనా పనులు మొదలుకాలేదు.
- కొవ్వూరు, విడవలూరు మండలాల్లో వసతి గృహాల్లో విద్యార్థులకు వైద్యసేవలు నామమాత్రంగా జరుగుతున్నాయి. విడవలూరు మండలంలో మూడు ఉండగా విడవలూరు బీసీ బాలుర, రామతీర్థంలో బాలికల వసతిగృహాలు విద్యార్థులు లేక మూతపడ్డాయి. లక్ష్మీపురంలో ప్రతి నెలా వైద్య సేవలందిస్తున్నారు. కొవ్వూరులో బాలుర, బాలికల ఎస్సీ వసతిగృహాల్లో కనీస వసతులు లేవు.
- రాపూరు ఎస్సీ బాలికల వసతి గృహం శిథిల భవనంలో నిర్వహిస్తున్నారు. వర్షం పడితే ఉరుస్తోందని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు.

రాపూరు: శిథిలావస్థలో వసతి గృహం

- సైదాపురంలోని రెండు బీసీ వసతి గృహాల్లో గతంలో 250 మంది వరకు విద్యార్థులు ఉండేవారు. ప్రస్తుతం 15 లోపే మాత్రమే ఉన్నారు. కనీస వసతులేక తల్లిదండ్రులు చేర్పించేందుకు ఆసక్తి చూపడం లేదు.
- కొడవలూరు, బుచ్చి మండలాల్లోని వసతి గృహాల్లో వైద్య పరీక్షలు చేస్తున్నారు. బుచ్చిలో అయిదు ఎస్సీ వసతిగృహాలు, బీసీ బాలుర 2, బాలికలు 1, కళాశాల విద్యార్థులకు బీసీ బాలికల, బాలుర వసతిగృహాలు ఉన్నాయి. పూర్తిస్థాయిలో వసతులేక ఇబ్బందులు పడుతున్నారు.
- పొదలకూరు మండలం మహ్మదాపురంలో రెండు ఎస్సీ, ఒక బీసీ, పొదలకూరు పట్టణంలో రెండు ఎస్సీ, ఒక బీసీ వసతిగృహాల్లో 310 మంది విద్యార్థులున్నారు. కొన్ని చోట్ల నీటిశుద్ధి యంత్రాలు లేక ట్యాంకు నీరు తాగుతున్నారు.

గోడ పత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

గ్రంథాలయ వారోత్సవాల గోడపత్రాలు ఆవిష్కరణ

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతాయని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బుధవారం వారోత్సవాల గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారోత్సవాల్లో బాల దినోత్సవం, పుస్తక ప్రదర్శన, కవిసమ్మేళనం, మహిళా సాధికారతపై చర్చాగోష్ఠి, విద్యార్థులకు పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఉద్యోగులు

నెల్లూరు(కలెక్టరేట్): అనంతపురం జిల్లాలో జరిగిన ఏపీ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడల్లో పాల్గొన్న ఉద్యోగులు కలెక్టర్ హిమాన్షుశుక్లాను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పోటీల్లో జిల్లా ఆరో స్థానంలో నిలిచింది. జేసీ వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయకుమార్‌ను కూడా కలిశారు.

క్రీడల్లో ప్రతిభ చూపిన వారితో ప్రిన్సిపల్ శ్రీనివాసరావు

రాష్ట్రస్థాయిలో సత్తాచాటాలి

బిట్రగుంట: క్రీడల్లో రాష్ట్రస్థాయిలోనూ సత్తా చాటి జిల్లా కీర్తి ప్రతిష్ఠలు పెంచాలని బిట్రగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పలు క్రీడల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన 15 మంది విద్యార్థులను అభినందించారు. క్రీడామైదాన అభివృద్ధి దాత పరిమి సీతారామయ్య, ఇన్‌ఛార్జి పీడీ మువ్వా సుదేష్ణకుమార్ పాల్గొన్నారు.

పొగ నారు.. ధర జోరు

దుత్తలూరులో సాగులో ఉన్న పొగనారు

దుత్తలూరు, న్యూస్‌టుడే: వాతావరణం అనుకూలించడంతో నియోజకవర్గంలో పొగనాట్లు ఊపందుకున్నాయి. మరోవైపు ఇటీవల వచ్చిన మొంథా తుపాను కారణంగా చాలా చోట్ల నారుమళ్లు దెబ్బతిన్నాయి. దీంతో ఒక్కసారిగా నారుకు భారీ డిమాండ్ ఏర్పడింది. కలిగిరి బోర్డు పరిధిలో ఏటా 4,200 హెక్టార్లలో పొగాకు పంటను సాగు చేస్తారు. గత పది రోజులుగా వాతావరణం అనుకూలంగా ఉండటంతో రైతులు ముమ్మరంగా నాట్లు వేస్తున్నారు. అయితే తగినంత నారు అందుబాటులో లేక ఒక్కసారిగా ధరలు రెట్టింపయ్యాయి. తుపానుకు ముందు మూట ధర రూ.3 వేల వరకు ఉండగా.. ప్రస్తుతం రూ.ఆరు వేలకు పైగా పలుకుతోంది. గత ఏడాది మూట ధర కేవలం రూ.3-4 వేల వరకు పలికింది. ఈ ఏడాది నాట్లు ప్రారంభంలోనే అధికంగా పలుకుతుండటంతో పెట్టుబడి ఖర్చులకు ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యారన్ పరంగా చూస్తే ఎంత తక్కువగా లెక్కించినా నారుకే రూ.50 వేలు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు.

బాలల్లో న్యుమోనియా నివారిద్దాం

నెల్లూరు (మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: బాలల్లో న్యుమోనియా నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో సుజాత సూచించారు. నెల్లూరులోని తన కార్యాలయంలో బుధవారం న్యుమోనియాపై అవగాహన కల్పించే కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండడంతో న్యుమోనియా వ్యాపించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇది ప్రాణాంతకమైన అంటువ్యాధని, నియంత్రిస్తే మరణాలు తగ్గించవచ్చన్నారు. చిన్నారులకు ఆరు నెలల వయసు వచ్చే వరకు తల్లి పాలు ఇవ్వడం, శుభ్రత పాటిస్తే ఇది రాదన్నారు. దీనిపై ఈ నెల 22వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఖాదర్‌వలి, ఉమామహేశ్వరి, యశ్వంత్, కనకరత్నం, భాస్కర్, రమేష్, జ్యోతి, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

న్యుమోనియా ప్రచార కరపత్రాలు చూపుతున్న డీఎంహెచ్‌వో సుజాత తదితరులు

సీఐఐ భాగస్వామ్య సదస్సుకు కలెక్టర్

నెల్లూరు (కలెక్టరేట్), న్యూస్‌టుడే: ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు కలెక్టర్ హిమాన్షు శుక్లా వెళ్లనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల పాటు ఇన్‌ఛార్జి కలెక్టరు బాధ్యతలను వెంకటేశ్వర్లుకు అప్పగించారు.

క్లెయిమ్ చేయని డిపాజిట్ల చెల్లింపునకు చర్యలు

నెల్లూరు (మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: రిజర్వు బ్యాంకు ఆదేశాలతో క్లెయిమ్ చేయని డిపాజిట్ల సొమ్ము చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని గ్రామీణ బ్యాంకు జనరల్ మేనేజర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. క్లెయిమ్ చేయని డిపాజిట్ ఖాతాదారులను గుర్తించి మేనేజర్లు వారికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. లావాదేవీలు సజావుగా జరిగేందుకు తప్పనిసరిగా ఈకేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు.

ఏం కావాలో చెప్పండి.. భూమి వదిలేయండి..!

రూ.కోట్ల స్థలం కాజేసేందుకు ఆక్రమణదారుల ఆఫర్లు

మల్లికార్జునపురంలో ఆక్రమించిన ప్రభుత్వ భూమి

న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు

పేదలు సెంట్ స్థలంలో చిన్న పూరిపాక వేస్తుంటే అధికారులకు నిబంధనలు గుర్తుకొస్తాయి.. తమ ప్రతాపం చూపిస్తూ గుడిసెలు సైతం కూల్చేస్తారు... ఏ స్థిరాస్తి వ్యాపారో.. భూస్వాములే అయితే ప్రభుత్వ భూమి అని పక్కాగా తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరించడం అధికారులకు పరిపాటిగా మారింది. గత వైకాపా పాలనలో ప్రభుత్వ స్థలాలను యథేచ్ఛగా స్థిరాస్తి వ్యాపారులు ఆక్రమించుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చర్యలు తీసుకుంటారనుకుంటే వారికే వంత పాడుతున్నారు.

- తోటపల్లిగూడూరు మండలం ఈదూరు-1 రెవెన్యూ పరిధిలోని ఒక సర్వే నంబరులో 1.32 ఎకరాలు, మరో సర్వే నంబరులో 3.65 ఎకరాలు మొత్తం 4.97 ఎకరాలు ప్రభుత్వ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో ఉంది. అడంగల్‌లోనూ గ్రామనత్తం, పోరంబోకు భూమిగా నమోదైంది.

వెలుగుచూడడంతో పంచాయితీ..

విషయం బహిర్గతమవడంతో తొలుత అధికారులు ఏర్పాటు చేసిన హద్దులు తొలగించిన ఆక్రమణదారులు ఇప్పుడు స్థానిక నాయకులు అధికారులతో పంచాయితీ చేసి సెటిల్‌మెంట్ చేసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. అందుకే రెవెన్యూ అధికారులు హద్దులు ఏర్పాటు చేయక పోగా కనీసం హెచ్చరిక బోర్డు కూడా పెట్టలేదు. పంచాయతీ కార్యాలయం నిర్మాణానికి ఆరు సెంట్లు ఇస్తామని, మిగిలిన భూముల విషయం వదిలేస్తే మీకు కావాల్సింది చేసిపెడతామనే ప్రతిపాదనతో చర్చించారు. రెవెన్యూ యంత్రాంగం జాప్యం చేస్తోందనే విమర్శకు బలం చేకూరుతోంది.

ఎకరా సుమారు రూ.కోటి మేర పలుకుతోంది. రూ.5 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి కొందరి కబ్జాదారుల చెరలో ఉంది. పంచాయతీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించారు. రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హద్దులను ఆక్రమణదారులు తొలగించినా చోద్యం చూస్తున్నారు. ప్రజావసరాలకు వినియోగించాలని హడావుడి చేసినా కొందరు స్థానిక నాయకులు పంచాయతీ కార్యాలయానికి ఇస్తే చాలు అన్నట్లు వ్యవహరించడం చర్చనీయాంశమైంది.

- తహసీల్దారు సుధీర్ మాట్లాడుతూ మాతో ఎవరూ చర్చించలేదన్నారు. పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి కావాల్సిన స్థలం విషయంలో ఉన్నతాధికారులకు నివేదిక పంపామని, అధికారుల ఆదేశాల మేరకు భూమి కేటాయిస్తామని చెప్పారు. ప్రభుత్వ భూమి ఆక్రమణలో ఉన్న విషయం వాస్తవమేనని, దాని విషయంలో పరిశీలించి తరువాత నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

వీసీకి వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

వెంకటాచలం, న్యూస్‌టుడే: వీఎస్‌యూలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సుజయ్ కుమార్‌ను కొంత కాలంగా శ్యాంసుందరం అనే విద్యార్థి అసత్య ఆరోపణలతో బ్లాక్ మెయిల్ చేస్తూ మనోవేదనకు గురిచేస్తున్నారని సదరు విద్యార్థిపై ఆంధ్రప్రదేశ్ యాదవ ఉద్యోగుల సంఘ నాయకులు ఫిర్యాదు చేశారు. బుధవారం వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావును ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. వేధింపుల విషయం వీఎస్‌యూ అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సభ్యులు రవీంద్ర, జానకిరామ్, కోటేశ్వరరావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర:	రూ.11,840
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ.94,720
వెండి గ్రాము :	రూ.167.10

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	132
లేయర్	120
బ్రాయిలర్స్	238
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	262
లేయర్ మాంసం	204

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: జిల్లా ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో 60 నుంచి 65 సంవత్సరాల మధ్య వయసున్న వ్యక్తి మృతి చెందిన ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వద్ద ఆధారాలు లభ్యం కాలేదు. ఆచూకీ తెలిసిన వారు 94407 00018, 0861 2328440 నంబర్లను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ కల్యాణ్ రాజు కోరారు.

ప్రతి జాబ్‌కార్డుకు ఈకేవైసీ తప్పనిసరి

పొదలకూరు, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏపీడీ గాయత్రీదేవి అన్నారు. బుధవారం చాటగొట్ల గ్రామంలో నిర్మించిన గోకులం షెడ్లను పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతూ మండలంలో ఇంకా 7363 మంది చేయించుకోవాల్సి ఉందని, వారికి పక్కా గృహాలు కావాలన్నా, పశువుల షెడ్లు, పండ్ల తోటల పెంపకం, పొలాల్లో నీటి గుంతలు తవ్వుకోవాలన్నా ఈకేవైసీ లేకుండా నమోదు చేయరని గుర్తు చేశారు. పొదలకూరు, తోడేరు మరి కొన్ని గ్రామాలు పూర్తిగా వెనుకంజలో ఉన్నాయని, వాటిలో 85 శాతానికి పైగా నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మండలానికి 4000 కంపోస్టు గుంతలు మంజూరైనట్లు చెప్పారు. ఇప్పటి వరకు 320 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగుకు అనుమతులు ఇచ్చామన్నారు. ఏపీవో శిరీష, ఇంజినీరింగ్ సహాయకులు, క్షేత్ర సిబ్బంది పాల్గొన్నారు.

మినీ గోకులాన్ని పరిశీలిస్తున్న ఏపీడీ గాయత్రీదేవి

రెండు రోజుల పోలీస్ కస్టడీకి అరుణ

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఎస్సై, అంగన్‌వాడీ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ వృద్ధుడిని మోసం చేసిన కేసులో నిందితురాలైన నిడిగుంట అరుణను రెండు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ విజయవాడలోని ఒకటో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడకు చెందిన రమేష్‌బాబు బంధువులకు ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ అరుణ అతడి నుంచి రూ.24.5 లక్షలు వసూలు చేసింది. దీనిపై సూర్యారావుపేట పోలీసులు గత నెల 13న కేసు నమోదు చేశారు. పీటీ వారెంట్‌పై ఆమెను విజయవాడ న్యాయస్థానంలో హాజరుపరిచారు. మరిన్ని వివరాలు రాబట్టేందుకు ఆమెను నాలుగు రోజుల పోలీస్‌కస్టడీకి ఇవ్వాలని పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఈ నెల 13, 14 తేదీల్లో కస్టడీకి అనుమతిస్తూ న్యాయమూర్తి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న అరుణను విజయవాడకు తీసుకువచ్చేందుకు పోలీసులు బుధవారం రాత్రి బయలుదేరారు. 13, 14 తేదీల్లో విచారణ అనంతరం తిరిగి ఆమెను 15వ తేదీన నెల్లూరు కేంద్ర కారాగారంలో అప్పగించాలని న్యాయమూర్తి ఆదేశించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య ఆమెను విచారించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

కందుకూరు పట్టణం : అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రెండు రోజుల క్రితం రైల్వేకోడూరులో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పట్టణానికి చెందిన **బి.లక్ష్మీఅక్షర** బంగారు పతకం సాధించిందని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ సలాం తెలిపారు. ఈనెల 14 నుంచి 19 వరకు జమ్మూకశ్మీర్‌లో జరగబోయే జాతీయ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం డీఎస్పీ సీహెచ్.వి.బాలసుబ్రహ్మణ్యం క్రీడాకారిణి, శిక్షకుడు పి.అఖిల్‌ను అభినందించారు. ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల డైరెక్టర్లు బి.నరేంద్ర, బాలభాస్కర్ పాల్గొన్నారు.

ఆటల్లో భళా.. అమ్మాయిలు ఇలా..

న్యూస్‌టుడే, వెంకటాచలం

వారంతా గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్న వసతులను సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణిస్తున్నారు... వెంకటాచలం మండలం గొలగమూడి బాలికల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థినులు సత్తాచాటుతున్నారు. . వ్యాయామ ఉపాధ్యాయురాలు షబీక ప్రత్యేక తర్ఫీదుతో తమకిష్టమైన క్రీడల్లో పాల్గొని జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పతకాలు సాధిస్తూ ఔరా అనిపిస్తున్నారు... నాలుగు వందల మంది విద్యార్థినులుండగా వారి ఆసక్తికనుగుణంగా.. ఖోఖో, వాలీబాల్, సాఫ్ట్‌బాల్, రగ్బీ, సాఫ్ట్ టెన్నిస్, కబడ్డీ, జావెలిన్ త్రో, బాస్కెట్ బాల్, పరుగు పందెం, లాంగ్ జంప్ తదితర విభాగాల్లో పీడీ శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థినులు అవకాశాలను అందిపుచ్చుకొని దూసుకెళుతున్నారు. 80 మందికి పైగా విద్యార్థినులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణిస్తూ పాఠశాలకు పేరు తెస్తున్నారు.

మరిన్ని పతకాలు సాధిస్తా..

అశ్రిత వైష్ణవి, తొమ్మిదో తరగతి

చదువుతో పాటు క్రీడలు అవసరమని గుర్తించా. మానసికంగా దృఢంగా ఉండడం అలవాటైంది. రగ్బీ, ఖోఖో, సాఫ్ట్‌బాల్ క్రీడలంటే ఇష్టం. పులివెందులలో జరిగిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో రాణించా. జిల్లాలో జరుగుతున్న పోటీలకు ఎంపికై ఆడుతున్నా. మూడు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నా. మరిన్ని పతకాలు సాధిస్తా.

ప్రభుత్వ కొలువే లక్ష్యంగా

సాహిత్య, ఆరో తరగతి

క్రీడల్లో రాణిస్తే ఉన్నత చదువుల్లో, ప్రభుత్వ కొలువుల్లో ప్రత్యేక అవకాశాలుంటాయని తెలిసింది. పాఠశాలలో విద్యతో పాటు వివిధ క్రీడాపోటీల్లో శిక్షణ ఇస్తున్నారు. ఖోఖో, సాఫ్ట్‌బాల్ రెండు పోటీల్లో పాల్గొంటున్నా. పల్నాడు, అనకాపల్లి జిల్లాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొన్నా. సాఫ్ట్ బాల్ పోటీల్లో పలు పతకాలు సాధించా.

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో

శిరీష తేజస్విని, పదో తరగతి

వ్యాయామ ఉపాధ్యాయురాలి ప్రోత్సాహంతో క్రీడలపై ఆసక్తి పెరిగింది. సాఫ్ట్ బాల్, బేస్ బాల్ రెండింటిలో శిక్షణ తీసుకుంటున్నా. ఇటీవల పల్నాడులో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 సీనియర్ విభాగంలో బేస్‌బాల్ పోటీల్లో పాల్గొన్నా. అనకాపల్లిలో జరిగే పోటీలకు ఎంపికయ్యా. క్రీడల్లో రాణించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవడంతో పాటు, ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తాననే నమ్మకముంది.

జాతీయ స్థాయిలో రాణిస్తా

దీక్ష, పదో తరగతి

చిన్నప్పటి నుంచి చదువుతో పాటు క్రీడలంటే ఇష్టం. ఎక్కడ పోటీలు జరిగినా పాల్గొంటా. చిత్తూరులో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొని రాణించా. పశ్చిమ గోదావరి జిల్లాలో జరుగుతున్న అండర్-17 పోటీల్లో పాల్గొంటున్నా. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో రాణించాలన్నదే లక్ష్యం.

EENADU Classifieds

JOBS | TOURS AND TRAVELS

Wanted any Degree, B.Tech Male / Female Online works. 9 AM to 6.30 PM. 11,000/- Per Month. Contact: 91608 38485

నెల్లూరులో ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు క్రింది డిపార్టుమెంట్‌లకు 40 సం॥లోపు జెంట్స్ స్టాఫ్ కావలెను. అకౌంట్స్, అడ్మినిస్ట్రేషన్, డ్రైవర్స్, ఫోటోషాప్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్. 8555993478

ఫోర్స్ మోటార్స్ కంపెనీ షోరూం నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ & రిసెప్షనిస్ట్ కావలెను. అమృత మోటార్స్, బుజబుజ నెల్లూరు. ✆ 95812 99916, 94929 34103

ఇంటర్, డిగ్రీ ఆపై చదవుకున్న యువతీ యువకులకు, గృహిణులకు గొప్ప అవకాశం. ఇంటి వద్ద చేస్తూ నెలకు వేలల్లో సంపాదన. ✆ 89193 30411.

వైద్యనాథ్, కలకత్తా, కామాఖ్య, మాయాపూర్, శృంఖలాదేవి, తేది 16-1-26, 8 రోజులు. టిక్కెట్ 16,000 రైలు/బస్సు, బో, రూం,K.వాసు, నెల్లూరు. ✆ 9491340504

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... B/w 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే వివరాలకు.. నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 600 Colour : రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

కావలి

•కావలి • ఉదయగిరి • కందుకూరు

దుస్తుల అందజేత

గుడ్లూరు: రావూరులో బండ్లమాంబ రాజమాతాదేవి 80వ జన్మదినోత్సవం సందర్భంగా గుడూరుకు చెందిన సత్యసాయి సేవాసమితి, రాజమాతాదేవి భక్త బృందం ఆధ్వర్యంలో గ్రామంలో సుమారు 500 కుటుంబాలవారికి చీర,పంచ, పసుపు, కుంకుమ, ప్రసాదాలు ఇంటింటికీ తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా భక్తులు బండ్లమాంబను దర్శించుకున్నారు.

బీపీఎస్‌తో క్రమబద్ధీకరణ

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: అనధికారిక భవనాలను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం బీపీఎస్ పథకాన్ని తీసుకువచ్చిందని దీన్ని సద్వినియోగించుకోవాలని పట్టణ ప్రణాళికాధికారి సునీల్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది ఆగస్టు 31కు ముందు నిర్మించుకున్న అనధికార భవనాలను రెగ్యులర్ చేసుకోవచ్చని తెలిపారు. ఇప్పటి నుంచి 120 రోజులు అనగా వచ్చే ఏడాది మార్చి 11వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. అనధికారిక భవనాల యజమానులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

ఒంగోలు గ్రామీణం: విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన జరుగుమల్లి మండలం చిరుకూరపాడు పంచాయతీ కార్యదర్శి యు.అనిల్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ప్రకాశం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వలేటివారిపాలెం మండలం చుండి పంచాయతీలో విధులు నిర్వహించిన సమయంలో... గ్రామకంఠం ఆస్తిని ఇతరుల పేరిట మార్చి ధ్రువీకరణ పత్రం జారీ చేశారు. ఈ విషయమై స్థానికులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా అధికారులు విచారణ చేపట్టారు. ఆ మేరకు ఆయనపై చర్యలు తీసుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: స్థానిక కమ్మపాలెం నుంచి రాజుపాలెం వెళ్లే మార్గంలో వీధి కుళాయిల పైపు పగిలి నీరు వృథాగా పోతోంది. – మణిదీప్
సమాధానం: వెంటనే పరిశీలించి సరిచేయిస్తాం. నీటి వృథా కాకుండా చూస్తాం.
– నరేశ్, పంచాయతీ కార్యదర్శి, గుడ్లూరు

? లింగసముద్రంలో పందుల బెడద అధికంగా ఉంది. నివారణ చర్యలు చేపట్టాలి. – సతీష్
✓ తక్షణమే పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.– మాధవరావు, పంచాయతీ కార్యదర్శి – న్యూస్‌టుడే, లింగసముద్రం

? కావలి టిడ్కో సముదాయంలో అర్ధరాత్రి వేళల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం వాటిల్లుతుంది. – బీరంగుంట సత్యవతి, మద్దూరుపాడు, కావలి
✓ సజావుగా విద్యుత్తు సరఫరా ఉండేలా చర్యలు తీసుకుంటాం. – చేజర్ల శ్రీనివాసులు రెడ్డి, ఏఈ – న్యూస్‌టుడే, కావలి

? కావలి పట్టణంలోని వైకుంఠపురం శివారు ప్రాంతాల్లో నీటి సరఫరా సరిగా జరగడం లేదు. – తలమంచి కామాక్షమ్మ
✓ ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నాం. వీలున్నంత వరకు ఇబ్బందులు తలెత్తకుండా చేస్తున్నాం. – సాయిరాం, డీఈఈ, పురపాలక సంఘం – న్యూస్‌టుడే, కావలి

? మండలంలోని వెంగాపురం పంచాయతీలో అంతర్గత రోడ్లపై గుంతలు పడ్డాయి. చిన్న వర్షానికే నీళ్లు నిలుస్తున్నాయి. – శ్రీనయ్య
✓ రహదారుల నిర్మాణానికి కృషి చేస్తాం. – రవీంద్ర, పీఆర్ ఏఈ– న్యూస్‌టుడే, కలిగిరి

? పట్టణంలోని పంచాయతీ బస్టాండ్ సెంటర్, బాలాజీనగర్‌లో పలు చోట్ల వీధిదీపాలు వెలగడం లేదు. – రామసుబ్బయ్య, స్థానికుడు
✓ వెలగని వాటిని గుర్తించి సరి చేయిస్తాం. – కరీముల్లా, కార్యదర్శి, ఉదయగిరి

? తిమ్మసముద్రంలోని నీటి పథకాలకు విద్యుత్తు సరఫరా చేసే నియంత్రికకు తరచూ ఫీజులు పోతుండటంతో ఇబ్బందులు పడుతున్నాం. – రాధాకృష్ణ, తిమ్మసముద్రం
✓ విద్యుత్తు లైన్‌మ్యాన్‌తో మాట్లాడి మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. – న్యూస్‌టుడే, సునీల్, ఏఈ జలదంకి

? మాచవరంలో దోమలు ఎక్కువగా ఉంటున్నాయి. – అంజయ్య, మాచవరం
✓ గ్రామంలో బ్లీచింగ్ చల్లిస్తున్నాను. రెండురోజుల్లో ఫాగింగ్ చేయించి సమస్యను పరిష్కరిస్తాను. –సుధాకర్, పంచాయతీ కార్యదర్శి, – న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం

? పట్టణంలోని విప్పగుంట రోడ్డు నుంచి కేజీబీవీ పాఠశాలకు వెళ్లే దారిలో పిచ్చిమొక్కలు పెరిగి ఇబ్బందిగా ఉంటోంది. – అన్నపూర్ణ
✓జంగిల్ క్లియరెన్స్ చేయించి పరిష్కరిస్తాం. – కె.అనూష, మున్సిపల్ కమిషనర్ – న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం

చిన్నారులకు బ్యాగుల పంపిణీ

బ్యాగులు అందుకున్న విద్యార్థులు

గుడ్లూరు, న్యూస్‌టుడే: స్థానిక ప్రధాన ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఐఐఎఫ్ఎల్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం 80 మంది విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారని హెచ్ఎం కుటుంబరావు, ఉపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. బ్యాగులు అందుకున్న చిన్నారులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఎం విజయ్‌కుమార్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పది, ఇంటర్ పరీక్షల సమయం దగ్గర పడిందని విద్యార్థులు ప్రణాళికతో కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యాశాఖ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ డి.వెంకటసుబ్బయ్య, బాలిక విద్యాభివృద్ధి అధికారిణి టి.మమత సూచించారు. పట్టణంలోని కేజీబీవీని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా భోజనశాలను పరిశీలించారు. ఎస్ఏ 1 పరీక్షల నిర్వహణ, మెనూ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎస్ఓ స్వాతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

గ్రామ సింహాలం..

కనబడితే కరిచేస్తాం

'కందుకూరు మున్సిపాల్టీలో మా మనుగడకు ఇబ్బందుల్లేవని తెలుసుకుని చుట్టుపక్కల ఉన్న వాళ్లమంతా ఇక్కడికే చేరాం. రోజూ సమావేశాలు నిర్వహించుకుంటాం. ఏ కాలనీలో, ఏ వీధిలో మా సంచారానికి ఇబ్బందులుండవో చర్చించుకుని అక్కడికి చేరతాం. కనిపించిన వారిపై దాడిచేస్తాం. మా దెబ్బకు చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు బెంబేలెత్తిపోయేలా రెచ్చిపోతుంటాం. మున్సిపల్ అధికారుల అండదండలు ఉన్నంత కాలం మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు. ఎందుకంటే మేము.. గ్రామ సింహాలం.' ఈ విధంగా పట్టణంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నా.. వాటి నియంత్రణకు అధికారులు చొరవ చూపకపోతుండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం

పట్టణంలో పలానా కాలనీలో వీధి కుక్కల సమస్య లేదు అని చెప్పలేనంతగా పరిస్థితి ఉంది. కొన్ని ప్రాంతాల్లో గుంపులుగా తిరుగుతూ ద్విచక్రవాహనాలను వెంబడిస్తుండటంతో వారు భయకంపితులై వాహనాలను వేగంగా నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా గుర్రంవారిపాలెం, సంతోష్‌నగర్, వాణీనగర్, కోటారెడ్డినగర్, ఉప్పుచెరువు, కోవూరుకోడు, బైపాస్‌రోడ్డు, ఎన్టీఆర్ కూడలి, పామూరుబస్టాండు, గుండంకట్టవీధి, శివాలయం, తూర్పుపాలెం, చుట్టుగుంటరోడ్డు, పోతురాజుమిట్ట, సుల్తాన్‌మొహిద్దీన్‌నగర్, మార్కెట్‌కూడలి ప్రాంతాల్లో శునకాల సమస్య అధికంగా ఉంది. రాత్రి 10 గంటల తరువాత బస్సు దిగి ఇళ్లకు వెళ్లే వారిని వెంబడిస్తూ నానా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు.

నమోదవుతున్న కేసులే నిదర్శనం

పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో కుక్కకాటుకు గురవుతున్న వారి సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. మున్సిపల్ అధికారులు కేవలం మొక్కుబడి చర్యలతో సరిపెడుతున్నారు. కొన్నిటిని మాత్రమే పట్టుకుని కు.ని.

కందుకూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కేసుల వివరాలు

నెల	బాధితులు
జులై	129
ఆగస్టు	154
సెప్టెంబరు	110
అక్టోబరు	164
నవంబరు (10వతేదీ)	70

పెరుగుతున్న కుక్కకాటు బాధితులు

ఆపరేషన్లు చేయిస్తున్నారు. వీటి దాడిలో గాయపడిన బాధితులు రోజులు తరబడి ఇంటికే పరిమితమవ్వాల్సి వస్తోంది.

చర్యలు తీసుకుంటున్నాం

: కె.అనూష, మున్సిపల్ కమిషనర్
వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పలుమార్లు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి కు.ని ఆపరేషన్లు చేయించాం. ఇతర ప్రాంతాల నుంచి కుక్కలను తీసుకొచ్చి పట్టణ శివారు ప్రాంతాల్లో వదిలేసి వెళ్తున్నారు. దీంతో సమస్య జఠిలమవుతుంది. మరోసారి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి చర్యలు తీసుకుంటాం.

డిసెంబరు 13న కావలిలో జగన్నాథ రథయాత్ర

కావలి, న్యూస్‌టుడే: గత తొమ్మిదేళ్లగా కావలిలో నిర్వహిస్తున్న జగన్నాథ (శ్రీగౌర-నితాయ్) రథయాత్రను ఈదఫా వచ్చేనెల 13వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ బాధ్యులు సుఖదేవ్, చంద్రశేఖర్‌లు వెల్లడించారు. బుధవారం కావలిలో విలేకరులతో మాట్లాడారు. అనంతరం కార్యక్రమ కరపత్రాలను కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు.

వ్యాయామంతో ఆరోగ్యం

సీతారామపురం, న్యూస్‌టుడే: చిన్నారులు, వృద్ధులు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు గమనిస్తే అశ్రద్ధ చేయరాదని వైద్యాధికారిణి స్వప్న అన్నారు. ప్రపంచ న్యుమోనియా డే సందర్భంగా బుధవారం సింగారెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎక్స్‌రే, రక్త, ఛాతీ బ్రోంకోస్కోపీ వంటి పరీక్షలతో న్యుమోనియాను గుర్తించవచ్చన్నారు. ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉండాలని, మంచి ఆహారంతో పాటు వ్యాయామం చేయాలని సూచించారు. అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్లతో అక్రమార్జన: ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి


లబ్ధిదారులకు మంజూరుపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి

కావలి, న్యూస్‌టుడే: జగనన్న లేఅవుట్ల పేరిట గత వైకాపా హయాంలో ఊరికి దూరంగా ఉన్న భూములను అధిక ధరలకు ప్రభుత్వానికి అంటగట్టి రూ. కోట్లలో అక్రమార్జన గడించారని ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి ఆరోపించారు. బుధవారం కావలి బుడమగుంటలో నూతన గృహనిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న లేఅవుట్‌లో నిర్మించిన గృహాలు నాసిరకంగా ఉన్నాయన్నారు.

మరో నాయకత్వం ఉండదు

నియోజకవర్గంలో మరో నాయకత్వం ఉండదని, తెలుగుదేశం ప్రతినిధిగా తానే కొనసాగుతానని ఎమ్మెల్యే కృష్ణారెడ్డి అన్నారు. గ్రామ తెదేపా కమిటీల ప్రమాణస్వీకారోత్సవంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రెండో రాజకీయం చేస్తానంటే క్షమించబోనన్నారు. ఏమైనా ఉంటే అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

వింజమూరు: మండలంలోని బుక్కాపురంలో పక్కా గృహాన్ని లబ్ధిదారులు పూర్తిచేయగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి నియోకవర్గంలోని నాలుగు వేల పక్కా గృహాలు మంజూరు కాగా 1645 పూర్తిచేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ సయ్యద్ పీరన్, తహసీల్దారు హమీద్, ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి నాయకులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక తెదేపా కార్యాలయంలో ఎనిమిది మండలాలకు చెందిన 83 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ ఫండ్ కింద రూ. 80 లక్షల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పక్కా గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

గుడ్లూరు, న్యూస్‌టుడే: ఈ నెల 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎర్రాప్రగడ శాఖ గ్రంథాలయ పాలకుడు ప్రభాకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. వారం రోజుల పాటు విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తామన్నారు. పుస్తక ప్రదర్శన ఉంటుందన్నారు. విజేతలకు ఈ నెల 20న జరిగే ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని వివరించారు.

కాటంరెడ్డి సేవలు మరువలేనివి

కావలిలో కాటంరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

కావలి, న్యూస్‌టుడే: రక్తదాన ఉద్యమంతో కావలి, అల్లూరు ప్రాంతాల్లో ప్రత్యేక సేవలందించిన దివంగత కాటంరెడ్డి ఆదినారాయణరెడ్డి సేవల్ని మరువలేమని రెడ్‌క్రాస్ ప్రతినిధులు అన్నారు. బుధవారం కాటంరెడ్డి 94వ జయంతిని ఘనంగా నిర్వహించారు. రెడ్‌క్రాస్ అధ్యక్షులు డాకారపు రవిప్రకాశ్, ఉప ఛైర్మన్ హరినారపరెడ్డి, బీఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మనీస్కాం నిగ్గు తేల్చండి

కావలి, న్యూస్‌టుడే: అనంతార్థ అసోసియేట్స్ పేరిట జరిగిన మనీస్కాంలో బాధితులను ఆదుకోవాలని కావలికి చెందిన వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం బాధితుల్ని పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ కేసులో పూర్వాపరాలు, నగదు రికవరీ అంశాలు తమకేమీ తెలియదన్నారు. అప్పులు చేసి స్కీమ్‌లో చేరామని తమకు న్యాయం చేయాలని కోరారు. వామపక్ష నాయకులు కరవాది భాస్కర్, పసుపులేటి పెంచలయ్య, ఎల్.లక్ష్మిరెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

నీటి పథకం.. నిరుపయోగం

మండలంలోని రంగనాయుడుపల్లి ఎస్టీకాలనీలో సోలార్ నీటిపథకం నిరుపయోగంగా మారింది. 167బిజీ రహదారి విస్తరణలో భాగంగా తొలగించిన అధికారులు.. దానిని తిరిగి ఏర్పాటు చేయలేదు. నెలలు గడుస్తున్నా పట్టించుకోక పోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పథకాన్ని పునరుద్ధరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సీతారామపురం

ఆదమరిస్తే.. ప్రయాణం విషమం

బ్రాహ్మణక్రాక ఎస్సీ కాలనీలోని దొరువు కాలువ వంతెనపై ర.భ శాఖ రోడ్డు కోతకు గురై అధ్వానంగా ఉంది. పిచ్చి మొక్కలతో ప్రమాదకరంగా మారింది. ఇటుగా జలదంకి, కలిగిరి మండలంలోని గ్రామాలకు వేలాది వాహనాలు వెళ్తుంటాయి. రాత్రి వేళల్లో ఏ మాత్రం ఆదమరిచినా.. కాలువలో పడే అవకాశం ఉంది. ర.భ శాఖ ఏఈ అహ్మద్ బాషా మాట్లాడుతూ చర్యలు తీసుకుంటామన్నారు.
– న్యూస్‌టుడే, జలదంకి

తలుపులకు లీకులు.. కట్టడాలపై మొక్కలు

మొంథా తుపానుతో మోపాడు చెరువు పూర్తిస్థాయిలో నిండింది. నీరు ఎక్కువై అలుగుల ద్వారా దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం మూడు తలుపుల దగ్గర నీరు లీకు అవుతోంది. దిమ్మెల రాతి కట్టడాలపైన చెట్లు పెరిగాయి. వేర్ల దగ్గర నీరు వస్తున్నాయి. బీటలు వచ్చే అవకాశముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
– న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం

కార్యాలయ ప్రాంగణం.. నీటిమయం

కావలి మండలం రుద్రకోటలోని రవాణాశాఖ అధికారి కార్యాలయ ప్రాంగణం ఇది. ఇటీవల కురిసిన వర్షాలతో నీటిమడుగు ఏర్పడింది. దీంతో పని నిమిత్తం వచ్చే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. భారీ వర్షాలు కురిసినప్పుడల్లా ఇదే దుస్థితి ఎదురవుతోందని పలువురు చెబుతున్నారు. – న్యూస్‌టుడే, కావలి

గుంత.. రాకపోకలకు చింత

కొండాపురం నుంచి రేణమాల వెళ్లే ర.భశాఖ రోడ్డు మార్జిన్ పగిలిపోయి ప్రమాదకరంగా దర్శనమిస్తుంది. గత వర్షాలకు పెద్దగుంతగా మారింది. ఎలాంటి ఘటనలు జరగక ముందే అధికారులు స్పందించి ఈ గుంతను పూడ్చాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈవిషయమై న్యూస్‌టుడే ర.భశాఖ ఏఈ ఫయాజ్‌ను వివరణ కోరగా పరిశీలించి మరమ్మతులు చేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, కొండాపురం

లారీని ఢీకొన్న బస్సు... నలుగురికి గాయాలు

మద్దిపాడు, న్యూస్‌టుడే: ముందు వెళ్తున్న లారీని వెనుకగా వస్తున్న బస్సు ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. పదహారో నంబరు జాతీయ రహదారిపై బుధవారం వేకువజామున ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటసూర్య తెలిపిన వివరాల ప్రకారం... ఉదయగిరి డిపోనకు చెందిన బస్సు విజయవాడ నుంచి ఉదయగిరికి వెళ్తోంది. ఏడుగుండ్లపాడు వంతెనపై ముందు వెళ్తున్న లారీని వెనుకగా బలంగా ఢీకొట్టింది. డ్రైవర్‌తో పాటు ముగ్గురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కనిగిరికి చెందిన ప్రయాణికుడు పీరూసాహెబ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

ఉదయగిరి: కళాశాలలో పరీక్ష రాసేందుకు వెళ్లిన యువతి అదృశ్యమైనట్లు బుధవారం ఫిర్యాదు అందిందని ఎస్సై కె.ఇంద్రసేనారెడ్డి తెలిపారు. వారి కథనం ప్రకారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి పట్టణంలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతోంది. మంగళవారం పరీక్ష రాసేందుకు వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువులు, స్నేహితులను విచారించిన ప్రయోజనం లేకపోవడంతో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

వివాహిత కనిపించడం లేదంటూ..

గుడ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత కనిపించడం లేదంటూ ఆమె తల్లి బుధవారం గుడ్లూరు పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. ఎస్సై వెంకట్రావు అందించిన వివరాల ప్రకారం ఈ నెల తొమ్మిదో తేదీన ఇంటి నుంచి వెళ్లింది. ఆచూకీ కోసం వెతికినా తెలియలేదు. ఆ మేరకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గుడ్లూరు, న్యూస్‌టుడే: తన పొలంలో టేకు, వేప చెట్లను కొట్టివేశారంటూ స్వర్ణాజిపురానికి చెందిన రైతు లక్ష్మయ్య ఫిర్యాదు చేశారు. ఉలవపాడు మండలం రాజుపాలేనికి చెందిన జంగం లక్ష్మయ్యకు స్వర్ణాజిపురంలో మామిడితోట ఉంది. పాజర్లకు చెందిన యు.మాల్యాద్రి తన తోటివారితో వచ్చి సుమారు రూ.రెండు లక్షల విలువైన వేప, టేకు చెట్లు ను కొట్టివేసి తీసుకుని వెళ్లారంటూ బాధితుడు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు.

జూద స్థావరంపై దాడి

ఉదయగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆనకట్ట సమీపంలో పాత బాణసంచా గోదాము వద్ద నిర్వహిస్తున్న జూద స్థావరంపై మంగళవారం రాత్రి ఎస్సై కె.ఇంద్రసేనారెడ్డి సిబ్బందితో కలిసి దాడి చేశారు. అయిదు మంది జూదరులను అదుపులోకి తీసుకొని.. రూ. అయిదు వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

వ్యవసాయ మోటార్ కేబుళ్ల చోరీ

కొండాపురం, న్యూస్‌టుడే: తూర్పుఎర్రబల్లిలో మంగళవారం రాత్రి పొలాల్లోని మోటార్ కేబుల్ వైర్లు చోరీకి గురయినట్లు రైతులు బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పది మందికి చెందిన కేబుల్ వైర్లను గుర్తుతెలియని దుండగులు అపహరించుకుపోయారన్నారు. వాటి విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని తెలిపారు. దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

కావలి: రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం రాత్రి పడుగుపాడు రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. అనంతసాగరం మండలం వెంగంపల్లికి చెందిన పెయ్యల శ్రీనివాసులు (27) కొన్నాళ్లగా పడుగుపాడు వద్ద నివాసం ఉంటూ భవన నిర్మాణకార్మిక పనులకు వెళుతుండేవారు. ప్రేమ విఫలం, ఇతర కారణాలతో ఆత్మహత్య చేసుకున్నాడని స్థానికులు చెబుతున్నారు. కావలి రైల్వేపోలీసు సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకున్నారు. కేసు విచారణ చేస్తున్నారు.

అల్లూరులో వాహనాల తనిఖీ

అల్లూరు: దిల్లీలో బాంబ్‌పేలుళ్ల నేపథ్యంలో అల్లూరు మండలంలో వాహనాలను తనిఖీలు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసులురెడ్డి తెలిపారు. తీర ప్రాంతంలో రాత్రి సమయాల్లో గస్తీలు కొనసాగిస్తున్నట్లు వివరించారు.

విద్యార్థుల మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

ఉదయగిరి, న్యూస్‌టుడే: మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జరుగుతున్న ఎస్ఏ-1 పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంఈవో-1 టి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని వెంకట్రావుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను బుధవారం పరిశీలించారు. పదోతరగతి విద్యార్థులు ప్రణాళికతో చదివి నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. దస్త్రాలను, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాగులో సస్యరక్షణ తప్పనిసరి

ఉదయగిరి, సీతారామపురం, న్యూస్‌టుడే: పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టి మంచి దిగుబడులు సాధించాలని ఏవో విజయభాస్కర్ అన్నారు. బుధవారం ఉదయగిరి మండలం కొండాయపాళెం, ఉదయగిరి-1 ఆర్ఎస్కేలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. రసాయనిక మందులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. ● విత్తన శుద్ధి తప్పనిసరి చేయాలని ఏవో చెన్నారెడ్డి అన్నారు. సీతారామపురం మండలం సింగారెడ్డిపల్లి, అయ్యవారిపల్లిలో సాగులో ఉన్న పంటలను పరిశీలించి జాగ్రత్తలు వివరించారు. కొనుగోలు చేసిన ఎరువులు, పురుగు మందులకు రసీదు తప్పక తీసుకోవాలన్నారు. ఏఈవో సుధీర్, వీఏఏ భరత్, తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఏవో చెన్నారెడ్డి

వైద్య కళాశాలను ప్రైవేటుపరం చేయడం తగదు

కావలి పట్టణంలో నిరసన ర్యాలీ

కావలి, కందుకూరు పట్టణం, ఉదయగిరి, న్యూస్‌టుడే: వైద్య కళాశాలలను ప్రైవేటీకరించడం తగదని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం ట్రంకురోడ్డులో ర్యాలీ చేశారు. ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కందుకూరు పట్టణంలో మాజీ ఎమ్మెల్యే బుర్రామధుసూధన్ ఆధ్వర్యంలో నిరసన చేశారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఉదయగిరిలో మేకపాటి అభినవ్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రేణులు ర్యాలీ చేశారు.

రాయితీపై సెనగ విత్తనాలు..

ఆసక్తి చూపని రైతులు

ఇటీవల వింజమూరుకు చెందిన గోపాల్ రెడ్డి అనే రైతు సెనగ సాగు చేపట్టాలని వ్యవసాయ శాఖ ద్వారా విత్తనాలు తీసుకున్నారు. వాటిలో మట్టిపెళ్లలు, వ్యర్థాలు, పుచ్చులు ఉండడంతో కంగుతిన్నారు.

న్యూస్‌టుడే, వలేటివారిపాలెం

రబీ సీజన్‌లో సాగుకు వీలుగా రాయితీపై సెనగ విత్తనాలను వ్యవసాయశాఖ అందుబాటులో ఉంచింది. కాగా బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే. . ధర దాదాపుగా సమానంగా ఉండడం, నాణ్యతపై అనుమానాలతో కొనుగోలు చేసేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు.

గరిష్ఠంగా అయిదు ఎకరాలకు

కందుకూరు నియోజకవర్గంలో వలేటివారిపాలెం, లింగసముద్రం, కందుకూరు, ఉలవపాడు, గుడ్లూరు మండలాల పరిధిలో సెనగ సాగు చేస్తుంటారు. గతేడాది సాధారణ విస్తీర్ణం 3,800 హెక్టార్లు ఉండగా.. కేవలం 411 హెక్టార్లల్లో పంట సాగయింది. దీంతో 2025-26 రబీకి సాధారణ విస్తీర్ణం 2,814 హెక్టార్లకు అధికారులు కుదించారు. ఆ మేరకు విత్తనాలకు ప్రతిపాదనలు పంపించారు. రైతుసేవా కేంద్రాల్లో రైతులు తమ పేర్లను నమోదు చేసుకుని తీసుకోవాలని చెబుతున్నారు. అయిదు మండలాలకు కాగ్ 2 రకం 3,396 క్వింటాలు, జేజే11 రకం.. 112 క్వింటాలు అందుబాటులో ఉంచారు. కిలో ధర రూ.78 కాగా రాయితీ రూ.19.50 పోనూ మిగతా మొత్తం చెల్లించాలి. ఎకరాకు 40 కిలోలు చొప్పున ఒక్కో రైతుకు గరిష్ఠంగా అయిదు ఎకరాలకు అందజేస్తారు.

గతంలో ఇలా..

తెదేపా ప్రభుత్వం ఉన్నప్పుడు సాగు విస్తీర్ణం ప్రకారం వ్యవసాయశాఖ అధికారులు ముందుగా విత్తనాలు తీసుకువచ్చేవారు. రైతులు నాణ్యతను చూసుకుని కొనుగులు చేసేవారు. వైకాపా ప్రభుత్వం వచ్చాక ఆర్బీకేల్లో రైతులు ముందుగా నగదు చెల్లిస్తే దాన్ని ప్రకారం విత్తనాలు అందించేవారు. కూటమి పాలనలో ఇదే విధానం కొనసాగుతోంది. అయితే నాణ్యత లేకపోయినా, మట్టి పెళ్లలు వచ్చినా.. తీసుకోవాల్సి వస్తోంది. దీనికి తోడు రాయితీ పోనూ క్వింటాకు రూ.5,850 చెల్లించాలి. బహిరంగ మార్కెట్‌లో క్వింటా రూ.ఆరు వేలుగా ఉంది. దీంతో రైతులు ముందుకు రావడం లేదు. ● భూమిలో తేమశాతం తగ్గిన వెంటనే సెనగ పంట సాగుకు అనుకూలంగా ఉంటుందని, రైతు సేవా కేంద్రాల్లో విత్తనాల కోసం రైతులు నమోదు చేసుకుంటే నాణ్యమైన విత్తనాలను సరఫరా చేస్తామని ఇన్‌ఛార్జి ఏడీఏ శేషారెడ్డి తెలిపారు.

2025-26లో కేటాయించిన వివరాలు ఇలా..

మండలం	అంచనా విస్తీర్ణం (హెక్టార్లల్లో)	కాగ్2 (క్వింటాల్లో)	జేజే11 (క్వింటాల్లో)
కందుకూరు	1637	1850	67
వలేటివారిపాలెం	720	1020	24
లింగసముద్రం	309	424	21
ఉలవపాడు	74	102	-
గుడ్లూరు	74	-	-

(c) eenadu

ఉద్యాన సాగులో రాయితీలు తెలుసుకోవాలా..!

ఈనాడు మిత్రుడు

పొదలకూరు, మనుబోలు, సైదాపురం మండలాల పరిధిలో ఉద్యాన సాగు చేసే రైతులు ప్రభుత్వం అందించే రాయితీలు తెలుసుకోవాలా..? ఇటీవల కురిసిన వర్షాలకు నిమ్మ, మామిడి, కూరగాయలు, తమలపాకు తోటలు దెబ్బతిన్నాయా..? చీడపీడల సమస్యలు వేధిస్తున్నాయా..? మెట్ట ప్రాంతంలో నిమ్మ కాకుండా ప్రత్యామ్నాయ పంటలు వేయాలనుకుంటున్నారా..? దీంతో పాటు సాగులో వివిధ సమస్యలను నేరుగా ఉద్యానశాఖ అధికారి ఆనంద్ దృష్టికి తీసుకురావచ్చు. 'ఈనాడు' ఆధ్వర్యంలో డయల్ యువర్ ఉద్యానశాఖ అధికారి కార్యక్రమం నిర్వహిస్తున్నాం. సాగుదారులు తమ సందేహాలు, రాయితీలు, వివిధ పథకాల గురించి తెలుసుకోవాలంటే దిగువ నంబరుకు ఫోన్ చేసి తెలియజేయొచ్చు. – న్యూస్‌టుడే, పొదలకూరు

తేది : 14–11–2025 (శుక్రవారం)
సమయం : ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య
ఫోన్ నంబరు : 79950 86943

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

యూరియా కొరత లేదు

మనుబోలు, న్యూస్‌టుడే : యూరియా కొరత ఎక్కడా లేదని, అన్నదాతలు ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య అన్నారు. బద్దెవోలు, కొలనుకుదురు గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. రైతులకు యూరియా బస్తాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఏఏలు సౌందర్య సుధ, నాగమణి, రైతులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు :79950 67034, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య : బుచ్చిరెడ్డిపాళెం పురపాలక పరిధిలోని 21వ వార్డులో వీధి దీపం వెలగడం లేదు. – స్వరూప్, స్థానికుడు
సమాధానం: పరిశీలించి వీధిదీపం వేయిస్తాం. – బాలకృష్ణ, కమిషనర్
? కొడవలూరు మండలం వెంకన్నపురంలో దోమలు ఎక్కువగా ఉన్నాయి. – రాజ
✓ దోమల బెడద లేకుండా చర్యలు తీసుకుంటాం. – వెంకటసుబ్బారావు, ఎంపీడీవో
? తోటపల్లిగూడూరు మండలం కోడూరు పంచాయతీ కార్యాలయం వద్ద బోరు నిరుపయోగంగా ఉంది. బోరు మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తీసుకురావాలి. – సుబ్రమణ్యం
✓ పరిశీలించి మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. –పెంచలయ్య, పంచాయతీ కార్యదర్శి
? తోటపల్లిగూడూరు మండలం పేడూరు వద్ద రోడ్డుపై వ్యర్థాలు పడేస్తున్నారు. చెత్త నిల్వ చేరి దుర్వాసన వస్తోంది. – ప్రసాద్
✓ తొలగించేలా స్థానిక అధికారులకు సూచిస్తాం. – లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో
? పొదలకూరు రూరల్ పరిధిలోని మహ్మదాపురంలో పది రోజులుగా వీధిదీపాలు వెలగడం లేదు. – పెంచలయ్య, స్థానికుడు
✓ పంచాయతీ బృందికి చెప్పి వెలిగేలా చూస్తాం. – నరసింహారావు, ఎంపీడీవో
? విడవలూరులోని పెనుగొండమ్మ ఆలయం సమీపంలో పైపులు లీకై నీరు వృథాగా రోడ్డుపై పోతున్నాయి. రోడ్డు బురదగా మారడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. – స్థానికులు
✓ పరిశీలించి తాగునీరు వృథా అరికడతాం. – జగదీశ్, పంచాయతీ కార్యదర్శి
? కోవూరులోని శ్రీనివాస థియేటర్ పరిసరాల్లో రోడ్డుపై పలుచోట్ల అనధికారికంగా వేగ నియంత్రికలు నిర్మించారు. వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు.– స్థానికులు
✓ సమస్య పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ
? పొదలకూరు రూరల్ పరిధిలోని నరసారెడ్డి కాలనీలో రోడ్డు గుంతలమయంగా మారింది. రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్నాం. – మహేశ్, స్థానికుడు
✓ సిబ్బందికి చెప్పి మరమ్మతులు చేయిస్తాం. –నరసింహారావు, ఎంపీడీవో
? మర్రిపాడు మండల పరిధిలోని నందవరంలో మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన, దోమల బెడద ఎక్కువగా ఉంది. – బాషా, స్థానికుడు
✓ ఇబ్బందులు లేకుండా కాలువలను శుభ్రం చేస్తాం. – రమేశ్, పంచాయతీ కార్యదర్శి
? పొదలకూరు మండలం డేగపూడి వద్ద రహదారిపై తూముకు పడ్డ రంధ్రం రోజురోజుకు పెద్దదవుతోంది. – వెంకటేశ్వర్లు, రైతు
✓ త్వరలో చేయిస్తాం. – శ్రీనివాసులు, ర.భ ఏఈ
? సంగం మండలం దువ్వూరులోని ఆలయానికి వెళ్లే మార్గంలో ముళ్ల చెట్లు ప్రమాదకరంగా ఉన్నాయి.. – రాజా, దువ్వూరు
✓ యంత్ర సాయంతో తొలగిస్తాం. –హమీద్‌బాషా, పంచాయతీ కార్యదర్శి

తెదేపా కార్యకర్తలకు అండగా ఉంటాం

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

కోవూరు, విడవలూరు, న్యూస్‌టుడే: తెదేపాకు కార్యకర్తలే బలమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరు పట్టణ పరిధిలోని ఒక ప్రైవేట్ కల్యాణ మండపంలో తెదేపా మండల, గ్రామ నూతన కమిటీలు, క్లస్టర్, అనుబంధ విభాగాల ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం నిర్వహించారు. తెదేపా పార్లమెంట్ నియోజకవర్గ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌తో కలిసి పార్టీ జెండా ఆవిష్కరించి కేకు కట్ చేశారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... వారానికి ఒక రోజు గ్రామాల్లో తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలన్నారు. అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబును స్ఫూర్తిగా తీసుకొని పార్టీ బలోపేతం చేయాలన్నారు. తెదేపా సీనియర్ నాయకులు, సానుభూతి పరులను, పార్టీకి సేవ చేసిన వారిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు పుల్లారెడ్డి, తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి, జీవీఎన్ శేఖర్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ప్రజా సమస్యలపై పోరాడే మాతూరు శ్రీనివాసులురెడ్డి మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. విడవలూరులో సంస్మరణ సభ బుధవారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఏపీఈఎంసీఎల్ ఛైర్మన్ పోలంరెడ్డి దినేశ్‌రెడ్డి మాట్లాడుతూ రైతు నాయకుడిని కోల్పోయామని పేర్కొన్నారు. పలువురు నాయకులు, సానుభూతిపరులు పాల్గొన్నారు.

అవస్థలు తొలగి.. అభివృద్ధికి అడుగులు

న్యూస్‌టుడే, బుచ్చిరెడ్డిపాళెం

అధ్వానంగా బుచ్చిరెడ్డిపాళెం– ఊటుకూరు రోడ్డు

నిన్నటి వరకు గతుకులు, గుంతలు, ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. గత వైకాపా పాలనలో వాహనదారులు అవస్థలు పడుతూ.. పలుమార్లు ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్లకు ప్రత్యేకంగా నిధులు మంజూరుచేసింది. కోవూరు నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రూ.11 కోట్లు మంజూరయ్యాయి. మూడు మండలాలను కలిపే బుచ్చిరెడ్డిపాళెం- ఊటుకూరుతోపాటుగా మరో రెండు రోడ్ల నిర్మాణ పనులు త్వరలో చేపట్టనున్నారు.

● కొన్నేళ్లుగా ప్రశ్నార్థకంగా ఉన్న నార్తురాజుపాళెం రైల్వే పైవంతెన నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. మూడు మండలాలను కలిపే బుచ్చిరెడ్డిపాళెం- కొడవలూరు- ఊటుకూరు రోడ్డుకు కూటమి ప్రభుత్వం రూ.8 కోట్లు మంజూరు చేసింది. ఇదే రోడ్డుపై అతి ముఖ్యమైన కొడవలూరు- నార్తురాజుపాళెం రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి అనుమతి వచ్చింది. రైల్వే ఆధ్వర్యంలో పైవంతెన నిర్మించనున్నారు. ర.భ అధికారులతో రైల్వే అధికారులు సమాలోచనలు జరిపారు. దీంతో పాటు కోవూరు మండలంలోని ముంబయి రోడ్డు- గంగవరం- కోవూరు రోడ్డుతో పాటు విడవలూరు మండలంలోని ఊటుకూరు- పల్లిపాళెం రోడ్డుకు రూ.3.2 కోట్లు మంజూరయ్యాయి.

● ర.భ శాఖ డీఈ వేణుగోపాల్ మాట్లాడుతూ... బుచ్చిరెడ్డిపాళెం- ఊటుకూరు రోడ్డుతో పాటు గంగవరం, ఊటుకూరు పల్లిపాళెం రోడ్లకు రూ.11.2కోట్లు మంజూరయ్యాయి. ముఖ్యమైన కొడవలూరు- నార్తురాజుపాళెం రైల్వే పైవంతెన రైల్వే శాఖ ఆధ్వర్యంలో నిర్మాణానికి శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

పరిశ్రమల సహకారంతో గ్రామాల అభివృద్ధి

తాగునీటి పథకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

తోటపల్లిగూడూరు, న్యూస్‌టుడే : పరిశ్రమల సహకారంతో గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మల్లికార్జునపురం గ్రామంలో ఎస్‌ఈఐఎల్ విద్యుత్తు సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన శుద్ధజల కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి, రూ.33 లక్షలతో నిర్మించనున్న పంచాయతీ కార్యాలయం, నూతన శివాలయం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్లికార్జునపురం గ్రామాన్ని గతంలో దత్తత తీసుకొని అభివృద్ధి చేశామని, ప్రస్తుతం ఎస్‌ఈఐఎల్ సంస్థ దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తోందన్నారు. స్థానికుల జీవనాన్ని మార్చేలా ఉపాధి, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి సీఎం చంద్రబాబును విమర్శించే అర్హత ఉందా అని ప్రశ్నించారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, డీసీ ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి, తెదేపా మండల అధ్యక్షులు రఘుబాబు, నాయకులు జీవ, వెంకటరమణయ్య, అధికారులు, ఎస్‌ఈఐఎల్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుదాం

తెదేపా నాయకులతో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, రాపూరు, సైదాపురం, కలువాయి, న్యూస్‌టుడే: నూతనంగా ఎన్నికైన నేతలు స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సూచించారు. బుధవారం స్థానిక ప్రైవేట్ కల్యాణ మండపంలో పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణకు మారుపేరని, పార్టీని నమ్ముకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ క్రమంలో నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. వెంకటగిరి మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడిగా అవ్వారు సత్యనారాయణ, డక్కిలి అధ్యక్షుడిగా కోటిరెడ్డి, బాలాయపల్లి అధ్యక్షుడిగా రావి సత్యనారాయణ, సైదాపురం అధ్యక్షుడిగా సుబ్రమణ్యం రాజు, రాపూరు అధ్యక్షుడిగా చెన్ను అశోక్‌రెడ్డి, కలువాయి అధ్యక్షుడిగా రఘురామిరెడ్డి ఎన్నికయ్యారు. వెంకటగిరి మండల పార్టీ అధ్యక్షుడి ఎంపిక వాయిదా పడింది. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ విశ్వనాథం, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, నేతలు రాజేశ్వరరావు, ఆనంద్, సీసీ నాయుడు, రామచంద్రయ్యనాయుడు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక

బి.కీర్తి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: స్కూల్‌గేమ్స్ అండర్-17 యోగా విభాగంలో ఆత్మకూరు బాలిక బి.కీర్తి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. నెల్లూరులో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపారు. 23, 24 తేదీల్లో బాపట్లలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో ప్రధానోపాధ్యాయురాలు కోటేశ్వరమ్మ పీడీలు సుమతి, నిహారికలను అభినందించారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

కావలి: రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం రాత్రి పడుగుపాడు రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. అనంతసాగరం మండలం వెంగంపల్లికి చెందిన పెయ్యల శ్రీనివాసులు (27) కొన్నాళ్లుగా పడుగుపాడు వద్ద నివాసం ఉంటూ భవన నిర్మాణకార్మిక పనులకు వెళుతుండేవారు. ప్రేమ విఫలం, ఇతర కారణాలతో ఆత్మహత్య చేసుకున్నాడని స్థానికులు చెబుతున్నారు. కావలి రైల్వేపోలీసు సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకున్నారు. కేసు విచారణ చేస్తున్నారు.

వనభోజనాల కరపత్రాల ఆవిష్కరణ

మర్రిపాడు, న్యూస్‌టుడే: మర్రిపాడు పీఎస్‌ఆర్ బృందావనం నందు జరిగే కార్తిక వనభోజనాలకు యాదవులంతా తరలిరావాలని జిల్లా యాదవ ట్రస్టు భవన్ ఛైర్మన్ నాగకిశోర్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని తిక్కవరం, పల్లవోలు, చుంచులూరు, పి.ఎన్.పల్లి గ్రామాల్లో పలువురు సంఘం నాయకులు కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పద్మజ యాదవ్, యాదవ నాయకులు రామచంద్రయ్య యాదవ్, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ప్రణాళికలపై ప్రత్యేక శిక్షణ

వెంకటాచలం : జిల్లాలో ఆదర్శ సమాఖ్యలుగా ఎంపికైన 13 మండలాల ఏపీఎం, సీసీ, అకౌంటెంట్లకు వెంకటాచలం సమాఖ్యలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యం, చదువు, జీవనోపాధి, వ్యవసాయం, ఆర్థిక ప్రణాళికలు తదితర అంశాలపై డీపీఎం మురళి శిక్షణ ఇచ్చారు. మూడు రోజుల పాటు కొనసాగనున్నట్లు వెంకటాచలం ఏపీఎం రుక్మిణి తెలిపారు.

అర్హులందరికీ ఇళ్ల నిర్మాణాలు

మనుబోలు, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం ద్వారా అర్హులందరికీ శాశ్వత గృహాలు నిర్మిస్తామని గృహనిర్మాణశాఖ ఏఈ శరత్‌బాబు తెలిపారు. అక్కంపేట గిరిజనకాలనీలో బుధవారం పర్యటించి సర్వే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్లు లేని గిరిజనులను గుర్తించి వారికి గృహాలు నిర్మిస్తామన్నారు. నవంబరు నెలాఖరు వరకు గడువు పొడగించారని అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంజినీరింగ్ సహాయకురాలు తేజ, తెదేపా నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, కోదండరామిరెడ్డి, అమీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జ్వాలాముఖి అమ్మవారి ఆలయానికి విరాళం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు జ్వాలాముఖి అమ్మవారి ఆలయంలో నిఘానేత్రాల ఏర్పాటుకు రూ.40 వేలు విరాళంగా అందజేశారు. అమ్మవారి భక్తుడు పేరు వెల్లడించేందుకు ఇష్టపడలేదు. భక్తుల సంరక్షణకు వీటిని ఏర్పాటు చేయాలని వారు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

పట్టించుకునేదెవరు?

తోటపల్లిగూడూరు మండలం కోడూరు పంచాయతీ పాతకోడూరులో తాగునీటి బోరు నిరుపయోగంగా ఉంది. తీర ప్రాంతం కావడంతో వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా బోరు వేశారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. చిన్నపాటి మరమ్మతులు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. మోటార్లు పనిచేయనపుడు ప్రత్యామ్నాయంగా బోర్లు ఉపయోగపడతాయని, అధికారులు స్పందించి బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు

ముళ్ల చెట్లు తొలగించరూ..

వెంకటాచలం మండలం సర్వేపల్లి నుంచి ముత్తుకూరుకు వెళ్లే మార్గంలో నిడిగుంటపాళెం వద్ద రహదారికి ఇరువైపులా ముళ్ల చెట్లు కమ్ముకున్నాయి. చెట్లు రహదారిపైకి రావటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో, ఎదురు వాహనాలు వచ్చినపుడు, ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి రహదారిపైకి వచ్చిన చెట్లు తొలగించాలని వాహన చోదకులు, స్థానికులు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, వెంకటాచలం

పారిశుద్ధ్యం.. అధ్వానం

కోవూరు పట్టణ పరిధిలో పారిశుద్ధ్య చర్యలు అధ్వానంగా ఉన్నాయి. వర్షం పడితే మురుగు కాలువలు పూడిపోవడంతో రోడ్డుపై ప్రవహిస్తోంది. బజారు కూడలి, గమళ్లపాళెం, మెయిన్ రోడ్డు, స్టాబీడీకాలనీ, గ్రంథాయలం వీధుల్లో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయింది. శాంతినగర్‌లోని కాలువలో మురుగు ముందుకు కదలక దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. పారిశుద్ధ్యం మెరుగుపరచాలని పలువురు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, కోవూరు

నిరుపయోగం

మండలంలోని కోడూరు పంచాయతీ పాతకోడూరులో గ్రామ సచివాలయం సమీపంలో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్సు షెల్టరు నిరుపయోగంగా మారింది. కొందరు పశువుల పాకగా మార్చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రజలకు నీడనివ్వాల్సింది పోయి ఎవరికీ ఉపయోగపడటం లేదు. షెల్టరు వద్ద వ్యర్థాలు పడేస్తున్నారు. ఇప్పటికైన స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు విన్నవిస్తున్నారు.–న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు

ఆదమరిస్తే ప్రమాదమే

తోటపల్లిగూడూరు మండలం చింతోపు గ్రామం సమీపంలో కోడూరు ప్రధాన రోడ్డు పక్కనే గుంత ప్రమాదకరంగా ఉంది. 15 గ్రామాలకు పలు వాహనాల్లో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల ద్విచక్రవాహనం అదుపుతప్పి పడడంతో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. అధికారులు స్పందించి గుంత వద్ద ప్రమాద సూచిక ఏర్పాటు చేయడం లేదా గుంతలు పూడ్చి సమస్య పరిష్కరించాలని విన్నవిస్తున్నారు. – న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు

నిమ్మలో సస్యరక్షణపై అవగాహన

సైదాపురం : నిమ్మ రైతులు సకాలంలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారిణి హైమావతి సూచించారు. మర్లపూడి గ్రామంలో బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

పాఠశాల గేటు ధ్వంసం చేశారని ఫిర్యాదు

పొదలకూరు, న్యూస్‌టుడే: బత్తులపల్లి గ్రామానికి చెందిన అశోక్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డిలపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహ్మద్ హనీఫ్ తెలిపారు. కొన్ని రోజులుగా వారు సొంతిల్లు నిర్మించుకుంటూ నిర్మాణానికి అవసరమైన సామగ్రి పాఠశాలలోని ఒక గదిలో వేశారు. ఇంతలో రైతులకు పంపిణీ చేసేందుకు యూరియా లోడు రావడంతో సచివాలయ సిబ్బంది గది ఖాళీ చేయాలని కోరారు. ఆగ్రహించిన వారిద్దరు స్కూల్ గేటు తాము పెట్టామంటూ తీసుకెళుతుండగా గ్రామస్థులు కొందరు అడ్డుకున్నారు. వారిపై దౌర్జన్యానికి పాల్పడ్డారన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

గేదెను ఢీకొని వ్యక్తికి గాయాలు

రాపూరు, న్యూస్‌టుడే: రాపూరు టోల్ ప్లాజా వద్ద గేదెను ఢీకొని ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికుల వివరాల మేరకు గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై రాపూరు వైపు వస్తుండగా జాతీయ రహదారి టోల్ ప్లాజా సమీపంలోకి రాగానే హఠాత్తుగా రోడ్డుపైకి వచ్చాయి. ఒక్కసారిగా గేదెను ఢీకొట్టడంతో కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై తమకెలాంటి సమాచారం లేదని పోలీసులు తెలిపారు.

జూద స్థావరంపై దాడి

మర్రిపాడు : పెదమాచనూరు గ్రామం సమీపంలోని పొలాల్లో నిర్వహిస్తున్న జూద స్థావరంపై సీఐ గంగాధర్, ఎస్సై శ్రీనివాసరావు తమ సిబ్బందితో బుధవారం దాడులు చేశారు. జూదం ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 7 చరవాణులు, రూ.50240 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి కాకాణి

వెంకటాచలం, కోవూరు, ఆత్మకూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పది వైద్య కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం దారుణమని మాజీ మంత్రి, వైకాపా జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి విమర్శించారు. వైద్య కళాశాలల ప్రైవేటీ కరణను నిరసిస్తూ వెంకటాచలంలో బుధవారం నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో కాకాణి పూజిత తదితరులు పాల్గొన్నారు.

● కోవూరు పట్టణంలోని బజారు కూడలి నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వైకాపా నాయకుల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

● వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గ్రామస్థాయి నుంచి ఉద్యమం చేపడతామని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరు పురపాలక బస్టాండ్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. కోటి సంతకాల కార్యక్రమంలో భాగంగా నాయకులు చేపట్టిన సంతకాల సేకరణ పత్రాలను ఆర్డీవో కార్యాలయం వరకు తీసుకెళ్లారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి స్వామిత్వ గ్రామసభలు

మనుబోలు : స్వామిత్వ ప్రత్యేక గ్రామసభలను ఈనెల 13 నుంచి నిర్వహించనున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గ్రామ కంఠాల్లోని ఇళ్ల స్థలాలకు ప్రాపర్టీ కార్డులు జారీ చేసే ముందు ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరణకు ఈనెల 13 నుంచి 26వ తేదీ వరకు గ్రామాల్లో గ్రామసభలను నిర్వహిస్తామని తెలిపారు.

వ్యాక్సిన్ ద్వారా న్యుమోనియా అరికడదాం

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే : బిడ్డ జన్మించిన ఆరో వారం నుంచే న్యూమోనియా వ్యాక్సిన్ వేయడంతో మహమ్మారి నుంచి కాపాడవచ్చని జగదేవిపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు బ్రహ్మేశ్వర్, కిషోర్ కుమార్ అన్నారు. బుధవారం జంగంవాని దొరువు పంచాయతీ కార్యాలయంలో సర్పంచి సుధీరమ్మ ఆధ్వర్యంలో పలువురు చిన్నారులకు ఉచితంగా వ్యాక్సిన్‌లను పంపిణీ చేశారు. పలువురు వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

మనుబోలు, విడవలూరు, న్యూస్‌టుడే : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14 నుంచి నిర్వహిస్తున్నట్లు మనుబోలు గ్రంథాలయాధికారి అరుణ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ శుక్రవారం బాలల దినోత్సవం సందర్భంగా వారోత్సవాలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. 15న పుస్తక ప్రదర్శన, 16న వివిధ అంశాలపై ప్రముఖ వ్యక్తులకు సంబంధించి ప్రసంగం, 17న సెమినార్లు, 18న పాఠశాల విద్యార్థులకు వివిధ పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20న అక్షరాస్యతా దినోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. ● ఈనెల 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తారని గ్రంథాలయాధికారిణి నిరూప ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారోత్సవాల్లో పుస్తక ప్రదర్శన, పుస్తక పఠనం, విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తారని విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

అందరికీ 'సహకారం'

సంగంలో కళాకారుల ప్రదర్శన

సంగం, న్యూస్‌టుడే: ప్రాథమిక సహకార సంఘాల ద్వారా సమాజంలో అన్ని వర్గాలకు సహకారం లభిస్తుందని కళాకారులు పౌరాణిక ప్రదర్శన ద్వారా ప్రజలకు వివరించారు. సంగంలో బుధవారం సహకారశాఖ ఆధ్వర్యంలో ఆర్థిక మరియు సాంకేతిక అక్షరాస్యత సదస్సు జరిగింది. కళాకారులు శ్రీకృష్ణ తులాభారం నాటకంలోని సన్నివేశం ప్రదర్శించి, అనంతరం సహకార శాఖ ఆధ్వర్యంలోని బ్యాంకుల ద్వారా లభిస్తున్న ఆర్థిక సేవల గురించి అవగాహన కల్పించారు. సంగం సహకార సంఘం అధ్యక్షులు జి.శ్రీనివాసులుయాదవ్, సీఈవో బాలకృష్ణ, బుచ్చి సహకార బ్యాంకు మేనేజర్ నాగరాజు తదితరులు హాజరయ్యారు.

అంకిత భావంతో ప్రజాసేవ చేద్దాం

చేజర్ల, న్యూస్‌టుడే: తెదేపా సిద్ధాంతాలకు అనుగుణంగా పార్టీ శ్రేణులంతా అంకితభావంతో పనిచేయాలని సోమశిల ప్రాజెక్టు కమిటీ అధ్యక్షులు వేలూరు కేశవ చౌదరి పిలుపునిచ్చారు. చేజర్లలో బుధవారం జరిగిన తెదేపా మండల గ్రామ కమిటీల ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలకు మరింత చేరువ కావాలని కోరారు. మండల, గ్రామ, బూత్ కమిటీల వివరాలను మండల కమిటీ అధ్యక్షులు సిరాజుద్దీన్ ప్రకటించారు. అనంతరం నూతన కార్యవర్గాలతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు

పరీక్షలు చేస్తున్న వైద్యులు

విడవలూరు, న్యూస్‌టుడే: విడవలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంపు చివరి రోజు కార్యక్రమంలో భాగంగా మన్నాథరావుపేటలో వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా కోఆర్డినేటర్ అల్లం ఉదయ్ శంకర్ విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ దీనదయాళ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయండి

మర్రిపాడు : ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో నిర్దేశించిన లక్ష్యాలను సిబ్బంది త్వరగా పూర్తి చేయాలని ఏపీడీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంట కుంటలు, పండ్లతోట పెంపకాలు, ఇంకుడు గుంతలు లక్ష్యాలను త్వరగా పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. ఏపీవో వెంకట నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు జలకళ.. సాగుకు సన్నద్ధం

న్యూస్‌టుడే, బుచ్చిరెడ్డిపాళెం

కనిగిరి రిజర్వాయర్

ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు జలకళ సంతరించుకున్నాయి. కోవూరు, కావలి నియోజకవర్గాల వరప్రదాయిని కనిగిరి రిజర్వాయర్‌లోకి భారీగా నీరు చేరింది... కోవూరు, విడవలూరు, వరిణి చెరువుల్లో నీరు పుష్కలంగా ఉండడంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు.

● కోవూరు, కొడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం, విడవలూరు, ఇందుకూరుపేట మండలాల్లో పూర్తిస్థాయిలో వరి సాగు చేస్తారు. ప్రస్తుతానికి కనిగిరి రిజర్వాయర్‌లో 2.5 టీఎంసీల నీరుంది. టీఎంసీ సుమారు పది వేల ఎకరాలకు నీరందిస్తుంది.

● నియోజకవర్గ పరిధిలో పంట కాలువలు పూడికతో నిండాయి. ఉపాధి హామీ పథకంలో కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా రైతులకు ప్రయోజనం చేకూరే పనులు చేయడం లేదు. సీజన్‌లో రైతులు కోరుకునే ధర ఉన్న ధాన్యం రకాలు వేసేలా అధికారులు విస్తృత స్థాయి ప్రచారంతో పాటు, సమృద్ధిగా విత్తనాలు, యూరియా అందించాలని కోరుతున్నారు. రెండింటిలో ఒక్కటి అందకపోయినా అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు వస్తాయని పలువురు చెబుతున్నారు.

● కోవూరు ఏడీఏ అనిత మాట్లాడుతూ... యూరియా సమస్యలు ఎక్కడా లేవన్నారు. గతంలో లేని విధంగా ముందుగానే యూరియా సరఫరా చేశామని, ఇంకా అవసరమైన యూరియా అందుబాటులో ఉందన్నారు.

(c) eenadu

నెల్లూరు

• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

దుకాణాలు రోడ్డు మార్జిన్ దాటకూడదు

బీవీనగర్‌లో మురుగునీటిని పరిశీలిస్తున్న ఆరోగ్యాధికారి డాక్టర్ కనకాద్రి

నెల్లూరు (నగరపాలకసంస్థ): నగరంలో దుకాణాలు రోడ్డు మార్జిను దాటకుండా నిత్యం పర్యవేక్షించాలని నగరపాలకసంస్థ ఆరోగ్యాధికారి డాక్టర్ కనకాద్రి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం నగరంలోని సుబేదారుపేట, నక్కలోళ్ల సెంటరు, బీవీనగర్, వేదాయపాలెం, మహాత్మాగాంధీనగర్ ప్రాంతాల్లో పర్యటించారు. బీవీనగర్‌లో రోడ్డుపై చేరిన మురుగునీటిని తొలగించాలని సూచించారు. అన్ని డివిజన్లలో నిరంతరం కాలువల పూడికతీత పనులు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్, బీపీఎస్‌పై అవగాహన: కోటంరెడ్డి

నెల్లూరు(నగరపాలకసంస్థ): ప్రజలకు ఎల్ఆర్ఎస్, బీపీఎస్ పథకాలపై అవగాహన కల్పించాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సూచించారు. బుధవారం నగరపాలకసంస్థ కార్యాలయంలో కమిషనర్ వైవో నందన్ ఆధ్వర్యంలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన ఎల్ఆర్ఎస్, బీపీఎస్ ద్వారా కార్పొరేషన్‌కు ఆదాయం చేకూరేలా చర్యలు చేపట్టాలన్నారు. రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందితే నగరం ప్రగతి బాట పడుతుందన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, సిటీప్లానర్ హిమబిందు, డిప్యూటీ సిటీ ప్లానర్ రఘునాథరావు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

నెల్లూరు(మార్కెట్ సెంటర్) : కష్టపడే కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మాగుంట లేఅవుట్‌లోని తన కార్యాలయంలో బుధవారం పలు పదవులు పొందిన నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనం మధ్యలో ఉంటూ వారి సమస్య పరిష్కరించే వారే నాయకులవుతారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

పవిత్ర స్థలం.. పాలకుల నిర్లక్ష్యం

న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

దక్షిణాది రాష్ట్రాల్లో రొట్టెల పండగ ఎంతో ప్రసిద్ధి.. ఏటా జరిగే ఈ ఉత్సవానికి దేశంలోని అన్నిమతాల వారు వస్తుంటారు. అదే నగరంలోని బారాషహీద్ దర్గా రొట్టెల పండగ. కోరికలు నెరవేరతాయన్న నమ్మకంతో లక్షలాదిగా భక్తులు పోటెత్తుతారు. గత ఏడాది పండగ సమయంలో భక్తులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వర్చువల్‌గా మాట్లాడారు. రాష్ట్ర పండగగా ప్రకటించారు. అలాంటి దర్గాపై పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో కళావిహీనంగా తయారైంది. దర్గా టెండరు నగదు దాదాపు రూ.కోటికిపైగా తీసుకెళ్లే వక్ఫ్ బోర్డు అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. వక్ఫ్ బోర్డు పరిధిలోకి వస్తుందని మాకు సంబంధం లేదని నగరపాలకసంస్థ అధికారులు చెబుతున్నారు. దీంతో భక్తులకు అవస్థలు తప్పడం లేదు. రొట్టెల పండగ సమయంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హడావుడి చేసి.. ముగిసిన తరువాత ఇటువైపు చూడడం లేదు. దీని బాగోగులు పట్టించుకోవడం లేదు.

అధ్వానంగా ఉన్న స్వర్ణాల చెరువు ఘాట్

ఈద్గా దుస్థితి

మందుబాబులకు అడ్డాగా..

దర్గా ఆవరణ మందుబాబులు, ఆకతాయిలకు అడ్డాగా మారింది. వారం రోజుల క్రితం దర్గాలో నిద్రిస్తున్న భక్తులపై గంజాయి బ్యాచ్ దాడి చేసింది. రాత్రిళ్లు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. ఎక్కడ చూసినా మద్యం ఖాళీ సీసాలు దర్శనమిస్తున్నాయి.

అధ్వానంగా ఘాట్ : దర్గా ఆవరణలోని స్వర్ణాల చెరువులో దాదాపు రూ.4 కోట్లు ఖర్చు చేసి ఘాట్ నిర్మించారు. దర్గాకు వచ్చే భక్తులతో పాటు జిల్లా వాసులు ఇందులో స్నానాలు చేస్తుంటారు. నగరవాసులు కుటుంబ సభ్యులతో కలిసి సేదతీరుతున్నారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఈ ఘాట్ కళావిహీనంగా తయారైంది. ఎక్కడ చూసినా వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. కనీసం శుభ్రం చేసేవారే లేకుండాపోయారు. భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏడాది పాటు దర్గా, ఆవరణ నిర్వహణ బాధ్యతలను రూ.1.30 కోట్లకు దక్కించుకున్న గుత్తేదారుడు సబ్ లీజులకు ఇచ్చేసి చేతులు దులుపుకొన్నారు.

గుత్తేదారుడిదే బాధ్యత

– ఖుదావన్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్

దర్గా, ఆవరణను ఏడాది పాటు నిర్వహణ బాధ్యతలను గుత్తేదారుడికి అప్పగించాం. శుభ్రం చేయించాల్సిన బాధ్యత అతనిదే.

గ్యాస్ గోదాము తనిఖీ

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: నగరంలోని అయ్యప్పగుడి ప్రాంతంలో ఉన్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ గ్యాస్ గోదామును బుధవారం ఆర్డీవో అనూష తనిఖీ చేశారు. గోదాములో తీసుకుంటున్న భద్రతా చర్యలు, నిల్వ సదుపాయాలను పర్యవేక్షించి, రికార్డులను పరిశీలించారు. సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, పలు సూచనలు చేశారు.

రోడ్డు ప్రమాద బాధితులకు ఉచిత వైద్యం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: నగరంలోని ఎన్టీఆర్‌నగర్ జాతీయ రహదారి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఎస్.ఎ.సుధీర్‌కుమార్ బుధవారం పరామర్శించారు. క్షతగాత్రులకు ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో ఉచిత వైద్యం అందిస్తున్నామని, కుటుంబాలకు భరోసాగా ఉంటామని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా! (10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: బాలాజీనగర్ పద్మావతి నగర్‌లో పీఎస్1-పీ4 స్తంభానికి విద్యుద్దీపం వెలగడం లేదు. శివారు ప్రాంతం కావడంతో చీకటిగా ఉంటుంది. ఇబ్బందులు పడుతున్నాం.
– ప్రసాదరావు, స్థానికుడు

సమాధానం: విద్యుద్దీపాన్ని ఏర్పాటుచేస్తాం.
– ముజాహిద్దీన్, డీఈ

? స్టోన్‌హౌస్‌పేట ముకుందాపురంలో కుక్కల బెడద ఎక్కువైంది. స్కూలు ఉండడంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు.
– వెంకటేశ్వర్లుప్రసాద్, స్థానికుడు

✓ కుక్కలను పట్టించేందుకు చర్యలు చేపడతాం. – డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి – న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

అధికారులతో కమిషనర్ సమీక్ష

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగరపాలకసంస్థ కమిషనర్ వైవో నందన్ బుధవారం కార్యాలయంలోని ఛాంబర్‌లో ఎస్టాబ్లిష్‌మెంట్, లీగల్ సెల్ విభాగాలతో సమావేశం నిర్వహించారు. పరిపాలన విభాగంలో గాయపడిన పలు విషయాలపై మేనేజర్ రాజేశ్వరితో చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులపై సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో సూపరింటెండెంట్ ప్రవీణ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **నెల్లూరు(నగరపాలకసంస్థ):** నగరపాలకసంస్థ కమిషనర్ వైవో నందన్ బుధవారం 17వ డివిజన్‌లో పర్యటించారు. పినాకిని రెవెన్యూ లేఅవుట్‌ను పరిశీలించారు. సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న భవనానికి సంబంధించిన నిర్మాణ అనుమతులను తనిఖీ చేశారు. కాలువలను పరిశీలించి పూడికతీత పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో నగరాభివృద్ధిసంస్థ మేనేజింగ్ డైరెక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, ఇంజినీరింగ్ విభాగం ఈఈ అనిల్‌కుమార్, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

నెల్లూరు డివిజన్ ఎల్ఐసీ కార్యాలయం ప్రారంభం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: నగరంలో ఆధునికీకరించిన భారత జీవిత బీమా సంస్థ నెల్లూరు డివిజన్ కార్యాలయ భవనాన్ని దక్షిణ మధ్య మండల కార్యాలయ జోనల్ మేనేజర్ పునీత్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ దక్షిణ మధ్య మండల కార్యాలయం చీఫ్ ఇంజినీర్ హిలాలి, నెల్లూరు డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ బి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

గుంత.. ప్రమాదాల చింత

నగరంలోని సుజాతమ్మ కాలనీలో రోడ్డు మధ్యలో గుంత ప్రమాదకరంగా మారింది. ప్రధాన పైపులైను లీకవుతుండడంతో సిమెంటు రోడ్డును పగులగొట్టి మరమ్మతులు చేశారు. వారం రోజులుగా పూడ్చకుండా వదిలేశారు. ఇందులో నీరు చేరి కలుషితవుతుంది. అది పైపులైనులోకి వెళుతుండడంతో కుళాయిల ద్వారా సరఫరా అవుతుందని స్థానికులు వాపోతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు (టౌన్)

శిలాఫలకాలు.. ప్రచారాలకు నిలయాలు

నగరంలో పలు వీధులకు పేర్లు తెలిపే బోర్డులు లేవు. సిమెంటు రోడ్లు వేసినప్పుడు ప్రాంతం, అంచనాతో పాటు ప్రజాప్రతినిధుల పేర్లతో శిలాఫలకాలను వేస్తున్నారు. కొత్తగా ఆ ప్రాంతానికి వచ్చిన వారు వీటిని చూసి వీధులు, ప్రాంతాలను గుర్తు పడుతున్నారు. కానీ కొందరు ఆ శిలాఫలకాలను ప్రచారాలకు వినియోగించుకుంటున్నారు. మాగుంట లేవుట్‌లో వీటిపై గోడప్రతులను అంటిస్తున్నారు.
– న్యూస్‌టుడే, నెల్లూరు (టౌన్)

ప్రమాదకరంగా గోడ

నగరంలోని పాత జడ్పీ కార్యాలయం గోడ శిథిలమై ప్రమాదకరంగా ఉంది. ఎప్పుడు పడిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. విద్యార్థులు, వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగించే వారితో ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. అధికారులు గోడకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, నెల్లూరు(మార్కెట్ సెంటర్)

వేడుకగా మూలస్థానేశ్వరుడి ఊరేగింపు

కార్తిక మాసం సందర్భంగా మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో బుధవారం విశేష పూజలు జరిగాయి. వేదపండితులు ఆకాశ దీపం వెలిగించారు. స్వామి, అమ్మవార్ల విగ్రహాల ఊరేగింపు వేడుకగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(మార్కెట్ సెంటర్)

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

మాట్లాడుతున్న రూప్‌కుమార్‌యాదవ్

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగర నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ సూచించారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు రహంతుజానీ, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో చోరీ

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: రామాలయంలో పట్టపగలే గుర్తుతెలియని వ్యక్తులు హుండీ కొల్లగొట్టడంతో పాటు సీతమ్మ తాళిబొట్టు చోరీ చేసిన ఘటన బుధవారం ఉదయం చోటు చేసుకుంది. బుజబుజ నెల్లూరు ప్రాంతంలోని మిట్టపై రామాలయంలోకి బుధవారం ఉదయం అయిదుగురు పూజలకు వచ్చారు. వారిలో మహిళలు కూడా ఉన్నారు. వారందరూ పూజలు చేస్తున్నట్లు నటిస్తూ హుండీలో ఉన్న సుమారు రూ.30 వేల నగదు తస్కరించారు. గర్భ గుడిలో ఉన్న సీతమ్మ మెడలోని బంగారు తాళిబొట్టును తీసుకొని ఉడాయించారు. అనంతరం గుర్తించిన దేవస్థానం కార్యనిర్వాహకులు గోపాలయ్య వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వన సమారాధనను విజయవంతం చేయాలి

నెల్లూరు (విద్య): యాదవ భవన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ ఆత్మకూరు నియోజకవర్గంలో చేపట్టనున్న కార్తిక మాస వన సమారాధన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని యాదవ భవన్ ట్రస్ట్ అధ్యక్షులు బొమ్మి నాగ కిషోర్ కోరారు. బుధవారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో దీనిపై గోడపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవరాల సుబ్రహ్మణ్యం, ఆనంగి వెంకటరమణయ్య, పెరుమాళ్ల పద్మజ, చిల్లూరి వెంకటరమణయ్య, రామచంద్ర, వెంకటేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉద్యోగుల నిరసన

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే, : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్ అండ్ బి కార్యాలయంలో ఉద్యోగులు చేపట్టిన నిరసనలు బుధవారం కొనసాగాయి. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు పొదిలి చిన్నయ్య మాట్లాడుతూ 25 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వర్క్ఇన్‌స్పెక్టర్ పోస్టులు భర్తీ చేయాలని, పదోన్నతులు కల్పించాలని కోరారు. పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఖాదర్‌బాషా, షబ్బీర్ అహ్మద్, రత్నం, శంకర్‌బాబు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏవీకే ఎస్టేట్.. సమస్యల నిలయం

న్యూస్‌టుడే, నెల్లూరు(మార్కెట్ సెంటర్)

నగరంలోని పొదలకూరు రోడ్డు ప్రాంతంలోని ఏవీకే ఎస్టేట్‌లో ప్రజలను సమస్యలు వేధిస్తున్నాయి. సదుపాయాలు కొరవడడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గతంలో పొగాకు గోదాము ఉన్న ప్రాంతంలో దాదాపు పదిహేనేళ్ల క్రితం పేదలకు నివాస స్థలాలు ఇచ్చారు. అనేక మంది తమ కలల సౌధాలను నిర్మించుకుని ఇక్కడ నివసిస్తున్నారు. రోడ్లు, కాలువలు లేక వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కాలనీలో నాలుగు ప్రధాన రహదారులు, రెండు అడ్డరోడ్లు ఉన్నాయి. రెండు రహదారులకు మాత్రం సిమెంట్ రోడ్లు నిర్మించారు. మిగిలినవి మట్టి రోడ్లు కావడంతో అస్తవ్యస్తంగా తయారయ్యాయి. గుంతలమయంగా ఉన్న రహదారులపై రాకపోకలు సాగించలేని పరిస్థితి. చిన్నపాటి చినుకులు పడినా రహదారులు బురదమయంగా మారుతున్నాయి.

కాలువలు లేక మడుగులా మురుగు

వీటిపై నడిచేందుకు స్థానికులు తిప్పలు పడుతున్నారు. ఏళ్ల క్రితం కాలనీ ఏర్పడినా ఇక్కడ సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. కాలువలు నిర్మించకపోవడంతో మురుగునీరు ముందుకు కదలడం లేదు. ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు వారి నివాసాల ముందు పేరుకుపోతోంది. రోజుల తరబడి నిల్వ ఉంటున్న మురుగు మడుగులా తయారవుతోంది. దుర్వాసన వస్తుండడంతో కొందరు పైపులు వేసుకుని దూరంగా ఉన్న కాలువలోకి వదులుతున్నారు. రోడ్లు, కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నా తమ గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. వీధులు, ఖాళీ స్థలాల్లో మురుగునీరు చేరి పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. మురుగునీటిలో వృద్ధి చెందుతున్న దోమలు పగలు, రాత్రి తేడా లేకుండా దాడులు చేస్తున్నాయి. వీటి కారణంగా వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ కాలనీలో కాలువలు, రోడ్లు నిర్మించాలని వారు కోరుతున్నారు.

విద్యార్థులకు వసతులు కల్పించాలి: మంత్రి

అధికారులతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : నగర నియోజకవర్గ పరిధిలో దాతల సహకారంతో అభివృద్ధి చేస్తున్న పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన వసతులు కల్పించాలని మంత్రి నారాయణ సూచించారు. బుధవారం నగరంలోని ఆర్ఎస్ఆర్, మల్లెల సంజీవయ్య మున్సిపల్ స్కూల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ నందన్, టీడీపీ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, కర్తం ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుల రాక

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు ఈనెల 13, 14 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ దుకాణాలు, ఐసీడీఎస్, మధ్యాహ్న భోజన పథకం అమలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాలను తనిఖీ చేస్తారన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అమలు చేస్తున్న ప్రధానమంత్రి మాతృ వందన పథకంపై సమీక్షిస్తారని వివరించారు.

పేదలకు అన్నదానం

నెల్లూరు (విద్య): నగరంలోని ట్రంకురోడ్డులోని సదాశివ హోమియో మెడిసెన్ అధినేత ఎంఎస్.సాగి వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు వాదనాల రాజశేఖర్, అనిల్, కిషోర్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి దూరదృష్టితో 3 లక్షల ఇళ్లు పూర్తి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టితో 16 నెలల్లోనే మూడు లక్షల ఇళ్లు పూర్తి చేశామని వక్ఫ్ బోర్డ్ రాష్ట్ర ఛైర్మన్, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ తెదేపా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇళ్లు కాదు ఊళ్లే నిర్మిస్తామని చెప్పి మాట తప్పిన ఘన చరిత్ర జగన్‌మోహన్‌రెడ్డిదని ఆరోపించారు.

నెల్లూరుగ్రామీణం : నగరంలోని రామ్‌నగర్‌లో కె.కోటేశ్వరికి కూటమి ప్రభుత్వం నిర్మించిన నూతన గృహాన్ని తెదేపా నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ బేస్‌బాల్ పోటీల విజేతకు సన్మానం

విజేత పి. హేమలతను సన్మానిస్తున్న పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్, స్థానిక నాయకులు

నెల్లూరు (బృందావనం), న్యూస్‌టుడే: అంతర్జాతీయ స్థాయిలో బేస్‌బాల్‌లో రాణించిన రూరల్ మండలానికి చెందిన క్రీడాకారిణి పి. హేమలతను భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ సింగ్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన యువ క్రీడాకారిణి ఇటీవల థాయ్‌ల్యాండ్‌లో జరిగిన అంతర్జాతీయ బేస్‌బాల్ పోటీలో ద్వితీయ స్థానం సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పలువురు పాల్గొన్నారు.

నేతాజీ సుబ్బారెడ్డికి అవార్డు

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : మూడు దశాబ్దాలుగా విద్యారంగంలో సేవలందిస్తున్న నేతాజీ ఎమ్మెస్సార్ పైలట్ స్కూల్ ఛైర్మన్ సుబ్బారెడ్డి ఫిన్‌లాండ్ ఎడ్యుకేషన్ అంబాసిడర్ అణు గుటోరమ్ అవార్డు అందుకున్నారు. ఇటీవల దుబాయిలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డు అందించారని ఆయన తెలిపారు. ఆయన్ను పలువురు అభినందించారు.

పచ్చదనంపై అధికారులకు శిక్షణ

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో థీమ్ 5, క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ పేరుతో నెల రోజుల కార్యక్రమాలకు అధికారులు సంకల్పించారు. ఇందుకు బుధవారం శిక్షణ ప్రారంభమైంది. దీనికి 46 మండలాల నుంచి ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు 92 మందిని ఆహ్వానించారు. దీన్ని జడ్పీ ఇన్‌ఛార్జి సీఈవో శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు. ఇందులో శిక్షణ తీసుకున్నవారు మండలాల్లో సిబ్బందికి థీమ్ 5, క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమం అమలుపై అవగాహన కల్పిస్తారు.

16న మహా రుద్రాభిషేకం

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ సుజాతమ్మ కాలనీలోని శ్రీకృష్ణమందిరం అష్టలక్ష్మి ఆలయంలో మహా రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆ సమితి అధ్యక్షుడు వాసుదేవరావు తెలిపారు. నెల్లూరు జర్నలిస్ట్ భవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 108 మంది దంపతులతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి రమేష్, నారాయణరావు, శ్రీధర్ శర్మ, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న నిర్వాహకులు

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై వైకాపా నిరసన

నగరంలో వైకాపా నాయకుల ప్రదర్శన

నెల్లూరు (కలెక్టరేట్), న్యూస్‌టుడే: ప్రైవేటు వ్యక్తులకు వైద్య కళాశాలలను అప్పగించడం దారుణమని ఎమ్మెల్సీ పి. చంద్రశేఖరరెడ్డి ఆరోపించారు. ఇందుకు నిరసనగా బుధవారం నగరంలో ప్రజా ఉద్యమ పోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. వీఆర్సీ సెంటరు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు ఖలీల్, కరిముల్లా, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

ఎం.౧ సినిమాస్.: స్క్రీన్. 1 జటాధర (తెలుగు),మాస్ జాతర (తెలుగు) స్క్రీన్ .2. ది గర్ల్ ఫ్రెండ్ (తెలుగు) స్క్రీన్..3. ప్రిడేటర్ 3డి (తెలుగు), మాస్ జాతర (తెలుగు) **స్పైస్.సినిమాస్:** స్క్రీన్ 1. . ఫీనిక్స్ (తెలుగు), జటాధర (తెలుగు), హఖ్ (హిందీ) స్క్రీన్ 2...ఆర్యన్ (తెలుగు), ప్రి వెడ్డింగ్ షో, (తెలుగు), హఖ్ (హిందీ) స్క్రీన్ 3..ప్రేమిస్తున్నా (తెలుగు), కృష్ణ లీల (తెలుగు), మాస్ జాతర (తెలుగు) స్క్రీన్.4. .ప్రిడేటర్ 3డి (తెలుగు, ఇంగ్లీష్) స్క్రీన్.5 ది గర్ల్ ఫ్రెండ్ (తెలుగు), మాస్ జాతర (తెలుగు) **రెయిన్ సినిమా :** స్క్రీన్..1. ప్రిడేటర్ 3డి (తెలుగు), మాస్ జాతర (తెలుగు) స్క్రీన్..2.. ది గర్ల్ ఫ్రెండ్ (తెలుగు), ఆర్యన్ (తెలుగు) స్క్రీన్..3.. జటాధర (తెలుగు), మాస్ జాతర (తెలుగు) స్క్రీన్..4..ప్రి వెడ్డింగ్ షో (తెలుగు), కృష్ణ లీల (తెలుగు)

హౌసింగ్ బోర్డు కాలనీ.. భయం.. భయం

ఈ చిత్రంలోని మహిళ పేరు రుక్మిణమ్మ. వయసు 75. ఇంట్లో ఒంటరిగా ఉంటున్నారు. ఈవిషయాన్ని తెలుసుకున్న దొంగలు మంగళవారం రాత్రి ఇంట్లోకి ప్రవేశించారు. ఆమె మొహంపై వస్త్రాన్ని కప్పి పిడిగుద్దులు కురిపించారు. మెడలోని బంగారు ఆభరణాలను తీసుకుని పారిపోయారు. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రి తీసుకెళ్లారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

న్యూస్‌టుడే, నెల్లూరుగ్రామీణం

కొన్నాళ్ల క్రితం ఓ వృద్ధురాలు కాలనీలో నడిచి వెళుతుండగా గుర్తుతెలియని ఇద్దరు ద్విచక్ర వాహనంపై వెంబడించారు. ఆమె మెడలోని బంగారు ఆభరణాలను తెంపుకెళ్లిపోయారు. ఈహఠాత్పరిణామంతో భీతిల్లిపోయారు. ఇలా నగరంలోని 24వ డివిజన్ కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో తరచూ దొంగతనాలు జరుగుతున్నాయి. చోరుల భయంతో ప్రజలు వణికిపోతున్నారు. కాలనీలో ఎల్ఐజీ, హెచ్ఐజీ, ఎమ్ఐజీ బాకులు ఉన్నాయి. చుట్టుపక్కల ఇందిరమ్మ, ఆర్టీటీ కాలనీలు, కల్లూరుపల్లి ప్రాంతాలున్నాయి. 10 వేల మంది వరకు నివసిస్తున్నారు. కొన్నాళ్లుగా నేరాలు పెరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వృద్ధులు, కళాశాలలు, ఉద్యోగాలకు వెళ్లే మహిళలను లక్ష్యంగా చేసుకొని గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఒంటరిగా ఉన్నారని తెలిస్తే చాలు ఇళ్లలోకి చొరబడి దొంగతనాలు చేస్తున్నారు. ప్రతిఘటిస్తే దాడులు చేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు ఇక్కడ నిత్యకృత్యమైపోయాయి.

కానరాని గస్తీ: నెల్లూరు గ్రామీణ పోలీసుస్టేషన్ పరిధిలో హౌసింగ్ బోర్డు కాలనీ ఉంది. రోజు వారీ పోలీసులు గస్తీ సరిగా జరగడం లేదని స్థానికులు చెబుతున్నారు. పదేళ్ల క్రితం రోజూ వచ్చి స్థానికులతో సంతకాలు చేయించుకొనేవారు. ప్రస్తుతం ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు పోతున్నారో తెలియడం లేదంటున్నారు. గంజాయి మూకలతో రోడ్లపై ఒంటరిగా వెళ్లేందుకు ప్రజలు భయపడుతున్నారు. పోలీసు అవుట్‌పోస్టు ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పోలీసులు గస్తీ పెంచాలని కోరుతున్నారు.

అవుట్‌పోస్టు ఏర్పాటుతో..

– కెవి.రాఘవేంద్ర, స్థానికులు

కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో దొంగతనాలు, చైన్‌స్నాచింగ్‌లు ఎక్కువైపోయాయి. ఇళ్లలో నుంచి బయటకు మహిళలు రావాలంటే భయపడుతున్నారు. ఈ ప్రాంతంలో పోలీసు అవుట్‌పోస్టు ఏర్పాటు చేయాలి.

అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలి

– ఎమ్.నరసింహరావు, స్థానికులు(ప్రైవేటు ఉద్యోగి)

ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోతున్నాయి. కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. కొంత కాలం క్రితం మా అమ్మ మెడలోని బంగారు గొలుసు దొంగలు లాక్కుని వెళ్లారు. క్రమం తప్పకుండా పోలీసుల గస్తీ జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

IN THE COURT OF THE V ADDL. DISTRICT JUDGE :: NELLORE
O.S. No. 68/2024
Allam Srivalli ... Plaintiff
Vs.
1. Narayanaswamykumari Anupama,
2. M. Jyothi
3. Allam @ Ankam Himabindu
... Defendants
NOTICE
1. Narayanaswamykumari Anupama,
2. M. Jyothi
అనువారికి,
పై నెంబరు దావాలో 1, 2 ప్రతివాదులు నోటీసు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున మహారాజశ్రీ కోర్టు వారు వారికి నోటీసు నిమిత్తం **19-11-2025** తేదీకి వాయిదా వేసియున్నారు. పై తేదీ నాడు 1, 2 ప్రతివాదులు స్వయముగా కానీ లేక వారి వకీలు ద్వారా కానీ కోర్టులో ఉదయం 10.30 గంటలకు హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల మీ పరోక్షము నందు తీర్మానించబడును అని తెలియజేయడమైనది.
By Order of the Hon'ble Court
Piduru Nageswara Rao, B.Sc., B.L.,
B. Krishna Sankar Sai, B.Com., B.L.,
వాది తరపు అడ్వకేట్స్

IN THE COURT OF THE V ADDL. DISTRICT JUDGE :: NELLORE
I.A. No. 14/2024
O.S. No. 68/2024
Allam Srivalli ... Petitioner / Plaintiff
Vs.
1. Narayanaswamykumari Anupama,
2. M. Jyothi
3. Allam @ Ankam Himabindu
... Respondents / Defendants
NOTICE
1. Narayanaswamykumari Anupama,
2. M. Jyothi
అనువారికి,
పై నెంబరు దావాలో వేసియున్న I.A. No. 14/2024 నందు 1, 2 ప్రతివాదులు నోటీసు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున మహారాజశ్రీ కోర్టు వారు వారికి నోటీసు నిమిత్తం **19-11-2025** తేదీకి వాయిదా వేసియున్నారు. పై తేదీ నాడు 1, 2 ప్రతివాదులు స్వయముగా కానీ లేక వారి వకీలు ద్వారా కానీ కోర్టులో ఉదయం 10.30 గంటలకు హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల వారి పరోక్షము నందు తీర్మానించబడును అని తెలియజేయడమైనది.
By Order of the Hon'ble Court
Piduru Nageswara Rao, B.Sc., B.L.,
B. Krishna Sankar Sai, B.Com., B.L.,
వాది తరపు అడ్వకేట్స్

(c) eenadu

ప్రశాంతి నిలయంలో గోపురానికి అలంకరణ

జ్ఞానకాంతి రూపం.. శతజయంతి వైభవం

ఈనాడు, పుట్టపర్తి: ప్రేమమూర్తి సత్యసాయి ఖ్యాతి ఖండాంతరాలు దాటేలా శతజయంతి ఉత్సవాలు నిర్వహించేందుకు సెంట్రల్ ట్రస్టు ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీశ్‌కుమార్ పర్యవేక్షణలో అధికారులు సౌకర్యాల కల్పనలో నిమగ్నమయ్యారు.
★ ఆధ్యాత్మిక పట్టణం విద్యుత్తు కాంతుల్లో వెలుగులీనుతోంది. చిత్రావతి నది వద్ద పార్కులు, సుందరీకరణ చేపట్టారు. పుట్టపర్తి బైపాస్ నుంచి మందిరం వెస్టుగేట్ వరకు రహదారి నిర్మించారు.
★ ప్రశాంతి మందిరం, వెస్టు గేట్, విద్యుత్తు సబ్‌స్టేషన్ పక్కన, చైతన్య జ్యోతి మ్యూజియం వద్ద భక్తులకు వసతి, మరుగుదొడ్లు, తాగు నీటి సౌకర్యం కల్పించారు. 50 వేల మందికి చొప్పున 4 చోట్ల ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గురువారం నుంచి ప్రతి ఒక్కరికీ అన్నప్రసాదం ప్రత్యేక కౌంటర్లను సిద్ధం చేశారు.

చిత్రావతిలో లేజర్‌షో..

పది పార్కింగ్ ప్రదేశాలు

చెన్నై నుంచి వచ్చే వాహనాల కోసం కర్ణాటక నాగేపల్లి వద్ద 3 చోట్ల, బెంగళూరు, అనంతపురం నుంచి వచ్చేవారి కోసం శిల్పారామం వద్ద 3, అలాగే ఆనంద్ విల్లాస్, పోలీసు పరేడ్ మైదానం, మందిరం వెస్టుగేట్ చింతతోపు, చిన్నపల్లి స్కూల్ వద్ద వీఐపీ, వీవీఐపీలకు ప్రత్యేక వసతులుంటాయి.

ఇక్కడ దాచుకుంటే.. దోచుకోవడం కష్టం

ఇళ్ల మధ్యలో ఈ బురుజేంటి? ఆశ్చర్యం కలిగించే రీతిలో ఉన్న ఈ నిర్మాణం శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం దొరిగల్లు గ్రామంలో ఉంది. 1800 సంవత్సరానికి ముందు పాలెగాడు నారాయణరెడ్డి కాలంలో మరాఠా దొంగలు, దివిటీ దొంగలు లాంతర్లతో ముసుగులు వేసుకుని గుర్రాలపై వచ్చి గ్రామస్థుల విలువైన ఆభరణాలు, వస్తువులు, నగదు దోచుకునేవారు. వారి నుంచి రక్షణకు అప్పట్లో గ్రామంలో ఇలా ఇళ్ల మధ్య రాళ్లతో బురుజును నిర్మించారు. విలువైన ఆభరణాలు, ధనం, వస్తువులు, ధాన్యం బురుజు కింద దాచుకునేవారు. ఆ బురుజు పైన ఉండే చిన్నరంధ్రాల్లోంచి దొంగల రాకను గమనిస్తూ కాపలా ఉండి.. ప్రతిదాడులు చేసేవారని రాయలసీమ చరిత్ర పరిశోధకుడు హరనాథ్‌రెడ్డి చెబుతున్నారు.

- ఈనాడు అనంతపురం, న్యూస్‌టుడే, ముదిగుబ్బ

కోనేటి నీరు.. ఔషధం తీరు

కోనేటి నీటిని దాహం తీర్చుకోవడానికి తాగుతాం.. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండల కేంద్రంలో అలా కాదు. కోనేటి నీటిని ఔషధంలా భావిస్తారు. 500 సంవత్సరాల క్రితం విజయనగర రాజు మాధవరాయుడు నిర్మించిన ఆలయం అది. శతాబ్దాలు గడిచినా చెక్కుచెదరని నిర్మాణ కౌశలం దీని సొంతం. అంతేకాదు అప్పటి నమ్మకం ఒకటి కొనసాగుతూనే ఉంది. పిల్లలకు తలలో పుండ్లు, పొక్కులు ఏర్పడితే వరుసగా ఆది, మంగళ, శుక్రవారాల్లో కోనేటి నీటితో స్నానం చేయిస్తే నయం అవుతాయని భావిస్తారు. ఇప్పటికీ పరిసర గ్రామాల నుంచి తల్లిదండ్రులు పిల్లలను పిలుచుకుని పెద్దసంఖ్యలో వచ్చి.. తలస్నానం చేయిస్తారు. 'ఈ నీటిలో కాపర్, జింక్ మూలకాలు ఉన్నాయని పరిశోధనలో తేలింది.. ఇవియాంటి బయాటిక్‌గా పని చేస్తున్నందున చర్మ సంబంధ రోగాలు తగ్గిపోతున్నాయి' అని విశ్రాంత ఆయుర్వేద వైద్య అధికారి రామయ్య చెబుతున్నారు.

- న్యూస్‌టుడే, గోరంట్ల

ఆ గంట గడిస్తే చాలు

న్యూస్‌టుడే, పుట్టపర్తి, అనంతపురం (వైద్యం)

గుండె నిమిషానికి 72 సార్లు కొట్టుకుంటుంది. 2 వేల గ్యాలన్ల రక్తాన్ని శుద్ధిచేసి 60 వేల మైళ్ల దూరం పంపింగ్ చేయగలుగుతుంది. ఆధునిక మనిషి పరుగు వేగం అందుకునేందుకు అంతటి గుండెకు సైతం ఒత్తిడి పెరుగుతోంది. అలుపెరుగని హృదయానికి వచ్చే జబ్బులపై కన్నేసి కాపాడుకుంటేనే మనకు జీవితం..

1 **ఆందోళన :** ఇటీవల కాలంలో వయసుతో సంబంధం లేకుండా ఎక్కువ మంది గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు

2 **కారణాలు :** కల్తీ ఆహార పదార్థాలు తినటం, సరైన ఆహారం తీసుకోక, చెడు వ్యసనాలకు అలవాటు, శారీరక వ్యాయామం లేకపోవడం

3 **ఊరట :** ఆసుపత్రుల్లో రూ. 45వేలు విలువ చేసే టెనెక్టెప్లేస్ ఇంజక్షన్ అందుబాటులోకి వచ్చింది

గోల్డెన్ అవర్..

గుండె సమస్యతో సదరు ఆసుపత్రులకు రోగులు వస్తే వెంటనే వారికి బీపీ, ఈసీజీ పరీక్ష చేసి వచ్చే ఫలితాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టెమీ యాప్ ద్వారా గుండె వైద్య నిపుణులకు పంపితే వారు వాటిని పరిశీలించి రోగికి ఎలాంటి చికిత్సలు అందించాలో సూచిస్తారు. ఆ మేరకు టెనెక్టెప్లేస్ ఇంజక్షన్‌ను వైద్యులు, సిబ్బంది రోగికి వేసి ప్రాణాలను కాపాడుతున్నారు. గుండె సమస్య తలెత్తిన గోల్డెన్ అవర్‌లో రోగిని ఆసుపత్రికి తీసుకువస్తే వారికి సకాలంలో ఇంజక్షన్ వేసి పునర్జన్మ ఇస్తున్నారు.

● గుండెపోటు బాధితులకు సీపీఆర్ చేయాలి. వారిని గోల్డెన్ అవర్‌లోనే తీసుకొస్తేనే బతికించడం సాధ్యం అవుతుంది. వైద్యులు సూచించిన చికిత్స విధానాలు చేపడితే కొన్ని నిమిషాల్లో కుదుట పడతారు. అప్పటికీ ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోతే వెంటనే టెనెక్టెప్లేస్ ఇంజెక్షన్ వేయాలి. ఆరోగ్యం నిలకడగా ఉన్న తరువాత ఆసుపత్రులకు తరలిస్తే శస్త్రచికిత్స ఉచితంగా చేస్తారు.

- డాక్టర్ డేవిడ్ సిల్వన్‌రాజ్, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త



ఈ లక్షణాలుంటే..

గుండెదడ, ఛాతీపై బరువు, మంటగా ఉండటం, శ్వాసలో ఇబ్బంది, వాంతులు, దవడ నొప్పి, చెమటలు పట్టడం, తలతిరిగి కిందపడిపోవటం, ఛాతినొప్పి, ఎడమచేతి వరకూ రావటం వంటి లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

శ్రీసత్యసాయి జిల్లాలో ఆసుపత్రుల వారీగా ఇలా..

ఆసుపత్రి పేరు	ఇంజక్షన్ల సరఫరా	వినియోగించినవి
ధర్మవరం	51	43
మడకశిర	81	74
కదిరి	134	117
హిందూపురం	87	81
గోరంట్ల	2	0
రొళ్ల	22	19
నల్లమాడ	10	9
పెనుకొండ	26	22
తనకల్లు	15	6
కొత్తచెరువు	8	3
చెన్నేకొత్తపల్లి	4	1

తీసుకో సైకిల్.. చుట్టేయ్ క్యాంపస్

ఫ్రెండ్స్.., స్కూటీ, బైక్‌పై దూసుకెళ్లే ఈ వయసులో సైకిలా? అని ఆలోచించకండి. సైక్లింగ్ ఆరోగ్యానికి ఎంతో మేలని గుర్తించండి. పని మీద శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీకి వెళ్తే మాత్రం ఈ విషయాన్ని మరవకండి.. కేవలం రూ.5 చెల్లించి సుమారు 500 ఎకరాల్లో ఉన్న వర్సిటీ ప్రాంగణాన్ని హాయిగా తిలకించవచ్చు. ఇక్కడ ఏ విభాగానికి వెళ్లాలన్నా హాయిగా వెళ్లి రావొచ్చు. డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు తమ ధ్రువపత్రాల కోసం వివిధ ప్రాంతాల నుంచి వస్తుంటారు. ఇలాంటి వారి కోసం ఎస్కేయూ, కెనరా బ్యాంకు సౌజన్యంతో గంటకు రూ.5 అద్దె వసూలు చేస్తూ సైకిల్ ఇస్తున్నారు.

- ఈనాడు అనంతపురం

నేడు ఆడిట్ బృందం రాక

అనంతపురం (వ్యవసాయం) : పశుసంవర్ధక శాఖలో నిధుల గోల్‌మాల్‌పై విచారణ చేపట్టేందుకు ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ దామోదర్‌నాయుడు ముగ్గురితో కూడిన రాష్ట్ర ఆడిట్ బృందాన్ని నియమించారు. 'పశుసంవర్ధక శాఖలో నిధులు మేసేశారు' శీర్షికన బుధవారం 'ఈనాడు'లో కథనం వచ్చింది. దీనికి స్పందనగా పరిశీలనకు సభ్యులు గురువారం జిల్లాకు రానున్నారు. ఉదయం 11.30 గంటలకు జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయానికి అధికారులు చేరుకుంటారు. ముందుగా జేడీఏ హెచ్ ప్రేమచంద్‌తో సమావేశమవుతారు. అనంతరం కార్యాలయంలో సెక్షన్ సీ-1లోని బిల్లు పుస్తకాలు, ఇతర రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. నిధుల గోల్‌మాల్‌పై కలెక్టర్ సైతం ఆరా తీశారు.

ప్రకృతి వనరు.. దోపిడీ ఆపరు

ఈనాడు, పుట్టపర్తి, న్యూస్‌టుడే, కొత్తచెరువు: పచ్చనిచెట్లతో ఆహ్లాదం పంచే కొండలు, గుట్టలను చూస్తే ఎవరికైనా మనసు పరవశించిపోతుంది. అక్రమార్కులకు వాటిని చూస్తే నోట్ల కట్టలు కనిపిస్తున్నాయి. తవ్వుకున్నోడికి తవ్వుకున్నంత అన్నట్లు స్థానిక నాయకులు.. అధికారులతో కుమ్మక్కై ప్రకృతి వనరులను దోచేస్తున్నారు.

రూ.లక్షల్లో గండి..

కరిగిపోయిన దాసరిపాము గుట్ట

కొండలు, గుట్టలు, అటవీ ప్రాంతాలు, ప్రభుత్వ భూముల్లో రాయి, ఇసుక, మట్టి తవ్వకాలు జరిపే ముందు ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. కొత్తచెరువులో పట్టా భూమి అని చెబుతున్నా.. మైనింగ్ శాఖ నుంచి అనుమతులు లేవు. వ్యవసాయ యోగ్యం కాని గుట్టకు అప్పటి అధికారులు జేబులు నింపుకొని పట్టాలిస్తే.. గత వైకాపా ప్రభుత్వంలో ఫ్రీహోల్డ్ చేసి చేతులు దులుపుకొన్నారు. ఫలితంగా 50 శాతం గుట్టను అక్రమార్కులు మింగేశారు.

కాసులు కురిపిస్తున్న ఇసుక

బత్తలపల్లి, ముదిగుబ్బ మండలాల్లో ఇసుక రీచ్ నుంచి టిప్పర్ల ద్వారా ధర్మవరం మీదుగా బెంగళూరుకు అక్రమంగా తరలిపోతోంది. చిత్రావతి నది నుంచి బత్తలపల్లి మీదుగా అనంతపురం, ముదిగుబ్బ, కదిరి మీదుగా మదనపల్లికి రవాణా చేస్తున్నారు. కొత్తచెరువు మండలం వంగపేరు నుంచి పట్టపగలే ట్రాక్టర్లతో తరలిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

అనుమతి లేకుండా కొండలు, గుట్టలు తవ్వితే విచారణ చేపడతాం. పేలుళ్లు చేయాలన్నా నిబంధనలు పాటించాల్సిందే. స్థానిక అవసరాలకు కాకుండా వ్యాపారం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

- ఓబుళరెడ్డి, మైనింగ్‌శాఖ ఏడీ

ఎక్కడ? కొత్తచెరువు మండలం నాగిరెడ్డిపల్లికాలనీకి సమీపంలో సర్వే నంబరు 392లో ఉన్న దాసరిపాము గుట్ట.

ఏం చేస్తున్నారు? హిటాచీ, టిప్పర్లతో మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. పెద్ద బండరాళ్లను ముక్కలు చేయడానికి పేలుళ్లు నిర్వహిస్తున్నారు.

స్థానికుల మాట కొత్తచెరువులో రెండ్రోజుల కిందట పేలుళ్లు జరిగాయి. వణికిపోయాం. ఇదేమని అడిగితే తమ పేరుతో పట్టా ఉందంటున్నారు. సొంత స్థలమైతే ఇష్టారాజ్యంగా పేలుళ్లు చేసుకోవచ్చా? అని అడిగితే సమాధానం లేదు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: రాజకీయాలకు అతీతంగా పేదల సొంతింటి కల నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సవిత, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలిపారు. బుధవారం పుట్టపర్తి మండల పరిధిలోని పెదపల్లిలో నూతన గృహాలను ప్రారంభించారు. తాళాలను మంత్రి, ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. పీఎంఏవై (పట్టణ)లో భాగంగా 2024-25 అర్హులైన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాల్లో కొత్తగా ఇళ్లు పూర్తి చేసుకున్న 8,086 మంది లబ్ధిదారులకు గృహ ప్రవేశాలు కల్పించి తాళాలు అందజేసినట్లు తెలిపారు. పీఎంఏవై అర్బన్ 2.0లో భాగంగా రూ.2.50 లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తోందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పెడబల్లిలో నూతన గృహాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తదితరులు

నేర్చుకో.. నెరవేర్చుకో!

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రస్తుత పరిస్థితుల్లో బీటెక్, ఎంటెక్ పూర్తి చేసినా ఉద్యోగాలు లభించడం గగనంగా మారింది. సాఫ్ట్‌వేర్ రంగం మాత్రమే కాదు అన్నింటా ఇదే పరిస్థితి. యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలని ప్రభుత్వం చొరవ చూపుతోంది. జిల్లాలో ప్రతి మూడు నెలలకోసారి నియోజకవర్గస్థాయిలో ఉద్యోగమేళాలు నిర్వహిస్తోంది. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, ఉద్యోగకల్పన శాఖల సమన్వయంతో మేళాలు ఏర్పాటు చేసి.. కొలువులకు ఎంపిక చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా యువతలో నైపుణ్యం లేకపోవడం, భావవ్యక్తీకరణ లోపం, సమస్య పరిష్కార సామర్థ్యం కొరవడటం, ఓర్పులేమితో చాలామంది ఉద్యోగాలు సాధించలేకపోతున్నారు. వీటిని అధిగమిస్తేనే కొలువు కల సాకారమవుతుంది.

గత ఆరు నెలల్లో..

- ఉద్యోగమేళాలు: 13
- పేర్లు నమోదు: 6,320
- ఎంపికైన వారు: 2,954
- కొలువులో చేరింది: 1,432

పేర్లు నమోదు తీరు..

- డిగ్రీ చేసిన వారు: 40 శాతం
- బీటెక్ విద్యార్థులు: 30 శాతం
- డిప్లొమా, ఐటీఐ విద్యార్థులు: 30-40 శాతం
- పదో తరగతి : 20-30 శాతం

అనంత ఆర్ట్స్ కళాశాలలో ఇటీవల జరిగిన ఉద్యోగ మేళాలో సంస్థల ప్రతినిధులు, యువత

కంపెనీలు ఏం ఆశిస్తున్నాయి

- భావ వ్యక్తీకరణ సామర్థ్యం. చక్కగా మాట్లాడటం.
- నడవడిక, ఆకర్షించే వేషధారణ, సమయపాలన, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, బృంద స్ఫూర్తి, వాక్చాతుర్యం
- డిప్లొమా, డిగ్రీ పూర్తయిన తరువాత అదనపు నైపుణ్య కోర్సులు, తగిన అనుభవం

ముందుకు సాగాలి బ్రో..

- ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ చేసిన యువత అక్కడితో ఆగిపోకుండా సంబంధిత స్వల్పకాలిక కోర్సులను పూర్తి అయ్యేలా ప్రణాళిక వేసుకోవాలి.
- వేతనం తక్కువైనా.. చిన్న ఉద్యోగమైనా వదులుకోవద్దు. వివిధ కంపెనీలు, సంస్థల్లో పనిచేయడం వల్ల అనుభవం వస్తుంది. ఇది ఉన్నత ఉద్యోగావకాశాలకు బాటలు వేస్తుంది. భవితను నిర్దేశిస్తుంది.
- రంగం ఏదైనా కొలువు చేయడానికి ఆసక్తి చూపితే భవిష్యత్తులో అవకాశాలు వస్తాయి. వినియోగించుకుంటూ సాగడం ఉత్తమం.

అవకాశాలు ఏమున్నాయ్..

నియోజకవర్గ స్థాయిలో జరిగే ఉద్యోగ మేళాల్లో సుమారు 20 కంపెనీలు పాల్గొంటున్నాయి.
- సేవ, ఐటీ, ఉత్పత్తి రంగాలు, మార్కెటింగ్, బ్యాంకింగ్, ఫార్మా కంపెనీలు యువతకు ఉద్యోగాలు కల్పించడానికి ముందుకొస్తున్నాయి.
- అనంతపురం, రాప్తాడు, శింగనమల, తాడిపత్రి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో మేళాలు నిర్వహిస్తున్నారు.

ఏవీ వదులుకోవద్దు

హరికృష్ణ, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి

ఏ ఉద్యోగం వచ్చినా వదులుకోవద్దు. ఇతర ప్రాంతాల్లో..చిన్నదైనా సరే ఉద్యోగంలో చేరాలి. అన్ని నియోజకవర్గాల్లో నైపుణ్య శిక్షణ కేంద్రాలున్నాయి. అందులో ఉచిత శిక్షణ పొందవచ్చు. అదనపు నైపుణ్యంతో కొలువులు సాధించవచ్చు.

నేటి నుంచి పదోతరగతి పరీక్ష ఫీజు చెల్లింపు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల నుంచి 2026 మార్చి, ఏప్రిల్‌లో జరగబోవు పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు రెగ్యులర్, పరీక్ష తప్పిన విద్యార్థులు ఈ నెల 25వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో కిష్టప్ప ఒక ప్రకటనలో కోరారు. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు రూ.125, మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ.125, మూడు కంటే తక్కువ రూ.110, ఒకేషనల్ విద్యార్థులు రెగ్యులర్ ఫీజుతోపాటు అదనంగా రూ.60, మైగ్రేషన్ కోసం రూ.80 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అపరాధ రుసుం రూ.50తో ఈనెల 26 నుంచి డిసెంబరు 3 వరకూ, రూ.200తో డిసెంబరు 4 నుంచి 10 వరకూ, రూ.500తో డిసెంబరు 11 నుంచి 15లోపు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

తాడిపత్రి రాళ్లలో.. ఎన్నెన్ని సొబగులో

తక్కువ ధరకే గ్రానైట్ పలకలు

- **గ్రానైట్ పరిశ్రమలు:** 180
- **నెలకు వచ్చే ముడిసరకు:** 1500 క్యూబిక్ మీటర్లు
- **ఏటా టర్నోవర్:** రూ.100కోట్లకుపైనే
- **ప్రభుత్వానికి ఆదాయం (నెలకు):** పన్ను, విద్యుత్తు ఛార్జీల రూపంలో రూ.2.50 కోట్లు
- **ఎగుమతులు:** ముంబయి, చెన్నై, దిల్లీ, కోల్‌కతా తదితర రాష్ట్రాలకు
- **లభించే రకాలు:** గ్రీన్, బ్లాక్, ఫిషర్ బ్లాక్, వైట్, రెడ్

తాడిపత్రి, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా తాడిపత్రిలో లభించే గ్రానైట్ బండలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. 25 ఏళ్లుగా ఇక్కడి పాలిషింగ్ యూనిట్లలో కోస్తున్న రంగు బండలు మన్నిక, నాణ్యతకు పేరు గాంచాయి. ముడిసరకు ఇక్కడ లభించకపోయినా ఇతర జిల్లాల నుంచి తెప్పించి...కటింగ్, పాలిషింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. తాడిపత్రి పరివాహక ప్రాంతంలోని పెన్నా నది ఒడ్డున పుష్కలంగా నీరు ఉండటంతో పెద్ద సంఖ్యలో పరిశ్రమలు వెలిశాయి. ప్రతి నెలా పన్నులు, విద్యుత్తు బిల్లుల రూపంలో ప్రభుత్వానికి రూ.2.50 కోట్లకు పైనే ఆదాయం వస్తోంది. ఈ పరిశ్రమల ద్వారా కర్నూలు, కడప జిల్లాలతో పాటు కదిరి, గుంతకల్లు ప్రాంతాలకు చెందిన దాదాపు 8 వేలకు పైగా కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలు, జిల్లాలతో పోలిస్తే తాడిపత్రిలో గ్రానైట్ తక్కువ ధరకు లభించడం ముదావహం.

చుక్కలూరు రోడ్డులోని క్వారీ పరిశ్రమలో వివిధ రంగుల్లో సిద్ధంగా ఉన్న గ్రానైట్ బండలు

బండను కటింగ్ చేస్తున్న యంత్రం

తక్కువ స్థలంలోనే ప్రకృతి సేద్యం..

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: కర్ణాటకలోని దావణగెరె పట్టణ సమీపంలో **ఏకాంతిక** పేరుతో విజయరాఘవ అనే రైతు ప్రకృతి సేద్యం చేస్తున్నారు. ఆయనలా ఎకరాల్లో పంటలు పండించే అవకాశం అందరికీ ఉండదు. కర్ణాటకలో విజయవంతమైన ఈ పద్ధతిని రాష్ట్రంలో మొట్టమొదటిసారి హిందూపురంలో ప్రకృతి ప్రేమికుడు చంద్రశేఖర్ అందుకున్నారు. విజయవంతంగా నడుపుతూనే ప్రతి ఆదివారం ఈ దారిలో పయనించాలనుకున్న పదిమందికి అవగాహన కల్పిస్తున్నారు.

ఎంత స్థలంలో?
3 అడుగుల వెడల్పు, 15 అడుగుల పొడవు చొప్పునా నాలుగైదు మడులు..
ఎన్ని రకాల కాయగూరలు: 60

ఎన్నాళ్లకు అందుబాటులోకి?
ప్రతి రోజు అరగంట పనిచేస్తే 40 రోజుల్లో..

ఎలా సాధ్యం?
మడులు ఏర్పాటు చేసుకొని అందులో ఎండిన ఆకులు, సేంద్రియ ఎరువు మట్టి వేసి సిద్ధం చేసుకోవాలి. అందులో దేశవాళీ ఆకుకూరలు, కూరగాయల విత్తనాలు మాత్రమే చల్లుతారు. రసాయన ఎరువుల వాడకం నిషిద్ధం.

లబ్ధి ఎలాగంటే..
ఏడాది పొడవునా దశలవారీగా చల్లుతూ ఉంటే కుటుంబానికి కావాల్సినవి సొంతంగా పండించుకోవచ్చు. ఆసక్తి ఉంటే విత్తనాలను నేనే ఇస్తా..

- చంద్రశేఖర్

కుదిరితే కప్పు కాఫీ.. నాలుగు మాటలు

న్యూస్‌టుడే, అనంతపురం (అశోక్‌నగర్)

నగరాల్లో నలుగురు మిత్రులు కలిసి సరదాగా మాట్లాడుకోవడానికి, ఉరుకులు పరుగులతో అలసిన మనసుకు ఒత్తిడి తగ్గించుకునేందుకు, స్థిరాస్తి వ్యాపార లావాదేవీలకు టీ కేఫ్‌లు వేదికలవుతున్నాయి. ఎక్కడా లేని టీ కేఫ్ సంస్కృతి అనంతపురం నగరంలో, 44వ జాతీయ రహదారి వెంబడి రోజురోజుకు విస్తరిస్తోంది. అర కిలోమీటరు విస్తీర్ణం కూడా లేని ఆదిమూర్తినగర్‌లో 60కి పైగా ఉన్నాయంటే మార్పు ఏ రీతిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఏ కేఫ్‌లో, ఏ సమయంలో చూసినా ఉదయం నుంచి సాయంత్రం దాకా సగటున 50, 60 మందికి తగ్గకుండా ఉంటున్న తీరు మారుతున్న ధోరణికి అద్దం పడుతోంది.

ఏమేం ఉంటాయి

ఇరానీ టీ, గ్రీన్, తాటిబెల్లం, అల్లం, జింజర్, బ్లాక్, మసాలా, బ్లూ, బ్లాక్ జింజర్, దమ్, రాగి మాల్ట్



భారీ పెట్టుబడి లేకుండానే..

నగరంలో కనీసం 5 నుంచి 10 సెంట్ల ఖాళీ స్థలం ఉంటే చాలు. వ్యాపారం చేద్దామనుకున్న వారికి టక్కున మదిలోకి వచ్చేది టీ కేఫ్ పెట్టాలన్న ఆలోచనే. పైన రేకులు వేయడం, గుండ్రని టేబుళ్లు పరవడం, కింద రాళ్లతో చిప్స్ వేయడం, కొంతభాగం ఖాళీగా ఉంచి తక్కువ ఖర్చుతో ఏర్పాటు చేసేస్తున్నారు.

విస్తరణ ఇలా..

నగరంలోని సాయినగర్ నుంచి అశోక్‌నగర్, విద్యుత్తు నగర్ కూడలి, హౌసింగ్ బోర్డు, జేఎన్‌టీయూ రోడ్డు, బెంగళూరు రోడ్డు, రాంనగర్ నుంచి శ్రీనగర్ కూడలి, ఆదిమూర్తినగర్, ఎన్టీఆర్ మార్గ్, 44వ జాతీయ రహదారి తపోవనం కూడలి, బళ్లారి, కళ్యాణదుర్గం, రుద్రంపేట నడక దారి, రాప్తాడు సమీపంలో ప్రసన్నాయపల్లి కూడలి వరకు పెద్ద సంఖ్యలో కేఫ్‌లు విస్తరిస్తున్నాయి.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు అనన్య

ముదిగుబ్బ: మండలంలోని కొడవండ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న అనన్య ఖోఖోలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం రామానాయుడు, పీఈటీ శాంతలింగం తెలిపారు. ఇటీవల అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. విద్యార్థినిని బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఆనందం.. అంతలోనే విషాదం

పుట్టినబిడ్డను చూసేందుకు వెళ్తూ తండ్రి దుర్మరణం

బత్తలపల్లి, న్యూస్‌టుడే : ఆ ఇళ్లు ఆనందాలకు నెలవు.. ఉన్నంతలో హాయిగా జీవనం.. భార్య రెండో కాన్పులో పండంటి బిడ్డకు జన్మనిచ్చిందని తెలిసి భర్త సంబరపడ్డాడు. ముద్దులొలికే బిడ్డను కనులారా చూడాలని ఆసుపత్రికి బయల్దేరాడు. సంబరంగా పయనమైన అతణ్ని చూసిన విధికి కన్ను కుట్టిందేమో.. మృత్యువు కబళించింది. కళ్లు తెరిచి లోకాన్ని చూడని ఆ పసిబిడ్డకు తండ్రిని దూరం చేసింది. విధి రాత ఎంత చెడ్డది అని ఊరువాడ బోరున విలపించింది.. ఆ ఇంట విషాదం నిండింది. ఈ ఘటన బత్తలపల్లి మండలంలో జరిగింది.

దిలీప్‌కుమార్ మృతదేహం

ధర్మవరంలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్న దిలీప్‌కుమార్ (25) రేషం వ్యాపారం చేసేవాడు. భార్య లాస్య, మూడేళ్ల కుమార్తె ఉన్నారు. బుధవారం లాస్య అనంతపురంలోని సర్వజన ఆసుపత్రిలో కుమార్తెకు జన్మనిచ్చారు. ఈ విషయం తెలిసిన అతడు బిడ్డను చూడాలని ద్విచక్ర వాహనంలో బయల్దేరాడు. మార్గమధ్యలో బత్తలపల్లి రింగ్ రోడ్డు మలుపులో రాత్రి 7 గంటల సమయంలో డివైడర్‌ను ఢీకొన్నాడు. తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించారు. అతని వద్ద లభించిన ఆధారాలతో కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. బిడ్డను చూడకుండానే అప్పుడే వెళ్లిపోయావా నాయనా అంటూ కుటుంబీకులు, బంధువుల ఆర్తనాదాలు అందరినీ కంటతడి పెట్టించాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపారు.

(c) eenadu

మెగా చేనేత క్లస్టర్ ఆదర్శంగా నిలుస్తుంది: మంత్రి

ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరంలో మెగా చేనేత క్లస్టర్‌ను రూ.40 కోట్లతో ఏర్పాటు చేస్తున్నాం. తద్వారా 22 వేల మందికి ఉపాధి కల్పిస్తాం. దేశంలోనే ఈ క్లస్టర్ ఆదర్శంగా నిలుస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. బుధవారం ధర్మవరం పట్టణంలోని చంద్రబాబు నగర్‌లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా మంజూరైన ఇళ్ల నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేశారు. నూతనంగా నిర్మించిన గృహాలను జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల సొంతింటి కలను ఎన్డీయే ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో పేదల ఇళ్ల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేశారన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సురేష్‌బాబు, పురపాలక కమిషనర్ సాయి కృష్ణ, హౌసింగ్ ఈఈ లక్ష్మీనారాయణమ్మ, డీఈ వెంకటేశులు, ఏఈ చిరంజీవి, మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్, భాజపా నాయకులు ఓబిలేసు, రాజారెడ్డి, జింకా రామాంజనేయులు, గిర్రాజు నగేష్, జింకా చంద్రశేఖర్, గొట్లూరు చంద్ర పాల్గొన్నారు.

రాయితీ, ప్రోత్సాహకం ఏదీ?

● పట్టుగూళ్ల రైతుల ఆందోళన ● పురం మార్కెట్‌లో క్రయవిక్రయాలు బంద్

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం మార్కెట్‌లో బుధవారం పట్టుగూళ్ల క్రయవిక్రయాలు జరగలేదు. ప్రభుత్వం బైవోల్టిన్ రైతులకు ప్రోత్సాహక మొత్తం, మల్బరీ సాగుకు ఎరువులు, మందులపై రాయితీ ఇవ్వకపోవటంతో పంట సాగుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైకాపా ప్రభుత్వ పాలనలోనే వాటిని నిలిపేయడంతో రూ.20 కోట్ల వరకు బకాయి ఉంది. చెల్లించాలని రైతులు ఆందోళనలు చేపట్టినా ఫలితం లేకపోయింది. దీంతో కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. పంటసాగు, పట్టుగూళ్ల పెంపకానికి పెరిగిన పెట్టుబడి వ్యయంతో రైతులు అవస్థలు పడుతున్నారు. 1985లో పట్టుగూళ్ల మార్కెట్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు క్రయవిక్రయాలు బంద్ అయిన సందర్భాలు లేవని స్థానికంగా చెబుతున్నారు. ఇక్కడి మార్కెట్‌లో లావాదేవీల ద్వారా ప్రభుత్వానికి ఏటా రూ.కోటికిపైగా ఆదాయం వస్తోంది.

ఉపాధిపై ప్రభావం

మార్కెట్‌లో జరిగే పట్టుగూళ్ల లావాదేవీ ద్వారా రీలర్లు, కూలీల దాదాపు 8వేల మంది రీలింగ్ యూనిట్లపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పట్టుగూళ్లు రాకపోతే రీలింగ్ యూనిట్లు కొనసాగక ఉపాధికి విఘాతం కలుగుతుంది. యూనిట్లు కొనసాగాలంటే ఇతర ప్రాంతాలకు తరలిపోతున్న గూళ్లు ఇక్కడికి తీసుకురావాలని రీలర్లు కోరుతున్నారు.

హిందూపురంలో బోసిపోయిన మార్కెట్

ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి

జిల్లా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని బైవోల్టిన్ రైతులకు రాయితీ, ప్రోత్సాహకం అందేలా చూడాలి. లేదంటే రైతులు కర్ణాటకకే పట్టుగూళ్లు తరలించుకొని వెళ్లే అవకాశం ఉంది. నాలుగు దశాబ్దాల మార్కెట్ చరిత్రలో పట్టుగూళ్లు రాని రోజంటూ లేదు. దీనిని గుణపాఠంగా భావించాలి.

- సిద్ధారెడ్డి, కార్యదర్శి, ఉమ్మడి జిల్లా పట్టు రైతుల సంఘం

కర్ణాటకకు తరలిస్తూ..

కర్ణాటక రాష్ట్రంలోని రాంనగర్, శిడ్లఘట్ట మార్కెట్లలో కిలోకు రూ.50 నుంచి 100 వరకు అదనంగా ధర లభిస్తుండటంతో ఈ ప్రాంతంలోని రైతులు బైవోల్టిన్, సీబీ పట్టుగూళ్లు తీసుకెళుతున్నారు. గతంలో బైవోల్టిన్ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం కిలోకు రూ.50 ప్రోత్సాహకం అందిస్తుండటంతో అధికశాతం మంది పురం తీసుకొచ్చి విక్రయించేవారు. ప్రస్తుతం కర్ణాటక మార్కెట్ మేలు అనే అభిప్రాయాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడి తక్కువగా ఉంటోంది

చలికాలంలో పట్టుగూళ్ల దిగుబడి తక్కువగా ఉంటోంది. ప్రస్తుతం చలి తీవ్రత పెరిగినందున పట్టుగూళ్లు అంతంతమాత్రంగా వస్తున్నాయి. గురువారం నుంచి గూళ్లు మార్కెట్‌కు వచ్చే అవకాశాలు ఉన్నాయి. **- హిందయ్య, హిందూపురం మార్కెట్ ఇన్‌స్పెక్టర్**

ఆధ్యాత్మిక సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నేడు(గురువారం) ఉదయం ఆరుగంటలకు స్వామివారి సాధారణ దర్శనం ఉంటుంది. ఆ గంటల నుంచి తొమ్మిది గంటల మధ్య అభిషేక, స్వర్ణ కవచ సేవలు ఉంటాయి. తర్వాత ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తిరిగి సాయంత్రం 5నుంచి రాత్రి 8.30గంటల వరకు భక్తులకు స్వామివారి సర్వదర్శనం ఉంటుంది.

ప్రభుత్వ వైద్యకళాశాలకు నూతనంగా 15 పీజీ సీట్లు

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: అనంతపురం ప్రభుత్వ వైద్యకళాశాలలోని పలు విభాగాలకు నూతనంగా 15 పీజీ సీట్లను కేటాయిస్తూ జాతీయ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) అనుమతి ఇచ్చిందని ప్రిన్సిపల్ డాక్టర్ విజయశ్రీ, సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. నూతనంగా పీజీ సీట్లు వచ్చేందుకు కృషి చేసిన ఆయా విభాగాలకు సంబంధించిన అధిపతులను ప్రిన్సిపల్ ఛాంబర్‌లో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో కళాశాలలో 121 పీజీ సీట్లు ఉండేవని, ప్రస్తుతం నూతనంగా 15 సీట్లు రావటంతో ఆ సంఖ్య 136కి చేరిందని తెలిపారు. ఎన్ఎంసీ పీడియాట్రిక్, అనస్తీయా, గైనిక్ విభాగాలకు నాలుగు సీట్లు చొప్పున, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి 3 సీట్లు అదనంగా కేటాయించారని వివరించారు. వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ షారోన్‌సోనియా, డాక్టర్ సుచిత్ర, డాక్టర్ భాస్కర్, మధుసుధన్, డాక్టర్ రేణుక, డాక్టర్ నిసార్‌బేగంతో పాటు వైద్యవిద్యార్థులు పాల్గొన్నారు.

విభాగాధిపతులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ విజయశ్రీ, సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం

'టింబక్టు 35 ఏళ్ల వేడుకకు తరలిరండి'

ప్రచార పత్రాలను ప్రదర్శిస్తున్న టింబక్టు వ్యవస్థాపకులు బబ్లూ గంగూలీ, సంస్థ ప్రతినిధులు

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: టింబక్టు కలెక్టివ్ సంస్థ స్థాపించి 35 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 14న చెన్నేకొత్తపల్లిలో నిర్వహించే వేడుకకు ప్రజలు తరలిరావాలని సంస్థ వ్యవస్థాపకులు బబ్లూ గంగూలీ, ఇతర సభ్యులు పేర్కొన్నారు. మండల కేంద్రానికి సమీపంలోని టింబక్టు కేంద్ర కార్యాలయంలో వేడుకలకు సంబంధించిన ప్రచార ప్రతులను సంస్థ ప్రతినిధులతో కలిసి వారు బుధవారం ప్రదర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ మూడు దశాబ్దాల కాలంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టామన్నారు. చెన్నేకొత్తపల్లి మండలంలో ప్రారంభమైన సంస్థ కార్యకలాపాలు జిల్లాలోని పలు మండలాలకు విస్తరించామన్నారు. అన్ని వర్గాల ప్రజలతో మమేకమై పని చేస్తున్నామన్నారు. తహసీల్దార్ కార్యాలయ సమీపంలో న్యామద్దల గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభవుతుందన్నారు. ప్రతినిధులు రమేష్, శ్రీకాంత్, మహేష్, రమీజా, గౌరీ, రవి, చిరంజీవి, వెంకటేష్, పోతన్న తదితరులు పాల్గొన్నారు.

జుబేదాకు అండగా ఉంటాం: మంత్రి లోకేశ్

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: మస్కట్ దేశంలో నరకం చూస్తున్నానంటూ గుంతకల్లుకు చెందిన జుబేదాబేగం సెల్ఫీ వీడియో ద్వారా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌ను వేడుకున్న విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన మంత్రి లోకేశ్ జుబేదాకు అన్నివిధాలుగా సాయమందించి స్వదేశానికి క్షేమంగా తీసుకొస్తామన్నారు. అక్కడి అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని, ఆమె ఒంటరి కాదని, ఇండియాకు వచ్చేవరకు అండగా ఉంటామని మంత్రి ఎక్స్‌లో పోస్టు చేశారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

పోటీలకు ఎంపికైన పంచాయతీ సిబ్బంది

పుట్టపర్తి, న్యూస్‌టుడే: పుట్టపర్తి, ధర్మవరం డివిజన్ పంచాయతీ కార్యాలయ సిబ్బంది రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. బుధవారం ధర్మవరంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో మహేష్ జూనియర్ అసిస్టెంట్, ఎం.ప్రభాకర్, జగదీష్, ప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు, రాఘవేంద్రప్రసాద్ జూనియర్ అసిస్టెంట్ (కేరమ్స్), వాలీబాల్ పోటీల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 19 నుంచి 22 వరకు విజయవాడలో జరిగే ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ టీమ్ సెలక్షన్ కాంపిటీషన్స్ పోటీల్లో వీరు పాల్గొననున్నారు.

వర్సిటీలో ఏబీవీపీ నాయకుల నిరసన

ఎస్కేయూ: విశ్వవిద్యాలయంలో మత కార్యకలాపాలు నిర్వహిస్తే సహించేదిలేదని ఏబీవీపీ నాయకులు ధ్వజమెత్తారు. ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాల సెమినార్‌హాల్లో కొందరు విద్యార్థులు సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తుండగా ఏబీవీపీ నాయకులు అడ్డుకున్నారు. సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అఖిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నిబంధనల ప్రకారం మతపరమైన కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. కార్యక్రమాల నిర్వహణకు ఎలా అనుమతి ఇచ్చారని ప్రిన్సిపల్ రామచంద్రతో వాగ్వాదానికి దిగారు. అనంతరం ఇన్‌ఛార్జి వీసీ అనితకు ఫిర్యాదు చేశారు. తగిన చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జి వీసీ చెప్పడంతో ఆందోళన విరమించారు.

పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

ఏర్పాట్ల పరిశీలనకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: సత్యసాయి శత జయంతి వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్ బుధవారం స్వయంగా ద్విచక్ర వాహనంలో వెళ్లి పరిశీలించారు. పెట్రోల్‌బంకు నుంచి పరేడ్ గ్రౌండ్, పార్కింగ్ ప్రాంతం, ప్రశాంతి నిలయం పడమర ద్వారం, చింతతోపు, చిన్నపల్లి హైస్కూల్ వద్ద ఏరియాల్లో చేస్తున్న ఏర్పాట్లు, భద్రతాపరంగా తీసుకోవాల్సిన చర్యలను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా 13వ తేదీలోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పారిశుద్ధ్యాన్ని పక్కాగా అమలు చేయాలని సూచించారు. విమానాశ్రయం నుంచి రైల్వే స్టేషన్, కర్ణాటకనాగేపల్లి నుంచి పుట్టపర్తికి వచ్చే రహదారి, గణేష్ కూడలి వరకు గడ్డిని తొలగించాలని ఆదేశించారు. 24 గంటల పాటు వైద్యం, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. హిల్‌వ్యూ స్టేడియంలో జరుగుతున్న పనులను పరిశీలించి అధికారులు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవోలు సువర్ణ, మహేష్, ఆర్టీవో కరుణాసాగర్‌రెడ్డి, కమిషనర్ క్రాంతికుమార్, డీపీవో సమత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సెక్టోరియల్ అధికారులు బాధ్యతల స్వీకరణ

బుక్కపట్నం, న్యూస్‌టుడే: సమగ్రశిక్షాలో నియామకమైన సెక్టోరియల్ అధికారులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సీఎంఓగా హరిప్రసాద్, ఐఈడీ కోఆర్డినేటర్‌గా పుల్లన్న, అలెస్కోగా ముజబుర్ రెహమాన్, ఏఎంఓగా చంద్రశేఖర్, ఏఎస్ఓగా ఫణిరాజశర్మ, ఏపీఓగా మాధవరెడ్డి, ఏజీసీడీఓగా అనిత బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారిని జిల్లాలోని సమగ్రశిక్షా ఒప్పంద, పొరుగుసేవల సిబ్బంది సన్మానించారు. అనంతరం సమగ్రశిక్షా ఉద్యోగుల ఐకాస జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి మాట్లాడుతూ ఇరవై ఏళ్లుగా 18 విభాగాల్లో ఒప్పంద ఉద్యోగులుగా 1592 మంది పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. తమ న్యాయమైన కోర్కెల పరిష్కారానికి సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఓబులేసు, కోశాధికారి ముకుంద, నాయకులు భాస్కర్, శ్రీనివాసులు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అరకుకు వెళ్తున్నట్లు చెప్పి చనిపోయిందే..

● కన్నీటి పర్యంతమైన యమున తల్లిదండ్రులు ● కిడ్నీ రాకెట్ వ్యవహారంపై పలుకోణాల్లో విచారణ

మదనపల్లె నేరవార్తలు, పట్టణం, కదిరి పట్టణం, న్యూస్‌టుడే: 'అమ్మా స్నేహితులతో కలిసి అరకు వెళ్తున్నా' అని చెప్పి వెళ్లిన నా బిడ్డ ఇలా మదనపల్లెకు వచ్చి చనిపోయిందే అంటూ కిడ్నీ తొలగించగా మృతి చెందిన యమున తల్లిదండ్రులు సూరమ్మ, నరసింగరావు కన్నీటి పర్యంతమయ్యారు. మదనపల్లెలోని గ్లోబల్ ఆసుపత్రిలో విశాఖపట్నం చెందిన యమునకు ఆదివారం శస్త్రచికిత్స చేసి కిడ్నీ తీసిన తరువాత సోమవారం ఆమె మృతి చెందింది. ఈ విషయం తెలుసుకుని ఆమె తల్లిదండ్రులు విశాఖపట్నం నుంచి మదనపల్లెకు మంగళవారం వచ్చారు. సోమవారం యమున చరవాణి నుంచి ఎవరో ఫోన్ చేసి మీ బిడ్డ కిడ్నీ అమ్ముకునేందుకు వచ్చి మూర్ఛ రావడంతో చనిపోయిందని చెప్పారంటూ వారిద్దరూ విలపించారు. తమ బిడ్డతో సన్నిహితంగా ఉన్న సూరిబాబుకు ఫోన్ చేసి అడిగితే కిడ్నీ వ్యవహారం బయటకు వచ్చిందని వాపోయారు.

అనుమతులు లేకున్నా శస్త్రచికిత్సలు

ఆసుపత్రి నిర్వాహకుల్లో ఒకరైన డీసీహెచ్ఎస్ డాక్టర్ ఆంజనేయులును బుధవారం ఉదయాన్నే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ మొదలు పెట్టారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రం ఇన్‌ఛార్జి బాలరంగడు, కదిరి డయాలసిస్ కేంద్రంలో పనిచేసే మెహరాజ్‌కు విశాఖపట్నానికి చెందిన పద్మ, సత్యతో పరిచయం ఉందని.. ఈ నేపథ్యంలో వారిద్దరి ద్వారానే కిడ్నీ మార్పిడికి యమునను మదనపల్లెకు పిలిపించినట్లు తెలిసింది. గ్లోబల్ ఆసుపత్రిలో ఎలాంటి అనుమతులు లేకున్నా అక్రమంగా శస్త్రచికిత్స చేసినట్లు పోలీసులు నిర్ధారించారు.

మదనపల్లె, కదిరి సిబ్బందితో ఎలా పరిచయం?

బాలరంగడు, మెహరాజ్‌కు విశాఖపట్నంలో ఉన్న మధ్యవర్తులు ఏవిధంగా పరిచయమయ్యారు. గతంలో వీరు ఏమైనా ఇంకా ఇలాంటి కిడ్నీ మార్పిడిలో పాల్గొన్నారా..? అని పోలీసులు విచారణ చేస్తున్నారు. బాలరంగడు మదనపల్లె డయాలసిస్ కేంద్రానికి వచ్చే పలువురిని పరీక్షల కోసం ప్రైవేటు ల్యాబ్‌లకు పంపి వారి ద్వారా పెద్దమొత్తంలో డబ్బు తీసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి.

ఏఎంసీలో ఆగంతుకుడి దుశ్చర్య

విద్యుత్తు తీగ కట్ చేసిన వైనం

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే : అనంతపురం సర్వజన వైద్యశాలలోని అక్యూట్ మెడికల్ కేర్ (ఏఎంసీ)లో ప్రాణాపాయ స్థితిలో ఉండే రోగులు చికిత్సలు పొందుతుంటారు. ఈ విభాగం రోగులు, క్షతగాత్రులతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక్కడ ఎక్కువ శాతం వెంటిలేటర్‌పైన ఉండే రోగులే ఎక్కువగా ఉంటారు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో ఉన్నఫలంగా 20 ని.షా విద్యుత్తు సరఫరా నిలిచిపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సంబంధిత ఎలక్ట్రికల్ సిబ్బంది సరఫరా ఎందుకు ఆగిందని పరిశీలించగా విద్యుత్తు తీగ కట్ అయినట్లు గుర్తించారు. ప్రధాన తీగను కట్ చేయటంతో జనరేటర్ ద్వారా కూడా సరఫరా ఇవ్వలేని పరిస్థితి తలెత్తింది. కొంతసేపటికి సరఫరాను పునరుద్ధరించారు. సీసీ కెమరాలో ఒక గుర్తుతెలియని వ్యక్తి ముఖానికి మాస్క్ ధరించి కేబుల్‌ను కత్తిరించినట్లు గుర్తించారు. అతను ఎందుకిలా చేశాడు? దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల కిందట ఘటన జరిగితే ఎందుకు ఫిర్యాదు విషయంలో ఆలస్యం చేశారన్న దానికి ఎవరూ సమాధానం చెప్పకపోవడం గమనార్హం. వెంటిలేటర్‌పై ఉన్న వారెవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవటంతో వైద్యాధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

EENADU Classifieds

JOBS

Urgent Civil Site Supervisors Required with or without Experience. Location Karnataka. Contact: 9347083151.

కదిరి జి-డిజిటల్ షోరూంలో మేనేజర్‌గా పనిచేయుటకు 10 సం.ల సేల్స్ అనుభవం కలిగిన వ్యక్తులు కావలెను. జీతం: 15K+ ఇన్సెంటివ్. Ph:97058 26033.

మా కంపనీలో పనిచేయుటకు M/F కావలెను. జీతం: 25K + Q: 12th, Degree. Age: 23+ Smart Phone తప్పనిసరి. 9347472381.

ప్రముఖ కంపెనీకి అడ్మినిస్ట్రేషన్ వర్క్ (Male) అభ్యర్థులు కావలెను. గుడ్ కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి యాక్టివ్‌గా ఉండవలెను. Exp: 3 Years above, Qly: డిగ్రీ / పీజీ. ✆ 89857 17076, 97034 02722.

IT HARDWARE

Internship / Final Year Projects. Web App | Data Analytics | Digital Marketing | Cloud | HR Certification Placement Support Bangalore. Ph: 8105577689

ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్

(incorporated under the State Financial Corporation Act LXIII of 1951)

28/453-E2, కలెక్టరేట్ దగ్గర, పెన్నార్ భవన్ వెనుక, అనంతపురము-515001, ఫోన్:08554-275511

ఇ -వేలం విక్రయ ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(6) & 9(1)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 రూల్ 8(6) & 9(1) తో కలిసి చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ప్రకారం స్థిర/చర ఆస్తుల విక్రయానికి

ఇ-వేలం విక్రయ ప్రకటన

అధీకృత అధికారి ద్వారా భౌతికంగా స్వాధీనం చేసుకొనబడినట్టి, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టబడిన/ఛార్జ్ చేయబడిన క్రింది రుణగ్రస్తులు మరియు హామీదారులనుండి బకాయిలు రాబట్టుకొనుటకు వారికి సంబంధించిన స్థిర/చర ఆస్తులు **"ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా"**, **"అక్కడ ఏమున్నదో అది"** మరియు **"ఏది అక్కడ ఉన్నదో అదే"** ప్రాతిపదికన తేది. **14.12.2025** విక్రయించబడతాయని ఇందుమూలముగా ముఖ్యంగా రుణగ్రహీత (లు), హామీదారు (లు) మరియు సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది. **రిజర్వు ధర, బయానా కూడా దిగువ తెలుపబడినవి. డిమాండు నోటీసు తేది:06.01.2023 స్వాధీనత తేది04.09.2023 రూ॥ లక్షలలో**

రుణగ్రహీత / గ్యారంటార్లు	31.10.2025 నాటికి గల బకాయి మొత్తము	ఆస్థి వివరములు	రిజర్వు ధర (రూ.లక్షలలో)	ధరావత్తు రూ.లక్షలలో	బిడ్ హెచ్చింపు ధర
మెసర్స్ లక్ష్మి ఇండస్ట్రీస్, సర్వే నం.115-1, శ్రీనివాసపురము, నందలపాడు గ్రామము, తాడిపత్రి మున్సిపాలిటి మరియు మండలము, అనంతపురము జిల్లా. ప్రొ॥ శ్రీమతి డి. లక్ష్మిదేవి గ్యారంటార్లు 1. శ్రీ డి. రాజేశ్వర రెడ్డి 2. శ్రీ డి. సుధీర్ రెడ్డి	**రూ॥36.87 లక్షలు మరియు తేదీ.01.11. 2025 నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు కలుప బడుతాయి.**	**ఐటమ్ నెం.1.** యూనిట్ కలిగిన భూమి మరియు భవనము. అనంతపురము జిల్లా, తాడిపత్రి మున్సిపాలిటి మరియు మండలము, నందలపాడు గ్రామము, సర్వే నెం.115/1 నందు కలిగిన భూమి విస్తీర్ణము 435.60 చ॥గ॥లు. దీనికి హద్దులు: తూర్పు: లక్ష్మిదేవికి చెందిన ఆస్థి మరియు రోడ్డు, పడమర: డి. నారాయణమ్మ కు చెందిన ఖాళీ స్థలము, ఉత్తరము: డి. నారాయణమ్మకు చెందిన ఖాళీ స్థలము, దక్షిణము: రోడ్డు (ప్రస్తుతము నివాస భవనము)	భూమి & భవనము మరియు ప్లాంటు & మెషినరి ఐటమ్ నెం. 1 & 2 **50.51**	భూమి & భవనము మరియు ప్లాంటు & మెషినరి ఐటమ్ నెం. 1 & 2 **5.61**	భూమి & భవనము మరియు ప్లాంటు & మెషినరి ఐటమ్ నెం. 1 & 2 **0.50**
		ఐటమ్ నెం.2. ప్లాంటు మరియు మెషినరి: 90mm ఎక్స్‌ట్రుడర్, మిక్సర్, 65 mm ఎక్స్‌ట్రుడర్, ట్విస్టింగ్ మెషిన్, టెన్సిల్ టెస్టింగ్ మెషిన్, రాడ్ బ్రేకింగ్ మెషిన్ .	ప్లాంటు & మెషినరి ఐటమ్ నెం.2. **7.06**	ప్లాంటు & మెషినరి ఐటమ్ నెం.2. **0.78**	ప్లాంటు & మెషినరి ఐటమ్ నెం.2. **0.10**
		ఐటమ్ నెం.3. అనంతపురము జిల్లా, తాడిపత్రి మున్సిపాలిటి మరియు మండలము, నందలపాడు గ్రామము, సర్వే నెం.115/1 నందు 787.95 చ॥గ॥లు కల నివాస స్థలము. దీనికి హద్దులు: తూర్పు: పబ్లిక్ రోడ్డు, పడమర:ప్రకాష్ రెడ్డికి చెందిన ఖాళీ స్థలము, ఉత్తరము: చెన్నా రెడ్డికి చెందిన ఖాళీ స్థలము, దక్షిణము: 12 అడుగుల రోడ్డు.	ఇంటి స్థలం ఐటమ్ నెం.3. **117.22**	ఇంటి స్థలం ఐటమ్ నెం.3 **13.02**	ఇంటి స్థలం ఐటమ్ నెం.3. **0.50**

ఇ-వేలం తేది మరియు సమయము:

https://www.bankauctions.in ద్వారా 14.12.2025 న ఉ॥11.30 నుండి మ॥ 12.30 వరకు అపరిమితంగా 5 నిమిషముల ఆటో ఎక్స్‌టెన్షన్‌తో

టెండరు నందు పాల్గొనదలచిన బిడ్డర్లు ఇ-ఆక్షన్ కొరకు సవివరమైన నియమనిబంధనల కొరకు మరియు టెండరు దాఖలు కొరకు వెబ్‌సైట్ https://esfc.ap.gov.in and https://bankauctions.in చూడవచ్చు. మరియు వెబ్‌సైట్ నందు కల అన్ని నియమనిబంధనలకు టెండరుదారులు కట్టుబడిఉండవలెను. ధరావత్తును అకౌంట్ నెం.147711100000098, (IFSC Code:UBIN0814776), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అశోక్ నగర్, అనంతపురము శాఖకు నెఫ్ట్ లేదా ఆర్.టి.జి.ఎస్ ద్వారా చెల్లించవలెను.

ధరావత్తుతో కూడిన టెండరును సమర్పించడానికి ఆఖరు తేది:12.12.2025 సా॥ 5.00 గం॥లోపు

ఇ-ఆక్షన్ టెండరు ఫారము, బిడ్ డాక్యుమెంట్, డిక్లరేషన్, సాధారణ నియమ నిబంధనలు, ఆన్‌లైన్ ఆక్షన్ వివరములు అన్నీ వెబ్‌సైట్:https://esfc.ap.gov.in and https://bankauctions.in నందు కలవు. టెండరు నందు పాల్గొనదలచిన టెండరుదారులు అన్ని సాధారణ ఇతర నియమనిబంధనలు/క్లారిఫికేషన్లు కొరకు అధీకృత అధికారిని సంప్రదించవలెను. సెల్: 7799881693.

ప్రదేశం: అనంతపురము **సం/-అధీకృత అధికారి, ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్,**

తేది: 13.11.2025 **అనంతపురము శాఖ.**

కాపర్ తీగల చోరీలో నలుగురి అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి, పక్కన సీఐ నాగేంద్ర, ఎస్ఐ వలిబాషా

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: మండలంలోని సోలార్ పవర్ ప్లాంటులో కాపర్ తీగల చోరీ కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. గత ఏడాది నుంచి సోలార్‌లో కాపర్ తీగల చోరీపై 6 కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేసినట్లు చెప్పారు. రూ.33 లక్షలు విలువజేసే 62 వేల మీటర్ల తీగను స్వాధీనం చేసుకొని ఎన్పీకుంటకు చెందిన బాబాఫక్రుద్దీన్, పెద్దముబారక్, చిన్నముబారక్, షేక్‌అలిని అరెస్టు చేసినట్లు చెప్పారు. అన్నమయ్య జిల్లా పీటీఎం మండలం నారాయణపల్లికి చెందిన బాలాజీ, ఎన్పీకుంట మండలం దిగువపల్లికి ఆవుల శివ పరారీలో ఉండగా అవుల రవి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. వీరు గత కొన్ని నెలలుగా సోలార్‌లో కాపర్ తీగలను చోరీ చేసి గాండ్లపెంట, సోమందేపల్లి మండలాల్లో విక్రయించినట్లు విచారణలో తేలిందన్నారు. ఎన్పీకుంట మండలం పెడబల్లి రోడ్డు సమీపంలో హంద్రీనీవా కాలువ వద్ద పోలీసుల వాహనాన్ని చూసి నిందితులు పారిపోతుండగా ఎస్ఐ వలిబాషా, సిబ్బంది అదుపులోకి తీసుకున్నారన్నారు. నలుగురిని రిమాండ్‌కు తరలించామన్నారు. సమావేశంలో సీఐ నాగేంద్ర పాల్గొన్నారు.

ముగ్గురు యువకులపై పోక్సో కేసు

రాప్తాడు, న్యూస్‌టుడే : చిన్మయనగర్‌కు చెందిన కుపేంద్ర, మల్లికార్జున, గంగాధర్‌లపై బుధవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపారు. ఆయన బుధవారం ఆయా వివరాలు వెల్లడించారు. కళ్యాణదుర్గం సమీపంలోని ఓ గ్రామానికి చెందిన బాలుడు నాన్నమ్మ వద్ద ఉంటూ ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. వారం కిందట నగరంలోని ఓ కాలనీకి చెందిన అమ్మమ్మ వద్దకు వచ్చాడు. ఈక్రమంలో శనివారం ఆర్డీటీ స్టేడియంలో క్రీడాపోటీలు ఉంటే స్నేహితులతో కలిసి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో చిన్మయనగర్‌కు చెందిన కుపేంద్ర, మల్లికార్జున, గంగాధర్‌లు బాలుడిని ముళ్లపొదల్లోకి తీసుకెళ్లి లైంగిక వేధింపులకు గురి చేశారు. బాలుడు జరిగిన విషయాన్ని ఎవరికీ చెప్పకుండా ఆదివారం స్వగ్రామానికి వెళ్లిపోయాడు. బుధవారం బాలుడి అమ్మమ్మను పిలిపించి విచారిస్తే జరిగిన విషయం తనకు తెలియదని సమాధానమిచ్చింది. తర్వాత బాలుడిని తీసుకొచ్చి విచారించగా లైంగిక దాడి జరిగిన విషయాన్ని చెప్పాడు. దీంతో సదరు యువకులను అరెస్టు చేసి పోక్సో కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

పుట్టపర్తిలో విస్తృత తనిఖీలు

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: సత్యసాయిబాబా శతజయంత్యుత్సవాల సందర్భంగా పుట్టపర్తిలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు బుధవారం వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. పట్టణ సీఐ శివాంజనేయులు మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా విదేశీయులు, కశ్మీరిలు, అనధికారకంగా పట్టణంలో నివసిస్తున్న వారిని, రౌడీ షీటర్లను, అనుమానాస్పద వ్యక్తులను దృష్టిలో ఉంచుకుని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టామన్నారు. రాత్రి, పగలు డ్రోన్ల సహాయంతో చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిఘా ఉంచామన్నారు.

అప్పులు తీర్చలేక యువకుడి బలవన్మరణం

ప్రవీణ్‌కుమార్

ధర్మవరం, న్యూస్‌టుడే: అప్పులబాధ తాళలేక ధర్మవరం పట్టణంలోని సత్యసాయి నగర్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్ (30) బుధవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రెండో పట్టణ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు వివరాలిలా.. జీవనాధారం నిమిత్తం ప్రవీణ్‌కుమార్ పలుచోట్ల అప్పులు చేశాడు. వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతుండేవాడు. జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి నారాయణస్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నాన్నమ్మ మృతి.. మనస్తాపంతో మనవడు ఆత్మహత్య

బాబు

బ్రాహ్మణపల్లి(సోమందేపల్లి), న్యూస్‌టుడే: మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన బాబు(20) బుధవారం తెల్లవారుజామున రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు . హిందూపురం పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి కథనం మేరకు.. బ్రాహ్మణపల్లికి చెందిన ఆదినారాయణ, నాగలక్ష్మి దంపతుల రెండో కుమారుడు బాబు. సోమందేపల్లిలోని ఒక పట్టు చీరల సిల్క్ హౌస్‌లో కార్మికుడిగా పని చేస్తున్నాడు. మూడు నెలల కిందట నాన్నమ్మ లక్ష్మమ్మ(75) మృతి చెందడంతో కుంగిపోయాడు. తీవ్ర మనస్తాపానికి గురై బుధవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో కాచిగూడ నుంచి మైసూరు వెళ్తున్న రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు : 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

(c) eenadu

హిందూపురం

• హిందూపురం • పెనుకొండ • మడకశిర

రాజకీయాలకు అతీతంగా అర్హులకు ఇళ్లు

పెనుకొండ, న్యూస్‌టుడే : కక్షసాధింపులకు తావులేకుండా, రాజకీయాలకతీతంగా అర్హులకు సొంతింటి కల నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ బాధ్యత అని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ఉద్ఘాటించారు. బుధవారం పట్టణంలోని అర్బన్‌కాలనీలో పీఎంఏవై అర్బన్‌గృహ నిర్మాణ పథకంలో లబ్ధిదారురాలు కుమ్మరి ఆనందమ్మ ఇంటి నిర్మాణానికి మంత్రి కూటమిశ్రేణులు, అధికారులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పట్టణంలో 1,500 ఇళ్లు నిర్మిస్తామన్నారు. ప్రస్తుతం 90 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. గత వైకాపా పాలనలో పేదల సొంతింటి కలను కూల్చివేసింది జగన్‌మోహన్‌రెడ్డి అని విమర్శించారు. పెనుకొండలో 147 ఇళ్లు పూర్తయ్యాయని, త్వరలో మిగిలిన 3,947 ఇళ్లు పూర్తిచేస్తామన్నారు. అనంతరం అర్బన్‌కాలనీ ప్రజలు సీసీరోడ్లు, డ్రైనేజీలు తాగునీటి సమస్య పరిష్కరించాలని మంత్రికి విన్నవించగా.. రూ.5కోట్లతో ఇక్కట్లు తీరుస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర సగర కార్పొరేషన్ ఛైర్మన్ వెంకటరమణ, ఆర్డీవో ఆనంద్‌కుమార్, కమిషనర్ సతీశ్‌కుమార్, తహసీల్దార్ స్వాతి, గృహనిర్మాణశాఖ డీఈ శివకుమార్‌నాయక్, ఏఈ శ్రీనాథ్ కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పెనుకొండలో భూమిపూజ చేస్తున్న మంత్రి సవిత, కూటమిశ్రేణులు, మట్టితీస్తున్న ఆర్డీవో ఆనంద్‌కుమార్

ఐఎంఎఫ్‌ఎల్ డిపోలో నిరుద్యోగులకు ఉపాధి

పాలసముద్రం వద్ద ఉన్న ఐఎంఎఫ్‌ఎల్ డిపోలో 32 మంది నిరుద్యోగులకు రాష్ట్రబీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ఉపాధి కల్పించడంతో బుధవారం కార్మికులు, కూటమి శ్రేణులు మంత్రిని ఘనంగా సత్కరించారు.

వైకాపా ఉనికి కోసమే ర్యాలీ

వైకాపా ఉనికి కోసమే వైద్యకళాశాలల నిర్మాణంపై అనవసర రాద్ధాంతం చేస్తోందని, పీపీపీ మోడల్‌లోనే కళాశాలలు నిర్మించి తీరతామని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత స్పష్టం చేశారు. విలేకరులతో మాట్లాడుతూ.. కల్తీ మద్యం, కల్తీనెయ్యి కేసుల్లో అన్ని వేళ్లూ తాడేపల్లివైపు చూపుతున్నాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధిని చూసి ఓర్వలేక జగన్ విషం కక్కుతున్నారని మండిపడ్డారు.

ఆ చోట ఆదమరిస్తే అంతే!

● గండంగా మారిన కొడికొండ శిర జాతీయ రహదారి ● ఇప్పటి దాకా 8 మంది మృత్యువాత

పరిగి, న్యూస్‌టుడే: కొడికొండ నుంచి శిరకు వెళ్లే జాతీయ రహదారి ప్రమాదకరంగా మారింది. గడిచిన 6 నెలల్లో మండల పరిధిలోని శాసనకోట, నేతులపల్లి, యర్రగుంట, చిన్నపల్లి, ధనాపురం క్రాస్‌ల వద్ద తరుచు జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 8 మంది మృత్యువాత పడగా, పలువురు క్షతగాత్రులయ్యారు.

ఇటీవల జరిగిన పలు సంఘటనలు..

● హిందూపురం మండలంలోని కొటిపి ముత్యాలమ్మ దర్శనానంతరం ఆటోలో తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా పరిగి చెరువు కట్ట కింద వెనుక వైపు నుంచి లారీ ఢీకొంది. ఈ ఘటనలో రొద్దం మండలానికి చెందిన నలుగురు మృత్యువాత పడగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.

● ధనాపురం క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని ఒకరు, ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో బోరెడ్డిపల్లికి చెందిన వ్యక్తి మృత్యువాత పడ్డాడు. తరచు ఈ రహదారిపై జరుగుతున్న ప్రమాదాలను అరికట్టేందుకు సంబంధిత శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.

● లేపాక్షి మండలానికి చెందిన వ్యక్తి ద్విచక్ర వాహనంలో పాలను తరలిస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని మృత్యువాత పడ్డాడు. పరిగి మండలం నేతులపల్లి సమీపంలో పెన్నా బ్రిడ్జి ప్రహరీని బొలెరో ఢీకొనడంతో చోదకుడు తీవ్రంగా గాయపడ్డాడు. చిన్నపల్లి క్రాస్ వద్ద ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి కారు బోల్తా పడిన ఘటనలో ప్రయాణికులు గాయాలపాలయ్యారు.

పరిగి చిన్నపల్లి క్రాస్ వద్ద వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి బోల్తా కొట్టిన కారు

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. వేగనిరోధకాలు ఉన్నప్పటికీ ప్రమాదాలు జరగడం కలవరపరిచే అంశం.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం

కొడికొండ శిర జాతీయ రహదారిలో ప్రమాదాల నియంత్రణకు పలు చర్యలు చేపట్టాం. వాహన చోదకులను అప్రమత్తం చేసేందుకు కూడళ్ల వద్ద సిగ్నల్ లైట్లతో పాటు, ప్రమాద హెచ్చరికను తెలిపే సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం.

- గిడ్డయ్య, నేషనల్ హైవే అథారిటీ డీఈ

వేతన సవరణ కమిషన్ నియమించాలి

రొళ్ల, న్యూస్‌టుడే: వేతన సవరణ కమిషన్‌ను నియమించి, 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని జిల్లా ఏపీటీఎఫ్ ఉపాధ్యక్షుడు యంజారప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులకు అందాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. అనంతరం ఏపీటీఎఫ్ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడు తిప్పేస్వామి, అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఉపాధ్యక్షులు వనజమ్మ, శ్రీనివాసులు, కౌన్సిలర్లు చంద్రబాబు, నాగభూషణ, శ్రీనివాసులు, కార్యదర్శిగా శ్రీనివాసరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకైనట్లు తెలిపారు.

వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ విజయవంతం చేయండి

గుడిబండ, న్యూస్‌టుడే: మండలంలో గురువారం జరుగుతున్న మహర్షివాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని తెదేపా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. గుడిబండలో తెదేపా నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి ఎంపీలు పార్థసారథి, అంబికాలక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాస్, గుమ్మనూరు జయరాం, ఎమ్మెస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరవుతారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, సింగిల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి సహకరించండి

మడకశిర, గుడిబండ, న్యూస్‌టుడే : గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు సూచించారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రొళ్ల మండలం ఎం.రాయాపురం, గుడిబండ మండల కెంకెర పంచాయతీల తెదేపా నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక మెజారిటీతో అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు

పేదలకు సొంతిల్లు..

నియోజకవర్గంలో అర్హులందరికీ ఇళ్లు నిర్మించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు తెలిపారు. పట్టణంలోని చౌళపల్లి వద్ద నూతనంగా మంజూరైన ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఇళ్లను లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు. నిత్యం ప్రజా సంక్షేమం కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రాజా, పట్టణ కన్వీనర్ నాగరాజు, మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాలకృష్ణ కృషితో అందరికీ న్యాయం

హిందూపురం, న్యూస్‌టుడే: నియోజకవర్గం ఎమ్మెల్యే బాలకృష్ణ కృషితో పార్టీ కోసం పనిచేసిన అందరికీ న్యాయం జరుగుతుందని తెదేపా జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజనప్ప వ్యాఖ్యానించారు. బుధవారం ఆర్ఎంఎస్ ఫంక్షన్ హాల్లో క్లస్టర్ బూత్ ఇన్‌ఛార్జుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. పార్టీ జిల్లా అధ్యక్షులు, మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్, ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర, నియోజకవర్గ సమన్వయకర్త శ్రీనివాసరావులు పాల్గొన్నారు. అనంతరం క్లస్టర్ బూత్ ఇన్‌ఛార్జులతో ప్రమాణం చేయించారు. పలు మండలాల అధ్యక్షులు వెంకటేశ్, రాము, అభిలాష్, శ్రీనివాసులు, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆనందకుమార్, రాష్ట్ర మైనార్టీ కమిషన్ డైరెక్టర్ షఫీవుల్లా, మార్కెట్‌యార్డు ఛైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ అనిల్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ప్రమాణం చేస్తున్న క్లస్టర్ బూత్ ఇన్‌ఛార్జులు

లబ్ధిదారులకు ఇళ్ల మంజూరే ధ్యేయం

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద పేదలందరికీ సొంతిళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లి, మార్కేండేయనగర్‌లో నూతన గృహనిర్మాణానికి భూమి పూజ చేసి, పలువురు లబ్ధిదారులతో గృహ ప్రవేశాలను చేయించారు. ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, తెదేపా నాయకులు హరీశ్‌కుమార్, ఉప్పరచంద్ర, హౌసింగ్ ఏఈ ఫణిరాజ్ పాల్గొన్నారు.

లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశం చేస్తున్న ఛైర్మన్, మున్సిపల్ అధికారులు

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 91548 46650
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య : కొరకెర ఎస్సీకాలనీలో విద్యుత్ నియంత్రిక ఏర్పాటు చేయాలి. - **నరసింహామూర్తి, స్థానికుడు**

సమాధానం: నూతన నియంత్రికను ఏర్పాటు చేస్తాం.

సమస్య : దాసరపల్లిలో అంగన్‌వాడీ భవనం అర్ధాంతరంగా ఆగింది. - **నాగరాజు, స్థానికుడు**

సమాధానం : వెంటనే పూర్తి చేయిస్తాం.

(పై రెండు ప్రశ్నలకు ఎమ్మెల్యే ఎమ్మెస్‌రాజు సమాధానమిచ్చారు.)

– న్యూస్‌టుడే, గుడిబండ

పిచ్చి మొక్కల తొలగింపు

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలో వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను 'ఈనాడు'లో ఈనెల 9వ తేదీన(ఆదివారం) 'కాలువ చుట్టూ పిచ్చి మొక్కలు' శీర్షికన కథనం వెలువడంతో సంబంధిత అధికారి స్పందించారు. పట్టణంలోని శ్రీకంఠపురం నుంచి పులమతి రోడ్డుకు వెళ్లే గంగమ్మ దేవాలయం పరిసర ప్రాంతాల్లో కొన్ని రోజుల నుంచి మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం, ప్లాస్టిక్‌కవర్లు, వ్యర్థపదార్థాలు తొలగించలేదు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ స్పందించి కార్మికులను పంపి పిచ్చి మొక్కలు, పేరుకున్న చెత్తాచెదారం తొలగించారు. చుట్టుపక్కల కాలనీ ప్రజలు 'ఈనాడు'కు అభినందనలు తెలిపారు.

‘ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపాల్సిందే’

హిందూపురం, న్యూస్‌టుడే: దేశాభివృద్ధికి కలంకంగా మారిన ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపి సమూలంగా నిర్మూలించాలని తెదేపా నాయకులు, విద్యార్థులు నినదించారు. దిల్లీలో ఉగ్రదాడులకు నిరసన, మృతులకు నివాళి అర్పించేందుకు బుధవారం పొట్టిశ్రీరాములు కూడలి నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త శ్రీనివాసరావు, పట్టణ, గ్రామీణ మండలం కన్వీనర్లు వెంకటేశ్, రాము, పార్టీ సీనియర్ నాయకులు నాగరాజు, అమర్‌నాథ్, శివకుమార్, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

నిరసన ర్యాలీలో పాల్గొన్న తెదేపా నాయకులు, విద్యార్థులు

పెండింగ్ బిల్లులు మంజూరు చేయండి

లేపాక్షి, న్యూస్‌టుడే: మండలంలో ఉపాధి హామీ బకాయిలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు ప్రవీణ్ కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కూలీలతో కలిసి ఆయన ఏపీవో చంద్రశేఖర్‌కు వినతి అందించారు.

వీఆర్‌ఓల సంఘం అధ్యక్షుడిగా రంగనాథ్

మడకశిర, న్యూస్‌టుడే : మడకశిర మండలం వీఆర్‌ఓల సంఘం నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఆమిదాలగొంది వీఆర్‌ఓ రంగనాథ్, ఉపాధ్యక్షుడు జూలప్ప, కార్యదర్శిగా రాజును ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ఉప తహసీల్దార్ సురేష్ తెలిపారు.

డిసెంబరు 15వరకు వేరుసెనగకు మంచి అదును

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: రబీలో వేరుసెనగ సాగుచేసుకోవడానికి డిసెంబరు 15వరకు మంచి అనుకూల సమయమని వ్యవసాయాధికారి తిమ్మప్ప పేర్కొన్నారు. బుధవారం కంటీపురం, బుళ్లసముద్రం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

అనధికార నిర్మాణాలు తొలగించాలి

పెనుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలో అనధికార, ప్రణాళికకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని ఉమ్మడి జిల్లా డీటీసీపీవో సువర్ణ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక నగరపంచాయతీ పరిధిలో పలు భవనాలను కమిషనర్ సతీశ్‌కుమార్, టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కలసి పరిశీలించారు.

రబీలో పంటమార్పిడి తప్పనిసరి

గోరంట్ల, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో మొక్కజొన్న సాగు చేసిన రైతులు రబీలో తప్పనిసరిగా పంటమార్పిడి చేయాలని మండల వ్యవసాయాధికారి శంకర్‌నాయక్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కొండాపురం పంచాయతీ గాజులవాండ్లపల్లిలో పంటల సందర్శన, రైతుల సమావేశం నిర్వహించారు. రబీలో తెగుళ్ల నివారణోపాయాలు గురించి తెలియజేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

రొద్దం, న్యూస్‌టుడే : స్థానిక రొద్దకాంబదేవి ఆలయ నిర్మాణానికి 34 కుటుంబాలకు చెందిన రొద్దగార, వక్కలిగరకు చెందిన గుడికట్లు వారు రూ.2,64,500 విరాళం అందించారు. మడకశిర నియోజకవర్గం గుడిబండ మండలంలోని కరికెర గ్రామానికి చెందిన గుడికట్లు వారు చందాల ద్వారా సేకరించిన నగదును చెక్కు రూపంలో ఇచ్చారు. కమిటీ సభ్యులు వేణుగోపాల్, భాస్కర్‌స్వామి, రామకృష్ణ ఉన్నారు.

విద్యార్థి దశనుంచే సేవాభావం అలవరచుకోవాలి

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే సమాజహితం కోసం ఉపయోగపడే సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అలవరచుకోవాలని పూలకుంట పంచాయతీ సర్పంచి మంజునాథ్ పేర్కొన్నారు. హిందూపురం ఎస్‌డీజీఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఏడు రోజులుగా నిర్వహిస్తున్న విద్యార్థుల ప్రత్యేక శ్రమదాన శిబిరం బుధవారం ముగిసింది. ప్రధానోపాధ్యాయుడు కేశవమూర్తి, ప్రిన్సిపాళ్లు జె.ఎస్.వి.ప్రసాద్, నాగేంద్రకుమార్, ప్రోగ్రాం అధికారి రాజన్న, పీడీ హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

పట్టా భూమి ఆక్రమణపై ఫిర్యాదు

రొద్దం: సర్వేనంబరు 250లో తన 3 ఎకరాల పట్టా భూమిని మరో వ్యక్తి ఆక్రమించి ఆన్‌లైన్‌లో వన్‌బీ చేసుకున్నాడని సీనియర్ అసిస్టెంటు శ్రీనివాసులకు బాధితుడు గోవిందప్ప ఫిర్యాదు చేశారు. బుధవారం కార్యాలయంలో తహసీల్దారు లేకపోవడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంటుకు సమస్య విన్నవించాడు.

ప్రైవేటీకరణతో పేదలకు అన్యాయం

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం, పేదలకు అన్యాయం చేసినట్లేనని వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త దీపిక ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని తీసుకోవడానికి రెవెన్యూ కార్యాలయంలో ఎవరూ లేకపోవడంతో ప్రధాన రహదారిపైకి చేరుకొని బైఠాయించారు. గంట పాటు ఆందోళనకు దిగడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని నిరసనను విరమించాలని కోరారు.

బైఠాయించిన వైకాపా నాయకులు

పెనుకొండ: వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైకాపా జిల్లా అధ్యక్షురాలు కేవీ.ఉష పార్టీశ్రేణులతో వైద్యకళాశాల నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ద్విచక్రవాహన ర్యాలీ చేపట్టారు. ఆర్డీవో కార్యాలయంలో ఏవో గిరిధర్‌కు వినతి పత్రం అందజేశారు. పెనుకొండలో 60 ఎకరాల్లో నిర్మిస్తున్న కళాశాలను ఎకరానికి రూ.100కే ప్రైవేటు వ్యక్తులు ధారదత్తం చేస్తుంటే మంత్రి సవిత కమీషన్లకు ఆశపడి కళాశాల అమ్మడానికి సిద్ధమైందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. తక్షణమే పీపీపీ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గొర్రెపిల్లల చోరీ

పెనుకొండ: దుద్దేబండ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి ఆంజినేయులుకు చెందిన 20 గొర్రెపిల్లలను బుధవారం గుర్తుతెలియని నలుగురు దుండగులు చోరీ చేశారు. వాటి విలువ దాదాపు రూ.1లక్ష ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. కియా ఇండస్ట్రియల్ ఏరియా పోలీసులను ఆశ్రయించగా దుండగులు ఉపయోగించిన ఆటో చిత్రాలు సీసీపుటేజీలో గుర్తించారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

సోమందేపల్లి: మండలంలో విస్తారంగా సాగుచేసిన కంది పంట కాయ దశకు చేరుకొన్న సమయంలో మరూక మచ్చల పురుగు, ఈగ ఆశించి నష్టాన్ని కలిగిస్తోందని వ్యవసాయ అధికారిణి విజయభారతి తెలిపారు. బుధవారం మండలంలోని పందిపర్తిలో రైతుల కంది పంట పొలాలను పరిశీలించి, పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

కళ్లలో కారం చల్లి.. చోరీకి యత్నం

సోమందేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని గుడిపల్లి- పాపిరెడ్డిపల్లి గ్రామాల మధ్య బుధవారం రాత్రి చరవాణి దుకాణం యజమాని సురేశ్ కళ్లలో కారం చల్లి.. నగదు చోరీకి దుండగులు యత్నించారు. బాధితుడు రాత్రి 8 గంటల సమయంలో దుకాణం మూసేసి ద్విచక్రవాహనంలో రూ.1.50 లక్షల నగదుతో సొంతూరుకు బయలు దేరాడు. తన గ్రామ సమీపంలోకి రాగానే ముగ్గురు దుండగులు వాహనానికి అడ్డుపడి నగదు బ్యాగును లాక్కోవడానికి ప్రయత్నించారు. అతను తిరిగి రాళ్లతో ప్రతిదాడి చేయడంతో ఆగంతకులు తుంగోడు వైపు పరారయ్యారని బాధితుడు తెలిపారు. ఘటనపై ఎస్సై రమేశ్‌బాబుకు ఫిర్యాదు చేయడంతో, సీసీ కెమెరాలను పరిశీలించి, విచారణ చేపడుతున్నట్లు చెప్పారు.

సమయమంతా ట్రాఫిక్‌లోనే

రద్దీతో పట్టణవాసుల సతమతం

పెనుకొండలోని ఎన్టీఆర్ కూడలిలో నిలిచిపోయిన ట్రాఫిక్

పెనుకొండ, న్యూస్‌టుడే: పెనుకొండ మండలానికి కియా ఇండియా, అనుబంధ పరిశ్రమల రాకతో గత ఐదేళ్లలో పట్టణంలో రద్దీ రెట్టింపయింది. పట్టణ జనాభా 45 వేలకు చేరుకుంది. పెనుకొండ ప్రాంతంలో పరిశ్రమల రాకతో కార్మికులను తరలించే బస్సులు, కార్లు ఉదయం సాయంత్ర వేళల్లో ఒక్కసారిగా వందల సంఖ్యలో రోడ్డుమీదికి వస్తుంటాయి. ఫలితంగా ట్రాఫిక్ సమస్య అధికమవుతోంది. వెరసి పట్టణ వాసులు ప్రధాన రోడ్డుమీదికి రాలేక సతమతమవుతున్నారు.

ఆలస్యమవుతోందని ఆవేదన..

● ప్రధానంగా దర్గా, అంబేడ్కర్, ఎన్టీఆర్‌కూడళ్లలో టీకొట్లు, బేకరీల వద్ద ద్విచక్రవాహనాలు, కార్లు రోడ్డు మీదే ఆపుతుండటంతో సమస్య ఎక్కువవుతోంది. కార్మికులను దింపిందేకు, ఎక్కించుకునేందుకు వచ్చే బస్సులు రోడ్డు మీదే ఆపుతున్నారు. ప్రధాన రహదారి మధ్యలో డివైడర్ ఉండటంతో వెనుక వచ్చే వాహనదారులు పక్కనుంచి వెళ్లలేక ట్రాఫిక్‌లో చిక్కుకుని అవస్థలు పడుతున్నారు. ద్విచక్రవాహనాలపై పరిశ్రమలకు వెళ్లే ఉద్యోగులు విధులకు హాజరయ్యేందుకు ఆలస్యమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కూడళ్లలో సిబ్బందిని నియమిస్తాం

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రధాన కూడళ్లలో పోలీసులను నియమిస్తాం. వాహనాలు రోడ్డు మీద ఆపకుండా చర్యలు చేపడతాం. వాహనదారులు సైతం స్వచ్ఛందంగా ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగనివ్వకుండా పక్కకు నిలిపుకోవాలని అవగాహన చేపడతాం.

- వెంకటేశ్వర్లు, ఎస్సై, పెనుకొండ

రోడ్డుమీద నిలపకుండా చర్యలు చేపట్టాలి

ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలంటే.. ముందుగా దుకాణాల వద్ద రోడ్డుమీద వాహనాలు నిలబడనివ్వకుండా చర్యలు చేపట్టాలి. బస్సులు, ఆటోలు నిలిపే ప్రధాన కూడళ్లలో రోడ్డు మీద గంపల్లో, తోపుడు బండ్లపై వ్యాపారాలు నిర్వహించే వారిని వెనక్కి ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాల్సి ఉంది.

లేఖ రాసి.. వివాహిత ఆత్మహత్యాయత్నం

పెనుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని మారుతీనగర్‌కు వివాహిత హారిక బుధవారం విష గుళికలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తరలించారు. కుటుంబసభ్యుల వివరాల మేరకు.. నాగేశ్వరరావు, భారతి దంపతుల కుమార్తె హారికకు గతేడాది అక్టోబర్‌లో కడపజిల్లా దువ్వూరుకు చెందిన రాజేశ్‌తో వివాహమైంది. 6 నెలల తరవాత అత్తింటి వేధింపులతో ఆమె పుట్టింటికి వచ్చింది. పోలీసులకు ఫిర్యాదు చేసిన న్యాయం జరగడం లేదని, తల్లిదండ్రుల మర్యాద కోసం, మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం చేసినట్లు ఓ లేఖ రాసింది. వివాహానికి ముందు ఉద్యోగం చేస్తానని ఆమె చేసిన ప్రతిపాదనకు ఒప్పుకొన్నారు. అనంతరం ఉద్యోగం చేయడం ఇష్టంలేదని వారించడంతో గొడవలు మొదలైనట్లు లేఖలో పేర్కొంది.

మట్టి రోడ్డే దిక్కు!

మండలంలోని సీసీగిరి, కురుబరపల్లి మధ్యన మట్టి రోడ్డు అధ్వానంగా తయారవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వర్షం వస్తే చాలు నీరు నిల్వ చేరి గుంతలమయమైది. ఇప్పటికైనా బీటీ రోడ్డుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ రాజ్ డీఈఈ వెంకటేశులు మాట్లాడుతూ.. బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతామని, మంజూరైన వెంటనే పనులు చేస్తామని హామీ ఇచ్చారు. - న్యూస్‌టుడే, గుడిబండ

ఏడాదిగా నీరు రావడం లేదు

ఉప్పారపల్లి ప్రాథమిక పాఠశాల పక్కన ఏర్పాటు చేసిన శ్రీరామిరెడ్డి తాగునీటి కుళాయి నుంచి ఏడాదిగా నీరు రావడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ప్రస్తుతం తాగునీటి బోరులో వచ్చే నీటిలో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉందని తెలిపారు. ఈవిషయంపై ఎంపీడీవో రామారావును వివరణ కోరగా సంబంధిత అధికారులతో మాట్లాడి కుళాయికి నీటి సరఫరా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. -న్యూస్‌టుడే, అమరాపురం

మరుగుదొడ్డికి మరమ్మతు కరవు

పరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం నిర్మించిన మరుగుదొడ్డి చుట్టూ పిచ్చి మొక్కలు, కంపచెట్లు పెరిగిపోయాయి. దీంతో అది నిరుపయోగంగా మారి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల హెచ్ఎం కృపాసత్యరాజ్ దృష్టికి తీసుకెళ్లగా దాతల సహకారంతో మరమ్మతులు చేయించి వాడుకలోకి తెస్తామన్నారు. -న్యూస్‌టుడే, పరిగి

PUBLIC NOTICE

This is to inform you that the owners of the lands under Survey Nos. Sy. No. 776, Sy. No. 782, and Sy. No. 783 have agreed to sell the properties. All persons having any right, title, interest or any claim over the properties under the above mentioned survey numbers are requested to submit their rights in writing along with relevant supporting documents to the address below within 7 days from the date of publication of this advertisement. In case of failure to submit any objections within the time limit, it shall be deemed that there are no objections and no further right, claim or demand shall be entertained.

Details of Properties (Schedule)

Item No. 1: Survey No. 776 - Total area 8 acres 94 cents, land falling within the limits of Gounivari Palli Gram Panchayat Pin: 515231, Sri Sathya Sai SRD of Chilamattur.

Item No. 2: Survey No. 782- Total area 11 acres 23 1/5 cents, land falling within the limits of Gounivari Palli Gram Panchayat Pin: 515231, Sri Sathya Sai SRD of Chilamattur.

Item No. 3: Survey No. 783 - Total area 13 acres 22 cents, land falling within the limits of Gounivari Palli Gram Panchayat Pin: 515231, Sri Sathya Sai SRD of Chilamattur.

Contact Person:
Advocate, **Mahima Prasad**, B.Com, LL.B
No. 401, Buildtech Matrix Apartment,
Kundalahalli Gate, Bangalore - 560037
Email: advmahimaderoyale@gmail.com Phone: 81054 56005

ప్రకటన

షెడ్యూల్

G.D. 248-1 Ac. 0.49 cents
G.D. 248-2 Ac. 0.24 cents
G.D. 248-3 Ac. 0.29
Total : Ac. 1.02 cents out of it Ac.0.60 cents out of 170.83

K.JAYAKALA, Advocate,
Penukonda. Cell No.9490859185
ఎన్.ఈశ్వరప్ప Cell No.9989452840

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

ధర్మవరం, న్యూస్‌టుడే: మద్యం గొలుసు దుకాణాలపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆశాఖ పోలీసులను ఆదేశించారు. బుధవారం ధర్మవరం ఎక్సైజ్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక మద్యం, నాటుసారా, గొలుసు దుకాణాలు నిర్వహించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీరామ్, సీఐ చంద్రమణి, ఎస్ఐ నాగరాజు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయం: మంత్రి

ధర్మవరం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని ప్రతి విద్యార్థి ఉద్యోగం సాధించేవిధంగా శిక్షణ ఇప్పించడం, ఉద్యోగమేళా నిర్వహిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ అన్నారు. బ్యాంకింగ్ శిక్షణకు ఎంపికైన విద్యార్థినులను నంద్యాల గురురాఘవేంద్ర బ్యాంకింగ్ శిక్షణ కేంద్రానికి ప్రత్యేక వాహనంలో మంత్రి పంపారు. ఈ సందర్భంగా వారితో మంత్రి మాట్లాడారు. విద్యార్థులందరూ ఉద్యోగం సాధించాలన్నారు. బ్యాంకింగ్ శిక్షణకు సంస్కృతి సేవా సమితి రూ.1.83 లక్షల చెక్కును మంత్రి చేతుల మీదుగా శిక్షణ కేంద్రం నిర్వాహకులకు అందజేశారు. సంస్కృతి సేవా సమితి కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసరెడ్డి, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

పుట్టపర్తి: 80085 73039
కదిరి: 80085 73033
ధర్మవరం: 99596 98222

సమస్య: తలుపుల మండలంలోని ఓబులరెడ్డిపల్లి పంచాయతీలోని ఓ ప్రధాన వీధిలో రోడ్డుపైనే మురుగునీరు చేరి నడవడానికి వీల్లేకుండా మారింది. శుభ్రం చేయించాలి.
- స్థానికులు

సమాధానం: సిబ్బందిని పంపి సమస్య పరిష్కరిస్తాం.
- భరత్, పంచాయతీ కార్యదర్శి
– న్యూస్‌టుడే, తలుపుల

శిథిల గదులు.. అరకొర వసతులు

● గిరిజన ప్రతిభా కళాశాలకు సొంత భవనం కరవు

● విద్యార్థినులకు తప్పని అవస్థలు



పెచ్చులూడుతున్న వంట గది పైకప్పు

కదిరి గ్రామీణం, కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి మండలం ముత్యాలచెరువు పంచాయతీలోని గట్లు సమీపంలో ఉన్న గిరిజన ప్రతిభా కళాశాలలో అరకొర సౌకర్యాలతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. కళాశాలను అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాలకు సంబంధించి 143 మంది విద్యార్థులు ఉన్నారు. మొత్తం 13 గదులు ఉండగా 4 గదుల్లో తరగతుల నిర్వహణ, 3 విశ్రాంతికి, 3 సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌కు, ఒక గది గ్రంథాలయం, ఒకటి ప్రిన్సిపాల్‌కు, ఒక గదిని అనారోగ్యంతో బాధపడే వారికి చికిత్స అందించేందుకు కేటాయించారు. విద్యార్థినులకు 3 విశ్రాంతి గదులు సరిపోవడం లేదు. దీంతో తరగతి గదుల్లోనే రాత్రి నిద్రిస్తున్నారు.

బీసీ వసతి గృహంలోకి తరలిస్తాం

గిరిజన ప్రతిభా కళాశాలను తనకల్లు మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలోకి తరలించడానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదించాము. అనుమతులు వచ్చిన వెంటనే కళాశాలను అక్కడికి తరలిస్తాం. - **మోహన్‌రామ్, డీటీడబ్ల్యూఓ**

అద్దె రూ.95 వేలు

కనీస వసతులు లేని ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్న గిరిజన ప్రతిభా కళాశాలకు నెలకు అద్దె సుమారు రూ.78 వేలు గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం యజమానులకు చెల్లిస్తోంది. ఈ ఏడాది జూన్ నుంచి అద్దెను రూ.95 వేలకు పెంచింది. కళాశాల సమీపంలో రహదారి విస్తరణ పనులు జరుగుతుండటంతో ప్రహరీని తొలగించారు. దీంతో విద్యార్థినులకు రక్షణ కరవైంది. గత ఆగస్టులో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కళాశాలను పరిశీలించారు. విద్యార్థినుల రక్షణ దృష్ట్యా వీలైనంత త్వరగా అన్నీ వసతులు ఉన్న భవనంలోకి కళాశాలను తరలించాలని ప్రిన్సిపల్‌కు సూచించారు.

అద్దె భవనంలో కొనసాగుతున్న కళాశాల

పెచ్చులూడుతున్న పైకప్పు

కళాశాలలోని ల్యాబ్ గదులు, వంటశాల పైకప్పు దెబ్బతిని కడ్డీలు తేలాయి. వంట సిబ్బంది భయంగా విధులు నిర్వహిస్తున్నారు. చిన్నపాటి వర్షానికి గదులు కారుతున్నాయి. దీంతో విద్యార్థులు, సిబ్బందికి ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్ల సమీపంలో పిచ్చి మొక్కలు పెరిగాయి. రాత్రివేళ వినియోగించుకోవడానికి విద్యార్థినులు భయపడిపోతున్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. మున్సిపాలిటీ కుటాగుళ్లలోని ఒకటో వార్డులో పేదలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథక గృహ మంజూరు పత్రాలను అందజేశారు. వాటి నిర్మాణాలను భూమిపూజతో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంతో పేదోడి సొంతింటి కల సాకారమైందన్నారు. ఈ సందర్భంగా కుటాగుళ్లలో రోడ్డు విస్తరణతో నివాసాలు కోల్పోయిన బాధితులకు ఇచ్చిన పట్టాలకు స్థలాలు చూపాలని ఎమ్మెల్యేను కోరారు. సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. తర్వాత ప్రత్యామ్నాయ సాగుకు ప్రభుత్వం ఇచ్చిన ఉలవ విత్తనాలను ఎమ్మెల్యే రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ దిల్షాదున్నీసా, అధికారులు మురళీకృష్ణ, కిరణ్‌కుమార్, సనావుల్లా, స్వచ్ఛ కార్పొరేషన్ సభ్యులు పర్వీన్‌భాను, కౌన్సిలర్లు గంగాభవాని, ముస్తఫా, నాయకులు గంగరాజు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి డ్రోన్‌లతో ఉపయోగం

బుక్కపట్నం, న్యూస్‌టుడే: రబీ సాగులో వ్యవసాయానికి డ్రోన్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఏవో నటరాజ్ తెలిపారు. మండలంలోని అగ్రహారంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు పలు అంశాలపై ఏవో సూచనలిచ్చారు. వరి సాగులో తీసుకోవాల్సిన నీటి యాజమాన్య పద్ధతులను వివరించారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: ఎన్పీకుంట మండలం ఎస్టీయూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. అధ్యక్షుడిగా ధనుంజయరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌కుమార్, ఆర్థిక కార్యదర్శిగా తిరుమల ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నూతన సభ్యులను సన్మానించారు. ఎస్టీయూ జిల్లా కౌన్సిలర్లు జవహర్, వెంకటేశ్వర్లు, వీరమహేశ్వర పాల్గొన్నారు.

గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం

పుట్టపర్తి పట్టణం: ఆవులకు గర్భకోశ చికిత్స చేయించడం ద్వారా ఆరోగ్యవంతమైన దూడలు పుట్టి అధిక పాల దిగుబడి సాధించవచ్చని జిల్లా పశుసంవర్ధకశాఖ డాక్టర్ శుభదాస్ పేర్కొన్నారు. బుధవారం జగరాజుపల్లిలో రాష్ట్రీయ గోకుల్ మిషన్, జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 76 పాడి ఆవులకు గర్భకోశ చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పశు వైద్యులు వెంకటేష్, గిరిజ, శివశంకర్‌నాయక్, శ్రీహరినాయక్ పాల్గొన్నారు.

జనసేనలో పలువురి చేరిక

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని శివరామ్‌నగర్ జనసేన కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి సమక్షంలో పేట, శాంతినగర్‌కు చెందిన పామిశెట్టి లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, పెద్దకోట్ల రవి, నరేష్, జయప్రకాష్, మంజునాథ్‌తో పాటు పలువురు మహిళలు చేరారు. వారికి పార్టీ కండువాలు వేశారు. రాజారెడ్డి పాల్గొన్నారు.

విత్తనశుద్ధి, ఎరువుల యాజమాన్యంతో లాభాలు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: పంట సాగులో విత్తనశుద్ధి, ఎరువుల యాజమాన్యం రైతులు తప్పక పాటిస్తే ప్రాథమిక దశలోనే చీడపీడల నివారణతో పాటు దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని జిల్లా వ్యవసాయ అధికారి రాములునాయక్ పేర్కొన్నారు. కొత్తచెరువు మండలం తిరుమలదేవరపల్లి గ్రామ పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రబీ వేరుసెనగ సాగు చేస్తున్న పొలాన్ని ఆయన పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సతీష్‌బాబు, ఏఈవో సునీత, వ్యవసాయ సహాయకులు ఫిరోజ్‌ఖాన్, రైతులు పాల్గొన్నారు.

పదవులు పొందిన వారు బాధ్యతగా పని చేయాలి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: పదవులు పొందిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పల్లె క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో నూతనంగా వివిధ స్థాయిల్లో పదవులు పొందిన నాయకుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. పార్టీ జెండా ఆవిష్కరించి, కేకు కోశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో తెదేపా జెండా ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, మండల కన్వీనర్లు, యూనిట్, క్లస్టర్, రాష్ట్ర డైరెక్టర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, పల్లె రఘునాథరెడ్డి, తెదేపా జిల్లా అధ్యక్షుడు అంజినప్ప

స్వాగత తోరణం

విద్యుత్తు దీపాల వెలుగుల్లో భవనం

పుట్టపర్తికి నవ్యశోభ

సత్యసాయిబాబా శతజయంతి వేడుకలను పురస్కరించుకొని పుట్టపర్తి పట్టణం ముస్తాబవుతోంది. అందులో భాగంగానే స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు. భవనాలు చెట్లకు విద్యుత్తు దీపాలు అలంకరించారు. రాత్రివేళ దీపాల వెలుగుల్లో పట్టణం వెలుగులీనుతోంది. – న్యూస్‌టుడే, పుట్టపర్తి

సెక్యూరిటీ గార్డుపై అడవి పందుల దాడి

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: ఎన్పీకుంట మండలం సోలార్ పవర్ ప్లాంట్ గమేషా కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న రామాంజనేయులుపై అడవి పందులు గుంపుగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతను కేకలు వేయడంతో మిగతా సిబ్బంది అక్కడికి వెళ్లి కేకలు వేస్తూ.. కర్రలతో కొట్టే ప్రయత్నం చేయగా పందులు పారిపోయాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం కదిరికి తరలించారు.

రాయితీపై ఉలవలు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: ధర్మవరం మండలానికి 300 క్వింటాళ్ల ఉలవలు కేటాయించినట్లు ఏవో ముస్తఫా బుధవారం తెలిపారు. కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మండల పరిధిలోని వసంతపురం గ్రామంలో వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. వేరుసెనగ పంటలో ఎకరాకు 200 కిలోల జిప్సం వినియోగించాలన్నారు.

పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టండి

తాడిమర్రి, న్యూస్‌టుడే: స్వచ్ఛత కార్యక్రమాలకు భారీగా నిధులు ఖర్చు చేస్తున్నామని గ్రామాల్లో పరిసరాల శుభ్రతకు పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టాలని ఉమ్మడి జిల్లా జడ్పీ సీఈవో శివశంకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని కునుకుంట్ల, తాడిమర్రి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని ఆరాతీశారు. ఆయన వెంట ఎంపీడీవో వెంకటరమణారావు, డిప్యూటీ ఎంపీడీఓ క్రిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో సౌకర్యాలు కల్పించాలని వినతి

తనకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని బొంతలపల్లి పంచాయతీలో ఆర్యవైశ్యులకు శ్మశానవాటిక కోసం 50 సెంట్లు కేటాయించారని, అందులో మౌలిక వసతులు కల్పించాలని ఆర్యవైశ్యులు బుధవారం ఈవోఆర్డీ మురళీ శ్రీనివాసులకు వినతిపత్రం ఇచ్చారు. ఆర్యవైశ్యులు సుదర్శన్‌శెట్టి, సురేంద్రగుప్తా, అశ్వర్థనారాయణ, బలమయ్యశెట్టి, రామనారాయణ, దామ, ఉదయ్‌కుమార్, జయచంద్ర, కాంగ్రెస్ మండల కన్వీనర్ పారెస్ పాల్గొన్నారు.

రీ సర్వేతో భూముల సరిహద్దుల గుర్తింపునకు అవకాశం

అధికారులతో చర్చిస్తున్న రాష్ట్ర భూసర్వే డైరెక్టర్ కుర్మనాథ

తాడిమర్రి, బత్తలపల్లి, న్యూస్‌టుడే: రీసర్వేతో రైతుల మధ్య వివాదాలకు తగ్గి భూముల సరిహద్దులు స్పష్టంగా గుర్తించడానికి అవకాశం ఉంటుందని రాష్ట్ర భూ సర్వే, ల్యాండ్ సెటిల్‌మెంట్ డైరెక్టర్ కుర్మనాథ తెలిపారు. బుధవారం తాడిమర్రి, బత్తలపల్లి మండలాల్లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న రీ సర్వే పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాయింట్ ఎల్‌పీఎంలుగా ఉన్న వాటిని సింగిల్ ఎల్‌పీఎంలుగా మార్చే ప్రక్రియను వేగవంతం చేయాలని సర్వే, రెవెన్యూ శాఖాధికారులను ఆదేశించారు.

రోడ్డు బాగు చేయాలని ధర్నా

నిరసన తెలుపుతున్న స్థానికులు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: అనంతపురం నుంచి కదిరి వెళ్లే 42వ జాతీయ రహదారిపై మలకవేములక్రాస్ దగ్గర రోడ్డు బాగు చేయాలని స్థానిక ప్రజలు బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల రోడ్డు గుంతలు పడటంతో తారురోడ్డును తొలగించి చదును చేసి వదిలేశారు. తర్వాత తారురోడ్డు నిర్మించకపోవడంతో హెచ్చుతగ్గులున్న దారిపై వెళ్లాలంటే నరకం అనుభవిస్తున్నామన్నారు. దీనికితోడు తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, కంకరపొడి చల్లి వదిలేయడంతో చుట్టుపక్కల దుకాణాలు, నివాసాల్లోకి దుమ్ము, ధూళి వస్తోందని వాపోయారు. రోడ్డుపై బైఠాయించడంతో రాకపోకలు స్తంభించాయి. పోలీసులు ఆందోళనకారులకు సర్దిచెప్పి పంపించారు.

బాలికల ఆత్మరక్షణకు కరాటే శిక్షణ

కదిరి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని బాలికల ఆత్మరక్షణకు కరాటే శిక్షణను సమగ్రశిక్షా ఆధ్వర్యంలో ఇస్తున్నారు. ఇందులో భాగంగా కదిరి ప్రాంతంలోని బాలికలకు శిక్షణ ప్రారంభించినట్లు మాస్టర్ షేక్షావలి తెలిపారు. ఆపద సమయాల్లో తమను తాము రక్షించుకునేందుకు అవసరమైన మెలకువలు నేర్పుతామన్నారు. తద్వారా బాలికల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు.

బాలికలకు శిక్షణ ఇస్తున్న మాస్టర్ షేక్షావలి

కార్మిక హక్కుల సాధనకు పోరాటం

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: కార్మికుల హక్కుల కోసం, సమస్యల పరిష్కారానికి సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తుందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పేర్కొన్నారు. సోమవారం పుట్టపర్తిలోని ప్రశాంతి గ్రామ్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికుల కడుపుకొడుతున్నాయని విమర్శించారు. నిత్యావసర ధరలను దృష్టిలో ఉంచుకుని కార్మిక, ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎల్ నరసింహులు, కోశాధికారి లక్ష్మినారాయణ, మహిళా కన్వీనర్ దిల్షాద్, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సి.శ్రీదేవి, వి.శ్రీదేవి పాల్గొన్నారు.

విద్యా ప్రగతిపై దృష్టి సారించండి

న్యామద్దల (చెన్నేకొత్తపల్లి), న్యూస్‌టుడే: విద్యా ప్రగతిపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని రెండో మండల విద్యాధికారి ప్రసన్నకుమార్ నాయుడు పేర్కొన్నారు. మండలంలోని న్యామద్దల ఎస్సీ కాలనీ, హర్యాయాన్‌చెరువు ప్రాథమిక పాఠశాలలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల మార్కుల నమోదు దస్త్రాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన నాణ్యత తనిఖీ చేశారు.

జూడోలో బంగారు పతకాలు కైవసం

విద్యార్థులతో పీడీ ప్రతాప్‌రెడ్డి

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో చిగిచెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటి బంగారు పతకాలు సాధించారు. బుధవారం ఆ పాఠశాల పీడీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 6వ తేదీ నుంచి 10 వరకు కాకినాడ డీఎస్ఏ క్రీడా మైదానంలో 17వ రాష్ట్రస్థాయి జూడో పోటీలు జరిగాయి. ఈ పోటీలకు చిగిచెర్ల పాఠశాల విద్యార్థులు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించారు. బాలుర 45 కేజీల విభాగంలో యశ్వంత్, 50 కేజీల విభాగంలో విక్రాంత్, బాలికల విభాగంలో 36, 48 కేజీల కేటగిరీలో నందిని, లాస్యరెడ్డి విజేతలుగా నిలిచి బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో గాండ్లపెంట విద్యార్థుల సత్తా

విద్యార్థులతో ఉపాధ్యాయులు

గాండ్లపెంట, న్యూస్‌టుడే: కదిరి ఎస్‌టీఎస్‌ఎన్ కళాశాలలో నిర్వహించిన 39వ జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో గాండ్లపెంట ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు పవిత్ర, హర్షిత, యశ్విని, జోయ ఫిర్దోస్‌లను హెచ్‌ఎం ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు హరిప్రసాద్, నాగశేషు, ఉపాధ్యాయులు శ్రీనాథ్‌రెడ్డి, మదర్సావలి, ముంతాజ్‌అలి, ఓబుళరెడ్డి, తాహీర్‌వలి అభినందించారు. డిసెంబర్ 1, 2 తేదీల్లో నరసారావుపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు.

విజేత జట్టుకు అభినందనలు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: ఎస్కేయూ అంతర్ కళాశాలల పురుషుల క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన మంగళకర డిగ్రీ కళాశాల విద్యార్థులను కొత్తచెరువు యూపీఎస్ సీఐ మారుతి శంకర్ అభినందించారు. ఈనెల 8 వరకూ గుంతకల్‌లోని ఎస్ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాలలో అంతర్ కళాశాలల ఫుట్‌బాల్ పోటీలు జరిగాయని కోచ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ పోటీల్లో అనంతపురం ఆర్ట్స్ కళాశాల జట్టుపై మంగళకర డిగ్రీ కళాశాల విద్యార్థులు క్రీడా నైపుణ్యం ప్రదర్శించి విజేతలుగా నిలిచారన్నారు. బుధవారం సీఐ మారుతి శంకర్ విజేత జట్టును అభినందించారు.

విజేత జట్టుతో సీఐ మారుతిశంకర్

పందుల సంచారాన్ని అడ్డుకోలేరా?

రోగాలు ప్రబలుతున్నాయని ఆందోళన

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. వీధులు, మురుగు కాలువలు, ప్రధాన కూడళ్లలో గుంపులుగా తిరుగుతున్నాయి. స్థానిక శాంతినగర్, లోనికోట, శారదనగర్, గూడ్స్‌షెడ్డు కొట్టాల, పోతుకుంటకాలనీ, చెరువుకట్ట సమీపంలో అవి విపరీతంగా సంచరిస్తూ అపరిశుభ్ర వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. వాతావరణంలో మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇలాంటి సమయంలో పందులతో అంటురోగాలు ప్రబలుతాయోమోనని కాలనీవాసులు భయపడుతున్నారు. కొన్నిసార్లు ఇళ్లలోకి దూరుతున్నాయని మహిళలు వాపోతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసే సమయంలో పందులు గుంపులుగా వస్తున్నాయని, వాటిని తరిమేందుకు నానా అవస్థలు పడుతున్నామని భోజన నిర్వాహకులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు.

తగిన చర్యలు చేపడతాం

- సాయికృష్ణ, ఇన్‌ఛార్జి కమిషనర్

పందుల యజమానులతో సమావేశమై వాటికి కేటాయించిన స్థలాల్లోకి తరలించాలని స్పష్టంగా ఆదేశిస్తాం. మాట వినకపోతే తదుపరి చర్యలు తీసుకుంటాం.

రాంనగర్‌లో పందుల గుంపు

పురపాలక శాఖాధికారుల నిర్లక్ష్యంతోనే..

ఆరు నెలల కిందట పట్టణంలో పందుల సంచారంతో సమస్యలు వస్తున్నాయని పురపాలక శాఖాధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో పందుల పెంపకందారులతో కమిషనర్ సమావేశమయ్యారు. బడన్నపల్లి సమీపంలో పందుల కోసం కేటాయించిన స్థలంలోకి వాటిని తరలించాలని ఆదేశించారు. ఆ తరువాత పందులు కనిపిస్తే కాల్చివేయాలని మున్సిపాలిటీ సిబ్బందికి సూచించారు. కమిషనర్ ఆదేశాలను పెంపకందారులు బేఖాతరు చేస్తూ పందులను పట్టణంలోకి వదులుతున్నారు.

'పీపీపీ విధానంతో పేద విద్యార్థులకు అన్యాయం'

ఏవో ఖతిజున్‌కుబ్రాకు వినతిపత్రం అందజేస్తున్న కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం తీసుకువస్తున్న మెడికల్ కాలేజీల పీపీపీ విధానంతో పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్య అభ్యసించాలంటే తీవ్ర ఇబ్బందులు తప్పవని వైకాపా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం వైకాపా నాయకులు పట్టణంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వైకాపా శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీలను నెరవేర్చకుండా దాటవేత ధోరణి అవలంబిస్తోందన్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ తనపై దృష్టి పెట్టకుండా నియోజక వర్గ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి ఏవో ఖతిజున్‌కుబ్రాకు వినతి పత్రం అందజేశారు.

నల్లమాడ: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి స్థానిక సత్యమ్మ గుడి దగ్గర నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు వైకాపా నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్తు కార్యాలయం ఎదురుగా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు.

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
కదిరి శాఖ (03011), శ్రీ సత్యసాయి జిల్లా.

స్థిరాస్తి విక్రయం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద స్థిరాస్తుల విక్రయం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్) అధీకృత అధికారి ద్వారా భౌతికంగా స్వాధీనం చేసుకొనబడినట్టి, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టబడిన/ఛార్జ్ చేయబడిన దిగువ వివరించిన స్థిరాస్తి, దిగువ తెలిపిన రుణగ్రహీత(ల) & హామీదారు(ల) నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, **కదిరి శాఖ** కు రావాల్సిన బకాయి **Rs.15,49,054.16/-(రూపాయలు పదిహేను లక్షల నలభై తొమ్మిది వేల యాభై నాలుగు మరియు పదహారు పైసలు మాత్రమే)** మరియు దానిపై తదనంతర వడ్డీ, ఛార్జీలు మరియు వ్యయాలు రాబట్టుకొనుటకు **28.11.2025** తేదీన **"ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా", "అక్కడ ఏమున్నదో అది"** మరియు **"ఏది అక్కడ ఉన్నదో అదే"** ప్రాతిపదికన విక్రయించబడతాయని ఇందుమూలముగా ముఖ్యంగా రుణగ్రహీత(లు), హామీదారు(లు) మరియు సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది. **రిజర్వు ధర, బయానా కూడా దిగువ తెలుపబడినవి.**

ఋణగ్రస్తులు, కో-అప్లికెంట్ మరియు గ్యారంటారు/లు

1. ఋణగ్రహీత: మెసర్స్ నూరాని శిల్క్ ఇండస్ట్రీస్, ప్రొ॥ శ్రీ కోలార్ మహబూబ్ బాషా, డోర్.నెం.3/515, ఇండస్ట్రియల్ ఎస్టేట్, కుమ్మరవాండ్లపల్లి, కదిరి 515591.
2. తనఖాదారు : శ్రీ కోలార్ మహబూబ్ బాషా, డోర్.నెం.3/515, ఇండస్ట్రియల్ ఎస్టేట్, కుమ్మరవాండ్లపల్లి, కదిరి 515591.
3.కొ-అబ్లిగెంట్/గ్యారంటారు : శ్రీ షేక్ మహబూబ్ పీరా, డోర్.నెం.3/512, ఇండస్ట్రియల్ ఎస్టేట్, కుమ్మరవాండ్లపల్లి, కదిరి 515591.

ఆస్థి వివరములు

ప్రాపర్టి **నెం.1:**ఎస్.ఆర్.డి. కదిరి మరియు హిందూపురము ఆర్.డి, కదిరి మండలము, కదిరి గ్రామ, మున్సిపల్ పరిధి, సర్వే నెం.309-2, ఎసి.8.04లలో 133.33 చ॥గ॥ల ఖాళీ స్థలము. ప్రాపర్టి **నెం.2:** ఎస్.ఆర్.డి. కదిరి మరియు హిందూపురము ఆర్.డి, కదిరి మండలము, కదిరి గ్రామ, మున్సిపల్ పరిధి, సర్వే నెం.309-2, ఎసి.8.04 లలో 26.66 చ॥గ॥ల ఖాళీ స్థలము. ప్రాపర్టి **నెం.3:** ఎస్.ఆర్.డి. కదిరి మరియు హిందూపురము ఆర్.డి, కదిరి మండలము, కదిరి గ్రామ, మున్సిపల్ పరిధి, సర్వే నెం.309-1, 133.33 sq.yds acs 5.84 or 2.361 hectors ఖాళీ స్థలము. **హద్దులు:** ప్రాపర్టి **నెం.1: ఉత్తరము:** 24 అడుగుల వెడల్పు గల రోడ్డు, **దక్షిణము:** రహంతుల్లాకు చెందిన స్థలము, **తూర్పు:** మహబూబ్ బాషాకు చెందిన స్థలము, **పడమర:** ఇనయతుల్లాకు చెందిన స్థలము. ప్రాపర్టి **నెం.2: ఉత్తరము:** 24 అడుగుల వెడల్పు గల రోడ్డు, **దక్షిణము:** రహంతుల్లాకు చెందిన స్థలము, **తూర్పు:** అగర్ వలికు చెందిన స్థలము, **పడమర:**మహబూబ్ బాషాకు చెందిన స్థలము. ప్రాపర్టి **నెం.3:** సర్వే నెం.309-1 నందు **1వ లాట్ 192.66 చ॥గ॥లకు హద్దులు ఉత్తరము:** కె. ప్రకాష్ కు చెందిన స్థలము, **దక్షిణము:** 24 అడుగుల వెడల్పు గల రస్తా, **తూర్పు:** కె.వెంకటప్ప కు చెందిన స్థలము, **పడమర:** 2వ లాటుకు చెందిన స్థలము సర్వే నెం.309-1 నందు **2వ లాట్ 96.33 చ॥గ॥లకు హద్దులు:**
ఉత్తరము: కె.ప్రకాష్ కు చెందిన స్థలము, **దక్షిణము:** 24 అడుగుల వెడల్పు గల రస్తా, **తూర్పు:** 1వ లాటుకు చెందిన స్థలము, **పడమర:** కె. మహబూబ్ బాషాకు చెందిన స్థలము.
కొలతలు: ప్రాపర్టి **నెం.1:** **విస్తీర్ణము 133.33 చ॥గ॥లు లేదా 2.75 సెంట్లు,**
ప్రాపర్టి **నెం. 2:** **విస్తీర్ణము 26.66 చ॥గ॥లు,**
ప్రాపర్టి **నెం.3:** **విస్తీర్ణము 289 చ॥గ॥లు** (192.66+96.33 Sq yds).

వేలం తేది మరియు సమయము
28.11.2025 మధ్యాహ్నం 12.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు.
(10 నిముషముల అపరిమిత ఆటో ఎక్స్‌టెన్షన్‌తో)

రిజర్వు ధర: ఆస్థి నెం.1 మరియు 2 కొరకు: **రూ॥18,23,250** (రూపాయలు పద్దెనిమిది లక్షల ఇరవై మూడు వేల రెండు వందల యాభై మాత్రమే)
ఆస్థి నెం.3 కొరకు రూ॥43,92,800/- (అక్షరాల నలభై మూడు లక్షల తొంభై రెండు వేల ఎనిమిది వందలు మాత్రమే)
చెల్లించవలసిన ధరావత్తు: ఆస్థి నెం.1 మరియు 2 కొరకు **రూ॥1,82,325/-** (అక్షరాల ఒక్క లక్ష ఎనభై రెండు వేల మూడు వందల ఇరవై ఐదు మాత్రమే)
3వ ఆస్థి కొరకు రూ॥4,39,280/- (అక్షరాల నాలుగు లక్షల ముప్పై తొమ్మిది వేల రెండు వందల ఎనభై మాత్రమే) ధరావత్తు చెల్లించడానికి ఆఖరు తేదీ: **27.11.2025**
సవివరమైన నియమ నిబంధనలకొరకు ఈ క్రింద తెలిపిన లింక్ ను రెఫర్ చేయవలెను. రిజిస్ట్రేషన్ తదితర వివరములకు సంప్రదించవలసిన **వెబ్‌సైట్:https://baanknet.com**
రిజిస్ట్రేషన్, లాగిన్ మరియు బిడ్డింగ్ నియమములకు చూడవలసిన వెబ్‌సైట్:
https://baanknet.com and https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx
వేలం సంబంధిత ఏవేని ఇతర వివరములకు సంప్రదించవలసిన ఇ-మెయిల్:
ubin0803014@unionbankofindia.bank or contact
Mr.Saurabh Jain 7009601040 Union Bank of India, Kadiri Branch.
తేది:11.11.2025 సం/- అధీకృత అధికారి,
ప్రదేశము: కదిరి శాఖ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

(c) eenadu

ఈనాడు శ్రీకాకుళం

గురువారం నవంబరు 13, 2025

మదినిండా భక్తిభావంతో
ఇష్టదైవాన్ని దర్శించుకున్నారు..
ఆ వెంటనే అంతా కలిసి
మరో క్షేత్రానికి పయనమయ్యారు..
మాటేసిన మృత్యువు
వారి దారికి ఎదురొచ్చింది..
రెప్పపాటులోనే దూసుకొచ్చి..
రెండు ప్రాణాలను బలిగొంది..

ఎదురొచ్చిన మృత్యువు..!

- దైవ దర్శనానికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం
- ఇద్దరు మహిళల దుర్మరణం, 9 మందికి గాయాలు

ఘటనా స్థలంలో క్షతగాత్రులకు సపర్యలు చేస్తున్న స్థానికులు

జలుమూరు, లావేరు, న్యూస్‌టుడే: జలుమూరు మండలం అచ్యుతాపురం వద్ద బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే దుర్మరణం చెందగా.. 9 మంది గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లావేరు మండలం, గుర్రాలపాలెం గ్రామానికి చెందిన 13 మంది కార్తికమాసం కావడంతో దైవ దర్శనానికి వెళ్లేందుకు ముందు రోజు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు.

గ్రామానికి చెందిన ఓ ఆటోను కిరాయికి మాట్లాడుకుని బయలుదేరారు. తొలుత టెక్కలి మండలం రావివలసలోని ఎండలమల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీముఖలింగం వెళ్లేందుకు పయనమయ్యారు. మధ్యలో అల్పాహారం తిన్నారు.

అచ్యుతాపురం ఉన్నత పాఠశాల సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న వ్యాన్ వీరి ఆటోను ఢీకొంది. ఘటనలో గట్టెం అచ్చియ్యమ్మ (55), గట్టెం పద్మ(35) మృతి చెందారు. గట్టెం సుమతి, చాంతాటి లక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీకాకుళం గ్రామీణ మండలం రాగోలులోని జెమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. క్షతగాత్రులకు అచ్యుతాపురం పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించి.. మెరుగైన వైద్యానికి శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి పంపారు. ప్రమాద స్థలాన్ని నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు, ఎస్సై అశోక్‌బాబు పరిశీలించారు. ఆసుపత్రిలోని క్షతగాత్రులతో జలుమూరు తహసీల్దారు జె.రామారావు మాట్లాడారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్‌బాబు తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి వైద్యులకు సూచించారు.

క్షతగాత్రులు వీరే..

గాయపడిన వారిలో మూడేళ్ల రుత్వికతో పాటు అశ్విని, రమణమ్మ, పద్మ, లక్ష్మి, సూర్యప్రకాశ్, హేమలత, మధుసూదనరావు, సుమతి ఉన్నారు.

అంతలోనే విషాదం..

గట్టెం అచ్చియ్యమ్మది వ్యవసాయ కుటుంబం. భర్త నాగరాజు, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమారుడు చిరంజీవికి నెల రోజుల కిందట వివాహం చేశారు. సందడి ఉన్న ఇంట్లో అచ్చియ్యమ్మ మృతి తీవ్ర విషాదాన్ని నింపింది.

ట్యూషన్ టీచర్..

గట్టెం పద్మ గ్రామంలోనే పిల్లలకు ట్యూషన్ చెబుతూ.. వ్యవసాయ పనులకు వెళ్తుంటారు. అందరితో సరదాగా ఉండే పద్మ ఆటో ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు కంటతడి పెడుతున్నారు. ఈమెకు భర్త అప్పలరాజు, ఇద్దరు పిల్లలు ప్రవల్లిక, షణ్ముఖరావు ఉన్నారు.



చెట్టు నిండుగా.. కాయలు దండిగా..

ఒక కొబ్బరి చెట్టులో గెలకు 20 లేదా 30 చొప్పున 60 నుంచి 100 బొండాలు కాస్తాయి. కానీ ఓ గెలకు 80 నుంచి 100 కాయలున్న కాసిన చెట్టు లావేరు మండలం వేణుగోపాలపురం గ్రామంలోని కొబ్బరితోటలో కనిపించింది. ఆ చెట్టుకు సుమారు 350 బొండాలు ఉన్నాయి. రాష్ట్రం డివిజన్ ఉద్యానశాఖ అధికారిణి అమరేశ్వరి వద్ద ప్రస్తావించగా జన్యుపరమైన కారణాలతో కొన్ని చెట్లకు ఇలా కాస్తాయని, ఎక్కువ బొండాలు వచ్చినా.. పరిమాణంలో చిన్నవిగా ఉంటాయని తెలిపారు. – న్యూస్‌టుడే, లావేరు

రేకుల చాటున.. రేపటి పౌరుల యాతన..!

వజ్రపుకొత్తూరు మండలం లింగాలపాడు ప్రాథమిక పాఠశాల భవనం శిథిలం కావడంతో రెండేళ్ల కిందట తొలగించారు. ప్రస్తుతం స్థానికంగా ఇలా ఓ రేకుల షెడ్డు ఏర్పాటు చేసి అందులోనే తరగతులు నిర్వహిస్తున్నారు. వర్షం పడినా.. ఎండ పెరిగినా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధ్యాయులు పడరాని పాట్లు పడుతూ పాఠాలు చెబుతున్నారు. పాఠశాలకు నూతన భవనం మంజూరైనా.. పనులు పునాదుల స్థాయిలోనే ఉన్నాయి. ఎంఈవో-2 వెంకటరమణను వివరణ కోరగా మూడు నెలల్లో పనులు పూర్తి చేస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

సెర్ప్ డైరెక్టర్‌గా డ్వామా పీడీ

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: సెర్ప్ డైరెక్టర్‌గా డ్వామా పీడీ బి.సుధాకరరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏడాది పాటు డిప్యూటేషన్‌పై విధులు నిర్వహించాలని అందులో స్పష్టం చేసింది.

కళా వైభవం

జిల్లా కేంద్రంలో జరుగుతున్న సిక్కోలు పుస్తక మహోత్సవం సందడిగా సాగుతోంది. సాహిత్య, సాంస్కృతిక సంబరాల్లో భాగంగా బుధవారం వివిధ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డాక్టర్ యమ్మాలని శ్రీకాంత్ శిష్యబృందం శాస్త్రీయ నృత్యం, వాణి సంగీత కళాక్షేత్రం దుంపల ఈశ్వరరావు బృందం అన్నమయ్య సంకీర్తనల ఆలాపనలు తదితర కార్యక్రమాలతో వేదిక విరాజిల్లింది. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

ఇద్దరు ఏజీపీల నియామకం

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: జిల్లాలో రెండు న్యాయస్థానాలకు ప్రభుత్వ సహాయ న్యాయవాదులను (ఏజీపీ) నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సోంపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు వంకాయల ధర్మారావు, నరసన్నపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు వాన శ్రీనివాసరావు నియమితులయ్యారు. మూడేళ్ల పాటు వారి పరిధిలోని న్యాయస్థానాల్లో సేవలు అందించనున్నారు.

పోషకాల రాగితో పాత రోజుల్లోకి..!

శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కళాశాల రహదారిలో రాగి జావ విక్రయాలు

– న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)

మారుతున్న జీవనశైలి కారణంగా చిన్న వయసులోనే అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. వాటిని దూరం చేసుకోవాలంటే ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని, తినే పదార్థాల్లో రాగుల్ని భాగం చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లావాసులు మళ్లీ పాతరోజుల్లోకి వెళ్తున్నారు. ఆరోగ్య భాగ్యం కోసం రాగుల వినియోగానికి ప్రాధాన్యమిస్తున్నారు.

సిక్కోలులో పెరుగుతున్న వినియోగం, పంట విస్తీర్ణం

ఒకప్పుడు..

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల రోజువారీ ఆహారంలో రాగిజావ భాగంగా ఉండేది. ఉదయాన్నే గ్లాసు నిండా అంబలి(రాగి జావ) తాగి పొలం పనులకు వెళ్లేవారు. కాలక్రమేణా అభి‘రుచులు’ మారిపోవడంతో రాగుల వాడకం తగ్గిపోయింది. తద్వారా పంట విస్తీర్ణం సైతం పడిపోయింది.

ఇప్పుడు..

ఉరుకుల పరుగుల జీవనం కారణంగా ప్రతి ఇంటినీ అనారోగ్యాలు చుట్టుముడుతున్నాయి. వాటి నుంచి కోలుకునేందుకు, మళ్లీ రోగాల బారిన పడకుండా ఉండేందుకు ‘రాగి’ బాట పడుతున్నారు. సిక్కోలు మార్కెట్లో పెరిగిన ఉత్పత్తుల విక్రయాలు, పంట విస్తీర్ణమే అందుకు నిదర్శనం.

★ రాగిజావ, సంగటి, చిరుధాన్యాలతో చేసిన మిఠాయిలు, ఇతర పదార్థాలు విక్రయించే దుకాణాలు, హోటళ్లు కూడా క్రమంగా పెరుగుతున్నాయి.

★ జిల్లాలోని 80 శాతం ఇళ్లలో రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ వంటి రుగ్మతలతో బాధపడేవారు కనీసం ఒక్కరైనా ఉంటున్నారని వైద్యులు చెబుతున్నారు. రాగుల ప్రాధాన్యం తెలుసుకున్న చాలా మంది అంబలిని దైనందిన జీవితంలో భాగం చేసుకుంటున్నారు.

★ శ్రీకాకుళం నగరం, ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురం, నరసన్నపేట, టెక్కలి ప్రాంతాల్లో ఉదయాన్నే రాగి ఉత్పత్తుల అమ్మకాల ద్వారా పలువురికి స్వయం ఉపాధి లభిస్తోంది.

మళ్లీ పంట పండుతోంది..

జిల్లాలో రాగి పంట విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది. వాడకం పెరుగుతుండటంతో ఆ మేరకు సాగు చేసేందుకు రైతులు ముందుకొస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఏపీ సీడ్స్ ద్వారా రాయితీపై విత్తనాలందిస్తూ ప్రోత్సహిస్తోంది. చౌకధరల దుకాణాల ద్వారా కూడా కార్డుదారులకు(కార్డుకు మూడు కిలోలు చొప్పున) రాగులు పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.



కలిగే ప్రయోజనాలివీ..

★ రాగుల వినియోగంతో శరీరానికి కావాల్సిన కాల్షియం, విటమిన్-బి, ఖనిజ లవణాలు అందుతాయి.

★ రక్తంలో మధుమేహం స్థాయి నియంత్రణలో ఉంటుంది.

★ ఐరన్ పుష్కలంగా లభించడంతో రక్తహీనత ముప్పు తగ్గుతుంది.

★ శరీరంలో కొవ్వు శాతం పెరగదు. ఎముకలు దృఢంగా ఉంటాయి.

★ ‘గ్లైసెమిక్ ఇండెక్స్’ తక్కువగా ఉండటంతో ఊబకాయం సమస్యను అధిగమించొచ్చని డైటీషియన్ శివప్రసాద్ తెలిపారు.

నరుబుజ్జిలి మండలం వెన్నెలవలసలోని జవహర్ నవోదయ విద్యాలయాన్ని పీఎంశ్రీ కేంద్ర బృందం సభ్యులు బుధవారం సందర్శించారు. ప్రయోగశాలలు, ఇతర సౌకర్యాలను పరిశీలించి.. పిల్లలతో మాట్లాడారు. క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. – న్యూస్‌టుడే, సరుబుజ్జిలి, కలెక్టరేట్

చూస్తే టమాటాలా.. తింటే తీపిగా..!

ఈ చిత్రంలో కనిపిస్తున్నవి టమాటాలు అనుకుంటే మీరు పొరబడినట్లే. చూడ్డానికి కాస్త పసుపు రంగులో ఉన్న ఫలం పేరు పెర్సిమాన్. జపాన్, చైనా, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, ఇతర శీతల ప్రాంతాల్లోనూ సాగు చేస్తున్నారు. తినడానికి ఆపిల్ మాదిరిగా ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు. శ్రీకాకుళం నగరంలోని పండ్ల దుకాణాల్లో వీటిని అమ్ముతున్నారు. ‘జపాన్ ఫ్రూట్’గా సంబోధిస్తూ.. కిలో రూ.400 వరకు విక్రయిస్తున్నారు. – ఈనాడు డిజిటల్, శ్రీకాకుళం

తెలిసినా ఉలకరు.. చెప్పినా పలకరు..!

- ఎం.కొత్తూరులో ఆక్వా సాగుకు ప్రభుత్వ భూముల కబ్జా
- రొయ్యల చెరువులు ఏర్పాటు చేసినా దృష్టి సారించని యంత్రాంగం

– న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

ప్రభుత్వ భూమి సెంటు అయినా ఎకరాలైనా అందరికీ ఆశే.. ఆక్రమిస్తే అడిగేదెవరు అన్నట్లుగా బెదురే లేకుండా కబ్జాదారులు చెలరేగిపోతారు. ఇందుకు ఉదాహరణ సంతబొమ్మాళి మండలం తీర ప్రాంతాల్లో జరుగుతున్న దందానే. తంపర మొదలు అటవీ భూముల వరకు ఆక్రమించని ప్రాంతమంటూ లేదు. వైకాపా హయాంలో ఎం.కొత్తూరు గ్రామ పరిధిలో తీరాన్ని ఆనుకుని వంద హెక్టార్లపైనే రెవెన్యూ, అటవీ శాఖ భూములున్నాయి. ఇవన్నీ ఒకప్పుడు మట్టి, ఇసుక దిబ్బలతోనే ఉండేవి. ఆక్వాసాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడటంతో అక్రమార్కుల కన్ను వీటిపై పడింది. సర్వే నంబరు 77లో 35 ఎకరాల మేర ప్రభుత్వ భూమి ఉంది. దీన్ని ఇసుక దిబ్బగా నోటిపై చేశారు. ఇది అటవీ, రెవెన్యూ పరిధిలోనే ఉంది. దీంతో ఈ భూములపై పర్యవేక్షణ లేకపోవడంతో వైకాపా హయాంలో ఆక్రమణదారులు చెలరేగిపోయారు. అప్పనంగా భూమికి విద్యుత్తు సౌకర్యం కల్పించుకుని ఆక్వా సాగు యథేచ్ఛగా చేస్తున్నారు. ఒకరిని చూసి మరొకరు ఇలా దాదాపు 30 ఎకరాల వరకు రొయ్యల చెరువులు నిర్మించేశారు. ఈ ప్రాంతంలో ఎకరా భూమి విలువ రూ.20 లక్షలు పలుకుతోంది.

ఎస్.బి.కొత్తూరు పంచాయతీ ఎం.కొత్తూరు గ్రామ పరిధిలో దాదాపు 30 ఎకరాల అటవీ, రెవెన్యూ భూమి కబ్జాకోరల్లోకి వెళ్లిపోయింది. రొయ్యల చెరువులుగానూ మారిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర దాటినా నేటికీ కబ్జాలపై అధికార యంత్రాంగం దృష్టి సారించలేదు. స్థానికులు ఇక్కడ జరుగుతున్న అక్రమ ఆక్వా సాగుపై ఇటీవల రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు.

సంతబొమ్మాళి మండలం ఎం.కొత్తూరు పరిధిలో అక్రమంగా నిర్మించిన ఆక్వా చెరువులు

అక్రమార్కులకు రాయితీ విద్యుత్తు..

★ తొలుత తహసీల్దారు, మత్స్యశాఖ అధికారికి దరఖాస్తు చేసుకోవాలి. వీఆర్వో నుంచి సీవోసీ ధ్రువపత్రం పొందాలి.

★ నిర్మించే స్థలం జిరాయితీలోని సర్వే నంబరని పేర్కొంటూ జియో ట్యాగింగ్ చేసుకోవాలి. సాగుదారు ఆధార్ నంబరుకు లింకు చేయాలి.

★ సాధారణంగా రొయ్యల చెరువులు ఏర్పాటు చేయాలంటే రెవెన్యూ, మత్స్యశాఖల నుంచి అనుమతులు తీసుకోవాలి.

★ ఇక్కడ ఇవన్నీ లేకపోయినా విద్యుత్తు సరఫరా ఇచ్చేశారు. అక్రమార్కులకు ప్రభుత్వం అందించే రాయితీ కూడా వీరికి వర్తించడం గమనార్హం.

చర్యలు తీసుకుంటాం.

ప్రభుత్వ భూములను ఆక్రమించి ఆక్వా సాగు చేయడం నేరం. చెరువుల నిర్మాణంపై గతంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.
– బి.హేమసుందర్, తహసీల్దారు, సంతబొమ్మాళి

లోక్ అదాలత్ నిర్వహణలో న్యాయవాదుల పాత్ర కీలకం

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: జాతీయ లోక్ అదాలత్ నిర్వహణలో న్యాయవాదుల పాత్ర కీలకమని ఒకటో అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన ఆయన మాట్లాడారు. వచ్చే నెల 13న లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసుల రాజీకి ప్రయత్నించాలని సూచించారు. 3, 4 అదనపు జిల్లా జడ్జిలు సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్, ఎం.ఫణికుమార్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.హరిబాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తంగి శివప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఒకటో అదనపు జిల్లా జడ్జి భాస్కరరావు

అందిస్తే సాయం.. మానుతుంది గాయం..!

- ‘మొంథా’ నష్టం రూ.95.35 కోట్లు

– ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం

మొంథా తుపాను ధాటికి సిక్కోలు అతలాకుతలమైంది. వరి పంట చేతికొచ్చే సమయంలో రైతులకు కన్నీరు మిగిల్చింది. విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. కొన్నిచోట్ల ఇళ్లు దెబ్బతిన్నాయి. మొత్తం రూ.95.35 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. తాత్కాలిక చర్యలకు రూ.12.10 కోట్లు, శాశ్వత పరిష్కారానికి రూ.83.25 కోట్లు అవసరమవుతాయని పేర్కొంటూ ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు.

తుపాను బాధిత వివరాలిలా..

- మండలాలు : 20
- గ్రామాలు : 115
- దెబ్బతిన్న ఇళ్లు : 161
- రైతులు : 8042 మంది

అన్నదాత కుదేలు..

జిల్లావ్యాప్తంగా వ్యవసాయ రంగానికి 1,632 హెక్టార్లలో నష్టం వాటిల్లింది. వరి రైతులు కుదేలయ్యారు. 1,632 హెక్టార్లలో పంట దెబ్బతినగా.. రూ.4.08 కోట్లు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. ఉద్యాన పంటల్లో 254 కొబ్బరి చెట్లు నేలకొరిగాయి. జీడిమామిడి 7.53 హెక్టార్లు, కూరగాయలు 4.2 హెక్టార్లలో దెబ్బతిన్నాయి.

★ పశువులు పెద్దవి రెండు, గొర్రెలు ఆరు, గొర్రెల షెడ్డు ఒకటి దెబ్బతింది. రూ.1.5 లక్షల నష్టం జరిగింది.

★ చిన్నతరహా నీటి పారుదల వ్యవస్థకు 244 ప్రాంతాల్లో కాలువలు, చెరువులు దెబ్బతిన్నట్లు గుర్తించారు. మొత్తం రూ.2.33 లక్షల నష్టం అంచనా వేశారు.

★ విద్యుత్తు శాఖకు రూ.32.26 లక్షల నష్టం జరిగింది. 33 కేవీ ఫీడర్లు 12, 11 కేవీ ఫీడర్లు 18, 73 నియంత్రికలు పాడయ్యాయి. 291 విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి.

‘దారి’కి తీసుకురావాలి..

ఆర్అండ్‌బీశాఖ పరిధిలో రూ.5.93 కోట్లు, పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో రూ.3.23 కోట్ల నష్టం జరిగింది. ఆర్అండ్‌బీకి సంబంధించి 108.58 కి.మీ. మేర రోడ్లు పాడయ్యాయి. ఓ రోడ్డు కోతకు గురైంది. 24 కల్వర్టులు, 11 రహదారులపై నీరు ప్రవహించింది. 27 చెట్లు కూలిపోయాయి. 38 పీఆర్ దారులు 81.24 కి.మీ. మేర దెబ్బతిన్నాయి. రూ.3.23 కోట్ల నష్టం జరిగిందని, శాశ్వత చర్యలకు రూ.56.47 కోట్లు అవసరమవుతాయని తేల్చారు.

★ 161 ఇళ్లు తుపానుకు దెబ్బతిన్నాయి. వీటిలో పూర్తిగా 14 ధ్వంసం కాగా పక్కా ఇళ్లు 5, పూరిళ్లు 142 దెబ్బతిన్నాయి. మొత్తం రూ.24.97 లక్షల నష్టం జరిగింది.

తీరు మారక గుణపాఠం నేర్చుకోక..!

- శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో నిర్వహణ లోపాలు

– న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలో శ్రీకాకుళం క్యాంపస్‌లో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఎక్కడెక్కడి నుంచో వచ్చిన వేల మంది విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. అందుకు తగ్గట్లుగా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సమస్యలు నానాటికీ పెరుగుతున్నాయి. తాజాగా ఓ విద్యార్థి బలవన్మరణంతో ఆ అంశం మరోసారి చర్చనీయాంశమైంది.

కౌన్సెలింగ్ ఎక్కడ..?

నిబంధనల ప్రకారం క్యాంపస్‌లో విద్యార్థులకు కెరీర్ కౌన్సెలింగ్ ఇవ్వాల్సి ఉన్నా అది జరగట్లేదు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి సంబంధించి నియమితులైన ఓ సైకాలజీ కౌన్సెలర్ నూజివీడులోనే ఉంటున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఐదు బ్యాచుల్లో 5 వేల మంది విద్యార్థులున్నా ఆమె ఒక్కసారి కూడా రాలేదు.

బాలుర వసతిగృహం

నియామకాల్లోనూ జాప్యమే..: శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ పదవి నియామకానికి ప్రకటన విడుదల చేసి.. నెలలు పూర్తవుతున్నా నియామక ప్రక్రియ కొలిక్కిరాలేదు. ప్రస్తుతం ఉన్న అధికారి అన్ని విషయాల్లో పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలూ ఉన్నాయి. ప్రస్తుతం కీలక పదవుల్లో ఉన్నవారు 4, 5 ఏళ్ల నుంచి వారే కొనసాగడంతో కూడా గాడి తప్పిందనే వాదనలు వినిపిస్తున్నాయి.

వార్డెన్లు, కేర్ టేకర్లు ఎందుకున్నారు..?: వసతి గృహాల వద్ద వార్డెన్లు ఉండాలి. కేర్ టేకర్లు ప్రతి గదిని పర్యవేక్షించాలి. ఎక్కడైనా సమస్యలు గుర్తిస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. ఇక్కడ మాత్రం వారు కేవలం కార్యాలయాలకే పరిమితమవుతున్నారని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ఇలాంటి ఘటనలకు ఆస్కారం ఏర్పడుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిఘా కెమెరాలు ఏవీ?

వేల సంఖ్యలో విద్యార్థులున్న సంస్థలో నిఘా కెమెరాలు పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలి. విద్యార్థులు, సిబ్బంది కదలికలు ఎప్పటికప్పుడు గమనించేందుకు ఓ వ్యవస్థ పనిచేయాలి. కేవలం అధికారుల కార్యాలయాల వద్ద తప్ప.. మరెక్కడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు.

చెప్పకుండా వెళ్లిపోయిన విద్యార్థినులు

ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళం క్యాంపస్ నుంచి ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థినులు ఎవరి అనుమతి లేకుండా బయటికి వెళ్లిపోయారు. బొబ్బిలికి చెందిన ఓ విద్యార్థినిని రాజాం వద్ద బస్సులో పట్టుకొని కుటుంబ సభ్యులకు అప్పగించగా.. మరో అమ్మాయి గురించి సమాచారం లేకపోయినా అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయకుండా గోప్యంగా ఉంచుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కె.వి.జి.డి.బాలాజీ, ఏవో ముని రామకృష్ణలను వివరణ కోరగా ఇద్దరు విద్యార్థినులు వెళ్లిపోవడం వాస్తవమేనని, వారు వచ్చేశారని.. ఇబ్బంది లేదని తెలిపారు.

ఆరిపోయిన ఆశల దీపం..!

- ట్రిపుల్ ఐటీలో విద్యార్థి ఆత్మహత్య
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

ఎచ్చెర్ల, బలగ, న్యూస్‌టుడే: ఎచ్చెర్ల మండలం షేర్‌మహ్మద్‌పురంలోని ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో ఇంజినీరింగ్ విద్యార్థి ప్రత్తిపాటి సృజన్ (20) బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరులోని ఏటీ అగ్రహారానికి చెందిన సృజన్ పీయూసీ పూర్తిచేసి మూడో సంవత్సరం ఇంజినీరింగ్ (ఈఈఈ) చదువుతున్నాడు. ప్రస్తుతం క్యాంపస్‌లో మిడ్ పరీక్షలు జరుగుతున్నాయి. విద్యార్థులంతా పరీక్షకు వెళ్లిపోగా సృజన్ మాత్రం బాలుర వసతి గృహం నాలుగో అంతస్తులో ఉండిపోయాడు. తర్వాత ఒకటో అంతస్తులో తన స్నేహితుడి గదికి వచ్చి తాడుతో ఫ్యానుకు ఉరివేసుకున్నాడు. ఉదయం 11 గంటల సమయంలో స్నేహితులు వచ్చి చూసేసరికి ఫ్యానుకు తాడు వేలాడుతుండగా, సృజన్ కింద పడి ఉన్నాడు. క్యాంపస్ అధికారులు వెంటనే తలుపులు పగలగొట్టి లోపలకు వెళ్లగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. తల్లిదండ్రులకు సమాచారం అందించి మృతదేహాన్ని శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. తండ్రి కృష్ణప్రసాద్ ఆటోడ్రైవర్. తల్లి జ్యోతి గృహిణి. ఎస్సై వి.సందీప్‌కుమార్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఫిలిమ్ మేకింగ్ అంటే ఇష్టమని, చదవటం ఇష్టం లేదని సృజన్ చెప్పేవాడని తోటి స్నేహితులు పేర్కొన్నారు. దీనికితోడు ఓ జూనియర్ విద్యార్థినితో మాట్లాడుతున్నాడని ఆరోపిస్తూ సీనియర్ విద్యార్థులు బెదిరింపులకు పాల్పడినట్లు సమాచారం. ఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే ఈశ్వరరావు సందర్శించారు. పర్యవేక్షణ పెంచాలని ట్రిపుల్ ఐటీ అధికారులకు సూచించారు.

సృజన్(పాత చిత్రం)

(c) eenadu

జనజీవన ప్రతిబింబం.. కథా సాహిత్యం

ప్రదర్శనలో ఉంచిన పుస్తకాలను చూస్తున్న సందర్శకులు

జనజీవన ప్రతిబింబం కథా సాహిత్యం. సమాజంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ వంటి పలు అంశాలను ఆవిష్కరిస్తూ ప్రతిబింబంగా చేసుకుని రచయితలు రచనలు చేస్తారని పలువురు వక్తలు పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద నగరపాలక సంస్థ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న సిక్కోలు పుస్తక మహోత్సవంలో భాగంగా బుధవారం పుస్తకాల ఆవిష్కరణ, జనజీవన వేదిక ఆధ్వర్యంలో తెలుగు కథలు, గాలు, కవితా పఠనం, సంగీత, నృత్య ప్రదర్శనలు జరిగాయి.

తెలుగు కథ ప్రభవించిన నేల

కొప్పల భానుమూర్తి అధ్యక్షతన కళింగాంధ్ర వచన సాహిత్య సభ నిర్వహించారు. కథా నిలయం కార్యదర్శి దాసరి రామచంద్రరావు మాట్లాడుతూ కళింగాంధ్రలోనే తెలుగు కథ ప్రభవించిందని తెలిపారు. గురజాడ అప్పారావు నుంచి ఇప్పటివరకు ఎందరో రచయితలు కథలు రాశారన్నారు. చరిత్ర వివరించలేనిది సాహిత్యం విశదీకరిస్తుందని పేర్కొన్నారు. రచయితలు భమిడిపాటి గౌరీ శంకర్, పిల్లా తిరుపతిరావు ప్రసంగించారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి కె.లక్ష్మయ్య, సిక్కోలు పుస్తక మహోత్సవం కమిటీ సభ్యులు కేతవరపు శ్రీనివాస్, గొంటి గిరిధర్, కంచరాన భుజంగరావు, సుధాకరరావు, ఉదయ్‌కిరణ్, పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు. తెలుగు కథ మజ్జి దేవిశ్రీ దివంగత అందెశ్రీ కవితా గానంతో నివాళులర్పించారు.

రెండు పుస్తకాల ఆవిష్కరణ

డా.కారా మాస్టారు సాహిత్య వేదికపై రెండు పుస్తకాలు ఆవిష్కరించారు. తెలుగు పండితుడు కూన రంగనాయకులు రాసిన ఆఖరి మెట్టు నవల, కూన కథలు పుస్తకాలను పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ రోణంకి గోవిందరావు ఆవిష్కరించారు. పిసిని వసంత రావు, బీవీ రమణ పుస్తక పరిచయం చేశారు. రచయిత కూన రంగనాయకులు దంపతులను సత్కరించారు. రచయిత ఉదయ్‌కిరణ్ నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో పలువురు రచయితలు, కవులు పాల్గొని కవితా గానం చేశారు.

కూన రంగనాయకులు రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

అబ్బురపరిచిన ప్రయోగాలు

విశ్రాంత ఉపాధ్యాయుడు శివ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పిల్లలకు అర్థమయ్యేలా చేయించిన సైన్స్ ప్రయోగాలు అబ్బురపరిచాయి. డా.ప్రదీప్ సాంకేతిక అనుబంధ అంశాలపై ప్రసంగించారు. జేవీవీ ఉపాధ్యక్షుడు కూర్మారావు, కోశాధికారి మురళీధర్, విశ్రాంత ఎంఈవో లింగరాజు, హరనాథ్, జ్యోతి, శోభారాణి పాల్గొన్నారు.

సైన్స్ ప్రయోగాలను తిలకిస్తున్న విద్యార్థులు

నేటి ప్రదర్శనలు.. ధర్మవరం గ్రామానికి చెందిన కళాకారుల చెక్కభజన, డా.నారాయణ హరిశ్చంద్ర ఏకపాత్రాభినయం, దుర్గ నాట్య కళామండలి (మందస) జానపద గేయాలు, కళాశాల విద్యార్థులు జానపద, పాశ్చాత్య నృత్యాలు ప్రదర్శిస్తారని నిర్వాహకులు తెలిపారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

థర్మల్ ప్లాంట్‌కు భూములు అప్పగిస్తే ఊరుకోం

25న చలో సరుబుజ్జిలి కార్యక్రమం నిర్వహించాలని తీర్మానం

సంఘీభావం తెలుపుతున్న థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: థర్మల్ పవర్ ప్లాంట్ పేరిట నిర్మాణ కంపెనీకి ప్రజల భూములు అప్పగిస్తే ప్రతిఘటన తప్పదని థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. ఈ నెల 25న చలో సరుబుజ్జిలి కార్యక్రమం నిర్వహించాలని తీర్మానించారు. శ్రీకాకుళం నగరంలోని క్రాంతి భవన్‌లో బుధవారం థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పవర్ ప్లాంట్ ఏర్పాటుతో పర్యావరణానికి తీవ్ర ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగాల ఆశచూపి భూములు కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు అసంపూర్తి ప్రాజెక్టులు పూర్తి చేసి పొలాలకు సాగునీరందిస్తామని చెప్పారని, ప్రస్తుతం ఆ భూములు ఇచ్చేయండని అడగడం సబబేనా అని ప్రశ్నించారు. డబుల్ ఇంజిన్ సర్కార్ అని చెప్పుకుంటున్న కేంద్ర మంత్రి నేరడి బ్యారేజ్ కోసం గెజిట్ నోటిఫికేషన్ వచ్చేలా ఎందుకు చర్యలు తీసుకోలేకపోతున్నారని ఆక్షేపించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, ఆదివాసీ వికాస పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి, న్యూడెమోక్రసీ జిల్లా ఉపాధ్యక్షుడు కె. శ్రీనివాసరావు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేవీ జగన్నాథరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. మోహనరావు, థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ కార్యదర్శి ఎన్. అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు

పోటీల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సమాఖ్య ప్రతినిధులు

శ్రీకాకుళం సాంస్కృతికం న్యూస్‌టుడే: వచ్చే నెల 5 నుంచి 7 వరకు తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహించనున్నట్లు శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య కార్యవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్. రామలింగ స్వామి, పన్నాల నరసింహమూర్తి, బంటుపల్లి రామచంద్రదేవ్ తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద రంగస్థల కళాకారుల సమాఖ్య కార్యాలయంలో బుధవారం ఆహ్వాన నాటిక పోటీల కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. శ్రీకాకుళం నగరంలోని బాపూజీ కళామందిరంలో పోటీలు జరుగుతాయన్నారు. తొలిరోజు అందరూ మంచివారే (యడ్లపాడు), క్రతువు (విజయవాడ), 6న అమ్మ చెక్కిన బొమ్మ (హైదరాబాద్), ఎవరు (తెనాలి), 7న సహాన (గుంటూరు), మంచి మనసులు (కాట్రపాడు) నాటిక ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. ప్రదర్శన సమాజాల నిర్వాహకులకు, విజేతలకు పారితోషికం, జ్ఞాపికలు అందజేస్తామన్నారు. సమాఖ్య ప్రతినిధులు ఐ.రమణరావు, బీపీ మోహనరావు, జ్యోతి, ఆశాలతాఖాన్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ కడగండ్లు..?

బాహుదా జలాల సద్వినియోగంతోనే సత్ఫలితాలు

న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

తుపాను హెచ్చరికలు, భారీ వర్ష సూచన వస్తే ఇచ్ఛాపురం ప్రాంత అధికారులు, రైతులు, ప్రజలు ఎగువనున్న ఒడిశా వైపు చూస్తుంటారు. అక్కడ నీరు వదిలితే పంటలు ముంపు బారిన పడతాయి. గ్రామాల్లోకి నీరు చేరే ప్రమాదం ఉంది. ఈ సమస్య దశాబ్దాల నాటి నుంచి ఉన్నా పరిష్కారానికి నోచుకోలేదు.

కొన్ని గంటల ముందు అప్రమత్తత

★ ఒడిశాలో బాహుదా నది ఆధారంగా 109 మీటర్ల ఎత్తున జలాశయాన్ని నిర్మించి 106 మీటర్ల వరకు నీరు నిల్వ చేస్తున్నారు. ప్రవాహం ఎక్కువైతే ఆంధ్రా వైపు ఉన్న గేట్లను ఎత్తివేసి దిగువకు వదులుతున్నారు. ఈ విషయాన్ని కొన్ని గంటల ముందు ఇక్కడి అధికారులకు సమాచారమిస్తుండటంతో సిబ్బందికి ఉరుకులు పరుగులు తప్పడం లేదు.

★ తీర ప్రాంత గ్రామాల ప్రజల్ని అప్రమత్తం చేసి ప్రాణ నష్టం లేకుండా పర్యవేక్షిస్తున్నా పంటలు ముంపు బారిన పడుతున్నాయి.

★ సరిహద్దులో ఆంధ్రాకు ఆనుకుని ఒడిశా గ్రామాలు ఉన్నాయి. ఆ రాష్ట్ర వాసులకు తాగు, సాగునీరు ఇబ్బంది లేకుండా మినీ ఎత్తిపోతల పథకాలను నిర్వహిస్తున్నారు గొట్టాల ద్వారా నీరు నేరుగా చేరేలా ఏర్పాట్లు చేశారు. ఆ ప్రాంతంలో వ్యవసాయం చక్కగా సాగుతోంది.

★ ఆంధ్రా పరిధి బొడ్డబడలో నీరు ప్రవేశించిన తర్వాత అడ్డుకట్ట వేయడానికి ఎలాంటి నిర్మాణాలు లేవు. ఈదుపురంలో ఎత్తిపోతల పథకం ఉన్నప్పటికీ అరకొరగా సేవలందిస్తోంది.

బెల్లుపడ వద్ద నివాసాల వద్దకు చేరిన వరద

ఏం చేయాలి..

- 11 ఓపెన్ హెడ్ ఛానళ్లను అభివృద్ధి చేసి వాటి పరిధిలో ఉన్న పెద్ద చెరువులకు కాలువలను అనుసంధానం చేయాలి. భారీ వర్షాలకు చేరిన నీటితో చెరువులు నిండి పంటలు పండుతాయి.
- మినీ ఎత్తిపోతల పథకాల ద్వారా తీరానికి దూరంగా ఉన్న బాలకృష్ణాపురం, మండపల్లి, కేదారిపురం, ముచ్చింద్ర, తిప్పనపుట్టుగ, బలరాంపురం తదితర ప్రాంతాలకు నీరు చేర్చొచ్చు.
- తీరంలో ఆక్రమణలు తొలగించి నదిలో ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేసి పరిరక్షించాలి.

వరద ఎంత వచ్చినా ఆంధ్రా గ్రామాలు, పంటల మీదుగా ప్రవహించి డొంకూరు వద్ద సముద్రంలో కలుస్తోంది.

★ ఇటీవల మొంథా తుపాను కారణంగా నదికి 52 వేల క్యూసెక్కుల నీరు చేరితే చివరికి 10 వేల క్యూసెక్కుల జలాలు మిగిలాయి. మిగిలినవన్నీ సముద్రం పాలయ్యాయి. ఒక్కోసారి నీరు వెళ్లకుంటే పొగురుతీత ద్వారా సాగరానికి మళ్లిస్తున్నారు. గత ప్రభుత్వం మినీ ఎత్తిపోతల పథకాలు నిర్మిస్తామంటూ హడావుడి చేసినా కార్యరూపం దాల్చలేదు.

ప్రతిపాదనలకే పరిమితం

★ బాహుదా జలాల వినియోగంపై 1996లో అప్పటి శాసనసభాపతి కావలి ప్రతిభాభారతి ఆధ్వర్యంలో 12 మంది ఎమ్మెల్యేల బృందం అధ్యయనం చేసింది.

★ అరకభద్ర వద్ద జలాశయం నిర్మించాలని ప్రతిపాదించారు. బెల్లుపడ వద్ద సిద్ధి చెరువును మినీ రిజర్వాయర్‌గా మార్పు చేసి 11 ఓపెన్ హెడ్ ఛానళ్ల ద్వారా ఇచ్ఛాపురం, కవిటి మండలాలకు నీరందించొచ్చని అప్పటి ఎమ్మెల్యే దివంగత దక్కత అచ్యుతరామయ్యరెడ్డికి సూచించారు. సర్వే కోసం రూ.40 కోట్లు కేటాయించారు. అధ్యయనం జరిగినా కార్యరూపం దాల్చలేదు.

నీటి వినియోగానికి కృషి

ఒడిశాలోని భగలట్టి జలాశయం నుంచి నీరు వదిలితే ఆందోళన చెందాల్సి వస్తోంది. వాస్తవానికి ఏడాది పొడవునా 1.5 టీఎంసీల నీరు దిగువకు వదలాలి. ఈ అంశాలపై ఒడిశా ప్రభుత్వంతో చర్చించి కొలిక్కి తీసుకొస్తాం. 2 నెలల కిందట జల వనరుల శాఖ ఉన్నతాధికారుల బృందం పర్యటించింది. ఆ నివేదిక ఆధారంగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– బెందాళం అశోక్, ప్రభుత్వ విప్

బుడితిలో భారీ చోరీ

చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్సై అనీల్‌కుమార్

సారవకోట, న్యూస్‌టుడే: మండలంలోని బుడితి గ్రామం కొసన్నపేట వీధిలో తంగుడు వెంకటరమణ ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదును గుర్తు తెలియని వ్యక్తులు తస్కరించారు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. వెంకటరమణ, భార్య జయలక్ష్మి, పిల్లలతో కలిసి ఈనెల 8న దైవదర్శనానికి తిరుపతి వెళ్లారు. ఇంటి తాళాన్ని పక్కింట్లో ఉంటున్న బి.రాజుకు అప్పగించారు. తీర్థయాత్ర ముగించుకుని బుధవారం సాయంత్రం ఇంటికి చేరారు. ప్రధాన తలుపు తెరిచి ఉన్నట్లు గుర్తించి, విషయాన్ని అక్కడే ఉన్న రాజు తల్లి సూరమ్మకు తెలియజేశారు. ఆమె కుమారుడు రాజుకు ఫోన్ ద్వారా విషయాన్ని చెప్పడంతో హుటాహుటిన 100కు ఫోన్ చేసి చోరీ జరిగిన విషయాన్ని తెలియజేశారు. ఇంట్లో ఉంచిన 12 తులాల బంగారు ఆభరణాలు, 3 కిలోల వెండి, పిల్లల చదువుల కోసం ఫీజు చెల్లించడానికి ఉంచిన రూ.1.5 లక్షలు నగదు పోయినట్లు వెంకటరమణ పేర్కొన్నారు. ఎస్‌ఐ బి.అనీల్‌కుమార్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించడంతో క్లూస్ టీం, నరసన్నపేట సీఐ ఎం. శ్రీనివాసరావు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడి దుర్మరణం

కంచిలి, న్యూస్‌టుడే: సోంపేట-జాడుపూడి రైల్వే స్టేషన్ల మధ్యలో రైలు ఢీకొని సుమారు 60-65 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు బుధవారం గుర్తించామని పలాస జీఆర్పీ పోలీసులు తెలిపారు. మృతుడి శరీరంపై తెలుపు, నలుపు రంగుల హాఫ్ హ్యాండ్స్ షర్ట్, గులాబీ రంగు లుంగీ ధరించి ఉన్నట్లు వివరించారు. పలాస జీఆర్పీ ఎస్సై ఎ.కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాల కోసం 94406 27567, 94922 50069 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

గ్రానైట్ కార్మికుడి మృతి

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: పరశురాంపురం గ్రామానికి చెందిన గ్రానైట్ కట్టర్ గేదెల ఎర్రయ్య (45) బుధవారం రావవలసలోని ఓ గ్రానైట్ క్వారీ వద్ద మృతి చెందారు. అస్వస్థతకు గురైన ఆయన్ను తోటి కార్మికులు టెక్కలి జిల్లా ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ కన్నుమూశారు. రాయిపై కూర్చుని ఉన్న సమయంలో కుప్పకూలినట్లు క్వారీ యాజమాన్యం చెబుతుండగా, మృతి చెందిన వరకు తమకు సమాచారం ఇవ్వలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పరిస్థితి గందరగోళంగా మారడంతో టెక్కలి పోలీసులు ఆసుపత్రికి చేరుకుని సమీక్షించారు. కాసేపటికి స్థానిక పెద్దల సూచనతో మృతదేహాన్ని గ్రామానికి తరలించారు. ఎర్రయ్యకు భార్య సరోజిని, వివాహమైన కుమార్తె, కుమారుడు ఉన్నారు.

చెరువులో మహిళ మృతదేహం

అంపోలు శకుంతల

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: మండలంలోని పురుషోత్తపురం గ్రామ సమీపంలో చెరువులో అంపోలు శకుంతల(40) అనే మహిళ మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈమె ఈనెల 10న ఇల్లు విడిచివెళ్లిపోయింది. అప్పటి నుంచి గాలిస్తుండగా బుధవారం చెరువులో శవమై కనిపించింది. ఈమెకు భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతికి గల కారణాలు తెలియలేదు. కన్నవారిది నరసన్నపేట మండలం చోడవరం గ్రామం. పోస్టుమార్టం కోసం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. ఆమె తండ్రి కంచరాపు రమణారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.హైమావతి తెలిపారు.

మస్కట్‌లో జిల్లా మహిళ అనుమానాస్పద మృతి

నాగమణి (పాతచిత్రం)

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ఆమదాలవలస మండలం వెదుళ్లవలస గ్రామానికి చెందిన సవలాపురపు నాగమణి (28) మస్కట్ దేశంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. నాగమణి జీవనోపాధి నిమిత్తం నాలుగేళ్లుగా అక్కడే పనిచేసి కొంతకాలం కిందట వచ్చేశారు. తిరిగి నాలుగు నెలల కిందటే ఏజెంట్ ద్వారా మస్కట్ వెళ్లారు. పనిచేస్తున్న దగ్గర వేధిస్తున్నారని, చాలా ఇబ్బంది పెడుతున్నారని, వచ్చేస్తానని తల్లికి ఫోన్‌చేసి చెప్పింది. ఇంతలోనే గత ఆదివారం నాగమణి ఆత్మహత్య చేసుకున్నట్లు ఏజెంట్ ఫోన్ చేసి చెప్పినట్లు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. తన సోదరి ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, ఎవరో చంపేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని సోదరుడు మధు ఆరోపిస్తున్నారు. జరిగిన విషయాన్ని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు చెప్పడంతో ఆయన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. విదేశాంగ శాఖ అధికారులతో మాట్లాడి మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

వసతిగృహ విద్యార్థిపై లైంగిక దాడి

రణస్థలం, న్యూస్‌టుడే: రణస్థలంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో ఆరోతరగతి చదువుతున్న విద్యార్థిపై అదే వసతి గృహంలో ఉంటున్న నలుగురు తొమ్మిదో తరగతి విద్యార్థులు లైంగిక దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. పోలీసుల కథనం మేరకు. . ఈ నెల 6న వేరే గదిలో ఉన్న ఆరో తరగతి విద్యార్థిని నలుగురు తొమ్మిదో తరగతి విద్యార్థులు గదికి పిలిచి లైంగిక దాడి చేయగా పదోతరగతి చదువుతున్న విద్యార్థి ట్యాబ్‌లో వీడియో తీశాడు. దీన్ని మరో విద్యార్థి సెల్‌కు పంపడంతో అందరికీ విషయం తెలిసి పాఠశాల ప్రధానోపాధ్యాయుడి దృష్టికెళ్లింది. దీంతో ఐదుగురు విద్యార్థులకు మంగళవారం టీసీలిచ్చి ఇచ్చి పంపించేశారు. బాధిత విద్యార్థి గొంతు నొప్పిగా ఉందని రణస్థలం సామాజిక ఆసుపత్రికి వెళ్లి వైద్యులకు జరిగిన విషయాన్ని చెప్పాడు. వైద్య సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేయాలని చెప్పడంతో బాధిత విద్యార్థి బుధవారం ఫిర్యాదు చేశాడు. దీంతో పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

పోక్సో కేసులో వృద్ధుడి అరెస్టు

నరసన్నపేట: నరసన్నపేట మండలంలోని ఓ ప్రాంతానికి చెందిన ఏడేళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన 70 ఏళ్ల వృద్ధుడిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సదరు వృద్ధుడు ఈనెల 9న బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో 10న పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై దుర్గాప్రసాద్ చెప్పారు. టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

గంజాయి రవాణా కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, పాతబస్టాండ్, న్యూస్‌టుడే: గంజాయి అక్రమంగా తరలిస్తూ పోలీసులకు చిక్కిన ఇద్దరికి పదేళ్ల జైలు, ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా అదనపు మొదటి సెషన్స్ జడ్జి పి.భాస్కరరావు తీర్పు వెల్లడించారని బుధవారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 2017 నవంబరు 30న విశాఖ నుంచి ఒడిశాలోని భువనేశ్వర్‌కు వెళ్తున్న రెండు కార్లను ఎచ్చెర్ల పోలీసుస్టేషన్ పరిధి చిలకపాలెం పాత టోల్‌గేటు వద్ద పోలీసులు తనిఖీ చేయగా 200 కిలోల గంజాయి లభ్యమైంది. పశ్చిమగోదావరి జిల్లా తణుకు పాత పట్టణానికి చెందిన ఇమంది వీర వెంకట సత్యనారాయణ, ఇమంది సాయి మధుసూదనరావులపై కేసు నమోదు చేశారు. విచారణలో వారిపై నేరం రుజువు కావడంతో జడ్జి శిక్ష ఖరారు చేశారని ఎస్పీ పేర్కొన్నారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి: ఎంపీ

క్షతగాత్రుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీ అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఈశ్వరరావు

లావేరు, శ్రీకాకుళం గ్రామీణం, బలగ, న్యూస్‌టుడే: జలుమూరు మండలం అచ్యుతాపురం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లావేరు మండలం గుర్రాలపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు మృతి చెందగా 9 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, జెమ్స్ ఆసుపత్రుల్లో చికిత్సపొందుతున్న విషయం తెలుసుకున్న విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పరామర్శించారు. వైద్యసేవలపై ఆర్డీవో కె.సాయిప్రత్యూషను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారందరికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఎంపీ, ఎమ్మెల్యే ఆదేశించారు.

పలకలు ఏర్పాటు చేశారు

స్పందనకు వందనం

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: తాడివాడలో మూతపడిన ప్రాథమిక పాఠశాల వద్ద ఎన్ఆర్ఈజీఎస్‌కు సంబంధించిన పని వివరాలు తెలిపే సిమెంటు పలకలు మూలనపడి ఉన్నాయి. పని చోట ఏర్పాటు చేయకుండా వదిలేయడంతో ఈ నెల 5న 'పనొక దగ్గర..పలకొక చోట' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఈసీ హరినాథ్ పర్యవేక్షణలో అక్కడ నుంచి తొలగించి పని వద్ద ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు.

జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శ్రీకాకుళం

టెండర్ ప్రకటన

Rc.No.02/SCESP/DBCS/2025-26. Date: 12.11.2025

జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శ్రీకాకుళం వారికి బడి పిల్లల కంటి అద్దములు సరఫరా చేయుటకు టెండర్లు ఆహ్వానించడమైనది. టెండర్ దరఖాస్తులను srikakulam.ap.gov.in వెబ్ సైట్ నుండి తేది 12.11.2025 నుండి 19.11.2025 వరకు డౌన్లోడ్ చేసుకోవలెను. టెండర్ దరఖాస్తులు సమర్పించుటకు ఆఖరు తేది 19.11.2025 మరియు కార్యాలయం పనిదినములలో సమయం: ఉదయం 11.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు సమర్పించవలెను. మరింత సమాచారం కొరకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ, అప్తాల్మిక్ వార్డ్, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, శ్రీకాకుళం వారిని సంప్రదించగలరు. టెండర్ అంగీకరించుటకు గాని రద్దు చేయుటకు గాని వాయిదా వేయుటకు గాని జాయింట్ కలెక్టర్ / ఛైర్మన్, జిల్లా కొనుగోలు కమిటీ శ్రీకాకుళం జిల్లా వారికి పూర్తి అధికారం కలదు. తదుపరి వివరాలు కొరకు ఈ దిగువ ఫోన్ నెంబర్‌నకు సంప్రదించండి : 8309334894, 9030731454.

District Programme Manager, DBCS, Srikakulam	District Medical & Health Officer, Vice Chairman, DBCS, Srikakulam	District Collector & Chairman DBCS, Srikakulam

దిశ మారింది.. ముంచేస్తోంది!

కోతకు గురవుతున్న నాగావళి తీరం

న్యూస్‌టుడే, శ్రీకాకుళం గ్రామీణం

శ్రీకాకుళం గ్రామీణ మండలం పెద్దపేట సముద్ర తీర ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం రూ.1.50 కోట్లతో 1.5 కిలోమీటర్ల మేర సీసీ రహదారి నిర్మించింది. ఈ మార్గం పర్యాటకులు, మత్స్యకారులకు ఎంతో ఉపయోగపడింది. ఇది లేనప్పుడు మత్స్య సంపదను తీరం నుంచి గ్రామానికి తీసుకురావడానికి ఇబ్బందులు పడేవారు. పర్యాటకులు గమ్యస్థానాలకు చేరడానికి చాలా సమయం పట్టేది. నాగావళి నదీ తీరం దిశ మార్చుకోవడంతో తీర ప్రాంతం దారుణంగా కోతకు గురవుతోంది. సమస్య తీవ్రతను ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. చెన్నై నుంచి వచ్చిన నిపుణుల కమిటీ అధ్యయనం చేసి నివేదికను కలెక్టర్‌కు అందజేసింది. ఆయన రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ద్వారా దిల్లీలోని జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థకు పంపారు. నిధులు మంజూరు కాకపోవడంతో అక్కడితో ఆగిపోయింది.

తుపాను దెబ్బకు ధ్వంసం

ఇటీవల మొంథా తుపాను ధాటికి తీర ప్రాంతం మరింత ఎక్కువగా కోతకు గురైంది. సరుగుడు, జీడి మామిడి చెట్లు నదిలో పడి సముద్రంలో కలిసిపోయాయి. తీర ప్రాంతం వరకు నిర్మించిన సీసీ రహదారి 15 మీటర్ల మేర నదీ గర్భంలో కలిసిపోయింది. భవిష్యత్తులో మరింత నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

నదిలో సీసీ రహదారి కలిసిపోయిన ప్రాంతం

రహదారి పొడవు	నిర్మాణ ఖర్చు	కొట్టుకు పోయింది	నష్టం
1.5 కి.మీ.	రూ.1.5 కోట్లు	15 మీటర్లు	రూ.1.5 లక్షలు

పర్యాటకుల తాకిడి

ప్రస్తుతం కార్తిక మాసం కావడంతో పర్యాటకులు పెద్దఎత్తున వస్తున్నారు. ఈ ప్రాంతం అత్యంత ప్రమాదకరంగా ఉంది. నది, సముద్రం కలిసే ప్రదేశం కావడంతో ముప్పు పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు. సుమారు 5 వేల మందితో ఘనంగా నిర్వహించిన యోగాంధ్ర ప్రాంగణం నదిలో కలిసిపోంది. ఇక్కడికి సమీపంలోని 5 గ్రామాల ప్రజలు సముద్రంలో వేట సాగించలేక వలస బాట పడుతున్నారు.

నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తాం..

నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా సుమారు రూ.94.50 కోట్లతో నది దిశ మార్చడానికి చేయాల్సిన ఏర్పాట్లకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

- సత్యనారాయణ, ఉపసంచాలకుడు, మత్స్య శాఖ, శ్రీకాకుళం

ప్రజలు ఉద్యమిస్తున్నా పట్టించుకోరా?


మాట్లాడుతున్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: తాము అధికారంలోకి వస్తే కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించిన వైద్య కళాశాలలను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొస్తామని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని డే అండ్ నైట్ కూడలి నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు బుధవారం వైకాపా ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. మాజీ సభాపతి తమ్మినేని సీతారాం, ఆ పార్టీ సమన్వయకర్త కుంభా రవిబాబుతో కలిసి తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్మాన మాట్లాడారు. 'కూటమి ప్రభుత్వం పేదలకు వైద్య సేవలు, విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తోంది. కొందరి స్వార్థ ప్రయోజనాల కోసం 17 వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారు. ప్రజలు ఉద్యమిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు' అని విమర్శించారు.

పోలీసులతో వాగ్వాదం

వైకాపా ప్రదర్శనకు అనుమతి లేదని డీఎస్పీ వివేకానంద మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు నచ్చజెప్పారు. 100 మందికి పైగా ఒకేసారి వచ్చి ట్రాఫిక్ ఆంక్షలను ఉల్లంఘించడం సరికాదని సూచించారు. ప్రజల పక్షాన పోరాడే హక్కును కాలరాస్తున్నారని.. ఈ విధానం సరికాదని ధర్మాన వాదించారు. డీఎస్పీని విదిలించుకుంటూ ప్రదర్శనగా వెళ్లారు. తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని వినతి పత్రం అందజేశారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	145	245	265

EENADU Classifieds

JOBS

క్రాంట్రాక్ట్ / ఔట్ సోర్సింగ్ పద్ధతిలో వైజాగ్, VZM, SKLM జిల్లాల్లో మైన్స్, హస్పిటల్స్, బ్యాంక్స్, స్కూల్స్, చెక్ పోస్ట్ ఆపరేటర్స్, అటెండర్స్, డేటాఎంట్రీ & కంప్యూటర్ ఆపరేటర్స్, జూనియర్&రికార్డ్ అసిస్టెంట్స్, P.O's క్లర్క్స్, GNM, స్పీచ్‌థెరపీ, ఫిజియోథెరపీ, ECG&Lab టెక్నీషియన్స్ 10th, ఏనీ డిగ్రీ, ITI, B.Tech. ఆల్ బ్రాంచ్. Age:18 to 42 జీ:20 to 50k M/F ✆9908656555.

RK సోలార్ టెక్ సొల్యూషన్స్ (ఆథరైజ్డ్ డిస్ట్రిబ్యూటర్స్), శ్రీకాకుళం నందు ఇంటి వద్దనే ఉండి నెలకు 30 వేలు రూ. పైబడి సంపాదించే అవకాశం కలదు. (మహిళలకు మాత్రమే) ✆ 8985834777, 8919884223, 7981829449.

మదర్‌ని చూసుకోవడానికి మహిళ కావలెను, లోలుగు, శ్రీకాకుళం జిల్లా జీతం: 13000/ కాంటాక్ట్: 9424933002.

FACULTY/ TEACHERS

ఎలక్ట్రికల్, డీజిల్ మెకానిక్, వెల్డర్, ఫిట్టర్ ట్రేడ్స్ బోధించుటకు టీచర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. శ్రీ కోటదుర్గ ITI, శ్రీకాకుళం ✆ 7337368699.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

(c) eenadu

పలాస
• పలాస • ఇచ్ఛాపురం

దుకాణాలు ముందుకొస్తున్నాయి..

మందస మండలం హరిపురం వ్యాపార రీత్యా దిన దినాభివృద్ధి చెందుతోంది. ఆ క్రమంలోనే ఆక్రమణలు చోటుచేసుకుంటున్నాయి. అంబేడ్కర్ కూడలి వద్ద కాయగూరల దుకాణాలు పోటాపోటీగా ముందుకొస్తున్నాయి. కొనుగోలు దారులు వారి వాహనాలు షాపుల ముందు రహదారిపై నిలుపుతున్నారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. కాయగూరల దుకాణాలకు ఎదురుగా ప్రయాణికుల కోసం ప్రైవేటు వాహనాలు నిలిపి ఉండటం కూడా కూడలి ఇరుకుకు మరో కారణం. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు బస్సుల కోసం కూడలికి చేరుతారు. ఆ సమయంలో కూడలి జనంతో కిక్కిరిసి ఉంటుంది. దీంతో దుకాణాలు ముందుకు రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కూడలిలో కానిస్టేబుల్‌ను నియమిస్తామని, ముందుకొచ్చే దుకాణదారులపై చర్యలు తీసుకుంటామని మందస ఎస్సై కె.కృష్ణప్రసాద్ తెలిపారు. – న్యూస్‌టుడే, హరిపురం (మందస)

కూడలిలో రోడ్డుపైకి వచ్చిన దుకాణాలు

సుజల'ధార' వృథా..

మందస మండలం కొండలోగాం పంచాయతీ చాపరాయివీధికి సంబంధించి రహదారి పక్కన అభివృద్ధి పనులు చేపట్టేందుకు పొక్లెయిన్‌తో బుధవారం నేల చదును చేస్తుండగా భూమిలో ఉన్న సుజలధార పైపు పాడైంది. దీంతో నీరు వృథాగా పోతోంది. కొత్తపైపు ఏర్పాటు చేస్తామని సర్పంచి ఎస్.రోజా తెలిపారు. – న్యూస్‌టుడే, హరిపురం (మందస)

ప్రణాళిక.. లక్ష్యం.. తగిన కృషి ఉంటే విజయమే

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: విద్యార్థికి ఒక లక్ష్యం.. దానిని చేరుకునేందుకు అవసరమైన ప్రణాళిక వేసుకుని వాటిని చేరుకునేలా కృషి చేస్తే, విజయం బానిస అవుతుందని మానసిక చైతన్య నిపుణులు, ఎస్‌వీడీ శిక్షకులు, వ్యాయామోపాధ్యాయులు రోజారమణి లిమ్మేష్ అన్నారు. ఇచ్ఛాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు)లో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు చేపట్టాల్సిన అంశాలు వివరించారు. ఈ సదస్సుకు ప్రిన్సిపల్ చింతాడ శరత్‌బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రోజారమణిని ఆయన సత్కరించారు. అధ్యాపకులు ఎన్.రమేష్, బి. సురేష్, పి.సురేష్‌కమార్, పాపారావు పాల్గొన్నారు.

రోజారమణి లిమ్మేష్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపల్ శరత్‌బాబు

పక్కా దారి వచ్చింది

బైపల్లి బీటీ రోడ్డు వంతెన నుంచి గ్రామంలోకి వెళ్లే మట్టి దారితో గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. దీనిపై ఇటీవల 'మట్టిదారి మారదా మరి' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ నాగభూషణం పర్యవేక్షణలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

స్పందనకు వందనం

పొదల తొలగింపు

అక్కుపల్లి నుంచి ఎం.గడూరు మీదుగా మెట్టూరు వెళ్లే రహదారి ఇరువైపులా ముళ్ల తుప్పలు పెరగడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై సెప్టెంబరు 21న 'పొదలతో ఇక్కట్లు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పొదలు తొలగించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

తిరగని మోటార్లు.. నీటికి ఇక్కట్లు

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి సోంపేట మండలాలకు సంబంధించి ఐదు ఎత్తిపోతల పథకాలున్నాయి. వీటి ద్వారా సుమారు 2 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. మరమ్మతులకు గురికావడం, నిర్వహణ లోపం వల్ల పథకాలన్నీ మూలకు చేరడంతో రైతులు అవస్థలు పడుతున్నారు.

● ఈదుపురం బాహుదానదిపై 18 ఏళ్ల కిందట నిర్మించిన పథకం మరమ్మతులకు గురై శిథిలావస్థకు చేరింది. సమీప పంట పొలాలకు నీరందక బాహుదానదిపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. 2017లో ఈ విషయమై ఎమ్మెల్యే బెందాళం అశోక్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి రూ.30 లక్షలు మంజూరు చేసి పథకాన్ని పునరుద్ధరించారు. రెండేళ్లు పనిచేసి మళ్లీ మరమ్మతులకు గురైంది. ప్రభుత్వం మారడంతో మరమ్మతులకు నోచుకోక మూలకు చేరింది. దీనివల్ల రైతులు ఇబ్బందిపడుతూ ఇంజిన్లతో నీటిని తోడి పంట పొలాలకు అందించాల్సిన దుస్థితి ఏర్పడింది.

ఈదుపురం వద్ద మూలకు చేరిన ఎత్తిపోతల పథకం

● సోంపేట మండలం పొత్తంగి, రుషికుద్ద, బెంకిలి వద్ద మరో మూడు ఎత్తిపోతల పథకాలుండగా అందులో ఒకటి అరకొరగా పనిచేస్తుంది. మిగిలిన రెండు 7 ఏళ్లుగా మరమ్మతులకు గురవ్వడంతో ఆ ప్రాంతంలో ఉన్న 700 ఎకరాలకు నీరందడం లేదు.

● ఈ పథకం ద్వారా కవిటి, ఇచ్ఛాపురం మండలాల్లో ఈదుపురం, కొళిగాం, పుర్రాకులం, తులసిగాం, దర్బపురం, బైరిపురం, పట్టిపుట్టుగ, విద్యగిరి, రాజపురం, లండారిపుట్టుగ గ్రామాల్లోని సంబంధించి ఆయకట్టు సుమారు 1,250 ఎకరాలకు నీరు అందేది. ప్రస్తుతం మరమ్మతులకు గురై దిష్టిబొమ్మలా మారింది. ఇప్పటికైనా పాడైన మోటార్, పైపులైన్లకు నిధులు మంజూరుచేసి వచ్చే ఖరీఫ్ సీజన్‌కైనా నీరందించాలని రైతులు కోరుతున్నారు.

● కంచిలి మండలం కుత్తుమ వద్ద ఆయకట్టుకు సంబంధించి 250 ఎకరాలకు పైగా పంట పొలాలకు ఈ పథకం ద్వారా నీరు అందేది. ఆరేళ్ల కిందట మరమ్మతులకు గురికావడంతో రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

● మహేంద్రతనయ నదిపై జగతికేశవపురం వద్ద నిర్మించిన పథకం కూడా పనిచేయడం లేదు. వీటి ద్వారా అధికారికంగా 900 ఎకరాలు, అనధికారికంగా మరో 400 ఎకరాలకు సాగునీరు అందేది.

"పథకాలు పనిచేసేందుకు శాశ్వత పనులకు ప్రస్తుతం రూ.11.18 కోట్ల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం. –జి.మధుసూదన్, ఏఈ, ఇచ్ఛాపురం"

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

పలాస : 80085 74279 ఇచ్ఛాపురం : 90631 44707

?: పలాస మండలం రెంటికోట పొందర వీధిలో ఒకపక్క కాలువ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. - స్థానికులు
● పరిశీలించి, సమస్యను పరిష్కరిస్తాం. - సద్దుణ, పంచాయతీ కార్యదర్శి, రెంటికోట – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

?: మామిడిపల్లి పంచాయతీ పాత్రపురంలో నాలుగు నెలలుగా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి సమయాల్లో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. - స్థానికులు
● ఎల్‌ఈడీ బల్బులు ఏర్పాటుచేసినా కొత్త దీపాలు అమర్చినా పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. - శైలజ, పంచాయతీ సెక్రటరీ, మామిడిపల్లి – న్యూస్‌టుడే, సోంపేట

?: సత్యసాయిబాబావీధి ముంగిట మురుగు నీటి సమస్య తీవ్రంగా ఉంది. దీనివల్ల ఇబ్బందులు పడుతున్నాం. - పి.రామరాజు, ఇచ్ఛాపురం
● పుర పరిధి వరకు కాలువల నిర్మాణం చేపట్టి, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటాం. - ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

నీరు పట్టేదెలా..

తేలుకుంచి ప్రధాన రహదారిలో తాగునీటి బోరు శిథిలావస్థకు చేరింది. బోరుకు కింది భాగంలో చప్టా సగం శిథిలమైంది. దీనికి తోడు పక్కనే కాలువ ఉండటంతో నీటిని సేకరించేందుకు ఇబ్బందులు తప్పడంలేదు. ఒక్కోసారి ప్రమాదాలకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి కల్పనను వివరణ కోరగా త్వరలోనే సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

శిథిల భవనం.. భయం.. భయం

కవిటి మండలం పుక్కళ్లపాలెంలో నివాసాల మధ్యనే శిథిల తుపాను రక్షిత భవనం ఉంది. దీంతో చుట్టు పక్కల నివాసముంటున్న వారు భయపడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ప్రమాదం జరగకముందే భవనాన్ని తొలగించాలని కోరుతున్నారు. దీనిపై డీటీ ఎం.కృష్ణమూర్తిని వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

పగటి వెలుగులు

పలాస మండలం కమలాపురం ప్రధాన వీధిలో ఆరు వీధి దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. దీంతో దీపాలు మరమ్మతులకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ మాత్రమే వెలిగి పగటి సమయంలో ఆరేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఇదే విషయం పంచాయతీ కార్యదర్శి రవి దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

బాబోయ్ కుక్కలు..!

హరిపురం పరిధిలో మాంసం దుకాణాలు పది ఉన్నాయి. ఈ దుకాణాల్లోని వ్యర్థాలను కొద్ది దూరంలో రహదారి పక్కనే పడేస్తున్నారు. వాటిని తిని కుక్కలు ఆ దుకాణాల ముందు రహదారిపై గుంపులుగా తిష్ఠ వేస్తున్నాయి. దీంతో వాహనదారులు, బాటసారులు ఆ ప్రదేశాన్ని దాటేందుకు భయపడుతున్నారు. శునకాలను పట్టించి దూర ప్రాంతంలో విడిచిపెట్టడానికి చర్యలు తీసుకుంటామని సర్పంచి పురుషోత్తం తెలిపారు. – న్యూస్‌టుడే, హరిపురం (మందస)

నివాసాల నడుమ మురుగు..

ఇచ్ఛాపురం పుర పరిధి మూడోవార్డు ఏఎస్‌పేట కాలనీలో దుస్థితి ఇది. నివాసాలకు ఆనుకుని ఖాళీ స్థలంలో మురుగునీరు తిష్ఠ వేసి ఉంది. అక్కడే కొందరు పశువులు కడుతున్నారు. మరికొందరు తమ సామగ్రిని పెడుతున్నారు తప్ప మురుగుపోయే మార్గాన్ని చూడటం లేదని పలువురు వాపోయారు. దుర్వాసన, దోమలతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎంఎస్ఐ ఉపేంద్రకుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

కూటమితోనే నిరుపేదలకు మేలు

కవిటి గ్రామీణం, ఇచ్ఛాపురం, పలాస న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలోని నిరుపేదలకు మేలు జరుగుతుందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, పలాస ఎమ్మెల్యే శిరీష అన్నారు. బుధవారం తన క్యాంపు కార్యాలయం రామయ్యపుట్టుగలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) 2.0 లబ్ధిదారులకు గృహ నిర్మాణ పత్రాలు అందజేశారు. ఇచ్ఛాపురం పుర పరిధిలో పీఎంఏవై 2.0 బీఎల్‌సీ పథకం కింద 123 మంది లబ్ధిదారులకు గృహ మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాల్లో నివసించే నిరుపేదలు ఇళ్లు లేకుండా ఉండకూడదనే లక్ష్యంతో పట్టణ పేదలకు ఈ పథకం ద్వారా ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ సుధాకర్, ఇచ్ఛాపురం పుర కమిషనర్ రమేష్, రాష్ట్ర బీసీ సాధికారిక సమితి కన్వీనర్ కొండా శంకర్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు. ❖ పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో గృహనిర్మాణశాఖ ఆధ్వర్యంలో 27వ వార్డులో భూమి పూజ, గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఇళ్లులేని వారంతా దరఖాస్తు చేసుకోవాలని, మంజూరైన వారంతా గృహనిర్మాణాలు ప్రారంభించాలని ఎమ్మెల్యే శిరీష కోరారు. ప్రత్యేకాధికారి మధు, గృహనిర్మాణశాఖ అధికారులు పాల్గొన్నారు.

రామయ్యపుట్టుగలో లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్

బాధ్యతగా పనిచేస్తేనే గెలుపు

పలాస, న్యూస్‌టుడే: పదవులు పొందామనే సంతోషంతో ఉండిపోకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో బాధ్యతగా పనిచేస్తేనే గెలుపు సాధించగలమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస తెదేపా కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ మండల అధ్యక్ష, కార్యదర్శులు, కన్వీనర్లు, కోకన్వీనర్లు, యూనిట్ ఇన్‌ఛార్జుల ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం నిర్వహించారు. కొంతమంది సోషల్ మీడియాలో రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తుంటారని, అలాంటివి మనసులో పెట్టుకోకుండా పనిచేయాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిచోటా తెదేపా జెండా ఎగరవేయాలని కోరారు. జిల్లా మాజీ అధ్యక్షుడు, పలాస నియోజకవర్గ పరిశీలకుడు చౌదరి బాబ్జి, టీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు, బీసీ విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.కామేశ్వరరావు, నాయకులు విఠల్, రమణ, నరేంద్రబాబు, తాతారావు, శ్రీకాంత్ పాల్గొన్నారు. ❖ ఆపదలో ఉన్న వారికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే శిరీష అన్నారు. పలాస తెదేపా కార్యాలయంలో 12 మంది లబ్ధిదారులకు రూ. 10.8 లక్షల చెక్కులను అందజేశారు.

పలాస తెదేపా కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రణాళికాబద్ధంగా పరీక్షలు జరగాలి

వజ్రపుకొత్తూరు గ్రామీణం, పలాస పట్టణం: రానున్న విద్యాసంవత్సరంలో పబ్లిక్ పరీక్షలు ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి ఆర్.సురేష్‌కుమార్ అన్నారు. వజ్రపుకొత్తూరులోని గోవిందపురం జూనియర్ కళాశాలలో బుధవారం దస్త్రాలు పరిశీలించారు. ❖ పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల కంప్యూటర్ సైన్సు విద్యార్థులు ఆన్ ది జాబ్ ట్రైనింగ్ (ఓజేటీ) పొందుతున్న కాశీబుగ్గలోని మాస్టర్ కంప్యూటర్స్ ఎడ్యుకేషన్ సంస్థను డీఐఈవో సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రిన్సిపల్ ఎస్.భీమేశ్వరరావు, అధ్యాపకులు తమ్మినేని వాసుదేవరావు, ఎన్.జయప్రకాష్ ఆచారి పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఈవో సురేష్‌కుమార్

పనులు పూర్తి చేయాలి

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించి గుర్తించిన ఉపాధి పథకం పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రాజెక్టు డైరెక్టర్ సుధాకర్ అన్నారు. బుధవారం కవిటిలోని ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 2026- 27 ఆర్థిక సంవత్సరంలో 266 పనులు గుర్తించారని అందులో రైతులకు సంబంధించినవి 163 పనులున్నాయని పేర్కొన్నారు. రైతుల వద్దకు వెళ్లి తక్షణ అవసరమైన పనులు త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. ఏపీవో మోహన్, ఈసీలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కాశీబుగ్గ, కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: కాశీబుగ్గకు చెందిన లోకనాథ త్యాడి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి జై జగన్నాథ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు రూ.30వేలు ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. చంద్రశేఖర త్యాడి, బాబూరావు పండా, ప్రసాద్ పాత్ర్, హరిశంకర్ త్రిపాఠి పాల్గొన్నారు. ❖ కంచిలి మండలం సాలిన పుట్టుగకు చెందిన సాలిన శేషగిరి(40) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ క్రమంలో బాధిత కుటుంబానికి బుధవారం సర్పంచి ప్రతినిధి తమరాల శోభన్‌బాబు గ్రామస్థుల సమక్షంలో రూ.5 వేలు అందజేశారు. ఎస్.ఢిల్లీరావు, ఎస్.సుందరరావు, ఆదినారాయణ, రంగయ్య, నవీన్ పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే రాజ్యాధికారం

సోంపేట, న్యూస్‌టుడే: సామాజిక ఐకమత్యంతోనే రాజ్యాధికారం సాధ్యపడుతుందని అఖిలభారత యాదవ మహాసభ జాతీయ అధ్యక్షుడు మహేష్ యాదవ్ అన్నారు. బుధవారం సోంపేటలో ఎమ్మెల్సీ నర్తు రామారావు అధ్యక్షతన జరిగిన మహాసభలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు, జాతీయ కార్యదర్శి అన్న రామచంద్రయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో 80 లక్షల యాదవ జనాభా ఉన్నప్పటికీ రాజకీయంగా కనీస న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ ఐక్యత కోసం యువత శ్రమించాలని, వైకాపా తనను గుర్తించి ఎమ్మెల్సీ అవకాశం కల్పించడంతో జిల్లాకు ప్రతినిధిగా గుర్తింపు పొందానన్నారు. సమావేశంలో యాదవులను బీసీ-బిలో చేర్చాలని, యాదవ కార్పొరేషన్‌కు రూ.2వేల కోట్లు కేటాయించాలని, 25 అసెంబ్లీ, ఐదు లోక్‌సభ సీట్లు ఇవ్వాలని పలు తీర్మానాలు చేశారు. అనంతరం రాజస్థాన్ నుంచి వచ్చిన జాతీయ అధ్యక్షుడు మహేష్‌యాదవ్, ఎమ్మెల్సీ నర్తు రామారావులను సన్మానించారు. రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నర్తు రామారావును సన్మానిస్తున్న యాదవ మహాసభ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు

ఆధార్ సేవలు.. సులభంగా.. వేగంగా

మకరాంపురం సచివాలయంలో ఆధార్ కేంద్రంలో వివరాలు నమోదు చేస్తున్న డిజిటల్ సహాయకురాలు

– న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

ప్రస్తుత కాలంలో వయసుతో సంబంధం లేకుండా ఆధార్ నవీకరణ ప్రతి ఒక్కరికీ అవసరమవుతోంది. వృద్ధాప్య పింఛను పొందడానికో, బ్యాంకు ఖాతాలు కొనసాగింపునకో, విద్యార్థులు వివిధ పరీక్షలు, ఉన్నత విద్య ఇలా ప్రతి పనికి ఇప్పుడు ఆధార్ అనుసంధానం ముఖ్యం. వీటిని నవీకరణ, మార్పులకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ పరిస్థితి మార్చి, ఆధార్ సేవలు ప్రజలకు సులభంగా అందించటానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

● ప్రతి మండలంలో ఎంపిక చేసిన కేంద్రాల్లో సేవలను ప్రారంభించింది. గతంలో ఈ సేవలు పొందటానికి వ్యయ ప్రయాసల కోర్చి మండల కేంద్రాలకు వచ్చి రోజంతా పడిగాపులు కాచినా పని పూర్తవుతుందని గ్యారంటీ ఉండేదికాదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం సమీప సచివాలయాల్లో ఆధార్ సేవలు అందిస్తుండటంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కేంద్రాల్లో సాంకేతిక కారణాలతో సేవలు నిలిచిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఇదీ పరిస్థితి..

కంచిలి మండలంలో మకరాంపురం, కంచిలి-2, ఎంఎస్‌పల్లి సచివాలయాల్లో ఆధార్ సేవలందిస్తున్నారు.

● కవిటి మండలం రాజపురం, శిలగాం, కొజ్జిరియా సచివాలయాల్లో సేవలు అందిస్తున్నారు. కవిటి కేంద్రాన్ని కపాసుకుద్ది, డీజీపుట్టుగ కేంద్రాన్ని కుసుంపురానికి మార్చారు. ప్రస్తుతం ఈ రెండు సాంకేతిక కారణాలతో సేవలందడం లేదు.

● సోంపేట మండలంలో మామిడిపల్లి, తాళభద్ర, పాలవలస, పలాసపురం, సోంపేట కేంద్రాల్లో ఆధార్ సేవలు ప్రారంభించినప్పటికీ కేవలం పాలవలస సచివాలయంలో మాత్రమే సేవలందుతున్నాయి. సోంపేటకు చెందిన చాలామంది విద్యార్థులు 10 కిలోమీటర్ల పైబడి దూరంలో ఉన్న మకరాంపురం సచివాలయానికి ఆధార్ సేవల కోసం రావాల్సి వస్తోంది.

● ఇచ్ఛాపురం పుర పరిధి పంజావీధి, ఇచ్ఛాపురం గ్రామీణంలో ఈదుపురం సచివాలయంలో సేవలందుతున్నాయి.

● ఆధార్‌సేవా కేంద్రాలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో కొత్త కేంద్రాల ఏర్పాటుతోపాటు సాంకేతిక కారణాలతో సేవలు నిలిచిన కేంద్రాలను అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

స్మార్ట్ కిచెన్ ప్రతిపాదనపై వినతి

మందస, న్యూస్‌టుడే: డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో మార్పులు చేస్తూ మండలం యూనిట్‌గా స్మార్ట్ కిచెన్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు చేస్తూ పనులు ప్రారంభించింది. ఈ ప్రతిపాదనలు విరమించుకోవాలని, ప్రస్తుతం ఉన్న విధానమే కొనసాగించాలని మందస మండల మధ్యాహ్న భోజనాల వంటకాల కార్మికులు డిమాండు చేశారు. ఈ మేరకు ఎంఈవో లక్ష్మణరావుకు బుధవారం వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.కేశవరావు, పి.దేవేంద్ర, కె.ప్రభావతి, జె.వరలక్ష్మి, పి.వరలక్ష్మి, స్వప్న, పార్వతి పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేపై గ్రామసభ

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ కంఠాల్లో ఇళ్లు, స్థలాలకు ప్రాపర్టీ కార్డులు మంజూరు చేయనున్నామని, ఎవరికైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని ఎంపీడీవో వసంతకుమార్ ప్రజలను కోరారు. పలాస మండలం పూర్ణభద్రలో డిప్యూటీ ఎంపీడీవో వైకుంఠరావుతో కలిసి బుధవారం గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి రేవతీపతి పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి చేయూత

ఇచ్ఛాపురం గ్రామీణం, కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: దాతల సహకారంతోనే పాఠశాలల అభివృద్ధి సాధ్యమని ప్రధానోపాధ్యాయులు జి.యశోద, ప్రదీప్‌కుమార్ అన్నారు. ఇచ్ఛాపురం మండలం బలరాంపురం పాఠశాలకు గ్రామస్థులు రూ. 25 వేల విలువ చేసే కలర్ ప్రింటర్ ప్రధానోపాధ్యాయినికి బుధవారం అందించారు. ఎస్ఎంసీ ఛైర్‌పర్సన్ యువరాణి, ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్, గౌరీ, శంకరం, తేజేశ్వరరావు, రవికుమార్, సంతోష్, దాశరథి పాల్గొన్నారు. కవిటి మండలం రఘునాథపురం పాఠశాలకు కిచెన్ షెడ్డు కోసం నీలి రంగు రేకులు, ఇతర సామగ్రి కొనుగోలుకు కొజ్జిరియా ఎస్ఎంసీ ఉపాధ్యక్షుడు జి.గణపతిరావు బుధవారం రూ. 15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఎస్ఎంసీ ఛైర్‌పర్సన్ హేమలత పాల్గొన్నారు.

నైతిక విద్యతోనే ఉన్నత భవిత

సోంపేట, న్యూస్‌టుడే: నైతిక విలువలతో కూడిన విద్యతోనే ఉన్నత భవిష్యత్తు సాధ్యపడుతుందని సోంపేట రామకృష్ణ సేవాసమితి కన్వీనర్ జి.శంకరరావు అన్నారు. సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వామి వివేకానంద చికాగో ప్రసంగాలు- యువతపై ప్రభావం' అంశంపై సోంపేట, మందస, కంచిలి, కవిటి, మందస మండలాల పరిధిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు, వివేకానంద పుస్తకాలు పంపిణీ చేశారు. సోంపేట మోడల్ స్కూలు, బారువ డిగ్రీ, జూనియర్ కళాశాల, సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, సంస్కారభారతి విద్యాసంస్థలు, ఇతర కళాశాలలకు చెందిన విజేతలకు సమితి ప్రతినిధులు రెల్ల నారాయణ, జి.రామకృష్ణ, జి.భీమారావు, కె.కాశీపతి, పి.వాసు అందజేశారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న 20 కిలోల గంజాయితోపాటు ఇద్దరిని ఇచ్ఛాపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ మీసాల చిన్నంనాయుడు బుధవారం విలేకరులతో మాట్లాడారు. తమిళనాడులోని తిరునవల్లి జిల్లా తుతుక్కుడి పట్టణానికి చెందిన వి.సతీష్‌కుమార్, అదే రాష్ట్రానికి చెందిన మరో బాలుడు కావాల్సిన గంజాయిని తీసుకొచ్చేందుకు ఒడిశా వచ్చారు. ఒడిశాలోని మోహన్ బ్లాక్ చంద్రగిరికి చెందిన ఇసాక్ బీర వద్ద 20.670 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. తిరుగు ప్రయాణంలో ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ విషయమై పట్టణ ఎస్సై ముకుందరావుకు సమాచారం రావడంతో తమ సిబ్బందితో రైల్వే స్టేషన్‌కు చేరుకుని వారి బ్యాగులు తనిఖీలు చేపట్టారు. సరకు స్వాధీనం చేసుకుని, సతీష్‌ను అరెస్టు చేసి ఇచ్ఛాపురం మెజిస్ట్రేట్ వద్ద హాజరు పరిచారు. బాలుడిని శ్రీకాకుళం జేజేజీ బోర్డు వద్ద హాజరు పరిచినట్లు ఎస్సై ముకుందరావు తెలిపారు.

దిగుబడులు తగ్గకుండా చర్యలు

సోంపేట, కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం సన్నాల పరంగా నెలకొన్న ఇబ్బందులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు, విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు అన్నారు. బుధవారం జింకిభద్ర, బెంకిలి, పలాసపురం రైతు సేవాకేంద్రాల పరంగా పంపిణీ చేసిన విత్తనాలను పరిశీలించారు. కేళీలు ఏర్పడటానికి కారణాలపై చర్చించారు. రాగోలు వరి పరిశోధనాస్థానం అధిపతి డాక్టర్ కె.మధుకుమార్, విత్తనాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ బాలకృష్ణ, ఏడీ భవానీశంకర్, ఏవో బి.నర్సింహమూర్తి పాల్గొన్నారు. ❖ కవిటి మండలం రఘునాథపురం, చండిపుట్టుగ గ్రామాల్లో ఏవో పిరియా శ్రీదేవి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వీఏఏలు లావణ్య, భవానీ పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయాలి

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: విశాఖలో డిసెంబర్ 31 నుంచి 5 రోజులపాటు జరగనున్న అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు పి.తేజేశ్వరరావు, డి.సుదర్శనం పిలుపునిచ్చారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో అఖిల భారత మహాసభల గోడప్రతులను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం సమావేశం నిర్వహించారు.

గొర్లపాడు అక్రమాలపై విచారణ

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: గొర్లపాడులో భూముల అక్రమాలపై ఈ నెల 1న కలెక్టర్ గ్రీవెన్స్‌లో గ్రామస్థులు, భారతీయ కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా కార్యవర్గ సభ్యులు పి.ఆరేలమ్మ, ఎ.లోకనాథం ఫిర్యాదు మేరకు స్థానిక తహసీల్దార్ మురళీమోహనరావు విచారణ చేపట్టారు. భూములను సర్వే చేశారు. లబ్ధిదారుల వద్ద ఉన్న భూమి పత్రాలు పరిశీలించి నమోదు చేసుకున్నారు. ఇతర సమాచారం సేకరించి లబ్ధిదారులకు న్యాయం చేస్తామని తెలిపారు.

వైకాపా నిరసన ప్రదర్శనలు

కవిటిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైకాపా నాయకులు

కవిటి, కాశీబుగ్గ, న్యూస్‌టుడే: కూటమి పాలనలో వైద్య విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని జడ్పీ అధ్యక్షురాలు పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. కవిటిలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని మాజీ మంత్రి డా.సీదిరి అప్పలరాజు అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రైవేట్‌కు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ పలాస-కాశీబుగ్గ పట్టణాల్లో వైకాపా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

(c) eenadu

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా ఎన్నిక

హిరమండలం, న్యూస్‌టుడే: మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో 23వ మహా జన సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం సాయిలక్ష్మి ఆధ్వర్యంలో కార్యవర్గ ఎన్నిక జరిగింది. సుభలయ కాలనీకి చెందిన పి. ప్రభావతి అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షురాలిగా జి. భారతి నియమితులయ్యారు. ఎల్‌సీ చిట్టిబాబు, సాహు పాల్గొన్నారు.

వసతిగృహంలో సమీక్ష

కొత్తూరు, న్యూస్‌టుడే: కడుము బీసీ వసతిగృహానికి చెందిన గొర్లె ఈశ్వర్ అనే ఎనిమిదో తరగతి విద్యార్థికి వారం రోజుల కిందట జ్వరం రావడంతో కురిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి పెద్దిన ప్రసన్నకుమార్ సేవలందించారు. అయినప్పటికీ జ్వరం తగ్గకపోవడంతో విశాఖపట్టణం తరలించారు. అప్రమత్తమైన ఎంపీడీవో నీరజ, కురిగాం వైద్యాధికారి ప్రసన్నకుమార్ వసతిగృహానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

జీడిపేటలో ఇంటింటా సర్వే

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: స్థలాలు కలిగి ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం కూటమి ప్రభుత్వం అందిస్తున్న గృహనిర్మాణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని భాజపా నేతలు జన్ని పరమేశ్వరరావు, ధర్మారావు, కామరాజు కోరారు. మేఘవరం పంచాయతీ జీడిపేటలో సచివాలయ సిబ్బందితో కలసి ఇంటింటా సర్వేలో పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: నందిగాం మండలం దిమిలాడ పంచాయతీ లింగాలపాడు గ్రామంలో మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని శిథిలమైన పాఠశాల భవనంలో నిర్వహిస్తున్నారు. కేంద్రానికి వెళ్లే దారిలో పనికిరాని మొక్కలు పేరుకుపోయాయి. సంబంధిత అధికారులు స్పందించాలి. **- పిల్లల తల్లిదండ్రులు** ★ క్షేత్రస్థాయిలో పరిశీలించి, సిబ్బందికి తెలియజేస్తాం. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- ఢిల్లేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి, దిమిలాడ** - న్యూస్‌టుడే, నందిగాం

అర్హులందరికీ సొంత ఇళ్లు

తలసముద్రంలో గృహ హక్కు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి, పాతపట్నం, న్యూస్‌టుడే: అర్హులైన ప్రతీ ఒక్కరికీ సొంత ఇళ్లు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రమణమూర్తి అన్నారు. బుధవారం తలసముద్రంలో నూతన గృహ ప్రవేశాల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెదేపా మండలాధ్యక్షుడు మిరియపల్లి వెంకటప్పలనాయుడు పాల్గొన్నారు. ❖ పాతపట్నం మండలం తిడ్డిమి గ్రామంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

పీఎం శ్రీ నిధులు సద్వినియోగం చేసుకోండి

కరవంజ ఆదర్శపాఠశాల వసతిగృహంలో సరకులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

జలుమూరు, న్యూస్‌టుడే: పీఎం శ్రీ నిధులు సద్వినియోగం చేసుకోవాలని పథకం కేంద్ర బృందం సభ్యులు శ్రీకళ, వేణుగోపాల్ అన్నారు. జలుమూరు మండలం కరవంజ ఆదర్శ పాఠశాలలో బుధవారం వారు తనిఖీలు నిర్వహించారు. వసతి గృహంలో సరకులను పరిశీలించారు. డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్ వర్మ, జిల్లా విద్యాశాఖాధికారి ఎ.రవిబాబు ఉన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పిల్లలకు సోకే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి మెరుగైన వైద్యం అందించాలని ఎన్ఎస్‌డీ, ఆర్బీఎస్‌కే కార్యక్రమ అధికారిణి శివరంజని పేర్కొన్నారు. ఉర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం వైద్య సిబ్బందికి ఆమె పలు సూచనలు చేశారు.

గంగివలస కేజీబీవీలో జ్వరాలు

పోలాకి, న్యూస్‌టుడే: గంగివలస కేజీబీవీలో 3 రోజులుగా పలువురు విద్యార్థులు జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో రవికుమార్, వైద్యాధికారి శ్రీనాథ్ వసతిగృహాన్ని పరిశీలించారు. ప్రస్తుతం ఆరుగురికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించారు. తాగునీటికి సంబంధించి జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్‌ఎం శారదకు సూచించారు.

దాచినా.. ఇక దాగదు..!

- న్యూస్‌టుడే, కొత్తూరు

ఉపాధి పనులను మరింత పారదర్శకంగా చేపట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తప్పుడు మస్తర్లతో మాయ, పనులు చేయకుండా బిల్లులు, కొలతల్లో వ్యత్యాసాలు తదితర వాటితో గతంలో నిధులు పక్కదారి పట్టేవి. వీటికి అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందడుగు వేస్తున్నాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నాయి.

అక్రమాలకు అడ్డుకట్ట

★ ప్రభుత్వ ఆదేశాల మేరకు సిబ్బంది వేతనదారుల ఆధార్‌ను అనుసంధానించారు. పాతపట్నం నియోజకవర్గంలో ఈకేవైసీ దాదాపు 80 శాతానికి పైగా పూర్తి చేశారు. పనులు గుర్తింపు, గ్రామసభల నిర్వహణ ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. ఇక గ్రామాల్లో పనులు చేయడానికి వచ్చే వేతనదారులకు రెండుపూటలా ముఖ హాజరు వేస్తారు.

పాతపట్నం నియోజకవర్గ వివరాలు

మండలం	పంచాయతీలు	వేతనదారులు	ఈకేవైసీ పూర్తి
కొత్తూరు	43	31,729	25,238
హిరమండలం	23	14,201	11,348
ఎల్ఎన్‌పేట	22	14,135	11,775
పాతపట్నం	34	18,295	14,352
మెళియాపుట్టి	37	19,733	15,887

ఇదీ పరిస్థితి..

★ ఉపాధి పథకం అమలవుతున్నప్పటి నుంచి ఏటా సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. కొత్తూరు మండలంలోని ఓ గ్రామంలో ఒక చోట పని మంజూరైతే మరో చోట చేశారు. దీన్ని సామాజిక తనిఖీల బృందం గుర్తించి, గ్రామ సభలో వెల్లడించింది.

★ కొత్తూరు మండలంలోనే మస్తర్లలో శాశ్వతంగా వలస వెళ్లిన వారితో పాటు మృతుల పేర్లు దర్శనమిచ్చాయి. నిధుల దుర్వినియోగం చేసినట్లు బయటపడటంతో అధికారులు చర్యలు తీసుకున్నారు.

★ పాతపట్నం మండలంలో పనులు, ఖర్చు చేసిన నిధులకు పొంతన కుదరలేదు. కొలతల్లో వ్యత్యాసాలు ఉండటంతో అధికారులు రికవరీకి ఆదేశించారు. ఇటువంటి పరిస్థితి దాదాపుగా అన్ని మండలాల్లోనూ కనిపించింది.

కొత్తూరు మండలంలో ఈకేవైసీ చేస్తున్న ఉపాధి సిబ్బంది

పనికి తగిన వేతనం

ఉపాధి పనుల్లో అక్రమాలకు తావులేకుండా ముఖ హాజరు విధానంతో పనులు చేపడతాం. దీంతో వేతనదారులకు పనికి తగిన వేతనం అందుతుంది. ఈకేవైసీ శత శాతం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. - పి.రాధ, ఏపీడీ, పాతపట్నం

★ ఒకరి తరపున మరొకరు హాజరు కావడానికి వీలుండదు. ఒక పూట ముఖ హాజరు వేసుకుని, రెండో పూట రాకపోతే ఒక పూట వేతనమే వస్తుంది. చేయాల్సిన పని వద్ద లొకేషన్ ఆధారంగా చిత్రాన్ని అప్‌లోడ్ చేయాలి. కొలతల్లో వ్యత్యాసాలు లేకుండా నమోదు చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియను ఆయా పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షిస్తారు.

చట్టాలపై అవగాహన అవసరం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: ఆడపిల్లలకు చట్టాలపై అవగాహన ఉండాలని కేస్ వర్కర్ కుప్పిలి ప్రసన్నరాణి అన్నారు. వన్‌స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ తిరుపతిరావు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

నందిగాం, న్యూస్‌టుడే: స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం పలాస నుంచి టెక్కలి వెళ్తున్న కారు అదుపు తప్పి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొని బోల్తాపడింది. కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు సురక్షితంగా బయట పడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఘటనపై సమాచారం లేదని పోలీసులు తెలిపారు.

శౌచాలయం.. నిర్వహణ శోచనీయం

ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగేశ్వరస్వామి ఆలయానికి వెనక ఉన్న మరుగుదొడ్ల నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారాయి. దీంతో ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో వంశధార నది వైపు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, మరుగుదొడ్లు బాగు చేయించాలని కోరుతున్నారు. దీనిపై ఈవో ఏడుకొండలు మాట్లాడుతూ.. సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేశామని చెప్పారు. - న్యూస్‌టుడే, జలుమూరు

చక్రాల బండే చెత్త నిల్వ కేంద్రం

సారవకోట ప్రధాన వీధుల్లో రోజూ ఇంటింటా చెత్త సేకరణ జరుగుతున్నప్పటికీ, రెల్లి వీధి గురించి పట్టించుకునే వారే లేకుండా పోయారని స్థానికులు వాపోతున్నారు. దీంతో వేరే దారి లేక చెరువు గట్టుకు సమీపంలో ఉంచిన మూడు చక్రాల బండిలో వ్యర్థాలు వేస్తున్నారు. రోజుల తరబడి వాటిని తొలగించకపోవడంతో ఆ మార్గంలో వెళ్లే వారు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పంచాయతీ కార్యదర్శితో మాట్లాడతామని ఎంపీడీవో మోహన్‌కుమార్ తెలిపారు. - న్యూస్‌టుడే, సారవకోట

మురుగు.. కానరాని మెరుగు

హిరమండలం పరిధి సుభలయ గ్రామం, సుభలయ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో పూర్తిస్థాయిలో కాలువలు లేక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాడుక నీరు అలికాం- బత్తిలి రోడ్డు మీద నుంచి ప్రవహిస్తుండటంతో వాహనదారులు రాకపోకలు చేసేటప్పుడు అసౌకర్యానికి గురవుతున్నారు. వాన పడితే అవస్థలు తీవ్రమవుతున్నాయని, కాలువలు నిర్మించాలని కోరుతున్నారు. నిధులు మంజూరైతే తక్షణమే పనులు చేపడతామని ర.భ.శాఖ డీఈఈ సాగర్ అన్నారు. - న్యూస్‌టుడే, హిరమండలం

అల్లుకుంటున్నా అలసత్వమేనా..?

నందిగాం మండలం నర్సిపురం- లఖిదాసుపురం గ్రామాల మధ్య బీటీ రహదారి పక్కన లఖిదాసుపురం సమీపంలో విద్యుత్తు స్తంభానికి పనికిరాని మొక్కలు అల్లుకున్నాయి. దీంతో ఈదురుగాలులకు తరచూ నిప్పులు రాలుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. 2 గ్రామాలకు తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని, చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, సిబ్బందికి తెలియజేస్తామని సంబంధిత శాఖ జేఈ నేతాజీ పేర్కొన్నారు - న్యూస్‌టుడే, నందిగాం

పక్కనే రంధ్రం.. పక్కలో బల్లెం

కొత్తూరు మండలం మాతల గ్రామం వద్ద కాలువ గెడ్డపై వంతెన శిథిలమైంది. ఓ పక్క రంధ్రం ఏర్పడటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు రాష్ట్రాల మధ్య వందలాది వాహనాలు తిరిగే మార్గంలో పరిస్థితి ఇలా ఉండటంతో పెదవి విరుస్తున్నారు. కొన్ని నెలలుగా పరిస్థితి ఇలాగే ఉందని, తక్షణమే వారధి మెరుగు పరచాలని కోరుతున్నారు. చర్యలు తీసుకుంటామని ఆర్‌అండ్‌బీ డీఈఈ సాగర్ చెప్పారు. - న్యూస్‌టుడే, కొత్తూరు

పార్టీ ప్రగతికి కమిటీలే కీలకం

ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

పాతపట్నం, న్యూస్‌టుడే: తెదేపా ప్రగతికి కమిటీలే కీలకమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. బుధవారం పాతపట్నంలో మండల కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీని నిలబెట్టింది కార్యకర్తలే అన్నారు. నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కోర్టుకు తెదేపా నాయకుల హాజరు

కొత్తూరు కోర్టు ప్రాంగణంలో తెదేపా శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటరమణ, ఇతర నాయకులు

హిరమండలం, కొత్తూరు, న్యూస్‌టుడే: శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు కలమట వెంకటరమణతో పాటు హిరమండలం ఏఎంసీ ఛైర్మన్ పొగిరి బుచ్చిబాబు మరో ఆరుగురు నాయకులు బుధవారం కొత్తూరు కోర్టుకు హాజరయ్యారు. 2021 నవంబర్ 18న జరిగిన జెడ్పీటీసీ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు రోజున ఫలితాలు తారుమారు చేసేందుకు అప్పటి వైకాపా నాయకులు ప్రయత్నించారు. వారి కుయుక్తులను అడ్డుకునేందుకు తెదేపా నాయకులు ఏటీ రోడ్డుపై శాంతియుతంగా నిరసన తెలిపారు. నాడు పోలీసులు హిరమండలం స్టేషన్‌లో ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. తాజాగా కోర్టుకు వచ్చారు. నాయకులు శ్రీనివాసరావు, కొల్లి నాగరాజు, బట్ని సురేష్, లోలుగు ఉత్తేజ్, కొర్లుబొడ్డ సింహాచలం, తూలుగు వినోద్ పాల్గొన్నారు.

అధికారుల అత్యుత్సాహం తగదు

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: సంతబొమ్మాళి మండలం మూలపేటలో వంశధార కాలువ గట్టు వద్ద ఆక్రమణలు తొలగింపులో వంశధార అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించడం తగదని అదే గ్రామానికి చెందిన ఇప్పిలి అప్పన్న ఆవేదన వ్యక్తం చేశారు. వంశధార కాలువ గట్టును ఆక్రమించి ఇప్పిలి అప్పన్న, ఇప్పిలి అప్పారావు ఇరు వర్గాలు కొంతకాలంగా వినియోగించుకుంటున్నారు. ఇప్పిలి అప్పన్నకు చెందిన పునాది తొలగించడానికి వంశధార అధికారులు రావడంతో ఆ ప్రాంతంలో బుధవారం ఉద్రిక్తత నెలకొంది. ఈ కాలువ గట్టు మీద పదుల సంఖ్యలో వంశధార స్థలాన్ని ఆక్రమించి శాశ్వత నిర్మాణాలు చేపట్టారని.. వాటిని తొలగించడానికి ఆసక్తి చూపని అధికారులు తన పునాదిని ఉద్దేశ పూర్వకంగా తొలగించడం సరికాదని ఆయన వాపోయారు. అనంతరం అక్కడకు వచ్చిన వంశధార ఏఈ అప్పలరెడ్డి, ఇతర అధికారులు వెనుదిరిగారు.

ఈఎస్ఐ చట్టం అమలు తప్పనిసరి

ఆర్డీవోతో కలసి కరపత్రాలు ప్రదర్శిస్తున్న అధికారులు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: కార్మికులకు ఈఎస్ఐ చట్టం అమలు తప్పనిసరి అని ఆర్డీవో ఎం. కృష్ణమూర్తి అన్నారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కార్మిక, భూగర్భగనుల, ఈఎస్ఐ శాఖ అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. 10మందికి పైగా కార్మికులున్న సంస్థల్లో ఈఎస్ఐ చట్టం అమలు తప్పనిసరి అని తెలిపారు. ఈ పథకం ద్వారా లభించే వైద్యసేవలు, ప్రయోజనాలు, ప్రమాద బీమా, శాశ్వత వైకల్య సాయం, పింఛను సదుపాయంపై కార్మికులకు చైతన్యం కల్పించాలన్నారు. డిసెంబరు 31లోగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న సంస్థలకు ఎటువంటి అపరాధ రుసుం ఉండదని చెప్పారు. సదస్సులో కార్మికశాఖ ఉప కమిషనరు కె.దినేష్‌కుమార్, మైన్స్ ఏడీ విజయలక్ష్మి, సహాయ కార్మికశాఖ అధికారిణి రాధాకుమారి, ఈఎస్ఐ శాఖ ఏడీ శ్యామ్‌ప్రసాద్, శ్రీనివాస్, ప్రజ్ఞ పాల్గొన్నారు.

దున్నకుండా విత్తనాలు వేయాలి

ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా నేల దున్నకుండా మొక్కజొన్న విత్తనాలు వేసుకోవాలని వ్యవసాయ శాఖ టెక్కలి సహాయ సంచాలకుడు జగన్మోహన్‌రావు సూచించారు. ఎత్తురాళ్లపాడులో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రబీలో వరి పంట వేయకుండా తక్కువ నీటితో పండించే పంటలు సాగు చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయాధికారి గోవిందరావు, సహాయకులు మాధవి, ఉపాధి క్షేత్ర సహాయకుడు సంతు ఉన్నారు. - న్యూస్‌టుడే, ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి)

తేమ శాతం లెక్కింపుపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

రైతులకు చైతన్యం కల్పించాలి

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: రైతులకు ధాన్యం కొనుగోలు ప్రక్రియపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ సూచించారు. మండల కేంద్రంలో సిబ్బందితో ఆమె మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే ధాన్యంలో తేమ, మట్టి, పొల్లు గింజలకు సంబంధించి నిబంధనలు రైతులకు వివరించాలని చెప్పారు. ఇబ్బందులుంటే నేరుగా ఫిర్యాదు చేయాలని తెలిపారు.

తైక్వాండో క్రీడాకారిణికి అభినందన

టెక్కలి, న్యూస్‌టుడే: టెక్కలికి చెందిన తైక్వాండో క్రీడాకారిణి పులి బంద జాస్విక క్రీడా కోటాలో మెడికల్ సీటు దక్కించుకుంది. తండ్రి తుపానురావు ప్రభుత్వ ఉపాధ్యాయుడు కాగా, తల్లి లక్ష్మి ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయిని. టెక్కలిలో శిక్షకుడు నర్సిపురం శేఖర్ వద్ద ఆరేళ్లపాటు సాధన చేసి జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చింది. మచిలీపట్నం వైద్య కళాశాలలో సీటు దక్కించుకోవడంతో గ్రామస్థులు అభినందించారు.

కాలం విలువ తెలుసుకోవాలి

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు కాలం విలువ తెలుసుకుంటేనే ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని విశ్రాంత కామర్స్ అధ్యాపకుడు ఎం.దుర్యోధనరావు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విద్యార్థుల స్వాగతోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చరవాణి వినియోగం తగ్గించాలని సూచించారు. ప్రిన్సిపల్ టి.గోవిందమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

హోరాహోరీగా సాఫ్ట్‌టెన్నిస్ పోటీలు

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం గిరిజన సామాజిక భవనం ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లాల సాఫ్ట్‌టెన్నిస్ ఛాంపియన్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. బుధవారం అండర్-14, 17, 19 విభాగాల్లో బాలబాలికలు పాల్గొన్నారు. తుది పోటీలు గురువారం నిర్వహించి విజేతల వివరాలను తెలియజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

మహాసభలను విజయవంతం చేయండి

టెక్కలి, న్యూస్‌టుడే: ఈనెల 16న టెక్కలిలో నిర్వహించనున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బగాది వాసుదేవరావు, కౌలు రైతు సంఘం కార్యదర్శి పోలాకి ప్రసాదరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కొల్లి ఎల్లయ్య పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆదివారం ఉదయం 9.30 గంటలకు ఆర్టీసీ బస్టాండు నుంచి సత్తారులోకనాథం, అన్నపూర్ణమ్మ కల్యాణ మండపానికి ప్రదర్శనగా వెళ్తామన్నారు.

బాధ్యతల స్వీకరణ

కొత్తూరు, న్యూస్‌టుడే: కొత్తూరు ఎస్ఐగా కె.వెంకటేశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ అమీర్‌ఆలీ వీఆర్‌కు వెళ్లారు. హిరమండలంలో పనిచేస్తున్న వెంకటేశ్‌ను ఇక్కడ నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యతో స్టేషన్‌కు వచ్చేవారికి సత్వర న్యాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు.

ఘనంగా తెప్పోత్సవం

నరసన్నపేట, న్యూస్‌టుడే: స్థానిక దేశవానిపేట సమీపంలో గెడ్డయ్య పుష్కరిణిలో బుధవారం రాత్రి తెప్పోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభించి, ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.

ఐతమ్‌లో పుస్తకావిష్కరణ

టెక్కలి: ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకులు బూడి శ్రీనివాసరావు, కాళ్ల కనకరాజు, తర్రా జగన్మోహనరావు, వీవీ అప్పలనాయుడు రచించిన రెన్యువబుల్ ఎనర్జీ ఇంటిగ్రేషన్ అండ్ పవర్ కండిషనింగ్ సిస్టమ్స్ పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు బుధవారం ఆవిష్కరించారు. ప్రిన్సిపల్ ఏఎస్ శ్రీనివాసరావు, శ్రీరాములు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రీసర్వే సమర్థంగా చేయాలి

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: గ్రామాల్లో భూముల రీసర్వే ప్రక్రియ సమర్థంగా పూర్తి చేయాలని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన ఆయన సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సర్వే ప్రక్రియలో లోపాలను గుర్తించి ఎప్పటికప్పుడే పరిష్కరించుకుంటే.. పని ఒత్తిడి తగ్గుతుందన్నారు. రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలన చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి. పాపారావు, డీటీ రాము, సర్వేయర్లు వెంకట్రావు, శ్యామలరావు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ నిరసన

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: టెక్కలిలోని ఓ ప్రాంతానికి చెందిన మహిళ న్యాయం చేయాలంటూ బుధవారం నిరసన తెలిపారు. పిల్లలతో సహా ప్రధాన కూడలిలో బైఠాయించారు. ఆడపడుచు తాను ఉంటున్న ఇంటిని ఆక్రమించుకునేందుకు చూస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. భర్త, అత్తమామలు మృతి చెందడంతో ఇంటి పత్రాలు బలవంతంగా స్వాధీనం చేసుకుందని ఆరోపించారు. పోలీసులు అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు.

పథకం ఉన్నా.. పక్క గ్రామానికి పరుగు

- న్యూస్‌టుడే, ఎల్ఎన్‌పేట

మిరియాప్పల్లి గ్రామానికి తాగునీటి కోసం వచ్చిన దబ్బపాడు గ్రామస్థులు

వంశధార నది చెంతనే దబ్బపాడు ఉన్నా తాగునీటి కష్టాలు తీరడం లేదు. 10 ఏళ్లుగా గ్రామానికి మంచి నీరందించాలని అధికారులను, ప్రజాప్రతినిధులు కోరుతున్నా పట్టించుకొనే వారే కరవయ్యారని స్థానికులు వాపోతున్నారు. వైకాపా పాలనలో ఐదేళ్లు సమస్య గురించి పూర్తిగా పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వమైనా పరిష్కరిస్తుందని ఆశ పడితే నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దబ్బపాడులో కుళాయిల వద్ద పెట్టిన బిందెలు

ఏళ్లుగా ఇదే సమస్య

దబ్బపాడులో 1,850 మంది జనాభా ఉన్నారు. 15 ఏళ్ల కిందట ఎల్ఎన్‌పేట గ్రామంలో మెగా రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేశారు. దీని ద్వారా తాగునీటి సరఫరాకు పైపులైన్లు ఏర్పాటు చేశారు. కానీ ముందు ఉన్న గ్రామాల వరకే నీరు వస్తుంది. దీంతో వంశధార చెలమల నీరే వారికి దిక్కుగా మారింది. పాతపట్నం ఎమ్మెల్యే గోవిందరావు దృష్టికి గ్రామస్థులు సమస్యను తీసుకెళ్లగా.. ఆయన స్పందించి రూ.7 లక్షల వరకు నిధులు మంజూరు చేయించారు. ఎల్ఎన్‌పేట నుంచి మిరియాప్పల్లి, వాడవలస గ్రామాల మీదుగా కొత్తగా పైపులైన్లు వేశారు. ముందున్న ఊర్లలో అక్రమంగా కనెక్షన్లు పెట్టడంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. దీంతో మిరియాప్పల్లి, వాడవలస గ్రామాలకు వెళ్లి నీటిని తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం జేఈ రాజేశ్వరి తెలిపారు.

ఎట్టకేలకు ఇబ్బందులు తీర్చారు

స్పందనకు వందనం

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: నరసన్నపేట మండలం కొల్లవానిపేట ప్రాథమిక పాఠశాల వెనక కాలనీకి వెళ్లే మార్గంలో కాలాలతో సంబంధం లేకుండా నిత్యం మోకాళ్ల లోతున నీరు నిలిచి దశాబ్దాలుగా మురుగుతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఈ ఏడాది జూన్ 29న 'మార్గాలు కాదు.. మురుగు కూపాలు' పేరిట ఈనాడులో కథనం ప్రచురితమైంది. పంచాయతీ కార్యదర్శి పి.రవిశంకర్ స్పందించి, సుమారు రూ.1.5 లక్షలతో సిమెంట్ రహదారితో పాటు కాలువలు నిర్మించారు. ❖ అదే గ్రామంలో ఊరబట్టిపై మూడు దశాబ్దాల కిందట నిర్మించిన కాలిబాట జులై నెలలో కూలిపోయింది. రైతులు పొలాలకు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. దీనిపై జులై 29న 'కూలిన కాలిబాట' పేరిట వార్త వెలువడింది. పంచాయతీ అధికారులు రూ.26 వేలతో నూతన వంతెన నిర్మాణం చేపట్టారు. సమస్యలు పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.1.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, కాలువ

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై నిరసన

టెక్కలి పట్టణం, పాతపట్నం, నరసన్నపేట, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై వైకాపా నాయకులు, కార్యకర్తలు బుధవారం నిరసన తెలిపారు. టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందించారు.

పాతపట్నంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆధ్వర్యంలో..

నరసన్నపేట ప్రధాన రహదారిపై వైకాపా శ్రేణుల ర్యాలీ

(c) eenadu

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

స్వామిశరణం.. అయ్యప్ప శరణం..

అయ్యప్పస్వామి తిరువీధి ఉత్సవం రణస్థలంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప ఆలయం నుంచి రామతీర్థాల కూడలి వరకు మాలధారణ భక్తులంతా తిరువీధి నిర్వహించారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, వైకాపా నాయకులు సాయికుమార్ పాల్గొన్నారు. పొందూరులో అనకాపల్లి శివకుమార్‌స్వామి పడి పూజల్లో 600 మంది స్వాములు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, రణస్థలం, పొందూరు గ్రామీణం

విద్యార్థులకు అభినందన

అంతర్జాతీయ అకౌంటింగ్ డే సందర్భంగా ఈ నెల 10న రాజాంలోని జీఎంఆర్ కళాశాలలో నిర్వహించిన జోనల్ స్థాయి క్విజ్ కార్యక్రమంలో మునసబుపేట వద్ద గాయత్రి కాలేజీ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థులు వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకున్నారు. విజేతలను బుధవారం విద్యాసంస్థల అధినేత జీవీ స్వామినాయుడు, ప్రిన్సిపల్ కేవీ సత్యనారాయణ అభినందించారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం గ్రామీణం

తెరపై ఈనాడు

❖ మారుతి: ఆర్యన్, లవ్ ఓటీపీ ❖ కిన్నెర: కె-ర్యాంప్ ❖ కీర్తన : ద గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో ❖ కీర్తిక: బైసన్ ❖ ఎస్‌వీసీ(రామలక్ష్మణ): ద గర్ల్ ఫ్రెండ్ ❖ సూర్యమహల్: జటాధర ❖ సన్‌మ్యాక్స్ : డైస్ ఇరాయ్ ❖ సరస్వతి : మాస్ జాతర

– న్యూస్‌టుడే, పాతబస్టాండ్

ఎన్టీఆర్ కాలనీల్లో మెరుగైన వసతులు

లబ్ధిదారుతో కలిసి గృహప్రవేశం చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: పేదలకు పక్కా ఇళ్లు మంజూరు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని.. ఎన్టీఆర్ కాలనీల్లో మెరుగైన వసతులు కల్పిస్తామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని 38వ వార్డు దమ్మల వీధిలో బుధవారం గంటి పార్వతితో గృహప్రవేశం చేయించి తాళాలు అప్పగించారు. డీఆర్వో ఎస్‌వీ లక్ష్మణమూర్తి, గృహ నిర్మాణ సంస్థ పీడీ డి.రమాకాంత్, తహసీల్దారు ఎస్.గణపతిరావు, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్లు

పైడిభీమవరంలో గృహాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం పేదలందరికీ గృహ సౌకర్యం కల్పిస్తుందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. పైడిభీమవరంలో బుధవారం పీఎంఎవై పథకంలో నిర్మించిన గృహాలను ప్రారంభించారు. ఇల్లులేని ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

రణస్థలం, న్యూస్‌టుడే: ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆ సంఘ జిల్లా గౌరవాధ్యక్షురాలు కె.నాగమణి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.అమ్మన్నాయుడు అన్నారు. బుధవారం కోష్టలో జరిగిన సంఘ సమావేశంలో మాట్లాడారు. కనీసవేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండు చేశారు. సెలవు లేకుండా పనిచేస్తున్నారన్నారు. పీఎఫ్, ఫించను సౌకర్యం కల్పించాలన్నారు.

మురుగు కూపాలు.. సమస్యల లోగిళ్లు..!

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

శ్రీకాకుళం నగరంలోని ప్రధాన కాలనీల్లో డీసీసీబీ కాలనీ ఒక్కటి. ఉద్యోగులు, ఉన్నతవర్గాల ప్రజలు నివాముంటున్నా మౌలిక సదుపాయాలు దూరంగానే ఉన్నాయి. రహదారుల నుంచి తాగునీరు వరకు అన్నీ అవస్థలే. నిత్యం ఈ ప్రాంతంలో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగిస్తున్నా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డీసీసీబీ కాలనీలో అన్నీ అవస్థలే

మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తం..

సీసీ కాలువల్లేక స్థానికుల వాడుకనీరు ఎక్కడికక్కడ నిల్వ ఉండిపోతోంది. వర్షాలు పడే సమయంలో రోజుల తరబడి నీరు దారులపై నిల్వ ఉండి రాకపోకలకు ఇబ్బందులు తప్పలేదు. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు నీటితో నిండి పొదలు, పనికిరాని మొక్కలతో విషకీటకాలకు ఆవాసాలుగా మారాయి. శివారు వీధులు నేటికీ సీసీ రహదారులు, వీధి దీపాలకు నోచుకోలేదు. మరమ్మతులకు గురైనా నెలలు తరబడి పునరుద్ధరించలేదు. ఈ ప్రాంతంలోని మురుగు, వర్షపునీటిని నాగావళి నది వరకు చేర్చే మిర్తిబట్టి ఆధునికీకరణ పనులు పదేళ్ల కిందట చేపట్టినా గుత్తేదారుకు బిల్లులందక మధ్యలో నిలిపివేశారు.

తాగునీటి కష్టాలు: కాలనీలకు పైపులైన్ల ద్వారా ప్రజల అవసరాలకు సరిపడా తాగునీరు అందటం లేదు. కొన్ని ప్రాంతాలకు మాత్రమే కుళాయిల ద్వారా నీరందుతోంది. అందించే అవకాశమున్నా ఆ దిశగా నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోవటం లేదు.

ఆక్రమణలో దారులు: చాలా వీధుల్లో ఇరువైపులా ఉన్న ఖాళీ స్థలాలను స్థానికులు ఆక్రమించి కారు షెడ్లు, ఇతర నిర్మాణాలు చేపట్టారు. దీంతో రహదారులు ఇరుకుగామారి వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు.

రహదారిపై నిల్వ ఉన్న మురుగు, వర్షపునీరు

శిథిలావస్థలో పార్కులు..

కాలనీలో ఉన్న పలు రిజర్వు స్థలాల్లో పార్కులు నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకున్నాయి. కాలనీలో పరిసరాలు అపరిశుభ్రతకు చిరునామాగా ఉన్నాయి. పారిశుద్ధ్య సిబ్బంది ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా చేపట్టక స్థానికులు చెత్తను ఇళ్ల మధ్య, రహదారుల పక్కన వేస్తున్నారు. దుర్వాసన, దోమలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రాధాన్యతా క్రమంలో సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. వీధి దీపాలను తక్షణమే పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటాం. పారిశుద్ధ్య పనులు మెరుగుపై దృష్టి సారిస్తాం. నిధుల లభ్యత ఆధారంగా అవసరమైన చోట్ల సీసీ రహదారులు, కాలువల నిర్మాణాలు చేపడతాం. – పి.వి.వి.డి.ప్రసాదరావు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్

అసంపూర్తిగా నిలిచిన మిర్తిబట్టి పనులు

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

?: మున్సిపాలిటీ పరిధి పంతులు పేట ప్రధాన రహదారిపై బహిరంగ మలవిసర్జన చేస్తున్నారు. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం - **రాములు, స్థానికుడు** ❖ పరిశీలించి బహిరంగ మలవిసర్జన నిర్మూలనకు చర్యలు తీసుకుంటాం. - **టి.రవి, మున్సిపల్ కమిషనర్, ఆమదాలవలస**

?: బీఆర్‌నగర్‌లోని అమరావతి పార్కులో రాత్రివేళల్లో గుర్తుతెలియని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. - **రాజారావు, స్థానికుడు.** ❖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం, భయపడాల్సిన పనిలేదు. - **ఎస్.బాలరాజు, ఎస్‌ఐ, ఆమదాలవలస.** – న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

కాలువలు శుభ్రం

స్పందనకు వందనం

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు మండలం తండ్యాం గ్రామంలో కాలువల్లో పూడిక ఉండటంతో మురుగు కదలక, దుర్వాసన, దోమల బెడద ఎక్కువైందనే సమస్యపై ఈనెల 10న 'దుర్వాసన..దోమల బెడద' శీర్షికతో ప్రచురితమైన వార్తకు గ్రామ సర్పంచి భాస్కరరావు స్పందించారు. కాలువలను శుభ్రం చేయించారు.

రహదారి ఎక్కడా..?

జి.సిగడాం మండల కేంద్రంలో గతంలో పేదలకు అందించిన జగనన్న కాలనీలో సరైన సౌకర్యాలు లేక కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. సరైన రహదారి లేకపోవడంతో కాలనీకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. వర్షాకాలమైతే దారుణంగా ఉంటుందని చెబుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో రామకృష్ణ వద్ద ప్రస్తావించగా కాలనీకి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, జి.సిగడాం

జంతువులతో భయం

ఉకవలస-సుభద్రాపురం రహదారిలో అడవి జంతువులతో భయపడాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. విషసర్పాలు వస్తున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి మొక్కలను తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఈవోపీఆర్డీ రామారావు వద్ద ప్రస్తావించగా ఉపాధి పనుల ద్వారా తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

కాలనీయా.. డంపింగ్ యార్డా..

ఆమదాలవలస జగనన్న కాలనీ సమీపంలో ఉన్న కొండ ప్రాంతం డంపింగ్ యార్డులా మారుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గాజులకొల్లివలస, ఆర్ఆర్ కాలనీల్లో ఇంటింటా సేకరించి చెత్త జగన్న కాలనీ సమీపం నిల్వ చేయడంతో దుర్వాసన భరించ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. తక్షణమే తొలగించేలా చర్యలు తీసుకుంటామని ఈవోపీఆర్డీ గోపాలరావు తెలిపారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

బాబోయ్ కుక్కలు..

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు పట్టణంలో కుక్కల సంచారంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మార్కెట్, పాఠశాలలకు వెళ్లే దారుల్లో నడవలేకపోతున్నామని ఫిర్యాదు చేస్తున్నారు. గుంపులుగా కనిపిస్తుండటంతో పిల్లలు, వృద్ధులు బయటకు వచ్చేందుకు భయపడుతున్నారన్నారు. ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు.

16న దేవాంగ సంఘ కార్తిక వనసమారాధన

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగర శివారు వైశ్యరాజు అప్పలరాజు పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 16న పట్టణ దేవాంగ సంక్షేమ సంఘం కార్తిక వనసమారాధన నిర్వహించనున్నట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.వీరభద్రరావు, కాకిన సూర్యప్రసాదరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు, నీట్, ఐఐటీ వంటి పోటీ పరీక్షల్లో సత్తా చాటి ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు పొందిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తామని పేర్కొన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భారీ సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

నేడు వనభోజనాలు

రణస్థలం, న్యూస్‌టుడే: రణస్థలంలోని యూబీ పరిశ్రమ ఎదురుగా ఉన్న రహదారి పక్కన ఉన్న కొబ్బరి తోటలో కూటమి పార్టీల ఆధ్వర్యంలో వన భోజనాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు, కూటమి పార్టీల ప్రతినిధులు తెలిపారు.

MISSING OF DOCUMENTS

We, Sivala Sri Rama Murthy and Sivala Suryanarayana, S/o Late Ramanna, R/o Shalantri Village, Sarubujjili Mandal, Srikakulam District, Andhra Pradesh-532190 hereby declare that two Original Documents, No. 737, Dated 30.03.1995 Sy. No. 1-5, 5 Acres and Doc. No. 910, Dated 16.04.1994 Sy. No. 30-1, A. 1-24 Cents belongs to Shalantri Revenue, registered at SRO, Amadalavalasa were missing. If any one found, hand over to the above named or Call 9440583526.

అవీ..ఇవీ..అన్నీ

పేద సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని సతీమణి, మాజీ ఎంపీపీ కూన ప్రమీల అన్నారు. బుధవారం పొందూరు మండలం లోలుగు గ్రామంలో నూతన గృహప్రవేశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

చట్టబద్ధంగా పిల్లల్ని దత్తత తీసుకోవాలి

రణస్థలం, న్యూస్‌టుడే: పిల్లలను చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలని బాలల రక్షణ అధికారి ఇప్పిలి లక్ష్మునాయుడు అన్నారు. జాతీయ దత్తత అవగాహన వారోత్సవాల సందర్భంగా మండల సమావేశ మందిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ ఏసీడీపీవో లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

చౌదరి లక్ష్మణరావుకు నివాళి

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రముఖ న్యాయవాది, సీనియర్ నాయకుడు చౌదరి లక్ష్మణరావు సంతాప సభ రాగోలులో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరి ప్రసన్న అధ్యక్షత వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ లక్ష్మణరావు ప్రజల పక్షాన నిలిచి సామాజిక న్యాయం కోసం పోరాడారన్నారు. వాన కృష్ణ చంద్, డిల్లీరావు, పొన్నాడ రవికుమార్, కేవీ జగన్నాథం పాల్గొన్నారు.

టూల్ కిట్ల పంపిణీ

రణస్థలం, న్యూస్‌టుడే: పీఎం విశ్వకర్మ యోజన టూల్‌కిట్లు క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు నాయీ బ్రాహ్మణులకు అందజేశారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు.

జామియా మసీదు అధ్యక్షుడిగా షేక్ నిజాముద్దీన్

శ్రీకాకుళం సాంస్కృతికం న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరం జి.టి.రహదారిలోని జామియా మసీదుకు పాలకవర్గాన్ని నియమిస్తూ వక్ఫ్‌బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. అధ్యక్షుడిగా షేక్ నిజాముద్దీన్, మరో 10 మంది సభ్యులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జామియా మసీదు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్, వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ జుబేర్, కమిటీ సభ్యులు మీర్ అసదుల్లా, అబ్దుల్ గఫార్‌ఖాన్, ఎండీ యాసిన్, షేక్ సలీం, ఎండీ ఇబ్రహీం, షేక్ షాన్‌బాషా, జుల్ఫికర్ అలీ బేగ్, ఎండీ రఫీ, బహదూర్‌బాషా, జామియా మసీదు జమాత్ సభ్యులు పాల్గొన్నారు.

కమిటీ సభ్యులతో కలిసి మాట్లాడుతున్న అధ్యక్షుడు షేక్ నిజాముద్దీన్

బకాయిలు చెల్లించాల్సిందే

నిరసన తెలుపుతున్న సర్వజనాసుపత్రి ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం సర్వజనాసుపత్రి ఒప్పంద ఉద్యోగులకు బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.మురళి, కార్యదర్శి ఆర్.ప్రకాశరావు డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం రిమ్స్ సెక్యూరిటీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సెక్యూరిటీ సిబ్బంది ఆకలితో అలమటిస్తున్నా వారి సమస్యలపై కార్తికేయ సెక్యూరిటీ కాంట్రాక్టర్, అధికారులు పట్టించుకోలేదని ఆక్షేపించారు. సీఐటీయూ సీనియర్ నాయకులు ఎం.ఆదినారాయణ, టి.రామారావు, సూర్యనారాయణ, వెంకటరమణ, రాజేంద్ర, లక్ష్మణరావు, శ్రీను, సత్యనారాయణ పాల్గొన్నారు.

వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

పాడి రైతులకు సూక్ష్మపోషకాల ప్యాకెట్లు అందిస్తున్న అధికారులు

జి.సిగడాం, న్యూస్‌టుడే: పశువులకు తరచూ వచ్చే వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణ అన్నారు. జి.సిగడాం మండలం ఆనందపురం గ్రామంలో బుధవారం ఉచిత పశు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స శిబిరం నిర్వహించారు. ఇందులో ఆయన పాల్గొని మాట్లాడారు. గర్భకోశ వ్యాధి సమస్యలుంటే పశువైద్య కేంద్రంలో సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఆడ దూడలు జన్మించే ఇంజక్షన్లపై అవగాహన కల్పించారు. అనంతరం పాడి రైతులకు సూక్ష్మపోషకాల ప్యాకెట్లును అందించారు. తెదేపా మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, పొందూరు ప్రాంతీయ ఆసుపత్రి ఏడీ ఎస్.రఘునాథ్, పశువ్యాధి నిర్ధారణ కేంద్ర సహాయ సంచాలకుడు ఆర్.కిశోర్ పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో విద్యార్థులకు మేలు

పొందూరు, న్యూస్‌టుడే: వృత్తి విద్య కోర్సులు విద్యార్థులకు ఉపయోగపడతాయని ఆన్‌దిజాబ్ ట్రైసాగ్ శ్రీకాకుళం జిల్లా కమిటీ సభ్యులు వై.శ్రీనివాస్ అన్నారు. పొందూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈటీ, ఎంఎల్‌టీ, ఏఅండ్‌టీ విద్యార్థులకు వివిధ రంగాలపై శిక్షణ కార్యక్రమం చేపట్టారు. డిసెంబరు 31వ తేదీ వరకు శిక్షణ కొనసాగుతుందని శ్రీనివాస్ తెలిపారు. అధ్యాపకులు వి.మురళీ, కె.సరస్వతి, ఎ.శ్రీనివాసరావు, ఎన్.చినరాయుడు, డి.శిరీషా, బి.సౌజన్య, ఎస్.వెంకటరావు, జి.రత్నకుమారి పాల్గొన్నారు.

పొందూరులో టెక్నో సెంటర్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

క్లబ్ పూర్వ వైభవానికి కృషి

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని ప్రసిద్ధ కాస్మోపాలిటన్ క్లబ్‌కు పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం క్లబ్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. మైదానం, ఇండోర్, అవుట్ డోర్ క్రీడలు, సమావేశ మందిరం, తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్లబ్ పునరుద్ధరణలో యువత, క్రీడాభిమానులు, సీనియర్ సభ్యులు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. క్లబ్ ప్రతినిధులు సురంగి మోహనరావు, జల్లేపల్లి గిరిధరరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యకళాశాలల్ని ప్రైవేట్ పరం చేయొద్దు

ఎచ్చెర్ల, ఆమదాలవలస పట్టణం,న్యూస్‌టుడే: పేద, మధ్యతరగతి వర్గాలకు ఆసరాగా నిలిచే వైద్యకళాశాలలు ప్రైవేటు పరం చేయొద్దని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే, వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొర్లె కిరణ్‌కుమార్, ఆమదాలవలస వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఎచ్చెర్ల, ఆమదాలవలసలో బుధవారం వైకాపా నేతలంతా నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

ఎచ్చెర్ల డీటీ బాలకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, నేతలు

ఆమదాలవలస: ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

ఆపదలో అండ.!

పురపాలికల్లో కార్మిక కుటుంబాలకు బీమా భరోసా

– న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

మున్సిపాలిటీల్లో పొరుగు సేవల విధానంలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించింది. ఆంధ్రప్రదేశ్ పొరుగుసేవల సంస్థ (ఆప్కాస్) పరిధిలో ఉన్న వారికి ప్రయోజనం చేకూర్చేలా కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాంత్వన కల్పించేందుకు యాక్సిస్ బ్యాంకుతో ఒప్పందం చేసుకుంది. చాలీచాలని వేతనాలతో జీవిస్తున్న వారికి ఇది అండగా నిలవనుంది. కార్మికులు, వారి కుటుంబాలకు బీమా కల్పిస్తూ ఆర్థికంగా భరోసా కల్పించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో ఆమదాలవలస పురపాలిక పరిధిలోని 112 మంది కార్మికులకు లబ్ధి చేకూరనుంది.

ఆమదాలవలస పుర కార్యాలయం

★ పొరుగు సేవల కార్మికులు, ఉద్యోగులు సహజ మరణం పొందితే పురపాలిక నుంచి రూ.2 లక్షలు, బ్యాంకు మరో రూ.2 లక్షలు అందిస్తారు.

★ ఉద్యోగులు చనిపోతే వారి పిల్లల చదువుకు ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున ఇస్తారు. ఇద్దరు పిల్లలుంటే రూ.8 లక్షలు ఇస్తారు.

★ ప్రమాదవశాత్తూ మరణిస్తే కుటుంబ సభ్యులకు రూ.20 లక్షలు పరిహారం అందనుంది.

★ విమాన ప్రమాదంలో మరణిస్తే రూ.కోటి పరిహారం వస్తుంది. రూ.4 లక్షల వరకు రుణ సదుపాయం బ్యాంకు కల్పిస్తుంది.

అవగాహన కల్పించాం..

'ఉద్యోగులు, కార్మికులకు కలిగే ప్రయోజనాలు వారికి అవగాహన కల్పించాం. ఇకపై ప్రతినెలా మూడో తేదీలోపు జీతాలు బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి' అని ఆమదాలవలస పురపాలిక కమిషనరు టి.రవి పేర్కొన్నారు.

న్యుమోనియా నివారణ సాధ్యమే

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: న్యుమోనియా వ్యాధి నివారణ సాధ్యమేనని మెడికవర్ ఆసుపత్రి వైద్యుడు అల్లా భాగ్యరాజ్ అన్నారు. ప్రపంచ న్యుమోనియా దినోత్సవం సందర్భంగా మెడికవర్ ఆసుపత్రిలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యుమోనియా సాధారణమైన వ్యాధి అయినప్పటికీ నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాపాయ పరిస్థితులకు దారి తీస్తుందన్నారు. ప్రాథమిక దశలో వైద్యులను సంప్రదిస్తే మేలని సూచించారు.

(c) eenadu

ఈనాడు
తిరుపతి

ప్రణాళికాయుత అడుగులతోనే ఉన్నత శిఖరాలు

విద్యార్థులు అనుకున్న లక్ష్యాలు చేరుకోవాలంటే అందుకు తగ్గట్లుగా ముందస్తు ప్రణాళికలు అవసరమని, విద్యార్థి జీవితంలో ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అందుకోవాలని వక్తలు సూచించారు. బుధవారం తిరుపతి గ్రామీణ మండలం పేరూరులోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో (శ్రీమీనాక్షి సౌధం క్యాంపస్) 'ఈనాడు- కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయం' సంయుక్తంగా నిర్వహించిన 'దశ దిశ' కార్యక్రమం విద్యార్థుల్లో సరికొత్త ఆలోచనలకు నాంది పలికింది. ఇంటర్ తరువాత ఉజ్వల భవిష్యత్తుకు ఏఏ కోర్సులపై దృష్టి సారించాలనే అంశాలపై నిపుణులు దిశానిర్దేశం చేశారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసి.. భవితపై భరోసా కల్పించారు. అంతకుముందు కేఎల్ యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డా.జె.శ్రీనివాసరావు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 'ఈనాడు' తిరుపతి యూనిట్ ఇన్‌ఛార్జి శ్రీధర్‌లాల్, కేఎల్‌యూ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ జేవీ షణ్ముఖ కుమార్, జోనల్ హెడ్ డా.రఘు, కళాశాల ప్రిన్సిపాళ్లు రాజేంద్ర, మల్లిక పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, తిరుపతి (విద్య)

ఆపరేషన్ స్వర్ణతో ఆటకట్టు

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: విశాలమైన లేఅవుట్‌లు, ఎనిమిది ఎకరాల్లో ఫాంహౌస్‌లు, అపార్టుమెంట్లు, అక్రమ కట్టడాలు, వందల ఎకరాల్లో మామిడి తోటలు.. ఇలా ఎన్నో అక్రమాలకు నెలవుగా మారింది స్వర్ణముఖి పరీవాహక ప్రాంతం. 'ఆపరేషన్ స్వర్ణ'లో భాగంగా తిరుపతి గ్రామీణ మండలంలో చేపట్టిన సర్వేలో గుర్తించిన ఆక్రమణల విలువ రూ.వెయ్యి కోట్ల పైమాటే. కొందరు రియల్టర్లు లేఅవుట్లు వేసి విక్రయించగా.. కొందరు ఐదారు అంతస్తుల భవనాలు నిర్మించుకున్నారు. వందల ఎకరాల్లో మామిడి తోటలు ఏపుగా పెరిగాయి. కుంట్రపాకం వద్ద విలాసవంతమైన ఫామ్ హౌస్ స్వర్ణముఖిలో వెలిసింది.

- ఆక్రమణదారుల్లో గుబులు
- సర్వేలో విస్తుగొలిపే నిజాలు వెలుగులోకి

తిరుపతి గ్రామీణ మండలంలోనే ఎక్కువ

జిల్లాలోని 9 మండలాల మీదుగా ప్రవహించే స్వర్ణముఖి ఎక్కువగా ఆక్రమణకు గురైంది మాత్రం తిరుపతి గ్రామీణ మండలంలోనే. స్వర్ణముఖి, దాని బఫర్ జోన్‌లో సుమారు 2 వేల కట్టడాలు ఉన్నట్లు తెలుస్తోంది. చిగురువాడ, వేదాంతపురం, దుర్గసముద్రం, తిరుచానూరు, అవిలాల ప్రాంతాల్లో కుంట్రపాకం ప్రాంతాల్లో ఎక్కువగా ఆక్రమణలు ఉన్నాయి. పరీవాహక ప్రాంతాల్లో 10 నుంచి 50 ఎకరాల వరకు ఆక్రమించుకుని పొలాలుగా మార్చారు. తిరుపతి గ్రామీణ మండలం తరువాత చంద్రగిరి, ఏర్పేడు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో ఎక్కువగా ఆక్రమణలు ఉన్నాయని రెవెన్యూ అధికారులు అంటున్నారు.

తిరుచానూరు సమీపంలో ఆక్రమణలు

జన్మస్థానం:	ముగింపు: వాకాడు	పొడవు:	విస్తీర్ణం:
పాకాల మండలం శంఖంపల్లె	మండలం పామంజి వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది.	155 కి.మీ.లు	3.10 లక్షల హెక్టార్లు

లక్షల మందిని ప్రమాదంలో పెట్టలేం: సి.దివాకర్‌రెడ్డి, ఛైర్మన్, తుడా

ఆపరేషన్ స్వర్ణ ముఖ్యమంత్రి అనుమతితో ప్రారంభమైంది. వేలాది ఆక్రమణలతో లక్షలాది మందిని ప్రమాదంలో పెట్టలేం. ఇలాగే వదిలేస్తే భావితరాలకు స్వర్ణముఖి పవిత్రను, ప్రయోజనాల్ని ఇవ్వలేం. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో ఆక్రమణల్ని గుర్తించగలిగాం. వంద మీటర్ల బఫర్ జోన్‌ను 50 మీటర్లకు కుదించారు. ఆ నిబంధనల ప్రకారం సరిహద్దు రాళ్లు పాతుతాం. స్వర్ణముఖి కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకుంటాం.

నది పొడవున ఇలా..

▲▲● ముక్కోటి నుంచి కుంట్రపాకం వరకు సర్వే చేశారు. ● స్వర్ణముఖి నది, దానికి ఇరువైపులా 50 మీటర్ల బఫర్ జోన్ హద్దుల్ని నిర్ణయించారు. ● వీటి మధ్యలో ఉన్న కట్టడాలు, పొలాలు, లేఅవుట్‌లను గుర్తించి వాటి వివరాలు సేకరిస్తున్నారు. ● తొలి విడతలో చంద్రగిరి నుంచి శ్రీకాళహస్తి వరకు సర్వే పూర్తి చేసి.. జనవరి నుంచి క్షేత్రస్థాయిలో సరిహద్దురాళ్లు పాతనున్నారు. ● నిరుపేదలుంటే వారికి ప్రత్యామ్నాయంగా స్థలాలు కేటాయిస్తారు. ● అక్రమార్కుల చెరలోని నిర్మాణాలు కూల్చివేస్తారు. స్థలాలను స్వాధీనం చేసుకుంటారు. ● అవసరమైన ప్రాంతాల్లో పూడిక తొలగిస్తారు. ● స్వర్ణముఖి విస్తరించిన 155 కి.మీల మేర సర్వే పూర్తయ్యాక.. ఆక్రమణకు గురవుతున్న ప్రాంతాలకు ఇరువైపులా 4 మీటర్ల వెడల్పు గల తాత్కాలిక రోడ్లను నిర్మిస్తారు.

ప్రభుత్వ విద్యార్థి.. అందుకో బహుమతి

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: మీరు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారా.. అయితే మీకో అవకాశం. మీ ప్రతిభకు పరీక్ష. ఇందులో విజయం సాధిస్తే నగదు ప్రోత్సాహకాలు ఇస్తారు. ఎపిఫనీ మెరిట్ టెస్ట్ (ఈఈఎంటీ 2025)లో సత్తా చాటితే చాలు. ఈ వివరాలు ఏంటో తెలుసుకుందామా..!

ప్రోత్సాహకాలు

- **అర్హులు:** ప్రభుత్వ పాఠశాలల్లో 7, 10వ తరగతి విద్యార్థులు.
- **ఫీజు:** రిజిస్ట్రేషన్ ఉచితం.
- **బహుమతులు:** రాష్ట్ర, జిల్లా స్థాయిలో విజేతలకు మొత్తం రూ.9 లక్షల వరకు నగదు, సర్టిఫికెట్లు.
- **పదో తరగతి:** రాష్ట్ర స్థాయిలో మొదటి మూడు ర్యాంకులకు రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు.
- **7వ తరగతి:** రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు అందిస్తారు.

- ముఖ్యమైన తేదీలు:
- రిజిస్ట్రేషన్‌కు గడువు: ఈ నెల 14
- ప్రిలిమ్స్: డిసెంబర్ 29
- మెయిన్స్: జనవరి 19

పరీక్షా విధానం

● పరీక్ష రెండు దశల్లో ఉంటుంది. ● ప్రిలిమ్స్ ఆన్‌లైన్‌లో రాయాలి. ఇందులో ప్రతిభ కనబరిచితే మెయిన్స్‌కు ఎంపిక చేస్తారు. ● **సిలబస్:** ఏపీ ప్రభుత్వ, ఎస్‌సీఈఆర్టీ, పాఠ్యపుస్తకాలపై (గణితం, సైన్స్, సోషల్, మానసిక సామర్థ్యం) ప్రశ్నలు ఉంటాయి. ● **పరీక్ష సమయం:** 60 నిమిషాలు

మీదే భారం

తిరుపతి జిల్లా డీపీ కండ్రిగ ఆర్.మల్లవరం గ్రామానికి చెందిన ఎస్.మునిశేఖర్ దివ్యాంగుడు. ఇతనికి ప్రస్తుతం రూ.6 వేల పింఛను వస్తోంది. సదరంలో 90 శాతం వైకల్యం ఉంది. రూ.15 వేల పింఛను మంజూరు కోసం బుధవారం రుయా ఆసుపత్రికి వచ్చారు. అతడికి సాయంగా బావమరిది రాగా.. బావను ఇలా భుజానికెత్తుకొని వైద్యుల వద్దకు ఇలా తీసుకెళ్తూ కనిపించారు.

– ఈనాడు, తిరుపతి

నిత్యం దారుణం



రుయా ఆసుపత్రిలో రోగిని స్ట్రెచర్‌పై తీసుకెళ్లాలంటే కుటుంబ సభ్యులో, బంధువులో ఉండాల్సిందే. బుధవారం ఉదయం ఆక్సిజన్ సిలిండర్ అమర్చిన ఓ రోగిని అత్యవసర విభాగం వైపు నుంచి పరీక్షల విభాగానికి ఇలా తీసుకెళ్తూ కనిపించారు. వృద్ధులైన రోగి బంధువులే స్ట్రెచర్‌ను లాక్కుంటూ వెళ్లారు. ర్యాంపు చిన్నగా ఉండటంతో ఇద్దరూ లాగలేక ఇబ్బందులు పడ్డారు. ఆసుపత్రి సిబ్బంది ఎంఎన్‌వో ఆక్సిజన్ సిలిండర్‌ను, స్ట్రెచర్‌ను వెనక నుంచి నెట్టుకుంటూ వచ్చారు.

తనిఖీలు.. వివరాలు ఆరా

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: దిల్లీలో పేలుళ్ల నేపథ్యంలో బుధవారం సూళ్లూరుపేటలోని రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, చెంగాలమ్మ ఆలయంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేశారు. అనుమానితుల వివరాలు ఆరా తీశారు.

చెంగాలమ్మ ఆలయంలో..

కలల గూడు.. సర్కారు తోడు

ఈనాడు– చిత్తూరు, తిరుపతి: పేదల సొంతింటి కలను నేరవేర్చడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గత ప్రభుత్వంలో మంజూరైన గృహనిర్మాణాలు వేగవంతం చేయాలని ఓవైపు అధికారులకు ఆదేశాలు ఇస్తూనే గ్రామాల్లోని పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని నిర్ణయించారు. ఇదే సమయంలో నగర, పురపాలికల పరిధిలో భూముల లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి సమాయత్తమైంది. సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో చిత్తూరు, కేవీబీపురంలో టిడ్కోకు భూములు కేటాయించాలని నిర్ణయించారు.

వైకాపా హయాంలో కదలిక లేక

తెలుగుదేశం 2014-19 పాలనలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పుంగనూరు, పలమనేరు, చిత్తూరు, పుత్తూరు, నగరి, తిరుపతి, శ్రీకాళహస్తిలో టిడ్కో గృహాలకు పునాది పడింది. అప్పట్లో 40,250 గృహాలు మంజూరయ్యాయి. చిత్తూరు, శ్రీకాళహస్తిలో దాదాపు నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈలోపు ఎన్నికలు రావడం.. వైకాపాకు అధికారం దక్కడంతో 25 శాతం లోపు పనులు జరిగిన వాటిని రద్దు చేయాలని ఆదేశించారు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు చిత్తూరు, పుంగనూరులో హడావుడిగా తాళాలిచ్చారు.

శ్రీకాళహస్తి మున్సిపాలిటీ ప్రజలకు: కేవీబీపురం మండలం కోవనూరులోనూ మరో 32.21 ఎకరాలను టిడ్కోకు కేటాయించారు. రూ.18.55 లక్షలను ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల కోసం ప్లాట్లను కేటాయించే అవకాశం ఉంది.

తిరుపతి, పలమనేరు, నగరిలో..

గతంలో తిరుపతిలో 2,560 టిడ్కో గృహాలు మంజూరుకాగా 2,160 గ్రౌండింగ్ అయ్యాయి. వైకాపా వీటిని రద్దు చేసింది. పలమనేరు, నగరిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

- రెండు జిల్లాల్లో టిడ్కో గృహాలకు 132.21 ఎకరాల కేటాయింపు
- ఏప్రిల్ నాటికి భూ బదలాయింపు పూర్తి

చిత్తూరు నగరం ఇరువారంలో కేటాయించిన భూమి

డిమాండ్ సర్వే తర్వాత

ఈ ప్రభుత్వం టిడ్కో ఇళ్లలో పెండింగ్ పనులు, సదుపాయాల కల్పనను వేగవంతం చేసింది. పట్టణాల్లో డిమాండ్ ఉండటంతో చిత్తూరు నగర పరిధి ఇరువారంలో వందెకరాలు కేటాయించారు. అనంతరం డిమాండ్ సర్వే చేస్తారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన- అర్బన్ 2.0 (ఎన్టీఆర్ నగర్) కింద ఎన్ని నిర్మించాలో నిర్ణయించి ప్రతిపాదనలు రూపొందిస్తారు.

సెమిస్టర్ ఫలితాలు విడుదల

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలో ఈ నెల మొదటి వారంలో నిర్వహించిన ఎంఫార్మసీ నాల్గవ సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసినట్లు పరీక్షల కార్యాలయం అధికారులు బుధవారం తెలిపారు.

ఫలితాలకు వెబ్‌సైట్ www.spmvv.ac.in

19న పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: శ్రీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఫార్మసీ డిప్లొమో (డీపీహెచ్) కోర్సులో ప్రవేశానికి ఈ నెల 19న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ పద్మావతమ్మ బుధవారం తెలిపారు. ఈ నెల 14 నుంచి 18లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ/బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులు అర్హులని తెలిపారు. అభ్యర్థులకు 19న ఉదయం 10నుంచి సాయంత్రం 5వరకు ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. సీటు పొందిన వారికి ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు.

వివరాలకు చరవాణి సంఖ్య: 9299008151లో సంప్రదించాలి

ఐఐటీ చూసొద్దామా..!

ఏర్పేడు, న్యూస్‌టుడే: ఐఐటీలో విద్యాభ్యాసం, తరగతుల నిర్వహణ, అందుబాటులో ఉన్న సదుపాయాలు, పరిశోధన కేంద్రాలతో పాటు 500 ఎకరాలకు పైబడి ఉన్న అందమైన ప్రాంగణాన్ని వీక్షించేందుకు పాఠశాల విద్యార్థులకు తిరుపతి ఐఐటీ అవకాశం కల్పించింది. ఏటా నిర్వహించే ఓపెన్ స్కూల్ డే కార్యక్రమానికి ఈ నెల 15న శ్రీకారం చుట్టింది. తొమ్మిది, పదో తరగతి చదివే 170 మందికి అవకాశం ఉంటుంది. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి.

- సంప్రదించాల్సిన నంబరు
- 87124 09921
- ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త సింధూరి

ఈ నంబర్లు సేవ్ చేసుకోండి..!

ఏదైనా ప్రమాదం జరిగిందా.. సైబర్ నేరగాళ్లు మీ డబ్బులు కొట్టేశారా.. అత్యవసర వైద్య సాయం కావాలా.. ఎవరిని సంప్రదించాలో తెలియడం లేదా.. అయితే మీ కోసమే ఈ నంబర్లు ఉన్నాయి. అవేంటో తెలుసుకోండి.. వెంటనే మీ ఫోన్‌లో సేవ్ చేసుకోండి.

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే:

1077 ● వరదలు, విపత్తులు ఎదురైనప్పుడు ఈ నంబరును సంప్రదించాలి. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు వచ్చి కాపాడుతాయి. 24 గంటలూ అందుబాటులో ఉంటారు.

1930 ● సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి డబ్బు పోగొట్టుకున్న వారు ఈ నంబరును సంప్రదించాలి. గుర్తించిన వెంటనే ఫిర్యాదు చేస్తే డబ్బు జమ అయిన బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేస్తారు. ఫోన్లో డేటా దుర్వినియోగం కాకుండా నిలువరిస్తారు.

101 ● ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఈ నంబరుకు కాల్ చేయవచ్చు. సంబంధిత ఫైర్ స్టేషన్‌కు.. కలవకపోతే జిల్లా అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ కలుపుతారు. వారి సమాచారంతో సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేస్తారు.

102 ● బాలింతలు, పిల్లల వైద్య సహాయం కొరకు నంబరును వినియోగించవచ్చు. ఆస్పత్రికి వెళ్లేందుకు అంబులెన్స్ సహాయం కోరినా స్పందిస్తారు. నిత్యం అందుబాటులో ఉంటారు.

112 ● వైద్య, పోలీసు సహాయం పొందవచ్చు. ఎలాంటి ఘటనలు జరిగినా సమాచారం ఇస్తే సమన్వయ కేంద్రం కొన్ని నిమిషాల్లో సేవలు అందేలా చూస్తోంది. వెంటనే బ్లూ కోల్ట్, రక్షక్ సిబ్బంది అక్కడికి చేరుకుని సేవలందిస్తారు.

181 ● ఇది మహిళా హెల్ప్‌లైన్ నంబరు. దేశ వ్యాప్తంగా పని చేస్తోంది. మహిళలకు సంబంధించిన పథకాలు, సేవలను తెలుసుకోవచ్చు. పోలీసులు, ఆస్పత్రులు, న్యాయసేవలు పొందవచ్చు.

14416 ● ఇది టెలీమానస్ టోల్‌ఫ్రీ నంబరు. ఆరోగ్యపరమైన ఒత్తిడికి గురైనా.. కుంగుబాటుతో ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన వచ్చినా.. మద్యం అలవాటు మానలేకపోయినా సంప్రదించవచ్చు.

1098 ● ఇది చైల్డ్ హెల్ప్ లైన్ నంబరు. బాల్య వివాహాలు నిలువరించడం, పిల్లల దత్తతకు కాల్ చేయవచ్చు. శిశు విహార్ కేంద్రాల్లోని చిన్నారులను దత్తత తీసుకోవచ్చు.

జిల్లాలో గృహప్రవేశాల సందడి

సూళ్లూరుపేట పరిధి మన్నారుపోలూరులో కొత్త ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: తిరుపతి జిల్లాలో పేదల సొంతింటి గృహ ప్రవేశ కల సాకారమైంది. జిల్లా వ్యాప్తంగా బుధవారం ప్రజాప్రతినిధులు, అధికారుల సారథ్యంలో లబ్ధిదారులు ఆనందోత్సాహాల మధ్య కొత్త ఇంటిలో అడుగు పెట్టారు.

జిల్లాలో ఇలా..

- మంజూరైన ఇళ్లు: 66817
- పూర్తయినవి: 33,991
- కూటమి ప్రభుత్వం వచ్చాక పూర్తి: 9373
- గృహ ప్రవేశాలు 14486.

35 రోజులకు రూ.2.20 కోట్లు

శ్రీకాళహస్తి,న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 35 రోజులకు రూ.2,20,13,724 ఆదాయం, స్వల్పంగా బంగారం, 599 కిలోల వెండి నిల్వలు వచ్చినట్లు ఆలయ ఈవో బాపిరెడ్డి తెలిపారు. 132 విదేశీ కరెన్సీ నోట్లు కూడా వచ్చాయని చెప్పారు. ఆలయ డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డితో పాటు పలువురు అధికారులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటల్లో, రూ.300 ఎస్‌ఈడీ టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. మంగళవారం శ్రీవారిని 67,367 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.4.30 కోట్లు హుండీ కానుకలు లభించాయి.

104FM Tirupati
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

రూ.50 కోట్లతో పద్మావతి ఘాట్

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: పవిత్ర స్వర్ణముఖి తీరంలోని తిరుచానూరులో పద్మావతి ఘాట్ ఏర్పాటుకు తుడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నది. పద్మావతి అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగే పంచమీ తీర్థం నాడు లక్షలాది మంది ఇక్కడ పుణ్య స్నానాలు ఆచరిస్తుంటారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఘాట్ నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించడంతో యంత్రాంగం రంగంలోకి దిగింది.

పద్మావతి ఘాట్ ప్రతిపాదిత ప్రాంతం

సుమారు 50 ఎకరాల్లో..

తిరుచానూరు నుంచి పాడిపేటకు వెళ్లే మార్గంలో ప్రస్తుతం ప్రైవేటు వాహనాల పార్కింగ్ కోసం వినియోగిస్తున్న స్థలం వద్ద సుమారు 50 ఎకరాల్లో పద్మావతి ఘాట్ నిర్మించాలని నిర్ణయించారు. స్వర్ణముఖి జీవనది కాకపోవడంతో స్నానాలు ఆచరించడానికి నీటి నిల్వ చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జలవనరుల శాఖ ఆధ్వర్యంలో ప్రతిపాదిత ప్రాంతానికి ఎగువ భాగంలో 11 చెక్‌డ్యాంలను నిర్మించి నీటిని నిల్వ చేసేలా సర్వే చేపట్టారు. అందుకోసం రూ.18 కోట్లు అవసరమని అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా రాజమండ్రికి చెందిన ఓ నిపుణుడు ఇప్పటికే ఘాట్ ప్రతిపాదిత ప్రాంతాన్ని పరిశీలించి నమూనాలు సిద్ధం చేసేందుకు అంగీకారం కోరినట్లు చెబుతున్నారు. ప్రతి శుక్రవారం పద్మావతి ఘాట్‌లో హారతి ఇచ్చేలా కార్యాచరణ రూపొందించారు. జలవనరుల శాఖతో సంబంధం లేకుండా రూ.50 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తుడా ప్రతిపాదించింది.

మురుగును అడ్డుకోవడమే సవాలు

ఘాట్ ప్రతిపాదిత ప్రాంతానికి ఎగువ భాగంలో స్వర్ణముఖిలోకి పలు ప్రాంతాల్లో మురుగునీరు ప్రవేశిస్తోంది. ఇవి నది పవిత్రతను దెబ్బతీస్తున్నాయనే ఆవేదన భక్తుల్లో ఎక్కువగా ఉంది. దీంతో అవసరమైన ప్రాంతాల్లో మురుగు నీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేసి కలుషితాలను నియంత్రించేందుకు నగరపాలిక సహకారం తీసుకోనున్నారు. ఇందులో రెవెన్యూ, జలవనరుల శాఖ, తుడా ప్రణాళిక విభాగం, సర్వే శాఖలను భాగస్వాములను చేశామని తుడా ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి తెలిపారు.

15న ఎస్వీయూలో జాబ్ మేళా

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ ఆవరణలోని మోడల్ కెరీర్ కేంద్రంలో ఈనెల 15 వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కేంద్రం అధికారి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మూడు ప్రముఖ సంస్థలు మేళా నిర్వహిస్తున్నాయని, ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఎంబీఏలో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు.

(c) eenadu

పాల్గొన్న యాత్ర సభ్యులు

శ్రీసిటీకి చేరిన జాగృతియాత్ర

శ్రీసిటీ(వరదయ్యపాలెం), న్యూస్‌టుడే: జాగృతియాత్ర బృందానికి చెందిన 525 మంది ప్రతినిధులు బుధవారం సాయంత్రం శ్రీసిటీని సందర్శించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను తయారు చేసే లక్ష్యంతో ముంబయికి చెందిన జాగృతి సేవా సంస్థాన్ స్వచ్ఛంద సంస్థ ఏటా చేపట్టే ఈ జాగృతి యాత్ర ప్రత్యేక రైలు ద్వారా దేశమంతా 8 వేల కి.మీ పర్యటించి వివిధ రంగాల్లో స్ఫూర్తిని కలిగించే ఆదర్శవంతులను నేరుగా కలుస్తారు. ఇందులో భాగంగా శ్రీసిటీకి చేరుకున్న బృందానికి శ్రీసిటీ డైరెక్టరు(సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి స్వాగతం పలికారు. అనంతరం వారు ప్రాంగణంలోని వివిధ పరిశ్రమలను సందర్శించారు.

35 బ్రాడ్ గేట్ల వితరణ

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి నాగార్జున సిమెంటు కంపెనీ ప్రతినిధులు 35 బ్రాడ్ గేట్లు బుధవారం వితరణగా అందజేశారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ఆలయానికి వీటిని అందజేశామని చెప్పారు. కంపెనీ తిరుపతి మేనేజర్ నందన్, ఆలయ ఈఈ వెంకట నారాయణ పాల్గొన్నారు.

వేలంతో రూ.1.06 కోట్ల ఆదాయం

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయ ప్రాంగణంలో ఏడాది కాలానికి దుకాణాలు, హోటళ్ల నిర్వహణకు బుధవారం ఆన్‌లైన్, సీల్డ్ టెండర్లలో బహిరంగ వేలం నిర్వహించారు. వీటి ద్వారా మొత్తం రూ.1,06,99,997 వచ్చిందని ఈవో పెంచల కిశోర్ తెలిపారు.

16న జిల్లా టెన్నికాయిట్ జట్ల ఎంపిక

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో జిల్లా టెన్నికాయిట్ సబ్ జూనియర్ బాలబాలికల జట్ల ఎంపిక చేపడుతున్నట్లు జిల్లా టెన్నికాయిట్ సంఘం అధ్యక్షుడు బి.శ్యామ్‌యాదవ్ తెలిపారు. ఔత్సాహికులు 2011 ఏడాది తర్వాత జన్మించిన వారై ఉండాలని, జనన ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలని సూచించారు.

సాంకేతిక నైపుణ్యమే.. విద్యార్థి భవితకు చుక్కాని

☛ 'ఈనాడు- కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ' అవగాహన సదస్సులో వక్తలు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: 'ఇంటర్‌లోనే విద్యార్థులు భవిష్యత్తు లక్ష్యాలు నిర్దేశించుకోవాలి.. అందుకు స్పష్టమైన ప్రణాళికలు ఇక్కడే రచించుకోవాలి. సాంకేతిక మార్పులు, మేధస్సు అందుకు చుక్కానిగా మార్చుకోవాలి.. అప్పుడే కలలు సాకారం అవుతాయి' అంటూ వక్తలు పేర్కొన్నారు. బుధవారం తిరుపతి గ్రామీణ మండలం పేరూరు లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో 'ఈనాడు- కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ' సంయుక్త ఆధ్వర్యంలో 'దశదిశ' పేరుతో విద్యార్థినులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వర్సిటీ ప్రతినిధులు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. వర్సిటీ తరఫున కిట్లు, కూపన్లు అందజేశారు. లక్కీడిప్ తీసి ఎం.అంకిత, డి.చేతనశ్రీలకు స్మార్ట్‌వాచీలు అందజేశారు. కేఎల్‌యూ అడ్మిషన్స్ డైరెక్టర్ డా.జె.శ్రీనివాసరావు, ప్రవేశాల అసిస్టెంట్ డైరెక్టర్ జేవీ షణ్ముఖ కుమార్, జోనల్ హెడ్ డా.రఘు, శ్రీచైతన్య కళాశాల ప్రిన్సిపాళ్లు రాజేంద్ర, మల్లిక, 'ఈనాడు' తిరుపతి యూనిట్ ఇన్‌ఛార్జి శ్రీధర్‌లాల్ పాల్గొన్నారు.

లక్కీడిప్ కార్యక్రమంలో విద్యార్థులు, అతిథులు

సదస్సుకు హాజరైన విద్యార్థులు

కార్పొరేట్ ప్రాధాన్యాలు గుర్తించాలి

ఇంజినీరింగ్ డిగ్రీ సార్థకం కావాలంటే సృజనాత్మక ఆలోచనలు, నైపుణ్యాలు అవసరం. పారిశ్రామిక, పరిశోధనాత్మక అంశాలపై దృష్టిసారిస్తూ అదనపు కోర్సులు అధ్యయనం చేస్తేనే అత్యుత్తమ ప్యాకేజీలు సాధ్యం. కేఎల్‌యూలో చదివిన ఓ విద్యార్థిని రూ.75 లక్షల ప్యాకేజీ పొందడం ఆనందంగా ఉంది. లక్ష్యంతో చదివితే ప్యాకేజీలు, ఉద్యోగాలు వాటంతటవే వరిస్తాయి. ఇంజినీరింగ్ కోర్సులను పాత పద్ధతుల్లో ఎంచుకోవడం సరైన ప్రక్రియ కాదు. కార్పొరేట్ కంపెనీల ప్రాధాన్యాలు మారాయి. అదనపు నైపుణ్యాలకు జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. శాటిలైట్ ప్రయోగాలతో జాతీయస్థాయిలో గుర్తింపు పొందాం. ఫీజుల్లో రాయితీ కల్పిస్తున్నాం.

- డా.జె.శ్రీనివాసరావు, కేఎల్ యూనివర్సిటీ ప్రవేశాల డైరెక్టర్

టెక్నాలజీకి అనుగుణంగా మార్చుకోవాలి

ప్రతి విద్యార్థి టెక్నాలజీకి అనుగుణంగా ఎదగాలి. ఆలోచనా విధానాలు మార్చుకోవాలి. ప్రతి క్షణం మంచి మార్కులు సాధించే దిశగా శ్రమించాలి. ఇతర దేశాలు విద్యపై ఎక్కువ ఖర్చు పెడుతున్నాయి. ఇది మన దేశంలోనూ పెరుగుతోంది.

- జె.వి. షణ్ముఖ కుమార్, ప్రవేశాల సహాయ డైరెక్టర్

మనకంటూ ప్రత్యేకత ఉండాలి

ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చే దిశగా పయనించాలి. కోర్సులు, ఉపకార వేతనాలు పరిశీలించి సరైన నిర్ణయం తీసుకోవాలి. విద్యార్థుల విజయాలు పరిశీలించాలి. ఇతర ప్రత్యేకతలు, విద్యా ప్రణాళికలు క్షుణ్నంగా తెలుసుకుని సరైన నిర్ణయం తీసుకోవాలి.

- డా.రఘు, జోనల్ హెడ్, కేఎల్‌యూ

మహిళా మోర్చా ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

ఆత్మీయ సమావేశంలో పీవీఎన్ మాధవ్, భూపతి రాజు శ్రీనివాస వర్మ, నిషిధరాజు తదితరులు

తిరుపతి (గాంధీ రోడ్డు), న్యూస్‌టుడే: రానున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు భాజపా మహిళా మోర్చా సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిషిధరాజు ఆత్మీయ సమావేశానికి రాష్ట్ర పీవీఎన్ మాధవ్, కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ నిషిధరాజు కుటుంబం పార్టీకి చేసిన సేవలను పార్టీ ఎప్పుడూ గుర్తించుకుంటుందన్నారు. ఎంపీ సత్యనారాయణ మాట్లాడుతూ మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. భాజపా జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, రమేష్ నాయుడు, భానుప్రకాష్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మనిర్భర్ భారత్‌కు యువత కృషిచేయాలి

■ కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: బలమైన, శక్తివంతమైన భారత నిర్మాణానికి యువత కృషి చేయాలని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పేర్కొన్నారు. తిరుపతిలోని డా.బీఆర్ అంబేడ్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్ వేదికగా భాజపా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఆత్మ నిర్భర్ భారత్ సదస్సు'లో ఆయనతోపాటు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి న్యాయ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఆత్మనిర్భర్ భారత్ ప్రతి భారతీయుని ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని, మనచుట్టు పక్కల ఉన్న స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని సూచించారు.

ద్రవిడ వర్సిటీలో పరిశోధనం

● గ్రంథాలు సమర్పించినా.. అందని పట్టాలు

● ఆచార్యుల చుట్టూ విద్యార్థుల ప్రదక్షిణ

ద్రవిడ భాషలు.. సంస్కృతి.. సంప్రదాయాలు పరిరక్షించాలనే లక్ష్యంతో త్రిరాష్ట్ర కూడలి అయిన కుప్పంలో ద్రవిడ విశ్వవిద్యాలయం ఏర్పాటైంది. పరిశోధన దిశగా అడుగులు వేస్తూ యూజీ, పీజీ కోర్సులకు కూడా శ్రీకారం చుట్టింది. కాలక్రమేణా నాటి పాలకులు.. అధ్యాపకులు.. ఆచార్యుల ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. పర్యవేక్షణ కొరవడటంతో విద్యార్థులు నాణ్యమైన పరిశోధనలు చేపట్టలేకపోతున్నారు.

ద్రవిడ వర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశాల కోసం సెప్టెంబరు 11న వర్సిటీ రిజిస్ట్రార్ నోటిఫికేషన్ విడుదల చేశారు. మొత్తం 14 విభాగాల్లో 62 సీట్ల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా.. ఇప్పటివరకు నెట్, జేఆర్‌ఎఫ్‌లో ఉత్తీర్ణత సాధించిన 26 మందికి ప్రవేశాలు కల్పించారు. ఇక్కడ నెలకొన్న లోపాలతో పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ అవుతాయన్న నమ్మకం కొరవడింది.

ఉదాహరణలెన్నో

● వి.కోట ప్రాంతానికి చెందిన ఓ పరిశోధక విద్యార్థిని 'చిత్తూరు జిల్లా స్త్రీవాద రచయిత్రుల కథలు, స్త్రీ జీవిత చిత్రణ' అంశంపై పరిశోధన చేశారు. దీనిపై సిద్ధాంత గ్రంథాన్ని ద్రవిడ వర్సిటీలో ఓ ఆచార్యులకు సమర్పించగా.. తిరుపతిలోని ఓ వ్యక్తికి సిఫార్సు చేశారు. సదరు వ్యక్తి రూ.80 వేలు ఇస్తే.. ఈ పరిశోధన అంశాన్ని పూర్తిచేస్తానని చెప్పగా.. రూ.10 వేలు అడ్వాన్స్‌గా ఇచ్చింది. రెండేళ్ల తర్వాత గ్రంథాన్ని తిరిగిచ్చినట్లు విద్యార్థిని ఆవేదన చెందుతోంది.

● ద్రవిడ విశ్వవిద్యాలయంలోని ఓ విభాగంలో పేరు చెప్పేందుకు ఇష్టపడని ఓ పరిశోధక విద్యార్థి తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి జిల్లాలో 'హోసూరు తెలుగు కథలు'పై క్షేత్రస్థాయిలో తిరిగారు. అంతరించిపోతున్న కథలు.. కథలు.. సంస్కృతి.. సంప్రదాయాలపై పరిశోధన చేసి 2023లో పరిశోధన సిద్ధాంత గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించారు. ఇంతవరకు పట్టా అందకపోవడంతో అతను వర్సిటీ చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన పరిస్థితి కొనసాగుతోంది.

● కుప్పానికి చెందిన ఓ పరిశోధకురాలు తమిళనాడు రాష్ట్రం కంచి, మదురై ప్రాంతాల్లో పర్యటించి 'తొండనాడు కథలు'పై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని వర్సిటీలో సమర్పించేందుకు యత్నించారు. అక్కడ సరైన స్పందన లభించలేదని ఆమె ఆవేదన చెందడం గమనార్హం.

- న్యూస్‌టుడే, కుప్పం గ్రామీణ

సమర్పించినా.. కాలయాపన

కొందరు విద్యార్థులు పరిశోధన గ్రంథాలను సమర్పించినా.. ఏదో ఒక కారణాలు చూపుతూ పట్టాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనివల్ల విద్యార్థుల సంఖ్య కనీస స్థాయికి పడిపోయి ఉద్యోగులకు సైతం జీతాలు ఇవ్వలేని పరిస్థితుల్లో ద్రవిడ విశ్వవిద్యాలయం కొట్టుమిట్టాడుతోంది.

కిం కర్తవ్యం

కొందరు పరిశోధక విద్యార్థులను పలకరిస్తేనే ఇన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయంటే.. ఇక పీహెచ్‌డీ పట్టాల జారీలో జాప్యం.. ప్రవేశాల రద్దు తదితర విషయాలపై లోతుగా ఆరా తీస్తే ఏ స్థాయిలో పరిశోధకులు ఇబ్బందులు పడుతున్నారో వెల్లడవుతుంది.

30 శాతం సీట్లు భర్తీ చేశాం..

యూజీసీ నిబంధనల ప్రకారం 30 శాతం నెట్, జేఆర్‌ఎఫ్‌లో ఉత్తీర్ణత సాధించిన 26 మందికి వర్సిటీలో ప్రవేశాలు కల్పించాం. మిగిలిన సీట్ల వివరాలను ఏపీఆర్‌సెట్‌కు సమర్పించాం. అర్హులందరికీ పీహెచ్‌డీ పట్టాలు ఇస్తున్నాం. ఏదైనా సమస్యలుంటే మా దృష్టికి తీసుకురావాలి.

- ఆచార్య కిరణ్‌కుమార్, రిజిస్ట్రార్

కార్యక్రమంలో బ్యాంకు ఉన్నతాధికారులు

ఘనంగా యూబీఐ దినోత్సవం

తిరుపతి (గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 107వ వ్యవస్థాపనా దినోత్సవం తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో బుధవారం ఘనంగా జరిగింది. జోనల్ మేనేజర్, హెడ్ పత్రి శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ విలీనం అనంతరం బ్యాంకు సమగ్రాభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని వివరించారు. వ్యాపార లావాదేవీలు రూ.22.10 లక్షల కోట్లు దాటాయని, దేశంలోనే ఐదో అతిపెద్ద బ్యాంక్‌గా ఎదిగిందన్నారు. ప్రస్తుతం 8,655 శాఖలు, 9,064 ఏటీఎంలు, 74,200 మంది ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. వినియోగదారులు, ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవకు 25 గ్రామాలు

☛ విజయనగర తామ్రశాసనాల్లో నిక్షిప్తం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: విజయనగర పురాతన తామ్ర శాసనాలు ఇప్పటికీ పదిలంగానే ఉన్నాయి. ముక్కంటి ఆలయ అనువంశిక ప్రధాన దీక్షా గురుకుల్ కుటుంబానికి చెందిన డా.ఎస్.ఎం.కె.పరశురాం గురుకుల్ సంరక్షణలో ఉన్నాయి. అయిదు రాగి రేకుల గుత్తులో ఉన్న వాటిపై లిఖించిన అక్షరాలు ఇప్పటికీ ఎంతో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

గోళాకృతిలో విజయనగర రాజ ముద్రిక

శ్రీరంగరాయ రాసిన రాగి పలక

54 ఏళ్ల క్రితమే వెలుగులోకి

విజయనగర సామ్రాజ్యంలో 1576-1644 మధ్య విస్తరించిన అరవీటి వంశచరిత్రకు సంబంధించిన ఈ తామ్ర శాసనాల గురించి శ్రీవిరూపాక్ష శ్రీరామ తామ్రశాసనాల పేరుతో పురావస్తు శాఖ అనుమతితో డా.వడ్లమూడి గోపాలకృష్ణయ్య పుస్తక రూపంలోనికి తీసుకువచ్చారు. విజయనగర సామ్రాజ్య రాజముద్రికలు రాగి గోళాలపై ఎంతో చక్కగా పొందుపరిచారు. సంస్కృతం, నందినాగరి లిపిలో రాసిన ఈ శాసనం 1498 శాలివాహన శకం, ధాత్రి సంవత్సరం, కార్తిక మాసంలో రాసినట్లుగా నిర్ధారించారు. ఆంగ్ల కాలమానం ప్రకారం సామాన్య శకం 1576 నవంబరు 3న రాసినట్లు తెలుస్తోంది. తరతరాల వారసత్వ సంపదగా వాటిని గురుకుల్ కుటుంబీకులు సంరక్షిస్తున్నారు. అరవీటి వంశచరిత్రను ఈ శాసనాల ద్వారా విశదపరిచారు. తిరుమలరాయల కుమారుడైన శ్రీరంగరాయలు శ్రీకాళహస్తీశ్వరుని నిత్యార్చనలకు వీలుగా 24 గ్రామాలు దానంగా ఇచ్చినట్లు శాసనం స్పష్టం చేస్తోంది. అలాగే పినవెంకటరాయల కుమారుడు మరో శ్రీరంగరాయలు మరో గ్రామాన్ని దానంగా ఇచ్చినట్లు పొందుపరిచారు.

కమిటీ సభ్యుడికి నియామకపత్రం అందజేస్తున్న రాష్ట్ర మహాసభ నాయకులు

ముదిరాజ్‌లకు ప్రాధాన్యమివ్వాలి

నాయుడుపేట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం భర్తీ చేసే ప్రభుత్వ నామినేటెడ్ పదవులు, ఆలయ కమిటీల్లో ముదిరాజ్‌లకు ప్రాధాన్యమివ్వాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొర్నా నారాయణ ముదిరాజ్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఎన్.వి.రమణయ్య డిమాండ్ చేశారు. బుధవారం నాయుడుపేట రామసుబ్బయ్య ఆసుపత్రిలో జరిగిన జిల్లా ముదిరాజ్ మహాసభలో వారు మాట్లాడారు. నాయకులు జి.సి.రత్నం, గురుమూర్తి, కనికట్ల మోహన్, జంగపల్లి, చిగురుపాడు సర్పంచులు లావణ్య, మస్తానయ్య పాల్గొన్నారు.

SBI భారతీయ స్టేట్ బ్యాంక్

RASMECCC & SARC, తిరుపతి, రేణిగుంట రోడ్, తిరుపతి, ఫోన్ నెం.: 99899 24214

స్వాధీనం చేసుకున్న వాహనాల ఇ-వేలం కోసం బహిరంగ ప్రకటన

మా ఋణగ్రహీతల క్రింద పేర్కొన్న వాహనాలు "అవి ఉన్న చోటనే ఉన్నట్లుగా" ఇ-వేలం పద్ధతిలో అమ్మకం కోసం ఇ-కొటేషన్లు ఆహ్వానించబడ్డాయి ఈ వాహనాలకు బ్యాంకు నిధులు సమకూర్చింది మరియు ఋణగ్రహీతలు వాయిదాలు (EMI) లు చెల్లించడంలో విఫలం అయినందున బ్యాంకు ఆ వాహనాలను స్వాధీనం చేసుకుంది మరియు వాటిని తేదీ.21-11-2025 న ఇ-వేలం పద్ధతిలో వేలం వేస్తున్నారు.

వ.నెం.	ఋణగ్రహీత పేరు / చిరునామా & ఖాతా నెం.	వాహనం నెం./ రిజిస్ట్రేషన్ నెం./ మోడల్ వివరాలు	రిజర్వు ధర / ధరావతు / బిడ్ పెంపుదల మొత్తం
1)	శ్రీమతి గుర్రం అంజలి & శ్రీ గుర్రం రఘురాం 1-59, దామచర్ల, ఖమ్మం - 507114, ఖమ్మం జిల్లా లోన్ ఖాతా నెం. : 37143922622	FORD INDIA PVT LTD MFG: FORD FIGO ASPIRE 1.5 REG NO : AP 03 CG 4774 MFG YEAR : 09/2017 TYPE OF BODY : MOTOR CAR COLOUR: SMOKEY GREY CHASIS No.: MAJZXXMTKZH08776 ENGINE No.: HP08776	రిజర్వు ధర : రూ.1,92,000.00 + జి.యస్.టి. వర్తించును ధరావతు : రూ.19,200.00 బిడ్ పెంపుదల మొత్తం రూ.5,000.00
2)	మోతుకూరి మల్లిఖార్జున్ నాయుడు, తండ్రి : ఎమ్.శ్రీనివాసులు నాయుడు డి.నెం.23-8-80/201, ఆనంద నిలయం, రాయల్‌నగర్, తిరుపతి-517501 లోన్ ఖాతా నెం. : 37620778878	MARUTHI SUZUKI VITARA BREEZA REG NO: PY 01 CS 4399 MFG : MARUTHI SUZUKI PVT LTD MFG.YEAR : 03/2018 TYPE OF BODY : SALOON (COLOUR : BLAZING RED CHASSIS NO : MA3NYFB1SJC359323 ENGINE NO : D13A5611799	రిజర్వు ధర : రూ.5,00,000.00 + జి.యస్.టి. వర్తించును ధరావతు : రూ.50,000.00 బిడ్ పెంపుదల మొత్తం రూ.5,000.00
3)	శ్రీ కగ్గోల వెంకటరమణ నాయుడు తండ్రి : కె.సిద్దయ్య 20-1-271, మారుతీనగర్, కొర్లగుంట, తిరుపతి-517501 లోన్ ఖాతా నెం. : 39149694274	TRIBER RXZ PETROL MT 1.ECE REGISTRATION NO: AP 39 EC 0562 MFG YEAR: 2020 TYPE OF BODY: STATION WAGON COLOUR: MOON LIGHT SILVER CHASSIS NO: MEERBC008L1031742 ENGINE NO: B4DA417E004599	రిజర్వు ధర : రూ.4,00,000.00 + జి.యస్.టి. వర్తించును ధరావతు : రూ.40,000.00 బిడ్ పెంపుదల మొత్తం రూ.5,000.00
4)	దేవి శ్రీ ట్రావెల్స్ (కమర్షియల్ వాహనం) ప్రొప్రయిటర్ : పి.సునీత (మరణించినారు), భర్త : జి.తిరిపిదాసు డి.నెం.15-64 -1, పద్మావతినగర్, రామాలయం దగ్గర, తిరుపతి-517501 కారు లోన్ ఖాతా నెం. : 43157086242	TOYOTA GLANZA V PETROL (MT) BS VI-REG CAR WITH REGISTRATION No: AP39 UX 0196 DATE OF REGISTRATION : 23-08-2024 Mfg : TOYOTA KIRLOSKAR MOTOR INDIA PVT LTD FUEL TYPE : PETROL, MFG YEAR : 06/2024 TYPE OF BODY : PASSENGER CAR COLOUR : ENTICING SILVER CHASSIS NO : MBHJWC13SRF779676 ENGINE NO : K12NP4490696	రిజర్వు ధర : రూ.9,00,000.00 + జి.యస్.టి. వర్తించును ధరావతు : రూ.90,000.00 బిడ్ పెంపుదల మొత్తం రూ.5,000.00
5)	ఎమ్.లలిత, భర్త : ఎమ్.మణి, నెం.3-313, వెంకటపతి నగర్, చెర్లోపల్లి, తిరుపతి కారు లోన్ ఖాతా నెం. 43477660691	KIA India PVT Ltd Sonet G 1.2 KMT HTK (O) CAR With Registration No.AP40 EM3240 Date of Registration : 04-12-2024 Mfg : Kia India Pvt Ltd., Fuel Type : Petrol Mfg. : Year : 2024 Type of Body : Station Wagon Clour : Gravity Grey Chassis No. : MZBFB812LRN456328 Engine No. : G4LFRV468993	రిజర్వు ధర : రూ.7,80,000.00 + జి.యస్.టి. వర్తించును ధరావతు : రూ.78,000.00 బిడ్ పెంపుదల మొత్తం రూ.5,000.00

ఈ-వేలం తేది & సమయం : తేది.21.11.2025, మ. 03.00 గంటల నుండి సా.4.00 గంటల వరకు

నియమ నిబంధనలు : 1) వాహనము రిజర్వు ధర కంటే తక్కువకు విక్రయించబడదు.
2) గెలుపొందిన బిడ్డరు అమ్మకం మొత్తంలో 15% శాతాన్ని వెంటనే డిపాజిట్ చేయవలెను మరియు మిగిలిన 75% మొత్తాన్ని విక్రయ తేదీ నుండి 7 రోజులలోగా చెల్లించవలెను.
3) వేలంను రద్దు చేయుటకు లేదా వాయిదా వేయుటకు బ్యాంకుకు హక్కు కలదు.
4) గెలుపొందిన బిడ్డరు వాహనం రిజిస్ట్రేషన్ చేసుకోవలెను. వాహనాన్ని గెలుపొందిన బిడ్డరుకు మాత్రమే అప్పగించబడును మరియు గెలుపొందిన బిడ్డరు పేరున మాత్రమే పేరు మార్చబడును.
5) ఆసక్తి గల బిడ్డర్లు వేలం తేదికి మూడు రోజుల ముందుగా పైన తెలిపిన బ్రౌజర్‌లో https: //ebkray.in/baankenet.com/eauction-psb/x-login నందు లేదా యూఆర్ఎల్ https://baanknet.com నందు ఎవరికి వారే రిజిస్ట్రేషన్ లేదా నమోదు చేసుకొనవలెను.
6) ఆసక్తి గల బిడ్డర్లు పైన తెలిపిన వెబ్‌సైట్‌లోని "Buyer / Guide for Login & Registration" విభాగంలో అందించిన వీడియోలు/ఫోటోలను డౌన్‌లోడ్ చేసుకోని చూడవలసినదిగా సూచించడమైనది.
7) అమ్మకం యొక్క నియమ నిబంధనల కొరకు వెబ్‌సైట్‌లో ఇవ్వబడిన URL https://ekray.In లేదా baanknet.com నందు వేలం తేదిని పరిశీలించి, యస్‌బిఐ బ్యాంకు ఎంచుకుని, నియమ నిబంధనలు అనుమతించి పాల్గొనవలెను.
8) తదుపరి వివరముల కొరకు (1) జి.వంశీ, మొబైల్ నెం. : 99493 49497,
(2) బి.బాలశ్రీనివాస నాయక్, మొబైల్ నెం.99899 24214.

తేది: 12.11.2025, ప్రదేశం : తిరుపతి | సం/- అధీకృత అధికారి, భారతీయ స్టేట్ బ్యాంక్

పరకామణి కేసులో ఆ ఐదుగురినీ విచారించండి

■ సీఐడీ డీజీకి విన్నవించిన తెదేపా బృందం

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: 'శ్రీవారి కానుకలు కాజేసిన నిందితులు ఎంత పెద్దవారైనా శిక్షించండి.. కేసులో పాత్రధారులనే కాకుండా వెనుక ఉండి నడిపించిన అప్పటి తితిదే ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డితోపాటు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి రోజూ ఆదేశాలు జారీచేసిన సీఎంవో చీఫ్ ధనంజయరెడ్డిని పిలిచి విచారించండి. ఇది రాజకీయ వేధింపుల కేసు కాదు.. భక్తుల మనోభావాలకు సంబంధించిన కేసుగా పరిగణించి క్షుణ్నంగా దర్యాప్తు జరపాల'ంటూ తెదేపా బృందం విన్నవించింది. బుధవారం పద్మావతి అతిథిగృహంలో సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్‌ను తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, బయో డైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయకుమార్, నాలెడ్జ్ సెంటర్ ఛైర్మన్ గురుజాల మాల్యాద్రి, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మన్నూరు సుగుణమ్మ, తుడా ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు, గంగమ్మ గుడి ఆలయ ఛైర్మన్ మహేష్ యాదవ్ తదితరులు 27 అంశాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. 'వైవీ సుబ్బారెడ్డి పీఏ బ్యాంకులో రూ.4.6 కోట్ల నగదు ఉంటే.. సుబ్బారెడ్డి ఖాతాలో ఇంకెంత ఉంటుంది. తిరుపతి, తితిదే తన చేతిలో ఉందని విర్రవీగిన భూమన కరుణాకర్‌రెడ్డి కేసు నుంచి తప్పించుకునేందుకు సుప్రీంకోర్టు న్యాయవాదుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. రవికుమార్‌కు సంబంధించిన ఆస్తులను జయచంద్రారెడ్డి ద్వారా కాజేశారనే ఆరోపణలు నిగ్గు తేల్చాలి' అని వారు విన్నవించారు.

సీఐడీ డీజీకి వినతిపత్రం అందజేస్తున్న వర్ల రామయ్య, తెదేపా నేతలు

14 నుంచి ఐసర్ వేదికగా వేడుకలు

ఏర్పేడు, న్యూస్‌టుడే: తిరుపతి భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధన సంస్థ (ఐసర్) వేదికగా బెంగళూరులోని ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (ఐఏఎస్‌ఈ) 91వ వార్షిక వేడుకలను నిర్వహించేందుకు శ్రీకారం చుట్టారు. ఈనెల 14 నుంచి 16 వరకు వైభవంగా జరిపేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. మూడు రోజులపాటు జరిగే వార్షికోత్సవాలకు దేశంలోని ప్రముఖ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు పెద్దఎత్తున హాజరుకానున్నారని నిర్వాహకులు వివరించారు. ఐఏఎస్‌ఈ ఇప్పటి వరకు సాధించిన ప్రగతితోపాటు వివిధ పరిశోధనల గురించి చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

చిన్న అప్పన్న బెయిల్ పిటిషన్ వాయిదా

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: శ్రీవారి లడ్డూ ప్రసాదాల కల్తీ నెయ్యి కేసులో అరెస్టు అయిన వైవీ సుబ్బారెడ్డి మాజీ వ్యక్తిగత కార్యదర్శి చిన్న అప్పన్న (ఏ24) బెయిల్ పిటిషన్ వాయిదా పడింది. కల్తీ నెయ్యి కేసులో నిందితుడైన అతన్ని గత నెల చివరి వారంలో సిట్ అరెస్టు చేసింది. బెయిల్ నిమిత్తం చిన్న అప్పన్న దరఖాస్తు చేయగా న్యాయస్థానం ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసింది.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయం విరమించాలి

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: పీపీపీ పేరుతో వైద్య కళాశాలల ప్రైవేటీకరణ విరమించుకోవాలని డిమాండు చేస్తూ బుధవారం వైకాపా నాయకులు నిరసన చేపట్టారు. గంగినేనిచెరువు వద్ద నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో వైకాపా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. వైద్య కళాశాలలను సీఎం చంద్రబాబు.. స్వప్రయోజనాల కోసం బినామీలకు కట్టబెట్టేందుకు యత్నిస్తున్నారని, పీపీపీ విధానం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి హెచ్చరించారు. అనంతరం వినతిపత్రాన్ని ఆర్డీవో కార్యాలయ ఏవో మురళీమోహన్‌కు అందజేశారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకులు రెడ్డెప్ప, నాయకులు చంద్రశేఖర్, కేపీ శ్రీధర్ పాల్గొన్నారు.

ఏవో మురళీమోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కరుణాకర్‌రెడ్డి, నాయకులు

తక్కువ ధరకు ఇల్లు కట్టిస్తామని బురిడీ

☛ పేదలను మోసగించి రూ.25 లక్షలు స్వాహా

☛ ఇద్దరు నిందితులకు రిమాండ్

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: పేదలకు తక్కువ ధరతో ఇల్లు కట్టిస్తామని, ఇంటి స్థలాలు, కార్లు, ఇతర వాహనాలు ఇస్తామని మభ్యపెట్టి మోసగించిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేసి బుధవారం నాయుడుపేట కోర్టులో హాజరుపరిచారు. స్థానిక సీఐ బాబీ కథనం మేరకు.. బాలాయపల్లి, ఓజిలి మండలం కుందాం గ్రామాలకు చెందిన గురుప్రసాద్, శిల్పా ప్రియాంకలు ఏపీఆర్‌డీ సంస్థ పేరిట తక్కువ ధరకు ఇళ్లు కట్టిస్తామని, వాహనాలు ఇస్తామని పేదల్ని నమ్మించారు. ఇలా నాయుడుపేట పరిసర మండలాల్లో పలువురి నుంచి రూ.25 లక్షల వరకు వసూలు చేసి.. మోసం చేశారు. నాయుడుపేట మండలం అన్నమేడు గ్రామానికి చెందిన సాధన అనే మహిళ ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆధారాలు స్వాధీనం చేసుకుని నిందితులిద్దరినీ అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. న్యాయమూర్తి రిమాండు విధించారు.

EENADU eClassifieds

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

రంగంపేట, మోహన్‌బాబు కాలేజ్ ఎదురుగా, తిరుపతి మదనపల్లి హైవేకి 15 అ॥. దూరంలో 66 అంకణాల ప్లాట్ కలదు. వివరాలకు సం॥. 8008685569.

TO LET

తుమ్మలగుంట - ఉప్పరపల్లి రోడ్ నందు 70x52=3640 sft, 37x46 = 1702 sft గోడౌన్‌లకు అద్దెకు ఇవ్వబడును. ✆ 90306 66269.

తిరుపతి, LIC రోడ్డులోని Ist ఫ్లోర్‌లో 700 Sq.Ft, ఉత్తర ముఖం ఫ్లాట్‌ను కమర్షియల్ పర్పస్‌కు మరియు IIIrd ఫ్లోర్‌లో (హెడ్‌రూమ్) సింగల్ బెడ్‌రూంను బాడుగకు ఇవ్వబడును. 24hrs వాటర్, బాత్ రూం సౌకర్యం కలదు ✆ 91001 55254, 62815 61213.

JOBS

తిరుపతిలోని ప్రముఖ కంపెనీకి బిజినెస్, రిటైర్డ్‌పర్సన్స్, వివాహితులు & యువత కావలెను. Age: 30 to 65, Qua: Inter to PG ✆ 7675095860

శారీస్ & ఫ్యాబ్రిక్స్ షాపుకు అనుభవజ్ఞులైన ఇద్దరు Salesman కావలెను. జీతం 15,000 to 24,000/-. శ్రీ వెంకటరమణ కట్‌పీసెస్ 8-3287, కొత్తవీధి, తిరుపతి ✆ 9440397253

శ్రీ వెంకటేశ్వర ఫైనాన్స్ మదనపల్లి, చిత్తూరు బ్రాంచ్‌ల నందు పని చేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్, కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. ✆ 99898 66066, 76808 86106

తిరుపతి APSRTC బస్టాండులోని పార్శిల్ కౌంటర్ నందు పనిచేయుటకు బాయ్/ గర్ల్స్ కావలెను. సంప్ర: ✆ 86888 18881.

ప్రముఖ కంపెనీకి అడ్మినిస్ట్రేషన్ వర్క్ (Male) అభ్యర్థులు కావలెను. గుడ్ కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి యాక్టివ్‌గా ఉండవలెను. Exp: 3 Years above, Qly: డిగ్రీ / పీజీ. ✆ 89857 17076, 97034 02722

IT HARDWARE

Internship / Final Year Projects. Web App | Data Analytics | Digital Marketing | Cloud | HR Certification Placement Support Bangalore. Ph: 8105577689

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

THE EENADU WAY CLASSIFIEDS

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే

అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు

వివరాలకు... 80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి

B/W: రూ. 600 Colour: రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

(c) eenadu

తిరుపతి

•తిరుపతి • చంద్రగిరి

దిల్లీ పేలుళ్లు బాధాకరం

తిరుమల, న్యూస్‌టుడే: దిల్లీలో బాంబు పేలుళ్లు బాధాకరం, అందులో అసువులు బాసిన వారికి న్యాయం జరిగేలా ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షా కఠిన చర్యలు తీసుకుంటున్నారని భాజపా నాయకులు సోము వీర్రాజు పేర్కొన్నారు. బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారి మూలమూర్తిని ఆయన దర్శించుకున్నారు. వెంకటగిరి ఎమ్మెల్యే కె.రామకృష్ణ శ్రీవారిని దర్శించుకున్నారు.

ఉత్సాహంగా అంతర కళాశాలల క్రీడలు

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: ఎస్వీయూ అంతర కళాశాలల పురుషుల క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవం ఉత్సాహంగా జరిగింది. వ్యాయామ విద్యావిభాగం ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీ వరకు జరుగనున్న టోర్నీకి ఎస్వీయూ అనుబంధంగా ఉన్న పలు కళాశాలలకు చెందిన 30 కళాశాలల జట్లు పోటీపడనున్నాయి. వ్యాయామ విద్య విభాగాధిపతి ఆచార్య శివ శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆచార్యుని అవతారమెత్తిన వీసీ

తిరుపతి (ఎస్వీయూ): శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ వీసీ ఆచార్య తాతా నరసింగరావు బుధవారం విద్యార్థులకు ఫిజిక్స్ పాఠాలు బోధించారు. వీసీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం భౌతికశాస్త్ర విభాగాన్ని సందర్శించారు. గంటపాటు ఎంఎస్సీ విద్యార్థులకు పాఠాలు బోధించారు.

నేటి నుంచి 'నృత్య వాహిని' ఉత్సవం

తిరుపతి (మహిళావర్సిటీ), న్యూస్‌టుడే: శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో 'నృత్య వాహిని' పేరుతో మూడురోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ కల్చరల్ ఎక్స్ఛేంజ్ ఫెస్టివల్ గురువారం ప్రారంభమవుతుందని వీసీ ఆచార్య వి.ఉమ తెలిపారు. మన దేశం నుంచే కాకుండా ఇతర దేశాల నుంచి మొత్తం 87 మంది కళాకారులు పాల్గొంటారని, కలెక్టర్ వెంకటేశ్వర్ ముఖ్యఅతిథిగా విచ్చేస్తారన్నారు.

ఎస్వీయూ వీసీ నుంచి ఉత్తమ అవార్డు అందుకుంటున్న విద్యార్థిని భావనరెడ్డి

యువ విద్యార్థులే దేశసంపద

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: దేశ భవిష్యత్తు, పురోగతి యువత మీదే ఆధారపడి ఉంటుందని, యువశక్తితోనే భారతదేశం అన్ని అంశాల్లో ముందుకు దూసుకుపోతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మహతి కళాక్షేత్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ విద్యార్థుల అభినందన సభలో వక్తలు ప్రసంగించారు. ముఖ్య అతిథులుగా ఎస్వీయూ వీసీ నరసింగరావు, తితిదే పాలకమండలి సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశానికి లేనంత యువశక్తి భారతదేశంలోనే ఉందన్నారు. నగరంలోని పలు విశ్వవిద్యాలయాలు, ప్రైవేటు కళాశాలల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శ్రీవెంకటేశ్వర ప్రతిభా పురస్కార్ అవార్డులను ఏబీవీపీ తరఫున అందజేశారు. ఆర్ఎస్ఎస్ దక్షిణమధ్య క్షేత్ర ప్రచారక్ భరత్ కుమార్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కేవీ చౌదరి, డా.లక్ష్మీనారాయణ, డా.వెంకటరమణయ్య, వై.సురేంద్రబాబు, సాయి సత్యనారాయణ, డా.సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిరీక్షణకు తెర.. హక్కులే తరువాయి

అభివృద్ధి పనులకు తుడా శ్రీకారం

మంగళం (తిరుపతి), న్యూస్‌టుడే: ఏడు దశాబ్దాల రైతుల నిరీక్షణ కూటమి ప్రభుత్వం తొలగించింది. శెట్టిపల్లె భూముల అప్పగింతకు పచ్చజెండా ఊపింది. గత తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ల్యాండ్‌పూలింగ్ అంశానికి ఆలస్యంగా తరువాత తిరిగి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పరిష్కారం చూపించింది. సంక్రాంతి పర్వదినంలోపు లబ్ధిదారులకు భూములు అప్పగించేందుకు తుడా పనుల్లో వేగం పెంచింది. భూములు చదును చేసే లేఅవుట్లను రూపొందించేందుకు పనులు ప్రారంభించింది.

భూములు చదును చేస్తున్న దృశ్యం

బ్రిటీష్‌వారి కాలం నుంచి శిస్తులు చెల్లిస్తూ, రైత్వారీ పట్టాల ద్వారా శెట్టిపల్లె రైతులు సుమారు 450 ఎకరాల భూములను సాగుచేసి, పంటలు పండించుకునేవారు. తరువాత రైతులకు హక్కులు కల్పించకుండా అన్‌సెటిల్డ్ భూములుగా, అన్‌సెటిల్డ్ ఇనామ్ ఎస్టేట్ విలేజ్‌గా రికార్డుల్లో నమోదు చేశారు. సమస్యకు పరిష్కారం చూపేందుకు తెదేపా సర్కారు 2019లో నాంది పలికింది. దాదాపు 50 శాతానికి పైగా ప్రక్రియను పూర్తి చేసింది. అయితే వైకాపా సర్కారు అధికారంలోకి వచ్చిన తరువాత శెట్టిపల్లె భూముల పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. సర్వేలు, రీసర్వేలు, రికార్డుల పరిశీలన పేరుతో రైతులను, ఇళ్లస్థలాల యజమానులను వేధించారు.

లబ్ధిదారుల్లో ఆనందం

శెట్టిపల్లె భూములను అభివృద్ధిచేసి లబ్ధిదారులకు అందించే బాధ్యతను తుడా తీసుకుంది. 248 మంది రైతులకు, 2,320 మంది ఇళ్ల స్థలాల కొనుగోలుదారులకు లేఅవుట్ స్థలాలు అప్పజెప్పనుంది. ఇళ్ల స్థలాల కొనుగోలుదారులకు 50:50 రేషియో ప్రకారం కనీసం రెండు సెంట్ల భూమి ఇవ్వగా, రైతులకు 30:70 ప్రకారం భూమిని కేటాయించేలా నిర్ణయం తీసుకుంది. సుమారు 375 ఎకరాల భూమిని సుమారు రూ.200 కోట్లతో అభివృద్ధిచేసే మౌలిక వసతులను కల్పించేందుకు తుడా ఇటీవలే పనులకు శ్రీకారం చుట్టింది. ఇందులో తుడాకు 65 ఎకరాలు, ప్రభుత్వ భూములు 90 ఎకరాలను మినహాయించి, మిగిలిన 227 ఎకరాలను లేఔట్లుగా అభివృద్ధిచేసి, సంక్రాంతిలోపు లబ్ధిదార్లకు లక్కీడిప్ ద్వారా అందజేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

పతకాలతో మహిళా అథ్లెట్లు

ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో సత్తా

తిరుపతి (క్రీడలు), న్యూస్‌టుడే: ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తాచాటారు. చెన్నై వేదికగా ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు జరిగిన 23వ ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన పుష్ప కుమారి జావెలిన్‌త్రో, డిస్కస్‌త్రో కాంస్య పతకాలు, హ్యామర్ త్రోలో రజత పతకం సాధించారు. నీరజ హైజంప్‌లో, భారతి పరుగుపందెంలో, సుశీల జావెలిన్‌త్రో, ట్రిపుల్‌జంప్‌లో కాంస్య పతకాలు సాధించారు. వీరిని ఉమ్మడి చిత్తూరు జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షురాలు ఎల్.సుశీల అభినందించారు.

త్వరలో.. టైసన్ నాయుడు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని సినీహీరో బెల్లం కొండ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. కిష్కింధ పురి చిత్రం విజయం తరువాత శ్రీవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే నూతన చిత్రం 'టైసన్ నాయుడు' విడుదల కానుందని, ఈ చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేయాలని కోరారు.



ఆలయం ఎదుట సినీ హీరో బెల్లంకొండ శ్రీనివాస్

వీఆర్‌కు తిరుమల వన్‌టౌన్ సీఐ

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల వన్‌టౌన్ సీఐ విజయ్‌కుమార్‌ను వీఆర్‌కు బదిలీ చేస్తూ అనంతపురం రేంజీ డీఐజీ షేముషీ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు సంవత్సరాలకు పైగా ఆయన పనిచేస్తున్నారు. కొత్తగా ఎవరినీ నియమించలేదని తెలుస్తోంది.

ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలో పాల్గొన్న పులివర్తి సుధారెడ్డి తదితరులు

పేదల సంక్షేమం కూటమి ప్రభుత్వానికే సాధ్యం

చంద్రగిరి, న్యూస్‌టుడే: పేదల సంక్షేమం కూటమి ప్రభుత్వానికే సాధ్యమని ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి అన్నారు. ఎన్టీఆర్ నగర్‌లో బుధవారం లబ్ధిదారులు, కూటమి నాయకులతో కలసి నూతన గృహప్రవేశాలు చేపట్టారు. ప్రభుత్వం రూ.12 కోట్లతో రోడ్లు, మురుగునీటి కాల్వలు నిర్మిస్తోందన్నారు. వైకాపా హయాంలో 1020 గృహాలు మాత్రమే నిర్మాణ దశలో ఉండేవన్నారు. కూటమి ప్రభుత్వంలో 5,472 గృహాలు పూర్తయ్యాయని, 4,430 గృహనిర్మాణాలు జరుగుతున్నాయన్నారు.

ఆహార కమిషన్ సభ్యుడి తనిఖీలు

తిరుపతి(రెవెన్యూ), న్యూస్‌టుడే: జిల్లా పర్యటనలో భాగంగా విచ్చేసిన రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి.కాంతారావు బుధవారం తిరుపతిలో పర్యటించారు. స్థానిక మామిడకాయల మండిలోని పౌరసరఫరాల గోదామును, నగరంలోని పలు చౌకదుకాణాలు, అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కార్డుదారులకు అందించే బియ్యం, నిత్యావసరాలు, అంగన్వాడీలో తల్లులు, చంటిబిడ్డలకు పంపిణీ చేసే గుడ్లు, బియ్యం, నిత్యావసరాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వెంట పౌరసరఫరాల జిల్లా డిపో మేనేజర్ బాలకృష్ణ, సరఫరాల అధికారి శేషాచలం రాజు, ఐసీడీఎస్ పీడీ వసంతబాయి అధికారులు ఉన్నారు.

తిరుపతిలోని గోదామును పరిశీలిస్తున్న కాంతారావు, అధికారులు

విజేతలతో ఎస్వీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌బాబు, అధ్యాపకులు పి.ప్రియవర్ధన్‌బాబు, ఏకే బాలాజీ, ఎం.యశోద, డా.సి.ఎల్.చెన్నారెడ్డి

పద్మావతి కళాశాల విద్యార్థినులతో సూపరింటెండెంట్ సుశీల, అధ్యాపకులు ఎ.జయమ్మ, డా.బి.కల్పన, వి.మునేంద్ర

పోటీతత్వంతోనే ప్రగతి సాధింపు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలంటే పోటీ పరీక్షల్లో పాల్గొనాలని, తద్వారా అనుకున్న లక్ష్యాలు చేరేందుకు మార్గం సుగమం అవుతుందని తితిదే ఎస్వీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌బాబు, శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డా.సి.భువనేశ్వరి పేర్కొన్నారు. బుధవారం ఆయా కళాశాలల్లో 'ఈనాడు, ఈటీవీ ఆంధ్రప్రదేశ్' ఆధ్వర్యంలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రతిభాపాటవ పోటీల్లో భాగంగా 'కృత్రిమ మేధ (ఏఐ)వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై వక్తృత్వ పోటీలు జరిగాయి. ఎస్వీ జూనియర్ కళాశాలలో పి.శశాంక్, డి.నిశాంత్ చక్రవర్తి, పి.హర్షవర్ధన్.. శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో బి.అనిత, ఎస్.దీక్షిత, వై.పావని వరుస స్థానాల్లో నిలిచి 'ఈనాడు' నుంచి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

హైడ్రా స్ఫూర్తితో ఆపరేషన్ స్వర్ణ

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: హైడ్రా స్ఫూర్తితో ఆపరేషన్ స్వర్ణ ప్రారంభించామని, అవిలాల చెరువును వినాయకసాగర్ తరహాలో నీటివనరులతో కళకళలాడేలా చేసిన తరువాతే అభివృద్ధి చెయ్యాలని తుడా ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి ఆదేశించారు. తిరుపతిలోని తుడా కార్యాలయంలో బుధవారం ఆపరేషన్ స్వర్ణ, శెట్టిపల్లి భూముల వ్యవహారం, తుడా అభివృద్ధి పనులపై రెవెన్యూ, జలవనరులు, సర్వే, తుడా ప్రణాళిక విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శెట్టిపల్లిలో 68 ఎకరాలు తుడా అభివృద్ధి చేస్తుందని, అతి త్వరలో పట్టాల పంపిణీ పారదర్శకంగా చేపడతామన్నారు. అవిలాల చెరువు నీటి సప్లై ఛానళ్లను పునరుద్ధరించి చెరువులను నీటితో నింపిన తర్వాత తుడా నిధులు రూ.8 కోట్లతో ఆహ్లాదాన్ని పెంపొందిస్తామన్నారు. ఆర్డీవో రామ్మోహన్, తుడా కార్యదర్శి శ్రీకాంత్‌బాబు, ఏడీ అరుణకుమార్, తిరుపతి ఇరిగేషన్ అధికారులు వెంకటేశ్వర ప్రసాద్, శివారెడ్డి పాల్గొన్నారు.

సమీక్ష నిర్వహిస్తున్న తుడా ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి

మట్టి.. తోడేళ్లు

భూముల విలువ రోజురోజుకీ పెరిగిపోతుండడంతో అక్రమార్కులు కొండలు, గుట్టలు కొల్లగొడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఉదయమాణిక్యం పంచాయతీ కోడిపిల్ల గుట్ట వందల ఎకరాల్లో విస్తరించగా అక్రమార్కుల కన్ను ఈ గుట్టపై పడింది. రాత్రీపగలు తేడా లేకుండా యంత్రాల సాయంతో గుట్టని తొలిచివేసి గ్రావెల్‌ని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రెవెన్యూ ఉన్నతాధికారి మౌఖిక ఆదేశాలతోనే మట్టి అక్రమ రవాణా జరుగుతోందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. **- న్యూస్‌టుడే, యర్రావారిపాలెం**

నిరంతర.. నిఘా

దిల్లీ బాంబు పేలుడు నేపథ్యంలో ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా పోలీసులు అప్రమత్తం అయ్యారు. ప్రముఖ పర్యాటక కేంద్రాలైన రాయలవారికోట, తలకోనతోపాటు చంద్రగిరి రైల్వే స్టేషన్, గాదంకి టోల్ ప్లాజా, ఆర్టీసీ బస్టాండ్లు, జాతీయ రహదారుల్లో పోలీసు నిఘా ఉంచారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, చంద్రగిరి**

విగ్రహం.. అపరిశుభ్రం

తిరుమలలోని గోగర్భం జలాశయం సమీపంలోని విద్యుత్ ఉపకేంద్రం వద్ద ఉన్న కాళీయ మర్ధన శ్రీకృష్ణుని విగ్రహం వద్ద అపరిశుభ్రత నెలకొంది. ఈ ప్రాంతంలో తితిదే ఉద్యాన వనశాఖ ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తారు. సరైన నిర్వహణ లేకపోవడంతో విగ్రహాల చుట్టూ అపరిశుభ్రం నెలకొంది. అధికారులు ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయాలని భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తిరుమల**

మడుగు.. యార్డు

తిరుపతి నుంచి తిరుచానూరుకు వెళ్లే మార్గంలోని మ్యాంగో మార్కెట్ ఆవరణం దుర్గంధం వెదజల్లుతోంది. ఆవరణలో గోతులు పెద్దఎత్తున ఉండగా వ్యర్థాలు చేరి పాకుడుపట్టడంతో రహదారిలో మురుగునీరు పెద్దఎత్తున నిల్వ ఉంటోంది. చివరకు రోగకారక దోమల ఉత్పత్తి కేంద్రంగా తయారైంది. సంబంధిత అధికారులు పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **-ఈనాడు, తిరుపతి**

శిక్షణ కార్యక్రమానికి హాజరైన యువ శాస్త్రవేత్తలు

పరిశోధనల ప్రచురణలపై శాస్త్రవేత్తలకు శిక్షణ

తిరుపతి (వ్యవసాయం), న్యూస్‌టుడే: శాస్త్రవేత్తల పరిశోధన ఫలితాలు ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ జర్నల్లలో వ్యాసరూపంలో ప్రచురితమవడం చాలా కీలకమని డా.వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డా.మధుమతి అన్నారు. తిరుపతిలోని ప్రాంతీయ ఉద్యాన పరిశోధనా స్థానంలో శాస్త్రీయ పద్ధతిలో పరిశోధన వ్యాసాల రచన అనే అంశంపై ఏర్పాటుచేసిన నాలుగురోజుల శిక్షణ శిబిరం బుధవారం ప్రారంభమైంది. సహ పరిశోధన సంచాలకులు సీహెచ్ రూత్ అధ్యక్షతన ఆమె మాట్లాడారు. వర్చువల్ విధానంలో అఖిలభారత పరిశోధనా మండలి (ఐ.సి.ఎ.ఆర్.) డీడీజీ డా.సంజయ్ కుమార్, ఏడీజీ వి.పి.పటేల్ అవగాహన కల్పించారు.



క్రీడాకారులకు ప్రోత్సహిస్తోన్న శాప్ ఛైర్మన్ రవినాయుడు, ఎస్పీ సుబ్బరాయుడు

క్రీడలకు ప్రభుత్వ ప్రాధాన్యం

తిరుపతి (విద్య, గ్రామీణం): ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని శాప్ ఛైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు. కాలూరు క్రాస్ వద్ద ఉన్న నారాయణ పాఠశాల ప్రాంగణంలో నారాయణ ప్రీమియర్‌లీగ్ 2025ను బుధవారం ప్రారంభించారు. ఆయనతోపాటు ఎస్పీ సుబ్బరాయుడు, ఒలింపిక్ హాకీ క్రీడాకారిణి రజని హాజరై మాట్లాడారు. విద్యాసంస్థల డీజీఎం కొండలరావు, రాష్ట్ర సమన్వయకర్త బ్రహ్మాజీ, కోర్ డీన్ శ్రీనివాసరావు, డీన్స్ గోపాల్, చక్రవర్తి పాల్గొన్నారు.

కార్తిక మహాదీపోత్సవ ఏర్పాట్ల పరిశీలన

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తితిదే పరిపాలనా భవనం ప్రాంగణంలోని కవాతు మైదానంలో నవంబరు 14న నిర్వహించనున్న కార్తిక మహాదీపోత్సవం ఏర్పాట్లను జేఈవో వి.వీరబ్రహ్మం బుధవారం పరిశీలించారు. విస్తృత ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

14న మహతిలో పంచగవ్య వైద్య మహాసమ్మేళనం

తిరుపతి (భవానీనగర్), న్యూస్‌టుడే: మహతి కళాక్షేత్రంలో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు 13వ పంచగవ్య వైద్య మహా సమ్మేళనం నిర్వహించనున్నట్లు పంచగవ్య విద్యాపీఠం గురుకులపతి గవ్య సిద్ధాచార్య నిరంజన్‌వర్మ గురుజీ తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. శాస్త్రవేత్తలు, గవ్యఉత్పత్తి నిర్వాహకులు, గోశాలల ప్రతినిధులు, గోరక్షకులు 1200 మందికిపైగా పాల్గొంటారన్నారు. పంచగవ్య విద్యను పూర్తిచేసిన 201 మంది విద్యార్థులకు ధ్రువపత్రాలు ప్రదానం చేస్తామన్నారు. బాలకృష్ణ గురుస్వామి, ఝాన్సీ లక్ష్మీబాయ్ పాల్గొన్నారు.

తుడా కాంప్లెక్స్ నిర్వహణపై న్యాయమూర్తి లేఖ

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: రాయలచెరువు రోడ్డులోని తుడా కాంప్లెక్స్ నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ తుడా ఛైర్మన్, వీసీలకు ఎర్రచందనం స్మగ్లింగ్ న్యాయస్థానాల జ్యుడీషియల్ మెజిస్ట్రేట్, సివిల్ జడ్జి ఎస్.శ్రీకాంత్ ఇటీవల లేఖ రాశారు. తుడా కాంప్లెక్స్‌లోని న్యాయస్థానంలో ఆవరణలో శుభ్రత చర్యలు చేపట్టాలని, లిఫ్ట్ మరమ్మతులకు గురైందని ఆయన లేఖలో వివరించారు.

'ఉద్యోగులను అవమానించిన అధికారిని తొలగించండి'

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: తన దగ్గర పనిచేసే సిబ్బందిని కులం పేరుతో దూషించి.. భౌతికంగా దాడికి పాల్పడ్డ వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ రవీంద్రనాథ్ రెడ్డిని విధుల నుంచి తొలగించాలని ఏపీ కమర్షియల్ ట్యాక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి జీఎం రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక వాణిజ్య పన్నులశాఖ కార్యాలయంలో బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నాలుగో తరగతి ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి చెన్నకేశవులు, ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, రమేష్ కుమార్, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు పూర్ణం, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

ఛాంబర్ ఆఫ్ కామర్స్ సన్మానం

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల డైరెక్టర్‌గా నియమితులైన మురళీమోహన్(చినబాబు)ను తిరుపతి జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గం బుధవారం సత్కరించింది. రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. తిరుపతి జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కె.వి.చౌదరి, కార్యదర్శి రఘురాంరెడ్డి, తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మోహన్‌రాజు, తిరుపతి జిల్లా ఎఫ్ఎంసీజీ డిస్ట్రిబ్యూటర్ల అసోసియేషన్ కార్యదర్శి మధుసూదన్‌రావు, సభ్యులు కొమ్మినేని మోహన్‌బాబు పాల్గొన్నారు.

మురళీమోహన్‌ను సత్కరిస్తున్న కామర్స్ ప్రతినిధులు

14న 'మీ డబ్బు- మీ హక్కు'

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: లావాదేవీలు జరగని బ్యాంకు ఖాతాల్లోని సొమ్మును తిరిగి పొందే అవకాశాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కల్పించిందని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ (ఎల్‌డీఎం) గుంటూరు రవికుమార్ తెలిపారు. అందుకోసం 14న 'మీ డబ్బు- మీ హక్కు' అవగాహన కార్యక్రమాన్ని తిరుచానూరులోని ఇండియన్ బ్యాంక్ వద్ద నిర్వహిస్తున్నట్లు వివరించారు. సరైన ధ్రువపత్రాలు సమర్పించి క్లెయిమ్ చేయని సొమ్మును తిరిగి పొందాలని సూచించారు.

తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: తితిదేపై సామాజిక మాధ్యమాల వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్న వైకాపా సైకోలపై కఠిన చర్యలు తీసుకోవాలని తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ఛైర్మన్ మహేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తితిదే గోశాల, అలిపిరి విగ్రహం, ప్రస్తుతం తితిదే వేదపారాయణదార్ పోస్టుల భర్తీపై ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. కొందరు ప్రభుత్వానికి, తితిదే పాలకమండలి సభ్యులకు తప్పుడు మెయిల్ పంపుతున్నారని... అలాంటి వారిపై తితిదే నిఘాపెట్టి చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎస్వీఎం శ్రీధర్‌ను సత్కరిస్తున్న ఆర్సీ మునికృష్ణ

పార్టీని నమ్ముకున్నవారికి సముచిత స్థానం

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: తెదేపా ఆవిర్భావం నుంచి నమ్ముకుని తిరుపతికి చెందిన ఎస్వీఎం కుటుంబ పని చేస్తోందని... ఆ కుటుంబానికి చెందిన తెదేపా 35వ డివిజన్ అధ్యక్షుడు ఎస్వీఎం శ్రీధర్‌ను మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించి సముచిత స్థానం కల్పించినట్లుఉప మేయర్ ఆర్సీ మునికృష్ణ అన్నారు. బుధవారం ఎస్వీఎం శ్రీధర్‌ను తెదేపా నాయకులు సత్కరించారు. కరాటే చంద్ర, జయరామిరెడ్డి, సుబ్బుయాదవ్, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

డిప్యూటీ ఈవో సేవలు కొనసాగింపు

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తితిదేలో గత ఏడాది డిప్యూటీ ఈవో స్థాయిలో బదిలీపై వచ్చిన కె.వెంకటేశ్వర్లు (డిప్యూటీ కలెక్టర్) పదవీకాలాన్ని మరో ఏడాదిపాటు పొడగిస్తూ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ ముఖ్య కార్యదర్శి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ప్రస్తుతం తిరుమలలో రెవెన్యూ ఎస్టేట్ అధికారిగా విధులు నిర్వహిస్తూ పరకామణి డిప్యూటీ ఈవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తూ ఉన్నారు.

తితిదే ఉద్యోగి బదిలీ..

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తిరుమలలో తితిదే పంచాయతీ, రెవెన్యూ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బి.రామయ్యను బదిలీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై రెచ్చగొట్టేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడం, తాను నక్సలైట్ అని ప్రకటించుకోవడంతో విజిలెన్స్ విభాగం నివేదిక మేరకు రామయ్యను తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారిలోని తితిదే ఆలయానికి బదిలీ చేశారు.

తిరుమలకు చేరుకున్న మంత్రి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి దర్శనార్థం మంత్రి కొలుసు పార్థసారథి బుధవారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. స్థానిక శ్రీకృష్ణ అతిథిగృహం వద్ద మంత్రికి జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి గురుస్వామిశెట్టి, తితిదే ఓఎస్డీ సత్రే నాయక్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

IN THE COURT OF
THE DISTRICT JUDGE OF
CHITTOOR
I.A.NO. 218 OF 2024
A.S.NO. OF 2024
O.S.NO. 715 OF 2014

Between:
Smt.C.Sudha and others ... Petitioners/Appellants
And:
P.Narayana Mandadi ... Respondent/Plaintiff

NOTICE TO THE RESPONDENT

To
P.Narayana Mandadi
S/o P.Subbaiah,
D.No.598, D-Type Quarters,
Vinayaka Nagar, K.T.Road, **Tirupati.**

Sir,
Please take notice that the petitioners/appellants have filed the above I.A. to condone the delay of 48 days in filing the appeal. The said I.A. is posted to **24.11.2025** for your appearance. If you have got any objection you may appear on **24.11.2025 at 10.30 A.M.** either in person or through an Advocate and file your objections. If you fail to do so the matter will be decided ex-parte.

Sd/-**P.PRAKASH REDDY,**
Advocate for Petitioners/Appellants
Chittoor, Dt.12.11.2025

IN THE COURT OF THE PRINCIPAL
JUNIOR CIVIL JUDGE OF TIRUPATI
E.A.No.208/2024, O.E.P. No.93/2023
O.S.No. 907/2019

G.Ramesh ...Petitioner/D.Hr
V/s
L.Damodara Prasad (Died) & 3 Others ...Respondents/Proposed Parties

Notice to Respondents/Proposed Parties No.2 to 4

R2) L.Bharathi W/o L.Damodara Prasad
R3) L.Prabhand Sathwik S/o L.Damodara Prasad
R4) L.Lalsa D/o L.Damodara Prasad
No. 2 to 4 are residing at Mamanduru Village, Ithepalli post, Chandragiri Mandal, Tirupati District.

పై కనిన కేసులో ఎల్.దామోదర ప్రసాద్ చనిపోయిన తరువాత మిమ్ములను సదరు కేసులో వారసులుగా చేర్చుకొనుటలో ఏదైనా అభ్యంతరములు ఉన్నచో తేది. 01.12.2025న ఉదయం 10.30 గంటలకు నేరులోగాని వకీలు ద్వారా హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకొనవలసినది. లేని యెడల మీ పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేది. 01.12.2025

A.BHOOPATHY
Advocate for Petitioner/D.Hr., Tirupati

(c) eenadu

'యూరియా కొరతపై ఆందోళన వద్దు'

తొట్టంబేడు: యూరియా కొరతపై ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, అవసరాలకు అనుగుణంగా అర్హత కలిగిన ప్రతి రైతుకు పంపిణీ చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి యస్.ప్రసాదరావు పేర్కొన్నారు. పెద్దకన్నలి, ఇలగనూరు రైతు సేవా కేంద్రాలతో పాటు తంగేళ్లపాళ్యం ప్రాథమిక సహకార సంఘంలో యూరియా పంపిణీని బుధవారం ఆయన పరిశీలించారు. ధనుంజయరెడ్డి, మండల వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

వేడుకగా కాలభైరవ జయంతి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: కాలభైరవ జయంతిని పురస్కరించుకుని స్వామి వారికి విశేష అలంకరణలు జరిపారు. ముక్కంటి ఆలయంలో కనకాచలం వద్ద కొలువుదీరిన భైరవునికి బుధవారం రాత్రి వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు.

శ్రీకాళహస్తి

• శ్రీకాళహస్తి • సత్యవేడు

బాలల దినోత్సవం నిర్వహించాలి

రేణిగుంట, న్యూస్‌టుడే: నవంబరు 14న బాలల దినోత్సవాన్ని నిర్వహించకుండా అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడం సరికాదని జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణ, మండల కార్యదర్శి కుప్పుస్వామి బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పరీక్ష వాయిదా వేసి ఘనంగా వేడుకలను జరిపించాలని సంయుక్త ప్రకటనలో వారు డిమాండ్ చేశారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి తిరుపతికి చెందిన గుడికృష్ణ మోహన్‌నాయుడు రూ.25 వేలు నగదు చెక్కును విరాళంగా ఇచ్చారు. బుధవారం తనికొండ కృతి పేరుతో చెక్కును ఆలయ ప్రొటోకాల్ ఏఈవో మోహన్‌కు అందజేశారు.

లక్షలు వెచ్చించినా.. వినియోగానికి దూరం

సత్యవేడు, న్యూస్‌టుడే: సత్యవేడు-తిరుపతి మార్గంలోని ఎన్టీఆర్ పార్కులో పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా తయారైంది. పట్టణ ప్రజలు, పిల్లలకు, విశ్రాంత ఉద్యోగుల సౌకర్యార్థం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో కూటమి ప్రభుత్వం పార్కు పునరుద్ధరణకు చర్యలు చేపట్టింది. రూ.10 లక్షల తుడా నిధులతో పార్కులోని పిచ్చిమొక్కలను తొలగించి మొత్తం మట్టిని పరిచారు. పార్కులో చెట్లకు నీరు పారుదలకు కనెక్షన్లు, ర్యాంపు ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదు. పర్యవేక్షణ కొరవడటంతో పార్కు మొత్తం పిచ్చిమొక్కలతో నిండి చిట్టడవిని తలపిస్తోంది

విన్యాసం.. చేపల వేటకు సాహసం

సువర్ణముఖి నదిలో మత్స్యకారులు ప్రమాదకర విన్యాసాలతో చేపలు పడుతున్నారు. రామసేతు పాత వంతెన గట్టుపై ఇరుకైన ప్రదేశంలో కూర్చొని చేపలు పడుతున్నారు. అటు, ఇటు ఎటు జరిగినా నదిలో పడిపోవడం తథ్యం. ఇలాంటి ప్రమాదకర విన్యాసాలకు పాల్పడే మత్స్యకారులను అధికారులు గట్టిగా హెచ్చరించాల్సి ఉంది.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

అద్దెలతో కష్టం.. పూర్తిచేస్తే సొంతం

శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసు స్టేషన్ ఏళ్ల తరబడి అద్దె భవనాల్లో కొనసాగుతోంది. పక్కా భవనాన్ని అందుబాటులోకి తెచ్చి అద్దె కష్టాలను తప్పించాలనే ఉద్దేశంతో తొట్టంబేడు పోలీసు స్టేషన్ పక్కన భవనం నిర్మించాలని నిర్ణయించి, 2019లో రూ.1.80 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. ప్రస్తుతం 90 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. మిగిలిన చిన్నపాటి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తే ప్రజలకు సౌలభ్యంతో పాటు అద్దె ఇక్కట్లు తప్పుతాయి.

- న్యూస్‌టుడే, తొట్టంబేడు

నక్కలవాగు.. కలుషితమయం

ఏర్పేడు మండలం చెన్నంపల్లి సమీపంలోని నక్కలవాగులో నిత్యం కలుషిత నీరు ప్రవహిస్తుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రేణిగుంట మండలంలోని పరిశ్రమల నుంచి విషపూరితమైన వ్యర్థజలాన్ని నక్కలవాగులోకి విడుదల చేస్తున్నారు. దీంతో భూగర్భజలాలు పూర్తిస్థాయిలో కలుషితం కావడంతో వ్యవసాయ బోర్లు, చేతిపంపుల నుంచి రంగుమారిన నీరు వస్తోంది. సమస్యను పరిష్కరించాలని స్థానికులు పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా ప్రయోజనం లేకపోవడంతో గ్రామీణులు అవస్థలు పడుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి కలుషిత నీటి ప్రవాహాన్ని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- న్యూస్‌టుడే, ఏర్పేడు

ప్రతికూలత దాటి.. అనుకూలంగా మార్చి

కాలమేదైనా ఆగని ఇసుకాసురుల ఆగడాలు

తొట్టంబేడు, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సహజవనరుల దోపిడీ విచ్చలవిడిగా సాగుతోంది. వరద ప్రవాహంతో ఏర్పడ్డ ప్రతికూలమైన వాతావరణాన్ని సైతం ఇసుకాసురులు వారికి అనుకూలంగా మార్చుకొని యథేచ్ఛగా ఇసుకను తవ్వి తరలిస్తున్నారు. కాలమేదైనా ఇసుకాసురులదే రాజ్యమని నిరూపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా భారీ యంత్రాలను దించి స్వర్ణముఖి నదీ గర్భాన్ని తోడేస్తున్నారు. రోజూ వందల టిప్పర్లను జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు. జిల్లాస్థాయి అధికారులకూ తెలిసినా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ఉచితం పేరు.. అమ్మకం జోరు

తొట్టంబేడు మండలంలోని పూడి, పెన్నలపాడు స్వర్ణముఖి నదీ తీరాల్లో ఇసుక దందా తారస్థాయిలో జరుగుతోంది. పరిమితికి మించి తోడేళ్లతో పోటీపడి తవ్వేస్తున్నారు. ప్రభుత్వ ఉచిత ఇసుక విధానాన్ని కొందరు దళారులు వారికి అనుకూలంగా

టిప్పర్‌కు ఇసుక నింపుతున్న భారీ యంత్రం

మార్చుకుని లాభపడుతున్నారు. దీంతో సామాన్యులకు ఇసుక అందుబాటులోకి రాక గగ్గోలు పెడుతున్నారు. ప్రజలకు ఇసుకను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిబంధనలు సడలించింది. దాన్ని ఇసుకాసురులు ఆసరాగా చేసుకొని ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. నదిలో యంత్రాలతో తవ్వకూడదనే నిబంధన ఉన్నా ఎక్కడా పాటించడం లేదు. నదీగర్భంలోకి భారీ యంత్రాలను దించి పెద్దఎత్తున తవ్వేస్తున్నారు. వరద నీరు వస్తున్నప్పటికీ సులువుగా పని కానిచ్చేస్తున్నారు. ఒక్కొక్క ట్రాక్టర్‌కు రూ.500- రూ.800ల వరకు వసూలు చేస్తూ ఇసుక లోడింగ్ చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ట్రాక్టర్ ఇసుక ధర రూ.4వేలు- రూ.5 వేల వరకు విక్రయిస్తున్నారు. టన్ను ఇసుక ధర రూ.1000లకు పైగా పలుకుతోంది. ఇసుక అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాచబాటలు వేసి దోపిడీ

ఇటీవల కురిసిన ఎడతెరిపిలేని వర్షాలు, మొంథా తుపాను ప్రభావంతో స్వర్ణముఖి నది ఉద్ధృతంగా ప్రవహించింది. వరద ప్రభావంతో గతంలో ఇసుకాసురులు పూడి, పెన్నలపాడు సమీపంలోని నదిలో నిర్మించుకున్న రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో అక్రమార్కుల ఇసుక దోపిడీకి ప్రతికూలత ఏర్పడింది. వరద ప్రవాహం తగ్గగానే ఇసుక తరలించేందుకు నదిలో మళ్లీ రోడ్డును పునరుద్ధరించారు. ఇసుకాసురులు నిర్మించుకున్న రాచ బాటల్లో యథేచ్ఛగా తవ్వకాలకు తెరలేపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

శ్రీకాళహస్తి(గ్రామీణ(ఏర్పేడు): సమస్య: శ్రీకాళహస్తి-ముచ్చివోలు రహదారిపై అడుగడుగునా బావులను తలపించేలా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. **- రంగనాథం, ముచ్చివోలు**

సమాధానం: సమస్యను త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం. **- ప్రభాకర్‌రెడ్డి, డీఈ**

పారిశుద్ధ్య పనులు

ఏర్పేడు, న్యూస్‌టుడే: మర్రిమంద పంచాయతీలో అధికారులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీధుల్లో మురుగు ప్రవహిస్తుండటంతో 'మేమున్నాం- మీకుతోడుగా' లో ప్రచురితమైన సమస్యకు అధికారులు స్పందించారు. మురుగు తొలగించడమే కాకుండా బ్లీచింగ్ చల్లి సమస్యను పరిష్కరించారు.

స్పందనకు వందనం

వ్యర్థాల తొలగింపు

పట్టణంలోని హౌసింగు బోర్డు కాలనీ కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో 'మేమున్నాం మీకు తోడుగా'కు స్థానికులు తీసుకువచ్చారు. పురపాలక కమిషనర్ భవానీప్రసాద్ సూచనల మేరకు కార్మికులు వ్యర్థాలు తొలగించారు.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో పాటు సంస్థాగత ఎన్నికల్లో ఎన్నికైన వారితో ప్రతిజ్ఞ చేయిస్తున్న అంకయ్యచౌదరి

శ్రమించిన వాళ్లకు తప్పక గుర్తింపు

శ్రీకాళహస్తి: పార్టీ కోసం శ్రమించిన వాళ్లకు తప్పక గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవనంలో బుధవారం నియోజకవర్గ పరిధిలో నియమితులైన మండల, గ్రామ, వార్డు అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులు, బూత్ స్థాయి ఏజెంట్ల ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం అయ్యాక అందరితో నియోజకవర్గ పరిశీలకులు అంకయ్య చౌదరి ప్రతిజ్ఞ చేయించారు. బీసీ బాలుర వసతి గృహంలో ఆర్‌వో ప్లాంటును ఎమ్మెల్యే ప్రారంభించారు. శుకబ్రహ్మాశ్రమం సమీపంలో లబ్ధిదారుడు హేమంత్‌కుమార్ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా గృహప్రవేశం చేశారు.

రహదారి అభివృద్ధికి నిధుల మంజూరు

ఏర్పేడు: గుడిమల్లం రహదారి అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించింది. రూ.2.30 కోట్లు నిధులు మంజూరు కావడంతో గుడిమల్లం ఆలయ మాజీ ఛైర్మన్ గిరినాయుడు ఆధ్వర్యంలో మండల నేతలు బుధవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని సత్కరించారు.

ఎన్టీఆర్ గృహకల్పతో పేదల సొంతింటి కల సాకారం

పిచ్చాటూరు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ గృహకల్ప పథకంతో నియోజకవర్గంలోని పేదలందరి సొంత ఇంటి కల సాకారమవుతుందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. పిచ్చాటూరు మండల కార్యాలయ సమీపాన ప్రభుత్వ పక్కాగృహ పథకంతో ఇంటి నిర్మాణం పూర్తిచేసిన లబ్ధిదారుడి గృహ ప్రవేశ వేడుకల్లో ఎమ్మెల్యే బుధవారం పాల్గొన్నారు. అనంతరం మండల కార్యాలయంలో జాబ్‌మేళా గోడప్రతులను ఆయన ఆవిష్కరించారు. ఎంపీడీవో మహమ్మద్ రఫీ, తహసీల్దారు సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇళంగోవర్ధన్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు సుమాంజలి, ఈవో మునివాసులు, పల్లికొండేశ్వరాలయ పాల్గొన్నారు. **నారాయణవనం, న్యూస్‌టుడే:** మొంథా తుపానుతో నారాయణవనంలో ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులకు బుధవారం ఎమ్మెల్యే ఆదిమూలం చేతుల మీదుగా బియ్యం, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. అనంతరం ఎంఈవో కార్యాలయంలో నూతనంగా నిర్మించిన సమావేశ మందిరాన్ని ప్రారంభించారు. జడ్పీటీసీ సభ్యుడు కోనేటి సుమన్ కుమార్, ఎంపీడీవో అరుణ, తహసీల్దారు రోజారాణి, ఎంఈవోలు పాల్గొన్నారు.

పిచ్చాటూరులో పక్కాగృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

డ్రమ్ సీడర్‌తో ఉపయోగాలు

రేణిగుంట, న్యూస్‌టుడే: డ్రమ్ సీడర్ పరికరంతో వరి విత్తే విషయంలో అనేక ఉపయోగాలు ఉన్నాయని రాస్ కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్థానిక కేవీకేలో డ్రమ్ సీడర్ పరికరంతో వరి విత్తే విధానంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఈ విధానంలో ఎకరానికి సుమారు రూ.7 వేలు వరకు ఆదా చేయవచ్చని తెలిపారు. డ్రమ్ సీడర్‌తో ఒక రోజులో ఒక కూలీ లేదా రైతు 4 నుంచి 5 ఎకరాల విస్తీర్ణంలో విత్తుకోవచ్చని సూచించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ దివ్య, ఫార్మా మేనేజర్ సురేష్, జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన సుమారు 100 మంది మహిళా రైతులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల బస్సులు తనిఖీ చేస్తున్న అధికారులు

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

శ్రీకాళహస్తి(గ్రామీణ(ఏర్పేడు), న్యూస్‌టుడే: వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటివారైన కఠిన చర్యలు తప్పవని శ్రీకాళహస్తి మోటారు వాహనాల తనిఖీ అధికారి దామోదరనాయుడు తెలిపారు. శ్రీకాళహస్తి ఒకటో పట్టణం సీఐ ప్రకాష్ కుమార్‌తో కలిసి బుధవారం ప్రైవేట్ పాఠశాలల బస్సులను తనిఖీ చేశారు. రెండు బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులు ఉండటంతో కేసులు నమోదు చేశారు. నిత్యం తనిఖీలు చేపడతామని తీరు మారకపోతే మరింత కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: సులభతర విద్యాబోధన, అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరచడం ద్వారా కార్పొరేట్ సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచాలని సమగ్ర శిక్ష పథకం జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటరు గౌరీశంకర్ కోరారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో బుధవారం సమగ్ర శిక్ష పథకాల అమలు తీరుతెన్నులపై ఆయన ఎంఈవోలు, సీఆర్పీలతో సమీక్షించారు. అనంతరం వరదయ్యపాళెం, బత్తులవల్లం, చిలమత్తూరు, మత్తేరిమిట్ట ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి, అక్కడ అసంపూర్తి భవనాలు, పీఎంశ్రీ వంటి పథకాల తీరును పరిశీలించారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకరయ్య, ఎంఈవోలో సరస్వతి, గున్నయ్య, సీఆర్పీలు మురళీ, మునీంద్ర, సతీష్ పాల్గొన్నారు.

తెలుగు అర్చకుల నియామకానికి కసరత్తు

మాట్లాడుతున్న ఛైర్మన్ పద్మనాభరాజు

నాగలాపురం : పల్లికొండేశ్వరాలయంలో దేవతా మూర్తుల సేవలతో పాటు భక్తుల సౌకర్యానికి అనువుగా ఇద్దరు తెలుగు అర్చకులను నియమించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఛైర్మన్ పద్మనాభరాజు పేర్కొన్నారు. ఆలయ కార్యాలయ ఆవరణలో పాలకమండలి తొలి సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న శివరాత్రికి ఉభయ రుసుమును రూ.50 వేలకు పెంచనున్నట్లు వెల్లడించారు. గోసంరక్షణ ట్రస్టును ఏర్పాటు చేసి ఆలయంలో ఉన్న 56 గోవుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు ఇద్దరు గోసంరక్షకులను నియమించనున్నట్లు తెలిపారు. ఈవో లత, ప్రధానార్చకులు కార్తికేశన్, పాలకవర్గ సభ్యులు కృష్ణయ్య యాదవ్, నెల్సన్ మండేలా, హంస, నాగభూషణమ్మ, శ్రీనివాసులు నాయుడు, దేవి, జయంతి, కవిత పాల్గొన్నారు.

సదస్సు విజయవంతానికి పూజలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: విశాఖపట్టణంలో రాష్ట్ర ప్రభుత్వం, సీఐఐ సంయుక్తంగా నిర్వహిస్తున్న భాగస్వామ్య సదస్సు విజయవంతం కావాలని తెదేపా బీసీ విభాగం నేతలు పూజలు జరిపించారు. పట్టణంలోని ఏడుగంగల ఆలయంలో బుధవారం పార్టీ శ్రేణులు సంయుక్తంగా పూజలు చేయించారు.

పోలీసుల శ్రమదానం

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: మండలంలోని శ్రీకాళహస్తి-తడ రహదారిపై ఏర్పడ్డ గుంతలతో వాహనదారుల అవస్థలను గుర్తించిన బీఎన్‌కండ్రిగ పోలీసులు బుధవారం శ్రమదానం చేపట్టారు. పదో మైలు వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటుండటంతో ఎస్సై హరిప్రసాద్ స్పందించి కంకర పొడిని గుంతలో పోయించారు. అనంతరం పోలీసు సిబ్బంది అనిల్ గుంతను చదును చేశారు.

స్టాక్ రికార్డు పరిశీలిస్తున్న రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు కాంతారావు

అంగన్‌వాడీ, పాఠశాలల తనిఖీ

నారాయణవనం, న్యూస్‌టుడే: రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి.కాంతారావు బుధవారం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి ఆహార నాణ్యత, స్టాక్ రికార్డును పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్డు బరువు విషయంలో వ్యత్యాసాన్ని గుర్తించి ఐసీడీఎస్ పీడీ వసంతబాయిని హెచ్చరించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. జిల్లా అధికారులు పౌర సరఫరా అధికారి శేషాచలం రాజులు, డీఎం బాలకృష్ణ, జిల్లా విద్యాశాఖ అధికారి రమణారావు, లీగల్ మెట్రాలజీ, ఫుడ్ సేఫ్టీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హస్తకళా గ్రామాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ హరిప్రసాద్

త్వరితగతిన పూర్తి చేయాలి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణానికి సమీపంలో నిర్మాణంలో ఉన్న పర్యాటక, హస్తకళా గ్రామం ప్రాజెక్టును వీలైనంత త్వరితగతిన పూర్తి చేయాలని హస్తకళా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు పరిధిలో నిర్మాణంలోని భవన సముదాయాలను బుధవారం పరిశీలించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్లు శోభన్‌బాబు, శ్రీదేవి పాల్గొన్నారు.

ఉపాధికి మార్గం నైపుణ్యమే

తొట్టంబేడు, న్యూస్‌టుడే: నిరుద్యోగులకు నైపుణ్య సాధనతోనే ఉపాధి సులువవుతుందని ఎస్వీపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.నాగరాజనాయుడు అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో బుధవారం నిరుద్యోగ అభ్యర్థులకు ఉద్యోగాలకు ముఖాముఖి నిర్వహించారు. జాబ్ మేళాలో రెండు కంపెనీల ప్రతినిధులు పాల్గొని 56 మంది అభ్యర్థులకు ముఖాముఖి నిర్వహించారు. 38 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

పాఠశాలలో పిచ్చి మొక్కల తొలగింపు

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: పాండూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు, ముళ్లకంపలు పెరగడంతో విషపురుగుల సంచారం పెరిగింది. విషయాన్ని గుర్తించిన ప్రధానోపాధ్యాయుడు మునిసుబ్రహ్మణ్యం పరిస్థితిని స్థానిక నాయకుడు శ్రీనివాసులురెడ్డికి విన్నవించడంతో ఆయన బుధవారం జేసీబీతో పాఠశాల ఆవరణలోని పిచ్చిమొక్కలు, తొలగించారు.

కార్మిక వ్యతిరేక చట్టాలపై ఉద్యమం తప్పదు

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: పాత కార్మిక చట్టాలు, కార్మికులను బానిసలుగా మార్చే లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌ఆర్ కల్యాణ మండపంలో నియోజకవర్గ ఏఐటీయూసీ కార్యవర్గ సమావేశం బుధవారం అధ్యక్షుడు కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్ మాట్లాడుతూ 30న వరదయ్యపాళెంలో జరిగే ఏఐటీయూసీ నియోజకవర్గ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఏఐటీయూసీ నాయకులు అన్నాదొరై, చంద్ర, సుభాష్, వాణి, సుబ్రహ్మణ్యం, కృష్ణమూర్తి, ధనంజయులు, సుధీర్ పాల్గొన్నారు.

గ్యాస్‌లీకై వ్యక్తి మృతి

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: కాటూరు ఎస్సీ కాలనీలో గ్యాస్ లీకై వ్యక్తి గాయపడిన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్సై హరిప్రసాద్ వివరాల మేరకు కాటూరు ఎస్సీ కాలనీకి చెందిన కోటేశ్వరరావు(50) గత పదేళ్లుగా ఒంటరిగా జీవిస్తున్నాడు. ఆదివారం రాత్రి వంట చేసుకున్న తర్వాత గ్యాస్ స్టవ్ ఆపకుండా అలాగే వదిలేసి నిద్రపోయాడు. అర్ధరాత్రి సమయంలో క్యాండిల్ వెలిగించగా ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో శరీరం పూర్తిగా కాలిపోయింది. స్థానికులు హుటాహుటిన శ్రీకాళహస్తి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్ర గాయాలు

కేవీబీ పురం, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన కె.వి.బి.పురం మండల పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు కాట్రపల్లి గ్రామానికి చెందిన ఎసర్ వేలు(24) బుధవారం గ్రామంలో విద్యుత్ వైర్లు మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్థులు వెంటనే అతడిని స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు

రెవెన్యూ భవనాలు.. సమస్యలకు నిలయాలు

కనీస మౌలిక వసతులు లేక సిబ్బంది అవస్థలు

నారాయణవనంలో పునాదులకే పరిమితమైన నిర్మాణాలు

సత్యవేడు: నియోజకవర్గంలోని పలు రెవెన్యూ కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. నూతన రెవెన్యూ కార్యాలయాలకు నిధులు మంజూరైనా కొన్ని పూర్తికాక, మరి కొన్ని ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. 2006లో వరదయ్యపాళెం, పిచ్చాటూరు మండలాల్లో రెవెన్యూ భవనాలు పూర్తిచేశారు. పలు కార్యాలయాల్లో సరిపడా గదులు లేక సిబ్బంది అవస్థలు పడుతున్నారు.

- నారాయణవనం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం పీహెచ్‌సీ సమీపంలోని సచివాలయ భవనంలో కొనసాగుతోంది. గత పదేళ్ల క్రితం భవన నిర్మాణానికి రూ.90 లక్షల నిధులు మంజూరయ్యాయి. ధర్మరాజుల గుడి సమీపంలో పునాదుల వరకు నిర్మించి వదిలేశారు. ప్రస్తుత సచివాలయం ఇరుకైనా భవనం కావడంతో రెవెన్యూ సమస్యలతో వచ్చే ప్రజలు కూర్చోడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు.
- నాగలాపురం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంపై భాగం పెచ్చులూడి ఇనుప చువ్వలతో దర్శనమిస్తోంది. నూతన భవన నిర్మాణానికి పదేళ్ల క్రితం రూ.90 లక్షల నిధులు మంజూరయ్యాయి. నాగలాపురం-తిరుపతి మార్గంలోని వినోభనగర్ సమీపంలో నిర్మాణం మొదలుపెట్టినా అర్థాంతరంగా ఆగిపోయింది. ఉన్న రెండు గదుల్లో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.
- సత్యవేడు తహసీల్దార్ కార్యాలయ భవనం బ్రిటీష్ కాలం నాటిది. భవనంపై భాగమంతా పెంకులతో నిర్మితమైంది. పెంకులు దెబ్బతినడంతో వర్షాలకు భవనమంతా ఉరుస్తోంది. రెవెన్యూ రికార్డుల గది పైభాగాన్ని గోతాలతో కప్పి నెట్టుకొస్తున్నారు. వీఆర్వో, సర్వేయర్ల గదులు దుస్థితికి చేరాయి. మరుగుదొడ్లు లేక అధికారులు, సిబ్బంది నిత్యం నరక యాతన అనుభవిస్తున్నారు.
- కేవీబీపురం, వరదయ్యపాళెం, పిచ్చాటూరు తహసీల్దార్ కార్యాలయాల్లో మరుగుదొడ్లు, తాగునీటి వసతులు లేక అధికారులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. కార్యాలయాల చుట్టు పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. బుచ్చినాయుడు కండ్రిగ తహసీల్దార్ కార్యాలయానికి చుట్టూ ప్రహరీ లేకపోవడంతో విషపురుగుల సంచారం పెరిగిపోయింది.

ముక్కంటి సేవలో విశాఖ ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: విశాఖపట్టణం ఉత్తరం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కుటుంబసభ్యులతో వాయులింగేశ్వరుని దర్శనార్థం వచ్చారు. వీరికి బుధవారం ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్ ఘనంగా స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. * అస్సాం రాష్ట్రం దర్గాంగ్ ఉదల్గురి ఎంపీ దిలీప్‌సైకియా కుటుంబ సభ్యులతో కలిసి వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు బుధవారం స్వామి, అమ్మవార్లను దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కుటుంబీకులతో ఆలయ ఛైర్మన్

'ఆర్‌టీఐ సమాచారం ఇవ్వకపోవడం దారుణం'

సత్యవేడు, న్యూస్‌టుడే: కన్నావరం గ్రామ రెవెన్యూ లెక్కదాఖలాలో డీకేటీ భూముల వివరాల గురించి నెల క్రితం సమాచార హక్కు చట్టం కింద స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేస్తే ఇప్పటి వరకు సంబంధిత పౌర సమాచార ఉపాధికారి డీటీ తహసీల్దార్ ఎలాంటి సమాచారం లభ్యం కాలేదని చెప్పడం దారుణమని కేవీపీఎస్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేశాండి అరుణాచలం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వైద్యవిద్యకు పేదలు దూరం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో పేద విద్యార్థులు వైద్యవిద్యను అభ్యసించేందుకు దూరమయ్యే అవకాశముందని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా బుధవారం వైకాపా కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు పార్టీ శ్రేణులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఆర్డీవో కార్యాలయ ఏవో శాంతికి వినతి పత్రాన్ని అందజేశారు.

ర్యాలీ నిర్వహిస్తున్న వైకాపా నేతలు

ఉనికి కోసమే ఉద్యమం

సత్యవేడు: ఉనికి కోల్పోతున్న వైకాపా ఉద్యమాల పేరిట నాటకాలు ఆడుతోందని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చిట్టేటి పృథ్వీరాజ్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

(c) eenadu

గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

ఉపసంహరించుకోని నగదుపై దృష్టి పెట్టాలి

నాయుడుపేట, న్యూస్‌టుడే: ఏళ్లతరబడి బ్యాంకు ఖాతాల్లో నిల్వ ఉండి ఉపసంహరించుకోని నగదు నిల్వలపై బ్యాంకు మేనేజర్లు ప్రత్యేక దృష్టి సారించాలని నెల్లూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు జనరల్ మేనేజర్ బి.రామకృష్ణ బ్యాంకు అధికారులకు సూచించారు. బుధవారం నాయుడుపేట ఏపీజీబీలో పలు ప్రాంతాలకు చెందిన మేనేజర్లతో సమీక్షించారు. ఎల్‌డీఎం జి.రవి, చీఫ్ మేనేజర్ ఆంజనేయులు, సీనియర్ మేనేజరు పి.బాలాజీ పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏపీజీబీ జీఎం రామకృష్ణ, ఇతర అధికారులు

సూక్ష్మపోషకాలతో అధిక వెన్నశాతం

సూక్ష్మపోషక మిశ్రమాలు అందజేస్తున్న పశువైద్యాధికారులు

దొరవారిసత్రం: పాళెంపాడులో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరాన్ని బుధవారం నిర్వహించారు. 85 పాడి పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. 25 పశువులకు సాధారణ వైద్యం, 63 దూడలకు నులిపురుగు మందు తాగించారు. సరైన సూక్ష్మ పోషకాలు అందిస్తే పాలల్లో అధిక వెన్నశాతం సాధించవచ్చని డీఎల్‌డీఏ ఈవో శ్రీనివాసులు తెలిపారు. బీఎన్‌కండ్రిగ, నాయుడుపేట, దొరవారిసత్రం, పెళ్లకూరు ఏడీలు మునిరాజ, గోవర్ధన్, శ్రీదేవి, ధనుంజయ్య పాల్గొన్నారు.

రోడ్డు చిన్నది.. గోతులు పెద్దవి..

సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి మధ్య ఉన్న ప్రధాన రహదారి నుంచి కొణ్ణెంబట్టు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు పెద్దవి కావడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. – న్యూస్‌టుడే, సూళ్లూరుపేట

కాలువకు తప్పని ఆటుపోట్లు

వాకాడు మండలం వావిళ్లపాలెం మరియమ్మ గుడి నుంచి కొండూరుకు వెళ్లే మార్గంలో తూర్పు వైపున ఉన్న ఆటుపోటుల ఉప్పుకాలువను ఇటీవల కొందరు మట్టి తోలి చదును చేసి కుదించేశారు. దీనివల్ల సముద్రపు నీరు బకింగ్ హామ్ కాలువ ద్వారా ఇందులోకి రావడం లేదని స్థానికులు వాపోతున్నారు. – న్యూస్‌టుడే, వాకాడు

మలుపు.. ప్రమాదాల కొలువు

నాయుడుపేట ఆర్టీసీ బస్టాండు ఎదురు మలుపులో ప్రధాన డ్రైనేజీ కాలువ రోడ్డు ప్రమాదకరంగా మారింది. కాలువ రోడ్డు అంచులు కోతకు గురయ్యాయి. దీంతో ఆదమరిస్తే కాలువలోకి పడిపోవాల్సిన పరిస్థితి. నిత్యం రద్దీగా ఉండే రహదారి మలుపు బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం

చేతి పంపు.. భ్రమలు కొలువు

వాకాడు సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మంచినీటి చేతిపంపు చుట్టూ వ్యర్థాలు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. కేంద్రానికి వచ్చే రోగులు పంపును చూసి నీరు రావడం లేదని భావిస్తూ బయటకు వెళ్తున్నారు. తీరా పంపును కదిలిస్తే అందులో నుంచి మంచినీరు వస్తోంది. పంపు చుట్టూ శుభ్రత చర్యలు చేపట్టాలి. – న్యూస్‌టుడే, వాకాడు

యమకంకరులు

పెళ్లకూరు మండలం పునబాక సమీప సూరమాల పరిసర ప్రాంతాల నుంచి నిత్యం నాయుడుపేట జాతీయ రహదారులపై టిప్పర్లు ఎత్తుగా కంకర పోసుకుని వెళ్తున్నాయి. 40 టన్నుల కంకరకు అనుమతి పొంది మరో పది టన్నులు అదనంగా తరలిస్తున్నారు. దీంతో కంకరంతా రోడ్డుపై పడి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. – న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు: 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 88979 08890
వెంకటగిరి: 80085 73966
సమయం 10 AM TO 1 PM

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: **సమస్య:** నాయుడుపేట గోమతి సమీప జాతీయ రహదారిపై మురుగు పారుతోంది. దుర్వాసన వస్తోంది. – **వెంకటేష్, స్థానికుడు**
సమాధానం: మురుగు నీరు రోడ్డుపైకి రాకుండా చేస్తాం.

సమస్య: నాయుడుపేట చిన్నదర్గా నుంచి రాజగోపాలపురానికి వెళ్లే దారిలో చెత్త నిల్వలున్నాయి. దీపాలు వెలగడం లేదు. – **మహేష్, స్థానికుడు**
సమాధానం: చెత్త తొలగిస్తున్నాం. వీధి దీపాలు వేయిస్తాం.

సమస్య: నాయుడుపేట పోలీసుస్టేషన్ ఎదురు వీధిలో గాడులు పడి జనం అల్లాడుతున్నారు. – **స్థానికులు**
సమాధానం: రహదారులను మరమ్మతు చేయాల్సి ఉంది.

సమస్య: నాయుడుపేట దర్గా రోడ్డు మధ్యలో చెత్త వేస్తున్నారు. – **మాల్యాద్రి నాయుడు, స్థానికుడు**
సమాధానం: చెత్త తొలగించాక స్థానిక వ్యాపారులు రాత్రివేళల్లో వేస్తున్నారు.

(పై ప్రశ్నలకు కమిషనర్ ఫజులుల్లా సమాధానాలిచ్చారు).

కోట, న్యూస్‌టుడే: **సమస్య:** తిమ్మానాయుడుపాళెంలో ఎస్సీ, బీసీ సామాజిక వర్గాల శ్మశానానికి దారి లేక ఇబ్బందులు పడుతున్నారు. దారి ఆక్రమణకు గురవడంతో అంత్యక్రియలకు వెళ్లాలంటే నరకయాతన పడాల్సి వస్తోంది. – **ఆనంద కృష్ణమూర్తి, మాజీ సర్పంచి**
సమాధానం: సర్వే చేయించి సమస్య పరిష్కరిస్తాం. – **జయజయరావు, తహసీల్దారు**

కానరాదు దీపం.. ఇదేం శాపం!

▸ **నెలబల్లి:** ఇక్కడ జాతీయ రహదారి పక్కన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ప్రాథమికోన్నత పాఠశాల, శ్రీహుస్సేనమ్మదర్గా, 20 వరకు దుకాణాలు రెండు కాలనీలుండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది.

✦ **జాతీయ రహదారిపై ఇదీ దైన్యం**

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: దొరవారిసత్రం మండలంలో సాయంత్రం ఆరు దాటితే జాతీయ రహదారిపై కారు చీకట్లు కమ్ముకుంటున్నాయి. మండలంలోని మూడు గ్రామాల మధ్యలో నుంచి ఈ రహదారి వెళ్తున్నా దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. ఇంత జరుగుతున్నా జాతీయ రహదారి నిర్వహణ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

మండలంలోని నెలబల్లి నుంచి తల్లంపాడు టోల్‌ప్లాజా వరకు సుమారు 15 కిలోమీటర్ల మేర విస్తరించిన జాతీయ రహదారి నెలబల్లి, దొరవారిసత్రం, తల్లంపాడు గ్రామాల మధ్యలో నుంచి వెళుతుంది. ఈ మూడు చోట్ల రహదారి మధ్యలోని డివైడర్‌పై ఒక్క విద్యుత్తు దీపం కూడా ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.

ప్రమాదాలు జరిగే నెలబల్లి జాతీయ రహదారి

▸ **తల్లంపాడు:** టోల్‌ప్లాజా నుంచి మావిళ్లపాడు వరకు ఉన్నత పాఠశాల, ఆదర్శపాఠశాల, మూడు కాలనీలు, పలు దుకాణాలు, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, అయ్యపాలెం రైల్వే స్టేషన్ వంటివి ఉన్నాయి. ఇక్కడ కూడా అర్ధరాత్రి వరకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు.

▸ **దొరవారిసత్రం:** మండల కేంద్రమైనందున పలు ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, గురుకుల పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల కళాశాల, ఎస్సీ బాలికల వసతిగృహాలు, పోలీసు స్టేషన్, విద్యుత్తు సబ్‌స్టేషన్, రైల్వేస్టేషన్, బ్యాంకు ఉన్నాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి కర్మాగారాలకు వెళ్లి వచ్చే వారితో రాత్రి 11 గంటల వరకు రద్దీ ఉంటుంది.

తరచూ ప్రమాదాలు

కొన్ని నెలల కిందట బీసీ గురుకులం అటెండర్ షాబ్‌జాన్ రహదారి దాటుతుండగా వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. నెలబల్లి, ఏకొల్లు, దొరవారిసత్రం, తల్లంపాడు గ్రామాలకు చెందిన ఎంతో మంది రహదారి దాటుతూ ప్రాణాలు విడిచారు. కొందరు తీవ్రంగా గాయపడ్డారు. అధికారులు స్పందించి ఈ మూడుచోట్ల రహదారిపై విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మత్స్యకారుల జీవనోపాధికి సాయం చేస్తా: ఎమ్మెల్యే

వాకాడు, న్యూస్‌టుడే: మత్స్యకారుల జీవనోపాధికి తన వంతు సాయం అందిస్తానని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. బుధవారం వాకాడు, దుర్గవరం, దుగరాజపట్నం, మొలగనూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. చేపల వ్యాపారం చేసుకునేందుకు వసతి కల్పించాలని స్థానిక మత్స్యకార మహిళలు కోరడంతో షెడ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇక్బాల్, పార్టీ అధ్యక్షుడు మధురెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ ప్రమీల, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, నందగోపాల్‌రెడ్డి, వేము దినకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వాకాడులో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌ను సత్కరిస్తున్న మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, నేతలు

ప్రజాభిప్రాయం మేరకే వంతెన నిర్మాణం

ప్రజాభిప్రాయం సేకరిస్తున్న ఆర్డీవో కిరణ్మయి, అధికారులు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: ప్రజాభిప్రాయం మేరకే రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మిస్తామని ఆర్డీవో కిరణ్మయి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో కొందరు ఆక్షేపణలు తెలిపినా.. ఎక్కువ మంది సుముఖంగా ఉన్నారన్నారు. అందరి ఆమోదం తీసుకొని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ బి.బాలమురుగన్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ కౌశిక్, సీఐ మురళీకృష్ణ, తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

వెంకటగిరి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం తిరుపతికి చెందిన అమర ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరంలో మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్, ఎముకలు, జనరల్ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తామని సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.

బాగుపడుతున్న సర్వీసు రోడ్డు

ఈనాడు కథనానికి స్పందన

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట, పెళ్లకూరు మండలాల్లోని 71వ జాతీయ రహదారి సర్వీసు రోడ్డును బాగు చేస్తున్నారు. సర్వీసు రోడ్డు దెబ్బతినడంతో వాహన చోదకులు పడుతున్న ఇబ్బందులపై 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు రోడ్డు పనులు చేపట్టారు. పెళ్లకూరు మండలం తాళ్వాయిపాడు వద్ద తారు వేస్తున్నారు.

దారి వివాదం పరిష్కరించిన అధికారులు

కోట, న్యూస్‌టుడే: గూడలి అరుంధతీయవాడలో కొన్ని ఇళ్లకు వెళ్లే దారికి ఓ వ్యక్తి ఫెన్సింగ్ రాళ్లు అడ్డుగా వేయడంతో బాధితులు తహసీల్దారు జయజయరావుకు బుధవారం విన్నవించారు. ఆయన ఆదేశాలతో శిక్షణ ఎస్ఐ నిఖిల్, రెవెన్యూ అధికారులు, సర్వేయరు పరిశీలించారు. చివరికి దారికి అడ్డుగా ఉన్న రాళ్లను తొలగించారు.

30 కిలోల ప్లాస్టిక్ సంచుల స్వాధీనం

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 30 కిలోల ప్లాస్టిక్ సంచులను పురపాలిక అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. రూ.1700 జరిమానా విధించారు. బాధ్యతారహితంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకుంటామని లైసెన్స్ రద్దు చేస్తామని తెలిపారు.

నిరుపేద విద్యార్థినులు.. కళల్లో ఆరితేరి

✦ **జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణింపు**

వెంకటగిరి, న్యూస్‌టుడే: వారంతా నిరుపేద కుటుంబాల నుంచి వచ్చినవారు. స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్య, క్రీడలు, కుట్టు విభాగంలో రాణిస్తూ తమదైన రీతిలో సత్తా చాటుతున్నారు. ఉపాధ్యాయినుల సహకారంతో వీరు రాష్ట్ర, జిల్లాస్థాయిలో రాణిస్తున్నారు. విద్యార్థినుల ప్రతిభపై ప్రత్యేక కథనం.

భారత జట్టుకు ఆడతా

నాన్న కోచ్ కావడంతో క్రికెట్ వైపు అడుగులు వేయాలనుకున్నా. 3వ తరగతి నుంచే నాన్న తర్ఫీదులో మెలకువలు నేర్చుకున్నా. సౌత్‌జోన్ పరిధిలో ఏసీఏ తరపున చిత్తూరు, కర్నూలు, కడప, అనంతపురం జట్లపై రాణించా. పాఠశాల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యా. భవిష్యత్తులో భారత జట్టుకు ఆడతా. – **సాయిశరణ్య, వెంకటగిరి**

వస్త్రాలతో న్యాప్‌కిన్ తయారీ

అమ్మానాన్నలు చేనేత కార్మికులు. జడ్పీ పాఠశాలలో చదువుతున్నాం. వస్త్రాన్ని వినియోగించి రుతుక్రమంలో వినియోగించే న్యాప్‌కిన్లను తయారు చేస్తున్నాం. ఇవి త్వరగా భూమిలో కలిసిపోతాయి. ఇందుకుగానూ జిల్లాస్థాయిలో ఎంపిక చేసి పత్రాలు అందించారు. – **త్రిభువని, ముని ధనలక్ష్మి, వెంకటగిరి**

పోలీసు అవుతా

జడ్పీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నా. సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యా. షాట్‌పుట్, డిస్కస్ త్రోలో జిల్లాస్థాయిలో రెండోస్థానంలో నిలిచా. తొలి నుంచి క్రీడలపై ఆసక్తి ఉంది. భవిష్యత్తులో పోలీస్ కావడమే లక్ష్యం. – **ఇందు, వెంకటగిరి**

అల్లికలో అందెవేసి..

జడ్పీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాం. పాఠశాలలో కుట్లు అల్లికలో శిక్షణ ఇస్తుండటంతో అందెవేసిన చేయిలా దూసుకుపోతున్నారు. ఫ్రాక్ కుట్టడంతో సహా చేతి కుట్టులో రాణించి జిల్లాస్థాయిలో అవార్డులు అందుకున్నాం. – **నవ్య, ఓవేయా, వెంకటగిరి**

రెజ్లింగ్ పోటీల్లో విద్యార్థులకు పతకాలు

పెళ్లకూరు: విజయవాడలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో పెళ్లకూరు మండలం రోసనూరు రాజుపాళెం గ్రామానికి చెందిన విద్యార్థి ముత్యాలయ్య, రెజ్లింగ్ విభాగంలో పసిడి, కాకినాడలో జరిగిన జూడో పోటీల్లో మేర్లపాక చరణ్ రజత పతకాలు సాధించారు.

జాతీయస్థాయి పోటీలకు గూడూరు విద్యార్థిని

గూడూరు పట్టణం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఒంగోలులో నిర్వహించిన షూటింగ్ పోటీల్లో గూడూరుకు చెందిన శ్రీ బాలాజీ కళాశాల విద్యార్థిని డి.లక్ష్మీప్రసన్న కాంస్య పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ కోటేశ్వరరావు తెలిపారు.

బహిరంగ వేలం

నవంబర్ నెల తేది : 13-11-2025

Vehicle No.	Description	Year
AP26TD-2338	EICHER PRO 1110 XP FBT	2015
AP26BF-9414	SONALIKA DI 740	2016

గమనిక : పైన తెలిపిన వాహనముల యొక్క రుణగ్రహీత(లు) / హామీదారులు మా యందు ఋణం పొంది వాహనము కొనుగోలుచేసి ఋణము చెల్లించనందువలన పలుమార్లు నోటీసులను పంపడమైనది. కాని ఖాతరు చేయనందువలన పలుమార్లు నోటీసు పంపడమైనది. కాని ఖాతరు చేయనందున పై వాహనములను వేలము ద్వారా విక్రయించి ఋణము రాబట్టుకొనుటకు కంపెనీ నిర్ణయించడమైనది. షరతులు వర్తిస్తాయి.

వేలము జరుగు ప్రదేశం : శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్, వెంకటాచలం, సర్వేపల్లి రోడ్డు, రైల్వేగేట్ దగ్గర, నెల్లూరు

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

డి.నెం.53-54, శ్రీనగరకాలనీ, శ్రీనివాస కాంప్లెక్స్, మాగుంట లేఔట్, దర్గా షోరూం దగ్గర, నెల్లూరు, ఫోన్ : 9849981316, 9849981418.

అట్టహాసంగా ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

నాయుడుపేట, న్యూస్‌టుడే: నాయుడుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం అట్టహాసంగా జరిగింది. కమిటీ గౌరవ అధ్యక్షురాలిగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ఛైర్మన్‌గా ఉయ్యాల ప్రవీణ్, వైస్ ఛైర్మన్‌గా కిలారి గోపి, కమిటీ డైరెక్టర్లుగా కాటూరు వెంకటేశ్వరరావు, కూచివాడ పవిత్రరెడ్డి, తుపాకుల కన్నెమ్మ, చెంబేటి సుజాత, కామిరెడ్డి కేశవరెడ్డి, చెంబేటి వేణయ్య, బైన సుబ్రహ్మణ్యంరెడ్డి, గోను బాబు, రాపూరు కస్తూరమ్మ, పాలూరు భాస్కర్, కొండూరు సోమయ్య, గెంజి సుధాకర్, గిండి సతీష్‌కుమార్, సంచి కృష్ణయ్య, దార అంకయ్య, సురేంద్రబాబు, నాగార్జునసాగర్‌లతో ఏడీఎం టి.సురేంద్రబాబు ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, రాష్ట్ర హస్తకళల ఛైర్మన్ హరిప్రసాద్, శ్రీకాళహస్తి ఆలయ కమిటీ ఛైర్మన్ కొట్టే సాయి, మాజీ మంత్రి పరసా వెంకటరత్నం, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచి గూడూరు ప్రభావతమ్మ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఎస్.విజయభాస్కర్, పుర వైస్‌ఛైర్మన్ ఎస్.కె.రఫీ తదితరులు నూతన ఛైర్మన్, డైరెక్టర్లను సత్కరించారు.

ఏఎంసీ ఛైర్మన్‌గా ఉయ్యాల ప్రవీణ్‌తో ప్రమాణం చేయిస్తున్న ఏడీఎం సురేంద్రబాబు

ఇంటి పట్టాలు అమ్ముకుంటే రద్దు చేస్తాం

వెంకటగిరి, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ నగర్‌లో ఇచ్చిన పట్టాలను విక్రయిస్తే వాటిని రద్దు చేస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం ఎన్టీఆర్ నగర్‌లో గృహ ప్రవేశాలు, శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్ నగర్‌లో మురుగు కాలువలు, సిమెంట్ రోడ్డు నిర్మాణాలకు చర్యలు చేపడతామన్నారు. తొలి విడత 105 గృహ ప్రవేశాలు, 247 గృహ నిర్మాణాలకు శంకుస్థాపన చేపడుతున్నట్లు వివరించారు. లబ్ధిదారులకు గృహనిర్మాణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పుర కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ విశ్వనాథం, శ్రీకాళహస్తి దేవస్థాన కమిటీ సభ్యురాలు కౌసల్యమ్మ, నేతలు రాజేశ్వరరావు, సత్యనారాయణ, ఆనంద్, అనిల్, రాధమ్మ పాల్గొన్నారు.

గృహప్రవేశ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

స్థానిక సంస్థల ఎన్నికలకు శ్రేణులు సిద్ధం కావాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సూచించారు. బుధవారం స్థానిక ఎస్ఆర్ఎల్ కల్యాణ మండపంలో పార్టీ నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారు. మున్సిపాలిటీ అధ్యక్షుడిగా అవ్వారు సత్యనారాయణ, డక్కిలి అధ్యక్షుడిగా కోటిరెడ్డి, బాలాయపల్లి అధ్యక్షుడిగా రావి సత్యనారాయణ, సైదాపురం అధ్యక్షుడిగా సుబ్రమణ్యం రాజు, రాపూరు అధ్యక్షుడిగా చెన్ను అశోక్‌రెడ్డి, కలువాయి అధ్యక్షుడిగా రఘురామిరెడ్డి ఎన్నికయ్యారు. వెంకటగిరి మండల పార్టీ అధ్యక్షుడి ఎంపిక వాయిదా పడింది.

పేదల సొంతింటి కల తీరుస్తాం

సూళ్లూరుపేట గ్రామీణం: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేరబోతోందని స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. బుధవారం ఆమె చేతుల మీదుగా మన్నారు పోలూరులో గృహాలను ప్రారంభించారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాసరావు, ఏఎంసీ ఛైర్మన్ ఆకుతోట రమేష్, తిరుమూరు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ✦ **గూడూరు పట్టణం:** చెన్నూరులో నూతన గృహ ప్రవేశ కార్యక్రమాన్ని తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి నిర్వహించారు.

జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం

నాయుడుపేట పట్టణం: నాయుడుపేట అగ్రహారపేట వద్ద జనసేన పార్టీ కార్యాలయాన్ని రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ ఛైర్మన్ హరిప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ముందుగా స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి కూటమి నాయకులు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, శ్రీకాళహస్తి ఆలయ కమిటీ ఛైర్మన్ కె.సాయి, సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన కన్వీనరు, ఏఎంసీ ఛైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, మండల పార్టీ అధ్యక్షుడు సతీష్, నాయకులు అట్ల కృష్ణారావు, బాలుశెట్టి, సురేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.
ప్రదర్శనలో రూ.60 వేల చోరీ..: జనసేన నాయకులు అట్ల కృష్ణారావు, సుమతీరావుల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు రూ.60 వేలు తస్కరించారు.

జనసేన పార్టీ కార్యాలయ ప్రారంభ కార్యక్రమంలో హరిప్రసాద్, ఎమ్మెల్యే విజయశ్రీ తదితరులు

చేనేత పరిశ్రమకు సహకరించండి

వెంకటగిరి: వెంకటగిరిలో చేనేత పరిశ్రమ స్థాపనకు సహకరించాలని భాజపా కన్వీనర్ ఎస్ఎస్ఆర్ నాయుడు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందజేశారు. బుధవారం తిరుపతికి వచ్చిన కేంద్ర మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో భాజపా నేతలు వేణుగోపాల్, తిరుపాల్‌రెడ్డి, వెంకటరత్నం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'ప్రైవేటుపరం దారుణం'

వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు, న్యూస్‌టుడే: వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడం దారుణమని పార్టీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైకాపా శ్రేణులు నిరసన ప్రదర్శన నిర్వహించాయి. బుధవారం నేదురుమల్లి నివాసం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన చేపట్టి అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నేతలు పాల్గొన్నారు. * సూళ్లూరుపేటలో పార్టీ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు వైకాపా శ్రేణులు ప్రదర్శన నిర్వహించి ఏవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొన్నారు. * గూడూరు సబ్ కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ వినతిపత్రాన్ని అందజేశారు.

సురేష్ మృతి తీరని లోటు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: కామ్రేడ్ సురేష్ మృతి చెందడం పార్టీకి తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు తెలిపారు. గూడూరు పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం జరిగిన కామ్రేడ్ సురేష్ సంతాప సభలో ఆయన మాట్లాడారు.

'ప్రధానోపాధ్యాయినిపై చర్యలు తీసుకోవాలి'

వెంకటగిరి: కలవలపూడి ప్రధానోపాధ్యాయిని అపర్ణ పనితీరుపై విచారించి.. శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు సాయిరామ్ డిమాండ్ చేశారు. బుధవారం పాఠశాలలో విధుల్లోకి చేరిన పీఈటీపై అనుచితంగా వ్యవహరించారని ఆరోపించారు.

నిందితుడికి జైలు

సూళ్లూరుపేట గ్రామీణం: నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఒకరి మృతికి కారణమైన చోదకుడికి బుధవారం సూళ్లూరుపేట అదనపు జడ్జి జైలు శిక్ష, జరిమానా విధించారు. 2023లో సూళ్లూరుపేట మండలం మన్నారు పోలూరుకు చెందిన కోను మునుస్వామిరెడ్డి మన్నారు పోలూరులో రోడ్డు పక్కన నడచి వెళ్తుండగా వెలగల పొన్నూరుకు చెందిన వేలుమూరు పవన్‌కుమార్ ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చి ఢీకొన్నాడు. ఈ ఘటనలో మునుస్వామిరెడ్డి మృతి చెందారు. అతని భార్య కోను ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్ఐ బ్రహ్మానాయుడు కేసు నమోదు చేశారు. సూళ్లూరుపేట అదనపు జడ్జి పి.సంయుక్త తుది తీర్పు ఇచ్చారు.

భూ ఆక్రమణపై కేసు

డక్కిలి, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు రెవెన్యూ శాఖ ఫిర్యాదు మేరకు పాతనాలపాడు పరిధిలో పి.కృష్ణయ్య అనే వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివశంకరరావు తెలిపారు.

(c) eenadu

రూపుదిద్దుకుంటున్న ప్రధాన వేదిక ప్రాంగణం

సింహాచలం వద్ద సరికొత్తగా...

విశాఖకు 'భాగస్వామ్య' కళ

సీఐఐ సదస్సుకు సర్వం సిద్ధం

ఉపరాష్ట్రపతి పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు

ఏయూ ప్రాంగణం, వన్‌టౌన్, ఎన్ఏడీ కూడలి, సింహాచలం, న్యూస్‌టుడే: సీఐఐ భాగస్వామ్య సదస్సుకు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నారు. బుధవారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖ చేరుకున్నారు. విమానాశ్రయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నేతలు ఘన స్వాగతం పలికారు. తరువాత ఒక హోటల్‌కు చేరుకున్న చంద్రబాబు.. పారిశ్రామిక వేత్తలతో భేటీ అయ్యారు. సదస్సు నేపథ్యంలో నగరాన్ని సుందరంగా ముస్తాబు చేశారు.

★ ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ 14న ఉదయం 8.30గంటలకు విమానంలో విశాఖకు చేరుకుంటారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి అల్పాహార విందులో పాల్గొంటారు. అనంతరం ఉదయం 8.55 గంటలకు సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొంటారు. అదే రోజు ఉదయం 11.15గంటలకు బయలుదేరి 'ఐఎన్ఎస్ డేగ'కు చేరుకొని అక్కడి నుంచి దిల్లీ బయలుదేరి వెళ్తారు. బుధవారం ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలోని డాక్టర్ వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఉప రాష్ట్రపతి సెక్యూరిటీ అధికారి సింగ్, ఇతర ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించారు.

★ ఉపరాష్ట్రపతి పర్యటనకు రక్షణ ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని అధికారులకు సూచించారు. అనంతరం ముఖ్యమంత్రి కార్యదర్శి కార్తికేయ మిశ్రా, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.

విమానాశ్రయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు అనిత, రవీంద్ర, ఎంపీలు శ్రీభరత్, సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, బండారు, పంచకర్ల, వెలగపూడి, గణబాబు, వంశీకృష్ణశ్రీనివాస్, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కార్యదర్శి కార్తికేయ మిశ్రా, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తదితరులు

ఏర్పాటు చేసిన సీఆర్‌డీఏ స్టాల్

నేడు మంత్రి లోకేశ్ రాక

వన్‌టౌన్, న్యూస్‌టుడే : రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం విశాఖ రానున్నారు. దిల్లీ నుంచి మధ్యాహ్నం 12.45 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని, అక్కడ నుంచి నేరుగా రోడ్డు మార్గంలో నగర తెదేపా కార్యాలయానికి చేరుకుని బస చేస్తారు. 14, 15 తేదీల్లో జరిగే భాగస్వామ్య సదస్సులో పాల్గొంటారు.

రేపటి నుంచి..
నరెడ్కో 'వైజాగ్ ప్రాపర్టీ ఫెస్ట్'

★ మూడు రోజుల పాటు నిర్వహణ
★ ప్రవేశం ఉచితం

ఈనాడు, విశాఖపట్నం: సొంతింటి కలలను నిజం చేసుకోవాలని, స్థలాలు కొనుగోలు చేయాలని భావిస్తున్న వారి కోసం 'నరెడ్కో (విశాఖపట్నం)' స్థిరాస్తుల ప్రదర్శన నిర్వహిస్తోంది. బీచ్ రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్‌లో ఈ నెల 14, 15, 16 తేదీల్లో 'వైజాగ్ ప్రాపర్టీ ఫెస్ట్' పేరుతో నిర్వహిస్తున్నట్లు నరెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధర్ తెలిపారు. 14న కేంద్రపౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి లోకేశ్ చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అరవైకిపైగా స్టాళ్లతో ప్రదర్శన ఉంటుందని అందులో స్థిరాస్తివే కాకుండా శానిటరీ, ఎలక్ట్రికల్ స్టాళ్లు ఉంటాయన్నారు. నాలుగు బ్యాంకులు కూడా స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ద వ్యాలీ, ఎస్‌బీఐ, జాక్వర్ ప్రధాన స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. ఒక భారీ స్టాల్‌లో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నమూనాను జీఎంఆర్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. 'భోగాపురం ఏరియా డెవలప్‌మెంట్' పేరుతో ఆ పరిసర ప్రాంతాల్లోని ప్రాజెక్టులతో మరో స్టాల్ ఉంటుందన్నారు. ప్రతి గంటకు లక్కీ డ్రాలు ఉంటాయని, ద్విచక్ర వాహనాలు బహుమతులుగా అందజేస్తామన్నారు.

అదిగో విమానం.. జోరుగా గగనయానం!!

విశాఖ నుంచి పెరుగుతున్న రాకపోకలు

అంతర్జాతీయ ప్రయాణికుల సంఖ్యలో వృద్ధి

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్ర ఆర్థిక, ఐటీ రాజధానిగా అభివృద్ధి చెందుతున్న విశాఖ నుంచి విమానయానానికి ప్రాధాన్యం పెరుగుతోంది. ఇక్కడి అంతర్జాతీయ విమానాశ్రయం.. ప్రయాణికుల రాకపోకలతోపాటు సర్వీసుల పరంగానూ జోరు కొనసాగిస్తోంది. నిత్యం 60 విమాన సర్వీసులు రాకపోకలు సాగిస్తున్నాయి.

ఎక్కడెక్కడికంటే...
హైదరాబాద్, దిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, తిరుపతి, విజయవాడ, భువనేశ్వర్, జయపురం, రాయ్‌పూర్, కర్నూలు, శ్రీవిజయపురం (పోర్టుబ్లెయర్), అబుదాబి, సింగపూర్.

అంతర్జాతీయ సర్వీసులు నడిచే రోజులు..
అబుదాబి: సోమ, బుధ, శుక్ర, ఆదివారం.
సింగపూర్: సోమ, బుధ, శుక్ర, శనివారం.

ఈ ఏడాది రాకపోకలు సాగించిన విమాన సర్వీసులు.. నెల	ఏప్రిల్	మే	జూన్	జులై	ఆగస్టు	సెప్టెంబరు	అక్టోబరు
దేశీయ	1,820	1,766	1,781	1,762	1,806	1,694	1,730
అంతర్జాతీయ	86	44	54	70	72	66	79

మెరుగ్గా ఆక్యుపెన్సీ: ఏడాదిగా విశాఖ నుంచి అంతర్జాతీయ విమాన ప్రయాణికుల రాకపోకలు పెరిగాయి. విశాఖ నుంచి వారానికి నాలుగు రోజులు అంతర్జాతీయ సర్వీసులు నడుస్తున్నాయి. ● సింగపూర్‌కు వెళ్లేందుకు ఎప్పటి నుంచో సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. ఈనెల 08న.. సింగపూర్ సర్వీసులో.. 160 ప్రయాణికులు రాగా.. 171 మంది ఇక్కడి నుంచి వెళ్లారు.

● ఇక్కడి నుంచి నేరుగా అబుదాబి (దుబాయి) చేరుకునేందుకు జూన్ 13 నుంచి విమాన సర్వీసు ప్రారంభమైంది. నవంబరు 09న అబుదాబి విమానంలో మొత్తం 116 మంది ప్రయాణికులు రాగా.. 180 మంది ఇక్కడి నుంచి బయలుదేరారు.

● గతంలో విశాఖ నుంచి కౌలాలంపూర్ (మలేషియా), బ్యాంకాక్‌కు నేరుగా సర్వీసులు నడిచేవి. ఈ ఏడాది మే నుంచి ఆయా సర్వీసులు నిలిచిపోయాయి.

రాకపోకలు సాగించిన ప్రయాణికులిలా..

సంవత్సరం	దేశీయ	అంతర్జాతీయ
2019–20	25,37,748	1,43,534
2020–21	11,05,935	7,581
2021–22	16,07,504	2,979
2022–23	24,35,320	65,334
2023–24	27,22,722	66,192
2024–25	28,33,007	1,21,972
2025–26 (అక్టోబరు వరకు)	16,50,797	59,115

అతిథులకు.. పర్యాటక ఆతిథ్యం!

సందర్శనీయ ప్రాంతాల్లో ఏర్పాట్లు

ఈనాడు, విశాఖపట్నం : ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖ కేంద్రంగా జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు దేశ, విదేశాల నుంచి ప్రతినిధులు వస్తున్నారు. వారంతా కార్యక్రమానికి హాజరైన తరువాత నగర అందాలు వీక్షించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఆసక్తి ఉన్న వారికి అరకు ప్రాంతాలను చూపించనుంది. ప్రశాంత వాతావరణం, ప్రకృతి అందాలు, ఆహ్లాదకర తీర ప్రాంతాలకు తీసుకువెళ్లనుంది. శాఖల వారీగా జరిగే ఒప్పందాలకు హాజరయ్యే పెట్టుబడిదారులను సంబంధిత విభాగాల అధికారులే వివిధ పర్యాటక ప్రాంతాలకు తీసుకువెళ్లనున్నారు.

■ రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో 410 ఒప్పందాలు చేసుకునేందుకు 1,200 మంది వరకు హాజరవుతున్నారు. వీరితో పాటు మరో మూడు వేల మంది పర్యటనల కోసం ప్రత్యేకంగా వోల్వో బస్సులు ఏర్పాటు చేశారు.

సుందరంగా తీర్చిదిద్దిన బీచ్ రోడ్డు

నగరంలో : సింహాచలం, కైలాసగిరి, తొట్లకొండ, భీమిలి బీచ్, ఎర్రమట్టిదిబ్బలు, రుషికొండ, యారాడ, బావికొండ, కురుసురా జలాంతర్గామి, టీయూ-142 యుద్ధ విమానం, ఆర్‌కే బీచ్.

■ సదస్సు నేపథ్యంలో ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని పర్యాటక ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దారు. చారిత్రక, వారసత్వ ప్రదేశాల్లో ఆయా ప్రాంతాల గొప్పతనం తెలిపేలా సూచిక బోర్డులు కొత్తగా ఏర్పాటు చేశారు. మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం ఇతర వసతులు కల్పించారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకంగా గైడ్లను అందుబాటులో ఉంచుతున్నారు

అరకులో : బొర్రా గుహలు, పద్మాపురం గార్డెన్స్, చాపరాయి, అనంతగిరి కాఫీ తోటలు.

ఆలయాలు : సింహాచలం, అరసవల్లి, శ్రీకూర్మం, రామనారాయణం.

విజయనగరం జిల్లాలో: తాటిపూడి జలాశయం.

అత్యవసర వైద్య సేవలకు సన్నద్ధం

ఈనాడు, విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సుకు వివిధ ప్రాంతాల నుంచి ఉన్నతస్థాయి ప్రముఖులు, ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

★ వైద్యారోగ్య సేవలను పర్యవేక్షించే బాధ్యతను డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డా. వాణికి అప్పగించారు. అత్యవసర పరిస్థితి ఎదురైతే సేవలందించేందుకు సిద్ధంగా ఉండేందుకు వైద్యులు, సిబ్బందిని సన్నద్ధం చేస్తున్నారు.

వైద్య బృందాలు.. అంబులెన్సులు

■ సదస్సు ప్రాంగణంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. గురు, శుక్ర, శనివారాల్లో మూడు షిఫ్టుల్లో అక్కడ వైద్యులు, సిబ్బంది సేవలందిస్తారు.

■ అత్యవసర సేవలందించేందుకు వైద్య బృందాలు, అంబులెన్సులు, ప్రథమ చికిత్స కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు.

■ జనరల్ ఫిజీషియన్, హృద్రోగ నిపుణులు, ఇతర వైద్య నిపుణులు, నర్సింగ్, ఇతర సిబ్బంది ఇక్కడుంటారు. పరిస్థితికి తగ్గట్టుగా చికిత్స చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

■ ప్రథమ చికిత్స సామగ్రి, అవసరమైన మందులు, ప్రాథమిక రోగనిర్ధారణ పరికరాలు సిద్ధం చేస్తున్నారు.

సదస్సు ప్రాంగణం వద్ద వాహనాలు నిలిపేందుకు చేస్తున్న ఏర్పాట్లు

■ కలెక్టరేట్‌లోని కంట్రోల్‌రూం నుంచి వైద్యారోగ్య శాఖ తరఫున ఒక ప్రతినిధి నిత్యం పరిస్థితిని పర్యవేక్షిస్తారు.

■ కంట్రోల్ రూం, హాస్టల్, పార్కింగ్ స్థలం తదితర ఆరు ప్రాంతాల్లో అంబులెన్సులు అందుబాటులో ఉంటాయి.

■ ప్రతినిధులు బస చేయనున్న రాడిసన్ బ్లూ, నొవొటెల్, గ్రాండ్ బే, దసపల్లా హోటళ్ల వద్ద అంబులెన్సులతో పాటు వైద్య బృందాలు సిద్ధంగా ఉంటాయి. ■ కేజీహెచ్, అపోలో, కేర్, మెడికవర్ ఆసుపత్రుల యాజమాన్యాలను అప్రమత్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో సేవలందించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

■ ప్రయాణ సమయంలో తక్షణ వైద్య సహాయం కోసం వీవీఐపీ కాన్వాయ్‌లో ప్రత్యేక అంబులెన్సును ఏర్పాటు చేయనున్నారు.

అరకు వెళ్తున్నట్లు చెప్పి.. అనంతలోకాలకు!! 8లో
కన్నీటి పర్యంతమైన యమున తల్లిదండ్రులు
కిడ్నీ రాకెట్ వ్యవహారంపై పలుకోణాల్లో విచారణ

అడుగడుగూ... ఐక్యంగా!
బీచ్ రోడ్‌లో బుధవారం ఉదయం నిర్వహించిన 'ఐక్యతా నడక'లో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, తదితరులు పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, పెదవాల్తేరు ...6లో

ఉద్యోగులు, కార్మికులకు సామాజిక భద్రత

కరాస, న్యూస్‌టుడే : ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన (పీఎంవీబీఆర్‌వై)వల్ల ఉద్యోగులు, కార్మికులకు సామాజిక భద్రత లభిస్తుందని ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ అమర్‌దీప్‌మిశ్రా అన్నారు. ఈ పథకంపై బుధవారం సాయంత్రం వాల్తేర్ రైల్వే డివిజనల్ కార్యాలయంలో ప్రావిడెంట్ ఫండ్ శాఖ అధికారులు అవగాహన సదస్సును నిర్వహించారు. అమర్‌దీప్‌మిశ్రా పథకం లక్ష్యాలను, అందులో లభించే ప్రోత్సాహకాలు, ఉపాధి అవకాశాలు, ఒప్పంద కార్మికులకు సామాజిక భద్రత వంటి అంశాలపై వివరించారు. పీఎఫ్ కమిషనర్-2 నితీష్‌కుమార్, అదనపు డీఆర్ఎం ఇ.శాంతారాం (ఐఆర్ఎస్ఈ), రైల్వే ఉన్నతాధికారులు, ఉద్యోగులు, కార్మికులు, రైల్వే గుత్తేదారులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న పీఎఫ్ ఉన్నతాధికారులు

బ్యాంక్ ఆఫ్ బరోడా
बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda
హైదరాబాద్ జోనల్ ఆఫీస్, 3-6-289, 1వ అంతస్తు, కరీమ్ మంజిల్, హైదర్‌గూడ, హైదరాబాద్-500029.
లీజుపై ప్రాంగణం కొరకు ప్రకటన
బ్యాంక్ ఆఫ్ బరోడా, జోనల్ కార్యాలయము, హైదరాబాద్ వారు విశాఖపట్నంలోని కొమ్మాది ఏరియాలో అన్ని సౌకర్యాలతో తమ శాఖను నెలకొల్పేందుకు సుమారు 1500–2350 చదరపు అడుగుల కార్పెట్ విస్తీర్ణంతో గ్రౌండ్ ఫ్లోర్/అప్పర్ గ్రౌండ్ ఫ్లోర్ / ఫస్ట్ ఫ్లోర్ లిఫ్ట్ సౌకర్యం కలిగిన యజమానులు/పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్స్ నుండి ఆఫర్లను ఆహ్వానిస్తున్నది. తగినంత విద్యుత్ శక్తితో ప్రాంగణం స్వాధీనముకు సిద్ధంగా ఉండాలి లేదా 3 నెలలలోపు స్వాధీనం చేసుకొనుటకు సిద్ధంగా ఉండాలి. ఈ ఉద్దేశించిన ఆఫర్‌లు పైన తెలిపిన చిరునామాకు 05.12.2025 తేదీలోగా లేదా అంతకు ముందుగా "టెక్నికల్ బిడ్" మరియు "ప్రైస్ బిడ్" రెండు వేర్వేరు సీల్డ్ కవర్‌లలో సమర్పించవలెను. పబ్లిక్ సెక్టార్ యూనిట్స్ / గవర్నమెంట్ డిపార్ట్‌మెంట్స్‌కు చెందిన ప్రాంగణాలకు ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కోసం దయచేసి మా వెబ్‌సైట్: www.bankofbaroda.com లోని టెండర్ల విభాగంలో లాగిన్ అవ్వగలరు. ఎటువంటి కారణాలను చూపకుండానే ఏదైనా ఆఫర్‌ను అంగీకరించడానికి లేదా తిరస్కరించే హక్కు బ్యాంకుకు కలదు.
అప్లికేషన్ సమర్పించుటకు ఆఖరు తేది మరియు సమయం : 05-12-2025 మ॥ 3.00 గం॥ల వరకు.
సం/- జనరల్ మేనేజర్, జోనల్ ఆఫీస్, హైదరాబాద్

భారత్ నేవీ చీఫ్ అమెరికా పర్యటన

సింధియా, న్యూస్‌టుడే: భారత నౌకాదళ అధిపతి చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్ అడ్మిరల్ **దినేష్ కె.త్రిపాఠి** అమెరికా పర్యటనకు ఈనెల 12న బయల్దేరి వెళ్లారు. నవంబరు 17 వరకు అక్కడ పర్యటించనున్నారు. భారత్-అమెరికా రక్షణ భాగస్వామ్యం బలోపేతం చేయడంలో అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి అమెరికా పర్యటన కీలకం కానుందని బుధవారం నౌకాదళ వర్గాలు తెలిపాయి. రెండు దేశాల నావికాదళాల మధ్య సమాచార భాగస్వామ్యం బలోపేతం వంటి అంశాలపై చర్చించనున్నారు.

సదస్సుకు కట్టుదిట్టంగా భద్రత

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : నగరంలో నిర్వహించే భాగస్వామ్య సదస్సుకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని, కమాండ్ కంట్రోల్ రూం ద్వారా నిఘా కొనసాగుతుందని సీపీ శంఖబ్రతబాగ్చీ అన్నారు. బుధవారం ఆయన కమాండ్ కంట్రోల్ రూంను సందర్శించి.. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీసీ కెమెరాల్లో దృశ్యాలను సునిశితంగా పరిశీలిస్తూ, ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనా వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. నగర పరిధిలో పలుచోట్ల ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని, వాహన చోదకులు సహకరించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహన రాకపోకలు సాగించినా, అనధికార పార్కింగ్ చేసినా, చర్యలు తప్పవన్నారు.

కమాండ్ కంట్రోల్ రూంలో పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చీ

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

సింహగిరిపై ఆక్టోపస్ మాక్‌డ్రిల్ 6లో

వేతన బకాయిలు చెల్లించాలంటూ ఆదేశం

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు ఉద్యోగుల వేతన బకాయిలు 2026 జనవరి నాటికి చెల్లించేలా చర్యలు తీసుకోవాలంటూ ప్రాంతీయ జాయింట్ లేబర్ కమిషనర్ బుధవారం ఉక్కు యాజమాన్యానికి ఆదేశాలు జారీచేశారు. గత ఏడాది సెప్టెంబరు నుంచి ఉక్కు యాజమాన్యం ఉద్యోగులకు పూర్తిస్థాయిలో జీతాలు చెల్లించకపోవడంతో ఏఐటీయూసీ లేబర్ కమిషనర్ దృష్టికి తెచ్చింది. దీంతో బుధవారం ఆయన ఉక్కు యాజమాన్య ప్రతినిధులు, కార్మిక సంఘ నాయకుల మధ్య చర్చలు జరిపారు. వేతన బకాయిలు 2026 జనవరి నాటికి చెల్లించాలని ఆదేశించినట్టు నాయకులు తెలిపారు. సమావేశంలో యాజమాన్యం తరపున వై.హెచ్.శంకర్, ఎస్.రామప్రసాద్, యూనియన్ తరపున డి.ఆదినారాయణ, దేముడు, శివ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

యువతలో స్ఫూర్తి నింపిన ఐక్యతా నడక..

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: దేశాన్ని ఐక్యం చేసిన మహోన్నత వ్యక్తి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అని విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలను పురస్కరించుకుని బీచ్‌రోడ్డులోని వై.ఎం.సి.ఎ. వద్ద బుధవారం యూనిటీ మార్చ్ చేపట్టారు. విశాఖ ఎంపీ శ్రీభరత్ కార్యక్రమాన్ని ప్రారంభించి, విద్యార్థులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ సర్దార్ పటేల్ తన అసాధారణ ప్రజ్ఞతో 565 సంస్థానాలను దేశంలో విలీనం చేయడంలో కీలక పాత్ర వహించారు. ఆయన దేశానికి అందించిన సేవలు మరువలేనివన్నారు. ఆర్కే బీచ్ వరకు ఐక్యతా నడక కొనసాగింది. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ యూనిటీ మార్చ్ యువతలో ఎనలేని స్ఫూర్తి నింపిందన్నారు. నెహ్రూ యువ కేంద్రం (మై భారత్) డిప్యూటీ డైరెక్టర్ జె.మహేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి, నెహ్రూ యువకేంద్రం పూర్వ సలహాదారు కాండ్రేగుల వెంకటరమణ, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, తదితరులు

పాల్గొన్న యువత

సాగర తీరంలో ఐటీ వెలుగులు!

- విశాఖకు వరుస కట్టిన కంపెనీలు
- భాగస్వామ్య సదస్సుకు ముందే శంకుస్థాపనలు

ఈనాడు–విశాఖపట్నం: కూటమి అధికారంలోకి వచ్చాక సాగర తీరంలో ఐటీ రంగం వెలుగులీనుతోంది. దిగ్గజ సంస్థలతోపాటు, పలు కంపెనీలు విశాఖకు వరుస కడుతున్నాయి. గూగుల్ డేటా సెంటర్ ప్రకటన తర్వాత మరిన్ని కంపెనీలు ముందుకొస్తున్నాయి. ఈనెల 14, 15వ తేదీల్లో తలపెట్టిన భాగస్వామ్య సదస్సుకు ముందే... గురువారం విశాఖ ఐటీ హిల్స్‌పై ఏకంగా నాలుగు ఐటీ కంపెనీలకు మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా శంకుస్థాపనలు జరుగనున్నాయి.

■ **కూటమి వచ్చాక:** వైకాపా హయాంలో విశాఖను వదిలి పలు కంపెనీలు వెళ్లిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తక్కువ ధరకు భూ కేటాయింపులు, కొత్తగా పాలసీలు ప్రకటించడం, రాయితీలు, ప్రోత్సాహకాలు పాత బకాయిలు చెల్లిస్తుండటంతో ఐటీ కంపెనీలు ముందుకొచ్చాయి. తొలుత ఐటీ దిగ్గజ సంస్థ ముందుకు రాగా 90పైసలకే హిల్‌3లో 22 ఎకరాలను కేటాయించారు. అలా రూ.1,370కోట్ల పెట్టుబడితో 12వేల మందికి ఉద్యోగాలు ఇచ్చేందుకు టాటా గ్రూపు ఒప్పందం కుదుర్చుకుంది. మిలీనియం టవర్స్‌లో తాత్కాలిక కార్యకలాపాలు ప్రారంభించడానికి సిద్ధమైంది. ఆ తర్వాత కాగ్నిజెంట్ రూ.1,583కోట్ల పెట్టుబడితో 8వేల ఉద్యోగాల కల్పనకు ఒప్పందం కుదుర్చుకుంది. యాక్సెంచర్ రూ.1,200కోట్ల పెట్టుబడితో 12వేల మందికి ఉపాధి కల్పించేందుకు ముందుకొచ్చింది. ఏఎన్ఎస్ఆర్, సత్య డెవలపర్స్, ఉర్సా వంటి కంపెనీలు కూడా వచ్చాయి.

■ **తాజాగా మరికొన్ని:** గూగుల్ డేటా సెంటర్ విశాఖకు రావడంతో మరికొన్ని కంపెనీలు తాజాగా ముందుకొచ్చాయి. కాపులుప్పాడలో క్వార్క్స్ టెక్నోసాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు నాలుగు ఎకరాలు కేటాయించారు. రూ.115కోట్ల పెట్టుబడితో 2వేల మందికి ఉద్యోగాలిచ్చేలా ఐటీ క్యాంపస్ ఏర్పాటు చేయనున్నారు. విశాఖకు చెందిన ఫ్లూయింట్ గ్రిడ్ సంస్థకు కాపులుప్పాడలో 3.3 ఎకరాలు కేటాయించారు. రూ.150కోట్ల పెట్టుబడితో 2వేల మందికి ఉపాధి ఇచ్చేలా ఏఐ, ఐఓటీ, అడ్వాన్స్ ఐటీ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయనుంది. సెయిల్స్ సాఫ్ట్‌వేర్, ఐ స్పేస్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్, టెక్ తమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఫినోమ్ పీపుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలకు ఐటీ హిల్ 2, 3లలో భూములు కేటాయించారు. ఈ నాలుగు కంపెనీలకే గురువారం శంకుస్థాపనలు చేయనున్నారు.

ఐటీ కార్యాలయాలు నిర్మించనున్న రహేజా: మధురవాడ ఐటీ హిల్స్ 3లో రహేజా ఐటీ స్పేస్ అండ్ లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాజెక్టు చేపడుతోంది. విశాఖ నగరానికి పెద్ద ఎత్తున డేటా సెంటర్‌లు, గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు, దిగ్గజ ఐటీ కంపెనీలు వస్తున్న నేపథ్యంలో ఆయా కంపెనీలకు అవసరమైన ఐటీ స్పేస్, రెసిడెన్షియల్ లగ్జరీ ప్లాట్లను ఈ సంస్థ నిర్మించనుంది. తొలి విడతలో రూ.2,172కోట్ల పెట్టుబడితో 8వేల మంది ఉపాధి కల్పించనుంది. ఎండాడలో కపిల్ గ్రూప్ ఆధ్వర్యంలో 'వరల్డ్ ట్రేడ్ సెంటర్' ఏర్పాటు చేయనున్నారు. 7.5మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక సాంకేతికతతో డబ్ల్యూటీసీని నిర్మిస్తారు. రహేజా, డబ్ల్యూటీసీ రెండింటికీ నేడు శంకుస్థాపనలు చేయనున్నారు.

పీపీపీ ప్రాజెక్టులకు అనుమతులు తప్పనిసరి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలో జీవీఎస్‌సీసీఎల్ (గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్) ఆధ్వర్యంలో పీపీపీ (ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం) ద్వారా చేపట్టబోయే రూ.10 కోట్లు, అంత కంటే అధికంగా వ్యయం చేసే ప్రాజెక్టులకు జీవీఎస్‌సీసీఎల్ బోర్డు సభ్యుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బోర్డులో జీవీఎస్‌సీసీఎల్ ఎండీ, సీఈవో ఛైర్మన్‌గా వ్యవహరిస్తారని, మున్సిపల్‌శాఖ అదనపు కార్యదర్శి, జీవీఎంసీ ప్రధాన ఇంజినీర్, ఏపీయూఎఫ్ఐడీసీ (ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్షియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) సభ్యులుగా ఉంటారని, సూపరింటెండెంట్ ఇంజినీర్ సమన్వయకర్తగా ఉంటారని తెలిపారు. ఆయా ప్రాజెక్టుల టెండర్ బిడ్లు, ఆర్ఎఫ్‌పీ (రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్), అర్హతలు, లీజులు, నిర్వహణ తదితర అంశాలను కమిటీ దృష్టికి తీసుకురావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

14న వ్యవసాయ రుణాలపై అవగాహన

కార్పొరేషన్, న్యూస్‌టుడే: సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయంలో 14న వ్యవసాయ రుణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని కార్యక్రమాలు ఉంటాయని బ్యాంకు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు, వ్యవసాయ ఆధారిత వ్యాపారులు సమీప బ్యాంకు సేవల్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు కాకినాడ జిల్లా రౌతులపూడి శాఖలో గాని, సమీప బ్రాంచ్‌లో గాని, టోల్ ఫ్రీ నంబరు 1800 3030లో గాని సంప్రదించాలని బ్యాంకు ప్రతినిధి శ్రీనివాసరావు సూచించారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT VISAKHAPATNAM
E.P.85/2020 in O.S.208/2012

Between:
M/s. Gowra Leasing & Finance Limited
Rep.by its Authorised Signatory Sri L.Vinod ...Decree Holder
And
M/s. Kalasimha Hospitals Pvt. Ltd., Rep. by its Managing Director
Dr. K.V.S.S. Geethanand & 2 others ...Judgment Debtors

వేలం ప్రకటన

పై నెంబరు అమలు పిటిషన్‌లో డిక్రీ దార్ [illegible] 28.11.2025 [illegible] 28.11.2025 [illegible] 10.30 [illegible] 5.00 [illegible]

SCHEDULE

All that piece and parcel of land admeasuring 3,433.33 sq. yds., or 2870.263 sq. mts., covered by Survey Nos.5/1, 5/2, 5/3 and 7/1 situated at Darapalem, H/o. Mudasarlova Village, now within the limits of Greater Visakhapatnam Municipal Corporation Area, Visakha Rural Mandal, in registration sub district of Madhurawada and in the registration district of Visakhapatnam.

Item No.3: Measurements: East to West: 180' or 54.86 mtrs & **North to South:** 30' or 9.14 mtrs. i.e., 600 sq. yds.
Boundaries: East: Land belongs to K.V.K.Raju, **West:** Land belongs to Sri Shiridi Sai Guru Paduka Peetham, **North:** Land belongs to Sri Shiridi Sai Guru Paduka Peetham, **South:** Land belongs to Sri Shiridi Sai Guru Paduka Peetham, **DHR Value: Rs.30,00,000/-, Amin Value: Rs.1,02,00,000/-, Market Value: Rs.1,02,00,000/-, JDR Value: Not furnished**

Item No.5: Measurements: East to West: 150' or 45.72 mtrs. & **North to South:** 30' or 9.14 mtrs. i.e., 500 sq. yds. Boundaries: **East:** Land belongs to K.V.K. Raju, **West:** Land belongs to Sri Shiridi Sai Guru Paduka Peetham, **North:** Land belongs to Sri Shiridi Sai Guru Paduka Peetham, **South:** Land belongs to Sri Shiridi Sai Guru Paduka Peetham, **DHR Value: Rs.20,00,000/-, Amin Value: Rs.85,00,000/-, Market Value: Rs.85,00,000/- , JDR Value: Not furnished**

VISAKHAPATNAM
DATE: 12.11.2025

M/s. SAIBABA & SRINIVAS, ADVOCATES
D.No. 30-1-1/16, 5TH FLOOR, NEELADRI COMPLEX
DABAGARDENS, VISAKHAPATNAM-530 020
MOBILE No. 9849118004

ఘనంగా యూబీఐ వ్యవస్థాపక దినోత్సవం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పోర్టు కళావాణి ఆడిటోరియంలో నిర్వహించిన ఈ వేడుకలకు బ్యాంకు జోనల్ హెడ్ హెచ్.టీ.వాసప్ప, రీజనల్ హెడ్ జె.సింహాచలం ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలని, సిబ్బంది తమ పని చేయాలని సిబ్బందికి సూచించారు. నగరంలోని వివిధ శాఖల ఖాతాదారులను సత్కరించారు. పలువురు వక్తలు బ్యాంకు సేవల్ని కొనియాడి భవిష్యత్తులో మరెన్నో వ్యవస్థాపక దినోత్సవాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఉద్యోగులు, వారి పిల్లల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డిప్యూటీ జోనల్ అధికారులు ఎ.శారదామూర్తి, శంకర్ హేంబరం, మేనేజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జోనల్, రీజనల్ హెడ్స్ హెచ్.టీ.వాసప్ప, జె.సింహాచలం తదితరులు

నల్లబ్యాడ్జీలు ధరించి ఉక్కు ఉద్యోగుల నిరసన

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు–3)న్యూస్‌టుడే: బ్లాస్ట్ ఫర్నేస్ విభాగంలో సుదీర్ఘ అనుభవం ఉండి, అంకితభావంతో పనిచేసే అధికారిని సస్పెన్షన్ చేస్తూ మంగళవారం ఉక్కు ఇన్‌ఛార్జి సీఎండీ తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి ఉక్కు ఉద్యోగులు విధులు నిర్వహించారు. సీఎండీ ఉద్యోగుల బదిలీలు, ఛార్జిషీట్లు, సస్పెన్షన్లతో నియంతలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సంఘాలకు అతీతంగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలో పాల్గొనడం అంటే సీఎండీ తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవాలని అన్నారు.

సింహగిరిపై ఆక్టోపస్ మాక్‌డ్రిల్

సింహాచలం, న్యూస్‌టుడే: మంగళవారం రాత్రి అప్పన్న స్వామి ఆలయ ద్వారాలు మూసివేసిన తర్వాత కొందరు ఉగ్రవాదులు దేవాలయంలో నక్కారు. అంతా నిశ్శబ్దంగా ఉన్న సమయంలో ఒక్కసారిగా ఆలయంలో సంచరించడం ప్రారంభించారు. విషయాన్ని గమనించిన ఆక్టోపస్ భద్రతా బలగాలు హుటాహుటిన సింహగిరికి చేరుకున్నాయి. కొండపై విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. తుపాకులు చేతపట్టి ఉగ్రవాదుల కోసం వెతుకులాట ప్రారంభించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు జరగడంతో కొందరు ఉగ్రవాదులు మృతి చెందారు. భద్రతా బలగాల్లో గాయపడిన వారికి వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రథమ చికిత్స చేసి సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఇదంతా సింహగిరిపై ఆక్టోపస్ భద్రతా బలగాల మాక్‌డ్రిల్ మాత్రమే.

★ దిల్లీలో ఉగ్రదాడి నేపథ్యంలో ఆక్టోపస్ డీఎస్పీ ఐ.తిరుపతయ్య, ఇన్‌స్పెక్టర్ శివాజీ ఆధ్వర్యంలో మంగళవారం అర్ధరాత్రి అప్పన్న ఆలయంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాదులు ఆలయాన్ని దిగ్బంధం చేస్తే ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై ఆలయ సెక్యూరిటీ, ఎస్పీఎఫ్, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, దేవస్థానం శాఖల సిబ్బందితో కలిసి భద్రతా బలగాలు వాస్తవాన్ని తలపించేలా మాక్‌డ్రిల్ చేపట్టారు. దేవస్థానం సిబ్బందిలో కొందరు ఉగ్రవాదులుగా నటించగా.. ఆలయంలో చిన్నపాటి బాంబును నిర్వీర్యం చేసినట్లు ప్రదర్శించారు. వేకువజాము వరకు కొనసాగిన ఈ ప్రక్రియలో పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులపై కాల్పులు జరిపి నమూనా విన్యాసం

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.95 కోట్లు

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం బుధవారం సింహగిరిపై పరకామణి కేంద్రంలో జరిగింది. ఈవో ఎన్.సుజాత ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది హుండీలు తెరిచి ఆదాయం లెక్కించారు. భక్తులు కానుకల రూపంలో సమర్పించిన నగదు రూ.1,95,27,442 సమకూరినట్లు ఈవో పేర్కొన్నారు. దీంతో పాటు 83.100 గ్రాముల బంగారం, 11.200 కిలోల వెండి లభ్యమైనట్లు వివరించారు. ఈ మొత్తం ఆదాయం 28 రోజులకు సంబంధించినదిగా తెలియజేశారు.

హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

EENADU eClassifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి ఆదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

BUILDING CONSTRUCTION

Give your home a fresh new look complete Home Renovation, Painting & Interior work quality, Timely & Budget. ✆ 9885824528.

VIZAG **TDR | BPS**
Contact for BPS PLAN APPROVALS
PILLA BRAHMAJI RAO
Rtd. BUILDING INSPECTOR
GVMC PRESENT LICENSED SURVEYOR
92904 41348

FINANCIAL SERVICES

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదా లేదా నెలవారీ వడ్డీ పద్ధతిలో పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ ✆ 73862 01191.

PERSONAL CLASSIFIEDS

BIRTHDAY GREETINGS

Happy 12th Birthday

Chi. Chikkala Shyumdana
Wishing you Joy, Laughter & Love today and always Love from
Father: CHIKKALA LOKESH KUMAR
Mother: CHIKKALA MANOGHNA
Sister: CHIKKALA SHRISTI SHAARVI
GrandMother: CHIKKALA UMA DEVI
S. TANUJA (AUNTY)
S. DINESH & FAMILY

MISSING

కనబడుటలేదు

గంధం నాగేశ్వరరావు (నాగేష్)
S/o. గంధం అప్పారావు (Late)
వయస్సు: 49 సం॥లు
కలర్: చామన చాయ
గాజువాక BC రోడ్‌కి చెందిన పై ఫొటోలోని వ్యక్తి తేది. 25-10-2025న ఇంటి నుండి బయటికివెళ్ళి తిరిగి రాలేదు. (తనకు మాటలు రావు)
పై వ్యక్తి ఆచూకి తెల్పిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును.
Contact:
9701000255
9948568188
9121838655
GAJUWAKA

REAL ESTATE

FLAT FOR SALE

GENERAL

MVP కాలనీలో 3BHK ఫ్లాట్, సాగర్‌నగర్ మరియు PM పాలెంలో 2BHK ఫ్లాట్ బ్యాంక్‌లోన్ సదుపాయంతో అమ్మకం. ✆ 8686997700.

LAND FOR SALE

GENERAL

తూర్పుగోదావరి జిల్లా, లింగంపర్తిలో గల వైఆర్‌సి కాలువ ఆనుకొని 52 ఎకరాల వ్యవసాయ భూమి ఎకరం 35 లక్షలకు అమ్మకమునకు కలదు. (నదిపాటి గోశాలకు 2 కిలోమీటర్ల దూరం), Contact Cell: 93909 91555.

TO LET

COMMERCIAL

GENERAL

Warehouse / Office Space for Rent @ Dwarakanagar 5th Lane, VSP. 2 Floors - Each 3000 Sft (Total 6000 Sft) 9652661542.

JOBS

Civil CAD, Excel & Sketchup experienced Female Staff for Naqsha Interiors @ Vizag. Salary + PF. Ph: 8096910470 (Mr. Sheriff).

WANTED
An ISO 2001 కార్పొరేట్ కంపెనీనందు దిగువ తెలుపబడిన ఉద్యోగములు కలవు.
❖ CUSTOMER INTERFACE BRANCH HEAD: 5 Nos
❖ TERRITORY MANAGERS: 7
❖ OFFICE SUPPORT STAFF: 10
Age: 30 Years above - M/F
Qlf: 10th, Inter, Any Degree, Any PG క్వాలిఫికేషన్స్ మరియు అనుభవాన్ని బట్టి తగు కేడర్ నిర్ణయించబడును.
ఏదైనా సెక్టారులో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
స్టేట్ మరియు సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగ విరమణ పొందిన వారికి తగు ప్రాధాన్యత ఇవ్వబడును.
ఇంటర్వ్యూ తేదీలు: 13th, 14th & 15th Time: 10 AM to 7 PM
Con: V. RAMA RAO
Doctors Colony, VSP
✆ 9391471241 9550757172

క్రాంట్రాక్ట్ / ఔట్ సోర్సింగ్ పద్ధతిలో వైజాగ్, VZM, SKLM జిల్లాలో మైన్స్, హస్పిటల్స్, బ్యాంక్స్, స్కూల్స్, చెక్ పోస్ట్ ఆపరేటర్స్, అటెండర్స్, డేటాఎంట్రీ & కంప్యూటర్ ఆపరేటర్స్, జూనియర్&రికార్డ్ అసిస్టెంట్స్, P.O's క్లర్క్స్, GNM, స్పీచ్‌థెరపీ, ఫిజియోథెరపీ, ECG & Lab టెక్నీషియన్స్ 10th, ఎనీ డిగ్రీ, ITI, B.Tech. ఆల్ బ్రాంచ్. Age:18 to 42 జీ:20 to 50k M/F ✆ 9908656555.

విశాఖపట్నం డిపోలో మెకానిక్స్‌గా పనిచేయుటకు ఐటిఐ చదివి 1,2 సం|| అనుభవంగల అభ్యర్థులు కావలెను. 15000/- జీతం PF, ESI. ✆ 98480 78290.

ప్రైవేటు బ్యాంకులు & NBFCలో బంగారు రుణాల కోసం సిస్టమ్ ఆపరేటర్లు, టెలికాలర్లు, CRO ఎగ్జిక్యూటివ్‌లు కావలెను. జీ:15k to35k ✆ 7995439539.

SECURITY GUARDS

సెక్యూరిటీగార్డ్స్ : ఆటోనగర్, పెందుర్తి, శొంఠ్యాం ఏరియాల్లో చేయుటకు గార్డ్స్ కావలెను. అర్హత: 10th, 8గం॥ డ్యూటీ, Age:25-45. ✆ 2721672, 9440387815

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

పెద్ద ప్రమాదమే తప్పింది..

శీలానగర్ కూడలిలో కంటైనర్ బోల్తా

అక్కిరెడ్డిపాలెం(శీలానగర్), న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై శీలానగర్ కూడలి వద్ద కంటైనర్ బోల్తా పడింది. కూడలిలో కంటైనర్ పడటంతో సుమారు 3 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. వివరాల్లోకి వెళ్తే బుధవారం తెల్లవారుజామున అచ్యుతాపురం నుంచి విశాఖపట్నం పోర్టుకు ఏపీ05 టీసీ 6660లారీపై పాల్ సీలింగ్ మెటీరియల్‌తో కంటైనర్ లారీ వెళ్తోంది. శీలానగర్ కూడలిలో పోర్టు రోడ్డువైపు మలుపు తిరుగుతుండగా కంటైనర్ లారీపై నుంచి కిందపడింది. తెల్లవారుజామున కావడంతో అటుగా ఎటువంటి రాకపోకలు లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది. కూడలి మధ్యలో కంటైనర్ పడిపోవడంతో విమానాశ్రయం నుంచి శీలానగర్ వైపు వచ్చే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కిలోమీటర్ల మేర వాహనాలు ఆగిపోయాయి. పోలీసులు కంటైనర్‌ను పక్కకు తొలగించేందుకు నాలుగు క్రేన్లు తెచ్చి దాదాపు గంటన్నర అనంతరం ఎట్టకేలకు తొలగించారు. సుమారు 3 గంటల పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందుల పడ్డారు.

రోడ్డుపై పడిపోయిన కంటైనర్‌ను క్రేన్‌లతో తొలగిస్తూ...

నిలిచిపోయిన వాహనాలు

మలివయసులో అసమాన ప్రతిభ

మురళీనగర్, న్యూస్‌టుడే: చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈనెల 5 నుంచి 9 వరకు నిర్వహించిన ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో వనితా వాకర్స్ క్లబ్ సభ్యురాలు వైజయంతిమాల(76) అసమాన ప్రతిభ కనబరిచారు. అన్ని రాష్ట్రాల నుంచి 3,312 మంది పాల్గొన్న ఈ పోటీల్లో 75 ప్లస్ గ్రూపులో 5కె నడకలో బంగారు పతకం, 800మీటర్ల పరుగులో వెండి, 80 మీటర్ల హార్డిల్స్, 2000 మీటర్ల స్టిపుల్ ఛేజ్, 10కె రన్‌లో రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా వైజయంతిని వనితా వాకర్స్ క్లబ్ సభ్యులంతా అభినందించారు.

నిర్వాహకుల నుంచి బహుమతి అందుకుంటున్న వైజయంతిమాల

ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతంపై దృష్టి

మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామిని సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యాదేవి, చిత్రంలో ఎంపీ శ్రీభరత్, డాక్టర్ రవిరాజు, డాక్టర్ వాణి, డాక్టర్ ఆర్.శశిప్రభ తదితరులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. ఆంధ్ర వైద్యకళాశాల క్యాబ్ భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఆయన బుధవారం సాయంత్రం ఆవిష్కరించారు. అనంతరం కళాశాల దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ఆసుపత్రుల్లో వసతుల కల్పనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఆంధ్ర వైద్య కళాశాల యూజీల కోసం రూ.8 కోట్లతో రెండు అంతస్తుల భవనం నిర్మించనున్నామని మంత్రి ప్రకటించారు. పీపీపీ పద్ధతిలో వైద్య కళాశాలల నిర్మాణంతో పేదలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, దక్షిణం తెదేపా బాధ్యులు సీతంరాజు సుధాకర్, ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, క్యాబ్ ఛైర్మన్ డాక్టర్ టి.రవిరాజు, విశ్రాంత ఆచార్యులు డాక్టర్ బి.ఉదయ్‌కుమార్, డాక్టర్ టి.రాధ, అంకోసా అధ్యక్షులు డాక్టర్ ఎస్ కేఈ అప్పారావు, వైద్యుల సంఘం అధ్యక్షులు డాక్టర్ జయధీర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో సినీనటులు

సింహాచలం, న్యూస్‌టుడే: సంతాన ప్రాప్తిరస్తు చిత్రంలో నటించిన హీరో హీరోయిన్లు విక్రాంత్, చాందినీ చౌదరి బుధవారం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అధికారులు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

కప్పస్తంభం వద్ద విక్రాంత్, చాందినీ చౌదరి

రుషికొండ బీచ్‌లో 'సైకత స్వాగతం'

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: భాగస్వామ్య సదస్సులో భాగంగా రుషికొండ బీచ్‌లో 'వైజాగ్ వెల్‌కమ్ గూగుల్' పేరిట సైకత చిహ్నం తీర్చిదిద్దగా.. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం పరిశీలించి సంబంధిత రూపకర్త కోట అప్పల నరసింహంను అభినందించారు. కార్పొరేటర్ ఎల్.అప్పారావు, స్థానిక కూటమి నాయకులు చిక్కాల విజయబాబు, బి.దొరబాబు, సారిపల్లి శ్రీనివాస్, సీహెచ్.సన్యాసిరావు, ఎ.రాంబాబు, ఎస్.మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

సైకత చిహ్నం వద్ద ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరులు

రూ.2.80 లక్షల విలువైన సామగ్రి వితరణ

వన్‌టౌన్, న్యూస్‌టుడే : లోటస్ వైర్‌లెస్ టెక్నాలజీస్ ఇండియా సంస్థ సామాజిక బాధ్యతగా కమల్ వెల్ఫేర్ ఫౌండేషన్ ద్వారా రూ.2.80 లక్షల విలువ చేసే 40 త్రీ సీటర్ కుర్చీలను కేజీహెచ్‌కు వితరణ చేశారు. బుధవారం ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణికి ఆయా కుర్చీలను అందించారు. అనంతరం సంస్థ ప్రతినిధులు ఎం.జగదీష్, కేఎస్ఎంకే. మూర్తి, వై.శ్రీనివాసకుమార్‌ను డాక్టర్ వాణి అభినందించారు. కేజీహెచ్ సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ యు.శ్రీహరి, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ బి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

లోటస్ సంస్థ ప్రతినిధులను అభినందిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, తదితరులు

ముగిసిన గిరిజన క్రీడా పోటీలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ (దిల్లీ) ఆధ్వర్యంలో టీసీఆర్ అండ్ టీఎమ్ కార్యాలయం పర్యవేక్షణలో జన జాతీయ గౌరవ దివస్ (జేజేజీడీ-2025) వేడుకల్లో భాగంగా గీతం వైద్య కళాశాల మైదానంలో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి గిరిజన క్రీడాపోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వివిధ ఐటీడీఏలకు చెందిన బాల, బాలికల జట్లకు ఈడీ డాక్టర్ ఎం.రాణి, తదితరులు ట్రోఫీలు, పతకాలు అందించి అభినందించారు.

విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఈడీ డాక్టర్ ఎం.రాణి

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	108	105
లైవ్	135	125
డ్రెస్‌డ్	196	220
స్కిన్‌లెస్	223	230

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్స్‌డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ వై. కిరణ్ చంద్ (చీఫ్ మేనేజర్) మొబైల్ నెం.91609 49910,
ఇ-మెయిల్ ఐడి: sbi.10077@sbi.co.in, ఆస్తి తనిఖీ కొరకు : 9866027578

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(6)కు 9(1) నిబంధనలతో చదువబడు (సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖా చేసిన స్థిరాస్తుల అమ్మకము)

SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిగా దిగువ సంతకందారు భౌతిక స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు బకాయిలు రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తనఖాపెట్టిన ఆస్తి/ఆస్తుల ఈ-వేలం (SARFAESI చట్టం 2002 క్రింద) "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతి పై నిర్వహించబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు నియమ నిబంధనలు దిగువ తెలుపబడినవి.

ఋణగ్రహీత(లు) : శ్రీమతి వేల్లూరు కృష్ణవేణి రాజ్, డోర్ నెం.45-2-60/55/1, రామచంద్ర నగర్, కేంద్రీయ విద్యాలయ, అక్కయ్యపాలెం - 533016. **వేరొక చిరునామా: శ్రీమతి వేల్లూరు కృష్ణవేణి రాజ్,** ఫ్లాట్ నెం.టిఎఫ్-4, డి.నెం.13-2-3/1, వీనస్ క్యాసిల్, ఆంథోని నగర్, సెయింట్ ఆంథోని స్కూల్ ప్రక్కన, విశాఖపట్నం - 530002. **శ్రీ వేల్లూరు శ్రీనివాస్ రాజ్,** డోర్ నెం.45-2-60/55/1, రామచంద్ర నగర్, కేంద్రీయ విద్యాలయ, అక్కయ్యపాలెం - 533016. **వేరొక చిరునామా: శ్రీ వేల్లూరు శ్రీనివాస్ రాజ్,** ఫ్లాట్ నెం.టిఎఫ్-4, డి.నెం.13-2-3/1, వీనస్ క్యాసిల్, ఆంథోని నగర్, సెయింట్ ఆంథోని స్కూల్ ప్రక్కన, విశాఖపట్నం - 530002. **డిమాండ్ నోటీసు తేది: 21-01-2023**
డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం : తేది.20.01.2023 నాటికి **రూ.64,61,760/- + తేది.21.01.2023** నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి.
ప్రస్తుత బకాయి మొత్తం: తేది.10-11-2025 నాటికి **రూ.75.51 లక్షలు** + భవిష్య వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి. (మునుపటి జమలు మినహాయించిన తరువాత).

షెడ్యూల్ ఆస్తి వివరములు: ఆస్తి ఐడి : SBINVELLOREKRISHNAVENI

విశాఖపట్నం - 530002, ఆంథోని నగర్, మహారాణిపేట టిఎస్ నెం.112, ప్లాట్ నెం.20 దక్షిణం భాగంలో 334 చ॥గ॥లు మొత్తంలో 41 చ॥గ॥లు లేదా 34.281 చ॥మీ॥ల అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు వాటా స్థల విస్తీర్ణంతో గల "వీనస్ క్యాసిల్" మూడవ అంతస్తు నందు 1240 చ॥అ॥ల విస్తీర్ణంతో, ఎలక్ట్రిసిటీ సర్వీస్ కనెక్షన్ నెం.1121031329 319507, కొత్త అసెస్మెంట్ నెం.1086157519, పాత అసెస్మెంట్ నెం.100001/80219, సమీప డోర్ నెం.13-2-3తో గల నివాస యూనిట్ ఫ్లాట్ నెం.ఎఫ్-2 యావత్తు ఆస్తి రిజిస్టర్డు డాక్యుమెంట్ నెం.7832/2018, తేది.02.11.2018 ప్రకారం శ్రీమతి వేల్లూరు కృష్ణవేణి రాజ్ మరియు శ్రీ శ్రీనివాస రాజ్ గార్ల పేరున కలదు. **ఫ్లాట్‌కు హద్దులు: తూర్పు:** ఓపెన్ స్పేస్, **దక్షిణం:** ఓపెన్ స్పేస్, **పడమర:** కామన్ కారిడార్ మరియు నివాస యూనిట్ నెం.1, **ఉత్తరం:** ఓపెన్ స్పేస్. **మొత్తం భవనమునకు హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం.19, **దక్షిణం:** ప్లాట్ నెం.21, **పడమర:** మున్సిపల్ రోడ్డు, **ఉత్తరం:** ప్లాట్ నెం.20 యొక్క మిగిలిన భాగంలోని బోసుల శ్రీరాములు గారి ఇల్లు.

రిజర్వు ధర : రూ.44,00,000/- ధరావత్తు : రూ.4,40,000/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఇ-వేలం తేదీ : 01-12-2025 సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఆస్తి తనిఖీ తేది మరియు సమయం: తేది:13-11-2025 నుండి 30-11-2025 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింకును రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఐయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.comను సంప్రదించండి.
2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.
గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు. కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డిను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలని సూచించటమైనది.
గమనిక -2 : ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 194-1A ప్రకారం అమ్మకంలో భాగంగా అమ్మకం విలువ రూ.50,00,000/- (యాభై లక్షల రూపాయలు) మరియు అంతకంటే ఎక్కువ ఉన్నచో సదరు మొత్తముపై TDS @ 1% వర్తిస్తుంది. కావున సఫలీకృత బిడ్డరు/కొనుగోలుదారు గవర్నమెంట్ గైడ్‌లైన్స్ ధర లేదా అమ్మకం ధరలో ఏది ఎక్కువైతే దానిలో 1% TDS ను తగ్గించుకొని సదరు మొత్తమును ఆదాయపు పన్ను డిపార్ట్‌మెంట్ యొక్క ఫారం నెం.16-బి నందు జమచేయవలెను మరియు సదరు ఒరిజినల్ TDS సర్టిఫికెట్‌ను బ్యాంకు వారికి సమర్పించవలెను. (వ్యవసాయ భూమి కాకుండా కేవలం స్థిరాస్తికి మాత్రమే వర్తించును).

తేది:11-11-2025, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్ స్క్రీన్-1
మాస్ జాతర
స్క్రీన్-2
ది గర్ల్‌ఫ్రెండ్

నేడు తెదేపా క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జుల ప్రమాణ స్వీకారం

సబ్బవరం, న్యూస్‌టుడే: పార్టీ ఆదేశాల మేరకు పెందుర్తి నియోజకవర్గం తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ ఆధ్వర్యంలో సబ్బవరం మండలంలోని క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జుల ప్రమాణ స్వీకారం గురువారం ఉదయం 9 గంటలకు ఐదువానిలో ఓ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు మండల తెదేపా అధ్యక్షుడు గండి ముత్యాలునాయుడు బుధవారం తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని తెదేపా నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ అభిమానులు హాజరు కావాలని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: పురుషోత్తపురం ఎల్‌బీనగర్‌లో వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. – రాజారావు
✓: సిబ్బందితో మరమ్మతులు చేయిస్తాం. – హరిబాబూరావు, ఏఈ, జోన్-8

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం కేజీబీవీ బాలికల వసతి గృహం పక్కన వ్యర్థాలు పేరుకుపోయాయి. – పి.ఈశ్వరరావు
✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – జె.రాజేశ్వరరావు, గ్రామ కార్యదర్శి

?: పాత సబ్బవరం నీళ్ల ట్యాంక్ సమీపంలోని కాలువలో పూడికలు పేరుకుపోయాయి. – జి.అప్పలనాయుడు, ✓: పూడిక తీసే ఏర్పాటు చేస్తాం. – డి.ప్రసాదరావు, సర్పంచి, సబ్బవరం

తుప్పలు తొలగించారు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం నుంచి చోడవరం వెళ్లే మార్గంలో రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు, తుప్పలు పెరిగిపోయి ప్రమాదకరంగా మారడంతో ఈ నెల 10న 'రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు' శీర్షికతో 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. బుధవారం పొక్లెయిన్‌తో తుప్పలు తొలగించే ఏర్పాటు చేశారు. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎట్టకేలకు శుభ్రత పనులు

నరవ(వేపగుంట), న్యూస్‌టుడే: నరవ పరిసర ప్రాంత కాలనీల్లో బుధవారం పారిశుద్ధ్య సిబ్బంది పరిశుభ్రత చర్యలు చేపట్టారు. రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తను తొలగించి, కాలువల్లో పూడిక తొలగించారు. ఆయా కాలనీల్లో అపరిశుభ్రతపై 12న 'నరవ కాలనీలు... అపరిశుభ్రతకు ఆనవాళ్లు' శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీంతో ఏఎంహెచ్‌ఓ కిరణ్‌కుమార్, ఎస్‌ఎస్ కోటేశ్వరరావు, పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ కృష్ణ స్పందించి.. తమ సిబ్బందితో శుభ్రత పనులు చేయించారు. వ్యర్థాలు తొలగించిన ప్రాంతాల్లో ముగ్గులు వేయించారు. శుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించి, నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

అధికారులు.. పరిశీలించి వెళ్లిపోతారంతే..!

పినగాడి కూడలి సమీప రహదారిపై నిలిచిన నీరు

పినగాడి(పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి మండలంలోని పలు రహదారులు అధ్వానంగా ఉన్నాయి. అధికారులు ఏదో తూతూమంత్రంగా పరిశీలించి వెళ్లిపోతున్నారే తప్ప ఎటువంటి కార్యాచరణ చేపట్టడం లేదు. దీంతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు.

★ పినగాడి కూడలి నుంచి మొగలిపురం వెళ్లే రోడ్డులో ఆపద పొంచి ఉందని వాహన చోదకులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కూడలిలోని జాతీయ రహదారి పైవంతెనకు సమీపంలోని కోటపాడు ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమైపోయింది. భారీ గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. జీవీఎంసీ కురిసిన వర్షాలకు రోడ్డుకు ఎగువ వైపున ఉన్న పొలాల నుంచి నీరు రోడ్డుపైకి ప్రవహిస్తోంది. దీంతో గోతుల్లో పెద్దఎత్తున నీరు నిలిచిపోతోంది. పగటి పూట ప్రయాణమే ప్రమాదకరంగా ఉంటే రాత్రివేళ ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటే వాహనచోదకులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే పలువురు ద్విచక్ర వాహన చోదకులు ఈ మార్గంలో గాయపడ్డారు. ఓ భారీ గుంత వద్ద ప్రమాదాలు జరగకుండా స్థానికులు ఒక డ్రమ్ము ఏర్పాటు చేశారు.

ప్రమాదకరంగా పినగాడి - మొగలిపురం రోడ్డు

రహదారిపై నీరు ప్రవహించడంతో: జీవీఎంసీ ఈ రహదారి దుస్థితిని ప్రత్యేక ఉప కలెక్టర్ పరిశీలించారు. ఇది జరిగి నెల రోజులవుతున్నా రహదారి అభివృద్ధిలో ఎటువంటి కదలికలు జరగలేదని స్థానికులు వాపోతున్నారు. గతంలో జాతీయ రహదారి నిర్మాణం జరిగినప్పుడు ఇక్కడ ఉన్న కల్వర్టు ధ్వంసం కావడంతో వర్షం నీరు రోడ్డుపైకి వచ్చేదని తెలిపారు. అప్పటి నుంచి ర.భ.శాఖ అధికారులు ఈ రహదారి నిర్మాణాన్ని గాలికొదిలేయడంతో పూర్తిగా గోతులు పడ్డాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి ప్రమాదాల రహదారిని బాగు చేయాలని పలువురు కోరుతున్నారు.

గోతిలో ఉంచిన డ్రమ్ము

న్యాయం చేయాలంటూ వినతి

సుజాతనగర్(పెందుర్తి), న్యూస్‌టుడే: భూములను సేకరిస్తున్న ప్రభుత్వం రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని జీవీఎంసీ 88వ వార్డు కార్పొరేటర్, నరవ గ్రామం రైతులు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక రత్నగిరినగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందించారు. నరవ రెవెన్యూ పరిధిలోని భూములు పూర్వకాలం నుంచి రైతుల స్వాధీనంలో ఉన్నాయన్నారు. తాజాగా రెవెన్యూ అధికారులు సర్వే ప్రారంభించారని రైతులకు సరైన పరిహారం అందించి న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. వార్డు జనసేన అధ్యక్షుడు జనార్దన శ్రీకాంత్, నాయకులు గవర సత్తిబాబు, ఇల్లపు శ్రీనివాసరావు, గంతకోరు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న 88వ వార్డు కార్పొరేటర్ ముల్లి ముత్యాలనాయుడు, రైతులు

గ్రంథాలయ వారోత్సవాలకు సన్నాహాలు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు శాఖా గ్రంథాలయాధికారిణి బి.చంద్రకళ తెలిపారు. ఈ మేరకు బుధవారం వారోత్సవాల ఏర్పాట్లపై ఆమె అభివృద్ధి కమిటీ సభ్యులతో సమావేశమై మాట్లాడారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 14న జరగనున్న బాలల దినోత్సవంతో వారోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 15న సాహిత్య సమ్మేళనం, ధరావతు సేకరణ, 16న గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ, పుస్తక ప్రదర్శన, 17న బాలలకు చిత్రలేఖనం పోటీలు, 18న విద్యార్థులకు వ్యాసరచన, 19న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మహిళా దినోత్సవం, మహిళలకు ముగ్గుల పోటీలు, 20న బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు. పాఠకులు, పాఠకులు ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వివరాలు వెల్లడిస్తున్న గ్రంథాలయాధికారిణి చంద్రకళ

బాక్సింగ్‌లో విద్యార్థి ప్రతిభ

సబ్బవరం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఈనెల 11న జరిగిన అంతర్ జిల్లా బాక్సింగ్ పోటీల్లో సబ్బవరం డిగ్రీ కళాశాల విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. ఖండపల్లి జశ్వంత్ 60 కిలోల విభాగంలో పాల్గొని తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఈ మేరకు బుధవారం కళాశాల ప్రిన్సిపల్ బి.శంకర్, వైస్ ప్రిన్సిపల్ ఎస్.సత్యనారాయణ, అధ్యాపకుడు ఎంవీ రామకృష్ణ తదితరులు జశ్వంత్‌ను అభినందించారు.

జశ్వంత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ బి.శంకర్, అధ్యాపకులు

దత్తతకు అర్హులైన బాలల గుర్తింపు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో దత్తతకు అర్హులైన బాలలను గుర్తించాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారిణి మమత సూచించారు. జాతీయ దత్తత మాసాన్ని పురస్కరించుకుని బుధవారం పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు భవనంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అర్హులైన బాలలను గుర్తిస్తే, ప్రోత్సాహకాలు అప్పగించే ప్రక్రియ చేపడతామన్నారు. దత్తత, బాలల హక్కులు, బాల్యవివాహాల నిర్మూలన, పోక్సో చట్టంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మానస, గీత, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాలల సంరక్షణ విభాగం అధికారిణి మమత

ఆలయానికి వెండి వితరణ

చింతలగ్రహారం(వేపగుంట), న్యూస్‌టుడే: చింతలగ్రహారం కృష్ణాపురంలోని జగన్నాథస్వామి ఆలయానికి కసకమేడల నరసింహమూర్తి, విజయలక్ష్మి దంపతులు అరకేజీ వెండి వితరణ చేశారు. బుధవారం ఆలయ ధర్మకర్త ఆళ్ల తాతారావుకు వెండి అందజేశారు. దాతలు అందించిన వెండితో పాటు ఇంకొంత వెండిని సమకూర్చి రథోత్సవం నాటికి వెండి చీపురు తయారు చేయిస్తామని తాతారావు తెలిపారు.

ధర్మకర్తకు వెండి అందిస్తున్న దాతలు

వైద్య శిబిరానికి స్పందన

చీమలాపల్లి(వేపగుంట), న్యూస్‌టుడే: జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా గోపాలపట్నం ఆదిత్య కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం చీమలాపల్లిలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నగరంలోని మెడికవర్ ఆసుపత్రి వైద్యులు హాజరై స్థానికులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గణపతిరావు పర్యవేక్షించారు.

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న స్థానికులు

ఐహెచ్ఆర్‌సీ నూతన కమిటీ ఎన్నిక

కృష్ణానగర్(వేపగుంట), న్యూస్‌టుడే: కృష్ణానగర్ ఐహెచ్ఆర్‌సీ (ఇండో హ్యూమన్ రైట్స్ కేర్) సంస్థ సర్వసభ్య సమావేశం బుధవారం సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగింది. సంస్థ ఛైర్మన్ రాజాన ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పలువిభాగాల నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. రాష్ట్ర క్రిస్టియన్ అడ్వైజర్‌గా ఆర్.షద్రక్, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విభాగ జనరల్ సెక్రటరీగా కె.హనుమంతరావు, ఉపాధ్యక్షులుగా కె.సుబ్బారెడ్డి, కార్యదర్శిగా బి.నరసింగరావు, బి.శంకర్రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎన్.సురేశ్, కె.శ్రీదేవిలను ఎన్నుకున్నారు. అనంతరం సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలల్లో డ్రగ్స్‌నివారణ, పరిసరాలు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ఉచిత వైద్యశిబిరాలు వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

నూతనంగా ఎన్నికైన సభ్యులు

సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

వేపగుంట, న్యూస్‌టుడే: పేదలకు సొంతింటి కలను నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, పీఎంఏవై అర్బన్ బీఎల్‌సీ 2.0. కార్యక్రమంలో భాగంగా నిర్మాణం పూర్తి చేసుకుని గృహప్రవేశాలు చేసిన వారికి ఇంటి తాళాలు అందించడం, కొత్తగా నిర్మిస్తున్న ఇళ్లకు శంకుస్థాపన చేసే కార్యక్రమాన్ని మేయరు పీలా శ్రీనివాసరావుతో కలిసి ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జోన్-8 పరిధిలో 719 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. మేయరు మాట్లాడుతూ అధికారులు ఇళ్ల మంజూరు విషయాన్ని తెలియజేయకుండా ఎవరికి వారే కార్యక్రమాలు ఏర్పాటు చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. దరఖాస్తు చేసుకున్న అర్హులకు ఇళ్ల మంజూరు చేయాలని సూచించారు. కార్పొరేటర్లు బల్ల శ్రీనివాసరావు, రాపర్తి కన్నా, శానాపతి వసంత మాట్లాడారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ దీపక్, పరవాడ, సబ్బవరం మండలాలకు చెందిన హౌసింగ్ అధికారులు, ఇన్‌ఛార్జి జోనల్ కమిషనర్ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, తదితరులు

పోలీసులకు బాలిక ఫిర్యాదు

పరవాడ(సబ్బవరం), న్యూస్‌టుడే: పరవాడ మండలం పి.భోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాల విద్యార్థిని పాఠశాల ఛైర్మన్ సూర్యనారాయణ రెడ్డి(60)పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు.. అసభ్యకర పదజాలంతో తిట్టి, కొట్టాడని, చాలాసార్లు ఆమెను తాకడం, చేయి పట్టుకోవడం వంటివి చేశాడని బాలిక ఫిర్యాదులో పేర్కొనడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నైపుణ్యత, నాయకత్వ లక్షణాలపై శిక్షణ

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కునగరం హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంటు సెంటర్‌లో బుధవారం ఎస్సీ, ఎస్టీ సభ్యులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎస్సీ, ఎస్టీ లైజన్ అధికారులు ఎన్.సుందరం, బాబూనాయక్ ప్రారంభించారు. డాక్టర్ ముత్యాలు, బాలాజీ, కంచర్ల సంజీవరావు, ఉక్కు ఎస్సీ, ఎస్టీ సంఘ నాయకులు బి.తౌడన్న, బయ్యే మల్లయ్య, ఎల్.వి.రమణ, మోహన్‌బాబు, హెచ్ఆర్‌డీ విభాగం అధికారి రమేష్ పాల్గొన్నారు.

'సంతాన ప్రాప్తిరస్తు' చిత్ర బృందం సందడి

అక్కయ్యపాలెం, జగదాంబకూడలి, న్యూస్‌టుడే: సంతాన ప్రాప్తిరస్తు సినిమా ప్రేక్షకుల్ని అలరిస్తుందని ఆ సినిమా హీరో, హీరోయిన్ విక్రాంత్, చాందిని పేర్కొన్నారు. డైమండ్ పార్కు సమీపంలోని ఓ హోటల్‌లో బుధవారం మధ్యాహ్నం సినిమా యూనిట్ సందడి చేసింది. ఈ సందర్భంగా హీరో హీరోయిన్ మాట్లాడుతూ మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్‌పై మధుర శ్రీధర్‌రెడ్డి, నిర్వి హరిప్రసాద్‌రెడ్డి నిర్మిస్తున్నారని, దర్శకుడు సంజీవ్‌రెడ్డి తెరకెక్కిస్తున్నారన్నారు. ఈ సినిమా ఈ నెల 14న విడుదల కానుందన్నారు. సమాజానికి చెప్పాల్సిన అంశాలు ఉన్నాయన్నారు. వెన్నెల కిశోర్, అభినవ్, తరుణ్‌భాస్కర్ వంటి నటులు ఉన్నారన్నారు.

అంతర కళాశాలల వాలీబాల్ పోటీల విజేత ఏయూ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం క్రీడలు, వ్యాయామ విద్య ఆధ్వర్యంలో ఏయూ సిల్వర్ జూబ్లీ క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న అంతర కళాశాల పురుషుల వాలీబాల్ పోటీలు బుధవారం ముగిశాయి. చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మధ్య జరిగిన ఫైనల్స్‌లో 46-38 పాయింట్ల తేడాతో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజయం సాధించి విజేతగా నిలిచింది. ఏయూ క్రీడా, వ్యాయామ విద్య సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్, విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి, పీడీలు గోపీకృష్ణ, వై.శ్రీనివాసరావు, రామకృష్ణ, లక్ష్మణ రెడ్డి, దిలీప్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

విజేత జట్టుకు జ్ఞాపిక అందజేస్తున్న ఏయూ అధికారులు

భక్తిశ్రద్ధలతో కాలభైరవ పూజలు

పెందుర్తి, న్యూస్‌టుడే : కార్తిక మాసం బహుళ అష్టమిని పురస్కరించుకుని 96వ వార్డు పెందుర్తి సూర్యానగర్‌లోని కాలభైరవ స్వామి సన్నిధిలో బుధవారం విశేష పూజలు జరిగాయి. అర్చకులు స్వామిని పంచామృతాలతో అభిషేకించారు. నూతన వస్త్రాలతో అలంకరించి ధూపదీప సేవలు చేశారు. వడమాలలు నైవేద్యంగా సమర్పించి భక్తులకు వితరణ చేశారు.

ఘనంగా అంబలం పూజ

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం అంతకాపల్లి శివారు రావులమ్మపాలెంలో మంగవారం రాత్రి అభయాంజనేయ స్వామి అంబలం పూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. వివిధ గ్రామాల నుంచి భక్తులు పూజా వేదికను సుందరంగా అలంకరించారు. వేదికపై వినాయకుడు, పార్వతీ పరమేశ్వరులు, శ్రీరాముని మందిరాలు ఏర్పాటు చేశారు. పురోహితులు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమ నిర్వాహకులు చొక్కాకుల వెంకట్రావు, లక్ష్మి దంపతులు భక్తులకు అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి నారాయణమూర్తి, చొక్కాకుల గోవింద, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న నిర్వాహకులు

పరిశోధనలు సమాజానికి ఉపయోగపడాలి

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: నవ్య ఆలోచనలతో పరిశోధనలు చేయాలని, వాటి ఫలితాలు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ(శ్రీకాకుళం) పూర్వ ఉపకులపతి ఆచార్య నిమ్మ వెంకటరావు అన్నారు. ఏయూ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా విద్యా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'రీసెర్చ్ మెథడాలజీ' అంశంపై కార్యశాల ముగింపు కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొని ప్రసంగించారు. విశిష్ట పరిశోధనలతోనే విశ్వవిద్యాలయానికి గుర్తింపు లభిస్తుందన్నారు. సదస్సు కన్వీనర్, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ కార్యశాలలో నేర్చుకున్న అంశాలు పరిశోధనలు జరిపే దిశగా ప్రేరణ కలిగిస్తాయన్నారు. ఏయూ వ్యాయామ విద్య సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్, ఆచార్య నాగార్జున వర్సిటీ డీన్ ఆచార్య టి.స్వరూపరాణి, కేంద్రీయ విశ్వవిద్యాలయం (ఒడిశా) విద్యా విభాగ ఆచార్యులు అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కార్యశాలలో ప్రసంగిస్తున్న ఆచార్య నిమ్మ వెంకటరావు

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

విజయవాడ(చిట్టినగర్), న్యూస్‌టుడే: గాయాలతో చికిత్స పొందుతూ వృద్ధురాలు బుధవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట పడాలవారివీధిలో చిట్టిబోయన కుమారి నివాసం ఉంటున్నారు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలం, కట్టవానిపాలెంలో ఆమె అన్నయ్య వద్ద ఉంటున్న తల్లి వరాలమ్మ(68) నెల రోజుల కిందట కొత్తపేటలో ఉండే కుమార్తె ఇంటికి వచ్చారు. అక్టోబరు 31న ఇంట్లో ఎవరు లేని సమయంలో వరాలమ్మ టీ పెడదామని గ్యాస్ స్టౌవ్ వెలిగించి.. లైటర్ కోసం వెతికి వెలిగించగా ఒక్కసారిగా మంటలు వచ్చి ఆమెకు పలు చోట్ల గాయాలయ్యాయి. అప్పటి నుంచి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఈ మేరకు మృతురాలి కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

నిబంధనల ప్రకారం ఆటోలు నడపాలి

మాధవధార, న్యూస్‌టుడే: నేటి నుంచి మూడు రోజుల పాటు నగరంలో భాగస్వామ్య సదస్సు నిర్వహించనున్నందున ఆటో డ్రైవర్లందరూ రవాణా, పోలీస్ శాఖ నిబంధనల ప్రకారం ఆటోలను నడపాలని డీటీఓ ఆర్.సి.హెచ్.శ్రీనివాస్ తెలియజేశారు. ప్రయాణికులు, ఇతర వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నడపాలని సూచించారు. సదస్సుకు కేంద్ర, రాష్ట్ర మంత్రులతో పాటు, దేశ, విదేశాల నుంచి వివిధ సంస్థల ప్రతినిధులు వస్తుండటంతో సభ ప్రాంగణం వద్దకు చేర్చడానికి 900 వరకు వాహనాలను కేటాయించడం జరిగిందని రవాణా శాఖ అధికారులు తెలియజేశారు. బస్సులు, మినీ బస్సులు, కార్లు ఇతర వాహనాలు అందుబాటులో ఉంచామని తెలిపారు.

మత్తు పదార్థాల నిర్మూలనే ఎజెండా

పరవాడ(సబ్బవరం), న్యూస్‌టుడే: మత్తు పదార్థాల నిర్మూలనే ఎజెండాగా అందరూ బాధ్యత వహించాలని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు అన్నారు. పరవాడ జెడ్పీ హైస్కూల్‌లోని విద్యార్థులకు మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. అనంతరం గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు.

మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు

నైపుణ్యాల మెరుగుదలకు దోహదం

నరవ(వేపగుంట), న్యూస్‌టుడే : నరవ విశాఖ ఇంజినీరింగ్ కళాశాలకు జేఎన్‌టీయూ-జీవీ రీసెర్చ్ సెంటర్‌ను మంజూరు చేసిందని కళాశాల ఛైర్మన్ జి.సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు బుధవారం మంజూరు ధ్రువపత్రాలను ఆయా విభాగాల అధ్యాపకులకు అందజేశారు. రీసెర్చ్ సెంటర్ ద్వారా విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మెకానికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ విభాగాల అధ్యాపకులు డి.శాంతారావు, బి.జీవనరావు, కె.తేజస్విని, తదితరులు పాల్గొన్నారు.

మంజూరు పత్రాలు అందుకున్న అధ్యాపకులతో ఛైర్మన్ జి. సత్యనారాయణ

19 నుంచి సత్యసాయి శత జయంతి వేడుకలు

వేపగుంట, న్యూస్‌టుడే: ప్రహ్లాదపురం సత్యసాయిబాబా మందిరంలో ఈనెల 19 నుంచి 23 వరకు సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు కమిటీ తెలిపింది. వేడుకల్లో భాగంగా 19న మహిళ, 20న సేవ, 21న యువజన, 22న బాలవికాస్ దినోత్సవాలు జరపనున్నట్లు తెలిపారు. 23న సత్యసాయి శత జయంతి కార్యక్రమం జరుపుతామన్నారు.

పచ్చిక మాటున.. పొంచి ఉన్న ఆపద

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి బృందావన్ గార్డెన్స్ ప్రాంతంలోని పలు ఖాళీ స్థలాలతో ఆపద పొంచి ఉందని స్థానికులు వాపోతున్నారు. లిటిల్ ఫ్లవర్స్ పాఠశాల సమీపంలోని ఖాళీ స్థలంలో పెద్దఎత్తున వర్షం నీరు నిలిచిపోయింది. వారాలుగా నీరు తొలగకపోవడంతో పాదులు పెరిగిపోయి పచ్చిక బయలును తలపిస్తోంది. ఈ ప్రాంతం దోమలకు ఆవాసంగా మారింది. పాములు, విషకీటకాలు సంచరిస్తున్నాయి. అధికారులు కనీసం దోమల నివారణ చర్యలు కూడా తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించాలని పలువురు కోరుతున్నారు.

ఫోకస్

పాలకులు కరుణించరు.. వెతలు తీరవు

చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ సప్తగిరినగర్‌లో రహదారులు అధ్వానంగా మారాయని స్థానికులు వాపోతున్నారు. మసీదు నుంచి కాలనీలోకి వెళ్లే మార్గంలో పలు బహుళ అంతస్తుల భవనాలున్నాయి. ఆయా అపార్టుమెంట్లలో వందలాది మంది నివసిస్తున్నారు. అయినప్పటికీ పక్కా రహదారి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. భవనాల ఎదుట ఇటీవల భారీ గుంత ఏర్పడింది. వర్షం కురిస్తే చెరువులా మారుతోంది. గోతుల దారితో అవస్థలు పడలేక స్థానికులు భవన నిర్మాణ వ్యర్థాలు వేసి పూడ్చారు. చదును చేసే అవకాశం లేకపోవడంతో అలాగే వదిలేశారు. ఇలాంటి దారిలో నిత్యం నరకం చూస్తున్నామని తెలిపారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

భార్య అప్పగింత

పెందుర్తి, న్యూస్‌టుడే : పెందుర్తి మండలానికి చెందిన ఓ మహిళ భర్తతో గొడవ పడి ఈనెల 6న ఇల్లు విడిచి వెళ్లిపోయింది. ఈ మేరకు ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు అదృశ్యం కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. చరవాణి సంకేతాల ఆధారంగా ఆమె దిల్లీలో ఉన్నట్లు హెచ్‌సీ సుమిత్ గుర్తించారు. పెందుర్తి తీసుకొచ్చి, భర్తకు అప్పగించారు. దంపతులిద్దరికీ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు.

(c) eenadu

చదువు

బీఈ రెగ్యులర్‌గా చేశాను. ఆంధ్రా యూనివర్సిటీ నుంచి దూరవిద్యలో రెండేళ్ల ఆన్‌లైన్ ఎంఏ (ఎకనామిక్స్)లో చేరాను. ఈ కోర్సుతో పీహెచ్‌డీకీ, ఇండియన్ ఎకనామిక్స్ సర్వీస్(ఐఈఎస్) పరీక్షలకూ అవకాశం ఉంటుందా? – ఆకాంక్ష

ఐఈఎస్‌కు అవకాశం ఉందా?

■ ఇంజనీరింగ్ రెగ్యులర్ విధానంలో పూర్తిచేసి, రెండేళ్ల ఎంఏ (ఎకనామిక్స్) ప్రోగ్రాంను ఆన్ లైన్‌లో చదువుతున్నానని చెప్పారు. జాతీయ విద్యా విధానం 2020 ప్రకారం.. ఆఫ్‌లైన్ డిగ్రీలు, ఆన్‌లైన్ డిగ్రీలు, ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీలు, దూరవిద్య డిగ్రీలకు సమాన గుర్తింపు ఉంటుంది. యూజీసీ వివిధ సందర్భాల్లో విడుదల చేసిన రెగ్యులేషన్స్ ప్రకారం.. ఒక అకడమిక్ ప్రోగ్రాం మధ్యలో, ఓపెన్ నుంచి రెగ్యులర్‌కు, రెగ్యులర్ నుంచి ఆన్‌లైన్‌కు కూడా అకడమిక్ క్రెడిట్లను బదిలీ చేసుకొని డిగ్రీ/పీజీ పూర్తి చేయొచ్చు. కానీ, జాగ్రత్తగా గమనించాల్సింది ఏంటంటే.. ప్రస్తుతం మీరు చదువుతున్న యూనివర్సిటీకి ఆన్‌లైన్‌లో అకడమిక్ ప్రోగ్రామ్స్ నిర్వహించడానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో (యూజీసీ డెబ్) అనుమతి ఉందా, లేదా అనే విషయం నిర్ధారణ చేసుకోండి. ఒకవేళ, అనుమతి ఉంటే, అనుమతించిన ప్రోగ్రామ్స్ జాబితాలో ఎంఏ ఎకనామిక్స్ ఉందో, లేదో తెలుసుకోండి. ఏదైనా యూనివర్సిటీకి ఆన్‌లైన్ లేదా డిస్టెన్స్ మోడ్‌లో కోర్సులు నడపడానికి అనుమతి లేకపోతే ఆ యూనివర్సిటీ అందించే ఆన్‌లైన్ డిగ్రీలు చెల్లుబాటు కావు. ఏదైనా యూనివర్సిటీ ఆన్‌లైన్ విధానంలో అకడమిక్ ప్రోగ్రాంను అందించాలంటే, ఆ యూనివర్సిటీకి కనీసం 3.26 న్యాక్ గ్రేడ్ ఉండాలి. యూజీసీ డెబ్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి, ఆంధ్రా యూనివర్సిటీకి మీరు చేస్తున్న పీజీని నిర్వహించడానికి అన్ని అనుమతులు ఉన్న విషయాన్ని నిర్ధారించుకోండి. వెబ్‌సైట్‌లో ఉన్న సమాచారం మేరకు, మీరు చేస్తున్న డిగ్రీకి యూజీసీ డెబ్ గుర్తింపు ఉంది. కాబట్టి, మీరు నిరభ్యంతరంగా ఇండియన్ ఎకనామిక్ సర్వీస్, పీహెచ్‌డీలకు సన్నద్ధం కావొచ్చు.

–ప్రొ.బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఇంటర్న్‌షిప్స్

హైదరాబాద్‌లో..

మెర్న్ స్టాక్ డెవలప్‌మెంట్

సంస్థ: జీగ్లర్ ఏరోస్పేస్
నైపుణ్యాలు: అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్), సీఐ/సీడీ, సీఎస్ఎస్ 3, ఇంగ్లిష్ మాట్లాడటం, ఎక్స్‌ప్రెస్.జేఎస్, హెచ్‌టీఎంఎల్ 5, జావాస్క్రిప్ట్, మెర్న్, మాంగోడీబీ, నోడ్.జేఎస్, రియాక్ట్, టైప్‌స్క్రిప్ట్, వెబ్‌సాకెట్స్
స్టైపెండ్: రూ.5,000
☛ https://shorturl.at/2Nm8G

హ్యూమన్ రిసోర్సెస్

సంస్థ: ఆస్మియం ఎనర్జీ ప్రై.లి.
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం స్టైపెండ్: రూ.10,000-20,000
☛ https://shorturl.at/dct0N

ఏఐ ఏజెంట్ డెవలప్‌మెంట్

సంస్థ: ఆటంప్రిక్స్ టెక్నాలజీస్ ప్రై.లి.
నైపుణ్యాలు: డేటా స్ట్రక్చర్స్, ఫాస్ట్‌ఏపీఐ, జనరేటివ్ ఏఐ టూల్స్, గిట్, గిట్‌హబ్, పోస్ట్‌గ్రేఎస్‌క్యూఎల్, ప్రాబ్లమ్ సాల్వింగ్, ప్రాంప్ట్.
స్టైపెండ్: రూ.12,000-15,000
☛ https://shorturl.at/wYvw6

వీటికి దరఖాస్తు గడువు: డిసెంబరు 5

సమగ్ర కథనాలు, మరిన్ని ఇంటర్న్‌షిప్పులు, ఉద్యోగ నోటిఫికేషన్లు https://epaper.eenadu.net లో.

గీత దాటితే.. వెతలు తప్పవు

ఆకర్షణీయమైన జీతం, అంతర్జాతీయ అవకాశాలు, ఆధునిక జీవనశైలి.. ఇవన్నీ యువతరాన్ని కార్పొరేట్ ఉద్యోగాలవైపు ఆకర్షించే అంశాలు. అయితే అక్కడ ఎదురయ్యే కంటికి కనిపించని సవాళ్ల గురించి చాలామంది ఉద్యోగార్థులకు అవగాహన ఉండకపోవచ్చు. ఎందుకంటే.. వీటిని ఎవరూ చెప్పరు, ఎక్కడా లిఖిత పూర్వకంగా ఉండవు. కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు ఆశించే యువతతో పాటూ, ఇటీవలే కొలువుల్లో చేరినవారూ ఈ అంశాలపై అవగాహన పెంచుకోవాలి. దీంతో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా, కెరియర్‌లో ఉన్నత స్థితికి చేరుకోవచ్చు.

అంతర్గత సాంకేతిక సమాచారం, క్లయింట్స్ డేటా, వ్యూహాలు, ఆర్థిక విషయాలు బయట ప్రపంచానికి వెల్లడికావడాన్ని ఏ సంస్థలూ అంగీకరించవు.

సోషల్ మీడియా

స్వాతి ఒక ఐటీ సంస్థలో ప్రాజెక్ట్ ట్రెయినీగా చేరి, బృందంలో చురుకుగా, ప్రొడక్టివ్‌గా ఉంటూ టీమ్‌కు అప్పగించిన ప్రాజెక్టును పూర్తి చేసి, 'ఎంప్లాయీ ఆఫ్ ద మంత్'గా గుర్తింపు పొందింది. 'ప్రాజెక్టు పూర్తి చేయడంలో నేను ఎదుర్కొన్న సవాళ్లు - ఆనందమయ క్షణాలు' అంటూ ఒక వ్యాసం రాసి, ప్రాజెక్ట్‌లో ఎదురైన సాంకేతిక సమస్యలను తానెలా పరిష్కరించింది, బృంద సభ్యుల మధ్య ఏర్పడ్డ సంఘర్షణలు, క్లయింట్ ఒత్తిడిని హ్యాండిల్ చేసిన విధానం, బ్లాగ్‌లో పోస్ట్ చేసింది. ఎంతో గోప్యంగా ఉంచాల్సిన అంతర్గత సమాచారం బయటపెట్టడంతో యాజమాన్యం స్వాతిని హెచ్చరించింది. ఆమెకు మరో ప్రాజెక్ట్‌లో అవకాశం రావడానికి చాలా సమయం పట్టింది. ఈ పరిణామంతో సంస్థకు చెందిన ఏ సమాచారమైనా అనుమతి లేకుండా బహిర్గతపరచడం ప్రమాదకరమన్న సత్యాన్ని స్వాతి గ్రహించింది.

◗ గోప్యతను ఒక పాలసీగానే కాకుండా, నమ్మకాన్ని నిలబెట్టే నైతిక బంధంగా భావించే వారిని ఉద్యోగులుగా కోరుకుంటాయి కార్పొరేట్ సంస్థలు.

సెల్ఫీల అత్యుత్సాహం

ఉద్యోగంలో చేరిన ఉత్సాహంలో, కార్పొరేట్ జీవన శైలిని, పని వాతావరణాన్ని మిత్రులకు తెలపడానికి.. పని ప్రదేశ ఫొటోలు సోషల్ మీడియాలో పోస్టు చేస్తుంటారు కొంత మంది. ఈ చర్య వల్ల ఉద్యోగికి ఏ విధమైన నిర్దిష్ట ప్రయోజనం లేకపోయినప్పటికీ, వాటి ప్రభావం కెరియర్‌పై తీవ్రంగా ఉంటుంది.

ప్రియాంక ఒక 'బల్క్ డ్రగ్స్' కంపెనీ ఆర్‌అండ్‌డీలో ట్రెయినీగా చేరింది. క్లాస్‌మేట్‌తో వీడియో కాల్ మాట్లాడుతూ.. తన ఛాంబర్ చూపించి, సెల్ఫీ తీసి వాట్సాప్‌లో పోస్టు చేసింది. ఆ ఫ్రెండ్ ఆ ఫొటోను మరో క్లాస్‌మేట్‌కు ఫార్వర్డ్ చేసింది. ఆ ఫొటో మేనేజ్‌మెంట్ వరకూ చేరింది. ప్రియాంక వెనుక ఉన్న వైట్ బోర్డులో కొన్ని ఫార్ములాలున్నాయి. అవి కేవలం అక్కడ ఆర్‌అండ్‌డీ విభాగంలో పనిచేసే వారికి ఉద్దేశించిన అత్యంత గోప్యమైన అంశాలు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన మేనేజ్‌మెంట్ పనిలో నిర్లక్ష్యానికి ప్రియాంకకు నోటీస్ జారీచేసింది.

◗ మీ సోషల్ మీడియా ప్రెజెన్స్ మీ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా ఉండాలి. సంస్థ గోప్యత బహిర్గతం కాకూడదు. ఒక అంశం సోషల్ మీడియాలో పోస్టు చేసే ముందు ఆలోచించి అడుగువేయాలి.

గోప్యత

సోషల్ మీడియా వాడకంలోని పరిధిని ఎవరూ తెలియజెప్పరు. ఈ పరిధి తెలుసుకోలేకపోవడం యువ ఉద్యోగుల కెరియర్‌పై తీవ్ర పరిణామాలు చూపడానికి దారితీయొచ్చు.

అభిషేక్, ఒక ఐటీ సంస్థలో డెవలపర్‌గా చేరాడు. తన నియామక పత్రంలో అంగీకరించిన నిబంధనలకు విరుద్ధంగా.. కొన్ని ప్రాజెక్ట్ వివరాలు వృత్తిలో సాధించిన విజయాలుగా 'లింక్డ్ ఇన్'లో పోస్టు చేశాడు. ప్రాజెక్ట్‌కు సంబంధించిన సాంకేతిక సమాచారం గోప్యతతో కూడింది కావడంతో యాజమాన్యం అభిషేక్‌పై చర్య తీసుకుంది.

◗ ఉద్యోగులు అందుకునే నియామక పత్రాలు నిబంధనలతో కూడి ఉంటాయి. కొన్ని ముఖ్యమైన గోప్యతా సూచనలు చదివి, అర్థం చేసుకోకుండా, నిబంధనలకు అంగీకరిస్తున్నట్లు సంతకం చేసి కాలక్రమంలో మర్చిపోతుంటారు. కొన్ని సంస్థల్లో 'నాన్ డిస్‌క్లోజర్ అగ్రిమెంట్' అంటే 'రహస్య ఒప్పందం'పై సంతకం తీసుకుంటుంటారు. ఇది ఉద్యోగి సంస్థలోని సున్నిత సమాచారాన్ని బయటకి వెల్లడించనని హామీ ఇచ్చే ఒక నిబంధన. ఇందులో పేర్కొన్న వాటిని ఉల్లంఘిస్తే సమస్యలు తప్పవు.

నైతిక బంధం

కార్పొరేట్ కెరియర్‌లో విజయవంతం కావాలంటే సాంకేతిక నైపుణ్యాలతోపాటు నైతికత, గోప్యత, వృత్తి ధర్మాలు కీలక పాత్ర పోషిస్తాయి.

రమేష్ ఒక తయారీరంగ సంస్థలో న్యూ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ టీమ్‌లో ట్రెయినీగా చేరాడు. ఒక ప్రోగ్రాంలో స్నేహితుడు రాజేష్‌ని క్యాజువల్‌గా కలిశాడు. ఇద్దరూ ఒకే తరహా ప్రాజెక్ట్ చేస్తున్నామని తెలుసుకుని సంతోషించారు. అయితే, రాజేష్ తనకు ఎదురైన ప్రాజెక్టులో కొన్ని సందేహాలను అడిగాడు. ఇది చాలా సున్నితమైన అంశం అని, ఈ సమాచారం బయటపెట్టలేనని, సున్నితంగా రాజేష్ అభ్యర్థనను రమేష్ తిరస్కరించాడు.

కొన్నాళ్ల తర్వాత ఈ విషయం మేనేజ్‌మెంట్‌కు తెలిసింది. రమేష్‌కు వృత్తిపై ఉన్న నిబద్ధత, పాటించిన గోప్యతకు ఎంతో సంతోషించిన యాజమాన్యం అతడికి కీలకమైన శాఖ బాధ్యతలు అప్పజెప్పింది.

◗ సంస్థ గోప్యతను కాపాడితే నమ్మకం బలపడుతుంది. విశ్వాసం కెరియర్ ప్రగతికి సహకరిస్తుంది.

దొరైరాజ్
సీనియర్ జనరల్ మేనేజర్, ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్

ప్రొబేషనరీ ఆఫీసర్లు..

ఈసీజీసీ లిమిటెడ్, ముంబయి... ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కేడర్‌లో ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తుంది.
◗ ప్రొబేషనరీ ఆఫీసర్: 30
విభాగాలు: జనరలిస్ట్ 28, స్పెషలిస్ట్ 02
అర్హత: జనరలిస్ట్ పోస్టులకు ఏదైనా విభాగంలో డిగ్రీ. స్పెషలిస్ట్ పోస్టులకు సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ.
వయసు: 01.11.2025 నాటికి 21 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి.
వేతన శ్రేణి: నెలకు రూ.88,635 - 1,69,025.
ఎంపిక: ఆన్‌లైన్ పరీక్ష (ఆబ్జెక్టివ్ టెస్ట్), ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామ్‌లతో. **దరఖాస్తు రుసుము:** ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు రూ.175. ఇతరులకు రూ.950. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 02.12.2025. **ఆన్‌లైన్ పరీక్ష తేదీ:** 11-01-2026.
వెబ్‌సైట్: https://www.ecgc.in/

మేనేజ్‌మెంట్ ట్రెయినీలు..

బ్రహ్మపుత్ర వ్యాలీ ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ లిమిటెడ్, అసోం.. ఒప్పంద ప్రాతిపదికన పలు విభాగాల్లో మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ మేనేజ్‌మెంట్ ట్రెయినీ: 16 పోస్టులు
విభాగాల వారీ: ◗ ప్రొడక్షన్: 07 ◗ మెకానికల్: 04 ◗ ఇన్‌స్ట్రుమెంటేషన్: 02 ◗ సివిల్: 01 ◗ హెచ్‌ఆర్ అండ్ అడ్మిన్: 01 ◗ ఫైనాన్స్: 01
అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, పీజీ, డిప్లొమా, సీఏ/సీఎంఏతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
వయసు: 01.11.2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూలతో. **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్‌కు రూ.500; ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు ఫీజు లేదు. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 09.12.2025.
వెబ్‌సైట్: https://bvfcl.com/

నిట్ వరంగల్‌లో..

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్), వరంగల్.. వివిధ విభాగాల్లో టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ ప్రొఫెసర్: 02 ◗ అసోసియేట్ ప్రొఫెసర్: 08
◗ అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-1: 08
◗ అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-2: 27
అర్హత: సంబంధిత విభాగంలో ఎంఈ/ఎంటెక్, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఏతో పాటు పని అనుభవం ఉండాలి. **గరిష్ఠ వయసు:** ప్రొఫెసర్‌కు 50 ఏళ్లు, అసోసియేట్ ప్రొఫెసర్‌కు 45 ఏళ్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు 40 ఏళ్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-2కు 35 ఏళ్లు.
దరఖాస్తు ఫీజు: జనరల్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్‌కు రూ.2000, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీలకు రూ.1000. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబరు 12. **ఎంపిక:** పరీక్ష, ఇంటర్వ్యూతో.
వెబ్‌సైట్: https://nitw.ac.in/page/?url=/careersnitw/Jobs/

పేదల సొంతింటి కల సాకారమే ప్రభుత్వ ధ్యేయం

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి డీఎస్‌బీవీ స్వామి

పద్మనాభం, న్యూస్‌టుడే: రానున్న రెండేళ్లలో అర్హులైన నిరుపేదలందరికీ పక్కా ఇళ్లు ఇవ్వడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో పద్మనాభం మండలం రెడ్డిపల్లి గ్రామంలో బుధవారం 'మన ఇల్లు మన గౌరవం' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. విశాఖపట్నం జిల్లా పరిధిలో త్వరలో 14,500 పైచిలుకు ఇళ్లు క్రమబద్ధీకరించి పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మూడు సెంట్లు, పట్టణ ప్రాంత ప్రజలకు రెండు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వడానికి మంత్రి మండలి ఆమోదం తెలిపిందన్నారు. పేదలందరికీ మెరుగైన వైద్యం అందించడానికి ప్రభుత్వం ఆసుపత్రులను అభివృద్ధి చేస్తుంటే.. ఆసుపత్రుల ప్రయివేటీకరణ అంటూ జగన్ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. ఓ పక్క ఐటీ పరిశ్రమలు, మరో పక్క పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తుంటే వైకాపా నాయకులు బైక్‌లపై ర్యాలీలు చేయడం వారి దాష్టీకానికి పరాకాష్ట అని వ్యాఖ్యానించారు. ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ వైకాపా ఆటవిక పాలన వల్ల అభివృద్ధిలో వెనుకబడిన రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం తిరిగి ప్రగతి పథంలో నడిపిస్తోందన్నారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదల సొంతింటి కలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు కశిరెడ్డి దామోదరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంఎల్‌సీ వేపాడ చిరంజీవిరావు, గండి బాబ్జీ తదితర తెదేపా నేతలు పాల్గొన్నారు. అంతకు ముందు ఎన్టీఆర్ కాలనీలో నిర్మించిన బన్ని నారాయణమ్మ, దుంగ శ్రీను ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు అతిథులు తాళాలు అందజేశారు.

అరకు వెళ్తున్నట్లు చెప్పి..అనంతలోకాలకు!!

★ కన్నీటి పర్యంతమైన యమున తల్లిదండ్రులు
★ కిడ్నీ రాకెట్ వ్యవహారంపై పలుకోణాల్లో విచారణ

మదనపల్లె నేరవార్తలు, పట్టణం న్యూస్‌టుడే, పీఎంపాలెం : 'అమ్మా స్నేహితులతో కలిసి అరకు వెళ్తున్నా.. అని చెప్పి వెళ్లిన నా బిడ్డ ఇలా మదనపల్లెకు వచ్చి చనిపోయిందే' అంటూ కిడ్నీ తొలగించగా మృతి చెందిన యమున తల్లిదండ్రులు సూరమ్మ, నరసింగరావు కన్నీటి పర్యంతమయ్యారు. మదనపల్లెలోని గ్లోబల్ ఆసుపత్రిలో విశాఖకు చెందిన యమునకు ఆదివారం శస్త్రచికిత్స చేసి కిడ్నీ తీసిన తరువాత సోమవారం ఆమె మృతి చెందింది. ఈ విషయం తెలుసుకుని ఆమె తల్లిదండ్రులు విశాఖపట్నం నుంచి మదనపల్లెకు మంగళవారం వచ్చారు. సోమవారం యమున చరవాణి నుంచి ఎవరో ఫోన్ చేసి మీ బిడ్డ కిడ్నీ అమ్ముకునేందుకు వచ్చి మూర్ఛ రావడంతో చనిపోయిందని చెప్పారంటూ వారిద్దరూ విలపించారు. తమ బిడ్డతో సన్నిహితంగా ఉన్న సూరిబాబుకు ఫోన్ చేసి అడిగితే కిడ్నీ వ్యవహారం బయటకు వచ్చిందని వాపోయారు. తమ బిడ్డకు తిండికి ఎలాంటి ఇబ్బంది లేదని, ఎందుకు కిడ్నీ అమ్ముకునేందుకు వచ్చిందో తెలియడం లేదని వారు కన్నీటి పర్యంతమయ్యారు. తమ బిడ్డ యమున మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

అనుమతులు లేకున్నా కిడ్నీ శస్త్రచికిత్సలు

మదనపల్లె గ్లోబల్ ఆసుపత్రిలో యమున మృతి చెందిన విషయం బయటకు రావడంతో పోలీసులు విచారణ ప్రారంభించారు. ఆసుపత్రి నిర్వాహకుల్లో ఒకరైన డీసీహెచ్ఎస్ డాక్టర్ ఆంజనేయులును బుధవారం ఉదయాన్నే అదుపులోకి తీసుకుని విచారణ మొదలు పెట్టారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రం ఇన్‌ఛార్జి బాలరంగడు, కదిరి డయాలసిస్ కేంద్రంలో పని చేసే మెహరాజ్‌లకు విశాఖపట్నానికి చెందిన పద్మ, సత్యతో పరిచయం ఉందని.. ఈ నేపథ్యంలో వారిద్దరి ద్వారానే కిడ్నీ మార్పిడికి యమునను మదనపల్లెకు పిలిపించినట్లు తెలిసింది. మదనపల్లెలోని గ్లోబల్ ఆసుపత్రిలో కిడ్నీ ఆపరేషన్లకు సంబంధించి ఎలాంటి అనుమతులు లేకున్నా అక్రమంగా శస్త్రచికిత్స చేసినట్లు పోలీసులు నిర్ధారించారు.

మదనపల్లెలో యమున కుటుంబీకులు, బంధువులు

యమున (పాతచిత్రం)

ఒక్కో మూత్రపిండం రూ.50 లక్షలకు విక్రయిస్తూ..

బెంగళూరుకు చెందిన ఓ వైద్యుడిని మదనపల్లెకు పిలిపించి మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్సలు చేయిస్తున్నట్లు తెలిసింది. సదరు వైద్యుడు ఒక్కో శస్త్రచికిత్సకు రూ.5 లక్షలు తీసుకున్నట్లు సమాచారం. కిడ్నీ ఇచ్చే వారికి రూ.7 లక్షలు లేదా రూ.8 లక్షలు ఇచ్చి.. ఆ అవయవం అవసరమున్న వారికి రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. గత కొన్ని నెలలుగా స్థానిక రోగులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వైద్యం కోసం రోగులు గ్లోబల్ ఆసుపత్రికి వస్తున్నారని తెలిసింది. గత కొంతకాలంగా మదనపల్లెలో కిడ్నీ రాకెట్ గోప్యంగా సాగుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారం ఎన్ని రోజుల నుంచి జరుగుతోంది..? ఎంతమందికి శస్త్రచికిత్సలు చేశారు..? ఇంకా ఎవరైనా చనిపోయారా..? అనే వివరాలు పోలీసులు సేకరిస్తున్నారు.

వైద్యఆరోగ్యశాఖ అధికారుల విచారణ: మదనపల్లెలోని గ్లోబల్ ఆసుపత్రిలో జరిగిన కిడ్నీ అక్రమ ఆపరేషన్ వ్యవహారంపై డీఈఎంఓ దేవశిరోమణి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రమేశ్‌బాబు, పీపీ యూనిట్ ఇన్‌ఛార్జి, 104 నోడల్ అధికారి డాక్టర్ శ్రీధర్, డిప్యూటీ హెచ్ఈఓ రాజగోపాల్, 104 ఓఈ ప్రవీణ్, టీబీ సూపర్‌వైజర్ ప్రభాకర్‌తో కూడిన బృందం విచారణ నిర్వహించింది. జిల్లా అధికారుల ఆదేశానుసారం ఆసుపత్రిని తాత్కాలికంగా సీజ్ చేశారు.

★ యమున మధురవాడ సమీప మారికవలస ప్రాంతంలో ఉంటోంది. ఆనందపురం మండలం బొడ్డపాలెం గ్రామానికి చెందిన కిరాణా వ్యాపారి నరసింగరావు, సూరమ్మ దంపతుల కుమార్తె యమున. ఈమెకు 2015లో మేనమామ కొడుకుతో వివాహమైంది. వీరికి కుమారుడు పుట్టిన ఏడాదికే భర్త మృతి చెందాడు. 2019లో కొడుకును తల్లిదండ్రుల వద్ద వదిలి జీవనోపాధి కోసంమధురవాడ ప్రాంతానికి వచ్చింది. ఈ క్రమంలో ఓ పత్రికలో ప్రచార ఉద్యోగిగా విధుల్లో చేరింది. ఆ సమయంలో సూరిబాబుతో పరిచయం ఏర్పడి సన్నిహితంగా ఉంటోంది. సూరిబాబు భార్య, ఈమె భర్త చనిపోవడంతో వీరిరువురి మధ్య స్నేహం పెరిగి మధురవాడలోని మొగదారమ్మ కాలనీ తదితర చోట్ల ఒకే ఇంట్లో కొన్నేళ్లుగా కలిసి ఉండేవారు. ★ యమున మృతి విషయం బయటకు చెప్పొద్దని, భారీగా నగదు ఇస్తామని, గాజువాకకు చెందిన మధ్యవర్తులు ప్రాధేయపడినట్లు మృతురాలి సోదరుడు మధు తెలిపారు. వారి ఫోన్‌కాల్స్ రికార్డు చేశామని, నిందితులను చట్టప్రకారం శిక్షించే వరకు పోరాడతామన్నారు.

కోన్ ఎలివేటర్ ఇండియా సంస్థ ప్రారంభం

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: విశాఖకు అంతర్జాతీయ సంస్థలు పెద్ద ఎత్తున వరుస కడుతున్నాయని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. వాల్తేరు అప్‌ల్యాండ్‌లో ఏర్పాటు చేసిన కోన్ ఎలివేటర్ ఇండియా సంస్థ కార్యాలయాన్ని బుధవారం ఉదయం ఆయన ప్రారంభించారు. లిఫ్టులు, ఎక్సలేటర్ల తయారీలో ఈ సంస్థ అగ్రగామిగా గుర్తింపు పొందన్నారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అమిత్ గోస్సేన్ మాట్లాడుతూ విశాఖలో ఏర్పాటు చేసిన కార్యాలయం నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలకు సేవలందిస్తామని చెప్పారు. దక్షిణ భారతదేశ నగరాల్లో విశాఖ శరవేగంగా అభివృద్ధి చెందుతుండటంతో ఇక్కడ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

సాంస్కృతిక ఉత్సవాలతో గిరిజన కళల పరిరక్షణ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డు వై.ఎం.సి.ఎ. ఆవరణలో గత మూడు రోజులుగా నిర్వహించిన గిరిజన యోధుడు బిర్సా ముండా జయంతి పక్షోత్సవాలు బుధవారం సాయంత్రంతో ముగిశాయి. జాతీయ గౌరవ దివస్ పేరుతో జరిగిన ఈ ఉత్సవాల్లో వివిధ జిల్లాల నుంచి 700లకుపైగా గిరిజన విద్యార్థులు పాల్గొని సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారని ట్రైబుల్ కల్చర్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ మిషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రాణి మంద తెలిపారు. చివరి రోజు పలువురు విద్యార్థినులు థింసా, కొమ్ము కోయ నృత్యాలు, కోలాటాలతో అలరించారు. గిరిజన సనాతన కళలను పరిరక్షించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని రాణి మంద తెలిపారు. గిరిజన ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన సంతకు నగరవాసుల నుంచి స్పందన లభించింది.



గిరిజన విద్యార్థులతో డాక్టర్ రాణి మంద

ఉత్సాహంగా అఖిల భారత టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్

పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: 40వ అఖిల భారత తపాలా టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ఎంవీపీకాలనీ స్పోర్ట్స్ ఎరీనాలో ఉత్సాహంగా కొనసాగుతోంది. మూడోరోజు బుధవారం ఉమెన్ డబుల్స్ ఈవెంట్, మిక్స్‌డ్ ఈవెంట్ పోటీలు నిర్వహించారు.

★ మిక్స్‌డ్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో..: క్వార్టర్‌ఫైనల్-1లో పౌలామిదాస్, ఆకాష్ (పశ్చిమబెంగాల్) 3-0 పాయింట్లతో భూమిన్, సోనల్(గుజరాత్)లపై, క్వార్టర్ ఫైనల్-2లో సైలూనూర్ బాషా, భరద్వాజ్‌బాబు (ఆంధ్రప్రదేశ్) 3-2 పాయింట్లతో పవన్, అనుపమ (తెలంగాణ)లపై, క్వార్టర్ ఫైనల్-3లో సాయాని బోస్, ప్రతీక్‌రాయి (పశ్చిమ బెంగాల్) 3-1 పాయింట్ల తేడాతో సెంటూర్‌పాండే, ఎ.రమేష్ (తమిళనాడు)లపై, క్వార్టర్ ఫైనల్స్-4లో వి.బి.వాలా, దివ్యా గోయల్(గుజరాత్) 3-1తో సంగీత, గౌరవ్(పశ్చిమబెంగాల్)పై విజయం సాధించారు.

★ మిక్స్‌డ్ డబుల్స్ సెమీఫైనల్స్‌లో..: సెమీఫైనల్-1లో పౌలామిదాస్, ఆకాష్ (పశ్చిమబెంగాల్) 3-1 పాయింట్లతో సైలూనూర్ బాషా, భరద్వాజ్‌బాబు (ఆంధ్రప్రదేశ్)లపై, సెమీఫైనల్-2లో వి.బి.వాలా, దివ్యాగోయల్(గుజరాత్) 3-1తో సయానిబోస్, ప్రతీక్‌రాయ్(గుజరాత్)లపై విజయం సాధించారు.

★ ఉమెన్స్ డబుల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో..: క్వార్టర్ ఫైనల్-1లో సయాని బోస్, సంగీత(పశ్చిమబెంగాల్) 3-0తో వైశాలి, దీపాలి(మహారాష్ట్ర)లపై, క్వార్టర్ ఫైనల్-2లో పౌలామిదాస్, సోమాలి(పశ్చిమబెంగాల్) 3-0 పాయింట్లతో వినీత, నుపూర్(ఉత్తరప్రదేశ్)లపై, క్వార్టర్‌ఫైనల్-3లో దివ్యా గోయల్, ప్రసున్నా(గుజరాత్) 3-0తో ఎస్.కె.జోషి, అవనిభట్(గుజరాత్)లపై, క్వార్టర్ ఫైనల్-4లో శ్రీలక్ష్మి, సైలూనూర్‌బాషా(ఆంధ్రప్రదేశ్) 3-0తో శ్వేత, పాయల్(ఛత్తీస్‌గఢ్)లపై గెలుపొందారని విశాఖపట్నం డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ ఎన్.వి.ఎస్.ఎన్.రాజు తెలిపారు.

12 నుంచి పీహెచ్‌సీల్లో 'సాన్స్' నిర్వహణ

సాన్స్ గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డా.జగదీశ్వరరావు, వైద్యాధికారులు

సీతంపేట, న్యూస్‌టుడే: పిల్లల్లో న్యూమోనియా లక్షణాలు, దగ్గు, జలుబు, అధిక జ్వరం ఉండటం, శ్వాస తీసుకొనే సమయంలో డొక్కలు ఎగురవేయడం మొదలగు లక్షణాలు గుర్తించిన వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చి వైద్యుడి సలహాలు పొందాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. ఈనెల 12 నుంచి 2026 ఫిబ్రవరి 28 వరకు ప్రతి ఆరోగ్య కేంద్రంలో సోషల్ అవేర్‌నెస్ అండ్ యాక్షన్ టు న్యూట్రలైజ్ న్యూమోనియా సక్సస్‌పుల్లీ(సాన్స్) కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. నీరు తాగలేకపోవడం, ఆహారం తినలేకపోవడం, శ్వాస తీసుకొనే సమయంలో గురక రావడం, నీరసంగా, మత్తుగా ఉండడం మొదలగు లక్షణాలు పిల్లల్లో కనిపిస్తే వైద్యుడిని సంప్రదించాలన్నారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ లూసీ మాట్లాడుతూ పిల్లలు పుట్టిన వెంటనే గంటలోపు తల్లి పాలు పట్టిస్తే న్యూమోనియా నుంచి రక్షించుకోవచ్చునన్నారు. అనంతరం 'సాన్స్' గోడపత్రికను ఆవిష్కరించారు.

పసిబిడ్డ మృతిపై ఆందోళన

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బాధితుల ఆరోపణ

బాధితులు, వైద్యులతో మాట్లాడుతున్న సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ శ్రీహరి

వన్‌టౌన్, న్యూస్‌టుడే : కింగ్‌జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్) పిల్లల వార్డులో ఆరు నెలల మగబిడ్డ మృతి చెందిన ఘటనపై బుధవారం బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యమే కారణమని వారు ఆరోపించారు. ఆ వివరాలు... పార్వతీపురం మన్యం జిల్లా, గుమ్మలక్ష్మీపురం మండలం వంగర గ్రామానికి చెందిన వై.అఖిల్ దంపతులకు ఆరు నెలల కిందట మగబిడ్డ (ధన్వీర్) జన్మించాడు. ఆ బిడ్డ అనారోగ్యం బారిన పడడంతో తొలుత పార్వతీపురంలో ఆసుపత్రికి, అక్కడ నుంచి విజయనగరంలో ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో 8వ తేదీ రాత్రి కేజీహెచ్‌కు తీసుకొచ్చి పిల్లల వార్డులో చేర్పించారు. బ్లడ్ ఇన్‌ఫెక్షన్ కారణంగా బిడ్డ ఇబ్బంది పడుతున్నాడని చెప్పిన వైద్యులు, అవసరమైన చికిత్స అందించారు. బుధవారం ఉదయం ఆరోగ్యం విషమించడంతో బిడ్డ మృతి చెందాడు. ★ అయితే ఆసుపత్రికి వచ్చిన తర్వాత బిడ్డకు రెండుసార్లు మూర్ఛ వచ్చినా, వైద్యులు సమాచారం ఇవ్వలేదని, ఎలాంటి చికిత్స అందించారో చెప్పలేదని, బిడ్డ మృతి చెందే వరకు ఆరోగ్య స్థితి మెరుగ్గానే ఉందంటూ మోసం చేశారని బాధిత కుటుంబీకులు ఆందోళనకు దిగారు. న్యాయం చేయాలని కోరుతూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిరసన కొనసాగించారు.

★ ఆసుపత్రి సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ శ్రీహరి స్పందించి బాధితులు, వైద్యులతో మాట్లాడారు. జరిగిన పరిణామాలు బాధిత కుటుంబీకులకు వివరించడంతో వారు శాంతించారు. అనంతరం అంబులెన్స్ ఏర్పాటు చేయడంతో బిడ్డ మృతదేహాన్ని తీసుకుని స్వగ్రామానికి వెళ్లారు.

(c) eenadu

భీమిలి

సినిమాలు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్- **ది గర్ల్ ఫ్రెండ్**
రాములమ్మ- **ది గ్రేట్ ప్రి వెడ్డింగ్ షో**
తాతా- **జటాధర**
సప్తగిరి- **మాస్ జాతర**

అప్పన్న ఆలయంలో ఘనంగా తదీయారాధన

సింహాచలం, న్యూస్‌టుడే: కార్తికమాసాన్ని పురస్కరించుకుని శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో బుధవారం తదీయారాధన (సామూహిక అన్న సమారాధన) ఘనంగా జరిగింది. ఈవో ఎన్.సుజాత ఆధ్వర్యంలో దేవస్థానం ఉద్యోగులు, సేవా కార్యకర్తలకు అప్పన్న ఆలయ కల్యాణ మండపం ప్రాంగణంలో కార్తిక వనభోజనాలు వడ్డించారు. తొలుత ఆలయ ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ప్రార్థన చేయించి స్వామికి నివేదించిన అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

సింహాచలానికి సీఐఐ శోభ

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: నగరంలో జరగనున్న సీఐఐ సదస్సు నేపథ్యంలో సింహాచలం బీఆర్టీఎస్ రహదారిని శోభాయమానంగా అలంకరించారు. విభాగినులకు రెయిలింగ్, వీధిదీపాలు ఏర్పాటు చేశారు. దేవస్థానం బస్‌స్టాండు వద్ద అప్పన్న స్వామి చిత్రపటంతో 'ఐ లవ్ సింహాచలం' అంటూ ఆంగ్ల అక్షరాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలంకరణ ఈ ప్రాంతానికి నూతన శోభను తీసుకువచ్చింది. గోడలపై తోడపెద్దుల చిత్రాలు ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. వీటిని బుధవారం రాత్రి 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం తదితరులు పరిశీలించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే: ?: దసపల్లా లేఅవుట్(ఎండాడ)లో ఎంవీవీ గ్రీన్‌ఫీల్డ్ అపార్ట్‌మెంట్ పరిసరాల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. **-అపార్ట్‌మెంట్ వాసులు** ✓: పరిసరాల శుభ్రతకు చర్యలు తీసుకుంటాం. **-రవి, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్**

?: విజయనగర్ టీచర్ లేఅవుట్ (మధురవాడ)లో కాలువలు అధ్వానంగా ఉన్నాయి. **-లేఅవుట్ వాసులు** ✓: కాలువల్లో పూడికలు తొలగిస్తాం. **-సాయికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్.**

?: ఈనాడు లేఅవుట్(సాగర్‌నగర్)లో పదికి పైగా విద్యుత్ దీపాలు మరమ్మతులకు గురయ్యాయి. **-విజయకృష్ణ అపార్ట్‌మెంట్ వాసులు.** ✓: విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేపడతాం. **-సాయిరాం, ఏఈ**

?: మిథిలాపురి వుడాకాలనీ(మధురవాడ) బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచి ఎదురుగా కాలువలు అధ్వానంగా ఉన్నాయి. **-వి.ఎల్.రావు** ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **-రవి, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్**

?: ముబారక్‌కాలనీ(ఎండాడ) ప్రధాన దారి గతుకులమయంగా ఉండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. **-తాజ్‌మల్, ముబారక్ కాలనీ** ✓: త్వరలో రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. **-శ్రీనివాస్, ఏఈ**

?: తులసీనగర్(మధురవాడ)లో దారంతా బురదమయంగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. **-తులసీనగర్ వాసులు** ✓: త్వరలో తారు రోడ్డు నిర్మించేందుకు చర్యలు చేపడతాం. **-కనకమహాలక్ష్మి, జెడ్సీ**

?: లచ్చిరాజు లేఅవుట్(మధురవాడ)లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. **-లేఅవుట్ వాసులు** ✓: శునకాలు పట్టే వారిని రప్పించి సమస్య పరిష్కరిస్తాం. **-రాజా రవికుమార్, ఆరోగ్య అధికారి**

?: కృష్ణా లేఅవుట్(రుషికొండ) ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే దారిలో రోడ్డు గోతులు పడి ప్రమాదకరంగా మారాయి. **-లేఅవుట్ వాసులు** ✓: త్వరలో తారురోడ్డు నిర్మిస్తాం. **-కనకమహాలక్ష్మి, జెడ్సీ**

?: వెంకన్న ఆలయం (గొల్లల ఎండాడ) కూడలిలో వీధి దీపాలు వెలగడం లేదు. **-సింహాద్రి, స్థానికుడు** ✓: మరమ్మతులు చేపడతాం. -సాయిరామ్, ఏఈ

స్పందనకు వందనం

పూడిక తొలగింపు

ఎండాడ, న్యూస్‌టుడే: జీసీసీ లేఅవుట్ (మధురవాడ)లో ఎక్కడికక్కడ కాలువల్లో పూడికలు పేరుకుపోయి దుర్వాసన, దోమల బెడదతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను లేఅవుట్ వాసులు 'ఈనాడు' 'మేమున్నాం..మీకు తోడుగా' దృష్టికి తీసుకురావడంతో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాయికుమార్ స్పందించి సిబ్బందితో పూడికలు తొలగించారు.

వెలిగిన వీధి దీపాలు

ఎండాడ, న్యూస్‌టుడే: వైఎల్వీ లేఅవుట్ (ఎండాడ)లో వీధి దీపాలు వెలగక నిత్యం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను స్థానికులు 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకురావడంతో విద్యుత్ ఏఈ సాయిరాం స్పందించి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకున్నారు.

శిథిల దారులు.. రాకపోకలకు ఇక్కట్లు

తగరపువలస, గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రహదారులు శిథిలమై స్థానికులు అవస్థలు పడుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే రోడ్లు అధ్వానంగా ఉండడంతో ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

» తగరపువలస ప్రధానరోడ్డులో పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రాత్రి వేళ, రద్దీ సమయాల్లో వాహనదారులు ప్రమాదాలకు లోనవుతున్నారు.

» నాల్గోవార్డు పరిధి బీచ్‌రోడ్డులోని మంగమారిపేట, నగరపాలెం, చేపలుప్పాడ, కాపులుప్పాడ, నిడిగట్టు, జేవీఅగ్రహారం ప్రాంతాల్లోనూ రోడ్లు పలుచోట్ల శిథిలమయ్యాయి.

» మజ్జివలస కూడలి నుంచి లక్ష్మీపురం, సింగనబంద, నారాయణరాజుపేటలకు ప్రధాన రహదారిగా ఉన్న బీటీ రోడ్డు గోతులతో అధ్వానంగా ఉంది.

మజ్జి కూడలి-నారాయణరాజుపేట రహదారి దుస్థితి

» తగరపువలస నుంచి చిప్పాడ, అన్నవరం గ్రామాలకు వెళ్లే మార్గం, చిప్పాడ-సిటీనగర్ రోడ్లు గతుకులమయంగా ఉన్నాయి. » తగరపువలస-పద్మనాభం ప్రధానరోడ్డు, సంగివలస నుంచి సామేయవలస మీదుగా మద్ది, పద్మనాభం ప్రాంతాలకు వెళ్లే రహదారి; కాపులుప్పాడ-పాతకల్లివానిపాలెం నుంచి జాతీయ రహదారికి పోయే రోడ్ల పరిస్థితి కూడా అంతే.

» భీమిలి నుంచి తాళ్లవలసకు వెళ్లే కుమ్మరిపాలెం రోడ్డు రాళ్లు తేలుతోంది.

» అన్నవరం-కొత్తపేట రోడ్డు, మూలకుద్దు గల్లీరోడ్డు, చిట్టివలస బొగ్గురోడ్డు, జ్యూటుమిల్లు మార్గంలో గుంతలు ఏర్పడి రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

▸▸ నియోజకవర్గంలోని రోడ్లను వెంటనే బాగు చేయాలి. పలు ప్రధాన మార్గాల్లో ప్రయాణించాలన్నా స్థానికులు, వాహనదారులు భయపడుతున్నారు. రోడ్ల దుస్థితిపై ఇటీవల ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇచ్చాం.
-బాగం గోపాలరావు, భీమిలి

▸▸ తగరపువలస, చిట్టివలస, సంగివలస ప్రాంతాల్లోని ప్రధానరోడ్లకు మరమ్మతులు చేయాలి. గుంతలతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. కొన్నిసార్లు గోతులను గమనించక ప్రమాదాలకు గురై గాయపడుతున్నారు.
-జగ్గుపల్లి ప్రసాద్, తగరపువలస

విదేశీ బృందం గీతం సందర్శన

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: అమెరికాలోని పెన్‌స్టేట్ విశ్వవిద్యాలయం అకడమిక్ నిపుణుల బృంద సభ్యులు గీతం డీమ్డ్ వర్సిటీని బుధవారం సందర్శించారు. అడ్మిషన్ల అసోసియేట్ డైరెక్టర్ అమందా ఎల్‌మోర్, గ్లోబల్ ఎంగేజ్‌మెంట్ కో-ఆర్డినేటర్ ఎండీ మోనిహన్, మార్కెటింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ వెంకటరామన్‌లు పలు విభాగాలను సందర్శించి గీతం ప్రో-వీసీ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, బిజినెస్ విద్యార్థులతో పెన్‌స్టేట్ వర్సిటీ నిపుణులు ముఖాముఖి నిర్వహించారు. ఇరు వర్సిటీల మధ్య గతంలో కుదిరిన అవగాహన ఒప్పందాల అంశాల్ని గీతం అదర్ కెరీర్ ఆప్షన్స్ డిప్యూటీ డైరెక్టర్ రవికాంత్ వివరించారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న అమెరికా వర్సిటీ ప్రతినిధి

విద్యా సామగ్రి వితరణ

విద్యార్థులతో దాతలు, నిర్వాహకులు

ఎండాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ ఎనిమిదోవార్డు పరిధి గొల్లల ఎండాడలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులుకి గ్రామస్థులంతా కలిసి బుధవారం రూ.50 వేల నగదు వితరణగా అందించారు. కొద్ది రోజులుగా ఆయన అనారోగ్యానికి గురవడంతో చికిత్స నిమిత్తం తామంతా కలిసి సంబంధిత మొత్తాన్ని సమకూర్చినట్లు వారు పేర్కొన్నారు.

మధురవాడ, న్యూస్‌టుడే: మల్లయ్యపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, ఇతర విద్యా సామగ్రిని జగదభిరామ కన్‌స్ట్రక్షన్ సీఈఓ, భీమిలి మండల జనసేన అధ్యక్షుడు నక్కా శ్రీధర్ బుధవారం వితరణగా అందించారు. 70 మందికి విద్యాసామగ్రితో పాటు పండ్లు పంచిపెట్టారు. నాయకులు అల్లాడ లింగేశ్వరరావు, సంతోష్‌నాయుడు, నాగోతి నర్సింహ నాయుడు, బి.వి.కృష్ణయ్య, బి.టి.డి. శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్చకుడికి నగదు అందిస్తున్న గ్రామస్థులు

అక్రమ నిర్మాణాల కూల్చివేత

షెడ్లను కూల్చివేస్తున్న సిబ్బంది

కె.నగరపాలెం(గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: కాపులుప్పాడ సమీప ప్రభుత్వ బంజరు భూమిలో అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్లను రెవెన్యూ అధికారులు బుధవారం తొలగించారు. కాపులుప్పాడ బీచ్ కూడలి ప్రాంతం నుంచి మారికవలసకు వెళ్లే మార్గంలో కొందరు వ్యక్తులు అక్రమంగా ఏడు షెడ్లు నిర్మించారు. ఈ ప్రాంతంలో సెంటు భూమి ధర రూ. 20 లక్షలపైమాటే. ఇలాంటి ప్రాంతంలో ఎంతో విలువైన 20 సెంట్ల స్థలాన్ని ఆక్రమించడంతో అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టారు. తహసీల్దారు రామారావు ఆదేశాల మేరకు వీఆర్వో ప్రసాద్ పర్యవేక్షణలో సిబ్బంది పొక్లెయిన్‌తో వాటిని కూల్చేసి ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించారు.

తాగునీటి పథకం ప్రారంభం

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: చిట్టివలస సమీప గుడివాడ ఎరుసుపేటలో చిప్పాడ దివీస్ యాజమాన్యం రూ.4.50 లక్షల నిధులతో పునర్‌నిర్మించిన రక్షిత మంచినీటి పథకం బుధవారం ప్రారంభమైంది. సర్పంచి చిల్ల జమున, దివీస్ సీఎస్ఆర్ మేనేజర్ సురేశ్‌కుమార్ దీన్ని ప్రారంభించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, దివీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పథకాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి జమున, దివీస్ సీఎస్ఆర్ మేనేజర్ సురేశ్‌కుమార్, తదితరులు

● తీరంలో గుర్తుతెలియని మృతదేహం

చేపలతిమ్మాపురం(గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: భీమిలి బీచ్‌రోడ్డులోని చేపల తిమ్మాపురం తీరానికి సుమారు 55 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు గల ఓ గుర్తు తెలియని పురుష మృతదేహం బుధవారం రాత్రి కొట్టుకొచ్చింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వివరాలు తెలిసిన వారు తమకు సమాచారం అందించాలని సీఐ తిరుమలరావు కోరారు.

● భీమిలిలో టైలర్ అదృశ్యం

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: భీమునిపట్నం నల్లబిల్లికి చెందిన కొయ్య రామమోహన్ (65) అనే టైలర్ అదృశ్యమయ్యారు. రెండ్రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన ఆ తర్వాత కనిపించలేదు. అప్పట్నుంచి పలు చోట్ల గాలించినా ఫలితం లేకపోవడంతో భీమిలి పోలీసు స్టేషన్‌లో బుధవారం కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ కె.సన్యాసిరావు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తిరుమలరావు పేర్కొన్నారు.

● సీహెచ్‌సీలో సదరం శిబిరాలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: శారీరక వైకల్యం ఉన్నవారికి ప్రతీ సోమవారం భీమిలి సీహెచ్‌సీలో సదరం శిబిరాలు నిర్వహించి ధ్రువపత్రాలు జారీ చేస్తారు. ఇందు కోసం అవసరమైన వ్యక్తులు ఈనెల 14వ తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో స్లాట్‌లు బుక్ చేసుకోవాలి. ఈ మేరకు రాష్ట్ర సెకెండరీ హెల్త్ డైరెక్టర్ కార్యాలయం ఆదేశాలు జారీ చేసినట్లు భీమిలి సీహెచ్‌సీ వైద్యాధికారులు పేర్కొన్నారు. * భీమిలిలోని భవిత కేంద్రంలో దివ్యాంగ బాలలకు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరికి అవసరమైన పరికరాలు అందించేందుకు ఈనెల 26న ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు స్పీచ్ థెరపిస్ట్ బాలేశ్వరి పేర్కొన్నారు. ఉపాధ్యాయినులు కెజియాకుమారి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

● రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

తగరపువలస, గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని వివిధ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు సంబంధిత పాఠశాలల పీఈటీలు బుధవారం ఆ వివరాలు వెల్లడించారు. బోయపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఐనోష్, యోజిత, భవాని కబడ్డీలో, టి.అదిక్ష సాఫ్ట్‌బాల్ రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నారు. భీమిలి మండలం లక్ష్మీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కె.శ్రావ్య, కె.మహేశ్ (ఫుట్‌బాల్), డి.వైష్ణవి (నెట్‌బాల్), బి.పవన్, బి.సురేంద్ర, కె.శ్రావ్య (రగ్బీ) రాష్ట్ర జట్లకు ఎంపికయ్యారు. చిట్టివలస జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బోర గణేశ్, బైరెడ్డి గణేశ్‌లు రాష్ట్ర కబడ్డీ జట్టులో స్థానం పొందారు. వీరిని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు తదితరులు అభినందించారు.

భీమిలిలో నేత్ర వైద్య శిబిరం

శిబిరంలో నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: విశాఖ నియోవిజన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం భీమిలిలో నిర్వహించిన నేత్రవైద్య శిబిరంలో 226 మందికి పరీక్షలు చేపట్టారు. భీమిలి గంటస్తంభం వద్ద ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని తెదేపా రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ప్రారంభించారు. ఇందులో 20 మందికి కంటి అద్దాలు అందించారు. 30 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

వేడుకగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణోత్సవం బుధవారం సింహగిరిపై వేడుకగా జరిగింది. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని చూడముచ్చటగా అలంకరించి ఆలయ బేడామండపంలోని వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు.

పూజలందుకుంటున్న దేవతామూర్తులు

ఓపెన్‌టాప్ బస్సుకు ముస్తాబు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా సాగర్‌నగర్ విద్యుత్తు ఛార్జింగ్ కేంద్రం ప్రాంగణంలో ఓపెన్‌టాప్ డబుల్‌డెక్కర్ బస్సును బుధవారం నుంచి ముస్తాబు చేస్తున్నారు. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులతో గురువారం ఉదయం 10 గంటలకు నొవొటెల్ హోటల్ వద్ద ఈ బస్సు బయల్దేరుతుందని టూరిజం బస్సుల నిర్వహణ సిబ్బంది పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆర్కేబీచ్, జూపార్కు, కైలాసగిరి, సాగర్‌నగర్, రుషికొండ మీదుగా తొట్లకొండ తదితర ప్రాంతాల వరకు భీమిలి బీచ్‌రోడ్డు పరిసర ప్రదేశాల విశిష్టత తెలుసుకునేందుకు సంబంధిత ప్రతినిధులు ఈ వాహనంలో విహరిస్తారన్నారు.

డబుల్‌డెక్కర్ బస్సును సిద్ధం చేస్తున్న సిబ్బంది

ధాన్యం కొనుగోలుకు సిద్ధం కావాలి

ఆనందపురం, న్యూస్‌టుడే: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు సహకార సంఘాల అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్ కోన తాతారావు సూచించారు. ఈ మేరకు ఆనందపురం, పద్మనాభం, భీమిలి మండలాల్లోని ప్రాథమిక సహకార సంఘాలను బుధవారం ఆయన సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ త్వరలో రైతులకు రాయితీపై డ్రోన్స్ అందిస్తామన్నారు. స్థానిక నాయకులు గంధ్రెడ్డి సోంబాబు, అప్పలరాజు, నాగరాజు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

వైకాపా శ్రేణుల ర్యాలీ

తగరపువలస, భీమునిపట్నం, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల ప్రవేటీకరణ తగదంటూ వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తగరపువలస కూడలిలో బుధవారం ఆ పార్టీ శ్రేణులు బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ భీమిలి మినీ స్టేడియం మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించారు. అంతకుముందు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మజ్జి శిరీష, జగ్గుపల్లి ప్రసాద్, జీరు వెంకటరెడ్డి, డబ్బీరు ప్రశాంతి, గంటాన సృజన, ఇల్లాపు వెంకట్, మజ్జి వెంకటరావు, పెదబాబు, పలువురు ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

దుకాణాల వేలం పాటకు విశేష స్పందన

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలో జీవీఎంసీ కొత్తగా నిర్మించిన వాణిజ్య దుకాణ సముదాయంలోని షాపులను లీజుకు ఇచ్చేందుకు బుధవారం నిర్వహించిన బహిరంగ వేలంపాటలో ఊహించిన దాని కంటే అధికంగా ఆదాయం సమకూరింది. ఈమేరకు భీమిలి జోనల్ కార్యాలయంలో జెడ్సీ వి.అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో కార్యాలయ సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాస్ వేలం పాట నిర్వహించారు. ప్రతీ దుకాణానికి రూ.12వేల పాటతో వేలం ప్రారంభించారు. గతంలో నెలకు ఒక్కో దుకాణానికి రూ.8వేలు మాత్రమే అద్దె వచ్చేది. ఈసారి విపరీతమైన డిమాండ్ ఏర్పడి కొన్నింటికి రూ.40వేల వరకు పాట వెళ్లింది. జడ్సీ మాట్లాడుతూ వ్యాపారులకు మూడేళ్ల కాలపరిమితికి దుకాణాలను లీజుకు ఇస్తున్నామని, నెలవారీ చెల్లించే అద్దెకు అదనంగా జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

అయ్యప్ప పీఠంలో అన్నసమారాధన

ఆనందపురం, న్యూస్‌టుడే: కణమాం గ్రామంలో కొత్తగా నిర్మించిన అయ్యప్ప స్వామి పీఠాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములకు ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో ఆయన పాల్గొని భక్తులకు ఆహార పదార్థాలు వడ్డించారు. స్థానిక నాయకులు యర్రా రాము, ఆబోతు రాము, చందవరపు కుమార్ పాల్గొన్నారు.

భక్తులకు వడ్డిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

● రామునాయుడుకు నివాళి

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: సీపీఐ తొలితరం నాయకుడు గుజ్జు రామునాయుడు వర్ధంతిని చిట్టివలస సమీప గుడివాడ గ్రామంలో బుధవారం నిర్వహించారు. చిట్టివలస ఏఐటీయూసీ లేబరు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పడాల రమణ, కొండపు ఈశ్వరరావు, సీపీఐ భీమిలి ఏరియా కార్యదర్శి కానూరు రాంబాబు, తదితరులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజలకు ఆయన అందించిన సేవలను కొనియాడారు. చిల్ల నర్సింహులు, చిల్ల రాంపైడి, మావూరి వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

● రాష్ట్ర గురుకుల పాఠశాలల డైరెక్టర్ సందర్శన

భీమునిపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్ర గురుకుల పాఠశాలల డైరెక్టర్ వి.ఎం.మస్తానయ్య బుధవారం భీమిలి ప్రభుత్వ డైట్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా డైట్‌లో జరుగుతున్న కార్యక్రమాల పురోగతిపై ఆరా తీశారు. తర్వాత ఛాత్రోపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డైట్ కళాశాల ఉప ప్రధానాచార్యులు జి.జి.ఎస్.నాగేశ్వరరావు, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

● సేవలకు సత్కారం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ఏపీ రాష్ట్ర కళింగ వైశ్య వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన సాగర్‌నగర్‌కు చెందిన తంగుడు సంతోష్‌కుమార్‌ను బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు సత్కరించారు. ఈ మేరకు సంబంధిత సంఘం ప్రతినిధులు పొట్నూరి బాబూరావు తదితరుల ఆధ్వర్యంలో కాలనీలో ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి వారంతా కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణ

కొమ్మాది, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి బి.సురేష్ పేర్కొన్నారు. మారికవలస సమీప ఏపీ గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న బాలుర గురుకుల పాఠశాల, బాలికల గురుకుల స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యాలయాలు సంయుక్తంగా మాక్ పార్లమెంట్, భారతీయ గిరిజనుల వేషధారణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 'మాక్ పార్లమెంట్'పై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా చేపట్టిన విద్యార్థుల వేషధారణ ఆకట్టుకుంది. విద్యాలయాల ప్రధానోపాధ్యాయులు శివప్రసాద్, వై.రోజా తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో దుకాణం దగ్ధం

ఆనందపురం, న్యూస్‌టుడే: వేములవలసలోని బసయ్య అల్పాహార దుకాణం మంగళవారం అర్ధరాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయి సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లింది. సుమారు 35 ఏళ్లుగా ఇక్కడ దుకాణం నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సీఐ వాసునాయుడు, వీఆర్వో పుష్పలత తదితరులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులు కోరారు.

బహిరంగ ప్రకటన

తే.05.11.2025 దీన గుండు గోపినాథ్, రామారావు, శేఖర్లు దిగువ షెడ్యూలు ఆస్తిని గురించి జారీ చేసిన బహిరంగ ప్రకటనకు జవాబుగా నా క్లయింటు ఆయిన గుండు కృష్ణవేణి, భర్త: వాసు, నివాసం పెద్దిపాలెం గ్రామం, ఆనందపురం మండలం, విశాఖపట్నం జిల్లా వాస్తవ్యులు చెప్పిన భోగట్టా ఏమనగా పైన పేర్కొన్న గుండు గోపినాథ్, రామారావు, శేఖర్లు తే.05.11.2025దీన జారీ చేసిన ప్రకటనలోని విషయములు అసత్యాలని తెలియజేయుచున్నారు. ప్రకటనలో పేర్కొన్న ఆస్తి పత్రాలు ఏవీ తమ వద్ద లేవనిన్నీ, మా క్లయింటు మామగారైన శ్రీ గుండు నారాయణ గారు తే.16.11.2012 దీన స్వర్గస్తులైన పిమ్మట గుండు శేఖర్ కల్లము వద్ద గల ఇంటి నుండి [illegible]

షెడ్యూలు ఆస్తి వివరం

[illegible]

SALADI VENKATA RAMANA M.A., B.L. ADVOCATE
Flat No. 301, Nestra Residency, Chaitanya Nagar, Chinimusidivada, Pendurthi, Visakhapatnam-530003. Cell No: 8501057554.

ప్రయాణికుడి నిజాయతీ

స్టేషన్‌లో నగదు అందుకుంటున్న సునీల్ కుమార్, వృత్తంలో శ్రీనివాసరావు (బ్యాగు అప్పగించిన వ్యక్తి)

కృష్ణలంక, న్యూస్‌టుడే: బస్సులో తనకు దొరికిన నగదుతో ఉన్న బ్యాగును ఓ ప్రయాణికుడు నిజాయతీగా పోలీసులకు అప్పగించిన ఘటన బుధవారం విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. విశాఖపట్నం మధురవాడ సమీప పీఎం పాలెంకు చెందిన మాదినేని సునీల్ కుమార్ రియల్ ఎస్టేట్, కేటరింగ్ తదితర వ్యాపారాలు చేస్తుంటారు. విజయవాడలో ఒకరికి నగదు ఇవ్వాల్సి రావడంతో బ్యాగుతో మంగళవారం రాత్రి విశాఖలో బస్సెక్కి బుధవారం ఉదయం బస్‌స్టేషన్‌లో దిగారు. ఈ క్రమంలో బ్యాగును బస్సులో వదిలి వెళ్లిపోయారు. అదే బస్సులో ప్రయాణిస్తున్న వేరొక ప్రయాణికుడైన శ్రీనివాసరావుకు ఆ బ్యాగు దొరకడంతో దానిని తీసుకుని విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు అప్పగించారు. కొద్ది సేపటికి బాధితుడు సునీల్‌కుమార్ కృష్ణలంక పీఎస్‌కు వచ్చి తాను బస్సులో రూ.6 లక్షలున్న బ్యాగు మర్చిపోయినట్లుగా ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. ఎస్సై భానుప్రసాద్ అతడి వద్ద వివరాలు సేకరించి నగదుతో ఉన్న బ్యాగును అందజేశారు. శ్రీనివాసరావు నిజాయతీని పలువురు ప్రశంసించారు.

అంతర కళాశాలల వాలీబాల్ పోటీల విజేత ఏయూ

విజేత జట్టుకు జ్ఞాపిక అందజేస్తున్న ఏయూ అధికారులు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయం క్రీడలు, వ్యాయామ విద్య ఆధ్వర్యంలో ఏయూ సిల్వర్ జూబ్లీ క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న అంతర కళాశాలల పురుషుల వాలీబాల్ పోటీలు బుధవారం ముగిశాయి. చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మధ్య జరిగిన ఫైనల్స్‌లో 46-38 పాయింట్ల తేడాతో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజయం సాధించి విజేతగా నిలిచింది. ఏయూ క్రీడా, వ్యాయామ విద్య సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్, విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి, పీడీలు గోపీకృష్ణ, వై.శ్రీనివాసరావు, రామకృష్ణ, లక్ష్మణ రెడ్డి, దిలీప్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

విశాఖ తూర్పు

25న బహిరంగ వేలంపాట

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-3 పరిధిలోని వాణిజ్య సముదాయంలో ఖాళీగా ఉన్న దుకాణాలను ఈనెల 25న బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు జోనల్ కమిషనర్ కె.శివ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంవీపీకాలనీ వాణిజ్య సముదాయంలోని 4,10 నుంచి 16 వరకు, డైమండ్ పార్కు వాణిజ్య సముదాయంలోని 8,9, జగ్గారావు బ్రిడ్జి వాణిజ్య సముదాయంలోని 6వ నెంబరు దుకాణాలను, ఆర్టీసీకాంప్లెక్స్ ఎజెంబజార్, బి.టి.ఆర్.కాలనీ రెల్లివీధిలోని సామాజిక భవనాలను అద్దెకు ఇవ్వడానికి ఆశీల్‌మెట్ట జోన్-3 కార్యాలయంలో వేలంపాట జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు జోనల్ కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య
పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ: 8008574769
మద్దిలపాలెం: 9912120229

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ?: 23వ వార్డు చైతన్యనగర్ ప్రాంతంలోని కనకమ్మ ఆలయానికి వెళ్లే మార్గంలో రహదారిపై చెత్త పేరుకుపోయినా తరలించడంలేదు. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. – అప్పలరెడ్డి, చైతన్యనగర్. ✓: తక్షణమే సిబ్బందితో చెత్తను తొలగిస్తాం. –సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్.

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ?: పెదవాల్తేరు చిన్నయ మిషన్ రహదారిలో వ్యర్థాలు పోగులుగా పడి ఉన్నాయి. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. – లక్ష్మణ్, స్థానికుడు ✓: సిబ్బందిని మీ ప్రాంతానికి పంపించి వ్యర్థాలను తొలగిస్తాం. – ప్రకాష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఆరిలోవ, న్యూస్‌టుడే: ?: పైనాపిల్‌కాలనీ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం గృహ సముదాయం వద్ద రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. – శేఖర్, పైనాపిల్ కాలనీ ✓: పరిశీలించి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – ఎం.రామకృష్ణ, వీధి దీపాల పర్యవేక్షకులు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ?: ఎంవీపీకాలనీ అప్పూఘర్ మత్స్యకారకాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రుళ్లు ఇబ్బందులు పడుతున్నాం. –జి.వినయ్, మత్స్యకార కాలనీ. ✓: త్వరలో వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. –కొల్లి అప్పలనాయుడు, ఏఈ

ఇందిరానగర్ (విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: ?: పదో వార్డు సుందర్ కూడలి నుంచి పాండురంగ ఆంజనేయస్వామి ఆలయం వరకు జీటీ వల పశు సంచారం అధికమైంది. రాత్రుళ్లు చోదకులు వాటిని ఢీకొని గాయపడుతున్నారు. – జగన్నాథం, విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి ✓: సిబ్బందిని పంపించి పశువులను స్వాధీనం చేసుకుని యజమానులకు జరిమానా విధిస్తాం. – డాక్టర్ రాజారవికుమార్, పశు సంరక్షక అధికారి

స్పందనకు వందనం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 16వ వార్డు బాలసుందర్ ప్రాంతంలోని కాలువల్లో వ్యర్థాలు తొలగించక మురుగు పారుదల నిలిచిపోయిందని బుధవారం 'ఈనాడు' లో ప్రచురితమైన వార్తకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు స్పందించారు. తక్షణమే సిబ్బంది చేత కాలువల్లో పూడికలు తీయించి సమస్యను పరిష్కరించారు.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : పదోవార్డు వివేకానందనగర్ జీవీఎంసీ వాణిజ్య సముదాయం వద్ద గల హైమాస్ట్ స్తంభంలో ఒక దీపం వెలగకపోవడంతో కూడలి చీకటిగా ఉంటోందని బుధవారం 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనికి వీధి దీపాల విభాగ ఏఈ గాయత్రి స్పందించారు. ఆమె ఆదేశాల మేరకు సిబ్బంది దీపానికి మరమ్మతులు చేయించి వెలిగేలా చేశారు.

అప్పన్న ఆలయంలో ఘనంగా తదీయారాధన

సింహాచలం, న్యూస్‌టుడే: కార్తికమాసాన్ని పురస్కరించుకుని శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో బుధవారం తదీయారాధన ఘనంగా జరిగింది. ఈవో ఎన్.సుజాత ఆధ్వర్యంలో దేవస్థానం ఉద్యోగులు, సేవా కార్యకర్తలకు అప్పన్న ఆలయ కల్యాణ మండపం ప్రాంగణంలో కార్తిక వనభోజనాలు వడ్డించారు. తొలుత ఆలయ ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ప్రార్థన చేయించి స్వామికి నివేదించిన అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

పెయింటర్లకు ఉచిత శిక్షణ

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్) ఆధ్వర్యంలో పెయింటర్లకు ఒక్క రోజు ఉచిత శిక్షణ ఇస్తామని నేక్ విశాఖపట్నం అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్‌ఎస్.రవికుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ధ్రువపత్రాన్ని అందజేస్తామన్నారు. ఆసక్తి గల వారు 85005 02395 నంబరులో సంప్రదించాలన్నారు.

తవ్వారు.. తాగునీరు లేకుండా చేశారు..!

నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో దుస్థితి..

ఆరిలోవ, న్యూస్‌టుడే: 11వ వార్డు పరిధి బాలాజీనగర్, గాంధీనగర్ వీధుల్లో మంచినీటి పైపులైన్ల ఏర్పాటు చేసేందుకు తవ్వకాలు జరిపారు. దీని కోసం సుమారు నాలుగు నెలల క్రితం ఇరుకు వీధుల్లో సిమెంటు రోడ్లు తవ్వి వదిలేయడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. యంత్రంతో తవ్వే సమయంలో ఇళ్లలో ఉన్న కుళాయిల పైపులు తెగిపోయాయి. దాంతో అసలు కాలనీలకు నీళ్లు రావడంలేదని స్థానికులు వాపోతున్నారు. మరో పక్క తవ్విన సిమెంటు రోడ్ల వ్యర్థాలు ఇళ్ల ముందు పోగులుగా పడి ఉన్నాయి. ఇరుకు రోడ్లు కావడంతో ప్రజలు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. రాత్రుళ్లు పిల్లలు, వృద్ధులు పడిపోతున్నారు.

■ నీటి ధార పెంచుతామని చెప్పి..: ఈ ప్రాంతంలో వీధి కుళాయిలు ఏర్పాటు చేసినప్పటి నుంచి సన్నటి దారంతో నీళ్లు వచ్చేవి. దశాబ్ద కాలంగా ప్రజలు ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఈ విషయాన్ని పలుమార్లు నాయకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ సమస్యను పరిష్కరించేందుకు నాయకులు, అధికారులు చొరవ చూపారు. వీధుల్లో పెద్ద పైపులు వేస్తున్నారు. వాటిని ప్రధాన పైపులైనుకు అనుసంధానం చేసి

గాంధీనగర్ ఇరుకు వీధిలో రోడ్డు ఇలా..

కుళాయిల్లో నీటి ధార పెంచుతామని జీవీఎంసీ మంచినీటి సరఫరా అధికారులు చెబుతున్నారు. సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవడం సంతోషమైనా.. నాలుగు నెలల నుంచి వీధుల్లో పనులు నిలిపివేయడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని స్థానికులు పేర్కొన్నారు. గుత్తేదారు అలసత్వం, అధికారుల పర్యవేక్షణ లోపమే దీనికి కారణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వేగంగా పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

■ నాలుగు నెలలుగా అవస్థలు: వినాయక చవితి ముందు వీధుల్లో రోడ్లను యంత్రంతో తవ్వినప్పుడు కుళాయి పైపులు దెబ్బతిన్నాయి. అప్పటి నుంచి మాకు నీరు రావడం లేదు. వారం రోజుల్లో బాగు చేస్తామన్నారు. నాలుగు నెలలైనా పట్టించుకోవడం లేదు. పక్క వీధుల్లో ఇళ్ల బోరునీరు మోసుకుని తెచ్చుకుంటున్నాం. తాగేనీరు కొనుగోలు చేసుకుని తెచ్చుకుంటున్నారు. నెలలపాటు ఇళ్ల ముందు గుంతలు ఉండటంతో వాహనాలు నిలుపుకోలేక ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి. – పి. లోలాక్షి, బాలాజీ నగర్

రూ.70లక్షలతో పార్కుల సుందరీకరణ

భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి తదితరులు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 18వ వార్డు ఎంవీపీకాలనీ సెక్టార్-2లో పార్కుల అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శంకుస్థాపన చేశారు. బాలాజీ, వెస్టర్న్ పార్కులను సుమారు రూ.70లక్షల వ్యయంతో ఆధునీకరిస్తున్నట్లు చెప్పారు. అనంతరం వార్డులోని ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తి.తి.దే. స్థానిక సలహా కమిటీ అధ్యక్షురాలు సి.హెచ్.వి.పట్టాభిరామ్, కార్పొరేటర్ జి.మంగవేణి, జీవీఎంసీ ఏ.ఇ. అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జనరంజకంగా కూటమి ప్రభుత్వ పాలన

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : మాస్కు అడిగినందుకు దళిత వైద్యుడు డాక్టర్ సుధాకర్‌పై పిచ్చివాడిగా ముద్రవేసిన ఆయన మరణానికి జగన్ కారకుడయ్యాడని మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. బుధవారం ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. జగన్ పాలన అంతా విధ్వంసం, విద్వేషంతో కొనసాగిందన్నారు. ప్రస్తుత చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వ పాలన జనరంజకంగా సాగుతోందన్నారు. అయినా వైకాపా నాయకులు విషం కక్కుతున్నారని ధ్వజమెత్తారు. అన్నక్యాంటీన్లు, మెగా డీఎస్సీ, పింఛన్ల పెంపు, ఉచిత సిలిండర్లు, స్త్రీశక్తి, రైతుభరోసా, మత్స్యకార సేవలో, తల్లికి వందనం, ఆటోడ్రైవర్ల సేవలో పథకాలు అమలు చేస్తుంటే జగన్ ఓర్వలేకపోతున్నారని తెలిపారు. మెడికల్ కళాశాలల సందర్శన, తుపాను బాధితుల పరామర్శ పేరిట బలప్రదర్శనలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని దుయ్యబట్టారు. తెదేపా విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుడుమూరి గోవింద్, నాయకులు గాడి సత్యం తదితరులు ఆమెను సత్కరించారు. ఎస్సీ యువతకు రాయితీతో కూడిన రుణాలు ఇవ్వాలని కోరారు. మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ఈతలపాక సుజాత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉండవల్లి శ్రీదేవిని సత్కరిస్తున్న తెదేపా నాయకులు

మొక్కల సంరక్షణ గాలికి..

సూర్యతేజనగర్ వద్ద ఎండిపోతున్న మొక్కలు

చినగదిలి కూడలి నుంచి ఆరిలోవ వెళ్లే ప్రధాన మార్గంలో సూర్యతేజనగర్ దగ్గర కాలినడక పక్కనున్న ఖాళీ స్థలంలో 2024లో 'వనం..మనం' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మొక్కలు నాటారు. మొక్కలు చెట్లుగా ఎదిగేవరకు సంరక్షించాలని అధికారులను ఆదేశించారు. అయితే జీవీఎంసీ ఉద్యానవిభాగ అధికారులు పట్టించుకోకపోవడంతో మొక్కలు చనిపోతున్నాయి. వాటికి రక్షణగా వేసిన ట్రీ గార్డ్స్ ఇప్పుడు లేవు. అదే విధంగా విభాగినుల్లో ఉన్న మొక్కలు కూడా ఎండిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మొక్కలను సంరక్షించాలని స్థానికులు కోరుతున్నారు. – ఆరిలోవ, న్యూస్‌టుడే

యూజీడీ మురుగు.. రహదారిపై పరుగు

చినవాల్తేరు కాపు వీధిలో భూగర్భ డ్రైనేజీ (యూజీడీ)లీకై రహదారిపై మురుగు, వ్యర్థాలు ప్రవహిస్తున్నాయి. ఈ ప్రాంతమంతా దుర్వాసనతో నిండి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే సమస్య తీవ్రత మరింత పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యూజీడీ లీకుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. – పెదవాల్తేరు, న్యూస్‌టుడే

చినవాల్తేరు కాపువీధిలో..

ఉచిత దంతవైద్య శిబిరానికి స్పందన

దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: తోటగరువు రాధాకృష్ణ కల్యాణ మండపంలో జరుగుతున్న ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో భాగంగా బుధవారం ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన స్థానికులకు క్లోవ్ దంత ఆసుపత్రి వైద్యుల బృందం పరీక్షలు చేసి వైద్య సలహాలు అందించారు. ప్రిన్సిపల్ బీసీఎన్ఎస్ మూర్తి, రీజనల్ మేనేజర్ పి.రామకృష్ణారెడ్డి, ఉప ప్రిన్సిపల్ ఎస్వీ బాబ్జీ, ఎన్ఎస్ఎస్ ప్రాజెక్ట్ అధికారి ఎస్.భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే విజయం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రణాళికతో చదివితే విజయం సాధించవచ్చని ఏయూ సైన్సు కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.వి.రామరాజు అన్నారు. బుధవారం కృష్ణా డిగ్రీ కళాశాలలో మానసిక సమస్యలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు లక్ష్యంతో ముందుకు వెళ్లాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఐ.విజయబాబు, ఉప ప్రిన్సిపల్ పి.జయ, అధ్యాపకులు రవిబాబు, ఎం.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆచార్య ఎం.వి.రామరాజు

'సంతాన ప్రాప్తిరస్తు' చిత్ర బృందం సందడి

అక్కయ్యపాలెం, జగదాంబ కూడలి, న్యూస్‌టుడే: సంతాన ప్రాప్తిరస్తు సినిమా ప్రేక్షకుల్ని అలరిస్తుందని ఆ సినిమా హీరో, హీరోయిన్ విక్రాంత్, చాందిని పేర్కొన్నారు. డైమండ్ పార్కు సమీపంలోని ఓ హోటల్‌లో బుధవారం మధ్యాహ్నం సినిమా యూనిట్ సందడి చేసింది. ఈ సందర్భంగా హీరో హీరోయిన్ మాట్లాడుతూ మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్‌పై మధుర శ్రీధర్‌రెడ్డి, నిర్వి హరిప్రసాద్‌రెడ్డి నిర్మిస్తున్నారని, దర్శకుడు సంజీవ్‌రెడ్డి తెరకెక్కిస్తున్నారన్నారు. ఈ సినిమా ఈ నెల 14న విడుదల కానుందన్నారు. సమాజానికి చెప్పాల్సిన అంశాలు ఉన్నాయన్నారు. వెన్నెల కిశోర్, అభినవ్, తరుణ్‌భాస్కర్ వంటి నటులు ఉన్నారన్నారు.

చాందిని, విక్రాంత్

చదువుకునేందుకు అన్ని వసతులు కల్పిస్తున్నాం

మాధవధార, న్యూస్‌టుడే: వసతి గృహాల్లోని విద్యార్థులు చదువుకునేందుకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని పేద పిల్లలు ఉన్నత చదువులు అభ్యసించి ఎదగాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా ఇన్‌ఛార్జి, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డీఎస్‌బీవీ స్వామి అన్నారు. జీవీఎంసీ 51వ వార్డు కళింగనగర్‌లోని ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలను రూ.143 కోట్లతో మరమ్మతులు చేసి సౌకర్యాలు కల్పించారన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. విద్యార్థులను సొంత పిల్లల్లా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి డీఎస్‌బీవీ స్వామి

మహిళల బాక్సింగ్ పోటీల్లో సత్తా

విశాఖక్రీడలు, న్యూస్‌టుడే : ఏయూ అంతర్ కళాశాలల మహిళల బాక్సింగ్ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల జట్టు గెలుపొందింది. ఏయూ వ్యాయామ విభాగం ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో బుల్లయ్య కళాశాల క్రీడాకారులు హీనా 48 కిలోల విభాగంలో స్వర్ణం, మల్లిక 51 కిలోల విభాగంలో స్వర్ణం, సౌజన్య 54 కిలోల విభాగంలో కాంస్యం, హర్షిత 57 కిలోల విభాగంలో రజతం గెలుపొందారు. ఎస్.జి.ఎస్.మల్లిక బెస్ట్ బాక్సర్ అవార్డు సాధించింది. బుధవారం విజేతలను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ అభినందించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.ఎస్.కె.చక్రవర్తి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య డి.దీపక్‌చౌదరి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, పీడీ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేతలతో కరస్పాండెంట్ జి.మధుకుమార్, తదితరులు

ఆకట్టుకునేలా భాగస్వామ్య సదస్సు వేదికలు

భారీ తెర ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. ఈ మేరకు ప్రధాన వేదికతో పాటు అనుబంధ వేదికల నిర్మాణం పూర్తయింది. కార్మికులు రాత్రింబవళ్లు శ్రమించి అనుకున్న సమయానికి వీటిని పూర్తి చేశారు. అదే విధంగా ఇంజినీరింగ్ కళాశాల మైదానాన్ని కూడా సుందరంగా తీర్చిదిద్దారు. రోడ్లు అద్దంలా మెరిసిపోతుండగా, డివైడర్లు రంగులతో కళకళలాడుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం రాత్రి నగరానికి చేరుకోవడంతో అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తమయ్యారు. మిగిలిన చిన్నచిన్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడానికి ఉరుకులు పరుగులు పెడుతున్నారు. 2022లో ఇదే మైదానంలో అప్పటి వైకాపా ప్రభుత్వం చేసిన ఏర్పాట్లతో ప్రస్తుత ఏర్పాట్లను సందర్శకులు పోల్చుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అద్భుతంగా చేస్తోందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

వేదిక బయట రంగులతో ముస్తాబు

లోపలికి వెళ్లే మార్గాన్ని తీర్చిదిద్దుతూ..

పరిశోధనలు సమాజానికి ఉపయోగపడాలి

ఏయూ సమాచారం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: నవ్య ఆలోచనలతో పరిశోధనలు చేయాలని, వాటి ఫలితాలు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ(శ్రీకాకుళం) పూర్వ ఉపకులపతి ఆచార్య నిమ్మ వెంకటరావు అన్నారు. ఏయూ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా విద్యా విభాగం ఆధ్వర్యంలో 'రీసెర్చ్ మెథడాలజీ' అంశంపై ఏర్పాటు చేసిన కార్యశాల ముగింపు కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొని ప్రసంగించారు. విశిష్ట పరిశోధనలతోనే విశ్వవిద్యాలయానికి గుర్తింపు లభిస్తుందన్నారు. సదస్సు కన్వీనర్, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ కార్యశాలలో నేర్చుకున్న అంశాలు పరిశోధనలు జరిపే దిశగా ప్రేరణ కలిగిస్తాయన్నారు. ఏయూ వ్యాయామ విద్య సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్, ఆచార్య నాగార్జున వర్సిటీ డీన్ ఆచార్య టి.స్వరూపరాణి, కేంద్రియ విశ్వవిద్యాలయం(ఒడిశా) విద్యా విభాగ ఆచార్యులు అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కార్యశాలలో ప్రసంగిస్తున్న ఆచార్య నిమ్మ వెంకటరావు

అంతర కళాశాలల వాలీబాల్ పోటీల విజేత ఏయూ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయం క్రీడలు, వ్యాయామ విద్య ఆధ్వర్యంలో ఏయూ సిల్వర్ జూబ్లీ క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న అంతర కళాశాలల పురుషుల వాలీబాల్ పోటీలు బుధవారం ముగిశాయి. చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మధ్య జరిగిన ఫైనల్స్‌లో 46-38 పాయింట్ల తేడాతో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజయం సాధించి విజేతగా నిలిచింది. ఏయూ క్రీడా, వ్యాయామ విద్య సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్, విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి, పీడీలు గోపీకృష్ణ, వై.శ్రీనివాసరావు, రామకృష్ణ, లక్ష్మణ రెడ్డి, దిలీప్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

విజేత జట్టుకు జ్ఞాపిక అందజేస్తున్న ఏయూ అధికారులు

ఆర్సీడీ ఆసుపత్రికి నూతన భవనం..!

రూ.కోటితో పాతభవనం ఆధునికీకరణ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పెదవాల్తేరు రాణిచంద్రమణి దేవి(ఆర్సీడీ) ఆసుపత్రిలో త్వరలో కొత్త భవనం అందుబాటులోకి రానుంది. ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ పి. హెచ్.వి.మురళీకృష్ణ బాధ్యతలు చేపట్టిన తరువాత చిన్న పిల్లలకే కాకుండా ఇతరులకు కూడా ఎముకల వైద్యం అందిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయాలైన వారికి, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నవారికి ఇక్కడ వైద్యం అందించడంతోపాటు శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగులు పెరుగుతున్నారు. ఫలితంగా ఆసుపత్రి భవనం సరిపోక సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆవరణలో నిరుపయోగంగా ఉన్న పాత భవనాన్ని ముస్తాబు చేస్తున్నారు.

రూపుదిద్దుకుంటున్న పాత భవనం

● రూ.కోటితో మరమ్మతులు: గతంలో ఆసుపత్రిలో పోలియో బాధితులకు చికిత్స అందించేవారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి బాధితులు ఇక్కడికి వచ్చేవారు. కాలక్రమేణా పోలియో కేసులు తగ్గిపోవడంతో ఇక్కడికి వచ్చే రోగుల సంఖ్య పడిపోయింది. దీంతో అప్పటి వరకు కళకళలాడిన భవనాలు బోసిపోయాయి. ఏళ్లుగా నిరుపయోగంగా పడి ఉన్నాయి. ముళ్ల పొదలతో నిండి విషసర్పాలు తిరుగుతున్నాయి. అలాంటివాటిలో పాడుబడిన విశాలమైన భవనాన్ని ప్రస్తుతం రూ.కోటి వ్యయంతో ఆధునికీకరిస్తున్నారు. ముళ్ల పొదలను తొలగించి భవనంలోని 21 గదులకు మరమ్మతులు చేయించారు. రంగులు వేయాల్సి ఉంది. త్వరలో ప్రారంభానికి సిద్ధం చేసి పాత భవనంలోని పలు విభాగాలను ఇక్కడికి తరలిస్తామని డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు.

● మార్పు చేసే విభాగాలు ఇలా: ప్రధానంగా ఓపీ విభాగాన్ని మార్పు చేస్తున్నారు. తర్వాత ఎక్స్‌రే, ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, రక్తపరీక్షల ల్యాబ్, రోగుల సహాయకులు విశ్రాంతి తీసుకునే గది, మందులిచ్చే గది, క్లినికల్ సైకాలజీ, డ్రస్సింగ్ తదితర విభాగాలను ఇక్కడికి మార్పు చేయనున్నారు. రెండు నెలల్లో భవనం అందుబాటులోకి వస్తుందని డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు.

నిబంధనల ప్రకారం ఆటోలు నడపాలి

మాధవధార, న్యూస్‌టుడే: నేటి నుంచి మూడు రోజుల పాటు నగరంలో భాగస్వామ్య సదస్సు నిర్వహించనున్నందున ఆటో డ్రైవర్లందరూ రవాణా, పోలీస్ శాఖ నిబంధనల ప్రకారం ఆటోలను నడపాలని డీటీసీ ఆర్.సి.హెచ్.శ్రీనివాస్ తెలియజేశారు. ప్రయాణికులు, ఇతర వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నడపాలని సూచించారు. సదస్సుకు కేంద్ర, రాష్ట్ర మంత్రులతో పాటు, దేశ, విదేశాల నుంచి వివిధ సంస్థల ప్రతినిధులు వస్తుండటంతో సభ ప్రాంగణం వద్దకు చేర్చడానికి 900 వరకు వాహనాలను కేటాయించడం జరిగిందని రవాణా శాఖ అధికారులు తెలియజేశారు. బస్సులు, మినీ బస్సులు, కార్లు ఇతర వాహనాలు అందుబాటులో ఉంచామని తెలిపారు.

వైభవుని సన్నిధిలో పవిత్రోత్సవాలు

మురళీనగర్, న్యూస్‌టుడే: ఎన్‌జీజీఓస్‌కాలనీ కప్పరాడ వైభవ వేంకటేశ్వరుడి దివ్యక్షేత్రంలో ఈనెల 14 నుంచి 16 వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. 14న ఉదయం విశేష హోమాలు, సాయంత్రం 6 గంటలకు పద్మావతి అమ్మవారికి కుంకుమార్చన, 15న శ్రీవారి సుప్రభాత సేవ, విశేష హోమాలు, ఉదయం 9 గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, మధ్యాహ్నం 12 గంటలకు నారాయణ సేవ ఉంటుందన్నారు. 16న శ్రీవారి పవిత్రాలంకృత ప్రభాత దర్శనం, శ్రీవారి ఉత్సవమూర్తులకు స్నపన మహోత్సవం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాల్లో భక్తులందరూ పాల్గొనాల్సిందిగా ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు.

మర్యాదపూర్వక భేటీ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి బుధవారం వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సిరిపురం వీఎంఆర్డీఏ కార్యాలయంలో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్లు ఈతలపాక సుజాత, నాగభూషణ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ పాల్గొన్నారు.

CHANGE OF NAME
I, MANTENA LALITHA, W/O Mantena Mohan Krishnam Raju, previously called ADDALA LALITHA, resident of 9-41-28/1, pithapuram colony, Opp ICAI Bhavan, Visakhapatnam - 530003 Andhra pradesh, Now changed my name from ADDALA LALITHA to MANTENA LALITHA. Henceforth I Will be called as MANTENA LALITHA for all purpose.

(c) eenadu

విశాఖ ఉత్తరం

• విశాఖ ఉత్తరం • విశాఖ దక్షిణం

మోహన్‌రావుతో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

వినతిపత్రం అందజేత

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పరకాంగ్ పీహెచ్ (మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్) వేత నాల్లో జరిగిన వ్యత్యాసాలు సవరించాలని ఏపీ ప్రభుత్వ వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీనివాసాచార్యులు, నగేష్‌పట్నాయక్, శేషుబాబు కోరారు. బుధవారం ఖజానాశాఖ డీడీ మోహన్‌రా వును కలిసి వినతిపత్రం అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796

విశాఖ దక్షిణం: 8008574977

గురుద్వారా, న్యూస్‌టుడే: ?: సీతమ్మధార రైతుబజార్ పక్కన హాకర్ జోన్ సమీపంలోని రహదారిపై వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. – రామాంజనేయులు ✓: చెత్తను తరలించేలా చర్యలు తీసుకుంటాం. – పారిశుద్ధ్య నిర్వహణ అధికారి, 13వ వార్డు

న్యూస్‌టుడే, జగదాంబకూడలి: ?: జీవీఎంసీ 37వ వార్డు గొల్లలపేట భజన ఆలయం వద్ద మాగ్గుడ్రైనేజీ నుంచి మురుగు లీకవుతోంది. తీవ్ర దుర్వాసనతో స్థానికులు, భక్తులు ఇబ్బంది పడుతున్నారు. – అప్పలరెడ్డి. ✓: సిబ్బందిని పంపి, శుభ్రత పనులు చేయిస్తాం. –నవీన్, వార్డు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్

మురళీనగర్, న్యూస్‌టుడే: ?: సెక్టార్-11 జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల సమీపంలో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. – చంద్రశేఖర్ ✓: దీపం వెలిగించి సమస్యను పరిష్కరిస్తాం. – అర్చన, వీధి దీపాల ఏఈ

స్పందనకు వందనం

దీపాలు బాగు చేశారు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : జీవీఎంసీ 29వ వార్డు దండుబజార్‌లో విద్యుత్తు దీపాలు వెలగడం లేదన్న సమస్యపై ఇటీవల 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. తమ సిబ్బందితో మరమ్మతులు చేయించి, దీపాలు వెలిగించారు.

వసతిగృహ నిర్మాణానికి శంకుస్థాపన

వన్‌టౌన్, న్యూస్‌టుడే : దక్షిణం పరిధి మహారాణిపేటలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్మించే కళాశాల బాలికల వసతి గృహ నిర్మాణ పనులకు బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్య, వైద్య రంగాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. బాలికల ఉన్నత చదువులకు ప్రభుత్వం చేయూతనిస్తుందని, ప్రతి ఒక్కరూ పట్టుదలతో చదువుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

బడ్డీలు.. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలు..

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 44వ వార్డు పరిధి అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డు నుంచి మాదేటిగార్డెన్స్ మీదుగా అబిద్‌నగర్ పార్కుకు వెళ్లే దారిలోని నాలుగు రోడ్ల కూడలిలో ఎటువంటి అనుమతులు లేకుండా బడ్డీలు ఏర్పాటు చేస్తున్నారు. రోడ్డు పక్కన వీటిని పెట్టడం వల్ల దారి కుదించుకుపోయి ఇరుకుగా మారుతోంది. బడ్డీల ఎదుట వినియోగదారులు తమ వాహనాలను గంటల తరబడి ఉంచేయడంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ రహదారిలో నిత్యం వేలాది వాహనదారులు ప్రయాణించడంతో వాహనాల పార్కింగ్ వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయంటూ కొంతమంది ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరంలో ఏ వీధిలో వెళ్లి చూసినా ఇటువంటి బడ్డీలే దర్శనమిస్తున్నాయి. స్థానిక నాయకుల అండదండలతో విచ్చలవిడిగా రహదారులను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు.

సాయంత్రమైతే చాలు..: రహదారి పక్కనున్న బడ్డీల వద్ద సాయంత్రమైతే చాలు ఆకతాయిలు చేరి అక్కడే సిగరెట్లు, మద్యం తాగడం వంటివి చేస్తున్నారు. కుర్రాళ్లు గుంపులుగా మారి అక్కడే తగాదాలు పడటం, వాహనాలను అక్కడే గంటల కొద్దీ ఉంచడంతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. సాయంత్రం ఇంటి నుంచి బయటకు రావాలంటే భయాందోళన చెందుతున్నామని విద్యార్థులు, మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు, పోలీసులు స్పందించి బడ్డీల దగ్గర మద్యం తాగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మాదేటిగార్డెన్స్ నుంచి అబిద్‌నగర్ పార్కుకు వెళ్లే రహదారి పక్కన ఏర్పాటు చేసిన బడ్డీలు

చదువుకునేందుకు అన్ని వసతులు కల్పిస్తున్నాం

మాధవధార, న్యూస్‌టుడే: వసతి గృహాల్లోని విద్యార్థులు చదువుకునేందుకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని పేద పిల్లలు ఉన్నత చదువులు అభ్యసించి ఎదగాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా ఇన్‌ఛార్జి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డీఎస్‌బీవీ స్వామి అన్నారు. జీవీఎంసీ 51వ వార్డు కొండగనగర్‌లోని ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలను రూ.143 కోట్లతో మరమ్మతులు చేసి సౌకర్యాలు కల్పించారన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. విద్యార్థులను సొంత పిల్లల మాదిరిగా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి డీఎస్‌బీవీ స్వామి

ఆదమరిస్తే అపాయమే..!

జీవీఎంసీ 24వ వార్డు టీపీటీకాలనీ రహదారి నెంబర్-4 కూడలిలో భారీ గొయ్యి ఏర్పడింది. నిత్యం రద్దీగా ఉండే కూడలి ప్రాంతం కావడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రాత్రి వాహనాల అందులో పడి చోదకులు గాయాలపాలవుతున్నారు. స్థానికులు ప్రమాద సూచికగా కొబ్బరిమట్టను అందులో పెట్టారు. కొద్ది రోజులుగా ఇలానే ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. గుంతను కప్పి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, గురుద్వారా

ఎప్పుడు ఎవరిమీద పడుతుందో..?

వీధి దీపం వెలగడం సంగతి ఏమో గాని, అది వేలాడి ప్రమాదకరంగా మారడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. జీవీఎంసీ 51వ వార్డు కొండగనగర్‌లోని 756ఎ/9 స్తంభానికి ఉన్న వీధి దీపం గత వారం రోజులుగా విరిగి వేలాడుతోంది. అది ఎప్పుడు ఎవరి నెత్తిన పడుతుందోనని కాలనీ ప్రజలు ప్రతి రోజూ ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు వీధి దీపాల నిర్వహణ సిబ్బందికి తెలియజేసినప్పటికీ కనీసం పట్టించుకోవడం లేదని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మాధవధార

అందంగా.. ఆకర్షణీయంగా..

కార్పొరేషన్, న్యూస్‌టుడే : భాగస్వామ్య సదస్సు నేపథ్యంలో మహా విశాఖ నగర పాలక సంస్థ రూ.60 కోట్లతో చేపట్టిన ఆధునీకరణ, అభివృద్ధి పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ఎక్కడికక్కడ రోడ్లను అద్దంలా తీర్చిదిద్దడంతో పాటు, ప్రధాన కూడళ్లలో ఫౌంటెయిన్లు, ఐలాండ్లలో వివిధ రకాల బొమ్మలు ఏర్పాటు చేశారు. నడక మార్గాలకు రంగులు వేసి, బస్‌బేలకు, ప్రహరీలకు విద్యుత్తు దీపాలతో అలంకరణ చేశారు.

నిబంధనల ప్రకారం ఆటోలు నడపాలి

మాధవధార, న్యూస్‌టుడే: నేటి నుంచి మూడు రోజుల పాటు నగరంలో భాగస్వామ్య సదస్సు నిర్వహించనున్నందున ఆటో డ్రైవర్లందరూ రవాణా, పోలీస్ శాఖ నిబంధనల ప్రకారం ఆటోలను నడపాలని డీటీఓ ఆర్.సి.హెచ్. శ్రీనివాస్ తెలియజేశారు. ప్రయాణికులు, ఇతర వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నడపాలని సూచించారు. సదస్సుకు కేంద్ర, రాష్ట్ర మంత్రులతో పాటు, దేశ, విదేశాల నుంచి వివిధ సంస్థల ప్రతినిధులు వస్తుండటంతో సభ ప్రాంగణం వద్దకు చేర్చడానికి 900 వరకు వాహనాలను కేటాయించడం జరిగిందని రవాణా శాఖ అధికారులు తెలియజేశారు. బస్సులు, మినీ బస్సులు, కార్లు ఇతర వాహనాలు అందుబాటులో ఉంచామని తెలిపారు.

మత్స్యకార గణన పై అవగాహన

వన్‌టౌన్, న్యూస్‌టుడే : కేంద్ర పాలిత ప్రాంతమైన లక్షద్వీప్‌లోని దీప్ పంచాయతీ చెట్లట్ గ్రామంలో బుధవారం నిర్వహించిన మత్స్యకార గణన అవగాహన కార్యక్రమంలో విశాఖలోని భారత మత్స్య పరిశోధన సంస్థ (ఎఫ్ఎస్ఐ) శాస్త్రవేత్త జీవీఏ.ప్రసాద్ పాల్గొన్నారు. ఎఫ్ఎస్ఐ డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు చెట్లట్‌కు వెళ్లిన ప్రసాద్ అక్కడి మత్స్యకారులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమ గోడపత్రిక విడుదల చేశారు.

గోడపత్రిక ప్రదర్శిస్తున్న శాస్త్రవేత్త ప్రసాద్, తదితరులు

ముక్కంటి సేవలో విశాఖ ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: విశాఖ ఉత్తరం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కుటుంబసభ్యులతో వాయులింగేశ్వరుని దర్శనార్థం వచ్చారు. వీరికి బుధవారం ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్ ఘనంగా స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఎమ్మెల్యే కుటుంబీకులతో ఛైర్మన్ కొట్టేసాయిప్రసాద్

నిందితులపై చర్యలకు డిమాండ్

కార్పొరేషన్, న్యూస్‌టుడే : దిల్లీ బాంబు పేలుళ్ల ఘటనకు సంబంధించిన నిందితులను పట్టుకుని, కఠిన చర్యలు తీసుకోవాలని జన జాగరణ సమితి నగర సమన్వయకర్త చింతపల్లి సునీల్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశ ప్రజలంతా ఐక్యం కావాలని, దేశంలో ఉంటూ ఉగ్రవాదానికి మద్దతుగా పని చేస్తున్న వారి వివరాలు తెలిస్తే.. పోలీసులకు చెప్పాలన్నారు. సమితి ప్రతినిధులు దుర్గాప్రసాద్, శంకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి'

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : పీపీపీ పద్ధతిలో రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ ఆధ్వర్యంలో పూర్ణమార్కెట్ నుంచి జగదాంబ కూడలి వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. నాయకులు కోలా గురువులు, కొండా రాజీవ్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

రామునాయుడు మృతి తీరనిలోటు

అల్లిపురం, సీతంపేట, న్యూస్‌టుడే : అనకాపల్లి జిల్లా సీపీఐ ప్రధాన కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు (53) బుధవారం బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆయన మృతి పార్టీకి తీరనిలోటని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు జె.వి.సత్యనారాయణమూర్తి, రాష్ట్ర సమితి సభ్యులు చలసాని రాఘవేంద్రరావు, ఎం.పైడిరాజు తదితరులు అభిప్రాయపడ్డారు. విశాఖ జిల్లా ప్రజా నాట్యమండలి అధ్యక్షునిగా, విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యునిగా రామునాయుడు అందించిన సేవలు మరువలేనివని వారు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

కేకే.లైన్‌లో డీఆర్ఎం తనిఖీలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : తూ.కో.రైల్వే వాల్తేర్ డీఆర్ఎం లలిత్‌బోహ్రా బుధవారం కేకే.లైన్‌లో తనిఖీలు నిర్వహించారు. రైల్వే కార్యకలాపాలను సమీక్షించడంతో పాటు, వివిధ అంశాలపై ఎన్ఎండీసీ అధికారులతో చర్చలు జరిపారు. రేక్ లోడింగ్ సామర్థ్యం గణనీయంగా పెంచడంతో పాటు ఇరు సంస్థలకు అదనపు ఆదాయం సమకూరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

అధికారులతో కలిసి పర్యటిస్తున్న డీఆర్ఎం లలిత్‌బోహ్రా

పెయింటర్లకు ఉచిత శిక్షణ

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్) ఆధ్వర్యంలో పెయింటర్లకు ఒక్క రోజు ఉచిత శిక్షణ ఇస్తామని నేక్ విశాఖపట్నం అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్. రవికుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ధ్రువపత్రాన్ని అందజేస్తామన్నారు. ఆసక్తి గల వారు 85005 02395 నంబరులో సంప్రదించాలన్నారు.

మహిళల బాక్సింగ్ పోటీల్లో సత్తా

విశాఖక్రీడలు, సీతంపేట, న్యూస్‌టుడే : ఏయూ అంతర్ కళాశాలల మహిళల బాక్సింగ్ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల జట్టు గెలుపొందింది. ఏయూ వ్యాయామ విభాగం ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో బుల్లయ్య కళాశాల క్రీడాకారులు హీనా 48 కిలోల విభాగంలో స్వర్ణం, మల్లిక 51 కిలోల విభాగంలో స్వర్ణం, సౌజన్య 54 కిలోల విభాగంలో కాంస్యం, హర్షిత 57 కిలోల విభాగంలో రజతం గెలుపొందారు. ఎస్.జి.ఎస్.మల్లిక బెస్ట్ బాక్సర్ అవార్డు సాధించింది. బుధవారం విజేతలను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి. మధుకుమార్ అభినందించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.ఎస్.కె.చక్రవర్తి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య డి.దీపక్‌చౌదరి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, పీడీ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేతలతో కరస్పాండెంట్ జి.మధుకుమార్, తదితరులు

పేదవాడి సొంతింటి కల నెరవేరుస్తాం

సీతంపేట, న్యూస్‌టుడే: ప్రతి పేదవాడికి సొంత ఇంటి కల నెరవేర్చే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందని దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. సీతంపేటలోని జనసేన నగర పార్టీ కార్యాలయంలో ఆయన బుధవారం ప్రధానమంత్రి ఆవాస్ యోజనా పథకం(పీఎంఏవై) లబ్ధిదారులు 21 మంది పట్టాలు అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల పక్షపాతి అని సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే వంశీకృష్ణ

సేవా రహదారిలో నిలిచిన ట్రాఫిక్

మాధవధార, న్యూస్‌టుడే: జాతీయ రహదారి బిర్లా కూడలి సేవా రోడ్డులో బుధవారం మధ్యాహ్నం ఒక భారీ వాహనం కారణంగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఇండస్ట్రియల్ ఎస్టేట్ వైపు వెళ్లాల్సిన ఈ వాహనం మార్గం తెలియక ఇటువైపు సేవా రహదారి వైపు తిప్పాడు. వెనకకు వెళ్లాలని తెలుసుకొని వాహనాన్ని తిప్పేందుకు సుమారు గంట సమయం పట్టడంతో వాహనాలన్నీ నిలిచిపోయాయి. మరో వైపు పాస్‌పోర్టుకు వచ్చే ప్రజలు తమ ద్విచక్ర వాహనాలను, కార్లను సేవా రహదారి పైనే పార్కింగ్ చేయడంతో చోదకులు మరింత ఇబ్బందులకు గురయ్యారు. ట్రాఫిక్ పోలీసులు స్పందించి పాస్‌పోర్టు కార్యాలయం వద్ద వాహనాల పార్కింగ్ కోసం తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

బిర్లా కూడలి వద్ద అడ్డంగా నిలిచిపోయిన వాహనం

అలరించిన సాహితీ సమ్మేళనం

సీతంపేట, న్యూస్‌టుడే: సహృదయ సాహితి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాల ఆవరణలో సాహితీ కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ హిందీ రచయిత్రి డాక్టర్ మయాషబ్నమ్ రచించిన 'ఆర్యవర్తికీ కుల వధ'పై హిందీ రచయిత్రి డా.చిట్టిళ్ల నిర్మలాదేవి ప్రసంగించారు. ఆ నవలలో ద్రౌపది వ్యక్తిత్వాన్ని, సౌందర్యాన్ని, ఆమెలోని కరుణ, క్షమాగుణాలను వర్ణించారు. సభకు వేణు అధ్యక్షత వహించగా, డీవీ సూర్యారావు, ద్విభాష్యం రాజేశ్వరరావు, సీహెచ్ చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణ మూర్తి, సోమంచి వినయ్ భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నిర్మలాదేవి

పనిచేసే వారికి ప్రాధాన్యం

'తెదేపా'లో నూతన నియామకాలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : తెలుగుదేశం పార్టీలో పని చేసే వారికి ప్రాధాన్యం ఉంటుందని విశాఖ దక్షిణం ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్ అన్నారు. బుధవారం ఆయన నియోజకవర్గం పరిధిలోని 13 వార్డులకు కొత్తగా నియమితులైన వార్డు అధ్యక్షులు, కన్వీనర్లు, కో-కన్వీనర్లు, క్లస్టర్, కో-క్లస్టర్ బాధ్యులతో నగర తెదేపా కార్యాలయంలో ప్రమాణం చేయించారు. వార్డు అధ్యక్షులుగా అల్లూరి సత్యనారాయణరెడ్డి (27), కండిపల్లి సతీష్ (29), డొకర రమణ(30), బత్తిన వెంకట సత్యనవీన్‌కుమార్(31), దాసరి దుర్గారెడ్డి (32), కర్రి నీలకంఠం(33), వాసుపల్లి రాంకుమార్ (34), బుచ్చా రామురెడ్డి (35), ఓదూరు శివయ్య (36), పిల్లా తాతయ్య(37), మజ్జి త్రినాథరావు(38), మైలపల్లి శ్రీనివాస్(39), ఐతి మధుబాబు(41) ఎంపికయ్యారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఎంపీ శ్రీభరత్, ఇంఛార్జి మంత్రి డీఎస్‌బీవీ స్వామి, పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అన్ని వార్డులకు కొత్త కమిటీలు ఏర్పాటు చేశామని సుధాకర్ పేర్కొన్నారు.

వార్డు అధ్యక్షులతో ప్రమాణం చేయిస్తున్న సీతంరాజు సుధాకర్

చాందిని, విక్రాంత్

'సంతాన ప్రాప్తిరస్తు' చిత్ర బృందం సందడి

అక్కయ్యపాలెం, జగదాంబకూడలి, న్యూస్‌టుడే: సంతాన ప్రాప్తిరస్తు సినిమా ప్రేక్షకుల్ని అలరిస్తుందని ఆ సినిమా హీరో, హీరోయిన్ విక్రాంత్, చాందిని పేర్కొన్నారు. డాబాగార్డెన్స్, డైమండ్ పార్కు సమీప హోటళ్లలో బుధవారం మధ్యాహ్నం సినిమా యూనిట్ సందడి చేసింది. ఈ సందర్భంగా హీరో హీరోయిన్ మాట్లాడుతూ మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్‌పై మధుర శ్రీధర్‌రెడ్డి, నిర్వి హరిప్రసాద్‌రెడ్డి నిర్మిస్తున్నారని, దర్శకుడు సంజీవ్‌రెడ్డి తెరకెక్కిస్తున్నారన్నారు. ఈ సినిమా ఈ నెల 14న విడుదల కానుందన్నారు. సమాజానికి చెప్పాల్సిన అంశాలు ఉన్నాయన్నారు. వెన్నెల కిశోర్, అభినవ్, తరుణ్‌భాస్కర్ వంటి నటులు ఉన్నారన్నారు.

గౌరీ పరమేశ్వరుల ఆలయంలో భారీ అన్నసమారాధన

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా జీవీఎంసీ 47వ వార్డు కప్పరాడలోని గౌరీ పరమేశ్వరుల ఆలయంలో బుధవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీ శ్రీభరత్ పాల్గొని ప్రారంభించారు. అంతకుముందు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, కార్యదర్శి పొలమరశెట్టి శ్రీను, వార్డు తెదేపా అధ్యక్షుడు చెంగల శ్రీను, కార్యదర్శి రాజు, ఆలయ కమిటీ అధ్యక్షుడు దిగుమూర్తి నూకరాజు పాల్గొన్నారు.

భోజనం వడ్డిస్తున్న ఎంపీ భరత్, కూటమి నాయకులు

వైభవంగా.. కార్తిక దీపోత్సవం

గురుద్వారా, న్యూస్‌టుడే: హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో సీతమ్మధార క్షత్రియ కల్యాణ మండపంలో బుధవారం రాత్రి కార్తిక దీపోత్సవం నిర్వహించారు. ముందుగా వేంకటేశ్వరుడి విగ్రహానికి తులసి పూజ, హరినామ సంకీర్తన చేశారు. కార్తిక మాసం ప్రాముఖ్యతను భక్తులకు ఇస్కాన్ అధ్యక్షుడు నిష్కించన భక్తదాస వివరించారు. రోజూ తులసి దేవికి పూజ చేసి దీపం వెలిగిస్తే ఎంతో మేలు జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొని దీపాలను వెలిగించారు.

దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా చర్యలు

మాధవధార, న్యూస్‌టుడే: ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ప్రైవేటు పాఠశాలల్లో సృజనాత్మక విద్యను అందించి విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేరుకునేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రైవేటు స్కూల్ అసోసియేషన్(అప్సా) ఛైర్మన్ సుందరరామయ్య పేర్కొన్నారు. అప్సా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో ప్రైవేటు పాఠశాలల సమస్యలు తెలుసుకోవడానికి 'మిత్రమా ఎలా ఉన్నారు' అనే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం మాధవధారలోని పలు ప్రైవేటు పాఠశాలలను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అప్సా రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్య రాజు, జిల్లా అధ్యక్షుడు కె.రామకృష్ణ, కార్యదర్శి డి.వి.శ్రీనివాసరావు, కోశాధికారి వాసు, గోవింద్, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

అప్సా సభ్యులను సత్కరించిన పాఠశాల నిర్వాహకులు

వైకాపా నాయకుల ర్యాలీ

గురుద్వారా, న్యూస్‌టుడే: ప్రభుత్వ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైకాపా ఉత్తరం నియోజకవర్గం నాయకులు బుధవారం గురుద్వారా దరి ప్రజా ఉద్యమ ర్యాలీ నిర్వహించారు. పార్టీ నగర అధ్యక్షుడు కె.కె.రాజు పాల్గొని నాయకులతో కలిసి సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రవీంద్రబాబు, 24 వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, బి.శ్రీనివాస్, కదిరి బాబురావు, జగన్నాథం, కటుమూరి సతీశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు

సీతంపేట, మురళీనగర్, న్యూస్‌టుడే: ఈనెల 14 నుంచి 20 వరకు విశాఖ పౌర గ్రంథాలయం, మురళీనగర్‌లోని శాఖా గ్రంథాలయాల్లో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు కార్యదర్శి డి.ఎస్.వర్మ, గ్రంథపాలకులు దుర్గారాణి, వై.పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారం రోజుల పాటు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

శ్రీ సోమేశ్వరస్వామివారి దేవస్థానం, సత్యానగర్, NH-5, విశాఖపట్నం
ఆర్.సి.నెం.19/2025-26, తే.10-11-2025ది

టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన

శ్రీ సోమేశ్వర స్వామి వారి దేవస్థానం, సత్యానగర్, విశాఖపట్నంకు చెందిన ఈ దిగువ సుదహరించిన ప్రకారం తేది.25.11.2025 మంగళవారం మధ్యాహ్నం 12-00 గంటలకు షాపుల లైసెన్సు హక్కు టెండర్ కం బహిరంగ వేలంపాట దేవాదాయశాఖ అధికారుల సమక్షమున కార్యనిర్వహణాధికారివారిచే దేవస్థానం వద్ద నిర్వహించబడును.

షాపు నెం.	షాపు వివరములు (పొడవు) అడుగులు	ధరావత్తు	లీజు కాలం
2.	10.6 x 8 = 84.8 చదరపు అడుగులు డోర్ నెం.37-7-9/2	10000/-	తేది. 01-12-2025 నుండి 30-11-2028 వరకు

1. ఈ వేలంపాటకు హిందూమతస్తులు టెండర్ దాఖలు చేయువారు టెండర్‌తో పాటు ప్రథమ ధరావత్తు సొమ్ము కార్యనిర్వహణాధికారి, శ్రీ సోమేశ్వర స్వామి వారి దేవస్థానం, సత్యానగర్, విశాఖపట్నం పేరున డిమాండ్ డ్రాఫ్ట్, ఆధార్ జెరాక్సు జతపరచవలెను. 2. వేలంపాట అనంతరం హెచ్చుపాటదారుడు వెంటనే 12 నెలలు లైసెన్సు ఫీజు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించవలెను. మిగిలిన వివరాలకు మొబైల్ నెం.9966817143ను సంప్రదించండి.

పి.సత్యనారాయణమూర్తి, కార్యనిర్వహణాధికారి



(c) eenadu

గాజువాక
• గాజువాక • విశాఖ పశ్చిమం

పారా లీగల్ వాలంటీర్ల నియామకం

గాజువాక, న్యూస్‌టుడే : మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, పారా లీగల్ వాలంటీర్ల నియామకాలకు బుధవారం గాజువాక కోర్టు సముదాయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. దరఖాస్తులు చేసుకున్న 25 మందిలో ఎనిమిది మందిని ఎంపిక చేశారు. ఏపీ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు 8వ అదనపు జిల్లా జడ్జి ఎస్.కవిత, బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు యశోధర వేదమణి ఇంటర్వ్యూలు జరిపారు. ఎనిమిదిమంది పారా లీగల్ వాలంటీర్లకు 13వ అదనపు జిల్లా జడ్జి జి.షణ్ముఖరావు చేతుల మీదుగా గుర్తింపు కార్డులను అందజేశారు.

గుర్తింపు కార్డు అందజేస్తున్న అదనపు జిల్లా జడ్జి షణ్ముఖరావు

సామూహిక ధ్యాన వేడుక

గాజువాక, న్యూస్‌టుడే : పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ వ్యవస్థాపకులు సుభాష్ పత్రీజీ అవతరణ మహోత్సవం పురస్కరించుకుని నెల్లిముక్కు అహింస ధ్యాన కేంద్రంలో బుధవారం సామూహిక ధ్యాన వేడుక నిర్వహించారు. కేంద్రం ఇన్‌ఛార్జి మీసాల శివగణేశ్వరరావు, అప్పారావు, వనిత, కేంద్ర సభ్యులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న పిరమిడ్ ధ్యాన కేంద్ర ప్రతినిధి

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య
గాజువాక: 98494 65088
పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

గోపాలపట్నం, న్యూస్‌టుడే: **సమస్య:** జీవీఎంసీ 92వ వార్డు గోపాలపట్నం కుమారి కల్యాణ మండపం రోడ్డు మధ్యలో డంపర్‌బిన్ వదిలేశారు. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. - పైడిరాజు, పాతగోపాలపట్నం
సమాధానం: డంపర్‌బిన్ తొలగించాలని సంబంధిత సిబ్బందికి సూచిస్తాను. - గోపీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్,
?: జీవీఎంసీ 90వ వార్డు సుసర్లకాలనీ-లక్ష్మీనగర్ రోడ్డు అధ్వానంగా ఉంది. -జి.రామనాథం, లక్ష్మీనగర్
✔: రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మరమ్మతులు చేపడతాం. - వెంకటలక్ష్మీ, పనులవిభాగం డీఈ

వైద్య సేవలకు.. 'సాంకేతిక' దన్ను

రాష్ట్రంలోని ఆసుపత్రులకు నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం

అగనంపూడి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడమే లక్ష్యంగా కూటమి సర్కారు చర్యలు చేపట్టింది. కీలకమైన విభాగాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి వీలుగా కొత్తగా పరికరాలను సమకూర్చనుంది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జిల్లా, ప్రాంతీయ ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరికరాల కొనుగోలుకు ప్రభుత్వం గత నెల రూ. 30కోట్లు కేటాయించింది.

● వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా మంజూరైన ఈ నిధులతో పరికరాల ఏర్పాటుకు పరిపాలన అనుమతులు ఇస్తూ జీవో జారీ చేసింది. ఆసుపత్రుల వారీగా వినియోగంలో ఉన్న పరికరాలు, మరమ్మతుకు వచ్చినవి, కొత్తగా ఏర్పాటు చేయాల్సిన వాటి వివరాలను విడుదల చేసింది.

● ఈ జాబితాను అనుసరించి పరికరాలను కొనుగోలు చేసి ఆసుపత్రులకు చేరవేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అగనంపూడి ప్రాంతీయ ఆసుపత్రికి పది విభాగాల్లో పరికరాలు ఏర్పాటు కానున్నాయి.

అగనంపూడి ప్రాంతీయ ఆసుపత్రికి కొత్తగా వచ్చే పరికరాలు..

★ డబుల్ పుంచ్ లెప్ సెట్ - ల్యాప్రోస్కోపీ సర్జరీలు చేయడానికి ఉపయోగపడుతుంది. ఇంతవరకూ ఈ పరికరం లేదు. కొత్తగా సరఫరా చేస్తారు.

★ యూఎస్‌జీ ప్రోబ్స్ - అల్ట్రా సౌండ్ స్కాన్ చేయడానికి వినియోగిస్తారు. ఇంతవరకూ లేదు. కొత్తగా సమకూరుస్తారు.

★ ఫ్రీజర్ బాక్సు - మార్చురీలో మృతదేహాలను భద్రపరచడానికి వినియోగిస్తారు. ఇంతవరకూ లేదు. కొత్తగా సమకూరుతుంది.

త్వరలో అందుబాటులోకి వస్తున్న ఎంసీహెచ్ బ్లాకు

సిద్ధమవుతున్న ఎంసీహెచ్ భవనం

వాక్యూమ్ ఎక్స్‌ట్రాక్టర్ - సాధారణ ప్రసవాలు జరగడానికి దీనిని ఉపయోగిస్తారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ఒకటి ఉంది. ఇంకొకటి అదనంగా ఇస్తారు.

లేబర్ టేబుల్స్ - ప్రస్తుతం రెండు ఉన్నాయి. ఇంకొకటి కొత్తగా ఇస్తారు.

బేబీ వార్మర్ - అప్పుడే పుట్టిన పిల్లలకు చికిత్స చేయడానికి వినియోగిస్తారు. ఒకటి ఉంది. ఇంకొకటి ఇస్తారు.

ఫీటల్ డాప్లర్ ఇన్ ఎల్‌డీఆర్ - నవజాత శిశువులకు చికిత్స అందించడానికి వినియోగిస్తారు. ప్రస్తుతం రెండు ఉన్నాయి. ఇంకొకటి సరఫరా చేస్తారు.

ఎల్‌డీఆర్ - రోగులను పరీక్షించడానికి ప్రస్తుతం 6 ఉన్నాయి. మరో రెండు అదనంగా ఇస్తారు.

ఎగ్జామినేషన్ కౌచ్, లైట్స్ - ఓపీ విభాగంలో ప్రస్తుతం ఒక కౌచ్ మరొకటి కొత్తగా ఇస్తారు. 2 లైట్స్ సమకూరుతాయి.

ఆల్ ఇన్ వన్ పీసీ - బయోమెడికల్ విభాగానికి ఒక కంప్యూటర్‌ను మంజూరు చేశారు.

మెరుగైన చికిత్సకు అవకాశం..

కొత్తగా వచ్చే పరికరాలతో రోగులకు మరింత మెరుగైన చికిత్స అందించడానికి అవకాశం కలుగుతుంది. త్వరలో ఆసుపత్రికి ఎంసీహెచ్ (తల్లి, పిల్లల విభాగం) కూడా అందుబాటులోకి రానుంది. తుది దశ పనులు జరుగుతున్నాయి. - డాక్టర్ పి.గోపీకృష్ణ, సూపరింటెండెంట్, అగనంపూడి ప్రాంతీయ ఆసుపత్రి

నిస్వార్థంగా వైద్య సేవలు అందించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

అగనంపూడి, న్యూస్‌టుడే : ఆసుపత్రికి వచ్చే రోగులకు నిస్వార్థంగా వైద్య సేవలు అందించాలని స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సిబ్బందికి సూచించారు. బుధవారం ఆసుపత్రిలో ఏర్పాటైన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విధుల నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. డీసీహెచ్ఎస్ శంకరప్రసాదు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.గోపీకృష్ణ, అభివృద్ధి కమిటీ సభ్యులు డొక్కా రమేష్, కె.తాతారావు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

★ ప్రాంతీయ ఆసుపత్రిలోని రోగుల వెయిటింగ్ హాలులో లుపిన్ ఫార్మా పరిశ్రమ రూ. 9 లక్షల సీఎస్ఆర్ నిధులతో కల్పించిన సదుపాయాలను ఎమ్మెల్యే పల్లా బుధవారం ప్రారంభించారు. లుపిన్ ప్రాజెక్టు హెడ్ పియూస్ విక్టర్, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి శంకర ప్రసాదు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.గోపీకృష్ణ, 79, 85 వార్డుల కార్పొరేటర్లు రౌతు శ్రీనివాసరావు, ఇల్లపు వరలక్ష్మి, తెదేపా 85వ వార్డు అధ్యక్షుడు కర్రి దశేంద్ర, గాజువాక తెలుగు మహిళ అధ్యక్షురాలు జి.కనకభవానీ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నంలో సినిమాలు
శ్రీనరసింహ: జటాధర, నరసింహం: మాస్ జాతర, మౌర్య: ది గర్ల్‌ఫ్రెండ్

ఎస్టీబీఎల్‌లో: స్క్రీన్-1: మాస్ జాతర స్క్రీన్-2: ది గర్ల్‌ఫ్రెండ్ స్క్రీన్-3: ఆర్యన్, స్క్రీన్-4: జటాధర

ప్రగతికి అడ్డుపడుతున్నారు

గోపాలపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రగతికి అడ్డుపడుతూ వైకాపా నాయకులు ప్రమాదకరంగా మారారని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. గోపాలపట్నంలోని ఆయన కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. భాగస్వామ్య సదస్సులతో కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిపై ఆలోచన చేస్తుంటే వైకాపా నాయకులు కొర్రీలు పెడుతున్నారని ఆరోపించారు. కార్పొరేటర్ రమేష్, తెదేపా నాయకులు విజయ్‌కుమార్, ప్రసాద్, సత్తిరాజు, ఆనంద్, తులసీరావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

కరాస, న్యూస్‌టుడే : రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం ఉదయం 52వ వార్డు, మర్రిపాలెం వుడా లే ఔట్ శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత రోజుల్లో ఒత్తిడిని జయించాలంటే ప్రతి ఒక్కరికి ఆధ్యాత్మిక చింతనతో పాటు వ్యాయామం తప్పనిసరని అన్నారు. ఈనెల 30వ తేదీన ఆర్.కె.ఫిట్‌నెస్ మంత్ర ఆధ్వర్యంలో నిర్వహించే హిల్‌ట్రెక్కింగ్‌కు సంబంధించిన గోడపత్రికను మంత్రి ప్రారంభించారు.

పేదల సొంతింటి కల సాకారం: ఎమ్మెల్యే పల్లా

గాజువాక, న్యూస్‌టుడే: ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక జోనల్ కార్యాలయంలో పీఎంఏవై పథకం కింద 1343 మంది లబ్ధిదారులకు గృహ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, తెదేపా సమన్వయకర్తలు కరణం రెడ్డి నర్సింగరావు, ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, పల్లా శ్రీనివాస్, బొండ జగన్, రౌతు శ్రీను, రాజాన రామారావు, హౌసింగ్ ఇ.ఇ. సుబ్రహ్మణ్యం, జెడ్పీ శేషాద్రి, ఏఈ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గృహ మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే పల్లా, డిప్యూటీ మేయర్ గోవిందరెడ్డి, నర్సింగరావు, కార్పొరేటర్లు

అందరూ సేవాభావంతో పనిచేయాలి

కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, న్యూస్‌టుడే : కార్యకర్తలందరూ సేవాభావం కలిగి ఉండాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పిలుపునిచ్చారు. బుధవారం గోపాలపట్నంలోని పశ్చిమ తెదేపా కార్యాలయంలో నియోజకవర్గంలోని వార్డులవారీగా అధ్యక్ష, కార్యదర్శులు, క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్, ఇన్‌ఛార్జిలతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్పొరేటర్లు దాడి వెంకటరమేశ్, బొమ్మిడి రమణ, ఎస్.రాజశేఖర్, నియోజకవర్గ యువ నాయకులు పి.మౌర్య సింహ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

మల్కాపురం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 63వ వార్డు తెదేపా కార్యాలయం వద్ద బుధవారం థాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చిన్న, గుడేల కృష్ణ, నర్సింగరావు, పి.కృష్ణ, ధర్మ తదితరులు పాల్గొన్నారు.

శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

గాజువాక, న్యూస్‌టుడే: ప్రైవేటు కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గాజువాక తహసీల్దార్ కార్యాలయం వద్ద వైకాపా ఆధ్వర్యంలో ర్యాలీ, మహా ధర్నా నిర్వహించారు. వైకాపా ఇన్‌ఛార్జి తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, జి.విజయకుమార్, నాయకులు పల్లా చినతల్లి, వరదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం(బీహెచ్‌పీవీ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 68వ వార్డు వైకాపా నాయకులు, కార్యకర్తలు బుధవారం ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర వైకాపా సంయుక్త కార్యదర్శి గుడివాడ అలిక్, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సింధియా(ములగాడ కాలనీ), న్యూస్‌టుడే : జీవీఎంసీ 59వ వార్డు ములగాడ కాలనీలో వైకాపా పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. వీఆర్వోకు వినతి పత్రం అందజేశారు. డిప్యూటీ మాజీ మేయర్ జియ్యాని శ్రీధర్, నాయకులు, కార్పొరేటర్లు, మహిళలు పాల్గొన్నారు.

రెయిలింగ్ విరిగి.. ప్రమాదకరంగా మారి!

ఎన్ఏడీవంతెన మెట్ల మార్గంలో విరిగిపోయిన రెయిలింగ్

గోపాలపట్నంలో బీఆర్టీఎస్ రోడ్డులో ఊడిపోయిన బ్యారికేడ్

గోపాలపట్నం, ఎన్ఏడీకూడలి, న్యూస్‌టుడే: గోపాలపట్నం బీఆర్టీఎస్ రోడ్డులోని విభాగినిలపై ఉన్న బారికేడ్లు విరిగిపోయి కిందపడ్డాయి. ఇటుగా వెళ్లేవారు వాటిని అక్కడే సరిచేసి వెళ్లిపోయారు. వాహనాలకు పొరపాటున తగిలితే ప్రమాదంబారినపడతారని ఆందోళన చెందుతున్నారు. అలాగే ఎన్ఏడీకూడలి వంతెన కింద ఏర్పాటు చేసిన మెట్లమార్గంలోని రెయిలింగ్ కొంతభాగం విరిగిపోయింది. దీంతో అటుగా వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

గాజువాక సబ్ రిజిస్ట్రార్ తారకేశును సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం(నాతయ్యపాలెం), న్యూస్‌టుడే: షీలానగర్ అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో శ్రీ మణికంఠ జ్యోతిభక్త సేవాసంఘం ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిగింది. సమారాధనకు గాజువాక సబ్ రిజిస్ట్రార్ తారకేశు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దాత, సంఘ ప్రతినిధులు తారకేశును సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

దువ్వాడ స్టేషన్‌లో విస్తృత తనిఖీలు

కూర్మన్నపాలెం (దువ్వాడ), న్యూస్‌టుడే: దిల్లీలో బాంబు పేలుడుతో అప్రమత్తమైన ఆర్పీఎఫ్ పోలీసులు దువ్వాడ రైల్వేస్టేషన్‌లో బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బీవీ రమణ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు కొనసాగించారు. లగేజీ బ్యాగులు, అనుమానితులను నిశితంగా పరిశీలించారు.

ప్రయాణికుల లగేజీ తనిఖీ చేస్తున్న ఆర్పీఎఫ్ పోలీసులు

పెయింటర్లకు ఉచిత శిక్షణ

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: న్యాక్ ఆధ్వర్యంలో గాజువాక న్యాక్ శిక్షణ కేంద్రంలో బిర్లా న్యూ, వాటర్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లంబింగ్ స్కిల్ కౌన్సిల్ నేతృత్వంలో అర్హులైన పెయింటర్లకు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు న్యాక్ విశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ : 91332 42666 సంప్రదించవచ్చన్నారు.

అనాథాశ్రమ పిల్లలకు పండ్లు పంపిణీ

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: అనాథాశ్రమ పిల్లలను ఆదుకోవాల్సిన అవసరం ఉందని 86వ వార్డు కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన జన్మదినం సందర్భంగా 88వ వార్డు మంగళపాలెం సమీపంలోని జీవీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథాశ్రమం పిల్లలకు కోటేశ్వరరావు, పద్మజ దంపతులు మధ్యాహ్న భోజనాలు, పండ్లు, మిఠాయిలు పంచిపెట్టారు. నాయకులు కర్రి ఈశ్వరరావు, బొడ్డ రమణ, రాజాన నాయుడు, తుంపాల శ్రీను, అయూబ్, కుమార్, రమేష్, ప్రసాద్, రాము తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో కార్పొరేటర్ కోటేశ్వరరావు దంపతులు

ప్రకటన

మహారాజశ్రీ నిడదవోలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.No. : 55/2023
EP No. : 5/2021
OS No. : 192/2010

1. Sri Gottumukkala Venkata Satyanarayana Raju (Died) ... Petitioner / DHr
Petitioners / Lrs of Deceased DHr/Palintiff :
2. Smt. Gottumukkala Venkata Lakshmi, W/o. Late Venkata Satyanarayana Raju, Hindu, Female, Age : 55 years, Door No.1-2-40, Satyam Residency, Floor No.6, PH-1, Vamsi Krishna Nagar, Street No4, Sivaraopeta, Bhimavaram, W.G.Dist.,
3. Sri Gottumukkala Lakshmipathi Raju, S/o. Late Venkata Satyanarayana Raju, Hindu, Male, Age : 32 years, Cultivation Business, Door No.1-2-40, Satyam Residency, Floor No.6, PH-1, Vamsi Krishna Nagar, Street No.4, Sivaraopeta, Bhimavaram, W.G.Dist.,
4. Smt. Penmetsa Lakshmi Tulasi, D/o. Late Venkata Satyanarayana Raju, Hindu, Female, Age : 30 years, Properties : R/o. 402. 4th Floor, Sri Karthik Paradise, Road No.4, Venkataraya Nagar, Nizampeta, Medchal-Malkajgiri, Hyderabad City, Telangana State.
And
Respondents/JDRs / Defendants :
1. Sri Karinki Nageswara Rao - Died
2. Karinki Venkata Ramana, S/o. Late Nageswara Rao, Age 49 years, Hindu, Male, Business, Resident of Quarter No.518-A, Sector No.16, Streel Nagar, Ukku Nagar, Visakhapatnam
3. Karinki Uma Maheswara Rao, S/o. Late Nageswara Rao, Age 41 years, Hindu, Male, Srinagar Colony, Flat No.24, S.A.Nagar, Hyderabad, Telangana State.
ప్రతివాదులు 2nd JDR : Karinki Venkata Ramana, S/o. Late Nageswara Rao, Age 49, Hindu, Male, Business, Resident of Quarter No. : 518-A, Sector No.16, Steel Nagar, Ukku Nagar, Visakhapatnam.
యీ నెంబరులో ప్రతివాదికి దావా సమను కోర్టు ద్వారాను రిజిస్టర్ పోస్టు ద్వారాను అనేక పర్యాయములు పంపిచిన్నా అమలు జరగనందున శ్రీ కోర్టు వారి వుత్తర్వుల ప్రకారం యీ ప్రకటన వేయడమైనది.
2nd JDR : Karinki Venkata Ramana, S/o. Late Nageswara Rao, Visakhapatnam.
అను వారు ది.27-11-2020 తేదీన పై కోర్టు వారు పిలిపించే టైముకు ఉదయం గం.10.30 లకు స్వయంగా కానీ, ప్లీడరు గారి ద్వారా కానీ హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలియపరచుకొనవలెను లేని యెడల ఎక్స్‌పార్టీ చేసి పరోక్షమున తీర్మానించబడును.
P.Venkanna Babu, B.Com, B.L., Advocate, Nidadavole, E.G.Dist., Cell : 93476 26143

మురుగు తొలగించారు..

స్పందనకు వందనం

సింధియా, న్యూస్‌టుడే: ఆర్నెల్లుగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ టెర్మినల్ రహదారిపై పేరుకున్న మురుగుతో కూడిన వ్యర్థాలను జీవీఎంసీ ప్రత్యేక డ్రైవ్ చేపట్టి తొలగించింది. ఏడు నెలల తర్వాత బుధవారం టెర్మినల్ రహదారి కాస్త మెరుగుపడిందని ఆయిల్ ట్యాంకర్ల సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. గత కొంతకాలంగా ఈ సమస్యపై 'ఈనాడు' పలుమార్లు వార్తలు ప్రచురించింది. టన్నులకొద్దీ చెత్తను తొలగించారు. దీంతో టెర్మినల్ పరిసరాలు కాస్త మెరుగుపడ్డాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఐవోసీ గేటు వద్ద మురుగు తొలగించిన తర్వాత..

నైపుణ్యత, నాయకత్వ లక్షణాలపై శిక్షణ

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కునగరం హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంటు సెంటర్‌లో బుధవారం ఎస్సీ, ఎస్టీ సభ్యులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎస్సీ, ఎస్టీ లైజన్ అధికారులు ఎన్.సుందరం, బాబూనాయక్ ప్రారంభించారు. డాక్టర్ ముత్యాలు, బాలాజీ, కంచర్ల సంజీవరావు, ఉక్కు ఎస్సీ ఎస్టీ సంఘ నాయకులు బి.తౌడన్న, బయ్యే మల్లయ్య, ఎల్.వి.రమణ, మోహన్‌బాబు, హెచ్ఆర్డీ విభాగం అధికారి రమేష్ పాల్గొన్నారు

శిక్షణలో పాల్గొన్న ఎస్సీ, ఎస్టీ సంఘ సభ్యులు

కంటి వైద్య శిబిరం విజయవంతం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: అదానీ గంగవరం పోర్టు ఆధ్వర్యంలో గంగవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సీఎస్సార్‌లో భాగంగా పోర్టు సీనియర్ అధికారులు ప్రత్యేక వైద్య బృందంతో కంటి పరీక్షలు జరిపి అవసరమైన విద్యార్థులకు కళ్లద్దాలను అందజేశారు.

ఎట్టకేలకు రహదారి విస్తరణ !

అగనంపూడి, న్యూస్‌టుడే: అగనంపూడి హోమీబాబా క్యాన్సర్ ఆసుపత్రి కూడలి నుంచి ఫార్మాసిటీ పునరావాస కాలనీకి వెళ్లే రహదారి విస్తరణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. జీవీఎంసీ నుంచి రూ. కోటి నిధులు మంజూరు కావడంతో రెండు నెలల క్రితం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. గుత్తేదారు పనులు మొదలు పెట్టకుండా జాప్యం చేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. దీనిపై గత నెల 20న 'శంకుస్థాపనతోనే సరి... విస్తరణ ఎప్పుడో మరి' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురించడంతో అధికారులు స్పందించారు. జేసీబీతో రహదారి నిర్మాణ పనులు మొదలుపెట్టారు. ప్రస్తుతం గోతులు తవ్వే పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి.

కొనసాగుతున్న విస్తరణ పనులు

ఈనాడు కథనానికి స్పందన

ఉక్కు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : 'ఉక్కు యాజమాన్య ఏకపక్ష నిర్ణయాలతో ఉక్కు ఉద్యోగులు నష్టపోతున్నారని... అభద్రతా భావంతో పనిచేస్తున్నారని తక్షణమే మీరు కల్పించుకొని కేంద్ర ఉక్కు శాఖమంత్రితో చర్చించాలని' ఇంటక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ నీరుకొండ రామచంద్రరావు.. బుధవారం ఇంటక్ జాతీయ అధ్యక్షులు జి.సంజీవరెడ్డిని హైదరాబాద్‌లో కలిసి కోరారు. ఆయన సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.

సంజీవరెడ్డిని కలిసి విశాఖ ఉక్కు పరిస్థితిని వివరిస్తున్న రామచంద్రరావు

ప్లాస్టిక్ వద్దు.. పచ్చదనం ముద్దు..

అక్కిరెడ్డిపాలెం(ఆటోనగర్), న్యూస్‌టుడే: ప్లాస్టిక్ వద్దు.. పచ్చదనం ముద్దు.. అంటూ ఆదిత్య డిగ్రీ కాలేజీ ఎన్సీసీ విద్యార్థులు బుధవారం జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాం పరిసర కాలనీల్లో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. బడిఈడు పిల్లలు బడులకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు, సిబ్బంది, ఎన్సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరణ

గోపాలపట్నం, న్యూస్‌టుడే: సంస్కృతి, సంప్రదాయాలు పాటించడం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుందని సుబ్రహ్మణ్యేశ్వర ఆలయ ధర్మకర్త, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. జీవీఎంసీ 91వ వార్డు ప్రశాంత్‌నగర్‌లో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఈనెల 26న స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. బుధవారం గోపాలపట్నంలోని ఆయన నివాసంలో కార్యక్రమ గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు.

దళిత సంఘాల నిరసన

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం బండ్లమూడిలో దళితులపై అగ్రవర్ణాల దాడులను ఖండిస్తూ బుధవారం చినగంట్యాడ సిటూ కార్యాలయంలో దళిత సంఘాలు నిరసన తెలిపాయి. కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు గణేశ్, నాయకులు ఇమ్మాన్యుయేలు, గొలగాని అప్పారావు పాల్గొన్నారు.

క్రీడా మైదానంలోకి మురుగు

దర్పణం

పెదగంట్యాడ: గాజువాక 75వ వార్డు నెల్లిముక్కు జీవీఎంసీ క్రీడా మైదానాన్ని మురుగు సమస్య పట్టి పీడిస్తోంది. విశాలమైన ప్రహరీకి రంధ్రం చేసి ఎగువ నుంచి వచ్చే వాడుక నీరంతా ఇందులోకి వదలడంతో ఉదయం, సాయంత్రం శిక్షణకు వచ్చే క్రీడాకారులు, సందర్శకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రెండెకరాల విస్తీర్ణంలో సుమారు రూ.1.5 కోట్లతో క్రీడా ప్రాంగణాన్ని జీవీఎంసీ అభివృద్ధి చేసిన సంగతి తెలిసిందే. ఇటీవల ఎగువ కల్యాణ మండపం వద్ద వరద నీరు, మురుగు వెళ్లే దారి లేదంటూ కొందరు ప్రహరీని ధ్వంసం చేసి మురుగు నేరుగా పార్కులోకి చేరుకునేలా తవ్వి వదిలేశారు. దీంతో వాడుక నీరంతా ప్రాంగణంలోకి చేరుకుంటోంది. మురుగు నుంచి విముక్తి కలిగించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

ప్రహరీకి పెట్టిన రంధ్రం

బదిలీలు పారదర్శకంగా జరిగేనా?

గోపాలపట్నం, న్యూస్‌టుడే : విశాఖపట్నం వ్యవసాయ మార్కెట్‌శాఖ ఆధ్వర్యంలో నగరంలో 15 రైతుబజార్లు కొనసాగుతున్నాయి. ఇందులో విధులు నిర్వహిస్తున్న ఎస్టేట్ అధికారులకు కొన్ని నెలల క్రితం బదిలీలు జరిగాయి. వారితోపాటు సహాయకుల బదిలీలు కూడా చేపట్టాల్సి ఉండగా.. మూడేళ్లు కావస్తున్నా నేటికి దస్త్రాలు కదల్లేదు. ఇటీవలే వీరి బదిలీల ప్రక్రియ తెరపైకి వచ్చింది. దీంతో ఆర్థిక, రాజకీయ బలాలతో తాము కోరుకున్న చోట బదిలీలు చేయాలంటూ ఉన్నతాధికారులను వీరు ఒత్తిళ్లకు గురిచేసినట్లు తెలిసింది. దీనిపై 'ఈనాడు'లో 'బదిలీలు ఎవరి కోసం' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై జిల్లా సంయుక్త కలెక్టర్ స్పందించి.. బదిలీల్లో అవకతవకలు లేకుండా చూడాలనే ఉద్దేశంతో వారి జాబితాను తాను తెప్పించుకున్నట్లు సమాచారం. అయితే బదిలీల ప్రక్రియను అంతా నేనే చూసుకుంటానని ఓ సహాయకుడు కొంతమంది రైతుబజార్ ఎస్టేట్ అధికారులు, పలువురు సహాయకులతో కలిసి ఏర్పాటు చేసిన రహస్య సమావేశంలో వెల్లడించినట్లు తెలిసింది. ఎస్టేట్ అధికారుల కంటే సహాయకులే మార్కెట్‌శాఖ అధికారులపై ఆధిపత్యం చలాయిస్తున్నారని ఓ ఉన్నతాధికారే వాపోవడం గమనార్హం. ఆర్థిక, రాజకీయ పలుకుబడి లేని సహాయకులకు శివారు బజార్లు, చిన్నబజార్లను అధికారులు కేటాయిస్తూ వస్తున్నారు. ఈసారైనా సహాయకులందరికీ తారతమ్యాలు లేకుండా బదిలీ ప్రక్రియలు జరపాలని కోరుతున్నారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' జిల్లా సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ వివరణ కోరగా.. భాగస్వామ్య సదస్సు పూర్తి కాగానే బదిలీల ప్రక్రియపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి కృషి

ఫోకస్

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: గాజువాక 76వ వార్డు స్వతంత్రనగర్‌లో ఏళ్ల తరబడి నిరాదరణకు గురైన శ్మశానవాటిక అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు జీవీఎంసీ అధికారులపై ఒత్తిడి తెచ్చి రూ. 50లక్షల నిధులు మంజూరు చేయించడంతో రెండు బర్నింగ్ యూనిట్లు, వాచ్‌మెన్ గది, విశాల ప్రహరీతోపాటు ఆరు కుళాయిల స్టాండ్లు, శివుడి విగ్రహం అందుబాటులోకి రానున్నాయి.

శ్మశానవాటిక ప్రస్తుత దుస్థితి

PGRS
RC.No.434/2025/SA/Dt.07.11.2025
O/o. ప్రత్యేక ఉప కలెక్టర్ (L.A.) స్టీల్‌ప్లాంట్, విశాఖపట్నం.

ఎండార్స్‌మెంటు

విషయం: PGRS - పెదగంట్యాడ మండలం, పెదగంట్యాడ R.H.C. సెక్టార్ -2 నెల్లిముక్కు, H/o. బాలచెరువు - శ్రీ యెల్లేటి నాగేశ్వరరావు S/o. సూర్యనారాయణగారు ఆర్ కార్డు నెంబరు. 134 ప్లాట్ నెంబరు. 2014 నా యొక్క ప్లాట్‌లో ఎవరో బౌండ్రీవాల్ కట్టియున్నారని, కావున సదరు ప్లాట్ నాకు ప్లాట్ అందజేయవలసిందిగా PGRS కార్యక్రమంలో [illegible]
సూచిక: 1) శ్రీ యెల్లేటి నాగేశ్వరరావు S/o. సూర్యనారాయణ గారు గారి PGRS VSP20250825149 దరఖాస్తు తేదీ. 25-08-2025.
2) [illegible] తేదీ: 28-10-2025.
[illegible]
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, (L.A.) స్టీల్ ప్లాంట్, విశాఖపట్నం.
శ్రీ యెల్లేటి నాగేశ్వరరావు, S/o. సూర్యనారాయణ, [illegible] గాజువాక, విశాఖపట్నం-530053. Ph. 9908258837.

(c) eenadu

ఈనాడు
విజయనగరం
గురువారం నవంబరు 13, 2025

ఇవిగో ఆనంద పరవళ్లు

– న్యూస్‌టుడే, రాజాం, విజయనగరం అర్బన్

వేల మంది సొంతింటి కలను 'కూటమి' ప్రభుత్వం సాకారం చేసింది. అదనపు సాయం అందించి గృహాలను పూర్తి చేయించింది. జిల్లా వ్యాప్తంగా బుధవారం సందడి వాతావరణంలో సామూహిక గృహ ప్రవేశాలు జరిగాయి. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 1.0, 2.0, పీఎం జన్‌మన్ పథకాల కింద నిర్మించిన 8,793 గృహాల్లో పాలు పొంగించారు. ఏడు నియోజకవర్గాల్లోనూ కార్యక్రమాలు సాగాయి.

అదనపు సాయంతో..

గత ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలను గాలికొదిలేసింది. ఇచ్చిన రూ.1.80 లక్షలు చాలక పోవడంతో లబ్ధిదారులు నిర్మాణాలను ముందుకు తీసుకెళ్లలేకపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.లక్ష చొప్పున అదనపు సాయం అందించడంతో పనులు పూర్తి చేశారు. త్వరలో మిగిలిన చోట్ల గృహ ప్రవేశాలు జరిగేలా చూస్తామని, పేదలకు ఇళ్లస్థలాలు సైతం ఇవ్వనున్నట్లు గృహ నిర్మాణ సంస్థ **పీడీ మురళీమోహన్** 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

జిల్లాలో ఇలా..

నియోజకవర్గం	ప్రవేశాలు
రాజాం	1,957
బొబ్బిలి	1,057
చీపురుపల్లి	812
గజపతినగరం	1,030
నెల్లిమర్ల	1,243
ఎస్.కోట	1,048
సాలూరు(మెంటాడ)	253
విజయనగరం	1,393

గజపతినగరం నియోజకవర్గానికి సంబంధించి బొండపల్లి మండలం అంబటివలసలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ లబ్ధిదారులకు తాళాలు అందజేశారు. విజయనగరంలో కనపాక, దుప్పాడ, రాజాంలో జీసీపల్లి, సంకిలి, బొద్దూరు, రాజాం, ఎస్.కోటలో మంగళపాలెం, నెల్లిమర్లలో నగర పంచాయతీ, చీపురుపల్లిలో జి.అగ్రహారం, బొబ్బిలి నియోజకవర్గంలోని చిన్నయ్యపేట, పాతబొబ్బిలిలో వేడుకగా నిర్వహించారు.

పేదలందరికీ గృహాలు: మంత్రి

అంబటివలసలో లబ్ధిదారుకు తాళం అందిస్తున్న కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్

బొండపల్లి, న్యూస్‌టుడే: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్రంలో సుమారు 3 లక్షల మంది లబ్ధిదారులకు గృహయోగం కల్పించినట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం బొండపల్లి మండలం అంబటివలసలో పలువురు లబ్ధిదారులకు తాళాలు అందించారు. మిగిలిన పేదలకు త్వరలోనే ఇళ్లు అందిస్తామన్నారు. గజపతినగరం నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న 4,052 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు రూ.8.11 కోట్లు మంజూరు చేశామన్నారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కలెక్టరు రాంసుందర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టరు కృష్ణ, గృహనిర్మాణశాఖ పీడీ మురళీమోహన్, డీఈ సత్యన్నారాయణ, ఏఈ అప్పలనాయుడు, తహసీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీవో గిరిబాల తదితరులు పాల్గొన్నారు.

విజయనగరాన.. విహంగ మార్గాన

– ఈనాడు, విజయనగరం

ఏ నగరానికి ఎంత దూరం.. విశాఖ నగరానికి 55 కి.మీ. విజయనగరం: 25 కి.మీ శ్రీకాకుళం: 65 కి.మీ.

విమానం ఎక్కాలంటే.. విశాఖ వెళ్లాలి. లేకుంటే విజయవాడో.. హైదరాబాదో చేరాలి.. ఇక నుంచి ఆ అవసరం ఉండదు. ఉత్తరాంధ్రుల ఏళ్ల నాటి కల నెరవేరనుంది. మరికొన్ని నెలల్లోనే గగన విహారానికి అవకాశం కలగనుంది. భోగాపురంలోని అంతర్జాతీయ విమానాశ్రయం సిద్ధమవుతోంది. ఇప్పటికే 92 శాతం పనులు పూర్తయ్యాయి. కూటమి రాకతో వేగవంతమయ్యాయి. ప్రస్తుత పరిస్థితిని రెండు రోజుల కిందట 'ఈనాడు' పరిశీలించింది.



పురోగతి ఇలా..

- ★ శంకుస్థాపన: 2019 ఫిబ్రవరిలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. 2023 మే 3న మాజీ సీఎం జగన్ మరోసారి భూమిపూజ చేపట్టారు.
- ★ భూముల కేటాయింపు: 2,708.26 ఎకరాలు
- ★ పనుల పూర్తికి గడువు: డిసెంబరు 2026
- ★ గడువు లక్ష్యం కుదింపు: వచ్చే ఏడాది జూన్
- ★ టెర్మినల్ బిల్డింగ్ విస్తీర్ణం: 81 వేల చ.మీ.
- ★ అంచనా వ్యయం: తొలిదశలో రూ.4,750 కోట్లు
- ★ ఆరంభంలో ఏడాదికి సేవలు: 60 లక్షల మందికి
- ★ రన్‌వే: 3.8 కిలో మీటర్ల పొడవున రెండు
- ★ ఏరో బ్రిడ్జిలు: 22

పనుల ప్రగతి ఇలా.. శాతాల్లో..

- ★ మట్టి పని: 100
- ★ రన్‌వే : 99.9
- ★ టాక్సీవే: 98.6
- ★ పీటీబీ : 86.2
- ★ ఏటీసీ : 84.4
- ★ యాన్సలరీ బిల్డింగ్స్: 76



అత్యాధునికంగా టెర్మినల్ బిల్డింగ్

త్వరలో భారీ విమానం రాక..

★ డిసెంబరు నెలాఖరు లేదా జనవరిలో బోయింగ్ విమానంతో రన్‌వేపై పరీక్షలు నిర్వహించనున్నారు. నాలుగు నెలల క్రితం చిన్న పాటి విహంగంతో ట్రయల్ రన్ పూర్తి చేశారు.

★ జాతీయ రహదారి-16లో పోలిపల్లి వద్ద నిర్మించిన ట్రంపెట్ నుంచి స్పీడ్ యాక్సెస్ రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

జరగాల్సిన పనులు

- ★ విశాఖపట్నం బీచ్ రోడ్ నుంచి ఆరు వరుసల రహదారి అభివృద్ధి
- ★ బీచ్ కారిడార్, మెట్రో.. విమానాశ్రయానికి అనుసంధానం
- ★ విశాఖ నలుమూలల నుంచి ఇక్కడికి చేరుకునేందుకు 15 మార్గాల నవీకరణ
- ★ ఉత్తరాంధ్ర సంస్కృతి ఉట్టి పడేలా సుందరీకరణ పనుల ప్రారంభం

పత్తి కొనుగోళ్లు ప్రారంభం

తూకం వద్ద ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తదితరులు

రాజాం, న్యూస్‌టుడే: పత్తి రైతులకు మద్దతు ధర అందించడమే ప్రభుత్వ ధ్యేయమని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. బుధవారం రాజాంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. 15 మండలాల రైతులకు మేలు జరుగుతుందని, క్వింటాకు రూ.8,110 మద్దతు ధర అందుతుందని చెప్పారు. భారత పత్తి సంస్థ 5,298 టన్నులు కొనుగోలు చేసేందుకు సుముఖత వ్యక్తం చేసిందన్నారు. అన్నదాతలు దళారుల బారిన పడొద్దని, అధికారులు ఎలాంటి సాయం కావాలన్నా అందిస్తారన్నారు. మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి రవి కిరణ్, వ్యవసాయశాఖ ఏడీ చంద్రరావు, ఏవో రఘునాథ్, ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాసరావు, నాయకులు కోండ్రు జగదీష్, గురవాన నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎగరలేని జింక.. కదల్లేని పులి!!



నేనూ పులినే..

గాండ్రిస్తున్న చిరుతపులి.. పడగవిప్పిన పాము.. చెంగుచెంగున ఎగురుతున్న జింక.. గజరాజు.. భల్లూకం.. ఇలా వణ్యప్రాణులన్నీ ఒకేచోట దర్శనమిస్తే చూడకుండా ఎవరుంటారు చెప్పండి.. అలాగని అవేవీ నిజమైన జంతువులు కాదండోయ్.. అచ్చుగుద్దినట్లు అచ్చం వాటిల్లానే ఉండే అందమైన బొమ్మలు. ప్రకృతి పరిరక్షణ, అడవుల విస్తీర్ణంపై అవగాహన కల్పించేందుకు విజయనగరం సమీపంలోని సారిపల్లి వద్ద ఏర్పాటు చేసిన నగరవనంలోని దృశ్యాలివి. వీటితోపాటు ఆవరణలో యోగా మందిరం, వ్యాయామశాల, పిల్లల ఉద్యానం, వాకింగ్ ట్రాక్‌లు ఆకట్టుకుంటున్నాయి. చూసేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం అయ్యన్నపేట

కదలొద్దు.. కరిచేస్తా..

సారిపల్లిలోని నగరవనంలో వన్యప్రాణుల బొమ్మలు

కొలకలూరికి గురజాడ విశిష్ట పురస్కారం



కంటోన్మెంట్: గురజాడ విశిష్ట పురస్కారాన్ని ఈ ఏడాది ప్రముఖ సాహితీవేత్త కొలకలూరి ఇనాక్‌కు ప్రదానం చేయనున్నట్లు గురజాడ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వరరావు, ప్రకాష్ తెలిపారు. గురజాడ వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 30న విజయనగరంలో నిర్వహించే సాహితీ చైతన్య ఉత్సవం రోజున హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ చేతుల మీదుగా అందిస్తామన్నారు.

చరితకు ఆనవాళ్లు.. చెక్కుచెదరని కట్టడాలు

వన విహారాల్లో వీటిపై ఓ లుక్కేయండి

– న్యూస్‌టుడే, విజయనగరం రింగురోడ్డు

విజయనగరం పేరు వినగానే.. పైడితల్లి ఆలయం.. గంటస్తంభం.. కోట.. గురజాడ గృహం.. ఇవే కదలాడుతాయి.. విద్యలనగరంగా.. సంగీత, సాహిత్య, ఆధ్యాత్మిక కూడలిగానూ ఈ ప్రాంతం గుర్తింపు పొందింది. ఎన్నో కట్టడాలు, చరితకు నిలయాలుగా నిలుస్తోంది. వన విహారాల వేళ వాటినీ ఓ సారి సందర్శించి, పిల్లలకు చూపిస్తే మదిలో నిలుపుకొంటారు.

నారాయణ నివాసం..

గజపతుల కోట, మోతీమహల్, రౌండ్ మహల్, అలక్ నారాయణ నివాసం, కోరుకొండ ఫోర్టు ప్రత్యేకమైనవి. అలక్ నారాయణ నివాసంలో అప్పట్లో విమానాలు దిగేవి. ప్రత్యేకంగా రన్‌వే సైతం ఉంది. ప్రస్తుతం ఏపీఎస్పీ క్వార్టర్స్‌కు వినియోగిస్తున్నారు. కోరుకొండ ఫోర్టును సైనిక పాఠశాలకు కేటాయించారు.

అలక్ నారాయణ ప్యాలెస్

రాళ్లతో నిర్మాణం..

నగరపాలిక పరిధిలోని కొత్తపేట సమీపంలో ఉన్న మన్నార్ రాజగోపాల స్వామి(కొత్తకోవెల) ఆలయాన్ని 1017- 1137 మధ్య నిర్మించారు. అంతకు పూర్వమే వైఎస్ఆర్ నగర్ సమీపంలోని వేణుగోపాలపురంలో ఉండేది. పిడుగులు పడి శిథిలం కావడంతో అప్పటి మహారాజులు అందులో ఉన్న విగ్రహాలను కొత్తపేట తరలించారు. రాళ్లతో కూడిన నిర్మాణాలు ఆకట్టుకుంటాయి. అన్ని కాలాల్లోనూ చల్లని వాతావరణం ఉంటుంది.

మన్నార్ రాజగోపాలస్వామి ఆలయం

దేవతల గుడి.. ● సారిపల్లి సమీపంలోని దిబ్బ లింగేశ్వరస్వామి ఆలయాన్ని 1000 ఏళ్ల కిందట నిర్మించారు. దేవతలు కొలువుదీరిన గుడిగా భావిస్తారు. ● రామతీర్థం కొండపై బౌద్ధుల ఆనవాళ్లు ఇప్పటికీ ఉన్నాయి. శిఖరంపై ఉన్న కొలనులో నిత్యం నీరు ఉంటుంది.

అతివకు చిరుసాయం

– న్యూస్‌టుడే, రాజాం, గుమ్మలక్ష్మీపురం

ఉమ్మడి జిల్లాలో చిరుధాన్యాల సాగు ఎక్కువ. ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ తదితర అంశాల్లో మన రైతులు ముందున్నారు. మహిళలు సైతం ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఈక్రమంలో స్థానికంగా మిల్లెట్ క్లస్టర్ ఏర్పాటు చేయాలనే డిమాండు ఎప్పటినుంచో వినిపిస్తోంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రానికి అనేక ప్రతిపాదనలు వెళ్లాయి. తాజాగా సూత్రప్రాయ అంగీకారం తెలిపింది. తమ ఆమోదంతో సంబంధం లేకుండా పనులు ప్రారంభించాలని ఇప్పటికే రాష్ట్రానికి సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో విజయనగరంలోని వైద్య కళాశాల సమీపంలో 13.48 ఎకరాలు గుర్తించినట్లు డీఆర్డీఏ అధికారులు తెలిపారు.

విజయనగరం జిల్లాలో.. సంఘాల ఆధ్వర్యంలో సాగు..

	ఎకరాల్లో	రైతులు
రాగులు	846	886
గంటిలు	330	535
కొర్రలు	27.5	59
జొన్నలు	15	25



గుమ్మలక్ష్మీపురంలో జంతికలు తయారు చేస్తున్న మహిళలు

★ మన్యంలో 5,400 ఎకరాల్లో చిరుధాన్యాలు సాగవుతున్నాయి

విజయనగరం కేంద్రంగా మిల్లెట్ క్లస్టర్

ఉత్పత్తుల తయారీకి అవకాశం

ప్రస్తుతం ఉన్నవి..

రాగి బిస్కెట్లు, రాగి లడ్డూలు, కొర్రలతో జంతికలు, మురుగులు తదితరాలు తయారు చేస్తున్నారు. మన్యంలో ఊదలతో ఇడ్లీలు, మిల్లెట్ పెరుగన్నం, మిల్లెట్ పెసరట్టు, కిచిడీ, మల్టీగ్రైన్ చపాతీలు, నువ్వుండలు, జొన్న గారెలు దుకాణాల్లో కనిపిస్తున్నాయి. ఇప్పటికే రస్తాకుంటుబాయిలోని కేవీకేలో మహిళలకు శిక్షణ ఇచ్చారు. అక్కడే యంత్రాలను బిగించి తయారీపై అవగాహన కల్పిస్తున్నారు.

1000 మందికి లబ్ధి..

దేశవ్యాప్తంగా చిరుధాన్యాల ఉత్పత్తులకు ప్రాధాన్యం పెరిగింది. ఆరోగ్యం దృష్ట్యా చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో డ్వాక్రా సంఘాల మహిళలకు లబ్ధి కలగనుంది. క్లస్టర్ పరిధిలో ఏర్పాటయ్యే యూనిట్లతో వివిధ రకాల వంటల తయారీకి అవకాశం ఏర్పడుతుంది. ఈ విధంగా దాదాపు 1000 మంది లబ్ధి పొందుతారని భావిస్తున్నారు.

సర్వే జరుగుతోంది..

'సాగు విస్తీర్ణం, ఉత్పత్తి అంశాలపై సర్వే చేపడుతున్నాం. యూనిట్ల ఏర్పాటుకు ఎంత మంది ఆసక్తి చూపుతారు? ఏఏ ఉత్పత్తులకు అవకాశం ఉంది.. విలువ జోడింపు తదితర అంశాలపై కసరత్తు చేస్తున్నాం. పూర్తిస్థాయి అనుమతులు వస్తే ముందుకెళతాం' అని **డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్** తెలిపారు. ● తృణధాన్యాల వినియోగంతో ఆరోగ్యంగా ఉండొచ్చని, వ్యాపారాలు బాగుంటాయని **కేవీకే గృహవిజ్ఞాన విభాగం శాస్త్రవేత్త ఉమాజ్యోతి** తెలిపారు.

పోలీసులను నెట్టేసి.. బారికేడ్లు తోసేసి

బారికేడ్లు తోసుకుని వెళ్తున్న నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

గరివిడి, చీపురుపల్లి, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల పీపీపీ విధానానికి వ్యతిరేకంగా వైకాపా శ్రేణులు బుధవారం చీపురుపల్లి నియోజకవర్గంలో చేపట్టిన నిరసన కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. ర్యాలీకి అనుమతి లేదని డీఎస్పీ రాఘవులు, సీఐ శంకరరావు ముందుగానే హెచ్చరించినా నాయకులు, కార్యకర్తలు పట్టించుకోలేదు. శాసన మండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణతో కలిసి గరివిడి నుంచి ప్రధాన రహదారి మీదుగా చీపురుపల్లి వరకు ర్యాలీగా బయలుదేరారు. గరివిడి ఆర్వోబీ వద్ద పోలీసులు అడ్డంగా బారికేడ్లు పెట్టి అడ్డుకున్నారు. దీంతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు, బారికేడ్లను తోసుకుని ముందుకెళ్లే ప్రయత్నం చేశారు. తీవ్రస్థాయిలో తోపులాటలు జరిగాయి. ఈక్రమంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 వరకు రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదే సమయంలో చీపురుపల్లి ప్రాంతీయాసుపత్రి నుంచి విజయనగరం ఆసుపత్రికి ఓ గర్భిణిని ప్రసవం కోసం తీసుకెళ్తున్న 108 ట్రాఫిక్‌లో చిక్కుకుంది. పోలీసులు చూసి, అంబులెన్సు వెళ్లేలా చేశారు. ఎస్సై దామోదర్‌పై వైకాపా నాయకులు తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఎమ్మెల్సీ బొత్స ట్రాఫిక్‌లో చిక్కుకుని కారులోనే ఉండిపోయారు. ఆ తరువాత పోలీసులు ఒక్కొక్క వాహనాన్నీ ముందుకు వదిలారు.

కాళ్లకు చక్రాలు.. కళ్లెదుట లక్ష్యాలు

విజయనగరంలోని నెహ్రూ చిల్డ్రన్స్ పార్కు, విజ్జీ స్టేడియం తదితర ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో పెద్దఎత్తున చిన్నారులు కనిపిస్తున్నారు. కాళ్లకు చక్రాలు కట్టుకుని తిరిగేస్తున్నారు. దేనికని ఆలోచిస్తున్నారా.. స్థానికంగా ఉండే పలువురు చిన్నారులు స్కేటింగ్‌లో రాణిస్తున్నారు. పోటీల్లో పాల్గొంటూ పతకాలు కొల్లగొడుతున్నారు. బుధవారం రాత్రి సమయంలోనూ విజ్జీ మైదానంలో ఇలా రింకు చుట్టూ తిరుగుతూ కనిపించారు. – న్యూస్‌టుడే, విజయనగరం కంటోన్మెంట్

చిన్న నంబరే.. పెద్ద సహాయం

మహిళలు, బాలల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్‌లు

– న్యూస్‌టుడే, విజయనగరం అయ్యన్నపేట, రింగురోడ్డు

మహిళలు, బాలికల భద్రత, రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా సహాయ కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. రోజులో 24 గంటలూ పనిచేస్తాయి. గృహహింసకు గురైనా, భౌతిక, లైంగిక దాడుల బారిన పడినా సంప్రదించవచ్చు. చిన్న నంబర్లే అయినా.. పెద్ద సహాయం పొందొచ్చు.

వేధిస్తే అంతే.. ముకొసర

అధిక కట్నం కోసం వేధించడం, శారీరక, మానసికంగా ఇబ్బంది పెడితే **181**కు ఫోన్ చేయొచ్చు. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ సంచాలకుల కార్యాలయంలో సిబ్బంది వివరాలు నమోదు చేసి ఆయా జిల్లాల పోలీసు, ఇతర శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రక్షణ కల్పిస్తారు. వన్‌స్టాప్ సెంటర్, అంగన్‌వాడీ సిబ్బంది, రెవెన్యూ అధికారులు చేరుకుంటారు.

ఉచితంగానే..: న్యాయ స్థానాల్లో కేసులకు సంబంధించి **15100**ను సంప్రదించాలి. ఫోన్ చేసి సేవలు పొందవచ్చు. న్యాయవాదులను పెట్టుకోలేని బాధిత మహిళలకు ప్రభుత్వమే ఆసరాగా నిలుస్తుంది.

వెంటనే చెప్పండి..: సామాజిక మాధ్యమాల్లో పరిచయాలు పెంచుకుని అశ్లీల చిత్రాలు తీసినా, ఇతర మార్గాల్లో మోసం చేసినా **1930**కు వెంటనే చెప్పాలి.

రక్షణ కోసం..: ఎవరైనా ఇబ్బంది పెట్టినా, వ్యక్తిగత, కుటుంబ, మరే ఇతర సమస్యలున్నా.. **100** నొక్కితే.. పోలీసులు ఇట్టే వాలిపోతారు.

★ బాలలతో వెట్టి చాకిరీ చేయించడం, కర్మాగారాల్లో పనులు చేయిస్తే 1098కు ఫోన్ చేస్తే వారికి విముక్తి కల్పిస్తారు. బాలలపై హింస, దాడులకు పాల్పడినా, అపహరణకు గురైనా ఈ నంబరును వెంటనే సంప్రదించవచ్చు.

మరికొన్ని ఇలా..

★ అత్యవసర వైద్యం	108
★ వైద్య సేవల్లో సందేహాల నివృత్తి	104
★ వయోవృద్ధుల హెల్ప్‌లైన్	14567
★ రోడ్డు ప్రమాదం జరిగితే	1973
★ డ్రగ్స్ నివారణ, సహాయం	1972
★ అత్యవసర స్థితి	112
★ రైల్వే ప్రయాణ సమయంలో	139

★ ఇవే కాకుండా పోలీసు శాఖ శక్తి వారియర్స్ పేరుతో శక్తి యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్లే స్టోర్‌లో నుంచి డౌన్‌లోడ్ చేసుకొని విపత్కర, అత్యవసర పరిస్థితుల్లో సద్వినియోగం చేసుకోవచ్చు. అదేవిధంగా 79934 85111ను సంప్రదించవచ్చు.

మన్నించండి అమ్మానాన్న.. మాటవినక మోసపోయా..

● ఓ మహిళ కన్నీటి కథ
● వ్యభిచార వృత్తిలోకి నెట్టేసిన రాక్షసుడు



అనగనగా ఓ అమ్మాయి. అమ్మానాన్న ఏదైనా చెబితే చాదస్తంగా భావించేది. మనిషి మంచిదే.. కాకుంటే స్వేచ్ఛగా బతకాలని కోరిక. అదే ఆమెను కష్టాల్లోకి నెట్టేసింది. ప్రేమ పేరిట ఇద్దరి చేతుల్లో మోసపోయి.. జీవితం తన చేతుల్లో లేకుండా చేసుకుంది. చివరకు కాదనుకున్న కుటుంబమే అక్కున చేర్చుకుంది. నేటి తరం తెలుసుకోవాల్సిన ఓ యువతి కన్నీటి గాథ ఇది!

– న్యూస్‌టుడే, విజయనగరం నేరవార్తా విభాగం

2016.. విజయనగరానికి చెందిన ఓ యువతికి గాజువాకకు చెందిన యువకుడు పరిచయమయ్యాడు. అది ప్రేమ.. పెళ్లిగా మారి మూడేళ్లు కలిసి ఉన్నారు. ఓ పాప పుట్టింది. మనస్పర్థలు వచ్చి విడిపోయారు. బిడ్డను తీసుకుని విజయవాడ వెళ్లిన ఆమె ఓ మెడికల్ సంస్థలో చేరింది.

ఈ క్రమంలో విజయనగరం ప్రాంతానికి చెందిన యువకుడు సామాజిక మాధ్యమాల్లో పరిచయమయ్యాడు. కొత్త జీవితాన్ని ఇచ్చి.. పాపను సొంత బిడ్డగా చూసుకుంటానన్నాడు. కుమార్తె కోసం అతడి మాటలు విని దగ్గరైంది. కొన్నాళ్లు విశాఖలో కాపురం పెట్టారు. అతడిలో రాక్షస ప్రవృత్తి బయటకొచ్చి.. ఆమెను వ్యభిచార వృత్తిలోకి దింపాడు. ఆ డబ్బులతో కారు, ఖరీదైన వస్తువులు కొనుగోలు చేశాడు.

రోజులు గడుస్తున్న కొద్దీ శరీరం సహకరించని ఆమె ప్రాధేయపడింది. కిరాణా దుకాణం పెట్టుకుని జీవిద్దాం.. శారీరకంగా అలసిపోయాను.. మానసికంగా కుంగిపోయానని వేడుకుంది. అతడిలో మార్పు రాలేదు సరికదా.. నీ బిడ్డతో వ్యాపారం చేస్తానంటూ బెదిరించాడు.

అతడి ఆగడాలు శ్రుతిమించడంతో కన్నీళ్లు ఆగలేదు. కన్నవాళ్లు గుర్తొచ్చారు. విజయనగరంలో ఉంటున్న సోదరికి విషయం చెప్పింది. 'మీ మాట వినకుండా అజ్ఞానంతో తప్పటడుగు వేశా. నా జీవితం ఎలాగూ పోయింది. కుమార్తెను కాపాడాలని ఏడుస్తూ విషయమంతా చెప్పింది. రక్త సంబంధం ఎలా వదులుకుంటుంది. కుటుంబ సభ్యుల సాయంతో తల్లీబిడ్డను విజయనగరం తీసుకొచ్చింది.

పోలీసులకు ఫిర్యాదు.. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన గ్రీవెన్సులో సంబంధిత మహిళ ఫిర్యాదు చేసింది. అంతా విశాఖలో జరిగింది కనుక ఆ ప్రాంత పోలీసులను ఆశ్రయించాలని సలహా ఇచ్చారు. ఈ విషయం అతడికి తెలిసి రూ.3 లక్షలు ఇచ్చి పెద్దలతో రాజీకి ప్రయత్నించాడు. అందుకు ఆమె అంగీకరించలేదు. కేసూ లేదు.. న్యాయమూ జరగలేదు.

జ్ఞాపకాల మదిలో...
జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి
మీరు చూపిన ఆత్మీయత.. అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట.. మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.. ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని భావాలను అక్షరరూపంలో నివేదించడం తప్ప..

ప్రకటనలపై జూనియర్ 5% తగ్గింపు అదనం
నిర్యాణం, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ఈనాడు ప్రకటనల విభాగం
9000866020, 8008597609

(c) eenadu

ఉపాధిలో వెనుకబాటు

న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమల్లో జిల్లాలో ప్రగతి కొరవడుతోంది. పనిదినాల కల్పన, సగటు వేతనం అంశాల్లో వెనుకంజలో ఉంది. దీనిపై కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి పలు సమావేశాల్లో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మెంటాడ, రామభద్రపురం, వంగర, మెరకముడిదాం మండలాల్లో పనులు ప్రారంభించేలా ప్రత్యేక ఆదేశాలు జారీచేశారు.

పనిదినాలు

ఆర్థిక సంవత్సరంలో 1.25 కోట్ల పనిదినాలు కల్పించడం లక్ష్యం. ఇప్పటివరకు 1.06 కోట్లు కల్పించారు. వేపాడ, జామి, తెర్లాం, రామభద్రపురం, డెంకాడ మండలాల్లో ప్రగతి 80 శాతంలోపే ఉంది. వేపాడలో అతి తక్కువగా 57.10 శాతం పనిదినాలే కల్పించారు.

కుటుంబానికి ఏదీ ఆసరా

ప్రతి కుటుంబానికి ఏడాదిలో వంద రోజుల పనిదినాలు కల్పించాలి. జిల్లాలో 2.77 లక్షల కుటుంబాలు పనుల్లోకి వస్తున్నాయి. వీరిలో ఇప్పటివరకు 1,645 కుటుంబాలే వంద రోజులు పూర్తిచేస్తుకున్నాయి. 23 మండలాల్లో వంద రోజులు పనిదినాలు పూర్తిచేసుకున్న కుటుంబాల సంఖ్య రెండంకెల్లోనే ఉంది. గంట్యాడ 178, సంతకవిటి 161, రేగిడి ఆమదాలవలస 159, గజపతినగరం మండలంలో 101 కుటుంబాలకు వందరోజులు పనిదినాలు కల్పించారు.

ఉపాధి పనుల్లో వేతనదారులు

సగటు వేతనం

ప్రభుత్వం నిర్దేశించిన వేతనం రూ.307. ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్‌లో రూ.189 ఉండేది. క్రమేపీ పెరుగుతూ వస్తోంది. నవంబరు నెలలో రూ.287గా ఉంది. రాజాం నియోజకవర్గంలో సగటు వేతనం తక్కువగా ఉంది. రేగిడి ఆమదాలవలసలో రూ.207.20 ఉండగా, మిగిలిన మూడుచోట్ల రెండు వందల్లోపే. గరిష్ఠంగా భోగాపురం రూ.231.47, గుర్ల మండలంలో రూ.229.76, విజయనగరంలో రూ.229, నెల్లిమర్లలో రూ.228.40 వేతనం కార్మికులకు లభిస్తోంది.

సొంత నిధులు పెంచుకునేలా!!

రూ.400 కోట్ల లక్ష్యంతో..

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)కు సొంత నిధులు లేవు. ఆప్కాబ్, నాబార్డు ఇచ్చే సొమ్ముపైనే ఆధారపడుతోంది. అందులోనుంచే రుణాలిస్తోంది. తగినంత డిపాజిట్లు లేకపోవడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణం. ఉమ్మడి జిల్లాలో 24 సహకార బ్యాంకులున్నాయి. వీటి ద్వారా డిపాజిట్ల సేకరణపై దృష్టిసారించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పర్సన్ ఇన్‌ఛార్జుల ఆధ్వర్యంలో రూ.23 కోట్లు వచ్చాయి.

– న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్

బ్యాంకు పరంగా ఏటా రూ.2,232 కోట్ల మేర టర్నోవర్ జరుగుతోంది. ఇందులో రుణాల కింద రూ.1893 కోట్లు ఇస్తున్నారు. దీని ప్రకారం రూ.800 కోట్ల మేర డిపాజిట్ ఉండాలి. ప్రస్తుతం రూ.339 కోట్లు మాత్రమే ఉన్నాయి. ఆరు నెలల వ్యవధిలో రూ.27 కోట్లను సేకరించారు. డిసెంబరు నాటికి మరో రూ.375 కోట్లను సమీకరించాలని నిర్ణయించారు. 2026 మార్చి నాటికి రూ.400 కోట్లు వచ్చేలా లక్ష్యంగా పెట్టుకున్నారు. వినియోగదారులను ఆకట్టుకునేందుకు సహకార బ్యాంకుల్లో అయితే 7.90 శాతం వడ్డీ, సొసైటీల్లో అయితే 8.90 శాతం వడ్డీ ఇవ్వనున్నారు.

ఇదీ పరిస్థితి..

- సహకార బ్యాంకులు : 24
- సొసైటీలు : 94
- ప్రస్తుత డిపాజిట్ : రూ.339 కోట్లు
- డిసెంబరు నాటికి లక్ష్యం: రూ.375

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు

కారణాలివీ..

గత పాలకవర్గాల్లో సొసైటీల స్పందన అంతంత మాత్రమే కావడంతో బ్యాంకు నష్టాల్లోకి వెళ్లింది. తొలి నాళ్లలో డిపాజిట్లపై నిషేధం ఉండడం కూడా ప్రధాన కారణంగా కనిపిస్తోంది. సహకార రంగంలో కొన్ని బ్యాంకులు, సంస్థలు దివాలా తీయడంతో ఆ ప్రభావం సైతం పడింది. రెండు జిల్లాల్లో 94 సొసైటీలున్నాయి. ఇందులో కెల్ల, తెట్టంగి, సతివాడ మినహా మిగిలిన అన్నింట్లో ధాన్యం కొనుగోలు ద్వారా వచ్చిన కమిషన్‌నే డిపాజిట్‌గా చూపుతున్నారు. వ్యక్తిగతంగా సేకరించడం లేదు. ఈ నేపథ్యంలో ప్రచారం చేయనున్నారు.

రైతుల మేలు కోసమే..

డిపాజిట్లు పెంచే దిశగా సొసైటీలతో సంప్రదింపులు జరుపుతున్నాం. ఇప్పటికే గాజులరేగ, చీపురుపల్లి తదితర కార్యాలయాలను సందర్శించాం. సొంత నిధులు పెంచుకోవడంతో తక్కువ వడ్డీకే రైతులకు రుణాలు ఇవ్వొచ్చు. దీంతో లక్ష్యాలు విధించాం.

– కిమిడి నాగార్జున, డీసీసీబీ ఛైర్మన్

అందిపుచ్చుకుంటే అడుగు బయటపెట్టక్కర్లే

'పురమిత్ర' యాప్‌పై కొరవడిన చైతన్యం

న్యూస్‌టుడే– రాజాం

నగర, పురపాలక సంఘాల్లోని 119 రకాల సేవలతో పాటు సమస్యల పరిష్కారానికి తీసుకొచ్చిన పురమిత్ర యాప్‌పై ప్రజల్లో అవగాహన కొరవడింది. ఇంటింటికీ వెళ్లి ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకునేలా ప్రోత్సహించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినా స్పందించడం లేదు. ఉమ్మడి జిల్లాలోని విజయనగరం, రాజాం, నెల్లిమర్ల, బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు, పాలకొండ పట్టణాల్లో 1,46,135 కుటుంబాలు ఉండగా.. ఇంతవరకు 34,670 కుటుంబాలు మాత్రమే యాప్ వినియోగిస్తున్నాయి.

ఒక్క చిత్రంతో పరిష్కారం..

సమస్య ఏదైనా ఒక్క ఫొటోతో పరిష్కరించే దిశగా దీన్ని రూపొందించారు. వీధి దీపం వెలగడంలేదని చిత్రం తీసి యాప్‌లో అప్‌లోడ్‌చేస్తే సంబంధిత వార్డు కార్యదర్శి లాగిన్‌కు వెళ్తుంది. యాప్‌నకు కృత్రిమ మేధ (ఏఐ) అనుసంధానించడంతో వివరాలు ఆటోమెటిక్‌గా వెళ్తాయి. వెంటనే పరిష్కరిస్తారు. ఫొటో తీయలేనప్పుడు సమస్యను నోటితో చెబితే చాట్‌బాట్ ద్వారా సంబంధిత అధికారులకు చేరుతుంది. ఇంటి నిర్మాణం అనుమతులు, దరఖాస్తు ప్రాసెస్ విధానం, ఫీజుల చెల్లింపు వంటి విషయాలను తెలుగు, ఆంగ్ల భాషల్లో చాట్‌బాట్ తెలుపుతుంది.

పురమిత్ర యాప్ హోమ్ పేజీ

8 విభాగాలు.. 119 సేవలు

యాప్‌లో ఎనిమిది ప్రధాన విభాగాల్లో 119 వరకు సేవలు పొందుపరిచారు. రెవెన్యూ, మెప్మా, నీటి సరఫరా, ప్రజారోగ్యం, వీధి దీపాలు, పరిశుభ్రత, ఇంజినీరింగ్ పట్టణ ప్రణాళిక విభాగాలు ప్రధానమైనవి. వీటికి ఒక్కో దానిలో 25 సేవలు అనుసంధానించారు. సేవలను అందించేందుకు కనిష్ఠంగా 24 గంటలు, గరిష్ఠంగా 30 రోజులుగా ప్రభుత్వం కాల వ్యవధి పెట్టింది. యాప్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకునేలా చైతన్యం కల్పించాలని పురపాలికల అధికారులకు ఆదేశించినట్లు పురపాలక ఆర్డీ రవీంద్ర తెలిపారు.

ప్రతిభకు ఉపకారం

విజయనగరం రింగ్‌రోడ్డు, న్యూస్‌టుడే: ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిత సాధ్యమని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి నిర్వహించిన పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన హోంగార్డుల పిల్లలను ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందించారు. బుధవారం తన కార్యాలయంలో 16 మంది పిల్లలను పిలిపించి, ప్రత్యేకంగా అభినందించి వారికి ఉపకార వేతనాలను అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి. సౌమ్యలత, వెల్ఫేర్ ఆర్ఐ గోపాలనాయుడు, పోలీసు ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ఎస్పీ ఏఆర్ దామోదర్

ఉద్యోగుల ఆటవిడుపు

క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు

విజయనగరం క్రీడా విభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల(పురుషులు-స్త్రీలు) క్రీడా పోటీలు బుధవారం ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి. విజ్జీ రాజీవ్ మైదానాల్లో రెండు రోజుల పాటు జరిగిన ఈ క్రీడా పోటీల్లో వివిధ విభాగాల్లో ఉద్యోగులు తలపడ్డారు. మంగళవారం క్యారమ్స్, చదరంగం, క్రికెట్, బెస్ట్ ఫిజిక్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, టెన్నిస్, కబడ్డీ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిని ఈ నెల 19 నుంచి 22 వరకు విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని క్రీడాధికారి ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా గెలుపొందిన వారిని ఆయన అభినందించారు.

క్యారమ్స్‌లో పోటీపడుతున్న ఉద్యోగులు

స్వగ్రామంలో సినీ నటుడు సాయికుమార్

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: సినీ రంగంలో 50 ఏళ్లు పూర్తిచేసుకున్నానని, సుమారు 300 చిత్రాల్లో నటించానని, అంతకుమించిన చిత్రాల్లో డబ్బింగ్ చెప్పానని ప్రముఖ సినీ నటుడు సాయికుమార్ అన్నారు. బుధవారం తన స్వగ్రామం మండలంలోని కళ్లేపల్లి గ్రామానికి ఆయన వచ్చారు. సమీపంలోని రేగ గ్రామంలో ఉన్న వేదమాత గాయత్రీ దేవి, కాశీ విశాలీశ్వర ఆలయాలను సందర్శించారు. అంతకు ముందు కళ్లేపల్లిలో గ్రామపెద్దలు, కుటుంబ సభ్యులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అరకులో ఎస్వీ కృష్ణారెడ్డి దర్శకత్వంలో నిర్మిస్తున్న వేద వ్యాస్ సినిమా షూటింగ్‌లో పాల్గొనేందుకు చిత్ర బృందంతో కలిసి వెళ్తున్నట్లు చెప్పారు. మార్గంమధ్యలో స్వగ్రామాన్ని చూడాలని వచ్చినట్లు చెప్పారు. గ్రామంలో తన తండ్రి పీజే శర్మ జ్ఞాపకార్థం కల్యాణ మండపం నిర్మించాలన్న ఆలోచన ఉందన్నారు. చుట్టుపక్కల గ్రామస్థులు పెద్ద సంఖ్యలో ఆయనను చూసేందుకు వచ్చి, సెల్ఫీలు తీసుకున్నారు.

విద్యార్థినులతో సాయికుమార్ సెల్ఫీ

పోలీసులు ఇబ్బంది పెట్టారు: బొత్స

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో మార్చాలనుకుంటున్న ప్రభుత్వ నిర్ణయంపై వైకాపా చేపట్టిన ప్రజా ఉద్యమ ర్యాలీ సందర్భంగా పోలీసులే రాష్ట్రకో.. దర్పా చేసినట్లు ఉందని శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. విజయనగరంలో బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గరివిడి నుంచి చీపురుపల్లి వరకు బైక్ ర్యాలీ జరగనివ్వకుండా పోలీసులు గంటన్నరపాటు ఇబ్బందులు పెట్టారని ఆరోపించారు. రాష్ట్రంలో మూడు లక్షల ఇళ్ల ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద కట్టామని ప్రకటనలు ఇచ్చారని, వాటికి భూసేకరణ, శంకుస్థాపనలు ఎప్పుడు చేసింది చెప్పాలని ప్రభుత్వాన్ని బొత్స ప్రశ్నించారు. మొంథా తుపాను నష్టం అంచనా వేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. విశాఖ సమ్మిట్ వంటివి వైకాపా హయాంలో ఎందుకు ఏర్పాటు చేయలేదని ముఖ్యమంత్రి ప్రశ్నిస్తున్నారని ఓ విలేకరి అడుగగా.. తమ హయాంలో సమ్మిట్‌కు అత్యధిక పెట్టుబడులు వచ్చాయన్నారు. రిలయన్స్ అధినేత అంబానీ, గూగుల్ అధినేత కుమారుడు వచ్చారు కదా అంటూ చెప్పారు. ఇప్పుడు దానికి కొనసాగింపే విశాఖ గూగుల్ సంస్థ ఏర్పాటని బొత్స వ్యాఖ్యానించారు.

శంబర ట్రస్టుబోర్డ్ ప్రమాణ స్వీకారం

శంబర(మక్కువ), న్యూస్‌టుడే: శంబర పోలమాంబ అమ్మవారి ట్రస్టుబోర్డ్ ఛైర్మన్‌గా నైదాన తిరుపతిరావు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆధ్వర్యంలో ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం చేశారు. పోలమాంబ అమ్మవారి దర్శనం అనంతరం చదురుగుడి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో రూ.3 కోట్లకు పైగా శంబర అమ్మవారి ఆలయ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రస్తుతం ఆలయ విస్తరణ, భక్తుల విశ్రాంతికి షెడ్ల నిర్మాణానికి పాటు ఇతర సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఛైర్మన్‌తో పాటు తీళ్ల సింహాచలం, అక్యాన సింహాచలం, గొట్టాపు భవాని, ఎ.వెంకటేష్, వి.నారాయణమ్మ, ఎస్.సత్యవతమ్మ, జి.లలితకుమారి, సీహెచ్.దక్షరాణి, వి.రామ ప్రమాణస్వీకారం చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు గుళ్ల వేణుగోపాలనాయుడు, ఈవో బండిమూడి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ట్రస్టు బోర్డు సభ్యులతో మంత్రి సంధ్యారాణి

చల్లగాలి వీస్తోంది.. చిన్నారులు జాగ్రత్త

విజయనగరం వైద్య విభాగం, న్యూస్‌టుడే: అయిదేళ్లలోపు పిల్లల్లో న్యుమోనియా లక్షణాలు అధికంగా కనిపిస్తాయని, ఈ వ్యాధి శీతాకాలంలో ఎక్కువగా వ్యాపిస్తుందని డీఎంహెచ్‌వో ఎస్.జీవనరాణి తెలిపారు. న్యుమోనియా నియంత్రణ దినోత్సవం సందర్భంగా బుధవారం తన కార్యాలయంలో అవగాహన కల్పించే గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దగ్గు, జలుబు, జ్వరం, వేగంగా శ్వాస తీసుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. తక్షణమే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం అందించాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాల అధికారి ఆర్.అచ్యుతకుమారి, అదనపు డీఎంహెచ్‌వో కె.రాణి తదితరులు పాల్గొన్నారు.

గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో జీవనరాణి

మోసానికి పాల్పడిన యువకుడి అరెస్టు

నిందితుడిపై 30 కేసులు

రాజాం, న్యూస్‌టుడే: వృద్ధుడిని మోసం చేసి సొమ్ము కాజేసిన నిందితుడ్ని రాజాం పోలీసులు పట్టుకుని జైలుకు పంపారు. సీఐ కె.అశోక్‌కుమార్ వివరాల ప్రకారం.. వంగర మండలం మరువాడ గ్రామానికి చెందిన సింగిరెడ్డి పైడిరాజు ఈనెల 10న రాజాం పట్టణంలోని ఎస్‌బీఐ ప్రధాన బ్రాంచి వద్ద ఏటీఎంలో రూ.98,500 తన కుమారుడి ఖాతాలో జమచేసేందుకు వెళ్లి.. ఎలా చేయాలో తెలియకపోవడంతో పక్కనున్న వ్యక్తి సాయం కోరారు. నిందితుడు తన సొంత ఖాతాలో జమ చేసుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు గుంటూరు జిల్లా వీరంగివారిపాలెం గ్రామానికి చెందిన కాటూరి వెంకటేష్(36) నిందితుడిగా గుర్తించారు. రూ.91,000 రికవరీ చేశారు. ఇతనిపై ఇదే తరహా కేసులు 30 ఉన్నట్లు గుర్తించామని సీఐ వెల్లడించారు.

నిందితుడు వెంకటేష్

ప్రాజెక్టులకు త్వరితగతిన భూసేకరణ

విజయనగరం అర్బన్: ప్రాజెక్టులకు అవసరమైన భూములను వెంటనే సేకరించాలని కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం దూరదృశ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మురుగునీరు శుద్ధి ప్లాంట్లకు పురపాలక సంస్థల్లో ప్రభుత్వ భూములను గుర్తించాలని, లేకుంటే ప్రైవేటుగా తీసుకోవాలన్నారు. 22 బీఎస్ఎన్ఎల్ టవర్లు, డెంకాడ మండలం పెదతాడివాలో విద్యుత్తు సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు.

రెవెన్యూ వసూళ్లు ముమ్మరం చేయండి

విజయనగరం పట్టణం: రెవెన్యూ వసూళ్లను ముమ్మరం చేసి సంస్థల ఆర్థిక పరిపుష్టికి కృషి చేయాలని రీజియన్ పరిధి మున్సిపల్ కమిషనర్లను ఇన్‌ఛార్జి ఆర్డీ పి.నల్లనయ్య ఆదేశించారు. ఈ మేరకు బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ అంశాలపై చర్చించారు. రెవెన్యూ మందకోడిగా ఉన్న పురపాలక సంఘాలు ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు త్వరితగతిన వసూలు చేసి లక్ష్యాలను అధిగమించాలన్నారు.

'పీపీపీపై చర్చకు సిద్ధమా'

గజపతినగరం, న్యూస్‌టుడే: వైద్యవిద్య, బోధనాసుపత్రులపై వైకాపా చేస్తున్న అసత్య ఆరోపణలపై బహిరంగ చర్చకు రావాలని ఆ పార్టీ నేతలకు బుధవారం కార్యకర్తల సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సవాలు విసిరారు. రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేసి, వాటిలో అయిదు ఆసుపత్రుల నిర్మాణాలు చేపట్టి అసంపూర్తిగా వదిలేసి కూటమి ప్రభుత్వంపై బురద జల్లడం సరికాదన్నారు. విజయనగరం కళాశాలను పూర్తి చేసేందుకు రూ.500 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు.

చంద్రబాబు కృషితోనే పరిశ్రమల రాక

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ కృషితోనే ఆంధ్రప్రదేశ్‌లో దిగ్గజ సంస్థలు పరిశ్రమలు పెట్టడానికి ఒప్పందాలు చేసుకుంటున్నాయని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చెప్పారు. విజయనగరం దుప్పాడలో ఎమ్మెల్యే అదితిగజపతిరాజుతో కలిసి బుధవారం ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో నిర్మించిన గృహాలను ఆయన ప్రారంభించారు. ప్రతి నియోజక వర్గంలో పారిశ్రామిక పార్కులు పెడుతున్నామన్నారు. ఎమ్మెల్యే అదితి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలోనే పేదల సొంతింటి కల సాకారమవుతోందని వివరించారు. తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పాలవలస యశస్వి, తహసీల్దారు నీలా కూర్మనాథరావు, ఎంపీడీవో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుకు నమూనా ఇంటి తాళం అందిస్తున్న ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే అదితి

EENADU Classifieds

REAL ESTATE

HOUSE FOR SALE

విజయనగరం-ప్రియనగర్ కాలనీ D-మార్ట్ దగ్గర 167 (30x50) గజాలు G+2 ఉత్తరం పేస్ ఇల్లు అమ్మకం. బ్యాంక్ లోన్ సౌకర్యం. సం|| 9441749727.

PLOT FOR SALE

విజయనగరం- విశాఖపట్నం NH-26 కు & రాయపూర్ హైవేకు ప్రక్కన 4 ఊర్లుకు మధ్యలో VMRDA అప్రూవ్డ్‌తో Fully గేటెడ్ కమ్యూనిటి లేఅవుట్‌లో Open ప్లాట్లు అమ్మకమునకు కలవు. డైరెక్ట్ కంపెనీ సేల్స్. సంప్ర|| 8883375999.

SECOND SALE

VZMలో GYM అమ్మకంనకు కలదు Cost:10 లక్షలు మాత్రమే ✆ 7075546232.

JOBS

కాంట్రాక్ట్ / ఔట్ సోర్సింగ్ పద్ధతిలో వైజాగ్, VZM, SKLM జిల్లాలో మైన్స్, హస్పిటల్స్, బ్యాంక్స్, స్కూల్స్, చెక్ పోస్ట్ ఆపరేటర్స్, అటెండర్స్, డేటాఎంట్రీ & కంప్యూటర్ ఆపరేటర్స్, జూనియర్&రికార్డ్ అసిస్టెంట్స్, P.O's క్లర్క్స్, GNM, స్పీచ్‌థెరపీ, ఫిజియోథెరపీ, ECG&Lab టెక్నీషియన్స్ 10th, ఏదీ డిగ్రీ, ITI, B.Tech. ఆల్ బ్రాంచ్. Age:18 to 42 జీ:20 to 50k M/F ✆9908656555.

మదర్‌ని చూసుకోవడానికి మహిళ కావలెను, లోలుగు, శ్రీకాకుళం జిల్లా జీతం: 13000/ కాంటాక్ట్: 9424933002.

మైపైసా డిజిటల్ చిట్స్‌లో ఉద్యోగ అవకాశాలు (M/F) పోస్ట్: అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్స్, బిజినెస్ అసోసియేట్స్ కావలెను. మార్కెటింగ్ అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత, కొత్తవారికి అవకాశాలు కల్పించబడును. ఇంటర్వ్యూ తేది : 15-11-2025. కొత్తపేట, గౌడ వీధి, వేణుగోపాలస్వామి ఆలయం ఎదురుగా, భారతీ ఎన్‌క్లేవ్ ఫస్ట్ ఫ్లోర్, VZM. ✆7997599996, 9989051745.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

గొల్లపల్లిలో అతిసారం

బాధితుల్లో నలుగురు బాలలు

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పట్టణంలోని గొల్లపల్లి హరిజనవీధిలో అతిసారం లక్షణాలతో పలువురు బాధపడుతున్నారు. రెండు రోజులుగా వాంతులు, విరోచనాలతో ఆసుపత్రుల్లో చేరుతున్నారు. బుధవారం అయిదుగురు బొబ్బిలి సీహెచ్‌సీలో చేరారు. రెయ్యి మహేష్(12), తాన్యశ్రీ (9), కాకల చిరు (8), రామకృష్ణ చికిత్స పొందుతున్నారు. యువకుడు సన్యాసిరావుకు మెరుగుపడడంతో సాయంత్రం ఇంటికి వెళ్లిపోయారు. రెండు రోజుల కిందట కె.రామకృష్ణ, ఆర్.రామకృష్ణ, ఆర్.మహేశ్, తామేశ్వరి చేరారు. వారికి నయం కాగానే మరికొన్ని కేసులు వచ్చాయి. మంగళవారం సాయంత్రం ధరణి (9) చేరగా.. విజయనగరం రిఫర్ చేశారు. నాలుగు రోజుల కిందట వీధిలో జరిగిన ఓ శుభకార్యంలో అల్పాహారం చేశారని, అప్పటి నుంచి వాంతులు, విరోచనాలు మొదలయ్యాయని చెబుతున్నారు. కలుషిత ఆహారమే కారణమని వైద్య సిబ్బంది భావిస్తున్నారు. పురపాలిక సిబ్బంది హరిజనవీధిలో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేశారు. తాగునీటి పరీక్షలు నిర్వహించారు. కాలనీలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పరిస్థితి అదుపులో ఉందని కమిషనర్ రామలక్ష్మి అన్నారు. తహసీల్దారు ఎం.శ్రీను కాలనీని పరిశీలించి, స్థానికులతో మాట్లాడారు.

చికిత్స పొందుతున్న రెయ్యి మహేష్

అస్వస్థతకు గురైన తాన్యశ్రీ

చదువుకోమంటే.. తనువు చాలించాడు

కొమరాడ, న్యూస్‌టుడే: పిల్లల భవిష్యత్తు ఉన్నతంగా ఉండాలని.. వారికి తమ కష్టాలు రాకూడదని శ్రమిస్తున్నారు ఆ తల్లిదండ్రులు.. పొలాన్ని నమ్ముకుని పంట దిగుబడులే ఆధారంగా ఇద్దరు కుమారుల్ని చదివిస్తున్నారు. బిడ్డల భవిష్యత్తు బాగుంటుందని కలలు కంటున్న తరుణంలో కుమారుడు కళాశాలకు వెళ్లకుండా బయట తిరుగుతున్నాడని తెలుసుకుని ఆవేదనతో మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన బాలుడు క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకుని కన్నవారికి తీరని శోకాన్ని మిగిల్చాడు. ఈ విషాద ఘటన కొమరాడ మండలంలో చోటుచేసుకుంది.

పోలీసుల వివరాల ప్రకారం..

మండలంలోని గుమడ సీతమాంబపురం గ్రామానికి చెందిన బాలకృష్ణ, సుగుణ దంపతుల మొదటి కుమారుడు వర్ధన్ బీటెక్, రెండో బాబు వై.ధనుష్(16) కొమరాడ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. కాగా ధనుష్ రోజూ కళాశాలకు వెళ్లకుండా బయట తిరుగుతున్నాడని తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన బాలుడు కన్నవారు పొలానికి వెళ్లిన సమయంలో ఇంట్లో పురుగు మందుతాగి, పక్కింటి వాళ్లకి చెప్పాడు. కుటుంబీకులు చేరుకుని కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అక్కడి నుంచి జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎన్నో ఆశలతో అల్లారుముద్దుగా పెంచిన బిడ్డ మృతితో తల్లిదండ్రులు విలపిస్తున్నారు. ఇన్‌ఛార్జ్ ఎస్సై ఎల్ఆర్ నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధనుష్(పాతచిత్రం)

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	125	220	230

పసిబిడ్డ మృతిపై ఆందోళన

విశాఖపట్నం(వన్‌టౌన్), న్యూస్‌టుడే: కింగ్‌జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్) పిల్లల వార్డులో ఆరు నెలల మగబిడ్డ మృతి చెందిన ఘటనపై బుధవారం బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యమే కారణమని వారు ఆరోపించారు. ఆ వివరాలు... పార్వతీపురం మన్యం జిల్లా, గుమ్మలక్ష్మీపురం మండలం వంగర గ్రామానికి చెందిన వై.అఖిల్ దంపతులకు ఆరు నెలల కిందట మగబిడ్డ (ధన్వీర్) జన్మించాడు. ఆ బిడ్డ అనారోగ్యం బారిన పడడంతో తొలుత పార్వతీపురంలో ఆసుపత్రికి, అక్కడ నుంచి విజయనగరంలో ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో 8వ తేదీ రాత్రి కేజీహెచ్‌కు తీసుకొచ్చి పిల్లల వార్డులో చేర్పించారు. బ్లడ్ ఇన్‌ఫెక్షన్ కారణంగా బిడ్డ ఇబ్బంది పడుతున్నాడని చెప్పిన వైద్యులు, అవసరమైన చికిత్స అందించారు. బుధవారం ఉదయం ఆరోగ్యం విషమించడంతో బిడ్డ మృతి చెందాడు.

- అయితే ఆసుపత్రికి వచ్చిన తర్వాత బిడ్డకు రెండుసార్లు మూర్ఛ వచ్చినా, వైద్యులు సమాచారం ఇవ్వలేదని, ఎలాంటి చికిత్స అందించారో చెప్పలేదని, బిడ్డ మృతి చెందే వరకు ఆరోగ్య స్థితి మెరుగ్గానే ఉందంటూ మోసం చేశారని బాధిత కుటుంబీకులు ఆందోళనకు దిగారు. న్యాయం చేయాలని కోరుతూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిరసన కొనసాగించారు.

బాధితులు, వైద్యులతో మాట్లాడుతున్న సీఎస్ఆర్ఎంవో శ్రీహరి

- ఆసుపత్రి సీఎస్ఆర్ఎంవో డాక్టర్ శ్రీహరి స్పందించి బాధితులు, వైద్యులతో మాట్లాడారు. జరిగిన పరిణామాలు బాధిత కుటుంబీకులకు వివరించడంతో వారు శాంతించారు. అనంతరం అంబులెన్స్ ఏర్పాటు చేయడంతో బిడ్డ మృతదేహాన్ని తీసుకుని స్వగ్రామానికి వెళ్లారు.

(c) eenadu

రాజాం, చీపురుపల్లి నియోజకవర్గాల్లో సమస్యలా?

ఈనాడు ఫోన్ ఇన్ కార్యక్రమం

చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని చీపురుపల్లి, రాజాం నియోజకవర్గాల ప్రజలారా.. మీ గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు వేధిస్తున్నాయా? తాగునీరు సక్రమంగా అందడం లేదా? వీధి దీపాలు వెలగడం లేదా? గ్రామ, వార్డు సచివాలయాల్లో సేవలు సక్రమంగా అందడంలేదా? 'ఈనాడు' మీకు తోడుగా నిలుస్తోంది. సమస్యలను డివిజనల్ అభివృద్ధి అధికారి కొత్తకోట హేమసుందరరావు దృష్టికి తీసుకెళ్లే అవకాశాన్ని కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా నిర్దేశించిన సమయంలో ఫోన్ చేయడమే. – న్యూస్‌టుడే, చీపురుపల్లి

తేదీ: 14.11.2025 (శుక్రవారం) సమయం: ఉదయం 10.30 గంటల నుంచి 11:30 వరకు

ఫోన్ నంబరు: 91545 21366

బొబ్బిలి

•బొబ్బిలి •రాజాం •గజపతినగరం •చీపురుపల్లి

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

తెర్లాం, న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే బేబీనాయన, బుడా ఛైర్మన్ తెంటు లక్ష్మునాయుడు అన్నారు. బుధవారం తెర్లాం, చిన్నయ్యపేట గ్రామాల్లో పీఎంఏవై పథకం కింద నిర్మించిన గృహాలను ప్రారంభించారు. లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేశారు. తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్, ఎంపీడీవో రేగ రాంబాబు, గృహనిర్మాణ శాఖ డీఈఈ వేణుగోపాల్, ఏఎంసీ ఛైర్మన్ నర్సుపల్లి వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తెర్లాంలో నూతన గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి - 80085 74348

? రామభద్రపురం మండల కేంద్రంలో కూరగాయల తోటలకు వెళ్లే దారి పాడైపోయింది. - రైతులు
★ ప్రతిపాదనలు పంపిస్తాం. - త్రినాథరావు, పీఈవో – రామభద్రపురం

? రాజాం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాముల వద్ద ఎండిపోయిన చెట్లు కొమ్మలు పడి ఉన్నాయి. - రైతులు
★ శుభ్రం చేయిస్తాం. - శ్రీనివాసరావు, ఏఎంసీ కార్యదర్శి – రాజాం

పూడికల తొలగింపు

పుడమి వందనం

వంగర: కొప్పరవలస, రుషింగి గ్రామాల్లో కాలువల్లో పూడికలు పేరుకుపోయాయి. మురుగు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఈనెల 10న వార్త ప్రచురితమవడంతో పంచాయతీ విస్తరణాధికారి రామారావు స్పందించారు. సర్పంచుల సహకారంతో పూడికలు తొలగించారు.

దుర్వాసన ఆగింది

గంట్యాడ గ్రామీణం: గొడియాడలో కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై గతనెల వార్త ప్రచురితమవడంతో అధికారులు స్పందించారు. చర్యలు తీసుకున్నారు.

గుంత పూడ్చారు

రాజాం గ్రామీణం: రాజాం మండలం బొద్దాం ఉన్నత పాఠశాల ఆవరణలో రక్షిత మంచినీటి పథకం పైపుల మరమ్మతులకు గుంత తవ్వి వదిలేశారు. దీనిపై వార్త ప్రచురితమవడంతో అధికారులు స్పందించారు. గుంత పూడ్చివేయించారు.

ఈ-వ్యర్థం.. సేకరణ శూన్యం

న్యూస్‌టుడే– బొబ్బిలి, రాజాం పట్టణం

స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పట్టణాలు, మేజర్ పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా ఈ-వ్యర్థాలు సేకరించి, వాటిని రీసైక్లింగ్ చేయాలని నిర్ణయించింది. దీనికి అనుగుణంగా ప్రతి రోజు తడి, పొడి చెత్తతో పాటు ఎలక్ట్రానిక్ వస్తువులను సేకరించాల్సి ఉంది. కాని ఎక్కడా జరగడంలేదు. ఈ-వ్యర్థాల నుంచి పరిశీలిస్తే రకరకాల ఆక్కతలు తయారవుతాయి. బాధ్యత మహిళా సంఘాలకు అప్పగించింది. వాటిని కార్యాలయాల్లో ఉంచాలి. ఆ దిశగా అడుగులు పడడంలేదు.

అమ్మిగారి కోనేరు గట్టు వద్ద ఉంచిన ఎలక్ట్రానిక్ పరికరాలు

ప్రజల్లో అవగాహన కరవు..

ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం పెరిగింది. ఇంటి నిండా ఇవే కనిపిస్తాయి. టీవీలు, చరవాణి వంటివి పాడైతే దుకాణాల నుంచి రోజూ వ్యర్థాలు బయటకొస్తాయి. అవగాహన లేకపోవడంతో ఆరుబయట పడేస్తున్నారు. దీన్ని గుర్తించి ప్రభుత్వం రీసైక్లింగ్ చేయాలని నిర్ణయించింది. సేకరించిన ఆరోగ్య వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బంది డంపింగ్ యార్డుల్లో పోసేస్తున్నారు.

నేటికీ ఏజెన్సీ లేదు..

ప్రతి ఇంట్లో పాడైన టీవీలు, చరవాణులు, లాప్‌టాప్స్, కంప్యూటర్లు, ఫ్యాన్లు, మిక్సీలు తదితర పరికరాలు లెక్కకు మించి ఉన్నాయి. మరమ్మతులకు గురైన వాటిని ఎక్కడ పడితే అక్కడ వేయకుండా.. సేకరించి ఓ చోటుకు తరలించాలి. తడి, పొడి చెత్తతో పాటే ఎలక్ట్రానిక్ పరికరాలు సేకరించి వేరుచేయాలి. అది పక్కాగా జరగడంలేదు. బొబ్బిలి పట్టణంలో రోజూ సేకరిస్తున్నట్లు పారిశుద్ధ్య శాఖ సిబ్బంది చెబుతున్నారు. వాటిని ప్రత్యేక ఏజెన్సీకి విక్రయించాలి. ఇంతవరకు ఏజెన్సీని ఖరారు చేయలేదు. ఆయా వ్యర్థాలు గుట్టలుగా పార్కుల్లో ఉంటాయి. వీటి నుంచి అంతకుమించి ఆదాయం లేదు. రామభద్రపురం మేజర్ పంచాయతీలోనూ అంతంతమాత్రంగానే ఉంది.

చర్యలు తీసుకుంటాం..

పట్టణవాసులకు ఈ-వ్యర్థాలపై అవగాహన కల్పిస్తున్నాం. ఇళ్లల్లో పాడైన వస్తువులు బయట పడేయకుండా పురపాలిక పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని చెబుతున్నాం. ఇప్పటికే కొంత మార్పు వచ్చింది. శతశాతం అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం. – రామలక్ష్మి, శ్రీనివాసరావు, పురపాలిక కమిషనర్లు, బొబ్బిలి, రాజాం

పార్టీ బలోపేతానికి కృషి

ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి కొండపల్లి

గజపతినగరం, న్యూస్‌టుడే: అందరి సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం గజపతినగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో గజపతినగరం, గంట్యాడ, దత్తిరాజేరు, బొండపల్లి, జామి మండలాధ్యక్షులుగా గంట్యాడ శ్రీదేవి, కొండపల్లి భాస్కరనాయుడు, చప్ప చంద్రశేఖర్, రావాడ అచ్చంనాయుడు, పోలవరపు సామినాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. వారిని మంత్రి సత్కరించారు. ఏఎంసీ అధ్యక్షురాలు పీవీవీ గోపాలరాజు, నియోజకవర్గ పరిశీలకుడు కోటేశ్వరరావు, కొండలరావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా తెదేపా

ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

రాజాం గ్రామీణం, న్యూస్‌టుడే: కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. బుధవారం రాజాం మండలం శ్యాంపురంలోని క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని గ్రామ, వార్డు, క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ముందుగా తెదేపా జెండాను ఆవిష్కరించారు. కష్టపడి పనిచేసే పలువురు కార్యకర్తలను సత్కరించారు. సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నాయకులు కళ్ల అప్పలనాయుడు, బొత్స వాసుదేవరావునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా అదనపు భవనం

బొబ్బిలి మండలం అలజంగి ఉన్నత పాఠశాలలో గత ప్రభుత్వ హయాంలో నాడు- నేడులో భాగంగా అదనపు తరగతి గదులు మంజూరు చేశారు. నేటికీ పనులు పూర్తికాలేదు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో నత్తనడకన సాగాయి. సిమెంటు, నిర్మాణ సామగ్రి సరఫరాలో జాప్యం కావడంతో పనులు ఆగిపోయాయి. విషయం ప్రధానోపాధ్యాయిని నిర్మలాకుమారి వద్ద ప్రస్తావించగా.. అధికారులు సిమెంటు ఇస్తామని చెప్పారని, వచ్చిన వెంటనే పూర్తి చేస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

వంతెన ఇలా.. వెళ్లేదెలా?

సంతకవిటి మండలం మంతిన పంచాయతీ బూరాడపేట గ్రామం సమీపంలోని నారాయణపురం కుడి ప్రధాన కాలువపై ఉన్న వంతెన ప్రమాదకరంగా ఉంది. జీఎన్‌పురం, రైతులు పొలాలకు వెళ్లేందుకు ఈ వంతెనే ఆధారం. శిథిలమైపోవడంతో ప్రజలు భయపడుతున్నారు. కొత్తది నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పరిశీలించి, ప్రతిపాదనలు పంపుతామని నారాయణపురం ఆనకట్ట ప్రాజెక్టు ఏఈ రాంబాబు తెలిపారు. – న్యూస్‌టుడే, సంతకవిటి

పునాదుల్లోనే రక్షిత నీటి పథకం

రామభద్రపురం మండలం నర్సాపురం పంచాయతీలో రూ.53 లక్షలతో చేపట్టిన రక్షిత మంచినీటి పథకం పనులు మూడు నెలలుగా అసంపూర్తిగా ఉన్నాయి. ట్యాంకు, పైపులైను, ఇంటింటి కుళాయిలు, బోరు తవ్వకాలు వంటి పనులు చేయడానికి నిధులు మంజూరయ్యాయి. ట్యాంకు పనులు పునాదుల్లోనే నిలిచిపోయాయి. ప్రస్తుతం చిన్న నీటి పథకం నుంచి ప్రజలకు నీరు అందజేస్తున్నారు. విషయం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్ కుమార్ వద్ద ప్రస్తావించగా.. పనులు పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. – న్యూస్‌టుడే, రామభద్రపురం

ప్రధాన దారి.. అవస్థలే మరి

సంతకవిటి- పొందూరు మండలాల మధ్య 17 కి.మీల పొడవున ఉన్న ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. సిరిపురం, అప్పలఅగ్రహారం, మల్లయ్యపేట, మిర్తివలస, మందరాడ, సంతకవిటి, చింతలపేట తదితర ప్రాంతాల్లో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. కొన్నిచోట్ల రహదారి కోతకు గురైంది. నిత్యం ఈ దారిలో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. చర్యలు తీసుకుంటామని ర.భ.శాఖ ఏఈ సతీష్‌కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, సంతకవిటి

పోలీసులతో వైకాపా నాయకుల వాగ్వాదం

గొడవ పడుతున్న నాయకులు

రాజాం గ్రామీణం, న్యూస్‌టుడే: రాజాం తహసీల్దారు కార్యాలయంలో వైకాపా నాయకులు, పోలీసుల మధ్య బుధవారం వాగ్వాదం చోటుచేసుకుంది. వైద్య కళాశాలల పీపీపీ విధానానికి వ్యతిరేకంగా నిర్వహించిన బైక్ ర్యాలీలో నిబంధనలకు విరుద్ధంగా మార్చిన సైలెన్సర్లు ఉన్న రెండు ద్విచక్రవాహనాలను సీఐ అశోక్‌కుమార్ గుర్తించారు. పెద్ద శబ్దాలు వస్తుండడంతో ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. దీంతో వైకాపా నాయకులు వాగ్వాదానికి దిగారు. మూడు రోజుల్లో సైలెన్సర్లు మార్చాలని హెచ్చరించి, వ్యక్తిగత పూచీకత్తుతో విడిచిపెట్టారు.

అత్యవసరమైనా ఆగాల్సిందే!

ట్రాఫిక్‌లో చిక్కుకున్న 108 వాహనం

చీపురుపల్లి, గరివిడి, న్యూస్‌టుడే: వైకాపా నాయకులు బుధవారం చీపురుపల్లిలో చేపట్టిన నిరసన ర్యాలీతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ర్యాలీకి అనుమతి లేదని పోలీసులు గరివిడి వద్ద అడ్డుకోవడంతో గంటపాటు తోపులాట జరిగి ట్రాఫిక్ నిలిచిపోయింది. చీపురుపల్లి ప్రాంతీయాసుపత్రి నుంచి విజయనగరం ప్రసవం కోసం ఓ గర్భిణిని తీసుకెళ్తున్న 108 వాహనం ట్రాఫిక్‌లో చిక్కుకుంది. మహిళ పురిటి నొప్పులతో తల్లడిల్లింది. అత్యవసర పనులు మీద వెళ్లే చాలామంది పరిస్థితీ ఇదే.

ఉపకరణాలకు 86 మంది ఎంపిక

వివరాలు సేకరిస్తున్న వైద్యులు

రాజాం గ్రామీణం, న్యూస్‌టుడే: రాజాం, వంగర, సంతకవిటి, రేగిడి మండలాలకు చెందిన ప్రత్యేకావసరాలు గల పిల్లలకు ఉపకరణాల పంపిణీకి బుధవారం రాజాం మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిక శిబిరం నిర్వహించారు. నాలుగు మండలాల చిన్నారులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. 86 మంది ఉపకరణాలకు ఎంపికైనట్లు ఐఈఆర్‌టీ జిల్లా కోఆర్డినేటర్లు ఎస్.సూర్యారావు, భారతీదేవి తెలిపారు. ఎంపీడీవో ఆనందరావు, ఎంఈవోలు ప్రవీణ్ కుమార్, దుర్గారావు, శాంతికుమారి, వెంకటరావు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని నిరసన

నినాదాలు చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

గజపతినగరం, న్యూస్‌టుడే: గజపతినగరం, పురిటిపెంట పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు రెండు నెలల బకాయిలు వెంటనే చెల్లించాలని బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండు చేశారు. సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. సమస్య పరిష్కరిస్తామని కార్యదర్శి జనార్దనరావు తెలిపారు. పురిటిపెంట జగనన్న కాలనీలో రోడ్లు, కాలువలు, విద్యుత్తు సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేశారు. సీఐటీయూ నేత లక్ష్మి, రెండు పంచాయతీల పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

కాజ్‌వేలపై కష్టాల ప్రయాణం

న్యూస్‌టుడే– దత్తిరాజేరు

దత్తిరాజేరు, గజపతినగరం, బొండపల్లి, గంట్యాడ మండలాల్లో ఆర్అండ్‌బీ రహదారులపై కాజ్‌వేలు సక్రమంగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే రాకపోకలు స్తంభించిపోతున్నాయి. ఆర్అండ్‌బీ రోడ్లపై చాలా ఏళ్ల క్రితం తక్కువ ఎత్తులో నిర్మించిన కాజ్‌వేలు చిన్నపాటి వర్షాలకు మునిగిపోతున్నాయి. వాటి మీదుగా రాకపోకలు చేయాల్సిన పరిస్థితి.

రాబంద- దాసరిపేట మార్గం (పాత చిత్రం)

ప్రతిపాదనలు పంపాం..

నియోజకవర్గంలోని ఆయా గ్రామాల రహదారుల మధ్య ఉన్న కాజ్‌వేల స్థానంలో వంతెనల నిర్మాణానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం. సమస్య పరిష్కరిస్తాం. – అజయ్‌భార్గవ్, ఆర్అండ్‌బీ జేఈ

ఇదీ పరిస్థితి..

★ దత్తిరాజేరు మండలం పాచలవలస నుంచి ఎస్.చింతవలస రహదారిలోని పోతల గెడ్డ కాజ్‌వేపై ఇటీవల వర్షాలకు సుమారు 10 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.
★ గజపతినగరం మండలం రాబంద నుంచి దత్తిరాజేరు మండలం దాసరిపేట మార్గంలో తక్కువ ఎత్తులోని కాజ్‌వే ఇటీవల వర్షాలకు మునిగిపోయింది. 20 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. ముచ్చర్ల- రంగుపురం మార్గంలో ఇదే దుస్థితి.

రాకపోకలకు తీవ్ర అంతరాయం..

బొండపల్లి మండలం వేంద్రాం- ఒంపల్లి దారిలో కాజ్‌వేపై వరద ఎక్కువగా వస్తుంది. ★ గంట్యాడ మండలం చంద్రంపేట- ఆర్.వసంత, లక్కిడాం- వసంత మధ్య మొంథా తుపాను సమయంలో ఆరు రోజుల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. వసంత- భీమసింగి, బుడతనాపల్లి- ఎం.కొత్తవలస మధ్య కాజ్‌వే వద్ద పరిస్థితి ఇంతే.

పిరిడిలో తాగునీటి ఇబ్బందులు

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: బొబ్బిలి మండలం పిరిడి గ్రామంలో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పది రోజులుగా కుళాయిల ద్వారా నీటి సరఫరా నిలిచిపోవడంతో పొలాల్లోని బోర్ల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. కారాడ వద్ద రహదారి పనులు జరుగుతుండడంతో పైపులైను పాడైపోయిందని, గురువారం నాటికి నీరు అందిస్తామని ఏఈ విశ్వతేజ తెలిపారు.

విద్యార్థిపై యువకుల దాడి

రాజాం ఆసుపత్రిలో బాధితుడు

రాజాం, న్యూస్‌టుడే: రాజాంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్న రాజాం పట్టణానికి చెందిన బండి ప్రేమ్‌కుమార్‌పై అయిదుగురు యువకులు బుధవారం విచక్షణా రహితంగా దాడి చేశారు. ప్రేమ్‌కుమార్ కళాశాల నుంచి సమీపంలోని ఆరుబయట మామిడితోట వద్దకు బహిర్భూమికి వెళ్లిన సమయంలో రాజాం పట్టణానికి చెందిన సాయి, కార్తీక్, మహేష్, కిరణ్, బిన్ని కులం పేరుతో దూషించి దాడికి పాల్పడినట్లు బాధితుడు ఫిర్యాదు చేశారు. బాధిత కుటుంబసభ్యులు అటువైపుగా వెళ్తున్న ఎమ్మెల్యే కారును ఆపారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఈ మేరకు నిందితులపై కుల దూషణ, హత్యాయత్నం సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు సీఐ కె.అశోక్‌కుమార్ వెల్లడించారు. బాధితుడికి రాజాంలో చికిత్స అనంతరం శ్రీకాకుళం తరలించారు.

బస్సును తప్పించబోయి ఆటో బోల్తా

వంగర, న్యూస్‌టుడే: వంగర మండల కేంద్రం నుంచి సంతకవిటి మండలం గుళ్లసీతారాంపురం వెళ్తున్న ఆటో ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సును తప్పించబోయి బుధవారం మధ్యాహ్నం అరసాడ సమీపంలో పొలంలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. సమీపంలోని స్థానికులు ఆటోను బయటకు తీశారు. ముగ్గురు ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాలేదని తెలిపారు. ఎటువంటి ఫిర్యాదు అందలేదని వంగర పోలీసులు చెప్పారు.

పీపీపీ విధానానికి వ్యతిరేకంగా నిరసన

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి, గరివిడి, బొబ్బిలి, రాజాం, గజపతినగరం, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల పీపీపీ విధానానికి వ్యతిరేకంగా వైకాపా నాయకులు చీపురుపల్లి, రాజాం, బొబ్బిలి, గజపతినగరంలో బుధవారం నిరసన ర్యాలీ చేపట్టారు. చీపురుపల్లిలో ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మాట్లాడారు. పేదలకు ప్రభుత్వ వైద్యాన్ని దూరం చేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటు పరం చేయడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పాల్గొన్నారు. ★ బొబ్బిలిలో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, రాజాం పట్టణంలో నియోజకవర్గ సమన్వయకర్త తలే రాజేష్, గజపతినగరంలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆధ్వర్యంలో నిరసన చేపట్టి, తహసీల్దార్లకు వినతి పత్రాలు అందజేశారు.

అదృశ్యమైన విద్యార్థి తల్లిదండ్రుల చెంతకు

రేగిడి, న్యూస్‌టుడే: తాతను తీసుకురావడానికి పాఠశాల నుంచి ఇంటికి వెళ్లిన విద్యార్థి కనిపించకుండా పోయిన ఘటన రేగిడి మండలంలో అలజడి సృష్టించింది. పుస్తకాలు చూసి పరీక్ష రాస్తున్నాడని మునకలవలస పాఠశాల ఏడోతరగతి విద్యార్థి ఎ.చక్రధర్‌ను ఉపాధ్యాయుడు వీరన్నాయుడు మందలించారు. తలిదండ్రులు వేరేచోట ఉన్నారని తెలియడంతో పాఠశాలకు వచ్చేటప్పుడు తాతయ్యని తీసుకురమ్మని చెప్పారు. ఈనెల 11న ఒక్కడే రావడంతో తాతను తీసుకురమ్మని పంపారు. అలా ఇంటికి వెళ్లిన విద్యార్థి తిరిగి రాలేదు. ఇంటికీ చేరలేదు. దీంతో అంతా వెతికారు. తలిదండ్రులు ఆందోళన చెందారు. ఎంఈవో ప్రసాదరావు ఆదేశాలతో మహిళా పోలీసు బుధవారం రేగిడి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బుధవారానికి విద్యార్థి విజయనగరంలోని తలిదండ్రుల వద్దకు చేరడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

మెంటాడ: మెంటాడకు సమీపంలోని జాతీయ హరిత రహదారి మీదుగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఆండ్ర ఎస్సై సీతారాం తెలిపారు. అపరాధ రుసుము వేయనున్నట్లు తహసీల్దారు అరుణకుమారి తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

చీపురుపల్లి: చీపురుపల్లి పాత బస్టాండు సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నెలరోజుల వ్యవధిలో రెండుసార్లు దొంగతనం జరిగింది. గత నెల 10న రాత్రి తలుపు గెడ కట్‌చేసి గ్యాస్ సిలెండర్ చోరీ చేశారు. ఈనెల 11న ఎలక్ట్రికల్ స్టవ్ పట్టుకుపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి తెలిపారు.

గొలుసు దుకాణాలపై దాడులు

చీపురుపల్లి గ్రామీణం, మెరకముడిదాం: చీపురుపల్లి ఎక్సైజ్ పరిధిలో అనధికారికంగా కొనసాగుతున్న గొలుసు దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ శాఖ సీఐ చక్రవర్తి తెలిపారు. మెరకముడిదాం మండలం ఉత్తరావల్లిలో ఏడు మద్యం సీసాలతో ఒకరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

రాజాం: రాజాం మండలం కంచరాం గ్రామం సమీపంలో బుధవారం జరిగిన రహదారి ప్రమాదంలో ఎంజేవలస గ్రామానికి చెందిన కె.పెద్దవెంకులకు గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. లారీ దూసుకుపోవడంతో ద్విచక్రవాహనం నుజ్జయింది. క్షతగాత్రుడిని రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

తెలుగు మహాసభలకు ఆహ్వానం

బొబ్బిలి గ్రామీణం: ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో గుంటూరులో వచ్చే ఏడాది జనవరి 3 నుంచి మూడు రోజులపాటు జరగనున్న ప్రపంచ తెలుగు మహాసభలకు కోమటిపల్లికి చెందిన తూర్పుభాగవతం కళాకారుడు బొంతలకోటి శంకరరావుకు ఆహ్వానం అందినట్లు తెలిపారు. భాగవతం ద్వారా తెలుగు సంస్కృతి, భాషా వికాసానికి కృషి చేస్తున్నందుకు నిర్వాహకులు ఆహ్వానం పంపించారన్నారు.

చిన్నారులకు దుస్తుల పంపిణీ

బొబ్బిలి: పట్టణంలోని తారకరామకాలనీ డిపెప్ పాఠశాలను ఎమ్మెల్యే బేబీనాయన బుధవారం సందర్శించారు. విద్యార్థులకు సులువుగా అన్ని సబ్జెక్టులు అర్థమయ్యేలా '40 డేస్ ఛాలెంజ్' కార్యక్రమాన్ని హెచ్‌ఎం ఉషారాణి రూపొందించారు. ఎమ్మెల్యే, ఉపాధ్యాయులు వీటికి సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. హెచ్‌ఎం సొంత నిధులు రూ.20 వేలతో పాఠశాల చిన్నారులకు దుస్తులు సిద్ధం చేయగా.. ఎమ్మెల్యే అందజేశారు.

పొదుపు సంఘాలకు భరోసా

చీపురుపల్లి, గ్రామీణం, గుర్ల: మన డబ్బులు- మన లెక్కల యాప్‌తో పొదుపు సంఘాల్లో పారదర్శకత పెరుగుతుందని డీఆర్డీఏ పీడీ శ్రీనివాసపాణి అన్నారు. బుధవారం చీపురుపల్లి మండల మహిళా సమాఖ్య సమావేశంలో మాట్లాడారు. ★ గుర్లలో ఏపీఎం భారతి అవగాహన కల్పించారు.

మూగజీవాలకు పరీక్షలు

బాడంగి: వాడాడలో బుధవారం పశువుల గర్భకోశ వ్యాధుల శిబిరం నిర్వహించారు. సుమారు 90 మూగజీవాలకు పరీక్షలు చేశారు. పాడి రైతులు శిబిరం వినియోగించుకోవాలని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి మురళీకృష్ణ సూచించారు. లింగ నిర్ధారిత వీర్యం రూ.150కి అందుబాటులో ఉందన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు షికారుగంజి ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఈశ్వరరావు తెలిపారు. ఈనెల 11న రామభద్రపురంలో జరిగిన జిల్లాస్థాయి అండర్-19 బాలుర విభాగంలో ఎన్.దుర్గాప్రసాద్, బాలికల విభాగంలో పి.అనూష ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈనెల 15, 16, 17 తేదీల్లో పల్నాడులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఉపాధ్యాయులు అభినందించారు.

మహిళలంతా అక్షరాస్యులుగా మారాలి

పుస్తకాలు అందిస్తున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ, న్యూస్‌టుడే: చదువు ఉంటే సంపద ఉన్నట్లేనని, మహిళలంతా అక్షరాస్యులుగా మారాలని గంట్యాడ ఎంపీపీ హైమావతి అన్నారు. బుధవారం గంట్యాడలో అక్షరాంధ్రా కార్యక్రమంలో 400 మంది వాలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. చదువురాని మహిళలను గుర్తించి 100 రోజుల్లో వారికి అక్షరాలు నేర్పించాలని కోరారు. ఎంపీడీవో రమణమూర్తి, ఏపీఎం సులోచనాదేవి, ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో సుందరం తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై అవగాహన కల్పించాలి

చీపురుపల్లి, న్యూస్‌టుడే: మేజర్ పంచాయతీ పరిధిలో చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలని డివిజనల్ అభివృద్ధి అధికారి హేమసుందరరావు అధికారులకు సూచించారు. చీపురుపల్లి వంగపల్లిపేటలో బుధవారం పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. తడి, పొడి చెత్త సేకరించాలని సూచించారు. పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలరావు పాల్గొన్నారు. అనంతరం చీపురుపల్లి-3 సచివాలయాలన్ని తనిఖీ చేశారు.

బాధితులకు అండగా సహాయనిధి.. చీపురుపల్లి గ్రామీణం, మెరకముడిదాం: పులిగుమ్మి, శ్యామాయవలస, గాదెలమర్రివలస, యాడిక, సోమలింగాపురం గ్రామాలకు చెందిన ఏడుగురుకి, చీపురుపల్లి మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారులకు తెదేపా నాయకుడు కె.రామ్‌మల్లిక్‌నాయుడు సీఎం సహాయనిధి చెక్కులు అందజేశారు.

(c) eenadu

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

తుప్పల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

శృంగవరపుకోట: తామరాపల్లి-సీతంపేట(టీఎస్) రోడ్డులో ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలు తొలగించే పనులు చేపట్టారు. ఈ దారిలో చోదకుల ఇబ్బందులపై బుధవారం 'ఈనాడు'లో 'తుప్పలతో రాకపోకలకు చిక్కులు' శీర్షికన వెలువడిన కథనంపై జేఈ వీరభద్రస్వామి స్పందించి దగ్గరుండి పనులు చేపట్టారు. సీతంపేట నుంచి తామరాపల్లి రోడ్డు, చుక్కపాలెం రోడ్డులో నిర్వహణ పనులు చేపడతామన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

నెల్లిమర్ల: మండలంలోని సారిపల్లి పారిశ్రామికవాడలో ఉన్న విద్యుత్తు ఉప కేంద్రం వద్ద నిర్వహణ పనుల కారణంగా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు గ్రామంతో పాటు ఆ ప్రాంతంలో సరఫరా ఉండదని ఈఈ పి.త్రినాథరావు తెలిపారు.

మహిళలు స్వతంత్రంగా ఎదగాలి

భోగాపురం: మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే లోకం మాధవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో టైలరింగ్ ఉచిత శిక్షణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. మహిళలకు టైలరింగ్, బ్యూటీ పార్లర్, పేపర్ బ్యాగ్ తయారీ తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చి, ఉపాధి పొందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న పలువురికి సీఎం సహాయనిధి చెక్కులు అందజేశారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

తెరపై ఈనాడు

● ఎన్సీఎస్ : జటాధర ● శ్రీకృష్ణ : ప్రిడేటర్ ● ఆదిత్య : కె.ర్యాంప్ ● లీలామహల్ : ది గర్ల్‌ఫ్రెండ్ ● రంజనీ స్క్రీన్-1 : ది గర్ల్‌ఫ్రెండ్ ● శివరంజనీ స్క్రీన్-2 : ఆర్యన్, ప్రిడేటర్ ● హిమగిరి : మాస్ జాతర ● సప్తగిరి : ద గ్రేట్ ప్రీవెడ్డింగ్ షో

– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

పేదలకు గృహయోగం

గ్రామీణ ప్రాంతాల్లో సర్వే ప్రారంభం

న్యూస్‌టుడే, నెల్లిమర్ల

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సొంతంగా స్థలాలు ఉండి ఇళ్లు నిర్మించుకోలేని పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ (పీఎంఏవై-జీ), (పీఎంఏ-వై) 2.0 పథకం ద్వారా మరోసారి అవకాశం కల్పిస్తోంది. అర్హులను గుర్తించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం సర్వే ప్రారంభించింది. ఈనెల 30 వరకు సర్వే నిర్వహిస్తుంది. గత వైకాపా ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణంపై తీవ్ర నిర్లక్ష్యం చూపింది. కూటమి ప్రభుత్వం వచ్చాక గృహ నిర్మాణాలపై దృష్టి సారించింది.

ఇళ్ల నిర్మాణాలకు ప్రణాళికలు..

ప్రభుత్వం భారీ స్థాయిలో ఇళ్ల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేసింది. దీనిలో భాగంగా నెల్లిమర్ల, డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురం, విజయనగరం గ్రామీణ ప్రాంతంలో లబ్ధిదారులను గుర్తించి క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నారు. నెల్లిమర్ల నగర పంచాయతీలో ఈ పథకంలో ఇప్పటికే 250 మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా, వీరిలో 90 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించి ఇళ్లు మంజూరు చేసింది. మిగతా 160 మందికి స్థల ధ్రువీకరణ పత్రం సమర్పిస్తే పరిశీలించనుంది. ప్రస్తుతం పట్టణంలో మరికొందరి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

మొయిదలో సర్వే చేపడుతున్న గృహ నిర్మాణశాఖ అధికారులు

దరఖాస్తు ఇలా..

సొంత ఇంటి నిర్మాణానికి అర్హులైనవారు స్థలం పట్టా, రిజిస్ట్రేషన్ పత్రాలు, లేదా పొజిషన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలి. తెల్ల రేషన్‌కార్డు, ఆదాయ, కుల ధ్రువపత్రం, భార్య, భర్తల ఆధార్‌కార్డులు జత చేయాలి. గతంలో గృహ నిర్మాణ పథకం ద్వారా ఇళ్లు నిర్మించుకున్నవారికి అవకాశం ఉండదు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న లబ్ధిదారులకు ఉపాధి పథకానికి చెందిన జాబ్‌కార్డు తప్పనిసరిగా ఉండాలి. బ్యాంకు పాస్‌పుస్తకం, లబ్ధిదారుల ఫొటో, చరవాణి నంబరు ఉండాలి. సంబంధిత దరఖాస్తులను గ్రామ, వార్డు సచివాలయాలకు, గృహ నిర్మాణశాఖ ఏఈ కార్యాలయానికి అందజేయాలి.

పథకానికి రూ.2.50 లక్షల మంజూరు

పట్టణ ప్రాంతంలో లబ్ధిదారులకు కేంద్రం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష కేటాయించాయి. గ్రామీణ ప్రాంతాల లబ్ధిదారులకు సర్వే పూర్తి చేసిన తర్వాత యూనిట్ ధర నిర్ణయిస్తుంది. పునాదులు స్థాయిలో రూ.60 వేలు, లింటల్ లెవెల్ రూ.60 వేలు, స్లాబ్ స్థాయికి రూ.60 వేలు, పూర్తి స్థాయి నిర్మాణానికి రూ.70 వేలు నిధులను విడతల వారీగా కేటాయిస్తారు.

30వ తేదీతో గడువు పూర్తి : ప్రస్తుతం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. నిబంధనల మేరకు మంజూరు చేస్తున్నాం. ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉంది. మరిన్ని వివరాలకు గ్రామ, వార్డు సచివాలయాలు, గృహ నిర్మాణశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలి. - జి.మురళీమోహన్, ఈఈ, ఆర్.పవన్, ఏఈ, నెల్లిమర్ల

పైడితల్లి హుండీ ఆదాయం లెక్కింపు

ఆదాయం లెక్కిస్తున్న దేవస్థానం సిబ్బంది, సేవకులు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర ఇలవేల్పు విజయనగరం శ్రీపైడితల్లి అమ్మవారి హుండీ ఆదాయం స్థానిక కల్యాణ మండపంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.శిరీష, రామతీర్థం ఈవో వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. 29 రోజులకు కేవలం చదురుగుడి హుండీ ఆదాయం రూ.20,97,852 సమకూరింది. బంగారం 15.200 గ్రాములు లభించగా.. వెండి 260 గ్రాములు సమకూరింది. లెక్కింపును దేవస్థానం పాలకమండలి సభ్యులు తామేశ్వరరావు, పద్మావతి, స్వాతి, తులసి పర్యవేక్షించారు.

గ్రామాల అభివృద్ధికి కలిసి పనిచేద్దాం

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ అభివృద్ధికి పార్టీలకు అతీతంగా అంతా సహకరించాలని, కలిసి ప్రజలకు మంచి సేవలు అందించాలని ఎమ్మెల్యే అదితిగజపతిరాజు చెప్పారు. ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అధ్యక్షతన మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పంచాయతీల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందించాలని కోరారు. వ్యవసాయం, రెవెన్యూ, ఆరోగ్యం తదితర శాఖల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై ఎంపీపీ అప్పలనాయుడు సమీక్ష నిర్వహించారు. వైస్ ఎంపీపీలు నారాయణ, నిర్మల, గాజులరేగ పీఏసీఎస్ అధ్యక్షుడు కోరాడ వెంకటరావు, ఎంపీడీవో జి.వెంకటరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి, పక్కన ఎంపీపీ అప్పలనాయుడు

పరీక్షలతో నైపుణ్యాలు మెరుగుపడాలి

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: పదోతరగతి విద్యార్థుల నైపుణ్యాలను పరిగణలోకి తీసుకుని, వెనుకబడిన వారిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా విద్యాశాఖాధికారి యు.మాణిక్యం నాయుడు తెలిపారు. బుధవారం ఆయన కొట్యాడ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకోవాలని సూచించారు. పదో తరగతిలో మంచి మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజనశాలలో శుభ్రత పరిశీలించారు. ఎల్.కోటలో మండల స్థాయి అధికారులతో సమావేశమై పీజీఆర్ఎస్‌లో వచ్చిన విద్యా సంబంధ సమస్యలు త్వరగా పరిష్కరించాలన్నారు. ఆయన వెంట ఎంఈవో ఎస్.అప్పారావు, ఎంఈవో కూర్మారావు ఉన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో మాణిక్యంనాయుడు

లక్షదీపారాధనకు ఆహ్వానం

పూసపాటిరేగ: కొవ్వాడలోని పురాతన స్వయంభూ శివాలయం వద్ద లక్షదీపారాధనను 17న సర్పంచి రఘు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కె.బంగార్రాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ఆయన కలిసి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని ఆహ్వానించారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/S SHRIRAM FINANCE LIMITED, Vizianagaram Branch-I, Vizianagaram, I issue the following notice to general public. My client intends to grant loan to Mr. KANDURI JAGANNADHA CHARYULU S/o K Sitaramacharyulu by keeping the below mentioned schedule property of SMT. KANDURI ANURADHA W/o L Jagannadha Charyulu as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, mortgages Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices. Otherwise, later objections will not bind my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

Vizianagaram District, Vizianagaram West Sub-District, Vizianagaram Mandalam, Dwarapudi Gram panchayat and village accounts covered by S.No.47-2 part, BALAJI TOWNSHIP layout in which Plot No.10 an extent of 400 sq. yards or 334.400 sq. meters of vacant site is measured and bounded by:

MEASUREMENTS: East to West : 75 feet or 22.70 meters ; **North to South :** 48 feet or 14.60 meters.

Bounded by: EAST : Plot no.7 site; **SOUTH :** Plot no.9 site; **WEST :** Layout road ; **NORTH :** Plot no.11 site

KODURI SREENIVASA RAO
SMT. SIVA KUMARI JALADI
Advocates,
S-2, Bharat Apartments, Behind Rythu bazar, Seethammadhara, Visakhapatnam-13.
Visakhapatnam Dt.12.11.2025
Mobile No.9885166648
Mail: sreenivaskoduri@gmail.com

CHANGE OF NAME

I, KEDARISETTI SEKHAR, S/o. K. Narasinga Rao, aged 37, Present residing at 5-76, Ramalayam, Telagapalem Village, Jami Mandal, Vizianagaram District, Hereby declare that in my wife's passport bearing No.AG702505 my name mentioned as Rajsekhar Kedarisetti, But as per records my correct name is KEDARISETTI SEKHAR. I request concerned authorities to change my name to KEDARISETTI SEKHAR.

చోరీ నిందితుల అరెస్టు

కాకినాడ, న్యూస్‌టుడే: రెండు నెలల కిందట బంగారం నగలు చోరీకి పాల్పడిన దొంగలను కాకినాడ పోలీసులు పట్టుకున్నారు. బుధవారం ఎస్పీ ఆ వివరాలు వెల్లడించారు. సెప్టెంబర్ 10న ఓ నగల వ్యాపారి విజయనగరంలో ప్రైవేటు ట్రావెల్ బస్సు ఎక్కారు. గండేపల్లి మండలం, తాళ్లూరు హనీ దాబా వద్ద భోజనానికి దిగారు. విజయనగరం నుంచి అతన్ని వెంబడిస్తూ అదే బస్సులో వచ్చిన ముగ్గురు నగల బ్యాగు దొంగిలించారు. దీనిపై గండేపల్లి పోలీసుల కేసు నమోదు చేయగా డీఎస్పీ శ్రీహరిరాజు ఆధ్వర్యంలో పోలీసు బృందం చోరీ చేసిన పి.నరసింహ, పి.తేజ, మహేందర్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.60 లక్షల విలువైన 624 గ్రాముల ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

నగలు పరిశీలిస్తున్న ఎస్పీ తదితరులు

1048 ఇళ్ల నిర్మాణం పూర్తి

కొత్తవలస: కూటమి ప్రభుత్వం వచ్చాక నియోజకవర్గంలో పీఎం ఏవై కింద 1048 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. సొంతింటి కల నిజం చేసుకున్న కుటుంబాలకు శుభాకాంక్షలు తెలుపుతూ మంగళపాలెంలో లబ్ధిదారులకు బుధవారం ఇళ్ల పంపిణీ చేశారు. గృహ ప్రవేశం చేసిన రెండు కుటుంబాలను కలిసి అభినందనలు తెలిపి నూతన వస్త్రాలు, మిఠాయిలు అందజేశారు. మంగళపాలెంలో కాలువల నిర్మాణానికి, రహదారులకు నిధులు మంజూరుకి హామీ ఇచ్చారు. దాసరి కార్పొరేషన్ ఛైర్మన్ రత్నాజీ, పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటరమణ, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ నానాజీ, సర్పంచి సీతారామపాత్రుడు పాల్గొన్నారు.

లబ్ధిదారుకు పత్రాలు, మిఠాయి అందిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

చెత్త తొలగించరూ..

శృంగవరపుకోట పట్టణంలో పుణ్యగిరి రోడ్డు నుంచి బర్మాకాలనీకి వెళ్లే దారిలో బ్రిడ్జి పక్కన చెత్తపోగులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. బర్మాకాలనీలో సేకరించిన చెత్తను కాలనీ ముందు వైపు, వెనుక క్వారీ వైపు వేస్తున్నారని స్థానికులు తెలిపారు. ఇక్కడ సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించకుండా కాలనీ పక్కనే ఖాళీ స్థలాల్లో వేస్తున్నారని వాపోయారు. దీనిపై పంచాయతీ ఈవో అనురాధ వద్ద ప్రస్తావించగా చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తున్నామన్నారు. కాలనీ ముందు చెత్త పోగును తీయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, శృంగవరపుకోట

క్షేత్ర సహాయకులపై ఒత్తిడి వద్దు

విజయనగరం గ్రామీణం: ఉపాధి క్షేత్ర సహాయకులపై పారంపాండ్ ఎక్కువ నిర్వహించాలని ఒత్తిడి చేయవద్దని సీఐటీయూ యూనియన్ నాయకులు సంఘం, తత్వరులను కోరారు. బుధవారం క్షేత్ర సహాయకులతో ఎంపీడీవో వెంకటరావు, ఏపీవో రవిబాబులకు వినతిపత్రం అందించారు.

వారం జైలు శిక్ష

శృంగవరపుకోట: శివరామరాజుపేట కూడలి వద్ద బుధవారం వాహన తనిఖీలు చేపట్టామని ఎస్సై ఎ.ఆర్.దామోదర్ ఓ ప్రకటనలో తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపిన ఇ.అప్పారావుపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి వారం జైలుశిక్ష విధించారన్నారు.

నేడు ప్రమాణ స్వీకారం

విజయనగరం అర్బన్: ఎన్నికైన తెదేపా నగర, వార్డు, మండల, గ్రామ కమిటీలు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిల ప్రమాణ స్వీకారం గురువారం జరగనుంది. ఉదయం 10 గంటలకు కార్యాలయంలో నిర్వహించనున్న కార్యక్రమానికి ఎమ్మెల్యే అదితి హాజరుకానున్నారని పార్టీ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

ఎస్.కోట, వేపాడ: తెదేపా ఎస్.కోట మండల అధ్యక్షుడిగా నియమితులైన డి.అచ్చింనాయుడు గురువారం ప్రమాణ స్వీకారానికి ఎల్.కోటలో ఏర్పాట్లు చేస్తున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి పలు పదవులు చేపట్టారు. ★ వేపాడ మండలంలోని 29 పంచాయతీల పరిధిలోని తెదేపా మండల కమిటీ సభ్యులు గ్రామ కమిటీల అధ్యక్షులు, బూతు ఇన్‌చార్జిల ప్రమాణస్వీకారం గురువారం ఉదయం 8.30 గంటలకు చేపడుతున్నట్లు మండలాధ్యక్షుడు వెంకటరావు తెలిపారు.

మూగజీవాల మృత్యువాత

విజయనగరం నేరవార్తా విభాగం: ధర్మపురి సమీపంలో మంగళవారం అర్ధరాత్రి పశువుల శాల దగ్ధమై నిండు చూలుతో ఉన్న ఆవు, మరో పెయ్యి మంటల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయాయి. వాటి యజమానులు కన్నీటి పర్యంతమైన తీరు అందర్నీ కంటతడి పెట్టించింది.

యువతకు ఉపాధి కల్పించండి

విజయనగరం అర్బన్, ఉడాకాలనీ: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వివిధ విభాగాల్లో జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. బుధవారం కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఉన్న పరిశ్రమలు మూతపడ్డాయని, కొత్తవి రాకపోవడంతో ఉపాధి లేకుండా పోయిందని పేర్కొన్నారు.

చినుకు పడితే వణుకే

న్యూస్‌టుడే, కొత్తవలస

కొద్దిపాటి వర్షం పడినా వరద ముంపుతో కొత్తవలస పట్టణ ప్రజలకు కంటి నిండా కునుకు దూరమవుతోంది. దీనికి కారణం ఏళ్లుగా ప్రమాదంలో వీరసాగరం చెరువుపై తరచూ గండ్లు పడుతుండటం. 1995 అక్టోబరు 10న ఈ చెరువుకు గండిపడి వరద రావడంతో పట్టణంలో పది మంది జలసమాధి అయ్యారు. భారీగా ఆస్తినష్టం జరిగింది. అంతకుముందు భారీ వర్షాలకు, ఐదేళ్ల కిందట మొంథా తుపానుకు చెరువు నిండి పట్టణంలోని పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. రహదారులు, లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురై ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ముందెన్నడూ లేనివిధంగా కొంతసేపు జాతీయ రహదారిపై విశాఖ-అరకు రహదారి, స్టేషన్ ప్రాంతంలోనూ కొత్తవలస-విజయనగరం రహదారిపైనా నీరు నిలిచిపోతుంది. ఏళ్లుగా సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు.

వీరసాగరం చెరువుపై కొత్తవలస వాసుల భయం

కొత్తగా ఆర్‌యూబీ సమస్య

పుండు మీద కారం చల్లిన చందంగా కొన్నేళ్ల నుంచి ఆర్‌యూబీ సమస్య కొత్తగా పుట్టుకొచ్చింది. పట్టణంలోని రైల్వే లెవెల్ క్రాసింగ్ గేటు స్థానంలో భూగర్భ వంతెనను నిర్మించింది. లోతట్టులో దీన్ని నిర్మించడంతో చిన్న వర్షానికే ఇందులో నీరు చేరి రాకపోకలు స్తంభిస్తున్నాయి. వీటన్నింటికీ వీరసాగరం చెరువునే కారణంగా భావిస్తున్నారు. 95లో ప్రమాదం జరిగినప్పుడు అప్పటి ప్రభుత్వం చెరువు గట్లను బాగుచేసింది. పంట కాలువలు మాత్రం ఇప్పటికీ మెరుగుపర్చలేదు. దీంతో వీటి ద్వారా వరద పట్టణాన్ని ముంచుతోంది. సుమారు 31 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు పట్టణీకరణ కారణంగా విస్తీర్ణం తగ్గింది.

నిర్వహణకు నోచుకోని చెరువు

మొంథా తుపానుకు..

మొంథా తుపాను సమయంలో చెరువు పూర్తిగా నిండిపోయింది. పట్టణ ప్రజలు ఆందోళన చెందారు. చెరువులోకి వచ్చే నీటిని గెడ్డలోకి అధికారులు దారి మళ్లించడంతో ప్రమాదం తప్పింది. చెరువు గర్భం కొంతమేర ఆక్రమణకు గురైంది. గట్లపై తుప్పలతో అడుగేయలేని దుస్థితి. దీన్ని ఉద్యానంగా తీర్చిదిద్దుతామన్న హామీ నెరవేరలేదు. గట్లు పటిష్ఠ పరచాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్యను ఇరిగేషన్ శాఖ ఏఈ హనుమంతరావు వద్ద ప్రస్తావించగా తుపాను సమయంలో చెరువు అభివృద్ధికి రూ.60 లక్షలతో ప్రతిపాదనలు చేశామన్నారు.

వారంలోగా పరిష్కారం

విజయనగరం పట్టణం: అభివృద్ధిలో భాగస్వామ్యులయ్యే గుత్తేదారులను ఇబ్బంది పెట్టే యోచన తమకు లేదని నగర పాలక సంస్థ కమిషనరు పి.నల్లనయ్య అన్నారు. బుధవారం తన ఛాంబరులో వారితో సమావేశమయ్యారు. ఇంజినీరింగ్, అక్కౌంట్స్ విభాగాలు వారంలోగా గుత్తేదారుల సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ★ ఎంజీ రోడ్‌లో ఓ భవనంపై అంతస్తును అనుమతి లేకుండా నిర్మిస్తున్నట్లు గుర్తించిన సిబ్బందితో తొలగింపజేశారు.

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింటు అయిన పెంటపాటి రామకృష్ణ S/o లేటు గాంధీ చిన్న వీధి వారు ఇచ్చిన భోగట్టా మేరకు ఇచ్చిన ప్రకటన

నా క్లయింటు తే 10-11-25 సమయం 13:30 ని॥ చిన్న వీధిలో తన ఇంటి నుంచి బయలుదేరి Bank Of Baroda కి వెళ్లే మార్గమున NCS సినిమా హాల్ దగ్గర తన యొక్క జేబులో ఉన్న 3 Chequeలు 2251, 2252, 2253 పడిపోయినవి. దాని గురించి 1-Town Police Stationలో 10-11-25న Complante మరియు Bank అధికారులకు Stop Payment ఇవ్వడం జరిగినది.

పై నెంబరు Chequeలు దొరికిన పై Addressలో ఉన్న నా క్లయింటుకు గానీ, నాకు గానీ తెలియజేసి రిటర్న్ చేయవలసినదిగా కోరుచున్నాము.

ఈ పై నెంబరు Chequeలు ఉపయోగించి తన క్లయింటుపై ఎవరైనా Civil, Criminal caseలు వేసినా నా క్లయింటుకు బంధించవని తెలియజేయుచున్నాము.

ఇట్లు
C.S.Bhagavan, Advocate
GF-3, Gayatri Residence
Kothaagraharm, Vizianagaram
Cell : 9441910030, 8555005702

PUBLIC NOTICE

Under the instructions of my client M/S SHRIRAM FINANCE LIMITED, Vizianagaram Branch-I, Vizianagaram, I issue the following notice to general public. My client intends to grant loan to Mr. KELLA RAMESH S/o Late Kella Rama Krishna by keeping the below mentioned schedule property as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, mortgages Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices. Otherwise, later objections will not bind my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

Vizianagaram District, Nellimarla Sub-District, Gurla Mandalam, Gudem Gram panchayat and village accounts, layout approved by Visakhapatnam Metropolitan Region Development Authority (VMRDA) vide LP No.34/2020, AP RERA Registration No.P02210191394, covered by S. Nos. 347-7, 347-8, 347-9, 347-10, 347-11, 347-12, 347-13A, 347-14, , 347-15, 347-16, 347-17, & 347-39 part, BBR ESTATES layout in which Plot No.309 Southern part an extent of 167.08 Sq. yards or 139.69 sq. meters of vacant site is measured and bounded by:

Measurements:
East to West on Northern side : 60 feet or 18.28 meters
East to West on Southern side : 60 feet or 18.28 meters
North to South on Eastern side : 26 feet or 7.92 meters
North to South on Western side : 24.125 feet or 7.35 meters

Bounded by:

East	Plot no.309 site
South	Layout compound wall
West	60 feet wide layout road
North	Plot no.308 Northern part

KODURI SREENIVASA RAO, SMT. SIVA KUMARI JALADI
Advocates,
S-2, Bharat Apartments, Behind Rythu bazar, Seethammadhara,
Visakhapatnam-13. Mobile No.9885166648
Visakhapatnam Dt.12.11.2025
Mail: sreenivaskoduri@gmail.com

సమస్యలపై వినతి

విజయనగరం వైద్య విభాగం: 104 వాహన విభాగంలో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లపై పని ఒత్తిడిని నియంత్రించాలని సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు జిల్లా సమన్వయకర్త సాయిరామ్‌కు వినతిపత్రం అందజేశారు.

చీరకు నిప్పు అంటుకుని మహిళ మృతి

విజయనగరం నేరవార్తా విభాగం: గాజులరేగ సమీపంలో ఈ నెల 8న చుట్ట కాల్చుతుండగా.. నిప్పు చీరమీద పడడంతో పి.నారాయణమ్మ(54) తీవ్ర గాయాలపాలైంది. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్ర తెలిపారు.

బైక్ అదుపుతప్పి పర్యాటకుడి దుర్మరణం

డుంబ్రిగుడ: పర్యాటకుడు రోడ్డు ప్రమాదంలో బుధవారం మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. నెల్లిమర్లకు చెందిన బొంతు సాయి(25) విజయనగరం నుంచి అరకులోయకు బైక్‌పై వచ్చాడు. తిరిగి పాడేరు వెళ్లే క్రమంలో కురిడి రైల్వే గేటు సమీపంలో బండి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సాయి తీవ్రగాయాలపాలై మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య కళాశాలలు ప్రైవేటీకరించొద్దు

నెల్లిమర్లలో వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ పెనుమత్స, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ

నెల్లిమర్ల, ఎస్.కోట: ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయొద్దంటూ మాజీ ఎమ్మెల్యే బి.అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పి.సూర్యనారాయణ రాజు డిమాండు చేశారు. బుధవారం నెల్లిమర్లలో వైకాపా నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీటీ జగన్నాథరావుకు వినతిపత్రం అందజేశారు. జడ్పీటీసీ సభ్యుడు సన్యాసినాయుడు, ఎంపీపీ సుధారాణి పాల్గొన్నారు. ★ ఎస్.కోటలో మాజీ ఎమ్మెల్యే హైమావతి ఆధ్వర్యంలో నాయకులు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు.

రాష్ట్ర, విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపిక

కబడ్డీలో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కొత్తవలస: తుమ్మికాపల్లి వాగ్దేవి కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ, విశ్వవిద్యాలయాల సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. గజపతినగరంలో మంగళవారం నిర్వహించిన అండర్-19 బాలుర కబడ్డీ పోటీల్లో సాగర్, హర్షవర్ధన్, జగదీష్ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని కరస్పాండెంట్ మహేశ్వరరావు తెలిపారు. 10న ఏయూలో జరిగిన అంతర విశ్వవిద్యాలయ బాలికల వాలీబాల్ పోటీల్లో ఇదే కళాశాలకు చెందిన పూజిత సత్తా చాటి విశ్వవిద్యాలయాల సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు.

క్రీడాకారునికి అభినందనలు

భోగాపురం/డెంకాడ: భోగాపురం మండలం చెరువుకొమ్ము గొల్లపేట గ్రామానికి చెందిన కోండ్రు కృష్ణ రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణం సాధించిన సందర్భంగా మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కె.బంగార్రాజు బుధవారం పోలిపల్లిలోని తన స్వగృహంలో అభినందించారు. నాయకులు సత్యనారాయణ, నారాయణరావు పాల్గొన్నారు.

వైకాపా నిరసనతో ట్రాఫిక్ జామ్

విజయనగరం పట్టణం, గ్రామీణం: వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైకాపా నిర్వహించిన నిరసన ర్యాలీతో నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యాయి. నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో సీఎంఆర్ కూడలి నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు బుధవారం ర్యాలీ చేపట్టారు. డీటీ స్వర్ణకుమార్ వినతి పత్రం అందుకునేందుకు వెళ్లారు. తహసీల్దారే వచ్చి వినతి స్వీకరించాలని నాయకులు బైఠాయించారు. మధ్యాహ్నం 12.15 గంటల సమయంలో తహసీల్దారు కూర్మనాథం రావడంతో కోలగట్ల ఆయనకు వినతి పత్రం అందజేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - దేవదాయ ధర్మదాయ శాఖ
శ్రీ గణపతి తదితర దేవాలయములు
కుమిలి (V), పూసపాటిరేగ (M), విజయనగరం జిల్లా.

టెండరు-కం-బహిరంగ వేలం ప్రకటన

Rc.No. Nil/2025, Dated. 7-11-2025

తమకు తెలియజేయునది ఏమనగా విజయనగరం జిల్లా, పూసపాటిరేగ మండలం, కుమిలి గ్రామంలో వేంచేసియున్న శ్రీ గణపతి తదితర దేవస్థానముల హక్కుభుక్తములో గల

వ.నెం.	భూమి ఉన్న గ్రామం	సర్వే నెం.	విస్తీర్ణం
1	కుమిలి	430/1 & 4. 30/2	9.58
2	కుమిలి	441/1 & 441/2	7.74
3	కుమిలి	431/7, 440/8, 440/3	5.14
4	కుమిలి	419/4	7.02
5	కుమిలి	424/13	0.90
6	కుమిలి	408/8	0.58
7	కుమిలి	411/1, 2 & 417/3, 4	3.71
8	కుమిలి	369/1, 3	3.51
9	కుమిలి	385/2	1.46
10	లోవ జగన్నాధపురం	7/3, 4 & 8/1, 11/1, 2	8.41
11	కుమిలి	416/5	1.10
12	కుమిలి	420/10	0.35
13	కుమిలి	440/1	1.60
14	కుమిలి	446/1	1.60
15	కుమిలి	446/51, 53, 71, 82, 95	2.20
16	ఆత్మారాముని అగ్రహారం	79	1.76

పై భూములకు 3 సం॥ల కాలపరిమితికి లీజుకు ఇచ్చుటకు గాను తే. 21-11-2025 దీన, శుక్రవారం ఉదయం గం॥ 11.00 ల నుండి ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం జరుపబడును. దేవదాయ శాఖ చట్టం 30/1987 లోని నియమ నిబంధనలు మరియు తదనుగుణంగా అందుపై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు అనుసరించి షరతులు వర్తిస్తాయి. మిగతా వేలం షరతులు విజయనగరం కార్యాలయంలో తెలుసుకొనవచ్చును. వివరములకు ఫోన్ నెం: 9948480807 ను సంప్రదించవలెను.

Sd/- **Executive Officer,**
Sri GANAPATHI Etc.,Temples, KUMILI (V), Pusapatirega (M).

(c) eenadu

శివకేశవులు ఇద్దరికీ ఎంతో ప్రీతికరమైనది కార్తిక మాసం. దీంతో సమానమైన మాసం, గంగతో సమానమైన తీర్థం లేదని పురాణోక్తి. విశేష పుణ్య సంపదను ప్రసాదించే ఈ మాసంలో దీపారాధనకు ఉన్న ప్రాధాన్యం అసమానమైనది. 'ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ, ఈటీవీ లైఫ్' ఛానళ్ల ఆధ్వర్యంలో కార్తిక దీపోత్సవం నిర్వహించనున్నారు. ఈ దీపోత్సవంలో పాల్గొనే మహిళలకు పూజ సామగ్రి నిర్వాహకులే సమకూరుస్తారు. చిన్నపిల్లలకు అనుమతి లేదు. నేలపై కూర్చోగలిగే వారు మాత్రమే హాజరు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు.

- ఈనాడు, తణుకు

గమనిక: ఈ నెల 4న జరగాల్సిన కార్తిక దీపోత్సవం వర్షం కారణంగా వాయిదా పడినందున ఆ కార్యక్రమం నిమిత్తం పంపిణీ చేసిన ఎంట్రీ పాసులు ఈ రోజు నిర్వహించే కార్తిక దీపోత్సవం కార్యక్రమానికి చెల్లవు. నిన్న పంపిణీ చేసిన కొత్త పాసులు మాత్రమే చెల్లుబాటు అవుతాయి.

సమయం: ఈరోజు (గురువారం) సాయంత్రం 5 గంటలకు

స్థలం: నూలి గ్రౌండ్స్, జ్యూయల్ హోమ్స్ పక్కన, ఎస్ఎన్‌వీటీ జూనియర్ కాలేజ్ వద్ద, తణుకు

ఈటీవీ ఆంధ్ర ప్రదేశ్ | ఈటీవీ తెలంగాణ | ఈటీవీ Life

ఈ ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారం నేటి సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు.

కార్తికం సందర్భంగా పుష్పాలంకరణలో పంచారామ సోమేశ్వరస్వామి

నారీ.. ర్యాపిడోపై సవారీ

ఇప్పటి వరకు ర్యాపిడో అంటే పురుషులే చోదకులు. ఇకపై ఫోన్ చేస్తే మహిళలు రయ్‌మని వాలిపోతారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల్లోని ఆసక్తి కలిగిన వాహన చోదకులకు జీవనోపాధి కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా ర్యాపిడో సంస్థతో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఒప్పందం కుదుర్చుకుంది.

ఉమ్మడి పశ్చిమలోని ఏలూరు, భీమవరం, జంగారెడ్డిగూడెం, నూజివీడు, చింతలపూడి, పాలకొల్లు, ఆకివీడు, తాడేపల్లిగూడెం, నరసాపురం, తణుకులో 25 చొప్పున ర్యాపిడ్ వాహనాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ పట్టణాల్లో ఇప్పటికే ఎంపిక ప్రక్రియ కొనసాగుతుండగా వాహనాల కొనుగోలుకు సంబంధించి ఒప్పందం దిశగా అడుగులు పడుతున్నాయి.

ఇవి తప్పనిసరి

- ఆసక్తి, లైసెన్సు ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు.
- తక్కువ ధరకే వాహనాలు కొనుగోలు చేసేలా ర్యాపిడో ఒప్పందం కుదుర్చుకుంది.
- నెలకు 250కు పైగా బుకింగ్స్ ద్వారా మహిళలకు ఆదాయం సమకూరే మార్గాలను అన్వేషిస్తున్నారు.
- ర్యాపిడో పికప్, డ్రాపింగ్ పాయింట్లు ప్రారంభించి నిర్దేశిత ప్రాంతాల్లో వాటిని నిలిపే అవకాశం కల్పిస్తారు.

జిల్లా, స్వయం సహాయక సంఘాలు, సభ్యులు			
ఏలూరు		7,500	75,000
పశ్చిమ	9,500	95,000	

- న్యూస్‌టుడే, భీమవరం పట్టణం

పాపం చేసిన మూడేళ్లకు
అదే రోజు కటకటాలకు.. 6లో
కూతురుని హతమార్చిన కన్నతండ్రి, సవతి తల్లి అరెస్టు

ఊర్లో ఉన్నట్లే.. ఇంట్లో తిన్నట్లే..!

ఏదైనా గుడికో, పర్యాటక ప్రాంతానికో వెళ్లాం.. అక్కడ దేవస్థానం గదిలో లేదా హోటల్ రూంలో దిగాం.. ఎవరైనా చేసేది అదే కదా.. ఇందులో ఏముంది ప్రత్యేకత? అదే మీరు దిగిన చోట.. ఊరిలో ఉన్న ఆత్మీయత దొరికితే.. ఇంట్లోలాగే ఆతిథ్యం అందితే.. తక్కువ ఖర్చుతో రుచికరమైన విందు పెడితే ఆ అనుభూతే వేరు.

- ఈనాడు డిజిటల్, భీమవరం, భీమవరం పట్టణం, న్యూస్‌టుడే

సంక్రాంతి సంబరాలకు పశ్చిమ పెట్టింది పేరు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాదు విదేశాల నుంచి ఎంతోమంది వస్తుంటారు. పంచారామాలు, పేరున్న ఆలయాలు ఉండటంతో ఏడాది పొడవునా భక్తులు వస్తుంటారు. ఆ మేరకు వసతి లేదు. ఈ నేపథ్యంలో అటు పర్యాటకులను ఆకర్షించేందుకు.. ఇటు స్థానికులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం జిల్లాలో హోం స్టేలను అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది.

140 హోం స్టేల ఏర్పాటుకు సన్నాహాలు

సంక్రాంతి నాటికి.. జిల్లాలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో 90కి పైగా హోంస్టేలను గుర్తించారు. తాజాగా పట్టణ మహిళా సంఘాల (మెప్మా) ఆధ్వర్యంలో భీమవరం, తణుకు, పాలకొల్లులో మరో 50 హోమ్‌స్టేలు సిద్ధం చేసేలా ప్రభుత్వం ప్రణాళిక రచించింది. హోంస్టేలంటే ఏదో అద్దెకిచ్చామన్నట్లు కాకుండా వచ్చిన వారితో మమేకమయ్యేలా, స్థానిక సంస్కృతి, సంప్రదాయాలు వివరించే బాధ్యతను పట్టణ పరిధిలోని మహిళా సంఘాలకు అప్పగించింది.

ఇవి ఉండాలి..

- హోం స్టేకు కనిష్ఠంగా ఒక గది (రెండు పడకలు), గరిష్ఠంగా ఆరు గదులు (12 పడకలు) ఉండాలి.
- ఇంటి యజమాని తన కుటుంబంతో అదే ప్రాంతంలో నివసించాలి.
- అతిథులకు అవసరమైన సేవలు అందించడానికి యజమాని నియమించిన ప్రతినిధి ఒకరు అందుబాటులో ఉండాలి.
- జిల్లా కేంద్రం భీమవరంలో 19 ఇళ్లను హోంస్టేలుగా ఇచ్చేందుకు ఆయా కుటుంబాల వారు ముందుకొచ్చారు.

మహిళలకు రుణాలు.. పట్టణ ప్రాంతాల్లో హోంస్టే ఏర్పాటుకు ముందుకొచ్చే మహిళలకు మెప్మా నుంచి రుణ సౌకర్యం కల్పిస్తారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, వ్యర్థాల నిర్వహణకు ఆర్థిక సాయం అందిస్తారు. పాత ఇళ్ల ఆధునికీకరణకు రూ.3 లక్షలు సమకూరుస్తారు.

పరిశీలన తర్వాత.. ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకుంటే ఆయా ఇళ్లను పరిశీలిస్తాం. వారి సత్ప్రవర్తన గుర్తించి, క్రిమినల్ కేసులు లేని వారిని అనుమతిస్తాం. సదుపాయాలు పరిశీలించి గోల్డ్, సిల్వర్ కేటగిరీలుగా వర్గీకరిస్తాం. అతిథులకు సదుపాయాల కల్పన, వారిపట్ల గౌరవంగా వ్యవహరించడం తదితర అంశాలపై నిర్వాహకులకు శిక్షణ ఇప్పిస్తాం. - హెప్సిబా, మెప్మా పీడీ

అదిరే.. చూస్తే కళ్లు చెదిరే



వన్నె తరగని ఆచంటలోని గంధర్వ మహల్

అణువణువునా కళాత్మకతతో.. అవందేళ్లు దాటినా వన్నె తరగని శోభతో అబ్బురపరుస్తోంది ఆచంటలో ఉన్న ఈ భవనం. స్థానికులు గంధర్వ మహల్‌గా పిలుచుకొనే ఈ భవనం ఘన కీర్తి ఉన్న చారిత్రక వస్తువులకూ నిలయంగా విలసిల్లుతోంది. స్థానిక జమిందారు గొడవర్తి నాగేశ్వరరావు హయాంలో 1918లో మొదలైన భవన నిర్మాణం 1924 నాటికి పూర్తయింది. 1885లో లండన్‌లో నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో రజత పతకం పొందిన అరుదైన పియానో ఇక్కడ ఉంది. గొడవర్తి కుటుంబీకులు సంగీత ప్రియులు కావడంతో దీనిని లండన్ నుంచి ఇక్కడకు రప్పించారు. 140 ఏళ్ల కిందట తయారైన ఈ పియానో ఇప్పటికీ సుస్వరాలు పలుకుతోంది. వందేళ్ల క్రితం బెల్జియం నుంచి దిగుమతి చేసుకున్న నిలువుటద్దాలు, బర్మా టేకుతో చేసిన ద్వారాలు, అలనాటి విద్యుత్తు దీపాలు ఔరా అనిపిస్తాయి. - న్యూస్‌టుడే, ఆచంట

140 ఏళ్ల నాటి పియానో

ఈ యువకులే ఊపిరి పోశారొయ్య

రైతుకు వెన్నుదన్ను.. పాండ్ మోనిటరింగ్

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: వాళ్లంతా భావి ఇంజినీర్లు.. భీమవరం విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో రెండు, మూడు ఏడాదుల విద్యార్థులు.. ఆక్వాతో సంబంధం లేని కుటుంబాల నుంచి వచ్చిన వాళ్లంతా రైతులకు ఉపయోగపడే ప్రాజెక్టుపై దృష్టి సారించారు. జాతీయస్థాయిలో ప్రథమంలో నిలిచారు. ఇంతకీ అది ఏంటో తెలుసుకుందాం.

జిల్లాలో ఆక్వా సాగులో ఏరియేటర్లు ఎంతో ప్రధానమైనవి. ఒక్కోసారి అకస్మాత్తుగా ఆగిపోతాయి. అలాంటప్పుడు రొయ్యకు ఆక్సిజన్ అందకపోతే చనిపోతుంది. ఇలాంటి విపత్కర పరిస్థితి నుంచి రైతుకు బాసటగా ఉండేలా పాండ్ మోనిటరింగ్ సిస్టం కనిపెట్టారు.

ఎలా పనిచేస్తుందంటే.. పాండ్ మోనిటరింగ్ సిస్టం యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఎస్టీఎం 22, స్మార్ట్ సినర్జీస్ ఐవోటీ సొల్యూషన్స్, జీపీఎంఎస్-1, కంప్రెషర్లతో తయారు చేసింది కావడంతో రైతుల ఫోన్ నంబర్లను ఇందులో నిక్షిప్తం చేసుకోవచ్చు. ఎప్పుడైనా సరే ఏరియేటర్లు ఆగిపోతే అలారం రైతు చరవాణిలో మోగుతుంది. దాంతో అప్రమత్తమయ్యే వీలుంటుంది. చరవాణిలో ఉంచిన సిగ్నలింగ్ వ్యవస్థతో ఆటోమేటిక్‌గా ఏరియేటర్లు ఆన్‌చేసుకోవచ్చు.

జీపీఎంఎస్-1 పరికరం

ఆరు నెలల కష్టం.. రైతుల దగ్గరకు వెళ్లి ఇబ్బందులు తెలుసుకున్న తర్వాత వచ్చిన ఆలోచన ఇది. దీన్ని కార్యరూపంలోకి తీసుకురావడానికి 6 నెలలు పట్టింది. యాప్‌ను ఇప్పటికే 20 మంది రైతులు ఉపయోగిస్తున్నారు. దీన్ని హైదరాబాద్‌లో ఈ నెల 1న నిర్వహించిన టై యూ-2025 టోర్నమెంటు గ్రాండ్ ఫినాలేలో ప్రదర్శించాం. అక్కడకు 300కు పైగా ప్రాజెక్టుల్లో ప్రథమంలో నిలిచి రూ.లక్ష బహుమతి వచ్చింది. - జి.మణిదీప్, కె.ధనుంజయ్, సీహెచ్ భరత్‌సాయి, పి.సత్య ఆనందరాజు, కె. జార్జి, సీహెచ్ వంశీకృష్ణ, ఎం.సాయికౌశిక్, వి.హేమశ్రీ

నాకూ ఉన్నారోయ్ ఫ్యాన్స్

భీమవరం అంటే ట్రెండ్. ఇక్కడున్న ప్రతి ఒక్కరికీ ఓ అభిరుచి ఉంటుంది. వీరికి పంకాలపై ఉంది. అందుకేనేమో ప్రస్తుతం మార్కెట్లో అందమైన ఆకృతుల్లో రూ.వేల నుంచి లక్షలు పలికే పంకాలు కొని వారి గృహాలు, కార్యాలయాలు, వాణిజ్య సముదాయాల్లో ఏర్పాటు చేసుకున్నారు. ఆధునికమైన ఫ్యాన్లతో పాటు పురాతనమైనవి కనువిందు చేస్తున్నాయి.

- ఈనాడు, భీమవరం

వృద్ధురాలితో కలిసి గృహప్రవేశం చేస్తున్న కలెక్టర్ నాగరాణి

ఇంటింత ఆనందమై

ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో నెరవేరిన వృద్ధురాలి కల

ఆకివీడు మండలం కుప్పనపూడి ఆలోని తాళ్లకోడు లేఅవుట్‌లో ఆకివీడుకు చెందిన కంకణాల కృష్ణవేణికి కొన్నేళ్ల కిందట స్థలాన్ని కేటాయించారు. ఆమెకు భర్త లేదు.. ఇల్లు కట్టుకునే ఆర్థిక స్తోమత లేదు. దీంతో మూడు నెలల కిందట మంగళగిరిలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కలిసి గూడు లేదని తన గోడు విన్నవించుకున్నారు. ఆయన ఆదేశాలతో జిల్లా అధికారులు 60 రోజుల్లో ఇల్లు పూర్తి చేశారు. బుధవారం కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆమెతో గృహ ప్రవేశం చేయించారు. నూతన వస్త్రాలు, పండ్లు, మిఠాయిలు అందజేశారు. ఎన్నో ఏళ్ల కల నెరవేరడంతో కృష్ణవేణి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. - ఆకివీడు, న్యూస్‌టుడే

కృష్ణవేణి ఇచ్చిన అర్జీని పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

జనవరి 12 నుంచి వందే భారత్

వడపళని, న్యూస్‌టుడే: డాక్టర్ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ నుంచి విజయవాడ వరకు వెళ్లే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును జనవరి 12వ తేదీ నుంచి నరసాపురం వరకు పొడిగిస్తున్నట్లు దక్షిణ రైల్వే బుధవారం ప్రకటన విడుదల చేసింది. నెం. 20677 రైలు చెన్నై సెంట్రల్‌లో జనవరి 12వ తేదీ 05.30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 14.10కి నరసాపురం చేరుతుంది. నెం. 20678 రైలు నరసాపురంలో అదే రోజు 14.50కి బయలుదేరి 23.45 గంటలకు చెన్నై సెంట్రల్ వస్తుంది. - రేణిగుంట, నెల్లూరు, ఒంగోలు, తెనాలి, విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నరసాపురం స్టేషన్లలో ఆగుతుంది.

నరసాపురం, తణుకు, న్యూస్‌టుడే, ఈనాడు డిజిటల్, భీమవరం

వాసనొస్తేనే వాలతారు

తూతూమంత్రంగా గంజాయి కట్టడి

జిల్లాలో ఇటీవల తణుకులో ఇద్దరు, భీమవరంలో వేర్వేరు ఘటనల్లో ఆరుగురు, ఆకివీడులో అయిదుగురు, ఆచంటలో ఇద్దరు యువకులు గంజాయితో పట్టుబడటం ఆందోళన కలిగిస్తోంది.

- నరసాపురంలో ఇటీవల అమ్మవారి ఉత్సవాల్లో గంజాయి మత్తులో ఇద్దరు యువకులు వీరంగం సృష్టించారు. పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు స్థానికులు స్టేషన్ వరకు వెళ్లినా వేధింపులు, దాడుల భయంతో వెనుతిరిగారు.
- తణుకు పట్టణ పరిధిలోని కొండాలమ్మ పుంత రోడ్డులో కొందరు నిషేధిత గంజాయి కలిగి ఉండటంతో ఏడుగుర్ని అదుపులోకి తీసుకుని, వారి నుంచి 4.350 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

గతేడాది కేసులు	10
అదుపులోకి తీసుకున్న వారు	44
సరకు స్వాధీనం	88.70 కిలోలు

తల్లిదండ్రులకు కౌన్సెలింగ్: జిల్లాలో మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్న వారిలో సుమారు 20 శాతం మైనర్లే ఉంటున్నారు. డ్రగ్స్, మద్యానికి బానిసై, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడితే వారి భవిష్యత్తు అంధకారంలోకి జారుకుంటుందనే ఉద్దేశంతో పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

కమీషన్లకు ఎర: సరకు రవాణా కోసం కమీషన్ల ఆశ చూపి, అమాయక యువకులను దందాలోకి లాగుతున్నారు. ప్రధానంగా కళాశాలల విద్యార్థులను ఎంపిక చేస్తున్నారు.

దాడులు మాత్రమే: విశ్వసనీయ సమాచారం ఆధారంగా అప్పుడప్పుడు విక్రేతలను పట్టుకోవడం తప్పితే... ఆ దందా వెనకున్న బడా వ్యాపారులపై దృష్టి పెట్టడం లేదు. ఏ దారిలో వస్తుంది? ఎక్కడ నుంచి వస్తుంది? రవాణాకు ఎవరు సహకరిస్తున్నారు? అన్నది గుర్తిస్తే పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.

- గంజాయిపై ఉక్కుపాదం మోపామని ఎస్పీ అద్నాన్ నయిం అస్మి తెలిపారు.

రాకండి.. ఈత కొలను కాదండి

భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని పార్కులో ఇటీవల కురిసిన వర్షానికి నీరు చేరడంతో ఈతకొలనును తలపిస్తోంది. లోతట్టు ప్రాంతం కావడం, సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో నీరు నిలిచిపోయి నాచుపట్టింది. దీంతో వ్యాయామ, ఆట పరికరాలు తుప్పు పట్టిపోతున్నాయి.

- ఈనాడు, భీమవరం

పరుగుల మోత.. వికెట్ల వేట!

అండర్-19 రాష్ట్ర జట్టుకు ఎంపిక

సమీరుద్దీన్

పాలకొల్లు, న్యూస్‌టుడే: అతడు బ్యాట్ పట్టి బరిలో దిగితే పరుగుల వరదే.. పదునైన బౌలింగ్‌తో ప్రత్యర్థులను కట్టడి చేస్తూ వికెట్లు తీయడంలోనూ దిట్ట. ప్రతి మ్యాచ్‌లోనూ ఆల్‌రౌండర్ ప్రతిభతో జట్టును విజయపథంలో నడిపిస్తున్నాడు పాలకొల్లు బ్రాడీపేటకు చెందిన షేక్ సమీరుద్దీన్.

ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన స్టేట్‌మీట్‌లో పశ్చిమ జట్టు (అండర్-19)ను మూడో స్థానంలో నిలిపాడు. డిసెంబరు 5 నుంచి హరియాణాలో జరిగే జాతీయస్థాయి అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా క్రికెట్ పోటీల్లో తలపడే రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు.

ఆటను చూసి.. కవిటం గ్రామానికి చెందిన సమీరుద్దీన్ ఆటను జాతీయ వెటరన్ క్రికెటర్ మణికంఠ చూసి ఆల్‌రౌండర్‌గా తీర్చిదిద్దారు. 2023లో అండర్-16 జిల్లా జట్టు కెప్టెన్ అయ్యాడు. అండర్-17 జట్టులో కర్నూలు, విశాఖ జట్లతో జరిగిన మ్యాచ్‌లో ప్రతిభ కనబరిచాడు. అనంతరం అండర్-19 జిల్లా జట్టు కెప్టెన్ అయ్యాడు.

మెరుపు విజయాలతో.. అక్టోబరులో జరిగిన స్టేట్ మీట్ క్వార్టర్ ఫైనల్స్‌లో పశ్చిమ జట్టు 8 ఓవర్లలో 72 పరుగులు చేయగా.. గుంటూరు జట్టును 58 పరుగులకే ఆలౌట్ చేయడంలో సమీరుద్దీన్ కీలక పాత్ర పోషించాడు. సెమీస్‌లో చిత్తూరు జట్టుతో జరిగిన మ్యాచ్‌లో ఒకే ఓవర్‌లో వరుసగా నాలుగు వికెట్లు తీసి గెలుపును సునాయాసం చేశాడు.

అబ్బా.. ఇదెక్కడబ్బ

పెనుగొండ, న్యూస్‌టుడే: నిండా కొబ్బరికోరు, ఎండు ఫలాలు దట్టించి.. వేడి వేడి తీపి పాకంలో ముంచి తీసిన పెనుగొండ కజ్జికాయ రుచి చూసిన వారెవరైనా.. వెంటనే మరోటి తినకుండా ఉండలేరు. 50 ఏళ్ల కిందట ఇక్కడ ప్రాణం పోసుకున్న ఈ మిఠాయి ఖ్యాతి ఖండాంతరాలకూ విస్తరించింది. పండుగలు, పెళ్లిళ్ల సీజన్‌లో దీనికున్న డిమాండే వేరు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సినీ, రాజకీయ ప్రముఖులు ప్రత్యేకంగా వీటిని తయారు చేయించుకొని తీసుకెళ్తారు.

చిన్న బండిపై మొదలై... పెనుగొండకు చెందిన విసుమర్తి కాళిదాసు వీటిని తయారు చేసి చిన్న బండిపై విక్రయించేవారు. ప్రత్యేక రుచి కారణంగా కొద్దికాలంలోనే దీనికి ప్రత్యేక గుర్తింపు వచ్చింది. గతంలో దీనిలో కొబ్బరికోరు మాత్రమే వేసేవారు. కాళిదాసు కుమారులు కొబ్బరికోరుకు జీడిపప్పు, ఎండు ఫలాలు జోడించి దీనికి మరింత వన్నె తెచ్చారు. ఏ సమయంలోనైనా వీటిని వేడి పాకంలోంచి తీసి అందిస్తారు.

నోరూరించే పెనుగొండ కజ్జికాయ

సారథి.. నన్నేమి సేతువో

ప్రారంభం: 2008-09

వ్యయం: రూ.8 కోట్లు

అయ్యా.. నేను అయ్యా.. కోనాల్ల- ఆరుళ్ల మధ్య యనమదుర్రు డ్రెయిన్‌పై చేపట్టిన వంతెనని. 17 ఏళ్ల కిందట ప్రారంభించారు. ఇప్పటికీ ఇలాగే ఉండిపోయాను.. నన్ను ఎందుకు కట్టాలనుకున్నారు.. నా వల్ల ఉపయోగం ఏమిటో ఓ సారి చెబుతాను.. అప్పుడైనా పూర్తి చేస్తారేమో!

ప్రస్తుత పరిస్థితి: వంతెనకు ఉన్న నాలుగు బ్లాకుల్లో ఒకటి పూర్తి కాలేదు. సర్వీసు రోడ్లు లేవు.

పూర్తవ్వాలంటే: రూ.1.5 కోట్లు కావాలి

పూర్తయితే: పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల్లోని తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు నియోజకవర్గాలకు అనుసంధానం . కోనాల, ముద్దాపురం, ఆరుళ్ల, మారంపల్లి, నందమూరు, జగన్నాథపురం, సూర్యారావుపాలెం, కాల్దారి, వేలివెన్ను, పసలపూడి, వడ్లూరు తదితర గ్రామాలకు రవాణా సౌకర్యం.

జనాభా: 50 వేలు

ఉదా: వంతెన ఉంటే కోనాల - సూర్యారావుపాలెం వెళ్లేందుకు 2 కి.మీ. లేకపోవడం వల్ల 15 కి.మీ ప్రయాణించాలి.

- న్యూస్‌టుడే, తణుకు

(c) eenadu

స్ఫూర్తి ప్రదాత మూర్తిరాజు

విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో నాగరాణి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: చింతలపాటి సీతారామచంద్ర వరప్రసాద్ (మూర్తిరాజు) దాతృత్వం వెలకట్టలేనిదని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. విద్యా దాత, గాంధేయవాది చింతలపాటి మూర్తిరాజు 13వ వర్ధంతి సందర్భంగా బుధవారం జువ్వలపాలెం రోడ్డులోని ఆయన విగ్రహం వద్ద సర్వోదయ మండలి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. దానికి కలెక్టర్ హాజరై మూర్తిరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ.. 110 ఏళ్ల క్రితమే విద్య ప్రాముఖ్యతను గుర్తించి.. వందలాది విద్యా సంస్థలను నెలకొల్పిన మూర్తిరాజు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు, కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, మానవత, అల్లూరి సీతారామరాజు సేవా సమితి, మంతెన రామలింగరాజు ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో అప్రంటిస్‌షిప్‌కు దరఖాస్తులు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఆర్టీసీలో అప్రంటిస్‌షిప్‌నకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విజయవాడ జోనల్ శిక్షణ కళాశాల ప్రధానాచార్యురాలు వి.నీలిమ ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ నెల 15 నుంచి 30వ తేదీలోగా www.apprenticeshipindia.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు.

చెత్త సేకరణలో నెగ్గిపూడి

ఐవీఆర్ఎస్ ప్రజాభిప్రాయ సేకరణలో తొలిస్థానం

మార్టేరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై దృష్టి సారించిన ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో పరిస్థితులపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తోంది. దీనిలో భాగంగా చెత్త సేకరణపై ఇటీవల ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేసింది. మీ ఇంటి నుంచి చెత్త సేకరణ జరుగుతుందా, వారానికి కనీసం రెండు సార్లయినా కార్మికులు వస్తున్నారా లేదా అనే అంశాలపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. 89.73 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేయడంతో పెనుమంట్ర మండలం నెగ్గిపూడి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. 36.40 శాతంతో ఆకివీడు మండలం పెదకాపవరం చివరి స్థానంలో ఉంది. జిల్లాలో 214 గ్రామాల్లో ఈ సర్వే చేశారు. నెగ్గిపూడి తరువాత రెండు, మూడు స్థానాల్లో ఉండి మండలం ఉప్పులూరు, ఇరగవరం మండలం కె.కుముదవల్లి గ్రామాలు నిలిచాయి. 48 గ్రామాల్లో 75 శాతానికి పైగా ప్రజలు చెత్త సేకరణ ప్రక్రియపై సంతృప్తి వ్యక్తం చేశారు. 14 గ్రామాల్లో ఈ శాతం 50 శాతాని కంటే తక్కువ ఉంది. వెనుకబడిన పంచాయతీల్లో ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు చేపట్టనున్నారు.

తాడేపల్లిగూడెం పురపాలక సంఘ కార్యాలయము

ఆర్.ఓ.సి.4103/2025/G1 ది. 11-11-2025

పత్రికా ప్రకటన

తాడేపల్లిగూడెం పురపాలక సంఘం పరిధిలో PMAY (U) - NTR నగర్, కొండ్రుప్రోలు ఎ.పి. టిడ్కో గృహ పథకములో భాగంగా 5376 ఇల్లు నిర్మించి లబ్ధిదారులకు కేటాయించడం జరిగినది. వివిధ కారణాలు వలన ఏర్పడినటువంటి ఈ దిగువ తెలిపిన టిడ్కో ఇళ్లను తిరిగి భర్తీ చేయుటకుగాను తాడేపల్లిగూడెం పురపాలక సంఘ కార్యాలయము, పట్టణ ప్రణాళికా విభాగము వారిని సంప్రదించి సంబంధిత ధృవపత్రములతో తేది. 20-11-2025 లోపు దరఖాస్తులు దాఖలు చేసిన యెడల ప్రభుత్వ ఉత్తర్వులకు లోబడి సదరు దరఖాస్తులను పరిశీలించి అర్హత కలిగిన లబ్ధిదారులకు సదరు టిడ్కో ఇల్లు కేటాయించు విషయమై చర్యలు తీసుకొనబడునని తెలియజేయడమైనది.

క్రమ సంఖ్య	కేటగిరి	గృహ విస్తీర్ణం	ఖాళీల సంఖ్య	లబ్ధిదారుని వాటా క్రింద చెల్లించవలసిన సొమ్ము	బ్యాంకు ఋణము (రూపాయలలో)	మొత్తం చెల్లించవలసిన సొమ్ము (రూపాయలలో)
1	బి	365 చ.అ.	26	25,000/-	3,15,000/-	3,40,000/-
2	సి	430 చ.అ.	49	50,000/-	3,65,000/-	4,15,000/-

పై తెలిపిన వివరాలు ప్రకారము సొమ్ము చెల్లించి టిడ్కో ఇల్లు పొందవలెను. కావున ఆసక్తిగల లబ్ధిదారులు మునిసిపల్ కార్యాలయమునందు పట్టణ ప్రణాళిక విభాగము నందు ఆఫీసు పనివేళలలో సంప్రదించవలసినదిగా కోరడమైనది.

సం/- **కమిషనర్,** తాడేపల్లిగూడెం పురపాలక సంఘం

ప్రకటన

నా క్లయింట్, అంజని విష్ణు అల్లైడ్ సర్వీసెస్ తరపున మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఎమ్.యస్.రాజు గారి కుమారుడు శ్రీ ఎ.ఎ.కె.వి. రాజు గారు నాకు ఇచ్చిన సంజాయిషీపై తెలియజేయునది ఏమనగా,

పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మండలం, భీమవరం పట్టణ కాపురస్తులు అయిన 1) తటవర్తి బ్రహ్మానంద మోహనరావు గుప్త గారి కుమారులు 1) నారాయణ మూర్తి, 2) కృష్ణ కిశోర్, 3) శ్రీనివాస్ మరియు 4) సునీల్ కుమార్ గార్లు ది:19-06-2020 వ తేదీన రిజిష్టరు కుటుంబ తగాయిదా పరిష్కార దస్తావేజు రీత్యా వారి తండ్రి గారి అనంతరం పైన ఉదాహరించిన ఆస్తులు [illegible]

సం/-

అల్లూరి వెంకటేశ్వర రాజు, అడ్వకేట్

[illegible] సెల్: 98482 11102

ఆటే వ్యాపకం.. విజయాల జ్ఞాపకం!

టెన్నిస్‌లో సత్తా చాటుతున్న సీనియర్ క్రీడాకారులు

పాలకొల్లు, న్యూస్‌టుడే

మలి వయసులోనూ టెన్నిస్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొంటూ సత్తాచాటుతున్నారు పలు ప్రాంతాలకు చెందిన సీనియర్ క్రీడాకారులు. పాలకొల్లు కాస్మో స్పోర్ట్స్ క్లబ్ నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నీలో ఉభయ తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలకు చెందిన వారు పాల్గొంటున్నారు. నిత్యం క్రీడా సాధనతో చక్కటి వ్యాయామం లభిస్తోందని, ఇలాంటి పోటీల్లో సాధించే విజయాలు ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు మధుర స్మృతులుగా నిలుస్తాయని వీరు చెబుతున్నారు.

తనయుడి కోసం వెళ్లి

గుంటూరు జిల్లా తెనాలికి చెందిన సాయి రాంబాబు వయసు 84 ఏళ్లు. ఆర్టీసీ డిపో మేనేజర్‌గా ఉద్యోగ విరమణ పొందారు. 1965లో బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి రాష్ట్ర జట్టు కెప్టెన్‌గా వ్యవహరించారు. ఏడు సార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని రాణించారు. కుమారుడికి టెన్నిస్ నేర్పించే యత్నాల్లో భాగంగా ఈయన కూడా 1992లో ఆ క్రీడలో సాధన ప్రారంభించారు. అప్పటి నుంచి 200కు పైగా పోటీల్లో తలపడి 70 సార్లు విజేతగా నిలిచారు. నిత్యం టెన్నిస్ సాధనతో ఆరోగ్యకర జీవనం సాగిస్తున్నట్లు రాంబాబు చెప్పారు.

అసలైన పండగలా..



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట సమీపాన అవిడి గ్రామానికి చెందిన 75 ఏళ్ల వైవీ రామకృష్ణ విశ్రాంత న్యాయమూర్తి. అదనపు ట్రైబ్యునల్ వైస్ ఛైర్మన్‌గా వ్యవహరించిన ఈయన 200కు పైగా టోర్నీల్లో పాల్గొన్నారు. ఏటా అక్టోబరులో మొదలయ్యే టెన్నిస్ టోర్నీల సీజన్ తమ బృందానికి అసలైన పండగలాంటిదని రామకృష్ణ చెబుతున్నారు. క్రీడా సాధనతో శరీరానికి తగినంత వ్యాయామం లభించి అనారోగ్యాలను దూరం చేస్తుందని పేర్కొన్నారు.

ఏటా ఏడు టోర్నీలు

భీమవరానికి చెందిన 65 ఏళ్ల ఎ.రాంబాబు ఉభయ తెలుగు రాష్ట్రాల సీనియర్ టెన్నిస్ క్రీడాకారుల సంఘానికి అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఏటా దేశవ్యాప్తంగా ఏడు సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నీలు జరుగుతాయని, ఈ ఏడాది అక్టోబరులో విజయవాడలో ఒకటి పూర్తికాగా.. ఇప్పుడు పాలకొల్లులో రెండో టోర్నీ జరుగుతోందని ఆయన చెప్పారు. తదుపరి టోర్నీలు హైదరాబాద్, విశాఖ, శ్రీకాళహస్తి, భీమవరం, బెంగళూరుల్లో జరుగుతాయని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 150కు పైగా పోటీల్లో తలపడి దాదాపు వంద విజయాలు నమోదు చేసినట్లు రాంబాబు చెప్పారు.

ఆశీస్సులు పొందుతున్న జస్టిస్ మల్లికార్జునరావు దంపతులు

సోమేశ్వరుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా పంచారామక్షేత్రం గునుపూడి సోమేశ్వరజనార్దనస్వామి ఆలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు దంపతులు బుధవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన వారికి ఆలయాధికారులు స్వాగతం పలికారు. స్వామిని, అమ్మవార్లను దర్శించి పూజలు నిర్వహించారు. ప్రధానార్చకులు స్వామి ఆశీర్వాదం, డివిజన్ దేవాదాయశాఖ తనిఖీదారుడు వి.వెంకటేశ్వరరావు శేషవస్త్రం, స్వామి వారి చిత్రపటం అందించారు.

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి: జేసీ

దస్త్రాలు పరిశీలిస్తున్న రాహుల్ కుమార్ రెడ్డి

తణుకు, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లతో అధికారులు సిద్ధంగా ఉండాలని జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముందుగా ఖరీఫ్ సీజన్ 2025-26 ధాన్యం కొనుగోలు, ఏర్పాట్లకు సంబంధించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం తేతలిలో విజయలక్ష్మి రైస్ మిల్లును అకస్మికంగా సందర్శించి.. దస్త్రాలను, ట్రక్‌షీట్లను పరిశీలించారు. రైస్ మిల్లు, ఆర్ఎస్‌కేలో ఉన్న తేమ శాతం పరికరాల తేడాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ఇబ్రహీం, జిల్లా సహకార శాఖ అధికారి మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు, జిల్లా రవాణాశాఖాధికారి కృష్ణారావు, తణుకు ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్లు అశోక్ వర్మ, సుందర్‌రాజు, వంశీ, మండల వ్యవసాయాధికారులు రాజేంద్రప్రసాద్, రాజేశ్, రాఘవేంద్రరావు, ఎంఎల్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతోనే న్యుమోనియా నిర్మూలన: డీఎంహెచ్‌వో

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: సురక్షితమైన వాతావరణం, శుభ్రతతోనే న్యుమోనియాను దూరం చేయవచ్చని డీఎంహెచ్‌వో జి.గీతాబాయి అన్నారు. ప్రపంచ న్యుమోనియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఏరియా ఆసుపత్రిలో 'సోషల్ అవేర్నెస్ అండ్ యాక్షన్ టు న్యూట్రలైజ్ న్యుమోనియా' (సాన్స్) కార్యక్రమంలో భాగంగా రూపొందించిన గోడ పత్రికను ఆమె ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. నవంబర్ 12 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకూ ఆశా, ఆరోగ్య సిబ్బంది ఇంటింటి పర్యటనలు చేసి 0-5 సంవత్సరాలు పిల్లల్లో న్యుమోనియా లక్షణాల గుర్తిస్తారన్నారని చెప్పారు.

చేతిలో దీపం.. మదిలో మావుళ్లమ్మ రూపం

భీమవరం మావుళ్లమ్మ మాలధారులు బుధవారం రాత్రి పట్టణంలో జ్యోతుల ప్రదర్శన నిర్వహించారు. అమ్మవారి పూరిగుడి మీదుగా పంచారామక్షేత్రం సోమేశ్వరజనార్దనస్వామి తదితర ఆలయాలను దర్శించుకుంటూ ప్రధాన రహదారి మీదుగా ఆలయానికి చేరుకున్నారు. దీక్షలు స్వీకరించిన సుమారు 500 మందితో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు. - **న్యూస్‌టుడే, భీమవరం ఆధ్యాత్మికం**

అప్సడా రిజిస్ట్రేషన్లు త్వరగా పూర్తి చేయాలి: కలెక్టర్

భీమవరం కలెక్టరేట్, వన్‌టౌన్, న్యూస్‌టుడే: అప్సడా రిజిస్ట్రేషన్లు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి అప్సడా రిజిస్ట్రేషన్ల పురోగతిపై మత్స్య, రెవెన్యూ శాఖాధికారులతో జూమ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మొత్తం 1.33 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతుండగా.. 14 వేల ఎకరాలు కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ పరిధిలో ఉందన్నారు. ఇప్పటి వరకూ 60 వేల ఎకరాలు మాత్రమే అప్సడా రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని, మిగిలినవి త్వరగా అప్సడా, కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీలో రిజిస్ట్రేషన్లు చేయించాలని ఆదేశించారు.

రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడి తనిఖీలు

నరసాపురం: గురుకుల పాఠశాలలో సిబ్బందిని ప్రశ్నిస్తున్న కృష్ణ కిరణ్

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కృష్ణ కిరణ్ బుధవారం జిల్లాలోని పలు వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పాలకొల్లు, నరసాపురం, పెనుమంట్ర, వీరవాసరం మండలాల్లోని వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంఎల్ఎస్ పాయింట్లను ఆయన పరిశీలించారు. పలు చోట్ల విద్యార్థులతో మాట్లాడి భోజనం నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎస్‌వో ఎన్.సరోజ, ఐసీడీఎస్, బీసీ సంక్షేమశాఖ అధికారులు ఉన్నారు.

సొంత ఇంటి కల సాకారానికి కృషి

ఆకివీడు, న్యూస్‌టుడే: అర్హులైన ప్రతి ఒక్కరి సొంత ఇంటి కల సాకారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఆకివీడు మండలం కుప్పనపూడిలోని తాళ్లకోడు ప్రాంతంలోని 74 ఎకరాల లేఅవుట్‌లో నిర్వహించిన సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమంలో బుధవారం ఆమె పాల్గొని మాట్లాడారు. జిల్లాలో పీఎంఏవై 1.0 కింద ఇప్పటి వరకు 6,600 మంది ఇళ్లు నిర్మించుకుని గృహ ప్రవేశాలు చేసినట్లు తెలిపారు. బుధవారం మరో 100 ఇంట్లో దిగారని, పీఎంఏవై 2.0 ద్వారా 595 గృహాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఏఎంసీ ఛైర్మన్ బొల్లా వెంకట్రావు, సర్పంచి ముత్యాల అనురాధ, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు పాల్గొన్నారు.

కదలనన్నా కట్టబెట్టారు!

• జడ్పీలో కాసుల ఉద్యోగోన్నతులు! • అన్యాయమంటూ జూనియర్లు గగ్గోలు

ఈనాడు-ఏలూరు: జిల్లా పరిషత్తు పరిధిలో పనిచేసే కొందరు నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు ప్రభుత్వ ఉత్తర్వులు, మెమోలను ధిక్కరించి అడ్డగోలుగా ఉద్యోగోన్నతులు కల్పించారు. ఉన్న చోట నుంచి కదలడం ఇష్టం లేక ఉద్యోగోన్నతులు వద్దని రాసిచ్చిన వారికే ఏరికోరి ఇవ్వటంపై వివాదం నెలకొంది. నిబంధనల ఉల్లంఘనపై ఉద్యోగులు భగ్గుమంటున్నారు. దీనిపై కలెక్టర్, జడ్పీ సీఈవో, పీఆర్ కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. కలెక్టర్ విచారణకు ఆదేశించారు.

ముడుపులు ఆశించి.. ఉద్యోగోన్నతులు వద్దని లేఖలు రాసిచ్చిన వారిలో కొందరికి కోరుకున్న చోట పోస్టింగ్ ఇస్తామని ఆశచూపి బలవంతంగా ఉద్యోగోన్నతులిచ్చారనే ఆరోపణలున్నాయి. దగ్గరి ప్రాంతాల్లో పోస్టింగ్ ఇస్తామనేసరికి వారు మెత్తబడుతున్నారు. ముడుపులు ముట్టజెబుతున్నారు. ఒకరు వద్దని తిరస్కరిస్తే వెనక ఉన్న ఉద్యోగికి త్వరగా ఉద్యోగోన్నతి వస్తుందనే ఆశ ఉంది. కాని అక్రమ ఉద్యోగోన్నతులతో తమకు అన్యాయం జరుగుతోందని వారు వాపోతున్నారు.

ప్యానల్ ఇయర్‌కే వక్ర భాష్యం.. ప్యానల్ ఇయర్ ప్రకారం సెప్టెంబరు 1 నుంచి ఆగస్టు 31 లోపు ఎవరైనా ఉద్యోగోన్నతికి అర్హులై నిరాసక్తత తెలియజేస్తే తిరిగి ఏడాది పాటు ఉద్యోగోన్నతి కల్పించకూడదు. దీనికి వక్రభాష్యం చెప్పారు.

చర్యలకు సిఫార్సు చేస్తా..

ఈ అక్రమాలు నా హయాంలో జరగలేదు. సంఘ నాయకులతో మాట్లాడి నిబంధనలకు విరుద్ధంగా ఉంటే బాధ్యులైన అధికారులు, ఉద్యోగులపై చర్యలకు సిఫార్సు చేస్తా. - **శ్రీహరి, జడ్పీ సీఈఓ, ఉమ్మడి పశ్చిమగోదావరి**

మచ్చుకు కొన్ని.. • జడ్పీ కార్యాలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ ఒకరు మార్చి 2024న పదోన్నతి వద్దని లేఖ ఇచ్చారు. కానీ జూన్‌లో ఉద్యోగోన్నతి కల్పించి పెరవలిలో పోస్టింగ్ ఇచ్చారు. • జంగారెడ్డిగూడెంలో పనిచేసే ఉద్యోగి ఒకరు 2024 మార్చిలో తిరస్కరించినా అక్టోబరులో ఏవోగా ఉద్యోగోన్నతినివ్వటం గమనార్హం. • తణుకులో పనిచేస్తున్న ఒక ఉద్యోగి 2023లో తిరస్కరించారు. సదరు ఉద్యోగికి తణుకులోనే ఉద్యోగోన్నతి కల్పించి పోస్టింగ్ ఇవ్వటంతో విధుల్లో చేరారు.

రీకాల్ చేసే వరకు పోరాడతాం

2023కు ముందు వద్దని రాసిచ్చిన వారికి నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగోన్నతులు కల్పించారు. అభ్యంతరం తెలిపి కలెక్టర్, జడ్పీ సీఈఓ, ఛైర్మన్‌కు ఫిర్యాదు చేయటం జరిగింది. పీఆర్ కమిషనర్‌కు లేఖ రాశాం. అక్రమ ఉద్యోగోన్నతులు రద్దయ్యే వరకు పోరాడతాం.

-శ్రీధర్ రాజు, జిల్లా అధ్యక్షుడు, ఏపీ మినిస్టీరియల్ పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం

ముగిసిన నన్నయ వర్సిటీ అథ్లెటిక్స్ పోటీలు

ఓవరాల్ ఛాంపియన్‌షిప్ డీఎన్ఆర్ కళాశాల కైవసం

ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న సెయింట్ థెరిస్సా కళాశాల క్రీడాకారిణులు

శ్యామలాసెంటర్ (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ఆదికవి నన్నయ యూనివర్సిటీ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు బుధవారంతో ముగిశాయి. మెన్ ఛాంపియన్‌షిప్‌ను డీఎన్ఆర్ (భీమవరం), ఉమన్ ఛాంపియన్‌షిప్‌ను సెయింట్ థెరిస్సా కళాశాల (ఏలూరు), ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను డీఎన్ఆర్ కళాశాల కైవసం చేసుకున్నాయి. ఈ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన చేసిన 14 మందిని బెంగళూరులోని రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాలలో జరిగే ఆలిండియా అథ్లెటిక్స్ పోటీలకు పంపించనున్నట్లు వ్యవస్థాపక కార్యదర్శి విజయ దుర్గ తెలిపారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్రరావు బహుమతులు అందజేశారు.

కొనసాగిన క్రీడాపోటీలు

యోగా పోటీల్లో ఇలా..

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం డీఎన్ఆర్ కళాశాల మైదానంలో అఖిల భారత సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలు బుధవారం కొనసాగాయి. క్రికెట్, యోగా విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎన్.మోహన్‌దాస్ తెలిపారు.

సెమీస్‌కు చేరిన టెన్నిస్ టోర్నీ

పాలకొల్లు, పట్టణం, న్యూస్‌టుడే: పాలకొల్లు కాస్మో స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు సెమీస్ దశకు చేరాయి. బుధవారం క్వార్టర్ ఫైనల్స్‌లో విజయం సాధించిన వారు గురువారం సెమీఫైనల్స్‌లో తలపడతారని క్లబ్ కార్యనిర్వాహక కార్యదర్శి గొట్టుముక్కల బాలరాజు తెలిపారు. 45, 55, 65, 70 విభాగాల్లో ఫైనల్స్ ఈ నెల 14న జరుగుతాయని, అదే రోజు విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

నేడు జిల్లాలో మహిళా కమిషన్ ఛైర్మన్ పర్యటన

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ రాయపాటి శైలజ గురువారం జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా పౌర సమాచార అధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడేపల్లి నుంచి రోడ్డు మార్గంలో పెనుగొండ చేరుకుని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటారని పేర్కొన్నారు.

పాపం చేసిన మూడేళ్లకు అదే రోజు కటకటాలకు..

• కూతురుని హతమార్చిన కన్న తండ్రి, సవతి తల్లి అరెస్టు
• వీడిన యువతి సజీవ దహనం మిస్టరీ

తణుకు, న్యూస్‌టుడే: తల్లిని పోగొట్టుకున్న కూతురిని ఎంతో ఆప్యాయంగా చూసుకోవాల్సిన తండ్రి నరహంతకుడిగా మారాడు. ఆమె సవతి తల్లితో కలసి ఘోరానికి తెగబడ్డ వైనం మూడేళ్ల తర్వాత బహిర్గతమైంది. తణుకు మండలం ముద్దాపురంలో ఆస్తి కోసం 19 ఏళ్ల యువతిని కన్నతండ్రి, సవతి తల్లి కర్కశంగా హతమార్చిన ఘటన జిల్లా వ్యాప్తంగా సంచలనంగా మారింది. మిస్టరీగా మిగిలిపోతుందనుకున్న ఈ కేసులో.. సంఘటన జరిగిన మూడేళ్ల తర్వాత అదే రోజైన నవంబరు 12నే... నిందితులు రిమాండ్‌కు వెళ్లడం గమనార్హం. ఈ కేసుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. తణుకు మండలం ముద్దాపురం గ్రామానికి చెందిన ముళ్లపూడి నాగహారిక(19) 2022 నవంబరు 12న ఉదయం తన గదిలో మంచంపై సజీవదహనమై ఉంది. చరవాణి ఛార్జర్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి మృతి చెందినట్లుగా తల్లిదండ్రులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

ఆస్తి కోసమే... ముద్దాపురానికి చెందిన ముళ్లపూడి శ్రీను అలియాస్ శ్రీరాములు మొదటి భార్య వసంత కుమార్తె నాగ హారిక. 2003లో ఈమె తల్లి వసంత అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. అనంతరం 2009లో ముద్దాపురానికి చెందిన ముళ్లపూడి రూపను శ్రీను వివాహం చేసుకున్నారు. వీరికి కుమార్తె జన్మించింది. మొదటి భార్య కుమార్తె నాగ హారిక పేరున ఎకరం పొలం ఉంది. తల్లి వసంత మృతి చెందిన తర్వాత హారికకు సంక్రమించే ఆస్తిపై కన్నేసిన రూప ఆమెను హత్య చేయాలని పథకం పన్నారు. ఇందుకోసం భర్త శ్రీనివాస్ సహకరించారు. 2022 నవంబరు 11న రాత్రి నాగ హారికకు మత్తు మందు కలిపిన నూడిల్స్ ఇచ్చి నిద్రించిన తర్వాత తలపై కొట్టి హత్య చేసి అనంతరం మంచంపైనే పెట్రోలు పోసి నిప్పు పెట్టారు. తెల్లారేసరికి ఏమీ తెలియనట్లు పోలీసులకు సమాచారం అందించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే మృతి చెందినట్లు నిర్ధారించిన పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఇది హత్యే అంటూ మేనమామ, అమ్మమ్మలు ఆరోపించినప్పటికి... పోలీసులు వీఆర్వో వద్ద ఫిర్యాదు తీసుకుని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

ఆలస్యంగా నివేదిక.. సాధారణంగా మూడు నెలల్లోనే రావాల్సిన ఫోరెన్సిక్ నివేదిక ఈ కేసులో మూడేళ్ల తర్వాత అందడంపై పలు అనుమానాలున్నాయి. అనుమానాస్పద మృతిగా నమోదు చేసిన పోలీసులు నివేదిక రావడంతో ఈ కేసులో సెక్షన్లను మార్పు చేసి హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుత సీఐ కృష్ణకుమార్, ఆధ్వర్యంలో ఎస్సై చంద్రశేఖర్ కేసు నమోదు చేసి నిందితులైన ముళ్లపూడి శ్రీనుతోపాటు సవతి తల్లి రూపను అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు

ఉరేసుకుని వైద్య విద్యార్థిని మృతి

భీమవరం గ్రామీణ, వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఉరి వేసుకుని వైద్య విద్యార్థిని మృతి చెందిన ఘటన భీమవరంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన నిమ్మల హేమవర్షిణి (22) స్థానిక కొవ్వాడ డ్రైవర్స్ కాలనీలో నివాసం ఉంటూ.. భీమవరంలోని ఓ దంత వైద్య కళాశాలలో బీడీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్నారు. మంగళవారం కైకలూరు వైద్య శిబిరానికి వెళ్లి వచ్చి.. కొవ్వాడలోని తన ఇంటికి వెళ్లిపోయారు. అదేరోజు సాయంత్రం తల్లిదండ్రులు ఫోన్ చేస్తే.. తీయకపోవడంతో వారు కంగారు పడి.. యువతి స్నేహితులను అక్కడకు వెళ్లి చూడమని పంపారు. వారు స్థానికులతో కలిసి వెళ్లి చూడగా.. హేమవర్షిణి పంకాకు ఉరి వేసుకుని ఉన్నారు. దీనిపై యువతి తండ్రి సింహాచలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భీమవరం గ్రామీణ ఎస్సై ఐ.వీర్రాజు బుధవారం తెలిపారు.

ఫోన్లో మాట్లాడుతూ భవనంపై నుంచి పడి వ్యక్తి..

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భవనంపై ఫోన్ మాట్లాడుతూ.. ప్రమాదవశాత్తూ ఓ వ్యక్తి కిందపడి మృతి చెందిన ఘటన రాయలంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం. . బిహార్‌కు చెందిన రామప్రవేశసహాని (46) టైల్స్ మేస్త్రీగా పని చేస్తుంటారు. ఆయన కొంత కాలంగా రాయలంలో తోటి కార్మికులతో కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి వాళ్లు ఉండే భవనం పైకి వెళ్లి ఫోన్ మాట్లాడుతుండగా.. ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందారు. ఈ ఘటనపై అతని వద్ద పని చేసే గౌతమ్‌కుమార్ సహాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రహమాన్ బుధవారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ప్రైవేట్ ఉద్యోగి..

సదాశివపేట, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. సదాశివపేట సీఐ వెంకటేశం తెలిపిన వివరాలు.. భీమవరం పట్టణానికి చెందిన పరాంకుశం రామానుజయ(53) ఓ ప్రైవేట్ ఉద్యోగి. భార్య అనురాధతో కలిసి కారులో మంగళవారం మహారాష్ట్రకు వెళ్లారు. తిరిగి బుధవారం ఉదయం హైదరాబాద్‌కు వస్తుండగా.. వెంకటాపూర్ వద్ద ఓ వాహనాన్ని తప్పించబోయి మరో వాహనాన్ని వెనక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రామానుజయ అక్కడికక్కడే మృతి చెందగా.. అనురాధ తీవ్రంగా గాయపడింది. ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

దేవస్థానం ఉద్యోగి సస్పెన్షన్

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల దేవస్థానం కల్యాణ మండపానికి లైటింగ్ వేసేందుకు రుసుం కట్టించుకుని నెల రోజుల వరకు జమ చేయనందుకు దేవాలయ ఉద్యోగి అప్పన్నను ఈవో మూర్తి సస్పెండ్ చేశారు. గత నెల 11న మాధవకల్యాణ మండపం సముదాయంలోని వైజయంతి కల్యాణ మండపానికి లైటింగ్ వేసేందుకు రూ.5,990 అప్పన్న ఫోన్ పే చేయించుకున్నాడు. ఈ సొమ్మును ఈ నెల 11న దేవస్థానానికి జమ చేశాడు. విచారణ జరిపిన అధికారులు బుధవారం సస్పెండ్ చేశారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -109 రిటైల్ ధర 136 చికెన్ విత్ స్కిన్ - 197, చికెన్ స్కిన్‌లెస్ - 224. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ [illegible]

92.7 FM Rajamahendravaram

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ 5 - ఉ 7
ఈ-మార్నింగ్స్	ఉ 7 - ఉ 11
నువ్వా నేనా	ఉ 11 - మ 2
సత్యభామ	మ 2 - సా 5
లైట్ తీస్కో	సా 5 - రా 9
సరదాగా కాసేపు	రా 9 - రా 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా 12 - తె 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

రామకృష్ణ గ్రూప్ Hyd. శ్రీమంతుల ఇండ్లలో వంటలు/పేషెంట్ సేవకు, [illegible] 9705297788, 9515108830.

JOBS

[illegible]

గమనిక

[illegible]

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

భీమవరం

•భీమవరం •ఉండి

మేమున్నాం.. మీకు తోడుగా..

భీమవరం పట్టణం: 80085 74471	10 AM to 1 PM
భీమవరం మండలం: 80085 74533	వీరవాసరం: 80085 74475
పాలకోడేరు: 80085 74467	ఉండి: 80085 74526
ఆకివీడు: 80085 74525	కాళ్ల: 94401 04042

కాళ్ల, న్యూస్‌టుడే: ? కాళ్ల లంక రోడ్డులో చెత్త నిల్వ ఉంచడంతో దుర్వాసన వెదజల్లుతోంది. పేదలకాలనీకి వెళ్లేందుకు చాలా ఇబ్బంది పడాల్సి వస్తోంది. **- జి.శ్రీనివాస్**

✔ గ్రామంలో ఎక్కడా పూర్తిస్థాయిలో డంపింగ్ యార్డు లేకపోవడంతో సమస్య ఉన్నమాట వాస్తవమే. ఆ ప్రాంతాన్ని పరిశీలించి చెత్త తొలగించే ఏర్పాటు చేయిస్తాం. **- సునీల్‌రాజు, కార్యదర్శి**

పాలకోడేరు, న్యూస్‌టుడే: ? గొల్లలకోడేరు పంట కాలువ సమీపంలో గట్టు వెంబడి చెత్త, వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయాయి.

- ముత్యాలరావు, గొల్లలకోడేరు

✔ చెత్త, వ్యర్థాలను తొలగిస్తాం.

- బి.గోపి, ఇన్‌ఛార్జి కార్యదర్శి

స్తంభం సరిచేశారు

స్పందనకు వందనం

ఉండి, న్యూస్‌టుడే: పాములపర్రు నుంచి పెదకాపవరం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారికి చేర్చి ఉన్న ఒరిగిపోతున్న విద్యుత్తు స్తంభాన్ని ఎట్టకేలకు అధికారులు సరిచేయించారు. ఈనెల 11న 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన ప్రచురితమైన సమస్యకు విద్యుత్తు ఏఈ పి.శ్రీనివాసరావు స్పందించి కూలీల సహాయంతో పనులు చేయించారు.

చెత్త ప్రక్షాళన పనులు

ఈనాడు కథనానికి స్పందన

ఉండి, న్యూస్‌టుడే: ఎన్నార్పిఅగ్రహారం- మహదేవపట్నం గ్రామాల మధ్య కాలువ గట్టు మార్గంలో పేరుకుపోయిన చెత్త ప్రక్షాళనకు ఎట్టకేలకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈనెల ఎనిమిదో తేదీన 'ఈనాడు'లో 'కాలువ గట్టు మార్గం ఎప్పటికీ బాగు?' శీర్షికన ప్రచురితమైన వార్తకు పంచాయతీరాజ్ శాఖాధికారులు స్పందించారు. రహదారి వెంబడి పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి భారీ గుంతలకు మరమ్మతులు చేయించారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పాలకోడేరు, న్యూస్‌టుడే: గొల్లలకోడేరు శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి బాలరాజు తెలిపారు. వారం రోజుల పాటు విద్యార్థులకు ప్రతిభా పోటీలు, పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఆక్రమించేసి.. రైతును ముంచేసి

డ్రెయిన్లపై ఇబ్బడిముబ్బడిగా నిర్మాణాలు

ఉండి, కాళ్ల, భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: కొన్నేళ్ల నుంచి ఆక్రమణల చెరలో చిక్కిన భీమవరం, ఉండి నియోజకవర్గాల్లోని వివిధ డ్రెయిన్లు పల్లపు ప్రాంతాల్లో వరి పంటకు తీవ్ర నష్టాన్ని సృష్టిస్తున్నాయి. ఇటీవల అధిక వర్షాలకు రెండు చోట్లా సుమారు 6,500 ఎకరాల్లో పంట నష్టపోయిందని గుర్తించారు. ప్రభుత్వ పరిహారానికి అయిదువేల మంది రైతులు ఎంపికయ్యారు. ఏటా పంట నష్టపోతుండటానికి అసలు కారణం డ్రెయిన్లపై ఇబ్బడిముబ్బడిగా ఆక్రమణలు పెరిగిపోవడమేనని స్పష్టమవుతోంది.

బొండాడ డ్రెయిన్ గట్టుకు చేర్చి వేసిన షెడ్డు

నిబంధనలకు నీళ్లు

నిబంధనల ప్రకారం ఆక్వా చెరువులు ఉన్న చోట్ల డ్రెయిన్ గట్టుకు మూడు మీటర్ల స్థలాన్ని వదిలిన తరువాతే ప్రత్యేకంగా గట్టు వేసుకోవాలి. ఇది అమలైన దాఖలాలు లేవు. ఫలితంగా పల్లపు చేలల్లో అధిక నీరు నిలిచి పంటను దెబ్బతీస్తున్నాయి.

ఉండిలో ఉపశమనం

ఉండిలో ఆక్రమణ తొలగింపుపై ఏడాది నుంచి ఉపసభాపతి రఘురామకృష్ణరాజు అమలు చేస్తున్న కార్యాచరణ వరి పంటకు జీవం పోసింది. ప్రధానంగా రుద్రాయకోడు, యండగండి డ్రెయిన్లపై రూ.45 లక్షల వ్యయంతో ఆక్రమణల తొలగింపు, మట్టి పూడికతీత పనులతో మురుగునీటి పారుదల వ్యవస్థ మెరుగుపడింది. కాలువలు, డ్రెయిన్లపై నూరుశాతం ఆక్రమణలు తొలగిస్తామని ఉపసభాపతి స్పష్టం చేస్తున్నారు.

అక్కడ దృష్టి సారించినవారే లేరు

ఉండి నియోజకవర్గంతో పోల్చి చూస్తే భీమవరంలో వివిధ డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపుపై దృష్టి సారించినవారే లేరు. యనమదుర్రు డ్రెయిన్‌పై భీమవరం పట్టణంలో పెరుగుతున్న ఆక్రమణలతో మురుగునీటి పారుదలకు తీవ్ర అవరోధాలు ఎదురవుతున్నాయి. గునుపూడి సౌత్, పాత కాలువ, ఉప్పుకోడు, బొండాడ, కాకినాడ, నీలకోడులపై ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. అన్ని డ్రెయిన్లపై కలిపి సుమారు 70 కిలోమీటర్ల పరిధిలో కనీసం కాలిబాట మార్గాలు కూడా కనుమరుగైపోయాయి. వీటి ప్రక్షాళన పనులు యుద్ధ ప్రాతిపదికన జరిగితే వ్యవసాయానికి మనుగడ ఉంటుంది. ఈ విషయమై డ్రెయినేజీ శాఖ ఏఈ జయప్రకాశ్ మాట్లాడుతూ. . డ్రెయిన్ల ఆక్రమణల తొలగింపు పనులు వివిధ చోట్ల జరిగాయన్నారు. ఉప్పుటేరులో డ్రెడ్జింగ్, చినకాపవరంతో పాటు వివిధ డ్రెయిన్లలో మట్టి పూడికతీత పనులు చేపట్టాల్సి ఉందన్నారు.

చెరకు గెడలతో నైవేద్యాలు

ఉండి, న్యూస్‌టుడే: ఉండి రాజులపేటలోని పార్వతీ సమేత చెన్నమల్లేశ్వరస్వామికి బుధవారం చెరకు గెడలతో ప్రత్యేకంగా నైవేద్యాలు సమర్పించారు. ఆలయ అర్చకుడు సన్నిధిరాజు శేషగిరిరావు ఆధ్వర్యంలో స్వామికి తొలుత చెరకు రసంతో అభిషేకాలు చేయించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

హరిహర పుత్ర.. అయ్యప్ప

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: మెంటేవారితోటలో గ్రంధి శ్యామ్‌శివరాజ్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ బుధవారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు పాల్గొని స్వామిని దర్శించుకుని మాట్లాడారు. యువత భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి మాలధారణ స్వీకరించి పడి పూజ, భజన కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. అయ్యప్ప పడి పూజ భారీ మండపం, విద్యుత్తు అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.



ప్రారంభ పూజలో ఎమ్మెల్యే రామాంజనేయులు

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

ట్రాక్టర్‌లో ఎగుమతి చేస్తున్న కలప

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు మండలంలోని పెదకాపవరం నుంచి చినకాపవరం వరకు సుమారు 2 కిలోమీటర్ల పొడవున చినకాపవరం ఛానల్ గట్టు వెంబడి ఉన్న చెట్లను నరికి రవాణా చేస్తున్నారు. సుమారు 100 చెట్ల వరకు ఇష్టానుసారంగా తరలించుకుపోతున్నారు. గత మూడు రోజులుగా సాగుతోంది. బుధవారం మిగిలిన చెట్లు కోసి తరలించారని రైతులు, స్థానికులు వాపోతున్నారు. అడిగితే కొంత సేపు అధికారులు చెప్పారని, నీటి సంఘం ప్రతినిధులు తొలగించమన్నారని పొంతనలేని సమాధానం చెబుతున్నారన్నారు. దీంతో పాటు కొన్నేళ్ల కిందట అటవీశాఖ అధికారులు నాటిన వాటిని.. అక్రమంగా నరకడంతో పాటు.. వాటి కొమ్మలను పారవేయడంతో ఛానల్ పూడిపోతుందని, వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జలవనరుల శాఖ డీఈ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ.. చెట్లు కోసి తరలిస్తున్న విషయం తన దృష్టికి రాలేదన్నారు. కాలువ గట్లు వెంబడి ఉన్న చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

తెదేపా నూతన కమిటీల ప్రమాణస్వీకారం రేపు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: అధిష్ఠానం ఆదేశాల మేరకు భీమవరం నియోజకవర్గంలోని రెండు గ్రామీణ మండలాలు, పట్టణ తెదేపా కమిటీల కార్యవర్గ సభ్యులు, బూత్, యూనిట్, క్లస్టర్ కన్వీనర్లు, కో కన్వీనర్ల నియామకాలను పూర్తి చేసినట్లు తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి, పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 14న పట్టణంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పట్టణ, మండల కమిటీ సభ్యుల వివరాలను వెల్లడించారు.

మాట్లాడుతున్న సీతారామలక్ష్మి

సత్కారం.. ఆకివీడు, న్యూస్‌టుడే: నూతనంగా నియమితులైన ఆకివీడు తెదేపా మండలాధ్యక్షుడు కోపల్లే సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు గంధం ఉమా, మండల ప్రధాన కార్యదర్శి నౌకట్ల రామారావును బుధవారం స్థానిక తెదేపా కార్యాలయంలో కూటమి నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ బొల్లా వెంకట్రావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు, మోటుపల్లి రామవరప్రసాద్, పిల్లా నరసింహారావు, అల్లాడి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పని చేసే శ్రేణులకే పార్టీ పగ్గాలు

ఉండి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసే శ్రేణులకే పార్టీ పగ్గాలు అప్పగించిందని ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. తెదేపా ఉండి మండల నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా నియమితులైన కరిమెరక నాగరాజు, కళ్లేపల్లి సతీష్‌రాజులను ఆయన అభినందించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలన్నారు.

(c) eenadu

సోమేశ్వరుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి

అమ్మవారి పూజలు చేస్తున్న జస్టిస్ మల్లికార్జునరావు దంపతులు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా పంచారామక్షేత్రం గునుపూడి సోమేశ్వరజనార్దనస్వామి ఆలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు దంపతులు బుధవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన వారికి ఆలయాధికారులు స్వాగతం పలికారు. స్వామిని, అమ్మవార్లను దర్శించి పూజలు నిర్వహించారు. ప్రధానార్చకులు స్వామి ఆశీర్వాదం, డివిజన్ దేవాదాయశాఖ తనిఖీదారుడు డి.వెంకటేశ్వరరావు శేషవస్త్రం, స్వామివారి చిత్రపటం అందించారు.

అవగాహనతోనే న్యుమోనియా నిర్మూలన: డీఎంహెచ్‌వో

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: సురక్షితమైన వాతావరణం, శుభ్రతతోనే న్యుమోనియాను దూరం చేయవచ్చని డీఎంహెచ్‌వో జి.గీతాబాయి అన్నారు. ప్రపంచ న్యుమోనియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం భీమవరం డీఎంహెచ్‌వో ఆసుపత్రిలో 'సోషల్ అవేర్‌నెస్ అండ్ యాక్షన్ టు న్యూట్రలైజ్ న్యుమోనియా' (సాన్స్) కార్యక్రమంలో భాగంగా రూపొందించిన గోడ పత్రికను ఆమె ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. నవంబర్ 12 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఆశా, ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే చేసి 0-5 సంవత్సరాల పిల్లల్లో న్యుమోనియా లక్షణాలు గుర్తిస్తారన్నారు. న్యుమోనియాపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకునేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సిబ్బందికి సూచించారు.

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అండగా ప్రభుత్వం

చిన్నారులతో కలెక్టర్ నాగరాణి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం పట్టణంలోని గాలి రామయ్య పురపాలక పాఠశాలలోని భవిత విలీన విద్య వనరుల కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అవసరాల పిల్లల వైద్య నిర్ధారణ శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. భవిత కేంద్రంలో అందజేసే సేవలపై ఆరా తీశారు. వైద్య శిబిరాలను ఈనెల 17 వరకు అన్ని నియోజకవర్గాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం శిబిరానికి వచ్చిన చిన్నారులతో ముచ్చటించారు.

అప్సడ రిజిస్ట్రేషన్లు త్వరగా పూర్తి చేయాలి.. భీమవరం కలెక్టరేట్, వన్‌టౌన్, న్యూస్‌టుడే: అప్సడ రిజిస్ట్రేషన్లు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి అప్సడ రిజిస్ట్రేషన్ల పురోగతిపై మత్స్య, రెవెన్యూ శాఖాధికారులతో జూమ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మొత్తం 1.33 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతుందని.. 14 వేల ఎకరాలు కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ పరిధిలో ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు 60 వేల ఎకరాలు ఆక్వా అప్సడ రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని, మిగిలినవి త్వరగా అప్సడ, కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీలో రిజిస్ట్రేషన్లు చేయించాలని ఆదేశించారు.

తాడేపల్లిగూడెం పురపాలక సంఘ కార్యాలయము

ఆర్.ఓ.సి.4103/2025/G1 ది. 11-11-2025

పత్రికా ప్రకటన

తాడేపల్లిగూడెం పురపాలక సంఘం పరిధిలో PMAY (U) - NTR నగర్, కొండ్రుప్రోలు ఎ.పి. టిడ్కో గృహ పథకములో భాగంగా 5376 ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు కేటాయించడం జరిగినది. వివిధ కారణాల వలన ఏర్పడినటువంటి ఈ దిగువ తెలిపిన టిడ్కో ఇళ్ళను తిరిగి భర్తీ చేయుటకు గాను తాడేపల్లిగూడెం పురపాలక సంఘ కార్యాలయము, పట్టణ ప్రణాళిక విభాగము వారిని సంప్రదించి సంబంధిత ధృవపత్రములతో తేది. 20-11-2025 లోపు దరఖాస్తులు దాఖలు చేసిన యెడల ప్రభుత్వ ఉత్తర్వులకు లోబడి సదరు దరఖాస్తులను పరిశీలించి అర్హత కలిగిన లబ్ధిదారులకు సదరు టిడ్కో ఇల్లు కేటాయించు విషయమై చర్యలు తీసుకొనబడునని తెలియజేయడమైనది.

క్రమ సంఖ్య	కేటగిరి	గృహ విస్తీర్ణం	ఖాళీల సంఖ్య	లబ్ధిదారుని వాటా క్రింద చెల్లించవలసిన సొమ్ము	బ్యాంకు ఋణము (రూపాయలలో)	మొత్తం చెల్లించవలసిన సొమ్ము (రూపాయలలో)
1	బి	365 చ.అ.	26	25,000/-	3,15,000/-	3,40,000/-
2	సి	430 చ.అ.	49	50,000/-	3,65,000/-	4,15,000/-

పై తెలిపిన వివరాల ప్రకారం సొమ్ము చెల్లించి టిడ్కో ఇల్లు పొందవలెను. కావున ఆసక్తిగల లబ్ధిదారులు మునిసిపల్ కార్యాలయమునందు పట్టణ ప్రణాళిక విభాగము నందు ఆఫీసు పనివేళలలో సంప్రదించవలసినదిగా కోరడమైనది.

సం/- **కమిషనర్**, తాడేపల్లిగూడెం పురపాలక సంఘం

ప్రకటన

నా క్లయింట్, అంజని విష్ణు అల్లైడ్ సర్వీసెస్ తరపున మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఎమ్.యస్.రాజు గారి కుమారుడు శ్రీ ఎ.వి.కె.వి. రాజు గారు నాకు ఇచ్చిన సంజయపీపై తెలియజేయునది ఏమనగా,

పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మండలం, భీమవరం పట్టణ కాపురస్తులు అయిన 1) తటవర్తి ప్రణమానంద మోహనరావు గుప్త గారి కుమారులు 1) నారాయణ మూర్తి, 2) కృష్ణ కిషోర్, 3) శ్రీనివాస్ మరియు 4) సునీల్ కుమార్ గార్లు ది:19-06-2020 వ తేదిన రిజిష్టరు కుటుంబ తగాయిదా పరిష్కార దస్తావేజు రీత్యా వారి తండ్రి గారి అనంతరం పైన ఉదాహరించిన ఆస్తులు వారికి సంక్రమింపపడిన భీమవరం మండలం, యనమదుర్రు గ్రామంలో గల షెడ్యూలు ఆస్తిలో కొంత ఆస్తిని అనగా రి.స.నెం: 7/1 లో గల 1) య.0-28 సెంట్లు, 2) య.0-52 సెంట్లు, 3) య.0-87 1/2 సెంట్లు మరియు 4) య.0-46 సెంట్లు వెరశి మొత్తం య.2-13 1/2 సెంట్ల భూమిని వారి సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములో ఉన్న ఆస్తి అని, వారికి తప్ప ఇతరులకు ఎవ్వరికి ఏ విధమైన హక్కులు లేవని మరియు సదరు ఆస్తిలపై ఏ విధమైన తగాయిదాలు లేని నిప్పిచి ఆస్తి అని నా క్లయింట్ పేరున రిజిష్టరు దస్తావేజు వ్రాయించి ఇచ్చెదనని నమ్మించి సదరు ఆస్తిని అమ్మజూపగా నా క్లయింట్ సదరు ఆస్తిని కొనుగోలు చేయదానికి అమ్మక ఒప్పందం కుదుర్చుకుని ది:10-09-2025 తేదిన నా క్లయింట్ వద్ద నుండి అడ్వాన్సుగా కొంత సొమ్మును తీసుకుని క్రియ అగ్రిమెంటు వ్రాయించి ఇచ్చియున్నారు. ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా క్రింద ఉదాహరించిన ఆస్తిపై ఎవ్వరికైనను ఏవైనా అభ్యంతరాలు ఉన్న యెడల ఈ ప్రకటన తేదీనుండి 15 రోజులలోగా క్రింద చిరునామా దారునకు వ్రాతపూర్వకంగా తెలియజేయవలెను. సదరు 15 రోజుల తరువాత వచ్చిన అభ్యంతరములు పరిగణలోనికి తీసుకొనబడవు అని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

1) తటవర్తి నారాయణ మూర్తి గారు అమ్మజూపిన ఆస్తి వివరం : పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మండలం, యనమదుర్రు గ్రామ పంచాయితి ఏరియాలోని, యనమదుర్రు గ్రామం

ఎ) రి.స.నెం: 7/1 రు య.2-15 టలో పడమర వైపు య.0-13 ట భూమికి హద్దులు : తూర్పు : తటవర్తి కృష్ణ కిషోర్ గారి వాటా, **దక్షిణం:** క్రింద ప్రతి బండి దారి, **పడమర** : బి.వి రాజు గారి వగైరాల భూమి, **ఉత్తరం:** బి.వి.రాజు ఫౌండేషన్ వారి భూమి.

యీ హద్దుల మధ్య 0-13 ట్ల భూమి అందులో గల భూమి మరియు సర్వ హక్కులతో సహా.

బి) రి.స.నెం: 7/1 రు య.2-15 ట్లలో దక్షిణం వైపు య.0-60 ట ఉమ్మడి బండి దారి భూమికి హద్దులు : తూర్పు : తటవర్తి నారాయణ మూర్తి గారి రి.స.నెం:6లో ఉమ్మడి బండి దారి, **దక్షిణం** : బి.వి. రాజు గారి భూమి, **పడమర** : బి.వి రాజు గారి భూమి, **ఉత్తరం:** తటవర్తి నారాయణ మూర్తి మరియు వగైరాలు తాలూకు ప్రతి భూమి.

యీ హద్దుల మధ్య య. య.0-60 ట్లలో 1/4 వ వంతు అనిర్దిష్టం జాయింట్ హక్కు .0-15 భూమి.

వెరశి రెండు ప్రతుల తాలూకు య.0-28 సెంట్ల భూమి.

2) తటవర్తి కృష్ణ కిశోర్ గారు అమ్మజూపిన ఆస్తి వివరం : పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మండలం, యనమదుర్రు గ్రామ పంచాయితి ఏరియాలోని, యనమదుర్రు గ్రామం

ఎ) రి.స.నెం: 7/1 రు య.2-15 ట్లలో మధ్య య.0-37ట్ల భూమికి హద్దులు: తూర్పు : తటవర్తి శ్రీనివాస్ గారి వాటాకు రాబడిన భూమి, **దక్షిణం** క్రింద ప్రతి బండి దారి, **పడమర** : తటవర్తి నారాయణ మూర్తి వాటాకు రాబడిన భూమి, **ఉత్తరం:** బి.వి.రాజు గారి వగైరాల భూమి,

యీ హద్దుల మధ్య య.0-37ట్ల భూమి అందులో గల భూమి మరియు సర్వ హక్కులతో సహా.

బి) రి.స.నెం: 7/1 రుయ.2-15 ట్లలో దక్షిణం వైపు య.0-60 ట ఉమ్మడి బండి దారి భూమికి హద్దులు: తూర్పు : తటవర్తి నారాయణ మూర్తి గారి రి.స.నెం: 6లో ఉమ్మడి బండి దారి, **దక్షిణం:** బి.వి.రాజు గారి భూమి, **పడమర:** బి.వి రాజు గారి వగైరాల భూమి, **ఉత్తరం:** తటవర్తి నారాయణ మూర్తి మరియు వగైరాలు తాలూకు ప్రతి భూమి.

యీ హద్దుల మధ్య య. య.0-60ట్లలో 1/4 వ వంతు అనిర్దిష్టం జాయింట్ హక్కు య.0- 15 ట్ల భూమి.

వెరశి రెండు ప్రతుల తాలూకు య.0-52 సెంట్ల భూమి.

3) తటవర్తి శ్రీనివాస్ గారు అమ్మజూపిన ఆస్తి వివరం : పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మండలం, యనమదుర్రు గ్రామ పంచాయితి ఏరియాలోని, యనమదుర్రు గ్రామం

ఎ) రి.స.నెం: 7/1 రు య.2-15 ట్లలో మధ్య య.0-72 1/2 ట భూమికి హద్దులు : తూర్పు : తటవర్తి సునీల్ కుమార్ గారి వాటాకు రాబడిన భూమి, **దక్షిణం:** క్రింద ప్రతి బండి దారి, **పడమర :** తటవర్తి కృష్ణ కిశోర్ గారి వాటాకు రాబడిన భూమి, **ఉత్తరం:** బి.వి.రాజు ఫౌండేషన్ వారి భూమి.

యీ హద్దుల మధ్య య.0-721/2 ట్ల భూమి అందులో గల భూమి మరియు సర్వ హక్కులతో సహా.

బి) రి.స.నెం: 7/1 రు య.2-15 ట్లలో దక్షిణం వైపు య.0-60 ట ఉమ్మడి బండి దారి భూమికి హద్దులు: తూర్పు : తటవర్తి నారాయణమూర్తి గారి రి.స.నెం:6లో ఉమ్మడి బండిదారి, **దక్షిణం:** బి.వి.రాజు గారి వగైరాల భూమి, **పడమర:** బి.వి రాజు గారి వగైరాల భూమి, **ఉత్తరం:** తటవర్తి నారాయణ మూర్తి మరియు వగైరాలు తాలూకు ప్రతి భూమి.

యీ హద్దుల మధ్య య. య.0-60 ట్లలో 1/4 వ వంతు అనిర్దిష్టం జాయింట్ హక్కు య.0- 15 ట్ల భూమి.

వెరశి రెండు ప్రతుల తాలూకు య.0-87 1/2 సెంట్ల భూమి.

4) తటవర్తి సునీల్ కుమార్ గారు అమ్మజూపిన ఆస్తి వివరం: పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మండలం, యనమదుర్రు గ్రామ పంచాయితి ఏరియాలోని, యనమదుర్రు గ్రామం

ఎ) రి.స.నెం:7/1 రు య.2-15 ట్లలో తూర్పు య.0-31 ట భూమికి హద్దులు: తూర్పు : తటవర్తి నారాయణ మూర్తి గారి రి.స.నెం:6లో భూమి కొంత మరియు పంట బోదె కొంత, **దక్షిణం:** క్రింద ప్రతి బండి దారి, **పడమర** : తటవర్తి శ్రీనివాస్ గారి వాటాకు రాబడిన భూమి, **ఉత్తరం:** బి.వి.రాజు ఫౌండేషన్ వారి భూమి.

యీ హద్దుల మధ్య య.0-31ట్ల భూమి అందులో గల భూమి మరియు సర్వ హక్కులతో సహా.

బి) రి.స.నెం: 7/1 రు య.2-15 ట్లలో దక్షిణం వైపు య.0-60 ట ఉమ్మడి బండి దారి భూమికి హద్దులు: తూర్పు : తటవర్తి నారాయణ మూర్తి గారి రి.స.నెం:6లో ఉమ్మడి బండి దారి, **దక్షిణం:** బి.వి. రాజు గారి వగైరాల భూమి, **పడమర:** బి.వి రాజు గారి వగైరాల భూమి, **ఉత్తరం:** తటవర్తి నారాయణ మూర్తి మరియు వగైరాలు తాలూకు ప్రతి భూమి.

యీ హద్దుల మధ్య య.0-60 ట్లలో 1/4 వ వంతు అనిర్దిష్టం జాయింట్ హక్కు య.0-15 ట్ల భూమి.

వెరశి రెండు ప్రతుల తాలూకు య.0-46 సెంట్ల భూమి.

సం/-

అల్లూరి వెంకటేశ్వర రాజు, అడ్వకేట్

ఫ్లాటు నెం.యస్-1, సుభద్ర రెసిడెన్సీ, శ్రీరామపురం, భీమవరం-2, పశ్చిమ గోదావరి జిల్లా, సెల్ : 98482 11102

పాపం చేసిన మూడేళ్లకు అదే రోజు కటకటాలకు..

- **కూతురుని హతమార్చిన కన్న తండ్రి, సవతి తల్లి అరెస్టు**
- **వీడిన యువతి సజీవ దహనం మిస్టరీ**

తణుకు, న్యూస్‌టుడే: తల్లిని పోగొట్టుకున్న కూతురిని ఎంతో ప్రేమగా చూసుకోవాల్సిన తండ్రి నరహంతకుడిగా మారాడు. ఆమె సవతి తల్లితో కలిసి ఘోరానికి తెగబడ్డ వైనం మూడేళ్ల తర్వాత బహిర్గతమైంది. తణుకు మండలం ముద్దాపురంలో ఆస్తి కోసం 19 ఏళ్ల యువతిని కన్నతండ్రి, సవతి తల్లి కర్కశంగా హతమార్చిన ఘటన జిల్లా వ్యాప్తంగా సంచలనంగా మారింది. మిస్టరీగా మిగిలిపోతుందనుకున్న ఈ కేసులో.. సంఘటన జరిగిన మూడేళ్ల తర్వాత అదే రోజైన నవంబరు 12నే.. నిందితులు రిమాండ్‌కు వెళ్లడం గమనార్హం. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. తణుకు మండలం ముద్దాపురం గ్రామానికి చెందిన ముళ్లపూడి నాగహారిక(19) 2022 నవంబరు 12న ఉదయం తన గదిలో మంచంపై సజీవదహనమై ఉంది. చరవాణి ఛార్జర్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి మృతి చెందినట్లుగా తల్లిదండ్రులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

ఆస్తి కోసమే... ముద్దాపురానికి చెందిన ముళ్లపూడి శ్రీను అలియాస్ శ్రీరాములు మొదటి భార్య వసంత కుమార్తె నాగ హారిక. 2009లో ఈమె తల్లి వసంత అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. అనంతరం 2009లో ముద్దాపురానికి చెందిన ముళ్లపూడి రూపను శ్రీను వివాహం చేసుకున్నారు. వీరికి కుమార్తె జన్మించింది. మొదటి భార్య కుమార్తె నాగ హారిక పేరున ఎకరం పొలం ఉంది. తల్లి వసంత మృతి చెందిన తర్వాత హారికకు సంక్రమించే ఆస్తిపై కన్నేసిన రూప ఆమెను హత్య చేయాలని పథకం పన్నారు. ఇందుకోసం భర్త శ్రీనివాస్ సహకరించారు. 2022 నవంబరు 11న రాత్రి నాగ హారికకు మత్తు మందు కలిపిన నూడిల్స్ ఇచ్చి నిద్రించిన తర్వాత తలపై కొట్టి హత్య చేసి అనంతరం మంచంపైనే పెట్రోలు పోసి నిప్పు పెట్టారు. తెల్లారేసరికి ఏమీ తెలియనట్లు పోలీసులకు సమాచారం అందించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే మృతి చెందినట్లు నిర్ధారించిన పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఇది హత్యే అంటూ మేనమామ, అమ్మమ్మలు ఆరోపించినప్పటికి... పోలీసులు వీఆర్వో వద్ద ఫిర్యాదు తీసుకుని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

ఆలస్యంగా నివేదిక.. సాధారణంగా మూడు నెలల్లోనే రావాల్సిన ఫోరెన్సిక్ నివేదిక ఈ కేసులో మూడేళ్ల తర్వాత అందడంపై పలు అనుమానాలున్నాయి. అనుమానాస్పద మృతిగా నమోదు చేసిన పోలీసులు నివేదిక రావడంతో ఈ కేసులో సెక్షన్లను మార్పు చేసి హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుత సీఐ కృష్ణకుమార్, ఆధ్వర్యంలో ఎస్సై చంద్రశేఖర్ కేసు నమోదు చేసి నిందితులైన ముళ్లపూడి శ్రీనుతోపాటు సవతి తల్లి రూపను అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు

ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణపై అవగాహన

వీరవాసరం, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026లో భాగంగా రాష్ట్ర ఎన్నికల అధికారి బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు వీరవాసరం తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, బీఎల్‌వోలు హాజరయ్యారు. ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ, చేర్పులు, మార్పులు, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలపై సమావేశంలో సిబ్బందికి సూచనలు చేసినట్లు తహసీల్దార్ రామాంజనేయులు తెలిపారు.

పంట, మురుగు కాలువల ప్రక్షాళనకు నిధులివ్వండి

ఉండి, న్యూస్‌టుడే: పంట, మురుగు కాలువల ప్రక్షాళనకు ప్రభుత్వం కనీసం రూ.300 కోట్ల నిధులిచ్చి డెల్టాలో రైతులను ఆదుకోవాలని యండగండి వినియోగదారుల సంఘం ప్రధాన కార్యదర్శి పీవీఎస్ గోపాలకృష్ణంరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి వినతిపత్రం పంపినట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడేళ్ల నుంచి కాలువల ప్రక్షాళన, లాకులు, వియర్లు, స్లూయిజ్‌ల మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో జిల్లాలో పంట నష్టపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. యనమదుర్రు డ్రెయిన్ కిక్కిస, చెత్తతో పూడిపోయిందని ఆవేదన చెందారు. వచ్చే వేసవిలో వీటి ప్రక్షాళనకు అవసరమైన నిధులు కేటాయించాలని గోపాలకృష్ణంరాజు ప్రభుత్వాన్ని కోరారు.

సెమీస్‌కు చేరిన టెన్నిస్ టోర్నీ

పాలకొల్లు, పట్టణం, న్యూస్‌టుడే: పాలకొల్లు కాస్మో స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు సెమీస్ దశకు చేరాయి. బుధవారం క్వార్టర్ ఫైనల్స్‌లో విజయం సాధించిన వారు గురువారం సెమీఫైనల్స్‌లో తలపడతారని క్లబ్ కార్యనిర్వాహక కార్యదర్శి గొట్టుముక్కల బాలరాజు తెలిపారు. 45, 55, 65, 70 విభాగాల్లో ఫైనల్స్ ఈ నెల 14న జరుగుతాయని, అదే రోజు విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

కొనసాగిన క్రీడా పోటీలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం డీఎన్ఆర్ కళాశాల మైదానంలో అఖిల భారత సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలు బుధవారం కొనసాగాయి. క్రికెట్, యోగా విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎన్.మోహన్‌దాస్ తెలిపారు.

16న హిందూ వన విహార్ కార్తిక వన సమారాధన

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: కార్తికమాసం సందర్భంగా హిందూ వన విహార్ ఆధ్వర్యంలో ఈనెల 16న ఆదివారం ప్రకృతి ఆశ్రమంలో డాక్టర్ వేగిరాజు రామకృష్ణంరాజుతోటలో కార్తిక వన సమారాధన నిర్వహిస్తున్నట్లు కన్వీనర్, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి మంతెన రామచంద్రరాజు బుధవారం తెలిపారు. ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు.

సొంత ఇంటి కల సాకారానికి కృషి

ఆకివీడు, న్యూస్‌టుడే: అర్హులైన ప్రతి ఒక్కరి సొంత ఇంటి కల సాకారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఆకివీడు మండలం కుప్పనపూడిలోని తాళ్లకోడు ప్రాంతంలోని 74 ఎకరాల లేఅవుట్‌లో నిర్వహించిన సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమంలో బుధవారం ఆమె పాల్గొని మాట్లాడారు. జిల్లాలో పీఎంఏవై 1.0 కింద ఇప్పటి వరకు 6,600 మంది ఇళ్లు నిర్మించుకుని గృహ ప్రవేశాలు చేసినట్లు తెలిపారు. బుధవారం మరో 100 ఇంట్లో దిగారని, పీఎంఏవై 2.0 ద్వారా 595 గృహాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. తాళ్లపూడి లేఅవుట్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలతో మూడు నెలల్లోనే కంకణాల కృష్ణవేణి అనే వృద్ధురాలికి ఇంటిని నిర్మించి గృహప్రవేశం చేయించడం సంతోషంగా ఉందన్నారు. ఏఎంసీ ఛైర్మన్ బొల్లా వెంకట్రావు, సర్పంచి ముత్యాల అనురాధ, ఎంపీపీ కతారి జయలక్ష్మి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు పాల్గొన్నారు.

మహాసభల విజయవంతానికి పిలుపు

కరపత్రాలు ప్రదర్శిస్తున్న నాయకులు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకూ జరిగే సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు పిలుపునిచ్చారు. సీఐటీయూ భీమవరం పట్టణ కమిటీ విస్తృత స్థాయి సమావేశాన్ని కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన స్థానిక కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. విశాఖపట్నంలో జరగనున్న మహాసభలకు ఉద్యోగ, కార్మిక సంఘాలు తరలి రావాలన్నారు.

ముగిసిన నన్నయ వర్సిటీ అథ్లెటిక్స్ పోటీలు

ఓవరాల్ ఛాంపియన్‌షిప్ డీఎన్ఆర్ కళాశాల కైవసం

శ్యామలాసెంటర్ (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ఆదికవి నన్నయ యూనివర్సిటీ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు బుధవారంతో ముగిశాయి. మెన్ ఛాంపియన్‌షిప్‌ను డీఎన్ఆర్ (భీమవరం), ఉమన్ ఛాంపియన్‌షిప్‌ను సెయింట్ థెరిస్సా కళాశాల (ఏలూరు), ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను డీఎన్ఆర్ కళాశాల కైవసం చేసుకున్నాయి. ఈ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన చేసిన 14 మందిని బెంగళూరులోని రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాలలో జరిగే ఆలిండియా అథ్లెటిక్స్ పోటీలకు పంపించనున్నట్లు వ్యవస్థాపక కార్యదర్శి విజయ దుర్గ తెలిపారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్రరావు బహుమతులు అందజేశారు.

నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పట్టణంలో ఫెమినా లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మంగళవారం రాత్రి జరిగింది. ఉండి రోడ్డులోని పద్మావతీ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో నూతన అధ్యక్షురాలిగా భూపతిరాజు ఐశ్వర్య, ఉపాధ్యక్షులుగా బొండా లక్ష్మీరమణ, వీఎస్ఎస్ లక్ష్మీదేవి, కార్యదర్శిగా చేకూరి ప్రీతి, కోశాధికారిగా కనగర్ల నాగమణి, సమన్వయకర్తగా వేగేశ్న సునంద, అడ్మినిస్ట్రేటర్‌గా ఇందుకూరి శిరీష, మార్కెటింగ్, సర్వీస్, మెంబర్ షిప్ ఛైర్‌పర్సన్‌లుగా పి.లక్ష్మీమౌనిక, వి.ప్రవల్లికదేవి, కె.ప్రియాంక, పలువురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

చేతిలో దీపం.. మదిలో మావుళ్లమ్మ రూపం

భీమవరం మావుళ్లమ్మ మాలధారులు బుధవారం రాత్రి పట్టణంలో జ్యోతుల ప్రదర్శన నిర్వహించారు. అమ్మవారి పూరిగుడి మీదుగా పంచారామక్షేత్రం సోమేశ్వరజనార్దన స్వామి తదితర ఆలయాలను దర్శించుకుంటూ ప్రధాన రహదారి మీదుగా ఆలయానికి చేరుకున్నారు. దీక్షలు స్వీకరించిన సుమారు 500 మందితో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, భీమవరం ఆధ్యాత్మికం

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌కు దరఖాస్తులు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌నకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విజయవాడ జోనల్ శిక్షణ కళాశాల ప్రధానాచార్యురాలు వి.నీలిమ ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ నెల 15 నుంచి 30వ తేదీలోగా www.apprenticeshipindia.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు.

వ్యకాసం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా జార్జి, సత్యనారాయణ

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ ఎన్నికైనట్లు వారు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల అత్తిలిలో జరిగిన వ్యకాసం 32వ జిల్లా మహాసభల్లో అధ్యక్ష, కార్యదర్శులతో పాటు మరో 25 మంది సభ్యులను ఎన్నుకున్నామన్నారు. జిల్లా మహాసభలో పలు అంశాలపై తీర్మానాలు చేసినట్లు వెల్లడించారు.

నేడు జిల్లాలో మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ పర్యటన

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ గురువారం జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా పౌర సమాచార అధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడేపల్లి నుంచి రోడ్డు మార్గంలో పెనుగొండ చేరుకుని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటారని పేర్కొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థికి ఆర్థిక సాయం

ఉండి, న్యూస్‌టుడే: పేద విద్యార్థులకు ఆర్థిక సహకారాన్ని అందించేందుకు తమ సంస్థ ముందుంటోందని ఉండి లయన్స్ క్లబ్ సభ్యులు అన్నారు. ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థి అవినాశ్‌వర్మకు దాతలు జి.రాము, డి.నారాయణరెడ్డి, ఎస్.బ్రహ్మారెడ్డి, ఎస్.అప్పలరాజు, బీహెచ్.సుబ్బరాజు, బీహెచ్.హరనాథరాజు, జి.వెంకటేశ్వరరాజు, పి.వెంకట్రాజు, జి.సుబ్రహ్మణ్యంరాజు, పి.నరసింగరావు రూ.50 వేల ఆర్థిక సహకారాన్ని బుధవారం అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జి.రంగరాజు, పి.రంగప్రసాదరాజు, ఆర్.నరసరాజు మాట్లాడారు.

ఫోన్ మాట్లాడుతూ భవనం పైనుంచి పడి మృతి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భవనంపై ఫోన్ మాట్లాడుతూ.. ప్రమాదవశాత్తు.. ఓ వ్యక్తి కిందపడి మృతి చెందిన ఘటన రాయలంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బిహార్‌కు చెందిన రామప్రవేశసహాని (46) టైల్స్ మేస్త్రీగా పని చేస్తుంటారు. ఆయన కొంత కాలంగా రాయలంలో తోటి కార్మికులతో కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి వాళ్లు ఉండే భవనం పైకి వెళ్లి ఫోన్ మాట్లాడుతుండగా.. ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందారు. ఈ ఘటనపై అతని వద్ద పని చేసే గౌతమ్‌కుమార్ సహాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రహమాన్ బుధవారం తెలిపారు.

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడి తనిఖీలు

నరసాపురం: గురుకుల పాఠశాలలో సిబ్బందిని ప్రశ్నిస్తున్న కృష్ణ కిరణ్

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కృష్ణ కిరణ్ బుధవారం జిల్లాలోని పలు వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పాలకొల్లు, నరసాపురం, పెనుమంట్ర, వీరవాసరం మండలాల్లోని వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంఎల్ఎస్ పాయింట్లను ఆయన పరిశీలించారు. పలు చోట్ల విద్యార్థులతో మాట్లాడి భోజనం నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎస్‌వో ఎన్.సరోజ, ఐసీడీఎస్, బీసీ సంక్షేమశాఖ అధికారులు ఉన్నారు.

వైద్య విద్య పేదల దరికి చేరేవరకూ పోరాటం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పేద విద్యార్థులకు కూటమి ప్రభుత్వం వైద్య విద్యను దూరం చేస్తోందని వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు విమర్శించారు. బుధవారం వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా భీమవరం పట్టణంలో ఆందోళన చేపట్టారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, పార్టీ పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త గూడూరి ఉమాబాల తదితరులు పాల్గొన్నారు.

ఉండి, న్యూస్‌టుడే: వైద్య విద్య పేదల దరికి చేరే వరకూ వైకాపా పోరాటం ఆగదని ఆ పార్టీ పార్లమెంటరీ ఇన్‌ఛార్జి ముదునూరి మురళీకృష్ణంరాజు, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీవీఎల్ నరసింహ రాజు అన్నారు. ఉండిలో ప్రదర్శన నిర్వహించారు.

స్ఫూర్తి ప్రదాత మూర్తిరాజు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: చింతలపాటి సీతారామచంద్ర వరప్రసాద్ (మూర్తిరాజు) దాతృత్వం వెలకట్టలేనిదని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. విద్యా దాత, గాంధేయవాది చింతలపాటి మూర్తిరాజు 13వ వర్ధంతి సందర్భంగా బుధవారం జువ్వలపాలెం రోడ్డులోని ఆయన విగ్రహం వద్ద సర్వోదయ మండలి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. దానికి కలెక్టర్ హాజరై మూర్తిరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ.. 110 ఏళ్ల క్రితమే విద్య ప్రాముఖ్యతను గుర్తించి.. వందలాది విద్యా సంస్థలను నెలకొల్పిన మూర్తిరాజు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు, కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, మానవత, అల్లూరి సీతారామరాజు సేవా సమితి, మంతెన రామలింగరాజు ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ స్థలాలు చూపాలని ఆందోళన

నినాదాలు చేస్తున్న బాధితులు, సీపీఎం నాయకులు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: భీమవరం డీఎన్ఆర్ కళాశాల రహదారిలో మురుగు కాలువ గట్టు వెంబడి నివాసం ఉండే పేదలకు ప్రత్యామ్నాయ స్థలాలు చూపకుండా ఇళ్లు తొలగిస్తే సహించేది లేదని సీపీఎం పట్టణ నాయకుడు ఎం.వైకుంఠరావు అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద బాధితులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. నాయకులు చల్లబోయిన వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

రామకృష్ణ గ్రూప్ Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషెంట్ల సేవకు, ఇంటిపని, వంటపని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు కావలెను. భో+వ+ జీతం 16- 18K ✆ 9705297788, 9515108830.

JOBS

ప్రముఖ బ్యాంకింగ్ అనుబంధ సంస్థ యందు పనిచేయుటకు పార్ట్‌టైమ్/ఫుల్‌టైమ్ ఉద్యోగస్తులు కావలెను. Q: 10th- PG., 25-65Y. ✆ 90001 43296.

శ్రీనివాస గ్రూప్ VJA ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/వంట బేబి కేర్‌కు పర్కర్లు కావలెను. భో+వ+జీతం ✆ 92814 52843, 92814 52827

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -109 రిటైల్ ధర 136 చికెన్ విత్ స్కిన్ - 197, చికెన్ స్కిన్‌లెస్ - 224. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 246 చికెన్ స్కిన్‌లెస్ - 256.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.05 పైII తణుకు ఆఫీసు: 08819-224254

92.7 FM Rajamahendravaram

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉII 5 - ఉII 7
ఈ-మార్నింగ్స్	ఉII 7 - ఉII 11
నువ్వా నేనా	ఉII 11 - మII 2
సత్యభామ	మII 2 - సాII 5
లైట్ తీస్కో	సాII 5 - రాII 9
సరదాగా కాసేపు	రాII 9 - రాII 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రాII 12 - తెII 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

ఉరేసుకుని వైద్య విద్యార్థిని మృతి

భీమవరం గ్రామీణ, వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఉరి వేసుకుని వైద్య విద్యార్థిని మృతి చెందిన ఘటన భీమవరంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన నిమ్మల హేమవర్షిణి (22) స్థానిక కొవ్వాడ డ్రైవర్స్ కాలనీలో నివాసం ఉంటూ.. భీమవరం దంతవైద్య కళాశాలలో బీడీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్నారు. మంగళవారం కైకలూరు వైద్య శిబిరానికి వెళ్లి వచ్చి.. కొవ్వాడలోని తన ఇంటికి వెళ్లిపోయారు. అదేరోజు సాయంత్రం తల్లిదండ్రులు ఫోన్ చేస్తే.. తీయకపోవడంతో వారు కంగారు పడి.. యువతి స్నేహితులను అక్కడకు వెళ్లి చూడమని పంపారు. వారు స్థానికులతో కలిసి వెళ్లి చూడగా.. హేమవర్షిణి పంకాకు ఉరి వేసుకుని ఉన్నారు. దీనిపై యువతి తండ్రి సింహాచలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భీమవరం గ్రామీణ ఎస్సై ఐ.వీర్రాజు బుధవారం తెలిపారు.

పంచాయతీ ఆదాయ వనరుల పెంపుపై శిక్షణ

వీరవాసరం, న్యూస్‌టుడే: పంచాయతీలు సొంతంగా ఆదాయ వనరులు సృష్టించుకునే దిశగా పాలకులు, కార్యదర్శులు దృష్టి సారించాలని ఎంపీడీవో కేఎం.వైభవతి సూచించారు. బుధవారం సర్పంచులు, కార్యదర్శులకు ఆదాయ వనరుల పెంపుపై వీరవాసరం ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉప ఎంపీడీవో జి.వెంకటరెడ్డి, సిబ్బంది కాశీ విశ్వనాధ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

భీమవరం బ్రాంచ్

3-8-484, రెస్ట్ హౌస్ రోడ్, పశ్చిమ గోదావరి జిల్లా

ఇ-మెయిల్: bmvija0826@centralbank.co.in ఫోన్ :6304906625

ఉద్దేశించిన అమ్మకం నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(6) నిబంధనలతో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం ఉద్దేశించిన అమ్మకం నోటీసు

తేది : 31.10.2025

ఋణగ్రహీతలు : శ్రీ పాతపాటి రామకృష్ణ, తండ్రి : బాల రామరాజు, పాత డోర్ నెం.3-106, క్రొత్త డోర్ నెం.3-107, విస్సాకోడేరు గ్రామం మరియు గ్రామ పంచాయితీ, పాలకోడేరు మండలం, పశ్చిమ గోదావరి - 534244, ఆంధ్రప్రదేశ్.

సహ-ఋణగ్రహీత : శ్రీ పాతపాటి నాగ వెంకట లక్ష్మికుమారి, పాత డోర్ నెం.3-106, క్రొత్త డోర్ నెం.3-107, విస్సాకోడేరు గ్రామం మరియు గ్రామ పంచాయితీ, పాలకోడేరు మండలం, పశ్చిమ గోదావరి - 534244, ఆంధ్రప్రదేశ్.

అయ్యా /అమ్మా,

విషయం : శ్రీ పాతపాటి రామకృష్ణ, తండ్రి : బాల రామరాజు మరియు శ్రీ పాతపాటి నాగ వెంకట లక్ష్మికుమారి, భర్త : పాతపాటి రామకృష్ణ వార్ల యొక్క NPA Cent HOME LOAN ఖాతా నెం. 4063795211 తో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, భీమవరం బ్రాంచ్ నందు పొందిన లోన్ గురించి.

....

శ్రీ పాతపాటి రామకృష్ణ, తండ్రి : బాల రామరాజు మరియు శ్రీ పాతపాటి నాగ వెంకట లక్ష్మికుమారి గార్లు భీమవరం బ్రాంచ్ నుండి **29/12/2020**న మంజూరు చేయబడిన పరిమితి **రూ.16,00,000/-** కోసం హోమ్ లోన్‌ను ఖాతా నెం. **4063795211** ద్వారా పొందారు.

ఋణగ్రహీతలు, బ్యాంకు మంజూరు చేసిన నిబంధనల ప్రకారం బకాయి మొత్తాలను చెల్లించడంలో విఫలమయ్యారు. హామీదారులను తగిన సొమ్ము మొత్తాన్ని సెక్యూరిటైజేషన్ చట్టం యొక్క సెక్షన్ 13(2) కింద జారీ చేసిన **21-04-2025** నాటి నోటీసు ద్వారా చెల్లించమని ప్రకటించాము. 60 రోజుల్లో చెల్లింపు చేయకపోతే, తనఖా పెట్టిన ఆస్తులు/ సెక్యూరిటీలను భౌతికంగా స్వాధీనం చేసుకోవడం ద్వారా బ్యాంక్ తన హక్కులను వినియోగించుకోవడానికి పరిమితం చేయబడుతుందని ఇందుమూలంగా స్పష్టంగా తెలియజేస్తున్నాము.

శ్రీ పాతపాటి రామకృష్ణ, తండ్రి : బాల రామరాజు మరియు శ్రీ పాతపాటి నాగ వెంకట లక్ష్మికుమారి గార్లు బ్యాంక్ యొక్క ఒప్పందము ప్రకారము నిర్దీత బకాయిలను చెల్లించడంలో విఫలమయ్యారు. అధీకృత అధికారి క్రింది షెడ్యూల్ లో మరింత సవివరంగా వివరించిన సెక్యూరిటీలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం నోటీసు ఇప్పటికే మీకు మరియు మీ హామీదారులకు పంపబడింది.

చట్టంలోని 13(4) సెక్షన్ ప్రకారం, బ్యాంకుకు వాటిపై (స్వాధీన పరచుకున్న ఆస్తి పై) ప్రభావం చూపే హక్కు ఉంది మరియు వడ్డీతో పాటు ఖర్చులు, ఛార్జీలు, మరియు బకాయి ఉన్న సొమ్ముల ద్వారా వచ్చే ఆదాయాన్ని హస్తగతం చేసికొనవచ్చు. తదనుగుణంగా, క్రింద సంతకం చేసిన వ్యక్తి ఇక్కడ క్రింది షెడ్యూల్ లో వివరించిన విధంగా జప్తు చేసుకున్న ఆస్తులను విక్రయించాలని భావిస్తున్నారు.

పైన పేర్కొన్న రుణ ఖాతాలలో తిరిగి చెల్లించాల్సిన మొత్తం బకాయిలు **రూ.16,97,880.00 (అక్షరాల పదహారు లక్షల తొంభై ఏడు వేల ఎనిమిది వందల ఎనభై రూపాయలు)** తో పాటు భవిష్య వడ్డీ మరియు ఇతర ఖర్చులుతో కలిపి చెల్లించవలసి ఉంటుంది.

ఈ-వేలం నిర్వహించడం ద్వారా ఈ నోటీసు అందిన తేదీ నుండి 30 రోజుల గడువు ముగిసిన తరువాత విక్రయాన్ని నిర్వహించాలని ఉద్దేశించబడింది.

షెడ్యూల్‌లో పేర్కొన్న ఆస్తుల రిజర్వ్ ధర ఆస్తి ఐటమ్-ఎ : **రూ.25,81,000/- (అక్షరాల ఇరవై ఐదు లక్షల ఎనభై ఒక్క వేలు రూపాయలు మాత్రమే)** గా నిర్ణయించబడింది.

స్థిరాస్తి వివరములు :

ఐటమ్-ఎ : (సెక్యూర్డు ఆస్థి/తనఖా ఆస్తి యొక్క వివరములు క్లుప్తంగా) పశ్చిమ గోదావరి జిల్లా, గునిపూడి యస్ఆర్ఓ, పాలకోడేరు మండలం, విస్సాకోడేరు గ్రామం, పాత డోర్ నెం.3-106, క్రొత్త డోర్ నెం.3-107, అసెస్‌మెంట్ నెం.308, ఆర్.యస్.నెం. 361-1 లోని మొత్తం విస్తీర్ణం రెండు ఐటమ్‌లుగా (అనగా 99.28 చ.గ.లు + 9.62 చ.గ.లు) ఈ క్రింది విధముగా కలవు.

ఐటమ్-1 : 99.28 చ.గ.లు విస్తీర్ణంనకు హద్దులు : తూర్పు : నడిపూడి తాతయ్య మరియు ఇతరుల స్థలం, **దక్షిణం:** తానేటి కామేశ్వర రావు గారి గోడ, **పడమర** : తల్పూరి మహాలక్ష్మి మరియు ఇతరుల స్థలం, **ఉత్తరం:** గోవిందలపూడి గున్నయ్యాచారి గారి స్థలము కొంతమేర మరియు దిగువ ఐటమ్ నెం.2 కొంతమేర.

ఐటమ్-1 :19.25 చ.గ.లలోని అవిభాజ్యపు వాటా అయిన 9.62 చ.గ.లు విస్తీర్ణంనకు హద్దులు : తూర్పు : నౌదూరి పాపయ్య కుమారుల స్థలం మరియు గోడ 43-4", **దక్షిణం:** పై 1వ ఐటమ్ స్థలం 4'-00", **పడమర** : గోవిందలపూడి గన్నయ్యాచారి గారి ఇల్లు, 43-4", **ఉత్తరం:** రాజవీధి (సిమెంట్ రోడ్డు), 4'-00".

తేది : 31.10.2025 సం/- అధీకృత అధికారి

ప్రదేశం : భీమవరం సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పోడూరు, న్యూస్‌టుడే: జిన్నూరులోని శ్రీ సీతారామరాజు విజ్ఞాన ప్రభ గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని గ్రంథాలయాధికారి బత్తుల జోగారత్నం, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స సూర్యనారాయణరాజు, ప్రధాన కార్యదర్శి తాతాబత్తుల వెంకటేశ్వరరావు తెలిపారు.

పెనుమంట్ర, న్యూస్‌టుడే: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నుంచి పెనుమంట్ర శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్ర లేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, ముగ్గుల పోటీలు నిర్వహిస్తామని గ్రంథాలయాధికారి డి.కృష్ణారావు తెలిపారు.

ఓటర్ల జాబితాల స్వచ్ఛీకరణపై సమీక్ష

మార్టేరు, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితాల స్వచ్ఛీకరణ, క్షేత్ర పరిశీలనపై రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం నిర్వహించిన వీడియో సమావేశంలో ఈఆర్వో, డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు పెనుమంట్ర తహసీల్దారు కార్యాలయం నుంచి పాల్గొన్నారు. అనంతరం బీఎల్వోలు, సూపర్‌వైజర్లతో సమావేశమై ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ, ఇతర అంశాలపై దిశానిర్దేశం చేశారు. కొత్త ఓటర్ల నమోదుకు దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు.

గోడపత్రాల ఆవిష్కరణ

నరసాపురం, న్యూస్‌టుడే: గ్రంథాలయ వారోత్సవాల గోడపత్రాలను ఆర్డీవో దాసి రాజు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శివయ్యకు అభిషేకాలు.. బిల్వార్చనలు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: కార్తిక మాసోత్సవాల్లో భాగంగా పంచారామ క్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఉదయం అభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన యాత్రికులు, అయ్యప్ప, భవానీ, శివ మాలధారణ భక్తులు స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

నరసాపురంలో అమరేశ్వరుడు

యలమంచిలి, న్యూస్‌టుడే: యలమంచిలి ఉమా సోమేశ్వరస్వామి ఆలయంలో బుధవారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు జరిగిన ప్రత్యేక పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వారికి ఆలయ ఛైర్మన్ అడబాల శ్రీమన్నారాయణ కుంకుమ భరిణెలు పంపిణీ చేశారు.

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలో అమరేశ్వర స్వామి ఆలయంలో రుద్రాభిషేకాలు, సహస్ర నామార్చనలు నిర్వహించారు. సాయంత్రం స్వామికి పంచ హారతులు ఇచ్చి ఆకాశ దీపం వెలిగించారు.

రాజగోపాలస్వామికి తోమాల సేవ

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలో రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాల స్వామి ఆలయంలో బుధవారం ఉదయం పంచామృతాభిషేకాలు, తోమాల సేవ, సహస్ర నామార్చనలు వైభవంగా జరిగాయి. అష్ట బుధవార ప్రదక్షిణ దీక్షలో భాగంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి అటుకులు, బెల్లం, తులసి మాలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బండి ముత్యాలమ్మ హుండీ ఆదాయం రూ.12.05 లక్షలు

మొగల్తూరు, న్యూస్‌టుడే: ముత్యాలపల్లిలో కొలువైన బండి ముత్యాలమ్మ ఆలయంలో హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. 55 రోజులకు రూ. 12,05,155 ఆదయం సమకూరినట్లు ఈవో ఎం.అరుణకుమార్ తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వర్ధినీడి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో సిబ్బంది, భక్తులు నగదు లెక్కించారు.

ఆరా తీసి.. పరిష్కారం చూపి!

'ఈనాడు' ఆధ్వర్యంలో వాక్‌విత్ కమిషనర్

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు పట్టణ పరిధి 5వ వార్డులో మురుగు సమస్యతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు పురపాలక కమిషనర్ బి.విజయసారథి దృష్టికి తీసుకెళ్లారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'వాక్‌విత్ కమిషనర్' కార్యక్రమంలో ఆయన వార్డులో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు వీధి దీపాలు, మురుగు, పారిశుద్ధ్యం, తాగునీరు, రోడ్ల సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

సమస్యలు తెలుసుకుంటున్న విజయసారథి

డ్రెయిన్ల నిర్మాణాలకు నిధులు

వర్షం కురిసినప్పుడు మురుగు రహదారిపై చేరుతోందని.. రాకపోకలకు ఇబ్బందిపడుతున్నామని రంగమన్నార్‌పేట వాసి సంధ్య ఫిర్యాదు చేశారు. డ్రెయిన్లను తరచూ శుభ్రం చేయకపోవడంతో మురుగు నిలిచిపోయి దుర్వాసన వస్తోందని అదే ప్రాంతానికి చెందిన దుర్గ తెలిపారు. మరికొన్ని ప్రాంతాల్లో స్థానికులు మురుగు సమస్యను ప్రస్తావించారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ పలు ప్రాంతాల్లో డ్రెయిన్ల నిర్మాణానికి ఇటీవల రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు రూ.20 లక్షలు మంజూరు చేయించారని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

● రంగమన్నారు పేట ప్రాంతంలో రహదారిపై కొందరు చెత్త వేస్తుండటంతో పారిశుద్ధ్యం అధ్వానంగా మారుతోందని స్థానికురాలు భవాని తెలిపారు. ఇదే ప్రాంతంలో ఆవులను రోడ్డుపైకి వదిలేస్తుండటంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని నాగమణి ఫిర్యాదు చేశారు. పైపులైన్లు ఏర్పాటు చేసిన గతంలో తవ్విన గుంతలను సక్రమంగా పూడ్చకపోవడంతో రోడ్డు పాడైందని.. రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గుత్తులవానిపేట వాసి చందు ఫిర్యాదు చేయగా కమిషనర్ క్షేత్ర పరిశీలన చేశారు. ఈ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని తెలిపారు.

● కొద్ది రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదని పలు కాలనీల ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి వెంటనే సిబ్బందిని రప్పించి మరమ్మతులు చేయించారు.

● ప్రజా కుళాయిలను తొలగించడంతో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రంగమన్నారుపేటతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలు కమిషనర్‌కు తెలిపారు. వ్యక్తిగత కుళాయి కోసం దరఖాస్తు చేసుకుంటే వెంటనే కనెక్షన్ ఇప్పిస్తామని కమిషనర్ పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసాపురం	80085 74504	ఆచంట	90631 44737
పాలకొల్లు	80085 74510	పెనుగొండ	80085 74469
పోడూరు	90631 44741	పెనుమంట్ర	91212 29087

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? రాయపేట ప్రాంతంలో కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు రంగుమారి బురద వాసన వస్తోంది. - జె. వీరాంజనేయులు, నరసాపురం
✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - ఎం. అంజయ్య, పురపాలక కమిషనర్

నరసాపురం, న్యూస్‌టుడే: ? రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న శ్మశానవాటిక సమీపాన వీధిదీపం కొన్ని నెలలుగా వెలగడంలేదు. రాత్రి వేళ రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. - శ్యామ్‌జోసెఫ్, నరసాపురం
✔ మరమ్మతులు చేయిస్తాం. - ఎం.అంజయ్య, పురపాలక కమిషనర్

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ? బ్రాడీపేట 1వ వీధిలో కొద్ది రోజులుగా వీధిదీపాలు వెలగడం లేదు. రాత్రి వేళ రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. - నాగరాజు, స్థానికుడు
✔ మరమ్మతులు చేయిస్తాం. - రాజ్‌కుమార్, పురపాలక డీఈ

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: ? నడిపూడి ఎస్సీ కాలనీ వద్ద రహదారి వెంబడి చెత్త వేస్తున్నారు. దుర్వాసనతో నిత్యం ఇబ్బంది పడుతున్నాం. - లక్ష్మణ్, స్థానికుడు
✔ పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. - వై.కిశోబాబు, ఇన్‌ఛార్జి కార్యదర్శి

పెనుగొండ, న్యూస్‌టుడే: ? చెరుకువాడ పరిధి మంగినవారి వీధిలో మూడు వీధి దీపాలు వెలగడం లేదు. - ఎం.శ్రీనివాస్, స్థానికుడు
✔ మరమ్మతులు చేయించేలా సిబ్బందికి సూచనలిస్తాం. - టి.సూర్యనారాయణమూర్తి, ఎంపీడీవో

మొగల్తూరు, న్యూస్‌టుడే: ? బండిముత్యాలమ్మ ఆలయ సమీపాన జాతీయ రహదారి పక్కన ఉన్న తాగునీటి పైపులైను మరమ్మతులకు గురై శుద్ధి జలాలు వృథాగా పోతున్నాయి. - ఎన్.రాంబాబు, ముత్యాలపల్లి
✔ పైపులైనుకు మరమ్మతులు చేయిస్తాం. - మోహనరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు

మార్టేరు, న్యూస్‌టుడే: పార్టీ కోసం పనిచేసే వారికి తెదేపాలో ఎప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందని, పదవుల్లో సముచిత స్థానం లభిస్తుందని పార్టీ యువ నాయకుడు పితాని వెంకట్ పేర్కొన్నారు. మార్టేరులోని శ్రీవేణుగోపాల ఆడిటోరియంలో నియోజకవర్గ పరిధిలో పార్టీ మండల, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెదేపాకు కార్యకర్తలే బలం, బలగమన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేలా శ్రేణులు కష్టపడి పనిచేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం పలు కమిటీలతో ప్రమాణ స్వీకారం చేయించారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు రుద్రరాజు వెంకటరామరాజు, ఆచంట జడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేశ్ బాబు, తెదేపా మండలాధ్యక్షుడు వెలగల బుల్లిరామిరెడ్డి, నాయకులు జిన్నా, రామకృష్ణ, అచ్యుతరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పితాని వెంకట్

వాటర్ గ్రిడ్ పనులకు శంకుస్థాపన

పోడూరు, న్యూస్‌టుడే: వాటర్ గ్రిడ్ పనులు పూర్తయితే డెల్టాలో తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెదేపా నాయకుడు పితాని వెంకట్ పేర్కొన్నారు. వాటర్ గ్రిట్ పనుల్లో భాగంగా కవిటం పరిధి ముంజెరువు గట్టు ప్రాంతంలో 60 వేల లీటర్ల తాగునీటి పథకం పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. సర్పంచి చుట్టుగుళ్ల పూర్ణిమ, ఎంపీపీ సబ్బితి సుమంగళి, సొసైటీ అధ్యక్షుడు ఊడిగ శ్రీనివాసరావు, కార్యదర్శి కృష్ణవేణి పాల్గొన్నారు.

ప్రభుత్వ నియంత్రణలోనే వైద్య కళాశాలలు

పాలకొల్లు, న్యూస్‌టుడే: పీపీపీ విధానంలో నిర్మించే వైద్య కళాశాలలన్నీ ప్రభుత్వ నిర్వహణ, నియంత్రణలోనే ఉంటాయని పాలకొల్లు ఏఎంసీ ఛైర్మన్ కోడి విజయభాస్కర్, భాజపా రాష్ట్ర మీడియా ప్రతినిధి ఉన్నమట్ల కబర్ధి స్పష్టం చేశారు. లంకలకోడేరులో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వైకాపా నాయకులు వైద్య కళాశాలల ప్రయివేటీకరణ అంటూ ప్రజల్లో గందరగోళం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. పాలకొల్లు మండలం దగ్గులూరులో రూ. 475 కోట్లతో వైద్య కళాశాల నిర్మాణానికి మాజీ సీఎం జగన్ శంకుస్థాపన చేశారని.. తరువాత నిధులు మంజూరు చేయకపోవడంతో అది పునాదుల దశలోనే ఆగిపోయిందని ఎద్దేవా చేశారు. వైద్య కళాశాలల్లో సీట్లు, ఫీజులు ప్రభుత్వ నియంత్రణలోనే ఉంటాయని.. ప్రజలకు ఉచిత వైద్యం అందుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న 104, 108 వాహన సేవలు సైతం ప్రయివేటు భాగస్వామ్యంతోనే నడుస్తున్న విషయాన్ని వైకాపా నాయకులు గుర్తించాలని హితవు పలికారు.

కాలువల ప్రక్షాళనతో ముంపు నివారణ

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో పంట, మురుగు కాలువల ప్రక్షాళనతోనే ముంపు సమస్యకు పరిష్కారం లభిస్తుందని.. ఈ దిశగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అధికారులకు సూచించారు. లక్ష్మణేశ్వరం, దర్బరేవు గ్రామాల్లో ఆయన అధికారులు, కూటమి నాయకులు, రైతులతో కలిసి బుధవారం పర్యటించారు. ముంపు నీటిని వశిష్ఠ గోదావరిలోకి మళ్లించే దర్బరేవు, ముస్కేపాలెం అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లను ఆయన పరిశీలించారు. డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ గుబ్బల మార్రాజు, జిల్లా మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య అధ్యక్షుడు మైల వసంతరావు, లక్ష్మణేశ్వరం సర్పంచి తిరుమాని వెంకట్రాజు, పలువురు నాయకులు పాల్గొన్నారు. ● మంగళగుంటపాలెంలో పేదల ఇళ్లను ఎమ్మెల్యే నాయకర్ బుధవారం ప్రారంభించారు.

అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయకర్

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం.. నరసాపురం, న్యూస్‌టుడే: వైద్యం నిమిత్తం సాయం అవసరమైతే తమను సంప్రదించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ సూచించారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'సఖి సురక్ష' వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైద్య సేవల పథకం వర్తించని అనారోగ్య బాధితులు సంబంధిత బిల్లులను అందజేస్తే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సాయం మంజూరుకు కృషిచేస్తానన్నారు. మెప్మా పీడీ జి. హెప్సిబా, పలువురు సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేరుస్తాం

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా మిగిలిన పేదల గృహాలకు మంత్రి నిమ్మల రామానాయుడు కృషితో మళ్లీ నిధులు మంజూరవుతున్నాయని పాలకొల్లు ఏఎంసీ ఛైర్మన్ కోడి విజయభాస్కర్ పేర్కొన్నారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు పరిధి పెద్దపేటకు చెందిన లబ్ధిదారుడి గృహ ప్రవేశం కూటమి నాయకుల ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేర్చాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం ఎస్టీలకు రూ. 75 వేలు, ఎస్సీ, బీసీలకు రూ. 50 వేల చొప్పున అదనపు నిధులు మంజూరు చేసిందన్నారు. సర్పంచి చొప్పల రజని, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏఎంసీ ఛైర్మన్ విజయభాస్కర్

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండ పరిధి కోడిపందేల దిబ్బ, నగరేశ్వర కాలనీల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా నిర్మించిన ఇళ్ల గృహ ప్రవేశాలు బుధవారం ఘనంగా జరిగాయి. తెదేపా యువ నాయకుడు పితాని వెంకట్, సర్పంచి నక్కా శ్యామలాసోని, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మండుటెండలో నిరీక్షణ

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: దొంగరావిపాలెంలో జాతీయ రహదారి వెంబడి బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఈ కూడలి విజయవాడ, హైదరాబాద్, ఏలూరు, తాడేపల్లిగూడెం, తణుకు, రావులపాలెం తదితర ప్రాంతాలకు వందలాది మంది ప్రయాణిస్తుంటారు. బస్సులు కోసం నిరీక్షించే విద్యార్థులు, మహిళలు, వృద్ధులు నిలువు నీడ లేక నానా అవస్థలు పడుతున్నారు. దీనిపై సర్పంచి కోన రామలింగేశ్వరరావు స్పందిస్తూ సమస్యను స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

రోడ్లేసి.. స్తంభాలు వదిలేసి!

నరసాపురం గ్రామీణ, పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో పలు ప్రధాన రహదారులను విస్తరించి అభివృద్ధి చేయగా.. వాటి పక్కన విద్యుత్తు స్తంభాలను అలాగే వదిలేయడంతో ప్రమాదకరంగా మారాయి. నరసాపురం, పెనుగొండ మండలాలతో పాటు మరికొన్ని ప్రాంతాల్లోనూ ఈ సమస్య ఉంది. కొన్ని చోట్ల స్తంభాల కారణంగా నాలుగైదు అడుగుల మేర రోడ్డును వినియోగించే పరిస్థితి లేదు. రాత్రి వేళ వీటిని గుర్తించలేక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారుల అలసత్వం, శాఖల మధ్య సమన్వయ లేమి ఈ పరిస్థితికి కారణమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తొలగించేందుకు చర్యలు.. నరసాపురం మండలంలో రహదారులపైకి ఉన్న స్తంభాలను తొలగించేందుకు చర్యలు చేపడతామని ఆర్‌అండ్‌బీ డీఈఈ జీవీఎస్ కిరణ్ కుమార్ పేర్కొన్నారు.

లక్ష్మణేశ్వరం కూడలిలో ఇలా..

● లక్ష్మణేశ్వరం నుంచి ఎల్బీచర్ల, మోడి, తూర్పుతాళ్లు మీదుగా పెదమైనవానిలంక వరకు రహదారి నిర్మించి ఏడాది గడుస్తోంది. లక్ష్మణేశ్వరం కూడలి, సారవ, ఎల్బీచర్ల గ్రామాల్లో రహదారిపైకి ఉన్న విద్యుత్తు స్తంభాలను నేటికీ తొలగించలేదు.

● చిట్టవరం-గొంది ప్రధాన రహదారిలో పెదపాలెం వద్ద విద్యుత్తు స్తంభాన్ని తొలగించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు వాపోతున్నారు.

● నరసాపురం- భీమవరం ప్రధాన రహదారిలో చినమామిడిపల్లి, సరిపల్లి, లిఖితపూడి, కొప్పర్రు తదితర గ్రామాల పరిధిలో స్తంభాలను తొలగించలేదు.

● పెనుగొండ మండలం దేవ గ్రామంలో ప్రధాన రహదారి విస్తరణ పనులు చేపట్టి చాలా కాలం గడచినా విద్యుత్తు స్తంభాలు తొలగించలేదు. సిద్ధాంతం, వడలి తదితర గ్రామాల్లోనూ ఇదే నెలకొంది.

అసలే ఇరుకు.. ఆపై రద్దీ

మొగల్తూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రం మొగల్తూరులో నిత్యం సాయంత్రం వేళ వాహనాల రద్దీతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో పాత కాలువ ప్రాంతం నుంచి పెదపల్లవపాలెం వరకు ప్రధాన రహదారి ఇరుకుగా ఉండటంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకునే అవకాశం ఉండటం లేదు. దీంతో పాటు సాయంత్రం వేళ గాంధీబొమ్మ కూడలిలో రద్దీ ఎక్కువగా ఉండటంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. పాఠశాలల బస్సులతో పాటు వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చి తిరిగి వెళ్లే వారు రద్దీలో ఇరుక్కుపోయి తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమస్యను ఎస్సై జి.వాసు దృష్టికి తీసుకువెళ్లగా రద్దీ వేళల్లో ఆ ప్రాంతంలో పోలీసు సిబ్బందిని నియమించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

గాంధీబొమ్మ కూడలిలో నిలిచిన వాహనాలు

ఆత్మీయం.. ఆనందం

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు బీవీఆర్‌ఎం బాలికల ఉన్నత పాఠశాలలో చదివిన 1974-79 బ్యాచ్ పూర్వ విద్యార్థినుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం జరిగింది. దాదాపు 30 మంది హాజరై బాల్య మిత్రులతో కలిసి సందడి చేశారు. అనంతరం పాఠశాల సైన్స్ ల్యాబ్‌కు అవసరమైన రెండు బీరువాలను ప్రధానోపాధ్యాయుడు వై.ప్రభాకరశాస్త్రికి అందజేశారు. అనంతరం పాఠశాల విద్యార్థినులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

పూర్వ విద్యార్థులతో హెచ్‌ఎం

శ్మశానంలో కొబ్బరి మొక్కలపై వివాదం

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట వేమవరం శ్మశాన వాటిక ప్రాంగణంలో కొందరు కొబ్బరి మొక్కలు నాటడం వివాదాస్పదంగా మారింది. గ్రామంలో సుబ్బారాయుడి గుడి వెనుక ప్రాంతంలో నివసించే వారికి ఉమ్మడి శ్మశానవాటిక ఉంది. 9 సంఘాలకు చెందిన వారు ఇక్కడ దహన సంస్కారాలు నిర్వహిస్తారు. ఓ సంఘానికి చెందిన వ్యక్తులు ఇటీవల శ్మశాన వాటికలో కొబ్బరి మొక్కలు నాటగా.. దీనిని మిగిలిన సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ అంశంపై పంచాయతీ కార్యదర్శి పి.చంద్రశేఖరరావును సంప్రదించగా సంఘాల మధ్య వివాదం లేకుండా సమస్య పరిష్కరించుకొనేలా సమావేశం నిర్వహించామన్నారు. 8 సంఘాల సభ్యులు ఆ మొక్కలు తొలగించాలని కోరడంతో ఈ మేరకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. స్థానిక పరిస్థితులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

వైకాపా ఆధ్వర్యంలో నిరసన

నరసాపురం, పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల ప్రయివేటీకరణ యోచనను ఉపసంహరించాలని వైకాపా జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఆయన ఆధ్వర్యంలో వైకాపా నాయకులు బుధవారం పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆర్డీవో దాసి రాజుకు వినతిపత్రం అందించారు. పాలకొల్లు పట్టణంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు.

నరసాపురం: ప్రదర్శనలో ప్రసాదరాజు, పార్టీ శ్రేణులు

సేంద్రియ సేద్యంతో నాణ్యమైన ఉత్పత్తులు

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: రసాయన ఎరువుల వాడకంతో నేల సారం కోల్పోతుందని.. సేంద్రియ సేద్యంతో నాణ్యమైన పంట ఉత్పత్తులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారిణి పి. స్పందన పేర్కొన్నారు. దొంగరావిపాలెం, నడిపూడి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. నడిపూడి గ్రామానికి చెందిన రైతు మన్యం వీరవెంకటకృష్ణ సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసిన డీఆర్‌ఆర్ ధన్ 75 రకం పంటను పరిశీలించారు. సాగులో రైతులు పాటించాల్సిన మెలకువలు, సేంద్రియ ఎరువులతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

పేదలకు చేయూత అభినందనీయం

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ఆర్థికంగా వెనుకబడిన వారికి వసుధ ఫౌండేషన్ ద్వారా చేయూతనివ్వడం అభినందనీయమని పాలకొల్లు కాస్మో స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు అన్నారు. నలుగురు పేద రోగులకు ఫౌండేషన్ తరఫున రూ. 40 వేల ఆర్థిక సాయాన్ని ఆయన బుధవారం స్థానిక కాస్మోక్లబ్ భవనంలో పంపిణీ చేశారు.

ఆహార పట్టిక అమలు చేయకుంటే కఠిన చర్యలు

నరసాపురం, పట్టణం, గ్రామీణ, పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు, చిన్నారులకు ఆహార పట్టిన ప్రకారం పోషకాహారం అందించకుంటే చర్యలు తప్పవని ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కృష్ణకిరణ్ హెచ్చరించారు. నరసాపురం పట్టణం, లక్ష్మణేశ్వరం, ఎల్బీచర్లలో గురుకుల పాఠశాలలు, పాలకొల్లు మండలం దిగమర్రు జడ్పీ పాఠశాల, పలు ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయన బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. దస్త్రాలు, స్టాకు నిల్వలు, ఆహారం నాణ్యతను పరిశీలించారు. తమకు ఆహారం సక్రమంగా అందించడంలేదని స్టేషన్‌పేట గురుకుల పాఠశాల విద్యార్థులు ఆయనకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన స్పందించి వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. 51 కిలోల బియ్యం వండాల్సి ఉండగా.. 34 కిలోలే వినియోగించినట్లు గుర్తించి సిబ్బందిని ప్రశ్నించారు. దీనిపై జేసీకి ఫిర్యాదు చేస్తానన్నారు.

రేషన్ డిపోలో తనిఖీలు చేస్తున్న ఫుడ్ కమిషన్ సభ్యుడు, అధికారులు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: బ్రాహ్మణచెరువులో పౌర సరఫరాల సంస్థ ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను ఫుడ్ కమిషన్ సభ్యుడు కృష్ణకిరణ్ పరిశీలించారు. స్టాకు రిజిస్టర్లను తనిఖీ చేసి స్థానిక బాధ్యులతో మాట్లాడారు.

ఆదాయ వనరుల పెంపుతోనే అభివృద్ధి

నరసాపురం గ్రామీణ, పెనుగొండ, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఆదాయ వనరులను పెంపొందించుకోవడం ద్వారా గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని జిల్లా రిసోర్స్ పర్సన్ పార్థసారథి అన్నారు. నరసాపురం మండల పరిషత్తు కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన బుధవారం పాల్గొని మాట్లాడారు. కేవలం ఇంటి పన్నులపైనే ఆధార పడకుండా ఇతర ఆదాయ వనరులపై దృష్టి సారించాలన్నారు. పెనుగొండ మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో టి.సూర్యనారాయణ మూర్తి పాల్గొని ఆదాయ వనరుల గుర్తింపుపై అవగాహన కల్పించారు.

మాట్లాడుతున్న రిసోర్స్‌పర్సన్ పార్థసారథి

పూర్తయిన శిక్షణ తరగతులు.. పెనుమంట్ర, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో ఆదాయ వనరుల పెంపుదలపై నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. పెనుమంట్ర మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ఈ తరగతులకు సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కృష్ణమూర్తి పలు అంశాలపై వారికి అవగాహన కల్పించారు.

దాడి కేసులో అయిదుగురి అరెస్టు

పోడూరు, న్యూస్‌టుడే: వద్దిపర్రుకు చెందిన పరుచూరి సూరిబాబుపై దాడి చేసిన కేసులో బుధవారం అయిదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై సుధాకరరెడ్డి తెలిపారు. వీరిని పాలకొల్లు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు. ఈ కేసులో మరో అయిదుగురిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, MEDCHAL MALKAJGIRI DISTRICT AT MEDCHAL
O.S.No.199 OF 2021
Between:
Garlapati Suresh Babu. ... Plaintiff
And
Smt. W. Ramya Jyothi & others. ... Defendants
To
Mogalapalli Ram Vidya Praveen, S/o. Ramakrishna, Aged not known, R/o. Vysya Street, Cherukuwada, Penukonda Mandal, West Godavari District, Andhra Pradesh.
Notice is hereby issued pursuant to the order of the Hon'ble Principal Junior Civil Judge, Medchal Malkajgiri District at Medchal in O.S. No.199 of 2021 filed Garlapati Suresh Babu posted on **24-11-2025** for your appearance at 10-30 a.m., on failure to appear before the court the matter will be decided by the Hon'ble Court as per Law.
(BY THE ORDER OF THE COURT)
RAMAKRISHNA K. Kala Sagar Jala. E. Kurumurthy, Advocates, # Plot No. 73, GA-I, SBH Colony Saidabad Hyderabad

వన్య ప్రాణుల వేటగాడి అరెస్టు

నరసాపురం, పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: వన్య ప్రాణుల వేటగాడిని బుధవారం అరెస్టు చేసినట్లు ఫారెస్టు రేంజ్ అధికారి ఎం. కరుణాకర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పాలకొల్లు పట్టణానికి చెందిన షెపార్డ్ చింతలపర్రు పరిధి పెచ్చెట్టిపాలెంలో వన్యప్రాణులైన నత్తకొట్టు, పచ్చ, తెల్ల కొంగలను వేటాడుతుండగా తమకు అందిన సమాచారం మేరకు దాడి చేసి అతడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడి నుంచి నాటు తుపాకీ, మూడు పక్షుల కళేబరాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై వన్యప్రాణి సంరక్షణ, అక్రమ ఆయుధాలు నిరోధక చట్టాల ప్రకారం కేసులు నమోదు చేశామన్నారు.

స్వాధీనం చేసుకున్న మృతపక్షులు

సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు

బాలుడిపై కేసు నమోదు

ఆచంట, న్యూస్‌టుడే: ఓ కులాన్ని కించపరిచేలా సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు పెట్టిన భీమలాపురానికి చెందిన బాలుడిపై కేసు నమోదు చేసినట్లు ఆచంట ఎస్సై కె.వెంకటరమణ బుధవారం తెలిపారు. దీనిపై కొన్ని సంఘాల ప్రతినిధులు ఫిర్యాదు చేశారన్నారు. తాడేపల్లిగూడెం డీఎస్పీ ఈ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

భారీ వృక్షం తొలగింపుపై ఫిర్యాదు

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట పరిధి కౌరుపాలెంలో వందేళ్ల నాటి భారీ వృక్షాన్ని అనుమతులు లేకుండా తొలగిస్తున్నారంటూ స్థానికులు జిల్లా అధికారులకు బుధవారం ఫిర్యాదు చేశారు. విద్యుత్తు పనుల ఆటంకంగా ఉందంటూ ఈ చెట్టు తొలగిస్తున్నారని చెబుతున్నారు. దీనిపై ఏపీఈపీడీసీఎల్ ఇన్‌ఛార్జి ఏఈ రామారావును సంప్రదించగా శివారు ప్రాంతాలకు కొత్త లైన్లు వేసే పనులకు అడ్డుగా ఉన్న కొమ్మలను మాత్రమే తొలగించామని చెప్పారు.

(c) eenadu

తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

ఆదాయం పెంచుకునేలా శిక్షణ

మాట్లాడుతున్న మల్లికార్జునరావు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: పంచాయతీలు సొంత ఆదాయాలు పెంచుకునేలా మండల పరిషత్తు కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నియోజకవర్గ ప్రత్యేక అధికారి జీవీకే మల్లికార్జునరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీడీవో పీవీవీఎస్ రాంప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో వైవీఆర్‌వీ ప్రసాద్, సర్పంచులు, పంచాయతీ అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

యోగాలో ప్రతిభ కనబర్చిన గురువులు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ యోగా పోటీల్లో పలువురు జిల్లా ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారని మోదుగగుంట వ్యాయామ ఉపాధ్యాయుడు బడుగు చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం భీమవరం డీఎన్‌ఆర్ కళాశాలలో నిర్వహించిన పోటీలలో తనతో పాటు ఆరవల్లి, చెరుకువాడ పాఠశాలల ఉపాధ్యాయులు హేమలత, రమాదేవి ఎంపికయ్యారన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	99488 53114
తణుకు	85558 50851
తణుకు గ్రామీణం	63005 79402
అత్తిలి	91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ? బ్రహ్మానందరెడ్డి మార్కెట్ నుంచి సత్యనారాయణపేటకు వెళ్లే రహదారిలో కల్వర్టుపై ఫలకాలు పగిలి ప్రమాదకరంగా మారాయి.- **శ్రీను, స్థానికుడు**

✔ నూతన ఫలకాలు ఏర్పాటుకు చర్యలు చేపడతాం. - **ఏసుబాబు, పురపాలక కమిషనర్**

? కడకట్ల నూతన పైవంతెన నుంచి హౌసింగ్‌బోర్డుకాలనీకి వెళ్లే దారిలో డంపర్ బిన్ నిండి చెత్త రహదారిలోకి వస్తోంది.- **నాగేంద్ర**

✔ సమస్య పరిష్కరిస్తాం. - **సోమేశ్వరంవు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

పూడిక తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే: పడమర విప్పర్రు గ్రామంలో పలుచోట్ల ఉన్న డ్రెయినేజీలో పూడికను తొలగించారు. 'పూడిక తొలగక.. నీరు కదలక' శీర్షికన 12న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి శోభన్ స్పందించారు. బుధవారం సిబ్బందితో మురుగు తొలగించి, బ్లీచింగ్ చల్లించారు.

శత శాతం లక్ష్యం.. దీటుగా సన్నద్ధం

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థుల భవిష్యత్తుకు పదో తరగతి పరీక్షలు ఎంతో కీలకం కావడంతో.. మెరుగైన ఫలితాలు సాధించేలా విద్యాశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. గణితం, సైన్స్, ఆంగ్లం సబ్జెక్టులపై సంసిద్ధం చేయడంలో మరింత శ్రద్ధ తీసుకుంటున్నారు. చదువు ఒత్తిడి లేకుండా రోజూ 10 నిమిషాల పాటు మానసిక ప్రశాంతత చేకూరే అంశాలు, యోగా, ధ్యానం వంటి అంశాలను ప్రణాళికలో పొందుపరిచింది. దీనికి అనుగుణంగా అత్తిలి బాలికోన్నత జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. వివిధ మోడల్ పేపర్లతో ప్రాక్టీసు చేయిస్తున్నారు. దీనిపై ఓ ప్రత్యేక కథనం..

సందేహాల నివృత్తి..

ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించే ప్రత్యేక తరగతులకు క్రమం తప్పకుండా హాజరవుతున్నాం. ఉపాధ్యాయులు సబ్జెక్టుల్లోని సందేహాలు వెంటనే నివృత్తి చేస్తున్నారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించగలమనే నమ్మకం కలిగింది. - **మహాలక్ష్మి**

అందరి సహకారంతో..

ఏకాగ్రతతో చదివితే మనసులో నిక్షిప్తమై ఉంటాయన్న ఉద్దేశంతో తెల్లవారుజామున లేచి చదువుతున్నా. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకారంతో మంచి మార్కులు సాధించాలనే తపన పెరిగింది. - **అలకనంద**

మెలకువలతో

సబ్జెక్టులకు సంబంధించి ఉపాధ్యాయుల నేర్పించే మెలకువలు మంచి మార్కులు రావడానికి దోహదం అవుతాయి. భయపడితే నేర్చుకున్న అంశాలు మర్చిపోయే అవకాశం ఉంటుంది. అందుకే ఏ భయం లేకుండా ప్రశాంతంగా పరీక్షలకు హాజరవుతా. - **అవీల**

ప్రణాళికతో చదువుతున్నా..

పాఠశాలలో పది పరీక్షల కోసం ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సబ్జెక్టుల్లోని సందేహాలను వెంటనే నివృత్తి చేసుకోవడానికి స్టడీ క్లాసులు జరుపుతున్నారు. పది పాయింట్లు సాధించడం కోసం ప్రణాళిక ప్రకారం చదువుతున్నా. - **మధుశ్రీ**

ప్రత్యేక బోధన అందిస్తూ..

పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. నూరు శాతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నాం. ఈ సారి 62 మంది పరీక్షలు రాయబోతున్నారు. ఉపాధ్యాయులు సబ్జెక్టులపై పట్టు సాధించేలా ఉదాహరణలతో బోధన చేస్తున్నారు. - **విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు**

కమిటీల నిర్మాణంతో పార్టీ బలోపేతం

కార్యక్రమంలో పాల్గొన్న బాజ్జీ, నాయకులు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని గ్రామ, మండల, యూనిట్, క్లస్టర్, బూత్ ఇన్‌ఛార్జుల ప్రమాణస్వీకారం భవన నిర్మాణ, ఇతర కార్మికుల సంక్షేమ బోర్డు ఛైర్మన్ వలవల బాజ్జీ ఆధ్వర్యంలో తన విడిది కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఏపీ సైన్స్ అండ్ అకాడమీ ఛైర్మన్ జోన్-2 సమన్వయకర్త మందాలపు రవికుమార్, ఏపీఐఏసీ ఛైర్మన్, తెదేపా పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు పాల్గొన్నారు. బూత్ ఇన్‌ఛార్జులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మరో సారి సర్వే చేయండి

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: మొంథా తుపాను కారణంగా అత్తిలి మండలంలో దెబ్బతిన్న పంట పొలాల అంచనా సర్వే మరో సారి చేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని లక్ష్మీనారాయణపురం ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు వ్యవసాయాధికారులను కోరారు. బుధవారం అత్తిలి ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ మక్కా సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీటీసీ మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండలం అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడాలన్నారు. ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. వ్యవసాయాధికారి రాజేశ్ మాట్లాడుతూ.. మండలంలో దెబ్బతిన్న 750 ఎకరాల పంట నష్ట పరిహారం అంచనాలను పంపడం జరిగిందని, మళ్లీ సర్వే చేస్తామన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉపాధి అవకాశాలు

తాడేపల్లిగూడెం టౌన్, న్యూస్‌టుడే: విద్యతో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఐసీడీఎస్ పెంటపాడు మండల పర్యవేక్షణాధికారిణి సుజాత అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సంస్థాగతంగా తెదేపా పటిష్ఠం: ఆరిమిల్లి

రామరాజుకు కేకు తినిపిస్తున్న రాధాకృష్ణ

తణుకు, న్యూస్‌టుడే: భారతదేశంలో ఏ పార్టీకి లేని విధంగా సంస్థాగత నిర్మాణం కేవలం తెదేపా పార్టీలోనే ఉందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాలకు సంబంధించి కమిటీల ప్రమాణస్వీకార కార్యక్రమం స్థానిక వీకే కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలతో పాటు పట్టణంలో కమిటీలను నియమించడం జరిగిందన్నారు. జిల్లా తెదేపా అధ్యక్షులు మంతెన రామరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు ఏ ఇబ్బంది వచ్చినా రాధాకృష్ణ అండగా ఉంటారన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. గురువారం రామరాజు జన్మదినం పురస్కరించుకొని రాధాకృష్ణ కేకు కోశారు.

అయిదేళ్ల విధ్వంస పాలన

తణుకు, న్యూస్‌టుడే: అయిదేళ్ల వైకాపా పాలనలో జగన్‌మోహన్‌రెడ్డి విధ్వంసకర పాలన చేశారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏ ఆశయంతో అయితే ప్రభుత్వాన్ని ప్రజలు అధికారంలోకి తీసుకువచ్చారో అందుకనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమాన్ని అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని కొనియాడారు. రాబోయే ఆర్నెళ్లలో టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా ఇంటి స్థలం ఉన్న 111 మంది లబ్ధిదారులకు రూ.2.50 లక్షలతో ఇల్లు కట్టుకునేందుకు మంజూరు పత్రాలు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్, తణుకు ఏఎంసీ ఛైర్మన్ శివ, నాయకులు పాల్గొన్నారు.

వైకాపా ఇళ్ల స్థలాల పేరుతో దోపిడీ

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో వైకాపా నాయకులు పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపు పేరుతో దోపిడీకి పాల్పడ్డారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆరోపించారు. తేతలిలో నిర్మించిన నివాసాలను బుధవారం ఆయన గృహ ప్రవేశం చేసి మాట్లాడారు. ఇళ్లు లేని నిరుపేదల కలలు నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొందని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలు పునరావృతం కాకుండా కాలనీల్లో మెరుగైన సదుపాయాలు కల్పించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇళ్ల స్థలాలు ప్రభుత్వం కేటాయిస్తోందని రాధాకృష్ణ వెల్లడించారు.

సొంతింటి కల సాకారమే లక్ష్యం: బొలిశెట్టి

లబ్ధిదారులకు తాళం అందజేస్తున్న శ్రీనివాస్

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ప్రతి పేదవాడి సొంతింటి కలను సాకారం చేయడమే ఎన్డీయే లక్ష్యమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మోదుగగుంట గ్రామంలోని లబ్ధిదారులకు గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ సారథ్యంలోని పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. పెంటపాడు మండలంలోని చింతపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. నియోజకవర్గ భాజపా కన్వీనర్ ఈతకోట తాతాజీ, జడ్పీటీసీ సభ్యులు ముత్యాల అంజనేయులు, వెంకటేశ్వరరావు, వీరాజు ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

శుభ్రతతో ఆరోగ్యకర సమాజం

తణుకు, న్యూస్‌టుడే: పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం నెలకొల్పవచ్చని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ జిల్లా కోఆర్డినేటర్ రోహిత్ విద్యానంద్ అన్నారు. స్థానిక మహిళా కళాశాల ఆధ్వర్యంలో గోటేరులో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా రెండవ రోజు వాలంటీర్లు సచివాలయం, అంగన్‌వాడీలు స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ సిహెచ్.రమేశ్‌బాబు, శ్యామలాదేవి, వాలంటీర్లు పాల్గొన్నారు.

పని చేసే శ్రేణులకే పగ్గాలు

ఉండి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసే శ్రేణులకే పార్టీ పగ్గాలు అప్పగించిందని ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. తెదేపా ఉండి మండల నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా నియమితులైన కరిమెరక నాగరాజు, క్షేపల్లి సతీష్‌రాజులను ఆయన ఒక ప్రకటనలో అభినందించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలన్నారు.

మూర్తిరాజు సేవలు చిరస్మరణీయం

గణపవరం, న్యూస్‌టుడే: గాంధేయవాది, విద్యా దాత మూర్తిరాజు సమాజానికి అందించిన సేవలు చిరస్మరణీయమని ప్రధానాచార్యులు పి.నిర్మలకుమారి అన్నారు. స్థానిక శ్రీచింతలపాటి వరప్రసాద్ మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఆయన వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. మూర్తిరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

ఉంగుటూరు: బాదంపూడిలో పునర్నిర్మించిన భక్తాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 13 నుంచి 15 వరకు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నారు. 13న గణపతి పూజ, గ్రామోత్సవం, 14న పుణ్యాహవాచనం, మండప పూజ, 15న ఆలయ శిఖర, ధ్వజ, యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ చేపట్టనున్నారు.

శివయ్యకు ప్రత్యేక పూజలు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: కార్తిక మాసం పురస్కరించుకొని బుధవారం అత్తిలి ఉమాసిద్ధేశ్వరుడికి ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. అర్చకులు స్వామివారికి విశేష సేవలు చేశారు.

గంజాయి రవాణా కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

ఒక్కొక్కరికి రూ.లక్ష జరిమానా

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, పాతబస్టాండ్, న్యూస్‌టుడే: గంజాయి అక్రమంగా తరలిస్తూ పోలీసులకు చిక్కిన ఇద్దరికి పదేళ్ల జైలు, ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా అదనపు మొదటి సెషన్స్ జడ్జి పి.భాస్కరరావు తీర్పు వెల్లడించారని బుధవారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 2017 నవంబరు 30న విశాఖ నుంచి ఒడిశాలోని భువనేశ్వర్‌కు వెళ్తున్న రెండు కార్లను శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల పోలీసుస్టేషన్ పరిధి చిలకపాలెం పాత టోల్‌గేటు వద్ద పోలీసులు తనిఖీ చేయగా 200 కిలోల గంజాయి లభ్యమైంది. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పాత పట్టణానికి చెందిన ఇమంది వీర వెంకటసత్యనారాయణ, ఇమంది సాయి మధుసూదనరావులపై కేసు నమోదు చేశారు. విచారణలో వారిపై నేరం రుజువు కావడంతో జడ్జి శిక్ష ఖరారు చేశారని ఎస్పీ పేర్కొన్నారు.

జూద శిబిరంపై దాడి

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఉనికిలి గ్రామ శివారులో పొలాల మధ్య జూదం ఆడుతున్నారనే సమాచారంతో బుధవారం శిబిరంపై దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ.8950 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్సై ప్రేమరాజు తెలిపారు.

వైకాపా నాయకుల నిరసన

తణుకు, న్యూస్‌టుడే: జగన్‌మోహన్‌రెడ్డి అయిదేళ్లలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను తీసుకువచ్చి చరిత్ర సృష్టించారని మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు పేర్కొన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైకాపా ప్రజా ఉద్యమం పేరుతో తణుకులో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకుంటూ ముఖ్యమంత్రిగా చేసినా ఇంతవరకు ఒక్క ప్రభుత్వ వైద్య కళాశాల తీసుకురాకపోగా జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన కళాశాలలను ప్రైవేటు పరం చేయడం దుర్మార్గమన్నారు. 17 కళాశాలల్లో 5 కళాశాలలు అందుబాటులోకి రావడంతో పాటు వైద్య, విద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని, జగన్ అధికారంలో ఉంటే 17 కళాశాలలు పూర్తిగా అందుబాటులోకి వచ్చేవని ఆయన పేర్కొన్నారు. వైకాపా నాయకులతో పాటు, సీపీఎం, సీపీఐలు ర్యాలీగా వచ్చి తహసీల్దార్ కార్యాలయం సిబ్బందికి వినతి పత్రం అందజేశారు.

విరిగిన ఫలకాలు!

యాగర్లపల్లి(తాడేపల్లిగూడెం టౌన్), న్యూస్‌టుడే: స్థానిక యాగర్లపల్లి ఏరియాలోని రెండవ పైవంతెన ఫుట్‌పాత్ పలు చోట్ల సిమెంటు ఫలకాలు విరిగిపోయి రంధ్రాలు ఏర్పడ్డాయి. బ్రిడ్జిపై ఉదయం వ్యాయామం చేసే పాదచారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంతెన దిగి రోడ్డుపై నడవాల్సి రావడంతో వెనుక నుంచి వచ్చే వాహనాల ఒక్కసారిగా వస్తున్నాయి. దీంతో ప్రమాదం జరిగే ఆస్కారముంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అధికారులు సత్వరమే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కంచె లేని పరివర్తకం

హౌసింగ్‌బోర్డు కాలనీ (తాడేపల్లిగూడెం టౌన్) న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పట్టణంలో 35వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో వాటర్ ప్లాంట్ రోడ్డులోని పరివర్తకం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి ప్రమాదకరంగా తయారైంది. చుట్టూ కనీసం ఎలాంటి రక్షణ కంచె లేకపోవడంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇటుగా నిత్యం పాఠశాల బస్సులు, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రాంతంలో తరచూ పిల్లలు ఆటలు ఆడుతూ ఉంటారని, విద్యుత్తు తీగలు పిల్లలకు సైతం చేతికందేలా ఉన్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రారంభంలో గుర్తిస్తే కుష్ఠు నిర్మూలన

గోడపత్రికను ఆవిష్కరించిన రవిబాబు, వైద్యులు

తణుకు, న్యూస్‌టుడే: 2027 నాటికి కుష్ఠును పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రభుత్వ పనిచేస్తోందని జిల్లా అదనపు వైద్యాధికారి రవిబాబు అన్నారు. బుధవారం తణుకు జిల్లా ఆసుపత్రిని ఆయన సందర్శించి మాట్లాడారు. జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రతి ఆరోగ్య కార్యకర్త ఇంటింటికి వెళ్లి స్పర్శ లేని మచ్చలు ఉన్న వారిని గుర్తించి అనుమానితుల పేర్లను నమోదు చేస్తారన్నారు. ప్రారంభ దశలో మచ్చలు గుర్తిస్తే కుష్ఠు వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చన్నారు. కేంద్ర, రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ప్రపంచ ఆరోగ్య సంస్థ సంయుక్తంగా కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు.

ముందస్తు జాగ్రత్తలే కీలకం

కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాగబాబు

తణుకు, న్యూస్‌టుడే: ముందస్తు జాగ్రత్తలతోనే కాలానుగుణ వ్యాధులను కట్టడి చేయగలమని జిల్లా అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి (డిపిఎంఓ) నాగబాబు అన్నారు. బుధవారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తణుకు సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావుతో కలిసి సందర్శించారు. వెక్టర్ బోర్న్ డిసీజెస్ ప్రోగ్రామ్ అమలవుతున్న విధానాన్ని మండల వైద్యాధికారి సాయి గిరిరెడ్డిని అడిగి తెలుసుకుని, దస్త్రాలను పరిశీలించారు. డెంగీ, మలేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ల్యాబ్ టెక్నీషియన్ ఆర్‌వీఎస్‌ఎన్ మూర్తి, ఫార్మసిస్ట్ బీఎన్‌ఎల్ కుమారి, స్టాఫ్ నర్సు జీటీవీ లక్ష్మి, పూర్ణిమ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

తణుకు, న్యూస్‌టుడే: ఈ నెల 14 నుంచి 20 వరకు స్థానిక మహిళా శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారిణి ప్రవీణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14న బాలల దినోత్సవం, గ్రంథాలయ వారోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, నీతి కథలపై స్టోరీ టెల్లింగ్ పోటీలు, 16న చదవడం మాకిష్టం కార్యక్రమంతో పాటు, గ్రంథాలయ ఉద్యమంలో ప్రముఖులకు నివాళులర్పించుడం, 17న మీకిష్టమైన పండగపై వ్యాసరచన పోటీలు, 18న స్వచ్ఛ భారత్ అభియాన్‌పై చిత్రలేఖనం పోటీలు, 19న మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఆటల పోటీలు నిర్వహణతో పాటు మహిళ చట్టాలు, ఆరోగ్యంపై అవగాహన, 20న డిజిటల్ గ్రంథాలయాల వినియోగంపై అవగాహన, గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమం ఉంటుందని వివరించారు.

ఇరగవరం, న్యూస్‌టుడే: రేలంగి శాఖా గ్రంథాలయంలో 14 నుంచి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలను గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సహకారంతో నిర్వహిస్తామని గ్రంథాలయాధికారిణి సీతారామలక్ష్మి బుధవారం తెలిపారు.

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఈ నెల 14 నుంచి గ్రంథాలయ జాతీయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తాడేపల్లిగూడెం ప్రథమ శ్రేణి గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ వారోత్సవాలు 20 వరకు జరుగుతాయని దీనిలో భాగంగా వివిధ అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామని తెలిపారు. విశ్రాంత ఉద్యోగులు జాన్‌బాబు, లక్ష్మణరావు, ఆంజనేయులు, జనార్దనరావు, సత్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

అవి ఇవి అన్నీ

హక్కులపై అవగాహన

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: బాలికలు చదువులో ముందంజలో ఉండాలని ఐసీడీఎస్ సెక్టారు సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి సూచించారు. బుధవారం వెంకట్రామన్నగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో- బేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. బాలికలకు హక్కులపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళిక తయారు చేసుకోవాలి

ఇరగవరం, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీలు సొంతంగా అభివృద్ధి ప్రణాళిక తయారు చేసుకోవాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో రంగమ్మరెడ్డి అన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో 'పంచాయతీల్లో సొంత ఆదాయ వనరుల పెంపుదల' అంశంపై సర్పంచి, కార్యదర్శులకు నిర్వహించిన రెండ్రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఆమె మాట్లాడుతూ.. పంచాయతీ బలాలు, బలహీనతలు విశ్లేషణ చేసి.. వాటిని అధిగమించేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. డిప్యూటీ ఎంపీడీవో పీవీ నరసింహమూర్తి మాట్లాడారు.

10 సొసైటీల్లో కొనుగోలు కేంద్రాలు..

ఇరగవరం, న్యూస్‌టుడే: మండలంలో 10 సొసైటీల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని వ్యవసాయాధికారి రాఘవేంద్రరావు బుధవారం చెప్పారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి సంచులు అందుబాటులో ఉన్నాయన్నారు. ట్రక్ షీట్ నమోదు చేసిన తర్వాత ఈకేవైసీ చేయించుకోవడంతో ధాన్యం మిల్లుకు చేరిన 48 గంటల్లో సొమ్ము ఖాతాకు జమ అవుతుందన్నారు.

ఆర్టీసీ బస్సులకు స్పందన

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా భక్తుల నుంచి ఆర్టీసీ బస్సులకు విశేషమైన ఆదరణ లభిస్తుందని డిపో మేనేజర్ దానమ్మ తెలిపారు. తాడేపల్లిగూడెం నుంచి వివిధ పుణ్య క్షేత్రాల సర్వీసులు నిర్వహిస్తున్నామని వివరించారు.

శునకాలు పట్టుకునే బృందం ఏర్పాటు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: పురపాలక కార్యాలయంలో పారిశుద్ధ్య పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ ఏసుబాబు సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. బస్టాండ్, రైల్వేస్టేషన్, పాఠశాలలు, ఆసుపత్రుల ప్రాంతాల్లో సంచరిస్తున్న శునకాలను పట్టుకునేందుకు బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సహాయ కమిషనర్ సుల్తానా బేగం, పురపాలక ఆరోగ్యాధికారి రాజు, ఏఈ హరీశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మహాసభల విజయవంతానికి పిలుపు

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: విశాఖపట్నం వేదికగా డిసెంబరు 31 నుంచి నాలుగు రోజులపాటు నిర్వహించనున్న సీఐటీయూ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ నాయకులు కోరారు. నిడమర్రు, బువ్వనపల్లి గ్రామాల్లో బుధవారం ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు రమణారావు, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ కాలనీ.. సమస్యల నివాసం..!

పెరిగిన పిచ్చి మొక్కలు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: కొండ్రుప్రోలు శివారు భగత్ సింగ్ కాలనీ సమస్యలకు నిలయంగా మారింది. సుమారు రెండు వేల జనాభా ఉన్న కాలనీలో అంతర్గత రహదారులు లేక అవస్థలు పడుతున్నారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం సమస్యలు వేధిస్తున్నాయని వాపోతున్నారు. మురుగు బోదెల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో దోమలు వృద్ధి చెంది కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని పలువురు ఆవేదన చెందుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

రోగాల బారిన..

ట్యాంకర్ రోజు విడిచి రోజు రావడంతో నీటి కొరత ఏర్పడుతుంది. దీంతో ప్రైవేట్ నీటి శుద్ధి కేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తోంది. డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకుపోవడంతో ఎక్కడికక్కడ మురుగు నిలిచిపోతోంది. - **వేగల దుర్గ, స్థానికురాలు**

చిట్టడివిని..

నివాసాల మధ్య పిచ్చి మొక్కలు, పొదలు పెరిగి చిట్టడివిని తలపిస్తోన్నాయి. దీంతో విష సర్పాలు నివాసాల్లోకి చొచ్చుకొస్తున్నాయి. రాత్రి సమయాల్లో బయట తిరగాలంటే భయభ్రాంతులకు గురవుతున్నాం. - **సారమ్మ, స్థానికురాలు**

మౌలిక వసతులకు కృషి చేస్తాం..

మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తాం. తాగునీటికి అదనపు ట్యాంకర్లు ఏర్పాటు చేస్తాం. అన్ని రకాల సమస్యలు పరిష్కరిస్తాం. - **శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి**

నిర్మాణం పూర్తి.. ప్రారంభానికి సుస్తీ

తణుకు, న్యూస్‌టుడే: తణుకు పట్టణం సంత మార్కెట్‌లో ఉన్న చేపల ఆధునికీకరణ మార్కెట్ నూతన భవనం పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో విక్రయాలు రహదారుల పక్కన వ్యాపారంచేసుకోవాల్సి వస్తోందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో ఆదివారం సంత మార్కెట్‌లో ఈ భవన నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ, తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం దీనిని పూర్తిగా విస్మరించింది.

సమస్య తగ్గుతుంది

ఈ ప్రాంతంలోనే ఆదివారం సంత, చేపల, పండ్ల మార్కెట్లు ఉండటంతో తణుకుతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు వందల సంఖ్యలో వస్తుంటారు. దీంతో ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కు చోటు లేక వ్యాపారులు, వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. భవనం ప్రారంభమైతే ఈ సమస్య తగ్గుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అధికారులు స్పందించి మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని వ్యాపారస్థులు, వినియోగదారులు కోరుతున్నారు.

చేపల మార్కెట్ భవనం

తీవ్రంగా నష్టం..

చేపల మార్కెట్ భవనం పూర్తయి సుమారు రెండేళ్లు కావస్తున్నా.. ఇప్పటికీ ప్రారంభించక పోవడంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ వ్యాపారాలు సాగిస్తున్నాం. వర్షానికి మార్కెట్ రోడ్లన్నీ బురదమయం అవ్వడంతో వినియోగదారులు రాక, కొనుగోలు చేసిన సరకు అమ్ముడు పోక తీవ్రంగా నష్టపోతున్నా. - **కొప్పిశెట్టి శ్రీనివాస్, చేపల వ్యాపారి**

ఏర్పాటు చేస్తున్నాం.. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్‌ను సంప్రదించగా. . భవనానికి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నాం. త్వరలోనే ప్రారంభించడానికి చర్యలు చేపడతామన్నారు.

(c) eenadu

దేవగుడిపల్లికి చంద్ర కాంతులు

చిన్నమండెం, రాయచోటి, రామాపురం, న్యూస్‌టుడే: 'ప్రజలు కులం, మతం, ప్రాంతం అని చూడకుండా అభివృద్ధి నిరంతరం కొనసాగేందుకు మద్దతుగా నిలవాలి' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం దేవగుడిపల్లిలో పేదల ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో ఆయన బుధవారం పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లబ్ధిదారులకు తాళాలు అందిస్తున్న సీఎం చంద్రబాబు

హెలికాప్టర్ దిగి అభివాదం చేస్తున్న సీఎం

నూతన గృహ ప్రవేశం అనంతరం లబ్ధిదారు ముంతాజ్‌తో చిరు దరహాసం

ముస్లిం చిన్నారులతో ముఖ్యమంత్రి ముచ్చట్లు

ప్రజా వేదికలో మాట్లాడారు. ఇవీ ఆ వివరాలు.. ● రాయచోటి ప్రాంతానికి సాగు, తాగునీటి కష్టాలు లేకుండా చూస్తాం. ● వెలిగల్లు ప్రాజెక్ట్ కింద అన్ని చెరువులను నీటితో నింపేలా కలెక్టర్‌కు అనుమతిచ్చాం. ● శ్రీనివాసపురం రిజర్వాయర్‌ను హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా నింపి చిత్తూరుకు నీరు తీసుకెళ్తాం. ● నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా తాగు నీరు అందిస్తాం. రాయచోటి నియోజకవర్గంతో పాటు తంబళ్లపల్లె, పీలేరు, రాయచోటి పురపాలకకు తాగునీరందిస్తాం.

● **సాదర స్వాగతం:** ఉదయం 11.40 గంటలకు హెలికాప్టర్‌లో సీఎం చిన్నమండెం చేరుకున్నారు. మంత్రులు పార్థసారథి, రాంప్రసాద్ రెడ్డి, కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్, ఎమ్మెల్యేలు అరవ శ్రీధర్, నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, తెదేపా నేత చమర్తి జగన్‌మోహన్‌రాజు, తితిదే బోర్డు మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్‌రాయుడు స్వాగతం పలికారు.

● **మార్గదర్శకులకు బాధ్యతలు :** ● దేవగుడిపల్లిలో లబ్ధిదారులతో ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా ఇళ్లల్లోకి సీఎం గృహ ప్రవేశం చేయించారు. గ్రామస్థులను ఆప్యాయంగా పలకరించారు. అంతకు ముందు ప్రజా వేదికలో లబ్ధిదారులకు ఇంటి తాళాలతో పాటు ఎనర్జీ సేవింగ్ పరికరాలను అందజేశారు. ● 54 బంగారు కుటుంబాల బాధ్యతను 13 మంది మార్గదర్శకులకు అప్పగించారు. ● సీఎం పర్యటన ఆద్యంతం పలకరింపులు, చలోక్తులతో సాగింది.

తమకు అందించిన ఇళ్ల పట్టాలతో సభలో పాల్గొన్న మహిళా లబ్ధిదారులు

రాజీవ్ కాలనీలో మహిళలతో మాటామంతీ

ఆ మాజీనే అడవి దొంగ

ఈనాడు, కడప: అటవీ ప్రాంతంలోకి అక్రమ ప్రవేశం.. ఆపై సంపదకు నష్టం కలిగించడం.. ఆక్రమణలకు పాల్పడటంపై కఠినమైన చట్టాల కింద చర్యలకు గురికావాల్సి ఉంటుంది. ఇవన్నీ లెక్క చేయని వైకాపాకు చెందిన మాజీ ప్రజాప్రతినిధి అడవిని చెరబట్టారు. భూముల్ని ఆక్రమించి సాగు చేపట్టారు. ఈ చర్యలపై జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్‌జీటీ) స్పష్టమైన ఆదేశాలిచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదు.

వైకాపా మాజీ ప్రజాప్రతినిధి అటవీ భూమిలో సాగు చేసిన మామిడి పంట

ఇదీ విషయం: మైదుకూరు మండలం నంద్యాలంపేట రెవెన్యూ గ్రామం 507లో 267.56 ఎకరాలు, 506/బిలో 38.94 ఎకరాల భూముల్ని వైకాపాకు చెందిన మాజీ ప్రజాప్రతినిధి ఆక్రమించుకుని మామిడి తోట సాగు చేశారు. అతని చెరలో మొత్తం 306.5 ఎకరాలుంది. ఆక్రమిత భూమిలో సాగుకు బోర్ల తవ్వకం చేపట్టారు. విద్యుత్తు కనెక్షన్లు పొందారు. ప్రభుత్వ రాయితీ కింద బిందు సేద్యం పరికరాలు కూడా తీసుకున్నారు. వైకాపా హయాంలో అటవీ శాఖ ఉన్నతాధికారి ఒకరు అతని అక్రమానికి సహకరించారు.

ఆదేశాలున్నా ఏవీ చర్యలు: అటవీ భూముల ఆక్రమణపై మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్‌జీటీ)ను ఆశ్రయించారు. విచారణ చేపట్టిన ట్రైబ్యునల్ భూమిని స్వాధీనం చేసుకోవాలంటూ 2023 సెప్టెంబరు 2న ఆదేశాలిచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. భూముల స్వాధీనంతో పాటు భవిష్యత్‌లో ఆక్రమణలకు తావు లేకుండా ట్రెంచ్ తవ్వకాలు చేపట్టాలని అటవీ శాఖ అధికారులను అప్పటి కలెక్టర్ ఆదేశించారు. వైకాపా ప్రభుత్వంలో ఇవేమీ అమలు కాలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదు.

అన్ని గ్రామాలకు అంతర్జాలం

అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ శ్రీధర్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని గ్రామాలకు అంతర్జాలంతో పాటు టెలిఫోన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. కలసపాడు మండలం ముదిరెడ్డిపల్లెకు చెందిన ఆర్మీ ఉద్యోగి శ్రీనివాసులు తమ గ్రామంలో ఇంటర్నెట్ సౌకర్యం లేదంటూ మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులతో కడపలోని తన క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ బుధవారం సమీక్షించారు. మారుమూల గ్రామాల్లో అంతర్జాలం, టెలిఫోన్ సౌకర్యం లేక సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యార్థులకు సాంకేతిక విద్య అందనంత దూరంలో ఉంటున్న నేపథ్యంలో అన్ని ప్రాంతాలకు అంతర్జాల సౌకర్యం కల్పించాలని స్పష్టం చేశారు. సమీక్షలో కలెక్టరేట్ ఏవో విజయ్‌కుమార్, నెట్‌వర్క్ ప్రొవైడర్లు రాంప్రకాశ్, వెంకటేశ్, మణికందన్ తదితరులు పాల్గొన్నారు.

పులుల గణనపై శిక్షణ

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: పులుల గణనపై కడప, కర్నూలు, నంద్యాల అటవీ విభాగాలకు చెందిన సిబ్బందికి కడప నగర వనంలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా M-STrIPES మొబైల్ యాప్ ద్వారా పులుల జాడను నమోదు చేసే విధానం, జీపీఎస్ ఆధారిత ట్రాకింగ్ పద్ధతులు, క్షేత్రస్థాయి సర్వేలో ఉపయోగపడే సాంకేతిక అంశాలపై కడప డీఎఫ్‌వో వినీత్ కుమార్ వివరించారు. అటవీ ప్రదేశాల్లో పనిచేసే ప్రతి సిబ్బందికి ఈ రకమైన శిక్షణ అత్యవసరమన్నారు. శాస్త్రీయ పద్ధతులతో వన్యప్రాణి సంపదను కాపాడగలుగుతామని చెప్పారు.

మాట్లాడుతున్న కడప డీఎఫ్‌వో వినీత్ కుమార్

ఉప్పొంగె గంగ.. తీరంగ బెంగ

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: నాలుగు నెలల కిందట నెర్రెలిచ్చిన నేలతో కర్షకులు క'న్నీటి' కష్టాలు ఎదుర్కొన్నారు. సాగు చేసిన పంటలను కాపాడుకోవడానికి తంటాలు పడ్డారు. పాతాళం వైపు గంగమ్మ పరుగులు తీసింది. 600-800 అడుగుల లోతు తవ్వినా బోర్లు నీరిచ్చింది లేదు. గత రెండు నెలల్లో కరవు తీరా వర్షాలు కురిశాయి. దీంతో జలఘోష తీరింది. తాగు, సాగునీటికి తాత్కాలికంగా ఇక్కట్లు తప్పాయి. కొన్నిచోట్ల వ్యవసాయ గొట్టపు బావుల్లో నీరు ఎగిసి పడుతోంది. వాగులు, వంకలు పొంగి పరవళ్లు తొక్కుతున్నాయి. చెక్‌డ్యాంలు కుంటలు నిండాయి. చెరువులు జలకళ సంతరించుకున్నాయి. నదులు గలగలా ప్రవహిస్తున్నాయి.



● జిల్లాలో ఈ ఏడాది జూన్ నుంచి అక్టోబరు వరకు సాధారణ వర్షపాతం 535.1 మి.మీ.

● వర్ష సంవత్సరం తొలి రెండు నెలల్లో ఆశించినరీతిలో వరుణుడు కరుణించలేదు.

● ఆగస్టులో సాధారణ వర్షపాతం నమోదైంది.

● సెప్టెంబరు, అక్టోబరులో వర్షాలు విస్తారంగా కురిశాయి.

● మొత్తంమ్మీద అయిదు మాసాల్లో 624.1 మి.మీ వర్షపాతం నమోదైంది.

● జిల్లాలో చెరువులు: 400
● పూర్తిగా నిండినవి: 241 (వీటిలో చిన్న, మధ్యతరహా, పెద్ద జలాశయాలు 11)
● మొత్తం నీటి నిల్వ సామర్థ్యం: 77.288 టీఎంసీలు
● ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు: 70.441 టీఎంసీలు

● పెన్నానది, కుందూ, చిత్రావతి, పాపఘ్ని, సగిలేరు గలగలా ప్రవహిస్తున్నాయి. ● సెప్టెంబరులో నీటి మట్టాలు సగటున 10.62 మీటర్లుంటే.. అక్టోబరులో 8.50 మీటర్లకు చేరాయి. ● విస్తారంగా కురిసిన వర్షాలతో జిల్లాలో 2.12 మీటర్ల మేర నీటిమట్టాలు పెరిగినట్లు భూగర్భ జల గణన శాఖ జిల్లా అధికారి మురళీధర్ తెలిపారు.

చిత్రావతి.. మరువలేని స్మృతి

ఓ వైపు నింగిని తాకేలా పచ్చని కొండలు.. మరోవైపు పరవళ్లు తొక్కుతున్న కృష్ణా జలాలు.. చిత్రావతి నదిలో నిటారుగా నిలిచి కనువిందు చేస్తున్న తాటి చెట్లు.. ప్రకృతి ఒడిలో సాగే ఈ రైలు ప్రయాణం మరపురాని జ్ఞాపకంగా మదిలో చూసే వారికి నిలిచిపోతుంటుంది. ఈ దృశ్యాలు జిల్లా సరిహద్దు ప్రాంతమైన కొండాపురంలోని చిత్రావతి రైల్వే వంతెన వద్ద కనువిందు చేస్తుంటాయి. రైలు నిలయం సమీపంలో ట్రాక్ యూ ఆకారంలో ఉండి ఆకట్టుకుంటుంది. **- న్యూస్‌టుడే, కొండాపురం**

నిర్వాసితులకు రూ. 3.22 కోట్ల పరిహారం

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: గండికోట జలాశయం ముంపు గ్రామమైన కొండాపురం మండలం కె.బొమ్మపల్లె నిర్వాసితులకు పరిహారం మంజూరు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు ఇచ్చింది. భూమికి సంబంధించిన రూ. 3,22,50,000 నిధులను మంజూరు చేస్తున్నట్లు జీవో 2798 ద్వారా తెలిపింది. నిర్వాసితులకు అదనపు నిధులు ఇస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఇంతింతై.. స్త్రీశక్తి 5 కోట్ల అంతై

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: 'కూటమి ప్రభుత్వం పెట్టిన స్త్రీశక్తి పథకం ద్వారా ఉచిత ప్రయాణంతో మహిళలు ఆలయాలు, పుణ్యక్షేత్రాలను సందర్శించుకుంటున్నారు' అని కడప ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూలనాగరాజు అన్నారు. కడపలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ వివరాలు..

కడప ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు

● కడప ఆర్టీసీ జోన్ (కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు) పరిధిలో నాలుగు వేల బస్సులు నడుస్తున్నాయి. ● జోన్ పరిధిలో ప్రతిరోజు 2,921 వరకు మహిళలకు తిప్పుతున్నారు. ● జోన్ వ్యాప్తంగా నెలకు రూ. 390 కోట్లు ఆదాయం సమకూరుతోంది. ● స్త్రీశక్తి పథకానికి జోన్ వ్యాప్తంగా అక్టోబరు వరకు రూ. 207 కోట్లను ప్రభుత్వం వెచ్చించింది. ● ఆగస్టు 15 నుంచి అక్టోబరు వరకు జోన్ పరిధిలో అయిదు కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ● నానాటికీ రద్దీ పెరుగుతున్న దృష్ట్యా జోన్‌కు మరో 1,000 కొత్త బస్సులు వచ్చే అవకాశం ఉంది. ● స్త్రీశక్తి పథకంతో ఒక్కో కుటుంబానికి నెలకు రూ. 5 వేల వరకు ఆదా అవుతోంది. ● కార్తిక మాసం సందర్భంగా జోన్ వ్యాప్తంగా వంద బస్సులు నడుపుతున్నాం. రూ. 5 కోట్ల ఆదాయం వచ్చింది. ● త్వరలో ఆర్టీసీలో కొత్త ఉద్యోగాల నియామకాలు చేపడతాం.

ఏసీ బస్సా! సుత్తుందా!!

సుత్తితో అద్దాలు పగలగొట్టే తీరును వివరిస్తున్న బస్సు డ్రైవర్

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: కర్నూలు సమీపంలో ఇటీవల చోటుచేసుకున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదం తర్వాత ప్రయాణికులు భద్రతపై ఆలోచిస్తున్నారు. రవాణా శాఖ అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేలా.. అనివార్య పరిస్థితులు తలెత్తితే ఎదుర్కొనేలా చర్యలు చేపడుతున్నారు. ఆపదలో తీసుకోవాల్సిన చర్యలపై ఏసీ బస్సుల ప్రయాణికులకు ఆర్టీసీ, ప్రైవేట్ బస్సు డ్రైవర్లతో అవగాహన కల్పిస్తున్నారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే బస్సులో ఉండే సుత్తితో అద్దాలను పగలగొట్టి బయట పడొచ్చంటూ వివరిస్తున్నారు. ప్రయాణికులు కూడా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుపుతున్నారు. ఇవీ ఆ విషయాలు..

● ఏసీ బస్సులు ఎక్కగానే చరవాణుల హెడ్‌ఫోన్లు పెట్టుకోవద్దు. ఒక్కసారి బస్సును క్షుణ్నంగా పరిశీలించాలి. అత్యవసర ద్వారం ఎక్కడుందో గమనించాలి. సుత్తి ఉందో లేదో చూడాలి. లేకుంటే వెంటనే డ్రైవర్‌కు తెలపాలి.
● ఒకవేళ ప్రమాదం చోటు చేసుకుంటే బ్యాగులు, లగేజీ కోసం చూడొద్దు. పొగ వస్తే వెంటనే కిందకు వంగి ముక్కుకు వస్త్రాన్ని అడ్డుగా కట్టుకోవాలి. అత్యవసర ద్వారం వద్దకు వెళ్లి సుత్తితో అద్దాన్ని పగలగొట్టాలి.

రెండు జిల్లాలకు 1,140 టన్నుల యూరియా

కడప రైల్వేస్టేషన్‌లో వివరాలు తెలుసుకుంటున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రానాయక్

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: రెండు జిల్లాలకు 1,140 టన్నుల యూరియా వచ్చింది. కడప రైల్వేస్టేషన్‌కు ర్యాక్‌లో వచ్చిన యూరియా వివరాలను కడప జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రానాయక్ బుధవారం పరిశీలించారు. కడపకు వచ్చిన 942 టన్నుల్లో ప్రైవేట్ డీలర్లకు 342, మార్క్‌ఫెడ్‌కు 600 టన్నులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లాకు సంబంధించి వచ్చిన 198 టన్నుల్లో ప్రైవేట్ డీలర్లకు 60, మార్క్‌ఫెడ్‌కు 138 టన్నులు కేటాయిస్తున్నట్లు ఆయన వివరించారు.

మైనర్లే.. వాహన చోరులు

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: హోటళ్లు, రెస్టారెంట్లు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, మార్కెట్లతో పాటు రహదారుల వెంట, ఇళ్ల ఎదుట నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలపై కన్నేస్తారు. ఆ తర్వాత వాటిని మాయం చేస్తారు. జిల్లా వ్యాప్తంగా ఈ తరహా కేసులు నెలకు సుమారు 10 నుంచి 15 వరకు అధికారికంగా నమోదవుతున్నాయి. ఫిర్యాదుల వరకు రానివి మరెన్నో ఉంటున్నాయి. ఈ చోరీలకు పాల్పడుతున్నది ఏ గజదొంగలో అనుకుంటే పొరపాటు. జల్సాలకు అలవాటు పడి, గంజాయి, మద్యానికి బానిసలై, చెడు స్నేహాలతో కొందరు చిన్నారులు చోరులుగా మారారు. సులువుగా డబ్బులు సంపాదించాలని వాహనాల చోరీకి పాల్పడుతున్నారు. ఇటీవల కాలంలో పోలీసులకు చిక్కిన వారిలో మైనర్లే ఉండటం ఇందుకు నిదర్శనం. ఈ పరిణామం ఇప్పుడు కలవర పరుస్తోంది. తమ పిల్లల కదలికలు, వ్యవహార శైలిపై తల్లిదండ్రులు తరచూ ఓ కన్నేసి ఉంచాల్సిన అవసరాన్ని ఎత్తి చూపుతోంది.

జిల్లాలో చోరీకి గురైన వాహనాల వివరాలు...

సంవత్సరం	వాహనాల సంఖ్య
2022	112
2023	129
2024	105
2025 (సెప్టెంబరు	15 వరకు) 65

ఇటీవల పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు(పాత చిత్రం)

సంకల్ప్ సిద్ధిరస్తు

పది, ఇంటర్ ఫలితాల మెరుగుకు ప్రత్యేక కార్యక్రమం

యర్రగుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులు

కడప విద్య, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా గతేడాది పదో తరగతిలో ఉత్తీర్ణతా శాతం తగ్గింది. మెరుగుకు ఈ విద్యాసంవత్సరం ఏం చేయాలి? సంకల్ప్ కార్యక్రమం అమలుతో గతంతో పోలిస్తే గతేడాది ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతా శాతం స్వల్పంగా పెరిగింది. ఇప్పుడు అదే ఒరవడి కొనసాగుతుందా? ఇవీ పదో తరగతి, ఇంటర్మీడియట్‌కు సంబంధించి ప్రస్తుతం ఉత్పన్నమవుతున్న ప్రశ్నలు. ఓ వైపు మెగా డీఎస్సీ-25 నియామకాలతో పాఠశాలల్లో కొత్త ఉపాధ్యాయుల సందడి కనిపిస్తోంది. అదే సమయంలో మరోవైపు ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ ఉపాధ్యాయుల కొరత పదో తరగతి విద్యార్థులపై ఏ మేరకు ప్రభావం చూపనుందోనన్న భయం వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పటి నుంచే విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి పరీక్షకు సిద్ధం చేయాల్సి ఉంది.

● **అధ్యాపకులకు బాధ్యతలు:** సంకల్ప్ కార్యక్రమ అమలుతో గతేడాది ఫలితాల్లో మెరుగుదల కనిపించింది. దీంతో ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచీ అమలు చేస్తున్నారు. విద్యార్థులను అధ్యాపకులు దత్తత తీసుకుంటారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా బాధ్యత వహిస్తారు. చదువులో వెనకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. అందుకు అనుగుణంగా కళాశాలల నిర్వహణ సమయాలనూ మార్చారు. పూర్తిస్థాయిలో అమలు చేస్తే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ ఏడాది ఉత్తీర్ణతా శాతం మరింత పెరిగే అవకాశాలుంటాయి.

● జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులు: 14,986
● బాలురు: 6,740 మంది
● బాలికలు: 8,246 మంది
● ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు: 5,529 మంది
● బాలురు: 2,134 మంది
● బాలికలు: 3,395 మంది

2022 నుంచి పది పరీక్షా ఫలితాలు..

సంవత్సరం	ఉత్తీర్ణతా శాతం
2022	71.03
2023	79.43
2024	92.1
2025	80.78

2022 నుంచి ఇంటర్మీడియట్ ఫలితాలు..

మొదటి సంవత్సరం	
సంవత్సరం	శాతం
2022	41
2023	46
2024	55
2025	61
ద్వితీయ సంవత్సరం	
2022	50
2023	60
2024	69
2025	75

దొంగ పట్టాల భరతం పడదాం

సీకే దిన్నె భూములపై కదలిక
విచారణ చేపట్టిన యంత్రాంగం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో అక్రమార్కులు రెచ్చిపోయారు. జిల్లా కేంద్రమైన కడపలో కలిసిపోయిన చింతకొమ్మదిన్నె మండలంలోని ప్రభుత్వ భూములపై కన్నేసి ఆక్రమించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని దొడ్డి దారుల్లో దొంగ పట్టాలు సృష్టించుకున్నారు. ప్రభుత్వం మారిన తర్వాత వీటిపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో జిల్లా అధికార యంత్రాంగం కన్నెర్ర చేస్తోంది. ఆక్రమణలకు గురైన భూములపై దృష్టిసారించింది. రహస్యంగా విచారణ చేపట్టింది. సుమారు 200 పట్టాల వరకు దొంగవి ఉన్నట్లు గుర్తించింది. అందులో 65 పట్టాలపై చర్యలకు సన్నద్ధమవుతోంది.

● **మరో 100పై విచారణ:** చింతకొమ్మదిన్నె మండలం జిల్లా కేంద్రమైన కడపలో కలిసిపోయి ఉంటుంది. దీంతో ఇక్కడి భూములు బహిరంగ మార్కెట్‌లో మంచి ధర పలుకుతున్నాయి. గత పాలకుల హయాంలో వీటిని విచ్చలవిడిగా ఆక్రమించారు. వచ్చిన ఫిర్యాదులపై కలెక్టర్ శ్రీధర్ విచారణకు ఆదేశించారు. అందులో భాగంగా కడప ఆర్డీవో ఆధ్వర్యంలో విచారణ చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 65 పట్టాలు దొంగవిగా, అక్రమంగా, అధికారాన్ని అడ్డుపెట్టుకుని సంపాదించినట్లు గుర్తించగా.. మరో వంద పట్టాల పైనా విచారణ సాగుతోంది. పూర్తిస్థాయి నివేదికల అనంతరం వీటిపై చర్యలకు ఉపక్రమించనున్నట్లు తెలుస్తోంది.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి : 99899 97626

కిడ్నీ రాకెట్‌లో వైద్యాధికారే సూత్రధారి

మదనపల్లెలో వెలుగు చూసిన కిడ్నీ రాకెట్‌లో ప్రధాన సూత్రధారి, పాత్రధారి జిల్లా వైద్యశాలల సమన్వయ అధికారి ఆంజనేయులు కావడం సంచలనం రేకెత్తించింది. మొత్తం ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేయగా ఇతనే ఏ-1 కావడం గమనార్హం. జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో అక్రమాలు జరగకుండా అడ్డుకోవాల్సిన బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వైద్యుడే దీని వెనుక నిలవడం జిల్లా మొత్తం ఒక్కసారిగా ఉలిక్కి పడేలా చేసింది. గ్లోబల్ ఆసుపత్రిలో ముగ్గురు వైద్యులు ఉండగా ఒక్క వైద్యుడిపైనే కేసు నమోదు చేయడంపై కూడా పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇతర వైద్యుల హస్తం ఉన్నా ఒక్కరినే బాధ్యుడిని చేయడం వెనుక అంతర్యమేమిటనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. - న్యూస్‌టుడే, మదనపల్లె వైద్యం

◆ మరికొందరు వైద్యుల ప్రమేయం

◆ కేసు నీరుగార్చేందుకు తీవ్ర యత్నాలు

● సాధారణంగా అన్ని ప్రైవేటు ఆసుపత్రులపై జిల్లా వైద్యశాఖ అధికారులు, స్థానిక వైద్యాధికారులు నిఘా వేసి పరిశీలించాల్సి ఉంది. అయితే ఏదైనా ప్రమాదకర సంఘటన జరిగిన సమయంలో తప్ప మిగతా సమయాల్లో తనిఖీల ఊసెత్తడం లేదు. ఇదే అదునుగా జిల్లాలో కొన్ని ప్రైవేటు వైద్యశాలలు అక్రమాలకు తెరలేపుతున్నాయి.

● మదనపల్లె నుంచి 900 కిలోమీటర్ల దూరంలో ఉన్న విశాఖపట్నం వాసులతో ఇక్కడున్న వారు పరిచయాలు పెంచుకుని కిడ్నీ అక్రమ రవాణా రాకెట్‌ను నిర్వహించారని బయట పడటంతో దీని వెనుక ఇంకా ఎంతమంది ఉన్నారోనని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

● ఒకప్పుడు హైదరాబాదు, విశాఖపట్నం వంటి పెద్ద పెద్ద నగరాలకే పరిమితమై కిడ్నీల అక్రమ రవాణా నేడు జిల్లాలకు పాకుతోంది. మదనపల్లె లాంటి పట్టణాల్లో గుట్టుచప్పుడు కాకుండా అక్రమ రవాణా సాగిస్తూ యథేచ్ఛగా తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. మదనపల్లెలో బయటపడిన కిడ్నీ అక్రమ రవాణా వ్యవహారమే ఇందుకు నిదర్శనం. ప్రైవేటు ఆసుపత్రులపై వైద్యశాఖ అధికారుల నిఘా లేకపోవడంతో ఇలాంటి అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు బలంగా విన్పిస్తున్నాయి.

గ్లోబల్ ఆసుపత్రిలో తనిఖీలు చేస్తున్న వైద్యశాఖ అధికారుల, పోలీసులు

మృతిచెందిన యమున (పాత చిత్రం)

ఆపరేషన్ కిడ్నీ.. వెల రూ.50 లక్షలు

ఆపరేషన్ కిడ్నీలో భాగంగా పోలీసులు చేపట్టిన విచారణలో అనేక వివరాలు వెలుగు చూశాయి. ఒక్కో కిడ్నీ అమ్మకానికి రూ.50 లక్షలు వైద్యులు డిమాండ్ చేస్తున్నట్లు తేలింది. శస్త్ర చికిత్స చేసేందుకు బెంగళూరు నుంచి వచ్చే ప్రత్యేక వైద్యుడికి రూ.5 లక్షలు, అమ్ముకునే బాధితులకు రూ.8 లక్షలు చెల్లిస్తున్నట్లు తేలింది. సహకరించిన ఇతర వైద్యులు, సిబ్బందికి రూ.10 లక్షల వరకు అందజేస్తున్నారు. ఇలా ఒక్కో కిడ్నీ అమ్మినందుకు రూ.25 లక్షల వరకు ఖర్చులు పోనూ నిర్వాహకులు రూ.25 లక్షలు వరకు వెనకేసుకుంటున్నారు. కిడ్నీ రాకెట్‌లో స్థానికులైతే ఇబ్బందులు ఎదురవుతాయని బయట ప్రాంతాలకు చెందిన వారిని ఎంపిక చేసుకుని ఇక్కడ శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఈ వ్యవహారం ఎంతకాలంగా జరుగుతోందన్నది పోలీసు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

● గతంలో కూడా పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో లింగ నిర్ధారణ చేస్తున్నారని ఆరోపణలు వచ్చినా అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి వెళ్లిపోయారు. పలు ప్రైవేటు ఆసుపత్రులను జప్తు చేసినా విచారణ సమయంలో తూతూమంత్రంగా ముగించారు. ఇప్పుడు కిడ్నీ అక్రమ రవాణా వ్యవహారంలో అలాగే చేస్తారని ఆరోపణలు వస్తున్నాయి.

అన్నమయ్య జిల్లా పరిస్థితి ఇది	
ప్రైవేటు ఆసుపత్రులు:	184
కిడ్నీ ఆసుపత్రులు	2 (మదనపల్లెలోనే ఉన్నాయి)
డయాలసిస్ కేంద్రం	1 (మదనపల్లె)
బాధితులు :	120

● ఈ విషయమై డెమో దేవ శిరోమణి మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రుల్లో అక్రమాలకు పాల్పడితే ఎలాంటి వారినైనా ఉపేక్షించేది లేదని చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం బయట పడిన కిడ్నీ అక్రమ రవాణాపై కూడా శాఖాపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు.

● ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటుకు చెందిన 12 డయాలసిస్ కేంద్రాలు ఉండగా 900 మంది వరకు చికిత్స పొందుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో కేవలం కిడ్నీలో రాళ్లు తొలగించడం, డయాలసిస్ చికిత్సలు అందించడానికి మాత్రమే అనుమతి ఉంది. జిల్లాలో ఎవరికి కిడ్నీ మార్పిడి చేసేందుకు అనుమతి లేదని వైద్యాధికారులు అంటున్నారు.

● ప్రతి నెల ప్రైవేటు ఆసుపత్రులను తనిఖీ చేసి చెక్ లిస్ట్ ప్రకారం పరిశీలించాల్సి ఉంటుంది. అలాగే ప్రతి మూడు నెలలకు ఒకసారి అన్ని ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించి లోటుపాట్లపై అవగాహన కల్పించాలి.

● జిల్లాలో ఇటీవల కాలంలో ఈ అవగాహనా కార్యక్రమాలు, తనిఖీలు నిర్వహించ లేదు. గతంలో పీలేరు, మదనపల్లెలో స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన సమయంలో మాత్రమే సమావేశం నిర్వహించారు. తర్వాత పట్టించుకోలేదు.

వైకాపా నుంచి తెదేపాలోకి చేరికలు

పార్టీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి

కమలాపురం, న్యూస్‌టుడే: మండలంలోని అప్పారావుపల్లెలో వైకాపాకు చెందిన వంద కుటుంబాలు తెదేపాలో చేరాయి. పొలతల రవిశంకర్‌యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం 80 కుటుంబాలు, కుందు బాలిరెడ్డి, అప్పిరెడ్డిల ఆధ్వర్యంలో మరో 20 కుటుంబాలు ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నట్లు వారు వివరించారు.

ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో రిమ్స్ వైద్య విద్యార్థిని సత్తా

సర్వజన ఆసుపత్రి: ప్రభుత్వ వైద్య కళాశాలలో 2024-25 బ్యాచ్ నిర్వహించిన మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ వైద్య కళాశాల వైద్య విద్యార్థిని శ్రీనిత్యసురగౌరి (అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ) విభాగాల్లో 900లకు మార్కులకు 749 మార్కులు సాధించి ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం స్థాయిలో మొదటి స్థానం సాధించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జమున అన్నారు. ప్రిన్సిపల్ కార్యాలయంలో బుధవారం శ్రీనిత్యసురగౌరిని అధ్యాపకులతో కలిసి సన్మానించారు. వైస్ ప్రిన్సిపల్ విజయభాస్కర్‌రెడ్డి, పెంచలయ్య, నాగశ్రీలత, కల్యాణి, బయోకెమిస్ట్రీ విభాగాధిపతి లక్ష్మీనరసమ్మ, ఫిజియాలజీ విభాగాధిపతి మురళీధర్ పాల్గొన్నారు.

శ్రీనిత్యసురగౌరిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ జమున, అధ్యాపకులు

ఉమీద్ పోర్టల్‌తో ఆక్రమణలకు అడ్డుకట్ట

ప్రొద్దుటూరు గ్రామీణ: మసీదులు, దర్గాల పరిధిలోని సొంత భూముల వివరాలను ఉమీద్ పోర్టల్‌లో ఈ ఏడాది డిసెంబరు5 లోపు నమోదు చేసుకోవాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టరు జాకీర్ హుస్సేన్, జిల్లా ఇన్‌స్పెక్టరు అక్తర్ వసీమ్ తెలిపారు. స్థానిక పెన్నానగర్‌లోని కల్యాణ మండపంలో బుధవారం ముస్లిం పెద్దలు, సంఘాలకు చెందిన ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఉమీద్ పోర్టల్‌లో ఆయా భూములను నమోదు చేస్తే ఆక్రమణలకు గురికాకుండా ఉంటుందని వివరించారు. వక్ఫ్ భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షణతోపాటు స్వాధీనం చేసుకునేందుకు వీలు ఉంటుందన్నారు.

దిల్లీ బాంబు పేలుళ్ల ఘటన ప్రభుత్వ వైఫల్యమే

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: దిల్లీలో బాంబు పేలుళ్ల ఘటన ప్రభుత్వ వైఫల్యమేనని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఆ ముందురోజే బాంబు పేలుళ్లు జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. కేంద్ర హోంశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు గౌస్‌పీర్, విజయ్‌కుమార్, మైనుద్దీన్, ముబారక్ పాల్గొన్నారు.

దాహం తీరదు.. ఆకలి చావదు

• సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో దాహం కేకలు

• గుక్కెడు నీటికి రోగులకు తప్పని అవస్థలు

ఒక్క సీసా నీటిని రెండు రోజులు తాగుతున్నాం

మంచి వైద్యం అందుతుందని ఇక్కడికి వచ్చాం. వైద్యులు బాగానే చికిత్స అందిస్తున్నారు. అంతా బాగుందని ఇక్కడే అడ్మిట్ అయితే తాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బయటకు వెళ్లి నీళ్ల ఒక్క సీసా తెమ్మని రెండు రోజులు కొద్ది కొద్దిగా తాగుతూ దాహం తీర్చుకుంటున్నాం. ఇంతటి ప్రాధాన్య ఆసుపత్రిలో గుక్కెడు మంచినీరు అందుబాటులో లేకపోతే ఏం చేయాలి. ఇప్పటికైనా శుద్ధి నీరు ఏర్పాటు చేయాలి. - మహిళా రోగి

రాత్రి పూట తినడమే మానేశాం

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో వారం రోజులుగా చికిత్స తీసుకుంటున్నా. ఐపీ విభాగంలో తాగేందుకు చుక్క నీరు కూడా అందుబాటులో లేదు. రిమ్స్ పక్కన దుకాణంలో రూ.20 లీ సీసా రూ.30కి అమ్ముతున్నారు. తప్పక కొనాల్సి వస్తోంది. రాత్రి వేళలో అయితే దప్పికయినా అలానే ఉండాల్సి వస్తోంది. ఇక్కడ కొంతమంది తాగేందుకు నీళ్లు లేక రాత్రి పూట ఆహారం సైతం మానేస్తున్నారు. - అడ్మిట్ అయి వైద్యం తీసుకుంటున్న రోగి

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, న్యూస్‌టుడే: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోని ఓపీ, ఐపీ విభాగాల్లో రోగులు గుక్కెడు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో ఆహారం తినే సమయంలో తాగేందుకు నీరు లేక తినడమే మానేస్తున్నారని కొందరు రోగులు చెబుతున్నారు. ఎవరైనా సహాయకులుంటే నగరంలోకి వెళ్లి తీసుకొస్తారు. ఎవరూ లేకపోతే ఆ పూట భోజనం కూడా చేయలేకపోతున్నామని వాపోతున్నారు.

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఐపీ విభాగంలో చికిత్స పొందుతున్న రోగులు

ఇదీ పరిస్థితి: కోట్ల రూపాయలు వెచ్చించి పేద ప్రజలకు లక్షల ఖరీదైన వైద్యం ఉచితంగా అందించేందుకు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించారు. కానీ రోగుల దాహం తీర్చేందుకు తాగు నీరు ఏర్పాటు చేయకపోవడం ఏంటని రోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా రాత్రి వేళల్లో మహిళలు, దివ్యాంగులు, వృద్ధులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారని నీళ్ల సీసా కొనాలంటే సర్వజన ఆసుపత్రి ఐపీ విభాగం ఎదుట ఉన్న దుకాణాల సముదాయానికి వెళ్లాల్సిందే. అక్కడికి వెళ్లాలన్నా దాదాపు అర కిలో మీటరు దూరం కాలి నడకన వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

ఖాజీపేట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ముత్తులూరుపాడు గ్రామానికి చెందిన మోపూరి యల్లయ్య హత్య కేసులో నిందితుడు నాగలారపు పెద్ద నరసింహులును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. ఈ నెల 3న మద్యం మత్తులో నరసింహులును యల్లయ్య హేళనగా, కించపరిచేలా మాట్లాడారు. వీరిద్దరి మధ్య గొడవ పెరిగింది. ఈ క్రమంలో నరసింహులు తన చేతిలో ఉన్న కర్రలో యల్లయ్య తలపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన యల్లయ్యను కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 5న మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం భూమాయపల్లె క్రాస్ రోడ్డు వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు సీఐ వంశీధర్ తెలిపారు.

కేసు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

తల్లిదండ్రులు మందలించారని వివాహిత ఆత్మహత్య

మైదుకూరు: ఫోన్ మాట్లాడుతుండగా తల్లిదండ్రులు మందలించారనే కారణంతో మైదుకూరు పట్టణం శ్రీరాంనగర్‌కు చెందిన వివాహిత తమ్మిశెట్టి హర్షిత (19) విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నారు. అయిదు నెలల కిందట పట్టణానికి చెందిన యువకుడితో వివాహం కాగా పదిరోజుల కిందట తల్లిదండ్రుల వద్దకు చేరింది. ఈ క్రమంలో ఫోన్ మాట్లాడుతుండగా తల్లిదండ్రులు మందలించడంతో మంగళవారం ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స కోసం కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు వివరించారు. తండ్రి తమ్మిశెట్టి వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

వృద్ధుడి బలవన్మరణం

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: స్థానిక భాగ్యనగర్ కాలనీలో వెంకటేశ్ (74) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ గుర్రప్ప తెలిపారు. ఏళ్ల కిందట భార్య చనిపోయారు. ఒంటరి జీవితం, అనారోగ్య కారణాలతో ఈ నెల 9న ఇంట్లో ఉరేసుకోగా ఎవరూ గమనించలేదు. బుధవారం దుర్వాసన రావడంతో తలుపులు తెరిచి చూడగా విషయం వెలుగులోకి వచ్చింది. కుమారుడు వెంకట రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందారు. ప్రొద్దుటూరు పట్టణం ఆంధ్రకేసరిరోడ్డుకు చెందిన నాగ మల్లయ్య (61) టైలర్‌గా పని చేసేవారు. భార్య వెంకటరమణమ్మతో కలిసి బట్టలు కొనేందుకు స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఓ వస్త్ర దుకాణానికి వెళ్లారు. అక్కడ బట్టలు కొనుగోలు చేసి ఇంటికెళ్లేందుకు ఆటో కోసం రోడ్డుపై నిలబడి ఉన్నారు. ఈ క్రమంలో ఓ ఆటో నాగమల్లయ్యను ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వృద్ధుడు..

ప్రొద్దుటూరు వైద్యం: ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలో గుర్తుతెలియని వృద్ధుడు (70) మృతి చెందాడు. అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఆసుపత్రిలో చేరారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. తెలిసిన వారు ఎవరైనా ఉంటే ఆసుపత్రిలో సంప్రదించాలన్నారు.

శ్మశానవాటిక వద్ద ఘర్షణ

శ్మశాన స్థలంలో కత్తి చూపిస్తున్న ఓ వర్గం వ్యక్తి

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని ఎస్సీ శ్మశానవాటిక వద్ద ఘర్షణ చోటుచేసుకుంది. బుధవారం మృతదేహాన్ని పాతిపెట్టేందుకు వచ్చిన ఎస్సీలను మరో వర్గానికి చెందిన ఎస్సీలు అడ్డుకున్నారు. ఇరువురి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఘటనలో ఓబయ్య, శేఖర్‌కు గాయాలు కావడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందించి 108 వాహనంలో ప్రొద్దుటూరుకు తరలించారు. అనంతరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. విచారణ అనంతరం కేసు నమోదు చేస్తామని ఎస్సై శివప్రసాద్ తెలిపారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఒప్పుకోం



ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల, న్యూస్‌టుడే: వైద్య కళాశాలలను ప్రైవేటీకరణను ఒప్పుకోమని... తద్వార ఎంత నష్టమో సీఎం చంద్రబాబుకే బాగా తెలుసని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. పులివెందులలో బుధవారం వైకాపా ఆధ్వర్యంలో వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు నిరసన కార్యక్రమం చేపట్టారు. పాత ఎమ్మెల్యే కార్యాలయం నుంచి మినీ సచివాలయంలో ఉన్న ఆర్డీవో కార్యాలయానికి వైకాపా నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎంపీ ర్యాలీగా బయల్దేరి వెళ్లారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో పరిపాలన అధికారి రవీంద్రారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్

మైదుకూరు, న్యూస్‌టుడే: బాలికలపై అసభ్యంగా ప్రవర్తించిన ప్రధానోపాధ్యాయుడిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉత్వర్వులు జారీ చేశారు. గత నెల 25న కందిమల్లయ్యపల్లె ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాధాకృష్ణమూర్తి విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో డీఈవో శంషద్దీన్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం బుధవారం సదరు హెచ్ఎంను విధుల నుంచి తొలగించినట్లు డీఈవో నుంచి అదేశాలు వచ్చాయని ఎంఈవో పుల్లయ్య తెలిపారు.

14న జిల్లా హాకీ జట్టు ఎంపిక

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 విభాగానికి సంబంధించి ఈ నెల 14న వైఎస్సార్ క్రీడా పాఠశాలలో జిల్లా స్థాయి హాకీ ఎంపికలు చేపడుతున్నట్లు ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 సెక్రటరీ చంద్రమోహన్‌రాజు తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే బాలబాలికలు ఈ నెల 14న ఉదయం 9 గంటల లోపు రిపోర్టు చేయాలన్నారు.

MARGADARSI CHIT FUND PVT. LTD.

Chit Groups are available at our *CUDDAPAH* BRANCH

CHIT GROUP	DURATION IN MONTHS	MONTHLY INSTALLMENT	CHIT VALUE
LT VV	50	2,00,000	1,00,00,000
FT VZ	40	1,25,000	50,00,000
FT D	40	50,000	20,00,000
FT N	40	12,500	5,00,000

Please Contact Branch Manager **Mr. D.SESHUBABU,** for further details. **Mobile No. 80089-33522, Landline: 08562-244606, 241977.**

JAMMALAMADUGU MUNICIPALITY

'e' Procurement Tender Notice No. 102, 103, 107 to 139/2025-26/E1, Dt: 10.11.2025

KUDA Grant - 02 Works - Rs. 42.00 Lakhs
15th FC 2023-24 2nd Installment Untied - 05 Work 66.0762 Lakhs
SCSP Grant - 18 Works - Rs.93.70 Lakhs
General Fund - 13 Works - Rs. 61.20 Lakhs

Bid Document Downloading Start Time 10.11.2025 @ 10.00 AM.
Bid document downloading end date: 02.12.2025 @ 3.00 PM.
Last date / Time of receipt of Tender: 02.12.2025 @ 3.30 PM.
Price Bid opening dated: 02.12.2025 @ 4.00 PM.

All rights are reserved to the Commissioner to cancel or reject the tenders without assigning any reasons there of
Further details any corrigendum can be seen @ https://www.tender.apeprocurement.gov.in

Sd/- Commissioner,
Jammalamadugu Municipality.

జాతీయ ట్రెక్కింగ్ శిబిరానికి విద్యార్థి ఎంపిక

విద్యార్థి మహేష్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ రవీంద్రనాథ్, అధ్యాపకులు

కడప విద్య, న్యూస్‌టుడే: యోగి వేమన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలి వద్ద జరగనున్న జాతీయ అడ్వెంచర్ ట్రైనింగ్ క్యాంపులో పాల్గొనేందుకు కడప ప్రభుత్వ పురుషుల స్వయంప్రతిపత్తి కళాశాల మూడో సంవత్సరం బీబీఏ విద్యార్థి కె.మహేష్ ఎంపికయ్యారు. ఈ శిబిరం ఈ నెల 22 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు మనాలిలో నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా ఎంపికైన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు హాజరై ట్రెక్కింగ్, అడ్వెంచర్ శిక్షణలో పాల్గొంటారు. కళాశాల ప్రిన్సిపల్ రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపల్ రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు అంకాల నాగరాజు, రమేష్‌యాదవ్, శివరాంకృష్ణలు బుధవారం కళాశాల ఆవరణలో విద్యార్థి కె.మహేష్‌ను అభినందించారు.

నెట్‌బాల్ పోటీలకు మోక్షిత

విద్యార్థిని మోక్షితకు మిఠాయి తినిపిస్తున్న హెచ్ఎం ఉమామహేశ్వరి

కడప క్రీడలు: జాతీయ స్థాయి నెట్‌బాల్ ఎస్‌జీఎఫ్ఐ పోటీలకు రామనపల్లె జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని మోక్షిత ఎంపికయ్యింది. రాష్ట్రస్థాయి పోటీలు ఈ నెల 7, 8, 9 తేదీల్లో విజయవాడలోని పటమట జడ్పీహెచ్ఎస్‌లో జరిగాయి. అండర్-17 విభాగంలో జరిగిన ఈ పోటీల్లో మోక్షిత ముఖ్యపాత్ర పోషించడంతో ఉమ్మడి కడప జిల్లాకు 4వ స్థానం దక్కిందని.. అలాగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగిందని ఆ పాఠశాల హెచ్ఎం ఉమామహేశ్వరి, వ్యాయామ ఉపాధ్యాయుడు గణేష్‌బాబు తెలిపారు. జాతీయస్థాయి పోటీలు వచ్చే నెలలో రాజస్థాన్‌లో జరగనున్నాయని వివరించారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ

అమానుల్లాను అభినందిస్తున్న నకాష్ మున్సిపల్ ఉర్దూ హైస్కూల్ ఉపాధ్యాయులు

కడప క్రీడలు, న్యూస్‌టుడే: స్కూల్‌గేమ్స్‌లో భాగంగా నకాష్ మున్సిపల్ ఉర్దూ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి అమానుల్లా రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబరచి కాంస్య పతకం సాధించాడు. తొలుత కడపలో జరిగిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అండర్-17 విభాగంలో ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు తిరుపతిలోని ఎస్వీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఆ విద్యార్థి కాంస్య పతకాన్ని సాధించాడు. ఈ మేరకు బుధవారం వారి పాఠశాలలో విద్యార్థి అమానుల్లాను ఆ పాఠశాల హెచ్ఎం జావిదాఖానం, వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ సాజిద్, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎండీ ఇలియాస్‌లతో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థిని

ఎంపికైన విద్యార్థినితో ఉపాధ్యాయురాలు

చిట్వేలి (పుల్లంపేట), న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు చిట్వేలి ఉన్నత పాఠశాల విద్యార్థిని కుసుమిత ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు దుర్గరాజు తెలిపారు. బుధవారం స్థానిక పాఠశాలలో ఆ విద్యార్థిని అభినందించారు. ఈ నెల 9న ప్రొద్దుటూరులో నిర్వహించిన తైక్వాండో జిల్లా స్థాయి సబ్ జూనియర్ విభాగంలో ప్రతిభ చూపడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 14, 15వ తేదీల్లో కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి కడప జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్, సుహాసిని, రామదేవి పాల్గొన్నారు.

క్రీడావని

బ్యాట్స్‌మెన్ల జోరు.. బౌలర్ల బేజారు!

● సెంచరీలు చేసిన నెల్లూరు ఆటగాళ్లు సమీర్, సూర్య

సమీర్

సూర్య

మహమ్మద్ నవాజ్

చిత్తూరు-అనంతపురం జట్ల మధ్య జరుగుతున్న క్రికెట్ మ్యాచ్

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ సౌత్ జోన్ అండర్-14 అంతర్ జిల్లాల నాలుగో రౌండ్ క్రికెట్ పోటీల్లో బుధవారం బ్యాట్స్‌మెన్లు జోరు చూపించారు. ముఖ్యంగా నెల్లూరు ఆటగాళ్లు సమీర్, సూర్యలు సెంచరీలు నమోదు చేశారు. నాలుగో రౌండ్ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. నెల్లూరు, చిత్తూరు జట్లు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఒక్కో జట్టు మూడేసి పాయింట్లను తమ ఖాతాలో జమ చేసుకున్నాయి. ● నెల్లూరు జట్టు రెండో రోజు (బుధవారం) తన తొలి ఇన్నింగ్స్‌ను ఆరంభించింది. ఆ జట్టు మ్యాచ్ ముగిసే సమయానికి 90 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 348 పరుగులు చేసింది. జట్టులో సమీర్ అజేయంగా 119 పరుగులు చేయగా.. మరో బ్యాట్స్‌మెన్ సూర్య 111 పరుగులు, మహమ్మద్ నవాజ్ అజేయంగా 58 పరుగులు చేసి రాణించారు. కడప బౌలర్లలో తాహీర్ 2 వికెట్లు తీసుకున్నారు. మ్యాచ్ డ్రాగా ముగిసింది. నెల్లూరు జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం రావడంతో తన ఖాతాలో మూడు పాయింట్లు జమ చేసుకుంది. ● వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియంలో ఒక వికెట్ నష్టానికి 80 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండో రోజు బ్యాటింగ్‌ను ఆరంభించిన చిత్తూరు జట్టు 87.5 ఓవర్లలో 191 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో మహమ్మద్ ఐజర్ 50, లిఖిత్ ఈరగంరెడ్డి 45 పరుగులు చేశారు. అనంతపురం బౌలర్లలో ఆదిత్యరెడ్డి, జశ్వంత్‌సాయి, తేద్రిక్, కార్తిక్ తలా రెండేసి వికెట్లు తీసుకున్నారు. ఆపై అనంతపురం జట్టు రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించి మ్యాచ్ ముగిసే సమయానికి 43 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 127 పరుగులు చేసింది. జట్టులో ఫంకజ్ 28, రణదీర్ 24 పరుగులు చేశారు.. చిత్తూరు బౌలర్ కేతన్‌కు 3 వికెట్లు, దక్షణ్‌సాయికి 2 వికెట్లు పడ్డాయి. ఈ మ్యాచ్ కూడా డ్రాగా ముగిసింది. చిత్తూరు జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం రావడంతో ఆ జట్టుకు మూడు పాయింట్లు తగ్గాయి.

EENADU Classifieds

REAL ESTATE

PLOT FOR SALE

రంగంపేట, మోహన్‌బాబు కాలేజ్ ఎదురుగా, తిరుపతి మదనపల్లి హైవేకి 15 అ।। దూరంలో 66 అంకణాల ప్లాట్ కలదు. వివరాలకు సం।। 8008685569.

WANTED

రాజంపేట శ్రీ సత్యా గార్డెన్‌లో టెలీకాలర్స్, ఆఫీసు ఇన్‌చార్జ్, అకౌంటెంట్‌లుగా పని చేయుటకు ఆసక్తిగల యువతీ యువకులు కావలెను. #9688888179.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఏటి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

JOBS

కడప మరియు చిత్తూరు జిల్లాలో పనిచేయుటకు Sales Person (Male) కావలెను. జీతం: 25-30K+TA, DA. సంప్ర: 83286 75684.

ప్రొద్దుటూరులోని శ్రీ సంగమేశ్వర హైస్కూల్ వారి చక్కటి వసతి కలిగిన హాస్టల్‌కు వార్డెన్స్ కావలెను. Cell : 94407 29641, 9059585727.

FACULTY/ TEACHERS

Wanted Local Teachers Lower Section. TKR High School, Jammalamadugu. Cell : 9603737014

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ।। 350/- మాత్రమే Contact: KDP: 9989997626 8008514248 PDTR: 8008597620 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

ప్రొద్దుటూరు

● ప్రొద్దుటూరు ● జమ్మలమడుగు ● బద్వేలు ● మైదుకూరు

అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి హిమబిందు

వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: చిన్నారులకు నిమోనియా సోకకుండా రక్షించడమే లక్ష్యంగా పని చేయాలని వైద్యాధికారి హిమబిందు అన్నారు. స్థానిక వైఎంఆర్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ నిమోనియా నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. నిమోనియా లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని, టీకాల ప్రాముఖ్యత అందరికీ తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సీవో ఎంవీ.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీడీపీవో అరుణకుమారి

బాలికల భవిష్యత్తుకు విద్య అవసరం

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: లింగ వివక్షతకు అవకాశం లేకుండా బాలికల భవిష్యత్తుకు విద్యనందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని ఐసీడీఎస్ సీడీపీవో అరుణ కుమారి తెలిపారు. కామనూరు పీహెచ్‌సీలో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత చదువులకు ప్రాధాన్యం ఇస్తే వారి జీవితాలకు బంగారు బాట అవుతుందన్నారు. లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, జైలు శిక్ష ఉంటుందని హెచ్చరించారు. పీహెచ్‌సీ వైద్యుడు హనీఫ్ బాబా, పంచాయతీ కార్యదర్శి సుభాషిణి, సీవో సునీత, సూపర్‌వైజర్లు ఈశ్వరమ్మ, రఫియా, పీహెచ్‌సీ పర్యవేక్షకుడు వరప్రసాదు, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మేమున్నాం... మీకు తోడుగా...

(10 AM to 1 PM)
ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు : 9000409516
మైదుకూరు : 8008573447
బద్వేలు గ్రామీణ : 8008573493

స్పందనకు స్పందనం

కొండాపురం మండలం లావనూరు ప్రాథమిక పాఠశాలకు వెళ్లే మార్గంలో మురుగు నిల్వ ఉందని ఈ నెల 1న 'మేమున్నాం.. మీకుతోడుగా'లో భాగంగా సమస్య ప్రచురితమైంది. స్పందించిన సచివాలయ సిబ్బంది శుభ్రం చేయించి పారిశుద్ధ్య పనులు చేయించారు. - న్యూస్‌టుడే, కొండాపురం

?: బద్వేలు పురపాలకలో వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. విద్యానగర్, సిద్దవటం రోడ్డులో పాదచారులు, ద్విచక్రవాహనదారులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. నియంత్రణకు చర్యలు తీసుకోండి. - సుబ్బరాయుడు, విద్యానగర్

✓: బద్వేలులోని వీధికుక్కలను గుర్తించేందుకు 20 బృందాలను ఏర్పాటు చేశాం. వాటిని త్వరలో పట్టుకుని షెల్టర్‌కు తరలించేందుకు చర్యలు తీసుకుంటాం. - నరసింహారెడ్డి, పుర కమిషనర్

?: బద్వేలులో కుళాయిల నుంచి తాగునీరు వృథాగా పోతోంది. రహదారులు అధ్వానంగా మారాయి. - పెంచలయ్య, స్థానికుడు

✓: బద్వేలులో కుళాయిల నుంచి తాగునీరు వృథాగా వెళ్తున్న ప్రాంతాలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - నరసింహారెడ్డి, బద్వేలు పురపాలక కమిషనర్ - న్యూస్‌టుడే, బద్వేలు

?: మైదుకూరు పోలీస్‌స్టేషన్ నుంచి ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే దారిపై మురుగు ఉంది. పారిశుద్ధ్య పనులు చేయించేలా చర్యలు తీసుకోవాలి. - మహబూబ్‌బాషా, మైదుకూరు

✓: మురుగునీరు దారిపై ప్రవహించకుండా చర్యలు తీసుకుంటాం. - శ్రీధర్‌నాయుడు, ఎంపీడీవో, మైదుకూరు

?: సాయినాథపురంలోని సర్వాయపల్లెరోడ్డు చివరలో చెత్త పేరుకుపోయి అపరిశుభ్రంగా మారుతోంది. చెత్త తొలగించేలా చర్యలు తీసుకోవాలి. - వెంకటరెడ్డి, స్థానికుడు

✓: చెత్త తొలగించేలా చర్యలు తీసుకుంటాం. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తాం. - నూర్జం, పారిశుద్ధ్య విభాగ అధికారి - న్యూస్‌టుడే, మైదుకూరు

వంద పడకలేనా?

జమ్మలమడుగు ప్రాంతీయ వైద్యశాలకు రోగుల తాకిడి

ప్రభుత్వ పరిశీలనలో ప్రతిపాదన

పాలకులు దృష్టి సారిస్తే ప్రయోజనం

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: జమ్మలమడుగులోని ప్రాంతీయ వైద్యశాల వంద పడకల నిర్మాణానికి నోచుకోవడం లేదు. గత తెదేపా ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా, అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం స్థల సేకరణలో జాప్యం చేసింది. దీంతో నిధులు వెనక్కి వెళ్లాయి. మళ్లీ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం స్థల సేకరణ పనుల్లో కదలిక వచ్చినా ముందుకు సాగడం లేదు.

★ నియోజకవర్గంలోని మండలాలతో పాటు కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాలోని సరిహద్దు మండలాల ప్రజలు వైద్యం కోసం ఇక్కడికి వస్తుంటారు. ప్రస్తుతం రోజుకు 650 నుంచి 700 వరకు ఓపీలు నమోదవుతున్నాయి. స్త్రీశక్తి పథకం అమలైనప్పటి నుంచి ప్రాంతీయ వైద్యశాలకు రోగుల తాకిడి మరింత పెరిగింది. ఆసుపత్రిలో 18 మంది వైద్యులు, 28 మంది నర్సులు పనిచేస్తున్నారు.

★ 2016లో అప్పటి తెదేపా ప్రభుత్వంలో 30 నుంచి 50 పడకలకు పెంచి నూతన భవనాలను నిర్మించింది. అనంతరం 2019లో 50 నుంచి వంద పడకల స్థాయికి పెంచి మరిన్ని వసతులతో పాటు అదనంగా వైద్యులను నియమించి, రూ.12.50 కోట్లు మంజూరు చేసింది. టెండరు దశలో ఉండగా సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో ఆ పనులు నిలిచిపోయాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ఆ నిధులను సద్వినియోగం చేసుకోలేక పోయింది. ఆసుపత్రి నిర్మాణానికి స్థలాన్ని చూపక పోవడం తదితర కారణాలతో నిధులు వెనక్కి వెళ్లాయి.

★ ఈ ఏడాది జూన్ 21వ తేదీ డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ జాయింట్ డైరెక్టర్ డా.రమేశ్‌నాథ్ ముద్దనూరు రోడ్డులోని జలవనరులశాఖ కార్యాలయాల సముదాయాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని వైద్యశాఖ ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని చెప్పారు. అయినా ఇంత వరకు పనుల్లో కదలిక లేకపోవడం గమనార్హం. అప్పట్లో వంద పడకలకు రూ.28 కోట్లు ఖర్చు అవుతాయని అధికారులు అంచనాకు రాగా ప్రస్తుత ధరల ప్రకారం రూ.50 కోట్ల వరకు పెరిగే అవకాశం ఉంది.

స్థల సేకరణ పూర్తి కాలేదు

ఆసుపత్రి నిర్మాణానికి స్థానిక జలవనరుల శాఖ కార్యాలయాల సముదాయాన్ని ఎంపిక చేశారు. అక్కడున్న ఆరు డివిజన్‌లలో మూడు డివిజన్‌లు ఖాళీ చేయాల్సి ఉంది. ఆ ప్రక్రియ పూర్తి కాగానే నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.
- డా. రఫీక్‌పాషా, సూపరింటెండెంట్, జమ్మలమడుగు ప్రాంతీయ వైద్యశాల

అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతి

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: నిధులు కేటాయించి ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం అమరావతి వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో మంత్రులు పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్‌లను మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు పురపాలకలో జరుగుతున్న అభివృద్ధిలపై చర్చించారు. అలాగే నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై మంత్రులతో ఎమ్మెల్యే చర్చించారు. ఇందుకు మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి, నాయకులు నంద్యాల రాఘవరెడ్డి, మెట్టుపల్లి రామచంద్రారెడ్డి, తదితరులున్నారు.

మంత్రి పయ్యావుల కేశవ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

పశు వైద్యశిబిరానికి స్పందన

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: గానుగపెంట పశువైద్యశాల పరిధిలోని దమ్మన్నపల్లిలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పోరుమామిళ్ల పశువైద్య సహాయ సంచాలకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వైద్యులు భరద్వాజ కృష్ణ పశువులకు పరీక్షలు చేశారు. 37 పశువులకు సాధారణ చికిత్సలు, 32 దూడలకు నట్టలనివారణ మందును తాపించారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు భరత్, హుసేన్, అజీమ్, రైతులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారమే లక్ష్యం

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఎర్రగుంట్ల 11వ వార్డులోని దొండపాడు రోడ్డులో ప్రభుత్వ సహకారంతో నిర్మించిన లబ్ధిదారుల గృహ ప్రవేశాల కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భూపేష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. జమ్మలమడుగు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు. ముద్దనూరు, చిలమకూరు, ఎర్రగుంట్ల, కమలాపురం మీదుగా కడపకు రూ.1,300 కోట్లతో బైపాస్ రోడ్డు మంజూరైందని, ప్రస్తుతం భూసేకరణ జరుగుతున్నట్లు వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నారని స్పష్టం చేశారు. సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు ఎర్రగుంట్లలో 115 మంది లబ్ధిదారులకు పత్రాలు మంజూరైనట్లు వివరించారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల నగర పంచాయతీ ఛైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, మార్కెట్‌యార్డు ఛైర్మన్ నాగరాజు, మధుసూదన్‌రెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మహిళకు ఇంటి మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తెదేపా ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో కాలభైరవస్వామి జయంతి

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పురపాలక కూరగాయల తాత్కాలిక మార్కెట్ వద్ద బుధవారం కాలభైరవ స్వామి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి విగ్రహానికి, చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ట్రస్టు ఛైర్మన్ శ్రీనివాసులస్వామి ఆధ్వర్యంలో 2వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మల్లికార్జున, వెంకటసుబ్బారెడ్డి, నాగశివుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో అన్నప్రసాదం వడ్డిస్తున్న నిర్వాహకులు

అయ్యప్పస్వామికి పూజలు ..

కొండాపురం : కొండాపురంలో అయ్యప్ప స్వామి పూజ అంగరంగ వైభవంగా బుధవారం నిర్వహించారు. మండల వ్యాప్తంగా అయ్యప్ప, శివ మాల ధరించిన భక్తులు పెద్ద సంఖ్యలో పూజ మహోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గురుస్వాములు రామయ్య, మారుతి రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నాగార్జున, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీచరణికి అభినందనల వెల్లువ

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: మహిళల ప్రపంచకప్ క్రికెట్ జట్టు సభ్యురాలు శ్రీచరణిని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర జోనల్ మేనేజర్ వైద్యనాథ్ సన్మానించారు. బుధవారం ఆర్టీపీపీలోని శ్రీచరణి నివాసంలో వైద్యనాథ్ కలిసి అభినందించారు.

దువ్వూరు : మహిళల క్రికెట్ వన్డే ప్రపంచకప్‌లో సత్తా చాటిన తెలుగు తేజం శ్రీచరణిని ఆమె స్వగృహంలో దువ్వూరు మండలం గుడిపాడు గ్రామానికి చెందిన యువకులు, క్రికెట్ అభిమానులు కలిసి అభినందించారు.

← శ్రీచరణికి జ్ఞాపిక అందజేస్తున్న బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర జోనల్ మేనేజర్ వైద్యనాథ్

క్రీడల్లో విద్యార్థుల సత్తా

బద్వేలు, న్యూస్‌టుడే: బద్వేలు హైస్కూల్ విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడల్లో రాణిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా పలాసలో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ హైజంప్ పోటీలో 8వ తరగతి విద్యార్థిని జాస్మిన్ రెండో స్థానంలో నిలిచింది. డిస్కస్‌త్రోలో దాదాపీర్ నాలుగో స్థానంలో నిలిచాడు.

జాస్మిన్ దాదాపీర్

సమస్యలు పరిష్కరించకపోతే పోరాటమే

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: కడప డీపీటీవో నిర్లక్ష్య, మొండివైఖరిని నిరసిస్తూ ఈ నెల 18 నుంచి నిరవధిక రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు ఎన్ఎంయూ నాయకులు స్పష్టం చేశారు. ప్రొద్దుటూరు ఆర్అండ్‌బీ అతిథి గృహంలో రీజనల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నాగముని, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ శివారెడ్డి, కార్యదర్శి సుధాకర్ మాట్లాడారు. కార్మికుల సమస్యలపై డీపీటీవోకు వినతిపత్రం ఇచ్చి రెండు నెలలు గడిచినా చర్చలకు పిలవకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించకుండా ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో నాయకులు జనార్దన్, సుబ్బారావు, వలీ, జయరాం, శ్రీనివాసులు, గోపాల్, టీఆర్‌జీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎన్ఎంయూ రీజనల్ కార్యదర్శి సుధాకర్ చిత్రంలో నాయకులు

లోలెవెల్ వంతెనపై నిలిచిన రాకపోకలు

బద్వేలు, గోపవరం, న్యూస్‌టుడే: గోపవరం మండలం కాలువపల్లె వద్ద లోలెవెల్ వంతెన పూర్తిగా మునిగింది. కాలువపల్లె, ఎర్రిచిన్నాయపల్లె, లక్కవారిపల్లె తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ మార్గంలో బస్సులు ఆటోలు, ద్విచక్రవాహనాలు వెళ్లడం లేదు. గ్రామీణ ప్రజలు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న వేరే గ్రామాన్ని చుట్టి బద్వేలుకు చేరుకోవాల్సి వస్తోంది. కాలువపల్లెలో బాలుర ఉన్నతపాఠశాల, గ్రామసచివాలయాలున్నాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఈ మార్గంలో రాకపోకలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బద్వేలు పెద్ద చెరువు అలుగులోకి ఈ వంక నుంచి నీరు వెళ్తోంది. బద్వేలు పెద్ద చెరువు పూర్తిగా నిండటంతో రెండు నెలల పాటు లోలెవెల్ వంతెనపై నీరు ఉంటుందని కూటమి ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కాలువపల్లె వద్ద మునిగిన లోలెవెల్ వంతెన

ఎస్టీయూ జిల్లా కార్యవర్గం ఎన్నికపై హర్షం

కలసపాడు, న్యూస్‌టుడే: మండలానికి చెందిన ఉపాధ్యాయులు జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. కలసపాడులో బుధవారం నాయకులు విలేకరులతో మాట్లాడారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం.శేఖర్‌బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎన్.శివారెడ్డి, ఆర్థిక కమిటీ సభ్యుడిగా కె.వి.సత్యనారాయణ, కమిటీ సభ్యులుగా బి.ఎన్.వి.ప్రసాద్, ఎం.రామకృష్ణారెడ్డి, జి.రమణారెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండలశాఖ అధ్యక్షుడు సత్యనారాయణ, ఎం.బాలరాజునాయక్, గురుప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.

నీటిశుద్ధి కేంద్రం నిరుపయోగం

రూ.లక్షల నిధులు వెచ్చించి నీటిశుద్ధికేంద్రం ఏర్పాటు చేసినా నిరుపయోగంగా మారింది. కొర్రపాడులోని ఆర్వో ప్లాంటు మూతపడింది. దీంతో దాదాపు 5 వేల మంది ప్రజలు ప్రైవేటుగా కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. నీటి కోసం నెలకు ఒక కుటుంబంపై రూ.300 నుంచి రూ.1000 భారం పడుతోంది. సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, రాజుపాళెం

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టేది?

జమ్మలమడుగులో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా రాత్రి వేళల్లోనూ అక్రమార్కులు పెన్నానది నుంచి ఇసుకను తోడేస్తున్నారు. ట్రాలీకి చెక్కలు అమర్చి అధిక లోడ్‌తో అతి వేగంగా ఇళ్ల మధ్య నుంచి వెళ్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణా అడ్డుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, జమ్మలమడుగు

ఆర్డీ నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న పుర ఛైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి

నిబంధనలు పాటించలేదని ఫిర్యాదు

ప్రొద్దుటూరుపట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పట్టణం అనిబిసెంటు ఉన్నత పాఠశాల మైదానంలో ఎగ్జిబిషన్ కేటాయింపుపై కమిషనర్ నిబంధనలు పాటించలేదని పుర ఛైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి పురపాలక రీజనల్ డైరెక్టర్(ఆర్డీ)నాగరాజుకు ఫిర్యాదు చేశారు. బుధవారం సాయంత్రం పురపాలక సంఘ కార్యాలయంలో ఆర్డీకి ఛైర్‌పర్సన్ ఫిర్యాదు చేశారు. కాంట్రాక్టర్ సకాలంలో డబ్బులు చెల్లించకుండా ఎగ్జిబిషన్ మూసివేశారని, అతడి నుంచి వసూలు చేయడంతో పాటు కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉగ్రదాడి మృతులకు నివాళి

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: దేశంలో ఉగ్రదాడులు మళ్లీ జరగకుండా కేంద్ర ప్రభుత్వం నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శివనారాయణ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ సూచించారు. దిల్లీలో ఉగ్రవాదుల కారు పేలుడు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మృతుల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ బుధవారం రాత్రి అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు.

నిధులున్నా.. మరమ్మతులు శూన్యం

ప్రొద్దుటూరులోని పొట్టిపాడు రోడ్డుపై గుంతలు పడి అధ్వానంగా మారింది. నడిచేందుకూ వీల్లేకుండా ఉంది. వాహనాలు అధికంగా రాకపోకలు సాగిస్తుండటంతో తాగునీటి గొట్టాలు ధ్వంసమయ్యాయి. వీటికి స్థానికులు మరమ్మతులు చేసుకునే దుస్థితి నెలకొంది. ఈ మార్గంలో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాలకు రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి అభివృద్ధికి నిధులు మంజూరైనా పనులకు నోచుకోవడం లేదు.
- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు

వివాహిత ఆత్మహత్యాయత్నం

పెనుకొండ, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మారుతీనగర్‌కు చెందిన వివాహిత హారిక బుధవారం విష గుళికలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తరలించారు. నాగేశ్వరరావు, భారతి దంపతుల కుమార్తె హారికకు గతేడాది దువ్వూరుకు చెందిన రాజేశ్‌తో వివాహమైంది. 6 నెలల తరవాత అత్తింటి వేధింపులతో ఆమె పుట్టింటికి వచ్చింది. పోలీసులకు ఫిర్యాదు చేసిన న్యాయం జరగడం లేదని మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం చేసినట్లు ఓ లేఖ రాసింది. వివాహానికి ముందు ఉద్యోగం చేస్తానని ఆమె చేసిన ప్రతిపాదనకు భర్త ఒప్పుకొని, అనంతరం ఉద్యోగం చేయడం ఇష్టంలేదని వారించడంతో గొడవలు మొదలైనట్లు లేఖలో పేర్కొంది.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

బద్వేలులో ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధ, నాయకులు

ప్రొద్దుటూరు గ్రామీణ, జమ్మలమడుగు, మైదుకూరు, బద్వేలు, న్యూస్‌టుడే : రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైకాపా నాయకులు బుధవారం నిరసన ర్యాలీలు చేపట్టారు. బద్వేలులో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధ ర్యాలీ చేశారు. అనంతరం తహసీల్దార్ ఉదయభాస్కర్ రాజుకు వినతిపత్రం అందజేశారు. జమ్మలమడుగులో ఆర్డీవో సాయిశ్రీకి ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి వినతిపత్రం ఇచ్చారు. ప్రొద్దుటూరులో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదురెడ్డి, మైదుకూరులో మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డిల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు.

భూ నిర్వాసితులకు అన్యాయం

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: కొత్తపల్లె వద్ద చాగలమర్రి, వేంపల్లె జాతీయ రహదారి నిర్మాణంలో నష్టపరిహారం చెల్లింపు విషయంలో తమకు తీవ్ర అన్యాయం జరిగిందని న్యాయం చేయాలని భూములు కోల్పోయిన రైతులకు కోరారు. ప్రొద్దుటూరు ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. భూములు, ఇళ్ల స్థలాలు కోల్పోయిన వారి సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. బాధితులు నాగార్జున, నారాయణరెడ్డి, జిలానీబాషా పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు వసూలు చేయండి

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో నగదు రహిత ఇంటి పన్నులు సకాలంలో చెల్లించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎల్‌పీవో నుర్జహాన్ కార్యదర్శులను ఆదేశించారు. గోపవరం పంచాయతీ కార్యాలయంలో బుధవారం డిప్యూటీ ఎంపీడీవో రామాంజనేయరెడ్డి, కార్యదర్శులతో బకాయి పన్నుల వసూళ్ల పురోగతి, పనితీరును సమీక్షించారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కొండాపురం, న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ కొండాపురం గ్రంథాలయాధికారిణి వరలక్ష్మి తెలిపారు. 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న తెలుగు శతకపద్య పోటీలు, పలు అంశాలపై ప్రసంగాలు, 17న ప్రముఖ వ్యక్తుల సెమినార్లు, 18న వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు, 19న జాతీయ మహిళ దినోత్సవం, 20న వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

చీడపీడల నివారణపై అవగాహన

చాపాడు, న్యూస్‌టుడే: వరి పంటలో ఎర్రమచ్చలు (తుప్పు తెగులు) ఎక్కువగా ఉందని వెంటనే మందులు చల్లకపోతే దిగుబడులపై ప్రభావం చూపుతుందని మైదుకూరు ఏడీఏ కృష్ణమూర్తి రైతులకు సూచించారు. మండలంలోని భద్రిపల్లెలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఏవో పద్మలత, వీఏఏ సుప్రియ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దముడియం : శనగ పంట చీడ పీడల నివారణ, విత్తనశుద్ధి ప్రాముఖ్యతపై ఏవో జాకీర్ షరీఫ్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు బుధవారం చిన్నపసుపులలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

భద్రిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న ఏడీఏ కృష్ణమూర్తి, ఏవో పద్మలత

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda
ఖాతాదారులకు ముఖ్యగమనిక
ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించుటకు మా బ్యాంక్ ఆఫ్ బరోడా, బద్వేలు బ్రాంచ్ తేదీ: 15.11.2025 నుండి నూతన ప్రాంగణంలోనికి మార్చబడుచున్నది.
నూతన చిరునామా: Survey No.923, S.B.V.R. ఎడ్యుకేషన్ క్యాంపస్ సైడ్ కాఫీ హౌస్ ప్రక్కన, మైదుకూరు రోడ్డు, బద్వేల్, కడప జిల్లా - 616227.
ఇట్లు: బ్రాంచ్ మేనేజర్, బ్యాంక్ ఆఫ్ బరోడా, బద్వేల్ బ్రాంచ్, కడప జిల్లా, ఫోన్: 9154285295.

(c) eenadu

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

ఘనంగా కాలాష్టమి వేడుక

పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కడప విద్య, న్యూస్‌టుడే: కడప నగరంలోని బాసట స్వచ్ఛంద సేవాసంస్థ దత్తత గ్రామమైన శ్రీకాలభైరవపురం (ఎంఎస్ కొట్టాలు) లోని శ్రీ ప్రకామర్తి కాలభైరవస్వామి దేవస్థానంలో బుధవారం కాలాష్టమిని పురస్కరించుకుని శ్రీధరశర్మ ఆధ్వర్యంలో స్వామికి అభిషేకం, అష్టోత్తరం, కుష్మాండదీపసేవారాధన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. బాసట ప్రతినిధి కార్తికరెడ్డి పాల్గొన్నారు.

శ్రీరంగనాథ స్వామి ఆలయ అభివృద్ధే ధ్యేయం

పులివెందుల, న్యూస్‌టుడే: పులివెందులలోని ప్రసిద్ధ పురాతన ఆలయమైన శ్రీరంగనాథ స్వామి ఆలయ అభివృద్ధే ధ్యేయమని ఈవో రమణ తెలిపారు. శ్రీరంగనాథస్వామి ఆలయంలో బుధవారం ఆయన ట్రస్ట్ సీఈవో రంగనాయకులుతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా ఆలయ పరిసరాల్లో ఉన్న చెత్త, చెదారాన్ని తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆలయంలో పచ్చదనం పెంచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. భవిష్యత్తులో ఆలయానికి అన్ని రకాల సదుపాయాలు కల్పించి భక్తులకు సౌకర్యంగా ఉండేలా కృషి చేస్తామన్నారు.

మొక్క నాటుతున్న ఆలయ ఈవో రమణ తదితరులు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
కడప: 8008573428, 8074174832
పులివెందుల: 8008573466
కమలాపురం: 8008573475

?: వేల్పుల చర్చి సమీపంలోని వీధిలో మురుగు ప్రవహిస్తూ దుర్వాసన వస్తోంది. పరిష్కారానికి మార్గం తెలపండి. **- గంగిరెడ్డి, వేల్పుల**

?: గొందిపల్లె, అమ్మయ్యగారిపల్లెలోని వీధుల్లో మురుగు ప్రవహిస్తూ దోమలు వృద్ధి చెందుతున్నాయి. **- పుల్లారెడ్డి, గొందిపల్లె.**

✓: పరిష్కారం: వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- (పై రెండింటికి ఎంపీడీవో గంగాదేవి సమాధానమిస్తున్నారు).** **- న్యూస్‌టుడే, వేముల**

?: ప్రధాన రహదారి నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే దారిలో వర్షపు నీరు రోజుల తరబడి నిల్వ ఉంటోంది. **- సంజీవరెడ్డి, వీరపునాయునిపల్లె**

✓: వెంటనే నీటి నిల్వలు తొలగిస్తాం. **- డిప్యూటీ ఎంపీడీవో, రామ్‌సింగ్, వీరపునాయునిపల్లె - న్యూస్‌టుడే, వీఎన్ పల్లి**

?: బోడెద్దులపల్లెలోని ప్రధాన వీధి గుంతలతో దారుణంగా ఉంది. ఈ వీధిలో నడవాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు సౌకర్యం కల్పించాలి. **- ఖాదర్‌బాషా, బోడెద్దులపల్లె**

✓: మండలంలోని బోడెద్దులపల్లెలోని ప్రధాన వీధికి సిమెంటు రోడ్డు కోసం ప్రభుత్వంకు ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే సిమెంటు రోడ్డు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం. **- కుళాయిబాబు, ఎంపీడీవో, సీకేదిన్నె**
- న్యూస్‌టుడే, సీకేదిన్నె

అంధకారంలో పల్లెలు.. ఇబ్బందుల్లో గ్రామీణులు

ఏటా రూ.లక్షలు వెచ్చిస్తున్నా ప్రయోజనం శూన్యం

పల్లెల్లో అంధకారం తొలగించి విద్యుత్తు వెలుగులు నింపేందుకు ప్రభుత్వం ఏటా రూ.లక్షల్లో ఖర్చు చేస్తోంది. అయినా నిర్వహణ లేక పలు చోట్ల పగలు వెలుగుతుండటంతో వృథా అవుతోంది. మరికొన్ని చోట్ల రాత్రిళ్లు అంధకారం నెలకొంటోంది. వర్షాలు ఆయితే అవస్థలు రెట్టింపవుతున్నాయి. వీధి దీపాలకు అధికారులు భారీగా ఖర్చు పెడుతున్నా లక్ష్యం నెరవేరడం లేదు. **- న్యూస్‌టుడే, కమలాపురం, పులివెందుల**

● కమలాపురం మండలంలో విద్యుత్తు దీపాల నిర్వహణకు ఏటా రూ.50 లక్షల వరకు మండలానికి నిధులొస్తున్నా గ్రామాల్లో 10 శాతానికి పైగా వీధి దీపాలు వెలగడం లేదు. కోగటం ఎస్సీ కాలనీ, జగనన్న కాలనీ, గంగవరం ఎస్సీ కాలనీ, పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, నసంతపురం, లేటపల్లె, పొడదుర్తి గ్రామాల్లో సమస్య ఎక్కువగా ఉంది. ! పెండ్లిమర్రి మండలం చింతవాళ్లపల్లె, ఎల్లటూరు, నందిమండలం, యాదవాపురం తదితర గ్రామాల్లో సగానికి సగం వరకు దీపాలు వెలగడం లేదు. వల్లూరు మండలం విద్యుత్తు దీపాలకు ఏటా రూ.6 లక్షలకు పైగా నిధులు ఖర్చు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వీఎన్‌పల్లెలో పలు వీధుల్లో వీధి దీపాలు వెలగటం లేదని స్థానికులు వాపోతున్నారు. సీకే దిన్నె మండలంలో ఏడాదికి రూ.4 లక్షల వరకు నిధులు ఖర్చు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నాయి.

పులివెందులలోని పోలీసుస్టేషన్ వద్ద రాత్రి వేళలో దుస్థితి

● పులివెందులలో అంధకారం రాజ్యమేలుతోంది. పట్టణంలోని ముద్దనూరు రోడ్డు, శ్రీనివాస థియేటర్ సమీపం నుంచి ముద్దనూరు రోడ్డులోని రింగ్‌రోడ్డు వరకు వీధిదీపాలు వెలగడంలేదు. పోలీసుస్టేషన్ వద్ద, కోర్టు ప్రాంగణం, కడప రింగ్ రోడ్డు, ముద్దనూరు రింగ్ రోడ్డు, శ్రీరంగనాథస్వామి రింగ్‌రోడ్డు బాకరాపురం, లయోలా డిగ్రీ కళాశాల రోడ్డు, కె.వెలమవారిపల్లె, వెంకటాపురం, యర్రగుడిపల్లె తదితర ప్రాంతాల్లో వీధిదీపాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పురపాలక కమిషనర్ రాముడును వివరణ కోరగా వీధి దీపాల విషయమై పురపాలక పరిధిలోని కౌన్సిలర్ల సమక్షంలో సమస్యను పరిష్కరించాలని సూచించామన్నారు.

కష్టపడే వారికే తెదేపాలో గుర్తింపు

కమలాపురం, న్యూస్‌టుడే: కష్టపడే వారికి తెదేపాలో తప్పకుండా గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నూతనంగా నియామకమైన మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీ బాధ్యులతో బుధవారం ప్రమాణ స్వీకారాన్ని నిర్వహించారు. ముందుగా దివంగత సీఎం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నియోజకవర్గంలోని 66 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.66,20,200 విలువైన చెక్కులు పంపిణీ చేశారు.

మాట్లాడుతున్న బీటెక్ రవి

ప్రమాణం చేస్తున్న క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీ సభ్యులు

పులివెందుల, న్యూస్‌టుడే: కష్టపడి పనిచేస్తేనే తెదేపాలో గుర్తింపు వస్తుందని పులివెందుల నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి బీటెక్ రవి అన్నారు. పులివెందులలోని పార్టీ కార్యాలయంలో బుధవారం మండల, గ్రామ స్థాయి కమిటీల సభ్యులతో ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసి ప్రమాణ స్వీకారం చేయించారు.

శ్రీకృష్ణదేవరాయల జయంతిని అధికారికంగా నిర్వహించాలని వినతి

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయల జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతూ తెదేపా నేతలు హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డిలు రాయచోటి జిల్లా పర్యటనకు వచ్చినా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరారు. కడప విమానాశ్రయానికి బుధవారం వచ్చిన సీఎంను వారు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి వినతి పత్రం అందించారు.

సీఎం చంద్రబాబుకు వినతి పత్రం అందిస్తున్న తెదేపా నేతలు హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి

దిల్లీ ఘటన బాధితుల కుటుంబాలకు సంతాపం

మారుతీనగర్, న్యూస్‌టుడే: దేశ రాజధాని నడిబొడ్డున సోమవారం రాత్రి జరిగిన భయంకరమైన బాంబు దాడిని సీపీఎం తీవ్రంగా ఖండిస్తుందని. ఈ పేలుడు ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తమ సానుభూతిని తెలుపుతున్నట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యులపై శ్రీనివాసులురెడ్డి స్థానిక జిల్లా కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాసులురెడ్డి

రాయలసీమ రత్నాలు వెంకటసుబ్బయ్య, సుబ్బన్న

వైవీయూ, న్యూస్‌టుడే: పద్యకవిగా పాలా వెంకటసుబ్బయ్య, అవధానిగా డాక్టర్ సీపీ సుబ్బన్న చేసిన కృషి ఎంతో గొప్పదని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి అన్నారు. ప్రసిద్ధ పద్యకవి పాలా వెంకటసుబ్బయ్య జయంతి, ప్రసిద్ధ అవధాని డాక్టర్ సీపీ సుబ్బన్న జయంతి సందర్భంగా యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో బుధవారం వేడుకలు నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ సహాయకులు రమేష్‌రావు, రచయిత రామాంజనేయులు, వెంకటరమణ, మౌనిక పాల్గొన్నారు.

వెంకటసుబ్బయ్య, సీపీ సుబ్బన్న చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న గోపాలకృష్ణశాస్త్రి

నైపుణ్య ఆధారిత విద్య అందించాలి

ప్రధానాచార్యులతో మాట్లాడుతున్న వైవీయూ వీసీ రాజశేఖర్

వైవీయూ, న్యూస్‌టుడే: విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లో నాణ్యతా ప్రమాణాలతో పాటు నైపుణ్య అధారిత విద్య అందించాలని వైవీయూ వీసీ బెల్లంకొండ రాజశేఖర్ ఆకాంక్షించారు. స్థానిక విశ్వవిద్యాలయంలో కడప, అన్నమయ్య జిల్లాల వైవీయూ అనుబంధ డిగ్రీ, పీజీ కళాశాలల ప్రధానాచార్యులతో వీసీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అనుబంధ కళాశాలల్లో విద్య నాణ్యతను అండర్ గ్యాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ స్థాయిలలో తగ్గుతున్న అడ్మిషన్ల సంఖ్యపై విశ్లేషించారు. కళాశాలల అభివృద్ధి మండలి డీన్ రఘుబాబు, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్ కోర్సు ఎంతో మేలు

కడప విద్య, న్యూస్‌టుడే: విద్యార్థినులు పుట్ట గొడుగుల పెంపకాన్ని నేర్చుకోవడం ఉపయోగకరమని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాషా అన్నారు. స్థానిక కళాశాల ఆవరణలో బుధవారం విద్యార్థినులు ప్రిన్సిపల్‌కు పుట్టగొడుగుల ప్యాకెట్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బోటనీ ఆధ్వర్యంలో సర్టిఫికెట్ కోర్సుగా కళాశాలలో పుట్ట గొడుగుల పెంపకం జరుగుతోందన్నారు. మిల్కీ మష్రూమ్‌ను విద్యార్థినులు సర్టిఫికెట్ కోర్సులో ప్రారంభించారన్నారు. వరి గడ్డిని సేకరించడం, వాటిని చిన్న చిన్న భాగాలుగా కత్తిరించడం, దానిని స్పాన్ ఉపయోగించి బెడ్స్‌ను చేయడం అనంతరం కేసింగ్ చేయడం చివరిగా పుట్ట గొడుగులు పెరిగిన తరువాత వాటిని హార్వెస్ చేయడం వివిధ దశల్లో చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, కంప్యూటర్ హెడ్ హరిత, ఎకనామిక్స్ హెడ్ విజయలక్ష్మి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల ప్యాకెట్‌ను ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాషాకు అందజేస్తున్న విద్యార్థినులు

పూర్వ విద్యార్థుల ఔదార్యం

తొండూరు, న్యూస్‌టుడే: తొండూరు జిల్లా పరిషత్తు పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు బాసటగా నిలిచారు. 1994-95లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రూ.50 వేలు, 2003-04 బ్యాచ్ రూ.25 వేలను బుధవారం హెచ్‌ఎం సుబ్బారెడ్డికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. చదువుకున్న బడి రుణం తీర్చుకోవాలని పూర్వ విద్యార్థులు ఔదార్యం చాటుకోవడం అభినందనీయమన్నారు. ఆళ్లగడ్డ సీఐ సుదర్శన్‌రెడ్డిని పాఠశాల బృందం, పూర్వ విద్యార్థులు సన్మానించారు.

కాలానుగుణ వ్యాధులపై అవగాహన

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: వాతావరణంలో వస్తున్న మార్పులతో సంక్రమించే కాలానుగుణ వ్యాధులపై గ్రామీణులకు అవగాహన కల్పించాలని జిల్లా అదనపు వైద్యాధికారి రవిబాబు అన్నారు. మండలంలోని దర్జిపల్లిలో 104 సంచార వాహనం ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను బుధవారం ఏడీఎంహెచ్‌వో తనిఖీ చేశారు. ఎంతమంది రోగులు వచ్చారు. అందులో మధుమేహం, రక్తపోటు, జ్వరాలు, జలుబు, దగ్గు, రక్తహీనత సమస్యతో ఎంతమంది బాధపడుతున్నారని ఆరా తీశారు. వైద్యాధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. వైద్యాధికారిణి భావన, పర్యవేక్షకుడు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖాధికారి సతీష్

చామంతి సాగులో ఎరువుల వినియోగం తప్పనిసరి

వెల్లటూరు(పెండ్లిమర్రి), న్యూస్‌టుడే: చామంతి సాగులో జీవన ఎరువులు వినియోగం తప్పనిసరి అని జిల్లా ఉద్యాన శాఖాధికారి సతీష్ అన్నారు. వెల్లటూరులోని బుధవారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ రైతులకు చామంతుల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన నారు సాగు చేసుకోవాలన్నారు. కేవీకే శాస్త్రవేత్త మానస మాట్లాడుతూ పూల సాగులో నూతన రకాలు సాగు చేసుకుంటే లాభదాయకంగా ఉంటుందన్నారు. ఉద్యానశాఖాధికారి రెడ్డెయ్య, మండల వ్యవసాయాధికారి కృష్ణ సుమంత్‌రెడ్డి, ఏఈవో గంగాధర్‌రెడ్డి, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ.. నగల అపహరణ

సిద్దవటం, న్యూస్‌టుడే: సిద్దవటంలోని ఎగువపేట శ్రీనలంద నగర్‌లో చాటగుంట రవిబాబు నివాస గృహంలో బుధవారం పట్టపగలే చోరీ జరిగింది. జీవనోపాధి నిమిత్తం ఉదయాన్ని యజమాని స్థానికంగా ఉన్న స్టూడియోకు వెళ్లారు. ఆయన భార్య సుకన్య ఉద్యోగ రీత్యా అట్లూరు వెళ్లారు. మధ్యాహ్నం భోజనానికి ఆయన ఇంటికి రాగా అప్పటికే ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో కంగుతున్నారు. లోపలికి వెళ్లి బీరువాలోని 8 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి సంఘటనా స్థలాన్ని నిఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

అదుపు తప్పి ట్యాంకర్ బోల్తా

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: మండలంలోని అచ్చంపేట శివారులో హైదరాబాద్ నుంచి చిత్తూరుకు వస్తున్న ఓ ట్యాంకరు అదుపు తప్పి బోల్తా పడింది. రాజంపేట నుంచి కడప వైపు వస్తున్న వాహనాన్ని తప్పించడానికి చోదకుడు వేణుగోపాల్ ప్రయత్నించి విఫలమయ్యాడు. ట్యాంకరు ఓ వైపునకు పూర్తిగా పడిపోయింది. డ్రైవర్‌కు గాయాలు కావడంతో స్థానికులు 108లో కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఎస్.ఐ.ప్రణయ్‌కుమార్‌రెడ్డి అక్కడికి చేరుకుని విచారణ చేశారు.

మెప్మా సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి

సీసీ రహదారి నాణ్యతగా పూర్తి చేయాలి

కమలాపురం, న్యూస్‌టుడే: పీవీఎస్ఆర్ఎం జూనియర్, సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలతో పాటు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, వార్డు సచివాయం, శ్మశాన వాటికకు కూడా వెళ్లే మార్గంలో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణాన్ని నాణ్యంగా త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి అన్నారు. పట్టణంలోని పాత స్టేట్ బ్యాంకు నుంచి రెండో వార్డు సచివాలయం వరకు రూ.1.26 కోట్లతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆయన బుధవారం ఆవిష్కరించి భూమి పూజ చేశారు. అనంతరం చిరు వ్యాపారులకు మెప్మా ఆధ్వర్యంలో పీఎం స్వానిధి 2.0 ద్వారా 115 మందికి రూ.15.25 లక్షలు, బ్యాంకు లింకేజీ ద్వారా స్వయం సహాయక సంఘాలకు రూ.1.05 కోట్ల చెక్కులను బ్యాంకు అధికారులతో కలిసి అందజేశారు. మెప్మా పీడీ కిరణ్‌కుమార్, పుర ఛైర్మన్ మేరి, కమిషనర్ ప్రహ్లాద్, పాలిటెక్నిక్ కళాశాల హెచ్‌వోడీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కషాయం.. పచ్చ పురుగు నివారణకు బ్రహ్మాస్త్రం

పులివెందుల, న్యూస్‌టుడే: పప్పు శనగ, కంది పంటలకు ఆశించే పచ్చ పురుగు నివారణకు బ్రహ్మాస్త్రం కషాయం వాడాలని ప్రకృతి వ్యవసాయ అధికారి భాస్కర్‌రెడ్డి తెలిపారు. పులివెందుల మండలం రాగిమానిపల్లెలో వ్యవసాయాధికారి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రైతులతో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అయిదు రకాల ఆకులైన వేప, కానుగ, ఉమ్మెత్త, బొప్పాయి, ఆముదం ఆకులను రెండు కిలోల చొప్పున తీసుకుని మొత్తగా రుబ్బి 15 లీటర్ల గోమూత్రంలో మరిగించి వచ్చిన కషాయాన్ని 100 లీటర్ల నీటిలో 3 లీటర్ల కషాయం కలుపుకొని పిచికారీ చేయడం వల్ల పచ్చ పురుగు నశిస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి చెన్నారెడ్డి, ఉద్యాన అధికారి రాఘవేంద్రారెడ్డిలు పలు సూచనలు, సలహాలు అందించారు.

కషాయం ఎలా తయారు చేయాలో చూపిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

నాణ్యతా ప్రమాణాలు పాటించండి

కొత్తమాధవరం(ఒంటిమిట్ట), న్యూస్‌టుడే: మధ్యాహ్న భోజనం తయారీలో నాణ్యతా ప్రమాణాలు తప్పక పాటించాలని ఎంఈవో-2 వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. మండలంలోని కొత్తమాధవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వచ్చే పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెరిగేలా.. ప్రణాళికబద్ధంగా విద్యా బోధన చేయాలన్నారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ

సిద్దవటం, న్యూస్‌టుడే: సిద్దవటం మండలంలోని భాకరాపేట, ఏపీఎస్పీ పదకొండో బెటాలియన్, సిద్దవటంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలను బుధవారం డీఈవో షంషుద్దీన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భాకరాపేటలో ప్రార్థన నిర్వహణ తీరును, బెటాలియన్‌లో ఎస్ఏ-1 పరీక్ష కేంద్రం, సిద్దవటంలో మధ్యాహ్న భోజనం, కేంద్రీకృత వంటశాల భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. తమకు కెమిస్ట్రీ అధ్యాపకుడు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వెంటనే నియమించేలా చర్యలు తీసుకోవాలని సిద్దవటంలోని ఇంటర్ విద్యార్థులు డీఈవోను కోరారు. ఎంఈవోతో మాట్లాడి అధ్యాపకుడిని నియమించే చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. హెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోనుమాకులపల్లె విద్యార్థినికి బంగారు పతకం

వీరపునాయునిపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని గోనుమాకులపల్లెకు చెందిన నర్రెడ్డి ఐశ్వర్య సివిల్ ఇంజినీరింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాయలసీమ విశ్వవిద్యాలయంలో బుధవారం వీసీ వెంకట బసవరావు నుంచి బంగారు పతకంతో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ కార్యక్రమాన్ని నవంబర్ 12న నిర్వహించగా ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరై పలువురికి పతకాలు అందించారు.

రాయలసీమ విశ్వవిద్యాలయ వీసీ వెంకట బసవరావు నుంచి పతకాన్ని అందుకున్న నర్రెడ్డి ఐశ్వర్య

ర్యాలీలో వైకాపా నాయకులు, కార్యకర్తలు

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిరసిస్తూ ర్యాలీ

బిల్టప్, కడప న్యూస్‌టుడే: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు నిరసిస్తూ మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా అధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైకాపా జిల్లా అధ్యక్షుడు రవీంద్రానాథ్‌రెడ్డి, మాజీ మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, ఇన్‌ఛార్జి మేయర్ ముంతాజ్‌బేగం, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి పాల్గొన్నారు.

కమలాపురం: ప్రైవేట్ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని వైకాపా నియోజకవర్గ బాధ్యుడు నరేన్ రామాంజులరెడ్డి, ఎస్ఈసీ సభ్యుడు సాయినాథ్‌శర్మ, రాజోలి వీరారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక గ్రామ చావిడి నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఉప తహసీల్దారు జ్యోతికి వినతిపత్రాన్ని అందజేశారు.

సమస్యలు తెలుసుకున్నాం.. పరిష్కారం చూపుతాం!

◆ వాక్ విత్ ఈనాడుతో పులివెందుల కమిషనర్ రాముడు

పులివెందుల, న్యూస్‌టుడే: ఏమ్మా.. ఏవైనా సమస్యలు ఉన్నాయా.. పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను రోజూ తీసుకెళ్తున్నారా.. మంచి నీటి సరఫరా ఎలా ఉంది.. అంటూ పులివెందుల పురపాలక కమిషనర్ దండే రాముడు బుధవారం ఉదయం స్థానిక 8, 9 వార్డుల ప్రజలను పలకరించారు. 'కమిషనర్ వాక్ విత్ ఈనాడు' కార్యక్రమంలో భాగంగా ఆయన ఇస్లాంపురం, గుంతబజారు, శివాలయం వీధి, అమ్మవారిశాల వీధి, వైఎస్ రాజారెడ్డి వీధుల్లో పర్యటించారు. స్థానికుల సమస్యలను వెంటనే పురపాలక సిబ్బంది, సచివాలయ సిబ్బందికి తెలియజేస్తూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

పులివెందులలోని డ్రైనేజీ పూడికతీత గురించి కమిషనర్ రాముడుకు తెలుపుతున్న మహిళలు

ఈనాడు మీతోడు

● గుంతబజారులో ఉన్న తాగు నీటి మోటారు వద్ద నీరు వృథాగా పోతుండడంతో కుళాయి మార్చాలని సిబ్బందికి తెలిపారు. అమ్మవారిశాల వీధిలో కుక్కల సంచారం ఎక్కువగా ఉందని సుబ్బారావు అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో త్వరలో వాటికి ఆపరేషన్లు చేయిస్తామన్నారు. గోవులు కూడా వీధుల్లో ఎక్కువగా తిరుగుతున్నాయని తెలపగా త్వరలో పులివెందులలో గోశాల నిర్మాణ పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

● ఇస్లాంపురంలో చాంద్‌బాషా అనే వ్యక్తి తమ వీధిలో దీపాలు వెలగట్లేదని చెప్పడంతో వెంటనే సిబ్బందికి తెలిపి పరిష్కరించాలని ఆదేశించారు. భూగర్భ డ్రైనేజీకి సంబంధించిన ఛాంబర్ల పైకప్పులు దెబ్బతినడంతో వాటి స్థానంలో కొత్త వాటిని అమర్చాలన్నారు.

● అమ్మవారిశాలలో కల్యాణి అనే మహిళ భూగర్భ డ్రైనేజీ ద్వారా మురుగు నీరు సక్రమంగా వెళ్లడం లేదని.. ఛాంబర్లు జామ్ అయ్యాయని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే ఆ పనులు చేయించాలని పారిశుద్ధ్య అధికారులకు ఆదేశించారు. వైఎస్ జయమ్మ పార్కు వద్ద నీరు రోడ్లపైకి వదులుతుండడంతో వారికి తెలియజేసి నీటి వృథాను అరికట్టాలని సూచించారు.

● బోలే వార్డులో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి హోటళ్లు నడుపుతున్న వారిని మందలించి.. మీరిలా చేస్తే పాదచారులెలా నడుస్తారని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ జయమ్మ కాలనీలో నీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని జాఫర్ అనే వ్యక్తి వినతిపత్రం సమర్పించారు. పురపాలక డీఈ సురేష్, పట్టణ ప్రణాళిక అధికారి అజయ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుళాయి నుంచి వృథాగా పోతున్న నీటిని కట్టడి చేస్తున్న కమిషనర్ రాముడు

రైతుబజారులో కూరగాయల ధరలు



కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: రైతుబజారులో కూరగాయల ధరలు కిలో (నిన్నటివి) ఇలా... బంగాళదుంప-45, క్యాబేజి-30, క్యారెట్-78, బీన్స్-50, బీట్‌రూట్-55, కీర-35, దోస-40, దొండకాయలు-58, ముల్లంగి-50, అల్లం-60, 80, కాలీఫ్లవర్-55, క్యాప్సికం-70, టమాట-18, 20, మిరపకాయలు 40, వంకాయలు-50, బెండకాయలు-40, బీర-50, కాకర- 50, మటిక్కాయ-50, చిక్కుడు-60, అలసందకాయలు-55, అనపకాయలు-60, ఉల్లిపాయలు-20, 25, మునగకాయలు-60.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu